
రామాయణం
వాల్మీకి రామాయణము - బాల కాండ
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org   Mobile App: Free Gurukul   email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul   Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in

అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

SREEMATH

ANDHRA VALMIKI RAMAYANAMU

ANDHRA VALMIKI
VASUDASUDU

VOL. I.

BALAKANDAM.

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

BY

VAVILICOLANU SUBBA ROW,

Telugu Pandit, Presidency College, Madras, (Now Retired)
and the Author of
Sree Kumarabhyudayamu, Sree Kausalya Parinayamu
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritam,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakam
&c, &c, &c

WITH AUTHOR'S OWN COMMENTARY
CALLED

MANDARAM

IMPROVED FIFTH EDITION

PRINTED BY
Mr K KODANDA RAMAIAH, AT
ANDHRA GRANDHALAYA PRESS, BEZWADA

1932.

[All Rights Reserved

సీతాకల్యాణము

శ్రీ రామచంద్ర.

శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణ క్షీరార్ణవ

మందరము - విషయవివరణము.

			పుట
౨	శ్రీమదాంజనేయపటలము	...	౨
౩	శ్రీరామరక్షామంత్రము	...	౩
౪	ఇష్టదేవతాస్తుతి	...	౫
	వ్యాఖ్యానకర్త్రాది		,,
	వ్యాఖ్యానరచనహేతువు	.	౯
	బాలకాండార్థవివరణము	...	౧౧
	శ్రీరామమంత్రవివరణము		౧౫
	నమశ్శబ్దనిర్వచనము		౧౮
	నమశ్శబ్దము సకలఫలార్థము	...	౧౯
౫	శ్రీసీతాదేవిస్తుతి	...	౨౦
	శ్రీశబ్దనిర్వచనము	.	౨
౬	బ్రహ్మస్తుతి	...	౨౬
౭	సరస్వతీదేవిస్తుతి	...	౨౮
౮	శివస్తుతి		౩౦
	రామపదముచే పాలింపఁబడు మూర్తి యెవరు?		౩౧
౯	పార్వతీ పరమేశ్వరస్తుతి	...	౩౨
౧౦	రామదాస ఆంజనేయస్తుతి	...	౩౪
	శ్రీరామపాదసేవాసక్తుండైన సాధకునికృత్య మిందుఁ జెప్పఁబడెను	...	౩౫
౧౧	సంస్కృతకవీంద్రవినుతి	...	౩౭
	రామాయణపఠనఫల మిందు వివరింపఁబడినది	..	౩౯
౧౨	ఆంధ్రకవీశ్వర వినుతి		౪౫
	ముక్తివిరోధులగు కృష్యాదివృత్తులు ప్రయత్నపూర్వకముగ వదలవలయుననుట		౪౬
౧౩	మిత్రప్రశంస		౫౧
౧౪	స్వవిషయము		౫౬

(A)

౧౫ కవికృతపూర్వగ్రంథ సంగ్రహపట్టిక .. ౬౪

౧౬ వితర్కాదికము ౬౬

అంత్యకాల స్మరణము కదా ఫలవంత, మిప్పుడే ధ్యానించి యేమి ప్రయోజన మని శంక - సమాధానము ౬౮

అంతర్యాగము బాహ్యయాగము గ్రాహ్యములే యనట ౭౦

శ్రీరామాయణ ముత్తమోత్తమకావ్యము .. ౯౮

ఉత్సాహకారణ భగవద్దత్తాభయవాగ్దానము . ౧౦౪

౧౭ అవతారిక ... ౧౦౫

—* ౧వ సర్గము *—

౧౮ వాల్మీకునకు నారదుఁడు రామాయణ ముపదేశించుట ... ౧౧౯

తపశ్శబ్ద విచారణ . ౧౨౧

నారద పూర్వచరిత్రము . ౧౩౪

వాల్మీకిచరిత్రము ... ౧౩౫

వాల్మీకి నారదు సంప్రశ్నించిన 'దేవరిఁగూర్చి?' యని ప్రశ్న - మోక్షదాతయగు భగవంతునిఁగూర్చి యని సిద్ధాంతము ౧౫౦

ఘంటాకర్ణ చరిత్రము ౧౫౧

నరునిగుఱించి విను మని నారదు వాక్యముగదా, పరమపురుషుఁ డని చెప్పెఁ, వెట్లు పొసంగు నని ప్రశ్నము ౧౫౨

ఉత్తరము ౧౫౩

వాల్మీకిప్రశ్న భగవంతునిగూర్చియైన సాకారుఁడా నిరాకారుఁడా యను మున్నగు ప్రశ్నము లడుగక గుణములగుఱించి యడుగనేల? యని ప్రశ్న ౧౫౩

తత్త్వవిచారముకంటె గుణవిచారమే శ్రేయస్కరమనుట వివక్షితము ౧౫౪

గుణవిచారమునందు వసిష్ఠాదు లుండ శ్రీరామమూర్తినే చెప్పవలసిన కారణమేమి యన ప్రశ్న - యుత్తరము . ౧౫౬

శ్రీరామచంద్రమూర్తి పరతత్త్వమగు శ్రీవిష్ణుమూర్తియే యని నారదుఁడు నిరూపించుట ... ౧౫[illegible]

నారదుఁ డుపదేశించినది మనుష్యునిగుఱించి కాదు మోక్షవిషయమై భగవంతుని విషయమనుట వివక్షితము ... ౧[illegible]

మాయావివరణము ... ౧[illegible]

రామచంద్రమూర్తి విష్ణ్వవతారమైయుండ నాయన కు శోకమోహములు కలుగునాయని యాక్షేపము ... ౨౨౫

ప్రత్యుత్తరము ... ౨౨౫

సంచితము - ప్రారబ్ధము - ఆగామి వివరణము ౨౬౬

భక్తులగు గృహస్థులకంటె సన్న్యాసాశ్రమస్వీకారము చేసినవారా యుత్తము లనుట వివరింపఁబడినది ౨౬౮

—* ౨ వ సర్గము *—

౧౯ వాల్మీకిమహర్షి తమసాతీరంబున విహరించుట వక్తృ వైలక్షణ్యము ౨౮౨

౨౦ బోయ క్రౌంచపక్షిని వధించుట వాల్మీకిమహర్షి చూచుట- ౨౮౯

౨౧ వాల్మీకిమహర్షి బోయను శపించుట - ఫలశ్రుతి ... ౨౮౯

భగవద్విషయ విచారసమయంబున గ్రంథభంగభయములేదు ౨౮౯

రేఫసంయుక్తాక్షర పూర్వాక్షరముల గురుత్వలఘుత్వ విచారణ ౨౯౩

మానిషాద శ్లోకవిషయమున కతక తిలక వ్యాఖ్యాతల యభిప్రాయమును దాని యథార్థభావ వివరణము ౨౯౫

స్నానక్రమము ౩౦౧

బ్రహ్మ వాల్మీకిని జూడవచ్చుట. ౩౦౨

బ్రహ్మ వాల్మీకిని రామాయణముఁ జెప్ప నియమించుట ౩౦౬

వాల్మీకి జాతిబ్రాహ్మణుఁ డనుట చెప్పఁబడినది ౩౦౮

వాల్మీకి వ్రాసినవిషయములు సత్యములు విశ్వాసపాత్రము లనుట ౩౧౦

కవిత్వమన నెట్టిది. .. ౩౧౫

కావ్యలక్షణము ౩౧౬

ఉత్తరకాండము ఖిల మను విషయము ... ౩౨౦

కవిరాజవిరాజితలక్షణము .. ౩౨౧

—* ౩ వ సర్గము *—

వాల్మీకి యోగదృష్టిచే రామచరిత మంతయుఁ గనుట ... ,,

విషయవైలక్షణ్యము . ౩౨౨

రామభద్రార్థవిచారము ... ౩౩౪

—* ౪ వ సర్గము *—

ప్రబంధవైలక్షణ్యకథనము ... ౩౩౫

కావ్యలక్షణవివరణము ... ౩౪౨

సీతారామ తారతమ్యము	...	౩౪౨
కావ్యవిషయిక బీజాది వివరణము	...	౩౪౪
గ్రంథగుణకథనము.	...	,,
కుశలవులు రామాయణమును నయోధ్యాపురంబున గానముచేయుట	.	౩౪౯
వీణెలవివరము		౩౫౩
యోగవాసిష్ఠాది రామాయణములనుగుఱించి		౩౫౪
రామాయణముగానముసేయు కుశలవుల శ్రీరాముఁడు పిలిపించుట	...	౩౫౫
అఖండయతి		౩౫౮
రామాయణరచనానంతరము జరిగిన కుశలవగానము పూర్వభాగమునం దేట్లువ్రాయఁబడెనని గుఱించి		౩౬౮
వాల్మీకి బ్రహ్మ సాక్షాత్కరించెననుట ఆత్మస్తుతి కాదా అను ఆక్షేపము - సమాధానము		౩౬౯
నాల్గవసర్గము తరువాతఁ జెప్పఁబడిన దన్నట్లు తక్కిన మూఁడు సర్గములు తరువాతఁ జేర్పఁబడిన వని యేల చెప్పరాదని ఆక్షేపము - సమాధానము	.	౩౬౯
విష్ణుపరత్వ నిర్ణయము	...	౩౭౧
౨ ఉపాయవివేచనము	.	౩౭౬
౩ శరణాగతికి ముఖ్యఫలము	..	౩౭౮
౪ పురుషకారము	...	౩౮౨
౫ అధికారి స్వరూపము	.	,,
౬ భగవత్పారతంత్ర్యము	..	,,
౭ భాగవత్పారతంత్ర్యము	...	,,
౮ అర్థపంచకజ్ఞానము	..	౩౮౩
౯ అకించినత్వము	...	,,
౧౦ ఆచార్యవరణము	...	,,
౧౧ ఔత్కంఠ్యత	...	,,
౧౨ నడవడి	...	౩౮౪
౧౩ వాసస్థానము	...	,,
౧౪ ఈరామాయణము ద్వయార్థ వివరణరూపము	...	,,
౧౫ గాయత్రి	...	౩౮౫

౧౬ దుర్విచారపరిహారము	...	౩౭౫
౧౮ సంసారజహాస	...	,,
౧౬ చతుష్షష్టికళలు	...	,,

—* ౫ వ సర్గము *—

శ్రీరామాయణకథారంభము	...	౩౭౬
అయోధ్యాపుర వర్ణనము	..	౩౯౩

—* ౬ వ సర్గము *—

దశరథమహారాజ గుణవర్ణనము	...	౩౯౯
అయోధ్యాపుర జనవర్ణనము	..	౪౦౩
నాస్తికుఁడు లేనియెడల జాబాలి నాస్తికవాద మెట్లు చేసెనని ప్రశ్నము - ఉత్తరము	.	౪౦౮
పాదాంతసంధివిషయము	...	౪౦౯
అతిథినిరూపణము	..	౪౧౩
బాహ్లికాదిదేశనిరూపణము	...	౪౧౫
భద్రాదిదిగ్గజవివరణము	...	౪౧౮
మంత్రుల లక్షణమునుగుఱించి	...	౪౨౪

—* ౭ వ సర్గము *—

దశరథుఁడు తన పుత్రహీనతకు విషాదపడుట	...	౪౨౬
అపుత్రకవిచారము	...	౪౨౯
దశరథుఁ డశ్వమేధయాగముఁ జేయ యోచించుట	...	౪౩౨

—* ౯ వ సర్గము *—

దశరథునకు సుమంత్రుఁడు సనత్కుమారవచనంబులఁ దెల్పుట	..	౪౪౦

—* ౧౦ వ సర్గము *—

సుమంత్రుఁడు దశరథునకు ఋశ్యశృంగు చరిత్రఁ దెల్పుట	...	౪౪౬
దీర్ఘబ్రహ్మచర్యము - వానప్రస్థము - సన్న్యాసము నిషిద్ధము లనుట	...	౪౫౪
వేశ్యాస్పర్శాదులవలనఁ దపోహాని కలిగియుండ ఋశ్యశృంగుఁడు పొలిమేర నడుగుపెట్టినంత మాత్రమున వర్షించెననుట యెట్లు యుక్తము?	...	౪౫౬

ప్రత్యుత్తరము ... ౪౫౭
బ్రహ్మవేత్తకుఁ బ్రార్థ్య మపరిత్యాజ్యమనుట ... ౪౫౭

—* ౧౧వ సర్గము *—

చంపానగరము .. ౪౬౧
వసిష్ఠాదులు తెలుసుకుఁ దెలిసిన దశరథునకు సంతానప్రాప్తి విషయమై యిన్ని దినా లేలదాఁచిరి? ఇప్పుడైనను దాము చెప్పక సుమంత్రునిచేఁ జెప్పింపనేల? ... ౪౬౪
దానికి పరిహారము ౪౬౫
దశరథుఁడు ఋశ్యశృంగునిఁ దోడితేరఁ బయనించుట .. ,,
దశరథుఁడు ఋశ్యశృంగునితో నయోధ్యఁ బ్రవేశించుట ... ౪౬౯

—* ౧౨వ సర్గము *—

దశరథుఁ డశ్వమేధయాగము సేయఁ బ్రయత్నించుట ... ౪౭౦

—* ౧౩వ సర్గము *—

వసిష్ఠుఁడు యజ్ఞసంభారముల సిద్ధముచేయించుట ... ౪౭౮
వసిష్ఠుఁడు రాజులను బిల్వ సుమంత్రుని నియమించుట ... ౪౮౩
యజ్ఞంబుచూడ నానాదేశపురాజు లయోధ్యకు వచ్చుట ... ౪౮౭

—* ౧౪వ సర్గము *—

అశ్వమేధయాగప్రారంభము .. ౪౮౯
శ్రీమణాశ్వము ఋష్యుఁడు పుట్టకముందునుండి యున్నదనుట .. ౪౯౨
యూపస్తంభప్రతిష్ఠ ౪౯౭

—* ౧౫వ సర్గము *—

దశరథుఁడు పుత్రకామేష్టి చేయుట ... ౫౧౦
దేవతలు రావణుఁడు పెట్టు సంకటములు బ్రహ్మతో విన్నవించుట ... ౫౧౧
శ్రీవిష్ణుమూర్తి దేవతలకుఁ బ్రత్యక్షమగుట ... ౫౧౪
విష్ణుశబ్ద నిర్వచనము ... ౫౧౯
విష్ణువుతో దేవతలు తమ సంకటములు విన్నవించుట. ౫౨౨
విష్ణుమూర్తి దేవతల కభయ మిచ్చుట ... ౫౨౩
కౌసల్యాదశరథుల పూర్వజన్మవృత్తాంతము ... ౫౨౬
సపరివారుఁడై సపరికరముగ విష్ణు వవతరించె ననుట ... ౫౨౯

—* ౧౬వ సర్గము *—

దేవతలు విష్ణువును మానవావతార మెత్తఁ బ్రార్థించుట ... ౫౩౧

శ్రీరామాది జననములకు రేతస్సు కారణము కాదనియు వారిదేహము లప్రాకృతములనుట	౧౩౬
దశరథుఁడు తన భార్యలకుఁ బాయసముఁ బంచి యిచ్చుట ...	౧౩౮
పాయసభాగవివరణము ...	౧౪౩

—* ౧౭ వ సర్గము *—

బ్రహ్మ దేవతలను వానరుల సృజింప నియమించుట ...	౧౪౪
వానరోత్పత్తి వివరణము ...	౧౪౮
శివుఁడు రావణుఁడు పక్షపాతి యనుట ...	౧౫౧
వానరసృష్టిసందర్భమున పరస్పరవిరుద్ధములను గూర్చిన యాక్షేపసమాధానములు ...	౧౫౯

—* ౧౮ వ సర్గము *—

శ్రీకౌసల్యాదేవి గర్భము ధరించుట	౧౬౩
శ్రీభగవదవతారఘట్టము	౧౬౬
అఖండము, అపరిచ్ఛేద్యము నగు భగవన్మూర్తి నాలుగు ఖండములుగ నెట్లయ్యెను - సమాధానము ...	౧౭౫
శ్రీరాముని శైశవవర్ణనము	౧౭౯
రాజకుమారగుణవర్ణనము	౧౮౫
విశ్వామిత్రుఁడు దశరథుని జూడవచ్చుట .	౧౯౩
దశరథుఁడు విశ్వామిత్రునిరాకకుఁ గారణమడుగుట	౧౯౭

—* ౧౯ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు దశరథునకుఁ దనరాకకుఁ గారణముఁ జెప్పుట	౨౦౦
విశ్వామిత్రుఁడు శ్రీరామునిఁ దనతోఁ బంపుమని దశరథు నడుగుట	౨౦౨
'పదునాఱేండ్లవాఁడు రాజేంద్ర' పద్యవ్యాఖ్యానము .	౨౦౫

—* ౨౦ వ సర్గము *—

శ్రీరామునిఁ బంపఁజాలక దశరథుఁడు పరితపించుట ...	౨౧౧
రామవయోవిచారము ...	౨౧౩
దశరథుఁడు విశ్వామిత్రుని యజ్ఞవిఘ్నకరులగు రాక్షసులవృత్తాంత మడుగుట	౨౨౪
దశరథుఁడు శ్రీరాములను బంప నిరాకరించుట ..	౨౨౫

—* ౨౧ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు దశరథునిపైఁ గోపించుట	.	౬౨౮
వసిష్ఠుఁడు దశరథునకు శ్రీరామునిఁ బంపుమని బోధించుట	...	౬౩౨

—* ౨౨ వ సర్గము *—

దశరథుఁడు రామలక్ష్మణుల విశ్వామిత్రువెంట నంపుట	...	౬౩౬
పూవుఁబోఁడి శబ్దసాధుత్వవిచారము	...	౬౩౯
విశ్వామిత్రశబ్దార్థము	...	౬౪౧
విశ్వామిత్రుఁడు రామునకు బలాతిబల లనువిద్యల నిచ్చుట	...	,,
యోజనశబ్దార్థము	...	౬౪౩
బలాతిబలమంత్రము	...	,,

—* ౨౩ వ సర్గము. *—

అరుణోదయమైన పిదప నిదురింపరాదనియు నట్లు నిదురించినఁ జేయవలసిన ప్రాయశ్చిత్త వివరణము	...	౬౪౭
కౌసల్యాసుప్రజా యనుటకు గారణములు	...	౬౪౯
నిద్ర లేవఁగనే చేయవలసినవిధి	...	౬౫౧
విశ్వామిత్రుఁడు రామునకు నంగదేశవృత్తాంతముఁ దెల్పుట		౬౫౩

—* ౨౪ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు రామునకు సరయూవృత్తాంతముఁ దెలుపుట	...	౬౫౬
గాయత్రి వివరణము	...	,,
విశ్వామిత్రుఁడు రామునకు మలద కరూశముల వృత్తాంతము చెప్పుట		౬౬౦
ఇంద్రునకు బ్రహ్మహత్య యెట్లువచ్చెను?	...	౬౬౧
విశ్వామిత్రుఁడు రామునకుఁ దాటకావృత్తాంతముఁ దెలుపుట	...	౬౬౩

—* ౨౫ వ సర్గము *—

తాటక నగస్త్యుఁడు శపించుట	...	౬౬౪
తాటకను జంప విశ్వామిత్రుఁడు రామునికి బోధించుట	...	౬౬౭
శ్రీరామచంద్రమూర్తి తాటకను జంపుట దోషము గాదనుట	...	౬౭౧

—* ౨౭ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు శ్రీరామునకు దివ్యాస్త్రంబు లొసంగుట ... ౧౭౮
అస్త్రమంత్రములు ... ,,
బ్రహ్మాస్త్రము - దండచక్రము - కాలచక్రము - విష్ణు చక్రము - బ్రహ్మశిరము .. ౧౭౯
నారాయణాస్త్రము - పాశుపతాస్త్రము ... ౧౮౧

—* ౨౮ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు శ్రీరామున కుపసంహారాస్త్రము లొసంగుట ౧౮౨
శ్రీరామున కుపసంహారాస్త్రదేవతలు ప్రత్యక్షమగుట ౧౮౩

—* ౨౯ వ సర్గము *—

శ్రీరామునకు విశ్వామిత్రుఁడు సిద్ధాశ్రమవృత్తాంతముఁ దెలుపుట ౧౮౬
కశ్యప శబ్దార్థము ... ౧౮౮
యాగ మనఁగా నేమి? ... ౧౮౯
తనయందనన్యభక్తిగల బలి నేట్లు విష్ణువు కాలుపఁ దల పెట్టె ననుటకు సమాధానము . ౧౯౧
పరిణామవాదము - వివర్తవాదము వీని విచారము ... ౧౯౨

—* ౩౦ వ సర్గము —

శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రయాగసంరక్షణం బొనర్చుట ౨౦౦
శ్రీరాముఁడు మారీచునిఁ బాఱదోలి సుబాహుని వధించుట ౨౦౩

—* ౩౧ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను మిథిలానగరమునకుఁ దోడ్కొనిపోవుట . ౨౦౭

—* ౩౨ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు తనవంశకథ శ్రీరామునకుఁ జెప్పుట ... ౨౧౨
కుశనాభు పుత్రికల వృత్తాంతము ... ౨౧౭
ముఖ - హస్త - మనోదగ్ధులగు బ్రాహ్మణుల కీరీతియందు శాపశక్తి లేదనుట ౨౧౯

—* ౩౩ వ సర్గము *—

కుశనాభసుతలు తమ్ముఁ బవమానిఁ డవమానించుటఁ దండ్రికిఁ దెల్పుట		౨౨౧
బ్రహ్మదత్తు చరిత్రము		౨౨౫
తపోవిశేషమున సర్వసమృద్ధ్యాదులచేఁ బూర్వులు సంతానము గని రనుట	...	౨౨౬

—* ౩౪ వ సర్గము *— ౨౨౭

ఎంతటి మహాత్ములయినను భగవత్సేవ యథాశక్తి చేయుట కర్తవ్యమని		౨౩౦
రాత్రివర్ణనము	...	౨౩౧

—* ౩౫ వ సర్గము *—

శ్రీరాములు గంగానదీవృత్తాంతము విశ్వామిత్రు నడుగుట	...	౨౩౬

—* ౩౬ వ సర్గము *—

గంగ త్రిపథగ యైనవృత్తాంతము శ్రీరామునకు విశ్వామిత్రుఁడు దెల్పుట	...	౨౩౯
పార్వతీదేవి దేవతల శపించుట	...	౨౪౫

—* ౩౭ వ సర్గము *—

కుమారస్వామి జననచరిత్రము	...	౨౪౬
శ్రీకుమారస్వామి జననము	...	౨౫౧

—* ౩౮ వ సర్గము *—

సగరచక్రవర్తి వృత్తాంతప్రారంభము	...	౨౫౩
సగరుఁడు జ్యేష్ఠపుత్రుఁడగు నసమంజుని వెళ్లఁ బడలెనని ధర్మసందేహము	...	౨౫౨
సిద్ధాంతము	...	౨౫౭
రాజునకు ముఖ్యధర్మ మేది? ప్రజాపాలన మనుట	...	౨౫౯
A Page from Indo-Egyptian History (By B Das, M. L A)	.	"
Aryan Conquest of Egypt	...	౨౬౦

Indo-Egyptian Relations . . . ౭౬౧
Aryan Civilisation older than Egyptian . . . ౭౬౨

— ౩౯ వ సర్గము —

సగరుఁ డశ్వమేధము సేయ నింద్రుఁడు యజ్ఞాశ్వ మపహరించుట . . . ౭౬౩
ఆర్యావర్తమధ్యదేశ పరిణామము . . . ,,
సగరకుమారు లశ్వము నిమిత్తము భూమిని త్రవ్వుట . . . ౭౬౪
దేవతలు బ్రహ్మతో సగరకుమారులవలని బాధను విన్నవించుట . . . ౭౬౭

— ౪౦ వ సర్గము —

బ్రహ్మకల్ప వివరణము . . . ౭౬౯
సగరకుమారులు కపిలుని కోపాగ్నిచే భస్మీభూతులగుట . . . ౭౭౧

—* ౪౧ వ సర్గము *—

అంశుమంతుఁడు యజ్ఞాశ్వమును వెదకఁబోవుట . . . ౭౭౪
పితృవ్యులకై యేగుచు నంశుమంతుని గరుడుం డూరార్చుట . . . ౭౭౬
చండాలాదులచే దుష్టమగు గంగను పాపులకు గంగోదకముచేఁ దర్పణములు, కర్మములు చేయవలెను . . . ౭౭౯

—* ౪౨ వ సర్గము *—

భగీరథుఁడు గంగకై తపంబుచేయుట . . . ౭౮౧

— ౪౩ వ సర్గము —

గంగ రుద్రజటాజూటంబునఁ దిరుగుచుపడుట . . . ౭౮౪
గంగ పవిత్రత్వమునకు కారణము . . . ౭౮౮

—* ౪౪ వ సర్గము *—

భాగీరథి ఆకాశగంగయే. ఆకాశమునుండియే భూమికి వచ్చెను. అట్లుండ సుర లాకాశమందే మునుఁగక భూస్పర్శమైనపిమ్మట నేల యట్లుచేసి రని సందేహము — సమాధానము . . . ౭౯౦
జహ్నుఁడు గంగాజలముల నెల్ల ద్రావుట . . . ,,
జహ్నువంశ వివరణము . . . ౭౯౧
భగీరథునకు బ్రహ్మ ప్రత్యక్షమగుట . . . ౭౯౨

గంగను గుఱించి యోగవిషయము ... ౨౯౩

గంగకు దక్షిణ నదులవలె రజస్స్వలాదోషము లేదనియు నెప్పుడైనను నందు స్నానము చేయవచ్చుననియు ౨౯౪

గంగా మాహాత్మ్యకథనము ౨౯౬

—* ౪౫ వ సర్గము *—

శ్రీరాములు విశ్వామిత్రుని విశాలానగరవృత్తాంత ముడుగుట ౨౯౮

శివుడు హాలాహలము మ్రింగుట ... ౩౦౦

క్షీరసముద్రమున ధన్వంతరి లోనగువా రుదయించుట . ౩౦౧

ఇంద్రునకునైన దుర్వాస శాపవృత్తాంతము - సముద్రమథనమును గుఱించిన యోగరహస్యవివరణము ... ౩౦౪

—* ౪౬ వ సర్గము *—

దితి యింద్రుని జంపుకొడుకునకై వ్రత మనుష్ఠించుట ౩౦౫

దితి నిద్రావిషయకచర్చ ... ౩౦౭

—* ౪౭ వ సర్గము *—

సప్తమరుత్తుల యుత్పత్తి . ౩౧౦

సప్తవాయువివరణము ... ౩౧౧

శ్రీరాములకు విశ్వామిత్రుడు విశాలాదేశవృత్తాంతముఁ దెల్పుట ౩౧౨

సుమతీరాజకథనము . ౩౧౩

—* ౪౮ వ సర్గము *—

సుమతి విశ్వామిత్రుల సంభాషణము .. ౩౧౪

గౌతమాశ్రమ వృత్తాంతప్రారంభము . . ౩౧౭

గౌతమశబ్దార్థము ... ,,

గౌతముఁడహల్యను, నింద్రుని శపించుట . . ౩౧౯

అహల్య శిలగా నయ్యెననుట వాల్మీకిమతముగా దని .. ౩౨౦

జారత్వదోషమునకుఁ బ్రాయశ్చిత్తము ... ౩౨౧

—* ౪౯ వ సర్గము *—

గౌతముని తపస్సు చెఱుచుట యెట్లు దేవకార్యమగు నని ప్రశ్నము .. ౧౨౫

అహల్యాశాపమోక్షణము ... ౧౨౭

ఇంద్రుఁడహల్యాజారుఁ డను విషయమున Maxmuller's History of Sanskrit Literature 530 P . ౧౨౮

—* ౫౦ వ సర్గము *—

శ్రీరామాదులు మిథిలకుఁ బోవుట .. ౧౨౯

—* ౫౧ వ సర్గము *—

రేణుకావృత్తాంతము .. ౧౩౨

శ్రీరాములకు శతానందుఁడు విశ్వామిత్రు పూర్వ వృత్తాంతముఁ దెల్పుట .. ౧౩౪

పట్టణశబ్ద సాధుత్వవిచారము . ౧౩౫

—* ౫౨ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు వసిష్ఠు నాశ్రమంబునకుఁ బోవుట ౧౩౬

వసిష్ఠుఁడు విశ్వామిత్రునకు విందుసేయుట ... ౧౩౮

—* ౫౩ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు తనకుఁ గామధేనువు నిమ్మని వసిష్ఠు నడుగుట ౧౪౦

—* ౫౪ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు కామధేనువును బలాత్కరించి పట్టుకొని పోవుట ౧౪౩

కామధేను కల్పితసైన్యముచే విశ్వామిత్రు సేన నాశన మగుట .. ౧౪౫

—* ౫౫ వ సర్గము *—

వసిష్ఠ విశ్వామిత్రుల యుద్ధము ... ౧౪౯

—* ౫౬ వ సర్గము *—

వసిష్ఠవిజయము గాయత్రీవిజయమే ... ౧౫౪

వసిష్ఠ విశ్వామిత్రులయుద్ధము ఆత్మఅనాత్మల యుద్ధమనుట ... ౧౫౪

—* ౫౭ వ సర్గము *—

త్రిశంకూపాఖ్యానము ౧౫౭

—* ౫౮ వ సర్గము *—

త్రిశంకుఁడను పేరువచ్చుటకు కారణము ౧౬౧
దైవపౌరుషబలవిచారము ౧౬౩

—* ౫౯ వ సర్గము *—

బ్రాహ్మణునకయాజ్యయాజనమకర్తవ్యమనుట ... ౧౬౬

—* ౬౦ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు త్రిశంకుని స్వర్గమునకనుచుట ... ౧౬౯

—* ౬౧ వ సర్గము *—

శునశ్శేపోపాఖ్యానము ... ౧౭౪
మగబిడ్డల నమ్మరాదను న్యాయమెఱింగిన ఋచీకుఁడు శునశ్శేపు నెట్లమ్మెనని దానికి సమాధానము ... ౧౭౬

—* ౬౨ వ సర్గము *—

శునశ్శేపుఁడు విశ్వామిత్రుని శరణుజొచ్చుట .. ౧౭౭
శరణాగతరక్షణవ్రత విశేష వివరణము .. ౧౭౯
తల్లిదండ్రుల ధిక్కరించుట మహాదోషము అనుట ... ౧౮౦

—* ౬౩ వ సర్గము *— ౧౮౨

విశ్వామిత్రుఁడు మేనకను మోహించుట .. ౧౮౩
పండితులు స్త్రీలవిషయమునఁ బ్రమాదపడరాదనుట ... ౧౮౪
కండుని చరిత్రము ... ౧౮౬
'లోపడు' శబ్దవిచారము ... ౧౮౭
విశ్వామిత్రుఁడు మహర్షి యగుట ... ౧౮౯

—* ౬౪ వ సర్గము *—

రంభ విశ్వామిత్రుని తపంబుఁ జెఱుపఁబోవుట ... ౧౯౧
విశ్వామిత్రుఁడు రంభను శిలగా శపించుట ... ౧౯౩

జితేంద్రియుఁడగుట - యోగమార్గముకంటె భక్తిమార్గమే శ్రేష్ఠమనుట ... ౮౯౩
తపస్సిద్ధికి జితేంద్రియత్వ మావశ్యకమనుట . ౮౯౪

—* ౬౭వ సర్గము *—

విశ్వామిత్రుఁడు ఘోరతపంబు సేయుట ... ౮౯౪
బ్రహ్మ విశ్వామిత్రునకు బ్రహ్మర్షిత్వ మిచ్చుట ... ౮౯౭
శిష్యుఁడు గురుపరంపర గురుమాహాత్మ్యము తెలిసికొనవలయు ననుట ... ౮౯౯
బ్రహ్మవిదున కపచారముచేసిన సర్వకార్యములు విఘ్నములగును, కఠినప్రాయశ్చిత్తముచే గాని యాదోషము పోదనుట ... ,,

—* ౬౬ వ సర్గము *—

విశ్వామిత్రుఁడు జనకునితో రామలక్ష్మణులకు శివువింటిం జూపు మనుట . . ౯౦౧

—* ౬౭ వ సర్గము *—

జనకుఁడు రామలక్ష్మణులకు శివువింటిని జూపుట ౯౦౩
శ్రీరాముడు హరువిల్లు విరుచుట ,,
జనకుఁడు దశరథునొద్దకు దూతలఁ బంపుట ౯౦౮

—* ౬౯ వ సర్గము *—

జనకుండు దశరథుతోఁ గుశల ప్రశ్న సేయుట ... ౯౧౪

—* ౭౦ వ సర్గము *—

వసిష్ఠుఁడు జనకునితో సూర్యవంశ క్రమంబుఁ దెలుపుట ... ౯౧౮

—* ౭౧ వ సర్గము *—

జనకుఁడు వసిష్ఠునకు నిజవంశ క్రమముఁ జెప్పుట ... ౯౨౪

—* ౭౨ వ సర్గము *—

గోదానవివరణము ... ౯౨౬

—* ౭౩ వ సర్గము *—

యుధాజిత్తు దశరథుఁ జూడవచ్చుట ... ౯౩౨

సీతాకల్యాణఘట్టము ... ౯౩౫

శ్రీసీతావివాహవిషయ చర్చ ... ౯౪౭

—* ౭౪ వ సర్గము *—

దశరథునకు మార్గంబున నవశకునము లగుట ... ౯౫౮

పరశురాముఁడు శ్రీరాములఁ జూడవచ్చుట ... ౯౬౦

—* ౭౫ వ సర్గము *—

దశరథుఁడు పరశురాముని శమింపఁ బ్రార్థించుట .. ౯౬౧

శైవవైష్ణవ ధనస్సుల వృత్తాంతము ... ౯౬౩

—* ౭౬ వ సర్గము *—

శ్రీరాముఁడు పరశురాముని ధిక్కరించి నిస్తేజుం జేయుట .. ౯౭౩

పరశురాముఁడు తనపుణ్యలోకంబుపై నస్త్రమేయఁ బ్రార్థించుట .. ౯౭౭

—* ౭౭ వ సర్గము *—

పరశురాముఁడు పోయినవార్తఁ దెలిపి శ్రీరాముఁడు తండ్రినిఁ బ్రయాణము సేయఁ గోరుట ... ౯౮౦

దశరథాదు లయోధ్యాపురిఁ బ్రవేశించుట ... ౯౮౧

శ్రీసీతారాములు స్వపురంబున సుఖంబు లనుభవించుట ... ౯౮౩

బాలకాండము ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ.

శ్రీ రామచంద్రాయ నమః.

శ్రీమతే రామానుజాయ నమః.

శ్రీ హయగ్రీవప్రసన్న.

శ్రీ శారదాయై నమః.

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణక్షీరార్ణవ

మందరము.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం, శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయే, త్సర్వవిఘ్నోపశాంతయే ॥
యస్య ద్విరదవక్త్రాద్యాః, పారిషద్యాః పరశ్శతమ్,
విఘ్నం నిఘ్నంతి సతతం, విష్వక్సేనం త మాశ్రయే.
కూజంతం రామరామేతి, మధురం మధురాక్షరమ్,
ఆరుహ్య కవితాశాఖాం, వందే వాల్మీకికోకిలమ్.
వాల్మీకే ర్మునిసింహస్య, కవితావనచారిణః,
శృణ్వ న్రామకథానాదం, కో న యాతి పరాం గతిమ్.
యః పిబ న్సతతం రామ, చరితామృతసాగరమ్,
అతృప్త స్తం మునిం వందే, ప్రాచేతస మకల్మషమ్.
గోష్పదీకృతవారాశిం, మశకీకృతరాక్షసమ్,
రామాయణమహామాలా, రత్నం వందే ఽనిలాత్మజమ్.
అంజనానందనం వీరం, జనకీశోకనాశనమ్,
కపీశ మక్షహంతారం, వందే లంకాభయంకరమ్.

శ్లో॥ మనోజవం మారుతతుల్యవేగం, జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్,
వాతాత్మజం వానరయూథముఖ్యం, శ్రీరామదూతం శిరసా నమామి.
ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలం, య శ్శోకవహ్నిం జనకాత్మజాయాః,
ఆదాయ తే నైవ దదాహ లంకాం, నమామి తం ప్రాంజలి రాంజనేయం.
ఆంజనేయ మతిపాటలాననం, కాంచనాద్రికమనీయవిగ్రహమ్.
పారిజాతతరుమూలవాసినం, భావయామి పవమాననందనమ్,
యత్ర యత్ర రఘునాథకీర్తనమ్, తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్,
బాష్పవారిపరిపూర్ణలోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్.
వేదవేద్యే పరే పుంసి, జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్సాక్షా ద్రామాయణాత్మనా.

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం,
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపం,
ఆజానుబాహు మరవిందదళాయతాక్షం,
రామం నిశాచరవినాశకరం నమామి.
వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామంటపే,
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్,
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం,
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్॥
రామాయ రామభద్రాయ, రామచంద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ, సీతాయాః పతయే నమః॥
నమ స్తే పరమకల్యాణ, నమ స్తే విశ్వమంగళ,
నమ స్తే వాసుదేవాయ, రఘూణాం పతయే నమః॥

శ్రీమ దాంజనేయపటలము.

శ్లో॥ శ్రీరాఘవాంఘ్రిసరసీరుహభృంగరాజం,
సీతామనఃప్రియవచోనిచయూరుమోదమ్,
కారుణ్యపూర్ణహృదయం ముదితాంతరంగం,
భక్తాళిరక్షణగుణం హనుమంత మీడే.
యోఽహస్కరస్య సవిధే వివిధార్థపేటీ,
మామ్నాయకోటి మతిశాతమనోవిలాసాత్,
శిష్యాత్మనైవ గతవాన్ శ్రితబోధనార్థం,
తం బ్రహ్మచారిణ మహం హనుమంత మీడే.

శ్లో॥ యో రామకార్యకరణే సకలప్రచారీ, తద్రామకీర్తనపటిష్ఠవచోభిరామః,
తత్తత్త్వజల్పనపర స్తదతిప్రపన్నః, తం భక్తబోధనఘనం హనుమంత మీడే.

శ్లో॥ ప్రాణావశిష్టరఘునాథసహోదరస్య,
ప్రాణప్రయోజనపితామహ మాపథేభ్యః,
బ్రహ్మేంద్రరుద్రపరమాద్భుతకార్యచర్యం,
భక్తౌఘబోధనఘనం హనుమంత మీడే.

శ్లో॥ య స్తత్త్వవేత్తా రఘునందనస్య, య స్తత్త్వబోద్ధా రఘునందనస్య,
య స్తత్త్వయోక్తా రఘునందనస్య, తం దేవదేవం హనుమంత మీడే.

శ్లో॥ యో భూ ద్రసాయనమహాగమపారదృశ్వా,
యో భూ దనంతగుణగానకళాప్రపూర్ణః,

యో భూ సిఖండఫలతారకతత్త్వవేదీ,
తం దేవదేవ మనఘం హనుమంత మీడే.

శ్లో॥ నవవ్యాకరణాన్యాన, స్రష్టాధారో జితేంద్రియః,
లంకాలంకారిలుంటాకో, హనుమాన్ పాతు మాం సదా.

శ్లో॥ శ్రీరామాయణమూలమంత్ర మఖిలం యో వేత్తి బోద్ధుం జపన్,
శ్రీరామాయణధర్మతంత్ర మఖిలం యో వేత్తి వక్తుం పఠన్,
శ్రీరామాయణగృహ్యసూత్ర మఖిలం యో వేత్తి కర్తుం వసన్,
తం దేవం హనుమంత మంచితధియం ధ్యాయామి శుద్ధాత్మనే.

శ్లో॥ రత్నశ్శిఖరిపాకారం, సామీరిం శాంతమానసమ్,
రామానుగ్రహముద్రాంకం, భజేహం బ్రహ్మచారిణమ్.

శ్లో॥ స్వామిన్ తవ కృపాకాస్తు, కృపాకాస్తు రేవ ప్రభో,
మయీతి కాంక్షమాణో నిత్యం, భగవన్ త్వాం సదా భజే.

శ్లో॥ న యాచే సంతతిం లక్ష్మీం, న యాచే ప్రాథనం బలమ్,
యాచే తవ దయాం శ్రీమన్, చిత్తశుద్ధిప్రసాదినీమ్.

శ్లో॥ జ్ఞానాజ్ఞానకృతాన్ దోషాన్, సంహర్తుం శక్తిరస్తి తే,
భవ్యమార్గగతిం దాతుం, భగవన్ శక్తిరస్తి తే.

శ్లో॥ ఆంజనేయపటలం మహాత్మభి, ర్భావితం బహుఫలప్రదాయకమ్,
రామచంద్రకరుణారసాశ్రయం, యః పఠేత్ స భవతి స్వయం సుధీః.

శ్రీ రామరక్షా మంత్రము.

శ్లో॥ శిరో మే రాఘవః పాతు, ఫాలం దశరథాత్మజః
కౌసల్యేయో దృశౌ పాతు, విశ్వామిత్రః ప్రియః శ్రుతే. ౧

ఘ్రాణం పాతు మఖత్రాతా, ముఖం సౌమిత్రివత్సలః,
జిహ్వాం విద్యానిధిః పాతు, కంఠం భరతవందితః. ౨

స్కంధౌ దివ్యాయుధః పాతు, భుజౌ భగ్నేశకార్ముకః
కరౌ సీతాపతిః పాతు, హృదయం జామదగ్న్యజిత్. ౩

మధ్యం పాతు ఖరధ్వంసీ, నాభిం జాంబవదాశ్రయః,
సుగ్రీవేశః కటిం పాతు, సక్థినీ హనుమత్ప్రభుః. ౪

జానునీ సేతుకృత్పాతు, జంఘే దశముఖాంతకః,
పాదౌ విభీషణశ్రీదః, పాతు రామోఽఖిలం వపుః. ౫

ఈమంత్రములకు వ్యాఖ్యానముగ మంత్రరామాయణ మనుపేర లక్ష్మణార్యులను మహానుభావుఁడు ఋగ్వేదములోనుండి ౧౫౭ ఋక్కులను గ్రహించి యవి

రామాయణకల్పవృక్షమున కంకురము లని విశదీకరించెను. కృత్యాదియం దాయన చేసినస్తోత్రమువలన నీమంత్రతత్త్వతత్త్వము తెలియఁగలదు.

శ్లో॥ రామాయణద్రుమం నౌమి, రామరక్షానవాంకురమ్,
గాయత్రీబీజ మామ్నాయమూలం మోక్షమహాఫలమ్.

దీనిని వివరించు భాగ్యము వ్యాఖ్యాతకుఁగలదేని గాయత్రికి వేదమునకు రామాయణమునకుఁగల సంబంధము సాక్షాద్వేదమును రామాయణరూపమున వాల్మీకి వచించె నను నగస్త్యసంహితోక్తికిఁ గారణము స్పష్టపడును.

---

*



శ్రీః.

శ్రీ సీతాలక్ష్మణహనుమత్సమేత శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

శ్రీ హయగ్రీవప్రసన్న.

శ్రీ శారదాయై నమః.

శ్రీమతే రామానుజాయ నమః.

శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణము.

బాలకాండము.

ఇష్టదేవతాస్తుతిః.

శ్లో॥ జ్ఞానానందమయం దేవం, నిర్మలస్ఫటికాకృతిమ్
ఆధారం సర్వవిద్యానాం, హయగ్రీవ ముపాస్మహే.

మహిజాధిపుండు, జడచేతనజీవవిధాత, సద్గిరీ
యోమరభూరుహంబు, సముదారవిదారణశీలి, భక్తవా
రామృతదాత, సంభృతశరాసకరాంబుజుఁ, డొంటిమిట్ట శ్రీ
రాముఁ డమాయవర్తనుఁడు రక్తి గ్రహించుత మన్నమస్కృతుల్. ౧

మందరము

కం॥ నారదవాల్మీకికమలజ, భారతులకు మ్రొక్కి రామభద్రకథాకూ
పారంబును మథియించెద, శ్రీరామకృపామృతంబుఁ జేకొన విబుధుల్.

కం॥ మునుపటి వ్యాఖ్యాతలకున్, వనజభవునిసతికి మాని వాల్మీకునకున్
జనకజకున్ రామునకున్, హనుమంతుని కెరఁగి భక్తి వ్యాఖ్యానింతున్.

సీ॥ ఇరువదిరెండవ•యేఁట మా పినతండ్రి, రామాయణం బను•గ్రహముచేసె
నావెంటనే వచ్చి • నావీటికిని దానె, కంపసముద్రని•కాయి వృద్ధు
చేట్లూరి శ్రీనార•సింహసద్గురుఁడు శ్రీ, వైష్ణవమణి సాధు•వర్తనుండు
నిష్కామచిత్తుండు • నిర్మలచరితుండు, నాకుజాతునకును • నారదుండు
పోలె శ్రీరామమంత్రంబుఁ•బూనిపలికె, మఱియు నాద్యాదిలక్ష్మిస•మంత్రయంత్ర
తంత్రముగ నుపదేశించె • దయచెలంగ, నట్టిగురుల కొనర్తు సా•ష్టాంగనతులు.

గీ॥ బాలకుఁడ రిక్తహస్తుఁడఁ • బదియు మీఁద, నైదురూప్యంబులను నేను•నాదుతల్లి
తోడ దేహము పోషించు•వాఁడ నగుట, సాహ్యమొకలవమేనియుఁ•జలుపలేదు
ఎట్టిశిష్యుఁడ ఛీ, ఛి, నా•దేమి బ్రదుకు, సాధువర్తనుఁ డగునట్టి • సద్గురునకు
నర్హమగు కార్యమాపుణ్యుఁ • డాచరించె, క్షుద్రచారిత్రుఁడైన శి•ష్యునకుఁ దగిన
గతిని నడపించె నను రమా•కాంతుఁ డకట, జనకులకుఁ బరిచర్య నా•చార్యసేవ
సలుపనట్టి మహాఘంబు • దలఁగిపోవ, జానకీరామ సేవను • జలుపువాఁడ
వారె జననియు జనకుండు • వారె గురులు.

కం॥ గురువులకు గురుఁడు తానై, పరమగురుండైన రామ•భద్రగురున్ శ్రీ
ధరణీతనయాయుక్తునిఁ, గరములు జోడించి వ్రాలి • కావింతు నతుల్.

సీ॥ అఱువదిపైఁ దొమ్మి • దరుగఁగ నేడులు, సాహసించితిని న•సాధ్యకృతికి
నెట్లగునో యని • యేలసందేహింప, సర్వమునకు రామ•చంద్రవిభుఁడె
కలఁ డారమేశుసం•కల్పంబె కొనసాగు, నఱువదిగడియ లం•హర్నిశమ్ము
జానకీశ్వరపద•సారసంబుల నిల్పు, స్వాంతంబు లభియించె • సాధనంబు
చెలియ యున్నది సీతమ్మ • సేవసేయ, సుజనవినతుండు యామ•ర్తి•సుబ్బ సుకవి
మందరధురంధరక్రియ • మాధవునకు,వైనతేయునివిధమున•బానటయ్యె.

కం॥ నాకును సధర్ములగు నా, లోకులకున్ ముదముఁగూర్ప • లోలాత్ముఁడనై
యీ కార్యంబును బూనితి, చేకొనఁడీ బుధులు కినుక•సేయక కరుణన్.

కం॥ శ్రుతికి విరుద్ధముఁ బలికెడి, స్మృతులు ప్రమాణములుగాని•రీతిని వల్మీ
కతనయుకృతికి విరుద్ధపుఁ, గృతులు ప్రమాణములుగా గ్రహిం•పఁగ నేరన్.

కం॥ కనుఁగొని పంచాంగంబులఁ, జనునే సవరింపఁ జుక్క•చాలును దివి, నా
ధునికకృతుల్ గని యాదిమ, ఘనకృతి కర్థంబుఁ బలుకఁ • గార్యంబగునే?

కం॥ కుప్పించి యెగసి క్రోఁతులు, తెప్పున సంద్రంబు దాఁటెఁ • దెగి మందర మే
త్రిప్పులఁ బడి మథియించుటఁ, దప్పక తద్గాధ మెఱిఁగె • దైవము కరుణన్.

కం॥ మునుపటి వ్యాఖ్యానంబులు, గనుఁగొని తత్త్వజ్ఞజనుల • కరుణం గని భూ
తనయాపతి ప్రేరించిన, యనువున వచియింతు నతఁడె • యాచార్యుఁడుగన్.

గీ॥ పూర్వకృతులను బరియించి • బుద్ధి తెలిసి, స్వప్రతిష్ఠకు లేదని • వదరునట్టి
వానికంటెఁ గృతఘ్నుండు•వానికంటె, మాయలాఁడును గలుగునే జ్ఞాతలమున?

కం॥ అమృతత్వ మభిలషించిన, సుమనస్సులు దీనిఁ గనుఁడు • శుద్ధమతిఁ దుః
ఖములన్ మునుఁగంగోరిన, విమనస్కులు పొందు దవ్వ • వీని కిద్దానిన్.

గీ॥ తప్పు లెన్నఁగనైనను • దెప్పనైన, దీనికీర్తినిఁ జెఱుపంగఁ • బూనిమైనఁ
జదివి లేదని కల్లాడు • జనునకైన, నంజలి ఘటింతు నిదె యసూ•యాల్కునకు.

కం॥ భాషాజ్ఞానముకొఱయగు, యోషారత్నము లు పూరు•షోత్తరములు సం
తోషింప విశదఫణితి న, శేషము నెఱిఁగింతు భక్తి•స్థిరపడెడుక్రియన్.

గీ॥ నాకుజాతునికృతిఁ బ్రొద్దు•పోకచదువు, తెంగాంధ్రకు ఫలమేమి•గూరఁగలదు?
భక్తియుక్తిని ముక్తికై•పరనమొనరఁ, జేసెడి ప్రపన్నులకు నిది • సిద్ధసుధయ.

కం॥ శ్రుతి పాంచరాత్ర మీకృతి, స్వతఃప్రమాణమ్ము లనుచు • శాస్త్రము లనుటన్
మతి శ్రద్ధఁబూని చదువుఁడు, మతిభక్తికొలంది ఫలము • మానవులారా!

కం॥ కావున భక్తిప్రపత్తుల, తావలమై యుంట దీనిఁ • దచ్ఛ్రద్ధతికే
నే వివరించెదఁ దచ్ఛ్ర, ద్ధావంతుల యుభయలోక•సౌఖ్యముపొందన్.

గీ॥ భక్తియుతులారా! నాయాడు•సూక్తి వినుఁడు, ఖలులునీనిసిదూషింఁ•గలతనలదు
కాళ్లగీఱు మ పికసంబుఁ • గందిగింజ, కానినుచుఁ గోడి త్రోచిన • ఘనతచెడునె?

గీ॥ అజ్ఞులశ్రద్ధధానులు • నైనవారు, సంశయాత్ములు చెపట నిఃస్సంశయంబ
కానఁ బూర్వులు మూఢులన్•గర్వముడిగి, ప్రాజ్ఞమానవులు చదువుఁడీ•రామచరిత.

కం॥ మందరనగంబు మోయుచు, బృందారకులకును నమృతె • మిడు దేవుం డీ
మందరభారము మోయుచు, నందిచ్చును నమృతమున్ బుధావళికెల్లన్.

కం॥ కలశాబ్ధి మందరముచేఁ, జిలుకుం డమృతమ్ము మీకుఁ • జేకుఱు నని తా
నెలవిచ్చి సిద్ధఁగూర్చెఁ, జలజాక్షుఁడు దీని నిట్లు • సాహ్యాం బగుతన్.

కం॥ మును కృతిఁ బలికించిన భూ, తనయాపతి నేఁడు లేఁడె • తత్తఱ మేలా
యని దీనికిఁ దత్ప్రేరణ, మునుఁబూనితిఁగాని గర్వ•మునఁ గాదు సుఁడీ.

శా॥ శ్రీరామాయణమంత్రశాస్త్రమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణధర్మతంత్రమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణగృహ్యసూత్రమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణముక్తిశాస్త్రమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్.

శా॥ శ్రీరామాయణకావ్యరత్నమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణసత్పురాణమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణయోగశాస్త్రమునకున్ • శ్రేష్ఠంబు లే దేదియున్
శ్రీరామాయణమే నిధానముసుఁడీ • శ్రేయోర్థులౌ వారికిన్.

గీ॥ ధర్మ మర్థంబు కామంబు • శర్మదంబు,నైన మోక్షంబు నను పురు•షార్థములను
ఇందుఁ జెప్పఁగఁబడినదే • యెందుఁ గలదు, ఇందులేనిది వెదకిన • నెందులేదు.

గీ॥ కావ్యతతులందు శ్రీరాము•కథయ మేలు, ముక్తిమార్గంబులందునుఁ•భక్తిమేలు
భక్తిమార్గంబునన రామ•భద్రుకథకు, వ్యాఖ్యరచియింతు సత్యవే•దాంతసరణి.

గీ॥ రాముచరితంబు లక్ష్యంబు • రాముఁ డజు, గీత లక్షణసూత్రంబు • ధాత్రి నాచ
రణము చూపునఁ జూపించె•రాముఁ డగ్ని,యనియె బోధించెఁ గృష్ణుఁ డై•యర్జునునకు.

గీ॥ చెప్పె నేధర్మచరితఁ బ్ర•చేతసుండు, సంగ్రహమ్ముగఁ గావ్యల•క్షణము చెడక
దానినే వివరించె వ్యా•ఖ్యానముగను, భారతామ్నాయ మను పేర•వ్యాసమౌని.

కం॥ ఏవంవిధమహిమము సీ,తావిభుచరితంబు దాని•తత్త్వముఁ దెలియం
గా విభుఁడెవ్వఁ డభవుఁడో, యా వల్మీకభవుఁడో భవుఁడో•హనుమయొ తక్కన్.

కం॥ పెద్దలుచూపిన త్రోవన, నద్దియ యావిష్కరింతు • నాంధ్రమునందున్
దిద్దుఁడు తప్పులుగలిగిన, బుద్ధి యొకరిసొమ్ముగామి • బుధు లెఱుఁగరొకో.

కం॥ ఎవ్వఁడు శక్తుఁడు ధరపై, నవ్వల్మీకజునికృతికి • వ్యాఖ్య రచింపన్
అవ్వాల్మీకియొ శివుఁడో, యన్వనజభవుండొ యొండె • నాతనిసతియో.

కం॥ రామాయణార్థ మెఱిఁగిన, యా మానవుఁ డిలను గలుగఁ • డార్యులలోనన్
రామాయణార్థ మెఱుఁగని, యా మానవుఁ డిలను గలుగఁ • డార్యులలోనన్.

గీ॥ అమరభాషను గలవు వ్యా•ఖ్యానవితతు, లల్ల వాల్మీకికృతము రా•మాయణమున
కాంధ్రమున లేని నెనయురా•మాయణమ్ము, నాంధ్రమున వ్యాఖ్యయుంటయు•న్హాంబ[కాదె.

కం॥ కావున మిత్రులుఁ గౌస,ల్యానరతనయుండు వెలిని • నంతస్సీమన్
వావిరి పెరరేఁపఁగ నీఁ,డీవిధముగఁ బూనుకొనియె • నీకృతిఁ బలుకన్.

కం॥ అవనిజపతి గలఁ డనియెడు, పావరొక్కటిదక్కఁ గండ•పావరేన్ జదువుం
బావరేనియు ధనముంగల, పావరేనియు లేదు కృతిని • బూనుటయందున్.

కం॥ వేడుకకై రాముఁడు తా, నాడుకొనఁ దలఁచి యంటఁ•జుట్టియు నెలమిన్
ద్రాడును విసరున వైచిన, నాడెడి నీ బొంగరం బ•హా యన జనముల్.

కం॥ సూత్రంబును గేలంగొని, సూత్రధరుఁడు లాగు చుండఁ • జూపఱు లలరన్
గాత్రంబును గదలించు న, పాత్రపుఁ దోల్బొమ్మ కేల • పరువుం బొగరున్.

కం॥ చదరంగపుఁబీఠంబున, నొదవిన క్రీడనక మనఁగ • నుంచినచోటన్
గదలకయుండుటె నాపని, చదురడునఁగ నాకుఁ గలదె • స్వాతంత్ర్యంబున్.

కం॥ పలికించువాఁడు నేర్పిన, పలుకులెకడ ప్రోదిచిలుక•పలుకు మనుండున్,
బలికించువాఁడు రాముఁడు, పలికెడి నీరామచిలుక • ప్రాజ్ఞులు మెచ్చన్.

కం॥ తెలియనిదానిం దెలుపఁగఁ, దెలివిడి యొనరింపఁ గొంత•తెలిసినదానిన్
బలికింప సాధుసూక్తులఁ, గలఁడుగదా రామవిభుఁడు • కలఁక యిఁ కేలా?

శా॥ తానై రమ్మని పిల్చి సన్నిటకు మోదం బారఁ గైంకర్యముం
బూనంజేసి తదర్థమై తిరుగుచో • భూముల్ వనల్ భిక్షుకై
తానే తోడయి మున్నుగాఁ జనుచునన్ • ధన్యాత్ముఁ గావింపఁగా,
నానాఁ డుండిన యాసకీవిభుఁడు లేఁడా నేఁడు నాపాలిటన్.

మ॥ శతవారంబులుమీఁద నెన్మిదియునౌ • సాటిల్ పఠింపించుచున్
కృతిస్వీయంబు నిరంతరాయముగ సంప్రీతిన్ జగచ్ఛ్లాఘ్యమౌ
గతి సామ్రాజ్యమహాభిషేకమున దాఁ • గైకొంచు శ్రీరామకీ
క్షితిజాకాంతులు నేఁడు తేరకృపచేన్ • శ్రీసుంగముం జేయఁగన్.

శా॥ తేజం బెల్లొకొ మూర్తిమంతమగుచున్ • దెంచునటు చెంతయుక్
నేఁ జంతింపఁగ సంయమించి యహహా • తేజస్సముద్రంబు నా
పైఁ జిత్రంబుగఁ బొల్పఁ దెచ్చెఁ బరకంపం దానిమధ్యంబునన్
దేజస్స్ఫీతుఁడు బాలుఁడొక్కఁడు గోచరించెన్ • దివ్యాద్భుతశ్రీలతో
నాజన్మంబుఁ దరింపఁజేయ నతఁడే • నాపాల నేఁ డుండెఁడే?

చం॥ పరులు ఘటించినారనుచు • బాలిశబుద్ధిని నీయఁ జేసి యే
నరుఁడు తమోంధుఁడౌచు జనసంఘము లెంచదు స్వశక్తి నెంచ కే
కరణి మహాకృతిం దలుపఁగా నిజ మాతఁడు లోకనింద్యుఁడౌ
కరటము రాజహంసకథ గాదె నిరర్గళ మెట్టివారికిన్.

మ॥ పులినిం గన్గొని యట్ల కాఁడెలఁచి జంబూకంబు తామై వాఁతలన్
కలయం గాల్చుకొనంగఁ జూచునొకొ వ్యాఘ్రంబానతి పెత్తిదాఁ
బొలియుంగా, కిటులే బుధానుకృతికై • పూనఁగ నెంచుండు దాఁ
బొలియున్ శాశ్వతదుర్యశఃకలితుఁడై • భూమీజనుల్ నవ్వఁగన్.

వ॥ అయినను.

కం॥ తెలియుము బాంధవులేమియుఁ, దెలియుము గ్రంథనవులేమి • దీనుఁడననుచున్
దెలిసియు రఘుపతిమహిమను, దలికెదఁ గర్తవ్యమగుట • స్వాధ్యాయంబున్.

వ్యాఖ్యానారంభము.

"ప్రయోజన మనుద్దిశ్య, న మందోపి ప్రవర్తతే" ఒకప్రయోజనము గోరక యేబుద్ధిమాంద్యముగలవాఁడును నొకకార్యమునఁ బ్రవర్తింపఁ డనఁ గవి యను వాఁడు ప్రవర్తించునా? అట్లునఁ గావ్యరచనవలనఁ బ్రయోజన మేమన? "కావ్యం యశసే, ర్థకృతే, వ్యవహారవిదే, శివేతరక్షతయే, సద్యః పరనిర్వృతయే, కాంతాసమ్మితతయోపదేశయుజే" యని కావ్యప్రకాశకారుఁడు వచించెను. కీర్తి కొఱకో ధనమునిమిత్తమో వ్యవహారజ్ఞాన మెఱుంగుటకో యశుభపరిహారమునకో పరలోకసుఖమునకో కావ్యము రచింపవలెను. కవిచే గద్యాత్మకము

గానో, పద్యాత్మకముగానో గద్యపద్యాత్మకముగానో (చంపువు) రచింపఁబడినది కావ్యము. ఇది లోకులకుఁ బ్రియురాలు ప్రియునకువలెఁ దియ్యనిమాటలచే హితముపదేశించునదియై యుండవలయునుగాని, వేదవాక్యులవలె రాజాజ్ఞవలె శాసించునదిగా నుండరాదు. పురాణములవలె మిత్రవాక్యమువలెఁ బథ్యమైనను నప్రియమై యుండరాదు.

ఇట్టి కావ్యములలో జన్మముచేతను, గుణాతిశయముచేతను నాఁటికి నేఁటికి నగ్రస్థాన మలంకరించునది సంస్కృతమున వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణము. ఓయీ! "కావ్యాలాపాంశ్చ వర్జయే" త్తని శ్రుతి నిషేధించుకార్యమునకు బ్రహ్మర్షి వాల్మీకి యెట్లు మార్గదర్శకుఁ డయ్యె ననరాదు. కావ్యాలాపము కూడ దను నిషేధవాక్యము ముద్రారాక్షసాద్యసత్కావ్యవిషయమేకాని లోకహితముకొఱకై యేనే నొకమహాపురుషుని నాయకునిఁగాఁ గొని యుత్తమపురుషార్థముల నుపదేశించుకావ్యములవిషయము గాదు.

శ్రీమద్రామాయణమున నాయిక సాక్షా చ్ఛ్రీదేవి సీత. నాయకుఁడో సాక్షాన్మహావిష్ణువు శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగమున దుష్టశిక్షకు, శిష్టరక్షకు, ధర్మసంస్థాపనమునకై యవతరించి స్వానుష్ఠానరూపమున నిహపరసాధకంబులగు "స్వధర్మంబుల" స్త్రీధర్మము సీతయుఁ బురుషధర్మము శ్రీరామచంద్రమూర్తియు లోకుల కుపదేశించినవారు. వారిచరిత్రమును వాల్మీకి రచింపకుండెనేని తరువాతికాలమువా రావిషయ మెఱుంగక యంధులై దురాచారవర్తనులై యుందురుకదా.

అట్టిమహోపకారము లోకమునకుఁ గావించిన వాల్మీకిమహర్షిని నెవ రెన్నివిధములఁ బొగడినను బర్యాప్తము కాదు.

బ్రహ్మర్షివాల్మీకికృతరామాయణము సంస్కృతభాషయం దుండుటఁజేసి యది నేఁటికి నూటికిఁ దొంబదితొమ్మిదిమందికి దురవగాహమై యున్నది. మహాకవులు కొంద ఱాంధ్రమున స్థూలభావమునఁ గథాంశముమాత్రము గ్రహించి గ్రంథములు రచించిరి. ముఖ్యముగా గ్రహింపవలసిన సూక్ష్మవిషయములను వారు విశదీకరింపరైరి. ఈయాంధ్రగ్రంథకర్త శ్రీరామభక్తకోటిలోఁ జేరి దాసోహంభావము గలవాఁడై పరమభక్తియో ప్రపత్తియో మోక్షోపాయ మని యెంచిన ప్రపన్నుఁ డగుటఁ ద్రికరణశుద్ధిగాఁ దనయిష్టదేవతాగ్రంథమును గైంకర్యరూపమునఁ దద్దేవతాంకితముగా రచించు నెపమునఁ దన్నామస్మరణము మననము సర్వదా లభింపఁజేసికొను నుద్దేశముతో ననన్యుఁడై యీకృతి రచించె నని ౯౭ వ పద్యమువలనఁ దెలియనయ్యెడిని. ఈ గ్రంథకర్త దీర్ఘరోగియు దుర్బలుఁడు నశక్తుఁడు నగుట జీవచ్ఛవముంబోలి యందు శ్వవృత్తిచే జీవించు

చుండినను శ్రీరామానుగ్రహంబునను భక్తకోటులయాశీర్వచనబలమునను బూర్వజన్మసుకృతపరిపాకంబునను నెట్టెట్లో దీనిని రచింపఁగలిగెను.

దీనిని బ్రకటించిన క్రొత్తలో నొకనాఁడు చెన్నపురమున నున్నత న్యాయస్థానసమీపమున బాటవెంటఁ బోవు నీయనను బ్ర. శ్రీ రా. శ్రీ న్యాపతి సుబ్బరావు పంతులుగారు చూచి 'యోయీ! మూలమునకు సరిగా రామాయణమును వ్రాసితివి. మూలమునకువలె నీకృతికి వ్యాఖ్యాన ముండిననే యాంధ్రలోకమునకెక్కువయుపయోగపడును. ఆమూలాగ్రము శోధించిననీవే దానికి సమర్థుఁడవు. దానికై యత్నింపు' మని హిత ముపదేశించిరి. ఆవల నొకనాఁడు బ్ర. శ్రీ. వావిలాల శివావధానులవారు వాల్మీకియుటజమునకు బ్రహ్మదేవునివలె శ్రీరామజయమందిరమునకు వచ్చి యావిషయమునే బోధించిరి. ఇది యిప్పటికి నిరువదిరెండుసంవత్సరములనాఁటివృత్తాంతము. వారు మఱచియుందురుగాని గ్రంథకర్తమాత్రము దాని మఱవఁడయ్యె. గ్రంథకర్తహృదయకేదారమున నాటిన విత్తిన మీనాఁటికి శ్రీరామచంద్రులకృపాకటాక్షంబున ఫలవంతమయ్యె.

ఈ గ్రంథకర్తృప్రపితామహుఁడైన వావిలికొలను రత్నాజీపంతులనువారు రత్నాజీయమను పేర రామాయణమునకు వ్యాఖ్య రచించిరని వినికిడి కలదుగాని యది యీ గ్రంథకర్తకు లభింపదయ్యె. దొరకినవాని సాయమున యథాశక్తి యథామతి రచింప సంకల్పించి సర్వభారము శ్రీసీతారామచంద్రులపై వైచి తాను నిమిత్తమయి కృతికి దొరఁకొని సాంగముగ నెఱవేఱ శిష్టమంగళాశాసనములర్థించుచున్నాఁడు. 'మత్కర్మకృత్ మత్పరమో భవ' యని యుపదేశించిన భగవంతుఁడే యిట్టి యానుకూల్యమును నేఁడీవిధమున నీగ్రంథకర్తకు సంఘటింపఁజేసెను.

బాలకాండము.—శ్రీరామచంద్రమూర్తి బాలుఁడుగా నుండునప్పటిచర్య తెలుపునది కావున దీనికి బాలకాండ మని పేరు. కాండ మనఁగా జలము. శ్రీరామాయణము మహార్ణవముగఁ జెప్పుటచే నందలిజలము కాండ మనఁబడెను. శ్రీరామాయణమందలి యేడుకాండములందును నేఁడువ్యాహృతులయర్థమిమిడింపఁబడినది. బాలకాండమందు 'ఓం భూః' అను వ్యాహృత్యర్థము కలదు. అది గ్రంథపఠనమునఁ దెలియఁగలదు.

శ్లో॥ శ్రీవిష్ణోః ప్రథమే కాండే, జగజ్జననహేతుతా
ద్వితీయే స్థితిహేతుత్వం, తృతీయే మోక్షదాయితా
చతుర్థే గుణసంపత్తిః, పంచమే సర్వహంతృతా
షష్ఠే వేదాంతవేద్యత్వం, సప్తమే స్రష్టృహేతుతా
ఏవం విష్ణుః పరం తత్త్వం, రామాత్మేతి సునిశ్చితమ్.

అన్నట్లు బాలకాండమున శ్రీరామచంద్రమూర్తియగు విష్ణువే జగజ్జననకారణమనియు, రెండవకాండమందు ప్రపంచస్థితి కాయనే హేతు వనియు, మూఁడవకాండమందు శ్రీరామచంద్రమూర్తి మోక్షదాత యనియు, నాలవ కాండమం దాయన గుణసంపత్తియు, నైదవదానియందు సర్వసంహారకర్త యనియు, నాఱవకాండమందు నాయన వేదాంతవేద్యుఁ డనియు, నేడవ కాండమం దాయన బ్రహ్మకు హేతు వనియు నీవిధముగ శ్రీరామచంద్ర మూర్తిగ నవతరించిన విష్ణువే పరతత్త్వమని సునిశ్చిత మని యర్థము.

జననముమొదలిరువదియైదేండ్లవఱకు రాముఁడు జరపినచర్య యీ కాండమునఁ దెలుపఁబడినది. పండ్రెండవయేఁట వివాహమైనది మొదలు పట్టాభిషేకయత్నము జరుగువఱకే విశేషకార్యము జరిగియుండలేదు.

ఇష్టదేవతానమస్కారముతో గ్రంథపీఠిక ప్రారంభింపఁబడుచున్నది.

శ్రీ. . ధవుండు = సంపదనొసంగు భూపుత్రికన్యయైన సీతాదేవికి భర్తయైనవాఁడు. జడ విధాత = ప్రాణములేనివానికిని బ్రాణముగలవానికిని జీవము ఘటించువాఁడు - అనఁగా జీవభూతియైయుండువాఁడు - చేతనాచేతనములైన యన్నిభూతములకు ధారణపోషణములు చేయువాఁ డని యర్థము. అచేతనమువలెనుండిన యహల్యను మనుష్యులలోఁ గలియఁజేసెను.

'మత్తే॥ నిన్నుఁ బాసి ధరాతనూజయు నేక నొక్క ముహూర్తమేని న్నిలంగలవారిషు తమనీటిఁ బాసిన చేఁపల'ట్లని చెప్పిన లక్ష్మణువాక్యములను నయోధ్యాపురజనులవాక్యంబులను నిట ననుసంధించునది.

సద్గరీ. భూరుహంబు = సాధువులందు శ్రేష్ఠులయినవారికిఁ గల్పవృక్షమయినవాఁడు.

సమదా శీలి = మదముతోఁగూడిన శత్రువుల జీల్చుస్వభావముగలవాఁడు.

భక్తవారామృతదాత = భక్తులసమూహమునకు మోక్షమిచ్చుదానగుణము గలవాఁడు.

సంభృతశరాసకరాంబుజుఁడు = భరించిన కోదండముగల కరకమలముగలవాఁడు.

అమాయవర్తనుడు = వంచనలేని నడవడిగలవాఁడు. 'రామో ద్విర్నాభిభాషతే' = రాముఁడు రెండుమాటలవాఁడు కాఁడు. ఒంటిమిట్ట శ్రీరాముఁడు = ఒంటిమిట్ట యని నామాంతరముగల యేకశిలానగరమందు వెలసియుండు శ్రీరామచంద్రమూర్తి, మన్నమస్కృతుల్ = నా సమస్కారములను, రక్తిన్ = ప్రేమతో, గ్రహించుతన్ = అంగీకరించునుగాక.

'మనాక్కా-వ్యార్థసూచన' మ్మను లక్షణమునబట్టి యిందుఁ గొంచెముగ శ్రీ రామాయణకథ సూచింపఁబడినది. శ్రీ మహిజాధవుం డనుటచే సీతాకల్యాణకథయును, జడచేతనజీవవిధాత యనుటచే నహల్యాశాపమోక్షణము, నయోధ్యానగరవాసులలోఁ గువారిక్షేమయు, సద్గరీయోమరభూరుహం బనుటచే ఋషీశ్వరుల కభయప్రదానము, సముద్రాదివిదారణశీలి యనుటచే ఖరవిరాధకబంధరావణకుంభకర్ణాదివధయు, భక్తిసారామృతదాత యనుటచే జటాయుశబరియయోధ్యాపౌరులకు మోక్షమిచ్చుటయు నని రామాయణమందలి యేడు కాండలకథలు సూచితములయ్యెను. ఇది లీలావిభూతియందలి శ్రీరామచర్య.

నిత్యవిభూతియందలి లక్ష్మీనాథపర్యాయముగ నొకయర్థముగలదు. శ్రీరాముఁడు = రామో రామశ్చ 'రామశ్చ' యన్నట్లు రాములు మువ్వురు గలరు. పరశురాముఁడు = ఈయన గండ్రగొడ్డలితో రమించువాఁడు - (క్రీడించువాఁడు) బలరాముఁడు = బలముచేఁ గ్రీడించువాఁడు - కావున నీ రెండవతారము లంశావతారములేకాని పూర్ణావతారములు గావు. శ్రీరామావతారమే పూర్ణావతారము. ఆయన శ్రీయందు రమించువాఁడు లక్ష్మీనాథత్వము భగవంతుఁడగు నారాయణునందుఁ దప్ప నితరు లెవరియందు నన్వయింపదు. కావున శ్రియఃపతియైన నారాయణుఁడే సీతాపతియైన శ్రీరామచంద్రమూర్తి. "రాఘవత్వే భవేత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ" అని విష్ణుపురాణమునఁ జెప్పినట్లు సీతాదేవి సాక్షాల్లక్ష్మియే కదా! శ్రీలక్ష్మియే సీత విష్ణుండవే నీ వని బ్రహ్మాదులు స్తుతించిరి కదా (యుద్ధ-౧౨౦౭ స). ఈ కారణముచేత శ్రీమహిజా యని సీతకు లక్ష్మీత్వము చెప్పఁబడెను. లక్ష్మీదేవియైన సీత యని యర్థము గ్రహింపవలెను

జడచేతనజీవవిధాత యనుచో "మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ." భ. గీ. ౭-౭. ఈ సమస్తమయిన చేతనాచేతన వస్తుసమూహము దారమునందు రత్నములసమూహమువలె నాయందుఁ గూర్పఁబడినది. రత్నములు హారముగానునికికి దారమెట్లు లాధారమో యట్లె ప్రాణముగల ప్రాణములేని సమస్తభూతములయునికికి నేనే యాధారమని యర్థము. ఈయర్థమునే "విష్ణోః స్వరూపాత్పరతోదితే ద్వే రూపే ప్రధానం పురుషశ్చ విప్ర। ప్రకృతిర్యా మయాఖ్యాతా వ్యక్తావ్యక్తస్వరూపిణీ పురుషశ్చాప్యుభావేతౌ లీయతే పరమాత్మని॥ పరమాత్మా చ సర్వేషామాధారం పరమేశ్వరః। విష్ణునామా స వేదేషు వేదాంతేషు చ గీయతే॥ స్మృతి. విష్ణుస్వరూపమునుండి ప్రధాన (ప్రకృతి) మని పురుషుఁడని రెండుకలిగెను. ప్రకృతి వ్యక్తావ్యక్తస్వరూపముగలది. అదియును బురుషుఁడును బరమాత్మయందు లయించును. పరమాత్మయగు పరమేశ్వరుఁడే సమస్తమున కాధారము. ఆపరమేశ్వరుఁడే విష్ణు వని వేదములందు వేదాంతములందు

స్తోత్రముచేయఁబడుచున్నాఁడు. 'యస్యపృథివీ శరీరమ్' ఎవనికి భూమి శరీరమో, 'యస్యాత్మా శరీరమ్' ఎవని కాత్మ శరీరమో 'ఏష సర్వభూతాంతరాత్మా' ఈ యనయే సమస్తభూతములకు నంతరాత్మ, ఇత్యాద్యనేకశ్రుతివాక్యములు భగవంతుఁడు నారాయణుఁడే జడమైనప్రకృతికి చేతనులైన జీవులకు ధారణ పోషణములకు నాధార మని ఘోషించుచున్నవి.

సద్గరీయోమరభూరుహంబు = ఈ విషయంబున శ్రీ భాగవతమందలి యీ పద్యంబుల ననుసంధించునది.

చ॥ చలమున బుద్ధిమంతులగు • సాధులు నా హృదయంబు లీల దొం
గిలికొనిపోవుచుండుదు ర•కిల్బిషభక్తిలతాచయంబులన్
నిలువఁగఁబట్టి కట్టుదురు • నేరుపుతో మదకుంభికైవడిన్
వలలకుఁ జిక్కి భక్తజన•వత్సలతం జరుచుందుఁ దాపసా!

కం॥ సాధులహృదయము నాయది, సాధులహృదయంబు నేను • జగములనెల్లన్
సాధుల నేన యెఱుంగుదు, సాధు లెఱుంగుదురు నాదు•చరితము విప్రా!

సమదారివిదారణశీలి = శిష్టరక్షణమువలె దుష్టశిక్షణము భగవంతుని కార్యమేకదా. దైత్యారిలోనైనవి యీయనకు బిరుదువాచకములేకదా.

భక్తవారామృతదాత = మోక్షసాధనము భక్తియో, ప్రపత్తియో; మోక్షమిచ్చువాడు శ్రీమన్నారాయణుఁడొక్కఁడే. శ్రీరామపరత్వమునం దిది సిద్ధాంతముచేయఁబడెను. శ్రీమన్నారాయణుఁడే శ్రీరామచంద్రమూర్తి.

అమాయవర్తనుఁడు = సంభవా మ్యాత్మమాయయా యన్నట్లు లవతార మందు మాయ గ్రహించును గాని నిత్యవిభూతియందు మాయారహితుఁడై యుండును. ఒంటిమిట్ట శ్రీరాముఁ డమాయవర్తనుఁ డనుటచే నొంటిమిట్ట యందలి యర్చావతారమూర్తికి నిత్యవిభూతియందలి పరమూర్తికి నభేద మని భావము. పరమూర్తి దుర్లభుఁడు. ఈ మూర్తి భక్తులకు సులభుఁడు. భేద మింతియ.

శ్రీరాముఁడు = (1) శ్రీమంతుఁడైన రామచంద్రమూర్తి (2) లక్ష్మీదేవి యందు రమించువాఁడు.

తాత్పర్యము.

శ్రీ సీతాదేవివల్లభుండును, జేతనాచేతనముల కాధారము పోషణకర్తయు నగువాఁడును, సాధువులపాలిటికిఁ గల్పవృక్షమైనవాఁడును, మదించిన శత్రువుల సంహరించుస్వభావముగలవాఁడును, భక్తసమూహమునకు మోక్షమునిచ్చు వాఁడును, హస్తకమలమందుఁ గోదండము ధరించువాఁడును, ఏకశిలానగర మను

నామాంతరముగల యొంటిమిట్టయందు విజయంచేసియుండువాఁడును, వంచన ములేని నడవడిగలవాఁడును, నిత్యవిభూతియందును నవతారదశయందును శ్రీ రామచంద్రమూర్తియైనవాఁడును నగు శ్రీరామచంద్రపరబ్రహ్మము నా నమస్కారములను ప్రేమతో నంగీకరించునుగాక.

విశేషవిషయములు.

ఈపద్యము మొదటిమూఁడు పాదములందలి మొదటియక్షరములు శ్రీం. ఓం. రాం. అని యగును. నాలవపాదంబగు 'రాముఁడమాయవర్తనుఁడు రక్తి గ్రహించుత మన్నమస్కృతుల్'అనుచో, కాదినవ, టాదినవ, పాదిపంచ-యాద్యష్టక మ్మనసాంఖ్యసంజ్ఞలవలన రా=౨ అగును - కావునఁ దొలియక్షరమైన 'రా' తరువాత రెండక్షరములు చదివి 'మాయ'యను రెండక్షరములు గ్రహింపవలయును. ఇప్పటికి రామాయ యని యేర్పడెను - అవల మాయ యనఁగా ౧౫ కావున 'రా' తరువాత ౧౫ అక్షరములు విడిచి రెండక్షరములు గ్రహించిన 'నమః'యనునది యేర్పడును, ఇప్పుడు 'రామాయనమః' అని నాలవపాదంబున నేర్పడియె. మొదటిమూఁడుపాదంబులయందలి మూఁడక్షరములు చేర్చి చదివిన 'శ్రీం. ఓం. రాం. రామాయ నమ' యని బీజాక్షరయుక్తమైన రామషడక్షర మంత్రమేర్పడును.

ఈమంత్రమునే యీగ్రంధకర్త తన ౨౨ వయేఁట కంపసముద్రవాస్తవ్యులైన శ్రీమాఁ చేట్లూరి నరసింహాచార్యదేశికులవలన నుపదేశము నొంది నాఁటినుండి సబీజముగ జపించుచుండువాఁడు. కావున దానినే కృత్యాదియందు మొదటిపద్యమునఁ బొందుపఱిచెను. శ్రీరామమంత్రోపదేశము లేక శ్రీమద్రామాయణము పారాయణము చేయరాదని పూర్వుల నియమము. సంస్కృతరామాయణపఠనాధికారము మంత్రాధికారములేనివారీపద్యార్థము మంత్రార్థము నెఱింగి యీ గ్రంధమును పారాయణము చేయుచున్నారు. ఇది యాంధ్రగ్రంథముకదా పారాయణమున కుపయోగించునా యని సందేహింపఁ బనిలేదు. ఈవిషయంబున నప్పకవీయమందలి యీ పద్యంబులు స్మరింపఁ దగినవి.

కం॥ ఆయాదేశమువారికి, నాయాదేశంబుభాష • నమరినకావ్యం
బాయతపురుషార్థంబులఁ, బాయక సమకూర్చు దేవ•భాషయపోలెఁ.
కం॥ సురభాషార్థము తెలియని, తరుణులకును శూద్రులకును • దమతమసీమం
బరఁగినమాటలఁ జెప్పిన, వరకావ్యము పఠనమున క•వశ్యక మయ్యెఁ.

దాక్షిణాత్యులు వేదాంతార్థములఁ దమభాషయందు వ్రాసికొని దానికి ద్రావిడామ్నాయ మని పేరుపెట్టి పఠించుచు సంస్కృతముకంటె మిన్నగ గౌర

వించుచున్నారుగదా. ఆంధ్రులకు మాతృభాష యాంధ్రము. మాతామహి భాష సంస్కృతము. సంస్కృతము తొలసివలెఁ బూజ్యమేకాని, శిరమునఁ బూలను ధరింతురుగాని తులసిని ధరింపరుగదా. వెంట్రుకలందుఁ దులసి ధరించు బ్రాహ్మణుఁడు శూద్రుఁ డని ప్రమాణముకలదుకదా!

మంత్రముగా గ్రహించునప్పుడు ప్రణవము తొలుతఁ దరువాత శ్రీ బీజము గదా యుండవలయును. తాఱుమాఱుచేయనేల యని కొందఱు సందేహింప వచ్చును. వాస్తవమే. రహస్యమంత్రము లుపదేశకాలమున సక్రమముగాఁ జెప్పినను వ్రాయునప్పు డట్లు చెప్పుట మాంత్రికాచారము కాదు. గరుడమంత్ర మందు పక్షియనుటకు క్షిప యని చెప్పఁబడినది. ఈ పదమే వాడుకయందును నిందార్థమున నుపయోగింపఁబడుచున్నది. అహిర్బుధ్నసంహితయందుఁ గొన్ని మంత్రములు తలక్రిందుగాఁ జెప్పఁబడినవి.

వేదమంత్రములకు ఓంకారమువలె నాంధ్రకృతులయందు శ్రీకారమే ప్రధానముగా గ్రహించుట యాంధ్రకవిసంప్రదాయమై యున్నది.

శ్రీమద్రామాయణము ‘సీతాయా శ్చరితం మహత్’ సీతాదేవిమహాచరిత్ర యనియే వాల్మీకి చెప్పెను. అంతియగాక యూరక రామాయణమనక శ్రీమద్రామాయణమనియేకదా యాయన పేరుపెట్టెను. ‘అప్రమేయంహి తత్తేజోయస్య సా జనకజాత్మజా’ - జనకరాజుకూఁతు రెవ్వనిదో వాని తేజ మపరిమితముకదా! రాముఁడు శ్రీరాముఁడగుటకు మహిజాధవుఁడవుటయే కారణమని భావము. శ్రీరామచంద్రమూర్తియు ‘నాకునుఁ శుభప్రద సుమహాను భావకిధ’ యని యంగీకరించియున్నవాఁడు. తండ్రికంటెఁ దల్లి పదింత లెక్కువ పూజ్యురాలు. సీతాదేవి యనుగ్రహము లభించిన రామానుగ్రహము తప్పక త్వరగా లభించును. ఈకారణములచే శ్రీశబ్దము తొలుతఁ బ్రయోగింపఁబడియె. మంత్రోచ్చారణమందుఁ బ్రణవము మొదటనే రావలయును. ఆఱక్షరముల రామమంత్రమందుఁ బ్రణవము లెక్కకురాదు. ఏలన, ‘రా’మ్మనునదియే ప్రణవార్థమును బోధించును. (శ్రీరామనామమాహాత్మ్యమును జూడుఁడు). ఈ కారణముచేతనే ప్రణవోచ్చారణమున కధికారులు కానివారును శ్రీ రామమంత్రమున కధికారులగుచున్నారు.

మంత్రమం దొకన్యాయమునఁ బ్రణవమును జేరుచున్నది. నారాయణ మంత్రమునం దక్షరము లెన్ని యని విమర్శింపఁబూని పూర్వులు-నారాయణ = ౦ + ౨ + ౧ + ౫ = ౮ కావున నారాయణమంత్రమున నక్షరము లెనిమిది యనియేసిద్ధాంతముచేసిరి. ఆ న్యాయ మనుసరించిన రామ = ౨ + ౫ = ౭ అగుచున్నది. రామమంత్రము వాస్తవమున నేడక్షరముల మంత్రమనియే గ్రహించు

టొప్పునుగాని యగ్నిబీజము తదర్థమునే బోధించుటచేఁ బ్రణవమును దంత్రమున విడుతురు.

'సర్వేషాం తాంత్రికంతువా' యని యుండుటచేఁ బ్రణవములేకయే యన్ని వర్ణములవా రుచ్చరింపవచ్చును. దానివలన ఫలలోపము లేదు, మంత్రలోపము లేదు. ఎట్లన, అష్టాక్షరమంత్రవిషయమున వైష్ణవ గ్రంథములు ప్రణవలోపము గలిగినను లోపములేదని,

"తత్రోక్తరాయణస్యాది, ర్బిందుమాన్ విష్ణు రంతతః
బీజ మష్టాక్షరస్య స్యా, త్తే నాష్టాక్షరతా భవేత్
పుండరీకోపి ధర్మాత్మా, నారాయణపరాయణః
నమో నారాయణాయేతి, మంత్ర మష్టాక్షరం జపన్.

నారాయణపరాయణుఁడైన పుండరీకుఁ డను ధర్మాత్ముఁడు 'నమో నారాయణాయ' యను నష్టాక్షరమంత్రము జపించి ముక్తుఁ డయ్యెను.

శ్లో॥ ఆసీనావా శయానావా, తిష్ఠంతో యత్ర కుత్ర వా
నమో నారాయణాయేతి, మంత్రైకశరణావయమ్.

కూర్చుండినను బండుకొనినను నెచ్చట నెచ్చట నిలుచుండినను 'నమో నారాయణాయ' యను మంత్రమే మాకు శరణ మని యుండుటచేఁ బ్రణవలోపమునఁ దత్పర్యాయబీజ ముండుటచే మంత్రమునకు ఫలమునకు వైధుర్యము లేదు.

'ఓం రామాయ' యనునపుడు ప్రణవము రామాయ యనుటకు విశేషణముగ గ్రహింపవలయును. ఈ విషయము అరణ్యాకాండమున 'అగ్రవర్తియై శ్రీరామ చంద్రమూర్తియరుగుచుండె' నను పద్యవ్యాఖ్యయందు విమర్శింపఁబడును.

శ్రీరామషడక్షరమంత్రము కేవలమోక్షసాధకులుమాత్రమే జపింపవలయు ననియు నైహికకాంక్షగలవా రాపదలందును నుచ్చరింపరా దనియు నాంజ నేయులు చెప్పినట్లు రామరహస్యోపనిషత్తునందుఁ గలదు.

శ్లో॥ ఐహికేషుచ కార్యేషు, మహాపత్సుచ సర్వదా
నైవ యోజ్యో రామమంత్రః, కేవలం మోక్షసాధకః.

తక్కినవారందఱు రామాష్టాక్షరి జపించుట శ్రేయస్కరముకావున శ్రీరామ భక్తులు శ్రీరామాయ నమ యనికాని రాంరామాయనమ యనికాని రామాయనమ యనికాని రామ యనికాని జపింపవచ్చును. శ్రద్ధాభక్తులకొలఁది ఫల మందఱకు సమానము. 'రామ' యను రెండక్షరములందే సర్వశక్తులు కలవు. అందుకు వాల్మీకియే సాక్షి.

శ్లో॥ మహాలక్ష్మ్యర్థక శ్శ స్స్యాత్, ధనార్థ రేఫ ఉచ్యతే,
(ఈ) తుష్ట్యర్థో ఽపరో నాదో, బిందుః దుఃఖహారార్థకః.
లక్ష్మీ దేవ్యా బీజ మేత, త్తేన దేవీం ప్రపూజయేత్.

శ్రీం యను మంత్రమునందలి శకారమునకు లక్ష్మియనియర్థము. రేఫమగ్ని బీజము కావున 'శ్రియ మిచ్ఛే ద్ధుతాశనా' త్తను ప్రమాణమువలన నది సంపత్కరము. 'ఈ' యక్షరమునకుఁ దుష్టి యని యర్థము. నాదమునకీశ్వరుఁ డని యర్థము, బిందువు దుఃఖహరము. 'శ్రీం రామాయ నమ' యని జపించువారీయర్థమును మనస్సుననిలిపి యీశ్వరయుక్తమై దుఃఖముల హరించి తుష్టిని సంపత్తును గలిగించునది యని శ్రీదేవిని ధ్యానింపవలెను. 'శ్రీరామ' యన్నప్పుడిట్టి శ్రీదేవితోఁగూడిన రామచంద్రమూర్తియని ధ్యానింపవలెను.

శ్రీశబ్దార్థము రెండవపద్యంబున వివరింపఁబడినది. అందది విశదీకరింపఁబడును.

శ్రీమద్రామాయణమంతయుఁ బ్రణవార్థమునే తెలుపుచున్నది. రామచంద్రమూర్తి సాక్షా ద్విష్ణువని వాల్మీకియే చెప్పెను. లక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సుగ్రీవవిభీషణాదులందఱుఁ దాము దాసులమనియే చెప్పుకొనిరి. ఈవిధముగా దాసత్వము తమ స్వరూపమని యెఱిఁగినవారందఱు బాగుపడిరి. అది యెఱుఁగని రావణాదిరాక్షసు లహంకారముచేఁ జెడిరి. సీతాదేవిపురుషకారముచేఁ గాకాసురుఁడు క్షేమపడెను. ఆమెపురుషకార మంగీకరింపని రావణుఁడు సమూలము చెడెను.

నమశ్శబ్దనిర్వచనము.

నమశ్శబ్దము సఖండముగను నఖండముగను నర్థము సేయవలయును. నమశ్శబ్దమఖండ మైనప్పుడు నమస్కారమని యర్థము. సఖండ మైనప్పుడు న + మః = నాకొఱకుఁగాదు అనఁగా 'నమస్కారము నాకొఱకుఁగాదు. ఏ జీవుని కొఱకుఁ గాదు.' అని యర్థము గ్రహింపవలెను. నాకే కానప్పుడు నా కుపకరణములైన ప్రకృతిపదార్థముల కెట్లు వచ్చును? కావున రామచంద్రమూర్తికి మాత్రమే యని యర్థము దృఢపడుచున్నది.

యాః కాశ్చన కృతయో మమ భగవతి నమమ తాసు మమతా నాస్తి - భగవత ఏవ తాః అను మోహం భగవతి అహమపి నమమ భగవత ఏవాహ మస్మి ఇత్యేవ మమతాం యోజయ త్యతో నమమ.

నే నేకార్యములు చేయుచున్నానో యవి నాకొఱకై కావు. వానియందు నాకు మమత్వములేదు. అవన్నియు భగవంతునికొఱకే. నాకొఱ కనునది లేదు. నాకై నేను లేనివాఁడను. నేనుగూడ నాకొఱకుఁగాను. భగవంతునికొఱకై యున్నాను.

ఈవిధముగా మనుత్వమును యోజించుటచే 'న మమ' యేదియు నాకొఱకుఁ గాదని యేర్పడుచున్నది. 'నేను, నాది' యను పదంబులు విషములు. 'నీవు, నీది, నాదికాదు' అనునవి యమృతములు. నను యని మీఁదఁ జెప్పినయర్థము భావించి చెప్పినచో నహంకారమమకారములు రెండు నాశమగుచున్నవి. రక్షణభారము సర్వము భగవంతునియందే పడుచున్నది. శరణమట కదియే మార్గము.

శ్రీమద్రామాయణమునకు శ్రీసీతాదేవి ప్రాణమని విజ్ఞులు సెలవిచ్చిరి. అట్టులే శ్రీమద్రామాయణము దీర్ఘశరణాగతి యనిరి. అట్టి శరణాగతికి నమశ్శబ్దము ప్రాణము. నమశ్శబ్దము లేక శరణాగతి లేదు.

భక్తుల ప్రపన్నులచేతి సుదర్శనాయుధము నమస్సు భగవంతుఁడు సుదర్శనముచే సర్వలోకముల జయించును. భక్తులు ప్రపన్నులు నమస్సుచే భగవంతుని జయించి వశపఱుచుకొందురు. కావున నమశ్శబ్దార్థానుసంధానము వారి కనివార్యము. ఈనమశ్శబ్దార్థము పార్వతీపతి నారదునకీ విధముగ నుపదేశించెనని యహిర్బుధ్న్య సంహితయందుఁ జెప్పఁబడెను. గ్రంథవిస్తరభీతి మూలశ్లోకము లను వదింపఁ బడవయ్యె. వలసినవారు ౫౨వ యధ్యాయంబునఁ గననగు.

నమశ్శబ్దమునకు స్థూలార్థము.

తమకంటె గరిష్ఠుఁడగు వానిని గుద్దేశించి తమకుఁ దామే వినయముతో దేహమును వంచుటకు నమస్కారమని పేరు లోకమునఁ జేతనవర్గము శ్రేష్ఠములు, అశ్రేష్ఠము లని రెండువిధములే కానవచ్చుచున్నవి. వేఱొకభేదము లేదు. కాలము చేతన, జ్ఞానము లేనివి ఎక్కడఁ గాన్పించునో కానవచ్చుచున్నదో యక్కడ ముఖ్యావృత్తిచే (లక్షణచేఁగాదు) శ్రేష్ఠ్యము సంభవించుచున్నది. ఈ కారణముచే నందఱకంటె శ్రేష్ఠుఁడు పరముఁడగు భగవంతుఁడే. చేతనవర్గ (జీవకోటి) మింతయు నాయనకంటె నికృష్టమని జ్ఞానులు చెప్పిరి. శ్రేష్ఠుఁడైన పరముని శేషి యనియు, నశ్రేష్ఠుఁడైన జీవుని శేషుఁడనియు వారికిరువురికు శేషిశేషత్వ, స్వామిభృత్యసంబంధముఁ జెప్పుదురు. నమస్కరించువాఁడు శేషుఁడు జీవుఁడు. నమస్కరింపఁబడువాఁడు శేషి పరముఁడు (యథేష్టవినియోగార్హం శేషశబ్దేన కథ్యతే- యన్నట్లు భగవంతుఁడు తనయిష్టప్రకారము వినియోగించుకొనుటకు నర్హుఁడు శేషుఁడు జీవునిఁ దనయిష్టప్రకారము వినియోగపఱచుకొనువాఁడు శేషి). ఈసంతృసంతృత్వభావము లోకప్రయోజనముకోరి కలిగినవి కావు. కల్పించుకొనినవి కావు. నీచోచ్చములు స్వభావసిద్ధములు. భగవంతుఁడుపాధిరహితుఁడు. నేనుపాధిసహితుఁడను. కావున నాకంటె భగవంతుఁడు సర్వదా శ్రేష్ఠుఁడు. అనుజ్ఞానముతోఁ జేతనుఁడు చేయునమస్కారమునకే నమనమని పేరు. అంతియ కాదు. అది భక్తవత్సలుఁడైన భగవంతుని, నీచులైనను భక్తులగువారివిష

యమున నణఁకువతో వంగునట్లు (లోఁబడునట్లు) ప్రేరించును. ఈ కారణముచేతను దానికి నమ స్సని పేరు. మనస్సుచే భగవంతు నుద్దేశించి వాక్కుచే నమ యనుచు దేహము వినయమున వంచిన నది త్రికరణశుద్ధిగాఁ జేయఁబడిన పూర్ణనమస్కార మగును. ఈమూఁటిలో నేది లోపించినను గొఱఁతయే. ఇది కరణపూర్తి యనఁ బడును. అంగపూర్తి యాఱువిధములు—ఆత్మనిక్షేపము - మహావిశ్వాసము - కార్పణ్యము - ఆనుకూల్యసంకల్పము-ప్రాతికూల్యవర్జనము- గోప్తృత్వవరణ మని. వీనివిషయము ప్రపత్తివ్యాసమందు విభీషణశరణాగతిసమయంబునఁ జెప్పఁబడును.

ఇట్లుచేసిన నది సాంగోపాంగనమస్కారము. ఇది స్థూలార్థము - ఇఁక సూక్ష్మార్థము చెప్పెదను.

ఈవస్తువులు నావి నావారివి యను మమత్వమునకు మమ్య మని పేరు. అనాదిగానుండువాసనకు నధీనమైన మిథ్యాజ్ఞాననిబంధనముచే 'నిది నాది, యిది నావారిది' యని తాను స్వతంత్రుఁడ నని యుండు నజ్ఞానము 'న మే' నాదికాదు అను సమీచీనజ్ఞానముచేఁ దొలఁగిపోవును. అట్లు తొలఁగించునది కావున నిది నమ యనఁబడును. 'నాహం మమ' నేను నాకుఁగాదు. అనఁగా నాయునికి నానిమిత్తమై కాదు. నేను స్వతంత్రుఁడను గాను. ఈ దేహాదికములు నాకుఁగావు. ఇవన్నియుఁ బరమాత్మవశములు. ఇవన్నియు నాయనవియే. ఈబుద్ధిచే నావి యని మమకారమును దొలఁగించును. అనాదివాసనలచేఁ బుట్టి నానావిధవికల్పములు గలిగి 'నేను స్వతంత్రుఁడను' అని దృఢముగ దూషితమైయున్నచిత్తమును ఆభ్రాంతి సరిగాదు, సర్వము విష్ణ్వాత్మకము. అయనయే నాకు నంత యను జ్ఞానము నమస్సుచేఁ గలుగును. ఇది సూక్ష్మార్థము.

నమశ్శబ్దమునందు నకారమునకు మార్గ మని యర్థము. మకారముచేఁ బ్రధానము నిరూపితము. విసర్గము పరమేశ్వరునిఁ దెలుపును. కావున ననాదియుఁ బరమేశ్వరుఁడు నగువాఁడు శక్తిమంతుఁడు. పురుషోత్తముఁడు. ఆ భగవంతుని ప్రాప్తికిది నమస్సు ప్రధానోపాయము. ఇది పరమార్థము. ఈ విధముగ నమశ్శబ్దమునకు మూఁడర్థములు.

కైవల్యముగాని సాయుజ్యముగాని కోరక నా నమస్కారములు గ్రహించునుగాక యనుటచే నీ గ్రంథకర్త కేవలప్రపన్నుఁడని యేర్పడుచున్నది. 'సత్యం శపే వారణశైలనాథ, వైకుంఠవాసేపి న మేభిలాషః' ప్రమాణముచేసి చెప్పుచున్నాను. నీ వైకుంఠమందు నాకుఁ గోరికలేదు అని కదా ప్రపన్నులుచెప్పుదురు.

'సద్గరీయోమరభూరుహంబు సమదారివిదారణశీలి' యనుటచేఁ బ్రణవమందలి అకారార్థము అవతారప్రయోజనమైన, సాధుపరిత్రాణము, దుష్టవినాశము చెప్పఁబడెను.

ఊరక శ్రీరాముఁడనక ఒంటిమిట్ట శ్రీరాముఁడనుటచే నానాఁటి విభవావతారమైన శ్రీరామచంద్రమూర్తికి నర్చావతారమై యొంటిమిట్టయందు వెలసియుండు శ్రీరామచంద్రమూర్తికి నభేదమెఱుంగునది. కాలభేదమునుబట్టి యవస్థాభేదము. అయిదు విధములైన యవతారము లేకవిధము గావుగదా. "ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశోవాపి తన్ముఖం" ఆశీర్వాదముగాని నమస్కారముగాని వస్తునిర్దేశముగాని కృతిముఖంబున నుండవలయును. అను నియమము ప్రకార మీ తొలిపద్యంబున నమస్కారము చెప్పఁబడియె.

పద్య ముత్పలమాల - భరనభభరవ గణములు. ౧౦ వ యక్షరము యతిస్థానము.

ఫలము - ధనహేమమణివస్త్రపశుతనూజపరిజనాశ్వాదిసంప్రాప్తి భగణమునకు. —అప్పకవి.

అని యుండుటచే భగణము తొలుతనుండుట శుభప్రదము.

గీ॥ వేదములకెల్ల నోంకార • మాదియైన, కరణిఁ గృతులకునెల్ల శ్రీ•కార మాది
గానఁ గవివరులెల్లను • దానిదక్క, నితరవర్ణంబు లిడరు స•త్కృతులమొదల.
—అప్పకవి.

నీలోత్పలశ్యాముఁ డగు శ్రీరామచంద్రమూర్తికి కాటుకకంటి సీతాదేవి నిజకటాక్షవీక్షామాలిక లర్పించి యలంకరించిన ట్లుత్పలమాల సమర్పణపూర్వకముగ భగవంతుఁ డర్చింపఁబడెను.

చం॥ జగముల నాశ్రయించి, శ్రిత•సంతతి కాశ్రయభూతిన్మై, నతో
క్తిఁ గరుణ విన్చు, నాథునకుఁ • దెల్పుచుఁ, గృత్తసమస్తదోషయై,
యగణితశక్తియుక్తినిఁ బ•రాశ్రయయై, పతి భక్తిఁ గొల్చు శ్రీ
భగవతి మాంత సీత నిర•పాయసుఖాత్ములఁ జేయు భక్తులన్. ౨

అర్థము.

ఇది కృతినాయికయైన సీతాదేవిస్తుతి.

జగములన్ = అనేకకోటిబ్రహ్మాండములను. ఆశ్రయించి శ్రితసంతతికిన్ = తన్నాశ్రయించినవారిసమూహమునకు. ఆశ్రయభూతయై = అండయై. నతోక్తి = నమస్కరించుదీనలమాటలను. కరుణన్ = దయచే. విన్చు = వినుచు. నాథునకున్ = తనభర్తకు. తెలుపుచు. కృత్తసమస్తదోషయై = ఛేదింపఁబడిన సకలవిధములయిన దోషములుగలదై. అగణితశక్తియుక్తిని = ఇంతమాత్రమని లెక్కింపరానిశక్తితోఁ గూడినదై. పరాశ్రయయై = భగవంతు నాశ్రయమ్ముగాఁ గొన్నదై. పతిభక్తి = పతియందుభక్తి. సలుపు = చేయు; శ్రీ = శ్రీ యను

పేరుగలది, భగవతి = కల్యాణగుణములు గలది. మాత = తల్లి. సీత = సీతాదేవి. భక్తాన్ = తన్ను ననురాగముతో సేవించువారిని. నిరపాయసుఖాత్మన్ = శాశ్వతమైన సుఖముతోఁగూడిన జీవులనగా లేక స్వభావముగల వారినిగా. చేయుత్ = చేయుఁగాక! (యని ప్రార్థనము).

తాత్పర్యము.

సమస్తప్రపంచములను నాశ్రయించి తన్నాశ్రయించినవారి కండయై, తన్నుఁగూర్చి నమస్కరించువారిదీనాలాపముల దయతో వినుచు, వారిని రక్షింపుమని భర్తకుఁ దెలుపుచు, అట్టిరక్షణమునకు యోగ్యులగునట్లు వారిదోషముల నెల్ల ఖండించి పవిత్రులఁ జేయుచు, నింత యని పరిమాణము చెప్పరాని శక్తిమహిమ గలదై భగవంతు నాశ్రయించి యాయనను బ్రతిఫలాపేక్షలేక యత్యంతప్రేమతో సేవచేయునట్టియు, శ్రీ యను సార్థకమైన నామధేయమును, మెత్తని మనస్సు, భర్తకు పరతంత్రురాలుగా నుండుట, దయ, క్షమ లోనైనకల్యాణగుణములు గలదై ప్రపంచమునకెల్లఁ దల్లియైన సీతాదేవి భక్తులకు శాశ్వతసుఖమును బ్రసాదించుఁగాక.

'శ్రీ రితి ప్రథమం నామ లక్ష్మ్యా' యన్నట్లు అకారము నారాయణునకు మొదటిపేరైనట్లు శ్రీయనునది లక్ష్మీదేవికి మొదటిపేరు.

శ్రీయతే = భగవంతుని నాశ్రయించి యుండునది, శ్రయతే = భక్తులచే నాశ్రయింపఁబడునది, శృణోతి = దీనాలాపములను వినునది, శ్రావయతి = దీనుల రక్షింపుమని భక్తులకు వినిపించునది, శృణాతి = శృణాతి నిఖిలాన్ దోషాన్ అన్నట్లు భగవత్ప్రాప్తికి విరోధు లగు నాశ్రితపాపములను నశింపఁజేయునది, శ్రిణాతి = ఆశ్రితులకు కైంకర్యగుణపరిపాకముఁ గలిగించునది, శ్రీశబ్దమునకీ యర్థములు గ్రహించునది.

శ్రీశబ్దనిర్వచనము.

శ్రీ యను శబ్దము శ్రీయతే- శ్రయతే - శృణోతి - శ్రావయతి - శృణాతి- శ్రీణాతి యని యాఱువిధములుగ భగవచ్ఛాస్త్రములందు నిర్వచనము చేయఁబడినది.

(1) శ్రీ - తమతమ యుజ్జీవనముఁ గోరునట్టి యీ చేతనులచే నాశ్రయింపఁబడినదై వీరి నుజ్జీవింపఁజేయుటకుఁగాను సర్వేశ్వరు నాశ్రయించియుండునది. తనయాజ్ఞమీఱి వర్తించు జీవులవిషయమున భగవంతుఁడు తండ్రి కావున నాగ్రహించి పరికోపించి 'తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్, క్షిపా మ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు' క్రూరులైన నరాధములను

శాశ్వతముగ నసురయోనులందుఁ ద్రోయుదును. 'నక్షమామి వసుంధరే' భూదేవీ, నేను క్షమింపను అని పలుకునపుడు లక్ష్మీదేవి తల్లిగావునఁ 'దల్లీ! తండ్రి నాపిషయమునఁ గోపించెను. నీవు నన్నుఁ జేపట్టి రక్షింపు'మని తన్ను నాశ్రయించిన జీవుల విషయమునఁ దాను సర్వేశ్వరుఁడగు తనభర్తను జూచి "కరుణాసాగరా! సర్వేశ్వరా! యిది యేమి యిట్లు చేయఁబూనితిరి? పిచ్చుకమీఁదనా బ్రహ్మాస్త్రము? నీవు కోపించిన వీరిగతి యేమి? వీరికి వేఱు రక్షకు లెవ్వరు గలరు? ఇట్టి వారియందుఁ గాకుండిన నీదయాగుణ మెవరియందుఁ జూపఁగలవు? అపరాధుల నెల్ల దండింపఁ బూనినచో లోకమున నపరాధముచేయని వా రెవ్వరు? నీరక్షకత్వ మెవ్వరి విషయమున సార్థకము?" అని బోధించి శాంతపఱచి తనస్వాభావిక మగు వాత్సల్యముచే నీచేతనుల నుజ్జీవింపఁజేయునది. ఆయన దండనేచ్ఛను నివర్తింపఁ జేయును. అట్లుచేయుటకే పురుషకార మని పేరు. ఒకనికి నొకకార్యము కావలసియుండఁగా నాకార్యము ఫలింపఁజేసికొనుటకుఁగాను వానికిఁ బ్రియులైనవారి వేఱొకని నాశ్రయించితిమేని య ట్లాశ్రయింపఁబడినవస్తువునకుఁ బురుషకార మని పేరు. విభీషణుఁడు రామానుగ్రహమునకై [illegible] వానరులఁగదా నాశ్రయించెను. రాక్షసస్త్రీలు తన్నాశ్రయించుటచేఁగదా హనుమంతుఁడు వారిని జంపకుండ సీతాదేవి కాచెను. ఇచ్చట నొక యాక్షేపము రావచ్చును. ఈమె యనుగ్రహమునిమిత్తమై వేఱొకని, వాని యనుగ్రహమునిమిత్తమై వేఱొకని నాశ్రయింపఁబూనిన ననవస్థాదోషము రాదా? ఆ భయములేదు. 'దేవ్యా కారుణ్యరూపయా' యన్నట్లు మూర్తీభవించిన భగవత్కరుణారసమే లక్ష్మీదేవి. కావున నామె వాత్సల్యము సౌలభ్యము స్వభావముగఁ గలతల్లి. భగవతి గావున భగవంతునియందు వాల్లభ్యముగలది - ఆమెమాట నిరాకరింపఁడు. ఇది వస్తుస్వభావము గావున లక్ష్మీదేవి యనుగ్రహమునిమిత్తమై వేఱొకని నాశ్రయింపవలసిన పని లేదు బిడ్డకుఁ దల్లి పాలిచ్చుటకుఁ బురుషకారము కావలయునా? వనవాసప్రయాణసమయమున లక్ష్మణుఁడు సీతానుగ్రహము సంపాదించుకొనికదా రామచంద్రమూర్తి నాశ్రయించెను. ఈ విధముగ జీవులచే నాశ్రయింపఁబడునది - భగవంతు నాశ్రయించునది యని యర్థ మేర్పడెను. శృణోతి = వినుచున్నది. శ్రావయతి = వినిపించుచున్నది యని యర్థము గ్రహించినపుడు 'తల్లీ! నేనపరాధిని - నన్ను క్షమించి భగవంతుని పాదములందుఁ జేర్పు' మని భక్తులు ప్రార్థింపఁగా వారి యార్తనాదము విని వారిస్థితి సర్వేశ్వరునకుఁ దెలిపి వారికష్టములఁ బోఁగొట్టునది యని గ్రహింపవలయును. 'శృణు చావహితం కాంత యత్తే వక్ష్యామ్యహం హితం, ప్రాణైరపి త్వయా నిత్యం సంరక్ష్యశ్శరణాగత' యని స్త్రీకపోతపక్షి మగపక్షికి బోధించెను. అనఁగా 'నాథా! నేను నీకు హితము చెప్పుచున్నాను వినుము. ప్రాణమిచ్చియైనను సర్వదా శరణాగతుని రక్షింప

వలయును.' ఈ ప్రకారము భగవంతునకు బోధించును. 'సర్వజ్ఞునకు మఱియొకరు చెప్పవలయినా? ఇది యాయనకు నేర్పవలయునా?' యనరాదు. సీతాదేవి నేను నీకు స్మరణమునకుం దెచ్చుచున్నానుగాని నేర్పరాలే దనికదా రామచంద్ర మూర్తికిం జెప్పెను.

"శృణాతి నిఖిలాన్ దోషాన్" దోషములనెల్ల హరించును. భగవంతుఁడు లక్ష్మీవిశిష్టుఁడయియే లోకముల సృష్టించును, రక్షించును, హరించును. ఇంతకు దయయే కారణము. "లక్ష్మ్యాసహ హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా, రక్షక స్సర్వసిద్ధాంతే వేదాంతేపిచ గీయతే" భగవంతుఁడు కరుణాస్వరూప యగు లక్ష్మీదేవినిగూడియే రక్షకుఁడగు చున్నాఁడని సర్వసిద్ధాంతములు వేదాంత ములు చెప్పుచున్నవి యని యర్థము. దయాహీనుఁ డెవరిని రక్షించును. కావున శ్రీ యనఁగాఁ దన్నాశ్రయించినవారి శ్రేయస్సునకు విరోధు లగు పాపకర్మముల నెల్ల నశింపఁజేయునది యని యర్థము.

'శ్రీణాతిచ గుణై ర్జగత్' అను నర్థమున నాశ్రితులకుఁ గైంకర్యపర్యంతము గుణపరిపాకము గలిగించునది యని యర్థము. దీనికిఁ గారణము కరుణయె. ఈ విధముగ జగముల నాశ్రయించియుండును. ఈ కారణములచే భగవంతు నే స్వరూపమున నాశ్రయించినను భక్తులగువారు లక్ష్మీవిశిష్టునిఁగా ననఁగా సీతా రామచంద్రమూర్తులను, రుక్మిణీ కృష్ణులను, రాధాకృష్ణులను, లక్ష్మీనారాయణు లను నాశ్రయింపవలెను. బాలకృష్ణునిమాత్ర మొంటరివానిఁగానే భావింప వచ్చును.

శ్లో॥ యువత్వాదౌ తుల్యే ప్యపరవశతా శత్రుశమన
స్థిరత్వాదీన్ కృత్వా భగవతిగుణాన్ పుంస్త్వసులభాన్
త్వయి స్త్రీత్వైకాంతాన్ మృదిమపతి పారార్థ్యకరుణా
క్షమాదీ న్వా భోక్తుం భవతి యువయో రాత్మని భిదా.

అమ్మా! యౌవనము లోనగు గుణములయందు మీ రిరువురు (లక్ష్మీనారా యణులు) సమానులైనను స్వాతంత్ర్యము (పరులకు వశపడకుండుట), శత్రు సంహారము, స్థైర్యము (తాను పూనినకార్యమునుండి చలింపకుండుట), యీ మొదలగు గుణములు పురుషుఁడైన నీ భర్తకు సులభములు. స్త్రీవైన నీకో మృదులహృదయము,పాతివ్రత్యము (పతిని సేవించుటయే వ్రతముగాఁగలది పతివ్రత - దానిభావము పాతివ్రత్యము), కరుణ (ఇతరులదుఃఖము సహింప లేకుండుట), క్షమ (ఇతరులయపరాధముల నోర్చుట) యను నీమొదలయిన కల్యాణగుణములు స్వభావములు. కావున మీయిద్దఱను సేవించుటయందు మీస్వరూపస్వభావవిగ్రహములం దీభేదము మనస్సునకు వచ్చుచున్నది.

శ్రీరామచంద్రమూర్తి పురుషుఁడు గావునఁ దాను పూనిన కార్యములరక్ష గాని శిక్షగాని యితరులకు వశపడక స్వతంత్రించి తానే చేయును. సీతాదేవియో శిక్షించుట యనునది యెట్టిదో యామె యెఱుఁగదు. 'నకశ్చిన్నాపరాధ్యతి' అపరాధముచేయనివాఁడే లేఁడుగావున శత్రువులైనను రక్షింపుమనియేకదా యామె చెప్పెను. ఆర్తరక్షణకార్యమే తనకుఁ గేవలకర్తవ్యముగా గణించుకొన్నది కావున శ్రీసీతాదేవి యపరాధులగు వారలకు ఏవిధమైన కష్టపడియైన వారిని రక్షింప నభయములతో యత్నించును. ఆమె యెట్టివారిని నిరాకరించక భాషించి సమయ మెఱిఁగి నయవినయములచే భర్తకుఁ దెలిపి వారిని రక్షింపఁజేయును. వినకపోయి రా యూరకుండును. వారు ప్రకోపింపక 'నా పాపములే వారుహేతులగుచుండ నేనుగూడ నేల వారిని జెఱుపవలయు' నని యూరకుండును. రావణాసురునివిషయమందు సీత యట్లే కదా వర్తించెను. తన్ను సకలబాధలు పెట్టిన రాక్షసస్త్రీలదోషముల క్షమించి రక్షించెఁగదా. ఋషులకీడొనర్చుఁగోరి రాక్షస వధకుఁగాను యత్నించిన శ్రీరామునకు నిష్కారణవధ తగదని బోధించెఁగదా. తన్ను రావణాసురుఁ డెత్తుకొని పోవుచుండ 'ఓ సూర్యా! రామచంద్రమూర్తికి నాస్థితిఁ దెలుపు' మని కోరెనేకాని, 'వీనితో యుద్ధముచేసి నన్ను విడిపింపు' మని కోరలేదుగదా! ఈమె యెదుట లేనప్పుడుగదా రామచంద్రమూర్తి రాక్షసుల నెల్ల వధించెను. పతిసేవకన్న సతికి వేఱుగతి స్వర్గము లేదుకదా చిన్నవయస్సుననే శ్రీరామచంద్రమూర్తి వెంట నడవికిఁ బోయెను. నవలసుఁడగు భర్త కపకీర్తిరాఁగూడదనికదా యంతమువఱకు శ్రీరామచంద్రమూర్తి నెడఁబాసి వాల్మీకాశ్రమమున సన్న్యాసినివలె నుండనోర్చెను. భర్తలకింతకంటెను సేవింపఁదగువారెవ్వరు లభింతురు' ఈ కారణముచేతనే సీతఁగూడిన శ్రీరామచంద్రమూర్తిని సేవించిన శుభముగలదని పెద్దలు వచించుట.

'రామో విగ్రహవాన్ ధర్మః' అనుటచేతను గాని ధర్మమే శ్రీరాముఁ డన్నట్లు శ్రీరామచంద్రమూర్తి కేవలధర్మస్వరూపుఁడు. సీతయో 'దేవ్యా కారుణ్యరూపయా' కరుణాస్వరూపయగు దేవి యన్నట్లు కేవల మూర్త్యాకారము గొన్న కరుణ. ధర్మములేని కరుణ, కరుణలేని ధర్మము విపరీతఫలమిచ్చును. కావున రెంటిని విడఁదీయరాదు. ఇరువురకు భేదములేదు. భగవతి- భగవచ్ఛబ్ద స్త్రీలింగరూపము భగవతి యనిమాత్రమర్థముకాదు భగవంతునందుఁగలగుణ సంపత్తి యీయమయందును గలదని భావము. ఈవిషయమును నీక్రిందిశ్లోకముల యర్థము గ్రహించునది.

శ్లో॥ యథా మయూఖో జగద్వ్యాప్తం, స్వరూపేణ స్వభావతః
తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీచ తథేశ్వరీ.

స్వరూపస్వభావములచే నే నెట్లు జగత్తునందంతయు వ్యాపించియున్నానో యట్లులే యామెచే నీ విశ్వమంతయు వ్యాపింపఁబడియున్నది. నియమించు నీశ్వరి యీయామెయే.

శ్లో॥ దేవతిర్యఙ్మనుష్యేషు, పున్నామా భగవాన్ హరిః
స్త్రీనామ్నా శ్రీశ్చ విజ్ఞేయా, నానయో ర్విద్యతే పరమ్.

మైత్రేయా! దేవతలయందుఁ బశుపక్ష్యాదులందు మనుష్యులందుఁ బురుషుల నామములు గలవన్నియు భగవంతుఁడైన హరియే. స్త్రీనామములు గలవి లక్ష్మియే. వీరిరువురకంటెఁ బరమైనది వేఱులేదు.

శ్లో॥ సర్వకామప్రదాం రమ్యాం, సంసారార్ణవతారిణీమ్
క్షిప్రప్రసాదినీం లక్ష్మీం, శరణ్యా మనుచింతయేత్.

సమస్తములైన కోరికలనిచ్చునదియు, రమ్యమైనదియు, సంసారసాగరమునుండి భక్తులఁ దరింపఁజేయునదియు, శీఘ్రముగ ననుగ్రహించునదియు, సర్వలోకశరణ్యయు నగు లక్ష్మీదేవిని సర్వపాపపరిహారార్థము తక్కిన ప్రాయశ్చిత్తముల విడలి శరణు చొరవలయును.

శ్లో॥ ప్రాయశ్చిత్తప్రసంగేతు, సర్వపాపసముద్భవే
మా మేకాం దేవదేవస్య, మహిషీం శరణం వ్రజేత్.

ఈమె మాత. తల్లియగుటచే శీఘ్రముగ నమస్కారమాత్రమున ననుగ్రహించును.

ప్రణవమందలి యుకారార్థ మీ పద్యంబున విశదీకరింపఁబడెను.

చంపకమాలకు న-జ-భ-జ-జ-జ-ర గణంబులు పదునొకండవస్థానంబున యతి.

సీతాదేవి- యోజనగంధి, చంపకామోద, చంపకవర్ణ. కావున నామెకుఁ జంపకమాల సమర్పింపఁబడియె.

'సర్వమ్ పరవశం దుఃఖ' మ్మన్నట్లు పరసాహాయ్య మపేక్షించునదియు శ్రమసాధ్యము దుఃఖకారణము నగు ధనహేమపకైంకర్యమున నియమింపక యక్లేశసాధ్యమగు పుష్పమాలికాసమర్పణకైంకర్యమున నియోగింపు మని కవియాశయమైనట్లు ఉత్పలచంపకమాలల నర్పించుటచే నేర్పడుచున్నది.

నతోక్తి - ఇది ద్వితీయార్థంబునఁ బ్రథమగా గ్రహింపవలెను. ద్వితీయగానే నతోక్తిఁ "గరుణ"యని చెప్పవచ్చునుగాని యీగ్రంథమం దెందును గవి నబిందుక నిర్బిందుకములకు లఘ్వలఘురేఫములకు శస, రల లకు ప్రాసముఁ గలిపినవాఁడు కాఁడు.

౪౦. సత్యము వాక్యము, లోకము! సత్యము, తనప్రాయసంబు, సత్యము, ప్రోయాల్
షత్యయగువాణియవు విధి! బ్రత్యూహమును గొలుతుఁ గృతికిఁ బ్రహ్మాయువిడన్. 3

అర్థము.

ఇది బ్రహ్మస్తుతి. వాక్యము సత్యము = చెప్పినమాట తప్పదు. లోకము సత్యము=ఉండులోకమునకు సత్య మని పేరు. సత్యలోకమందుఁగదా బ్రహ్మయుండుట. తనవ్రాయసంబు సత్యము = తాను వ్రాసినవ్రాఁత వ్యర్థము పోనిది. 'హరిణాపి హరేణాపి, బ్రహ్మణాపి సురైరపి,లలాటలిఖితా రేఖా,పరిమార్ష్టుం నశక్యతే' 'నొసటన్ వ్రాసిన వ్రాఁతకన్నఁ గలదా నూతేండ్లు చింతించినన్?' అని కలదు గదా. ప్రోయాల్ = భార్య. సత్యయగు వాణి = సత్యస్వరూపయగు సరస్వతి. 'సత్యా వాణీ సరస్వతీ' యని కలదుగదా. అవ్విధిన్ = ఇట్టివాఁడైన బ్రహ్మదేవుని. కృతికిన్ = ఈగ్రంథమునకు. బ్రహ్మాయువున్ = బ్రహ్మయొక్క యాయుస్సును. ఇడన్ = ఇచ్చుటకుఁగాను. ప్రత్యహమున్ = ప్రతిదినమును. కొలుతున్ =సేవింతును. ప్రోలు + ఆలు=ప్రోయాలు. ఇచ్చట ప్రోలనఁగా గృహమనియర్థము.

తాత్పర్యము.

ఎవనివాక్యము సత్యమో, యెవఁ డుండులోకము సత్యమో, యెవనివ్రాఁత సత్యమో, యెవనిభార్య సత్య యగు సరస్వతియో యట్టిబ్రహ్మదేవుఁ డీకృతికిఁ దనపరిపూర్ణాయువు నొసంగుటకై ప్రతిదినము ప్రార్థించెదను.

'బ్రహ్మదేవా; వాల్మీకికి,

> కం॥ ఎందాఁకఁ గులధరావళుఁ
> లెందాఁక నదీనదంబు • లిల వెలయునో తా
> నందాఁక రామకథ జగ
> మందున్ స్థిరమగుచు వెలయు•నయ్య మునీంద్రా!

> కం॥ నీరామాయణకావ్యము
> ధారణి నెందాఁక నిలుచుఁ • దత్పర్యంతం
> బారయ యశఁబుఁ గని ముని
> మారమ్యజగంబుఁ బొందు•మా యామీఁదన్.

అని నీ విచ్చినవర మీయాంధ్రవాల్మీకిరామాయణవిషయమందును సత్యముగా నిచ్చి నీసత్యత్వము రక్షించుకొమ్మని ప్రార్థనము. శ్రీరామకథాశ్రవణపరనమననాదులచే లోకమును దరింపఁజేయఁగోరికదా బ్రహ్మదేవుఁడు వాల్మీకిచే శ్రీరామాయణమును బలికించెను. దేశమున సంస్కృతభాషాజ్ఞానము క్షీణించుటచే నాయనసంకల్ప మిప్పుడు సార్థకము గానన్నది. ఆయన సంకల్పమును సార్థకపరచునది యీయాంధ్రవాల్మీకిరామాయణ మొక్కటియే. కావునసంస్కృతరామాయణమునఁగల యనుగ్రహబుద్ధి దీనియం దుంప బ్రహ్మ ప్రార్థింపఁబడెను.

బ్రహ్మదేవుఁడు "శ్రీరామావతారంబు జగత్పావనంబును సన్మత్ప్రసాద కారణంబును" ననికదా వచియించె- భాగవ. ౨-౧౭౪. కావున రామదాసుఁడు రామభక్తుని రామకార్యమునకై ప్రార్థించుట సమంజసమేకదా.

ఛందస్సు.—ఇది కందపద్యము - దీని మొదటిపాదంబున మూఁడుగణములు. రెండవపాదంబున నైదుగణంబులు. ఈపద్యమున భ-జ-స-నల-గగ తప్ప మఱి యేగణము రాఁగూడదు. ఇవి కవి యిష్టముకొలఁది ప్రయోగింపవచ్చును. క్రమ నియమము లేదుగాని జగణము బేసిని నుండరాదు. కడపట గురువే యుండవల యును. ఏడవగణము ప్రథమాక్షరము యతిస్థానము ఆఱేంట నల-జ లుండవలెను.

ఈపద్యమునందలి వాక్యముల నిట్లు త్రిప్పిచదువవచ్చును. వాక్యముసత్యము- లోకము సత్యము - ప్రాయసము సత్యము - వాణి సత్యము భగవంతుఁడు 'బహుస్యాం ప్రజాయేయేతి- నామరూపంవ్యాకరవాణి' యని సంకల్పించి నామరూపంబులఁ బరిణామము నొందును. కావున బ్రహ్మము సత్యమేని శబ్ద బ్రహ్మము సత్యమే. రూపబ్రహ్మము సత్యమే. మన్న సత్యమైనఁ గుండ మూఁకుడు సత్యములేకదా! వాణి సత్యము, లోకము సత్య మనునవి యీ యర్థమునే సూచించును.

ఉ. నారసనాలతాగ్రమున • నవ్యగతి న్నటియించి సద్యశః
పూరము నించి తీజగతిఁ • బూర్వమునందె మదంబ! వాణి! సం
సారము నుత్తరింప రఘు•చంద్రమునత్కృతికై తొడంగితిన్
సారసనేత్ర! యేకరణి • సారదియం గృతి నుద్ధరించెదో! ౪

అర్థము.

ఇది సరస్వతిస్తుతి. నారసనాలతాగ్రమునన్ = తీఁగవంటి నానాలుకకొన యందు. నవీనగతిన్ = నవీనమై శ్లాఘ్యమైన రీతిని. నటియించి = నాట్యమాడి. ఈజగతిన్ = ఈయంధ్రదేశమందు. సద్యశఃపూరము = మంచికీర్తి ప్రవాహము. పూర్వమునన్ = ఇంతకుముందే నించితి = నిండఁజేసితివి. (ఇప్పుడు) సంసారము నుత్తరింపన్ = సంసారమును దాఁటుటకు- ఛేదించుటకు. రఘుచంద్రము = శ్రీ రామచంద్రుని. సత్కృతికై = మంచికావ్యమును జేయుటకై. తొడంగితిన్ = ప్రయత్నించితిని. సారసనేత్ర = కమలములవంటి కన్నులుగల. మదంబ = నా తల్లీ! వాణి = సరస్వతీదేవి! ఏకరణి - యేవిధముగా. నీకృతి నుద్ధరించెదో- ఆ భారము నీదేయనుట.

విశాలమై చలింపని దృఢమైనరంగమునందు నాట్యమాడుట సులభముగాని చలించుచు నడుగుపెట్టిన క్రుంగిపోవు తీఁగమీఁద నాట్యమాడుట దుష్కరము. కావున నీనర్తనక్రమము నవీనము శ్లాఘ్యము నని భావము. దీనివలన గ్రంథ

కర్త్రయం దేపాండిత్యపటుత్వము లేదనియు, సరస్వతి తననేర్పుకొలఁది స్ఖలనము లేకుండఁ దానే నటించి కీర్తిమాత్రము తనభక్తుఁడైన యతనికి లభింప నను గ్రహించెననియు వ్యంగ్యము. నటియించుటయందు పదవిన్యాసచమత్కారము చూపునట్లె గ్రంథమునందును పదవిన్యాసచమత్కారము గలదుకదా!

పూర్వమునందు = శ్రీకుమారాభ్యుదయ శ్రీకౌసల్యాపరిణయ రంగనాయక శతక ద్విపదభగవద్గీతారచనయందు.

మదంబ = నాతల్లి. తల్లికి నసమర్థుఁడయిన కుమారునియందు వాత్సల్య మెక్కు వ. అట్లగుటచే నసమర్థుఁడయినను వాఁడు కీర్తిగాంచుఁడు కావలయును. ఈమెకుమారుఁడు వ్యర్థుఁ డను పేరు రాఁగూడదు అట్లు వచ్చెనేని యాయవ మానము తనకే యని యెంచి యామెకుమారుని నిమిత్తకర్తగాఁ జేసి కీర్తిమా త్రము వానికే వచ్చునట్లు చేయును.

అట్లె యీగ్రంథకర్త నిమిత్తమాత్రమనియుఁ బలికినది సరస్వతియే యనియు నాశయము. బ్రహ్మాపనఘున సరస్వతీదేవి వాక్కునఁ బలికినదా శ్రీమద్రామాయణ మును వాల్మీకిచేఁ బలికించెను. తనతీవ్రరోగబాధ దుర్బలత్వము అల్పపాండిత్యము సహాయహీనత లోనగునవి యాలోచించి యీకృతి భగవత్సంకల్పముచే నెఱ వేఱెనగాని స్వశక్తిచేఁ గాదని కవ్యాశయము.

సంసారము నుత్తరింపన్ = ఎవరి రచనచే గ్రంథకర్తయు, జదువుటచే బాఠ కులు నని గ్రాహ్యము. ఈయర్థమువచ్చుటకె యిచ్చో 'నేను' అను కర్తృపదము లోపింపఁబడెను. ఉత్తరించుట యనుటకు దాఁటుట - ఖండించుట యను రెండర్థ ములు గలవు. సంసారము సముద్రముగా నెంచిన దాఁటుటయనియు, 'ఊర్ధ్వమూల మధశ్శాఖమ్, అశ్వత్థం ప్రాహురవ్యయమ్', 'అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా' అన్న ట్లు సంసారమును రావిచెట్టుగా నెంచునెడల ఛేదించుట యనియు గ్రహింప వలెను. సత్కృతికిన్ = "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" కావ్యాలాపములు కూడ దను నిషేధము కామపరకావ్యములవిషయమేకాని భగవద్విషయమై మోక్ష కారణమైన శ్రీమద్రామాయణవిషయము కాదని తెలుపుటకై సత్కృతి యని చెప్పఁబడెను. కడంగితిన్ = ప్రయత్నించుట నావంతు, దానిని సాంతముగ నెఱ వేర్చుభారము నీవంతని యర్థము. సాగసనేత్ర = హర్షముచే విచ్చిన కనులతోఁ బరిపూర్ణకటాక్షములతో వీక్షింపు మని భావము.

తా త్ప ర్య ము.

నాతల్లీ! వికసించిన కమలములవంటి కన్నులుగల సరస్వతీదేవీ! నీవే! యిం తకుఁబూర్వమే నాచే శ్రీకుమారాభ్యుదయము, శ్రీకౌసల్యాపరిణయాది కావ్యములఁ బలికించి నాయశస్సాంధ్రలోకమున వ్యాపింపఁ జేసితివి. అవియును

భగవద్విషయగ్రంథములేమైనను నాదృష్టి యశస్సుమీఁద నుండుటచే నాఫలమే కలిగించి నాకోర్కి నెఱవేర్చితివి. ఇప్పుడు నా కట్టి ఫలకాంక్ష లేదు కావున సంసారవిషవృక్షమును ఛేదింప శ్రీరామచంద్రమూర్తి చరిత్రము రచింపఁబూనితిని. పరిపూర్ణదయగలదానవై యీసద్గ్రంథము నెట్టు లుద్ధరింపవలెనో యది నీవే యాలోచించి కార్యసాఫల్యముఁ గూర్పుము. అనాఁడు రామాయణమునకు నెట్లు వాస్తవకర్త్రివై తివో యిప్పుడు నట్లె కమ్ము.

నారసనాలతాగ్రమున నను-చో నేకదేశిసమాసము. ఏకదేశి సమాసములు సంస్కృతమందును గలవు.

ఆ- ఈ - ఏ- తన- నా - నీ శబ్దములతో నేకదేశిసమాసము లాంధ్రంబునఁ బెక్కులు గలవు. తనయశోవిశదముక్తాసౌధపాళికి-(వసు), నీకంఠార్పితకాలపాశము (భాస్కర), ఇత్యాదులు పెక్కులుగలవు.

కం॥ రామా ! మారాముని వే
నామములకు సరియ రామ•నామం బది పో
రాములకు విరామ మిడి ని
రామయసుఖ మిడెడు ననెడు • హరుఁ డోముఁ గృతిన్. ౫

అర్థము.

ఇది శ్రీరామచంద్రమూర్తిభక్తుఁడైన శివుస్తుతి.

రామా= సుందరీ. మారాముని = లక్ష్మియందు రమించు శ్రీవిష్ణువుయొక్క. వేనామములకు = వేయుపేర్లకు. రామయనుపేరు. సరియ=సమానమే. అది = అనామమే. పోరాములకు = మరణజననములకు. విరామము = నిలుపుదలను. ఇడి = కలిగించి. నిరామయసుఖమున్ = నడుమ నడుమ బాధలేని శాశ్వతము నిత్యమునైన సుఖమును. అనఁగా మోక్షమును. ఇడెడున్ = ఇచ్చును. అనెడి=పలుకునట్టి. హరుఁడు = శివుఁడు. కృతిన్ = ఈగ్రంథమును. ఓమున్ = రక్షించుఁగాక.

రామా = 'సుందరీ రమణీ రామా' యని నిఘంటువు. అందగత్తెకుఁ బేరు. రామా మొదలు ఇడెడువఱకుఁ గలది శివుఁడు పార్వతి నుద్దేశించి పలికిన వాక్యము. సామాన్యసంభాషణమందును రామనామ మేవిధముగనైన నెన్నిమార్లుచ్చరించిన నంతశ్రేయమను తలంపుతో నాపేరు పలుమాఱు వచ్చునట్లు శివుఁడు పార్వతిని సంబోధించుచున్నాఁడు.

'రమణీ' విష్ణుసహస్రనామములకు సరియయినది రామ యను నామము. ఇదియే జననమరణము లనెడి సంకటములను వారించి శాశ్వతనిత్యానందమును

గలిగించును.' అని పార్వతికి నుపదేశించిన శంకరుఁడీ కృతిని రక్షించునుగాక. రామనామము జపముచేయువాఁడు రామాయణమును రక్షించుట విహిత కృత్యమేకదా.

ఈ సందర్భమునఁ 'బద్మపురాణమునందలి యీశ్లోకముల ననుసంధించుచునది.

'శ్రీరామ రామ రామేతి, రమే రామే మనోరమే, సహస్రనామత త్తుల్యం, రామనామవరాననే' ఓపార్వతీ! శ్రీరామరామరామయని రామచంద్రమూర్తి యందే నేను రమించుచుందును. ఆవిష్ణుసహస్రనామములకు రామనామము సమానము. అనియుపదేశించెను. కటపయాది సంఖ్యప్రకారము రామ=౨ X ౫=౧౦ కావున రామ రామ రామ ౧౦ X ౧౦ X ౧౦=౧౦౦౦ రామ యను రెండక్షరముల మంత్రము పండ్రెండులక్షలమార్లు జపించినను సర్వాభీష్టఫలసిద్ధి యగును.

"శుద్ధస్ఫటిక సంకాశం, కేవలం మోక్షకాంక్షయా
చింతయన్ పరమాత్మానం, ద్వాదశలక్షం జపేన్మనుం
ద్వ్యక్షరో మంత్రరాజోయం, సర్వాభీష్టప్రదం తతం.
—రామరహస్యోపనిషత్తు.

ఈరామపదముచే నుపాసింపఁబడు మూర్తి యెవరు? కొందఱు చెప్పునట్లు రూపనామక్రియలులేని శుద్ధచైతన్యమా? అవతారమూర్తియై యవని నవతరించి యయోధ్యయందుండి రావణాదిరాక్షసుల వధించినట్లు శ్రీమద్రామాయణమునఁ జెప్పఁబడిన మూర్తియా? ఈవిషయమును రామతాపన్యుపనిషత్తిట్లు చెప్పుచున్నది.

శ్లో॥ చిన్మయే స్మిన్ మహావిష్ణౌ, జాతే దాశరథే హరౌ
రఘోః కులే ఖిలం రాతి, రాజతే యో మహీస్థితః
స రామ ఇతి లోకేషు, విద్వద్భిః ప్రకటీకృతః
రాక్షసా యేన మరణం, యాంతి స్వోద్రేకతోథవా
రామనామ భువి ఖ్యాత, మభిరామేణవా పునః
రాక్షసా న్మర్త్యరూపేణ, రాహుర్మనసిజం యథా
ప్రభాహీనాం స్తథా కృత్వా, రాజ్యార్హాణాం మహీభృతాం
ధర్మమార్గం చరిత్రేణ, జ్ఞానమార్గంచ నామతః
తథాధ్యానేన వైరాగ్య, మైశ్వర్యం స్వస్య పూజనాత్
తథారాత్యస్య రామాఖ్యా, భూమి స్యా దథ తత్త్వతః
రమంతే యోగినో నంతే, నిత్యానందే చిదాత్మని
ఇతి రామపదే నాసౌ, పరబ్రహ్మాభిధీయతే.

అర్థము:- జ్ఞానమయుఁడై హరియై మహావిష్ణువై యెవఁడు రఘువంశంబున దశరథునకుఁబుట్టి సర్వదాతయై రాజిల్లుచు మహియందుండెనో యతఁడు రాముఁడని జ్ఞానులు ప్రకటించిరి. ఎవనిచే రాక్షసులు మరణమునొందిరో యతఁడు రామచంద్రమూర్తియని అభిరాముఁడని చెప్పఁబడును. రాహువు మనసిజము (చంద్రుని) వలె నెవఁడు రాక్షసులను మనుష్యరూపమున తేజోహీనులఁ జేసెనో వాఁడు రామచంద్రమూర్తి. రాజర్హులైన మహీపతులవంశముల నెవఁడు భూమిపై స్థాపించెనో యతఁడు రామచంద్రమూర్తి. తననడవడిచే ధర్మమార్గమున, పేరుచే జ్ఞానమార్గమున, ధ్యానముచే వైరాగ్యమును తన్నుఁ బూజించువారికి నైశ్వర్యమును నెవఁ డిచ్చునో వాఁడు యథార్థముగ రామచంద్రమూర్తి. అనంతుఁడు నిత్యానందుఁడు (సత్యానందుఁడు- పాఠాంతరము. పాద్మపురాణము- పుట-౨౩౮) జ్ఞానస్వరూపుఁడున్నైన యెవనియందు యోగులు రమించుచున్నారో అట్టి యీరాముఁడే పరబ్రహ్మ మని చెప్పఁబడుచున్నాఁడు. జ్ఞానమయశరీరుఁడును రెండవవాఁడు తనయంతటివాఁడు లేనివాఁడును అపరిచ్ఛిన్నుఁడును ఒకవిధమైన శరీరములేక యాకాశాది నానావిధశరీరముల ధరించువాఁడును నగు బ్రహ్మము రూపము కల్పించుకొనుట యుపాసకులనిమిత్తమేకాని స్వప్రయోజనమునకై కాదు. బ్రహ్మమునకు రూపము నుపాసకులు కల్పించుచున్నారనుట సరిగాదు. భక్తపరాధీనుఁడగు భగవంతుఁడు భక్తులరుచికొలఁది రూపమును తానే ధరించి వారికిఁ బ్రత్యక్షమగుచుండును.

ఈ యుపనిషద్వాక్యమువలన 'యస్యాత్మా శరీరం' మన్నట్లు ఆత్మకు నంతర్యామియై యుండు పరమాత్మయే దశరథకుమారుఁడని కౌసల్యానందనుఁ డని సీతాపతి యని ఖరదూషణరావణాదిరాక్షసహంత యని యయోధ్యాపతి యని పేరొందిన శ్రీరామచంద్రమూర్తి అని యేర్పడెను.

ఘోరాములకు = సంకటములకు. ఇదియు పోవచ్చునను క్రియనుండి కలిగిన వ్యతిరేకభావార్థకరూపము. శ. ర. "నీ పీయులభ్యరత్నంబు దాపవలయు, ప్రాణంబుపై వచ్చునంతటి ఘోరామియందును నెవ్వరి కెఱింగింపకుండునది."
—హరి. పూ. ౩. ఆ. ఘోరాములు = మరణజననములు.

ఉ॥ శ్రీను సురార్థమై విషము • మ్రింగుట డాయుట స్థాణ్వపస్మృతిక్
సామజి ద్యోనదిందు లవి • చక్కఁ దొలంపఁగరాని రామనా
మామృతభుక్తిఁ జేవఁగొని • యంది మహేశ్వరసర్వమంగళా
త్మామితభూతి, మీఱెడు శివాఽసమకల్పలతల్ కృతిశ్రముల్. ౭

అర్థము.

ఇది పార్వతీపరమేశ్వరుల స్తుతి.

సురార్థమై = దేవతల రక్షించుకొఱకు. ప్రేమన్ = అనురాగముచే. విషముమ్రింగుట = పాలసముద్రమునందుఁ బుట్టి లోకములఁ గాల్చుచున్న హాలాహల విషయమును మ్రింగుటచేత శివుఁడును. డాయుటన్ = ఆయనను దానిని సమీపించుటచేఁ బార్వతియు స్థాణుతన్ = స్థాణుత్వమును (1) 'స్థాణూ రుద్ర ఉమాపతి' యని శివునకుఁ బేరు కావున శివుఁడు స్థాణువగుటయు (2) చెట్లు బోదెవలె నగుటయు అపర్ణతన్ = అపర్ణ యనఁగాఁ బార్వతి. ఆకులు లేక పోవుట. అనఁగా శివుఁడు హాలాహలమును మ్రింగుటచే స్థాణువు = ఎండిపోయిన చెట్టుబోదెవలెను, పార్వతి ఆ విషమును సమీపించుట కారణమున దావాగ్ని సెగకు కమరి ఆకులు రాలిపోయిన చెట్టువలె నగుటను. సాపెన్ = సగము తయించి. శివుఁ డర్ధనారీశ్వరుఁడు. సగము దేహము శివుఁడు, సగము దేహము పార్వతి గావున నిట్లు శుష్కించుటకుఁ గారణము విషము త్రాగుటచే నని హేతూత్ప్రేక్ష. ద్యోనదీందులు = ఆకాశగంగయుఁ జంద్రుఁడు. అవి = పార్వతీపరమేశ్వరుల కృశత్వమును. చక్కన్ = పూర్తిగా. తొలఁగరామి = తొలఁగింప రాకుండుటచే - అనఁగా విషతాపమును హరింప శీతోపచారమునిమిత్తము వారి తలమీఁద నాకాశగంగను, చంద్రుని నుంచినను బాధ మానినది కాదు. కావున నిరువురిశిరములందు గంగను చంద్రుని నుంచినట్లు చెప్పినను జెప్పవచ్చును. శివుఁడు గంగాధరుఁడు - చంద్రశేఖరుఁడు. పార్వతిని 'చంద్రకలావతంసే' యనికదా కాళిదాసు స్తుతించెను. రామనామామృతభుక్తిన్ = రామనామ మను నమృతమును భుజించుటచే. బాహ్యశైత్యోపచారము నిష్ప్రయోజన మవుటచే. చేవఁగాని = బలముగలిగి - లోపలికి మందిచ్చుటచే విషబాధ హరించుటయేగాక దేహమునకు బలము వచ్చెనని భావము.

మహేశ్వరసర్వమంగళాత్వామితభూతిన్ = మహేశ్వరత్వమును సర్వమంగళాత్వము ననెడి మితిమించిన సంపదచే (భూతిక బూడిద యనియు నర్థము కలదు. శివుఁడు విభూతిధరుఁడేకదా). అనఁగా నిచికిత్సచే బలకొని శివుఁడు మహేశ్వరుఁడయ్యెను, పార్వతి సర్వమంగళ యయ్యె నని భావము. అంది = పొంది - కలవారై. మీఱెడు = అతిశయించెడు, శివానసుకల్పలతల్ = శివుఁడు శివ యను పేరుగల యసమానకల్పవృక్షము - తీఁగెలు. కృతిత్రముల్ = ఈగ్రంథమును రక్షించునవి యగునుగాక.

తాత్పర్యము.

దేవతలనిమిత్తమై, లోకమునిమిత్తమై ప్రేమచే వారిని రక్షింపఁగోరి శివుఁడు సముద్రమథనకాలమున హాలాహలమును మ్రింగి యాతాపముచే మొద్దువారి

పోయెను. ఆయనప్రక్కనున్న పార్వతి యాసెగకు నాకులురాలిన చెట్టువలె నయ్యెను. అయ్యో! మననిమిత్తమయి వీరిట్లు సగమయిరే యని దేవతలు శీతోపచారములు చేయుచు నారిశిరములందు గంగను చంద్రుని నుంచిరి. కాని యవి ప్రయోజనపడవయ్యెను. అప్పుడు వైచికిత్స వ్యర్థ మని యెంచి రామనామామృతమును ద్రావం జేసిరి. ఆయమృతబలమువలనఁ దాపము హరించి బలము గొని శివుఁడు మహేశ్వరుఁ డయ్యెను. పార్వతి సర్వమంగళ యయ్యెను. ఇట్లు రామనామముచే బాగుపడినవారు గావున పార్వతీపరమేశ్వరు లీ రామాయణమును రక్షింతురుగాక యని తాత్పర్యము.

మహేశ్వరుఁడు = గొప్ప యైశ్వర్యముతోఁ గూడినవాఁడు. సర్వమంగళ = సమస్తమైన శుభములు గలది. అపర్ణ=శివునిఁగూర్చి తపస్సు చేసినపుడు పార్వతి యాకులనైన నాహారముగఁ గొన్నది కాదు. కావున నపర్ణయని పేరుపొందెను. స్థాణువు = ప్రలయమందు నుండువాఁడుగనుక స్థాణువు - ప్రలయము గావించువాఁ డాయనయే కదా. శివ + అసమ, శివా + అసమ = శివాసమ - ఏకశేష వృత్తి. శివాచ + శివశ్చ = శివౌ యని గ్రహింపవలయును. శివులు అసమాన కల్పలతలు. కల్పలతలని దానమందు సమానములైనవి చింతామణి కామధేను మందార హరిచందనాదులు కలవు. అదియునుగాక కల్పాదులందు దాన గుణము కలదేకాని రక్షాగుణము లేదు. ఈ కల్పవృక్షములో దేవతలను లోకములను రక్షింపఁగోరికదా విషమును మ్రింగెను. ప్రేమ=లోకమునఁ గావఁ గోరివిషమును మ్రింగువారు కలరు. విషస్య విషమౌషధ మన్నట్లు విషమును బొరపాటున మ్రింగి యది హరింప వేఱొకవిషమును మ్రింగువారు కలరు. కాని లోకరక్షణార్థమై పరులకై తాము విషము మ్రింగువా రెందుఁ గలరు? తన ప్రాణములయందుండు ప్రేమకన్న లోకులయందుఁ బ్రేమ యతిశయించుటచేఁ గదా శివుఁ డట్లు చేసెను? పార్వతి దాని నంగీకరించెను. అట్లుగాకున్న నేయిల్లాలు తనమగఁడు విషము మ్రింగుదు ననిన నంగీకరించును? కల్పవృక్షము స్థావరము - శివకల్పవృక్షము చేతనము. రక్షాశక్తి గలది. కావున నీకల్పవృక్షములకు స్వర్గమండలి కల్పవృక్షములు సమానములు కావు.

ఉ॥ శ్రీరఘురామపాదసరసీరుహయుగ్మము నాత్మ నిల్పి, కూ
పారము దాఁటి, విఘ్నములఁ బాఱఁగఁ దోలుచు, లంకఁ జొచ్చి, సీ
తారమణీమణిం గని, ముదంబున గూర్చి, రఘూత్తమాంఘ్రిసే
వారతి మీఱు పావని శివంకరుఁడై వెలయించు మత్కృతిన్. ౭

అర్థము.

ఇది రామదాసుఁ డగునాంజనేయ స్తుతి. శ్రీ రఘురామపాదసరసీరుహయుగ్మము = శ్రీమంతుఁడై రఘువంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తి

యొక్క పాదకమలములజంటను. ఆత్మ నిలిపి = మనస్సునం దుంచుకొని. ఆబలముచే. కూపారముల్ = సముద్రమును . దాఁటి = తరించి . రామనామమును మనస్సున దృఢముగా నిల్పఁగా దానిమహిమవలనఁగలిగిన బలముచే హనుమంతుఁడు సముద్రమును దాఁటెను, లంకలోఁ జేయవలసిన కార్యములు చేయఁ గలిగెను గాని, తన కేవలదేహబలముచేఁ గా దని భావము ఇది యాంజనేయుఁడే 'శ్లో॥ నూనం రామప్రభావేన వైదేహ్యాస్సుకృతేనచ, యన్మాం దహనకర్మాయం నాదహ ద్ధవ్యవాహనః॥' రామప్రభావముచేతను సీతాదేవిపాతివ్రత్యమహిమచే ను వారిదాసుఁడనైన నన్నగ్నిహోత్రుఁడు దహింపఁ జాలఁడయ్యె 'శ్లో॥ సీతాయా శ్చానృశంస్యేన తేజసా రాఘవస్యచ, పితుశ్చ మమ సఖ్యేన నమాం దహతి పావకః' సీతాదేవికృపచేతను - రాముని తేజస్సుచేతను- నాతండ్రికి స్నేహితుఁ డగుటచేతను అగ్నిహోత్రుఁడు నన్నుఁ గాల్పఁడు- అని యంగీకరించెఁగదా. విఘ్నములఁ బాఱఁగఁ దోలుచున్ = విఘ్నములు దూరముగఁ బరువెత్తునట్లు చేయుచు మైనాకుఁడు - సురస - సింహిక - లంక వీరు గావించినవిఘ్నముల నూహించునది. లంకన్ = లంకయందు. చొచ్చి = ప్రవేశించి. సీతామణీమణిన్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలయిన సీతాదేవిని. కని = చూచి. ముదంబునఁగూర్చి = ఆమెకు సంతోషముఁ గలిగించి. మరల వచ్చి. రఘూత్తమాంఘ్రిసేవారతి = శ్రీరాములచరణముల యందలిప్రీతిచేత, మీఱు = అతిశయించు. పావని = పవనునికుమారుఁడగు నాంజనేయుఁడు. శివంకరుఁడై = శుభము కలిగించువాఁడై. ఈకృతిన్= ఈగ్రంథమును. వెలయించున్ = ప్రసిద్ధికెక్కఁ జేయునుగాక.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తిచరణారవిందద్వంద్వము హృదయంబున నిలిపి, విఘ్నముల నివారించుచు సముద్రమును దాఁటిపోయి, లంకలోఁ బ్రవేశించి, సీతను వెదకి చూచి, యామెకు ధైర్యము చెప్పి, సంతోషపఱిచి, మరలవచ్చి, శ్రీరామచంద్రులపాదసేవఁ జేయుచుండు పావనచరిత్రుఁడైన హనుమంతుఁ డీ ప్రబంధమును బ్రసిద్ధికెక్కఁ జేయునుగాక.

శ్రీరామచరణారవిందముల సదా ధ్యానించుచు, సంసారసాగరము దాఁట యత్నించి, నడుమ నడుమ బంధులవలనను, స్త్రీలవలనను, శత్రువులవలనను గలిగెడి విఘ్నములనెల్ల నివారించుచు, లోచూపుగలవాఁడై యాత్మాన్వేషణము గావించి యాత్మసాక్షాత్కారము గలవాఁడై యాత్మసంతుష్టి గలవాఁడై దేహాభిమానమును దగ్ధముచేసి (లంకాదహనము) మరల శ్రీరామపాదసేవ యందే యాసక్తి గలిగిన పవిత్రచరిత్రుఁడైన సాధకుని కృష్య మీపద్యమునఁ

జెప్పఁబడెను. ఈయర్థమున హనుమంతుఁ డనఁగా పవిత్రమైన మనస్సు గలవాఁ డని గ్రహింపవలెను. ఆత్మావలోకనమై దేహాభిమానము వదలించుకొనిన పిమ్మట భగవద్ధ్యానము చెప్పుటచే భక్తుఁ డాత్మావలోకనముతోనే తనయభ్యాసము నిలుపరాదనియుఁ దరువాతకూడ భగవత్సేవచేసి భగవదనుగ్రహము సంపాదింపవలయు ననియు గ్రహింపవలెను. ఆత్మావలోకనమువలనఁ గలుగు కైవల్యముక్తినిగూడ భక్తుఁడు స్వర్గాదిసుఖంబులవలెఁదుచ్ఛముగానేచూచును. సీతను రాముని కొప్పగించుటకు సంతుష్టిపడని హనుమంతునివలె భక్తుఁ డాత్మను భగవంతునియొద్దఁ జేర్చుటకు (దీనికే సాయుజ్య మని పేరు) భగవత్సేవ యనుకృషి (కరచరణాదులతోడఁ జేయుకార్యములేకున్న మానసికముగానైన) చేయక మానఁడు. "శ్లో॥ యస్త్వాత్మరతిరేవ స్యా, దాత్మతృప్తశ్చ మానవః, ఆత్మన్యేవచ సంతుష్ట, స్తస్య కార్యం నవిద్యతే." భ.గీ. ౩-౧౭.

అను వాక్యముచొప్పున నాత్మనిష్ఠునకు చేయవలసినకార్యము లేదని యెప్పుడు చుండఁగా మరల భక్తిచేయు మనెడి వేల యని ప్రశ్నింపరాదు ఏలనఁ జేయవలసినకార్యమే లేదని యాత్మనిష్ఠుఁడు శ్వాసముఁ బీల్చఁడా? ఆహారముఁ గైకొనఁడా? మలమూత్రములు విడువఁడా? తెప్పలు వ్రాల్పఁడా? మూయఁడా? ఆత్మధ్యానము కార్యముకాదా? కావున నాత్మనిష్ఠునకుఁ జేయవలసిన కామ్యకర్మములు నైమిత్తికకర్మములు యోగసాధనములు ప్రాణాయామాదులు లేవని యర్థమే కాని భగవద్భక్తి నిషిద్ధమని యర్థము కాదు. ఈశ్వరునందుఁ బరమప్రీతికి భక్తి యనిపేరు. అదిలేని సమస్తసాధనములు వ్యర్థములు. శ్లో॥ యోగినామపి సర్వేషాం, మద్గతేనాంతరాత్మనా, శ్రద్ధావాన్ భజతే యో మాం, స మే యుక్తతమోమతః. భ.గీ.౬-౪౭. అర్జునా! యోగులందఱిలో నంతరాత్మ నాయందు నిలిపి శ్రద్ధగలవాఁడై యెవఁడు భక్తిచేయునో వాఁడు యోగసిద్ధి పొందినవారలలో శ్రేష్ఠుఁ డని నాయభిప్రాయము, అని శ్రీకృష్ణభగవానులే సెలవిచ్చిరి కదా. లోకమున శుకమహర్షిని మించిన జ్ఞానిగాని యోగిగాని విరాగిగాని లేఁడుకదా? ఇట్టివాఁడు భక్తిరసపూరితమైన భాగవతము మేల యధ్యయనము చేసెను, ఏల పరీక్షిత్తున కుపదేశించెను, అని ప్రశ్నరాఁగా నెట్టిజ్ఞానులకైనను నెట్టియోగులకైనను భక్తియే సేవ్య మని చెప్పఁబడెను.

"ఇట్లు భాగవతంబు నిర్మించి మోక్షార్థి యైనశుకునిచేఁ జదివించె నని చెప్పిన విని శౌనకుండు నిర్వాణతత్పరుండును సర్వోపేక్షకుండును నైన శుకయోగి యేమిటికి భాగవతం బభ్యసించె ననవుడు సూతుం డిట్లనియె.

క॥ ధీరులు నిరపేక్షులు నా,త్మారాములు నైన మునులు॰ హరిభజనము ని
ష్కారణమ సేయుచుందురు,నారాయణుఁ డట్టివాఁడు॰నవ్యచరిత్రా. భాగ.౧-౧౩౭.

క॥ హరిగుణవర్ణనరతుఁడై । హరితత్పరుఁడైన బాదరాయణి శుభత
త్పరతం బఠించెఁ ద్విజగద్వరమంగళ మైన భాగవతనిగమంబుల్. భాగ.౧-౧౩౮.

ఈకాలమున శ్రీరామకృష్ణపరమహంసగారిని మించినవారు లేరుకదా. అట్టివారు సమాధ్యంతము యోగము సాధించియు బాలరామునితో (విగ్రహముతో) నాడుకొనుచుండినట్లు లాయనచరిత్రము చెప్పుచున్నది. కావున నిశ్శ్రేయసకాలములైనవారి కెవ్వరికైనను హనుమదాచార్యుఁడు చూపించిన మార్గమే యనుష్ఠేయము.

పావని = పవనునికుమారుఁడు. పవనుఁడు అనఁగా (1) పవిత్రముచేయువాఁడు, (2) శోధించువాఁడు. ఇట్టివానిపుత్రుఁడు అట్టివాఁడుగాక యెట్టివాఁడగును? లంక = లం + క = లం అనునది పృథివీతత్త్వమును దెలుపు బీజాక్షరము. పృథివీతత్త్వ మెక్కువగాఁ గలిగినది దేహము. కావున లంక యనఁగా దేహము. "లఙ్కా భూమౌ భయే చాహ్లాదనేపిచ" యని విఘంటువు. ఈప్రబంధము వివరింపఁబోవు నీపద్యమునందలివిషయమే కావున నిశ్శ్రేయసార్థులైన భక్తులు తమవలెఁ దక్కినవారును దరించుటకై యీగ్రంథమును లోకమునఁ బ్రసిద్ధి చేయుదురుగాక.

ఉ॥ శ్రీమహిళాయనంబును, బ్రకృష్టసుకాండము, స్వాదుసద్రసో
ద్దామగభీరతాధ్వనివిధాలసితంబు, మనోహరంబు నౌ
రామకథాసుధాంబునిధిఁ ద్రచ్చి, బుధుల్ విమలామృతోజ్జ్వలుల్
గా, మహిఁ జేయు నాదికవిఁ గంజజుఁ బ్రాంజలినై భజించెదన్. ౮

సంస్కృత కవీంద్రనతి.

అర్థము.

శ్రీమహిళాయనంబును = (౧) శ్రీ = లక్ష్మీదేవియవెడు. మహిలా = స్త్రీకి. అయనంబును = వాసస్థానమును "అయనం నిలయేమార్గే" నానా.ర. ఇది పాల సముద్రముపర్యాయమైన యర్థము. (౨) శ్రీ = లక్ష్మీస్వరూపిణియగు. మహిలా = మహి + లా = "లఃఖండనే త్రిష్వాదానే స్త్రీ" నానా.ర. భూమిచేఁ బుత్రికగా గ్రహింపఁబడినదికావున మహిల యనఁగా సీతాదేవి ఆమెయొక్క, అయనము = చరిత్రము - రామాయణపరమైనయర్థము. ప్రకృష్టసుకాండము = (౧) మిక్కిలి శ్రేష్ఠమైనరసము (పాలు) గలది, (౨) మిక్కిలి శ్రేష్ఠములైన కాండము లను విభాగము గలది. అనఁగా నొక్కొక్కకాండము పఠించిన నొక్కొక్క శ్రేయస్సు గల దని భావము. స్వాదు లసితంబు = (౧) స్వాదు = పాలు కావునఁ దియ్యఁదనముయొక్కయు సద్రస = కావుననే మంచిరుచియొక్కయు, ఉద్దామగభీరతా = మిగుల లోఁతుయొక్కయు, ధ్వని = అలలచప్పుడు

యొక్కయు, విధా = ఆధిక్యముచే, లసితంబు = ప్రకాశించునది. (౨) స్వాదు = మధురమైనది. ఎన్నిమార్లు చదివినను మరల మరలఁ జదువ నాశ గలిగించునది-రామాయణము "యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్, అతృప్త" యని రామకథామృతసముద్రమును సర్వదా త్రాగుచుండినను దృప్తికలుగలే దనికదా చెప్పఁబడెను. అగస్త్యుఁడు త్రావినది యుప్పునీళ్లసముద్రము. కావున నొకసారి త్రాగఁగానే రోఁతపుట్టి మరల నాయన యీవంక కీయకొనఁడయ్యె వాల్మీకియో రామకథామృతసాగరము పానముచేసెను. ఒకసారి కమ్మని పాలుత్రావినవాఁడు మరల నాకుఁ బాలు వలదనునా? సద్రస = (౧) మంచి నీళ్లతోఁగూడినది, (౨) "రసోవైసః" యన్నట్లు రస మనఁగా నానందము. రామాయణము మిగుల నానందముగలిగించునది. సద్రస = శృంగారహాస్యాదిన వరసములతోఁ గూడినది. ఉద్దామ గభీరతా = (౧) మిగులలోఁతైనది, (౨) రామాయణము మిగులలోఁతైన యర్థముగలది. ధ్వని = (౧) పాలసముద్రమలలచప్పుడుగలది, (౨) రామాయణము విశేషవ్యంగ్యార్థములు గలది. విధా = అతిశయముచే లసితంబు = ప్రకాశించునది మనోహరంబు = మనస్సు నాకర్షించునది. రామకథాసుధాంబునిధి = శ్రీరామచరిత్ర మనెడి పాలసముద్రమును. ద్రచ్చి = మథించి. బుధుల్ = (౧) దేవతలు, (౨) జ్ఞానముగలవారు. విమల = నిర్మలమైన, అమృతోజ్జ్వలుల్ = (౧) అమృతపానముచేఁ దేజోవంతులైనవారు, దేవతలు లంకనుండు దుర్వాసోముని శాపముచే నిశ్శ్రీకులై తేజోహీనులై యుండిరి, (౨) మోక్షసుఖముచేఁ బ్రకాశించువారు. శ్రద్ధాభక్తులతో రామాయణమును బఠించువారు. కాన్ = అగుటవల్ల - మహిన్ = భూమియందు పాలసముద్రములోఁబుట్టిన యమృతమును త్రావినవారు దేవతలు స్వర్గమం దుండువారు. అంతకుమించిన యమృతత్వము భూలోకమున మనుష్యులకుఁ గలిగింపఁ బరోపకారబుద్ధి శ్రమించినవాఁడు వాల్మీకి. ఆదికవి = కవులయందు మొదటివాఁడు. వాల్మీకికిముందు కావ్యము రచించినకవి లేఁడు. వేదములందు శ్లోకము లున్నను నవి నియమరహితములై చాలుమూలలేనివై యున్నవి. శ్లోకముల నియమబద్ధముచేసినవాఁడు వాల్మీకియే. కావున నాయనకు నాదికవి యని బిరుదము. "ఋషేప్రబుద్ధోసి, వాగాత్మని బ్రహ్మణి తద్బ్రూహి రామచరితమ్। అవ్యాహతజ్యోతి రార్షం తే ప్రాతిభం చక్షుః। ఆద్యఃకవి రసి" అని బ్రహ్మవాక్యము - ఉత్తరరామచరిత్ర. కంజజుఁడ = బ్రహ్మను. కమలమందుఁబుట్టినవానిని. ప్రాంజలినై = రెండుచేతులు జోడించినవాఁడనై. భజించెదన్ = సేవించెదను. వాల్మీకిని బ్రహ్మ యనుట నిష్కారణస్తుతి గాదు. ఇరువురకు సామ్యము గలదు. (౧) ప్రపంచసృష్టియందుఁ బ్రథమకర్త బ్రహ్మ. కావ్యసృష్టియందుఁ బ్రథమకర్త వాల్మీకి. (౨) ఈసృష్టియందు "మ. జగదుత్పాదనబుద్ధి బ్రహ్మకు

మదిఁ సంధింపఁగా నెంచియే, భగవంతుండు సరస్వతిం బనుపఁ "ప్రద్యోస్యతా నవ్విభుఁ, మగనింగా వరియించి తద్భువనసామ్రాజ్యస్థితిఁ సృష్టిపాలనలం జేసెఁ మును" అని శ్రీభాగవతమునఁగలదు. అట్లయితే కావ్యసృష్టికై బ్రహ్మచేఁ బనుపఁబడి సరస్వతి వాల్మీకిజిహ్వయందు నిలిచి రామాయణము రచింపఁజేసెను. (౩) సృష్టికిఁ బూర్వము తొలుత భగవంతునిచే 'తప తప' యని యుపదేశింపఁబడి తపస్సుచేసి యావల బ్రహ్మ లోకముల సృజించెను. వాల్మీకియుఁ దపస్వియై తపోబలంబున రామాయణము రచించినట్లు ముందు చెప్పఁబడును. (౪) బ్రహ్మసృష్టి జీవకోటి యుపకారార్థము. వాల్మీకికృతియు లోకోద్ధారణనిమిత్తము. (౫) బ్రహ్మదేవుఁడు వేదముల నాధారముచేసికొని 'ధాతా యథా పూర్వ మకల్పయ' త్తనునట్లు నామనామి సృష్టి సలిపెను. వాల్మీకియు 'వేదైశ్చ సమ్మితమ్' 'వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా' యన్నట్లు వేదమునే రామాయణరూపముగ నుపబృంహణముగ రచించెను. (౬) బ్రహ్మ కమలము నుండి వెలువడెను. వాల్మీక పుట్టలోనుండి వెలువడెను.

ఈగ్రంథమున ఫలశ్రుతి యుత్తరకాండమున నిట్లు చెప్పఁబడెను.

కం॥ మానని శ్రద్ధను శ్రీసీతానాయకుచరిత వినఁ ధన్యుఁడు ఘోరా
ఘానీకంబులఁ బాయుచుఁ । దా నెలకొను విష్ణుసన్నిధానమునందున్.

ఆ॥ వె॥ ఆదికావ్య మిద్ది యార్షంబు పూర్వంబు, వల్మీకోద్భవర్షి భాషితంబు
నియతి భక్తిచేత నిరతంబు వినువారు, హరిగాఁగ విష్ణు రూపుఁగాంచు.

కం॥ నిరతము రామునిచరితముఁ । బరమతి నాకర్ణించువాఁడు భక్తివశమునన్
బరిపూతుండై బహువత్సరములు జీవించి మోక్షసంగతి నెలయున్.

ఈరామాయణమును వినుటచేఁ బరిశుద్ధులగువారు విన్నవారుమాత్రమే కాదు.

కం॥ జనకుండు జనకజనకుఁడు । జనకునితాతయును గనిన జనకుఁడును ద
జ్జనకుఁడును విష్ణులోకంబున నిలుతురు రామకథను బొరిఁబొరి విన్నన్.

ఈరామాయణమును విన్నవారికే యిట్టిఫలము గలుగఁగా జదివినవారి కెట్టిఫలముగలదో.

శ్లో॥ ఇదం పవిత్రం పాపఘ్నం, పుణ్యం వేదైశ్చ సమ్మితమ్,
యః పఠే ద్రామచరితం, సర్వపాపైః ప్రముచ్యతే.
ఏత దాఖ్యాన మాయుష్యం, పఠన్ రామాయణం నరః,
సపుత్రపౌత్ర స్సగణః, ప్రేత్య స్వర్గే మహీయతే. బాల. ౧. ౯౮-౯౯.

పవిత్రులను జేయునట్టిదియు, పాపముల ధ్వంసముచేయునట్టిదియు, పుణ్యఫల మిచ్చునదియు వేదములతో సమానమైనదియు నగు నీరామాయణము నెవఁడు చదువునో వాఁడు ఆగామిసంచితములైన పాపములచేమాత్రమే ~~కాక~~

ప్రమాదమువలనఁ గలిగిన యుత్తరాఘంబుచేతను బూర్ణముగా విడువఁబడును. ఆయుస్సును వృద్ధిచేయు నీరామాయణము నెవఁడు చదువునో వాఁ డీలోకము నందుఁ బుత్రపౌత్రసేవకులతో సుఖించి మరణింప వారితోడ మోక్షమును బొందును. ఈరామాయణమును వినెడివాఁడు తనవంశమువారినిమాత్రమే తరింపఁజేయును. చదివినవాఁడు తనయందు భక్తివిశ్వాసములుగల పరిజనమును గూడ ముక్తులఁ జేయును. ఇట్టిగ్రంథమును రచించిన వాల్మీకిమహర్షి వంద నీయుఁ డగుట కేమి సందియము ? అట్లు నమస్కరింపనివారు కృతఘ్నులు. పూర్ణ శ్రద్ధాభక్తులుగలవారికిఁ బూర్ణఫలము కలదు. అల్పశ్రద్ధాభక్తులుగలవారికి సల్ప ఫలమే. శ్రద్ధాభక్తులులేనివారికి శ్రమమమాత్రము ఫలము. శ్రద్ధానసారము ఫలము.

విమలామృతము = పాలసముద్రమునఁ బుట్టిన యమృతముఁ ద్రావిన దేవతలకుఁ బ్రలయమందు మరణము కలదు. అవల మరల జన్మము కలదు. అది యునుగాక యది యాయువును బెంచునేకాని పాపహారము కాదు. ఈరామా యణము పాపమును హరించి పునర్జన్మము లేకుండ ముక్తిసుఖమును గలిగించును.

ధ్వని యనఁగా మాటలవలనఁ దోఁచునర్థమే కాక విశేషార్థమునకు సంజ్ఞ. కావ్యమునకు ధ్వనియే ప్రాణము. పాలసముద్రములో మంచినీళ్లున్నట్లు చెప్ప వచ్చునా యని సందేహింపఁబనిలేదు. పాలవలె తెల్లని రుచిగల నీళ్లు కలదే పాలసముద్రము. 'క్షీరోదమథనం కృత్వా రసం ప్రాప్స్యామ తత్ర వై' పాల సముద్రమును మథించి యమృతమును బొందుద మని దేవతలు తలంచిరి. అని బాల. ౪౫-౧౭. 'అప్సు నిర్మథనా దేవ, రసస్తస్మా ద్వరస్త్రియః' నీళ్లను జిలు కఁగా రసము పుట్టెను. అందుండి యుత్తమస్త్రీలు జన్మించిరి. అప్పు లనఁగా నీళ్లు. దానినుండి పుట్టిరి కావున నాస్త్రీ లప్సరస లనఁబడిరి.

తా త్ప ర్య ము.

లక్ష్మీదేవికి స్థానమై, మంచినీరుగలదై, తియ్యనిరసము తెలియరానిలోఁతు విశేషధ్వని గలదై, మనోహరమైన పాలసముద్రమును మథించిన దేవత లెట్ల మృతము ననుభవించిరో యట్టులే సీతాదేవిచరితంబున బాలకాండము అయో ధ్యాకాండము లోనగు నేడుకాండములు గలదియు, మనోహరమైన నవరస వర్ణనము, అర్థగాంభీర్యము, నానావిధధ్వన్యర్థములు గలదియు, ఒకసారి చదివిన మఱియొకసారి చదువుదమా యని మనస్సున కింపై యుండునదియు నగు నీరామాయణమును జదివిన వారికి నిహమందు సుఖము, పరమందు మోక్షము కలుగును.

క౦॥ పంచజనరక్షణార్థము, పంచమ వేదంబుఁ దెలియఁ • బల్కిన లీలా
పంచజన పంచముఖు న,భ్యంచితమతిఁ గొలుతు నార్యుఁ • బారాశర్యున్. ౯

అర్థము.

పంచజనరక్షణార్థము = మనుష్యులధర్మవర్తనులై - దురాచారముల పాలై చెడక సద్ధర్మ సదాచారపరులను జేసి కాపాడునిమిత్తమె. పంచమవేదంబున్ = శ్రీమహాభారతమును. తెలియన్ = వేదముచదువుట కధికారములేని స్త్రీలకు-శూద్రులకు బ్రహ్మక్షత్రియవైశ్యాభాసులకు సులభముగ బోధపడునట్లు "స్త్రీ శూద్రద్విజబంధూనాం త్రయీ న శ్రుతిగోచరా" భాగ-౧స్కం. "దీనవత్సలుం డయిన వ్యాసుండు స్త్రీశూద్రులకుం ద్రైవర్ణికాధములకు వేదంబులు విన నర్హం బులుగావు కావున మూఢులకెల్ల మేలగు నని భారతాఖ్యానంబుసేసి" ఆంధ్ర-భాగ-౧స్కం- ౮౭౪. లీలాపంచజనపంచముఖున్ = విలాసార్థముగా జనించిన నారాయణుని. ఆర్యున్ = గొప్పవానిని. పారాశర్యున్ = పరాశరునికుమారుఁడైనవ్యాసమహర్షిని, అభ్యంచితమతిన్=భక్తిచే నొప్పుమనస్సుచే. కొలుతున్=సేవింతును.

తాత్పర్యము.

జ్ఞానహీనమనుష్యుల నిహపరంబుల రక్షింపఁగోరి వేదము విన నధికారము లేని స్త్రీలు-శూద్రులు-నధమబ్రాహ్మణక్షత్రియవైశ్యులు ధర్మాధర్మము లెఱింగి బాగుపడుటకై శ్రీమహాభారతమును రచించిన వ్యాసమహర్షిని సేవించెదను.

పంచజనులు = అయిదు భూతములవలనఁ బుట్టినవారు. పంచజనపంచ ముఖుఁడు. నరసింహావతార మెత్తిన విష్ణువు. పారాశర్యున్ = పరాశరమహర్షికి ఉపరిచరవసువునకుఁ బుట్టినసత్యవతి యను క్షత్రియస్త్రీయందు జన్మించినవాఁడు. సత్యవతి బెస్తవానిచేఁ బెంపఁబడినదేకాని జాతిచేత బెస్తది కాదు.

పంచముఖము = వెడల్పయిన ముఖముగలది. కావున సింహమునకు పంచాస్య మని పంచముఖ మని పేరు. నాలుగువేదములలోని ముఖ్యాంశములు గలవుకావున భారతమునకు నైదవవేద మని పేరు.

సీ॥ ఏసత్కవీంద్రువా•చాసముజ్జృంభణ, వింతతాలము నేర్పు • వేధసతికి
నేవాక్ప్రతిపటిష్ఠ•వావదూకత తార్కి,కగజకోటికి సింహ•గర్జనంబు
ఏమహామహుమతి•రామానుజాచార్య,మతమహీసితపో(త్రి•మహితదంష్ట్రి)
యేవైష్ణవాగ్రణి•భావమార్గము ముక్తి, భామినీసౌధసో•పానపంక్తి

తే॥ యట్టికవితార్కికోగ్రపం•చాస్యమూర్తి, సాధునుతకీర్తి వైష్ణవ•చక్రవర్తి
ధీసురాచార్యు వేదాంత•దేశికార్యు, వేంకటాచార్యుఁ గొలుతు వే•వేలగతులఁ.౧౦

అర్థము.

ఏసత్కవీంద్రుఁ. .జృంభణ = ఏసుకవిశ్రేష్ఠుని వాక్కుయొక్క విశేషవికాసము. వేధసతికిన్ = సరస్వతికి. వింతతాలము = క్రొత్తతాలము. నేర్పున్ = నేర్పునో.

ఇచ్చట నొక్కయైతిహ్యము కలదు. 'కంచుఢక్కా' బిరుదముగాఁగల డిండిమభట్ట కవి వేదాంతదేశికులతోడ వాదమునకై వచ్చి 'యీఢక్కా నీవు వాయింపుము. ఆప్రకారము నేను కవిత్వము చెప్పెదను. నేను వాయించెదను, నీవు కవిత్వము చెప్పు' మని పన్నిదము చఱచెను. సర్వతంత్ర స్వతంత్రుఁడైన వేదాంతదేశికులు తానా ఢక్కాతీసికొని వివిధతాలములు శాస్త్రప్రకారము వాయించెను. ఆధాటికి సరిగా డిండిమభట్టు చెప్పలేక తికమకలాడి 'నేను వాయించెదను, నీవు కవిత్వము చెప్పు' మనెను. అట్లులే కానిమ్మని ఢక్కాయతనిచేతికిచ్చెను. అతఁడెట్టులైన కవితార్కిక సింహుని నోడింపవలె నని శాస్త్రమార్గము తప్పించి చేతికి వచ్చినట్లు తాఱుమాఱుగ వాయింపసాగెను. దానికిఁ దగినటులే వేదాంతదేశికులు రామాయణ కథ గద్యముగాఁ జెప్పెను. దానికే రఘువీరగద్య మని పేరు. ఈప్రకారముగ నాశుధారగ పాదుకాసహస్ర మని రాములపాదుకలపై వేయి శ్లోకములఁ జెప్పెను. ఇట్టి వనేకములు గలవు. ఇవి యీయన కవితాపాండిత్యసామర్థ్య మును దెలుపును. ఏవాక్పతి = ఏచతుర్ముఖునియొక్క. పటిష్ఠ = మిక్కిలి సామర్థ్య ముతోఁగూడిన. వావదూకత = యుక్తియుక్తముగ మాటలాడుట యందలి చాతుర్యము. తార్కికగజకోటికిఁ = తార్కికు లనెడి యేనుఁగులసమూ హమునకు. సింహగర్జనంబు = సింహముయొక్క కంఠధ్వని. అనఁగా సింహ గర్జనము విన్న యేనుఁగులగుంపు లెట్లు బెదరి పాఱునో యట్లు తర్కవా దము నీయన ప్రారంభింపఁగనే విపక్షతార్కికులు లేచి పాఱిపోదు రని భావ ము. ఈ కవిత్వతర్కశాస్త్రములందలి పాండిత్యాతిశయముచేతనే యీయ నకు కవితార్కికసింహుఁ డని బిరుదు గలిగెను. ఏమహామహుమతి = గొప్ప మహిమగలయెవ్వనిబుద్ధి. రామానుజాచార్యమత = విశిష్టాద్వైతమతము నుద్ధరించి శారీరమీమాంసకు భాష్యము వ్రాసి భాష్యకారు లని పేరొందిన శ్రీరామానుజాచార్యులవారి మనస్సనెడి. మహీ = భూమికి, సితపోత్రి = శ్వేతవరాహమూర్తియొక్క, మహితదంష్ట్ర = గొప్పకోఱ. రామానుజా చార్యులవారు స్థాపించిన విశిష్టాద్వైతమును భూమిని శ్వేతవరాహమూర్తి కొమ్మున నెత్తి సముద్రమున మునుఁగకుండ రక్షించినట్టు లీయన రక్షించె నని భావము.

ఈయనవ్రాసినగ్రంథములే లేకుండిన విశిష్టాద్వైతము నామావశిష్టమై యుండును.

ఏవైష్ణవాగ్రణి = వైష్ణవులందు గొప్పవాఁడైన యెవని. భావమార్గము = అభిప్రాయమార్గము. ముక్తి పంక్తి = ముక్తి కాంతయొక్క మేడమీఁదికిఁ బోవుటకు మెట్లవరుసయో అనఁగా ముక్తికాంక్షించువారి కయన చూపినదే మార్గము.

అట్టి = అటువంటిమహిమగల. కవితార్కికోగ్రపంచాస్యమూర్తి = కవితార్కికసింహబిరుదముగలవానిని. సాధునుతకీర్తి = సాధువులచే స్తోత్రము చేయఁబడినకీర్తిగలవానిని. వైష్ణవచక్రవర్తి = వైష్ణవులకెల్ల శ్రేష్ఠుఁడైనవానిని ధీసురాచార్యున్ = బుద్ధియందు బృహస్పతిని. వేదాంతదేశికార్యున్ = వేదాంతదేశికు లను ప్రఖ్యాతిఁ గాంచినవానిని. వేంకటాచార్యులన్ = వేంకటాచార్యు లనుపేరుగలవానిని. వేవేలగతులన్ = అనేకవిధముల. కొలుతున్ = సేవింతును.

ఈవేదాంతదేశికులు విద్యారణ్యస్వాములవారిసమకాలికుఁడు, సతీర్థ్యుఁడు. అయినను ఆయన భోగమార్గమును యీయన త్యాగమార్గమును నవలంబించినవారు. ఈయన కేవలవిరక్తుఁడై భిక్షాచర్యచే జీవించెను.

జృంభణశబ్దము చరిత్రాదులలోఁ జేరుటచే ముప్రత్యయము.

వేధశ్శబ్దము తిన్నమమున వేధశబ్దమగును. 'వేధప్రోధఘరోధనుఁడు'-సులభవ్యాకరణము నన్న. ౯౫ సూ ఇది సాధ్యసాంస్కృతికసమాసము.

తాత్పర్యము.

ఎవ్వఁడు సరస్వతీదేవిని స్తోత్రస్తోత్రతాలములప్రకారముగ నాడఁజేసెనో, ఎవనివాదవైఖరి తార్కికు లను నేనుఁగులకు సింహగర్జనమో, ఎవఁడు రామానుజాచార్యులవారు స్థాపించిన విశిష్టాద్వైతమును శ్వేతనరాహమూర్తి భూదేవినివలె నుద్ధరించెనో, ఎవని యభిప్రాయప్రకారము వర్తించువారు మోక్షలక్ష్మినిఁ జేపట్టెదరో అట్టి కవితార్కికసింహబిరుదుగలిగి సాధువులచేఁ బొగడఁబడు కీర్తిగలిగి వైష్ణవశ్రేష్ఠుఁడయిన వేదాంతదేశికులకు నమస్కరించెదను.

కం॥ కవికేసరి యన దేశిక, కవికే సరిగాక యితరుఁకవియుం గవియే?
పవిసఖనఖముఖభయదవపువు పులియుం బులియు నీఁగఁపులియుం బులియే? ౧౦

అర్థము.

వేదాంతదేశికవిషయమే మఱియొకపద్యంబునఁ జెప్పఁబడెను. కవికేసరి యనన్ = కవిసింహ మనియెడి పేరు. దేశికకవికే = వేదాంతదేశికు లను కవికే. సరిగాక = తగునగాని. ఇతరకవియున్ = కవి యని పేరు పెట్టుకొన్న యితరుఁడు. కవియే = కవి యగునా? ఎట్లన? పవి . వపువు = వజ్రాయుధముతో సమానమైన గోళ్లకొనలచే భయముకలిగించు దేహముగల. పులియును = పులియు. ఈఁగపులియున్ = ఈఁగపులి యని పేరుగల సాలెపురుగు. పులియే = పులి యగునా?

తాత్పర్యము.

వాఁడియై భయంకరమైన గోళ్లు గలిగి మృగములఁ జీల్చివైచుపులికిఁ బులి యను పేరుతగునుగాని సాలెపురుఁగునకుఁ దగునా? అటులే కవికేసరి యను బిరుదము దేశికకవికిఁ దగునుగాని యాపేరు పెట్టుకొన్నంతమాత్రమున నితరులకుఁ దగ దని తాత్పర్యము. కవిసింహబిరుద మాయనయందు సార్థక మని భావము.

తే॥ కాళిదాసుని రఘువంశ•కర్తఁ దెలిచి, పూతవాగ్ఖ్యాతి కాభవ•భూతి కెరఁగి
యల్ల జయదేవు వినుతమ•హానుభావు, రాజశేఖరుని మురారిఁ • బ్రస్తుతింతు. ౧౨

అర్థము.

రఘువంశకర్తన్ = రఘువంశ మను కావ్యమును వ్రాసిన, కాళిదాసున్ = కాళిదాసుఁ డను పేరుగల కవిని. తెలిచి = స్తుతించి. అభిజ్ఞానశాకుంతలము, మేఘసందేశము లోనగుగ్రంథములు వ్రాసినకవి యీయనయే. పూతవాగ్ఖ్యాతిన్ = పవిత్రమైనవాక్కనెడి సంపదగల. భవభూతికన్ = భవభూతికి. ఎరఁగి = నమస్కరించి. ఈయన పూర్వరామాయణమును, మహావీరచరిత్ర యను పేరను ఉత్తరరామాయణమును, ఉత్తరరామచరిత్ర యనుపేరను నాటకముగా రామకథ రచించెను. వినుతమహానుభావున్ = స్తోత్రముచేయఁబడిన గొప్ప మహిమగల. జయదేవున్ = ప్రసన్నరాఘవ మనుపేర రామచరిత్రమును నాటకముగా రచించిన జయదేవకవిని. రాజశేఖరున్ = రాజశేఖర కవిని. మురారిన్ = అనర్ఘరాఘవమును వ్రాసిన మురారికవిని. ప్రస్తుతింతున్ = స్తోత్రముచేయుదును.

తాత్పర్యము.

రఘువంశ మను గ్రంథమును రచించిన కాళిదాసకవిని మహావీరచరిత్ర ఉత్తరరామచరిత్ర వ్రాసిన భవభూతికవిని, ప్రసన్నరాఘవము వ్రాసిన జయదేవకవిని, బాలరామాయణము రచించిన రాజశేఖరకవిని, అనర్ఘరాఘవమును వ్రాసిన మురారికవిని వీరు రామచరిత్రమును వ్రాసినవా రగుటచే వీరిని నుతించెదను.

—• ఆంధ్రకవీశ్వరవినుతి. •—

క౦. అయకవితావిభవుల నన్నయ నెఱ్ఱాప్రెగడ దిక్క•నలఁ బూర్వకవి
త్రయము న్మూర్తిత్రయముం, ద్రయిఁబోలె నుతింతు నతశి•రస్కుఁడ నగుచున్.

ఇఁక నాంధ్రకవులు పొగడఁబడుచున్నారు.

అయకవితావిభవుల౯ = శుభమును గలిగించుకవిత్వమే సంపదగాఁగల. నన్నయ్య౯ = నన్నయభట్టనుకవిని (ఈయనయే శ్రీమహాభారతమును దెనిఁగింప నారంభించినవాఁడు). ఈయనకుముం దాంధ్రకవు లుండిన నుండురుగాక, లేకుండిన లేకపోదురుగాక, సంస్కృతమున వాల్మీకివలె నాంధ్రమునఁ గవిత్వమును స్థాయికిఁ దెచ్చి యాదికవి యని సార్థకబిరుదమును బొందినవాఁ డీయనయే. ఎఱ్ఱాప్రెగడ౯ = శంభుదాసుఁ డను బిరుదు వహించి రామాయణము రచించిన కవి యీయనయే. ఈయనయే యరణ్యపర్వశేషము, నృసింహపురాణము, హరివంశమును దెనిఁగించెను. ఈయనరామాయణము నామావశిష్టము. తిక్కన౯ = ఉత్తరరామాయణము వ్రాయ నారంభించిన కవి యీయనయే. ఈయనయే శ్రీమహాభారతము విరాటపర్వముమొదలు ౧౫ పర్వములను దెనిఁగించెను. పూర్వకవిత్రయము౯ = ఈపేర్లుగల ముగ్గురుకవులను. త్రయి = మూఁడు వేదములు. మూర్తిత్రయము౯. బ్రహ్మవిష్ణుమహేశ్వరులను నుతించినట్లు, నతిశిరస్కుఁడ నగుచు౯ = వంచినతలగలవాఁడనై, నుతింతు౯ = స్తోత్రముచేసెదను. ప్రగడ- ప్రగ్గడ అసాధురూపములు.

తాత్పర్యము.

ఆంధ్రభాషకుఁ దొలుత లక్షణ లక్ష్యభిక్షపెట్టిన నన్నయభట్టారకుని ఆయనమార్గ మవలంబించి యాయనపూనిన మహాభారతమును సాంగము చేసిన యెఱ్ఱాప్రెగడ తిక్కనలను వేదములు త్రిమూర్తులను స్తోత్రముచేసినట్లు స్తోత్రముచేసెదను. ఇందుఁ గాలక్రమ మనపేక్షితము. తిక్కనకు వెనుకటి కవి యెఱ్ఱాప్రెగడ.

సీ॥ ఆంధ్రీకరణశక్తి • నతకరించెను జాల, సర్వజ్ఞ లనఁబడు•సకలకవులఁ
బరమమధూక్తుల • భవ్యకవితఁ గూర్చెఁ, గొదదీఱ నమృతంబుఁ • గూరి కూరి
భక్తిరసైకసం•పద గర్భితముఁ జేసె, సకలరసావళి • శ్లాఘ్యరీతి
హరివర్ణనాసమ•యమునను స్వశరీర, విస్మృతి గనఁబడ • వెలసె నట్టి
తే॥ పోతనామాత్యు సత్కవి • పూగజాత్యుఁ, దిర్పితాదిత్యు రఘుపతి • ధ్యాననిత్యు
సహజపాండిత్యుఁ గృతకృత్యు•శస్తసత్యు,ధీసురామాత్యుఁ గొలిచెద•వాసిచెలఁగ.

అర్థము.

ఆంధ్రీకరణశక్తి౯ = సంస్కృతగ్రంథమును దెనుఁగున వ్రాయుసామర్థ్యమందు. సర్వజ్ఞ లనఁబడు సకలకవులన్ = సర్వజ్ఞ లని పేరుపొందిన కవీశ్వరులనందఱను, జాలన్ = మిక్కిలి, అతకరించెను. = అతిశయించెను. పరమమధూక్తులన్ = మిక్కిలితియ్యనైనమాటలచే. కొదదీఱన్ = కొఱఁతలేకయుండునట్లు. అమృతంబున్ = అమృతమును. కూరికూరి = ఎంతవఱకు కూరసాధ్యమౌ నంత యంత

వఱకు మీఁదమీఁద గట్టిపడునట్లు చొప్పించి చొప్పించి. భవ్యకవిత = శుభమై సౌభాగ్యమైన కవిత్వమును. కూర్చెన్ = కూర్చెను. సకలరసావళిన్ = అన్ని రసములసమూహములను. శ్లాఘ్యరీతి = పొగడఁదగినవిధముగ. భక్తిరసైక సంపదగర్భితము = భక్తిరసమే ప్రధానసంపదగా లోపల నిమిడియుండునట్లు. చేసెన్ = చేసెను. ఏరసము వర్ణించినను దానియందు భక్తిరస మిమిడియే యుండును. హరివర్ణనాసమయమునన్ = నారాయణునిస్తోత్రముచేయుసమయ మందు. స్తుతిపర్యాయమునందు వర్ణనా యనియు రూపముగలదు. స్వశరీర విస్మృతి = భక్తిపారవశ్యముచేఁ దనదేహమును మఱచి పోవుట. కనఁబడన్ = అగపడునట్లు. వెలసెన్ = వెలసెను. అట్టిపోతనామాత్యున్ = బమ్మెరపోతనా మాత్యుని. సత్కవిపూగజాత్యున్ = సుకవులసమూహమందు శ్రేష్ఠుని. 'పూగస్స్తు క్రముకే గణే' నానా. "జాత్య శ్శ్రేష్ఠకులీనయోః" నానా. తర్పితాదిత్యున్ = సంతోషపెట్టఁబడినదేవతలను సూర్యుని గలవానిని, రఘుపతిధ్యాననిత్యుఁ = శ్రీరామధ్యాన మెడఁదెగక చేయువానిని. సహజపాండిత్యుఁ = గురుశిక్ష లేకయే భగవదనుగ్రహమునఁ గలిగిన పాండిత్యముగలవానిని, కృతకృత్యుఁ = భూమిమీఁదఁ బుట్టి జన్మముసార్థకముచేసికొనుట కేకార్యము చేయవలయునో యది చేసినవానిని. శస్తసత్యుఁ = ప్రశస్తమైన సత్యగుణముగలవానిని, ధీసు రామాత్యుఁ = బుద్ధియందుబృహస్పతియైనవానిని, వాసి=మేలు. చెలఁగఁ = అతిశయింప. గొలిచెదఁ = సేవించెదను.

ఋ॥

తాత్పర్యము.

సంస్కృతగ్రంథమును దెనిఁగించుటయందు సర్వజ్ఞు లని పేరొందిన సకల కవీశ్వరులను రసపోషణమందు మించెనో, అమృతము కూరికూరి పోసిన ట్లైవని కవిత్వము భగవద్విషయమగుటచే శుభకరమై తియ్యనై చెవులపండువునై యుండునో, ఏరసము వర్ణించినను దానియందు భక్తిరస మిమిడియే యుండునో, భగవంతుని వర్ణించుచు వ్రాయునపుడు భక్తిపారవశ్యముచేఁ దనదేహము తానే మఱచిపోవునో, యటువంటి కవిశ్రేష్ఠుని, దేవతోపాసకుని, శ్రీరామ చంద్రచరణారవిందములను సదా డెందమందు నిలిపినవానిని, భగవదనుగ్రహ ముచే గురుశిక్షలేకయే పండితుఁడైనవానిని, శ్రీభాగవత మాంధ్రీకరించి యయాచితవృత్తి జీవించి జన్మసాఫల్యము కలిగించుకార్యముచేసినవానిని, సత్య వ్రతముగలవానిని, బుద్ధియందు బృహస్పతితో సముఁడైనవానిని, బమ్మెర పోతనామాత్యుఁ డను కవీంద్రునిఁ గొలిచెదను.

శ్రీభాగవతమును దెనిఁగించిన మహాకవి యీయనయే. ఈయన వీరభద్ర విజయ మను గ్రంథమును వ్రాసె నందురు కాని యది యీయన పేరు పెట్టు

కొని యొకఁడో యొక యపలక్షణకవి వ్రాసినదే కాని యాయన వ్రాసినది కాదు. (పోతరాజువిజయముఁ జూచునది). ఈకవి పరమభాగవతశిఖామణి. జన్మముచే శైవుఁ డయినను భక్తిచే వైష్ణవోత్తముఁడు. 'నరాణాం క్షీణపాపానాం, కృష్ణే భక్తిః ప్రజాయతే' పాపములన్ని నశించినఁగాని విష్ణుభక్తి జనింపదు. 'సుఖసంతానసిద్ధ్యర్థ' మనక 'శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై' యని గ్రంథంబుఁ బ్రారంభించినవాఁడు.' 'భాగవతముం దీనిం దెనిఁగించి నాజననంబుఁ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్' అని నిశ్చయబుద్ధిగలవాఁడు. శ్రీరామచంద్రమూర్తిచే "నీకు భవబంధంబులు తెగు" నని వరముపొందినవాఁడు. ఇంతటిభక్తవతంసమైనను, ఆజన్మమున ముక్తికి నాయనవృత్తి ప్రారబ్ధరూపమున నడ్డుపడినది. ఈవిషయమై మనుస్మృతివాక్యము లుదాహరించెదను.

శ్లో॥ వైశ్యవృత్త్యాపి జీవంస్తు, బ్రాహ్మణః క్షత్రియోపివా
హింసాప్రాయాం పరాధీనాం, కృషిం యత్నేన వర్జయేత్.

బ్రాహ్మణుఁడేని క్షత్రియుఁడేని వైశ్యవృత్తిచే జీవింపఁబూనినను భూమిలోని జంతువుల హింసించుటలోనగునవి కలిగి, యెద్దులు మొదలగు జంతువుల యధీనమైయుండు కృషిని (సేద్యమును) ప్రయత్నపూర్వకముగ వదలనలయును.

శ్లో॥ కృషిం సాధ్వితి మన్యంతే, సా వృత్తి స్సద్విగర్హితా
భూమిం భూమిశయాంశ్చైవ, హంతి కాష్ఠ మయోముఖమ్.

యాచనలేకుండుటచే, స్వతంత్రజీవనమగుటచేఁ గొందఱు కృషి శ్రేష్ఠమైనదని తలంతురు కాని యిది సజ్జనులు నిందించువృత్తి. ఏలన, నాఁగలికొఱ్ఱు పాఱ మొదలగునినుపమొనలుగల దున్నెడిసాధనములు భూదేవిని, భూమిలోని పెక్కుజంతువులను హింసించుచున్నవి. ఆ దోషము పోవ నాయన వేఱొకజన్మమెత్తవలసివచ్చెను. కాలవిలంబనమే కాని భగవద్వాక్యము వ్యర్థముగపోదు. భరన్యాసముచేసి కృషినైనను భగవత్సేవగాఁ దత్ప్రీత్యర్థ మని చేసియుండవచ్చునేమో గాని యదియైనను ఫలించియుండునా యని సందేహము.

శ్లో॥ నవేదబల మాశ్రిత్య, పాపకర్మ రుచి ర్భవేత్
అజ్ఞానాచ్చ ప్రమాదాచ్చ, దహ్యతే కర్మ నేతరత్. మను.

కొందఱు రామ రామ యనినఁ బాపముపోవునుగదా! నేను పాపము చేయుచుందును, రామ రామ యనుచుందు నందురు. ఇది కేవలదురభిప్రాయమని పై శ్లోకము తెలుపుచున్నది. అజ్ఞానమువలనఁ బొరపాటువలనఁ జేసినపాపములు వేదములందుఁ జెప్పిన ప్రాయశ్చిత్తములవలనఁ బోవునుగాని బుద్ధిపూర్వకముగఁ జేసినవి నశింపవు. మఱి యెక్కువశిక్షయుఁ గలుగును. అట్టులే పోతనామాత్యుఁడు

భరన్యాసముచేసియుండినను బుద్ధిపూర్వకముగ గ్రహించిన హింసాత్మకవృత్తి మఱుజన్మము రాకుండఁ గాపాడియుండదు.

అధఃకరించెను దీనితద్భవము అతకరించెను.

కం. తుచ్ఛుఁడు సరిగా దనినను, స్వచ్ఛపుఁబోతనకవిత్వ•సంపద చెడునే?
స్వేచ్ఛ జఱభి దూషించిన, నచ్ఛపతివ్రతను బాప • మంటుట గలదే? ౧౫

ఈపద్యము బమ్మెరపోతనవిషయమే.

తుచ్ఛుఁడు = నీచుఁడు. అల్పగుణము = అల్పబుద్ధిగలవాఁడు. సరిగాదనినను= ఈయన వ్రాసిన కవిత్వము సలక్షణముగా దని చెప్పినంతమాత్రమున. స్వచ్ఛపుఁబోతనకవిత్వసంపద = నిర్మలమై, శుద్ధమై, సలక్షణమైన పోతనామాత్యుని కవిత్వసంపద. చెడునే = చెడిపోవునా? పోదనుట. ఎట్లనఁగా. జఱభి = అంకుటాలు. స్వేచ్ఛన్ = తన యిష్టమువచ్చినట్లు. దూషించినన్ = నిందించినంత మాత్రమున. అచ్ఛపతివ్రతను = నిర్మలమైన శీలముగల పతివ్రతను. పాపమంటుట = పాపముపొందుటయు. కలదే = ఉన్నదా?

తా త్ప ర్య ము .

అంకుటాలొకతె యొకపతివ్రతను అంకుటా లని నోరార దూషించినంత మాత్రమునఁ బతివ్రత అంకుటా లగునా? అంకుశనముచేసినదోష మామె నంటునా? అంటదు. అట్టులే లక్షణలక్ష్యజ్ఞానములేనివాఁడొకఁడభిమానము వహించి బమ్మెరపోతనకవిత్వము సలక్షణము కా దని నిరసించినంతమాత్రమున పోతనకవిత్వమందుఁ గల మాధుర్యలక్ష్మి తొలఁగిపోవునా? పోదు.

అంకుటా లని యుపమానముగాఁ జెప్పుటచేఁ బతివ్రతయందది యారోపించు దోషము దానియందే కల దని భావము.

అప్పకవిని మనస్సున నిడుకొని యీగ్రంధకర్త యీపద్యము వ్రాసె నని తోఁచుచున్నది.

అప్పకవీయమందు ౨ ఆ. ౨౩౮ పద్యము.

ఉ॥ బమ్మెరపోతరాజకృత•భాగవతంబు సలక్షణంబు గా
కిమ్మహి నేమిటం గొదువ • యెంతయు నారసిచూడఁజూడ రే
ఫమ్ములు ఱాలునం గలిసి • ప్రాసములైన కతంబునంగదా
యిమ్ముల నాదిలాక్షణికు • లెల్లను మాని రుదాహరింపఁగన్.

సీ॥ అఖిలవేదాంతవి•ద్యారహస్యవిదుండు, సహజపాండిత్యవి•శారదుండు
మత్తక్షితీశాధ•మస్తోత్రవిముఖుండు, శంభుపదాబ్జ పూ•జారతుండు
పటుతరకవితావి•భాసిత ప్రతిభుండు, సకలాంధ్రలక్షణ•చక్రవర్తి
రఘుకులేశనిదేశ•రచితమహాభాగ, వతపురాణుఁడు పుణ్య•వర్ధనుండు

గీ॥ బుధజనహితుండు బమ్మెరపోతసుకవి, యెన్న రేఫ అకారంబు • లెఱుఁగఁడనుచు
నజ్ఞులాకకొంద ఱాడుదు • రమ్మహాత్ము, కవిత కెందును లోపంబు • గలుగ దభవ!
సీ॥ ఘనుఁడు పోతనమంత్రి • మును భాగవతము ర,చించి చక్రికి సమ • ర్పించు నెడల
సర్వజ్ఞసింగయ • తన్నవరుం డది దన, కిమ్మని వేఁడిన నిడకయున్న
నలిగి యాపుస్తకం • బవనిఁ బాఁతించినఁ, జివికి యం దొకకొంత • శిథిలమయ్యె
గ్రమ్మఱ నది వెలి • గందల నారప, రాజును మఱి బొప్ప • రాజు గంగ
రాజు మొదలగుకవివరు • ల్తేజమెసఁగఁ, జెప్పి రా గ్రంథములయందె • తప్పులొదవెఁ
గాని పోతకవీంద్రుని • కవితయందు, లక్షణం బెందుఁ దప్పదు • దక్షహరణ! ౨౬౬
—లక్షణసారసంగ్రహము ౩ ఆ.

కౌసల్యాపరిణయటీకయం దీవిషయము చర్చింపఁబడినది.

క౦॥ రామాభ్యుదయకవీంద్రుని, ధీమహితులఁ దిక్కనార్యుఁ • దిమ్మన మల్లాం
బామణి భాస్కరుఁ బాపన, రామకవుల రంగనాథుఁ • బ్రణుతి యొనర్తున్. ౧౬

రామాభ్యుదయకవీంద్రునిన్ = రామాభ్యుదయ మను గ్రంథమును వ్రాసిన అయ్యలరాజు రామభద్రుని. ధీమహితులన్ = బుద్ధిబలముచే గొప్పవారైన. తిక్కనార్యున్ = ఉత్తరరామాయణము వ్రాసిన తిక్కన్నను. తిమ్మనన్ = అచ్చ తెనుఁగురామాయణము వ్రాసిన తిమ్మకవిని. మల్లాంబామణిని = కుమ్మరమల్లమ్మను. భాస్కరున్ = తిక్కనతాతయగు భాస్కరకవిని. పాపనన్ = కంకంటి పాపరాజును. రంగనాథునిన్ = ద్విపదరామాయణమువ్రాసిన రంగనాథుని. రామకవులన్ = రామకథవ్రాసిన యేడ్వురుకవులను (రా + మ = ౨ + గి = ౭) వీరిని నుతించెదను.

మొల్లరామాయణము - మొల్లమ్మ యని వ్రాసిరికాని యీపేరు మల్లమ్మ యనియే యుండవలయు నని తోఁచుచున్నది. ఈమె వాసస్థానమయిన గోపవరము నెల్లూరు - కడపమండలముల సరిహద్దునందు కడపమండలమున సిద్ధవటముతాలూకాలో నొంటిమిట్టకు మూఁడామడలోనే యున్నది. దీనికిఁ గేవల సమీపమందే మల్లెమకొండ యని పర్వతము గలదు. (మల్లెమ్మకొండ యనునది సరియయినపేరు). మల్లికేశ్వరుఁ డనుపేర శివుఁ డీ పర్వతముపై నున్నాఁడు. ఈప్రాంతములవా రాపేరు తెలుచుగా నంచుకొనుచున్నారు. కావున నీమె పేరు మల్లెమ్మ యనియే యుండవలయును. ఈగ్రామమున కెనతిదూరంబున నుండు ఆత్మకూరు ఆతుకూరుగా మాఱెనేమో లేక ఆతుకూరే యాత్మకూరయ్యెనో.

తా త్ప ర్య ము.

రామాభ్యుదయమురచించిన అయ్యలరాజు రామభద్రుని నుత్తరరామాయణకర్త దిక్కనను నిర్వచనాంధ్రరామాయణమును వ్రాసిన తిమ్మన్నను మల్ల

ష్ణును భాస్కరకవిని కంకంటి పాపరాజును రంగనాథుని రామచరిత్రము వ్రాసిన యీయేడ్వురుకవులను నతించెను.

శా॥ శ్రీరామాయణపూర్వభాగము రచించె న్భక్తి నాంధ్రంబుగా
ధీరుం డార్యజనస్తవార్హుఁడును, బృథ్వీదేవతాశ్రేష్ఠుఁ, డు
ర్వీరామాత్మభవేశభక్తుఁ, డగుగోపీనాథ వేంకార్యుఁ, డా
సూరిం గూర్చి నమస్కరించెదను సత్సూక్తిం బ్రశంసించుచున్. ౧౭

శ్రీరామాయణపూర్వభాగమున్ = బాలకాండము మొదలు యుద్ధకాండము తుదవఱకుఁ గల శ్రీమద్రామాయణమును. భక్తిన్ = భక్తిచే. ఆంధ్రంబుగాన్ = తెలుఁగుభాషయందు నెవఁడు రచించెనో యట్టి, ధీరుండు = పండితుఁడు. ఆర్యజనస్తవార్హుఁడు. పృథివీదేవతాశ్రేష్ఠుఁడు = బ్రాహ్మణోత్తముఁడు. ఉర్వీరామాత్మభవేశభక్తుఁడు = భూమితనయాపతియగు శ్రీరాముల భక్తుఁడు అగు గోపీనాథము వేంకయ్య యను. సూరిన్ = పండితుని సత్సూక్తిన్ = మంచిమాటలచే. ప్రశంసించుచున్ = మెచ్చుకొనుచు, నమస్కరించెదను.

తాత్పర్యము.

శ్రీమద్రామాయణము బాలకాండము మొదలు యుద్ధకాండము తుదివరకు నాంధ్రీకరించినట్టియు, పండితుఁడు పెద్దలస్తుతికియోగ్యుఁడు బ్రాహ్మణుఁడును శ్రీ రామభక్తుఁడు నగు గోపీనాధము వేంకయ్య యనుకవిని మంచిమాటల శ్లాఘించుచు నమస్కరించెదను.

ఈవెంకయ్య రమారమి ౪౦ సంవత్సరములక్రింద మరణించెను. ఈయన వేంకటగిరిప్రభుపోష్యవర్గములోఁ జేరినవాఁడు. ఈయన రామభక్తుఁ డయినను ప్రభుప్రీతికై రామాయణమును గృష్ణున కంకితమిచ్చినవాఁడు. ప్రభుప్రీతికి బ్రహ్మానందశతక మను నొక పర మాశ్లీలగ్రంథమును రచించెనుగాని లోకప్రచారమున కయోగ్యమగుటచే ముద్రింపఁబడలేదు. సేవకులు ప్రభుప్రీతికై యెట్టి దుష్కార్యమయినఁ జేయవలసివచ్చును. ఈయన భగవద్గీత బ్రహ్మకైవర్తపురాణము లోనగు పెక్కు గ్రంథముల రచించెను. ఈరసికునితోడఁ గలసి మెలసి తిరిగినవారు నేటికున్నారు.

క॥ కరములు శిరమునఁ జేరిచి, వరగతి భజియింతుఁ గృతిఁ గృపారతిఁ గనఁగా
వరకవితాచణులన్ హితకరగుణులన్ వర్తమానకవ్యగ్రణులన్. ౧౮

కృతిన్ = ఈయాంధ్రవాల్మీకిరామాయణమును, కృపారతిన్ = దయతోడి ప్రేమచే, కనఁగాన్ = చూచుటకుఁగాను, వరకవితాచణులన్ = శ్రేష్ఠమైన కవిత్వమునందు నేర్పుగలవారిని హితకరగుణులన్ = మేలుకలిగించుగుణము కలవారిని, వర్తమానకవ్యగ్రణులన్ = ఈ గ్రంథకర్తకు సమకాలికులయిన

యిప్పటికవిశ్రేష్ఠులను, కరములు శిరమునఁ జేరిచి = చేతులు తలపై నుంచుకొని, వరగతిన్ = ఉత్తమవిధమున, అనఁగా దేవతలకు నమస్కరించినట్లు, భజియింతున్ = సేవింతును.

తాత్పర్యము.

అల్పజ్ఞుఁడు, నపండితుఁడు, దీర్ఘరోగతమకశ్వాసగోగి, పరాధీనజీవి, పారతంత్ర్యనరకనివాసి యగు నాగ్రంథమునం దెన్నియో దోషము లుండునుగాన నాకారణముచే నిరసింపక కేవలదయచే నాదరించుటకుఁగాను సత్కవిశ్రేష్ఠులను నితరులకు మేలుచేయుగుణములుకలవారిని నీకాలపు నుత్తమకవులను జేతులు తలపై జోడించి నమస్కరించెదను.

ఈప్రమొక్కులను గైకొని వర్తమానపండితకవిశ్రేష్ఠులందఱు నేకగ్రీవముగ నీకృతిని నాదరించి యాదరించుచు నీగ్రంథకర్తకు "నాంధ్రవాల్మీకి" యని పేరొసంగి యామోదించిరి. ఉత్తమకవులందఱు దీని నాదరించిరి. కృతిధన్యతకు దానిని దైవము తత్సములైన పండితకవు లాదరించుటకన్న నేమి కావలయును?

కం॥ నతిఁ జేసెద నీ రాముల,కృతి సారదయార్ద్రదృష్టి • క్షితి రక్షింపన్
శతగతులన్ బుధతతులన్, గతకల్మషమతుల భావి•కవితారతులన్. ౧౯

అర్థము.

ఈరాములకృతిన్ = ఈ యాంధ్రవాల్మీకిరామాయణమును, దయార్ద్రదృష్టిన్ = దయారసముచేఁ దడిసినచూపుచే, క్షితిన్ = భూమియందు, రక్షింపన్ = శాశ్వతముగానుండఁ గాపాడుటకుఁగాను, శతగతులన్ = నూఱువిధములను, బుధతతులన్ = పండితులసమూహములను, గతకల్మషమతులన్ = కల్మషముతోఁగూడిన మనస్సులుగలవారుకానివారిని, భావికవితారతులన్ = ఇఁకముందు కవిత్వమందుఁ బ్రీతిగలకవులను, నతిఁజేసెదన్ = నమస్కరించెదను.

తాత్పర్యము.

గ్రంథమునందు సారములేకపోయినను రామాయణముకదా యను గౌరవబుద్ధిచేనైనను నిఁక ముందురాఁగలపండితులను అసూయామాత్సర్యాదులచేఁ గనుమాలమైన మనస్సులులేనికవులను నీకృతిని దయతో నంగీకరింప నమస్కరించెదను.

—* మిత్రప్రశంస *—

సీ॥ సీతాంబికాగర్భ•సింధుసుధాంశుండు, వీరరాఘవవంశ • వృద్ధికరుఁడు
శ్రీకుప్పమాంబికా•హృత్కంజమిత్రుండు, పట్టాభిరామ [illegible]

నిర్నిమిత్తకదయా•నిర్నిద్రమానసుం, డంకహీనప్రతి•భాంచితుండు
కలితవాక్యామృతా•స్ఖలితకవిత్వుండు, కౌశికగోత్రుఁ డ•గళితయశుఁడు
ప్రథిత లంకలపల్లెస•ద్వంశజాతుఁ, డనఘ వేంకటసుబ్బార్యుఁ • డార్యహితుఁడు
కృతు లొనర్పఁగఁ బేరేచి•కీర్తిఁ దెచ్చె, నాకునీద్యుఁడుగాఁడొకో•నాదుహితుఁడు.

ఎవనితల్లి సీతమ్మయో, యెవనితండ్రి రాఘవయ్యయో, యెవనిభార్య కుప్పమ్మయో, హూ ణాంధ్ర ద్రావిడ కర్ణాట మహారాష్ట్రహిందీభాషల నెవఁ డెఱుంగునో, యెవఁడు కారణములేని దయగలవాఁడో, లోకములోలేని ప్రతిభ గలవాఁ డెవ్వఁడో, యెవఁడు మృదుమధురవాక్కులచేఁ గవిత చెప్పఁగలఁడో, యెవఁడు కౌశికగోత్రసంభవుఁడో యెవనియింటిపేరు లంకలపల్లెయో, యట్టి వేంకటసుబ్బార్యుఁడు, గ్రంధములురచింపఁ బ్రేరించి కీర్తిఁగలిగించెనో యట్టివాఁడు స్తోత్రార్హుఁడేకదా.

సీ॥ వేంకటనరసాఖ్య•విఖ్యాతప్రైవజ్ఞ, సత్తమహార్ద్రాబ్ధి•చంద్రముఁడను
సరిమాసతీగర్భ•వరశుక్తిముక్తాఫ, లాయమానుఁడు సాధు•గేయమానుఁ
డన్నపూర్ణావధూ•హల్లకామృతరోచి, హారితసగోత్రాభ్యు•దయకరుండు
శ్రీరావుచెల్లమాం•బారావుకరుణాక, టాక్షసంలబ్ధరా•మాధికుండు
తే॥ రామకృష్ణార్యననుజుండు • ప్రకటక్రొత్త, పల్లికులఖనిమణిదయా•పరుఁడుఘనుఁడ
మద్వయస్యుండు హితుఁడు స•న్మార్గరతుఁడు, సర్వగుణహారి శ్రీపద్మ•నాభశాస్త్రి.

తాత్పర్యము.

ఎవనితండ్రి వేంకటనరసయ్య యను జ్యోతిష్కుఁడో, యెవనితల్లిసరిమ్మయో, యెవనిభార్యయన్నపూర్ణమ్మయో, యెవఁడు హారితసగోత్రుఁడో, యెవఁడు కోలంక వీరవరముగ్రామముల జమీందారైన శ్రీరాజా రావు చెల్లమాంబారావుగారి యౌదార్యముచే సంపదగలవాఁడయ్యెనో, యెవనియన్న రామకృష్ణశాస్త్రియో, యెవఁడు క్రొత్తపల్లెయను నింటిపేరుగలవాఁడో, యెవఁడుసద్గుణములచే గొప్ప వాఁడో, యెవఁడు సన్మార్గప్రవర్తనము గలవాఁడో, యట్టిపద్మనాభశాస్త్రి నా స్నేహితుఁడు.

ఇందుఁ బేర్కొనఁబడిన శ్రీ శ్రీరాజా రావు చెల్లాయమ్మరావు బహదర్ వారును, ఈమెసోదరులు శ్రీ శ్రీరాజ రావు రామాయమ్మ బహదర్ వారును నీ గ్రంథకర్తకును దల్లులవలెఁ బూజ్యులు. అయాచితముగ శ్రీకృష్ణలీలామృత ము ముద్రణమునకై సహస్రరూప్యంబులును, రు ౨౬౦౦లు శ్రీకోదండరామ కైంకర్యార్థమైయు నొసఁగిరి.

చం॥ హితము సతంబుఁ గూరిచెద • రెక్కటి గ్రుక్కినఁ బెక్కుచిక్కులన్
వెతఁ బడఁ జావుసెజ్జఁ బెయి•వీడ స్వకీయులు పూర్వపోషితుల్,

మతిగొని యాదుకొం చుసుఖ • మందుల నిల్పిరి, పూర్వజన్మసం
చితసుకృతంబ కాక ధరఁ • జిక్కుదురే యిటువంటిమిత్రముల్ ? ౨౨

అర్థము.

సతంబున్ = ఎల్లవేళ, హితమున్ = శ్రేయస్కరమయినదానినే, కూరిచెదరు = సంఘటించెదరు, ఎక్కటి = ఒంటరిగా - నసహాయుఁడనై, స్రుక్కి సన్ = శుష్కింపఁగా, పెక్కుచిక్కులన్ = అనేకకష్టములచే, వెతపడన్= బాధపడుచుండఁగా, చావుసెజ్జన్ = మరణమాసన్నమై పడుకసైఁ బడియుండువేళ, పూర్విపోషితుల్ = ముందునాచేఁబోషింపఁబడినవారగు, స్వకీయులు = అన్నదమ్ములు లోనగు సమీపబంధువులు, చెయిపీడన్ = ఆదరణతప్పి సహాయముచేయుటమానఁగా, అట్టిసమయంబునన్ = అటువంటికష్టకాలమందు, మతిగొని = మనస్సుపెట్టి, ఆదుకొంచున్ = సహాయపడుచు, మందులన్ = ఔషధములచే, ఉసుఱునిల్పిరి = ప్రాణమురక్షించిరి, ఇట్లు వీరు కష్టకాలములో సహాయపడుటకుఁ గారణము, నాయొక్క, పూర్వజన్మసంచితసుకృతంబు = పోయినజన్మములందు సంపాదించి చేర్చియుంచుకొనినపుణ్యమే, కాని యితర కారణములేదనుట, కాక = అటు గానిపక్షమున; ధరన్ = భూమియందు, ఇటువంటి మిత్రముల్ = ఇటువంటి స్నేహితులు, చిక్కుదురే = దొరకుదురా ? దొరకరనుట - నిర్వ్యాజమిత్రులు దుర్లభులు.

తాత్పర్యము.

నాకు నెల్లవేళల శ్రేయస్సులనే కలిగించిరి. ఒంటరిగా ననేకకష్టములచే శుష్కించి బాధపడుచు నాచే ముందుపోషింపఁబడిన సమీపబంధువులు నేను జచ్చుటకు సిద్ధముగానుండు సమయమందు చేయివిడిచిపోగా నట్టికష్టవేళ వీరు మనస్సుపెట్టి సహాయపడి వారే చేతిడబ్బుపెట్టి మందులిచ్చి ప్రాణముకాపాడిరి (ఈకార్యము చేసినవాఁడు పద్మనాభశాస్త్రియే)-పూర్వజన్మములందుఁ బుణ్యము చేయకుండిన నట్టిస్నేహితులు లభింపరు.

ఎక్కటి = అసహాయుఁడు , సెజ్జ - ప్రకృతి శయ్య , వెత - ప్రకృతి వ్యథ; ఏకః ప్రకృతి, ఎక్కటి వికృతి.

శా॥ ప్రేరింతుర్ శుభకావ్యసంఘటనకై • ప్రేరించి మధ్యంబునం
దేరోగంబున నైన డీలుపడ నెం • తేఁ గూర్తు రుత్సాహమున్,
బారం బందఁ బ్రశస్తి సేయుదురు, నా • భాగ్యంబు గాదే మహో
దారుల్ ధీరులు ధీరశాంతు లిటు లం • త్యంతాప్తులై యబ్బుటల్. ౨౩

అర్థము.

శుభకావ్యసంఘటనకై = సత్కావ్యములనురచించునట్లు. ప్రేరింతుర్ = ప్రోత్సాహము కలుగఁజేయుదురు. ప్రేరించి = ఉత్సాహముకలుగఁజెప్పి, యాప్రకార

మీగ్రంథకర్త కావ్యరచనకై పూనుకొని పనిచేయుసమయమున; మధ్యంబునందున్ = నడుమ, గ్రంథముపూర్తికాకముందే; పరోగంబునన్ నైనన్ = శ్వాసకాసజ్వరములోనగు వ్యాధిచేతనయిన, డీలుపడన్ = ఈకార్యము నావలనం గాఁగలదా, యేల వ్యర్థశ్రమమని నిరుత్సాహినైనప్పుడు, ఎంతేన్ = మిక్కిలి, ఉత్సాహమున్ = ఉత్సాహమును, కూర్తురు = కలిగింతురు, పారం బందన్ = కావ్యరచన పూర్తికాఁగా, ప్రశస్తిసేయుదురు = లోకమున వ్యాపించి కీర్తి గలుగఁజేయుదురు; మహోదారుల్ = మిక్కిలి గొప్పగుణము గలవారు, ధీరుల్ = పండితులు, ధీరశాంతుల్ = శమముతోఁగూడినబుద్ధిచేఁ బ్రసన్నమైన మనస్సుగలబ్రాహ్మణులు, ఇటు = ఈప్రకారము, అత్యంతాప్తులై = కేవల హితులై, అబ్బుటల్ = లభించుటలు, నాభాగ్యంబుగాదే = నాయదృష్ట ఫలముగాదా.

తాత్పర్యము.

ఈమిత్రులు నన్ను సత్కావ్యములు రచింపఁ బ్రేరించి వారిమాటప్రకారము రచించుచు నడుమనడుమ క్షయశ్వాసకాసము లోనగు వ్యాధులచేఁ బీడింపఁబడి సత్తువలేక నిరుత్సాహినై యుండఁగా మరల మరలఁ బ్రేరించి కావ్యములు కొనసాగించి సాంతమైన తరువాత వానిని బ్రచురించి లోకమునఁ గీర్తి తెచ్చిరి ఎంత భాగ్యమో లేకున్న నిటువంటి మిత్రులు లభింతురా?

కం॥ ఎక్కడి చింతలపూఁడియొ, యెక్కడి రఘునాథపురమొ • యెక్కడి కడపో
చిక్కని నెయ్యము మువురకు, నెక్కరణియొ, దైవచిత్ర • మే మనవచ్చున్? ౨౪

అర్థము.

చింతలపూఁడి = పడమటిగోదావరిమండలమున నేలూరునొద్ద నున్నది. రఘునాథపురము = ఆరణిసమీపమున నున్నది. కడప = కడపమండలమున నున్నది. చింతలపూఁడి గ్రామనివాసి పద్మనాభశాస్త్రి, రఘునాథపురనివాసి వేంకటసుబ్బయ్య, కడపపురనివాసి యీ గ్రంథకర్త, చిక్కని నెయ్యము = గాఢమైన స్నేహము, మువురకున్ = ఈముగ్గురకు, ఎక్కరణియొ = ఏవిధముగా, కలిగెనో, దైవచిత్రము = ఆశ్చర్యకరమైన దైవశక్తి, ఏమనవచ్చున్ = ఏమని చెప్ప సాధ్యమగును?

తాత్పర్యము.

పద్మనాభశాస్త్రి యుండు చింతలపూఁడి యెక్కడ? వేంకటసుబ్బయ్యయుండు రఘునాథపురమెక్కడ? ఈ గ్రంథకర్తయుండు కడపపురమెక్కడ? ఒకదానికొకటి యేవిధమయిన సంబంధములేదే. మూఁడు మూఁడుదిక్కుల నున్నవే. ఇట్టి మువ్వురకు నిష్కారణగాఢస్నేహము కుదురుటయెక్కడ? విచిత్రమైన దైవతంత్ర మిప్పుడెట్లుఁగును? ఏమని చెప్పసాధ్యపడును?

ఆ॥ అడవియుసిరికయును • నంబుధిలవణంబుఁ, జేరి నట్టటంచుఁ • జెప్పుచుంద్రు
మైత్రిఁ బలుకుచోట,•మాయెడ నయ్యది, సత్యమయ్యె రామ•చంద్రుకరుణ.

అర్థము.

మైత్రిన్ = స్నేహమునగూర్చి, పలుకుచోటన్ = చెప్పెడుసందర్భమందు, అడవియుసిరిక = అడవిలోనుండు నుసిరికకాయయును, అంబుధిలవణంబు = సముద్రములోనుండు నుప్పు, చేరినట్టటంచున్ = కలిసినట్లని, చెప్పుచుంద్రు = చెప్పుచుందురు. అయ్యది = ఆ యుపమానము, మాయెడన్ = మా యుభయుల విషయమున, శ్రీ రామచంద్రుకరుణన్ = శ్రీ సీతారాములయనుగ్రహముచే సత్యమయ్యెన్ = యథార్థపడియెను.

తాత్పర్యము.

లోకములో దూరమువనుండువారి స్నేహమునగూర్చి మాటలాడునప్పు డడవిలోని యుసిరికకాయ సముద్రములోనియుప్పు కలిసినట్లని చెప్పుటకలదు. కాని యది శ్రీరామచంద్రుల యనుగ్రహముచే మావిషయమున సత్యమయ్యెను.

పద్మనాభశాస్త్రులే గ్రంథకర్తను రోగబాధవేళ మందులిచ్చి కాపాడుట యటుండ శ్రీకౌసల్యాపరిణయము, ఆంధ్రవాల్మీకిరామాయణము, సుభద్రా విజయము ముద్రితమగుట కాయనయే కారణభూతుఁడు. రాజకీయకలాశాలయం దాంధ్రపండితపదవి లభించుటకుఁ బద్మనాభశాస్త్రులే కారణము. అనేకపండితుల పరిచయము లభించుటకుఁ బద్మనాభశాస్త్రులే కారణము. ఇన్ని కార్యములిట్లు జరిపించుటకు శ్రీరామచంద్రమూర్తి కరుణాకటాక్షమే కారణము. పద్మనాభశాస్త్రులతోడి మైత్రికి వేంకటసుబ్బయ్య కారణము. ఆయనతోడి మైత్రికి శ్రీకుమారాభ్యుదయము కారణము. దానికిఁ బిన్నవ్వభక్తి కారణము.

కం॥ ఫలకాంక్షారహితంబుగఁ, బలువిధముల నాకుఁ దోడు•పడు మిత్త్రులకున్
గలిమియు సుఖముఁ జిరాయువుఁ, గులవృద్ధియుఁ గలుగఁజేయఁ•గోరెద రామా!

అర్థము.

ఫలకాంక్షారహితంబుగన్ = ప్రతిఫలముమీఁదికోరికలేక, పలువిధములన్ = అనేకరీతులను, నాకున్ = నాకు; గ్రంథకర్తకనుట. తోడుపడుమిత్త్రులకున్ = సహాయముచేయుస్నేహితులకు, కలిమియున్ = సంపదయును, సుఖము, చిరాయువు = దీర్ఘమైనయాయుస్సు, కులవృద్ధి = సంతానప్రాప్తియు; రామా - కలుగఁజేయఁగోరెదను.

ఇది వ్రాసినపిమ్మట వారిరువురకు రామునికరుణచే సంపత్తు సంతతి రెండును కలిగెను. ఈగ్రంథమును బ్రకటించినపిమ్మటను జాలఁగాలము వీరిరువురు జీవించి యుండిరి.

తా త్ప ర్య ము .

నావలనఁ బ్రతిఫలమేదియుఁగోరక స్నేహభావమునే పురస్కరించుకొని యనేకవిధముల సహాయపడిన యీస్నేహితులకు సంపత్తు, సౌఖ్యము, సంతానము దీర్ఘాయువు రామా! కలిగింపుము.

— స్వవిషయము —

శా॥ భారద్వాజపవిత్రగోత్రజుఁడ నాపస్తంబసత్సూత్రుఁడన్
పారావారసుతాధినాథపదసేవాలోల గోల్కొండవే
పారిన్, సత్కవిమిత్త్రుఁడం, గనకమాంబారామచంద్రాహ్వయో
దారానుత్తమదంపతిప్రజల మధ్యస్థుండ, సుబ్బాఖ్యుఁడన్. ౨౭

ఈపద్యమున గ్రంథకర్త తన విషయము చెప్పుకొనుచున్నాఁడు.

అర్థము.

భారద్వాజపవిత్రగోత్రజుఁడన్ = భరద్వాజమహర్షియొక్క పరమపవిత్రమయిన గోత్రమందుఁబుట్టినవాఁడను; ఆపస్తంబసూత్రుఁడన్ = ఆపస్తంబసూత్రముల ననుసరించినవాఁడను. పారావార గోల్కొండవేపారిన్ = సముద్రముకూఁతురైన లక్ష్మీదేవికి భర్తయైన శ్రీమన్నారాయణుని పాదములుసేవించుటయం దాసక్తిగల గోల్కొండవేపారికులమునఁ బుట్టినవాఁడను. సత్కవిమిత్త్రుఁడన్= సుకవులకందఱకు స్నేహితుఁడను. కనక మధ్యస్థుండన్ = కనకమ్మ రామచంద్రరావనెడి పేర్లుగల యుత్తమదంపతుల కుమారులలో నడిమివాఁడను. సుబ్బాఖ్యుఁడన్ = సుబ్బఁ డను పేరుగలవాఁడను.

తా త్ప ర్య ము .

నాది భారద్వాజగోత్రము, ఆపస్తంబసూత్రము, శ్రీమన్నారాయణుని పాదసేవచేయు గోల్కొండవ్యాపారిశాఖవాఁడను, సుకవులకు స్నేహితుఁడను; నాతల్లిపేరుకనకమ్మ, నాతండ్రిరామచంద్రరావు - ఆయిరువురకుమారులలో నేను నడిమివాఁడను.

భరద్వాజుఁడే భారద్వాజుఁడు, నరకము నారకము, పురుషుఁడు పూరుషుఁడు, రమ రామ, నరాయణుఁడు నారాయణుఁడు, అన్నట్లు. 'అన్యేషామపి దృశ్యతే' యని వ్యాకరణసూత్రము. 'భారద్వాజమహామునీంద్రుఁడగదే'యని శ్రీనాథుఁడు. అటుగాకున్నను భర-భార శబ్దములు రెండునుగలవు. 'భరింపుమీద్వాజ ననియె' నని వ్యుత్పత్తి. సత్కవిమిత్త్రుఁడన్ = ఈకవికి స్నేహితులు మండపాక పార్వతీశ్వరశాస్త్రులు, వారికుమారుఁడు, దేవులపల్లె సుబ్బారాయశాస్త్రులు, వారితమ్ముఁడు తమ్మనశాస్త్రులు, తిరుపతి వేంకటేశ్వరకవులు, మాఁడభూషి వేంకటాచార్యులు, కొక్కొండ వేంకటరత్నముపంతులు, వేదము వేంకటరాయ

శాస్త్రులు, అద్దంకి తిరుమల తాతాచార్యులు, ఆత్మకూరు శ్రీనివాసాచార్యులు నింకను బెక్కురు గలరు. ప్రసిద్ధకవులంద ఱీయన స్నేహితులే.

వ్యా క ర ణ ము.

కనకమాంబా.— శ్లో॥ ఆర్యాంబాదికశబ్దాస్స్యు, శ్రేష్ఠార్థవాచకాయతః
తత స్తదంశశబ్దేభ్యో, నైవశ్రేష్ఠార్థగోచరాః॥ అథర్వణ॥

అనఁగా అయ్య అమ్మ మొదలగు శబ్దములు ఎదాంతమందుండునేని శ్రేష్ఠార్థము న దెలుపును. అవియే మరల తెంచినసారినచ్చునేని శ్రేష్ఠార్థమును దెలుపవు. ఈ సూత్రప్రకారము తెంచినశబ్దము శ్రేష్ఠార్థమును దెలిపినను దెలుపకున్నను నట్టిపద మసాధువని యథర్వణుఁడు చెప్పలేదు. ఇట్లుండ నొకఁడు లక్కమాంబ రామయార్యుం డనునవి యసాధువు లనెను. ఇట్టి ప్రయోగము లసాధువు లగునేని మొదటియపరాధి నన్నయభట్టారకుఁడే. "నిత్యసత్యవచను మత్యము రాధిపాచార్య్య సుజను నన్నపార్యుఁ జూచి" యని తనపేరు నన్నపార్యుఁడని వ్రాసికొనెను. ఇట్టులే తిక్కనార్యుఁడు పెద్దనార్యుఁడులోనైనవి నామములు బిరుదులు సంస్కృతశబ్దములతో సమానమగునపుడు సంస్కృతపదములుగానే భావింపఁబడు చున్నవి. వేఁగీదేశము. ఇట్లులే లక్కమాంబ యనుచో లక్ష్మియను నది నామము. లక్ష్మియను నంబ లక్కమాంబ అన్నఁగాదేని స్త్రీవాచకాంతశబ్దముల సంధిలేదుగదా, సవర్ణదీర్ఘసంధి యెట్లుగలిగెను? 'తిమ్మలమహారాయోక్తిన్.' వసు. ౧-౪. ఇందు గుణసంధియెట్లు? తిరుమలేంద్రశ్రీమహారాయనిన్, మహారాయ — ఇది యేసమాసము? కావున లక్కమాంబ యను పోతనప్రయోగ మసాధువుగాదు. ఇట్టిప్రయోగము లాంధ్రగ్రంథములందుఁ బెక్కులు గలవు.

శ్లో॥ భవేద్బిరుదశబ్దేషు, యథేచ్ఛం వర్ణకల్పనా।
గ్రామమానుష్య బిరుద, శబ్దానామపి సా మతా.

రాహుత్ శబ్దభవము రావుతు - రౌతు అనఁగా గుఱ్ఱముపై నెక్కి యుద్ధము చేయువాఁడు. ఈరావుతు శబ్దములోఁ గుదివర్ణము లోపించి 'రావు' అయ్యెను. ఈగోలకొండవేపారులకుఁ గలమొకట్టి యొకవన్ పాయము వీరు గోలకొండ నవాబునొద్ద మంత్రులు మొదలైన పదవులందును సేనానాయకులుగాను నుండినవారు. హైదరాబాదుసీమయందు వీరికి వేపారులనియే పేరు. ఈ ప్రాంతముల మాధ్వులకును నేకగుంపుటనే గోలకొండనుండివచ్చి వీరు గోలకొండవేపారులైరి. గోలకొండవేపారు లందఱు విశిష్టాద్వైతులే. వీరు పంచసంస్కారపరులైన నియోగులు.

ఉ॥ ఖ్యాతచరిత్రులుఁ, విబుధపూజితులుఁ, సుయశోమనోహర
స్ఫీతపవిత్రమూర్తులును, శ్రీరఘునాయని లమాంగరున్,

శ్రీతరుణీశపాదసరసీరుహసంకలితాత్మమందిరుల్,
మా తలిదండ్రులం దొరయ మా తలిదండ్రులె శక్తు లిద్ధరన్. ౨౮

అర్థము.

పూతచరిత్రులున్ = పవిత్రమైన నడవడిగలవారును, విబుధపూజితులున్ = పండితులచే గౌరవింపఁబడినవారును, సుయశోమనోహరస్ఫీత పవిత్రమూర్తులు = మంచికీర్తిచే మనోహరమై యధికమైన మంచిగుణములచే పావనమైన యాకారములుగలవారు. శ్రీ గణుల్ = సంపత్తుచే నందమయిన యింటిముంగిలి కలవారు; శ్రీ. మందిరుల్ = లక్ష్మీదేవి భర్తయైన నారాయణుని పాదకమలములతోఁగూడిన తమయింఢ్లుకలవారు. ఇట్టి మాతలిదండ్రులన్ = ఇటువంటి మాతలిదండ్రులతో, దొరయన్ = సమానమగుటకు, మాతలిదండ్రులె = లక్ష్మీదేవితలిదండ్రులయిన గంగాక్షీరసాగరులే, శక్తులు = శక్తిగలవారు. మాతలిదండ్రులతో సమానులు గంగాక్షీరసాగరు లని చెప్పుటచే నిరువురయందు సమానగుణములుండవలెను. కావున గంగాక్షీరసాగర పర్యాయమున నర్థము చేయఁదగును. పూతచరిత్రులన్ = తమయందు స్నానముచేసినవారి పవిత్రులఁజేయు నడవడిగలవారిని. 'గంగాపాపం, శశీతాప' మన్నట్లు గంగ తనలో స్నానముచేయువారి పాపమును బోఁగొట్టును. సముద్రస్నాన మట్టిదేకదా. విబుధపూజితులు = దేవతలచే గౌరవింపఁబడువారు. దేవతల కాహారమైన యమృతము నొసంగుటచే దేవతలకు సముద్రుఁడు పూజ్యుఁడు. భగీరథుఁడుగంగఁ దెచ్చునపుడు గంగాదేవిని దేవతలందఱు పూజించిరికదా. సుయశో. మూర్తులు = మంచికీర్తివలె అతిశయమైన పావనత్వముగల యాకారములుగలవారు. గంగయుఁ బాలసముద్రము నిరువురు తెలుపే. 'సత్కీర్తి తెలు పని కవిసమయము. శ్రీ. గణుల్ = లక్ష్మీదేవి క్షీరసాగరవాసినియేకదా. శ్రీ... మందిరుల్ = నారాయణుఁడు పాలసముద్రమునసం బవాఁడేకదా. కావున నుపమానోపమేయములందు సమానగుణములు కానవచ్చుచున్నవి. మా = లక్ష్మీదేవి. 'ఇందిరా లోకమాతా మా'- నిఘంటువు.

కం॥ గురువులఁ బరమదయాళుర, ధరణిం బ్రత్యక్షదైవతంబుల నస్మ
త్తరణకళేబరదాతల, నిరతము భజయింతు నఘము నిష్కాలింతున్. ౨౯

అర్థము.

గురువులన్ = తలిదండ్రులను, పురుషులకు ముగ్గురుగురువులు. "పూరుషున కాచార్యుండునుం దల్లియున్ జనకుండున్ గురులైరి మువ్వురు" నని యయోధ్యాకాండము ౧౧౧వ సర్గమునఁ గలదు. పరమదయాళురన్ = మిక్కిలిదయగలవారలను, ప్రత్యక్షదైవతంబులన్ = కంటికిఁగానవచ్చుదైవములను, 'మాతృ

దేవోభవ, పితృదేవోభవ' యని శ్రుతికలదుగదా. 'స్వాధీనదేవతల బింబాధర! తన తల్లిఁదండ్రి నాచార్యవరున్' (అయోధ్య ౮-౫౫ ప) అని శ్రీరామచంద్రమూర్తి సీతకుఁజెప్పెనుగదా. అస్మత్ కరణకళేబరదాతలన్ =నాకుధర్మసాధనమున కుపకరణములయిన యవయవములతోఁగూడిన దేహమునునిచ్చినవారిని, నిరతము =ఎల్లప్పుడు, భజియింతున్ = సేవింతును, దానివలన, అఘమున్ = పాపమును, నిర్మూలింతున్ = వేళ్లతో నాశము సేయుదును.

తా త్ప ర్య ము.

గురువులై దయావంతులై కన్నులకుఁ గానవచ్చు దేవతలై నాకు ధర్మసాధనమైన శరీరమునిచ్చిన తల్లిదండ్రులను గొలిచి పాపము సమూలము నాశముచేసెదను.

దేహసాహాయ్యములేక జీవుఁ డేకార్యము చేయలేఁడు. ఏధర్మకార్యముగాని యేయోగముగాని సాధింపవలెనన్న దేహమావశ్యకము. అవి చేయక తరించు మార్గములేదు. కావున నట్టి గొప్ప యుపకారముచేసిన తలిదండ్రులు సర్వదా వారు జీవించినను మరణించినను బూజ్యులేకదా. అట్లు పూజింపఁడేని పుత్రుఁడు కృతఘ్నుఁడై నరకము పాలగును.

శా॥ బాల్యంబందున తండ్రి వాసి చన సద్భావంబునన్ మమ్ము ము
న్గల్యాణాత్మకుఁడై నకృష్ణుఁడు కృపం గౌరవ్యసంజాతకౌ
టిల్యం బందకయుండఁ బాండవులఁ బాటించెం గదా యట్ల దాఁ
గల్యుండై ననుఁ గాచు పిన్నజనకుం గాదే ప్రశంసింపఁగన్. 30

అ ర్థ ము.

బాల్యంబందున = నేను బాలుఁడుగానున్నప్పుడే, తండ్రి వాసిచనన్ = తండ్రి మరణింపఁగా, సద్భావంబునన్ = మంచియభిప్రాయముతో, మమ్మున్ = మా యన్నదమ్ములను, మున్ = పూర్వమందు, కల్యాణాత్మకుఁడైన కృష్ణుఁడు = శుభకరమయిన మనస్సుగల కృష్ణుఁడు, కృపన్ = దయతో, కౌరవ్యసంజాతకౌటిల్యంబందకయుండన్ = దుర్యోధనాదులయందలి కుత్సితమున బొందకయుండునట్లు, పాండవులన్ = పాండవులను, పాటించెన్‌గదా = ఆదరించెఁగదా, అట్ల= అట్టులే, తాన్ = తాను, కల్యుండై = నేర్పరియై, ననన్ = నన్ను, కాచు పిన్నజనకున్ = రక్షించుపిన్నతండ్రిని, ప్రశంసింపఁగన్= స్తోత్రముచేయఁగా, కాదే= తగదా?

బాల్యంబందున, అందున అవధారణార్థకము బాల్యమందే అందునన్ అని ద్రుతాంతముగాఁ బ్రయోగించుట సరిగాదు.

తాత్పర్యము.

నా బాల్యమునందే యనఁగా నా పదునొకండవయేట మాతండ్రి మరణింపఁగా, దుర్యోధనాదుల కుత్సితచేష్టలకు లోఁబడి చెడిపోకుండ నెట్లు కృష్ణుఁడు పాండవులను రక్షించెనో, యట్లు ధృతరాష్ట్రునివలె దురభిప్రాయముతోఁగాక మంచిమనస్సుతో మా యన్నదమ్ములను మా తల్లిని సమర్థుఁడై రక్షించిన మాపినతండ్రిని బ్రశంసించుట న్యాయ్యమేకదా. అట్లు చేయకుండినఁ గృతఘ్నుఁడఁగదా నగుదును. పాండవుల యుపమానము చెప్పుటచే బాల్యమునందు నీగ్రంధకర్తబంధువులు జ్ఞాతులును వీరితల్లి, యన్నదమ్ముల విషయమున ద్రోహముచేయ యత్నించిరనియు, వారియత్నము కొనసాగనీయకుండఁ బినతండ్రి లక్ష్మణరావు రక్షించెననియు నేర్పడుచున్నది.

క॥ కఱపెను విద్యాబుద్ధులు, నెఱపెను మజ్జీవనంబు ♦ నీతియు గుణముం
గఱపెను లక్ష్మణరాయఁడు, మఱవంగా వశమె సుజన♦మాన్యుఁ బితృవ్యున్. ౩౧

అర్థము.

విద్యాబుద్ధులు = విద్యయు బుద్ధియు వచ్చునట్లు. కఱపెన్ = నేర్పెను. మజ్జీవనంబు నెఱపెన్ = నాబ్రతుకు వ్యాపించునట్లుచేసెను. నీతియుగుణముమ్ = నీతితోవర్తించువిధము - మంచిగుణమును. కఱపెన్ = నేర్పెను. లక్ష్మణరాయఁడు = ఇది పినతండ్రిపేరు. అటువంటి, సుజనమాన్యున్ = సజ్జనులచే గౌరవింపఁబడువానిని, పితృవ్యున్ = తండ్రితమ్ముని, మఱవంగావశమె = మఱచుటకు సాధ్యపడునా?

తాత్పర్యము.

ఎవఁడు చదువునేర్పి జ్ఞానముఁగలిగి ప్రవర్తింపనేర్పెనో యెవఁడు నాపదునైదవయేటనే క్షయము ప్రారంభమై పీడింపఁగాఁ దనయొద్ద నుంచుకొని నానావిధచికిత్సలుచేయించి బ్రతికియుండఁజేసెనో యెవఁడు నీతిమార్గము సుగుణముకలిగి వర్తింపనేర్పెనో యట్టి సజ్జనులచే గౌరవింపఁబడు నా పిన్నతండ్రి లక్ష్మణరావును మఱచుటకు శక్యమగునా? కాదు. అట్లు మఱచుటయే కలిగిన నాయన నేర్పినదంతయు వ్యర్థమేకదా?

ఈగ్రంధకర్త యీ పినతండ్రివిషయమునఁ దనకుఁగల కృతజ్ఞతఁజూపుటకై తొలుత వంశావళి వ్రాసి యందీయనను స్తుతించెను. 'మా వంశావళి లోకమున కేమి ప్రయోజనకారి కాఁగలదు, అది యెట్లుశాశ్వతముగా నిలువఁగల'దని యోజించి దానిని గ్రంధస్థముచేసెను. ఆ గ్రంథమే శ్రీ కుమారాభ్యుదయము. ఆ గ్రంధము నత్పత్తికి నీయన పేరు గ్రంథస్థముచేసి శాశ్వతస్వర్గసుఖము కలిగింపవలయు నను కోరికయే కారణముకాని యితరము కాదు.

తే॥ గీ॥ దుష్కృతము లెన్ని చేసినఁ దుదిని సత్
సంతతులలోన నొక్కఁటిసలుపునతఁడు
కుతుకమునఁ దన నూటొక్క కులమువారి
నరకములఁ బాపి ముక్తికి నడపు నిజము
నెగడుఁ గావునఁ గావ్య మిన్నిఁటికిఁ దొడవు.

కం॥ పురివఱద నీరు గోదా। వరిని గలిసి యోగ్యమైన । వడువునఁ గడుదు
శ్చరితుండైనను గావ్యాం। తరమునఁ జెప్పఁబడి పావ।నచరిత్రుఁ డగున్.

—అప్పకవీయము. ౧ ఆ.

మీఁదఁజెప్పిన ఫలము సత్కృతులందుఁ జెప్పఁబడినవారికే. దుష్కృతులందుఁ జెప్పఁబడినవారు పురివఱదనీరు అమేధ్యపురొచ్చులోఁ బడిన ట్లగుదురు.

కం॥ అన్న యగు శేషగిరి రా, వన్నవ యగురంగరాయఁ । డాత్మగృహిణి యై
చెన్నలరు రంగనాయకి, సన్నుతకావ్యములె నాదు । సంతానంబుల్. ౩౨

అర్థము.

అన్నవ = చిన్నవాఁడు, గృహిణి = భార్య, సంతానములు = బిడ్డలు.

తాత్పర్యము.

నాయన్న పేరు శేషగిరిరావు - నాకంటెఁ జిన్నవాని పేరు రంగరావు - నాభార్య రంగనాయకి - నాసంతానములు సజ్జనులచే నుతింపఁబడు నాకావ్యములే. శేషగిరిరావు క్రీ. శ. ౧౯౦౫ లోను - తల్లి ౧౯౦౪ లోను భార్య ౧౯౧౦ లోను - తమ్ముఁడు ౧౯౧౭ లోను మరణించిరి.

పూర్వజన్మంబున ఋణమిచ్చుటయుఁ బుచ్చుకొని ముంచివేయుటయు లేని కారణముచే ఋణానుబంధము కొలఁది పుట్టు మనుష్యరూపసంతానము కలుగ లేదు. కాని యిహపరసాధకమయిన మానససంతాన మింకను గలుగుచున్నది. భగవంతుఁడు దేహదార్ఢ్య మనుగ్రహించెనేని యింకను వెలువడఁగలదు. ఇది దుష్టసంతానమో సత్సంతానమో నిర్ణయింపఁగలవారు లోకులే. ఈ సంతానములోఁ బెద్దవాఁడు శ్రీరామచంద్రమూర్తియే. ఆయన కలిగినపిమ్మ టనే తక్కిన సంతానము కలిగెను. ఆయనయే యీయనకు సంస్కర్త.

సీ॥ శాంతచిత్తుల మేలి।బంతి యెవ్వం డన, నాతఁ డంచన సర్వఁ। డైనవాఁడు
అతిసాధుతకు నుదా।హరణ మెవ్వం డన, వాఁడెపో యని చూపఁ।బడెడివాఁడు
సత్యనీతిప్రతా।చరణకు గుఱియెవ్వఁ, డనిన వాఁ డన యోగ్యుఁ। డైనవాఁడు
బంధువత్సలతకుఁ । బట్టుఁగొమ్మెవఁ డన, నాయన యనఁగఁ బా।త్రైనవాఁడు
సారసౌభ్రాత్రమున రామ।చంద్రుసాటి, యెవ్వఁడనవీఁడనఁగఁ గీ।ర్తి నెసఁగువాఁడు
బుద్ధికాణాచి, నెయ్యంబు।భూమి, సుప్రసన్నతను సిరియన్న, శే।షన్న నిజము. ౩౩

అర్థము.

మేలుబంతి = అక్షరములు కుదుర్చుటకై బాలురు వ్రాయునపుడు పెద్ద వారు వ్రాసియిచ్చు మొదటిపంక్తి. దానివలెఁ దక్కిన పంక్తు లుండవలెను. దీనినే మానా యందురు. సౌభ్రాత్రము = సోదరుతనము. కాణాచి = ఉనికి పట్టు. సిరియన్న = చంద్రుఁడు.

కం॥ తెలియనికతమున భావిక,వులు మద్విషయంబునందుఁ • బొరవడకుండన్
బలికితి నాదుకుటుంబముఁ, గలరు పితృవ్యజులు తల్లి • గల దిప్పటికిన్. ౩౪

అర్థము.

భావికవులు = ముందు రాఁబోవు కవులు, పితృవ్యజులు = పినతండ్రికుమారులు, ఇప్పటికిన్ = ఈగ్రంథము ప్రారంభించునప్పటికి.

గ్రంథారంభము ౧౯౦౦ సంవత్సరము. ౧౯౦౪ లోఁ గవితల్లిగారిమరణము.

కం॥ మావంశము తెలుఁ గంతయు, మావృత్తాంతంబుఁ దెలియ • మత్పూర్వకృతం
బై వెలయు రాభ్యుదయమం, దే విస్తృత మగుట నొడువ • నే నిట మరలన్.

అర్థము.

మత్పూర్వకృతము = నాచేఁ బూర్వముచేయఁబడినది, రాభ్యుదయము = శ్రీ కుమారాభ్యుదయము. శ్రీకుమారాభ్యుదయము = మన్మథుని చరిత్రము. 'శృంగారయోని శ్శ్రీపుత్రః' నిఘంటువు. కుమారాభ్యుదయము = మన్మథునిచరిత్ర- 'కుమారో మాసు తే స్కందే" యని ॥నానా॥ మారాభ్యుదయము= మన్మథునిచరిత్ర, "మదనో మన్మథో మార" యని యమరము. రాభ్యుదయము=మన్మథునిచరిత్ర. "రః పుమాన్ పావకే కామే" అని ॥నానా॥ శ్రీకుమార= కుమార = మార = ర = మన్మథుఁడు. విస్తృతము = విస్తరింపఁబడినది. నొడువన్ = పలుకను.

తాత్పర్యము.

ఇప్పటిచరిత్రకారులు పూర్వకవులనుగుఱించి తాఱుమాఱుగ వ్రాసినట్లు నన్నుఁగుఱించి రాఁబోవుచరిత్రకారులు కవులు పొరపాటుపడకుండుటకై నా జన్మస్థలము మా వంశవృక్షములోనైనవి శ్రీ కుమారాభ్యుదయమునందే వ్రాసియుండుటచేఁ జర్వితచర్వణ మేల యని మరల నిట వ్రాయలేదు.

శా॥ సారామాత్యతనూభవుం డగుచుఁ దేజఃపుంజమైత్త్రియా
వారాశిం జుళికీకరించి ఋషిమై ప్రస్ఫీతయోగాఢ్యుఁడై
తారామండలమానిసప్తకమునం దా న్కృక్కఁడై వెల్గు శ్రీ
భారద్వాజుని సంస్తుతించెదను దాత్పర్యంబు సంధిల్లఁగన్.

కం॥ ఆతనికి నిర్మలతనూ।జాతుండై వెలసె వసుధ సవనారంభో
ద్భూతఘనధూమమున ఘన।మాతతముగ ధూమయోని యని పేరందన్.
కం॥ అతనికి గాదిలితమ్ములు । క్షితిలో రత్నాజి యనఁగఁ గృష్ణాజియు నా
నతులితగుణమణిహారులు । వితతయశుల్ గలరు వేదవిదులై యందున్.
తే॥ గీ॥ పిన్నపంతులు నాంచారు పేరఁబరఁగు।లలనయందుఁదగంగాంచె లలితగుణుల
జెలఁగి శ్రీలక్ష్మణార్యుని శ్రీనివాసు।రంగరాయాహ్వయుని సుధీప్రథితమతుల.
కం॥ అమ్మహనీయులు క్రమమున । సమ్మతి నుద్వాహమైరి సరసతమై మం
గమ్మను గుప్పమ్మను లక్ష్మమ్మను శృంగారవతుల సాధ్వీమణులన్.
చ॥ లలితసుధీసుధీరగుణ లక్షణలక్ష్మణమంగమాంబలం
దలరఁగఁ బుట్టి రంతట నిరంతరసత్త్వుఁడు రామచంద్రుఁడున్
జెలఁగెడు సీతమాంబయును శీతమరీచియు లోకమాతయుం
గలశపయోధివీచికలఁ గాంతిని సంపదఁ బుట్టినట్లుగన్.
వ॥అతండు.
కం॥ వరపూతగుణోపేతన్ । వరశీలవ్రాత భువనవంద్యన్ సీతన్
గరిమంబునఁ దాఁ గైకొనెఁ । బరమవిధి రామచంద్రుభాతిం బ్రీతిన్.
కం॥ ఆవరదంపతులకు వసు।దేవునకుం దేవకికి విధి జనకుభాతిం
బావనతేజుఁడు కృష్ణుఁడు । భావింపఁగఁగలిగె వంశపావనుఁడగుచున్.
కం॥ పరమాదరమున ఫణిపతి । గిరికిం బ్రహ్మోత్సవంబు కేళిం గనఁగా
నరిగి యట బంధు లలరఁగ । వరరతమతి రుక్మిణి న్వివాహంబయ్యెన్.
చం॥ అరయఁగఁ గీర్తిధన్యమగు నామిథునంబునకుం జనించి రా
హరిభుజతుల్యులై దశరథావనినాథ తనూభవాపర
స్ఫురదురుమూర్తులో యనఁగఁ బోణిమి నల్వురు సత్కృపానిధుల్
వరగుణశీలభాసులు ప్రభావవిభావసులై వసుంధరన్.
ఆ॥ రామచంద్రరావు రహిమీఱ లక్ష్మణ।రావు శ్రీనివాసరావు వేంక
టనరసింహరావు నన(గనొప్పిరి వారు । బుద్ధి నలువ యందుఁ బెద్దవాఁడు.
కం॥ ఆరామచంద్రరాయఁడు । హారిగుణోదారిఁ గనకమాంబను దనకుం
దారఁగఁ గైకొనె మువ్వురు । వారికి సుతులైరి పెద్దవాఁడై వెలసెన్.
చం॥ వినయవివేకపోషుఁ డతివిశ్రుతసత్యవచోవిశేషుఁడు
స్వజననుతవేషుఁడున్ ఘనవిశాలయశస్సువిశేషుఁడున్ మనో
వనజసమర్చితాచలనివాసకశేషుఁడు ధూతదోషుఁడుం
బొనరఁగఁ గంజజాతకులభూషుఁడు శేషుఁడు మాన్యుఁ డన్నిఁటన్.
తే॥ శేషగిరిరావునకు మితభాషణునకుఁ । దమ్ములిరువురుగలరు యశమ్ముఁగూర్చు
సుబ్బరాయఁడు శేముషీస్ఫూర్తిమెఱయ । రంగరాయఁ డనంగ సత్సంగరతులు.

వ॥ అందు.

క౦॥ సకలుండవ సుదాసుఁడు । సుకరంహారిద్రయైకలబ్ధసుందరతరవా
  క్కరందబిందుతుందిల । ప్రకటకవిత్వాతిముదితబంధుజ్ఞండఁర్.

తే॥ నాదు రెండవపినతండ్రి నయగుణుండు । శ్రీనివాసాఖ్యుఁడా ధన్యజ్యేష్ఠపుత్రి
  కామతల్లిక వంగూరి రామరావు । ధర్మపత్ని గుణాఢ్యసీతమ్మయనఁగ.

క౦॥ నా కింతకాఁచిపోయఁగ । నాకాంతసజీవయుండె నాఁ డీవేళర్
  నాకాయము రక్షింపఁగఁ । జేకొనె సీతమ్మ నాదు చెల్లెలు కరుణర్.

క౦॥ ఘటికాచలవాసిని నాన్నిటకుర్ రప్పించి రాఘవేంద్రుఁడు సేవర్
  ఘటియింప నాజ్ఞసేయుట । నిట నేఁ గైంకర్యకాంక్ష నిచ్చ నిలిచితిర్.

చ౦॥ అదిసుత యొంటివాని నను సాదరదృష్టిని జూచి యార్తిమై
  వదలక కష్ట మంచనక వంచనలేక సహాయభూతయై
  ప్రిదు లని శ్రద్ధయుర్ మిగులఁ బ్రేమముఁగూడఁగ దేవకార్యమున్
  మదిగొని అన్నదానమును మానక నాయనఁ జాత సల్పెడున్.

క౦॥ ఆసాధ్వీమణిసాయము । శ్రీసీతాపతిఘటింపఁజేయఁడయే నీ
  దాసుఁడు దాస్యము లవమేన్ । జేసియయుండండు నిజము సిద్ధం బిచటన్.

ఉ॥ ఓడద దెంతగాసికిని, నోర్మిగుణం బొకలేశమేనియున్
  వీడదు, స్వాత్మబంధు లని వింతజనంబుల నాదరించు, మా
  టాడదు కోపగించినను, స్వాత్మసుఖార్థము కాసునేనియున్
  వేఁడదు, వాడ ద్వేష్ఠ, నవనీతముపో హృదయంబుచూడఁగన్.

తే॥ దానమునుజేయుచున్నట్టి మానవతులు । గలరు ధరణిని వేనవేల్ కాని యిట్లు
  కాయకష్టంబు నోర్చి నిష్కామలోక । దైవసేవయుఁ జలిపెడి తరుణిలేదు.

తే॥ జపములేటికి వేయాఱు తపములేల । యోగమేటికి సర్వసంత్యాగమేల
  సాధ్విగుణమును నిట్లు నిష్కామసేవ । చేయుభాగ్యంబు గలిగినచేడియలకు.

క౦॥ రాముఁడె పతియగుటను శ్రీ । రాముఁడె పతి యైన మనుచు శ్రద్ధామతినిన్
  బ్రేమించు నీమె కిమ్మా । సామప్రియు భర్తతోడ సాయుజ్యంబున్.

ఒంటిమిట్టయందలి శ్రీరామసేవాకుటీరమున నన్నదానకార్యము దేవతా
  కార్యము నిర్వహించుచుండునది యీమెయే.

—• కవికృతపూర్వగ్రంథసంగ్రహపద్యము •—

౬౦. శ్రీపతి యగుసీతాభా, మాపతికృతులిమి శ్రీకుమారాభ్యుదయం
  బాపయి శతకము కౌసల్యాపరిణయకావ్య మొండు నయ్యెం బలుకర్. ౩౬

అర్థము.

శ్రీపతి = లక్ష్మీనాథుఁడు, శ్రీకుమారాభ్యుదయము, శతకము = తల్పగిరి
రంగనాయకశతకము. కౌసల్యాపరిణయము.

క॥ కృష్ణావతారతత్త్వముఁ, గృష్ణసులీలామృతంబుఁ • గీర్తించితిఁ, ద
త్కృష్ణసుగీతల శ్రద్ధా,నిష్ణాతుఁడ నగుచుఁ బల్కి • నెగడితి ద్విపదన్. 32

అర్థము.

కృష్ణావతారతత్త్వము = కృష్ణలీలామృతము, ద్విపద భగవద్గీత పలికితిని.

శ్రద్ధానిష్ణాతుఁడను = శ్రద్ధయందలినేర్పు - అనఁగా మిక్కిలి శ్రద్ధగల వాఁడను.

ఈగ్రంథమువ్రాయునప్పటికి రచింపఁబడిన గ్రంథము లివియే. ఈవల సుభద్రా విజయనాటకము, ఇది రామాయణరచనమధ్యకాలమునఁ జెప్పఁబడెను. తరువాత సులభవ్యాకరణము, ఆర్యకథానిధులు, ఆర్యచరిత్రరత్నావళీమాలికా గ్రంథములు, హితచర్యమాలికాగ్రంథములు, భక్తిప్రసూనమాలికాగ్రంథములు, ఆధునికవచనరచనావిమర్శనము, పోతనని కేతనచర్చ, పోతరాజవిజయము లోనగు పెక్కుగ్రంథములు రచింపఁబడెను. భక్తిసంజీవని యను మాసపత్రికయందుఁ గొన్ని గ్రంథములు వెలువడుచున్నవి. కొన్ని వెలువడఁగలవు. ముద్రితములైనవిగాక సంపూర్ణముకానివి రెండు గలవు. అందొకటి రామాశ్వమేధము. రెండవది యాంధ్రజయము. ఆంధ్రభారతమే యాంధ్రజయము. ఆంధ్రవాల్మీకిరామాయణము సాంతమైనతరువాత దానివలెనే భారతమునం తయుఁ దెనిఁగింపు మని యా గ్రంథకర్తను బ్రేరించి లం॥ వెంకటసుబ్బయ్య యాదిపర్వముమొదలు స్త్రీపర్వము కడవఱకుఁ దాను దెనిఁగించునట్లును శాంతిపర్వ మీ గ్రంథకర్తను దెనిఁగింపు మనియు బోధించెను. అట్లేకాని మ్మని యిరువు రొక్కదినమందే ప్రారంభించిరి. ఈ గ్రంథకర్త శాంతిపర్వమున సగము, కడపటి నాలుగుపర్వములు తెలిఁగించెనుగాని వేంకట సుబ్బయ్య రెండువందల పద్యముల కెక్కువ వ్రాసినవాఁడు కాఁడు. అదియునుగాక యాకార్యమున కితరులు పూనకొన్నట్లు తెలియవచ్చెను. ఇతరులుచేయు కార్యమును దానుఁజేయుట యీయనకు సమ్మతమైనది గాదు. అట్టిసమయమందే ఆర్యకథానిధులు ఆర్యచరిత్రరత్నావళులు వ్రాయవలసివచ్చెను. భారతరచనకన్న నీ గ్రంథములు రచించుట లోకమున కెక్కువ లాభకారిగాఁ దోఁచెను. ఈకారణములచే నాంధ్రజయము నిలిచిపోయెను. దీనిలోని కొన్ని పద్యములు శ్రీకృష్ణలీలామృతంబున ననువదింపఁబడెను. రామాశ్వమేధము పూర్తికామికి ప్రోత్సాహకులయుపేక్షయు నొంటిమిట్ట కోదండరామస్వామికి నంకిత మీయ కుండుటయుఁ గారణములు. ఈయన పేరుపెట్టని యేకృతియు సాంతమగుట లేదు. ఇది యనుభవవిదితము.

—• వితర్కాదికము •—

సీ॥ కనులకుఁ గలఁకయు • గరళంబు మదికి నై, తపియింపఁజేయు విత్తమ్ము లేదు
కాళ్లబందా లురి•త్రాళ్లు కుత్తుకకు నౌ, బిడ్డలజంజాట • మడ్డు లేదు
మంచిసెబ్బర లెద • స్మరియింప నీయని, యంతటిభోగంబు • లమర లేదు
ఈపూఁట హరిహరీ • యేపాటఁ గడచు న, న్దారిద్ర్యభీతి యిం•తయును లేదు
రాముఁ దలఁపఁజేయ•నామయం బుండఁగ, సౌఖ్య మరయుపొంటె•జాయ యుండ
నింతవలను గలుగ • నిప్పుడ శ్రీరాముఁ, దలఁపకున్న నెపుడు•దలఁచువాఁడ. ౩౭

అర్థము.

కలఁక = ఇదియొకవ్యాధి, మదికిఁ = మనస్సునకు, గరళంబు = విషము, విత్తమ్ము = ధనము, బందాలు = బంధములు - కట్లు, ఆమయము = రోగము, అరయుపొంటె = విచారించుకొఱకు, జాయ = భార్య.

తా త్ప ర్య ము .

కనులకుఁ గలఁకవంటిదియు, మనస్సునకు విషమువంటిదియునై బాధపెట్టుటకు ధనములేదు. ఇట్టటు కదలనీయక కాళ్లకు బంధములు, కుత్తుకకు నరిత్రాళ్ళు నగు బిడ్డలజంజాటమూ లేదు. ఇది మంచిది యిది చెడ్డది యని తెలియనీయని యంతటి భోగములూ లేవు. 'హరిహరీ యీపూఁట యెట్లు కడచును ? ఆహారమునకుఁ ద్రోవయేది' యని దుఃఖపడఁజేయు పేదఱికమువలని భయమునులేదు.

రామునిఁ దలంపఁజేయుటకుఁ దీవ్రరోగ మున్నది. (ఆపద్దశయందే భగవంతుఁడు స్మృతికి వచ్చునుగాని సంపద్దశయందు రాఁడు. కావున భగవంతుని స్మరింపఁజేయుటచే వ్యాధియు మేలుచేసినదే.)

భగవంతుఁడిచ్చినదానిని వండి వేళ కింత వేయుటకు భార్య యున్నది. ఇన్ని యనుకూలము లుండఁగా నిప్పుడే శ్రీరాముని స్మరింపకపోయితినేని మఱి యెప్పుడు నేను స్మరింపఁగలను? ఇంతకంటె ననుకూలమైన కాల మెప్పుడు రాగలదు? రా దని భావము.

విస్తారధనము లేకపోవుట - బిడ్డలులేకపోవుట - భోగములు లేకపోవుట-కూటివిచారమందే మనస్సును బోనిచ్చు పేదఱికము లేకయుండుటయు - రోగబాధ-భార్యయునికి యివన్నియు వివేకి యగుభగవన్నామచింతకునకు ననుకూలములేకాని, ప్రతికూలములు గావు.

చం॥ ప్రబలి కఫంబు కంఠమున •బాధలు పెట్టెడివేళఁ, జూపులున్
గబగబ బైటఁ బట్టుఁ డిఁకఁ • గార్యము లే దనువేళఁ, గింకరు
ల్దబదబఁ బ్రాణవాయువులు • లాగెడివేళలఁ, నాలుఁ జుట్టముల్
అబలబ లాడువేళలఁ ద•లంపఁగ శక్యమె రామనామముల్? ౩౮

అర్థము.

చూపఱుల్ = చూచువారలు, కింకరుల్ = యమకింకరుల్. 'చెలియే మృత్యువు, చుట్టమే యముఁడు సంసేవార్థులే కింకరుల్॥'—భాగ.

తాత్పర్యము.

కఫము గొంతులోఁ జేరికొని శ్వాసమాడక ప్రాణముపోక యెగయూపిరి విడుచునపుడు, చూచువారిక బ్రదుకఁడు, నక్షత్రమెట్టిదియో యేమో, బైట పట్టుడు, లేకున్న యిల్లు పాడుపడును, అని బంధువులకు బోధించుకాలమున, యమకింకరులు పాశములువేసి జీవాత్మని వెలికిలాగుసమయమున, పెండ్లాలు బంధులు పోయెడిప్రాణమును సుఖముగఁ బోనీయక బాధపఱచుచు పైఁబడి లబలబ మొత్తుకొనువేళ రామనామము స్మరింపశక్యమా? ప్రాణము పోవుటతప్పఁ దక్కినవన్నియు నీ గ్రంధకర్తకుఁ బరిచితములే.

సీ॥ దంతంబులూడున • న్చింతపుట్టకమున్న, కనుదోయి మసకలు • గొనకమును
ముడుతలచే మేను • మిడుకులాడకమున్న, వడఁకునఁ గాళ్లడఁ • ఁడకమున్న
పెండ్లము కడుఁ గడ•గండ్లు పెట్టకమున్న, నందను ల్దనుఁ జూచి • నగకమున్న
గద్దించి బుడుతలు • బుద్ధి చెప్పకమున్న, చెడురోగములఁ దేల్చి • చెడకమున్న
పూని వైద్యుండు చెప్పక • పోకమున్న
కాలభటదర్శనంబును • గాకమున్న
రామశ్రీరామశ్రీరామ•రామయనుచు
ధ్యానమొనరించువాఁడెపో • ధన్యతముఁడు. ౮౦

అర్థము.

ఊడునన్చింత = దంతము లూడునేమో యను విచారము, కదలుటకు ప్రారంభించినదిమొదలుకొని యని యర్థము. మసకలు = చీఁకట్లు, మేను = దేహము, కడగండ్లు = బాధలు, నగక = నవ్వక, మున్న = ముందే, బుడుతలు = చిన్నవాండ్రు, గద్దించి = ధిక్కరించి, ధన్యతముఁడు = ధన్యులలో శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము.

అయ్యో, పండ్లూఁగులాడుచున్నవే, చిగుళ్లు నొప్పియెత్తుచున్నవే, గట్టి పదార్థములు నమలి తినుటకు లేకపోవునేమో యను విచారము పుట్టకముందే, కన్నులు రెండు చీఁకట్లు క్రమ్మినట్లయి చక్కఁగాఁ గానరాక దృష్టిబలము తగ్గకముందే, ముదిమిచే దేహమునందు ముడుతలు కలుగకముందే, నడు వఁబోయినఁ గాళ్ళు వడఁకకముందే, పిలిచిన రాక యేమి యీ ముసలి గోఁ జని పెండ్లాము బాధలు పెట్టకముందే, తన కొడుకులే తన్నుఁ జూచి నవ్వకముందే, పిన్నవాండ్రు ధిక్కరించి 'తాతా' సీకుఁ దెలియదు. నీ పూరక

వేసినది తిని మూలఁబడియుండుము. నీ కెవ్వరు చెప్పినా రీసెత్తన'మని ధిక్కరించి బుద్ధిచెప్పకముందే, తీవ్రవ్యాధులచే బుద్ధిబలము చెడకముందే, వీఁడు చచ్చునని నిశ్చయించుకొని, యిక్కడ నుండి ప్రయోజనములేదని, పోయెదనని చెప్పిన రోగిబంధువు లుండుమని పీడింతురని, చెప్పకియే వైద్యుఁడు పోకముందే, యమ కింకరుల దర్శనముకాకముందే శ్రీరామ శ్రీరామ శ్రీరామ యని యెవఁడు ధ్యానించునో వాఁడే సార్థకజన్ముఁడు. తక్కినవారి బ్రదుకు వ్యర్థము.

శంక.

బాల్యమందు వయస్సునందే శ్రీరామధ్యానము చేయఁ బ్రారంభించినను పండ్లురాలకపోవునా? కనుచూపుబలము తగ్గకపోవునా? మృత్యువురాకపోవునా? కాఁబట్టి చిన్నప్పటినుండి యేలచేయవలయును? అదియునుగాక,

భగవద్గీత ౮ అధ్యాయము ౫వ శ్లోకము.

శ్లో॥ అంతకాలేచ మామేవ, స్మరన్ముక్త్వా కళేబరమ్
యః ప్రయాతి స మద్భావం, యాతి నాస్త్యత్ర సంశయః.

మరణకాలమున నన్నే స్మరించుచు నెవఁడు దేహమువిడుచునో వాఁడు నా స్వభావము పొందుచున్నాఁడు. అనఁగా నన్నేమూర్తిగా ధ్యానించునో యట్టి యాకారమును బొందుచున్నాఁడు. సందేహములేదు. అని యంత్యకాలస్మర ణముకదా ఫలవంతమని కృష్ణుఁడు చెప్పెను. ఇప్పుడే ధ్యానించి యేమిప్రయో జనమని శంక.

సమాధానము.

పుట్టినప్పటినుండి రామ రామ యని భగవద్ధ్యానము చేసినంతమాత్రమున పండ్లురాలకపోవు, చావురాకపోదు. రామనామస్మరణముచేయుట యాఫల ముద్దేశించియుఁగాదు. మరణకాలమున భగవంతుని స్మరించువానికే ముక్తి కలు గుటయు సత్యమే. అయినను చిన్నప్పటినుండి సర్వకాలసర్వావస్థల దేనిని విశేషముగ స్మరించుచుండుమో యదియే యంత్యకాలమున నభ్యాసబలముచే స్మరణమునకు వచ్చునుగాని మఱియొకటి నూతనముగ రమ్మనినరాదు. కావుననే కదా భగవద్గీతయందు ౮ అధ్యాయము ౬ శ్లోకము.

శ్లో॥ యంయంవాపి స్మరన్ భావం, త్యజ త్యంతే కళేబరమ్
తం తమే వైతి కౌంతేయ, సదా తద్భావభావితః.

'ఎవఁడు మరణకాలమున నేయేభావమును స్మరించుచు దేహము విడుచునో వాఁడు ఎల్లప్పుడు ఆభావమునే స్మరించుచున్నవాఁడగుటచే దానినే పొందును.' అనికదా కృష్ణభగవానుఁడు బోధించెను. కావునఁ జిరకాలము మనస్సు దేని యం దుంచుదుమో యదియే మరణకాలమందును మనస్సునకుఁ దనంతటఁ దానే వచ్చును. ఆకారణమున నట్టిజన్మమే మరలఁగలుగును. జడభరతుఁడు జింకగాఁ

బుట్టలేదా? కావున బాగున్నప్పుడు సర్వకాలసర్వావస్థల భగవంతుని స్మరించువానికే మరణకాలమందును భగవత్స్మరణము కలుగునగాని యితరులకుఁ గలుగదు. అదియునుగాక ప్రాణముపోవుసమయమునఁ మనస్సు మనస్వాధీనములో నుండు నని యేమినమ్మకము? ఆకస్మికముగ నెందఱు చచ్చుటలేదు? మరణకాలమున ప్రాణముపోవుటకు ముందే స్మృతితప్పిపోయినవా రెందఱు లేరు? కావున మరణకాలమందు భగవంతునిఁగూర్చి స్మృతికలుగునని నమ్మరాని విషయము. అదియునుగాక—

శ్లో॥ సత్యం బ్రవీమి మనుజాః స్వయ మూర్ధ్వబాహుః,
యో మాం ముకుంద నరసింహ జనార్దనేతి
జీవన్ జప త్యనుదినం మరణే ఋణీవ
పాషాణకాష్ఠసదృశాయ దదామి ముక్తిమ్.

శ్లో॥ స్థితే మనసి సుస్వస్థే, శరీరే సతి యో నరః,
ధాతుసామ్యే స్థితే స్మర్తా, విశ్వరూపంచ మా మజమ్
అహం స్మరామి మద్భక్తం, నయామి పరమాం గతిమ్.

'మనుజులారా! స్వయముగ నేను జేయెత్తి సత్యము పలికెదను. జీవించియుండు సమయంబున నెవ్వఁడు ప్రతిదినము ముకుందా! నరసింహా! జనార్దనా యని నన్నుఁ బలుమాఱు పిలుచుచుండునో నా నామము జపించునో యట్టివాఁడు నిర్యాణసమయమునఁ బాషాణమువలెను కట్టెవలెను స్మృతిలేక పడియుండినను నప్పుగొన్నవాఁడు మరల నప్పుదెల్లించినవిధమున వానికి ముక్తి నిచ్చెదను.'

చంచలమగు మనస్సు కుదిరికతో నిలిచి శరీరము స్వస్థమై వాతపిత్తశ్లేష్మధాతువులు సమముగానుండు సమయమున నెవ్వఁడయినను నెట్టివాఁడైనను నెప్పుడయినను నన్ను విశ్వరూపుఁడ నగుటఁ జేసి యంతటను వ్యాపించి అజుఁడ నగుటచే నెప్పుడు సన్నిహితుఁడనై యుండు నన్ను స్మరించునో (అన్ని పదార్థములు నామయమే కావున నేది చూచినను నేను జ్ఞాపకమునకు వత్తునుగదా) యావల నే నదియె నెపముగాఁ గొని మరణకాలమున ఱాతివలెఁ గట్టెవలెఁ బడియున్నవానినైనను నా భక్తుని నేనే స్మరించి పరమపదంబు నొందించెదను అని భగవద్వాక్య ముండుటచేతనే

శ్లో॥ కృష్ణ! త్వదీయపదపంకజపంజరాంతే। మద్యైవ మే విశతు మానసరాజహంసః
ప్రాణప్రయాణసమయే కఫవాతపిత్తైః। కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే.

కృష్ణా! నీ పాదపంకజములను పంజరమందు నామనస్సనెడి రాజహంస యిప్పుడే ప్రకాశించునుగాక. ప్రాణముపోవుసమయమున కఫవాతపిత్తములు కంఠము నిరోధించినపుడు నీ స్మరణ మెక్కడిది?

అనికదా కులశేఖరాళ్వారులు ముకుందమాలయందుఁజెప్పిరి. కావున జీవించి బాగుగనున్నప్పుడే భగవన్నామస్మరణము సర్వదా చేయుచుండవలెను. అట్లు చేయువానిజన్మమే సార్థకము. తక్కినవానిజన్మము వ్యర్థము. కావున సర్వకాల సర్వావస్థలయందును భగవన్నామమము స్మరించుచునే యుండవలయును.

క॥ సంగతవాక్యంబుల హృత్సంగతు రఘురాము భక్తిఁ • దలఁచుటకన్నన్
రంగగుమేలువిధంబు గ,సంగా రా దింక నెన్ని •నయమార్గములన్. ౪౧

అర్థము.

సంగతవాక్యంబులన్ = మనస్సునకింపైనమాటలచే, హృత్సంగతున్ = హృదయస్థానమును బొందియుండు, రఘురామున్ = రఘువంశంబున జన్మించిన శ్రీరాముని, భక్తిన్ = ప్రేమతోడిసేవచే, తలఁచుటకన్నన్ = స్మరించుట కంటె, రంగగు మేలు విధంబు = నాణెమైన శుభమునిచ్చుమార్గము, ఎన్ని నయమార్గములన్ = ఎన్ని నీతిమార్గముల శోధించినను, కసంగారాదు = కానరాదు - లేదనుట.

తాత్పర్యము.

మీఁదఁజెప్పిన కారణములచే మనస్సునకు ప్రియమైన మాటలచే హృదయ ప్రదేశముననుండు రఘురాముని భక్తితో స్మరించుటకంటె నెన్ని నీతిమార్గముల శోధించి చూచినను శ్రేష్ఠమైన మార్గము వేఱొకటిలేదు. తక్కిన మోక్ష మార్గములన్నియు నేదే నొకకారణముచే దీనికిఁ దక్కువయే

'హృత్సంగతున్' అనుచోట 'సర్వస్య చాహం హృది సన్నివిష్ట-ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశే ర్జున తిష్ఠతి' యను భగవద్గీతావాక్యంబులు స్మరించునది. అంతర్యామియై భగవంతుఁడన్నిప్రాణులయందు నన్నాఁడు. అంతర్యామి గానుండు నాభగవంతుఁడే విభవావతారంబున కౌసల్యానందనుఁ డన వెలసెను. ఆయనయే యర్చావతారంబున కోదండరాముఁ డన నొంటిమిట్టయందు వెలసిన వాఁడు. కావున నవతారభేదమే కాని వస్తుభేదములేదు. అట్లగుటచే లోపల వెలుపలఁగూడ నెవరు భగవంతుఁ బూజించెదరో యెవ రీరెంటికి నభేద మనుట గ్రహింతురో వారే నిజమైనభక్తులు.

అంతర్యాగముకాని బాహ్యయాగముకాని త్యాజ్యము కాదు. రెండును గ్రాహ్యములే.

'హృత్సంగతు రఘురాము' ననుటచే హృదయకమలమం దుండు సీతావిశిష్టు రఘురామమూర్తియే ధ్యేయము. వెలుపల మన మేమూర్తిని సేవింతుమో యామూర్తినే లోపల సవస్త్రసాలంకారసాయుధుఁగా ధ్యానించుట శ్రేయ స్కరము. ఈమార్గమే శ్రీభాగవతమున ద్వితీయస్కంధమున ౨౩వ వచనం

బునను, విష్ణుపురాణంబున ఖాండిక్యకేశిధ్వజసంవాదంబునను గొనియాడఁబడి నది. భక్తులకుఁ బ్రశస్తమార్గ మిదియే.

కం॥ పూర్వులు నెవ్వరుఁ బలుకరు, పూర్వోత్తరరామకథల • ముని పల్కిన య
త్తెర్వునఁ దెలుఁగున గావున, సర్వము నెఱిఁగింతు రామ•చంద్రుని కరుణన్. ౪౨

అర్థము.

శ్రీరాముల స్మరించుట శ్రేయస్కరమే కాని యెట్లు స్మరింపవలయును? ఊరక రామ రామ యనుచుండవలయునా? లేక మఱి యేమార్గమైనఁ గలదా? యని యాలోచింపఁగా రామ రామ యని స్మరించుట శ్రేయస్కరమే కాని యది స్మరించువానిని మాత్రమే తరింపఁజేయును. తరింపవలసినవారు పెక్కురుండఁగాఁ దా నొక్కఁడు తరించిన నెంత? తరింపకుండిన నెంత? 'ఏక స్స్వాదు నభుంజీత' మధురాహారము తా నొక్కఁడే తినరాదు. నలువురకుఁబెట్టి తాను దినవలెను. కావునఁ దనతోపాటు లోకులుకూడ బాగుపడు కార్యముచేయుట శ్రేయస్కరము. అట్టి మార్గ మేది యన.

పూర్వులు = ఇంతకుముందు రామాయణము వ్రాసినవారెవ్వరును నేభాష యందును నేదేశమందును, ఎవ్వరు = ఎవ్వరైనను, పూర్వోత్తరరామకథల్ = పూర్వరామాయణమును,ఉత్తరరామాయణమును, మునిపల్కిన యత్తెర్వునన్ = వాల్మీకిపలికినవిధముగా, తెలుఁగునన్ = ఆంధ్రభాషయందు, పలుకరు = వచించినవారుకారు. కావునన్ = ఆకారణముచే, రామచంద్రునికరుణన్ = శ్రీరాములదయచేత, సర్వము = పూర్వరామాయణ ముత్తరరామాయణముకూడ, ఎఱిఁగింతున్ = తెలియఁజలికెదను.

తాత్పర్యము.

పూర్వకవు లెవ్వరును బూర్వరామాయణము నుత్తరరామాయణమును బూర్ణముగఁ దెలిఁగించినవారు లేరు. కావున నారెంటిని బూర్ణముగ లోకమున కెఱిఁగింతును.

నారదుఁడు వాల్మీకికి రామచరిత ముపదేశించినది మొదలు రావణవధానంతరము శ్రీరాము లయోధ్యలోఁ బట్టాభిషిక్తుఁడగువరకుఁ గలది పూర్వరామాయణము. పట్టాభిషేకము మొదలు నిర్యాణమువఱకుఁ గలది యుత్తరరామాయణము.

ఈరెంటిని సమగ్రముగా యథామూలముగాఁ బలికినవారు పూర్వకవులందును లేరు. నేఁటికవులందును లేరు. నేఁటిరామాయణములందు మూలానుసరణముగా నుండునది సమగ్రముకాదు. సమగ్రమయినది మూలానుసరణముగాదు. 'తనదికొంత. తాళ్లపాకవారిదికొంత' యన్నట్లు గ్రంథకర్తలు తమయభి

ప్రాయములను నితరుల యభిప్రాయములను మూలమునఁ జేర్చి చెప్పితేని యది వాల్మీకిపలికిన దెట్లగును ?

భగవంతుని స్మరణముచేఁ దాను లోకులుకూడ బాగుపడు కార్యము చేయుట శ్రేష్ఠమని రామాయణము రచించెద నంటివే. అది తక్కినవానికంటె నెట్లు శ్రేష్ఠము? తీర్థస్నానములు - క్షేత్రదర్శనములు దేవాలయనిర్మాణము లోనైనవి మంచివికావా దనను. వానిని జేయవలయు ననిన ధనముకావలయును. దేహదార్ఢ్యముకావలయును. వ్యయప్రయాసములులేక తక్కిన యాలుసంతానములుగాని జ్ఞానకర్మయోగ భక్తిమార్గములుఁగాని సాధ్యపడునవికావు. పుణ్యతీర్థక్షేత్రాదు లవి యున్నచోటికిపోయినవారికిమాత్రము ఫలము నొసంగునే కాని యితరుల కియ్యఁజాలవు. సత్కృతియో యట్లు కాదు. అది వారివారి యిండ్లకుఁ బోవును. వానిని వారివారి కనుకూలమైన కాలమందే పఠింప వచ్చును. పరులకు వినిపింపవచ్చును. తక్కినవియన్నియుఁ గొంతకాలమునకుఁ గాకున్నఁ గొంతకాలమునకైన నశించును. సుకృతి యట్టిది గాదు. ఏవిధముగఁ జూచినను భగవత్కథ రచించుటయే శ్రేయస్కరము. అందు నిది కల్పితముకాదు. సత్యమైనది. కావున భగవచ్చరిత్రము రచించుసుకవి తాను దరించి లోకులను దరింపఁజేయును. భగవచ్చరిత్రము లెన్నియో యుండ రామాయణరచనకుఁ బూనఁ గారణ మేమి యనిన.

చం॥ తతభవబంధమోచనని•దాన మ టంచు నెఱింగి ఘోరసం
సృతి దృఢపాశబంధనము • ద్రెంచి మొనర్పఁగ, శాశ్వతోరుసౌ
ఖ్యతతి నెసంగ, నిత్యము ని•రామయ మైనముకుందలోకసం
గతిఁ జెలువార, రామకథఁ • గైకొనితిన్ రచియింప నీగతిన్. ౪౩

అర్థము.

తతభవబంధమోచననిదానము = విస్తారమైన సంసారరూప జననమరణ బంధమునుండి విడించుటయందు మొదటికారణమైనది, అటంచు నెఱింగి = అని తెలిసికొని, ఘోరసంసృతి = భయంకరమైన సంసారముయొక్క, దృఢ = బలిష్ఠమైన, పాశ = త్రాళ్ళయొక్క, బంధనము = కట్లను, ద్రెంచి మొనర్పఁగన్ = త్రెంచుటకు, శాశ్వతోరుసౌఖ్యతతిన్ = శాశ్వతమై గొప్పదైన సౌఖ్య సమూహానుభవముచే, ఎసంగన్ = అతిశయించుటకు, నిత్యము = నాశము లేనిది, నిరామయము = ఏవిధమైన బాధలేనిదియైన, ముకుందలోకసంగతిన్ = నారాయణుని లోకముయొక్క కూడికచే - ననఁగా నారాయణుఁడుండు వైకుంఠమునందు, చెలువారన్ = ఆనందముచే నతిశయింపఁగా - అనఁగా సాయుజ్యమునొందుటకై; ఈగతిన్ = ఈవిధముగ - రచియింపన్, రామకథన్, కైకొనితిన్ = పూనితిన్.

"పరిపూర్ణబ్రహ్మానుభవాత్మికా ముక్తి" యని; ముక్తి యనఁగాఁ బరిపూర్ణ బ్రహ్మానుభవస్వరూపముగావున నట్టి యానందానుభవమే యిందుఁ జెప్పఁబడెను. అసాధ్యమైన యాత్మలయమును భక్తుఁడు గోరఁడు. రామాయణము మోక్షప్రదమనుటకుఁ గొన్ని ప్రమాణవాక్యములు ముందే వ్రాయఁబడెను.

ఈగ్రంథకర్తసంకల్పము నెఱవేఱు ననియే నమ్మఁదగియున్నది. ఏలన వీరి జాతకము శోధించిన దైవజ్ఞశిఖామణులు కూటాగూళ్లగ్రామనివాసులు బ్రహ్మశ్రీ గండ్లూరి లక్ష్మీనారాయణప్పగారీ విధముగ వ్రాసియున్నారు.

"తమ జాతకచక్రంబులకు జన్మకాలంబునకు తను వ్యయాధిపతియగు శని యు పంచమాష్టమాధిపతియగు బుధుఁడు పరివర్తనయోగయుక్తులై పంచ మాధిపతి బుధుఁడు మోక్షస్థానమందు రవిశుక్రులతోఁ జేరి పంచమస్థానమును గురుదృష్టిగలిగియుండుటచేత జ్ఞానసిద్ధిగలిగి ద్వాదశమందు సుఖతపస్థానాధిపతి శుక్రుఁడు రవిబుధులతోఁ గలిసియున్నందున ఫలము

శ్లో॥ బుధశౌరి రవిర్యంతే । భృగుస్వోచ్చేనవీక్షితే
విష్ణులోకం భవేత్తస్య యోగః కైవల్యసంజ్ఞకః ॥

అని చెప్పఁబడినది.

శ్లో॥ యోగే కైవల్యకో జాతః । బ్రహ్మజ్ఞానసదా రతః
అంత్యే మూర్ఖో భవేత్సత్యం । ముక్తిలాభం ససంశయః॥

అని యిత్యాది ప్రమాణశ్లోకములు గలవు."

వీరి వాక్యము యథార్థపడునుగాక.

తా త్ప ర్య ము .

జననమరణరూపకమైన సంసారబంధమునుండి విడిపింప మొదటికారణము రామకథయని ప్రమాణవాక్యములచేఁ దెలిసికొని భయంకరమైన సంసారమనెడి గట్టిపగ్గములను త్రెంచివేయుటకుఁగాను శాశ్వతమైన గొప్పసౌఖ్యమునొందుట కును నాశములేనిది, బాధలేనిదియగు వైకుంఠపదప్రాప్తిగలిగి భగవత్సాయుజ్య ము నొందుటకును శ్రీ రామాయణమువ్రాయఁ బ్రారంభించితిని.

చం॥ కవికిని యోగివర్యునకుఁ • గానను భేద మొకింత, నెట్లు నా
నవిరళభక్తియుక్తిని మ•నోంబుజవీధిని నిల్పి శ్రీహరిం
బ్రవిమలనిష్ఠఁ దన్మయత • భాసిలి తద్గుణవర్ణనాస్థచే
నవిరతకాలయాపన స•మంజసుఁ డౌఁగద సత్కవీంద్రుఁడుర్వి. ౪౪

ఓయీ! చిత్తవృత్తులనెల్ల నిలిపి మనస్సు నేకాగ్రముచేసి యోగివై భగ వద్ధ్యానము నిరంతరము తెఱపిలేక చేసినఁగదా ముక్తి. అటుచేయక పుస్తకము

వ్రాయుచుఁ గూర్చుండిన మూర్తి యెట్లువచ్చునను సందేహమునకు నీ పద్యమున సమాధానము చెప్పఁబడుచున్నది.

అర్థము.

సత్తపీంద్రుఁడు, అవిరళభక్తియుక్తిఁ = దిట్టమై తైలధారవలెఁ దెంపులేని భక్తితో, మనోంబుజవీథిఁ = మనస్సనెడి కమలప్రదేశంబున, తన్మయతఁ = తన్మయత్వముచే, తన్మయత్వమనఁగా దేనిని ధ్యానించుచున్నాఁడో యా రూపమే తానయి తనరూపము నునికిని బూర్తిముగ మఱచిపోవుట, తద్గుణవర్ణనాస్థచే = భగవద్గుణ వర్ణనమునందలి యాశచే, అవిరతకాలయాపన సమంజసుఁడు = తెఱపిలేక కాలముద్రోయుటచే నొప్పినవాఁడు.

తాత్పర్యము.

వాస్తవము విచారించినఁ గవికిని యోగికిని భేదములేదు. యోగి యే ప్రకారము చలింపని మనస్సుతో ప్రత్యాహారధ్యానధారణాసమాధులందున్నవాఁడై తన్మయత్వముచెందునో యట్లులే సత్తపీశ్వరుఁడు పరమభక్తితోఁ గూడినవాఁడై హృదయపద్మమునందు శ్రీమన్నారాయణుని నిలిపి నిర్మలమైన నిష్ఠచే నాయనగుణములనే వర్ణించుచు కొంచమైనను కాలము వ్యర్థముగాపోనీక తన్మయుఁడై ప్రయాసపడి సమాధిలో యోగి యనుభవించు నానందమును ప్రతిపద్యమందు ప్రతిపదమందు ననాయాసముగా ననుభవించును, గావున కవికి యోగికి భేదములేదు. చిత్తవృత్తినిరోధము యోగమని పతంజలి చెప్పెను. చిత్తవృత్తినిరోధమే లేదేని కవి కొకపద్యమైన సాగదు. 'సమత్వం యోగ ఉచ్యతే' యని భగవద్గీత. సుఖదుఃఖాదులందు సముఁడుగానుండుటే యోగము. కవిత్వము చెప్పఁబూనిన కవికి సుఖదుఃఖములు మనస్సున నంటవు. తన లోకమే తనది. ఆ యా కవియానందము ఆ యా కవికిఁ దెలియవలయునేకాని యితరులకుఁ గుకవులకు భక్తిహీనులకుఁ దెలియదు. వ్రాయునపుడు తన్మయుఁడై యుండుటచే నెవ్వరైనవచ్చి యెదురుగా నిలిచినను వారు కవికి గంటలకొలఁది కానరారు. వ్రాయుటచాలించి యితరకార్యముచేయునపుడును 'యోషాజారమివ ప్రియ'మన్నట్లు వానిమనస్సు తాను వ్రాయుచు విడిచివచ్చినదానియందే యుండును. ఇవన్నియు మహాకవులకు ననుభవగోచరములే. ఏండ్లకొలఁది జన్మములకొలఁది సాధించి సమాధియందు యోగి యనుభవించు నానందము కవికి నప్రయాసమున ప్రతిపద్యమందును గలుగుచుండును. శ్రద్ధాభక్తినిష్ఠాహీనులై పండితంమన్యులగు కుఱకుఱకవుల కిది శశవిషాణము.

"శ్లో॥ సంగీత మపి సాహిత్యం, సరస్వత్యాస్తనద్వయమ్
ఏకమాపాతమధురం, ద్వితీయం చింతనామృత" మ్మని కలదుకదా.

ఇంతయేల! ఈ గ్రంథమున జదివిన పెక్కురు మీఁదివిషయములు కొన్ని యనుభవమునకు వచ్చినవారుకలరు. ఊరక పైపై చదువువారికే యట్టిభావోల్బణత్వముకలుగుచుండఁగాఁ గవికెట్టులుండెనో యది సమీపముననుండి చూచిన వారికిఁ గొంతకుఁ గొంత తెలియును. కావున యోగికిఁ గవికి భేదములేదు. అందుఁ గవి కవియునైనపక్షమునఁ జెప్పవలసిన పనియేలేదు. [కవి యనఁగా బ్రహ్మవేత్త].

ఆ॥ మనసు కారణంబు • మనుజునిబంధమో,క్షముల కౌట మనసు • సారసాక్షు
నందు నిల్పి ము_క్తి•నందుట సుకరకా,ర్యంబటంచుఁ దోఁచె • నా_త్మయందు. ౭౫

అర్థము.

మనజుని బంధమోక్షములకున్ = మనుష్యుఁడు సంసారమందుఁ బ్రకృతిచేఁ గట్టువడియుండుటకు, దానినుండి విడిపించుకొని పోవుటకు. మనస్సే కారణము. మనస్సు కామక్రోధలోభములకులోఁబడి విషయములవెంటఁ బోవుచుండెనా మనుష్యుని గాఢముమీఁదఁబెట్టి త్రాళ్లతోఁ గదలకుండ గట్టిగ బిగించినట్టు సంసారమున కదలకుండ బంధించి నరకముల పాలుచేయును. అటుగాక యా మనస్సే కామక్రోధాదులకు లోఁబడక భగవచ్చింతనయందు వ్యవహరించుచుండెనా ప్రకృతిబంధములు తొలఁగి మోక్షార్హుఁ డగును. ఆత్మకు నాత్మయే బంధువు. ఆత్మకాత్మయే శత్రువని కృష్ణమూర్తి చెప్పెను. సారసాక్షునందున్ = నారాయణునందు, సుకరకార్యంబు = కష్టములేక చేయఁదగిన పని.

తాత్పర్యము.

మనుష్యుఁడు ప్రకృతిపాశబద్ధుఁడై సంసారసాగరమునఁగూలి నరకముల పాలగుటకు మనస్సే కారణము. దానినుండి విడిపించుకొనిపోయి ముక్తుఁడగుటకు మనస్సే కారణము. కావున బాగుపడఁదలఁచినవాఁడు ప్రకృతిపదార్థములందుండు మనస్సును నప్రాకృతదివ్యపురుషుఁడైన భగవంతునందురించిన సులభముగా ముక్తుఁడు కాఁగలఁడని తోఁచెను.

'శ్లో॥ మనఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయో' యను వాక్యము నిట ననుసంధించునది.

ముక్తలక్షణము శ్రీభాగవతంబున నిట్లు చెప్పఁబడెను.

సీ॥ జీవుండు భగవత్కృపావశంబునఁజేసి దేహాధర్మంబులై ధృతి ననేక
జన్మానుచరితదృశ్యములైన యజ్జరామరణంబు లాత్మధర్మంబులైన
ఘనపుణ్యపాపనికాయనిర్మోచన స్థితినొప్పి పూర్వసంచితములైన
యపహతపాప్మవత్త్వాదృష్టతద్గుణవంతుఁడై తగ భవచ్ఛరీర

గీ॥ భూతుఁడై పారతంత్ర్యాత్మ బుద్ధినొప్పి! దివ్యమాల్యానులేపన భవ్యగంధ
కలితమంగళదివ్య విగ్రహవిశిష్టుఁడగుచు హరిసూపమొందుటే యనఘ! ముక్తి.
—భాగవతే-3-౨౬౭.

'మమసాధర్మ్యమద్భావమాగతా' యను భగవద్వాక్యములు 'పరమం సామ్యముపైతి (మిక్కిలి సమానత్వము పొందుచున్నాఁడు)' అను శ్రుతివాక్యము సాయుజ్యశబ్దమునకు సమానగుణకత్వయుక్తను వ్యాసాచార్యవచనము ఈ యర్థమునే తెలుపుచున్నది.

మ॥ అటుగాకైహికవృత్తిమై, విషయతంత్రాధీనుఁడై ధీరుఁడుం
బటువాగ్వైభవజృంభణంబు తరుణీప్రత్యంగదుర్వర్ణనా
ర్భటి వ్యర్థంబుగఁ జేయఁ దత్కలితహృద్వ్యాపారదుశ్చింతనా
స్ఫుటఘోరాఘసుదగ్ధచిత్తుఁ డగుచుఁ క్షుణ్ణుం గదా యెంతయుఁ. ౪౭

అర్థము.

ధీరుఁడుఁ = పండితుఁడైనను, అటుగాక = ఆప్రకారముచేయక, యనఁగా మనస్సు భగవంతునిపైనుంచి గ్రంథములువ్రాయక, ఐహికవృత్తిమైఁ = ఈ లోకవ్యాపారముచే, విషయతంత్రాధీనుఁడై = విషయవ్యాపారములకు లోఁబడినవాఁడై, పటువాగ్వైభవజృంభణంబు = నేర్పుతోఁగూడిన మాటలసంపదయొక్క యతిశయము, తరుణీ = వయస్సుస్త్రీలయొక్క, ప్రత్యంగ = ఒక్కొక్కయవయవముయొక్క దుర్వర్ణనా = చెడుస్తోత్రములయొక్క, అర్భటిఁ = మ్రోఁతచే; వ్యర్థంబుగఁజేయఁ = ప్రయోజనములేని దానిఁగాఁజేసినయెడల, తత్కలిత... చిత్తుఁడు= దానిచేఁగలిగిన మనోవ్యాపారమైన చెడ్డధ్యానముచే లభించినస్పష్టమైన భయంకరమైన పాపములచేఁ గాల్పఁబడిన మనస్సుగలవాఁడు, అగుచుఁ, ఎంతయుఁ = మిక్కిలి, క్షుణ్ణుంగదా = క్షీణించునుగదా.

తాత్పర్యము.

మీఁదఁజెప్పినప్రకారము మనస్సును భగవంతునిపైనుంచి యాయన గుణములు వర్ణించి కవిత్వముచెప్పక స్త్రీల ప్రత్యవయవమును ననఁగా కన్నులు చన్నులు ముక్కులు చెక్కులు బొడ్డులు ముడ్డులు వీనిని మిక్కిలి చమత్కారముగ వర్ణించుటయందే తమ నేర్పంతయుఁజూపి వాగ్వ్యభిచారము చేయువాఁడెంతటి పండితుఁడైనను ఆ వర్ణనాసమయమందును నుపమానోత్ప్రేక్షాదులకై వెదకు సమయంబునను నా యా యవయవములందే మనస్సు నిలుపుటచే సంపాదించిన భయంకరపాపములచే దగ్ధమైన మనస్సుగలవాఁడై మిక్కిలి చెడిపోవును గదా. అనఁగా పరలోకదూరుఁ డగును. అసూయాకామక్రోధదాసులు సద్గ్రంథ

ములు వ్రాసినను మనస్సు నిర్మలముగాక భక్తి లేకపోవుటచేఁ బూర్ణఫలము రాదు.

ఉ॥ రామకథాసుధాంబుధి ని।రంతరమజ్జన మాచరించెదన్
రామకథామృతంబుఁ దమిఁ। ద్రావుచు దారుణతృష్ణ నార్చెదన్
రామకథానలాపమునఁ। గ్రాలుచు నందు నహర్నిశంబు, నే
రామకథౌషధంబున ని।రామయశాశ్వతసౌఖ్య మందెదన్. 82

అర్థము.

ఆకారణముచే, రామకథాసుధాంబుధి = రామచరిత్రమనెడి క్షీరసాగర మందు, నిరంతరమజ్జనము = ఎడఁదెగనిస్నానము, ఆచరించెదన్ = చేసెదను. రామకథామృతంబున్ = రామకథయనెడి యమృతంబును, తమిన్ = అపే క్షచే, త్రావుచున్ = త్రావుచు, దారుణతృష్ణన్ = భయంకరమైనదాహమును, ఆర్చెదన్ = నశింపఁజేసెదను, రామకథానలాపమునన్ = రామకథనే చెప్పు టచే, క్రాలుచున్ = ప్రకాశించుచు, ఉందున్ = ఉండెదను, అహర్నిశంబున్ = పగలురేయి, రామకథౌషధంబునన్ = రామకథయనెడి మందుచే, నిరా. . సౌఖ్యము- నిరామయ = దుఃఖరహితమై, శాశ్వత = ఎల్లకాలముండునది యైన, సౌఖ్యము = సుఖము, అందెదన్ = పొందెదను.

తాత్పర్యము.

మనస్సు భగవంతుపైనుంచిన జననమరణబాధ తొలఁగిపోవును గాన స్నా నము నిత్యకృత్యమగుటచే నెల్లప్పుడు రామకథయనెడు పాలసముద్రమునందే స్నానముచేయుచుండెదను. ఆఁకలి దప్పి పోవ రామకథయనెడు నమృతమునే పానముచేసెదను. ఉబుసుపోకకు ముచ్చటలాడుటకు మాఱుగా రామకథలే సల్లాపించుచుండెదను. రోగినిగావున రామకథ యను మందు తీసికొని మరల దుఃఖము రోగము లేక శాశ్వతసౌఖ్య మనుభవించెదను.

నిత్యకృత్యము కావున స్నానముచేయక తప్పదు. స్నానముచేయుట యేల? దేహమునందలి మురికిపోవుటకని స్నానముచేయుట వ్యర్థము. స్నానముచేసిన కొంతసేపటికే దేహమున మురికి వెలువడుచుండును. దేహము మలభాండము కదా. కావున మురికిపోవలయుననిన గంటగంటకు స్నానముచేయుచుండవల యును. స్నానముచాలించుటకే త్రిషవణస్నాన మేర్పాటుచేయఁబడినది. కార్మాధికారయోగ్యతకలుగుటకని చేయుట ముఖ్యము కావుననే కర్మణ్యతా సిద్ధ్యర్థమ్మని స్నానసమయంబున సంకల్పము చెప్పుట. ఏకర్మముచేయుటకు? భగవ త్కర్మచేయుటకు. కావున భగవదారాధనమందు. స్నానము ప్రథమకర్మమగు చున్నది. స్నానముచేయక యేకర్మముచేయరాదు. కావుననే ప్రాతస్స్నానము

విధింపఁబడినది. దైవకర్మములు పితృకర్మములు చేయుటయేల? ప్రతికార్యము చేసిరామార్పణము, కృష్ణార్పణము బ్రహ్మార్పణము నారాయణార్పణ మని చెప్పుటచేఁ గ్రమముగ మనస్సు భగవంతునందే దృఢపడి స్థిరముగా నిలుచును. ఎవనిమనస్సు భగవంతునందు నిలిచినదో వాఁడు లోకసంగ్రహార్థము ప్రమాదము రాకుండుటకుఁగాను గర్మములు చేయవలయును గాని యాత్మార్థము గాదు.

అట్టివాఁడు స్నానాదికర్మలుచేసినఁ గలుగులాభము లేదు చేయకుండినఁ గలుగులోపము లేదు. మేడయెక్కినవానికి నిచ్చెనతో నేమిపని? సప్తవిధస్నానములలో మానసస్నానము ముఖ్యము. 'మానసం హరిచింతన' మ్మనునట్లు భగచ్చింతనమే మానసికస్నానను. ఇదిలేక వారుణస్నానము వ్యర్థమే. వారుణస్నానమనఁగా నీటమునుఁగుట. మూఁడుకోట్ల యేడులక్షల తీర్థములందు మునిఁగినను రాగద్వేషములు పోవు. భగవచ్చింతనముచేతనే యవి పోవును.

శ్లో॥ జ్ఞానహ్రదే ధ్యానజలే, రాగిద్వేషమలాపహే
యస్స్నాతి మానసే తీర్థే, సయాతి పరమంపదమ్.
యోనిత్యమాచరేత్తత్తు సనై నారాయణస్మృతః. యని చెప్పఁబడెను.

కావున ప్రాకృతజలములందు మునిఁగినను మునుఁగకున్నను, జ్ఞానయుక్తమైన భగవచ్చింతినచేఁ గాలము గడపెదనని కవిభావము.

స్నానముచేయకుండినఁ బ్రాణము పోదు. ఆహారములేకున్నఁ బ్రాణముపోవునే యనిన "కాదంబరీరస జ్ఞానా దాహారోపి నరోచతే" కాదంబరీరసజ్ఞానమువలన నాహారము రుచింపదు. (కాదంబరి = (1) కల్లు (2) బాణకవికృతగ్రంథము) కాదంబరియందే యంతగుణముండిన రామకథయం దెంతగుణములేదు! ఈ పని చేయునపు డాహారమెవ్వరైనఁ దెచ్చిన, వారు విఘ్నకారులగు రాక్షసులుగాఁ గవికిఁ దోచుదురు. వాస్తవముగ నాఁకలిదప్పులు తెలియవు. దేహధారణము నిమిత్తమే యాహారగ్రహణము. ఆత్మోద్ధరణమునకు రామనామచింతన.

రోగి యేయౌషధము తీసికొనినను మరల నారోగమో మఱియొకరోగమో రాకమానదు. రామనామమను నౌషధమును దీసికొనిన మరల రోగమురాదు, ఏబాధయు లేదు, శాశ్వతసుఖమే కలుగును. కావున నాపనియే చేసెద నని భావము.

తే॥ రామనామమహాత్మ్యంబు • రాఁ దెలుంగ,
నల్లసర్వజ్ఞునకు నైన • నట్టిచోట
నేను రామాయణముఁ బల్క • నేర్తుననుచుఁ,
బూను టెట్టివివేకమో • బుధులకెఱుక. ౭౦

తాత్పర్యము.

రామ యను రెండక్షరముల మాహాత్మ్యము సర్వజ్ఞుఁడైన శివునకే తెలియునో తెలియదో - అటుండ నేను రామాయణము వ్రాయుదునని పూనుట యెంత యవివేకమో - యెంతసాహసమో పండితులకే యెఱుక. శ్రీరామ నామమాహాత్మ్య మనుగ్రంథమున నీ విషయము కొంచెము వ్రాయఁబడెను.

శా॥ భావిబ్రహ్మనొ పార్వతీపతినొ దుర్వాసుండనో కాక నే
భావింపన్ రఘురాముసద్గురువు విశ్వామిత్రసన్మౌనినో
యావిశ్వజ్ఞుఁడు నే వసిష్ఠుఁడనొ లీలాంభోజసంభూతుఁడౌ
నావాల్మీకినొ పల్కనౌనె సకలం బారామచారిత్రమున్? ౪౯

అర్థము.

భావిబ్రహ్మనో = హనుమంతుఁడనా? పార్వతీపతినో = శివుఁడనా? దుర్వాసుండనో = దుర్వాసుఁడనా? విశ్వామిత్రసన్మౌనినో = విశ్వామిత్రమహర్షినా? విశ్వజ్ఞుఁడునౌ = సర్వము తెలిసిన వసిష్ఠుఁడనా? లీలాంభోజసంభూతుఁడు= లీలాబ్రహ్మనా? రామచరిత్రము సకలము వ్రాయసాధ్యమా?

తాత్పర్యము.

ఆంజనేయునివలె శ్రీరాముని సన్నిధానమందు దాసుఁడై యుండి యాయన విషయమెఱిఁగినవాఁడనుగాను. రామనామమాహాత్మ్యమెఱింగిన సర్వజ్ఞుడగు శివుఁడనుగాను. రామాయణము వ్రాసిన దుర్వాసుఁడనుగాను. రామునకు గురువైన విశ్వామిత్రుఁడనుగాను. పురోహితుఁడుగానుండి యాయనవిషయమంతయు దెలిసిన వసిష్ఠుఁడనుగాను. శతకోటిగ్రంథవిస్తరమైన రామాయణము తనయొద్దనుంచుకొని తన కది ప్రసాదముగ నొసఁగినట్టి బ్రహ్మయొక్క యవతారమగు వాల్మీకిని గాను. వీరికందఱకు రామునితో సంబంధముగలదు. నా కేవిధమైన సంబంధము లేదు. ఇట్టి నాకు రామాయణమంతయు వ్రాయ సాధ్యమా ? కాదు.

కం॥ రామకథఁ బలుకఁ జేనియు, నేమెయినేన్ సుకవి గాఁడ దెట్టిబుధుండున్
ధీమహితులమత మౌ టిది, రామాయణమును రచింతు శ్రద్ధాయుక్తిన్. ౫౦

అర్థము.

ఏమెయినేన్ = ఏవిధముగానైనను, బుధుండున్ = పండితుఁడైనను, ధీమహితులమతము = గొప్పబుద్ధిగలవారి యభిప్రాయము. శ్రద్ధాయుక్తిన్ = శ్రద్ధతో.
నీకు సాధ్యముగాదని తెలిసితెలిసి యేల యిటువంటిపనికిఁ బూనెదవందు వేని దానికిఁ గారణములు తెలుపుచున్నాఁడు.

తా త్ప ర్య ము.

ఎట్టిపండితుఁడైనను రామకథ కొంచెమో గొప్పో గద్యముగానో పద్యముగానో చెప్పనియెడల వాఁడు సుకవి యనిపించుకొనఁడు. ఇది గొప్ప కవీశ్వరుల సంప్రదాయము కావున రామాయణము శ్రద్ధతో రచియించెదను.

కం॥ రాముఁడు పరదైవత మా,రాముఁడె నాపాలివేల్పు • రక్షింపఁగ శ్రీ
రామకృపాసంలబ్ధికి, రామాయణమును రచింతు • శ్రద్ధాయుక్తిన్. ౫౧

సుకవి యనుబిరుదు సంపాదించుటకా నీవు రామాయణము వ్రాయఁబూనితి వందురేమో- అటుకాదు. పూర్వజన్మసుకృతమువలన బాల్యమునుండియుఁ బద్యము లల్లువిద్య రామానుగ్రహమునఁ దనంతటఁదానే లభించినది. అట్లు లభించినదానిని దుర్విషయముల వ్యర్థపఱుపక సద్విషయంబున వినియోగించి మంచిపేరు తెచ్చుకొనుట నింద్యముకాదు. అది గౌణము. ముఖ్యకారణ మేమనఁగా.

అ ర్థ ము.

రాముఁడు పరదైవతము = దేవతలందుఁ శ్రేష్ఠుఁడయినవాఁడు, దేవతలకెల్ల దేవత, మోక్షమిచ్చు నధికారముగలవాఁడు రాముఁడు, ననురక్షించుటకు నాపాలివేల్పు = దేవత. ఆరాముఁడే. కావున శ్రీరామకృపాసంలబ్ధికై = శ్రీ రామానుగ్రహము కలుగుటకుఁగాను, రామాయణమును రచించెదను.

తా త్ప ర్య ము.

దేవతలకెల్ల దేవతయు, మోక్షదానాధికారియు నన్ను రక్షించుదేవతయు శ్రీరాముఁడే. కావున నాయన యనుగ్రహమునకై రామాయణమును రచించి వాగ్రూపకైంకర్య మొనర్చెదను. ఇది ముఖ్యకారణము. ముందుఁజెప్పిన సాలోక్యసారూప్యములు, సుకవిత్వలబ్ధి-యివియన్నియు గౌణములు, ఆనుషంగికములు.

కం॥ రామాయణమును బూర్వులు,దాము వచింపఁగనె యేమి? • తత మొరుసుకృతం
బోమునె యితరులఁ? గావున, రామాయణమును రచింతు • శ్రద్ధాయుక్తిఁ. ౫౨

అ ర్థ ము.

ఒరుసుకృతంబు = ఒకఁడుచేసినపుణ్యము. ఇతరులనోమునె = ఇతరులను రక్షింపఁగలదా?

తా త్ప ర్య ము.

పూర్వము రామాయణమును గొందఱు వ్రాసియున్నారుగదా. మరల రామాయణ మేల వ్రాసెదవనిన నెవరిపుణ్యము వారిది. ఒకలిపుణ్యము మఱియొకరిని రక్షించునా? రక్షింపదు. కావున నేను భగవదనుగ్రహము సంపా

దించుకొన రామాయణము రచించెదను. రామకథ "యెవ్వ రెన్నిగతుల౯ వర్ణించిర౯ గ్రాలదే" కం. పా. అనియు "స్వసూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం కవీనాం కో దోష" యనియుఁ బూర్వులే చెప్పిరికదా. అదియును గాక యేదోవిషయమును, నిష్టదైవమునకుఁగాక వేఱొకరికి నంకిత మిచ్చునట్లు గాక యిష్టదైవతమైన శ్రీరామునకు నాయనచరిత్రమునే వ్రాసి యాయనకే సమర్పించుట త్రికరణశుద్ధమైన ప్రశస్తమార్గముగదా.

కం॥ ఆమిక యిది గాదు సుఢీ, రామధ్యానక్రమంబు • రాగిల్లుట కై
బాములు దొలఁగుటకొఱకై, రామాయణమును రచింతు • శ్రద్ధాయుక్తిన్. ౫౩

అర్థము.

ఆమిక = అహంకారము - గర్వము; బాములు = జన్మములు.

పూర్వులకంటె గొప్పవాఁడ ననిపించుకొనవలెననికాని పూర్వులు వ్రాసిన దానికంటె బాగుగ వ్రాసెదననికాని గర్వముచే నిది వ్రాయఁబూనలేదుసుమా. ఈ విధముగా రామధ్యానక్రమమునందు, రాగిల్లుటకై = రంజిల్లుటకై - అనురాగము పుట్టుటకై, బాములు = భవములు - జన్మములు, తొలఁగుటకొఱకై = మరలరాకుండఁ జేసికొనుటకై.

తాత్పర్యము.

లోకులారా! ఇది గర్వముచేఁ జెప్పుట కాదు. వాస్తవము చెప్పుచున్నాను. రామధ్యానమునందు ననురాగముపుట్టుటకును మరల జన్మములేకుండఁ జేసికొనుటకును రామాయణము రచించెదను.

భవము దీనితద్భవము బాము. అహమిక తద్భవము ఆమిక.

ఉ॥ ఆరయ మోక్షమార్గము లు•పాయము పూరుషకార, మీద్వయిఁ౯
భారతమం దుపాయ మభి•వర్ణిత మయ్యెను, రామసత్కథ౯
గారవ మారఁగాఁ బురుష•కారము విస్తృత మయ్యెఁ, జేర్చి పెం
పౌ రహిఁ దోఁచు భాగవత•మందు ననుత్తమవిష్ణుతత్త్వము౯. ౫౪

అర్థము.

మోక్షమార్గములు = ముక్తిలభించుత్రోవలు, రెండు. అందొకటి - యుపాయము = సాధనము. రెండవది - పురుషకారము = పురుషప్రయత్నము. విస్తృతమయ్యె౯ = విస్తరింపఁబడినది. అనుత్తమ = దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమము - విష్ణుతత్త్వమునకంటె గొప్పతత్త్వము లేదనుట.

తాత్పర్యము.

మోక్షమునకు మార్గములు రెండు. అందొకటి యుపాయము. రెండవది పురుషకారము. ఈరెంటిలో భారతము దుపాయము విస్తరింపఁబడెను. రామాయణమందుఁ బురుషకారము విస్తరించి చెప్పఁబడెను. శ్రీభాగవతమందుఁ దేనికంటె గొప్పతత్త్వములేదో యట్టి విష్ణుతత్త్వము చెప్పఁబడెను.

ఉపాయము = సాధనము. ఏయోగమును సాధనముగాఁ గొని మోక్షము సాధింపనెంతుమో దానికి నుపాయ మనిపేరు. భక్తి - జ్ఞాన - కర్మ - యోగాదు లుపాయములే. అన్నియుపాయములలో శ్రేష్ఠమైనది సిద్ధోపాయము భగవంతుఁడే. సేవకులయనుగ్రహము సంపాదించుకొని వారిమూలమునఁ బ్రభు ననుగ్రహము సంపాదించుకంటె భగవంతునినే నమ్మి యాయననే యుపాయముగఁ గొని యాయనపాదములపైఁ బడుట సిద్ధోపాయము. భారతమునఁ బాండవులు శ్రీకృష్ణునినే సాధనముగఁ గొని తరించిరి

పురుషకారము — తన కొకకార్య మొకనివలనఁ గావలసియుండెనేని దన యందుఁ బ్రీతిగలిగి యితరునియందు వాత్సల్యముగలిగి కార్యముఁ జక్కఁబఱచు మధ్యవర్తికిఁ బురుషకార మని పేరు.

రామాయణమున సీత - హనుమంతుఁడు పురుషకారభూతులే.

కం॥ మును వాల్మీకిరితసజ్జననుతకావ్యంబు రామచంద్రునితనయుల్
విని పించి, రిపుడు దెనుఁగునఁ, బొసరింపఁగ రామచంద్రపుత్రుండఁ గదా? ౫౫

అర్థము.

మును = పూర్వము, వాల్మీకిరితసజ్జననుతకావ్యంబున్ = వాల్మీకిచేఁ జెప్పఁబడి సజ్జనులచే మేలుమేలని స్తోత్రముచేయఁబడిన సంస్కృతకావ్యమును, రామచంద్రునితనయుల్ = రామచంద్రునికుమారులు - కుశలవులే, వినిపించిరి = రామునకు లోకమునకు వినిపించిరి.

తాత్పర్యము.

పూర్వము వాల్మీకిచే రచింపఁబడి దేవతలు, ఋషులు, లోకులందఱు మేలు మేలని శ్లాఘించినసంస్కృతరామాయణమును శ్రీరామచంద్రునికుమారులే లోకమునఁ బ్రకటించిరి. ఆంధ్రమున నట్లే చేయుటకు నేనును రామచంద్రతనయుఁడనే కదా. కుశలవుఁడనేకదా. కావున నట్టి యధికారము నాకుఁ గలదు.

కం॥ తనయులు మును దమచరితము, వినిపింపఁగ వినినయట్టి వీనుల మరలన్
వినఁగాత రాముఁ డిట్లీ, తనయుఁడు వినిపింపఁగోరు తమచరితంబున్. ౫౬

అర్థము.

వీనులు = చెవులు.

తాత్పర్యము.

పూర్వము తమ చరితమును దమ కుమారులు వినిపింపఁగా వినిన చెవులతో నిప్పుడీ తనయుఁడు వినిపించు తమ చరితము మరల రాముఁడు వినునుగాక.

తే॥ రామచంద్రుండు కృతిభర్త ♦ రామచంద్ర
సుతుఁడు కృతివక్త విషయంబు ♦ శుద్ధమోక్ష
మహితలాభప్రదంబు రా♦మాయణంబు
గలుగఁగలదె వైలక్షణ్య♦ములను గొఱఁత. ౫౭

అర్థము.

కృతిభర్త = ఈ గ్రంథమున కధిపతి శ్రీ రామచంద్రుడు, రామచంద్రసుతుఁడు కృతివక్త = రామచంద్రునికుమారుఁడు గ్రంథమును బలుకువాఁడు, విషయంబు = ఈ గ్రంథమందుఁడు విషయమో, శుద్ధ ప్రదంబు = మరల జన్మమునకు బొత్తుగ రాకయుంటట యను గొప్ప లాభమును గలిగించునట్టి, రామాయణము = శ్రీరామచరిత్రము, వైలక్షణ్యములను = విలక్షణసంపత్తులందు, కొఱఁతగలదా?

ఉత్తమకావ్యములందు విశేషలక్షణములు మూఁడుండవలయును. ఆ మూఁడును నీ గ్రంథమందుఁ గలవు.

తాత్పర్యము.

కృతిపతి శ్రీరామచంద్రుఁడు. కృతివక్త శ్రీరామచంద్రమూర్తికుమారుఁడు. కృతియందలి విషయము శ్రీరామచరిత్రము. కావున వైలక్షణ్యములం దేలోపములేదు. కృతిభర్త మనుష్యుఁడైనను, కృతికర్త దుర్నీతిపరుఁడైనను విషయ మైహికమైనను అది యుత్తమకృతికాదు.

ఉ॥ శ్రీమహితుండు వాల్మీకి వ♦చించెఁ గదా యని యుత్సహించి శ్రీ
రామకథార్ణవంబును ద♦రంబె తెరింపఁగ నాదుబోఁటికిన్?
భీమతరస్వియౌ హనుమ ♦ వేగము దాఁటు నటంచు నీరధిం
జీమయు దాఁటఁ బూను నిఁకఁ ♦ జెప్పెడిదేమి వివేకసంపదన్! ౫౮

అర్థము.

శ్రీమహితుండు = తపశ్శక్తి - యోగబలము - బ్రహ్మానుగ్రహము అను సంపత్తిచే గొప్పవాఁడు. శ్రీరామకథార్ణవము = రామకథ యను సముద్రమును; నాదుబోఁటికిన్ = నావంటివానికి, తెరింపఁగన్ = దాఁటఁగ, తరంబె =

సాధ్యమా? భీమతరస్వి = భయంకరమైన బలము వేగము గలవాఁడగు; హనుమ= హనుమంతుఁడు, నీరధిన్ = సముద్రమును.

తాత్పర్యము.

తపశ్శక్తి = యోగబలము - బ్రహ్మానుగ్రహము గల వాల్మీకి రచించిన రామాయణమును నేశక్తియులేని నాయట్టియల్పుఁడు వ్రాయఁబూనిన సాధ్యపడునా? మిగుల బలము వేగము గల హనుమంతుఁడు సముద్రమును దాఁటెనని చీమగూడ నేను దాఁటెద నని పూనిన దాని తెల్విగుఱించి యేమనిచెప్పవలెను? అవివేక ప్రసంగమేకదా?

కం॥ ఓపి యగస్త్యుఁడు నీరధి, నాపోశన మెత్తెఁ గాదె ♦ యని యితరులు దా
మాపని కై పూనినఁ దుద, యేపారునె? లోకమెల్ల ♦ నిహిహీ యనదే? ౫౯

అర్థము.

నీరధిన్ = సముద్రమును, ఆపోశనమెత్తెన్ = అరచేతిలోకిఁ దీసికొని త్రావెఁగదా, ఇహిహీయనదే = నవ్వదా?

తాత్పర్యము.

పూర్వమగస్త్యమహర్షి సముద్రమునంతయు నరచేతిలోనికిఁ దీసికొని త్రావెఁగదా యని యితరు లట్లు చేయఁజూచి రేని లోకము నవ్వదా?

కం॥ గోవిందుఁడు మున్నెత్తఁడె, గోవర్ధన మనుచు వెఱ్ఱి ♦ గొల్లం డొకఁడా
గ్రావం బెత్తఁగఁ బూనిన, నేవిధమున సఫల మగు న ♦ భీష్టార్థంబుల్? ౬౦

తాత్పర్యము.

గోపాలకృష్ణుఁడు గోవర్ధనమెత్తెనని వెఱ్ఱిగొల్లవాఁడొకఁడు తాను నట్లు చేయఁబూనెనేని వానికోరిక యెట్లు సఫలముకాఁగలదు? గ్రావము = పర్వతము.

ఆ॥ రామకోటి నేను ♦ వ్రాయంగ మఱవ వై, రాగివేషములను ♦ రాత్రిఁ గలను
బోధ మొనరఁజేయు ♦ పుణ్యాత్ము లీకృతి, నిర్వహింత్రు గాక ♦ నిఖిలవిధుల. ౬౧

తాత్పర్యము.

మహాకార్యభారము పూనుటకు ముందు జ్ఞానముచేతనో, ధైర్యముచేతనో యుత్తరకుమారునివలెఁ బ్రగల్భములు పలుకవచ్చునుగాని భారము వహింపవలసి వచ్చినపు డెట్టివాఁడును జంకకమానఁడు. అట్లులే యీగ్రంథకర్తయు నధైర్యపడియు మరలఁ గొన్ని నిదర్శనములచే భగవంతుఁడు తనపాలఁ గలఁ డని ధైర్యము తెచ్చుకొనుచున్నాఁడు. నేను రామకోటి వ్రాయ మఱవఁగా నిరువురు బైరాగులు వచ్చి రామకోటి వ్రాయుట యేల విడిచితివి వ్రాయరాదా యని బోధిం

చిరి. ఈ యిరువురు రామలక్ష్మణులే కాని యితరులు కారు. నా శ్రేయస్సుఁగోరి కదా వా రిరువు రట్లు బోధించుట? అట్టివా రిప్పు డేల గ్రంథరచనవిషయమున సహాయపడకుందురు? అవశ్యము తోడగుదురు. వారే నిర్వహింతురు. ఈ కల (౧౮౯౮) నెల్లూరిలో తిప్పరాజువారిసత్రమునొద్ద రామమ్మగారి యింటిలోఁ గాపురమున్న సమయమున వచ్చెను. ఇప్పు డౌషధముల విక్రయించు శర్మగారీ రామమ్మగారి యల్లుఁడే.

తే॥ అద్భుతంబుగ మట్టమ•ధ్యాహ్నమునను, బుష్కరాఖ్యవిరాగిని • బుణ్యరామ
భక్తి నామదిలోపలఁ • బ్రజ్వలింప, నెఱపఁ బంపించునఁ డిది • నిర్వహించు. ౬౨

తాత్పర్యము.

ఆశ్చర్యకరమైన విధముగా నొకనాఁటి మధ్యాహ్నమందొక బైరాగి పుష్కరుఁడను పేరుగలవాఁడు వచ్చి రామభక్తివిషయమై కొన్నిసంగతులు బోధించి యుత్సాహవంతునిఁ జేసిపోయెను. ఇదియు భగవత్ప్రేరణమే కదా? ఇది యీకృతి ప్రారంభదశయందే జరగెను. ఈ బైరాగి నెవఁడు పంపెనో వాఁడే యీకృతిని నిర్వహించుకొనును. ఇదియును నెల్లూరిలో సంతపేటలో నుండ జరిగెను. ఈకాలమందీగ్రంథకర్త నెలకు రు ౭-౫-౪ ల యుపవేతనములో జీవించుచుండెను. ఈగ్రంథ మారంభించిన కొలఁదికాలమునకే చెన్నపురియందుఁ దిరువళిక్కేణి హిందూహైస్కూల్ అను పాఠశాలయందు నెలకు రు ౨౦-౦-౦లు వేతనముగల యాంధ్రపండితపదవి లభించెను.

ఇవన్నియు రామానుగ్రహనిదర్శనములే యని గ్రంథకర్తవిశ్వాసము.

తే॥ అన్నచేత నిరస్తుఁడై • యార్తిఁ గూరి
శరణుచొచ్చిన రాక్షసు • శత్రుననుజుఁ
బ్రేమఁ జేపట్టి నట్ట ద•యామయుండు
ప్రోచు న న్నెప్పు నాదోష•పుంజ మణఁచి. ౬౩

అర్థము.

అన్నచేతన్ = తనయన్నయగు రావణాసురునిచే, నిరస్తుఁడై వెడలఁద్రోయఁబడినవాఁడై, ఆర్తిఁగూరి = ఆర్తినిపొంది, శత్రుననుజున్ = విరోధితమ్ముని, చేపట్టి, = అభయహస్తమిచ్చి, రక్షించినట్టి, దయామయుండు = కరుణాకాకుత్స్థయని బిరుదుగల కృపాస్వరూపుఁడు, దోషపుంజమున్ = దోషసమూహమును, అణఁచి = పోఁగొట్టి.

తాత్పర్యము.

అన్నయగు రావణాసురునిచే వెడలఁగొట్టఁబడి దీనుఁడై శరణుఁజొచ్చిన పగవానితమ్మునికి నభయహస్త మిచ్చి 'రిపూణామపి వత్సలః' శత్రువులందును దయ

గలవాఁడని పేరుఁ గొన్న దయామూర్తి తనకనుకూలుఁడై భృత్యుఁడై వర్తించు నన్ను నాదోషములనఁ బోఁగొట్టి రక్షించును గాక.

కం॥ మందరనగభరమునకై, బృందారకు లెల్లమొఱలు • వెట్టినఁ బక్షి
స్యందనుఁడై సాయముపడు, నిందిరపతి నాకు శరణ • మీకార్యమునన్. ౬౮

అర్థము.

మందరనగభరమునకై = మందరపర్వతభారమును మోయఁజాలక, బృందారకులు = దేవతలు, పక్షిస్యందనుఁడై = పక్షివాహనముగాఁగలవాఁడై, ఇందిరపతి = లక్ష్మీదేవిభర్త, శరణము = దిక్కు - రక్షకుఁడు.

తాత్పర్యము.

మందరపర్వతభారము వహింపలేక దేవతలెల్ల కుయ్యో, మొఱ్ఱో యని మొఱవెట్టఁగా గరుడవాహనారూఢుఁడై వచ్చి యాభారమును దాను వహించి వారికిఁ దోడుపడిన శ్రీమన్నారాయణుఁ డీకార్యనిర్వహణమందును భారము తనపై వైచికొని నిమిత్తమాత్రముగా నన్నుంచుకొని నాకు దిక్కయి రక్షించును గాక.

చ॥ అమృతము లబ్ధమౌను గల • శాంబుధిఁ ద్రచ్చ, నటంచుఁ దన్మహో
ద్యమమున బాస టౌచు, నమృ • తం బిడి ప్రోచె నిలింపకోటి నే
విమలుఁడు, వాఁడె తోడగుత • వీడక నే నమృతోపభోగినై
యమరఁగఁ జల్పు రాఘవక • థామృతసాగరమంథనంబునన్. ౬౯

అర్థము.

కలశాంబుధిన్ = పాలసముద్రమును, త్రచ్చన్ = చిలుకఁగా, అమృతము, లబ్ధమౌను = లభించును, అని బోధించి, తన్మహోద్యమమునన్ = ఆ మహాప్రయత్నమందు, బాసటౌచున్ = సహాయుఁడగుచు, అమృతంబిడి = అమృతమిచ్చి, నిలింపకోటిన్ = దేవతలసమూహమును, ఏవిమలుఁడు = ఏపాపరహితుఁడు, ప్రోచెన్ = రక్షించెనో, వాఁడే = ఆభగవంతుఁడే, వీడక = వదలక, నేను, అమృతోపభోగినై = అమృతము ననుభవింపఁ గోరికగలవాఁడనై, అమరఁగన్ = చక్కఁగ, చల్పు = చేయునట్టి, రాఘవకథామృతసాగరమంథనంబునన్ = రామకథ యనెడి క్షీరసాగరమును చిలుకుకార్యమునందు, తోడగుతన్ — సహాయుఁడగును గాక.

తాత్పర్యము.

'దేవతలారా! మీరు క్షీరసాగరమును జిలికితిరా యందమృతము లభించు' నని బోధించి వారా మహాప్రయత్నమునకుఁ బూని మందరము తేలేక నడి

త్రోవలో నీడిగిలఁబడ నప్పుడు తానే దానిని మోచితెచ్చి పాలసముద్రమున వైచి చిలుకఁజేసి యందమృతము పుట్టఁగా దానిని దేవతల కిచ్చి రక్షించిన భగవంతుఁడు రామాయణకథ యను పాలసముద్రమును మందరముచేఁ జిలుక పూనిన నాకుఁ దోడయి కార్యము నెఱవేర్చి యమృతము ననుభవింపఁజేయును గాక.

౬౮, ౬౯ పద్యము లప్పటికంటె నిప్పు డెక్కువ సార్థకములు.

ఉ॥ శ్రీరఘురామచంద్ర! యొనరించెద నే నొకమన్వి, నాదరం
బారఁగ నప్రమాదమతి • వై వినుమీ కనుమీ, వచింపఁ ద్వ
ద్భూరితరప్రబంధమును • బూనితి, దానిని నిర్వహింపఁగా
భారము నీభుజంబుననె • వైచితి, వల్దన వీడ నమ్ముమీ! ౬౬

గ్రంథకర్త యిఁక పరోక్షప్రార్థనము మాని రామునిఁ బ్రత్యక్షముగా సంబోధించుచున్నాఁడు.

అర్థము.

అప్రమాదమతివై = పరాకులేనివాఁడవై. త్వద్భూరితరప్రబంధమున్ = మిగుల గొప్పదైన నీ కావ్యమును. భారము = బరువు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రప్రభూ! నే నొకమనవిచేయుచున్నాను. నీ రాచఠీకపు రీవి యావలఁబెట్టి ప్రీతితో పరాకులేక విని యావల దానిని నెఱవేర్ప నాలోచింపుము. నీమనవి యేమో చెప్పు మనెదవా! నీ గొప్పచరిత్రమును జెప్పఁబూనినాఁడను. సంకల్పించుట నావంతు. దానిని నిర్వహించుట నీవంతు. 'నీవు చేయుకార్యములన్నియు నా కర్పణముచేయు' మని నీవు చెప్పితివి గనుక దానిని సాంతముచేయుభారము నీ భుజములందే వైచితిని. నీవు వల దనినను వదలను. ఈమాట నమ్ముము.

చం॥ కవి ననుగాఢగర్వమునఁ • గాదు, మహత్తర మైన బుద్ధివై
భవమునఁ గాదు, నిస్తులిత•పాండితిపెంపునఁ గాదు రయ్యా, యీ
ప్రవితతకావ్యసంఘటన•భారము నే నిటు పూనుటెల్ల, రా
ఘవ! భవదీయసచ్చరణ•కంజయుగంబు స్మరింపఁగాఁ జుమీ. ౬౭

తాత్పర్యము.

రామచంద్రమూర్తీ! యీ గొప్పకావ్యమును రచించుభారమును పూనుటకుఁ గారణము నేను కవి నను గొప్పగర్వముకాదు. విశేషమైన బుద్ధిసంపద గాదు. అసమానమైన పాండిత్యముయొక్క యతిశయము గాదు. ఈ కార్యము

నకుఁ బూనినమొదల నీ పాదకమలములను స్మరించుచుండుట కనుకూలపడు నను నాశయేసుమా!

చం॥ చిఱునగ వొప్పె నేమిటికొ • శ్రీరఘురామ! భవన్ముఖాబ్జమం
దెఱుఁగఁగఁ జెప్పవే, తెలిసె • 'హీ యితఁ డెక్కడఁ దుచ్ఛమానవుం
డుఱు వగుమత్కథం బలుక • నూనుట యెక్కడ ? నేమి సాహసం ?
బుఱక పయోధి నీఁదుటకు • నూనెఁ గదే' యన దుర్ణ హసించెదే ? ౬౮

తాత్పర్యము.

రామచంద్రమూర్తీ! నీ ముఖకమలమందుఁ జిఱునవ్వు కానవచ్చుచున్నదే యేల? తెలియఁజెప్పుమా! తెలిసెఁదెలిసె. నీవు చెప్పవలసిన పనిలేదు. 'ఎట్టి శక్తిసామర్థ్యములులేని యధమమనుష్యుఁడు వీఁ డెక్కడ? బ్రహ్మరుద్రాదులకుఁ బూర్ణముగఁ దెలియరాని నాకథను జెప్పఁబూనుటెక్కడ? వీఁ డెంతటిసాహసి? లక్ష్యములేక సముద్రము నీదుటకు యత్నించుచున్నాఁడే' యనికదా నవ్వెదవు!

చం॥ తెలియుము రామ! నీవ యొక • ధీరుఁడ వంచుఁ దలంపఁ బోకుమీ,
జలనిధి నీఁదు టెంత పని? • జన్మము లెన్నిటి నెత్తినాఁడనో,
యలయక ఘోరసంసృతిమ • హాంబుధు లెన్నిటి నీఁదినాఁడనో,
యలయిక యున్నె? నైజమును • మా బహుళార్తులు దేహధారికిన్! ౬౯

అర్థము.

ఘోర . అంబుధులు = భయంకరమైన సంసారము నను సముద్రములు.

తాత్పర్యము.

నీవు నవ్విన నవ్వుదువుగాక. నే నొకవిషయము చెప్పెదను తెలిసికొనుము. నీవే యొకధీరుఁడవు,సముద్రము దాఁటితి నని తలంపకు. నీవు సేతువుకట్టించుకొని యరకాలు తడిగాకుండఁగదా దాటితివి. నేనో యెన్నిజన్మము లెత్తినాఁడనో యెన్ని భయంకరమైన సంసారసముద్రముల నలసటలేక యీఁదినాఁడనో. ఇన్ని యీఁదినను నిప్పటికిని నాకేమైన యలఁతయున్నదా? ఇంక జన్మము లెన్నయిన నెత్తి యెన్నిసముద్రములైన దాటుటకు సిద్ధముగా నున్నానుగదా! ఏల నీ కలసట దోఁపలే దందువా? దేహధారులకు దుఃఖములు స్వభావములు, కావున నవి దుఃఖములుగాఁ గానరావు. అమేధ్యములోఁ బుట్టి పెరుఁగు పురుగులు దాని నసహ్యించుకొనునా?

ఉ॥ తావకవర్ణనాసరణిఁ • దప్పులు గల్గినఁ గోపగించుచుం
ద్రోవకు నన్ను, నావలన • దోసము లే దణుమాత్రమేనియున్
భూవరచంద్ర! నీవు తెలు • పో నలుపో నిజ మే నెఱుంగ, నా
కీవలఁ గెన్నఁడేఁ దెలిపి • తే? కనిపించితె యున్న రూపమున్? ౭౦

అర్థము.

తావకవర్ణనాసరణిన్ = నీస్తోత్రముయొక్క పద్ధతియందు, తప్పులుగల్గినన్ = అసత్యము లుండెనేని, కోపగించుచున్ = ఆగ్రహపడుచు, నన్ను, త్రోవకు = తొలఁగఁ ద్రోయవలదు. అణుమాత్రమైనను = కొంచెమైనను, దోషము = తప్పు, నావలన లేదు = నాయందులేదు, భూవరచంద్ర = ప్రభుసత్తమా! నీవు తెలుపో నలుపో = నీవు తెల్లనివాఁడవో నల్లనివాఁడవో, నిజమున్ = యథార్థమును, ఏ నెఱుంగన్ = నాకుఁ దెలియదు. ఈవలుకు = ఒంటివలుకు, ఎన్నఁడేన్ = ఏనాఁడైనను, తెలిపితే = తెలియఁజేసితివా? ఉన్నరూపమున్ = నీయథార్థస్వరూపమును, కనిపించితె = చూపితివా.

తాత్పర్యము.

మహాప్రభూ! శ్రీరామచంద్రా! నిన్ను వర్ణించుటయందు నేమైన దోషము లుండిన నే నసత్యమాడితి నని నామీఁద నీవు కోపించి నన్నుఁ గడ కీడువ వలదు. ఏలయంటివా? నాయందు దోషము కొంచెమైనను లేదు. నీవు నల్లనివాఁడవో తెల్లనివాఁడవో నిజము నాకుఁ దెలియదు. ఏల తెలియ దందువా? నీవు నాకెన్నఁడైన నేను నల్లనివాఁడ ననికాని తెల్లనివాఁడ ననికాని చెప్పితివా? నీ స్వస్వరూపముతో నాకుఁ గనఁబడితివా? రెండును లేనప్పుడు న న్నెట్లు తప్పులు పట్టెదవు. చెప్పనిదోషము కనఁబడనిదోషము నీదే తెలియనివాఁడ పూరకుండవలె. అసత్యము లేల వ్రాసెదనందువు.

కం॥ పలువురు పరిపరివిధములఁ, బలికిరి యందెంతొ నిజమొ, ప్రభువ! యెఱుంగన్;
బలికెద యథార్థ మిట నీ,కలరూపుం దెలిపితేని, కారుణ్యనిధీ! ౭౧

అర్థము.

పలువురు = అనేకులు, పరిపరివిధములన్ = అనేకరీతులు, నీవిషయమై, పలికిరి = చెప్పిరి, అందు = వారివాక్యములందు, నిజము, ఎంతొ = సత్యమెంతో, అసత్యమెంతో, ఎఱుంగన్ = నాకుఁదెలియదు, నీకలరూపున్ = నీ యథార్థస్వరూపమును, తెలిపితేని = తెలిపినపక్షమున, ఇటన్ = ఈగ్రంథమందు, యథార్థము = ఉన్నదున్నట్లు, పలికెదన్ = చెప్పెదను.

తాత్పర్యము.

మహాప్రభూ! నేను నిరాధారముగా వ్రాసినవాఁడను గాను, అనేకు లనేక రీతుల నీవిషయమై వ్రాసిరి. ఒకరు నీవు తెలుపని వ్రాసియుండిరి. లుపని మఱి యొకరు బంగారుచాయ యని వ్రాసిరి. ఒకయుగమున నలుపని మఱియొక యుగమునఁ దెలుపని మఱికొందఱు వ్రాసిరి. నే నొకఁడనే నాలుగురూపముల

ధరించి జనించెద నని చెప్పితివికదా. నీవు నలు పెట్లు ? లక్ష్మణుఁడు తెలు పెట్లు ? ఒక్కపదార్థమునకు రెండువర్ణము లేకకాలమున నుండునా ? నీ యాంతరంగికులైన మహర్షులు స్మృతీతిహాసపురాణకర్తలు చెప్పినదానిని విశ్వసించి నేను జెప్పెదను. పోనీ యిప్పుడు మించిన దేమి ? ఇప్పుడైన నీవు నీయథార్థస్వరూపముతోఁ గానవచ్చి యిది తప్పు అది యొప్పని చెప్పుము. అట్టులే వ్రాసెదను. లేదా నేను వ్రాసినదే సరి యని యంగీకరింపుము.

క॥ మీామహిమ మీార లెఱుఁగరు, శ్రీమహిళానాథ! యిట్టి • చిత్రచరిత్రో
ద్దాముల మిముఁ దెలియంగా, నేమానవుఁ డోపు, నీవ • యెఱిఁగింపు దయన్. ౭౨

అర్థము.

మీామహిమన్ = మీాగొప్పతనమున-ప్రభావమున, మీారెఱుంగరు=మీారే తెలిసినవారు కారు, శ్రీమహిళానాథ = లక్ష్మీనాయకా! ఇట్టి = ఇటువంటి, చిత్రచరిత్రోద్దామున్ = ఆశ్చర్యకరమైన నడవడిచే గొప్పవారైన మిమ్ము, భార్యాభర్తలను, ఏమానవుఁడు తెలియఁగానోపున్ = ఏమనుష్యుఁడు తెలిసికొన సమర్థుఁ డగును. కాఁడు. కావున దయన్ = కృపచే, నీవే, యెఱిఁగింపుము = నీవే తెలియఁజేయుము.

తాత్పర్యము.

మీాతత్త్వము నాకుఁ దెలియదని మీా రాక్షేపింపవలసినపనిలేదు. ఆకాశము పరిమాణము ఆకాశమునకే తెలియనట్లు మీామహిమ యెంతదో యెట్టిదో మీాకే తెలియదు. మీాజ్ఞానమున కెట్లంతెములేదో, మీామహిమకు నట్లంతము లేదు. అంతములేనిదానిని మీారుమాత్ర మెట్లు తెలిసికోఁగలరు? సర్వజ్ఞులు సర్వశక్తులునైన మీా కసాధ్యమైనది నాయట్టి యజ్ఞునకు నెట్లు తెలియఁగలదు. అప్రాకృతమునైన మీాచరిత్రమును ప్రకృతిబద్ధుఁడైన తుచ్ఛమనుష్యుఁడెవఁడు తెలిసికొనఁగలఁడు. కావున నీవే దయచేఁ దెలియఁజెప్పుము.

తే॥ చక్కఁగా ని న్నెఱింగిన • సత్యవచన
పరుఁడు ఎలుకుట నీతనిూ•భవులె పాడ
నీవు ప్రత్యక్షముగ వీవి • నిక్క మనుచు,
మెచ్చి యుండుట నీకథ • నచ్చినాఁడ. 23

అర్థము.

సత్యవచనపరుఁడు = ఋషిశ్రేష్ఠుఁడు, - ఋషయ స్సత్యవచసః' అమరము - యథార్థము చెప్పువారు గనుక ఋషులకు సత్యవచను లని పేరు. అట్టివారి

యందు శ్రేష్ఠుఁడు. తనూభవులు = కొడుకులు. పాడఁగ = గానముచేయఁగా. నచ్చినాఁడఁగ = నమ్మినాఁడను.

తాత్పర్యము.

ఓయీ యితరఋషీశ్వరులుకూడ నాచరిత్రమును వర్ణించి చెప్పిరికదా దీనిని నీవు ప్రమాణముగాఁ గొన నేమి కారణమందువా? తండ్రీ! చెప్పెదను వినుము. ఋషీశ్వరులు సత్యవచనులు గావున వా రసత్యముఁ జెప్పరు. అట్టి వారిలో శ్రేష్ఠుఁడు కావున వాల్మీకి యసత్యమాడఁడు. వాల్మీకిమహర్షి నీతో సమకాలికుఁడు, నీకుఁ బరిచితుఁడు, నీతండ్రికి స్నేహితుఁడు. చిత్రకూటమం దాయన యున్నప్పుడు మీ రాయన యాశ్రమమునకుఁ బోయి యుంటిరి. ఆయనను తెలిసి నమ్మిగదా నీభార్యను ఆయన యాశ్రమములో విడిచితివి. సీతాదేవి తన యాశ్రమమం దుండుసమయంబునఁగదా వాల్మీకి రామాయణమును రచించెను. పొరపా టుండిన నామె సవరించియుండునుగదా. నీకొడుకులు గానము సేయఁగా నీవు నీతమ్ములతో సుగ్రీవాదివానరులతో విభీషణాది రాక్షసులతో విని సత్య మని యామోదించితివికదా. ఎవ్వ రెవ్వ రీ చరిత్రమునఁ జెప్పఁబడిరో వారందఱు విని యామోదించినవారేకదా. అసత్యవిషయ మొక్కఁటి చెప్పియుండినను దీనివలెనే నీ వసత్యమాడితి వని వాల్మీకి నప్పుడే ధిక్కరించి యుందువుకదా. వాల్మీకి చెప్పినదానిలో నసత్య ముండ దని బ్రహ్మ వరమిచ్చెఁగదా. వసిష్ఠవామదేవాదులవలె నీయొద్ద నుద్యోగమందుండి నీయనుగ్రహముఁ గోరి యిచ్చకాలు చెప్పువాఁడు వాల్మీకి కాఁడుకదా. అట్లిచ్చకాలమారియైనచో నీదోషములను, (నసత్యమాడ సుమంత్రుని బ్రేరించుట - యుద్ధమందు వెనుకంజపెట్టుట - వాలిని చాటుగ నుండి కొట్టుట,) చెప్పియుండఁడుగదా. ఒకవేళ చెప్పినను సవరించి చెప్పియుండునుగదా. కావున సత్యముచెప్పవలయు నని యాయన యుద్దేశమేకాని నీయనుగ్రహ మెట్టులైన సంపాదింపవలెనని యాయన యుద్దేశము గాదు. అట్టివాఁడు చెప్పినదికనుకనే నిజ మని నేను నమ్మినాఁడ నని తాత్పర్యము.

వాల్మీకిపేరుతోనుండు నితరరామాయణము లాధునికకల్పితములు. వారివారి మతసిద్ధాంతపోషణమునకై వ్రాసి ప్రశస్తికై వాల్మీకిపేరు పెట్టఁబడినవికావున వాస్తవచరిత్ర మెఱుఁగఁగోరినవారి కవి విశ్వాసపాత్రములు గావు. ఆ యా మతాభిమాను లా యా గ్రంథముల నభిమానింతురు. వాస్తవకథనముకావున శ్రీమద్రామాయణము సర్వజనసేవ్యము. కావున శ్రీమద్రామాయణములోని విషయములు చర్చించునపు డా గ్రంథమును దానికి విరోధింపని యితరగ్రంథములలోనివిషయములను బ్రమాణములుగఁ గైకొనఁబడునుగాని తక్కినవి యర్వాచీనములుకావునఁ గైకొనఁబడవు.

అవతారిక - ఓయీ వాస్తవచరిత్రముకావున నాఖ్యాయికలవలె వినోదముగాఁ బఠింపవచ్చుననియా నీ శ్రమమునకుఁ గారణము.

కాదు. కాదు. భగవద్విషయము కల్పితమైనను గ్రాహ్యమేకాని కల్పితమందు శ్రద్ధాభక్తులు కుదురవు. కావున ఫలము స్వల్పమే. వాస్తవ భగవచ్చరిత్రములందు శ్రద్ధాభక్తులు కుదురుగా. కావున విశేషఫలము కలదు. భక్తి లేకచేసినకార్యమదెంత గొప్పదైనను వ్యర్థమే.

సీ॥ ఆమ్నాయపఠనంబు • లడవియేడ్పులె కదా, తావకభక్తి య•భావమైన
నిత్యకర్మప్రవృత్తి • నిగిడి చచ్చుటకె కా, తావకభక్తి య•భావమైన
నఖిలతీర్థస్నాన • మగచాట్లకే కదా, తావకభక్తి య•భావమైనఁ
బట్టెనామంబులు • భయపెట్టుటకునె కా, తావకభక్తి య•భావమైన
నీదుభక్తిలేమి • నిఖిలంబు వ్యర్థంబు, ప్రాణహీనమైన•వపువుఁ బోలె
నీదుభక్తిగలుగ • నిఖిలంబు వ్యర్థంబు, నదిఁ దరించు పిదప • నావయట్లు. ౭౮

అర్థము.

తావకభక్త యభావమైనన్ = నీభక్తి లేకపోయెనేని, ఆమ్నాయపఠనంబులు = వేదము లధ్యయనముచేయుటలు, అడవియేడ్పులుకదా = మనుష్యసంచారములేని యడవిలో నేడ్చిన విచారించువారెవరు? కావున భక్తిలేని వేదాధ్యయనము వ్యర్థము. నిత్యకర్మప్రవృత్తి = ఎడతెగక తన వర్ణాశ్రమములకుఁ దగిన శాస్త్రీయకర్మములఁ జేయువ్యాపారము. నిగిడిచచ్చుటకెకా = నిక్కినీల్గి చచ్చుటకేకదా. అఖిలతీర్థస్నానము = లోకమునఁగల సార్ధత్రికోటితీర్థములందు మునుఁగుట. అగచాట్లకేకదా = కేవలము శ్రమమునకేకదా. పట్టెనామంబులు = పట్టెనర్థనములు - పట్టెలుపట్టెలుగా పుండ్రములుధరించుట, భయపెట్టుటకేకదా- జొన్నచేని కావలివెఱ్ఱిబొమ్మలవలెఁ జూచినవారిని భయపఱుపనేకదా. ఇవన్నియు సశాస్త్రములేయైనను భక్తలేకచేసిన వ్యర్థంబులు.

ప్రాణహీనమైన వపువుఁబోలెన్ = ప్రాణములేని దేహమువలె భక్తిహీనకార్యంబులన్నియు వ్యర్థములు. నదిఁ దరించుపిదప నావయట్లు = నదిని దాఁటినవెనుక నోడవలె భక్తికుదిరిన సర్వకర్మములు వ్యర్థములు. కర్మములన్ని చేయుట భగవంతునందు భక్తికుదురుటకే. భక్తికుదిరినపిమ్మట సాధనములు లేకున్న హానిలేదు.

తాత్పర్యము.

భక్తిలేదేని వేదాధ్యయనము శాస్త్రీయనిత్యకర్మానుష్ఠానము, సర్వతీర్థస్నానము, పుండ్రధారణము లోనైనవి వ్యర్థములు. ఇవన్నియు భక్తితోనే

చేయవలయును. దానివలన భక్తి బాగుగ దిటపడును. భక్తి బాగుగ దిటపడిన తరువాత నధ్యయనము తీర్థస్నానము లోనైనవి లేకుండిన దోషములేదు. లోకసంగ్రహార్థమై ప్రమాదరాహిత్యమునకై చేయవలయును గాని భగవత్ప్రాప్తి కుపాయము లని గాదు. ఎట్లనఁగా నేఱుదాటువఱకుఁ దెప్పతోఁ బని గలదు. ఏఱు దాఁటి యావలయొడ్డు చేరినపిమ్మట పడవను మోచికొని పోవలయునా ?

శా॥ ప్రారబ్ధంబులు పెక్కు లెప్పుడు నను • న్బాధించెడిం, గాన నా
ధీరత్వం బతిచంచలత్వముఁ గనెం • దె ల్వేదె, విఘ్నావళుల్
చేరం జొచ్చి కలంచుచు న్మనము ని, న్జేరంగ రానీయ, వీ
ఘోరాపజ్జలరాశిభంగముల మ•గ్నుం డౌచు క్షీణింతునో. ౭౫

అవతారిక - అన్నికర్మములకు భక్తి ప్రాణమై యుండ నట్టిభక్తి నాయందుఁ గుదురు నపాయము లేదే. నేను గడ తేఱు మార్గ మేఁటిలో నేనుజేయు నీ సేవ వ్యర్థమగు నేమో? అధోగతులపా లగుదునేమో యని గ్రంథకర్త విషాదపడుచున్నాఁడు.

అర్థము.

ప్రారబ్ధంబులు = పూర్వజన్మములఁజేసి యీజన్మమున ఫలానుభవమునకై వచ్చియుండు పుణ్యపాపకర్మఫలంబులు, పెక్కులు = అనేకములు, ఎప్పుడు = సర్వకాలసర్వావస్థలందు, బాధించెడిన్ = నన్ను బాధపెట్టుచున్నవి, కానన్ = కావున, నాధీరత్వము = నాధైర్యము, అతిచంచలత్వముగనెన్ = మిక్కిలి చలింపసాగెను. తెల్వేదెన్ = తెలివి నశించెను. విఘ్నావళుల్ = విఘ్నముల సమూహములు. కలంచుచున్ = కలవరపెట్టుచు, మనమున్ = మనస్సును, నిన్ జేరంగరానీయవు = నిన్ను సమీపింపనైన సమీపింపనీయవు - కావున ఘోరాపజ్జలరాశిభంగములన్ = భయంకరమైన యాపద యను సముద్రముయొక్క యలలందు, మగ్నుండౌచున్ = మునిఁగినవాఁడనై, క్షీణింతునో = నాశమగుదునేమో.

'కొన్ని యెడల మధ్యమోత్తమ పురుషంబులకు బ్రథమ పురుషమగు, (సు - వ్యా - కారక - ౪౦) మగ్నుండౌచు ననుటకు మగ్నుం డౌచునని ప్రయోగింపఁబడియె. ఇట్లు 'పాండుభూవరునకుఁ గోడలైతి'— తిక్కన.

తాత్పర్యము.

పూర్వజన్మములందుఁ జేసిన పుణ్యపాపఫలములు నన్ననుభవింపు నన్ననుభవింపుమని సకలకాలములందు నొకటివెనక నొకటిసముద్రమునందలి యలలవలె విరామ

ములేక నాపైఁబడిబాధించుచున్నవి. కావున నాగుండెచెదరి వికలమై నాధైర్యము నిలుకడ తప్పెను. ఆకారణముచే జ్ఞానము నశించెను. సత్కార్యముచేయుద మనిన విఘ్నములు గుంపులై వచ్చి యాకార్యమును కొనసాగనీయకున్నవి. మనస్సునైన నీయొద్దకురానీయకున్నవి. ఇట్లయిన నే నేమిబాగుపడఁగలను? ఈభయంకరమైన యాపద యను సముద్రములో నీయల యటుగొట్ట నాయల యిటుగొట్ట నెటుపోవలేక దరిచేరలేక మునిఁగిపోదునేమో, శ్రీరామచంద్రమూర్తీ! నన్నేమి రాచేయుమనెదవు? నేను దరి జేరుమార్గ మేది? తండ్రీ!

ఉ॥ ఎంతటి జ్ఞానహీనుఁడ, న • దెంతటిమత్తుఁడ, నెంత వ్యర్థుఁడన్,
జింతిలుచున్నవాఁడ నెటు • చేకుఱు నాయభికాంక్షితం బటం
చెంతయు, నీవు రాఘవ! య•హీనకృపామతి భీతిఁ బాపుచుం
జెంతలఁబాసటై నిలువఁ • జేడ్పడ నేల వ్యథావిలుండనై? ౭౬

అర్థము.

జ్ఞానహీనుఁడన్ = జ్ఞానములేనివాఁడను. మత్తుఁడన్ = మదించినవాఁడను. వ్యర్థుఁడన్ = నిష్ప్రయోజనముగ జీవించువాఁడను. అహీనకృపామతిన్ = అతిశయించిన కృపగలమనస్సుతో, భీతిన్ = భయమును, పాపుచున్ = పోఁగొట్టుచు, చెంతలన్ = సమీపమందు. బాసటై = తోడై. వ్యధావిలుండనై = వేదనచేఁ గలఁతపొందిన మనస్సుగలవాఁడనై. చేడ్పడనేల = ఏలబాధపడవలయును?

తాత్పర్యము.

రామచంద్రప్రభూ! నీవు నిండారుదయతో నా భయమును బోఁగొట్టుచు నాయొద్దనే తోడైయుండఁగా నే నెట్లు కడతేఱుదునా, సముద్రములో మునిఁగిపోవుదునేమో, నన్ను రక్షించువా రెవ్వరు, నాకోరిక యెట్లు నెఱవేఱు నని దిక్కులేనివానివలె నీ ప్రకారము దుఃఖించుచు వేదనచే మనస్సుచెదర బాధపడుచున్నవాఁడనే నె నెంతటితెలివిమాలినవాఁడను. ఎంత యెడ లెఱుంగక తిరుగువాఁడను. ఎంత వ్యర్థజీవిని! ఛీఛీ!

చ॥ ‘మనమున నెప్పు డేని నొక•మాఱె తమిన్ స్థిరసత్ప్రపత్తిచే
నను శరణంబు జొచ్చిన జ•నంబుల కే నభయం బొసంగెదన్
విను మిది నావ్రతం’ బనెదు • నీడగువిశ్రుతవాక్య మూఁతగాఁ
గొనితిని, స్థైర్యధైర్యములు • కూడె, నపాస్తము లయ్యె శంకలున్. ౭౭

అర్థము.

ఒక్కమాఱె = ఒక్కసారియే, తమిన్ = కుతూహలముతో, స్థిరసత్ప్రపత్తిచేన్ = చలింపని శరణాగతభావముతో, విశ్రుతవాక్యము = ప్రసిద్ధమైన మాట, అపాస్తములయ్యెన్ = తొలఁగిపోయిన వయ్యెను.

తాత్పర్యము.

"ఎవ్వఁడైనను వీఁడు వాఁడనక యేజనంబులయినను జీవించియుండు కాలములో నెప్పుడైనను నొక్కసారియే (పలుమాఱు లక్కఱలేదు) నన్నుచలింపని భక్తితో 'రామా నీవే శరణు - నీవాఁడను నేను' అనినంత మాత్రమున నెవ్వరివలన భయములేకుండ రక్షించెదను. ఇది నావ్రతము" అని నీవు జగమెఱుంగఁగా కోట్లకొలఁదులు వినుచుండఁగాఁ జెప్పినవాక్యము నాధారముగా నంగీకరించితిని దీనివలన నామనస్సు చలనముమాని కుదుటఁబడెను. నమ్మకముగా దరిఁజేరితి నని ధైర్యము వచ్చెను. సందేహము లన్నియుఁ దొలఁగిపోయెను.

కం॥ నీవాఁడని యొకపరియే
మేవాఁడేఁ శరణు వేఁడెనేని సకల భూ
తావళి కభయంబును నే
నావిరి ఘటించియుంతు నిదియ వ్రతమగు నాకున్

—యుద్ధ. ౩౮౭ ప.

అని విభీషణు విషయంబున శ్రీరాములు చెప్పినమాటల (చరిమశ్లోకము) నిట ననుసంధించునది.

ఉ॥ ఉల్లమునందుఁ దోఁచెను మ ◆ ఱొండు భవల్లపితంబు,'నెవ్వఁ డేఁ
బెల్లగు సర్వధర్మముల ◆ వీడి, దృఢోద్యదనన్యభక్తి సం
ధిల్లఁగ, నన్ను నొక్కరు, హృదిన్ శరణం బన, మత్పదాప్తి రా
జిల్లఁగనీని విఘ్నములఁ ◆ జెండెదఁ జింతిల' కంచుఁ బల్కవే? ౭౮

అర్థము.

మఱొండు = మరియొక, భవల్లపితంబు = నీమాట, ఉల్లమునందున్ = మనస్సునందు, తోఁచెన్ = స్మృతికివచ్చెను. అదియేమంటివా. పెల్లగు = అనేకములయిన. సర్వధర్మములు = కర్మయోగ- జ్ఞానయోగ- భక్తియోగములులోనైన మోక్షసాధనములన్నిఁటిని, వీడి = వదలిపెట్టి, దృఢోద్యత్ = స్థిరముగాఁబుట్టిన, అనన్యభక్తిన్ = ఇతరులయందు భక్తియుంచమి. సంధిల్లఁగన్ = కూడఁగా, నన్నునొక్కరున్ = నన్నొక్కనినే, హృదిన్ = మనస్సునందు, శరణంబనన్ = శరణమంటివేని, మత్పదాప్తిన్ = నాపదమును పొందుటను, రాజిల్లఁగనీని = సంతోషపడనీయని. విఘ్నములన్ = అంతరాయములను. చెండెదన్ = ధ్వంసముచేసెదను. చింతిలకు = శోకింపకుము. అని నీవుపల్కవే = నీవు పలుకలేదా?

తాత్పర్యము.

నీవు రామావతారమునఁ జెప్పిన వాక్యమే కాదు. నీవు కృష్ణావతారమునఁ జెప్పిన మఱియొక వాక్యముకూడ జ్ఞప్తికివచ్చినది. అది యేమంటివా? మోక్షసాధనము లని చెప్పఁబడిన యుపాయము లేవేవిగలవో వానినన్నిఁటిని వదలిపెట్టుము. వాని ననుష్ఠింప నీవు ప్రయాసపడవలదు. నిశ్చయమైనమనస్సుతో నితరులయం దెవ్వరియందు మనస్సునుంచక భక్తిసేయక నన్నొకనిమాత్రము శరణము అనుము, చాలును. ఈమాత్రము నేను జేసెదను. నీవేమిచేసెద వందువా? నన్నుఁ బొందనీయక నిన్ను బాధలఁబెట్టు విఘ్నరూపకములైన పాపముల నన్నిఁటిని నేను ధ్వంసముచేయువాఁడను. శోకింపకుము. అని నీవు చెప్పలేదా. ఇచ్చట

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ.
అహంత్వా సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మాశుచ.

యను భగవద్గీత (౧౮ అధ్యాయము - ౬౬వ శ్లోకము) చరమశ్లోకార్థమనుసంధించునది.

కం॥ కావున నిర్భీకుఁడనై, కావించెద నీదుచరితఁ • గావ్యముగాఁగన్
నావలనఁ దప్పు గలిగిన, నీవలననె కలిగె ననుచు • నే మది నెంతున్. ౭౯

అర్థము.

కావునన్ = మీఁదఁ జెప్పిన కారణముచేత, నిర్భీకుఁడనై = భయమువదలినవాఁడనై, నీదుచరితన్ = నీచరిత్రమును, కావ్యముగాఁగన్ = కావ్యరీతిగా, అనఁగా కావ్యలక్షణములు పోషించుచు, కావించెదన్ = రచియించెదను, నావలనఁ దప్పుగలిగినన్ = నాయందేదైన దోషము పుట్టినను, అది నీవలననె కలిగెననుచు = ఆదోషమునకుఁ గారణము నీవే నేను గానని, మదిన్ = మనస్సునందు, ఎంతున్ = తలంతును.

తాత్పర్యము.

'శ్రీరామచంద్రమూర్తీ! నామనస్సునందు భక్తియనునది లేదు, భక్తిలేక నీసేవచేసినఁ బ్రయోజనములేదు, ఇఁక నాగతియేమి' యని దిగులుపడుచుంటిని. నీవు రామావతారమందుఁ గృష్ణావతారమందుఁ జెప్పిన యుభయవాక్యములందు శరణువేఁడుమని చెప్పితివే కాని భక్తితో శరణువేఁడుమని చెప్పలేదు. కాఁబట్టి భక్తిలేదని భయము నాకిఁక లేదు. కావున భయము విడిచి నీచరిత్రమును కావ్యరూపముగా రచించెదను. దానిలో నేదైనఁ బొరపాటు వచ్చెనా, యాదోషము నీదే, నాది కాదని నాయభిప్రాయము.

నీ వాఁడించినట్లు నే నాఁడువాఁడనేకాని నా దోష మే మున్నది? కావున దోషమేదియు రాకుండునట్లు కనిపెట్టవలసినది.

సీ॥ భవ్య మై మౌనిసం।భావ్య మై సుజనాను, భావ్య మై నవరస।భావ్య మగుచు
హృద్య మై భక్తి సం।వేద్య మై కావ్యాళి, నాద్య మై సతతాన।వద్య మగుచు
శుద్ధ మై పద్యని।బద్ధ మై శాస్త్ర సం, బద్ధ మై నిగమార్థ।సిద్ధ మగుచుఁ
బూత మై కలితసం।గీత మై మౌనిరా, డ్జాత మై ధర్మని।కేత మగుచు

తే॥ శ్రావ్య మై సర్వలోకసం।స్తవ్య మగుచు, దివ్య మై పార్వతీశాజ।సేవ్య మగుచు
నవ్య మై గుణమణిగణ।దివ్యదర్ధ,మయినకావ్యంబురచియింతు।నాంధ్రభాష.౧౦

అవతారిక .— ఓయీ! రామాయణము వ్రాయఁబూనితివే. దానియం దేమి మహిమ గల దను ప్రశ్నమునకు సమాధానము వ్రాయఁబడుచున్నది.

అర్థము.

భవ్యమై = [‘భవ్యంశుభేచసత్యేచ, యోగ్యేభావినితు త్రిషు’ అని నిఘంటువు.] శుభమై సత్యమై యోగ్యమైనది. సంపత్సంతతీ రామకథాత యను వాక్యమునుబట్టి యిహలోకసుఖమేగాక పరలోకసుఖమును గలిగించునది కావున శుభమైనది. ముందుపద్యములందుఁ జెప్పిన కారణములవలన సత్యమైనది. కల్పితకథకాదు. కొన్ని గ్రంథములు కొందఱు చదువవచ్చును. కొన్ని గ్రంథములు కొందఱు చదువరా దను నధికారనియమము గలదు. దీని కా నియమము లేదు. ఎవ్వరైనను నాచండాలము స్త్రీలు పురుషులు చదువవచ్చును, వినవచ్చును. కావున సర్వజనగ్రాహ్యమైనది.

మౌనిసంభావ్యమై = మునీశ్వరుల గౌరవమునకుఁ బాత్రమైనది. కుశలవులు యాగశాలలయొద్ద రామాయణము చదివినపు డందఱు మేలుమే లని శ్లాఘించిరి.

సుజనానుభావ్య మై = సాధువులచే ననుభవింపఁదగినది, నవరస భావ్యము = శృంగారము - హాస్యము - కరుణము - వీరము - రౌద్రము - భయానకము - బీభత్సము - అద్భుతము - శాంతము అను తొమ్మిదిరసములు గలది.

హృద్యము = మనస్సున కింపయినది, భక్తిసంవేద్యము = భక్తిచేఁ దెలిసికోఁదగినది. భక్తిలేనివారి కిందలి తత్త్వార్థము బోధపడదు. కావ్యాళిఁ = కావ్యముల పంక్తియందు. ఆద్యమై = మొదటిదై. కావ్యములందు శ్రీమద్రామాయణమే మొదటిది. కనుకనే దీనికి నాదికావ్య మని పేరు.

సతతానవద్యమై = ఎల్లప్పుడు దోషరహితమైనది. కొన్నిగ్రంథము లొకవేళ చదువవచ్చును, ఒకవేళ చదువరా దను నియమము గలదు. దీని కట్టినియమములేదు. రామాయణము భోజనమునకు ముందు వెనుకల పారాయణము

చేయవచ్చును. శుద్ధమై = నిర్మలమై, పద్యనిబద్ధమై = పద్యములచేతనే కూర్పఁబడినది. ఇందు గద్యములులేవు శాస్త్రసంబద్ధమై=శాస్త్రములకట్టుబాట్లుగలదై నిగమార్థసిద్ధమై = వేదముల యర్థముచే సిద్ధమైనది, పూతమై = పవిత్రమై, చదివెడివారలను పవిత్రులఁజేయునది. కలితసంగీతమై = సంగీతముతోఁ గూడినదై, అనఁగా రాగజ్ఞానముగలవారు రాగయుక్తముగఁ జదువ సాధ్యమైనది. మానిరాడ్జాతమై = మునిశ్రేష్ఠునివలనఁ గలిగినదై, ధర్మనికేతమై = ధర్మవిషయములకు స్థానమై, ఎవ్వరేయేధర్మమందు నెట్లెట్లు వర్తించిన బాగుపడుదురో యావిధముల నెల్లఁ దెలుపునది

శ్రావ్యము = విన నింపైనది - వినఁదగినది సర్వలోక సంస్తవ్యము = సమస్తజనులచేత స్తోత్రముచేయఁదగినది. జైనులు - బౌద్ధులు కూడ రామకథ నాదరించినవారే.

దివ్యమై = దేవసంభవమైనదై, పార్వతీశాజ సేవ్యము = పార్వతి - శివుఁడు బ్రహ్మ - వీరిచే సేవింపఁబడునది . నవ్యమై = శ్లాఘ్యమై.

గుణమణిగణదీప్యదర్థము = కావ్యగుణములను గుణసమూహముచేఁ బ్రకాశించు నర్థముగలది.

తా త్ప ర్య ము .

శుభకరమై, సత్యమై, యోగ్యమై, మునీశ్వరులచే గౌరవింపఁబడినదై, సజ్జనులనుభవింపఁదగినదై, నవరసయుక్తమై, మనస్సున కాహ్లాదమొసఁగునదియై, భక్తిచేతనే తత్త్వమెఱుఁగఁ దగినదై, మొదటి కావ్యమై, దోషరహితమై, శుద్ధమై, పద్యములచే నిబంధింపఁబడినదై, శాస్త్రబద్ధమై, వేదార్థమునుగలదై, పవిత్రమై, స్వరాదియుక్తమై, గానమొనర్చుటకుఁ దగినదై, మునీశ్వరుని వలనఁ గలిగినదై, ధర్మస్థానమై వినుటకింపై, సమస్తజనులచే స్తోత్రముచేయఁబడునదియై, దేవతాసంబంధమై, పార్వతీ పరమేశ్వర పరమేష్ఠులచే సేవింపఁబడునదియై, శ్లాఘ్యమై, కావ్యగుణము లనెడి మణుల సమూహముచేఁ బ్రకాశించు నర్థముగలదైన కావ్యంబును నాంధ్రభాషయందు రచియించెదను

శ్రీమద్రామాయణ ముత్తమోత్తమకావ్యము.

౪౦॥ తనువగు శబ్దార్థంబులు । ధ్వని జీవ మలంక్రియావితానంబు సొమ్ముల్
దనరుగుణంబులు గుణములు । ఘనవృత్తులు వృత్తులనఁ గావ్యేందిరకున్.

—నరసభూ.

కావ్యలక్ష్మికి నర్థవంతములైన శబ్దములు దేహము, ధ్వని ప్రాణము, శబ్దాలంకారములు అర్థాలంకారములు సొమ్ములు, గుణములు గుణములు, వృత్తులు వృత్తులు.

ఉత్తమకావ్యమందు శబ్దములు వ్యాకరణదుష్టములుగాక సమయసందర్భోచితములై యర్థవంతములై యుండవలయును. ధ్వనియనఁగా వ్యంగ్యము. అనఁగా శబ్దమునుబట్టియో యర్థమునుబట్టియో తోఁచు విశేషార్థము.

వీఁడు పండితపుత్త్రుఁ డనిన వీనితండ్రి పండితుఁడేకాని వీఁడు శుంఠయని భావము. రామాయణమంతయు ధ్వనిగుంభితము. శబ్దాలంకారములు ఛేకానుప్రాసము, లాటానుప్రాసము, వృత్త్యనుప్రాసము యమకము లోనైనవి.

అర్థాలంకారములు- ఉపమ, ఉత్ప్రేక్ష, స్వభావోక్తి లోనైనవి. గుణములు- శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, ఓజము, సమాధి వృత్తులు - కైశిక, ఆరభటి, సాత్త్వతి, భారతి. రీతులు - వైదర్భి, గౌడి, పాంచాలి.

ఈ లక్షణములుగలది యుత్తమకావ్యము - ఇవియన్నియు మూలరామాయణమునందువలెనే యాంధ్రరామాయణమునందును గలవు

తే॥ అమరభాషను బలికె రామాయణంబు,
నాంధ్రభాషకు వ్యాకృతి నాద్యుఁ డయ్యె
నట్టివాల్మీకి మనమున నలరకున్నె,
యస్మదీయాంధ్రపద్యరామాయణము ? ౮౧

అర్థము.

అమరభాషకు - సంస్కృతమునందు, వ్యాకృతికి = వ్యాకరణమునకు, ఆద్యుఁడయ్యెన్ = మొదటివాఁడయ్యెను. అలరకున్నె = సంతోషింపకుండునా ?

తాత్పర్యము.

సంస్కృతభాషను శ్రీమద్రామాయణము రచించెను. ఆంధ్రభాషావ్యాకరణము రచించినవారిలో మొదటివాఁడయ్యెను. ఇట్లాదికావ్యకర్తయు ఆంధ్రవ్యాకృతికర్తయు నైన వాల్మీకి తాను రచించిన శ్రీమద్రామాయణమునకు సరియైనదియుఁ దాను రచించిన వ్యాకరణలక్షణములచే బద్ధమైనదియు నైన యాంధ్రపద్యరామాయణమునకు సంతోషపడకుండునా ?

వాల్మీకివ్యాకరణ మను నొక చిన్న తాళపత్త్రగ్రంథము నీగ్రంథకర్త కీర్తిశేషులైన గుమ్ముడూరు వేంకటరంగారావు నొద్దనుండఁ జూచెను. వ్రాసికొని యిచ్చెద నిమ్మనిన నిదోయదో యని కాలహరణముచేసి తుదకది యెవరికో యిచ్చి యురువు లేకుండఁ జేసెను. ప్రాకృత భాషకు వ్యాకరణము వ్రాసిన వాల్మీకి యాంధ్రమునకు వ్రాయకుండునా?

కం. ఉండఁగ నెందఱొ వేల్పులు, కొండాడెద రొక్కరాముఁ • గోవిదు లేలా?
పండినమామిడి దండనె, యుండఁగఁ గీరంబు లొండు • నొల్లునె చేరన్? ౮౨

అర్థము.

ఎందఱొ వేల్పులు = దేవతలెందరొ యుండఁగా, కోవిదులు = పండితులు, ఒక్కరామునే = రామునొకనినే, విశేషించి, కొండాడెదరు = స్తోత్రము చేసెదరు. ఏల = ఏమినిమిత్తము. పండిన మామిడిచెట్టు, దండనె = తమసమీపమందె, కీరంబులు = చిలుకలు, ఒండు = మఱియొక చెట్టును, చేరన్ = చేరుటకు, ఒల్లునే = ఇష్టపడునా?

తాత్పర్యము.

దేవతలెందఱో యుండఁగాఁ గోవిదులందఱు రామునొక్కనినే స్తుతించెదరే దాని కేమి కారణము? బాగుగఁ బండిన తియ్యమామిడిచెట్టు తమ సమీపమందేయుండఁగాఁ జిలుకలు తక్కినచెట్లకై యేలపోవును? కోవిదులు అనఁగా "కం నామ నవేత్తీతి కోవిద. విద జ్ఞానే" అది యిది యను నియమములేక సర్వము తెలిసినవారు - గురుబాలప్రబోధిక. 'కో ర్వేదస్య విదః। యద్వా కవి వేదే। విదాయస్య - విదా జ్ఞానేచ నిర్దిష్టా మనీషాయాంచ యోషితి' యని రామాశ్రమి. కోవిదు లనఁగా వేదవేత్తలు, సర్వము తెలిసినవారు. ఇట్టివారు శ్రీరాముని ధ్యానించునపుడు వేదములయందు వేదాంతములయందుఁ దెలియఁబడువాఁడను నేనే యనుటను వారు రామునియం దన్వయించి కదా యట్లు చేసియుందురు? కావున వేదవేత్తల యభిప్రాయమున పరతత్త్వము శ్రీరాముఁడే. ఆయనయే మోక్షదాత. శ్రీరామ పరత్వముఁ జూడుఁడు.

శ్లో॥ స్వసూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం
కవీనాం కోదోషః స్సతు గుణగణానా మవగుణః
యదేతై ర్నిశ్శేషై రపరగుణలుబ్ధై రివ జగ
త్యసా వేక శ్చక్రే సతతసుఖసంవాస వసతిః.

కవులందఱు తమ మంచివాక్కులకుఁ బాత్రునిగా రామచంద్రమూర్తి నొకనినే చేయుచున్నారే ఇది కవుల దోషమా? కాదు. సద్గుణములయందుండు దుర్గుణమే. ఏలన? అన్ని కల్యాణగుణములు గట్టిఁగఁడినట్లు పోయి యాయన యందే సుఖముగ నివసింప నేమి కారణము? సద్గుణములను వర్ణించుట కవి కార్యము. కావున నవి యెవరియందున్నవో వారిని వర్ణింతురుకాని యితరులను వర్ణింపరు. పండిన పండ్లుగల తియ్యమామిడి చెట్టును వదలి యేచిలుక వేపకాయలకుఁ దుమ్మకాయలకుఁ బరువులు పెట్టును?

తే॥ తత్సవితృవంశధారిణీ•ధవవరేణ్యు, భర్గవిధి దేవతాసము•పాస్యమాను
ధీమహితునధియోగియో•క్త్రిపుమనః ప్ర, చోదనార్థంబుయాత్వరి•స్తుతియొనర్తు.

అవతారిక.— రామాయణము గాయత్రీగర్భితము. సంస్కృతమున వేయి గ్రంథముల కొక గాయత్ర్యక్షర ముంపఁబడినది. గాయత్రీ మంత్రము భగవత్పరమే కావున గాయత్రీమంత్రమును గర్భితముచేసి రామపరముగ నీపద్యము చెప్పఁబడినది. గాయత్రీమంత్రమువచ్చిన వారు సులభముగా నిందు దాని నెఱుఁగఁగలరు. కావున వ్రాయఁబడ దయ్యె

అర్థము.

తత్సవితృవంశధారిణీధవవరేణ్యున్ = ప్రసిద్ధికెక్కిన సూర్యవంశపురాజులలో శ్రేష్ఠుని. భర్గవిధిదేవతా సముపాస్యమానున్ = శివుఁడు బ్రహ్మమొదలయిన దేవతలచేఁ జక్కఁగా నుపాసింపఁ బడుచున్నవానిని.

ధీమహితున్ = బుద్ధిచే గొప్పవాని. అధియోగిన్ = యోగులనందఱ నతిశయించినవానిని. యోక్త్రిపున్ = గోపపతిని (యోక్త్రము = పలుపు - అదిగలవాఁడు యోక్త్రి = గోపకుఁడు - వారిని పాలించువాఁడు యోక్త్రిపుఁడు) మనః ప్రచోదనార్థంబు = మనస్సును ప్రేరించుకొఱకు, యాత్వరిన్ = యాతు + అరి = రాక్షసవిరోధిని - "నైరృతో యాతు రక్షసీ" యని. యాతువు లనఁగా రాక్షసులు. స్తుతి = స్తోత్రమును. ఒనర్తున్ = చేసెదను.

తాత్పర్యము.

ప్రసిద్ధికెక్కిన సూర్యవంశపురాజులలో శ్రేష్ఠుఁడును. బ్రహ్మశివాది దేవతలచే నుపాసింపఁబడువాఁడును - బుద్ధిచే గొప్పవాఁడును - యోగీశ్వరుఁడును - యోగేశ్వరుఁడును - గోపాలకపతియును నగు వానిని నామనస్సు తనయందే వర్తించునటుల ప్రేరించుటకై స్తుతించెదను

గాయత్రియందు భగవంతుని తేజస్సు (శక్తి) చెప్పఁబడినది. ఇందు భగవంతుఁడే చెప్పఁబడినాఁడు.

మూలమందు గాయత్ర్యక్షరములవలె నీరామాయణమం దీ పద్యాక్షరములం దందు నిముడ్పఁబడినవి. అవి పెద్దయక్షరములతో ముద్రింపఁబడినవి. అవి వేయిపాదముల కొకటివంతున గనఁగను.

ఉ॥ ఖండితపాతకోత్కరు, న•ఖండయశోజయభాగ్యశాలి, మా
ర్తండకులప్రకాండు, నహి•తాండజపన్నగవైరి, సత్కృపా
మండనభూషితుం, గడప• మండలవాసుని, నొంటిమిట్టకో
దండరఘూత్తము, న్నియత•దాస్యమున న్భజియింతు భక్తినే. ౧౪

అర్థము.

అవతారిక - ఇఁక నైదుపద్యములచే గ్రంథకర్త కృతిపతిని సంబోధించుచున్నాఁడు

ఖండితపాతకోత్కరున్ = నఱకఁబడిన పాపముల సమూహములుగల వానిని అఖండయశోజయ భాగ్యశాలిన్ = సంపూర్ణమైన యశస్సుచేతను, జయముచేతను, భాగ్యముచేతను ప్రకాశించువానిని. మార్తాండకులప్రకాండున్ = సూర్యవంశమువారిలో శ్రేష్ఠుని. అహితాళిభుజంగవైరిన్ — విరోధులనెడు పాములకు గరుత్మంతుఁడైనవానిని. సత్కృపామండనభూషితున్ = మంచి దయయే యాభరణముగాఁ గలవానిని కడపమండలవాసున్ = కడపమండలమందు వసించు వానిని - ఒంటిమిట్టకోదండరఘూత్తమున్ = ఒంటిమిట్టయను గ్రామంబున వెలసిన శ్రీకోదండరాముని నియతదాస్యమునన్ = దాస్యమునే నియమముగా నంచుకొన్నవాఁడనై భజించెదన్ = సేవించెదను.

తాత్పర్యము.

భక్తుల పాప సమూహమును ఖండించువానిని పూర్ణమైన యశోజయలక్ష్ములచేఁ బ్రకాశించువానిని సూర్యవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని విరోధులను సర్పములకు గరుత్మంతునివంటి వానిని దాసోహమ్ భావమే నియమముగా నంచుకొని కడప మండలమందలి యొంటిమిట్టయందలి శ్రీరామచంద్రమూర్తిని సేవించెదను.

ఉ॥ బమ్మెర పోతరాజు నిరపాయసుఖస్థితుఁ జేయుపొంటె వా
క్యమ్ముల నిల్పి భాగవత మారసుధారసధారఁ జిల్కఁ, బూ
ర్వమ్మును నేఁడు నింక సరివారలు మిన్నలు లేక యుండ సా
రమ్ముగఁ బల్కు నేకశిల రాముఁడు నాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. ౮౫

బమ్మెర పోతరాజున్ = ఆంధ్రభాగవత గ్రంథకర్తయైన బమ్మెర పోతనామాత్యుని, నిరపాయసుఖస్థితున్ = ఎడబాయని సుఖమందుండు వానిఁగా, చేయుపొంటెన్ = చేయుటకొఱకై, వాక్యమ్ములనిల్పి = ఆయన మాటలయందుండి, 'పలికెడిది భాగవత మఁట, పలికించెడి వాఁడు రామభద్రుండఁట' యని యాయనయే చెప్పెనుగదా. భాగవతము = శ్రీభాగవతమును, ఆరన్ = పూర్ణముగా, సుధారసధారలు = అమృతరసధారలు, చిల్కన్ — చిలుకుచుండునట్టులు, పూర్వమ్మును = ఆయనకుముందును, నేఁడు = ఈకాలమందును, ఇంకన్ = భవిష్యత్కాలమందును, సరివారలు = సమానులు, మిన్నలు = గొప్పవారు, సారమ్ముగన్ = సారముగలుగునట్లు, పలుకు = పలికిన, ఏకశిల యను పేరుగల యొంటిమిట్టయందుండు శ్రీరామచంద్రమూర్తి, నాకున్ = నాయందును, ప్రసన్నుఁడయ్యెడున్ = అనుగ్రహబుద్ధి గలవాఁ డగునుగాక.

తాత్పర్యము.

బమ్మెర పోతనామాత్యునికి మోక్షమియ్యఁదలంచి యాయనవాక్యములందు నిలిచి యమృతరసధారలు చిలుకునట్లు తియ్యనిమాటల భాగవతమును నాయనకు ముందుగాని యిప్పుడుగాని యింకముందుగాని యాయనకు సరివారలుగాని యాయనకంటె గొప్పవారుగాని లేకయుండునట్లు తానే పలికించి యొంటిమిట్ట శ్రీరామచంద్రమూర్తి యాయనయందువలె నాయందును ననుగ్రహబుద్ధిగలవాఁడగునుగాక.

ఉ॥ అమ్మక! కోవెలందుఁ దనయమ్మయు నొంటరిమి వీడిపోవ, రే
పమ్మినయాఁకటన్ శిశువు పాలకు నేడ్వఁగ, నాలకించి తా
నమ్మగ స్తన్య మిచ్చినదయామయి! నన్గనవమ్మ! యమ్మ! సీ
తమ్మ! భయార్తుధార్మికుని నయ్యలరాజకులోద్భవుం బలెన్. ౮౬.

అర్థము.

అమ్మక = ఔరా, ఆశ్చర్యార్థకము, కోవెలందున్ = గుడియందు, తన యమ్మయు = తనతల్లికూడ, ఒంటరిమి = ఒంటరిగా, వీడిపోవన్ = వదలిపెట్టి పోవఁగా, రే = రాత్రియందు, పమ్మినయాఁకటన్ = అతిశయించిన యాఁకలి చేత, శిశువు = బిడ్డ, పాలకున్ = పాలకై, ఏడువన్ = రోదనముచేయఁగా, ఆలకించి = విని, తాన్ = తాను, అమ్మగ = తల్లివలె, స్తన్యము = చనుఁబాలు. ఇచ్చిన దయామయి = కరుణాస్వరూపిణి, 'లక్ష్మీః కారుణ్యరూపిణీ' యని ప్రమాణము భగవంతుని దయాశక్తియే లక్ష్మి, ఆమెయే సీత. అయ్యలరాజుకులోద్భవున్ బలెన్ = అయ్యలరాజువారి వంశమునఁ బుట్టిన రామభద్రునివలె. నన్ = నన్ను, అమ్మ = తల్లీ, సీతమ్మ = సీతాదేవీ, కనవమ్మ = చూడవమ్మ.

తాత్పర్యము.

ఔరా! యేమియాశ్చర్యము! దేవాలయమందుఁ దండ్రియేకాక తల్లియు ను శిశువును వదలిపోఁగా రాత్రివేళ యాఁకలికై యాక్రోశించుఁ డేడువ దయాస్వరూపిణియైన సీతాదేవి! నీవు చనుగుడిపి యాయయ్యలరాజు రామభద్రునిఁ గాపాడితివికదా? అట్టులే సంసారసాగరమునఁ బడి మునుఁగుచు తేలుచు మరణభీతిని మీయనుగ్రహమనెడి యాహారములేక పరితపించుచుండువానిని నన్ను నాయనునవలెనే తల్లి, సీతాదేవీ! కరుణాకటాక్షములచే వీక్షించి రక్షింపవమ్మా!

ఈగ్రంథకర్త ప్రార్థనము జగన్మాత సీత వ్యర్థము చేసినదికాదు. అష్టోత్తరశతవారంబులు శ్రీమద్రామాయణము పారాయణము చేసి నూటయెనిమిది సీతాకల్యాణములు, నూటయెనిమిది పట్టాభిషేకములు చేసి సామ్రాజ్య పట్టాభిషేకము చేయ సంకల్పించిననాఁటి రాత్రినుండి మూఁడుకార్యములు ముగియువఱకు

సీతాదేవిసాహాయ్యమే యీగ్రంథకర్తకు విశేషముగఁ గలిగెను. ఇప్పటికిని గలదు.

—• ఉత్సాహకారణభగవద్దత్తాభయవాగ్దానము •—

కం॥ ఎమ్మెయి నగునో ప్రారంభ మ్మొనరింపఁగ నిదంచుఁ • బ్రార్థింప నినుర్
'లెమ్మా హరిశార్దూలా!, యిమ్మహితార్ణవము దాఁటు • మీ' వని యనవే? ౭౬

అర్థము.

ప్రారంభమ్మొనరింపఁగన్ = మొదలుపెట్టితినేని, ఎమ్మెయినగునో = ఏవిధముగా నగునో - యని నిన్ను ప్రార్థింపఁగా హరిశార్దూలా! లెమ్ము, ఈసముద్రముదాఁటుము అని నీవు చెప్పలేదా?

తాత్పర్యము

శ్రీరామాయణరచనమా గొప్పకార్యము, కష్టకార్యము, దీర్ఘకాలము పట్టునది. నేనా రోగిని. ఒకకాలుపీట, నొకకాలు కాట నుంచుకొని యేదిన మే మగుదునో యని బ్రతుకుపాటు నిశ్చయములేని దీర్ఘక్రూరరోగిని. కావుననే జీవన్మృతుఁడను. ఇట్టిసందర్భములో నే నాకృతి రచింపఁబూనినఁ బూర్తియగునో కాదోయని సందేహము కలవాఁడనై నీయనుమతి తీసికొనఁగోరి రామాయణ మందుఁ బ్రశ్న వేయఁగా, 'ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్' అని ప్రత్యుత్తర మీయలేదా.

కం॥ కావున నీవాక్యమ్మే, కేవల మాధారముగను • గీర్తించెద నీ
పావనదివ్యచరిత్రం, బావల నేమైనఁ జేయుమా శ్రీరామా! ౭౭

అర్థము.

శ్రీరామా! కావునన్ = కనుక, నీవాక్యమ్మే = నీమాటయే, ఆధారము గఁగొని, నీ పావనదివ్యచరిత్రమున్ = పావనమైన దివ్యమైన మీ చరిత్రమును, కీర్తించెదన్ = స్తుతించెదను, ఆవలన్ = అటుపిమ్మట. ఏమైనఁజేయుమా.

తాత్పర్యము.

నీవా ప్రకార మభయవాక్యమిచ్చి నీసేవకులయిన హరులలో నన్నొకనిగఁ గ్రహించితివి. కావున 'రామో ద్విర్నాభిభాషతే — రాముఁడు రెండుమాటల వాఁడు కాఁ' డను నిశ్చయబుద్ధిగలవాఁడనై నీపలుకే యాధారముగ నీమాట నీవు దక్కించుకొందు వను ధైర్యముతో నాలోపములను లక్ష్యపెట్టక నీదివ్యమై పవిత్రమైన చరిత్రమును గీర్తించెదను.

ఆవల నీయిష్ట మేమిచేసినను, శిక్షించినను సంతోషమే, రక్షించినను సంతోషమే. ఆవిచారము నాకేల? నేను జేయవలసినపని నేను జేసెదను.

శ్రీరామార్పణమస్తు.

శ్రీరామచంద్రాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః
శ్రీ హయగ్రీవ ప్రసన్న.
శ్రీ శారదాంబాయై నమః.

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణక్షీరార్ణవ మందరము.

అవతారిక.

శ్రీకాంతుఁడును, నవాప్తసమస్తకాముఁడును, హేయప్రత్యనీకసమస్తకల్యాణగుణాకరుఁడును, సర్వేశ్వరుఁడును, నప్రాకృత దివ్యమంగళ విగ్రహుఁడును, శ్లో॥ వైకుంఠేతుపరేలోకే, శ్రియాసార్ధంజగత్పతిః। ఆస్తేవిష్ణురచింత్యాత్మా భక్తైర్భాగవతైస్సహ॥ సమస్తలోకములకుఁ బ్రభువై పాలించువాఁడును, లోకములోఁ గానవచ్చు వస్తువులతోఁ బోల్చి యిట్టిదట్టిదని తలంపరాని స్వరూపస్వభావ మహిమలు గలవాఁడును, చేతనాచేతనములం దన్నిటఁ బ్రవేశించి వ్యాపించుటచే విష్ణువనుకీర్తిని వహించినవాఁడును, నగు శ్రీమన్నారాయణుండు, శ్రీమహాలక్ష్మీదేవితోఁ గూడి, భక్తియోగమును సాధనముగాఁ గొని మోక్షమునందిన వారితోను, ప్రపన్నులై తనయొద్దకు వచ్చి సేవించు భాగవతులతోను, ప్రకృతిమండలమున కంతకుఁ బైనున్న పరబ్రహ్మలోకమందు, వైకుంఠ మనుపేరుగల స్థానవిశేషమందు శ్రీమహామణిమంటపమున శ్రీభూనీళాసమేతుఁడై రత్నసింహాసనంబు నలంకరించి, నిత్యులు ముక్తులుమాత్రము తనపాదపద్మములను నిరంతరము సేవించుచుండుటయు, నట్లు స్వచరణశుశ్రూషలేక ప్రకృతియందు నచిత్తుతోఁ గలిసి కమసాలిమైనపుటుండయందుఁ గలిసిన బంగారు రేణువులనుబోలెఁ బ్రత్యేకించి యెఱుఁగ వలనులేక యజ్ఞానులై చెడుచున్న సంసారిజీవులు, శ్లో॥ ఏవంసంసృతిచక్రస్థే, భ్రామ్యమాణేస్వకర్మభిః। జీవేదుఃఖాకులేవిష్ణోః, కృపాకాప్యుపజాయతే॥ సంసారచక్రమునఁ దగులుకొని తమ పుణ్యపాపకర్మలచేఁ బుట్టుచుఁ జచ్చుచుఁ జచ్చుచుఁ బుట్టుచు విధివిరామములులేక దుఃఖించుచుండుటగని దయామయుఁడైన భగవంతుఁడు వారివిషయమున నపరిమితంబగు కరుణ జనింప వారల యజ్ఞానముఁ దొలఁగించి జ్ఞానవంతులఁ జేయనెంచి "శ్లో॥ విచిత్రా దేహసంపత్తి, రీశ్వరాయనివేదితుమ్। పూర్వమేవకృతాబ్రహ్మన్, హస్తపాదాదిసంయుతా॥" దేవమనుష్య తిర్యక్స్థావరములుగను, వానిలో ననేకభేదములుగలవిగాను, బహువిధముల విచిత్రమైనట్టిదియుఁ గాలుసేతులు మొదలయిన యవయవములతోఁ గూడినట్టిదియు నగు దేహసంపదను సర్వస్వామియు సర్వేశ్వరుఁడు నగు తనకు సేవచేసి సమర్పించుటకుఁగా సమష్టివ్యష్టిరూపంబున జగంబు

సృజించి తనసేవకై జీవులకుఁ గరణకళేబరాదులను నదిని దాఁటఁగోరువానికిఁ బడవనిచ్చినటు లిచ్చెను. నదిని దరింపఁగోరినవాఁ డసమర్థుఁడై, దానిని మంచి స్థితియందుంచి చక్కఁగ నడపి యేఱుదాఁటి యొడ్డుచేరలేక, ప్రవాహము వెంటఁ బోయి సముద్రమును జొచ్చినట్లు జీవులు సంసారమును దరింపవలయునని తా నొసంగిన దేహముతో విషయాదిసుఖముల మరగి సంసారమహాప్రవాహమున మునుఁగుచుఁ దేలుచు నాదుఃఖమునే సుఖమని తలంచుచుఁ జెడుటగాంచి భగవంతుఁడు స్వాజ్ఞారూపములగు వేదశాస్త్రముల నిచ్చి యామూలమున సరియయిన మార్గమును బోధించినను సంసారు లన్యథాజ్ఞాన విపరీతజ్ఞానములచే నాశాస్త్రములకు విపరీతార్థములఁ గల్పించి వాని నుల్లంఘించి ప్రవర్తించుచుండుటయేగాక వారిలోఁ గొందఱు తదాజ్ఞచొప్పున వర్తించువారిని బీడింపను సాగిరి తనయాజ్ఞ నుల్లంఘించి వర్తించువారిని శిక్షించుటకును, వారిచేఁ బీడింపఁబడు సాధువుల రక్షించుటకును సపరివారముతో నిండువెడలు రాజువలె భగవంతుఁడును స్వాజ్ఞాతివర్తుల దండించుటకును, దనయాజ్ఞచొప్పున వర్తించువారిని రక్షించుటకును, దనయాజ్ఞ యప్రతిహతముగ నిలుచుటకును, దత్సమయోచితములైన రూపములు ధరించి యవతరించుచుండును. ఇట్టి సంకటసమయంబు త్రేతాయుగాంతమున సంఘటించె.

ఆకాలంబున బ్రహ్మచే వరంబులనొందిన రావణుఁడు లోకంబు నాకులం బొనరించుచు, సాధువుల బాధించుచుఁ, బతివ్రతలఁ జెఱచుచు, జనుల నల్లాడఁ బెట్టుచుండెను. వానినెట్లు వధింపవలయునని శ్రీమహావిష్ణు వాలోచించునెడ బ్రహ్మాదిదేవతలును నద్దానినే కోరిరి. ఆశ్రితజనరక్షా ధురంధరుండైన శ్రీమన్నారాయణుండు పూర్వజన్మంబునఁ దన్నారాధించి తనచే వరంబుఁ గాంచి యుండిన దశరథుని యభీష్టము నెరవేర్ప, నతనికుమారులై శ్రీరామ భరత లక్ష్మణశత్రుఘ్ను లను పేర నాలుగు రూపంబుల నవతరించెను.

జను లనుష్ఠింపఁదగిన ధర్మములు రెండు విధములు. అం దొకటి సామాన్యధర్మము, రెండవది విశేషధర్మము. జనులలోఁ బ్రవృత్తిమార్గమందుండు బుభుక్షువులు సామాన్యముగ ననుష్ఠింపవలసిన ధర్మము సామాన్యధర్మము. జ్ఞానాధికులు ముముక్షువులు భగవద్ధర్మనిష్ఠులు ననుసరింపవలసిన ధర్మము విశేషధర్మము. సత్యమును జెప్పుము మను వేదానుశాసనము సామాన్యధర్మమును దెలుపును. ఈధర్మము నుల్లంఘించి భగవత్పరతంత్రుఁడై మోఁగిన వసుదేవుఁడు విశేషధర్మనిష్ఠుఁడు. పితృవాక్య మనుల్లంఘనీయ మనుట సామాన్యధర్మము. ప్రహ్లాదుఁడు విశేషధర్మనిష్ఠుఁడు.

భగవంతుఁడు తనసంకల్పముచొప్పున దశరథునకు నాలుగు రూపములఁ బుత్త్రుఁడై జనించెను. శ్రీరామరూపమున నవతరించి, పితృవాక్యపరిపాలనము

గావించి, సత్యవ్రతుఁడై, రావణాది దుష్టుల వధించి, కర్మయోగియై, స్వధర్మ నిష్ఠ యిట్టిదని యదియే యెట్టివారికి శ్రేయస్కరమని లోకులకుఁ దన నడవడిచే బోధించెను. లక్ష్మణుఁడుగ నవతరించి - సర్వకాలసర్వావస్థల శ్రీరామ సేవ చేయుచుఁ, దద్విరోధియైన యింద్రజిత్తును సంహరించి, యాయన యభయ మిచ్చిన విభీషణునిఁ దనప్రాణమిచ్చి రక్షించి, కైంకర్యమునకు విఘ్నకారియైన యావరాజ్యాధిపత్యము శ్రీరాముఁ డిచ్చినను నిరాకరించి, భగవచ్ఛేషత్వ మను విశేషధర్మమును, భరతుఁడుగ నవతరించి - తాను దనరాజ్యము శ్రీరామునిదే కాని తనది యగునది యేమియులేదని హస్తగతమయిన రాజ్యసంపద ననుభవింపకయు, గంధర్వుల వధించియు, భగవత్పారతంత్ర్య మను విశేషధర్మమును, శత్రుఘ్నుఁడై యవతరించి - లవణాసురుఁ జంపి, భాగవతుఁడైన భరతుని బాల్యమాదిగఁ గొలిచి, భాగవత శేషత్వ మను విశేషధర్మమును, నాచరణపూర్వకముగ లోకమున కుపదేశించెను. శ్రీరామచంద్రమూర్తి తన నిమిత్తమై యే మాత్రమైనను శ్రమించినవారికని, నేదియులేక 'రాముని వాఁడను నేను' అని దృఢవిశ్వాసముతోఁ బ్రేమించినవారికని, నట్టి భావములు లేక తనయందసూయ వహింపక స్నేహభావమువాత్రముగల ప్రాణులకుఁ బశువులకుఁ, బక్షులకు, మనుష్యులకుఁ దన సమీపస్థులకుఁ గోరిన ... మాత్రమునఁ బునర్జన్మరహితమైన శాశ్వత మోక్షపదవి ననుగ్రహించి, భుక్తి కష్టసాధ్యముగాని, ముక్తి బహుసులభసాధ్య మని శ్రీమద్రామాయణముఁ బ్రకటించెను.

సర్వలోకహితపరుఁడైన బ్రహ్మదేవుఁడు వీరిచరిత్రములును వీ రనుష్ఠించిన ధర్మములును నాకాలమునంగుండు జనులయొక్క జ్ఞానమాత్రమం దుండెనేని స్వల్పకాలమున లోకము నశించుననియు, సనాతనధర్మములు లోకమువారికి శాశ్వతముగఁ దెలుపుమార్గము కలిగింపవలయుననియుఁ దలంచి, తద్ధర్మప్రకాశకమై శతకోటిగ్రంథాత్మకమగు నొక ప్రబంధము రచించి ...నారదాది మహర్షుల కుపదేశించెను.

అంతటతో సంతుష్టిపడక దీనివలన విశేషలాభమును బొందవలసినవారు మనుష్యులై యుండుటచే భూలోకమునదీనిఁ బ్రవర్తింపఁజేయఁగోరితనపుత్రుఁడైన నారదుఁ బిలిచి 'నీవి రామాయణచరిత్రమును సంగ్రహముగ శ్రీరామభక్తుఁడైన వాల్మీకి కుపదేశింపుము. ... శ్రీమద్రామాయణము ... ' యని బోధించె. నారదుఁ డట్లు చేయుటఁ గోరి ... వాల్మీకి మహర్షి కుపదేశించెను. "శ్లో॥ వాల్మీకనాచ యత్ప్రోక్తం, రామోపాఖ్యాన ముత్తమమ్। బ్రహ్మణా చోదితం తచ్చ, శతకోటిప్రవిస్తరం। ఆహృత్య నారదేనైవ, వాల్మీకాయ నివేదిత"మ్మని మాత్స్యపురాణంబునఁగలదు. (వాల్మీకిచేవచింపఁబడిన యుత్తమమైన రామోపాఖ్యానము

బ్రహ్మచేఁ బ్రేరేపింపఁబడినది. అది శతకోటిగ్రంధములఁ గలది - (గ్రంథము= ౩౨ అక్షరములుగలది) దానిని నారదుఁడు వాల్మీకికి నుపదేశించెను.

శ్రీరామచంద్రమూర్తి రావణవధానంతర మయోధ్యాపురింబునఁ బట్టాభిషిక్తుఁడైయుండుసమయంబున సీతాదేవివిషయంబున లోకు లాడుకొను నపవాదమునకు భయపడి సీతాదేవియందు దోషములేదని యెఱిఁగి యెఱిఁగియు "శ్లో॥ రాజ్ఞి ధర్మిణిధర్మిష్ఠాః । పాపే పాపాస్సమే సమాః । లోకా స్తదనువర్తంతే । యథా రాజాతథా ప్రజా॥" యను రాజనీతిననుసరించి లోకసంగ్రహార్థ మామెను వాల్మీకాశ్రమమునకు లక్ష్మణు వెంటఁ బంపెను. లక్ష్మణుఁడును సీతాదేవిని గంగాతీరంబున వాల్మీకాశ్రమముపొంత విడిచి యయోధ్యకుఁ బోయెను.

సీతారామలక్ష్మణులు చిత్రకూటంబునకుఁ బోయినప్పు డందు వాల్మీకిని దర్శించిరి. (అయోధ్య ౧౪౭౬ వ పద్యముఁ జూడుఁడు.) అప్పుడు వాల్మీకాశ్రమము చిత్రకూటమం దుండెను. భరతుఁడు శ్రీరాముల దర్శించి పాదుకలు కొని పోయిన యనంతరము చిత్రకూటమందలి ఋషులెల్ల దానిని విడిచి వేఱువేఱాశ్రమములకుఁ బోయిరి. అప్పుడు వాల్మీకిమహర్షి గంగానది కుపనదియైన తమస యను నదీతీరంబున [ఇప్పుడీ నదిని (Tons) టాన్సు అందురు. ఇది ప్రయాగ (అలహాబాదు) సమీపంబున గంగానదిలోఁ గలియును.] నాశ్రమంబుఁగల్పించుకొనియుండెను. తనయాశ్రమముపొంత సీతాదేవి దుఃఖించుచుండుట విని వాల్మీకి యచ్చోటికిఁ బోయి యామె సీతాదేవి యని గుర్తించి యిట్లు చెప్పెను.

" సీ॥ దశరథధారుణీధవు కోడలవు నీవు, మహిఁబవి శ్రీరామమహీపునకును
జనకనృపాలుని తనజాతవును దతి, వ్రతల మిల్పంతి స్వాగతము ! నీకు
నీరాకహేతువు నిఖిలంబు నేయోగ, దృష్టిని జూచితి శిష్టచరిత
సర్వలోకంబుల జరిగెడి నవియెల్ల, విదితముల్ నా కునో వెలఁది మిన్న
తే॥ మ త్తపోలబ్ధచాక్షుషమహిమఁజేసి, కంటి, నీయందుఁ బాప మొకండునైనఁ
గలుగనేరదు భీతిల్లవలదు తల్లి, యుండుమీ యిందు నీమది నుదిలగొనకు.

ఉత్తర. ౧౦ ౨౦ ప.

అని యూరార్చి కనుపొడ్డులనుండు నిండుచూలాలిని మునిపత్నుల కప్పగించెను. ఆమెకుఁ గుశలవులను నిరువు రమడలు కొమరులుపుట్టిరి. ఆరాత్రి శత్రుఘ్నుఁడు లవణాసురుఁ జంప మధురకుఁ బోవుచు వాల్మీకాశ్రమంబునఁ దిగియుండెను. ఈప్రకారము పండ్రెండు సంవత్సరములు సీతాదేవి వాల్మీకాశ్రమమున నుండెను.

"అంతటి మహాపతివ్రత కట్టి నిష్కారణనిందయు, నట్టికష్టము వచ్చుటయుఁ గరుణామయుఁడైన యమ్మహర్షి కేమియు సరిపడక, యీయామె కపకీర్తి యేవిధమునఁ బోవును ? ఆమెసత్కీర్తి లోకమున నెట్లు నిలుచును ? ఇంతటి శీలవతియే

యిట్టు లపవాదహతమయ్యెనేని యిఁక లోకములోఁ బాతివ్రత్య మేమి నిలుచును? పతివ్రతలెవ్వరు బాగుపడుదురు? సత్యము హతమగుటను దెలిసి తెలిసి యెట్లు తేరకానివలెఁ జూచుచుందును? దీనికి నే నేమి ప్రతిక్రియచేయ వచ్చును? ఈసీతాచరిత్రమంతయు గ్రంథముగ వ్రాయుదునా? అది కావ్యమగునే? 'కావ్యాలాపాంశ్చ వర్జయే' త్తని వేదానుశాసనముగదా! వ్రాసితిని బో లోకు లేమందురు? 'వాల్మీకి యొక ఋషిమాత్రుఁడు. దశరథునకు రామునకుఁ బరిచితుఁడు. (ఉత్తర ౯౯ ర స) ఆకారణముచే నామెపక్షము వహించి యేమేమో వ్రాసెను ఇది యేమాత్రము ప్రమాణము?' అందురు. మఱికొందఱు 'శ్రీరాముఁడే తనభార్యను మరల గ్రహింపఁగోరి వాల్మీకిచేఁ దన భార్య పతివ్రత యని గ్రంథము వ్రాయించె' నందురు. ఇట్టి యభిప్రాయము ప్రబలెనేని నా శ్రమము వ్యర్థమగుటయే గాక సీతాదేవికి మేలుసకుమా యెక్కువ కీడుచేసినవాఁడ నగుదును. లోకమునకై వ్రాయు గ్రంథము లోక మాదరింపదేని యా శ్రమ మేల చేయవలయును? లోక మాదరింపని గ్రంథ ముండిన నేమి? యుండిన నేమి? ఒకవేళ వ్రాసితినిబో నే నాగ్రంథమును బల్లెల బట్టుకొనిపోయి యెందఱ కని చదివి వినపింతును? తేనెయున్న చోటకీఁగలు వచ్చునట్లు గ్రంథసారస్య మెఱిఁగి లోకులు తామె వచ్చి గ్రహింతురు గ్రంథము గ్రంథముగాని గ్రంథవాని యొద్దకుఁ బోయి నీవు తీసికో నీవు తీసికో యని ప్రార్థించి బలాత్కరించి గ్రహింపఁ జేయు గ్రంథ మది యేమి గ్రంథము?

అటుగాక కావ్యాలాపనిషేధ మసత్కావ్యవిషయమే కదా. సీతారాము లవతారమూర్తులుకదా. కావున వారిచరిత్రము గ్రాహ్యమే యందునా? నా కగును గాక. పామరలోకమున కేమి తెలియును? వా రవతారమూర్తు లని తెలిసియుండిన నిట్టి ఘోరపాపవాక్యములు వారివిషయమై లోకు లుచ్చరింతురా? ఏఋషులకో కొందఱ కవతారరహస్యము తెలిసిన నేమిలాభము? పామరలోకమునుగదా నేను నమ్మించి చక్కఁ జేయుపవలయును. కావున నేను వ్రాయునది మహాత్ములు విజ్ఞులు సత్య మని యెను గ్రహింపవలయును. పామరులు సత్యమని గ్రహింపవలయును. అప్పుడు నా శ్రమము సఫలము.

అవతారరహస్యము నేను బయలుపఱుపవచ్చునో రాదో? ఋషులు నాచర్య నామోదింతురో యామోదింపరో? అవతారరహస్యము వెలిపఱుపక సీతారామచరిత్ర మెట్లు వ్రాయుదును? నా హేతువాదము లెవరు నిల్వ వ్రాయుదునా? ఏమి లాభము? మహారాజపురుషు లెందఱు పుట్టరో యెందరు గిట్టరో? ఎట్టిమహారాజపురుషుఁడైనను మానవుఁడు మానవుఁడే. మానవచరిత్రమా నేను వ్రాయుట. ఛీ! అది సరికాదు. భగవంతుఁడే ధర్మసంస్థాపనార్థము - మానవుఁడై యవతరించి శ్రమించె నని యాయనచరిత్రమును వ్రాసిన లోకమునకు మేలుగలదు

గాని మనుష్యుల కసాధ్యమైన భగవచ్చర్య నృసింహావతారము, వామనావతారము వంటివి చెప్పియు నేమి లాభము? వారివలె నేమనుష్యుఁడు చేసి మేలు పొందఁగలఁడు? సీతారాములో కేవల మనుష్యులవలెఁ జరించుచున్నారు. కావున వారి ననుకరించి బాగుపడుట లోకమునకు సాధ్యము కావున నున్నదున్నట్లు సర్వము చెప్పుటే ప్రశస్తకార్యము. ఇది యాలోచించు కొలఁది మిగుల దుష్కరముగాఁ దోఁచుచున్నది. ఈవిషయమున నాకు మార్గదర్శియూ లేఁడు. దైవానుగ్రహములేక యిట్టి మహాకార్యము ఫలింపదు. నీ వీత్రోవఁ బొమ్మని బోధించు మహానుభావుఁ డెవ్వఁడు లభింపఁ లేదు. ఏమిచేయుదును?"

అని యాలోచించు సమయమున బ్రహ్మమానసపుత్రుఁడు నారదమహర్షి యాయనయొద్దకు వచ్చెను. అప్పుడు తనకుఁ దగినగురువు లభించెనని వాల్మీకి సంతసించి యిట్లు లాలోచించెను. సీతారాములగుఱించి చెప్పుమని నేనడిగితినా యంతమాత్రమే చెప్పెను. అంతకంటె గొప్పవాఁ డుండినఁ జెప్ప నవకాశముగలుగదు. వేదములందుఁ బరతత్త్వ మని చెప్పఁబడిన శ్రీరాముఁ డీయనయా వేఱొకం డున్నాఁడా? భగవన్నామ మని నే నెవ్వనినామము జపించుచున్నానో యా రామశబ్దవాచ్యుఁ డీరాముఁడా వేఱొకం డున్నాఁడా? నేను దెలియఁగోరునది పరతత్త్వనిర్ణయము గాని లౌకికవిషయముగాదు కావున భగవంతుని యందుండు లోకోత్తరగుణములు గలవాఁ డీకాలమున నీలోకమున నెవ్వఁ డని యడిగిన నట్టివాఁ డీరాముఁడే యాయెనా యీయనను గుఱించియే చెప్పెను. అటుగాక మఱియొకఁడుండిన నతనిపేరు చెప్పును. అప్పు డీరాముని గుఱించి నేను శ్రమింపఁబని యుండదు. అని యాలోచించి యిట్టిగుణములు గలవాఁ డెవ్వఁ డని ప్రశ్నించెను. నారదుఁ డాయన యభిప్రాయం బెఱింగి శ్రీసీతారామచరిత్రము గాయత్రీసంపుటితముగ సంక్షేపముగ నుపదేశించి తాను వచ్చినకార్యము సుకరముగ నగుటకు సంతసించి మరలిపోయి యావార్త బ్రహ్మదేవున కెఱిఁగించెను. పదపడి బ్రహ్మ సరస్వతిని వాల్మీకిజిహ్వాయం దుండఁ బనిచి స్వయముగ వాల్మీకియొద్దకు విచ్చేసి నారదునివలన నుపదేశముఁగొన్నవిధముగ శ్రీమద్రామాయణము రచింపు మని యాదేశించి, సకలము సాక్షాత్కరింపను, దానిని గ్రంథరూపముగ రచింపను, శక్తి నొసంగిపోయెను. బ్రహ్మవరబలంబున వాల్మీకి వేదోపబృంహణంబుగ శ్రీమద్రామాయణమును రచింపఁదొడఁగెను. ఇయ్యది వాచ్యార్థప్రధానంబై యితిహాసరూపమునను, వ్యంగ్యార్థప్రధానంబై మహాకావ్యరూపంబునను నుండును. అదియును సంస్కృతభాషయం దుండుటచే నీకాలమున సుబోధముగాదని కొందఱాంధ్రకవులు లోకోపకారార్థమై రామాయణములఁ దెనుఁగున రచించిరిగాని యవి కథనమాత్రము గాని స్వేచ్ఛగఁ జెప్పబడుటచే నాకాలమున కవి చాలినను నిప్పటికిఁ జాలినవి కావయ్యెను. అదియు

నుగాక శ్రీమద్రామాయణ పఠనమునకు నెల్లరు యోగ్యులుగారు. కావున నర్థపూర్తికలిగి కావ్యేతిహాసగౌరవపాత్రమై సర్వజనపఠనీయమై ప్రామాణికమై మూలానుసారమైన రామాయణ మాంధ్రంబున నుండుట లోకోపకారకమని యోజించి యనతిసంక్షేపవిస్తరముగ యథాశక్తి మూలానుసారంబుగ నీయాంధ్రరామాయణము రచియింపఁబడియె. 'కావ్యాలాపాంశ్చవర్జయే' త్తను శాసనము ప్రాకృతమనుష్యవిషయముగాని యప్రాకృత దివ్యాకారలోకోత్తరమహాపురుషవిషయము గా దని యభిప్రాయము.

అట్టి యాంధ్రవాల్మీకిరామాయణము వెలువడిన వెంటనే కొందఱు పెద్దమనుష్యులు మిత్రులు హితులు సంస్కృతరామాయణమునకు సంస్కృతంబున వ్యాఖ్యయున్నట్లు లాంధ్ర రామాయణమున కాంధ్రమున వ్యాఖ్యానమున్నచో సంస్కృతము రాని యాంధ్రులకెల్ల నది యుపకారముగ నుండు నని బోధించిరి. మూలగ్రంథము వ్రాయుటకంటె వ్యాఖ్యానము వ్రాయుట కష్టతరము. అంతటి శక్తిచాలమియు దానికి విరామములేమియు నెఱింగియు మరల రామచరితామృతపాన మనుకూలపడియెఁగదా యని సంతోషించి యిప్పుడు కీర్తిశేషులైన నామిత్రుఁడు ఇ గోవిందాచార్యులవారితో నీవిషయము ప్రస్తావింప సంస్కృతమున నన్ని విషయములు నేను తెనుఁగుచేసియిచ్చెదను విశేషవిషయములు నీవే వ్రాయుము. ఇట్లైన గ్రంథము శీఘ్రముగ సాంతమగునని కొంతగ్రంథము గోవిందరాజీయ వ్యాఖ్యానము ననుసరించి వ్రాసియిచ్చిరి. ఇది యిరువది సంవత్సరములనాఁడు ౧౯౦౯-౧౯౧౦ లో జరిగిన వృత్తాంతము. ఆయన సంస్కృత పండితుఁడు, తార్కికుఁడు. ఆయనశైలికి గ్రంథకర్తశైలికిఁ జాల భేదముకలదు. కొన్నిచోటల కవిహృదయము కనలేక తాఱుమాఱుగ వ్రాసెను. అదిగాక యిప్పుడు విషయములు విశేషించి వ్రాయవలసివచ్చెను. ఆకారణముచే నది పర్యాప్తము గాదయ్యెను. అయినను దానిని సహాయముగనుంచుకొని నూతనముగ నీవ్యాఖ్యానము వ్రాయఁదలంచితిని. ఆయన ప్రతిఫలాపేక్షచే సహాయపడినను కృతఘ్నతాదోషభీరుఁడనై యీవిషయము వాక్రుచ్చితిని.

ఈవ్యాఖ్యానము మత్సమానధర్ములకు విశేషభాషాజ్ఞానము ధర్మజ్ఞానము తత్త్వజ్ఞానము లేని స్త్రీశూద్రాదులకుఁ దత్ప్రాయులైన యితరులకు సుబోధముగ భక్తిజనకముగ ధర్మబోధకముగ నుండవలయుననుట ప్రథమోద్దేశము. సాధ్యమగు నంతవఱకుఁ బరిభాషాపదములు తొలఁగింపఁబడినవి. అవి వ్రాయవలసినచోట వ్రాసి వెంటనే వానియర్థము వ్రాయఁబడెను. ఇతరగ్రంథపఠనమం దిది సహాయపడఁగలదు. ప్రతిపదార్థము వ్రాయునపుడు పద్యమునందు సులభముగ నర్థమగు పదములకు నర్థము వ్రాయఁబడదు. సమాసముల కర్థము వ్రాయునపుడు వైయాకరణఫక్కి ననుసరింపఁబడదు. ఉదా.—పుండరీకాక్షుఁ డన్నప్పు

'దేవనియతులు పుండరీకములవంటివో వాఁడు' అని వ్రాయక కమలములవంటి కన్నులుగలవాఁ డనిన సుబోధము అను భావముతో నిట్లే వ్రాయఁబడును. పండితులు క్షమింతురుగాక. ప్రతిపద్యమునకుఁ దాత్పర్యము వ్రాయఁబడును. కొన్నిచోట్ల వ్యాఖ్యానకోలాహలములోఁ బద్యార్థమేమో యెఱుఁగుట కొందఱకుఁ గష్టముగా నుండును. వారికిది యుపకారక మగుటయేకాక తాత్పర్యము మాత్రము చదువుచుఁబోయిన నది వచనరామాయణపఠన మగును. సంగ్రహశక్తి చాలదని పండితు లాక్షేపించిన నాక్షేపింపనిండు. చదివినవారికి విషయము చక్కఁగ బోధపడవలయునను తలంపుతో నేదైనఁ జర్చింపఁబూనినపుడు విస్తరభీతిలేక విపులముగనే చర్చింపఁబడును. ఇంతయేల? ఎట్టెట్టిచోట నెట్టెట్లు చెప్పిన సుబోధముగనుండునని తోఁచునో యట్టట్టిచోట నట్టట్టిశైలియు నట్టట్టిరీతియు నవలంబింపఁబడును. వాక్యపటుత్వము లేదని నిందవచ్చిన రానిండు. పాఠకులు సుబోధమని సంతోషించినచో నీనిశ్రమము సఫలమని వీఁడు సంతోషించును. పూర్వవ్యాఖ్యాతల యభిప్రాయముతో నేనేకీభవించినచోట వారు వ్రాసినట్లే వ్రాసెదను. లేనిచోట నా యభిప్రాయమును దెలుప నవశ్యమని తోఁచినచోట వారి యభిప్రాయమును దెలిపెదను. ఏలయన లోకమందు రుచిభేదము కలదు గదా! పూర్వవ్యాఖ్యాతల యభిప్రాయముతో నేను వేఱుపడిన స్థలములు గలవు. వానిని గ్రహించుటకు నిరాకరించుటకుఁ బాఠకులు స్వతంత్రులు. వ్యాఖ్యాతల యభిప్రాయము వ్యాఖ్యాతల యభిప్రాయమే. అది కవిహృదయమైనను గావచ్చును, గాకున్నను గాకపోవచ్చును. నాయభిప్రాయమే సరి, అదియే కవిహృదయ మని బొమ్మగుద్దుకొని వాపోవువాఁడను నేను గాను. వ్యాఖ్యాతలు భిన్నాభిప్రాయములు గలవారు. అందేదో యొకటి కవిహృదయము గాఁగలదుగాని పరస్పర విరుద్ధములు కవిహృదయ మెట్లు గాఁగలవు? కావున నాకు సరియని తోఁచినది నేను జెప్పెదను. అభిజ్ఞులుమెచ్చి యానందింతురు. పురోభాగులు నిందించి యానందింతురు. వీఁడు రెంటికి నానందించును.

ఈ వ్యాఖ్యానము నెపమున నొకమతము ఖండింపవలయు ననికాని, మఱియొకదాని నుద్ధరింపవలయు ననికాని, యొక దేవతను గొండపైఁగూర్చుండఁబెట్టి మఱియొక దేవతను గ్రిందఁద్రోయవలయు ననికాని యీ వ్యాఖ్యాత యభిప్రాయముగాదు. గ్రంథమునఁ నున్నది చెప్పుటే వీని కార్యము. స్వానుష్ఠానముచే నుభయలోకసాధకధర్మములను లోకుల కందఱకు నన్నివర్ణాశ్రమములవారికి నుపదేశింపఁబూనినది శ్రీరామావతారము. ఇదియే సరియైన ధర్మసంస్థాపనము. ఈ యుభయవిధార్థములు పాఠకులకు మనస్సున నాటఁ దేటతెల్లము చేయవలయుననియె వ్యాఖ్యాతయభిప్రాయము. భగవత్తత్త్వము తర్కభేద్యముగాదు దానికదియే ప్రమాణము. కావున రామాయణ మందలి ధర్మముల స్థాపింప

వేటొండు ప్రమాణములనుగోరుట సూర్యుని జూపుటకు దివిటీయెత్తినట్లు. పరిమళయుక్తమైన కమలమును గ్రోతులు చించి చెండాడును. రసికులు శిరసా వహించి యానందింతురు తుమ్మెదలు దానియందలి తేనె త్రాగును. అట్లులే కుత్సితతార్కికులు రామాయణమును జింపి పాఱవేయనిండు. భక్తులు దానియందలి దివ్యామృతరసమును గ్రోలి యానందింతురు.

పూర్వవ్యాఖ్యాతలు వ్రాసిన విషయములు విశేషించి గ్రహించినను వారు సూచింపని కొన్ని విశేషము లిందుఁ గలవు. అంతమాత్రమున నిది పర్యాప్తమని చెప్పసాహసింపను. ఒకఁడు సముద్రముఁ మునిఁగి యూపిరిపట్టఁగూడినంత సేపుండి దొరికినన్నిముత్యములు తీసికొని రాఁగానే సముద్రమున నిఁక ముత్యములు లేవనవచ్చునా? గ్రంథ మెట్లున్నను నెవరి యభిప్రాయ మెట్లున్నను నీ గ్రంధరచన సర్వదేశదశాకాలములందు నీ వ్యాఖ్యాతకు నిరంతర నిరంతరాయ శ్రీ సీతారామ స్మరణమున కుత్తమసాధనమైనది. అంత్యకాలమున నీ ఘటము తరించుట కిది చాలును. ఇతర విచారములు వీని కేల?

కొందఱు 'తనకృతికిఁ దాను వ్యాఖ్యానము వ్రాయుట తన తనయతోఁ దాను సంగమించుటవంటి' దని నిరాకరణజల్పముల వదరుదురు. ఉపమానోపమేయములకుఁ బోలికయే లేదు. అదియునుగాక అప్పయదీక్షితులవారు తమ వరదరాజస్తవమను గ్రంథమునకుఁ దామే వ్యాఖ్యానము రచించిరి. "శ్లో॥ అభివంద్యచంద్రశేఖరు మాద్యం గౌరీసఖం పరంజ్యోతిః। వ్యాకుర్వే స్వేన కృతాం గూఢార్థాం వరదరాజస్తుతిం" కాశీ లక్ష్మణశాస్త్రిగారు గురువంశకావ్యము రచించి "శ్లో॥ స్వకీయగురువంశస్య, వ్యాఖ్యా లక్ష్మణశాస్త్రిణా। సంక్షేపేణ సతాం ప్రీత్యై క్రియతే భావబోధినీ." అని దానికిఁ దామే భావబోధిని యను వ్యాఖ్య రచించిరి.

పండితులగువారు కవియుద్దేశించినవానికంటె విశేషార్థములు చెప్పఁగలరు. ఇట్టివారు వంద్యులే. వారి కిది ప్రాతిపదికమగును గాక.

ఈగ్రంధరచనకుఁ గారణము హితబోధము శిరసా వహించి యాంధ్రలోకసేవచేయవలయునను తలంపు. ఇది మీఁదఁ జెప్పఁబడెను.

2. శ్రీకృష్ణభగవానుఁ డవతారప్రయోజనమును "శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచదుష్కృతామ్। ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే" అనఁగా సాధురక్షణము- దుష్టశిక్షణము - ధర్మసంస్థాపనము చేయుటకుఁ గాను నేను యుగయుగమున నవతరించుచుందును, అనిచెప్పెను. రామాయణమున మొదటిరెండు స్పష్టముగఁ గానవచ్చుచున్నవి. వీనినిగుఱించి పూర్వవ్యాఖ్యాతలు విశేషించి వ్రాసియున్నారు. కారణ మేమోకాని మూఁడవదాని కీయవలసినంత ప్రాముఖ్యమిచ్చినవారు గానరైరి.

ధర్మము రెండువిధములు. 1 సామాన్యధర్మము, 2 విశేషధర్మము. శాస్త్రీయ సదాచారము సామాన్యధర్మము. కేవలమోక్షధర్మము విశేషధర్మము. మొదటిది ప్రథమసోపానము. రెండవది ద్వితీయసోపానము. మొదటిది లేకుండిన రెండవది దురారోహము.

శ్లో॥ అవిప్లవాయ ధర్మాణాం, పాలనాయ కులస్య చ,
సంగ్రహాయచ లోకానాం, మర్యాదాస్థాపనాయ చ,
ప్రియాయ మమవిష్ణోశ్చ, దేవదేవస్య శార్ఙ్గిణః,
మనీషీ వైదికాచారం, మనసాపి నలంఘయేత్॥

ధర్మమున కుపద్రవము రాకుండుటకును, కులరక్షణార్థముగను, లోకమును బాగుచేయుటకును, మర్యాద (కట్టుబాటు) స్థాపించుటకును, నాయొక్కయు దేవదేవుఁడు విష్ణువు ప్రీతినిమిత్తము బుద్ధిమంతుఁడు వైదికాచారమును మనస్సునందైన నుల్లంఘింపరాదు. ఏల? 'శ్రుతిస్మృతీ మమైవాజ్ఞే' శ్రుతియు స్మృతులు నా యాజ్ఞాస్వరూపములు అనికదా భగవద్వచనము. రాజా! నీయందు నాకుభక్తియే కాని నీయాజ్ఞప్రకారము నేను నడవ ననుట యెట్టిదో నేను భగవద్భక్తుఁడను భాగవతుఁడనే కాని సదాచారమును వర్తింపఁజాల ననుట యట్టిదే "శ్లో॥ సర్వాగమానాంహి సర్వేషా, మాచారః శ్రేష్ఠ ఉచ్యతే। ఆచారప్రభవో ధర్మః, ధర్మాదాయుర్వివర్ధతే॥ 'ధర్మస్య ప్రభు రచ్యుతః,' అన్ని వేదములలో నాచారమే శ్రేష్ఠమని చెప్పఁబడెను. ధర్మ మాచారమువలనఁ గలిగినది. ధర్మమునకుఁ బ్రభువు విష్ణువు అని యుండుటచేఁ దన శ్రేయస్సు కోరుకొనువాఁడు సదాచారసంపన్నుఁడు కావలయును. ఆచార మనఁగాఁ జక్కని నడవడి. దీనియందు స్థిరుఁడై స్థైర్యానికి యత్నింపవలెను. ధర్మసంస్థాపనార్థమని వ్యవస్థలేక చెప్పుటచే రెండుధర్మములు గ్రాహ్యములు. శ్రీమద్రామాయణమున నీరెండుధర్మములు విపులముగ నాచరణరూపమున విశదీకరింపఁబడినవనియే యీవ్యాఖ్యాత యభిప్రాయము.

ఎట్లు విశదీకరింపఁబడెను? శ్రీరామాదుల స్వానుష్ఠానముచే. కావున శ్రీరామచంద్రమూర్తిని ధర్మాచార్యుఁడనుట యెంతయుఁ దగియున్నది. శాస్త్రములు చదివి యాప్రకారము తాను నడచి యితరులను నట్లు చేయువాఁడుగదా యాచార్యుఁడు. శ్రీరామచంద్రమూర్తియందు నీయాచార్యగుణములు సంపూర్ణముగాఁ గార్యరూపమునొందియున్నవి. శ్రీరామచంద్రమూర్తి యాచార్యుఁడని శ్రీమద్రామాయణమే నిరూపించుచున్నది.

తొలుదొల్త వాల్మీకి ప్రశ్నించుటయందే ధర్మజ్ఞుఁ డెవ్వఁడు? అనుటతో సంతుష్టిలేక "సంతతానుష్ఠితచారిత్రుఁ డెవ్వఁడు? దృఢనిష్ఠుఁడెవ్వఁ"డని ప్రశ్నించెను. ప్రత్యుత్తర మిచ్చుటయందు నారదుఁడు శస్త్రధర్మవిదుండు, ధర్మసంర

క్షుండు, నిజధర్మరక్షకుండు, అపరధర్మనియంత్రివాఁడు అనికదా చెప్పెను. ఇట్లులే కదా అరణ్యకాండమందు "రామో విగ్రహవాన్ ధర్మ" యని మారీచుఁడును, రాముఁడు రూపమెత్తిన ధర్మము అనియు "యస్మిన్న చలతే ధర్మో, యో ధర్మం నాతివర్తతే" యెవనియందు ధర్మము చలింపదో, యెవఁడు ధర్మము నతిక్రమింపఁడో, యని యుద్ధకాండమున శుకుఁడును "చాతుర్వర్ణ్యంచ లోకేస్మిన్, స్వేస్వే ధర్మే నియోక్ష్యతి" నాలుగువర్ణంబుల జనములఁ దమతమ ధర్మమందు నిలుపుఁ దలఁగకుండ నని నారదుఁడును "విధిమాం ఋషిభి స్తుల్యం కేవలం ధర్మమాస్థితమ్" 'అతులితసత్యధర్మనియమైకరతిం జరియించు సంయమిప్రతతులతోడ సాటి నని బాగుగ నిల్పుము దేవి నీవుర్వి' అని శ్రీరామచంద్రమూర్తియు "ధర్మాత్మా సత్యసంధశ్చ, రామో దాశరథిర్యది" సాంధర్మాత్ముఁడును సత్యసంధుఁడేని రామచంద్రుండు దశరథరాజసుతుఁడు అని లక్ష్మణుఁడును "లోకానాం త్వం పరో ధర్మ" యని బ్రహ్మయుఁ జెప్పిరి. ఈ వాక్యములవలన శ్రీరామచంద్రమూర్తి ధర్మాత్ముఁడు, ధర్మనిష్ఠుఁడు, ధర్మమూర్తి, ధర్మానుష్ఠానపరుఁడు, ధర్మస్థాపకుఁ డని స్పష్టమగుచున్నది.

'ఆచినోతిహి శాస్త్రార్థాన్ । ఆచారే స్థాపయ త్యపి
స్వయ మాచరతే యస్మా। త్తస్మా దాచార్య ఉచ్యతే.'

ఇట్టి యాచార్యుఁడు శ్రీరామచంద్రమూర్తిగాక మఱి యెవ్వఁడు?

కావున శ్రీరామచంద్రమూర్తి ధర్మాచార్యత్వమునకుఁ బ్రాముఖ్య మీయని వ్యాఖ్యానము పర్యాప్తము గా దని వీరి యభిప్రాయము.

'శ్రీరామచంద్రమూర్తి ధర్మాత్ముల రక్షించెను, దురాత్ముల శిక్షించెను' అని మనముబుసుపోకకుఁ జెప్పుచుండిన లాభములేదు. ధర్మాత్ము లనఁబడినవారే ధర్మమున వర్తించుటచే రక్షింపఁబడిరి. దురాత్ములే యధర్మమున వర్తించుటచే శిక్షింపఁబడిరి. ధర్మాధర్మములు మనకుఁ దెలియువిధ మెట్లు? అని విచారపడ వలసిన కారణము లేదు. శ్రీ సీతారామలక్ష్మణభరతశత్రుఘ్నవిభీషణహనుమదాదులచర్యలు ధర్మమార్గము నిరూపించుచున్నవి. రావణాదిరాక్షసులయుఁ గైకేయీమంథరాదులయుఁ జర్య లధర్మమార్గమును నిరూపించుచున్నవి.

ఓయీ! శాస్త్రోక్తమైన చర్యగదా ధర్మము. శ్రీసీతారామచంద్రమూర్తులచర్యలు ధర్మయుక్తము లని నాకు శాస్త్రజ్ఞానముండినఁగదా తెలిసి యాప్రకారము వర్తింతును. ధర్మాధర్మలక్షణజ్ఞానము శాస్త్రమువలన నాకు లభించెనేని శ్రీసీతారామాదులచరిత్రముతో నాకేమి పని? నాకు శాస్త్రజ్ఞానము లేదాయెనా వారు ధర్మచరిత్రులను విశ్వాసము నాకెట్లుగల్గును? కావున నాకు శాస్త్రజ్ఞానముండినను లేకుండినను శ్రీమద్రామాయణపరనము వ్యర్థమేకదా? యని యడుగ

వచ్చును. లోకమున లక్షణైకచక్షుష్కు లని లక్ష్యైకచక్షుష్కు లని యిరుదెగలవారు గలరు. మొదటివారు శాస్త్రజ్ఞానము పరిపూర్ణముగ సంపాదించి ప్రతికార్యము దానిననుసరించి యున్నదా లేదా యని పరిశోధించువారు. రెండవవారు పూర్వపుమహాత్ము లీ ప్రకార మాచరించిరి. కావున నే నట్లులే యాచరించెద నను వారు. వీరికి శాస్త్రజ్ఞానముతోఁ బనిలేదు. తల్లిదండ్రుల ననుకరించుబిడ్డలు - గురువులననుకరించుశిష్యు లీతెగలోఁ జేరినవారు. శాస్త్రజ్ఞానము వెనుక నెప్పుడో వచ్చినరానీ, రాకున్న రాకపోనీ, విచారములేదు. జననీజనకులు, గురువులు ధర్మాత్ములై నిర్దుష్టులై యుండవలయును. లేకుండిన వారిననుకరించువారు చెడుదురు.

సాధువులమార్గము ననుసరించి పోవువానికి దృఢవిశ్వాసబలంబున సందేహములు రావుగాని శాస్త్రజ్ఞానముమాత్రముగలవానికి నాచరణమందు సందేహములు రాకమానవు. ఇట్టివారందఱు శ్రీరామునొద్దకు వచ్చి తమసందేహములు దీర్చుకొనుచుండిరని రామాయణమునఁ గలదు. శ్రీరామావతారోద్దేశ మిదియే. స్వతఃప్రమాణమైన రామాయణమునఁ జెప్పఁబడిన ధర్మాధర్మములకుఁ బ్రత్యేకప్రమాణము లనావశ్యకములైనను గొందఱ సంతుష్టికై కొంతవఱకు ధర్మశాస్త్రవాక్యములు ధర్మకూటానుసారముగ ననువదింపఁబడును. దానివలన ధర్మశాస్త్రవాక్యములకు శ్రీరామాదుల యనుష్ఠానమునకుఁ బోలిక చూచుకొని రామాయణమునఁ జెప్పఁబడినవన్నియు సప్రమాణము లని విశ్వాసము సంపాదించుకొనవచ్చును. ఈవిధముగ నుభయవిధ ధర్మానుష్ఠానమును రామాయణమువలన నేర్చుకొనవలయునుగాని వానరులకుఁ దోఁక తలయందుండెనా మొలయందుండెనా? మొలయందుండిన నెట్లు వస్త్రములు కట్టుకొనిరి? యని యిట్టి సందేహములచేఁ బెణుకులాడుచుండరాదు. రామాయణమువలన నేర్చుకొనవలసిన వివి కావు.

కృతయుగంబున నందఱు జ్ఞానసంపన్నులే. అప్పు డొకరి నొక రుద్బోధింపఁ బనిలేదు. త్రేతాయుగమున నొకపాదము ధర్మము లుప్తము. కావున పాతిక భాగము ధర్మజ్ఞానము లుప్తము. కావున శాస్త్రజ్ఞులకు సందేహము లంకురించెను. అయినను వారిస్థితి యొకరు శాస్త్రీయమార్గమున వర్తించిరేని దానిని జూచి శాస్త్రముతో దానిని బోల్చి శాస్త్రార్థ మిదిగదా యని నిశ్చయించుకొనఁజాలి యుండిరి. ఇట్టిదశయందు శ్రీరామచంద్రమూర్తి యుపదేశముపని పెట్టి కొన్నవాఁడు కాఁడు. ద్వాపరయుగము రాఁగా ధర్మము రెండుభాగములు నశించెను. ద్వాపరశబ్దమున కే సందేహమని యర్థము. కావున వారిమనస్స్థితి 'పెద్దలనడవడి సరియా? నానడవడి సరియా?' యని సందేహించునదియై యుండెను. ధర్మాధర్మములు సమానబలము గలవైనప్పు డిది ధర్మ మని యిది యధర్మ మని తెలిసినవాఁ డొకఁడు నోరుతెఱచి చెప్పవలసివచ్చెను. ఇది కృష్ణావతార

ప్రయోజనము. ఈ కారణముచే భగవద్గీత యుద్ధవగీత జన్మింపఁ గారణమయ్యె ను. ఇది కలికాలము. కలి యనఁగా గలహము. ఇప్పు డా రామమూర్తి యా కృష్ణమూర్తి యవతరించి వచ్చినను బవిసి యూర్చుకొని పోవలసివచ్చును. నీవు చెప్పునది యేమి? నేను వినునది యేమి? నాకుఁ జెప్పుటకు నీ వెవ్వఁడ వని మనవారు కొట్టఁబోదురు. వీరిని జక్కఁబెట్టవలసినది కల్క్యవ తారమే. కావున శ్రీరామావతార మనుష్ఠానావతారము. శ్రీకృష్ణావతార ముపదేశావతారము. శ్రీరామచంద్రమూర్తియనుష్ఠానముచే దేనిని ధర్మ మని నిరూపించెనో దానినే శ్రీకృష్ణమూర్తి యుపదేశముచే స్థాపించెను. కావున శ్రీమద్రామాయణము లక్ష్యగ్రంథము. భగవద్గీత లక్షణగ్రంథము. ఈరెండు గ్రంథముల నెఱిఁగినవాఁడు కింకర్తవ్యతామూఢుఁడు కాఁజాలఁడు. తక్కినశా స్త్రములు చదివినను జదువకున్నను లోపములేదు. ఈరెండువిషయములు భగ వద్గీతకు రామాయణమునకుఁ గల సామరస్యము. శ్రీసీతారామాదుల చర్యల వలన మన మెఱుంగవలసిన ధర్మము విశదీకరింప నీవ్యాఖ్యానము శ్రమింపఁగల దు. ఇది గొప్పపండితులకు సాధ్యమగుకార్యము. అట్టిదాని నెట్టిసహాయములేని యీయల్పజ్ఞుఁడు పూనుకొనుట పరిహాసాస్పదమే.

చ॥ నిరుపహతిస్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
 ప్పురవిడె, మార్త్త కింపయిన భోజన, మొయ్యెలమంచ, మొప్పు త
 ప్పరయు రసజ్ఞు, లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
 దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే.

వీనియం దొక్కటియైనను వీనికి లేదు. కార్యవిఘ్నకరములగు ప్రతికూలప్రార బ్ధములు మెండు. కాలమా సమీపించుచున్నది. కావున శీఘ్రముగా ముగింప వలసియున్నది. ఇట్టిస్థితిలోఁ జేయు మహాకృతియం దెన్నియో లోపము లుం డును. అది యేమి దైవతంత్రమో ఆదినుండి యింతవఱకు మారుమానిసి సాహా య్యములేకయే యిన్నికృతులు రచింపవలసివచ్చెను.

అయిన నగునుగాక. వాసుదాసుఁ డొంటిమిట్ట చేరుటకుముం దాగ్రామ మందలి పెద్దమనుష్యులు సభదీరి స్వామి యయ్యాలపీఁటకు గొలుసులు దెప్పింప వలయు నని చందాలువేయఁబూనుకొనిరి. చేతినిండఁ గాకితములు - బుడ్డినిండ మసి యినుపముక్కుకలము పూని యగ్రాసనాధిపతిగారు సభ నలంకరించిరి. కాని - పేరు వ్రాసినవాఁడు, అంకెవేసినవాఁడు లేఁడాయె. పేరంటాండ్రకదా నీవు పాడు నీవు పాడు మన్నట్లు వీరును నీవు నీ వని కాలక్షేపము చేయుచుండిరి. కాలుగంట యయినను 'హరిః ఓ' మ్మని యంకెవేసినవాఁడు లేఁడాయెను. అప్పు డచ్చటికి నొక పంచముఁడు వచ్చియుండి వీరు పడుపాటులు చూచి యయ్యూ

లారా! యీ మాలవానిధనము స్వామికిఁ బనికివచ్చునా యనెను. దాని కేమి యాక్షేప మని సభ్యు లనిరి అట్లైన నాచందా రు ౧౦-౦-౦ లు వేసికొనుఁడు, ఇప్పుడే తెచ్చియిచ్చెద ననెను. ఆమాట వాఁ డనఁగానే యీ పెద్దమనుష్యుల ముఖమునఁ గాటువేసిన నెత్తురులేదు. రూపాయ వేయుదమా అర్థము వేయుదమా యని యాలోచించు పెద్దమనుష్యులకు గుండెలలో రాయిపడెను. మాలవాఁడు రు ౧౦-౦-౦ లు వేసినప్పుడు దానికిఁ దక్కువ వేయుట యవమానమని వారు సగ్గిసముగ్గిసలైరి. సర్వాజ్ఞనీధ్వజుఁడైన యీ వ్యాఖ్యాతయు మాలదాసుఁడే. స్పర్థచేనైన నీవ్యాఖ్యానమునకు మించిన వ్యాఖ్యానమును పండితుఁడగువాఁడు వ్రాయునుగాక! వాని కిది మార్గదర్శియగునుగాక! గోడ నిర్మించినఁ జిత్తరువు వ్రాయువారెందఱో యుందు రనియే యీ వ్యాఖ్యాత యభిలాష.

సామాన్యధర్మవిషయమున శ్రీమద్రామాయణమునకు వ్యాఖ్యానమే శ్రీ మహాభారతము. మోక్షధర్మవిషయమున శ్రీ భాగవతము వ్యాఖ్యానము. ఈగ్రంథము సాంతమగునంతకు నీ వ్యాఖ్యాతకు నారోగ్యము - నాయుష్యము నిచ్చి శ్రీరామచంద్రమూర్తి తనయొద్దకు రమ్మని పిలువరాఁడేని యథాశక్తి పైవిషయములందు విశదీకరింపఁబడును. లోపములను మహాజనులు క్షమించి బోధింతురుగాక యని యీ దాసుఁడు ప్రార్థించుచున్నాఁడు.

యత్ర రామో భయం నాత్ర, నాస్తి తత్ర పరాభవః.

శ్రీసీతారామప్రసాదసిద్ధి రస్తు.

గ్రంథారంభము

― ౧ సర్గము. వాల్మీకునకు నారదుఁడు రామాయణ ముపదేశించుట ―

కం॥ **త**పమున స్వాధ్యాయంబున, నిపుణుని వాగ్విద్వరేణ్యు • నిఖిలమునిజనా
ధిపు నారదుసంప్రశ్నము, తపస్వి వాల్మీకి యిట్లు • తమిఁ గావించెన్. ౯

అన్వయక్రమము.

తపమున స్వాధ్యాయమున నిపుణుని, వాగ్విద్వరేణ్యుని, నిఖిలమునిజనాధిపుని, దపస్వి యగు వాల్మీకి తమి నిట్లు సంప్రశ్నించెను.

"ఆచార్యాద్ధైవవిద్యావిదితా సాధిష్ఠం ప్రాపత్ . ఆచార్యవాన్ పురుషోవేద" గురూపదేశమున నెఱిఁగిన విద్యయే శ్రేష్ఠమైనది. కావున నాచార్యు నాశ్రయించిన పురుషుఁడే వేదాంతమును జక్కఁగ నెఱిఁగినవాఁ డగును. ఆచార్యునకు నాచార్యలక్షణపూర్తియు నుండవలయును. కావున నారదునికి నాచార్యలక్షణపూర్తి కలదని (1) తపమున స్వాధ్యాయంబున నిపుణుని (2) వాగ్విద్వరేణ్యున్ (3) నిఖిలమునిజనాధిపున్ (4) నారదున్ - అను నాలుగు ద్వితీయాంతంబులచేఁ దెలుపఁబడెను. "రజస్తమోభ్యాం నిర్ముక్తా, స్తపోజ్ఞానబలేన యే, ఆప్తాశ్శిష్టా స్త ఏవోక్తా, స్తేషాం వాక్య మసంశయమ్" రజోగుణమునకుఁ దమోగుణమునకు వశులుగాక తపోజ్ఞానబలముచే నాప్తులు శిష్టులు నగువారు చెప్పెడు వాక్యము నిస్సందేహముగ గ్రహింపవలయును అని గురువుల లక్షణ ముండుటచే నిట్టిగురువులను గావ్యాది నతించి వారికి నమస్కరించియే కావ్యారంభము చేయవలయు ననియు నదియే మంగళకర మనియుఁ దెలుపుటకై తపమున స్వాధ్యాయంబున నిరతుని అని తొలుతనే నారదగుణవిశేషము చెప్పఁబడెను. ఏ విశేషకార్యమైనను దేవతాగురుస్తుతిపూర్వకముగఁ జేయవలయును.

ప్రతిపదార్థము.

తపమున స్వాధ్యాయంబునన్ — తపమునందును స్వాధ్యాయమునందును - అని తపముయొక్క స్వాధ్యాయమునందున, నిపుణుని = విశేషాసక్తివలనఁ గలిగిన యభ్యాసముచే నెంతటి నేర్పుగలవాఁడని యిది గురుపుంగవునకుఁగల సర్వసామర్థ్యమును దెలుపుచున్నది. "యద్దుస్తరం యద్దురాపం, యద్దుర్గం యచ్చ దుష్కరమ్ । తత్సర్వం తపసా సాధ్యం, తపోహి దురతిక్రమమ్" - మనువు. దాఁటరానిది పొందరానిది దుర్గమైనది చేయఁ గష్టమైనది యీ యన్నియుఁ దపస్సుచే సాధ్యములు. తపము దురతిక్రమముగదా యని యర్థము. స్వాధ్యా

యమునందు నిపుణుఁ డనుటచే నేది చెప్పినను వేదోక్తము ననుసరించియే యుండు నని యభిప్రాయము; వాగ్విత్ = పండితులయందు; వరేణ్యుల్ = శ్రేష్ఠుని; నిఖిలమునిజనాధిపుల్ = సమస్తమైన మునులసమూహమందు నధికుఁ డైనవానిని - ఇట్లు చెప్పుటచే నతీంద్రియాభిజ్ఞుఁ డని సూచితము, నారదుల్ = నారదమహర్షిని, తమిల్ = ప్రీతితో - అక్కఱతో, తపస్వియగు వాల్మీకి, ఇట్టు = ఈక్రిందఁ జెప్పఁబోవువిధముగ, సంప్రశ్నము = చక్కని యర్థవంతమైన ప్రశ్నమును, కావించెల్ = చేసెను (అడిగెను).

తాత్పర్యము.

వేదాధ్యయనమున సంపన్నుఁడును, వేదాంతవేత్తయు, బ్రహ్మజ్ఞాననిష్ఠుండును, జపపరుండును, వేదాంగములయిన వ్యాకరణాదుల నెఱింగినవాఁడును, భక్త్యతిశయముచే సరస్వతీపుత్త్రులయినమరీచ్యాదులందు శ్రేష్ఠుండును, అజ్ఞానముఁ దొలఁగించి జ్ఞానముకలిగించి పరమాత్మస్వరూపమును బోధించువాఁడును, యోగవేత్తలలో ముఖ్యుండును నగు నారదమహర్షిం జూచి భగవద్విషయమును బోధింప యోగ్యుఁడగు గురువు దొరకకపోయెనే యను నిర్వేదముతోఁ దపించి శుష్కించినవాఁడును మననశీలుఁడును తపశ్శాలియు నగు వాల్మీకి సాష్టాంగనమస్కారపూర్వకముగ నిట్లు చక్కఁగఁ బ్రశ్నించెను.

తపమున స్వాధ్యాయంబున నిపుణుని నను విశేషణ మాచార్యునందు ముఖ్యముగ నుండవలసిన గుణసంపత్తిని దెలుపును. అదెట్లన.—తపము - చాంద్రాయణాదివ్రతము, స్వాధ్యాయము ఇవిరెండును బ్రాహ్మణునికి నావశ్యకములు గావున నందుఁ దొలుతఁ జెప్పఁబడెను. "శ్లో॥ తపోవిద్యాచ విప్రస్య, నిశ్రేయసకరం పరమ్। తపసా కల్మషం హంతి, విద్యయా మృత మశ్నుతే." "ఆ॥వె॥ ధారిణీసురునకుఁ దపము విద్యయు రెండు। ముక్తిదంబులగుచు మొనయుచుండు." —భార॥ తప మనఁబడు చాంద్రాయణములోనగు వ్రతములును వానిననుష్ఠించుటచే లభించిన విద్య వేదము. ఈరెండు బ్రాహ్మణునకు మోక్షకారణములు. తపస్సుచే జ్ఞానవిరోధులగు పాపములను జంపుచున్నాఁడు. అప్పుడు మనస్సు నిర్మల మగును. ద్వి॥ దానంబు యజ్ఞంబు తపము మనీషి,మానవోత్తమ! చేయు మఱి పావననిగ॥ ద్వి. భ. గీ. ౧౮ అ. ఇట్లు మనస్సు నిర్మలమై ముఱికి కడిగిన యద్దమువలెఁ గాఁగా జ్ఞానమునకు వికాసము కలుగ నారంభించును. వేదపఠనముచే జ్ఞానమును సంపాదించినాఁడు. కావున నారదుఁడు తపశ్శీలుఁడనియు వేదాధ్యయనసంపన్నుఁడనియు నేర్పడుచున్నది.

'తప - ఆలోచనే' ఆలోచనార్థకమగు 'తప్' అను ధాతువుచే నిష్పన్నమైన తపశ్శబ్దము ఆలోచన యను నర్థముగలదియు నగును. ఈ యర్థమును శ్రుతియుఁ

చెప్పును. "యస్య జ్ఞానమయం తపః" ఎవనికిఁ దపస్సు జ్ఞానమయమో యనుటచేఁ
బరబ్రహ్మమునకును జ్ఞానరూపమగు తపస్సుగలదు. ఆజ్ఞానము యోగరూపము.
"స్వాధ్యాయా ద్యోగమాసీత, యోగా త్స్వాధ్యాయమావసేత్, స్వాధ్యాయ
యోగసంపత్త్యా, గమిష్యతి పరాంగతిమ్" అఁగా స్వాధ్యాయాత్ = ఆచార్యు
నివలనఁ జక్కఁగ గ్రహించిన వేదమువలన, యోగ = భక్తియోగమునందు,
ఆసీత = స్థిరుఁడై యుండవలయును. అనఁగా నభ్యసింపవలయును. అనఁగా
భక్తినిగలిగింపని వేదాధ్యయనము ప్రశస్తముగాదని భావము. యోగాత్ =
ఇట్టిభక్తియోగమువలన, స్వాధ్యాయమ్ = వేదమునందు, ఆవసేత్, = స్థిరుఁడై
యుండవలయును. అనఁగా వేదాధ్యయనము భక్తితోఁ జేయవలయును. ఇట్లు
యోగవేదములసంపత్తిచే, పరాంగతిమ్ = పరమపదమును, మనుష్యుఁడు, గమి
ష్యతి = పొందఁగలఁడు.'వేదాధ్యయనముచే యోగమును, యోగముచే వేదా
ధ్యయనమును సంపాదింపవలయును. ఇట్లు పరస్పరసహాయములైన వేదయో
గములు గలవాఁడు ముక్తుఁడగును.' అను శాస్త్రముచొప్పున నారదుఁడు వేద
మును భక్తియోగమును రెంటని గలవాఁ డని యేర్పడెను. "తపోహి స్వా
ధ్యాయః" తపస్సు వేదమే యను శ్రుతివచనంబు గలదు. కావునఁ దప మనఁ
గా వేదమనియుఁ జెప్పనగును. స్వాధ్యాయమనఁగా జపము 'స్వాధ్యాయో
వేదజపయోః॥ స్వాధ్యాయపదము వేదజపములకు వాచకము' అని ప్రమాణము.
"స్వాధ్యాయాన్మాప్రమదః"వేదాధ్యయనమువలనన జాగ్రత్తపడకుము."వేదమేవ
జపేన్నిత్యమ్" ఎల్లప్పుడు వేదమునే జపింపవలయును. అను శాస్త్రరీతిని వేద
మునేసదా జపించువాఁడనియు నర్థము తపము = వ్యాకరణము, 'ఆసన్నబ్రహ్మణ
స్తస్య తపసా ముత్తమం తప।ప్రథమం ఛందసా మంగ మాహు ర్వ్యాకరణం
బుధా.'॥ వేదాంగములలోఁ బ్రథమమగు వ్యాకరణము బ్రహ్మానుగ్రహసంపా
దకమగు నుత్తమతపము, అని వాక్యపదీయంబునఁగలదు. ఈ తపశ్శబ్ద మీ
యర్థమున సకలవేదాంగముల సూచించును. దీనిచే సాంగముగ వేద మధ్య
యనము చేసినవాఁ డని యేర్పడుచున్నది. ఈ సమస్తనిర్వాహములచేతను నార
దునికి వేదాధ్యయనసంపత్తి చెప్పఁబడెను.

తప మనఁగా నాలోచన. అనఁగా ధ్యానము. దానియొక్క స్వాధ్యాయ
మనుటచే ధారణ చెప్పఁబడెను. దానియందు నిపుణుని ననుటచే సమాధి
చెప్పఁబడెను. దీనిచేత సంయమము శక్తి చెప్పఁబడెను. 'తపస్స్వాధ్యాయేశ్వర
ప్రణిధానాని క్రియాయోగ' యని పాతంజలిసూత్రము (౨.౧) ఇందుఁ దపము
స్వాధ్యాయము చెప్పఁబడెను. నారదశబ్దముచే నీశ్వరప్రణిధానము చెప్పఁబడెను.
దీనివలన నష్టాంగయోగసిద్ధిగలఁవాఁ డని యర్థము.

తపశ్శబ్దము పరబ్రహ్మవాచకము. కావునఁ దపస్స్వాధ్యాయనిపుణు ననఁగాఁ బరబ్రహ్మమును ధ్యానించుటయందు సమర్థుని అని యర్థము.

ఎన్ని వేదములు వల్లించినను వానియర్థము గ్రహించినను భగవచ్చింతన లేకున్న వ్యర్థముగదా. 'త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున.' భ.గీ. ౨-౪౫ వేదముల్ త్రైగుణ్యవిషయముల్ గాన నాదని నిస్త్రైగుణ్యుఁడగుచు, నిర్ద్వంద్వుఁడగుచు నిత్యంబు మొగిని యోగక్షేమములను ద్యజించి యగుమయాత్మస్వరూపాన్వేషణార్థి" వని కలదు. కావున నారదుఁడు గుణాతీతుఁడైన మహాయోగియు భక్తుఁడు నని తెలియనయ్యె. "ఋతంతప, స్సత్యంతప, శ్శ్రుతంతప, శ్శాంతంతపో, దమస్తప, శ్శమ స్తపో, దానంతపో, యజ్ఞంతపో, భూర్భువస్సువర్బ్రహ్మైతదుపాస్స్వైతత్తపః॥" తైత్తిరీయము- నారాయణవల్లి, ౧౧౮ అనువాకము- అని యుండుటచే ఋతము-సత్యము- శ్రుతము - శాంతము - దమము - శమము-దానము - యజ్ఞము- బ్రహ్మోపాసనము , ఇవన్నియుఁ దపస్సులే ఇట్టి తప మని నిర్ధారింపకపోవుటచేత నారదునియం దీతపములన్నియుఁ గల వని యెంచవలయును.

కం॥ తప మనఁగ, మత్స్వరూపము, తప మను తరువునకు ఫలవితానము నే నా
తపమునకే జననస్థితి,త్యుపసంహారణము లొనర్చుచుండుదుఁ దనయా!

కం॥ కావున మద్భక్తికిఁ దప,మేవిధమున మూలధనము నిది నీమది రా
జీవభవ! యెఱిఁగి తప మిటు, గావించుట విగతమోహాత్ముఁడ వింకన్.
—భాగ. ౨. ౨౪౬.

తప మనఁగా భగవత్స్వరూపము గావునఁ దపమున స్వాధ్యాయంబున నిపుణుని ననుటచే భగవత్స్వరూపానుసంధానమందు సమర్థుఁ డని యేర్పడెను.

ప్రప్రథమమందే యిట్లు ప్రయోగించుటచే నీగ్రంథమునకు ముఖ్యవిషయము భగవత్స్వరూపానుసంధాన మని యేర్పడుచున్నది.

వాగ్విద్వరేణ్యుని = వాగ్విదులయందు వరేణ్యుఁ డని సప్తమీతత్పురుష సమాసము. అర్థజ్ఞానములేని కేవల వేదాధ్యయనము నిప్పులేని కట్టెలవలెఁ బ్రకాశింపదు. చలువగుడ్డలుమోయు గాడిదకువలె భారమాత్రప్రయోజనము. 'య దధీత మవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే, అనగ్నావివ శుష్కేంధో నతజ్జ్వలతి కర్హిచిత్' అన్నట్లు లర్థజ్ఞానములేని యధ్యయనము వ్యర్థము.

యోధీత్య విధివ ద్విప్రో నవేదార్థం విచారయేత్
ససాన్వయ శ్శూద్రసమః, పాత్రతాం నప్రపద్యతే.

సవిధిగ వేద మధ్యయనముచేసియు వేదార్థము విచారింపనివాఁడు వానివంశముతోడ శూద్రసముఁడు. బ్రాహ్మణయోగ్యతకు నర్హుఁడుకాఁడు. కావునఁ

HYDERABAD (DECCAN)

కేవల వేదమేకాక యర్థజ్ఞానమును నారదునకుఁ గల దని యీవిశేషణమునభి ప్రాయము.

వాక్కు=వేదము. 'శ్లో॥ అనాదినిధనో-ప్యేషా వాగుత్సృష్టా స్వయంభువా॥ ఉత్పత్తిలయములు లేని వేదమును బ్రహ్మ వెల్లడిచేసెను. అనుచో వాక్కు వేద మను నర్థమునఁ బరిగింపఁబడినది. కోవిదులు = దానిని సార్థకముగ నెఱిఁగినవారు. శాస్త్రవేదు లిత్యాదు లిట్టి యర్థమునసే వ్యవహరింపఁబడుచున్నవి కదా.

వాక్కు = వ్యాకరణము. 'వాగ్యోగ విదుష్యతి చాపశబ్దే' యనుచో వాక్ఛబ్దము వ్యాకరణపర్యాయంబుగ గ్రహింపఁబడియె. వ్యాకరణ మను నర్థముగల 'వాక్' శబ్దము సకలవేదాంగములను సూచించును. కాఁగా, వాగ్విదులు = వేదాంగవిదు లని యర్థము - వేదమును సాంగముగఁ జదించువారికి సర్వజ్ఞానము తప్ప దను నర్థ మీపక్షమున సూచింపఁబడియె వాగ్విదులు = తా మనుకొన్న యర్థములు పరులకు సుబోధముగఁ జక్కనివాక్యములఁ బ్రయోగించువారు; అధ్యాపకులు. ఈపక్షమున విశేషణ ద్వయముచేతను నధ్యయనాధ్యాపనములు నారదునికిఁ గలవని తెలియనగును. పూర్వవిశేషణము వేదజ్ఞానమును, ఈ విశేషణము తదితర సకల శాస్త్రజ్ఞానమును గోబలీవర్దన్యాయముగఁ దెలిపెడిని వాగ్విదులు = సరస్వతీపుత్రులు - మరీచ్యాదులు (వాచా = సరస్వతిచేత, విద్యన్తే = కనఁబడిన వారని వ్యుత్పత్తి) వారికంటెను భగవద్భక్తిచే, వరేణ్యుఁడు = శ్రేష్ఠుఁ డనటచే వారికన్నను గొప్పకులము గుణము కలవాఁడని యాభిజాత్యము సూచితము. ఈపక్షమున విశేషణద్వయ మాచార్యత్వోపయోగులగు సద్వంశ ప్రసూతివిద్యలఁ దెలుపును.

వాక్కు, పర - పశ్యంతి - మధ్యమ - వైఖరి యని నాలుగు విధములు. ఇందు పర యనునది మఱ్ఱిచెట్టునకు దానివిత్తనమువలె నతిసూక్ష్మమైననాదము. దీనిస్థానము సుషుమ్న. ఇది శబ్దబ్రహ్మమగు భగవంతుని సూక్ష్మశక్తి. ఈశక్తినే ఆదిలక్ష్మియని మహాకాళి యని మహాసరస్వతి యని త్రిపురసుందరి యని యాయామతములవారాయా పేర్ల వ్యవహరింతురు. ప్రలయకాలమందు నచేతనమయిన ప్రకృతితోఁగలిసి చేతనలును నచేతనములవలెఁ బడియుండుట చూచి కారుణ్యరూపయగు నీశక్తి వీరు కడతేఱు టెట్టులా యని యాలోచించును. ఇప్పుడీమెకు పశ్యంతి యనిపేరు. అనఁగా నాలోచించునది యని యర్థము. "తదైక్షత బహుస్యాం ప్రజాయే యేతి - ఈక్షతేర్నా శబ్దమ్" అను శ్రుతి. సూత్రముల యందీయర్థము చెప్పఁబడెనగదా. ఈశక్తిస్థానము స్వాధిష్ఠానము. ఇదియేకదా ప్రజోత్పత్తి కారణస్థానము. స్వాధిష్ఠానము మేహనము.). ఇదియే ఈశక్తియే తదుపరి వ్యష్టి సమిష్టిరూపములతో శూన్యము - స్పర్శము - నాదము - ధ్వని

బిందువు - బీజాంకురములు లోనగునవి యగును. ఇది పరవలె నతిసూక్ష్మముగాక వైఖరివలె నతిస్థూలముగాక మధ్యమదశయం దుండుటచే మధ్యమ యనఁబడును. ఇది బుద్ధితత్త్వముతోఁగూడి యనాహతచక్రమం దుండును. ఆపిమ్మట వైఖరియై కంఠదేశము చేరి విశుద్ధచక్రము స్థానముగలదిగా నగును. ఇది జ్ఞాన విషయముగలది. అర్థవంతమైన శబ్దము. మనుష్యులకుఁ దెలియునది యిదియే. యోగు లీనాలుగింటిని నెఱుఁగుదురు. ఇది తెలిసినవాఁడే యోగి, జ్ఞాని యని యుండుటచే నారదుఁ డీనాదరహస్య మెఱిఁగినవారిలో శ్రేష్ఠుఁ డని యర్థము. "అపదం పదమాపన్నం పదంచాప్యపదం భవేత్ । పదాపద విభాగంచ యః పశ్యతి సపశ్యతి"యని ప్రమాణము.

నిఖిలమునిజనాధిపు నను విశేషణము సమాహితత్వ మను నాచార్యగుణమును దెలుపును. "అభిజనవిద్యాసముపేతం సమాహితం సంస్కర్తార మీప్సే" త్తని యాపస్తంబధర్మసూత్రమున నాచార్యలక్షణ ముక్తము. అభిజన = వేదవేత్తల వంశమునఁ బుట్టుకచేతను, విద్యా = సాంగవేదములచేతను, సముపేతం = కూడినవానిని, సమాహితం = కర్తవ్యములు నిషిద్ధములు నగు క్రియలయందు జాగరూకుని, సంస్కర్తారం = ఆచార్యునిగ, ఈప్సేత్ = పొందవలయును. మునులు మననస్వభావులు. కలకాలము మననము చేయుచుండినఁ జాలదు. తీవ్రనిరంతర మననముచే గురువువలన విన్నవిషయమును సాక్షాత్కరించుకొనవలెను. ఇట్టివారు మునులు. కావున నారదుఁడు భగవత్తత్త్వమును సాక్షాత్కరించుకొనెనని తెలియనగు. నిఖిలశబ్దము శేషములేమిని దెలుపును. జనశబ్దము అనేకత్వమును దెలుపును. ఒక్కఁడైనను దప్పక సమస్తమునులలోన గొప్పవాఁడని యర్థము. తపమున స్వాధ్యాయమున నిపుణు నను విశేషణము వేదార్థశ్రవణమును దెలుపును. వాగ్విదాంవరేణ్యు నను ద్వితీయవిశేషణము మననమును దెలుపును. నిఖిలమునిజనాధిపు నను తృతీయవిశేషణము నిదిధ్యాసమును దెలుపును. అని యీవిశేషణత్రయముచేతను శ్రవణమనననిదిధ్యాసనాత్మకమైన యోగపూర్తి యీయనకుఁ జెప్పఁబడియె అంతేగాక పాండిత్య బాల్యమౌనములైనను దెలుపఁబడియె. ఇవి యోగసహకారు లని శ్రుతులు చెప్పుచున్నవి. "తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్ బాల్యంచ పాండిత్యంచ నిర్విద్యాథ ముని" యని శ్రుతి. బ్రాహ్మణః = ఉపాసకుఁడు, పాండిత్యం నిర్విద్య = పాండిత్యమును సంపాదించి - ఉపాస్యమగు బ్రహ్మమును పరిశుద్ధముగను పరిపూర్ణముగను నెఱింగియని భావము. బాల్యేన = గర్వము లేమిచేత. అనఁగా బాలున కెన్నిగుణములున్నను గర్వముండదు. కావున నిట గర్వాభావము బాల్యశబ్దము చెప్పును. తిష్ఠాసేత్ = ఉండునది. బాల్యంచ పాండిత్యంచ నిర్విద్య = బాల్యపాండిత్యములను సంపాదించి, అథ = పిమ్మట, మునిః స్యాత్ = పరిశుద్ధ పరిపూర్ణ బ్రహ్మమును ధ్యానించువాఁ

తపమున నిపుణుఁడనుటచే జ్ఞానాధికుఁడనియు, మునిజనాధిపుఁడనుటచే నుపాసకులందు శ్రేష్ఠుఁడనియు, నారదునందు నీ రెండు విధములైన శక్తులు పూర్ణముగాఁ గలవని యేర్పడుచున్నది.

నారదుఁ = నారము - నరునికి సంబంధించిన యజ్ఞానము - దానిని (ద=ఖండనము) ఖండించువాఁడు గాన నారదుఁడు. "గాయన్నారాయణకథాం, సదా పాపభయాపహామ్। నారదో నాశయన్నేతి, నృణామజ్ఞానజం తమ" యని నారదీయము. (పాపభయమును నశింపఁజేయు నారాయణకథను సదా పాడుచుఁ దన్గాలమున జనుల యజ్ఞానమును బోఁగొట్టుచు నారదుఁడు సంచరించుచుండును.)

నారము = జ్ఞానము, దాని నిచ్చువాఁడు నారదుఁడు, సద్గతినిఁ బొందించువాఁడు గావున నారుఁడు - పరమాత్మ. వాని నుపదేశించును గావున నారదుఁడనియుఁ జెప్పనగు. "నరతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతన" యని భారతము. నారద మనఁగా మేఘము. అది జనుల ప్రార్థనములేకయే భగవత్సంకల్పానుసారముగ నెక్కడెక్కడ వర్షింపవలయునో యచ్చటచ్చట వర్షించునట్లు తననిమిత్తమై వచ్చి దినములకొలఁది మాసములకొలఁది సంవత్సరముల కొలఁది కాచుకొని తనకు శుశ్రూషచేయుచు శిష్యులు కాలహరణము చేయకుండునట్లు భగవత్స్వరణమునఁ జెప్పవచ్చునని తోఁచినవారికెల్ల తానే యుత్తమమోక్షమార్గమైన భక్తిమార్గము నారదుఁ డుపదేశించునని భావము. దీనివలనఁ దక్కిన గురువులకంటె దయాసౌలభ్యవాత్సల్యములందును లోకహితబుద్ధియందును దిన గురువే శ్రేష్ఠుఁడని వాల్మీకి గురుమహిమ వెల్లడించినవాఁడయ్యెను. ఇట్లు నారదునాచార్యలక్షణపరిపూర్తి చెప్పఁబడెను.

ఇఁక వాల్మీకికి శిష్యలక్షణపరిపూర్తి చెప్పఁబడును. ప్రశంసార్థకమైన మతుప్ప్రత్యయ మంతమందుఁగల తపస్విశబ్దము ప్రశస్తమైన తపముగలవాఁడని యర్థమిచ్చును. అది బ్రహ్మజ్ఞానానుకూలమై శిష్యున కావశ్యకమగు తపస్సు అని శ్రుతియందుఁగలదు. 'తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ' 'సతపోఽతప్యత' 'సతపస్తప్త్వా ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' ఇతిశ్రుతి. (తపస్సుచే బ్రహ్మము నెఱుఁగుమని యాచార్యుఁడు చెప్పఁగా శిష్యుఁడు తపస్సుచేసి యానందస్వరూపమైన బ్రహ్మము నెఱిఁగెను.)

తపశ్శబ్దము వేదవ్యాకరణజ్ఞాననిర్వేదవాచకము. అల్పాస్థిరఫలంబైన కర్మకాండోక్తకర్మముయొక్క జ్ఞాన మిట జ్ఞానశబ్దార్థము. నిర్వేదము అనంతస్థిరఫలమైన మోక్షాభిలాషారూపము. ఈనాలు గర్థములును బరస్పర మన్వయించును. అప్పుడు సాంగవేదాధ్యయనానంతరము వేదపూర్వకాండోక్తకర్మముల నల్పా

స్థిరఫలములుగా నెఱిఁగి యనంతము స్థిరము నగుఫలంబైన మోక్షము నభిలషించువాఁడని తపస్విశబ్దమున కర్థాంతర మేర్పడును. నిర్వేదము లేనివాఁడు ముముక్షువు కాఁజాలఁడు. కావున వాఁ డుపదేశార్హుఁడుకాఁడు. వాల్మీకి నిర్వేదము కలవాఁడు కావున నుపదేశయోగ్యుఁడు. ఇతర విషయములందలి వైరాగ్యముతో నుపదేశ్యమగు నర్థమున నభిలాష శిష్యాధికారమే కదా.

తపస్వి = శరణాగతుఁడు, తపస్వియనఁగా ప్రశస్తమైన తపస్సుగలవాఁడు. అన్నితపస్సులలో శ్రేష్ఠమైన తపస్సు న్యాసము. న్యాసమనఁగా నేను నాది యని దేనియం దభిమానముకలదో దానినెల్లను భగవంతున కప్పగించి మనలను రక్షించుభారము మనముచేయు కర్మములఫలము భగవంతునం దుంచుట. దీని వలనఫల మీదేహము విడిచినపిమ్మట మరల జన్మము లేకుంటయే.

మం॥ జ్ఞాత్వా తమేవం మనసాహృదా చ భూయోనమృత్యు ముపయాహి విద్వాన్। తస్మాన్న్యాసమేషాం తపసా మతిరిక్తమాహుః॥ తైత్తిరీయోపనిషత్సు నారాయణప్రశ్న ౧౯-౨౦ మంత్రములు.

ఆపరబ్రహ్మము నిట్టివానిఁగా మనస్సుచేతను భక్తిచేతను (హృదా యనఁగ భక్తిచే ననియర్థము) దెలిసికొనినవాఁడు మరల మృత్యువును బొందఁజాలఁడు. కావున నన్నితపస్సులలో న్యాసమే శ్రేష్ఠమైనదానినిఁగా బ్రహ్మవేత్తలు పలుకుచున్నారు,అనియర్థము. ప్రహ్లాదుఁడు చెప్పిన యాత్మనివేదనము పతంజలి చెప్పిన యీశ్వరప్రణిధానము నిదియె. న్యాసవిద్యను విశేషముగ బోధించు రామాయణమును రచించు వాల్మీకికి దానియందు శ్రద్ధయుండుట సమంజసమేకదా. ఇచ్చట శరణాగతి నమస్కారరూపము. 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' యను సమస్తశిష్యలక్షణము లున్నవనియుఁ జెప్పనగు. గురువునకు నమస్కరించి తత్త్వార్థ మడుగుట శిష్యకార్యమేకదా. గురువు తపస్స్వాధ్యాయ నిపుణుఁ డని శిష్యుఁడు తపస్వియనుటచే గురువునకుఁ దగిన శిష్యుఁ డని యేర్పడుచున్నది. వల్మీకము = పుట్ట, దాని యపత్యము (= కుమారుఁడు) వాల్మీకి. ఇచట నొక పూర్వపక్షము కలదు. ఇతఁడు వల్మీకాపత్య మనుట యుచితముగాదు. భృగువంశమున జన్మించినట్లు ప్రమాణములు గలవు. 'ఋక్షోఽభూద్భార్గవస్తస్మాద్వాల్మీకిర్యోఽభిధీయతే' యని విష్ణుపురాణవచనము 'భార్గవేణ తపస్వినా' యని యుత్తరకాండవచనము గలవు. ప్రచేతసుని పుత్రుఁడనియు మఱికొన్నివచనములు గలవు. "చక్రే ప్రచేతసః పుత్రః తం బ్రహ్మాప్యన్వమన్యత" (ప్రచేతసుని పుత్రుఁడగు వాల్మీకి రచియించిన రామాయణమును జూచి బ్రహ్మయును మోదించె ననియు, "వేదః ప్రాచేతసా దాసీత్" (= ప్రచేతసుని పుత్రుఁ డగు వాల్మీకి నుండి వేదము రామాయణరూపమున వెలువడియె) అనియు నుండుట ప్రసిద్ధము. వాల్మీకియే "ప్రచేతసోఽహం దశమః పుత్రో రాఘవనందన" యని యుత్తర

కాండమునఁ జెప్పుకొనియెఁగదా. ఇట్లుండ వాల్మీకి యని పేరుపెట్టుట యుచితముగాదు, అని పూర్వపక్షము. సమాధాన మేమన.

భృగుపుత్రుఁడైన ఋక్షుఁ డను ఋషి విశేషతపస్సుచే నిశ్చలుఁడై యుండగా నతనిపై పుట్ట పెరిఁగెను. తపస్సిద్ధ్యనంతరం మది కరుగునట్లు వరుణుఁడు వాన కురియింప నది కరఁగి యందుండి యాఋషి వెలువడియె. కావున భార్గవుఁడు ప్రాచేతసుఁడు వాల్మీకి యను పేర్లుచితములే. 'పుంనామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః' అన్నట్లు 'పతత్యనేన పితా నరకమితి అపత్యమ్' దీనిచేతఁ దండ్రి నరకమునఁ బడఁడుఅని. నరకమునుండి తప్పించువాఁడపత్యమగుఁగాని వల్మీకసంబంధమాత్రమునఁనే యపత్య మనవచ్చునా? యన, గోణీసంబంధముచే గోణీపుత్రుఁడు, కలశసంబంధముచేఁ గలశీసూనుఁడు, భూపుత్రిక, జనకపుత్రి, పాణ్మాతురుఁడు నను వ్యవహారములు ప్రసిద్ధములేకదా! ఇట్లే బ్రహ్మవైవర్తపురాణమునందును జెప్పఁబడియున్నది. 'అథా బ్రవీన్మహాతేజా బ్రహ్మాలోకపితామహః। వల్మీకప్రభవో యస్మాత్తస్మాద్వాల్మీకరిత్యసౌ॥' యని యందలి వచనము. (వల్మీకమునుండి పుట్టుటంబట్టి వాల్మీకి యని యీయనకుఁ బేరని బ్రహ్మ యనెను) అనియొక సమాధానము. అపత్యార్థము గాకున్నను సంబంధార్థకమునను పాణినీయప్రకార మీశబ్దము నిష్పన్న మగును, అని రెండవ సమాధానము.

భృగువంశమునఁ బ్రచేతసుం డని యొక ఋషియుండెను. అతనికిఁ బదుగురు పుత్రులు. అందుఁ బదియవవాఁడు ఋక్షుఁడు. ఈయనయే వాల్మీకి యని మూఁడవ సమాధానము. ఈయన కనేక నామధేయము లుండ నిట వాల్మీకి యను పేరుతో నిర్దేశించుట జనుమునకై యీయన తనమీఁదఁ బుట్టపెరిగినను దెలియనంతటి దీర్ఘసమాధియం దుండెనని యీయన గొప్పతనము తెలుపుటకే. స్వగుణమహిమచే లభించిన ప్రశస్తనామము నామకరణమునాఁటి పేరును మఱుఁగుపఱుచును. వేదవ్యాసుఁడు - రామదాసుఁడు లోనైనవి సుప్రసిద్ధములు.

భృగువంశమునఁ బుట్టినవాఁ డగుటచే వాల్మీకి జాతిబ్రాహ్మణుఁడే కాని కొందఱు తలఁచునట్లన్యజాతివాఁడుకాఁడు. శ్లో॥ మచ్ఛందాదేవ తే బ్రహ్మన్, ప్రవృత్తేయం సరస్వతీ. ౧. ౨. ౩౧. ఓబ్రాహ్మణుఁడా! నా యభిప్రాయమువలననే సరస్వతీదేవి నీవాక్కునందు నిలిచి యిట్లు ప్రవర్తించెను అని బ్రహ్మ వాల్మీకిని సంబోధించెను. లక్ష్మణుఁడు సీతాదేవితో శ్లో॥ సఖా పరమకో విప్రో, వాల్మీకిస్సుమహాయశః॥ పరమసఖుఁడు విప్రుఁడు మహాయశస్సంపన్నుఁడగు వాల్మీకి (సమీపమందున్నాఁడు). ౭-౪౭-౧౬ అని చెప్పెను. ఒకానొక బొల్లిరాజు వాల్మీకి యను పేరుగల పురుషుఁడే లేఁడనియు నది కల్పితనామ మనియు వ్రాసెను. శ్లో॥ ఆదిత్యా

తేజః ప్రతిమానతేజా, భీష్మోయథారాజసి సువ్రతస్త్వమ్, వాల్మీకివత్తేనిభృతం స్వవీర్యం, వసిష్ఠవత్తే నియతశ్చ కోపః॥ భార-ఆది-౫౫,౨౮- 'నీ తేజము సూర్యుని తేజముతో సమానమైనది. భీష్మునివలె నీవు సువ్రతుఁడవు. వాల్మీకి వలె స్వవీర్యమును భరించినవాఁడవు. వసిష్ఠునివలె నీవు కోపమును నియమించినవాఁడవు.' అని జనమేజయుని యాస్తీకుఁడు స్తుతించెను. శ్లో॥ సహదేవః సునీథశ్చ వాల్మీకశ్చ మహాతపాః। సమీకస్సత్యవాక్చైవ ప్రచేతాస్సత్యసంగరః. సభా-౭-౧౬. ఇంద్రుని సభయందు సహదేవుఁడు సునీథుఁడు మహాతపస్వియగు వాల్మీకి సత్యవాదియగు సమీకుఁడు సత్యసంగరుఁడైన ప్రచేతసుఁడు నున్నట్లు నారదుఁడు చెప్పెను. శ్లో॥ వాల్మీకశ్చాహ భగవాన్, యుధిష్ఠిరమిదంవచః।వివాదే సాగ్నిమునిభి, బ్రహ్మఘ్నో వై భవానితి. భార. అను. ౮౯ అ. శ్రీభాగవతంబున షష్ఠస్కంధంబున ౧౮వ యధ్యాయమందు 'చర్షిణీ వరుణస్యాసీ, ద్యస్యాం జాతోభృగుః పునః। వాల్మీకిశ్చ మహాయోగీ, వల్మీకాదభవత్కిల.' ఆంధ్రభాగవతంబున "వరుణునకుఁ జర్షిణి యను భార్యయందుఁ బూర్వకాలంబున బ్రహ్మపుత్రుండయిన భృగువును వాల్మీకియు నుదయించిరి. హరివంశంబున ౧. ౬ నందు 'యద్వాజపేయేనతు రాజసూయాద్దృష్టంఫలం హస్తిరథేన చాన్యత్ । తల్లభ్యతే వ్యాసవచః ప్రమాణం గీతంచ వాల్మీకిమహర్షిణాచ' అని యున్నది ఈ ప్రమాణవాక్యములవలన వాల్మీకి వాస్తవపురుషుఁడేకాని మిథ్యాకల్పితపురంజనుఁడు కాఁడు.

సంప్రశ్నము:— సమ్యక్ అనునర్థమున సమ్ అను నుపసర్గప్రయోగము ప్రశ్నము మిగుల శ్రేష్ఠమని తెలుపును. అడుగఁబడిన విషయము మంచిదనుటచేతను, విశేషించి యుండుటచేతను ప్రశ్నము మంచిదనఁబడును. ఈగ్రంథము వేదార్థమును విశదీకరించునది. కావునఁ బ్రథమశ్లోకముచే "పరీక్ష్యలోకాన్ కర్మచితాన్, బ్రాహ్మణో నిర్వేద మాయాత్, నాస్త్యకృతః కృతేన, తస్మై సవిద్వానుపన్నాయ సమ్యక్ప్రశాంతచిత్తాయ శమాన్వితాయ యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచతాం తత్త్వతో బ్రహ్మవిద్యా''మ్మని శిష్యుఁడు గురూపసత్తి చేయఁదగువిధముఁ దెల్పు శ్రుతి విఖ్యాతమయ్యెను. (అంగములతోఁడ వేదాధ్యయనము చేసినపురుషుఁడు పుణ్యకర్మములచే సంపాదింపఁబడు స్వర్గాదిలోకములను మీమాంసాన్యాయ్యములచే నల్పములు నస్థిరములని యెఱిఁగి నిత్యుఁడగుపరబ్రహ్మము ఫలాపేక్షతోఁ జేసిన యజ్ఞాదికర్మములచేఁ బొందఁబడఁడని తెలిసి పరితాపపడును. అట్టి పరితాపముగల పురుషుఁడు సమిధలు లోనగుకానుకల నాచార్యున కిచ్చుటకై చేతఁబట్టుకొని వేదాంతార్థమును దెలిసినవాఁడును బ్రహ్మసాక్షాత్కారము గలవాఁడును నగు నాచార్యుని గుఱించి పోవలయును. సమిధలు తీసికొనిపోవుట తన యకించనత్వమును

దైన్యమును దెలుపుటకు. గురువులయొద్దకు రిక్తహస్తములఁ బోరాదు. బ్రహ్మజ్ఞానము గురుముఖముగ సంపాదింపవలయును గాని స్వతంత్రప్రయత్నము గూడదని భావము. ఇట్లు బాహ్యేంద్రియజయము నంతరింద్రియజయము గలిగి మనస్సును జయించి విద్వాంసుఁడగు గురువు బాగుగ నిర్వేదముతోఁ గూడి వినయయుక్తుఁడయిన శిష్యునకు నేవిద్యచేత నక్షరమును సత్యమునగు పురుషుని నెఱుఁగనగునో యట్టి బ్రహ్మవిద్యను జెప్పవలెను.) అదెట్లన.—తపస్వి యనుపదము 'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన' యను శ్రుత్యర్థమును దెలుపును. వాల్మీకి యను పదము 'ప్రశాంతచిత్తాయ శమాన్వితాయ' యను శ్రుత్యర్థమును దెలుపును. తపమున స్వాధ్యాయంబున నిపుణుని నను విశేషణము 'శ్రోత్రియ' మ్మను శ్రుతియర్థమును వివరించును. నిఖిలమునిజనాధిపు ననుటచే బ్రహ్మనిష్ఠశబ్దార్థము వివరింపఁబడెను. నారదు నను పదము గురుశబ్దార్థమును జెప్పును. గురువు = అజ్ఞాన మను చీఁకటిని బోఁగొట్టువాఁడు. నారదపదమం దీయర్థము మీఁదఁ జెప్పఁబడెను. 'గుశబ్ద స్త్వంధకారస్స్యాత్, రుశబ్ద స్తన్నిరోధకః। అంధకార నిరోధిత్వాద్ గురు రిత్యభిధీయతే' యని కలదుగదా.

సంప్రశ్నము పరిప్రశ్నేన యను శబ్దార్థమును దెలుపును. తమిత్ = శ్రద్ధతో. నక్తుఅ = కోరికగలవాఁడై యని యర్థము. తమిఁగావించె ననుపదము 'తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛే' త్తను శ్రుత్యర్థమును దెలుపును.

బ్రహ్మవాచి తపశ్శబ్దము కృత్యాదియందుఁ బ్రయోగించి దేవతానమస్కారరూపమంగళము చేయఁబడెను తపమున స్వాధ్యాయంబున నిపుణుని = పరబ్రహ్మమును ధ్యానించుటయందుఁ గుశలుని. ఎన్ని వేదములు వల్లించినను భగవద్భక్తి లేకున్న వ్యర్థము.

తపమున స్వాధ్యాయంబునన్ = పరబ్రహ్మమును ధ్యానించుటచే వాల్మీకి యిట్లు సంప్రశ్న గావించెననియు గ్రహింపనగు. పరబ్రహ్మమును ధ్యానించుటచేఁ గలిగిన తపశ్శక్తిగల వాల్మీకి పరబ్రహ్మనిష్ఠుఁడైన నారదు సంప్రశ్నించిన విషయము పరబ్రహ్మవిషయమైగాక వేఱొండు గాఁజాలదు. కావున ముముక్షువులకీరామాయణ మవశ్యపఠనీయ మనియు, నిది యుపదేశగ్రంథముకావున నధికారియైన శిష్యుఁడు యోగ్యుఁడైన గురువుచే నుపదేశముపొందియే పఠింపవలయు ననియు నేర్పడుచున్నది. 'దేవతావాచకా శ్శబ్దా' యని యుండుటచే మంగళకరములగు శబ్దములు గ్రంథాదిని బ్రయోగింపవలయు ననుట సత్యమే యయినను నవి పెక్కులుండఁ దపశ్శబ్దమే యేల గ్రహింపఁబడెను? వాల్మీకి రచియించిన శ్రీమద్రామాయణ మిరువదినాలుగువేల గ్రంథముల పరిమితిగలదు.

ముప్పదిరెం డక్షరములకు గ్రంథ మని పేరు వెయ్యికి నొకటివంతున ౨౪,౦౦౦ గ్రంథములందు ౨౪ గాయత్రీవర్ణములు చేర్పఁబడినవి. అందులో మొదటి వేయికి మొదటి గాయత్ర్యక్షరములందు మొదటిదైన తకారము కూర్పఁబడెను. పూర్వపీఠికయందలి గాయత్రీరామాయణమున వీనిఁ గనఁదగు. బ్రహ్మవాచితపశ్శబ్దము కృత్యాదిఁ బ్రయోగించి దేవతానమస్కారరూపమంగళము గావింపఁబడెను.

గ్రంథము రచియించువానికిని పఠించువానికిని తకారప్రయోగము శుభదాయకము. తకారమునకు జలము భూతము, బృహస్పతి దేవత, కావున నిది శుభకరము. తకారము విఘ్ననాశకము. 'తకార స్సౌఖ్యదాయకః' 'తకారో విఘ్ననాశక' యని ప్రమాణములు.

తపశ్శబ్దమునకుఁ దాప మను నర్థమును గలదుగదా! కావున నిది యశ్లీలార్థకముగదా, కృత్యాది నుండవచ్చునా? యని సందేహింపరాదు. పశబ్దమున కే యర్థమున సూత్రియో బహుళప్రయోగము కలదో యాయర్థ మశ్లీల మగునా కాదా యని మాత్ర మాలోచింపవలయును. తాపార్థమునఁ దపశ్శబ్దమునకు స్వరసప్రయోగము లేమింజేసి వ్రతాదులందే స్వరసప్రయోగ ముండుటంబట్టియు వ్రత మను నర్థమే తొలుత స్ఫురించును గావున నశ్లీలదోషము రాదు తపమున నిపుణుఁ డనినఁ దాపమున నిపుణుఁడని యర్థ మగునా? ఈసమాధానము పామరనిమిత్త మీయఁబడినది. తపస్సుచే దేహమును గృశింపఁజేయు తపస్వియే కృతార్థుఁడు కాఁగలఁడు భగవంతుఁడు తపోమయుఁడే. బ్రహ్మ తపస్సుచే భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడయ్యెను తపస్సును గుఱించి "మన్న" యను పేరితో నొకకళావిదుఁడు వ్రాసినవాక్యములు విచారపరుల కర్పించుచున్నాను.

"The Sanskrit word *Tapas* is very suggestive It has been found that "the naturally coloured crystals as well as those coloured by exposure to the radio active rays can be made colourless by heating to a sufficiently high temparature"

The colour of the dark violet crystals found in the blue John mine in Derbyshire is frequently "so dark that large crystals appear almost black—when such a crystal is heated until it becomes colourless and is then subjected to the radium radiation, it assumes a beautiful sky blue tint and at the same time it becomes strongly flourescent, the flourescence continuing for some days after 'removal from the influence of the rays' That is the paradise of a crystal, of a Tapasvi crystal which has radium as its God Thy God, my soul! is more radiant certainly than radium"

భగవంతుఁడు బ్రహ్మకుఁ 'దపతప'యని యుపదేశించెను. ఆరెండక్షరములు గ్రంథాదినుంచి వాల్మీకియు దానినే మన కుపదేశించెను. తప=పదని మీఁద వ్రాయఁబడెనుగదా! దానినిగుఱించి మీఁద ననువదింపఁబడిన కళావేత్త యిట్లు వ్రాసెను.

"My soul! There are things which you may not understand. But every law discovered enables you to peep into the mind of God, and hear partially the real music of the visible universe. John new lands so heared it when he discovered his law of octones after meditation on chemical elements, the law which Mendeleep called the periodic Law Arrange the elements in the numerical order of their atomic weights and you see a recurrence of similar chemical and physical characters at every eighth elements

"Similarly" say Luff and Candy each of the first seven notes of a musical octones has a distinct character of its own but the eighth note is essentially a duplicate of the first and this duplication extends note for note throughout the next octone and so on

మన మశ్లీలముగ నెంచు నేడునం దెంత మహిమయున్నదో చూడుఁడు. సరిగమపదని యని చెప్పి మరల "స" చెప్పుట ప్రకృతివిభాగము. అంతకు మించినది లేదు. ఇట్టులే సూర్యకిరణములు అగ్నిజిహ్వలు ఏడింటికిమీఁద విభాజ్యము గాని సంఖ్యలేదు. గ్రంథవిస్తరభీతి బాధించుచున్నది. తక్కినవి మేధావులాలోచింతురుగాక.

గురువు శిష్యు నొకసంవత్సరము పరీక్షింపక యుపదేశింపరాదని ప్రమాణముకలదుగదా అట్లుండ నెట్లు నారదుఁడు వాల్మీకి యడిగినంతమాత్రముననే యుపదేశించెనని సందేహము కలుగవచ్చును. పరీక్ష యనునది యధికారి గాని వానివిషయము. శిష్యుఁడు గురువునొద్దకు రాఁగానే యాశిష్యుఁ డుపదేశములకు నధికారియగునా కాఁడా యని గురువు తెలిసికొని యధికారి యయ్యెనా వెంటనే యుపదేశించును. అధికారి కాఁడేని వాని యోగ్యతఁ దెలిసికొని మూఁడుమాసములో యాఱుమాసములో సంవత్సరమో పంద్రెండుసంవత్సరములో తన యొద్దనుంచుకొని వ్రతానుష్ఠానములచేతను నాహారవ్యవహారములచేతను వానికి యోగ్యతవచ్చిన పిమ్మట నుపదేశించును. సీతయొక్కకు హనుమదాచార్యుఁడు రామప్రేషితుఁడు పోయినట్లు అధికారియగు శిష్యుని వెదకికొని గురు భగవత్ప్రేరితుఁడై గురువే యతఁ డుండుచోటికి వచ్చును. బ్రహ్మాపనుపున నారదుఁడు వచ్చి వాల్మీకి కుపదేశించెనుగావునఁ బరీక్షతోఁ బనిలేదు. గురువునొద్దకు శిష్యుఁడు పోయినపుడే పరీక్ష కావలయును. అదియునుగాక సంవత్సరపరీక్ష యనునది జ్యేష్ఠపుత్రునియం దన్వయింపదు. వాల్మీకి నారదునకు సోదరపుత్రుఁడు.

ఏ శుభకార్యమైనను బ్రారంభించుటకుఁ బూర్వము భగవంతుని గురువును స్మరింపవలయుననియుఁ దా నెంత గొప్పవాఁడైనను దన గురువుగుణములే ముందుగ విశేషించి చెప్పవలయుననియు, నాచార్యగుణసంపత్తి గలవానినే గురువుగా గ్రహింపవలయు ననియు, వినయవిధేయతలచేతను, సేవచేతను గురుకరుణఁబడసి న్యాయ్యమయిన ప్రశ్నలచేఁ దత్త్వబోధమునకునధికారికావల యుననియుఁ, దా నెంత తెలిసినవాఁడైనను భగవద్విషయము గురూపదేశమూల మున నే గ్రహింపవలయుననియుఁ,దపశ్శాలికానివాఁ డట్టియుపదేశమున కర్హుఁడు గాఁడనియు నీపద్యమువలన గ్రహింపవలసిన నీతి.

రామాయణమున గాయత్రి యిముడ్పఁబడి యుండుటచే గాయత్రి సవిత్రృ ప్రతిపాదికగావున నీగ్రంథము తద్వంశప్రతిపాదకము కావున గాయత్రిచే విస్త రింపఁబడిన దందురు. ఈవిషయము శ్రీభాగవత విషయమునఁ జెప్ప సాధ్య పడునా ? యని సందేహము.

అలంకారములు.

కావ్యములం దలంకారములు రెండువిధములు - శబ్దాలంకారములు - అర్థాలం కారములు అని. శబ్దములందు విచిత్రముకానవచ్చిన శబ్దాలంకారము. అర్థము నందుఁజిత్రము కానవచ్చిన నర్థాలంకారము. ఈపద్యమున నకారపకారముల కా వృత్తియుండుటఁజేసి వృత్త్యనుప్రాస మను శబ్దాలంకారము గలదు. ఒకయక్ష రము పలుమారులు వచ్చుటకే యావృత్తి యనిపేరు. సి పదములు హేతుగర్భ ములు గావునఁ బరికర మను నర్థాలంకారము. తపఃస్వాధ్యాయంబున నిపుణుని నిత్యాదివిశేషణములు శిష్యుఁడు ప్రశ్నింప నర్హుఁ నాచార్యలక్షణము దెలుపునుగావునఁ బదార్థహేతుకకావ్యలింగాలంకారము.

నారద వాల్మీకుల స్వరూపములఁ జెప్పుటచే లోకమున శిష్యాచార్యు లుండఁ దగినస్వరూపము దెలియును గావున వాక్యగతవస్తువుచేత వస్తుధ్వని.

ఛందస్సు.

ఇది కందపద్యము. నలము - గగము - భగణము - జగణము - సగణము అను నీనైదుగణములు తప్ప నితరగణములు రావు. నీనిలో మూఁడుగణములచే మొదటపాదము మూఁడవపాద మేర్పడును. ఏదేసి గణములచే రెండవ నాల్గవ పాదము లేర్పడును. ఈ రెండుచిన్నపాదములయందును యతిలేదు. బేసిని జగణ ముండదు. ఆఱవగణము నలముగనైనను జగణముగనైన నుండవలయును. గణముల నెంచునపుడు మొదటిరెండుపాదములనొకటిగఁ దక్కిన రెంటి నొకటిగ నెంచవలయును. కావున నుత్తరార్థమునఁ దపస్వి యను జగణము నాలుగవ

గణమగును, గావునఁ దోషములేదు. రెండవపాదము నాల్గవపాదము కడపట గురు వుండవలయును.

వ్యా క ర ణ ము.

తపమున స్వాధ్యాయంబున - వేదముయొక్క జపము అను నర్థంబున షష్ఠీ తత్పురుషసమాసము. షష్ఠీతత్పురుషంబులందు న గాగమంబు విభాషనగు (ప్రౌ. వ్యా. సమా. ౧.) నను వ్యాకరణసూత్రముచే "యోగక్షేమమున తెలుఁగు" భార-ఉద్యో'౧-ఆ, ఎలజవ్వనంబున విలసనంబు-భార-ఆది 3 ఆ. 'అరదంబున యురవడికిఁ. నిర్వ-౬-ఆ-' అను ప్రయోగములందువలె నకారాగమము. తపమున అనుచో నకారము "యొక్క" అను నర్థమున వచ్చెను. 'వాల్మీకో వాల్మికః ప్రోక్తో, వాల్మీకి రపి వాల్మికి' యని శ్రీహర్షుని ద్విరూపకోశము. వాల్మీకుఁడు వాల్మికుఁడు వాల్మీకి వాల్మికి యని రూపాంతరములు.

సాం ఖ్య ము.

వాల్మీకిరామాయణమునఁ బ్రథమశ్లోకాక్షరముల సంఖ్యలఁగూడిన ౧౦౦ అగుటయుఁ బ్రథమసర్గమున ౧౦౦ శ్లోకములే యుండుటయుఁ బూర్వపీఠిక యందుఁ జెప్పఁబడెను.

౬ ౧ ౭ ౦ ౨౪ ౯ ౧ ౧ ౩ ౦ = ౩౨

క॥ త ప ము న స్వా ధ్యా యం బు న

౦ ౧ ౫ ౦ ౪ ౩౪ ౮౪ ౨౫౧ ౦ ౨ ౩ ౫ ౦౮ ౦ = ౫౫

ని పు ణు ని వా గ్వి ద్వ రే ణ్యు ని ఖి ల ము ని జ నా

౯ ౧ ౦ ౨ ౮ ౨ ౧౨౫ ౫ = ౪౦

ధి పు నా ర దు సం ప్ర శ్న ము

౬ ౧ ౨౪ ౪ ౩౫౧ ౧ ౧౧౬ ౫ ౩ ౪ ౬ = ౫౮

త ప స్వి వా ల్మీ కి యి ట్లు త మిఁ గా విం చెఁ.

౧౯౦

సాంఖ్యశాస్త్రప్రకారం బీ పద్యాక్షరసంఖ్య ౧౯౦ యగుచున్నది. ఈపద్యము మొదలు ౧౮౫ పద్యమువఱకుఁగల వాక్యములును ౧౯౦ అగుచున్నవి. ఈపద్యములకే సంక్షేపరామాయణమని పేరు. ఇందు సంయుక్తాక్షరములు రెంటికిని సంఖ్యలు గ్రాహ్యము. వాక్యమన్నచోట "నస్యా ద్వాక్యవిరామేతు" అను **సూత్రమందలి వాక్యార్థ** మిట ననుసంధించునది.

తకారము వర్ణసమామ్నాయమందలి ౧౬ వ యక్షరములు. త = ౧౬ = ౧ + ౬ = ౭ సప్తసంఖ్య ప్రణవసూచకము అటుగాక తప యని రెండక్షరములు గ్రహించినను 'వర్ణానాం వామతో గతి' యనుసూత్రప్రకారము ౧౬ అగుచున్నది.

నారద పూర్వచరిత్రము.

శ్రీభాగవతము సప్తమస్కంధము ౪౭౨ - ౪౭౬ వ॥ వినుము పోయినమహా కల్పంబునందు గంధర్వులలోన నుపబర్హణుం డనుపేర గంధర్వుండనై నేను సౌందర్య మాధుర్య గాంభీర్యాది గుణంబుల సుందరులకుఁ బ్రియుండనై క్రీడించుచు నొక్కనాఁడు విశ్వస్రష్టలైన బ్రహ్మలు దేవసత్త్ర మనెడియాగంబులోన నారాయణకథలు గానంబు సేయుకొఱకు నప్సరోజనులను గంధర్వులనుం బిలిచిన

ఆ॥ క్రతువులోన నేను గంధర్వగణముతోఁ । గలిసి పోయి విష్ణుగాథ లచటఁ
గొన్ని పాడి సతులఁగూడి మోహితుఁడనై । తలఁగి చనితి నంత ధరణినాథ!

కం॥ వారిజగంధులపొత్తున । వారిం గైకొనక తలఁగి వచ్చినబుద్ధిన్
వా రెఱిఁగి శాపమిచ్చిరి । వారింపఁగరాని రోషవశమున నధిపా!

ఆ॥ పంకజాక్షు నిచటఁ బాడక కామినీ । గణముఁగూడి చనిన కల్మషమున
దగ్ధకాంతి వగుచు ధరణీతలంబున, । శూద్రజాతిసతికి సుతుఁడ వగుము.

వ॥ అనియిట్లు విశ్వస్రష్టలు శపించిన నొకబ్రాహ్మణదాసికిఁ బుత్త్రుండనై జన్మించి, యందు బ్రహ్మవాదులయిన పెద్దలకు శుశ్రూష సేసినభాగ్యంబున నిమ్మహాకల్పంబునందు బ్రహ్మపుత్త్రుండనై జన్మించితి. మీఁదిశాపప్రకారము శూద్రకు సుతుఁడై జన్మించినచరిత్రము వ్యాసులకు నారదుఁ డిట్లు చెప్పెను. శ్రీభాగవతము ప్రథమస్కంధము. ఇదియును బూర్వకల్పవృత్తాంతమే. "పూర్వకల్పంబునం దొల్లిటిజన్మంబున వేదవాదుల యింటిదాసికిం బుట్టి పిన్ననాఁడు వారలచేఁ బనుపంబడి యొక్కవానకాలంబున యోగిజనంబులకుఁ బరిచర్య సేయుచుండ వారు భగవచ్చరిత్రములు పాడఁగా వర్ణింపఁగా దానియందు మక్కువ యెక్కువయయ్యె. ఆహరిసేవారతిం జేసి భక్తి జనించె. ఆభక్తికి సంతోషించి యామునులు భగవత్తత్త్వము నుపదేశించిరి. దానివలన హరివిషయమున విజ్ఞానంబుగలిగె. ఇట్లు తల్లియందలి ప్రీతిచేఁ దల్లితోడనింట నుండి యామెతోపాటు సేవ సేయుచుండె.

ఇట్లుండఁ దల్లి సర్పదష్టయై మరణించె. అంతట నతండు బంధము వీడెనని సంతోషించి యిల్లు విడిచిబయలుదేఱి యుత్తరాభిముఖుండై పోయి పోయి యొక యేటియొడ్డున రావిమ్రానియొద్దఁ గూర్చుండి మునులు తన కుపదేశించిన విధముగ హరిని ధ్యానించెను. ఇట్లు ధ్యానించునాయనకు హృదయమునందు భగవద్దివ్యరూపంబు గానవచ్చెను. ఆసంతోషాతిశయంబున దిగ్గన లేవఁగా నా స్వరూ

పంబు వెలుపలఁగానరాదయ్యె. మరల దానిని జూడఁగోరి యాతురుండై తపించుచుండ భగవంతుండు కానరాక ధ్వనిమాత్రము వినవచ్చున ట్లిట్లు పలికెను. 'కుమారా! నాస్వరూపము చూడఁగోరి యేల వ్యథపడెదవు? నాస్వరూపము కామాదుల నాఱిఁటిని బూర్ణముగ జయించినయోగికాని యితరులు చూడఁజాలరు. నీవొక్కసారియైన గానరాకున్న నిరుత్సాహపడెద వని నీకుత్సాహంబుఁగలిగింపఁ గానవచ్చితి. నీ విట్టులే నాభక్తిగలవాఁడవై వర్తింపుము. ఈదేహంబు నీవు విడిచి రాఁగల ప్రళయానంతరమందలి యుగంబున నాయనుమతిచే భాగవతుండవై బ్రహ్మపుత్త్రుండవు కాఁగల వని చెప్పెను. ఆవరము ప్రకార మీ కల్పంబున బ్రహ్మపుత్త్రుండై నారదుం డొప్పె.

వాల్మీకి చరిత్రము.

శ్రీసీతారామలక్ష్మణులు చిత్రకూటంబున వాల్మీకిని దర్శించినపు డాయనయే తనవృత్తాంతము నిట్లు శ్రీరాములతోఁ జెప్పెను. అధ్యాత్మరామాయణమం దేశ్లోకము లున్నవో యాశ్లోకములే యానందరామాయణమునను (రాజ్యకాండ ౨౪ స॥ గలవు. ముం దేదిపుట్టెనో వెనుక నేదిపుట్టెనో ఆ శ్లోకార్థ మిందు వ్రాయఁబడును.

రామా! నేను బూర్వమందుఁ గిరాతులందుఁ గిరాతులచేఁ బెంపఁబడితిని. జన్మమున బ్రాహ్మణుండనైనను నాచారమున శూద్రుఁడనైతిని. నేను మనస్సు జయింపఁజాలక శూద్రియందుఁ బెక్కురుపుత్త్రులఁ గడసితిని. ఆవల దొంగలలోఁ గలసి నేను దొంగనైతిని. ధనర్బాణములధరించి నేను జీవజంతువులపాలికి యమునివంటి వాఁడనైతిని. ఒకనాఁడు జ్వలించుచున్న నగ్నివంటి తేజస్సుగల సప్తఋషు లాభయంకరకాననంబున నాకు గోచరించిరి. వారివస్తువులు గ్రహింపఁగోరి నిలుఁడు నిలుఁ డనియఱచుచు వారివెంటఁ బరువెత్తితిని. ఆమునులు నన్నుఁ జూచి 'యోనీచబ్రాహ్మణుఁడా! యేలరా! వచ్చితి' వని ప్రశ్నించిరి. వారితో నేను 'మునిసత్తములారా! నాదారపుత్త్రాదులు పెక్కురు గలరు. వారాఁకలిగొనియున్నారు. వారి సంరక్షణార్థమై యీకొండలలో నడవులలోఁ దిరుగుచున్నాను. మీయొద్దనుండునది సంగ్రహించికొనిపోవుటకై వచ్చితిని' అంటిని. అప్పుడు వారు నన్నుఁ జూచి "యోరీ నీవింటికిఁ బోయి నీవారినందఱను వేఱు వేఱుగా 'మీసంరక్షణార్థమై నేను దినదినమిన్ని పాపములుచేయుచున్నానుగదా! ఈపాపమందు మీకు భాగముకలదా లేదా' యని యడుగుము. నీవిచ్చటకు మరల వచ్చువఱకు నిజముగా నిందేయుందుము. నీవు సందేహింపకుము. బ్రహ్మహత్యచేసినవాఁడు - కల్లు సారాయము త్రావినవాఁడు - బంగారు దొంగిలించినవాఁడు - గురుభార్యనుబొందినవాఁడు - బ్రాహ్మణులసొమ్ము నపహరించినవాఁడు -

వీరలతో సాంగత్యముఁ జేసినవాఁడు నే పాపగతికిఁ బోవునో మేమిందుండి తరలిపోయితిమేని మా కాగతులు గలుగునుగాక" యని శపథముచేసిరి. ఇట్లు శపథముచేయఁగా వారిని నమ్మి యింటికిఁ బోయి మునులు చెప్పిన ప్రకారము నాభార్యను గొడుకులను నడిగితిని. వా రందఱు 'నీవు తెచ్చిన వస్తువుల ననుభవించువారమే కాని నీ పాపముతో మా కేమి సంబంధము? అది నీదే' యనిరి. ఆ మాటలు విని మనస్సునఁ బరితాప [illegible] గరుణాపూర్ణాత్ములయిన యామును లుండుచోటికి వచ్చి యామునులదర్శనముచేత నే నంతఃకరణము శుద్ధముకాఁగా విల్లు మొదలయినవానిని బాఱవైచి వారి పాదములపై దండమునఁ బడి మునీశ్వరులారా! నరకమునఁ గూలిన నన్ను రక్షింపుఁడీ యని ప్రార్థించితిని. వారు నాయందుఁ గనికరించి 'యోరీ! లెమ్ము! సాధుసమాగమము వ్యర్థము కాదు. ఫలవంత మగును. నీకుఁ గొంచె ముపదేశించెదము. దానివలన ముక్తుఁడ వగుదువు' అని వారిలో వా రాలోచించి 'యీ బ్రాహ్మణాధముఁడు చెడునడవడి గలవాఁడు. వీని నుపేక్షించుటే తగును. అయినను వీఁడు మనకు శరణాగతుఁడు. కావున నే ప్రయత్నముచేనైన వీనికి మోక్షమార్గ ముపదేశించి రక్షించుట తగిన కార్యము' అని, రామ! నీ నామమును వారు నాయందు దయగలవా రగుటచేఁ దలక్రిందుగ నుపదేశించిరి. 'ఓరీ! నీ విచ్చటనే యేకాగ్రమనస్సుతో మరా మరా యని యెల్లవేళల విడువక జపించుచుండుము. మేము మరల వచ్చెదము. అంతవఱకు సర్వదా జపింపుము' అని చెప్పి దివ్యదర్శనులైన మునులు వెడలిపోయిరి. నేనును వా రుపదేశించిన ప్రకారము బాహ్యమును మఱచి యేకాగ్రమనస్సుతో జపించుచుంటిని. సాక్షినిమిత్తమై యిచ్చట నొక దండము నాటితిని. ఇట్లు సర్వసంగవిహీనుఁడనై నిశ్చలుఁడనై దీర్ఘకాలము జపించితిని. అంతట నాపైఁ బుట్ట పెరిగెను. నాతపోబలముచే నేను నాటినదండమే వృక్ష మయ్యెను. ఇట్లు సహస్రయుగములు గడువఁగా ఋషులు మరల వచ్చి లేచి రమ్మని పిలిచిరి. నేనును శీఘ్రముగ లేచి వచ్చితిని. మంచు విరియించి తోఁచు సూర్యునివలెఁ బుట్టలోనుండి నేను వెలికిరాఁగా వారు 'మునీశ్వర! వాల్మికీ!' యని పిలిచి నీవు పుట్టయందు సంభవించితి గావున నీ కిది రెండవజన్మ మనిరి." ఈ ప్రకారము వాల్మికి శ్రీరాములకుఁ జెప్పెను. ఆనందరామాయణమున మఱియొకవిశేషము గలదు. కృణుఁ డను ఋషీశ్వరుఁడు సరోవతీరమున నాహారము వర్జించి యూర్ధ్వరేతస్కుండై దీర్ఘకాలము తపస్సుచేసి కన్నులు తెఱవఁగా నాయన కన్నులనుండి రేతస్సు స్రవించెను. దానిని ఋతుకాలంబున నొక యాఁడుపాము మ్రింగెను. దానికి జనించి యడవిలోఁ బడియుండఁగాఁ గిరాతులు సాకి రని యందున్నది. ఈ శిశువే వాల్మీకి.

సీ॥ ఎవ్వఁ డీధారిణి • నీకాలమున గుణ,వంతుండు నతివీర్య•వంతుఁ డెవఁడు
ధర్మజ్ఞుఁ డెవఁడు కృ•తజ్ఞుండు నెవ్వఁడు, నిజమరియును దృఢ•నిష్ఠుఁ డెవఁడు
సంతతానుష్ఠిత•చారిత్రుఁ డెవ్వఁడు, సర్వభూతహితార్థ•పరగు నెవ్వఁ
డెవ్వఁడు విద్వాంసుఁ • డెవఁడు సమర్థుండు, తతసదైకప్రియ•దర్శనుండు

ఆ॥ నెవ్వఁ డాత్మవంతుఁ•డెవఁడు జితక్రోధుఁ,డెవఁడు కాంతియుక్తుఁ • డెవఁ డసూయ
లేనివాఁడు కలన • లీల నెవ్వం డూన,నాగ్రహంబు వణఁకు • నమరతతియు. ౯౦

ప్ర తి ప దా ర్థ ము.

ఈధారిణిక్ = ఈభూలోకమునందు, ఈకాలమునక్ = ఇప్పుడు - మన సంభాషణసమయమందు - ఈభూలోకమున ననుటచే వైకుంఠముననుండు విష్ణువునుగుఱించి నే నడుగలేదు. ఈకాలమున ననుటచేఁ బూర్వకాలము నందలి నృసింహాద్యవతారముల గుఱించియు నే నడుగలేదని భావము.

ఈలోకమున నీకాలమున గుణవంతుఁ డెవ్వఁ డనక యెవ్వఁ డనునది తొలుతనే ప్రయోగించుట ప్రశ్నగౌరవపురుషవైలక్షణ్యము తెలుపుటకే. గుణము మొదటఁ జెప్పియుండిన గుణములకుఁ బ్రాధాన్య మిచ్చినట్టు లగును. ఎవ్వఁ డనుటచేఁ బురుషునకుఁ బ్రాధాన్య మిచ్చినట్టు లయ్యె. ఎవ్వఁడు లేకుండిన నీగుణములన్నియుఁ జెట్టువిడిచిన పక్షులవలె నిలువ నెలవులేక దిక్కుగానక యల్లాడుచుండు నని భావము. ఇట్టిపురుషుఁడు బంగారుతామరపువ్వువలె లోకవిలక్షణుఁ డనియుఁ దెలుపుటకే యెవ్వఁ డని తొలుతనే ప్రయుక్తంబయ్యె. ఎంతవెలగల మాణిక్యమైనను బంగారునందుఁ బొదిగిన నెక్కువగఁ బ్రకాశించును ("అనర్ఘ మపి మాణిక్యం, హేమాశ్రయ మపేక్షతే") గాని యూరకుంచినను బొగ్గులోఁ బొదిగినను బ్రకాశింపదు. 'నీచాశ్రయో నకర్తవ్యః, కర్తవ్యో మహదాశ్రయ' యని కలదుకదా. అట్టులే కల్యాణగుణములెల్లఁ దమ శోభకై భగవంతు శ్రీరాము నాశ్రయించినవి.

గుణవంతుఁడును = (1) సమస్తకల్యాణగుణములే కలవాఁడు. 'గుణవంతుం డతి వీర్యవంతుం' డనక 'గుణవంతుఁడును' అని మొదటనే చెప్పనేల యనిన? 'ఉను' అనునది సంస్కృతమునందలి 'చ'వంటిది. దానివలె నిది నానార్థములఁ బ్రయోగింపఁబడును. ఇచట ఏవకారార్థంబునఁ బ్రయోగింపఁబడినది. మామిడి తోఁపు అన్నప్పుడు మామిడితోఁపునందుఁ మామిడిచెట్లు విశేషించి యున్న వని యర్థమేకాని యితరజాతిచెట్లు ఒకటైన లేవని యర్థము కాదు. ఇట్టులే అశోకవనము. అట్టులే గుణవంతుఁ డన్నప్పుడు అన్నియు సద్గుణములేకాక యొక దుర్గుణమైన నుండు నని యూహింపవచ్చును. అట్టి సందేహమును దొలఁగింప సద్గుణములను మాత్రమే కలవాఁ డని యర్థము స్ఫురింపఁజేయ 'గుణ

వంతుఁడును అని చెప్పఁబడెను. ఈయర్థమందే 'కోన్వస్మిన్ లోకే' యని మూలమునను బ్రయోగింపఁబడినది. అవ్యయ మనేకార్థములు గల దని ప్రమాణము గలదుగదా. దీనివలన హేయగుణరహితుఁడు కల్యాణగుణసహితుఁడు నెవ్వఁడని ప్రశ్నభావము. ఇచ్చట వంతుఁ డనునది నిత్యసంయోగమును దెలుపు మతుప్ప్రత్యయము. - ధర్మరాజొకయసత్యమాడినట్లు లోకమున నొకనియందు నేకాలమందైన దుర్గుణ మొకటియైనఁ గానవచ్చును. రాముఁ డట్టివాఁడు గాఁడనియుఁ గల్యాణగుణము లేకాలమం దేదేశమం దే స్థితియందుఁ గాని (నిత్యవిభూతియందుఁగాని లీలావిభూతియందుఁగాని) విడనాడక యంతయేయుండు నని భావము.

ప్రప్రథమమందే యెవ్వఁడు గుణవంతుఁ డని ప్రశ్నించుటచే నిర్గుణబ్రహ్మమునకు రామాయణమందు నిలువ నెలవు సెలవు లే దని యేర్పడుచున్నది. నిర్గుణబ్రహ్మ మనుటకు రెం డర్థములు కలవు ౧ గుణాభావమైన బ్రహ్మము. ౨ గుణప్రకోపములేని బ్రహ్మము. రామాయణ మీ బ్రహ్మములవిషయముకాదు. ఇట్లే యిందుఁ దక్కనవిశేషముల నన్వయింపవలయును. వీర్యవంతుఁ డెవఁడను చో 'ను' లుప్తము. రాముఁడును లక్ష్మణుఁడును వచ్చిరి యనుచో రాముఁడు లక్ష్మణుఁడు వచ్చిరనునట్లు. ఇట్లు సామాన్యముగఁ బ్రశ్నించి ప్రత్యేకించి యొక్కొక్క గుణమును బ్రశ్నించుచున్నాఁడు. కావున మీఁదఁ బేర్కొనఁగలవాని కది యవతారిక, (2) ఆశ్రితులు పలుమారు దేనిని గణింతురో యా గుణము- సౌశీల్యము. దానిని గలవాఁడు గుణవంతుఁడు, తా నెంత గొప్పవాఁడైనను తన గొప్పతనము తలఁచుకొని యహంకరింపక తక్కువవారలతో నైనను [illegible] భేదభావములేక కలసిమెలసియుండు గుణము సౌశీల్యము. ఆ శ్రేష్ఠగుణముకలవాఁ డెవ్వఁ డని ప్రశ్న. భగవంతుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తుఁడు మహాత్ములలో నెల్ల మహిష్ఠుఁడై యుండియు మహాపాపము లొనర్చి హేయపదార్థములం దుండు జీవుల నుద్ధరింప వానియందుఁ బ్రవేశించి నరకములందును వారివెంట నంటి యుండునుగదా. అట్లులే శ్రీరాముఁడు మహారాజకుమారుఁడై యుండియు గుహుఁడు మొదలగు బోయలతోను, శబరి యువ్వ మొదలగు వృద్ధలతోను, వానరులగు మృగములతోను గలసిమెలసి తిరుగుటయేగాక కౌమారదశయందును, నయోధ్యలో నెవరింటనైన యజ్ఞమో పెండ్లియో యేదైన శుభకార్యమో జరుగుచుండెనేని వారు పిలిచినను పిలువకున్నను తానైపోయి యాకార్యము చక్కఁగ నెఱవేర్చి వచ్చుచుండెనని యయోధ్యాకాండమున ముందు చెప్పఁబడును. ఎవ్వఁడు గుణవంతుఁడు వీర్యవంతుఁడు నని యడిగినఁ జాలదా ? పలుమారు ఎవ్వఁడెవ్వఁడని చెప్పుట యేలయన నాదరాతిశయము చేతనేకాక పదిలోఁ బదునొకండుగఁ గాక ప్రతిగుణమును నొక్కిచెప్పుటకే.

ఈ యర్థమునందే 'వశీ వదాన్యో గుణవా నృజుశ్శుచి' యని స్తోత్రరత్నంబునఁ బ్రయోగింపఁబడినది. ఒక్కొక్క గుణమునే ప్రత్యేక ప్రత్యేకముగ నడుగఁబోవుచు నీసామాన్యప్రశ్నముచేయుట వ్యర్థముగాదా యందురేని కాదు. మొట్టమొదట నాప్రశ్నవేయుట యేలన, గుణవంతుఁడని యెప్పుడు చెప్పెనో ఆకారవంతుఁడని యప్పుడే యంగీకరింపఁబడెను. గుణి గుణముల కవినాభావసంబంధము. కావున భిన్నకాలములయందుఁ బరిశోధించి తెలియవలసిన గుణములుగాక రూపము చూడఁగానే యీయన గుణవంతుఁడని లోకుల కెట్టివారికైనఁ దోఁచెడువాఁ డని యర్థము.

౨. అతివీర్యవంతుఁడు = మిక్కిలి వీర్యము గలవాఁడు. వీర్యము (1) తాను వికారపడక పరులను వికారింపఁజేయుశక్తి. (2) వీర్యవంతమైన యౌషధమున్నట్లు, తాను వికారపడ హేతువు లున్నను నట్లు కాకుండుట. గొప్పవాఁడైనను గాకున్నను బలహీనుఁడును గుణవంతుఁడుగా నుండవచ్చునుగదా, యను సందేహము దీర వీర్యవంతుఁ డెవఁ డని ప్రశ్న. వీర్యవంతుఁ డయినను దన యక్కఱ యవసరములఁ దక్కువవారితోఁ గలసి యుండవచ్చునను సందేహముదీర ధర్మబుద్ధి నట్లుచేయువాఁడుగా నుండవలయునుగాని స్వప్రయోజనార్థముగా నుండఁగూడదనుటకై ధర్మజ్ఞుఁ డెవఁ డని ప్రశ్నించుచున్నాఁడు.

శ్రీరాముఁడు తనకార్యము సాధించుకొనుటకు వానరులతో స్నేహము చేసెనుగాని ధర్మబుద్ధితోనా యను సందేహము కలుగవచ్చును. అది నిరాధారము. ఎట్లన.- కం॥ ఈ నిఖిలావని యక్షుల, దానవరక్షఃపిశాచతతులను వలతేఁ, భానుజ! యంగుళికొనచే, నే నిమిషములోనఁ జిమ్మనే మిత్రీఁ గనన్. యుద్ధ 32౯. ఇంతటి వీర్యవంతుఁడు లక్ష్మణసహాయుఁ డయ్యుఁ దన కార్యము తాను జేసికొనలేక వానరసాహాయ్యముఁ గోరినవాఁడు కాఁడు. ఈ యర్థమునే సుగ్రీవునకు హనుమంతుఁ డుపదేశించెను. - కిష్కింధా-22౫ వ ప.
"ఉ॥ నీవిల బొనకైచనక నిల్చినయంతనె రాముకార్యమున్, బోవునె రిత్తయై నిశితభూరిశరావళిచే మనుష్యభు గ్దైవతపన్నగావళులఁ దక్షణమాత్రన పిల్లుమార్పఁగాఁ, జేవగలండు, నీప్రతిన చేయుటయెట్టిదొ చూడఁదాకొడిన్."అట్టైన వానరసాహాయ్య మేల కోరెనందు రేని వారిచే సేవచేయించుకొని యానెపమున వారికి మోక్ష మిచ్చుటకే యని యెఱుంగవలయును. గీ॥ ఆదిదేవుఁడైన యీ రామచంద్రుని, కర్థిఁగట్టు లెంక యనుసుకోటిఁ, జంపు లెంత కపుల సాహాయ్య మదియెంత, సురలకొఱకుఁ గ్రీడసూపెఁగాక॥ శ్రీభాగవతము- స్క ౯, ప. 3౫౯. 'సవీర్య మతిశక్తిభాక్' - అమరకోశము. అత్యంతశక్తిమంతుఁడైన వీరునియందుం డుత్సాహగుణము వీర్యము. వీరులు మఱి రెండు తెగలు

దానవీరు లని, దయావీరు లని. ఇచ్చట నిట్టి దని నిర్ధారింపకపోవుటచే రెండును గ్రాహ్యములే. తక్కిన వేవియుండినను లేకుండినను నివి రెండు లేనివాఁడు గుణవంతుఁ డనిపించుకొనఁజాలఁడు. కావున వెంటనే వీర్యవంతుఁ డని ప్రశ్న. ఆశ్రితరక్షణమునకుఁ గావలసిన ముఖ్యగుణము లీరెండు గలవు. కావుననే భగవంతుఁడు సేవ్యుఁ డయ్యెను.

వీర్యవంతుఁ డనటచే నీయన నామాక్షరములు రెండును వీర్యవంతములే యని భావము. రామనామమేకదా తారక మని ప్రసిద్ధి. శివనారాయణశబ్దములు వీర్యవంతములు గావాయందు రేని యగునగాక. ప్రణవాది బీజాక్షరసంయోగము లేక వానికి మంత్రత్వప్రాప్తి లేదు. రామనామమో బీజాక్షరసంయోగము లేకున్నను మంత్ర మగును. ఏల? రామనామమే ప్రణవము కావునఁ బ్రణవసంయోగము దానికనావశ్యకము. "ముముక్షూణాం విరక్తానాం, తథాచాశ్రమవాసినామ్ । ప్రణవత్వాత్సదా ధ్యేయో, యతీనాంచ విశేషతః । రామమంత్రార్థవిజ్ఞానీ, జీవన్ముక్తో నసంశయః" - రామరహస్యోపనిషత్తు. మోక్షమందాసక్తి గలవారికి, విరక్తులకు, సన్యాసులకు రామనామము ప్రణవమగుటచే నెల్లప్పుడు ధ్యానింపఁదగినది. రామమంత్రార్థ మెఱిఁగినవాఁడే జీవన్ముక్తుఁడు. "ఏకాక్షరో మనుః ప్రోక్తో మంత్రరాజః సురద్రుమః కేవలం మోక్షకాంక్షయా, చింతయన్ పరమాత్మానం, ద్వాదశలక్షం జపేన్మనుం ॥" ఏకాక్షర రామమంత్ర ముపాసకులకుఁ గల్పవృక్షము. కేవలమోక్షకాంక్ష గలవారు పరమాత్మను జింతించుచు ౧౨ లక్షలు దానిని జపించవలెను. "ద్వ్యక్షరో మంత్రరాజోఽయం సర్వాభీష్టప్రదస్తతః" రెండక్షరముల రామమంత్రము సర్వాభీష్టముల భుక్తిముక్తుల రెంటి నిచ్చును. "రామో భుక్తిముక్తిఫలప్రదః" -రామరహస్యోపనిషత్తు. 'రామేతి ద్వ్యక్షరంనామ మానభంగః పినాకిన" యని సంప్రదాయజ్ఞులు చెప్పుదురుగదా.

విష్ణుసహస్రనామములకు రామనామము తుల్యమని శివుఁడే పార్వతి కుపదేశించెనుగదా. కావున నిట్టి వీర్యవంతమయిన నామము గలవాఁడని యర్థము.

3. ధర్మజ్ఞుఁడు = ధర్మముల నాచరించునట్లు తెలిసినవాఁడు- ధర్మము పరలోకమునందలి సుఖమునకు హేతువు. అది సామాన్య మని విశేష మని ద్వివిధ మని పూర్వము చెప్పఁబడెను. దాని నెఱుఁగువాఁడు ధర్మజ్ఞుఁడు. పరిత్యజింపవలసిన ధర్మములు దెలిసినవాఁడనియు నీపద తాత్పర్యము. ధర్మాధర్మములు తెలిసినంతమాత్రమునఁ బ్రయోజనమేమి? ఆచరణమం దుంచుకొన్నవాఁడుగా నుండవలయునని కృతజ్ఞుం డెవ్వఁ డని యడుగుచున్నాఁడు.

౪. కృతజ్ఞుఁడు = ఉపకార మెఱిఁగినవాఁడు - పరులు తనకుఁజేసినయుపకార మల్పమైనను బ్రాసంగిక మైనను దానిని గొప్పగ నెంచి జ్ఞప్తియం దుంచుకొను వాఁడు. అపకారము స్మరింపనివాఁ డని 'ను' అను సముచ్చయము తెలుపును. భగవంతునిపట్ల మనముచేయు నపకారములకు మనల నాయన శిక్షింపఁబూనిన మనగతియేమో? "కం॥ ఉపకార మేమి పని కే । నెపుడే నించుక యొనర్ప నెలమిఁగన, సదా । యపకారశతము సల్పిన । విపరీతము లెంచఁ డాత్మవిజ్ఞుం డగుటన్॥"- అయోధ్య. ౧౧. భగవంతుఁడు సర్వేశ్వరుఁ డవాప్తసమస్తకాముఁడు కదా. ఆయనకు మనము చేయవలసిన యుపకార మేమి? అది లేనప్పు డాయన కృతజ్ఞుఁ డెట్లగును? అని ప్రశ్నము. భగవంతునకు మనము చేయు నుపకార మేదియు లేదు. ఆయన విషయమై మనము చేయునవన్నియు మనక్షేమమునకే. భగవత్కార్య మేదియుఁ జేయలేనివా రాయననామమును స్మరించుచుండినఁ జాలును. ఇట్లు స్మరించుచుంటిమేని అయ్యో! మననామమును వీఁడు స్మరించు చున్నాఁడే, మనవలన వీఁ డేప్రతిఫలమును గోరినవాఁడు కాఁడే, వీని ఋణము మన మెట్లు తీర్చుకొందుమా యని వేచియుండి ప్రాణాపాయము కలిగినపుడు మోక్షసుఖము నిచ్చును. ఈ యర్థమునే "శ్లో॥ సత్యం బ్రవీమి మనుజాః స్వయ మూర్ధ్వబాహుః । యో మాం ముకుంద నరసింహ జనార్దనేతి । జీవన్ జప త్యను దినం మరణే ఋణీవ । పాషాణకాష్ఠసదృశాయ దదామి ముక్తిమ్" - 'అహం స్మరామి మద్భక్త' మ్మను వాక్యములు ఘోషించెడిని.

౫. నిజమరి -(నిజము + అరి) = సత్యశీలుఁడు- మహాసంకటములందును నస త్యము పలుకనివాఁడు. (అరణ్య. ౧౩౬ ప. చూడుఁడు.) "కం॥ ఎన్నివిపత్తుల మునుఁగుచు । నున్నన్ వరధర్మలోప మొల్లమిఁ గల్లన్ । మున్నెన్నఁ డాడ నిఁక నే నెన్నం డాడంగఁబోవ నిది నిజమనఘా॥"- కిష్కింధ ౩౬౭. అన్నిటిలో సత్యము శ్రేష్ఠము గావున సత్యవాది యెవఁ డని ప్రశ్న.

౬. దృఢనిష్ఠుఁడు = నిశ్చలసంకల్పుఁడు. "కం॥ విడిచెదఁ బ్రాణములైనన్ । విడిచెద నిన్నైననఁ దమ్మునిన్ విడిచెద నేవిడుతు నె ప్రతిజ్ఞనందుం । బుడమిసురుల తోడఁ బల్కి ముగ్ధా యెపుడేన్."- అరణ్య. ౧౩౮. కృతజ్ఞుఁడైనను సత్యవాదియై నను జంచలచిత్తు నమ్మరాదు. గావున దృఢనిష్ఠుఁ డెవఁ డని ప్రశ్న.

౭. సంతతానుష్ఠితచారిత్రుఁడు = సదా సదాచారము మీఱనివాఁడు. శ్రీరా మచంద్రమూర్తి ప్రతిసంధ్యమున వేళకు సంధ్యావందన మాచరించుచుండె నని ముందుఁదెలియఁగలదు. చరిత్రము=ఆచారము;ఆచారమే ప్రథమధర్మము.'ఆచార ప్రభవో ధర్మః, ధర్మస్యప్రభు రచ్యుత' యని భారతము. చరిత్రమే- చారిత్ర మని స్వార్థిక ప్రత్యయము- రాక్షస వాయస పూరుష నారక శబ్దములవలె.

ప్రత్యేక ప్రత్యేకముగా నొక్కొకగుణ మడుగనేల యని ధర్మములందన్నిటి మొదటిదైన సదాచారమును గురించి ప్రశ్న. అది యుండిన సన్నియున్నట్లే. ఎంతటి సదాచారసంపన్నుఁడైనను సర్వభూతములయందును నేకాకారమైన హితబుద్ధిగలవాఁడు దుర్లభుఁడు. కావున నట్టివాఁడు గలఁడా యని ప్రశ్నించుచున్నాఁడు. ఆచారము లోనైనవి కాయికములు ఇది మానసికము. ఆత్మ విషయము.

౮. సర్వభూతహితార్థ జరిగునెవఁడు — సర్వభూత = సమస్త ప్రాణులకు, హిత = మేలుచేయుటకు, అర్థ = ప్రయత్నము, కోరికగలిగి, జరిగువాఁడు = వర్తించువాఁడు. భూతము లని చెప్పుటచే వీఁడు తనవాఁడని, వాఁడు పరుఁడని భేదబుద్ధి లేదని తెలుపుచున్నది. అపరాధము చేసినవారికిని మేలుచేయువాఁడని సర్వశబ్దతాత్పర్యము. శత్రువునితమ్ముని రక్షించు టేమిలెక్క? శత్రువైన రావణాసురుఁడు వచ్చినను రక్షించెదనని శ్రీరాముఁడు చెప్పెనుగదా. రావణాసురుని ప్రథమయుద్ధమునఁ దనచేతఁ జిక్కినవానిని జంపక విడిచెనుగదా. కాకాసురుని రక్షించెఁగదా. ఇట్టివాఁడు పామరుఁడుగా నుండరాదు. పండితుఁడుగా నుండవలయు నని తలఁచి విద్వాంసుఁ డెవఁ డని ప్రశ్నించుచున్నాఁడు.

౯. విద్వాంసుఁడు = సమస్తశాస్త్రములు దెలిసినవాఁడు. కొందఱు విద్యావంతులు లౌకికవ్యవహారమందసమర్థులై యుందురు. కావున సమర్థుఁ డెవఁ డని యడుగుచున్నాఁడు.

౧౦. సమర్థుఁడు = సమస్తకార్యములు తాను స్వయముగ నిర్వహించుకొనఁ జాలినవాఁడు. లౌకికవ్యవహారమునను బ్రజల రంజించుటయందును గల చాతుర్యము సామర్థ్యము- దానిని గలవాఁడు.

౧౧. తతసదైకప్రియదర్శనండు = ఎవ్వనిదర్శనము లోకులకు బ్రియమో వాఁడు ప్రియదర్శనుఁడు. సదా = ఎల్లప్పుడు, తత = విస్తారము. అట్టివాఁ డొక్కఁడే యగుఁవాఁడు. ఎవ్వఁడైన జరావ్యాధికారణముచేఁ బ్రియదర్శనుఁడు కాకపోవచ్చును. అటుగాక సర్వదా యతిశయించియుండు ప్రియదర్శనముగలవాఁడు. అట్టివాఁడు వాఁడుతప్ప వేఱొకరుఁ డుండరాదని భావము. (2) ఎవ్వనిదర్శనము ప్రియస్వభావము నొక్కటేకలదో యట్టివాఁడు ఏకప్రియదర్శనుఁడు. "తస్మాద్దుఃఖాత్మకం నాస్తి, నచ కించిత్సుఖాత్మకమ్" పూర్వము చెప్పిన కారణముచే "దుఃఖమే కలిగించు వస్తువుగాని సుఖమేకలిగించు వస్తువుగాని యొకటియైన లేదు." అన్నట్లు చందనకుసుమతాంబూలాదులగు ప్రియవస్తువు లన్నియు నొకప్పుడు సుఖము నిచ్చును. వేఱొకప్పుడు దుఃఖ మిచ్చును. ఒకరికి సుఖకరమైనది వేఱొకరికి దుఃఖకరముగా నుండును.

'ద్వి॥ పంచతన్మాత్రలవలనను బుట్టు, పంచేంద్రియమ్ములు నరుసగి విషయ, ములను గూడిన శీతమును వేఁడి సౌఖ్య, ములును దుఃఖంబులుఁ బొడముచునుండు, అవి యనిత్యంబులు సరుదెంచుఁ బోవు॥'—ద్వి. భ. గీ. అధ్యా. ౨. నాప్రశ్న యిట్టివానినిగూర్చి కాదని భావము. 'క్షణేక్షణే యన్నవతా ముపైతి, తదేవ రూపం రమణీయతాయాః' నిమిష నిమిషమునను క్రొత్తతనమును బొందు ననట యేదికలదో యాక్రొత్తయగుటయే అందమునకు స్వభావము. ప్రతి నిమిషమందును క్రొత్త క్రొత్తగాఁ బ్రీతిని గలిగించు సందమే యంద మనిభావము అన్నట్లు. సాకూ స్వస్థ మన్మథుఁ డైన యతని దర్శనము చేయువాఁడు ఇంకను దర్శనముచేయవలయునని కోరునేకాని యిఁకఁజాలు ననరా దని భావము. 'పుంసాం మోహనరూపాయ' పురుషులనుగూడ మోహింపఁజేయు సౌందర్య ముగలవాఁ డనికదా చెప్పఁబడెను. (అరణ్యకాండము ౯వ పద్యము చూడుు).

ఇట్టియందముగలవాఁడు కాముకుఁడుగ నుండరాదని యాత్మవంతుఁ డేవఁ డని యడుగుచున్నాడు.

౧౨. ఆత్మవంతుఁడు = తనకు స్వాధీనమైన మనస్సుగలవాఁడు 2. నిశ్చల ధైర్యవంతుఁడు.

౧౩. జితక్రోధుఁడు = (1) కోపమును స్వాధీనపఱుచుకొన్నవాఁడు. అపరాధములఁ జేసినవారియెడ నెంత కోపింపవలయునో యంతమాత్రమే యపరాధమునుబట్టి కోపించువాఁడు. నేరమునకు మించిన దండనము చేయఁడని భావము. 'క్రోధ మాహారయ త్తీవ్రన్' 'తెచ్చికొంచుఁ గినుకన్'. - అరణ్య - ౨౭౯ ప. తీవ్రకోపమును దెచ్చుకొనెను అని ముందు చెప్పఁబడును. జితక్రోధుఁడు = అరిషడ్వర్గముల జయించినవాఁడు.

౧౪. కాంతియుక్తుఁడు = ఆశ్చర్యకరమైన కాంతిగలవాఁడు క౦॥ ఆరాముని సంహననం। బారూపము సౌకుమార్య మా తేజంబున్ । శ్రీరమణీయ సువేషము । వారక కని యబ్రపడిరి వనసంవాసుల్ ॥ అరణ్య॥ ఉ॥ దేవకుమారరూపు వరదివ్య దలంకరణాభిరాము, సీతావిభు, నాదునందనుని, దాయఁగ వచ్చెడువానిఁజూచి లో। భావనచేసి పొంగిపడువాఁడ సముతుముఁ జూచినంతనే। యౌవన మప్పుడే యొదవిన ట్లగు నాకు ననర్ఘకారిణీ॥ అయోధ్య-౩౮౫.

౧౫. అనసూయుఁడు = పరులగుణములందు దోషబుద్ధి యసూయ, యది లేనివాఁడు.

౧౬. ఎవ్వఁ డాగ్రహమును గలన లీల నూన నమరతతియు వణఁకును = ఏపురుషుఁడు కోపమును యుద్ధరంగమందు వేడుకకై తెచ్చుకొనినను దేవతల గుంపుగూడ భయమున గడగడలాడును. అమరులు=దేవతలు - చావులేనివారు.

చావులేనివారుకూడ వడఁకునప్పుడు మర్త్యులమాటచెప్పనేల? దేవతలు వణఁకగా రాక్షసులమాట యేలయనిఁ కైముతికన్యాయమున సిద్ధము. కోపము శత్రువులగు రాక్షసులమీఁదనే కలిగినను దానిని జూచి మిత్రులగు దేవతలుకూడ భయపడుదు రనిభావము. అమరతతియు నను-చో సముచ్చయ మీయర్థము నిచ్చుచున్నది.

అని వాల్మీకి నారదుని ప్రశ్నించెను. ఇప్పుడు చెప్పినగుణములు సర్వసాధారణమైనవి కావున నిట్టి గుణములుగల రా జెవ్వఁ డని వాల్మీకి ప్రశ్నించినట్టును భగవద్విషయము గాదని యొకఁడు వ్రాసెను. అది సరిగాదు. ౙం దట్టిమాట లేదు. 'వీర్యవంతుఁడు' 'కలస నెవ్వఁ డాగ్రహించిన సమరతతియు వణఁకు' నివి క్షత్రియునిఁ దెలుపవా యనినిఁ బరశురామునివంటి బ్రాహ్మణులనుగూడఁ దెలుపును. ఈ ప్రశ్నలు ప్రాకృతమనుష్యమాత్రులగుఱించియే యందురేని యాకాలపు రాజులలో వాల్మీకి యెఱుఁగనివాఁ డెవఁడు? అట్టివానితోడ నాయన కేమిపని? అట్టి వానిని గుఱించి నారదు నడిగి తెలిసికొనవలయునా? త్రిలోకజ్ఞుఁడైన నారదు నట్టివాఁ డాలోచించిచెప్పవలయునా? నారదునివంటి భక్తాగ్రేసరుఁడు మెచ్చి సంతోషింపఁదగిన విషయము లిందేమి యున్నవి? బ్రహ్మాయంతటివాఁ డట్టి ప్రాకృతమనుష్యునిగూర్చి కావ్యము వ్రాయు మనిచెప్పునా? అట్టి కార్యమునకై వాగ్దేవి వచ్చి యాయన నోర నిలువవలయునా? కావ్యాలాపాంశ్చ వర్జయే' త్తను వేదానుశాసనము నుల్లంఘించి వాల్మీకి నరమాత్రుని చరిత్రము గ్రంథస్థముచేయునా? అట్టి నరమాత్రుని విష్ణువని చెప్పునా? అట్టివాని కథ మోక్షహేతు వనిచెప్పునా? అట్టివానిని బ్రహ్మరుద్రాదులు నీవే నారాయణమూర్తివి, సీత మహాలక్ష్మియని స్తుతించియుందురా? ఇత్యాద్యనేకకారణములచే సంతతాధ్యాత్మచింతాస్వాంతుండైన వాల్మీకి యడిగిన విషయములు మనుష్యుఁడుగా నవతరించిన భగవంతుని విషయమే యనుట నిస్సందేహము. సదైకప్రియదర్శనఁ డిత్యాదు లేప్రాకృతపురుషునియం దన్వయించును?

ప్రశ్నములు పదునాఱు. ఇది తపస్సంఖ్యాకము. ఈరాకారాత్రికాలములోఁ బదునాఱు కళలతోఁగూడినవాఁ డెవ్వఁడనినఁ జంద్రునిఁదప్ప వేఱొకనిఁ జెప్ప సాధ్యపడదు. పదునాఱు కళలతోఁ గూడినవాఁడు పూర్ణచంద్రుఁడైనట్టులీ పదునాఱు ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరముగ శ్రీరామచంద్రునిఁ దప్ప వేఱొకనిఁ జెప్ప సాధ్యపడదు. పదునాఱు కళలతోఁ గూడినవాఁడు పూర్ణచంద్రుఁడైనట్టులీ పదునాఱు ప్రశ్నలకు విషయమైన శ్రీరామమూర్తి పూర్ణావతార మని యేర్పడుచున్నది. శ్రీరాములవిషయమై తన యభిప్రాయము దృఢపఱుచుకొనుటకును భగవద్విషయము నుపదేశరూపముగ గ్రహించుటకై యీ పదునాఱుప్రశ్న లడుగఁబడెను.

గుణవంతుఁడనుట బాల్యమునందే గుహాది నీచజాతులవారితో సహవాసము చేయుట తెలుపును. వీర్యవంతుఁడనుట తాటకాసుబాహు లిమిధ్వజ వధమును దెలుపును. ధర్మజ్ఞుఁడనుట గురుజనకవాక్యము మీఱరాదని తాటకను జంపుటయు, జనకాజ్ఞలేక సీతను వివాహమాడనొల్లమినిఁ దెలుపును. (చూ-అయోధ్య-౨౧౮౮.) కృతజ్ఞుఁడు - తనమేలుగోరి దివ్యాస్త్రముల నుపదేశించిన విశ్వామిత్రుని బంధు వని స్మరించి, పరశురామునిఁ జంపక విడిచినవాఁడు. దీనిచే శ్రీరామచంద్రమూర్తి తనకు మేలుచేసినవారినేగాక వారివారినిఁగూడ రక్షించునని యేర్పడుచున్నది. భగవంతుఁడు తనభక్తునికి మోక్ష మిచ్చుటయేగాక యతని కాప్తులుగ నుండువారికిఁగూడ మోక్షమిచ్చునుగదా. ఇంతవఱకు బాలకాండకథ.

సత్యవాది, దృఢవ్రతుఁడు, సచ్చరిత్రుఁ డనునవి యయోధ్యాకాండ కథను దెలుపును. సచ్చరిత్రుఁడు, సర్వభూతహితుఁడు ననునవి కాకాసుర రక్షణమును దెలుపును విద్వాంసుఁడు, సమర్థుఁడు ననునవి హనుమత్సంభాషణము, వాలివధము లోనగు కిష్కింధాకాండకథను దెలుపును. ప్రియదర్శనుఁ డనునది సుందరకాండమున సీతాహనుమంతులు రామసౌందర్యము వర్ణించుట తెలుపును. ఆత్మవంతుఁ డనునది విభీషణ శరణాగతిఁ దెలుపును. జితక్రోధుఁ డనునది తనసేనను మాయచేఁ జంపు నింద్రజిత్తుపై నలుగకుండుటను, చేజిక్కిన రావణాసురుని జంపక విడుచుట దెలుపును. కాంతియుక్తుఁడు=శ్రీరాముని తేజస్సు చూచి రావణుఁడును నోటువడియెఁగదా. అసూయలేనివాఁడు = విరోధియైన రావణుఁగూడ రామచంద్రమూర్తి మెచ్చుకొనెఁగదా. యుద్ధమున భయంకరుఁ డనునది రామరావణయుద్ధమునాఁటిచర్యఁ దెలుపును. ఈగుణము లన్నియుఁ బుంజీభవించి భగవంతునియందుఁ దప్పఁ బూర్ణముల్తై మనుష్యునం దుండవు. కావున శ్రీరామచంద్రమూర్తియే సాక్షాద్భగవంతుఁ డని సిద్ధాంతమయ్యెను.

సాంఖ్యశాస్త్రప్రకారము తప యనఁగా ౧౬ అగుచున్నది. ఈశబ్దము తపమున స్వాధ్యాయంబున నిపుణ నని నారదునిపట్లను తపస్వియని వాల్మీకిపట్లను బ్రయోగింపఁబడుటయేగాక ప్రశ్నములు పదునారుగానుండుట చిత్రము. శ్రీభాగవతమున ౧ వ స్కంధమున ౬౨ వ పద్యమున 'మహదహంకార తన్మాత్రసంయుక్తుఁడై చారుషోడశకలాసహితుఁడగుచు' నని భగవంతునిఁగూర్చి చెప్పఁబడెను. కావున నీ పద్యము మనుష్యస్వరూపము ధరించిన భగవత్పర్యాయమే కాని కేవల మనుష్యపర్యాయము కాదు.

తా త్ప ర్య ము.

౧. ఈ భూలోకమందు నిప్పటికాలమున సమస్తకళ్యాణ గుణములుగల వాఁ డెవఁడు? ౨. ఎవఁ డెట్టిసందర్భమందును వికారపడుటకు హేతువు

లున్నను దాను వికారపడక యితరులను వికారపఱచుటయం దత్యంతము మనోబలము దేహబలము గలవాఁడు? ౩. ఎవఁ డనుష్ఠానమునకు సర్వజనులు తేఁదగిన సామాన్యధర్మముల లక్షణ మిట్టిది, యం దీవర్ణమువా రీయాశ్రమమువా రనుష్ఠింపవలసిన ధర్మము లివి, విశేష సందర్భములందు వానికి విరుద్ధముగ నడువఁదగిన విశేషధర్మము లివి, యాచరణమం దుంచుకోరాని యధర్మము లివి యని చక్కఁగా నెఱిఁగినవాఁడు? ౪. ఎవ్వఁడు తన కెవ్వరైన నెప్పుడైనఁ గొంచెముగనైన, గొప్పగనైన, బుద్ధిపూర్వకముగనైన, నబుద్ధిపూర్వకముగనైన జేసిన మేలు మఱవక ప్రత్యుపకారము చేయువాఁడు? ౫. ఎవఁడు తనసత్యమందుఁ దాను నిల్చుటయేగాక యితరులను దాను శ్రమించియైన సత్యవంతులఁ జేయువాఁడు? ౬. ఎవఁడు తాను బూనినకార్యమో, చేసిన సంకల్పమో ఫలవంతమగువఱకుఁ బట్టినపట్టు వదలకుండువాఁడు? ౭. సర్వవేళల సదాచారమున మానక యనుష్ఠించువాఁ డెవఁడు? ౮. సర్వభూతముల కనఁగా మనుష్యులకే కాక పశుపక్ష్యాదులకు-దేవతలకు-నల్పజంతువులకును-మిత్రులకును-శత్రువులకును మేలేకోరువాఁ డెవఁడు? ౯. ఎవఁడు బలమే ధర్మమని స్వేచ్ఛగాఁ జరింపక యేశాస్త్రములం దేమిచెప్పఁబడెనోయవియెల్లఁ దెలిసినవాఁడు? ౧౦. ఎవఁ డేకార్యమునైన నితరసాహాయ్యము లేక తానే నిర్వహించు శక్తిగలవాఁడు? ౧౧. ఎంతకాలముచూచినను నిమిషనిమిషమునకు క్షణక్షణమునకుఁ గ్రొత్తక్రొత్తగా మనోహరమైన సౌందర్యము కలవాఁడై యెల్లవారికి (స్త్రీలకుఁ బురుషులకుఁ)గూడ నింకను జూతమా, యింకను జూతమా యను నాశను గలిగించువాఁ డెవఁడు? ౧౨. తన మనస్సును తన స్వాధీనమం దుంచుకొని యెట్టిసందర్భమందును జలింపనీయనివాఁ డెవఁడు? ౧౩. కామ క్రోధ లోభ మోహ మద మత్సరముల జయించి, వానిని దనస్వాధీనమందుంచుకొనిన జితేంద్రియుఁ డెవ్వఁడు? ౧౪. సూర్యచంద్రాగ్నులకు వలె వృద్ధిహ్రస్వములులేక సర్వదా యేకరీతి కాంతితోఁ గూడియుండువాఁ డెవఁడు? ౧౫. పరుల ధనమునకుఁగాని విద్యాపాండిత్యములకుఁగాని తేజమునకుఁగాని యసూయపడనివాఁ డెవఁడు? ౧౬. రణరంగమునఁ గోపించెనా యెవనినిజూచి పగవారైనరాక్షసాదులేకాక తనవారైనదేవతలుగూడ గజగజలాడుదురు?

అలంకారము.—సమృద్ధిమద్వస్తువర్ణనలవలన నుదాత్తాలంకారము.

ఛందస్సు.—సీసపద్యమునకుఁ బాదమున కెనిమిదిగణములు, అందు మొదటి యాఱు నింద్రగణములు - కడపటి రెండు సూర్యగణములు - నాలుగుగణము లొక్కదళము - పాదమునకు రెండుయతులు. మొదటిదళములో మూఁడవ గణముమీఁదను రెండవదళములో మూఁడవ గణముమీఁదను యతి - ఇట్టి పాదములు నాలుగు చెప్పి మీఁద నాటవెలఁదినైనఁ దేటగీతినైనఁ జెప్పవలయును. ఇంతయుఁగలిసి సీసమగును. సీసము లెనిమిది విధములు.

వ్యాకరణము.—సంస్కృతమున ధారిణి ధారణియని రూపములు గలవుగాని ధారుణియని రూపములేదు. అయినను నన్నయభట్టు భారతమున 'ధారుణి ప్రజనేలుచుఁ విగతరోషుఁడనై' యని ప్రయోగించెను. ఈ రూపసాధుత్వము విచార్యము. నిజము + అరి = అరిమత్ప్రత్యయము. సంకరి, జూదరి, జాలరి, బాగరి లోనైనవి. ఇది కల యను నర్థమునఁ బ్రయోగింపఁబడును.

గుణవంతుఁడును = నామ సర్వనామంబులకును, గళ లగు నవ్యయంబులకును గడపలసముచ్చయార్థవిశేషపాదపూరణంబు లందును 'ను' శబ్దంబు తఱచుగనగు. కళలగు సనదంతశబ్దంబులమీఁద నయ్యాది యువర్ణ పూర్వకంబుగ విభాష నగు- ఉ॥ నిజమరియును. ఇవ్విటుల సర్థవిశేషంబుల నువర్ణము ప్రయుక్తము.

చం॥పరమకుతూహలంబు విన ♦ భావమునం దుదయించె దీని, నో
పరమమహర్షివర్య! తెలు♦పం దగువాఁడవు నీవ యిట్టిస
త్పురుషు, న టన్న నబ్జజసు♦తుండు త్రిలోకవిదుండు హర్షసం
భరితమనోంబుజుండు విన♦మూ యని యి ట్లను సాదరంబుగన్. ౯౧

ప్రతిపదార్థము.

అవతారిక.—ఇన్నిగుణము లొక్కనియం దుండఁగాలవు. కావున నిట్టి విషమప్రశ్నలచేఁ దన్నుఁ బరాభవింపఁదలఁచితి నని నారదుఁ డెంచునేమో యని వాల్మీకి తలఁచి నేను వాస్తవార్థము తెలియఁగోరి యడుగుచున్నాను గాని నిన్నుఁ బరీక్షించుటకుఁగాదని చెప్పుచున్నాఁడు. ఆచార్యుఁడు జ్ఞానవంతుఁ డని శిష్యుఁ డెఱిఁగి గురూపసత్తి చేయవలయును - గావున శిష్యుఁడు వాల్మీకి గురువగు నారదునకుఁగల జ్ఞాన మెఱిఁగినవాఁ డనుట సూచించుచు సంబోధించుచున్నాఁడు.

ఓ పరమ మహర్షివర్యా = ఓగొప్ప ఋషిశ్రేష్ఠుఁడా! గమనార్థకముగల ఋషధాతువునుండి ఋషిశబ్దము పుట్టినది. గమనార్థకము లన్నియు జ్ఞానార్థకములని వైయాకరణుల సంకేతము. కావున ఋషి జ్ఞానవంతుఁడని యర్థము. బ్రహ్మపుత్రుఁడవై యాయనయొద్ద సకలం బెఱింగిన నీవే యిట్టి సత్పురుషునిఁ దెలుప శక్తిగలవాఁడవు. పరమమహర్షి యనినసే చాలునే 'ఓ' యేల? యనిన నీ ప్రశ్నలను విని యీయన యేమి యిట్టి విషమప్రశ్నలన వేయుచున్నాఁడే యనికాని తాను వచ్చినకార్యము సుకరమైనదని సంతోషముచేఁగాని యాలోచించుచుండు నారదుని మనస్సు తనవంకకుఁ ద్రిప్పుకొనుటకే - దీనిన్=ఈగుణంబులుగల వస్తువును; వినన్ = వినుటకేకాని యాక్షేపించుటకుఁ బరీక్షించుటకుఁ గాదు. పరమకుతూహలము = ఉత్కృష్టసంతోషము, భావంబునన్ = మనస్సు

సందు, ఉదయించెఁ = పుట్టెను. కావున వినఁగోరెదఁగాని నిన్ను నిర్బంధ పెట్టను. నీ కనుగ్రహము గలదేని చెప్పఁగూడునేని దయచేసి యానతిమ్మని భావము. ఇట్టి విషమప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మిచ్చుశక్తి నా కెక్కడిది? ఎవరి నైన గొప్పవారి నడిగి చెప్పెదనన నేమోయని నీకంటె గొప్పవాఁడు లేఁడని 'పరమమహర్షివర్య'యని సంబోధించెను. ఋషులు అతీంద్రియార్థములను సాక్షాత్క రింపఁ జేసికొనువారు. వారిలో గొప్పవాఁడు మహర్షి. వారిలో శ్రేష్ఠుఁడు మహర్షివర్యుఁడు. వారిలో శ్రేష్ఠుఁడు పరమ మహర్షివర్యుఁడు. ఇట్టి నీకు నీతండ్రి యితరులకుఁ దెలియని పరమరహస్యములుకూడఁ దెలిపియుండును. కావున నిట్టి సత్పురుషుఁ = పరమపురుషుని 'యఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే, పురుషం పుండరీకాక్షః,' అను శ్రుతిస్మృతులయందలి పురుష శబ్దము లిట స్మరింపఁదగినవి. పురుషుఁడనఁగా దేహమునందు శయనించువాఁడని - యర్థము.

తెలియందగువాఁడవు నీవ = తెలిసికొను యోగ్యతగలవాఁడవు నీవొక్కఁడ వేకాని నీకంటె నితరుఁడు లేఁడు. అని చెప్పఁగా, అక్షజసూతుండు = బ్రహ్మదేవుని కొడుకైన నారదుఁడు, త్రిలోకవిదుఁడు - (I) స్వర్గమర్త్యపాతాళము లను మూఁడులోకములలో మూఁడుకాలములలో జరిగినదానిని జరుగుచున్న దానిని జరుగఁగలదానిని తపస్సుచేత నేగాక తిరిగి ప్రత్యక్షముగఁ జూచియుఁ దెలిసినవాఁడు. (II) త్రిలోకమనఁగా బ్రహ్మాండము దానిసంగతియుఁ దెలిసిన వాఁడు, (III) కృతకము - అకృతకము - కృతాకృతకము లోకములు మూఁడువిధ ములు. మహర్లోకపర్యంతము కృతకము - జనలోకము కృతాకృతకము, సత్య లోక మకృతకము. వీనిని దెలిసినవాఁడు. (IV) లోకములు = జనులు, బద్ధులు ముక్తులు- నిత్యులు అని మూఁడుతెగలు. వీరినిఁ దెలిసినవాఁడు, 'శ్లో॥ ఋషయ స్సంయతాత్మానః, ఫలమూలానిలాశనాః। తపసైవ ప్రపశ్యంతి, త్రైలోక్యం సచరాచరమ్' మను. ౧౧-౨౩౬. మనోజయముకలిగి పండ్లు మూలములు గాలి యాహారముగాఁ దీసికొను ఋషులు తపస్సుచేతనే చరాచరములతోఁగూడిన మూఁడులోకములు చూడఁగలరు. మీఁద పరమమహర్షివర్య యనుటచే నిట్టి దృష్టి నారదునకు విశేషముగఁ గలదని భావము. హర్షసంభరిత మనోంబు జుండు = సంతోషముచే నిండిన మనస్సనెడి కమలముగలవాఁడు, నారదుఁడు తా నేవిషయమును బ్రహ్మవలన గ్రహించి వాల్మీకి కుపదేశింపవచ్చునో యా విషయమునే వాల్మీకి ప్రశ్నించుటచేతను శతకోటిపరిమితమైన రామాయణము తాను బ్రహ్మవలన విన్నదే కావునఁ దనకుఁ దెలిసినవిషయమే వాల్మీకి ప్రశ్నించుటచే సులభముగాఁ జెప్పవచ్చుఁగదా యనియైనను, రామగుణస్మరణ మను నమృతపానమునకు నవకాశము లభించెఁగదా యనియైనను నిట్టి సచ్ఛిష్యుఁడు

దొరికెఁగదా యనియైనను తాను సనత్కుమారునొద్ద 'సోహంవిదేవాస్మి నాత్మవి' త్తని మనవిచేసికొనుచు నపస్తి నట్లే యితఁడునొనర్చి యావిషయమును దనకు జ్ఞాపక పఱుచుటచేతనైనను నారదునికి నపరిమితానందము గలిగెనని చెప్పనగును. కావుననే, సాదరంబుగన్ = ప్రీతితోఁగూడ, విధియా కర్ణమా యని విసుగు కొనక యనిభావము. వినుమా యని = ఇతరచింతలేక విననలసినదని, శ్రీరామగుణస్మరణమున మనస్సు పరవశమయ్యెనా నేనుచెప్పుచున్నది నీ మనస్సున కెక్కదు. కావున నన్యధ్యానములేక మనస్సిచ్చి వినవలయును. భగవద్విషయ మొకరు చెప్పుచున్నప్పుడు దానికి విఘ్నముగలుగ లోకవార్తలు చెప్పువారు గాడిదలై జన్మింతురు కావున నేకాగ్రచిత్తుఁడవై విను మని భావము. 'విను' అనికాని 'వినరా' అనికాని యనక వినుమా యనుట యాదరాతిశయమును సూచించుచున్నది. శ్రద్ధతో శిష్యులు సద్విషయ మెఱుఁగఁ గోరి యడిగినప్పుడు గురువు లాదరముతోఁ బ్రత్యుత్తర మీయవలయునని యిది సూచించుచున్నది 'కృపయా నిస్స్పృహో వదేత్' దయచే బ్రతిఫలకాంక్ష లేక గురువు శిష్యునకు బోధింపవలె నని ప్రమాణము. ఇట్లు = ఈక్రిందఁ జెప్పబోవువిధముగా, అనన్ = చెప్పఁగ.

'తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛే'త్తను శ్రుతియందుఁ జెప్పఁబడిన గురూపసత్తిని నీపద్యము పూర్వార్థముచేఁ జెప్పి నిరూపిస్తు నాచార్యుఁడు శిష్యునకుపదేశింపవలసిన విధమును 'యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యా' మ్మను శ్రుతియందుఁ జెప్పినట్లు నిరూపించుచున్నాఁడు.

ప్రశ్న

ఓయి! తమకుఁ దెలియనివిషయమునుగదా ప్రశ్నింపవలెను. శ్రీరామునిఁ జక్కఁగ నెఱిఁగిన వాల్మీకి యాయనను గుఱించి ప్రశ్నఁ జేయుట యసంగతము. శ్రీరాముల నుద్దేశించి ప్రశ్నయుండుటచే ప్రత్యుత్తరము శ్రీరాములవిషయమే యయ్యెను. శ్రీరాములగుఱించి వాల్మీకి చెప్పిన విషయము లన్నియు వాల్మీకి యెఱిఁగినవే. ఇఁక నారదుఁ డేమి యుపదేశించినట్లు? వాల్మీకి యేమి గ్రహించినట్లు? వాల్మీకి శ్రీరాముల నెఱిఁగినవాఁడనుటకుఁ బ్రమాణములు విను. (1) వాల్మీకి శ్రీరామునిరాజ్యమందే యయోధ్యకు సమీపమందే యుండెడివాఁడు. (2) దశరథునకుఁ బరిచితుఁడు 'ఇట దశరథభూరమణ సఖుండగు విప్రుఁడు విమలమనస్కుఁడు తపస్వి విదితయశుఁడన్ మునివాల్మీకి వసించును.' ఉత్తర, ౯౯౩-౯౯౪-ప. (3) చిత్రకూటమందు సీతారామలక్ష్మణులు వాల్మీకిని దర్శించి యాప్రాంతమందే పర్ణకుటీరమున గల్పించుకొని యుండిరి. 'కం॥ అని రాముఁడు లక్ష్మణుతో, జనకతనూజాతతోడ సద్భక్తిపైనం, జనియె మహాత్ముని

వాల్మీకిఁ,గని ముని కథివాదనంబుఁ గావించెనొగిఁ.' (అయోధ్యా-౧౪౭౪-౧౪౭౫ ప. చూడుడు.) (4) 'రాముఁడు రాముఁడు రాముఁడు రాముఁడటం చతనికథలు ప్రజ వర్ణింపఁ రామమయమయ్యె భువనము' యుద్ధ-౭౯౬౮. అని వాల్మీకియే వ్రాసెనుగదా. లోకుల కందఱకుఁ దెలిసినది విశేషదర్శియగు వాల్మీకికిఁ దెలియదా! రామభరత సమాగమసమయమున ఋషులతోపాటు సభయం దున్నవాఁడు. ఋషీశ్వరులు సమాధియందుఁదప్ప 30 దినములు 12 మాసములు ముక్కుపట్టుకొని యుండరు. ఈ లోకమునవా రెవ్వ రెఱుంగనిదిగదా సత్యలోకవాసియగు నారదు నడుగవలయును. కావున నీప్రశ్న యుక్తముకాదు.

సిద్ధాంతము.

శ్రీరామచంద్రులగుఱించి వాల్మీకియు నెఱుఁగును. నారదుఁడు నెఱుఁగును. లోకములో నంద ఱెఱిఁగిన విషయమే యయినయెడల దానియం దడిగెడి వాల్మీకికిఁ బరమకుతూహల మెట్లుగలుగును? నారదునంతవాఁడు 'మన మునఁ జక్కఁగ యోజించిచెప్పెద' నని యేలయనను? అట్టిదానిని జెప్పుట యందు నారదుఁ డేల యంత సంతోషమున నప్పాంగవలయును? కావున దీని వలననే ప్రశ్న లోకోత్తరవిషయమై యని గ్రహింపఁదగు. అడిగెడువాఁడు చెప్పెడివాఁడు నిరువురు వేదాంతజ్ఞులు. సర్వదా భగవచ్చింతనము చేయువారు. కావునఁ బ్రశ్నయు సమాధానము దాని ననుసరించియే యుండవలయునుగదా. గుణవంతుఁ డెవఁడు, వీర్యవంతుఁ డెవఁడు అని యడిగినపు డాయాగుణములు పూర్ణముగాఁగలవాఁ డని గ్రహింపవలయునుగాని గౌణార్థముగ నల్పగుణుని నల్పవీర్యుని గ్రహింపరాదు. ఈ గుణములు పూర్ణముగ భగవంతునియందేకల వని వేదాంతముల నాయా ప్రకరణంబులఁ జెప్పఁబడినవి. అయినను నీ గుణములు పూర్తిగ నీకాలమున శ్రీరామచంద్రునందును గానవచ్చుచున్నవి. కాన వేదాంత ప్రతిపాదితుఁడైన భగవంతుఁ డాసాక్షా చ్ఛ్రీరామచంద్రమూర్తిగ నవతరించెను! విష్ణువుకదా శ్రీరామచంద్రమూర్తియై యవతరించినవాఁడు. అట్టైన విష్ణువేకదా వేదాంతప్రతిపాదితుఁ డైన భగవంతుఁడు. బ్రహ్మాదులుకారుగదా. అట్టైన మోక్షప్రదానశక్తి, పరత్వము శ్రీరామునకుఁ గలవా యని ప్రశ్న భావ మని గ్రహింపవలయును. అకాట, సత్తు - బ్రహ్మ ఆత్మ లోనగు శబ్దములను అపర్యవసానవృత్తిప్రకారమో, యవయవవ్యుత్పత్తితో సాక్షాత్తుగానో యాపరమపురుషునే బోధించును. 'సర్వేవేదా, యత్పద మామనంతి' అని శ్రుతి-అనుభావముతో సకలకల్యాణగుణములు శ్రీరామచంద్రమూర్తియందే కల వని చెప్పుచున్నాఁడు. అట్లగుటచేఁ బరత్వ మీయనయందే కలదని యీయనయే మోక్షదాత యని యేర్పడుచున్నది. మోక్షదాత శ్రీమన్నారాయణుఁడే యనుటకు శ్రీకృష్ణలీలామృతములోని ఘంటాకర్ణు చరిత్రయు శ్రీరామపద

త్వముఁ జదువుఁడు. ఆంధ్రహరివంశములందుఁ జదివి ప్రయోజనములేదు. అందు ముఖ్యవిషయము లుప్తము - మూలానుసారమును గాదు. ఎట్లన :—

హరివంశే విష్ణుపర్వణి చతుర్వింశదధిక ద్విశత తమోధ్యాయః

పిశాచః.-

శ్లో॥ శ్రూయతా మభిధాస్యామి, సమాహిత మనాభవ
నమస్కృత్య జగన్నాథం, హరిం కృష్ణం జగత్పతిమ్
ఆదిదేవ మజం విష్ణుం, వరేణ్య మనఘం శుచిమ్
వక్ష్యామి సకలం యద్వ, స్తథాశ్రుణుయ దిచ్ఛసి
ఘంటాకర్ణోస్మి నామ్నాహం, పిశాచో ఘోరదర్శనః
మాంసాదో వికృతో ఘోరః, సాక్షా న్మృత్యురివాపరః
ధనదస్యానుగం తాహం, సాక్షా ద్రుద్రసఖస్యచ
మమాయ మనుజ స్సాక్షా, దంతకస్యాంతకో హ్యయమ్
మృగయేయం సుమహతీ, విష్ణోః పూజార్థమిత్యుత
మమేయం వర్తతే సేనా, శ్వగణోపి మమైవతు
ఆగతోహం మహాశైలా, త్కైలాసా ద్భూతసేవితాత్
అహం పిశాచవేషేణ, సంవిష్టః పాపక ర్మకృత్
సతతం దూషయ న్విష్ణుం, ఘంటా మాబధ్య కర్ణయోః
మమ నప్రవిశే న్నామ, విష్ణోరితి విచింతయన్
అహం కైలాసనిలయ, మాసాద్య వృషభధ్వజమ్
ఆరాధ్య తం మహాదేవ, మస్తువన్ సతతం శివమ్
తతః ప్రసన్నో మా మాహ, వృణీష్వేతి వరం హరః
తతో ముక్తి ర్మయా తత్ర, ప్రార్థితా దేవసన్నిధౌ
ముక్తిం ప్రార్థయమానం మాం, పున రాహ త్రిలోచనః
ముక్తిప్రదాతా సర్వేషాం, విష్ణురేవ నసంశయః
తస్మా ద్గత్వాచ బదరీం, తత్రారాధ్య జనార్దనమ్
ముక్తిం ప్రాప్నుహి గోవిందా, న్నరనారాయణాశ్రమే
ఇత్యుక్తో దేవదేవేన, శూలినా జ్ఞాతవా నహమ్
తమేవ పరమం మత్వా, గోవిందం గరుడధ్వజమ్
తస్మా త్ప్రార్థయమాన స్స, న్ముక్తిదేశ మముం గతః॥

అ ర్థ ము.

పిశాచ మిట్లు చెప్పెను. సావధానమనస్సు గలవాఁడవై వినుము, చెప్పెదన. జగన్నాథుఁడును, గృష్ణుఁడును, జగత్పతియు, నాదిదేవుఁడు, నజుఁడు, విష్ణువు, వరేణ్యుఁడు, ననఘుఁడు, శుచియు నగు హరికి నమస్కరించి సర్వము

చెప్పెదను. ఇష్టముగలదేని వినుము. నాపేరు ఘంటాకర్ణుఁడు. నేను భయంకరపిశాచమను. మాంసభక్షకుఁడను. వికారస్వరూపముగలవాఁడను. రెండవ మృత్యువువంటివాఁడను. రుద్రునిసఖుఁడైన కుబేరుపరిచరుఁడను. అంతకునకు నంతకుఁడైన వీఁడు నాతమ్ముఁడు. విష్ణుపూజార్థమై వెదకుచున్నాను. ఈసేన నాది. ఈకుక్కలగుంపు నాది. భూతసేవితమైన కైలాసమునుండి వచ్చుచున్నాను. పాపకర్మములు చేయు పిశాచవేషమున నే నిట వచ్చితిని. విష్ణుదూషణమే యెప్పుడు చేయుచు విష్ణునామము నాచెవిలోఁ బడకుండుటకై చెవులకు గంటలు కట్టుకొని యుండువాఁడను. కైలాసవాసియు, వృషభధ్వజుఁడును మహాదేవుఁడగు శివుని నేను బూజించి స్తుతించితిని. నాయందనుగ్రహించి హరుఁడు వరము కోరుమనెను. ఆదేవసన్నిధానమున నేను ముక్తి కోరితిని. ముక్తి నిమ్మని ప్రార్థించు నన్నుఁజూచి త్రిలోచనుఁడు మరల నిట్లనెను. అందఱకు ముక్తినీయఁగలవాఁడు విష్ణుఁడొకఁడే. సందేహము లేదు. కావున నరనారాయణాశ్రమమైన బదరీవనమునకుఁబోయి జనార్దను నారాధించి ముక్తిఁ బడయుము. ఇట్లు దేవదేవుఁడయిన శూలిచేఁ దెలిసికొంటిని. గోవిందుఁడగు గరుడధ్వజుఁడే యందఱకంటెఁ బరముఁడని యెంచి ముక్తిదేశమగు నిచటికి వచ్చితిని.

ఇవి ఘంటాకర్ణుఁడు శ్రీకృష్ణునితోఁ జెప్పినమాటలు. తాళపత్రగ్రంథము నుండి గ్రహింపఁబడినవి. ఆంధ్రకవులువ్రాసిన హరిహరసామ్యము లోనగు చిత్రములు మూలగ్రంథమందు లేవు. విష్ణువే ముక్తిదాత యను వాక్యములు మ్రింగివేయఁబడినవి. స్వమతదురభినివేశముచే సత్యము దాఁచి మిథ్యలు చెప్పువారి నేమనఁగొనవచ్చును? మిథ్యలచే స్థాపింపఁజూచుమత మదియేమిమతమో. ఇట్టిరోగము తెలుగుముద్రాక్షరశాలవారియందు నున్నది. ద్రౌపదీవస్త్రాపహరణకాలమున నామె స్తుతివాక్యములలో నొకశ్లోక మాంధ్రముద్రితప్రతులందు లుప్తము. ఎంతకాలమునకైన దొంగతనము, అంకుతనము బయలుపడును గాని కలకాలము దాఁగవు.

ప్రశ్నము.

'త్వం సమర్థోసి జ్ఞాతు మేవం విధం నరమ్' ఇట్టినరుని దెలిసికొన నీవు సమర్థుఁడవని వాల్మీకివాక్యము. 'శ్రూయతాం నరః' అట్టి నరునిగుఱించి వినుమని నారదువాక్యము. నరుఁడనఁగా మనుష్యుఁడనుటకు 'మనుష్యా మానుషా మర్త్యా మనుజా మానవా నరాః, స్యుః పుమాంసః పంచజనాః పురుషాః పూరుషా నరః' అని యమరము. ఇట్లుండ నీవు పరమపురుషుఁడని చెప్పెదవే? అది యెట్లు పొసగును?

ఉత్తరము.

నరశబ్దము వాల్మీకి ప్రయోగించినది వాస్తవమే. ఆశబ్దమునే నారదుఁడు ప్రయోగించినది వాస్తవమే. తక్కిన పర్యాయపదములనెల్ల వదలి నరశబ్దమునే యిరువురు ప్రయోగింప నేల? నరశబ్దము నీ వేయర్థమునఁ బ్రయోగించితివో యా యర్థముననే నేను నీ భావము గ్రహించి చెప్పెద నని వాల్మీకి గ్రహించు టకుఁగదా యీ నరశబ్దమునే నారదుఁడు ప్రయోగించెను. వాల్మీకి మనుష్యునే యుద్దేశించినయెడల 'శృణు మానవ' అట్టి మనుష్యుని గుఱించి విను మనియే చెప్పియుండును. నరుఁడనఁగా 'నయంత ఇతి నరః' అన్నిటిని స్వవశముఁ బొందించుకొనువాఁ డని వ్యుత్పత్త్యర్థము. ఇది యెవరియందు సార్థకము? మను ష్యుఁడు సర్వమును వశపఱచుకొనఁగలఁడా? 'నృ నయే' యను ధాతువునుండి పుట్టినది. నరశబ్దము 'నరతి నృణాతివా నర' పురుషులను త్తమగతికిఁ దీసికొనిపో వువాఁ డనియర్థము. ఈయర్థ మెవరియందు సార్థకము? 'నరోఽజే మను జేఽర్జునే' యను మేదినీనిఘంటువుప్రకారము నరుఁ డనఁగాఁ బుట్టువులేనివాఁడు. భగ వంతుఁడని యర్థము. నరుఁ డనఁగా క్షయములేనివాఁ డని యర్థము. (రఙ్=క్షయే) మనుష్యునకు మరణములేదా. కావున నరశబ్దము పరమపురుషునియందు ముఖ్యము. మనుష్యునియందు గౌణము అట్టులే పురుషశబ్దము రెండువిధముల నన్వయించును. 'నరాఖ్యస్య పరమాత్మనః' నరుఁ డను పేరుగల పరమాత్మ యొక్క యని కుల్లూకభట్టు 'ఆపోవై నరసూనవ' జలములు నరునివలన(బిడ్డలు) సృజింపఁబడెను. అనికదా ప్రమాణము 'అపఏవ ససర్జాదౌ' యని కలదు గదా? జలములను దొలుత సృజించిన నరుఁ డెవఁడు? ఈ కాలమందలి యీలోక మందలి నరుఁడనుటచే మనుష్యాకారము ధరించిన భగవంతుఁ డను నర్థమే సమంజసము.

ప్రశ్న.

ఓయీ! వాల్మీకిప్రశ్న భగవంతునిగూర్చియే యగునేని యాయన సగు ణుఁడా, నిర్గుణుఁడా, సాకారుఁడా, నిరాకారుఁడా, ద్రవ్యమా, అద్రవ్యమా, ఏకతత్త్వమా, అనేకతత్త్వమా యని యిట్టి ప్రశ్నలువేయక గుణములగుఱించి యడుగనేల?

ఉత్తరము.

నీవు చెప్పునది విచారమార్గము. అది విచారముతో నారంభము, విచార ముతో నంతమేకాని ఫలవంతము కాదు. ఆ మార్గమునఁ బోయి తరించినవారు లేరు. అది వాదమునకే కాని యనుష్ఠానమునకుఁ గాదు. అనుష్ఠానము ప్రధా నముకాని వాదముకాదు. మామిడిపండు తీపా, పులుపా యని విచారించిన దాని రుచి తెలియదు. తినిననే వాస్తవము తెలియును. వాక్కునకు మనస్సున

కందరానివస్తువు నెవఁడు సంపూర్ణముగ మనస్సుచేఁ దెలిసికొనఁగలఁడు? మన శక్తికొలఁది ధ్యానింపఁగా నాయన యనుగ్రహించి చూపినంత చూడఁగల వారమే. కాని పూర్ణముగా నెవ్వఁ డెఱుఁగఁగలఁడు? కావున ననుష్ఠానరూపక మైన భక్తిమార్గమే శ్రేయము నారదుఁడు భక్తుఁడు. నీవుజెప్పిన తత్త్వవిచారముకంటె గుణకీర్తనమే శ్రేయస్కర మని; నారదుని మతము. వాల్మీకియు నామతములోఁ జేరినవాఁడే. కావుననే భగవద్గుణవర్ణనము వాల్మీకి చేయఁగా నారదుఁడు హృష్టసంభావితమనోరథుఁ డయ్యెను. తరణోపాయము గుణవర్ణనమే యని నారదుఁడు వ్యాసున కుపదేశించెను. 'ఉ. అంచితమైన ధర్మచయమంతయుఁ జెప్పితి వందులోన, నించుకగాని విష్ణుకథ లేర్పడఁజెప్పవు ధర్మముల్ ప్రపంచించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక, నీకు నీ, కొంచెము వచ్చు నెల్ల హరిఁ గోరి నుతింపుమి నార్యసన్నుతా' యనికదా నారదుఁడు చెప్పఁగా వ్యాసుఁడు శ్రీభాగవతము రచించెను నారదుఁడు రచించిన పాంచరాత్రాగమ మంతయు నీవిషయములేకదా బోధించును.

తాత్పర్యము.

ఇట్టివాఁ డెవఁడో వానిని వినఁ మిక్కిలి కుతూహలపడుచున్నాఁడను - ఓయీ! ఉత్తమ మహర్షిసత్తమా! ఇట్టి సత్పురుషుని దెలుపందగువాఁడవు, త్రిలోకజ్ఞుఁడవు, త్రికాలజ్ఞుఁడవునైన నీవేకాని యితరులుగారు అని వాల్మీకి వచింపఁగా బ్రహ్మపుత్రుండును త్రిలోకజ్ఞుఁడును నైన నారదుఁడు వాల్మీకిజిజ్ఞాసకుఁ దాను వచ్చిన కార్యము సఫలమగుటకు భగవద్గుణవర్ణనానుభవము గలిగెఁగదా యని మిక్కిలి సంతోషించినవాఁడై వాల్మీకీ! నీప్రశ్నమునకుఁ దగినసమాధానము చెప్పెదను సావధానుఁడవై వినుమా యని యాదరముతోఁ బ్రబోధించి యిట్లనియెను.

అలంకారము

ఈవాక్యమునకుఁ ప్రథమపాదార్థమునకు ద్వితీయపాదార్థము హేతువు. కావునఁ గావ్యలింగాలంకారము. 'పరమమహర్షిస్త్వ' యనుపదము సాభిప్రాయము గావునఁ బరికరాలంకారము. వీనికి బూర్వార్థమునఁ దిలతండుల న్యాయమున సంసృష్టి.

వ్యాకరణము

త్రిలోకసమాహారము త్రిలోక మని (పాంచరాత్రమువలె) సమాహారద్విగువుగాఁగాని త్రిత్వవిశిష్టలోకము త్రిలోక మని కేవల ద్విగువుగాఁగాని త్రిలోకము లెందున్నవో యది బ్రహ్మాండము అని బహువ్రీహిగాఁగాని త్రిలోకశబ్దమునకు సమాసము.

ఛందస్సు.

చంపకమాలాపద్యము - దీనికి నజభజజజరగణములు ౧౧వ స్థానము యతి.

సీ॥ నీవు కీర్తించిన♦నిరుపమగుణములు, బహుళములు మఱి దుర్లభములైన
మానీంద్ర! చక్కగ ♦ మనమున యోచించి, వచియింతు న్ననిష్ట♦వరగుణాఢ్యు
జనియించె నయ్యా యి♦క్ష్వాకువంశంబున, రామునామంబునఁ ♦ బ్రజలు వొగడ
నియతాత్మకుఁడు మహా♦నిస్తులవీర్యుఁడు,ద్యుతిమంతుఁడును ధృతి ♦యుతుఁడువశియు
తే॥ బుద్ధిమంతుండు నతుల ♦సిద్ధనీతి,
పరుఁడు వాగ్మియు శత్రుని♦బర్హణుండు
శ్రీయుతుండును విపులాంసుఁ ♦ డాయతంబు,
లైనభుజములుగలఁడు మ♦హాహనుండు. ౫-౬

అవతారిక — ప్రశ్న మొక్కటి, ప్రత్యుత్తరము మఱియొక్కటి యైనయెడ రెంటికిని యుక్త యనుకూలమై యుండదు. కావున శిష్యుని కే విషయము నే యభిప్రాయముతో నడిగెనో యది తెలిసికొనలేక గురువాచార్యుఁడు మఱియొక విధమున నుత్తరమిచ్చెనని యది సదుత్తరము కాదు. కావున నట్టిదోష మున కెడములేకుండునట్లు నారదుఁడు వాల్మీకి యభిప్రాయమును గ్రహించినట్టు లతనికిఁ దెలియుట్కై మొదట రెండుపాదములఁ జెప్పుచున్నాఁడు.

తాత్పర్యము.

మానీంద్రా! నీవు కీర్తించిన నిరుపమగుణములు బహుళములు. మఱియు దుర్లభములు. అయినను నేను మనమునఁ జక్కఁగ యోచించి యట్టి వరగుణాఢ్యు వచియింతును.

అర్థము.

నీవు కీర్తించిన = నీవు స్తుతించిన, ప్రశ్నించినప్పుడే యాగుణము లానంద కరములై స్తోత్రపాత్రములయిన వని భావము. నిరుపమ గుణములు = అసమా నములయిన వీర్యాదిగుణములు. 'నగనం గగనాకారం' మన్నట్లు పరమాత్మగుణ ములకు సమానగుణములు పరమాత్మగుణములే కాని నాగుణముల కాశ్రయుఁడు మఱియొకఁడు లేఁడని భావము. బహుళముల్ — విపులములు నీవు ప్రశ్నిం చిన గుణములు పదునారైనను వానినుండి యనేకగుణములు పుట్టునంతటివి. వాల్మీకి యడిగిన ప్రశ్నములం దంతర్భూతములై మఱికొన్ని కలవు. కావున విపులములైన ప్రశ్నగుణములే యనేకగుణములకును బ్రశ్నయగును. బహుళ ములు = ఇన్ని యని లెక్కింపరానివి. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మన సాసహ' 'ఆనందం బ్రహ్మణో విద్వాన్' 'నబిభేతికుతశ్చన' యను శ్రుతులు గుణ ముల కపరిమితత్వము చెప్పుచున్నవి. ఈశ్రుతియం దానంద మపరిమిత మని

చెప్పియున్నను సర్వగుణములు నిశ్లే యని యెఱుఁగునది. కావుననే 'ఉపర్యుపర్యబ్జభవోపి పూరుషాన్, ప్రకల్ప్యతే యే శత మిత్యనుక్రమాత్' 'గిరాస్త్వదేకైకగుణావధీప్సయా స్థితా' అని స్తోత్రరత్నమునఁ జెప్పఁబడినది.

మఱి = అంతియకాక మఱియును- సముచ్చయార్థకమగు నీశబ్దము పూర్వోక్తగుణములు స్వాభావికములు అనవధికాతిశయములు అసంఖ్యేయములు శుభరూపము లని తెలిపెడిని.

దుర్లభముల — దుర్లభములు + అ = వాస్తవముగ దుర్లభములే. 'అ' ఇది నిశ్చయార్థకము. నీవు చెప్పినగుణములు పరమపురుషునియందుఁ దప్ప నితరుల యం దెందును లేవు. 'నబ్రహ్మానేశానః' యను శ్రుతి యన్య లెవరియందును నీ గుణములు లేనట్లు చెప్పుచున్నదిగదా దీనిచే వాల్మీకి ప్రశ్నించిన గుణములు గలవాఁడు విష్ణువే యనియు విష్ణువును గుఱించియే యాయన ప్రశ్నించె ననియు నా ప్రశ్నభావమును జెప్పఁగఁ దా నెఱుఁగ ననియుఁ దెలిపెడిని.

ఓయీ! ఈగుణములు వసిష్ఠవిశ్వామిత్రాదిమహాత్ములందు లేవా? వారిని జెప్పక రామచంద్రమూర్తినే చెప్పవలసినకారణ మేమి?

ప్రత్యు - వసిష్ఠ విశ్వామిత్రులం దీగుణములు గలవు. కాని వారు ధర్మమార్గమం దుండి స్ఖలితులై మరలఁ దపస్సుచేసి శాంతిపడినవారు - శ్రీరామచంద్రుఁడో యాదినుండి యంతమువఱకు స్ఖలనములేని ధర్మనిష్ఠుఁడు - 'శ్లో॥ధర్మవ్యతిక్రమో దృష్టో మహతాం సాహసం తథా। తేజీయసాం న దోషాయ వహ్నేః సర్వభుజో యథా॥ తదన్వీక్ష్య ప్రయుంజానస్సంసీద త్యవరో జనః'- మనుస్మృతి. మహాత్ములుఁను సాహసముచేఁ జేసిన ధర్మవ్యతిక్రమము గానవచ్చుచున్నది వారిని జూచి యంతటివారు కానివారు వారివలెఁ జేసిన నాశమగుదురు. అట్టిదోషము వసిష్ఠ విశ్వామిత్ర భరద్వాజ పరశురామాదులందు గానవచ్చెడిని. కావున వారిమార్గము లన్నియు ననుసరణీయములు గావు. కావున వారిని గేవలధర్మాత్ము లనరాదు. శ్రీరామచంద్రమూర్తి చేసిన యేకార్యమైనను మనను పాపభయములేక చేయవచ్చును. కావుననే భట్టాచార్యులు 'రామవద్వర్తితవ్యం - సధర్మః. రావణవ న్నవర్తితవ్యం సోఽధర్మః' యని వచించిరి. ఇచ్చట నొకసందేహము. నిర్దోషురా లని తెలిసి తెలిసి లోకులేమో యనుకొన్నారని భార్యనువదిలెనుగదా. మన మట్లుచేయవచ్చునా? "యద్య దాచరతి శ్రేష్ఠ, స్తత్త దేవేతరో జనః, స యత్ప్రమాణం కురుతే, లోకస్త దనువర్తతే" శ్రేష్ఠుఁడనిపించుకొన్నవాఁ డేది చెయునో యితరు లదియే చేయుదురు. వాఁ డేది ప్రమాణమని చేయునో లోక మామార్గముననే నడచును. రామచంద్రమూర్తి సీతను విడనాడకుండిన లోకమునఁ బాతివ్రత్యము నాశమై యింటింటఁ గులటలు ప్రబలియుందురు. మగవారు నోరుమూసికొని పడియుండ

వలసివచ్చును. ‘సీతను రాముఁ డేలుకొనలేదా, మీకుమాత్ర మే’ మని వారు సీతారాముల దృష్టాంతముగఁ జెప్పుదురు చెప్పుదు రననేల? చెప్పనే చెప్పిరి కదా. ఉత్తరకాండము. ౯౩౬, ౯౩౭, ౯౩౮ పద్యములఁ జూడుఁడు. ‘కం॥ తామసుఁ డగు రాక్షసుగృహ, సీమను జిరకాల ముప్ప చెఱఁబడిన సతిన్, రాముఁడు గోయక కూడెడు, గాముకులగువారి కెందుఁ గన్నులు గలవే.” ‘కం॥ రాజాను మతము ధర్మము, రాజవిధంబను సరింపఁ బ్రజకర్హంబౌ, రాజువలె మనకు నాత్మ స్త్రీజనచర్యలు సహింపఁ దీరగు నింకన్.” “కం॥ అని వారు వాడ దోఁచిన, యనువునఁ బురిజనపదముల ననకొని వారల్, పలుకులెల్ల వినిన రాముఁడు, మన మునఁ బరిమార్తి కతన మల్లడిగొనుచున్.”

గురువు - తల్లిదండ్రులు - భర్తలు - పెద్దలనిపించుకొన్నవారు తాము ధర్మ కార్యమే చేయుచున్నను దానియర్థము కారణము తెలియక శిష్యులు - బిడ్డలు - భార్యలు - పిన్నలు నక్షేపచేసి చెడిపోవుచుండినచో నాధర్మకార్యమును వారు మానవలయును. కృష్ణుఁడు సూత్రముగఁ జెప్పెను. రామచంద్రమూర్తి లక్ష్యము కనఁబఱిచెను. “కం॥ పాపాత్ములఁ బాపములం, బాపఁగ నోపుచుఁ బద్మాక్షునిపైఁ, బాపము గల దని పలికిన, పాపాత్ముల పాపమునకుఁ బారముగలదే.” భాగ-౧౦ యన్నట్లు పరమపాపులుగాని రామచంద్రమూర్తియందు దోషమెంచరు. ఏవమ్ = అటులున్నను, మహామునీంద్ర = ఋషిశ్రేష్ఠా, (1) ప్రవాహమున మునిఁగినవాఁడు తన్నుద్ధరింప నితరుల సాహాయ్యమును గోరునట్లు నారదుఁడు రామగుణప్రవాహ ములో మునిఁగి దిక్కుతోఁపక ఋషిని బిలుచుచున్నాఁడని భావము. (2) మిక్కిలి జాగరూకతతోఁ బ్రశ్నయడుగుటవలన శ్లాఘించి సంబోధించుచున్నాఁడనియుఁ జెప్పవచ్చును. (3) ఇట్టి ప్రశ్న యడుగ నీకుఁదప్ప నితరులకు సాధ్యముకా దను నభిప్రాయముతో సంబోధించుచున్నాఁడు, మౌని=మననము కలవాఁడు-తాను తెలిసికొన్న విషయములు మఱపు రాకుండుటకై అవి యుక్తాయుక్తములుగా నున్నవా యని చక్కఁగఁ దఱచి యాలోచించుట మననము. అట్టి మౌనులలో నీవు శ్రేష్ఠుఁడవు, కావున నీ కుపదేశించినదానిని జక్కఁగ మథించి సారము గ్రహించి మేలుపడఁగలవాఁడవు. కావున నీ వడిగినది దుర్లభమైనను నిది క్లిష్ట ప్రశ్న మని నిరాకరింపక యాలోచించి మనస్సునకుఁ దెచ్చుకొని బోధించెదనని భావము.

నేను=(1) బ్రహ్మవలన నీవిషయమంతయు నెఱిఁగిన నేను. (2) నేను వచి యింతు ననుటచే నీప్రశ్నలకుఁ బ్రత్యుత్తరమీయ నాకుఁదప్ప నితరులకు సాధ్యముగాదని భావము.

వరగుణాఢ్యమ్ = శ్రేష్ఠమైన గుణములచే సంపన్నని - కళ్యాణగుణములు కలవానిని; పరమాత్మ సర్వగుణహీనుఁడు. గుణములన్నియు నాయనయందు

భ్రమకల్పితము లను వాదము నారదునకు సమ్మతము కాదని దీనివలనఁ దెలియుచున్నది.

చక్కఁగ మనమున యోజించి వచింతును వినవలసినది. చక్కఁగ నాలోచించి చెప్పెదను. త్రిలోకవిహారుఁడవైన నీకు సర్వ మింతకుఁబూర్వమే విదితము. తెలియని విషయముగదా యాలోచింపవలయును తెలిసిన విషయము వెంటనే చెప్పుటకు చక్కని యాలోచన యేల? యనిన (1) రాముని దివ్య గుణములు స్మరించి యానందసాగరమున మునిఁగి నిగ్రహముగోనియున్నాను కొంత నిదానించి వేని చక్కఁగ నాలోచించి చెప్పెదను. (2) ఇప్పటికేదో యొకటి సమాధానము నాకుఁ దోఁచినది చెప్పను. నా తండ్రి బ్రహ్మతోఁడ నేను జదివిన శతకోటిపరిమితరామాయణమునందలి రామగుణముల స్మరించి నీప్రశ్నలకుఁ దగిన ప్రత్యుత్తరముల నిచ్చెద నని భావము.

తాను వాల్మీకి కుపదేశింపవచ్చినది రామచరిత్రమైయుండ నీయన యింకేదో ప్రశ్నించుచున్నాఁడే యేమి చేయుదు నని యాలోచించి యాయనప్రశ్నలకు సదుత్తరము తాను జెప్పవచ్చిన రామచరితయే యని స్పష్టపఱచుకొని సంతోషించె ననియు నెఱుఁగనగు.

ఇఁక వేదాంతోక్తసకలగుణములు గలవాఁడు రామచంద్రమూర్తిగా నవతరించిన వేదాంతవేద్యుఁడు పరతత్త్వమగు శ్రీవిష్ణుమూర్తియే యని నారదుఁడు నిరూపించుచున్నాఁడు. ఇఁక మొదలు ౧౬ వ పద్యముదాఁక నేకాన్వయము. అయ్యా - నాయనా, ఇది శిష్యునందు గురువునకుఁగల వాత్సల్యాతిశయమును దెలుపును. ఇక్ష్వాకువంశంబునన్ = ఇక్ష్వాకువు వైవస్వతమనువుయొక్క జ్యేష్ఠపుత్త్రుఁడు. అతని వంశమునందు, ఇతరమహావంశము లెన్నియో యుండ వానినెల్ల విడిచి యీ వంశమున జన్మించుటకుఁ గారణమేమన — ఇక్ష్వాకు మహారాజు విష్ణువుఁగూర్చి బహుకాలము తపస్సుచేయఁగా శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై వరముఁగోరు మనెను. అయ్యెడ యతఁడు నీ విగ్రహరూపమున నే నాయింటఁ బ్రతిదినము పూజగైకొనుచుండవలసిన దని కోరుకొనెను. నారాయణుఁడు నట్లగాక యని యనుగ్రహించి యర్చామూర్తియై యాయనయింట నిలిచి ప్రతిదినము గృహారాధనమున నర్చింపఁబడుచుండెను- అని పురాణకథ గలదు. కావున సూర్యవంశ మని చెప్పక యిక్ష్వాకువంశ మని చెప్పెను. మఱియు 'వైష్ణవో నః కులే జాత స్స న స్సంతారయిష్యతి' అను స్మృతివాక్యప్రకార మీ వంశమున నొకఁడు విష్ణుభక్తుఁడుగాఁ బుట్టిన నావంశమున నిరువదియొక్కతరమువారలు తరింతురు. (ప్రహ్లాదునకు నృసింహమూర్తి చెప్పినవాక్యము శ్రీభాగవతంబునఁ జూడుడు.) ఈ వంశమునం దున్ననో యిక్ష్వాకుతరము

మొదలు భగవంతుండు విష్ణుమూర్తి శ్రీరంగనాథమూర్తియై వెలసి నిత్యము పూజింపఁబడుచుండెను. కావున నిట్టి సాత్త్వికవంశము వేఱొండులేదని యభిప్రాయము. దీనివలన భగవంతునకుఁగల యాశ్రితపక్షపాతము తెలియుచున్నది. వంశమనఁగా మనుష్యులకు వెదుక తృణప్రాయమైనట్టు దేవతలకుఁ బరదేవతయైన భగవంతునకు మనుష్యులు పల్లుపేకదా ఉట్టుంచినను వెదురునందు ముత్యమువలె మనుష్యులందు జన్మించినాఁ డనుటచే భగవంతుని సౌశీల్యము ప్రకటమాయెను. ఈసౌశీల్యమే ప్రశ్నలందలి గుణవంతుఁ డనుమాట కర్థము. “రమంతే స్మిన్ సర్వజనా గ్గుణైరితి రామః” అని ప్రజలు గుణములచే నితనియందు రమించుచున్నారు కావున రాముఁడు “గుణై ర్దాస్య ముపాగతః” ఈయన గుణములచే నీయనకు దాసుఁడ నైతి నని లక్ష్మణుఁడు చెప్పెనుగదా

రామనామంబునన్ = రాముఁడను పేరితో (1) అందఱను గుణములచే రమింపఁజేయువాఁడు ‘రమయతి సర్వాన్ గుణైరితి రామః’ ‘రామోరమయతాం వర’ యని ఋషినిర్వచనవాక్యము దీనికిఁ బ్రమాణము (2) ఈయనను యోగులు హృదయమునఁ గని సంతోషింతురు “రమంతే యోగినో ఽనంతే సత్యానందే చిదాత్మని ఇతి రామపదే నాసౌ పరబ్రహ్మాభిధీయతే” యను నగస్త్యసంహితావచనము దీనికిఁ బ్రమాణము. క్షత్రియాపసదుఁడు బుట్టుటకు మఱియొక కారణము గలదు పరశురాముఁడు క్షత్రియవంశమును నిర్మూలించెను. రాజ్యపాలనము క్షత్రియధర్మముగాని యితరధర్మముకాదు క్షత్రియవంశమును స్థాపించుటకు క్షత్రియుఁ డొకఁడుగాని క్షత్రియేతరులనారధికారులుగారు. ఈవిషయము విపులముగ శ్రీరామనామ మాహాత్మ్యమునఁ గననగు.

ప్రజలు పొగడన్ = జనులు స్తుతింపఁగా - తాటకావధము మొదలు రావణవధ పర్యంతముగాఁగల శ్రీరామకార్యంబులను జనులు పొగడుటయేకాక యూరక యున్నప్పుడును ఆ రామనామమందు గల మాధుర్యము ననుభవించుటకై లోకులెల్లవేళ రామరామ యనుచుందురు. లోకములో నందఱకుఁ దెలిసినవిషయము నీకు మాత్రము తెలియదా? గుణములు రెండువిధములు- స్వరూపనిరూపకములు - నిరూపితస్వరూపవిశేషణములు అని. ఏగుణము తెలియనపుడు వస్తుస్వరూపమే తెలియదో యట్టి గుణములు స్వరూపనిరూపకములు. వస్తుస్వరూపము తెలిసినపిమ్మట నావస్తువున నింకను విశేషముగఁ దెలుపునది నిరూపితస్వరూపవిశేషణము. అందు స్వరూపనిరూపక విశేషణములను జెప్పుచున్నాఁడు.

నియతాత్మకుఁడు = ఒక్కవిధమైన స్వభావముగలవాఁడు - నిర్వికారుఁ డని భావము. అచిత్తు సదా మాఱుచుండును, ఇతఁ డట్లు మాఱువాఁడుకాఁడు. ‘నాస్య

జర మైతజ్జీర్యతే- నవధేనాస్యహన్యతే - అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకోఽ జిఘత్సో ఽపిపాస' యని శ్రుతి.

మహానిస్తులవీర్యుఁడు = సాటిలేని గొప్పశక్తిగలవాఁడు. అచింత్యవివిధ విచిత్ర శక్తిమంతుఁడు. 'పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ' యని శ్రుతి.

ద్యుతిమంతుఁడు - స్వాభావిక ప్రకాశముగలవాఁడు - స్వయంప్రకాశుఁడు - జ్ఞానస్వరూపుఁడు జ్ఞానముగదా స్వయంప్రకాశము - 'విజ్ఞానఘన ఏవ ప్రజ్ఞాన ఘన' యని శ్రుతి ఘన యనఁగా గడ్డ.

ధృతియుతుఁడు = నిరతిశయమైన యానందముతోఁ గూడినవాఁడు - 'ఆనందో బ్రహ్మ' యని శ్రుతి. 'ధృతిర్యోగాంతరే ధైర్యే, ధారణే ప్రీతిసౌఖ్యయోః' నానా. 'ధృతిస్తు తుష్టిస్సంతోషః' వైజయంతి అను నిఘంటువులఁబట్టి ధృతి యనఁగా సంతోషము.

వశియును = సకలజగమును దన స్వాధీనమం దుంచుకొన్నవాఁడు-సర్వమునకును స్వామి. 'సర్వస్య వశీ సర్వస్యేశాన' యని శ్రుతి. ఇంద్రియములను దన స్వాధీనమం దుంచుకొన్నవాఁడు హృషీకేశుఁ డని భావము 'కారణంతు ధ్యేయ' యని ధ్యేయుఁడగు పరమాత్మకు జగత్కారణత్వముగూడ నొకగుణము కావున జగత్సృష్టి కనుకూలములగు గుణముల నిఁకఁ జెప్పుచున్నాఁడు.

బుద్ధిమంతుఁడు - సర్వజ్ఞుఁడు "య స్సర్వజ్ఞ స్సర్వవి" త్తని శ్రుతి.

అతులప్రసిద్ధనీతిపరుఁడు సమానములేని ప్రసిద్ధమైన నీతియే ప్రధానముగాఁ గ వాఁడు. నీతి = మర్యాద - పొలిమేర వస్తువులు తమతమస్వభావమును మీఱకయుండునట్లు ఎల్ల రాయిగా నుండువాఁడు. "ధాతా యథా పూర్వ మకల్పయత్ - ఏష సేతు ర్విధరణ ఏషాం లోకానా మసంభేదాయ" యని శ్రుతి.

వాగ్మియును మంచివాక్కు గలవాఁడు. పరిహితమైనవాక్కు మంచివాక్కు. 'కమలాక్షు నర్చించు కరములు కరము' లన్నట్లు - సర్వలోకహితమైన వాక్కు వేదమే. కావున వాగ్మి = సర్వవేదప్రవర్తకుఁడు. "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం, యోవై వేదాగంశ్చ ప్రహిణోతి తస్మై" యని శ్వేతాశ్వతరోపనిషత్తు.

శ్రీయుతుండు - ఉభయ విభూతులతోఁ గూడినవాఁడు. నిత్యవిభూతి, లీలా విభూతియని విభూతులు రెండు. లీలావిభూతి జగత్తు - నిత్యవిభూతి పరమపదము -"సర్వ మిద మభ్యాత్త" యని శ్రుతి శ్రీయుతుఁడు-లక్ష్మీదేవితోఁ గూడినవాఁడు - శోభతోఁ గూడిన మంచివేషముగలవాఁడు.

శత్రునిబర్హణుండు = ఆవిభూతిసమృద్ధికి విరోధులగువారి నశింపఁజేయువాఁడు. విభూతిపాలకుఁడు. "ఏష భూతపతి రేష భూతపాల" యని శ్రుతి. 'పారక్రమా దర్థక్రమో బలీయాః' నను న్యాయమున నిటనన్వయము మార్చుకొనవలయును. తన్ను ద్వేషించినా రన బుద్ధితో నెవరిని భగవంతుఁడు ద్వేషింపఁడు గాని తన్నాశ్రయించిన సాధువుల ద్వేషించువారిని దనకు శత్రువులుగా భావించును. శ్రీకృష్ణుఁడు రాయబారమునకు వెళ్ళినప్పుడు విదురునింటఁ దాను విందు గ్రహించుటకు దుర్యోధనువీట గ్రహింపమికిఁ జెప్పినకారణము స్మరించునది.

క॥ పగవారియింటఁ గుడిచిన, నగుఁ దమ కనుమాన మమృతమైనను దారుం బగతురకుఁ గుడువఁబెట్టఁగఁ, దగ దొడఁబడరు కెప్పు డెవ్విధము వాటిలునో.

వ॥ నేను బగతుండ నె యంటి వేని,

క॥ అలుగుదు పాండవులకు వారెలు నాకుం బ్రాణములు ధరావల్లభ యిట్టలముగఁ దమప్రాణములకు, నలుగుజగులు పగతు రగుట యనుమానంబే.

ఉద్యోగ. 3–౨౨౫.

వ॥ భగవంతుఁడు విష్ణువు, భక్తజనపక్షపాతి

శ్లో॥ రక్షతే భగవాన్ విష్ణు, ర్భక్తా నాత్మశరీరవత్ భగవంతుఁ డగు విష్ణువు తనశరీరమునువలె భక్తులను రక్షించు నని యర్థము.

"అథ య ఏషోంత రాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రు ర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వఏవ సువర్ణ స్తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ తస్యోదితి నామ సఏష సర్వేభ్యః పాప్మభ్య ఉదిత ఉదేతి హవై సర్వేభ్యః పాప్మభ్య య ఏవంవేద" యని ఛాందోగ్యమున నంతరాదిత్యవిద్యాప్రకరణమునఁ జెప్పఁబడిన ప్రకారము భక్తులచే ననుభవింప యోగ్యమై సర్వాంగసుందరమైన యాకారము సౌష్ఠవము నిటఁ జెప్పుచున్నాఁడు. ఇది ప్రియదర్శనుఁ డెవ్వఁడను ౧౧వ ప్రశ్న కుత్తరము.

నిశ్చలమై నిత్యమై నిరుపమానమైన సౌందర్యగుణ మెవ్వనియందుఁ గల దను ప్రశ్నకు శ్రీరామచంద్రుని యాకారము వర్ణింపఁబడెను. దీనివలన "యత్రాకృతి స్తత్ర గుణా" యనునట్లు (ఆకార మున్నచోట గుణము లుండును.) రెంటికి నవినాభావసంబంధము చెప్పఁబడెను. కావున భగవంతుఁడు సత్తని నచో సాకారుఁ డనియే యర్థము. ఉండుట యనునదికూడ గుణమే కదా. సాకారుఁ డంటిమా గుణవంతుఁ డనియే యర్థము. ఒకటి యంగీకరించిన రెండవది యంగీకరింపక తప్పదు. గుణములవలన గుణికిఁ బ్రశస్తి. కావున గుణవర్ణనమే ప్రధానము. "ధర్మముల్ ప్రపంచించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక" యనికదా నారదుఁడు వ్యాసులకుఁ జెప్పెను. విపులాంసుండు = ఉన్నతములగు

భుజశిరస్సులుగలవాఁడు మహాపురుషుఁడు. "కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణస్కంధో లలాటికా, సర్వభూతేషునిర్దిష్టా ఉన్నతాస్తు సుఖప్రదా" యని సాముద్రిక లక్షణము. కక్షములు - కడుపు - ఎదుఱురొమ్ము - నాసిక - మూఁపురములు - నొసలు ఇవి మిట్టలయి యుండిన సుఖప్రదములు.

ఆయతంబులైన భుజములు గలఁడు = బలిసి గుండ్రముగాఁ దీరిన రెట్టలుగల వాఁడు. అజానుదీర్ఘములైన బాహువులవాఁ డని భుజముల నిడుపు ముందు చెప్పఁబడును కావున నిచట నాయతశబ్దమునకు బలిసి గుండ్రముగా దీరిన యని లాక్షణికార్థము. 'ఆజానులంబినౌ బాహూ వృత్తపీనౌ మహీశ్వర' యని సాముద్రికలక్షణము. గుండ్రములై బలిసినవై మోఁకాలిసంటు నిడివిచేతులవాఁడు రా జగును. మహాహనుండు = బలిసిన చెక్కిళ్లమీఁది భాగముగలవాఁడు. "మాంసలౌతు హనూ యస్య భవత స్త్వీషదున్నతౌ, స నరో మృష్టమశ్నాతి యావదాయుస్సుఖాన్వితః" యని సాముద్రికము. ఎవనికిఁ జెక్కిళ్లు బలిసి కొంచెము మిట్టగానుండునో వానికి జీవించి యుండువఱకు దేహసౌఖ్యము భోజనసౌఖ్యము కలవు.

ఛందస్సు.—సీసపద్యము. వ్యాకరణము —కలఁడు = కలవాఁడు. "ఎల్లవారి కంటె నెఱుకగలవు" అరణ్య-3-322. 'ఎఱుకగలరె తరుణు లెందు' అరణ్య 3-౧౮-భార. 'వెరవుగలరు' ఉద్యో ౪-ఆ-౧౧౦ ప. 'గెల్వగలారు' భీష్మ-౨-౧౧. 'ప్రాణానఁగలనె' ద్రో. ౧-౨౬3 'కలవేని' అరణ్య ౧-3౦౦- 'మిము నెల్ల మిగులు భుజగర్వము మదముగలఁడు గొనఁ డరాతుల నధిపా' ఉద్యో. శాంతి, ౯ -. 3౯౪ ఈప్రయోగములం బట్టి కలవాఁ డనుటకు కలఁడని - కలవాఁడ వనుటకు కలవనికలవాఁడ ననుటకుఁ గల నని- రూపంబు లేర్పడుచేకాక సు-వ్యా-క్రియాసూ-౧౨౮ ప్రకారము కలాఁ డనియు నేర్పడును.

తాత్పర్యము.

అయ్యా, మునిశ్రేష్ఠా! నీవు శ్లాఘించినగుణము లసమానములు. ఒక్కొక్క గుణముం గొంతసూక్ష్మభేదములై మఱికొన్ని యుండుటచే ననేకములు. మనుష్యమాత్రులయందుఁ గానవచ్చునవికావు అయినను నీ వేయభిప్రాయముతో నీ ప్రశ్నలడిగితివో యా యభిప్రాయమును జక్కఁగ మనస్సునం దాలోచించి తెలిసికొని యిట్టి సుగుణసంపత్తిగలవానిని నీకుఁ జెప్పుచున్నాను. పరాకుమాని వినుము. నాయనా! యేవంశంబున నెవనియింట నిత్యము భగవంతుఁ డారాధింపఁబడుచున్నాఁడో యట్టి యిక్ష్వాకుమహారాజువంశమున రామా రామా రామా యని లోకులు యోగులు నందఱు పొగడుచుండ రామచంద్రమూర్తి యను నామధేయముతో నాయన జన్మించెను. ఆయన యెప్పుడును వికారము పొందక యేకవిధముగ నుండు

స్వభావముగలవాఁడు. మిగులగొప్పదై యసమానమైన వివిధమై విచిత్రమైన శక్తిగలవాఁడు. స్వయముగ ప్రకాశముగలవాఁడు నిరతిశయమైన యానందము గలవాఁడు. ఇంద్రియములను సకలభూతములను దనకు వశముపడఁజేసికొనువాఁడు. సర్వము దెలిసినవాఁడు సమానములేని ప్రసిద్ధమైన నీతియే ప్రధానముగానెంచుకొన్నవాఁడు. పరులకు హితము ప్రియమునైన వాక్కులుగలవాఁడు. శ్రీమంతుఁడు. ఎవరియందుఁ దనకు శత్రుభావము లేకుండినను దన్నాశ్రయించిన సాధువులపై ద్వేషించువారల నాశముచేయువాఁడు ఎత్తైన మూఁపురములు గల వాఁడు బలసిన చెక్కిళ్లుగలవాఁడు.

క॥ కంబుగ్రీవుఁడు విపులో,రంబు విడంబించువాఁడు ♦ రాజితకోదం
డంబు గలవాఁడు శత్రుక,దంబకకాలాంతకుండు ♦ దారుణుఁ డాజిన్. ౯౩

కంబుగ్రీవుఁడు = శంఖముతో సమానమైన మెడ గలవాఁడు, మూఁడు రేఖలుగల మెడ కంబుగ్రీవ "కంబుగ్రీవశ్చ నృపతిర్నింబకర్తో ఽభిభూషణః" అని లక్షణము. విపులోరంబు విడంబించువాఁడు = విశాలమైన రొమ్ము కలవాఁడు. విడంబించువాఁడు = అనుకరించువాఁడు. భక్తానుగ్రహార్థమై భగవంతుఁ డిట్టి యాకారము పరిగ్రహించియున్నాఁడు. తనకై యేయాకార మక్కరలేనివాఁడని సూచితము. ఈయర్థమునే జితంతాస్తోత్రమున నిట్లు చెప్పఁబడియున్నది.

శ్లో॥ నతే రూపం నచాకారో, నాయుధాని నచాస్పదమ్
తథాపి పురుషాకారో, భక్తానాం త్వం ప్రకాశసే॥

నీయర్థమైన రూపము నీకు లేదు. అట్టి యాకారము లేదు. అట్టి యాయుధములు లేవు. అట్టిస్థానము లేదు. అట్లుండియు భక్తులకుఁ బురుషునివలెఁ గనవచ్చుచుందువు. 'ఉపాసకానాంకార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా' ఉపాసకుల నిమిత్తమై బ్రహ్మము రూపము కల్పించుకొనునని యుపనిషత్తు చెప్పుచున్నది.

రామావతారము మనుష్యవిడంబనమే కదా. 'మాయామానుషవిగ్రహ' యనిగదా ప్రసిద్ధి.

రాజితకోదండంబుగలవాఁడు = ప్రకాశించునట్టి పెద్దధనస్సుగలవాఁడు. అట్టి దీర్ఘమైన ధనస్సును ధరించు నొడ్డుపొడుగుగల దేహముకలవాఁ డనిభావము. కావున నవయవవర్ణనప్రకరణమున నాయుధకీర్తనమువలని ప్రక్రమభంగము లేదు.

శత్రుకదంబకకాలాంతకుండు = విరోధుల సమూహమునకుఁ బ్రలయకాల యమునివంటివాఁడు. శత్రువులు = పాపములు - పాపవిరోధియు నపహతపాప్మునగువాఁడు భక్తానుగ్రహార్థము దేహము ధరించి దేహివలె నటించును.

అస్మదాదులకువలెఁ గర్మకారణమైన జన్మము పాంచభౌతికదేహము గలుగవు అని వ్యంగ్యము. కావునఁ బ్రక్రమభంగము లేదు.

ఆజౌ దారుణుఁడు = యుద్ధమునందు భయంకరుఁడు.

తాత్పర్యము.

శంఖమువలె మూఁడురేఖలు కల కంఠము గలవాఁడు. విశాలమైన వక్షస్స్థలము గలవాఁడు. గొప్పదగు విల్లుధరించువాఁడు. ఆశ్రితపాపము లనెడి శత్రుసమూహములకుఁ బ్రళయకాలయమునివంటివాఁడు. యుద్ధమునందు భయంకరుఁడు.

ఛందస్సు.—కందపద్యము.

సీ॥ ఆజానుదీర్ఘంబు ♦ లైనబాహులవాఁడు, రమణీయ మైనయు♦రంబువాఁడు
తరము లేనట్టి సుం♦దరలలాటమువాఁడు, కమనీయ మైనవి♦క్రమమువాఁడు
అందమైన సరిసరి♦యంగముల్ గలవాఁడు, మినమిన మనుమేని♦మెఱుఁగువాఁడు
దారుణ మైనప్ర♦తాపంబు గలవాఁడు, చారుపీవరసువ♦క్షంబువాఁడు
తే॥ గేయమగువాలువిరివికం♦దోయివాఁడు, మెచ్చుగొలిపెడిలచ్చిచే♦హెచ్చువాఁడు
నవ్యశుభలక్షణుండును♦భవ్యమూర్తి, రామచంద్రుండుసుగుణాభి♦రాముఁడనఘ.

ఆజానుదీర్ఘంబులైన బాహులవాఁడు = మోకాఁటివఱకు నిడుపైన భుజములుగలవాఁడు.

రమణీయమైన శిరంబువాఁడు = సమమైనది, ఛత్త్రాకారమైనది, గుండ్రమైనది గనుకనే మనోహరమైనదియు నగు తలగలవాఁడు. ఇట్టి తలగలవాఁడు దీర్ఘాయువు నేకచ్ఛత్త్రాధిపతియు నగు నని సాముద్రికము- "సమవృత్తశిరాశ్చైవ ఛత్త్రాకారశిరా స్తథా, ఏకచ్ఛత్త్రాం మహీం భుంక్తే దీర్ఘమాయుశ్చ జీవతి" యని లక్షణము.

ఏకచ్ఛత్త్రాధిపతి = పూర్వకాలమున మనరాజులు రాజ్యమేలుచుండినపుడు రాజొక్కఁడే గొడుగు పట్టుకొనవచ్చునుగాని ప్రజలలో నెవ్వరు పట్టుకొనరాదనియు, దానివలననే రాజునకు నేకచ్ఛత్త్రాధిపతి యని పేరనియు నొకపాశ్చాత్యుఁడు వ్రాసియున్నాఁడు. వీని మాధ్యాతిశయము వేనోళ్ళఁ బొగడఁదగును. శ్వేతచ్ఛత్త్రము రాజచిహ్నము. ఒక్కఁడే సమస్తభూమి నేలునేని వాఁ డేకచ్ఛత్త్రాధిపతి.

తరములేనట్టి = సమానములేని. సుందర లలాటమువాఁడు = అర్ధచంద్రునితో సమానమైనదియు నెత్తైనదియుఁ గాన నందమైనదగు నొసలుగలవాఁడు.

కమనీయమైన విక్రమమువాఁడు = అందమైన నడకగలవాఁడు. ఏనుఁగువలెనో - సింహమువలెనో నడచుట యంద మని కవిసమయము. క్రమము = పద

న్యాసము. 'సింహర్షభ గజవ్యాఘ్రగతయో మనుజా మునే, సర్వత్ర సుఖ మేధంతే సర్వత్ర జయిన స్సదా॥' యని లక్షణము. ఇది పురుషులవిషయము. ఈ యుపమానములు స్త్రీలకుఁ జెల్లవు. వారినడకను హంసనడకతోను మదపుటే నుఁగునడకతోను బోల్తురు.

'ఏమ తెదవుసుమీ యెప్పుడైన నీమనంబున నేని రాముఁ డేగ వనాళి' - ననికదా సుమిత్ర లక్ష్మణునకు బోధించెను. (అయోధ్య-౧౯-౭౨) రామచంద్రమూర్తియొక్క గమనసౌందర్యమును జూచి తదనుభవమువలనఁగలిగిన యానందమునఁ బరవశుఁడవై రామచంద్రమూర్తి నేమఱెదవు సుమీ యని దీని యర్థము. అంగైన = అందమైన.

సరిసరియంగిముల్ గలవాఁడు = ఎచ్చుదక్కువలులేక ప్రమాణమునకు సరియైన పరిమాణముగలిగి యొకదానికొకటి సరియగుచు యవయవములు గలవాఁడు. "శ్లో. భ్రువౌ నాసాపుటె నేత్రే, కర్ణా వోష్ఠౌచ చూచుకౌ, కూర్పరౌ మణిబంధౌచ, జానునీ వృషణౌ కటీ, కరౌ పాదౌ స్ఫిచౌ యస్య, సమౌ జ్ఞేయస్స భూపతి''యని సాముద్రికము. కనుబొమలు, ముక్కుపుటములు, కన్నులు, చెవులు, పెదవులు, చనుముక్కులు, మోచేతులు, మణికట్లు, మోకాళ్లు, వృషణములు, పిఱుఁదులు, చేతులు, కాళ్లు, పిక్కలు నెవనికి సమానములుగనుండునో వాఁడు భూమి నేలును. జంటజంటగానుండు నీయవయవములలో జంటలోని రెండు నొకదానికి నొకటి సమానముగా నుండుటయేగాక యాకారము సరిగా నుండవలయును. అర్జునుని పిక్కలు వరిపొట్టలవలెఁగాక కొలఁతసేరులవలె నుండుటచేఁ గష్టజీవి యయ్యె నని భారతమునఁ గలదు.

మిసమిస మనుమేనిమెఱుఁగువాఁడు = తళతళ మెఱయుచుండు దేహకాంతి గలవాఁడు. "శ్లో. నేత్రస్నేహేన సౌభాగ్యం, దంతస్నేహేన భోజనమ్, త్వచస్నేహేన శయ్యాచ, పాదస్నేహేన వాహనమ్" అని వరరుచివాక్యముగలదు. కన్నులమెఱపు సౌభాగ్యకారణము. దంతములకాంతి మంచిభోజనమును దెలుపును. చర్మము నిగనిగలాడుచుండిన శయ్యాసుఖము గలదు. పాదములమెఱపుండిన వాహనలాభము గలుగును.

ప్రతాపము = పరాక్రమము. పేరువిన్నంతమాత్రమున శత్రువులు జడియునట్లు చేయుశక్తి.

చారుపీవరసునక్షంబువాఁడు= మనోహరమైబలిసినమంచిఱొమ్ము గలవాఁడు.

గేయమగు వాలు విరివికందోయివాఁడు = శ్లాఘ్యమై నిడుపై విశాలమైన రెండు కన్నులుగలవాఁడు. 'రక్తాంతైః పద్మపత్రాక్షై ర్లోచనైస్సుఖభోగిన' యని

సాముద్రికము. ఎఱ్ఱని కొనలుగలిగి తామర రేకులతో సమానములైన లోచనములు గలవాఁడు సుఖభోగి.

ఈనేత్రముల యందమును దలఁచి సీతాదేవి యిట్లు దుఃఖించెఁగదా.

క॥ ధన్యులు రఘుకులమూర్ధన్యుని నాహృదయనాథు రాముని సతతరాజన్యుని రాజీవాక్షుని, మాన్యునిఁ గను దేవసిద్ధమానిప్రవరుల్. సుం. ౬౭౬

క॥ మాన్యునిఁ గృతజ్ఞు నతసౌజన్యునిఁ గమలాక్షు సింహాసనగతిఁ గృతిమూర్ధన్యుని నాప్రాణవిభుఁ, ధన్యులువో గన్నులారఁ దర్శించుజనుల్. సుం. ౬౮౬

హనుమంతుఁడు శ్రీరాముని లక్షణములు సీతాదేవితోఁ జెప్పునపుడు రాముండు కమలపత్రవిశాలలోచనుం డనికదా ప్రారంభించెను. సుం. ౮౨౦.

శూర్పణఖయు రావణునితో నిడుపుబాహువులవాఁడు వెడఁదకన్నులవాఁడని ప్రారంభించెను.

లచ్చి = (1) అవయవకాంతి, (2) సీతాస్వరూప యగు లక్ష్మీదేవి. లక్ష్మీశబ్ద భవము లచ్చి.

సత్యశుభలక్షణుఁడు = క్రొత్త క్రొత్తవియు మంగళకరములు నయి యిప్పుడు చెప్పని యనేక లక్షణములు కలవాఁడు. భగవంతుని లక్షణములన్నియుఁ జెప్పవలయు ననిన నెవ్వనికి సాధ్యము? కావున సమిష్టిమీఁదఁ జెప్పెను. భవ్యమూర్తి = దర్శనమాత్రమున శుభ మొసంగు నాకారము గలవాఁడు.

సుగుణాభిరాముఁడు = మంచిగుణములచే నొప్పువాఁడు.

రామచంద్రుండు = 'చది ఆహ్లాదనే' యను ధాతువువలనఁ గలిగిన చంద్రశబ్దమునకు నా బాలగోపాలము సంతోషపెట్టువాఁ డని యర్థము. ఆచంద్రుని కంటె నభిరాముఁడు రామచంద్రుఁడు. ఈరామచంద్రునిఁ జూచినపిమ్మటఁ జంద్రునిఁ జూచిన సందిమగఁ గానఁబడఁ డని భావము.

తా త్ప ర్య ము .

శ్రీరామచంద్రమూర్తి నిడుపులైన మోకాళ్లనంటుచేతులు గలవాఁడు. అందమైన వక్షముగలవాఁడు. సౌందర్యమందు సమానములేని నొసలు గలవాఁడు. చూచువారిని మైమఱపొందఁజేయునడకగలవాఁడు, అంగమైయొకదాని కొకటి శాస్త్రమునఁ జెప్పినపరిమాణమునకు సరియైన యవయవములుగలవాఁడు. మిన మిన మని ప్రకాశించు దేహకాంతిగలవాఁడు. భయంకరమై శత్రువులకు సహింపరాని ప్రతాపము గలవాఁడు. మనోహరమై బలిసిన మంచివక్షము గలవాఁడు. కీర్తింపఁదగి నిడివి వెడలుపుగల కన్నులు గలఁవాఁడు. ఎదుటివారు మెచ్చు కొనశోభతోఁగూడిన వేషముగలవాఁడు. శ్లాఘ్యమైన శుభచిహ్నములుగల

వాఁడు. చూచువారికిని, శుభముకలిగించు నాకారము గలవాఁడు. మంచి గుణములచే మనోహరుఁడు.

సీ॥ శస్తధర్మవిదుండు ♦ సత్యసంధుండును, సకలభూజనహిత♦సతతరతుఁడు
సద్యశఃపూర్ణుండు ♦ జ్ఞానసంపన్నుండు, నత్యంతశుచియు స♦మాధియుతుఁడు
వశ్యుండునం బ్రజాపతిసన్నిభుండును, శ్రీమంతుఁడును ధాత ♦ రిపుహరుండు
జీవలోకావన♦శీలుండు ధర్మసం, రక్షుండు నిజధర్మ♦రక్షణుండు
తే॥ స్వీయజనగోప్తయును సాంగ♦వేదతత్త్వ, నిపుణతముఁడు ధనుర్వేద♦నిష్ఠితుండు
సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞ♦చతురుఁడనఘు,స్మృతియుతుఁడును బ్రతిభావి♦శేషయుతుఁడు.

ఇట్లు లాశ్రితు లనుభవింప యోగ్యమగు దివ్యమంగళవిగ్రహమును జెప్పి యిఁక నాశ్రితుల రక్షింప ననువగు గుణములఁ జెప్పుచున్నాఁడు.

శస్తధర్మవిదుండు = శుభమైన ధర్మము దెలిసినవాఁడు. శరణాగతరక్షణమే ప్రశస్తధర్మము.

తే॥ మైత్రి భావించి తాన సంప్రాప్తుఁడైన, వాని నెట్టులైనఁ జేపీనువాఁడగాను
వాని యెడనుండెనేని నెద్దేనిదోష, మద్దిగ్రాహ్యంబుగాదు సదాళులకును.

అని రాముఁడు విభీషణుఁడు శరణుచొచ్చినపుడు చెప్పెను.

సత్యసంధుండును = నిజమైన ప్రతిజ్ఞగలవాఁడు.

కం॥ విడిచెదఁ బ్రాణములైన, న్విడిచెద నిన్నైనఁ దమ్మునిన్ విడిచెద నే
విడుతునె ప్రతిజ్ఞనందుం, బుడమిసురలతోడఁ బల్కి ముద్దాగొప్పుపున్. ఆరణ్య.౧౩౮

సకలభూజనహితసతతరతుఁడు = సకలప్రాణులకును మేలుచేయుటయం దెల్లప్పుడు నాసక్తిగలవాఁడు - ప్రజలమేలునకై కదా తన సంసారసుఖము నాశము చేసికొని సీతను వాల్మీకాశ్రమమునకుఁ బంపుట

సద్యశఃపూర్ణుండు = ఆశ్రితసంరక్షణము లోనగువానివలన సంపాదించిన యశస్సుచేఁ బరిపూర్ణుఁడు. 'తస్యనామ మహద్యశః' యని శ్రుతి.

ఒక స్త్రీని గాపాడుకొనలేక పరులపాలుచేసె నని సీతావిషయంబునను, భార్యానిమిత్తమై తమ్మునిఁ గోలుపోయెనని లక్ష్మణమూర్ఛసమయంబునను నప కీర్తి వచ్చె ననికదా శ్రీరామచంద్రమూర్తి దుఃఖించెను.

యశశ్శబ్దముచేఁ గీర్తియును గ్రహింపవలయును. శత్రువధవలనఁ బరాక్రమమువలనఁ గలిగినది కీర్తి. జ్ఞానసంపన్నుఁడు =(1) సర్వవిషయికజ్ఞానముతోఁ గూడినవాఁడు. 'య స్సర్వజ్ఞ స్సర్వవి' త్తని శ్రుతి. సర్వజ్ఞతయేకదా యాశ్రితరక్షణార్హుఁడు - (2) బ్రహ్మజ్ఞానము గలవాఁడు. కావుననేకదా జటాయువునకు మోక్ష మియ్యఁగలిగెను.

అత్యంతశుచి = మిక్కిలిశుద్ధుఁడు - ఋజుస్వభావముగలవాఁడు.

సమాధియుతుఁడు = (1) ఆశ్రితుల నెవ్వరెవ్వరి నెప్పుడెప్పు డెట్లెట్లు రక్షింతునా యను నెడఁదెగనియాలోచనము గలవాఁడు, (2) తనతత్త్వమును యోగసమాధియందుఁ దెలిసికొనవాఁడును.

వశ్యుండు = (1) ఆశ్రితులకుఁ బరతంత్రుఁడు. (2) పిత్రాదులకుఁ బరతంత్రుఁడు.

ప్రజాపతిసన్నిభుండు = బ్రహ్మతో సమానుఁడు, బ్రహ్మాదులకంటె సర్వోత్కృష్టుఁడయ్యుఁ బ్రజారక్షణార్థము బ్రహ్మవిష్ణుమహేశ్వరు లనునట్లు బ్రహ్మాదులలో నొకఁడుగా నవతరించె నని భావము. త్రిమూర్తులలో నొకఁడుగా నెన్నఁబడు విష్ణుమూర్తి యవతారమూర్తియే కాని పరవాసుదేవమూర్తిగాదు. నిజాంశమూర్తులైన బ్రహ్మరుద్రులను రెండుచేతులవలె గ్రహించి వారిచే సృష్టిసంహారకార్యములు చేయించుచు రక్షాకార్యము తాను జేయుచుండును. శ్రీరామచంద్రమూర్తి సాక్షాద్విష్ణువేకావునఁ బ్రజాపతిసన్నిభుఁ డని చెప్పఁబడెను.

శ్రీమంతుఁడు = జగద్రక్షణమునఁ బురుషకారి యగు లక్ష్మితో నిత్యసంబంధము గలవాఁడు. ఇచ్చట మతుప్ప్రత్యయము నిత్యసంబంధమును దెలుపును. 'రాఘవత్వే భవే త్సీతా, రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేషు చావతారేషు విష్ణోరేషా నపాయినీ.' —విష్ణుపురాణము.

ధాత = పోషకుఁడు.

రిపుహారుండు = (తనకు విరోధి యని చూడఁదగినవాఁ డెవ్వఁడు లేఁడు గావున) ఆశ్రితవిరోధుల సంహరించువాఁడు.

ఇఁక భగవంతుఁ డవతారములనొందఁ గారణములగు గుణములఁ జెప్పుచున్నాఁడు.

జీవలోకావనశీలుఁడు = ప్రాణిసమూహములఁ గాపాడుట స్వభావముగాఁ గలవాఁడు. కొందఱు తమవారినిమాత్రము భరింతురు. ఈయనయో సమస్తలోకములందలి సమస్తప్రాణులను భరించువాఁడు. 'కం॥ లోకచయభర్త శుభమతి, యాకోసలతనయ గాంచె మహనీయుఁ' - ఇది సీతోక్తి. సుందర. ప ౯౪౭. లోకములో సమస్తప్రాణులను రక్షించునెడఁ బాపాత్ములనుగూడ రక్షింపవలదా? వారి నేల శిక్షించుచున్నాఁ డని ప్రశ్నింపరాదు. ఏలన.

ధర్మసంరక్షకుండు = తా నాచరించియుఁ బ్రజలచే నాచరింపించియు ధర్మసంస్థాపనము చేయువాఁడు. ధర్మమందుండువారి నిప్పుడే రక్షించును. అధర్మమందుండువారికో వ్రణరోగికి శస్త్రచికిత్స గావించి యారోగ్యముకలిగించు శస్త్రవైద్యునివలె వారిపాపము కష్టానుభవముచేఁ బోవునట్లు చేసి రక్షించును. కష్ట

ములు పాపపరిహారకములు. భోగములు పుణ్యపరిహారకములు. కష్టములు దాపరించినపుడు మనపాపము హరింప భగవంతుఁ డట్లు కావించె న. తలఁపవలయునేకాని ద్వేషబుద్ధిచే నట్లు చేసె నని తలఁపరాదు. బంగారును బుటమువేసిన ట్లని తలఁపవలయును.

నిజధర్మరక్షణుండు = (1) తనదియగు శరణాగతరక్షణ మను విశేషధర్మమును విశేషముగా రక్షించుకొనువాఁడు, (2) వారి వారి వర్ణాశ్రమధర్మములను రక్షించువాఁడు, (3) తా ననుష్ఠింపవలసిన ధర్మములను దాను దప్పక యనుష్ఠించి కాపాడువాఁడు. 'శ్లో॥ ధర్మోపదేశసమయే, జనా స్సర్వేపి పండితాః, తదనుష్ఠానసమయే మునయోపి నపండితా' యన్నట్లు లోకులందుఁ బరులకు బోధించుపండితులు తఱుచు గానవత్తురుగాని వానిని స్వయముగా నాచరించువారు కానరారు శ్రీరామచంద్రమూర్తి యట్లు కాదు. తా నాచరించి యితరులకు మార్గదర్శి యగును 'రాముఁడు చేసినట్లు చేయుము. కృష్ణుఁడు చెప్పినట్లు చేయు' మనికదా లోకోక్తి.

స్వీయజనగోప్తయును = తనవారినిఁ గాపాడువాఁడు. (1) కొందఱు ప్రభువులు పరులనుమాత్రము కాపాడుదురుగాని తమవారిని రక్షింపరు. ఈయనయో తమవారిని రక్షింపఁ దమకపడుచుండును. శ్లో॥ దాస్య మైశ్వర్యభావేన జ్ఞాతీనాంచ కరోమ్యహమ్, అర్ధభోక్తాచ భోగానాం వాగ్దురుక్తానిచ క్షమే॥ యని భగవద్వాక్యము. స్వీయజనమునకును గోప్త యని సముచ్చయగర్భితవిగ్రహము, స్వజనరక్షణము దుర్లభ మని సముచ్చయభావము. (2) స్వీయజనులు శరణాగతులు. వారిని విశేషించి రక్షించువాఁ డని విగ్రహములోని సముచ్చయ నభిప్రాయము. రక్షణమందలి విశేష మేమన — శరణాగతిచేసినవారియందు దోషము లున్నను వానిని లక్ష్యపెట్టక రక్షించుట. తే॥ మైత్రి భావించి తానసంప్రాప్తుఁడైన। వాని నెట్లైనఁ జేపిఁడువాఁడఁగాను। వానియెడ నుండెనేని నేదేనిదోష। మద్ది గర్హ్యంబుగాదు సదాళులకును॥ అని తానే చెప్పెఁగదా. (3) సాధుజనంబుల సంరక్షసలుపఁ। బాధింప దుష్కృతి పరులైనవారి। జగతి ధర్మంబు సంస్థాపనసేయ। యుగయుగంబునఁ బుట్టుచుండుదునేను. -ద్వి. భ.గీ. ౪ అధ్యాయము. ఈ వాక్యప్రకారము నాలుగుపదముల కర్థమగు జీవలోకావనశీలుఁ డనుపదమునకు స్వీయజనగోప్త యనునది వివరణము. ఈ పదములు సాధుజనపరిత్రాణమును దెలుపును. ధర్మసంరక్షుఁడు నిజధర్మరక్షణుఁ డనునవి సామాన్యధర్మములను విశేషధర్మములను రక్షించువాఁ డని తెలుపును. స్వీయజనగోప్తయును నను సముచ్చయము దుష్టసంహర్త యనుటను తెలుపును. (2) ధర్మరక్షణుఁడు = తన వర్ణాశ్రమధర్మముల రక్షించుకొనువాఁడు (3) నిజధర్మము = తనస్వభావము - పరమునకంటెఁ బరమనుట - దానికి రక్షకుఁడు - శివ

నుర్భంగపరశురామజయాదులచే నది స్థాపితముగదా. ధర్మము = ధనుస్సు. నిజధర్మరక్షణుఁడు = సదాధనుర్ధరుఁడు. ఇఁక శ్రీరాముఁ డష్టాదశవిద్యాస్థానముల నెఱిఁగినవాఁ డనట తెలుపఁబడును.

సాంగవేదతత్త్వనిపుణతముఁడు = షడంగములతోఁగూడిన నాలుగువేదముల తత్త్వార్థజ్ఞానమున మిక్కిలి నేర్పరి. వేదము = తెలియఁదగిన సకలధర్మములను దెలుపునది యని వ్యుత్పత్తి. అది ఋగ్యజుస్సామాథర్వణము లని నాలుగువిధములు కలది. వేదార్థజ్ఞానమున సాయపడునవి వేదాంగములు. శిక్ష - వ్యాకరణము - ఛందము - నిరుక్తము - జ్యోతిషము- కల్పము నని యవి యాఱువిధములు. వేదములోని అకారాద్యక్షరములకు స్థానస్వరాదుల బోధించునది శిక్ష. వేదశబ్దసాధుత్వమును దెలుపునది వ్యాకరణము. పద్యలక్షణములు దెలుపునది ఛందము. ఇట వర్ణాగమము ఇట వర్ణలోపము ఇత్యాదులను నిశ్చయించునది నిరుక్తము. వేదోక్తకర్మానుష్ఠానమునకు నర్హవేళఁ దెలుపునది జ్యోతిషము. వేదోక్తికర్మముల యనుష్ఠానక్రమమును దెలుపునది కల్పము.

ధనుర్వేదనిష్ణితుండు=ధనుర్వేదమును జక్కఁగ నెఱిఁగినవాఁడు. ధనుస్సుపట్టవలసిన విధము బాణము సంధింపవలసిన విధము దానిఁ బ్రయోగించువిధము లోనగునవి చెప్పు శాస్త్రము ధనుర్వేదము ఇది యొకయుపవేదము. ధనుర్వేదశబ్ద ముపలక్షణము. ఇతరములైన యుపవేదములనుగూడ నెఱిఁగినవాఁడని గ్రహింపవలయును. ధనుర్వేదము క్షత్రియులకుఁ బ్రధానము గావున నది చెప్పఁబడినది. ధనుర్వేదము - ఆయుర్వేదము - గాంధర్వవేదము - అర్థశాస్త్రము అని యుపవేదములు నాలుగు. వైదిక ధర్మానుష్ఠానమునకు విరోధముగా రోగమువచ్చినపుడు ఔషధప్రతిపాదకమగు నాయుర్వేద ముపయోగించును. ఇవి ధన్వంతరి చరక సుశ్రుత వాగ్భటాది కృతములు. నాట్యగీతశాస్త్రము గాంధర్వవేదము. ఇది సామగానమున నుపయోగించును. భరతశాస్త్రాదులు. చాణక్య కామందకాది నీతిశాస్త్రము - అర్థశాస్త్రము - వైదికకర్మానుష్ఠానమునకై వలయు ద్రవ్యముల సంపాదించుటయం దుపయోగించును.

సర్వశాస్త్రార్థచతురుండు = సర్వశాస్త్రములు గోబలీవర్దన్యాయముగ ముందు చెప్పినశాస్త్రములుగాక తక్కిన యుపాంగములైన శాస్త్రములు. ధర్మశాస్త్రము, పురాణము, న్యాయశాస్త్రము, మీమాంస యని యవి నాలుగువిధములు. ధర్మశాస్త్రము - వేదపూర్వకాండార్థవివరణము. పురాణము= వేదాంతార్థవివరణము. న్యాయమీమాంసలు సకలపదార్థజ్ఞానమున కుపయోగించును. వాని తత్త్వార్థములు తెలిసినవారిలో నేర్పరి శాస్త్రార్థచతురుఁడు= శాస్త్రార్థతత్త్వజ్ఞచతురుఁడు.

స్మృతియుతుండు = శాస్త్రము లెన్ని నేర్చినను జ్ఞప్తియం దుంచుకొను శక్తిలేదేని వ్యర్థమేకదా? కావునఁ దెలిసినవిషయమును మఱవక బాగుగ జ్ఞప్తియం దుంచుకొనువాఁడు.

ప్రతిభావిశేషయుతుఁడు = ప్రతిభ యనఁగాఁ బూర్వము విన్నదియైనను విననది కాకున్నను వ్యవహారకాలమందు యుక్తికిఁదగిన ప్రతియుక్తి యప్పటి కప్పుడే తోఁచుబుద్ధి. అట్టి విశేషముతోఁ గూడినవాఁడు.

ఆక్షేపము.

ఓయి! వాల్మీకి యడిగిన ప్రశ్నములందును, నారదుఁ డిచ్చిన ప్రత్యుత్తరమందును విశేషణములన్నియు భగవంతుని పర్యాయములుగ నన్వయించి రామాయణమును బ్రహ్మవేదాంతగ్రంథమును జేసితివి. ఆ గుణములన్నియు సామాన్యముగ నుత్తమపురుషులయం దుండునవేకదా. మనుష్యపర్యాయమున నన్వయించుట కేదైన ననుపపత్తికలదా? అది లేనప్పుడు నీవు క్లిష్టకల్పనముచేసి గందరగోళము పెట్టెదవేల?

సమాధానము.

క్లిష్టకల్పనముచేసి లేనిదిసృష్టించిచెప్పవలసినంత కష్టదశ నాకేమియు రాలేదు. సామాన్యజనులను భగవదవతారమూర్తియని చాటించి మసిపూసి మారేడు నేరేడుకాయ చేసి జనుల వంచింపవలసినపనియు లేదు. అట్టిమాహాత్మ్యము పట్టదలయు లేవు. ఉన్నదున్నట్లు పూర్వులు చెప్పినట్లు నాకుఁ దెలిసినంత చెప్పవలయుననియే నా ప్రయత్నము. శ్రీమద్రామాయణము ధ్వనికావ్యము. గూఢార్థగుంభితము. వ్యర్థపదము వ్యర్థవిశేషణ మొక్కటియుఁ గానరాదు. రామాయణార్థమును జక్కఁగ గ్రహింపవలయుననిన ననేకశాస్త్రములందు జ్ఞానమును సంపాదించి యుండవలయును. అజ్ఞానము లేనివారికి దాని యథార్థజ్ఞానము గలుగదు. అట్టి వేదవేదాంతశాస్త్రజ్ఞానములేని యంధప్రాయులు తాము నేర్చిన మూఁడు ముక్కలతో నర్థము చెప్పఁబూనినప్పుడు వారికి వాస్తవార్థ మెట్లు తెలియఁగలదు? తమకుఁ దెలియనిదాని నితరులు చెప్పినప్పు డసూయచేతను నజ్ఞానముచేతను నహంకారముచేతను వారు దురాక్షేపములు చేయుచుందురు. వాస్తవార్థమందు నారద మనఁగా మేఘము - జలము నిచ్చునది. అట్టిలే నారదమునకు నీరము లిచ్చుట స్వభావముగాని నిప్పులు గురియుట స్వభావముగాదు.

నారదుఁడనఁగా జ్ఞానదాత యని వ్యుత్పత్తివ్యాఖ్యానము మున్నే చెప్పఁబడెను. అట్టి జ్ఞానదాత శిష్యునకు జ్ఞాన ముపదేశించుట స్వభావముగాని తుచ్ఛమను ష్యవర్తనములు నవలలు బోధించుట స్వభావముగాదు. స్వభావవిరుద్ధము. కావున నారదుఁడు వాల్మీకి కుపదేశించినది మోక్షవిషయమే యయి యుండ

వలయును. ఈ నారదుఁడు నారాయణునివలన భాగవతశాస్త్రము విని పాంచ రాత్రాగమము నేర్పఱిచినవాఁడు. నారదపాంచరాత్ర మనియేకదా పేరు. సాత్త్వతశాస్త్ర మియ్యదియే. దీనినే ప్రాచేతసుల కుపదేశించెను. వాల్మీకి వ్యాసులకు నుపదేశించెను. వాల్మీకి యుపదేశము గొని శ్రీమద్రామాయణ మును రచించెను. వ్యాసు లుపదేశము నొంది శ్రీభాగవతమును రచించెను. ఇత్యాదికారణములచే నారదశబ్ద మాయనయందు సార్థకమైయున్నది. ఇన్నిటియం దాయన యుపదేశించినది మోక్షవిషయమైన భగవచ్ఛాస్త్రమేకాని త్రివర్గము గుఱించికాదు. ఇన్నిటియం దాయన వచించినది భగవంతునివిష యకమైన సత్యచరిత్రములేకాని పామరజనకథలు గావు. ఇచ్చటను భగవంతు నుద్దేశించిన భగవచ్ఛాస్త్రమునే యుపదేశించె ననుట యుక్తియుక్తముగాని స్వరూపవిరుద్ధమైన యేదోయొకరాజుకథను జెప్పె ననుట యుక్తియుక్తము గాదు. ఋషీశ్వరులు ఋషీశ్వరులు సంభాషించునపుడు లౌకికప్రసంగములు చేసి రనుట హాస్యాస్పదము. కావున వాల్మీకి ప్రశ్నించినది యవతారమూర్తిని గుఱించియే, నారదుఁడు బోధించినది యవతారమూర్తిని గుఱించియే. కావున మనుష్యపర్యాయముగను భగవత్పర్యాయముగను నన్వయించుటే స్వార స్యము. కాని యొకటిమాత్రమే యనుట సరసముకాదు రామావతారమందుఁ బరత్వము గూఢము. మనుష్యత్వము ప్రకటము కావునఁ దద్గ్రంథ మట్లే యున్నది. కావున రెంటిజ్ఞాన మావశ్యకమే. లోకములో హరిశ్చంద్రాదులు సత్యసంధులులేరా? కార్తవీర్యార్జునుఁడు లోనగు బలశాలురులేరా? రామ చంద్రమూర్తికంటె నెక్కువదుఃఖ మనుభవించిన హరిశ్చంద్రులు లేరా? శ్రీరామచంద్రుఁడవతారమూర్తి గాకున్న నాయనయం దేమివిశేషముగలదు? ఇట్టియర్థము ప్రశస్తమో 'నారదుఁడు మేఘుఁడు. మేఘుఁడు అవిరిస్వరూపము గలవాఁడు. వాల్మీకి పుట్టలోనుండి వచ్చునపాము. వాన ఋసగొట్టఁగా మేఘ ముఱిమె నని. బుస్సుబుస్సు అననిగానఁ బాము సుబ్బరాయఁడు. ఆయన దానినివ్రాసె' నని యీకాలపుభక్తిహీనులు చెప్పునర్థమె గ్రాహ్యమో బుద్ధి మంతు లాలోచింపవలెను.

ఇఁక వాల్మీకియో తపస్వి. మీఁదఁ బుట్టలు పెరిఁగినను దెలియనంతటి సమాధిలో దీర్ఘకాల ముండినవాఁడు. ఇట్టివాఁ డేలాఁటిముఁ గోరి రాజమాత్రుని గుఱించి ప్రశ్నించియుండును? వాల్మీకి యడిగిన ప్రశ్నములందలి గుణము లెట్టి వానియందైన నలఁగొలఁగా నుండునుగాని పూర్ణముగా నుండవు. అన్నిగుణ ములు పుంజీభవించి పూర్ణముగ నొకభగవంతునియందే యుండునుగాని నరమా త్రునం దుండవు. ఇట్టి సామాన్యవిషయ మెఱుఁగక వాల్మీకి ప్రశ్నించియుండునా? సామాన్యప్రశ్నయేని నారదునంతటివాఁ డాలోచించి చెప్పెద ననునా?

భగవంతునియందుఁ బుంజీభవించి పూర్ణముగనుండుగుణము లట్టులే పూర్ణముగ మనుష్యునియందుఁ గానవచ్చెనేని యతఁడు సాక్షాత్ భగవత్స్వరూపుఁడగును గాని నరమాత్రుఁ డగునా? కావున వాల్మీకిప్రశ్న యవతరించిన భగవద్విషయమే. ఉత్తరము అవతార మెత్తిన భగవద్విషయమే.

తాత్పర్యము.

ప్రశస్తమైన ధర్మజ్ఞానముగలవాఁడును, క్షత్రియులకుఁ బ్రశస్తధర్మము శరణాగతరక్షణము కావున దానిని ముఖ్యవ్రతముగా నాచరించువాఁడును, ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడును, సమస్తభూజనులకు మేలైనకార్యములను చేయుటయందే యాసక్తిగలవాఁడును, దానధర్మములు స్వాశ్రితరక్షణము మొదలైనవానివలన లభియించిన యశస్సును, శత్రువుల నణఁచుటచేఁ గలిగిన కీర్తియును గలవాఁడును, సర్వవిషయములు దెలిసినవాఁడును, బ్రహ్మజ్ఞానసంపన్నుఁడును, మిక్కిలి పరిశుద్ధుఁడును, ఋజుస్వభావముగలవాఁడును, ఆశ్రితరక్షణమందుఁ దత్పరుఁడును, ఆత్మతత్త్వ మెఱిఁగినవాఁడును ఆశ్రితులకును మాతాపిత్రాచార్యాదులకును వృద్ధులకును వశపడియుండువాఁడును, విష్ణువుతో సమానుఁడును, శ్రీమంతుఁడును జగమును ధరింపఁ బాలింప సమర్థుఁడును, ఆశ్రితశత్రువులను దనశత్రువులను నణఁచువాఁడును, ఎల్లప్రాణికోటుల రక్షించు కోరికగలవాఁడును, ధర్మము దా నాచరించుటయేకాక యితరు లాచరింపఁజేయువాఁడును, స్వధర్మపరిపాలకుఁడును, స్వజనరక్షకుఁడును, వేదవేదాంగములను రహస్యార్థములతో నెఱిఁగినవాఁడును, కోదండదీక్షాగురుండును, సర్వశాస్త్రములయర్థము నిస్సందేహముగ నిర్ణయించుటయందు నేర్పరియు, జ్ఞాపకశక్తిగలవాఁడును, విశేషప్రతిభగలవాఁడును.

ఉ॥ సర్వజగత్ప్రియంకరుఁడు ♦ సాధునదీనవిచక్షణుండు నే
సర్వసరిత్తులన్ జలధి♦నా సతతార్యజనాభిగమ్యుఁడున్,
సర్వసముండు, నార్యగుణ♦శాలి, సదైకమనోజ్ఞదర్శనం,
దుర్వార సర్వపూజ్యుఁడు, గు♦ణోత్తరుఁ డన్నిట, మానిసత్తమా! ౯౬

ఇఁక శ్రీరామచంద్రమూర్తి సదా సదుపాస్యుఁ డగుట చెప్పఁబడును. సర్వజగత్ప్రియంకరుఁడు = రావణాదిరాక్షసవధిచే ముల్లోకములకుఁ బ్రియముచేసినవాఁడు, యజ్ఞాదులు చేయుటచే దేవతలకును, న్యాయపాలనముచే భూలోకవాసులకును బ్రియముచేయువాఁడు, లోకుల కిందఱకుఁ బ్రియమును గలిగించువాఁడు; దానివలననే సత్పురుషు లీయనను సమీపింతురు. అసత్పురుషు లేయ సమీపింప రన:

సాధువు = పరులనమ్మించుటకు స్వప్రతిష్ఠ సృష్టించుకొని రక్షించుకొనుటకు "పటాటోపోభయంకర" యన్నట్లు వాగాడంబరముగాని వేషాడంబరముగాని లేనివాఁడు, ఆకారణముచే సాధువులుమాత్రమే చేరవత్తురు. నివురుగప్పిన నిప్పువంట యీయనమహిమ గనలేక యసాధువు లీయనయందు గౌరవమెంచక చేరరారు. విభీషణుఁడు వచ్చెఁగాని రావణుఁడు వచ్చెనా? భగవంతుఁడు కృష్ణుఁడే.

ద్వి. ఆతతమా నామహాభావమెదను । దెలియంగఁజాలని ధీవిరహితులు వలనుగ మనుజసంబంధదేహమును । జేకొన్న నన్ను పేక్షింతురు వార్థి । దైవియా ప్రకృతిని దవిలి మహాను । భావులు, భూతాద్య వ్యయవిరహితుని । నేకచిత్తమున నన్నే భజియింతు । రేకాలమున నన్నె యెలమిఁగీర్తింత్రు । నాకొఱకై ప్రయత్నము చేయుచుంద్రు । ప్రాకటంబుగ దృఢవ్రతపరులగుచు । నాకుఁగా నభివాదనములు గావింత్రు॥ ద్విపద భ. గీ. ౯ అధ్యాయము, యిట్లు చెప్పెఁగదా.

అదీనవిచక్షణుండునై, అదీనుఁడు=గంభీరప్రకృతిగలవాఁడు, విచక్షణుఁడు= వివిధవిషయములను జక్కఁగఁ జెప్పువాఁడు.

అదియునుంగాక, దివంబునంబోలెనను మహాకవిప్రయోగములవలె నిందు ద్రుతంబుపై ద్రుతంబు గానంబడియెడి. ఈగుణ ముండుటఁబట్టె సత్పురుషు లీయనను సేవింతురని చెప్పుచున్నాఁడు.

సర్వసరిత్తులన్ = సమస్తనదులచేత, జలధినాన్ = సముద్రమువలె, సతత= ఎల్లప్పుడును, అస్త్రాభ్యాసాదికాలములందును, ఆర్యజన = సత్పురుషుల సమూహముచేత, అభిగమ్యుఁడున్ = పొందఁదగినవాఁడును, సాము గరిడీలు చేసి విలువిద్య నభ్యసించుచు నడుమ నడుమ విశ్రాంతికై యొకచోట నిలిచినపుడు విశేషార్థములఁ దెలిసికొనుటకై సత్పురుషు లచ్చటను వీరిని జుట్టుకొని ప్రశ్నించుచుందురని భావము. అభియను నుపసర్గ ప్రయోగముచేత గుంపులుగ నలువైపులఁ జుట్టుకొని యుందురని యేర్పడుచున్నది. సర్వసరిత్తుల ననుచో సర్వశబ్దమిదే యర్థమునే బోధించును. నాలుగుదిశలయందుండియు నదులువచ్చి సముద్రములోఁబడునుగదా. అధిక ప్రవాహముచే నదులన్నియు నేకకాలమున వచ్చిప్రవేశించినను సముద్రము కలఁత నొందనట్లు చిత్రకూటమందు మరల రాజ్యముఁ గొమ్మని జాబాలినాస్తికవాదము చేసినను, భరతుఁడు వినయముతోఁ బ్రార్థించినను, వశిష్ఠుఁడు నీతి నుపదేశించినను, దల్లులు దుఃఖించుచుండినను రామునిమనస్సు క్షోభ చెందలేదని భావము. (౨) కొన్నినదులు వర్షాకాలమున నే సముద్రముతో సంగమించును. మహానదులైన నెప్పుడు నేకవిధముగ రావు. ఈయనయం దట్లుకాదు. సత్పురుషు లెల్లవేళల నేకరీతి నానాదేశములనుండి

యాశ్రయింపవచ్చు నందురని సతతశబ్దభావము. తనవలన నొక ప్రయోజనముఁ గోరివచ్చినవారితో వితండవాదములాడియో కసరియో పంపినయెడల నొకసారి వచ్చినవారు మరల రాకుండుటేకాక యావృత్తాంత మెఱిఁగిన యితరులును రాకుందురు. రాముఁ డట్లు చేయక వచ్చినవారిని మెచ్చికతో నాదరించి, చెప్పవలసినవి మంచిమాటలతోఁ జెప్పి పంపువాఁడగుటచే సదా వచ్చు చుండిరనియు భావము విరుద్ధకథాభిలాషి గాఁడని ముందుఁ జెప్పఁబడును.

రత్నాకరుఁడగు సముద్రునితో సంగమించిన నదులు నీటియందుఁ గొన్ని రత్నములు కలుగులాగున నీయన నాశ్రయింపవచ్చినవారి కీయన తన సద్గుణములు కొన్ని పట్టుపడునట్లు చేయుచుండెనని యభిగమ్యపద వ్యంగము.

రాజకుమారు లొకప్పుడేని వినోదార్థమై శృంగారాది రహస్యవేత్తలచే నటవిటగాయకులచే నాశ్రయింపఁబడుదురు ఈయన యట్లు గాదు. ఈయనయొద్దకు నార్యులేవత్తురుగాని యనార్యజనులు రారని యార్యజనపద ధ్వని. 'నదీనాం సాగరో గతిః' నదులకు సముద్రముతప్ప వేఱుగతి లేనట్లు ఆర్యులకు కీయన తప్ప వేరొకయాశ్రయములేదని సౌలభ్య ముపమానమువలన నేర్పడుచున్నది.

విద్యాప్రసక్తి లేనిచోట నేయిందఱు వచ్చినవారని నింత నింపునవు డెందఱు వచ్చియుందురో యూహింపవలయును అరియునగాక విలువిద్య నేర్చుచోటఁ జూచి చెప్పుటకు శాస్త్రగ్రంథము లుండవుగనుక సన్ని శాస్త్రములు ముఖస్థములనియు నందు నెట్టిసందేహములు లేవనియు నేర్పడుచున్నది

తే॥ అతఁడు విలువిద్యఁ గఱచెడు నప్పుడైన, జ్ఞానవృద్ధ వయోవృద్ధ సజ్జనులును
శీలవృద్ధులు నయిన విశిష్టజనులుఁ, గూడ నెస్సంప్రదాయంబు గోష్ఠిజరుపు.
—అయోధ్య॥౧-౨.

మహానదులుమాత్రమే సముద్రములోనికి వచ్చునట్లు గొప్పవారుమాత్రమే యీయనను జేరవత్తురని గ్రహింపవలయును. మఱియును సత్పురుషులు సమీపించుట శ్రీరామచంద్రమూర్తికిఁ దెలియనివిషయము లుపదేశించుటకుఁ గాదు. ఆయనవలన నేర్చుకొనుటకే యని సదార్యజనాభిగమ్యుఁడన్ అను పదమునకు భావము. ఈ తాత్పర్యము సర్వసరిద్భిర్ జలధినా నను నుపమానమువలన నేర్పడుచున్నది. నదులన్నియు వచ్చి కలియుటచే సముద్రమున కే లాభములేదు. నీరెక్కువయుఁగాదు. సముద్రములోఁ గలియునది మహానదియను ఖ్యాతి యవి తెచ్చుకొనును. ఈయన శ్రీరామచంద్రమూర్తితో మాట్లాడివచ్చినాఁడే - ఈయన యెంతగొప్పవాఁడో యను ఖ్యాతి సంపాదించుకొనుటకే విద్వాంసుఁ డాయనయొద్దకుఁ బోవుట.

ఎంతపెద్దనదియయినను సముద్రము చేరఁగానే దాని పేరుపెంపు మాయమైపోవునట్టు లెంతగొప్పవిద్వాంసుఁడైనను జ్ఞానియైనను యోగియైనను శ్రీరా

ము చంద్రమూర్తియొద్దకు రాఁగానే సూర్యునిముందట చంద్రునివలె నగును. యాదృగ్గుణేనభర్త్రాస్త్రీ, సంయుజ్యేత యథావిధి। తాదృగ్గుణా సాభవతి సముద్రేణేవ నిమ్నగా.—మ ౯-౨౨. ఎటువంటి గుణములుగల భర్తను స్త్రీ గలిసికొననో సముద్రముచేత దానిలోఁ గలిసిన యేటివలె నాస్త్రీ యట్టిగుణములు గలదేయగును. అనిచెప్పుటచే శ్రీరామచంద్రమూర్తిగుణములవంటి గుణములు గలవా రగుదురని యుపమానసారస్యము. 'యథోదకంశుద్ధే శుద్ధమాసిక్తం తాదృగేవ భవతి. ఏవం మునే ర్విజానత ఆత్మాభవతి గౌతమ॥ యను కఠోపనిషన్మంత్రము. జీవాత్మ పరమాత్మను జేరినపుడు పరమాత్మ సత్యకామ సత్యసంకల్పత్వాది గుణములే జీవాత్మకుఁ గలుగుననికదా తెలుపుచున్నది. తాదృగేవ = అటువంటిదే.

సన్నవంకనైనను మహానదినైనను సముద్రుఁ డెట్లు తనలోనికిఁ దీసికొనునో యట్లే తనయొద్దకు వచ్చినవారిని నల్పులనైనను నధికులనైనను నాదరించునే కాని వెనుకకుఁ బంపఁడని భావము

శ్రీరామచంద్రుఁడు రాజకుమారుఁడుగదా యెవరనినవారు సమయాసమయములు గమనింపక సేవకులయనుజ్ఞలేక ముందుగాఁ జీటీలనంపి యనుమతి పొందక తటాలునఁ బోవచ్చునా ? యనిన, నదులు సమయాసమయములువేచి కాచియుండి సముద్రములోఁ గలియునా ? అట్టులే యందఱుఁ దన్నెల్లవేళలఁ గొలువఁగూడినంతేట సర్వజన సులభుఁడని యింకఁ జెప్పుచున్నాఁడు.

ఆర్యజనాభిగమ్యుఁ డనుటచే ననార్యులకు దూరమున నుండువాఁడని భావము. దూరస్థం చాంతికేచ తత్—భ. గీ. ౧౩-౧౫ అని కలదుగదా.

ఆర్యగుణశాలి. ఆర్యులు = అందఱు నాశ్రయింపఁదగిన గొప్పవారు. అట్టివారి గొప్పగుణములతోఁ బ్రకాశించువాఁడు. అయినను గొప్పవారికి సులభుఁడే కాని కొలఁదివారికిఁ గాఁడుగదా యనరాదు. ఏలయన.

సర్వసముండు = సత్పురుషులకు మాత్రమేకాక జాతి వయస్సు గుణము సంపత్తు లోనగు భేదముల నెన్నక సమస్తజనులకు సమానుఁడు. బాలురు, పేదలు, నల్పులు నైనను దమకు విరామ మున్నకాలములో శ్రీరామచంద్రమూర్తిని దర్శింపఁ నైనఁ బోవచ్చును, గాని రామచంద్రమూర్తి కిది విరామ కాలమా దర్శింప సమయమా యని విచారింపఁ బనిలేదు. వేఱుపని యేదియు లేక స్వామిదర్శనమునకై వచ్చితి ననినను ద్వారపాలుఁడు లోపలకు విడువవలయునేకాని యడ్డగింపరాదు. 'అసతిబాధకే సర్వంవాక్యం సాధారణ' మ్మను న్యాయ మనుసరించి యీయన సర్వసముఁడే. మఱియొకప్పుడు రా - మఱియొక విధముగ రా యని చెప్పుటలేదు.

సర్వసముఁ డనఁగా యోగ్యతాయోగ్యతావిచారములేక యల్పులను నధికులను సమముగా నాదరించి మహాత్ముల కిచ్చు నాసనములను పామరుల కిచ్చి వారికిఁ జేయుగౌరవము వీరికిఁ జేయు నని యర్థముగాదు. యోగ్యతానుసారముగా నాదరించుచు గొప్పవారికిఁ దగినట్లు గొప్పవారిని గొలఁదివారి యోగ్యతకుఁ దగినట్లు కొలఁదివారిని నాదరించు నని భావము

ధర్మసందేహములు గలిగి పరిష్కరించుకొన వచ్చువారియందుమాత్రమా యీ సర్వసమత్వము, లేక పామరులయందును గలదా యనుసందేహము దీనఁ జెప్పుచున్నాఁడు.

సదైకమనోజ్ఞదర్శనుఁడు = ఎల్లప్పుడు నేకవిధముగ మనోహరమైన దర్శన మిచ్చువాఁడు. ఈయనను సదా దర్శనము చేసికొనుచున్నను జనులకుఁ జాలు నను తలంపు గలుగదు. ఎప్పటి కప్పుడు క్రొత్తగానే కనఁబడుచుండును. విజ్ఞులకును సమస్తార్థముల నుపదేశించుటచే నట్టివారికే రావచ్చునుగాని యితరులు రాఁగూడ దనుమాట లేదు. ఈయన సౌందర్యమును జూచి యానందింపఁగోరువారును కేవల దర్శనార్థమై వత్తురనట. భగవద్దర్శనమునకు సమయాసమయాదినియమములు లేవు. సనకసనందాదులు జయవిజయులను శపించిన కథ స్మరించునది. కావుననే,

ఉర్విని సర్వపూజ్యుఁడు = కావుననే భూలోకమున సజ్జనులచేతను బూజింపఁబడు యోగ్యుఁడు. నీచవారికిని గొప్పవారికి సులభుఁడగుటచేతనే యెల్లరు పూజింతురు.

అన్నిట గుణోత్తరుఁడు = అన్నివిషయములందును సమస్తగుణములచేతను శ్రేష్ఠుఁడు - శ్లో॥ ఇషుక్షయా న్నివర్తంతే, నాంతరిక్షక్షితిక్షయాత్ । మతిక్షయా న్నివర్తంతే, నగోవిందగుణక్షయాత్. విలుకాఁడు బాణములు ముగియుటచే నివర్తించుచున్నాఁడుకాని యాకాశమున నెడములేక కాదు. అట్లే స్తుతి చేయువాఁడు మనస్సునకు శక్తిలేక చాలింపవలసినదేకాని భగవంతునియందు గుణములు లేకకాదు - అనునట్లు భగవద్గుణము లసంఖ్యములు గావున నన్నిటిని బ్రత్యేకించి చెప్పుట శక్యముగాదు. కావున సంగ్రహించి గుణోత్తరుఁడని కవి చెప్పెను. ఇది యనిర్వచనీయలక్షణముఁ దెలుపుచున్నది. కొందఱు భగవంతునియందు గుణములు లేకుండుటచేఁ జెప్పుటకేమియు లేమిని ననిర్వచనీయుఁ డందురు. కొందఱు భగవంతుఁడు సత్తుగాఁడు, అసత్తుగాఁడు, కావున ననిర్వచనీయుఁ డందురు. ఆ యభిప్రాయముల నిది నిరాకరించి భగవంతుని కల్యాణగుణము లనంతములగుటచే వానిని మనస్సుచే నూహించుటకు వాక్కుచే వర్ణించుటకును సాధ్యముకామిని ననిర్వచనీయుఁ డను వారి యభిప్రాయము

స్థిరపఱుచుచున్నది. "యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" యనిక దా శ్రుతి - ఆకాశమున బాణము చిమ్మిన నది పోవుట కాకాశమున నెడములేకయా వెనుకకు వచ్చుట? కాదు. పోవశక్తిలేక. అట్టులే భగవద్విషయమున వాక్కు, మనస్సు.

ఛందస్సు.

పద్యంబు ఉత్పలమాల. భ-ర-న-భ-భ-ర-వ గణములు. ౧౦ వ స్థానమున యతి.

తా త్ప ర్య ము .

సమస్తప్రపంచమునకుఁ బ్రియమును జేయువాఁడును, సాధువును, గంభీరప్రకృతిగలవాఁడును, అన్నివిషయములు చక్కఁగ బోధించువాఁడును, సమస్తనదులు సముద్రమునకై పాఱునట్లెల్లప్పుడు నార్యులకుఁ బొందఁదగియుండువాఁడును, అందఱియందును సమముగ వారివారియోగ్యతకొలఁది వర్తించువాఁడును గొప్పగుణములు గలవాఁడును, ఎల్లప్పుడు నేకవిధమై మనోహరమైన దర్శనమిచ్చువాఁడును, సమస్తభూతకోటికిఁ బూజ్యుఁడును, అన్నిట గుణశ్రేష్ఠుఁడును, ఇట్టివాఁ డెవఁడయ్యా, యందువేని.

సీ॥ అతఁడు కౌసల్యాత్మ♦హర్షవృద్ధికరుండు, గాంభీర్యమునను సా♦గరముఁ బోలు
ధైర్యంబునను హిమ♦ధరణీధరముసాటి, వీర్యసమున్నతి ♦ విష్ణునిభుఁడు
ద్విజరాజుగతిని సం♦ప్రియదర్శనుండును, బ్రళయాగ్నిసముఁడు కో♦పంబు గదుర
నోరుపుగుణమున ♦ నుర్వీసమానుండు, ధనసంకాశుండు ♦ త్యాగమునను
తే॥ నపరధర్మునియట్టివాఁ♦డతులసత్య, పరత మునిరాజచంద్ర! యా♦పరమపురుషుఁ
డతనికిని నుద్దిగలరయ్య♦యరయ నెంత, రాజమాత్రుండె శ్రీరఘు♦రామవిభుఁడు.

అతఁడు = మీఁదఁజెప్పిన గుణములుగలవాఁడు, కౌసల్యాత్మహర్షవృద్ధికరుండు = కౌసల్యాదేవిమనస్సున సంతోషమును వృద్ధిపఱచువాఁడు, కోసలదేశమురాజు కూఁతురు కౌసల్య. రాముఁడు తండ్రిపేరు చెప్పఁజాలనివాఁ డని యా కవి తండ్రి పేరు చెప్పక తల్లి పేరు చెప్పెనని తలఁపరాదు. దశరథుఁడు కామపాశబద్ధుఁడై తన యసత్యఫలముఁ దా ననుభవింపక నిష్కారణముగ శ్రీరాము నడవులకుఁ బాఱఁదోలెను. ఆయన స్వలాభము చూచుకొనెఁగాని పరులకష్ట మాలోచింపలేదు. అట్టివాని పే రేమని ముందుగఁ జెప్పవలయును? కౌసల్య నవమీవ్రతములు చేసి యుప్పిఁడి చప్పిడి దిని కనినది. -భర్త లోకాంతరగతుఁడైనను బుత్రవాత్సల్యముచే జీవించియుండి శ్రీరామచంద్రమూర్తిపట్టాభిషేకముఁ గన్న ధన్యురాలు. అట్టిధన్యత దశరథునకులేదు. అతఁడు "భువిజను లెవ్వరా భువనపూజ్యుని రాము సనీతు లక్ష్మణుఁ సవురుగ నుండి రాఁగనఁగఁజాలుదు రట్టివారు ధన్యు"లని దశరథుఁడు యేడ్చి యేడ్చి

చచ్చెను. పండ్రెండు నెలలు శ్రీరామచంద్రమూర్తిని గర్భమున ధరించినది కౌసల్యయే. ప్రథమ ముఖదర్శనము కౌసల్యకే. పాలు నీళ్లుపోసి ముద్దులాడి సంతోషించినది కౌసల్యయే. బాలక్రీడలు చూచి యానందించినది కౌసల్యయే. అట్టి ధన్యత కౌసల్యకుఁ గలిగెను.

కౌసల్యాసుప్రజా రామా! యని విశ్వామిత్రుఁడు రాముని సంబోధించెను. 'లోకచయభర్త శుభమతి యా కోసలతనయ గాంచె' నని సీతాదేవివచనము. సాక్షాద్విష్ణువు ముఖదర్శనము మొదట(గౌసల్యకేగాని దశరథునకుఁగాదు. ఆనందానుభవము నట్టులే.

దశరథపుత్రుఁ డనిచెప్పిన నాయనకుఁగల మూఁడ్వొందల ముప్పది భార్యలలో నీయన యెవతెకుఁబుట్టెనో రాజ్యార్హత కలదో లేదో యను సందేహము కలుగకుండుటకై పట్టమహిషియైన కౌసల్యపేరే కవి చెప్పెను. కౌసల్య కొక్కఁడే కొడుకు. లేకలేక పుట్టినవాఁడు. కావున నెక్కువ ప్రీతిపాత్రుఁడు. దశరథునకో నలుగురు కొడుకులు. అట్టులుండియు విశ్వామిత్రుఁడు శ్రీరామచంద్రమూర్తినిఁ దనవెంటఁ బంపుమని యడిగినప్పుడు పామరుఁడై స్వసంతోషలాభమును జూచుకొని నేను బంపుటలే దనెను. కౌసల్యయో పుత్రుని శ్రేయస్సు కీర్తిప్రతిష్ఠలు కోరి మాఱుమాటచెప్పక యంగీకరించెను గాని తనయొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని ముద్దులాడుచు నానందము ననుభవింపవలయు నని తలఁపలేదు.

శ్రీరామచంద్రమూర్తి కౌసల్యానందవర్ధనుఁ డనుటచే దశరథునకు దుఃఖప్రదుఁడని యర్థముకాదు. 'రామో రతికరః పితు' అని కలదుకదా. ఈవాక్యముచేతను, రామవియోగము సహింపలేక ప్రాణములవిడుచుటచేతను గౌసల్యకంటె దశరథున కెక్కువ ప్రీతి యనిచెప్ప సాధ్యపడదు. లోకమునందు సాధారణముగా బిడ్డలయందుఁ దండ్రులకుండు ప్రీతికంటెఁ దల్లులకే యెక్కువప్రీతి. శాపచోదితమైన దశరథునిమృతికి రామవియోగము నిమిత్తమయ్యెను. వానప్రస్థునిశాపములేదేని దశరథుఁడు రామవియోగముచేఁ జచ్చియుండునో యుండఁడో. కౌసల్యానందవర్ధనుఁడని నారదుఁడును, కౌసల్యాసుప్రజారామ యని విశ్వామిత్రుఁడును, 'కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ' యని సీతయుఁ జెప్పినపుడు దానికి విరుద్ధమైన వ్యాఖ్యానము చేయుట సరిగాదు. ప్రేమదాసి కౌసల్య. కామదాసుఁడు దశరథుఁడు. "ప్రాణాతురుఁడైనచోఁ బరిణయంబుల పట్లను బల్కుబొంకు సత్యాతిశయంబ యండ్రు." "వారిజాక్షులందు వైవాహికములందుఁ బ్రాణ వృత్తి మానభంగమందు బొంకవచ్చు నఘము పొందఁ"డని శాస్త్రములుచెప్పుచుండ రతికై కైకేయితోఁ జేసిన ప్రమాణమునకు భంగము కలిగిన ననత్యభయములేదు. ఆఁడుదానికి లోఁబడి కామదాసుఁడై కొడుకును కోడలిని నడవులపాలుచేసె నని లోకమున నవమానము ప్రాప్తించుననియు

నెఱుఁగును. ఆకారణముచే బొంకినను బొంకియుండవచ్చును. ఈయనపోమ్మ న్నను బోవలదనినను కైకేయితోఁ జెప్పినమాటప్రకారము శ్రీరామచంద్ర మూర్తి యడవులకుఁ బోవుట సిద్ధము. అట్లుండ నడవికిఁబొమ్మని వస్త్రాదులుమూట కట్టి యియ్యకుండిన నీవుపోవుట నాకు సమ్మతములేదని మాటమైనఁ జెప్పియుం డవచ్చునుగదా. అప్పుడు నింద యీయనయందు లేకపోవును.

దశరథునకంటెఁ గౌసల్యయే ప్రశంసనీయయగుటచే నామె పేరు చెప్పఁబడెను. కుశలభావము కౌశల్యము. శసల కభేదముకావునఁ గౌశల్యమే కౌసల్యము. కౌశల్యయనియు రూపాంతరముగలదు. కుశలశబ్దమునకు సామర్థ్యము పుణ్యము క్షేమము నిపుణత్వము నను నర్థములు గలవు. ఇవన్నియుఁ గలది కౌసల్య. అతఁడు కౌసలానందవర్ధనుఁడు = మీఁదఁజెప్పిన గుణముగలవాఁడు కౌసల్యాపుత్రుఁడగు విష్ణువేకాని బ్రహ్మాదులలో నెవ్వఁడు కాఁడని భావము. "నాహంనాహం నచాహం నచభవతి పున స్తాదృశో మాదృశేషు" నేనగాను నేనుగాను అట్టివాఁడు మాలోఁ లేఁడు, అని గజేంద్రునిమొఱ విని బ్రహ్మాదులన్న వాక్యము స్మరించునది. "గీ. విశ్వమయతలేమి వినియు నూరకయుండి, రంబుజా సనాదు లడ్డపడక, విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు" భాగ. ౮-౯౪. గొప్పవంశమున జనించుటచేతను, బట్టపుదేవిపుత్రుఁడగుటఁబట్టియు రాజ్యార్హ తయును గుణములును నీయనకుఁగలవని చెప్పఁబడును. ఇఁక (నీయనకు సరివారును మించినవారును లేరని చెప్పుటకై) లోకములోని యుత్కృష్టవస్తువులతో నీయన యొక్కొక్కగుణమునకును సామ్యముఁజెప్పి యట్టి గుణములన్నియు నీయనయం దుండుటఁబట్టి యీయనకు సరివారును నీయనను మించినవారును లేరని తెలు పుచున్నాఁడు.

గాంభీర్యమునను సాగరముఁబోలుఁ = గాంభీర్యమున సముద్రమునకు సమానుఁడు. గాంభీర్యము = తనలోఁతు (రహస్యవిషయము) బయలుపడకుండ దాఁచుకొనుగుణము. సముద్రము తనయందలి రత్నాదులను వెల్లడిచేయనట్లు లీయనయుఁ దనపరత్వము బయలుపడనీయఁడని భావము. "మనుజుఁడనని దశ రథనృపు,తనయుఁడ నని రాముఁడ నని తలఁతును." యుద్ధ ౧౨౦౧౧ ప. అని ముందు చెప్పఁగలఁడు. ఇది యుపమేయమునకుఁ దగిన యుపమానము గాదు. నీచోపమ యనియుఁ జెప్పనగు. అయినను మనకుఁ గానవచ్చు లౌకిక పదార్థములలో గాంభీర్యమున సముద్రమునకంటె గొప్పదిలేదు. మనకుఁ గాన వచ్చు సముద్రములోఁతు మనకుఁ దెలియదే. ఇఁక నిట్టి యనేక కోటిబ్రహ్మాం డము లొక్కొక్కరోమకూపమునఁగల భగవంతునిరహస్యము నెవఁ డెఱుఁగఁ గలఁడని యూహింపసాధ్యపడుటకై యీ యుపమానము ప్రయోజనపడును. ఇట్టులే తక్కినవియు నని తెలిసికొనవలయును.

HYDERABAD (DECCAN)

సముద్రములోఁతు కేవలము గూఢముగాదు. సముద్రమున మునిఁగి ముత్యములు దెచ్చువారుకలరుగదా. త్రాడువేసి కొలిచినవారు కలరుగదా. అట్టులే రాముఁడు తనయందు నిండుమనస్సుతో మునిఁగినవారికిఁ దనరహస్యము వెలిపుచ్చును. శాస్త్రవాక్యములచేఁ దెలిసికొనువారి కామాత్రమే తెలియనిచ్చును. సముద్రమునందు మహాపర్వతములు గలవు తిమి - తిమింగిల - తిమింగిలగిలాది మహామత్స్యములు గలవు చేఁపపిల్లలు నెండ్రకాయలు గలవు. ఇన్నిటివిషయములో సముద్రుఁ డేకవిధముగానే యుండును. అట్టులే శ్రీరామచంద్రమూర్తి తన్నాశ్రయించినవారిలో వీరు గొప్పవారని వీరు కొలఁదివారని యాలోచింపక యందఱ నేకవిధముగ రక్షించును. ఈ యుపమానముచుట్టి భగవంతుఁడు తనతత్త్వము నెవ్వరికి నేమియుఁ దెలియకుండఁ బూర్ణముగఁ దాఁపవలయు ననుసభిప్రాయము కలవాఁడుకాఁడనియు నెవరి కెంత శక్తి శ్రద్ధయో యంతమాత్ర మెఱుఁగనిచ్చుననియు భావము ఆదినుండియు సత్యమువఱకుఁ దన యవతారరహస్యమును వెలిపుచ్చినవాఁడుకాఁడు. బ్రహ్మాది దేవతలు నీవు నారాయణుండవని స్తుతించినపుడును.

'కం॥ మనుజుఁడనని దశరథనృప । తనయుఁడనని రాముఁడనని తలఁతును నన్నుఙ్ఞ. అనియే మర్మమువిడువక మాటలాడెను వేషమునకుఁ దగినభాష గదా యుచితము.

ధైర్యమునను హిమధరణీధరముసాటి = ధైర్యగుణమున హిమాలయపర్వతముతో సమానుఁడు. ధైర్యము = దుఃఖకారణ మున్నను దుఃఖపడకుండుట వర్షము పిడుగు తనపైఁ బడుచున్నను హిమాలయము స్థిరముగా నున్నట్లు దుఃఖకారణము లనేకము లున్నను నీయన దుఃఖింపఁడని భావము. "గిరయో వర్షధారాభిర్హన్యమానా నవివ్యథుః । అభిభూయమానా వ్యసనైర్యథాఽధోక్షజచేతస" యని ప్రయోగము (విష్ణువును మనస్సునందుంచుకొనినవారు వ్యసనపీడితులైనను జలింపనట్లు వర్షధారలకుఁ బర్వతము వ్యథపడలేదు.) విష్ణువును మనస్సునం దుంచుకొన్నవారే వ్యసనపీడితులు కానప్పుడు విష్ణువు కాఁగలఁడా ? ఇదియును వేఱుగతిలేక 'ఇషువ గ్గచ్ఛతి సవితా' బాణమువలె సూర్యుఁడు సూటిగాఁ బోవుచున్నాఁ డని చెప్పినట్లని యెంచవలయును. పట్టాభిషేకభంగసమయమునఁ దననిమిత్తముగా నితరులు దుఃఖించెదరే యని లోకవిడంబనార్థము దుఃఖనటనము గావించెననియుఁ దెలియునది. చూ. అయోధ్య౯౨ - ౯౨౨ ప.

హిమవత్పర్వతము ఎండతాఁకునఁ దపించి కరఁగిపోవుచున్నట్లు పైకిఁగనపించినను లోపల నెట్టితాపము లేకయున్నట్లు రాముఁడును గష్టములచేఁ బైకి వ్యసన

పడినట్లు కానవచ్చినను నవి యాయనయంతరంగమును భేదింపఁజాల వయ్యె నని తెలియవలెను.

వీర్యసమున్నతి విష్ణునిభుఁడు = వీర్యగుణాతిశయమున విష్ణునిభుఁడు - ఉపమాలంకారమున నుపమానము ఉపమేయము భిన్నములై కదా యుండవలయును. రాముఁడు విష్ణునిభుఁ డన్నప్పుడు వారిరువురు భిన్నులే కాని యొకరు కారుగదా యని పూర్వపక్షము. సిద్ధాంత మేమన తక్కిన యుపమానములు నాఁటికి నేఁటికి జనులకుఁ గన్నులకు గోచరించునవియై యున్నవి. వీర్యమున నాకాలమువారితోఁ బోల్చిన నీకాలమునందలి మన మెట్లూహింపఁగలము ? కావున లౌకికసామ్యము గ్రహింపఁబడలేదు. శ్రీరామచంద్రమూర్తి విష్ణువర్థాంశము. కావున సంపూర్ణవిష్ణుభేదము చెల్లును. ఏకదేశముపఁ బూర్ణత్వాంశము లేకుండుటచే సంపూర్ణవస్తుభేదము చెల్లును. "స ఉ శ్రేయాన్ భవతి జాయమాన" పరత్వదశకంటె నవతారదశయం దెక్కువ శ్రేయోవంతుఁ డగుచున్నాఁడు. యని శ్రుతియుఁ జెప్పుటఁబట్టియు నంశాంశులకు సామ్యము యుక్తము. (2) విష్ణునిభుఁడు = వీఁడఁజెప్పినకారణముచే మనుష్యు నుపమానముగా గ్రహింప వలనుపడనపుడు ఇఁక దేవతలయం దొకని నుపమానము చెప్పవలయును. దేవతలయం దాయనతో సమానుఁ డాయనయే కాని వేఱొకఁడు లేఁడు. కావున నాయన కాయనయే సమానుఁ డని చెప్పఁబడెను. అనన్వయాలంకారము. ఉపమేయమునకు గుణమున వేఱొక యుపమానము లేకుండుటచే నా యుపమేయమే యుపమానముగా గ్రహించిన ననన్వయాలంకార మగును. సముద్రమునకు సముద్రమే సాటియన్నట్లు. ఏవస్తువును వర్ణింపఁదలఁతుమో యట్టి ప్రస్తుతవస్తువు ఉపమేయము. దానికి సమానముగ దూరమునునుండు నేవస్తువును జెప్పుదుమో యది యుపమానము. శ్రీరామచంద్రమూర్తి ఉపమేయము. సముద్రము హిమాలయము లోనైనవి యుపమానములు. రెంటియందు సమానముగా నుండు గాంభీర్యము, ధైర్యము మొదలగువానికి అలంకారశాస్త్రమున సామాన్యధర్మము లనిపేరు. వీర్యమున విష్ణునిభుఁ డనుటయందు మఱియొకవిశేషము స్ఫురించెడి. దుర్వాసునిపైఁ బ్రయోగింపఁబడిన విష్ణుచక్రము బ్రహ్మాదిసమస్తదేవతల కెట్లు ప్రతిహతమో రామబాణ మట్టిదియని తాత్పర్యము. కాకాసురునిపై వైచిన దర్భపోచను నివారింప బ్రహ్మాదు లెవ్వరు సమర్థులు కాకపోయిరికదా.

సముద్రము నుపమించుటచే గాంభీర్యతాపహరత్వసౌలభ్య తేజోవత్త్వాది గుణంబులు గ్రాహ్యములు.

ద్విజరాజుగతిని = చంద్రునివలె, సత్ప్రియదర్శనుండు=ఇట సత్పదము సమస్తలోకమున కుపలక్షణము. ఇంతకంటెఁ బ్రియదర్శనము గల పదార్థము వేఱొం

డులే దని భావము. దుఃఖనివృత్తియు నాహ్లాదమును గలిగించునని యీయుపమానము భావము. వృద్ధిక్షయము కలంకముగల చంద్రునికంటె శ్రీరామచంద్రుఁడు సదా ప్రియదర్శనుఁ డని భావము.

కోపంబుగదురర్ = కోపము కలిగెనేని యనుటచే స్వభావముగాఁ గోపగుణము లేదనియుఁ బొరుగూరివస్తువు నీయూరికిఁ దెప్పించుకొనునట్లు రప్పించుకొనవలయుననియు, నదియు నాయన కపరాధము చేసినపుడు రాదనియు, నాయనయాశ్రితుల కపరాధముచేసిన వచ్చుననియు గ్రహింపవలయును.

ప్రలయాగ్నిసముఁడు = ప్రలయాగ్నిజ్వాల శీతలమైననీటియం దెట్లు కలుగునో యట్లుశాంతియుక్తమైనయీయాయనమనస్సుననొకానొకప్పుడుకోపముకలుగుననియు వచ్చినపు డది యప్రతిహతమనియు నెఱుంగవలయును. అగ్నిహోత్రమును జల్లార్పవలసినది నీళ్ళు. అట్టినీళ్ళలోనే యగ్నిపుట్టిన దాని నెట్లు చల్లార్ప సాధ్యపడును? ఈకోపము తన్ను పరాభవించువారిపై రాదు. తనయాశ్రితులఁ బరాభవించినను వారి కొకకీఁడు కలిగించినను వచ్చును.

ఓరుపుగుణమున నర్వీసమానుండు = తన విషయమున నెవరెంతట యపరాధము చేసినను నచేతనమగు భూమివలె సర్వము సహించు నని భావము. "అపరాధశతము సల్పిన, విపరీతము నెంచఁ డాత్మవిజ్ఞుం డగుటర్" అని ముందు చెప్పఁబడును. భూమికివలె శ్రీరామచంద్రమూర్తికి నోర్పు సహజగుణ మని భావము.

త్యాగమునను ధనదసంకాశుండు = దానమునఁ గుబేరునివంటివాఁడు. 'త్యాగీచ ధనదో యథా' యని ముందనేకవచనములు కుబేరునిదానగుణమును జాటించుచున్నవి. 'రాజానై శ్రవణో దదాతు' అనియును గలదు. కుబేరుఁడు లోభి యని యెచ్చటను జెప్పఁబడలేదు. కావున నీ యుపమానము యుక్తము. త్యాగమునను=దానముచేయుచున్నను, ధనదసంకాశుండు=కుబేరునివంటిధనికుఁ డని యొకరు వ్యాఖ్య వ్రాసిరి. అది సరిగాదు. గుణవర్ణనము చేయునపు డది యుక్తి యుక్తము గాదు. ధనికత్వ మొకశ్లాఘ్యగుణము గాదు. దాతృత్వమే గుణము. దాతృత్వముచెప్పక ధనపతిత్వముచెప్పిన లోభగుణము చెప్పినట్లగు. 'కృతేయుగే బలిర్దాతా త్రేతాయాంరఘునందనః ద్వాపరేసూర్యపుత్రశ్చ' యను నదియు, స్మరింపనగును. ఎవనియనుగ్రహ మప్టైశ్వర్యములకునంతకుమించిన యుత్తమదశకుఁ గారణమగునో యట్టివాఁడు తనకుఁగలదానిలో నిచ్చువానికంటె నుత్తముఁడు కదా. ధన + ద=ధనమునిచ్చువాఁ డని - ధనదశబ్దార్థము. దానముచేయునపుడు విశేషించి దానముచేయుటయందు దృష్టియుంచునుగాని ధనముపోవునేమో యని తలంచువాఁడు కాఁ డని భావము. అతులసత్యపరతర్=సాటిలేని సత్యమే ప్రధానముగాఁ గలిగియుండుటయందు.

అపరధర్ముని యట్టివాఁడు = రెండవధర్మదేవతవంటివాఁడు. ఇట నుత్ప్రేక్షా లంకారము. లోకములోని హరిశ్చంద్రునివంటి సత్యసంధులందఱు నసత్యదోష ము తప్పుంటకుండఁ గాపాడుకొనుచుండిరిగాని యితరుల కసత్యదోషము రాకుం డఁగాపాడినవారుకారు. రామచంద్రుఁడో తాము సత్యమందునిలుచుటే కాక దశర థుని సత్యవ్రతమును కాపాడెను. (2) అ + పరధర్ముఁడు = విష్ణువుయొక్క యుత్కృష్టధర్మమును గలవాఁడు. అకారవాచ్యుఁడు= విష్ణువు. అకారమే నారా యణుని మొదటిపేరు. ఆయన పరధర్మ మేదిగలదో లోకరక్షణము దానిని గలవాఁడు. సత్యస్వరూపుఁడు సత్యమయుఁడు సత్యకాముఁడు సత్యసంకల్పుఁడు భగవంతుఁడే. అతులశబ్దమువలన నిది జీవాత్మల కన్వయింపదు. అట్టివాఁడనుట అంశాంశులభేదముచే నని యెఱుంగవలయును.

రాజమాత్రుండె?= ఇది వ్యతిరేకార్థమును బోధించు ప్రశ్న. అనఁగా శ్రీ రామచంద్రమూర్తి అందఱురాజులవంటిరాజు గాఁడు. మనుష్యమాత్రుఁడును గాఁడు. కావున నాయనయందుఁ గేవలరాజని బుద్ధినుంచక పరబ్రహ్మ మనియే యుంచు మని భావము.

తాత్పర్యము.

అట్టివానిని చెప్పెద వినుము. ఆయనయే కౌసల్యానందము నభివృద్ధిఁజే యుచుఁ గౌసల్యానందనుఁ డని పేరొందినవాఁడు. గాంభీర్యమునందు సముద్రుని వంటివాఁడు. ధైర్యమున హిమవత్పర్వతమునకుఁ దుల్యుఁడు వీర్యాతిశయమునందు విష్ణువుతో సమానుఁడు. చంద్రునివలెఁ జూచుటకుఁ బ్రియమైనవాఁడు. కోపం బునఁ బ్రళయకాలాగ్నికి నుద్ది ఓరుపునందు భూమి. దానమునందుఁ గుబే రునిఁ బోలును. అసమానమైన సత్యసంధత్వమునందు ధర్ముని మాఱుమూర్తి. ఇటువంటి పురుషోత్తమునకు సరియైనవారు లోకమున వెదకినను లేరు. శ్రీరా మచంద్రమూర్తి సామాన్యరాజని తలంచితివా యేమి?

౪. రామునినేతత్సుగుణా,రామునివిక్రమునపరాక్రమ జ్యేష్ఠున్
సామగుణాఢ్యునిఁ బ్రియునిన్, భూమిజనహితప్రసక్తుఁ బోరిఁ బ్రకృతులకై. ౧౮

జగత్కారణుం డనియు, సర్వజ్ఞుండనియు, సర్వశక్తుఁడనియు, సర్వాంతర్యామి యనియు, వేదాంతముల సకలకళ్యాణగుణవంతుఁడుగాఁ జెప్పఁబడు బ్రహ్మత త్త్వము శ్రీరామచంద్రమూర్తిగా నవతరించిన విష్ణువా? బ్రహ్మేంద్రాదులలో నొకఁడా? యని వేదార్థము విశదీకరించుటకై వాల్మీకి ప్రశ్నింపఁగా వేదాం తోక్తసకలగుణములును ఇతరులయందు లేమింజేసియు విష్ణువునందు మాత్రమే యుండుటంజేసియు విష్ణువే వేదోక్తపరబ్రహ్మ మని నారదు లింతదాఁక నుప దేశించెను. వేదాంతములయందుఁ బరతత్త్వనిర్ధారణప్రకరణముల నుపయో

గించిన స్వయంభూశివాదిశబ్దములు అవయవవృత్తిగానో పర్యవసానవృత్తిగానో విష్ణువుకే వాచకములు అనుటయు నిట సూచితముకాఁగా నింతవఱకు వేదాంతసారము చక్కఁగా వివరింపఁబడెను. వేదాంతములయందు బ్రహ్మస్వరూపమువలె మోక్షమును దదుపాయంబును జెప్పఁబడియున్నవి. వానినేల వాల్మీకి ప్రశ్నింపలేదు? అని ప్రశ్న ప్రత్యుత్తరమేమనఁగా సంప్రశ్నము గావించె ననఁగా బాగుగాఁ బ్రశ్నముచేసె ననికదా యర్థము. మోక్షతదుపాయములఁగూడఁ బ్రశ్నించెననుట 'బాగుగా' నను పదమునకుఁ దాత్పర్యము. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అనుచోట నభిప్రాయముగూడ నర్థమగుట కలదుగదా. కావున వాల్మీకి ప్రశ్నింపలేదనుట యుక్తముగాదు. ఉత్తరముచెప్పునపుడు "సకలభూజనహితసతతరతుఁడు" అని భగవంతుఁడు మోక్షోపాయంబుగాను, "సదైకప్రియదర్శనుఁడు" అని భగవదనుభవమే మోక్షఫలముగాను నారదుఁ డుపదేశించెను. గావున వేదాంతోక్తసకలార్థములును నిందుఁ జెప్పఁబడియె. భగవంతుఁడు మోక్షసాధనమయ్యెనేని యతఁడు సర్వసముఁడయి సర్వత్ర యుండ నందఱకేకకాలమున మోక్ష మేల కలుగలే దనుట యుక్తము కాదు. భగవంతుఁడు సర్వసముఁడయి సర్వత్రయున్నను నధికారులకే మోక్షమిచ్చును. అనధికారుల కియ్యఁ డని వ్యవస్థశాస్త్రములం దున్నది. సర్వసముఁ డన యోగ్యతాయోగ్యతలు విచారించి వారివారి యోగ్యతకుఁ దగినఫలము నిష్పక్షపాతబుద్ధితో నిచ్చువాఁ డని యర్థమేకాని త్రిగుణాతీతున కిచ్చు ఫలమునే తమోగుణభూయిష్ఠుఁడైనవానికి నిచ్చుననికాదు. మోక్షేచ్ఛయు సాధనాంతరపరిత్యాగ మనునవి యధికారిలక్షణములు. ఎవ రేది కోరిన నది యిచ్చుట భగవంతుని వ్రతము. ఐహికసుఖములు కోరినవానికి నైహికసుఖముల నిచ్చును. మోక్షము కోరినవానికి మోక్షము నిచ్చును. ఉత్కృష్టమైన మోక్షసుఖముఁ గోరువాని కదియు నానుషంగికముగ నైహికసుఖముల నిచ్చును. గాని నికృష్టమైన యైహికసుఖములాసించువానికి వాని యోగ్యతకుఁ దగిన యైహికఫలములనే యిచ్చునుగాని మోక్షమియ్యఁడు. మోక్షాధికారులు కొందఱె యప్పుడప్పుడు పుట్టుచుందురు. అందఱును గాలక్రమమున ముక్తులే యగుదురు. రామాయణము వేదార్థమును వివరించునది యని మొదటనవతారికలోఁ జెప్పఁబడెను. రానురాను వేదాంతార్థమే చెప్పఁబడుచున్నది. వేదపూర్వభాగార్థ మింతదాఁక నేలచెప్పలేదు? ఇఁకఁ బైగ్రంథమునఁ జెప్పఁబోవు నర్థమేది?

ఇంత వఱకుఁజెప్పిన శ్రీరామచంద్రమూర్తియొక్కగుణంబులకును, జెప్పని గుణములకును, వారిచరిత్రమూలకముగా దృష్టాంత మిఁకఁ బైగ్రంథమునఁ

జెప్పఁబడును. శ్రీరామచంద్రమూర్తి మొదలైనవారి యాచారములమూలమున సామాన్యవిశేషధర్మములను నటఁ జెప్పఁబడును గావున వేదపూర్వభాగార్థమును విశదపఱుచును.

బాలకాండమున శ్రీరామచంద్రమూర్తియొక్క గుణముల కుదాహరణమగు విషయము లంతగా లేవు. కావున విశదముగాఁ జెప్పలేదు. కాని యింతకు ముందే సూచనగాఁ జెప్పఁబడెను. ఎట్లన.—

'జనియించెనయ్యా యిక్ష్వాకువంశంబున' ననుటచే శ్రీరామచంద్రమూర్తి అవతారమూర్తియనియు, '... సల్యాణ్మహాభ్యుదయ...' డనుటచే జననము, మహానిస్తులవీర్యుఁ డని తాటకావధయు, వరధను ర్వేదనిష్ఠుఁ డని విశ్వామిత్రునియొద్ద సకలాస్త్రగ్రహణమును, శ్రీయుతుఁ డని సీతావివాహమును, దారుణుఁ డాతఁ డని పరశురాము భంగపాటును గల బాలకాండకథలు సూచితంబులు. ఇఁక నయోధ్యాకాండకథను బ్రారంభించుచున్నాఁడు.

కం॥ రాముని నేతత్సుగుణా,రాముని నిర్వక్రవిక్రమ...

సామగుణాఢ్యునిఁ బ్రియునిఁ,భూమిజనహితప్రసక్తుఁ బొలిఁ బ్రకృతులన్. ౯౮

కం॥ తనయుని దశరథమహిపతి, యనుమతి యువరాజుఁ జేయఁ దలపోయుచుఁ జయ్యన జతనము గావింపఁగఁ, జనవుమెయిం దదభిషేకసంభారంబుల్. ౯౯

దశరథమహిపతి = దశరథుఁడు — పదిదిక్కులయందును దనరథమున కెదురులేనివాఁడు. ఇంతటిపరాక్రమశాలి కావున భరతుఁడులేనిసమయమున శ్రీరామచంద్రమూర్తికి రాజ్యమియ్యఁబూనుట కేకయరాజునకు భయపడికాదనియు న్యాయ మనుసరించియనియుఁ దాత్పర్యము.

మహిపతి = సర్వభూమికిని దానే స్వామి. తన సొత్తును దానొకని కియ్య స్వాతంత్ర్యముగలవాఁడు. కాఁబట్టి తన సొత్తునే తన కొడుకునకు నిచ్చెను. కాఁబట్టి మఱియెవరికిని ఆటంకము లేదు. ఇట్లు శ్రీరామచంద్రమూర్తికి రాజ్యమిచ్చుటయందు దశరథుఁడు తప్పుచేయలేదని చెప్పి గృహీతయగు రామచంద్రమూర్తియందును దోషము లేదని చెప్పుచున్నాఁడు.

ఏతత్సుగుణారామునిఁ = ఇంతదాఁకఁ జెప్పిన సమస్తగుణములచేతను మనోహరుని. (2) ఆరామము = ఉద్యానవనము. దానియందు జనుల కుపయోగపడు ఫలవృక్షములు పూలచెట్లు లెట్లు పాదుకొని స్థిరముగ నుండునో యట్లు సుగుణములన్నియు శ్రీరామచంద్రునియందుఁ బాదుకొని స్థిరముగ నిలిచియున్నవని భావము.

మామిడివనము - అశోకవనము అన్నట్లు రాముఁడు సుగుణారాముఁడు. ఇట్లనుటచేఁ గల్యాణగుణములు భగవంతునందు స్వభావసిద్ధములేకాని యారోపితములుకావు. మాయగాడని భావము. మఱియెందుండియైనఁ జెట్లుగొట్టి తెచ్చి యొకచో వేసిన నది యారామమునఁబడదుగదా. ఆరామము దానియందు విహరించి క్రీడించి ఫలాదులగ్రహించి సంతోషించువారికి లాభకరమేకాని దానికేలాభము లేదు. అట్టులే భగవంతుని కల్యాణగుణములవలన నాయనకే లాభము లేదు. వానివలన మేలుపడువా రాయననాశ్రయించినవారే యనిభావము.

ఇట్టివాఁడు సర్వజగత్పతి యని భావము.

నిర్వక్రఘనపరాక్రముఁ = అకుంఠితమైన గొప్పపరాక్రమముగలవానిని. సర్వరక్షణశక్తుని ననుట. దీనివలన రాజ్యభరణసామర్థ్యము చెప్పఁబడియె.

తనయునిఁ = తనకుమారుని. కావున రాజ్యార్హుని 'కులం మదంవా తనోతీతి తనయః' 'తన విస్తారే' కులమునుగాని సంతోషముగాని విస్తరింపఁజేయువాఁడు.

జ్యేష్ఠుఁ = అంగఱుకొడుకులలోఁ బెద్దవాఁడు గానఁ బ్రథమముననే రాజ్యార్హుని.

సామగుణాఢ్యునిఁ = (1) సామదానభేదదండోపాయము లను నాలుగుపాయముల సంపత్తిగలవానిని. (2) సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, సమాశ్రయము నను నాఱుపాయములు తెలిసినవానిని. దీనిచే రాజ్యరక్షణోపాయము తెలిసినవాఁ డని చెప్పఁబడియె.

ప్రియునిఁ = సదా ప్రీతిపాత్రుని. తాత్కాలికప్రీతిచే రాజ్య మీయలే దని భావము. ఇతరులకుఁ దనయందుఁ బ్రీతిగలిగించుట యద్భుము కమలము ఫలములకుఁబోలె శ్రీరామచంద్రమూర్తికి సహజగుణ మని భావము.

జనహితప్రసక్తుఁ = జనుల కందఱకు మేలుచేయువానిని. అనఁగా సర్వానుకూలుని. అందఱు శ్రీరామచంద్రమూర్తికి రాజ్యమీయఁగోరిరేకాని ఈరాదని యాక్షేపించువాఁ డెవ్వఁడు లేఁడని భావము. దీనిచే శ్రీరామచంద్రమూర్తికి బ్రజారక్షణకాంక్ష ముఖ్యమనియుఁ దక్కిన రాజులవలె భోగకాంక్ష కాదనియుఁ దెలియనగును.

రామునిఁ = ప్రజలమనస్సును రమింపఁజేయువానిని. "రమయతి సర్వాన్ గుణై రితి రామః." ఈయన గుణములను గని యుతనియందు జనులందఱు రమింతురు కావున రాముఁడు "రమన్తే ఽస్మిన్ సర్వేజనా గుణై రితి రామ" యని యోగార్థములు.

ఈ విశేషణములు రాముఁడు రాజ్యమును బాలింప యోగ్యతగల వాఁడని తెలుపుచున్నవి.

పౌరిఁ ప్రకృతులకై = ప్రకృతు లనఁగా మంత్రులు, అమాత్యులు లోనగు వారు. ప్రకృతులకై = మంత్రులు లోనగువారికోరిక నెఱవేర్చుటకై. పుత్త్రుఁడని యభిమానము తనకున్నను, శ్రీరామచంద్రమూర్తి ప్రజానురాగము కలవాఁడైనను, రాజ్యాంగములోఁ జేరిన మంత్రులు మొదలగువా రొల్లరేని యీ కార్యము చేయరాదు. అయినను ఆ మంత్రులే శ్రీరామచంద్రమూర్తికి రాజ్యమిమ్మని కోరుటచే వారికోరిక నెఱవేర్చుటకుఁ బూనినవాఁడై. ప్రకృతులకై — ఈపద్యమందుఁ గ్రియలేదు. కావున వాక్యము ముగియలేదు. క్రిందిపద్యములతో నన్వయించినఁగాని ముగియదు. ఇట్టి యన్వయము రెండుపద్యములలోఁ గుదిరిన యుగ్మక మందురు. ఈ విషయమున నీ శ్లోకములు ప్రమాణంబులు. "కులకం బహుభిః శ్లోకైః సాకాంక్షై రేకవాక్యతా, ద్వాభ్యాంతు యుగ్మకంనామ తుల్యార్థాభ్యాంతు చుంబకమ్," "ద్వాభ్యాం యుగ్మమితిప్రోక్తం త్రిభిశ్శ్లోకైర్విశేషకమ్। కలాపకం చతుర్భిస్స్యాత్ తదూర్ధ్వం కులకం స్మృతమ్." ఏకాన్వయముగల రెండుపద్యములకు యుగ్మకమనియు మూఁటికి విశేషకమని నాల్గింటికిఁ గలాపకమనియు నంతకుఁ బైపడినఁ గులక మనియుఁ బేరు.

పౌరిఁ = మిక్కిలి - అనుటచేఁ దన పుత్త్రాభిమానమునకంటె మంత్రులకోరిక నెఱవేర్చుపనిగొప్పదిగాఁ దలఁచె నని భావము.

చనవునఁ = మచ్చికచే. మంత్రులతో నాలోచించి తాను మిక్కిలిప్రీతితోఁ దలపెట్టుకొన్న కార్యము కావున నిఁక తప్పుట యసాధ్యము.

యువరాజుఁ + చేయఁ = తండ్రి రాజ్యమేలుచుండఁగా నాయనకుఁ గార్యభారము తగ్గించుటకు, రాజకార్యముల నేర్చుకొనుటకు రాజుగా నభిషేకింపఁబడువాఁడు యువరాజు. వెనుక వీఁడే రాజగును.

తనమతిఁ దలపోయుచు జతనముగావింపఁ = తనమనస్సున నాలోచించి యభిషేకము చేయఁబ్రయత్నింపఁగా. యత్నశబ్దభవము జతనము. తనమతి ననుటచేఁ దాను గోరెనేకాని రాముఁ డడిగినవాఁడు కాఁడు, కోరినవాఁడుకాఁ డనిభావము. ఈ విషయము దశరథుఁడుచెప్పువఱకు శ్రీరామచంద్రమూర్తికిఁ దెలియదుకదా! 'అతులధనార్జనంబు పరమార్థముగాఁ గఁదలంప' నని శ్రీరామచంద్రమూర్తి చెప్పుటచేతన ఆయన రాజ్యము కావలయునని కోరకుండుటచేతను నదిపోయినను ఆయనకు దుఃఖముకలుగలేదు. కామ ముండి విఘ్నపడినఁ గ్రోధము దుఃఖము కలుగును. కామములేనప్పుడు దుఃఖమే లేదు. దీనిచే నవతారప్రయోజనము సుఖానుభవమునకై కాదనియు లోకరక్షణార్థమే యనియు గ్రాహ్యము.

లోకరక్షణము యోగముచేతను క్షేమముచేతను జేయఁదగినది. యోగము = లేనిదికలిగించుట. ఇది మోక్షము. ఈమార్గ మనుష్ఠానపూర్వకముగఁ దెలిపెను. క్షేమము = ఉన్నదానిని రక్షించుట. ఇది వర్ణాశ్రమధర్మరక్షణముచేతను న్యాయపరిపాలనముచేతను కలిగించెను.

తా త్ప ర్య ము.

ఇటువంటి సుగుణాభిరాముఁడైన శ్రీరామచంద్రమూర్తిని, జ్యేష్ఠకుమారుని, మహాపరాక్రమశాలిని, సామగుణసంపదగలవానిని, తనకుఁ బ్రజలకుఁ బ్రియుఁడైనవానిని, భూజనలక్షేమమే కోరి ప్రవర్తించువాని, నమాత్యులు మంత్రులు లోనగువారి యభీష్టము నెఱవేర్చుటకై దశరథమహారాజు యువరాజుగాఁ జేయఁ దనమనస్సునం దాలోచించి పట్టాభిషేకమునకుఁ గావలసిన సంభారము లన్నియు సమకూర్చి యత్నింపఁగా.

చం॥ కనఁగొని ధారిణీశుసతి • కైకయి యాధరణీశు వేఁడఁగా
మును తన కిచ్చినట్టివర•ముల్ నెఱవేర్పఁగ, రాముఁ గానకుం
బనుప, నిజాత్మజుణ్ భరతుఁ • బట్టముగట్టఁగ, ధర్మపాశబం
ధనములఁ జిక్కి సత్యవచ•నప్రవణుం డయి కూర్మిపుత్రునిన్. ౧౦౦.

దశరథుఁడు తాను మరలఁ దీసికొనుటకు వలనుపడనట్లు రాజ్యము రామున కియ్య యత్నించె నని చెప్పి, యంతటిబలిష్ఠమై దశరథునకుఁ ద్రోయరానిదైన కైకయియాచనను జెప్పుచున్నాఁడు. ౧౦౦-౧౦౧ పద్యము లేకాన్వయము.

ధారిణీశుసతి = రాజగు దశరథుని భార్య. దశరథుఁడు తాను రాజగుటం బట్టి భోగార్థమై వివాహముచేసికొన్న భార్య కావున నామె ప్రార్థనము త్రోయుట సాధ్యముగా దని భావము.

కైకయి = కైకయి యను పేరుగలది. క × ఏక + యి = కము = సుఖము, ఏకము = ముఖ్యము, కైకము - దానిని బొందించునది కైకయి. భోగస్త్రీ యని యేర్పడుచున్నది. ఇట్లని శిరోమణికారుఁడు వ్రాసెను.

"కం శిరోంబు సుఖే క్లీబమ్" నానా. కం = శిరస్సు - ఉదకము - సుఖము అని యర్థము. 'య స్త్యాగే నిలయే వాయౌ యమే దాతరి యాంతరి, యాస్త్రీయాం యానమంజర్యోశ్శోభాలక్ష్మ్యోశ్చనిర్మితౌ.' నానా. యప్ర. త్యాగమునకు, స్నానమునకు, వాయువునకు, యమునికి, దాతకు, పోవుచున్నవానికిని పేరు. యా. స్త్రీ ఇది వాహనమునకు - పుష్పపుగుత్తికి - కాంతికి - లక్ష్మికి - చేయుటకును పేరు.

వ్యాకరణవిషయము.

కేకయదేశమునకు రాజు కేకయుఁడు. కేకయశబ్దముపై తద్రాజార్థకము అణ్ ప్రత్యయము వచ్చి లోపింపఁగా కేకయుఁడని రూపమేర్పడియె. కేకయరాజు కూఁతురు కైకేయి. కేకయశబ్దముపై అపత్యార్థకము. అణ్ ప్రత్యయముచేసి స్త్రీ ప్రత్యయము చేర్పఁగా కైకయియని రూపమగును. అపత్యార్థకము అణ్ ప్రత్యయముచేసినపుడు ఇయాదేశము వైకల్పికము. ఇయాదేశమువచ్చినపుడు కైకేయి యని రూపము. ఇయాదేశము లేనపుడు కైకయి యని రూపము. "కైకేయీ కైకయీ" యని శబ్దభేదప్రకాశిక. "ప్రాక్కైకయీతో భరత స్తథాభూ" దని భట్టికావ్యము.

కేకయి యనియు నొక రూపము గలదు దానిరూపనిష్పత్తి యెట్లన — కేకయుఁడు అనునది పూర్వమువలెనే. కేకయుని యోగము కలది కేకయి. యోగము = సంబంధము పితృపుత్రీభావ మిట గ్రాహ్యము. కేకయశబ్దమే స్త్రీలింగాంతమై గుణముగఁ బ్రయోగింపఁబడునని న్యాసకారుఁడు

తదభిషేకసంభారంబుల్ = ద్వితీయార్థమునఁ బ్రథమ. రామపట్టాభిషేకమునకుఁ గావలసిన పదార్థములు "ఔదుంబర్యాసందీతస్యై ప్రాదేశమాత్రాః దాన్య" యనునదిమొదలు "దధిమధుసర్పిరాతపవర్ష్యాఆప" యనునంతవఱకుఁ గల బ్రాహ్మణమునఁ జెప్పఁబడిన యుపకరణముల సవిధానము.

కనుఁగొని = తెలిసికొని, సమయముగఁ జూచినంత దృష్టముగ మంథరచే విని. మును = శంబరాసురయుద్ధమున.

వరముల్ = రెండుకోరికలు. శంబరాసురునితోడ దశరథుఁడు యుద్ధముచేసి మూర్ఛిల్లఁగాఁ గైకి దశరథుని వానిబారినుండి తప్పించి మూర్ఛదేఱువఱకు శిశిరోపచారములు చేయఁగా దశరథుఁడు సంతోషించి యిట్లు రెండుమార్లు రక్షించుటచేత రెండువరముల నిచ్చెను అవి తనయిచ్చవచ్చినపుడు కోరికొనునట్లు కైక దాఁచియుంచెను. అవియే యీవరములు. ఇఁక నాకోరికలఁగోరిన రీతిని దెలుపుచున్నాఁడు. "రాముఁగానకు" ననునదిమొదలు 'పట్టముఁ గట్టఁగ' ననువఱకు.

ఆమహీపతి = మంత్రులతోను బ్రజలతోను నాలోచించి శ్రీరామచంద్రమూర్తికి రాజ్యమిచ్చునట్లు సభలోఁ బ్రతిజ్ఞచేసిన యా దశరథమహారాజు.

మహీపతి = భూమిని బాలించువాఁడు అనుటచే నీయనకుఁ బాలనమందు మాత్రమే యధికారము వంశపారంపర్యముగ వచ్చినదగుటచే శాస్త్రప్రకారము జనులసమ్మతిప్రకార మెవరికిఁ బోవలయునో వారికిఁ బోవలయునే

కాని స్వార్జితమువలెఁ దన యిష్టప్రకారము వినియోగింప నధికారము లేనివాఁడు. అట్టివాఁడు జ్యేష్ఠున కీయక కనిష్ఠున కిచ్చుట మహాపాపకార్యము.

ధర్మపాశబంధనములన్ = ధర్మము పాశమువంటిది ధర్మపాశము. పాశము = ఉరి - దానియొక్క బంధనములన్ ఉరిత్రాళ్లకట్లయందు ధర్మమే పాశము. ధర్మపాశము - రూపకసమాసము. మయూరవ్యంసకాదులలోఁ జేరినది.

సత్యవచనప్రవణుండయి = స్త్రీవిషయమునఁ దా నాడిన యథార్థవచనములకు లోఁబడినవాఁడై, కుంఠితధర్మనిష్ఠుఁడయి ప్రియకుమారుని 'రామో విగ్రహవాన్ ధర్మ' యనునట్లు ఆకారముగొన్న ధర్మమగు శ్రీరామచంద్రుని వదలి స్త్రీవిషయమగు నీచధర్మము నవలంబించెను అని భావము.

'శ్లో॥ సాంకేత్యం పారిహాస్యం వా, స్తోభం హేళన మేవ వా। వైకుంఠనామగ్రహణ, మశేషాఘవినాశన' మనియు 'కామోహ్యస్తి నగో కల్ భయమునకు గలుగుదు' డనియు నిట్లు లెక్కలేని వాక్యవిధిచే భగవన్నామస్మరణము చేసినవానికి మోక్షము కలుగునని శాస్త్రములు చెప్పుచుండ శ్రీరామమూర్తియందుఁ బ్రీతి కలిగియు సదా రామరామయని స్మరించు స్వర్గ్యకులు గలుచుచు నుండు వాఁడయ్యును దశరథుఁడు ధర్మములలో హెచ్చుతగ్గులు తెలియక కాశకుశన్యాయ మవలంబించి సిద్ధమును త్యజించి సాధ్యోపాయము గ్రహించుటచేత మోక్షంబునంజెందక సత్యవచనమున స్వర్గంబునే చెందెనని తెలుపఁగా సామాన్యధర్మమైన సత్యమాడుటవలనఁ గలుగుఫలము స్వర్గము భగవంతుని నాశ్రయించినఁ గలుగు ఫలము మోక్షము. రాముని జేపట్టెడు దశరథునకు లేదాయె. ఇట్లు సంక్షేపమున వసుదేవునకు శ్రీకృష్ణుఁడు పుత్రుఁడని ప్రమాణము చేసి చెప్పియుండియుఁ గృష్ణుఁడు రక్షించునని యెంచనందున మోక్షప్రాప్తి ముముక్షువుగా నుండువాఁడు దశరథునివలె నాత్మనాశము కలుగక యుండఁగూడదను నీతి యేతచ్ఛ్లోకములవలన వచనములకుఁ దెలియును.

తాత్పర్యము.

ఆయత్నమును గైకేయి యను దశరథుని భార్య చూచి 'రాజా! పూర్వము నాకు నీవు రెండువరము లిచ్చితివి వానిని నేఁడు నెఱవేర్పవలసినది. అవి యేవనఁగా శ్రీరామచంద్రమూర్తి నరణ్యమునకుఁ బంపుట యొకటి, రెండవది నాకొడుకైన భరతునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయుట,' యని వేఁడఁగా సత్యముఁ దప్పరాదను ధర్మమును మీఱఁజాలక రాముని యందుకంటె సత్యమందే యెక్కువ ప్రీతిగలవాఁడై తనప్రియకుమారుని.

కం॥ రామునిఁ గానకుఁ జను మని, యామహిపతి పంప పీరుఁ • డయ్యుం జనియెన్
నేమము నడుపఁగఁ గయికకు, నామోదము గూర్చు జనకు•నాజ్ఞం దీర్పన్.౧౧౧

ఇంక౯ బితృవచనపరిపాలనము పుత్త్రుల కవశ్యకర్తవ్యమ్మను ధర్మమును శ్రీరామచంద్రమూర్తుల యాచారమూలమునఁ దెలుపుచున్నాఁడు.

వీరుఁడయ్యు౯ = (1) రాజ్యపరిపాలనశక్తిగలిగియు (2) దశరథునిఁ దిరస్కరించి పట్టాభిషేకము చేసికొనశక్తిగలవాఁడయ్యు.

కయికకు నామోదముఁగూర్పఁ జనకునాజ్ఞందీర్ప౯ = తండ్రి స్త్రీకిఁ బరవశుఁడై యక్రమమున వర్తించినను నతనియాజ్ఞ యనుల్లంఘనీయ మని భావము. తండ్రి న్యాయముగఁ జెప్పినను అన్యాయముగఁ జెప్పినను గొడుకు కాప్రకారము నడచుకొనవలయునుగాని తండ్రినాక్షేపించునధికారము కొడుకునకు లేదని భావము. తండ్రి యన్యాయమున వర్తించిన నాఫల మతఁ డనుభవించును. దానిని విచారించుటకుఁ గొడు కధికారి గాఁడు.

నేమము నడుపఁగ౯ = తాను గైకేయియెదుటఁ జేసిన ప్రతిజ్ఞ నెఱవేర్చుటకును "కం॥ భూమిపతి గురువు తండ్రియు, నామే లెడఁగోరు నెపుడొనర్తు నభీష్టం, బోమాత బాసచేసెద, రాముం డిరుమాటలాడ రా దెఱుఁగు మన౯" అయోధ్య ౧౧౮ ప. యని చెప్పెను.

ఆమోదము = సంతోషము.

చనియె౯ = దండకారణ్యమునకుఁ బోయెను.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తిని నడవులకుఁ బొమ్మని యారాజు పంపఁగా రాజ్యపాలనశక్తియుఁ దండ్రిని ధిక్కరించి రాజ్యముగ్రహించుశక్తియుఁ గల వీరుఁడయ్యును గైకకు సంతోషము గలిగించు జనకునాజ్ఞ నెఱవేర్పను, దాను గైకయితోఁ జెప్పినమాట నిలుపుటకును నరణ్యములకుఁ బోయెను.

శ్రీరామచంద్రమూర్తిని నరణ్యమునకుఁ బొమ్మనినది కైకగదా యను సందేహ మక్కఱలేదు. తొలుతఁ బ్రేరించినది కైకయయ్యును దాని నిరాకరింపకపోవుట యటుండ దానిని సమ్మతించి "గచ్ఛ స్వారిష్ట మవ్యగ్రః పంథాన మకుతోభయమ్" అయోధ్య. ౩౪-౩౧. అని స్పష్టముగఁ బొమ్మనియె దశరథుఁడు చెప్పెను.

సీ॥ అడవుల కారీతి ♦ నరుగుశ్రీరామునిఁ, గని తమ్ముఁ గుఱ్ఱఁడు ♦ కరముఁ బ్రియుఁడు
నయధురంధరుఁడు నన్నకుఁ బ్రీతిమంతుఁడు, ననఘసుమిత్రకు ♦ హర్షదుండు
నగు లక్ష్మణుండు నెయ్యంబు దీపింప హా!, సౌభ్రాత్ర మేపారఁ ♦ జనియె వెంట
రామునిప్రియభార్య ♦ రమణీయగుణచర్య, నయశీలహితలోల ♦ సాధునకును

ఆ॥ సతము ప్రాణతుల్య • జనకావనీశ్వర, మహితకులజ దేవ•మాయయట్లు
సంభవించి నట్టి•జానకి సద్గుణా,న్వీత వినుతచరిత • జాతపూత. ౧౦౨

"జనియించెనయ్య యిక్ష్వాకువంశంబున" ననునది మొదలు సకలకళ్యాణ గుణపరిపూర్ణతనుజెప్పి శ్రీరామచంద్రమూర్తికి సర్వస్వాత్వరత్వమును జెప్పెను. 'రాముని నేలత్సుగుణా రాముని'నను నది మొదలు సిద్ధముగానున్న పట్టాభిషేకము తప్పిపోయి యడవులకు వెడలెననుటవలన భగవంతునకుఁగల సౌలభ్యము చెప్పఁబడెను. ఇట్టి పరత్వసౌలభ్యములు గలవాఁడేకదా యాశ్రయింప యోగ్యుఁడు. కావున నిఁకఁ దదనుగుణముగ సమాశ్రయణంబు చెప్పఁబడుచున్నది. (2) సిద్ధోపాయంబు నవలంబించువారు లక్ష్మణునివలె సదా భగవత్కైంకర్యపరులై యనుకూలురై యుండవలయునని యిఁకఁ జెప్పుచున్నాఁడు. సిద్ధోపాయము = రక్షించువాఁడు భగవంతుఁడే. మన పురుషశక్తి సాధ్యము లయిన కర్మజ్ఞానయోగాదులు గావని భగవంతు నాశ్రయించుట.

పద్యాన్వయ మేకాన్వయము.

తమ్ముఁగుఱ్ఱఁడు = భ్రాత - 'భ్రాతాస్వామూర్తిరాత్మన' యనునట్లు తనయాకారమే యని భావము. తమ్ముఁగుఱ్ఱఁడు = చిన్నతమ్ముఁడు.

ప్రియుఁడు = శ్రీరామచంద్రమూర్తియందుఁ బ్రేమగలవాఁడు, ప్రేమరూపమగు భక్తిగలవాఁడు కావున నన్నతో నడవికిఁబోవుట యుక్తమే. 'సా ప్రేమరూపా' భక్తి ప్రేమరూపముగలది యని నారదభక్తిసూత్రము - లక్ష్మణునిభక్తి దాస్యభక్తి. ఇదియే శేషత్వము. లక్ష్మణుఁడే హనుమంతునితో "తద్వారధీసద్గుణరాజికిఁ వశుఁడనై దాస్యంబుఁ గాంచెంచెదిఁ" అని (కిష్కింధ ౧౩౯ప) చెప్పెనగదా.

నయధురంధరుఁడు = రామకైంకర్యానుకూలమగు వినయభారమును వహించినవాఁడు. వినయము = శేషత్వజ్ఞానము. శ్రీరామచంద్రమూర్తి స్వామి యని తాను దాసుఁడని తలఁచి స్వామికనుకూలమగు కార్యములఁ జేయుటయే శేషత్వజ్ఞానము. శరణాగతునకే కాక యెట్టి విద్యావంతునకు వినయము ప్రథమచిహ్నము. శేషుఁడు = సేవకుఁడు.

అన్నకుఁ బ్రీతిమంతుఁడు = అన్నయొక్క ప్రీతికర్హుఁడైనవాఁడు. దాసునికి స్వామియందుఁ బ్రీతియుండి స్వామికి దాసునియందుఁ బ్రీతిలేదేని శోభింపదు. దాసునియందే దోషమున్నదని యూహింపవలసియుండును. అట్టి దోషము లక్ష్మణునియందు లేదని భావము. 'యమేవైషవృణుతే తేనలభ్య' యను శ్రుతిరీతిని బ్రియుఁడై వరింపఁదగియున్నాఁడు. ఆత్మ నెవరు వరింతురో వారికే యాత్మ లభించును. ఆత్మ = పరమాత్మ - 'చిరముగ బ్రహ్మకుం దపము సేసి'

యన్నట్లు 'అన్నకు' అనుదానికి అన్ననుగూర్చి ద్వితీయార్థమున షష్ఠి. అన్న విషయమునఁ బ్రీతిగలవాఁ డని యర్థము. దీనివలనఁ బరస్పరప్రీతి చెప్పఁ బడెను.

అనఘసుమిత్రకు నాత్మజుండు = పాపహీనురాలైన సుమిత్రకుఁ గొడుకు. కైకేయివలె సుమిత్రయు శ్రీరామచంద్రమూర్తికి సవతితల్లియైనను నామెవలె శ్రీరామచంద్రమూర్తివిషయమున దురభిప్రాయము లేనిది. అనఘురాలైన సుమిత్రకు నాత్మజుఁడు కావున నామె యభిప్రాయము ననుసరించి లక్ష్మణుఁడు నడుచుకొనెను "రామునితోడ నరణ్యమునకుఁ బోవ జన్మించితివి పొమ్మాన తిచ్చెద" ననియు "తే॥ రాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు నిజము" అనియుఁ జెప్పెనుగదా. (అయోధ్యా ౧౦౭౭-౧౦౭౮ ప) సుమిత్ర మగధ రాజు కూఁతు రని కాళిదాసుఁడు రఘువంశమునఁ జెప్పెను. సుమిత్రకుమారులు సుమిత్రులై యుండుట వింతగాదు. ౨౮౭ ప. బాల. చూడుము.

సర్వభూతేషు మేద్యతి స్నిహ్యతీతి మిత్రః-ఞిమిదా స్నేహనే. సర్వభూతము లందు స్నేహయుక్తుఁడు (గురుబాలప్రబోధిక). సుమిత్ర కౌసల్యతో స్నేహయుక్తయైయుండినను కైకయియందు ద్వేషభావముకలది కాదు. అనఘయను విశేషణము కౌసల్యవలె రాగముగాని కైకేయివలె ద్వేషముగాని లేనిదని తెలుపు చున్నది.

లక్ష్మణుఁడు = లక్ష్మీసంపన్నుఁడు - రామశుశ్రూషయే లక్ష్మి. లక్ష్మణము = చిహ్నం. రామశుశ్రూషయే చిహ్నముగాఁ గలవాఁడు. ఇతఁడు రామశుశ్రూషాపరుఁడు కాఁగలఁ డని యోజించియే వసిష్ఠు లీపేరు పెట్టిరి. భగవద్భక్తియే లక్ష్మి. శ్రీకృష్ణుల పాదఘట్టనముచే నలిగులియై గర్వ ముడిగి భగవంతుని నాశ్రయించినపిమ్మట నతనిని 'సతు నాగవర శ్రీమాన్'' "సర్వశ్రేష్ఠుఁ"డని "శ్రీమంతుఁ"డని శుకుఁడు చెప్పెను. ఇల్లు వాకిలి పెండ్లాము బిడ్డలు ధనము లోనైనవన్నియు వదలి కట్టుబట్టలతో శ్రీరామచంద్రమూర్తిసన్నిధికి శరణాగతిసేయవచ్చిన విభీషణునిఁగూర్చి 'అంతరిక్షగత శ్రీమాన్'అని వాల్మీకి చెప్పెను. కావున నుభయలోకముల రక్షింపఁగలది శ్రీ=భక్తియే కాని యుండినను లేకున్నను బాధాకరమగు వెండి బంగారు మొదలైనవి కావు. ఇవి క్రమముగ నశించునవి. అది క్రమముగ వృద్ధినొందునది. వానివలన దుఃఖము లాభము. దీని వలన శాశ్వతసుఖము లాభము. ధనమును మనము రక్షింపవలయును. భక్తి తల్లివలె మనల రక్షించు. వాల్మీకియు నిట్లే లక్ష్మణునిఁగూర్చి ముందుచెప్పఁ గలఁడు. 'లక్ష్మీవాన్ లక్ష్మణః శ్రీమాన్' అనునవి పర్యాయముగ నుపయోగించెను.

నెయ్యము = స్నేహము.

ఉ॥ చిన్నతనాననుండియును జ్యేష్ఠుఁడు శ్రేష్ఠుఁడు లోకరాముఁడౌ
అన్నకు లక్ష్మివర్ధనుఁ డనంతముఁ గూరుచు స్నేహభక్తి సం
పన్నుఁడు లక్ష్మణుండు వెలిప్రాణము స్వీకమునౌ శరీరముఁ
కన్నను మిన్నయౌ సకలకార్యహితాచరణుం డజస్రమున్. బాల-౫౩౨.

అని చెప్పఁగఁలడు. దీనివలన భక్తి యనునది పూర్వజన్మసంస్కారమువలన బాల్యమునుండి లభింపవలయును. గాని పరులుచెప్పిననైన నిజేచ్ఛనైన నేమిచ్చిననైనఁ గానలకు నేగిన నైన రాదు. లక్ష్మణుఁడు రామునివెంట నరణ్యములకుఁ బోయినకారణము స్నేహభావమేకాని సీతసందేహించినట్లు చెడుతలంపుచేఁ గాదు.

సౌభ్రాత్ర మేపారఁ = (1) లక్ష్మణునికి శ్రీరామచంద్రమూర్తిపట్లఁ గల చక్కని భ్రాతృస్నేహము వృద్ధియగునట్లు - లక్ష్మణునికి శ్రీరామచంద్రమూర్తి యందలి స్నేహము శ్రీరామచంద్రమూర్తిని నదలి క్షణమైనను జీవింపసాధ్యము కానంతటిది యని ముందు చెప్పఁబడును.

మత్త॥ నిన్నుఁ బాసి ధరాతనూజయు నేను నొక్కముహూర్తమే
నిన్నిలంగలవారమే తమనీటిఁ బాసిన చేఁపల
ట్లన్న యాజనకాఖ్యుఁడేటికి సంబయేటికిఁ దమ్ముఁడేఁ
నిన్నుఁ బాసిన స్వర్గమేటికి నిక్క మియ్యది రాఘవా. అయో. ౧౮౨౯

ఇట్టి భక్తియే పరమభక్తి. 'పునర్విశ్లేషభీరుత్వం పరమా భక్తి రుచ్యతే' అని పరమభక్తి లక్షణము. నారదమతమున భక్తిలక్షణ మియ్యదియే. అట్లే లక్ష్మణునియెడ శ్రీరామచంద్రుని స్నేహమును.

కం॥ జనయిత్రియె మృష్టాన్నముఁ । గొనివచ్చి య దెంతవేఁడుకొన ముట్టండుఁ
గనుమూయఁడు పురుషోత్తముఁ । డనుఁగుందమ్ముండు లక్ష్మణాఖ్యుఁడులేమిఁ.
బాల. ౫౩౩.

సుభ్రాతృభావము = సౌభ్రాత్రము. (2) లోకమున సౌభ్రాత్ర మిట్లు లేపార వలయు నని నేర్పుటకుఁబోలె సవతితల్లులబిడ్డలైనను అన్నదమ్ము లిట్లు పరస్పరప్రీతిగలవారై యుండవలయు నని దృష్టాంతముచేఁ జూపుటకుఁగానో యేమో యని యీయర్థమున 'పోలెఁ' అననది యధ్యాహార్యము. గమ్యోత్ప్రేక్ష యలంకారము.

ఆరీతిఁ = మీఁదఁ జెప్పిన విధముగ.

అడవుల కరుగురామునివెంటఁ = అడవులకుఁబోవు శ్రీరామచంద్రుని వెంబడి. పెండ్లిండ్లకుఁగాదు, విందులుభుజింపఁగాదు, నారచీరలుగట్టి జడలు ధరించి

కాయగసరులు కందమూలములు దిని కాలినడక ముండ్లలో గండ్లలో కష్టపడుటకై యడవులకుఁబోవు శ్రీరామచంద్రమూర్తి వెంట నతని సవతితల్లికొడుకు లక్ష్మణుఁడును బోయెను. ఏల? అయోధ్యలో నున్నప్పుడు సేవలు చేయువారు పెక్కురు గలరు. కావునఁ దనకుఁ గొన్ని సేవలే లభించుచుండెనుగాని యన్ని చేయుటకు వలనుపడలేదు. శ్రీరామచంద్రమూర్తి యొంటరియై యడవులందున్నప్పుడో యన్ని సేవలు తానే చేయవచ్చు ననునాశతో నడవులకుఁగూడఁ బోయెను. ఇంతమాత్రము ప్రీతియే కాదు. "మాతాపితాచ భ్రాతాచ, నివాస శ్శరణం సుహృత్, గతిర్నారాయణ" యనునట్లు శ్రీరామచంద్రమూర్తి సకలవిధముల నిరుపాధికబంధువు. ఈ యర్థమునే లక్ష్మణుఁడు సుమంత్రునితో నిట్లు ముందు చెప్పఁగలఁడు.

కం॥ రాముఁడె భ్రాతయుభర్తయు। రాముఁడె ప్రియబంధువరుఁడు రాముఁడె చుమ్మీ
రాముఁడె నాజనకుండును। భూమిపు నెడలేదు జనకబుద్ధి సుమంత్రా.

అయో. ౧౫౧౩.

చనియె హా! = అహా పోయెనుగదా! యని నారదుఁడే, యాశ్చర్యపడుచున్నాఁడు. లోకములో నొకతల్లికడుపునఁ బుట్టినకొడుకులే తండ్రి సంపాదించిన ధనమునకై కలహింతురు. ఒకనికీర్తిప్రతిష్ఠలు మఱియొకనికి నసూయాజనకములై యుండును. ఇట్లుండ రామలక్ష్మణులు సవతితల్లుల కొడుకులు. పోవునది దుఃఖమయమైన యడవికిఁగాని సుఖభోజనమునకు సుఖానుభవమునకుఁ గాదు. కైకేయీదశరథులు రాము నరణ్యమునకుఁ బొమ్మనిరి కాని లక్ష్మణునిఁ బొమ్మనలేదు పోకున్న బోలే దని యాక్షేపమును లేదు. ఇట్లుండియు నన్నకు వదినెకు సేవసేయుటకై లక్ష్మణుఁడు పోవుట యాశ్చర్యకరమైనదేకదా. హా= ఆశ్చర్యార్థకము. భగవంతునియందుఁ దాను గొంచెము ప్రీతియుంచినను భగవంతుఁ డదియే మిక్కిలి గొప్పగ భావించి తనయం దతివాత్సల్యముఁ జూపఁగా నతని నేకాంతమునఁ దన యిష్టానుసారము సకలవిధముల శుశ్రూషింపవలయునని యాశపడు నొక్క చేతనుఁ డీసందర్భమున సూచింపఁబడెను.

చేతనుఁడు మోక్షమునకై భక్తి సేయునపు డతనియందలి సద్గుణములను మాత్రము గోరంతలు కొండంతలుగాఁ జెప్పి పురుషకారము చేయుటకును మోక్షము లభించినపుడు భర్తతోడఁ దానును బ్రాప్యురాలగుటఁబట్టియు సీతకు భర్తతో నిత్యసాన్నిధ్యము గల దని చెప్పుచున్నాఁడు.

రామునిప్రియ=సాక్షాన్మన్మథమన్మథుఁడై జనమనోహరమూర్తియగు శ్రీరామచంద్రమూర్తికి మనోహరురాలై ప్రియురాలైనది. శ్రీరామచంద్రమూర్తికి ప్రియురాలైన సతి యాయనకుఁ దుల్యయో యధికురాలో యయి యాయన

కంటె నభిరామ యైయుండవలయును. కావుననే "రాముఁ డభిరామయు" నని ముందు చెప్పఁబడును. (బాల. ౧౩౯౮ పద్యము)

రాముని ప్రియభార్య యనుటచే నప్రియభార్య మఱియొకతె గలదని యభిప్రాయముగాదు. అటుచెప్పుట విపరీతప్రజ్ఞాలక్షణము. అట్లైన శ్రీరామచంద్రమూర్తికి లక్ష్మణుఁడు ప్రియుఁడు తమ్ముఁడనిన యప్రియుఁడైన తమ్ముఁడు మఱియొకఁడు కలఁడని యర్థమా? నా ప్రియమిత్రుఁ డనిన నప్రియమిత్రుఁడు వేఱొకఁడున్నాఁడని యర్థమా?

సతము భార్య = సతము – ఎల్లవేళ - భార్య = హృదయమున భరింపఁదగినది. సత మనుపద మిచ్చటికి నాకర్షింపవలయును. నాథునకు సతముఁ బ్రాణతుల్య = ప్రాణముతో సమానురాలు కనుకనే ప్రియయు భార్యయు నయ్యె నని యెఱుంగునది. సతము రమణీయగుణచర్య = భర్తకునెల్ల వేళ మనోహరమైన గుణములు నడవడులు గలది - పతివ్రత.

సతము నయశీల = ఎల్లప్పుడు వినయమే స్వభావముగాఁ గలది - వినయము శేషత్వ లక్షణము.

సతము హితలోల = (1) ఎల్లవేళల నాశ్రితులకు మేలుచేయుటయం దత్యంతాసక్తికలది - నాథునకను శబ్దము కాకాక్షిన్యాయముచేఁ బూర్వోత్తర మన్వయించి నాథునకు హితలోల యనియుఁ జెప్పనగు.

"కాదని నిం దలపించితిం జుమీ! మనమున నీ వెఱుంగని సుమార్గము నేర్పుట గాదు" అని సీతచెప్పెనుగదా (అరణ్య ౧౧౯ ప)

జనకావనీశ్వరమహితకులజ = జనకమహారాజుయొక్క శ్లాఘ్యమైన వంశమునఁ బుట్టినది. "కర్మంబుచేతనే కద జనకాదు | లందిరి సంసిద్ధి" ద్వి. భ గీ. ౩అ. అని జనకుఁ డాచారప్రధానుఁడు గావున నీమెయు నాచారప్రధానురాలని భావము.

దేవమాయయట్లు = (1) అమృతము పంచిపెట్టుటకై యసురమోహనార్థము విష్ణుదేవుఁడు చేసినమాయను బోలినది. మాయచే విష్ణుదేవుఁడు ధరించిన మోహినీరూపమును బోలినదానినని భావము. (2) సుందోపసుందులను రాక్షసులను మోసముచేయ దేవతలు మాయచే సృజించిన తిలోత్తమవంటిది. (3) విష్ణుదేవుని యాశ్చర్యశక్తి వంటిది- ఈయర్థమున సౌందర్య మత్యంతాధికమని భావము. 'అతిరూపవతీ సీతా, అతిమూర్ఖశ్చ రావణ' అను చాటు వనుసంధించునది. (4) మాయ = లక్ష్మీదేవి. లక్ష్మీదేవియే జానకిగా సంభవించినదని యర్థము. మా + యా = ఎవతె లక్ష్మీదేవియో—లక్ష్మీదేవి యెవతెయో యామె మాయ. "లోకమాతా మా రమామంగళదేవతా" అని యమరుఁడు.

"నీదుమాయ, శ్రీవిశాలాక్షి పూర్వపరిగ్రహంబు, గాకయెవ్వఁడు తెలియం గఁగలఁడు నిన్న" ఉత్త ౧౫-౭౪. ఈయర్థమున 'అట్లు సంభవించినట్టి= ఆప్రకారమనఁగా జగత్ప్రసిద్ధముగా నయోనిజయై భూమినుండి పుట్టినట్టి యని యన్వయింపవలెను.

వినతచరితజాతపూత = ప్రసిద్ధికెక్కిన సత్కారసమూహములచేఁబవిత్రురాలు. జాత మనఁగా సమూహము.

మాయ = మహానారాయణోపనిషత్తు – "వివిధవిచిత్రానంతమహామాయా విశేషైః పరివేష్టితాం, అనంతమాయాశక్తిసమష్ట్యాకారా, మనంతదివ్యతేజో జ్వాలాజాలై రలంకృతాన్, మూలప్రకృతిజననీం.

ఈశ్వరస్య మహామాయా, తదాజ్ఞావశవర్తినీ, తత్సంకల్పానుసారిణీ వివిధా నంతమహామాయాజాలజననమందిరా, మహావిష్ణోః క్రీడాశరీరరూపిణీ, బ్రహ్మా దీనా మగోచరా, ఏతాం మహామాయాం తరంత్యేవ యే విష్ణుమేవ భజంతి నా న్యేతరంతికదాచన."

మహామాయ యెట్టిదనఁగా వివిధములై విచిత్రములై యనంతములైన గొప్పమాయావిశేషములచేఁ జుట్టుకొనఁబడినది. అనంతములైన మహామాయా శక్తుల సమష్టియాకారము గలది. అనంతములై దివ్యములైన తేజోజ్వాలల సమూహము నలంకరింపఁబడినది. మూలప్రకృతికిఁ దల్లియైనది. ఈశ్వరుని మహామాయ యాయనయాజ్ఞకు లోపడి వర్తించునది. అనేకవిధములై యనంతము లైన మహామాయాశక్తులచే బాగుగ సేవింపఁబడినది. అనంతములైన మహా మాయాసమూహములకుఁ బుట్టినిల్లు. మహావిష్ణువుయొక్క క్రీడాశరీరరూపము గలది. (మహావిష్ణువు తనతోడఁ గ్రీడించుటకై శరీరము ధరించునది.) బ్రహ్మా దులకు గోచరింపనిది. ఇటువంటి మహామాయను నెవరు విష్ణువును మాత్రమే భజింతురో వారుమాత్రమే తరింతురు. ఇతరు లెప్పటికిఁ దరింపరు.

ఈ యుపనిషద్వాక్యములు మాయయనునది భగవంతుని యచింత్యాద్భుత శక్తి యనియు నాయనసంతోషార్థము శరీరధారణముచేసి సేవించుచు నాయన సంకల్పానుసార మాయనయాజ్ఞకు లోపడి వర్తించు సాధ్వియేకాని మగని నజ్ఞానముపాలుచేసి మోహపఱిచి యాయనను శవప్రాయముచేయు ధూర్తస్త్రీవంటిది కాదనియు 'మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే' యన్నట్లు విష్ణునకుఁ బ్రపన్నులైనవారలే యీమాయ దాటుదురు గాని యితరుల కిది దురత్యయ మనియు స్పష్టపడుచున్నది.

కావున భగవన్మాయ యనునది శ్రీభగవతి - చైతన్యస్తన్యదాయిని - మహా లక్ష్మీదేవియేకాని యింద్రజాలము గాదు - శూన్యముకాదు - హుళిక్కికాదు -

వంచనగాదు - రాక్షసులమాయ లన్నప్పుడు రాక్షసుల యత్యద్భుతశక్తు లని గ్రహింపవలయును.

తా త్ప ర్య ము.

ఆప్రకారమడవులకుఁబోవు శ్రీరామచంద్రమూర్తినిఁ గనఁగొని యాయన యందు మిక్కిలి స్నేహభావముగల చిన్నతమ్ముఁడు - వినయసంపన్నుఁడు - నన్నప్రీతికిఁ బాత్రుఁడు, సుమిత్రాదేవి యను దశరథుని రెండవభార్యకుమారుఁడు నైన లక్ష్మణుఁడు స్నేహభావము ప్రకాశింపఁగా నొరా జ్యేష్ఠభ్రాత సేవ్యుఁ డనుకారణముచే వెంటఁబోయెను.

శ్రీరామచంద్రమూర్తికి ప్రాణసమానురాలైన యిల్లాలు మనోహరమైన గుణములు నడవడిగలది. స్వభావముచేతనే నయగుణము కలది. హితముచేయుట యందే యాసక్తిగలది. జనకమహారాజుకూఁతురు. దేవమాయవలె నయోనిజ యై జనించినది (దేవమాయకుఁ దల్లిదండ్రులు లేరుకదా) మంచిగుణములచేఁ గూడినది. లోకమంతయుఁ బొగడునట్టి నడవడులచేఁ బవిత్రురాలు నగు జానకీదేవి (ముందుపద్యముతో నన్వయము).

కం॥ సీత సకలశుభచిహ్నోపేత వరారోహ దశరథేశ్వరు కోడల్
చేతోధవు శశి రోహిణిరీతి న్వెన్నంటె చనె సతీణప్రతిన్.　　　　౧౦౩

సకలశుభచిహ్నోపేత = సాముద్రికశాస్త్రప్రకారము ముత్తమస్త్రీకి నుండఁ దగిన శుభకరములయిన సకలలక్షణములతోఁ గూడినది.

వరారోహ = పురుషోత్తముఁ డగువానికిఁదగిన యుత్తమస్త్రీ సీత= నాఁగటి చాలునకు సీత యనిపేరు. 'సీతా లాంగలపద్ధతి' యని యమరుఁడు. అందుఁ బుట్టినది కావున నీమెకు సీత యనిపేరు. అయోనిజగాన వైకుంఠమున నున్నప్పటి సౌందర్య మిప్పుడును గలదై యున్న దని భావము.

చేతోధవునిఁ = మనోనాయకుఁ డగు శ్రీరామచంద్రమూర్తిని. శ్రీరామచంద్రమూర్తి చేతోధవుఁడుగావున ధవుఁ డున్నచోటఁ జేత నుండుట ధర్మమని యామె వెంబడించిన దనట. ఆయన సౌందర్యాదు లామెమనస్సు నాకర్షించియుండుటచే నాయనను వెంబడింపక తప్ప దని భావము ఒక యినుపములికిని నయస్కాంత మాకర్షించినపుడు పడిపోయినట్లేకదా యినుపములికి పోవును. ప్రత్యేకించియుండు శక్తి యెక్కడిది? కేవలపారతంత్ర్యమేకదా.

శశిని రోహిణిరీతిఁ = చంద్రుని రోహిణివలె - రోహిణి చంద్రుని కసాధారణ భార్య. శ్రీరామచంద్రమూర్తి సౌందర్యాదు లాకర్షింపఁగా సీత యాతని వెంటఁ బోయినదనుటమాత్రము గాదు. పాతివ్రత్యము ననుసరించి రోహిణి చంద్రు నె

ట్లనుసరించి పోవునో యట్లేసీతయుఁ బోయె నని యీ యుపమానతాత్పర్యము. ఈ విషయమునే సీత యనసూయతోఁ జెప్పఁగలదు.

కం॥ దివిదేవత యగురోహిణి, యువతిజనశ్రేష్ఠయొక ముహూర్తంబేనిన్
స్వవిభుం దారాపతివె, న్దవులక చరియింపఁగలుగునా యెన్నండున్.
అయోధ్య. ౨౫౭౧.

ఈరోహిణి ౨౭ నక్షత్రములలోఁజేరిన రోహిణిగాదు. ఈరోహిణి ౨౭ దినముల కొకనాఁడేకదా చంద్రునితో సమాగమము. సర్వదా చంద్రునివెన్నంటి యుండు రోహిణి వేఱొకనక్షత్రము గల దందురు.

అరీణప్రీతిన్ = చక్కనిప్రీతితో - అరీణము = వంకరకానిది. సీత భర్త వెంటఁ బోవుటకుఁ గారణ మపవాదభీతి ఇతరుల బలాత్కారము గాదనియుఁ, జక్కని నిండుప్రీతి యనియు భావము.

వెన్నంటిచనన్ — వెన్ను + అంటి = వెన్నంటి. "పయ్యెదకొం గడ్డమైనఁ బ్రాణమె పోవున్" అన్నట్టులు దూరదూరముగఁ బోవుటవలనఁ గలుగు విశ్లేషమును సహింపలేక వీఁపు నొరయునట్లు పోయె నని భావము.

తాత్పర్యము.

సాముద్రికశాస్త్రప్రకార ముత్తమస్త్రీల కుండవలసిన శుభలక్షణముల నెల్లఁ గలదై దశరథమహారాజు కోడలై యుత్తమస్త్రీయైన సీతాదేవి చంద్రుని రోహిణి యేప్రకార మెల్లవేళ ననుసరించిపోవునో యట్లలే నిండారుప్రేమచే దన ప్రాణేశ్వరు వెంబడి పోయెను.

కం॥ పౌరులు దుస్సహచింతా,చారులు దూరంబు వెంటఁబడి, రటు కించి
ద్దూరము తండ్రియు, గంగా,తీరంబును దాసి ధర్మధనిరతుండున్. ౧౦౮

సీతాలక్ష్మణులువోలెఁ బౌరులును శ్రీరామచంద్రమూర్తియందలి భక్త్యతిశయముచే నాయనను వెంబడించి రని చెప్పుచున్నాఁడు.

దుస్సహదుఃఖవిచారులు = సహింపరాని రామవియోగదుఃఖమునకుఁ జింతపడుచున్నవారు. శ్రీరామచంద్రమూర్తియందుఁ బౌరులకుఁ బరమభక్తిగల దని దీనివలనఁ దెలియవచ్చును. వియోగభయమే పరమభక్తి.

పౌరులు = పురజనులు - అయోధ్యాపట్టనవాసులు - స్త్రీలు - వృద్ధులు - బాలురు - పురుషులు- మిత్రులు - శత్రులు - ఉదాసీను లను భేదములేక సమస్త జనులును. ఈజనులకు శ్రీరామచంద్రునియందలి పరమభక్తిగలుగుటకుఁ గారణ మేకదేశవాసమే యని యీపదము సూచించుచున్నది. ఏకదేశవాస మనఁగా రామచంద్రుఁ డేపురమం దుండెనో యాపురమందే యాయనకు సమీపమందే

పురజను లుండుటచే నాయన మాహాత్మ్యము తేజమునలన వారికాయనయం దట్టి భక్తి గలుగఁ గారణమయ్యెను. ఈ తేజస్సునే యాంగ్లభాషయం దారాయం దురు. దీనివలన భక్తిపరులు భగవత్సమీపమందే నివసింపవలయు నని యేర్పడు చున్నది.

దూరము = తమసానదీతీరమువఱకు - ఒకనాఁటి ప్రయాణము నంతదూ రము. వెంటఁబడిరి = వలదు వలదన్నను బలవంతముగా వెంటఁబోయిరి.

తండ్రియును = దశరథుఁడును - యును ఉక్తార్థసముచ్చయము. తాను దండ్రి కావునఁ బుత్రవాత్సల్యముచే ననుసరించెఁగాని పౌరులవలె భక్తితోఁగాదు అని తండ్రిపదము నభిప్రాయము.

అటు = పౌరులవలె - పౌరులవలె వెంటఁ బోవుటే సామ్యముగాని దూరము నందుఁగాని భక్తియందుఁగాని సామ్యముకాదు.

ఆబాలగోపాల మూరంతయు శ్రీరామచంద్రుని వెంటఁ బోవునపుడు తాను మొద్దువలె నింటఁగదలక కూర్చుండుట బాగుగా దని వెంబడించె నని భావము.

కించిద్దూరము=నడివీధివఱకు - లోకులేమనుకొందురో యని పోయినవాఁడు కావునఁ బౌరులు పోయినంతదూరమైనఁ బోఁడయ్యె. వెంటఁజనిరి యనుదానిని నేకవచనక్రియగా మార్చి యిటఁ గ్రియగాఁ జేసికొనునది- కించిద్దూరము వెం టఁ బోయె నని. ఇంతవఱకుఁ బరత్వసౌలభ్యములను గుణములను జెప్పి యిఁక వాత్సల్యసౌశీల్యములను జెప్పుచున్నాఁడు.

ధర్మధీనిరతుంఁడు=ధర్మబుద్ధియందు మిగులనాసక్తుఁడగు శ్రీరామచంద్రుఁడు- ఆశ్రితులయెడ వాత్సల్యసౌశీల్యములను ధర్మము-పితృవాక్యపరిపాలనాధర్మము.
గంగాతీరమును డాసి - గంగయొడ్డు సమీపించి.

తాత్పర్యము.

రాముని విడిచియుండఁజాలక సహింపరాని వియోగతాపముచేఁ దపించు యయోధ్యాపురవాసులు శ్రీరామచంద్రుఁడు రావలదు రావల దని వారించు చున్నను వినక యాయన వెంబడి చాలదూరము పోయిరి. తండ్రికూడఁ గొం చెముదూరముపోయెను. ధర్మబుద్ధియం దత్యంతాసక్తిగల శ్రీరామచంద్రమూర్తి గంగానదీతీరముచేరి (ముందుపద్యముతో నన్వయము).

తే॥ శృంగిబేరపురంబును ♦ జేరి యచట, నాత్మమిత్త్రుని గుహుని నిషాదాధిపతిని
జూచి సెలవిచ్చెఁబొమ్మని•సూతునకును, గుహుఁడు దాఁటించె వారిము•గ్గురను గంగ.
౧౦౫.

శృంగిబేరపురంబును -- శృంగముకలది శృంగి- జింక. బేరము = (కృత్రిమమైన) యాకారముగలది శృంగిబేరము - అపక్కణమునన్నబోయలు అడవి జింకలను వంచించి చంపుటకై యాయూరిసలువైపుల జింకలవలె నాకారములు చేసియుండిరి. అప్రాంతపు టడవులందు నడవిజింక లామోస మెఱుంగక తమజాతిజింకలేకదా యని సమీపింపఁగా వారు చంపుదురు. అంతట క్రూరపట్టనమయ్యును భక్తనివాసముగావునఁ బవిత్రనుగు గంగాతీరమునఁ డాసియనుటతో సంతుష్టిలేక శృంగిబేరపురంబుఁ జేరి యని చెప్పెను. పవిత్రస్థలముకన్నను బరమభక్తనివాసస్థానముగదా యుత్కృష్టము. ఈ యర్థమునే భాగవతాగ్రగణ్యులగు వేదాంతాచార్యులు లోకగురువారు 'సా కాశీతి న చాకశీతి' యని చెప్పిరి. ఊరిలక్షణము చెప్పి యందలి ప్రజలయు, నధిపతియు లక్షణము చెప్పుచున్నాఁడు.

నిషాదాధిపతిని = బోయలకుఁ బ్రభువైనవానిని - బోయలే క్రూరులు - ప్రాణిహింసకులు. అట్టివారిని నణఁచి లోపఱుచుకొనియుండువాఁ డెంతటి కఠినచిత్తుఁడుగా నుండవలయును.

ఆత్మమిత్రుని = అట్టి ప్రాణస్నేహితుని - ఆత్మవలెఁ బ్రియమైనవానిని. గుహుని = పరులను వంచించు స్వభావముగల యాతనిని, జాతిని, నడతను, గుణమునను, గులమునను నీచుఁడైయున్నను భగవద్భక్తి గలవాఁడుకావున నామాత్రముననే యాదరింపఁదగినవాఁ డయ్యెను.

"ద్వి॥ ఎవ్వారు భక్తిన న్నెలమి భజింతు, రెవ్వార లుందురు నాయందు, నేవారి,
యందు వసింతు దురాచారుఁడైన, నెందక యితరులయందలి భక్తి,
నన్నె భజించు మానవుఁ డెవ్వఁడైన, నెన్నంగ సాధువే యని జగతి...

తొలిజన్మమునఁ జేయు పాపంబుకతన, వెలదులు కోమట్లు వృషలులుగాగ,
జనియించినట్టి యేజనులైనఁగాని, నను నాశ్రయించి యనంతమౌ గతిని,
బొందుచునున్నారు. ..." ద్వి. భ. గీ. ౯ అధ్యా.

"అదిగాక యఖిలపాపాత్ములకన్న, నధికపాపాత్ముండ వగుదువేనియును,
దరియింపఁగలవు పృథాసుత సకల, దురితంబు జ్ఞానమన తెప్పునావ.. "
ద్వి. భ. గీ. ౪ అధ్యా.

ఇక్కడ జ్ఞానమనఁగా నధికభక్తి యని శాండిల్యమతము తక్కిన దోషములెన్నియున్నను నిజమైన భక్తుఁడు కావున సాధు వనియే రాముఁ డాయన యున్నచోటికిఁ బోయెను. దీనివలన భగవంతుని మనము వెదకుచుఁ బోవలసిన పని లేదనియుఁ బండు మనచేతిలోనున్న బాలుఁడు చేరవచ్చునట్లు భక్తి మన యందుండిన భగవంతుఁడే మనల వెదకికొనుచు వచ్చుననియు నేర్పడుచున్నది.

అంతియకాదు - ఇంతియకాదు - రాముఁడు శృంగిబేరపురముఁ జేరవచ్చినవార్త తెలియఁగానే పరువున వచ్చి గుహుఁడు రాముని గౌఁగిలించుకొనెనట. (అయోధ్య-౧౩౦౫-౧౩౦౬-౧౩౦౭ పద్యములు చూడుఁడు) దీనివలన భగవంతుఁడు భక్తుల కెట్టిచనవు స్వాతంత్ర్యము నిచ్చునో తెలియుఁడు. జీవాత్మపరమాత్మలు పరమస్నేహముచేఁ బరిష్వంగాలింగనము చేయుచోఁ గలుగు నానందాతిశయమున మైమఱచుటే ముక్తి యని శంకరాచార్యులవారి యభిప్రాయ మని కోకలేశ్వరశాస్త్రిగారు వ్రాసిరి. హనుమంతుని శ్రీరాముఁడు కౌఁగిలించుకొనెను. (యుద్ధ-౧౩-౧౪ పద్యములు) గుహుఁడు శ్రీరాముని గౌఁగిలించుకొనెను. తారతమ్య మరయుఁడు.

గుహునిఁ జూచి రాముఁడు సూతునకు సెలవిచ్చెను. సూతుఁ డనఁగా సుపస్యశ్వాననితి సూతః-షూ ప్రేరణే గుఱ్ఱములను తోలువాఁడు. గుహాతి గోపాయతీతి గుహః రక్షించుకొనువాఁడు. గుహూ సంవరణే. ఆత్మజ్ఞానముచే భగవత్కింకరుఁడై రక్షించుకొనువాఁడు. ఇట్టివాఁడు దొరికినప్పుడు పశువులఁ దోలుకొనువాఁడు త్యాజ్యుఁడే కదా. తానై రాముని గౌఁగిలించుస్వాతంత్ర్యము గుహునికిఁ గలిగెఁగాని సుమంత్రునికి లేదయ్యెఁగదా. సుమంత్రుఁ డనఁగా మంచియాలోచనగలవాఁడు. అనఁగా జ్ఞాని. గుహుఁడో భక్తిపరవశుఁడు కావుననే యాత్మమిత్రుఁ డని చెప్పఁబడెను. "జ్ఞానీత్వాత్మైవ మే మతమ్. జ్ఞానీతుపరమైకాంతి" యని జ్ఞాని యనఁగాఁ బరమైకాంతియగు పరమభక్తుఁడు. భగవంతుఁడు భక్తజనపక్షపాతి. దీనివలన జ్ఞానికంటె భక్తుఁడే భగవంతునకుఁ బ్రియతముఁ డని యేర్పడుచున్నది.

చూచి = రాముఁడు తాను గొప్పవాఁ డనియు గుహుఁడు నీచుఁ డనియు భేదములేక యేకీభవించియుండె నిషాదాధిపతిని జూచి యనుట వలన శ్రీరాముని సౌశీల్యగుణము సూచింపఁబడెను. గొప్పవాఁడు తక్కువవానితో భేదములేక కలసిమెలసియుండుట సౌశీల్యము. ఇదియే యనన్యభావము. దీనివలన గొప్పవారు జారులతోఁ జోరులతో జూదరులతో దురాచారులతో నీచగుణులతో స్నేహము చేయవలయు నని తాత్పర్యముగాదు. కులమున నీచుఁడైనను గుణమున భగవద్భక్తియం దుత్తముఁడై యుండవలయును. గుణహీనుఁడు భక్తిహీనుఁ డుత్తమకులములోఁ బుట్టినను స్నేహపాత్రుఁడు గాఁడు. నట విట గాయక వేశ్యాసహవాసముచేయు రాజునందు సౌశీల్యము గల దనరాదు. నిషాదాధిపతి యనుటవలన గుహుఁడు మిక్కిలి నీచుఁ డనియు, ధర్మధీనిరతుఁ డనుటవలన రాముఁడు మహాత్ముఁ డనియుఁ, జూచి యను పదమువలన భేదములేక స్నేహించుటయు, ధర్మధీనిరతుఁ డనుటవలన నిట్టి

స్నేహము ధర్మయుక్తమైనదే యనియుఁ జెప్పఁబడెను. వాత్సల్యము = దోష మున్నను దానియందును బ్రేమగలబుద్ధి.

సూతునకును = సుమంత్రునకును. వంశపరంపరగా వచ్చినవాఁడును మిగుల నాప్తుఁడును నౌటచే వదలుట యసాధ్యకార్య మని 'ను'కార తాత్పర్యము.

పొమ్మని సెలవిచ్చెను = అప్పుడు పుట్టినదూడ ప్పైఁగల ప్రేమాతిశయముచే ముందటి యెడదూడను వదలుగోవువలె గుహునిఁ జూచి సుమంత్రుని వదలెను. దీనివలన సూతునియం దుండుప్రేమకంటె గుహునియందు వాత్సల్యము మెండని సూచితము.

గుహుఁడు వారిముగ్గురిని గంగ దాఁటించెను = సీతారామలక్ష్మణులను ముగ్గురను దాఁటించెను. ణిజంతము కావున ద్వికర్మకము.

గుహుఁడు వారిని ముగ్గురిను నావపై నెక్కించి యింతపుణ్యకార్యము లభించెఁ గదా యనుసంతోషముతోఁ దాను స్వంతముగా నావ నడిపి గంగను దాఁటించెనుగాని తాను రాజ ననుగర్వముతో నెవనినో యొక్కని నావతోలుకొనిపోయి వీరి నావలియొడ్డున విడిచి రారా యని చెప్పలేదు. మఱియొకఁడు నడపుచుండఁ దానూరక కూర్చుండను లేదు. కూర్చుండినఁ దాఁటింపఁజేసె నని కవి చెప్పియుండును. భగవత్సేవయందు ఇతరుల నియమించి తా నూరక కూర్చుండరాదు.

తాత్పర్యము.

శృంగిబేరపురమును జేరి యచట నుండు బోయనాయకుని గుహుఁ డను నాప్తమిత్రునిఁ జూచి సారథితో "సుమంత్రా! యిఁక నీ వూరికిఁ బొ" మ్మని సెలవిచ్చి పంపెను. ఆవల గుహుఁడు వారి ముగ్గురిని గంగ దాఁటించెను.

ఉ॥ రాజకుమారులుం జనక♦రాజకుమారియుఁ గాననానఁ బ
రోజను గాల్నడం జని, ఒ♦హూఁడికసింధులు దాఁటి, యాభర
ద్వాజునిశాసనంబున సు♦పర్వనికాశులు చిత్రకూటముం
రాజిలువేడ్కఁ జేరి, తమి♦గ్రాలఁగ నుండిరి పర్ణశాలలోన్. ౧౦౬

రాజకుమారులుం జనకరాజకుమారియుం=ముగ్గురిపేర్లుమాత్రమే చెప్పుటచే గంగ దాఁటించి గుహుఁడు మరల తనయూరికి వచ్చె నని తెలియనయ్యెను. కాననకాననం = అడవివెంబడిగల యడవియందున - వీప్స. క్రొత్తక్రొత్త యడవులందు సంతోషముతోఁ బోయిరనియుఁ, బోవునపుడు అడవులలోనే పోయిరిగాని తిండ్రియాజ్ఞ మీఱినట్లగునని యూళ్ళలోనికిఁ బోలేదనియు సూచితము. అడవివెంట నడవి దాఁటిపోయి రనుటచే నేయడవియందును విశ్రమింపలే దని యర్థము.

పేరోజను = మిక్కలి సంతోషముతో - విలాసముగా. సంస్కృతమున 'తే వనేన వనం గత్వా' యని యున్నది. తే + వనేన వనమ్ = వారు అడవివెంబడి యడవిని అని యొకయర్థము. తేవనేన + వనం = క్రీడవలె నడవికిఁ బోయి యని యొకయర్థము. ఈ శ్లేషము తెనుఁగునఁ గుదరదు. కావున రెండర్థములు పేరోజను కానకానన్ అని ప్రత్యేకముగ వ్రాయఁబడెను.

చని = అనాయాసముగఁ బోయి - రాజకుమారులును జనకరాజకుమారి యును అనఁగా అగర్భశ్రీమంతులు సుకుమారులు నైన మహారాజపుత్రు లడవిలోఁ గాలినడక సంచరించుటయే ప్రయాసముతోఁగూడిన కార్యము. ఒకవేళ రాజకుమారు లడవులందు వేఁటకై తిరుగువారేకదా యని నప్పుడు వాహనములు పరిచారికులు పాదరక్షలు లోనైన వన్నియు నుండును. ఇప్పు డవన్నియు లేవు. మగవారుకావున వారట్లో సహించిరనినను మహారాజపుత్రికయైన సీతాదేవియును నట్టులే కాల్నడ నడవులందు సంతోషముతో సంచరించెనఁట. వ్రత పరిపాలనకార్యమునకై పోవువారు గనుక వారి కది సంతోషకార్యముగాఁ దోఁచెను గాని కష్టకార్యముగఁ దోఁచినది కాదు. పితృవాక్యపరిపాలన వ్రతము వెనుకనుండి త్రోయఁగా ఆశ్రితరక్షణకార్యము ముందునకు లాగుచున్నది అని సముచ్చయార్థము.

బహూదకసింధులు = విశాలముగను లోఁతుగను నీరుగల గంగానదిని. నదులలో గంగ ప్రధాన మని యెంచి దానిని ప్రత్యేక నామముతోఁ జెప్పక సింధువు లని సామాన్య నామముతో జెప్పెను.

(2) సింధులు = యమునానది - గంగానదీతరణము పూర్వపద్యమునఁ జెప్పబడినది. సింధులు = ఇది జాతివాచకపదము బహువచనాంతమైనది. 'జాత్యాఖ్యాయా మేకస్మిన్బహువచన మన్యతరస్యాం' మ్మని పాణినిసూత్రము. (3) పూజార్థంబున బహువచనము - రాములు, వాల్మీకులన్నట్లు. దితిః పాశాన్ అనునట్లు అవయవబహుత్వముచే బహువచనము. సింధులు = గంగాయమునలు గాక మందాకిని యని చిత్రకూట పర్వతసమీపంబున నొకనది గలదు. సౌకర్యార్థమై యది యిచ్చటనే చెప్పఁబడినది.

గంగాయమునల దాఁటిరిగదా యడవులవెంటబోఁయిరి. అడవులలోఁబోయి యావల నదులు దాఁటి రని చెప్పుటసరియా యని సందేహింపరాదు. "అగ్నిహోత్రం జుహోతి - యవాగూం పచతి" యని వేదమునఁ గ్రమముగ రెండు వాక్యములు గలవు. అందు యవాగూపాకానంతరము అగ్నిహోత్రహోమము. కావున నర్థక్రమముగా 'యవాగూం పచతి - అగ్నిహోత్రం జుహోతి' యని

యచ్చట మార్చుకొందురు. "వాఁడు గుఱకపెట్టి నిద్రపోయెను" నిద్రపోయిన తరువాత గుఱకవచ్చుఁగాని మేలుకొనియుండఁగా రాదుగదా. అట్లున్నను గుఱక ముందు చెప్పుదుము. అట్లు ఇచ్చటను బహూదకసింధులు దాఁటదాఁటి కానకానఁ బేగోజను గాల్నడం జనిచని యని యర్థక్రమముగా మార్చుకొనవలయును. లేదా చని = చనఁగలిగి యని భవిష్యత్కాలము ఇట నన్వయము. ముఖం వ్యాదాయ స్వపితి - నోరు తెఱచుకొని నిద్రించుచున్నాఁ డన్నట్లు.

భరద్వాజుని శాసనంబునన్ = భరద్వాజమహర్షి యాజ్ఞచేత. ఈయన యాశ్రమము ప్రయాగయొద్ద నున్నది. (1)'ఏషఏవ బిభ్రద్వాజః ప్రజా వై వాజః తాఁ ఏష బిభర్తియద్బిభర్తి తస్మాద్భరద్వాజఇత్యాచక్షతే' యని బుగ్వేదారణ్యకము చెప్పులాగున భరద్వాజుఁడు - ప్రజాసంరక్షణమే స్వభావముగాఁ గలవాఁ డని వ్యుత్పత్తి. (2) వాజము = రేతస్సు - వాజీకరణము ఇత్యాదులందు వాజ శబ్దమునకు రేత స్సని యర్థము దానిని స్ఖలనముగానీక భరించువాఁడు భరద్వాజుఁడు - అస్ఖలితనిత్యబ్రహ్మచారి యని యర్థము 'భరద్వాజో హవై త్రిభి రాయుర్భి ర్బ్రహ్మచర్య మువాస' యని శ్రుతి. (3) చిత్రకూటమును = ఆశ్చర్యకరమైన శిఖరము కలది యని వ్యుత్పత్తి.

భగవంతుఁడు విరజానది దాఁటి ప్రకృతిమండలమునకువచ్చినట్లు రాముఁడు గంగానది దాఁటి చిత్రకూటముఁ జేరెను. చిత్రకూటము - ప్రకృతి- ఈయర్థము వేఱొకచో విస్తరింపఁ డును.

రాముఁడు వేడ్కను జేరి = ప్రస్ఫుటమైన సంతోషముతోఁ జేరి. తాము సౌఖ్యముగా నుండ ననుకూలముగా స్థలజలరామణీయకముగల యీపర్వతము దొరకెఁగదా యని సంతోషము (2) చిత్రకూటము దండకారణ్యములోనిదే కావున దండ్రి యాజ్ఞప్రకారము దండక చేరితిమిగదా యని సంతోషము (3) అవతార ప్రయోజనమును నిర్వహింపఁగల ప్రదేశమునకు వచ్చి చేరితిమిగదా యని సంతోషము.

పర్ణశాలలోన్ = లక్ష్మణుఁడు కట్టిన యాకులగుడిసెయందు. సుపర్వనికాశులు = దేవతలతో సమానులు - లక్ష్మీనారాయణులతో సీతారాములును, నాకముక్తునితో లక్ష్మణుఁడును సమానులని భావము. సుపర్వులతో సమానులని విగ్రహము నిభసంకాశాది శబ్దములకు నిత్యే గ్రహించునది ' ఈ యుపమానమువలన దుఃఖమే లేక యచ్చట సదా సమానచిత్తవృత్తితో రమించుచుండి రనుట వ్యంగ్యార్థము. సీతారాములు పుష్పాహరణజలక్రీడాదులచేత రమించుచుండిరి. 'కలికి యీచిత్రకూటనగంబునందుఁ, జారుమానసవాక్కాయ

సంయతములు, వివిధభావంబు లెల్లను వేడ్కసరసి, కొనుచుం గ్రీడింతువే నన్నుం గూడి ప్రీతి.' అయో. ౨౦౪౩ ప. అని రాముడు సీతతోం జెప్పిన యిట్టి క్రీడలచే భార్యాభర్తలు రమింపంగా లక్ష్మణుండో వారికిరువురకుం గైంకర్యము చేయుచు నిట్టి యవిచ్ఛిన్నసేవ లభించెంగదా యని సంతోషించెను.

'ఉ॥ పంకులు గడ్డలుౘ వననివాసు ఖ గ్రాసము గాంగ మెక్కు వేడ్కొండు నైదైనం దెచ్చెదగు, నర్చిజ నీవునుగూడి యారగించుౘ। గొండలయందల న్నిదురగూరియ యున్నను మేలుకొన్నం గోదండధరుండనై మెలపుదాలిచి సర్వము నేన తీర్చెదన్॥' అనికదా లక్ష్మణుడు చెప్పెను. ఇట్టి లాంఛనహేతువు వేరైనను ఆనందము మాత్రము నిరతిశయమై యొక్కటేవిధముగు యుండెను. మోక్షదశయందు ముక్తుడు లక్ష్మీనారాయణులకై కైంకర్యముచే నానందించుటను, నా కైంకర్యముచే లక్ష్మీనారాయణు లానందించుచుండుట నానందభేదము లేదు గదా. "పరమం సామ్య ముపైతి - భోగమాత్ర సామ్యలింగాచ్చ" యని శ్రుతి బ్రహ్మసూత్రములు. పరమపదమందు నారాయణస్వరూపుడై భగవంతుని యానందమునకుం గొఱంతలేదు. ఆయనతోడం బరమసామ్యముం బొందిన ముక్తుని యానందమునకుం గొఱంత లేదు

సుపర్వనికాశు లనుపదమునందలి యుపమాలంకారము చే నొకయర్థము ధ్వనించుచున్నది. అది యేదియనంగా - స్వస్వరూప, పరస్వరూప, పోపాయ స్వరూపముల నెఱింగి తత్త్వాలంబున భగవంతునియందు ప్రేమరూపమగు భక్తిగల పురుషుని భగవంతుడు కరుణించి లక్ష్మీదేవితోడం బాగు వానియొద్దకేతెంచి వానిని దివ్యవిమాన మెక్కించుకొని యతివాహకులచే సత్కారము చేయించి విరజనదిని దాటి తిలకాంతారము గడచి యమానవపురుషునిచే ననుమతి యిప్పించి దివ్యలోకమగు వైకుంఠమునకుం జని యట మహామణి మంటపమునం దానను దేవియు సింహాసనాసీనులై వాండు సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందును జేయుపరిచర్యల నంగీకరించియు నందించుచు దన్మూలమున నతనికిం దమతో సమానానందము నిచ్చుచు నట యావత్కాల ముండు ననుసర్థము సూచితము.

రాజకుమారులు రాజకుమారి యరణ్యము వెంబడి యరణ్యము తిరిగి యనేక నదులన్ని దాటి భరద్వాజుని శాసనంబున సుపర్వనికాశులు చిత్రకూటముం జేరి రనుటచే భగవదంశమైన జీవు లోక జన్మము వెంబడి వేఱొకజన్మ మెత్తి యగాధసంసారములను దరించి కడపట గురుబోధచే దేవస్వరూపము నొంది (యప్రాకృతదివ్యశరీరము) ముక్తిపదము చేరుదు రని ధ్వని.

తమిగ్రాలంగ నుండిరి = సంతోష మతిశయించి ప్రకాశింపంగా నుండిరి. దీని వలన మువ్వురకు సంపూర్ణ సమాన పరమానందము చెప్పంబడెను. ఆంకలి

గొనిన భాగ్యవంతుఁడు పంచభక్ష్యపరమాన్నములు భుజించిన నెట్టి సంతుష్టి గలుగునో యంతటి యట్టి సంతుష్టియే యాఁకటివేళ సంకటి తిని మంచినీళ్లు ద్రావిన పేదవానికిని గలుగును. సంతోషము, దుఃఖము నిచ్చుశక్తి పదార్థము లందు లేదు. అవి మనోవ్యాపారములు. దూరయాత్రపోయిన కుఱ్ఱవాఁడు చేర వచ్చినపుడు తల్లిదండ్రుల కెట్టి సంతోషమో యట్టి సంతోషమే జీవుఁడు తమ్ముఁ జేరవచ్చినపుడు లక్ష్మీనారాయణులకుఁ గలుగును. పితృభక్తిగల యాపుత్రున కెట్టి సంతోషమో వారిని జేరఁబోయిన జీవునకుఁ గలుగును. 'ప్రమోదము తుల్యములేదు వాసి.' (2) అయోధ్యయం దెట్టిసౌఖ్య మనుభవించుచుండిరో యట్టిసౌఖ్యమే చిత్రకూటమందును ననుభవించుచుండుటచే నయోధ్య విడిచి వచ్చిన దుఃఖము వారెఱుఁగరైరి.

శా॥ నానాపక్షిమృగాకులంబు సుమనోనవ్యద్రుమభ్రాజితం
బై నాగేంద్రమృగాగనాదితమునై హారిప్రతీరాధ్యమా
కానర్ మాల్యవతీతటంబునను జొక్కన్ జానకీరాఘవుల్
సానందంబుగఁ గ్రీడసల్పిరి ప్రవాసాయాస సంవిస్మృతిన్. అయో. ౧౮౮౭.

అని ముందు చెప్పఁబడును. (3) చిత్రకూటమందు మిగుల సంతోషముతో నుండి రనుటచే నయోధ్యయందు వారి కింత సంతోషము లే దని వ్యంగ్యము.

ఒక గొప్పకార్యము చేయఁదలంపుగలవాఁడు ఆ కార్యమును జేయఁబూని చేయునపుడుగలసంతోషము సోమరిగా నున్నప్పుడు కలుగదు. రావణవధాదిక మైన ఘనకార్యము ముందుండఁగా నది చేయుటయందుఁ బ్రవర్తింపక యూరక యయోధ్యయం దుండుట రామునకు సంతోషకరము గాదు.

తాత్పర్యము.

ఇట్లా రాజకుమారు లిరువురు రాజకుమారి సీతయు మువ్వురు గంగానదిని యడవివెంబడి యడవి వగినగ దాఁటిపోయి భరద్వాజునిశాసనముప్రకారము చిత్రకూటపర్వతముఁ జేరి యచ్చటఁ బర్ణశాల నిర్మించుకొని యథాసుఖముగ నుండిరి.

కం॥ పుత్రకులు చిత్రకూటధరిత్రీధరవాసు లయినఁ ♦ బ్రేమభరమునం బుత్రునకై విలపించుచు, ధాత్రీపతి చనియె నమరధామముఁ జేరన్. ౧౦౭

ఇట్లు భగవంతునియందు లక్ష్మణునికింగల దాస్యాభిలాష వివరించి యిఁక భరతునకుఁగల పారతంత్ర్యమును దెలుపుటకై యుపోద్ఘాతముగఁ గొంత చెప్పుచున్నాఁడు.

పుత్రకులు = రామలక్ష్మణులు. స్వార్థక కప్రత్యయము.

చిత్రకూటధరిత్రీధరవాసులయినన్ = చిత్రకూటపర్వతమున నివసించువారుకాఁగా.

ధాత్రీపతి = దశరథమహారాజు.

ప్రేమభరమునన్ = ప్రేమాతిశయముచే. నలుగురు కుమారులలోను రాముని యందు దశరథునకుఁ బ్రేమమెండని భావము. "వారలలో జనకునకున్, శ్రీరాముఁడు కేతురీతిఁ బ్రియుఁ డయ్యెఁ గడున్." —బాల. ౫౨౬ ప

పుత్రునకై విలపించుచున్ = శ్రీరాముఁడు కనఁబడకపోయెనే యని దుఃఖముతో కడు బాధనొంది యాతనిఁ గూర్చి హారామ! హాపుత్రా! యని రోదనముచేయుచు. అమరధామముఁ జేరం జనియెన్ = స్వర్గమునకు జెందెను. మరణించెనని భావము.

తాత్పర్యము.

అచ్చట నయోధ్యాపురంబునఁ దనకుమారులు చిత్రకూటపర్వతము చేరఁగా శ్రీరామునందుఁగల ప్రేమాతిశయముచే రామా రామా యని యేడ్చి యేడ్చి దశరథుఁడు మరణించెను.

కం॥ జనకుం డీల్గుట రాజ్యం, బునకు వసిష్ఠాదివిప్రముఖ్యులు దన్నం
బనిపూని వేఁడ భరతుఁడు, గొనఁ డయ్యె న్వారిమాటఁ గొనసాగింపన్. ౧౧౪

జనకుం డీల్గుటన్ = తండ్రి చచ్చుటచేత. పరమపురుషుఁ డగు రామునకుఁ గన్నతండ్రియయ్యు వైకుంఠముకు జేరక యగ్నించిత్సుకృతము చేసినవారి కందఱకు సాధారణమై నశ్వరమైన స్వర్గముకు బొందుట యొకపెద్దకాదని యలక్ష్యభావముతో నీల్గుట యని చెప్పఁబడెను.

వసిష్ఠాది విప్రముఖ్యులు = వసిష్ఠుఁడు మొదలుగాఁగల బ్రాహ్మణశ్రేష్ఠులు.

తన్నన్ = భరతుని. రాజ్యమునకై = రాజ్యమేలుటకై. పని బూనన్ వేఁడన్ = పెద్దప్రయత్నము వహించుటకుఁ బ్రార్థింపఁగా.

భరతుఁడు = "భరత ఇతి రాజ్యస్య భరణాత్," పిన్నవాఁ డగుటచే రాజ్యప్రాప్తికి వలను గలుగకున్నను రాజ్యముకు భరించునని యెఱిఁగి వసిష్ఠుఁ డతనికి భరతుఁడని పేరుపెట్టెను. భరతుఁడు = రాజ్యభారముకు వహించుటయందు సమర్థుఁడయ్యెను.

వారిమాటఁ గొనసాగింపఁ గొనఁడయ్యెను = వసిష్ఠాదులమాటను నెఱవేర్ప నంగీకరింపలేదు. తనకు రాజ్యమేలుటకు శక్తియున్నను సర్వజ్యేష్ఠుఁడు రాముఁడున్నప్పుడు తా నేలుట స్వరూపవిరుద్ధ (పారతంత్ర్యవిరోధము) మగుట నంగీకరింపలే దనుట భరతుఁ డను పదమువలన గ్రహింపఁదగియున్నది.

కం॥ పుట్టియు దశరథునకు నే, నెట్టులు హరియింతురాజ్య మీరాజ్యంబుల్
అట్టులె నేనును రాముని, విట్టగుటను నీవ చెప్పుమీధర్మగతిన్. అయో ౮౯-౯౯.
అని భరతుఁడు ముందు చెప్పును.

ప్రశ్న - త్రిశంకుఁడు చెప్పినట్లు (బాల ౧౦౨-౬) సూర్యవంశపురాజులకుఁ బురోహితుఁడైన వసిష్ఠుఁడే గతి దిక్కు దైవ మై యుండ రాజాజ్ఞనను సరించి యాయన బోధించినదాని నేల భరతుఁడు తిరస్కరించెను? ఇది గురువాక్యము మీఱినట్లుగాదా?

సమాధానము - రాజు చెప్పినమాటను వసిష్ఠుఁడే చెప్పెనేకాని పెద్దవాఁడుండఁ జిన్నవాఁడు రాజ్య మేలుట యన్యాయ మని యాయనకుఁ దెలియక పోలేదు. ఇఁక భరతుఁడో భగవత్పరతంత్రుఁడు తన్నుఁ దన దేహమును దన సర్వస్వమును శ్రీరామునకే తత్పూర్వమే సమర్పణము చేసినవాఁడు. అట్టిదాని మరల గ్రహించుట దత్తాపహారదోషప్రాప్తికిఁ గారణమగును. అది పారతంత్ర్యమునకు విరోధము. దానివలన స్వరూపహాని గలుగును. ఇట్టి యాత్మహత్యవంటి ఘోరకార్యమును నెవరు చెప్పినను జేయరాదు. తనమాట వినలే దని వసిష్ఠుఁడు కోపించిన శాప మియ్యఁగలఁడేకాని యాత్మహాని గూర్పలేఁడుకదా. ఆయనమాట వినినఁ గలుగు స్వరూపహానినుండి యాయన తప్పింపఁగలఁడా? అట్టి శక్తిలేక యకార్యమును జేయు మని ప్రేరించువా రెవ్వరైనను వారిమాట వినరాదు. ఈ కారణముచేతనేకదా ప్రహ్లాదుఁడు తండ్రిమాట వినఁడయ్యెను. అంతకు వసిష్ఠుఁడు వేఁడెనేకాని శాసింపలేదు.

వారిమాట = వారిబోధమునకు యాజ్ఞయనక 'మాట' యని చులకనగాఁ జెప్పుట వారిమాటయందు గౌరవబుద్ధి లేకుండుటచేతనే

తా త్ప ర్య ము.

తండ్రి మరణించుటచేతను రాజ్యస్థుఁడైన జ్యేష్ఠపుత్రుఁ డరణ్యములందుండుట చేతను రాజ్య మరాజకమగు నని తలఁచి దశరథునభిప్రాయము పురస్కరించుకొని వసిష్ఠుఁడు మొదలగువారు రాజ్యభారము వహింప భరతుని బ్రార్థించిరి కాని వారిమాట నాయన నెఱవేర్ప నంగీకరింపఁడయ్యె.

సీ॥ అమ్మహాబలుఁడు ని•జాగ్రజాంఘ్రిప్రసా, దార్థియై వనమున • కరిగి రాము
నసఘు మహాత్ము య•థార్థపరాక్రము, నార్యభావంబున • నర్థి వేఁడె
నన్న! ధర్మజ్ఞుండ • వైననీవె రాజుఁ, గానుండవే యనఁ • గరుణఁ జూచి
రాముండుత్యాగాభి•రాముండు సుముఖతో, ద్దాముండు సద్యశో•ధాముఁడయ్యు
తే॥ దండ్రియాదేశమును మదిఁ • దలఁచి రాజ్య, పాలనం బొల్ల కతనికిఁ • బావలిచ్చి
తనకుమాఱుగఁ, బొమ్మంచుఁ•దఱిమిచెప్పి, పంచె నతని నయోధ్యకు •భరతుఁడంత.

అమ్మహాబలుఁడు = (1) రాజ్యమేలుటకుఁ గావలసిన బలముగలవాఁడు. (2) కామక్రోధాదులగు నరిషడ్వర్గంబులను జయించు శక్తిగలవాఁడు. (3) చతురంగబలముతోడి గొప్పసైన్యము గలవాఁడు

సేనతోడఁ బోవుటకుఁ గారణమేమనఁగా—(1) భరతుఁడొంటిగఁ బోయిన నితఁ డొక్కఁడే ప్రార్థింపవచ్చినాఁడు. శక్తినవా కెవ్వరికిని నేను రాజగుట యిష్టములేదేమో యని రాముఁడు తలఁచునేమో యని యొక సందేహము. (2) వీఁడు రాజ్యమును గ్రహించుటకుముందు మర్యాదకొఱకు నన్నుఁ జూడ వచ్చి యేల వచ్చితివి నీ వని నే నడుగ నీకు రాజ్యమిచ్చుటకు వచ్చితి నని యుపచారవాక్యము చెప్పుచున్నాఁడే కాని నిర్వంచనముగా వీని కీ యభిప్రాయము గలదా యని రామ నడవడినే సందేహించునేమో యనునది రెండవ సందేహము. (3) తనమాట లక్ష్యము చేయకున్నను నింకను చెప్పిన వినకుండునాయను నాపేక్ష. (4) లోకులు తాను బాంధవ్యానికబుద్ధితో శ్రీరామునిఁ బిలువలేదని సందేహింతురేమో - వారే సాక్షులుగానుండిన మేలని. (5) తాను నిలువఁ దలఁచినను తప్పఁ గన కనుకూలురు పట్టంబున లేరని యంతయు రామున కనుకూలురే యని లోకకుఁ దెలియుటకు. నిజాగ్రజాంఘ్రిప్రసాదార్థియై, నిజాగ్రజ = తనయన్నగారియొక్క, అంఘ్రి = పాదము, అంఘ్రిశబ్ద మిచ్చటఁ బూజార్థకము. 'పూజ్యేతు పాదనామాంక' యని యనుశాసనముచేఁ జెప్పఁబడి నట్లు పాదశబ్దము మాత్రము పూజ్యవాచకమై కనఁబడినను 'అస్మత్ పితృచరణా' యని పూజార్థకప్రయోగమునుబట్టి పాదపర్యాయము లన్నియుఁ బూజ్యవాచకములు. పూజ్యుఁడైన తనయన్నగారి యనుగ్రహమును ప్రార్థించువాఁడై (2) రాముని పాదంబులదయను సంపాదించువాఁడయి దయచేయువాఁడు రాముఁడే యయ్యును రామపాదంబులదయ ననుట శేషభూతులవ్యవహారంబు. ఆత్మనైచ్యానుసంధానము. దేవరవారిపాదంబుల దర్శింపవచ్చితి మనఁగా భృత్యులు గొప్పవారిఁగూర్చి చెప్పుట వాడుక. నడచిరావలసినవి పాదములే కావున వానిదయ సంపాదించుకొనుట యవశ్యకార్యము.

వనమునకరిగి = అడవికిఁబోయి. రామునిక భరతునియందుఁ గోపము లేదు. భరతుఁడు దానికై ప్రార్థించుటయు నక్కఱలేదు. అయినను దశరథుఁడు రాజ్యంబును భరతునికిచ్చెఁగదా యన్న తలంపుమార్చుటకై వేఁడఁబోయె నని భావము.

ఉ॥ చెప్పితి బుద్ధి తల్లికని జెన్నఁటి రీతిని నాకు దత్తమై
విప్పగు భాగ్యయుక్తపృథివీస్థలి మీకు నొసంగువాఁడనై
యిప్పనిఁబూనివచ్చితి నహీనగుణాఢ్య యకంటకంబునా
నిప్పుడమింగ్రహించి యవనీశ్వరనన్నుఁ గృతార్థుఁజేయవే. అయో. ౨౩౬-౭ప.

అని భరతుఁడు చెప్పెను.

అనఘుః = ద్వేషాదిదోషములు లేనివానిని - తుచ్ఛరాజ్యము నిమిత్తమై న న్నడవులపాలు సేసెఁగదా యని ద్వేషము, క్రోధము లేనివానిని.

మహాత్మః = గొప్పమనస్సుగలవానిని, ప్రార్థన యక్కరలేకయే స్వయముగానే దయఁదలఁచువానిని.

యథార్థపరాక్రమః = యథార్థశబ్దము భావప్రధానము - యాథార్థ్య = సత్యమునందు, పరాక్రమః = భ్రంశములేనివానిని - రామునిఁ.

ఆర్యభావంబునః = మంచితనముతో - సాధుభావముతో,

అర్థిః = ఎట్లైన శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకము చేయవలయునను కోరికతో. వేఁడెః = ప్రార్థించెను. ఏమని వేఁడెను?

ధర్మజ్ఞుండవైన = జ్యేష్ఠుఁడే రాజ్యాధికారి, జ్యేష్ఠుఁడుండ కనిష్ఠుఁడు రాజ్యభరమున కనర్హుఁ డను ధర్మము నెఱిఁగినవాఁడవైన.

నీవే రాజుగా నుండవే యనిః = నీవుతప్ప వేఱొకఁడు రాజు కాఁగూడదని. ప్రార్థింపఁగా = శరణాగతిచేయఁగా. శరణాగతి = శరణ + ఆగతి, శరణము = రక్షకము - రక్షణము. ఆగతి = ఆగమనము = రాక, వచ్చుట. రక్షణముఁగోరి రక్షింపఁగలవానియొద్దకు వచ్చుట - అనఁగా నన్ను నీవు రక్షింపుమని యాశ్రయించుటకు శరణాగతి యని పేరు. ఇంతే దీర్ఘవాక్యము వ్రాయుటకు మాఱు సంగ్రహపదము శరణాగతి యనివ్రాయఁబడును. దీనికే ప్రపత్తి యనియుఁ బేరు. ఇట్లు భరతుఁడు చేసిన శరణాగతి ఫలింపలేదు? శరణు వేఁడు నధికారిలోపమా? రాముని రక్షకత్వమున లోపమా? ఉపాయోపేయముల వరలక మున్నఁగద యధికారిలోపము. భరతుఁడు శ్రీరామచంద్రునిఁదప్ప వేఱొకని యాశ్రయింపఁడు. శ్రీరామచంద్రమూర్తినే శరణువేఁడి శ్రీరామచంద్రమూర్తి కైంకర్యమునే యపేక్షించుటచే నుపాయముగాని యుపేయము వేఱొండు గలదనరాదు కావున నధికారిలోపము లేదు. శ్రీరాముఁడు సర్వగుణపరిపూర్ణుఁ డగుటచేత రక్షకునియందు లోపము లేదు. అయినను శరణాగతికిఁ బ్రబలప్రతిబంధకము ప్రారబ్ధము. అదియే కారణ మని చెప్పుచున్నాఁడు.

రాముఁడయ్యును = స్వభావగుణములచేత నాశ్రితుల మనస్సును సంతోషపఱచుస్వభావము కలవాఁడయ్యును. అయ్యును అను పదము ప్రతివిశేషణమున నన్వయించును.

త్యాగాభిరాముఁడయ్యెను = దానగుణముచేత మనోహరుఁడయ్యెను. 'ఆత్మదా బలదా' యని శ్రుతి.

సుముఖతోద్ధాముఁడయ్యెను = శరణార్థులు వచ్చిరే యని మండిపడక సంతోషముకల ముఖముతో మనోహరుఁడయ్యెను.

సద్యశోధాముఁడయ్యెను = అర్థిమనముల వ్యర్థపరుపక పూర్తిచేయువాఁడన్న కీర్తికి నివాసమయ్యెను. "స హ్యర్థినః కార్యవశా దుపేతాః, కకుత్స్థవంశే విముఖాః ప్రయాంతి" అని విష్ణుపురాణవచనము.

తండ్రియాదేశమును మదిఁ దలఁచి — ఆదేశము = ఆజ్ఞ - ఈ యాజ్ఞయే ప్రబలప్రతిబంధము.

రాజ్యపాలనంబొల్లక = తండ్రియాజ్ఞచొప్పునఁ బదునాలుగు సంవత్సరములు రాజ్యమేలుటకు సమ్మతింపక. ఈ ప్రతిబంధకము శరణాగతి చేసినపిమ్మట వచ్చినది కాదు తత్పూర్వమే పుట్టి యనుభవమునకు వచ్చియున్నది. ప్రార్థ మనుభవింపక నశింపదు. కావునఁ దత్కాలమున నిష్ఫలమయ్యెను. శరణాగతి వ్యర్థము కాని యుపాయము. కావున సర్వథా భరతుని నిరాకరింపఁగూడక ప్రతిబంధము తీఱువఱకు భరతాపేక్షితమునకుఁ బ్రతినిధిని చెప్పుచున్నాఁడు.

కరుణఁ జూచి తనకుమాఱుగానతనికిఁ బావలిచ్చి = దయతోఁ జూచి "రాము పాదుకలు రాజ్యము నేలుచున్నవి నేను వానియాజ్ఞప్రకారము నడచుకొనువాఁడను అట్లున నాకు స్వాతంత్ర్యహాని లేదు. నీకు నీకోరికయు వ్యర్థము పోదు" అని తలఁచుకొనుము అని చెప్పి రాజ్యమేలుటకుఁ బాదుకలు తన పాదుకల నిచ్చెను. పావలు = పాదుకలు. రామచంద్రమూర్తిపాదముల ప్రసాదము కోరుటచేఁ బాదుకలు లభించెను

అయోధ్యకుఁ బొమ్మంచుఁ బెక్కుమఱి చెప్పి పంపెను = పెక్కుమఱి చెప్పి = మీఁద మీఁదఁ బలుమాఱు చెప్పి భరతుఁడు రామచంద్రమూర్తిని విడిచిపోలేక యచ్చటనే యుండుటచేతఁ బలుమాఱు చెప్పి బలాత్కరించె నని భావము

తాత్పర్యము.

రాజ్యమేలుటకుఁ గావలసిన దేహబలము, సేనాబలము, ఇంద్రియముల నిగ్రహించుబలము గలవాఁడయ్యెను భరతుఁడు శ్రీరామచంద్రచరణారవిందముల యనుగ్రహము కోరినవాఁడై, యితఁడు నా కన్నులనీరు తుడిచి యుపచారవాక్యములు చెప్పుటకై వచ్చెనే కాని నిజముగా వీఁడు రాజ్యమీయ వచ్చినాఁడా? అట్లు వచ్చియుండిన యొంటరిగా నేలవచ్చు ననికాని, నేను బారమార్థికబుద్ధితోఁ బిలువవచ్చినను మరల నగరమునకు రావలయునని కోరువాఁడు

వీఁడొక్కఁడేకాని తక్కినవారు పోయినఁబోనీలే యని పౌరులందఱు నుదాసీనులై యున్నారేమో యనికాని రాముఁడు సందేహించునో, తనకే రాజ్యముదక్కవలయునని సగౌరవముగాఁ బిలువలే దని లోకులే సందేహింతురో, నాప్రార్థనము వినకున్నను నిందఱు ప్రార్థించిన నంగీకరింపకుండునా యనియు నాలోచించి సర్వసేనలతో బయలుదేఱి రాముఁ డున్న చిత్రకూటముఁ జేరి తనయందు ద్వేషబుద్ధిలేని గొప్పమనస్సుగల సత్యవిక్రముఁడైన శ్రీరామచంద్రమూర్తిని సాధుభావముతో 'నన్నా! నీకుఁదెలియని ధర్మమేదియున్నది. పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు రాజై పట్టాభిషేకము చేసికొనవచ్చునా? కావున నీవే రాజవుకమ్ము' అని ప్రార్థింపఁగా నతనిదయార్ద్రదృష్టిచేఁ జూచి తండ్రియాజ్ఞ యను ప్రార్థము మీఱరానిదగుటచే శ్రీరామచంద్రమూర్తి పరులకు సంతోషపెట్టుస్వభావము గలవాఁడయ్యు, అట్లు సంతోషపెట్టుటకు నెంతత్యాగమైనఁ జేయువాఁడయ్యు, వీని నిమిత్తమై యింతత్యాగము చేయవలసివచ్చెనే యని ముఖము మాడ్పులేనివాఁడయ్యును, నర్థులమనోరథమును వ్యర్థముచేయఁ డన్న మంచికీర్తికి నివాసభూమియయ్యును, శ్రీరామచంద్రమూర్తి జనకాజ్ఞను స్మరించి రాజ్యమంగీకరింపక భరతునిప్రార్థనము వ్యర్థముసేయ నొల్లక తనకుఁ బ్రతినిధిగఁ దన పాదుక లిచ్చి యప్పటికిఁ దన్ను విడచిపోవుటకు సమాధానపడని భరతుని పొమ్ము పొమ్మని బలవంతపెట్టి పంపఁగా భరతుఁడు (ముందరి పద్యముతో నన్వయము)

క॥ కామము నెఱవేఱమిచే, రాముని పాదుకలఁ గొల్చి ♦ రామాగమనం
బే మది వేచుచు నంది,గ్రామంబున నిస్స్పృహతను ♦ రాజ్యముఁ జేసెన్. ౧౧౦

ప్రబల ప్రతిబంధకముచే శరణాగతుని యిష్టము నెఱవేఱనప్పుడు నాఁడా ప్రతిబంధకనివృత్తివఱకు శరణ్యునియెడ దాసుఁ డుండవలసినవిధమును జెప్పుచున్నాఁడు. శరణ్యుఁడు రక్షించు యోగ్యత కలవాఁడు.

భరతుఁ డను విశేష్యమును బూర్వపద్యాంతమునుండి తెచ్చుకొనవలయును.

కామము నెఱవేఱమిచే = రామునికిఁ గైంకర్యము చేయుచుండవలయునన్న కోరికఫలము కాకుండుటచేత నే.

రామునిపాదుకలఁ గొల్చి = ప్రతిదినము శ్రీరామచంద్రమూర్తి పాదుకల సేవ సేయుచు.

రామాగమనంబేమదివేచుచున్ = ఎప్పుడు పదునాల్గుసంవత్సరములు ముగియునా - ఎప్పుడు శ్రీరామచంద్రమూర్తి వచ్చునా - ఆయనకైంకర్య మెప్పుడు లభించునా యని మనస్సంతయు దానియందే నిలిపి యెదురుచూచుచు.

నందిగ్రామంబునఁ = అయోధ్యకు సమీపమున నందిగ్రామ మను నొకగ్రామ ముగలదు. దానియం దుండి భరతుఁడు రామచంద్రమూర్తిలేని యయోధ్య యందుఁ బ్రవేశింప నొల్లఁడయ్యెను.

నిస్స్పృహతను = భోగాపేక్షగాని ఫలాపేక్షగాని లేక.

రాజ్యముచేసెఁ = శ్రీరామచంద్రమూర్తి నియమించిన కైంకర్యముగదా యను తలంపుతో రాజ్య మేలెను. భగవదనుగ్రహము వచ్చి యాయన సాక్షాత్క రించువఱకు నాయనమాఱుగ నాయనపాదుకలో విగ్రహమో పటమో యొక దాని నుంచుకొని దానికి సమస్తసేవలు దేవోపచారములు చేయవలయును. ఇట్టి భగవచ్చింతాపరునకు నగరవాసము త్యాజ్యము.

శ్లో॥ సమ్మానకాలకూటం, తరుణీకుణపం, సభాభుజంగించ
పరిహరతి రాజధానీ, కుంభీపాకంచ, గుప్తమాహాత్మ్యః॥

ఇట్టి భగవద్ధ్యానరతుఁడు గౌరవమును గాలకూటవిషము వలెను, వయస్సు స్త్రీలను బీనుఁగులవలెను, సభను ఱేఁడుసర్పమువలెను, నగరవాసము కుంభీపాక వాసముగా నెంచవలయును. ఈకారణముచే భరతుఁడు నగరమును, భార్యను, సింహాసనమును, సభామండపమును సర్వము విడిచెను.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకముచేసి సన్నిధినుండి సేవచేయుచుండ వలయు ననెడి తనకోరికకొనసాగక పోవుటచే నాయనమాఱాయనపాదుకలకు సేవసేయుచు రామచంద్రమూర్తి యెప్పుడు వచ్చునో? ఎప్పుడు కన్నులార దర్శింతునో? ఎప్పుడు సేవింతునో యని యెదురుసూచుచు శ్రీరామచంద్ర మూర్తి లేనినగరము చేరనొల్లక నిరంతరధ్యానమునకుఁ బల్లెటూరు తగిన ప్రదేశ మని యెంచి నందిగ్రామమందు భోగకాంక్షకాని ఫలకాంక్షకాని లేక రాజ్యముచేసెను.

సీ॥ భరతుఁ డట్టులు చనఁ • బౌరులు మఱిమఱి, దనుఁ జూడ వత్తుర • న్తలఁపుఁ జేసి
దండక విజతేంద్రి•యుండు సత్యాత్ముండు, సొచ్చి విరాధుని • స్రుక్కఁ జేసి
శరభంగు దర్శించి • చని సుతీక్ష్ణునిఁ గాంచి, కనుచు నగస్త్య న•గస్త్యభ్రాతఁ
గడుమోదమునను న•గస్త్యుమాటన యైంద్ర,ధనవు ఖడ్గముఁ దూణి•సునిశితంబు
తే॥ లక్షయశరంబులం గొనె•నటవిచరుల, తోడ నుండెడిరఘురాము•తోడ మౌను
లసురరాక్షససంహార • మర్థి వేఁడ, నట్లకావింతు నని వారి • కభయ మిచ్చె.

అయోధ్యాకాండార్థమగు పితృవచనపరిపాలనసిద్ధిని నిగమించుచు నరణ్య కాండార్థమును బ్రస్తావనకుఁ దెచ్చుచున్నాఁడు.

భరతుఁడట్టులు చనెన్ = అట్టులు = ఆప్రకారము అనఁగా రూపముధరించిన రామాజ్ఞయగు పాదుకల శిరసా వహించి రామాగమనము వేచుచు నిస్పృహుఁడై తనకు విధిగ నేర్పడిన రాజ్యపాలనకార్యముచేయఁ బోఁగా రామచంద్రమూర్తియుఁ దండ్రియాజ్ఞ శిరసా వహించి దేవతల శరణాగతి ఫలింపఁజేయ రావణవధకాలము వేచి రాజ్యమునందు నిస్పృహుఁడై తనకు విధిగ నేర్పఱుచుకొన్న రాక్షసవధాదికార్యముఁ దీర్ప నాచిత్రకూటము విడిచిపోయె నని భావము.

సత్యాత్ముఁడు = భరతుఁ డెంత నిర్బంధించినను కదలక నిశ్చలమైనసత్యమే స్వభావముగాఁగలవాఁడు.

విజితేంద్రియుఁడు = సమస్తేంద్రియములను జయించి స్వాధీనమం దుంచుకొన్నవాఁడు. తల్లి, భరతుఁడు మున్నగువా రెంతో ప్రార్థించినపుడును రాజ్యమునం దాశ నహింపనివాఁడు.

మఱిమఱి = పలుమాఱు.

పౌరులు దనఁ జూడవత్తురన్ తలఁపుఁజేసి = అయోధ్యాపురిజనులు తన్నుఁ జూడవత్తు రను నభిప్రాయముతో నాస్థలమును వదిలెను. (1) జనులు పలుమాఱు గుంపులై వచ్చుచుండిన నచ్చటి ఋషులకు ననుష్ఠానవిరోధము. పౌరులు చూడవచ్చిరా భరతుని వేఁడికోలు. తననిరాకరణము స్మృతికిఁ దెచ్చి సత్యాత్ముఁడు విజితేంద్రియుఁడు నైనను మనస్సును గలవరపెట్టు నని "నామనసు భ్రాతపయిం జనుచున్న దహహా! భావుఁడు చిత్రకూటమునఁ బాదములం బడెఁ జేతులొగ్గ నెంతో వడి వేఁడె నస్మరిలఁదోఁద్రోసిపోవ నిరాకరించితిన్." యుద్ధ. ౧౭౬౭. అని రాముఁడే చెప్పెనుగదా.

ఇట్లయోధ్యాకాండార్థమును సంగ్రహముగాఁ జెప్పి పితృవచనపరిపాలన మను సామాన్యధర్మమును స్వామియగు భగవంతుని విషయమున దాసుఁడు చేయవలసిన కైంకర్యవృత్తియుఁ బ్రపన్నుఁడు భగవత్పరతంత్రుఁడుగానే యుండవలయు ననియుఁ, బ్రపత్తికి భంగమువచ్చు కార్యము లెవరుచెప్పినఁ జేయరాదనియు విశేషధర్మములను దెలియబఱిచెను.

ఇఁక నరణ్యకాండార్థము సంగ్రహింపఁబడును. ఎన్నికష్టములు వచ్చినను ప్రతిజ్ఞను అందు ముఖ్యముగా బ్రాహ్మణులయెదుటఁ జేసినదానిని, తప్పరాదనుట యరణ్యకాండార్థ తాత్పర్యము.

విరాధుని ద్రుక్కఁజేసి = ఆయుత్సాహముచేతనే విరాధుఁ డను రాక్షసుని సంహరించి.

శరభంగు దర్శించి = శరభంగుఁ డను మహర్షి దర్శనము చేసికొని.

'రిక్తహస్తేన నోపేయాత్, రాజానం దైవతంగురు' మ్మన్నటు లుత్తచేతులతో మహర్షిని దర్శింపఁబోవుట బాగుగాదని యెంచి విరాధసంహారమును గానుక గా నంచుకొని శరభంగుని దర్శించెనని తాత్పర్యము.

సుతీక్ష్ణునిఁ గాంచి = శరభంగుఁడు చెప్పినదారినిబోయి సుతీక్ష్ణునిఁ జూచి.

అగస్త్యు, నగస్త్యభ్రాతఁ గనుచున్ = అగస్త్యమహర్షిని, ఆ యగస్త్యుని తమ్మునిఁజూచుచు - అగస్త్యుని తమ్ముని పేరు సుదర్శనుఁడు 'యవీయా నేష మే భ్రాతా, సుదర్శన ఇతి స్మృత' యని సనత్కుమారసంహితయందు నగస్త్యుఁడే చెప్పెను. కుంభమునఁబుట్టిన యగస్త్యునికి సోదరుఁడు లేకున్నను నాత నితోఁగూడఁ బెంపఁబడుటచే నితఁ డగస్త్యభ్రాత యయ్యెను.

కడుమోదమునన్ = (శ్రీవీర్యంబునకుఁదోడు తగిన యాయుధములును దొరకెఁగదా యని) మిక్కిలి సంతోషముతో.

అగస్త్యునిమాటన = అగస్త్యునిమాట త్రోసివేయలేక తీసికొన్నాఁడుగాని తానుగ యాచించి తీసికొన్నవాఁడు గాఁడు అని 'అ' కారము (మాటన్ + అ మాటన) తాత్పర్యము.

ఇంద్ర ధనువును = ఇంద్రుఁడిచ్చిన వింటిని, ఐంద్రము. - సంబంధార్థక అణ్ ప్రత్యయాంతము - ఇచ్చుటయే సంబంధము (అరణ్య- ౨౦-౨)

ఐంద్రశబ్దము ధనుశ్శబ్దముతోమాత్రము సమాసమైయున్నను దూణిశరం బులకును నన్వయించును.

తూణి = అమ్ములపొదులు రెండు. ఇట జాత్యేకవచనము.

సునిశితంబులు = మిక్కిలి పదునుగలవి.

అక్షయశరంములం గొనెన్ = యుద్ధమున నెంతయుపయోగించినను దఱుగని బాణములను బుచ్చుకొనెను.

అగస్త్యుమాటకొనెన్ — అనుటచే నగస్త్యుఁడు ఖడ్గాదులను రామునిచేతి కందియ్యలేదనియు అవిగో నందున్న వని చెప్పినఁ దానే యెత్తికొనెననియు గ్రహించునది. ఇఁక నిట్లు విరోధినిరసనమున కానుకూల్యమును జూచి యిది గదా మన కవకాశ మని తలఁచి ఋషులు రామునిఁ బ్రార్థించుచున్నారు.

మానవులు = శరభంగాశ్రమమందలి ఋషులు "శరభంగాశ్రమే రామ మభి జగ్ముశ్చ తాపసా" యని ముందు చెప్పఁబడును.

వనచరులతోడ నుండెడి రఘురాముతోడన్ = చిత్రకూటము పంపావనము మొదలగునడవులయందలి ఋషులతోఁగూడినరాముని (1) ఈఋషులును రాము

నియొద్దకు వచ్చుటకుఁ గారణము రాక్షససంహారము చేయు మని ప్రార్థించుటకే. శరభంగాశ్రమమందలి ఋషు లితరసకలఋషులతోడను రాక్షసబాధ పడలేక రాముని వేఁడి రని భావము. 'పంపావననివాసానా, మనుమందాకినీ మపి, చిత్రకూటాలయానాంచ, క్రియతే కదనం మహ' త్తని ముందు చెప్పఁబడును. (2) ఇట్లు రామచంద్రమూర్తి ఋషులతోఁ గలిసి వానప్రస్థుఁడై యున్నను నాయునికి లక్ష్యపెట్టి ప్రార్థించి రని భావము. "కం॥ కావున మేమెల్లరమును, నీ విషయమునందునుంట నీచే నెపుడున్ । గావంబడ సర్హుల మో, భూవరతనయాగ్రణీ ప్రభూతపుఁగరుణన్" అరణ్య. ౧౪. అని ముందు చెప్పఁబడును.

అసురరాక్షససంహారము — అసురరాక్షసులు = అసురస్వభావముగల రాక్షసులు. 'విభీషణస్తు ధర్మాత్మా, నతు రాక్షసచేష్టితః' యన్నట్లు విభీషణునివలె మంచి స్వభావములేక దుర్మార్గులగు రాక్షసులు (2) అసురులును - రాక్షసులును. కబంధాదు లసురులు రావణాదులు రాక్షసులు యోగమును దప్పున దుర్వినియోగపఱచి మాంసభోజులయి దుర్వృత్తి మరగినవారు రాక్షసులు బ్రాహ్మణులకు దుష్టస్వభావలగు స్త్రీలకు జనించినవారు మాతృదోషముచే రాక్షసు లగుదురు రాక్షసవేళల సంభోగించుటచే గర్భము నిలిచెనేని రాక్షసులు పుట్టుదురు. తల్లి క్రూరాలోచనలు చేయుచు సంభోగించెనేనియు బిడ్డలు రాక్షసు లగుదురు. వీర్యబలముకొలఁది వీరి క్రౌర్య మతిశయించి యుండును. తమ కట్టి జన్మము కలిగించినవారు బ్రాహ్మణులే కావున వారినే పట్టి తిందురు. నేరమునకుఁ దగినశిక్ష న్యాయ్యమేకదా. 'ఏకః పాపాని కురుతే, ఫలం భుంక్తే మహాజనా' యన్నట్లు పాపముచేయువాఁ డొకఁడు, దాని ఫల మనుభవించువారు పెక్కండ్రు.

రావణాదులు పౌలస్త్యులు హిరణ్యాక్షాదులు కాశ్యపులు. (3) అసు = ప్రాణములను, రా=లాగువారగు రాక్షసులు అసురరాక్షసులు. ఇట్టివారి సంహారము మునులు కోరినది. దుష్టరాక్షససంహారమే కాని శిష్టరాక్షససంహారము కాదు. అర్థిన్ వేఁడన్ = ఆశతోఁ బ్రార్థింపఁగా - శరణాగతి చేయఁగా.

ఋషులదుర్దశఁ గని వారితో వారివిరోధుల నిరసింతునని ప్రతిజ్ఞచేసెనని చెప్పుచున్నాఁడు.

అట్లు కావింతును = మీరుకోరినట్లే చేయుదును.

అభయమును వారి కిచ్చెను= భయముయొక్క అభావము అభయము - భయపడవలదని చెప్పె నని భావము, **రాముఁ డను పద మధ్యాహారము.**

తాత్పర్యము.

భరతుఁ డాప్రకారము మూర్తీభవించిన రామాజ్ఞ యగుపాదుకల శిరసా వహించి మరలి యయోధ్యకై పోవఁగా పురజనములు పలుమాఱు తన్ను దర్శింపవచ్చుచుందురనియు, దానిచే నాశ్రమవాసులైన తాపసులతపస్సులకు భంగము కలుగుచుండుననియు నాలోచించి యింద్రియముల జయించిన వాఁడును సత్యస్వరూపుఁడునైన రామచంద్రమూర్తి దండకారణ్యము ప్రవేశించి విరాధు వధించి శరభంగు దర్శించి సుతీక్ష్ణునిఁ గాంచి యగస్త్యునినాయనతమ్ముఁడైన సుదర్శనుని దర్శించి, యగస్త్యుఁడు చెప్పఁగా నాయనయొద్దనున్న (యింద్రుఁ డగస్త్యునొద్దనుంచిన) ధనస్సును, ఖడ్గంబును, రెండంబులపొదులను, పదునైన యక్షయశరంబులను సంతోషముతోఁ దీసికొని మునీశ్వరులతోడ నుండఁగా నాయాశ్రమవాసులైన ఋషీశ్వరులును దమ తపస్సు విఘ్నముచేయు హింసాపరులైన రాక్షసుల వధింపుమా యని వేఁడఁగా నట్లే చేయుదునని వారి కభయమిచ్చెను.

ఉ॥ ఆనరపాలచంద్రసుతుఁ డచ్చట నిచ్చఁ జరించుచోఁ జన
స్థాననివాసినిన్ భయదదానవకామినిఁ గామరూపిణిన్
బూని విరూపఁ జేయ నది బోదనచేసిన సర్వరాక్షసుల్
తో నడువం ద్రిశీర్షఖరదూషణముఖ్యులు దన్నుఁ దాఁకినన్.　　౧౧౨

ఇఁక రాముని ప్రతిజ్ఞ నిర్వహింప విస్తరము విత్తుచున్నాఁడు.

ఆనరపాలచంద్రసుతుఁడు = దశరథపుత్త్రుఁడగు శ్రీరామచంద్రమూర్తి.

అచ్చటన్ = జనస్థానమునందు, ఇచ్చన్ = ఇచ్చకొలఁది, చరించుచోన్ = తిరుగుసమయమందు.

జనస్థాననివాసినిన్ = జనస్థానంబున నివసించుదానిని, కామరూపిణిన్ = కోరినరూప మెత్తఁగలదానిని - రామునియొద్దకు వచ్చినపుడు ఆయనను కామించుటకై సౌమ్యరూపమును ధరించిన దని.

భయదదానవకామినిన్ = భయంకరియగు రాక్షసస్త్రీ యగు శూర్పణఖను- జాతిభేద ముండినను వృత్తియం దందఱు సమానులే కావున అసుర రాక్షస దానవ దైత్య శబ్దములు పర్యాయపదములుగాఁ బ్రయోగించుట కవిసమయము. కామిని = ఈశబ్దమువలన నారాక్షసి కామప్రేరితయై రామునొద్దకు వచ్చినదని భావము. అది నెఱవేఱనపుడు సీతాపహరణార్థము భయంకరాకారము దాల్చిన దని భయదశబ్దసారస్యము. జాతియందు రాక్షసియయ్యు దానవశబ్దప్రయోగము కృత్యముంబట్టి యని యెఱుంగునది. అసురస్వభావ యని భావము.

పూని = ప్రయత్నించి. స్త్రీకదాయని రామచంద్రమూర్తి యెంత యుపేక్షించినను సీతను హరించుటకై యది పైపడి వచ్చుటచే శిక్షించుటకై ప్రయత్నము చేయవలసివచ్చిన దని భావము. అనఁగా నది క్రోధముచేఁ జేసిన పని కాదనియు, దాని బాధ తప్పించుకొనుటకై వేఱుమార్గములులేక చేయవలసి వచ్చి చేసె ననియు భావము.

విరూపఁజేయఁగ = ముక్కు సెవులు తెగఁగోసి వికారరూపము కలదానినిగాఁ జేయఁగా. చేసినది లక్ష్మణుఁడేయైనను ఆయన నిమిత్తమాత్రమే యగుట కర్తృత్వము రామచంద్రునకే చెప్పఁబడెను

విధవయయ్యుఁ గామముగల దగుటచే దాని కాశిక్ష. విరూపకరణము మరలఁ గామభోగపరతంత్ర కాకుండుటకై యని గ్రహింపవలయును.

ఆయుధము ధరించి తన్నుఁజంపవచ్చిన బ్రాహ్మణుని,దన్నుఁబొడిచిచంపవచ్చిన గోవును, నట్టియుద్యమముగల స్త్రీని జంపినను దోషములే దని భారతంబునఁ గలదు. అల్పముతోఁ గార్యము సిద్ధించునేని చంపరాదు దాని బాధ తప్పించుకొనుటకై యెంత తక్కువశిక్ష చేయవచ్చునో యంతే చేయఁబడెను. ఒకప్రక్క కైకేయి యొకప్రక్క శూర్పణఖ లేకుండిన లోకమునకు రామాయణము లభించియుండదు. విధవయై కాముకయై పుట్టినిల్లుచేరిన యాఁడుబిడ్డల మాట విని వర్తించువారు వంశనాశనమై పోదు రని శూర్పణఖవలన లోకము నేర్చుకొనవలసిన విషయము. సర్వరాక్షసులఁ = జనస్థానమందుండు రాక్షసు లందఱు - పదునాలుగువేల రాక్షసులు. తోడఁ = ఇది సహార్థకావ్యయము. తమతోడఁ అని. త్రిశిరఃఖరదూషణ ముఖ్యులు = త్రిశిరుఁడు - ఖరుఁడు - దూషణుఁడు అను ప్రధానసేనానాయకులు. ఖరుఁడు - రావణుని ప్రతినిధి - దండకయందుండువాఁడు - రావణునికిఁ బినతల్లి కుమారుఁడు. తన్నుఁ దాఁకిరఁ = తనతో యుద్ధముచేయుటకుఁ బైపడఁగా.

వ్యాకరణము.

తమతోడఁ అనఁగాఁ దమతోడ ననుటకు. "గీ॥ స్తంభగతరత్నపుత్రిక తనదు బోటి । యని విలోకించి తోన మాటాడకునికి । నలుగడలుచూచి తెలిసి యచ్చెలువ బెదరి । వెడలనుంకింపఁ జేదమ్మి యొడిసిపట్టె॥" రామా. ౪ ఆ. (తోడఁ= తనతోడ) ప్రౌ. వ్యా. కారక. ౬.

తాత్పర్యము.

ఆవల పంచవటియందు సీతారామలక్ష్మణులు తమ యిష్టప్రకారము సంచరించుచుండుసమయంబున జనస్థానమునందు వాసముచేయు భయంకరరూపము

గల రాక్షసకామినిని కామరూపను విరూపఁజేయఁగా నది ప్రేరింప ఖరదూషణ త్రిశిరు లను రాక్షసులు సేనలతో యుద్ధమునకు రాఁగా.

ఉ॥ వారిని వారివారి సని♦వారణవారణవిక్రముం డనిన్
వీరుల నాలుగుంబదియు♦వేవుర రాముఁ డేకతంబ దో
స్సారమున న్వధింపఁ దన♦జ్ఞాతుసంహరణంబు విన్ని దు
ర్వారతరాగ్రహంబుమెయి♦ రావణుఁడుం దనకున్ సహాయతన్   ౧౧౩

అనివారణ = నివారింపరాని.

వారణవిక్రముఁడు = ఏనుగుబలమంత బలముగలవాఁడు - రాముఁడు.

ఏకతంబ = అసహాయుఁడయి. లక్ష్మణుఁడు సీతారక్షణార్థమై దూరమం దుండెను.

దోస్సారమునన్ = భుజబలముచేత.

నాలుగుంబదియు వేవురన్ వీరులన్ = పదునాలుగువేల సైనికులను శూరు లగువారిని.

వారిని వారివారినిన్ = ఖరదూషణత్రిశిరస్సులను వారి యనుచరులను.

అనిన్ = యుద్ధమందు. వధింపన్ = చంపఁగా.

రావణుఁడు = (1) కైలాసపర్వతముక్రిందఁ చేతులు చిక్కికొన్నప్పుడు ఆర్తుఁడై రావము (ధ్వని) చేసెనుగాన రావణుఁడు 'కం॥ కైలాక్రాంతుఁడవై నీ। వీలీల నుహారవంబు నెల్లజగంబుల్। వ్యాలోలంబుగఁ జేయుట। హాళిన్ ఘటి యింతు రావణాఖ్యగ నీకున్.' ఉ. రా. ౩౨౬. (2) తన దుష్టచేష్టలచే లోక మేడ్చునట్లు చేసినవాఁడు. (3) విశ్రవసుని కుమారుఁడు. విశ్రవశ్శబ్దమునకు రవా దేశమువచ్చి యపత్యార్థకాణ్ ప్రత్యయముచేయఁగా రావణుఁడు అని సిద్ధించును. (4) రామపత్నీం వనస్థాం నినాయేతిరావణః = రాముభార్యను వనముల నున్నదానిని, నయించె (హరించె) కావున రావణుఁ డని వ్యుత్పత్తులు. రవణుని కుమారుఁడు రావణుఁ డనియు వ్యుత్పత్తి గలదు. తనజ్ఞాతుల సంహరణంబు విన్నిన్ — జ్ఞాతులు — బంధువులు. దుర్వారతరాగ్రహంబు మెయిన్ = దుర్వారతర ఆగ్రహము మెయిన్ = అణఁపరాని కోపముతో. సహాయతన్ = తోడుపడుటకు.

తా త్ప ర్య ము.

వారిని వారివారిని బదునాలుగువేల రాక్షసులను రణరంగమున నెదురులేక సంచరించు పరాక్రమవంతుఁడైన రామచంద్రమూర్తి యొక్కఁడే లక్ష్మణసాహాయ్యమును లేక కేవలభుజబలముచేతనే వధింపఁగా తనబంధువులమరణంబు విని రావణుఁ డాగ్రహించి పోయి తనకు సహాయుఁడవుగ రమ్మని.

శా॥ మారీచుం డనురాక్షసాధిపుని సం♦ప్రార్థింప వాఁ డంతయే
నోరీ రావణ! నీకుఁ గానిపని ద♦ర్పోద్రిక్తుఁడౌ రాముతోఁ
బోరాటల్ ఘటియింప నం చతనికిన్ ♦ బోధింప, నద్దైత్యుఁడుం
బ్రేరింపన్ శమనుండు, నీతి రుచి గాఁ♦మిం, బోయెఁ దద్యుక్తుఁడై. ౧౧౪

మారీచుం డను రాక్షసుని తనకు సహాయతన్ సంప్రార్థింపన్ అని యన్వయము. దర్పోద్రిక్తుఁడు = భుజబలమదముచే నతిశయించినవాఁడు అగు రాముతోన్-పోరాటల్ ఘటియింపన్=యుద్ధము చేయుట నీకుఁ గానిపని యని యన్వయము.

అంచున్ అతనిన్ బోధింపన్ = అని రావణునికిఁ జెప్పఁగా.

శమనుండు = యముఁడు.

ఛ ం ద స్సు.

నాల్గవపాదంబున 'ంబ్రే' కును 'మి' కిని యతి. ంప-ంఫ-ంబ-ంభ లకు వర్గపంచమమైన మకారముతో యతిచెల్లును. దీనికి బిందుయతి యనిపేరు

తా త్ప ర్య ము.

మారీచుఁడను మాయలమారి రాక్షసుని మిక్కిలి ప్రార్థింపఁగా వాఁడోయి రావణా! మహాబలపరాక్రమవంతుఁడైన శ్రీరామచంద్రమూర్తితో యుద్ధము సేయుటవలన నీకుఁగీడగును. ఈయాలోచన మాను మని బోధింపఁగా వినక మృత్యువు ప్రేరింపఁగా వానిని దోడు తీసికొని సీతారాములున్నచోటకుఁ బోయెను.

ఉ. మాయలమారి యాయసుర ♦ మానవనాథతనూజయుగ్మ మెం
తో యెడగల్గ రా వనులఁ ♦ దోడ్కొనిపో, రఘురాముదేవి దై
తేయకులాధినేత గొని ♦ తెచ్చునెఁ బోవుచు నాజటాయు ఘా
తాయువుఁ జేసి లంకను ధ♦రాత్మజ నుంచె నశంకితాత్ముఁడై. ౧౧౫

మాయలమారి యాయసుర = మాయలు చేయుటయే స్వభావముగాఁగల యామారీచుఁ డను రాక్షసుఁడు - వారిని మోసపుచ్చుటకై మిక్కిలి యాశింపఁ దగు చిత్రమైన బంగారుజింకవేషము వేసికొనె నని భావము.

పరులను మోసగింపఁజేయు విచిత్రశక్తికి మాయ యని పేరు.

మానవనాథతనూజయుగ్మమున్ = దశరథుని యిద్దఱుకుమారులను.

వనులన్ = అడవులందు. ఎంతో యెడ = మిక్కిలిదూరము. కల్గన్ = కలుగునట్లు. రాన్ = వచ్చునట్లు. తోడ్కొనిపోన్ = పిలుచుకొనిపోఁగా. ఇదిగోనదిగో

పట్టుకొండమన్న యాశతో రామచంద్రమూర్తి తన్ను వెంబడింపఁగాఁ జిక్కక చాలదూరము తీసికొనిపోయి రామునివలె నార్తధ్వనిచేసి లక్ష్మణుఁడును వచ్చునట్లు చేయఁగా.

దైతేయకులాధినేత — దైతేయకుల + అధినేత = రాక్షసకుల ప్రభువు.

తెప్పునన్ =(రామలక్ష్మణులు వత్తురను భయముచేత) త్వరతో.

జటాయువున్ = జటాయువను గృధ్రరాజును. ఈయన సీతకు సాహాయ్యముగా నామెను విడిపింప వచ్చినవాఁడు.

జటాయు, జటాయూ అని రూపాంతరములు.

ధూతాయువుంజేసి = ఎగురఁగొట్టఁబడిన యాయువుగలవానిగాఁజేసి - ప్రాణాంతమగునట్లు హింసించి.

రఘురాముదేవిన్ = రఘువంశదీపకుఁడైన రామచంద్రమూర్తి సొక్కనాఁడైన విడువని సీతాదేవిని.

అశంకితాత్ముఁడై = నిర్భయమగు మనస్సుగలవాఁడై - లంకవచ్చి చేరితిమి గదా. ఈ లంకచుట్టు సముద్రమే యగడ్తగా నున్నదిగదా ఈలంక కొండమీఁద నున్నదిగదా. కోటానుఁగోట్లు రాక్షసవీరులు కావలియున్నారుగదా. ఇఁక రామలక్ష్మణు లెట్లురాఁగలరు, వచ్చి యేమిచేయఁగల రని నిర్భయత్వము.

లంకను ధరాత్మజ నుంచెను = లంకలోని యశోకవనమున సీత నుంచెను.

వాస్తవసీత రావణుని మాటలుజరుగు వానిదురభిప్రాయ మెఱిఁగి యతనికి నర్ఘ్యాదులు దెచ్చుట కని పర్ణశాలలోనికిఁ జని యగ్నిలో దాఁగెననియు నామె సృజించిన మాయాసీత యర్ఘ్యాదులఁగొని రాఁగా నామెను రావణుఁడపహరించెననియుఁ గావుననే రావణవధానంతరము మాయాసీత యగ్నిలో మాయమయ్యెననియు వాస్తవసీత యగ్నినుండి బయలువెడలి రాముఁ జేరెననియుఁ గొందఱందురు. కొందఱు లక్ష్మణుఁడు వెడలిపోవునపుడు గీఁతగీఁచి దానిలో సీతనుంచి దానిని దాఁటిరావల దని చెప్పినట్టును ఆకారణముచే రావణుఁడు ఆమెయుండిన స్థలమునే పెల్లగా లేవతీసి యామెను దాఁకకయే తీసికొనిపోయెననియు నందురు. ఇవి యధ్యాత్మకాండమునఁ జర్చింపఁబడును. ఈ రెండును వాల్మీకిమతము గాదు. రఘురాముదేవి ననుటచే రావణుఁ డెత్తుకొనిపోయినది రాముని భార్యయగు సీతనేకాని యామె ప్రతిబింబముకాదని భావము.

తా త్ప ర్య ము.

వంచించుటయే స్వభావముగాఁగల మారీచుఁడు బంగారువన్నెగల జింకయై రాఁగా సీత కోరఁగా నామెనిమిత్తమై దాని వేఁటాడఁబోయి యస్త్రముచే వధిం

పంగా నది ప్రేటుపడి చచ్చుచు హాలక్ష్మణా యని యఱచెను. ఆధ్వని విని లక్ష్మణుఁడు సీత నొంటిగ విడిచి యన్నకొఱకై పోయెను. ఒంటరిగనున్న సీతను రావణుఁడు హరించి కొనిపోవుచుఁ ద్రోవలో సీతారక్షణార్థమయి యడ్డమువచ్చిన జటాయు వను గ్రద్దఁ జేనిఁ జంపి తనలంకను జేరి భయమువిడిచి యంతఃపురము నకుఁజేరిన యశోకవనమందు నామె నుంచెను.

సీ॥ పక్షిరాణ్మరణంబు ♦ భార్యాపహరణంబుఁ, గని విని రాముండు ♦ కళవళించి
యాకులేంద్రియుఁ డయి ♦ యాగృధ్రరాజున, కగ్నిసంస్కారంబు ♦ లాచరించి
హా యని పలవించి ♦ యఖిలవనంబుల, వెదకుచో వైదేహి ♦ వికృతరూపు
ఘోరదర్శనుని రక్షోనాథునిఁ గబంధుఁ, గని త్రుంచి దహియింపఁ♦జనియెవాఁడు

తే॥ నాకలోకంబునకు, నాతఁ ♦ డరుగు వేళ, శబరి సద్ధర్మచారిణి ♦ శ్రమణి గలదు
సకలసద్ధర్మనిపుణ యా♦సతిని జూడఁ, బొమ్మటంచును బోధించి ♦ పోవుటయును.

పక్షిరాణ్మరణంబు భార్యాపహరణంబుఁ గనివిని = పక్షిరాణ్మరణంబుకని భార్యాపహరణంబు విని యని యథాక్రమ మన్వయము.

పక్షిరాట్ మరణంబు = సీతాదేవిని విడిపింపఁ దనపక్షమున యుద్ధము చేసిన జటాయువు చచ్చుటకు సిద్ధముగా నుండుస్థితిని - కుట్టూపిరియం దుండు స్థితిని. భార్యాపహరణంబు = తనభార్యయగు సీతాదేవిని రావణుఁడు హరించుటను. విని=జటాయువు చెప్పఁగా విని

పక్షముగలది పక్షి - పక్ష మనఁగా = ఱెక్క (2) ప్రీతి అభిమానము.

కళవళించి = మిక్కిలి దుఃఖించి.

ఆకులేంద్రియుఁడై = కలఁతపడిన సర్వేంద్రియములు గలవాఁడై - మూర్ఛపోయి. సీతకానరాలేదని దుఃఖము - రాక్షసుఁ డెత్తుకొనిపోయెనని మిక్కిలి దుఃఖము - జటాయువు మరణించె నని మూర్ఛ

హా యని పలవించి = హాయని యేడ్చి.

ఉ॥ తమ్ముఁడ చూడుమీ యకట ధారుణిరాజ్యము వేఱుపాటు, భీ
ష్మమ్మగుకాననస్థలిని సంకటపాటు, ధరాత్మజాత నిం
దిమ్మెయిఁ గోలుపాటు, విహగేశ్వరు త్రుంగుడుపాటు నాయభా
గ్య మ్మెటువంటిదో కని తెకాల్పఁగ నోపుఁ గృశాను నేనియున్.

అరణ్య ౧౧౫౩.

అని రాముఁడు పలవించెను రఘురాముదేవిక్ వైదేహి ననుటచే తన యజాగ్రత్తచే రెండువంశములవారికి నిటువంటియపకీర్తి కలిగెఁగదా యని రామచంద్రమూర్తి కత్యంతదుఃఖము కలిగెననుట సూచితము.

ప్రశ్న.

రామచంద్రమూర్తి విష్ణ్వవతారమైయుండ నాయనకు శోకమోహములు కలుగునాయని కొంద ఱాక్షేపింతురు.

ప్రత్యుత్తరము

శోకమోహములలక్షణ మాలోచింపమియే యీయాక్షేపమునకు మూలము. మనుష్యుల కెట్టి శోకము మోహము ప్రాప్తించునో యట్టులే రామచంద్రమూర్తికిని బ్రాప్తించె నని వీరి యభిప్రాయము అట్లైనచో మనకు శోకమోహములు గలుగుటకుఁ గారణమేమి ? ఇచ్ఛాద్వేషములు. ఇచ్ఛ=కామము-ద్వేషము-క్రోధము. ఈ యిచ్ఛాద్వేషములే శోకమోహములకుఁ గారణములు. ప్రకృతిపరిణామమే దేహము. ప్రకృతిగుణమే రజస్సు. రజోగుణమువలన జన్మించినవి కామక్రోధములు. కామము (కోరిక) విఘ్నమైనయెడల నదియే క్రోధరూపముగఁ బరిణమించును. ఇష్టవస్తువుయొక్క అప్రాప్తిగాని వియోగము కాని శోకకారణము. ఇష్టవస్తువు లభింపకుండినను, లభించినవస్తువు నెడఁబాసినను శోకము కలుగును మోహము క్రోధమువలనఁ గలుగునదే కావునఁ బ్రకృతిపరిణామమైన దేహము ప్రకృతిగుణములైన సత్త్వరజస్తమస్సులను గుణములను గలదై యుండుననియు, కొలఁదిగానో గొప్పగానో యీమూఁడుగుణములు లేకదేహి యుండఁడనియు, అందు రజస్సువలన జనించినవి శోకమోహములనియు, నివి పూర్వజన్మమున మనము రజస్తమస్సులకు వశమై చేసిన పాపములవలన నీజన్మమున ఫలానుభవమునకై ప్రాప్తించెననియు నేర్పడెను. దీనికిఁ బ్రమాణ వాక్యములు.

శ్లో॥ ఇచ్ఛాద్వేషం సుఖం దుఃఖం, సంఘాత శ్చేతనాధృతిః
ఏతత్క్షేత్రం సమాసేన, సవికార ముదాహృతమ్.　　భ.గీ. ౧౩-౬

ఇచ్ఛాద్వేషసముత్థేన, ద్వంద్వమోహేన భారత
సర్వభూతాని సమ్మోహం, సర్గే యాంతి పరంతప.　　౭-౨౭

సత్త్వం రజస్తమ ఇతి, గుణాః ప్రకృతిసంభవాః
నిబధ్నంతి మహాబాహో, దేహే దేహిన మవ్యయమ్.　　౧౪-౫

కామఏష క్రోధఏష, రజోగుణసముద్భవః
మహాశనో మహాపాప్మా, విద్ధ్యేన మిహ వైరిణమ్.　　౩-౩౭

ఆవృతం జ్ఞాన మేతేన, జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ, దుష్పూరే ణానలేనచ.　　౩-౩౯

రజో రాగాత్మకం విద్ధి, తృష్ణాసంగసముద్భవమ్
తన్నిబధ్నాతి కౌంతేయ, కర్మసంగేన దేహినమ్.　　౧౪-౭

సంగాత్సంజాయతే కామః, కామాత్క్రోధోభిజాయతే
క్రోధాద్భవతి సమ్మోహః, సమ్మోహాత్స్మృతివిభ్రమః. ౨-౬౨

వీనివలన ప్రకృతిబద్ధుఁడైన పురుషుఁడు ప్రకృతిగుణములైన శోకమోహములచేఁ బీడింపఁబడు నని యేర్పడెను.

ఇఁక విష్ణువో 'తమసః పరః, తమసః పరస్తాత్' ఇత్యాదివాక్యములచేఁ బ్రకృతికి సలీతుఁడుగదా. ఇట్టివాఁ డెట్లు ప్రకృతిగుణములచేఁ బీడింపఁబడు నని మీ రూహింపవచ్చును. అవతారదశయందుఁ బ్రకృతికి బద్ధుఁడుగదా యందు రేని యట్లును గాదు. 'నృసింహరామకృష్ణేషు, షాడ్గుణ్యం పరిపూర్తితమ్, పరావస్థాతు దేవేశ, దీపాదుత్పన్నదీపవత్.' ॥పద్మ॥

అని యుండుటచే శ్రీరామావతారము పూర్ణావతారమే. కావుననే ప్రకృతి సంసర్గములేదు. శరీర మప్రాకృతము. కావుననే ప్రకృతిగుణము లాయనను బాధింపవు. అట్లైన రామచంద్రమూర్తి మనుష్యునివలె శోకించిన దసత్యమా? శోకించినట్లు వాల్మీకి చెప్పెఁగదా యందు రేని - రామచంద్రమూర్తి శోకించినది యసత్యము గాదు. మాయ గాదు ఇంద్రజాలమును గాదు. సత్యముగ శోకించెను. ఏలయందు రేని తనకుఁగలిగిన కష్టమునకును గాదు. నష్టికిని గాదు. తమకు దుఃఖములు వచ్చిన వని మనుష్యులు దుఃఖింతురు. తనకై తన యాప్తులు బంధువులు దుఃఖింపఁగాఁ దననిమిత్తముగా వీరి కింతదుఃఖము ప్రాప్తించెనే, వారిదుఃఖము మాఁపవలసినవాఁడను నేనే వారిదుఃఖమునకుఁ గారణమైతినే యని వారికి దుఃఖము కలిగినందునకు రామచంద్రమూర్తి దుఃఖించెను. ఇఁక సీతావిషయంబుఁ గనో.

'ఉ॥ ఒంటిమి నన్ను వీడి చన నోర్చెదవేని, వియోగబాధ నీవెంటనె వచ్చు ప్రాణములు.' అని సీత చెప్పెను.

"మ॥ నిన్నుఁబాసి ధరాతనూజయు నేను నొక్కముహూర్తమే, నిన్నిలం గలవారమే తమనీటిఁ బాసిన చేఁపలట్లన్న" యని లక్ష్మణుఁడు చెప్పెను. అయోధ్య-౧౫-౨౬. ఇంతటి ప్రీతిగలదానిని, దన్ను నమ్మి యడవులకు వచ్చిన దానిని, దానజా గ్రత్తతో నున్న వేళ రాక్షసు లెత్తుకొనిపోఁగా దన్నుఁబాసిన దుఃఖముచే నామె కెంతదుఃఖము గలిగెనో యనియే రామచంద్రమూర్తి దుఃఖించెను. వియోగము వలనఁ దమకుఁ గలిగిననష్టికై శోకించువారు మనుష్యులు. జీవులకుఁగలిగిన కష్టములకై దుఃఖించువాఁడు భగవంతుఁడు. పరులదుఃఖమునకు దుఃఖించుటే దయ. మనుష్యులయందుండు దయ భగవంతునిదయయొక్క యెన్నవయంశమోకదా. బిడ్డకు రోగమువచ్చి మిగులబాధపడుచుండఁ దల్లిదండ్రు లేడ్తురుగదా. ఏల? ఆబాధ తాము చూచి సహింపలేకయేకదా - పరమాణువుదయగల మను

ష్యుల స్థితియే యిట్లుండ దయానిధియైన భగవంతుఁడు తనబిడ్డలయిన చేత నలుపడు దుఃఖమునకు మఱెంత దుఃఖింపవలయునో యాలోచింపుఁడు. కావున నేకదా.

కం॥ వ్యసనంబులు జనములకును, బొసఁగినదా నధికదుఃఖమును బొందును, సం
తసమును గనజనములు, సంతసమును దా నొందుచుండుఁ దండ్రివిధమునన్.

అయోధ్యా ౬౬.

భగవంతుఁడు పరమకారుణికుఁ డని శాస్త్రములు చెప్పుచున్నవి. తనపరత్వ స్వభావముల విడువక యవతరించిన సాక్షాద్విష్ణువునం దాగుణములు లేవా? రామచంద్రమూర్తి జితేంద్రియుఁ డని వేయిచోట్లఁ జెప్పఁబడెఁగ. ధనము పోయెనని భార్యపోయెనని యేడ్చునాఁడు జితేంద్రియుఁడా? ఇట్టి దయాగుణమే లేని వాఁ డేమి దేవుఁడు? మనకష్టసుఖములు విచారించి మన కేదమేలో యది చేయఁడేని యట్టిదేవుఁ డుండి యేమిలాభము? లేకున్న వ్యసన మేమి? మాయామానుషవిగ్రహ యనికదా రామునకు విశేషణము. అటనిననేమి? తన దివ్యాద్భుతశక్తిచేఁ దనస్వరూపము మనుష్యస్వరూపమువలెఁ జూచువారికిఁ గనఁబడు నట్లుచేసి గూఢముగి నాటకరంగమునందలి నర్తకునివలె నటించువాఁడు. మనుష్యాకారముగా గోచరింపనేల? మనుష్యులకుఁ దాను ధర్మమార్గదర్శి యగుటకే. మనుష్యాకారముతోఁ గ్లిష్టధర్మమంతయుఁ జరించనేని యాయన మనుష్యుఁడనియే తలఁచువాఁ డొక మనుష్యునకు సాధ్యమైనది వేఱొకని కేల గా దని తా నాప్రకారము జరుప యత్నించును. అట్లుగాక దేవుఁడుగానే గోచరించి యాప్రకారము చేసిన ఆయన దేవుఁడుగనుక నాయన యాప్రకారము చేయఁగల్గెను. మనుష్యుల కట్లు సాధ్య మాగునని నిరుత్సాహముతో నట్లు చేయఁబూనఁడు. అంది యందని ఫలము గ్రహింప నెవ్వఁడైన యత్నించునగాని యాకాశమున వ్రేలెడిదాని నెవఁ డాశించును? కాఁబట్టి మనుష్యవేషధారణము మనుష్యులకు మార్గదర్శిగా నుండవలయుననిన మనుష్యునివలె నటింపవలయునుగదా. కాఁబట్టి మనుష్యుల ననుకరించి కార్యము చేసెను. కావున మనుష్యులవలె దుఃఖించెను. సీతావియోగమున రాముఁడు దుఃఖింపకుండిన నది మనుష్యనటన మగునా? అప్పుడు ప్రజ లేమి యందురు? తండ్రిచచ్చిన నేడువలేదు భార్యను గోలుపోయి యేడువలేదు రాజనిమిత్తమై పట్టనమంతయు నేడ్చినను నూరకున్నాఁడు. ఎంత కఠినచిత్తుఁడు! అనికదా యందురు. తాను మార్గదర్శియై ప్రజలకు నేర్పవలసిన దిది యగునా? కావున మనుష్యవేషము వేసినపుడు మనుష్యులవలెనే నటింపవలసినదే విధి. విష్ణువప్రాకృతదివ్యమంగళవిగ్రహుఁడుగదా - కన్నీరెట్లు వచ్చెను, నెత్తురెట్లుకాఱె నందురేమో మనుష్యనటనమున నవియన్నియు నుండవలయును గదాయని

యట్లు కనఁబడజేసెనుగాని వాస్తవమైన కన్నీరుగాదు, నెత్తురుగాదు. నాటకములందు మనుష్యులే యిట్టి లెన్నో చేసెదరే. ఇఁక సర్వశక్తుఁడు భగవంతుఁడా చేయలేఁడు? ప్రాకృతపురుషవేషము వేసినంతమాత్రమునఁ బరశక్తిస్వాతంత్ర్యము తప్పిన దని తలఁపరాదు. ఆమాత్రముచేతనే యాయనకు నీచదశ ప్రాప్తించిన దనియుఁ దలఁపరాదు.

శ్లో॥ అవజానంతి మాం మూఢాః। మానుషీం తనుమాశ్రితం
పరంభావ మజానంతో। మమ భూతమహేశ్వరమ్.   భ. గీ. ౯-౧౧

మానుషీం = మనుష్యస్త్రీయైన దేవకీదేవి (ఇట్లులే కౌసల్యయు) యొక్క, తనుం = దేహమును - ఆశ్రయించి యుండువానిని, భూతమహేశ్వరమ్=సమస్తభూతముల కధీశ్వరుఁడనై యుండు నన్ను. మమపరంభావ మజానన్తః = నాపరమైశ్వర్యభావమును దెలిసికొనలేనివారైన మూఢులు నన్ను అవజానంతి=ఎఱుఁగరు. దీనివలన మనుష్యస్త్రీగర్భమునం దుండుట - వెలువడుట యనునవి మనుష్యవిడంబనార్థమేకాని సత్యముకాదనియు, మనుష్యస్వరూపము పొందునప్పుడు వచ్చునపుడును షడ్గుణము పూర్తిగ నుండుననియు విష్ణుమాయామోహితులై యిది తెలిసికొనలేక తమవలెనే నేను జన్మించితినని యుఁ దమవలె నేను ప్రకృతిబద్ధుఁడననియుఁ దలంతురని భావము. విక్రమార్కుఁడు లోనగు రాజులు మాఱువేషములు వేసికొని వేషమునకుఁ దగిన భాషలాడుచుఁ గార్యములు చేయుచునుండిరి. ఆమాత్రమున వారికిఁగల ప్రభుశక్తి తప్పిపోయెనా? నీచత్వము వచ్చెనా? ఒకరాజు వ్యాయామమునకై యొంటిగఁ ద్రోవ నడచిపోవుచుండెను. అప్పుడు త్రోవలో నొక ముసలివాఁడు కట్టెలమోపు తలపై మోచి తెచ్చుచు రాయి తట్టుకొని క్రిందఁబడెను. మోపు క్రిందఁబడెను. బోరగిలఁ బడుటచే మోఁకాటికి గాయము దగిలి సుఖముగ నడవలేక మోపు తలపై కెత్తుకొనలేక కష్టపడుచుండెను. అప్పు డారాజు వచ్చి చూచి తాను మోపు తలపైనంచుకొని ముసలివానిచేతిని బట్టుకొని తిన్నగ వానియిల్లుచేర్చి మోపు దించెను. ఈరాజునకు నీచత్వ మాపాదించెదరా? ధనలాభమునకై తన పదవునకుఁ దగని కార్యముచేయుట నీచత్వమును దెలుపునుగాని పరోపకారముగ దానినే చేయుట గొప్పవాని గొప్పతనమునకు వన్నెపెట్టినట్లగునే కాని యితరము కానేరదు. అవాప్త సమస్తకాముఁడై సర్వజ్ఞుఁడై సర్వశక్తుఁడైన భగవంతుఁడు మనలనుద్ధరించుటకై వచ్చి మనవలె నటించి మనకు మార్గదర్శియగుటచే నాయన సౌశీల్య సౌలభ్య పరమకారుణికత్వాది కళ్యాణగుణములకు మెఱుఁగు పెట్టినట్లయ్యెఁగాని యితరము గాదు. భిక్షమెత్తుట నీచకార్యమే కదా. బలిని భిక్షించుటచేఁ బరువు మాసెనా? కుచేలుని పిడికెఁడడుకులు తినఁగానే కృష్ణుని దారి

ద్రవ్యము తీరెనా? ధర్మమార్గమున బీదసాదల కుపకారముచేయుట తమపరువునకుఁ దక్కువ యని కార్యములు చేయనివాఁ డెంత యితరవిషయముల గొప్పవాఁడైనను గుణమున నీచుఁడే. వానినడవడి ప్రశస్తముకాదు. కావున రామచంద్రమూర్తియం దేదోషమును లేదు. ఆయనచేసినట్లు మనము చేయవలసియుండఁగా నాయన నాక్షేపించుట యెట్టి తెలివిమాలినతనము.

కం॥ ఎంతటిదుష్కరమును భూ,కాంతుఁడు ఘటియించు నీమెఁ గనకయు బ్రదికెం
చింతావ్యథఁ జిక్కుండును, వింతగదే మిగుల రామవిభుచరితంబుల్.

అనికదా హనుమంతుఁడు తలఁచెను. దీనివలననే రామచంద్రమూర్తి మనస్తత్త్వమెఱుంగనగు.

ఆగృధ్రరాజునకుఁ = తనతండ్రిమిత్త్రుఁడును - దనకై ప్రాణము విడిచినవాఁడును నగు గృధ్రరాజు జటాయువునకు.

అగ్నిసంస్కారములు + ఆచరించి = పరమపదయోగ్యుఁ డగువానికిఁ జేయవలసిన బ్రహ్మమేధసంస్కారముచేసి ఇతఁడు తిర్యగ్జాతి జనించినవాఁడు కావున బ్రహ్మమేధ సంస్కారమున కర్హుఁడు కాకున్నను, దశరథసఖుండగుట, సర్వస్వామి యగు రామునకై ప్రాణముల త్యజించినవాఁడగుట నగుటచేతను, ముక్త్యర్థమై దేహము విడుచుటచేతను, ఇతని కీ బ్రహ్మమేధసంస్కారము యుక్తమే ఇట్లే విష్ణుపురాణమునను జెప్పఁబడినది. 'మత్కృతే నిధనం యస్మాత్త్వయాప్రాప్తం ద్విజోత్తమ, తస్మాత్త్వం మత్ప్రసాదేన విష్ణులోక మవాప్స్యసి' ఇది జటాయువునకే గాక భగవంతునికార్యమునఁ బ్రాణమువిడుచువారి కందఱకు సామాన్యమనియు నందందుఁ జెప్పఁబడినది. "విష్ణోః కార్యం సముద్దిశ్య, దేహత్యాగో యతః కృతః, తతో వైకుంఠమాసాద్య, ముక్తో భవతి మానవ" యనియాగ్నేయమునను, "ప్రాణాం స్త్యజతి యో మర్త్యో, మాం ప్రపన్నోపి మత్కృతే బాలసూర్యప్రకాశేన వ్రజే ద్యానేన మద్గృహ" మ్మని యాశ్వమేధపర్వమున నున్నది. మానవమర్త్యశబ్దములు ప్రాణిసామాన్యవాచకములు. తే॥ "పదిగతి యజ్ఞశీలురకేది యగు హా! తొగ్నులకు నపరావృత్తులైనవా! కుత్సితాతల కిట్టి యుత్తమగతి! కరుగు మత్సంస్మృతి మదాజ్ఞ నమితసత్త్వ." యని యీగ్రంథమున రాభోపుపద్యము. ఇందు "అపరావృత్తులైనవారికి, యుద్ధమున వెనుకంజపెట్టనివారికి, వీఁపుచూపనివారికి" నని చెప్పరాదు. ఇతఁడు మహావీరుఁడు. స్వామికై దేహము దాఁపక ధర్మయుద్ధముచేసి యభిముఖుఁడైనవేళ హతుఁ డయ్యెను. కావున నాతని కాఫలము స్వతస్సిద్ధము. 'ద్వావిమౌ పురుషౌ లోకే, సూర్యమండలభేదినౌ, పరివ్రాడ్యోగయుక్తశ్చ, రణే చాభిముఖో హత' యని కలదు

గదా. కావున అపరావర్తులైనవారి కనఁగా ముక్తిచెందినవారి కని యర్థము చెప్పవలెను. "నచ పునరావర్తతే" యనికదా ముక్తివిషయమైన శ్రుతి.

సుకృత మెంతచేసియున్నను బ్రాణత్యాగానంతరము అగ్నిసంస్కారము లేనివాఁడు ఆసుకృతఫలముఁ జెందనేరఁడుకదా. ఇతని కట్లుగాక రామచంద్రమూర్తి సంస్కరించెనుగాన తత్కాలమున స్వర్గాదిప్రాప్తి యని యేలయనరాదు. మత్సంస్కృతి నరుగు మని గ్రంథమందే (ఆరణ్య ౧౧౭౬ ప.) యున్నదిగదా. నేను నీకు సంస్కారముచేయుటచే ననంస్కారునికివలెఁగాక నీకు సల్లోకములుకలుగు ననికదా దానిభావము. అట్లుండ ముక్తిప్రాప్తి యని యేల చెప్పవలెను అని పూర్వపక్షము చేయరాదు. ఎవ్వఁడు నిత్యనైమిత్తికాదికర్మముల కర్తయో వానికి నగ్నిసంస్కారాదులు లేనియెడల స్వర్గాదులు కలుగవుగాని లిప్సాజాతి యగు నితఁడు శాస్త్రవశ్యుఁడు కాఁడు. కాన యుద్ధమరణముననే స్వర్గాదులు స్వతస్సిద్ధములు. దానికి రామానుగ్రహ మక్కఱయే లేదు. మోక్షప్రాప్తికే రామానుగ్రహ మావశ్యకము. కావున ముక్తిచెందినవారి కని యర్థము బాగు. ముక్తిచెందెడివారి కిహలోకఫల మనపేక్షితముగదా. "ఏనిగతి యజ్ఞశీలురకు" నిత్యాదులు స్వర్గాదు లతని కిచ్చుట యెట్లు యుక్తమగును (1) ఫలాపేక్షలేక యజ్ఞాదికర్మముల నంగములుగాఁ జేయుచుఁ బ్రధానముగా నుపాసనము చేయువారికే ముక్తికలుగు ననుట సిద్ధాంతము. అంగములేక యంగి కొనసాగదు కాన యజ్ఞాదులు లేక యుపాసనమాత్రముచే ముక్తి చెందుట యసాధ్యము. ప్రధానమున కేది ఫలమో యదియే యంశమునకు ఫలముకాఁగా సాంగముగాఁ బరబ్రహ్మము నుపాసించువారి కేది ఫలమో యాఫలము నీకుఁ గలుగునుగాక యని యీవాక్యమునకు విశిష్టార్థముగాని మోక్షముతో స్వర్గాదులను జెందవలయునని తాత్పర్యముగాదు. (2) "ఇమాన్ లోకాన్ కామాన్నీ కామరూప్యనుసంచరన్" అని వేదముచెప్పిన రీతిని ముక్తునికి సర్వలోకసంచారమును గలదు గాన స్వర్గాదిలోకముల నిచ్చుట యుక్తమే. (3) ఈపద్యము స్వర్గాదుల ననుభవించి యాపిమ్మట మోక్షమును బొందుమని క్రమముక్తిని జెప్పుచున్నది.

"ఆత్మానం మానుషం మన్యే" యను వక్ష్యమాణరీతిని రాము లీయవతారమునఁ దన పరత్వమును బ్రకటించుటలేదుగదా. జటాయువున కిట్లు మోక్షమిచ్చెనేని మోక్షప్రదాత పరతత్త్వముకాన నీయనపరత్వము వెల్లడిచేసినట్లు కాదా యనరాదు. 'సత్యేన లోకాన్ జయతి' సత్యముచే లోకంబుల జయించును అన్నట్లు రామచంద్రమూర్తి సత్యముచే సర్వలోకములఁ దనస్వాధీనము చేసికొన్నవాఁడు. మోక్షమునకుఁ బొమ్మనినమాత్రానఁ బరతత్త్వ మనవచ్చునా? మహాత్ములు బ్రహ్మవిద్యాగురువులు శిష్యుఁడు మోక్షమునకై సందే

హించుచుండ సందేహ మక్కఱలేదు నీకుఁదప్పక మోక్షము కల దనినంతమాత్ర మున వారు పరబ్రహ్మ మగుదురా? కావునఁ దెలియనివారు వారివలెనే రామ చంద్రమూర్తి చెప్పె నని తలంతురు. ఇంతకు శ్రీరామచంద్రమూర్తి చెప్పిన యీమాటలను లక్ష్మణుఁడుతప్ప విన్నమానవుఁడు మఱియెవ్వఁడు లేఁడు. ఇది రామాయణముగ నశ్వమేధకాలమునఁ గుశలవులు గానముచేసినపుడు బయలు పడినది. అప్పటికిముందే లంకలోనే రావణవధానంతరము రహస్యము బ్రహ్మా దులచేఁ బ్రకటింపఁబడియెను. కావున నీశ్లోకమును విన్నవారు రాముని పరతత్త్వ మెఱిఁగినవారు జటాయువునకు మోక్షప్రాప్తి యని నిశ్చయించియుందురు. రావ ణవధవఱకే పరత్వము రహస్యముగాని యిప్పుడు గాదు కంసవధవఱకుఁ గృష్ణుఁడు చతుర్భుజములఁ దాఁచినట్లు రావణవధవఱకు రామచంద్రమూర్తి పరత్వమును దాఁచెను. పరత్వమును దాఁపకున్నచో రావణుఁడు చావఁడు.

అఖిలవనములన్ = అన్నియడవులయందు.

వైదేహిన్ వెదకుచో = సీతను వెదకునపుడు

వికృతాకారున్ = పొట్టయందు నోరుకలిగి వికారమైన రూపాకారము గల వానిని.

ఘోరదర్శనుని = చూచుటకు భయంకరుఁడైన వానిని

కబంధున్ = తలలేని మొండెమే వాని యాకారము కావునఁ గబంధుఁడని పేరుగలవానిని,

రక్షోనాథున్ = రాక్షసశ్రేష్ఠుని- ఇతఁడు వంశమున దానవుఁడు, చర్యలచే రాక్షసుఁడు.

త్రుంచి = భుజముల ఛేదించి.

దహియింపన్ = వాఁడు కోరినప్రకారము వాని దేహమును గాల్పఁగా.

వాఁడు నాకలోకమునకుఁ జనియెన్=స్వర్గమునకుఁ బోవుటకు ననుకూలమైన గంధర్వరూపము ధరించి స్వర్గమునకుఁ బోయెను.

వరధర్మచారిణి = గురుశుశ్రూష యను గొప్పధర్మమును జేయునది. ఆచా ర్యాభిమాన మను చరమపర్వనిష్ఠగలది. పరమాత్మాభిమానమున నిష్ఠకల వాఁడు ప్రథమ పర్వనిష్ఠుఁడు. ఇది యందఱకుఁ గలుగునుగాని చరమ పర్వనిష్ఠ కొందఱకే కలుగును. "పాదమూలం గమిష్యామి యానహం పర్య చారిష" మ్మని ముందు చెప్పఁబడును.

సకలసద్ధర్మనిపుణ = సద్ధర్మములు — అతిథిసత్కారాదులు. అట్టివానియం దన్నిటియందు నేర్పరి. ధర్మసూక్ష్మము నెఱిఁగినది. రాముఁడు తన యాశ్రమ మునకు రాఁగలఁ డని ముందుగాఁ దెలిసికొని యాయనను సత్కరింప మనో

హారము లగు ఫలములు సంపాదించి యవి మంచి రుచిగల వవునో కావో యని పరీక్షించి దాఁచియుంచి యాయన వచ్చినపుడు ఆమె యవి రామున కిచ్చి సత్కరించె నని ప్రసిద్ధముగదా. ఇదిగదా పరమప్రేమరూప మగుభక్తి. గురుశుశ్రూషచేతనే పుణ్యలోకముల సంపాదించినవారు శబరియు నారదుఁడును.

శ్రమణి = సన్న్యాసిని- "చతుర్థ మాశ్రమం ప్రాప్తా, శ్రమణా నామ తే స్మృతా" యని స్మృతివాక్యము.

శబరి = బోయెత - ఈమె ప్రతిలోమజాతిలోనిది - తక్కువజాతి పురుషునకు నెక్కువజాతిస్త్రీయందుఁ గల్గినవారు ప్రతిలోమజాతివారు. ఎక్కువజాతి పురుషునకుఁ దక్కువజాతిస్త్రీయందుఁ బుట్టినవా రనులోమజాతివారు. "నృపాయాం వైశ్యతో జాత, శ్శబరః పరికీర్తితః, మధూని వృష్ట్వా దానీయ, విక్రీణీతే స్వవృత్తయే" యని నారదీయవాక్యము. వైశ్యునకు రాచస్త్రీయందుఁ బుట్టినవారు శబరులు. వీరి వంశములోఁ బుట్టినది శబరి. తేనె యమ్మి జీవించుట శబరులవృత్తి.

ఆసతిని - ఆమహాత్మురాలిని.

చూడఁబొమ్ము = జాతిలోఁ దక్కువైనను భాగవతభక్తిమహిమకలవారిని భగవంతుఁడే యెదురుకొని వెదకుచువచ్చునని దీనివలన సూచితము.

అటంచును బోధించి = చిరకాలము నెడఁబాసిన స్వర్గమునకుఁ బోవలయునని కుతూహలమున్నను రామచంద్రమూర్తియెడ భక్తివిశ్వాసములు నుపకారస్మృతియుంచి కొంచెముకాల మాకాశమున నిలిచి యిట్లు తెలియఁజేసి.

పోవుటయును = నాకలోకమునకుఁబోయిన తరువాత - 'యును' ఆనంతర్యార్థకమును దెలుపును.

తాత్పర్యము.

సీతను విడిపింపఁబోయి రావణాసురుచే హతుఁడైన జటాయువును జూచి యాయనవలనఁ దనభార్యను రావణాసురుఁడు హరించెనని విని రామచంద్రమూర్తి మిక్కిలి స్రుక్కి సోలి వ్రాలి యాగ్రద్ధ్రజేనికిఁ దనతండ్రికి యోగ్యమైనరీతిని దహనాదిక్రియలుదీర్చినానిమిత్తమై యింతఅకిన్ని దుఃఖములుకలిగెఁగదాయని విలపించి, యడవులన్నియు వెదకుచుఁబోయిపోయి వికారస్వరూపము గలవాఁడై చూచుచుటకు భయంకరుఁడైన కబంధుఁడను రాక్షసుని వధించి, వానిని దహింపఁగా వాఁడు శాపవిముక్తుఁడై తన స్వర్గలోకమునకుఁ బోవుచు 'రామచంద్రా! పంపాతీరంబున శ్రేష్ఠధర్మమగు గురుశుశ్రూషయందు వర్తించునదియు నతిథిపూజలోనగు సకలసద్ధర్మముల నెఱిగినదియునగు నొకసన్న్యాసిని బోయది (శబరి) గలదు. ఆమెను నీవు చూడఁబొ' మ్మని బోధించి పోయెను.

ఇక్కడ సన్న్యాసిని యనఁగాఁ గావివస్త్రములుగట్టి తల బోడిచేయించుకొని చతుర్థాశ్రమస్వీకారముచేసిన దని యర్థముగాదు. కామ్యకర్మములు చేయమాను టయే నిజమైన సన్న్యాసము. దీనికి వేషము ముఖ్యముగాదు. 'నలింగం ధర్మ కారణ'మ్మని మనుస్మృతి. 'జ్ఞానం సన్న్యాసలక్షణ'మ్మని కలదుగదా?

కం॥ ఆపగిది శత్రుదమనుఁడు, భూపసుతుఁడు చక్క శబరి♦పూజలఁ గొని యి
చ్ఛాపూర్తి కామె చెప్పిన,రూపునఁ బంపాసరస్సు♦రోధముఁ జేరెన్. ౧౧౭

శత్రుదమనుఁడు = మోక్షప్రతిబంధకముల నివర్తింపఁజేయువాఁడు.

"నీ దయార్ద్రదృష్టి నిహతపాతకనైతి, నక్షయంబులైన పదము లందు దాన."
(ఆరణ్య. ౧౨౬౬ వ పద్యము) అని శబరి చెప్పను

భూపసుతుఁడు=దశరథుని పుత్త్రుఁడు - శత్రుదమనుఁడు - ఖరాదిరాక్షసులను విరాధ మారీచ కబంధాదులను సంహరించినవాఁడు. అరణ్యకాండమందు శత్రు సంహారకథ చెప్పఁబడెను. ఇఁక మిత్రసంపాదన విషయము చెప్పఁబడు నని భావము.

ఆపగిదిః = కబంధుఁడు చెప్పినవిధమున.

చక్క శబరిపూజలంగొని = శబరిపూజలను సంతృప్తిగ గ్రహించి. కొనియను టచే నామెపెట్టినంతతడవునుగూడ సహింపలేక తానే వానిని దీసికొని యని యర్థము. తల్లియొడిలోఁ గూర్చుండి పాలుత్రాగుటకు సిద్ధముగానుండియు నైక మొగఁదీసి యిచ్చునంతలోఁ దకతకలాడు శిశువులవలె నని భావము. (1) అఱు వదివేలయేండ్లు సంతానము లేకలేక కడ కతిప్రయాసముతోఁ దన్నుఁ గనిన దశరథునింట నత్యాదరమున భుజించు మృష్టాన్నభోజనముకన్నను క్షణకాల స్నేహము చేసినబోయది భక్త్యతిశయముచేత సమర్పించు ఫలము లతిశ యించి యుండెనని భావము. భగవద్భక్తులగు శరభంగాదిఋషులు చేసినది పూజమాత్రమే. భాగవతభక్తురా లగుశబరిచేసినది చక్కనిపూజ. చక్కనిపూజ చక్కగాఁ గొని యని యన్వయింపవలెను. (2) శబరి తానగఁ బరీక్షించి రస వంతంబు లని యేఱియుంచిన ఫలములచేఁ జేసినపూజల నంగీకరించి 'కౌసల్యా యార్పితం గేహే, కాననే లక్ష్మణార్పితం, పంపాయాం శబరీదత్తం, భరద్వాజా ర్పితం జపేత్' అని.

ఇచ్ఛాపూర్తికిః = సీతను వెదకి తేవలయు నను (రామచంద్రమూర్తి) తన కోరిక నెఱవేఱుటకు.

ఆమెచెప్పినరూపున = ఆమెచెప్పినత్రోవన.

పంపాసరస్సు రోధముఁజేరెను = పంప యను కొలనియొద్దు చేరెను.

ఈపంపయే కన్నడమున హంపి యయ్యెను. ఇది బళ్లారిమండలమునఁ గలదు.

రోధముజేరెన్ - ఒడ్డునఁబడినాఁ డన్నట్లు సీతను సాధించు నుపాయము తెలియక సముద్రమువంటి యరణ్యములో దిక్కుతెలియక యల్లాడుచుండినవాఁడు సీతాన్వేషణకార్యమున కనుకూలమైన ప్రదేశముఁ జేరె నని భావము.

తా త్ప ర్య ము.

ఆవిధముగ శత్రుసంహారదక్షుఁడయిన రాజకుమారుఁడు రామచంద్రమూర్తి శబరి నిండు శ్రద్ధాభక్తులతో సమర్పించిన యాతిథ్యమును నిండారుప్రీతితోఁ బరిగ్రహించి సీతను రోయు కార్యమందుఁ దనయిష్టము నెఱవేఱుట కామె చెప్పినవిధమున బంపాసరస్సును జేరెను.

కం॥హనుమత్కపి నటఁ గని యా,తని వచనముపేర్మి సూర్య,తనయునితోఁ బొందొనరించి తనదుకథయును, వినిచెన్ సర్వంబు సీత,వృత్తాంతంబున్. ౧౧౮

రాముఁడు తానుచేసిన ప్రతిజ్ఞ నెఱవేర్పుగుణము గలవాఁ డనుట యరణ్యకాండసారార్థము. దాని నింతవఱకుఁ జెప్పెను. స్నేహితులకై పూనిన కార్యము నెఱవేర్చుట యను గుణము కిష్కింధాకాండసారార్థము నిఁక సంగ్రహముగఁ జెప్పుచున్నాఁడు.

అటన్ = పంపాసరస్సు సమీపపు టడవియందున్.

హనుమత్కపిన్ - హనుమత్ = గొప్పదవుడలుగల, పరాక్రమము ప్రకటించుగాయము ముఖమునఁగల, కపిన్ = వానరుని.

హను వనఁగా జ్ఞానము, హనుమంతుఁడు = జ్ఞానముగలవాఁడు — జ్ఞాని యని యర్థము. కపిన్=సూర్యుని, (కం + పి) జలములను పానముచేయువాఁ డని వ్యుత్పత్త్యర్థము. కపయో౽ర్కేభవానరాః = కపి యనఁగా సూర్యునకు, ఏనుఁగునకు, కోఁతికిఁ బేరు. కప్యాసం అని ప్రమాణము. జ్ఞాని పామరులయజ్ఞానము పోఁదోలునట్లు సూర్యుఁడు చీఁకటుల హరించునట్లు హనుమంతునిఁ జూచుటతో రామచంద్రమూర్తికి దుఃఖము దీనత్వము నుమయఁగా దీనివలన మనకార్యము కాఁగల దను ధైర్యము కలిగె నని భావము.

కని = చూచి, భార్యావియోగమునఁ దపించు పురుషులకుఁ బ్రాణాంతకమైన యీచెరువునొడ్డున రాముఁడు దనకుఁ దనభార్యతో ఘటనగలిగించు నీ హనుమంతునిఁ జూచుట యెట్లున్నదన నొకఁడు తనసొత్తును దొంగలు దోఁచుకొనిపోఁగాఁ, దాను వారిచే దెబ్బలు దిని యల్లాడి యాకులుమేయుచుఁ, గడకుఁ దన యాప్తులఁజూచినట్లున్న దని భావము.

నిర్జనమైన యీచెరువునొడ్డున మన కేదిగతి యని రాముఁడు చింతించుచు విజయలక్ష్మీముఖమున నృత్యముచేయుచిహ్నములో యనునట్లు గాయమున్నదైన కాయలు ప్రకాశించు నీపురుషునిఁజూచుట భాగ్యవశమునఁ గలిగె నని హనుమత్పదభావము.

రావణునివలెఁ గపటసన్న్యాసిగా వచ్చి మోసపుచ్చక నిజరూపమిచ్చె దని తెలిపెఁగదా యని రామచంద్రమూర్తి కాయనయందు నమ్మకము గలిగెనని కపిశబ్దభావము. కపి అయోధ్యాకాండాంతమున "చొచ్చెను విపినభూమి న్భ్రమండలము సు జలజాప్తులీల" అని (౨౬౦౭౫) చెప్పఁబడెను.

ఇచ్చటఁ గపిదర్శనమయ్యె నని చెప్పుటచే మబ్బువిడిచిన సూర్యుని ప్రకాశమువలె రామచంద్రమూర్తిప్రతాప మింక వెలుఁగగల దని యాశయము.

ఆతనివచనముపేర్మిన్ = హనుమంతుని మాటయందలి గౌరవముచే.

సూర్యతనయునితోన్ = సూర్యునికొడుకైన సుగ్రీవునితో.

పొందు + ఒనరించి = స్నేహముచేసి - పురుషకార మనుకూలమైనందికాన నుచితజ్ఞుఁడైన మిత్రుఁడు లభించె నని భావము. సూర్యునికొడుకు సుగ్రీవుఁడు. సూర్యుని వంశమునఁబుట్టినవాఁడు రామచంద్రమూర్తి. ఇరువురు భార్యలను బోఁగొట్టుకొనినవారే. ఇరువురు యావ రాజ్యమును బోఁగొట్టుకొనినవాఁరే. ఇరువురు నిల్లు వాకిలి లేక యల్లాడువారే. కావునఁ బొందుగుదిరెను.

స్నేహలక్షణము పరస్పరరహస్యము లడుగుట చెప్పుట కావున నిఁక నది చెప్పఁబడును.

స్వంబు తనదు కథయును = పుట్టినదిమొదలు నిదివఱకు జరిగిన తన చరిత్రమును. ఇది నమ్మకమునకై చెప్పెను. సీతవృత్తాంతంబు సర్వమును = వెదకి సాధింపవలసినది సీతనే కావున నామెచరిత్ర సంపూర్ణముగను, కాకాక్షిన్యాయముచే 'సర్వము' ఉభయత్ర నన్వయించును.

వినిచెన్ = వినిపించెను.

తాత్పర్యము.

అపంపాతీర వనమందు హనుమంతుఁ డిట్లు కపిని జూచి యాయనమాటగౌరవమువలన సూర్యనందనుఁడైన సుగ్రీవునితో స్నేహముచేసి తనకథయును సీతవృత్తాంతమును సర్వ మీయనకుఁ దెలియఁజెప్పెను.

కం॥ అంతయు విని కపి నలినీ,కాంతతనూజుండు చెల్మి ♦ గావించె ధరా
కాంతకుమారునితో నే,కాంతము హుతవహుఁడు సాక్షి♦గా నామీఁదన్.౧౧౯

నలినీకాంతతనూజుఁడు = పద్మప్రియుఁ డగు సూర్యుని పుత్త్రుఁడు.

కపి = ఇచట సుగ్రీవుఁడు.

అంతయును = ప్రయోజనాపేక్షతో శ్రీరామచంద్రమూర్తి చెప్పినకథ యంతయును.

విని = ఈ రామచంద్రమూర్తి తనకార్యము తప్పక నెఱవేర్పఁగలఁడు గదా యను సంతోషముతో విని.

హుతవహుండు సాక్షిగా = అగ్నిసాక్షిగా.

ఏకాంతము = రహస్యమున. మిక్కిలి.

ధరాకాంతకుమారునితోఁ = దశరథపుత్రునితో.

చెల్మిఁగావించె = స్నేహముచేసెను. "కయ్యమునకు నెయ్యమునకు, వియ్యమునకు సమతవలయునని యుండఁగాఁ గపికిని - ధరాకాంతకుమారునకు నెయ్యమెట్లు కుదిరె" నని సందేహము. దీనినే సీతయు హనుమంతుని 'నరులకు వానరులకు నెట్లు చెలిమి కుదిరెనయ్యా' యని ప్రశ్నించెను. రామచంద్రమూర్తి ధరాకాంతకుమారుఁడైనచో సుగ్రీవుఁడు నలినీకాంతతనూజుఁ డని సమాధానము. తక్కినవిషయంబుల సమత్వంబు ముందే చెప్పఁబడెను.

ధర = భూమి, దానిసంకేతరూపము కమలము. "పద్మిని పద్మహస్తా" యని లక్ష్మీదేవికిఁ బేర్లు. ప్రపంచమునంతయుఁ దనచేతిలో నుంచుకొని యుండునది పద్మహస్త. కావున ధరాకాంతకుమారునకు నలినీకాంతకుమారునకు స్నేహము పొసఁగె నని భావము.

లక్ష్మీదేవి కమలమందు వసించు నని బ్రపంచమునకంతయు నామె యీశ్వరి యని భావము. కమల మామెచేత ధరించె నన సమస్తప్రపంచ మామె యెట్లాడించిన నట్లాడుచు నామెకు వశపడియున్న దని భావము. "శ్లో॥ సర్వేషా మేవ లోకానా, మీశ్వరీ మమ వల్లభా, అస్యా మమచ శేషంహి, విభూతి రుభయాత్మికా" అనికదా విష్ణుపురాణము చెప్పుచున్నది. అనఁగా నీ సమస్తలోకములకు నావల్లభ యగు లక్ష్మీదేవియే యీశ్వరి. రెండురూపములనుండు విభూతులు లీలావిభూతి (ప్రాకృతిమండలము సమస్తము), నిత్యవిభూతి (అప్రాకృత మండలము) ఆమెకు నాకు లోబడియున్నవి.

రాముఁడు కపితో స్నేహముచేసె ననుటచే రాముని సౌశీల్య మతిశయితమని సూచితము. గుహుఁడు హీనజాతివాఁడైనను బురుషుఁడు గావున నతని చెలిమివలన సౌశీల్యముమాత్ర మేర్పడెను. హీనస్త్రీ యగు శబరితో స్నేహము చేయుటవలన మిక్కిలిసౌశీల్యము చెప్పఁబడెను. తిర్యగ్జాతివాఁ డగు సుగ్రీవునితో స్నేహముచేయుటచే మీఁదుమిక్కిలి సౌశీల్యము చూపఁబడెను. దీనివలన భక్తిచేయుటయం దెట్టి నీచులైన నధికారులే యనియు, నట్టి యధి

కారము నీచజాతులయందే విశేషముగాఁ గానవచ్చుననియు నేర్పడుచున్న జ్ఞానముచే రామచంద్రమూర్తి నెఱింగి యాశ్రయించినవారు శరభంగాదులు కొందఱే. భక్తిచే నాశ్రయించినవారు కోట్లకొలఁదులు. ఇరువురకు ఫలము తుల్యము.

అమీఁదట = అట్లు స్నేహముచేసిన పిదప.

తాత్పర్యము.

అట్లు రామచంద్రమూర్తి తన వృత్తాంతము సీతవృత్తాంతము సర్వము చెప్పిన పిదప సుగ్రీవుఁడు రామునితో నగ్నిసాక్షికముగా మిక్కిలి స్నేహము చేసెను.

చం॥ తనకును వాలికిం బగవిధంబు దివాకరసూతి చెప్పినన్
విని ఘను వాలిఁ గూల్ప రఘువీరుఁడు పూని ప్రతిజ్ఞచేసినన్
విను మని వాలివీర్యబలవిక్రమము ల్వినిపించి యాత్మలో
నినకులుఁ డింద్రజున్ గెలుచునే యని సంశయలోలితాత్ముఁడై. ౧౨౦

దివాకరసూతి = సూర్యపుత్త్రుఁ డగు సుగ్రీవుఁడు.

వాలి వీర్యబలవిక్రమములు = చూచుటచేతనే వీరులు లోఁబడిపోవు తేజస్సు. బలము = దేహశక్తి, విక్రమము = శత్రువుపై విజృంభించుట. వాలియొక్క యీ గుణములను.

వినిపించి = రామచంద్రమూర్తికి మిక్కిలి యుత్సాహము పెంపఁ జెప్పి.

ఇంద్రజున్ = ఇంద్రపుత్త్రుఁ డగు వాలిని.

గెలుచునే యని = రామచంద్రమూర్తి కర్త. ఆ పదమధ్యాహారము. రామచంద్రమూర్తి వాలిని గెలువఁగలఁడా యని.

సంశయలోలితాత్ముఁడై = సందేహముచేఁ గలఁతపడిన మనస్సుగలవాఁడై. ఇంద్రజు నినకులుఁడు గెలువఁగలఁడా యని సందేహము. ఇంద్రుఁడు మూఁడు లోకములకు, సర్వదేవతలకు, సర్వగ్రహాదులకు నధిపతి. అయన భృత్యుని వంటివాఁడు సూర్యుఁడు కావున నట్టి యింద్రుని సాక్షాత్పుత్రుఁడు దేవాంశ సంభూతుఁడు నగు వాలిని సూర్యవంశమునఁ బుట్టిన మనుష్యుఁడు గెలువఁ గలఁడా యని సందేహకారణము.

సుగ్రీవుఁడు రామపరత్వ మెఱుఁగఁడుకదా.

తాత్పర్యము.

తనకుఁ దన యన్నయగు వాలికి విరోధము ప్రాప్తించినవిధము సుగ్రీవుఁడు చెప్పఁగా విని రామచంద్రమూర్తి వాలిని జంపఁ బ్రతిజ్ఞఁజేసెను. అమీఁద వాలి

పరాక్రమంబులు రామచంద్రమూర్తికి వినిపించి యింతటి బలశాలిని వాలిని రామచంద్రమూర్తి గెలువఁగలఁడా యని సంశయించెను.

ఉ॥ నమ్మిక యూనపొంటె దిననాథతనూజుఁడు గానిపింప గో
త్రమ్మన నందు దుందుభిసురప్రకరారికళేబరంబు హా
సమ్మిగురొత్తఁ జూచి బలశాలి వెసన్ దశయోజనంబులం
జిమ్మెఁ దదస్థిఁ ద్రెళ్ళ రఘుసింహుఁడు పాదమునంగుటంబునన్. ౧౨౧

దిననాథతనూజుఁడు = సూర్యపుత్రుఁడు.

నమ్మిక = రామచంద్రమూర్తిబలమున విశ్వాసమును.

ఊనుపొంటెన్ = చెందుటకొఱకు - పొంటెన్. ఇది చతుర్థీప్రత్యయము. 'కంటెఁ బొంటెవర్ణకములు పరము లగునపుడు భావార్థక ట వర్ణకము వైకల్పికముగ లోపించు' అను సూత్రము ప్రకారము టవర్ణకలోపము.

గోత్రమ్మననందు -- గోత్రము = పర్వతము, ఇది పర్వతమాయేమి యని సందేహింపఁదగినట్లు రాశియై యెత్తుగనుండు.

దుందుభి, సురప్రకరారి, కళేబరంబున్, కానిపింపన్ = దుందుభి యను దేవతాసమూహవిరోధియొక్క దేహాకారముగానుండు నెముకలగూటినిఁ జూపఁగా సందేహమును మనస్సులో నుంచుకొనక బయలుపడిచెప్పి యీకార్యము చేసెనని భావము.

బలశాలి = అపరిమితబలముచేఁ బ్రకాశించువాఁడు.

రఘుసింహుఁడు = రఘువంశశ్రేష్ఠుఁడు రాముఁడు - సింహము శార్దూలము నాగము - పుంగవము - వృషభము లోనగుపదములు పుంలింగమైన నుత్తరపదములై శ్రేష్ఠార్థంబును దెలుపును.

హాసము = చిఱునవ్వు. నాబలము పరీక్షించుటకు నీకోఁతి యెంతగొప్ప కార్యము చేయుమని యడిగెను? ఇదియా నాబలము తెలిసికొనుటకుఁ దగిన పరీక్ష! యని చిఱునవ్వు నవ్వెను.

ఇగురొత్తన్ = అంకురింపఁగా. బిగ్గనవ్వుట యనౌచిత్యము.

తదస్థిన్ = ఆ యెముకలరాశిని - త్రెళ్ళన్ =ఎగిరిపడునట్లు.

పాదమునంగుటంబునన్ = కాలిబొటనవ్రేలితో.

పదియోజనంబులన్ = పదియామడదూరమునందు.

వెసన్ + చిమ్మెన్ = శీఘ్రముగా విసిరెను. అంగుష్ఠశబ్దభవము - అంగుటము, ఉంగుటము. 'గీ॥ మ్రొక్కి నిలిచి యతనిముందట మేదిని । నంగుటమున

నోరయుచున్నఁ జూచి' నిర్వ. ౩ ఆ. 'చేసేతం బృథివీశులందు-
మందును నీ శబ్దము ప్రయుక్తము. "ఉంగుటంబున హరించెం బల్ల

తాత్పర్యము.

సుగ్రీవుఁడు తనకు నమ్మకముగలుగుటకొఱకై పెద్దకొండవలెనుఁడు దుంద-యను రాక్షసుని కళేబరముచూపి దీని 'రామా చిమ్ముమీ' యనెను. నాబలము తెలిసికొనటకిదియా పరీక్ష యని చిఱునవ్వునవ్వుచు నలక్ష్యముగ దానిని కాలి బొటనవ్రేలితో పెంచికబిళ్ళను జిమ్మునట్లు పదియామడదూరమున పడునట్లు చిమ్మెను. ఈ పరీక్షతో సుగ్రీవుఁడు తృప్తిపడినవాఁడు కాఁడు. దీనిని దొలుత చిమ్మునపుడు వాలి చాల నలసియుండెను. ఈ కళేబరము నెత్తురు మాంసముఁతోఁగూడి భారముగానుండెను. ఇప్పు డెముకలగూడుతప్ప మఱియేమి లేదు. ఈకారణమున నెట్లు వాలికంటె రామచంద్రమూర్తి బలశాలి యని నమ్ముదును. కావున మఱియు బరీక్షించెద నని సాలవృక్షమును భేదింపు మని రామచంద్రమూర్తినిఁ గోరెను.

కం॥ లీలగ నొకపెనుఁగోలను, సాలాగమసప్తకంబు ♦ శైలవరంబుఁ
దూలించె రసాతలమున, ప్రీలనిప్రత్యయము గలుగ ♦ వీరుం డంతన్. ౧౨౨

'దనుజ కళేబరంబును గేలఁ బైకెత్తి వెసయోజనంబున విసరివైచె' (కిష్కింధ. ౨౮౮.) నని, వాలి దుందుభికళేబరంబును జేతితోఁ బైకెత్తి యామడదూరమునఁ బడునట్లు విసరివైచెను రామచంద్రమూర్తి కాలిబొటనవ్రేలితో పదియామడ దూరమునఁ బడఁజిమ్మెను. దీనివలననే వాలిబలముకన్న రాముబల మధికమని తెలియుచున్నను, వాలి దీర్ఘకాలము యుద్ధముచేసి యలసియుండి పచ్చిగానుండు దానిని రక్తమాంసములతోడఁ జిమ్మెను - రామచంద్రమూర్తి ప్రయాసముపడని దశలో నుండుటయేగాక కళేబరము శుష్కించి యెముకల గూడుమాత్రము మిగిలినది కావున దీనివలన రామచంద్రమూర్తి వాలికంటె బలవంతుఁడని నిర్ధారింప సాధ్యపడదు గనుక సుగ్రీవుఁడు మఱియొక్క పరీక్షచేయఁగోరెను. అప్రకారమే రామచంద్రమూర్తియు సుగ్రీవుఁడు కోరినట్లుచేసి నమ్మకమును గలిగించెను. అది యెట్లనిన—

వీరుఁడు = శూరుఁ డగు రాముఁడు.

సాలాగమసప్తకంబును = ఏడుమద్దిమ్రానులను.

శైలవరంబుఁ = పెద్దకొండను.

రసాతలమున = అధోలోకములలో నాఱవలోకమును.

ప్రీలనిప్రత్యయము కలుగఁ = మొదటిసారివలెఁగాక దృఢమైన విశ్వాసము కలుగుటకై.

లను = ఒక్క గొప్పబాణముచేత - మిత్రుని కార్యము నెఱవేర్పఁ సాధనసామగ్రియున్న దని తెలుపుటకై.

లన్ = అవలీలగ తూలించెను = ఛేదించెను. ఒక్కబాణమున నొక్కచెట్టునే కొట్టినయెడల వాలితో సముఁడని యెంచునేకాని సుగ్రీవుఁడు తన్ను వాలి కంటె బలవంతుఁ డని యెంచఁ డేమోయని యేడుచెట్లను నొక్కబాణముతోనే కొట్టెను. ఏడుచెట్లు చాలుగనుండెనేని బలాతిశయముచే నొక్కబాణంబునఁ గొట్టవచ్చును గాని పందిటి గుంజలవలె మూలకొకటి యుండిన నొక్కబాణముతో ఛేదించుట యసాధ్యకార్యముగదా. ఇట్లు చెట్లనుమాత్రమే కాక పర్వతమును భేదించుట మఱియసాధ్యము. పోయినబాణ మంతటితోఁ బోక మరల చేతికివచ్చుట మహాద్భుతము.

అంతన్ = ఛేదించిన పిమ్మట.

తా త్ప ర్య ము.

సుగ్రీవునికోరిక నెఱవేర్చి యాయనకు మరల సందేహమున కెడములేకుండునటు లేడు సాలవృక్షములను ఛేదించి యవి యుండెడికొండను రాముఁడు భేదించెను. ఆబాణము రసాతలమునకుఁ బోయి మరలి చేతికి వచ్చెను. అంతతో సుగ్రీవునిమనస్సు నిశ్శంకమయ్యెను.

కం॥ బంధుర మగువిశ్వాసము, సంధించుచుఁ బ్రీతమానసము పెంపునఁ గి
ష్కింధాగుహకును నలినీ,బాంధవజుం డరిగె రామభద్రునితోడన్.   ౧౭౩

నలినీబాంధవజుండు=పద్మములకు బంధువగు సూర్యునికొడుకు - సుగ్రీవుఁడు.

బంధురమగు విశ్వాసము = అధికమైన నమ్మికను.

సంధించుచున్ =(రామచంద్రమూర్తియతిమానుషచర్యఁ జూచి)పొందుచు.

ప్రీతమానసము పెంపునన్ = ఇఁక నాకు వానరరాజ్యము తప్పక లభించినది యను ప్రీతిగల మనస్సుయొక్క అభివృద్ధిచేత మనస్సునందలి యిట్టి ప్రీత్యతిశయముచేతను.

రామభద్రునితోడన్ = శుభమునిచ్చు రామునితోన్.

కిష్కింధాగుహకున్ = గుహవలెఁ బర్వతముల నడుమనుండు కిష్కింధాపట్టణమునకు.

అరిగెన్ = పోయెను. ఋశ్యమూకమునుండి యని యధ్యాహారము.

తా త్ప ర్య ము.

పొచ్చెములేని నచ్చికగలవాఁడై సుగ్రీవుఁ డిఁకఁ దనపగదీఱెను, వానర

రాజ్యము లభించెను, అని సంతుష్టపడిన మనస్సుగల
మూర్తిని దోడుకొని కిష్కింధాగుహాప్రాంతమునకుఁ బోయెను.

ఉ॥ కాంచనపింగళుండు ప్లవగప్రభుఁ డర్కతనూజుఁ డంత గ
ర్జించినఁ దద్రవంబు విని జిష్ణుతనూజుఁడు యుద్ధకాంక్ష నే
తెంచుచు దార తారకును దెల్పి భయంపడకుండ, సూర్యజుం
డొంచిన, వానిఁ ద్రుంచెను ఘనం బొక కోలను నేలఁ గూలఁగన్. ౧-౭౬

అంతట = కిష్కింధాప్రాంతము చేరినతరువాత.

ప్లవగప్రభుఁడు = వానరప్రభుఁడు. అవ్యవహితభవిష్యత్తునకు వర్తమానభూతము లగు నన్నట్లు కొంచెము కాలములోనే ప్రభువు కాఁబోవును గనుక నయినట్లు చెప్పఁబడినాఁడు. 'మదర్థే త్యక్తజీవితా' యన్నట్లు

కాంచనపింగళుండు = బంగారమువలెఁ బసుపురంగుగల దేహముగలవాఁడు. సంతోషాతిశయముచేత ముందున్న వికారరూపము పోయి మనోహరాకారము కలవాఁ డయ్యె నని యర్థము.

అర్కతనూజుఁడు = సూర్యపుత్రుఁడు - పై విశేషణము సూర్యకాంతిని ఈ విశేషణము సూర్యప్రతాపమును దెలిపెడిని.

గర్జింపఁగ = తన సుగ్రీవతకుఁ దగినట్లు గొప్ప సింహనాదము సేయఁగా.

జిష్ణుతనూజుఁడు = జయించు స్వభావముగల యింద్రునికొడుకు. కారణగుణము కార్యమునందు వర్తించునట్లు తండ్రివలెఁ దాను సర్వదా జయించుచుండువాఁడ ననియే తలఁచెనుగాని యిప్పుడు [illegible]పుత్రునివలె నయినాఁ డని భావము

తద్రవంబువిని - తత్ + రవంబు + విని - ఆ శబ్దమును విని. ఇదివఱకు సుగ్రీవుఁడు చేయుచుండిన సింహనాదముకంటెను నీసారిచేసిన సింహనాదము విలక్షణమై మునుపటివానివలె దౌర్బల్యమును దెలుపక సహాయ[illegible]క మయి ధైర్యముతోఁ జేసినట్లు తోఁచె నని భావము.

యుద్ధకాంక్ష = యుద్ధమునందలి యపేక్షతో.

దారతారకును = భార్యయగు తారకు. సుగ్రీవుఁడు దశరథకుమారుఁడైన రామచంద్రమూర్తిని సహాయునిఁగాఁ దెచ్చుకొన్నాఁడు. అట్టిసహాయసంపన్నుఁడైన తమ్మునితో నేల విరోధము? యుద్ధమునకుఁ బోవల దని తార యడ్డగింపఁగా.

భయంపడకుండఁ దెల్పి = శ్రీరామచంద్రమూర్తి ధర్మాత్ముఁడు, నిరపరాధి నగునన్నుఁ బరునితో యుద్ధముచేయునపుడేల వధించు నని సమాధానపఱిచి.

ంచినర్ = సుగ్రీవుని యుద్ధమున బాధింపఁగా.
వాలిని.

ఁడు = ధర్మసూక్ష్మములఁ జక్కఁగా నెఱిఁగిన గొప్పవాఁడగు రామచంద్ర ర్తి వాలిని వధించుటదోషమా, మైత్రి భావించి తాన సంప్రాప్తుఁడైన వానిని గ్రీవుని నగ్నిసాక్షిగ స్నేహముచేసినవానిని జేవడలుట దోషమా యని ధర్మాధర్మబలాబలము లాలోచించి యుత్తమమార్గ మవలంబించినవానిని.

ఒక్కకోలను = (1)ఒకబాణము తప్పిన రెండవది వైచునంతలో వాలి సుగ్రీవునిఁ జంపునో, పరువెత్తి యూరిలోకిఁ బోవునో యని సందేహించి మొదట బాణముతోనే చంపెను. (2) మొదటిసారియైనను రెండుమూఁడు బాణము లొక్కసారిగ వేయలేదు. కుక్కనగొట్టుటకు పచ్చెనకోల కావలయునా యన్నట్లు వాలిని జంపుటకు రెండుమూఁడు బాణములు కావలయునా యనియు నొకమాట యొకబాణము లను బిరుదునకు విరోధముగా నొకగుఱిని రెండుమార్లు కొట్టిన ట్లగుననియుఁ దలఁచి, యస్త్రమునఁగూడఁ గాదు, ఒకకోలతో.

నేలఁగూలఁగర్ త్రుంచెర్ — దిగువఁబడునట్లు సంహరించెను.

తమ్మునిభార్యతో సంగమించినవానికి శిక్ష వధ యని శాస్త్రము చెప్పుటచే శాస్త్రబద్ధుఁడై రామచంద్రమూర్తి యట్లు చేసెను. నేలఁబడునట్లు కొట్టెనుగాని వెంటనే ప్రాణము పోవునట్లు కొట్టలేదు. ఏల యనిన వానిదోషము వానికిఁ దెలిపి నీదోషమున కిది ప్రాయశ్చిత్తము అని వానికి సమాధానము చెప్ప నవకాశ ముండవలయుననియేకాని యింక గొంచెము గట్టిగా వెంటనే ప్రాణము పోవునట్లు కొట్టఁ జేతఁగాక కాదు. దీనివలన రామచంద్రమూర్తి ధర్మబుద్ధియు సత్యపరాక్రమము స్పష్టము. రామచంద్రమూర్తి వాలిని బహుబాణములు వైచి ప్రత్యక్షమునఁ జంపె నని యొకవాదము బయలుదేఱినది. ఆవిషయము కిష్కింధాకాండమందుఁ జర్చింపఁబడును

తాత్పర్యము.

బంగారువన్నె దేహకాంతిగల వానరేశ్వరుఁడైన బహుశక్తిమంతుఁడు సుగ్రీవుఁడు సింహనాదము గావించెను. ఆధ్వనివిని యింద్రకుమారుఁడైన వాలి సుగ్రీవునితో యుద్ధముసేయ బయలుదేఱెను. కాని యాయనభార్య తార యడ్డమై సుగ్రీవుఁడు రామసహాయుఁడై యున్నవాఁడు. నీవు రణముసేయఁ బోవలదు. నీవు నీ తమ్మునితో సమాధానము పడు మని బోధించెనుగాని వాలి రామచంద్రమూర్తి ధర్మాత్ముఁడు, ఇతరునితో యుద్ధముచేయ నన్నేల చంపు నని సమాధానపఱిచి వచ్చి సుగ్రీవుని యుద్ధమున నొప్పించెను. తనమిత్రుఁడు తనయెదుట నొప్పింపఁ

ఒడుట కనలారఁ జూచి యిపుడు గాకున్న శరగ్ర
మ తెప్పటి కని రామచంద్రమూర్తి వాలిని న
గొట్టెను.

ఆ॥ మిత్రపుత్రుమాట, మేరగ వాలిని, రణమునందుఁ ద్రుంచి ♦
వానిరాజ్యమున ది♦నాకరతనయునే, పట్టమొప్పఁగట్టెఁ ♦

రాఘవుండు = మహావంశమునఁ బుట్టి సకలధర్మ
చంద్రమూర్తి.

మిత్రపుత్రుమాట మేరగన్ = సూర్యపుత్రుఁడైన సుగ్రీవునిమాట ప్ర
(కిష్కింధాకాండము ౩౨౨ వ పద్యము గూచునది).

రణమునందున్ = సుగ్రీవునితో యుద్ధముచేయునపుడు.

వాలిన్ = వాలిని, త్రుంచి = సంహరించి.

వానిరాజ్యమునన్ = వాలిరాజ్యమున.

దివాకరతనయునే = (వాలికుమారుఁడైన యంగదుఁడు చిన్నవాఁ డగుటచే
తను, బూర్వము సుగ్రీవుఁడే యువరాజుగా నుండుటను, సుగ్రీవునకు రాజ్య
మిచ్చెద నని బాసచేసియుండుటను నంగదునకు రాజ్యమీక) సుగ్రీవునినే.

ప్రాభవమున్ - ప్రభుభావము ప్రాభవము = గొప్పగా.

పట్టమొప్పఁగట్టెను = రాజుగా నభిషేకించెను.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి సుగ్రీవుఁడు కోరినప్రకారము వాలిని రణమున
వధించి యావాలి యేలుచున్న రాజ్యమందు వాలిస్థానమున సుగ్రీవునినే
ప్రభువుగా నొనరించెను.

ఉ॥ సీతను రోయఁగాఁ బనిచె ♦ వెచ్చి వానరనాథసూనుఁ డ
త్యాతతవిక్రమాఢ్యుల మ♦హాకపివర్యుల, వారిలోన సం
పాతివచఃప్రబోధమునఁ ♦ బావని యామడ లొక్కనూఱునై
భీతిద మా మహార్ణవముఁ ♦ బెల్చనఁ దా నవలీల దాఁటుచున్. ౧౨౬

రామచంద్రమూర్తి తనమాటప్రకారము వాలిని వధించి రాజ్యము సుగ్రీ
వున కీయఁగాఁ బ్రత్యుపకారముగఁ దనమాటప్రకారము సుగ్రీవుఁడు సీతను
వెదకుటకై వానరులఁ బంపుచున్నాఁడు.

వానరనాథసూనుఁడు = దినపతికొడు కగు సుగ్రీవుఁడు.

సీతనురోయఁగాన్ = సీతను వెదకుటకు.

లన్ — మిక్కిలి ప్రఖ్యాతిచెందిన గొప్పపరాక్రమము

= గొప్పయాకారముగల వానరశ్రేష్ఠులను.
చెన్ = శీఘ్రముగా రప్పించి, శీఘ్రముగా నొక నెలలోపల
డని పంపెను.

ని వెదక దక్షిణదిక్కునకై పోయినవానరులలో.
పుత్త్రుడు - హనుమంతుడు. పవనుని కుమారుడు పావని
శమము. పుంలింగము 'పవనః పవతా మస్మి' యన్నట్టు పావనము
యువారిలో పవనుడు శ్రేష్ఠుడు. అట్టివానికుమారుడు కావున సుగ్రీవుడు
చేసినబాస నెఱవేఱునట్లు చేసి యతనిమిత్త్రఋణవిముక్తునిం జేసె నని భావము.

సూర్యశిష్యుడు సూర్యపుత్త్రుని ఋణవిముక్తుం జేసి సూర్యవంశ్యుం డగురామ
చంద్రమూర్తికిం దోడ్పడుట భావ్యమేకదా.

సంపాతివచః ప్రబోధమునన్ = జటాయువున కన్న యగు సంపాతిమాటల
వలనం దెలిసికొన్నవాడై. లంకలో రావణు నంతఃపురములో సీతాదేవి యున్న
దని సంపాతి చెప్పంగాం దెలిసికొన్నవాడై.

ఆమడలొక్కనూఱునై = ఒక్కనూ అనంగా చక్కంగా ... పైనొకటి యని
యర్థముకాదు. ఇంచుమించు నూ అని యర్థము. "ఒకమున్నూఱు కదల్చి
తెచ్చినలలాటోగ్రాక్షుచాపంబు" - భాగవతము. అనేకమను నర్థమున శతము -
సహస్రము- అయుతము - అనుపదము ప్రయోగింపంబడును.

భీతిదమౌ = భయంకరమైన.

మహార్ణవమున్ = గొప్పసముద్రమును.

అవలీలన్ దాంటుచున్ = నడుమనడుమ విఘ్నములు వచ్చినను నవి
యాయన కాయాసమును గలిగించినవికావు.

క॥ ఇట్టులు నూఱామడ యొక, పెట్టు వడిం దాంటి బాహువిక్రమపరుడై
నిట్టూర్పైనను విడువండు, కొట్టంబడండుగాసిం గీశకుంజరుండంతన్.
సుందర-౧౩౧.

తాత్పర్యము.

అట్లు శ్రీరామచంద్రమూర్తి తనకార్యభారము నెఱవేర్పంగా సుగ్రీవుడు
తన ప్రతిజ్ఞప్రకారము సీతను వెదకుటకు వానరులను నాలుగుదిక్కులకు మిక్కిలి
పరాక్రమవంతులైన వారిని బంపెను. వారిలోం బవననందనుండైన హనుమం
తుండు జటాయుసోదరుండైన సంపాతి సీతాదేవి లంకలో నున్నదని చెప్పంగా

నాహూటప్రకారము రమారమి నూఱామడ వెడల్పుగల సముద్రమును సునాయాసముగ దాఁటెను.

కం॥ రావణపాలిత మహా లం,కావరనగరంబుఁ జొచ్చి ♦ కనియెను బహుశో
కావిల నశోకవనగత, శ్రీవాస న్నాథసక్త,చేతఁ సీతన్. ౧౨౭

రావణ పాలితమహా= రావణుచేఁ బాలింపఁబడుచున్న.

లంకావరనగరంబు = లంక యను పేరుగల గొప్పపట్టనము.

చొచ్చి = ప్రవేశించి.

అశోకవనగతఁ = రావణు నంతఃపురికి జేరి విస్తారముగ నశోకవృక్షములు గల యుద్యానవనమం దున్నదానిని.

నాథసక్తచేతఁ= భర్తయందే లగ్నమైన మనస్సుగలదానిని - ఎల్లప్పుడు భర్తనే ధ్యానించుచుండుదానిని.

బహుశోకావిలఁ = (భర్తను విడిచి రావలసివచ్చెఁగదా యనియుఁ దన నిమిత్తమై శ్రీరామచంద్రమూర్తి యెంత దుఃఖించుచున్నాఁడో యనియు) అధికమైన శోకముచేఁ గలఁతనొందిన మనస్సుగల దానిని.

శ్రీవాసఁ= సతీరత్నమునకుఁ దగిన స్వాభావిక కాంతికి నివాసమైనదానిని.

సీతఁ కనియెఁ= శ్రీసీతాదేవిని జూచెను. పదినెల లాహారములేక స్నానము లేక నేలమున్నులోఁ బడి పొరలాడుచు నొక్కటిగఁ జేసిన జడతో గుర్తించుటే కష్టముగాఁ జిక్కియుండునది శ్రీవాస యెట్లయ్యె నన స్త్రీలను రక్షించునది శీలము. స్త్రీలకు నాభరణములవలెఁ గాంతి నిచ్చునది శీలము. అట్టిశీల లక్ష్మి యాయమయందు స్థిరముగాఁ గాఁపురము చేయుచున్నదనియు నేలక్షణములచే నామె యట్టి శీలవతి యని తెలిసికొనవచ్చునో యట్టి సహజశుభలక్షణము లామెయందు స్పష్టముగఁ బ్రకాశించుచున్న వనియు భావము. సంసారతాపత్రయంబు నోర్వక భగవత్కటాక్షమునకుఁ బాత్రుఁడఁ గాకపోయితినే యని యేకాంతస్థలమునుండి తపించుచు భగవత్సాక్షాత్కార మపేక్షించి యాయనసే సర్వదా ధ్యానించుచుఁ దన్మయమై పోవుటచేఁ గలిగిన బ్రహ్మతేజస్సంపన్నుఁడగు భక్తుఁ డిట ధ్వనించును.

తాత్పర్యము.

రావణాసురుఁ డేలెడు లంకాపట్టణమునఁ బ్రవేశించి హనుమంతుఁడు రావణుని యంతఃపురమునకుఁ జేరికగా నశోకవనమం దుండి శోకించుచు తనభర్తనే ధ్యానించుచుఁ దపోబలముచే శీలసంపత్తిచేఁ గలిగిన నైజవర్చస్సుచేఁ బ్రకాశించుదానిని శ్రీసీతాదేవిని జూచెను.

౬౦॥ వైశ్వానరహితతనయుఁడు, విశ్వాసముపుట్టఁ జూపి ♦ విభుముద్రికఁ దా
నాశ్వాసించెను సతి, హరి,దశ్వసుతునితోడఁ జెలిమి♦యగుటయుఁ జెప్పెన్. ౧౨౮

వైశ్వానరహితతనయుఁడు = అగ్నిదేవునికి మిత్త్రుఁ డయిన వాయుదేవుని పుత్త్రుఁడు-హనుమంతుఁడు. ఈపద్యమునందు౧౨౯ వ పద్యమునందు నిదియే కర్తృపదము కావున హనుమంతుఁ డింపుమించు లంకానగర మంతయు నగ్నిహోత్త్రునకుఁ బూర్ణాహుతిగ వేల్చుటయు, హనుమంతునితోఁక కాలకుండుటయు దానికిఁ గారణము నీపదము తెలుపుచున్నది. 'లోహితాశ్వో వాయుసఖ' యని యమరుఁడు.

విశ్వాసము పొంకెర్= (రావణాసురుఁడు సన్న్యాసివేషము వేసికొని మోసగింప వచ్చినట్లు లతఁడో మఱియొకఁడో క్రోఁతివేషము వేసికొని తన్ను మోసగింపవచ్చినాఁ డని యెంచక నిజముగ) రాముదూతయే యని నమ్ముటకొఱకు.

విభుముద్రికను = శ్రీరాముని యుంగరమును.

చూపి = గుఱుతుగాఁ గనఁబఱిచి యామె కిచ్చి.

హరిదశ్వసుతునితోడి చెల్మియగుటయుఁ = సూర్యపుత్త్రుఁడైన సుగ్రీవునితోడ స్నేహము చేసికొనుటయును. చేసికొనుట యనిచెప్పక "యగుటయును" ననుటచే సీతాదేవికై రామచంద్రమూర్తి చేయుప్రయత్నము దుఃఖపాటు మొదలయిన వన్నియుఁ జెప్పె నని సముచ్చయార్థకము స్ఫురింపఁజేసెడిని. స్నేహముచేసికొనె నని చెప్పిన స్నేహఫలము రామచంద్రమూర్తినిమాత్రమే చెందునని తోఁపఁగలదు వాస్తవముగ స్నేహఫలము రామసుగ్రీవుల కిరువురకుఁ బ్రాప్తించెను. కావున నాత్మనేపద ముపయోగింపక 'చెలిమి లభించె' నని చెప్పెను.

తాన్ = తాను (ఆంజనేయుఁడు), సీతన్ = సీతాదేవిని.

ఆశ్వాసించెను = సమాధానపఱిచెను. నీభర్త వానరులతో వచ్చి సముద్రమును దాఁటి లంక ముట్టడించి రావణు సబాంధవముగ వధించి నిన్నుఁ బిలుచుకొనిపోయి పట్టాభిషిక్తుఁ డగు నని యూరడించె నని భావము.

తాత్పర్యము.

అగ్నిహోత్రునిమిత్త్రుని కుమారుఁడైన హనుమంతుఁడు శ్రీసీతాదేవి తన్ను నమ్ముటకై శ్రీరామచంద్రమూర్తి యిచ్చిన రామముద్రికను జూపి దుఃఖపడవల దని రామచంద్రమూర్తి త్వరతో వచ్చి నిన్నిచెఱనుండి విడిపించు నని యామెను సమాధానపఱిచి యిరువురు రామలక్ష్మణులు సముద్ర మెట్టు దాఁటి రాఁగలరు? రాఁగలిగినను నింతటి బలశాలిని రావణు నెట్లు జయింపఁగల రను

సందేహము తీఱుటకై సూర్యపుత్రుఁడగు సుగ్రీవునితో రామచంద్రమూర్తికి స్నేహము లభించుటయుఁ జెప్పెను.

సీ॥ తోరణంబును బ్రవి♦దారణం బొనరించి, పంచసేనానులఁ ♦ ద్రుంచి వైచి
సప్తమంత్రిసుతాళి ♦ సప్తాశ్వసుతుఁ గూర్చి, శూరు నక్షుని నల్చి ♦ చూరు చేసి
బ్రహ్మాస్త్రమునఁ జిక్కి ♦ బ్రహ్మవరంబునఁ, గట్టు వాసినయట్టి ♦ గుట్టు దెలిసి
తను లాగుదైత్యుల ♦ మనమున మన్నించి, సీత ఉప్పుఁగ లంక ♦ భూతిఁ జేసి
తే॥ రియము మెయిదాశరథికిని ♦ బ్రియముఁ జెప్ప, మరలి చనుదెంచివానర♦వరుఁడు ధీర
తామహోత్తరుఁ గాంచిప్ర♦దక్షిణించి, కంట వానికిఁ బస్వాయు♦క్తముగ ననియె.
౧౨౯.

తోరణంబును = అశోకవనము తలవాకటద్వారమును.

ప్రవిదారణంబు, ఒనరించి = చక్కఁగా విఱుగఁగొట్టి.

పంచసేనానులన్ = అయిదుగురు సేనానాయకులను - పింగళనేత్రుఁడు మొదలగు వారు 'సేనాం నయతి' సేనను నడిపించువాఁడు సేనాని.

త్రుంచివైచి = చంపి.

సప్తమంత్రిసుతాళిన్ = జంబుమాలి మొదలగు నేడ్వురు మంత్రిపుత్రులను.

సప్తాశ్వసుతున్ - ఏడుగుఱ్ఱములుగలవాఁడు సూర్యుఁడు వానిసుతున్ = వాని కుమారుఁడగు యముని - యముఁడు శనైశ్చరుఁడు సూర్యునికొడుకులు.

కూర్చి = చేర్చి - అనఁగాఁ జంపి. పర్యాయోక్తాలంకారము.

శూరున్ అక్షున్ = రావణు రెండవకుమారుఁడును మిక్కిలి పరాక్రమశాలియు నగు అక్షకుమారుని (ఇంద్రజిత్తు - అక్షకుమారుఁడు వీరిగువురు మండోదరీపుత్రులు).

నల్చిచూరుచేసి = నలిగి పొడి పొడి యగునట్లు నేలపై విసరి మోఁది.

బ్రహ్మాస్త్రమునఁ జిక్కి = ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము చేతఁ గట్టుపడి.

బ్రహ్మవరంబునన్ = బ్రహ్మాస్త్రమున నీవఁడు కట్టుపడినను నీకేమాని మృత్యుభయము లేదని బ్రహ్మ హనుమంతునికి బాల్యమున నిచ్చిన వరముచేత.

కట్టువాసినయట్టి గుట్టు తెలిసి = కట్టు వాసిన రహస్యము తెలిసికొని.

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే హనుమంతునిఁ గట్టెను. అస్త్రబంధన మభేద్యమని తెలియని మూఢులగు నతని యనుచరు లూరక క్రిందపడినాఁడని తలఁచి తటాలునఁ బైపడి త్రాళ్లతోఁ గట్టిరి. నీచసాంగత్యమును విశ్వాసములేమిని

నోర్వక బ్రహ్మాస్త్రము వదలిపోయెను. అది రాక్షసులకుఁ దెలియదు. హనుమంతునికిఁ దెలిసియు రావణునిఁ జూచి మాటలాడవలయు నను తలంపుతోఁ గట్టుపడినవానివలెనే నటించెను. ప్రపత్తికి మహావిశ్వాసము ప్రాణము. విశ్వాసమున లోపము గలిగెనేని ప్రపత్తి వ్యర్థమగును. బ్రహ్మాస్త్రబల మెఱుంగని మూఢరాక్షసులు బ్రహ్మాస్త్రబంధములకన్నఁ ద్రాళ్ళకట్లు గొప్పవని తలఁచి హనుమంతుని గట్టుటచే నస్త్రబంధము లవమానము సహింపక యూడి పోయెను. అట్లులే భగవంతునకు శరణాగతులైనవారు దానియందు నమ్మకములేక యితరోపాయముల వెదకిరా భ్రష్టు లగుదురు

తనలాగుదైత్యులఙ్ = త్రాళ్ళతోఁ దన్నుగట్టి యీడ్చు రాక్షసులను.

సీతఁదప్పఁగ లంకభూతిచేసి = సీతనుదప్పఁ దక్కినలంక (లంకలో విశేష భాగము) గాల్చి బూడిదచేసి. సాధువై సీతాపతిపాతి యగు ధర్మాత్ముఁడగు విభీషణుని యిల్లుగూడఁ గాల్పక విడిచెను. దాశరథికిఁ బ్రియముఁ జెప్ప దయము మెయి మరలి యని యన్వయము.

దాశరథకిఙ్ = రామచంద్రమూర్తికి-దశరథాపత్యము-పుంలింగము-దాశరథి.

ప్రియమును = సంతోషకరమైన సీతాదర్శనవార్తను

ధీరతామనోహరుఙ్ = ధైర్యమున మిక్కిలి గొప్పవానిని-సీతావిరహావేదనయందును ధైర్యమువదలనివానిని - రామచంద్రమూర్తిని.

కాంచి = చూచి - తన్నుఁ జూడఁగానే యితఁడు కృతకృత్యుఁడని తెలిసికొని సంతోషపడునట్టి చూపులఁజూచి - వాక్కుచే సంతోషింపఁ జేయుటకుముందే యాకారముచేతనే సంతోషింపఁజేసెననియు నిష్కారణముగ రామునకు గలిగిన దుఃఖంబుట హనుమంతుఁడు పోఁపఁడయ్యెననియు భావముఘనవన భంగమునకియు నొకకారణము. తమరాక విని రాముఁడు సంతోషింపుఁగాక యని.

ప్రదక్షిణించి = చుట్టుతిరిగి. ఇది ప్రణామమున కుపలక్షణము ఇది. యాత్మప్రదక్షిణము గాదు. పెద్దవారియెదుటను ప్రభువులయెదుటను దేవతాసన్నిధానంబునను పృష్ఠభాగము కనఁబడఁజేయు ఆత్మప్రదక్షిణము నిషిద్ధము. ఎవరికి నమస్కరించెదమో వారికుడిచేతి వైపుగాఁ బ్రారంభించి తిరిగి వారియెడమచేతిప్రక్కనుండి వచ్చి యెదురుగా నిలిచినఁ బ్రదక్షిణముచేయుటగును.

కంటిని జానక దత్త్వాయుక్తముగ ననియె = సీతను జక్కఁగఁ జూచి వచ్చితి నని చెప్పెను- జానకినిగంటి ననక కంటినిజానకి ననుటకుఁ గారణమే మన ముందు జానకి నని చెప్పిన రెండవపద మేమి చెప్పునో, కనఁబడలేదనే చెప్పునో, రావణునకు వశపడె నని చెప్పునో యని యీరెండవమాట చెప్పులోపల రామచంద్ర

మూర్తి సంతపించునే యని ప్రధానకార్యమగుట ముందు గంటిని అని చెప్పెను. అంతతో విడిచిన నేమిచూచెనో యని సందేహించునే యని జానకి నని చెప్పెను. ఏమిగా సీతను జూచెనో యని తలఁచునే యని తత్త్వయుక్తముగ గనియెను.

తత్త్వయుక్తముగ = వాస్తవముగ నియమవ్రతయై శీలరక్షణము చేసికొనుచు జీవించియుండు సీతాదేవిని జూచితి నని యర్థము. సీత బ్రతికియుండినను శీలము కోలుపోయియుండెనేని యామె క్లేశమించుటవ్యర్థ మని శ్రీరామచంద్రమూర్తి తలంచు నని తత్త్వయుక్తముగ నని చెప్పెను.

తాత్పర్యము.

ఒక్కవానరుఁడే యింతచేసెనే వానరసేనతో, రామచంద్రమూర్తి వచ్చిన లంక ధ్వంసముచేయుటయం దేమి సందేహ మని సీతాదేవి ధైర్యము వహించుటకును రావణుని బల మెంతమాత్రమో తెలియుటకును, నానినే యుద్ధమున కడ్డి తన్నిన వాఁడు తెలిసి తెచ్చుకొని సీత నిచ్చి సమాధానపడు నను తలంపుతోను, హనుమంతుఁడు పరాక్రమోపాయమున కుపక్రమించి యశోకవనము తలవాకిట ద్వారమును విఱుగఁగొట్టి సేనానాయకుల నేవురవధించి, యేడ్వురమంత్రిపుత్రులను జంపి, శూరుఁడైన యక్షకుమారుని నలిగులిగా మర్దించి, యింద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచేఁ గట్టువడియును బ్రహ్మవరముచే నాకట్లు వదలిపోవుట తెలిసియు, రావణుని జూచి సంభాషింప వలయునని తన్నుఁ గట్టిన త్రాళ్లు లీడ్చు రాక్షసుల జంపక విడిచి, సీతాదేవినిదప్ప లంక నంతయు దహించి భస్మముచేసి శీఘ్రముగ రామచంద్రమూర్తికి సీతాదేవివార్త దెలుపవలెనని లంకవిడిచి మరలివచ్చి ధీరాగ్రగణ్యుఁడైన శ్రీరామచంద్రమూర్తికిఁ బ్రదక్షిణించి రామా! చూచితిని సీతను శీలమువిడువక జీవించియుండుదాని నని చెప్పెను.

సీ॥ సూర్యకులుం డంత ♦ సూర్యాత్మజునితోడఁ, జేరి మహోదధి♦తీర మచట
నూరసన్నిభశరా♦సారంబునను వార్ధిఁ, గలఁగ నొల్లక♦ల్లోలములఁ బ
నాపగానాయకుం♦ డొపక తేఁ దూర్పు, నమ్మనాని బోధింప ♦ నతను త్వష్ట్ర
సూనునిచేఁ గట్టించి ♦ సేతువు నాల్గోప, లంకాపురంబు ని♦శ్శంక నరిగి

తే. [illegible] రా♦వణుని వధించి, [illegible] ♦ [illegible]
నిండుసభ నిష్ఠురములు రా♦ముండు వలుక, త్మాతనాజాతచితిఁ జొచ్చె♦ సాధ్వి గాన.
౧౩౦.

యుద్ధకాండకథారంభము.

అంతఁ = హనుమంతునిమాట విన్నపిదప.

సూర్యాత్మజునితోడఁ = సుగ్రీవునితో.

మహోదధితీరముం జేరి = దక్షిణసముద్రపుటొడ్డును బొంది.

వార్ధిక్ = తాను ప్రార్థించినను మార్గమియ్యక యుదాసీనుఁడైన సముద్రుని.

సూరసన్నిభశరాసారంబునన్ = సూర్యునితో సమాన మగు నస్త్రపరం పరచేత.

చాలఁగఁ నల్లకల్లోలపఱుపన్ = పాతాళమునుండి నీళ్ళు, కలఁతపడునట్లు చేయఁగా.

ఆపగానాయకుండు = నదులకు భర్తయగు సముద్రుఁడు.

అప్సమూహము = నీటిసమూహము - ఆపము. వానిచేఁ బోవునది ఆపగ = నది.

ఆపగలు = నదులు - వానికి భర్తసముద్రుఁడు - సరిత్పతి యని సముద్రునకుఁ బేరు. సుగ్రీవుని రక్షింపవేఁడుటకు తాను వచ్చినట్లు - కాకాసురుని రక్షింపవేఁడు టకు నాయనభార్యలు నాగకాంతలు వచ్చినట్లు - సముద్రుని భార్యలైన నదు లును సముద్రునికి ముందుగా శ్రీరామచంద్రమూర్తిని వేఁడుకొన వచ్చి రని యీవిశేషణముచే ధ్వని స్ఫురించెను.

ఓపకి = తాళఁజాలక, తనుహారమనూని = నీని యథార్థరూపముతో, అన్నిభూతముల కధిష్ఠానదేవతలు గలరు. కావున సముద్రమున కధిష్ఠానదేవత యగువాఁడు వచ్చె యని భావము నీళ్లాయనకు శరీరము వంటిది. అగ్నిదేవత మంటగను, జలదేవత నీళ్లుగను, భూదేవత భూమిగను నిట్లా యాదేవత లాయారూపములు ధరించి భగవదాజ్ఞ శిరసావహించి మనుష్యుల కుపకారులై వర్తింతురు. కావుననే మనుష్యులకు వీరు పూజ్యులు. వీరని బూజింపకుండు వాఁడు కృతఘ్నుఁడు.

ఉపను = ఉపాయమును. బోధింపన్ = తెలుపఁగా - సముద్రుఁడు నలునిచే సేతువు కట్టింపు మని యుపాయము నేర్పెను.

త్వష్టృసూతిచేన్ = విశ్వకర్మ కుమారుఁడగు నలునిచే.

సేతువుకట్టించి = సేతుకట్ట గట్టించి.

నిశ్శంకము = శంకు. భయము లేక - అవ్యయీభావసమాసము - సులభ వ్యాకరణము సమాసపరిచ్ఛేదము ౬౫౯ వ సూత్రము.

రణతలమునన్ = యుద్ధభూమియందు.

క్షమసుతను = భూమికూఁతురైన సీతను. ఇది షష్ఠీసమాసము సు-వ్యా- సమాస. ౪ సూ.

లజ్జాభరమునన్ కుంది = (పౌరుషబలములచే సీతను సాధించితినిగాని యేమిలాభము? ఇన్నిదినాలు పరగృహమున నున్నదానితోఁ గూడినాఁడురాముఁ

డెంతలజ్జాభిమానములు లేనివాఁ డని యనరా యని) అధికమైన సిగ్గుచే విచారపడి.

నిండుసభన్ = దేవ వానరరాక్షసులచేఁ బూర్ణమైనసభలో.

నిష్ఠురములు = కఠినవాక్యులు. పతివ్రత యగు సీతాదేవి నుద్దేశించి యని యధ్యాహారము.

క్ష్మాతనూజాత = భూమిపుత్త్రి యగు సీత. క్షమసునా, క్ష్మాతనూజాతయను శబ్దములు రామచంద్రమూర్తి ని[illegible]మాడినది. అగ్నియందుఁ బ్రవేశించి వెడలివచ్చినది, భూమియందుఁ బుట్టిన సీతయే కాని యామె ప్రతిబింబము కాదు. మాయసీతయుఁ గాదు వాస్తవసీతయే యని తెలుపుచున్నవి.

సాధ్విగాన = పతివ్రత యగుటఁ జేసి.

చితిన్, చొచ్చెన్ = లక్ష్మణుఁడు పేర్చిన చితియందు మండెడునగ్నిలోఁ బ్రవేశించెను పాతివ్రత్యస్థాపన కని యధ్యాహారము.

తాత్పర్యము.

సూర్యవంశసంభవుఁ డైన రామచంద్రమూర్తి సూర్యపుత్త్రుఁ డైన సుగ్రీవునితో నతని సేనలతోడ దక్షిణసముద్రతీరముచేరి దాఁటుటకై తెరువిమ్మని సముద్రునిఁ బ్రార్థింపఁగా నతఁ డీయకున్నఁ గోపించి సూర్యునితో సమానము లైన బాణంబులచే సముద్రము నంతయు క్షోభింపజేసిన నతఁడును దనభార్య లైన నదులను బురస్కరించుకొని నిజస్వరూపముతో వచ్చి రామచంద్రమూర్తిపాదములపైఁ బడి ప్రార్థించి నలునిచే సేతువు కట్టింపు మని యుపాయము చెప్ప నాప్రకార మాచరించి దానిపై సేనలతో నడచిపోయి లంకాద్వీపంబు నిర్భయముగఁ బ్రవేశించి యుద్ధభూమియందు రావణాసురు వధించి సీతాదేవిని గని యిన్నాళ్లు పగవానియింట నొంటరిగా నున్న నాఁడు దానిని మరల నెట్లు గ్రహింతునా యని సిగ్గుపడి సీతాదేవిని కఠినోక్తు లాడఁగా నామె పతివ్రతగావున నామాటలు వినఁజాలక తనపాతివ్రత్యమహిమ లోకమున కెల్ల నెఱింగింప లక్ష్మణుఁడు పేర్చిన చితయందు మండెడుమంటలోఁ బ్రవేశించెను.

కం॥ క్షితిసుత నిస్తులిత పతివ్రత యని హుతవహుఁడు వలుక • రామవిభుం డా
సతినిన్ మరలం గైకొని, యతిమోదం బందె వేల్పు•లందఱుఁ బొగడన్. ౧౩౧

క్షితిసుత = సీత.

నిస్తులితపతివ్రత = ఈమెతో సమానురా లని చెప్పఁదగిన పతివ్రత లేనిది.

అని హుతవహుఁడు = అగ్నిహోత్త్రుఁడు - హోమముచేసినహవిస్సును మోసికొనిపోయి దేవతల కిచ్చువాఁడు.

ఆసతిని = పతివ్రత యగు నా శ్రీసీతాదేవిని.

వేల్పులండఱుం బొగడఁగ = దేవతలందఱు స్తోత్రముచేయుచుండఁగా.

మరలం గైకొని యతిమోదం బందెఁ గ అని యన్వయము. సీతాదేవిపాతివ్రత్యమును రామచంద్రమూర్తినడవడిని దేవతలు మెచ్చిరి.

అతిమోదము = మిక్కిలి సంతోషము.

శ్రీరామచంద్రమూర్తి ధర్మరక్షణార్థమై తనప్రియురాలినిగూడ నింత కఠినముగఁ బరీక్షించెఁగదాయని దేవతలే శ్లాఘింపఁగా నిఁక వానరుల, రాక్షసుల మాట చెప్పనేల? కావునఁ గావ్యార్థాపత్త్యలంకారము.

హుతవహుఁ డనుటచే మంత్రముచేఁ బవిత్రమై దోషరహితమైన హుతమును దేవతల కందిచ్చునట్లు పాతివ్రత్యముచేఁ బవిత్ర యగుసీతను శ్రీరామచంద్రమూర్తి కిచ్చె నని శబ్దసారస్యము.

తా త్ప ర్య ము .

అప్పు డగ్నిహోత్రుఁడు సీతను బిడ్డవలె నెత్తికొని వచ్చి శ్రీరామచంద్రా! యీ సీతాదేవివంటి పతివ్రతలు లోకమున లేరు. ఈమెయం దెట్టి దోషము లేదు. గ్రహింపు మని యీయఁగా శ్రీరామచంద్రుఁడును నాసతిని మఱల గ్రహించి బ్రహ్మరుద్రాదిదేవతలందఱు నాభార్యాభర్తలనడవడి మెచ్చుకొనుచుండ మిగుల సంతోషించెను.

కం॥ సురతతిచేఁ బూజతుఁడై, కర మలరెఁ రాముఁ డతని ♦ ఘనకార్యమునన్
సురమునిగణములు సచరా,చరమగుముల్లోకములును♦సంతోషించెన్. ౧౩౨

సురతతిచేఁ = దేవసమూహముచేత.

కరము + అలరెఁ = మిక్కిలి సంతోషించెను.

గణములు = గుంపులు.

సచరాచరము = స్థావరజంగమములతోఁగూడిన.

స్థావరములు = కదలనిపర్వతవృక్షాదులు-జంగమములు = సంచరించు పశుపక్షిమృగాదులు.

"అంత స్సంజ్ఞా భవం త్యేతే" యను విష్ణుపురాణోక్తిచే వృక్షాదులకును సంతోషభయాదులు గలవు. క్రొత్తచిగుళ్ళను బువ్వులను వికసింపఁజేసి చెట్లు తమసంతోషమును తెలిపెను.

అతనిఘనకార్యమునన్ = ఆయన చేసిన రావణవధ యను గొప్పపనిచేత,

తాత్పర్యము.

దేవతాసమూహముచే నిట్లు గౌరవింపఁబడినవాఁడై శ్రీరామచంద్రమూర్తి తనచేసినకార్యము లోకోపకారకమై లోకసమ్మతమైనదికదా యని మిక్కిలి సంతోషించెను. ఆ రావణాసురవధరూపక మగు నా మహాకార్యమును జూచి దేవతలు - మునులు చరాచరయుక్తము లైన ముల్లోకములును రావణాసురుని బాధ తొలఁగెఁగదా యని సంతోషించెను.

క౦॥ శ్రీరాముండు విభీషణు, నారక్షోవిభుఁగ లంక ♦ నభిషేకమునన్
గూరిమిఁ దా నొనరించియు, వీరుఁడు కృతకృత్యుఁ డగుచు ♦ విజ్వరుఁ డయ్యెన్. ౧౩౩

విభీషణపట్టాభిషేకానంతరము సీతాదేవిని గైకొనుట యను నిటుఁ గ్రమమునపేక్షింపక కవి చెప్పను

విభీషణునిన్ = శత్రువులకు భయపడువాఁ డని వ్యుత్పత్త్యర్థము.

ఆరక్షోవిభుగన్ - రావణునిస్థానమున రాక్షసరాజుగ.

అభిషేకమునన్ = పట్టాభిషేకమును, కూరిమిన్ = ప్రేమతో.

ఒనరించియు = చేసియును. ఇచ్చట 'యున్' అన్వాచయమును స్ఫురింపఁజేయును. అన్వాచయము = తనకు - ప్రధానమగుమోక్షమిచ్చి, యప్రధానమగు లంకారాజ్యము నిచ్చెను. భగవచ్ఛరణాగతికి ఫలములు రెండు - ప్రధానము, అప్రధానము. ఇందు ప్రధానము మోక్షము. అప్రధానము ఐహికసంబంధసుఖము. 'శరీరారోగ్య మర్థాంశ్చ, భోగాంశ్చైవానుషంగికాన్, దదాతి ధ్యాయతాం పుంసా,మపవర్గప్రదో హరి' యను ప్రమాణము. తన్ను ధ్యానించువారికి మోక్ష మిచ్చు శ్రీమహావిష్ణువు ఆరోగ్యము, ధనము, భోగముకూడ నిచ్చు నని యర్థము

శ్రీరాముండు -- శ్రీ-లక్ష్మి లక్ష్మిచే మనోహరుఁడైనవాఁడు సీతాపహరణమైన పిమ్మట రాముఁడు రాముఁడేకాని శ్రీరాముఁడు కాఁడు. కావుననేయీపద్యములందు సీతాపహరణానంతర మింతవఱకు శ్రీరామశబ్దము ప్రయోగింపఁబడలేదు రామునకు సీతతో శ్రీయును బోయినది. సీతతో మరల నిప్పుడు వచ్చినది. (2) శ్రీ - కాంతి - కాంతితోఁగూడిన రామచంద్రమూర్తి ఇంతవఱకు రావణు నెట్లు చంపుదునా? విభీషణునికి నెట్లు పట్టాభిషేకము చేయఁగలుగుదునా మాశ్రితరక్షణముచేసినవాఁడ నెప్పు డగుదునా యని చింతాకులుఁడై యుండుటచేఁ గాంతిహీనుఁడై యుండెను. అభిషేకమైనది కావున మరలఁ గాంతియుక్తుఁ డయ్యెను.

వీరుఁడు = కార్యనిర్వహణసమర్థుఁడు. కావున.

కృతకృత్యుఁడు + అగుచుర్ = చేయవలసినకార్యము చేసినవాఁడై.

విజ్వరుఁడు అయ్యెర్ = మనోదుఃఖములేనివాఁడయ్యెను. (1)భరతునికి రాజ్య మీయఁగాఁ గైంకర్యసామ్రాజ్య మభిలషించి యీతుచ్ఛరాజ్యము నంగీకరింపఁ డయ్యెను. విభీషణుఁడుకూడ నంతటిభక్తుఁడే. ఈయన లంకారాజ్యము వల దనునేమో. అట్లనిన నామాట వ్యర్థ మగునే "నిన్ననఘా కట్టెదఁ బట్ట మా యసురరాజ్యశ్రీకి సత్యంబుగర్." (యుద్ధ ౪౧ ప) అని చెప్పితినిగదా. ఆ ప్రతిజ్ఞ నెఱవేఱకపోవునేమో యని విచారపడుచుండెను. విభీషణుఁడు పట్టాభి షేక మంగీకరించుటచే నాహృదయతాపము పోయెను. (2) ఇంద్రజిత్తుబాణ ములచే గాయపడి క్రిందఁబడి యుండినపుడు

తే॥ ప్రతినచేసితి రాక్షసరాజు జేయు,వాఁడ నంచు విభీషణు గాన దప్పె
నట్టియనృతోక్తి యిపు డనాయానయనముల, నిప్పువలెఁ గాల్చుచున్నదినేఁడునైప.
యుద్ధ-౧౦_౨౦. ప

ఇట్టి దుఃఖతాప మిపుడు నివర్తించెను.

'అవిమహోర్ష్యమానస్తాప,స్సంజ్వర పరికీర్తితః, యే నాంగారనదీమధ్యే, విలుఠ న్నివ భావ్యతే' నిప్పులయేటిసడుమఁ బొరలాడుచున్నట్లు సహింపరాని మన స్తాపమునకు సంజ్వర మనిపేరు.

విభీషణున కభిషేకముచేసి కృతకృత్యుఁడు విజ్వరుఁడు నయ్యెను' అనుటచే రావణవధ, సీతాప్రాప్తి ప్రధానములు కావనియు, విభీషణపట్టాభిషేకమే ప్రధా నమనియు సూచితము. ప్రధానఫలము ప్రాప్తించినపుడుగదా మనుష్యుఁడు కృత కృత్యుఁడు విజ్వరుఁడు నగును.సీతాప్రాప్తి స్వకార్యము. దొంగ లెత్తుకొనిపోయిన తనసొమ్ము తాను రాఁబట్టుకొనుట వంటిది. దొంగదండనమే రావణవధ. తన కార్యము తాను జేసికొనుటలో విశేష మేమి? విభీషణపట్టాభిషేకము ఆశ్రిత రక్షాధర్మకార్యము. చేయకుండినఁ బ్రత్యవాయము గలదు. కావున నాశ్రిత రక్షాభిలాషయే రావణవధకు ముఖ్యకారణము. సీతాప్రాప్తి గౌణము. కావు ననే సీతను నిరాకరింపఁగలిగెనుగాని విభీషణపట్టాభిషేకమునకై యత్నాంతర వహించెను. (3) వి = పక్షి -ఇచ్చట జటాయువు. కావున విజ్వరుఁడు=జటాయు విషయమైన మనోదుఃఖము గలవాఁడు. తండ్రి జీవించియుండుపుత్రునకు నుత్స వము జరుగుచున్న దని సంతోషము పడుచున్నను మరణించిన పుత్రునిఁ దలఁచి లోలోన దుఃఖించునట్లు సర్వలోకజనకుఁడు సర్వలోకస్వామియు నగు శ్రీరామ చంద్రమూర్తి విభీషణపట్టాభిషేకసమయమునఁ దనకై యంత సాహసము చేసి ప్రాణ మిచ్చిన జటాయు విట్లభిషిక్తుఁడు కాఁడయ్యెఁగదా పరలోకసుఖ

మిచ్చితిసిగాని యిహలోకసుఖ మీయఁజాల నైతినిగదా యని స్మరించుచు దుఃఖ పడెనని భావము.

తాత్పర్యము ..

ఇప్పుడు విభీషణుని లంకారాజ్యమునకుఁ బ్రభువుగాఁ జేసి వీరుఁడైన శ్రీరామచంద్రమూర్తి కృతకృత్యుఁడై తాపము పాసినవాఁ డయ్యెను.

సీ. స్వర్గవాసులచేత • వరములఁ దా నొంది, మృతకపులకు నుసు • రిచ్చి మనిచి
మిత్రవృతుం డగు • మిత్రకులాగ్రణి, యరి కసాధ్యము నయో • ధ్యం గనంగఁ
బుష్పకారూఢుఁడై • పోవుచో నిగి త్రోవ, నల్ల భరద్వాజు • నాశ్రమమున
భరతాంతికమునకుఁ • బవమానసుతు నంపి, పుష్పకంబున నెక్కి • పురమునకును

తే॥ బోవుచోఁ బూర్వకథ లెల్ల • బ్రజ్ఞ దెలిసి, మెచ్చుకొనుచుఁ గలుగు నా • సచ్చరిత్రుఁ
డనఘుఁ డున్న నందిగ్రామ • మున కరిగె, బలువు నానంద • సహితుఁ డగుచు.
౧౩౪.

స్వర్గవాసులచేత = శ్రీరామచంద్రమూర్తి జయము స్తోత్రముచేయ వచ్చిన దేవతలచేత.

మృతకపులకుఁ = యుద్ధమునఁ జచ్చినవానరులకు

ఉసులు ఇచ్చి మనిచి - దేవత లిచ్చినవరముచేఁ బ్రాణ మిచ్చి బ్రతికించి. రామచంద్రమూర్తి యుసురిచ్చి బ్రతికించెననుటచే దేవతలవరము నిమిత్త మాత్రమనియు మనుష్యుఁ డనము సాధకమని యనియు గ్రహించునది.

మిత్రకుల + అగ్రణి = సూర్యవంశశ్రేష్ఠుఁడు - రామచంద్రమూర్తి

మిత్రవృతుండయి = సుగ్రీవవిభీషణాది స్నేహితులచేఁ జుట్టఁబడి.

అరికిన్ + అసాధ్యము = శత్రులకు ముట్టడింపశక్యము కానిది. అరికిన్ ప్రత్యేకవచనము అరికి నసాధ్యము గా జాతియేకవచనము.

పుష్పకారూఢుఁడై - కుబేరుని యొద్దనుండి రావణుఁడు తెచ్చియుంచుకొన్న పుష్పకము నెక్కినవాఁడై త్రోవలో భరద్వాజునాశ్రమమున నిగి యని యన్వయము. నిగి = మార్గమధ్యమున భరద్వాజుని యాశ్రమమునఁ గాని నిలిచి.

భరత + అంతికమునకున్ = భరతునియొద్దకు.

పవమానసుతున్ = వాయుపుత్రుని - హనుమంతుని. అంపి = పంపి. పదునాలుగుసంవత్సరములు పూర్తియగునప్పటికి నయోధ్యకు వచ్చెద నని భరతునితోఁ జెప్పినమాటప్రకారము మాయనకుఁ దనవార్త దెలిపి సంతోషింపఁజేయఁదలఁచి తాను వచ్చినవార్త తెలుపుటకై హనుమంతుని ముందుగఁ బంపెను.

పురమునకున్ = అయోధ్యకు.

పూర్వకథను = భరతుఁడు చిత్రకూటమునఁ గనఁబఱచిన భక్తకథను.

ముచ్చటించుచున్ = చెప్పుచు.

ఆ + సత్ + చరిత్రుఁడు + అనుజుఁడు = శ్లాఘ్యమైన చరిత్రముగల తమ్ముఁడు భరతుఁడు భరతుని శ్లాఘ్యచరిత్ర యేమనఁగా ఱఁఱచేతికి వచ్చిన రాజ్యమును గైకొనకుండుటయు, తప్పక పాలింపవలసివచ్చినప్పుడు భోగముల నాశింపకయు ఋషిచర్యయందుండుట. భరతునిచర్యకు అసిధారావ్రతచర్య యని పేరు. అనఁగా కత్తివాదరపై నటించుటవంటిది మంచిప్రాయమునందుండి భోగింపశక్తియు సర్వానుకూల్యములు గల్గిన పురుషుఁడు మంచివయస్సునందుండి సుందరియై భోగింపఁగోరు భార్యతో నేకశయ్యయందుఁ బరుండియు దానిని దాఁకక దానిపై మనస్సు పోనీకయుండు చర్యకుఅసిధారావ్రతచర్యయని పేరు. అట్లుతే కరతలగతమైన రాజ్యలక్ష్మి భోగ్యమైయుండియు పరిత్యజించినవాఁడు. అంతియకాక రామచంద్రమూర్తి యరణ్యమందు గడ్డ ఫలమూలాదుల భక్షించి బ్రహ్మచర్యవ్రతము జరపెనో యట్లు పురమందుండియు జడలు ధరించి బ్రహ్మచారియై ఫలమూలముల భక్షించి నేలఁ బరుండి సుఖము లాశింపక కఠిన చర్య నడపినవాఁడు.

సోదరసహితుఁ డగుచున్ = ముగ్గురుతమ్ములతోఁ గూడినవాఁడై.

అటన్ = నందిగ్రామమున. జడలవీడెను = జడల విడిపించుకొనెను. సోదర సహితుఁడయి జడల వదలె ననుటచే శ్రీరామలక్ష్మణులవలె భరతుఁడును జడల ధరించియుండె నని యెఱుఁగవలయును. జడలు వీడుటమాత్రము కాదు. రాజయోగ్యములైన వస్త్రమాల్యాలంకారములను దాల్చెను.

తాత్పర్యము.

ఇంద్రాదిదేవతలచే వరములు పొంది వరము నెపముగాఁ గొని రణమున మరణించినవానరులకెల్లఁ బ్రాణము లిచ్చి ప్రదికించి మిత్రు లయిన సుగ్రీవవిభీషణాదులతోఁ గూడి సాధ్వి నగు సీతయుగల యయోధ్యకుఁ బుష్పకవిమానము నెక్కిపోవుచుఁ ద్రోవలో భరద్వాజాశ్రమమునందు దిగి, భరతునొద్దకు వాయు సుతుని దనరాక యెఱిఁగింప ముందుగాఁ బంపి, తా వలఁ బుష్పకముపై నెక్కి యయోధ్యకుఁ బోవుచు, నానాఁడు జరిగినవృత్తాంతమంతయు సుగ్రీవునకుఁ దెలియఁ జెప్పుచు, సాధుచరిత్రుఁడగు భరతుఁ డుండు నందిగ్రామమున దిగి, తమ్ముల తోడ జడలు వదలెను.

౪౦॥ తనతో వెలయఁగ భూమీ,తనయామణి రాజ్యరమను • దాల్చెన్ మరలన్
దినమణితేజుఁడు దశరథ,తనయుఁడు భువనంబు లతిము•దంబున వరలన్. ౧౩౫

దినమణి తేజుఁడు = సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడు. దినమణి = సూర్యుఁడు.

భూమీతనయామణి = సీత. ఆకాశరత్నము రామచంద్రమూర్తి. భూరత్నము శ్రీసీతాదేవి. సూర్యుఁడు లేని యాకాశమెట్లు తేజోహీనమై ప్రకాశింపదో యట్లు సీతాదేవి లేని భూలోకము (ప్రపంచము) ప్రకాశింపదని భావము. అలక్ష్మీకమైన ప్రపంచము శూన్యమేకదా.

తనర్చి వెలయఁగన్ – (ఒకరినొకరు) మిక్కిలి ప్రకాశింపఁగా.

భువనంబులు = లోకములు. అతిముదంబునన్ = మిక్కిలి సంతోషముతో.

వెలుఁగన్ = ప్రకాశింపఁగా.

రాజ్యరమను = రాజ్యలక్ష్మిని.

మరలన్ + తాల్చెన్ = పూర్వము మాటమాత్రముగ ధరించెను. ఇప్పుడు కార్యరూపముగ ధరించెను. పదునాలుగు సంవత్సరములు భరతుఁడు రామచంద్రమూర్తికిఁ బ్రతినిధిగ రాజ్యకార్యములు నడపెనుగాని రాజుగఁ గాదు.

తాత్పర్యము.

సీతామహాలక్ష్మి తనతోడఁ గూడఁగ సూర్యతేజుఁడైన శ్రీరామచంద్రమూర్తి రాజ్యలక్ష్మిని యథార్థముగ మరలఁ బొందినవాఁ డగుటచే మూఁడులోకములు మిగుల సంతోషించెను.

క౦॥ విష్టపచయములు మిగులఁ బ్రహృష్టములై యొప్పెఁ బుల్లలేపార మెయిన్
శిష్టులు సుధార్మికులుఁ గడుఁ, బుష్టిని గని రవని రాముఁ భూపతిఁ జేలన్. ౧౩౬

శ్రీరామరాజ్యమువలనఁ బ్రజలకుఁ గలిగిన మేలును దెలుపుచున్నాఁడు.

శ్రీరాముఁడు - అవనిన్ + ఏలన్ = భూమిని పాలింపఁగా.

విష్టపచయములు. లోకుల సమూహములు - విష్టపము లనఁగా లోకంబు లయినను నిచట జహదజహల్లక్షణావృత్తిచే లోకముల నుండువారని గ్రహింపవలయును.

మెయిన్ = దేహమందు. పుల్లలు + ఏపారన్ – గగుర్పాటతిశయింపఁగా.

ప్రహృష్టములై = మిగుల సంతోషించినవై.

శిష్టులు = గొప్పవారును సుధార్మికులు – సుధర్మము - శ్రీరామభక్తితోఁ జేసినకార్యము - ఆకార్యముల నాచరించువారు సుధార్మికులు. విశేషధర్మము యొక్క ఫలమును బొందినవారు

కడున్ + పుష్టిని గనిరి = ఇంతవఱకు శ్రీరామవియోగముచే లోకమంతయు శుష్కించియుండెను. ఇప్పుడు మరలఁ బుష్టిఁగొని బలిసెను.

అయోధ్య. ౧౫-౨౩, ౧౫-౨౪, ౧౫-౨౫ పద్యముల జూడుఁడు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుఁడు రాజ్య మేలునపుడు లోకములన్నియు మిగుల సంతోషించెను. సంతోషాతిశయముచేఁ గలిగిన గగుర్పాటులో సాధువులు ధర్మాత్ములు మిగులఁ బుర్కొనిరి.

కం॥ ఆధులు పొసఁగవు జనులకు, వ్యాధులు తను వంట వాస్థ • కవరోధముగా
సాధుల కీతు లనంబడు, బాధలు లే వెందు రామ • పాలనమందున్. ౧౩౭

సాధులకు, జనులకున్ -. ఇది సర్వవాక్యములయందు నన్వయించును.

రామపాలనమందున్ = రాముఁడు రాజ్యమేలఁగా. ఎందున్ = ఏ ప్రదేశమందును. ఆధులు = మనోవేదనలు. పొసఁగవు=కలుగవు. వ్యాధులు = రోగములు. ఆస్థకున్ = రామునియందలి భక్తికిన్. అవరోధముగా = అడ్డముగా. తనువున్ = దేహమును. అంటవు = తాఁకవు.

ఈతు లనంబడుబాధలు=ఈతు లను పేరుగల ఆఱువిధములైనబాధలు- అతివృష్టి - అనావృష్టి-ఎలుకలదండు - మిడుతలదండు - చిలుకలదండు - రాజుసమీపమందుండుటవలనఁ గలిగెడిబాధ - ఈయాఱింటికి ఈతిబాధ లని పేరు.

విష్టపచయము లను పద్యము ప్రజలకు శ్రీరామాభిషేకమునఁ గలిగిన సంతోషాతిశయము వర్ణింప సాధ్యముకా దని ప్రహృష్టములై పుల్ల లేపారఁ గడుఁ బుష్టిని గనిరను పదములచేఁ జెప్పెను. వారతిప్రీతిచే శ్రీరామచంద్రమూర్తి యెడఁ జేసిన కైంకర్యవృత్తిని నాపద్యమునందలి సుధార్మికు లను పదమునఁ జూపెను. ఆధులు పొసఁగ వను పూర్వార్థముచే నట్టి కైంకర్యమునకు విరోధులగువ్యాధులు నివర్తించెనని చెప్పెను. ఇచ్చట ఆధులు వ్యాధులు ననిచెప్పుటచే భక్తియోగమునకు విఘ్నకరము లయినవన్నియుఁ జెప్పఁబడెను. భక్తికి విఘ్నకరములైన క్లేశములన్నియు శ్రీరామానుగ్రహముచేఁ దొలఁగిపోవును.

తా త్ప ర్య ము.

శ్రీరామరాజ్యమందు సాధులుసేయు శ్రీరామసేవకు విరోధముగా మనోవేదనలుగాని రోగబాధలుగాని యీతిబాధలుగాని లేవు.

కం॥ కానరు పుత్రులమరణము, మానరు సాధ్వీగుణంబు • మానవతుల్ దా
మూనరు వైధవ్యము వై, శ్వానరుభయ మింతయేనిఁ • బాటిల్ల దెటన్. ౧౩౮

ఉత్తరకాండమునఁ బ్రధానముగ వర్ణాశ్రమ ధర్మపాలనము ప్రతిపాదింపఁబడినది. ఆకథ యిఁక సంగ్రహముగఁ జెప్పఁబడును.

కానరు పుత్రులమరణము = తల్లిదండ్రులని కర్తృపద మధ్యాహారము, లేక మానవతుల్ అను పదమైన కర్తృపదముగా గ్రహింపనగు. కాన రను సామాన్య నిషేధముచే నేదేశమందైనను నెప్పుడైనను అట్టి బాలమరణము లేదని భావము. బ్రాహ్మణపుత్రుఁడు తండ్రియుండఁగానే మరణించెఁగదా యనిన నది యాగంతుకముగ వచ్చినది, యప్పుడే పరిహరింపఁబడెను.

మానవతులు = స్త్రీలు, సాధ్వీగుణంబును = పాతివ్రత్యమును, మానరు = విడువరు ,కావుననే, వైధవ్యము = విధవగా నుండుదశను, ఊనరు = పొందరు. పాతివ్రత్యహీనతయే వైధవ్యమునకుఁ గారణము.

"వ్యభిచారరతా నారీ, బాలరండాతు జాయతే." పోయిన జన్మమున వ్యభిచరించిన స్త్రీ యీ జన్మమున బాలవిధవ యగును. వ్యభిచరింపక మగని నిర్లక్ష్యముగాఁ జూచినది కాలాంతరమున విధవయగును.

పాపముచే ఆయువు క్షీణించును. అట్టిచోట భర్తలు తమపాపమునేగాక భార్యల పాపమును ననుభవింపవలసియుంచుటచే వేగిరము చత్తురు. భార్యలు చేసిన పాపమునకు శిక్ష వైధవ్యము. రామరాజ్యమందో స్త్రీలు పతివ్రతలు గావున నన్నంతకాలము భర్తలతో సుఖభోగము లనుభవించుచుండి వార్ధకమున సుమంగలులుగానే మరణించుచుండిరి. కౌసల్యాదులకు వైధవ్యము రామపాలనమున రాలేదు. లక్ష్మణుని నూర్మిళ యనుగమించెను; గాని యింట నిలువలేదు. స్త్రీలకు వైధవ్యము లేదనుటచే పురుషులకు మరణమే లేకపోవలయును గదా యని యొకరు వ్రాసిరి. ఇది యేమి తర్కమో. విధవలు లేరని చెప్పెనుగాని విధురులు లే రని చెప్పలేదుగదా. కావున స్త్రీలందఱు పుత్రవతులై ముసలిముత్తైదువలై సుమంగలులుగానే మరణించుచుండి రని గ్రహింపవలెను. (2) వివిధు లగు ధవులనుగలవారు విధవలు—చారిణులు. వారిగుణము వైధవ్యము. ఊనరు అనఁగా జారిత్వములేదనుట. ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము అనునవి తాపత్రయము. ఇది శ్రీరామరాజ్యమున లేశమాత్రమైన లేదు.

వైశ్వానర భయము = నిప్పువలని భీతి. ఇంతయేనిఁ = కొంచెమైనను. పాటిల్లదు = సంభవింపదు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి రాజ్యముచేయుకాలమందుఁ దల్లిదండ్రులకుఁ బుత్రశోకము కలుగదయ్యెను. స్త్రీలు పాతివ్రత్యమును విడువరైరి. కావుననే వారికి వైధవ్యదుఃఖము లేదు. ఏగ్రామమందును నగ్నిహోత్రునివలన భయములేదు.

క॥ కూలవు జంతులు జలముల, గ్రీలదు ప్రజ వాతజాత♦భీతిం, జోరుల్
గ్రాలరు, వేఁకిని నాఁకట, గ్రాలుట లే దెందు రామ♦రాజ్యమునందున్. ౧౩౯

శ్రీరామరాజ్యమునందు. జంతులు=ప్రాణులు. జలములఁ గూలవు = నీటిలోఁ బడి చావవు. ప్రజ = జనము. వాతజాతభీతిః = సుడిగాలివలనఁ గలిగినభయము చేత, గ్రీలదు = నశింపదు. ఇంతవఱకు నాధిదైవికతాపము లే దని చెప్పెను. చోరులు = దొంగలు. గ్రాలరు — లేరు. ఇది యాధిభౌతికతాపము లేదనుటకు సూచకము.

ఇఁక నాధ్యాత్మికతాపము లే దనుచున్నాఁడు. వేఁకిని = జ్వరముచేతను. ఆఁకటః = ఆఁకలిచేతను. గ్రాలుట = నశించుట. లేదు. అగ్నిజలవాతయక్షరాక్షసాదులవలనఁ గలుగుతాపము ఆధిదైవికము. జ్వరము తలనొప్పి మొదలగువానివలనఁ గలుగుతాపము ఆధ్యాత్మికము. దొంగలు పులులు లోనగువానివలనఁ గలుగుతాపము ఆధిభౌతికము. వీనికి తాపత్రయ మనిపేరు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి రాజ్యమేలుకాలమున నీళ్లలోఁ బడి చచ్చినవారు లేరు. పెద్దగాడ్పులచేత జనులు పీడింపఁబడరు దొంగలు లేరు. ఆఁకలిచేతను జ్వరముచేతను తపించినవారు లేరు.

క॥ పురముల జనపదములఁ గాఁపురములు గావించుజనులు ♦ భోగాభోగ
స్ఫురతను ధనధాన్యంబులఁ, గని సుఖించెదరు కృతయు♦గంబునఁబోలెన్. ౧౪౦

శ్రీరామరాజ్యమునఁ బ్రజల కనిష్టములు కలుగుట లే దని యింతవఱకుఁ జెప్పి యిఁక వారికిఁ గలిగిన యిష్టసిద్ధిని దెలుపుచున్నాఁడు.

పురములః = పట్టణములయందు జనపదములః = గ్రామములయందు. కాఁపురములు సేయుజనులు ధనములచేతను ధాన్యములచేతను భోగ + ఆభోగ స్ఫురతను = సౌఖ్యానుభవముయొక్క యతిశయముచేత. పురముల జనులు ధనములచేతను, గ్రామజనులు ధాన్యములచేతను నతిశయించి రని యథాక్రమముగ నన్వయము. క్రమాలంకారము.

కృతయుగంబునఁబోలెః కనిసుఖించెదరు = కృతయుగమునందువలెఁ ద్రేతాయుగమందును సుఖించెదరు. 'రాజా కాలస్య కారణ' మ్మని యుండుటచే శిష్టుఁడైన రాజు కలియుగమందును కృతయుగధర్మము నడిపింపఁగలఁడు. దుష్టప్రభువు కృతయుగమును గలియుగము చేయఁగలఁడు.

తాత్పర్యము.

నగరములందును గ్రామములందును గాపురముండు జనులు భోగాభివృద్ధికై

ధనములను ధాన్యములను విస్తారముగఁగలవారై కృతయుగమునందువలెనె మిక్కిలి సుఖ మనుభవింతురు

ఆ॥ వాజపేయశతము [illegible] బహుసువర్ణకములఁ, గూర్చి జరిపి కోట్ల గోచయముల నెన్న రానిధనము [illegible] బ్రాహ్మణులకు, బ్రహ్మలోకమునకుఁ [illegible] ప్రథితగుణుఁడు. ౧౪౧

క్షత్రియునకు [illegible] మిం దాఁకఁ జెప్పె [illegible] శ్రీరామ చంద్రమూర్తియందుఁ [illegible] చున్నారు.

ప్రథితగుణుఁడు = ప్రసిద్ధిచెందిన [illegible] యసంఖ్యచేత గుణవంతుఁ డని [illegible] చెందిన వాఁడు - [illegible] నాయన ధనకోశములోని [illegible] కని భావము.

వాజపేయశతము [illegible]

[illegible] సువర్ణకము [illegible] కాని. “బహూని సువర్ణాని యత్ర [illegible] బహు సువర్ణక”యని ప్రమాణము. [illegible] మేధా [illegible] సూత్రమున మొదటనే చెప్పఁబడిన యగ్నిష్టోమాదుల [illegible] సిద్ధము.

కోట్లగోసమూహములను — [illegible]

బ్రహ్మ = విష్ణువు బ్రహ్మలోకము [illegible] ‘[illegible] మాత్మా తపో వేదో బ్రహ్మ [illegible] ’ నానా [illegible] యని యర్థము. ‘నారాయణ పరం బ్రహ్మ [illegible] బ్రహ్మలోక మన నారాయణలోకము [illegible]

అగుగుక — పోఁగలఁడు [illegible] బ్రహ్మలోక [illegible] యొకరు వ్రాసిరి. [illegible] మోక్షము [illegible] సత్యలోకము ననుట పరిహాస్యమునకే

ప్రథితగుణుఁడు [illegible] యేదో యొకయప వాదము విని యాకొను జనులందఱు [illegible] యాచించెను. “సంభావి తస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే” యను ప్రసిద్ధి [illegible] మాఁటంతయు నిజ మవ వాద మన్నమరణముకంటెఁ గూడా [illegible] ఘుహాది భీతిమాత్రమే కాదు. లోకసంగ్రహార్థ [illegible]. మర్యాదయు యనుష్ఠానముచే లోకులకు ధర్మమును బోధింపవచ్చినవాఁడు కావున సర్వ సంకటసమయ ములో నెట్లు ప్రవర్తింపవలయునో యనుష్ఠానముచే బోధించెను. రామచంద్ర

మూర్తి యట్లుచేయకున్న నిండ్లలో అంకుటాండ్రు ప్రబలియుందురు. నిష్కారణముగ వచ్చిన యపవాదమునైనను దొలఁగించుకొనవలయు నని దీనివలన లోకము నేరువవలయును. "యథా రాజా తథా ప్రజా" యని తా నసత్య మాడిన లోకులందఱు నసత్యమాడుదురే యని లోకసంగ్రహార్థము దశరథుఁడు బొంకినొల్లక ప్రాణములను సంతసించెఁ బ్రియుఁడైన రాముని విడిచెను. శ్రీరామచంద్రమూర్తి సీతాదేవినిర్దోషురాలని యెఱిఁగి యెఱిఁగి లోకసంగ్రహార్థము భార్యను విడిచెను ఏల నిష్కారణముగ నడవులపాలు చేసెద వని తండ్రిని రామచంద్రమూర్తి యడిగినవాఁడు గాఁడు. సీతాదేవియు నడిగినది కాదు. ధర్మసంస్థాపనమునకై పుట్టినవారుకావున లోకమర్యాద చెఱుపరా దని భార్యాభర్తలిరువురు నెన్నికష్టములైన సహించిరికాని మేము నిర్దోషులమే యేల నిష్కారణముగ దుఃఖము ననుభవింపవలయు నని మనస్సునందైనఁ గుందినవారు కారు. ఇది యుత్తముల మార్గము.

శ్లో॥ సతాం కేనాపి కార్యేణ, లోకస్యారాధనం వ్రతమ్, తత్పూరితం హి తాతేన, మాంచ ప్రాణాంశ్చ ముంచతా. ఉత్త.రా. ౧-అంకము.

ఏవిధముగనైన నెట్టికార్యము చేసియైన లోకారాధనముచేయుట సజ్జనుల వ్రతము. కావున మాతండ్రి నన్నుఁ దనప్రాణములను వదలి దానిని బూర్ణముగఁ జేసెను.

ద్వి॥ఎది శ్రేష్ఠుఁ డాచరించు నితరజనంబు। నదియ కావించెడు నయ్యా వాఁడేది। సప్రమాణం బని చెలువునో మూఢుఁ। డాప్రకారమె సల్పు నమరేంద్రతనయ। చలుపఁగఁదగిన కర్తవ్యం బింతయైనఁ। గలుగదునాకు, నేఁ గాంక్షింప నర్హ।మగునది లేదనవాప్తంబులేదు। జగములమూఁట, నేఁ జలుపుచున్నాఁడఁ। గాదె కర్మంబుల? గాండీవి! యప్ర।మాదంబు కల్మిఁ గర్మంబులయందు। నెప్పుడేనియునుండ నేనియు జనులు। నప్పుడ నామార్గ మనుసరించెదరు। నేఁ గర్మమును జేయనేని యీజనము। లోగు నొందెద రింతె నోచవు సంకరము, దానిక నేను కర్తగనౌచు జనుల। హానినిముంచినయతఁడు నే నగుదు. ద్విపద భగ. ౩ అధ్యా.

రాముఁడు చేసినట్లు చేయుము, కృష్ణుఁడు చెప్పినట్లు చేయు, మనికదా లోకోక్తి. శ్రీరామచంద్రమూర్తి యేదిచేసెనో యదియే శ్రీకృష్ణమూర్తి చెప్పెను.

రామాయణము లక్ష్యగ్రంథము - భగవద్గీత లక్షణగ్రంథము. ఈవిషయము వేఱొకచోటఁ జర్చింపఁబడును. తనకుఁ గష్టమైనను సుఖమైనను, నిష్టమైనను ననిష్టమైనను, బాపమైనను బుణ్యమైనను రాజగువాఁడు ప్రజకు హితమైనదానిని జేయవలయు ననుట రాజధర్మము. తక్కినమూఁడు వర్ణములవారి కిది యన్వయింపదు. వారికి వారివారిగృహములం దన్వయించును.

తా త్ప ర్య ము.

అనేకములు వాజపేయములు - బహువర్ణకములు లోనగు యజ్ఞములు సలిపి బ్రాహ్మణులకు నింతింతని లెక్కింపరాని గోవులను ధనములను దాన మిచ్చి తన సౌఖ్యము వదలుకొని నైనఁ బ్రజలకు సుఖము గలుగునట్లు ధర్మపద్ధతి రాజ్య పరిపాలనము గావించి తన వైకుంఠలోకమునకుఁ బోఁగలఁడు.

ఆ॥ రామచంద్రవిభుఁడు • రాచవంగడముల, నిలిపి నూర్లకొలఁది•నిల్పడ నిల నాల్గువర్ణములజ•నంబులఁ దమతమ,ధర్మమునందు నిలుపుఁ దలఁగకుండ ౧౮౨

శ్రీరామచంద్రమూర్తి తాను ధర్మముల ననుష్ఠించుటయే గాక లోకమున ధర్మములు ప్రవర్తించు నటులును జేసె నని చెప్పుచున్నాఁడు

రామచంద్రవిభుఁడు = (1) చంద్రునివలె సంతోషకరుఁ డగు శ్రీరామ ప్రభువు (2) మనోహరుఁడైన చంద్రుఁడు చంద్రునకంటె నభిరాముఁడైనవాఁడు. అనఁగా రామచంద్రమూర్తియెదుటఁ జంద్రుఁడు దృష్టిదోషము తగులకుండఁ గట్టినబొమ్మవలె నుండు ననియు శ్రీరామచంద్రమూర్తినిఁ జూచినవెనుకఁ జంద్రునిఁజూచిన నోకిలింతవచ్చునని యు భావము. (3) చంద్రుఁడు కొందఱకు మనో హరుఁడే కాని వియోగులు రోగులు చక్రవాకములు లోనగువానికి నాహ్లాద కరుఁడు గాఁడు. పగటను నమావాస్యనాఁడులఁ గానరాఁడు ఈ చంద్రుఁ డెల్ల వేళల నొకరీతిని గానవచ్చును. అదియునుగాక యాకాశచంద్రుఁడు విభుఁడుగాఁడు. మఱియును నాయనకుఁ గాంతి సహజము కాదు, సూర్యునివలనఁ గలిగినదే. శ్రీరామచంద్రమూర్తియో విభుఁడు, సహజసౌందర్యకాంతిగలవాఁడు, స్వయం ప్రకాశుఁడు చంద్రునందు సుఖరోగపీడితులకు మేహసంబంధమైన పొడవలెఁ గళంకము గలదు. శ్రీరామచంద్రమూర్తి నిష్కలంకుఁడు. చంద్రుఁడు దీర్ఘరోగి కావున జీవన్మృతుఁడు. శ్రీరామచంద్రమూర్తియో యారోగ్యదృఢాపము, నేఁటి కిని జీవించియున్నవాఁడే కావున నాచంద్రునకంటె నీచంద్రుఁ డభిరాముఁ డని భావము.

రాచవంగడములన్ = రాజవంశములను.

నూర్లకొలఁది = అనేకములుగా.

నిల్పడన్ నిలిపి = అనేకరాజవంశములవారిని వృద్ధికిఁ దెచ్చి, వారికి రాజ్యము లిచ్చి ప్రజలను ధర్మమార్గమునఁ బాలింప స్థిరపఱిచి. ఇతరరాజు లందఱు తాము బాగుపడఁగోరి "అసంతుష్టో ద్విజో నష్టః। సంతుష్ట ఇవ పార్థివ" యను రాజనీతి ననుసరించి యితరులతో యుద్ధముచేసి ప్రజల హింసించి పరరాజ్యము లపహరించుచుందురు. రామచంద్రమూర్తియో రాజవంశములనే ప్రతిష్ఠచేసి వారికి రాజ్యముల నిచ్చెను.

నాల్గువర్ణంబులు [illegible] - బ్రాహ్మ, క్షత్త్ర, వైశ్య, శూద్రు లను నాలుగు జాతులవారిని

[illegible]

[illegible] నిలుపుట [illegible] దేశము [illegible] క్షత్రియులు [illegible] దేశము [illegible] పరశురాముడు [illegible] యొక్క మాట [illegible] వెదకి [illegible] చేసెను. కశ్యపుడు [illegible] చేసెను. అప్పు [illegible] ప్రచ్ఛన్న వేషము [illegible] శ్రీరామచంద్ర మూర్తి [illegible] హతులైన రాజుల వంశము [illegible] వారి వంశ [illegible]

[illegible]

శ్రీ [illegible] దేశములం [illegible] యున్న పూర్వ [illegible] రాజ్యము లిచ్చి వారి వంశము [illegible] పోకుండునట్లు [illegible] బరిపాలించె [illegible] స్థానము [illegible]

౯౭॥ లోకంబు [illegible] లేకాకృతి [illegible]

[illegible] లోకి [illegible] జేరున్. ౧౮౩

శ్రీరామచంద్రమూర్తి ధర్మసంస్థాపన [illegible] కాలము చేసె నని తెలుపు [illegible] దెలుపుచున్నాడు.

[illegible] దానియందే ప్రీతిగలవాడై.

చ॥ అతివ [illegible] మూర్తి [illegible] నీ

[illegible] మీ నిజ మీ వెలుంగుమీ

యతులి [illegible] సంయమి

ప్రతతులతోడ సాటి [illegible] నిల్పుము దేవి నీమదిన్. అయో. ౫౩౩

అని రాముఁడు చెప్పఁబోవును.

ఏకాకృతిః = ఒక్కవిధమున. ఒకప్పుడైన ధర్మలోపము లేదని భావము.

ఏకాదశదశశతంబులు = పదునొకండు వేలు.

అబ్దంబులు = సంవత్సరములు. లోకంబులేలి = అనాయాసముగఁ బరిపాలించి. బ్రహ్మలోకం ఒరుగుః = సపరికరముగఁ దనవైకుంఠమునకుఁ బోవును.

ఏకాదశదశశతంబులు - నిత్యైకవచనాంతమయ్యు బహువచనాంతముగఁ బ్రయోగింపఁబడుటఁజేసి సంస్కృతమున మూఁడు బహువచనంబును దెలుపును గావున ముప్పదిమూఁడువేల సంవత్సరము లగుచున్న దని శిరోమణికారుఁడు వ్రాసెను. శతశబ్ద మొక్క నూటిని జెప్పునప్పుడుమాత్రము నిత్యైకవచనము. రెండు మూఁడు నూర్లను జెప్పునపుడు బహువచనాంతమే. "త్రయోదశాబ్ద సాహస్రం బ్రహ్మచర్య మఖండితం" మ్మను చోట నేకవచనము సమాహారముచేత నిర్వహింపనగును. కావుననే 'ద్వేశతే, త్రీణిశతాని' యని ప్రామాణిక ప్రయోగములు కలవు. శిరోమణికారుని యభిప్రాయము చొప్పున ద్వేశతే యన్నప్పుడు నాల్గునూర్లనియు త్రీణిశతానియన్నప్పుడు తొమ్మిదినూర్లనియు నర్థముకావలసి వచ్చును. కాఁబట్టి రామరాజ్య పరిపాలనకాలము పదునొకండువేల సంవత్సరములే యనుట యుత్తమము. ఈ పదునొకండువేల విషయ ముత్తరకాండమునఁ జర్చింపఁబడును.

బ్రహ్మలోకపదమ్ = వైకుంఠమునఁ దననెలవున.

చేరుః = చేరఁబోవఁ గలఁడు.

శ్రీరాముఁడు రాజ్యమేలుచుండఁగా సీతాదేవి వాల్మీకియాశ్రమమున నున్న సమయంబున సీరామాయణమును నారదమహర్షి వాల్మీకి కుపదేశించెను. ఆకాలమందే వాల్మీకి రామాయణమును రచియించి కుశలవులకు నేర్పెను. పట్టాభిషేకమువఱకు నీసంభాషణమునకుఁ బూర్వకాలవృత్తాంతము గావున భూతార్థక క్రియ లుపయోగింపఁబడినవి. తక్కినవి యీసంభాషణానంతరము జరగఁబోవునవి కావున భవిష్యదర్థకక్రియ లుపయోగింపఁబడినవి. అరుగుః - నిలుపుః - చేరుః -- ఇవి భవిష్యదర్థకక్రియలు. ఈకారణముచే రామావతారమునకు ముందే వాల్మీకి రామాయణమును రచించె నను వాదమంగీకరింపఁదగినది కాదు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి పదునొకండువేలయేం డ్లొక్కవిధముగ రాజ్యమును బాలించి విష్ణులోకమును జేరును,

చ॥ కడుఁ బరిశుద్ధము౯, సకల•కల్మషనాశము, పుణ్య మిచ్చుటం
దడయదు, వేదసమ్మితము, • తారకరూపము, దీర్ఘకాలము౯
బుడమి సుఖింపఁ జేయు గణ•పుత్త్రకపౌత్త్రకయుక్త, నిద్ది యే
ర్పడఁ బఠియించినం, బిదప • వాఁడు సుఖించును జచ్చి స్వర్గతి౯. ౧౪౪

ఈ రామాయణపఠన మిహపరలోకసౌఖ్యసాధన మని నారదుఁడు చెప్పు చున్నాఁడు.

కడు౯ పరిశుద్ధము౯ = వినెడివారిని జదివెడివారిని బరిశుద్ధులుగఁ జేయును గావున గ్రంథము పరిశుద్ధమే పదార్థమునందలి మురికిని శుద్ధజలము పోఁగొట్టునుగాని యశుద్ధజలము పోఁగొట్టఁజాలదు.

పరిశుద్ధి = సత్కార్యోపయోగమగు మనస్సునందలి యొకశక్తి - పరిశుద్ధి చేయుసాధనము. 'యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్' భ. గీ. ౧౮-౫ యజ్ఞము (దేవపూజ) దానము తపస్సు వివేకులను బావనముచేయును. పావన మనఁగా భగవదుపాసనకు విరోధులయిన పూర్వకర్మములఁ దొలఁగించుట యని యర్థము. ఇచ్చటఁ బరిశుద్ధ మాయర్థమునసే ప్రయుక్తము. శుద్ధ మనక పరిశుద్ధ మనుటచే మరల నవి తలచూపకుండ నిర్మూలముచేయుట

సకలకల్మషనాశము = మీఁదఁ జెప్పినంతమాత్రమేకాదు. అట్టి పరిశుద్ధి పాపముపోయినఁగాని రాదు కావున సమస్తపాపములను బోఁగొట్టునది. సంచితము - ప్రారబ్ధము - ఆగామి యని పాపములు మూఁడువిధములు. గత జన్మమువఱకుఁ గలపూర్వ జన్మంబులఁ జేసిన పుణ్యపాపముల సముదాయము సంచితము. ఇది పండించి గరిసెలలోఁ బోసియుంచిన ధాన్యమువంటిది. సంచితమునందు నీ జన్మమున నెంత యనుభవింపవలసినట్లు విధింపఁబడినదో యది ప్రారబ్ధము పూర్వకర్మఫల మనుభవించుటకుఁ బ్రారంభింపఁబడినది. గరిసెలలోనుండు ధాన్యమునందు నీదినము వాడుకొనఁ దీసిన ధాన్యమువంటిది. మఱుజన్మంబున ననుభవమునకు రాఁబోవునది ఆగామి. రేపు మనము తినఁబోవుధాన్యమువంటిది. ఈమూఁటికిఁ బ్రారబ్ధ మనుభవింపక నశింపదు. శ్రీరామాయణపఠనము సంచితమును భస్మీభూతముఁ జేయును. ఆగామిని రాకుండ నిలుపును. ప్రామాదికముగ వచ్చినను బాధ కలుగనీయదు. "బ్రహ్మహత్యాసహస్రాణి, వీరహత్యాశతానిచ స్వర్ణస్తేయ సురాపాన, గురుతల్పాయుతానిచ, కోటికోటిసహస్రాణి ఉపపాతక జన్యపి। సర్వాణ్యపి ప్రణశ్యంతి రామచంద్రస్య కీర్తనా" త్తని రామోపనిషద్వాక్యము.

భగవద్గీతాచరమశ్లోకంబున "సర్వపాపేభ్య" యనుదాని కేమియర్థమో సకలకల్మష మనుటకు నిచ్చట నాయర్థమే. 'పుణ్యపాపే విధూయ' యన్నట్లు

మోక్షప్రతిబంధకములైనపుణ్యపాపములన్నియుఁ బ్రారబ్ధముదక్కనని యర్థము. మోక్షమునకుఁ బుణ్యపాపములు రెండును బ్రతిబంధకములే. ఇది మోక్షాసక్తులవిషయము అర్థకామములు కోరువారికి నాఫలములే సంఘటింపఁ జేయును. ఆవిషయమే పుణ్యమిచ్చుటఁగొడయదు ధర్మాసక్తులగువారికిఁ బుణ్యఫలమును శీఘ్రముగ నిచ్చును. ఆలస్యముచేయదు ప్రాయశ్చిత్తాదులు పాపమును మాత్రము పోఁగొట్టును. పుణ్యమును హరింపఁజేయలేవు రామాయణపఠనము కోరువారికి రెంటిని ధ్వంసముచేయును. కావున నిది ప్రాయశ్చిత్తాదులవంటిది కాదు.

వేదసమ్మితము = సర్వవేదములతో సమానమైనది.

తారకరూపము = రామతారకమంత్రస్వరూపమైనది. ఈరెండు విశేషణములును బాపనాశపరిశుద్ధి పుణ్యమోక్షములు దీనిం జదువుటచేతఁ దప్పక కలుగు ననుటకు హేతువులు ప్రణవమునకు రామమంత్రమునకును తారకసంజ్ఞ రామనామమాహాత్మ్యము చూడుఁడు.

ఇద్ధి = ఈసంక్షేపరామాయణము. పఠన్‌, చక్రఁగా = వేదాధ్యయనాదులందువలె నియతితప్పక పఠించిన, గణపుత్రకపౌత్రకయుక్తః = భృత్యులయొక్కయు ప్రియపుత్రుల యొక్కయు, ప్రియులైన మనుమలయొక్కయు కూడికతో. పుత్రకపౌత్రక శబ్దములందు ననుకంపార్థక కప్రత్యయము అనుకంప = దయ.

దీర్ఘకాలముఁ, పుడమిఁ. సుఖింపఁజేయుఁ = ఇహలోక సౌఖ్యముల నెల్ల ననుభవింప దీర్ఘాయుస్సు నిచ్చును.

వాఁడు = ఈరామాయణమును బఠించువాఁడు.

చచ్చి = మరల శరీరసంబంధము లేకుండునట్లు ఈ శరీరము విడిచి.

స్వర్గస్థితిఁ — పరమపదమున నుండుటచేత. స్వర్లోకమునం దుండుటచేత నని యర్థము చెప్పరాదు. 'తస్యాంహిరణ్మయ, కోశ, స్వర్గోకో జ్యోతిషావృత' యని వైకుంఠ మను నర్థమున స్వర్గశబ్దము ప్రయోగించుట కలదు. అత్రి స్మృతియందు "విద్వేషా ఏవ గోపింపం, వయ ఘూంమోక్షై స్సరన్‌, శిశుపాలో గతస్స్వర్గం, కింపున స్తత్పరాయణా"యని కలదు. ఇక్కడ స్వర్గ మనఁగాఁ బరమపదమే. నానార్థరత్నమాలయందును 'స్వర్నాకేపరలోకేచ' యని కలదు. సర్వపాపవిముక్తుఁడైన వానికి స్వర్గమేల? స్వర్గప్రాప్తి మరల జన్మింపవలసిన వానికి. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'యని కలదుకదా. కావున నీ రామాయణము ముముక్షువునకు మోక్షమే యిచ్చును. ధర్మార్థకామములు కోరువానికి నవియే ఘటింపఁజేయును.

సుఖించుర్ = నిత్యానందముఁ జెందును.

కర్మయోగులు - జ్ఞానయోగులు - అష్టాంగయోగయుక్తులు ననేకజన్మములు శ్రమించి తా మతికష్టముస్తైఁ దరింతురు. కాదేని తమవంశమువారిని గొందఱఁ గాపాడఁగలరు. ఈ రామాయణమును బఠించువాఁడు తాను దరించుటేకాక తన పుత్రులను పౌత్రులను భటులను దన్నాశ్రయించియుండు పశుపక్ష్యాదులనుగూడఁ దరింపఁజేయఁగలఁడు.

శ్లో॥ పశుర్మనుష్యః పక్షీవా, యేచ వైష్ణవసంశ్రయాః
తేనైవ తే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమంపదమ్॥

విష్ణుభక్తుల నాశ్రయించియుండు పశువులైనను, మనుష్యులైనను, పక్షులైనను వారితోడఁ దామును విష్ణువుయొక్క పరమపదమును జేరుదురు.

తాత్పర్యము.

ఈ రామాయణము మిక్కిలి పరిశుద్ధమై పఠించువారి వినువారి మూఁడు విధములైన సమస్తపాపములను హరింపఁజేసి యాలస్యములేక మోక్షఫలము గలిగించును. అట్టి శక్తి దీని కెట్లు కలిగె ననిన నిది వేదస్వరూపమై వేదార్థమునే బోధించును. అంతియకాక సంసారసాగరమును దరింపఁజేయును. అట్లైన నిది వినినవారు చదివినవారు సన్న్యాసులు గావలసినవారా యనిన నట్లు గాదు. ఆయుస్సు వృద్ధిచేసి భూలోకసుఖములను కొడుకులు మనుమలు మొదలయిన యిష్టబంధువులతో ననుభవింపఁజేసి మరణించిన తరువాత మోక్షమున బ్రహ్మానందము ననుభవింపఁజేయును. భక్తులగు గృహస్థులకంటె సన్న్యాసాశ్రమస్వీకారముచేసినవా రుత్తము లని భ్రమపడువా రీ వాక్యంబుల గమనింపఁదగు.

శ్రీ భాగవతము ద్వితీయస్కంధము ౩౨. “ వ॥ మఱియు నొక్క విశేషంబు గలదు. పుణ్యాతిరేకంబున బ్రహ్మలోకగతులైనవారు కల్పాంతరంబునం బుణ్యతారతమ్యంబుల నధికారవిశేషంబు నొందువార లగుదురు. బ్రహ్మాదిదేవతాభజనంబునం జనువారు బ్రహ్మజీవితకాలం బెల్ల బ్రహ్మలోకంబున వసియించి ముక్తు లగుదురు. నారాయణచరణకమల భక్తపరాయణత్వంబునం జనినవారు నిజేచ్ఛావశంబున నిరర్గళగమనులై బ్రహ్మాండంబు భేదించి మహోన్నతవైష్ణవపదారూఢులయి తేజరిల్లుదురు.”

ఈ మూఁడుతెగలలో రెండవవారు సన్న్యాసులు. బ్రహ్మలోకమున నిలువక సరాసరి బ్రహ్మాండంబు భేదించిపోవు మూఁడవతెగవారు భక్తులు. రెండవతెగవారిగుఱించి శ్రుతియు నిట్లే చెప్పుచున్నది. ముండకోపనిషత్తు- శ్లో॥ వే

దాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః। సన్న్యాసయోగాద్యతయ శ్శుద్ధసత్త్వాః । తే బ్రహ్మలోకేషు పరాంతకాలే । పరామృతాః పరిముచ్యంతి సర్వే." యతులు వేదాంతవిజ్ఞానమువలన నిశ్చయింపఁబడినయర్థముగలవారై సన్న్యాసయోగమున శుద్ధమనస్కులై మరణించిన పదపడి బ్రహ్మలోకమున పరాంతకాలము వఱకుండి యావల ముక్తు లగుదురు, అని యర్థము. వ్యాఖ్యాతమతానుసారము. దీనివలన నిజమైన సన్న్యాసులకుఁ గ్రమముక్తి యనియు భక్తులకు సద్యోముక్తి యనియు నేర్పడుచున్నది.

ఉ॥ వాగ్వృషభత్వముల్, సకలవార్ధిపరీతధరాపతిత్వముల్,
బాగుగఁ బణ్యలాభము, నపారమహత్త్వముఁ గల్గు నీకృతిన్
సాగఁగ విప్రభూమిధవసంఘము వైశ్యులు శూద్రకోటి శ్ర
ద్ధాగరిమం బఠించిన యథావిధి విన్నఁ బఠింప నారయన్. ౧౪౫

ఈపద్యంబునను ఫలశ్రుతియే చెప్పఁబడినది. ఒక గ్రంథమును బఠించిరేని గలుగుఫలమును జెప్పుటయే ఫలశ్రుతి. 'ప్రయోజన మనుద్దిశ్య నమందోపి ప్రవర్తతే' యన్నట్లు ప్రయోజనములేక యెవ్వఁడేకార్యమును జేయఁడు. 'నీవీ యౌషధమును సేవింపుము. నీకీవ్యాధి శమించును.' అని వెంటనే చెప్పకున్న వాఁ డాయౌషధమును సేవింపఁడు. దానియందు వానికి రుచి పుట్టదు. కావున 'రోచనార్థా ఫలశ్రుతి' యని చెప్పఁబడెను. ఒకదానియందు రుచి పుట్టించుటకే ఫలశ్రుతి చెప్పఁబడును. ఫలము తెలియనియెడల ఫలములేని యీకార్య మేల చేయవలెనని లోకులు చేయకుందురు. ఈ రామాయణము లెక్కకు వ్రాసినవంటిది గాదు. చదివిన మంచిఫల మెట్లుగలదో చదువకుండినఁ బ్రత్యవాయము గలదు. బాలకాండము ౨౪౦ పద్యమును జూడుఁడు. ఐహికాముష్మికఫలములలో నాముష్మికఫలము ప్రధానముగావున నది పై పద్యమునఁ జెప్పఁబడినది. ఐహికఫల మీపద్యమునఁ జెప్పఁబడుచున్నది. ఆముష్మికఫలము సర్వజనులకు సమానము గావున నేవర్ణమువారేఫలము నెక్కువగఁ గోరుచుందురో వారి కాఫలము గలుగు నని చెప్పఁబడుచున్నది.

విప్ర భూమిధవ సంఘము = బ్రాహ్మణులయొక్కయు క్షత్రియులయొక్కయు సమూహము, వైశ్యులు = కోమట్లు, శూద్రకోటి = శూద్రజనములసముదాయము. శ్రద్ధాగరిమన్ = అధికమైన విశ్వాసముతో, ఈకార్యముచేసిన నీ ఫలము గలుగు నను నమ్మకమే శ్రద్ధ. అదిలేకున్న దేవపితృకార్యములలో దేనిని జేసినను బ్రయోజనము లేదు. యథావిధి శాస్త్రోక్తనియమములు తప్పక యోగ్యుఁ డగు గురువుచే నుపదేశమునొంది స్నానముచేసి పరిశుద్ధుఁడై స్థిరచిత్తుఁడై పారాయణమునకు ముందు చేయవలసినకార్యములు స్వసంప్రదాయానుసారముగఁ జేసి

గ్రంథమును బూజించి తరువాతఁ బఠింపవలయును. పారాయణాంతమున నక్లే చేయవలయును. దినమున నొకసర్గము చదువవచ్చును. ఇతరకార్యములతొందర చేత నంతకుఁ దక్కువగ నొకఘట్టము చదివినను జదువవచ్చును. ప్రతిదిన మొక పద్యమైనఁ జదువవలయును. కామ్యార్థులు భోజనమునకు ముందును మోక్షా ర్థులు భోజనానంతరమును శుచులై వార్చియుఁ బఠింపవలయును. భోజనానంత రము విరామములేనివారు తెత్పూర్వమే పఠింతురు.

ఈకృతిꣳ = ఈగ్రంథమును. పఠించినꣳ = చదివినను, పఠింపవిన్నను = చదువలేనివారు పరులు చదువఁగా విన్నను, 'శృణ్వꣳ రామాయణం భక్త్యా' యని కలదు. కావునఁజదువువారి కెంతఫలమో భక్తితో వినువారికి నంతఫలము గలదు. ఆరయꣳ = విచారించినను, పఠనమునకు శ్రవణమునకుఁ దీరికలేనికాల ములలో దీనిలోని యొక్కొక్కవిషయమును గుఱించి ధ్యానించినను, వాగృషభత్వ ముꣳ = వాక్ + ఋషభత్వమును = వాక్కునందు శ్రేష్ఠత్వమును. (వాకు=వేద వేదాంగములు). ఇది బ్రాహ్మణులకుఁగలుగుఫలము. సకలవార్థి = సమస్తసముద్ర ములచేత, పరీత = చుట్టఁబడిన, ధరా = భూమికి, పతిత్వముꣳ=ప్రభుత్వమును, చక్రవర్తిత్వమును, ఇది రాజులకుఁ గలుగు ఫలము. పణ్యలాభముꣳ = వాణి జ్యమున లాభమును, ఇది వైశ్యులకుఁ గలుగు ఫలము. శౌకమహత్త్వ ముꣳ = మిక్కిలి గొప్పతనమును, ఇది శూద్రులకుఁ గలుగు ఫలము. సమానుల యందు త్తముఁడవు కమ్మనియే వేదోక్తాశీర్వచనము. కావున సమానులందు మిక్కిలి గొప్పవాఁ డని భావము. సమానులం దనునది భక్తిగలవారివిషయము [illegible] అందఱికంటె నన్నిట గొప్పవాఁడు భగవంతుఁడొ క్కఁడే కావున సమానులందు గొప్పవాఁ డని గ్రహింపవలయును. క్రమాలం కారము. ఇప్పటికి నారదుఁడు వాల్మీకి కుపదేశించిన సంక్షేపరామాయణము ముగిసెను. దీనినే బాలరామాయణ మందురు. ఇది సంస్కృతమునఁ బ్రథమ సర్గము. ఈ సర్గమున మొదటిశ్లోకమున మొదటి యక్షరము 'త'కారము (తప) అది గాయత్రీమంత్రమందలి మొదటి యక్షరము. కడపటి శ్లోకమున గడపటి యక్షరము 'యాత్' ఇది గాయత్రియందలి కడపటి యక్షరము. గాయత్రియందలి యిరువదినాలుగక్షరములు చెప్పుటచే నీసర్గము గాయత్రీ సంపు టిత మని యేర్పడుచున్నది. ఈ నియతి ననుసరించియే వాల్మీకి వేయి గ్రంథ ములకు మొదట నొక్కొక్క గాయత్రియక్షరము నుంచెను. కావున ౨౪౦౦౦ గ్రంథమయ్యెను. ౨౪౦౦౦ గ్రంథ మనఁగా ౨౪౦౦౦ శ్లోకము లని యర్థము కాదు. ౩౨ అక్షరముల సముదాయమునకే గ్రంథ మని పేరు. "గ్రంథోదనే వాక్సందర్భే ద్వాత్రింశ ద్వర్ణసంహతౌ" యని నానా. ఒక శ్లోకమందు ౩౨

అక్షరములకు మించియుండెనేని ౩౨ అక్షరములు మాత్రమే గ్రంథముగా నెన్నఁబడును. ఈ ప్రథమసర్గమందు నాద్యంతాక్షరముల మధ్యభాగమునఁ దక్కిన యక్షరము లుండు నని సందేహించి యేనియతి ననుసరించి శోధించినను గానరావయ్యెను. ఎఱిఁగిన విజ్ఞులు తెలిపిన వారికి నవస్కరింపఁగలవాఁడ. తక్కినయక్షరములు గానరాకున్నను లోపములేదు. ఆద్యంతాక్షరములు గ్రహించుటచేతనే సర్వము గ్రహించిన ట్లగు నట్టివి పెక్కులు గలవు. కావున శ్రీమద్రామాయణము గాయత్రీసంపుటితమగుట నిర్వివాదము. ఆనియతి ననుసరించియే యీ యాంధ్రవాల్మీకిరామాయణమునందు గడపటిశబ్దము 'ఆరయన్' యకారముతో ముగింపఁబడెను తెనుఁగునందు కొన్నిచోట్లు 'న్' శబ్దముకడపట రాఁజాలదు. కావున దానికి ముందున్న యకారము గ్రహింపఁబడెను. గాయత్రీరామాయణమందును 'యోగాన్మేదు రాత్ర్య' మ్మని యకారమే కదా గ్రహింపఁబడెను.

సంస్కృతవ్యాఖ్యాతలు సంస్కృతరామాయణమును శూద్రులు పఠింప వచ్చునా కూడదా యని చర్చించి కొంతగ్రంథము వ్రాసి రందును కప్రస్తుత మగుట విచారింపవలసినపని లేదు ఈరామాయణము నెవ్వరైనఁ బఠింప వచ్చును, వినవచ్చును. మహాఫలము ననుభవింపవచ్చును.

సంక్షేపరామాయణము - సంక్షేపము = సంగ్రహము కథయందును శబ్దము నందును మితమైనది రామునిజన్మము మొదలు నిర్యాణమువఱకుఁ గల చరిత్రమంతయు సంక్షేపముగాఁ జెప్పఁబడె.

రామాయణము = రామునియొక్క + అయనము. రామాయణము = రామునిచరిత్ర. (2) అయనము = ప్రతిపాద్యము అయనము దేనికో యది రామాయణము. (3) రాముని భజించుటకు సాధనము రామాయణము. (4) అయన మనఁగా మోక్షము — మార్గము 'నాన్యః పంథా విద్యతే ఽయ నాయ' యని. కావున మోక్షకాములకు మనోహరమైన మార్గము. (5) అయ నము = స్థానము. రామాయణము. ఇదియున్నచోట శ్రీరామచంద్రమూర్తి యుండును. రషాభ్యాం నోణ స్సమానపదే యనుసూత్రము ప్రకారము రామా యణ మను నది సంజ్ఞ కావున 'అయన' శబ్దములోని 'న' ణకారముగా మా ఱెను. నారాయణ, శూర్పణఖ మొదలయినవానియందిట్లే 'న' ణ యయ్యెను.

తా త్ప ర్య ము.

పరిమితి చెప్ప సాధ్యపడని మహత్త్వముగల యీ రామాయణగ్రంథమును శాస్త్రప్రకారము చదివినను (నిధ్యాసము), ఇతరులు చదువఁగా విన్నను

(శ్రవణము), అర్థవిచారముచేసినను (మననము) బ్రాహ్మణునకు వేదవేదాంగముల నధ్యయముచేసినఫల మబ్బును. క్షత్రియునకు సర్వభూపతిత్వము లభించును. వైశ్యునకు వ్యాపారమందు లాభము కలుగును. శూద్రునకు నపారమైన గొప్పతనము ప్రాప్తించును. కావున నాలుగువర్ణములవారు స్త్రీలు పురుషులు దీనిని జదువవలయును, వినవలయును. విషయములను జింతనము చేయవలయును. వినియెడివారుండినఁ దాను జదువవలయును. చదివెడివా రుండిన దాను వినవలయును. ఇవిరెండు జరగని కాలమందు విన్నదానిని గన్నదానిని విశేషముగ మననము చేయవలయును. ఏయుపాయముచేతనైన మనస్సు దీనియందు నిలుపవలయును. 'అరే శ్రోతవ్యో మంతవ్యో' యను శ్రుతి

సంక్షేప రామాయణము సమాప్తము.

—* ౨ సర్గము. వాల్మీకిమహర్షి తమసాతీరంబున విహరించుట *—

విషయక్రమము. నారదుఁడు చెప్పిన రామచరిత్రమును విని సంతోషించి వాల్మీకి నారదునిఁ బూజించెను. నారదుఁడు పోయినపిమ్మట వాల్మీకి తమసానదీతీరమున శిష్యునితో సంచరించుచు నొకక్రౌంచమిథునమును జూచెను. వాల్మీకి చూచుచుండఁగనే బోయయొకఁడు వానియందు మగపక్షిని బాణముతోఁ గొట్టి చంపెను. ఆఁడుపక్షి యేడుపు విని వాల్మీకి మిగుల జాలిఁగొని బోయవానిని తెలియుమా నిషాద యని శపించెను. ఇట్లు మొదటివినోర వెలువడిన వాక్యములు సమాక్షరములుగల నాలుగు పాదములపద్య మయ్యెను. ఆవల నావిషయమై యాలోచించుచు శిష్యుఁడైనభరద్వాజునితోడ నాశ్రమమునకు వచ్చెను. అచ్చటికి బ్రహ్మదేవుఁడు వచ్చి రామాయణము వ్రాయు మని యుపదేశించి సర్వము తెలియవచ్చునట్లు వర మిచ్చిపోయెను. వాల్మీకి రామాయణము రచింప నిశ్చయించుకొనెను.

ఆ॥ అనుచు నారదుండు ♦ హర్షరసావిష్ట, చిత్తుఁ డగుచుఁ దెలియఁ ♦ జెప్పుటయును
వాక్యకుశలుఁ డైన ♦ వాల్మీకి యర్థోత్తరంబు నాలకించి ♦ శ్రద్ధతోడ. ౧౮౬

పరమకారుణికుఁ డగు వాల్మీకిమహర్షి 'ఇష్టంహి విదుషాం లోకే, సమానవ్యాసధారణ' మ్మనురీతిని తొలుత నారదుఁడు సంక్షేపముగఁ జెప్పినరామచరితను నిఁక వాల్మీకి విస్తారముగఁ జెప్పఁబూనుచున్నాఁడు. గ్రంథమును జదువఁగోరువారు వక్తృవైలక్షణ్యము, విషయవైలక్షణ్యము, ప్రతిపాద్యవైలక్షణ్యము నను

మూఁడువిషయము లవశ్యము తెలియవలయును. వైలక్షణ్యము = విశేషము. గ్రంథము చెప్పినవాఁ డెవఁడు? వాని నడవడి యెట్టిది? లోకుల కాప్తుఁడా? కాఁడా? యని విచారింపవలయును. ఇదియే వక్తృవైలక్షణ్యము. మేలుకోరి హితమే చెప్పు నను విశ్వాసమున కెవఁడు పాత్రుఁడో వాఁ డాప్తుఁడు. వీనివాక్యము ఆప్తవాక్యము. ఆప్తవాక్యము త్రోసివేయరానిది మొదటియాప్తుఁడు భగవంతుఁడు. వేదమాప్తవాక్యము ఆవెనకఁ బ్రజలమేలుకోరి వేదార్థములను బురాణేతిహాసశాస్త్రములవలన లోకులకుఁ దెలిపినవా రాప్తులు. వారికృతము లాప్తవాక్యములు.

యథార్థజ్ఞుఁ డై తా నెఱిఁగి కామక్రోధలోభాదిదూషితచిత్తుఁడు గాక తా నెఱిఁగిన యథార్థవిషయమునే యితరులకు మేలుకోరి చెప్పుట యాప్తలక్షణము. అట్టి యాప్తత యీయనకు బ్రహ్మానుగ్రహమునఁ గలిగెను. గావున నీయన పరమాప్తుఁడు. బ్రహ్మయాజ్ఞప్రకారము లోకులు తరించుటకుఁగాను వాల్మీకి యీకృతి రచించెను. ఈవక్తృవైలక్షణ్యము తొలుతఁ జెప్పఁబడుచున్నది.

హర్షరసావిష్టచిత్తుఁడు — ఆనందరసముచే నావేశింపఁబడిన మనస్సుగలవాఁడు. రామచంద్రచరిత్రము చెప్పఁబూనినప్పుడే నారదుఁ డానందరసమగ్నుఁ డయ్యె నని భావము. పిశాచ మావేశించినవానికి దేహము తెలియనట్లు నారదుఁ డానందపరవశుఁడై కొంతసేపుండి యావల స్మృతి తెచ్చుకొనెను. కావుననే "చక్కఁగ యోచించి వచింతు"నని చెప్పెను. (చూడుఁడు. ప - ౨. శ్లో.)

తెలియఁజెప్పుటయు = సంక్షేపరామాయణమును జెప్పిన యనంతరము. ఇది యానంతర్యార్థకము - తెలియఁజెప్పుట యనఁగా సందేహమున కెడము లేక సుబోధముగఁ జెప్పుట.

వాక్యకుశలుఁడు = వాక్యములందు నేర్పరి. పరులు జెప్పినదానియందు సారార్థమును గ్రహించుటకును దాను దాని సారసంతము లగు వాక్యములఁ జెప్పుటకును సమర్థుఁడు. ఇట్టివాఁడు కనుకనే గురువు సంగ్రహముగఁ జెప్పిన విషయమును విస్తరించి గ్రంథరూపముగ వాల్మీకి లోకమునకుఁ దెలిపెను.

అర్థోత్తరంబున = తన ప్రశ్నకుఁ దగిన నారదుని ప్రత్యుత్తరమును. శిష్యుఁడు గురువాక్యములందు శ్రద్ధయు, నాయనయందు భక్తిగలవాఁడై యుండవలయును. శ్రద్ధతోడ నాలకించి 'యాతనిఁ బూజలం దనిపి' యనుటచే వాల్మీకియం దీరెండును గల వని యేర్పడెను. ఈరెండును లేనివాఁడు శిష్యుఁడు కాఁడు.

ఆలకించి = విని, శ్రద్ధతో = విశ్వాసముతో.

తాత్పర్యము.

అని శ్రీరామచరిత్రము ప్రశంసించు భాగ్యము కలిగెంగదా యని సంతోషముచే నుప్పొంగుచు నారదుఁడు మీఁదఁజెప్పిన ప్రకారము తెలియఁజెప్పఁగా విన్నవిషయమును కలిసాము గ్రహించుటకు గ్రహించినదానిని బరులకుఁ దెలియఁజెప్పుటకు సమర్థుఁడైన వాల్మీకి తన ప్రశ్నమునకు సరియైన యుత్తరము వచ్చె నని శ్రద్ధతో విన్నవాఁడై నారదునితో నిట్లనియె.

చం॥ అడిగినయర్థ మెల్లఁ బరమార్థతఁ గర్ణరసాయసంబుగా
నొడువుట నోమహాశయ! యనూనసుధారసతుందిలోక్తి- ని
ప్పుడ కృతినైతి నం చతనిఁ బూజలఁ దన్పి సశిష్యవర్గుఁడై
కడుఁ బరితుష్టుఁ జేసె ననఘవ్రతుఁడుర్ హృదయంగమోక్తులన్. ౧౪౭

కర్ణరసాయనంబుగన్ = చెవుల కింపుగ, "రసానాం హి ధాతూనాం లాభోపాయో రసాయనం। రసాయనం విహంగే స్యాజ్జరావ్యాధిహరౌషధే" నీరసమైన ధాతువులకు బుష్టిగలిగించునది రసాయనము. జర - వ్యాధి, వీనిని హరించునది రసాయనము (Tonic). పరమార్థతన్ = యిక్కలి యథార్థముగ, ప్రీతితోను, హితబుద్ధితోను, అనూన = కొఱఁతలేని, సుధారస = అమృతముచే, తుందిల + ఉక్తిన్ = బలిసిన (నిండిన) మాటలచేత, నైలి శయ్యయై మాటలు తియ్యనై యుండునట్లు సుధ యనఁగా సుఖముగాఁ బానముచేయఁబడునది. కొన్ని త్రాగుటకుఁ దియ్యగా నున్నను వెనకఁ గీడుచేయును. కొన్ని త్రాగునపుడు వెగటుగా నున్నను పిదప మేలుచేయును. రామకథాసుధ = త్రాగుటకు (వినుటకు) నింపై యుండును. పిదపను మేలే యిచ్చును. నొడువుటన్ = చెప్పుటచేత, కృతిని = సమర్థుఁడను. ఇన్నిదినములు వేదాంతార్థనిర్ధారణ సామర్థ్యము లేకయుంటిని. నీ మాటలవలన వేదార్థము నిర్ధారణచేయ సామర్థ్యము కలిగెను. కావునఁ గృతకృత్యుఁడ నైతిని. తన్పి - తృప్తిపఱిచి; అనఘవ్రతుఁడుర్ = దోసములేని వ్రతముగల వాల్మీకి, సశిష్యవర్గుఁడై = శిష్యులసమూహములతోఁ గూడినవాఁడై, హృదయంగమోక్తులన్ = మనోహరమైన మాటలచే.

ఛందస్సు.

న + ఊన. అన్ + ఊన = అనూన. నఞ్ సమాసము - కావున నుభయయతి - ఉభయయతులం దచ్చైన హల్లైన యతి చెల్లును. ఇచ్చట హల్లుయతి చెల్లెను.

తాత్పర్యము.

మహాత్మా! నే నడిగినవిషయమంతయు నాహితము నా శ్రేయస్సు గోరి వినుట కింపైనరీతిని నమృతబిందువులవంటి వాక్యముల జెప్పుటచే నే నిప్పుడు కృతకృత్యుడనైతిని. నా సందేహము తీరెను. అని శిష్యసమూహముతో నారదుని మనోహర వాక్కులచే భంగములేని ప్రేమముగల వాల్మీకి సంతోషపఱచెను.

తే॥ అర్చనల నంది యోగతిశ్రేష్ఠుఁ డెలమి, నారదుఁడు దాను బోవ ననుమతిని బొంది
చనియె నుయథేచ్ఛ మాకాశసరణిఁ దిరిగి, దేవలోకంబుఁ జేరంగ దేవమౌని ౧౮౯

దేవమౌని = నారదుఁడు. అర్చనలు - పూజలు, ప్రదక్షిణనమస్కారాదులు. అంగి = గ్రహించి, హర్షము = సంతోషము - అనుమతి = సెలవు. ఇది ఆజ్ఞ యనుశబ్దతద్భవము దేవలోకము = బ్రహ్మలోకము. బ్రహ్మలోకమునుండివచ్చినవాఁడుగావున మరల బ్రహ్మలోకమునకే పోయెను. ఆకాశసరణిఁ బట్టి = ఆకాశమార్గముగా. యథేచ్ఛము = ఇష్టానుసారము. ఇది యవ్యయీభావసమాసము కావున నపుంసకలింగము చనియెను - పోయెను. బ్రహ్మవాక్యము నొప్పవలె వాల్మీకిఁ దాను రామాయణ ముపదేశించినవార్త తెలుపుటకుఁ బోయె నని భావము.

అనతి యనఁగా నాజ్ఞ కాదు. పోయివత్తునా యని నారదుఁ డడుగఁ బోయిరమ్మని వాల్మీకి సమ్మతించె నని యర్థము.

తాత్పర్యము.

ఇట్లు వాల్మీకి గావించిన ప్రదక్షిణనమస్కారాదిపూజల నంది నారదుఁడు గ్రహించి పోయివచ్చెద నని చెప్పి యాకాశమార్గమున బ్రహ్మలోకమునకుఁ బోయెను.

కం. నారదుఁ డరిగిన గంగాతీరంబున కనతిదూరదేశంబున
హారివనకుసుమభరవిస్తారలతాచారుతటిని తమసను నదిన్. ౧౯౦

గంగ తీరమునకుఁ = గంగయొడ్డునకు, అనతిదూరదేశమున = మిక్కిలి దూరముగాని ప్రదేశమందు (ఉన్న) అనతి = దూరముగా వ్యాపించు గంధముగల, "సమాకీర్ణ నిర్హారి" యని యమరము. వనకుసుమ = శ్రేష్ఠములైన పూవులయొక్క, భర = భారము యొక్క, విస్తార — అతిశయముగల; లతా = తీఁగలచేత, చారు — మనోహరమైన, తటిని = పొంపరిండ్లు గలదానియందు, తమసాతటినిన్ = తమసయను పేరుగల నదియందు, పాటనాడఁగ నేగి యని మీఁది పద్యవాక్యముతో నన్వయము.

తా త్ప ర్య ము.

నారదుఁడు చనిన యనంతరము వాల్మీకిమహర్షి గంగాతీరమునకు సమీపమందుఁ దమ పూలవాసనలను దూరమందే వ్యాపింపఁజేయు పూలతీఁగలు గల పొదరిండ్లుగల తమసానదియందు.

మత్తకోకిలము॥ రాజితద్యుతి వాల్మికర్షియు ♦ రాఁగ వెన్కనిత స్భర
ద్వాజుఁ డన్ప్రియశిష్యవర్యుఁడు ♦ వారి నాడఁగ నేగి, పే
రోజ మై నడిమింట రాఁజల ♦ నుగ్రదీధితి, చార్వ ను
ద్వేజితాంబులఁ గాంచి యిట్లనుఁ ♦ బ్రీతుఁ డై నిజశిష్యుతోన్. ౧౫౦

రాజితద్యుతి = ప్రకాశించు బ్రహ్మతేజస్సుగల. వాల్మికర్షి-వాల్మీక + ఋషి= వాల్మీకిఋషి. ప్రియశిష్యవర్యుఁడు = ఇష్టుఁడైన శిష్యశ్రేష్ఠుఁడు. తన వెంబడి రాఁగా, వారిన్ = నీటియందు, ఆడఁగన్ = స్నానముచేయుటకు, పేరు + ఓజ = మిక్కలి ప్రకాశముతో - మబ్బుమాటులేక, ఉగ్రదీధితి = తీక్ష్ణకిరణములు గల సూర్యుఁడు, నడిమింటన్ = ఆకాశమున నడుమ, రాజిలన్ = ప్రకాశింపఁగా, చారు = మనోహరమైన, అనుద్వేజిత = సౌమ్యాకారముగల, అంబులన్ = తీర్థమును, నిజశిష్యుతోన్ = తనయొక్క శిష్యునితో.

ఛందస్సు.

మత్తకోకిలవృత్తము - ర-స జ-జ-భ-ర-గణములు - ౧౧ వ చోట యతి.

తా త్ప ర్య ము.

బ్రహ్మతేజస్సు ప్రకాశించు నమ్మహర్షి భరద్వాజుఁ డను ప్రియశిష్యుఁడు వెంటవచ్చుచుండఁగా మాధ్యాహ్నికకర్తవ్యానుష్ఠానమునకై స్నానముచేయఁబోయి తేటగా నిర్మలముగా నుండు నీళ్లను జూచి సంతోషించి తన శిష్యునితో నిట్లనియె.

కం॥ అంబువులఁ గంటె సుజనుమ,నంబుంకుం దుల్య మగుచు ♦ నవ్యము రమణీ
యంబై నిరతంబుఁ బ్రసన్నంబై నిష్పంక మగుచు ♦ ననువుం గూర్చెన్. ౧౫౧

అంబువులన్ = నీళ్లను. కంటె=చూచితివా - కంటి వే యొక్క రూపాంతరము. నవ్యము = క్రొత్తది. ఇదివఱ కెన్నిమాఱులో చూచినదైనను క్రొత్తగఁ జూచినట్టు మనోహరమైయున్న దని భావము. రమణీయంబై = మనోహరమైనదై. నిరతము = ఎల్లప్పుడు. ఇది తెలుఁగుపదము. తత్సమమున దీని కీయర్థము లేదు. ప్రసన్నంబై = నిర్మలమైనదై; నిష్పంకమగుచున్ = అడుగున బురదలేని దగుచు; కొన్నితీర్థము లడుగున బురదలేకున్నను నీళ్లు బురదలుగానే యుండును. కొన్నియడుగున బురదయున్నను మీఁదఁ దేటగానే యుండును.

ఇది లోపల మీఁదకూడ బురదలేనిది. నవ్యమును, రమణీయమును అని భావము. కావుననే, సుజనుమనంబునకుఁ = సత్పురుషుని మనస్సునకు, మాద్రి = సమానము - మాదిరి రూపాంతరము. మాత్రృశబ్దభవమని తోఁచెడి పైవిశేషణములు సుజనుమనంబునకు నన్వయించును అప్పుడు నిష్పంక మనఁగాఁ బాపము లేనిదని యర్థము. పంకము-(1) బురద (2) పాపము. ప్రసన్నము = కలఁతలేక తేటగ నుండునది. నన పు = ప్రేమ

తాత్పర్యము.

నాయనా! భరద్వాజా! కంటివిగదా యీ నదీజలము లడుగునఁగాని మీఁదఁగాని బురదలేక లోపలఁ బాపపు టాలోచన మీఁదఁ బాపపుచర్య లేక శుద్ధాంతఃకరణముగల సత్పురుషుమనస్సువలెఁ దేటగా నున్నది దీనిని మన మెన్నిమాఱులో చూచితిమిగాని యెప్పటికప్పుడు క్రొత్తగాను మనోహరము గాను గానవచ్చుచు నెంతో సంతోషము కలిగించెను

కం॥ తెమ్మా యీవల్కలల మిట్లు, లిమ్మా కలశంబు నంపు ♦ మిమ్ముగునెడ వే
రమ్మా వత్సా! నే స్నా,నమ్మొం గావింతుఁ బుణ్య♦నదీతీర్థమునన్. ౧౫-౨

వత్సా = చిన్నవాఁడా, వల్కలము = (స్నానముచేయుటకు) నారగుడ్డను, కలశంబుఁ = నీటపాత్రను, ఇమ్ముగునెడఁ = తగినచోటను, పుణ్యనదీతీర్థమునఁ = పుణ్యముగలిగించు నదీనీటియందు. నే స్నానమ్మొం గావింతుఁ = (మధ్యాహ్నకాల మతిక్రమింపఁబోవుచున్నదికావున) నే నిందే స్నానము చేసెదను. గంగకుఁబోవ నవకాశము లేదని భావము. 1-12 వఱకే మాధ్యాహ్నికకర్మముల కధికారము. ఆవల నపరాహ్ణము. పగటికాలమును నైదు భాగములుచేసిన నందలి మూఁడవభాగము మధ్యాహ్నము.

తాత్పర్యము.

నాయనా! యీ స్నానశాటిని సంగిమ్ము. కమండలువున బదిలముగ నొకచోట నంపుము. ఈ పుణ్యనదీతీర్థములందు నేను స్నానము చేయవలయును. శీఘ్రముగ రమ్ము.

కం॥ అని పలుకుచు వల్కలముఁ, ఘనుఁడు భరద్వాజుఁ డియ్యఁ ♦ గైకొని యతధీ
ఖని యీర! సంచరించుచు, వనసీమఁ విపులవిటపి♦వారోద్దామన్. ౧౫౩

ఘనుఁడు = (గురుభక్తిచేత) గొప్పవాఁడు. యతధీఖని = నియమితమైన బుద్ధికి గనియైనవాఁడు. విపుల = విశాలమైన, విటపివార = వృక్షసమూహాము చేత, ఉద్దామఁ = ఎక్కువైన, వనసీమఁ = వనప్రదేశమందు, యతధీఖని సంచరించుచు = నారదమహర్షివలన నేను పాపహారమైన గొప్పవిషయమును

వింటిని, ఇది నాలోనే సమసిపోవలయునా? మధురాహారమొక్కడే తినరాదు గదా! నే నొక్కడనే బాగుపడిన నెంత? బాగుపడకున్న నెంత? లోకము బాగుపడుటకదా ప్రధానము లోకమునకు దీనిని దెలుపుట యెట్లని యాలోచించుచు మధ్యాహ్నము మించిపోవనుండుటయుఁ గూడఁ దెలియక పాదప్రచారము చేయుచుండెను. ౫౮-ఆశ్చర్యార్థకము. జితేంద్రియుఁడైన వాల్మీకికిఁగూడ వనసౌందర్యము చూచి సంతోషింపఁ గోరిక పుట్టెగదా యని యాశ్చర్యము - ఆహా దైవతంత్రము.

తాత్పర్యము.

అని చెప్పుచు గురుభక్తిపూర్ణుఁడైన యాశిష్యుఁడు స్నానశాటి యీయఁగైకొని నారదోపదేశము వెలిపించి లోకమునెల్ల బాగుపఱుతునా యని యాలోచించుచు మధ్యాహ్నము మించనుండుట దైన మనస్సునకుఁ దేక పెద్దవృక్షములుగల యావనమందు మెల్లగ సంచారము చేయుచుండెను. భగద్విషయ విచారసమయంబునఁ గర్మభంగదోషము లేదు. 'యస్మిన్ కాలే విశాలాక్షి, యస్య యత్కర్మ చోదితమ్। తత్కాలే కర్మతత్త్యక్త్వా, మాముపాస్తే నరో యది।నదోష స్తత్ర దేవేశి, భవత్యేవ నసంశయః। రథ్యాంగతేచ దేవేశే, అస్థానం చాస్థితే సతి, మధ్యేసంధ్యా మనుప్రాప్తాం, దృష్ట్వా వేదార్థమోహితాః। సంధ్యోపాస్తిం ప్రకుర్వంతి, విప్రా విష్ణుపరాఙ్ముఖాః। శ్వానయోని శతం ప్రాప్య, చాండాలీం యోని మాప్నుయుః. — వరాహపురాణము.

అర్థము.

ఎవఁడేకాలమం దేకర్మము చేయవలయు నని చెప్పఁబడెనో ఆకాలమందు దానిని విడిచి నా యుపాసనము చేసెనేని వానినాకర్మము విడిచినదోష ముంటదు. దేవీ! సందియములేదు విష్ణుపరాఙ్ముఖులైన విప్రులుకొందఱు వేదార్థమోహితులై 'త్రైగుణ్యవిషయావేదా' యని యెఱుఁగక నేను వీథులలో నున్నపుడుగాని యస్థానమందున్నప్పుడుగాని సంధ్యావేళయయ్యెనని నాసేవవదలిపోయి సంధ్య వార్తురు. ఇట్టివారు నూఱుజన్మములు కుక్కలుగాఁబుట్టి పిదపటఁ జండాలయోని జనింతురు. ఇది భగవంతుని బ్రధానముగా నెంచిన భాగవతులలక్షణము. భగవంతునికంటెఁ గర్మము బ్రధాన మనుకొనువారు కొందఱు గలరు. కర్మము లచేతనము లనియుఁ, గర్మఫలదాత భగవంతుఁడేయనియు నచేతన కర్మనిష్ఠకంటె భగవన్నిష్ఠ శ్రేష్ఠమనియు వా రెఱుంగలేరు.

* బోయ క్రౌంచపక్షిని వధించుట వాల్మీకిమహర్షి చూచుట. *

కం॥ అంచితచారుస్వనమై, చంచచ్ఛద మగుచు సురతసంగతిఁ గడురా
ణించెడి విరహాసహన, క్రౌంచద్వంద్వంబు మానిసకనెఁ జేయలఁతిన్. ౧౫౪

మౌని=వాల్మీకి, అంచిత = ఒప్పునట్టి, చారు = మనోహరమైన, స్వనమై= (సురతకాలమునఁజేసెడు) కంఠధ్వని గలదై, చంచత్ + ఛదము=కదలుచున్న ఱెక్కలు గలది, సురతసంగతిఁ = సంభోగాసక్తమైన కూజితతో. రాజించెడి = మనోహరమైయుండు, విరహ + అసహన = ఎడఁబాటు నోరువని, క్రౌంచద్వంద్వమున్ = భార్యాభర్తలగు క్రౌంచపక్షులను, క్రౌంచజాతిలో భార్యాభర్తలు క్షణకాలమైనఁ బాయుటలేదని లోకప్రసిద్ధి చేయలంతిఁ = సమీపమునందు, క్రౌంచము ప్ర॥ వికృతి -క్రొంచ.

తాత్పర్యము

ఇట్లు సంచరించుసమయమున సమీపమందు సురతకాంక్షచే ఱెక్కలు విచ్చి మనోహరముగఁ గూయుచు వియోగము సహింపలేని క్రౌంచపక్షులు పోతు పెంటి కలిసియుండుట చూచెను.

ఆ॥ వానియందు నొక్క•దానిని మగపక్షిఁ, గూఁడి వైరిబుద్ధి• గూళయెఱుకు
పాపనిశ్చయుండు • తూపునొక్కటి దొడి,తానెఱు చుచున్న•నైన నఱక.౧౫౫

పాపనిశ్చయుండు = ఆపక్షుల సంభోగసమయమును లక్ష్యముచేసి చంపునంతటి క్రూరమైన మనస్సుగలవాఁడు కూళయెఱుక = క్రూరుఁడైన బోయ. ఉఱక = లక్ష్యముచేయక, వైరబుద్ధిఁ=సకలజంతువులయందు నెండుసహజమైన ద్వేషబుద్ధిచేత, గీ॥ కసవుచే నీటచే మోకలసచేత, ద్రుదుకు మృగ మీన సజ్జన ప్రకరములకు, శబరధీవరసూచకజనలు జగతిఁ, గారణములేని పగవారు గాదె తలఁప'-భర్తృహరి తూపున్ = బాణమును, తొడి = సంధించి, 'ఉపకారఫలం మిత్ర మపకారోరిలక్షణ' మ్మని కిష్కింధాకాండము. ఉపకారముచేయుట మిత్రలక్షణము. అపకారము చేయుట శత్రులక్షణము.

తాత్పర్యము.

ఇట్లు తాను జూచుచున్నను లక్ష్యముచేయక సహజముగ జంతువుల హింసించుటే స్వభావముగఁ గల యాదయలేని బోయవాఁడు పాపమునందు స్థిరపడిన బుద్ధిగలవాఁడగుటచే నారెండుపక్షులలో మీఁదనుండు మగపక్షిని బాణముచే నేలఁ బడఁగొట్టి చంపెను.

కం॥ అంతటఁ గనఁగొనె ముని భగ,వంతుఁడు బహుళాస్రపూర•పరిమగ్నంబై
చెంతయు మెడ వ్రేలాడ, జ్వంతం బడి పొరలుచున్న • నీడోద్భవమున్.౧౫౬

బహుళ = అధికమైన, అస్ర = నెత్తుటియొక్క; పూర = ప్రవాహమున, పరిమగ్నంబై = బాగుగ మునిఁగినదై, చెంతన్ = దగ్గఱ; నీడ + ఉద్భవమున్ = (గూఁటియందుఁ బట్టినదానిని) క్రౌంచపక్షిని, భగవంతుఁడు — శ్రీ,

జ్ఞానము, వైరాగ్యము, యశస్సు, వీర్యము, ఐశ్వర్యము యీ ఆటికి భగమని పేరు. ఇవికలవాఁడు-కనుకనే శాపానుగ్రహసమర్థుఁడు - ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియ, జ్ఞానవైరాగ్యయోశ్చైవ, షణ్ణాంభగ ఇతీరణా.

తా త్ప ర్య ము.

అట్లు నేలఁబడి మెడప్రేలవైచి నెత్తుటివెల్లువయందు మునిఁగి తనసమీపమందే పొరలాడుచు మరణావస్థయం దున్న యామిగపక్షిని జూచెను.

క॥ ఎత్తఱిచేనిం బాయక, హత్తిలి నెయ్యమున వెంట ♦ నంటెడుమగనిన్
మత్తిల్లియున్నవానిని, నెత్తురు ముంపఁగ శిరంబు ♦ నేలం బొరలన్. ౧౧౭

క॥ విలవిల మని ప్రాణానిలములుఁ గూయుచు వివృతవక్త్రమును గలకాంతున్
జలజలఁ గన్నుల నీళ్ళులు,సెలఁగం గనికూసెఁ బెంటి♦క్రౌంచమువగచేన్. ౧౧౮

ఈరెండుపద్యములకేకాన్వయము - పెంటి = ఆఁడుపక్షి. ఏతఱిన్ = ఏసమయమందునైన, హత్తినెయ్యమునన్ = వదలని స్నేహముచే, స్నేహశబ్దభవము నెయ్యము, మత్తిల్లి=సంభోగమున మైమఱచి, ప్రాణ + అనిలములన్ = ప్రాణవాయువులను, వివృతవక్త్రము = తెఱవఁబడిన నోరుగల, కాంతున్ = ప్రియుని, ఉరలన్ = రాలఁగా, నీళ్ళులు = ఇట సంశ్లిష్ట బహువచనముపై బహువచనము కానంబడియెడి. కొన్ని బహువచనాంతనామంబులమీఁద బహువచనం బగు సు-వ్యా-ఆచ్ఛి-౨౫సూ.

తా త్ప ర్య ము.

ఆహారనిద్రావిహార సమయములందైనను రేయైనను బగలైనను స్నేహముచే దనవెంటనే తిరుగుచుండువానిని, సురతానందముచే మైమఱచి సమీపమందు వోయయుండుటయైన గమనింపనివానిని, ప్రేటుపడి నెత్తుట మునిఁగి శిరము నేలఁబడి పొరల విలవిల తన్నుకొనుచు ప్రాణవాయువులు వెడలిపోఁగా నోరుతెఱచి యున్న మగనిఁ జూచి యాఁడుక్రౌంచము దుఃఖముచేఁ గన్నీళ్ళు రాలఁగ విస్వరముతోఁ గూయసాగెను.

ఉ॥ ఎంతయుఁ గీచుకీచు మని ♦ యీరెలుఁ గొప్పఁగఁ గూయుచున్, ధవుం
జెంతను వ్రాలి చంచువునఁ జీఱుచు, బోయకు నుల్కిపాఱుచున్,
బొంతను గొమ్మవ్రాలి నిజ♦పూరుషుఁ జూచుచు, నేడ్చుకాంత నే
కాంతము చూచి నేలపయిఁ ♦ గ్రౌంచము గూలుట కాంచి యాత్మలోన్. ౧౧౯

ఎంతయున్ = మిక్కిలి (తెలివిలేక). ఈరెలుఁగు = సన్ననిధ్వని- ఈరు = అల్పము. ఇట్లు ఈరెండ. చంచువునన్ = ముక్కుతో; చీఱుచున్ = గీఱుచు; ఉల్కిపాఱుచున్ = భయపడి పరువెత్తుచు; పొంతను = సమీపమున; నిజ

పూరుషుఁ = తన మగనిని, పోతుపక్షిని. ఏకాంతము = ఏకాగ్రమనస్సుతో. (ఏక + అంతము=ఒక తేకొనగలది). ఏప్పుకాంత నేకాంతము చూచి యనటచే చచ్చిన మగపక్షియవస్థకంటె వియోగమున దుఃఖించు నాఁడుపక్షిదురవస్థ వాల్మీకికి నధికసంతాపము కలిగించెను. 'లేబరముగాదె యిల్లాలులేని బ్రదుకు' 'అసారే దగ్ధసంసారే, సారం సారంగలోచనా' 'నానానారీ నిష్ఫలా లోకయాత్రా' యన్నట్లు భార్యను విడనాడి నిస్సారమై శూన్యప్రాయమైన సంసారమునఁ బడియున్న రామచంద్రమూర్తియవస్థకంటె వియోగతాపమునఁ దపించు సీతాదేవి దురవస్థయేకదా వాల్మీకిని గరఁగించి రామాయణము రచింపఁజేసినది.

తా త్ప ర్య ము.

కీచుకీచు మని సన్ననిధ్వనితో తెలిపిలేక కూయుచు సమీపమందు వ్రాలి ముక్కుతో గీరుచు బోయవాఁడు రాఁగా వానికి భయపడి యెగిరిపోయి సమీపమందున్న కొమ్మమీఁద వ్రాలి తన మగనిఁ జూచుచు నేడ్చుచుండు నాఁడుపక్షిని తదేకధ్యానముతోఁ జూచి మగపక్షి నేలమీఁదఁ బడియుండుట చూచి తన మనస్సులో.

ఆ॥ కరఁగి ధర్మవిదుఁడు ♦ కడువగఁ దత్కృతి, నెఱికి దూర మగుట ♦ నిశ్చయించి
భ్రుకుటి వికటముగను♦రోష తామ్రాక్షుఁడై, కఱకు టెఱుకుఁజూచి♦కరుణమాలి. ౧౬౦

ధర్మవిదుఁడు = జంతుహింస కులధర్మముగాఁగల బోయలైనను జంతువుల నెప్పుడు హింసింపవచ్చును, ఎప్పుడు గూడ దను ధర్మరహస్య మెఱిఁగిన వాల్మీకి. కరఁగి = మనస్సు నీరుకాఁగా, తత్ + కృతి = ఆబోయవాఁడు అసమయమునఁ బక్షిని హింసించుట, నెఱిక = న్యాయమునకు, భ్రుకుటి = కనుబొమ్మలు, వికటముగను=భయము గలిగించునట్లు, వ్యత్యస్తముకాఁగా, రోష తామ్ర అక్షుఁడై = కోపముచే నెఱ్ఱనైన కన్నులుగలవాఁడై, కఱకు + ఎఱుకు — నిర్దయుఁడైన బోయను, కరుణమాలి = (బోయనివిషయమున) దయ వదలి.

వ్యా క ర ణ ము.

కఱకు + ఎఱుకు — కర్మధారయంబులం దుత్తున కప్పుపైఁ గునపుకు టు గాగమం బగు. సు.వ్యా. సం.౫౭ సూ. తామ్రాక్షుఁడు — బహువ్రీహిని అక్షిశబ్ద మకారాంత మగు. సు.వ్యా. సమా. ౬౭ సూ.

తా త్ప ర్య ము.

వేఁటలయందును జీవహింస కులవృత్తిగాఁగల వేఁటకాండ్రనుష్ఠింపవలసిన ధర్మముల నెఱిఁగిన వాల్మీకి, పోతు పెంటి కలిసియుండుసమయమందు కొట్టుట

ధర్మముకా దని నిశ్చయించి కనుబొమలు ముడివడఁ గన్ను లెఱ్ఱన గాఁగాఁ గ్రూరుఁడైన బోయవానియందు దయవిడిచి యిట్లు వాని శపించెను.

'తే॥ కుటిలబుద్ధుల గెలువంగఁ గుటిలమతియ, యర్హ మగుఁగాని నీతి గా దార్జవంబు.' అన్నట్లు క్రూరునియందు దయతప్పుట దోషముగాదు. పాండురాజిట్టిదోషము చేయుటచేఁగదా కిణిందముఁ డను ముని శపించెను.

—♦ వాల్మీకిమహర్షి బోయను శపించుట ♦—

తే॥ తెలియు మా నిషాదుండ! ప్రతిష్ఠనీక, ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనములఁ
క్రౌంచమిథునంబునందు నొక్కండు నీవు, కామమోహితముం జంపు కారణమున. ౧౬౧

నిషాదుండ = ఓరీ బోయవాఁడా! కామమోహితమున్ = కామముచేత మోహమును జెందినదానిని - కామముచేఁ బరవశమైనదానిని. క్రౌంచమిథునంబునందున్ = క్రౌంచపక్షిజాతి వగు భార్యాభర్తలలో, ఒక్కండున్ = ఒకదానిని (మగపక్షిని); చంపు కారణమునన్ = చంపుట యను హేతువుచేత, శాశ్వతహాయనములన్ = అనేకసంవత్సరములయందు, ప్రతిష్ఠ = జీవించియుండుట, 'ప్రతిష్ఠా స్థితిమాహాత్మ్యే' యని వైజయంతి. నీకు, అప్రాప్తమయ్యెడున్ = లభింపక పోవునుగాక. ప్రతిష్ఠ నీకు, అప్రాప్తమయ్యెడు నని పదవిభాగము. అనేకసంవత్సరములు జీవింపక త్వరలోనే చచ్చెద నని భావము. తెలియుమా = ఈవిషయమును దృఢముగాఁ దెలిసికొనవలసినది. ఇట్లని వాల్మీకి యభిప్రాయము.

ఇదియే రామాయణము వ్రాయసంకల్పించిన వాల్మీకినోరి వెలువడిన ప్రథమశ్లోకము. బ్రహ్మానుగ్రహమున రామాయణమునకు బీజభూతముగఁ దొలుతొల్త వెలువడిన యీ శ్లోకము కేవల దారుణశాపోక్తిగ నుండఁజాలదనియు, 'మనాగ్వ్యార్థసూచనఃప్యసి కావ్యార్థము కొంతయైనఁ గలదై మంగళశ్లోకముగ నుండు ననియు యాలోచించి కృతిభర్తయు భగవంతుఁడు నైన శ్రీరామచంద్రుని మంగళాశాసనముగను గావచ్చు నని పూర్వు లిట్టి యర్థము వచించిరి.

ఎట్లన — మానిషాదుండ=లక్ష్మికి నివాసస్థాన మగు శ్రీనివాసుఁడా- శ్రీరాముఁడా, కామమోహితమున్=సీతావిషయమునఁగామముచేమైమఱచినవానిని, సీత నపహరించిన వానిని. దీనిచే రావణుఁడు సీతను గామకుఁడై యెత్తికొనిపోయెనే కాని కొందఱు చెప్పునట్లు భక్తిభావనచేఁ గా దని తెలియనయ్యెడి. "తతస్తస్మిన్నినాదినిధనే, పరబ్రహ్మభూతే భగవ, త్యనాలంబిని కృత మనస్తల్లయం దశాననత్వే ప్యనంగపరాధీనతయా జానకీసక్తచేతసో దాశరథిరూపధారిణస్తద్రూపదర్శనమేవాసీత్ నాయ మచ్యుత ఇత్యాసక్తిర్విపద్యతోఽంతఃకరణస్య మానుషబుద్ధిరేవ కేవల మస్యాభూత్." (విష్ణుపురా. ౪-౧౫.) దీనివలన రావణునకు శ్రీరా

ముఁడు నారాయణుఁడని తెలిసి యాయనచేఁ జావఁగోరి, సీత లోకమాత యని తెలిసి హరించె ననునవి యెల్లఁ బొల్లుమాటలుగ నెఱుంగ నగు. ఈవిషయము వేఱొకచో విపులముగఁ జర్చింపఁబడును. క్రౌంచమిథునంబునందుఁ=రాక్షస జాతివారగు మండోదరీరావణు లను భార్యాభర్తలలో, క్రౌంచము=కుటిలస్వభావముగల- క్రుంచగతి కౌటిల్యాల్పీభావయో యని ధాతుపాఠము. ఒక్కండుఁ= ఒక్కరావణుని, చంపు కారణమునన్, శాశ్వతహాయనములన్, ప్రతిష్ఠ = మాహాత్మ్యము, నీక = నీకే- నిశ్చయార్థికము, ప్రాప్తమయ్యెడుఁ=లభించును.

కాముకుఁడగు రావణునిఁ జంపి లోకముల సంరక్షించుటచేత నీకుఁ దప్పక శాశ్వతకాలము జయముగలిగి వర్థిల్లుదువుగాక యని భావము.

ఇట్లీపద్య మిష్టదేవతాస్మరణరూపము కావున మంగళరూప మగును. ఈ పద్యమున నుత్తరార్థము పూర్వార్థమునకుఁ గారణముగాఁ జెప్పఁబడినది కావున వాక్యార్థహేతుకకావ్యలింగ మను నలంకారము. ౧౬ వ పద్య వ్యాఖ్యయుఁ జూచునది.

వ్యాకరణము.

మధ్యమపురుష ము వర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోప ము విభాషనగు. సు.వ్యా. ౭౯సూ. సంధి ప్రకారము తెలియు + మానిషాదుఁడ అనుచో ము వర్ణకము లోపించి 'తెలియు' అని మిగిలెను.

ఛందస్సు.

ప్రతిష్ఠ నీక।ప్రాప్తమయ్యెడు ననుచో నొక యర్థమున నీకు అప్రాప్తమయ్యెడు నని పదవిభాగము చేయఁబడెను. అటుచేసినపుడు 'ప్రా' యను సంయుక్తాక్షరము నకు ముందుండు 'క' గురువు కావలదా? అట్లైనచో ఛందోభంగము కాదా యను సందేహము గలుగవచ్చును. అట్టి సందేహమున కాకరము లేదు.

సర్వలక్షణసారసంగ్రహము.

"గీ॥ సంస్కృతపదంబు లొగి సమాసములు గూర్చు। నపుడు క్రారనగూడిన యక్కరంబు। లూఁదియుండు నొక్కొక్కచో నూఁదకుండుఁ। దెనుఁగుఁ గృతుల యందు సామజాజినని చోళ."

లక్ష్యములు.

ఉ॥ కావునఁ గామక్రోధములఁ గ్రాఁచుచు నాశ్రితకోటిఁ గాచుచున్. —శాంతిపర్వము.

సీ॥ సంధ్యాభివందన శ్రద్ధయుజ్జన సేయు । గీతవాద్యవినోద క్రియలఁ దగులు. —కాశీఖండము.

చం॥....... ... . గురుండుగాఁ
డె నరవరేణ్య ధర్మప్రకటీకృతచిత్తుఁడు శాంతమూర్తి. —ఉద్యో.
చం॥ కృపకృతవర్మలం గడిమిఁ గిట్టి శిఖండి ప్రభద్రకుల్ మహో.
—శల్యపర్వము.

శ్లో॥ సంయుక్తే సంస్కృతాద్యస్యా, త్పర మాంధ్రపదం లఘుః
భవే దాద్యసమాసేపి, రేఫయోగా త్పదం తథా
పదాపిచ తథా త్వం స్యాత్, క్వచిన్నైవ సరేఫకే
సర్వాస్వపిచ భాషాసు, రహయుక్తేక్షు రే పరే
పూర్వవర్ణస్య లఘుతా, చేష్టా మల్పాదికేపిచ —అథర్వ.
ప్రాప్తనాభిహ్రదనిమజ్జన మితి. . . —మాఘకావ్యము.
ఇవిగాక.
ఉ॥ వైచిన ప్రత్యయార్థముగ వాఁ డతిప్రీతి భుజింపఁబోయినన్
—భోజ. ౨ఆ. ౧౮౮ ప.

కం॥ వేంకటవరదుఁడు వెలయు ని,రంకుశ వితరణనిరూఢప్రజ్ఞను రణని
శ్శంకితప్రాభవమున నక,లంకితకీర్తిప్రతాపలక్షులమహిమన్. రా. పాం. ౧ ఆ.

౧. తెనఁగుశబ్దముమొదటిసంయుక్తవర్ణమునకు ముందుండు నక్షరము.

౨. సంయుక్తమైనసంస్కృతాక్షరమునకు ముందుండు నాంధ్రపదవర్ణము.

3. సంస్కృతసమాసమందుఁ బదంబుమీఁది రేఫసంయుక్తవర్ణమునకుఁ బూర్వాక్షరము వైకల్పికముగ.

౪. అద్రుచు - విద్రుచ్చు - పద్రుచ్చు - చిద్రుపలు - ఇగ్రుచు శబ్దంబుల సంయుక్తాక్షరమునకుఁ బూర్వాక్షరములును గురువులు కావు.

కతకవ్యాఖ్య యెట్లనిన.—

నిరతాం సాదయతీతి నిషాద యని వ్యుత్పత్తి. ముల్లోకములను మిక్కిలి బాధించువాఁడా యని సంబోధనము. కామమోహితమున్ = భర్తయందలి ప్రేమాతిశయముచే మైమఱచిన క్రౌంచమిథునంబునందు, రాజ్యనాశవనవాసములవలనఁ గలిగిన దుఃఖముచేఁ గలఁగిన సీతారాములయందు. "క్రుంచకౌటిల్యాల్పభావయోః" యని ధాతుపాఠము. ఒక్కఁడు = ఒక్కసీతను. వనమొక్కఁడు పులియొక్కఁ డన్నట్టు సామాన్యనపుంసకము. చంపుకాలిమునన్ = చావుతో సమాన మగు భర్తృవియోగదుఃఖమును గలిగించుట యను హేతువుచేత, శాశ్వతసంవత్సరములయందు నీకు ప్రతిష్ఠ యశాశ్వత మగు నని యన్వయము. ప్రతిష్ఠ బ్రహ్మ యనుగ్రహించినట్లు పుత్రపౌత్రాదులతోడి సుఖజీవనము.

'ఈవ్యాఖ్యాన మంగీకరింపఁదగినది కాదు. ఈశ్లోకము రావణవధానంతరము రామపట్టాభిషేకానంతరము చెప్పఁబడినది. మరణించినరావణుని శపించుట యన నెట్టిది ?' అని తిలకవ్యాఖ్య కతకాభిప్రాయమును బూర్వపక్షముచేసి తన యభిప్రాయ మిట్లు చెప్పుచున్నది.

ఈ పద్యమునఁ గావ్యార్థము సూచింపఁబడలేదు. కవి కట్లుచేయుతలంపును లేదు. బ్రహ్మ వచ్చి రామాయణము రచింపు మని యాజ్ఞాపించినపిమ్మట నట్టి తలంపు గలిగెనుగాని తత్పూర్వ మట్టితలంపు లేదు. కావున నట్టి యర్థము నిచ్చు శ్లోకమును జెప్పె ననుటయుఁ బొసఁగదు. అట్లు కావ్యార్థమును సూచించు తలంపు గలిగెనేని బోయవాఁడుచేసిన యధర్మకార్యమునకుఁ గోపము శోకము గలిగి శపించువాక్యమందా యట్టి రెండవయర్థము కుదుర్చును? ఇంతకు శ్లోకరూపముగఁ దనశాపోక్తి యుండవలయు నను తలంపును వాల్మీకికి లేదు. ఏల ? తా నూరక నోరికి వచ్చినట్లు దూషించినవాక్యము శ్లోకముగఁ బరిణమించెనే, యిది యేమి చిత్ర మని యాయనయే యాశ్చర్యపడెఁగదా. కావునఁ గావ్యార్థ సూచన ముద్దిష్టము గాదు. కావున దీని యథార్థభావ మేమనఁగా:—

వాల్మీకి నారదునివలన రామవృత్తాంతము సర్వము నెఱింగి యాతని చరిత్ర రచింపఁబూనినపుడు శ్రీరాముఁడు కరుణారసపరిపూర్ణమైన తనచరిత్రను వ్రాయఁబూనినవాఁడు మిక్కిలి కరుణము గలవాఁడై యుండవలయు నని యెంచి వాల్మీకికరుణను బరీక్షింపఁగోరియుఁ బూర్వము భృగుమహర్షి యిచ్చినశాపము స్థిరపరుపఁగోరియు వ్యాధరూపంబు ధరించి వాల్మీకి చూచుచుండఁగనే యలక్ష్యముగ నొకరాక్షసుఁడైన క్రౌంచపక్షిని జంపెను. ఋషి దానిం గని తెలియుమా యను పద్యప్రకారముగ శపించెను. ఈపద్యమున కర్థము శాపపరముగ మొదట వ్రాసినట్లె. నీ వెట్లు మగపక్షినిఁ జంపి యాఁడుపక్షిని భర్తృహీనఁజేసితివో మగపక్షికిని భార్య లేకుండఁజేసితివో యట్లే నీవును నీభార్య లేక యుండవలెను, నీ భార్యయు భర్తలేక యుండవలయును, అని యీ పద్యముభావము. ఆ పక్షి రాక్షసుఁ డని యెట్లు తెలియు ననిన మీఁద బ్రహ్మ వరమిచ్చినపిదపఁగూడ 'దానియందు నొక్క దానిని మగపక్షి వైరబుద్ధి' (వైరనిలయ యని సంస్కృతమున) యనుపద ముపయోగించుటచేఁ దెలియుచున్నది. లోకులు రాక్షసులనేకదా వైరనిలయు లనుట. బోయఁడు తన యాహారార్థమై పక్షిని జంపునుగాని వానికి దానియందుఁ బగ యెంతమాత్రము లేదు. రామవృత్తాంతము నెఱిఁగిన వాల్మీకి వైరనిలయుఁ డన్నమాటకు రాక్షసుఁ డనియే యర్థము. పగలేకయును హింసచేయుట, పగలేక యితరుల ప్రాణంబు హింససేయు రౌద్రకర్మము రామభద్రా దొరకొంటివి. ఆరణ్యా. ౧౧౦. అనియు ముందు రాఁగలదు. ఈ యర్థమంతయుఁ గవివాక్యసారస్యమువలననే

యేర్పడుచున్నది. పాద్మపురాణమునను నిరువదినాల్గవ యధ్యాయమున శివ పార్వతీసంవాదమున రామవైభవమును వర్ణించుసందర్భమున నీయర్థము చెప్పఁబడినది. "తతో జానపదః కశ్చి త్సామరః కాష్ఠవిక్రయీ, స్వభార్యాగర్హణ ద్వారా రావణస్య గృహోషితాం, గర్హియామాస వై దేహీం దుర్వృత్తో లోకనిదకః, తచ్ఛ్రుత్వా దేవి చారేభ్యో భీతో లోకాపవాదతః, ఆహూయ లక్ష్మణం ప్రాహ రామో రాజీవలోచనః, శృణు మే వచనం గుహ్యం సీతాసంత్యాగకారణం, వాల్మీకి నాథ భృగుణా శప్తోస్మి కిల లక్ష్మణ, తస్మా దేనాం త్యజా మ్యద్య, జనో నైవాద్య కారణన్" అని కలదు. కట్టెలమ్మి జీవించు పల్లెటూరివాఁ డొకఁడు తనభార్యను దిట్టుటలో సీతాదేవినిఁగూడ దూషిం చెననియు, నది చారులచే విని లక్ష్మణుని బిలిచి రాముఁడు 'లక్ష్మణా! సీతను నడవుల విడిచి రమ్ము. దీనికి జనము కారణము కాదు. పూర్వము భృగు మహర్షియు వాల్మీకియు శపించుటయే కారణము.' అనెనఁట. ఈవ్యాఖ్యాన సంగ్రహ మేమనఁగా:—రాముఁడు మరలఁ దాను వాల్మీకిచే శపింపఁబడఁగోరి బోయవాఁ డయ్యెనఁట. ఇట్లగుటకుఁ గారణము శోకరసపూరితమైన తనచరిత్ర మును వ్రాయుటకుఁ జాలినంత శోకరసము వాల్మీకిమనస్సునం గలదా లేదా యని పరీక్షించుట కఁట. మగక్రౌంచపక్షి రాక్షసుఁ డఁట. ఆఁడుపక్షి యెవ తెయో. కాఁబట్టి యీ పైపద్యమునఁ గావ్యార్థసూచనము లేదు.

ఈవ్యాఖ్యానముపైఁ గొన్ని యాక్షేపములు తోఁచుచున్నవి.

వాల్మీకిరామాయణమునఁ గథానాయకునివిషయము విచారించినపుడు వాల్మీకిరామాయణము ప్రధానమా? ఇతరపురాణములు ప్రధానములా? ఇతరపురాణములు నందు లేని వానిలోఁ బరస్పరవిరోధము లుండు ఘట్టంబుల నేది ప్రమాణము? ఏది యప్రమాణము? పద్మపురాణము లోఁ గట్టెలమ్మువాని మాటను నాధారముగఁ జేసికొన్నమాట సత్యమా? మఱియొకగ్రంథమునం దలి చాకలివానిమాట ప్రధానమా? లోకమునందంతయు నపవాదము నెఱసి యున్న దని వాల్మీకి చెప్పినమాట సత్యమా? రామరాజ్యమునందు జారత్వమే లే దని రామాయణము చెప్పుచుండఁగా చాకలిదాని అంకుపురాణము, కట్టె లమ్ముదాని అంకుపురాణము ప్రమాణముగఁ దీసికొని వాల్మీకి వ్రాసినది యసత్య మనవలయునా? కావున వాల్మీకిరామాయణమున కర్థము చెప్పునపుడు వాల్మీకిరామాయణమే ప్రమాణముగాని యితరగ్రంథములు ప్రమాణములు గాఁ గొనరాదు. భారతములో మార్కండేయుని రామోదంతమునందుఁ గుం భకర్ణుని లక్ష్మణుఁడు చంపినట్లు గలదు. బౌద్ధుల జైనుల రామాయణములందు సీత రాముని సోదరి. పురాణకథలందుఁ బరస్పరవిరుద్ధవిషయములు చెప్పఁ బడినచోటఁ గల్పాంతరవ్యవస్థ యని పెద్దలు సమాధానము చెప్పుదురు.

సత్యము. అంగీకరించితిమి. అట్లైన నీకల్పములో జరిగినదానికి నేదో కల్పములో జరిగినదా మనకుఁ బ్రమాణము? లేక యీకల్పములో జరిగినదా? ఈసంవత్సరాదిపండుగునాఁ డొకయింట నీ యీ వేడుకలు జరిగె నని యందుండి చూచిన వాఁడు చెప్పఁగాఁ, గాదుకాదు పోయిన సంవత్సరమో తత్పూర్వమో యెప్పుడో మఱియొకవిధముగా జరిగె నని చెప్పుట యేమియుక్తి? వాల్మీకిరామాయణమే యాదికావ్యము. ఆదిరామాయణము. దానిని బట్టి వారి వారి మతానుసారముగా నద్వైతరామాయణములు శాక్తేయరామాయణములు బౌద్ధజైనరామాయణములు నానారామాయణములు పుట్టినవి. ఇవన్ని యప్రమాణములనియా నీయభిప్రాయ మందురేమో? అవి ప్రమాణములే యగుఁగాక. కల్పాంతరముల జరిగినవే యగుఁగాక. వాల్మీకిరామాయణమున కర్థము చెప్పునప్పు డవి ప్రమాణములుగాఁ గొనరా దని నాయభిప్రాయము. అనాలోచితప్రక్షిప్తములు పరస్పరవిరుద్ధములు నగువానినెల్లఁ బ్రమాణములుగాఁ గొనుటచేతనే రామచరితమున గందరగోళము పుట్టినది. కావున నీవ్యాఖ్యయందు విషయచర్చ చేయునపుడు వాల్మీకివాక్యములే ప్రమాణముగఁ గొని సిద్ధాంతము చేయఁబడును గాని 'మఱియొకగ్రంథమున నట్లున్నది గావున నీ గ్రంథమునకిది యర్థ' మని చెప్పఁబడదు అయినను బూర్వులు వ్రాసినవిషయము వ్రాసి యాపై స్వాభిప్రాయము దెలుపఁబడును. లోకులు వారి వారికి రుచించినది గ్రహింపవచ్చును. పూర్వవ్యాఖ్యాతల కెట్టి స్వాతంత్ర్యము కలదో యిప్పటి వ్యాఖ్యాతలకు భవిష్యద్వ్యాఖ్యాతలకు నట్టి స్వాతంత్ర్యము కలదుకదా. వాల్మీకి చెప్పినదానిని స్థిరపఱుచుటకుఁ గాను నితరాధారము లుండినఁ దెలుపఁబడును. కాని యందైన నవి ప్రమాణములుగఁ గొనఁబడవు. ఈవిధముగ నర్థగ్రహణము చేసినఁ జిక్కు లనేకములు తొలఁగిపోయి వాస్తవార్థ మేర్పడును. వాల్మీకి రామాయణము సత్యచరిత్ర మని, యందలి విషయములు జరిగినవి జరిగినట్లు తెలుపఁబడిన వని పాఠకులు మనస్సునందుంచుకొనవలయును. తక్కినరామాయణములట్టివి కావు. స్వమతాభిమానమున స్వమతము నుద్ధరింప వ్రాయఁబడినవి.

(1) తన యేడుపుగొట్టుకథను వ్రాయుటకు వాల్మీకి యేడుపుగొట్టువాఁ, కాఁడా యని రామచంద్రమూర్తి పరీక్షించినాఁ డనుట వింతగానున్నది. సీతకు వ్రాసినది సీమకంతయు వ్రాయవలయును గాఁబోలు! జితేంద్రియు లగు మహర్షు లేడుపుగొట్టు లెట్లగుదురు? కరుణాళువు లగుదురుగాని కరుణవంతులుగారు. మఱియు నేడుపుగొట్టయినను గాకున్నను దనచిత్తవృత్తిప్రకారము వ్రాయు

స్వాతంత్ర్య మెందుండి వచ్చెను? ఇంతకు వాల్మీకిరామాయణము శృంగారప్రబంధముగ వ్యాఖ్యాత లందఱు అంగీకరించిరిగాని కరుణప్రబంధముగ నంగీకరింపలేదు. (కరుణ = దయ. కరుణము = శోకము) సీతావియోగము విప్రలంభశృంగారము.

(2) భృగుశాప మొకటి కాచియుండఁగా మరల వాల్మీకిశాప మేటికో తెలియదు. నలకూబరబ్రహ్మలవలె నందు లేని యాసందర్భములు వేఱు. అది మఱియొకచోఁ జర్చింపఁబడును. భృగుశాపవిషయ ముత్తరకాండమున ౧౦౮౦ మొదలు ౧౦౮౮ వఱకుఁ గలపద్యంబులఁ గననగు. భృగుమహర్షిని నరకముల పాలుసేయనొల్లక తానై యంగీకరించిన తిట్టునే మరల నిపుడు తిట్టించుకొనఁ దలఁచె ననుట యెంతసమంజసమో పాఠకులే యాలోచింపవలెను. తనకు భార్యావియోగము కలిగించినకారణమున నీకును భార్యావియోగము కలుగునుగాక యని శపించుట యందొకన్యాయమున్నది. దీనికిని, నీవును మగపక్షిని జంపి యాఁడుపక్షికి దుఃఖము కలిగించితివి కావున, నీవు శీఘ్రకాలమున నాశము గమ్ము అను శాపమున కేమి సంబంధము? కావున రెండవశాపప్రసక్తియే యసంగతము. మఱియొకచిత్రము. చూడుఁడు.

వాల్మీకిరామాయణమునకుఁ దక్కినరామాయణములకుఁ దారతమ్యము తెలియుటకును, యాథార్థ్యమును గ్రహించుటకును ననుకూలపడుటకై కొన్ని విషయంబు లందందు వ్రాయఁబడును. ఈ క్రింద వివరింపఁబడు వినోదకథ యద్భుతరామాయణమునందలిది.

అంబరీషునకు శ్రీమతి యను నొక పుత్రిక కలదు. ఈమె యతిరూపవతి. ఈమె కన్యకగా నుండుసమయంబునఁ బర్వతనారదు లంబరీషుగృహమునకు వచ్చి యాయనచే గౌరవింపఁబడి యిరువురును గామమోహితులై యొకరికిఁ దెలియకుండ మఱియొకరు శ్రీమతిని దమ కిచ్చి వివాహముచేయఁ గోరిరి. మీ రిరువురు రేపు రండు. మీలో నెవరిని నాకూఁతురు వరించునో వానికిచ్చి వివాహము చేసెదను - అని యంబరీషుఁడు చెప్పెను. శ్రీమతి పర్వతుని వరించునేమో యని సందేహించి నారదుఁడు వైకుంఠమునకుఁ బోయి విషయము దెలియఁజెప్పి, దేవా రేపు స్వయంవరకాలమునఁ బర్వతునిముఖము శ్రీమతికి మాత్రము క్రోఁతిముఖమువలెఁ గనఁబడఁజేయు మని కోరును. అట్టులే యగు నని నారాయణుఁడు వరమిచ్చెను. సంతోషముతో నారదుఁడు మరలివచ్చెను. పర్వతుఁ డట్టులే పోయి నారదునిముఖము భల్లూకముఖమువలెఁ గనఁబడఁ జేయుమని కోరెను. అట్టులే యగు నని నారాయణుఁడుచెప్పెను. మఱునాఁడు ఋషీశ్వరులిరువురు సభయం దుండ నంబరీషుఁడు శ్రీమతితోడవచ్చి

యమ్మా వీరిరువురిలో నొకని నీపతిగా వరింపు మనెను. ఆమెయును ఋష్యమాల చేతఁగొని వారిరువురన సమీపించి చూచి గడగడ వడఁకుచు నేమియుఁ జేయఁ జాలక యూరక నిలువఁబడెను. అంబరీషుఁ 'డే మమ్మా యిట్లు నిలువఁబడితివి? ఇరువురు మహానుభావులే నీ కిచ్ఛకువచ్చిన వానిని వరింపు' మనెను. ఆమె 'తండ్రీ! వీ రిరువురిలో నొకరిమొగము క్రోఁతిముఖమువలె నున్నది; మఱియొకరిముఖము భల్లూకముఖమువలె నున్నది. వారిని జూడఁగానే నాకు దేహము కంపించుచున్నది. వారి యిరువురి నడుమ మఱియొక సుందర విలాసపురుషుఁ డున్నాఁడు. ఆయనను నీవు చెప్పవైతివి. ఏమిచేయుటకు నాకుఁ దోఁచినదికాదు' అనెను. అంబరీషుఁడు నివ్వెరపడి యూరకుండెను. వారిరువురు 'మననడుమ మఱియొకఁ డెవ్వఁ డున్నా' డని చేతులతోఁ దడివిచూచిరి. యోగ దృష్టిచేఁ జూచిరి ఏమియుఁ దెలియరాదయ్యెను. అప్పుడు వారిరువు రిది యేమో మాయగా నున్నదని తలఁచి మూఁడవవాఁ డెట్టివాఁ డని యామె నడిగిరి. ఆమెయును, 'నాసుందరుఁడు పదునాఱేండ్ల ప్రాయమువాఁడు, మెఱుఁగులతోడి మేఘమువలె నున్నాఁడు. ఆజానుబాహువు. కమలములవంటి కన్నులు గలవాఁడు. రెండుచేతులు గలవాఁడు నన్నుఁ దన ప్రక్కకురమ్మని సైఁగచేయుచున్నాఁడు. వక్షమున నొకమాలికయున్నది చేతుల ధనుర్బాణములుమాత్రము ధరించియున్నాఁ' డనెను. వా రామాటలు విని యీ మాయావి యెవ్వఁడు? ఇది విష్ణుమాయగా నున్నదే యని యాలోచించుచుండిరి. అంబరీషుఁడు 'మునీంద్రులారా! మీపోకలు చూచినఁ గన్యను వరింపవచ్చినవారిగాఁ గానరాలేదు ఇ వేమిచేష్టలు? కన్యయందు మీ కభిలాష యుండిన ఋజుమార్గమున వర్తింపుఁడు.' అని పలికెను. వారును 'మాయందు వంచనలు లేవు. అవి మీవిద్యలు. ఆచిన్నది యెవరిని గోరిన వారు వివాహమాడుటకు సిద్ధపడియున్నాము. మాయం దేవంచన నీవు కనుఁగొంటి' వనిరి. అంబరీషుఁ డేమియుఁ జేయఁజాలక 'శ్రీమతీ మేమిది యిట్లు చేసెదవు? నీ యిష్టము వచ్చినవానిని వరింపుము' అనెను. ఆమెయు నేమియుఁ జేయఁజాలక ఋషులు శపింతురని వెఱచియు వారు భయంకరాకారములఁగాన వచ్చుటచేఁ జేతిదండను వారినడుమ నున్నవానిమెడ నైచెను. వెంటనే యామె యదృశ్యురాలయ్యెను. ఆమె దీర్ఘకాలముగ విష్ణువును వివాహమాడఁ దపసులు ధారపోయుచుండెను. ఆమెకోరిక నెఱవేఱెను. వెంటనే పర్వతనారదు లిరువురు వైకుంఠమునకుఁ బోయిరి. వారిరాకచూచి 'శ్రీమతీ! నీవుకొంచెము సేపు మఱుఁగున నుండుము. వీరి సాగనంపివచ్చెద' నని వారికెదురుగఁబోయి సగౌరవముగఁ దోడితెచ్చెను. నారాయణుఁజూచి నారదుఁడు నమస్కరించి 'దేవా! యిట్టి వంచన నీకుఁ దగదు మేము వరించినదానిని నీవెట్లు హరించితి' వనెను. 'నారదా! నీవు కామాంధునివలె మాటలాడుచున్నాఁడవుగాని, భక్తునివలె మాటలాడుట

లేదు. నేను చతుర్భుజుఁడనా ద్విబాహుఁడనా? మీరెఱుఁగరా?' యనిన, నిజమని వారు నమ్మి యంబరీషుఁడే తపస్వులైన తమ కీయ నిష్టములేక యేదో మోసము చేసినాఁడని కోపించి యయోధ్యకు వచ్చి, 'యంబరీషా! నీకన్యక నీయ నిష్టములేకుండిన నట్లులే చెప్పియుండరాదా? మాకాశచెప్పి రమ్మని పిల్లను మాయముచేసెదవా? కానిమ్ము. నిన్ను గాఢమైన యజ్ఞానాంధకారము ముంచునుగాక' యని శపించెను. వెంటనే గాఢాంధకార మతనిఁ గ్రమ్మెను. వెంటనే మింటనుండి సుదర్శనచక్రము వచ్చి దానినెల్ల హరించి ఋషులను దఱుమ నారంభించెను. వారు చెడితిమి పడితి మని లోకాలోకముల కెల్లఁ బరువెత్తినను నది వదలినదికాదు. తుదకు వైకుంఠమునకుఁ బరువెత్తి దేవా! పాహి పాహి యని భగవంతుని పాదములపైఁ బడిరి. నారాయణుఁడు వారినిరువుర నూరార్చి 'ఋషులారా! మీరిరువురు నాకెట్లు భక్తులో యంబరీషుఁ డట్టి భక్తుఁడే. మీ రతనిని బాధించిన నేనెట్లు చూచుచుండఁగలను?' అనెను. వారిరువురు 'దేవా! యీమాయ యంతయు నీదేకాని యితరులది కాదు. మేము మోహించిన కన్యను నీవు మోహించి మమ్మిట్లు గోడాడించితివి. కావున నిన్ను శపించెదము. నిష్కారణముగ మాచే నేయంబరీషుని శపింపఁజేసితివో యా యంబరీషునివంశమందే దశరథుఁ డనువానికిఁ గుమారుఁడుగాఁ బుట్టుము. నీవు శ్రీమతి కేరూపముచే మతి విభ్రమముఁ గలిగించితివో యారూపమునే ధరింపుము. ఆకన్యక భూసుతయై జనకరాజుచేఁ బెంపఁబడును. మేము కోరిన కన్యకను మాయచే నీవు రాక్షసునివలె హరించితివి కావున నీప్రియురాలగు భార్యను రాక్షసుఁడు హరించునుగాక. మాకు వియోగతాపము కలిగించితివి కావున నీవును వియోగతాపమున నడవులలో నేడ్తువుగాక'యని శపించిరి. భగవంతుఁడును వారినిఁ గరుణార్ద్రదృష్టినిఁ జూచి మునులారా! మీ శాపమును స్వీకరించితిని. చక్రమా! వీరిని బాధింపకుము. అజ్ఞానాంధకారమా! నేను మనుష్యుఁడుగాఁ బుట్టినప్పుడు నాపైకి రమ్ము.' అనెను. కోపము చల్లారఁగానే పర్వతనారదులిరువురు మిగులఁ బరితపించి 'యయ్యయ్యో! కామవశులమై యెంతటి ఘోరకార్యము చేసితి' మని దుఃఖించి హిమాలయమునఁ దపంబుచేయఁ బోయిరి.

ఇట్టివా ప్రమాణములు? శ్రీ రామావతారంబున భగవంతునకుఁ దన పరత్వజ్ఞానము లేదని చెప్పుటకై కల్పించిన కథ యిది యని యెఱుంగుఁడు. నాట్యరంగమందు వేషధారినటనమువంటిది శ్రీరామనటన మని తలంపుఁడు. పరత్వజ్ఞాన హానిలేదు.

వాల్మీకి బోయను బోయవాఁ డను భావముతో శపించెనా? రామచంద్రమూర్తి యని తెలిసి శపించెనా? బోయవాఁడనియే శపించెనుగాని రామచంద్రమూర్తి యని తెలిసియుండిన శపింపఁడు. ఏల? ఆయనభార్య తనయాశ్రమమందే

దుఃఖించుచున్నది. ఆమెదుఃఖమున కెంతో పరితాపపడుచున్నాఁడు. అట్టివాఁడు మరల నామెదుఃఖమునే మఱింత బలపఱుచునా? శపించినది బోయవాఁడను బుద్ధితో నైనను వచ్చినవాఁడు రామచంద్రమూర్తి గనుక శాప మాయనకుఁ దగిలె నందురా? యదియు నసంగతమే. ఈరాక్షసుఁ డెవఁడు? లోకములో రాక్షసు లందఱు వైరనిలయులా? విభీషణ ప్రహ్లాద బల్యాదు లనేకులు సాధువృత్తులు లేరా? కావున వైరనిలయుఁ డనఁగానే రాక్షసుఁ డనుటయెట్లు? లోక మరాక్షసము చేసెద నని రాముఁడు పూనెనా? పూనకున్న నిష్కారణముగ రాక్షసు నేల చంపెను? చంపెనుబో, భార్యతోఁ గ్రీడించునపుడు ధర్మవిగ్రహమై ధర్మసంస్థాపనమునకు వచ్చిన రామచంద్రమూర్తి చంపునా? చంపుట కదియా సమయము? కావునఁ దిలకవ్యాఖ్యాన మంగీకార్యము కాదు.

బోయలకు జంతుహింస సహజకర్మముకాదా? వా రెట్లు వైరనిలయు లైరన బోయను వాల్మీకి వైరనిలయుఁ డనెను. నిలయమనఁగా నిల్లు. ఒకయింట మనుష్యులెట్లు వాసము చేయుదురో యట్లే జంతువులవిషయమున వైరగుణము వీరి యందుఁ గాఁపురము చేయుచున్నదని, యనఁగా నది వానికి సహజమని భావము. వైర మనఁగానేమి? 'అపకారోరి లక్షణ' మ్మని శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు లపకారముచేయుటే వైరిలక్షణము. ప్రాణము తీయుటకన్న నపకార మేదిగలదు? కావుననే భర్తృహరి 'శబరకైవర్తసూచకజనులు జగతిఁ, గారణములేని పగవారుగాఁ దలఁప' నని చెప్పెను. మిత్రులు శత్రు లుదాసీను లను మువ్వురిలో బోయలు బెస్తలు దేనిలోఁ జేర్పఁ దగుదురు? అదియునగాక, ఏనఁగును సింహము, గుఱ్ఱమును గాఱెనుపోతు, ఆవులను బులి, ఎలుకలను బిల్లి, ఏల చంపును? 'కంఠీరవో గజరిపుః సింహదృష్టిర్మృగాధిప, లులాయో మహిషో వాహద్విషత్కాసరసైరిభాః॥' గజరిపు, వాహద్వేషి, యీశబ్దముల కర్థమేమి? ఋష్యాశ్రమములఁ బులులావులు గలిసి సహజవిరోధముఁ బాసియుండునందు రే యెట్లుపొసఁగును? 'అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగ' యని పతంజలియుఁ జెప్పెఁగదా! 'సమోహం సర్వభూతేషు' అని కృష్ణుఁడు చెప్పెనగదా. దైత్యారిశబ్ద మెట్లు సార్థకము? 'జ్ఞాతిశ్చేదనలేన కి' మ్మని జ్ఞాతులు సహజవైరులు గారా? వైరనిలయుఁడనఁగా సహజవైరియనియే యర్థము. కావ్యార్థసూచనము వాల్మీకియుద్దిష్టము గాదనుట మాకును సమ్మతమే. సీతాదేవి కపకీర్తి యెట్లు పాపుదునా యనిమాత్ర మాయనకుఁ దలం పుండవచ్చును గాని యది కార్యరూపముగఁ బరిణమింపలేదు. ఈసమయమున నప్పటికి నాందిశ్లోకమైన వ్రాసినవాఁడు కాఁడు. కాఁబట్టి, తిట్టును దీవనను నొక శ్లోకములోఁ జెప్పవలసిన యావశ్యకము కలుగలేదు. ఇంతకుఁ దాను దిట్టినది శ్లోకరూపముగ నున్నదని తిట్టునపుడును దెలియదు. తిట్టినపిమ్మట నంతయుఁ గలిపిచూడ శ్లోకముగా నుం

డెను. శ్లోకముగానుండుటయేకాక యది గేయము నయ్యెను. అంతియగాక తా నుద్దేశింపని యర్థమును గలదయ్యెను ఇది యాయన యాశ్చర్యపడుటకుఁ గారణము. ఆయన యుద్దేశింపనిది యాయననోర నెట్లువచ్చు నందురా? వరము కోరువేళఁ గుంభకర్ణునినోర నిద్ర యనుమాట యెట్లువచ్చెను? ఆ సరస్వతియే యిచ్చటను గలదుగదా. అంతియకాక మనము మాటలాడునపుడును మనమాటలకు మన ముద్దేశింపని యర్థముఁ బరులు సూచింతురు. కథాసరిత్సాగరమున 'మోదకైస్తాడయ' యన్న నాయిక తన్ను లడ్డుంటతోఁ గొట్టుమని యుద్దేశించి చెప్పెనా? ఉయ్యాల యూఁగు ముక్కుతిమ్మన్న తెనాలి రామలింగకవిని నూఁచుమన్నప్పుడు తన ముఖమున నతఁ డుమ్మివేయు నని యూహించెనా? శివు నుద్దేశించి శ్రీనాథుఁడు శీమఖండమున వ్రాయునపుడు 'మహాగ్రామసింహాసనస్థుని' నని యశ్లీల ముద్దేశించి వ్రాసెనా? 'సీతలఁ జేను గంటి', 'సీరువట్టులవడ,' 'సుఖంబగుచే రలికేళి జిహ్వాకుర్ణ,' 'ఉసిరికకాయ లంతలుపయోధరముల్ దిగజారుచుండఁగన్'—కాశీఖండము- అను తిక్కన శ్రీనాథుల వాక్యములకు విపరీతార్థము వారు సంకల్పించి వ్రాసిరా? కాఁబట్టి కొన్నికొన్ని వేళల మనమాటలకు మన ముద్దేశింపని రెండవయర్థము పొసఁగుట విపరీతముగాదు. ఇప్పుడు నశ్లీ లయూహించునది. బాలకాండ మని వాల్మీకి పేరుపెట్టినప్పుడు బాలకి + అండము అని పదచ్ఛేద మాయన యుద్దిష్టమా? ఈ రామాయణమందే యిట్టివి కొన్నిగలవు "తే॥ కోర్కులు భంగపు మత్స్యంబు గ్రోలుకృత్య। మఖిలమును దీర్పు మేఁ బోదు మాతుఁడు గాఁగ। రామవిభుఁ డక్షయంబుగ రమణిసీతఁ। బొంగఁగలుగును నీకెడఁ బొగలవలదు॥" యుద్ధ. ౧౮౦౫. 'చనుమా। కుఫు ఎథాస్థమై మదనసేచరయుక్తుఁడు రాము మీఁదికిన్' యుద్ధ. ౧౦౦ 'పద్యములందుఁ గుంభకర్ణుఁడు రావణుఁడు నుద్దేశించిన దేది? నోరవచ్చిన దేది? భవభూతి యుత్తరరామచరిత్రమందు శ్లో॥ లౌకికానాంహి సాధూనా, మర్థంవా గనువర్తతే। ఋషణాం పునరాద్యానాం, వాచమర్థోనుధావతి. ౧-అం. చెప్పినటు లౌకికులు ముందర్థమూహించి దానికిఁ దగిన పదములను నేరికి కూర్తురు. ఋషులవాక్కులవెంట నర్థము పరువెత్తుచుండును. కావున వాల్మీకి యీయర్థముల ముందూహించి శ్లోకము చెప్పెనా యను సందేహ మసంగతము.

పలికించినది బ్రహ్మవనుపున రామకథ వాల్మీకిచేఁ జెప్పింపవలయునని వచ్చిన సరస్వతి. కావున 'తెలియు మానిషాదుఁడ' యను పద్యమునకుఁ గావ్యార్థమును సూచించు నర్థముండుట వింతగాదు. కవి యుద్దేశింపకున్నను సరస్వతి యుద్దేశించుటచే నట్టియర్థ మప్రయత్నముగ సందుఘటిల్లెను. అది యెట్లనః— 'కావ్యార్థ సూచనం కైశ్చి న్నాందీమేవ నిరూప్యతే' యను వచనానుసార

ముగ నీపద్యము రామాయణార్థమును సర్వమును సూచించుచున్నది. 'మానిషాదుండ' యనుపదము సీతావివాహ పర్యంతమైన బాలకాండార్థమును సూచించును. 'ప్రతిష్ఠ నీక శాశ్వతం బగు' ననుపదము పితృవచనపరిపాలనమున రాముని ప్రతిష్ఠను జూపు నయోధ్యాకాండార్థమును సూచించును. 'శాశ్వత హాయనములు' నని ప్రతిష్ఠ యనేకసంవత్సరములదాఁక నుండునట్లు చెప్పుటచే దండకారణ్యఋషులకై రాముఁడు ప్రతిజ్ఞచేసినదియు, నది నెఱవేఱినదియుఁ దన్మూలమునఁ గలుగు రామునిప్రతిష్ఠయుఁ జెప్పు నరణ్యకాండార్థము సూచితము. ఉత్తరార్థము తిర్యగ్జాతి యగు వాలితారలలో సుగ్రీవునిభార్యను మోహించిన వాలిసంహారమును జెప్పుచుఁ గిష్కింధా కాండార్థమును సూచించును. క్రౌంచులు = కుటిలులు 'క్రుంచ కౌటిల్యాల్పీభావయోః' యని ధాతుపాఠము. క్రౌంచము = దుఃఖముచేఁ గృశించిన మిథునమునందు సీతారాములలో నొక్కండగు సీతను జంపుకారణమున = హింసించుటచేత నని యర్థము చెప్పఁగా సీతావిరహదుఃఖమును వర్ణించు సుందరకాండార్థము సూచితము. యుద్ధకాండార్థము ముందే సూచింపఁబడినదని చెప్పఁబడెను. ఋషిపత్నులఁజూడఁగోరి యీ యభిలాషచే మోహించిన సీతను రాముఁ డడవికిఁ బంపుఁడోలి బాధపఱిచిన కథారూపమయిన యుత్తరకాండార్థముకూడ నుత్తరార్థము సూచించును.

మృగపక్ష్యాదుల వేఁటాడుట బోయల కులధర్మముగదా! వారి కులధర్మమున వారు వర్తించుట న్యాయ్యమే కదా! అట్లుండ నిరపరాధియగు బోయను వాల్మీకి శపింపహేతువేమి? (రా. కిష్కింధ. ౧౮ ౬) వేఁటాడుట కులాచారముగ నుంచుకొన్నవారుకూడ సంభోగించు మృగాదులను హింసింపరాదను న్యాయము గలదు. అది యందు అంగీకరించినదియే. ఆయర్థమును సూచించి వాని దోషము వానికిఁ దెలియఁజెప్పుటకే యీపద్యమునఁ గామమోహిత మను పదముపయోగించెను. కిష్కింధా కాండమునందలి ౧౮-౬ పద్యమందును సంభోగించు మృగములఁ జంపవచ్చునని చెప్పఁబడలేదు. మఱియు మహాభారతమునఁ బాండురాజుచే హింసింపఁబడిన కణిందముఁ డను ఋషి యతనిఁగూర్చి చెప్పు పద్యమునందీ యర్థమే యున్నది. 'యస్మాత్త్వం మయి శస్యం త్వాం, మగతిష్ఠసి భారత। కో హి విద్వాన్మృగం హన్యా, చ్చరంతం మైథునం వనే' యని యందుఁ జెప్పఁబడెను.

వాల్మీకి తాను బరమాప్తుఁడనియుఁ గావునఁ దనకు వక్తృవైలక్షణ్యము కల దని చూపుటకుఁగదా యీసందర్భమును బ్రారంభించెను. బ్రహ్మ తన యాశ్రమమునకు వచ్చి తనకు వరము లిచ్చుట మున్నగువిషయములఁ జెప్పిన యెడల నావక్తృవైలక్షణ్యము స్ఫుటముగ నేర్పడును. అట్లుండఁ దనచరిత్ర

నిచ్చట వ్యర్థముగఁ జెప్పనేల? ఈకథ చెప్పకున్న సందర్భశుద్ధికి హానిలేదు గదా, యని పూర్వపక్షము. ఈవిషయము ప్రస్తుతమేకాని యప్రస్తుతము కాదు. తన యాశ్రమమందుఁ దనరక్షణమం దుండు లోకోత్తరపతివ్రత యగు సీతాదేవి కట్టి నిష్కారణాపవాదము వచ్చుట దయామయుఁడగు వాల్మీకికి సరిపడినది కాదనియు దానిని బాపు నాలోచన చేయుచుండెననియు మున్నే చెప్పితిమి. ఇది లోకులకు సహజకర్మముగాని యిందు వింత యేమియు లేదు. అపవాదముపడి తమయిల్లు చేరిన పుత్త్రిని దల్లిదండ్రు లాదరించి యెట్టిదైన నా యపవాదమును బాపఁ బ్రయత్నించుచుండుట లోకమున సాధారణమై యున్నది. సామాన్యస్త్రీలవిషయమై యిట్లుండ నిఁక సీతాదేవివిషయమై వాల్మీకి కెట్టి పరితాప ముండవలయునో చదువరులే యూహించుకొనవచ్చును. సీతాదేవిమాహాత్మ్యమును లోకమునకుఁ దెలుపుట యన రామాయణము రచించుటేకదా! ఈ విషయమైన వాల్మీకి యూహాపోహములను మున్నే వివరించితిమి. ఈ సందర్భమునందే బ్రహ్మ తన రామాయణమును భూలోకమున వ్యాపింపఁజేయు టెట్లని యాలోచించి యట్టిశక్తిగల వాల్మీకియొద్దకుఁ దత్కార్యార్థమై నారదునిఁ బంపెను. నారదుఁడును రామాయణ ముపదేశించి పోయెను. దానివలన రామకథ రచనాయోగ్య మని తెలిసెనుగాని రచించు మార్గము తెలిసినది కాదు. అప్పటికిఁ గావ్యము లోకమున లేదు. ఇట్టి రామ చరిత్రప్రకటనమం దభిలాషగల బ్రహ్మదేవుఁడు సరస్వతిని వాల్మీకిచే రామాయణమును పలికింపుమని పంపెను. ఆమెమహిమచే నాయననోర మొట్టమొదట వచ్చిన శ్లోక మిది. అదివచ్చుటకు సందర్భ మట్లు దైవికముగఁ గుదిరెను. కావున నీశ్లోకము రామాయణమునఁ బ్రథమశ్లోకమనియు నాందీశ్లోకమనియుఁ బూర్వులు చెప్పుట తప్పుగాదు. మఱి యొప్పే యగు. కృత్యాది ప్రథమశ్లోకమున కుత్పత్తిమార్గము చెప్పుట యెట్లు లసందర్భ మగు? కావున నీశ్లోకమును జెప్పవలసి బోయవానికథను జెప్పెనేకాని తన ప్రతిష్ఠ చెప్పఁదలఁచి కాదు. మహార్థవంతమై గేయమై ఛందోబద్ధమైన శ్లోక మప్రయత్నముగాఁ దాను వచించుట యాశ్చర్యజనకమైన దనుట యేమియాశ్చర్యము! ఆవిషయమై యాయన దీర్ఘాలోచనము సేయుట యేమి వింతయము? వాల్మీకి గ్రంథరచనకై పూనినచో సరస్వతి పలికింపఁగలదుగాని యూరకుండిన నెట్లు పలికింపఁగలదు? కావున నాప్రయత్నమును బూనఁజేయుటకై బ్రహ్మదేవుఁడు వచ్చి కర్తవ్యమును బోధించి యాజ్ఞయు వరము నిచ్చిపోయెను. ఇచ్చట బ్రహ్మకును వాల్మీకికిని సమానత్వము గానవచ్చుచున్నది. వేదము లనాదులు. బ్రహ్మముఖమున నవి వెలువడిన వనుటచే బ్రహ్మ వక్తయేకాని కర్త గాఁడు. ఆయన స్వతంత్రించి కల్పించి చెప్పినవి కావు. భగవంతుఁడు సరస్వతినిఁ బంపఁగా నామె యాయననోర వాగ్రూపమున

నిలిచి యీవేదము లాయన నోరఁబలికించెను. సరస్వతి భగవంతుని పను పున బ్రహ్మయొద్దకు వచ్చిన దని ముందే భాగవతపద్య ముదాహృతము. "మ॥ జగదుత్పాదనబుద్ధి బ్రహ్మకు మదిం సంధింప నూహించియే । భగవంతుండు సరస్వతిం బనుప నాపద్మాస్య దా నవ్విభుఁ । మగనింగా నియమించి తద్భువనసామ్రాజ్యస్థితిన్ సృష్టిపారగుఁజేసెన్ మును బ్రహ్మ నట్టి గుణి నారంభింతు సేవింపఁగన్." అట్టులే సరస్వతీదేవి బ్రహ్మపనుపున వచ్చి వాల్మీకినోర నిలిచి రామాయణరూపమైన వేదమును బలికెను. వాల్మీకి నిమిత్తమాత్రుఁడైన వక్తయేకాని కర్తగాఁడు. ఈవిషయము వాల్మీకియే చెప్పియున్నాఁడు. (బాల. ౨౮౦ ప.) కావునఁ గార్యకారణపరంపరలోఁ జేరిన 'తెలియుమా నిషాదుఁడ' యను పద్యము బోయకథ ప్రస్తుతము సందర్భోచితమే మఱియును 'అర్థతత్త్వతో వాపి మనాక్కావ్యార్థసూచన'మ్మను వచనానుసారముగా నీసందర్భమునఁ గావ్యార్థసూచనముఁజేసి యీగ్రంథమునకుఁ బేరు పెట్టుచున్నాఁడు. అదియెట్లన.—'అంబువులఁ గంటె' యిత్యాదిపద్యములఁ బావనమైన సేతుస్థలము సూచితము. 'అంచితచారుస్వనమై' యిత్యాది పద్యములయందు లంకలో సుఖముగ వసియించు రావణుని రామచంద్రమూర్తి వధించె నని సూచితము అదెట్లన — అంచితచారుస్వనమై = రమణీయవాక్యములతోఁ గూడినదై సౌఖ్యముల ననుభవించుచు, మిహానన[illegible]ద్వంద్వము = రావణమందోదరులను, చేయలంతిన్ = ఆసేతుస్థలసమీపమున, లంకాపట్టనమందు. మౌని కనెన్ = వాల్మీకి తపస్సామర్థ్యమున యోగదృష్టిచేఁ జూచెను. పాపనిశ్చయుండు = రావణుని పాపముల నిర్ధారణముగాఁ దెలిసికొన్న. పుంలింగమైన యెఱుకుశబ్దమునకు లక్షణావృత్తిచే రామచంద్రమూర్తి యని యర్థము. ఎఱుకగలవాఁడు - ఎఱుకు = సర్వజ్ఞుఁ డని యర్థము. వైరబుద్ధిన్ = హిరణ్యకశిపు రావణ శిశుపాలాదు లగు మూఁడు జన్మంబులను వారిని సంహరించుటచేత నెడఁదెగని శత్రుత్వబుద్ధిచేత, మగపక్షిఁ గూల్చెన్ = రావణుని సంహరించెను. ఆ పైపద్యములయందు మండోదరీవిలాపము సూచితము. తత్ప్రతి నెఱికి దూరమగుట నిశ్చయించి = రావణుని నడవడి యంతయు నధర్మ మని యెఱిఁగి యని యర్థము. ఈ యర్థముగల యీ సందర్భముచేత నీకవి రావణవధను జక్కగాఁ దెలిసికొని యీ గ్రంథమునకుఁ బౌలస్త్యవధ మను పేరుపెట్టును అని యేర్పడుచున్నది. 'తెలియుమా' యను పద్యము రామాయణార్థప్రతిపాదకము గావున నీసందర్భమునకు విరోధమైనది కాదు. కాఁబట్టి యీకవి యీగ్రంథ మిట్టి దని యేర్పడినపిదప నీగ్రంథమునకు వక్తృవైలక్షణ్యమును జెప్పఁగోరి ముందుగ గ్రంథనామసూచకమగు తనచరిత్ర చెప్పెను. గాన నది సందర్భవిరుద్ధముకాదు.

వాల్మీకి యీ గ్రంథమును సీతామహాచరితమనియుఁబలికెఁగదా. ఆచరిత్రమును సూచించుసందర్భములఁ జెప్పినాఁడనియుఁ జెప్పనగు ఎట్లన, 'అంబువులఁగంటె' యిత్యాదిపద్యములు గోదావరీతీర్థమును సూచించును. 'అంచితచారుస్వనమై' యిత్యాదిపద్యములు సారసాదిపక్షులనాదముచే రమ్యమైన గోదావరీతీర మందలి పంచవటియందు సుఖముగా వసించు సీతారాములలో సీతను రావణుఁ డపహరించెను, అప్పు సీత విలపించెను, ఇత్యాదివృత్తాంతమును దపోబలముచే వాల్మీకి చూచి యీ గ్రంథమునకు సీతాచరిత్రమనుట తగియుండునని తెలిపెను.

'అంచితచారుస్వనమై = వేదాంతప్రతిపాద్యమై. క్రౌంచద్వంద్వము = సీతారాములను. మిగిలిన పదముల కర్థము స్పష్టము.

సంస్కృతమున 'మానిషాద' యనుశ్లోకము దారుణ మని భయపడ నక్కఱ లేదు ఆదివర్ణము. 'మా' లక్ష్మీవాచకము. 'లోకమాతా మా రమా మంగళదేవతా' యని యమరుఁడు. కావున శుభప్రదమే. మొదటిగణము 'మానిషా' రగణము - అగ్నిదేవతాకము. 'శ్రియమిచ్ఛే ద్ధుతాశనా' త్తని యుండుటచే నదియు శుభకరమే

ఆంధ్రమున నాది వర్ణము 'త'కారము. తె- దీనిమహిమ ముందే వ్రాయఁ బడెను. గణము నగణము. "దివ్యభోగం బీగి తెలుపు వర్ణము జాతి విప్రము నగణమునకు" ననియు "సీ గ్రహములలోన భాస్కరుని చందంబునఁ, దరులలోఁ బారిజాతంబు కరణి। భూధరంబులలోన సింగనకాద్రికైవడి, నదులలో జహ్ను కన్యకవిధమున। దైవతంబులలోన దైత్యారిచాడ్పునఁ, బ్రమథులలో శూల పాణిపగిది। మృగములలోఁ గరిద్వేషిభాతిని జూడ, వివిధవిద్యలలోన వేదము క్రియ। తే॥ గీ॥ క్షేత్రములలోన వారణాసీస్థలంబు। రీతి నిభములలోన నైరావణంబు।రీతి గణములలోనఁ జర్చించి చూడ। నగణ మొప్పారు శుభనిధానం బుగాను॥ అప్పకవీ ర. అ.

తాత్పర్యము.

ఓరి నిషాదుఁడా! క్రౌంచదంపతులయందుఁ గామముచేఁ బెంటితోఁగూడి మత్తుగొనియున్న యొక్కపక్షిని జంపితివిగావున నీవు దీర్ఘకాలము భూమిపై బ్రదుకవు.

రెండవ యర్థము.

శ్రీనివాసా! రాక్షసులందుఁ గామముచే దేహ మెఱుఁగక దుష్కార్యములు చేయు మగవానిని జంపితివికావున నీకీర్తి లోకమునందు శాశ్వత మగుఁగాక.

చం॥ అని శపియించి కోప మెద • నాఱినఁ గూఱినచింత నంతయుం
బనవెడిక్రౌంచపక్షిదుర•వస్థకుఁగాఁగ నిషాదుఁగూర్చి నే
ననినది యేమి? యంచును మ•హామతి గాఁ గలపోసి యంతలోఁ,
గనఁగాని శిష్యు నిట్టనియెఁ • గాంచితె వింత నొకంట నేఁ డిటన్. ౧౬౨

శపియించి = తిట్టి, ఎద = మనస్సునందు, ఆఱినన్ = శమింపఁగా, పనవెడి = ఏడ్చెడి, నే ననినది యేమి = నే నేమని యంటిని? తిట్టితినా? దీవించితినా? నే ననినది గద్యమా? పద్యమా? పాఠ్యమా? గేయమా? మహామతి = శాస్త్రజ్ఞానముగల వాల్మీకి, తాను చెప్పినది పద్యము గేయము నని నిశ్చయించుకొని, వింత = ఆశ్చర్యము.

తాత్పర్యము.

అని యీప్రకారము బోయను శపించి సర్వశాస్త్రజ్ఞానసంపన్నుఁడైన యావాల్మీకిమహర్షి మిక్కిలిదుఃఖించుక్రౌంచపక్షిదురవస్థ చూడలేక బోయ నుద్దేశించి నే నేమని యంటిని? అది యేమిగాఁ బరిణమించెను? అని యాలోచించి శిష్యునితో భరద్వాజ! యిప్పు డొక వింతజరిగెను. కంటివా?

తే॥ కినిసి కుమతినిషాదుని•కీడుసేఁత, కాత్మ శపియింప శోకార్తి • నాఁడినట్టి
భాషితము పద్య మగుచును•బరిఢవిల్లినది భరద్వాజ! చిత్రమి•ట్టిదియుఁగలదె?
౧౬౩

కుమతి = దుష్టబుద్ధిగల, కీడుసేఁతకున్ = చెడ్డకార్యమునకు, కినిసి=కోపించి, భాషితము = వాక్యము, పద్యమగుచున్ = ఛందశ్శాస్త్రపద్ధతిని పద్యలక్షణముగలదై, పరిఢవిల్లినది = వర్ధిల్లినది.

తాత్పర్యము.

దుష్టబుద్ధి యగు బోయవాఁడు చేసిన యకార్యముచే మనస్సున మిగులఁ దాపము కలుగఁగా శోకబాధచేఁ గోపించి నేను బోయను పలికినమాటలు ఛందశ్శాస్త్రవిధుల ననుసరించినపద్యమై యొప్పుచున్నది. ఏమి యాశ్చర్యము!

కం॥ సమపాదచతుష్కంబై, సమవర్ణాన్వితమగుచుఁ • జారువిపంచీ
క్రమతాలలయాన్వితమై, కొమరారుచు నున్నయదియుఁ • గోవిదవర్యా! ౧౬౪

ఈ 'పద్య' మను కర్తృపద మధ్యాహారము. కోవిదవర్యా = పండితశ్రేష్ఠా, జ్ఞానివరా! సమ = హెచ్చుతక్కువలులేక సమానములైన, పాదచతుష్కంబు + ఐ = నాలుగుపాదములుగలదై, సమవర్ణ + అన్వితము = ప్రతిపాదమునందును సమానసంఖ్యాక్షరములతోఁ గూడినదై, చారు = మనోహరమైన, విపంచీ

క్రమ = వీణాధ్వనిక్రమము, లయ = ఏకకాలమున విరామము, కొమరారుచున్ = ఉంగించుచు నీపద్య మున్న దని. సంస్కృతరామాయణమున

శ్లో॥ మానిషాద ప్రతిష్ఠాం త్వ । మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచమిథునా దేక । మవధీః కామమోహితమ్.

దీనియందు నాలుగుపాదములు పాదమున కెనిమిదియక్షరము లున్నవి. ఆ కారణముచే సమపాదచతుష్టయము సమవర్ణాన్వితము నయ్యెను.

ఆంధ్రంబునను,

తే.గీ॥ తెలియుమా నిషాదుండ ప్రతిష్ఠ నీక = ౧౩
ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనములఁ = ౧౩
క్రౌంచమిథునంబునందు నొక్కండు నీవు = ౧౩
కామమోహితముం జంపుకారణమున = ౧౩
౫౨. = రామ.

ఈ పద్యమునందు నాలుగుపాదములు పాదమునకుఁ బదుమూఁడక్షరములు గలవు. సాంఖ్యశాస్త్రప్రకారము పదుమూఁడు ప్రణవమును బోధించును.

ఎట్లన —వర్ణసమామ్నాయమందు ౧౩ వ యక్షరము 'ఓ' విష్ణువను నర్థముగల మానిషాదశబ్దము 'అ' కారమును సూచించును. 'అకారార్థో విష్ణు' వని కదా ప్రమాణము ప్రతిష్ఠ — ఇది స్త్రీలింగము. ఇచ్చట స్త్రీవాచకము ప్రకృష్టమైన ష్ఠ గలది 'విష్ణో శ్శేషానపాయినీ' యన్నట్లు ఎడఁబాటులేక విష్ణువుఁ గూడియు నుండునది ప్రతిష్ఠ యనఁగా నగును. "ప్రతిష్ఠా సమాప్తౌ గౌరవేపిచ, కార్యనిర్వాహసామర్థ్యే ఛందసిస్థితౌ"-నానా. ప్రతిష్ఠ యనునది లక్ష్మీవాచకమైన ఉకారమును బోధించును. అవధారణార్థకమందును 'ఉ'కారము ప్రయోగింపఁబడును గావున 'నీక' యనునది 'ఉ' కారముయొక్క అవధారణార్థకమును దెలుపును. క్రౌంచమిథునంబునందు నొక్కండు ప్రకృతిపురుషులయందు - కుటిలగతి కలది ప్రకృతి యనియు దానిసంబంధముచే నల్పమైన జ్ఞానముగలవాఁడు (బద్ధజీవుఁడు) పురుషుఁ డనియు గ్రాహ్యము. ఇది మకారమును బోధించును.

ఈ రెంటిలోఁ గామమోహితముఁ = ప్రకృతిపరిణామరూపమై కామాది ప్రకృతిగుణములుగలది దేహము. కావున దేహమును, చంపుకారణమున=పునఃసంబంధము లేకుండునట్లు చేయుటచే, క్రౌంచమిథునంబునం దొక్కఁడైన పురుషుఁడు, శాశ్వతహాయనములఁ = పునరావృత్తిలేని శాశ్వతమోక్షమును, ప్రాప్తమయ్యెడుఁ=లభించును క్రౌంచమిథునంబునందు నొక్కండనునది కాకాక్షిన్యాయముచే నుభయత్ర యన్వయింపవలయును.

విష్ణుమూర్తీ! ప్రకృతిపురుషవిశిష్టమైన యీ దేహమునందుఁ బ్రకృతి సాంగత్యమును నిర్మూలించుటచేఁ బురుషుఁడు లక్ష్మీపురుషకారమూలమున మోక్షమును బొంద నిశ్చయించిన ముముక్షువగు పురుషునకుఁ బ్రాప్యస్థానము నీవే యనియు నట్టి ప్రాప్తి లక్ష్మీపురుషకారముచే లభించు ననియు సారాంశము.

ప్రతిష్ఠ యనునది పంచమ్యర్థమునఁ బ్రథమ యని కాని ద్వితీయ యనికాని గ్రహింపవలయును. ప్రతిష్ఠింపవలసిన యని యర్థము. హేత్వర్థమునఁ బంచమి.

ఆంధ్రవాల్మీకిరామాయణము నిర్వచనముగను గ్రంథకర్తచే మొట్టమొదట వ్రాయఁబడినపద్య మిదియే. మూలమునందలి శ్లోకము నింతకన్నఁ దెనిఁగించువారు లేరు. వ్యాఖ్యాతలు వ్రాసిన యన్నియర్థములు నిచ్చునట్లు వ్రాయ శక్యమైనదియు దీనిని దెనిఁగింపఁగలిగిన సర్వము సుసాధ్యమే యనియును దలఁచి యీ తాత్పర్య మిది తొలుత రచింపఁబడియె. ఈ నిర్వచనపద్యము బాలకాండమందలి ౧-౧వ పద్యము. అందుఁ జిత్రాలంకారము గలదు. ఆ పద్యము నొకయంత్రము వ్రాయఁబడెను గదా. ఆ పద్యమును మెల్లఁగాఁ బట్టుకొని యిటువంటివారు తమపద్యమును వ్రాసికొనిరి కాని చిత్రాలంకారపద్యము వారికి అసాధ్యమాయెను. ఇట్టిపద్యములు ననాయాసముగఁ గుదురుటచే ధైర్యమునఁ గవి యాంధ్రీకరణమున కుపక్రమించెను.

శ్లో॥ తస్మాదోమి త్యుదాహృత్య యజ్ఞదానతపః క్రియాః,
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్
తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపః క్రియాః,
దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః. ౧౭ భగవ.

ఏకార్యమైనను 'హరిః ఓమ్' అని ప్రారంభింపవలసియుండఁగా నట్లు లేక గ్రంథ మారంభింపనగునా? రామాయణమునందును నోంకారార్థము నేకదా ప్రతిపాదించు చున్నది, అని యోచించి యోంకారార్థము రాముఁడన్న దానియర్థమైన వచ్చినఁ జాలు నని సంతోషించి యిట్లు వ్రాయఁబడెను.

మోక్షకాంక్షగలవారు ఓంతత్ అని ప్రారంభింపవలయునని మీఁద నుదాహరించిన భగవద్గీతాశ్లోకము చెప్పుచున్నది. సంక్షేపరామాయణమున సంస్కృతమున నిట్లు కలదు. తపస్స్వాధ్యాయ   నిరతాత్. సంస్కృతమున తకారపొల్లుగల శబ్దములు గలవుగావున నాభాషయం దది సుసాధము. తెనుఁగున 'త్'తో సంతృప్తమగు శబ్దములు లేవుగనుకఁ బ్రథమాక్షరముతోనే తృప్తిపడవలసివచ్చెను. ఇదియు నట్లె తకారాది యయ్యె.

తాత్పర్యము.

సమానమైన నాలుగుపాదములు నాలుగుపాదములందు సమానసంఖ్యగల యక్షరములు గలిగి మనోహరమై వీణ్యం వాయించుటకు ననుకూలపడి తాళమునకు లయకు సరిపడునట్టి దీయ్యమింపుగా నున్నది నాచే చెప్పఁబడినది?

చం॥ అనుచును వామలూరుభవుఁ • డాదటఁ బ్రగురుభాష్యఁ బంచు స
ద్వినయముతోఁ దిదుస్తకని • విస్మయ మందుచు వాగ్విధేయ మై
పనగొనఁ జేయ శ్లోకమును • వాల్మికుఁ డెంతయు సంతసించె శి
ష్యునిచరితంబు గాంచి, కవి • కోరిన లోకము మెచ్చుఁగ కదా. ౧౯౫

వామలూరుభవుఁడు — పుట్టలోనుండి పుట్టినవాఁడు - వాల్మీకి, ఆదటఁ = ప్రేమతో, గురు + ఉక్తిన్ = ఆచార్యునిమాటను, ఎంచు, తిదుస్తకని = రామాయణార్థసంగ్రహమైన యీవాక్యమునకు, విస్మయము = ఆశ్చర్యము, వాక్ + విధేయుఁడై — శిష్యుఁడై, పనగొనఁజేయఁగా — వల్లెవేయఁగా, శిష్యుని చరితము = శిష్యుఁడు వాక్యమును వల్లెవేయుటను, సంతసము — సంతుష్టి, అలంకారము అర్థాంతరన్యాసము. సామాన్యవిషయముచే విశేషమును సమర్థించినను, విశేషముచే సామాన్యమును సమర్థించినను అర్థాంతరన్యాస మగును. దినదినము = పూఁటపూఁట వేదాధ్యయనముచేయు వారిస్నోర వేదములలో దండిగానుండు శ్లోకములవంటి శ్లోకము వచ్చుటగాని ఘుణాక్షరన్యాయమున నట్లు గియ మగుటగాని విశేషాశ్చర్యకరము గాదు. తానొకయర్థమునకుఁ జెప్పిన మాటలకు (శాపవాక్య) నన్యార్థము (భగవత్కథాసనముగ) గలుగుట విశేషాశ్చర్యము.

తాత్పర్యము.

అని ప్రేమతో వాల్మీకి చెప్పఁగా భరద్వాజుఁడను శిష్యుఁడు గురువుగారి యామాట వినయముతో గ్రహించి యాపద్యరూపవాక్యమునకు మిక్కిలి యాశ్చర్యపడి దానిని ముఖస్థమగునట్లు వల్లెవేయఁగా నాశిష్యుని నడవడిక చూచి వాల్మీకి మిక్కిలి సంతోషించెను. కవికోరుట తాను చెప్పినది లోకము మెచ్చుకొనవలయు ననియే కదా.

చం॥ అవల యథావిధిన్ మునికులాగ్రణి యేటఁ గృతావగాహుఁడై
సవిధమునందుఁ బూర్ణకలశంబును గొంచు చరుదేర ఛాత్రుఁడున్
దవులఁగఁ జింత పద్యమునఁ • దెల్పరుఁ దోఁచు నిజాశ్రమస్థలిన్
గవితిలకంబు చేరి హితగాథలఁ బ్రొద్దులు పుచ్చి వేడియున్. ౧౯౬

అనంతర౯ = తరువాత, మునిపుంగవ + అగ్రణి — ఋషిసమూహములో శ్రేష్ఠుఁడు, కవితిలకంబు = కవిశ్రేష్ఠుఁడు, వాల్మీకి, యథావిధి౯ = ధర్మశాస్త్ర విధానము మీఱక, కృత + అవగాహనుఁడై = చేయఁబడిన స్నానముగలవాఁడై, స్నానము చేసినవాఁడై, ఈస్నానక్రమము వ్యాసస్మృతియందు విస్తారముగఁ జెప్పఁబడినది "తతో మధ్యాహ్నసమయే స్నానార్థం మృద మాహరేత్। పుష్పాక్షతా౯ కుశతిలా౯ గోమయంగంధ మేవచ। నదీషు దేవఖాతేషు తటాకేషు సరస్సుచ। స్నానం సమాచరేన్నిత్యం నదీప్రస్రవణేషు చ। మృదైక యా శిరః క్షాళ్య। ద్వాభ్యాం నాభే స్తథోపరి। అధశ్చ తిసృభిః క్షాళ్యం। పాదౌ షడ్భి స్తథైవచ। మృత్తికాచ సమాఖ్యాతా త్వార్ద్రామలకమాత్రకా। గోమయస్య ప్రమాణం త [illegible] లేపయే [illegible]। లేపయే [illegible] తీరస్థ స్తల్లింగై రేవమంత్రతః। ప్రక్షాళ్య [illegible] స్నాయా త్సమాహితః। అభిమంత్ర్య [illegible] తా। [illegible] యసం [illegible]। [illegible] దేవ [illegible] స్నానకాలే [illegible]। త్రైతస్య సోంకార మాహాత్మ్యం [illegible]। అన్తర్జలే [illegible] దాదిత్య మూర్ధ్నిం పుష్పం జలాన్వితం। [illegible] యే ద్దేవం। ఋగ్యజుస్సామ రూపిణ" మ్మని యచ్చటి శ్లోకములు.

ధార్యుఁడు = శిష్యుఁడు, భరద్వాజుఁడు, పూర్వోక్తకలశంబున = నిండింపఁబడిన పాత్రను, సవిధమునందుండ౯ — మిక్కిలి సమీపమునఁ, [illegible] ఉండఁ దవులఁగ = శాపకోపములుగాఁ జెప్పిన సద్విదమిత్రాదిములుగల శ్రీమన్నారాయణాశీర్వాదరూపమగు నారాయణమును సదా ధ్యానింపఁగా, తత్ + పరుఁడు = ఆపద్యమే మనస్సునఁ బ్రధానముగాఁ గలవాఁడు హితగాథల౯ = మేలైన కథలచేత అనఁగా నిది నాలవది యగు స్వాధ్యాయకాలము గనుక భగవద్విషయమైన కథలఁ [illegible] ప్రసంగించుచు. [illegible] ఋషులకు హితమైనకథ లేమున్నవి?

కొందఱు వచనరూపముగఁ దిట్టినమాటలు శ్లోకరూపముగఁ బరిణమించుటచే వాల్మీకియు శిష్యుఁడు నాశ్చర్యపడి రని యందురు. అది తృప్తికరమైన సమాధానము గాదు. ఏలన వేదాధ్యయనమందు మానిషాదవంటి యనుష్టుప్పులు ప్రతిదినము వారు లేనగలు పఠించువారే - ఎట్లన.

సహస్రశీర్షా పురుష ఠ
సహస్రాక్ష స్సహస్రపాద్ ఠ
ఇది యనుష్టుప్పు

సబ్రహ్మా సశివ స్సేంద్ర ర
స్సాసురః పరమస్వరాట్ ర

ఇందు సబ్రహ్మసశివస్సహేంద్ర యనునది యపపాఠము - ఛందోభంగము. ఈ యపపాఠమును కాంప్రపాఠ మని పేరు.

ఇట్టి శ్లోకములు వాల్మీకికి రావా? భరద్వాజునకు రావా? ఆ వాడుక దొప్పున నట్టిదే వచ్చిన దీర్ఘకాలము చింతించి చింతించి యాశ్చర్య పడవలసిన విషయ మేమున్నది? కావున సంతమాత్రమేకాక మీఁది వివరించిన యర్థ విశేషము లుండుటయే వారి మననమునకు నాశ్చర్యమునకు వాస్తవకారణము.

తాత్పర్యము.

అపిమ్మట వాల్మీకి శాస్త్రస్థముఁ జెప్పఁబడినరీతి ననుసరించి నదియందు స్నానముచేసి సమీపమున నున్న జలపూర్ణకమండలువును దీసికొని శిష్యుఁడు తన వెంటరాఁగాఁ దాను జెప్పిన పద్యమునందే మనస్సు నిలిపి నేనూరకశపించినమాటలు పద్యముఁ గానేల? అంతియేకాక శాపోక్తులకు నాశీర్వాదముగా నర్థ మేర్పడుట యేల? నేమి యీచిత్ర మని యాలోచించుచుఁ దనయాశ్రమ ప్రదేశముఁ జేరి భగవద్విషయమైన కథలచేఁ బ్రొద్దుపుచ్చు యామీఁద.

బ్రహ్మ వాల్మీకిని జూడవచ్చుట

చం. చటులవిషాద మూరుచు నిశామునిఁ దిట్ట వచించి నట్టియా
పటుతరపద్యముం గుఱిచి బ్రాహ్మణవర్యుఁడు భావనారతిన్
దిటముగ నుండ, భూరినిజతేజము దిక్కుల నిండ హస్తసం
పుటములతోడ యోగిజనపుంగవు లెల్లరు వెంట నంటఁగన్. ౧౬౭

పావనశీలుఁడు = పరిశుద్ధమైన స్వభావముగల వాల్మీకి, చటుల విషాదము = చంచలమైన దుఃఖము - మనస్సును జంచలముగఁ జేయు దుఃఖమని తాత్పర్యము, ఊరుచున్ = పొంగుచున్, పటుతరపద్యము — అర్థగాంభీర్యములచే సారవంతమై దృఢమైనపద్యమును, భావనా + రతిన్ -- ధ్యానించుప్రీతియందు, భూరి= అధికము, నిజతేజము (1) తనప్రభావము (2) తనకాంతి, నిజము = తన యొక్క యనియర్థము. తెనుఁగున నిజ మని యొకపదము గలదు. దానికి సత్య మని యర్థము. అది తెనుఁగుపద మను జ్ఞానములేక యిప్పటివారు నిజానిజము లని వ్రాయుట కేవలదుష్టము. యోగిజనపుంగవులు = సనకసనందనాది యోగిశ్రేష్ఠులు, హస్తసంపుటములతోడన్ = అంజలిగాఁ జేర్చినచేతులతో. తాన = తనంతటఁ దానే; ఎవరిప్రార్థనలేకయే.

క॥ వచ్చెను వాల్మీకిం గన, నచ్ఛపుమచ్చికను దాన ♦ యబ్జజుఁడు త్రిలో
కోచ్ఛ్రయకర్త మరుత్తతి, విచ్చలవిడి బలసి కొలువ ♦ వివిధస్తుతులన్. ౧౬౮

అబ్జజుఁడు=కమలమునందుఁ బుట్టినవాఁడు, బ్రహ్మ, త్రిలోక + ఉచ్ఛ్రయ + కర్త = మూఁడులోకములకును నభివృద్ధిని గలుగఁజేయువాఁడు. త్రిలోక మనునది సర్వలోకములను సూచించును. అభివృద్ధి సృష్టిరూపము. విధి = బ్రహ్మ, మరుత్ + తతి = దేవతలసమూహము, విచ్చలవిడి = యథేచ్ఛముగా, బలసి = చుట్టుకొని, వివిధస్తుతులన్ = అనేకస్తోత్రములచేత, అచ్ఛముమచ్చికమును = నిష్కపటమైనప్రేమతో, వాల్మీకిం గనవచ్చెన - కర్మధారయంబులందు మువర్ణకంబునకు పు, ంపులగు (సు వ్యాకరణ ౧౧౧) అచ్ఛము + మచ్చిక = అచ్ఛపుమచ్చిక. వాల్మీకికి రామాయణము వ్రాయుటకు గ్రహింపఁగలశక్తి సత్యలోకమునుండియే బ్రహ్మ గలిగింప వచ్చెను. వాల్మీకివంటి రామభక్తునియందు నాదరాతిశయముచేతను, వాల్మీకిని లోకులకు శ్రద్ధాభక్తివిశ్వాసములు గలుగుటకును స్వయముగా నాతఁడు వచ్చెనని భావము. అట్లు వచ్చి చెప్పకుండిన వాల్మీకిసందేహ మెట్లు తీరియుండును, సాధులోకమునకు దానియందుఁ బ్రమాణబుద్ధి యెట్లు గల్గును?

అబ్జజుఁడు = ప్రపంచప్రతీకమైన కమలమునందుఁ దొలుతఁ బుట్టినవాఁడు కావున బ్రహ్మకుఁ గమలభవుఁ డని యబ్జజుఁ డని పేరు, జగదాదిజుఁ డనికదా బ్రహ్మకుఁ బేరు. లక్ష్మియు, గాయత్రియు హస్తములయందుఁ గమల ముంచుట ప్రపంచమంతయు వారిచేతిలో (స్వాధీనములో) నున్న దని సూచించుటకే. ఈకమలము నారాయణు నుదరమునందుఁ బుట్టుటచే నాయనయుదరమందు లీనమై యుండినదే వెలికివచ్చిన దని భావము మార్కండేయుఁ డీలోకముల నన్నిటిని నారాయణు నుదరమందుఁ జూచెఁగదా.

౧౬౭ - ౧౬౮ పద్యముల తాత్పర్యము.

బోయవాఁడుచేసినకార్యమువలనఁ గలిగిన దుఃఖముచే మనస్సు వ్యాకులపడఁగా వానిని దూషించిచెప్పినపద్యము గురించి తదేకధ్యానముతో నాలోచించుచు నుండుసమయంబున నధికమైన తనతేజము పదిదిక్కుల వ్యాపింపఁగా యోగిశ్రేష్ఠులు చేతులు జోడించి వెంబడి రాఁగా వేలకొలఁది సంవత్సరములు తపస్సు చేసినఁగాని కానరాని బ్రహ్మదేవుఁడు తనంతటఁ దానే దేవతాసమూహము చుట్టుచేరి సేవింపఁగా వాల్మీకిని జూడవచ్చెను.

పంచచామరము॥ ఇటూచతుర్ముఖుండు రాఁగ ♦ నిష్టశిష్టపాళితోఁ
దటాలున న్మునిప్రభుండు ♦ తద్దభక్తియుక్తిమై

నిటాల మందుఁ గేలుదోయి ♦ నిల్పి మ్రొక్కి నిల్చి తా
ని కేటికో నసంగ గసంగ ♦ నేగుదెంచె ధాతయున్. ౧౬౯

చతుర్ముఖుండు = నాలుగు మోములుగల బ్రహ్మదేవుఁడు, ఇష్ట = ప్రేమాస్పదులగు, శిష్ట = పరిమయోగులయొక్క, పాళితో = సమూహముతో, దర్ప = మిక్కిలి, భక్తియుక్తమైన = భక్తియొక్క కూడికచేత, కేలుదోయి = రెండుచేతులు, నిటాలమందు = నొసటియందు. నిటలము సూపాంతరము నిటాలము. నిల్పి = అంజలిగాఁగట్టి, తాలుననక = శీఘ్రముగా, "ప్రాణా హ్యూర్ధ్వముత్క్రామంతే యూనః స్థవిర ఆగతే। ప్రత్యుత్థానాభివాదాభ్యాం, పునస్తాన్ప్రతిపద్యతే" పెద్దవారు వచ్చినపుడు చిన్నవారి ప్రాణములు లేచిపోవును. లేచుట నమస్కరించుటవలనఁ బ్రాణములు దేహములోనికి మరల వచ్చును. పెద్దవారు వచ్చినప్పుడు చిన్నవారు లేవకున్న నాయుష్షయమని భావము. కావునఁ దాను శీఘ్రముగ లేవనియెడలఁ దన ప్రాణములు లేచిపోవునని శీఘ్రముగాఁ దాను లేచెనని భావము ధాత = బ్రహ్మ, సగక - నాయప్పుడె యల్పుని - మనుష్యమాత్రుని.

ఛందస్సు.

వృత్తము పంచచామరము. జ-ర-జ-ర-జ-గ గణములు. పదవయక్షరము యతి. చతుర్ముఖునకుఁ బంచచామర మర్పించుట యోగ్యమేకదా.

తాత్పర్యము.

ఇట్లాబ్రహ్మ తన యిష్టులతోను శిష్యులతోను రాఁగాఁ జూచి వాల్మీకి తటాలున లేచి మిక్కిలిభక్తితోఁ జేతులు ఫాలతలమునందు జేర్చి మ్రొక్కి నిలఁబడి యీపరమేష్ఠి యిట్లువచ్చుటకుఁ గారణ మేమికలిగెనో?

కం॥ అని కడు సచ్చెరువడి ముని, వినయంబున నర్ఘ్యపాద్య♦విధిఁ బూజనముల్
ఘనముగఁజల్పి యథావిధి,గను సాష్టాంగముగఁ బ్రణతిఁ ♦ గావించి మఱిన్. ౧౭౦

కడున్ + అచ్చెరువుపడి = మిక్కిలి యాశ్చర్యముపొంది. ఆశ్చర్యశబ్దభవము అచ్చెరువు. మొట్టమొదటఁ దనప్రయత్నములేకయే నారదుఁడు తనసందేహము దీర్చి రామచరిత నుపదేశించుట, బోయను శపించినవాక్యమే పద్యమై గేయమై యర్థగాంభీర్యము గలదగుట వీనికే యచ్చెరువుపడుచుండఁగా నెంతో తపస్సుచేసినను బ్రత్యక్షముగాని బ్రహ్మదేవుఁడు తనంతటఁదానే తనగుడిసెకు వచ్చుట మిక్కిలి యాశ్చర్యకారణమయ్యెను.

అర్ఘ్యపాద్యవిధిన్ — అర్ఘ్యము = చేతులుకడుగుకొనఁ నీరిచ్చుట. పాద్యము = కాళ్లుకడుగుకొనఁ జలమిచ్చుట. విధిన్ = శాస్త్రప్రకారము. సాష్టాంగముగన్ = ఎనిమిదియంగములతోఁగూడ, యథావిధిగను = 'మనోబుద్ధ్యభిమానేన, సహ

న్యస్య ధరాతలే, కూర్మవచ్చతురః పాదాన్, శిరస్తత్రైవ పంచమం। ప్రదక్షిణ సమేతేన, హ్యేవం రూపేణ సర్వదా। అష్టాంగేన నమస్కృత్య, హ్యుపవిశ్యాగ్రతః ప్రభో॥ యను శాస్త్రానుసారముగ, ప్రణతిన్ = నమస్కారమును.

తాత్పర్యము.

ఇది యేమో మిగుల వింతగా నున్నది. నారదుఁడే తానై వచ్చి రామ చరిత్రముపదేశించుట మొదటివింత. శాపోక్తులు పద్యముగాను భగవత్సంగళా శాసనముగను నగుట, యేండ్లకొలఁది తపస్సుచేసినఁగాని ప్రత్యక్షముగాని బ్రహ్మ తనంతటఁదానే నాగుడిసెలోనికి వచ్చుట, యివియన్నియుఁజూడ నాశ్చర్యమగు చున్నది, అని వినయముతో బ్రహ్మకు నర్ఘ్యము పాద్య మిచ్చి ప్రదక్షిణనమస్కారాదు లాచరించి సాష్టాంగముగఁ బడెను. తరువాత.

ఆ॥ కుశలవార్త లడుగఁ ♦ గూర్చుండి పెర్మిపై, నబ్జభవుఁడు మౌని ♦ నాజ్ఞసేయఁ
జిఱుతయాసనమునఁ ♦ జేరి కూర్చుండియు, వదలఁడయ్యె నెఱుకు ♦ వానిచింత. ౧౬౧

కుశలవార్తలు = క్షేమసమాచారములు, అబ్జభవుఁడు = బ్రహ్మ, ఆజ్ఞసేయన్ = కూర్చుండు మని యానతీయఁగా, చిఱుతయాసనమునన్ = వాల్మీకికిఁ దగిన యెత్తులేని చిన్నపీటపై. దీనివలనఁ బెద్దవారితో సమముగఁ బిల్లవాండ్రు కూర్చుండరా దని సూచన.

తాత్పర్యము.

బ్రహ్మదేవుఁడు తా నున్నతాసనమునఁ గూర్చుండి వాల్మీకిని గుశలప్రశ్నలడిగి నీవును కూర్చుండు మని చెప్ప నాయన సమీపమందుఁ గూర్చుండియు బోయవాని విచారిముమాత్రము ఎంలకి మనస్సున ధ్యానించుచునే యుండెను.

ఆ॥ పాపబుద్ధి యకట ♦ పగఁబూని వగమాని, యేమికతములేక ♦ భూమిఁగూల్చెనట్టి చారునినద ♦ మమరుక్రౌంచంబు నా, యెఱుకువాఁ డదెట్టి ♦ కఱకువాఁడొ?
౧౬౨

పాపబుద్ధి = చెడుబుద్ధిగల, వగ = జ లి, కతము = కారణము, చారునినదము = మనోహరమైన స్వరము, అమరు = ఒప్పునట్టి, కఱకువాఁడో = క్రూరుఁడో. కావ్యలింగాలంకారము.

తాత్పర్యము.

అయ్యో! యీ బోయవాఁ డెంతదయావిహీనుఁడోకదా! ఏమికారణము లేక పగపట్టి యయ్యోపాప మనక పాపాత్ముఁడు మనోహరముగఁగూయుచున్న క్రౌంచపక్షిని జంపెనుగదా.

ఆ॥ అనుచు నాఁడుపక్షి♦వ్యసనంబు మఱిమఱి, తలఁచితలఁచి వగపు ♦ దలకొనంగఁ
దా రచించినట్టి♦తత్పద్యమునుగూర్చి, మనములోనఁ జింత ♦ మునుఁగుచున్న. ౧౨౩

వగపు = దుఃఖము, తలకొనంగన్ = అతిశయించుచుండఁగ, రచించిన = కూర్చిన, తత్పద్యము = 'తెలియు మా నిషాదుండ' యను పద్యమును.

తా త్ప ర్య ము.

అని యీప్రకార మాలోచించుచు నాఁడుపక్షి పడినదుఃఖము మీఁది మీఁదఁ దలఁచి శోక మతిశయింపఁగాఁ దాను జెప్పినపద్యమునుగూర్చి యెదుట బ్రహ్మదేవుఁడు వచ్చి యున్నాఁడని గ్రహింపఁగలంపక చింతామగ్నుఁడైన వాల్మీకిని జూచి.

—* బ్రహ్మ వాల్మీకిని రామాయణముఁ జెప్ప నియమించుట *—

మ. దరహాసాంకుర మొప్పఁ బద్మభవుఁ డా♦ధన్యాత్ము వీక్షించి సా
దరుఁడై యేటికిఁ జింతసేయ మునినా♦థా! శంకఁ బోవిడుమీ
యరయన్ బద్యమె చుమ్మి యద్ది, యెటులో♦రా వచ్చె నం చెంచె, కా
సరణిం దెల్పెద, మన్ని దేశమున భా♦షాకాంత నీవాక్కునన్. ౧౨౪

చం. అమరఁగ నిల్చి పల్కెను, సురా♦ణాకృతశాస్త్రము గాఁగ నీవు ప
ద్యము రచియించు మింక, సుగు♦ణోత్తమ రామకథాప్రపంచ మ
త్యమలినభక్తియుక్తిని బు♦ధాకృతి సేయుము నారదోక్తి సం
క్రమమున, సద్గుణాంబునిధి ధర్మయు రాముఁడె చూ ద్విజోత్తమా! ౧౨౫

పద్మభవుఁడు = బ్రహ్మ.

దరహాస + అంకుర = చిఱునవ్వు మొలక, నా మూలమునఁ దన జిహ్వ యందు సరస్వతీదేవి నివసించి శ్లోకము పలికె నని వాల్మీకి తెలిసికొనలేక కలవర పడుచున్నాఁడని బ్రహ్మ నవ్వె నని భావము. ధన్య + ఆత్మన్ = సఫలమైన మనస్సుగలవానిని - వాల్మీకిని, వీక్షించి = చూచి, సాదరుఁడై = ప్రేమతోఁ గూడినవాఁడై, ౧౨౦ వ పద్యములోని 'అనుచు వచియించి' యను పదముతో నన్వయించును. మునినాథా! చింతసేయ నేటి కని యన్వయక్రమము. పద్య విషయ మని యధ్యాహారము. శంక=సందేహము, పోవిడుమీ = వదలుమా.

అద్ది = తెలియుమా నిషాద యను పద్యము. పద్యమె = కీర్తికి మార్గమైన పద్యమేకాని రిక్తవాక్యముగాదు - నిషాదుని తిట్టుమాత్రమునుగాదు - అని భావము. ఎటులు = ఏకారణమున, కారణములేకయే యని భావము. ఆస రణిన్ = ఆపద్యము నీనోర వెలువడిన మార్గము, భాషాకాంత = సరస్వతి;

రసధ్వని, భావధ్వని, యలంకారధ్వని, వస్తుధ్వని యని పలువిధములగు ధ్వనుల కాధారమగు వాక్కులకు నధిష్ఠానదేవత యగు సరస్వతి యను తనపేరు సార్థకముగ ననేకధ్వనిగర్భితముగ నీవాక్కున నవతరించినదని భావము. ఘుణాక్షరధర్మముగాదు = అబుద్ధిపూర్వకముగ జరిగినదికాదు. సన్నపురుగులు తాటియాకులనుగాని బొంగువెదుళ్లనుగాని తొలుచునపుడు ఆగీతలలోఁ గొన్ని యక్షరములయాకారములు గలవై యుండును. అవి యాపురుగులు బుద్ధిపూర్వకముగఁ జేసినపని కాదు. అట్టులే యబుద్ధిపూర్వకముగఁ జేసినదానిలో నొక విశేషము గనఁబడిన ఘుణాక్షరన్యాయ మందురు. వాల్మీకినోర వెలువడినది పద్యమగునా కాదా, యది యెట్లువచ్చె, నను సందేహమును దీర్చి బ్రహ్మ యిఁక దాని ప్రయోజనమును జెప్పుచున్నాఁడు. అటులౌటను = నాయాజ్ఞప్రకారము నీవాక్కున సరస్వతి నిలిచియుండుటచేత. మునినాథా = అనేకజన్మంబుల నుండి తపోధ్యానాదు లభ్యసించుటచేతఁ బుణ్యసాపకర్మము పరిపక్వమై భగవద్భక్తి యతిశయించి మునిశీలుఁడవైన నీవు రామావతారరహస్యమును జక్కగ నెఱుఁగుదువు. కావున నీకుఁ బ్రకృత రామచరితను రచించుట సుకర మని భావము, కావుననే, అన్యూనులిన = మిక్కిలి నిర్మలమైన, భక్తియుక్తిని = భక్తితోఁగూడినవాఁడవై, రామకథాప్రపంచమును = రామకథయొక్క విస్తారమును, రామకథనన్ని మని భావము. నారదోక్తి = నారదునిచేఁ జెప్పఁబడిన, సత్క్రమమునన్ = మంచిరీతిని, ద్విజోత్తమా = బ్రాహ్మణశ్రేష్ఠుఁడా, మహాకృతిఁ జేయుము = గొప్పకావ్యమును రచింపుము. నీవు బోయవాని నుద్దేశించి చెప్పిన పద్యములనంగ పద్యములతో - నని యధ్యాహారము ఇందు వాల్మీకి ద్విజోత్తమా యని సంబోధింపఁబడెను. మూలమునందు "మచ్ఛందాదేవ తే బ్రహ్మన్," బ్రాహ్మణుఁడా యని సంబోధింపఁబడి యున్నది. దీనివలన వాల్మీకి జాతి బ్రాహ్మణుఁడేకాని యితర జాతివాఁడు కాఁడు. విశ్వామిత్రునివలె నితర జాతిసంభవుఁడై బ్రాహ్మణత్వమును బొందినట్లు ప్రమాణములు లేవు. బ్రహ్మదేవుఁ డిట్లు చెప్పుటకు ముందే లక్ష్మణుఁడు సీతతో.

"కం॥ రమణీయంబులు కడుఁ బుణ్యములున్ వెతపడకు మమ్మ యట దశరథభూ
రమణు సఖుం డగు విప్రుఁడు, విమలమనస్కుఁడు తపస్వి వితతయశుండున్.

కం॥ ముని వాల్మీకి వసించును "

అని చెప్పెను. అంతియకాక వాల్మీకి తన్నుద్దేశించి శ్రీరామచంద్రమూర్తితోఁ జెప్పునప్పుడు

'సీ॥ శ్రీరామ నేను బ్రచేతసు పదియవ, పుత్రుండ మదినైన బొంకుదలఁప"

నని చెప్పెను. కనుకనే యాయనకుఁ బ్రాచేతసుఁ డని పేరు. ఈ ప్రచేతసుఁడు

భృగువంశమునఁ బుట్టినవాఁడు. కావుననే కుశలవులు శ్రీరామునితో "మా గురుండు పక్షియై మానివరుఁడు భార్గవుండు నీదు వర్తనంబె" యని చెప్పిరి. భార్గవ నీతిసంహితాయామ్' అని రామాయణమును గుఱించి యుత్తరకాండమున ౯౩ వ సర్గలోఁ జెప్పఁబడును. ఈయన తపస్సు చేయుచుండఁగా నీయన మీఁదఁ బుట్ట పెరిఁగెను. ఆ ప్రకార మెంతకాల ముండెనో తెలియదు. ఆవల కొన్నినాళ్లు కాపుట్టలోనుండి వెలువడుటచే నాయన పుట్టనుండి పుట్టినాఁ డన సాగిరి. చ్యవనుఁడు తపస్సుచేయునపు డాయనపై నిట్లె పుట్ట పెరిఁగెనుగదా. శ్రీరాముఁడు వాల్మీకితో 'ప్రత్యయ యోహి బ్రహ్మన్ తవవాక్యై రకిల్బిషైః.'—ఉత్త. ౯౭. స.

"శ్రీరాఘవుఁడుగ్ । జనమధ్యంబున సీతా । వనజాక్షిం గనుచుఁ బలికె బ్రాహ్మణవర్యా," "నమ్మితి నేను నీపలుకు. ఉత్తర. ౧౫౦౭." అని చెప్పెను. "కవే రల్పాపి వాగ్వృత్తి ర్విద్వత్కర్ణావతంసతి । నాయకో యది వర్ణ్యేత లోకోత్తర గుణోత్తర" యని భోజుఁడు చెప్పినట్లు కావ్యమున వర్ణింపఁదగిన ప్రధాననాయకునకు వలసినగుణములన్నియు నుండెనేని యతని కావ్యము లోకప్రఖ్యాత మగును. "మహాకులీన తౌజ్జ్వల్యం మహాభాగ్య ముదారతా । తేజస్వితా విదగ్ధత్వం ధార్మికత్వాద యోగుణా" యని యుత్తమ నాయకగుణములు చెప్పఁబడినవి. ఈ కావ్యమునఁ బ్రధాననాయకుఁ డగు రామున కీగుణములు కలవని యిచ్చటివిశేషణములు చెప్పుచున్నవి. ధర్మి=ధార్మికత్వమును, ౧౭౬ పద్యములోని మతిమంతుఁ డననది పాండిత్యము సౌదార్యమును, సద్గుణాంబునిధి యననది మహాభాగ్యము కులీనత్వమును, రాముఁడనునది తేజస్విత్వము, ఔజ్జ్వల్యమును దెలుపును. రాముఁడె యనుచో ఏవకారము ఇట్టిగుణంబు లన్నియుఁ గలవాఁడు నీ కేకాలమం దేదేశమందును వేఱొకఁడు దొరకఁ డని తెలుపును. రామకథ చెప్పుటచే వాల్మీకి ప్రసిద్ధుఁ డయ్యెనా వాల్మీకియంతటివాఁడు చెప్పుటచే రామచంద్రమూర్తి ప్రసిద్ధుఁ డయ్యెనా యని కొందఱు సందేహింతురు. రాత్రిచేతఁ జంద్రుఁడు, చంద్రునిచే రాత్రి ప్రకాశించినట్టు లన్యోన్యోపకారులైరని తోఁచెడి. మఱి యే ఋషీశ్వరుఁడు చెప్పిన నింత బాగుగ రామకథ చెప్పియుండఁజాలఁడు. మఱి యేనాయకుని వర్ణించినను వాల్మీకి కిట్టి లోకోత్తరప్రసిద్ధి వచ్చియుండదు.

తా త్ప ర్య ము .

ఈపద్యము తననోరవచ్చుటకుఁ గారణము నేనని యెఱుఁగఁ జాలక తికమకపడుచున్నాఁడే యని చిఱునవ్వు నవ్వుచు బ్రహ్మ సార్థకజన్ముఁడైన వాల్మీకినిఁ జూచి ప్రేమతో నిట్లనియె. మునీశ్వరా! ఏల నీ వింతదూర మాలోచించెదవు? సందేహము వదలుము, నీనోర వచ్చినది పద్యమే. అది యాదృచ్ఛికముగ

వచ్చినదికాదు. నాపనుపున సరస్వతీదేవి నీనోరనుండి పలికించినది. ఇది నేనుద్దేశించినకార్యమేకాని తనంతటనైనది కాదు. సరస్వతీదేవి నానోర నిలిపినదైన నాచే నాపద్యము పలికింపవలసినంత కార్య మేమి యేర్పడె నందువా? నీకు నారదుఁ డుపదేశించినప్రకారము శ్రీరామచరిత్రమంతయు నిప్పుడు నీవు చెప్పినట్లు పద్యములతోనే మిక్కిలిభక్తిగలవాఁడవై గొప్పకావ్యముగఁ జెప్పవలయును. ఆయనచరిత్రము నే నేల చెప్పవలయు నందువా? బ్రాహ్మణోత్తమా! సమస్తకల్యాణగుణసమేతుఁడును హేయగుణరహితుఁడును సమస్తధర్మములకు నిలువనీడయును శ్రీరాముఁడె సుమా.

ఉ॥ ఆమతిమంతుసచ్చరిత • యందు నగూఢనిగూఢవృత్తముల్
రాముని తత్సహోదరుని • రాక్షసపాళుల సీతవృత్తముల్
ధీమహితా! భవన్మతికిఁ • దెల్లముగాఁగను గోచరించెడిన్
నీమహనీయకావ్యమున • నేరదు దబ్బ ఱొకండునుం జొరన్. ౧౭౬

ఇట్లు రామాయణము రచింప సంక్షేపముగ వాల్మీకికి నన్నుజ్ఞ యిచ్చి బ్రహ్మ యిఁక దానినే సవిస్తరముగఁ జేయ నాజ్ఞ యొసఁగుచు దానికి సహాయముగ నందలి విషయములన్నియు వాల్మీకికిఁ జక్కఁగఁ దెలియునట్లు నర మనుగ్రహించుచున్నాఁడు.

ఆమతిమంతు = బుద్ధిమంతుఁడైన రామునియొక్క. బుద్ధిమంతుఁడు కావున రహస్యకార్యములు అవతారవిషయములు రహస్యముగను, ప్రకాశింపఁజేయదగినవి వెల్లడిగను జేసెను. కావున నాయన చేసిన అగూఢ = రహస్యము కానివి, నారదుఁడు చెప్పినవి అందఱకు దెలిసినవి, నిగూఢ = రహస్యములైనవి. పరత్వము దాఁచిపెట్టిన సందర్భములు, అడవిలో నొంటరిగానున్నప్పుడు చేసినవి, ఆయన మనస్సులోనుండినవి, లోనైనవి నారదుఁడు చెప్పనివి.

వృత్తములు = కార్యములు - చర్యలు, రాక్షసపాళుల = రాక్షస సమూహములయొక్క, ధీమహితా = సూక్ష్మబుద్ధి కలవాఁ డగుటచే గౌరవింపఁదగినవాఁడా, భవత్ + మతికిన్ = నీబుద్ధికి, తెల్లముగాఁగను = స్పష్టముగా, ఇంతకు ముందు నారదునివాక్యములవలన నీకు స్పష్టముగఁ దెలియకుండినదియు, నాయనుగ్రహమున సందేహము తీఱునట్లు స్పష్టముగా నీవే తెలిసికొనఁగలవు.

ఇట్లు రామచరితంబునందలి సర్వవిషయంబులు దాపరికములేక యథార్థముగాను నున్నదున్నట్టు నీకుఁ దెలియు నని యనుగ్రహించి యిఁక నీవు విషయములన్నియు సత్యములుగనే యుండును గాని యసత్యము నీనోర రాదని యనుగ్రహించుచున్నాఁడు.

నీమహనీయకావ్యమునఁ = నీవు రచింపఁబోవు శ్లాఘ్యమైన రామాయణమందు, దబ్బఱ యొకండుఁ = (1) ఒక యసత్యమైనను (2) కావ్యదోషములుగాఁ జెప్పఁబడిన పదవాక్య తదర్థదోషంబులలో నొక్కదోషమైనను (3) పూర్వోత్తరవిరుద్ధములైనను ఇంచుకంతయును జొరనేరవు ఈదోషములు కవివాక్యలయందే కాని పాత్రములచర్యలయందుఁ గాదని యెఱుంగవలయు. సీతను రావణుఁడు చంపవచ్చినప్పుడు వారించినది ధాన్యమాలిని యని యొకచోటను మందోదరియని యొకచోటను జెప్పఁబడినది ధాన్యమాలిని యనునది కవివాక్య. గుర్తింపలేక హనుమంతుఁడు మందోదరి యని చెప్పెను ఈదోషము కవిది కాదు. సీతాదేవి బొంకినట్లును, రామచంద్రమూర్తి చాటుననుండి వాలిని గొట్టినట్లును యుద్ధమున వెనుకంజ పెట్టినట్లును సుమంత్రుని బొంక నేర్పినట్లును జెప్పెను. ఇవి నాయికానాయకులయందుఁ శాస్త్రోచిత గుణములైనను విగుణములైనను నున్న దున్నట్లు వాల్మీకి చెప్పినాఁడుగాని పాత్రముల కెట్లైన దోషములఁ జెప్పక గుణములకే మెఱుఁగుపెట్టఁ దలఁపలేదు. కాఁబట్టి యిందుఁజెప్పఁబడిన విషయము లన్నియు యథార్థముగ నడచినవే యని విశ్వాసపాత్రము లగుచున్నవి. ఇం దేదైన నమ్మరాని దని తోఁచిన నది మన మనోదుస్స్థితినిఁబట్టి తోఁచినదిగా నెంచవలయును గాని యసత్యము వ్రాయఁబడినదని తలఁపరాదు. వర్ణనలయం దుత్ప్రేక్షాదు లలంకారములు.

మన మిప్పు డుండు సధ మాధమ పరిమనీచ స్థితినిఁబట్టి రామాయణమున వాల్మీకిచెప్పిన (బుద్ధిహీనులు చొప్పించిన ప్రక్షిప్తములు, అధికపాఠములు గావు) విషయము లసత్యము లని తోఁచును. దీని కొకటి రెం డుదాహరణములు తెలిపెదను. శి. వి. వైద్య, ఎం. ఎ, ఎల్. ఎల్. బి గారు

"The idea that Rama went back to Ayodhya in one day in a *Viman* of Kubera strikes us as hyperbolical But it is possible to believe that he was carried in a palanquin of superb construction by fast bearers, a palanquin given by Vibhishana, etc, etc రాముఁ డొకదినములో కుబేరవిమానములోఁ గూర్చుండి యయోధ్యకుఁ బోయెననుభావము మనకు నత్యుక్తిగాఁ దోఁచుచున్నది. అయినను విభీషణుఁ డిచ్చిన మిగుల గొప్ప పల్లకీయందుఁగూర్చుండి బలిష్ఠులైన మోఁతగాండ్రచే మోయించుకొని పోయె నని నమ్ముటకు సాధ్యపడును." ఇట్లు వీరు ౧౯౦౬ లో నేఁటికి ౨౬ సంవత్సరములకు ముందు వ్రాసిరి. వీరి కన్నులయెదుటనే యాకాశవిమానములు నానాదేశములందు సంచారముచేయుట చూచి వీరి వ్రాఁతకు వీరు సిగ్గుపడిరో లేదో తెలియదు. వాల్మీకి యత్యుక్తి వ్రాసె ననిన

వైద్యగారు తా మెట్టి యత్యుక్తి వ్రాసిరో వారికే దోంచినది కాదు. సీతారామలక్ష్మణులుమాత్రమే కారు. సర్వవానరులు, విభీషణాదులును బోయిరి వీ రేవాహనంబులపైం బోయిరి? ఇందఱకుం బల్లకులు విభీషణుం డిచ్చె నను కొందము. ఒక్కొక్కపల్లకి మోయుటకు సథమపక్షమున నెనమండ్రైన రాక్షసులు మోతగాండ్రుండవలెంగదా. అనగా వానరసేనకు నెనిమిదంతలు గాకున్న నందరైన నుండవలయునా? బాలురు వృద్ధులు తప్ప దక్కిన రాక్షసులెల్ల యుద్ధమునం జచ్చినవారే కదా ఇంక బలిష్ఠులు లంకలో పల్లకులు మోయ దాంగి యుండిరా? లంకనుండి యయోధ్యకు నొకనాంట నడచి దండకారణ్యములోం బోనసాధ్యమా? ఇది యత్యుక్తియో వాల్మీకి వ్రాసిన దత్యుక్తియో బుద్ధిమంతు లాలోచింపుడు. రెండవది ఈగ్రంథకర్త ౧౯౧౮ సంవత్సరము వేసంగిసెలవుదినములలోం గాశినుండి బదరీనారాయణు దర్శింప హిమాలయపర్వతములనడుమం బయనించునపుడు ఆ కొండలలో గంగానది (హరిద్వారము - కాశి - పచ్చుశాఖ) పాఱుట చూచి 'యయ్యో వాల్మీకి చెప్పినదంతయు నమ్మియుంటినే. ఇచ్చోట గంగానది యెందో యడుగునం గంటకైనం గానరానిమార్గముల నడవిమృగములైనం దిరుగలేని గహనప్రదేశములం బాఱుచున్నదే, రామాయణమున భగీరథు రథమువెంటం బాఱినున్నదే పక్షులైనం బోవంజాలని యిచ్చోట గుఱ్ఱములు రథ మెట్లు పోంగలిగెనని జుగుప్స నాలోచించుచు ఖిన్నుండై నడచుచుం బోయి యాపూట నొకచోట నాగి పారాయణమునకై రామాయణము దీసి యాఘట్టమును మరల శోధించెను. అందు "భగీరథోపి రాజర్షి ర్దివ్యం స్యందన మాస్థితః । ప్రాయా దగ్రే మహాతేజా గంగా తం చాప్యనువ్రజత్" అను శ్లోకము చదివి యందలి దివ్యం స్యందనం అను పదములు చదివి మరల స్వస్థచిత్తుండయ్యెను. చూ. ౯౦౩ బాల. రామాయణమందుంగల యిట్టి శంకలకు సాధ్యమైనంత వఱకు సమాధానములు చెప్ప యత్నింపంబడును.

తాత్పర్యము.

లోకమున కేవిషయములు బహిరంగముగాం దెలుపవచ్చును ఏవి తెలుపరాదను వివేకముగల శ్రీరాముని సత్యచరిత్రమందు రహస్యములయినవి రహస్యములు కానివి సీతారామలక్ష్మణ రావణాదులచరిత్రములు బుద్ధిమంతుండా! నీమనస్సునకు స్పష్టముగా గోచరించును. లోకపూజ్యమైన నీ కావ్యమందు విషయము చెప్పుటయందు జరిగినదానిక విరుద్ధములుగాని పూర్వోత్తరవిరుద్ధములుగాని యొకయర్థమును దెలుపుమాటకు బదులు మఱియొక మాటగాని వాక్యముగాని యొక్కటైనను గొంచెమైనను గలుగంజాలదు.

క॥ ఇంచుక యైనను గావునఁ, గొంచక శుభరామకథను ♦ గొబ్బునఁ గృతిఁ గా
వించి మనోహరసత్ప,ద్యాంచితగా ధరణి వెలయు♦నటు సేయ వనా. ౧౭౭

కొంచక = జంకక, శుభ = అశుభముల నణఁచి శుభముల నిచ్చునది. ఇది రామచరితవలని మొదటిప్రయోజనము. మనోహర = ఈశబ్దము విన్న తోడనే తక్కినవిషయముల మఱచి ఆ యానందమునకే మనస్సు లయింపఁ జేయును. ఇది రెండవ ప్రయోజనము. ఈప్రయోజనము లెవరికి? శ్రద్ధాభక్తులు గలవారికిగాని రాక్షసప్రాయు లగుపామండులకుఁ గాదు. సత్ + పద్య + అంచిత = మంచిపద్యములచేత నొప్పుచున్నది. కేవలగద్యమయముగాక పద్యగద్యాత్మకముగాక కేవల పద్యాత్మక మని భావము. 'పద్య' యని సామాన్యముగఁ జెప్పుటచేఁ గేవలానుష్టుప్పులనేగాక (ఇది సంస్కృతమున - తెనుఁగున గీతములు) మంచి వృత్తములుగూడ వచ్చు నని భావము.

సత్ = అని చెప్పుటచే రసోచితములయి విన నింపయిన వృత్తములనేకాని సందర్భోచితములుకాని గడబిడవృత్తములు గా వని భావము. గొబ్బునన్ = శీఘ్రముగా, కృతిన్ = గ్రంథమును, ధరణిన్ = భూమియందు, ఊర్ధ్వలోకవాసులకు నేను జేసియున్నాను గావున భూలోకవాసులకు నీవు చేయవలయు నని భావము. చేయవనా = చేయవయ్యా. చేయుము + అన్నా = చేయవనా: అన్న. సూ. అన. ప్రార్థనార్థకమధ్యమపురుషంబున నె దాదు లనుప్రయుక్తంబు లగుచో ము డుల్లు లకు వు రు లగు. (సు. వ్యా. క్రియ. 3౮)

తా త్ప ర్య ము.

కావు౦ నీవు సందేహింపక కీడులను గొలఁగించి మేళ్ళనుజేయు రామకథను నీవు మంచిపద్యములతో శీఘ్రముగాఁ గావ్యముగా రచియించి నాయనా! నా లోకమున నేను జేసినట్లు నీవు భూమియందుఁ బ్రకాశింపఁ బ్రచురపఱుప వలసినది.

క॥ ఎందాఁకఁ గులధరావళు, లెందాఁక నదీనదంబు ♦ లిల వెలయునొ తా
నందాఁక రామకథ జగ, మందున్ స్థిరమగుచు నిలుచు ♦ నయ్య మునీంద్రా! ౧౭౮

ఈ గ్రంథము చాలఁగాలము వర్థిల్లు నట్లును దీనిమూలమునఁ గవికి సత్కీర్తి గలుగునట్లును జెప్పుచున్నాఁడు.

కులధర + ఆవళులు = కులపర్వత సమూహములు; ధరము = పర్వతము; 'ధర శ్శైలేధరా భువి' నానా. మహేంద్రో, మలయ, స్సహ్య, శ్శుక్తిమా, నృక్షపర్వతః। వింధ్యశ్చ, పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః॥ ఇవి యేడు కులపర్వ

తములు. నదులు = తూర్పుగాఁ బ్రవహించు గంగా గోదావరీ కావేరులవంటి. యేళ్లు. నదములు = పడమటి ముఖమై పాఱునదులు- తపతిలోనైనవి. ఇలన్ = భూమియందు.

తాత్పర్యము.

నీవు దేవతాశ్రేష్ఠుఁడవు, లోకపూజ్యుఁడవు. కావున నీపలికిన రామాయణము నీలోకమున శాశ్వతముగా నిలిచినది. అట్టి మహిమ నాయందు లేదు గదా. నేను జెప్పునది నాకాలమువారియందైన వ్యాపించునో వ్యాపింపదో. ఈలోకమున నసూయాపరులు మెండు గావు నేమేమి విఘ్నములు గలిగించి యెల్లెల్లు దోషము లెన్ని వ్యాపింపకుండఁ జేయుదురో. కొంతకాలమే యుండి కొంతదేశమందే వ్యాపించుదానికైనే నేల శ్రమపడవల యునందువేమో, నీ కావిచారము లేదో, నిలేదు. ఎంతదనుక కులపర్వతములు నెందాఁక నదులు నదములు భూమియందుండునో యందాఁక నీవు రచియించు రామచరిత్రము శాశ్వతముగా నుండును. ఈ బ్రహ్మవర మెట్లు సార్థకమయ్యెనో నేఁటిమనకు ననుభవవిదితమే

కం॥ నీరామాయణకావ్యము, ధారుణి నెందాఁక నిలుచుఁ, దత్పర్యంతం
బారయశంబును గని మని, మారమ్యజగంబుఁ బొందు, మా యామీఁదన్. ౧౭.

ఇఁక నీకవికి శాశ్వతయశమును, దత్ఫలముగ నిహపరసౌఖ్యములను జెప్పుచున్నాఁడు. తత్పర్యంతంబు = అంతవఱక, ఆరన్ = సంపూర్ణముగ, మని = ఇహలోకమున జీవించి, ఆమీఁదన్ = మరణానంతరము, మారమ్యజగంబున్ = మాసత్యలోకమును, నేనున్నంతవఱకు మనముకూడనుండి యూవల నిరుపమము మోక్షము చెందవచ్చునని భావము. రామాయణమును జదివినవారికి విన్నవారికి మోక్షఫలము కలుగఁగా రామాయణమును రచించి సీతారాముల నర్చించి వారియనుగ్రహమునకుఁ బాత్రుఁడైనఁ వాల్మీకికి సద్యోముక్తిలేక క్రమముక్తి యేల యందురేని యాయనపలికిన రామాయణ పారాయణనోటనుండియే తాను దనవారు సత్యలోకమున విననలయు ననినో బ్రహ్మయభిప్రాయమని శిరోమణికారుఁడు. నాలుగవపాదంబున ప్లుతయతి.

తాత్పర్యము.

నా రామాయణము లోకమున శాశ్వతముగా నిలిచిన దనుకొమ్ము. దానివలన నాకు రాఁగలఫల మేమి యందువా? ఎంతవఱకు నీరామాయణకావ్యము భూలోకమున వ్యాప్తిగాంచి యుండునో యంతవఱకు నీవు పూర్ణమైన యశస్సునుబొంది జీవించి యూవల మాలోకమునకు రాఁగలవు. బ్రహ్మలోకము మొద

లన్నిలోకములకుఁ బునరావృత్తి గలదుగదా - అట్లుండ మోక్షమునకై తపస్సులు ధారవోయ నేను బరమపదమునకుఁ బోక నీలోకమునకు వచ్చిన నాకోరిక యెట్లు నెఱవేఱుఁగలదందు వేమో నాలోకమునకు వచ్చిన నీకుముక్తి హానిలేదు. అది యెప్పటికైన నీసొత్తే. నాలోకమువారును నీరామాయణము వినఁ గుతూహలముగలవారు. కావున నీవు మాలోకమునకు వచ్చి నేనున్నంత కాలముండి నాతోడ నీవును ముక్తుఁడగుము.

కం॥ అనుచు వచించి విరించియుఁ, జనుఁడుం దిర్భూక్తి కలరి ♦ సారాద్భుతవా
ర్ధిని మునిఁగెను శిష్యులతో, మునివరుఁ డెదఁ దలఁచి ♦ మునుపటిచరితన్. ౧౭౦

విరించి = బ్రహ్మ, చనుడుం = పోయినపిమ్మట, తద్భూక్తికిన్ = ఆయన చెప్పినమంచిమాటలకు, అలరి = సంతోషించి, శిష్యులతో = భరద్వాజాదులతోడ, సారాద్భుతవార్ధిని = శ్రేష్ఠమైన యాశ్చర్యసముద్రమునందు

తాత్పర్యము.

అనిచెప్పి బ్రహ్మ వెడలిపోఁగా నా మంచిమాటలకు వాల్మీకి సంతోషించి ముందు జరిగిన వృత్తము సర్వము శిష్యులతో నాలోచించి యాలోచించి సంతోషసాగరమున మునిఁగినవాఁడయ్యెగ.

కం॥ పౌనఃపున్యముగాఁ దమ, మానసముల ముదము వర్ధ ♦ మానముగా స
మ్మానిశిష్య లెల్లరు, మానుగఁ గడుఁ బేర్తి యనుచు ♦ మఱిమఱి తమలోన్. ౧౭౧.

మానసములన్ = మనస్సులందు, ముదము = సంతోషము, వర్ధమానముగాన్ = వృద్ధియగుచుండఁగా, పౌనఃపున్యముగాన్ = మరల మరలఁ జెప్పుట కలుగునట్లుగ, మునుపటిచరితన్, ఎదన్, తలఁచి తలఁచి యనునది పూర్వపద్యమునుండి యిట కన్వయించును. మునుపటిచరితన్ = మొదటిపద్యమును. మానుగన్ = మనోహరముగ.

తాత్పర్యము.

వాల్మీకిశిష్యులందఱు మరల మరలఁ దలపోయుకొలఁది సంతోష మతిశయింపఁగాఁ దమలోఁ దా మిది చాల వింతవిషయము.

కం॥ ప్రాకటముగ సమవర్ణం, బై కొమరారుచును నాలు ♦ గంఘ్రులకిలిమిన్
శోకమె శ్లోకం బగుచును, శ్రీకరమై చెలఁగె నిట్టి ♦ చిత్రము గలదే. ౧౭౨

ప్రాకటముగ = ప్రకటముగ, ప్రసిద్ధముగ, సమవర్ణంబై = నాలుగుపాదములందును సమానసంఖ్యగల యక్షరములుగలదై; విషమవృత్తము కాదని

భావము. నాలుగు + అంఘ్రులు = నాలుగుపాదముల, కలిమిన్ = కలిగి యుండుటచేత, దీనివలన నిది యర్థసమవృత్తమును గాదు, శోకమె = క్రౌంచ పక్షిదుఃఖమునుజూచి తాళలేక చెప్పినమాటయు, శ్లోకంబగుటన్ = పద్య లక్షణములతోఁగూడిన దగుచు, 'శ్లోకః పద్యే యశస్యపి' నానా. శ్లోకమునకుఁ బద్యమనియు నర్థము. సంస్కృతశ్లోకములను శ్లోకములనియు ఆంధ్రశ్లోకములను పద్యములనియు వాడుక. అనేకులు కొనియాడఁదగినదగుటన్, శ్లోకమె శ్లోకం బగుచు నని నది పాఠాంతరము. శ్లోకమె కీర్తికరముయినదై యని యర్థము. శ్రీకరమై = సంపదనిచ్చునదై, పఠించువారికి వారు వారు కోరు సంపదనిచ్చు నదై, చెలఁగెన్ = వర్ధిల్లెను.

శోకమె శ్లోకమయ్యె ననుటయే సరి యని తోఁచుచున్నది. శోకమెకదా శ్లోకమునకుఁ గారణమయ్యెను కవిత్వ మనఁగా ఛందోభంగము లేకుండునట్లుగ బలాత్కారముగమాటల నీడ్చి తెచ్చి కదలకుండ నొకచోఁ గూలవైచి బిగించి తనకుఁ దాను జదువుకొని మురియు పద్యములకూర్పు గాదు. యరలవమదనస యనుమ నని చెప్పినవాఁడు కవిగాఁడు. ఏదైన నొకమనసునఁ దీవ్రముగ నాటు పదార్థమో విషయమో గోచరించినపుడు గలుగు భావోద్రేకముచేఁ దమంతటఁ దాము వెలువడు రసోదంచితవాక్యములు కవిత్వ మనఁ బడును. అట్టిది చెప్పువాఁడు కవి. వారు వారు వ్రాసిన గ్రంథములే యెవరుసహజకవులో యెవరు కృత్రిమకవులో తెలుపుచుండును. ఈ భావోద్రేకమునకు శృంగారము కారణ మని కాళిదాసుఁడును 'ఏకో రస కరుణ ఏవ' యని భవభూతియు వచించిరి. ఇచ్చట శృంగార ప్రసక్తిలేమిని శోకరసానుభవమే వాల్మీకిని గవిఁ జేసెను. 'నిషాదవిద్ధాండజదర్శనోత్థః, శ్లోకత్వ మాపద్యత యస్య శోకః' రఘువం - ౧౪-౭౦.

కవిత్వవిషయమై పాశ్చాత్యులయభిప్రాయ మిదియే. కవిత్వ మనఁగా-
"The natural impression of any object or event by its vividness executing involuntary movement of imagination or passion and producing by sympathy a certain modulation of the voice or sounds expressing it" -Hazlitt

తాత్పర్యము.

స్పష్టముగా సమానసంఖ్యగల యక్షరములుగల నాలుగుపాదములు కలదై యందమై మన గురువుగారి శోకమె శ్లోకమై భగవద్విషయము గర్భితమగు టచే సంపత్కరమై వెలసెను. ఏమి యీయాశ్చర్యము. ఇట్టివింతకూడఁ గలదా.

క॥ అని యలర భావితాత్ముఁడు, ముని రామాయణసుకావ్య♦మును రచియింతున్
బనిగొని యేతాదృశపద,ద్యనిబంధముగాఁగ నంచు ♦ నాత్మం దలఁచెన్. ౧౮౩

అని (మానీశు శిష్యులెల్లరు) అలరఁగా = సంతోషింపఁగా, వాల్మీకి రామాయణమును రచించుచున్నాఁడని చెప్పుచున్నాఁడు.

భావిత + ఆత్ముఁడు = ధ్యానింపఁబడిన పరమాత్మ గలవాఁడు. గ్రంథము నిర్విఘ్నముగఁ గొనసాగుటకై మొదటఁ బరమాత్మను ధ్యానించుచున్నాఁడని భావము.

పరమాత్మవిషయమై చెప్పుటకుఁ బరమాత్మధ్యానాసక్తుఁడర్హుఁడుకాని యితరులర్హులా? ముని = వాల్మీకి, ఏతాదృశపద్య = తెలియు మా నిషాదుండ యను పద్యమువంటి పద్యములతో, అనఁగా వచనము లేకుండునట్లు, నిరూఢముగాఁగన్ = ప్రసిద్ధముగా, రామాయణ సుకావ్యము = కవియొక్క కర్మము కావ్యము. కవికర్మము లన్నియుఁ గావ్యములుగావు. గ్రంథరచనారూపక కర్మముమాత్రమే. సుకావ్యము=మంచికావ్యము. కావ్యాలాపాంశ్చవర్జయేత్తను నిషేధముండుటచే నిది యట్లు ముద్రారాక్షసాది కావ్యములవలె నిషేధింపఁదగినది కాదనుటకై 'సు' ప్రయోగింపఁబడెను. భగద్విషయము కావున సత్కావ్యము. రామాయణ మను మహాకావ్యమున 'సుగుణౌ సాలంకారౌ, శబ్దార్థౌ దోషవర్జితౌ కావ్య' మ్మని కావ్యాదర్శమునఁ గావ్యలక్షణము చెప్పఁబడినది.

కావ్యలక్షణము.

ఆశీర్నమస్క్రియావస్తు, నిర్దేశోవాపితన్ముఖం
ఇతిహాస కథోద్భూత, మితరద్వార సంశ్రయమ్
చతుర్వర్గఫలాయత్తం, చతురోదాత్తనాయకమ్
నగరార్ణవశైలర్తు, చంద్రార్కోదయవర్ణనైః
ఉద్యానసలిలక్రీడా, మధుపాన రతోత్సవైః
విప్రలంభైర్వివాహైశ్చ, కుమారోదయవర్ణనైః
మంత్రద్యూత ప్రయాణాజి, నాయకాభ్యుదయైరపి
అలంకృత మసంక్షిప్తం, రసభావ నిరంతరమ్
సర్గైరనతి విస్తీర్ణైః శ్రావ్యవృత్తై స్సుసంధిభిః
సర్వత్రభిన్న సర్గాంతై, రుపేతై ర్లోకరంజనమ్
కావ్యం కల్పాంతరస్థాయి, జాయతే సదలంకృతి॥

అని కావ్యలక్షణము.

ఏతాదృశపద్య నిరూఢమనుటచే గ్రంథమంతయుఁ దేటగీతులలోనే వ్రాయఁబడినదని యర్థముగాదు. తేటగీతియైనను నాలుగుపాదములు సమానాక్షరములు గలదగుటచే సమవృత్తములను బోలియే యున్నది. గణము లన్నిట సమానము గావందుకేని యింద్రసూర్యగణముల విభజనము ప్రకారము సమానగణ

ములే. ఇటువంటి పద్యములచేనని చెప్పఁబడెనగాని పద్యనామము నిరూపింప లేదు. సంస్కృతమందును మానిషాద యనునది సమవృత్తముగాదు. కాకున్నను సమవృత్తములు గ్రంథంబునఁగలవుకదా. వాల్మీకిరామాయణమంతయు నను ష్టుప్పులతోనే వ్రాసెను. దీర్ఘపాదవృత్తములు ప్రక్షిప్తము లనువారము దుర్వా దము. ఆవిషయము పీఠికయందుఁ జర్చింపఁబడును.

ప్రథమసర్గమునఁ గడపటిశ్లోక మనుష్టుప్పు గాదుగదా ఇంతయేల యీ సర్గమునందే దీనికి రెండవశ్లోక మనుష్టుప్పు కాదుకదా. కావుననే తాదృశ మనఁగాఁ బద్యకావ్య మనియే గ్రహింపఁదగును. పనిగొని = ప్రయత్నించి. కావ్యము రచించె నని శేషము. ఆరచనక్రమము 3 వ సర్గమునందుఁ జెప్పఁబడును.

తా త్ప ర్య ము.

అని సంతోషింపఁగాఁ బరమాత్మవిషయమై చెప్పఁబూనిననాఁడై పరమాత్మ ధ్యానాసక్తుఁడయిన వాల్మీకి రామాయణమనెడి సత్కావ్యమును బోయవానివిష యమై తాను జెప్పినట్లు పద్యములతోనే వచనము లేకుండునట్లు రచింప నిశ్చ యించెను.

క॥ సారమనోహరవాక్యో, దారము సమవర్ణవృత్త ఘనరసాధా
ధారము సదమలకీర్తివి, హారము రామాయణంబు నఘహారిణంబున్. ౧౮౪

ఇట్లు తలఁచి గ్రంథమును రచించి కుశలవాదులకు దానిని వినఁడని చెప్పు చున్నాఁడు. ఈరెండుపద్యములు సంగ్రహవాక్యములు - ఏకాన్వయము కలవి.

సార = శ్రేష్ఠమైన, రసవంతమైన, అర్థయుక్తమైన, యుక్తమైన. సారో బలే స్థిరాంశేగే న్యాయ్యేక్లీబం వరేత్రిషు - నానా॥ అర్థముచేతను, లక్షణము చేతను శయ్యచేతను వాక్యము శ్రేష్ఠము. "యా పదానాం పరాన్యోన్య మైత్రీ శయ్యేతి కథ్యతే" యని శయ్యాలక్షణము. పదములయన్యోన్యమైత్రి శయ్య. మనోహరము = యింపైన, వైదర్భి గౌడి పాంచాలి యనురీతులలో వైదర్భీ రీతిని గలదగుటచే నింపైనదని భావము వినుటకు శ్రవ్యమై యింపగుటచేతను, మననమున నమృతమగుటచేతను మనస్సు నాకర్షించునదియై యని భావము.

శ్లో॥ సంగీతమపి సాహిత్యం, సరస్వత్యాస్తనద్వయమ్
ఏక మాపాతమధురం, ద్వితీయం చింతనామృతమ్.

సంగీతము - సాహిత్యము అనునవి రెండు సరస్వతీదేవికి రెం...
ఒకటి వినుచుండువఱకుఁ దియ్యగానుండును. రెండవదియు
తలఁచుకొలఁది నమృతమువంటిది యని యుండుటచే నీరెండుగు
యణమందుఁ గలవు. ప్రతిపద్యము రాగయుక్తముగఁ బా

జెవులకింపు, అర్థవంతమగును గావున చింతనామృతము. సార యను శబ్దమునందే యీయర్థము సూచితము సా = సాహిత్యము. ర = రాగము. 'బంధపారుష్య రహితా శబ్దకాఠిన్యవర్జితా, నాతిదీర్ఘసమాసాచ, వైదర్భీరీతి రిష్యతే' యని వైదర్భీలక్షణము.

బంధపారుష్యము, శబ్దకాఠిన్యము, అతిదీర్ఘసమాసములు లేనిది వైదర్భి. వాక్య = పదసముదాయముచేత, ఉదారము = గొప్పది. 'ఉదారో దాతృమహతో'యని యమరము సమవృత్త=ప్రతిపాదమునందు సమానసంఖ్యగల యక్షరములుగల. వృత్తైః=చంపకమాలాదివృత్తములచేత, తత=వ్యాప్తమైనదియు, నిండినదియు, అనఁగా విశేషముగా సమవృత్తములే కలది. ఇది జాత్యుపజాతుల కుపలక్షణము. గూఢ + అర్థ=లోనదాఁగి స్పష్టముగాఁ దెలియని యర్థములకు, వ్యంగ్యార్థములకు. ఆధారము=ఉనికిపట్టు, వ్యంగ్యార్థప్రధానమైనకావ్యమే యుత్తమకావ్యము. సత్ + అమల + కీర్తి= శ్రేష్ఠమై నిర్మలమైన కీర్తికి. కీర్తికి శ్రేష్ఠత్వము పెద్దలు సాధువులు మంచిగా నగకొనుట, నైర్మల్యము = అపకీర్తి సంబంధమే లేకుండుట, విహారము = వేడుకగా సంచరించు స్థలము. కృతిపతికిని జదువువారికిని గీర్తినిచ్చునది యని భావము."ఆదిరాజ యశోబింబ మాదర్శం ప్రాప్యవాఙ్మయం। తేషా మసన్నిధానేపి నస్వయం పశ్య నశ్యతి" యని దండికవి. కృతిపతి యగు శ్రీరామచంద్రమూర్తి యితరవిధముల గొప్పవాఁడయ్యును గావ్యనాయకుఁడుగాకున్న నాయన విషయ మెవ రెఱింగియుందురు? ఎవఁ డెంత గొప్పవాఁడై యెన్ని గొప్పకార్యములు చేసినను కావ్యమునఁ జెప్పఁబడఁడేని వానికిఁ గీర్తి లేదు. "రత్నాఖిలవేష్టితావని వినంబడఁడాతఁడు మేరువెత్తినన్." అని. అఘహారణంబున్ = చదువువారికి, నర్థము చెప్పువారికి, వినువారికి, చదివించువారికిఁ బాపమును బోఁగొట్టునది. "వాసుదేవ కథాప్రశ్నః పురుషాంస్త్రీన్పునాతిహి। వక్తారం పృచ్ఛకం శ్రోతౄన్ తత్పాద సలిలం యథా." శ్రీమన్నారాయణుని కథాప్రశ్నము చెప్పువారిని నడుగువారిని వినువారిని నాయనపాదతీర్థమువలెనే స్త్రీలను బురుషులను బవిత్రులఁజేయును. అనియున్నదికదా. రెండవ పాదంబున నుభయయతి.

తాత్పర్యము.

రసవంతమై వినుట కింపగుటచేతను, మననమున నమృతమగుటచేతను, ర్థించునదియై ప్రాయికముగ సమానాక్షరములుగల సమవృత్తములచే హస్యార్థముల కాధారమైనదియుఁ బఠించువారికి వినువారికి నిర్మల గించునదియై భగవత్ప్రాప్తికి విరోధులయిన పాపములనెల్ల హరిం

కవిరాజ విరాజితము.

సరససమాసవిలాసవిభాసము • సాధునుతంబు సుసంధిగముణ్
వరమధురోపనతార్థసువాక్యని•బద్ధము యోగసమంజసము
ఖరదశకంఠవధాదికముణ్ సుమ•నస్సుఖదంబు మునీరితముణ్
స్ఫురదురుసద్గుణభూషణభూషి•తముణ్ గనుఁడీ రఘురామకథణ్. ౧౮౫

సరస = నవరసములతోఁ గూడి రసవంతమై వినుటకింపైన, సమాస = తత్పురుషాదులగు సమాసములయొక్క, విలాసవిభాసము = తగినచోట నుండుటచేఁ బ్రకాశించునదియును, సుసంధిగముణ్ = యణాదేశసంధి మొదలగు గొప్పసంధులను బొందినది. యోగ = యోగపదములచేత, సమంజసము = మనోహరమైనదియు, పదదోషముగాని సంధిదోషముగాని సమాసదోషముగాని యిందు లేదని భావము. ప్రధానమల్లనిబర్హణన్యాయముగఁ గొన్నిదోషములు ముఖ్యములైనవి లేవన్నప్పుడు చిల్లరదోషములు లేవని చెప్పినట్లే యగు. ఈ పదముచేతఁ గావ్యగుణములఁ జెప్పుచున్నాఁడు. ఏవి — ఈ యుతా గుణములచేత శ్రేష్ఠమైనది. "సమం బంధేష్వవిషమం, తే మృదుస్ఫుటమధ్యమాః" యని సమతావిషయమై దండికవి.

మధుర = మధురత యను గుణముకలదియు, 'మధురం రసవద్వాచి వస్తున్యపి రసస్థితిః, యేన మాద్యంతి ధీమంతో మధునేవ మధువ్రతాః' యని దండికవియే మధురతను నిరూపించెను. ఉపనతార్థ = అర్థవ్యక్తి యను గుణము కలదియునగు, "అర్థవ్యక్తి రమేయత్వమర్థస్య" యని యాకవియే నిరూపించియున్నాఁడు. ఇట్టివాక్యములచేత, నిబద్ధము = చక్కఁగాఁ గూర్పఁబడినదియు, స్ఫురత్ = ప్రకాశించెడి, ఉరు = గొప్పవగు, సద్గుణ = మంచివగు నితర కావ్యగుణము లనియెడి, భూషణ = అలంకారములచేత, భూషితముణ్ = అలంకరింపఁబడినదియు, ఇట్లు కావ్యదోషములులేక గుణములుగల్గి యుండుటంబట్టియే సుమనస్సుఖదంబు = అసూయాదులులేక మంచిమనస్సుతో వినువారికానందమిచ్చునది, సాధునుతంబు = సత్పురుషులచేతఁ గొనియాడఁబడినదియు; ఖర = క్రూరుఁడైన, దశకంఠ = రావణునియొక్క, వధాదికమును = వధలోనగాఁ గలదియును- దీనికి పౌలస్త్యవధమను పేరు కూడఁ గలదని యీ కవియే యింక ముందు చెప్పును. ముని + ఈరితముణ్ = బ్రహ్మచే ననుగ్రహింపఁబడిన సత్యవచనుఁడగు వాల్మీకిచేఁ బల్కఁబడినదియు (2) నారదమునిచే నుపదేశింపఁబడినదియు; నగు రఘురామకథణ్ = రఘువంశమున జనించిన రామచంద్రమూర్తి చరిత్రమును - రామాయణమును.

ఈగ్రంథము రామపట్టాభిషేకాంతమే వినినను, అపేక్షితఫలము లభించుచున్నది. కావున నంతవఱకే చాలుననియు, భారతమున హరివంశమువలె రామాయణమున నుత్తరకాండము ఖిలమనియు, కాఁబట్టియే యోగదృష్టిచే రామచరితను వాల్మీకి సాక్షాత్కరించునెపుడు అభిషేకాంతమే విశదముగ సాక్షాత్కరించెననియుఁ, గావున నంతవఱకే గ్రంథము పఠనీయ మని ప్రాచీనుల యభిప్రాయమనియుఁ గొందఱయభిప్రాయముకాని యిది నిరుత్తరము కాదు. ఉత్తరకాండము పారాయణముచేయుట యాచారమునందు లేకుండుటకుఁ గారణ మది యశుభాంత మనియే. ఉత్తరకాండము పఠించువారును గలరు. అట్టివారు మరల రామజన్మఘట్టమువఱకో సీతాకల్యాణఘట్టమువఱకో చదివి ముగింతురు. పట్టాభిషేకానంతరము శ్రీరాముని జూడవచ్చిన మునీశ్వరులలో వాల్మీకి లేఁడు. అప్పుడు జరిగిన విషయము వాల్మీకి కెట్లు తెలిసె? అది యటుగాక భవిష్యత్తు నారదుఁడు సూచించెను. యోగదృష్టిచే వాల్మీకి చూచెనని చెప్పఁబడిన విషయసూచికలో నదియుఁ గొంతగలదు. యోగదృష్టిగలవానికిఁ గొంతగోచరించి కొంతగోచరింపలేదనుట యెట్లదో మాకు బోధపడలేదు. యోగదృష్టిగలవానికి దేశభేదముకాని కాలభేదముకాని లేక పరదాపై వ్రాయఁబడిన బొమ్మవలె సర్వమఖండముగా గోచరించును. ఎట్లన.— మిగుల నెత్తయిన పర్వతాగ్రముపై నుండువాఁడు ప్రాతఃకాలమున మనకంటె గంట రెండుగంటలకు ముందే సూర్యునిఁ జూడఁగలఁడు మనకు సూర్యుఁ డస్తమించిన గంట రెండు గంటలకుఁగాని వానికి సూర్యుఁ డస్తమింపఁడు. కావున మనము రాత్రి యనుకొనుకాలము వానికిఁ బగలుగానే యుండును. మనకుఁ బగటికాలము ౧౨గంటలయిన వీనికి ౧౪-౧౬ గంటలుగ నుండును. ఉత్తరధ్రువమున నుండువారికి ౬ నెలలు పగలు, ౬ నెలలు రాత్రి గదా. మనకుఁ బగ లని రాత్రి యని భేదము భూమిభ్రమణంబునఁ గలుగుచున్నది మేఘమండలమున కన్నఁ బైగ బోయినవానికి దేశమంతయు నొక్క దేశముగను గాలమంతయు నొక్క పగలుగ నుండునుగాని నిన్న నేఁ డను భేదముండదు. ఆదేశ మీదేశ మను భేదము లేదు. అట్లులే యోగదృష్టికిఁ బ్రకృతిపదార్థము లడ్డము రాఁజాలవు. కావున సర్వ మఖండముగఁ గానవచ్చును. చూడకున్న నేమో కాని చూడఁదలఁచిన యెడల దూరదర్శినిచేఁ జూచువానికిఁ జూపుమేరలోఁ గానరానివి యుండునా? కనుఁడీ = శిష్యులను సంబోధించి వాల్మీకి చెప్పుచున్నాఁడు - మీకన్నులయెదుట జరుగుచున్నట్టులు తదేకధ్యానముతో వినుఁ డని భావము.

ఛందస్సు.

పద్యము కవిరాజవిరాజితము. నగణము నాఱు జగణములు వగణముగలది కవిరాజవిరాజితము. దీనికి యొకమతమున ౮-౭-౭ స్థానంబులందును, నొకమతమున

౧౪ వ స్థానమునమాత్రము యతి చెల్లును. ఈపద్యమున యతి రెండవపక్షము ననుసరించి వ్రాయఁబడినది. నన్నయ యిట్లు వ్రాసియున్నాఁడు.

రజనికరానన పీనపయోధర◆రాజితరాజసుత ర్గవిలసత్. అని—ఆరణ్య.

వినుమది సాత్యకిచచ్చుట కోర్వక◆వీరవరుండగు పార్థుఁడుసేసిన తగవయ్యె॥

—స్త్రీపర్వము ౨ ఆ.

అనవుడు నిట్లను◆నన్నరపాలున◆కాతఁడు మోక్షము◆నర్థి జగ౹జ్జనులకు॥

—స్త్రీ పర్వము ౧ ఆ.

తిక్కన రెండువిధముల వ్రాసియున్నాఁడు. అప్పకవి మొదటి పక్షమును మాత్రమే చెప్పెను.

వ్యా క ర ణ ము.

సమాసము = సంగ్రహము. రామచంద్రమూర్తియొక్క చరిత్రమను విస్తర రూపమునకు రామచరిత్రమనునది సంగ్రహరూపము. దీనికే సమాస మనిపేరు.

సంధి—(1) రెండుశబ్దములు చేరునపుడు మొదటదాని కడపటియచ్చు పోయి రెండవదానిలోని మొదటియచ్చాదేశ మగుట సంధి. ఇది యాంధ్రశబ్దసంధి లక్షణము. అచ్సంధి హల్సంధి లోనగు భేదములు గలవు.

తా త్ప ర్య ము.

రసవంతములైన సమాసములచేఁ బ్రకాశించునదియు, సజ్జనులచే స్తోత్రము చేయఁబడినదియు, సుకరమైన సంధులుగలదియు, సమత్వము - మాధుర్యము-అర్థ వ్యక్తి లోనగు గుణములుగలదియు నగు వాక్యములచే బద్ధమైనదియు, యోగము గూఢి లోనగువానితోఁ గూడినదియు, (పంకజము= బురదలోఁ బుట్టినది యను నర్థము యోగము. కమల మనునది రూఢ్యర్థము), రావణాసురునివధము సధిక రించి చెప్పఁబడినది, మనస్సునకు సుఖమిచ్చునది, పామరకవులచేఁగాక మునీశ్వ రుచేఁ జెప్పఁబడినది, మంచికావ్యగుణము లను నలంకారములచే నలంకరింపఁ బడినది యగు శ్రీరామచరిత్రమును శ్రద్ధతో దర్శనసమాకారమైన ధ్యాన ముతో వినుఁడు.

3 వ సర్గము. వాల్మీకి యోగదృష్టిచే రామచరితమంతయుఁ గనుట

క౦॥ అని ధర్మాత్ముఁడు వాల్మీకి, ఘనధర్మయుతంబు రామ◆కథ సర్వంబున్
గనఁగ యథార్థము నాలోఁచన సేయఁగ సాగె మిగుల◆శ్రద్ధాన్వితుఁడై. ౧౮౭

గ్రంథము జనుల కత్యంతాదరణీయమగుటకై తా నాప్తతముఁడ ననియు, దానిచే గ్రంథమునకు వక్తృవైలక్షణ్యము కల దనియు, నీ గ్రంథమును దాను

రచించుటకుఁ గారణము తాను లోకులు తరించుతలంపేకాని కామక్రోధాదులు గావనియు నీముున్నగువిషయములను గవియింతవఱకుఁ జెప్పి యిఁకను విషయ వైలక్షణ్యమును జెప్పుచున్నాఁడు.

విషయము గ్రంథమునఁ జెప్పఁబడుసంగతి. దానికి-వైలక్షణ్యము=చక్కఁగ నాలోచించి చెప్పఁబడుటయు- దుష్కామాదివిషయముగాక సంసారతరణో పాయముబోధించుటయు. విషయమట్లుుండిననేకదా లోకులాదరించి విందురు. కావున నారెంటినిఁ జెప్పఁదలఁచి యందు ముందుగ విషయము చక్కఁగ నాలో చించి యున్నదున్నట్లు చెప్పఁబడిన దని చెప్పుచున్నాఁడు. దానికై తా నాలో చించిన విధమును జెప్పుచున్నాఁడు. శ్రద్ధాన్వితుఁడై = అక్కఱతోఁ గూడిన కోరికయు, విశ్వాసము గలవాఁడై, తాను జెప్పెడుదానియందుఁ దనకే విశ్వా సము లేనివాఁడు వంచకుఁడగును గాని ఋజుబుద్ధి గాఁడు చేయఁదలఁచిన కార్య మునందుఁ బూర్ణముగ నిచ్చలేకున్న నది యడావిడిగ నుండును. కావున వాల్మీకి యందీ రెండుదోషములు లేవని భావము. ధర్మ + ఆత్ముఁడు = ధర్మమునందు మనస్సుగలవాఁడు. కావున ధర్మయుతము = గొప్పధర్మములతోఁ గూడిన రామకథను; సర్వంబుఁగ = పూర్వోత్తరకథలను. కొంతయే చూచినాఁడను సందేహమును నిది నివర్తించుచున్నది. యథార్థముగ = జరిగినది జరిగినట్లు. ఇట్లు చెప్పుటచే వాల్మీకి చెప్పినదానికి విరోధముగ నెవరైన నేదేని చెప్పిన దానికి కారణాంతర మేదేని గ్రహింపవలయును. యథార్థ మేకవిధముగ నుండును గాని పలువిధములఁ బరస్పరవిరుద్ధముగ నుండదు.

అని = ఈప్రకారము, ధర్మాత్ముఁడు = ధర్మమే స్వభావముగాఁ గలవాఁడు; వాల్మీకి = వాల్మీకిమహర్షి, ఘనధర్మయుతంబు = గొప్పధర్మముతోఁగూడి నది. అన్నిధర్మములలో గొప్పది మోక్షధర్మమే కావున మోక్షప్రదమైనది. రామకథ సర్వంబుఁగ = రామునిజన్మము మొదలు నిర్యాణమువఱకుఁ గల కథను. యథార్థము = ఎట్లెట్లు జరిగినదో యట్లట్లు, కనఁగ = కన్నులారఁ జూచుటకు, శ్రద్ధాన్వితుఁడై = శ్రద్ధతోఁగూడినవాఁడై, ఆలోచన చేయ సాగెఁ = ధ్యానింపఁ బ్రారంభించెను.

తాత్పర్యము.

ధర్మవిచారమే స్వభావముగాఁగల వాల్మీకి గొప్పధర్మముతోఁ గూడిన శ్రీరామచరిత్రమును నాదినుండి యంతమువఱకు వాస్తవముగ జరిగినది జరిగి నట్టు కన్నులారఁ జూచుటకై శ్రద్ధతో నాలోచింప సాగెను.

౪౦॥ వారిచి కరములు మోడిచి, తూరుపుకొనదర్భలపయిఁ ♦ దోరపుయోగం బార సుఖాసీనుండై, సారమతిం గనఁగ రామ♦చంద్రునిచరితన్. ౧౮౭

ఆలోచించినవిధముఁ జెప్పుచున్నాఁడు.

వారిచి = ఆచమించి; కరములు మోడిచి = తనగురువు నారదునిఁ బ్రాచార్యు బ్రహ్మను దలంచి, చేతులు ముకుళించి = అంజలిచేసి, తోరము + యోగము = గొప్పధ్యానము, సమాధి, ఆరఁ = సంపూర్ణముగ నగుటకై, సుఖాసీనుండై = స్వస్తికాసనమం దున్నవాఁ డయి. ఆసనము కుదిరినగాని ధ్యానము కుదురదు, గావున మన స్సైకాగ్రముగ నిల్చుటకై యాసనమం దున్నవాఁడై, సారమతిఁ = అచంచలమైన బ్రహ్మానుగ్రహమువలనఁ గలిగిన గొప్పబుద్ధితో. ఆసనమందుండి యచంచలచిత్తుఁడై సమాధియం దున్నవాఁడై. దీనివలన ధర్మాదాయకమైన కర్మము శుచియై నియమవంతుఁడై శ్రద్ధాభక్తి గలవాఁడై చేయవలయు నని యేర్పడుచున్నది.

శ్లో॥ ఋషయ స్సంయతాత్మానః । ఫలమూలానిలాశనాః । తపసైవ ప్రప శ్యంతి । త్రైలోక్యం సచరాచరమ్. మను ౧౧-౨3౬.

త్రికరణశుద్ధిగలవారై ఫలములు - మూలములు - గాలి యాహారముగాఁగల ఋషులు తపస్సుచేతనే చరాచరములతోఁ గూడిన మూఁడులోకములను జూతురు.

'పరిణామత్రయ సంయమా దతీతానాగతజ్ఞానమ్' పతంజలి 3-౧౬. పరి ణామత్రయసంయమ, మనగా ధ్యానధారణసమాధిత్రయము నేకత్ర సంయ మముచేయుట. మనుస్మృతియందలి సంయతాత్మాన యనుట దీనినే సూచించు చున్నది.

తా త్ప ర్య ము.

ఆచమించి తనగురువు నారదుని గురుగురువును బ్రహ్మదేవునిఁ దలఁచి నమ స్కరించి తూరుపుకొనలుగాఁ బఱచిన దర్భలమీఁదఁ గృష్ణాజినము దాని మీఁద వస్త్రము పఱచి దానిపై సుఖాసనమునఁ గూర్చుండి మనోవృత్తు లన్నిఁటిని బూర్ణముగ నియమించి యేకాగ్రచిత్తుఁడై బ్రహ్మానుగ్రహమువలనఁ గలిగిన గొప్పమనస్సుతో రామచంద్రుని చరిత్రమంతయుఁ జూచుట కారం భించెను.

ఉ॥ ఆరయ రామలక్ష్మణధ♦రాత్మజలుఁ స్వసతీసమేతుఁ డౌ
ధారణిభర్తయుం, బ్రజలు ♦ దదియు నెయ్యడ నేది సల్పిరో
నారల యాచరిత్రములు ♦ వారలనవ్వులు వారిమాటలుఁ
వారలరాకపోకలును ♦ వారలచేష్టలు నున్నరూపునన్. ౧౬౮

ఆలోచింపఁగాఁ గలిగిన ఫలమును జెప్పుచున్నాఁడు. ధరా + ఆత్మజ = భూపుత్రి-సీతాదేవి. స్వ + సతి=తనభార్యలగు కౌసల్యాసుమిత్రాకైకేయులతో,

సమేతుఁడై = కూడినవాఁడై, ఆజి = అజమహారాజుకుమారుఁడు దశరథుఁడు; ప్రజ = జనులు; తద్దయున్ = మిక్కిలి, ఉన్నరూపునన్ = ఉన్నదున్నట్లు.

తా త్ప ర్య ము .

ఇట్లు లాలోచింపఁగా సీతారామలక్ష్మణులు - దశరథుఁడు, సతని భార్యలు కౌసల్యాసుమిత్రాకైకేయులు నగరమందలి ప్రజలు నేయేప్రదేశమం దేదేది చేసిరో యెట్లు నడచికొనిరో యెట్లు నవ్విరో వారిమాటలు వారల రాకపోకలు వారుచేసిన కార్యములు నన్నదున్నట్టు.

ఆ॥ శ్రీతృతీయుఁ డైన • శ్రీరఘురాముఁడు, సత్యసంధుఁ డగుచుఁ • జలిపె నెవ్వి కానలోన నట్టికార్యంబు లన్నియుఁ, గరతలామలకము • గాఁగఁ గాంచె. ౧౮౯

ఇట్లు రాముఁ డయోధ్య నున్నప్పుడు జరిగినవానిని గని యతఁ డరణ్యమున నున్నప్పుడు జరిగినవాని నిఁకఁ జూచుచున్నాఁడు.

శ్రీతృతీయుఁడు = ఆఁడుది మూఁడవదిగాఁగలవాఁడు, తక్కినయిద్దఱు రామలక్ష్మణులు, సత్యసంధుఁడు = నిజమైన ప్రతిజ్ఞగలవాఁడు, కానలోనన్ = అడవియందు, కరతల = అరచేతిలోని, ఆమలకముగాఁగ = ఉసిరికకాయవలె; కరతల + అమల + కమ్ = అఱచేతిలోని నిర్మలమైననీళ్లు అనియుఁ జెప్పుదురు. అట్లు స్పష్టముగాఁజూచె నని భావము. ఉసిరికకాయకుమాఱు రేగుకాయ చెప్పుటయుఁ గలదు. కరబదర మని వాసవదత్త.

తా త్ప ర్య ము.

సీతాలక్ష్మణులతో శ్రీరామచంద్రుఁడు పితృవాక్యపరిపాలనమునకై తానా డినమాట తప్పక యడవిలో నేయేకార్యములు చేసెనో యవన్నియు నఱచేత నుసిరికకాయను జూచినట్టు జూచెను.

ఆ॥ మఱియుఁ గోరి యోగ • మార్గావలంబుఁ డై, నెఱిఁ దదేకనిష్ఠఁ • గొఱలి కాంచి యనఘరామకథ య • థార్థంబుగా సర్వ, మొండుకృతి రచింప • నూనె నపుడు. ౧౯౦

యోగమార్గావలంబుఁడై = యోగమార్గము నాధారముగఁ గొన్నవాఁడై; తత్ + ఏక + నిష్ఠ = ఆ యొక్క విషయమునే ధ్యానముతో, సర్వము = రామ నిర్యాణాంతము వఱకు, ఊనెన్ = ప్రయత్నించెను.

తా త్ప ర్య ము .

అంతతోఁ దృప్తిపడక యోగసమాధియం దున్నవాఁడై యేకాగ్రమనస్సుతో పాపరహితమైన రామునికథనంతయు నిర్యాణమువఱకు వాస్తవముగాఁ జూచి దానినంతయు నొక్క గ్రంథముగా రచింపఁబూనకొనెను.

శా॥ కామార్థంబులు నించుకించుకయ గల్గన్, ధర్మమోక్షంబు లు
ద్దామస్ఫూర్తిని విస్తరిల్ల, వరరత్నస్ఫారవారాశియ
ట్లామానీశుఁడు సంఘటించె రఘురామాధీశు కావ్యంబు ము
న్నేమార్గిన్ సురమాని పల్కె నటు లెంతేఁ గర్ణపేయంబుగాన్. ౯౧

కామ + అర్థంబులు. కామము = కోరిక = ఐహికవాంఛ. ఇది చతుర్విధ పురుషార్థములలో మూఁడవది. అర్థము = ధనము. ఇది రెండవది. ఇంచు కించుకయ=కొంచెముకొంచెమే. అర్థకామములగుఱించి యేమియుఁ జెప్పకున్న వాని వలనికీడు తెలియకపోవును గావున వానిని గైకేయీ దశరథ శూర్పణఖా రావణుల నెపమునఁ గొంచెముగఁదెలిపి, ధర్మమోక్షములు= మొదటిదియు నాలుగవదియునగు పురుషార్థములు - పుణ్యకార్యములు - దానివలనఁగలుగు మోక్షము. ధర్మార్థకామమోక్షము లని వరుసగఁ జెప్పవలసి యుండఁగా వరుస తప్పించుట యేలనఁగా ధర్మము ననుసరించి యర్థకామంబు లనుభవించుట దూష్యము గాదు. కైకేయి లోనగువారి యర్థకాంక్ష శూర్పణఖారావణుల దుష్కామము ధర్మహీనమైనవి. కావున ధర్మహీనమైన కామార్థంబులు చేటు దెచ్చునని చెప్పుటకైయవి ప్రత్యేకముగఁ జెప్పఁబడినవి. అర్థకామాసక్తిఁ బ్రతిఫలముగోరి చేయుధర్మము మోక్షసాధనము కాఁజాలదు ఇచ్చట ధర్మము మోక్షములోఁ జేర్చి దానికి సాధనముగాఁబెట్టుటచే భగవద్విషయక భాగవతనిష్ఠామధర్మమని గ్రహింపవలయును. ఉద్దామ = ఎక్కువగు, స్ఫూర్తిని = తెలివితో, విస్తరిల్లన్ = ఇం దవి ప్రధానము గావున వివివిగాఁజెప్పఁబడిన వనిభావము. ఇట్లు చెప్పుటచే మోక్షసాధకమైన ధర్మము, అట్టిధర్మాచరణము వలనఁగలుగు మోక్షఫలము, ఈరెంటినే రామాయణము విరివిగ బోధించునని తెలియవలయును. అట్టిసాధనమందు ఫలమందుఁ గోరికలేని వా రీగ్రంథము వలన లాభమును బొందలేరు. అర్థకాంక్షచే నధర్మమార్గమున నడచువారు కైకేయివలె తుదకు వ్యర్థప్రయత్నులై లోకమున నపకీర్తి పాలగుటయే కాక తమ కయినవారినిఁగూడ దుఃఖముల పాలుసేయుదురు. మదన మోహితులై కన్నులుగానక స్త్రీవ్యసనాసక్తులగువారు దశరథునివలెఁ దాము చెడుదురు. ఇతరులకుఁ గష్టములు గలిగింతురు. విధవయయ్యు రాముని మోహించిన శూర్పణఖవలెను రావణువలె నధర్మకాముకులు వంశనాశముచేసి పోదుర. స్వధర్మనిష్ఠులకు రామచంద్రమూర్తి వలెను, భగవద్భాగవతకైంకర్యపారతంత్ర్యపరులకు లక్ష్మణ భరత శత్రుఘ్న సుగ్రీవ హనుమ దాదులవలె, విభీషణవలె, వారితోడ సంబంధమగువారివలెఁ బరమపదముఁ గాంతురు. ఇదియే రామావతారముఖ్యప్రయోజనము. శ్రద్ధాభక్తులతోడి రామాయణగ్రంథపఠనమీఫలమునే యిచ్చును. వరరత్న = శ్రేష్ఠములగు మాణిక్యములచే; స్ఫార =

ప్రకాశించు, వారాశియట్లు = సముద్రమువలె, పాలసముద్రమందుఁ బుట్టిన విషమువంటివి కామార్థములనియు, చింతామణి లక్ష్మి యమృతము వంటివి ధర్మమోక్షములనియు గ్రాహ్యము. సముద్రమునందలి రత్నములవలె నీకావ్యమున రసములున్నవని గ్రహింపనగు, ఏమాడ్కిన్ = ఏవిధముగ, సురమౌని= నారదుఁడు, ఎంతేని = మిక్కిలి, కర్ణపేయంబుగాన్ = చెవులతో నాస్వాదించునట్లు, మిక్కిలి శ్రుతిమనోహరమగునట్టు. శబ్దమార్దవము శ్రవణరంజకము, అర్థగాంభీర్యము మనోరంజకము. వినుట కింపుగనుండిన నెట్టివారును వినఁబ్రియత్నించి పిదప గుణమెఱిఁగి బాగుపడుదురు. శ్రుతికటువుగ నుండిన లోకసామాన్యమునకు గ్రాహ్యముగాదు.

తా త్ప ర్య ము.

కామము అర్థము గుఱించి కొంచెముగను, ధర్మము మోక్షము గుఱించి విస్తారముగను నుండునట్లు రత్నములతోఁగూడిన సముద్రమో యనఁ బూర్వము తనకు నారదుఁ డెట్లుపదేశించెనో యాప్రకారము గురుబోధ నతిక్రమింపక యంతకు మించియుండునట్లు వినుటకు మిక్కిలి నింపుగా నుండునట్లు శ్రీరామచరిత్ర రచించెను.

ఉ॥ రామునిపుట్టు, వాతనిప♦రాక్రమమున్, సకలానుకూలతన్
భూమిజనప్రియత్వమును, ♦ భూరితితిక్షయు, సౌమ్యసత్యసం
ధామహిమంబు, గాధిజక♦థాకథనంబు, ధనుఃప్రభంగమున్
భూమిసుతావివాహమహ♦మున్, జమదగ్నిజుతో వివాదమున్. ౧౫ ౨

ఇఁక రామాయణమున విషయసూచిక చెప్పఁబడుచున్నది.

పుట్టువు = పుట్టుక, ఆతని పరాక్రమము = తాటకావధ మున్నగువాని కనుకూలమగు శ్రీరాముని బలము, సకల + అనుకూలతన్ = అందఱియందు నొక్కవిధమయిన యనుకూలభావము, ప్రియత్వము = ప్రేమాస్పదుఁ డగుట, భూరితితిక్ష = అపరాధములను గష్టములను మిక్కిలి సహించుట, సౌమ్య = మంచితనముయొక్కయు (ఉగ్రత లేకుండుట), భావప్రధాననిర్దేశము. సత్యసంధా = నిజమైన ప్రతిజ్ఞయొక్కయు, మహిమము = ప్రభావము, గాధిజకథాకథనంబు = (1) విశ్వామిత్రుఁ డితరకథలఁ జెప్పుటయు (2) విశ్వామిత్రుని యొక్కకథను శతానందుఁడు రామునకుఁ జెప్పుటయు. దీనికిఁగారణ మహల్యాశాపమోక్షణమే కావున నదియు సూచితము. ధనుఃప్రభంగమున్ = జనకునింట శివునివిల్లు విఱుచుటయు; వివాహమహము = సీతాకల్యాణోత్సవము, జమదగ్నిజుతోన్ = పరశురామునితో, వివాదము,

తాత్పర్యము.

శ్రీరాములజననము, బాల్యమందే తాటక సుబాహుఁడు లోనగు రాక్షసుల వధించుటయందుఁ గనఁబఱిచిన పరాక్రమము, సమస్తప్రజలందాయనకు నాయనయందు సమస్తప్రజలకుఁ గల యనుకూలభావము, సమస్త జనులయందాయనకుఁగల ప్రీతి, మిగుల నోర్పు, సత్యవాదిత్వము, విశ్వామిత్రుఁడు కథలు చెప్పుట, శివునివిల్లు విఱుచుట, సీతాకల్యాణము, పరశురామునితో వివాదము.

ఉ॥ రామగుణోత్కరంబు, యువ♦రాజుగ నౌసభిషేకయత్నముఁన్,
కాముకకైక పల్కుబడి ♦ కాంక్షిత, మాయభిషేకవిఘ్నముల్,
రామవివాసనంబును, ధరా♦పతి శోకముచేత నీల్గుటల్,
భూమిజనార్తి, తజ్జనుల ♦ భూమిసుతాపతి వీడి పోవుటన్. ౧౩

ఇఁక నయోధ్యాకాండమందలి విషయసూచన. రామగుణ + ఉత్కరంబు = శ్రీరాముల గుణాతిశయవర్ణనము, కాముక = ధనమునందాశగలది, సంభోగేచ్ఛగలది కాముకి, పల్కుబడి = మాటలవిధము, కాంక్షితంబు = కోరిక, వివాసనము = అడవికిఁ బంపుట, నీల్గుట = చచ్చుట, ఆర్తి = దుఃఖము, భూమిసుతాపతి = రామచంద్రమూర్తి, వీడిపోవుటల్ = వంచనచేసి వదలిపోవుట.

తాత్పర్యము.

శ్రీరాముల సుగుణసంపత్తి యౌవరాజ్యమునఁ బట్టముఁ గట్ట దశరథుఁడు చేసినయత్నము, ధనకాముకయైన కైక పలికినవిధము, యామెకోరిక పట్టాభిషేకవిఘ్నము, రామచంద్రమూర్తి యరణ్యమునకుఁ బ్రయాణమగుట, దశరథుఁడు దుఃఖముచేఁ జచ్చుట, పౌరులు దుఃఖించుట, వారిని వదలి రాముఁడు పోవుట.

చం॥ సొరిది గుహాభిభాషణము, ♦ సూతనివర్తన, మభ్రవాహినీ
తరణము, వాజధారిముని♦దర్శన, మావలఁ జిత్రకూటభూ
ధరవరదర్శనంబు, దళ♦ధామనిమిత్తము, వాస్తుకర్మముఁన్,
భరతుసమాగమంబును, గృ♦హామతి నాతని నాదరించుటల్. ౧౪

సొరిది = కథాక్రమముగా, గుహ + అభిభాషణము = గుహునితో మాటలాడుట, సూతనివర్తనము = సుమంత్రు నయోధ్యకు మరలిపొమ్మనుట; అభ్రవాహినీతరణము = గంగను దాఁటుట, వాజధారిముని = భరద్వాజమహర్షి భూధరవర = పర్వతశ్రేష్ఠముయొక్క, దళధామనిమిత్తము = ఆకుటింటికొఱకు, పర్ణశాలకొఱకు, వాస్తుకర్మము = వాస్తుపురుషపూజ - గృహప్రవేశమున

సూచించును, సమాగమము = చేరుట; కృపామతిఁ = దయతోఁగూడిన మనస్సుతో, అతనిఁ = భరతుని, ఆదరించుటల్ = రాముఁడు పాదుకల నిచ్చి ప్రేమించుటయు.

తా త్ప ర్య ము .

ఆవల వరుసగా గుహునితో మాటలాడుట, సుమంత్రుని మరల నయోధ్యకుఁ బొమ్మనుట, గంగను దాఁటుట, భరద్వాజదర్శనము, చిత్రకూట పర్వతదర్శనము, నందుఁ బర్ణశాల నిర్మించుకొని ప్రవేశించుట, భరతునిరాక, యతని నాదరించుట.

చ॥ జనకునకుఁ నివాపము లోఁ•సంగుటయుఁ, మఱి పాదుకాభిషే
చనమును లోనుగా భరతు•చర్యయు, రాముఁడు దండకాటవిం
జనుట, విరాధుమారణము • సంయములఁ శరభంగునిఁ సుతీ
క్ష్ణునిఁ గను, టంత సీత కన•సూయ యొసంగుట యంగరాగముల్. ౧౯॥

నివాపములోసంగుట = తర్పణముచేయుట, పాదుకాభిషేచనము = పాదుకలను రాజుగా సింహాసనమున నుంచి యభిషేకించుట లోనుగా, భరతుచర్య అయోధ్యాపరిత్యాగము - నందిగ్రామవాసము- జటాధారణము లోనైనవి. మారణము = చంపుట - ఇచ్చటినుండి అరణ్యకాండకథ. సంయములఁ = ఋషులను, అనసూయ = అత్రిభార్య, అంగరాగముల్ = గంధము మొదలగు లేపనద్రవ్యములు, అనసూయ సీత కంగరాగము లిచ్చుట విరాధవధకుఁ బూర్వమే జరిగినది. ఇచ్చట రామాయణకథను సంక్షేపముగాఁ జెప్పుట యుద్దేశముగాని క్రమ మపేక్షితముగాదు.

తా త్ప ర్య ము.

దశరథునకు నీళ్ళు విడుచుట, పాదుకాభిషేకము, నందిగ్రామవాసము మొదలైన భరతచర్య, రామచంద్రమూర్తి చిత్రకూటము విడిచి దండకాటవిచేరుట, విరాధునిఁ జంపుట, శరభంగుని సుతీక్ష్ణుని జూచుట, అనసూయ సీతాదేవి కంగరాగము లిచ్చుట.

కం॥ ఘటసంభవదర్శనమును, జటాయుసంభాషణంబుఁ • జని పంచవటీ
తటమునకుఁ శూర్పణఖఁ, ఘటితవికారాపఘనఁగఁ•గావించుటయున్. ౨౦॥

ఘటసంభవ = కుండయందుఁబుట్టిన యగస్త్యునియొక్క. తటము = స్థలము; ఘటితవికార= చేయఁబడిన విరూపముగల; అపఘన = అవయవముగలద.

తాత్పర్యము.

అగస్త్యదర్శనము - జటాయువుతో మాటలాడుట - పంచవటిచేరి యందు వసించుట - శూర్పణఖ ముక్కుచెవులు గోయుట.

ఉ॥ ఏచి ఖరత్రిశీర్షుల జ♦యించుట, రావణునిర్గమంబు, మా
రీచవధంబు, సీతను హ♦రించుటయున్, రఘురాముశోకమున్
నీచు సురారి గృధ్రపతి ♦ నీల్గఁగఁ జేఁతఁ, గబంధసద్గతిం
బౌచతురాత్మ యా శ్రమణి♦యాశ్రమమున్, హనుమంతుఁ జూచుటల్. ౨౯

ఏచి = పరాక్రమించి, ఖరత్రిశీర్షులను = ఖరదూషణాది పదునాల్గువేల రాక్షసులను, నిర్గమంబు = లంకవిడిచి వెయలుదేఱుట, సుర + అరి = దేవవిరోధి యగు రావణుఁడు, గృధ్రపతిన్ = జటాయువును, చేఁత = చేయుట, చతుర + ఆత్మ = మంచి మనస్సుగల, ఆశ్రయము = పొందుట, నీచు = నీచుఁడైన. నీచుఁడు గా. నీచు ను - వ్యా తత్సమ సూ. ౨౦.

తాత్పర్యము.

దానికి సహాయులై వచ్చిన ఖరదూషణ త్రిశీర్షులను వారిని సేనలతోడ వధించుట, సీతాదేవి నపహరింప రావణుఁడు బయలుదేఱుట, రామచంద్రమూర్తి మాయామృగమై వచ్చిన మారీచుని జంపుట, రావణుఁడు సీతాదేవిని దొంగిలించుకొని పోవుట, రామచంద్రమూర్తి విలాపము, రావణుఁడు సీతాదేవికి సహాయపడవచ్చిన జటాయువును జంపుట, కబంధునిఁ జూచుట, గురుశుశ్రూషయందు నేర్పుగలశబరినిఁజూచుట, హనుమంతునిఁజూచి సంధాయించుట.

కం॥ ఋశ్యమూకంబునకు నేగి♦యినసుతునకు, నమ్మకముఁజూప నెయ్యంబు♦నెమ్మిఁజేసి
వాలిసుగ్రీవులని సేయ♦ వాలిఁ గోలఁ, ద్రుంచి సుగ్రీవు రాజుఁ గా♦వించుటయును.
౨౯

నెయ్యము = స్నేహము, నెమ్మిన్ = ప్రేమతో, అని = యుద్ధము, కోలన్ = బాణముతో, ఇనసుతునకు = సూర్యుని పుత్రుఁడైన సుగ్రీవునకు.

తాత్పర్యము.

హనుమంతునితోడ ఋశ్యమూకము చేరి సూర్యపుత్రుఁడైన సుగ్రీవునితో స్నేహముచేసి యతనికి నమ్మకము పుట్టించి వాలి సుగ్రీవులు యుద్ధము సేయు సమయమున వాలి నొక్కబాణముతోఁ జంపి సుగ్రీవుని వానరరాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁ జేయుటయు.

క॥ తారార్త్రియు సమయము వ,ర్షారాత్రి నివాసనంబు ♦ రఘుపతి కనలున్
వైరోచని కపిసేనా,వారముఁ గూర్చుటయు దిశలఁ ♦ బంచుట కపులన్. ౯౯

తారా + ఆర్త్రియు = తారయేడ్చుటయు; సమయము = వానకాలము గడచినపిమ్మట సీతను వెదకు ప్రయత్నములు చేయవలసినట్లు రామ సుగ్రీవులు చేసికొన్న సంకేతము, వర్షా = వానకాలముయొక్క, రాత్రి = అనఁగా రేయి యుఁబగ లని యర్థము త్రిరాత్రము - దశరాత్రము. అన్నప్పుడు రేయిపగలు కలిసిన దిన మనియేకదా యర్థము. నివాసనంబు = రాముఁడు పర్వతగుహలో నుండుట; కనలు = సుగ్రీవుపైఁ గోపము, వైరోచని = సూర్యపుత్రుఁ డగు సుగ్రీవుఁడు, వారము = సమూహము.

తాత్పర్యము.

మరణించిన వాలికై తార యేడ్చుటయు, వానకాలము గడవఁగానే సీతను వెదక వానరులఁ బంపెద నని సుగ్రీవుఁడు చెప్పిన సంకేతము, వానకాలమందు గుహలో నుండుటయు, సుగ్రీవుఁడు సమయముతప్పి వర్తించె నని రామచంద్రమూర్తి కోపించుట, సుగ్రీవుఁడు సేనలఁగూర్చుట, వానరులను సీతాదేవిని వెదకిరం డని నాలుగుదిక్కులకుఁ బంపుట.

ఉ॥ భూమి నివేదనంబు క్రమ♦మున్, మణిముద్రిక యీవియున్, గుహన్
ధీమహితు ల్గపీశ్వరులు ♦ దేఁకువఁ జొచ్చుట, చావఁ గోరుచున్
భూమి శయించుటల్, నికట♦భూమి జటాయుసహోదరుండు శా
ఖామృగపాళిఁ జూచుట, న♦గంబుఁ నెక్కుట, యబ్ధి దాఁటుటన్. ౧౦౦

భూమి నివేదనంబు = ద్వీపములు సముద్రము మొదలగు భూమిభాగము లను సుగ్రీవుఁడు వానరులకుఁ దెలుపుటయొక్క, మణిముద్రిక = రత్నపుటుంగరము, ఈవియున్ = రామచంద్రమూర్తి హనుమంతున కిచ్చుటయు, ధీమహితుల్ = మంచిబుద్ధిచే గొప్పవారు, గుహన్ = స్వయంప్రభయుండు గుహను, తేఁకువన్ = ధైర్యముతో, చొచ్చుట = ప్రవేశించుట, జటాయు సహోదరుండు = సంపాతి, శాఖామృగపాళిన్ = వానరులగుంపును, నగంబు = మహేంద్రపర్వతంబును, ఎక్కుట = సముద్రమును దాఁటుట కై యని భావము, అబ్ధిన్ = సముద్రమును.

తాత్పర్యము.

వారివారు పోవుదిక్కులందుఁగల నదులను పర్వతములను పట్టణములను వనములను సుగ్రీవుఁడు చెప్పుట, దక్షిణపుదిక్కు వెదకఁబోవు నాంజనేయునకు రామచంద్రమూర్తి తనముద్రిక నిచ్చుట, ఆంజనేయాదులు స్వయంప్రభాగుహలోఁ

తాత్పర్యము.

సీతాదేవి యిచ్చినమణి నిచ్చుటయును, రామచంద్రమూర్తి సేసలతో సముద్రముదాఁట యత్నించుట, నలుఁడు సేతువుగట్టుట, అందఱు సముద్రము దాఁటి లంకఁ జేరుట.

కం॥ హితతర విభీషణుశరణా,గతి రక్షోవధవిధంబు♦ గథనం బనిలో
నతికాయుఁగుంభకర్ణుని, నతివిక్రము నింద్రజిత్తు♦నడఁగించుటయున్. ౨౦౬

హితతర = మేలిబుద్ధి, విభీషణశరణాగతి = విభీషణుఁడు రామచంద్రమూర్తి శరణు చొచ్చుట, రక్షః + వధ + విధంబు = రావణ ప్రహస్త మొదలగు రాక్షసులఁ జంపునుపాయముయొక్క, కథనంబు = చెప్పుటయును, అనిలోన్ = యుద్ధమునందు, అతికాయున్ = పెద్ద దేహముకలవానిని, అతివిక్రమున్ - మిక్కిలిబలము గల వానిని, అడఁగించుటయున్ = చంపుటయు

తాత్పర్యము.

మంచిబుద్ధితో విభీషణుఁడు శ్రీరామచంద్రమూర్తి శరణుచొచ్చుట, విభీషణుఁడు రాక్షసుల జంపునుపాయము చెప్పుట, యుద్ధమందు రామచంద్రమూర్తి మిక్కిలి పెద్ద దేహముగల కుంభకర్ణుని, నింద్రజిత్తును జంపుట

కం॥ రావణవధయును భూజా,తావాప్తియు నరిపురంబు♦నందున యభిషే
కావాప్తి విభీషణునకు, నావలఁ బుష్పకమునందు ♦ నధిరోహణమున్. ౨౦౭

అరిపురంబునంద - శత్రునగరమునందే, దీనిచే రామచంద్రమూర్తిపరాక్రమము మిక్కిలి యధికమని తోఁచును. భూజాతా + అవాప్తి = సీతను బొందుటయు, అధిరోహణము = ఎక్కుట.

తాత్పర్యము.

రావణవధ - సీతను గ్రహించుట - శత్రుపట్టణమునందే విభీషణునికిఁ బట్టాభిషేకము చేయుట - యావలఁ బుష్పకవిమాన మెక్కుట.

కం॥ అంద ఱయోధ్యాపురమున,కుం దరలుట భరతుఁ గూడి♦కొనుటయు, నతులా
నందంబుగఁ గౌసల్యా,నందనుఁ డభిషేకమహము♦న వెలుంగుటయున్. ౨౦౮

అందఱు = సీతారామలక్ష్మణులును, భార్యలతోడ రాక్షసవానరులును, తరలుట = ప్రయాణమగుట, అతుల + ఆనందంబుగన్ = సాటిలేని సంతోషము కలుగునట్లు, అభిషేక మహమునన్ = అభిషేక మను నుత్సవముచేత, వెలుంగుట = ప్రకాశించుట, విభీషణుఁడు స్త్రీలతో నయోధ్యకుఁ బోయినట్లు వాల్మీకి స్పష్టముగఁ జెప్పలేదు. ముఖమెఱుఁగని తారా రుమాది వానరకాంతల నెల్లఁ బిలుచు

కొనిపోవఁగోరిన సీతాదేవి తన కష్టదశయందుఁ దన్నెంతో యాదరించిన విభీషణు భార్యాపుత్రికల నేల పిలుచుకొనిపోవఁ గోరలేదు? ఆమె యంతటి కృతఘ్నురాలా? కాదు. రావణాంతఃపురస్త్రీలందఱు విధవలై మూలఁబడిరి. దుఃఖమున మునిఁగియున్న వీరినెల్ల విచారింపవలసినవారీ యిరువురే. ఇంట దుఃఖించు శోకోద్ధంద్రను - గోడంద్రన నెల్లర వగలి స్త్రీలు వేడుక చూడఁ బోవ నెట్లుసాధ్యపడును? కావున సరమాదులు పోరైరి

తాత్పర్యము

అంత అయోధ్యాపురమునకుఁ బ్రయాణమగుట, నందిగ్రామమందు భరతుని తోఁ గలియుట, మిక్కిలిసంతోషముతో శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకముఁ గైకొనుట.

తే॥ సర్వసైన్యవిసర్జనంచరిత మవని, భావివృత్తంబు శ్రీరామభద్రకృతము
నించుకవుదాని వాల్మీకిఋషివరుండు, కావ్యమునఁ జెప్పె నుత్తరకాండముగను. ౨౯

ఇఁక నుత్తరకాండకథ చెప్పఁబడును.

సర్వసైన్య = వానర రాక్షస సేనలనేగాక, రామచంద్రమూర్తిసహాయముపోవ భరతుఁడు కూర్చిన రాజసేనలయొక్క, విసర్జనచరితము = గౌరవించి వారివారి యూళ్లకుఁ బంపినకథ, ఇది సీతాపరిత్యాగమువఱకుఁగల చరితకు సూచకము. ఇంతవఱకు నుత్తరభాగ మందురు. శ్రీరామభద్రకృతము = మంగళకరుఁడైన శ్రీరామునిచేఁ జేయఁబడినదానిని, ఇంచుక + అవుదానిన్ = కొంచెమైనదానిని, భావివృత్తంబును = జరుగఁగల చరిత్రము, బ్రాహ్మణపుత్రుని బ్రదికించుట, అశ్వమేధయాగము లోనైనవి, ఉత్తరకాండముగను = ఉత్తరకాండ మనుపేర, కావ్యమునన్ = రామాయణమందు, ఇంచుక = కథయందుఁ గొంచెమని భావము. పట్టాభిషేకమువఱకు జరిగినకథ గొప్పది. ఆవల జరిగినది కొంచెము.

శ్రీరామచంద్రమూర్తికి రామచంద్రుఁడనియు రామభద్రుఁడనియు నామములు గలవు. ఈ పేర్లు రామాయణమున లేవుగాని యుపనిషత్తులందుఁ గలవు. రామచంద్రశబ్దార్థ మిదివఱకే వ్రాయఁబడెను. ఇఁక భద్రార్థము విచారింతము. 'భద్రశబ్దేన దేవస్య నిత్యనిర్దోషతోచ్యతే'—అహిర్బుధ్న్యసంహిత. (౪౯ వ శ్లో. ౫౪ అధ్యా.) అనఁగా భద్రశబ్దము భగవంతుని నిత్యనిర్దోషత్వము తెలుపుచున్నదని యర్థము. కావున నిత్యనిర్దోషత్వముచే నభిరాముఁడగువాఁడు రామభద్రుఁడు 'భాం దధాతిరవౌ, భద్రాం, భావం ద్రవయతే సతామ్ భవంద్రాయతే ఘోరం, సంసారం తాపసంతతిమ్॥' మంగళకరమైన కాంతిని సూర్యుని

యందుఁ గలిగించువాఁడును, సజ్జనుల భావమును గరఁగించువాఁడును, ఘోరమైన సంసారమును దాపత్రయములను బరువెత్తునట్లు చేయువాఁడును నగువాఁడు భద్రుఁడు. పరబ్రహ్మము. అంతకంటె నభిరాముఁడు-రామభద్రుఁడు "సఉశ్రేయాన్ భవతి జాయమాన" యని పరత్వాదిశకంటె నవతారదశ శ్రేష్ఠమని కదా శ్రుతి చెప్పుచున్నది. 'శుభమంగళయో ర్భద్రం స్యాద్ద్రివ్యశ్రేష్ఠయో స్త్రిషు॥' (నానా. ౪) భద్రశబ్దమునకు శ్రేష్ఠుఁడని యర్థము రామభద్రుఁ డనఁగా రాములందుశ్రేష్ఠుఁడు. పరశురామ బలరాములకంటె శ్రీరాముఁడు శ్రేష్ఠుఁ డని భావము.

తా త్ప ర్య ము .

సేనలనన్నిటిని వారివారి స్థానములకుఁ బంపుట లోనగు జరిగఁబోవు కథను శ్రీరామచంద్రమూర్తిచరిత్రమును గొంటెమైన దాని వాల్మీకి కావ్యమున నుత్తరకాండముగఁ బలికెను.

—* ౪ సర్గము. ప్రబంధవైలక్షణ్యకథనము *—

సీ॥ భువనావనార్థంబు ♦ భూమిపై జన్మించి, ప్రాప్తరాజ్యుం డయి ♦ ప్రజల రాముఁ
డేలుచు నుండ లో♦కోపకారంబుగ, భగవంతుఁ డగుఋషి ♦ వాల్మీకుండు
శ్రీరాముచరితంబు ♦ చిత్రపదంబుల, వెలయ నిర్వదినాల్గు♦వేలు శ్లోక
సంఖ్యయు, వానిని ♦ సర్గముల్ గాఁగను, పుణ్యరామాయణ♦మునను పేరఁబు
తే॥ లేను, కాండంబులాఱుగ♦ జక్కమీఱ, వెండియుత్తరకాండంబు♦ పదపడి కాండ మొండు
పావనంబైనరఘురాము♦భావికథను, పోల్పఁగాంగని నెల్లర♦పోల్పదముగ

౧-౧౦

ముందటి ప్రకరణమున విషయ వైలక్షణ్యము తెలుపఁబడెను. ఈ ప్రకరణమునఁ బ్రబంధవైలక్షణ్యమును దెలుపుచున్నాఁడు. పరమాప్తుఁడగు కవి రచించుటయు, గీర్తిమంతుఁడుగు నాయకుఁడు ప్రతిపాద్యుఁడుగ నుండుటయు, మహాత్ములు దాని నంగీకరించుటయుఁ గథానాయకుఁడే దాని శ్లాఘించుటయు మొదలగునవిగల గ్రంథమునకుఁ బ్రబంధ వైలక్షణ్యము గలుగును. ఇప్పటి పద్యమున నిగ్రంథము పరమాప్తుఁడు రచించిన దనియుఁ గీర్తిశాలియగు నాయకుని బ్రతిపాదించునది యనియుఁ జెప్పుచున్నాఁడు.

రాముఁడు = సమస్తసద్గుణములచే నభిరాముఁడు, ఇట్టిగుణములచే లోకులానందింపఁ జేయువాఁడుగాన యాయన చరిత్రమైన యిది లోకులకు మిక్కిలి యాదరణీయమైనదని భావము. "ఉపశ్లోక్యస్య మాహాత్మ్యాదుజ్జ్వలాః కావ్యసంపదః" యని వామనవాక్యము. భువన + అవన + అర్థము = లోకమును సంరక్షించు

కొఱకు, భూమిపై = భూలోకమున, జన్మించి = పుట్టి, దీనివలన దేవతలాదరించిన చెట్టని భూమిమీఁద దేవాదిదేవుఁడు స్వేచ్ఛగ లోకుల సంరక్షించుటకై మే యంతటి కర్మబద్ధుఁడై కాదని భావము ప్రాప్తరాజ్యుఁడు = అంగీకరించినరాజ్యము గాలఁబడిరి. ఓముదుర్ = రక్షించుచుర్, భగవంతుఁడు - బ్రహ్మయనుగ్రహమున దీంగే. ఇంట గలవాఁడు, ఋషి = వాక్యరచనయందు నేర్పరి 'నానృషిః కురుతే కావ్యం' కూడఁ ఋషయంశము లేనివాఁడు కావ్యము చేయఁజాలఁడు, చిత్రపదములర్ = ర్యకరములగు పదముల చేరికచేత, దీనిచేఁ గావ్యమున కాస్త్రయగురీతి యిందుఁ గలదని యేర్పడెను. 'రీతి రాత్మా కావ్యస్య, విశిష్టపదరచనారీతిః, సమగ్ర రోజః ప్రసాద ప్రభృతిభిర్గుణైరుదితా వైదర్భీనామరీతి' యని వామనవాక్యము (౭) చిత్ర = విచిత్రములగు శబ్దాలంకారములయు అర్థాలంకారములయు, పదములర్ = స్థానములగు వాక్యములతో, అట్టి యలంకారముగల వాక్యముచేత, వెలయర్ = ప్రకాశించునట్లు, శ్రీరామచరితంబు = ఇట్టి మహాపురుష చరిత్రంబు కావున విజ్ఞానాదులగు ననేకలాభంబు లిందుఁ గల వని భావము. 'ప్రాప్త రాజ్యుఁడయి రామచంద్రమూర్తి ప్రజల నోముచుండఁగ' నని చెప్పుటచే రామచంద్రమూర్తి రాజ్యము చేయుచుండు కాలమునందు సీతాదేవి తన యాశ్రమము చేరినతరువాత వాల్మీకి రామాయణము రచియించె నని యేర్పడుచున్నది. దీనివలన రామచంద్రమూర్తి యవతరించుటకు ముందే వాల్మీకి రామాయణమును రచియించె నను వాదము ఖండితము. ఇఁక వాల్మీకిరామాయణమునఁ గల శ్లోక, సర్గ, కాండ సంఖ్యలను దెలుపుచున్నాఁడు. ఇట్లు చెప్పనియెడల వలసినవారు వలసినన్ని శ్లోకములను జేర్తురు కదా. ఇట్లు చెప్పుటవలన భారతాదుల వలెఁ బెద్దదియుఁగాక మిక్కిలి సంక్షేపమునుగాక యుండుట తెలిసి మిక్కిలి ప్రేమతోఁ జదివెదరు. ఇన్ని బందుకట్లు చేసియుంచినను బ్రక్షిప్తములు నధికపాఠములు చేరియున్నవి

శ్లోకసంఖ్య — సంస్కృతపద్యముల లెక్క, వానిని = ఇరువదినాలుగు వేలింటిని సర్గములుగాఁగ, పూర్వరామాయణమున = రామపట్టాభిషేకాంత రామాయణమందు, నూఱులు + ఏను = ఏనూఱు, కాండములు + ఆఱుగ, ఏనూఱు సర్గములని భావము, ఉగ = ఉండము. వెంజియును = మఱియును, మీఁదఁ జెప్పనదిగాక, పడపడె = పుట్టుట, పావనంబైన = పరిశుద్ధమగు, భావికథను = అశ్వమేధము, బ్రాహ్మణపుత్రు బ్రతికించుట మున్నగు చరిత్రను, శ్రీరాముఁ డశ్వమేధమును జేయుటకుముందు సీతను వదలినతరువాత నీగ్రంథము రచించినట్లు ఇతరకథలను భావికథ లనుటచేఁ దెలియనగు. భావికథ కొంచెమగుట చేతనే 'ఇంచుక' యని ౨౦౯వ పద్యమునఁ జెప్పెను. సోత్తరంబుగర్ = రామాభిషేకము మొదలు సీతాపరిత్యాగమువఱకుఁగల కథతోఁ గూడునట్లు;

ఒండుకావ్యము = ఉత్తరకాండమను మఱియొకకాండము. తక్కిన కాండములవలె గూఢముగఁగాక యీకాండమున రామచంద్రమూర్తి పరదేవతయనుట మిగుల స్పష్టముగ ననేకస్థలములఁ జెప్పఁబడినది. కావున దీని కుత్తరకాండమనిపేరు. ఉత్తరకాండము = తక్కిన యన్నికాండములకంటె శ్రేష్ఠమైనది. కోసలవాసుల కందఱకు భగవత్సాలోక్య మీకాండమునఁగదా చెప్పఁబడినది.

కాండములు	సర్గములు.	శ్లోకములు.
బాలకాండము	౭౭	౨, ౨౫౬
అయోధ్యాకాండము	౧౧౯	౪,౪౧౫
అరణ్యకాండము	౭౫	౨,[illegible]౨
కిష్కింధాకాండము	౬౭	౨,౬౨౦
సుందరకాండము	౬౮	౩,౦౦౬
యుద్ధకాండము	౧౩౧	౫,౯౯౦
ఉత్తరకాండము	౧౧౧	౩, ౨౩౪
	౬౪౭	౨౪,౨౫౩

సంస్కృతరామాయణమున సర్గములయు శ్లోకములయు సంఖ్య యిప్పుడీ ప్రకారమున్నవి. ఏనూఱుసర్గలు పూర్వరామాయణమని యెంచినయెడల ౩౭ సర్గములును, సమిష్టిపై ౨౫౩ శ్లోకము లధికమగుచున్నవి. దీనికిఁ గారణము.

(౧) అనేకవేల సంవత్సరములనాఁడు రచింపఁబడిన యీ గ్రంథమును వెనుక వ్రాసినవారి వ్రాఁతదోషమో.

(౨) తొలుత సంకల్ప మాప్రకారముండినను ఆశువుగాఁ జెప్పునప్పుడు హెచ్చై యుండవచ్చునుగదా.

(౩) ౨౪౦౦౦ అనునది అధమపక్షమని సూచించుటకేకాని గ్రంథపరిమితి యిదమిత్థమ్మని నిర్ణయించుటకుఁ గాదు.

(౪) ఈవలివారు శ్లోకము లేవైనఁ జేర్చియుండవచ్చును.

(౫) ౭౧ మహాయుగములు = ౧ మన్వంతరము

౧౪ మన్వంతరములు = ౧ బ్రహ్మపగలు - కల్పము.

౧౦౦౦ మహాయుగములు = కల్పము.

కాఁగా, ౧౦౦౦ మహాయుగములను బదునాలుగింట విభజింపఁగా ౭౧ ౩/౭ మహాయుగము లొక మన్వంతర మగుచున్నది. ౩/౭ మహాయుగమనఁగా ౧౮౫౧౪౨ సంవత్సరము లెక్కువగుచున్నది. అయినను, 'మన్వంతరంతు దివ్యానాం, యగానా మేకసప్తతిః' యని చిల్లర త్రోచివైచి ౭౧ మహాయుగములే లెక్కకుఁ దీసికొనఁబడినవి. చతుర్యుగ సహస్రాణి బ్రహ్మణోదినముచ్యతే' యనియుఁ గలదు. గంట యెంతయని యడిగినప్పుడు ఐదునిమిషము లెక్కువై యున్నను నొకటిన్నర రెండున్నర యని చెప్పునట్లు స్థూలదృష్టిని పెద్దసంఖ్య చెప్పునప్పుడు దానిపైనందు చిల్లరసంఖ్య గణింపఁబడదు. అట్లే యిక్కడ పెద్ద సంఖ్య చెప్పఁబడినదనియు చిల్లరసంఖ్య చెప్పఁబడలేదనియు నెంచవచ్చును. ఈశ్లోకము ప్రక్షిప్తమని కతకుని యభిప్రాయము. తక్కిన వ్యాఖ్యాతలందఱును దదభిప్రాయమును నిరసించిరి. కావున నా విషయమైన చర్చ యనావశ్యకము.

బొంబాయి (ముంబాయి)లో ముద్రింపఁబడిన రామాయణమందు

కాండముపేరు.	సర్గ సంఖ్య.	శ్లోకసంఖ్య.
ఆదికాండము	౬౪	౨౮౫౦
అయోధ్యకాండము .	౮౦	౪౧౭౦
అరణ్యకాండము . .	౧౧౪	౪౧౫౦
కిష్కింధాకాండము .	౬౪	౨౦౨౫
సుందరకాండము	౪౩	౨౦౪౫
యుద్ధకాండము	౧౦౫	౪౫౦౦
అభ్యుదయిక కాండము	౯౦	[illegible]౬౦
అభ్యుదయికం సభవిష్యం సహోత్తరం	౫౬౦	౨౪౦౦౦

ఈప్రకారమున్నది.

తాత్పర్యము.

లోకరక్షణకొఱకై భూమిమీఁద శ్రీరామచంద్రమూర్తి యవతరించి ప్రజాపాలనము చేయుచుండు కాలమున భగవంతుఁడగు వాల్మీకిమహర్షి లోకోపకారముగఁ జిత్రమైన పదములచే నిరువదినాలుగువేల శ్లోకము లుండునట్లును పూర్వరామాయణమున నాఱుకాండములలో ౫ నూర్ల సర్గము లుండునట్లును, నామీఁద శ్రీరాముల పట్టాభిషేకానంతరము గ్రంథమును గుశలవులు ప్రక

టించువఱకు జరిగినకథను వియోగానంతరము జరిగిన భవిష్యత్కథను నుత్తర కాండముగ రచించెను.

కం. వ్యాపింపఁ జేయ జగమున, నోపిక వాగ్వశముగాఁగ ♦ నొనరింపఁగ మేల్
నైపుణి గలుగుసమర్థుఁడు, ప్రాపించునె దీని కనుచు ♦ భావించె మదిన్. ౨౧౧

ఇఁక నీకావ్యము మహాజను లంగీకరించినది యని యనతారికఁ జెప్పుచున్నాఁడు.

వ్యాపింపఁజేయన్ = లోకము నందఱకుఁ దెలియునట్లు చేయుటకు, వాక్ + వశముగాఁగన్ = కంఠపాఠముగా, మేల్ నైపుణి - మంచి నేర్పు, ప్రాపించునె = కలుగునా ?

తా త్ప ర్య ము.

ఇట్లు గ్రంథము రచించి దీనిని లోకమున వ్యాపింపఁజేయుటకు నోపికతో దీనినంతయు ముఖస్థముగఁ జేయఁజాలినశక్తిమంతుఁడు కలుగునాయని యాలోచించెను.

కం॥ ఘనముగఁ జింతింపఁగ నిటు, మునిపుంగవుఁ డతనిపాద♦ములఁ జాఁగిలిపాటున మునివేషులు బాలకు, లనుపమధీరతులు మ్రొక్కి♦రధికపుభక్తిన్. ౨౧౨

ఘనముగన్ = దృఢముగ, అనుపమధీరతులు-సాటిలేని బుద్ధితో సంతోషించువారు, బాలకులు = గ్రహించుటయందును దానిని జ్ఞప్తియందుంచుకొనుటయందును సామర్థ్యముగలవారు (కుశలవులు), మునివేషులు = మునులవేషము కలవారు. కావున నుపదేశార్హులు. చాఁగిలిపాటున = దండాకారమున సాష్టాంగముగ.

శత్రుఘ్నుఁడు లవణాసురుని మీఁదికి యుద్ధమునకుఁ బోవుచు వాల్మీకి యాశ్రమమందు సేనతో విడిసెను.

ఆరాత్రి సీతాదేవి కవలకుమారులఁ గనెనని వినెను ఆవల లవణునిఁ జంపి మథురయందుండి పండ్రెండు సంవత్సరములు ముఖముచూపులు లేక యుండ రాదుగావున నాగడువు వెళ్లుటకు ముందే రామచంద్రమూర్తిని దర్శింప నయోధ్యకుఁబోవుచు వాల్మీకియాశ్రమమందు విడిసెను. అప్పుడు కుశలవులు రామాయణము గానముచేసిరి. కావున నప్పటికిఁ గుశలవులకుఁ బండ్రెండేండ్ల ప్రాయము. అప్పటికే వారు రామాయణమును ముఖస్థముచేసి యుండుటచే వారు ౧౦-౧౧ ఏండ్ల ప్రాయమప్పుడే దీనిని నేర్చుకొని యుండవలెను. సీతాదేవి వాల్మీకియొద్దఁ జేరుటకుముందే రామాయణము రచింపఁబడెనని యది తెలిసియే రామచంద్రమూర్తి సీతను వాల్మీకియాశ్రమమున విడిచెననియు పూర్వులు వ్రాసిరికాని యట్లై

నచో దీనిని నేర్చుకొనువా రెవ్వరా యని యాలోచించు వాల్మీకి తనశిష్యులకు నేర్పక ౧౪ సంవత్సరము లూరకుండెనని యెట్లూహింపనగు? ఈవిషయము రామునకెట్లు తెలిసెను? రామునకుఁ దెలిసియుండినఁ దక్కినవారికిఁ దెలియకుండునా? ఈగ్రంథము సీతాపాతివ్రత్యము స్థాపించుటకే పుట్టినది. కావున తనయాశ్రమము చేరినప్పుడనే వాల్మీకి దీని రచించెను. మొదటిసారిశత్రుఘ్నుఁడు ౧౮
వాల్మీకాశ్రమమున విడిసినప్పటికి రామాయణము రచింపఁబడలేదు. రచింపఁబడియుండినచో రెండవసారి విన్నట్లు మొదటిసారి వినియే యుండును.

తాత్పర్యము.

ఇట్లు దీర్ఘముగ నాలోచించు వాల్మీకియొద్దకు మునివేషముల ధరించినవారు బాలురు నసమానబుద్ధిచమత్కారముగలవారు, మిక్కిలిభక్తితో సమస్కరించి మేము మీగ్రంథమును సమగ్రముగ ముఖస్థము చేసెదమని చెప్పిరి.

ఉ॥ రాజకుమారు లాజలధి॰రాజకుమారయశోవిభాసులుఁ
రాజితధర్మవేత్త లప॰రాజితతేజులు మంజులస్వర
భ్రాజితులుఁ నిజాశ్రమని॰వాసులు ప్రాజ్ఞులు సామగానవి
ద్యాజయశోభితుల్ కుశల॰వ ఖ్యులు నిశ్చలవేదనిష్ఠులున్. ౨౧౩

రాజకుమారులు = రాజయిన శ్రీరామచంద్రమూర్తి కుమారులు, జలధిరాజకుమార=చంద్రునివలెఁ దెల్లనగు, యశః+విభాసులుఁ = కీర్తిచేతఁ బ్రకాశించువారును, అనామధేయులు కారనట, ఈకీర్తి—విద్య, గుణము, బుద్ధి వీనివలనఁ గలిగినది. రాజిత = ప్రకాశించెడు, ధర్మ = గురుశుశ్రూషాధర్మమును, వేత్తలు = ఎఱిఁగినవారు, అపరాజిత = పరాజయములేని, తేజులు = పరాక్రమము గలవారు, కాంతిగలవారు, విష్ణుదేజమువంటి తేజము గలవారు, మంజుల = మనోహరమగు, స్వర=శారీరమనఁబడుకంఠధ్వనిచేత, భ్రాజితులు = ప్రకాశించువారు, సామగాన విద్యా= గాంధర్వవిద్యయందు, అజితులు = జయింపఁ బడనివారు, నిశ్చలవేదనిష్ఠులు = దృఢముగ సాంగవేదముననే స్థిరాభిలాషగలవారు, అధ్యయనమును = వేదమును అర్థములేక సాంగముగఁ జదువుట యని యీవిశేషణము తెలుపును, ప్రాజ్ఞులు = మేధావంతులు. ప్రజ్ఞ = బుద్ధి అని సామాన్యవాచకమయ్యును బుద్ధివిశేషమగు 'మేధ' యను నర్థమున నిచ్చట వ్రాయఁబడినది, మేధ=జ్ఞాపకశక్తిగలబుద్ధి, ఈ రెండువిశేషణములు వీరు సాంగవేదాధ్యయన సంపన్నులు గావున వేదార్థమును స్పష్టముగఁ దెలుపు నీగ్రంథమును జదువుటకు వారు యోగ్యులని తెలుపును, నిజ+ఆశ్రమవాసులు = తనయాశ్రమమందే యున్నవారగుటచేత నాఋషికి మిక్కిలిఁ బ్రేమాస్పదులని భావము.

తాత్పర్యము.

క్షత్రియజాతి బాలురును, జంద్రునివలెఁ దెల్లనైన కీర్తిచేఁ బ్రకాశించు వారును, గురుశుశ్రూషాధర్మము నెక్కుఁగ నెఱిఁగినవారును విష్ణుతేజమువంటి తేజముగలవా రగుటచే నెట్టి సందర్భమందును దేజము గోలుపోవనివారును, దన యాశ్రమమందే యుండువారును, చక్కని మేధ గలవారును సామగానవిద్య లందు నెట్టివారినైన జయించి కీర్తి సంపాదించువారును, వేదమార్గమందుఁ జలింపని నిష్ఠగలవారును, గుశలవు లను పేరు గలవారును.

తే॥ అన్నదమ్ములు దనకు సాష్టాంగ మెరఁగఁ, దతము వేదోపబృంహణార్థంబునైన
మామకోత్తమ కావ్యంబు మహితరీతిఁ, బరన మొనరింప వీరిలే ప్రభువులనుచు. ౨౧౪.

ఎరఁగఁగ = నమస్కరింపఁగా, తతము = విస్తారమయినదియును, వేద + ఉప బృంహణార్థంబునైన=వేదార్థమును విశదపఱుచుటకు ప్రధానముగాఁ గలదియు నగు, ఉపబృంహణము = పెక్కుశాస్త్రముల సాహాయ్యముచేత వేదార్థము నిర్ణయించి తెలుపు గ్రంథము, మామక = నాదియగు, ఉత్తమకావ్యంబు = శ్రేష్ఠకావ్యమగు రామాయణము, మహితరీతిఁ = శ్లాఘ్యమైన విధముతో, ప్రభువులు = శక్తులు. "ప్రభూశక్తాధిపౌ" అని భాస్కరుఁడు.

తాత్పర్యము.

అన్నదమ్ములిరువురు తనకు సాష్టాంగ నమస్కారము చేసి నిలువఁగా వారినిఁ జూచి మిక్కిలి వేదార్థమును విశదపఱుచు నాయుత్తమకావ్యము దాని గొప్ప యోగ్యతకుఁ దగినట్లు పాఠము చేయుటకు మీఁదఁ జెప్పిన యోగ్యతగల వా రగుటచే వీరే యోగ్యులని తలఁచెను.

దీనివలన యోగ్యవిద్య మేధావులు నియతాత్ము లగువారికి నీయఁదగును గాని యయోగ్యుల కీయరాదని యేర్పడుచున్నది అయోగ్యులు రామాయణ ము చదివి చేయు దురాక్షేపములు వినుచున్నారము గదా!

ఆ॥ జనకరాజసుతామహాచరితమెల్లఁ, బల్కె రామాయణంబుఁ గావ్యంబుగాఁగ
వ్రతగరిష్ఠుండు పౌలస్త్యవధమునిషన, బ్రథితభాషణముల యథాతథముగాఁగ. ౨౧౫.

వ్రతగరిష్ఠుండు = వ్రతములచేత మిగుల గొప్పవాఁడు, పెక్కువ్రతములఁ జేయుటవలన నత్యధికమైన జ్ఞానము మహిమ గలవాఁ డని భావము. రామాయ ణంబుఁ = (1) రాముఁడు = సంతోషపఱుచువాఁడు, 'రామోరమయతాం వర' యని నిర్వచన వాక్యము (2) గుణములచే వీనిని జూచి యందఱు సంతో

షింతురు, అని వ్యుత్పత్తి రెండు విధములు, ఆయనము= ప్రతిపాదకము రామాయణము, సమస్త శుభగుణములుగల శ్రీరాముని బ్రతిపాదించునది రామాయణము, కావ్యంబుగాఁగన్, కవి = లోకోత్తరముగ వర్ణించుటయందుఁ జాల నేర్పరి, అట్టివానికృతి కావ్యము, గ్రంథము వేదార్థోపబృంహణ మైనప్పుడు కావ్య మనవచ్చునా ? యని సందేహింపరాదు. ఇది వేదార్థోపబృంహణమయ్యుఁ గాంతవలెఁ దత్త్వార్థంబును మిగుల సొంపుగా ధ్వన్యర్థముగా నపదేశించును గావున నిది కావ్య మయ్యె. గ్రంథములు మూఁడు విధములు (1) ప్రభుసమ్మిత శబ్దప్రధానము. ఇది శబ్దముల యాడంబరము గలిగి రాజువలె నాజ్ఞాపించునది, వేదము, వేదవాక్యము రాజాజ్ఞవంటిది. చెప్పినట్లు చేయవలసినదే విధి. ఏల యని ప్రశ్నింపరాదు. చేయకుండిన శిక్షగలదు. (2) సుహృత్సమ్మితము అర్థ ప్రధానము. ఇది స్నేహితునివలె బోధించునది. స్నేహితునకు బోధించు నధికారమే కాని దండించి చేయించునధికారము లేదుగదా! ఇవి పురాణేతిహాసాదులు. (3) కాంతాసమ్మితము వ్యంగ్యప్రధానము. వ్యంగ్యార్థమే ముఖ్యముగాఁగలిగి ప్రియురాలివలె మనస్సునకు నచ్చచెప్పి చేయించునది. ఇవి కావ్య నాటకాదులు. ఇది యర్థ ప్రధానమై ఇతిహాసముగను, వ్యంగ్య ప్రధానమై కావ్యముగను నగుట యుక్తమే. పంచమవేద మగు భారతము కావ్యమనియే చెప్పఁబడెను. "కృతం మయేదం భగవన్ కావ్యం పరమపూజితమ్" అని నే నీ కావ్యమును రచించితి నని వ్యాసమహర్షి బ్రహ్మతోఁ జెప్పఁగా, బ్రహ్మ "త్వయాచ కావ్య మిత్యుక్తం, తస్మాత్కావ్యం భవిష్యతి" యని చెప్పెను.

జనకరాజసుతా = సీతాదేవియొక్క, మహాచరిత్రము = ఉత్కృష్టమైన చరిత్రము. రామచంద్రమూర్తి చరిత్రకంటె సీతాదేవిచరిత్ర యుత్కృష్టమైన దని భావము కౌసల్యాగర్భసంభూతుఁడు రాముఁడు, అయోనిజ సీత. తండ్రి యాజ్ఞప్రకార మడవులకుఁ బోయినవాఁడు రాముఁడు, ఎవరి బలాత్కారములేక కేవల పతిభక్తిచే నడవులకుఁ బోయినది సీత. సాముగరిడీలచేతను వేఁటలాడుట యుద్ధముచేయుట మొదలగు కష్టకార్యములచే గట్టిపడిన దేహముకలవాఁడు రాముఁడు, ఎండకన్ను వానకన్ను నెఱుఁగక యంతఃపురములోనున్న సుకుమారి సీత. స్వతంత్రుఁడై నిర్భయుఁడై శక్తుఁడై తోడుగలవాఁడై దుఃఖ మనుభవించినవాఁడు రాముఁడు, రాక్షసాధీనయై ప్రాణభయముగలదై నిరాహారయై యశక్తయై యొంటరియై దుఃఖ మనుభవించినది సీత. భక్తులయందలి దోషములను క్షమించెద నన్నవాఁడు రాముఁడు, భక్తులయందు దోషములే లేవనినది సీత. కాకాసురునికి శిక్ష విధించి క్షమించినవాఁడు రాముఁడు, పదిమాసములు రేయుంబగలు తన్ను బాధించిన రాక్షసస్త్రీల నూరక క్షమించినది సీత. తనకు వచ్చిన యపవాద మునకై యితరుల దండించినవాఁడు రాముఁడు; మగని యపవాదము పోవు

టకై వాల్మీకి యాశ్రమమున నవసినది సీత. లోకపిత రాముఁడు, లోకమాత సీత. తండ్రికంటెఁ దల్లి శతగుణ మధికురా లని శాస్త్రము. మైత్రిభావించి తాన సంప్రాప్తుఁడైనవానిని రక్షించువాఁడు రాముఁడు, నమస్కారమాత్రమున రక్షించునది సీత. సీత ప్రేమస్వరూప, సీతలేని రాముఁడు ప్రేమలేనివాఁడు. రావణుచేఁ జెఱసాల నుంపఁబడిన స్త్రీల కాలిసంకెలల నూడఁదీయుటకై తన కాలికి సంకెలలఁ దగిలించుకొని సీత నిర్బంధమున నుండెఁగదా! హనుమంతుఁడు చెప్పినట్లు సీతాదేవి తేజస్సుచేఁ జచ్చినరావణుని గదా రాముఁడు నిమిత్తమాత్రమై యానలఁ జంపెను. కావున భక్తరక్షణమందు రామచంద్రమూర్తికంటె సీతాదేవియే త్వరగలది. సీత తనకంటె మహానుభావ యనియుఁ దన చరిత్రము కంటె సీతచరిత్రమే శ్రేష్ఠమైనదనియు రామచంద్రమూర్తియే చెప్పెను గదా! (చూ. బాల. ౨౩౪ ప) ఈకారణములచే శ్రీరామాయణము సీతామహాచరిత మగుట కేమిసందియము? ఈ కారణములచే రామచంద్రమూర్తికన్న సీతాదేవియే శ్రేష్ఠురాలనియు, రామచరితమునకన్న సీతాచరిత్రమే శ్రేష్ఠమైన దనియుఁ దలఁచి సీతామహాచరిత మని వాల్మీకి చెప్పెను. ఇంతకు వాల్మీకి యుద్దేశము సీతాచరిత్రము చెప్పవలయుననియే కదా. ప్రధానము సీతాచరిత్రము, గౌణము రామచరిత్రము. రామచరిత్రము చెప్పక సీతాదేవిచరిత్రము చెప్పుటకు సాధ్యపడదు గావునను పోలికచేతఁగాని సీతయుత్తమత్వము తెలియరాదుగనుకను రామచరిత్రము చెప్పవలసి వచ్చెను. "మాత ర్మైథిలి రాక్షసీస్త్వయి తథైవార్ద్రాపరాధాస్త్వయా। రక్షంత్యా పవనాత్మజా ల్లఘుతరా రామస్య గోష్ఠీకృతా। కాకం తంచ విభీషణం శరణ మిత్యుక్తిక్షమౌ రక్షత। స్సానస్సాంద్ర మిహాగ సస్సుఖయతు క్షాంతి స్తవాకస్మికీ॥ అని శ్రీగుణరత్నకోశమునఁ గలదుకదా. జనకరాజసుతామహాచరితమగుట కిదేకారణము. రామాయణ మనుపేరుకూడ నీయర్థమునే బోధించును. రామా = సీతాదేవియొక్క, అయనము = చరిత్రము, రమ = లక్ష్మి - రమయే రామ - లక్ష్మీస్వరూపయగు సీత, స్వార్థకప్రత్యయము - హారిద్ర మాక్షిక శబ్దములవలె.

దీనిచే నీగ్రంథము శరణాగతి మంత్రము ద్వయమున కుపబృంహణ మనుట తెలియనగు. శ్రీభాగవతాదులు అష్టాక్షరోపబృంహణములై భగవత్కథను దెలుపును. 'నారాయణకథామిమా'మ్మని యందే చెప్పఁబడెను. 'శ్రీమద్రామాయణమపి పరం ప్రాణితి త్వచ్చరిత్రే' యని పరాశరభట్టారకులును, 'ప్రాతర్ద్యూత ప్రసంగేన, మధ్యాహ్నే స్త్రీప్రసంగతః। రాత్రౌ చోర ప్రసంగేన కాలోగచ్ఛతి ధీమతా'మ్మని యాభాణకుఁడును శ్రీరామాయణము సీతాచరిత్ర మనిరి. మఱియు మోక్షోపాయ పురుషకారములలో నుపాయస్వరూపము భారతమునను, పురుషకారస్వరూపము శ్రీరామాయణమునను జెప్పఁబడెను. ఉపాయము=భగ

వంతుఁడు. పురుషకారము లక్ష్మి యని పూర్వాచార్యులనిరి. ఇట్లగుటచేతనే, 'ధీరాత్ముం డవికత్థనుండు, కరుణోద్వేలుండు సత్త్వాఢ్యుఁ డా ధీరోదాత్తుఁ' డని చెప్పఁబడిన లక్షణములుగల శ్రీరామచంద్రమూర్తి కుశలవులుపాడ నీరామాయణము విననంగీకరించెను. లేనియెడఁ దనస్తుతిగల కావ్యమును రామచంద్రమూర్తి వినునా? తనది కాదుగనుకనే వినెను. ప్రియాచరిత్ర మగుటచేతనే యామె విరహకాలమున విరహబాధతీఱ రాముఁడు వినుచుండెను. కాముకులకు ప్రియావిరహసమయమున ప్రియచరిత్రయేకదా విననిన సంతోషదాయకము.

ఎల్లక = సమస్తము. అగుటచే భూమియందుఁ బ్రవేశించుటకూడ నని యర్థము. అది చెప్పకున్న సీతాచరితమంతయుఁ జెప్పినట్లు కాదుకదా. ఇట్లు రామాయణమున వ్యంజనావృత్తిచేఁ జెప్పఁబడు నర్థము సీతారాముల చరిత్రము లని చెప్పి, యిఁక శబ్దశక్తిలభ్యమగు నర్థమును జెప్పుచున్నాఁడు. సీతామహాచరిత మనుటచే శివశక్తి చరిత్రమని భ్రమింపరాదు. శాక్తేయశక్తితత్త్వమునకు సీతాతత్త్వమునకు భేదముగలదు

పౌలస్త్యుఁడు = పులస్త్యగోత్రమునఁ బుట్టినవాఁడు, గోత్రాపత్యార్థక తద్ధితాంతము. అతనియొక్క, వధము = చావు. ఇదియే యిందుఁ బ్రధానఫలము దీని నుద్దేశించి చేయుటంబట్టి యీ గ్రంథమునకుఁ బౌలస్త్యవధమనియే పేరు. ఫలము నుద్దేశించి గ్రంథమునకుఁ బేరుకలిగెను. కృష్ణచరిత్రము శిశుపాలవధ యని నట్లని యెఱుంగునది. కాకాక్షి న్యాయ్యముచే 'ఎల్లక' అనునది రామాయణముతోను నన్వయించును. రామనిర్యాణమువఱకు నని యర్థము.

ప్రతికావ్యమునను బీజము, బిందువు, పతాక, ప్రకరి, కార్యము అని యయిదు విషయంబులు చెప్పవలయును. 'బీజ బిందు పతాకాఖ్యాః ప్రకరీ కార్యలక్షణాః। అర్థప్రకృతయః పంచ, పంచావస్థా సమన్వితా' యని దీనికిఁ బ్రమాణము - ఆయైదంటిలోఁగూడ ఆరంభము, యత్నము, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమము అననవి యైదు కార్యావస్థలు. "ఆరంభయత్న ప్రాప్త్యాశా, నియతాప్తి ఫలాగమా" యని ప్రమాణము. అందు బాలకాండమునఁ జెప్పిన రామావతారము సీతావివాహము మొదలగునవి కథాబీజములు. అయోధ్యాకాండమున రామ పట్టాభిషేకవార్తచే రావణవధ ప్రయత్నము, విచ్ఛేదపడినను వనవాస ప్రస్తావముచేత నాప్రయత్నము అవిచ్ఛేదముగ వచ్చినదికావున నిచ్చట బిందువు చెప్పఁబడెను. 'వస్తునస్తుతి విచ్ఛేదే బిందు రచ్ఛేద కారణ'మ్మని లక్షణము. సుగ్రీవ వృత్తాంతము పతాక యనఁబడును. 'యదంతరాను వృత్తంస్యా। త్సాపతాకేతి కీర్త్యతే, యనిలక్షణము. విభీషణ వృత్తాంతము ప్రకరి యనఁబడును. 'కథాంతర ప్రసంగేన ప్రకరీస్యా త్ప్ర

దేశభాక్కని ప్రకరిలక్షణము. రావణవధముఫలము ఇదియే కార్యమని చెప్పఁబడును. "సమగ్రఫల సంపత్తిః ఫలయోగో యథోచిత"యని ఫలలక్షణము. కావున నీఫలము నుద్దేశించి పౌలస్త్యవధ మని యీగ్రంథమునకుఁ బేరిడఁబడెను. మిషను — నెపము రావణవధమని సాకుపెట్టి సీతారామచరిత్రమే యిందుఁ జెప్పఁబడెను. సీతాదేవిచరిత్రము చెప్పఁదలఁచినవాఁడు రాము పాతివ్రత్య ప్రకటనమే ఫలముగాఁ జెప్పి సీతాచరిత్రమని యేలపేరు పెట్టరాదందురేని యీయన యుద్దేశము గ్రంథనామమువలననే బయటపడఁగా నామెయందలి పక్షపాతముచేఁ జెప్పెనాఁడని లోకులు తలంతురు. అదియునగాక లోకమున నీగ్రంథరచనకాలమునకు సీతకపఖ్యాతి ప్రబలియుండినది. అట్టిస్త్రీగ్రంథమనిన నెవఁడు విన నియ్యకొనును. అదియునగాక మీఁదఁ జెప్పిన కావ్యలక్షణములన్నియుఁ గుదురవు. రామునిచరిత్ర మని పేరు పెట్టరాదా యనిన రామచంద్రుని ప్రతిదినము లోకులు చూచుచున్నారు ఆయన చరిత్రములు వినుచున్నారు. రావణవధ మెవ్వరు కన్నది కాదు, వినినదిగా విన్నదికాదు. క్రొత్తయొకవింతగా లోకులువిందురు. అట్లైన నుత్తరకాండమున నిగనీ కథయే యని కుశలవులు శ్రీరామునితోఁ జెప్పినట్లు చెప్పఁబడిన దే యందురేని (ఉత్తర. ౧౪౮-౨ ప) సత్యము. రావణవిషయమంతయు నగస్త్యునిచే రాముఁడు విని యున్నాఁడు. యావద్వృత్తాంతము తెలిసియున్నది. తన సంసారసుఖమును నాశముచేసినవాని కథను మరల మరల నేమి వినవలయు ననిరాముఁడు పేక్షించునని నీకథయనియే బాలురు చెప్పిరి. పామరాభిప్రాయము తమవిషయమై తనకుఁ దెలిసిన దే. ఋషీశ్వరాభిప్రాయ మెట్లున్నదో వినుట బాగనియు నీమూలమున సీతాదేవీమాహాత్మ్యము వెలువడుననియు రామచంద్రమూర్తి విన నిచ్ఛగించెను.

'ప్రథిత భాషణములన్ — ప్రసిద్ధికెక్కిన మాటలతో, అందఱకుఁ దెలిసిన మాటలతో, అర్థము గూఢమేకాని పదములు గూఢములు కావని భావము. యథాతథము = ఉన్నదున్నట్లు.

తాత్పర్యము.

సమస్త సీతాచరితముపరముగాఁగల రామాయణమంతయు ప్రసిద్ధులచే గొప్పవాఁడగు వాల్మీకి రావణవధను నెపముగాఁగొని ప్రసిద్ధవాక్యములనన్న దున్నట్లు రచించెను.

సీ. చదివినఁ బాడిన ♦ శ్రవ్యమై భవ్యమై, జనమనోహర మయి ♦ యొనరుదాని
లలి ద్రుతమధ్యవి♦లంబితధ్వనిపరి, చ్ఛేదగానంబులఁ ♦ జెలఁగుదాని
సరిగమపదని యన్♦స్వరముల జాతుల, బద్ధమై శుద్ధమై ♦ పఱిబలు దాని
రాణ విపంచికా♦రమ్యమై సౌమ్యమై, తాలలయంబులఁ♦గసుబుదాని

తే॥ నతులశృంగారకారుణ్య హాస్యవీర, రౌద్ర శాంతాద్భుతాదిక రసము లలరు
దాని, శృంగారరసము ప్రధానముగను, గప్ప మవుదాని నేర్పె నా కవలు పాడ.
-౨౧౬-.

ఇఁక నీ గ్రంథగుణములు కుశలవుల కుపదేశించుటయుఁ జెప్పఁబడును.

చదివిన ల్ = చదువవలసిన విధము భరతఋషి నాట్యశాస్త్రమునఁ జెప్పినాఁడు. 'షడలంకార సంయుక్తం, కలాకాల సమన్వితం, యత్పఠ్యతే నాటకాద్యా తత్పాఠ్య మభిధీయతే" యని. శ్రవ్యమై = వినుట కింపై, కొన్ని పద్యములు చదువుటకింపై, గానమున బాగుండవు. మఱికొన్ని గానమున బాగుండునుగాని చదువుటకు బాగుండవు ఇది యట్లుగాదు ఇది చదివినను, బాడినను బాగుండును. మనోహరము = మనస్సు నాకర్షించునది. లలిన్ = క్రమముగా. ద్రుత + మధ్య + విలంబిత = ఈ పేళ్లుగల కాలములు, ధ్వని = పాటశబ్దముయొక్క, పరిచ్ఛేద = మితిని జూపువానినిగల, గానంబులన్ = పాటలచేత, సరిగమపధనియన్ = ఇట్టి సంకేతనామములుగల, స్వరములజాతుల = స్వరజాతిలోఁ జేరిన యేడుస్వరములచేత, స్వరజాతి, శుద్ధము, వికృతము, సంకీర్ణము లోనగు భేదములచేఁ బదునెనిమిది విధములు అందుఁ బ్రధానము లేడు స్వరములు. ఇవి గానమున కత్యావశ్యకములు స = షడ్జము, రి = ఋషభము, గ = గాంధారము, మ = మధ్యమము, ప = పంచమము, ధ = ధైవతము, ని = నిషాదము, అని యేడుస్వరములకు సంజ్ఞాక్షరములు. ఇవియే సరిగమపధని యయ్యె. ఇందు ష-ఋ కఠినోచ్చారణములు గావున స రి యని సరిచేసికొనిరి. 'స్వతో రంజయతి శ్రోతృచిత్తం సస్వర ఉచ్యతే స్వయం రంజయతే నాదః సస్వరః పరికీర్తితః' విను వారి చిత్తములను స్వయముగ రంజింపఁజేయునది కావున స్వరమనఁబడును.

బద్ధమై = కట్టఁబడినదై. శుద్ధమై = గానలోపములు లేనిదై, రాణన్ = ఒప్పిదముతో, విపంచికా = వీణచేత - వీణయందుఁ బాడుటచేత, రమ్యమై = మనోహరమై, సౌమ్యమై - కొన్ని శబ్దములవలె భయంకరములుగాక, శాంతమై, తాల = కంచువాద్యశబ్దఁబులతోను, లయఁబులన్ = మృదంగము తాలము మొదలగు వాద్యముల సమకాలమున ముగింపు లయము వీనితో, తనరు = ఒప్పు, అతుల = సాటిలేని, ఆదికశబ్దము భయానక బీభత్స రసములఁ దెలుపును. రసము = స్థాయీభావ మనఁబడు నొక్కవిధమగు మన స్సుస్థితిని వెల్లడిపఱుచుట; శృంగారాదులు తొమ్మిదింటికి స్థాయిభావములు తొమ్మిది విధములు. రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్సాహము, భయము, జుగుప్స, విస్మయము, శమము. శృంగారము సంభోగ మనియు విప్రలంభ మనియు రెండువిధములు.

భార్యాభర్తల సంయోగము సంభోగము. వారి యెడఁబాటు విప్రలంభము. ఈగ్రంథమునందు శృంగారాది రసములన్నియు వర్ణింపఁబడినవి. ఎట్లన:—

"శ్రీరఘురామచంద్రుఁడును సీతనుగూడి" యను బాలకాండము ౧౩౬౪ పద్యము మొదలు రావణుఁడు సీత నపహరించువఱకును, పట్టాభిషేకానంతరము సీత వాల్మీకియాశ్రమమునకు బంపఁబడునఱకు సంభోగ శృంగారము గావ్యము సూచించుచున్నది. ఆపై విప్రలంభశృంగారము. శూర్పణఖావృత్తాంతమున, త్రిజటుని వృత్తాంతమున హాస్యరసము. దశరథాదులచరిత్రమందుఁ గరుణ రసము. కరుణము = ఏడ్పు - దుఃఖము. బుద్ధి భ్రమలేక సదా ప్రయత్నమును దెలుపునది వీరరసము. లక్ష్మణాదిచరిత్రములం దిది చెప్పఁబడినది. కొట్టుట వీల్చుట చంపుట మొదలగు కార్యములచే రౌద్రరస మేర్పడును. రావణు చరిత సందర్భమున నిది స్పష్టము. వికారమగు క్రూరజంతువులఁ జూచినపుడు భయానకరస మేర్పడును. సీతకుఁ గాఁపున్న రాక్షసస్త్రీలు వీరిచర్యయందు నిది తెలియనగును. అసహ్యమగు వస్తువులఁ జూచుటవలన బీభత్సరసము. విరాధకబంధాదుల చరిత్రఘట్టముల నిది స్పష్టము. విచిత్రము లగువానిఁ జూచుటవలన నద్భుతము. రామరావణయుద్ధమునందువలె. ఇట్లన్నిరసము లిందున్నను నీకావ్యమునఁ బ్రధానరస మేది యనఁ గొందఱమతమున శోక ము. (కరుణము). 'శోకమె శ్లోకంబగుచును' అని యుండుటచే శోకముతోనే పుట్టిన యీ గ్రంథమున శోకవృత్తియగు కరుణరసమే ప్రధానమందురు. మఱి కొందఱు పౌలస్త్యవధమని కృతినామము కావున వీరరసమే ప్రధానమందురు. నాయికానాయకులు సీతారాము లనట యంగీకార్యమేని యీ రెండభిప్రాయ ములు సరిగావు. శ్లోకమె శ్లోకంబగుచు ననుపాఠాంతరమొకటి యున్నది. గాన శోకమె ప్రధానకారణమని చెప్పవలనుపడదు. పౌలస్త్యమగుట వీరరసమందమా, యది యుద్ధకాండమందే కలదు. తక్కినకాండముల రావణవీరత్వ ప్రకటనము ప్రత్యక్షముగలేదు. శృంగారరసమో సంభోగరూపముగనో విప్రలంభరూపము గనో యన్నికాండములందును గలదు. జనకరాజసుతామహాచరితము వీరరస ప్రధానంబుగ నెట్లుండఁగలదు? కావున శృంగారరసమే యీకావ్యమునఁ బ్రధాన రసము. తక్కినవి యంగములు - అనిపూర్వులు వ్రాసిరి. కమ్రము=మనోహరము, కవలు = అమడలు - కుశలవులు. పాడనేర్పెనని యన్వయము

తాత్పర్యము.

చదివినను బాడినను వీనులకింపై మనస్సునకు సంతోషకరమై శుభకరమై యుండునదియు, ద్రుతము మధ్యము విలంబితముననుకాలములను ధ్వని, పరిచ్ఛే దములను, గల గానంబుల కనువైన దానిని, సరిగమపధనిస యను స్వరంబుల చేతను జాతులచేతను బద్ధమై దోషరహితమై యతిశయించినదానిని, వీణపై వాయించుటకుఁ దగి కలువుగాక తాలమునకు లయమునకు సరిపోవుదానిని, శృంగారము - హాస్యము- కరుణము - వీరము-రౌద్రము-శాంతము-అద్భుతము

భయానకము - బీభత్సము అను నవరసములు గలదయ్యు నందు శృంగారరసమే ప్రధానముగఁ గలదై మనోజ్ఞమైన రామాయణమును నాకుశలవులు గానము సేయునట్లు వాల్మీకి నేర్పెను.

ఉ॥ గానకళాధురంధరులు • కమ్రతరాకృతు లీడ్యమూర్ఛనా
  స్థానవిశారదాగ్రణులు • చారుతరస్వరు లన్నదమ్ములు
  మ్రానుగ మంజుభాషణులు • నాటకలక్షణశాస్త్రవేదుల్
  మానితరామచంద్రవిభు•మాఱటమూర్తులు గావ్యమంతయున్. ౧౧౭

ఇట్లు కుశలవులకు రామాయణమును ఋషి నేర్పుటేగాక వారు దానిని కంఠపాఠముచేసి సభలయందుఁ బాడ నారంభించి రని చెప్పుచుఁ దదనుగుణముగ వారి గానసామర్థ్యమును దెలుపుచున్నాఁడు.

గానకళా = గానశాస్త్రమందు - గాంధర్వమందు, ధురంధరులు = నేర్పరులు. ఈడ్య = శ్లాఘింపఁదగిన, వీణాదివాద్యముల నుపయోగించుట. స్థాన=తదనుగుణముగ - మంద్రస్వరము మధ్యస్వరము తారస్వరము అని మూఁడువిధములగు స్వరములు కలుగుచోట్లు వీనియందు. విశారద = పండితులయినవారిలో అగ్రణులు = శ్రేష్ఠులు. దీనివలన జంత్రగాత్రముల రెంటను వీరు సమర్థు లని యేర్పడుచున్నది. చారుతర = మిక్కిలి మనోహరమైన, స్వరులు కంఠస్వరము గలవారు, కింతేన కంఠం వినా యన్నట్లు పాండిత్య మెంతయున్నను కంఠము లేదేని వ్యర్థము, అన్నదమ్ములు = ఇది యిరువురన్నిట సమాను లని తెలుపుచున్నది, కమ్రతర = మిక్కిలి మనోహరములగు, ఆకృతులు=రూపముగలవారు, మ్రానుగన్ = ఇంపుగ, మంజుభాషణులు = మనోహరములగు మాటలుగలవారు, ఊరక మాటలాడునపుడే యెంతో యింపుగనుండ నిఁకఁ బాడునపుడెటులుండునో యని భావము నాటకలక్షణ = భరతశాస్త్రమునఁ జెప్పఁబడిన లక్షణములను, వేదులు = తెలిసినవారు, కావునఁ దాము పాడునపుడు సమయోచితముగ రసపోషణము చేయుచు నాయాభావంబులను ముఖనయనాది వికారంబులచేతనే యభినయించిరని భావము. ఇంత సామర్థ్యము మొదలయినవి కలుగుటకుఁ గారణము రాముని పుత్త్రులయి జనియించుటయే యని తెలుపుచున్నాఁడు. మాఱటమూర్తులు = ప్రతిబింబస్వరూపులు. మూర్ఛన యనఁగా సప్తస్వరముల యారోహణావరోహణములు. 'క్రమాత్స్వరాణాం సప్తానామారోహశ్చావరోహణమ్ । మూర్ఛనేత్యుచ్యతే గ్రామ స్తా ఏతాస్సప్త సప్తచ' యనిలక్షణము.

తాత్పర్యము.

గానవిద్యయందు సమర్థులు, సుందరమూర్తులు, మూర్ఛనాది విషయంబులఁ దెలిసినవారిలో శ్రేష్ఠులు, విన నింపైన కంఠస్వరము గలవారు, మనోహరముగ

మాటలాడువారు, నాటకలక్షణ శాస్త్రము చక్కఁగ నెఱిఁగినవారు, అన్నదమ్ములు రామచంద్రుని ప్రతిబింబములో యనఁదగు కుశలవులు.

—* కుశలవులు రామాయణమును నయోధ్యాపురంబున గానము సేయుట *—

చం॥ నిపుణత వాగ్విధేయముగ ♦ నేరిచి లెస్స యథాక్రమంబుగా
నపరిమితానురక్తిని మహర్షులు విప్రులు సాధు లున్నయా
విపులసభాంతరాళముల ♦ విశ్రుతవైఖరిఁ గూడఁ జొచ్చి రా
తపసికుమారులట్టిరు య♦థాకథితంబుగ ధర్మ్యకావ్యమున్. ౨౧౮

రామాయణములకు మహాజనుల యంగీకారము కలదని చెప్పుచున్నాఁడు.

నిపుణతన్ = సామర్థ్యముతో, లెస్స=బాగుగ, వాక్ + విధేయముగ = కంఠపాఠముగ, నేరిచి, యథాక్రమంబుగన్ = వరుసదప్పక, అపరిమితానురక్తిని = అధికమైన ప్రేమతో, విపుల = విశాలమగు, విప్రులు = ఋషులు కాని యితరబ్రాహ్మణులు, సభా + అంతరాళములన్=సభలనడుమ. సభ=శాల, విశ్రుత = ప్రసిద్ధికెక్కిన, వైఖరిన్ = రీతితో, అనఁగానందజనకుఁ డెలిసిన రీతిగ, తపసికుమారులు + అట్టిరు = ఋషిపుత్రుల యట్టివారు ఋషివేషముల ధరించిన చిన్నవాండ్రు, యథాకథితంబుగన్ = వాల్మీకి తమకు నేర్పినట్లు, ధర్మ్య = ధర్మమునుండి తప్పనిది. ధర్మమునే కలుగఁజేయునదియని భావము.

వ్యా క ర ణ ము.

అట్టిరు=అట్టివారు అట్టి-యిట్టి-యెట్టి విశేషణంబులమీఁది తచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాష నగు.— త్రి. ల. సమాస. సూ. ౯.

తా త్ప ర్య ము.

మునికుమారులవలె నుండు నాబాలురు సామర్థ్యముతో రామాయణమంతయు చక్కఁగ ముఖస్థము చేసి వాల్మీకి నేర్పిన ప్రకారము సంతోషముతో మహర్షులు బ్రాహ్మణులు సాధువు లున్న పెద్ద సభామందిరంబులందు ప్రశస్తరీతిని ధర్మసమ్మతమైన కావ్యమును గానముచేయ నారంభించిరి.

చం॥ జలజల రాల బాష్పములు ♦ సర్వమునీశులు దాని నెల్ల వీ
నులకును విందుగా విని మ♦నోగతి నచ్చెరు వంది హర్షసం
కలితమతిం గుశీలవుల ♦ గాయనవర్యుల మౌని వేషులన్
సలలితరూపయుక్తులఁ బ్ర♦శంసఁ యొనర్చిరి సాధుసూక్తులన్. ౨౧౯

విద్వన్మహా జనులు గ్రంథమును బ్రశంసించి రని చెప్పుచున్నాఁడు.

బాష్పములు = సంతోషమువలనఁ గలిగిన కన్నీళ్లు, పీనలకు = చెవులకు: గాయన వర్యులన్ = పాటపాడువారిలో శ్రేష్ఠులను; సలలిత = విలాసముతోఁ గూడిన. 'హారభేదే విలాసేచ లలితం చారుణి త్రిషు.' నానా. రూపయుక్తులన్ = ఆకారముతోఁ గూడిన వారిని; కుశీలవులన్=కుశలవులను, రామపుత్రౌకుశలవావేకయోక్త్యా కుశీలవౌ. అమరశేషము నిపాతనాత్ ఈకారః హర్ష = సంతోషముతో, సంకలిత = కూడిన, మతిన్ = మనస్సుతో, సాధుసూక్తులన్ = మేలు మేలు అనుమంచిమాటలతో, ప్రశంస యొనర్చిరి = మెచ్చుకొనిరి.

తా త్ప ర్య ము .

స్వరము సొంపు గానము నింపు కథ పెంపు కర్ణరసాయనముగ వినటవలన జనించినయానంద బాష్పములుకన్నులనండిజలజలరాలుచుండ రామచంద్రమూర్తి చేయు నశ్వమేధయాగముఁ జూచుటకై వచ్చియుండు మునీశ్వరులందఱు విని యాశ్చర్యపడి సంతుష్టమనస్కులై యాసంగీతవిద్యయందు శ్రేష్ఠులై మునుల వేషములు ధరించియుండు కుశలవులను మనోహరమైన సుందరాకారులను మేలైన మాటలతో నుతించిరి.

ఉ॥ ఎంతటి పాటసొంపహహా! • యెంతటి యింపగు పద్యపాళి హా!
యెంతటి శబ్దసౌష్ఠవ మ • దెంతటి సన్మధురస్వరం బహా!
యెంతటి యర్థపుష్టి యిది • యెంతవిచిత్ర మహో! ప్రవృత్తమై
యెంతయుఁ గాల మేగినను • నిప్పుడు జగ్గెడు నట్లు దోఁచెడిన్. ౨౨౦

శ్లాఘించిన విధము చెప్పఁబడుచున్నది.

పద్యపాళి = పద్యసమూహము, శబ్దసౌష్ఠవము = మాటలెట్టి దోషములు లేక యింపుగాఁ గుదిరియుండుట, అర్థపుష్టి = పాటకన్నను వాచ్యవ్యంగ్యార్థములు అతిశయించియుండుట, ప్రవృత్తమై = జరిగినదై, ఏగినను = కడచినను, ఇప్పటికి శ్రీరామునకు నేఁబదినాలుగో యేఁబదియైదో సంవత్సరముల వయస్సు. సీతాదేవికి ౪౭-౪౮ సంవత్సరములవయస్సు - వాల్మీకాశ్రమము చేరునప్పటికి ౩౪ సంవత్సరములు.

తా త్ప ర్య ము.

ఆహాహా! ఏమి పాటనీటు! అరే! యేమిపద్యముల హృద్యత! బలేబలే! పదముల సౌష్ఠవము! ఓహోహో!ఏమికంఠస్వరమాధుర్యము! సెబాసు! ఏమియర్థపుష్టి! ఔరౌర యేమిచిత్రము! ఎంతకాలము ముందుజరిగిన వృత్తాంతము! వీరు పాడుట వినిన నేఁడు జరగుచున్నట్లు దోఁచుచున్నదే!! ఏమి యాశ్చర్యము !!!

చం॥ అని యనసూయులై మునికు•లాగ్రణు లందఱు నొక్క పెట్ట మే
లని నుతియింప సాగ మఱి • యంతకునంతకు హర్షమాణులై
కని యమళంబు మిక్కిలిగ • గాన మొనర్చె సరక్తితాలమూ
ర్ఛనముగ సొంపు నింపి మధు•రంబుగ శ్రోతలు సొక్క, వారిలోన్. ౨౨౧

ఋషులెల్లు శ్లాఘింపఁగా బాలురు మఱింత యుత్సాహముతోఁ బాడిరని చెప్పుచున్నాఁడు

అనసూయులై = అసూయలేనివారై, అసూయ = గుణదోషమిచేత గుణములను దోషములుగాఁ జెప్పుట, ఒక్కపెట్ట = ఒక్కసారిగ, నీయభిప్రాయము చెప్పు నీయభిప్రాయము చెప్పు మని యొకరికొకరు వేఱొకరు కాచుకొనక, సంతోషాతిశయము పట్టఁజాలక, యెవరంతటవారు మెచ్చుకొనసాగిరని భావము. నుతియింపసాగఁగ = స్తోత్రముచేయుటకుఁ బ్రారంభింపఁగా, యమళము = అమడలు, కుశలవులు, హర్షమాణులై = సంతోషపడుచున్నవారై, శ్రోతలు = వినువారు, చొక్కఁగ = పరవశులుకాఁగ

తా త్ప ర్య ము.

వాల్మీకి మనవంటి ఋషయేకదా మన మీగ్రంథమును బొగడిన మనకంటె నతఁడు గొప్పవాఁడనఁబడునుగదా. వానికట్టి కీర్తిరానీయరా దను నిట్టియోర్వ లేనితనమునకు లోనుగాక ఋషీశ్వరు లంద ఱొక్క విధముగ నితరుల యభిప్రాయమేమో యని తలఁపక యెవరికివారే మేలు మేలని స్తుతింపఁబ్రారంభింపఁగా వారి యుత్సాహవాక్యములకు బాలురు మఱింత యుప్పొంగి స్వరము-లయము - గ్రామము - మూర్ఛనలతో రక్తికట్టునట్లు మనోహరముగ వినువారు పరవశులగునట్లు పాడిరి.

సీ॥ ఇందమిందమటంచు • నిచ్చెజందె మొకఁడు,నిదొయిదొయనిబృసి•నిచ్చెనొకఁడు
కోకొండటంచు నొ•క్కొరుఁడు వల్కలమిచ్చె, మంచిదం చొకరుఁడు•మౌంజినిచ్చె
బట్టుపట్టుఁ డటంచుఁ • బాత్ర మొక్కరుఁ డిచ్చె, సరసతనొకఁడక్ష•సరమునిచ్చెఁ
గొండుకొం డనుచుఁ గ•మండలువొకఁ డిచ్చె, రండురండనియిచ్చె • దండ మొక్కఁ
తే॥ డొక్కఁడాయుష్యమిచ్చె నం•దున్న మునులు, తమకుఁగలిగినవస్తుసం•తతుల నేఱి
రాణమీఱినవారి నా•మాణవులకుఁ, గరుణ నొసఁగిరి సంతోష•గరిమ నిట్లు.
౨౨౨.

సంతోషించిన ఋషు లాబాలుర కిచ్చిన బహుమతులఁ జెప్పుచున్నాఁడు.

బృసి = అధ్యయన సమయంబున ఋషులు కూర్చుండు ఆసనము, కొండు = తీసికొండు, వల్కలము = నారచీర, మౌంజి = ముంజి కసవుతో నల్లిన మొలత్రాడు, అక్షసరము = జపమాల; కమండలువు = జలపాత్ర, దండము=అశ్వత్థ

దండము. ఆయుష్యము = దీర్ఘాయుష్మాన్ భవయను నాశీర్వచనము. సంతతులను = సమూహములను, రాణమీఱినవానిని = శ్లాఘ్యమైన వానిని, మాణవులకున్ — బాలురకు, గరిమ = అతిశయము, బృసీ - బ్రసీ - బ్రషీ రూపాంతరములు. శబ్దరత్నాకరకారుఁడు బ్రుసి యని వ్రాసెనుగాని దాని సాధుత్వము చింత్యము.

తాత్పర్యము.

అంత నా వినువారిలో గొందఱుబుషు లివోయివో యని జందెములిచ్చిరి. కొందఱు తీసికో తీసికోయని చిత్రాసనము లిచ్చిరి. కొందఱు, కొనుఁడు కొనుఁడని నారవస్త్రము లిచ్చిరి. కొందఱు' నాయనలారా! యీమాంజి మంచిదని తీసికొనుఁ డని యిచ్చిరి. చేయిపట్టు చేయిపట్టు మని కొందఱు పాత్రము లిచ్చిరి. కొందఱు కమండలువు లిచ్చిరి. రా రండని కొందఱు దండము లిచ్చిరి. ఏవియులేని కొందఱు దీర్ఘాయుష్యమస్తని దీవించిరి. ఇట్లు యజ్ఞమును జూడఁజేరిన మునులలో వారువారు తమయొద్దనున్న ప్రియవస్తువులలో మంచివిగా నేఱి యాబాలకుల కిచ్చిరి. (ఇవి బహుమానములేకాని దానములు గావని యెఱుంగునది.) కుశలవుల చరిత్రమువలన భగవత్కథలు, పురాణములు చెప్పువారు ప్రతిఫలాపేక్షలేక చెప్పవలయుననియు, వినువారట్టివారిని యథాశక్తి సత్కరింపవలయుననియు నేర్పుచున్నది. మఱియు మహాజనపరిగ్రహములేనిది వ్యర్థమనియు నేర్పుచున్నది. "తస్మాద్గాయతే నదేయ" మ్మను నిషిద్ధవాక్యము. అనఁగా గానముచేసెడివారి కేమియు నీయఁగూడదు." అననది గానముచే జీవనము చేయువారివిషయ మని యెఱుంగునది.

కం॥ మంది యొడఁగూడి యుండిన, సందుల గొందులను రచ్చ♦చావడులను సా
నందు లయి విపణిమార్గము,లందును బాడంగఁ జొచ్చి ♦ రారాకొమరుల్. ౨౨౩

మంది = జనసమూహము, విపణిమార్గములు = అంగడి వీథులు, రాకొమరుల్ — రాచకుమారులు, సానందులు = ఆనందముతోఁ గూడినవారు.

తాత్పర్యము.

గుంపులు గుంపులుగా జనులు చేరినచోటను, సన్నవీథులందున, సందులందును, గొందులందున, రచ్చపట్టులందును, అంగడివీథులందున, నారాజకుమారులు సంతోషముతోఁ బాడఁ బ్రారంభించిరి.

సీ॥ కొండెగా నొదలఁ ♦ గురులను ముడి వైచి, వీఁపుపై నొకకొన్ని ♦ వ్రేల విడిచి
పున్నమజాబిల్లిఁ ♦ బురిడించు మోమున, భవ్యచందనరేఖ ♦ పదిలపఱిచి
మొనయించి డాపలి♦మూఁపుమీఁదఁ బ్రవాల, మణి కేలఁగాయల ♦ నమర నిలిపి
తరుణాంగుళంబులఁ ♦ దంత్రుల మీటుచు, మెడ నొంటిజందెంబు♦మెఱుఁగు లీనఁ

తే॥ గటితలంబునఁ జిన్నివల్కలముఁ జుట్టి, రాగ మలరార మంజుల రాగమొప్పఁ
గాలతాలలయాదుల క్రమ మెఱింగి, పాడి రవ్వేళనట వాడ వాడయందు. ౨౨౪

ఇందుఁ గుశలవుల వేషము వర్ణింపఁబడుచున్నది. ఔ + తలల్ = తలయందలి ముందటిభాగమునందు, జాబిల్లిన్ = చంద్రుని, పురుడించు=పోలు, ప్రవాలమును = వీణాదండమున, డాపలి = ఎడమ, కాయను = వీణయొక్క సొరకాయబుఱ్ఱను, తరుణ + అంగుళంబులన్ = లేఁతవ్రేళ్లతో. ఇప్పటికి కుశలవుల వయస్సు ౧౪ సంవత్సరములు. తంత్రులు = తంతెలను, ఒంటిజందెము = బ్రహ్మచారులు గనుక నొంటిజందెము, కటితలమునన్ = మొలయందు; చిన్ని = అందమైన, వల్కలము = నారచీర, రాగము = ప్రేమ, అలరారన్ = ప్రకాశింపఁగా, మంజుల = మనోహరమగు, పురిన్ = యజ్ఞమును జూఁడగోరి వచ్చినవారికై కట్టఁబడిన పురమందు, వాడ వాడలందున్ = వీథి వీధి, పేఁట పేఁట యందు, ఒకవాడ యయినతరువాత వేఱొక వాడయందు, వీప్స. అలంకారము స్వభావోక్తి. ఇందలి వర్ణనము వలనఁ గుశలవులు గానమునకుఁ దతె ముపయోగించునట్లు లేర్పడుచున్నది. తత మనఁగాఁ దంతెలుగల వీణె మొదలగు వాద్యములు.

వీణెలు రెండువిధములు (1) శ్రుతివీణె (2) స్వరవీణె. శ్రుతివీణె ౨౨ శ్రుతుల కుపయోగించును. స్వరవీణె సప్తస్వరముల కుపయోగించును. ఒంటి తంతెగలది ఏకతంత్రి. దీనికి బ్రహ్మవీణయని పేరు. రెండు తంతెలుగలది నకులము; మూఁడుతంతెలుగలది త్రితంత్రిక, జంత్రము ఏడు తంతెలుగలది, చిత్ర తొమ్మిది తంతెలుగలది, విపంచి ఇరువదియొక్క తంతెలుగలద. మత్తకోకిల - స్వరమండల - ఇవిగాక ఆలాపిని - కిన్నరి - పినాకి - పరివాదిని - నిశ్శంక యనునవి ముఖ్యభేదములు. సరస్వతి వీణెకు కచ్ఛపియనియు నారదుని వీణకు మహతియనియు, తుంబురు వీణెకు కలావతి యనియు, విశ్వావసు వీణెకు బృహతి యనియుఁ బేర్లు.

తా త్ప ర్య ము.

శిరమునందలి ముందటి వెండ్రుకలను కొండెగాఁజుట్టి ముడివేసి వెనుకప్రక్క వెండ్రుకలను జాఱవిడిచి, పున్నమచందురునిఁబోలు మొగమునందు గోపీచందనమును రేఖగా దిద్ది యెడమభుజముమీఁద వీణెదండమును నెడమపాణియందుఁ గాయయును నిలిపి, లేఁతలగు కుడిచేతివ్రేళ్ళతోఁ దంత్రులమీటుచు మెడలో నొంటిజందెము వ్రేల, నడుమునకుఁ జిన్ని నారవస్త్రమును జుట్టి సమయ మెఱిఁగి మనోహరమగు రాగములతోఁ గాలము తాలము తప్పకుండ వాడవాడయందుఁ బాడిరి.

సీ॥ భావికవీశ్వరా♦వళికి బట్టంగొమ్మ యుక్తగీతంబుల ♦ కోజబంతి
క్షమ వినువారికిఁ ♦ గర్ణరసాయనం, బాయువు పెంపఁగ ♦ నమృతధార
రమణీయసద్గుణ♦రత్నరత్నాకరం, బఖిలరసంబుల ♦ కాటపట్టు
సలలితాలంకృతి♦చయములమణిపేటి, యాత్మపుష్టికిని ది♦వ్యౌషధంబు
తే॥ భవ్యకావ్యంబు నీరీతిఁ♦బలికె నౌర, యహహా! వాల్మీకి యెంతమ♦హామహుఁడో
యనుచునచ్చోటఁజేరిన♦యఖిలజనులు, వాడవాడను నింత్రు కై♦వారములను. ౨ ౧౫

భావి + కవీశ్వర + ఆవళికి = ఇఁకమీఁదఁ బుట్టఁబోవు కవిశ్రేష్ఠుల సమూహములకు, పట్టు + కొమ్మ = పట్టంగొమ్మ = ఊఁతకోల, ఆధారము, ఓజబంతి = మేలుపంక్తి, పైపంక్తి, రూ. ఒజ్జబంతి, క్షమన్ = ఓపికతో, కర్ణరసాయనంబు = చెవులకింపైనది. సద్గుణ + రత్న = మంచిగుణము లను రత్నములకు, రత్నాకరము = సముద్రము, సముద్రమునందు రత్నములవలె నిందు సద్గుణము లనంతము లని భావము, అఖిలరసములకు = శృంగారాది నవరసములకు ఆటపట్టు = విహారస్థలము - నివసించుచోటు, అలంకృతి చయనములకు = నానాభేదములతోఁగూడిన అర్థాలంకార శబ్దాలంకార సమూహములకు, మణిపేటి = = రత్నముంచు పెట్టె, ఆత్మపుష్టికిన్ = ఆధులచేఁ జిక్కియున్నవారి మనస్తాపము పోవుటకు (2) జీవాత్మస్వరూపము వర్ధిల్లుటకు, జీవునికి జ్ఞానప్రకాశ మెక్కువగుటకు, దివ్యౌషధము = దేవతలు చేసిన శ్రేష్ఠమైన మందు, భవ్య = శుభకరమైన, మహామహుండో = గొప్పశక్తికలవాఁడో, కైవారములను = స్తోత్రములను, నింత్రు = నిండింతురు.

తాత్పర్యము.

తన వెనుక రాఁబోవు కవీశ్వరులు కవితకు నాధారమై యోగ్యమగు రాగంబులకు మానమై, ఓపికతో వినువారి చెవుల కమృతధారయై, ఆయువు వృద్ధి చేయుటకు నమృతమై, సద్గుణము లనెడి రత్నములకు సముద్రమై, నవరసంబులకు నిలువనీడయై, యాధులను వ్యాధులను శమింపఁజేసి యాత్మజ్ఞానము పుష్టిగొనునట్లు చేయునదియై శ్రేష్ఠమైన కావ్యంబును వాల్మీకి వచించెఁగదా. ఆహా! యాయన యెంత మహామహిమగలవాఁడో, యని యజ్ఞశాలలయందలి జనులందఱు వీధివీధిని స్తోత్రములు చేయసాగిరి.

"యోగవాసిష్ఠ" మను గ్రంథము రామావతారమున వసిష్ఠునిచే రామున కుపదేశింపఁబడిన దని చెప్పఁబడినను, ఉపురాణమునందే యర్జునోపాఖ్యానమను పేరఁ గృష్ణావతారమున భగవంతునిచే నర్జునునకుఁ జెప్పఁబడిన భగవద్గీతాసారము భగవంతుఁ డర్జునున కుపదేశించిన యనేక శ్లోకముల యానుపూర్వితోఁ గూడ నిర్వాణప్రకరణమున సువిపులముగ నున్నది. (యోగ. ౬ పూర్వ. సర్గ

౫౨-౫౯) అనియు. "అధ్యాత్మరామాయణమును యోగవాసిష్ఠమును విస్తృతములైనను భగవద్గీతకన్న నవీనము లను సంగతి వాని రచనవలననే స్పష్టమగుచున్నది." అని కీర్తిశేషులయిన బాలగంగాధర టిలకుగారు తమ గీతా రహస్యమున వ్రాసిరి. వాస్తవమిదియే. ఆధునికులు తమ తమ మతసిద్ధాంతములకై రామాయణ మను పేరుపెట్టి గ్రంథములను వ్రాసి పూర్వఋషుల పేర్లు పెట్టిరి. సీతారామాంజనేయ మనునది వాస్తవముగ సీతారామాంజనేయుల సంభాషణమనియే కొందఱ భ్రాంతి.

ఉ॥ అందము దప్పకుండఁగ న♦యాభినయంబులతోడఁ దద్రస
స్యందిమనోజ్ఞవైఖరిని ♦ సారెఁ గుమారులు పాడుచుండ నా
నందరసాబ్ధిమగ్నులు జ♦నంబులు మైమఱ పొంది మే లటం
చందఱుఁ దత్కుశీలవుల ♦ నాదట మెచ్చిరి మేలివాక్కులన్. ౨౨

నయ + అభినయములతోడన్ = నీతులను సూచించు హస్తాదుల సంజ్ఞలతో, తత్ + రస = ఆయారసములు, స్యంది = కాఱునట్లు, చక్కఁగా వెల్లడియగు నట్లు, సారెన్ = పలుమాఱు, ఆనందరస + అబ్ధిన్ = ఇంపైన సంతోష మను సముద్రమందు, మగ్నులు = మునిఁగినవారు. మైమఱపు = దేహము తెలియక పోవుట, ఆదటన్ = ప్రేమతో.

తాత్పర్యము.

నాణెము చెడకుండునట్లుగ నయములతోను, నేత్ర శిర గ్రీవా హస్తాభినయంబులతోను, నేయేరసము లొలుకుపలుకులు పలుకుమరో యాయారస ముట్టిపడునట్లు బాలురు పాడుచుండఁగా లోకులు సంతోష సాగరంబున మునిఁగినవారై దేహములను మఱచి యాకుశలవులను బళిబళీ యని మెచ్చిరి.

రామాయణము గానము సేయు కుశలవుల శ్రీరాముఁడు పిలిపించుట

ఉ॥ రాజపథంబునందు ముని♦రాజకుమారకవేషు లానిశా
రాజముఖుల్ సుధాజలధి♦రాజకుమారికుమారుఁ బోలు ను
త్తేజులు పాడుచుండ రవి♦తేజుఁడు రాముఁడు పిల్వఁ బంపెఁ బే
రోజ నిజాలయంబునకు ♦ నూర్జితకీర్తులఁ బుణ్యమూర్తులన్. ౨౩

నిశారాజ = చంద్రునివంటి, ముఖుల్ = మొగములు కలవారు, సుధా జలధిరాజ = పాలసముద్రముయొక్క-ఇట రాజశబ్దము శ్రేష్ఠార్థకము, కుమారీ = కూఁతురగు లక్ష్మీదేవియొక్క, కుమారుని = మన్మథునివంటి, ఉత్ + తేజులు = అధికమైన కాంతిగలవారు, రాజపథంబునందు = రాజమార్గమునందు, రవి తేజుఁడు = సూర్యకాంతివంటి కాంతిగలవాఁడు - రాముఁడు, ఊర్జితకీర్తులన్ =

గొప్పయశస్సు కలవారిని, నిజ + ఆలయంబునకుఁ = తనగృహమునకు; పేరోజఁ = గొప్పయుత్సాహముతో.

తా త్ప ర్య ము .

రాచబాటలందు మునివేషములు ధరించి చంద్రునివంటి ముఖములు గలవారై మన్మథునివంటి సౌందర్యముగలిగి యత్యంత తేజస్సుగలవారై పాడుచుండఁగా సూర్యతేజస్సువంటి తేజస్సుగల రామచంద్రమూర్తి యా కీర్తిసంపన్నులను బుణ్యాకారులను దనయింటికిఁ బిలిపించెను.

౪౦॥ బాలకులను జితరోలంబాలకులను బాలశశినిభాలికులను శ్రీ
పాలకులను రామక్ష్మాపాలుండు కృపాలుఁ డగుచుఁ బనిచెం బిలువన్. ౨౪

జిత = ఓడింపఁబడిన, రోలంబ = తుమ్మెదఁలుగల, అలకులను = ముంగురులుకలవారిని- తుమ్మెదలకంటె నలుపును గాంతియును గల ముంగురులు గలవారి నని భావము. బాలశశినిభ = లేఁతచందురుతో సమానమగు, అలికులను= నొసలుగలవారిని, శ్రీపాలకులను= అవయవకాంతిని రక్షించువారిని; క్ష్మాపాలుఁడు = రాజు - రాముఁడు,

తా త్ప ర్య ము .

నల్లని తుమ్మెదలను మించిన ముంగురులుగలట్టియు, లేఁతచందురునిబోలు నొసలుగలట్టియు శరీరకాంతిగలట్టియు, బాలకులను రామచంద్రప్రభువు కృపగలవాఁడై పిలిపించెను.

ఉ॥ వారలఁ బిల్వఁ బంచి చెలువం బగుదివ్యసువర్ణపీఠిపైఁ
బేరిమి నుండి తమ్ములును బెక్కురు రాజు లమాత్యవర్యులుఁ
గూరిమిఁ గొల్వ భాసిలుచు నొబ్బున నెమ్మది గారవించి తాఁ
గోరె వినంగఁ దచ్చరితఁ గోవిదవర్యులు పాడుచుండఁగన్. ౨౫

ఇఁక నీగ్రంథమును గథానాయకుఁడే యంగీకరించెనని చెప్పుచున్నాఁడు. చెలువము = అందము, కాంచన సింహపీఠిపై = బంగారు సింహాసనముమీఁద; పేరిమిఁ = గొప్పతనముతో, అమాత్యవర్యులుఁ = మంత్రి శ్రేష్ఠులును; వసిష్ఠుఁడు లోనగువారు, నెఱ + మది=నెమ్మది,= నిండుమనస్సుతో; సత్కరించి= పూజించి, కొనియాడి, కోవిదవర్యులు = గానమునఁ బండితులగు కుశలవులు.

తా త్ప ర్య ము .

ఇట్లు తాను బంగారు సింహాసనముపైఁ గూర్చుండి తమ్ములు సామంతరాజులు మంత్రులు లోనైనవారు చుట్టుకొని సేవలు చేయుచుండ వారిని బిలిపించి

'నాయనలారా! మీరేదో పాడుచున్నారే దానిని వినఁగోరెదను బాడుఁ' డని కోరెను.

క॥ మారాకారుల నతిసుకు,మారుల మునివేషయుతకు♦మారులఁ దుల్యా
కారుల సమస్తవిద్యా,ధారులఁ గని నియతిశీలి ♦ దమ్ముల కనియెన్.   ౨౩౦

మార + ఆకారులన్ = మన్మథునివలె నందమైన రూపముగలవారిని, అతి సుకుమారులన్ = మిగుల సుకుమారులైనవారిని, మునివేషయుత = ఋషి వేషముతోఁగూడిన, తుల్య + ఆకారులన్ = పరస్పరము సమానమైన దేహములు గలవారిని; నియతిశీలి = నియమము స్వభావముఁగాఁగల రామచంద్రమూర్తి.

తా త్ప ర్య ము.

మన్మథునివంటి యాకారముగలవారిని మిక్కిలి సుకుమారులను మునివేషములు వేసిన బాలురను పరస్పరము సమానలుగా నుండువారిని నన్నివిద్యలు నేర్చినవారిని గని నియతియే స్వభావముగాఁగల రామచంద్రమూర్తి తమ్ములతో నిట్లనియె.

క॥ అందం బై నిష్యందమ,రందం బై యమృతరసత♦రంగం బై స
చ్ఛందం బై విన బ్రహ్మా,నందం బై యమరఁగా గ♦ణంగిరి పాడన్.   ౨౩౧

రామచంద్రమూర్తి శ్లాఘించినవిధముఁ జెప్పుచున్నాఁడు. నిష్యంద = స్రవించుచున్న; మరందంబై = తేనెగలదై, అమృతరస = అమృతమువంటి రసముయొక్క, తరంగంబై = అలలు కలదై, సముద్రమున నలలు మీఁదమీఁద వచ్చునట్లు దీనియందు రసము వెంటరసము పొంగి పొరలివచ్చుచున్నదని భావము. సచ్ఛందంబై = మంచి యభిప్రాయము గలదై - వేదార్థములతోఁగూడినదై; బ్రహ్మానందంబై = పరబ్రహ్మముయొక్క యానందమువంటి యానందము కలిగించునదియై; కణంగిరి = ప్రారంభించిరి.

తా త్ప ర్య ము.

తమ్ములారా! యందమై తేనెలొలుకు చున్నదై, యమృతరస ప్రవాహమందలి యలలవంటిదై వేదార్థములందలి మంచి యభిప్రాయములు గలదై విన విన బ్రహ్మానందమును గలిగించునదై యుండునట్లు పాడుచున్నారు. వింటిరా!

రామాయణము వేదార్థమును గలదై - శ్రుతికటువుగాక వినినంతనే యైహికానందము మాత్రమే ఫలముగాక యమృతమనఁగా మోక్షానందము గలిగించునదియై యదియు నలలవలె నంతములేక యెప్పటికప్పుడు క్రొత్తక్రొత్తగా

వచ్చునదియై యొప్పు బ్రహ్మానందమును గలిగించుట సత్యమేకదా, రాముఁ డేల యసత్యమాడును ? ఆనందము - రెండు విధములు. విషయానందము - బ్రహ్మానందము. విషయసుఖమువలనఁ గలుగు నానందము విషయానందము. కమ్మని పదార్థములు తినుట, యింపైన ధ్వనులు వినుట, పరిమళ పదార్థములు మూచూచుట లోనగు వానివలనఁ గలుగు సంతోషము - విషయానందము. మోక్షదశయందుఁ బరిపూర్ణ బ్రహ్మానుభవమువలనఁ గలిగిన యానందము - బ్రహ్మానందము.

ఉ॥ సోదరులార! వింటిరె ర♦సోదయకారణ మై విచిత్ర శ
బ్దాదరణీయ మై విమల♦మై చెలువారెడు కావ్య మిందిరా
సోదరమూర్తి తేజులు త♦పసికుమారులు ♦ గాన మొనర్ప నద్దిరా
మాదిరి మీఱె నంచు బహు♦మానపురస్కృతవాక్యు లాడినన్. ౨౭-౨

రస = శృంగారాది నవరసములయొక్క, ఉదయ = ఉత్పత్తికి, కారణము = హేతువు. రసము సభ్యావాసమై భాసిల్లున్ అని, వినువారియందుఁ గలదు కాని ప్రదర్శకులయందులేదు. కావున వా రేరసము కలుగఁ బాడుచున్నారో యారసము మనయందుఁ బుట్టుచున్నది. విచిత్ర = శబ్దాలంకారములు. అర్థాలంకారములు, చిత్రకవిత్వము లోనగువానిచేత నాశ్చర్యకరమైన, శబ్ద + ఆదరణీయమై = పదములచేఁ బ్రేమింపఁదగినదై, విమలమై = కావ్యదోషములు, వ్యాకరణదోషములు మొదలగు దోషములులేనిదై, చెలువారెడి = మిక్కిలి మనోహరమగు, ఇందిరాసోదర తేజులు = లక్ష్మీదేవికిఁ దోడఁబుట్టువగు చంద్రుని కాంతివంటి కాంతిగలవారు, తపసిసూనులు = ఋషికుమారులు, సొంపు = అందము, మాదిరిమీఱెన్ = సాటిలేక యతిశయించియున్నది. అద్దిరా = ఆశ్చర్యము, బహుమాన = గౌరవము. పురస్కృత = ముందుగాఁగల, వాక్కులు = మాటలు.

ఇందిరాసోదర తేజులు = పదార్థవృత్తి నిదర్శనాలంకారము. ఒక పదార్థ గుణమును వేఱొక పదార్థమందున్నట్టు చెప్పిన పదార్థవృత్తినిదర్శనాలంకారమగును. చంద్రునికాంతి చంద్రునియందే యుండునుగాని మఱియొకచోట నుండదు. అట్టిది యీ బాలురయందున్నదని చెప్పుటచే నిదర్శనాలంకారము.

ఛందస్సు - మూఁడవపాదమున నఖండయతి.

అఖండయతి.

ఈ యతివిషయమై భిన్నాభిప్రాయములుగలవు. ఈగ్రంథకర్త దీని నంగీకరించినవారిపక్షమందుఁ జేరినవాఁడు. దానిని సిద్ధాంతము చేయుటకే యీయతిని నీ గ్రంథమందును నేతత్పూర్వ గ్రంథములందును బ్రయోగించెనుగాని మఱియొక్క

విధముగ వ్రాయలేక కాదు. దీని నిరాకరించువారు లక్షణ లక్ష్యములు శోధించినవారు కారు. భారతమైనను బూర్ణముగఁ జదివినవారుకారు. కావున నందలి ప్రయోగములు కనఁబడినపుడు వానిని సవరించి పాఠాంతరములఁ గల్పించుటయే కార్యముగ నంచుకొనినవారు గావునఁ బూర్వకవీశ్వర ప్రయోగములను బెక్కులు సవరించిరి.

అయినను విచారములేదు. పూర్వాపారముల ననుసరించు లక్షణ గ్రంథము లున్నవి. ఎంతసవరించినను నేఁటఁని వారి దృష్టపథమునఁ బడనివి వారికి సవరింప సాధ్యముగానివి భారతాదులందుఁ గలవు. మీమాంసకుఁ బూనుకొనిన గ్రంథవిస్తరమగును గావున సంక్షేపముగ దీనినిగుఱించిచెప్పఁబడును.

భీమకవి తన కవిజనాశ్రయమందు.

కం॥ స్వరవర్గాఖండ ప్రా । దృశ్య ఏందుప్లుతములుం బ్రయుక్తాక్షరముల్
పరగఁగ నెక్కటిపోలిక । సరసలు నాఁగఁదివిధములఁ జనునల్లు మహిన్.

అని యతులు పదివిధము లని యం దఖండయతి యొకటియని చెప్పి దానికి లక్ష్యముగ.

ఉ॥ మానుగ విశ్రమాక్షర సమంచితమై స్వరమూఁదినన్ దదీ
యానుగుణాక్షరంబె కొనినైనను జెప్పఁగ నొప్పు నీక్రియన్
భానసహస్రభాసి వృషభాధిపుఁడన్నటు లర్థయుక్తమై
పూనినచో నఖండవళి పొల్పగు నాదికవిప్రణీతమై.

యని వ్రాయుచు నిది పూర్వకవి సమ్మతమనియు స్వకపోలకల్పితము గాదనియుఁ జెప్పెను. దీనివలన నన్నయభట్టాదులు దీని నంగీకరించినా రనుట స్పష్టపడియె. ఇఁక దీనిని నప్పకవికిఁ బూర్వులు, భీమకవికి వెనుకటిలక్షణజ్ఞు లెట్లు లాదరించిరో చూతము. సులక్షణసారంబునఁ దాతంభట్టు లక్షణచూడామణి నుండి యతిభేదంబు లెఱింగించు సీసపద్యము నుదాహరించుచు.

"కాకువులు రివ్వడియును నఖండవిరతి
యుభయయతి యశవర్గాదు లొనరుమెఱసి
కృతుల ముప్పదియొక్కటి యతులు దనరు
సత్కవుల సమ్మతంబున జలధిశయన.
యనిచెప్పి, దీనికి లక్ష్యముగ భీమన చెప్పిన

'మానగ విశ్రమాక్షర సమంచితమై' యనుపద్యము నుదాహరించుటయే గాక, భాస్కరరామాయణమునుండి.

ఉ॥ అన్నవు తండ్రియట్ల విను మంతియకాదటమీఁద రాజ వే
మన్నఁగొ అంతలేదు మణిమండన ముఖ్యములైన కానకల్

అను పద్యము నుదాహరించెను. ఇప్పటికిని ముద్రితగ్రంథములం దిదియే పాఠము కానవచ్చెడిని. ఆనందరంగరాట్ఛందమునందు నఖండయతిని యతి విభాగములం దొకటిగ గ్రహించి భీమనఛందస్సునుండి "మానగ విశ్రమాకర"మను పద్యము నుదాహరించుటయేకాక, తానిట్లు లక్ష్యమువ్రాసెను.

కం॥ ఆనందరంగనృపతి జ, నానందతసేయు నొక్కనాఁటిసెలవు పా
చ్ఛానగరున నెలకట్టడ, మానుగ లెక్కింపఁ దుల్య మందురు పేర్మిన్.

అంతియకాక పూర్వకవికృత ప్రబంధములనుండి యీలక్ష్యముల నుదాహరించెను.

భారతము - అశ్వమేధపర్వమున.

కం॥ నీవును దల్లులు బంధుజ, నావళి పురజనులు హస్తినాపురమునకున్
రావలయు ధర్మజుని సం, భావనయుం బడయుఁడెసఁగుఁ బరమసుఖంబుల్.

భారతము - ద్రోణపర్వమున.

ఉ॥ తేరులయొప్పు మోటువడఁ దేకువ దప్పిపదాతికోటి ను
గ్గై రుధిరమ్ములో మునుఁగఁ గ్రమ్మిన యేనుఁగుపిండు. .

భారతము - ఆదిపర్వమున.

కం॥ నావచనమున నపత్యముఁ, గావించును గుంతి నీకుఁ గడు నెయ్యముతో
నీవడిగిన యీ యర్థము, చూవె మనంబునను దలఁచుచుండుదు నేనున్.

భారతము - ఉద్యోగపర్వమున.

కం॥ తమ తండ్రిభంగి నీకును, సముచితముగ భక్తిచేసి సజ్జనసుతమా
ర్గమునఁ జరింపంగా విమ, లమతీ నీకొడుకు నట్టు లరయంగ నగున్.

అష్టమహిషీ కల్యాణంబున.

ద్వి॥ ఉన్నాఁడు తడవుగా నన్నాఁడతండు, మన్నాఁడు మమ్ముఁ దెమ్మన్నాఁడటన్న.

అలసాని పెద్దన - హరికథాసారమున.

కం॥ శఠకోపయతికి ఖలతరు, కుఠారరూపమతికి శరగురునుత వృత్త
స్మర నిరతికిఁ జతురాగమ, పఠనా యవని మతికి యజషాధికభృతికిన్.

భాస్కర రామాయణమున.

కం॥ రమణీయరత్నముల రుచి, నమరెడు నది పంక్తి కంఠునగరు నృపాలో
త్తమ యిది దశయోజనవి, స్తృతము వింశతియోజనాయతమునై యొప్పున్.

"దీనిని గొంద ఱాదేశయతికి నుదాహరణ మందురు. అదికాదు" అనియు వ్రాసెను.

భాస్కరరామాయణమున.

ఉ॥ అన్నవు తండ్రియట్ల విను మంతియగాదు మీఁదరాజ వే
మన్నఁగొంతలేదు మఱియుండుట యుక్తములైన కానకన్...

. ...

రాఘవపాండవీయమున.

గీ॥ గళిత హరికుంజర శతాంగముల ధరిత్రిఁ, గప్పు చు యథామనోరథగతిఁజరించె
నవనిజాహూథ మదవారణ క్రియలకు, నిలువలేక పార్థబలయోధులు తొలంగె.

అని యి ట్లనేక ప్రబంధములందు విస్తారముగ నుదాహరణయోగ్యముగా లక్షణకవులైన మహాత్ములు చెప్పియున్నారు. కనక నిది జడయని తెలిసి యతుల నిలుపునది, యని వ్రాసెను.

కూచిమంచి తిమ్మకవియు లక్షణసారసంగ్రహంబున.

గీ॥ హల్లునకు హల్లు వడియిడునపుడు దాని, తుదిని స్వరము ఘటిల్లిన నది యఖండ
వడియనంగఁబొల్పుఁ గృతుల దేవాదిదేవ, యనుచుఁ జెప్పిన శైలకన్యాధినాథ!

యని లక్షణము లక్ష్యము నిచ్చెను. మఱియు నీలక్షణమునకుఁ బ్రమాణ లక్ష్యములు భీమకవి యుదాహరించిన "అన్నవు తంత్రి యట్ల" యను పద్యంబును, శ్రీరంగమాహాత్మ్యము నండి.

ఉ॥ ఆకులవృత్తి రాఘవు శరాగ్రమునందుఁ దృణాగ్రలగ్న నీ
రాకృతి వార్ధినిల్చుట దశాననుఁ డీల్గుట మిథ్యగాదె వా
ల్మీకులు చెప్పకున్నఁ గృతిలేని నరేశ్వరు వర్తనంబు ర
త్నాకరవేష్టితావని విన౯బడ దాతఁడు మేరువెత్తినన్.

మనుచరిత్ర.

చ॥ అలరులబంతి జృంభికకు నడ్డముసేయుచుఁ గర్ణపాళి లేఁ
దళుకులు ద్రోయుమేనఁ బ్రమదాశ్రులు నొయ్యన గోట మీటుచున్,
అని వ్రాసిరి.

కం॥ స్వర వర్గాఖండప్లుత, సరస ప్రాదులును బిందు సంయుక్తములున్
బొరి నెక్కటి పోలికలును, విరతులు పదికొబ్బములను వెలయు మహేశా!

అని యతివిభాగములందు నఖండ యతిని జేర్చియు భారత ప్రయోగము లేమిని నిది సుప్రయోగము కాదనియె భారతమును బూర్ణముగ శోధించి యుండినఁ గానవచ్చియుండును.

ఆధునిక గ్రంథ మగు వింజమూరి లచ్చారాయణిఁగారి లక్షణ సంగ్రహ సీసమాలిక యందు.

సీ॥వళికి నభిఖ్యలై వర్గిల్లు ధరణిలో నవి డెబ్బది విధంబులను మ నదియె
రేఁబది విధములం చిల నల్వదియునొక్కటంచు ముప్పదియొక్కటంచు నిర్వ
దియు నేడనుచు నిర్వదియు నాల్గను మను భీమనసచించిన యట్ట యతులు పద్రియె
పూర్వకవీంద్రులపొత్తంబులందున బహుళంబుగాఁ గానఁబడుచు నంట
నవి పదియె ప్రధానమని వచించిరిగాన వాని నిచ్చటఁ దేటపఱుతు వినుము
స్వరయతి వర్గాఖ్యవళి యఖండప్రాంతి ప్రాగివిక్రమము బిందుద్వ్యాఖ్యవిరతి
ప్లుతము సంయుక్తంబు పోలికసరసంబు నెక్కటియన నొప్పు నివి పదియును,
నని కానఁబడియెడి.

ఈయన వ్రాసినదే యథార్థము. భీమకవి యఖండయతిక్రిందఁ జేర్చిన వానినే యొక్కొక్క శబ్దమున కొక్కొక్క పేరు పెట్టియప్పకవ్యాదులు సంఖ్యాబాహుళ్యము గావించిరి. కాని భీమనకంటె వీరు హెచ్చుగఁ జెప్పిన దేదియు లేదు. అప్పకవ్యాదులు శబ్దమున కొకయతివంతున ఏనియతి - ఏసియతి - యుష్మత్తు యతి - అయ్యయతి - అమ్మయతి - అఱియతి యని చెప్పుటమాత్రమే విశేషము. అట్లయినచో 'సోదరమూర్తు లీతపసిసూను' లనుచో సోదరయతి యని చెప్ప వచ్చును.

'సాంగంబులగుచుండ•నఖిలవేదంబులు' భారతము, ఆది. ౧౬౭. 'సాకారమ్మై వచ్చి సకలంబుచూడంగ సితపద్మహస్తమై యతనిఁబొందె' (అరణ్య. ౫-ఆ. ౨౨౧ ప.) తిమ్మకవి సాంగ-సాంబ-సాదర శబ్దములకు మాత్రమే చెప్పెను. తక్కన యిట్టివాని గతియేమి?

చం॥ అని మదినిశ్చయించి తగనందఱుఁ బల్వఁగఁబంచి వారితో
ననిపని మాటలాడి వినయంబునఁ బ్రార్థనచేసి మీరు మీ
కొనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొ
చ్చిన సకలంబునొప్ప నభిషేకముఁ గైకొనుఁ డుత్సవంబునన్.

దీని మూఁడవపాదమందుఁ బదునొకొంటికి నని యున్నచోట సంధిగూర్చి స్వరప్రధానవడిగాను సోమయాజులు ప్రయోగించినారు. ఇది తెలియక కొందఱు మూఢులు 'దేశ్యనిత్యసమాసవడి యనుకొందురు' అని యప్పకవి వ్రాసెఁగదా. ఆ సోమయాజులవారే స్త్రీపర్వము ౧ ఆ- ౮3 పద్యము.

కం॥ పాండవులవలన గీడొ, క్రొండును లేదధిప నీదు కొడుకులు ధరణీ
మండల మంతయు ద్రుంగిరి ..అని వ్రాసిరే - దీని నప్పకవి చూచెనా?
ఇది యేమి యతి?

కం॥ అతిథి నినుఁ గోరె నేనియు,
మతిఁ గింకిరిపడక యోల మానగొనక॥ —భార.
యవని కాంతరమున నోల మానగొనియె॥—నైషధ.
ఆహావోన్ముఖతకు నోల మానగొనక.—అనిదముపూరిన. ఇది యేమి యతి?
భారతమందలి యీ ప్రయోగములకు ఏమి పేర్లు?

అనుశాసనిక పర్వము ౧ ఆ. ౩౭౮ పద్యము.

కం॥ అనిమఱియుఁ బెక్కు ప్పేర్లం। వినతించుచు శరణు వేఁడి వినతశిరస్కుం
డను ముకుళీకృతహస్తుం। డను నైగమేయుండఁ దేవుఁ డతిశయకరుఁడై.

ఆదిపర్వము ౬ వయాశ్వాసము ౧౯౦ పద్యము.

ఉ॥ క్రచ్చుఱ నొక్క రక్కసుఁడ కాఁడు సురాసురులెల్ల నొక్కటై
వచ్చిన నీవచూడఁగ నవార్యబలోద్ధతిఁజేసి వారలన్
వ్రచ్చివధింతుఁగాక యిటవచ్చి శ్రమంపడియున్న చోట నే
నిచ్చగ వీరిదైనసుఖ నిద్రకు భంగముసేయ నేర్తునే?
నేను + ఇచ్చగన్ = నేను బుద్ధిపూర్వకముగ ననియర్థము. దీని పైపద్యము
చూడుఁడు.

ఉ॥ నామనమార దీనిఁ గని ప్పుడె సంతసమయ్యెఁ జాలు నా
కిమహనీయ రత్నము వహింపఁగ నప్పుడితండె ॥ సౌప్తికము ౨ ఆ ౯౭ ప.

శాంతిపర్వము. ౨-౨౯౭.

గీ॥ సాంగవేదవేది యగు పురోహితుఁ డెవ్వ .

ద్రోణపర్వము ౨-౨౦౦

చం॥ అనిమిషదైత్య కింపురుషులాదిగ నెవ్వరు వచ్చికాచినన్
దునుముదు నెల్లి సైంధవునిఁ ద్రోయజమిత్రుఁడు గ్రుంకకుండుము
న్న నరవరేణ్య! యత్తఱిఁగు న కొనరింపఁగ రాకయున్న నే
ననలముఁజొచ్చువాఁడ నృపులందఱుఁజూడఁగ గాండివంబుతోన్.

అనుశాసనికము ౩-౧౦౦.

తద్దా। న్నము లొనరింతు రవి పాచు న్నాదురితములన్.
మత్త॥ ఎన్నఁడు। న్నని మోఘముగాదు దిగ్ధరణీ రపీందు లెఱుంగఁగన్.
ఆది. ౭-౧౮౨.

భీమ ఖండము. ౩ ఆ. ౬౧ ప.

సీ॥ లక్ష్మీకెంగేలి లీలారవిందమ్మున.. ॥

చం॥ మగఁటిమిఁ జెంద్రగజ్జరస♦మంటిన వామపదాంబుజంబునన్.

చంద్రాంగదచరిత్ర, ౧ ఆ. ౪ ప.

శ్రీరామానుజనామధేయము భళీరే సార్థతంజెందఁ జ

త్పూరమ్యస్థితిమై మెలంగి శరభం♦గోద్యద్గతింగాంచి.

వరాహపురాణము - ౩ ఆ.

కం॥ శ్రీవాసలోపనాద్రి, శావిజయస్తంభదండ ♦ చయదంతురిత

త్పావలయ తుళువకూపా, రావారమ్యంగాంక యీశ్వర ప్రభుసరసా.

కావ్యాలంకారచూడామణి, ౭-౫౨.

తే॥ స్వర్గగిరిచాపుఁడర్చింపవలయు వేల్పు। స్వాంతమగు మంత్రమూ ప్తపం♦చాంతు

రంబు॥

అప్పకవి, ౪ ఆ. ౩౮౧ ప.

కం॥ తోటలు లెస్సైయున్నవి। తాటాదూటములుగావు ♦ తాపసులుండన్

బేఁటలు దామోదరుచె। ల్లాటలకు న్నెళవులు మధు ♦ రాపురిచెంతన్.

గ్రంథవిస్తరభీతి సంక్షిప్తము.

తా త్ప ర్య ము .

తమ్ములారా! వినుచున్నారుకదా. ఈబాలకు లేరసము నభినయించి పాడుచున్నారో యారసము మనయందుఁ బుట్టి మన కనుభవమునకు వచ్చుచున్నది. ఇదిగాక కవిత్వమూ విచిత్రశబ్దములచే సొంపై యున్నది. ఏదోషమైనను లేకయున్నది. ఇట్టినిర్దుష్టమై గుణవంతమై శ్లాఘ్యమైన కావ్యమును చంద్రబింబములవంటి యీతపసికుమారులు పాడుచున్నారు. అని సగౌరవముగా బహూకరించి పలికెను.

కం॥ ఆలాపాదుల మధురిమ, బాలకు లట వెల్లిగాఁగఁ ♦ బాడిన సభ్యుల్

గ్రోలిరి కుత్తుకబంటిగ, వ్రాలిరి తలమునకలైనఁ ♦ బరవశు లగుచున్. ౨౩౩

ఆలాప + ఆదుల = ఆలాపము మొదలగువాని యొక్క, మధురిమ = తీపు, వాలాయము = ఎడఁదెగక, వెల్లిగాఁగ = ప్రవాహమువలెఁ గాఁగా, కుత్తుకబంటిగన్ = గొంతుదాఁక, దఘ్నార్థంబున బంటి శొలఁదు లగు, క్రోలిరి = త్రాగిరి.

తాత్పర్యము.

ఆలాపము - రాగము, వీనితియ్యందనము ప్రవాహమై పాఱునట్లు బాలకులు రామాయణము గానముచేయఁగా వినువారలారసమును గుత్తుకవఱకు నిండునట్లు త్రావి యింకను దనివిచాలక దానిలోనే మునిగి పరవశులైరి.

చం॥ అది గని రామచంద్రుఁడు ధరాధిపలక్షణలక్ష్మి తాంగులై
పొదలిక మౌనివేషములఁ బూనినవారిఁ, గుశీలవాఢ్యులై
సదమలహృత్తపస్వు లయి జా నగువారల, నాకునర్థ శుభ
ప్రద సుమహానుభావకథఁ బాడెడివారి వినుండు సాధువుల్! ౨౩౪

అది = సభ్యులు పరవశులగుటను, ధరాధిప తాంగులై = రాజచిహ్నములతోఁగూడిన యవయవములు గలవారైనను, కుశీలవాఢ్యులై = గాయకులలో శ్రేష్ఠులై, సదమలహృత్ = నిర్మలమైన మనస్సుగల, తపస్వులయి = ఋషులయి, రాజలక్షణము లెక్కడ? మునివేష మెక్కడ? తపస్సెక్కడ? గానమెక్కడ అని విరోధాలంకారధ్వని వంశపారంపర్యముగ రానిపిమ్మ యహంకారకారణమగును గానకళాపాండిత్యమట్లు రానిదయ్యు బాలకుల కహంకారకారణము కాలేదని తపస్వు లనుశబ్దము తెలుపుచున్నది. నాకునర్థ శుభప్రదము=(1) సర్వేశ్వరుఁడగు నాకుఁ గూడ శుభము నిచ్చునది, ఇఁక నితరులమాట చెప్పనేల? యని భావము. కావ్యార్థాపత్తి ధ్వని నాకునర్థ సుమహానుభావ కథ = నాకంటె మహానుభావురా లగుదాని కథ. చూ. బాల ౨౧౫ప.వ వ్యాఖ్య. నాకునర్థ = పంచమ్యర్థమున షష్ఠి. "విలువిద్యనోరులు నీ కగ్గలముగ లేకుండ" భార. ఆది. ౫ ఆ అని ప్రయోజనము. మహానుభావమైన కథ, 'సోఽంగ వేదయదివా న వేద' యన్నట్లు సర్వజ్ఞుఁడగు నాకును దెలియఁ గష్టమైన మహిమగల చరిత్రమును. ఈ యర్థము చెప్పిన సర్వజ్ఞతకు హాని రాదా యనిన 'యస్యాస్తే మహిమాన మాత్మన ఇవ త్వద్వల్లభోపి ప్రభుః ॥ నాలంమాతు' మ్మని యామునాచార్యులు నుడివిరి. మఱియును 'దేవిత్వ న్మహిమా నచాపి హరిణా నాపిత్వయా జ్ఞాయతే। యద్యప్యేవ మథాపి నైవ యువయోస్సర్వజ్ఞతాహీయతే। యన్నాస్త్యేవ తదజ్ఞతా మనుగుణాం సర్వజ్ఞ తాయావిదు। ర్వ్యోమాంభోజ మిదం తయాఖలు విదన్నాభ్రింతోయ మిత్యుచ్యతే' యని కూరేశులుకూడ నుడివిరి. (2) నాకునర్థ = భార్య నెడబాసియున్న నాకును, శుభప్రదము = సౌఖ్యమిచ్చునది. భార్యావృత్తాంతము వినఁగానే విరహికి విరహవేదనపోయి సౌఖ్యము కలుగునుగదా. శ్రీరామచంద్రమూర్తికిఁ దేజస్సు సీతాసంబంధమువలనఁ గలిగినదేయని "జనకసుతాసంబంధం। బున రాముం డప్రమేయ ప్పురు తేజుఁ"డని యారణ్యకాండమునఁగలదు. ౫౯౫. సీతవలననే రామచంద్రమూర్తి శ్రీరా

మచంద్రమూర్తియయ్యెను. ఆమెసంబంధము లేకున్నఁ బరశురామునివలె నపూజ్యుఁడయి యుండును.

అపవాదమునకు భయపడి సీతను విడనాడుటచే రామచంద్రమూర్తి చరిత్రముకూడ మఱింత కళంకితమైనది. లోకులనినారనియే సీతను విడిచినాఁడా? ఆయనకుఁగూడ సందేహముండియే నలువురు దానిని తెలిసికొనిరని విడిచినాడు గాని సీత నిర్దోషురాలని నమ్మియుండిన నట్టిభార్యను నేలవిడుచు-నను నపవాద మీ గ్రంథమువలనఁబోయి వాస్తవార్థము తెల్లమగును గావున నిది నాకును శుభప్రదమని భావము. భర్తనగుటచే భార్యహితమెంచవలసినది నాకు విధియైయుండఁగాఁ బురుషుఁడ నగుటచేఁ బౌరుష్యము నహించి కలుషచిత్తుఁడనై నిరపరాధినియగు దన్ను బాధించినను, స్త్రీయగుటచే సహజవాత్సల్యము గలదై నన్ను క్షమించె. ఆకారణమున నామె నాకంటె మహానుభావురాలే కదా. మహానుభావుఁడగు రామచంద్రమూర్తి చరిత్రమును మహానుభావుఁడగు వాల్మీకి రచించుటచేతను, మహానుభావులగు కుశలవులు పాడుటచేతను, సుమహానుభావమని చెప్పనగు నని కొందఱయభిప్రాయము సరిగాదు. స్వచరిత్రమని రామచంద్రమూర్తి భావించియుండిన నాత్మప్రశంసగల దీనిని వినియేయుండఁడు. రామచంద్రమూర్తి ధీరోదాత్తుఁడు కదా. ధీరోదాత్తుఁడవికత్థనుఁడు. స్తోత్రప్రియుఁడు గాఁడు.

సాధువుల్ = సాధువులారా. అసాధువులకు రామాయణము రుచింపదు. "కుక్కకు నాజ్యమిందునే" పంచ.

వ్యా క ర ణ ము.

సధువుల్ = మధ్యమపురుష బహువచనయోగంబున నారగాగమంబు విభాషనగును.— వ్యా - తత్స. ౬౭ సూ.

తా త్ప ర్య ము.

ఇట్లు సభ్యులా గానమహిమచే నానందపరవశులై యుండుట గాంచి శ్రీరామచంద్రమూర్తి వారితో నిట్లనియె. ఓ సాధువులారా! 'సద్యఃఫలం సంగీత' మని గానమనోహరత్వమున నానందమగ్ను లగుచున్నారు. సంగీత మాపాతమధురము. కావున విన్నంతవఱకే మధురము. ఆవలకాదు. ఇది యట్లుగాదు. కావున మీరు కథయందుండు విశేషమునుగూడ గ్రహించుటకై సాహిత్యభాగమునకు మనస్సీయవలెను. అది దృఢముగ మనస్సున నిలిచి స్మరించినపు డంతయు సంతోషము కలిగించును. శ్రేయస్సును సమకూర్చును. అదెట్లనిన మీరు నన్ను మహానుభావుఁడని భావించియున్నారు. ఈ చరిత్రము నాకంటె మహానుభావురాలి విషయము. సీత యంతటి మహానుభావురాలని నీకుఁ దెలిసియుండిన నేల విడిచితివందురా? అందు దోషమెవరిదో యిప్పుడీ గ్రంథము

వలన స్పష్టపడును గావున మీరు శ్రద్ధతో వినవలసినది. ఇట్లు పాటలు పాడుచు వీధులవెంట వచ్చువా రెందఱో గలరని తలఁపకుఁడు. వీ రుదరపోషణార్థమై వచ్చినవారుగారు. వీరి దేహమునందు రాజుల కుండఁదగిన మొక్కల్లు గాన వచ్చుచున్నవి. వేసిన వేషమా మునివేషము. వీరు రాజకుమారులైరా, భిక్షాటనము క్షత్రియవృత్తిగాదు. మునికుమారులైరా, ప్రతిగ్రహము నాసింపరు. వారికి ధనముతోఁ బనిలేదు. కావున వీరు గానముసేయుట స్వలాభాపేక్షచేఁగాదు వీరు గానవిద్యయందు సభ్యులయందు నిపుణులై తమ విద్యలను గీర్తికోరి ప్రకటింపవచ్చిన వారందురా, కాదు ఏలన? పండితపుత్రులన్నట్లు వేషమునమాత్రమే మునికుమారులుగాక నిర్మలమైన మనస్సుగల తపస్వులు. ఇట్టివారు తమ్మెవరు మెచ్చుకోవలయునని వీధులవెంట వత్తురా? రారు. ఇది శుభము గలుగఁజేయు మహానుభావురాలికథ. ఇందుఁ బ్రతిపాదింపఁబడిన నాయిక స్వయముగా శుభము నిచ్చునది. ఇందుఁ జెప్పఁబడిన ౧ త్రము నట్టిదే. (శుభప్రదయగు సుమహానుభావురాలి కథ) కావున ౦ చరిత్రాంశమును గూడఁ జక్కఁగా వినవలయును.

తే॥ అనుచు సభ్యుల బాలకు • లలరఁ బల్కి, వారు దీపునకును దీపుఁ • గూరి పాడఁ
దిన్నతిన్నగ గద్దియ • డిగ్గి వచ్చి, సభను గూర్చుండి వినె సహో • స్త్తమతిని.

అలరఁ = సంతోషించునట్లు, గద్దియ- సింహాసనము, రామచంద్రమూర్తి సింహాసనమునుండి మెల్ల మెల్లగ దిగి నలువురితోపాటు సభలోఁ గూర్చుండి మనస్సిచ్చి వినెనని యన్వయము. డడడడ ధ్వనిచేయుచు దిగిన నలువురు తన్నే చూతురనియు దానివలన రసభంగమనియు మెల్లగ దిగెను. భగవత్కథా శ్రవణమందు సర్వజనులు సమానులే కాని గొప్పకొలఁదు లుండరాదని సింహాసనమునుండి దిగెను. తియ్యని పదార్థము తానొకఁడే తక్కినవారికర్హులై ననుభవింపరాదనియు సింహాసనమునుండి దిగెను సహముఁందు – సభయందు. యశః ప్రభృతుల యంత్యసకారంబునకు లోపంబు వైకల్పికంబు. సు-వ్యా- తత్సమ. ౯ ౩౭ సదము-సదస్సు.

తాత్పర్యము.

అని బాలకుల కుత్సాహము జనింప నిట్లు సభ్యులతోఁ జెప్పి యాబాలురు తేనెలోఁ జక్కెరకలిసినట్లు తీపునకు మఱింత తీపుకలుగునట్లు పాడుచుండ భగవత్కథలు చెప్పెడువారికంటె వినువా రున్నతస్థానమం దుండరాదు. కావున రామచంద్రమూర్తి సద్దుచప్పిడిలేక మెల్లగ సింహాసనముదిగి వచ్చి నలువురితో పాటు కూర్చుండి వినసాగెను. ఆహా! రామాయణము రామచంద్రమూర్తినిఁ గూడ నాకర్షించెఁగదా!

౪౦॥ శ్రీరామోత్సాహ వ్యాహారములన్ మార్గవిధి మహానందమున్మై
నీరీతి వారు పాడిరి, సారం బైనట్టి రామచరితం బెల్లన్. ౨౩౬

ఉత్సాహ వ్యాహారములన్ = సంతోషము కలిగించు మాటలచే, మహానందమున్మై = గొప్పసంతోషముచే, సారము = శ్రేష్ఠము, రసవంతము, మార్గవిధి – దేశి, మార్గ మను రెండువిధములలో సార్వత్రికమైన మార్గప్రకారము.

తా త్ప ర్య ము .

శ్రీరామచంద్రుని యుత్సాహకరములైన మాటలకు మిగుల సంతోషించినవారై కుశలవులు దేశాటనియమములులేక యెచ్చటనైనను బాడఁగూడిన మార్గ మను సంగీతవిధానము ననుసరించి రామచరిత్రమంతయు నిట్లు పాడిరి.

'తపమున స్వాధ్యాయంబున' అను పద్యముమొదలింతదాఁక నీ రామాయణంబున కుపోద్ఘాతమని తలఁచునది. ఎట్లు నాటకమున నాదియందుండు ప్రస్తావన నాటకాంతర్గతమో యట్లులే ఈ యుపోద్ఘాతముకూడ రామాయణాంతర్గతమే. ఈ యుపోద్ఘాతమున వక్తృవైలక్షణ్యము, విషయవైలక్షణ్యము, ప్రబంధవైలక్షణ్య మను నీ మూఁడు విషయములు పఠించువారికి గ్రంథముపై గౌరవము కలుగుటకై చెప్పఁబడినవి గ్రంథమున గౌరవబుద్ధి కలిగినఁగాని లోకులు గ్రంథపఠనార్థము ప్రవర్తింపరు. అట్లు ప్రవర్తించినఁగాని దానివలనఁ గలుగు లాభము పడయఁజాలరు కుశలవులు పాటపాడుట మొదలైనవి రామాయణ రచనానంతరముకదా జరిగెను. అదియెట్లు రామాయణపూర్వభాగమున వ్రాయఁబడెను. అని యాక్షేపింపరాదు. (1) వాల్మీకి త్రికాలజ్ఞానికావున దన యోగదృష్టిచే రామనిర్యాణాది వృత్తాంతము ముందుగఁ దెలిసి చెప్పినట్లే దీనిని జెప్పెనని తలంపవచ్చును. (2) వాస్తవమున నీ యుపోద్ఘాతములోని కుశలవుల విషయ ముత్తరకాండమున సరియయిన స్థలమునందే చెప్పఁబడినది, ఆ విషయమే లోకులకుఁ బ్రరోచనార్థమై తెలియుటకు ముందుగను జెప్పఁబడినది. కావున నీ యొకసర్గము (౪ వది) తరువాతఁ జేర్చెనని చెప్పినను బాధలేదు. (3) నాల్గవ సర్గము వాల్మీకి రచితముకాకయుఁ బోవచ్చును. రామాయణము పూర్తియయిన పిమ్మట నాయన శిష్యుఁ డెవఁడేని జరిగిన వృత్తాంతము ప్రరోచనార్థమై చెప్పియుండవచ్చును. ఇట్లు చేర్చుట కొన్ని గ్రంథములందుఁ గానవచ్చుచున్నది. యాజ్ఞవల్క్యస్మృత్యాదియందు నిట్లున్నదని వ్యాఖ్యాతయగు విజ్ఞానేశ్వరుఁడు వ్రాసియున్నాఁడు. నాటకరచనానంతరము గ్రంథకర్తయో మఱియొకరో ప్రస్తావన వ్రాయు నాచారమును గలదుగదా. యోగదృష్టిచే జరగఁబోవు వృత్తాంతము ముందుగ వాల్మీకి తెలిసికొని నాలు

గవ సర్గము వ్రాసె నను విషయమున నొక సందేహము తోఁచును. అదేమన.- కుశలవులు శ్రీరామచంద్రులయెదుటనే యీ నాల్గవ సర్గముకూడఁ బాడిరి గదా - అప్పు డా సర్గమునందుఁ జెప్పఁబడిన 'రాజకుమారులు' 'రామచంద్ర విభు మాఱటమూర్తు' లను పదద్వయములను విన్నప్పుడు గాయకులు తనకుమారులని రామచంద్రమూర్తికిఁ దోఁపకయుండునా? వెంటనే యావిషయము విచారించి యుండఁడా? కావున నిది యసంగతము. సమాధానము.— బిడ్డలయందుఁ గానవచ్చునవి తండ్రిమొక్కట్లేగావు మేనమామలు మొదలయినవారి పోలికలు నుండును. కావున పోలిక యున్నమాత్రముననే మీరు నాకొడుకులా యని రామచంద్రమూర్తి వారి నేమని యడుగును? ఆ బాలురకుఁ దాము వాల్మీకిశిష్యులమని మాత్రము తెలియునుగాని తా మారామచంద్రమూర్తికుమారు లగుట తెలియదు. అందున్నవారిలో శత్రుఘ్నుఁడుతప్ప మఱియెవ్వ రేమియు నెఱుఁగరు అదియునుగాక సీతాదేవివిషయమున వాల్మీకి యేమి చెప్పునో యనియు నామెవిషయము లోకమెఱుఁగ వలయుననియు రామచంద్రమూర్తి యభిలాష కావున నీ సందేహము తీర్చుకొన యత్నించెనేని యది విఘ్నముగును. కావున రామచంద్రమూర్తి యావిషయము ప్రస్తావింపక యుండవచ్చును. ఆలోచించి చూడ నీనాల్గవ సర్గమును గుశలవులు పాడలేనియు వాల్మీకియో యాయన శిష్యుఁడో చేర్చుననియుఁ జెప్పుటయే బాగని తోఁచుచున్నది. దానివలన గ్రంథమున కేబాధయులేదు. ఇదమిత్థమ్మని శోధించి స్థిరపఱుప సాధ్యమేగాని విరామము లేదు. శ్రమము మెండు. కావున నుపేక్షితము. మఱియొక యాక్షేపము.—మొదట మూఁడుసర్గములయందు వాల్మీకి స్వవిషయము తాను యోగదృష్టి కలవాఁడనని తనకు బ్రహ్మ సాక్షాత్కరించెనని చెప్పుకొనుట యాత్మస్తుతికాదా?

సమాధానము.— మొదటి మూఁడుసర్గములయందు గ్రంథోత్పత్తి విధము చెప్పఁబడినదేకాని మఱియేమియుఁ జెప్పఁబడలేదు యోగదృష్టి యనునది ప్రాకృతప్రాయులమైన మనకిప్పు డసాధ్యముగఁ దోఁచుచున్నదికాని యది యోగాభ్యాసపరులకందఱకు నాఁటికినేఁటికి లభించునదే. ఈవిషయము చెప్పకుండిన గ్రంథమునకుఁ బ్రామాణ్యమే తప్పును. కావున నున్నదున్నట్లు చెప్పుట దోషము కాదు. యోగదృష్టి గలవారు ఆనాఁడు వాల్మీకిచూచిన దంతయు నేఁడు చూడవచ్చును. యోగవిద్య యొకరిసొత్తు కాదుకదా! ఆనాఁడు చూచినవాఁడు వాల్మీకి యొకఁడేకాఁడు. భరద్వాజాదులును జూచిరి.

మఱియొక యాక్షేపము.— నాల్గవసర్గము తరువాతఁ జెప్పఁబడిన దన్నట్లు మొదటి మూఁడుసర్గములుకూడఁ దరువాతఁ జేర్పఁబడినవని యేల చెప్పరాదు.

'వాల్మీకి ప్రశ్నించెను' అని యీప్రకారము ప్రథమపురుషమేకదా ప్రయోగింపఁబడినది.

సమాధానము.—ప్రథమపురుషము ప్రయోగింపఁబడుటచేతనే యీసర్గములు వాల్మీకి చెప్పినవి కావని వలనుపడదు. తన్నుద్దేశించి చెప్పునపుడు వినయసూచనగాఁ బ్రథమపురుషము ప్రయోగింపఁబడును. నేను అని చెప్పుటకు మాఱు 'వీఁడు మీదాసుఁ'డని చెప్పుట కలదుకదా. ఆంధ్రమహాభారతమున నన్నయభట్టు 'నన్నయభట్టు ధీరతన్', 'నన్నపార్యుఁడు' అని ప్రయోగించెనుగదా.

అంతియగాక ప్రథమసర్గముకూడఁ గుశలవులు రామసన్నిధానమునఁ బాడిరని యుత్తరకాండమునఁ జెప్పఁబడెను. (ఉత్తర. ౧౪౭౬. ప).

అప్పటికి రచింపఁబడకుండిన వారెట్లు పాడియుందురు? అదియునుగాక యీమూఁడు సర్గముల విషయ మితరులకుఁ దెలియునదికాదు. ఈవిషయ మాయన వివరింపకుండిన బాల. ౨౪౦ వ పద్యమున బ్రహ్మ పల్కినదిది, బహుపాప విచ్ఛేది, క్షితిని బ్రవర్తింపఁజేయుమాత్రమధికారమందితి, ననిన వాక్యము లెట్లు బోధపడఁ గలవు?

మనుస్మృతియందు.

శ్లో॥ స తైః పృష్టస్తథా సమ్యగమితౌజా మహాత్మభిః
ప్రత్యువాచార్చ్యతాన్సర్వాన్ మహర్షీం ఛ్రూయతామితి॥

మనుస్మృతి మనువు వచించినదైనను 'మనువును ఋషులడిగిరి. ఆయన వారికిట్లు చెప్పెను' అని యందుఁ గానఁబడుచున్నది.

దానిపై వ్యాఖ్యాతయగు కుల్లూకభట్టు.

"ప్రాయేణాచార్యాణామియంశైలీ యత్స్వాభిప్రాయమపి పరోపదేశమివ వర్ణయంతి. అత ఏవ 'కర్మాణ్యపి జైమినిః ఫలార్థత్వా' దితి జైమినే దేవ సూత్రం. అతఏవ 'తదుపర్యపి బాదరాయణ సంభవా' దితి బాదరాయణస్యైవ శారీరకసూత్రం" అని వ్రాసెను. సాధారణముగ నాచార్యులశైలి యిట్లే యుండును. స్వాభిప్రాయముకూడఁ బరు లుపదేశించినట్లు చెప్పుదురు. కావుననే జైమిని రచించిన సూత్రములందే 'జైమిని యిట్లు చెప్పెను' అని చెప్పఁబడును. శారీరక మీమాంసయందును బాదరాయణు లిట్లే వ్రాసిరి. కావున వాల్మీకి నారదు నడిగెను, వాల్మీకి నారదునకుఁ జెప్పెను, లోనగునవి వాల్మీకి రచించినవి యనియే యెఱుఁగవలయును.

ఈ క్రింద వివరింపఁబడు విషయము గోవిందరాజీయ వ్యాఖ్యానంబునఁ గలదు. ఈ రామాయణమునఁ బదునెనిమిది విషయములు కలవు. వానిపేర్లం దుఁ దెలుపఁబడును. వేదాంతములయందు జగత్కారణ మనఁబడునది విష్ణు

మూర్తియే కాని బ్రహ్మరుద్రాదులు కారని రామాయణము విశదీకరించు చున్నది. ఈయర్థము సంక్షేప రామాయణమున విశకలితముగా నున్నను నిచ్చట మీమాంసా న్యాయపూర్వకముగఁ బరిపూర్ణ రామాయణము విశద ముచేయుచున్నది. కానఁ బునరుక్తము కాదు. "ప్రాయేణ పూర్వ భాగార్థో, ధర్మశాస్త్రేణ కథ్యతే। ఇతిహాస పురాణాభ్యాం, వేదాంతార్థః ప్రకాశ్యతే" యన్నట్టు లిది యితిహాసము గాన వేదాంతార్థవిచారరూప మని యెఱుఁగునది. "యతోవా ఇమాని భూతాని జాయంతే, యేనజాతానిజీవంతి, యత్ప్ర యం త్యభిసం విశంతి, త ద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ" యని యుపని షత్తునందు కారణ వాక్యమునందు జగత్కారణము బ్రహ్మ మని చెప్పఁబడి యున్నది. ఆ కారణము త్రిమూర్తులలో విష్ణువేయని యీ గ్రంథమున విశదము. ఒక గ్రంథమునఁ బ్రతిపాద్యవిషయ మాఱువిధముల నిశ్చ యింపవలయును. "ఉపక్ర మోపసంహారా వభ్యాసో పూర్వతాఫలం। అర్థ వాదోపపత్తీచ, లింగంతాత్పర్యనిర్ణయే" గ్రంథాది - గ్రంథాంతము - గ్రంథ మధ్యము - అపూర్వత - ఫలము - అర్థవాదము - యుక్తులు నేనిచే గ్రంథప్రతి పాద్యవిషయము తెలిసికొనఁదగు. ఇవియన్నియు విష్ణువిషయమున నేకీభవించి యున్నవి.

(౧) గ్రంథాదియందు - 'ఎవ్వఁడీ ధారిణి' నని వేదాంతమునందుఁ జెప్పఁ బడిన గుణవంతుఁడు త్రిమూర్త్యాదులలో నెవ్వఁడని వాల్మీకి ప్రశ్నించినపుడు రామచంద్రమూర్తిగ నవతరించినవాఁడే యని "జనియించెనయ్య యిక్ష్వాకు వంశంబున' ననునదిమొదలు నారదుఁ డుత్తరముచెప్పెను. విష్ణువేకదా రామ చంద్రమూర్తిగ నవతరించెను.

(౨) అంతమున బ్రహ్మవాక్యమునందు సకలజగత్కారణుఁడగు విష్ణువే రామ చంద్రమూర్తియని స్పష్టముగ నున్నది. చూ. ఉత్తర(౧౫౭౩-౧౫౭౪-౧౬౫౪). "పూర్వంబు జగములఁ బొలియించి మాయచే, స్వయముగ జలరాశి శాయి వగుచుఁ" "గొలుత సృష్టించితి జలములయందు నన్న" "వారిజంబున నీనాభి వలన నన్నుఁ గలుగఁజేసి" "రావిష్ణు విష్ణు" ఇత్యాదులు బ్రహ్మవాక్యములు.

(౩) గ్రంథమధ్యమున=బాలకాండమున "ఈలోనన జాంబూనద।చేలుండు జగత్ప్రభుండు శ్రీకరభృశరు । గ్జాలుండు శంఖచక్ర గదా లలితుఁడు విష్ణు మూర్తి త్వర విచ్చేసెఁ." బాల ౪౮౫ ప. అనుపద్యమున జగత్కారణత్వము విష్ణుదేవునకుఁ జెప్పఁబడెను "అరిమర్దన నీవేకద। పరమగతివిమాకు నెల్లవారికిఁ గానక" అను దేవతల వాక్యముచేతఁ బరాత్పరున కసాధారణమైన సర్వ శరణ్యత్వ మను గుణముచెప్పఁబడెను. అప్పైన 'కాళగళాదిసురుల్ మధుద్విషుఁ

వినతి యొనర్చి యనుపద్యమున సర్వస్తోత్రార్హతయుఁ జెప్పఁబడెను. 'ఏ నెఱుంగుదు రాజేంద్ర! యీమహాత్ము రాము సత్యపరాక్రమోద్దాము మఱి ప్రసిద్ధతేజోధికుండు వసిష్ఠమునియు నీతపస్విసుతులెల్లరు నెఱుఁగువారు" అను విశ్వామిత్రువాక్యమునఁ "వేదాహమేతం పురుషం మహాంతం। తమేతంవేదాను వచనేన బ్రాహ్మణా వివి దిషంతి యజ్ఞేన దానేన తపసా నాశకేన" యను శ్రుతియందున్నట్లు మహాపురుషతయు, తపోబలములేక తెలియ సాధ్యముకాకుండుటయు శ్రీరామచంద్రమూర్తివిషయమునఁ దెలుపఁబడెను. సీతావివాహఘట్టమున వంశక్రమము చెప్పునపుడు "అవ్యక్తుఁడు నిత్యుఁ డవ్యయుండగుబ్రహ్మగనె మరీచి"నను (బాల. ౧౨౮౫ ఎ) వసిష్ఠుని వాక్యమున సకలమూలకారణత్వము చెప్పఁబడినది. "కం. గుడు సుంగ్రాదువు వేలుపు, వడికిని శివధనువు పెడిలి పడుటయు వేల్పు౦। దుడుములు మునులును విష్ణువె। కడునధికుం డనుచు నపుడు గ్రహియించి రెరఁగ" (బాల. ౧౩౨౯) అను పరశురామువాక్యమున సర్వాధికత్వము చెప్పఁబడినది.

అయోధ్యాకాండమున - ౭ ప-'రావణుఁజంప దేవతా। బృందమతిఁ సనాతనుఁడు విష్ణువు పుట్టె ధరఁ నరాకృతిఁ' అని రామచంద్రమూర్తికి సనాతనత్వము చెప్పఁబడినది. 'ఆకాశ ప్రభవో బ్రహ్మ శాశ్వతో నిత్య అవ్యయ' యను పద్యమున శ్రీరామునకు సర్వవ్యాపకత్వమును, స్వయంప్రకాశకత్వమును నీరెండు గుణములాకాశశబ్దముచేఁ జెప్పఁబడినవి. బాల- ౧౨౮౫ లోని అవ్యక్తవాచ్యుఁడును నిందలి యాకాశవాచ్యుఁడు నిరువురు నొక్కఁడే. విష్ణు వనుటకు శ్రీభాగవతమున —

ఉ. సర్వఫలప్రదాతయును। సర్వశరణ్యుఁడు సర్వశక్తుఁడున్
సర్వజగత్ప్రసిద్ధుఁడును। సర్వగతుండగు చక్రపాణి యీ
సర్వ శరీరులుఁ విగమ। సంగతిఁజెంది విశీర్యమాణులై
పర్వినచో నభఁబుగతి। బ్రహ్మము దాఁ జెడకుండు నెప్పుడుఁ. అనికలదు.

ఆరణ్యకాండమున —"జనకాత్మజ సంబంధం,బున రాముం డప్రమేయపురుతేజుండు" (౫౭౫౪) అను మారీచువాక్యమున నపరిచ్ఛిన్నమాహాత్మ్యము చెప్పఁబడెను.

కిష్కింధాకాండమున.— "ఉ॥ సాధులవాసవృక్షము, ప్ర।శస్తమహాగతి యార్యకోటికిఁ। బాధితపాళికాశ్రయను, బంధురకీర్తికి నేకపాత్రమా। రాధిత శాస్త్రలౌకిక వరప్రతిపచ్ఛుభశీలి వల్లభా। భూధరమెల్ల ధాతులకుఁ బోలె గుణంబులకెల్ల నిక్కయా॥ కిష్కింధ- ३౯౬." అను తారావచనమున జ్ఞానానందాదులగు సమస్తకళ్యాణగుణములు శ్రీరామచంద్రమూర్తికే చెప్పబడినవి.

సుందరకాండమందు — "గీ॥ అధిప బ్రహ్మ స్వభువు చతురాస్యుఁడైన। త్ర్యంబకుఁడు రుద్రుఁడును బురహరుఁడునైన। నింద్రుఁడు మహేంద్రుఁడును సురాధీశుఁడైన గలన శ్రీరామవధ్యునిఁగావలేరు॥ (౧౧౭౬ప) అను పద్యమున సర్వసంహారకత్వమును రామచంద్రమూర్తియందుఁ జెప్పఁబడెను. "అకటయవ్యక్తమేకమనంతమగు నచింత్యవిష్ణుని తేజంబు స్వీయమాయ, వానరాకృతిఁ గైకొని వచ్చెనేమొ! ౧-౨౩౭. యను పద్యమున ననంతరూపత్వ మను గుణము చెప్పఁబడెను.

యుద్ధకాండమున.—'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే' యను శ్రుతివాక్యమువలనఁ జతుర్ముఖ బ్రహ్మకును 'యదాతమస్తన్న దివా న రాత్రిర్న సన్న చాసచ్ఛివ ఏవ కేవల' 'యను శ్రుతియందు శివునకును, 'ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే' యను శ్రుతియందు నింద్రునకును జగత్కారణత్వమున్నట్లు తత్త్వముల నిరూపించు సందర్భములఁ జెప్పుచుండ విష్ణువునకే కారణత్వమనుట యెట్లు యుక్తమని ప్రశ్న మనస్సునం దుంచుకొని విష్ణువు దేవతలకన్న శ్రేష్ఠుఁడని చెప్పుటంబట్టి యాయనకే కారణత్వమనియు ఈ తత్త్వనిరూపణ సందర్భములఁ జెప్పియున్న హిరణ్యగర్భ శివేంద్ర శబ్దములు, సత్, బ్రహ్మ, ఆత్మ శబ్దములు విష్ణువునకే పేరని యెఱుంగునదియును తెలుపుటకు "కాన రాముండు నిక్కము మహాయోగి యనాదిమధ్యాంత సనాతనుండు। పరమాత్ముఁడును బరాపరుఁడు మహాత్ముకు, బరమ మహాత్మును బానుధాత। శ్రీవత్సనతుండు శ్రీనిత్యనిలయుండు, శంఖచక్రగదాది సాధనుండు। శాశ్వతుఁడు ధ్రువుం డజయ్యుండు సత్యపరాక్రముడగు విష్ణుఁ డవనిమీఁద (యు ౨౯౩౮ ప) ని చెప్పఁబడెను. ఆకాండమందే (౨౭౦౭) "నారాయణా దేవ లక్ష్మీనాథా విభూ శంఖచక్రాయుధా నీవ మున్నొంటికొమ్ము శృంగంబు భూదారమై భూమిక ధారమై నిల్చి పెన్వేల్పవుం" అని నారాయణశబ్దవాచ్యుఁడు రాముఁడే యనియు నన్నది. నారాయణ శబ్దము పరమాత్మ పరమని వేదాంతమునఁ బ్రతిపాదింపఁబడినది. నారాయణుఁ డను పేరు విష్ణువునకే యనుటయు నప్రకంప్యముగదా. ఇట్లనేక స్థలములఁ బరమాత్మకుఁ గల యసాధారణ గుణములతో శ్రీరాముని జెప్పుటచే విష్ణుస్వరూపుఁడగు శ్రీరాముఁడే జగత్కారణమగుట సిద్ధము.

(౪-౫) పరాత్పరుఁడు విష్ణువే యనుట యిట్టి గ్రంథముచే నెఱుఁగనలయును గాని ప్రత్యక్షాది ప్రమాణములచేత నెఱుఁగుట యసాధ్యము. కావున నపూర్వతయు నిటఁ గలదు. అపూర్వత యనఁగా నితరప్రమాణములచేఁ దెలియరానిది దెలుపుట. ఫలంబును శ్రీరామచంద్రమూర్తి పరాత్పరుఁ డనుటకనుకూలముగ నన్నది. రామచంద్రమూర్తి తనయందుఁ బ్రీతిగల కోసలవాసుల కందఱకు సాలోక్యమునుగదా ఫలముగా నిచ్చెను. అది పరమాత్మకుఁ గాక తక్కిన యెవ్వరికి నసాధ్యము.

(౬) అర్థవాదమును యుక్తులును రామచంద్రమూర్తి పరమాత్మయనుట యందే కలవు. అర్థవాదము = స్తోత్రము. బాలకాండమునఁ బరశురామ గర్వభంగ ఘట్టంబున 'నీ రెండు విండులు భూరిసత్త్వంబులు' ననునది మొదలు స్తోత్రము చెప్పఁబడినది. 'గుడుసుంగై దువు వేలు' పనుపద్యము మీఁద నుదాహరింపఁబడెను. దానియందు విష్ణువు శివునోడించుటచేత విష్ణువే శివుని కన్నను గొప్పవాఁడను యుక్తిచే విచారించి నిర్ధారణచేసినట్లు చెప్పఁబడినది. మఱియు నరణ్యకాండమున ౧౯౩ వ పద్యమున నగస్త్యుఁడు పూజించు సర్వదేవతాస్థానములఁ జెప్పి రుద్రస్థానము చెప్పకపోవుట యాయనపూజార్హుఁడు కాఁడనుటను స్పష్టపఱుచును. ఈదేవతాస్థానము లన్నియు నగస్త్యదర్శనార్థము వచ్చిన దేవతల స్థానములని చెప్పరాదా' అగస్త్య దర్శనార్థము రుద్రుఁడువచ్చుటలేదు. కావున నాయనకు స్థానము కల్పింప లేదనరాదా' అనరాదు. అగస్త్యదర్శనార్థమై వచ్చు దేవతలందఱు సాధారణ దేవతలేకాని ప్రధాన దేవతలుకారు. ఇటఁ జెప్పిన దేవతలు ప్రధాన దేవతలుకాన వీరు పూజ్యులేకాని యగస్త్య పూజకులుగారు. గృహస్థుగృహమున దేవత లున్నట్లు చెప్పినచో వారు గృహస్థుఁడు పూజించు దేవతలని యేర్పడునేకాని గృహస్థుఁ బూజింపవచ్చిన దేవతలనుట స్వరసముగాదు. మఱియు "రుద్రుండు త్రిదశులఁగాంచి రోషమునను భాగార్థులార! భాగంబు నాకు నేలకల్పింప'రని రుద్రుఁడడిగినట్లుచెప్పుటచే రుద్రునకు యజ్ఞభాగము లేదని యేర్పడుచున్నది. కావున నిట్టిదేవతకుఁ బరత్వము చెప్ప నెట్లగును? కాఁబట్టి యుపక్రమాదులగు తాత్పర్య లింగము లాఱును, సహాయముగ నుంచుకొని రామాయణము రామచంద్రమూర్తిగ నవతరించిన విష్ణువే పరతత్త్వమని నిర్ధారణ చేయుచున్నది. ఈయర్థమునే చతుర్ముఖుఁడు.

ఉ॥ ఉత్తమ కావ్య మియ్యది త్వదుద్భవమాది సుఖంబు దుఃఖముల్
హత్తినరీతిఁ దెల్పెడి యథార్థముగా సభవిష్యమై మఱిన్
సోత్తరమానటుల్ పలికె సొంపుగ వాల్మికి దానినెల్ల నీ
విత్తఱి విన్మ నీవ యవనీశ్వర! యర్హుఁడ వద్ది గైకొనన్॥

కం॥ నీయంద సుప్రతిష్ఠిత।మై యఖిలం బుండు రామ యాదిమకావ్యం
బీయది దివ్యం బద్భుత।మై యజ్ఞానచ్యుతంబు నై సత్యంబై.
—ఉత్తర. ౧౧౧౩-౨ ౧౧౧౩౩.

అని చెప్పెనుగదా దీనివలన రామాయణమునఁ జెప్పఁబడిన పరతత్త్వము శ్రీరామచంద్రమూర్తిగా నవతరించిన విష్ణువే యని స్పష్టపడియె. జటాయువునకుఁ గోసలదేశప్రజలకందఱకు మోక్షమిచ్చినవాఁడు పరతత్త్వముగాకున్న మఱి యెవ్వఁడు కాఁగలఁడు? నీవ యర్హుఁడ వనుటచే తానుగాని రుద్రేంద్రాదు

లెవ్వరు గాని దీని కర్తలుగారని బ్రహ్మభావము. విష్ణువు పరమాత్మ యయ్యెనేని యాయనకు రామాద్యవతారము లెట్లు యుక్తమగును? కర్మముచేఁగదా జన్మముగలుగును. పరమాత్మ కర్మరహితుఁడు. నిష్కళం నిష్క్రియం శాంత మ్మని కదా యుపనిషద్వాక్యము - అని కొందఱు సందేహింతురు. అది యుక్తము గాదు. కర్మాయత్తజన్మము ఇచ్ఛాయత్తజన్మము అని జన్మములు రెండువిధములు. అందు బద్ధజీవులకుఁ గర్మాయత్తజన్మము. ఈశ్వరునకు నిచ్ఛాయత్తజన్మ. 'అజాయమానో బహుధా విజాయతే' యని శ్రుతియు, 'ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహ' యని స్మృతియు నీయర్థమునే తెలుపుచున్నవి. దుష్టశిక్షణ శిష్టరక్షణములఁ జేసి లోకములఁ గాపాడుటకై భగవంతుఁ డా యా కాలముల కనుకూలముగ స్వేచ్ఛచే స్వశక్తిచే నప్రాకృతదేహములఁ గల్పించుకొనును. వేష మిట్టిది వేసినను బరత్వశక్తి తప్పదు. రాజు మాఱువేషము వేసికొనినంతనే ప్రభుత్వశక్తి తప్పునా? కారాగృహములఁ బరీక్షింపఁబోవు నధికారులకు నేరముచేసి శిక్ష ననుభవింపఁ బోవు దోషులకు భేదములేదా? ఆశ్రితులకు మోక్ష మిచ్చుశక్తి పరదేవతకే కదా కలదు! అది శ్రీరామచంద్రమూర్తియందుఁ గల దని చెప్పఁబడెను. 'ఏదిగతి యజ్ఞశీలుర కేది యాహితాగ్నులకు నపరావర్తులైనవారి। కుర్విదాతల కట్టి యనుత్తమగతి। కరుగు మత్సంస్మృతి మదాజ్ఞనమితే స్త్వ' (అరణ్య ౧౧౭౬) అను పద్యమున అపరావర్తులైన వారి కనుటచే రాముఁడు జటాయువునకు మోక్ష మిచ్చినట్లేర్పడెను. ఈపద్యమున నపరావర్తులైన వారి కను పదమునుగుఱించిన విచారము సంక్షేపరామాయణమున ౧౧౬ వ పద్యమునఁ గలదు

రాముఁడు పరతత్త్వ మయ్యెనేని సంధ్యావందన సూర్యనమస్కారాది కర్మములు చేయనేల యని యాక్షేపము. స్వధర్మము శ్రేయస్కర మని స్వధర్మమార్గమునఁ దాను వర్తించి లోకుల వర్తింపఁ జేయుటకై మాయామానుషవేషధారియగు రామచంద్రుఁడు అట్లు వర్తించెను. నర్తకులే యే వేషములు ధరింతురో దానికిఁ దగినచేష్టల రంగమున వర్తింపవలయును. గాని తత్పూర్వము వా రున్నదశల నాలోచించి వర్తింపరాదు గదా!

"ఆత్మానం మానుషం మన్యే'' నేను మనుష్యుఁడ నని తలఁచెద నని చెప్పిన వాఁడు దానికిఁ దగిన చర్యయందుఁగదా యుండవలయును. కావున వసిష్ఠవిశ్వామిత్రాదిఋషులకు, గౌసల్యాహల్యాది స్త్రీలకు మ్రొక్కినట్లే సూర్యోపాస్తియుఁ జేసెనని యెఱుంగవలయును, అని సమాధానము. కాఁగా, రామచంద్రమూర్తిగా నవతరించిన విష్ణువే పరతత్త్వము. దానికాధారముగ బాలకాండమున నాయనకు సృష్టికారణత్వమును, అయోధ్యాకాండమున స్థితికారణత్వము, ఆరణ్యకాండమున మోక్షప్రదత్వము; కిష్కింధాకాండమున సర్వకారణత్వము, సుందరకాం

డమున సర్వసంహారకత్వము యుద్ధకాండమున వేదాంతవేద్యతయు, ఉత్తర కాండమున సృష్టికర్తలగు బ్రహ్మాదులకుఁ గారణభూతుఁ డనియుఁ జెప్పఁబడి యున్నవి ఈయర్థము వకుళాభరణాది గుణపరంపరా ప్రాప్తమైన దనియు నూతనసృష్టి కా దనియు నెఱుంగునది. ఇందలి విశేషార్థము లందందుఁ జెప్పఁ బడును. ఈ విషయమున శ్రీరామపరత్వము చూచునది.

ఇది ద్వైత విశిష్టాద్వైతాది భాగవతుల యభిప్రాయము. వాదా ద్వైతుల కెల్ల నిది యింద్రజాలము శాక్తేయులు శ్రీ త్రిపురసుందరీదేవియే రామచంద్ర మూర్తిగా నవతరించె నందురు. బౌద్ధులు బుద్ధదేవుఁడే (మాయాదేవిసుతుఁడు) యాకాలమున శ్రీరాముఁడుగా నవతరించె నందురు. తురకలు తమ రహిమే రాముఁ డందురు. శైవులు శివుఁడే రాముఁ డయ్యె నందురు. మన శ్రీరామ చంద్రమూర్తినే యింద ఱన్ని భావముల నన్ని నెపములనైనఁ బెట్టుకొని పూజిం చుచున్నారుగదా- యని రామభక్తులు సంతోషపడుచున్నారు. కాని వేఱొం డభిప్రాయము గలవారుగారు. రావణుఁడు నీవు విష్ణువు పంపిన వచ్చితివా యని హనుమంతు నడుగ నాయన యెవఁడో నేను రామదూతనే యనెనుగదా. ఈ గ్రంథకర్త యభినివేశ మట్టిదే. ఈ గ్రంథమున విశ్వాసముంచి బాగుపడఁగోరు వారికి శ్రీరామచంద్రపదారవిందభక్తిపూరితచిత్తమున ననుష్ఠానమున సీతా రామా ద్యనుకరణముగాని విష్ణ్వనుకరణముగాదు, శివానుకరణముగాదు, శక్త్యనుకరణముగాదు, శుష్కవివాదముగాదు. స్వాభిప్రాయంబునస్థిరులై పరాభి ప్రాయము సహించుట యుత్తమజనలక్షణము.

౨. ఉపాయ వివేచనము.

ఇట్లు పరత్వమును స్థాపించి యట్టి పరమాత్మ ననుభవించు నుపాయము శరణాగతి యని యందుఁ బ్రతిపాదించుచు నాయుపాయమే వారివారి యధి కారముకుఁబట్టి వారివారి యిష్టమును సాధించుచున్నాఁ డనియుఁజెప్పుచున్నాఁడు. కాఁబట్టి యీగ్రంథము 'యోబ్రహ్మాణం విదధాతి పూర్వం, యోవై వేదాగ్ం శ్చ ప్రహిణోతి తస్మై, తగ్ంహదేవ మాత్మబుద్ధిప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే,'' యను శ్వేతాశ్వతరోపనిషదర్థమును వివరించును.

అందుఁ బ్రథమమున 'ఈలోనన జాంబూనద।చేలుండుజగత్ప్రభుండు శ్రీకర భృశరు।గ్జాలుండు శంఖచక్ర।గ।దా లలితుఁడు విష్ణుమూర్తి త్వర విచ్చేసెన్'' అను పద్యమున సర్వస్వామి యగు సర్వేశ్వరుఁడు లోకు లెప్పుడు తన్ను రక్షింపఁ వేఁడుదురా యని ప్రతీక్షించువాఁడు కావున నాసమయము తాను జగద్రక్షణము సేయుట కనుకూలమైనదిగ దాయనియుబ్బి మిగుల వెలుఁగుచు రక్షణసాధనములగు శంఖచక్రాదులతోఁ దన రక్షణము గోరుచుండు దేవతలుండు చోటికిఁ దానే వచ్చి

చేరెను. బ్రహ్మరుద్రాది దేవతలట్టి దేవునిఁజూచి రావణవధ యను ఫలముఁగోరి శరణు చొచ్చిరి. ఖలుని వధియించి సురపాళిఁ గావ నిన్ను శరణుచొచ్చిన వ్యర్థము కాదనియుఁ జెప్పెను. ఇమీఁద "అన్నపదంబులంబడి మహామతి కట్టగఁ బట్టి కొంచు నాయన్నలమిన్న సీతఁ గని యామెను బ్రార్థనచేసి మున్నుగా" అయోధ్య. ౮౭౧ అను పద్యమున సర్వ్యమునకుఁ దన్నుఁగూడఁ దీసికొనిపోవ లక్ష్మణుఁడు చేసిన శరణాగతిచేత శరణాగతికిఁ బురుషకార మవశ్యమని తెలియు చున్నది. "రాముఁడు పట్టసంబునకు రా మదిఁబూనెడి దాఁక నింద్ర శా । లా ముఖమందు నప్పిడి యిలాత్రిదశుండధమర్తువాకిట । మోమున గడ్డవెంచుకొని ముట్టక కూడును నీళ్లు నుండున । గ్లామియు ముట్ట కేను నసియించెద" అయోధ్య ౨౮౯౩ ప. అని భరతుఁడు పట్టాభిషేకార్థమై శరణుచొచ్చెఁగదా. అది యేల విఫలమయ్యె నన నింతకుఁ బూర్వమే రావణవధార్థమై దేవతలు శరణాగతిచేసియుండుటఁబట్టియు ననివార్యమైన జనకాజ్ఞ యను ప్రబల ప్రతిబంధ మడ్డుపడుటను భరతుని శరణాగతికి ఫలవిలంబమైనది. కాని వ్యర్థము కాలేదు. అంతమాత్రమేకాక యిప్పటికి రామపాదుకల లాభము కలిగినది. శరణాగతికిఁ బ్రబలప్రతిబంధ ముండెనేని కాలవిలంబన మగును గాని వ్యర్థము కాదు. అప్పటికిఁ గొంతఫలమైన కలుగక తప్ప దని దీనివలనఁ దెలియ నయ్యెడి. దండకారణ్యవాసులు ఋషులు విరోధి సంహారార్థమై శరణాగతి చేసిరి. ఆరణ్య. ౧౨-౮౦. 'మత్స్వామివి నీవ నీవు వసధారిణి నండిన నూర కుండినక' యని వారిప్రార్థన.

"కావున మే మెల్లరమును నీవిషయమునందు నుంట నీచే నెపుడుం గావంబడ నర్హులము" అనియుఁ జెప్పిరి. 'నీవిషయము నందు నంట' యను పదము శరణాగతి యనఁ బ్రభువున్న దేశమున నండుటే చాలునని తెలుపుచున్నది. "కాకియు వెఱ మూఁడులోకములను, సంచరించుచుఁ బలువురఁ శరణు వేఁడెఁ, గన్న తండ్రియు సురలును ఘనమహర్షి, చయమునుం దాము గావఁగఁ జాలమనఁగ మరలి చనుదెంచి రామునే శరణుచొచ్చె. శరణంచు ధరణిపై సాఁగిలిఁబడి నట్టి వాయసుఁగని యది వధ్యమయ్యుఁ జంపక కాచితి" సుందర. ౯౩౩ ప. అను కాకాసుర వృత్తాంతముచేతరక్షకుని యెదుటఁ బడియుండుటే శరణాగతికిఁ జాలు నని తెలియుచున్నది. కావుననే యీ గ్రంథకర్త యనన్యుఁడై కోదండ రాములసన్నిధి నొంటిమిట్టయందుఁ బడియుండఁ గోరుట.

అపరాధివి వారిమెడం। గపినాయక దోషహరణకరణక్షమ మా । నుపమ మఱిమెద్దిలే దిఁక।నిపుడంజలిఁ జేర్చిమ్రొక్కు మీ సౌమిత్రికిఁ. "కిష్కిం. ౮౮౭.

అను సుగ్రీవుని వృత్తాంతముచే శరణాగతికంజలిబంధమేచాలు నని తెలియ నయ్యెడి. "రావణా! కొంకకు రాములోఁ జెలిమిఁ గోరుము యప్పురుషోత్త

ముందు ధర్మాంకుఁడు నిన్ను నేలు శరణాగతవత్సలుఁడౌట నక్షిలికి". సుందర. ౧౧౬. అని సీత రావణున కుపదేశించిన వాక్యముల వలన శరణాగతికి నానుకూల్య మావశ్యక మని యేర్పడుచున్నది. "అవజ్ఞచేసినఁ దురుసున, నాలుబిడ్డలను ద్రోపిడి యిమ్మెడ రామచంద్రునిఁ శరణముఁ జొచ్చినాఁడ" యుద్ధ. ౩-౨౮ అను నీవిభీషణశరణాగతి వాక్యములవలన శరణాగతికి విరోధపరిహార మత్యావశ్యక మని స్పష్టమగుచున్నది. "తూరుపు మొగమై మునియై శయనించెను నవ్వననిధిఁ బ్రార్థించుకొనుచు." యుద్ధ. ౪౩౬ అను రామశరణాగతియందు నయోగ్యుఁడు శరణాగతి చేయునపుడు వేఱుయోగ్యత సంపాదించుకొన నక్కఱ లేదు. యోగ్యుఁడు శరణాగతి చేయునపుడు నయోగ్యత తెచ్చుకొనఁ బనిలేదు. శరణాగతికిముందు వాఁడువాఁ డుండు దశయే చాలును. అశుద్ధమగు లంకానగరమునుండి శరణార్థియై వచ్చిన విభీషణుఁడు శరణాగతికిఁ బూర్వము తన పూర్వపు టునికికై పశ్చాత్తాప పడుట తప్ప వేఱుప్రాయశ్చిత్తాదులఁ జేసికొని క్రొత్తయోగ్యత సంపాదించుకొని రాలేదుగదా. శరణాగతికిఁ బూర్వము క్రొత్త యోగ్యత సంపాదించుకొన నక్కఱలేనియెడల సముద్రునియందు రామచంద్రమూర్తి శరణాగతి వ్యర్థము కానేల'-అని యాక్షేపము. సముద్రమునకు సామర్థ్యమును గారుణ్యమును లేకుండుటచేతనే యని సమాధేయము. సమర్థుఁడు కారుణికుఁడు నగువానిని శరణుచొచ్చిననే శరణాగతి సఫలమగును. శ్రీరాములకంటె సముద్రుఁడు సమర్థుఁడును గాఁడు, కారుణికుఁడును గాఁడు. కావున వ్యర్థమయ్యెను. "మనలఁ దమియింపఁగ వేఁడుకొంటయే పోలును."సుందర. ౨౦౮ అని త్రిజట సీతాదేవిశరణు వేఁడెను. ఈ కారణముచేతనే రావణ వధానంతరము హనుమంతుఁడు రాక్షసస్త్రీలనందఱఁ జంప నాజ్ఞయిమ్మనఁగా త్రిజటాశరణాగతిని స్మరించి హనుమను వారించి వారల రక్షించెను. దీనివలన నాపన్నుఁడైన వానికై మఱియొకఁడు శరణాగతి చేయవచ్చు ననియు నది సఫలమగు ననియు స్పష్టమయ్యె. వైష్ణవులపక్షమున భాష్యకారులు శరణాగతి చేసిరి. విభీషణుఁడు శరణన్నమాత్రాన శరణు వేఁడని యాయన మంత్రులనుగూడ రక్షించుటచే శరణాగతుని సంబంధులకును భగవత్కటాక్షము సిద్ధమనుట స్పష్టము. ఇట్లాదిమొదలంతమువఱకు నీగ్రంథమున వారివారి యిష్టానుసారము శరణాగతి ఫలించుననుట విశదీకరింపఁబడినది. అట్టి శరణాగతియే మోక్షమునకు హేతు వని యెఱుంగునది. ఇందలి యితరవిశేషము లాయాసందర్భములందుఁ జెప్పఁబడును.

౩ శరణాగతికి ముఖ్యఫలము.

భగవంతునియెడఁ జేసిన యిట్టి శరణాగతికి ముఖ్యఫలము భగవత్సన్నిధానమునఁ జేరి భగవంతునికి సేవచేయుచుండుటయే యనియు నితరఫలము లాను

షంగికము లనియు నీగ్రంథమువలన స్పష్టమగుచున్నది. మొట్టమొదట దేవతలు శ్రీవిష్ణుమూర్తిని శరణు వేఁడుటవలనఁ గలిగిన ప్రధానఫలము తాము వానరాది రూపముల నవతరించి భూమియందవతరించిన భగవంతునకు సేవచేయుటయే.

రావణవధ యానుషంగికఫల మని యెఱుఁగవలయును. లక్ష్మణుఁడు శరణు చొచ్చి యిట్లు ప్రార్థించెను. "పండులు గడ్డలున్ వన నివాసులు గ్రాసము గాఁగ మెక్క వేటాండు నదైనఁ దెచ్చెదను, నర్విజ సీవును గూడి యాడుచున్, గొండల పేటుల న్నిదుర గూరియయున్నను మేలుకొన్నఁ గోదండ ధరుండనై మెలపుదాలిచి సర్వముఁ దీర్చుచుండెదన్" అయోధ్య. ౮౮౭. ఇందు శరణాగతికి సర్వకాల సర్వదేశ సర్వావస్థలయందును భగవత్కైంకర్యమే ప్రధాన ఫల మని తెలియుచున్నది. చిత్రకూటమున భరతుఁడు రామచంద్రమూర్తి శరణు చొచ్చినదియుఁ దత్కాలమునఁ గాకున్నఁ గాలాంతరముననైన రామసేవ దొరకకునుగదా యను తలంపుతోనే, భరతుఁడు శరణాగతి చేయకుండిన యెడల రామచంద్రుఁ డయోధ్యకు మరలి వచ్చియుండఁడు. భరతునకు రాముసేవ లభించియు నుండదు. ఈ భయముతోనే భరతుఁడు శరణాగతుఁడయ్యెను. (అయోధ్య. ౧౫౬-౧౫౭౧) (యుద్ధ. ౨౮౪౨ ప నూడుఁడు.) దానికి సంపూర్ణ ఫలము వెంటనే ప్రతిబంధక బాహుళ్యముచే దొరకకున్నను దాత్కాలిక ఫలమైన శ్రీరామపాదుకలసేవ లభించి తుదకుఁ బ్రధానఫలమగు శ్రీరామసేవయు లభించెను. దండకారణ్యమున మునుల శరణాగతికి ఫలము శ్రీరాముని స్తోత్రమే.

స్తుతించుటయుఁ గైంకర్యమే. ఆనుషంగికము విరోధినాశము.

ఉ॥ భాసురసంభవత్కుముదబాంధవతేజుని రామచంద్రునిన్
శ్రీసహితున్ సుమిత్రసుతు స్ఫీతయశస్విని జానకీసతిన్
మానసరక్తి పూర్ణబహుమాన పురస్సరయుక్తి మంగళా
శాసన సంప్రయుక్తిని బ్రశస్తమతుల్ భజియించి రాస్థమై. ఆర. ౮.

అని యాసందర్భమునఁ జెప్పఁబడినది.

సుగ్రీవ విభీషణుల శరణాగతికిఁ బ్రధానఫలము రామసేవయే. రాజ్యలాభాదు లానుషంగికములు. చం॥ హరిచయనాథుఁ డీకరణి నావహకీర్తిగడించి యామినీచరపతి గాసిపెట్టి సువిశాల నభోంగణమున్ మహాజవో గ్రగతి దాఁటివచ్చి నవతోయజనేత్రుని రాముప్రక్కఁగాహరివరసంఘమధ్యమున నల్లన నిల్చె శ్రమంబుదీఱఁగన్. యుద్ధ. ౮౧౯.

సుగ్రీవుఁడు రావణుమీఁదికి బోవుటకుఁ గారణము. పరులచేఁ దాను జేయించు సేవతోఁ దృప్తిలేక తాను ప్రత్యేకముగ యథాశక్తి భక్తి ప్రకటించుటకే. అటుగాకున్న హనుమదంగదాదులఁ బంపియుండిన నందున్న రాక్షసుల నందఱను రావణునితోడ గొంతులకుఁ దోఁకలుచుట్టి యీడ్చుకొని వచ్చియుందురు. రావణుని రణమున కీడ్చి చావఁగొట్టి బుద్ధివచ్చునట్లు చేయవలయు నని హనుమంతుఁడు తలఁచెను. గాని యది నెఱవేఱినదిగాదు. ఆలోపమును బూర్తిసేయ సుగ్రీవుఁడు మొదలుపెట్టెను.

విభీషణుఁడు "సకలభూత శరణ్యుని నిన్నుఁ జేరితిఁ నిను శరణంబుఁ జొచ్చితిని నెయ్యుర లంక సిరిం ద్యజించితిఁ - మనుజవరా భవద్గతము మత్సుఖ జీవితరాజ్యభోగముల్" యుద్ధ ౩౯-౪ - అని చెప్పెను. దీనివలన విభీషణుఁడు కోరినది రామసేవ యనియుఁ దక్కిన వానషంగికము లనియు నేర్పడు చున్నది.

ప్రాణార్థియై కాకాసురుఁడు శరణుజొచ్చినపుడు రామచంద్రమూర్తి వానిని రక్షించెను. కాని వానిదుర్మార్గమునకు శిక్షగా నొక కంటిని దీసికొనెను. మరల దుర్మార్గప్రవర్తకుఁడు గాకుండుటకై యిట్లుచేసినది యనుగ్రహరూపకమే కదా? పరశురామునిపై నస్త్రమును బ్రయోగింపఁబూని యతఁడనుకూలుఁడగుటచే నతనిపైఁ బ్రయోగింపక యతని యిష్టమునకు విరోధి యగు నతని సుకృతముపైఁ బ్రయోగించెను మోక్ష మతని యిష్టము, స్వర్గాది ప్రాప్తిహేతువు పుణ్యము. మోక్షవిరోధి. మఱియు సముద్రమునకై యెత్తిన యస్త్రమును వాని యనతాపమును జూచి కరుణించి వానిపైఁ బ్రయోగింపక వాని విరోధులపైఁ బ్రయోగించెను. 'తస్య పుత్రాదాయ ముపయంతి సుహృదస్సాధుకృత్యాం, ద్విషంతః పాపకృత్యా' మ్మను శాస్త్రోక్తి ననుసరించి యిట్లు రామచంద్రమూర్తి చేసెను. ఇట్లే కాకాసురుని శిక్షయు నని యెఱుంగునది. అకించనుఁడయి వేఱుగతిలేనివాఁడు సమర్థుఁడయి దయాళు వగు వాని శరణుచొచ్చిన యెడ సఫలమగును. రామచంద్రమూర్తి సముద్రుని శరణుచొచ్చుట వ్యర్థమగుటకు హేతు విరువురు నధికారులు కాకుండుటయే. సముద్రుని శరణుచొరుమని విభీషణుఁడు చెప్పుటకుఁ గారణము తన శరణాగతి ఫలించినట్లే శరణాగతు లన్నివేళల సఫలమగునని తలఁచుటచేతనే దేశము, కాలము, అధికారి, ఫలము లిట్టులే యుండవలయును, నట్లుండరా దను నిర్బంధము లేకున్నను, ఇట్టివానినే (అధికారినే) శరణు పొందవలయునని మాత్రము నిర్బంధ మున్నట్టు లేర్పడుచున్నది. విభీషణునకుఁ దెలియకున్న నాశాస్త్రప్రవర్తకుఁడైన రామచంద్రమూర్తికిఁ దెలియదా, యేల శరణాగతి చేసె? ననిన విభీషణుని మూలమ్మున లోకమునకు బోధించుటకే. ప్రపత్తియని చెప్పఁబడు శరణాగతియందుఁ బ్రధానముగాన శ్రీరామాయణమును దీర్ఘశరణాగతియని యీ భాణకుఁడు

చెప్పెను. సమస్తాంగములును ఆశరణాగతి కనుకూలముగనే యిందుఁ జెప్పఁబడి నవి. సమర్థుఁడై కరుణాళువై సుశీలుఁ డగువానియెడ జేసిన శరణాగతి సఫల మగును. రుద్రధనుర్భంగము పరశురాము జయించుట సప్తసాలభేదనము సేతు బంధము మున్నగునవి రామచంద్రమూర్తిసామర్థ్యమును సర్వజ్ఞత్వమును బ్రక టించును. సీతావియోగకాలమందలి చర్యలన్నియు నీయన పరమకారుణికుఁ డని చెప్పును. గుహ శబరీ సుగ్రీవాదుల వృత్తాంతము లీయన సౌశీల్యమును వెల్లడి చేయును. విశ్వామిత్రుని యజ్ఞసంరక్షణము దండకారణ్య ఋషుల రక్షణము రావణుఁడు బాధించిన సకలదేవతల సంరక్షించుటయు, తన సౌందర్యాదులఁ జూచి పరమ ప్రీతులయిన స్వదేశజనులకు మోక్షమిచ్చుటయు, నీయన సర్వరక్ష కత్వమును జూపును. కావున నిట్టి సకల సద్గుణంబులు గల భగవంతుని యెడఁ జేసిన ప్రపత్తిచే సకలఫలములును గలిగినను దానియందుఁ బ్రధానఫలము భగవత్ప్రాప్తియే ఇతరఫలము లానుషంగికము లనుట యీ గ్రంథమున స్ప ష్టము. భగవత్ప్రాప్తిఁగోరి శరణువేఁడినవానికి నితరకామ్యార్థము లానుషంగిక ములై వచ్చును గాని యితరకామ్యములఁగోరినవానికి నవి మాత్రము ఫలించును గాని భగవత్ప్రాప్తిలేదు. కోరినదాని కెక్కువరాదు

౮ పురుషకారము

ఇట్టి శరణాగతికిఁ బురుషకార మావశ్యకము రక్ష్యుని శరణాగతుని దోష ములను గూడ గుణములుగఁ జెప్పి రక్షకుఁడు రక్షించునట్లు చేయుట పురుష కారము. రక్ష్యరక్షకులకు ఘటనసేయుట పురుషకారము. ఈ పురుషకారా వశ్యకత యీ గ్రంథములో నొక్క ప్రధానవిషయము. ఈ పురుషకారమునకు వలసిన ముఖ్యగుణములు శరణాగతుని యెడ దయ శరణ్యునకు (రక్షకునకు) పరతంత్రుఁడుగను అనన్యార్హుఁడుగను నుండుట.

శరణ్యున కనన్యార్హుఁ డనఁగా రక్షకునకుఁ దప్ప మఱియొకనికిఁ బరతంత్రుఁడు గను దాసుఁడు (లోఁబడియుండువాఁడు) గను, గాకుండువాఁడు ఆత్మస్వాతంత్ర్య మును గూడదు. శేషుఁడు అనఁగా రక్షకునకే తన చేనైన సేవచేయువాఁడు? సీత రామున కనన్యార్హగను పరతంత్రగను నుండుటఁ బట్టియు శ్రీరాముల యందు లక్ష్మణాదుల విషయమున సీతకుఁ బురుషకారము గలదు. అట్టిది సీతా చరిత్రయందుఁ బ్రధానము గాన నీగ్రంథమునఁ బురుషకార మొక్కటి ప్రధాన మనుటయ్యె. ఈ పురుషకారము చేయఁగలవారు సమీపమున లేనపుడు అపరాధి మన్నింపఁబడఁడు. ఉండెనేని మన్నింపఁబడును. పురుష కారము సీత రామునిసన్నిధానమున నుండుటచేతనే యపరాధి కాకము మన్నింపఁబడెను. ఆమె సన్నిధానమున లేకుండుటచే రావణుఁడు వాలి సంహ

గింపఁబడిరి. విభీషణశరణాగతి సమయమునఁ బురుషకారము చేసినవారు హనుమ దాది వానరులు. వారలను ముందుంచుకొనియే విభీషణుఁడు రాముని శరణు వేఁడెను. "రామచంద్రునిఁ శరణము చొచ్చినాఁడ, రఘుసత్తముతోడ జగచ్ఛరణ్యుతోఁ బరమమహాత్ముతోఁ బ్లవగవర్యులు నాస్థితి వేగఁ దెల్పరే" యుద్ధ. ౩౨౮. అని విభీషణువాక్యము. ఆపురుషకారపూర్వకముగనే రామచంద్రమూర్తి విభీషణుని గ్రహించెను

'హా మ్మికఁ లెమ్ము కంజహితపుత్రక! వాఁడు విభీషణుండయేఁ, సమ్మతి రావణుండయయినఁ విను మే నభయం బొసంగితిఁ' యుద్ధ. ౩౮౮. 'హర్షయుక్తి సుగ్రీవుని వాక్యముల్ విని సుకీర్తి గ్రహించె దశాస్యభ్రాత.' యుద్ధ ౩౯౧. సుగ్రీవుఁడును హనుమమూలముననే రాముని శరణుఁదొచ్చెను. ఈ విషయము విపులంబుగఁ గిష్కింధాకాండయందు నాఘట్టంబునఁ జర్చింపఁబడినది. అల్పవిషయంబులందును నీపురుషకారమును లోక మంగీకరించియే యున్నది.

౫ అధికారి స్వరూపము.

ఇట్లు శరణాగతి ననుష్ఠించు నధికారికి శేషత్వము పారతంత్ర్యము స్వరూపము. ఇట్టి స్వరూపములలోని శేషత్వము లక్ష్మణుని కార్యములయందు స్పష్టము. "ఈ ప్రాజ్ఞానజాతుండఁ దద్వరధీ సద్గుణరాజికిఁ వశుఁడనై దాస్యంబుఁ గావించెదఁ"కిష్కింధా. ౧౩౫ ప. 'క॥ అనుచరునిఁగాఁగ నన్నే। ల్లొనుమీా వైధర్మ్యమిందుఁ గొఱలదు నేరఁ। మనఁ గలుగుఁ గృతార్థుఁడనై। తిన నీకుఁ బ్రయోజనంబు దెలిసెడి దీనన్.' అయో. ౮౮౫ అని లక్ష్మణుఁడు చెప్పి, చెప్పినట్టు లాచరించెను. మనకంటె భగవంతుఁడు గొప్పవాఁ డను జ్ఞానము శేషత్వము.

౬ భగవత్పారతంత్ర్యము.

భరతు కార్యములచేఁ బారతంత్ర్యము స్పష్టము. 'ఆగురువర్యుని గర్హలాడె ఛీ! యని గురువంచు నిందుసభయంచును గొంకక యారటంబునఁ.' అయోధ్య. ౧౯౫౭ ప-మొదలు యుద్ధకాండము ౨౯౮౩ పద్యమువఱకుఁ గల భరతుచర్య పారతంత్ర్యమును స్థాపించుచున్నది. రాజ్యంచాహంచరామస్య = రాజ్యము నేను రామునివారమే అని కదా చెప్పెను.

౭ భాగవతపారతంత్ర్యము.

'అనరక్తు ననఘుశత్రు! ఘ్ను నిత్యశత్రుఘ్నుఁ గైక కొమరుం డనఁజు! దన వెంటఁ దీసికొనచుం! జనియెను దన మేనమామ సదనంబునకుఁ.' అయో.౨.

ఇట్టి సందర్భములయందు శత్రుఘ్నుని కార్యములచేత భాగవత పారతంత్ర్యము స్పష్టము. కాఁబట్టి యధికారికి భాగవత పారతంత్ర్యముకూడ నపేక్షితము.

౮ అర్థపంచకజ్ఞానము.

శరణాగతున కర్థపంచకజ్ఞాన మావశ్యకము. I బ్రహ్మస్వరూపము. II జీవస్వరూపము. III బ్రహ్మప్రాప్తి కుపాయమైన శరణాగతి స్వరూపము. IV ఫలస్వరూపము V ఫలప్రాప్తికి విరోధులగువాని స్వరూపము. ఈ యైదింటికి నర్థపంచక మనిపేరు. రామునిచరిత్రయందు బ్రహ్మస్వరూపమును, లక్ష్మణచరిత్రయందు జీవస్వరూపమును, శరణాగతివర్ణనమందు నుపాయస్వరూపమును, విభీషణాదుల కథలయందు ఫలస్వరూపమును, రావణాది చరిత్రలయందు విరోధిస్వరూపమును జెప్పఁబడెను.

౯ అకించనత్వము.

శరణాగతుఁడు అకించనుఁడు అనన్యగతికుఁడు నై యుండవలయును. అకించనుఁడు = కొంచెమైనఁ దనగ యనునది లేనివాఁడు శరణాగతి తప్ప వేఱుపాయము లేనివాఁడు. అనన్యగతికుఁడు = భగవంతుఁడు తప్ప వేఱు గతిలేనివాఁడు. బ్రహ్మరుద్రాదులు వరము లిచ్చినను రావణునికిఁ జావు తప్పకుండుటచేత వారు రక్షకులు గారనియు, దశరథచరిత్రవలనఁ దండ్రియుఁ, గైకేయీవృత్తాంతముచేతఁ దల్లియు, విభీషణుఁడు - ఇంద్రజిత్తు మొదలగువారి చరిత్రములవలనఁ దోడఁబుట్టువులు కుమారులు రక్షకులు గారనియు, భగవంతుఁడొక్కఁడే రక్షకుఁడనియుఁ, దక్కినవారు రక్షించుట భగవంతుని యాజ్ఞమీఁదనే యనియు నీ గ్రంథమువలన స్పష్టమగును.

౧౦ ఆచార్యవరణము.

జీవుఁడు భగవంతునిస్వరూపము నాచార్యులమూలముగనే యెఱుఁగవలయునుగాని స్వయముగఁ గాదనుట హనుమంతునిచరిత్రయందు స్పష్టము ఈ విషయము సుందరకాండ మందు విశదపఱుపఁబడును.

౧౧ ఔత్కంఠ్యత.

శరణాగతుఁడగు చేతనుఁడు ఎప్పుడీశరీరము దొలఁగి ముక్తి లభించునా యని యెదురు చూచుచుండవలయు నని లంకలోని సీతావృత్తాంతమువలన నేర్పడుచున్నది. 'కృతకృత్యాః ప్రతీక్షంతే మృత్యుం ప్రియమివాతిథి' మ్మని ప్రమాణవాక్యము. ఈనిరీక్షణము దేహమునందలి హేయబుద్ధిచేఁగాదు. భగవత్ప్రాప్తి యందలి యుత్కంఠతచేతనే శరణాగతుఁడు 'నాభినిందేతమరణం। నాభినందేత జీవితమ్' అని మరణము దూషింపరాదు, బ్రదుకుపాటు కోరరాదు. నెలజీతము దీసికొనువాఁడు జీతమునందలి యాశచేఁగదా నెల యెప్పుడు ముగియునా యని యెదురు చూచుట.

క౦॥ రాముఁడు దశకంధరునం। గ్రామంబున నింద చంపి కలబంధులతో।
సేమముగ నన్నుఁ గైకొన। సామీరీ యతనిక దియె సముచితకృతియా॥
సుం. ౯౧౨

మఱియు సుందర ౮౦౩ - ౮౮౪ పద్యములు.

లంక శరీరము, రావణకుంభకర్ణు లహంకార మమకారములు, ఇంద్రజిత్తు మొదలగువారు కామక్రోధాదులు, విభీషణుఁడు వివేకము, లంకలోఁ జెఱయం దున్న సీత శరీరములోనున్న బద్ధజీవుఁడు, హనుమంతుఁ డాచార్యుఁడు, ఆయన మూలమున సీతకు శ్రీరామచంద్రమూర్తి తన్నుఁగూర్చి విచారపడుచున్నాఁ డని రక్షాప్రయత్నమున నున్నాఁడని తెలిసినది శ్రీరాముల లక్షణములను హనుమంతుఁడే చెప్పెను. సీత కంతవఱకు శ్రీరాముల లక్షణములు తెలియవా యన రాదు. పుస్తకములమూలమున భగవల్లక్షణము తెలిసియుండినను వానిని గురుముఖమున వినవలయును. వాల్మీకికి రామవృత్తాంతము తెలియకయా నారదుచే నుపదేశముఁ గొనెను? రామచంద్రమూర్తియే హనుమంతునిఁ బంపుటచే భక్తి విశ్వాసము లుండెనేని భగవంతుఁడే యాచార్యుని జీవునొద్దకుఁ బంపు ననియు జీవి గురువును వెదకికొనచుఁ బోవలసినపని లేదనియు నేర్పడెను. భగవంతుఁడు లంకాదేహమును అహంకార మమకారములతో ధ్వంసముచేసి యందలి సీతయను జీవుని తన సన్నిధానమునఁ జేర్చుకొను నని తెలియునది. దీని విస్తరము సుందరకాండమున స్పష్టమగును. జీవుఁడు భగవత్ప్రాప్తి రూప ఫలంబునకై యెదురు చూచుచుండ భగవంతుఁడు ఫలము దానుగనే యిచ్చు ననుట యిందు స్ఫుటమగు.

౧౨ నడవడి.

శరణాగతుఁడు రామాదులవలె మంచి నడతగలవాఁడై యుండవలయును గాని రావణాదులవలె వర్తింపరాదనియు వాని కృత్యాకృత్యము లిందుఁ జెప్పఁ బడినవి.

౧౩ వాసస్థానము.

ఇతనికి వాసయోగ్యదేశము భగవంతుని సన్నిధానమే యనుట కోసలదేశ జనులచే నెఱుంగ నగు. ఆకారణముననే వారి కప్రయత్నముగ మోక్షము లభించెను.

౧౪ ఈ రామాయణము ద్వయార్థ వివరణరూపము.

"శ్రీమన్నారాయణ చరణౌ శరణంప్రపద్యే." "శ్రీమతే నారాయణాయ నమ" యను నది నారాయణమంత్రద్వయము. బాలకాండమున సీతావివాహ మును జెప్పుటచే శ్రీమత్పదార్థమును, అయోధ్యాకాండమున శ్రీరాముల

గుణముల వర్ణించుటచే నారాయణపదార్థమును, అరణ్యకాండమున 'భాసుర సంభవక్షముద బాంధవ తేజని'సని శ్రీరాముల దివ్యమంగళవిగ్రహమును వర్ణించుటచే చరణ శబ్దార్థమును, కిష్కింధాసుందరకాండములందు శరణశబ్దార్థమును, యుద్ధకాండమున ప్రపద్యేపదార్థమును, ఉత్తరకాండమున ముక్తిప్రస్తావనచే నుత్తరఖండార్థమును జెప్పఁబడినవి. ద్వయానుసంధానము శరణాగతునికి నిత్యంతావశ్యకము." "ద్వయ మనసంధానేన సదైవం వక్తా"యని భాష్యకారుల వాక్యము. కావున ద్వయార్థవివరణమైన యీ రామాయణముచేతనే శరణాగతుఁడు సదా కాలక్షేపము చేయుచుండవలెను.

౧౫ గాయత్రి.

శరణాగతునికి సదా జప్యము రామాయణమే యగుటకు నిందు గాయత్రి మంత్రార్థమును గలదు. వేదములయందు జగత్కారణ మని ప్రసిద్ధిఁగన్న భగవంతుని స్వరూపము బాలకాండమునఁ జెప్పియుండుటచేతఁ దత్సవితృశబ్దార్థమును, అయోధ్యా కిష్కింధాకాండములలో భగవంతుని గుణముల వర్ణించుటచేత వరేణ్యశబ్దార్థమును, అరణ్యకాండమున రాముని తేజోమయ మంగళాకారము వర్ణించుటచే భర్గశబ్దార్థమును, సుందరకాండమున దివ్యమంగళవిగ్రహలక్షణములు వర్ణించుటచే దేవశబ్దార్థమును, యుద్ధకాండమున శరణాగతి చెప్పుటచే ధీమహి శబ్దార్థమును, ఉత్తరకాండమున మోక్షప్రస్తావనచేతఁ దృతీయ పాదార్థమును జెప్పఁబడెను.

౧౬ దుర్వ్యాచార పరిహారము.

జాబాలివచనములను లక్ష్మణుని వాక్యములను రామచంద్రమూర్తి త్రోసివేయుటచేత శరణాగతుఁడు చార్వాకబౌద్ధాదిమతములయందుఁ గొంచెమైన సంబంధము కలిగియుండరా దనుట స్పష్టము.

౧౭ సంసారజిహాస.

శ్రీరామచంద్రమూర్తికి రాజ్యము పోవుటయు సీతాపహరణము నాగపాశబంధనము హనుమంతుఁడు బ్రహ్మాస్త్రమునఁ గట్టుపడుట వీనివలన సంసారమున నెంతటివానికి దుఃఖము తప్పదు కావున దానియందుఁ బ్రీతియుంపరాదని రామాయణము తెలుపుచున్నది.

౧౮ చతుష్షష్టికళలు.

ఈ గ్రంథమున నఱువదినాలుగు విద్యలు సంగ్రహముగఁ జెప్పఁబడినవి. ఇందు వేదవేదాంతార్థములు గలవని ముందే చెప్పితిమి. రాముఁడు హనుమంతుని మాటల శ్లాఘించునపుడు "అనఘ యీతని త్రిస్థలవ్యంజనస్థమైన"

యను కిష్కింధ. ౧-౨౭ వ పద్యమున శిక్షార్థము స్పష్టము. అశ్వమేధాది యజ్ఞ ప్రకరణములందు కల్పసూత్రార్థము స్పష్టము 'వ్యాకృతియంతయు వల్లించె నిజముగ నెన్నిమాఱులో' యనుటచే వ్యాకరణార్థము స్పష్టము. ఇట్టులే సాముద్రికము జ్యోతిషము వైద్యము శిల్పము లోనగు కళల యర్థము లందందు నెఱుఁగఁదగు.

బాలకాండమందు శ్రీవిష్ణువు భూమిపై నవతరింపవలసిన కారణము, అయోధ్యాకాండమందు స్థితికారణము, అరణ్యాకాండమందు మోక్షమిచ్చు నధికారము గలిగియుండుట, కిష్కింధాకాండమందు గుణసంపత్తి, సుందరకాండ మందు సర్వసంహారకశక్తి, యుద్ధకాండమందు వేదాంతవేద్యత్వము, ఉత్తర కాండమందు సృష్టికి హేతువగుటయుఁ జెప్పఁబడెను.

ఇది గోవిందరాజీయాను సారము.

౧ సర్గము. శ్రీ రామాయణకథా ప్రారంభము

తే॥ పూర్వమీభూమివలయంబు • పూర్ణముగను, నన్యదుస్సాధమగు భుజ • యాఢ్యులైన
మనువు మొదలగు నేన్నృప • మణులచేత, నింపు దళుకొత్తఁ జక్కఁ బా • లింపఁబడియె.

'ఆచార్యవాన్ పురుషో వేద, ఆచార్యాద్ధైవవిద్యా విదితా సాధిష్ఠంప్రాప' త్తని శ్రుతిచెప్పినట్లు'ఆచార్యుని యొద్దనుండియే విద్యనభ్యసింపవలయును. అట్టివిద్యయే యభివృద్ధిచెందును. మేలిచ్చును.' అనువిషయము విశదపఱుచుచుఁ దాను నార దునివలన విన్న రామచరిత్రమును సంక్షేపముగ 'సంక్షేపరామాయణ'మను పేర మొదట నీకవి రచియించెను. ఆమీఁద నింతదాఁక నారదానుగ్రహము వలనఁ దాను జేసిన కార్యములును బ్రహ్మవరంబున యోగదృష్టిచే రామచరిత్ర మంత యునుఁ జూచుటయు ఆవిషయమైన ప్రబంధమును రచించుటయుఁ దెలిపెను. ఇఁక నిది మొదలు గ్రంథారంభము. గ్రంథము నిర్విఘ్నముగ ముగియుటకును దేశమున వర్ధిల్లుటకు మంగళపద్యము రచించుచున్నాఁడు. ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖ మ్మన్నట్లు మూఁడు విధములగు మంగళములలో వస్తు నిర్దేశ మను మంగళ మిట నాలుగుపద్యములఁ జేయుచున్నాఁడు. ఈగ్రంథమున విషయ మిదియనియు, విషయమునకు గ్రంథమునకు సంబంధ మిదియనియు,అట్టి గ్రంథమును జదువ నిట్టివాఁడు యోగ్యుఁడనియు, దానిచే వానికిట్టి ప్రయోజన ముకలదనియుఁ, జదువకున్నఁ బ్రత్యవాయము కలదనియుఁ దెలుపకున్న నెవ్వఁ డీగ్రంథమును జదువఁడు, బాగుపడఁడు గాన నవి యీనాలుగు పద్యములందు సూచింపఁబడినవి. మఱియు నీకవి తాను జేయఁబోవు కార్య మిద్దియని తెలుపుచు దానిని సత్పురుషులు పరిగ్రహింతురుగాకయని ప్రార్థించుచున్నాఁడు.

పూర్వము = సృష్ట్యాదియందు, వలయము = మండలము; పూర్ణముగను= సప్తద్వీపములలోఁ గొంతయైనఁ దక్కువలేక, అనన్యదుస్సాధము = ఇతర రాజులు హరించుటకు సాధ్యముకానట్లు, జయాఢ్యులు = గెలుపుచేత సంపన్నులు, నృపమణులు = రాజశ్రేష్ఠులు, ఇంపు=ఆనందము, తళుకు + ఒత్తెన్= మెఱుఁగెక్కినట్టులు పూర్వమని చెప్పటచే మొదటిరాజు మనుప్రజాపతి యని యెఱుంగునది. ఆయనకొడుకు ఇక్ష్వాకుఁడు. బాల. ప-౧-౨౮౫.

"Manu as a legislator is identified with the Cretan Minos, as progenitor of mankind with the German Manonus"

తాత్పర్యము.

ఆదియందు నీ భూమండలమంతయు నితరులకు సాధ్యపడక జయశీలురైన యేమనువు మొదలగు రాజవర్యులచేత లోకమునకు సంతోషకరముగఁ బాలింపఁబడియెనో.

క॥ ఘనులగునఱువదివేవురు, తనయులచే సాగరంబుఁ ద్రవ్వించె నెవం
డనుగతు లందఱు నెవనికి, ననఘుం డాసగరుఁ డెందునధికుం డయ్యెన్. ౨३౮

అట్టి జయాఢ్యులైన రాజులలో నొకని చరిత్ర యుదాహరణముగఁ జెప్పుచున్నాఁడు. ఘనులు = బలపరాక్రమాదులచే గొప్పవారు, అఱువదివేవురు = అఱువదివేలమంది. తనయులచే = పుత్రులచే, ఇది యణిజంతకర్త. క్రియ యణిజంతమైనపుడు తృతీయాంతమైనది. (ణిజంతము = ప్రేరణార్థకము.) సాగరంబును = సగరుఁ డను తన పేరుసంబంధముకల సముద్రమును, అనుగతులు = దండు వెడలునపుడు వెంటవచ్చువారు, అనఘుఁడు = పాపరహితుఁడు, ఆసగరుఁడు = సముద్రము త్రవ్వించుట మున్నగుకార్యములచేత లోకప్రసిద్ధుఁడగు సగరుఁడు, ఆ = ప్రసిద్ధిని దెలుపును. సముద్రమును ద్రవ్వించుటకును లోకపావనియగు గంగను భూలోకమునకుఁ దెచ్చుటకును నీయనయే మూలకారణమగుట నితరరాజులను విడిచి యీయననే కవి యిచ్చటఁ బ్రశంసించెను. ఎందున్= (1) ఏవంశమందు, (2) ఏవంశమందు జన్మించుటచేత. ఈవంశమునఁ బుట్టుటచే నాయన కట్టిశక్తి గలిగిన దనిభావము.

తాత్పర్యము.

అట్టిరాజులలో నెవఁ డఱువదివేల కొడుకులతో సముద్రమును ద్రవ్వించెనో యెవని నిందఱు ననుసరించి చరించుచుండిరో యట్టి సగరుఁ డను పేరుగల పుణ్యాత్ముఁడు రాజులలోనెల్లఁ జక్రవర్తియగుటచే శ్రేష్ఠుఁడు గదా.

తే॥ అట్టియిక్ష్వాకువంశంబు • నందుఁ బుట్టె, నట్టినరపాలురం దిల • నవతరించి
నట్టి రఘురాముచరిత రా • మాయణంబు, పూజనీయంబు ప్రథితంబు • భువనములను.
౨౩౯

నరపాలురందుఁ = రాజులవంశమున, ఇలఁ = భూమియందు, అవతరించిన = పుట్టిన, ఇది రామచంద్రమూర్తితోను చరితముతోను నన్వయించును. ఎట్లు భగవంతుఁడు రామచంద్రమూర్తియై భూమిమీఁద నవతరించెనో యట్టులే యాయనచరిత్ర రామాయణము బ్రహ్మానుగ్రహమున నవతరించె నని భావము. పూజనీయము = నమస్కారాదులచే గౌరవింపఁదగినది. భువనములను = పదునాలుగు లోకములందు ఆస్తికనాస్తికులు శైవవైష్ణవులు బౌద్ధజైనులు, ద్వైతాద్వైత విశిష్టాద్వైతులు వీరియందున, ప్రథితము = కీర్తికెక్కినది. అవతరించి యను పదమును రామాయణముతో నన్వయించి రామచంద్రునివలె రామాయణము ఇక్ష్వాకువంశమునఁ బుట్టినదగుటచే రామ రామాయణముల కైక్యము "రామేతిద్వ్యక్షరం నామ" యిత్యాదులందు రామునికిని తత్ప్రతిపాద్యమునకును నైక్యము ప్రస్ఫుటముగదా యని శిరోమణికారుఁడు వ్యాఖ్యానించెను. వాచ్యుఁడైన రామునకు వాచకమైన రామాయణమునకు నభేదము స్వతస్సిద్ధము. కావున రామాయణము పఠించువాఁడు సాక్షాద్రామసేవ చేసినవాఁడే యగును. ద్విజులకందఱకు వేదాధ్యయనము విధియై యున్నది. ఈ కాలములో వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుఁడు వేయింటికొకఁ డున్నాఁడో లేఁడో. అట్టివాఁడు రామాయణ పఠనముచే వేదపఠనము చేసినవాఁడే యగును. 'వేదః ప్రాచేతసా దాసీత్ । సాక్షాద్రామాయణాత్మనా' యను ప్రమాణము కలదుకదా. కావున జాతిబ్రాహ్మణ్యమును గోలుపోవ నిష్టములేనివా రందఱు శ్రీమద్రామాయణమును బ్రతిదినము బఠింపవలసినది విధి. తక్కిన వారికిని విశేష లాభముగలదు. 'పూర్వ మీభూమి వలయంబు' అను పద్యమున గ్రంథనాయకునికి మహాభాగ్యము, తరువాత రెండు పద్యములందు మహాకులీనతయుఁ జెప్పఁబడెను. అట్టి యిక్ష్వాకువంశ మని ప్రసిద్ధిగాఁ జెప్పుటకు వేఱు కారణమును గలదు. భగవద్గీత ౪ వ యధ్యాయమందు 'ఇమం వివస్వతే యోగం, ప్రోక్తవా నహమవ్యయమ్ । వివస్వా న్మనవేప్రాహ, మను రిక్ష్వాకవేబ్రవీత్ । ఏవం పరంపరాప్రాప్త, మిమం రాజర్షయో విదుః । సకాలే నేహ మహతా, యోగోనష్టః పరంతప॥' "ఈ నిష్కామకర్మయోగమును నేను దొలుత సూర్యునకుఁ జెప్పితిని. ఆయన మనువునకుఁ జెప్పెను. మను విక్ష్వాకునకుఁ జెప్పెను. ఇట్లు పరంపరగా వచ్చిన దీని రాజర్షు లెఱుఁగుదురు. దీర్ఘకాలమగుటచే నిది నష్టమైనది." అని శ్రీకృష్ణభగవానుఁడు చెప్పెను. మఱియు నీ కర్మయోగలక్షణము

గుఱించి 'తస్మా దసక్త స్సతతం, కార్యం కర్మ సమాచర। అసక్తో హ్యాచరన్ కర్మ, పరమాప్నోతి పూరుషః। సన్న్యాసః కర్మయోగశ్చ, నిశ్శ్రేయసకరావుభౌ। తయోస్తుకర్మ సన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే॥' అర్జునా! నీవు ఫలమందాసక్తిలేక కర్మము చేయుము, అట్లాసక్తిలేక కర్మముచేయువాఁడు ముక్తుఁడగును. సన్న్యాసము కర్మయోగము రెండును మోక్షకారణములే. అయినను కర్మసన్న్యాసమున కంటె కర్మయోగమే శ్రేష్ఠము. ఇట్టి యోగానుష్ఠానముచేఁ బవిత్రమైన వంశము ఇక్ష్వాకువంశము. 'వార్ధకే మునివృత్తీనాం యోగీనాం తే తనుత్యజా' మ్మని కదా కాళిదాసు సూక్తి.

ఛందస్సు.

రామాయణ శబ్ద ముభయయతి కనుకూల పదము. కావున నీపద్యమునఁ దృతీయపాదమున నుభయయతి. రామ + అయనము = రామాయణము = రామునిఁ బ్రతిపాదించునది, పొందించునది. రామమయతీతి జ్ఞాపయతీతి రామాయణం. గత్యర్థకము లన్నియు జ్ఞానార్థకములు కావున రాముని జ్ఞాపకపఱుచునది రామాయణము.

తాత్పర్యము.

ఆ విధముగఁ బ్రసిద్ధికెక్కిన మనువుకుమారుఁడైన యిక్ష్వాకు మహారాజు వంశంబునఁ బుట్టిన సగరాది రాజులలో భూమిమీఁద నవతరించిన రఘురామ చరిత్రము రామాయణము - భూలోకవాసు లందఱుఁ బూజింపఁదగినది. సుప్రసిద్ధమైనది. ఈ వంశంబునఁ బుట్టి భగీరథుఁడు బ్రహ్మను బ్రార్థించి బ్రహ్మలోకమం దున్న గంగను భూలోకమును బావనముచేయుటకు భూలోకమునకు దిగునట్లు చేసెను. అట్లులే బ్రహ్మానుగ్రహముచే వాల్మీకి బ్రహ్మలోకమం దున్న రామాయణమును భూజనులను బవిత్రులను జేయుటకై యీ లోకమున నవతరింపఁజేసెను. ఆగంగ స్వర్గసుఖమునుమాత్రము గలిగించును. ఈ రామాయణగంగ యిహలోకసుఖమును స్వర్గసుఖమును మోక్షమునుగూడ నొసంగును కావున దానికంటె నిది యెక్కువ పూజనీయము ఆగంగ విష్ణువామపాదాంగుష్ఠ నఖమునుండి వెలువడినది. ఈగంగ విష్ణుపూర్ణావతారమైన శ్రీరాములవలన వెలువడినది. కావునఁ గాలిగోటికిఁ బూర్ణవిగ్రహమునకు నెంత తారతమ్య ముండవలెనో యంతయు నున్నది. ఆగంగ యొకమార్గము ననుసరించిపోయి తనయొద్దకు వచ్చినవారినే పవిత్రులఁ జేయును. ఇది భగవంతుని వలెనే సర్వతోముఖమై ప్రపంచమం దంతయు వ్యాపించి నగర నగరమునకు గ్రామ గ్రామమునకు బల్లె బల్లెకు నింటింటికిఁ బోయి తన్ను సేవించినవారినిఁ బవిత్రులఁ జేయును.

సీ॥ వాల్మీకి యొకఋషి ♦ పల్కినయది యిది, బ్రహ్మముఖోద్గతం♦బా? యటంచు
నన కనసూయులై ♦ యాలింపవలె మీర, లటుగామిఁ బ్రత్యవా♦యంబుగలదు
బ్రహ్మపల్కిన దిది ♦ బహుపాపవిచ్ఛేది, క్షితిని బ్రవర్తింపఁ♦జేయు మాత్ర
మధికార మందితి ♦ నార్యులారా! ధర్మ, కామార్థములుఁ గూర్చుఁ♦గాన దీని
తే॥ విస్తరింపఁగఁ జేసెద♦విశదఫణితి, మొదటి నుండియుఁ దుదదాఁక♦మోదమునను
నన్యవిషయాళిపైఁ జింత♦నవలఁద్రోచి, భక్తితోడుత వినుఁడు శు♦భంబులొదవు. ౨౪౦

రామాయణము పూజనీయ మనుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు. ఒకఋషి = అప్రసిద్ధుఁడగు నెవరోయొక యల్పఋషి. ఒక శబ్దం బొక్క చో నల్పార్థకంబగు. త్రి.శబ్ద ౮ర సూ. నారద వసిష్ఠాదులవలె మిక్కిలి ప్రసిద్ధుఁడుగాఁడని భావము- ఇది = ఈరామాయణము, బ్రహ్మముఖోద్గతంబా=బ్రహ్మముఖమునుండి వచ్చిన వేదమా! అనసూయులై = అసూయలేనివారై, గుణములను దోషములుగాఁ జెప్పుగుణము అసూయ. శ్రద్ధగలవారై. ఆలింపవలెన్ = అవశ్యము వినవలయును. వలెను=ఇది విధివాచకము. అటుగామిన్ = అటువినకపోయిన పక్షమున, ప్రత్యవాయము = కర్తవ్యమును జేయనిదోషముగలదు. పాపవిచ్ఛేది = మోక్ష విరోధులనన్నిఁటిని నశిఁపజేయునది. 'సర్వపాపేభ్యో మోక్షయిష్యామి'యని భగవద్గీత. 'సర్వపాపైః ప్రముచ్యతే'యని మోక్షమును గలిగించునది యని భావము. ఇది బ్రహ్మ పల్కినది. బ్రహ్మముఖోద్గతంబా, వేదమా యనుట కిది ప్రత్యుత్తరము. వేద మెట్లు బ్రహ్మముఖమునుండి వెలువడెనో యిదియు నట్లే వెలువడెనుగాన నిది వేదమె యని భావము. బ్రహ్మ పలికినదానిలో నీ ప్రతిష్ఠయేమి యందురా? క్షితిని = భూమియందు- భూలోకమున, ప్రవర్తింపన్ = అందఱకుఁ దెలియునట్లు వ్యాపింపజేయుటకు, అధికారము అందితిని = బ్రహ్మ నారదుల యాజ్ఞానుసారముగా కర్తను నేను గాను. కర్తృత్వాభిమానమును నాకులేదు. మీరు దీనిని దిరస్కరించిన బ్రహ్మను దిరస్కరించినట్లగును గాని నన్నుఁ దిరస్కరించినట్లు కాఁజాలదు అని భావము. ఆర్యులారా! మహాత్ములారా! జాయమానకాలమున నీశ్వరకటాక్షముచే సద్వంశమునఁ బుట్టి సన్మార్గముననుండి భగవద్భక్తిగల యాస్తికులారా! ఇట్టివారికే యీగ్రంథ ముద్దేశింపఁబడినది. వారికే ఫలమిచ్చునది. కాని నాస్తికులకుఁ దత్త్వాయులకు నశ్రద్ధగలవారికి సంశయచిత్తులకు నిది ఫలమియ్యఁజాలదు. వారికి దీనియం దభిరుచియుఁ గలుగదు. ఒకవేళ వారు చదివినను వారికి విపరీతార్థములు సందేహములే తోఁచు గాని వాస్తవార్థము తోఁపదనిభావము. పూర్వజన్మ సంస్కారము పుణ్యవంతమై యుండినఁగాని భగవత్కథలందు రుచికలుగదు. "జాయమానంహి పురుషం. యంపశ్యే న్మధుసూదనః సాత్త్వికస్సతువిజ్ఞేయ స్సవై మోక్షార్థచింతకః"యని

యు 'భక్త్యాశాస్త్రాద్వేత్తి జనార్దన మ్మనియుఁ బ్రమాణములు భూమిపైఁ బుట్టుచున్న యెవనియందు ననఁగా జనన సమయమందే యెవనిపై భగవత్కటాక్షము ప్రసరించునో వాఁడే సత్త్వగుణము ప్రధానముగాఁ గలవాఁడగును. వాఁడే మోక్షప్రయత్నము చేయువాఁడగును. భగవత్కటాక్షము లేనివానియందు మోక్షాపేక్ష గలుగదు. దానికై వాఁడు కృషియుఁ జేయుఁడు. భగవంతుని భక్తిచేతను శాస్త్రముచేతను తెలిసికొనుచున్నానని యర్థము. కూర్చుౕ = కలిగించును, అయ్యైన నీగ్రంథము ముముక్షువులకే కాని బుభుక్షువులగు సంసారులకుఁ బనికిరాదందురేమో. అటు కాదు. ఇది ధర్మార్థకామములును గలిగించును. ఈ గ్రంథము చదువఁగా లభించు పుణ్యముచే వారువారు కోరునది ధర్మమో యర్థమో కామమో వారి వారికిఁ గలుగును. "సంపత్సంతతి రామకథాతః" శ్రుతితో రామాయణము పఠించుటవలన సంపద సంతానము కలుగు నను ప్రమాణము కలదుగదా (2) ధర్మార్థములఁ గూర్చియు నిందు నచ్చటచ్చటఁ జెప్పఁబడియుండుటచే వాని లక్షణములును దెలియును. విశేషణిలీౕ = తేటమాటల చేత, మొదటినుండియు = రాముని జన్మము మొదలు, తుదదాఁకౕ = నిర్యాణమువఱకు, నడుమ నేదియు వదలక విస్తరింపఁగఁ జేసెదను = నాసొంతకల్పన మిందేదియు లేదు గాన మీరసూయపడఁ గారణము లేదనిభావము. అన్యవిషయ = ఇతర సంగతులయొక్క, ఆళిపైౕ = సమూహముపైన, గృహకృత్య లౌకిక వ్యవహారములపై పరధ్యానము మాని యని భావము, వినుండు = ఆయా రసములకుఁ దగిన స్వరాభినయములచేఁ జెప్పెదఫుం వినఁగా మనస్సున నెక్కినట్టు పుస్తకపారమున నెక్కదని భావము.

అట్టి యిక్ష్వాకు వంశంబునందు - అను పద్యమునఁ బ్రతిపాద్యమును ధర్మార్థకామములు, బహుపాప విచ్ఛేది యనుటచే ధర్మార్థ కామమోక్షములను నాల్గు పురుషార్థములును ఫలమును అనసూయులై అసూయలేని శ్రద్ధావంతులే యధికారులనియు నీనాల్గు పద్యంబులందుఁ జెప్పఁబడెను. సంబంధము ప్రతిపాద్య ప్రతిపాదక భావమనుట స్వతస్సిద్ధమే. భక్తిచే వినుఁ డనుటచేఁ దక్కినవన్నియు వదలి చతుర్విధపురుషార్థముల నిచ్చునది కావున దీనినే వినవలయు నని భావము. ఇది వినువారు తక్కిన దేనిని వినకుండినను దోషములేదు. తక్కినవన్నివిని దీని నొక్కదానిని వినకుండినఁ బ్రత్యవాయము గలదు. (వేదము వినుటకు విధి నిషేధములు కలవు ఉపనయనమైనవారే, వేదాధ్యయన శ్రవణముల కర్హులు. ఇది యట్లు కాదు. కొందఱు వేదశ్రవణమున కధికారులు గారని నిషేధము కలదు. దీని కట్టిది లేదు. ఏవయసువారైనను నేజాతి వారైనను స్త్రీలైనను బురుషులైనను అసూయ యొక్కటిమాత్రము లేనివారైరేని దీనిని విన నర్హులు. వారు విన్న నేమి యందురేమో. వారు వినుటచే

కావ్యమునకు కావ్యకర్త భర్తలకు నేలోపము లేదుకాని గుణమునందు దోషము నారోపించుటచే పాపభోజులై చెడుదురు. కావున వారి క్షేమము గోరియే యసూయులు వినరాదు. చెట్టుచెడు కాలానికిఁ గుక్కమూతిపిందెలు పుట్టినట్లు దేశక్షీణదశ సూచించుచు నిట్టివారు కొందఱు నేడు కలిగినారు కదా. ఇట్టివారియందుఁ గరుణగలిగియే వాల్మీకి ముందుగానే యట్లు చెప్పెను.

తాత్పర్యము.

ఆర్యులారా! 'వాల్మీకి యొక సామాన్యఋషిమాత్రుఁడేకదా, ఆయన చెప్పినది యిదియేమి వేదమా, మనము పఠించుట' కని యసూయచే దీనిని నిరసింపవలదు ఇది బ్రహ్మముఖమందుండి వచ్చినదియే కావున మీ రవశ్యము వినవలసినది. అసూయచేతఁగాని యశ్రద్ధచేతఁగాని సోమరితనముచేఁగాని యలక్ష్యముచేఁగాని వినకపోయితిరా మీరు చేయవలసిన కార్యము చేయక పోయినవా రగుటచేఁ బాపాత్ము లగుదురు. వినిన నేమిఫలమందురా అనేకవిధములైన పాపములు సంచిత ప్రారబ్ధాగములను నశింపఁజేయును. చెఱువులోనీరు తూమునుండి వరిమళ్ళకుఁ బాఱునట్లు బ్రహ్మయే నాముఖమున మీకు దీని లభింపఁజేయును. ఈ పుణ్యకావ్యమును లోకమునందు వ్యాపింపఁజేయుటయందు మాత్రమే నాకధికారము గలదుగాని రచనాదులందు ఫలప్రధానమందు నాకేమియు నధికారములేదు. ఇది పాపముల హరించుట మాత్రమేకాక ధర్మకాంక్షగలవానికి ధర్మమును, నర్థకాంక్ష గలవారికి నర్థమును కామాశగలవారికిఁ గామమును లభింపఁజేయును కావున మోక్షాసక్తులేగాక యిహస్వర్గభోగాసక్తులు ధర్మాసక్తులు వినయోగ్యమైనది. బ్రహ్మ నాకిచ్చిన యధికారము విశదవాక్యములతో శ్రీరామజననము మొదలు నిర్యాణము వఱకు నిర్వహించెదను. మీరును నితరవిషయచింతలఁ బాఱఁదోలి దీనియందే మనస్సుంచి సంతోషముతో భక్తితో వినుఁడు. మీకు శుభము గలుగును.

—♦ అయోధ్యాపుర వర్ణనము ♦—

కం॥ రాసులు ధనధాన్యంబులు, వాసిలుప్రజ లెల్లఁ బుష్టిఁబరులుఁ సుఖులుఁ,
ఆసల వాసి రహించుచుఁ,గోసల మొప్పారు సరయుఁగూలమునందున్. ౨౭౧

పూర్వము ప్రతిజ్ఞచేసిన రామచంద్రమూర్తి చరిత్ర చెప్పుట కుపక్రమించి యాయన యవతరించిన దేశముయొక్క మాహాత్మ్యమును జెప్పుచున్నాఁడు.

రాసులు = ప్రోవులు. ఏక. రాశి, బహు. రాసులు, పదాంతమైన శి బహువచనంబున సు యగు. వాసిలు = వృద్ధిపొందు. ఆసలఁ = దిక్కులయందు, రహించుచుఁ = ఒప్పుచుఁ; కోసలము = కోసలదేశము, సరయూ కూలములందుఁ = సరయూనదియొక్క రెండుగట్లయందును; సరయూనది కుత్తరమున నుండునది

యుత్తర కోసలము, దక్షిణమున నుండునది దక్షిణకోసలము. దక్షిణకోసలాధిపతి కౌసల్యతండ్రి భానుమంతుఁడు. ఉత్తరకోసలాధిపతి దశరథుఁడు. వంశములు వేఱువేఱు. సామాన్యముగాఁ గోసల యుత్తరకోసలమునకే యన్వయించును. దక్షిణకోసలము కోసల్యకుఁ బ్రసిద్ధము. సరయూనది నిప్పుడు గోగ్రా యందురు.

తాత్పర్యము.

సరయూతీరమునందుఁగల కోసలదేశమందు నెందుఁ జూచినను ధనములు ధాన్యములు రాసులు రాసులుగా పండుచుండుటచే నాగరికులు ధనములు ధాన్యములు పరుల నాశింపవలసిన పనిలేకుండెను. లోకులు దేహపుష్టిగలిగి సుఖులై యుండిరి. ఇట్టి యా దేశము జగమునందుఁ గీర్తి వహించియుండెను.

సీ. రాణ్మై సిరులకు ♦ రాణ్మై సొగసుల, నాణెమై మనువిని♦ర్మాణ మగుచు
నిడివిని బదిరెండు♦ నెడలుపు మూఁడును, యోజనంబులగు య♦యోధ్య యొప్పు
నిరుపంకలను మేలి♦విరులకు నెడచల్లు, తరువులచే మనో♦హరము లగుచు
నంబు వైచినయట్లు ♦ డంబుమీఱిన యట్టి, యింబైన రాజమా♦ర్గంబు లమరి
తే॥ గాలికిని రేఁగు కెందూళి♦చేలములను, సొంపు చెడ ముంచి కనలఁగా♦రింపకుండ
బాటసారుల, కింపుగ♦ బాటలెల్ల, నీట సిక్తంబులై యుండు♦ వాటముగను. ౨౮

ఇఁక రామచంద్రమూర్తి యవతరింప యోగ్యమైన పట్టనమును వర్ణించుచున్నాఁడు. రాణ + మై = ఒప్పిదముచే, రాణ + మై = స్థానమగుటచే, ఇరుపంకలను = బాటకు రెండు ప్రక్కల, మేలివిరులకు = పరిమళము మొదలగువానిచే శ్రేష్ఠమైన విడిపుష్పములను, వెదచల్లు = నాల్గుప్రక్కల జల్లునట్టి, తరువులచేత = చెట్లచే, అంబువైచినయట్లు = బాణము పోవునో యట్లు వంకరలేక చక్కఁగా, డంబు = కాంతి, ఇంబు = ఇంపు; కారింపక = బాధపెట్టక, ఏవేళ = ఎండకాలమున, రాత్రిపగలనక యెల్లప్పుడు. వానకాలమున మనుష్యప్రయత్నమక్కరయే లేదు. వాటముగ = బాగుగ, సిక్తంబులు = తడుపఁబడినవి, రాణ = అన్యదేశ్యము. స్థానశబ్దభవమని చెప్పనగు. పల్లకీత్యాదిశబ్దములవలె హ్రస్వరూపము.

తాత్పర్యము.

ధనధాన్యాది సంపదలకు స్థానమగుటచే మిగులఁ జక్కఁదనము గలదై మనువు స్వయముగ మనస్సుచే నిర్మించినదై నిడుపు పండ్రెండామడలు వెడల్పు మూఁడామడలు గలదై బాణము పోయినట్లు వంకరలేక చక్కఁగా నుండి యిరుప్రక్కల సువాసనగల పుష్పము లెల్లవేళల రాల్చుచుండు చెట్లుగలవై గాలికి

దుమ్మురేఁగి త్రొవనడచువారి కన్నులలోఁ బడి బాధింపకుండునట్లు నీటిచేఁ దడుపఁబడుచున్న రాజవీథులు గలదై యయోధ్య యని పేరుగల మహాపట్టనమందమై యుండెను.

సీ॥ వాట మహామేటిక•వాటంబు లామోద, కారణంబులు నైన•తోరణములు
నెడనెడ విర్వియం•గడివీధు లొప్పున, సర్వయంత్రాయుధా•ఖర్వమహిమ
శిల్పకోవిదవరా•నల్పసమూహంబు, సూతమాగధవంది•జాతి గలిగి
శ్రీమంత మతులసు•ధీమంత మగుచు న,చ్చొట్ట కేతనముల • మట్టు మీఱి
తే॥ సాధ్వసకరశతఘ్నికా•సంచయంబు, లెచటఁ జూచిన నర్తకీ•నిచయములును
దోరమామిడి•తోఁపులమరి, శ్రీపురంబుగ్గియగున యో•ధ్యాపురంబు.
౨౮౩.

కవాటములు = తలుపులు, ఆమోద = సంతోషమునకు, తోరణములు = తలవాకిటి ద్వారములు, విర్వి = విశాలములైన, అఖర్వ = అధికమైన, కోవిదవర = పండిత శ్రేష్ఠులయొక్క, అనల్ప = అధికమైన, సూతమాగధవంది జాతి = సూతులు మాగధులు అను రెండు విధముల జాతి. వందజాతి రెండు విధములు.

సూతులు = సారథులు, మాగధులు = రాజుల మేలుకొలుపువారు, "మాగధాః రాజప్రబోధకాః" భాస్కరుడు. క్షత్రియాద్విప్రకన్యాయాం సూతో భవతిజాతితః, వైశ్యాన్మాగధవైదేహౌ రాజవిప్రాంగనాసుతౌ, మను ౧౦-అధ్యా. ౧౧ శ్లో. క్షత్రియునకు బ్రాహ్మణస్త్రీయందుఁ బుట్టినవాఁడు సూతుఁడు, వైశ్యునకు క్షత్రియస్త్రీయందుఁ బుట్టినవాఁడు మాగధుఁడు 'రాజ్ఞః పరిజనస్యాపి, మంగళాచారశంసినః మాగధ్యస్తే మాగధకా గీతే మాగధా ఇత్యుదీరితాః.' కాముడు. శ్రీమంతము = విశేషసంపదగలది, అతుల = సాటిలేని, సుధీమంతము = పండితులుగలది, ఉచ్చ + అట్ట = ఎత్తైన మండపములపైఁ గట్టిన చిన్నయిండ్లయందలి, కేతనములన్ = టెక్కెములచేత, మట్టుమీఱి = అతిశయించి, సాధ్వసకర = దిగులు కలిగించు, శతఘ్నికా — నాలుగుమూరల నిడివిగల యినుపముండ్ల కర్రల యొక్క, సంచయంబులు = సమూహములు, ఆరము — [illegible], ఉగ్గి = సమానము. శతఘ్ని — శతఘ్నీచ చతుస్తాలా లోహకంటకసంచితా. అయఃకంటకసంఛన్నా శతఘ్నీ మహాశిలా.

తాత్పర్యము.

చక్కగాఁ జేర్పఁబడిన గట్టివాకిండ్లు తలుపులును, వాకిండ్లముందు మంగళార్థమై పచ్చనియాకుల పూలసరములు గట్టుటకై యేర్పఱుపఁబడిన స్తంభములును, నడుమనడుమ విశాలమైన యంగడివీధులును, శత్రువులతో యద్ధము

చేయుటకై కావలసిన నానావిధములైన యంత్రములు నాయుధములు గల భవనములును, శిల్పమునఁ బ్రసిద్ధికెక్కిన పనివాండ్ర సమూహములును, సూతులు - మాగధులు - వందులు - ఈ జాతివాండ్రును గలిగి, శ్రీమంతమై పండితులుగలిగి, యెత్తైన మంటపములమీఁదఁ గట్టిన ధ్వజములుఁ, జూచువారికి భయముకలిగించు శతఘ్ను లను నాయుధములును, నన్నిప్రక్కల నాట్యమాడు స్త్రీల సమూహములును, విశేషముగఁ దియ్యమామిడితోఁపులును, గలిగి లక్ష్మీదేవి పట్టనమువలె నయోధ్యాపురము రాజిల్లును.

సీ॥ పురసతీమేఖలా♦భరణ మావరణంబు, విద్వేషిముస్తాళి♦విశిఖ పరిఖ
ధారాటకరిఘటా♦వారం ఁపారంబు, గోమహాంగింబులు ♦ కోటికోట్లు
మంతురహించుసా♦మంతు లమంతులు, పరకరప్రదకర్త♦పరులు పరులు
ప్రకటనానాదేశ♦వాసు లావాసులు, సమధికధనులు స♦చ్ఛర్యు లర్యు
తే॥ లోఁ నవరత్నమయములు ♦ రాజులిండ్లు, సాటమీఁటుమనోజ్ఞంబు ♦ లాటమలలు
ఘనవిచిత్రితనలభులు ♦ నెనరి సిరిని, గోపురముసాట యగు నయో♦ధ్యాపురంబు. ౨౪౪

ఆవరణము = ప్రసిద్ధికెక్కిన యూప్రాకారము. "ప్రాకారో వరణః సాలః"—అమరుఁడు; పురసతీ = అయోధ్య యనుస్త్రీకి, అయోధ్యాశబ్దము స్త్రీలింగము గనుక స్త్రీగా రూపకము చేయఁబడెను. మేఖలా + ఆభరణము = మొలనూలనుసొమ్ము. పరిఖ=అగడ్త - పరిఖాపరిఘూసమే —ద్వియావకోశము విద్వేషి= శత్రువులను, ముస్తా + అళి = తుంగగడ్డలసమూహమునకు, విశిఖ = గుద్దలి, రథ్యాఖనిత్రోర్విశిఖా.-నానా. ధారాట = గుఱ్ఱములయొక్కయు, ధారాటా హయచాతకౌ॥ నానా॥ కరిఘటా = ఏనుఁగులసమూహముయొక్కయు, ఘట యనఁగా నేనుఁగుల గుంపుకదా కరిఘటయన నేల? ఇది మాక్తికహారమువలెనని గ్రహించునది. 'కరిఘటలఁ దాఁకె భీముఁ'డని భారతమున తిక్కనప్రయోగము. ఇచ్చట ఘటాశబ్దము కేవల సమూహవాచకము. "విశిష్టవాచకానాం పదానాం సతి పృథగ్విశేషణవాచకే సమనిధానే విశేష్యమాత్రపరత్వ" మ్మని న్యాయము కలదుగదా. గోమహాంగింబులు = ఆవులు - ఒంటెలు, మంతు = ప్రసిద్ధి, "మంతుకెక్కినహాగమంతుండు దాము." రం. రా. కిష్కింధ. సామంతులు = కప్పముకట్టు చిన్నరాజులు, అమంతులు = అపరాధముచేయని వారు, విరోధబుద్ధిలేక మైత్రితోఁ బ్రవర్తింతు రనట' 'ఆగోపరాధోమంతుశ్చ' యని యమరము. పరులు = శత్రువులు, పర = శ్రేష్ఠమైన, కరప్రదకర్త = కప్పము కట్టు కార్యమందు. పరులు = ఆసక్తులు, సంతోషముతోఁ గప్పము కట్టెద రని భావము. ఆవాసులు = ఆలయూర నివసించువారు, ప్రకట = ప్రసిద్ధ

ములగు, నానాదేశవాసులు = అనేకదేశములం దుండినవారు. వారున్న దేశములు ప్రసిద్ధములయినవైనను అంతకంటె నిచట నీతి, ధర్మము, వ్యాపారము, హెచ్చుగానుండుటచే తమదేశములు విడిచివచ్చి యిచ్చటఁ గాపురములు చేయుచున్నారని తాత్పర్యము. అర్యులు = కోమట్లు = మిగుల ధనము గలవారు. సత్ + చర్యులు = మంచి నడవడిగలవారు, ఓజక్ = క్రమముగా, మనోజ్ఞములు = అందమైనవి, ఆటములు = రాజు వినోదార్థమై కల్పించిన కృత్రిమపర్వతములు ఘు = క్రమముగాఁ గట్టఁబడినదియు. విచిత్రిత = పలు విధములైన చిత్రములుకలదియు నగు, వలభులు = పై మేడలు, గోపురము = స్వర్గపురము = అమరావతి. గో = స్వర్గము ఈ పద్యము లాటానుప్రాసము నర్థాలంకారము అర్థభేదము కలిగి వచ్చిన శబ్దమే మరలవచ్చినచో లాటానుప్రాసము గా న్వయోపలక్షిత ప్రాణస్వర్గపురంబులో మను॥ నానా.

తాత్పర్యము.

అయోధ్యాపురి యనెడి స్త్రీ నడుమునకుఁ బెట్టుకొన్న యొడ్డాణమువలెనుండు ప్రాకారము, పగవారికి నెదు తుంగముస్తలకు గుద్దలివంటి యగిష్ఠలు, మితి మీరిన సంఖ్యగల గుఱ్ఱములు, లొట్టిపిటలు, ఆవులు, ఎద్దులు, ఏనుఁగులు, కుత్సితము లేక యనుకూలురైన సామంతరాజులు, యుద్ధమున నోడి కప్పములు కట్టు విరోధిరాజులు, తమదేశముకంటె నిచ్చట సుఖము నీతి ధర్మము వ్యాపారము విశేషించియుండుటచేఁ గాఁపురములు చేసిన నానాదేశ జనులు, విశేషధనవంతులయిన వైశ్యులు, నవరత్నమయములైన రాజులిండ్లు స్త్రీపురుషులు విశ్రమింపను చేసిన చంద్రశాలలు గలిగి యీయయోధ్యాపురము స్వర్గనగరమగు నమరావతికి సాటియై యున్నది.

ఉ॥ మానితరత్నఖచితవిమానవితానము, పుత్రపౌత్రసం
తానలసద్గృహంబు, సమధాత్రినివేశిత, ముత్తమోత్తమం
బైనసుశాలితండులచయంబునై, నుత్తమపంకజాతనే
త్రానికరంబు, నై పురము రాజులు జూడఁబుచ్చుటపోలికన్ ౧౫

మానిత = గౌరవింపఁబడిన శ్రేష్ఠములగు, రత్న = మాణిక్యములచేత, వజ్రము - వైడూర్యము - పద్మరాగము - గారుత్మతము (గరుడపచ్చ) - ఇంద్రనీలము - పుష్యరాగము - ప్రవాళము (పగడము) - గోమేధికము - మౌక్తికము - ఇవి నవరత్నములు, ఖచిత = చెక్కఁబడిన, విమాన = విమానాకారములగు నిండ్లయొక్క, వితానము = సమూహము, కలదియును, పుత్రపౌత్రసంతాన = కొడుకులు మనుమలతోఁ గూడిన సంతతముచేత, లసత్ = ప్రకాశించుచున్న, ఇండ్లుగలదియును, ఇంటింటఁ గొడుకులు మనుమలుగల పెద్దవారు జీవిం

చియుండిరని భావము. సమభూమి = మిట్టపల్లములు లేనిచోట, నివేశితము = నిర్మింపఁబడినదియు, ఉత్తమోత్తమంబు = గొప్పవిట్టిగములకంటె గొప్పది, సుశాలితండుల = శ్రేష్ఠమైన నియ్యముయొక్క, చయంబు = సమూహము గలదియును, ఉత్తమ = గొప్పజాతిలోఁ జేరిన, పద్మిని, శంఖిని, చిత్రిణి, హస్తిని స్త్రీ జాతి నాలుగు విధములు, పంకజ నేత్రా = తామరపువ్వుల వంటి కన్నులుగల స్త్రీలయొక్క, నికరంబుగా = సమూహముగా, నిండియుండెను.

తా త్ప ర్య ము.

నవరత్నములచే జెక్కఁబడి విమానాకారముగాఁ గట్టఁబడిన యిండ్లును, నింటింటఁ గోవులు మనుములు మునిమనుములు గలిగి దీర్ఘాయుష్మంతులైన వృద్ధులును, మిట్టపల్లములు లేక సమభూమియందుఁ గట్టఁబడిన ప్రతిగృహము వారివారికిఁ బండియిచ్చిన నిడ్లైన నియ్యపు గాదెలుగల ధాన్యాగారములును, నింటింట నుత్తమజాతిస్త్రీలును గలిగిన యిండ్లుగల నాలుగు వీధులు నాలుగు ముఖముల వ్యాపింపఁగా నన్నము రా గృహములకు బ్రహ్మయు జూచి మెచ్చునటు వలె నొప్పును

ఐ యనఁగా కలిగియనుటకు, "చెప్పఁగ నగరము నిండఁ జాలఁ జాందవాగ్రణులై."

కృష్ణుని సారథ్యము నైర్మల్య్యము —ఉద్యో. ౧ ౨౬౭

పెండ్లి చోరఁగు రెత్తురు నై.—భీష్మ. ౧-౩౬౧ అని భావము

అనఁగా నాలుగూరిన్నమ నొల్లగృహములు, లోపలికి లోన కట్టడములు లేక గాలివచ్చుటకై విడిచిన బయలుభాగములు, ఁ రాచవీధులు లుప్పరిగల రాచబాటలును నుండి, నాచుటకు జూపుచుండెనట్లుండెనని భావము.

కం॥ ఆనగరమున జలములు, భావితమధురిమను బాలకుసుమములు బోలెన్
గానఁ దేను ముక్తాఫలలావణ్యముఁ బోలు రుచిరలాఘవము సుమనోజ్ఞమై. ౨౮౬

భావిత = పొందఁబడిన, మధురిమ = తీపిచేత, నవ = నరిశుద్ధములగు నిండుపుటయందు, ముక్తాఫల = ముత్యములయొక్క, లావణ్యము = స్వచ్ఛమైన కాంతి, రుచిర = ఇంపైన, లాఘవము = తేలికదనము.

తా త్ప ర్య ము.

ఆ గొప్పపట్టణమందు జలము చెఱకుపాలవలెఁ దియ్యనై మిగుల తేలికయై మంచిముత్యములయందు గానవచ్చులావణ్యమువంటి కాంతిగలదై యుండును.

కం॥ దుందుభిమృదంగవీణా, బృందంబులయులివు పణవవేణునినదముల్
సుందరులకాలియందెల, క్రందును నొక్కటిగ బెరసి త్రిస్థలి నించున్   ౨౮౭

దుందుభి = నగారాలయొక్కయు; బృందంబుల = సమూహములయొక్క; ఉలివు = ధ్వని, పణవ = ఉడక యను వాద్యముయొక్క; వేణు = పిల్లనగ్రోవి యొక్క, నినదముల్ = ధ్వనులు; క్రందు = ధ్వని. బెరసి = కలసి, ధూస్థలి= భూప్రదేశము, నించుఁ = నిండించును.

తాత్పర్యము.

నగారాలు-మద్దెలలు-వీణెలు-ఉడకలు-పిల్లంగ్రోవులు వీనిధ్వనులు సుందరుల వైన కాలియందెల రవముగలసి దిక్కుల నిండెను. అనఁగా నెప్పుడు నాటలు - పాటలు - ఉత్సవములు - అలంకరించుకొన్న స్త్రీలు-గలదై యుండెను.

కం॥ వరతపమున దివి సిద్ధులు, పరిలబ్ధిం గను విమానపంక్తుల వోలెన్
నరవరసమావృతం బై, వరవేశ్మము లాపురమున వన్నెలమీఱున్. ౨౧౮

సిద్ధులు = తపస్సునఁ గడ తేఱినవారు, దివిన్ = స్వర్గమందు, పరిలబ్ధిం గను = పొందునట్టి; నరవర = పండితులచేత, సమావృతంబై = సంపూర్ణ మైనదై.

తాత్పర్యము.

ఘోరమైన తపస్సులుచేసి సిద్ధిపొందినవారికి స్వర్గమందు లభించిన విమానములవంటియిండ్లు ఆ పురమున సంసారముచేయువారి కాకష్టములేకయే ప్రాప్తించెను.

ఉ॥ ఒంటరివాని, వంశమున కొక్కఁడ కర్తగ నుండువాని, భీ
యంటిన డాఁగువాని, లఘుహస్తవిశారదు లయ్యుఁ జంపఁ బో
రొంటు లభించియుం బురిన నుత్తమశూరులు, కాననంబులన్
గెంటుదు రొక్కవ్రేటునన కేసరులం గిరి ఖడ్గకోటులన్. ౨౧౯

లఘుహస్త = చక్కఁగ నభ్యసించిన విలువిద్యకలవారు; విశారదులు = పండితులు. లఘుహస్తస్సుహస్తశ్చ, కృతాస్త్రఃకృతపుంఖకః" వైజయంతి. అయ్యును= నేర్పరులునయినను, కర్త = వృద్ధిచేయువాఁడు, తోడఁబుట్టువులు లేక తానొక్కఁడే తనవంశమును వృద్ధిచేయవలసిన వానిని, భీ = భయము, ఒంటు = అనుకూలసందర్భము, కేసరులన్ = సింహములను; కిరుల = పందులయొక్కయు, ఖడ్గ = ఖడ్గములయొక్కయు, కోటులన్ = సమూహములను, వ్రేటు = దెబ్బ; గెంటుదురు = క్రిందఁబడఁ ద్రోయుదురు. కాననంబులన్= అడవులందు. మృగములకు నడవుల బలమెక్కువ గదా. అవతారమున కను కూలప్రదేశమును బురమును జెప్పి తదనుకూలుఁడైన పురుషునిఁ జెప్పు చున్నాఁడు,

తాత్పర్యము.

శత్రువునైనను సమయము దొరికెఁగదా యని యాయుధపరికరములేక, సహాయులులేక యొంటరిగాఁ జిక్కినను, పైఁబడినచ్చినను, వంశమునకు వాఁడొక్కఁడే కర్తయై వానివలన వంశాభివృద్ధి కావలసియుండినను, భయపడి డాఁగినవాని, విలువిద్యయందు నస్త్రవిద్యయందు నేర్పరులయ్యును నానగరము నందలి శూరులు చంపరు. ఇట్లు చేయుట బలధైర్యసాహసములు లేక కాదు. ఏలన, వారే యడవులకు వేఁటకుఁ బోయినప్పుడు సింహములను నడవి పందులను ఖడ్గమృగములను ముఖాముఖి కలియఁబడి భుజబల శస్త్రబలములచే నొక్కక్రేటుననే క్రిందఁబడిచావఁ గొట్టుదురు.

తే॥ ఆహితాగ్నులు గుణులును ♦ సాంగవేద,పారగులు సత్యరతులు న♦పారదాను
లగు మహాత్ములు ఋషిమాత్రు♦లై మహర్షి,కల్పులగు ద్విజవర్యులు ♦ గలరు పురిని.

ద్విజవర్యులు — బ్రాహ్మణశ్రేష్ఠులు, ఆహితాగ్నులు = అవిచ్ఛిన్నాగ్నిహోత్రముగలవారు, గుణులు — శమదమాది గుణసంపత్తి గలవారు, సాంగవేదపారగులు = అంగములతోఁడ నాలుగువేదములను దుదముట్ట నధ్యయనముచేసినవారు, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము అని నాలుగువేదములు. వీని కంగములు ఆఱు, శిక్ష - వ్యాకరణము - ఛందస్సు - నిరుక్తము - జ్యోతిషము - కల్పము. సత్యరతులు = సత్యమునందుఁ బ్రీతిగలవారు, అపారదానులు = మితిమీరి వేనవేలు దానముచేయువారు, మహాత్ములు = గొప్ప మనస్సుకలవారు, ఋషిమాత్రులు = సామాన్యఋషులు, అయినను మహర్షికల్పులు = వసిష్ఠాదిమహర్షులతో నించుమించు సమానులు. వీ రిండ్లయం దుండియే యడవులలో తపస్సుచేసిన వసిష్ఠాదులతోఁ గొంచెము తక్కువగాఁ దులదూఁగుదురు. కల్పప్రత్యయము కొంచెము తక్కువను సూచించును.

తాత్పర్యము.

ఆపట్టణమందలి బ్రాహ్మణులందఱు నవిచ్ఛిన్నముగ నగ్నిహోత్రములుగలవారు శమదమాది గుణసంపన్నులు, ఆఱంగములతోఁ నాలుగువేదముల నధ్యయనము చేసినవారు, సత్యవాక్య నిరతులు, వేలకొలఁది దానముచేయువారు, గొప్ప మనస్సుగలవారు, సామాన్యఋషులయ్యును గృహస్థులై నగరవాసు లయ్యును నడవులలో నుండు మహర్షులకు సమానులు.

—* ౬ సర్గము. దశరథమహారాజగుణ వర్ణనము *—

కం॥ ఈలీల మహారథతతి, వాలాయము గొలువ సమర♦వరుఁడు దివంబుం
బాలించెడి వడువునఁ బరి,పాలించును దశరథుండు ♦ ప్రథ నాపురమున్. ౨౫౧

ఉత్తమగుణములుగల దేశమునకుఁ బ్రభువు నుత్తముఁడే యగుచున్నాఁడు. మహారథ = మహావీరులయొక్క, యుద్ధమున సారథిని దేరిగుఱ్ఱములను దిగ్నా రక్షించుకొనచు యుద్ధముచేయువాఁడు మహారథుఁడు, 'ఆత్మానం సారథిం చాశ్వాన్ రక్షన్ యుధ్యతియోనరః సమహారథ సంజ్ఞస్స్యా' త్తని ప్రమాణము తతి = సమూహము, వాలాయము = నిరంతరము, అమరవరుఁడు = విష్ణువు, దివంబున = పరమపదమున, నపువ్వున్ = విధముతో, ప్రథ = ప్రఖ్యాతి-కీర్తికరము.

అమరవరుఁడు = విష్ణువు, విభుశ్శ్రియా విష్ణురివామరేశ్వరః. అని వాల్మీకియే బాల 22 వ సర్గమందుఁ బ్రయోగించియున్నాఁడు. అదియుఁ గాక.

శ్లో॥ యస్మాము త్పత్స్యతే తస్యాం భగవాన్ పురుషోత్తమః
తస్మాత్సా నగరీ పుణ్యా హ్యయోధ్యేతి ప్రకీర్తితా
నగర్యాం పరిధామోన్నా నామ తస్యాస్త్వభూచ్ఛుభే
యత్రాస్తే భగవాన్ విష్ణు స్తదేవ పరమంపదమ్॥
గత్వైవైవ భవేన్మోక్షః సర్వకర్మనికృంతనః
జాతే తత్ర మహావిష్ణౌ నరాస్సర్వే పరం యయుః
నానాజనపదాకీర్ణం వైకుంఠం తద్గరే, పరం —పద్మ.

అచ్చట భగవంతుఁడు పుట్టుటచే నాపుణ్యనగరి యయోధ్య యని కీర్తింపఁబడెను. భగవంతుఁడైన విష్ణు వెందుండునో యదియే పరమపదము. ఆయయెడ సేవయే మోక్షము అదియే సర్వకర్మముల ధ్వంసముచేయును అచ్చట మహావిష్ణువు పుట్టుటచే మనుష్యు లందఱు ముక్తులైరి. ఇవి శివుఁడు పార్వతి నుద్దేశించి చెప్పిన వాక్యములు.

తా త్ప ర్య ము.

ఈ విధముగ మహారథుల సమూహము లన్నెల్లప్పుడు సేవింపఁగా వైకుంఠముఁన విష్ణువు పాలించునట్లు కీర్తికరముగ నాపట్టణమును దశరథుఁడు పాలించుచుండెను.

సీ॥ వేదవేదాంతార్థవిదుఁ డగోవిదుఁడు భాస్వద్గృహశూరాదిసంగ్రామాంగ
నతిచిరకాలభావ్యర్థదర్శనశీలి, పౌరజానపదాళి పరమహితుఁడు
నిక్ష్వాకు వంశోత్తముండు, దెల్లరు నతిరథుం, డనిరతాధ్వరసత్క్రియాసురుండు
నాపి శారామ కులపన్యాహానిర్మాత, స్వవశీకృతాఖిలజనసమయుండు

ఆ॥ వరమహర్షి సముఁడు పరమరాజర్షియు, విశ్వవినుతకీర్తి వీర్యవంతుఁ
డమితబలుఁ డమిత్రహారుఁడు ప్రశస్తమిత్రాన్వితుఁడు జితేంద్రియాగ్రసరుఁడు.

౫౫-౨

భాస్వత్ = విద్యలచేతను, పరాక్రమముచేతను ప్రకాశించుచున్న, బుధ శూర ఆది = పండితులు వీరులు మొదలగు వారిని, సంగ్రహుండు = ధనము గౌరవము మొదలైనవి యిచ్చి స్వాధీనము చేసికొనవాఁడు, అతీత కాలభావి= చాలకాలము తరువాత గలుగఁబోవు, అర్థ = విషయములను, దర్శి = కను గొనటయే, శీఘ్ర - స్వభావముగాఁ గలవాఁడు, నూరాలోచనము నేయుస్వభా వముగలవాఁడు, పౌర = పురములందు బుట్టినవారు, జానపద = జనపదము లం బుట్టినవారు, జనపదము = గ్రామము, వీరియొక్క, ఆళి= సమూహమునకు, వంశ్యులు = వంశమునఁ బుట్టినవారు, అతిరథుండు = ఏకాకిగఁ బెక్కురు మహా రథులతోఁ యుద్ధముచేయువాఁడు, అవిరత = ఎడఁదెగని, అధ్వర = యజ్ఞ మనెడు, సత్క్రియ = మంచికార్యమే, పరుండు = ప్రధానముగాఁ గలవాఁడు, వాపికా = నడబావులయొక్కయు, ఆరామ = తోఁటలయొక్కయు, కూప = చేఁదుడుబావులయొక్క, వ్యూహ = సమూహములను, నిర్మాత = చేయించిన వాఁడు, స్వవశీకృత = తనకధీనము చేసికొనఁబడిన, రాజర్షి = రాజఋషి = రాజరూపఋషి. రాజుగా నుండి ఋషిచర్య గలవాఁడు, విశ్వ = లోకుల చేత, వినుత = కొనియాడఁబడిన, అమిత బలుండు = మితిమీరిన చతురంగ బలముకలవాఁడు, కాఁబట్టియే, అమిత్రహరుండు = శత్రువుల నశింపఁజేయు వాఁడు, ప్రశస్త = కొనియాడఁబడిన, మిత్ర + అన్వితుండు = స్నేహితులతోఁ గూడినవాఁడు, జిత + ఇంద్రియ=శబ్దాదులగు దుర్వ్యసనములకు స్వాధీనుఁడు కాక పరవశధీనముగాఁ జేసికొన్న చక్షురాదీంద్రియములు గలవారియందు,అగ్ర సరుండు — మొదటివాఁడు, స్నేహభావముతో దిద్దఁగలిగే వాని కొలుచు వాఁడు , మిత్రుఁడు వేదవేదాంతార్థ విదుండు - ఇందు వేదియని వున్నవు వ్యర్థము. అర్థము తెలియక వేదము చదువువాఁడు వానివంశపువారు శూద్రులే. "సవేదపార మాత్రేణ, సంతుష్టస్స్యాద్ద్విజోత్తమః। పారమాత్రావసాయీతు, పంకే గౌరివసీదతి॥ యోధీత్య విధివ ద్విప్రో, వేదార్థం విచారయేత్। ససా న్వయః శూద్రసమః। పాత్రతాం నప్రపద్యతే॥

తాత్పర్యము.

వేదములయు వేదాంతములయిన యుపనిషత్తులయు నర్థము తెలిసినవాఁడు. ఇది వినికిచే మాత్రమునఁగాక స్వయముగ నర్థము గ్రహింపఁజాలు పాండిత్యము గలవాఁడు. ఆకారణముచేఁ బండితులను, శూరుఁడగుటచే శూరులను సంగ్రహించి చినవాఁడు. చాలఁగాలము వెనుక, నేమి జరుగఁబోవునది యూహించి తెలిసి కొనఁగలవాఁడు. పట్టనవాసులకు గ్రామవాసులకు నేదివేలో దానిని యోజించి వారికి హితమైనది చేయువాఁడు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన రాజులలో నెల్ల నతిరథుఁడు విడువక యజ్ఞములు చేయుటయం దాసక్తిగలవాఁడు, మనుష్యులకుఁ

పశువులకు నుపయోగిపడుటకై బావులు - గుంటలు - తోఁటలు - తోఁపులు - త్రవ్వించి స్థాపించినవాఁడు. దానమానాదులచే నందఱు జనులను దనకు వశపడఁ జేసికొన్నవాఁడు. మహర్షులతో సమానుఁడు రాజర్షులలో శ్రేష్ఠుఁడు. ప్రపంచముచేఁ గొనియాడఁబడిన కీర్తిగలవాఁడు విద్యానుభవము కలవాఁడు అతిశయించిన దేహబలము దుర్గబలము లోనైనవి కలవాఁడు. కావుననే శత్రువుల జయించినవాఁడు. విశ్వాసపాత్రులై మిత్రశబ్దమునకుఁ బాత్రులైన వారితోఁ గూడినవాఁడు. ఇంద్రియజయము గలవారిలో మొదటివాఁడు.

కం॥ రా జగణితయశమున నగ, రా జతులితధృతిని భోగిరాజ కళల నౌ
రా! జగతి దశరథునిసరి,రా జగదీశుండు గలఁడె రాజకులమునన్? ౨౫౩

అగణిత= ఎంచనలవికాని, యశమునన్ = కీర్తియందు, రాజు=చంద్రుఁడు, కీర్తి తెలుపని కవిసమయము. నిండువెన్నెలచేఁ జంద్రుఁడు ప్రజల రంజింపఁజేసినట్లు లీరాజు తనకీర్తిచే జనుల రంజింపఁజేసెనని భావము. అగణిత=ఒకప్పుడైన విడువని, ధృతిని=ధైర్యమునందు, నగరాజు=పర్వతశ్రేష్ఠుఁడు, హిమాలయమును వంటివాఁడు, ధైర్యమున హిమవంతుఁ డని యాకవియే చెప్పెను. కళలన్ = విద్యలయందు, భోగిరాజు = సర్పములరాజగు నాదిశేషుఁడు, జగతిన్ = భూమియందు, చంద్రహిమాలయశేషాభేదములు దశరథునకుఁ జెప్పఁబడినవి. కావున తాద్రూప్యాభేద రూపకాలంకారము.

తాత్పర్యము.

అత్యంతకీర్తిచేఁ జంద్రుఁడు ధైర్యమునందుఁ బర్వతరాజైన హిమవంతుఁడు, విద్యలయం దాదిశేషుఁడు. ఆహా యీదశరథరాజుతో సరిపోలువాఁడు రాజకులంబునందుఁ గలఁడా?

చం॥ అమలసువర్ణరత్నమహితాంబరసంచయసంగ్రహుండునై
యమరధనైకపింగనిభుఁ డైవిభుఁడై మనంతి విక్రమ
క్రమమున లోకలోకపరిరక్షణదక్షుఁడునై యథార్థవా
ద మతి త్రివర్గరక్షణవిధిజ్ఞుఁడునై పురి నేలు నిచ్చలన్. ౨౫౪

అమల = నిర్మలమగు, మహిత = శ్రేష్ఠమైన, అంబర = వస్త్రములు, సంచయ = నిధులు, వీనిని, సంగ్రహుఁడై = స్వాధీనము చేసికొన్నవాఁడై, కావుననే అమరధవ = దేవేంద్రునితోను, ఏకపింగి = కుబేరునితోను, నిభుఁడు = సమానుఁడు, ఇంద్రునివలె రత్నాదులగు సమస్తశ్రేష్ఠ వస్తువులను, కుబేరునివలె నిధులను గలవాఁడు, విభుఁడు = ప్రభువు, మనసి = స్వైవస్వతమనువువలె, విక్రమక్రమమునన్ = పరాక్రమము అభివృద్ధి చెందుటచేత, లోకలోక = అందఱకుఁ గానవచ్చులోకము భూలోకమును (వి) సమస్తమును గనఁగలపండితులను;

(తె) లోకములోని జనులయొక్క, పరిరక్షణ దక్షుఁడు = చక్కఁగాఁ బాలించుట యందు నేర్పరి. తన రాజ్యమునం దలివారినే కాక లోకములోని యందఱను రక్షింపనేర్చిరి. రోహిణీ శకట భేదము నివారించుటచే నని గ్రహింపనలయు. దశరథుఁడు రాజ్యముచేయుచుండఁగా జ్యోతిషికులువచ్చి 'రాజేంద్రా! శనైశ్చరుఁడు రోహిణీశకటమును భేదింపనున్నాఁడు. ఆయన యట్లు చేసెనేని పండ్రెండు సంవత్సరములు దేశమంతయు దుర్భిక్షచే బాధపడును' అని తెలిపిరి. అప్పుడా దశరథుఁడు రథముపైఁ గూర్చుండి నక్షత్రమండలమునకుఁ బోయి రోహిణిని వెనుక వేసికొని శనైశ్చరున కభిముఖుఁడై కోదండధరుఁడై దివ్యాస్త్రమును దొడిగి యాయన మార్గమునకు నడ్డముగ నిలిచెను. తనతో నెదురడ్డముగ నిలిచిన రాజును జూచి 'నీవెవ్వఁడవు నాతో నింత కేలయడ్డముగ నిలిచితివి?' అని శనైశ్చరుఁ డడిగెను. 'నీవు రోహిణీశకటమును భేదించితివేని ద్వాదశవర్ష దుర్భిక్షముచే లోకము బాధపడు నని బ్రాహ్మణులు చెప్పిరి. నేను రాజనై ప్రజాదుఃఖము నెట్లు చూడఁగలను? నేను బ్రతికియుండ నీవట్లు సేయరాదు నిన్ను యుద్ధమున జయించి వధించి లోకబాధమాన్పెదను.' అని చెప్పగ 'దశరథా! నీయంతటి సాహసిని, నింత ప్రజాహిత కాంక్షగలవానిని నేను జూడలేదు నీహితబుద్ధికి సంతోషించితిని. వర మేదైన గోరు మిచ్చెద నని' శనైశ్చరుఁడు చెప్పెను. 'వరమిచ్చెదవేని యిదిమొదలెన్నఁడేని రోహిణిని భేదింపకుము. ఇదియే నాకు వర' మనెను. అట్లే కానిమ్మని నాఁటినుండి శనైశ్చరుఁడు రోహిణి కానకొని పోవునేకాని భేదించిపోవుటలేదు. రాజు మరలివచ్చి యీవార్త యందఱకుఁ దెలిపెను. యథా + అర్థవాది = ప్రసంగితిమైన నున్నదున్నట్లు చెప్పువాఁడు, త్రివర్గ=ధర్మార్థకామముల యొక్క, రక్షణవిధిజ్ఞుఁడు = కాపాడునట్టి శాస్త్రము పద్ధతి నెఱిఁగినవాఁడు, నిచ్ఛలుఁడు = ఎల్లప్పుడు నిత్యశబ్దభవము నిచ్చలు దీని రూపాంతరము నిచ్చ.

తాత్పర్యము.

అచ్చపు బంగారు రత్నములు వెలగల వస్త్రములు సంగ్రహించినవాఁడై, యింద్రునితోను కుబేరునితోను సరిపోలి, ఆజ్ఞారూపమున సర్వత్ర వ్యాపించినవాఁడై వైవస్వతమనువువలె విక్రమమందును, జగజ్జనములఁ బాలించువాఁడునై సత్యవాదియై ధర్మార్థకామములను రక్షించువిధానము తెలిసినవాఁడై యెప్పుడు హెచ్చరికతో నాపురమును బాలించుచుండెను.

—•• అయోధ్యాపురి జనవర్ణనము ••—

చం॥ శమదమసద్గుణాన్వితులు • సత్యవచస్కులు నాహితాగ్ను ల
త్యమలినధీద్విజాతులు స•హస్రద వేదషడంగపారగో
త్తములు మహామతుల్ సుకృత•ధన్యులు దేవమహర్షి కల్పులుఁ
హిమకరమిత్ర తేజులు మ•నీషులు గ్రాలుదు రప్పురంబునన్. ౨౫౫

ఇందాఁక బరిపాలన విధముఁజెప్పి దానిఫలమగు నిమలస్థితిని దెలుపు చున్నాఁడు.

శమ = మనస్సును జయించుట, దమ = బహిరింద్రియముల జయించుట యని కొందఱు, శమ = బహిరింద్రియముల జయించుట, దమ = మనస్సును జయించుటయని కొందఱు. రెండర్థములు ప్రమాణసిద్ధములే. అన్వితులు = కూడినవారు, సత్యమైన వచస్సుకలవారు - సత్యవచస్సులు, బహువ్రీహియందు కప్రత్యయము, ఆహిత + అగ్నులు = సదా యగ్నిహోత్రములుకలవారు, అతి + అమలిన = మిక్కిలి నిర్మలమైనబుద్ధి కలవారును, అనుటచే వంచనాదిదుర్గుణములు లేనివారు ద్విజులు = బ్రాహ్మణులు, సహస్రద = వేలకొలఁది దానము చేయువారును, అనుటచే దానము గొనవలసిన యక్కఱలేనివారు, వేద = నాలుగు వేదములందును, ఇది వేదాంగమునకు నుపలక్షణము, షడంగ, షట్ + అంగ = శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను నాఱు వేదాంగములయందును, పారగోత్తములు - పండితులయందు శ్రేష్ఠులు, సుకృత = పుణ్యము చేత, ధన్యలు = సంపన్నులు, దేవమహర్షి కల్పులు = నారదుఁడు మొదలగువారికిఁ గొంచెముతక్కువగ సమానులు, హిమకర = చంద్రుఁడు, మిత్ర = సూర్యుఁడు - వీరినంటికాంతిగలవారు - మిత్రులకుఁ జల్లనివారు, శత్రువులకు వేఁడిమి చూపువారు, మనీషు = విద్వాంసులు, క్రాలుదురు = ప్రకాశింతురు, ఇందు ద్వితీయపాదమునఁ గ్రాదియతి, చతుర్థపాదమున నుభయయతి, మనస్ + ఈషా = మనీషా, అదికలవాఁడు మనీషి పరరూపసంధి ఇది శకంధ్వాదులలోఁ జేరినది.

అయోధ్యాపురమందలి బ్రాహ్మణు లీవిధ్యంబున వర్ణింపఁబడిరి. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణావివిదిషంతి యజ్ఞేన దానేన తపసానాశకేన" ద్విజు లను టచే వేదవచనములచేతను యజ్ఞముచేతను దానముచేతను తపస్సుచేతను ఉప వాసాది వ్రతములచేతను దానిని (ఆత్మను) బ్రాహ్మణులు తెలిసికొందురు." అను శ్రుత్యర్థ మందుఁగలదు. ఎట్లన.

ద్విజులనుటచే "అష్టవర్షం బ్రాహ్మణ ముపనయీత" ఎనిమిదవయేఁటబ్రాహ్మణున కుపనయనము చేయవలయును. అను వేదానుశాసనప్రకార మెనిమిదవయేఁట నుపనయనము చేయఁబడినవారు. వేదషడంగపారగు లనుటచే ఆ అంగములతో సశిరస్కముగ వేదాధ్యయనము చేసినవారు ఆహితాగ్నులనుటచే యజ్ఞములు చేసినవారు. సహస్రదులు అనఁగా బ్రాహ్మణసాత్కృతద్రవ్యముచే శక్తికొలఁది లోభములేక దానముచేయువారు. మహామతు లనుటచేఁ దపస్సులు చేసినవారు. శమదమ సద్గుణాన్వితు లనుటచే బ్రాహ్మణునకు ముఖ్యమైన యంతరింద్రియ బాహ్యేంద్రియ నిగ్రహముకలవారై కామక్రోధముల వశపడుచుకొన్నవారు. సత్యవచస్సులు = సత్యస్యసత్య మని యుండుటచేఁ బరమాత్మను గుఱించియే

మాటలాడువారు. భగవన్మంత్రమే జపించుచు భగవత్కథలచేతనే కాల యాపనముచేయుచు భగవంతునియందు భక్తిగలవారు మనీషులు. 'మనీష ఆలోచనే' యని కలదు. కావున భగవద్విషయమైన యాలోచన ధ్యానముగల వారు. హిమకరమిత్రతేజు లనుటచే బ్రాహ్మణవర్చస్సు వారియందుఁ దాండవ మాడుచున్నది. దేవర్షి, మహర్షి కల్పులు కావుననే భగవంతుఁ డిచ్చట ననతరించు నని యెఱిఁగి యాపురిమందుఁ జేరిరి. బహుశ్రుతులని చెప్పుటచే "బాల్యంచ పాండిత్యంచ నిర్విద్యాథః మునిః" అన్నట్లు అభిమానాదులు లేనివారు

తాత్పర్యము.

అయోధ్యాపురిమందలి బ్రాహ్మణులు బాహ్యేంద్రియములను అంతరింద్రియ ములను జయించి సంధ్యావందనాదిగుణములు దురాచారులు లేక సత్యమునే చెప్పుచు భగవత్కథలనే వ్యాఖ్యానించుచు యజ్ఞములుచేసి మిక్కిలి నిర్మలమయిన బుద్ధిగలవారై వేదములందుఁ జెప్పిన ధర్మములను నాచ రించుచు యాచకులకు శక్తికొలఁది విశేషముగ దానమిచ్చుచు తాము యాచించు టలేక పనిలేక యంగములతోడ వేదముల స్వాధ్యాయనములు చేసి గొప్ప మనస్సు కలవారై పుణ్యకార్యములు చేయుచు దేవర్షి మహర్షులకు సములై సూర్యచంద్రుల తేజస్సువంటి వర్చస్సుగలవారై భగవద్ధ్యానులై యుందురు.

ఉ॥ అందఱు హృష్టమానసులె ♦ యందలియందఱు ధర్మవేదులే
యందఱు శాస్త్రచింతనుల ♦ రాయణులే మఱి స్వస్వతుష్టులే
యందఱుఁ ద్యాగశీలు రట ♦ సందఱు సత్యవచోభిభాషణా
మందులు భూరిసంచయ ల♦మాంస గవాశ్వ ధనాఢ్యు లందఱున్ ౯౬

హృష్టమానసులు = పురసౌఖ్యముచేత సంతోష
శాస్త్రచింతన = శాస్త్రవిషయముల నాలోచ
కార్యముగాఁగలవారు, స్వ=తన
నొందినవారు, 'తేన త్యక్తే
చొప్పున నడచుకొను
వారు, అభిభా
వారు, సన్నిచ
వారు, గోవ
ధనముగా

అయో
తుష్టిగల మనస

విషయమై యాలోచనలు చేయుటయందు సమర్థులే, అందఱు తమకు భగవంతుఁడిచ్చిన దానితోఁ దృప్తిపడి యుండువారే, అందఱు త్యాగము స్వభావముగాఁ గలవారే, అందఱు నిజము చెప్పువారే, అందఱు కావలసినంత సంపాదించి యుంచుకొన్నవారే, అందఱు కొఱఁతలేక వారివారికిఁ గావలసినన్ని గోవులు, గుఱ్ఱములు - ధనములు కలవారే.

కం॥ జననియుజనకుఁడువధువులు,తనయులుఁదనయయునుగృహిణి•దానునతిథియుఁ
దనివిగ నిండక యుండెనె, మనికి యొకం డైన లేదు • మందున కైనన్. ౨౫౭

కుటుంబిసౌఖ్యమును జెప్పుచున్నాఁడు. 'మాతాపితాస్నుషే పుత్రౌ పుత్రీ పత్న్యతిథి స్స్వయం। దశసంఖ్య కుటుంబీతి విష్ణునోక్తం ద్విజోత్తమ' యని కుటుంబలక్షణము వధువులు = ఇరువురు కోడండ్రు, తనయులు = ఇద్దఱు కొడుకులు, తనయయు = కొమార్తెయు, గృహిణి = ఇల్లాలు, తనివి – తృప్తి, మనికి = జీవనము - ఈ పదుగురి కూడికయే కుటుంబము.

తాత్పర్యము.

తల్లి తండ్రి తాను దనభార్య, ఇద్దఱు కొడుకులు, ఇద్దఱు కోడండ్రు, ఒక కూఁతురు ఒక యతిథి యీపదుగురుండినఁ గుటుంబ మనఁబడును. ఇంతకుఁ దక్కువగల యిల్లా నగరమున లేదు.

ఆ॥ తన్ను ధర్మవిధులఁ • దనయులఁ దనయల, తల్లిఁ దండ్రిఁ దనదు•దార నన్న
గమ్ములను గదిస్యి•తావశచిత్తుఁడై, యేఁచువాఁడు లేఁడ • యెచట నేని. ౨౫౮

ధర్మవిధులన్ = పుణ్యకార్యములను, తనయులఁ దనయలన్ = ఇట సంఖ్యా
భార్య, కదస్యతా=కదర్యుఁడు. ఈపద్యమునఁ జెప్పఁబడిన
కాని యితర విధములఁగాని బాధించువాఁడు కద
అత్యంతలోభియై యని భావము. 'ఆత్మానం
భార్యా పితరం భ్రాతౄన్ స

డు కడుపునిండఁ
బడును. అట్టివాఁ

చదువులన్
డు వెదకినన్.
౨౫౯

పూర్వ మన్నిజాతులవారును విద్యనేర్చినవారే యని చెప్పుచున్నాఁడు. పూర్వము శూద్రులకు విద్య నిషేధింపఁబడినదను దుర్వాదము దీనిచే ఖండితము. శూద్రులకు వేదము నిషేధింపఁబడెఁగాని సాహిత్యము, కులవృత్తికిఁ గావలసిన విద్యలోనైనవి నిషేధింపఁబడలేదు.

పోడిమి = ఒప్పిదము, తత్ + పురమునన్ = ఆ యయోధ్యాపట్టనమున, ఖలుఁడు = దుష్టుఁడు, దుష్టకామి = పరస్త్రీ యభిలాషకలవాఁడును, తన భార్యతోనైన నిషిద్ధదినంబుల సంగమించువాఁడును, వాఁడిమి = తీక్ష్ణత, నాస్తికుఁడు = కన్నులకుఁ గానరాని దేవుఁడు, కర్మము, పరలోకము, లేదనువాఁడు, 'నాస్తిపరః యస్యఇతినాస్తిక' అని సంస్కృతమునవ్యుత్పత్తి. ఇట్టివారు చార్వాకమతస్థులు. వారికిఁ బ్రత్యక్షమొక్కటే ప్రమాణము అనుమానశబ్దములప్రమాణములు. బౌద్ధ మాధ్యమిక శాఖవారుగు నేఁటి యచలపరిపూర్ణవాదులు నాస్తికులే.

ప్రశ్న. నాస్తికుఁడు లేనియెడల జాబాలి యెట్లు నాస్తికవాదముచేసెను?

ఉత్తరము.- జాబాలిచేసినది నాస్తికవాదమేకాని జాబాలి నాస్తికుఁడు కాఁడు. రామచంద్రమూర్తి కష్టములు పడుటకు సహింపక యెట్లైనను నాయనను మరలఁ బురికిఁ బిలుచుకొనిపోవ నట్టినాటకముచేసినట్లు లాయనయే చెప్పెనుగదా! ఆవాద మాయనతోఁ బుట్టినదికాదు. అంతకుఁబూర్వమే పుట్టినది. దానికే బృహస్పతిగీతలని పేరు. అయోధ్యయందు నాస్తికుఁడులేఁడనిన నావాదము నామోదించువాఁడు లేఁడని యర్థమేకాని లోకమున నావాదమే లేదని యర్థముకాదు. అట్టిమతమొకటి లేకున్న దురాచారులకు జారులకుఁ జోరులకు స్వైరసంచారులకు అపాపపాయులకు అభక్ష్య భోజులకు శరణమేది?

తాత్పర్యము.

అంతనైన యానగరమందు దుష్టుఁడులేఁడు. పరస్త్రీల నాశించువాఁడు, తన భార్యలోనైనను నిషిద్ధదినంబుల నిషిద్ధసమయంబులందుఁగాని క్రీడించువాఁడును, వేశ్యాలంపటుఁడును లేఁడు చెప్పఁగూడనిమాటలు పలుకువాఁడును లేఁడు. దేవుఁడు, పరలోకము లేదనువాఁడు లేఁడు.

ఉ॥ అందఱు ధర్మశీలరతు • లందఱు నిశ్చలసంయతాత్ములే
యందఱు సత్స్వభావయుతు • లందఱు నిర్మలవృత్తశాలు గే
యందఱు సన్మహర్షినిభు • లందఱు నిర్మలమానసాఢ్యు ల
య్యందఱు దారహారయుతు • లందఱుఁ గుండలమండితశ్రవుల్. ౧౬౦

రతులు = ప్రీతిగలవారు, సంయతాత్ములు = జితేంద్రియులు, నిస్తుల = సాటిలేని; వృత్తవంతులు = ఆచారముగలవారు; తారహార = ముత్యాల సరము

లతో॥ యుతులు = కూడినవారు, కుండల = మకరకుండలములచేత, మండిత= అలంకరింపఁబడిన, శ్రవుల్ = చెవులుగలవారు.

తాత్పర్యము.

ఆపురమందందఱు ధర్మముతోఁ గూడిన శీలమందుఁ బ్రేమగలవారే, అందఱు నింద్రియనిగ్రహముగలవారే, అందఱు మంచిస్వభావముగలవారే, అందఱు దోషరహితమైన నడవడిగలవారే, అందఱు ఋషులతో సమానులే, అందఱు కలంకములేని మనస్సుకలవారే, అందఱు ముత్యాలసరములు లోనైన యాభరణముల ధరించినవారే, అందఱు కుండలములచే నలంకరింపఁ బడినవీనులు గలవారే.

ఉ॥ అందఱు సుందరుల్ మకుటు ♦ లందఱుఁ జందనలిప్తదేహు లం
దందఱుఁ బూర్ణభోగియుతు ♦ లందఱు సంతతమృష్టభోక్త ల
య్యందఱు దానశీలురతు ♦ లందఱు భూషణభూషితాంగు ల
య్యందఱు నిష్కవంతు లట ♦ నందఱు సంగదదీప్తబాహువుల్. ౨౬౧

మకుటులు = కిరీటములు గలవారు,లిప్తదేహులు = పూయబడిన దేహము గలవారు, పూర్ణభోగ = నిండుసౌఖ్యముతో, సంతతి = ఎల్లప్పుడు, మృష్ట = సంపూర్ణముగ, భూషణ = సొమ్ములచేత, భూషిత + అంగులు = అలంకరింపఁ బడిన దేహము కలవారు, నిష్కవంతులు = ఱొమ్మునధరించెడి పతకము లోనగు సొమ్ముగలవారు, అంగద = బాహుపురులచేత, దీప్త = ప్రకాశింపఁ జేయఁబడి, బాహువుల్ — భుజములుగలవారు, "సాష్టే శతే సువర్ణానాం హేమ్న్యురోభూషణేపలే - దీనారేపిచనిష్కః" అమరుఁడు.

తాత్పర్యము.

అందఱు చక్కఁదనము గలవారే, కురూపులు లేరు. అందఱు మకుటములు ధరించినవారే, అందఱు చందనము పూసికొనియుండువారే, అందఱు కొఱంత లేక భోగము లనుభవించువారే, అందఱు నిష్టమై పరిశుద్ధమైన యాహారము తీసికొనువారే, అందఱు నన్నదాతలే, అందఱు నన్నియవయవములందు నలంకారముల ధరించినవారే. అందఱు నురోభూషణములు గలవారే, అందఱు బాహుపురులు గలవారే.

ఉ॥ అందఱు నిర్జితేంద్రియులు ♦ నందఱు యజ్వలు నాహితాగ్ను ల
య్యంద ఱటఁ స్వకర్మరతు ♦ లందఱు నిత్యము బ్రహ్మచింతనుల్
అందఱు సంతతాధ్యయను ♦ లందఱు సంయమితుల్యు లప్పురిం
జెందిన యట్టిలోకులు సుశీలరతుల్ కరుణాపరాయణుల్. ౨౬౨

నిర్జిత ఇంద్రియులు = ఇంద్రియములు పోయినట్లు తాము పోక వానిని దమ యాజ్ఞకు లోఁబడి వర్తించునట్లు చేసినవారు, యజ్వలు = సోమయాగములఁ జేసినవారు, ఆహితాగ్నులు = అవిచ్ఛిన్నముగ నగ్నులు కలవారు, స్వయుక్తా = తమతమ వర్ణాశ్రమములకుఁ దగిన కార్యములందు, బ్రహ్మవాదినః = పరమాత్మను ధ్యానించువారు సంతతాధ్యయనులు = హ్రస్వవిచ్ఛేదముగాని దీర్ఘవిచ్ఛేదముగాని లేని వేదాధ్యయనము కలవారు అధ్యయనము (1) చదువుట (2) జపించుట, వల్లెవేయవలసిన భాగములను వల్లెవేయుచు జపింపవలసిన మంత్రములను జపించుచని భావము. సంయమితుల్యులు = యోగులతో సమానులు. కరుణాపరాయణులు = దయాళువులు మూఁడవపాదము మొదట విసంధికి వాక్యవిరామమగుటే కారణము "వాక్యవిరామమున సంధి లేమిదోషంబు గాదు" సు వ్యా సంధి ౧౩ సూ.

పాదాంత సంధివిషయము.

ఈ పద్యమునందు సంధిగూర్పక వ్రాయఁబడియున్నది. దీని సాధుత్వమును గూర్చి కవులు భిన్నాభిప్రాయులై యున్నవారు. ఎట్లనిన.

"వాక్యావసానంబున సంధిలేమి దోషంబు గాదని యార్యులందురు 'సంశ్యము సర్వశ్రేయము. అది లేనిచో సర్వధర్మములు వ్యర్థములు.' ఇట్లు సంధివిరహంబు కావ్యంబులం బాదాంతమందు చూపట్టెడు," బా వ్యా సంధి 54 వ సూత్రము చేతను "నస్యాద్వాక్యవిరామేతు సంధ్యభావోపి దోషకృత్" అను కారికచేతను వాక్య విరామమందు సంధి లేకున్న దోషంబు లేదు వాక్యమనఁగా (1) ఏకక్రియాన్వితపదసమూహము. (2) పద్యపాదము. ఈయర్థమే "వాక్యాత్తగితే పదానాంచ" అను సూత్రమునందును గ్రహింపఁబడియున్నది. వాక్య శబ్దమున కర్థద్వయము గలుగుటం జేసియే యీ భిన్నాభిప్రాయములకుఁ గారణమయ్యెను. కొందఱు పద్యంబుల పాదాంతమునందుఁ గోలె పాదమధ్యమునందును వాక్యము ముగిసినచో సంధిగూర్పకున్న దోషము లేదని, "ఆ ప్పడె యతివేషము చేకొని యున్నాఁడు, ఇదుగో" నని విజయవిలాసము నందలిదని పద్యము నుదహరించుచున్నారు. ఈపద్య మిప్పటి ముద్రితగ్రంథము "చేకొని యున్నాఁడు నీకుఁ జెంతనె" అని యీపోల్పున నున్నది. ప్రయోగాంతరము మృగ్యము. మఱికొందఱు 'పాదాంతము వాక్యాంతముగ నప్పుడే మున్న యెడనే సంధివిరహంబు సాధు' వందురు. సూత్రంబును జూడ చిన్నయసూరిగారీయభిప్రాయము గలవారని తోఁచెడిని. మఱికొందఱు వాక్యావసానమైనను గాకున్నను బాదాంతమైనం జాలునందురు. ఇఁకఁ బ్రామాణిక కవుల ప్రయోగంబులు చూపెదము. పాఠకులీమూఁడభిప్రాయంబుల నేది సరియో

గ్రహింతురుగాక. "సర్వతీర్థాభిగమనంబు సర్వవేద। సమధిగమము సత్యంబుతోఁ సరియుఁ గావు। ఎఱుఁగుమెల్ల ధర్మంబులకెల్లఁ బెద్ద" యను భారతపద్య మిదివఱకు వారు పీఠికనేల యొల్లరంగీకరించియుండిరి, ఉన్నారు నన్నయభట్టు తప్పు వ్రాసినాఁడనికాఁబోలు. ఆనందముద్రాక్షరశాలవారి నాగసభాంతంబున 'సరియుఁగావ యెఱుఁగు' అని సవరింపఁబడియున్నది. ఈ ప్రకారమే కవిత్రయము వారి గ్రంథంబున పెక్కుచోట్ల సవరింపఁబడి యున్నారు "పడగనున్నహనుమ భయవిహ్వలుఁడుగాఁడు। అరిదిమునకు సూతుఁ డప్యతుండు." అను పాఠము పూర్వలాక్షణికకవిసమ్మతము. నవలాక్షణికులు 'లుంగుగాఁ డరదమున' కనియెదరు అందురుగాక. సపరిణపాఠములే సఘువులేని వీని నదాహరించిన పూర్వలాక్షణికుల యభిప్రాయమేమి?

ఎఱ్ఱాప్రెగడగారి నరసింహపురాణము—

చం॥ పొలుపుగ నెల్లనాఁడు నడివోపక పెల్లుగఁబూచు తీఁగెలన్। ఎలువులు మీఱితోయనిధి తీరవనంబులు చూడ్కి కప్పుడున్। ఎలమి యెసఁగ్గ వేల్పులచలేంద్రునిఁ గర్వముచేసితెచ్చుప॥ అ ౧ ప ౭౫. అని యున్నది. అర్థము చెడినఁ జెడుఁగాక "యెప్పుడే నెలమి" యుండు రేమో.

అందే, ఉ॥ ఎందును బుష్పసౌరభము, యెందును మందమరాళఝుంకృతుల్। ఎందును సాంద్రపల్లవము . ఆ ౨-ప ౬౨.

విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి.—

తే॥ ఇట్టి యుద్దీపన విభావహిత వినోద।విభవములఁ బొందుఁ జాళుక్య విశ్వవిభుఁడు। అలరువిల్తునిభంగి జయంతులీల। ౧-ఉల్లాసము. ప ౨౭.

తే॥ తనరు శృంగారహాస్య శాంతములు గృపయుఁ। బొసఁగు మాధుర్యమునన చెప్పుట గుణంబు। అద్భుతము రౌద్రవీర భయానకములు॥

తే॥ అర్థిసేవించి రాకకొంక అప్సరసలు। అపుడు కొండవ్యత్కిలాస మనఁగఁబరగె.
—భీమఖండము ౫ అ. ४० ప.

క॥ అర్ధకపాలము గేలను। నర్థనిశాస్వాభాముఁ గౌగిల నెడమన్। అర్థాంగ లక్ష్మిగౌరియు.. . అని భీమఖండము ౫ అ. ౧౩౦ ప.

క॥ అ వ్విబుధ జగతిలోపలఁ। గొవ్వదఱిఁగి సురగణంబు క్షోభమునొందెన్ ఇవ్విధమున నుత్పాతము. .అని నాచనసోముని ఉ. హరి ౬ ఆ. ౧౫౯ ప.

తే॥ అనలుఁ డర్కజుఁ డసురేశుఁ డబ్ధిరాజు। అనిలుఁ డర్థేశుఁ డలికలోచనుఁడు గొలువ. —వసు ౩ ఆ. ౫౮ ప.

మహాకవి ప్రయోగము లిట్టివుండుటచే సూత్రమునందలి వాక్యశబ్దమునకుఁ బాద మనియే యర్థము గ్రహించు టొప్పు.

పాదమునడుమ సంధిరారాదు. కందమున నెనిమిదిగణములు కలదే పాదము. చిన్న పాదములను భాగములుగ గణింపరాదు. సీసములందు నట్టులే ౮ గణములుగల రెండుదళములు గలసినదే పాదము.

తా త్ప ర్య ము.

ఆపురమునందలి యందఱు నింద్రియముల జయించినవారే. అందఱు సోమయాగముచేసినవారే. అందఱు నగ్నిహోత్రములు కలవారే అందఱు వారివారి వర్ణాశ్రమధర్మముల ననుసరించి కర్మములు చేయువారే. అందఱు ప్రతిదినము బ్రహ్మమును ధ్యానించువారే. అందఱు జపతపస్సంపన్నులే. అందఱు ఋషుల చర్యలు గలవారే అందఱు దయాళులే. అందఱు చక్కని నడవడి గలవారే.

ఆ॥ ఆహితాగ్ని గాని • యాతఁ డయజ్వయు, నధనుఁ డనఁడు దొంగ • యైన వాఁడు వృత్తసంకరుండు • వెదకిన దొరకఁ డా, కాలమందు నాజి•పాలనమున. ౨౬౩

వృత్తసంకరుఁడు = వర్ణాశ్రమాచార ధర్మములఁ జెఱచువాఁడు. విలోమ పద్ధతిని భిన్నజాతిస్త్రీయందు సంతానము గలవాఁడు. అధ్యయనము = జపరూపాధ్యయనము. ఆజి = అజునికుమారుఁడు, దశరథుఁడు అపత్యార్థక తద్ధితాంతము. పాలనమున = రక్షణమందు, దశరథుఁడు పాలించు దేశమందు, కాలమందు. దశరథుని తండ్రి అజుఁడు, తల్లి ఇందుమతి.

తా త్ప ర్య ము.

దశరథమహారాజు పాలించునపు డగ్నిహోత్రము లేనివాఁడు సోమయాగము చేయనివాఁడు, అల్పవిద్య అల్పధనము గలవాఁడు, పరక్షేత్రమందు బీజములు చల్లు వర్ణసంకరుఁడు, దొంగ లేఁడు.

కం॥ తమతమకర్మంబులనే, తమిఁ జేయుచు విప్రవరులు • దానాధ్యయనో త్తములయి జితేంద్రియులు సం,యమితాత్ములు నీవి గొనఁగ•నర్హులు సుమతుల్. ౨౬౪

తమిన్ = అపేక్షతో, ఈవి = దానము, కొనఁగ నర్హులు = తీసికొనుటకుఁ దగినవారు. అంతటి సత్పాత్రము లని యర్థము. అయినను దా మొకరి కిత్తురే కాని యొకరిచేఁ దాము గైకొన రని భావము. ఉత్తమబ్రాహ్మణులకు క్షత్రియులకు వైశ్యులకుఁ బ్రతిగ్రహము నిషిద్ధము.

తాత్పర్యము.

బ్రాహ్మణులు తమ వర్ణమునకు నాశ్రమమునకు శాస్త్రోక్తమైన విహితకర్మ మేదియో దానిని శ్రద్ధతోఁ జేయుచు విద్యాదానమందు నధ్యయనమం దుత్తములై వశ్యేంద్రియులు జితమనస్కులు నయి, దానమునకుఁ బాత్రులై యుండిరి.

కం॥ దీనులును జంచలులు గల,హీనులు నషడంగవిదు ల•నృతపరు లీర్ష్యా
ధీనులు నబుధులు ననయుత,దానులువ్యథితులును లేరు•తత్సమయమునన్. ౨౬౫

దీనులు = (1) దరిద్రులు, (2) భయపడువారు చంచలులు = నిలుకడలేని మనస్సుగలవారు, అషడంగవిదులు = ఆఱువేదాంగముల నెఱుఁగనివారు, అనృతపరులు = అసత్య మాడువారు, ఈర్ష్యా + అధీనులు = ఓరువలేని తనమునకు లోపడినవారు, అబుధులు = పండితులుకానివారు, అనయుత దానులు = అయుతదానులు కానివారు, అయుతము = పదివేలు. ఇచ్చట హిరణ్యదానము గ్రాహ్యము. వ్యథితులు = వ్యాధులచేఁ బీడింపఁబడువారు.

తాత్పర్యము.

చపలచిత్తులు - ఐహికాముష్మిక కార్యసాధనమునకుఁ గావలసిన దేహబలము మనోబలము లేనివారు, ఆఱంగము లెఱుఁగనివారు, అసత్యవాదులు, ఈర్ష్యగలవారు, పండితులుగానివారు, పదివేలకుఁ దక్కువదానము చేసినవారు, దుఃఖించువారు దశరథుడు పాలించు సమయమందు లేరు.

కం॥ సొగయించుచక్కఁదనముం, జిగిబిగులును లేనివారు • క్షితిపతిభక్తిన్
దగులనివారలు లేరటఁ, మగలందును మగువలందు • మాటకునైనన్. ౨౬౬

సొగయించు = మోహముచేఁ బరవశులఁ జేయు, జిగిబిగులు = దట్టమైన కాంతులు - మగువలందు = స్త్రీలయందు.

కం॥ మగవానికి మగవాఁడును, మగువకు మగువయును వలచు మఱి యెట్లన్నన్
నగరపు రాజకుమారుల,జిగిబిగిసోయగము చెలుల సింగారంబుల్. వి జ వి లా.

తాత్పర్యము.

స్త్రీలు స్త్రీలను బురుషులు పురుషులనుగూడఁ బరవశులఁజేయు చక్కఁదనపు గాంతులులేని వారు మాటమాత్రమునకైనను స్త్రీలయందును లేరు; పురుషులందును లేరు. రాజభక్తిలేనివారును లేరు.

తే॥ దేవతాతిథిపూజల • దీక్షితులును, గృతమెఱింగినవారలు • నీగి గలరు
శౌర్యవిక్రమవంతులు • సత్యధనులు, నాల్గువర్ణంబులందలి•నరులు పురిని. ౨౬౭

దీక్షితులు = దేవపూజ యతిథిపూజ చేయుట యను దీక్షగలవారు. కృతమును = చేసిన యుపకారమును, ఈగి = దానమును, కలరు = కలిగినవారు, సత్యధనలు = సత్యవ్రతమే ధనముగాఁగలవారు, పూర్వము పరిచయములేక యొకరాత్రి భోజనమునకై యితరుల యిండ్లనందు బ్రాహ్మణుఁడు అతిథి, పూర్వపరిచితుఁడు అభ్యాగతుఁడు. స్వధర్మయుక్తం కుటుంబినమభ్యాగచ్ఛతి ధర్మపురస్సారో నాన్న ప్రయోజనః, సోఽతిథిర్భవతి - ఇతి ధర్మ పురస్సారః కృత్యా ద్యనుష్ఠానం పురస్కృత్య తత్సిద్ధ్యర్థం యాచ్ఞాపరః ఇత్యర్థః. అభ్యాగతస్త్వన్నమాత్రార్థిత్వాత్. అన్నమునకై కాక యజ్ఞాదులు చేసెద నని యాచించువాఁ డతిథి. అన్నముమాత్రము గోరువాఁ డభ్యాగతుఁడు

"ఏకరాత్రంతు నివసన్నతిథిః బ్రాహ్మణస్స్మృతః అనిత్యం హి స్థితో యస్మాత్తస్మాదతిథి రుచ్యతే" — మనువు

పరగృహంబున నొకరాత్రి మాత్రమే వసించు బ్రాహ్మణుఁ డతిథి యనఁబడును. అతఁ డొక దినమైనను నొకచోట నిలుకడగ నుండఁడు గనుక నతిథి యనఁబడును ఒక గ్రామమందే యుండువాఁడు, విచిత్రకథలు, ప్రొద్దుపోని ముచ్చటలు జీవనార్థమై చెప్పువాఁడు, భార్యాగ్ని రహితుఁడై దేశము తిరుగువాఁడు నతిథి యనఁబడఁడు.

తాత్పర్యము.

ఆపట్టనమునందలి నాలుగు వర్ణములవారైన, దేవపూజ చేయక యతిథి వచ్చిన నాదరింపక ముందు భోజనము చేయరు. ఇది వారిదీక్ష. పరులు తమకుఁ జేసిన మేలు మఱువరు. ఎవరైన దేహి యనిన నాస్తియనరు.

శౌర్యపరాక్రమములుగలవారు. సత్యమే ధనముగాఁగలవారు. ధనమువలె సత్యమును గాపాడుకొనువారు. శూద్రులు తాంత్రికమంత్రములతో దేవపూజయు హిరణ్యాదానముతో నతిథిపూజయుఁ జేయుదురు. బ్రాహ్మణులు విద్యాశూరులు - వాదపరాక్రములు.

ఆ॥ సత్య శీలధర్మ • సంశ్రితవ్రతు లాప్త, చిరతరాయులుగ న • శేషజనులు
సుతులతోడఁ బౌత్ర • తతులతో సతులతో, నొప్పు చుందు రన్ని • యొప్పిదముల. ౨౬౮

సంశ్రితవ్రతులు = పొందఁబడిన (అనుష్ఠింపఁబడిన) వ్రతముగలవారు. కావుననే, ఆప్త =పొందఁబడిన. చిరతర ఆయులు = మిక్కిలిదీర్ఘమైన యాయువులు గలవారు.

తా త్ప ర్య ము.

సత్యము = సదాచారము, ధర్మము. వీనిని విడువరాని వ్రతముగాఁగల వారు కావుననే దీర్ఘాయువులు. — ఈమూఁడును నాయుర్వృద్ధి కారణములే. కావుననే అంగ్ల జనులు పుత్రులతో, పౌత్రులతో, భార్యలతోఁగూడి, సకల సుఖములు గలవారై యుండిరి. సత్యసదాచారములవలన నాయువు పెరుగును. ధర్మమువలన నర్థకామాభివృద్ధి.

చం॥ ధరణిసురోపదిష్టవిధి•తత్పరులై చరియింత్రు క్షత్రియుల్
ధరణిధవానుకూలురై సతంబుఁ జరింతురు వైశ్యవర్యులున్
ధరణిసురాళి క్షత్రియవి•తానము నర్యుల సేవఁ దన్పుచున్
బరమపవిత్రులై యనఘ•శూద్రులు పొల్తురు నైజవృత్తులన్. ౨౯

క్షత్రియులు - ధరణిసుర + ఉపదిష్ట = బ్రాహ్మణులచేఁ జెప్పబడిన, విధి = కార్యములందు, తత్పరులై = ఆసక్తిగలవారై, చరియింత్రు = నడతురు, వైశ్య వరులు = శ్రేష్ఠులగుకోమట్లు, సతంబు = ఎల్లప్పుడు, అనరవర్ణులు = శూద్రులు, అర్యులన్ = కోమటులను, సేవన్ = పరిచర్యచేత, తన్పుచున్ = తృప్తిపఱచుచు, నైజవృత్తులన్ = సహజములగు వారి వారి కులవిద్యలచే; పరమ పవిత్రులై = వినయముచేతను దురహంకారము లేమిచేతను మిగుల శుభ్రులై, పొల్తురు = ప్రకాశింతురు

తా త్ప ర్య ము.

బ్రాహ్మణు లుపదేశించిన కార్యములందు నాసక్తి గలవారై క్షత్రియులు వర్తించుచుండిరి. రాజుల కనుకూలురై వైశ్యులుండిరి. బ్రాహ్మణక్షత్రియ వైశులకు సేవసేయుచు వంచనము దొంగతనము లేక శూద్రులును, నడఁకువ బ్రతుకుపాటునకై వారి వారి కులవిద్యలు నేర్చి కులవృత్తులయం దుండిరి.

క॥ కందరముల సింహము లన,నందురు దావాగ్నిసములు•యోధు లకుటిలుల్
మందరధృతిబంధురబల, మందిరు లన వన్నెకెక్కు•మహితౌజస్కుల్. ౨౧

ఈపట్టణమునఁగల చతురంగసేనను జెప్పఁదలఁచి మొదటఁ గాల్బలమును జెప్పుచున్నాఁడు.

దావ + అగ్ని = కారుచిచ్చుతో,సములు=సమానులు,దవము-హా-దావము. అకుటిలుల్ = వంకరబుద్ధిలేనివారు, మందరధృతి = మందర పర్వతముయొక్క ధైర్యమువంటి ధైర్యమునకును, బంధురబల = అధికమైన దేహబలమునకును, మందిరులు = స్థానములైనవారు, మహిత + ఓజస్కుల్ = పూజింపఁదగిన

నుత్సాహముగలవారు, యోధులు = యుద్ధవీరులు. కందరములన్ = గుహల యందు.

తాత్పర్యము.

గుహలయందు సింహములవలె యుద్ధభటులు కారుచిచ్చు వంటి తేజము గలవారై, మందరమువంటి ధైర్యముగలవారై, యెన్ని ప్రిప్పులుపడినను కార్య మొనగూర్చుచు దానికి తగిన దేహబల మనోబలములు గలవారై మిక్కిలి యుత్సాహవంతులై యుండిరి

క౦॥ కాంభోజ బాహ్లిక క్షితి, సంభూతవనాయుజత • సైంధవతతుల
య్యంభోజ బాంధవాశ్వము, జంభారిహయంబు గెలుచు ♦ జవనాధికతన్. ౨౮౧

ఇంక నశ్వముల పూర్తి చెప్పుచున్నాడు కాంభోజ బాహ్లికములని కొన్ని దేశ ములకుం బేర్లు బాహ్లికమిప్పుడు బాల్ Balkh యని పలుకంబడు చున్నది. క్షితి= భూమియందు, అనగా దేశములందు, సంభూత- పుట్టినవియును, వనాయుజ = వనాయు (అరేబియా) దేశమునం బుట్టినవియు నగు, సైంధవ = సింధు దేశమునం బుట్టినగుఱ్ఱములు, జవన + అధికత = వేగము యొక్క యతిశయముచే, అంభోజ బాంధవ = కమలములకు బంధువైన సూర్యునియొక్క, అశ్వమును = గుఱ్ఱ ములను ఉచ్చైశ్శ్రవసము. జంభ + అరి= జంభాసురుని శత్రువగు నింద్రునియొక్క, హయము = గుఱ్ఱమును - ఉచ్చైశ్శ్రవమును, శిలాశాసనములలోన కొన్ని దేవనాగరలిపి ముద్రించినవానిలోను కాంభోజ యనియే యున్నది. దేవ నాగరమున బొంబాయి యందు ముద్రించిన వానిలో కాంభోజ యని యున్నది. సింధునదికి పడమటి దేశ మంతయు గుఱ్ఱములకుం బ్రసిద్ధికెక్కి నది తురకి అనంగా పెరుగును గుఱ్ఱము ఇది యు తురకి దేశమునుండి వచ్చిన పేరే. ఈ తురకిదేశమే యిప్పుడు టర్కి (Turkey) యని యింగ్లీషుల నోటం బడి యియినది. వ్రాసినట్లు దగిపిన తురకి యనియే యగును గాని వారి యుచ్చా రణ పద్ధతిలో శబ్దస్వరూపము లేక మారుచున్నవి. ఈతురకి యనునది తురగ శబ్దభవము. మంచి గుఱ్ఱములుం గల దేశము తురకి (తురగి).

Kamboja was probably situated somewhere North of the Hindu Kush and Kashmir Prof Lassen surmises that this name is etymologically connected with Cambyses which is in the cunic form inscriptions of Behistan is written "Ka (m) buja"

The great poet Kalidasa places Kamboja to the North of Himalayas"—Raghu Vamsa Ch IV. 69"

—Geography of Ancient India.

తాత్పర్యము.

దశరథుసేనయందలి గుఱ్ఱములు కాంభోజ బాహ్లికదేశములందుఁ బుట్టినవియు వనాయువు (అరేబియా) దేశమునందుఁ బుట్టినవియు నై సూర్యుని గుఱ్ఱములకంటెను ఇంద్రుని యుచ్చైశ్శ్రవముకంటెఁ ద్వరగాఁ బోవునవి.

తే॥ అచటఁ దనరారుదిగిభాన్వ•యప్రథములు,మదయుతంబులుశక్తిస•మన్వితములు
వింధ్యహిమశైలభవములు•విశ్రుతములు, నైన గజములు వేనవే•లసమమిాఱి• ౨౭ ౨

ఇఁక గజబలపూర్తిని జెప్పుచున్నాఁడు.

దిక్ + ఇభ = దిగ్గజములయొక్క, అన్వయ = వంశమున, ప్రథములు=మేలైన వని కీర్తి కెక్కినవి, దిగ్గజముల వంశజాతులని ప్రసిద్ధిగల వని భావము, నీహార పర్వత = హిమాలయమందు, ఆవిర్భవములు = పుట్టినవి, అసము = కీర్తి, యశము - వికృతి - అసము, వేనవేలు=వేలు + వేలు, పెక్కువేలు, తనరారుట = ఒప్పును, రెండవపాదంబునఁ బ్రాదియతి. మదయుతములు- ఏనుఁగులు మదించినపుడు వానిదేహమందు నీళ్లులుగాఱును. దానికి మదమనిపేరు. "శ్లో. దానం కపోలయోస్సీధు, రక్ష్ణోశ్శ్రుత్యోస్తు సాగరః। కరాగ్రే శీకరస్సిక్యం, స్తనాగ్రే మేహనే మదః। హృదయే ఘర్మసలిలం మేఘుస్తు చరణవ్రజే। సంజ్ఞయాష్టమదా హ్యేతే, జాయంతే భద్రదంతినామ్". ——అమరశేషము.

ఏనుఁగులకుఁ జెక్కిళ్లనుండి దానమని, కన్నులనుండి సీధు వని చెవులనుండి సాగర మని, తొండము కొననుండి శీకర మని, స్తనముల కొనలనుండి సిక్య మని మేహనము (శిశ్నము) నండి మద మని హృదయమునుండి ఘర్మ మని, పాదముల నండి మేఘ మని యెనిమిది విధముల మదపు నీళ్లులు స్రవించును.

తే. భద్రమంద్రమృగంబులు • భద్రములును
మంద్రములు మృగములు భద్ర•మంద్రములును
దగఁగ మృగమంద్రములు భద్ర•మృగము లనఁగ
నచలసన్నిభ మదకరు • లందుఁ గలవు. ౨౩

గజజాతి భేదములను జెప్పుచున్నాఁడు. భద్రము, మంద్రము, మృగము. ఈమూఁడు శుద్ధజాతులు. తక్కినవి మిశ్రజాతులు. అచలసన్నిభ = పర్వతముతో సమానములైన, కరులు = ఏనుఁగులు, రథబల మిటఁ జెప్పకున్నను నింతమాత్రమున నదియు నూహింపఁదగినది. భద్రమంద్ర, భద్రమృగ, మృగమంద్రము లనునవి ఆరెంటి ప్రకృతిగల సంకీర్ణజాతులు. అనఁగా భద్రములకు మంద్రములకుఁ బుట్టినవి భద్రమంద్రములు. ఇట్లే తక్కినవి. భద్రమంద్రమృగము త్రిప్రకృతికములైన సంకీర్ణజాతులు.

తా త్ప ర్య ము.

"భద్రోమంద్రోమృగశ్చేతి విజ్ఞేయాస్త్రివిధాగజా" యని హలాయుధుఁడు. భద్రమని మంద్రమని మృగమని యేనుఁగులందు మూఁడు జతులు గలవు భద్రములు - మంద్రములు - మృగములు - భద్రమంద్రములు-మృగమంద్రములు - భద్రమృగములు - భద్రమంద్రమృగములు నను శుద్ధజాతి సంకీర్ణజాతి యేనుఁగులు కొండలవంటివి గలవు.

"అంగప్రత్యంగ భద్రత్వం, సంశ్లిష్టం భద్రలక్షణమ్ । పృథుత్వం శ్లథతా స్థౌల్యం, సంశ్లిష్టం మంద్రలక్షణమ్ । తనుప్రత్యంగ దీర్ఘశ్చ, ప్రాయోమృగగణోమతః"

భద్రజాతిగజమునకు వక్షము విశాలము, చెవులు పెద్దవి, తోఁక నిడివి, ధైర్యము మెండు, శ్రమమోర్చును. మంద్రము నలుపు పచ్చని కన్నులు. వశపడుట కష్టము. మృగము చర్మము తెలుపుమచ్చ లుండును.

శ్లో॥ నాసౌసుతో యత్ర గుణా నసంతలి, । నాసౌబుధో యేన తపో నతప్తమ్ ।
నాసౌపుమాన్యస్య వశా నభార్యా । నాసౌనృపో యస్య నశా ననాగాః॥

గుణములులేనివాఁడు కొడుకుగాఁడు. తపస్సులేనివాఁడు తెలిసిన పండితుఁడు గాఁడు. భార్యను వశమం దుంచుకోలేనివాఁడు మగవాఁడు కాఁడు. ఏనుఁగులు లేనివాఁడు రాజుఁగాడు.

చంద్రహీనా యథా రాత్రి । సస్యహీనా యథామహీ ।
గజహీనా తథా సేనా । భర్తృహీనా యథాంగనా॥

చంద్రుఁడులేని రాత్రి, పైరుపండని భూమి, మగఁడులేని స్త్రీ యెట్లో యేనుఁగలులేని సేన యట్లు.

కావునఁ బూర్వపురాజులు విశేషించి యేనుగులఁ బెంచుచుండిరి.

తే॥ ఆమడలు రెండు నెటు మాడ • సార్థకాభి,ధానమయి యొప్పునాయయో • ధ్యాపురంబు
శక్రుఁ డమరావతిని బోలె • సారసారి,ఋక్షములయట్లు శమితారి • యేలుచుండె ౨౨౪

సార్థకాభిధానము = అర్థముతోఁగూడిన పేరుగలది, శక్రుఁడు = ఇంద్రుఁడు, సారసారి = చంద్రుఁడు, ఋక్షములయట్లు = నక్షత్రములవలె, శమితారి = అణఁపఁబడిన శత్రువులు గలవాఁడు, శత్రువులను లోఁచుకొనువాఁడు, అయోధ్యా = యుద్ధమందు జయింప సాధ్యముకానిది. అని పదమున కర్థము. వాస్తవమున నా నగరమిట్టిదే కావున దాని కాపేరు తగినది.

తా త్ప ర్య ము.

ఏప్రక్కఁజూచినను రెండామడ నిడివికలిగి శత్రువులకు జయింపరానిది యను పేరునకుఁ దగినదై యొప్పు నయోధ్యానగరమున, అమరావతీనగరమును ఇంద్రునివలె, చుక్కలను చంద్రునివలె, దశరథుఁడు పాలించుచుండెను.

ఉ॥ మంతులు మంతుగల్గు మతి•మంతులు నింగితశీల సత్కళో
వంతులు ధర్మలోలగుణ•వంతులు లోకహితానుకారి ధీ
మంతులు న్యాయవంతులు న•మంతులు మంత్రసుతంత్ర సత్కళా
వంతులు శౌచవంతులు నృ•పాలకభక్తి నలంతు లెంతయున్. ౨౭౫

ఇఁక రాజమంత్రులు వర్ణింపఁబడుచున్నారు.

మంతులు = మంత్రులు - మంత్రిశబ్దభవము మంతి. మంతుకెక్కు = ప్రసిద్ధికెక్కిన, మతిమంతులు=బుద్ధిమంతులు, ఇంగితశీల సద్యశోవంతులు = ముఖము చూడఁగానే యెదుటివాని యభిప్రాయము తెలిసికొనుశక్తి, మంచి నడవడి, మంచికీర్తి గలవారు, ధర్మలోలగుణవంతులు = ధర్మమునం దాసక్తిగల గుణము గలవారు, లోకహితానుకారి ధీమంతులు = ప్రజలకు మేలుచేయ వలయునను బుద్ధిగలవారు, న్యాయవంతులు = న్యాయమం దుండువారు, అమంతులు = అపరాధములేనివారు, మంత్రతంత్ర సుకళావంతులు = మంచి యాలోచనము, ఆయాలోచనము నెఱవేర్చు నుపాయము నను విద్య చక్కఁగాఁ దెలిసినవారు, శౌచవంతులు=పరిశుద్ధమైన భావముగలవారు, నృపాలకభక్తిఁ = రాజభక్తి యందు, నలంతులు = సమర్థులు, మంత్రము = ఆలోచించువాని రక్షించునది.

తా త్ప ర్య ము.

దశరథమహారాజుమంత్రులు బుద్ధిమంతులు, ప్రసిద్ధికెక్కినవారు, పరాభిప్రాయము వారిని జూచినంతమాత్రముననే తెలిసికొనఁగలవారు. సదాచార సంపత్తిగలవారు, ధర్మమందాసక్తి గలవారు, లోకమునకు మేలుచేయు నాలోచన గలవారు, న్యాయమం దుండువారు, అపరాధములు లేనివారు, ఆలోచన చేయుట యందును చేసిన నాలోచన కార్యముగాఁ బరిణమింపఁ జేయుటయందును సామర్థ్యము గలవారు, ప్రజలవలన లంచములు తీసికొనటగాని రాజద్రవ్యమపహరింత మనిగాని యభిప్రాయము లేనివారు, మిక్కిలి రాజభక్తిగలవారై యుండిరి.

తే॥ అర్థసాధక విజయసి•ద్ధార్థు లనఁగ, ధృష్టియు జయంతుఁ డనఁగను • ధీరగుణులు
మంత్రపాలుఁడశోకుండు•మంత్రులయిరి,సుజియునందష్టముండును•మంత్రుఁడయ్యె. ౨౭౬

మంత్రులపేర్లు చెప్పుచున్నాఁడు - (౧) ధృష్టి (౨) జయంతుఁడు (౩) విజయుఁడు (౪) సిద్ధార్థుఁడు (౫) అర్థసాధకుఁడు (౬) అశోకుఁడు (౭) మంత్రపాలుఁడు (౮) సుమంత్రుఁడు వీ రెనమండ్రు మంత్రులు. ౪. సురాష్ట్రుఁడు. ౫. రాష్ట్రవర్ధనుఁడు. ౭. ధర్మపాలకుఁడు - ఈప్రకారము పాఠభేదము గలదు.

తాత్పర్యము.

అర్థసాధకుఁడు - విజయుఁడు - సిద్ధార్థుఁడు - ధృష్టి - జయంతుఁడు - మంత్రపాలుఁడు-అశోకుఁడు సనవా రేగురును సనిమిదనవాఁడు సుమంత్రుఁడును దశరథునకు మంత్రులై యుండిరి.

శ్లో॥ ధృష్టిర్జయంతో విజయ స్సురాష్ట్రో రాష్ట్రవర్ధనః ।
అశోకో ధర్మపాలశ్చ సుమంత్ర శ్చాష్టమ స్స్మృతః॥

ఏడుగురి నొకటిగాఁ జెప్పి సుమంత్రు నొకని వేఱుగాఁ జెప్పుటచే వారందఱొకయెత్తు సుమంత్రుఁ డొక యెత్తని భావము. అందఱికంటె వీఁడే దశరథునకుఁ జాల ముఖ్యుఁడు. వీని కంతఃపురప్రవేశమందు నధికారము కలదు.

కం॥ హితులై రవివంశపురో, హితులై తద్రాజవృద్ధి•హితకర్ములై
నతిఁగాంచి రల వసిష్ఠుఁడు, మతిమంతుఁడు వామదేవ•మౌనీంద్రుండున్. ౨౭

హితులు = మేలుకోరువారు, తద్రాజవృద్ధికి = ఆసూర్యవంశపురాజుల వృద్ధికి, హితకర్ములై = హితములైన కార్యములు చేయువారై, వసిష్ఠ వామదేవాదులు పురోహితులు- మంత్రులు. "హితులు భిషగ్విజ్ఞబుధ, బృంద కవీంద్ర పురోహితుల్" ఆముక్త. అన్నట్లు వీరెప్పటికి రాజు మేలే కోరుచుందురు. హితములైన శాంతిపౌష్టికాది కర్మములందు ముందుంచఁబడువాఁడు కావునఁ బురోహితుఁడయ్యె

తాత్పర్యము.

వసిష్ఠుఁడు వామదేవుఁడు నిరువురు రాజపురోహితులు. వీరు సూర్యవంశపురోహితులై రాజుల మేలుకోరుచు వారికి వృద్ధికరములైన కర్మములు చేయుచుందురు.

సీ॥ ఆన్వీక్షికత్రయీ•ఖ్యాతవిద్యల నెల్లఁ, జక్కఁగా నేర్చి ప్ర•శస్తి నొంది
చేయఁగా రానట్టి•చేఁత లజ్జఘులై, నియతేంద్రియులు శుభ • నీతివిదులు
భాగ్యభోగాభోగ•భాక్కులౌచుఁ గుశాగ్ర,బుద్ధులై శాస్త్రప్ర•బుద్ధు లగుచు
నప్రతిహతవిక్ర•మాన్వితులై కీర్తి, మంతులై రాజ్యక•ర్మంబులందుఁ
తే॥ ద్రికరణంబుల నొక్కులై • తేజరిలుచు, నఱలి సుస్మితపూర్వాభి•భాషు లగుచు
బలిమిఁగలుములమిగులఁబ్రా•భవముఁగనుచు, మహిమ వెలసిరి దశరథు•మంత్రివరులు.
౨౮

అన్వీక్షికీత్రయీవ్యాఖ్యాత = అన్వీక్షికి యనియు, త్రయి యనియు ప్రసిద్ధము లగు- అన్వీక్షికి = తర్కము. త్రయి=వేదము. వార్త = వ్యవహారము. దండనీతి = శిక్షాశాస్త్రము. విద్యలనెల్ల = రాజనీతివిద్యల నన్నిటిని. ఎల్ల ననుటచే వార్తయు దండనీతియు గ్రాహ్యములు. ప్రశస్తి = ప్రఖ్యాతి. చేఁతల = పనిచే, లజ్జాళులై = సిగ్గుపడువారై, నియత = (1) మంచిమార్గమునఁ గట్టఁబడిన; (2) చెడుత్రోవలనుండి మరలిన, భాగ్య = అదృష్టముచేత, భోగ + ఆభోగ = భోగములయొక్క విస్తారమును, భాక్కులు = పొందినవారు. కుశ, అగ్ర, బుద్ధులు=దర్భకొనవలెమిగులసూక్ష్మమైనబుద్ధిగలవారు. శాస్త్రప్రబుద్ధులు = ప్రబుద్ధములగు శాస్త్రములు కలవారని విగ్రహము. ఆహితాగ్ని శబ్దమునవలెఁ గ్తాంతమునకు బహువ్రీహిని పరనిపాతము, చక్కగా నెఱుఁగఁబడిన శాస్త్రములుగలవారు. అప్రతిహత = ఎదురులేని, త్రికరణంబులఁ = మనోవాక్కాయములయందు, తేజరిలుచుఁ = ప్రకాశించుచు. ఎంచకుంటవలె మనస్సున నొక్కటి తలఁచి నోటితో వేఱొకటి చెప్పి కార్యము మఱియొకవిధముగాఁ జేయువారు గారని భావము. వఱలి = ప్రకాశించి, సుస్మిత = మంచినవ్వు, విషపు నవ్వుగాదు. పూర్వ = ముందుగాఁ గలుగునట్లు, అభిభాషులు = జనవుతో మాటలాడువారు, సంతోషముతో పరిచితులవలెఁ జనవుతో మాటలాడుదురని భావము. (2) ఎదుటివారికి సంతోషము కలుగునట్లు మాట్లాడువారు, బలిమికలుములఁ = బలసంపదలచేత, ప్రాభవముఁ = గొప్పతనమును. లజ్జాళువునకు లజ్జాళులు, లజ్జాళురు అని బహువచనము రెండురూపంబులు. కడు దయాళురు దేవతాగణములెల్ల నని శ్రీనాథుఁడు.

తాత్పర్యము.

అన్వీక్షికి - త్రయి - వార్త - దండనీతి యనెడు నాలుగు రాజవిద్యలనెల్ల నేర్చి వానియందుఁ బ్రఖ్యాతులై చేయరానిపని చేయుటకు సిగ్గుపడువారై యింద్రియచపలతలేక మంచినీతిమార్గము తెలిసినవారై విస్తారభాగ్యమును భోగమును గలవారై బుద్ధిసూక్ష్మతగలవారై శాస్త్రజ్ఞానము చక్కఁగాఁ గలిగి విక్రమమందు నెదురులేనివారై మంచియశస్సు సంపాదించి రాజకార్యములందు మనోవాక్కాయముల నొక్కటిగఁ బ్రవర్తించుచు, తమ్ముఁ జూడవచ్చినవారితో సంతోషముతో నవ్వుచుఁ దామే ముందుఁ బలుకరించుచు బలసంపదలు గలిగి దశరథుమంత్రులు గొప్పతనముచేఁ బ్రకాశించుచుండిరి.

౬౦॥ కామంబున నైనను ధన,కామంబున నైనఁ గ్రోధ•గరిమన యేనిన్
నేమంబుఁ దప్పి కల్లల, నామంత్రులు వలుక రెట్టి•యవసరములలోన్. ౨౭౫

కామంబునన్ = స్త్రీలయందలి యభిలాషచే, ధనకామంబునన్ = ధనాశచేత; క్రోధగరిమన్ = కోపాతిశయముచే, నేమము = సత్యమే మాటలాడవలయును - న్యాయముననే వర్తింపవలయును అను నియమమును, ఎట్టియవసరముల లోన్ = ప్రాణము పోవునంతటి కష్టకాలము వచ్చినను, నియమ శ్రద్ధయవము నేమము.

తాత్పర్యము.

స్త్రీలయందలి కోరికచేఁగాని ధనాశచేఁగాని కోపముచేఁగాని యామంత్రులు ప్రాణము పోవునంత యాపదలందైనను నియమమును దప్పి యసత్యములు పలుకరు.

సీ॥ చారమూలంబు వి♦చారణమూలంబు, గా నాత్మపరరాష్ట్ర♦కాండజనులు
సలిపిన సలిపెడి ♦ సలుప నెంచిన పనుల్, గల్గదు వారెఱుం♦గని లోకంపు
వ్యవహారకుశలులు ♦ పరమసౌహృదమున, సుపరీక్షితులు పరి♦శుద్ధమతులు
తప్పుగల్గినఁ దమ♦తనయులనైనను, దండింప కుండరు ♦ దండనీతి
తే॥ నర్థసంగ్రహకుశలతే ♦ నఖిలసైన్య,వి త్తదానంబునను గాపు♦వి ధమునందు
నప్రమాదులు శత్రువు♦లైన నిరప,రాధు దండితుఁ జేయ రీ♦ రసముఁ బూని. ౨౮౦

ఆత్మ = తమ, పర = ఇతరులయొక్క, రాష్ట్ర = రాజ్యములయొక్క, కాండ= సమూహమునందలి జనులు, చారమూలముగాన్ = వేఁగువాండ్రవలన, విచారణమూలంబుగా విన్నదాని నాలోచించుటచేతను, వ్యవహార = నిశ్చయించిన యర్థములఁ జక్కఁగా వివరించి తెలుపుటయందు, కుశలులు= నేర్పరులు, సౌహృదము = స్నేహము, సుపరీక్షితులు = దశరథునిచేత నని యధ్యాహారము, అర్థసంగ్రహ=రాజు బొక్కసమున ధనముగూడఁబెట్టుటయందలి, విత్తదానంబులన్= ధన మిచ్చి పోషించుటయందు, కాపు వితంబునన్ = జనుల రక్షించు విధము నందు, అప్రమాదులు=పొరపాటులేనివారు, ఈరసము = ఈర్ష్య - ఓర్వలేనితనమును, దండితున్ =శిక్షింపఁబడిన వానినిగాఁ జేయరు దండింప రనుట.

తాత్పర్యము.

స్వరాష్ట్రమందును బరరాష్ట్రమందును జరిగినవి జరుగుచున్నవి జరుగఁబోవునవి వేగులవారివలన వార్త తెప్పించుకొని, విని, విన్నవాని నాలోచించి యెట్లెట్లు వర్తింపవలయునో యట్లు వర్తింతురే కాని వారికిఁ దెలియక వారి రాష్ట్రమందుఁ బరరాష్ట్రమందు జరగునది యేదియులేదు వ్యవహారమందు మంచి సమర్థులు. వీరిస్నేహ మెంతమాత్రము నిర్వంచనమో తెలిసికొనఁగోరి దశరథుఁడు రహస్యముగాఁ జేసిన పరీక్షలందు నిష్కలంకముగఁ బరిశుద్ధు లనితీర్మానింపఁబడినవారు. పరీక్షాసమయమందే కాక తక్కిన వేళలందును బరిశుద్ధమైన మనస్సుగలవారు. దోషము కనఁబడినా తమ పెద్దకొడుకునైన దండిం

పక విడువరు. రాజునకై ధనార్జనమునందును, సేవలకు జీతములు బత్తెములు బహుమానములు తగినసమయంబుల నిచ్చుటయందును, సంపాదించిన ధనము వ్యర్థముగాక రక్షించుటయందును, సమర్థులై ప్రమాదములేక వర్తింతురు. దోషము చేయని శత్రువును శత్రువుగా నున్నంతమాత్రముచే బక్కెకదా యని నిష్కారణముగ కోపముతో దండింపరు.

కం॥ వీరులు సతతోత్సాహులు, పారగతనృపాలశాస్త్ర♦వాసులు శుచు ల
పౌరజనంబులఁ బ్రోతు రు,దారులు ధీరులు దశరథ♦ధరణీపుమంత్రుల్. ౨౮౧

సతత + ఉత్సాహులు=శత్రుజయమునందు నెప్పుడు నుత్సాహము కలవారు, పారగత = తుదికాంచిన, నృపాల శాస్త్రవాసులు = నీతిశాస్త్రమును గల వారు, అయనుష్ఠానఫల మేమన, శుచులు = నిర్దోషులు, ధరణీపు = రాజుయొక్క.

తాత్పర్యము.

దశరథరాజుమంత్రులు సభయం దుండి యాలోచనలు చెప్పుటమాత్రమే కాక యుద్ధసమయంబున వీరులై యుద్ధముచేయువారు. శత్రుజయంబునందు మిత్రరక్షణమందు సర్వదా యుత్సాహవంతులు. రాజనీతిశాస్త్రము నెల్ల సమగ్రముగాఁ జదివినవారు కావుననే శుచులు. పురజనుల ధర్మపద్ధతిని రక్షింతురు. ఔదార్యము గలవారు ధైర్యవంతులు.

ఉ॥ నేరము లేకయున్న నొక♦నిష్కము దండుగు దీయ రేయెడన్
నేరము గల్గినం బరిగ♦ణించి బలాబల తారతమ్యముల్
వారక విప్రరాట్కుల♦పర్యులయెుద్దనయేనిఁ దీసి భం
డారముఁ గోశముల్ లసదు♦పాయులు నింతురు ధర్మకర్తులై. ౨౮౨

నిష్కము = అరవరహా, దండుగు = అపరాధమునకుఁగా నపరాధివలనఁ దీసెడి ధనము, బల + అబల = నేరములందు గొప్పకొంచెముల యొక్క -(2) అపరాధుల శక్త్యశక్తులయొక్క, తారతమ్యముల్ = వాసిని, పరిగణించి = ఆలోచించి, గొప్పనేరము చేసినవానికిని, గొప్పబలము గలవానికిని శిక్షయెక్కువ, అల్పమైన నేరము చేసినవానికిని బలహీనునకును శిక్షతక్కువ, వారక = విడువక, విప్రరాట్ = బ్రాహ్మణులయొక్కయు క్షత్రియులయొక్కయు, కోశముల్ = బండారముగ, లసత్ + ఉపాయము = ఎప్పటికి కప్పుడు తోఁచు నుపాయము గలవారు.

తాత్పర్యము.

దోషి యని క్రిందివా రొక రొకనియందు నేరముమోపి పంపినను తమ విచారణమందు వారియందు నేరములేకయున్న నొక నిష్కమైనను వానికి దండుగు విధింపరు. దోషము కనఁబడినా వాఁడు బ్రాహ్మణుఁడైనను క్షత్రియుఁడైనను

నేరము ? లాబలములు దోషియొక్క శక్తి సామర్థ్యము లాలోచించి నేరమునకు దోషి యోగ్యతకుఁ దగిన దండుగు ధర్మశాస్త్రప్రకారము విధించి యట్టి ధనముచే బండారము నింతురు. బొక్కసము నిండవలె నని పెక్కురీతులగు దండనలు విధింపరు

కం॥ సుద్దుల మఱి బుద్ధుల నొక, యుద్దిగఁ బ్రెగ్గడలు గలసి ♦ యొద్దిక నందున్
బద్దులు పలికెడి మనుజుఁడు, పద్దునకైన లేఁడు పురిని ♦ బల్లెలయందున్. ౨౮౩

ప్రెగ్గడలు = మంత్రులు హా - ప్రగడలు "ప్రెగ్గడపట్టులకు రాజు ప్రియుఁడై మఱితా నెగ్గు ప్రజ కాచరించుట" "పిఱికివిగాక నీవు నొక ప్రెగ్గడవే" నా. ఉత్తహారి 'ప్రెగడలకుం జెప్పి తీర్పు నంపెప్పుడుఁగన్' భా-ఉద్యో ౨ ఆ. ప్రగడ, ప్రెగ్గడ అనునవి యపశబ్దములు, ఉద్దిగ = సమానముగ, ఒద్దిక = అనుకూల్యము. ఒకరి యిష్టప్రకారము మఱియొకరు పోవుట బద్దులు = అసత్యములు పద్దునకు = లెక్కకైనను. సూక్తిశబ్దభవము సుద్ది - మంచిమాట బుద్ధి భవము బుద్ది.

తాత్పర్యము.

మంచిమాటలయందున, ఆలోచన యందును మంత్రులతో నైకమత్యముగల వారై యొద్దికతో నుందురు. అసత్యములాడువాఁడు పట్టణమునందుఁగాని పల్లెలందుఁగాని లేఁడు.

కం॥ దుష్టులు వెలిచవి మఱగిన, భ్రష్టులు లేరపురమున ♦ రాష్ట్రమునఁ దుర్
శిష్టులు సువేషపటయుత, పుష్టులు నృపహితచరిష్ణువులు నగ్రవిహృల్. ౩౮౪

వెలిచవిని = అంకుతనమును, మరిగిన = అభ్యాసపడిన, భ్రష్టులు = కులము నుండి పుణ్యలోకమునుండి పడినవారు, సు వేష పట - మంచి యలంకారముతోను మంచి వస్త్రములతోను, యుత = కూడినవారైన. నృపహితచరిష్ణువులు = రాజునకు మేలగు పనులయందు సంచరించువారు.

తాత్పర్యము.

చెడునడవడి గలవారును, అంకుతనమును మరిగి కులము నుండియుఁ బుణ్యలోకమునుండియుఁ బడి యధమదశకువచ్చినవారు రాష్ట్రమందుఁగాని నగరమందుఁగాని లేరు. లంచ దుర్గుణములు గలవారు. మంచియలంకారములు వస్త్రములుగలవారై దేహపుష్టికలవారై రాజునకు మేలుగలుగు కార్యములందు సంచరించువారై యుండిరి.

చం॥ గురువులయందు నున్నగుణ♦కోటులుమాత్రమ సంగ్రహించుచున్
బురుతరవిక్రమంబుమెయి ♦ భూతభవిష్యదుదంతవేదితన్

బరవిషయంబుల న్నిగులఁ బ్రస్తుతి కెక్కుచు, సంధివిగ్రహా
చరణధురీణులై పతికిఁ సత్ప్రియవాదులు నైరి తజ్జనుల్. ౨౮౫

గురువు .. ..సంగ్రహించుచున్ = గురువులయందుండు సుగుణములను మాత్రమే తామాచరణములోనికిఁ దెచ్చుకొందురుగాని వారు ప్రమాదమునో కావలయుననియో యేదేని తమ కకార్యముగఁ దోఁచినదాని నొనర్చినను దానిని గమనింప రని భావము. ఉరుతర=మిక్కిలి యధికమగు, విక్రమంబుమెయిన్=పరాక్రమముచేత, భూత=జరిగినదియు, భవిష్యత్=జరగఁబోవునదియునగు, ఉదంత = వృత్తాంతములన, వేదిత = ఎఱుఁగుటచేత, పరవిషయంబులన్ = ఇతరదేశముల యందున, సంధి = శత్రువులతో సమాధానపడుట యొక్కయు, విగ్రహ=యుద్ధము యొక్కయు, ఆచరణధురీణులై = చేయుటయందు నేర్పరులై, సత్ = మేలైనదియున, ప్రియ = ఇష్టమైనవియు నగు మాటలన, వాదులు = చెప్పువారు, అప్పటికిష్టమై తర్వాత ననిష్టమగు మాటలు చెప్ప రని భావము. తత్ + జనులు = ఆమంత్రిసమూహములు.

మంత్రులలక్షణమును గుఱించి మనవు.

'మౌలాన్ శాస్త్రవిదః శూరాన్, లబ్ధలక్షాన్ కులాగతాన్, సచివాన్ సప్త చాష్టౌవా, ప్రకుర్వీత పరీక్షితాన్॥ మంత్రిణో యస్య కులజా అసంహార్యాః సహోషితాః। నృపతేర్మతిదాఃసంతి సంతి సంబంధకోవిదాః। అనాగత విధాతారః కాలజ్ఞాన విశారదాః। అతిక్రాంతమశోచంతః సరాజ్యఫలమశ్నుతే। సమదుఃఖ సుఖా యస్య సహాయాః ప్రియకారిణః।అర్థచింతాపరాః సభ్యాః। సరాజ్య ఫల మశ్నుతే॥' దీనివలన దశరథుని మంత్రులందఱు శాస్త్రసమ్మతవర్తనము గలవారని యేర్పడుచున్నది.

తాత్పర్యము.

తమ్ము రక్షించునవి మంచిగుణములే కాని దుర్గుణములు కావు. కావున గురువులయందున్న దుర్గుణములువదలి మంచిగుణములను మాత్రమే గ్రహించుచుందురు. దుర్గుణములు దోఁచెనేని పరోక్షమున మీ కిది మర్యాద కాదని మందలింతురు, గాని నలువురిలో నవమానింపరు. అప్పటికి నవి వాఁడు మానకున్న దూరముగఁ దొలఁగుదురు. వాని దుర్గుణములవలనఁ జెడెడువాఁడు వాఁడుమాత్రమే కాక లోకము చెడునట్లుండినఁ బట్టి దండింతురు. గొప్ప పరాక్రమముచేతను జరిగిన జరగుచున్న జరగఁబోవు వృత్తాంతము లను దెలిసికొని తగినట్లు వర్తించుటచేతను, నితర దేశములందును మిక్కిలి ఖ్యాతిని సంపాదించి సంధివిగ్రహాదులయందు సమయోచితముగ వర్తించువారై రాజునకు మంచి ప్రియములు హితములు చెప్పువారైరి.

ఆ. రాష్ట్రకార్యచింత ♦ ప్రకటంబుగానీక, వరకుశాగ్రబుద్ధి♦వర్తు లగుచుఁ
బలుకుప్రల్లదంబు♦పజ్జను బోవక, ప్రతిభ మింతురు ప్రాడ్వి♦వాకవరులు. ౧౮౬

ప్రాడ్వివాకవరులు = అధికారులు - అమాత్యులు - మంత్రు లాలోచనము చెప్పువారు, ఆ యాలోచన మాచరణమునకుఁ దెచ్చువా రమాత్యులు, రాష్ట్రకార్యచింత = రాజ్యమువిషయమైన కార్యముల యాలోచన, ప్రకటము = వెల్లడి, పలుకుప్రల్లదంబు = కొంటె దుడుకుతనము. ప్రతిభ = అప్పటి కప్పటికిఁ గ్రొత్తగా వికసించెడి బుద్ధి

తాత్పర్యము.

అధికారులు స్వరాజ్యమునందుఁ జేయఁదలఁచిన కార్యములను గార్యరూపముగ లోకులకుఁ దెలియఁజేయుదురే కాని ముందుగ రహస్యము వెలిపఱుపరు. సూక్ష్మబుద్ధిగలవారు ఎట్టివారిని నిష్ఠురము లాడరు, సమయోచితమైన బుద్ధివికాసముచే నతిశయింతురు.

ఉ॥ ఇట్టియమాత్యు లెల్లఁ దను ♦ నెప్పుడు గొల్వఁగఁ జారచక్షు వై
దిట్టలు చెల్మికాం డ్రమరఁ ♦ దేజున నెక్కుడు నద్ది సూడు పే
ర్వెట్టఁగ రాక, కప్పములఁ ♦ బెల్లుగ నీయఁగఁ గ్రిందిఱేండ్లు దా
నట్టె వెలింగె నాజి కర♦ణావళి నూతనభానునట్టు లై. ౨౮౭

చారచక్షువై = వేగులవారు నేత్రములుగాఁగలవాఁడై, 'చారైః పశ్యంతి రాజానః' యని నీతి "వనే వనచరాః కార్యాః శ్రమణాటవికాదయః। పరప్రవృత్తిజ్ఞానార్థం శీఘ్రాశ్చారపరంపరాః" యని మనువు రాజున కనేక చారు లుండవలయు నని చెప్పెను. దిట్టలు = బలవంతులు, చెల్మికాండ్రు = స్నేహితులు, సూడు = శత్రువు - దశరథునకు సమానుఁడుకాని యధికుఁడుకాని లేఁ డని భావము. కిరణ ఆవళిన్ = కిరణములవరుసచేత, నూతనభాను అట్టులు ఐ = ఉదయించుచున్న సూర్యునివలెనై - దశరథుఁడు మిత్రులతో వెలిఁగె నని భావము. ఉదయించు సూర్యునితోఁ బోల్చుటచే రామాదులచే నిఁక వృద్ధి కాఁగలదనియు జనులకు సమీపింపనరాక భయంకరుఁడును గాక వారిమనస్సుల కుల్లాసము లోకమునకు విలాసము కలుగునంతమాత్రము ప్రేమతో నున్నాఁడనియుఁ దెలుపును. భాను + అట్టులు = భానునట్టులు - షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరం బగునపుడు నగాగమం బగు. సు.వ్యా. సంధి. ౪౯ సూత్రము.

దీనిచే రాజు దా నెంత సమర్థుఁడు తెలిసినవాఁడైనను బురోహితామాత్యులతో నాలోచించియే రాజ్యపాలనము చేయవలయు నని సూచితము.

తాత్పర్యము.

ఈప్రకారము మానవులందఱుఁ దన్ను సేవించుచుండఁగా దశరథుఁడు వేగులవారిచేత లోకములో జరుగునవి తాను గన్నారఁ జూచినట్లు తెలిసికొనుచు నప్పుడగిన స్నేహితులు గలిగి పరాక్రమమునందు సరియైనవాఁడుగాని యెక్కుడైనవాఁడుగాని పగవాఁడు లేక, తనచేతిక్రింది రాజులు విస్తారముగఁ గప్పములు కట్టుచుండఁగా వసియించు బాలసూర్యుఁడు కిరణములచేఁ బ్రకాశించునట్లు ప్రకాశించెను. సూర్యబింబము తోఁచిన యేడునిమిషములకుఁ గాని సూర్యకిరణములు భూమిని దగులవు సూర్యబింబమువలన లోకమునకు లాభములేదు. సూర్యకిరణములవలననే లాభము అట్లయితే రాఁగల రామాదులు దశరథునకు సూర్యునకుఁ గిరణములవంటివారు. ఉదయమున నెఱ్ఱగానుండు సూర్యుఁడు దర్శనయోగ్యుఁడు కాఁడు. ఎండ వ్యాపించి బింబము తెల్లగానైన పిమ్మటనే దర్శింపయోగ్యుఁడు అట్లే రామాదులవలననే దశరథుఁడు లోకమాన్యుఁడు. జనకనామపూర్వుఁడు, స్వనామపూర్వుఁడు, పుత్రనామపూర్వుఁడు అని ముగ్గురు పురుషులు. మొదటవానికంటె రెండవవాఁడు, వానికంటె మూఁడవవాఁడు శ్రేష్ఠుఁడు దశరథుఁడు మూఁడవరకమువాఁడు.

౮ సర్గము - దశరథుఁడు దనపుత్రహీనతకు విచారపడుట

కం॥ కలరాతనికిని ముగ్వురు, జలజాక్షునిసతులఁ బోలు • చంద్రనిభాస్యల్
లలిఁ ద్రివర్గక్రియల్, సలలితగుణవతులు పరమ • సాధ్వులు భార్యల్. ౨౮౮

దశరథుఁ డింతటి ధార్మికుఁడగుటచే భగవదవతారమునకితఁడు తగినవాఁడని చెప్పి యిఁక భగవదవతారనిమిత్తము వాఁడు చేయు భగవదారాధనరూపకమగు యజ్ఞమును జెప్పఁ దలఁచి వాల్మీకిపూర్వపీఠిక నారంభించుచున్నాఁడు.

జలజాక్షుని = విష్ణుమూర్తియొక్క, సతులన్ = భార్యలగు శ్రీదేవి భూదేవి నీళాదేవులను, చంద్రనిభ ఆస్యల్ — చంద్రునితో సమానమైన ముఖములుగలవారు- ఈయుపమ సౌందర్యమును దెలుపును, ఒక్కటిగాఁగూడిన-త్రివర్గముల క్రియల్ = ధర్మార్థకామములవలె, పరమసాధ్వులు = మిక్కిలి పతివ్రతలు, ముగ్వురు భార్యలు - కౌసల్య సుమిత్ర కైకేయి యను వారలు. గుణవతులను శబ్దము కౌసల్యాసుమిత్రాకైకేయులు రాజస సాత్త్విక తామస గుణములఁ బోలి యున్నారనియు స్ఫురింపఁజేయును. కౌసల్యయందు రజోగుణము, సుమిత్రయందు సత్త్వగుణము, కైకయందుఁ దమోగుణము గలదని వారినడవడులే తెలుపుచున్నవి కౌసల్యనోర పతివిషయమున నిష్ఠురములు వచ్చెగాని, సుమిత్ర సదా శాంతచిత్తయై యుండెను. రామునందు రజోగుణము లేకున్న రాజెట్లు కాఁగలఁడు? కావున రాజస యగు కౌసల్యకు రాముఁ డుదయించెను. దాస్య

భాగవతపారతంత్ర్యములు కేవలసాత్త్వికలక్షణములుగదా. తామసురాలగు కైకకు భగవత్పారతంత్ర్యం బెట్లు గలిగె ననుసందేహము లక్ష్మణునకే కలిగెం గదా. అరణ్య ౨౭౪ ఓ. గూడుఁడు. దీనికిఁ బ్రత్యుత్తర మగ్నిరాహ యని విప్పునకు నీళ్లు, హిరణ్యకశిపునకుఁ బ్రహ్లాదుఁడు పుట్టినట్లని సమాధానము చెప్పుకొనవలయును.

తాత్పర్యము.

విష్ణుమూర్తికి శ్రీదేవి భూదేవి నీళాదేవినివలె ధర్మము అర్థము కామము వలె సత్త్వరజస్తమస్సులవలె మంచిగుణములుగల మగ్గురు యాగ్యభార్యలు కలరు.

తే॥ కనక ధర్మానుకూల కౌసల్యయునుఁగ, గాగ్ర సుగోత్ర సుమిత్రయుఁగ గాంతహార్దినహార్య కైకయునఁగ, నాఖ్యలు గాంతు రబ్జముఖులు.
౨౮౯

త్రివర్గోపమానముగ నప్పుడు గుణములతో భార్యలఁ బేర్కొని చున్నాఁడు. అబ్జముఖులు = చంద్రునివంటి ముఖములుగల యాభార్యలు. 'అబ్జో జైవాతృకస్సోమో' యని యమరుఁడు. సతతధర్మానుకూల్య = సదా పుణ్యకార్యము లందు అనుకూలత గలది యగు కౌసల్య- ఈమె ధర్మమును బోలినది- కావుననే యీమెకు భగవంతుఁడు పుత్త్రుఁడై ప్రాదుర్భవించెను. పాత్రవన = దానమునకు కర్హులైన లోకులకు, వసుగోత్ర = మేరుపర్వతము- ఈమె సుమిత్ర యట్టిదానగుణము కలది సుమిత్ర యగు. శేమి యాశ్చర్యము? ఈమె యర్థమువంటిది. ఈమె ధర్మస్వరూప యగు కౌసల్య కనుకూలవతి. కావుననే యీమెపుత్త్రులు భగవద్భాగవత పరతంత్రులైరి. కాంతహార్దిద = భర్తకు సంతోషమునిచ్చు, రూప+ఏక = సౌందర్యమే ప్రధానముగాఁగలది కైకి. కాంతుఁడు అనఁగా మనస్సునకుఁ బ్రియుఁడైనవాఁడు. వాఁడు తనకుఁ బ్రియమైనకార్యములు చేయుటకు వానికి హార్దిదయే. అటుచేయ కున్నప్పుడు దుఃఖదయే (దుఃఖమునిచ్చునట్టిదయే). కైక యిట్టిదేకదా. కావున నీమె కామమునకుఁ బోలిక. అందు దుష్కామమునకు. ఈమె ధర్మార్థములవంటి కౌసల్యాసుమిత్రలకు విరోధురాలు. 'జ్యేష్ఠభ్రాతృసమానేన త్రయఃకుర్వంతి సోదరా'యన్నట్టులు కౌసల్యారాములపై ద్వేషించిన యీమెపై కొడుకుగూడ ద్వేషించెను.

తాత్పర్యము.

వారెవ్వరనిన ధర్మమునందనుకూలబుద్ధిగల కౌసల్యయుఁ బాత్రులైనజనులకు బంగారుకొండవంటి సుమిత్రయుఁ బ్రియునకు సంతోషము గలిగించు రూపము ప్రధానముగాఁగల కైకయు నను చంద్రవదనలు. చంద్రునియందు లోకా

ప్లాదకరత్వము సౌమ్యము - శిశువుల బాధించుగుణము కలదు. "పుట్టిన బిడ్డ నికిం బగ్గెన, నీ వెట్టిప్రదోషవేళ జనియించినవాఁడవో కాక చంద్రమా" యన్నట్లు చంద్రుఁడేకదా బాలారిష్టదోషకారకుఁడు. అట్లే యీ మువ్వురి యందు వరుసగ మూఁడుగుణములు కల వని యజ్ఞముఖు లను శబ్దము తెలుపు చున్నది.

"కోసలస్య నృపస్యాథ, తనయాంచ శుచిస్మితామ్
కౌసల్యాంనామకన్యాం తా, ముపయేమే స పార్థివః
మాగధస్య నృపస్యాథ, పుత్రీసర్వాంగశోభనా
సుమిత్రానామనామ్నాచ, ద్వితీయా తస్య భామినీ
తృతీయా కేకయస్యాథ, నృప తే ర్దుహితా తథా
భార్యా భూ త్పద్మపత్రాక్షీ, కైకేయీనామ నామతః"—పద్మపురాణము.

ఈ వాక్యములవలనఁ గౌసల్య కోసలరాజుకూఁతురనియు, సుమిత్ర మగధ రాజు కూఁతు రనియు, కైక కేకయరాజు కూఁతు రనియు నెఱుఁగ నగు.

క॥ *వారణవములు వాజు లసాధారణభోగంబు లెన్నొ ♦ తనయుల యో
దారసుఖంబును గానఁడు, ధారణివల్లభుఁ డదేమి ♦ దైవకృతంబో. ౭౯౦

వారణములు = ఏనుఁగులు, వాజులు = గుఱ్ఱములు, అసాధారణ = ఇతర రాజులకు లేని, ఉదార = గొప్ప. వాజ మనఁగా ఱెక్క- వాజములు గలవి వాజులు - గుఱ్ఱములకుఁ బూర్వకాలమున ఱెక్క లుండెనట.

తాత్పర్యము.

ఏనుఁగులు గుఱ్ఱములు ఇతరుల కెవ్వరికి లేని భోగము లెన్నో గలవు. గాని యదేమి దైవతంత్రమో కొడుకులవలనఁ గలుగు సుఖము మాత్రము రా జను భవించినవాఁడు గాఁడు. కన్నబిడ్డలను గౌఁగిలించుకొన్నసుఖము కన్నతల్లి దండ్రులకుఁ దెలియును.

"విపరీతప్రతిభాష లేమిటికి సర్వానాథ యీపుత్రగాత్రపరిష్వంగసుఖంబు చేకొనుము ముక్తాహారకర్పూరసాంద్రపరాగప్రసరంబు చందనముఁ జంద్ర జ్యోత్స్నయుం బుత్రగాత్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడుఁ శీతమే." — భారత. ఆది.

ఉ॥ *కాంతనిశాంతకోటులును ♦ గమ్రఘుమాయితపుష్పవాటులుఁ
దంతసువర్ణరత్నరచి♦తాసనశాలలు రాజ్యలీలలుఁ
గాంతలు సౌకుమార్యరతి♦కాంతలు విక్రమ మిన్ని యుండియుఁ
సంతతిలేమి సంతతవి♦షాదమునం బరితప్యమానుఁ డై. ౭౯౧

కాంత = మనోహరములగు, నిశాంత = గృహములయొక్క, సంతతులు = సమూహములు, కమ్ర = ఇంపై, ఘుమాయిత = గుమగుమ వాసనగొట్టుచున్న, పుష్పవాటికల్ = పూలతోఁటలు, రచిత = చేయఁబడినవి గనుకనే, స్ఫుట = స్పష్టముగానున్న, శాలలు = గృహములు, రతి = రతీదేవివలె సుందరులైన, కాంతలు = మనోహరము లగు భార్యలు, పరితప్యమానుఁడై = మిక్కలి తపస్సు జేసినవాఁడై - వృత్త్యనుప్రాసము.

తాత్పర్యము.

సుందరములైన మందిరములు, గమగమ వాసన లీను పూలతోఁటలు, ఏనుఁగు దంతములు బంగారు రత్నములతోఁ గట్టిన యసమానమైన శాలలు, రాజ్యవిలాసక్రీడలు, సుకుమారత్వమున రతిదేవివంటి సుందరులైన భార్యలు, పరాక్రమము - యివన్నియు నుండియు సంతానములేనికారణమున నెడఁదెగని విచారముచేఁ దపస్సు చేసినవాఁడై.

తే॥ *సౌఖ్యసంతానములు నాకుఁ గలిగెఁ గాని సంతానసౌఖ్యంబు గలుగదయ్యె
భోగసంతతి నాకు నాభోగముగ నెఁ గాని సంతతిభోగంబు గలుగదయ్యె.
౨౯౨

సౌఖ్యసంతానములు = సుఖములసమూహములు, సంతానసౌఖ్యంబు = పుత్రునివలనఁ గలుగు సుఖము, ఆభోగము = విస్తారము - భోగసంతతిసుఖానుభవముల సమూహము. సంతతిభోగంబు = కొడుకులవలనఁ గలుగు భోగము.

సంతానములు - ఇవి యేడు.

కం॥ తనయుఁడు, చెఱువును, గావ్యంబు, నిధానము, గుడి, వనంబు, భూదేవస్థాపనమును, నను నియ్యేడును, జను శాస్త్రములందు సప్తసంతతు లనఁగన్.

తే॥ దుష్కృతము లెన్ని జేసినఁ దుదిని సప్తసంతతులలోన నొక్కటి సలుపువాఁడు
కుతుకమునఁదననూటొక్కకులమువారి, నరకములఁ బాపి ముక్తికినడుపునిజము.
—అప్పకవి.

అపుత్రకవిచారము.

శ్రుతి॥ జాయమానో వై బ్రాహ్మణ స్త్రిభిర్ ఋణవాజాయతే। బ్రహ్మచర్యేణ ఋషిభ్యో, యజ్ఞేన దేవేభ్యః, ప్రజయా పితృభ్య, ఏషవా అనృణోయః పుత్రీ॥ బ్రాహ్మణుఁడు పుట్టువుతోడనే మూఁడుఋణములతోఁ బుట్టును. బ్రహ్మచర్యముచే ఋషులఋణము - యజ్ఞములచే దేవఋణము - బిడ్డల గనుటచే పితౄణము దీర్పవలయును. పున్నామ్నో నరకా త్త్రాయత ఇతి పుత్రః - పున్నామనరకమునుండి రక్షించువాఁడు కావునఁ గొడుకునకుఁ బుత్త్రుఁ డని పేరు. "నాపుత్రస్యగతి

లోకో నాస్తి" "అపుత్రస్య గతి ర్నాస్తి" సుతులులేనివారికి గతులు లేవు. "శ్రుతి॥ ప్రజాతంతుంమావ్యవచ్ఛేత్సీః" సంతానతంతువుఁ ద్రెంపకుము. — శ్లో. "పుత్రేణలోకాన్ జయతి, పౌత్రేణానంత్య మశ్నుతే। అథ పుత్రస్య పౌత్రేణ, నాకమే వాధిరోహతి" - బోధాయనులు. పుత్రునిచే లోకముల జయించును. పౌత్రునిచే నానంత్య మనుభవించును. మునిమనుమనిచే స్వర్గ మధిరోహించును. "సప్త పరాన్ సప్తపూర్వాన్ షడన్యా నాత్మసప్తమాన్। సత్పుత్ర మధిగచ్ఛాన స్తారయే దేనసో భయాత్" తనవెనుకటివారి నేడ్వురను, తనపూర్వుల నేడ్వురను, దన్ను సత్పుత్రుఁడు నరకభయమునుండి తప్పించును. ఇవన్నియు సత్పుత్రవిషయమైన వాక్యములు. సత్పుత్రునివలన నెంత మేలుకలదో దుష్టపుత్రునివలన సంకటము గలదు. కావుననే "మాజనిష్ట సనో వంశే, తోవా ద్రాగ్విలయం తాప్। అనస్త మనోనాం యస్య, వాసుదేవో నదైవతమ్" ఇది పితృదేవతలవాక్యము ఎవఁడు ఆమరణాంతము భగవద్భక్తిగలవాఁడు కాఁడో వాఁడు మావంశమునఁ బుట్టకుం డునుగాక, ఒకవేళపుట్టినా వెంటనేచచ్చునుగాక యని పితృదేవతలు కోరుచుం దురు 'యః పుత్రః పితరం ద్వేష్టి, తం విద్యా దన్యరేతసమ్, యో విష్ణుం సతతం ద్వేష్టి, తం విద్యా దంత్యరేతసమ్' తండ్రిని ద్వేషించువాఁ డన్యరేతస్సునకుఁ బుట్టినవాఁడు. విష్ణువును ద్వేషించువాఁ డంత్యజురేతస్సునకు జనించినవాఁడు. ఇట్టికొడుకు దండ్రి నెట్లు యుద్ధరించును? సంతానవిషయమై పాండురాజువిచా రము మహాభారతమున నిట్లు చెప్పఁబడెను. "పాండురా జాత్మగతంబునఁ బురుషుండు పుట్టుచుండి దేవఋషిపితృమనుష్యఋణంబులు నాలిగింటితోడం బుట్టి యథాకాలవిధుల వీనివలన ముక్తుండు గావలయు నట్లుగానివానికిఁ బుణ్య లోకంబులు లేవు యజ్ఞంబులంజేసి దేవతలఋణంబును, తపస్స్వాధ్యాయ బ్రహ్మచర్యవ్రతంబులంజేసి ఋషులఋణంబును, శ్రాద్ధ పుత్రలాభంబులంజేసి పిత రుల ఋణంబును, మానృశంసనార్జంబులంజేసి మనుష్యులఋణంబును బాప వలయు, నందుఁ బితరుల ఋణంబు దక్కఁ దక్కిన మూఁడుఋణంబులవలన విము క్తుండనయితి. గీ॥ దేహనాశంబుతోడన తీఱునెల్ల, వారిఋణములు మఱి పితృవరులఋణము, నాశమయినను దీఱదు నాకు నిదియుఁ, దక్కియున్నది యే నెట్లు దానిఁ బాతు." భార ఆది. ౫ ఆ. ౭౦-౭౧-పద్య.

ఈ సందర్భమున జరత్కారుచరిత్రము స్మరించునది. పితృదేవతలు జరత్కా రునితోఁ జెప్పిన వాక్యము.

చం॥ తగిన సుపుత్రులం బడసి ధర్మువు తప్పక తమ్ము నుత్తముల్
పొగడఁగ సమ్యగ్హోమతులు పొందుగతుల్ గడుఘోరనిష్ఠతోఁ
దగిలి తపంబుజేసియును, దక్షిణ లిమ్ముగ నిచ్చి యజ్ఞముల్
నెగడఁగఁజేసియుం బడయనేర రపుత్రకులైన దుర్మతుల్.

ఈవిషయమున సంస్కృతమున విస్తరగ్రంథము గలదు గ్రంథవిస్తరభీతి ననువదింపఁ బడదయ్యె.

తాత్పర్యము.

అహా నాకు సౌఖ్యములు చాలఁ గలవుగాని కుమారులవలనఁ గలుగు సౌఖ్యములు లేవాయె. కొడుకువలనఁ గలుగు భోగము లేనప్పు డెన్ని భోగము లుండియు నేల? నేను జేసిన తపస్సు వ్యర్థమాయెఁగదా.

ఉ॥ చాలఁగ నిట్లు మానసము ♦ సంతతిలేమికిఁ గుందుచుండఁ బే
రోలగమందు భాసిలుచు ♦ యోజనచేసెను మంత్రియుక్తుఁడై,
యేల తురంగమేధమును ♦ నే నొనరింపనె? నిక్కమై నే [illegible]
జాలములేక కల్గు సుత ♦ సంతతి యంచును నిశ్చితాత్ముఁడై ౩

కుందుచుఁడు = దుఃఖించుచు, పేరు+ఓలగమునందు = పెద్దకొలువుకూటమునందు, భాసిలుచుండు = ప్రకాశించుచుండు, తురంగమేధము = అశ్వమేధయజ్ఞమును, జాలము = ఆలస్యము, నిశ్చిత+ఆత్ముఁడై = నిర్ధారణచేసికొనఁబడిన మనస్సుగలవాఁడై, మనస్సుచేగాని మనస్సున దన్నవిషయము నిశ్చయపఱచుకొన్నవాఁడై

తాత్పర్యము.

అని యీప్రకారము మాలోచించి మనస్సు [illegible] సభామండపము చేరి మంత్రులతో నిట్లు యోచించెను [illegible] పుత్రులు కలుగుటకై యశ్వమేధయాగము చేయుటెట్లని [illegible] చేసిన నేని నాకు సంతానము కలుగును అని నిశ్చయించినవాఁడై.

కం॥ మంత్రినికరావతంసు సు,మంత్రుని నృపకార్యవిహితమంత్రుని నరిభీ
తంత్రుని సమస్తకళల స్వ,తంత్రునిఁ జేరంగఁ బిలిచి ♦ దశరథుఁ డనియెన్ ౪

మంత్రినికరావతంసుని = మంత్రిసమూహమునకు శిరోభూషణమైవానిని, నృపకార్య = రాజకార్యములందు, విహితమంత్రుని = చేయఁబడిన విశేషహితమైన యాలోచన కలవానిని, అరిభీతంత్రుని = శత్రువులకు భయము గలిగించు కార్యము గలవానిని, సమస్తకళలః = సమస్తవిద్యలందు, స్వతంత్రుని = పరాపేక్షలేనివానిని, అవతంసము = తలయందుంచుకొను పూవు - వా. వతంసము.

తాత్పర్యము.

ఇట్లు నిశ్చయించుకొన్నవాఁడై మంత్రులందు శ్రేష్ఠుఁడై రాజకార్యములందు మేలైన యాలోచనచేయుచు శత్రువులకు భయముగలిగించుకార్యములు చే

యుచు సన్నివిక్యాలయందుఁ బరాపేక్షలేని సుమంత్రునిఁ బిలిచి దశరథుఁ డిట్లనియెను.

కం॥ గురువుల నందఱ వైళమ, పురోహితులఁగూడ నీవ ♦ పోయి యిచటికిన్
గురు వగుకార్యము గల దని, సొసఁగఁ దోడ్కొనుచు రమ్ము ♦ చయ్యనఁ బొమ్మా. ౪౯

వైళము = శీఘ్రముగ, గురు వగు కార్యము = గొప్పపని.

తాత్పర్యము.

అందఱుగురువులను అందఱుపురోహితులను నీవే శీఘ్రముగఁ బోయి గొప్పకార్య మాలోచింపవలసియున్నది, వెంటనే రమ్మని పిలుచుకొనిరమ్ము, పొమ్ము.

చం॥ అని పతి యానతిచ్చిన ర♦యంబున నేగి సుమంత్రుఁ డెల్లరం
బనివడి తోడితెచ్చె శ్రుతి♦పారగవర్యుల వామదేవునిన్
మునుల సుయజ్ఞ కాశ్యపుల ♦ ముఖ్యగురుం డగునవ్వసిష్ఠుఁ ద
క్కినసద్విజసత్తమావళులఁ ♦ గీర్తిధనాఢ్యుల సాధుశీలురన్. ౫౦

ఆనతి = ఉత్తరువు - ఆజ్ఞప్తి, రయంబునన్ = వేగముతో, శ్రుతిపారగులు = వేదములఁ దుదముట్టఁ జదివినవారు, సాధుశీలురన్ = మంచి స్వభావము గలవారిని, కీర్తి ధన ఆఢ్యులన్ = యశస్సును ధనముచేఁబూర్ణులైనవారిని.

తాత్పర్యము.

అని రాజాజ్ఞాపింపఁగానే సుమంత్రుఁడు తడవుసేయక వెంటనే యందఱ యిండ్లకుఁ బోయి సాంతముగ వేదాధ్యయనము చేసినవారల వామదేవుని సుయజ్ఞుని జాబాలిని గాశ్యపుని ముఖ్యగురువైన వసిష్ఠుని నింకను దక్కిన ముఖ్యబ్రాహ్మణులను సాధువర్తనులైనవారిని కీర్తిధనులను బిలిచికొనివచ్చెను.

—* దశరథుఁ డశ్వమేధయాగముఁ జేయ యోచించుట. *—

ఉ॥ ఈగతి నేగుదెంచినము♦నీశ్వరులన్ బహుమానపూజనో
ద్యోగముచేతఁ దన్పుచు ర♦ఘూద్వహుఁ డిట్లను భక్తి నోతపో
భోగివరేణ్యులార! మిము♦బోఁటిమహాత్ముల ప్రాపు గల్గియున్
నాగడుసుంగ్రహంబు లవి ♦ నన్ననపత్యునిఁ జేసె నీవిధిన్. ౫౧

రఘు + ఉద్వహుఁడు = రఘువంశమున శ్రేష్ఠుఁడు- దశరథుఁడు, యోగము = కూడిక; తన్పుచున్ = సంతోషపఱుచుచు; తపోభోగివరేణ్యులార = తపస్సునందు శ్రేష్ఠులారా! తపమే భోగముగాఁగలవారు తపోభోగులు - వారియందు

వరేణ్యులు = శ్రేష్ఠులు, ప్రాపు = ఆశ్రయము, గడుసు గ్రహములు = క్రూరములైన గ్రహములు. అనపత్యుని = బిడ్డలులేనివానిని. గడుసుంగ్రహంబులు - సులభ వ్యా. సంధి. ౬౭వ సూత్రము-'సమాసంబులను ద్రుతంబులగు శబ్దంబులకును పుంపు లకును సమసంబులు పరంబులగునప్పు డగాగమంబగు.'

తాత్పర్యము.

ఇట్లు వచ్చిన మునీశ్వరుల నెల్లరను బహుమానించి పూజించి సంతోషింపఁ జేసి దశరథుఁ డిట్లనియెను - ఓ తపస్వి సత్తములారా! మీరు మహాత్ములు నాకు సహాయులుగా నుండియు నదియేమోకాని క్రూరగ్రహములు నన్నిట్లు కొడుకులు లేనివానినిగాఁ జేసెను.

క॥ లోకనయనుఁ డాదిగ, వాలి యీమహిత వంశము నిలుపఁగ
వ్రేలెఁడు మొలకయు లేదకొ,వాలాయముఁ గంత నొడ్లవల సని నాకున్. ౭౭

లోకనయనుఁడు = సూర్యుఁడు, ఆదిగ = మొదలుగాఁగల, వాలి = అతిశయించిన, వ్రేలెఁడు = అంకురము - చిన్నబిడ్డఁడు - ఇది వాచకపదము.

తాత్పర్యము.

కొడుకులు లేని యేల విచారించెదరు? సూర్యుఁడు మొదలు నాకరముపటకు విచ్ఛిత్తిలేక వచ్చిన యీ గొప్పవంశము నాతో నిల్చెను వంశము నిలుపుటకు అంకురము లేదాయెఁగదా! యీ రాజ్యము పరుల పాలగు నేని ఆయపకీర్తి నాకు వచ్చునే!

క॥ సంతానము ప్రాప్తింపమిఁ, చింతాంభోనిధినిమగ్న చిత్తుఁడనై యే
కాంతము వనరెద నిఁక నా,సంతాపముఁ బాపరయ్య సంయములారా! ౭౮

చింతా + అంభోనిధి = విచారమను సముద్రమున, నిమగ్నచిత్తుఁడను = మిక్కిలి మునిఁగిన మనస్సుగలవాఁడను, వనరెదను = శోకించెదను, సంయములారా = ఋషులారా! పాపుఁడు + అయ్య = పాపరయ్య-పోఁగొట్టుఁడని వేఁడెదను.

తాత్పర్యము.

ఏమి చేయుదును? సంతానము లేదను చింతాసాగరమున మునిఁగి మిక్కిలి బాధపడుచున్నాను. మునీంద్రులారా! నాసంకటము తొలఁగఁ ద్రోయుఁడు.

క॥ సుతలబ్ధికి హయమేధ,క్రతువును జలుపఁగను గోర్కి గలిగెను, నది దానతులితమగుగతి విఘ్నని,హతిఁ బొందక యుండు టెట్లొ యరయుఁడు మీరల్. ౮౦

లబ్ధికిన్ = పొందుటకు, హయమేధక్రతువును = అశ్వమేధ యాగమును, విఘ్ననిహతిని = ఆటంకములనలనిచేటును, అరయుఁడు = వెదకుఁడు, ఉపాయము అధ్యాహారము.

తాత్పర్యము.

పుత్రులు గలుగుటకై యశ్వమేధయాగము చేయవలయు నని కోరిక కలిగెను. అది విఘ్నములేక చక్కఁగా నెఱవేఱు నుపాయము మీ రాలోచింపవలెను.

చం॥ అన విని మేలు మే లదియ ♦ యాగ మని బ్రాహ్మణు లెల్ల సమ్మతం
బునఁ బొగడల వసిష్ఠముఖ•ముఖ్యధరామరు లెల్ల భూపతిం
గనుఁగొని లెస్స నీ తలఁపు, ♦ గల్గు నవశ్యము వాంఛితార్థముల్,
పనికిని బూనుమీ, వలయు•వస్తువులన్ సమకూర్పుమీ వెసన్. ౧౧

సమ్మతంబునన్ = అంగీకారముతో, ధరా + అమరులు = బ్రాహ్మణులు; వాంఛిత = కోరఁబడిన, వెసన్ = శీఘ్రముగా.

తాత్పర్యము.

అని రాజు చెప్పఁగా మేలుమేలు మీయాలోచన సరిగా నున్నది. నీ వా యాగముచేసిన నీకోరిక నెఱవేఱును. కావున దానికిఁ గావలసినపదార్థములు సేకరించుటకుఁ బూనుకొను మని వసిష్ఠుఁడు మొదలగు బ్రాహ్మణులు చెప్పిరి.

క॥ విడువుము ఘోటకమును బో,వి డువుము సందేహ మొకఁడు ♦ ప్రేష్యుల కెల్లన్
నుడువుము సామగ్రులకై, కొడుకులు గలిగెదరు నీకుఁ ♦ గువలయనాథా! ౧౨

ప్రేష్యులు = సేవకులు, నుడువుము = చెప్పుము. కొడుకులు - 'ఏష్టవ్యా బహవః పుత్రాః' యన్నట్లు పెక్కుఁడు.

తాత్పర్యము.

గుఱ్ఱమును దేశసంచారముకొఱకు వదలుము. సందేహము మానుము. పని వాండ్రనందఱను కావలసినపదార్థములు తీసికొనిరా నియమింపుము. రాజా! నీ కవశ్యము కొడుకులు గలిగెదరు.

క॥ తనయులఁ గానఁగవలె నను,ఘనధార్మికబుద్ధి నీకుఁ ♦ గలుగుటచేఁ బూ
తనయులఁ దనయులఁ గనియెద, వనఘులసంకల్ప మెల ♦ వ్యర్థమగుననన్. ౧౩

ఘన = గొప్పదియు; ధార్మిక = ధర్మము చేయనెంచునదియు; పూత, నయులన్ = పరిశుద్ధమైన న్యాయవంతులగు, అనఘుల సంకల్పము = నిర్దోషుల తలఁపు; అర్థాంతరన్యాసాలంకారము. నాల్గవపాదమున ప్రాదియతి.

తాత్పర్యము.

సుతులఁ గనవలె నను గొప్ప ధర్మబుద్ధి నీకుఁ గలిగెను గావున నీవు పవిత్రమైన నీతిగలవారలఁ గనియెదవు. పాపరహితుల సంకల్ప మేల నిష్ఫల మగును?

కం॥ అనఘుల వినుచుఁ గన్నుల, నానందాశ్రువులు రాల • నధిపతి హర్షా
ధీనతఁ దనయుల నప్పుడ, మానుగఁ గనినట్లు పొంగి • మంత్రుల కనియెన్. ౩౦౪

అనఘులన్ = ఋషులమాటలను, ఆనంద + అశ్రులు = సంతోషముచేఁ గలిగినకన్నీరు. మానుగన్ = బాగుగ.

తాత్పర్యము.

వారుచెప్పిన పలుకులు విని కన్నుల వెలికొలఁకులందు చల్లని యానంద బాష్పములు రాలఁగా దశరథుఁడు బ్రాహ్మణవాక్యము వ్యర్థము కాదు కావున తన కప్పుడే కొడుకులు గలిగినట్లు విని సంతోషించినవాఁడై యుప్పొంగి మంత్రులతో నిట్లనియె.

చం॥ వలసినసర్వవస్తువు ల • వారిగఁ జేర్చి సుహస్తి గుఱ్ఱముల్
బలియు ఘనుం బురోహితునిఁ • బ్రాపుగఁ గూరిచి వీడి యజ్ఞశా
లల సరయూత్తరక్షితి త • లంబునఁ గట్టి యథావిధిం గ్రమం
బలవడ శాంతికార్యము స • మాచరణం బొనరింపుఁ డెంతయున్. ౩౦౫

అవారిగన్ = అపరిమితముగ. పాఠాం-అవ్వారిగ, బలియున్ = బలిష్ఠుఁడైన వానిని ఘనున్ = సమర్థుఁ డగు పురుషుని, 'చతుశ్శతా రక్షంతి యజ్ఞస్యాఘాతాత్' యని చెప్పినట్లు, ప్రాపుగన్ = గుఱ్ఱమునకు రక్షకునిఁగ, పురోహితుని = అధ్వర్యుఁడు మొదలగు ప్రధానఋత్విక్కులను 'ఎడపా దడపా జుహోతి' యని శాస్త్రోక్తకార్యములు నెఱవేఱుటకై ఋత్విజుని నంపుట. ఉత్తరక్షితితలంబునన్ = ఉత్తరపుఁ బ్రక్కనుండు భూమియందు, శాంతికార్యము = విఘ్నముల నణఁచు కార్యములను. జాత్యేకవచనము. యథావిధిన్ = శాస్త్రప్రకారము. క్రమము = శాంతికల్పమునఁ జెప్పినక్రమము. 'క్రమస్తు కథ్యతే కల్పే' యని భాగురివాక్యము. అలవడన్ = పొందిక పడునట్లు, సమాచరణంబు + ఒనరింపుఁడు = చక్కఁగాఁ జేయింపుఁడు; నాల్గవపాదంబునఁ బ్రాదియతి.

తాత్పర్యము.

మంత్రులారా! యజ్ఞమునకుఁ గావలసిన సమస్తవస్తువులు దండిగఁ జేకూర్ప వలయును. గురువులుచెప్పిన ప్రకారము గుఱ్ఱమును విడువవలయును. దానికి రక్షకునిఁగ బురోహితులం దొకరిని బంపవలెను. సరయూనదియుత్తరపుటొడ్డున

యజ్ఞశాల నిర్మింపవలెను. శాస్త్రప్రకార మిచ్చటఁ జేయవలసిన శాంతికార్యములు చేయింపవలయును.

క౦॥ అపరాధంబులు పొసఁగిన, విపులవ్యసనములు దమ్ము • వెనకొనవేనిఁ
నృపవరు లెల్లరు దీని, న్నిఘ్నులు వో చలుప ధారిణీస్థలి నెందున్. ౩౦౬

అపరాధములు = యజ్ఞమంత్రముల స్వరలోపము ద్రవ్యలోపము మొదలగు తప్పులు, విపుల = అధికమగు, వెనకొనవు = వెంటనంటిరావు, నిఘ్నులు = నేర్పరులు, వో = ఇది నిశ్చయమును దెలుపును. కాఁబట్టియే సాధారణరాజు లెవ్వరు నీయజ్ఞముఁ జేయ పూనుకొన రని భావము.

తాత్పర్యము.

ఈ యజ్ఞమును రాజులందఱు చేయవలయు నను కోరికగలవారే కాని చేయుటకు భయపడుదురు. ఏలన మంత్రలోపమో, తంత్రలోపమో, పదార్థలోపమో, శ్రద్ధాలోపమో, దక్షిణాలోపమో యిటువంటివి తటస్థించెనేని వెంటనే గొప్పదుఃఖము కలుగును. కావున నట్టివిలేకుండ మీరు హెచ్చరికతోఁ బ్రవర్తింపవలయును.

క౦॥ నెమకుచు నుందురు యజ్ఞక్రమకోవిదు లైన బ్రహ్మ•రాక్షసు లెట ఛి
ద్రము లొదవవె యని క్రతువిఘ్నముఁ గం దత్కర్త యపుడ•కను నాశంబున్. ౩౦౭

కోవిదులు = పండితులు, బ్రహ్మరాక్షసులు = పాపములుచేసి ప్రాయశ్చిత్తములు పెట్టకొనమిచేతను, తగని వస్తువులను దానము పట్టుటచేతను, అయోగ్యులకు యజ్ఞాదుల చేయించుటచేతను, తనకు వచ్చినవిద్య నితరు లడిగినను జెప్పక పోవుటచేతను, రాక్షసులుగాఁ బుట్టిన బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులు. ఎట=ఏవిషయమందైనను, ఛిద్రములు = రంధ్రములు (లోపములు). ఒదవవె = కలుగవా యని, నెమకుచుందురు = వెదకుచుందురు, పాపముచేత రాక్షసులయ్యును బాపబుద్ధి పోకుండుటచేతఁ దాము పూర్వము సంపాదించినశాస్త్రజ్ఞానము వలన లోపములను దెలిసికొని యేదైన సందుదొరికిన యజ్ఞము పాడుచేయుదు రని భావము. క్రతువిఘ్నమునఁ = యజ్ఞమున లోపముకలిగి రాక్షసులు చెఱుచుటచేత, తత్. కర్త = యజ్ఞము జేయు యజమానుఁడు. 'సంయోగం పతితైర్గత్వా, పరస్యైవచ యోషితమ్। అపహృత్యచ విప్రస్వం, భవతి బ్రహ్మరాక్షసః.' మను. ౧౨-౬౦.

పతితులతోఁ గూడియుండువాఁడును, పరస్త్రీసాంగత్యము చేసినవాఁడును, బ్రాహ్మణుసొమ్మపహరించినవాఁడును బ్రహ్మరాక్షసుఁడుగాఁ బుట్టును. రాక్షసులందు బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులు, రావణాదులు క్షత్రియరాక్షసులు.

తాత్పర్యము.

యజ్ఞక్రమమునందు లోపాలోపములు - పట్టువిడుపులు - తెలిసిన బ్రహ్మ రాక్షసులు లోప మెచ్చటనైనఁ గలుగునా యని వెదకుచుఁ గాచియుందురు. కాచియుండి సందుదొరికెనా యజ్ఞమును విఘ్నపఱుతురు. యజ్ఞము విఘ్న పడెనా కర్త యపుడే నాశ మగును.

కం॥ వేలిమి యెటు విఘ్నంబుల,పాలం బడకుండు నట్టి♦భంగిని మీరల్
చాలసమర్థులు దీర్పఁగ, హాళి మెయిన్ నిర్వహింప♦రయ్యా శ్రద్ధన్. ౩౦౮

హెచ్చరికగా వర్తింపవలసిన కారణములు చెప్పి మంత్రులు చేయవలసిన కార్యములఁ జెప్పుచున్నాఁడు. వేలిమి = యజ్ఞము, భంగి = విధము, హాళి మెయిన్ = అపేక్షతో, శ్రద్ధన్ = చేయవలసిన కార్యములందు మనస్సుంచి యక్కఱతో, నిర్వహింపుఁడు + అయ్యా = నిర్వహింపుఁడయ్యా - 'ప్రార్థనార్థక మధ్యమపురుషంబున నెదాదు లన ప్రయుక్తంబు లగు నవో ముదుస్తులకు వు-రు-లగు.' సు. వ్యా. క్రియ. ౩౮ సూ.

తాత్పర్యము.

కావున నేవిధముగా నర్తించిన యజ్ఞము విఘ్నములు లేక కొనసాగునో యావిధముగా మీరు వర్తింపవలయును. మీరందఱు నిట్టికార్యములందుఁ జాల సమర్థులు - కావున శ్రద్ధతోను అక్కఱతోను కార్యము నిర్వహింపఁ గోరెదను.

చ॥ పతి యిట్లు లాడఁ బ్రెగ్గడలు♦ వల్లె యటంచుఁ మిమ్ముఁ బో ల్లహా
మతు లిలఁ బూనకర్జముల♦ మాఱొడఁగూడునె? సత్యసత్ఫలా
న్వితనతికార్యలోలురరు♦ విఘ్నములుం బొడచూపు టె ట్లగున్?
హితగతి నప్రమాదమతి♦ నెంతయుఁ దీర్తుము సర్వకార్యముల్. ౩౦౯

ప్రెగ్గడలు=మంత్రులు, వల్లె = సరి, కర్జములన్=కార్యములందు, మాఱు = వ్యతిరేకము, ఒడఁగూడునె = సంభవించునా? మీరు అనవసము అధ్యాహార్యము, సత్య = తప్పక కలుగునట్టి, సత్ + ఫల = మంచిలాభముతో, అన్విత= కూడిన, కార్యలోలురరు = కార్యములం దభిలాషగలవారు. పొడచూపుట = కనఁబడుట, మీ మాహాత్మ్యముచేతనే విఘ్నములు కలుగవు. అట్లని మే మజాగ్రత్తతోఁ బ్రవర్తింపక హెచ్చరిక కలిగి యజ్ఞకార్యము నెఱవేర్చెద మనుచున్నారు, హితగతి = మేలైన విధముతో, అప్రమాదమతిన్ = అజాగ్రతలేని మనస్సుతో.

తాత్పర్యము.

ఈప్రకారము రాజు చెప్పఁగా మంత్రులంగీకరించి రాజా మీవంటి గొప్పవారు పూనకొనినపనికి విఘ్నములు లోపములు గలుగునా? మీరు సత్యాత్ములు. మంచిఫలము నొసఁగుకార్యములం దాసక్తులరు. ఏవిధముగా విఘ్నములు కలుగును? అయినను మేము హితమైన హెచ్చరికతో నన్నిపనులు చక్కఁగఁ జేసెదము.

కం॥ అని యాడుచు భూవరునిం, గొనియాడుచు నున్న విప్రకోటులు నృపుడీ
వనలం దనుపుచు ననుమతి, గొనుచుం బనివినిరి ముదము గుబ్బతిలంగన్. ౩౧౦

భూవరునిన్ = రాజును, తనుపుచున్ = సంతోషపఱుచుచు, అనుమతిని = సమ్మతిని, ముదము=సంతోషము, గుబ్బతిలంగన్ = అతిశయింపఁగా, రాఁగల పౌర్ణమాస్యనాఁడీ యజ్ఞమును బ్రారంభించెద మని చెప్పి, పనివినిరి= సెలవు తీసికొని పోయిరి. ఆజ్ఞతీసికొనిపోవుతక్కువవారివిషయములోనే పనివిను శబ్దము ప్రయోగింపవలయును. తండ్రిచే సెలవు తీసికొని కొడుకు పనివినియె ననవచ్చును గాని కొడుకుతోఁ జెప్పి తండ్రి పనివినియె ననరాదు. గుబ్బతిలు-నూపాం-ఆగుబ్బతిలు. 'కోర్కులాగుబ్బతిలంగఁ జూచె' మను. చ. 'మబ్బుల యుబ్బులు గుబ్బతిల్లఁగన్. వసు.

తాత్పర్యము.

అని చెప్పి రాజును శ్లాఘించుచు మంత్రులు పురోహితులు తక్కిన బ్రాహ్మణులు దశరథుని దీవించుచు నాయనయొద్ద సెలవుతీసికొని సంతోషముతో వెడలిపోయిరి.

ఉ॥ అంతట మంత్రులం బిలిచి యంతయు సంతనకట్టుఁ డిద్దియున్
సాంతత నొందునట్లు లని యాజ్ఞయొనర్చి నితాంతసమ్మదా
క్రాంతమనోబ్జుఁ డౌచు నిజకాంతనిశాంతముఁ జేరి యాజి శు
ద్ధాంతగతాత్మపత్నులను నాదటఁ గానఁగ నేగి యిట్లనున్. ౩౧౧

ఉన్న = తక్కిన, ఆజి = దశరథుఁడు, ఇద్ది = ఈయజ్ఞము, సాంతతన్ = పరిపూర్ణతను, సంతనకట్టుఁడు= సిద్ధపడుఁడు, నితాంత = ఎక్కువ, సమ్మోద = సంతోషముచేత, ఆక్రాంత = అంతట క్రమ్ముకొనఁబడిన, మనః + అబ్జుఁడు= హృదయకమలము కలవాఁడు, నిజ = తనయొక్క, కాంతనిశాంతము = మనోహర మగు గృహమును, శుద్ధాంతగత = అంతఃపురములోనున్న, ఆత్మపత్నులన్ = యజ్ఞార్హ లగు కౌసల్య మొదలయిన భార్యలను, భర్తకు యజ్ఞాది ఫలములను గలిగించు భార్య యను నర్థమున పతిశబ్దముపై నకారము నంచిన

పత్ని యనురూపము లభించును, భర్తకు యజ్ఞాదిఫలములఁ గలుగఁజేయు భార్యకే పత్ని యని పేరు. 'పత్యుర్నోయజ్ఞసంయోగే' యని వ్యాకరణము. రెండవ నాలవపాదముల నుభయయతులు.

తాత్పర్యము.

ఇట్లు వారు వెడలిపోఁగా దశరథుఁడు మంత్రులఁ బిలిచి యజ్ఞము కొఱఁత లేక జరుపుటకుఁ గావలసినవన్నియుఁ గూర్చి సిద్ధపడుఁడు, అని యాజ్ఞచేసి మిక్కలి సంతోషించుచున్నవాఁడై తన మనోహరభవనంబున కేగి యచ్చట నుండి తన యంతఃపురస్త్రీలను జూడఁ బోయి వారితో ని ట్లనియె.

ఉ॥ ఓయలివేణులార! తన♦యోదయకారణ మౌ సవంబు నేఁ
జేయఁగఁ బూనినాఁడఁ, దమి ♦ చెన్నలరాఁగ నేఁటినుండి దీ
క్షాయుత లై చరింపుఁ డని ♦ సాంత్వనవాక్యులు పల్కె మంచుకా
ర్పాయఁగ నొప్పు తమ్ము లన ♦ వారిముఖాబ్జము లుల్లసిల్లఁగన్. ౩౧౨

అలివేణులారా — అలి = తుమ్మెదలవలె నల్లనైన, వేణులారా=జడలు గల వారలారా! ఇక్కడ స్త్రీ సామాన్యతను బోధించునేగాని యవయవార్థము బోధింపదు, తనయ + ఉదయ = కుమారుఁడు కలుగుటకు, సవంబు=యజ్ఞము, తమి = కుతూహలము, దీక్షా = యజ్ఞాదిక్రియారంభకాలమున ననుష్ఠింపఁ బూనకొనెడి యాచారనియమములతో; యుక్తలై = కూడినవారై, సాంత్వన వాక్కులు = సంతోషకరము లగు మాటలు, మంచుకారు = మంచుకాలము, పాయఁగన్ = పోఁగా, తమ్ములన్ = తామరపూలవలె, అనన్ — ఇట నుప మావాచకము కాన నుపమాలంకారము, ముఖాబ్జములు = కమలముల వలె సరసములైన ముఖములు, ఉల్లసిల్లఁగన్ = ప్రకాశింపఁగా, మంచు సోఁకి యందము చెడియున్న తామరలు ఆ ఋతువులు గడవఁగానే వసంతము రాకచే మరల వికసించునట్లు లన్నిదినములు పుత్రుఁడు లేఁడన్న శోకముచేఁ గాంతిహీనములైన వీరి ముఖములు నేఁడీ మాట వినఁగానే మిక్కిలి ప్రకా శించిన వని భావము. హేమంతమున పగళ్ళకు, శిశిరమున కమలములకు, వసంతమున లజ్జకు, గ్రీష్మమున రాత్రులకు, వానకాలమున నేలదుమ్మునకు, శరత్కాలమున బురదకు క్షీణదశ. ఉపమానబలముచే నీ ప్రస్తావన చైత్ర మాసారంభమున జరిగె నని యెఱుఁగనగు. చైత్రశుద్ధపూర్ణిమ యజ్ఞారంభము.

తాత్పర్యము.

ఓ యలివేణులారా! పుత్రులుపుట్టుటకుఁ గారణమైన యొకయజ్ఞమును జేయఁబూనినాఁడను. మీరును సంతోషముతో నేఁటినుండి దీక్షవహింపవల యును, అని మంచిమాటలు చెప్పఁగా వారును సంతోషించిరి.

౯ సర్గము. దశరథునకు సుమంత్రుఁడు సనత్కుమారవచనంబులఁ దెల్పుట.

సీ॥ మంత్రిసత్తముఁడు సు•మంత్రుఁ, డిట్లను ధరా,కాంతునితోడ నే•కాంతమునను
చింత యేటికి నీకు • సంతానమున కన,పాయంబునైనయు•పాయ మొండు
దొల్లి ఋషీశ్వరు•లెల్లరు వినఁగ స,నత్కుమారుండు హ•ర్షోత్కముగను
వివరించె ననుచు ఋ•త్విజులుపల్కఁగవింటి, నదియెద్దియనవిను • ముదముతొలఁకఁ
తే॥ గలఁడు కాశ్యపసంయమి • లలితకీర్తి, యుండు నాతనిసుతుఁడు • విభాండకుండు,
నతనికిని ఋశ్యశృంగుఁడన్ •సుతుఁడుపుట్టె, హారిణియందొక గురుతపః•పరుఁడుసుకృతి. ౩౧౩

ఇఁక మూఁడుసర్గములదాఁక భగవదవతారమునకు ముఖ్యకారణ మగు పుత్రకామేష్టి ప్రస్తావన జరుగును. ధరాకాంతుఁడు = రాజు, ఏకాంతము = రహస్యముగ - నొంటరిగా నున్నప్పుడు, అనపాయము = విఘ్నములేని, ఒండు = ఒకటి, హర్షోత్కము = అతిశయసంతోషము, సవురుమైన్ = చక్కఁగా, తొలఁకన్ = అతిశయింపఁగా, నిర్మల=నిర్దోషియగు, తపస్వి = ఋషి, గురుతపఃపరుఁడు = గొప్ప తపస్సే ప్రధానముగాఁ గలవాఁడు, సుకృతి = పుణ్యవంతుఁడు. హరిణియందు = ఆఁడుజింకయందు.

విభండకుఁడు కశ్యపవంశమునఁ బుట్టినవాఁడు. పశ్యక యనునది కశ్యప యను వర్ణవ్యత్యయముచే నయ్యెను. సర్వము తెలిసినవాఁడు (చూచువాఁడు) అని యర్థము 'కశ్యపః పశ్యకో భవతి సౌక్ష్మ్యాత్ యత్సర్వం పరిపశ్య' తీతి శ్రుతిః.

తాత్పర్యము.

అంతటఁ దనసౌధమున నున్న భూకాంతునిఁజూచి ముఖ్యమంత్రి యగు సుమంత్రుఁ డిట్లనియె. రాజేంద్రా! కొడుకులు లేరని నీవు వింతపడవలదు. నీకుఁ గొడుకులు గలుగుటకు నిర్విఘ్నమైన యుపాయమొకటి సనత్కుమారుఁడు ఋషులు వినుచుండఁ జెప్పెనని వసిష్ఠాదు లనఁగా వింటిని. అది యేది యనెదవా? కాశ్యపుఁ డను మునిశ్రేష్ఠుఁ డొకఁడు గలఁడు. ఆయనకుమారుఁడు ఋశ్యశృంగుఁ డనువాఁ డతనికి హరిణియందు జనించును. అతఁడు గొప్పతపస్వి. పుణ్యవంతుఁడు.

తరలము॥ జననమాది రసాస్థలిన్ వన•చారియై సతతంబు నాఁ (౨౦౦౧)
మునివరేణ్యుఁడు గానఁ దండ్రికి • మ్రొక్కవచ్చెడియోగులన్
ఘనతపస్వులఁ గాని యన్యముఁ • గానఁ డెద్దియు, నిత్యమ
య్యనఘుఁ డుగ్రతపంబులన్ జన•కాజ్ఞచొప్పున వర్తిలున్. ౩౧౪

వనచారి = అడవులలోఁ దిరుగువాఁడు. సతతంబును=ఎల్లప్పుడు, కానన్ = అడవియందు. అన్య మెద్దియుఁ గానఁ డని యన్వయము. గ్రామములనుగాని

యందలిమనుష్యులను వస్తువులనుగాని యెద్దియు నెఱుఁగఁడు, జనక + ఆజ్ఞ చొప్పున = తండ్రియుత్తరువు ప్రకారము. వర్తిలుక = నడచుకొనును.

ఛందస్సు — వృత్తము - తరలము న-భ-ర-స-జ-జ-గణములు. పండ్రెండవ స్థానమున యతి.

జననమాది రసాస్థలిః - అని చో సకారము [illegible] పద్యములోఁ నత్-స-కారమును దలుపుచు ఇప్పటికి ౧౦౦౦ పాదములు ముగిసెను. సాంఖ్యశాస్త్ర ప్రకారము సకారమునకు నేడని సంజ్ఞ కావున నిది యీపాదంబున నేడవస్థానంబున నుంచఁబడియె. ఇట్టులే ౧౧౧౧ [illegible] జూడ నగు. కశ్యపక్షేత్రము కాశ్మీర మని యొకరు వ్రాసిరి. కాని కశ్యపునకు Caspian కాశ్యపునకు సంబంధముగలదేమో యని యీగ్రంథకర్త యభిప్రాయము.

తాత్పర్యము.

రాజేంద్రా! యీ ఋశ్యశృంగుఁడు పుట్టినది మొదలు వనమునందే తిరుగుచు నాయడవిలోఁ [illegible] గాక [illegible] దిన [illegible] కాలము గడపుచుండెను.

తే॥ విప్రతతి బ్రహ్మచర్యంబు • వినుతిసేయుఁ, బ్రథయు జగమున నెప్పుడుఁ • బ్రబలుచుండు
నమ్మహాత్ముని బ్రహ్మచ • ర్యంబునకును, నబ్బు ద్వైవిధ్య మది కార • ణాంతరమున. ౩౧౫

వినుతిచేయుట = శ్లాఘించుట, ప్రథ = (అస్ఖలితబ్రహ్మచర్యమును గూర్చిన) ప్రఖ్యాతి, కారణాంతరమునన్ = ఒకానొకకారణముచేత, ద్వైవిధ్యము=స్త్రీసంబంధమువలన చేటు. అబ్బున్ = కలుగును. అది = ద్వైవిధ్యము - 'పదాద్యంతగతం బా శబ్దం బమహదర్థకంబు సమస్తంబు వ్యస్తంబునయి కొన్నియెడల నర్థశూన్యం బగు'. ఉ॥ మఱి బావులు నూటికంటె నొక్క సత్క్రతువది మేలు' భార - ఆది. ౫ ఆ. కావున నిచట అది వాక్యాలంకారము. (లేదా) బ్రహ్మచర్యము = తన భార్యతో ఋతుకాలంబునందుమాత్రము సంగమించుట యను బ్రహ్మచర్యమును మాత్రము, వినుతిచేయుట = గొప్పగాఁ జెప్పును. "ఋతుకాలమునఁ దన సతితోడ రమియించు పరమశీలుఁడు సదా బ్రహ్మచారి." —భార. బ్రహ్మచర్యమునందు నని యధ్యాహారము. మౌంజి, అజిన, దండధారణాదిరూప మగు మఱియొక బ్రహ్మచర్యము - నందు నని యర్థము. ప్రథ = ఇదియే బ్రహ్మచర్య మను ప్రఖ్యాతి, అది ద్వైవిధ్యము = లోకులు చెప్పునట్టి మౌంజ్యజిన దండాదిరూపమును, స్మృతులు చెప్పునట్టి ఋతుసంగమ మను నీ రెండువిధములును ఆమహాత్ముని బ్రహ్మచర్యమునకుఁ గారణాంతరమున నబ్బు

ను, అని యన్వయము. దీనిని యాజ్ఞవల్క్యఋషియుఁ జెప్పియున్నాఁడు. 'షోడశర్తు న్నిశాః స్త్రీణాం, తస్మిన్ యుగ్మాసు సంవిశేత్ । బ్రహ్మచార్యేవ పర్వా ణ్యాద్యాశ్చతస్రశ్చ వర్జయే' త్తని.

తాత్పర్యము.

బ్రాహ్మణులు బ్రహ్మచర్యము త్తమమైనది యని శ్లాఘింతురు. లోకమునందును నది గొప్పదనియే కీర్తి వహించినది. ఆ బ్రహ్మచర్యము రెండువిధములు. గృహస్థా శ్రమమునకుఁ బూర్వాశ్రమమందుండి స్త్రీవిషయచింతయే లేకుండుట యొకటి. గృహస్థుఁడై తన వివాహితభార్యతో ఋతుకాలమునందుమాత్రము సంగమిం చుట రెండవది. ఒకానొకకారణముచే నీ రెండువిధముల బ్రహ్మచర్యము ఋశ్యశృంగునికి లభించును.

చ॥ జనకుఁడు గొల్చు చగ్నులను • సన్మతి వేల్చుచు నుండ, నిట్లు చా
యను జరియింప నాయసమయంబున నేలెను రోమపాదుఁడ
ను జనరేణ్యుఁ డసమానపరాక్రముఁ డంగరాజు, త
జ్జనపతిదోషహేతువున • ధాత్రి తపించును వృష్టిహీనతన్. ౩౧౬

వేల్చుచున్ = హోమము చేయుచు, ఇట్ల చాయన్ = ఈవిధముగ, మొదటి బ్రహ్మచర్యమున; చరియింపన్ = నడచుచుండఁగా, అసమానపరాక్రముఁడు = సాటిలేని పరాక్రమము కలవాఁడు, అంగరాజు = అంగదేశమునకుఁ బ్రభువు, రహించున్ = ప్రకాశించును, ప్రఖ్యాతిచెందును. తత్ + జనపతి = ఆ ప్రభు వుయొక్క, దోషహేతువునన్ = అధర్మ మను కారణముచేత, తపియించును = పొక్కును. ఈదోషము బ్రాహ్మణావమానము. రోమపాదుఁడు = అఱకాళ్ల యందు వెండ్రుకలు గలవాఁడు. ఆగర్భశ్రీమంతుఁడు గాఁబున నడచి యెఱుఁ గఁడు.

తాత్పర్యము.

జనకుసేవ యగ్నిహోత్రకార్యము దప్ప వేఱొకటి యేదియు లేక యా యనకాలక్షేపము చేయుచుండుసమయమందు రోమపాదుఁ డను బలపరాక్రమ ములుగల రాజు అంగదేశమునకుఁ బ్రభువై యుండెను. ఆయన బ్రాహ్మణుల నవ మానించిన కారణముచే శిష్టులగు బ్రాహ్మణులందఱు నాదేశము విడిచిపోదురు. ఆకారణమున నతనిరాష్ట్రమందు వర్షములు కురియవు. దానివలనఁ బ్రజలు బాల బాధపడుచుండురు.

క॥ దారుణ మగువఱపిటు లేన, ధారణి నోదవినను దుఃఖ•తాపార్దితుఁడై
కారణమును శ్రుతవృద్ధుల, ధారుణీసుర్జరులఁ బొచి•తం బతఁ డడుగున్. ౩౧౭

దారుణము=దీర్ఘకాలము వ్యాపించిన దగుటచే క్రూరము; వఱపు = కఱవు, ఒదవినన్ = కలుగఁగా, అర్దితుఁడై = పీడింపఁబడినవాఁడై, శ్రుతవృద్ధులను = పెక్కండ్రయొద్దఁ బెక్కువిధముల శాస్త్రార్థముల విన్నవారిని, 'బహుభ్యశ్శ్రోతవ్యం, బహుధాశ్రోతవ్య' మ్మని ప్రమాణము. ధారుణీనిర్జరులన్ = బ్రాహ్మణులను. పాచితము = దుర్భిక్షమునకుఁ గారణమైన తనపాపమునకు ప్రాయశ్చిత్తము. ప్రాయశ్చిత్త భవము పాచితము.

తాత్పర్యము.

తనదేశమందు భయంకరమైన కఱవు రాఁగా నారాజు మిగులదుఃఖపడుచు 'నేనేమి పాపముచేసితిని? ఏల నారాజ్యమందీ దుర్భిక్షము ప్రాప్తించెను? నేనేమి ప్రాయశ్చిత్తము పెట్టుకొనిన మరల దేశమున సుభిక్షము కలుగును? చెప్పుఁడా' యని పెక్కుశాస్త్రములు చదివి, పెక్కురుపెద్దల సేవచేసి, వారివలన ననేకవిషయముల నెఱిఁగిన వృద్ధబ్రాహ్మణులను బిలిపించి యడుగుచు

ఉ॥ పాఱులు వేదశాస్త్రచయ◆పారగు లంతట రాజుఁ జూచి దై
వాఱుముదాన నందఱు వి◆భండకుఁ డన్మునివర్యుపుత్త్రుఁ డా
పోఱఁడు ఋశ్యశృంగుఁడు త◆పోధనుఁ డాతనిఁ దెచ్చినంతటన్
దీఱు నుపద్రవంబు, లెది◆తీరున వాఁ డిటు రా నొనర్పుమీ. ౩౧౮

అస్ఖలితబ్రహ్మచారికిఁ గన్యాదానము చేయుటయే తగిన ప్రాయశ్చిత్త మని బ్రాహ్మణులు చెప్పుచున్నారు వేదశాస్త్రచయపారగులు = తుదముట్టవేదశాస్త్రసమూహములఁ జదివినవారు, పాఱులు = బ్రాహ్మణులు, దైవాఱు = అతిశయించు, ముదాన=సంతోషముతో, పోఱఁడు=బాలుఁడు. ఎదితీఱునన్= ఏవిధముననైనను. విభండకుఁడు, విభాండకుఁడు అని రెండు రూపములుగలవు.

తాత్పర్యము.

ఇట్లు రాజు ప్రశ్నింపఁగా సాంతముగ వేదశాస్త్రములఁ జదివిన బ్రాహ్మణులు రాజును జూచి దేశక్షోభ నివారింప రాజు యత్నముచేయుచున్నాఁడు గదా యని సంతోషించి యందఱేకవాక్యముగ నిట్లనిరి. 'నరపాలా! విభండకుఁ డను మునీశ్వరునకు ఋశ్యశృంగుఁ డను కుమారుఁడు గలఁడు. అతఁడు మహాతపస్సంపన్నుఁడు. ఆయన యిచ్చటికి వచ్చెనా యీ దేశోపద్రవము దీఱును. ఏవిధముగనైన నతని నిందు రప్పింపుము. బ్రాహ్మణులు ఋశ్యశృంగుని రప్పింపుమని చెప్పుటకుఁ గారణము భారతంబునఁ జెప్పఁబడినది. 'ఉ॥ శాంతుఁడు ఋశ్యశృంగుఁ డను సన్మునియున్నయెడన్ ధరిత్రికిన్ । సంతతవర్షణంబగు భృశంబగునట్టి వరంబుఁ దొల్లి వృ।త్రాంతకుచే దయంబడసె నమ్ముని గావున ఋశ్యశృంగు వే। దాంతనివేది రాఁబనుపు మంగమహీశ్వర నీదు నేర్పునన్.'—భార. ఆది. ౯౩.

సీ॥ అతనికి భక్తి నీసుత శాంత గుణకాంత, హస్తకృతి నొసంగు • శస్తమతిని
సన వీర్యవంతు నాతని నెట్టు రప్పింప, నని మానసమున యోజన యొనర్చి
మంత్రుల రప్పించి • మంతనం బుండి స,భృత్యపురోహితామాత్యవరుల
బనిచెద నని పల్క • విని వారు వెఱఁగుంది, దీనులై యంద్రు న•తాననముల
వెఱచువారము మునినాథు•కలుకుఁ దెలఁచి, యుపమఁ జెప్పెద మేమొండు•నృపవరేణ్య
యరుచువారవధూటులఁ•బనుపుదాన,దోష మొుం వదయనవార•యోషితలను.
౩౧౯

శాంతన్ = శాంత యను పేరుగలదానిని, గుణకాంతన్ = సద్గుణములచే మనోహర యగుదానిని, హస్తకృతి= పాణిగ్రహణమున - ఇది గతిసమాసము. వీర్యవంతున్ = అస్ఖలిత బ్రహ్మచారిని, యోజనము = ఆలోచన, యోచన యనుట యవ్యుత్పన్నశబ్దము మంతులన్ = మంత్రులను, మంతనంబు=ఆలోచన, బ్రాహ్మణుని బ్రాహ్మణులచేతనే రప్పింపవలయు నను నాలోచన, మాన్య = గౌర వింపఁదగిన, అమాత్యులు = దేశములోని కార్యనిర్వాహకులు, పనిచెదన్ = పంపెదను, వెఱన్ = ఋశ్యశృంగునివలని భయమున, కుంది = దుఃఖించి, దీనులై = కలఁతపడిన మనస్సుగలవారై, నత + ఆననములన్ = వంచు కొన్నముఖములతో, కలకున్ = కారిన్యమును, ఒండు + ఉపమ = ఋశ్య శృంగునిఁ దెచ్చుటకు వేఱుపాయమును, వారవధూటులన్ = భోగము వారిని - స్త్రీలను, దానన్ = వేశ్యలఁ బంపుటచేత, దోషము = (1) ఋశ్య శృంగునికి వేశ్యాసంబంధ మను దోషము - ఋష్యశృంగునికి వేశ్యా సంబం ధము లేకుండ రప్పించెద' మని భావము. (2) మనకు ఋషివిభండకుని శాపము (3) వఱ పన దోషము, ఒదవదు = కలుగదు, వారయోషితలు = వేశ్యలు, ఉపాయశబ్దభవము ఉపమ, "స్త్రీవధూయోషితా రామా" అని త్రికాండ శేషము. యోషిత్ - భాషా - యోషిత.

తాత్పర్యము.

ఆయన నిచ్చటికి రప్పించి నీపుత్రికయైన శాంతను నాయన కిచ్చి వివాహముఁ గావింపుము- అనిన రా జామాటలు విని యస్ఖలిత బ్రహ్మచర్యము సనుండిన మహా వీర్యవంతుఁ డతని నెట్టు రప్పింపసాధ్యపడును. ఆయన కాముకుఁడా గాఁడు. స్త్రీలన నెట్టివారో యెఱుఁగడు. విషయవిచారణమూ లేదు ఆయనచేయఁదగిన యోగ్య కార్యమూ యిందు లేదు. ఏ మని పిలిపింతును? అని యోజించి మంత్రుల రప్పించి వారితో నాలోచించి భృత్యపురోహితామాత్యులఁ బంపెదను, అనిన వారు భయపడి మొగములు వ్రేల వైచి, యయ్యా! యాఋషీశ్వరుఁడు విభాండకుండు తీవ్రకోపి కావున శాపమునకు భయపడెదము. ఋశ్యశృంగుఁ డిచ్చటికి వచ్చు

నుపాయము చెప్పెదము. వేశ్యలను బంపెదవేని వా రాయనను దోడుకొనివత్తు రు. వేశ్యలకుఁ బురుషులను వశపఱుచుకొనుటే వృత్తి గావున వారికి వృత్తిభంగము వృత్తభంగము లేదు. వీ రాయనతోఁ గ్రీడింపఁబోరు. కావున ఋశ్యశృంగునకు వేశ్యాసాంగత్య దోషములేదు. నీవు నీపుత్త్రి శాంతని కిచ్చి వివాహము చేయ సాధుభావముతోఁ బంపించినవాఁడవగుట నీశిష్టు ముని యలుగఁడు. ఆయన వచ్చుటచే వా నకురియును. కావున మనోహరవేష లగు వారయోషలఁ బంపుము.

కం॥ పంచిన వారలు మునిఁ దోడ్కొంచును రా నృపతి తనదుకూఁతుర్ శాంతన్
బంచాలయనామణిఁ గావించును బరిణయ మతఁడు • వృష్టియుఁ గురియున్. ౧౭

వృష్టి = వర్షము, పంచలనయనా = కలువ చిన్న నేత్రములుగల స్త్రీల యందు, మణిన్ = రత్నమును, శ్రేష్ఠురా లగు శాంతను, పరిణయము = వివాహము.

తా త్ప ర్య ము .

అని చెప్పఁగ రాజు వారకాంతలను బంపును. వారు పోయి ఋశ్యశృంగుని దోడితెత్తురు. అంగరా జాయనకుఁ దనకూఁతు శాంత నిచ్చి వివాహముచే యును. వర్షము కురియును

తే॥ అతనియార్త్విజ్యమున నీవు•క్రతువు సేయ, గొడవుదురునీకుఁదనయులు•విదితకీర్తు
లంచుఁబలుకంగ నే నాలకించినాఁడ, నన్యథాత్వంబు గలదె యమ్మాన్యునుడికి. ౧౮

ఇంతవఱకు సనత్కుమారుఁడు చెప్పినమాట లాయన చెప్పినట్లు చెప్పి యిఁకఁ దనమాటగా నాయన యభిప్రాయమును జెప్పుచున్నాఁడు.

ఆర్త్విజ్యము = ఋత్విజుఁడు చేయుకార్యము, ఋశ్యశృంగుని బురోహితునిగా నంచుకొని యనిభావము. క్రతువు = పుత్త్రకామేష్టి, విదితకీర్తులు = ప్రఖ్యాతమైన కీర్తిగలవారు, ఆలకంచినాఁడను = విన్నవాఁడను, అమాన్య = మహనీయుఁడగు సనత్కుమారుని, నుడికిన్ = మాటకు, అన్యథాత్వంబు = తప్పిపోవుట, అంతటిగొప్ప యోగిమాట తప్పదు కావున నట్లు నీవు జరుపుట మేలు. సనత్ + కుమారుఁడు = ఎల్లప్పుడు కుమారదశయందే యుండువాఁడు.

తా త్ప ర్య ము .

ఆఋశ్యశృంగుఁడు ఋత్విజుఁడై నీచే యజ్ఞము చేయించెనేని నీకుఁ గీర్తిమంతులైన కొడుకులు గలుగుదు రని సనత్కుమారుఁడు చెప్పఁగా నేను వింటిని. ఆమహాత్మునిమాట లసత్యము లగునా?

చం॥ అని వచియింప మేనఁ బుల♦కాంకురముల్ నన లెత్తఁ బల్కె వే
యనఘచరిత్ర! యా సుమహి♦తాత్మ విభండకపుత్త్రు జన్మముల్
వనితలు వాని నెట్టినెఱి♦వంచనలం గొని తెచ్చి రాకథ
న్వనమున వేఁగ యయ్యెడు వి♦నంగ సవిస్తరవాక్యపద్ధతిన్.   ౩౨౨

మేనన్ = దేహమునందు, పులక + అంకురముల్ = మొలకలవంటి గగుర్పాటులు, ననలు + ఎత్తన్ = మొలకలెత్తఁగా, అనఘచరిత్ర = నిర్దోషమైన నడతకలవాఁడా, సుమంత్రుఁడా, సుమహితాత్మ = మిక్కిలి పూజింపఁదగిన మనస్సుగల, వనితలు = వేశ్యాస్త్రీలు, నెఱి = కుటిలమైన, సవిస్తర = విరివితోఁ గూడిన, అర్థవిస్తారము, శబ్దవిస్తరము ఈరెంటితోఁ గూడిన, వాక్యపద్ధతిన్ = మాటల క్రమముతో,

తా త్ప ర్య ము .

అని సుమంత్రుఁడు చెప్పఁగా దశరథుఁడు దేహమున గగుర్పాటు కలుగ విని యోయి సుమంత్రా! యంగొప్పప్రభావముగల ఋశ్యశృంగుని జన్మచరిత్రము, ఏవిధముగా స్త్రీలాయనను వంచించి తెచ్చిరో యాకథపూర్ణముగా వినఁ గోరిక కలిగెను. కావున నీ విప్పుడు సంగ్రహముగఁ జెప్పినదానిని వ్యాసముగాఁ జెప్పుమా యని యడిగెను.

—* ౧౦ సర్గము. సుమంత్రుఁడు దశరథునకు ఋశ్యశృంగుచరిత్రఁ దెల్పుట *—

కం॥ అని యడిగినఁ బృథివీపతిఁ, గనఁగొని హితసచివవరుఁడు ♦ కౌతుకమతియై
యనియెన్ మంత్రియుతంబుగ, జనవర్యుఁడు మంత్రముండి♦ సవిచారుండై.౩౨౩

హితసచివవరుఁడు = మేలు చెప్పెడి మంత్రిశ్రేష్ఠుఁడు సుమంత్రుఁడు, కౌతుకమతి — కౌతుకముతోఁ గూడిన మతి = సంతోషముతోఁ గూడిన మనస్సు, మధ్యమపదలోపి కర్మధారయము, ఐ = కలవాఁడై, విశదతరఉక్తిన్ = మిక్కిలి స్పష్టములగు పలుకులతో, వృత్త్యనుప్రాసము. మంత్రియుతంబుగ = మంత్రులతోఁ గూడినవాఁడై.

తా త్ప ర్య ము .

అని రాజిట్లు తన్నడుగఁగా రాజు మేలుఁగోరు నామంత్రిశ్రేష్ఠుఁడు విశదముగాఁ జెప్పెద వినుమని యిట్లనియె.

తే॥ అతని నెట్టులుపిలిపింప ♦ నగును నాక,టంచు నెంచి యమాత్యుల♦కనియె నృపతి
యనఘులార! మత్పరమహి♦తార్థులార! యరుగరేమీరు లోకహి♦తార్థముగను.

నృపతి = రోమపాదుఁడు; అమాత్యులకున్ = కార్యనిర్వాహకులగు మంత్రులకు, మత్ = నాయొక్క, పరమహిత = గొప్పమేలును; అర్థులార = కోరెడి

వారలార, లోకహితమగు సుభిక్షమే తనకుఁ బరమహితము, అరుగుఁడు + ఏ అరుగరే. సు-వ్యా ప్రార్థనార్థక మధ్యమపురుషంబున నదాదు లనుప్రయుక్తంబు లగుచో ము డుజ్జులకు వు-రు లగు, క్రియ. ౩౮.

తాత్పర్యము.

ఋశ్యశృంగుని బిలిపింపుమని బ్రాహ్మణులు చెప్పఁగా రోమపాదుఁ డమాత్యులను బిలిపించి 'నామేలుకోరెడి యోమంత్రులారా! బ్రాహ్మణులు ఋశ్యశృంగుని బిలిపింపు మనుచున్నారు. నాకార్యములఁ జక్కఁజేయువారు, నామేలు కోరినవారిలో మీకంటె గొప్పవారు నిర్వంచనముగాఁ బనిచేయువారు లేరు. మీరీలోకహితముకొఱకై నా కార్యము సమకూర్పుఁడు.

కం॥ హితమతు లగుమీరుఁ బురోహితులును జతగూడి వేగ ♦ మేగి సుకృతధీ
రతి నతులితమతిచాతురి, నతనిం గొనిరం డమాత్యులారా! యనినన్. ౩౨౯

జతగూడి = ఒక్కటిగాఁ జేరి, సుకృతధీ = పుణ్యమునందలి తలంపున, రతిన్ = ఆశగలవానిని, అతులిత = అసమానమైన, మతిచాతురి = బుద్ధిచాతుర్యము కలవారిని, ఈ పద్యమున తకారమునకు వృత్త్యనుప్రాసము.

తాత్పర్యము.

నాక్షేమము గోరినమీరు పురోహితులతోఁగూడి శీఘ్రముగాఁ బోయి పుణ్యవంతమైన మనస్సుతో వంచనలేక గౌరవముగ మీబుద్ధిచమత్కారమంతయుఁ జూపి యాయనను దోడుకొనిరండు.

కం॥ వారలు వెలవెలఁబోవుచు, భూరమణునిఁ గాంచి యనిరి ♦ 'భూనత! యతనిం
జేరఁగఁ జని మనియెదమే', క్రూరత శపియింపకున్నె' ♦ కుటిలతఁ దెలియన్. ౩౨౬

వెలవెల + పోవుచున్ = వెలవెలఁబోవుచు = భయముచేఁ దెల్లపోయినవారగుచు, భూరమణుని = రాజును, భూ = భూజనులచేత, 'మంచాః క్రోశంతి' యన్నట్లు లక్షణావృత్తి. నత = కొనియాడఁబడినవాఁడా, మనియెదమే = బ్రతికెదమా, కుటిలత = మా బుద్ధియొక్క వక్రత = మామోసబుద్ధి, ఉన్నె = ఉండునా ?- ఉండునే - ఉన్నె, అవశ్యము శపించును.

వ్యాకరణము.

ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబు లగు నుండు - చను - చేరు - కొను లు ప్రశ్నార్థకకారాంతకంబు లగునపుడు వాని కడయచ్చులకు లోపంబు విభాష నగు. అగుచో నుండు డకారంబునకు నకారం బగు. ప్రౌ. వ్యా. క్రియ. ౨. 'పురుషార్థంబునకు హానిపుట్టకయున్నె.' భార. విరా. ౧. ౭.

తాత్పర్యము.

అని రోమపాదుఁడు వచింపఁగా భయముచేఁ దెల్లవాఱిన మోములతోఁ రాజుం గని యిట్లనిరి. ఱేఁడా! తండ్రికొడుకుల నెడఁబాపవచ్చినార మని తెలియఁగానే మమ్మతఁడు శపింపఁడా? మాయుద్దేశము తెలిసిన నతఁడు శపించుట సత్యము. కావున నతనికిఁ దెలియకుండ వంచనచేసియే పిలుచుకొని రావలెను. దాని కేమి యుపాయము చెప్పెద వినెదరా వినుండు.

మత్తకోకిలము॥ ఆఋషీంద్రుఁడు పుట్టు వాదిగ • నంబుజాయతనేత్రల
న్వార లెట్టిరో యాలకింపఁడు • పల్లెనేటికిఁ జూచుటల్
వారముఖ్యలు ధారుణీశ్వర! • వంచనాపర లాటచే
నేరుపుల్ పచరించి తేరఁగ • నేర్తు రెంతెయుఁ దిన్నఁగన్. 3 ౨౭

ఋషి = ఋ గతౌ యను ధాతువువలనఁ బుట్టినది. గత్యర్థకము లన్నియు జ్ఞానార్థకములు, కావునఋషి = జ్ఞాని, రుషి యనియుఁ గలదు. అది రుష హింసాయాం అనుధాతువు వలనఁ గలిగినది. ఇది హింసార్థకము. ఇంద్రియముల హింసించువాఁడు. జితేంద్రియుఁ డని యర్థము. ఋషిశబ్దభవము రిసి గాని రుసి గాదు. ప్రాకృతవ్యాకరణము. ఋషి,ఋషీ యని రూపా. ఋషిశ్చాపి ఋషీచస్యాత్ - ద్వి - కోశము. అంబుజ + ఆయత + నేత్రలు=తామర రేకులవలె నిడుపైన కన్నులుగలవారు, స్త్రీలు. ఎట్టిరో = ఎట్టివారో- ఎట్టులుండువారో, చూచుటల్, పల్లెనేటి కని యన్వయము. వారముఖ్యలు=జనులచే గౌరవింపఁబడు వేశ్యలు. "సా జనైః । సత్కృతా వారముఖ్యా స్యాత్" అని అమరము. వారస్త్రీ=వేశ్య - నామైకదేశే నామగ్రహణమ్మని యం దొకశబ్దము వార యనునది వారస్త్రీపర్యాయముగ గ్రహింపఁబడినది. భీమసేన యను శబ్దమునుండి భీమశబ్దము, సత్యభామశబ్దమునుండి భామ యనుశబ్దము వాసుదేవ శబ్దమునుండి వాసుశబ్దము గ్రహించినట్లు పచరించి = ఉపయోగించి. ప్ర ప్రచారించు. వి. పచరించు. తేరఁగ = తీసికొని రాఁగ -ఋషి నని యధ్యాహారము. ఋశ్యశృంగుఁడు రూపా. ఋష్యశృంగుఁడు. ఇందు ఋప్రాసము. ఋకారమునకు రేఫమునకుఁ బ్రాసము చెల్లును. 'ఆఋషిపుత్రుఁడు కట్టన। చీర' లని భారత ప్రయోగము.

తాత్పర్యము.

ఆ ఋశ్యశృంగుఁడు జననము మొదలు స్త్రీ లిట్లుందురని వినియు నెఱుఁగఁడు. ఇఁకఁ జూడలే దని చెప్పనేల? కావున స్త్రీలే యాయనం బిలుచుకొని రాఁదగినవారు. అందుఁ గులకాంత లిట్టికార్యములకుఁ దగరు. కావున వారు పోరాదు. వారకాంతలే పోఁదగినవారు. వారు వంచనములకుఁ బుట్టినిండ్లగు

టచే నెట్టి మగవారినైన వారు వశపఱుచుకొనఁ గలరు. కావున వారిని బంపి తిరేని వారి నేర్పు చూపి యెట్లైనఁ దోడితేఁగలరు.

కం॥ కావున వారలఁ బంచుట, యేవిధమున నైన లెస్స • యిది యుక్త మనన్
భూవరుఁడు సమ్మతించిన, వే వారలు పంచి రపుడు • వేశ్యామణులన్. ౩౨౮

వే = త్వర, యుక్తము = తగినది.

తా త్ప ర్య ము.

ఇత్యాది కారణములచే వారినే పంపుట మే లని మంత్రులు చెప్పఁగా రాజు సమ్మతించెను. అప్పుడు మంత్రులు వేశ్యలందు ముఖ్యులుగానుండువారిని బిలిపించి యాకార్యమందు నియోగించిరి.

కం॥ ఆరామలు మునియుండెడు,నారామమునందుఁ దిరిగి • యారామరమా
కారంబుల నా మాయో,దారలు యత్నించి రతని • దర్శించుమతిన్. ౩౨౯

మాయోదారలు = ఎక్కువకపటముగలవారు, రామలు = స్త్రీలు - ఇచ్చట వేశ్యలు, ఆరామము = వనము - విశేషపదము సామాన్యవాచకముగా నుపయోగింపఁబడినది. లక్షణావృత్తిచేతనే యీయర్థము దీనికిఁ జెప్పనగును. సామాన్యపదమును విశేషవాచకముగా నుపయోగించునపుడు అభిధావృత్తి చాలును. పదము సామాన్యమైనను సందర్భముచేఁ గొలఁది విశేషార్థక మగును. ఆశ్రమభూమి కావున నిట్లు చెప్పఁబడెను. ఆరామ + రమా + ఆకారంబులన్ = వనలక్ష్మీ వేషములతో, దర్శించుమతిన్ = చూచుకోరికతో, యత్నించిరి = జాగ్రత్తగాఁ గాచుకొనియుండిరి. రేఫమకారములకు వృత్త్యనుప్రాసము. ఋశ్యశృంగాశ్రమము కౌశికీతీరస్థమైన క్షేత్రము. కౌశికీనది నిప్పుడు కూసి యందురు. ఈయాశ్రమము భాగల్పురజిల్లాలో సింఘేశ్వరమునం దున్నది.

తా త్ప ర్య ము.

మాయలయందు సమర్థలైన యాస్త్రీలు ఋశ్యశృంగునిఁ దోడితెచ్చుటకై యాయనయుండు వనంబునకుఁ బోయి యందు నతనిఁ జూచు నాసతో వనలక్ష్మీ దేవతలవలె సంచరించుచుండిరి.

తరలము. జనన మందిన దాదిగాఁ బుర•సంభవంబు నెదేనియున్
జనపదోద్భవమైనఁ జూచిన•జాడ లేదు, నెలంత ల
న్వినియు నేని నెఱుంగఁ, దుర్గము•నిష్ఠుఁ డొటఁ దపంబునన్
దనదునాశ్రమభూమి వీడఁడు • దండ్రిఁ దన్పు సపర్యలన్. ౩౩౦

వారలు ఋషికై కాచియుండు హేతువును జెప్పుచున్నాఁడు.

పురసంభవము = పట్టనమునఁ బుట్టినది - గుఱ్ఱము మొదలగునవి. జనపద + ఉద్భవము = పల్లెలయందుఁ బుట్టినది - కోడి మొదలైనది. జాడ = గుర్తు; నెలంతలన్ = స్త్రీలను, వినియు నేని యెఱుంగఁడు - ఇఁకఁ జూచుట యన నెట్టిది. ఇల్లుండఁ గాననేమన — ఉగ్ర = భయంకరమగు, సునిష్ఠుఁడు = మంచిపట్టుదల గలవాఁడు, వీడఁడు = వదలఁడు, సపర్యలన్ = పూజలచేత్, తనుపున్ = సంతోషపఱుచును, తండ్రిసపర్య నుపాసిష్ఠ ఈ కారణములచే నాశ్రమము విడలకుండినవాఁడు గావున నేవస్తువున్నను జూచినవాఁడు కాఁడు. చూచుకోరికయు లేదు. కావున గ్రంథములవలననైనను స్త్రీలక్షణ మెఱుఁగఁడు - బైటవెడలు ప్రస్తావనయే లేకుండుటచే నాయన యెప్పుడైన బైట వచ్చునా యని దూరమునఁగాచి యుండవలసివచ్చెను.

తాత్పర్యము.

ఆ ఋశ్యశృంగుఁడు పుట్టినది మొదలు నగరమునందుఁగాని పల్లెలందుఁగాని పుట్టిన యేవస్తువును గాంచినవాఁడు కాఁడు. స్త్రీ లెట్లుందురో వినియు నెఱుఁగఁడు. తీవ్రమైన నిష్ఠయందుండువాఁ డగుటచేఁ దపస్సునందును పితామకాలం బునఁ దండ్రికి శుశ్రూషచేయుటయందును గాలము గడుపుచుండెను. కావున నాశ్రమము విడిచి బాహ్యమునకు రానలసిన పనికాని కాలముగాని యాయనకు లేకుండెను. ఇతిహాసపురాణాదులవలనను స్త్రీలస్వరూప మిట్టిదని యెఱిఁగిన వాఁడు కాఁడు. ఆశ్రమమునొద్దకుఁ బోగ మనిన విభండకుఁడు శపించు నని భయముకావున నాస్త్రీలు చాలదూరమందే కాలమునకై వేచియుండిరి.

కం॥ భూదేవకుమారునకుఁ దలోదరు లిటు వేచి యుండ • నొకదినసమునన్
యాదృచ్ఛికముగ నాతం, డాదృతిఁ జనుదెంచె వారి•యంతికమునకున్. ౩౩౧

తల + ఉదరులు = అఱచేతివంటి కడుపులుగలవారు, భూదేవకుమారునికి = బ్రాహ్మణపుత్రునకు - ఋశ్యశృంగునకు, వేచి = యెదురుచూచి, యాదృచ్ఛికముగ = దైవవశమున, అంతికమునకున్, = సమీపమునకు, ఆదృతిన్ = ఆదరణముచేత, ఎప్పుడుచూడని యట్టి యాకారములను గ్రొత్తగాఁ జూచుట వలన నాదరణము.

తాత్పర్యము.

ఆబ్రాహ్మణకుమారునినిమిత్తమై యాస్త్రీ లా ప్రకారము కాచి యుండు సమయంబున దైవతంత్రమున కొకనాఁ డున్నట్టు లుండి వార లుండు స్థలమునకు సమీపప్రదేశమున కాయన వచ్చెను.

—* వేశ్యలు ఋశ్యశృంగుని వంచించి తోడితెచ్చుట. *—

కం॥ వచ్చెడిఋషిపుత్త్రునిఁ గని, మెచ్చగు వేషములఁ బూని • మెలఁతుక మిన్నల్
పొచ్చెంబు లేనిమధురిమ, హెచ్చఁగ గానంబు సేయు • చేగిరి డాయన్. ౩౩౨

మెలఁతుక మిన్నల్ = అందమున గొప్పవారగు నావేశ్యలు - మణిశబ్దభవము మిన్న, మెచ్చగు వేషము = కొనియాడఁదగిన చిత్రాలంకారములను, పొచ్చెము = లోపము, సేయుచును = చేయుచు, చేగిరిడాయన్ = వ్యాపింపఁ [illegible].

తాత్పర్యము.

ఇట్లు వచ్చు ఋషికుమారునిఁ జూచి యాస్త్రీలందఱు వేషములు వేసికొని మిక్కిలి మనోహరమైన విధమున గానముచేయుచు నాయన సమీపమునకుఁ బోయిరి.

కం॥ చని యిట్లు వినయంబున నవ్వనజేక్షణ లనిరి విప్రవర! యెందుండై
మనుజులు మెట్టాడని యీవనముల నెవ్వఁడవి వెలయ వలసె నీడుగన్? ౩౩౩

వనజేక్షణలు = తామరలవంటి కన్నులుగల యావేశ్యలు, మెట్టాడని = సంచరింపని, విప్రవర = బ్రాహ్మణశ్రేష్ఠుఁడా, ఋషుల స్వతత్త్వమును గుఱించి యుత్తరకాండమున వసిష్ఠజన్మకథనంబునఁ జూచునది.

తాత్పర్యము.

ఇటుపోయి వినయముతో నో బ్రాహ్మణోత్తమా! మీరెవ్వరు - మనుష్యసంచారము లేని యీయడవులందు నొంటిగా నేల సంచరించుచున్నారు?

చం॥ పలుకుము మాకనుచు వేఁడఁగ విభండకపుత్త్రుఁడు పూర్వ మెట్టి ని
స్తులసుమనోహరాకృతులఁ • దోయజహస్తులఁ జూడకుండుట
న్గలికితనంబుచేఁ గరఁగి • నర్తిలిఁ బల్కు విభండకాఖ్యుఁడౌ
యలఘుతపస్వి యౌరసుఁడ • నొందు పేరను ఋశ్యశృంగుఁడన్. ౩౩౪

నిస్తులగ = సాటిలేని, కలికితనంబుచేత = మనోజ్ఞతచేత, 'కలికితనమొప్పదంబు కాంతయమ్యో' నిఘంటువు. నర్తిలిఁ = స్నేహభావముతో అలఘు = గొప్పవాఁడగు, ఔరసుఁడను = కన్నకొడుకును - పూర్వము విభండకుఁడు మహాభూతతటాక మను సరస్సున స్నానముచేయుచు నాకాశమునఁబోవు నూర్వశి యను నప్సరసను జూడఁగా నతనికి రేతస్స్ఖలనమాయెను. దానిని బ్రహ్మశాపవశమున నాఁడుమనుఁబోతైయుండిన యొక యప్సరస నీటితోఁడఁ ద్రావెను. దానివలన నది గర్భము ధరించి ఋశ్యశృంగునిఁ గనెను. అంతతో బ్రహ్మవాక్యప్రకారము దానికి శాపముక్తియు నయ్యెను. ఋశ్యము = మనుఁబోతు - దాని కొమ్మువంటి కొమ్ముగలవాఁడు గావున ఋశ్యశృంగుఁడు అని

పిలువఁబడుచుండెను. ఋశ్యము - రూపా - ఋష్యము. ఉరస్సుననుండి పుట్టినవాఁడు ఔరసుఁడు.

తాత్పర్యము.

మాకుఁ దెలియఁజెప్పుమా యని ప్రార్థింపఁగా నట్టి సుందరాకారముల, నంతటి విలాసముల, నంతటి వినయవిధేయతల - నెన్నఁడును జూచినవాఁడు కాకుండుటను నంతటి మనోహరివాక్యములు విన్నవాఁడు కాకుండుటను నాయొప్పులకుప్పలనేర్పులకు మనస్సు కరఁగినవాఁడై యిట్లనియె. ఋషిపుత్రులారా? నేను విభండకుఁ డను ఋషీశ్వరుని కౌరసపుత్రుఁడను. నా పేరు ఋశ్యశృంగుఁ డందురు.

ఉ. అల్లదె దాపునందున మ♦దాశ్రమభూమి రహించు, నయ్యెడన్
సల్లలితాంగులార! విధి♦సమ్మతిఁ గూర్చెద నాతిథేయ మం
చెల్లర వేఁడ నాశ్రమది♦దృక్షులతాంగులు వోవ వారలం
బెల్లుగ నర్ఘ్యపాద్యములఁ ♦ బ్రేముడి సత్ఫలమూలపాళులన్. ౩౩౫

దాపునందున = సమీపమందే, సల్లలితాంగులార = ఇది స్త్రీలకుఁ బురుషులకు సాధారణమైన పదము. ఆస్త్రీలు పురుషు లనియే ఋశ్యశృంగుని తలంపు. ఆయన నోరి నసత్యము పొరపాటుననైన రాదు. విధిసమ్మతిన్ = శాస్త్రానుసారముగ, నాతిథేయము = అతిథిపూజ, దిదృక్షన్ = చూడవలయు ననకోరికతో, అర్ఘ్యము = పూజ - దాని కుపయోగించు నీళ్లు అర్ఘ్యము పాద్యము - కాళ్లుకడుగుకొనుట కిచ్చునీళ్లు, పాళులన్ = సమూహములతో, పెల్లుగన్ = అధికముగ - పై పద్యముతో నన్వయము.

తాత్పర్యము.

అదిగో నిచ్చటికి సమీపమందే నాయాశ్రమభూమి యున్నది. సుందరులారా! యచ్చటికి రండు. శాస్త్రవిధానముచొప్పున నర్ఘ్యము పాద్యము నాతిథేయము నిచ్చెదను, అని యాయందఱుఁ బ్రార్థింపఁగా, నాయన యాశ్రమముఁ జూడకోరికచే వారందఱు నచ్చటికిఁ బోయిరి. ఋశ్యశృంగుఁడును విశేషించి వారి నర్ఘపాద్యాదులచేతను మంచిఫలమూలములచేతను బ్రేమతో నాదరించెను.

ఉ॥ పూజలఁ దన్ప వారు ముని♦పుత్రకుతో భుజియింపు వేగ మో
రాజితతేజ! స్వాదుఫల♦రాజ మదీయము, దానిపేర్మి నీ
తేజు చెలంగు నంచు నని ♦ తెప్పునఁ గొంగిటఁ జేర్చ స్వాదుతా
యోజితమోదకావళుల ♦ నొప్పగుభక్ష్యము లెన్ని యే నిడన్. ౩౩౬

మునిపుత్రకుతో నను పదము 'అని' యనుపదముతో నన్వయము. రాజత తేజ = ప్రకాశించు కాంతిగలవాఁడా? మదీయము = నాదియగు; స్వాదు = రుచిగల, రాజి = సమూహము, వేగ - విభండకుండు వచ్చిన శపించు నని భయముతో చెప్పినమాట యిది, తేజు = కాంతి, చెలంగుచు=అతిశయించుచు, తెప్పునన్=తటాలున, కౌఁగిటఁజేర్చి=స్నేహభావముతో మిత్రులు మిత్రులు కౌఁగిలించినట్లు వ్యాజము - వశీకరణమునకు వాస్తవము. స్వాదుతా = రుచితో; యుత = చేర్పఁబడిన - కూడిన, మోదక + ఆళులన్ = లడ్డుల సమూహములను, భక్ష్యములను = వేఁచితినుబండములను, పైంద్యముతో నన్వయము.

తాత్పర్యము.

ఇట్లు లాయన గౌరవింపఁగా వారును మునికుమారా! మాయొద్దనున్న తియ్యనిఫలములను భుజియింపుము. దానివలన నీకుఁ దేజస్సతిశయించును, అని ప్రేమాతిశయముచేఁ గౌఁగిలించుకొని అొమ్ముల కొత్తుకొని తియ్యనిలడ్డువాలు మొదలైన భక్ష్యములు పెట్టురకములవి యియ్యఁగా.

క॥ వనచరుల కలభ్యములై, ఘనరుచ్యము లైనవానిఁ గైకొని తిని యా
ముని యవియును ఫలములకా, మనమునఁ దలపోసి హృష్టమానసుం డయ్యెన్. ౩౩౭

వనచరులకు = అడవులందే తిరుగుచుండువారికి, అలభ్యములు=దొరకనివి, ఫలములు + అ + కాన్ = ఫలములే యని, హృష్టమానసుండు = సంతోషించుచున్నవాఁడు.

తాత్పర్యము.

అడవిఁ దిరుగువారికి దుర్లభములై మిగుల రుచిగలవానిని దీసికొని తిని యామునికుమారుఁ డవియు నొకతెగఫలము లని యెంచి మిగుల సంతోషించుచున్నవాఁ డయ్యెను.

క॥ రాజాస్యలు గురుసంయమి, రాజునకున్ వెఱచి మౌనిరత్నమ మాకుం
బూజావసర మటంచును, వ్యాజంబిడి పాఱిపోయి రతిదూరముగన్. ౩౩౮

రాజ + ఆస్యలు = చంద్రముఖులు - ఆవేశ్యలు, గురుసంయమిరాజునకున్= తండ్రియగు మునిశ్రేష్ఠునకు - విభండకునకు, వ్యాజము = నెపము.

తాత్పర్యము.

ఇట్లు తిన్నగ నతనినిఁ బలలో వేసికొన్నవారై యావారకాంతలు విభండకుండు వచ్చిన శపించు నని భయపడి ఋషినందనా! మా కనుష్ఠానమునకు సమయమయ్యె; ఇఁక నిందు మేము నిలువరాదు. పోయెద మని చెప్పి చాల దవ్వుగఁ బాఱిపోయిరి.

కం॥ వారలుపోయినపదపడి, యాఋషిపుత్రుండు వారి యాకారంబుల్
సారెకుఁ దలపోయుచుఁ జిం,తారతి నస్వస్థమతి వనంబునఁ దిరిగెన్. ౨౩

పదపడి = పిమ్మట, అస్వస్థమతిన్ = నెమ్మదిలేని మనస్సుతో,

నాలవపాదంబున బిందుయతి. పూర్ణబిందుపూర్వక తకారమునకు నాసిక పంచమాక్షర మగు నకారమునకు యతి.

తాత్పర్యము.

వారు వెడలిపోయిన పిమ్మట ఋష్యశృంగుఁడు వారియాకారములు, వారిచ్చిన యాహారములు తలపోసి తలపోసి చింతాకులుఁడై మనస్సు స్వస్థముగ లేక విచారముతో వనమందుఁ దిరుగుచుండెను.

కం॥ అవనిసురసుతుఁడు తొలుతటి,దివసంబునఁ గనిన నెలకుఁ జెప్పనఁ జని తా
నవురుగఁ గనఁగొనియెను రో,నవలాలను మఱునాఁడు నవలాలితలన్. ౨౪

నెలకు = నెలవునకు - చోటికి, నవలాలసలన్ = తనయందు నూతనముగ నభిలాష కలవారిని, రోనవలాలను = వెలయాండ్రను, "వెల జట్టి విలువ రో" యని నిఘంటువు. రో-రోయి-వెల యని యర్థము. నవలాలు - ఇది దేశ్యపదము కావున నచ దేశ్యపదే యను సూత్రము ప్రకారము హ్రస్వాంతము కాలేదు. నెలస్థానమనుటకు.

కం॥ అని పలుకు కలశభవముఖ, మునిజనముల ప్రశ్న వాక్యములు విని పూర్ణభి
క్షుయుఁడు తత్త్రివిధము నొ,క్కనెలను గమిగూడి యుసిరిఁ గనఁజాలమికిన్.
—పాంచు - ౧౯.

పూర్ణముగఁ బరిపక్వమయి తొడిమెయూడుటమాత్రము మిగిలి కారణాంతరముల జన్మించిన శుకాదులకుఁ దప్పఁ దక్కిన యందఱకుఁ గామము దుర్నివారము - అజయ్యము కావున గృహస్థుఁడుగానుండి సంసారసుఖదుఃఖము లనుభవించి రోసి నిజమై స్థిరమైన వైరాగ్యముగలవానికి మరల స్త్రీలవలన భయములేదు, గాని బ్రహ్మచారిగాని యపక్వమనస్కుఁడైన గృహస్థుఁడుగాని తత్కాలజనితవైరాగ్యావేశమున సన్న్యాసియయ్యెనేని వాఁ డడవులయం దొంటిగా నున్నను నేవేళయందో యేసందర్భమందో వాని కన్నులో వానిమనస్సో వానిని గామమునకు నప్పగించును. అప్పు డుభయభ్రష్టుఁ డగును. కావుననే దీర్ఘబ్రహ్మచర్యము - వానప్రస్థము - సన్న్యాస మీకాలమున నిషిద్ధము లని స్మృతులు ఘోషించుచున్నవి. ఇంట గెలిచి రచ్చ గెలువవలయు నను సామెత యీ విషయమునఁ బూర్ణముగ నన్వయించుచున్నది. మనస్సు పరిపక్వముగాక స్త్రీపురుషభేదజ్ఞానము నశింపక యద్వైతానుసంధానంబు చేయువాఁ డెవ్వఁడైన భ్రష్టుఁడే.

తాత్పర్యము.

ఆ బ్రాహ్మణకుమారుఁడు ముందుదినము తానాస్త్రీలను జూచిన స్థలమునకుఁ ద్వరగాఁ బోయి యాక్రొత్తసౌందర్యముగల వెలయాండ్రను జూచెను.

ఉ॥ పూర్వదినంబు దోఁపఁగ న◆పూర్వవిలాసగతిం జరించు చా
పర్వసుధాకరాస్యలు త◆పస్వివరా! యిటకేఁ బోదమయ్య? మా
యుర్వికి నీవు వచ్చెదె? సు◆ఖోన్నతిఁ గూర్చెద, మన్న వేఁలుపా
టోర్వఁగలేమి నెక్కొనియె ◆ నుత్తలమందక తండ్రిఁ బాయుచున్. ౩౪౧

పర్వసుధాకర = పున్నమచంద్రునివంటి, ఆస్యలు = ముఖములుగల యావేశ్యలు, అపూర్వ = క్రొత్తదియగు, విలాసగతిఁ = శృంగారచేష్టను, సుఖ + ఉన్నతిఁ = సౌఖ్యముయొక్క యతిశయమున - ఇక్కడ నీకుఁ గలుగు సౌఖ్యముకంటెను, మేము నీకుఁ గలిగించు సౌఖ్యము చాల నెక్కుడుసౌఖ్య మని భావము. కావున నీవును నిష్టుని ప్రార్థన, వేఁలుపాటు = పిడిచియుండుట, ఉత్తలము = తండ్రినివదలెడముగదా యను దుఃఖము, పాయుచున్ = వదలుచు,

తపస్వివరా - యనుటచే నంతకుముందు నీతులు విలాసవతులు యువతులు గట్టిగాఁ గౌఁగిలించినను స్ఖలనముగాని యూర్ధ్వరేతస్కుఁ డని భావము.

తాత్పర్యము.

ఆసుందరులు ముందుదినమువలెనే క్రొత్తక్రొత్తవిలాసములు శృంగారచేష్టలు చేసి యాయినమనస్సు మెత్తపడినది చూచి యెత్తిరి "యోమునీంద్రా! మాకు సెలవిచ్చెదవా? మాయాశ్రమములకు మేము పోయెదము-నీవును మాతోడ వచ్చెదవేని నీకు సర్వసుఖములు కలిగింతుము" అనిన ఋశ్యశృంగుఁడును వారిని విడిచియుండఁజాలక తండ్రిని వదలి వారివెంటఁ బోయెను.

ఉ॥ ఇట్టులు దోడుకొంచరిగి ◆ యిందుముఖుల్ నగరోపసీమ నా
నెట్టకసీల నిల్పి ధర◆ణీవిభునొద్దకు వార్తఁ బంప, ధా
త్రీట్టరుదెంచి బ్రాహ్మణస◆మేతముగా నతియించి కార్యముం
బట్టుగఁ దెల్పి తోడ్కొనుచు ◆ వచ్చె నిజాలయసీమలోనికిన్. ౩౪౨

తోడికొంచరిగి = నావ నెక్కి గంగాప్రవాహమార్గమునఁ దమనగరమునకుఁ దోడుకొని పోయినట్లు మహాభారతమున నరణ్యపర్వమున జెప్పఁబడినది. నది స్రోతస్సుండి తిరిగిపోవుటచే వలను పడకుండునట్లును, శీఘ్రముగఁ బోవుటకును, విభండకుని నేమఱించుటకు నీయుపాయము పన్నఁబడినది.

నగర + ఉపసీమన్ = పట్టణపుటెల్లయందు, నెట్టకసీలన్ = సదాచారమే స్వభావముగాఁగల యాఋషిని, ధాత్రీ + ఈట్టు = భూమికినీశుఁడు-రాజు;

షమేతముగా = కూడినట్లుగా, నతియించి = స్తోత్రముచేసి - అర్ఘ్యపాద్యా లిచ్చి నమస్కరించి మహాత్మా! నీవు మహానుభావుఁడవు నాకును దేశప్రజలకు యనివార్యమైన దుర్దశ లభించె-దానిని జక్కఁబఱుప నీవుతప్ప మఱి యెవ్వఁడు లేఁ డని స్తుతించి, నిజ=తన; ఆలయసీమలోనికిన్ = ఇంటిలోనికి.

మూఁడవపాదంబున ప్రాదియతి.

నిష్ఠాశీల భవము నెట్టకసీల - దీనికి రెండులింగములందు నొకరూపమే.

కం॥ పట్టినచలమున నీగతి, మట్టముగా నేఁ బిలుకుమార్చి కదలిరా
నెట్టకసీలలు మదిలోఁ, బుట్టిన హర్షమునఁ దమ తపోవనమునకున్.

—జై. భా. ఆ. ౬

ఆముక్తమాల్యద ౬ ఆ- చూడు.

తాత్పర్యము.

ఆ ప్రకారము వారకాంతలు నిష్ఠాశీలుఁడైన మునికాంతునిఁ దమవెంటఁ దోడుకొనిపోయి రోమపాదుని నగరము సమీపమున నిల్చి రాజునకుఁ దమ రాక యెఱుఁగఁ బంపఁగా నా రోమపాదుఁడును బ్రాహ్మణసమూహములతో నెదురుగా వచ్చి వారిని మెచ్చుకొని కార్యక్రమము ఋశ్యశృంగునకుఁ దెలిపి తన నగళ్ళకుఁ బిలుచుకొని పోయెను.

ఉ॥ ఏ మనువాఁడ నోదశరథేశ్వర! యాతఁడు రోమపాదభూ
మీమహిళేశురాష్ట్రమున మేరఁ బదం బిడినంతమాత్రనే
వ్యోమతలంబు నిండ మొఱపుల్ మొగులు ల్గలయంగఁ బ్రాఁకి ధా
రామహితోగ్రవృష్టి జలరాసులఁ జేసె నదీతటాకముల్. ౩౮౩

భూమీ + మహిళా + ఈశుఁడు = భూమి యనెడు స్త్రీకి నధిపతి - రాజు; మేరన్ = ఎల్లయందు, వ్యోమతలము = ఆకాశప్రదేశము, మొగులుల్=మేఘములు; ఏకవచ. మొగులు - మొగిలు-మొయిలు - ఈరూపముల కాధారము మృగ్యము. కలయంగన్ = అంతటను; ధారా = వర్షధారలచే, మహిత= గొప్పదియు; ఉగ్ర = భయంకరమయినదియు, వృష్టిన్ = వానచేత; జల రాసులన్ = సముద్రములుగా; రాష్ట్రమునమేర = రాష్ట్రముయొక్క యెల్ల; తెనుఁగున షష్ఠీ సప్తమీతత్పురుషంబుల నవర్ణకంబు విభాష నగు. —సులభ వ్యా. సమాసపరిచ్ఛేదము.

ప్రశ్న - వేశ్యల స్పృశించుటచేతను, వార లిచ్చిన భక్ష్యముల భుజించుట చేతను ఋషికిఁ దపోహాని కలిగియుండ నతఁడు పొలిమేరలో నడుగుపెట్టినంత మాత్రమున వర్షించె ననుట యెట్లు యుక్తము?

ప్రత్యు.— స్త్రీలను జ్ఞానమే యాయనకు లేనప్పుడు వారస్త్రీ లనుజ్ఞాన మెట్లు కలుగఁగలదు ? కావున మనశ్చాంచల్యమునకుఁ గారణము లేదు. రాగయుక్త మైన మనస్సుతోఁగూడని యింద్రియవ్యాపారము ఫలకారి కాఁజాలదు. హనుమంతుఁడే సాక్షి. కావునఁ దపోహానియు లేదు. వేశ్యలచేతిభక్ష్యములఁ దినుటచేఁ గొంతపాపము గలిగినను దపోమాహాత్మ్యముచే మాధ్యాహ్నికసంధ్యచే నదియు దగ్ధమయ్యె నని సమాధానము.

ప్రశ్న.— నిర్మలబ్రహ్మచర్యమందుండి పెక్కుశాస్త్రములఁ జదివినవాఁడు తత్త్వజ్ఞుఁడు కాకమానఁడు సకలాంశములు శాస్త్రముల నున్న వేకదా! స్త్రీ లిట్టివారనియు వారితోఁ జేరిక బ్రహ్మచారికిఁ బాప మనియు శాస్త్రమున నితఁ డెఱిఁగి యుండఁడా ? మఱియు నడవిలోని బోయవాండ్ర మున్నగువారినిఁ జూచియుండఁడా? ఇట్లు కాక యితఁ డేమియుఁ దెలియని యజ్ఞుఁ డయ్యెనేని యనుగ్రహసామర్థ్య మెట్లుండును? కావున నితఁడు సర్వము తెలిసినవాఁడే. అకృత్యకరణముచే నితనికిఁ దపోహానియు సంభవించినదే యిట్లుండఁ బరస్పరవిరోధమున కెట్లు పరిహారము ?

ప్రత్యు.— బ్రహ్మవేత్త దేనిని జూచినను బ్రహ్మ మని యెంచుచుఁ దదనుగుణముగ వర్తిల్లును. కాన నతఁడు చేయుకార్యములన్నియు ఋజుబుద్ధితోడనే చేయునుగాని విషయాభిలాష యెంతమాత్రము నట్టివానికుండదు కాదు-కాదు. ఋజుబుద్ధికిఁ బాపప్రస్తావనయే యసంభావితము. అట్లుండఁ దపోహాని యెట్లు? అటుగాక మఱి యేమనఁ దపోభివృద్ధియే యగును. ఎంతటి బ్రహ్మవేత్తకును బ్రారబ్ధ మపరిత్యాజ్యముగదా! వీరలఁ జూచినంతమాత్రముననే సర్వజ్ఞుఁ డగు నతఁడు తనప్రారబ్ధబలమున వీరిమూలమునఁ దనకు రాజస్త్రీసంబంధము రానున్న దని తలఁచెను. కావుననే తదనుగుణముగ వారికి భయజనకుఁడుగాక చరియించెను. కాఁబట్టియేకదా యతనితండ్రి యోగబలముచే సర్వమును సాక్షాత్కరించి, యిది కుమారుఁడయినయే యొప్పుకొన్నదే- అతనికిఁ బ్రారబ్ధ మపరిత్యాజ్యము-రాజును వేశ్యలును నిమిత్తమాత్రము-అని యెంచి రాజునకును వేశ్యలకును శాపమియ్యకుండెను. కావున నిం దేమియుఁ బరస్పరవిరోధములేదు. ఈ వృత్తాంతముచేత రెండంశములు గ్రహింపఁదగును.1. బ్రహ్మవేత్త సర్వమును బ్రహ్మముగాఁ దలఁచును గావున నతని నేదోషము నంటదు. 2. అట్టివానికి దానముచేయ వలయు నని యెంచినతోడనే యిచ్చినదానిఫలము కలుగును. పుత్త్రుఁడు కనంబడనపుడు విభండకుఁడు వెదకుచు దొరకకుండుటచే మిక్కిలి కోపింపఁగాఁ ద్రోవనొకచోట ఋశ్యశృంగునివృత్తాంత మెఱింగి సంతోషముతో నాశ్రమమునకు మఱలిపోయె నని కొందఱు పలికెదరు. విభండకుఁడు తనపుత్త్రునిచర్యను బూర్వ

ము చెప్పిన ట్లెఱిఁగియుండవలయును, అని వీరును జెప్పవలయును. లేనిచో పతనికి వచ్చిన కోప మెట్లు శమించెను? రాజు చేయించినవన్నియు నకార్యములే కావా? కావున విభండకుఁడు వెదకినను వెదకకున్నను అతఁడును అతనిపుత్త్రుఁడును దత్త్వజ్ఞులుకాన దోషలేశము లేకనియే సమాధానము చెప్పవలయును. అని తిలకవ్యాఖ్యాత వ్రాసెను.

పై పూర్వపక్షసిద్ధాంతవాదముల వెంటను నాక్షేపముల కెడ మిచ్చునవి పెక్కులు గలవు. స్త్రీ లని-వీరివలనఁ దనకు క్షతి్రియస్త్రీసాంగత్యము కలుగఁగలదని-తెలిసి వారిని ఋశ్యశృంగుఁడు కౌఁగిలించియుండెనేని యాయనకు స్త్రీలెట్టివారో తెలియ దని వ్రాసినవాల్మీకాదు లసత్యవచనులే కదా? వనములందు బోయస్త్రీలను జూచె ననియే తలంతము. అడవిలోనిమృగములలో వా రొకవిధమృగము లని తలంచియుండునే కాని వారు స్త్రీ లని,భోగ్య లని యతఁ డే మెఱుఁగును? శిశువు లెంతో యతఁడు నంతే. "ఋశ్యశృంగుం డను కుమారుండు జన్మించి తండ్రిని దదాశ్రమంబునఁగాని యొండు వో కెఱుంగక ఘోరతపంబు చేయుచున్నంత" నని భారతంబున నంపుటచే బోయస్త్రీలనైన నతఁడు చూచె ననుట నిరాకరము. వీరిమూలమునఁ బ్రారబ్ధబలమున క్షత్రియస్త్రీ తనకు భార్య గాఁగలదని యెఱిఁగియుండెనేని వారలఁ గౌఁగిలింపవలయునా? ఊరక వారి వెంటఁ బోయినఁ జాలదా? సర్వత్ర బ్రహ్మసాక్షాత్కారము స్థిరపడియుండి వేశ్యలను బ్రహ్మ మని కౌఁగిలించెనేని శాంత నేమని కౌఁగిలించెను? ఏమని బిడ్డలను బుట్టించెను? ఇట్టివి మఱికొన్ని సందేహములు కలుగుచున్నవి. కావున నది విడిచి మాకుఁ దోఁచిన సమాధానము చెప్పెదము. వారస్త్రీలచేతి లడ్డుంటలు తినుటచే ఋశ్యశృంగునకుఁ దపోహాని యగునేని వాతాపినిదినిన యగస్త్యునిగతి యేమి? మావటివానియుచ్ఛిష్ట మగు గుగ్గిళ్లు తినిన యుషస్తిబ్రాహ్మణునిగతి యేమి? కుక్కమాంసవిషయమున విశ్వామిత్రుఁ డేమి చెప్పెను? ఇట్టి యల్పదోషములన్నియు మాధ్యాహ్నిక సంధ్యావందనమందలి 'ఆపఃపునంతు' మంత్రముచేతనే శ్రద్ధాభక్తులతో సంధ్య వార్చువానికిఁ బరిహారమగుచున్నవి. ఇఁక స్పర్శదోష మందమా, నారియందలి కశ్మలము బలీయమా? ఆయనతపస్సు బలీయమా? సముద్రములోఁ గొఱివి యద్దిన సముద్రము వెచ్చఁబడునా? కొఱివి చల్లారునా? నిప్పును చెద లంటునా? అట్లులే యాయన తేజస్సుచే వారును శుద్ధపడియుందురు గాని వారి కశ్మలముచే నాయన చెడలేదు. నీటిని తపింపఁజేసిన దానియందు వేఁడిమి యెట్లుపుట్టునో యట్లే తపస్సుచే దేహమున నొకశక్తి (సూదంటు రాయియందలివంటిది) యుద్భవించును. దీనివలన దీర్ఘాయురారోగ్యాది శుభలక్షణము లనేకములు గలుగును. ఈ శక్తిచేత నెట్టియసాధ్య కార్యమైన సుసాధమగును. వేఁడినీటిపాత్ర దగులునట్లు చల్లనీటిపాత్రనుంచిన నెట్లు లా

వేఁడిమి చన్నీళ్ళకుఁ బోయి రెండును సమానము లగునో యట్లే యాశక్తి గలవారు శక్తిలేనివారిని సమీపించినను దాఁకినను వీరిశక్తి వారికిఁ బోవును. సదాచారనిష్ఠు లగు బ్రాహ్మణులు చండాలాదులఁ దాఁకకుండుట కిదియే కారణము. చండాలాదుల నన నేల? మైలవారిని దల్లిదోఁడులనైనను దాఁకరు. కష్టార్జితమైన యీ శక్తిని బోఁగొట్టుకొనఁ నెవఁడు వివేకి యంగీకరించును? లక్షరూపాయలు కలిగి యుండియు సంపాదించుకొనుశక్తి గలవానికిఁ బదిరూపాయలు పోయిన వ్యసనములేనట్లు సంపాదించుశక్తిగలవానికిఁ గొంచెము నష్టమైనను వ్యసనము లేదు. రూపాయలు మాత్రము గలవానికి కొంచెముగాఁ గలవాఁడు ఆ కొంచెము పోఁగొట్టుకొనిన భ్రష్టుఁడగును. శక్తి కామక్రోధములచేతను నష్టమగును. విశ్వామిత్రుఁ డిట్లు నష్టపడినవాఁడే. లక్ష్మణుఁ డోరిమి సహింపక సీత రావణుని భస్మము చేయలేదు.

తాత్పర్యము.

దశరథమహారాజా! ఋశ్యశృంగుని మహిమ నేనేమని చెప్పుదును? ఆయన రోమపాదునిరాష్ట్రమునందుఁ గాలుంచెనో లేదో వెంటనే యాకాశమున మబ్బులు గ్రమ్మి ధారాపాతముగ వర్షము కురిసి చెఱువులు నదులు సముద్రముల వలెఁ గనఁబడునట్లు చేసెను.

ఉ॥ అంతట రోమపాదుఁ డతఁ ♦ డాగ్రహ మూనకయుండ నిచ్చె నా
శాంతయశోవిశోభితన ♦ మస్తసుశీలమునీనిశాంత మే
కాంతసురూపశాంత నిజ ♦ కాంతఁ దనూజను శాంత నా
శాంతను గాంచెఁ గాంతలు ♦ సంతసమంద వివాహపద్ధతిన్. ౩౪౪

అతఁడు = ఋశ్యశృంగుఁడు, ఆగ్రహము = వేశ్యలచే మోసపుచ్చి తనన్నా రికిఁ దెప్పించెనని రాజుపైఁ గోపము, ఊనక = చెందక, (౨) అతఁడు = విభాండకుఁడు, ఆగ్రహమూనకయుండన్ = పుత్రునికిఁ దన కూతునిచ్చి మనశ్శాంతి కలిగించి తనపాలముఁ దండ్రికి రాజుపైఁ గోపము గలుగకుండుటకు, ఇట్లు చేయుటఁబట్టియే కదా విభాండకుఁడు రాజుపైఁ గోపింపఁడయ్యె నని సమాధానము చెప్పవలసియున్నది. మూలమం దీసమాధానమే చెప్పఁబడినది. విభాండకునికి ఋశ్యశృంగునికి నిట్లు కోపశాంతి చేయవచ్చు నని యెంచియే కదా వేశ్యలమూలమున ఋశ్యశృంగుని రప్పింపు మని యాలోచనను మంత్రులు రోమపాదునకుఁ జెప్పిరి. అట్లు మంత్రులును రాజును నీవిషయము ముందే యాలోచింపనియెడలఁ గోపోపశాంతికి మార్గ మేది యని యెంచిరి. (చూ ౩౧౯ ప.) కోపమువచ్చినఁగదా యనునాలోచన ముందు కలుగనే లేదని ప్రాజ్ఞులగు మంత్రులు రాజుతోఁ జెప్పవలను పడునా? కోపముచే ఋషీశ్వరుఁడు తమ్ము శపించునని మంత్రులు భయపడిరిగదా

(౩౨౯ప). కావున నిదియే సమాధానము. ఆశా + అంత = దిక్కులకొనవఱకు వ్యాపించిన; యశః + వినోభిత = గుణరూపములవలనఁ గలిగిన కీర్తిచేఁ బ్రకాశింపఁ జేయఁబడినదియు, సమస్తసుశీలమణీ = అనేకములైన మంచిస్వభావము లను రత్నములకు, నిశాంత = గృహమైన దానిని, ఏకాంత = అతిశయమైన, "తీవ్రైకాంతనితాంతాని గాఢబాఢదృఢానిచ" అమరము. సురూపకాంత = మంచి యాకారముచే మనోహరయగు దానిని, నిజకాంత = తనభర్తయొక్క, మనః + జలరుట్ = మనస్సను తామరపుష్పమునకు, (జలరుట్ = నీటియందు మొలచునది), నిశా + అంతము = వేకువకాల మయిన దానిని, వేకువకాలము తామర పువ్వును వికసింపఁజేయునట్లు ఈమె తనభర్తమనస్సును సంతోషపఱుచునది యని భావము. సద్విధిః = శాస్త్రమునఁ జెప్పియున్న మంచి క్రమముతో, బ్రాహ్మవివాహముగఁ గాంతగా నిచ్చె నని యన్వయము. కేవలవర్ణకమున ప్రాదియతి.

తాత్పర్యము.

అట్లు వర్షము కురియఁగా సంతోషించి తాను మొనసగించి యింద్రోదుకుల నెడఁబాపసని తనన్నెవారు కోపింపకుండునట్లు గుణవతియని సౌందర్యవతి యని దిక్కులందుఁ బ్రసిద్ధిఁగాంచినదియు సదాచారసంపన్నయు మిక్కిలియందగత్తెయు తనభర్తను రంజింపఁజేయు నేర్పుగలదియు నగు తనకూఁతురు శాంతను ఋశ్యశృంగున కిచ్చి వివాహముఁ గావించెను.

తే॥ ఋశ్యశృంగుఁడు కాంతాసమేతుఁడగుచు, రామగారింటఁ జేస♦సమ్మానమమర
మొగిని రెండవయాశ్రమం♦బు గ్రహించి, శిష్టవృత్తిగ వెలయని♦శ్చింతమతిని. ౩౪౫

కాంతాసమేతుఁడు = భార్యతోఁగూడినవాఁడు, మొగిని = బ్రహ్మచర్యము గార్హస్థ్యము క్రమముగ, రెండవయాశ్రమమును = గార్హస్థ్యమును, గ్రహించి = పొంది, శిష్టవృత్తి + అ = ఈయాశ్రమమున కనుకూల మగు గొప్పవారి నడతయే, నిశ్చింతమతి = బ్రహ్మచర్యము వదలితి మన్న చింతలేని మనస్సుతో. ఏకపత్నీవ్రతము బ్రహ్మచర్యము వంటి దని భావము, సమ్మానము = గౌరవము, ముముక్షువునకు స్వవర్ణధర్మము స్వాశ్రమధర్మము చక్కఁగా నడుపుట ప్రధానము. ఫలమునం దన్నియు సమానములు.

తాత్పర్యము.

ఋశ్యశృంగుఁడును భార్యయగు శాంతతోఁగూడి సగౌరవముగ మామగారాదరింప నాయనయింటనే గృహస్థధర్మ మవలంబించి సద్వృత్తితో నేవిచారములేక యుండెను.

౧౧-వ సర్గము.

మ॥ ధరణీనాథ! సనత్కుమారముని వృత్తాంతంబుఁ బూర్వోక్త మా
దరబుద్ధిన్ వినిపించి మానవులకుం ద[illegible]ం బెల్ల జన్మించెడిన్
వరధర్మజ్ఞుఁడు సత్యసంధుఁ డిల నిక్ష్వాక్వన్వయక్షీరసా
గరరాకామృతరోచియై దశరథాఖ్యక్ష్మాధవాధీశుఁడున్. ౫౪౬

ఇట్లు సుమంత్రుఁడు దశరథుని ప్రశ్నకు సమాధానముగ జెప్పి యా కథాశేషమును బూర్తిగాఁ జెప్పుచున్నాఁడు. పూర్వ + ఉక్తము = ముందు చెప్పఁబడిన, ఆదరబుద్ధిన్ = ఆదరముతోఁగూడిన బుద్ధితో, [illegible] + యున్ = [illegible]ర్ధన్ = ఇందు 'యు' సముచ్చయార్థకము-కాక నైరర్థక్యముగ లోనగుటయుఁ గలదు, ఉదా. మఱియున్ = మఱిన్, ఉండియున్ = ఉండిన్ - ఇత్యాదులు - ప్రయోగములు గలవు సత్యసంధుఁడు = సత్యమైన ప్రతిజ్ఞ గలవాఁడు-అనఁగా ప్రతిజ్ఞ తప్పనివాఁడు, ఇక్ష్వాకు + అన్వయ = ఇక్ష్వాకురాజవంశమను, క్షీరసాగర = పాలసముద్రమునకు, రాకా + అమృతరోచి = నిండుపున్నమనాఁటి చంద్రుఁడు, అమృతరోచి = అమృతమైనకిరణములుగలవాఁడు, రూపకాలంకారము, క్ష్మాధవ + అధీశుఁడున్ = రాజాధిరాజు, ఇల జన్మించెడి నని యన్వయము.

తాత్పర్యము.

రాజా! మీఁదఁ జెప్పన ప్రకారము సనత్కుమారుఁడు మునీంద్రులకు ఋశ్యశృంగచరిత్ర తెలిపి మఱి యిట్లనియె. ఇక్ష్వాకువంశమునఁ బాలసముద్రమునఁ జంద్రునివలె ధర్మమే తెలిపినవాఁడును సత్యాత్ముఁడును నగు దశరథుం డను రాజు జన్మించును.

తే॥ ఆతనికి నంగరాజుతో సఖ్యమైత్రి, సంఘటిల్లు, నాతనికిఁ బుట్టు శాంత యనంగ
నమలగుణశీల తనజాత యంగపతికి, రోమపాదుం డనంగఁ బుత్రుండు పుట్టు. ౫౪౭

ఆతనికి = దశరథునకు, అంగరాజుతో = రోమపాదునితో, మైత్రి = చెలిమి, సంఘటిల్లున్ = కలుగును; ఎట్లనఁగా, ఆతనికిన్ = ఆదశరథునకు, అమల = శుద్ధురాలయిన, తనజాత = కూఁతురు, అంగపతికిన్ = అంగరాజునకు, అంగదేశరాజధాని చంపానగరము.

"Champa is believed to have been near the modern town of Bhagalpur" From Monghir, Heuen Thasang travelled eastwards for 300 lis, or 50 miles to Chen-po or Champa which is an old name of the District of Bhagalpur."—Cun - Geo. An. India p. 447.

తాత్పర్యము.

ఆ దశరథునకు శాంత యనియెడు నొకకన్య జనించును. అయనకు నంగరాజు కుమారుఁడైన రోమపాదునకు స్నేహము సంఘటిల్లును. ఆకారణమున దశరథుఁడు తనకూఁతురు శాంతను రోమపాదునకు దత్తుగా నిచ్చును.

కం. ప్రథితు లగుచిత్రరథదశ,రథులకు నిండారుమైత్రి • రాజల్లెడు ని
ర్మథితారి దశరథుఁడు హృ,ద్వ్యథచేఁ గన నేగి రోమ•పాదుం బలుకున్. ౩౮౭

ప్రథితులు = ప్రసిద్ధి చెందినవారు, చిత్రరథుఁ డని రోమపాదుని నామాంతరము, నిండారుమైత్రి = సంపూర్ణస్నేహము - బిడ్డలులేని రోమపాదునకు దశరథుఁడు తనకూఁతు శాంతను దత్తుగా నిచ్చుటచే నిరువురకు స్నేహము వృద్ధి యయ్యెను, నిర్మథిత + అరి = చంపఁబడిన శత్రువులు గలవాఁడు, హృత్ + వ్యథచేన్ = కొడుకులేఁ డను మనస్సునందలి బాధచేత, శాంత తల్లి పేరు తెలియదు.

తాత్పర్యము.

చిత్రరథుఁ డనుపేరు గల రోమపాదునకు దశరథునకు స్నేహము కుదురఁగా దశరథుఁడు బిడ్డలులేనివాఁడై విచారగ్రస్తుఁడై రోమపాదునిఁ జూడఁ బోయి యిట్లు చెప్పెను.

ఉ॥ సంతతి లేనివాఁడ నృప•సత్తమ! పంపఁగదే మహాత్ము నీ
శాంతమనోవిభుం గ్రతువు • సాంగముగా నెరవేర్చుపొంటె, నా
చింతలు దీర, వంశము ప్రసిద్ధిఁ బ్రతిష్ఠయు నొంద ధాత్రిపై
సంతతి పొందుపొంటె, హిమ•సత్తమ! యంచును వేఁడు చుండఁగన్. ౩౮౮

సంతతి = పుత్రుఁడు, సత్ + తమ = మిగులశ్రేష్ఠుఁడా! మనోవిభున్ = భర్త యగు ఋశ్యశృంగుని, క్రతువు = యజ్ఞము, నెఱవేర్చుపొంటెన్ = నెఱవేర్చుటకొఱకు. కంటె, పొంటెవంటి కములు పరము లగునపుడు భావార్థక ట వర్ణకము వైకల్పికముగ లోపించు, ప్రతిష్ఠ = స్థిరముగ నుండుట, ధాత్రి = భూమి. సంతతి = సంతానము, రెండవపాదంబున సాంగశబ్దము సహశబ్దపూర్వబహువ్రీహి. యతి. చూ. ప. ౨౩౨.

తాత్పర్యము.

రాజేంద్రా! నేను బిడ్డలులేనివాఁడను. కుమారులు కలుగుటకై యజ్ఞము చేయ సంకల్పించితిని. అది నిర్విఘ్నముగఁ దుదముట్ట నెఱవేర్చుకొఱకు నీ యల్లుని శాంతపెనిమిటిని ఋశ్యశృంగుని నావెంటఁ బంపుము. నీ వీమాత్రము సాహాయ్యము చేసితివేని పుత్రులు లేరను నాదుఃఖము తొలఁగును. మావంశము

నకుఁ బ్రసిద్ధియుఁ బ్రతిష్ఠయుఁ గలుగును. నాకు సంతానము కలుగును. నీవు నామిత్రుఁడవు గావున నీమాత్రము తోడుపడవలసిన దని వేఁడుచు.

ఉ॥ ఆ నుడు లాలకించి మహి • తాత్ముఁడు యోజన సేసి శాంతతో
మానిని బుశ్యశృంగుని న • మానుష తేజునిఁ బుత్రవంతునిన్
మానుగఁ బంపఁ దోడ్కొనుచు • మానసనాథుఁ డపాస్తశోకుఁ డై
తా నగరంబుఁజేరి క్రతు • తంత్రముఁ దీర్చెఁ బ్రహృష్టచిత్తుఁ డై. ౩౫౦

అనుడులు = దశరథుని యామాటలు, యోజనసేసి = ఆలోచించి, అమానుషతేజునిన్ = మనుష్యులందు లేని ప్రభావముగలవానిని, పుత్రవంతునిన్ = అనుగ్రహమాత్రమునఁ బుత్రులు గలుగఁజేయు శక్తిగలవానిని (2) తన పుత్రునితోఁ గూడినవానిని - పుత్రసంతుఁ డన సదమిలాఁడాహితాగ్ని యనుట దెలుపును. పుత్రవంతుండే యగ్న్యాధానము చేయవలయును 'జాతపుత్రః కృష్ణకేశోఽగ్నీనాదధీత' యని శాస్త్రము - ఆహితాగ్ని కాని యితఁడు బుత్విక్కుగా నుండఁదగినవాఁ డనియు సూచితము.

ఈపాంతరముగ నీయర్థమును బూర్వవ్యాఖ్యాతలు గ్రహించిరి. కాని, 'నీకుఁ బుత్రుఁడు కలుగఁగానే వెడలిరమ్మని విభండకుఁడు బుశ్యశృంగునితోఁ జెప్పెను. బుశ్యశృంగుఁడును దాని నంగీకరించెను,' అని భారతమునఁ గలదు. మొదటి యర్థము మాత్రమె గ్రహించిన నీవిరోధబాధ లేదు. కాదేని పుత్రుఁడు కేవల బాలుఁ డనియైన గ్రహింపవలయును.

అపాస్తశోకుఁడై = పోఁగొట్టఁబడిన దుఃఖముగలవాఁడయి, గమించి = పోయి, ప్రహృష్టచిత్తుఁడయి = సంతోషించిన మనస్సుగలవాఁడై, క్రతుతంత్రము = యజ్ఞకార్యము.

తాత్పర్యము.

ఆమాటలు విని యుదారస్వభావముగల యారోమపాదుఁడు బుశ్యశృంగునితో నాలోచించి యవశ్యము పంపుటయే యుత్తమకార్య మని నిశ్చయించి భార్యతోడ బుశ్యశృంగునిఁ బంపఁగా దశరథుఁ డా దివ్యతేజము గలిగి పుత్రసంతానము గలిగింపఁగల యాబుషివర్యుని దోడుకొనిపోయి తన పట్టనము చేరి చింత విడిచి సంతోషముతో యజ్ఞము నెఱవేర్చెను.

కం॥ అంజికతోడుత నృపతి కృ, తాంజలి యై బుశ్యశృంగు • నార్త్విజ్యముఁ బ్రే
మం జలుపఁగఁ బ్రార్థించిన, నంజాయింపక యతండు • నౌనని పూనున్. ౩౫౧

ఆ యజ్ఞమున నతనినే దశరథుఁడు బుత్విక్కుగాఁ జేసె నని చెప్పుచున్నాఁడు. అంజిక = భయము; కృతాంజలియై = చేతులు జోడించుకొన్నవాఁడై. భయ

భక్తులతోఁ బ్రార్థించె నని భావము. ఋత్విక్కు = యజ్ఞముచేయించువాఁడు - వానిగుణము ఆర్త్విజ్యము - భావార్థకతద్ధితాంతము. అంజాయింపక = సందేహింపక, తన కల్లుఁడైనను బ్రాహ్మణుఁడౌటను, ఋషీశ్వరుఁడౌటను దాను పెద్దవాఁడైనను నమస్కరించెను.

తా త్ప ర్య ము.

ఆయజ్ఞ ముపక్రమించునపుడు దశరథుఁడు ఋశ్యశృంగునినే ఋత్విజుఁడుగా నుండ భయభక్తులతో నంజలి మోడ్చి ప్రార్థించును. ఆయనయు నంగీకరించును.

క॥ ప్రసవార్థము ప్రసవార్థము,పొసఁగఁగ స్వర్గంబు చలుప ♦ భూపతి యజ్ఞం బసమానవిక్రముల వం,శసుప్రతిష్ఠాపకులను ♦ శాశ్వతయశులన్. ౩౫౨

క॥ నలువురు తనయులఁ గను నని, పలువురు విన విధిసుతుండు♦పలికెను గథగాఁ దొలియుగమున నప్పలుకుటను, బిలువఁగఁజనవలయు నతని♦బ్రియముననిటకున్. ౩౫౩

రెండుపద్యము లేకాన్వయము. ప్రసవార్థము = గొప్పది యగు పుత్రకామేష్టి సలుపుకొఱకు, ప్రసవార్థము = యజ్ఞమూలమున సంతానము గలుగుకొఱకు, స్వర్గంబుపొసఁగఁగన్ = సంతానమూలమున స్వర్గము కలుగుటకు, "అపుత్రస్య గతి ర్నాస్తి స్వర్గో నైవచ నైవచ" యని శాస్త్రము. ప్రసవార్థము ప్రసవార్థము పొసఁగఁగ స్వర్గంబు అనఁ డంజాయింపక యార్త్విజ్య మా నని పూర్వము అనియు నన్వయింప నగు. యజ్ఞము = పుత్రకామేష్టి, అసమానవిక్రములను = సాటి లేని పరాక్రమము కలవారిని, వంశసుప్రతిష్ఠాపకరులన్ = వంశమును స్థిరముగా స్థాపించువారిని, శాశ్వతయశులన్ = స్థిరమైన కీర్తిగలవారిని, విధిసుతుండు = బ్రహ్మకుమారుఁడు — సనత్కుమారుఁడు, తొలి + యుగమున = కృతయుగమున. సనత్కుమారుఁడు చెప్పిన దింతతో ముగిసెను.

తా త్ప ర్య ము.

సంతానమునిమిత్తమై యజ్ఞము సలుపుటకును, స్వర్గలోకప్రాప్తికిని దశరథుఁడు యజ్ఞముఁజేయఁగా స్థిరమైన కీర్తిగలవారిని, వంశమునిలుపువారిని నలువురు కుమారులను గాంచును, అని బ్రహ్మపుత్రుఁడైన సనత్కుమారుఁడు పలువురు ఋషులు వినుచుండ పూర్వయుగముననే చెప్పెను. ఆ ఋషీశ్వరు లిపుడు చెప్పుకొనుచుండఁగా నేను వింటిని.

సందేహము.

తమకుఁ దెలిసినవిషయ మిన్నిదినా లేల దాఁచిరి? ఇప్పుడైనను దామై రాజుతోఁ జెప్పక సుమంత్రునిచేఁ జెప్పింప నేల?

పరిహారము.

'ఆఁకలి గొన్నవానికి నన్నము పెట్టిన మేలుకలదు కావున రాజనకే యెప్పు డక్కఱ పుట్టునో యప్పుడే చెప్పవచ్చును. కాఁగల దెల్లను గాఁగలదు. మన మేల తొందరపడవలయును' సకాలమునఁ జెప్పినఁ దలకెక్కునట్లు లకాలమునఁ జెప్పిన నెక్కదు' అని ఋత్విక్కులు వారించకయే యుండిరి ఇప్పుడు తామే చెప్పిన నీకార్యము మీఁదిపడునఁ గాదా, వేఁడుకనిఁ బిలుచుకొని రావలయునా? మీశక్తి యీమాత్రమా యని రాజనకో తెలుచునో యని పరోక్షమున రాజునకుఁ దెలిపిరి సనత్కుమారుఁడీవిషయముఁ దెలుపు నప్పటికి రోమపాదుఁడు పుట్టలేదు. భగవంతుఁ డవతరింపఁబోవు నని ఋషు లెఱుఁగుదురు. కాని సందర్భము తెలుఁగక ప్రశ్నించఁగా నిట్టి సందర్భములు గలిగి నపు డవతరించు నని చెప్పెను. అవతారవిషయము రహస్యము. కావున ఋషులు సమంత్రునితో నావిషయము చెప్పలేవారు కారు

కం. ఘనవాహనబలయుతముగ, ఘనవాహనతేజ! నీవ • కడుఁగొని చని యా
యినతేజునిఁ గొని తెచ్చినఁ, గొనసాగును నీకు నెల్ల • కోర్కె లటన్నన్. ౩౫౪

ఘనవాహన = మేఘములు వాహనముగాఁగల యింద్రునియొక్క, తేజ = కాంతివంటి కాంతిగలవాఁడా, నీవు + అ = నీవే స్వయముగా, పురోహితుల మూలమునఁ గాదని భావము, ఘనవాహనబల = గొప్పగుఱ్ఱములు, ఏనుగులు, సేనలు, కాలుబలము, వీనితో, యుతముగన్ = కూడుకొనునట్లు, కడుఁగొని = ప్రయత్నించి, ఇనతేజుని = సూర్యునివంటి తీక్ష్ణమైన ప్రభావముగల ఋశ్యశృంగుని, కొనసాగును = నెఱవేఱును, ఘనవాహనపదమునకు యమకము. ఇది సుమంత్రుని అంతవాక్యము. కోరిక - కోరిక యని పాఠాంతరము. కోర్కె యనునది గ్రామ్యము, అపశబ్దము.

తాత్పర్యము.

'ఇంద్రసమానతేజ! నీవు చతుర్విధసేనలతో రోమపాదునిఁ జూడఁబోయి ఋశ్యశృంగునిఁ దెచ్చితివేని నీకోరిక కొనసాగును' అని సుమంత్రుఁడు చెప్పెను.

* దశరథుఁడు ఋశ్యశృంగునిఁ దోడితేఁ బయనించుట *

ఉ. సూతునివాక్యవైఖరిని • సూరకులాగ్రణి యవ్వసిష్ఠుతోఁ
బ్రీతిగఁ దెల్పి యాతఁ డది • రీతియ యంచును సమ్మతింపఁగా
జాతకుతూహలంబు నను • సత్వరుఁడై తన రాణివాసముల్
ఖ్యాతసుధీనిధుల్ సచివు • లందఱు రాఁ జనె రాజసంబునన్. ౩౫౫

సూరకుల + అగ్రణి = సూర్యవంశమున శ్రేష్ఠుఁడు; జాతకుతూహలంబు వను = కలిగిన సంతోషముతో, రాణివాసముల్ = అంతఃపురస్త్రీలు, కౌసల్య మొదలగు భార్యలు, ద్వి. 'రాణివాసద్రోహి రావణుఁ జెట్టి। పోణిమి చెలు పవా బుధులు నుతింప.'

తాత్పర్యము

ఇట్లు తన సారథియైన సుమంత్రుఁడు చెప్పఁగా విని దశరథుఁడు మాటలు వసిష్ఠునితోఁ జెప్పి యది సత్యమే యట్లు చేయుమని యాయన యంగీకరింపఁగా దశరథుఁ డుత్సాహవంతుఁడై గుసేయాక తన యంతఃపురస్త్రీలును ప్రసిద్ధులైన బుద్ధిమంతులునగు మంత్రులు తోడరాఁగా వా లు పోవలసిన విధముగా నాటోప ముతో తాను గోరిన రోమపాదుఁడే యంగీకరించి పోవునో ఋశ్యశృంగుఁడే కాద ననో, స్త్రీలైనచో రోమపాదుని భార్యతోను శాంతతోను జెప్పి వారు రోమ పాదునకు ఋశ్యశృంగునకుఁ జెప్పినట్లు చేయవచ్చును గదా యనియు, శాంత మాయమ్మ యేల రాలేదని యడుగునేమో యొక తెను మాత్రము పిలుచుకొని పోయిన తక్కినవారు మచ్చరికింతురో యని భార్యలనందరిఁ బిలుచుకొనిపోయెను.

ప్రహరణకలిత॥ వనములు నదులున్ । వరుసగఁ గనుచున్
జనపతి చనెఁ దివ్యనిపయమునన్
మునికులతిలకున్ । మునుగ చని కనెం బా
వనశుచిరుచినిన్ । విబుధనుతయుతున్ ౩౫౬

పావన = ఇతరులను పరిశుభ్రము చేయునదియు, శుచి = స్వయముగఁ బరి శుభ్రమైనదియు, రుచినిన్ = బ్రహ్మతేజస్సుగలవానిని, 'స్వయంతీర్ణః పరాంస్తారయతి' యన్నట్లు - ఈతని బ్రహ్మతేజము తాను పరిశుద్ధమై యితరులను బరి శుద్ధులఁ జేయునది, మునుకనెన్ = ముందుగాఁ జూచెను. రోమపాదునిఁ జూడకమునుపే ఋశ్యశృంగునిఁ జూచెను.

అల్లుఁడగుట భక్త్యతిశయము, కార్యసాధకత్వము కారణములు.

వృత్తము ప్రహరణకలిత. న-న భ-న-వగణములు, ౭ వ యింట యతి.

తాత్పర్యము.

ఇట్లు పయనమై త్రోవలో నదులు పర్వతములు దాఁటి మెల్లగఁబోయి రోమపాదుని చంపకానగరంబుఁజేరి ముందుగాఁబోయి తోలుతనే యితరులను పావనులఁ జేయునట్టియు శుచిమంతమైనట్టియుఁ దేజస్సుగల ఋశ్యశృంగుని దర్శించెను. వనములు నదులు చూచుచుఁ బోయె ననుటచే ప్రజలకుఁ గష్టము భారము కలుగు నని పురంబులలోఁ బ్రవేశింపలే దని భావము.

ఉ॥ ఆవల రోమపాదవసు ♦ ధాధిపుఁ డూఁడ సనేఁడు నెయ్యమున్
భావనచేసి పూజల ♦ పారముగా ఘటియించి తుష్టుఁడై
పావనశీల! నా కితఁడు ♦ బంధువు నెయ్యుఁడు స్వాత్మజాత శాం
తావరవర్ణినీమణిని ♦ నాకు గుమారికగా నొసంగుటన్. ౩౫౭

నెయ్యమున్ = స్నేహమును, భావనసేసి = ఎంచి, వరవర్ణినీమణిని=ఉత్తమ స్త్రీరత్నమును, నెయ్యుఁడు = మిత్రుఁడు, "అనేన మే౽పత్యాయ, దత్తేయం వరవర్ణినీ, యాచతే మిత్రభూతాయ, శాంతా ప్రియా౽౽త్మజా । సో౽యం తే శ్వశురో బ్రహ్మన్ యద్దేవాహం తథా నృప" యని పురాణవచన మని తిలకశిరోమణివ్యాఖ్యానము నున్నది.

తా త్ప ర్య ము.

ఆ పిమ్మట దశరథుఁడు రోమపాదుని గూర్చి నాయనయు స్నేహ మూహించి విశేషముగ గౌరవించి దశరథుని రాకకు మిగుల సంతోషించి ఋశ్యశృంగు నొద్దకుఁ దోడుకొనిపోయి పవిత్రచరిత్రా యీ దశరథుఁడు నాకు బంధువు, మిత్రుఁడు. ఈయన కుమారిని శాంతను నాకుఁ గుమారికగా నిచ్చెను.

ఉ॥ మామయు నీటు నీకి ♦ ంమాన్యచరిత్రుఁడ నేను బోలెఁ గ
చామహితాత్ముఁ డెన్నఁ దగి ♦ యాడిన దానికి గౌరవింపఁగం
దామొగి నేఁడు వెన్నఁది దిక్కునబుద్ధి నన్నొట సిచ్చి యా మో
భూమిప! పంపవే హితుని ♦ ప్రోలు గ నేఁగొని నూఁతు నల్లునిన్. ౩౫౮

హితుని ప్రోలు = మిత్రునిపురము, ఎంశకృథకము ప్రోలు. Polis Tripoli= త్రిపురము.

తా త్ప ర్య ము.

కావున నేను మీకు మామ నో యాయనయు నట్టులే మీకు మామగా నగుదురు. అని చెప్పఁగా ఋశ్యశృంగుఁడును దశరథుని మామగారి నాదరింప వలసిన రీతిగా గౌరవించెను. అప్పుడు దశరథుఁ డా రోమపాదుతోడ నేడెని మిది దినములుండి రోమపాదునితో, రాజా! నేనిఁకఁ బ్రయాణము చేయవలసి యున్నది. నీయల్లునిఁ బుత్రుని నీస్నేహితునియూరుచూడఁ బంపుము.

చం॥ కల దొక దొడ్డకార్య మున ♦ గా నగు లౌత మనశ్య మంపుదున్
వలనదు సందియం బికఁ ♦ చుఁ దగ్గి మునీశ్వరుఁ జూచి కార్యమున్
గల తెఱఁ గంతయుం దెలిపి ♦ కారుణికోత్తమ! భార్యతోడఁ బో
వలె నట కీ వటం చనఁగ ♦ వల్లె యటంచును ఋశ్యశృంగుఁడున్. ౩౫౯

తాత్పర్యము.

అందు గొప్ప కార్యము చేయవలసియున్నదికదా యనిన రోమపాదుం డున, నట్లులే కానిమ్ము అవశ్యము పంపుదును, సందేహింప వలదని చెప్పి ఋశ్య శృంగునిం జూచి కార్యమున్నవిధముం జెప్పి సదయహృదయా! మీరు మీ భార్యతోడ నయోధ్యకుం బోయి రాంగోరెదను, అనిన నాయనయు సంగీకరిం చెను.

ఉ॥ ఆనృపుచే ననుజ్ఞం గొని ♦ యాలును దాను రాం గడంగినన్
మానవపాలు రిద్దఱు స♦మంజసరీతి బహూకృతుల్ నతు
ల్వే నతులన్ ఘటించి భృశ♦లీల ముదుల్లసితాంతరంగు లై
రీనెఱి వీడుకోల్వడసి ♦ యేగుచు నిం(ద్ర)సమానుం డాజియున్. ౩౬౦

సమంజసరీతిన్ = చక్కనివిధముతో, నతులు = స్తోత్రములు, నతులు = నమస్కారములు, భృశలీలన్ = మిక్కిలివేడుకతో, ముత్ + ఉల్లసిత = సం తోషముచే వికసింపంజేయంబడిన, అంతరంగులు = మనస్సులుగలవారు, ఈ నెఱిన్ = ఈవిధమున.

తాత్పర్యము.

అంతట మామగారిచే వీడుకోలువడసి ఋశ్యశృంగుఁడు తనభార్యతోం బ్రయాణముకాంగా ఇరువురురాజులు మర్యాదచొప్పున బహుమానములు, పొగడ్తలు, నమస్కారములు గావించి సంతోషించిరి. దశరథుఁడును నీప్రకా రము రోమపాదుచేం బంపంబడి ప్రయాణమై పోవుచు.

ఉ. దూతలం బంపెం బౌరులకుం ♦ దూర్ణ మలంకృతి సేయం బట్టనం
బాతతలీలం గల్వడము ♦ లంతట నెత్తంగ, నీరు చల్ల, వీ
థీతతులందు మ్రుగ్గులను ♦ దీర్చి యనంటులు నాటి మాలికా
వ్రాతముం దోరణంబులును ♦ వావిరి గట్టంగ నర్హ్మభంగులన్. ౩౬౧

ఆతతలీలన్ = ఎక్కువవేడుకతో, కల్వడములు = టెక్కెములు, అనంట్లు = అరంటిచెట్లు, వ్రాతములు = సమూహములు, వావిరిన్ = వరుసగా, అర్హ్మభం గులన్ = తగినవిధముతో, తూర్ణము = శీఘ్రముగా.

తాత్పర్యము.

తమరాకను ముందుగాం దెలుపుటకును, పట్టనమంతయు ధ్వజములెత్తి వీథుల నీళ్లుచల్లి రంగవల్లులు దీర్చి యనంటికంబములు కట్టి పూలతోరణములుగట్టి యలంకరించుటకును దూతలంబంపెను,

దశరథుఁడు ఋశ్యశృంగునితో నయోధ్యఁ బ్రవేశించుట

సీ॥ అనాఁడు [illegible] యు ♦ నాలించి పరివారగణమ్, [illegible] డెందమునను ♦ న్నాఁడు నేఁడు
[illegible] మాత్యతతిని ♦ [illegible] సంహృష్టులై, [illegible] మోదకుఁ ♦ బూని [illegible]
కైసేఁత [illegible] ♦ గనఁగొంచు [illegible], దుందుభికాహళీ ♦ [illegible]
చెలఁగి మ్రోయుచుఁగ ఋశ్య ♦ శృంగునింపుగన్నగాఁ, [illegible]
తే॥ బౌరులెల్లను [illegible] ముని ♦ ప్రభువిలోంచి, [illegible] ♦ [illegible] వుండు
వారలను గారవించు చె ♦ ల్వారఁ [illegible], [illegible] మోద ♦ [illegible]. ౩౬౨

ఆలించి = విని, [illegible] మాత్యతతిన్ = [illegible], అతిమోదకుఁడై = [illegible],
ప్ర[illegible] ఆజ్ఞ[illegible], కైసేఁత = (పురమునందలి) అలంకారము యొక్క, [illegible]తము = [illegible]ము, దుందుభి = నగారాలయొక్కయు, కాహళి - [illegible]రాలయొక్కయు, [illegible]చెను = ప్రవేశించెను

తాత్పర్యము.

[illegible] దనరాజు వచ్చుచున్నాఁడని ప్రజలు మిక్కిలి సంతోషించి [illegible] బట్టిన [illegible] దశరథుఁడును నగరముఁ బ్రవేశించి యలంకారపీఠములం [illegible] నగారాలయు తుత్తూరాలయు ధ్వనులు మ్రోయుచుండఁగా ఋశ్యశృంగుని [illegible] వీనులవెంటఁ [illegible] మునీంద్రుని [illegible] మిక్కిలి సంతోషింపఁ [illegible] మునఁ బ్రవేశించెను. దశరథునకు ౩౫౦ మంది భార్యలు వారిలో ముగ్గురు మాత్రమే దశరథుని వెంటఁ బోయివచ్చినవారు.

ఆ॥ అట్లు శాస్త్రవిహిత ♦ మైనకృత్యంబులఁ, బూజ సలిపి భూవి ♦ బుధవరేణ్యు
నగరిలోన నిలిపి ♦ నందించె నేఁటికి, నైతి ధన్యుఁడ [illegible] ♦ [illegible]. ౩౬౩

విహితమై = విధింపఁబడిన, భూవిబుధ = బ్రాహ్మణులయందు, వరేణ్యున్ = శ్రేష్ఠుని - ఋశ్యశృంగుని, ధన్యుఁడు = మిక్కిలిసఫలమైన ప్రయత్నముకలవాఁడు, నందించెను = సంతోషించెను.

తాత్పర్యము.

శాస్త్రములందుఁ జెప్పినచొప్పున ఋశ్యశృంగునిఁ బూజచేసి యాయనను రాచనగరిలోనుంచి, దైవమా నేఁటికిఁ గృతార్థుఁడనైతిని, నాజన్మము సార్థకమయ్యె నని దశరథుఁడు సంతోషించెను.

క॥ శాంతాకాంతామణి నిజ,కాంతునితో నరుగుదేరఁ ♦ గనుఁగొని ధరణీ
శాంతఃపురకాంతాజన,సంతతి సంతసము నొందెఁ ♦ జక్షుఃప్రీతిన్. ౩౬౪

నిజకాంతునితో నరుగుదేర = తనభర్తతోరాఁగా, ఇప్పుడు మగనితో వచ్చిన దనుటచే నింతకుమునుదు కన్యగా నిన్నప్పు డొంటరిగా వచ్చుచు పోవుచుండె ననియు నేర్పడుచున్నది. ధరణీశ = రాజైన దశరథునియొక్క, అంతఃపుర కాంతాజనసంతతి = అంతఃపుర స్త్రీసమూహము, చక్షుఃప్రీతిన్ = కనులపండువుగా. ఈవాక్యములు వృత్త్యనుప్రాసము ౩౬౨ వ పద్యమున జెప్పిన ఎల్లకాంతలు భార్యలనియు నిందుఁజెప్పినవారు పరిచారికాదు లనియు గ్రాహ్యము.

తాత్పర్యము.

కాంతారత్నమగు శాంతాదేవి తన హృదయకాంతునితో వచ్చుటచూచి దశరథునియ యంతఃపురకాంతలు వారిని గన్నులపండువుగాఁ జూచి సంతోషించిరి.

కం. అంతఃపురకాంతలు భూ,కాంతుండును గారవింపఁ♦గా మిక్కిలి నా
శాంతాకాంతుండుండెను, నంతముదముతోడ ఋత్వి♦గన్వితుఁ డగుచున్. ౩౬౫

శాంతాకాంతుఁడు = ఋశ్యశృంగుఁడనికాని తండ్రిపేరుతోఁగాని చెప్పక భార్యపేరితో నిర్దేశించుట పుట్టినింట నాఁడుబిడ్డకుఁ బ్రాధాన్యముండుటచేత నే 'సీతాయాః పతయే' యన్నట్లు, అనంతముదముతోడన్ = అధికసంతోషముతో, ఋత్విక్ + అన్వితుఁడు + ఐ = వసిష్ఠుఁడు మొదలగు ఋత్విజులతోఁ గూడినవాఁడై, అనంతశబ్దము నఞ్ సమాసము. నాలుగుపాదంబున నఞ్ సమాస యతి - యను నభయయతి

తాత్పర్యము.

రాజకాంతలు - రాజు తన్నుమిక్కిలి గౌరవింపఁగా ఋశ్యశృంగుఁడు ఋత్విజులతోఁ గలిసి సంతోషమున నర్తించుచుండెను.

౧౨ సర్గము. దశరథుఁ డశ్వమేధయాగము సేయ యత్నించుట

ఉ॥ అంత లతాంతకాంతము వ♦నాంతరఫుల్లలతాంతవాసనా
క్రాంతదిశాంత ముద్భటని♦రంతరకంతుగుణారవాళ్యుప
క్రాంతము పాంథసాధ్వసదు♦రంతము పల్లవపుష్పభారశా
ఖాంతము హృత్సరోరుహాలి♦శాంతము దోఁచె వసంత మెంతయున్. ౩౬౬

దశరథుఁడు సర్వకామపరిపూర్ణుఁ డయ్యును సంతానము లేనివాఁ డయ్యెను. వానప్రస్థకుమారునిఁ దపస్వినిఁ జంపినపాపము సంతానప్రాప్తికి విఘ్నకర

మైన ప్రతిబంధముగా నుండెను. తమకుఁ గలిగించిన పుత్రవియోగదుఃఖమునకుఁ గాను నీవును పుత్రవియోగదుఃఖమున మరణింతువు మని శపించుట కాని యది హత్యకుఁ బ్రాయశ్చిత్తము కాదు. ఈ బాల్యపరిశ్రమమున అంత్యకాలమున కచ్చెడుఁ మఱవనే మఱచెను. కాఁబట్టి సంతానప్రాప్తికిఁ బ్రతిబంధకమైన పాపము పరిహారమగుటకై యశ్వమేధయాగముఁ జేయఁదలఁచెను. అనిష్టపరిహారము ఇష్టప్రాప్తి యను రెంటిలో నశ్వమేధమువలన ననిష్టపరిహారము, పుత్రకామేష్టి వలన నిష్టప్రాప్తి. అనిష్టపరిహారము వలనను యిష్టప్రాప్తి కలుగునని సిద్ధాంత ము లేదు చేలో కలుపుమొక్కలనంతమాత్రముననే గింజ లింటికి వచ్చునా? గింజ లింటికి వచ్చుటకుఁ గావలసినకృషియగు నిష్టిపని కదా - అట్లు లేకపోయిన నశ్వమేధము వలనఁ బాపపరిహారమని "సర్వంపాప్మానం తరతి, తరతి బ్రహ్మహత్యాం, యోఽశ్వమేధేన యజతే" యని శ్రుతియందును "రాజాస్వర్గకామోఽశ్వమేధేన యజేత" యని స్మృతియందును గలదు. దీనివలన నశ్వమేధము సర్వపాపహరము. ఇది యాలోచింపక యొకఁడు పుత్రకామేష్టి - యన నిష్టికానిదియు నా సర్గములు ప్రక్షిప్తములనియు వ్రాయుట యవిచారమూలకము.

అశ్వమేధము చేసినంతనే సంతానము కలుగఁగలదని యెంచి సనత్కుమారు వచనంబుల స్మరించి సుమంత్రుఁడు రాజునకుఁ జెప్పఁగా దానికై శాంతతోడ ఋశ్యశృంగుని రప్పించి కొంతకాలముంచుకొని తగిన కాలమునకుఁ దాను దలఁచి యుండునట్లు పుత్రకామేష్టికిఁ బూర్వాంగముగా నశ్వమేధయాగము చేయ నారంభించుచున్నాఁడని కవి చెప్పుచున్నాఁడు.

అంతః = ఋశ్యశృంగుఁడు వచ్చినపిమ్మట, ఋతౌ = ఋతువుచే, కాంతము = మనోహరమైనది, వనాంతరే = అడవినడుమ, ఫుల్ల = పూచిన, లతాంత = పుష్పములయొక్క, వాసన = సుగంధముచేత, ఆక్రాంత = క్రమ్మఁబడిన, దిశాంతము = దిక్కులకొనలుగలది, ఉద్భట = అధికమైన, నిరంతర = ఎడఁతెగని, దట్టమైన, కేతు = మన్మథునియొక్క, గుణ = అల్లెత్రాడగు తుమ్మెదలయొక్క, ఆవాలి = సమూహముయొక్క, ఉపక్రాంతము = ఆరంభముకలది పుష్పములు మన్మథుని ధనుస్సుగాను, బాణముగాను, చిగురు బాకుగను, మత్స్యముగాని మకరముగాని ధ్వజముగాను, చెఱకువిల్లుగాను చెప్పుట కవి సమయము. ఈవర్ణనము వసంతారంభమును సూచించుచున్నది. పాంథ = భార్యలను విడనాడి దేశసంచారము చేయు వియోగిబాటసారుల యొక్క; సాధ్వస = భయముచేత; దురంతము = చెడ్డదియు, బాటసారులు భార్యా వియోగమునకుఁ దాళఁజాలక ప్రాణాపాయమువలన భయపడుచుందురు. కావున వసంతము వారిపాలిటికి గీడైనది యని భావము. పల్లవ = చిగుళ్లయొక్కయు, పుష్ప = పూవులయొక్కయు, భార = బరువుకల;

శాఖాంతము = కొమ్మలకొనలుగలదియు, హృత్ = (ఎడఁబాయని దంపతుల యొక్క) మనస్సు అగెడి, సరోరుహ = కమలమునకు సితాంశుము = సూర్యోదయకాలము వంటిదియు నగు, వసంతము = వసంతకాలము, ఆగాఁచెన్. రెండు మూఁడుపాదములందుఁ బ్రాదియతి. అలంకారము అంత్యప్రాసము. లతాంతమనఁగా జగురనటకు "అసుగుపెట్టదు సవ్యాహరిచందనలతాంత। యానిన్నిఁగాని యీ యరుణచరణ-" అను. ఇచ్చటఁ బుష్పమను నర్థ మరుణచరణ యను పదసాంనిధ్యమును జెలుచును. ఏలన విశేషవిశిష్టముగాని పుష్పము తెలుపనియే కవిసమయము. 'సామాన్యగ్రహణే వారి ముచాంకృష్ణత్వమేవహి। రక్తత్వమేవ రత్నానాం పుష్పాణాం శౌక్ల్యమేవచ'-కావ్యకల్పలత. శ్లో. నవపలాశపలాశవనం పురస్స్ఫుటపరాగ పరాగతపంకజమ్। మృదులతాంత లతాంత మలోకయత్ ॥ మాఘు ౬ సర్గము.

తాత్పర్యము.

ఇట్లు ఋష్యశృంగుఁడు వచ్చియయోధ్యచేరిన పిమ్మట చిగుళ్ళచే మనోహరమైన వనములలో వికసించిన పూలవాసనలచే నాక్రమింపఁబడిన దిశల కొనలుగలదై విశేషముగ మన్మథుని యస్త్రములనఁ దుమ్మెదల ఝుంకారములచే నపక్రమింపఁ బడినదయి పరస్పర మెడఁబాసిన భార్యాభర్తలకు భయోత్పాదకమైనదియు, చిగురులయు, పూలయు నగువులఁ గొమ్మలకొనలుగలదియునై దంపతుల హృదయకమలములకు సూర్యోదయమువంటిదియు నగు వసంతము ప్రాపించె

చం. పగపుమనోహరంబగుచు ♦ వాలిన యమ్మధుమాసపూర్తిమన్
నామము మలిమ్లుచాదికవి♦వర్జిత మైనదినంబునన్ ధరా
వరుఁడు తలంచి సాంగ్రహిణి ♦ వర్తిలఁ జేయఁగ ఋష్యశృంగునిన్
సరసత వేఁడెఁ బూనఁ గుల♦సంతతికై నిజయాజకత్వమున్. ౨

వరము = దినవారాదిశుద్ధి యను సమస్తగుణములచేత శ్రేష్ఠమైనదియు, మలిమ్లుచ + ఆదిక = మలమాసము మున్నగు దోష సమూహము వివర్జితము, అగు దినంబునన్ = విడువఁబడిన దినమగు. ఈదినము నాదోషము లేదనిభావము. సాంగ్రహిణిన్ = అశ్వమేధారంభమునఁ జేయు నొకానొక యజ్ఞమునకు సాంగ్రహిణి యనిపేరు, వర్తిలఁజేయఁగన్ = నడిపింపఁగ, "చైత్ర్యాం పౌర్ణమాస్యాం ప్రాతరశ్వమేధేన యక్ష్య ఇతి సంకల్ప్య సాంగ్రహిణ్యేష్ట్వా యజతి" యను స్మృతివాక్యమిందుఁ బ్రమాణము. ఈ సాంగ్రహిణికై ఋత్విక్కుల వరించుట ప్రాప్తమై కావున మొదట దశరథుఁడు ఋశ్యశృంగుని బ్రహ్మగా వరించుచున్నాఁడు. కులసంతతికై = వంశ మవిచ్ఛిన్నముగనుండుటకై; నిజయాజకత్వమున్ = త

యజ్ఞముచేయింప బ్రహ్మపదవిని, వాలిన = అతిశయించిన, మధుమాసపూర్ణిమన్ = చైత్రమాసముయొక్క పున్నమనాఁడు

తాత్పర్యము.

మిక్కిలి మనోహరమై యతిశయించిన చైత్రశుద్ధమునఁ బున్నమనాఁడు దినవారాది దోషములులేని దినంబు (తనకు సంతానము గలుగుటకై) యశ్వమేధారంభమునఁ జేయవలసిన సాంగ్రహణి యను కర్మమును జేయుటకై ఋత్విజుఁడుగానుండి కార్యము నిర్వహింప దశరథుఁడు ఋశ్యశృంగునిఁ బ్రార్థించెను.

ఉ॥ ఆఋషిచంద్రుఁ డవ్విధినె ♦ యాకవుటఁ జుమ వల్కి వేగ సం
భారములం గడింపు, మఖవాజిని వీడు, మటంచుఁ జెప్పఁగన్
ధారుణినాథుఁడంప మంత్రి సుమంత్రుని గర్గ్గాని ఋత్విగాదులన్
ధీనుల బ్రహ్మవాదులను ♦ దోడ్కొని వేగము పోయి రమ్మనన్   ౩౬-౪

ప్రీతన్ + అటంచున్ = ప్రీతమటంచు. ఎడు-తే-ల ప్రుతంబున కచ్చుపరంబగునప్పుడు మకారంబగు' ను వ్యా-క్రియ సూం ౬౩ సంభారములన్ = సామగ్రులను, గడింపు = సంపాదింపుము, మఖ=యజ్ఞముయొక్క, వాజిని = గుఱ్ఱమును, 'అపదాతీ నృత్విజస్సమానహంతో సుబ్రహ్మణ్యాయో' యనుశ్రుతి విధించినట్లు అధ్వర్యుఁడు మున్నగు ఋత్విక్కుల వరించుచున్నాఁడు. ఆ సుబ్రహ్మణ్యాయో=సుబ్రహ్మణ్యుఁ డను ఋత్విక్కును వరించునాడక, ఋత్విజః= ఆయా ఋత్విక్కులను, అపదాతీన్ = పదాతులు కాకుండునట్లు, కాలినడకలేక వాహనములపై నెక్కించుకొని, ఆనహంతి=పిలుచుకొని వచ్చుచున్నారు, అని యీశ్రుతి కర్థము. మీఁదఁ జెప్పఁబోవురీతిని వారలను వరింపవలసినది. చైత్రపౌర్ణమాసినాఁడు రాజపురుషులు తాము అధ్వర్యు బ్రహ్మ హోత అగ్నీధ్రు లనుఋత్విక్కులను సోమప్రవాకమును వరించి వారింటికిఁ బోయి యేనుఁగు గుఱ్ఱము మున్నగు వాహనములపై నెక్కించుకొని రావలయును. చైత్రబహుళామావాస్యనాఁడు పూర్వము వరించిన యధ్వర్యుఁడు మున్నగువారిచే సంజ్ఞాన మను యాగము కొఱకు మరల వరింపవలయును. వైశాఖపూర్ణిమనాఁడు ప్రాజాపత్యర్షభపశు నిమిత్తము సోమప్రవాకము వరించిన మైత్రావరుణ ప్రతిప్రస్థాత లను నిద్దఱు ఋత్విక్కులను వాహనములపై నెక్కించుకొని రాజపురుషులు వారింటినుండి పిలుచుకొని రావలయును. జ్యేష్ఠబహుళామావాస్యయందు సోమప్రవాకమున వరించిన యుద్గాతను ముందుచెప్పినట్లు పిలుచుకొని రావలయును. మఱుసంవ *త్సరమునఁ జైత్రపూర్ణిమనాఁడు త్రైధాతవీయ మను కార్యముకొఱకు ప్రస్తోతను పూర్వమువలెఁ బిలుచుకొనిరావలయును. దీక్షారంభమైన మూఁడవదినము మొదలు లొక్కొక్క దినమున నొక్కొక్కని ప్రకారము ఎనిమిది దినముల

యందు (౧) బ్రాహ్మణాచ్ఛంసి (౨) అచ్ఛావాకుఁడు (౩) నేష్ట (౪) ప్రతిహర్త (౫) గ్రావస్తుతుఁడు (౬) పోత (౭) ఉన్నేత (౮) సుబ్రహ్మణ్యుఁడు. అను నెనమండ్రు ఋత్విక్కులను బిలిపింపవలయును. ఇట్టి ఋత్విగ్వరణము నిట సంగ్రహముగఁ జెప్పుచున్నాఁడు. ధీరులను = కార్యము నెఱవేర్పుటయందుఁ బాండిత్యమువలసఁ గలిగిన ధైర్యముగలవారిని, బ్రహ్మవాదులను = సదా వేదమునే పఠించువారిని,

తాత్పర్యము.

ఆ ఋషీశ్వరుఁ డట్టులే కాని మ్మని యంగీకరించి 'యీ క్రతువునకుఁ గావలసిన వస్తువులను సంపాదింపవలసినది, యజ్ఞాశ్వమును వదలవలసినది,' యని చెప్పఁగా దశరథుఁడు సుమంత్రుని బిలిచి ఋత్విజులను బండితులైన బ్రహ్మవాదులను బిలిచికొనిరమ్మని పంపెను.

తే॥ వామదేవసుయజ్ఞజా♦బాలికాశ్యపులఁ బురోధ వసిష్ఠునిఁ ♦ బురుడులేని
యితరభూమీసురేంద్రుల♦నెల్లఁదోడి, తెచ్చెనసుమంత్రుఁడప్డుహ♦ర్షోచ్ఛ్రయమునను. ౩౬౯

పురుడులేని = సాటిలేని; భూమీసురేంద్రులన్ = బ్రాహ్మణశ్రేష్ఠులను, హర్ష + ఉచ్ఛ్రయమునన్=సంతోషాతిశయముచేత.

తాత్పర్యము.

సుమంత్రుఁ డట్టులే పోయి వామదేవుని - సుయజ్ఞుని - జాబాలిని - కాశ్యపుని - వసిష్ఠుని - బ్రహ్మవిద్యయం దసమానులైన యితర బ్రాహ్మణోత్తములను బిలిచికొనివచ్చెను.

౩౭౦ మొదలు ౩౮౨ వఱకుఁగల పద్యములు ప్రాయికముగ ౨౯౭ మొదలు ౩౧౦ వఱకు నుండు పద్యములే.

పూర్వ మాలోచన - ఇప్పుడు కార్యభాగమున ఋత్విగాదివరణము - ముందొక విధము వెనక నొకవిధము గాకుండుటకై యామాటలే చెప్పఁబడును. కావునఁ బునరుక్తి దోషములేదు.

ఉ॥ ఈగతి నేగుదెంచినము♦నీశ్వరులన్ బహుమానపూజనో
ద్యోగముచేతఁ దన్పుచు ర♦ఘూద్వహుఁ డిట్లను భక్తి నో తపో
యోగశిష్టులార! భృశ♦యోగ్యులు మీకృప కల్గి యుండియున్
నాగడుసుంగ్రహంబు లిటు♦ ♦ నన్ననపత్యునిఁ జేసెఁ గ్రూరతన్. ౩౭౦

క॥ సంతానము ప్రాప్తింపమిఁ. జింతాంభోనిధినిమగ్న♦చిత్తుఁడనై యే
కాంతము వనరెద నిఁక నా, సంతాపముఁ బాపరయ్య♦సంయములారా! ౩౭౧

కం॥ సుతలబ్ధికై హయమేధ, క్రతువును జలుపఁగను గోర్కి • గలిగెను నాకీ
యతులితమునిసుతుమహిమను, మతిఁ గలవాంఛితము లెల్ల • మాసక తీరున్. ౩౭౨

చం॥ అని విని మేలు మే లనియె • యాయని బ్రాహ్మణు లెల్ల సమ్మదం
బునఁ బొదల న్వసిష్ఠముఖ•ముఖ్యులు శాంతిధవుండు భూపతిన్
గనఁగొని లెస్స నీవలఁపు • గల్గు నవశ్య మఖేప్సితార్థముల్
పనికిని బూనుమీ, పనియు•వస్తువులన్ సమకూర్పుమీ వెసన్. ౩౭౩

కం॥ విడువుము ఘోటకముఁగ బోఁ, పిడువుము సందేహ మెడను • బ్రేష్యు లెల్లన్
నొడువుము సామగ్రుల్లకై, కొడుకులు కలిగెదరు నీకుఁ • గువలయనాథా! ౩౭౪

కం॥ తనయుల నొందఁగ నిలె నన, ఘనధార్మిక బుద్ధి నీకుఁ • గలిగెను గాన
దనయుల నలువురఁ గాంచెదు, ఘనుఁగుల సంకల్ప మేల • వ్యర్థ మగు ననన్. ౩౭౫

కం॥ అనుపలు వినుచుఁ గిన్నల, నానందాశ్రులు రాల • సధిపతి హర్షా
ధీనతఁ దనయుల నప్పుడె, మానుగఁ గనిన ట్లు పొంగి • మంత్రుల కనియెన్. ౩౭౬

చం॥ వలసిన సర్వవస్తువు లు•నాగ్నిగఁ దెచ్చి, గురూక్తి నస్త్రముల్
బలియురు సత్పురోహితులఁ • బ్రాపుగఁ గూరిచి పీఠి, యజ్ఞశా
లల సరయూత్తరక్షితిత•లంబునఁ గట్టు, యథావిధిం గ్రమం
బలనడ శాంతి కార్యము స•మాచరణం బొనరింపుఁ డంతయున్. ౩౭౭

వలసిన సర్వవస్తువులన్ = అశ్వమును విడుచుటకు వలసిన సాధనముల నన్నిఁటని, "ద్వాదశారత్ని రశనా భవతి" యని శాస్త్రోక్తమైన పంద్రెండు అరత్నులు పొడవుగల ముంజదర్భతోఁ జేయఁబడిన త్రాడు, "చతుష్టయ్య ఆపో భవంతి" అని శాస్త్రోక్తమైన "ఆరెపతి పల్వలములు, కూప్యములు, స్థావరములు, వహంతులు అను నాలుగువిధములైన తీర్థములు మున్నగునవి. ఆ యుపకరణములు. అరత్ని = పిడికిలి బెత్తెవమూర, బలియురు = బలిష్ఠు లగు రాజపుత్రులు మున్నగువారు, 'చతుశ్శతా రక్షంతి' యని యిందుఁ బ్రమాణము. పురోహితులు = నలుగురు ఋత్విక్కులు, శ్రుతియందు- 'చత్వారి స్సముత్కృ' యని ప్రారంభముచేసి 'శతేన రాజపుత్రై స్సహాధ్వర్యుః శతేనారాజభిరుగ్రై స్సహ బ్రహ్మా శతేన సూతగ్రామణిభి స్సహహోతా, శతేం క్షత్త సంగ్రహీతృభి స్సహోద్గాతా'' యని రక్షకుల సంఖ్య చెప్పఁబడినది. దీనినే భట్టభాస్కరుఁడును సంగ్రహముగ శ్లోకమున వ్రాసియున్నాఁడు "సన్నాహవంతః క్షితిపాలపుత్రా స్సన్నద్ధసూతా శ్శత మస్య తేఽధ్వర్యోః , గోపాయితార శ్శతమేవ ముగ్రా సన్నాహవన్తో దృశసూను యుక్తాః, వైశ్యాశ్శతం ప్రాంచితా పథస్య ర్వరూథినీ స్తైశ్శతమేవ శూద్రా" యని వారిశ్లోకములు. పుణ్యనామ దేవయజ

న మధ్యవస్యతియని శాస్త్రము చెప్పినట్లు యాగమునకుఁ దగినపుణ్యస్థలమునిటఁ జెప్పుచున్నాఁడు. సరయు + ఉత్తరతీరే = సరయూనది యుత్తరపు గట్టు; జనసమ్మర్దములేని యేకాంతప్రదేశము కాఁబట్టి యక్కడ యజ్ఞశాలలఁ గట్టుఁ డనుచున్నాఁడు. యథావిధి = శాస్త్రమును మీఱక, కల్పసూత్రమునఁ జెప్పిన క్రియాక్రమమున

కం॥ అపరాధంబులు పొసఁగిన, విపులవ్యసనములు దప్పు • నెనకొను వేనిన్
నృపవరు లెల్లరు దీని, న్నిపుణులగుచుం బరప ధారుణిస్థలి నెంగన్. ౩౨౮

కం॥ నెమకుచు నందురు యజ్ఞ, క్రమకోవిదులైన బ్రహ్మ • రాక్షసు లెట ఛి
ద్రము లొదవవె యని, క్రతువిఘ్నము లొనరించినయపుడ • కను నాశంబున్.

కం॥ వేలిమి యెటు విఘ్నంబుల, పాలం బడకుండ నట్లు • భంగిసి మీరల్
చాలసమర్థులు దీర్పఁగ, హాళిమెయి న్నిర్వహింప • నయ్యది క్రతునన్. ౩౩౦

చం॥ పతి యిటు లాడఁ బ్రగ్గడలు • బ్రాహ్మణులున్ ధరణీశు మహా
మతు లిలఁ బూనకార్యములు • మాయడఁగూడునె? నిర్వ్యసనస్థలా
న్వితనతకార్యలోలుఁడవు • విఘ్నములుం బొడచూపు టెట్లుగన్?
హితగతి నప్రమాదమతి • నెంచియుఁ దీర్తుము సర్వకార్యముల్. ౩౩౧

కం॥ అని యాడుచు భూవరునిం, గొనియాడుచు నన్నవిప్ర • కోటులు నృపు దీ
వనలం దనుపుచు నంతటి, గొనగచుం జనిరి నిజనికేతము • గుఱ్ఱలఁగన్. ౩౩౨

౩౨౮ - ౩౩౨ వఱకు తాత్పర్యము.

ఇట్లు వచ్చిన యాబ్రాహ్మణుల నెల్లగనుఁగొని దశరథుఁడు వారిని సబహుమానముగా సత్కరించి భక్తితో నిట్లనియె. ఓతపస్సంపన్నులారా! మీరంది ఱెంతట తపోమహిమయో గలవారు మీయనుగ్రహముచే బహుసౌఖ్యము గలిగియుండియు నాపాలి దుష్టగ్రహములు నాకు సంతానములేకుండఁ జేసెను. సంతానము లేకుండుటచే బుత్రులు లేనివారికిఁ బుణ్యగతులు లేవను మాట స్మరించి నాగతి యేమికానున్నదో కదా యని మిక్కిలి సంతాపించుచున్నాను, నాపరితాపముఁ దీర్ప వలసిన భారము మీయందున్నది. ఈ సంతానము గలుగుటకై నే నశ్వమేధ యాగము చేయ సంకల్పించితిని. అనుమానములేని మునికుమారుని బుష్యశృంగుని మహిమచే నామదిలోఁగల కోర్కులన్నియు నెఱవేఱఁగలవు.

అనిన వారందఱు సదియే మేలయినపని యట్లు చేయుమని సంతోషము తోఁ జెప్పఁగా నందు ముఖ్యులయిన వసిష్ఠ బుష్యశృంగులును రాజును గనఁ

గాని- నీయాలోచన లెస్సయైనది. నీవు తలపెట్టిన ఫల మవశ్యము ఫలించును. కావున నీకుఁ గార్యభాగమునకై పూనుము. కావలసిన వస్తువులన్నియుఁ దెప్పింపుము. యజ్ఞాశ్వమును సంచారమునకై వదలుము. నీసేవకులనందఱ నాయాకార్యములందు నియమింపుము. నీ కవశ్యము కొడుకులు గలిగెదరు. సందేహము వలదు. ధర్మబుద్ధిచే నీవు కొడుకులు గావలయు నని కోరితివి. కావున నీకు నలుగురుకొడుకులు గలిగెదరు. నిష్కల్మషచిత్తులసంకల్ప మేల వ్యర్థమగును?

అని వారు చెప్పఁగా రాజు కన్నులనుండి యానందబాష్పములు రాలఁ దన కిప్పుడే కుమారులు గలిగినట్లు సంతోషించి మంత్రులతో నిట్లనియె—మంత్రులారా! కావలసినవస్తువులన్నియు సమకూర్పుఁడు. గురువులు చెప్పినట్లు యజ్ఞాశ్వమును వదలుఁడు. దానికి రక్షణార్థము ఋత్విక్పురోహితు నొకనిఁ బంపుఁడు. సరయువునకు నుత్తరతీరమున యజ్ఞశాలల నిర్మింపుఁడు. శాంతికార్యములన్నియుఁ జక్కఁగఁ జేయింపుఁడు. ఈయజ్ఞము సులభసాధ్యము కాదు. కావుననే కదా రాజులందఱు దీనినిఁ జేయ సాహసింపరు. వలన, నేమాత్ర మపరాధము సంభవించినను గష్టములు తెప్పును. యజ్ఞక్రమమును దెలిసిన బ్రహ్మరాక్షసులు మంత్రలోపమో తంత్రలోపమో క్రియాలోపమో యేదేని లోపము గలుగునా యని కాచి వేచియుందురు. లోపము కలిగినా వారు విఘ్నముచేయుదురు. విఘ్నము కలిగినా కర్త వెంటనే నశించును.

కావున మిక్కిలి యుపాయముతోఁ గూడినది కావుననే మీరందఱు నేలోపము రాకుండునట్లు కనిపెట్టి పనిచేయవలయును. మీరట్టికార్యములందు మిగుల సమర్థులు కావున శ్రద్ధతోఁ బనిచేయఁగోరెదను- అని రాజు చెప్పఁగా మంత్రు లట్లే కాని యని యంగీకరించి మఱియు నిట్లనిరి.

రాజా! ఇది చక్కఁగా జరుగునా యను విచారము మీ కేల? మీసంకల్ప

మహాత్ములు పూనినకార్య మెన్నఁడైన విఘ్నహతమగునా? మీరు సత్యాత్ములు. సత్ఫలము కోరియే కార్యములుచేయువారు. ఇట్టివా రట్టికార్యములు చేయఁబూనినపుడు విఘ్నము లేల సంభవించును? మముఁ జేయవలసిన కార్యములన్నియుఁ బ్రమాదపడక హితబుద్ధితోఁ జేసెదము- అని చెప్ప రాజును బొగడుచుండ బ్రాహ్మణులును సెలవుతీసికొని వెడలిపోయిరి

విప్రకోటులు ఎనిపినిరి. ఇచ్చట కిర్త్రిపద మమహద్వాచకము. క్రియాపదము మహద్వాచకము. మహాన్నమూహార్థకశబ్దం ఐమహత్కార్యయుక్తం బయ్యుఁ దగ్విశేషణక్రియాలు మహత్కార్యయోగ్యంబులు విభాషచేసి. "పడనడుతురు నిన్నుఁ గన్నఁ బ్రమథగణంబులు" ఇత్యాది. ప్రౌ. వ్యా. శబ్ద ౧౭ సూ. వ్యాఖ్యానమునకు ౩౧౧ వ పద్యమునకు వ్యాఖ్యానము చూచునది.

౧౩ సర్గము. వసిష్ఠుఁడు యజ్ఞసంభారముల సిద్ధము చేయించుట

చం॥ సమముగ నొక్కయేఁ డరుగఁ జారువసంతము రాఁగఁ గ్రమ్మఱ
న్సమయమున నశ్వమేధము నొనర్ప సుతార్థికి నై ధరాధవుం
డమలు వసిష్ఠుఁ జేరి విధి యొప్పున సేసి యథోక్తసేవనం
క్రను మొనరింతు విఘ్నహతిఁ గానక యుండఁగఁ జేయుఁ డీకృతిన్. ౧-౩

ప్రథమసంవత్సరమున చైత్రపూర్ణిమనాఁడు సాంగ్రహణేష్టిని జరిగించి మఱు నటిదినమున 'చత్వారి స్తనుమత్సరి' యను శాస్త్రోక్తరీతిగా బ్రహ్మౌదనము, మేధ్యాశ్వబంధనము, స్నాపనము, ప్రోక్షణము, అశ్వవిమోచనము మొదలగు కార్యముల నెఱవేర్చి, యది మొదలు ప్రతిదినము 'సావిత్ర మష్టాకపాలం ప్రాతర్నిర్వపతి' యని శ్రుత్యుక్తక్రమముగ సావిత్రాదికర్మములు చేయుచుండవలయును. అట్లు మొదటిసంవత్సరము గడచినపిదప రెండవసంవత్సరము ప్రారంభమున దేవయజనము యాగస్థానమునకు బయలుదేరవలయును. అది యికమీఁదట సందర్భమునఁ జెప్పఁబడుచున్నది

సమముగన్ = పూర్ణముగ, ఒక్కయేఁడరుగన్ = ఒక్క సంవత్సరము జరుగఁగా, నాయేఁటికడపటిమాసము రాఁగా, చారువసంతము = మనోహరమైన వసంతఋతువు రాఁగాఁ జైత్రమాసమే యని కట ప్రధానము. సుత + అర్థికిన్ = పుత్రులు గలుగుటకు, సమయమున = శాంతితో, అశ్వమేధము నొనర్పన్ - దేవయజనమునకుఁ బోయెద అని యధ్యాహారము. ఉఖాసంభరణము, త్రైధాతవీయము, దీక్షణీయము మున్నగు కార్యములు చేయవలసియున్నవి కదా. కావున నీ దినమున నే యజ్ఞస్థలమునకుఁ బోవలయును. ఇదియే భట్టభాస్కరులును జెప్పియున్నారు. 'సంవత్సరస్యాస్యతు యాంతిమామా వాస్యా విధేయా ఖిహాదీక్షణీయా । త్రైధాతవీయం ప్రవదంతి సప్త దినాని దీక్షా హుతయస్తథాస్తా' యని వారివాక్యము. ఇట్లు దేవయజనగమనము సంక్షేపముగఁ జెప్పెను. ఇఁక నీ సందర్భమందెయు దీనినే విస్తరించి చెప్పెను. బ్రహ్మౌదన మను క్రియారంభము మొదలు అశ్వమేధసమాప్తివఱకు వలసినవస్తువుల సంపాదింపను గాని యే కార్యమునకుఁగాని స్వాతంత్ర్యము లేదు. కావున నీవ డుమ గావలసినవస్తువుల సంపాదించుటకై యధ్వర్యునే ప్రేరింపవలయును. కావున నధ్వర్యు వగు వసిష్ఠుని నాకార్యములకై మొదటనే ప్రార్థించుచున్నాఁడు. ఇట్లు భట్టభాస్కరులు చెప్పియున్నారు- 'రశనాం జనతః పశ్చా దధ్వర్యుః పరిగీయతే, రాజ్ఞ్యాయ సచ రాజా స్యా ద్యావత్సంతిష్ఠతే క్రతు' వని వారివాక్యము. రశనాంజనతః- రశనా=ద్వాదశారత్నిరశనా భవతి మౌంజీభవతీయని శాస్త్రమునఁ జెప్పిన యశ్వమేధముగుఱ్ఱమును గట్టుత్రాటియొక్క; అంజనతః=య దా

జ్యముచ్ఛిష్యతే తస్మిన్ గరశనాన్యన్నమితి యని శాస్త్రము విధించినట్లు బ్రహ్మోదన క్రియయందు మిగిలిన నీటితోఁ దనపుటకు, పశ్చాత్ = వెనుక నని యర్థము, వసిష్ఠునిన్ =ఇచ్చట యుపత్యాసనాముచేత సమానతయు సూచితము సంఘనిన్ =శాస్త్రవిహితతోఁ గూడునట్లు, యథోక్తిన్ - శాస్త్రమునఁ జెప్పినదానిని మీఱక, ఉపక్రమము = యజ్ఞారంభము, క్రతుని = ఈయజ్ఞకార్యమును, ద్రవ్యము = దేవత, సర్వము మున్నగువానిని, విఘ్నహాతిన్ = అడ్డుపడుటవలనఁ గలిగెడు చేటును.

తాత్పర్యము

అశ్వమును విడిచినపిమ్మట నొక్క సంవత్సరము పూర్తిముగాఁ గడవఁగా మఱల వసంతఋతువు చైత్రమాసము రాఁగా దశరథుఁడు వసిష్ఠునిఁ జేరి యశ్వము సంచారము చేసి వచ్చినది. ఇఁక యాగము ప్రారంభింపవలసియున్నది. మీరు చెప్పినప్రకారము నేను ప్రారంభించెదను విఘ్నములు రాకుండ మీరు కాపాడుఁడు.

కం॥ గురుఁడవు నిస్తులమైత్రీ, భరుఁడ వవిచ్ఛిన్నసఖ్య•పరుఁడవు క్షేమం
కరుఁడవు కూరిమి మీరలె, భరియింపవలయు యజ్ఞ•భారం బెల్లన్. ౩౮౪

నిస్తుల = సాటిలేని, మైత్రీ = స్నేహముచే, భరుఁడవు = నిండినవాఁడవు, అవిచ్ఛిన్న = నడుమనడుమఁ జెడక యొక్కటే ధారగా వచ్చునట్టి, సఖ్య = స్నేహమే, పరుఁడవు = ప్రధానముగాఁ గలవాఁడవు, క్షేమంకరుఁడవు=క్షేమము కలుగఁ జేసెడివాఁడవు. కావున, కూరిమిన్ = ప్రేమతో, భరియింపను వలయున్ — ఇచ్చటి నివర్ణముచేత ఆర్త్విజ్యమును గూడ భరింపవలయు ననుట సూచితమగును.

తాత్పర్యము.

మహాత్మా! నీవు మాకు గురుఁడవు. అంతియకాక యసమానమైన స్నేహభావమును మాయందుఁ గలవాఁడవు. వంశపరంపరగా నెడఁదెగక వచ్చిన సఖ్యము ప్రధానముగాఁ గలవాఁడవు. మాకు క్షేమమునే కలిగించువాఁడవు. కాఁబట్టి కేవల పౌరోహిత్యమేకాక ఋత్విజుని భారము తదితరభారము లన్ని మీరే వహించి కార్య మెట్లు సఫలమగునో యట్లు నిర్వహింపవలయును.

చం॥ అనవుడు నవ్వసిష్ఠముని • యా నిఁక సర్వము నిర్వహింతు నే
నని సవనంబుఁ దీర్పఁగ ని•యామ్యులునైన ద్విజాతివృద్ధులన్
సనియమధర్ములన్ స్థపతి•సంఘములన్ వరశిల్పవిజ్ఞులన్
ఖనకులఁ గర్మకారులను • నర్తకవర్ధకి చిత్రకారులన్. ౩౮౫

సవనమున = యజ్ఞమున, నియామ్యులు నైన = ఇదివఱకే నియమింపఁబడినవారిని, సనియము = ఏర్పాటుతోఁగూడిన, ధర్మజ్ఞుల = ధర్మకార్యముగలవారిని, స్థపతి = ఆయావస్తువులఁ దెచ్చుటకుఁ బ్రధానులుగా నియమింపఁబడినవారియొక్క, సంఘములన్ = సమూహములను, వర = శ్రేష్ఠులగు, శిల్పికారులన్ = ఇటికలుచేయువారు మొదలగువారిని, ఖనకుల = తటాకాదులఁ ద్రవ్వువారిని, కర్మకారులన్ = పనివాండ్రను, నర్తక = నాట్యమాడువారిని, శిల్పక = చిత్తరువుల వ్రాయువారిని, లేఖకారులన్ = లెక్కలువ్రాయువారిని, దీనివలన నపుడు లెక్కలువ్రాయుటయుఁ గలదని యేర్పడుచున్నది. అప్పటికి వ్రాఁతయే లేదను వారివాదము ఖండితము. కూర్చి చెప్పను అని యధ్యాహారము.

తాత్పర్యము.

అని యిట్లు రాజు ప్రార్థింపఁగా సరి కానిమ్ము సర్వము నేనే నిర్వహించెదను అని యజ్ఞకార్యముల నిర్వహించుటకై యేర్పఱుపఁబడిన వృద్ధబ్రాహ్మణులను నియమవంతులైన ధర్మాత్ములను స్థపతిసంఘములను శిల్పవిద్యాప్రవీణులను గుంతలు త్రవ్వువారిని ఇతరకార్యములుచేయు పనివాండ్రను వడ్రంగులను చిత్రకారులను బిలిపించి వారివారికిఁ జెప్పవలసినపనులు వారికి వారికిఁ వసిష్ఠుఁడు చెప్పెను.

చం॥ గొనకొని వేనవేలుగను ♦ గూర్పుఁడు తెండిటు, కిప్పు డిట్టికల్
ఘనవిపులంబు లైనయుప♦కారిక లుత్తమవిప్రవాటికల్
గనఁగ సునిష్ఠితంబులు ఫ♦లప్రచయాదిక భక్ష్యపానభో
జననిలయంబులు న్వలయుఁ ♦ జక్కఁగ నిర్మితిసేయ నియ్యెడన్. ౩౮౬

గొనకొని = ప్రయత్నించి, ఘనవిపులంబులు = దృఢమైనవియు విశాలమైనవియు - ఇందు నెత్తుకూడ వివక్షితము. ఉపకారికలు = రాజగృహములు, వాటికల్ = గృహములు, సునిష్ఠితంబులు = గాలికి, వానకు శిథిలముగానివి. ప్రచయ = సమూహము, భక్ష్య = తినుబండములు, నిలయంబులు = గృహములు, నిర్మితిసేయుఁడు = కట్టుఁడు.

తాత్పర్యము.

వేలకొలఁది నిటుకలు కావలయును. వాని నిప్పు డిచ్చుటకిఁ దేవలయును. విశాలములై యెత్తైన రాజగృహములు ఉత్తమబ్రాహ్మణులకు ఋత్విక్కులు మొదలగువారికి విడుదులు దృఢములై ఫలములు భక్ష్యభోజ్యపానీయములు లోనైన వుంచుటకుఁదగినభవనములు చక్కఁగా నిర్మాణము కావలెను.

తే॥ విప్రవరు లుండ యోగ్యంపు♦వీటిపట్లు, బహువిధంబులుభక్ష్యాన్న♦పానములును
గలిగిదృఢ మయివాసయో♦గ్యంబుగాఁగ, వందలకొలందిదీర్పంగ♦వలయుమీరు. ౩౮౭

వీటిపట్లు = వాసస్థానములు; పానములు = త్రాగుసట్టి నీరుమొదలగు ద్రవ పదార్థములు, వాసయోగ్యము = వసించుటకు తగినది.

తా త్ప ర్య ము.

ఋత్విక్కులకు సహాయులైన బ్రాహ్మణులకుదగిన వసతులు నానావిధములైన భక్ష్యాన్నపానములు వినియోగించుటకు తగినవై వాసయోగ్యములైన యిండ్లు నిర్మింపవలెను.

క౦॥ అట్టివ పటులకును గృహములగువనకు లోగిని ♦ దిట్టముగ వలయుక
నెట్టన యెవియెవి కోరిన, నట్టివి సంసిద్ధి యుండ ♦ నగు నాయిండ్లన్. ౩౮౦

పౌరులకు = పట్టణపుజనులకు, దిట్టములు = దృఢములు, వసతులు = గృహములు, ఒగిని = క్రమముగా, అట్టివి = అట్టి + అవి. అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తెలుగుగా నగు. అగు అవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు వైకల్పికంబు - సు వ్యా సంధి ౨౦. ఎవియెవి - తెలుచుగ ననుటచే ఎవియేమ్యాదులలో చేరని సంధిలేదు నెట్టన కళ.సూ. నెట్టనము.

తా త్ప ర్య ము.

ఇవిగాక యిటకు జూడవచ్చిన పౌరులకు దృఢములైన యిండ్లు కట్టించి యింటింటను గావలసిన పదార్థములన్నియు మంచి మంచి సరుగకయుండున ట్లొక్కొక్కరికి నించియుండవలెను.

క౦॥ ఆరీతి జనపదులకును, జానుతెరంబుగను దీర్చి ♦ శాస్త్రోక్తవిధిక
సారతరాన్నాదులను గృహంగానములు నిడంగవలయును ♦ గా వశ్రద్ధల్. ౩౮౧

జానపదులకుక = పల్లెటూరివారికి, శాస్త్రోక్తవిధి దీర్చి యని యన్వయము. ఈపద్యము ముందుగ గృహాంగణముల గని యన్వయింపును.

తా ప్ర ర్య ము.

మన నగరమువారికి ఏర్పాటు చేసినట్లుగనే పల్లెటూరులనుండి వచ్చినవారికిని గాను శాస్త్రప్రకారము రమ్యములైన నలవు లేర్పాటులు చేసి వారివారికి గావలసిన యన్నపానాదుల సగౌరవముగా నిచుట కేర్పాటుచేయవలయును. పల్లెలవారు కదా యని యశ్రద్ధ చేయరాదు.

దీనివలన 'శ్రద్ధయా దేయ' మన్నట్లు దానము శ్రద్ధతోనే జేయవలయు నని సూచన. ఈవిషయమున భ.గీత. "అశ్రద్ధయా హుతందత్తం తపస్తప్తం కృతం చయత్। అస దిత్యుచ్యతే పార్థ నచ తత్ప్రేత్యనో ఇహా" అర్జునా! శ్రద్ధలేక

చేయు హోమము దానము తపస్సు మఱియితరకార్యము అస త్తనఁబడును. దానివలన నీలోకమున మేలులేదు, పరలోకమున మేలులేదు, అని తెలుపు చున్నది. "అజ్ఞ శ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి" జ్ఞానము లేనివాఁడు శ్రద్ధలేనివాఁడు సంశయముకలవాఁడు నశించును.

'శ్రద్ధామయోయం పురుషో, యో యచ్ఛ్రద్ధ స్సఏవ సః' పురుషుఁడు శ్రద్ధామయుఁడు. ఎవనిశ్రద్ధ యెట్టిదో వాఁ డట్టివాఁడే యగును. దృఢమైనవిశ్వాసమునకు శ్రద్ధ యనిపేరు. శ్లో॥ అశ్రద్ధా పరమం పాపం, శ్రద్ధా పాపవిమోచనీ। జహాతి పాపం శ్రద్ధావాన్, సర్పో జీర్ణామివ త్వచమ్.— భా॰ అశ్రద్ధయే (శాస్త్రమందు విశ్వాసములేక పోవుటయే) పాపకారణము. శ్రద్ధయే పాపమును దొలఁగించును. పాము కుబుసమును విడిచినట్టు శ్రద్ధావంతుఁడు పాపమును విడుచును.

తే॥ అన్నిజాతులవారి యథార్హభంగి, సత్కరించుచు వారలు • సంతసించు
నటు లొనర్పుఁడు కినుకచే • నైనఁ గామ,బలముచేనైన నవమాన•పఱుపవలదు. ౩౯౦

యథార్హభంగిన్ = వారికి వారికిఁ దగిన విధమున, సత్కరించుచున్ = గౌరవించుచు, కినుకచే = కోపముచేత - కామముచే = వేడుకచేఁగాని, లాభము గోరికాని,

తా త్ప ర్య ము.

అన్నిజాతులవారిని నన్నితరగతులవారిని వారికి వారికి యోగ్యమైన రీతిని సత్కారము గావించుచు వారు తృప్తిపడునట్లు చేయుఁడు. కామముచేనైనను క్రోధముచేనైనను నెట్టివారినైనను నవమానపఱుపఁగూడదు.

చం॥ వలయును యజ్ఞకార్యముల • వ్యగ్రమనస్కుల, శిల్పకారులన్
వలసినయన్నవిత్తము ల•వారిగ నిచ్చి యథాక్రమంబుగా
నలరఁగఁ జేయ, పీడక ర•వంతయుఁ గూర్పుఁడు సర్వమున్ మదిం
జెలిమియుఁ బ్రీతి నూని, యనఁ • జెచ్చెర వారలు దీర్చి యమ్మునిన్. ౩౯౧

వ్యగ్రమనస్కులన్ = జాగ్రత్తగల మనస్సుగలవారిని, అవారిగన్ = సంపూర్ణముగ, యథాక్రమముగ = పెద్దపిన్నల వరుసగ; అలరఁగ = సంతోషపడునట్లు; పీడక = వదలక;

తా త్ప ర్య ము.

ఆవల యజ్ఞకార్యములందు హెచ్చరికతోఁ దిరుగుపనివాండ్రను శిల్పులు లోనైన వారిని, వారికిఁ గావలసిన యన్నపానాదు లొసగి వారు కూటికి నీళ్లకు

దేవురులాడునట్లు చేయక సక్రమముగా నాదరింపవలయును. అల్పకార్యమైనను గొప్పకార్యమైనను జేయవలసినదానిని వదలక చేయుఁడు. చేయుకార్యమును మనస్సులో స్నేహము ప్రీతి కలిగి చేయుఁడు. వెట్టికిఁ జేయకుఁడు - అని వసిష్ఠుఁడు పనివాండ్రను నియమింపఁగా వారు నట్లేచేసి వసిష్ఠునితో నిట్లనిరి

కం॥ మీరు వచించిన విధమునఁ, గారియము ల్దీర్చు టయ్యెఁ ♦ గడమపడక యిం
కేరీతి వచించిన నా,తీరున సర్వంబు వేగ ♦ దీర్తు మ టన్నన్. ౩౯-౨

కారియములు = పనులు, కడముపడక = కొఱఁతలేక, కార్యశబ్దభవము - కారియము.

తాత్పర్యము.

అయ్యా, మునీంద్రా' మీరుచెప్పిన పనులన్నియుఁ జేసితిమి. ఏలోపము లేదు. ఇంకను నేమైననుండినఁ జెప్పుము చేసెదను.

——* వసిష్ఠుఁడు రాజులను బిల్వ సుమంత్రుని నియమించుట *——

చం॥ అతఁడు సుమంత్రుఁ జూచి విది♦తాత్మక! చయ్యనఁ బిల్వఁబంపుమీ
క్షితిఁ గల సర్వధార్మికుల ♦ శిష్టధరామరభూమిపాల్యశూ
ద్రతతుల సర్వదేశగస♦త్ప్రకరంబుల వేనవేలు, స
త్కృతు లొనరించి శ్రద్ధ దలఁ♦గింపక రక్తిపురస్సరంబుగన్. ౩౯-౩

ఇట్లుపకరణములు సమకూర్చి యిఁక రాజులను బిలిపించుట చెప్పుచున్నాఁడు.

విదిత + ఆత్మక = ఎఱుఁగఁబడిన యంతఃకరణముగలవాఁడా, శిష్ట=శ్రేష్ఠులగు, ధరామర = బ్రాహ్మణులయొక్కయు, ప్రకరంబులన్ = సమూహము లందు, తలఁగింపక = వదలక, రక్తిపురస్సరంబుగన్ = ప్రేమ మున్నుగ, వైళమ = శీఘ్రమే.

తాత్పర్యము.

అనిన వసిష్ఠుఁడు సుమంత్రునితో నిట్లనియె. సుమంత్రా! నీకందఱ చిత్తవృత్తులు తెలియును. ఎవ రెవరి నెట్లు పిలువవలయునో యాదరింపవలయునో నీ వెఱుంగుదువు. కావున దేశమందుఁగల ధర్మాత్ములను శిష్టులైన బ్రాహ్మణులను వైశ్యులను శూద్రులను అన్ని దేశంబుల నుండు నానాజనములను యజ్ఞముచూడ రమ్మని త్వరగా శ్రద్ధతోఁ బిలిపింపుము.

చం॥ జనకుని సత్యవిక్రముని ♦ శౌర్యధనాఢ్యుని వేదశాస్త్రని
ష్ఠుని మఱిఁ బూర్వబాంధవుని ♦ సూరిజనాగ్రణి నీవ పిల్వుమీ

యనఘు మహాత్ము సత్కృతుల • నాదృతిఁ దన్పుచు, మున్నమున్న నే
ననితిని శిష్టుఁ డిష్టుఁడును • నైన యతఁ డొప్పుటచే నెఱుంగుమా. ౩౮

సత్యవిక్రమునిఁ = నిజమైన పరాక్రమము గలవానిని, పూర్వబాంధవునిఁ = చిరకాలస్నేహితుని, సూరిజ + అగ్రణి = పండితులందు గొప్పవానిని, జనకునిఁ = జనకమహారాజును అదృతిన్ = ప్రేమతో, నీవు + అ = నీవే స్వయముగాఁ బిలువవలయును. మఱి యెవ్వరిని బంపరాదని భావము. మీఁదఁ జెప్పిన వన్నియు సుమంత్రుఁడు స్వయముగాఁ బిలువఁదగిన కారణములు. మునుమున్న = మొట్టమొదట - అందరురాజులకంటె ముందు, పూర్వబాంధవుని ననఁగా ముందు చుట్టముకాఁబోవువాని నని సూచించుటచేఁ దెలిసి వసిష్ఠుఁ డిట్లు చెప్పె నని తి॥ వ్యా॥

తాత్పర్యము.

నీవు మొట్టమొదట సత్యపరాక్రముఁడును, మనకు పూర్వ చిరకాలస్నేహితుఁడును శౌర్యవంతుఁడును, వేదశాస్త్రజ్ఞానములందు సమర్థగలవాఁడును, పండితులందు శ్రేష్ఠుఁడును నైన జనకమహారాజును నీవేపోయి స్వయముగా సగౌరవముగ సత్కారపూర్వకముగఁ బిలువవలయును. ఆయన బ్రహ్మతేజస్సు క్షత్రియశౌర్యము రెండునుగల సమర్థుఁడు, ముందు నకు చుట్టము కాఁబోవువాఁడు. మొట్టమొదట నీయన పేరు చెప్పుచున్నాను. ఇట యోగ్యతనుబట్టి ప్రథమాహ్వానము.

౪౦॥ సతతము ప్రియవాదియు నృపహితుఁడును గురు కాశిరాజు • వృద్ధుని ధర్మిక్
సుతసహితు నృపతిమామను, హితగతిఁ గేకయునిఁ బిలువు • మీవే యిటకున్. ౩౯

సతతము = ఎల్లప్పుడు, ప్రియవాదియు = ప్రియములు పలుకువాఁడును, నృపహితుఁడును = మనరాజుమేలుకోరువాఁడును, వృద్ధుఁడుగు = పెద్దవాఁడును; ధర్మిక్ = ధర్మాత్మునిని, కాశియుఁ గూడ కేకయుదేశముననుండు మనరాజుమామ యగు కేకయరాజును బుత్రులతోడ రమ్మని నీవె పిలువవలయును.

తాత్పర్యము.

ఎల్లప్పుడు ప్రియములు పలుకువాఁడును మనరాజుహితము గోరువాఁడును పెద్దవాఁడునగు వృద్ధుని కాశిరాజును, కేకయదేశ ప్రభువును మనరాజుమామయగు కేకయరాజును గొడుకులతోడ రమ్మని నీవే పిలువుము. పరులను బంపవలదు.

జనకమహారాజు యోగ్యతచే విశిష్టుఁడు గనుకను వెనుక స్నేహధర్మమును బట్టి ముఖ్యుఁడు కాశిరాజు. వీరిద్దఱయినతరువాత సంబంధులు. ఈవరుసను

బట్టి చూడ బంధువులకంటె యోగ్యులగు మిత్రులను ముందుగను హెచ్చుగను నాదరింపవలయునని యేర్పడుచున్నది.

తే॥ అంగవిషయాధినాథు మహాయశస్వి, రోమపాదుని నృపతిశాంతాలమిత్రు
దోడి తెమ్ము మహాభాగు ♦ దోన నీవ, సత్కృతుఁ బొనరించు మహాసాధుచరిత! ౩౦౬

అంగవిషయాధినాథుఁ = అంగదేశపు రాజుని, మహాభాగుఁ = మహాభాగ్యవంతుని, తోడితెమ్ము = పిలుచుకొనితెమ్ము

తా త్ప ర్య ము.

అంగదేశపురాజు మిగుల కీర్తిమంతుఁడు మనలోమిక్కిలి స్నేహితుఁడగు రోమపాదుని నీవే సత్కారపూర్వకముగ పిలుచుకొనిరమ్ము.

తే॥ భానుమంతునిఁ గోసల♦పార్థివేంద్రు, సర్వశాస్త్రవిశారదు ♦ శౌర్యధనుని
మగధనాథు వదాన్యు సుమిత్రావేది, సత్కృతుగఁ బిల్చితోడ తేరఁగ♦ జనుమునీవు. ౩౦౭

వదాన్యుఁ = దానశీలిని. ఈపద్యమునకు మూలము కన్నిరామాయణ ప్రతులందు లేదు, కొన్నిటఁ గలదు సుప్రసిద్ధివేదిఁ = లక్షలాది ద్రవ్యము లీసినవాఁడు. భానుమంతుఁడు కౌసల్యతండ్రి మగధరాజు సుమిత్రతండ్రి లడితేరఁ = తోడితెచ్చుటకు.

తా త్ప ర్య ము.

కోసలరాజగు కౌసల్యతండ్రిని భానుమంతుని సర్వశాస్త్రములందుఁ బండితుని శౌర్యవంతుని మఱియు సుమిత్రాదేవితండ్రి యగు దాతయు భవిష్యజ్ఞానముఁ గలవానిని నీవే పోయి సత్కరించి పిలుచుకొనిరమ్ము.

క॥ తూరుపుభూమీశుల సౌవీరపతిని సింధురాజ♦బృందారకునిన్
సౌరాష్ట్రీయుల దక్షిణభూరమణుల దూతలఁ బంపు♦ పొలుపుగ నిటకున్. ౩౦౮

రాజబృందారకుని = రాజశ్రేష్ఠుని, సౌరాష్ట్రీయులఁ = సురాష్ట్రదేశప్రభువులను.

తా త్ప ర్య ము.

తూరుపుదేశపురాజులను, సౌవీరరాజును, సింధుదేశపురాజును, సురాష్ట్రపతులను, దక్షిణదేశపురాజులను దూతలచేఁ బిలిపింపుము. వీరినిమిత్తమై నీవు పోవలసినపని లేదు.

క౦॥ ఇంతలు సంతలు బుడుతలు, కాంతలు సహచరులు హితులు • గలవారలతో
నంతలపొంతలవారిని, నెంతేఁ దమిఁబిల్వఁ బంపు•మీ యీవేళన్. ౩౯౮

ఇంతలు సంతలు = చిన్నవారు పెద్దవారు, బుడుతలు = పిల్లవాండ్రు, చిన్నబిడ్డలు పెద్దబిడ్డలు నని భావము. అంతల పొంతలవారిని = దూరపు బంధువులను, ఎంతేని = అధికమైన, తమిన్ = సంతసమున. నాల్గవపాదమున ప్లుతయతి.

తాత్పర్యము.

వీరుగాక మనరాజుగారి దూరపుబంధువులను, సమీపబంధువులను, భార్యలతో మిత్రులతో తోడివారలతో చేతికెదిగిన చేతికెదుగని బిడ్డలతో రమ్మని యాసక్తితోఁ బిలువ మనుష్యులను బంపుము.

క౦॥ అనవుడు వసిష్ఠునడుల, న్విని పంచెను నృపులఁ బిల్వ • వే తగువారిన్
జనెఁ దాసు ముని వచించిన, జనపతులం బిలువ నర్హ•సంభావనలన్. ౪౦౦

అనవుడున్ = ఈప్రకారము వసిష్ఠుఁడు చెప్పఁగా, అర్హసంభావనలన్=తగిన గౌరవములతో.

తాత్పర్యము.

ఈప్రకారము వసిష్ఠుఁడు చెప్పఁగా నాయన పలుకులు విని కొందఱను బిలుచుటకుఁ దగినవారిని బంపి కొందఱను బిలుచుటకు తగిన పూజాద్రవ్యములతోఁ దానే పోయెను.

క౦॥ అంతలఁ గర్మాంతికు లావంతయుఁ గొఱలేక తీర్చి • యన్నియుఁ దద్వృ
త్తాంతముఁ దెలిపిరి మునిజన,కాంతునకుం జక్కనయ్యెఁ • గార్యము లనుచున్. ౪౦౧

కర్మాంతికులు = కార్యములుచేయువారు, ఆవంతయు = అవగింజంతయైన; కొఱలేక = కొఱతలేక, తీర్చి = చక్కఁజేసి.

తాత్పర్యము.

సుమంత్రుఁడట్లు పోయిన పిమ్మటఁ బనిచేయువారు కొఱంతలేకుండఁ బనులన్నియుఁ జక్కఁజేసి యావృత్తాంతము వసిష్ఠునకుఁ దెలిపిరి.

చ౦॥ కిసియపి యన్నియు న్మునియు • గాటపుహర్షముతోడ నెల్లరం
గనుఁగొని వారి కిట్లనియెఁ • గార్యభరాతిశయంబు దోఁపఁగన్
బను లొనరించువేళఁ బొర•పాటున నే నెవఁడేని నెప్పు డే
జన దవహేల యీవి, నటు•సల్పిన దాత నిజంబు రూపఱున్. ౪౦౨

గాటము=గొప్ప, అవహేలన=అవమానపఱచుట, ఈవి=దానము, దాత=ఇచ్చువాఁడు, సూపఱుక = సళించును. 'శ్రద్ధయాదేయం' దానే శ్రద్ధతో దానముచేయవలయును గాని 'అశ్రద్ధయాఽదేయం' అని అవమానదృష్టిఁ జూచియియ్యరాదు.

తా త్ప ర్య ము.

పనివాండ్రుచేసిన పను లన్నియుఁజూచి సంతోషపడి యెల్లవారలంజూచి తరువాత జరగవలసిన కార్యములభారము నాలోచించి వారితో నిట్లనియె. అయ్యలారా! కట్టుకార్యములు చక్కఁగాఁజేయించితిరి. కాని యింకఁ బెట్టుకార్యములున్నవి. ఆపనులు చేయునప్పుడు దానవిషయంబున నవమానదృష్టిఁ జూచి యెవ్వరికి నియ్యరాదు. కొలఁదివారికైనను గొప్పవారికైనను బహుమానదృష్టిఁ జూచి సగౌరవముగ దాన మియ్యవలయును. మీ రశ్రద్ధచేసిన దాతకుఁ గీడు కలుగును - ఇదిసత్యము.

—* యజ్ఞంబుఁజూడ నానా దేశములరాజు లయోధ్యకు వచ్చుట *—

క॥ ఈరీతిఁ బలుక నావల, ధారుణిపైఁ గలుగు సకల♦ధాత్రీనాథుల్
చేరి రయోధ్యాపురమును, హారాదిక బహువిధోప♦హారంబులతోన్. ౪౦౩

బహువిధ + ఉపహారంబులతోన్ = అనేకవిధములైన కానుకలతో.

తా త్ప ర్య ము.

ఈరీతి నందఱను హెచ్చరించి బోధించి నియమించిన పిమ్మట నానాదేశపు రాజులందఱు హారములు లోనైన పలుతెగల కానుకలు తీసికొని యయోధ్యాపురముఁ జేరిరి.

క॥ రేయుం బవలును ధరణీ,నాయకు లరుదేర ముదము♦నం బొంగుచు మే
ధాయుత మైత్రావరుణియు,నాయాజుం గాంచి పల్కె ♦ నయగతిదోఁపన్. ౪౦౪

మేధాయుత=చక్కనిబుద్ధితోఁగూడిన, మైత్రావరుణి = వసిష్ఠుఁడు, (చూడు ఉత్తరకాండము పద్యము ౧౧౦౩) మైత్రావరుణి - మైత్రావరుణుఁడని రెండురూపములు గలవు.

తా త్ప ర్య ము.

రాత్రియనక పవలనక యీవేళ యావేళయనక రాజులురాఁగా నందఱు సద్భావముతో వచ్చిరిగదా యని వసిష్ఠుఁడు పొంగి దశరథునితో సనయముగ నిట్లనియె,

ఉ॥ వచ్చిరి ధారిణీశులు భవన్మహితాజ్ఞ వహించి, కానుకల్
దెచ్చిరి వేనవేలుగఁ ద్వదీయనవార్థము, వారి నందఱన్
గ్రచ్చఱ యుక్తరీతిని సగౌరవసత్కృతి నాదరించితిన్,
మెచ్చిరి నీనియంతృత, కమేయగుణాకర! లెమ్ము చెచ్చెరన్. ४०౫

అమేయ = మితిలేని, గుణాకర = గుణములకునిధీ!, భవత్ = నీయొక్క, మహిత + ఆజ్ఞ = పూజింపఁబడిన యుత్తరువును, వహించి= తలఁదాల్చి, క్రచ్చఱన్ = శీఘ్రముగా, నియంతృతకు = ప్రభుత్వమునకు, నీవుచేసిన యేర్పాటులకు.

తాత్పర్యము.

రాజేంద్రా! దేశదేశ రాజులందఱు నీ గొప్పయాజ్ఞ శిరసావహించి వచ్చిరి. నీయజ్ఞముకొఱకై వేలకొలఁదులుగఁ గానుకలుదెచ్చిరి వారి నందఱ నెవ్వారెవ్వారి నెట్లెట్లాదరింపవలయునో యట్లట్లు మర్యాదతో నాదరించితిని. నీవుచేసిన యేర్పాటులను వారు చాలమెచ్చిరి. ఇఁక లెమ్ము

క॥ జన్నము నారంభింపఁగ, జన్నపునెలవులను జూడఁ జనదె, మున్నటఁ దా
మున్నవి సిద్ధము నస్తువు, లన్నియు మతివిరచితములయట్ల నృపాలా! ४०౬

జన్నపు నెలవులు = యజ్ఞశాలలు,మతివిరచితములయట్లు =సంకల్పముతోఁ జేయఁబడినట్లు, యజ్ఞశబ్దభవము జన్నము మనస్సుతో నెంతయైన సంకల్పింప వచ్చును. చేతితో నాప్రకారము చేయుట కష్టముకదా!

తాత్పర్యము.

స్థలములు చేసినపనలు పరిశీలించుటకును యజ్ఞము ప్రారంభించుటకును లేచిరమ్ము. అన్ని సంకల్పమువలనఁ గలిగినట్లున్నవిగాని చేతితోఁ జేసినట్లులేదు.

ఉ॥ చెప్పఁగ ఋశ్యశృంగుఁడు వసిష్ఠుఁడు నిట్లు, పుణ్యలగ్నమం
దప్పుడ రాజు దా వెడలి యచ్చటి కేగిన, ఋశ్యశృంగుఁ డా
రొప్పుగ మున్నుగాఁ గొని ద్విజోత్తము లెల్లరు యజ్ఞకర్మమున్
దప్పక చల్పఁ బూనిరి యథావిధిగా సరయూత్తరావనిన్. ४०౭

అర్థము సుగమము.

తాత్పర్యము.

వసిష్ఠుఁడు ఋశ్యశృంగుఁడు నిట్లుచెప్పఁగా దశరథుఁడు మంచిముహూర్త మందు బయలుదేఱి యజ్ఞశాలకుఁ బోగాఁ బ్రాహ్మణులందఱు ఋశ్యశృంగుని ముందుంచుకొని సరయూనదియుత్తరతీరమున యజ్ఞకర్మము నారంభించిరి.

—* ౧౪ సర్గము. అశ్వమేధయాగ ప్రారంభము *—

సీ॥ అశ్వంబు విడిచి హాయనమాటయును నది, క్రముకం బిప్పల వృజమునందు
బంధించి హయమేధపునకై ఫాండకు, ఘృష్వంబుగా దీక్షపుంగవులును
బ్రతిపత్తు మొదలుగా గ్రహగణంబును మూడు, వైశ్వదేవంబులు వలయునట్లు
సప్తవాసరములు సల్పి క్రమంబుగ, జరిపి ప్రవర్గ్యోపసదములాది
తే॥ నవల బ్రాతస్సవన మాది నైంద్రమిచ్చి, సోమవల్లిని విధ్యుక్తి స్తుతియొనర్చి
యంగమాధ్యందనముఁ దృతీయంబుఁ దీర్చి, రోలిన్యాయాతిరిక్తతలాంకకుండ. ౪౦౧

సంవత్సరాంతమున యజ్ఞాశ్వము తిరిగివచ్చుటయు, యాగము జరుగుటయు నికఁ బూర్ణముగఁ జెప్పఁబడును.

హాయనము = సంవత్సరము- కొంతకు క్రొత్తగా సంవత్సరమని గ్రహింపవల యును. దీని వివరము ముందు తెలియఁగలదు. ఆది =ఆగ్నేయము, క్రముకా = మఱలరాఁగా, పిప్పలవ్రజము = (1) రావిమాని కులతో యందు - (2) రావి కట్టెలతోఁ జేయఁబడిన పసులకొట్టమునందు, బంధించి=కట్టి. యజ్ఞాశ్వము వెఱలివచ్చినప్పుడు కర్తవ్య విధి మెట్లు దనఁగా మొదటిసంవత్సరమున గుఱ్ఱమును స్వేచ్ఛావిహారార్థమై విడువఁగా నదియు విహరించుచుండ రాజపుత్రులు, ఉగ్రరాజులు, సూతగ్రామణులు, క్షత్త్రసంగ్రహీతలు అను వారొక్కొక్కరు నూఱేసిమందిగా వెంట నన్నాఱునూరుమంది దానిసంరక్షణార్థమై వెంబడి పోవల యును. వారు దానిని మఱలింపఁగూడదు. అది యట్లు తిరుగుచుఁ దుదకుఁ దానుగ గృహమునకు మఱలి వచ్చును. అప్పుడు బ్రహ్మ, అధ్వర్యుఁడు, హోత, ఉద్గాత లను నలువురుఋత్విక్కులు దానిని రథకారునిగృహమున బంధించి దాని నాలుగుపాదములయందు "ఇహధృతి స్వాహా" ఇత్యాదులగు మంత్రములఁ జెప్పి హోమముచేయుదురు. 'రథకారగృహే తస్య వసతి స్వాహాయుత్యేతుచతు ష్పత్సు హోతవ్యాశ్చతస్రో ధృతయః క్రమా' త్తని దీనికిఁ బ్రమాణము. అశ్వ విసర్జనసంవత్సరమున పదునొకండుమాసములు గడచినపిదప దాని నచ్చట నుండి తోలికొనివచ్చి సదస్సునకుఁ దెచ్చి యందు నశ్వత్థవ్రజమున బంధింపవల యును. "ఊర్ధ్వమేకాదశాన్మాసా దాశ్వత్థే వ్రజేఽశ్వం బధ్నీయా' త్తని యూప స్తంభసూత్రము దీనికిఁ బ్రమాణము. ఆ సంవత్సరము పండ్రెండవమాసమున యజ్ఞమునకు వలసిన సామగ్రులను సంపాదించుకొని యీ సంవత్సరము కడ పటి ఫాల్గునామావాస్యనాఁడు ఋత్విక్కులతో యజ్ఞశాలను బ్రవేశించి రెండవ సంవత్సరము ప్రథమదినమగు పాడ్యమి మొదలు అశ్వమేధయజ్ఞ మారంభింప వలయును.

ద్విజపుంగవులు = బ్రాహ్మణశ్రేష్ఠులు - ఋత్విక్కులు. వైభాండక = విభండక ఋషిపుత్రుఁ డగు ఋశ్యశృంగుఁడు. పూర్వకంబుగా = ముందుగా. అతఁడే ఋత్విక్కులలోఁ ప్రధానుఁడగు బ్రహ్మ యను ఋత్విక్కని దీనిచే సూచింపఁ బడును. చైత్రశుద్ధమున పాడ్యమి మొదలు పదుదినములు 'త్రీణిత్రీణి వైశ్వ దేవాని జుహోతి' యని శాస్త్రము చెప్పినట్లు ఇరువదియొక్క హోమములను 'పూర్ణాహుతిముత్తమాం జుహోతి' యని శ్రుతిచెప్పిన క్రియావిశేషమును జేసి రనుచున్నాఁడు. ప్రతిపత్తు = పాడ్యమి, వైశ్వదేవము = ఒకానొకహోమము, వఱలునట్లు = ప్రకాశించునట్లు, సప్తవాసరములు = పదుదినములు, సల్పి = పూర్ణాహుతి యంత్యముగా జరిపి, క్రమంబుగిక = శాస్త్రి, మీమాంస, కల్పసూత్రములక్రమము తప్పక జరప 'నాగ్నిష్టోమేఽధ్వర్యుప్రత్యక్ సదోతియా' త్తనశ్రుత్యుక్తక్రమము తప్పక ఋత్విక్కులందఱు కార్యములు జరిపి రని భావము. ఇట్లు సోమక్రయణమైనపిదప సోమలతా రాజమునకు నభివర్ధకములగు కొన్ని క్రియలను జరపుచున్నాఁడు — ఇదిక = మొదట, ప్రవర్గ్య + ఉపసదములు = 'దేవా వై సత్ర మాసత' యిత్యాదిగ ప్రవర్గ్యబ్రాహ్మణమునఁ జెప్పియున్న ప్రవర్గ్య మను క్రియావిశేషమును క్రమముగ మూఁడు ప్రవర్గ్యోపసదములు అను బహువచనము 'త్రిరేవ సాహ్న స్యోపసదో ద్వాదశాహీనస్య'యను నతిదేశశాస్త్రమును బట్టి ప్రాప్తమగు పన్నెండుప్రవర్గ్యోపసదములనుగూడఁ జేసి రని సూచించును.

ఇఁక సోమప్రయోగమును జరుపుచున్నాఁడు. అంతక = ప్రవర్గ్య, ఉపసదము లయినపిమ్మట, ప్రాతస్సవనము - ఇది యొకక్రియావిశేషము, ఆదిక = మొదట, ఐంద్రము = ఇంద్రునిగూర్చి చేయఁబడిన సోమపానమును (ఐంద్రము = ఇంద్రునకు దేవతగాఁగల హవిస్సు ధానములు, కరంభము, పరివాపము, పురోడాశము, పయస్య యని యైదుపదార్థములు) ప్రాతస్సవనమునందలి హవిస్సులు 'ఇంద్రాయవతేధానా ఇంద్రాయపూషణ్వతే కరంభా సరస్వతే పరివాపః ఇంద్రాయ పురోడాశః మిత్రావరుణాభ్యాం పయస్యా' యని చెప్పినట్లు యీ యైదు హవిస్సులను ప్రాతస్సవనమున నింద్రునిఁ గూర్చియే హోమముచేయవలయును. 'అథకస్మాదేవేషాగ్ం హవిషామంత్రమేవ యజంతి'యను ప్రమాణము. మాధ్యందినసవనమునను, సాయంసవనమునను పయస్యతప్ప తక్కిననాల్గు హవిస్సులను హోమముచేయవలసినదే.

అంతక = ప్రాతస్సవన మైనపిదప; మాధ్యందనమును = మాధ్యందిన మను పేరుగల రెండవ క్రియావిశేషమును, అపిదప, తృతీయము = సాయంసవన మను మూఁడవక్రియావిశేషము; న్యూనాతిరిక్తతలు = హెచ్చుతక్కువలు, ఓలిక = క్రమముగాఁ, దీర్చిరి.

తాత్పర్యము.

సంచారార్థమై గుఱ్ఱమును విడిచి సంవత్సరము సమీపింపఁగా, నది క్రమ్మఱి రాఁగా దాని రాకతోఁ బ్రసన్నుఁడు కర్త హయమేధమం దాసక్తులైన బ్రాహ్మణులు ఋశ్యశృంగుఁడు మొదలుగా పాడ్యమి మొదలు దినదినము మూఁడు వైశ్వదేవంబు లేడుదినములు చేసి ప్రవర్గ్యముపసదము లను కర్మములను ప్రాతస్సవనమును మొదట నైంద్రము సలిపి సోమతీఁగను శాస్త్రమునఁ జెప్పిన చొప్పున స్తుతిచేసి యంతట తృతీయము సూధ్యందినము వీనియం దేమియుఁ గొఱఁత లేకుండ శాస్త్రంబునఁ జెప్పఁబడిన ప్రకారము సలిపిరి.

చం॥ స్ఖలితము హోమలోప మెటఁ • గానము, సర్వము మంత్రవంతమై
వెలసె నిరంతరాయముగ • వేలక కేవల నొక్కఁ డేనియున్
గలుగఁడు దప్పి నాఁకటను • గాఱియ నొందెడివాఁడు, విద్యలం
దెలియనివాఁడు, నూర్వురకు • నందఁగుశిష్యులు లేనివిప్రుఁడున్. ౪౦౯

స్ఖలితము = (1) క్రమముతప్పి హోమము చేయఁబడినది (2) హోమము నకై పాత్రమునుండి యెత్తునప్పుడు అగ్నికావల పెడఁతి దిగునఁబడినది హోమలోపము = హోమమునందు లోపము, సర్వమున్ = సకలహోమములును, మంత్రవంతమై - ఆ యా మంత్రములతోఁ గూడినదై, నిరంతరాయమునన్ = విఘ్నము లేక. విఘ్నశాంతికై రక్షోఘ్నమంత్రాదులను బఠించుచుండిరి. కాన నచటి క్రియాకలాపములన్నియు నిర్విఘ్నముగా జరిగెను. కాఁబట్టి యన్నిహోమములును వానివానిమంత్రములు తప్పక చెప్పి హోమము చేయఁబడినవి. హోమముచేయక మఱచినదియుఁ గ్రమముతప్పి హోమముచేసినదియు నొక్కటైనను లేదని భావము-అని కొందఱు. ఇటఁ జెప్పఁబడిన హోమములు అశ్వమేధమునఁ జేయవలసిన అన్నహోమము మున్నగునవి. అవి యనేకములు కానఁ దప్పులు సంభవింపవచ్చును. అట్టి వెప్పుడును సంభవింపకయుండునట్లు మిక్కిలి జాగ్రత్తగాఁ జేసిరి. 'పత్నీసంయాజనాంతే హ్యన్యగ్నిష్టోమేలు సంస్థితే । ప్రజాపతి సమే గీతే వీణాగణకిభి ర్నృపే । అస్తంగతే సహస్రాంశా వారుహ్యాశ్వత్థనిర్మితాః । షట్త్రింశతమథాసందీ । స్తావంతో ధ్వగ్యాత్తో వృతాః । అప్రాకృతైస్స్రువై ర్దీర్ఘదండైః ఖదిరసంభవైః । సర్వాం తాం రాత్రి మన్నాని దశాజ్యాదీని జుహ్వతి । సంఖ్యాహుతీ స్తాస్స్రుదేవ హుత్వా పరార్ధపర్యంతమథ క్రమేణ । హుత్వాశ్వనామప్రభృతీనిరాత్రే శ్శేషోర్ధ్వ సంఖ్యాహుతిభి స్సమాప్య' యను యాజ్ఞికవాక్యము ప్రమాణము. ఇఁక నన్నదానసమృద్ధిని జెప్పుచున్నాఁడు. సోమలతాక్రయ మయినపిదప వపాహోమ మగునంతవఱకు యజ్ఞాన్నమును భుజింపరాదు. అట్లు భుజించినఁ బాపము సంభవించును, అని 'నదీక్షితాన్నమ

శ్నీయాత్ -హుతాయాం వపాయాం దీక్షితాన్నమశ్నీయాత్' అని శాస్త్రములు చెప్పుచున్నను వీరెట్లు భుజింప హేతువేమనఁగా దశరథుఁడు తనసొత్తునంతయు వసిష్ఠునికి స్వాధీనపఱిచెను. తనస్వాతంత్ర్యమందుండి వదలుకొనెను. అప్పుడు సొత్తు యజమానునిదికాదు. వసిష్ఠునిది. కాఁబట్టి యీయన్నము యజ్ఞమునకుం చినను భుజించువారికి దోషము లేదు. ముందు చెప్పిన శ్రుతివాక్యములు యజమానుఁడు తనసొత్తుగా నభిమానించెనేని యట్టి యన్నమును భుజింపఁగూడదు. కావున శాస్త్రవిరోధము లేదు.

తా త్ప ర్య ము .

హోమము చేయునపుడు చేయిదప్పిజాఱిపడినదిగాని చేయవలసినది లోపించినది గాని యేకార్యమందును లేదు. అన్నికార్యములు సమంత్రకముగానే విఘ్నములేక జరిగెను. వినోదమునకైనను నోక్కఁడైనను నాకాఁకలి నాకు దప్పి యన్నవాఁడు లేఁడు. బ్రాహ్మణులందు వేదవిద్య రానివాఁడుగాని శిష్యులులేనివాఁడుగాని లేఁడు.

ఉ॥ పాఱులు నాథవంతులును ♦ బాలురు వృద్ధులు వ్యాధిచేత నో
టాఱినవారలుఀ శ్రమణు ♦ లంగనలు న్వివిధౌదనంబులుఀ
గాఱఁగఁ జేరిలఀ ఘృతము ♦ కమ్మని పప్పులు పిండినంటలుఀ
జూఱలుగా భుజించి రటఁ ♦ జొక్కపుమక్కువ ముక్కుబంటిగన్. ౪౧౦

పాఱులు = బ్రాహ్మణులు, నాథవంతులు = సేవకులు, బ్రాహ్మణశబ్దముతోడ సేవకశబ్దముచెప్పుటచేత బ్రాహ్మణులకు శుశ్రూషచేయు శూద్రులని యర్థము. నాథవంతులు - నాథుఁడు (= యజమానుఁడు) కలవారు. ఓటాఱినవారు = బలహీనులు, శ్రమణులు = (1) దిగంబరులు - "శ్రమణా వాతవసనా"యని నిఘంటువు (2) సన్న్యాసులు = "చతుర్థ మాశ్రమం ప్రాప్తా శ్శ్రమణా నామ తే స్మృతా" యని స్మృతివాక్యము. శ్రమణశబ్ద మిచ్చటఁ బ్రయోగింపఁ బడియుండుటచేతను బౌద్ధసన్న్యాసులకు శ్రమణులని పేరుండుటచేతను బౌద్ధమతము వ్యాపించినపిమ్మట రామాయణము రచింపఁబడెనని కొందఱు తలంతురు. బుద్ధుఁడు పుట్టకముం దుండియు సంస్కృతమున నీపద మున్నది. ఆపేరిచేతనే బౌద్ధసన్న్యాసులు తమ్ముఁ బిలుచుకొనసాగిరి. అంతియకాని యీ పదము బౌద్ధులు సృష్టించినది కాదు, అంతకుముందు లేకయుఁ బోలేదు. చైత్యశబ్ద మిట్టిదే. 'భీమపరాక్రమ' యని రామహనుమంతులవిషయమున రామాయణమం దుండుటచే భీముఁడు పాండవుఁడు కావున నా తర్వాత రామాయణము వ్రాయఁబడె, నని యొకఁడు వ్రాసెను. వివిధ + ఓదనములు = వివిధములగు నన్నములు; ముక్కుబంటిగఀ=ముక్కు మునుఁగువఱకు, చూఱలు = కొల్లలు.

తాత్పర్యము.

బ్రాహ్మణులును - సేవకులును - పిల్లవాండ్రు - ముసలివాండ్రు - రోగపీడితులు - విరక్తులగు స్త్రీలు నానావిధములైన యన్నములు - చేలకొలఁది నెయ్యి - రుచిగల పప్పులు - పిండివంటలు - వీనినన్నిటిని ముఖ్యముగాఁ బ్రీతితో కొల్లలుగా లొట్టలువేసికొనుచు భుజించిరి.

ఉ॥ అంచితభక్ష్యభోజ్యములు,యచ్ఛపుఁగమ్మనివాసనల్ ఘుమా
యించుచుఁ దీర్ప నాఁకలిని ♦ నెంతయుఁ ద్రేఁచుచుఁ బొట్ట దమ్ముచున్
మించినఁగాని సాపడియు ♦ మేకొనఁ జాలమిఁ దృప్తి పిస్తరిల్
దించి చనంగ లే, రెసరు ♦ దీర్చిర దెట్టులొ శాకపాకముల్. ౪౧౧

అంచిత = ఒప్పునట్టి, భక్ష్య-కఠినములగు తినుబండములయొక్క-యు-వడలు మొదలైనవి భోజ్యములు = అన్నము మొదలయినవానియొక్క-యు, అచ్ఛము = పరిశుద్ధముగు, మేకొనన్ = పొందన్.

తాత్పర్యము.

మనోహరములయిన భక్ష్యములయు భోజ్యములయుఁ గమ్మనివాసనలే ఘుం ఘుమ్మని ప్రసరించి యాఁకలి దీర్చుచుండఁగాఁ ద్రేఁపులు తేన్చుచుఁ గడుపులు నిమిరికొనుచు రుచిగలవవుటచే జిహ్వాచాపలముచే వంటకము తినుదమని యాసపడియుఁ గడుపునం దెడములేమి తినలేక లేచిపోవుటకు మనసురాక భోక్తలు కష్టపడిరి ఆహా యాశాకపాకము లెవ్వ రెట్టులు దీర్చిరోకదా!

క॥ కుడువఁగఁ జాలక విస్తరి, విడువంగా లేక మిణుక ♦ వెక్కసమయి, వే
యిడుఁడీ యిడుఁడీ యన్నం, బడబాల, లటంచుఁ బలుకు ♦ నధికారితతుల్.
౪౧౨

అడబాలలు = ఓ వడ్డించువారలారా! మధ్యమపురుషయోగముచే నిట నారగాగమము వైకల్పికము.

తాత్పర్యము.

భోక్తలు కడుపులు పూర్ణముగ గొంతులవఱకు నిండుటచేఁ దినలేరు, లేచిపోద మనిన మనసురాదు. ఇట్లు వెక్కసమయి మిణుకఁగా నధికారులు భోక్త లాకులముందు కూర్చుండియుండుటచూచి యింకను భుజించెద రను తలంపుతో వంటవారలారా! ఇంకను వడ్డింపుఁ డని పలుకుచుండిరి.

క॥ సూపంబులు వివిధంబు ల,పూపము లన్నింబు నాజ్య♦పూరము రుచ్యా
ద్దీపితపాయసములును న,నూపము నొనరించె ధర న,నూనముగాఁగన్. ౪౧౩

సూపములు = పప్పులు; అపూపములు = పిండివంటలు - అప్పచ్చులు, ఆజ్యపూరము = నేతిప్రవాహము, రుచి + ఉద్దీపిత = కమ్మనిచవిచేత నొప్పునట్లు చేయఁబడిన, అనూపము = బురదనేల, అనూనము = కొఱఁతలేనిది, నాలవపాదంబున నఞ్సమాసయతి.

తా త్ప ర్య ము .

పప్పులు - నప్పచ్చులు - నన్నము - నేతికాల్వలు - మిక్కిలి రుచిగల పాయసంబులు భోజనశాలను బురదినేలగాఁ జేసెను.

కం॥ నానాదేశసమాగత, మానవతీపురుషజనము ♦ మానసకయొప్పుచుఁ
బానాన్నంబుల రుచులం, బూనిక కొండాడియాడి ♦ భుజియించెఁ దమిన్. ౫౧౪

నానాదేశసమాగత = అనేకదేశములనుండివచ్చిన, మానవతీ = స్త్రీల యొక్కయు.

తా త్ప ర్య ము .

నానాదేశములనుండి వచ్చిన స్త్రీపురుషసమూహములు నన్నపానంబుల రుచులను పొగడి పొగడి కోరికదీర భుజించిరి.

కం॥ దిన దినముఁ గ్రొత్త క్రొత్తగ, జనులకు విధివంశములుగ ♦ సమకూర్చినయో
దనరాసులు కొండలొ నాఁ, గనవచ్చె మహానసములఁ ♦ గ్రతువిధ వేళన్. ౫౧౫

విధివంశములుగ = పాకశాస్త్రమునఁజెప్పినరీతిని, ఓదనరాసులు = భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానము లనునైదువిధములయిన తినుపదార్థముల కుప్పలు, మహానసములఁ = వంటయిండ్లయందు, క్రతువిధివేళఁ = యజ్ఞముచేయుసమయమున.

తా త్ప ర్య ము .

దశరథుఁడు యజ్ఞముచేయుకాలమున వంటయిండ్లలో ప్రతిదినము నేపూఁట కాపూఁట క్రొత్త క్రొత్తగ శాస్త్రప్రకారము సిద్ధముచేసిన యన్నపురాసులు కొండలవలెఁ గానవచ్చుచుండెను.

శా॥ భద్రం తే నృపలోకపాలవర! తృ♦ప్తాస్స్మ ప్రభో! యంచు న
త్యుగ్రామోదముతోడ నభ్రతలముల్ ♦ సోఁకంగ భోక్తల్లు నుల్
మాద్రి స్తీఱఁగఁ గూయిడ న్దశరథ♦క్ష్మాపాలుఁ డాలించి య
చ్ఛిద్రానందము నొంది దానమును జే♦సెం జేలము ల్యాభవలున్. ౫౧౬

నృపలోకపాల = దిక్పాలురవంటిరాజులయందు; వర = శ్రేష్ఠుఁడా; తే = నీకు, భద్రం = మేలు; అస్తు = అగుఁగాక యని యధ్యాహారము. ప్రభో =

దశరథమహారాజా! తృప్తాః = తృప్తి చెందినవారముగా, స్మ = అగుచున్నాము. అచ్ఛిద్ర = అధికమైన, ఆమోదముతోఁ = సంతోషముతో, నుడుల్ = మాటలు, అభ్రతలము = ఆకాశప్రదేశము, భోక్తల్ = భుజించువారలు, కూయిడఁ = మొఱపెట్టఁగా- అఱవఁగా, క్ష్మాపాలుఁడు = రాజు, ఆలించి = విని, మీఁది స్తుతివాక్యములు జనులవి కాని కవివికావు దీనివలన 'బ్రాహ్మణావీణాగాథినో గాయతే' యని ప్రారంభించి 'ఇత్యదదా ఇత్యయజథా ఇత్యపచ ఇతి బ్రాహ్మణో గాయే' త్తని శాస్త్రమునఁ జెప్పినట్లు స్తుతిశ్రవణ మనుకార్య మీ సందర్భమునఁ జెప్పిన ట్లయినదని గ్రహింపవలయును. అచ్ఛిద్ర + ఆనందము = అధికసంతోషము; చేలముల్ = వస్త్రములు

తాత్పర్యము.

'ఓ రాజేంద్రా! నీకు శుభమగుగాత, మేము తృప్తులమైతిమి.' అని సంతోషాతిశయముచే భోక్తలాకాశమునిండునట్లు గట్టిగఁ జెప్పుచుండ దశరథుఁడు విని సంతోషించి భోజనానంతర మంతఱకు వస్త్రములు ఆభరణములు దానము చేసెను.

కం॥ బోనసేసెడివిప్రులకు, న్గైసేఁతల నొప్పుశుచిజ♦నము వడ్డించెన్
వేసట లేక వ్వారికి, బాసట నై కుండలములు♦వారలు గిలుగన్   ౪౧౭

బోనసేసెడి = బోనము + చేసెడి = భోజనముచేయునట్టి, కైసేఁతలన్ = అలంకారములచేత, వేసట = శ్రమము, ఆ + వారికిన్ = వడ్డించువారికి, బాసట = సహాయము

ఆవిపన్నంబు సంకటప యంబలియును.
జేయ నవరేయివేసి బోనసిపోవు = హంస - ౪ ఆ.
పోవద్దు బోసేయన నేవచ్చెదనన్న॥ శిఖ. ౪౩.

తాత్పర్యము.

భోజనముచేయు బ్రాహ్మణులకు వడ్డించువారు శుభ్రవస్త్రములు కట్టుకొని శుచిమంతములైన దేహముల నలంకరించుకొని వడ్డింపఁగా వేసటలేక వారి కందిచ్చువారు కుండలములు ధరించినవారు సహాయులుగ నుండిరి. చెమటలు గాఱుచు వడ్డించువారిని జూడఁగానే వారలికి వచ్చునట్లుండిన నన్న మెట్లు సహ్యమగును?

కం॥ మా పూపో మా సూపో, మా పరిమాన్నం ఘృతం చ ♦ మా దధిదుగ్ధే
మా పరితుష్టాస్స్మ యనుచుఁ, గూపెట్టినదాఁక నిడిరి ♦ కోరిన వెల్లన్.   ౪౧౮

అపూపః = పిండివంట, మా = వలదు, సూప = పప్పు, మా = వలదు; పరమాన్నం = పాయసము, మా = వలదు, ఘృతంచ = నెయ్యియు, వలదు, దధిదుగ్ధే = పెరుఁగు పాలు, మా = వలదు, పరితుష్టాః స్మ = మిక్కిలి తృప్తిపడితిమి. అనుమర్ = ఈవిధముగాఁ జెప్పుచు, కూపెట్టుదాఁక = మొఱపెట్టు దనుక.

తా త్ప ర్య ము.

అప్పచ్చులు మాకు వలదు, పప్పువలదు, పరమాన్నము వలదు, నెయ్యి వలదు, పాలు పెరుఁగువలదు, కడుపులు నిండినవి, మిక్కిలి తృప్తిపడితిమి - యని కేకలు వేయునటులకుఁ గావలసిన పదార్థములన్నియు సిద్ధించిరి

తే॥ కుడిచి కూర్చుండి సన్మణీ♦కుండలాది,భూషణాలంకృతాంగులై ♦ భూమిసురులు
గెరలి తొడఁగి రన్యోన్యజి♦గీషఁ జేసి,హేతువాదంబునకు, జన్న ♦ మిట్లుజరుగ. ౪౧౮

సత్ + మణీ = మంచిరత్నములుగల, కుండల + ఆది = చెవులపోగులు మొదలగు, భూషణ + అలంకృత + అంగులై = సొమ్ములచేత నలంకరింపఁబడిన దేహములుగలవారై, భూమిసురులు = బ్రాహ్మణులు - ఋత్విక్కులు, కెరలి = అతిశయించి, అన్యోన్య = ఒకరినొకరు, జిగీషఁ జేసి = జయించుకోరిక చేత, హేతువాదమునకు = ప్రకృతయాగానుష్ఠానమున కుపయోగములగు కారణములవిషయమైన వాదమునకు, తొడఁగిరి = ప్రారంభించిరి సవనముల మధ్యకాలమున నని భావము 'కిగ్గ్స్విదాసీ త్పూర్వచిత్తి' యని హోతకును బ్రహ్మకును జరుగు ప్రశ్న ప్రతివచనములవంటి బ్రహ్మోద్యమను సంవాదము నెఱ వేఱెనట్లు దీనిచేఁ జెప్పఁబడెను

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము భుజించి నిర్విచారముగఁ గూర్చుండి రత్నములు చెక్కిన కుండలములచే నలంకరింపఁబడిన దేహములు గలవారై బ్రాహ్మణు లొకరి నొకరు గెలుచు కోరికకలవారై హేతువాదములకుఁ బ్రారంభించిరి. ఈప్రకారము యజ్ఞము జరిగెను.

క॥ దినము దిన మచట సంస్తర,మున నేర్పరులై సద్విజులు ♦ మునుకొని క్రియలర్గొనసాగింపుదు రన్నియుఁ, బనివడి విధివిహితమైన♦పద్ధతు లమరన్. ౪౨౦

ఉమా, ఔర్వ్య, కావ్యులు దేవతలుగాఁగలవియు, 'ద్విరాశంసనం ప్రాతస్సవనం, ద్విరాశంసనం మాధ్యం దినసవనం, సకృన్నారాశంసనం తృతీయసవన' మ్మని శాస్త్రమున విధింపఁబడ్డవియు నయి యాదినముల మూఁడు పూఁటలును జేయవలసినకార్యములఁ జెప్పుచున్నాఁడు. దినదినము = అశ్వమేధము

చేయు ప్రతిదినమును; సంస్తరములకై = దిగువఁ బఱచిన దర్భలయందు, క్రియ లన్నియు = ఉపమాదిదేవతాకములగు కార్యములను, ఉమాజౌర్వ్యాకావ్య లను వారు ప్రాతస్సవనాదులగు మూఁడుసవనము లందు నవయుక్తులగు పితృదేవతలు; నారాశంసనము = చమసవిశేషము.

తా త్ప ర్య ము.

ప్రతిదినము పఱచిన దర్భలమీఁద నేర్పరులైన బ్రాహ్మణులు కార్యము లందు నీవు నీవు నేను చేసెద నేను చేసెద నని ముందుపడి శాస్త్రములందుఁ జెప్పిన చొప్పున కార్యము లన్నియుఁ జేయుచుండిరి

ఆ॥ వ్రతములు గానివారు ♦ వారశాలీనుల, శ్రుతిషడంగవిదులు ♦ సూరి జనుల
వలన వినికిలేని♦వారు నారశంఘు, నోలగమున బొరిక ♦ నొక్కఁడేని. ౪౨౧

వ్రతులు = ప్రాజాపత్యములోనగు వ్రతములు గలవారు, శాలీనులు = ధైర్య హీనులు, మెతకలు, అశ్రుతిషడంగ విదులు = నాలుగువేదములను ఆఱు వేదాంగములను నెఱుఁగనివారు, సూరి = పండితులగు, వినికిలేనివారు-గొప్ప విషయములను బలువూఱు వినినవారు, ఓలగమునకై = సభయందు.

తా త్ప ర్య ము.

వ్రతములేనివారు, వారిములు గసమర్థులు, ఆఱంగములతోడ వేదముల నభ్యసింపము చేయనివారు పెద్దలసేవచేసి వారివల్ల విషయములు గ్రహింపని వారు నాశంఘుని సభయందు నొక్కఁడైనను లేఁడు

—* యూపస్తంభ ప్రతిష్ఠ *—

సీ॥ యూపప్రతిష్ఠకు ♦ నుచితంపువేళ రా, మారేడుచంద్రుల ♦ మహితము లగు
యూపంబు లాఱాఱునొకచో దాఫున నాటి, యన్నియ మోదుగు ♦ లవల నిల్పి
విరిగియూపం బొండు ♦ వేడిప్ప ఘటించి, దాని ప్రక్కల దేవ♦దారుయూప
యుగ్మంబుఁ బొనరించి ♦ యొయ్య శోభార్థమై, శాస్త్రకోవిదులు కాం♦చనవిభూష
తే॥ ణంబులను వానిని నలంకృ♦తంబుఁ జేసి, యేకవింశతియూపంబు ♦ లిరువదొకటి
గలుగఁ జిటికెనవ్రేల్మూర♦కొలఁదనిలిపి, యొక్కొక్కవస్త్రముంచి రొ♦క్కొక్కటికిని
౪౨౨

ఔపవసథ్యదినమునఁ బశ్వాలంభ మను కార్యమును జరుపుటకై మొదట యూపస్తంభస్థాపనమును జెప్పుచున్నాఁడు

యూప = యజ్ఞపశువును గట్టవేయు స్తంభముయొక్క, ప్రతిష్ఠకు=స్థాపించు టకు, ఉచితము + వేళ=నిర్దోషమగు తగినకాలము, రాఁగా, "యూపాయో చ్ఛ్రియమాణాయాను బ్రూహి" యను ప్రేషము రాఁగా నని భావము. ఆఱు +

ఆఱు = మారేడుకొయ్యలతోఁ జేసినవి ఆఱు, చంద్రలతోఁజేసిన యూపము లాఱు, ఒకటిదాపుగ = మారేడు సమీపమునఁ జంద్రయూపములను స్థాపించి, అన్నిమోదుగులు = మోదుగుకఱ్ఱలతోఁజేసిన యూపములనాఱిటిని, విరిగి యూపము = విరిగి కొయ్యతోఁ జేసిన యూపము, ఒండు = ఒకటి, వేదిపజ్జఁ = అగ్నియుంచు తిన్నెకు సమీపమున - నెదుటిభాగమున, ఘటించి= నాటి, దాని ప్రక్కలఁ = విరిగి యూపము రెండుప్రక్కలయందును, దేవదారు యూపయుగ్మంబు = దేవదారువు కఱ్ఱలతోఁ జేసిన రెండు యూపస్తంభములను, 'రాజుద్దాలమగ్నిష్ఠమ్మినోతి పౌతదువావభితో భవత' యను శ్రుతివాక్యమున విరిగియూపమొక్కటియనియు దాని కిరుప్రక్కల దేవదారుయూపములు రెండనియు నేర్పడియున్నది. యూపస్తంభముల నాటవలసినక్రమ మీక్రింద వ్రాసినవిధముగ నెఱుంగునది. మీఁదఁ జెప్పిన శ్రుతిప్రకారము విరిగి యూపము నగ్నివేదియెదుట నానకొని నాటవలయును. దానియుత్తరదక్షిణముల పార్శ్వములందు దేవదారుయూపముల నాటవలయును, ఆమూఁటి కుత్తరమున మూఁడు మోదుగు యూపములను దక్షిణమున మూఁడు మోదుగు యూపములను నాటవలయును. ఈతొమ్మిదింటి కుత్తరమున మూఁడుబిల్వ యూపములను దక్షిణమున మూఁడు బిల్వయూపములను నాటవలయును. ఈ మారేడు మోదుగు యూపములతో దేవదారుయూపముల ప్రక్కన నేజాతివియున్నను దప్పులేదు. కాని బిల్వము లాఱింటికి వెంబడి చంద్రయూపము లమరునట్లు నాటవలయును. అదియే యిట ముఖ్యము. దేవదారుయూపముల ప్రక్కల బిల్వయూపముల నాటినచో వాని కిరుప్రక్కలఁ బూర్వోత్తరక్రమమునఁ జంద్రజాతివి ఆ వెంబడి మోదుగుజాతివి యూపముల నాటునది. కావుననే కవి మారేడుచంద్రల నని యా రెండుపదములనే క్రమముగ ద్వంద్వసమాసముగఁ గూర్చెను. ఇయ్యర్థమే యూపస్తంబసూత్రమునఁ గలదు. "రాజుద్దాల మేకవింశత్యరత్నిం, సమ్మినోతి పౌతుద్రువావభిత। త్రయో బైల్వాదక్షిణత। త్రయ ఉత్తరతః త్రయః ఖాదిరా దక్షిణత త్రయఉత్తరతః। త్రయః పలాశాదక్షిణత। త్రయఉత్తరత"యని యూపస్తంబసూత్రము.

ఇఁక వాని సంఖ్యను సలంకారమును జెప్పుచున్నాఁడు.

శాస్త్రకోవిదులు = యజ్ఞశాస్త్రమునఁ బండితులు. శోభార్థమై = యజ్ఞాలంకారముకొఱకై, కాంచనవిభూషణంబులను = బంగారుసొమ్ములచే - బంగారు రేకులు మొదలయినవానిచే, అలంకృతంబుజేసి = అలంకరించి - ఈయలంకారము శాస్త్రసిద్ధము కాదుగాని యజ్ఞమున కలంకారముగ నుండు నని తలంపుతో ననుభావము శోభార్థమై యను పదమువలన నేర్పడుచున్నది. ఇరువదియొక్కటి చిటికెనవ్రేల్మూర కొలఁతకలుగ, 'వెలయునట్టి' యనుపద మధ్యాహా

రము. ఒక్కొక్క యూపమునెత్తు కొలిచినఁ బిడి తక్కువమూరంతో నిరువదియొక్కటి యుండవలయు నని భావము. "ఏకవింశత్యరత్ని రశ్వమేధస్య" యను శ్రుతి దీనికిఁ బ్రమాణము. ఏకవింశతి యూపములు = ఇరువదియొక్క యూపములు, నిలిపి = నాటి. ఒక్కొక్క యూపమును బారెఁడేసి దూరమున నాటవలయును. ఈ విషయమును ధర్మనిర్ణయకారుఁడు వ్రాసియున్నాఁడు. "షణ్ణవత్యంగుళం బాహుదండ మష్టోత్తరంతు వా యూపాంతరాళ తన్మాత్ర మశ్వమేధే మహాక్రతౌ" యని వారివాక్యము.

తాత్పర్యము.

యూపస్తంభములు నాటుటకుఁ దగిన సమయము రాఁగానే మారేడు స్తంభములారు, చంద్రవారు, ఆవల మోదుగు స్తంభము లన్నియే నాటి వేది యొద్ద విరిగి స్తంభ మొకటి నాటి దాని కిరుప్రక్కల దేవదారుయూపము లొక్కొకటి నిలిపి ఆ స్తంభముల కలంకారార్థమై బంగారుసొమ్ములు పెట్టిరి. ఇట్టు లిరువదియొకటి యూప స్తంభము లొక్కొక్కటి పిడి తక్కువమూరం కొలఁత యుండునట్లుచేసి యొక్కొక్కదానిని వస్త్రముచే నలంకరించిరి

చంద్ర	చంద్ర	చంద్ర
బిల్వము	బిల్వము	బిల్వము
మోదుగు	మోదుగు	మోదుగు
దేవదారు	△ వేది	దేవదారు
	విరిగి	
	స్తంభము	
మోదుగు	మోదుగు	మోదుగు
బిల్వము	బిల్వము	బిల్వము
చంద్ర	చంద్ర	చంద్ర

అన్నికలిసి ౨౧ స్తంభములు.

౪౦॥ శిల్పోక్తమార్గమునను న, నల్పము సుకృతంబు సుదృఢ ♦ మష్టాస్రముగన్
గొల్పంగ మెఱుఁగు లీన, న్శిల్పు లొనర్చిరటను యూప ♦ నివహము వెలిఁగన్. ౪_౨౩

ఇందు నాటిన యూపముల నిర్మించినవిధమును జెప్పుచున్నాఁడు.

శిల్పులు = యూపనిర్మాణవిధము నెఱిఁగిన శిల్పులు, అనల్పము = గొప్పదియును, సుకృతము = ఎచ్చుతగ్గులులేక చేయఁబడినది, సుదృఢము = తొఱ్ఱ లొంకర మొదలగు లోపములులేనిది; అష్టాస్రము = ఎనిమిది మూలలు గలది. రెండవ పాదమున నఞ్ సమాసము.

తాత్పర్యము.

కల్పమునఁ జెప్పినప్రకారము చిన్నవికాక చక్కఁగాఁ దీర్పఁబడి గట్టినవై యెనిమిదిపకుములుగాఁ దీర్పఁబడి మెఱుఁగులు దేఱునట్లు ననఘుగా శిల్పులు సిద్ధముచేయుటచే యూపములు శోభావంతములై యుండెను.

కం॥ లిప్తవరచందనంబై, ప్రాప్తాంబరపుష్పకాంచనాలంకృతమై
దీప్తిం గనె యూపవితతి, సప్తర్షులు మింట వెలుఁగుచందం బమరన్. ౪_౨౪

యూపములవర్ణన — లిప్త = పూయఁబడిన, వరచందనంబై = శ్రేష్ఠమైన గంధముకలదై, ప్రాప్త = పొందఁబడిన, అంబర, పుష్ప, కాంచన = వస్త్రములు, పూలు, బంగారురేకులుకలిగిన వానిచే, అలంకృతమై = అలంకరింపఁబడినదై. విశేషణోభయపదకర్మధారయ సమాసము. మింటన్ = ఆకాశమున, సప్తర్షులదృష్టాంతము సంఖ్యకుఁ గాదు, ప్రకాశమునకు మాత్రమే. ఏడింటి కేడింటికైనను గాంచి సంఖ్యలకు దృష్టాంతము కావచ్చును.

తాత్పర్యము.

చందనము పూసి వస్త్రాభరణములచే నలంకరించి యుంచుటచే యూపస్తంభము లాకాశమున సప్తర్షులవలెఁ బ్రకాశించెను.

సీ॥ శాస్త్రోక్తపరిమితి • సద్బుద్ధియుక్తికల్, గొని శుల్బమను పనిఁ • గుశలులైన
బ్రాహ్మణుల్ వేగని • బాగుగఁ దీర్పఁగ, నదిగను [illegible] • [illegible]పశు
యుక్తమై త్రిగుణమై • యొప్పె యష్టాశ్రి, [illegible] రాత్రి • మతి నియుక్తి
పశువులఁ బాములఁ • బక్షుల విహగాలి, సర్వ్యాయుధోల్బుల • నా[illegible]
తే॥ వాని జలచరములఁ గట్టి • [illegible] యూపములకు [illegible] • యూపములకుఁ
బశువులను మూఁడువందల • బద్ధవేంద్ర, సర్వ [illegible] రా • యనిమిషులు.
౪_౨౫

యూపముల నాటుటకుముందు చేయవలసిన చయన మనుక్రియను జెప్పుచున్నాఁడు.

శుల్బము = యజ్ఞములోని కార్యము - ప్రకృతము చయన మని యర్థము. శుల్బము = బంటిపేటత్రాడు - గోడ కట్టువాడు దాని సరికొలఁత చూచుకొనుట కుంచుకొన్నత్రాడు - దాని సాహాయ్యమునఁ జేయఁబడుకార్యముకూడ నిట శుల్బ మని చెప్పఁబడుచున్నది. శుల్బము = వేదినిగట్టుట, దానియందుఁ గుశలులు = నేర్పరులు, బ్రాహ్మణులు = ఋత్విక్కులు; శాస్త్రోక్తపరిమితిన్ — శాస్త్రమునఁ జెప్పఁబడినకొలఁతలో. 'పదమాత్రోర్ధ్వమాత్రో ఒణుకమాత్ర ఋజురేఖా దక్షిణావృతా స్సవ్యావృతా స్త్ర్యాలిఖితాశ్చ' యని యిటికలకొలఁతకు శాస్త్ర

ము, వేదిని = అగ్నికి నాధారమగు తిన్నెను, అది = ఆ వేది, గరుడ + ఆకృతిః = ఱెక్కలు తోఁకను చాఁచి తూర్పుముఖమై భూమిని జూచుచు నాకాశమున నున్న గరుత్మంతుని యాకారమువంటి యాకారముకలది. 'శ్యేనచితం చిన్వీత' యను శ్రుతియందు శ్యేనశబ్దమునకు గరుడుఁ డని యర్థము. హేమపక్షయుక్తమై = (గరుడుఁడు బంగారుచాయగలవాఁడు గనుక హేమాంగుఁ డనియుఁ బేరుగలది. 'హేమాంగా తార్క్ష్యవేధసౌ' – నానా॥ర. కావున) బంగారు ఱెక్కలతోఁ గూడినదై, అనఁగా ఱెక్కలస్థానమునందు బంగారునాణెములు చల్లియున్నా రని భావము. "సహస్రంను హిరణ్యశకలై ప్రతిదిశ మగ్నిం ప్రోక్షతి" యని ప్రమాణము. త్రిగుణమై = దర్శపౌర్ణమాసులలోని వేదికన్నను మూఁడింతలు వైశాల్యముకలదై "షట్త్రింశత్ప్రక్రమా భవతి" యను శ్రుతియందు ఆఱు ప్రస్తారములకొలఁదే ప్రకృతియాగము కని చెప్పఁబడినది. అశ్వమేధమునందలి వేదికి ఆ కొలఁదకు మూఁడింత లెక్కువచేసి పదునెనిమిది ప్రస్తారముల కొలఁదిగా నెలుఁగునది. అష్టాదశ ప్రస్తారకమయి – పదునెనిమిది ప్రస్తారములుకలదై, త్రిగుణమై యనుటచేతనే వేదికొలఁది పదునెనిమిది ప్రస్తారము లని యేర్పడఁగా మరల అష్టాదశప్రస్తారకమై యనుట యేలయనఁగా – 'పంచవింశతిరో భవతి' యని తైత్తిరీయకశ్రుతివాక్య మొకటి యున్నది. దానివలనఁ బ్రకృతివేదికి కొలఁది యిరువదియైదు ప్రస్తారము లని యేర్పడును. దానను సారముగాఁ ద్రిగుణమైనచో నశ్వమేధవేదికఁ గడు నేడు ప్రస్తారములే కొలఁది యని యేర్పడును. కావున నట్టిభ్రమ నివారించి పాజసనేయశ్రుతియం దున్నట్లు ప్రకృతివేదికొలఁది తీసికొని దానిని మూఁడింత లెక్కువచేసిన పదునెనిమిది ప్రస్తారములు అశ్వమేధవేదికి కొలఁదిగా నెలుంగునని యని తెలుపుటకై యష్టాదశప్రస్తారక మని చెప్పఁబడెను. ఇఁకఁ బశువుల నాయూపములకుఁ గట్టుట చెప్పఁబడును. నియుక్తపశువులన్ = శాస్త్రమునందు విధించిన పశువులను, కట్టుటకు సాధ్యముగా నివానిని పంజరములలో నుంచినవియును, అయ్యయి వేల్పులన్ – ఆ యా పశువులకు దేవతలుగాఁ జెప్పఁబడిన యింద్రాదులను, 'ఇంద్రాయరాజ్ఞే సూకర, వరుణాయరాజ్ఞే కృష్ణ' యిత్యాది శాస్త్రములిందు గానుసంధింపవలయును. నిలిపి=ధ్యానించి, యూపములకుఁ గట్టవైచి రని యాకర్షించుకొనవలెను. గ్రామ్య పశువులను యూపములకును అరణ్యపశువులను ఆరోకములకును గట్టి రని యర్థము. 'యూపేషుగ్రామ్యాన్ పశూన్ నియుంజతి, ఆరోకేషు ఆరణ్యాన్ ధారయంతి' యను శ్రుతిప్రమాణము. 'పర్యగ్నికృతా నారణ్యా నుత్సృజంత్య హింసాయా' యని శ్రుతి చెప్పినట్లు ఆరణ్యపశువుల నగ్నికిఁ బ్రదక్షిణముచేయించి వదలి గ్రామ్యపశువులను హింసార్థముగ గట్టి రనుచున్నాఁడు. వాజిన్ = అశ్వమేధమునకు సంబంధించిన గుఱ్ఱమును, జలచరములన్ = తాఁబేలు మొదలగు

నీటిజంతువులను, శాస్త్రమందుఁ జెప్పఁబడిన యితరగ్రామ్యపశువులుకూడ నిటఁ దాత్పర్యమే. అపుడు = పశుహింసాకాలమందు. యూపములకుఁ గట్టిన పశువులసంఖ్యను జెప్పుచున్నాఁడు. పశువులు మూఁడునూర్లను - ఈసంఖ్య ప్రధాన పశువులకుమాత్రమే - అప్రధానపశువు లనేకములు. 'అశ్వమేధపశుసంఖ్యాతు పంచశత మేకోనవింశతి శ్చేతి' యని పశువుల గుఱించిన భాస్కరవాక్యము. అశ్వరత్న మను పదస్వారస్యముచేత ఆ గుఱ్ఱమునకు ననేకరత్నాభరణములను గూడ నుంచి రని యేర్పడుచున్నది ఇటఁ బశుహింసచేసి రనియు నెఱుఁగవలయును.

"The Aswamedha and Purushamedha (man-sacrifice) celebrated in the manner directed by this Veda (Sukla Yajurveda) are not really sacrifices of horses and men In the first, 609 animals of various prescribed kinds, domestic and wild, including birds, fish and reptiles are made fast, the tame ones to 21 posts and the wild ones in the intervals between the pillars, and after certain prayers have been recited, the victims are let loose without injury This made of performing the Aswamedha and Purushamedha as emblematic ceremonies and not as real sacrifices, is taught in this veda and the interpretation is confirmed by the rituals and by the commentators on the Samhita and Brahmana The horse, which is the subject of the religious ceremony called Aswamedha, is also avowedly an emblem of Viraj or the primeval and universal manifested being

—*Colebrooke's Miscellaneous Essays, Vol I*

దీనివలన నే జంతువులేవియుఁ జంపఁబడ లేదని తెలియనయ్యెడిని

తాత్పర్యము.

శాస్త్రమందుఁ జెప్పఁబడిన కొలఁదిగల యిటుకరాలు తీసికొని శిల్పనిపుణులు కార్యమందు నేర్పరులైన బ్రాహ్మణులు వేదిని గట్టఁగ నది గరుడుని యాకారము బంగారు ఱెక్కలు గలదై మూఁడంతలై పదునెనిమిది ప్రస్తారములు గలిగి ప్రకాశించెను. ఆవల శాస్త్రమునఁదుఁ జెప్పినప్రకారముగ పశువులను బక్షులను నాయా దేవతల ధ్యానించుచు గుఱ్ఱమును జలజంతువులను మూఁడునూర్ల పశువులఁ గట్టిరి.

సీ॥ అంతటఁ గౌసల్య • హయమును సేవించి, మొనసి కృపాణముల్ • మూఁటఁ జీల్చి
యొక్క రేయెల్లను • మక్కువ శయనించె, నావాజయొద్ద ధ • ర్మాభిలాష
బ్రహ్మకు హోతకుఁ • బదపడి సధ్వర్యునకును నుద్గాతకు • నరవిభుండు
మహిషి వావాతను • మఱియుఁ బాలాకలిఁ, బరివృత్తిని నొసంగె • స్పర్శనముగ

ఆ॥ నంత వాజపశు • నగ్నిలో వేల్వ సంపన్న ఋత్విజుండు • పాప మణఁగఁ
బార్థివుండు తద్వ • పాధూమగంధంబు, మూరుకొని యొఁగాల • మునను సవిధి. (౪౨౩

ఇఁకఁ జచ్చినగుఱ్ఱమునకుఁ జేయు నుపచారములఁ జెప్పుచున్నాఁడు.

కౌసల్య = పట్టపురాణి. సేవించి = ప్రదక్షిణాదులచేఁ గొలిచి, కృపాణముల్ మూఁటను = మూఁడు బంగారుసూదులచేత, చిల్చి = గాట్లుపడఁజేసి, కౌసల్య యను పదము తక్కినభార్యలను సూచించును, 'సౌవర్ణీభి స్సూచీభిః పత్న్యో౽శ్వస్యాసిపథా న్కల్పయంతి,ప్లక్షోజా త్ర్స్యంచీభి' యని సూత్రము. పట్టపురాణి చేయవలసినకార్యాంతరమును జెప్పుచున్నాఁడు. ధర్మాభికాంక్ష = పుణ్యము కలుగు నను కోరికతో, ముక్తపర్ = ప్రేమతో - చచ్చిన గుఱ్ఱముకదా యని యసహ్యపడక, ఆవాజియొద్దన్ = ఆచచ్చిన గుఱ్ఱము సమీపమున, వాసమే = వేగముగలది. ఇప్పుడు ఋత్విక్కులకిచ్చు దక్షిణను జెప్పుచున్నాఁడు.

నరపతిభుండు = దశరథుఁడు, బ్రహ్మ, హోత, అధ్వర్యుఁడు, ఉద్గాత యీ నలుగురు ప్రధాన ఋత్విక్కులకు, మహిషిని, వావాత, పాలాకలి, పరివృత్తి యను తన భార్యలను, స్పర్శనంబుగ = దానంబుగ, 'లంబే అంబా ల్యంబికే ఇతి పత్నీ ముదానయతి, శ్రుతి. ఉదానయతి = చేతితోఁ బట్టుకొనుచున్నాఁడు. అని స్పష్టమగుచు 'మహిషీం బ్రహ్మణే దదాతి. వావాతాం హోత్రే, పరివృత్తి ముద్గాత్రే, పాలాకలీమధ్వర్యవే' యని సూత్రము యీప ఋత్విక్కులకు ధనమిచ్చి భార్యలను రాజు తీసికోవలయును. మహిషి = పట్టపురాణి, పరివృత్తి = ఉపేక్షింపఁబడిన రాజభార్య, వావాత = సౌభాగ్యవతిమై యుండునది వేశ్య యని కొందఱు. రాజునకుఁ బ్రాణప్రియురాలైనది పాలాకలి క్షత్రియజాతి భార్య మహిషి యని, వైశ్యజాతిభార్య వావాత యని, శూద్రజాతిభార్య పరివృత్తి యని కొందఱమతము

"కృతాభిషేకా మహిషీ పరివృత్తి రుపేక్షితా, వావాతా భోగినీ పాత్ర ప్రదా పాలాకలీ మతా" యని వైజయంతి.

ఇఁక వపాహోమమును జెప్పుచున్నాఁడు.

సంపన్న = చాతుర్యముగల, వాజినపను = గుఱ్ఱము హృదయమాంసమే యిచ్చట వపగాఁ జెప్పఁబడెను. వప = సన్ననిచర్మపుఁబొర, ఇది గుఱ్ఱములకుండదు. కావున తేజని యను గుఱ్ఱపు హృదయమాంసము నిచ్చట గ్రహింపవలెను. దీనిని కొందఱు చంద్ర మందురు. 'నాశ్వస్య వపా విద్యతే' యనిసూత్రము. 'నాన్యేషాం పశూనాం తేజన్యా అవద్యంతి అవద్యంత్యశ్వస్య' యని శ్రుతి, వేల్వన్ = హోమముచేయఁగా, వపాపాక మిచ్చటఁ జెప్పకున్నను నదిలేక హోమము జరగదుగనుక హోమమునకు ముందే వపాపాకమయినట్లు తెలియుచున్నది. పార్థివుండు = దశరథుఁడు, సకాలమునన్ = సరియయిన కాలమందు. వపాహోమకాలమందు; సవిధిగన్ = శాస్త్రప్రకారముగ, తత్.. గంధంబు=

ఆవపాహోమమునఁ గలిగిన పొగలోని వాసనను, మూరుకొనెన్ = వాసన చూచెను. పాపము = దశరథుని సంతానవిఘ్నకారియైన పాపము. వానప్రస్థ బాలకవధ.

తా త్ప ర్య ము.

ఆవలఁ గౌసల్య హయమునకుఁ బ్రదక్షిణనమస్కారాదులఁ జేసి మూఁడు బంగారుసూదులతోఁ గోసెను ఒక రాత్రియంతయును ధర్మమందలి కోరికచే నాగుఱ్ఱముసమీపమునఁ బండుకొనెను. ఆవల దశరథుఁడు బ్రహ్మకు-హోతకు - సధ్వర్యునకు - నుద్గాతకు మహిషిని వావాతను పాలాకలిని బరివృత్తిని దానముగా నిచ్చెను. అంతట ఋత్విజుఁడు వపను మంత్రయుక్తముగ నగ్నిలో హోమముచేయఁగా దశరథుఁడు శాస్త్రమునఁ జెప్పినరీతి తగిన సమయమున దానిని వాసనచూచెను. వపాధూమవాసన పాపహరమని భారతంబునను జెప్పఁబడినది "తం వపాధూమగంధంతు, ధర్మరాజస్సహానుజైః। ఉపాజిఘ్రద్యథాశాస్త్రం సర్వపాపాపహం తదా."

ఆ॥ హయవరంబునంగ♦ములంగంబుఁ గైకొని, యిడియు నాగ్నిదేవ♦బ్రాహ్మహోత్ర
ములు సమంత్రకముగఁ♦బూనివేల్చిరి వహ్ని,యందు శాస్త్రయుక్త♦మైనసరణి. ౪౭

ఇట్లు వప హోమముఁ జెప్పి యిఁక నంగహోమముఁ జెప్పుచున్నాఁడు. అంగమంగంబు = ఒక్కయింగిమీఁదవిస్తుట మఱియొక యింగము. వీన్సయందు ద్విరుక్తి సర్వము హోమమైనదని మిగతలేదు. కావున నిందు శేషభక్షణ మను నది లేదు సమంత్రకము = మంత్రములతోఁ గూడుకొన్నది, శాస్త్రయుక్తము = శాస్త్రమున విధించిన, అంగహోమమునకుఁ బ్రత్యేకఫలము గలదు. 'అంగే అంగేవై పురుషస్య పాప్మోపశ్లిష్ట, అంగాదంగాదే వైనం పాప్మన స్తేన ముంచంతి' యని శ్రుతి.

తా త్ప ర్య ము.

పదునాఱుమంది బ్రాహ్మణులు గుఱ్ఱము నొక్కొక్కయంగమునే తీసికొని మంత్రవంతముగ నగ్నిలో హోమముచేసిరి.

తే॥ అన్య మగునధ్వగంబుల♦ హవిసుఁ బ్లక్ష,శాఖచే సంస్కరింత్రశ్వ♦సవమునందు
వైతసంబున నంపఁగ♦వలయుఁ గాన, నట్ల యొనరించె నాఋత్వి♦గాళియపుడు. ౪౮

వపాపాకముచేసినవిధము చెప్పుచున్నాఁడు. అన్యమగు నధ్వరంబులన్ = ఇతరయజ్ఞములందు, యజ్ఞపశువులయొక్క,హవిస్సు = వపన, ప్లక్షశాఖచే=రావికొమ్మయందుంచి, సంస్కరింత్రు = పాకముచేయుదురు, అశ్వసవమునందు =

అశ్వమేధయాగమునందు, అందలి పశువులయొక్క, హవిస్సు-అనపద మధ్యాహారము. వైతసంబునన్ = ప్రబ్బలిశాఖయందు, ఉంపంగన్ = పాకమునిమిత్తమై యుంచుట, 'ప్లక్షస్య శాఖాయా మన్యేషాం పశూనా మవద్యంతి, వేతస శాఖాయా మశ్వస్య' యనిశ్రుతి.

తా త్ప ర్య ము.

ఇతరయజ్ఞములందు హవిస్సును రావిసమిధలతోఁ బాకము చేయుదురు. ఈ యశ్వమేధమందు ప్రబ్బలిసమిధలతోఁ బాకము చేయవలయును. కావున నట్లేచేసిరి.

సీ॥ యజ్ఞవిధానంబు•నందు బ్రాహ్మణముల, దినములు మూఁడు వా•కొనఁగఁబడియె
హయమేధవిధియందు • నందుఁ జతుష్టోమ, మనఁబడు దొలుతటి•దినము, రెండ
వదిన ముక్థ్యం బయ్యె • వలనొప్ప మూఁడవ, దిన మతిరాత్రంబు • ననెడిపేర
శాస్త్రదృష్టం బగు • సకలేతరక్రియా,వాళిఁ దీక్షను ఋత్విఁ•గాళి యంత
తే॥ సమలరీతి జ్యోతిష్టోమ•యజ్ఞ మాయు, రధ్వరంబును నతిరాత్ర•యజ్ఞయుగము
నవల నభిజిత్తు విశ్వజి•దధ్వరంబు, గ్రాలఁ జేసె నప్తోర్యామ•క్రతువరంబు. ౭౨౯

అశ్వమేధయజ్ఞదినములసంఖ్యను జెప్పుచున్నాఁడు. హయమేధవిధియందు =అశ్వమేధయాగకార్యమున, దినములు మూఁడు అని, యజ్ఞవిధానంబునందు = యజ్ఞమును విధించు కల్పసూత్రమునందును, బ్రాహ్మణములను = ఆ సూత్రములకు మూలకారణములగు బ్రాహ్మణము లను శ్రుతులయందును, వాకొనఁబడియెన్ = చెప్పఁబడెను. అశ్వమేధదినము లనేకములయ్యును ప్రధానదినములు మూఁడు, ఆదినములఁ జెప్పుచున్నాఁడు - అందున్ = ఆమూఁటిలో, తొలుతటి = మొదటి, చతుష్టోమము — అగ్నిష్టోమ మను యజ్ఞము, అది యీ దినమున ననుష్ఠింపఁబడును గావున దీనికిఁ జతుష్టోమ మని పేరు. ఉక్థ్యము = ఉక్థ్య మను కార్యము లిరువదియొక్కటిగల జ్యోతిష్టోమము, రెండవదినమున నక్థ్యము చేయఁబడుటచే నాదినమునకు నక్థ్య మని పేరు. అతిరాత్రము = సర్వస్తోమ మను యాగము, అది మూఁడవదినమునఁ జేయఁబడును గావున నాదిన మతిరాత్ర మనఁబడును.

ఇట్లశ్వమేధము మూఁడుదినములలో ముందు చెప్పిన మూఁడుక్రతువులే కాక 'అధిక స్యాధికం ఫల' మ్మను న్యాయమునుబట్టి శాస్త్రాంతరమునఁ జెప్పిన వేర్వేఱు క్రతువులను గూడ రాజు తరువాతి దినములలో జరిపినట్లు చెప్పుచున్నాఁడు. శాస్త్రదృష్టంబు = ఇతరశాస్త్రములఁ జూడఁబడిన, పాళిన్ = సమూహమును; వేఱుక్రతువు లేవనఁగా; అతిరాత్రయజ్ఞయుగము = ఒక యతి

రాత్రమనే రెండుసార్లు చేసి రని భావము, ఈయాలు క్రతువులను బూర్వము చెప్పిన మూడుదినములయిన తరువాతిదినములలో దశరథుడు చేయించె నని భావము. వేదినిగట్టుట, యూపములనాటుట, పశుబంధనము, వపాహోమము, చతుష్టోమాదిక్రతువులు అని క్రమ మెఱుగవలయును.

తాత్పర్యము.

బ్రాహ్మణములందు అశ్వమేధము మూడుదినములు చేయవలెనని చెప్పఁబడెను. అందు మొదటిదినమునఁ జతుష్టోమము రెండవదిన ముక్థ్యము మూడవదిన మతిరాత్ర మనఁబడును. ఇవిగాక జరుగవలసినశాస్త్రోక్తకార్యములు జ్యోతిష్టోమము ఆయుర్ధ్వరము అతిరాత్రము అభిజిత్తు విశ్వాజిత్తు నప్తోర్యామము వీనినిగూడ ఋత్విజులు సలిపిరి.

సీ॥ ప్రాచి హోతకు నిచ్చి • పశ్చిమం బధ్వర్యు, కు బ్రహ్మకును దక్షి • ణంపుదిశయు
నుత్తరదిశయెల్ల • నుద్గాతకు నొసంగి, స్వర్ణంబుగ బరి • వర్ధనంబు
హయమేధ మంతయు • సాంగంబుఁ గావించి, శాస్త్రచోదితమైన • సరణివెలయ
సర్వసర్వంసహా • చక్ర మీరీతిని, ఋత్విజులకు దాన • మిచ్చియున్న
తే॥ యనఘు నిర్మలచిత్తుని • జననినాథుఁ, గాంచి ఋత్విజులెల్ల నిష్కాములైన
సంయములమేడఁబుడమిజం • జాటమేడ, యోగి మలయూరి భోగమే • లయూరుచెప్పుచు.

ఇఁక ఋత్విక్కులకు దక్షిణాదానము నెప్పుచున్నాఁడు. ౪౩౦

వంశవర్ధనండు = ఇక్ష్వాకువంశమును వృద్ధిచేయు దశరథుఁడు, ఇంతటి దక్షిణనిచ్చుటకు నిక్ష్వాకువంశమునఁ గాక యితరులకు శక్యము కానందున నిప్పటి కీయనకు వంశవర్ధనత్వము లభించిన దనియు భావము. ప్రాచి — తూర్పుదిక్కు భూమిని, కృత్స్నచోట్ల నిర్మాణముగును. స్వర్ణముగ దానముగా, సాంగంబుగా సంపూర్తిగ, శాస్త్రచోదితమైనసరణి = శాస్త్రమున విధింపఁబడిన మార్గముగ, 'ప్రతిదిశం దక్షిణాం దదాతి, ప్రాచీం హోత్రే దక్షిణాం బ్రహ్మణః ప్రతీచీ మధ్వర్యో రుదీచీ ముద్గాతు' యను సూత్ర మంతె దక్షిణనిచ్చుటకుఁ బ్రమాణము. 'మహాపృథివీ న దేయా' యను శాస్త్రము సర్వపృథివీదానమును నిషేధించి నను దానవిషయమున విధియు గలుగగ కావున నీశాస్త్రము వైకల్పిక మని యేర్పడెను. సర్వంసహా + చక్రము = భూమండలము, నిర్మలచిత్తుఁ = ఇంత యియ్యవలసివచ్చెనే యన్నదు ఖములేని మనస్సుగలవానిని, నిష్కాములము = సంసారసౌఖ్యమున నపేక్షలేనివారము, సంయములము = యోగులము; జంజాటము = తగులము, ఉపద్రవము, భోగము = సౌఖ్యము; అలంకారము విషమము, సమానముకానివస్తువులవర్ణనము విషమము. సీసమున మూఁడవ పాదము మొదటిదళమున నుభయయతి.

తాత్పర్యము.

ఇట్లు యజ్ఞము సాంతము కాఁగా హోతకుఁ దూర్పుదిశనుగల రాజ్యము, పశ్చిమ మధ్వర్యునకు, బ్రహ్మకు దక్షిణము, ఉత్తరదిశ నుద్గాతకు దానముగ నిక్ష్వాకుకులవర్ధనుండగు దశరథుఁడు దానమిచ్చెను. ఇట్లు యజ్ఞము పూర్తిచేసి తనకుఁ గలరాజ్యమంతయు ఋత్విజులకు నిర్మలమనస్సుతో దాన మీయఁగా ఋత్విజు లాయనను జూచి నిష్కాములమైన ఋషులము మాకు రాజ్యమేల? యోగమునకు భోగమునకు నెక్కడిసంబంధము?

ఉ॥ ఒల్లము ధారుణీశ్వర! ప్రయోజన మేదిన మేదినీస్థలం
బెల్లను నీవ కైకొనుమి, యేలుచు నుండుము, దానిమాఱుగాఁ
బెల్లుగ గోవు లేని మణిబృందము లేని పసిండి నొసంగు కేని రం
జిల్లుదు మిమ్ము చాలుఁ, దమి సేయము ధారుణిఁ గోరుటంతయున్. ౪౬

ధారుణీశ్వర = రాజా! కావున నీవే యీభూమి నేలఁదగినవాఁడవు. నీది నీవే తీసికో. ప్రయోజనము + ఏదిన = ఉపయోగములేని, మాకని - అధ్యాహారము. మేదినీస్థలము = భూప్రదేశము - ఇచ్చినది మరలఁ బుచ్చుకొనిన దత్తాపహారము కాదా యనిన సమాధానము చెప్పుచున్నారు. దానికి మాఱు గాఁ = ఆభూమికి వెలగా, ఇంతభూమి కెంత వెల యగునని యిమ్మువారి యొక్క అయిష్టము కొలఁది గాన నీశక్తి కొలఁది, ఒసంగు కేని = కొంచెమైనను, పెల్లు = అధికము, బృందము = సమూహము, రంజిల్లుదుము = సంతోషింతుము. దమి సేయము = కోరకుండుము.

తాత్పర్యము.

కావున రాజా! యింతదేశము మాకేల? వలదు. ఈ ప్రయోజనము మాలిన భూమిని బెట్టుకొని మే మేమి సేయఁగలవారము? ఇదంతయు నీవే గైకొని యేలుచుండుము. దీనిమాఱు గోవులో రత్నములో బంగారో కొంచె మైన నిమ్ము. చాలును భూమి చేకొనుటయును మాకు వలదు.

మ॥ అనుచున్ విప్రులు పల్క భూమిపతి యుల్లాసంబునం బీయ నా
లను వేవేల్ పదికోట్లస్వర్ణములు నాల్గింతల్ రూప్యంబులుం
గొని యాఋత్విజు లెల్ల నెల్లధనముం గొంపోయి యర్పింపఁ జ
య్యన భాగించిరి యన్వసిష్ఠుఁడను శాంతాత్ముండు తద్భాగముల్. ౪౭

వేవేలు = వేయివేలు - పదిలక్షలు, ఆలను = ఆవులను, స్వర్ణము = బంగారు, నాల్గింతల్ = నలుబదికోట్లు; ఏదునాల్గుకోట్లనికొందఱు- సంయములకింత ధన మేల యన వారు యజ్ఞములుచేయుటకు రూప్యము = వెండి, 'తస్మా ద్రజతగం

హిరణ్య మదక్షిణ్య' మ్మనిశ్రుతి- వెండి, బంగారు దానము నిషేధించియున్నది కావున నిది దానము గాదనియు నిచ్చినభూమికి బదులనియు గ్రహింపవగు. ఎల్ల ధనమున్ = దక్షిణగా నిచ్చినదానిని, అర్పింపన్ = భాగించి యిచ్చుటకు.

తా త్ప ర్య ము .

అని బ్రాహ్మణులు చెప్పఁగా సరి యని యంగీకరించి దశరథుఁడు వారికి వెయ్యివేల యావులను, పదికోట్లస్వర్ణములను, దాని నాలుగంతలు వెండి నాణెములను నీయఁగా ఋత్విజులు గ్రహించి ధనమంతయుఁ గైకొని పోయి వసిష్ఠ ఋశ్యశృంగులయొద్ద నీయఁగా వారివారికి రావలసినభాగముల ప్రకార మాధనమును వారికిఁ బంచియిచ్చిరి.

ఆ. వారు వారివారి♦భాగంబు లన్నియుఁ, బాడి దప్పకుండఁ ♦ బంచి పెట్ట
వారు గొని నృపాల♦వరుఁ గాంచి సంప్రీతిఁ, జెందినార మనుచుఁ♦ జెప్పిరంత ౪౩౩

పాడి = క్రమము- 'యావదధ్వర్యవే దదాతి, తదర్థం ప్రతి ప్రస్థాత్రే, తృతీయం నేష్ట్రే, చతుర్థ మున్నేత్రే'యను శ్రుతిప్రకారము.

తా త్ప ర్య ము .

ఈ ప్రకార మెవ్వ రెవ్వరి కెంతెంత రావలయునో యంతధనము వారికి వారికి వా రిరువురు పంచిపెట్టఁగాఁ గైకొని రాజుతో, రాజా! తృప్తిఁ జెందితిమి, సంతోషించితిమి. పోయి వచ్చెద మని చెప్పి పోయిరి.

ఉ॥ జన్నముఁ జూడ వచ్చినప్రజల్ గడుసంతసమందఁ జాళువా
సన్ననిచేలము ల్మణులు ♦ సాలువలు స్వర్ణము లగ్గలంబుగా
నెన్నఁగ రానికోటులను ♦ నిచ్చెన, జేతికడెంబు లర్థి ని
చ్చె న్నిఱుపేదపాఱునకుఁ ♦ జేరి తనుం గొనియాడ నాతఁడున్. ౪౩౪

జాళువా చేలముల్ = బంగరు సరిగగల సన్ననివస్త్రములను; సాలులు = సాలువలు, అగ్గలము = అధికము, నిఱుపేద = మిక్కిలిబీద, కడెంబులు = కడియములు- ఉన్నదంతయు నీయఁగా మిగిలిన తనమీఁది సొమ్ములందు.

తా త్ప ర్య ము .

యజ్ఞము చూడవచ్చిన లోకులు సంతసించునట్లు బంగారు దువ్వలువలు, రత్నములు, సాలువలు, బంగరునాణెములు లెక్కలేకుండ దానము చేసెను. తుదకు నిఱుపేదబ్రాహ్మణుఁ డడుగఁగాఁ దనచేతికడియముల నిచ్చెను.

ఉ॥ ఈవుల నెల్లవారలను ♦ నీవిధి మిక్కిలి దన్పి భక్తి సం
భావనఁ జేరి కేల్మోగిచి ♦ పజ్జన నిల్చినఁ జూచి యమ్మహా
పావను భూమిదేవత ల♦పారదయామతిఁ బెక్కురీతులన్
దీవన లిచ్చి౦ం ధరణి♦ తేజుఁడు హృష్టమనోంబుజాతుఁడై. ౪౩౫

తన్పి = తృప్తిపఱిచి, భక్తిసంభావనన్ = భక్తితోఁగూడిన గౌరవబుద్ధితో, మహాపావనున్ = మిక్కిలిపవిత్రుఁడైన దశరథుని, భూమిదేవతలు = బ్రాహ్మణులు, తరణితేజుఁడు = సూర్యునివంటి కాంతిగలవాఁడు - దశరథుఁడు, మహాపావనుఁడనఁగా = యజ్ఞముచే నిష్టప్రాప్తికి విరోధులైన ప్రతిబంధములనుండి విముక్తుఁడైనవాఁ డని భావము

తాత్పర్యము.

ఈ ప్రకారము దానముచే నందఱను సంతోషపఱిచి భక్తిగౌరవములచేఁ జేతులు జోడించి తమయందున వచ్చి నిలిచిన మిక్కిలిపవిత్రుఁడైన రాజును నిండారుదయతో బ్రాహ్మణులు దీవించిరి దశరథుఁడును మిగుల సంతసించెను.

కం॥ అనితరధరణిపసులభం, బను త్తమము సర్వపాప♦హారమున్ స్వర్గ్యం
బగు సవముఁ దీర్చి యాదరుచు, నినకులుఁ డాదటను ఋశ్య♦శృంగు౦ బలికెన్.
౪౩౬

అని. లభ్యంబు = ఇతరరాజులకు సులభముగానిది, అనుత్తమము = దీనికంటె నుత్తమమైనది వేఱొకటిలేనిది, సర్వ హారమున్ = పుత్రులు పుట్టుటకు విఘ్నకారణములగు నందఱు పాపముల నన్నిటిని బోఁగొట్టునది. స్వర్గ్యంబు = పుత్రులఁగలిగించి తన్మూలమున స్వర్గంబును గలిగించునది, సవము=అశ్వమేధము; ఆదటన్ = ప్రేమతో.

తాత్పర్యము.

ఇతరరాజులకు సులభముకానిదియు, మిగుల శ్రేష్ఠమైనదియు సర్వపాపములు హరించునదియు స్వర్గప్రాప్తి కలిగించునదియు నగు యజ్ఞము నెఱవేర్చి సంతోషించుచుఁ బ్రీతితో దశరథుఁడు ఋశ్యశృంగునితో నిట్లనియె.

కం॥ కులవర్ధను లగుతనయులు, గలుగఁ బ్రసాదింప నీవ♦కా కెవ్వరు యో
గ్యులు నన్ను ధరణి ధన్యునిఁ, జలుపఁగదే యనినఁ బ్రాజ్ఞ♦సత్తముఁ డనియెన్.
౪౩౭

ఇట్లు దశరథుఁడు పుత్రోత్పత్తికి ప్రతిబంధకమగు సకలపాపముల నశింపఁ జేయ భగవదంగభూతసకలదేవతారాధనరూప మగు నశ్వమేధమును జేసి సాక్షాద్భగవదారాధనమై పుత్రోత్పత్తికి హేతు వగు యజ్ఞమును జేయింప

సుమంత్రునివాక్యానసారము ఋశ్యశృంగుని బ్రార్థించుచున్నాఁడు. అంధులైన వానప్రస్థులకుమారు నొకనిఁ జంపి తన్మూలమున వానితలిదండ్రులను జంపెను. ఇది బ్రహ్మహత్యాసమమైన పాపము. అది నశింప నశ్వమేధము. ఈ విషయము పూర్వమే వ్రాయఁబడినది.

తాత్పర్యము.

మునీంద్రా! నీ కరుణచే ననిష్టపరిహార మగు నశ్వమేధయాగము సలుపు టయ్యెను. ఇఁక నిష్టప్రాప్తి యగు సంతానలాభము ననుగ్రహింప నీవుకాక యెవ్వరు సమర్థులు? కావున నన్ను ధన్యునిఁగాఁ జేయు మనిన నా పండితోత్తముఁ డిట్లనియె.

౧౫ సర్గము. దశరథుఁడు పుత్రకామేష్టిఁ జేయుట

ఉ॥ అట్టుల యాగ గాక వసుధాధిపచంద్రమ! కీర్తిపట్టు లౌ
పట్టులు నీకు నల్వు రొదవం గలవారు విషాద మేల? యం
చట్టె యొకింతధ్యానపరుఁడై స్మృతిఁ దోఁపఁగ నీకుఁ బుత్రకుల్
పుట్ట నథర్వమంత్రములఁ బొల్పగు నిష్టి యొనర్పఁ జేసెదన్. ౪౩౭

భగవంతుఁడు పుత్రకామేష్టివ్యాజమున సాధుసంరక్షణార్థమై భూలోకమున నవతరింప నెంచియుండ దేవతలు దుష్టశిక్షణ మను నప్రధానఫలమునకై భూలోకము నవతరింప భగవంతుని బ్రార్థించుచున్నారు. వసుధాధిపచంద్రమ = రాజశ్రేష్ఠుఁడా, కీర్తిపట్టులు = యశస్సునకు నివాసస్థానములు అగు, పట్టులు = కుమారులు, ధ్యానపరుఁడై = ఏయజ్ఞము చేయ నగు నని కొంచెమాలోచించి యని భావము. స్మృతి = జ్ఞప్తి, తోఁపఁగన్ = కలుగఁగా, అథర్వమంత్రములన్ = అథర్వణవేదమునఁ జెప్పినమంత్రములచేత, ఇష్టిన్ = యాగమును.

తాత్పర్యము.

రాజేంద్రా! యట్టులేకానిమ్ము - కీర్తికి స్థానములైన నలువురుకొడుకులు నీకుఁ గలుగుదురు. ఏల విచారపడియెదవు? అని తదేకధ్యానముతోఁ గొంత యోజించి నీకుఁ గొడుకులు గలుగునటు లథర్వమంత్రములతో నిష్టి చేయించెదను.

ఆ॥ ఉక్తమంత్రవిధిని హుతవహు వేల్చిన, సుతులు పుట్టఁగలరు క్షితిప! యనిన
నామనోహరోక్తు లాలించి తుష్టుఁడై, నవము సల్పు చున్న యవసరమున. ౪౩౮

ఉక్తమంత్రవిధిని = ముందుఁజెప్పిన యథర్వమంత్రమునందలి క్రమముతో, హుతవహున్ = అగ్నిని, మనోహర + ఉక్తులు = ఇంపైన మాటలు; తుష్టుఁడై = సంతోషించినవాఁడై.

తాత్పర్యము.

రాజా! మీఁదఁ జెప్పిన యథర్వణమంత్రములప్రకారము నగ్నిహోత్రుని నుద్దేశించి హోమముచేసిన నీకుఁ గొడుకులు కలుగుదురు. అనిన మనోరంజకములైన యామాటలు విని సంతోషించి యజ్ఞము చేయు సమయంబున,

తే॥ అటకు గంధర్వదేవసిద్ధాదిసురులుఁ, బరమఋషులును హవిర్భాగములకు
వారిజాసనుతోడుత వచ్చుకతన, ధాతఁ గన్గొని దేవతాతతి వచించె.　　౪౪౦

౪౬౩ వ పద్యము మొదలు మిగత యాగమును గుఱించి చెప్పఁబడును. ఈనడుమ భగవదవతారమునకు హేతువగు దేవతల శరణాగతి చెప్పఁబడుచున్నది. అటకున్ = ఆయజ్ఞము చేయుస్థలమునకు, వారిజాసను తోడన్ = బ్రహ్మతో, వచ్చుకతనన్ = వచ్చుటచేత దేవతల కంతర్ధానశక్తిగలదు గావున మనుష్యులకు గోచరింపక యుండిరని భావము. ధాతన్ = బ్రహ్మను.

తాత్పర్యము.

అప్పటికి గంధర్వులు - దేవతలు- సిద్ధులు మొదలగు దేవతలు పరమఋషులు హవిర్భాగమునకై బ్రహ్మతోడ వచ్చినకారణముచే దేవతలందఱు బ్రహ్మను జూచి యిట్లనిరి.

దేవతలు రావణుఁడు చేయు కపటములు బ్రహ్మతో విన్నవించుట.

చం॥ స్థిరనతిమద్విధేయ! భవదీయదయాలబ్ధ రావణా
సురుఁడు నితాంతగర్వమున సూడు గలంచి యలంచె మమ్ము నె
ల్లరను, భుజాబలంబున వలంతులుగా మొదలించి గెల్వ, నీ
వరమును గాచి పలుపాటులు నైచెదమయ్య గొంకెనే.　　౪౪౧

స్థిర　　విధేయ = దృఢమనస్సుతో నమస్కరించువారికి స్వాధీనుఁడవగు నో బ్రహ్మ! భవ　. లబ్ధ = నీదయను బొందుటచేత, కలిగిన యని యధ్యాహారము, నితాంతగర్వమునన్ = ఎక్కువ క్రొవ్వుచేత, సూడు = పగను, భుజాబలము = భుజములబలము, వలంతులము = సమర్థులము, మీ రేల వానిని గెలువఁజాలరనుటకు సమాధానముఁ జెప్పుచున్నారు, నీవరమును = దేవతలమైన మాచే రావణుఁడు చావఁగూడదను నీవిచ్చినవరమును, పలుపాటులు = రావణుఁడు కలిగించు ననేకకష్టములు. నీవు నతిమద్విధేయుఁడ వగుటచేత నే నమస్కారమునకు సంతోషించి మెవ రేవరములు కోరిన ముందువెనకఁజూడక వారి కావరముల నిచ్చెదవు. వెనక వారిచే బాధలుపడలేక మేముచచ్చెదమని భావము.

తాత్పర్యము.

నమస్కారవిధేయుఁడవైనదేవా! నీదయ పూర్ణముగా సంపాదించుకొన్న వాఁడై రావణాసురుఁడు బ్రహ్మవరము కలదు, నా కెవ్వరెదురని మిగులగర్వించి మాపై పగపూని మమ్ము నెల్లరను బాధించుచున్నవాఁడు భుజబలంబున వాని నెదిరించి యుద్ధముసేయ సమర్థులము గాకున్నారము. ఏవిధముగనైన వానిని జంపుటకు దేవతలచేఁ జావకుండ నీవు వానికి వరమిచ్చుటచే దానిని మేముగౌర వించి వానిఁ జంపక కన్నబాధలు పడుచున్నాము.

ఉ॥ ఆకులతన్ జగత్త్రియము • హాయని రాయిడిపెట్టె దుష్టుఁడై,
వ్యాకులతన్ మహేంద్రునిఁ బ్ర•వాసిగఁ జేయఁగ నిచ్చగించె, న
స్తోకవరస్మయంబున వ•సువ్రతియక్షధరామరాదులన్
గాకు పడంగఁ జేసెఁ, గొఱ•గాముల కియ్యది మేర చెప్పవా. ౪౪౨

రావణుఁడు దేవతలను బాధించువిధమును జెప్పుచున్నాఁడు.

ఆకులతన్ = కలఁతపడుటచేత, రాయిడి = ఉపద్రవమును, వ్యాకులతన్ = మిగుల దుఃఖపాటుచేత, ప్రవాసిగన్ = దేశభ్రష్టునిగ- స్వర్గమునుండి వెడలఁ గొట్టఁబడిన వానిఁగన్, ఇది యింద్రజిత్తు ఇంద్రుని బంధించి లంకకు దెచ్చుట సూచించెడిని, అస్తోక స్మయంబునన్ = వరమునలనఁ గలిగిన యధికమైన గర్వంబున, వసు = అష్టవసువులు, వ్రతి = వ్రతములు గలవారు- ఋషులు లోనగువారు, కాకు = చీకాకు, కొఱగాములకున్ = దుశ్చేష్టులకు, మేర = హద్దు.

తాత్పర్యము.

మిమ్ము వాఁ డేమి చేయుచున్నాఁ డనెదవా వినుము. మమ్ముమాత్రమే కాదు. మూఁడులోకములు మనోవ్యాకులతచే హాహాకారములు చేయునట్లు దుష్టుఁడై రాపాడుచున్నాఁడు. ఇంద్రుని స్వర్గమున లేకుండ వెడలఁగొట్ట నిచ్ఛగించినాఁడు. నీ విచ్చిన గొప్పవరబలములచే వసువులను వ్రతులను యక్షులను బ్రాహ్మణులను జీకాకుపడఁజేసెను. చెడుపనులే చేయఁబూనినవానికి నివి చేయ వచ్చును, ఇవి చేయరాదను మితిమేరకలదా. కావున నే నన్ని చెప్పుదుము?

చం॥ తపనుఁడు చంద్రుఁ డయ్యెను, స•దాగతి వీవఁడు పజ్జ,నిచ్చ భం
గపడుసముద్రుఁడున్ నకన•కం బడి నిశ్చలుఁ డయ్యె నివ్వెఱన్,
గృపయొకయింత లేక మముఁ• గీడ్పడఁజేయుట నేమిచెప్పఁగా?
నుపమ యొకండు లేదె పరుఁ • డోటఱిపోవ జగంబుఁ బ్రోవఁగన్. ౪౪౩

తపనుఁడు = తపింపఁజేయువాఁ డని పేరుగల సూర్యుఁడు, చంద్రుఁడయ్యె = చంద్రునివలె జల్లనివాఁడయ్యె. రావణుడు బయలు గ్రీడించునపుడు వేఁడిమిసోఁకినఁ గోపించు నని సూర్యుఁడు వేఁడిమిచూపుట మానెను.-యుద్ధ. ౨౫౭౬ పద్యము. సదాగతి = ఎప్పుడు గమనము గలవాఁ డని పేరుగల వాయుదేవుఁడు. పజ్జ = రావణు ప్రక్కన; వీవఁడు = విసరఁడు. రావణుని యుద్యానమందలిపూలు రాలిన రావణుఁడు కోపించు నని భీతిచేత నని భావము ఇచ్చ = ఇష్టమువచ్చినట్లు, భంగపడు = భంగము + పడు = అలలు గలవాఁడగు, నిచ్చ = సదా; భంగపడు = అవమానపడు అగడ్త రూపమున సేవకునివలె సర్వదా కాచి యుండుటచే, సకసకంబడి = కృశించి; నివ్వెఱ - నిండు + వెఱ = అధిక భయముచేత, లవము = కొంచెము, పరుఁడు = రావణుఁడు, ఓటఱి = బలహీనుఁడయి, ఉపమ = ఉపాయము.

తాత్పర్యము.

రావణాసురునకు భయపడి సూర్యుఁడు వేఁడిమిఁజూపుట మాని చంద్రునివలెఁ జల్లనయ్యెను. అతనిసమీపమందు వాయుదేవుఁడును గదలఁడు. ఎప్పుడు నలలుగల సముద్రుఁడును శుష్కించి భయముచేఁ గదలకయున్నవాఁడు. అట్టి వారిగతి యట్లుండ నిఁక మాపడుబాధల మే మేమని చెప్పుదుము' దేవా! యీ శత్రువు బలహీనుఁడై పోవుటకు, నామూలమున జగంబుల రక్షించుటకు నుపాయములేదా?

సీ॥ వేలుపు లిటు వేఁడ ♦ విధి మేలుమేల్ వాఁడు, గ్రుంగునుపాయంబు ♦ దోఁచె వినుఁడు.
దేవగంధర్వాది ♦ తేయవిద్యాధర, నసుయక్ష ఖేచర ♦ వరులచేత
వధ్యుండఁ గానట్టి ♦ వరము నిమ్మని కోర, నట్ల యీఁగావుత ♦ మంటిఁ దొల్లి
మానవులను నవ ♦ మానబుద్ధినిఁ జేసి, పరిగణింపఁడు వాఁడు ♦ వరము వేళఁ

తే॥ గాన మనుజునిచే వాఁడు ♦ కాలమందుఁ, గాని పరులకు వధ్యుఁడు ♦ గాఁ డటన్న
సురలు మానులుఁ గెరలిరి ♦ యరుసమునను, నిట్లు వారలు రక్షకా ♦ పేక్షులగుచు.
౪౪౪

విధి = బ్రహ్మ; మేలుమేల్ = తన కుపాయముతోఁచె నన్న సంతోషముచేత చెప్పినమాట, గ్రుంగు = చచ్చు; ఖేచరవరులచేత = దేవశ్రేష్ఠులచేత; ఖే + చరులు = ఆకాశమందు + సంచరించువారు. అలుక్సమాసము. కావుత + అంచు = కావుతమంచు, అవమానబుద్ధి = తిరస్కరించు తలంపు; పరిగణింపఁడు = లక్ష్యముచేయఁడు; కాలము = మరణమును, పరులచే = ఇతరుల చేత; కలన = యుద్ధమున; అరుసముగ = హర్షముతో - సంతోషముతో; కెరలిరి = ఉబ్బిరి; రక్షక + అపేక్షులు = తమ్ము రక్షించువానిని గోరువారు;

రావణునికంటె బలవంతులగు దేవత లుండినను వరబలముచే వారలచేఁ జావఁడు; మనుష్యులచేఁ జచ్చు నని యొకటి యేర్పడెను. సంతోషమే. మనుష్యులచేఁ జావఁగోరినను వానిని జంపఁగల బలముగలవాఁడు మనుష్యులలో లేఁడే! ఎవని నాశ్రయింతుము? మమ్ముల రక్షింపఁగలవాఁ డెవ్వఁడు? అని యాలోచించు చుండఁగా.

తాత్పర్యము.

దేవతలు ఇట్లు ప్రార్థింపఁగా, బ్రహ్మదేవుఁడు విని "సంతోషము సంతోషము. వాఁడు చచ్చునుపాయము తోఁచెను. చెప్పెదవినుఁడు. వాఁడు నన్ను వరము కోరునప్పుడు దేవతలచేతను, దైత్యులచేతను, విద్యాధరులచేతను, వసువులచేతను, యక్షులచేతను, నాకాశసంచారులచేతను, జావక యుండునట్టి వరము కోరెనే కాని యంతకంటెఁ దక్కువతరగతులైన మనుష్యులచేఁ జావు లేకుండ నడుగలేదు. 'మనుష్యులు దుర్బలులు. వారు నన్నేమి చేయఁగలరు' వారికంటెఁ దక్కువగు వానరాదులు నేమిచేయఁగల' రని మనుష్యులను నంతకుఁ దక్కువ భూతములను నలక్ష్యపెట్టెను. కావున వాఁడు మనుష్యునిచేఁ దప్ప మాఱెవ్వరిచేతఁ జచ్చువాఁడు కాఁడు." అనిచెప్పఁగా రావణవధోపాయ మొకటి లభించెఁగదా యని దేవతలు సంతోషించియే వానిఁ జంపఁజాలిన మనుష్యుఁ డెవ్వఁడు' అట్టివాఁ డెవ్వఁడు లేఁడే, ఎవ్వరి నాశ్రయింతుమని యాలోచించు చుండిరి.

—* శ్రీవిష్ణుమూర్తి దేవతలకుఁ బ్రత్యక్ష మగుట *—

కం॥ ఈలోనన జాంబూనద,చేలుండు జగత్ప్రభుండు • శ్రీకరతను రు
గ్మాలుండు శంఖచక్రగ,దాలలితుఁడు విష్ణుమూర్తి • త్వర విచ్చేసెన్. ౪౪౫

'ద్వి॥ సాధుజనంబుల సంరక్షసలుప, బాధింపదుష్కృతి పరులైనవారి, జగతి ధర్మంబుసంస్థాపనసేయ,యుగయుగంబునఁబుట్టుచుండుదు నేను॥' భగవద్గీత. అను తననియమముప్రకారము శిష్టులరక్షించుట, దుష్టులశిక్షించుట, ధర్మము స్థాపించుట, దశరథుని యభీష్టము పూర్తిచేయుట యనుకార్యములు చేయుటకై పరమకరుణాళు వగు భగవంతుఁడు భూలోకమున నవతరింపఁదలఁచి దేవతలున్నచోటికి వచ్చె ననుచున్నాఁడు. ఈలోనన = ఈలోపలనే - దేవతలు తమ్ము రక్షించువానిని గోరుచుండుసమయమందే. అనఁగా వారు రక్షకునివిషయమై తీర్మానించుకొనక ముందే. దీనిచే భగవంతుఁడు చాలఁగాలముగా దేవత లెప్పు డెప్పుడు శరణ మపేక్షింతురా,యెప్పుడువారిని రక్షింతునా యనియెదురుచూచు చున్నట్లేర్పడుచున్నది. "సర్వజ్ఞోఽపిహి దేవేశ, స్సదా కారుణికోఽపిసన్, సంసారతంత్రవాహిత్వా ద్రక్షాపేక్షామపేక్షతే." (2) భగవంతుఁడుతానుక్షణమాత్ర మాలసించినను, దేవతలే వెదకుచువత్తురు. యాచించినపిమ్మట యాచకులకోరిక

నెఱవేర్చుట యుత్తమపక్షము గాదు. తన్ను శరణుచొచ్చినవారి కష్టములఁ గలిగింపఁగూడదని తానే యప్పుడే వచ్చునని యెఱుంగవలయును. అటయినచో సర్వజ్ఞునకు రావణుఁడు చేయుకార్యములు దేవతలు పడుబాధలు తెలియకున్నవా? అప్పుడే యేల రక్షింపరారాదను సందేహము కలుగవచ్చును. ఎట్టివానికైనను దన్నుఁ దాను రక్షించుకొనఁగలనను ధైర్యము, అహంకారము, స్వప్రయత్నముండువఱకు దైవసాహాయ్యము రాదు 'దైవమేవ పరం మన్యే పౌరుషంతు నిరర్థకమ్,' దైవమే పరమగతి - దైవసాహాయ్యము లేని పురుషప్రయత్నము వ్యర్థ మని యెప్పుడు తోఁచి భారము భగవంతునిమీఁద వేయుట కలుగునో యప్పుడు తప్పక దైవసాహాయ్యము కలుగును. అట్లుగాక యెవరికైన వారికి తానై సాహాయ్యము చేయఁబూనిన లోకమువారిని నొక్కసారి ముక్తులఁ జేయవలసివచ్చును. ఇది స్వసంకల్పవిరోధము. ముందొకటి సంకల్పించి దానికి విరోధముగ వెంటనే ప్రవర్తించుట యవ్యవస్థితచిత్తలక్షణముగాని సర్వజ్ఞుని లక్షణము కాదు. కావున నెవ్వఁడు తన్ను రక్షింపుమని కోరునా అని యెదురు చూచుచుండును. కావున సమత్వహాని లేదు. కూడు కావలెనని నెత్తిఁగొట్టుకొనియేడ్చినట్లు తనతోఁ బనిలే దనువానివెంటఁ దాను పరువులెత్తుట తగదు. అన్నదాన మాఁకలిగొన్నవానికిఁ గాని కడుపునిండినవానికిఁ గాదు. అస్థానప్రేమ హానికరము. భగవంతునకు మనకుఁ బరిమాణముచేఁ బోలికయే లేదు. అట్లుండ మనకంటెఁ బదికోట్లంతలు భగవంతుఁడు గొప్పవాఁ డను కొనుఁడు. అటు లగుటంజేసి మనము భగవంతుని కెదురుగ నొక యడుగు నడచిన నాయన మన కెదురుగ పదికోట్ల యడుగులు వచ్చును. ఇది యనివార్యవిధి. (3) దేవతలు రక్షకునిఁ గోరుచున్నారని భగవంతుఁడు తెలిసికొనెను. కావున నాయనకు నాశ్రితరక్షయందు నానుకూల్యము, ఋజుబుద్ధి, ఔత్కంఠ్యము నపరిమితమని తెలియవలెను (4) ఆసమయమున మఱొక్కఁడు రక్షించెద నని యంగీకరించినఁ దనకు రక్షకత్వము లభింపదుగదా యనిమిక్కిలి త్వరవచ్చెననియు భావము. 'అతంద్రితచమూపతిప్రహితహస్త'మనికదా వారి త్వరప్రసిద్ధము. గజేంద్రుని రక్షింపవచ్చినపుడు గరుడుని వేగము చాలదని తానే యాయనను గూడ లాగుకొనివచ్చెనగదా.

విష్ణుమూర్తి=సర్వాంతర్యామిగా సర్వత్ర వ్యాపించిన యాకారముగలవాఁడు. భగవంతుని సర్వవ్యాపి యని చెప్పినప్పు డంతయు నొకవిషయము మనస్సునం దుంచుకొనవలయును. కుండనిండ నీళ్ళుగాని గాలిగాని వ్యాపించియున్నట్లు భగవంతుఁ డున్నాఁడనియు, నాకారణమున భగవంతునియునికికి స్థలమొకటి యాధారముగావలసియున్నదనియుఁ దలఁపరాదు. భగవంతుని కట్టియాధారము తోఁ బనిలేదు. సర్వమునకు భగవంతుఁడే యాధారము. మనము దేశమననది

కూడ భగవంతునియందే యున్నది. దేశ మనునది వ్యవహారమునిమిత్తము కల్పింపఁబడినది. తాను సుఖపడుటకన్నను జీవుని జక్కఁబఱిచి సుఖపెట్టుటయే ప్రధాన మని తలఁచి తదంతర్యామియై భగవంతుఁ డున్నాఁ డని భావము. 'త్వంమేఽహం మే 'యనికదా భగవంతుని తలంపు.

శ్రీకరభృశరుగ్జాలుండు – శ్రీకర=సంపత్కరమగు, భృశ = అధికమైన, రుక్ + జాలుండు = కాంతుల సమూహము గలవాఁడు. ఆశ్రితరక్షణము కలిగెఁ గదా యని పట్టరానిసంతోషముచే లోకవిలక్షణమైన కాంతియుక్తుఁ డాయె నని భావము ఇప్పుడు సంతోషయుక్తుఁ డాయె నని చెప్పుటచే నింతకుఁ బూర్వ మింత జీవకోటిలో నారక్షణముఁ గోరువారే లేరుకదా. సంసారదుఃఖములో మునఁగుచుఁ గష్టించుచున్నను దిమ్ము రక్షింపసిద్ధపడియుండు నన్ను స్మరింపరు గదాయని చింతపడుచుండె నని తెలియనగు. 'స ఏ కాకీ న రమేత.' ఆయన యొంటరిగాఁ గ్రీడింపఁ డనికదా శ్రుతి. లీలావిభూతి లేనియెడల లోభి వాని ధనమువలెఁ దన వాత్సల్య సౌశీల్య పరమకారుణికత్వాది గుణములు వ్యర్థములేకదా.

శంఖచక్రగదా లలితుఁడు – లలితుఁడు = మనోహరుఁడు - ఆశ్రితుల రక్షించునపుడు ఆయుధగ్రహణార్థము విలంబముకారా దని సదా పంచాయుధముల ధరించియుండువాఁడు. "శ్లో॥ పాతు ప్రణతరక్షాయాం విలంబ మసహన్నివ।సదా పంచాయుధీం బిభ్రత్సన శ్రీరంగనాయకః" యని పెద్దలవాక్యము కలదు. లేక మువ్వురసహాయముతో నవతారకార్యముఁ దీర్ప నూహించె నని యైనఁ జెప్పనగును. నాలుగవచేతియందు నభయముద్ర ధరించె నని యూహింపవలెను. ౪౫౩ పద్యమం దభయహస్తము చెప్పఁబడెను.

శ్లో॥ స్థిత్యై చక్రం సరసిజం, దధానం సృష్టయే పునః
ముక్తయే పాంచజన్యంచ, గదాం సంహృతయే తథా॥- బృహద్బ్రహ్మసంహిత.

చక్రధారణము స్థితినిమిత్తము, కమలము సృష్టికొఱకు, పాంచజన్యము, ముక్తి నిచ్చుకొఱకు, గద సంహారముకొఱకు.

కమలము సృష్టి నిమిత్తము ధరించునది గావున నీయవతారంబునఁ దొలి మూఁటితోనే కార్యముకావున వానినే ధరించివచ్చెను.

పూర్వవ్యాఖ్యాతలు, ఆయుధత్రయము ఆయుధపంచకమున కుపలక్షణ మని వ్రాసిరి. అదియు గ్రాహ్యమే. ఆయుధములందెల్లఁ జక్రము శ్రేష్ఠమైయుండ దానిని మొదటఁ జెప్పక శంఖమును జెప్పుటకు హేతు వేమన? అది మోక్షప్రద మను పాంచరాత్రాగమమును బట్టి యని గ్రహింపవలయు. సంహారించునది చక్రము. రక్షించునది శంఖము. ఈ కారణముచేతనేకదా శ్రీ శంకరాచార్య

లవారు విష్ణుపాదాది కేశాంతవర్ణనమందుఁ దొలుతఁ బాంచజన్యమునే స్తుతించిరి. ఆయుధములు ధరించినవాఁడు సాధారణముగా భయంకరుఁడుగానే యుండును. అట్లుండియు నీయన మనోహరుఁడుగానే యున్నాఁ డని శత్రువుల కాయుధధారి భయంకరుఁడుగాని మిత్రులకుఁ గాఁడు. లలితుఁడనటచే నాయుధములు భయంకరములుగానున్నను ముఖము ప్రసన్నమయియే యుండె నని కరుణారస మొలుకుచుండెననియు దానివలన నెత్తఁబోవు నవతారమందుఁ 'కరుణాకాకుత్స్థ' యన్నట్లు కరుణారసమే ప్రధానముగా గ్రహింపఁదలఁచినాఁడనియు భావము.

జాంబూనదచేలుఁడు = బంగారుసరిగవస్త్రము కలవాఁడు, 'తస్య మహారజతం వాస' యనిశ్రుతి జగత్ప్రభుండు = లోకస్వామి. ఇన్నివిధములనీయన ప్రపంచ మేల రక్షింపవలయు ననిన నాయన ప్రభువు, ప్రపంచము దాస్యము చేయునది. తన సేవకులను దానుగాక మఱియెవరు రక్షింతురు' అంతియగాక యీయన స్వామి. స్వామి యనఁగా స్వమ్ము (సొమ్ము) కలవాఁడు. ప్రపంచము సొమ్ము. తనసొమ్ము తాను రక్షింపకుండిన మఱియెవరు రక్షింతురు? 'పితాహమస్య జగతః మాతాధాతాపితామహ' యని భగవద్గీత. ఇక్కడ రక్షించుట యన బాధ తొలఁగించుటయే. దేవతలు కోరిన దదియే. ఇఁక నీపద్యములోని వాక్యతాత్పర్యము చెప్పఁబడును. విచ్చేసెను = విజయముచేసెన, దయచేసెను. రోగి వైద్యుని వెదకుచుఁ బోయినట్లు కోరిక తీర్చుకొనక్కఱగలవారు వారే తన్ను వెదకుచు రానిమ్మని యుపేక్షింపక తానే వారుండుచోటికి వచ్చెను. విచ్చేసెను = రేపువచ్చెదను మాపువచ్చెద నని గడువులు వేయక కాలహరణము చేయక రానే వచ్చెన.

జగత్ప్రభుండు విచ్చేసెను = మంపుగలవారు ప్రభువునొద్దకుఁ బోవలెఁగాని ప్రభువు మనవిచేసికొనువారియొద్దకు రాకుండుట లోకసామాన్యప్రభుమర్యాద. అట్లుండియు జగత్తునకంతయుఁ బ్రభువయ్యుఁ దానే మనవిగల తనదాసుల యొద్దకు వారి దుఃఖముల విచారింపవచ్చెను. దీనివలన భగవంతునియౌదార్యము తెలియుచున్నది. జాంబూనదచేలుండు విచ్చేసెను. 'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖ' మ్మన్నట్లు ప్రపంచమునకు భగవంతుఁడు గానరాకుండఁజేయునది బంగారువస్త్రమే. అదియే మాయ, ప్రకృతి. 'సంభవామ్యాత్మ మాయయా' మాయగ్గైకొని కాని మలయరానన్నట్లు దానిసహాయములేక లోకమునకు గోచరింపఁడు. కావున నవతరించుటకుఁ దిగినసన్నాహముతోనే వచ్చెను. (పైనన్న బంగారువస్త్రమును నడుమునకు దట్టివలెఁగట్టి సన్నద్ధుఁడై వచ్చెను. (2) విష్ణుమూర్తి విచ్చేసెను=అంతర్యామియై యెవరికిఁ గానరాక యుండువాఁడు మార్గబుధ్యమునసే వారికి గోచరించెనేని యీవార్త ప్రస్తావనకే రాకపోవును. అని

తలంచివారికిఁ గనఁబడక వారితోడనే యుండి యజ్ఞస్థలమున వారిప్రార్థనాసమయమున వారికి మూర్తి వహించి గోచరించెను. దీనిచేత సౌలభ్యము చెప్పఁబడెను. ఈలోనన విష్ణుమూర్తి విచ్చేసెను = బ్రహ్మాదులలో నొకరిని దేవతలు శరణు వేఁడఁగా వారు గజేంద్రమోక్షణమునందువలె "నాహం నాహం నచాహం నచభవతి పునస్తాదృశో మాదృశేషు" నేనుగాను నేనుగాను మాలో నీవు చెప్పిగుణములు కలవాఁడు లేఁడు అని గజేంద్రునివిషయములో బ్రహ్మరుద్రాదులు చెప్పినట్లు" అని మరలఁ దమ యశక్తత్వమును బ్రకటించుకొనుట వారి కవమానకరమును దేవతలకు దుఃఖకరమును నగా నగును. కావున నవి గలుగుట విష్ణువున కిష్టముగాదు. కావునఁ ద్వరితో వారికి దూరముందే కానవచ్చునట్లు వచ్చెను. ఈ + లోన్ + అనన్. ఈఁ = లక్ష్మీదేవి, లోనన్ = లోపల, హృదయమందు, అనన్ = చెప్పుచుండఁగా - అనఁగాఁ బ్రేరించుచుండఁగా ననుట. అకారమునకు స్త్రీలింగరూపము ఈ. "ఈకారోఙ్గజే లక్ష్మ్యా"మ్మని నానా. ఈయనఁగా లక్ష్మీదేవి రామావతారమునకుఁ బ్రేరకురాలు లక్ష్మీదేవియే. రావణుఁడు పతివ్రతలను బాధపెట్టుటచేతను వారందఱు మొఱలుపెట్టుచు స్త్రీమూలముననే వీఁడు హతుఁడగునుగాక యని శపించుటచేతను వానిరాయిడికిఁ దాళఁజాలిన స్త్రీ వేఱొకతె లేక యుండుటచేతను 'దేవ్యాకారుణ్యరూపయా' యన్నట్లు కరుణాస్వరూపిణియగు లక్ష్మీదేవియే పనిపూని 'రావణనాశమునకు నేను హేతువయ్యెదను. నీవు కార్యము నెఱవేర్పు' మని భర్తను ప్రేరించి తాను ముందుగా సీతగా నవతరింపఁ బోవుటచే విష్ణు విట్లు వచ్చెనని భావము. కావుననే యిచ్చట లక్ష్మీదేవితో వచ్చినట్లు చెప్పలేదు.

శ్రీకరరుగ్జాలుండు విచ్చేసెను = "దివిసూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా। యది భాస్సదృశీసా స్యాద్భాసస్తస్య మహాత్మన"యన్నట్లు దుస్సహమగు నపరిమితకాంతి కలిగియున్నను నట్టికాంతియు నార్తుల కాహ్లాదకరముగ నున్నదని భావము. వారు దూరమునందే తన్నుఁ జూచి సంతోషింపవలయు ననియే యంతకాంతితో వచ్చెను. అట్లు చేయకున్నఁ దాను సమీపమునకు వచ్చువఱకు దుఃఖించుచుందురుగదా.

విష్ణుమూర్తి శ్రీ...జాలుండు. ఈయన ప్రపంచమంతయు నెట్లు వ్యాపించి యున్నాఁడో యీయన తేజస్సు నట్లే యపరిమితమై వ్యాపించి యున్నదని భావము. విష్ణుమూర్తి వచ్చెనని చెప్పక విజయము చేసె నని చెప్పుటచే ఈ మహానుభావునిరాక బ్రహ్మాదుల యవమానమును - దేవతలభయమును హరించుటచే వారికి సమ్మాననీయ మయ్యె నని భావము. శంఖచక్రగదాలలితుఁడు విచ్చేసెను, దేవతలందఱుఁ గూడి తన్నుఁ జంపుట కాలోచించుచున్నా రని రావణుఁడు వేగులచే నెఱింగివారిని వధించుటకై యచ్చటికి వచ్చి

వానినివధించెనేని రక్ష్యలాభహానిచే తన రక్షకత్వము నిష్ప్రయోజన మగునని యెంచి వాని నచ్చటనే చంపుటకై యాయుధములు ధరించివచ్చెను గాని హవిస్సునకై పాత్రము తీసికొని భోజనమునకు రాలేదని భావము. భాగ ప్రతిగ్రహ మానుషంగికము. దానికింత సిద్ధపడి యిట్లు రావలసినది లేదు. ఇట్టి భగవంతుఁడే యుపాస్యుఁడనియు శరణాగతిమంత్రమునఁ జెప్పినట్లు ప్రపత్తి చేయఁదగిన శరీరము కలవాఁడనియు దీనిచేఁ దెలియనయ్యెను. ఇట్టిపద్యమున విశేష్యవిశేషణములు సాభిప్రాయములు గాపున పరికరాంకురపరికరాలంకారములకు సంసృష్టి, జంబూనదములోఁ బుట్టినది గాపున జాంబూనదము. జాంబూనదమని పేరు

విష్ణుశబ్దనిర్వచనము.

"వ్యాపిత్వాత్సర్వభూతానాం విష్ణురిత్యభిధీయతే, యోసౌ సర్వగతో దేవస్సఏవ పరమేశ్వరః" సర్వభూతములందు వ్యాపించుటచే విష్ణు వనఁబడును. సర్వగతుఁడైన యీదేవుఁడే పరమేశ్వరుఁడు.

"తత్త్వత్రితయవ్యాప్తి ర్విష్ణుశబ్దేన భణ్యతే" - విష్ణుశబ్దముచే మూఁడు తత్త్వములందు వ్యాప్తి చెప్పఁబడుచున్నది

తాత్పర్యము.

దేవతలిట్లు లాలోచించు చుండఁగనే కాంచనచేలుఁడును - జగన్నాయకుండును - శుభకరమైన దేహకాంతిగలవాఁడును - శంఖచక్రగదాఽభయముద్రలచే మనోహరమైనవాఁడును నగు - విష్ణుదేవుఁడు శీఘ్రముగ నచ్చటికి విజయము చేసెను.

కం॥ అరుదెంచి యావిరించను, దరిని సమాహితమనంబునన్ విలసిల్లన్
సురలున్ వినుతుల నతులన్, హరిమన మలరించి యిట్లు లాడిరి భక్తిన్. ౪౪౬

విరించనుని దరిని = బ్రహ్మసమీపమున, సమాహితమనంబునన్ = తాను జేయఁబోవు నాశ్రితరక్షణమునకు వలయు నేకాగ్రతగల మనస్సుతో, సురలున్ = బ్రహ్మాది దేవతలు, హరి = ఆశ్రితుల కష్టముల హరించువాఁడు. శతానంద శ్శతధృతిర్ద్రుహిణో విరించః॥ నిఘంటువు.

తాత్పర్యము.

ఇట్లువచ్చి శ్రీవిష్ణు బ్రహ్మసమీపమున నేకాగ్రమనస్సుతో నుండఁగా దేవతలు నమస్కారములుస్తోత్రములు గావించి హరిమనస్సును సంతోషపెట్టి భక్తితోనిట్లు పలికిరి.

సుగంధి॥ నిన్ను వేఁడు వార మయ్య • నీరజాక్ష ! మమ్ము నా
పన్నులం బ్రపన్నులం• బ్రపంచము న్దయామతిం
జెన్ను మీఱఁ గావవే; ప్ర•సిద్ధుఁ డిద్ధకీర్తిసం
పన్నుఁడున్ వదాన్యుఁడుం ద•పస్వితుల్య తేజుఁడున్. ౪౪౭

నీరజ + అక్ష = తామరలవంటి నేత్రములుగలవాఁడా! ఆపన్నులన్ = ఆపద చెందినవారము కనకనే, ప్రపన్నులన్=శరణుచొచ్చిన వారిని; ఇద్ధ = పరిశుద్ధుడై ఖ్యాతిచేఁ బ్రకాశించు, వదాన్యుఁడు=దాత, తపస్వితుల్య తేజుఁడున్= ఋషులతో సమానమైన ప్రభావముకలవాఁడును; ఈ విశేషణములు క్రింది పద్యములోని కాకుత్స్థవరుఁడు అను పదముతో నన్వయించును. అతఁ డవతారదశయందు భగవంతునకుఁ గండ్రి యనిపేరు పొందుటకు యోగ్యతగల దని తెలుపుటకు నీవిశేషణము లుపయోగింపఁబడినవి. పద్యము సుగంధి ర-జ-ర-జ-గ గణములు ౯ వ యక్షరము యతి.

క॥ కాకుత్స్థవరుఁడు దనయుల,కై కడఁగెను భక్తిఁ గ్రతువుఁ • గావింప నిలే
శాకూతము నెఱవేఱఁగ, శ్రీకర సదయాంతరంగ ! • చింతింపఁగదే. ౪౪౮

కాకుత్స్థవరుఁడు=దశరథుఁడు- ఎవరివంశమున నీవు రంగనాథమూర్తి ధరించి నిత్య మర్చింపఁబడుచున్నావో యట్టి వంశమువారిలో శ్రేష్ఠుఁడు. పూర్వ రాజులవలె నర్చించుటయేగాక యాభగవంతుని నేపుత్రునిగాఁ బడయనున్నాఁడు. కావున శ్రేష్ఠుఁడు. కడఁగెను = ప్రయత్నించెను, ఇలా + ఈశ్వర = రాజు యొక్క. ఆకూతము = అభిప్రాయము - కోరిక, సదయ + అంతరంగ = దయతోఁ గూడిన మనస్సుగలవాఁడా!

కాకుత్స్థుఁడు = కకుత్స్థవంశమునఁ బుట్టినవాఁడు - గోత్రార్థకతద్ధితము. కకుత్ + స్థుఁడు = ఎద్దుమూఁపురమం దుండిన వాఁడు. ఈ రాజునకు మొదటి పేరు పురంజయుఁడు.'యతశ్చ వృషభకకుది స్థితేన రాజ్ఞాదైతేయబలంనిషూదిత మత శ్చాసౌ కకుత్స్థసంజ్ఞా మవాప. వి. పు. ౪-౨-౨౦.

ఒకసారి దేవతలకు రాక్షసులకు యుద్ధము సంభవింపఁగా దేవత లీ పురంజయుని సహాయపడఁ గోరిరి. అప్పు డాయన కోరినప్రకార మింద్రుఁడు వృషభమై యాయనకు వాహన మాయెను. ఆ వృషభముమూఁపురమందుఁ గూర్చుండి యుద్ధముచేసి యీరాజు రాక్షసులనెల్ల జయించెను. అదిమొద లీయనకుఁ గకుత్స్థుఁ డని పేరు.

తా త్ప ర్య ము .

కమలములవంటి కనులుగల మహానుభావా! ఆపదలచే బాధపడుచున్నారము. నిన్నుఁ బ్రపత్తిచేసినవారము. కావుననే నిన్నుఁ బ్రార్థించుచున్నారము,

ఇట్టి మమ్మును బ్రపంచమును దయతో రక్షింపుము. న న్నేమి చేయు మనెద రందువా? జగమునందు సత్ప్రవర్తనగలవాఁడని ప్రసిద్ధికి వచ్చినవాఁడు, మంచి కీర్తిసంపాదించినవాఁడు, దాత, ఋషులతోసమానమైన తేజముగలవాఁడు, కకుత్స్థవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడు నగు దశరథుఁడు పుత్రులు కలుగ వలయు నని సంకల్పించి యజ్ఞము చేయుచున్నాఁడు.

కం॥ కల రీతనికిని ముగ్గురు, వెలఁదులు హ్రీ శ్రీని గీర్తిఁ • బెంపునఁ బోలం
గలవారలు వారలకుఁ, నలువిధముల సుతుఁడ వగుచు • నటియింపఁగదే. ౪౪

హ్రీ శ్రీ కీర్తి యనువారు దక్షప్రజాపతికూఁతులు హ్రీ = భూదేవి, శ్రీ = లక్ష్మీదేవి. 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చపత్న్యౌ' యని పురుషసూక్తము. కీర్తి = నీళా దేవి - దశతీతి దశ యని దశశబ్దమునకుఁ బక్షి యని యర్థము. రథము = వాహనము - దశరథుఁడు = పక్షివాహనుఁడు విష్ణువు. కావున నీ వవతరింపఁ దగినవా రని యర్థము. పెంపునఁ = గొప్పతనముచేత, వెలఁదులు = భార్యలు, నలువిధముల సుతుఁడవగుచుఁ = నాలుగురూపములు ధరించి యవతరింపవల యును. రావణరావణి గంధర్వ లవణు లను రాక్షసుల సంహరింప నని భావము. నటింపుము = క్రీడింపుము. 'సురలకొఱకుఁ గ్రీడచూపెఁగాక' యన్నట్లిదియం తయు జగన్నాటకసూత్రధారికి నటనమేకదా.

తా త్ప ర్య ము.

ఈ దశరథునకు భూదేవిని శ్రీదేవిని గీర్తిని బోలు ముగ్గురు భార్యలుగలరు. వారియందు నీవు నాలుగువిధముల కొడుకవై జన్మింపుము.

ఉ॥ ఆవరవర్ణినీత్రికముఁనందు నరాకృతిఁ బూని తోఁచి, దు
ర్భావుని లోకకంటకుని • బాహుబలద్రవిణప్రవృద్ధునిఁ
దేవసమాజదుర్జయునిఁ • దీర్పుము రావణు, సిద్ధసాధ్యలే
ఖావళి మౌనిసంఘముల • నాతఁడు కాఱియ పెట్టెడిఁ హరీ! ౪౫

నే నట్లు లవతరించిన మీకేమి లాభ మందువా, వరవర్ణినీ త్రికమునందుఁ = ఉత్తమస్త్రీలగు ముగ్గురయందు, నర + ఆకృతి = మనుష్యుల యాకారము వంటి యాకారముతో, తోఁచి = కనవచ్చి, అకర్మవశ్యుఁడుగాఁ గర్మబద్ధుల వలెఁ బుట్టుటలేదు, దుర్భావునిఁ = చెడుతలంపులు గలవానిని, లోకకంట కుని = ప్రజల కుపద్రవము చేయువానిని; బాహుబలద్రవిణప్రవృద్ధునిఁ = భుజబల పరాక్రమములచేత వృద్ధిపొందినవానిని, దేవసమాజదుర్జయుని = దేవతలందఱు గుంపుగూడియుఁ జంపఁజాలనివానిని, రావణుఁడు దేవతల కవధ్యుఁడయి మనుష్యులలో నతనిఁ జంపగల శక్తిసామర్థ్యములు గలవాఁడు

లేనప్పుడు భగవంతుఁడే తప్పక మానషరూపము ధరింపవలయునని భావము. తీర్పుము = నశింపఁజేయుము; లేఖావళిక్ = దేవతాసమూహమును, కాఱియ = బాధ; కావున నీవు వానిని సంహరింపవలయునని భావము.

తా త్ప ర్య ము.

ఆముగ్గురు స్త్రీలయందు నీవు మనుష్యునివలెఁదోఁచి చెడుతలంపులు గల వాఁడై లోకమునకు బాధగావించువానిని, భుజబలముచే నతిశయించి యుండు వానిని, దేవతలమైన మేమందఱము కలిసినైననను బ్రత్యేకముగ నైనను జంపఁ జాలనివానిని, రావణు వధింపుము. వాని నేల చంపు మనెద రందువేమో లోక మునకు మేలుచేయు సిద్ధులు, సాధ్యులు, దేవతలు, మానులు - వీరి నందఱను మిగుల బాధించుచున్నాఁడు.

—* విష్ణువుతో దేవతలు తమ సంకటంబుల విన్నవించుట *—

సీ॥ మునికోటు లడవుల ♦ ముక్కుపట్టఁగ రాదు, దేవతల్ వాహ్యాళి ♦ దిరుగరాదు
గంధర్వకోటులు ♦ గానమెంచఁగరాదు, యాయజూకులు యాగ♦మనఁగరాదు
తెలిగంటికన్నెలు ♦ తెరువులఁ జనరాదు, నందనం బనుపే ర♦నంగరాదు
సురకోటులు హవిస్సు♦జోలి పల్కఁగరాదు, చెలువలు సైకసేఁత ♦ సేయరాదు
తే॥ ఏమ టంచు వచింతు మో♦యిందిరేశ! మాయవస్థలు దాఁగంగ ♦ మఱువు లేదు
ఖలుని వధియించి సురపాళిఁ ♦ గావ నిన్ను, శరణుఁ జొచ్చినవార మో♦జగదధీశ!

రావణుఁడు లోకులఁ బెట్టెడి బాధలు వివరించుచున్నాఁడు. ముక్కుఁబట్టఁ గక్ = ప్రాణాయామమున కని భావము. వాహ్యాళి = ఏయ్యాళి, విలాస సం చారము; ఎంచఁగరాదు = మనస్సులోనే యనకొనరాదు. యాయజూకులు = సదా యజ్ఞముచేయు స్వభావముగలవారు, తెలిగంటి కన్నెలు = దేవతా స్త్రీలు; తెలిపి + కన్ను - తెలి + గంటి = ఎప్పుడు తెలుచుకొని తెప్ప పాటులేక యుండునది. తెరువులక్ = వీథులయందు, నందనము = ఇంద్రుని యుద్యానము. ఇందిరా + ఈశ = లక్ష్మీపతీ, మఱువు = చాటు. ఇందిరేశ యను టచే స్త్రీయగు లక్ష్మీదేవియే కరుణచే నీకార్యమున ముందడుగు పెట్టుచుండఁ బురుషుఁడవైన నీవు వెనుకఁబడుట తగదని స్మృతికిఁ దెచ్చుటకే.

తా త్ప ర్య ము.

జగన్నాయకా! మునీశ్వరులు సంధ్యవార్చుటకై పూని ప్రాణాయామము చేయఁబూనిరేని రాక్షసులు పైపడివచ్చి ముక్కులు కోయుచున్నారు. ఆకాశ మందు దేవతలు విమానములమీఁదఁ గూర్చుండి వయ్యాళి తిరుగఁబూనిరేని విమానములు విఱిచి కుప్పలు పెట్టుచున్నారు. గంధర్వులు హాయిగాఁ బాడుద

మని స్వర మాలాపించిన గొంతులు పిసుకుచున్నారు. యజ్ఞశీలురు యజ్ఞమని తలఁపనేరాదు. దేవతాస్త్రీలు వీధులవెంటఁ బోయిరేని మానము గోలు పోయినవారే. దేవత లెవ్వరైనను నందనవనమునకు విహారార్థముగఁ బోవల యునని యనుకొననేరాదు. దేవతలు యజ్ఞములందు హవిస్సునకై పోరాదు. మనుష్యస్త్రీలెవ్వరు సింగారించుకొనరాదు. లక్ష్మీవల్లభా! మా దుఃఖములు మే మేమని విన్నవింతుము. వారిబార పడకుండ దాఁగుటకైనను మఱుఁగుస్థలము లేకున్నది. అట్టి దుశ్చరిత్రుఁడైన రావణు వధించి దేవతలమైన మమ్ముఁ గావు మీయని శరణుచొచ్చినారము.

కం॥ అరిమర్దన! నీవే కద, పరమగతివి మాకు నెల్ల ♦ వారికిఁ గానఁ
సురశత్రుల దండింపఁగ, ధరణికి నీచనఁగ మదిని ♦ దలఁపుము దేవా! ౪౫౨

ప్రముఖులగు నితరదేవతలుండ నన్నే యేల వేఁడెద రని ప్రశ్నింపరా దనుచున్నారు.

అరిమర్దన=శత్రుసంహారకుఁడా, సామాన్యవాచకమైన యరిశబ్దము ప్రయోగించుటచే నేయరినైన సంహరింపఁగలవాఁడవని భావము. కావుననే నీవే పరమగతివికద = నీవే = నీవుకాక నిశ్చయముగ మఱియెవ్వఁడును లేఁడనిభావము; పరమగతివి = అల్పదుఃఖములఁ దీర్చువారుగలరుగాని యిట్టిమహోపద్రవము వచ్చినపుడు రక్షింపఁగలవాఁడవు రక్షకులగువారల కందఱకంటెఁ శ్రేష్ఠుఁడవు నీవొక్కఁడవే, కద - ఇది ప్రసిద్ధిని దెలుపును. 'మమప్రాణాహి పాండవా' యన్నట్లు మాకెవరు శత్రువులో వారు నీకును శత్రువు లని తెలుపు 'అసురారి' మొదలగు పదములు నీయందేకదా రూఢములైయున్నవి. కావున సురశత్రులు నీకునశత్రువు లనిభావము. ఇందలిబహువచనము రావణ-రావణి-లవణ-గంధర్వాదులను దెలుపును.

తాత్పర్యము.

శత్రుసంహారశీలా! మాకందఱకు బరమగతివి నీవే కదా! నీకంటె మాకు రక్షకు లెవ్వరు? కావున సురలకు విరోధు లగు రావణాదుల వధియించుటకు భూలోకమునకు నీవు పోవ మదిలో సంకల్పింపుము.

విష్ణుమూర్తి దేవతల కభయమిచ్చుట

చం॥ అడజడి వేల్పు లిట్లు చతు♦రాస్యుఁడు మున్నుగ విన్నవింపఁగా,
నడలకుఁడీ సురల్, వెఱపు ♦ నందకుఁడీ మునివర్యు, లింక నేఁ
బుడమిఁ జెనంటిరక్కసులఁ ♦ బొల్పఱఁ జేయుదు, మీకు నైనయీ
గొడవ దొలంగఁ జేసెదను ♦ గూర్చెదఁ మే, లభయం బొసంగితిన్. ౪౫౩

చతురాస్యుఁడు = నాలుగుమోములు గలవాఁడు-బ్రహ్మ, అడజడి = కష్టము-రూ. అలజడి, అడలకుఁడీ = పరితాపపడకుఁడీ; చెనఁటి = దుర్మార్గులగు; రక్కసులన్ = రాక్షసులను, పొల్పుటన్ = నశించునట్లు. ఇది దేశ్యనిత్య సమాసము. గొడవ = ఆపద; అభయము = భయములేమిని.

తా త్ప ర్య ము .

బ్రహ్మదేవుఁడు లోనగువారు దేవతలు పడుకష్టము నీరీతి విన్నవింపఁగా మహావిష్ణుండు వారిని జూచి 'దేవతలారా! దుఃఖపడకుఁడు, మునీంద్రులారా! భయపడవలదు. నే నాదుష్టరాక్షసుల నాశము చేసెదన. మీకుఁ గలిగిన యీ కష్టము నివారించెగను. శుభము కలుగఁ జేసెదన. అభయమిచ్చితిని.'

కం॥ పుత్రులతోఁ మంత్రులతోఁ, బౌత్రులతో వానిజ్ఞాతి•బాంధవతతితో
మిత్రులతో శకలీకృత,గాత్రునిఁ గావింతుఁ బంక్తి•కంధరు ననిలోన్. ౨౫౭

పౌత్రులు = మనుమలు, పంక్తికంధరుని = పది మెడలుగల రావణుని; అనిలోన్ = యుద్ధమందు, శకలీకృతగాత్రుని = ముక్కలు ముక్కలుగాఁ జేయఁబడిన దేహముగలవానిని.

తా త్ప ర్య ము .

ఏమిచేసెదవందురా ? రావణాసురుని కొడుకులతోను మంత్రులతోను మనుమలతోను, వాని దాయాదులు చుట్టములు లోనగు వారితోను మిత్రులతోను వాని కకార్యములందుఁ దోడ్పడువారిని, బ్రేరించువారిని, కూడి పనిచేయువారిని, నిందఱను వధించెదను. మేము ద్రుంపఁగోరినది ముఖ్యులనే కదా, యందఱను సమూలముగఁ ద్రుంచెదనంటివే యేలయన, శరణుచొచ్చినవారినేకాక వారి యాప్తులను వారి కనుకూలురను నెట్లు రక్షింతునో యట్టులే దుష్టులను వారి కాప్తులను వారి కనుకూలురను దండింతును.

కం॥ అదయుని మునిసురదరకరుఁ, బొదవి వధించెద రణాగ్ర•మునఁ బృథివిపయిం
బదివేలవత్సరంబులుఁ, బదినూఱేడులు వసింతుఁ • బాలింతు ధరన్. ౨౫౮

దరకరున్ = భయము కలిగించువానిని, రణ + అగ్రమునన్ = యుద్ధప్రారంభమున, పదివేల వత్సరంబులు పదునూఱేడులును = ౧౦౦౦౦ + ౧౧౦౦ = పదునొకండువేల సంవత్సరములు.

తా త్ప ర్య ము .

దయాహీనుఁడై భూతహింససేయువానిని,పరులను బాధింపక లోకక్షేమమే గావించువారగు మునులను దేవతలను భయపఱుచువానిని, మనమెవ్వరిట్లు సేయరాదు. చేసిన మన కిట్టిగతియే ప్రాప్తించునని లోకమెఱిఁగి సత్ప్రవర్తన

మందే యుండుటకై పలువురకుఁ దెలియునట్లు యుద్ధభూమియందే వధించెదను. ధర్మము పదేశమూలముననేగాక యనుష్ఠానపూర్వకముగఁ దెలుపుటకై పదునొకండువేల సంవత్సరములు భూమిమీఁదనుండి ధర్మము స్థాపించెదను. అట్లు చేసితినేని లోకులు 'మనము భగవంతుని శరణువేఁడితిమేని మనము కోరినదానికంటె నెక్కుడుఫలమొసఁగి మనయోగక్షేమము లాయనయే విచారించు' నని తెలిసికొని బాగుపడుదురు.

చం॥ శరణముఁ జొచ్చినట్టి వన♦జప్రభవాదుల కెల్ల నీగతిఁ
దరము దొలంగఁగా నభయ♦దాన మొసంగి యొసంగురక్తి నీ
ధరపయి నేరియందు నవ♦తారము నొందఁగ మానవాకృతిం
దరమగు నంచుఁ గొంతవడి ♦ దాఁ దలపోసి యనంతరంబునన్. ౪౫౬

వనజప్రభవ = కమలభవుఁడు - బ్రహ్మ, దరము = భయము, ఒసంగి = ఇచ్చి, ఎసంగురక్తిఁ = అధికప్రేమతో, తరము = సాధ్యము.

తా త్ప ర్య ము.

శరణాగతులైన బ్రహ్మాది దేవతలకెల్ల భయముదీఱ నభయహస్తమిచ్చి ప్రీతితో 'మానవాకృతితో భూమిపై నెవరియందవతరింతును? అట్టి యోగ్యతగలవా రెవ్వ' రని యాలోచించి.

కం॥ పద్మపలాశాక్షుఁడు దురి, తార్మరుఁ డానతజనావ♦నాసక్తుం డ
చ్ఛద్ముఁడు దనకు నయోధ్యా,సద్ముఁడు దశరథుఁడె తగును ♦ జనకుఁడుగాఁగన్. ౪౫౭

పద్మపలాశాక్షుఁడు = తామరరేకులవంటి కన్నులుగలవాఁడు, తనజనకునిఁగా దశరథునిఁ దలంచునపుడే యతనిగుణములను జూచి విష్ణువునకు సంతోషముచేఁ గన్నులు విశాలములైన వని భావము. (౨) తామరతేకుల నంద దాశించునట్లు ఈయననేత్రము లందఱకు స్పృహణీయము లనిభావము. ఇట్లంద దాశింపఁ దగినవాఁడు నేఁ డితరునిఁ దా నాశించె ననిభావము. (3) 'తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ' యని శ్రుతిచెప్పినట్లు పరమాత్మత్వసూచకముగ పుండరీకాక్షత్వముగలవాఁడు. పుండరీక మన నెఱ్ఱతామర యనియు, అమరమునఁ దెల్ల దామరయనుట ప్రమాదముచే ననియుఁబండితాభిప్రాయము. ఇంతటిపరాత్పరుఁడు కూడ జన్మము నపేక్షించెను. జన్మముగలవారికి మోక్షము దుర్లభమయినట్లు జన్మరహితునకు జన్మము దుర్లభమయి లోకహితార్థమై యత్యంతాభిలషితమై యుండును. దుర్లభవస్తువునుగదా యందఱు గోరుదురు. లోకోపకారార్థకమైన జన్మము సంతోషదాయక మని యేర్పడుచున్నది. దేవతలు పాదములచేనైన నంటనిభూమియందు జన్మమునొంద నింతసంతోషపడుట భగవంతుని యాశ్రిత

వాత్సల్యమును దెలుపుచున్నది. దురిత + అర్దరుఁడు = పాపముల నశింపఁ జేయువాఁడు, అర్దరుఁడు = మిక్కిలి భక్షించువాఁడు- భగవంతునిదయ యపూర్ణకుక్షియని పెద్దలు చెప్పిరి. భక్తులపాపరాసుల నెంత తినినను దానికడుపునిండదఁట. ఆనత సక్తుండు = నమస్కరించుజనుల రక్షించునభిలాషగలవాఁడు, అచ్ఛద్ముఁడు= కపటములేనివాఁడునగు భగవంతుఁడు; అయోధ్యాసద్ముఁడు = అయోధ్యవాసస్థానముగాఁగలవాఁడు నగుదశరథుఁడె. 'గుణైర్దశరథోపమ' మ్మన్నట్టు తానజన్మించి సంపాదించినకీర్తి యు స్వాభావికములు నైనగుణములచేఁ దనతో సమానుఁడు, ౪౮౯ పద్యవాఖ్యచూడుఁడు. జనకుఁడు = 'పితాపుత్రేణ పితృమాన్ యోని యోనౌ'యన్నట్లు, సకల జగత్తునకు జనకుఁడగు (పితాహమస్య జగతః) భగవంతుఁడు తనకుమారులలో నొక్కఁడగు దశరథుని దండ్రిగాఁ గోరెను. ఇందుఁ జెప్పఁబడిన నాలుగు విశేషణములు భగవంతుఁడు నాలుగు రూపములుగ నవతరింపఁ బోవుటను దెలుపుచున్నవి.

తాత్పర్యము.

తామరలవంటి విశాలనేత్రములు కలవాఁడును, పాపసంహారుఁడును, నమస్కరించు జనుల రక్షించుటయం దాసక్తిగలవాఁడును, వంచనలేనివాఁడును నగు భగవంతుఁ డయోధ్యాపురాధిపతియగు దశరథుఁడే తనకుఁ దండ్రియను పేరు పొంద నర్హుఁడని తలఁచెను. పద్మపలాశాక్షుఁ డనుటచే 'పుంసాం మోహనరూపాయ' యన్నట్లు దివ్యమంగళ విగ్రహోపేతత్వము సౌందర్యము. దురితార్దరుఁ డనుటచే నపహతపాప్మత్వము (అహల్యాశాపమోచనాదికము), ఆనత. సక్తుం డనుటచే శరణాగతవ్రతధారణము, అచ్ఛద్ముఁ డనుటచే నింద్రజిద్రావణాది యుద్ధమునందువలె సత్యపరాక్రమత్వము తెలుపుచున్నవి.

కౌసల్యా దశరథుల పూర్వజన్మ వృత్తాంతము.

శ్రీరుద్రః॥ స్వాయంభువోమనుఃపూర్వం, ద్వాదశార్ణం మహామనుమ్ ।
జజాప గోమతీ తీరే, నైమిశే విమలే శుభే॥
తేనవర్షసహస్రంతు, పూజితః కమలాపతిః।
ప్రసన్నఃప్రాహ దేవేశో, వరదః కమలాపతిః॥
మత్తోవరం వృణీష్వేతి, తం మునిం భగవాన్ హరిః।
తతః ప్రోవా చ హర్షేణ, మను స్స్వాయంభువో హరిమ్॥
పుత్రత్వం భజ దేవేశ, త్రీణిజన్మాని మేఽచ్యుత।
త్వాం పుత్రలాలసత్వేన, భజామి పురుషోత్తమ॥
ఇత్యుక్తస్తేన లక్ష్మీశః, ప్రోవాచ శుభయాగిరా
ఏవమస్తు మునిశ్రేష్ఠ, యత్తే మనసి కాంక్షితమ్॥

మమైవచ మహాప్రీతి, స్తవ పుత్రత్వ మాసితుమ్।
స్థితి ప్రయోజనేకాలే, తత్ర తత్ర ద్విజోత్తమ॥
త్వయిజాతే త్వహమపి, జనిష్యే తవ సువ్రత।
ఏవం దత్వా వరం తస్మై, తత్రైవాంత ర్దధే హరిః॥
అస్యాభూత్ప్రథమం జన్మ, మనోస్స్వాయంభువస్యచ।
రఘూణామన్వయే పూర్వం, రాజా దశరథో హ్యభూత్॥
ద్వితీయే వసుదేవోభూ, ద్యదూనా మన్వయేమనుః।
కలేర్దివ్యసహస్రాబ్ద, ప్రమాణస్యాంऽత్యపాదకే॥
శంబళగ్రామకే ముఖ్యే, బ్రాహ్మణస్య జనిష్యతి।
తతోముక్తిర్భవేత్తస్య, మనోర్జన్మ త్రయాంతరే॥
రాఘవః ప్రథమంజజ్ఞే కృష్ణస్తు తదనంతరమ్
కల్కిరూపీ హరిః పశ్చా ద్బ్రాహ్మణస్య జనిష్యతి॥
తస్యపత్నీ మహాభాగా సుశలా నామభామినీ।
కౌసల్యా సమభూత్పూర్వం, పత్నీదశరథస్యహి॥
యదువంశ్యస్య సైవాథ, దేవకీనామ సువ్రతా॥
హరివ్రతస్య విప్రస్య, భార్యాదేవ ప్రభాపునః
ఏవం మాతృత్వ మాపన్నా, త్రీణిజన్మాని శార్ఙ్గిణః॥

స్వాయంభువమనువు పూర్వము వాసుదేవ ద్వాదశాక్షరీమంత్రమును గోమతీ తీరంబున నైమిశారణ్యంబున జపించెను. శ్రీమన్నారాయణుండు ప్రసన్నుండై నీకేమివరము కావలయు నని యడిగెను. మూఁడుజన్మంబులందు నీవు నాకుఁ బుత్రుఁడవుకమ్మని మనువుకోరెను. అట్లులేయని యంగీకరించి యాయన దశరథుఁడుగాఁ బుట్టినపు డాయనకు రాముఁ డను పేరిఁ బుత్రుఁడయ్యెను. ఆవల యదువంశంబున వసుదేవుఁడుగా మనువు పుట్టినపుడు కృష్ణుఁడుగాఁ బుత్రుఁడయ్యెను. మూఁడవజన్మంబున శంబళిగ్రామంబున కలియుగమున నాలవపాదమందు హరివ్రతుఁడను బ్రాహ్మణునకు కల్కియై పుట్టఁగలఁడు. మనువుభార్య సుశీలయను నామె కౌసల్యయను పేర దశరథునకు, దేవకియను పేర వసుదేవునకు, దేవప్రభ యను పేర హరివ్రతునకు, భార్యయై మూఁడుజన్మంబుల విష్ణువునకుఁ దల్లియగును. శంబళి-సంబళి-శంభళి-సంభల మని పాఠాంతరములు గలవు. హరివ్రతునకు విష్ణుశర్మ యను పేరు భారతంబునఁ గలదు.

చం॥ అనుచుఁ జతుర్విధాకృతుల • నాదటఁ బూని జనింప నెంచినన్
ఘనతరహృష్టచిత్తు లయి • కాలగళాదిసురుల్ మధుద్విషున్
వినుతి యొనర్చి త్రుంపఁ గద•వే సదయాత్మక! రావణాసురున్
మునిజననిగ్రహున్ సురస•మూహవిరావణు దుర్నివారణున్. ౪౫౬

అనచుర్ = దేవతలు చెప్పినట్లు నిశ్చయము చేయుచు, చతుర్విధ + ఆకృతులర్ = నాలుగు విధములగు నాకారములచేత, తాను జన్మింపవలసి యున్నను నాలుగు శరీరములఁ బరిగ్రహించుట దశరథుని గుణాతిశయముఁ బట్టియు, నొంటిపుత్త్రుఁడు పుత్త్రుఁడుగాఁ డను శాస్త్ర ముండుటచేతను - అని భావము పూని = పాయసభాగము మూలముగా నాలుగయి, ఘన చిత్తులు = మిక్కిలి యధికముగా సంతోషించిన మనస్సుగలవారు, కాలగళాది సురుల్ = శివుఁడు మొదలయిన దేవతలు, మధుద్విషుర్ = మధు వను రాక్షసుని (ద్వేషించి) చంపిన భగవంతుని, మధువువలె రావణాదులఁ జంపవలయుననియు, మధువు సంతతివానిఁ జంపినవానికి రావణ కుంభకర్ణు లెంతయనియు భావము. నిగ్రహుర్ = బాధను జేయువానిని, విరావణుర్ = ఏడ్పించువానిని, దుర్నివారణుర్ = మాకెవ్వరికి నడ్డగింప నలవికాని వానిని, మాచేఁగు కార్యమైన నీకేల శ్రమమియ్యు నంగీకరింతు మని భావము. తృతీయ పాదమున ప్లుతయతి.

తాత్పర్యము.

అని సాదరుఁడై నాలుగాకారములతోఁ బుట్టుటకై యోజించుటయు నాయనయభిప్రాయ మెఱింగి శివుఁడు మొదలైన దేవతలు మధువైరి యగు విష్ణువును స్తుతించి, పరమకరుణాకర మునీశ్వరులను నిగ్రహించువాఁడును, దేవతాసమూహములను మొఱ్ఱో యనిపించువాఁడును, మాకెవ్వరికిని వారింప సాధ్యముకానివాఁడును నగు రావణుని వధింపుమా.

శ్రీమద్రామాయణమందు విష్ణువే నలువురుగఁ బుట్టెనట్లు చెప్పఁబడినది.

పద్మపురాణమందు.

శ్లో॥ కైకేయ్యాం భరతో జజ్ఞే, పాంచజన్యాంశ చోదితః
అనంతాంశేన సంభూతో లక్ష్మణః పరవీరహా.
సుదర్శనాంశా చ్ఛత్రుఘ్న స్సంజజ్ఞేఽమితవిక్రమః॥

అనియున్నది. ఈభేదమును సూచించుచు మహేశ్వరతీర్థులు, "శంఖచక్రానంతానామపి భగవద్రూపతాసూచితా। హుంకారేణ భగవానివ పాంచజన్యః శబ్దమాత్రేణ సకలభువనక్షోభకత్వా ద్విష్ణుతుల్యప వేతి బోధ్యం" అని వ్రాసిరి. అనఁగా విష్ణువు నేను బుట్టెద నన్నప్పుడు పరికరములతోడ పరివారములతోడ నని యర్థమేకాని యేదియులేక యనికాదు. శంఖచక్రానంతులు భగవదంశములే, భగవత్స్వరూపములే. 'చక్రశ్చేతసి' యన్నట్లు చక్రము భగవంతుని చేతస్సు. మనస్సును - సంకల్పమును విడిచివచ్చుటయెట్లు? భగవంతుని నాదమే శంఖము. శివకేశవ యుద్ధమందు ౧౩౨ ప.

కం॥ పంకజలోచను భీకర, హుంకారమున లిఖిల దేవతల గ్రసిత ఘనాపూర్ణ
బింక మతి మహాగర్వుడు, శంకరుడు త్రిలోచనుడును స్తంభంబయ్యెన్.

అన్నట్లు హుంకారముచేతనే శివుడు వింటితోడ బెండువడి పోయెను.

శంఖమునుండి పుట్టినది యీనాదము గదా.

'శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గాద్యైర్దివ్యైస్సహ, పరీతం పురుషాకారైస్త్రైలోక్యం, పరిరక్షతే' పద్మ - అన్నట్లు భగవంతుని శక్తులన్నియు బురుషాకారములు వహించి యాయనను సేవించుచుండును. కావున విష్ణు వవతరించె నన్నప్పుడు నతనియాయుధ సంచారములు నతనితో సహాయము చేయ వెలసియుండె.

ఇది సరియైన సమాధానముగా నున్నది. భగవంతుని శక్తులాయుధములు స్త్రీపురుష స్వరూపముల భగవంతు సేవించుననుటకు ఉత్తరకాండమున ౧౬౮౨ వ పద్యము చూడుడు.

"సీ॥ అంగన్యాదిశక్తి పద్మహస్తయై శ్రీదేవి, హ్రీదేవి ధరయంచు నడుమనుండి
సంహారశక్తియు జనగ మున్నగి శరచాపముల్ పూరుషరూపములను
సకలాయుధావళుల్ సరవిని గొలువంగ, బ్రాహ్మణాకృతులను బరగ శ్రుతులు
సప్తపతితో గాయత్రి, చనగ నేటు, నోంకారయు ... మొప్పగ"

ఈ విషయము ... వ్యాఖ్యానములు ... దిగినవి కావున ననువదింపబడును.

'ఓమిత్యేతదక్షరం పరంబ్రహ్మ తదేవోపాసితవ్యం. ఏతదేవ సూక్ష్మాష్టాక్షరం భవతి. తదేత దష్టాత్మకోఽష్టధా భవతి. అకారః ప్రథమాక్షరో భవతి ఉకారో ద్వితీయాక్షరో భవతి. మకారస్తృతీయాక్షరో భవతి. బిందు స్తురీయాక్షరో భవతి. నాదః పంచమాక్షరో భవతి. కలా షష్ఠాక్షరో భవతి. కలాతీతా సప్తమాక్షరో భవతి. తత్పర శ్చాష్టమాక్షరో భవతి. తారకత్వా త్తారకో భవతి. తదేవ తారకం బ్రహ్మ త్వం విద్ధి. తదేవోపాసితవ్యం. ... భవతి.

అకారాత్ప్రభవ బ్రహ్మా జాంబవానితిసంజ్ఞకః,
ఉకారాక్షరసంభూత ఉపేంద్రో హరినాయకః,
మకారాక్షరసంభూత శ్శివస్తు హనుమాన్ స్మృతః,
బిందు రీశ్వరసంజ్ఞస్తు శత్రుఘ్నః చక్రరాట్స్వయం,
నాదో మహాప్రభు ర్జ్ఞేయో భరతః శంఖనామకః,
కలాయాః పురుష స్సాక్షా ల్లక్ష్మణో ధరణీధరః,

కలాతీతా భగవతీ స్వయం సీతేతి సంజ్ఞితా,
తత్పరః పరమాత్మాచ శ్రీరామః పురుషోత్తమః.

అ కారమువలన బ్రహ్మ జాంబవంతుఁ డనుపేరుతో సంభవించెను. ఉ కారమువలన నుపేంద్రుఁడు సుగ్రీవుఁడు జనించెను. మ కారమువలన శివుఁడు హనుమంతుఁ డయ్యెను. ఈశ్వరసంజ్ఞ బిందువు, చక్రము శత్రుఘ్నుఁడు, నాదము మహాప్రభువు, శంఖము భరతుఁడు. కలయొక్క పురుషుఁడు శేషుఁడైన లక్ష్మణుఁడు. కలాతీత భగవతియే సీత. ఆమెకుఁబరుఁడైన పరమాత్మ పురుషోత్తముఁ డగు శ్రీరాముఁడు. ఏకాదశరుద్రుఁడు రామసేవకై హనుమంతుఁడుగా నవతరించె నని కొందఱందురు. శివుని తేజస్సును వాయువు గొనివచ్చి యంజనాగర్భంబున నుంచె నని కొంద ఱందురు. శివుఁడు హనుమంతుఁడై యవతరించెనని యిందుండుటయేకాక 'హనుమాన్ రుద్రబీజజ' యని ఆనందరామాయణమునను గలదు. 'అష్టమూర్తేశ్శివ స్యాసీ ద్వాయుమూర్తి ర్మహాబలీ। హనుమాన్ కేసరిక్షేత్రే మకారార్థ స్స ఉచ్యతే' యనియుఁ గలదు.

కం॥ బలబంధుయుక్త వానిన, బొలియించి సురేంద్రగుప్తమును గతదోషా
వలియుం బరము స్వలోకము, వెలయఁగఁ జనుదెమ్ము మరల విగతజ్వరతన్. ౮౫

వానిన్ + అ = వానినే- రావణుని మాత్రమే - వానివలెఁ గ్రూరుఁడు కాని విభీషణునిఁ గూడ ననిభావము - విభీషణునియందు రాక్షసచేష్టలు లే వని శూర్పణఖయే చెప్పెను పొలియించి = చంపి, సురేంద్రగుప్తము = (1) విష్వక్సేనునిచే రక్షింపఁబడినది. (2) ఇంద్రునిచే రక్షింపఁబడినది. గతదోషావళి = రాగద్వేషాది సాంసారిక దోషములులేనిది - అప్రాకృతమైనది. 'శ్రీవైకుంఠ ముపేత్య నిత్య మజడ' మ్మనికదా. చిరము= శాశ్వతమైనది. బ్రహ్మలోకము నశించినను నశింపనిది - శాశ్వతమైనది. 'ఆబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తినో ర్జున' భ. గీ. స్వలోకము=నీలోకమగు వైకుంఠమును గుఱించి మీఁదఁ జెప్పిన విశేషణములు ఇంద్రలోకమున కన్వయింపవు. కావున వైకుంఠ మనియే సిద్ధాంతము. విగతజ్వరతన్ = వదలిన చింతాతాపము గలవాఁడవై -ఆశ్రితరక్షణము చేయలేదు గదా అని చింత- అదిలేనివాఁడవై. దీనివలన నాశ్రితరక్షణము చేసి మరలి వైకుంఠముఁ జేరువఱకు సంసారు లెప్పు డెప్పుడు చక్కఁబడుదు రను చింత కల దని తెలిసెడిని. మరలంజనుదెమ్ము= (1)మనుష్యలోకమునకుఁ బోయి కార్యముఁ దీర్చి మరల దేవలోకమునకు రమ్ము. (2) ఇప్పుడు వచ్చినది వైకుంఠమునుండి కావున మరల వచ్చుటకే రమ్మని భావము. సురేంద్ర = ఓయుపేంద్రుఁడా! గుప్తము = మాబోఁటి ప్రకృతి బద్ధులకుఁ బోవ నశక్యమైనది. 'అత్యర్కానల దీప్తం తత్, స్థానం విష్ణో ర్మహాత్మనః, స్వయైవ ప్రభయా రాజన్, దుష్ప్రేక్షం

దేవదానవై' యని మహాభారతవాక్యము. అనియు వ్యాఖ్యానము చేయనగు. స్వలోకాదివిశేషణములంబట్టి యాలోకము స్వర్గము కాదనియుఁ బ్రకృతిమండలము దాఁటియుండు వైకుంఠమనియు నేర్పడును.

తా త్ప ర్య ము.

సేనలతోడను బంధువులతోడను రావణునే చంపి స్వామీ! మాబోంట్లకు లభ్యముకానిదియుఁ బ్రాకృతదోషరహితమైనదియు ననిత్యములైన స్వర్గసత్యలోకాదులవలెఁగాక నిత్యమైనదియు నగు నీ లోకమునకు నిన్ని యవతారము లెత్తియు సంసారులు తరించుమార్గము తెలుపకపోయితినే, వారికి మార్గము చూపకపోయితినే యను మనస్తాపము వదలి మనము చేయవలసినకార్యము చేసితిమి, బుద్ధిమంతుల రక్షించితిమి, కాలాంతరమున బాగుపడఁ గోరిక గల వారికి మార్గము చూపితిమి - అను సంతోషముతో రమ్ము.

౧౬ సర్గము. దేవతలు విష్ణువును మానవావతారమెత్తఁ బ్రార్థించుట

ఉ॥ చేయఁగఁ బ్రార్థనంబు సుర♦సిద్ధముఖాదులెల్ల రిట్లు నా
రాయణుఁ డాదరంబు మెఱు♦ నాత్మ నెఱింగియుఁ బల్కె నీమహో
పాయముచే సురారులను ♦ బంచతఁ గూర్చెదఁ జెప్పుఁ డన్న వా
రాయమితౌజు మ్రొక్కుచు న♦రాకృతిఁ బూనివధింపు మాశరున్. ౪౬౧

దేవతల ప్రార్థనప్రకారము దశరథపుత్రుఁడై యుండునపుడు ఉపేంద్రాదులవలె నుండవలయునా? మనుష్యరూపముగా నుండవలయునా' యను ప్రశ్నము విష్ణుమూర్తి మరల దేవతలను గౌరవార్థము అడుగుచున్నాఁడు. వారి కార్యవిధము ముందు తాను నిశ్చయించుకొన్నను నెదుటివారిగౌరవార్థము మనస్సును బరీక్షింప వారిని బ్రశ్నించుట రామావతారమున నొకవిశేషగుణము. ఇది లక్ష్మణ - భరత - విభీషణ రక్షావిషయంబులఁ గననగు. ఇదియు లోకులు నేర్చుకొనవలసినవిషయము. నారాయణుఁడు - నరిష్యంతి ఇతి = నశింపవు కావున - నరాః అని వ్యుత్పత్తి. నిత్యవస్తువు లని యర్థము. నరముల సమూహము నారము. (1) నారములు + అయనముగాఁ గలవాఁడు నారాయణుఁడు, (2) నారములకు + అయనము = నారాయణుఁడు. మొదటిది బహువ్రీహి - రెండవది తత్పురుషము. సంజ్ఞయందు ణత్వము, సర్వాంతర్యామి యనికాని, సర్వాధారుఁ డనికాని భావము. రెండవసమాసమునఁ బుంలింగము విశేషము. ఇధ్మవ్రశ్చనాదులవలె నెఱుంగునది. ఇంతటి గొప్పవాఁడు దేవతల యిష్టానుసారము చేయుటచే నాశ్రితపారతంత్ర్యగుణ మేర్పడును. ఆత్మ నెఱింగియు = నిశ్చయింపఁబోవు విషయమును దాను నిర్ధారణ చేసికొనియుండియు, ఆదరంబు మెఱయ = గౌరవార్థ మాదరము; పంచతఁ = చావును, బాల్యకౌమార

యౌవనవార్ధకము లను నాలుగుదశలు పోఁగా నైదవది మరణము, అమిత + ఓజునిన్ = అధికపరాక్రమముగల విష్ణువును, నరాకృతిన్ = దైవాకృతి కూడదని భావము. ఆశరున్ = రాక్షసుని, నర + అయన = నారాయణశబ్దము నిత్యసమాసము. కావున నుభయయతులలోనిది. 'రా'కు యతిస్థానము హల్లుగాని యచ్చుగాని చెప్పవచ్చును. అట్లులే న + అ + అయన = నారాయణ యని సంధిచేసిన స్వరయతిగాఁ జెప్పవచ్చును. అప్పు డుభయయతియే.

తాత్పర్యము.

ఇట్లు సిద్ధులు దేవతలు లోనగు నమరులందఱు ప్రార్థింపఁగా శ్రీమన్నారాయణుడు తనకుఁ దెలిసియున్నను దేవతలయందలి యాదరబుద్ధిచే వారిని గౌరవింప నెంచి యో దేవతలారా! నే నే యుపాయముచే రాక్షసులను జంపుదునో చెప్పుఁడు అనిన వా రామహాతేజోవంతుఁడైన భగవంతునకు నే విధముగఁ గార్యము దీర్పనను దీర్చుటకు సమర్థుఁడైన మహానుభావుఁడు మమ్ముల నొక పెద్దచేసి యేమి తెలియనివానివలె నడుగుచున్నాఁడే యేమి యీయన యౌదార్య మని యాయన గొప్పగుణముఁ దలంచి మ్రొక్కుచు, దేవా! నరాకారము వహించియే రాక్షసుఁ ద్రుంపుము. ఏల యందువా?

ఉ॥ తేఁకువఁ బెక్కులేఁడు లతితీవ్రముగాఁ జతురాస్యుఁ గూర్చి యే
న్వీఁకఁ దపంబు సేయ విధి నెమ్మి నయం బొడచూప లోకమ
ల్లాఁకలు పెట్టఁ గోరి వివిధాకృతిభూతములందు దేనిచేన్
లోఁకువ గామిఁ గోరె, మదిలో గణియింపఁడు మానవాళులన్. ౪౬౧

తమ్ము నొకపెద్దచేసి యడిగినపుడు తగినరీతిఁ దమకుఁ దోచినది తప్పో యొప్పో చెప్పకున్న నాదరించినవారిని నిరాకరించినట్లగుఁ గావున 'నీవు సర్వజ్ఞుఁడవే మమ్ము నడుగనేల, మేము నీకుఁ జెప్పనేల, నీయిష్టము వచ్చినట్లు చేసికొను' మనక తమకుఁ దోఁచినది దేవతలు చెప్పుచున్నారు.

దానికి హేతు వేమన.— తేఁకువ = ధైర్యము, ఏను + వీఁకన్ = గొప్ప యుత్సాహముతో, నెమ్మిన్ = సంతోషముతో, ఆఁకలు + ఆఁకలు — అల్లాఁకలు = మిక్కిలి నిర్బంధములు, వివిధ భూతములందున్ = పలువిధములగు నాకారముగల ప్రాణులలో, లోఁకువ= తక్కువ, గణియింపఁడు = లక్ష్యపెట్టఁడు కాన వారివలన లోఁకువలేమి నడుగలేదని భావము. ఉపేక్షించినభూతములలో మనుష్యుఁడు శ్రేష్ఠముగావున వానిపేరు చెప్పఁబడెను. వానరభల్లూకాదులను వాఁడు చేర్కొనలేదు. మనుష్యులను లెక్కపెట్టనివాఁడు మృగముల లక్ష్యపెట్టునా?

తాత్పర్యము.

అనేక సంవత్సరములు రావణాసురుఁడు బ్రహ్మనుగూర్చి ఘోరమైన తపస్సు చేయఁగా నాయన ప్రత్యక్షమై లోకమును బాధింపఁగోరి నానాకారములుగల భూతములందు దేనికి లోపడకుండునట్లు వరమును గోరెఁగాని మనుష్యులను లక్ష్యపెట్టువాఁడు కాఁడు.

క॥ ఓ° యని యజుఁ డిచ్చుట, దానవుఁడు మదిం దలఁచి లోక♦తరుణీతతికిన్
మానముఁ బ్రాణము గొనెను, మానవుచేఁగాని వాఁడు♦ మడియఁడు గలనన్.
౬౪_౨

అజుఁడు = బ్రహ్మ, లోకతరుణీతతికిన్ = దేవగంధర్వాది పురుషులయొక్కయు స్త్రీలయొక్కయు సమూహమునకు, కలనన్ = యుద్ధమందు, మడియఁడు = చావఁడు, కావున నీవు మానవరూపమే ధరింపుమని భావము, ఈ పద్యము వలన రావణాసురునియందు బలాత్కారముగ స్త్రీలను గొనుటే ముఖ్యదోషమని యొప్పుచున్నది.

తాత్పర్యము.

అట్లయితే కాని యట్టి బ్రహ్మదేవుఁడే వరమిచ్చుటచే నారాక్షసుఁడు గర్వించి యున్నలోకములవారిని ముఖ్యముగా నయిన స్త్రీలను ప్రాణము మానముఁ దీసెను. పురుషుల ప్రాణము దీసెను స్త్రీలమానముఁ గొనెను. పైకారణముచే మనుష్యునిచేఁ గాని వాఁడు మడియఁడు. సామాన్యమనుష్యుఁ డెవ్వఁడు వానిని జంపలేఁడు కావున నీవే మనుష్యునివలెనై వానిని జంపవలయును.

చం॥ అనుచు నచింప నట్లయగు♦ నంచుఁ దిరోహితుఁ డయ్యె వెన్నుఁడున్,
జనపతి పుత్త్రులం బడయుఁ♦ జల్పుచు నుండఁగ నిష్టి, హవ్యవా
హను నడుమంతరంబున స♦యంబున నద్భుత మందె నిండుఁ దే
జున దిశలెల్ల వెల్గఁగను♦ జూపఱు నివ్వెరపాటు బొందఁగన్. ౪౬_౩

వెన్నుఁడు = విష్ణువు, తిరోహితుఁడయ్యెన్ = అంతర్ధానము చెందెను. ఆదేవసభనుండియే యని యధ్యాహారము. దశరథుఁడుచేయు పుత్త్రకామేష్టికి ఫలముగా భగవదవతారమును సూచించు ప్రాజాపత్యపురుషుని పాయసప్రదానమును జెప్పుచున్నాఁడు.

ఇష్టిన్ = పుత్త్రకామేష్టిని, హవ్యవాహను = అగ్నియొక్క, నడుమంతరంబునన్ = మధ్యప్రదేశమందు, నడుము + అంతరము — మొదటిపదము తెనుఁగు. రెండవపదము సంస్కృతము. ఈరెండు సమానార్థకములయ్యు నొకటిగాఁజేరి యాయొకయర్థముననే యుపయోగింపఁబడుచున్నది. చూపఱు = చూచు

వారు; నిండు తేజ=పూర్ణమైనకాంతి - మబ్బులేక నిలిచిక్కాయు నెండవంటిది. నివ్వెరపాటు = ఆశ్చర్యము. ఇంతకుముం దిట్టిది చూడలేదు గావున నాశ్చర్యము.

—* దశరథునకుఁ బ్రాజాపత్యపురుషుఁడు పాయసం బిచ్చుట *—

సీ॥ నీలరక్తంబైన♦చేలంబు నెట్టని, మోము దుందుభిరవం♦బును రహింప
నునుపారు కేసరి♦తనజాతములఁ బోలు, వెంట్రుకల్ మీసలు ♦ వెలయుచుండ
శుభలక్షణంబులు ♦ శుభభూషణంబులు, శైలశృంగోన్నతి♦జానమీఱ
సమదశార్దూలవి♦క్రమముసూర్యోపమా, కారంబు దీప్తాగ్ని♦కరణిఁ దేజ
తే॥ గలిగి భూరివీర్యంబున♦త్కటబలంబు, వొఱసియద్భుతభూతంబు ♦ దోఁచియపుడు
దివ్యపాయసయుతముప♦త్నివలెఁ బ్రియము, నైనపైఁడిపాత్రికబాహు♦లందునమర. ౪౬౪

ననపారు = మిక్కిలి నున్నన యగు, కేసరితనూజాతముల్ = సింహము యొక్క వెండ్రుకలు, వెంట్రుకలు = తలవెండ్రుకలు, శైలశృంగ + ఉన్నతి = పర్వతముకొనయంతయెత్తు, సమద విక్రమము=క్రొవ్విన పెద్దపులివంటి పరాక్రమము, దానివలె భయంకరుఁడు, సూర్య + ఉపమ + ఆకారము = కాంతి యందు సూర్యునితో సమానమైన రూపము, భూరి = అధికమైన, ఉత్కట = అధికమైన, దొరసి = పొంది, భూతము = బ్రహ్మ పంపిన పురుషుఁడు; పాత్రిక = పాత్రము, ఇది స్త్రీలింగము కావున పత్నివలెఁ బ్రియ మను దృష్టాంతము యుక్తము - బాహులందుఁ = భుజములయందు, పాత్రము పెద్దదికావునఁ జేతులతోఁ బట్టుకొన సాధ్యపడక భుజములయం దుంచుకొనెను. భగవంతుఁ డంతర్ధానమై తన తేజమునే పాయసముగా సంఘటించితానే తీసికొని యగ్నిలో నుండి యావిర్భవించెననియు, అట్లుకానియెడల నితరునికి భగవత్తేజమును మోయ శక్తి లేదనియుఁ గొందఱు చెప్పుదురు. పద్మపురాణమందు.

"శ్లో॥ తస్మా దావిరభూ దగ్నే ర్యజ్ఞరూపో హరి స్తధా
శుద్ధజాంబూనదప్రఖ్యశ్శంఖచక్రగదాధరః" అనియున్నది.

౪౬౩, ౪౬౪ తాత్పర్యము.

అని వారు చెప్పఁగా సరియని యంగీకరించి మహావిష్ణువు కానరాకపోయెను. ఇచ్చట దశరథుఁడు పుత్రకామేష్టి చేయుచుండఁగా నగ్నిహోత్రము నడుమ నుండి తన తేజున దిక్కులు వెల్గఁజేయుచు చూచువారు దిగ్భ్రమ పొందునట్లుగా నలుపు-ఎఱుపుకలిసినవస్త్రము ధరించి రక్తవర్ణపుముఖము దుందుభివంటి కంఠరవము కలవాఁడై నున్నపై సింహము మెడమీఁది వెండ్రుకలవంటి వెండ్రుకలు మీసములు ప్రకాశించుచుండ శుభచిహ్నములు శుభములైన సొమ్ములు ధరించి

కొండవలె నున్నతమైన దేహముతో నందిగించి మదించిన వ్యాఘ్రమువంటి పరాక్రమము సూర్యునితో సమానమైన తేజస్సు గలిగి మండుచున్న యగ్నివంటి తేజస్సుగలవాఁడై గొప్పవీర్యము అధికమైన బలముగలిగి భుజములందు దివ్యపరమాన్నము గలదియు, భార్యవలెఁ బ్రియమైనదియు నగు బంగారుపాత్రమును భుజములందు ధరించి.

శా॥ క్ష్మానాథుం దిలకించి భూపవర! ప్రాజాపత్యమూర్తిం జుమీ
కాన న్వచ్చితి ని న్న టన్నఁ బ్రణతుల్ గావించి కేల్మోడ్చి దే
వా! నాకుం గరణీయ మెయ్యది? యనం బల్కెన్ మహాశక్తి సం
తానం బీ వభిలాష చేసి క్రతుతంత్రంబిట్లు గావింపఁగన్. ౪౬౫

తిలకించి = చూచి, ప్రాజాపత్యమూర్తిని = బ్రహ్మకు సంబంధించిన మనుష్య స్వరూపమును, కరణీయము = చేయఁదగిన కార్యము, మహాశక్తి = గొప్ప శక్తిగల పురుషుఁడు; అభిలాషచేసి = కోరి, క్రతుతంత్రము = అశ్వమేధ పుత్రకామేష్టులను.

చం॥ ఎసఁగినసంతసంబున మహీవర! దేవతలెల్లఁ బంపఁ బా
యస మిది దేవనిర్మితము నన్యదురాసదముం బ్రజాకరం
బసమ మనామయంబు శుభమై కడుధన్యము నైనదాని నీ
కొసఁగఁగఁ దెచ్చితిం గొనుమ యూర్జితపుణ్యచరిత్ర! దీనినిన్. ౪౬౬

అన్యదురాసదము = ఇతరులకుఁ బొందరానిది, ప్రజాకరము = సంతానము గలిగించునది. అసమము = సాటిలేనిది, అనామయప్రదము = ఆరోగ్యము నిచ్చునది, 'అనామయంస్యా దారోగ్య'మ్మని యమరకోశము. ధన్యము = ప్రశస్తము, ఊర్జిత = వృద్ధిచేయఁబడిన, పుణ్యచరిత్ర = పుణ్యమైన నడవడి కలవాఁడా! రెండవపాదమున నఞ్ సమాసయతి.

౪౬౫ - ౪౬౬ తాత్పర్యము.

దశరథునిఁ జూచి, రాజేంద్రా! నేను ప్రాజాపత్యమూర్తిని నిన్నుఁ జూడ వచ్చితిని అని చెప్పఁగా దశరథుఁడు చేతులుజోడించి నమస్కరించి దేవా! నే నేమి చేయఁదగును? సెలవిమ్మన్న నా మహాశక్తి యిట్లనియె- నీవు సంతానము కోరి యీ ప్రకారము యజ్ఞముచేయఁగా దేవతలెల్ల సంతోషించి పంపఁగా వచ్చితిని. ఈ దేవతలచే నిర్మితమైనది, ఇతరులకు లభింపనిది, సంతానకారణమైనది, ఆరోగ్యకరమైనది, మేలిచ్చునది, నిన్నుఁ ధన్యునిఁ జేయునది యగు పాయసముఁ దెచ్చితిని. కావున నో పుణ్యాత్మకా! దీనిని నీవు గ్రహింపుము.

కం॥ అనురూపలైన భార్యల,కును గరుణ నొసంగు మీవు ♦ గోరినమాడ్కిం
దనయులు జనియించెద రో,మనుజవరా! యనిన మోద♦మానండగుచున్.
౨౬౭

అనురూపలు = కులగుణచేష్టాకీర్తులందు నీకు సమానలు, మోద మానుఁడు = సంతోషించుచున్నవాఁడు- దీనివలన యథావిధి శ్రద్ధాభక్తులతోఁ జేసిన వైదికకర్మము ఫలవంతమగును గాని వ్యర్థముగాదని చెప్పెడెను.

తా త్ప ర్య ము.

దీనిని నీవు గైకొని నీకుఁ గులగుణచేష్టాకీర్తులందుఁ దగినవారని తోఁచిన భార్యలకు నియ్యవలెను. నీవు కోరినట్లు నీకుఁ గొడుకులు గలిగెదరు అనిన రాజు సంతోషించెను.

కం॥ సురదత్తముఁ గాంచనభా,స్వర మగు దేవాన్నపూర్ణ♦పాత్రము నృపుఁడుం
శిరమునఁ గొని భూతమునకుఁ, బురుభక్తిఁ బ్రదక్షిణించెఁ ♦ బొగడుచు మ్రొక్కెన్.
౨౬౮

సురదత్తము = దేవత లిచ్చిపంపినది. కాంచనభాస్వరము=బంగారుమయము కావునఁ బ్రకాశించునది. దేవ . పాత్రము = దేవతలు నిర్మించి పాయసముతో నించిన పాత్రమును, పురుభక్తి=అధిక భక్తితో - ప్రాజాపత్యపురుషుని గ్రహించిరి. క్షీరసాగరమందుఁ బుట్టిన యమృతమువలె స్వర్గమందు నమృతము గాదు. భగవంతుని తేజస్సు మనుష్యస్త్రీగర్భమునఁ బ్రవేశించుటకు మంత్రవంతమైన హవిస్సువలె నిమిత్తమాత్రమైన పదార్థమొకటి యుండవలెనుగదా. ఆకారణముచే భగవత్తేజఃపూరితమైనపాయసాన్నమని గ్రహించునది. క్షీరసాగరమందుఁ బుట్టిన యమృతమగునేని దానిని త్రావిన స్త్రీలు మరణింపక యుండవలసివచ్చును. ఈ కారణముచే శ్రీరామాదిజననములకు రేతస్సర్గము కారణము గాదనియు వారిదేహము లప్రాకృతము లనియు నెఱుంగునది. దశరథుఁడు త్రావియుండిన గర్భములకు రేతస్సంబంధము చెప్పనగును గాని యిప్పుడా ప్రసంగమునకుఁ గారణమే లేదు. శాస్త్రరీతి నింద్రియయోగములవలన నేర్పడు దేహములకు స్త్రీగర్భవసతి యావశ్యకమగును గాని దివ్యతేజస్సువే నగువానికి స్త్రీగర్భవసతి యావశ్యకము గాదు. దీనికి మాంధాతృజననము, కుంభజులైన యగస్త్య వసిష్ఠ ద్రోణాచార్యాదుల జననము, ధృష్టద్యుమ్న ద్రౌపదీ జన్మములు దృష్టాంతములు. ఈ జాతులందు క్షేత్రము ప్రధానము గాదు. గర్భస్థజీవుఁడే తన తపోబలముచే స్వేచ్ఛాత్తశరీరుఁడగును గాని వీరల దేహములు తల్లితినునాహారము, తల్లిసంకల్పములుపట్టి నగునవికావు. కావునఁ దల్లిదండ్రులజాతికి బిడ్డలజాతికి సంబంధములేదు. కట్టెలందుఁ బుట్టిన యగ్ని

హోత్రునిజాతి యేది? కావునఁ దాను మున్నిచ్చినవరము చెల్లించుటకుఁ దన యందుఁ గౌసల్యాదశరథులకుఁ బుత్రమోహము గలిగించుటకు భగవంతుఁడు పన్నిన పన్నాగమే యిదికాని యితరము కాదు. కావుననే రహస్య మెఱింగిన విశ్వామిత్రుఁడు దశరథపుత్రా కౌసల్యాపుత్రా యనక ‘కౌసల్యాసుప్రజారామ’ యని రాముని సంబోధించెను. స్వేచ్ఛానుసారము స్వతంత్రులై కారణాంతర మున తపోబలముచే జన్మించు మహాత్ములజన్మంబులకుఁ బామరులజన్మములకుఁ బోలికయే లేదు. ఈవిషయమున భారతము- అనుశాసనికపర్వము **53** అధ్యాయ మందలి శ్లోకములు స్మరింపఁదగినవి.

‘శ్లో॥ ఈశంత్యాత్మన ఇత్యేతే గతిశ్చైషాం నసజ్జతే, బ్రహ్మభూయాంస ఇత్యేవ ఋషయః శ్రుతిచోదితాః॥ నింద్యా నచైతే రాజేంద్ర ప్రమాణం హి ప్రమాణినామ్, లోకోనమన్యతే చైతాఞ్ ప్రమాణం హ్యత్ర వై తపః॥ ఏవం మహాత్మభిస్తాత తపోజ్ఞానసమన్వితైః, ప్రవర్తితాని కార్యాణి ప్రమాణాన్యేవ సత్తమ॥తస్మాత్రచింతా కర్తవ్యా మహర్షీణాం సముద్భవే, యథా సర్వగతో హ్యగ్నిః తథా తేజో మహాత్మసు॥’

తపస్వులకే తమ జన్మకర్మములం దిట్లు స్వాతంత్ర్య ముండఁగా నీకథగ నద్విషయ మేమని చెప్పవలెను. శ్రీరామపరత్వము చూడుఁడు. ‘శ్రీరా ముఁడు వాల్మీకి చెప్పినట్లు సాక్షాద్విష్ణువని మునులందఱు నమస్కరించిరి కాని క్షత్రియుఁడని జాతివినక్షత యుండినవో నమస్కరించియుండరుకదా.

తాత్పర్యము.

దేవత లనుగ్రహించినదియు దివ్యపాయసాన్నముతో నిండినదియు నగు బంగారుపాత్రమును దశరథుఁడు చైకొని శిరస్సున ధరించి యాప్రాజపత్య పురుషునకుఁ బ్రదక్షిణముచేసి భక్తితో నమస్కరించెను.

కం॥ నిఱుపేదకుఁ బెన్నిధి చే,కుఱిఁ గలిగ సంతసిల్లె ♦ గొబ్బున భూతం
బుఱవుగ నదృశ్యముగ, న,స్తేజిఁ దఱచగుకోర్కు లూర ♦ దశరథుపత్నుల్. ౪౬౯

పెన్నిధి — పెను + నిధి = పెద్దనిక్షేపము - భూమిలోనుంచినధనము నిక్షే పము. ఉఱవుగఁ = ఉచితముగ, అస్పృశ్యముగఁ = అగ్నియందే యదృశ్య కాఁగా, తఱచు = అధికము.

చం॥ ఎలమి వికాసభాసురము♦షేందులుగా నవరోధనంబు భా
సిలె శరదిందుమండలరు♦చిప్రకరస్ఫుటపుష్కరాభమై,
తలఁగక భూపచంద్రుఁడును ♦ దారలయొద్దకు నేగి సమ్మదా
కులహృదయంబునం బలికెఁ ♦ గోసలరాజతనూజతోఁ దమిన్. ౪౭౦

ఎలమిన్ = పాయసము లభించిన సంతోషముతో, వికాస. ...ఇందులు= కాంతిచేఁ బ్రకాశించు చంద్రునివంటి ముఖములు గలవారు, అవరోధనంబు = అంతఃపురము, శరత్. ఆభమై — శరత్ + ఇందుమండల = శరత్కాల మందలి చంద్రమండలముయొక్క, రుచిప్రకర = కాంతిసమూహముచేత; స్ఫుట పుష్కర = స్పష్టముగాఁ బ్రకాశించు నాకాశముతో, ఆభమై = సమానమై. భాసిలెన్ = ప్రకాశించెను, తలఁగక = వదలక, సమ్మద హృదయం బునన్ = సంతోషముచే నిండిన మనస్సుతో.

౨౬ — ౨౭ తాత్పర్యము.

కేవలము నిఱుపేదకు గొప్పనిక్షేపము దొరికినట్లు దశరథుఁడు సంతోషించెను. ఆ దివ్యపురుషుఁ డదృశ్యుఁ డయ్యెను. ఈవార్త విని దశరథుభార్యలు తమకోరికలు పండెఁగదా యను సంతోషముతో వికాసమునొందిన ముఖకమలములు గలవారుకాఁగా వర్షాకాలము పోయి శరత్కాలము రాఁగానే పూర్వపుఁ దేజోహీనత పోయి మరలఁ దేజోవంతమై ప్రకాశించుచంద్రమండలకాంతులతోఁ బ్రకాశించు నాకాశమువలె నంతఃపురమంతయుఁ (అంతఃపురస్త్రీలు) బ్రకాశించె. అంతట దశరథుఁడు తనభార్య లుండుస్థలమునకుఁ బోయి (యజ్ఞకాలమందు స్త్రీ లుండుటకై ప్రత్యేకప్రదేశ మేర్పాటు కాఁబడియుండును. అప్పుడందఱు నొకచోటనే యుందురు.) పట్టపుదేవియగు కౌసల్యను జూచి యామెతో సంతోషాతిశయంబున నవ్వుంగుచు ని ట్లనియెను.

—* దశరథుఁడు తనభార్యలకుఁ బాయసముఁ బంచి యిచ్చుట. *—

క॥ దేవీ! పుత్రీయంబై, పావన మానమృతతుల్య॰పాయస మిది సం
భావింపుము సుతవతి వై, శ్రీ విలసిల్లెద వటంచుఁ ♦ జెలఁగినరక్తిన్. ౨౭

పుత్రీయంబు = పుత్రోత్పత్తికిఁ గారణమైనది. సంభావింపుము= గౌరవింపుము, సుతవతివి = పుత్రుఁడు గలదానవు.

తా త్ప ర్య ము .

దేవీ! యిదిగోఁ బుత్రోత్పత్తికిఁ గారణమై జన్మము పావనముచేయునదియై యమృతముతో సమానమైన పాయసము. దీనిని బూజింపుము. దీనిని నీవు గ్రహించితివేని నీవు కొడుకుగలదాన వగుదువు-అని ప్రేమతో.

ఉ॥ అంబురుహాప్తవంశ్యుఁడు స॰యజ్ఞుఁడు కోసలరాజపుత్రిక
ర్థంబు నొసంగెఁ బాయసముఁ ♦ దక్కినయర్థమునన్ సుమిత్రక
ర్థంబు నొసంగెఁ, గైకకును ♦ దక్కినయర్థమునన్ సగంబు, శే
షంబు సుమిత్ర కిచ్చెఁ బతి ♦ స్వాంతమునం దలపోసి వెండియున్, ౨౮

ఇఁక రాజపత్నులకు భాగక్రమముగఁ బాయసదానమును జెప్పుచున్నాఁడు. నయజ్ఞుఁడు=పెద్ద పిన్న యను నీతిమెఱింగినవాఁడు. అంబు. నరశ్యుఁడు = సూర్యవంశమునఁ బుట్టిన దశరథుఁడు, అర్ధంబు = మొత్తమున సగము, భాగము కౌసల్య కిచ్చెను. తక్కినయర్ధమునకు = మొత్తములోఁ గౌసల్యకిచ్చిన సగము పోను మిగిలిన సగములో - అర్ధంబుకు = సగములోసగము అనఁగా నాలుగవ భాగము సుమిత్ర కిచ్చెను. తక్కినయర్ధమునకు = సుమిత్రకిచ్చిన యర్ధభాగము గాక మిగిలిన సగభాగమున, అనఁగా మొత్తమున మిగిలిన పాతికభాగములో; సగంబుకు = మొత్తములో నెనిమిదవ భాగమున, కైకకు నొసంగెను. శేషము మొత్తములోమిగిలిన యెనిమిదవ భాగమును, స్వాంతమునకు= మనస్సునందు; తలపోసి = ఆలోచించి- భార్యలలోఁ బెద్దపిన్నతర మాలోచించి, వెండియుకు =మరల, సుమిత్ర కిచ్చెను. అందఱికన్నను పెద్దభార్య పట్టపుదేవి కౌసల్య. రెండవది సుమిత్ర. మూఁడవది కైకేయి. కావునఁ బాయసములోసగము కౌసల్య కిచ్చెను; రెండవభార్య సుమిత్రకు మిగిలినసగములోసగమును దొలుత నిచ్చెను. మిగిలిన పాతిక కైకేయి కిచ్చిన సుమిత్రను గైకేయిని సమానముగఁ జూచిన ట్లగును. అది ధర్మముగాదు. కావున నయజ్ఞుఁడైన దశరథుఁడీ విషయ మాలోచించి కైకేయికిమిగిలినపాతికలో సగము కైకేయికి సగము సుమిత్ర కిచ్చెను. కైకేయి యందఱికన్నఁ జిన్నదికావునఁ బరకపా లిచ్చెను. సగము కౌసల్యకు, రెండుమాఱ్లుగ పాతిక పరక సుమిత్రకు, పరక కైకేయికి నిచ్చెను. కైకేయి సంభోగవిషయమునఁ బ్రియురాలు. కాని న్యాయముగ భాగమునందుఁ గాదు. ఇట్లు భాగతారతమ్యము లేనిచోఁ బెద్దపిన్నగౌరవము పాటింపన ట్లగును. అది ధర్మయుక్తము గాదు. ధర్మదృష్టిఁ జేసిన భాగపరిష్కారము గుటనే "క్షితిధవు పత్నులు కడుసమ్మతి గొనిరి." అటుకాకున్న రాజస్త్రీ లవమానమును సహింతురా? దశరథునకు ధర్మాత్ముఁడను పేరు వచ్చునా? రామచంద్రమూర్తి విష్ణువు నర్ధాంశము. లక్ష్మణుఁడు పాదాంశము. భరతశత్రుఘ్ను లిరువురు కలిసి చెరి పరకవంతునఁ బాదాంశము. — సాక్షాద్విష్ణువునంశము రామునందు నాలుగవ యంశం బూని కైకేయికికి భరతుఁడు, విష్ణు నర్ధాంశులై సుమిత్రాదేవి గర్భంబున లక్ష్మణశత్రుఘ్నులు జనించిరి.౫౦౩పే.౬పద్య తాత్పర్య మిట్లూహించుకొన వలయును. సాక్షాద్విష్ణువు = కన్నులకుఁ గానవచ్చువిష్ణువు రాముఁడు. ఆయనయందుఁ జతుర్థాంశము భరతుఁడు, అనఁగా విష్ణువునం దష్టమాంశము. అర్ధాంశులు = అర్ధ మనఁగా భాగము - అట్టి యంశము గలవారు. భాగములు యథాసందర్భ మూహించుకొనునది. వీరిలలోఁ బాయసభాగములనుబట్టి కుమారుల పెద్దపిన్నతనములు చెప్పరాదు. పాయసము త్రాగుటయందలియుఁ గుమారుల జన్మకాలమునందలియు ముందు వెనుకలఁబట్టి కుమారులపెద్దపిన్నతనము నిర్ధా

రింపవలయును. తనకు న్యాయముగ రావలసిన సగభాగము తనకు దశరథుఁ డీయఁగానే కౌసల్య పాయసమును ద్రావెను. ఆకారణముచే నామెకొడుకు తొలుతనే జన్మించి జ్యేష్ఠుఁ డయ్యెను. తక్కినసగముపాయసమును రెండుభాగములు చేసి యొకభాగము సుమిత్ర కీయఁగానే తనతోసమానముగఁ గైకకిచ్చునేమో, యది తన కవమానకర మని భావించి సుమిత్ర త్రాగక యూరకుండెను. ఆమె యభిప్రాయమును గ్రహించి సుమిత్ర కీయఁగా మిగిలినదానిని రెండుభాగములు చేసి యొకభాగము కైకకిచ్చెను. తనకు న్యాయముగ రావలసినభాగము తనకు వచ్చుటచేఁ గైకేయి వెంటనే త్రావెను. ఆకారణముచే నామెకొడుకు రెండవవాఁడై పుట్టెను. పాతికయుఁ బరకయు నావల వేఱుగఁ ద్రావుటచే లక్ష్మణశత్రుఘ్ను లమడలై పుట్టిరి. ఈవిధముగ భాగవిషయము పూర్వాపరపాయసపాన కాలములఁబట్టి కుమారులజననము గ్రహింపసగు. దానినిబట్టి పెద్దపిన్న విచారము.

తాత్పర్యము.

సూర్యవంశమునందుఁ బుట్టినవాఁడును, నీతివిదుండును నగుదశరథుఁడు ప్రాజాపత్యపురుషుఁ డిచ్చిన పాయసమందు సగము కౌసల్యకుఁ దొలుతనే యిచ్చెను. ఆమె దానిని ద్రావెను. తక్కినసగములో సగము (పాతిక) రెండవభార్య యగు సుమిత్ర కిచ్చెను. తక్కినపాతిక యెవరి కిచ్చునో యని సుమిత్ర ద్రావక యూరకుండెను. ఆమె యభిప్రాయము గ్రహించి సుమిత్రతో సమానముగఁ గైక కిచ్చుట ధర్మము గాదని యెంచి మిగిలినపాతికపాయసమును రెండుభాగములు చేసి యొకభాగము కైక కిచ్చెను. ఆమెయుఁ ద్రావెను. తక్కిన భాగము సుమిత్ర కిచ్చెను. అప్పు డామె తన కిచ్చిన భాగములు వేఱు వేఱ రెండుమార్లుగఁ ద్రావెను.

ఈపాయసభాగమును బ్రహ్మపురాణమున నిట్లు చెప్పఁబడెను.

శ్లో॥ సరాజా తత్ర దృష్ట్వాథ, పత్న్యౌ జ్యేష్ఠకనీయసౌః
విభజ్య పాయసం దివ్యం, ప్రదదౌ సుసమాహితః
ఏతస్మిన్నంతరే పత్నీ, సుమిత్రా తస్య మధ్యమా
తత్సమీపం ప్రయాతా సా, పుత్రకామా సులోచనా
తాం దృష్ట్వా తత్ర కౌసల్యా,కైకేయీచ సుమధ్యమా
అర్ధ మర్ధం ప్రదదతు స్తే తస్యై పాయసం స్వకమ్.

ప్రాజాపత్యపురుషుఁ డిచ్చిన పాయసమును పెద్దభార్యకుఁ జిన్నభార్యకుఁ జెరిసగ మిచ్చెనఁట. ఎక్కడనోయుండిన సుమిత్ర యప్పుడు రాఁగా తమకు రాజిచ్చిన దానిలో సగము సగము కౌసల్యాకైకేయులు సుమిత్రకు నిచ్చిరఁట. దీని

వలనఁ బాయసము నాలుగుసమభాగములుగ విభజింపఁబడినట్లు లగుచున్నది. ఇది వాల్మీకిమతవిరుద్ధము. సుమిత్రపాయసవిభాగసమయమునకు నెచ్చటనో పోయియుండి వచ్చిన దనుటయు భాగయోగ్య యగు నామెకు నా సమయమందు మాత్రము దశరథుఁడు మఱచెననుటయు నసంభావ్యములు. పెద్దభార్య కీయఁగానే రెండవభార్యకుఁ దరువాత మూఁడవభార్యకు సక్రమముగా నిచ్చినట్లు వాల్మీకి చెప్పెను. ఈ పాయసభాగ మంగీకరించితిమేని నలువురు జన్మకాలమునుబట్టి యొకటి రెండు దినములు వ్యత్యాస మున్నను వీర్యమునందుఁ దారతమ్య ముండరాదు. రామచంద్రమూర్తికంటె లక్ష్మణుండు వీర్యమునఁ దక్కువవాఁ డని స్పష్టముగ ననుభవమునఁ దెలియుచున్నది. కబంధుఁడు రామలక్ష్మణులఁ బట్టుకొన్నప్పుడు,

> "తత్ర ధైర్యేణ శూరస్తు రాఘవో నైవ వివ్యథే
> బాల్యా దనాశ్రయ త్వాచ్చ, లక్ష్మణ స్త్వతివివ్యథే."

రాముఁడు శూరుఁడు కావున ధైర్యము కలవాఁడై దుఃఖింపనే లేదు. లక్ష్మణుఁడు బాల్యముచేతను (బాలబుద్ధిచేతను), ధైర్యము లేకపోవుటచేతను మిగుల వ్యథపడెను. సమానవీర్యులందు నింతటి తారతమ్య ముండఁ గారణము కలదా.

రామలక్ష్మణులను నింద్రజిత్తు నాగపాశబద్ధులఁ జేసినప్పుడు 'ఏత స్మిన్నంతరే రామం ప్రత్యబుధ్యత వీర్యవాన్, స్థిరత్వా త్సత్త్వయోగాచ్చ శరై స్సందానితోపి సన్॥' బాణములచేఁ గట్టఁబడియున్నను మూర్ఛిల్లియుండిన రామచంద్రమూర్తి ధీరుఁడును బలవంతుఁడును గావున స్మృతిగలవాఁ డయ్యెను. లక్ష్మణుఁడు విషణ్ణుఁడై యుండెను.

కుంభకర్ణుఁడు లక్ష్మణుబాణములను లక్ష్యపెట్టినవాఁడే కాఁడు. ఇట్లే బల స్థైర్యధైర్యాదులందు నిరువురకుఁ దారతమ్యము కానవచ్చుచున్నది. దీనికిఁ గారణము భగవత్తేజోమయమైన పాయసము తారతమ్యము కారణముగాని జననకాలవ్యత్యాసము కానేరదు. కావున నలువురకు సమభాగము లనుట గ్రాహ్యము కాదు.

సవతులకు బిడ్డలవిషయమున మాత్సర్యము మెండు. సవతులకు విషము పెట్టుట సవతిబిడ్డలఁ జంపుట యటుండ నిండు. కుంతీదేవి ముగ్గురు బిడ్డలఁ గనెను. తనకు బిడ్డలు లేరైరని మాద్రి దుఃఖింపఁగాఁ బాండురాజు కుంతితో మాద్రికిని నామంత్రబలమునఁ బుత్రులు కలుగఁజేయు మని కోరెను. అట్లే చేసెను. మాద్రి నకులసహదేవుల నమడలఁ గనెను. ఆవల మఱియొకబిడ్డను కలుగఁజేయుము అని పాండురాజు చెప్పఁగా ఒకసారికే యిద్దఱుబిడ్డలఁ గనినది. ఇఁక నేను జెప్పిన నాతో సమానురాలగును, లేదా మించియే పోవునో కావునఁ గుంతి, నేను జెప్ప

ననెను. ఇట్టిది స్త్రీలసహజగుణము. ప్రతిస్త్రీయును దాను మంచిబిడ్డలఁ గనవలయు ననియే యోజించును. అట్లుండఁ గైకేయివంటిది తనకొడుకుతో సమానుఁ డయినకొడుకు సవతికిఁ బుట్టనిమ్మని సగము పాయసము పంచియిచ్చె ననుట విశ్వాసపాత్రము గాదు.

దశరథుఁ డిచ్చె నందమా-పట్టమహిషితోపాటు తక్కినవారి నాదరించె ననుట ధర్మము కాదు. కావుననే కౌసల్యాకైకేయులిచ్చినట్లు చెప్పుట పద్మపురాణము ననుసరించియే యధ్యాత్మరామాయణ భోజచంపూ రఘువంశాదులందుఁ జెప్పఁబడినది. ఇవన్నియు నాదికావ్యమునకు నర్వాచీనములే. కావునఁ బంచాంగములఁబట్టి నక్షత్రముల సవరింపఁ బ్రయత్నింపరాదు. నక్షత్రగతి యొక్కటియే యయినను బంచాంగములు భిన్నములైనట్లు వీనిని భావింపవలెను. అది యునుగాక లక్ష్మణుఁ డాదిశేషుఁ డని, భరతుఁడు పాంచజన్య మని, శత్రుఘ్నుఁడు చక్ర మని చెప్పుచు నీనలువురు సమాను లనుట యసంభావితము.

కం॥ సుతసంప్రాప్తికి ధరణీ,పతి యీగతిఁ బాయసంబుఁ • బంచి యొసఁగినన్
క్షితిధవుపత్నులు కడుస,మ్మతిఁ గొనిరి నితాంతహృష్ట•మానసలగుచున్. ౪౭౩

సంప్రాప్తికిన్ = పొందుటకు, నితాంత హృష్టమానసలై = మితిమీఱిన సంతోషమున మునిఁగిన మనస్సుగలవారై, సమ్మతిన్ = రాజు పాయసమును గ్రమముగఁ బంచిపెట్టుట యను బహుమతిని - రాజు తన భార్యలలో పెద్ద పిన్నలనుజూచి తదనుగుణముగఁ బాయసమును బంచియిచ్చుటను జూచి భార్య లందఱు మిగుల సంతోషించి రని భావము.

తాత్పర్యము.

కొడుకులు గలుగుటకై దశరథుఁ డీవిధముగ ధర్మమార్గ మనుసరించి పెద్ద పిన్న గౌరవము లాలోచించి పాయసముఁ బంచి యీయఁగా రాజపత్నులు మిగుల సంతోషించినవారై సమ్మతిపడిరి.

ఉ॥ వారలు పాయసంబుఁ జెలు•వంబుగ నాని వహించి రంత దు
ర్వారహుతాశనాంబురుహ•బాంధవతుల్యరుచిప్రదీప్తముల్,
వారక దేవతానికర•భావుకకారణముల్, సురాంగనా
వారకశృంఖలాహరణ•పాటవగర్భము లైనగర్భముల్. ౪౭౪

యజ్ఞవృత్తాంతములోని కొదవసంగతి చెప్పవలసియున్నను వదలి ముందు ప్రారంభించినసంగతి కనుస్యూతముగ నుండు చరిత్రను సౌకర్యార్థమై యిఁకఁ జెప్పుచున్నాఁడు.

చెలువంబుగన్ = చక్కఁగా; ఆని = త్రాగి, దుర్వార ప్రదీప్తముల్ - దుర్వార = అణఁపరాని, హుతాశన= అగ్నితోన, అంబురుహ + బాంధవ= తామరపూలకు మిత్రుఁడైన సూర్యునితోన, తుల్య = సమానమగు, రుచిః= కాంతిచేత, ప్రదీప్తముల్ = ప్రకాశించునవియు- ఈవిశేషణములు లింగ పరిణామము చేసికొని గర్భిణులకు నన్వయింపవచ్చును.

దేవతానికర = దేవతాసమూహములయొక్క, భావుక = మేలునకు, కారణముల్ = హేతువులు, సుర + అంగనా + వారిక = దేవతాస్త్రీలసమూహముయొక్క, స్వార్థకమైనను, అనుకంపార్థకమైనను నిట క ప్రత్యయ మగును. శృంఖలా = సంకెలలను, హరణ= తీసివేయుటయందలి, పాటన= సామర్థ్యము; గర్భములు = లోనఁగలిగినవియును నగుగర్భముల వహించిరి.

తాత్పర్యము.

కౌసల్యా సుమిత్రా కైకేయులు సంతోషముతోఁ బాయసమును బానము చేసిన యావల దుస్సహములైన సూర్యాగ్ని తేజములవంటి తేజస్సు గలవియు, దేవతలక్షేమమునకుఁ గారణభూతములైనవియుఁ, రావణాసురునిచే జెఱసాలయందుంచఁబడిన దేవతాస్త్రీఁ కాలిసంకెలల నూడఁదన్ను సామర్థ్యము గలవగు గర్భములను ధరించిరి.

ఉ॥ అలలనాశిరోమణుల • నర్థిలిఁ గాంచి సరోరుహాప్తతే
జోలలితుండు శాత్రవని•షూదనదక్షుఁడు దీర్ఘకాలవాం
ఛాలులితుండు నిస్తులిత•సమ్మదసారవికస్వరాత్ముఁడై
చాలఁగఁ బొల్చె సిద్ధసుర•సంచయపూజితజిష్ణువైఖరిన్. ౪౭౫

సరః . లలితుండు = సూర్యునికాంతివంటికాంతిచేత మనోహరుఁడు; శాత్రవనిషూదనదక్షుఁడు = శత్రుసమూహమును నశింపఁజేయుటయందు సమర్థుఁ డగు దశరథుఁడు; లలనాశిరోమణులన్ = గర్భిణులయిన స్త్రీరత్నములగు తన భార్యలను, అర్థిలిన్ = ప్రేమతో, నిస్తులిత ఆత్ముఁడై = సాటిలేని సంతోషాధిక్యముచే వృద్ధిచెందిన మనస్సు గలవాఁడై, సిద్ధ వైఖరిన్ = దేవతల సమూహముచేతఁ బూజింపఁబడిన యింద్రునివలె- ఈ యుపమానమును బట్టి గర్భిణు లగు భార్యలను జూచి పుత్రోత్పత్తి కాఁగల దని రాజు సంతోషించునట్లు దేవతలును ఆపుత్రోత్పత్తిచే దమ దీర్ఘకాలకష్టములు తీరునుగదా యని సంతోషించుచుండి రని యేర్పడును. సరోరుహాప్తతేజుఁ డనుటచే సూర్యుని తేజస్సు కమలముల కెట్టు లుల్లాసకరమో యట్టులు దశరథుని సంతోషము లోకహితమైన దని భావము. తమ భార్యలు గర్భవతులైనచో భర్తలు సంతోషింతురు. ఇది యట్లు గాదు. భూలోకము దేవలోకముగూడ సంతో

షించెను. కావుననే కదా లోకభర్తయైన పుత్రుని కౌసల్య గనె నని సీత చెప్పెను. అందఱుబిడ్డలు తల్లిదండ్రుల, దారసుతుల భరించువారే, ఈగర్భము లట్టివి కావు, లోకమును భరించునవి. సూర్యకిరణములవలన లోకమునకే కదా విశేషలాభము. రాజగువాఁడు మిత్రభరణము, శత్రుహరణము చేయువాఁడుగా నుండవలయును. కావున నీవిశేషణము మిత్రభరణమును జెప్పుచున్నది. శాత్రవనిషూదనదక్షుఁ డను నది శత్రుహరణసామర్థ్యము చెప్పుచున్నది. ఈ గర్భములను జూచువఱకు దశరథుఁడు తనలో "దైవమా నాకా యఱువదివేలయేండ్ల ప్రాయమాయెన, వృద్ధుఁడనైతిని. ఇప్పుడు శత్రువులెవ్వరైన దండెత్తివచ్చిరా యెట్లు వారిని జంపఁగలను. ఈ రాజ్యము నాది యనువాఁ డొకఁడు లేమిని నందఱురాజులు నాది నాది యనువారే యగుదురే, జీవితదశయందే రాజ్యభ్రష్టత్వము ప్రాప్తించునేమో" యని విచారపడుచుండినవాఁ డిప్పుడు 'జయించితిని శత్రువులను ఇఁక భయములే' దని నిర్భయుఁడయ్యెను. సంతానహీనుఁడనై మిత్రరక్షణము శత్రురక్షణ మెట్లు చేయుదునా యని దీర్ఘకాలముగ విషాదపడుచుండినవాఁడు దీర్ఘకాలవాంఛాలులితుం డిప్పుడు ప్రసన్నుఁడయ్యె ననిభావము.

తాత్పర్యము.

ఆయుత్తమస్త్రీరత్నములను జూచి కమలబాంధవుఁడైన సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడును, శత్రువుల సంహరించుటయందు సమర్థుఁడును, దీర్ఘకాలముగ సుతులు లేరైరిగదా కొడుకులు గలుగుదురా యను కోరికతో వ్యాకులపడుచున్న మనస్సుగలవాఁడు నగు దశరథుఁడు నిష్కపుసంతోషముచే వికాసమునొందిన మనస్సుగలవాఁడై సిద్ధులు దేవతలు వీరిచేఁ బూజింపఁబడుచున్న యింద్రునివలె వెలిఁగెను.

౧౭ సర్గము. బ్రహ్మ దేవతలను వానరుల సృజింప నియమించుట

ఉ॥ అక్కడ నిర్జరాళి హవిరంశములం గొని యేగుచోటఁ బె
న్దక్కువ మీనిమిత్తమయి మాధవుఁ డుర్విఁ జనింప నెంచె, మీ
రుక్కునఁ గామరూపుల బలోద్ధతులన్ నఖరాయుధోగ్రులౌ
నెక్కటివీరులన్ హరికి నెంతయు బాసటగా సృజింపుఁడీ. ౪౭౬

విష్ణుమూర్తి యజ్ఞసభలోఁ జేరిన దేవతలనడుమనుండి యంతర్ధానమైన పిదప జరిగిన కార్యములు రెండు. అందు మొదటిది ప్రాజాపత్యపురుషుఁడు పాయసము తీసికొని యావిర్భవించుట. రెండవది బ్రహ్మ దేవతల నాదేశించుట. ఇంతవఱకు మొదటివిషయము, దానికిఁ బ్రసక్తివిషయములు చెప్పఁబడినవి. ఇఁక నీసర్గమున రెండవది యగు బ్రహ్మనియోగమును దానిఫలమును జెప్పఁబడును.

అక్షుదర్ = ఊర్ధ్వలోకమందు, నిర్జర + ఆళి = దేవసమూహము, మక్కువ = ప్రేమ; మాధవుఁడు = విష్ణువు- వ్యు. మా + ధవుఁడు = లక్ష్మీపతి. ఉర్విన్ = భూమియందు, ఉక్కునన్ = శౌర్యముతో, కామరూపులు = కోరినరూపము ధరింపఁగలవారు, రాక్షసులు మాయచేత నానారూపములు ధరింపఁగలరు కావున వారికిఁ దగినట్లు వీరును గోరినరూపము ధరింపఁగలరు. ఉద్ధతులన్ = మీఱినవారిని, నఖర + ఆయుధ + ఉగ్రులు = గోళ్లు అను నాయుధములచే భయంకరులను, ఎక్కటి = సహాయము లేని, బాసట = సహాయము

తాత్పర్యము.

యజ్ఞములందుఁ దమ హవిర్భాగములు తీసికొని తృప్తులైన ఇంద్రాదులు మఱలి తమ స్థానములకుఁ బోవుసమయమున బ్రహ్మ యింద్రాదులతో నిట్లనియె. దేవతలారా! మీకు క్షేమము గలిగించుకొఱకై శ్రీమహావిష్ణువు భూలోకమున జన్మింప సంకల్పించెనుగదా. ఆయనకు సహాయులుగా బలవంతులను, కామరూపులను, గోళ్లు కోఱలు నాయుధములుగాఁ గలవారిని, అసహాయశూరులు నగువారిని సృజింపుఁడు.

ఉ॥ సూరులు నీతిమంతు లతిశూరులు వాయుసమానవేగదు
ర్వారులు విష్ణుసన్నిభపరాక్రము లెవ్వరి కజయ్యు లిద్ధమా
యారతు లస్త్రశస్త్రనిపుణాత్ములు ధీరులు బుద్ధివానరా
కారులు త్వత్సమానబలగర్వితచిత్తులు పుట్టువారలన్. ౪౭౭

వానరులవిశేషముల నే జెప్పుచున్నాఁడు.

సూరులు = పండితులు, దుర్వారులు = అడ్డగింపరానివారు, సన్నిభ = సమానమగు, అజయ్యులు = జయింపశక్యపడనివారు, అజేయులు = జయింప యోగ్యులుకానివారు - అని భేదము, 'క్షయ్యజయ్యౌ శక్యార్థే' శక్యార్థమున క్షయ్యజయ్యరూపములు యత్ప్రత్యయాంతము లగు. జేయశబ్దము యోగ్యార్థక యత్ప్రత్యయాంతము. ఇద్ధ = ప్రకాశింపఁ జేయఁబడిన, మాయా = కపటమున, రతులు = అభిలాషకలవారు, 'పిశాచానాం పిశాచభాషయైవ ప్రత్యుత్తరం దాతవ్య' మ్మను న్యాయమ్మున మాయావులగు రాక్షసులతో యుద్ధముచేయ వీరును మాయావులై యుండవలయునుగదా "కుటిలబుద్ధుల గెలువంగఁ గుటిల మతియ! యర్హమగుఁగాని నీతిగా దార్జవంబు" అని కలదుగదా. మాయ = ఆశ్చర్యమైన శక్తియనియు నర్థము గలదు. నిపుణ = సామర్థ్యముగల; త్వత్ ... చిత్తులు = మీతో సమానమగు బలముచే గర్వించిన మనస్సుకలవారు, మాయారతు లనుచోట - మాయా + అరతులు = వంచనయందు నిచ్చలేని

వారు; సత్యపరాక్రములనుట. సత్యపరాక్రముండైనవానియొక్క నట్టివారేకద భటులై యుండవలయును.

తాత్పర్యము.

పండితులు (హనుమంతునివంటివారు), నీతిమంతులు (సుగ్రీవునివంటివారు) అతిశూరులు, వాయువేగమునంటి గమనవేగము గలవారు, ఎందును సడ్డులేని వారు, విష్ణుపరాక్రమముతో సమానమైన పరాక్రమము గలవారు; యుద్ధమున జయింపరానివారు, మాయాలక్షణము నెఱింగినవారయ్యు మాయలు చేయ నొల్లనివారు, అస్త్రశస్త్రముల నెఱింగినవారు, ధైర్యవంతులు; భల్లూకములు, వానరములు, గోలాంగూలములు వీని యాకారమువంటి యాకారములు గల వారు, బలాధిక్యమునందు మీతో సమానులునైనవారును.

ఉ॥ కిన్నరకాంతలందుఁ, గపురుషాంగనలందు, యక్షవి
ద్యున్నిభగాత్రలందు సురయోషలయం, దహిఋక్షభామలం,
దెన్నికగన్నరామల మెయిం గపివర్యులఁ బుట్టఁ జేయుఁడీ
క్రన్నన వారు దైత్యవిసరంబులఁ ద్రుంపఁగ నేర్తు రాజిలోన్. ౪౭౨

విద్యున్నిభ = మెఱుపుతో సమానమగు, గాత్రలందుఁ = దేహముగల వారలందు - యక్షస్త్రీలయందు, సురయోషలందు = దేవతాస్త్రీలయందు, అహి = సర్పములయొక్కయు, ఋక్ష = ఎలుఁగుగొడ్డులయొక్కయు, భామ లందుఁ = స్త్రీజాతులందు, ఎన్నికగన్న = ప్రసిద్ధి వహించిన; రామల = స్త్రీలయొక్క, మెయిఁ = దేహములందు - గొప్పస్త్రీ లని చెప్పుట గుణవంతు లగు పుత్రులు గలుగుటకే - కొడుకులు తల్లులగుణములు గలవారగుట శ్రేయస్కరము, పుత్రికలు తండ్రిని బోలియుండవలయును, తమ భార్య లందు దేవతలకు గర్భోత్పత్తి కాఁగూడ దను శాపమువలనను, దేవతా స్త్రీలయందు దేవతలకు జనించువారు దేవతలే యగుదురు కావున వారిచే రావణునకు భయము లేమియు నాలోచించి యని యెఱుంగునది. కపివర్యు లఁ = వానరశ్రేష్ఠులను - కపిశబ్ద ముపలక్షణ యగుటచే నిచ్చటఁ బ్రాయి కముగా నని యెఱుంగవలయును. కపివర్యుల ననుట రావణునకు నందికేశ్వరుఁ డిచ్చిన శాపము ననుసరించి యని తెలంపవలయును. ఉత్తరకాండము 3 ౨౬ వ పద్యము చూడుఁడు.

ఉ॥ మర్కటవక్త్రుఁ డంచు నవమానము దోఁపఁగ నవ్వెదే ననం
దర్క మిదేల? విను రణదర్పసమగ్రులు మద్బలాకృతుల్
కర్కశవిగ్రహుల్ గిరినికాశులు పుత్రక మిత్రభృత్య సం
పర్క భవద్బలంబు రణమండలి ద్రుంపఁగఁ బుట్టువా రిలన్,

అని నందికేశ్వరుఁడు శపించెఁగదా. వికరంబులన్ = సమూహములను, ఆజులోన్ = యుద్ధములో, అశ్వదేహము మనుష్యముఖముగలవారు కిన్నరులు. మనుష్యదేహము అశ్వముఖము గలవారు గంధర్వులు. "బింబోష్ఠం బహుమనుతే తురంగవక్త్రశ్చుంబంతం ముఖమిహ కిన్నరం ప్రియాయాః, శ్లిష్యంతం ముహురితరోపి తన్నిజస్త్రీ ముత్తుంగస్తనభరభంగభీరుమధ్యామ్" - (మాఘకావ్యము)

తాత్పర్యము.

కిన్నరస్త్రీలయందు నప్సరస్త్రీలయందు వానరస్త్రీలయందు యక్షస్త్రీల యందు దేవతాస్త్రీలయందుఁగూడ పన్నగ భల్లూకస్త్రీలయందు వీరిలోఁ బేరు వహించిన యుత్తమస్త్రీలయందు వానరులఁ గలిగింపుఁడు. వారు రాక్షసులను జంపువారగుదురు.

తే॥ ఇంతకునుమున్న నా కావలింతఁ గలిగి, యెంత వినియుంచెనొకజాంబవంతుఁడనఁగ
నంతకోపమవీరుఁడనంతయశుఁడు, వింతబలియుఁడు భల్లూకకాంతుఁడగుచు. ౪౭—

బ్రహ్మ తానును దేవజాతిలోని వాఁడును వారిలో జ్యేష్ఠుఁడును 'బ్రహ్మాత్మభూస్సురజ్యేష్ఠ' యని యమరము గావునఁ దక్కినవారితోపాటు తానును వానరాదుల సృజింపవలసినవాఁడగుటచేఁ జాంబవంతుకార్యము నిదివఱకే తాను జేసినట్టు చెప్పుచున్నాఁడు.

భల్లూకకాంతుఁడు = ఎలుఁగులఱేఁడు - జాంబవంతుఁడు. ఇంతకుమున్న = కృతయుగముననే.

తాత్పర్యము.

ఇది యిట్లు కాఁగలదని నాకుఁ దెలియును. నా కావలింత కలుగఁగా జాంబవంతుఁడను నొకఁడు మహాబలపరాక్రమసంపన్నుఁడు నాసంకల్పముచేతనే కలిగెను. అతఁడు భల్లూకముల కెల్ల నధిపతియయ్యెను.

సర్వశక్తుఁడగు భగవంతునికి మనసాహాయ్య మేల యని తలంపకుఁడు. మనము భగవత్కార్యముచేయుట మనము తరించుటకే కాని యాయన నుద్ధరింపఁ గాదు. మనము సాహాయ్యముచేసినను జేయకున్నను ఆయిన పూనినకార్య మాయన నిర్వహింపఁగలఁడు. మనకు సాక్షాద్భగవత్సేవ కావలయునన్న వైకుంఠమునకైనఁ బోవలయును. భూలోకమునకైన రావలయును. వైకుంఠమున సేవ మనకు దుర్లభము. కావున భగవంతుఁడు భూమియందవతరించినపుడే మనము సేవ చేయవలసియున్నది. అట్లు చేయుటవలన మనకృత్యము సఫలము చేసినవార మగుదుము. సుగ్రీవునకు హనుమంతుఁడు చెప్పినమాటలు చూడుఁడు (కిష్కింధ-

౭౭౫ పద్యము (యుద్ధ. ౩౭౯ వ ప) ప్రభువును ముందు పంపి సేవకులు వెనుక చిక్కుట గాని తోడఁ బోకుండుటగాని భావ్యముగాదు.

చం॥ అనుచు వచించి ధాత చన ♦ నంత ననిలయందఱు సిద్ధసాధ్య య
క్షనగమునీశకింపురుష♦చారణకిన్నరఖేచరావళుల్
వనచరభర్తృవీరులను ♦ వారిరిగా సృజియింపఁ, గోనలన్
వనములఁ బర్వతాగ్రముల ♦ వాఁకల వారు చరించి రుగ్రులై. ౪౮౦

నగ=సర్పములు - 'నాగో నగశ్చ భుజగే' యని రత్నమాల. వారిరిగాన్ = అధికముగా, వాఁకలన్ - వంకలన్ = ప్రవాహములందు, పూర్వబిందుపరకమైన హ్రస్వము దీర్ఘమగుచో నిలుచుచున్నయిననున్నయది గు. (౧౦ సూ. వ్యా. సంధి సూ.)

తాత్పర్యము.

అని యీప్రకారము బ్రహ్మ చెప్పిపోఁగా నందఱు నట్లు చేయుదమని సిద్ధులు - సాధ్యులు - యక్షులు - కిన్నరులు - కింపురుషులు - ఋషులు - చారణులు - ఖేచరులు మొదలైన దేవజాతివారందఱు వానరవీరులను భల్లూకశూరులను విస్తారముగా జనింపఁజేసిరి వారును కొండలఁ గోనల ప్రవాహములు వాఁకల నంచరించుచుండిరి.

—* వానరోత్పత్తివివరణము *—

సీ॥ హరిహయునకు వాలి ♦ వార్కు సుగ్రీవుఁడు, గురుమతి తారుండు ♦ గురునకప్పుడు
నరవాహనునకును ♦ గంధమాదనుం, డలవిశ్వకర్మకు ♦ నలుఁడు రోహి
తాశ్వునకును నీలుఁ ♦ డాశ్వినేయులకును, మైందద్వివిదులు న♦మందబలులు
నప్పతికి సుషేణుఁ ♦ డొప్పఁగాఁ బర్జన్యునకు శరభుఁడు వాయు♦నకును నప్ర
ఆ॥ మేయబలుఁడు వైన♦తేయజవుండు వజ్రయుతాంగుఁ డాంజ♦నేయుఁ డనఁగ
నరగ జనన మంది ♦ రెసిరి దిశకిందర, కిందళనరత లంకులంగతులు. ౪౮౧

హరిహయునకును — హరిహయుఁడు = ఆకుపచ్చనివన్నె గుఱ్ఱములు గలవాఁడు - ఇంద్రునకు, వాలి జననమందె యను నుత్తరక్రియతో నన్వయము. ఇట్లే సర్వత్ర చూచునది రామచంద్రమూర్తిచేఁ జంపఁబడిన వాలి యాయన కెట్లు సహాయుఁ డని చెప్పవచ్చుననఁగా, వాలిసుగ్రీవులిరువురు రామకార్యార్థమయియే సృజింపఁబడిరి. ఇది యేర్పాటు. దీనికే సమయ మని పేరు. ఇట్లు పుట్టిన వాలి రావణవధయందు రామచంద్రునకు సాహాయ్యముచేయుటకు మాఱుగా రావణాసురునితోఁ బరమమైత్రి గావించుటయేగాక కామాతురుఁడై రామకార్యమునకు సహాయపడఁగల సుగ్రీవునితో విరోధించి యాతనిని గూడఁ జంపి రామకార్యమునుఁ జెఱుపఁ జూచెను. ఇది యుద్దిష్టమైనను గాకున్నను

వాలిప్రయత్నమునకు ఫల మిది. కావున వధ్యుఁ డయ్యెను. కావుననే శ్రీ రామచంద్రమూర్తి సుగ్రీవునకుఁ జెప్పి పంపుటలో "సమయే తిష్ఠ సుగ్రీవ! మా వాలి పథ మన్వగాః" "దుశ్చ్యవనా త్మజ త్రోవ నీవునుం బోవకు వానరా! సమయమునుం దలపోయు మిఁకేని నీమదిన్" (కిష్కింధ. ౮౪౯-ప.) అని కదా చెప్పి పంపెను వాలివలె నీవును సమయమును బాటింపవేని వాని గతియే నీకు అని యర్థము ఈ సమయ మనునది రామసుగ్రీవులకు ఋశ్య మూకంబున జరిగినదే కాదు. తొలుత వాలిసుగ్రీవులజన్మమం దైనదే. కొందఱు మఱియొకవిధముగఁ జెప్పుదురు. అంగదునిమూలమున నని యెఱుంగ వలయు. మఱియు వాలి జన్మింపకయు, జన్మించియు సుగ్రీవునితో విరోధింప కయు, విరోధించియు రామచంద్రునిచే వధ్యుఁడుకాకయుఁ బోయెనేని సమూల రావణవధయే సెలవేలను. వాలి జన్మించి సుగ్రీవునితో విరోధించుటచేతనే కదా సుగ్రీవరామసఖ్యము కలిగెను. వాలికిని రామచంద్రమూర్తికి సఖ్యము కలిగి యున్నను నిష్ప్రయోజనమే. వాలిభీతిచే రావణుఁడు సీతను రామచంద్ర మూర్తి కిచ్చివేయును. లోకోపద్రవము తగ్గను. అపరాధి శిక్షితుఁడు కాక పోవును. కావున వాలి జన్మించుటయు సుగ్రీవునితో విరోధించుటయు రామ చంద్రునిచేఁ జచ్చుటయు రామసాహాయ్యార్థమే యని యెఱుంగునది. ఈ సమా ధానము నిరాక్షేప మని చెప్ప వలనుపడదు. వాలిసుగ్రీవులు కలిసియే రామ చంద్రునకు సహాయపడి యుండవచ్చును. ఆ మాత్రముచేతనే రావణుఁడు భయపడువాఁడు కాఁడు. "అతిసాహసతీ సీతా, హ్యాలిమూర్ఖశ్చ రావణ" యని కలదుగదా కావున వాలికి భయపడి సీత నిచ్చి యుండుననుట యంగీ కార్యము గాదు. మల్లయుద్ధమున రావణుఁడు వాలికంటె బలహీనుఁడే. కాని సేనసమేతుఁడైన రావణుని - వాలి యేమి చేయఁగలఁడు! ఇంద్రదత్తమైన హారముబలముచే నెగులుఁబడినవానిబలములో సగము వచ్చు నుగదా యంచురేని కన్నులకుఁగానరాక యుద్ధముచేయు నింద్రజిత్తు నేమి చేయఁగలఁడు? వాని బ్రహ్మాస్త్రపాతమును సహింపఁగలఁడా? కుంభకర్ణు నేమి చేయఁగలఁడు? ఇట్టివారిందఱు దనకు సహాయులను ధైర్యము రావణునకు లేదా? తన్నుఁ జెఱఁబెట్టిన కార్తవీర్యార్జునునిఁ జంపిన పరశురామునిఁ గ్రీడలో జయిం చినవాఁడు, తన్నుఁ జంకలో నిఱికించుకొని యేడుసముద్రముల ముంచిన వాలిని నొకబాణమునఁ జంపినవాఁడు, పదునాలుగువేలరాక్షసుల నత్యల్పకాలములో నొంటిగ నేలపాలుచేసినవాఁడు తనకంటె బలవంతుఁ డని రావణుఁ డెఱుఁగఁడా? రామభయములేనివాఁడైన నేల నంగతనమున సీత నేల తెచ్చును? తనసేనల తోడ నుత్తరగోగ్రహణంబున నొకయర్జునునకు నోడి పాఱియు మరల యుద్ధము నకు వెనుదీయని దుర్యోధనునికన్న రావణుఁడు తక్కువమూర్ఖుఁడా? 'శ్లో॥ ద్వా

విమౌ పురుషౌ మూర్ఖౌ, దుర్యోధనదుశ్శాసనౌ, గోగ్రహణవనభంగంచ దృష్ట్వా యుద్ధం పునః పునః.' అనికలదుగదా. ఇంద్రునకు సంకల్పము తనకొడుకు రామచంద్రునకు సహాయపడవలయు ననియే యుండవచ్చునుగాని వాఁడు పెంకెయైన నతఁడేమిచేయును? కాకాసురుఁడు నింద్రునికొడుకేగదా - అయన యిద్దరుకొడుకులు రెండురత్నములు.

వాలి మదోన్మత్తుఁడు కావున సుగ్రీవునివలె రామునెడ వినయవిధేయతలు గలవాఁడై యుండఁడు. కావున సమానగిశయం దుండు రామసుగ్రీవులసఖ్యమువంటి సఖ్యము రామవాలులకుఁ గుదిరియుండదు. సుగ్రీవాదుల ఋశ్యమూకమం దుండరేని సీతాభూషణప్రాప్తి లేదు. కావున వాలి చేసినది వ్యతిరేకసాహాయ్య మనవచ్చును. మందోదరీసోదరు లగు మాయావిని దుందుభిని వధించి వారిసాహాయ్యము రావణునకు లేకుండఁజేసెను శ్రీకృష్ణుఁడిట్టులేకదా చేసెను. ఇదియుఁ గొంతసాహాయ్యమే. హరికిన్ = సూర్యునికి, గురునకున్ = బృహస్పతికి, నరవాహనునకున్ = కుబేరునిక, అల=అప్రసిద్ధికెక్కిన, రోహితాశ్వునకున్ = అగ్నికి, అశ్వినేయులకు = అశ్వినీదేవతలకు, అప్పతి, అప్ + పతి = నీటికిఁ బ్రభువు - వరుణుఁడు, పర్జన్యునకున్ = వర్షాభిమానదేవతకు, అప్రమేయ = కొలఁతకు మించిన, వైనతేయుడవుండు = గరుత్మంతుని వేగమువంటి వేగముగలవాఁడు, వైనతేయుఁడు — వినతయొక్క పుత్రుఁడు, అపత్యార్థక తద్ధితాంతము, వజ్రాయితాంగుఁడు = వజ్రమువలె దృఢమయి యభేద్యమగు నవయవములు గలవాఁడు, వజ్రాయితము = వజ్రమువలె నాచరించునది. ఆచారార్థక క్యచ్ ప్రత్యయాంతము. ఆంజనేయుఁడు = అంజనాదేవి పుత్రుఁడు-అంజనీపుత్రుఁడు ఇది యపశబ్దము. (అంజనీ యని రూపములేదు.) అపత్యార్థకతద్ధితాంతము. సరగన్ = త్వరగా, నెరపిరి = లోకమునిండ వ్యాపించిరి. రుద్రుఁడు వానరసృష్టిచేయుటకుఁ గారణము రావణపక్షపాతమున ననుట సరిగాదు. 'శ్రీరామరామరామేతి' యని భార్యకుపదేశించినదానికి రామపక్షపాత మెక్కువ యని చెప్పవలయును. కాని రావణపక్షపాత మెక్కువ యనరాదు. హనుమంతుఁ డేకాదశరుద్రుఁ డని రుద్రతేజస్సునే వాయు వంజనయం దుంచెననియుఁ జెప్పుదురు. రాజు యుద్ధమునకు బయలుదేఱునపుడు భటులులోనగు పరివారము బయలుదేఱునట్లు భగవంతుఁడు దుష్టశిక్షకై యవతరించినపుడాయన యాశ్రితులందఱును భూమిపై నవతరింతురు. పుత్రకామేష్టిసమయమున శరణాగతిచేసిన దేవతలలో శివుఁడును జేరియుంటను రావణవధానంతరము శ్రీరాముని గాంచి స్తుతించినవారలలో నొకఁడును నగుటచే శివుఁడు రావణపక్షపాతి యని యాతనివధ యాయనకు నసమ్మత మని యాకారణమున వానరుని సృష్టింపలేదని చెప్పుట నిరాకరము. బ్రహ్మ యిచ్చినవరములకంటె శివుఁ డేమి

విశేషవరములు రావణున కిచ్చెను. ఈయభిప్రాయమంగీకరింపక హనుమంతుఁడు రుద్రాంశసంభూతుఁడు గాఁ డనుటకు నద్భుతరామాయణమున నొకయద్భుత కథ చెప్పఁబడినది. సువర్చల యను నప్సరస బ్రహ్మసభయందు నాడుచుండి యలక్ష్యముగాఁ బ్రవర్తించిన కారణముచే దానిని గృధ్రిగాఁ బుట్టుమని బ్రహ్మ శపించెనఁట. అది వేఁడుకొనఁగా నీవు గృధ్రివై యుండి దశరథుఁడు పాయసవిభాగము చేయుకాలమున నీవు కైకేయికిచ్చినదానిని దన్నికొని పోయి యంజనాద్రియందుఁ బడవేయుము. అప్పుడు నీశాపము తీఱు ననెనఁట అదియును కైకేయిచేతనున్న పాయసపాత్రమును దన్నికొని పోయి యంజనాద్రియందుఁ బడవైవ నందుఁ దపస్సుచేయు నంజనదోసిట నది పడెనఁట దానినామె స్వీకరింపఁగా నామెకు హనుమంతుఁడు పుట్టెనఁట. ఇట్టి కథలను బట్టి వాల్మీకిరామాయణమునకుఁ దక్షిణయాయన పేరుపెట్టి వ్రాయఁబడిన రామాయణములకుఁ దారతమ్యమును బుద్ధిమంతు లెఱుంగఁగలరు.

"రుద్రో బ్రహ్మణా నియుక్తోపి రక్షఃపక్షపాతిత్వా న్నకంచన సృష్టవాన్" బ్రహ్మచే నియుక్తుఁడయ్యు రుద్రుఁడు రాక్షసపక్షపాతముచే నెవరిని సృష్టింపలేదు అని గోవిందరాజీయవ్యాఖ్యయందుఁ గలదు. దీనిపై నొకఁడు రుద్రుని బ్రహ్మ నిర్దేశించినట్లు రామాయణమున లేదనియు రాక్షసపక్షపాతము వరములిచ్చిన బ్రహ్మకే కాని రుద్రునకు లేదనియు నిది శివుని దూషించుటకై వ్రాయఁబడె ననియు వ్రాసెను. గోవిందరాజవ్యాఖ్య కేవలవిష్ణుపక్షపాతము కల దనుటయందు సందేహములేదు. కాని యిచ్చట నాయన వ్రాసినది నిరాకరమనుట సరిగాఁ దోఁపలేదు. ఏలన "తతో దేవాస్స గంధర్వా, స్స రుద్రాస్సాప్సరోగణాః। స్తుతిభి ర్దివ్యరూపాభి స్తుష్టువు ర్మధుసూదనమ్" అని దశరథుయజ్ఞకాలమున విష్ణువును స్తుతించినదేవతలలో రుద్రుఁ డున్నట్టు మీఁది శ్లోకము వలన (౧౫ స) దెలియుచున్నది. బ్రహ్మ, యోదేవతలారా! వానరుల మీమీ యంశముల సృజింపుఁ డని యందఱకుఁ గలయఁ జెప్పెనుగాని, యో యింద్రుఁడా! యో యగ్నీ! యని పేరుపెట్టి పిలిచి యెవరికిఁ జెప్పలేదు. కావున సమష్టిమీఁద నందఱకుఁ జెప్పినపుడు వారిలో నొక్కొక్కనికిఁ జెప్పినట్లే గ్రహింపవలయును. శివునకు రావణునందుఁ బక్షపాతము లేదనుటయు సరిగాదు. (౧)వరము లిచ్చుటచే బ్రహ్మ రావణపక్షపాతి యగునేని శివుఁడును వరములు, చంద్రహాసము నిచ్చినవాఁడే కదా. (౨) ఉత్తరకాండమున ౬ వ సర్గమందు.

"ఇత్యుక్తస్తు సురైస్సర్వైః, కపర్దీ నీలలోహితః
సుకేశం ప్రతి సాపేక్షః, ప్రాహ దేవగణాన్ప్రభుః
అహం తా న్నహనిష్యామి, మయా వధ్యోహి తే సురాః."

అని చెప్పఁబడెను. మాల్యవదాదులను జంపు మని దేవతలు శివునిఁ బ్రార్థింపఁగా సుకేశునందలి ప్రేమచే నేను వారిని జంపను. వారు నా కవధ్యులని యాయన చెప్పెనఁట. ఇట్లు చెప్పుట పక్షపాతముచేత నేకదా? ఇది దోష మని చెప్పరాదు. ఏలన విష్ణువు సృత్రపక్షపాతి కావున నతని నేను జంపరాదు. అని యుపాయము చెప్పి పంపెను. ఇక్కడ శివుఁడు చేసినకార్యమదియేకదా.

౨. రావణాసురుఁడు శివభక్తకోటిలోఁ జేరినవాఁడు. వారిలో నతని పేరు పఠింపఁబడును. కార్తవీర్యార్జున యుద్ధసందర్భమందు ౩౧ వసర్గము.

"వాలుకావేదిమధ్యేతు । తల్లింగం స్థాప్యరావణ
అర్చయామాసగంధైశ్చ । పుష్పైశ్చామృతగంధిభిః."

అని రావణుఁడు నర్మదాతీరమందు శివలింగ పూజచేసినట్లు చెప్పఁబడెను. ఇది శివభక్తునిలక్షణముగదా - తన భక్తునియందుఁ దనకుఁ బక్షపాత ముండుట దోషమా!

3. శివోత్సవములందును శివునకు రావణాసురవాహన ముంచ యోగించుచున్నారు. ఈ కారణములచే రావణునందు శివునకుఁ బక్షపాతము కల దనియే చెప్పవలయును. అయినను వాఁడు చేయు దుశ్చేష్టలాయనకు సమ్మతమని చెప్పవలను పడదు. వానిమరణము సమ్మతము గనుకనే దేవతలతోఁ గలిసి వచ్చెను. రావణవధానంతరము శ్రీరామచంద్రమూర్తిని దర్శింప వచ్చెను.

హనుమంతుఁడు వాయుపుత్త్రుఁ డని యున్న దేకాని శివాంశసంభూతుఁ డని వాల్మీకిరామాయణమున లేదు. మీఁద నుదాహరించిన నుపనిషత్తునందు శివుని తేజస్సును వాయువు దెచ్చి యంజనయం దుంచెనని యున్నది.

ఇది కుమారస్వామిజననము వంటిది.

రుద్రులు పదునొకొండుగురు. రావణాసురునకు శిరస్సులు పది. రావణుఁడు శివపూజచేయునపుడు పదుగురురుద్రులను స్తుతించి తన్నొకనిని బూజింపమిచే నేకాదశరుద్రుఁ డగు ఏకపాదరుద్రుఁడు వానిపైఁ గోపించి హనుమంతుఁడుగా జన్మించి రావణవధయందు ముఖ్యసహాయుఁ డయ్యెనని యొకచో వ్రాయఁబడి యున్నది. ఏది యెట్లున్నను శ్రీరామునందు భక్తిగల శివుఁడు శ్రీరామునకు సాహాయ్యము చేయలేదనుట యంగీకార్యము కాదను తలంపుతో నుపనిషద్వాక్యము నాధారముచేసికొని యాయనసాహాయ్యము చేసినట్లు ముందు వ్రాయఁబడెను, వారివారిరుచికొలఁది వారువారు గ్రహింపవచ్చును.

ఇంతవఱకుఁ బ్రధానవానరసృష్టిని జెప్పి యిఁక సాధారణ వానర సృష్టిని జెప్పుచున్నాఁడు. దశ .. గతులు = రావణుని కంఠమును ఛేదించుటయందు నభిలాషగలవారు, అకుంఠగతులు = అడ్డగింపఁబడని గమనము గలవారు.

తాత్పర్యము.

ఇంద్రునకు వాలి - సూర్యునకు సుగ్రీవుఁడు - బృహస్పతికిఁ దారుఁడు - కుబేరునకు గంధమాదనుఁడు - విశ్వకర్మకు నలుఁడు - అగ్నిహోత్రునకు నీలుఁడు - అశ్వినీకుమారులకు మైందద్వివిదులు - వరుణునకు సుషేణుఁడు - పర్జన్యునకు శరభుఁడు - వాయువునకు మహాబలశాలియు గరుడవేగుండును వజ్రమువంటి దేహముగల యాంజనేయుఁడును మఱియును రావణాసురుని వధయందుఁ గాంక్షగల మహాబలులు మహావేగులు నగు వానరులు జనించిరి.

తే॥ మేరుమందరతుల్యులు • వీరవరులు, కామరూపులు ప్రబలవి•క్రాంతిరతులు
దృఢశరీరులు గోపుచ్ఛ•ఋక్ష కానన, నోకసులు పుట్టి రెలమి నసం•ఖ్యాకులగుచు. ౪౮-౨

విక్రాంతిరతులు = పరాక్రమమున నభిలాషగలవారు, గోపుచ్ఛ = కొండముచ్చులు, కానన + ఓకసులు = అడవి వాసములుగాఁ గలవి.

తాత్పర్యము.

మేరుపర్వతముతోను మందరపర్వతముతోను సమానమైన దేహములు గలవారు, వీరులందు శ్రేష్ఠులు, కోరినరూపము ధరింపశక్తిగలవారు, విశేష విక్రమముగలవారు, దృఢములై రోగములు నొప్పులులేని దేహములుగలవారు నగు గోలాంగూలములు భల్లూకములు వానరులు నగువారు లెక్కకు మిక్కిలి యైనవారు జనించిరి.

కం॥ ఏదేవత కేరూపము, యాదేవతరూప మూని • యవనీస్థలిపైఁ
బ్రాదుర్భావము నొందిరి, యాదృఢసత్త్వములతో వ•నౌకఃప్రవరుల్. ౪౮-౩

ఆదృఢసత్త్వము = ఏయే దేవతాంశమున జన్మించిరో యాయా దేవత యొక్క బలమువంటి దృఢబలముతో, వనౌకఃప్రవరుల్ = వానరశ్రేష్ఠులు, ఆదేవత రూపమూని యనుటచే ముఖముమాత్రము వానరాద్యాకారముగనున్నను దక్కిన దేహము యొక్కట్లు తండ్రిని స్ఫురింపఁజేయుచుండెనని భావమగును. నిప్పు నీళ్లు గాలి యివి యాయా దేవతల నిజమైన స్వరూపములు గావు. ఈరూపములతో దేవతలు గానవచ్చియో కానరాకయో మనల రక్షించుచున్నారు. కావున నిచ్చట రూపమనునది వారివారి నిజమైన రూపములని గ్రహింపవలయునుగాని మనకుఁ

గానవచ్చు రూపము లని గ్రహింపరాదు. వన + ఓకము - వనౌకము = అడవి నివాసముగాఁ గలది.

తాత్పర్యము.

ఏ దేవత కేది రూపమో - యే దేవత కెంత బలమో - యే దేవత కెంత దార్ఢ్యమో యట్టి రూపము - అట్టి బలము - అట్టి దార్ఢ్యము గలవారై యాయా దేవతలకు వానరాదులు పుట్టిరి

సీ॥ ఋక్షీతతికిఁ గిన్నరీచయంబులకుఁ గోలాంగూలసతుల కింపురుషాంగనలకు
దేవతాస్త్రీలకు దివ్యర్షిదారలకు, నహియోషలకుఁ దార్క్ష్యమహిళలకును
నప్సరఃకింపురుషాంగనలకు నాగకన్యకాతతులకుఁ గ్రసిద్ధులకు
విద్యాధరాబలావితతికి వరాంగనా,రాగోపాలకు యక్షనారులకును
తే॥ సుతులఁ గలిగింప నప్డు దేవతలు ధరణి, వారువారికి నెలుగును ఘోరకాయులు
గోళ్లుఁ గోఱలు నాయుధంబులుగను, వివిధశస్త్రాస్త్రవిదు లయి వేఁకమీఱి. ౧౮-౨౪

ఇంతవఱకు వాయుజాతిస్త్రీలయందు సంగా స్త్రీయందుఁ గోతు లుత్పత్తియైనట్లు చెప్పఁబడెను ఇఁక భిన్న తిర్యక్‌స్త్రీలయందును వానరాదులు పుట్టుట చెప్పఁబడును ఋ - కిన్నరీ-ఇవి స్త్రీప్రత్యయములు. ఋక్షజాతి స్త్రీవాచకములు సక్షిప్తములు నిట్టి యెఱుంగవలయును దివ్యర్షి - దివ్య + ఋషి = దేవఋషులయొక్క, దారాః = స్త్రీలయందును, అహియోషలః = వాసుకిమొదలగువారి భార్యలయందు, తార్క్ష్యమహిళలు = గరుడజాతిస్త్రీలయందు, నాగకాంతలు = దిగ్గజములభార్యలయందు, అబలా వితతి = స్త్రీసమూహము, వరాంగనా = ఉత్తమస్త్రీ, అప్పుడు = విష్ణువుజననకాలముననే ఇఁక వారి ప్రభావమును చెప్పుచున్నారు శస్త్రాస్త్రవిదులు = దేవతలపుత్రులుగావున స్వయముగానే శస్త్రాస్త్రజ్ఞానము కలవారు కాని వానితో యుద్ధముచేయరు. వీరి యాయుధములు నఖదంతశిలాదులు, శస్త్రాస్త్రజ్ఞానము పరులు తమపైఁ బ్రయోగించిన వానిచే బాధలేక రక్షించుకొనుటకే కాని ప్రయోగించుటకుఁ గాదు. రామరావణయుద్ధమందు రామలక్ష్మణులు దప్ప రామునిపక్షమున నస్త్రయుద్ధముచేసినవారు లేరు. శస్త్రాస్త్రములు వానరులు ప్రయోగించుట స్వభావవిరుద్ధము. అట్లు వారు ప్రయోగించిరేని వీరు స్వభావవానరులుగారని దేవతలని రావణుఁడెంచును. అప్పుడు వారిచే రావణునకు బాధలేదు. వీరందఱు సహజముగ వానరులే యని వానికిఁ దోఁపఁజేయవలయును. శ్రీరామచంద్రమూర్తి యిట్లులేకదా వర్తించెను.

దేవతలు పశుపక్ష్యాదులతో కోక్కోకశాస్త్రప్రకారం మామాంతరసంభోగ ముచే సంతానము గలిగించి రని యెంచరాదు. తమసంకల్పబలముచేఁ దామే యాయాజాతిస్త్రీలయందు నాయాయాకారములు ధరించి జన్మించి రని యెఱుఁగ వలయును.

కొంతకాలము పూర్వము స్త్రీ పురుషసంభోగములేక నే సంతానము సృష్టి - స్పర్శ - సంకల్పములచేఁ గలుగుచుండె నని విష్ణుపురాణమునఁ గలదు. రామాయణమునం దలి ప్రస్తావనఁ దెల్పెన దేకదా. ఒకానొకజంతువు పోతు పంక్తి స్పర్శము దూరముననుండి స్త్రీ గర్భము ధరించుచున్నది. "తతః ప్రభృతి మైథునో ప్రజా మైథునసంభవా । సంకల్పా ద్దర్శనాత్ స్పర్శాత్పూర్వేషా మభవత్ ప్రజా" వి - పు ౧-౧౫-౭౮.

తాత్పర్యము

ఋక్షస్త్రీలకు - కిన్నరస్త్రీలకు - పన్నగస్త్రీలకు - గరుడస్త్రీలకు - దేవతాస్త్రీలకు - గంధర్వస్త్రీలకు - అప్సరస్త్రీలకు - కింపురుషస్త్రీలకు - నాగస్త్రీలకు - సిద్ధస్త్రీలకు-విద్యాధరస్త్రీలకు-మునికాంతలకు-యక్షస్త్రీలకు-దేవతలు కుమారులుఁ గలుగఁజేయఁగా వారు భూమియందుఁ బ్రబలి తాలు-రాళ్లు-గోళ్లు-గోటలు నాయుధములుగఁ గొని నానాశస్త్రప్రయోగములు విలుపులు తెలిసిన వారై ప్రబలిరి

ఉ॥ కొండలు పిండిగొట్టు, ద్రుమకోటులఁ బెండ్లఁగ నొక్కిపెట్టు, మా
ర్తాండుని మ్రింగఁ, బట్టు ఘని తాయుచుఁ బట్టు నభోస్థలంబు, సము
ద్రుండని ద్ధంగఁ గల్పఁ, బర తాడనమాత్ర యుర్విఁ గూల్పు, చా
చండపరాక్రముల్ గలిసి తోపుల మొత్తను నింపి రెయ్యెడన్. ౪౮౫

ద్రుమ = వృక్షములయొక్క, పెండ్లఁగ = పెల్లగొఁడ మిండివేయఁగ, మార్తాండునిన్ = సూర్యుని, మ్రింగుటకుఁ దగువానికొఱకు మార్తాండుఁడు అపత్యార్థకగద్ధితాంతము. పూ-మార్తాండసుఁడు = గడించిన బ్రహ్మాండమును బ్రతికించువారను, నభ + అవనులు = ఆకాశమును - భూమిని, సముద్రుండ = మిక్కిలి గర్వముతో, కల్పన్ = కల్పివేయఁగా, పరతాడనమాత్రన = కాలి దెబ్బచేతనే, చండ = తీక్ష్ణమైన.

తాత్పర్యము.

ఇట్లు జనించిన వానరాదులు కొండలనైనను బిండిగొట్టగలకును, జెట్లగుంపులను నొక్కసారిగఁ జెండివైచుటకును సూర్యునినైన మ్రింగుటకును భూమి నొక చేత నాకాశము నొకచేతఁ బట్టుకొని తాలముకొట్టుటకును సముద్రమును బల

ముచేఁ గలుపుటకును గాలిదెబ్బచేతనే నేలకూలిపోవునట్లు చేయుటకును బలప రాక్రమములు గలవారు జన్మించి భూమియందెయు నాక్రమించియుండిరి.

క॥ పట్టుదురు మేఘముల నేఁ, గొట్టుదు రటవీప్రమత్తకుంజరతతులన్
దట్టుదురు నేలఁ బడ దివి, ముట్టసువిహగముల నాదమున నాకీశుల్. ౭౭౬

మేఘములనేన్ = అవిరిగాపముగ నందు మేఘములనైన, అటవీ తతులన్ = అడవిలోని మదించిన యేనుఁగుల సమూహములను; దివి ముట్టిన విహగముల నేలఁబడఁదట్టుదురు. అని యన్వయము - విహగములు = పక్షులు, నాదమున = కంఠధ్వనిచేత, ఆకీశుల్ = ఆక్రోతులు, నాకి + ఈశుల్ = దేవతా శ్రేష్ఠులు.

తాత్పర్యము.

ఆవానరులు గాలివలెనుండి చేచిక్కని మేఘములనైన పట్టకొందురు. అడవియందు మిగుల మదించి తిరుగు నేనుఁగులనైనఁ గొట్టుదురు. ఆకాశమునఁ బరువుపాఱుచున్న పక్షులనైన నేలఁబడఁ గొట్టుదురు. ఆకీశులు నాకీశులగుటచే నిట్లు చేయఁ గలిగిరి.

ఉత్సాహము॥ కామరూపధారులుం బ్రకాశమాన తేజులన్
ధీమతుల్ ప్రథాయుతుల్ సుధీరతావిరాజితుల్
భీమవేగభూరిశౌర్యవిక్రమేద్ధయూథపుల్
భూమిశతసహస్రశతము పుట్టె క్రాలుచుండఁగన్. ౭౭౭

సకలవానరసంఖ్యయుఁ జెప్పుట యసాధ్యము కావున వారిలోని మేటుల సంఖ్యను జెప్పుచున్నాఁడు. ప్రథాయుతుల్ = ప్రఖ్యాతితోఁ గూడినవారు. ధీమతుల్ = బుద్ధిచేఁ బూజింపఁబడువారు - 'మతౌ సంమిత పూజితౌ' నానా - ర. సుధీరతా = మంచి ధైర్యముచే, విరాజితుల్ = ప్రకాశించువారు. భీమ యూథపుల్ = భయంకరమైన వేగముతోను, అధికమైన బలపరాక్రమములతోను సంపూర్ణు లగు వానరసేనానాయకులు. శతసహస్రశతము = నూఱు లక్షలు. ఉత్సాహమునకు నేడు సూర్యగణములు నొకగురువు. ఐదవగణము మొదటియక్షరము యతి.

తాత్పర్యము.

కోరినరూపముల ధరింపఁగలవారును, తేజముచేఁ బ్రకాశించువారును, బుద్ధిచేఁ బూజింపఁబడువారును, కీర్తిమంతులును, మంచిధైర్యవంతులును, భయంకరవేగము గొప్పశౌర్యము పరాక్రమము వీనిచేఁ బొగడ్తగల యూథనాయకులును లక్షలకొలఁది భూమిపైఁ బుట్టి ప్రకాశించుచుండిరి.

మ త్తకోకిలము॥ అట్టిమర్కటయూథపాళుల ♦ యందు మిక్కిలిమేలు లై
దిట్టలై రవిపుత్రుఁ డాదిగఁ ♦ దేజరిల్లిరి యూథనా
థేట్టు లీప్లవగేంద్రులుఁ జని ♦ యింపఁ జేసిరి ధీరతా
పట్టభద్రుల శౌర్యరుద్రుల ♦ స్వామికార్యవినిద్రులన్. ౨౯

ప్రధానులయందును బ్రధానులఁ జేరుకొనుచున్నాఁడు.-మర్కట యూథప + ఆళులన్ = వానర సమూహమును రక్షించువారి గుంపులో, యూథము = సేనా సమూహము- దానిని రక్షించువాఁడు యూథపుఁడు, దిట్టలై = ధైర్యవంతులై, రవిపుత్రుఁడాదిగ = సుగ్రీవుఁడు మున్నగువారు-ఇక్కడఁ బెద్దవాఁడైన వాలినిఁ జెప్పక సుగ్రీవునిఁ జెప్పుట యతఁడు రామునికార్యసహాయుఁడగుటచేతనే. యూథనాథ + ఈట్టులు = యూథపులకుఁ బ్రభువులన్, ధీరతా . భద్రులన్ = ధైర్యముచే గొప్పవారలన, శౌర్యరుద్రులన్ = పరాక్రమమున రుద్రులవలె భయంకరులును, వినిద్రులు = జాగరూకులు వారు. మత్తకోకిలము- ర-స-జ-జ-భ-ర-గణములు. ౧౧ వ యింట యతి.

తా త్ప ర్య ము.

అట్టివానరయూథపతుల గుంపులయందు మిక్కిలి గొప్పవారై శూరులైన సుగ్రీవుఁడు మొదలగువారు యూథనాథులై విలసిల్లిరి ఈ వానరులును ధైర్యవంతులు శౌర్యవంతులు స్వామికార్యధురీణు లగువారిని బుట్టించిరి.

క॥ కొందఱు ఋషవచ్ఛైలముఁ, గొంద ఱు నానావిధాద్రి ♦ కూటచయములన్
గొందఱు కాంతారంబులు,మందిరములుగా గ్రహించి♦మలయుచునుండన్. ౩౦

వా రుండుస్థలమును జెప్పుచున్నాఁడు.

ఋషవత్ + శైలములన్ = ఋషవంతమను పర్వతములన, నానా. చయములన్ = అనేకములైన పర్వతశిఖరసమూహములును, కాంతార ములన్ = అడవులును, మందిరములు = గృహములు- ఉండుస్థలములు, మలయుచున్ = తిరుగుచున్.

తా త్ప ర్య ము.

ఇట్లు పుట్టిన వానరులలోఁ గొందఱు ఋషవంతమును కొందఱు నానావిధములైన కొండశిఖరములను కొందఱు అడవులను నునికిపట్టులుగాఁ గొని సంచరించుచుండిరి.

ఉ॥ వానరకోటి నెల్లఁ బరి♦పాలన సేయుచు గోత్రపక్షభి
త్సూనుఁడు సార్వభౌముఁ డయి ♦ సూర్యజుఁడున్ యువరాజుగా, హనూ

మారుతుఁడు నీలుఁడుఁ నలుఁడు • మంత్రులుగా, సమదారిభీకరుం
డై నుతిఁ గాంచె, కీశులు న•యంబునఁ గొల్చిరి వారి నన్యులన్. ౭౯౦

ఇఁక వానరులలో రాజ యువరాజ మంత్రులఁ బేర్కొనుచున్నాఁడు.

గోత్ర సూనుఁడు - గోత్ర = పర్వతములయొక్క - వ్యు. భూమిని రక్షించునది కావున గోత్రము, పక్ష = ఱెక్కలను, భిత్ = ఛేదించినవాఁడగు నింద్రునియొక్క, సూనుఁడు = కుమారుఁడు- వాలి, సార్వభౌముఁడు = వానరచక్రవర్తి, యువరాజు = పట్టాభిషిక్తుఁడైన పెద్దరాజు క్రింది వ్యవహారముల నిర్వహించు చిన్నరాజు- సుగ్రీవుఁడు, నల నీల హనుమంతులు మాత్ర మిటఁ బేర్కొనఁబడిరి. వీరుగాక మఱియుఁ గొందఱు గలరు. సమద + అరి + భీకరుండై = మదముతోఁ గూడిన శత్రువు లగు దుందుభి రావణాదులకు భయంకరుఁడైన, వారిని = రాజ యువరాజ మంత్రులను, అన్యులన్ = ఇతర యూథనాథులను, కీశులు = వానరులు, పాలన శబ్దము చరిత్రాదులలోఁ జేరుటచే మువర్ణకలోపము. వ్యాక. హనూమానుఁడు - సు-వ్యా-తత్సమ. ౧౫ సూ.

ఒకానొకచో మహత్త్వంబునందు మతుప్త్రకారమున కానాదేశంబు విభాషనగు - హనుమంతుఁడు - హనమానుఁడు, భగవంతుఁడు - భగవానుఁడు.

తాత్పర్యము.

ఈ వానర సమూహమునెల్ల రక్షించుచు నింద్రపుత్రుఁడైన వాలి రాజుగానుండి సుగ్రీవుఁడు యువరాజుగా,హనుమంతుఁడు-నీలుఁడు-నలుఁడు-మంత్రులుగా శత్రుభయంకరుఁడై ప్రసిద్ధిగాంచెను వానరులందఱు వారినిగొందఱు, కొందఱు మఱికొందఱను సేవించుచుండిరి

ఆ॥ వైనతేయబలులు • ప్రధనవిశారదుల్, వివిధదేహచిహ్న•వేషధరులు
వ్యాఘ్రసింహభుజగ•భయదులై నిండిరి, గానలందు విరివి • కోనలందు. ౭౯౧

వైనతేయబలులు = గరుడుని బలముగలవారు, ప్రధన = యుద్ధమునందు, విశారదుల్ = పండితులు - సమర్థులు, వివిధ ధరులు = అనేకవిధములగు దేహములు - చిహ్నములు - వేషములు ధరించినవారు, బిరుదులు = చిహ్నములు - వేషములు శరీరాసాధారణధర్మములు, విరివి = విశాలమైన.

తాత్పర్యము.

గరుత్మంతునివంటి వేగముగలవారును, యుద్ధమునందు నిపుణులును, నానావిధదేవతల నానావిధ చిహ్నములు వేషములు ధరించినవారును నగు వానరాదులు పులులకు సింహములకు సర్పములకుఁగూడ భయము గలిగించువారై యడవులందును విశాలమైన కోనలందును నిండియుండిరి.

మనోహారిణి॥ జలధరబృందా॰చలకూటనిభుల్, బలమదవంతుల్॰ప్లవగప్రముఖుల్
వెలసిరి సీతా॰విభుసాహ్యమ్ముకై, బలకొని చక్షు॰ర్భయదాకృతులన్. ౮౯ ౨

జలధర = మేఘములయొక్క, బృంద = సమూహములవంటి, అచల = పర్వతములయొక్క, కూట = సమూహములవంటి లేక శిఖరములవంటి, నిభులు = సమానులు, ప్లవగ = వానరులలో, ప్రముఖుల్ = ముఖ్యులగువారు, చక్షుః + భయద + ఆకృతులన్ = చూపులకు భయముకలిగించు నాకారములతో; బలకొని = అతిశయించి, బలము + కొని = బలకొని, సాహ్యమ్ముకై = సాయపడుటకై.

ఆక్షేపము.

పూర్వము వానరసృష్టి చెప్పినప్పుడు నరవాహనునకు గంధమాదనుఁడు - అప్పటికి సుషేణునకు పర్జన్యునకు శరభుఁడని బాలకాండమునఁ జెప్పఁబడి నది రావణునకు శార్దూలుఁడు చెప్పినసమయమున, 'ధర్మునిపుత్రుఁడు ధర్మచిత్తుఁడు విఖ్యాతుని సుషేణుండనియు' (౬-౩౯ స) ౬-౮౨ సర్గలో 'వైశ్రవణాత్మభవులు గజగవాక్షగవయులును గంధమాదనుండు శరభుండు' అనియు యుద్ధకాండమునఁ జెప్పఁబడెను. ఇవి పరస్పరవిరుద్ధములు.

సమాధానము.

"నీ మహనీయకావ్యమున నేమియు దప్పు కానంబడ దెరా" అని బ్రహ్మచేత వరముపొందిన వాల్మీకి చెప్పినదానియందుఁ దప్పు యుండఁజాలదు. కావున వాల్మీకి యిచ్చటఁ జెప్పినదే సరి. శార్దూలుఁడు చెప్పినది వాల్మీకి చెప్పినదికాదా యందు రేని-కాదు, శార్దూలుఁడు చెప్పినదానిని వాల్మీకి చెప్పెనుగాని యది వాల్మీకి స్వవాక్యము గాదు. శార్దూలుఁ డొకటి చెప్పియుండ మఱొకటి వాల్మీకి చెప్పియుండెనేని వాల్మీకి యసత్యము వ్రాసినవాఁడే యైయుండును. శార్దూలుఁడు చెప్పినదానిని చెప్పినట్టు జెప్పుట యసత్యము వ్రాయుటేకదా. శార్దూలుఁడు కల్ల చెప్పెనా యనఁ దెలిసి చెప్పినవాఁడు కాఁడు. వాఁడు వేగులవాఁడు. వాఁడు బుద్ధిచే నూహించి చెప్పెనో యెవ్వఁడైన ననుకొనుచుండిన విని చెప్పెనో. వాని యూహయో విన్నదియో యబద్ధమై యుండవచ్చును. వాఁడు సత్యమే విని యుండినను వాఁడు రావణునితోఁ జెప్పునప్పుడు వానరులచేఁ జావు దెబ్బలు తిని కొఱఁతయూపిరితో నున్నట్లుండెను. ఇట్టి మతిభ్రమణదశయం దేమిచెప్పెనో. వానిస్థితి యుద్ధ-౬-౨౭ మొదలు ౬-౩౧ వఱకుఁ దెలుపఁబడినది. ఇట్టి తబ్బిబ్బుల దశయందుండు వేగులవానిమాట సత్యముగా నెట్లు గ్రహింపవచ్చును? హనుమంతుఁడు ధాన్యమాలినిని మండోదరి యని భ్రమించి వానరులతో సీత కడ్డ

పడినది మండోదరి యని చెప్పలేదా? అట్లే యిది. జరిగినది జరిగినట్లు చెప్పుటే వాల్మీకి తనకుఁ గృత్యముగా నంచుకొనెను గాని పాత్రములలోపముల నవరింప వలయు నని యాయన తలంపుగాదు. అట్టి తలంపేయుండిన రామచంద్రమూర్తి యందు లోపము లని మనకుఁ గానవచ్చునవికూడ నాక్షేపములకు నెడము లేకుండ సవరించియుండును. వాలిని నెదుట నిలఁబడి చంపె నని వ్రాసియుండినను ఖరాసురయుద్ధంబున వెనకంజ పెట్టిన విషయమును, సుమంత్రు నసత్యమాడఁ బ్రేరించినవిషయమును వ్రాయకుండినను నాక్షేపించువా రెవరు? అసత్యభీతియే యాయనను బాధించినది.

ఆ క్షే ప ము.

ఋశ్యశృంగుఁడు పుత్రకామేష్టి నారంభించునపుడు దేవతలు యజ్ఞసభ యందుఁ జేరి యాలోచించిరినియు, పిదప భగవంతుఁడు దశరథపుత్రుఁడు గాఁ దలఁచెననియు, పిదప బ్రహ్మ యవతరింపఁగల విష్ణువునకు సాహాయ్యార్థమై వానరుల సృష్టిచేయుఁ డని దేవతల కుత్తరువు చేసినట్లు నిట నన్నదికదా. ఇది కొన్ని సందర్భములలో విరోధించుచున్నది. ఎట్లన.—రావణదిగ్విజయకాలమున వాలి సుగ్రీవు లున్నట్లు తేర్పడుచున్నది. రావణదిగ్విజయకాలమో కృత యుగమో త్రేతాదియో యని యేర్పడుచున్నది. కార్తవీర్యార్జునునిచే చెఱ సాలనుండి విడివడఁగానే వాలిమీదికిఁ యుద్ధమునకుఁ బోయిన ట్లున్నది. కావున వాలి కార్తవీర్యార్జునులు సమకాలికు లని యేర్పడుచున్నది. మయుఁడు మండో దరిని రావణున కిచ్చి వివాహముచేయుసమయమున "ఇరువురు కొడుకులు నాకు న। మరసుందరియందుఁ గలరు మాయావి యనఁగ । బరఁగెను జ్యేష్ఠుఁడు దుందుభి । వరబలుఁడు ద్వితీయుఁడగుచు వ_ర్తిలు జగతిన్." ఉత్త- ౨౯ ౨. అని చెప్పెను. వీ రిరువురు వాలితో యుద్ధముచేసి చచ్చిరి. ఇటు చూచినను రావణ దిగ్విజయకాలమున వాలి సుగ్రీవు లున్నట్టు తేర్పడును. దుందుభిని వాలి చంపఁ బోయినపుడు సుగ్రీవుఁడుకూడఁ బోయినవాఁడే యగుట వాలి సుగ్రీవు లేక కాలమువా రగుదురు. ఇట్టి వాలిసుగ్రీవులు రామచంద్రమూర్తితోడ సమ వయస్కు లెట్లగుదురు? మైందద్వివిదులును చిరకాలమువారు. శుకుఁడు రావణు తోఁ జెప్పిన మాటలవలన వీ రమృతప్రాశులనియు క్షీరసాగరమథనము నాటివా రనియు దెలియనయ్యెడి. క్రథనుఁడు దేవాసురుల యుద్ధమునాఁటివాఁ డని సారణుఁడు రావణుతోఁ జెప్పినవాక్యమువలన నేర్పడుచున్నది.

చూడు - యుద్ధ - ౫౭౪పద్యము. ఇట్టివారు పెక్కురుగలరు ఇట్టివారు రామ సవయస్కు లనుట సరిగాదు.

మొదటి సమాధానము.

బ్రహ్మ సామాన్యముగా దేవతల నందఱఁ జూచి వానరసృష్టి చేయుఁడని నియమించెను. ఆపై దేవతలు వానరసృష్టిచేసిరని యున్నది. "సరిగ జననమందిరి సిరి" యని వానరోత్పత్తి సందర్భమున వాక్యము - బ్రహ్మ యాజ్ఞ యిచ్చిన తరువాతనే లోకములోని వానరులందఱు పుట్టిరని యంతకుముందు లోకమున వానరులే లేరని యర్థము కాదు. రామకార్యమునకు వానరసాహాయ్యము విస్తారముగఁ గావలసియుండుననియు విస్తారముగ వానరసృష్టియే చేయుఁడనియు బ్రహ్మ యాజ్ఞగాని యంతకుముందున్నవారు పనికిరారని యాయన యభిప్రాయముకాదు. కావున జాంబవంతునివలె మఱికొందఱు కాలాంతరమున ముందే జనించియుండిరి అట్టివారు రామకార్యమున కుపయోగించువారును చేర్పఁబడిరి. వీరికార్యమున కుపయోగించువారు గనుకనే వీరితండ్రులు మరల వానరుల సృజింపనైరి. ఇంతవఱకు వానరుల సృజింపనివారిప్పుడు బ్రహ్మ వాక్యానుసారము సృజించిరి. కావున నీ సామాన్యవానరసృష్టియందు "సుతులఁ గలిగింపనప్పుడు దేవత" లని యున్నది గాని రం౧వ పద్యములోని వానరుల విషయమై లేదు. వానరులు పుట్టిరని మాత్రము చెప్పఁబడెను. కావున సామాన్యవానరులే రామసవయస్కులుగాని వాల్యాది పూర్వవానరులు గారు. వానరులందఱు రామసవయస్కులని రామాయణమున లేదు.

రెండవ సమాధానము.

వాల్యాదులు రామసవయస్కులే - వాలి కార్తవీర్యార్జునని కాలమునాటి వాఁడు గాఁడు - రావణుఁడు కార్తవీర్యునిచేఁ బరిభవింపఁబడిన తరువాత నెంతో కాలమునకు వాలిచే జితుఁడయ్యెను. రావణార్జున యుద్ధమైనతోడనే వాలిరావణయుద్ధమని యాసందర్భమున లేదు. వాల్యర్జును లిరువురు రావణు నోడించిరనిన యగస్త్యవాక్య మా యిర్వురు సమకాలికు లని స్థాపింపఁజాలదు. ఏలన రావణాసురుఁడు జయించినవారినందఱ నగస్త్యుఁడు చెప్పఁగా విని శ్రీరాముఁడు " లోకంబు శూరత్వశూన్యమై స్రుక్కెనయ్యా! రాజొండెఁ గాకున్న రాజమాత్రుండైనఁ గలుగఁడా మొక్కఁడా బలియు గెలువ, నక్కటా క్షత్రియుల్ హతవీర్యులైరికా నిర్జితులైరికా నిఖిలనృపులు" అని ఉత్త-౬౯ సవ. అని యడుగఁగా నప్పుడు రావణాసురుని గెలిచినవారికథలు చెప్ప దొడఁగెను గాని యివియన్నియు నొకటివెంట నొకట యవ్యవధానముగ జరిగినవని చెప్పలేదు రావణుఁడు గెలిచిన సురథుండు గాధి పురూరువుండు గయుఁడు దుష్యంతుఁడు మరుత్తు అనరణ్యుఁడు - వీరందఱేక కాలము వారా? కృష్ణుఁడు కంసశిశుపాలదంతవక్త్రులను (కొందఱు దంతవక్త్రుఁడందురు) జయించె ననునివి యేకకాలమున జరిగె ననవచ్చునా? అదియునుగాక ఉత్తర

౭౫౬-౭౫౭ పద్యములఁ జదివినఁ గార్తవీర్య - వాలి చరిత్రలకు నడుమ నెంతో కాలము కడచిన ట్లర్థ మగును. కావున నగస్త్యవాక్యము కాలము నిశ్చయింపదు. దుందుభి రావణుభార్యకు సోదరుఁడే కావున నించుమించు రావణ సవయస్కుఁడై యుండి రావణువలెనే వాఁడును వాలితో యుద్ధముచేసి యుండవచ్చునుకాని యేదిముందో యేదివెనకో రెంటికి నడుమ నెంతకాలము జరిగెనో తెలియరాదు. ఆలోచింపఁగా దుందుభివధయే వెనక జరిగె నని తోఁచుచున్నది. రావణదిగ్విజయ మొకయేట జరిగినపని గాదు. ఒకసారి దేశమంతయుఁ జుట్టివచ్చి యింటనున్నవాఁడును గాఁడు. శూరుఁ డనుపేరు విన వచ్చినచోటికంతయుఁ బరువెత్తుచుండెను. కావున సర్వహేతువులు అన్యథాసిద్ధము లగు సందేహహేతువులేకాని యన్యథాసిద్ధములయిన నిశ్చాయక హేతువులు గావు. మైందద్వివిదు లమృతము ద్రావినవా రనిన దేవతలంతటి బలవంతు లని క్షుద్బాధలేనివా రని యర్థము - ఆఁకలిబాధ విశేషములేనివారిని అమృతముద్రావినారని యనుట వాడుకయందును గలదుగదా. అట్లు గాకున్న నమృతము ద్రావినవారికి మరణము లేదుగదా. ద్వివిదుఁడు బలరాముచే నెట్లు చచ్చెను ? ఇట్లే దేవాసురకాలమునాఁటివారనుటయు నంతటిగొప్పవారని యర్థముకలది. మఱి సారణశార్దూలవాక్యము లంతగాఁ బ్రమాణములు కావు.

మూఁడవ సమాధానము.

రావణోపద్రవమును గూర్చి బ్రహ్మ పూర్వమే యాలోచించి దేవతలతో క్షీరాంభోధికిఁ బోయి భగవంతునిఁ బ్రార్థింపఁగ నాయన తాను జేయఁదలఁచిన కార్యమును బ్రహ్మతోఁ జెప్పెను. అప్పుడు బ్రహ్మ దేవతలను వానరసృష్టి సేయుఁ డని యాజ్ఞాపింపఁగా నావిషయ మిట సందర్భానుసారముగఁ గవి వ్రాసెను గాని యంతమాత్రముచేతనే వానరసృష్టి యప్పటిదే యని యంతకుఁ బూర్వము లేదని చెప్పరాదు. దీనికే రామాయణచంపువునందు భోజరాజును వ్రాసియున్నాఁడు. కాఁబట్టియే సనత్కుమారున కీ విషయము పూర్వమే తెలిసినది. దానినే సుమంత్రుఁడు వినుచుండఁ దెలిపెను. దానిచేతనే విష్ణువు సంకేతముచేసికొన్నట్టు దేవతలందఱుఁ గూడియున్నచోటునకు వచ్చుట. బ్రహ్మ యజ్ఞస్థలమున విష్ణువును బ్రార్థించినది దేవావధ్యుఁ డగు రావణు వధింప భగవంతుఁడు మనుష్యుఁడుగా నవతరింపవలయునని దాని కిది సమయ మని. ఈసందర్భమునఁ బదముల కర్థ మేతదనుగుణముగఁ జేసికొనవలయును.

రామావతారవిషయము యజ్ఞసమయమందే మొదట వెలువడలేదు. వసిష్ఠ విశ్వామిత్ర నారద భరద్వాజ శరభంగ సుతీక్ష్ణాగస్త్య నిశాకర గౌతమ సనత్కుమారా ద్యనేకులకు మున్నే తెలియును. భగవంతుఁడు ముందుగాఁ దన యభిప్రాయము దెలుపకున్న వీరెట్లెఱుఁగుదురు? ఇది విష్ణువే యింద్రునితో గూఢ

ముగ ఉత్త. ౬౦౯ వ పద్యంబున సూచించెను. అదియునగాక హనుమంతునకు బ్రహ్మ వరమిచ్చుపట్టున ఉత్తర. ౮౧౮ వ పద్యంబున దేవతల కీ విషయము దెలిపి నట్టు చెప్పఁబడినది. కావున యజ్ఞకాలమునకు ముందే బ్రహ్మ యీవిషయము ముఖ్యదేవతలకుఁ దెలిపె ననియుఁ జిల్లరదేవతలకు యజ్ఞకాలమునఁ దెలిపె ననియుఁ దెలియనగు.

నాల్గవ సమాధానము.

దేవతలందఱు గుమిగూడినది యజ్ఞస్థలమునఁ గాదు. బ్రహ్మలోకమునందే. అచ్చట నందఱు నాలోచించుకొని వానరులను సృష్టిచేసిరి. ఈ చిరకాలపు సంగతిని విష్ణుమూర్తియవతారమున కుపోద్ఘాతముగాఁ గవి గూర్చెను. రామచంద్రమూర్తి యెవఁడైనది లోకమునకుఁ దెలుపుటే యీ యుపోద్ఘాతము నుద్దేశము. దేవత లిచ్చటనుండి భూలోకమునకు యజ్ఞార్థమై వచ్చునప్పటికి దేవమానప్రకారము కాలము కొంచెమైనను మనుష్యమానానుసారముగ కాల మెక్కువయైనది. కావున వాల్యాదులు పూర్వకాలీనులు. ఇందు మూఁడు సమాధానములు వాల్యాదులు రామపూర్వకాలీను లని నిర్ధారణచేయును. ఒక్కటి సవయస్కులని నిర్ధారణచేయును. వారి వారి రుచ్యనుసారము గ్రహింపవచ్చును.

తా త్ప ర్య ము.

మేఘసమూహములవలె బలసినవారై కొండశిఖరములవలె నున్నతదేహములు గలవారై బలగర్వములుగలవారై వానరశ్రేష్ఠులు శ్రీరామునకు సాహాయ్యము చేయుటకుఁగాను చూచుటకు భయంకరమైన యాకారములతో వెలసిరి.

౧౮ సర్గము. శ్రీకౌసల్యాదేవి గర్భము ధరించుట

చం॥ క్రతుపరిపూర్తి దేవతలు ♦ గైకొని పోవ హవిష్యభాగముల్
క్షితిపతి దీక్ష వీడి పురిఁ ♦ జేరి ప్రియాత్మసతీసమేతుఁడై
హితతర సమాగతాఖిలన ♦ రేశ్వరులం బరివారయుక్తులన్
వితతదుకూలహేమమణి ♦ బృందములం బరితుష్టచిత్తులన్.	౪౯౩

'రాసులు ధనధాన్యంబులు' అను ౨౪౧ వ పద్యము మొద లింతదాఁక భగవదవతారమునకు హేతువులు చెప్పఁబడెను. ఇఁక భగవదవతారమే చెప్పఁబడుచున్నది. క్రతుపరిపూర్తి యను పద్యము మొదలు అందఱు నిట్లు పుచ్చి యనుపద్యము కడదాఁక ముందు చెప్పిన యర్థమునే యనువదించుచున్నాఁడు.

క్రతుపరిపూర్తిన్=యజ్ఞము సమాప్తియయినపుడు, ప్రియా...సమేతుఁడై= ఇష్టురాండ్రగు తన భార్యలతోఁ గూడినవాఁడై; హితతర = మేలుచేయు తలంపుతో; సమాగత=వచ్చిన; వితత = అధికమగు; దుకూల = పట్టువస్త్ర

ములయొక్కయు; హేమమణి = బంగారురత్నములయొక్కయు, బృందములన్ = సమూహములచేత.

తా త్ప ర్య ము.

యజ్ఞము సాంతమై దేవతలు వారివారిహవిర్భాగములు తీసికొనిపోయిన తరువాత రాజు దీక్షవిడిచి ప్రియభార్యలతో నయోధ్య చేరి యజ్ఞమునకై వచ్చిన రాజులందఱకు వారివారిపరివారములను వస్త్రాభరణములు కానుక లిచ్చి సంతుష్టి పఱిచెను.

ఆ॥ చలుప మానినాథు♦సెల వంది వారెల్ల, నేగ ఋశ్యశృంగ♦ఋషివరుండు
వీడుకోలుగాంచి♦ విచ్చేసెఁ దనదార, మామఁ దోడుకొని స♦మంజసముగ. ౪౬౪

మానినాథు = ఋశ్యశృంగునియొక్క, వీడుకోలు = సెలవు. సమంజసముగన్ = బాగుగ.

తా త్ప ర్య ము.

వారందఱు వసిష్ఠు ననుమతి తీసికొని వెడలిపోయిరి. ఋశ్యశృంగుఁడును తన భార్యతోడను మామగారితోడను దశరథునిచే వీడుకొలుపఁబడి వెడలిపోయెను.

ఉ॥ అందఱ నిట్లు వుచ్చి హృద♦యంబున వేడ్క దొలంక నెన్నఁ డేఁ
గందునొ కన్నులారఁ గసి♦గందుల నంచును వేచి లోన మి
న్నొందినకోరికల్ మదని ♦ నువ్విళులూరుచు నుండె భూపసం
క్రందనుఁ, డంతఁ గోసలధ♦రాపతిపుత్రికి నంతకంతకున్. ౪౬౫

ఏను గసిగందుల నెన్నఁడు కన్నులారఁ గందునో యని యన్వయము. కసిగందులన్ = చిన్నికుమారులను, మిన్ను + ఒందిన = ఆకాశమును, ముట్టిన = అతిశయించిన; భూపసంక్రందనుండు = రాజేంద్రుఁడు, దశరథుఁడు, ఉవ్విళులూరుచున్ = మిక్కిలి యాశపడుచు, కోసలధరాధిపతిపుత్రికిన్ = కౌసల్యకు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకార మందఱను బంపి సంతోషముతో నెప్పుడు చిన్నకుమారులను గన్నులారఁ గందునో యని యువ్విళ్లూరుచుఁ గోరిక లాకాశము ముట్టుచుండ దశరథుఁడు తనలో నుబ్బి పోవుచుండెను. కౌసల్యాదేవికి గర్భము పెరుఁగుచుండెను.

కం॥ *వటపత్రసన్నిభం బగు, కుటిలాలకయుదరసీమ ♦ గురు వయి యిపుడున్
వటపత్రనిభమ యయ్యెను, వటపత్రశయానుఁ డుంట ♦ వారని ప్రీతిన్. ౪౬౬

ఇఁక గర్భవర్ణనము - వటపత్రసన్నిభము = మఱ్ఱియాకుతో సమానమైన; కుటిల + అలక = వంకరలైన ముంగురులుగల కౌసల్యయొక్క; ఉదరసీమ =

కడుపు అను ప్రదేశము; గురువు = పెద్దది; ఇపుడున్ = పరిపూర్ణగర్భకాలమందును; వారని ప్రీతిన్=అధికమగు ప్రేమతో, వటపత్రశయానుఁడు = మఱ్ఱియాకునందుఁ బవ్వళించువాఁడు- నారాయణుఁడు - విష్ణుమూర్తి; ప్రలయకాలమున క్షీరాబ్ధియందు దానొంటిగ మఱ్ఱియాకుపై శయనించియుండునని పురాణగాథ. ఉంటన్-ఉండుటచేత; వటపత్రనిభము + అ = మఱ్ఱియాకుతో సమానముగానే - గర్భములేనప్పుఁడుత్తమస్త్రీల యుదరము పలచగా మఱ్ఱియాకువలె నుండును. గర్భము పూర్ణమయినపుడును గడుపుముందఱకు వచ్చినను గౌసల్య కడుపు మఱ్ఱియాకువలెనుండెననుట విరోధము. పరిహార మేమన మఱ్ఱియాకునఁ బవ్వళించు భగవంతుఁడు కౌసల్యగర్భమున నుండుటచేత నామె గర్భము మఱ్ఱియాకువంటిదే యయ్యెను కావున విరోధాభాసాలంకారము. ఒక్కరీతిగా నర్థములకుఁ బరస్పరవిరోధ మున్నట్లు కనంబడి మఱియొక్కరీతిగా విరోధపరిహారమును నయ్యేనేని విరోధాభాసాలంకారము.

తా త్ప ర్య ము .

గర్భము రాకముందు కౌసల్యయుదరము పలుచనగా మఱ్ఱియాకువలె నుండెను. ఇప్పుడు గర్భమున వటపత్రశాయి యగు విష్ణువుండుటచే బలిసియు మఱ్ఱియాకువలె నున్నది.

ఆ॥ *పాలవెల్లిలోనఁ • బండి లోకంబులఁ, బాలనంబు సేయు•బాలకునకుఁ
బాలొసంగునట్టి•భాగ్యమబ్బెనటంచు, నోలినుబ్బె సతిప•యోధరములు. ౪౯౭

పాలవెల్లిలోన్ = పాలసముద్రమునందు, పండి = పండుకొని, అబ్బెన్ = కలిగెను, పయోధరములు = పాలిండ్లు, ఓలిన్ = దినక్రమమున. హేతూత్ప్రేక్షాలంకారము. గర్భసమయమున స్వాభావికముగనుబ్బినస్తనములకు భగవంతునకు పాలొసంగునట్టి భాగ్య మబ్బె నని కారణము చెప్పఁబడెను. ఇందు త్ప్రేక్షావ్యంజకశబ్దము లేమిచేత గమ్యము. బాలకుని విశేషణముచేతఁ బరికరాలంకార మేర్పడును. విశేషణము సాభిప్రాయమైనచోఁ బరికరాలంకారము. ఇందుఁ బరికర ముత్ప్రేక్షకు సహాయము కావున సంకరము.

తా త్ప ర్య ము .

పాలసముద్రమునందుఁ బండుకొని లోకములనెల్ల రక్షించుపరమాత్మునకుఁ బాలిచ్చుభాగ్యము మాకుఁ గలిగెను. ఏమి మాయదృష్టము! అని సంతోషముచే నుబ్బినవా యేమి యన్నట్లు కౌసల్యాదేవిస్తనము లుబ్బెను.

క౦॥ *బంధం బెక్కడ నెఱుఁగని, బంధురగుణయశుఁడు బుధుల•బాధల మాన్పన్
సింధురగమనోదరని,ర్బంధంబున నుండె భక్త•బాంధవుఁ డగుటన్. ౪౯౮

బంధము = కర్మబంధము - సంసారపుఁజిక్కు; బంధురగుణయశుఁడు = అధికములై మనోహరములైన గుణములును గీర్తియును గలవాఁడు. భక్తబాంధవుఁడగుటఁ; బుధుల = దేవతల; సింధురగమనా = ఏనుఁగు నడకవంటి నడక గల కౌసల్యయొక్క; ఉదరనిర్బంధమునఁ = గర్భ మను నిఱుకైన ప్రదేశమందు.

కర్మబంధమువలన గర్భప్రవేశము - సంసారబాధ లేకున్నను దనకు భక్తులైన దేవతలనిమిత్తమై భక్తులకు బంధువుగావున తన యిచ్ఛకొలఁది తానే గర్భ మను నల్పప్రదేశమునఁ జిక్కువడియుండెను. అంతటి స్వతంత్రుఁడు భక్తుల నిమిత్తమై పరతంత్రునివలె నగుట యాయన స్వాతంత్ర్యమును వాత్సల్యాతిశయమును బోధించును.

తా త్ప ర్య ము .

అపరిమేయుఁ డగుటచే నే బంధములేనివాఁడు భక్తబాంధవుఁ డగుటచే భక్తులై శరణుచొచ్చిన దేవతలబాధలఁ బాపి రక్షించుకొఱకు నొకస్త్రీమాత్రమైన కౌసల్యాదేవి యుదరమను చెఱసాలయం దుండెను.

—* శ్రీభగవదవతారఘట్టము *—

క॥ క్రతువు పరిపూర్తి యగుడుఁ, బుతుషట్కం బరుగఁ బదియు♦రెండవ నెలలోఁ
క్షితిఁ జైత్రశుద్ధనవమి న,దితితారను రవియు నడిమి♦దివిని వెలుంగన్. ౯౯

క॥ వరకర్కటలగ్నంబున, సురగురుఁ డుదయించుచుండ ♦ సోమునితోడఁ
దరణిముఖగ్రహపంచక, మరుదుగ స్వోచ్చస్థలంబు♦లందు వెలుంగన్. ౫౦౦

క॥ కౌసల్య జగత్పతి శ్రీ,వాసునియర్ధాంశమూర్తి ♦ వరశుభచిహ్నుఁ
భాసురరఘుకులవర్ధను, వాసిఁ గనెఁ సర్వలోక♦వందితు రామున్. ౫౦౧

ఈ మూఁడుపద్యములందును రామావతారమును దత్కాల గ్రహసంపత్తియును దత్ఫలంబును జెప్పఁబడును.

క్రతువుపరిపూర్తి వైశాఖాదియం దయి యుండును. ఆపైన బుతుషట్కంబు= ఆఱుబుతువులు- వసంతము మొదలు శిశిరము కడవఱకు, వైశాఖమునకుఁ బన్రెండవమాసము చైత్రము. చైత్రశుద్ధనవమిఁ = చిత్రానక్షత్రముతోఁ గూడిన పున్నమ చైత్రము. అట్టిచైత్రమగు పున్నమనుగల మాసము చైత్రమాసము. చైత్రమాసమునఁ బునర్వసువు శుక్లపక్షమునఁ గావున నిట శుక్లపక్షము. శుద్ధ = శుక్లపక్షములోని; నవమిఁ = నవమి యను తిథియందు; అదితితారను = పునర్వసువు నక్షత్రమున- ఈ నక్షత్రమునకు దేవత యదితి కావున నామెపేరితోఁ జెప్పఁబడెను. "పునర్వసూ నక్షత్ర మదితి ర్దేవతా" యని

శ్రుతియందుఁ బ్రమాణము. రవియున్ = సూర్యుఁడును; నడిమిదివిని = ఆకాశమునడుమ; వెలుంగన్ = ప్రకాశింపఁగా- అభిజిత్తని భావము.

వర = శ్రేష్ఠమగు, కర్కట = కర్కట మను పేరుగల, లగ్నంబునన్ = రాశి యుదయించుకాలమున, 'రాశీనా'ముదయో లగ్నమ్మని యమరము. రామాయణమున లగ్నశబ్ద మీయొకశ్లోకమందే గలదనియు నిది ప్రక్షిప్తమనియు నొకఁడు వ్రాసెను. లగ్నశబ్ద మీయొకశ్లోకమందే కాదు. అయోధ్యాకాండము ౧౫ సర్గమందు 3 వ శ్లోకమున 'లగ్నే కర్కటకే ప్రాప్తే జన్మ రామస్యచ స్థితే' యని కలదు. అది ప్రక్షిప్త మన సాధ్యపడదు. సోమునితోడన్ = చంద్రునితోడ, సురగురుఁడు = బృహస్పతి, తరణిముఖ = సూర్యుఁడు లోనగు, గ్రహపంచకము = అయిదు గ్రహములు, అంగారక, సూర్య, గురు, శని, శుక్రులు. స్వోచ్చస్థలంబులందున్ = తమతమ యుచ్చస్థానంబులందు, సూర్యునికి మేషరాశి, గురువునకు కర్కాటకము, శనికి తుల, శుక్రునికి మీనరాశి, అంగారకునికి మకరరాశి ఉచ్చస్థానములు. "శ్లో. అజ వృషభ మృగాంగనా కుళీరా ఝష వణిజౌచ దివాకరాదితుంగా" యని వరాహమిహిరాచార్యుఁడు. సూర్య, చంద్ర, అంగారక, బుధ, గురు, శుక్ర శనులకు వరుసగా మేషము, వృషభము, మకరము, కన్య, కర్కటము, మీనము, తుల ఉచ్చస్థానము లని భావము - గురుఁ డుదయించుచుండన్ - అను పదమును బట్టియు, పునర్వసువు కర్కటరాశి యందుండుటఁ బట్టియు, కర్కటరాశియందుఁ జంద్రుఁ డున్న ట్లేర్పడుచున్నది. కాఁగా గురుఁడు కర్కటరాశిలోఁ జంద్రునితోడఁ జేరియుండుటను ఉచ్చము, చైత్రమున సూర్యుఁడు మేషరాశిలోఁ బ్రవేశించెను గాన నుచ్చము. బుధుఁ డెప్పటికి సూర్యునిసమీపమందే యుండునుగావున నుచ్చమునం దున్నవాఁడు కాఁడు - 'బుధప్రకాశో జగదప్రకాశ' యని ప్రమాణము. చంద్రుఁడు కర్కటములో నుండుటచే నది యాతని కుచ్చము గాదు. కాఁగా ముందుచెప్పిన యయిదుగురే యుచ్చమందున్నారని యెఱుంగునది. ఆయా గ్రహముల పేరు ప్రత్యేకించి చెప్పక మొత్తముగ గ్రహపంచకమనుట ఫలాధిక్యసూచనార్థము- 'ఏకగ్రహోచ్చజాతస్య సర్వారిష్ట వినాశనం, ద్విగ్రహోచ్చేతు సామంత స్త్రిగ్రహోచ్చేమహీపతిః । చతుర్గ్రహోచ్చే సమ్రాట్స్యాత్, పంచోచ్చేలోకనాయకః॥ అనిలోకనాయకునకునైదుగ్రహములుచ్చమందుండును సూర్యాదులుప్రత్యేక ముచ్చమందున్నప్పుడు ఫలమేమన:-'సూర్యే స్వోచ్చగతే జాత స్సేనాపత్య మవాప్నుయాత్, భౌమే స్వోచ్చగతే జాతో వనే రాజాభవిష్యతి గురౌ స్వోచ్చగతే జాతో ధనీరాజ్యాధిపో భవేత్ । శుక్రే స్వోచ్చగతే జాతో రాజ్యశ్రియమవాప్నుయాత్ । శనౌ స్వోచ్చగతే జాతో రాజ్యాధిప సమో భవేత్॥ అని ప్రమాణము - ఇందు గురుచంద్రయోగమునకు ఫలమును వరాహమిహిరుఁ డిటు

చెప్పెను. "దృఢసౌహృదో వినీతస్స్వబంధుసమ్మానకృద్ధనేశశ్చ, శశిగుర్వోఃగుణశీల స్సురద్విజేభ్యో రతో భవేత్పురుషః॥" దృఢస్నేహము గలవాఁడును, వినయవంతుఁడును, తన బంధువుల సమ్మానించువాఁడున, గుణశీలుఁడును, దేవబ్రాహ్మణప్రీతిగలవాఁడును నగును. రవి బుధయోగఫలము "వేదాంతపిత్ స్థిరమనో రవిబుధయోః ప్రాయశో యశోర్థీ స్యాత్ । ఆర్యః క్షితిపతి దయిత స్సతాంచ బలరూపవిద్యావాన్" అని వరాహమిహిరుఁడు. "చైత్రే మధురభాషీ స్యా దహంకారసుఖాన్విత" అని చైత్రమాసఫలము. "దీర్ఘవైరీ భువి ఖ్యాతో, వశ్యశ్శూరశ్చ పండితః । నిర్భయ స్సర్వభూతేభ్యో నవమ్యాం జాయతే నర "యని నవమీఫలము. "సహిష్ణు గ్గాఢవృత్తిశ్చ శ్లేష్మలో నాట్యకోవిదః । అగృధ్నురల్పసంతుష్ట శ్శీఘ్రగో౽దితిధిష్ణ్యజః" అని నక్షత్రఫలము. పునర్వసూచతుర్థపాదఫలము - "కాంతః ప్రియవపు శ్శ్లక్ష్ణః సజ్జనః ప్రియదర్శనః । లక్ష్మీవాన్ ప్రియవాదీచ ఆదిత్యాంతే ప్రజాయతే" అని ఉచ్చ బృహస్పతితోడఁ జంద్రుఁడు కర్కటరాశియం దుండుటచే పునర్వసూ చతుర్థపాద మని తెలియనగును. 'కర్కటే లగ్నకే చంద్రయుక్తే దృష్టేచ భోగవాన్, గురుణా వీక్షితే యుక్తే ధనాఢ్యో బహుభోగవాన్" అని కర్కటలగ్నఫలము ఇట్టి ఫలములఁ జూపుటకై యిట మాసాదులు పేర్కొనఁ బడినవి.

శ్రీరామచంద్రమూర్తి జాతకమును గుఱించి దైవజ్ఞశిఖామణి బ్ర॥ శ్రీ గండ్లూరు లక్ష్మీనారాయణప్పగారు వ్రాసిపంపినదాని నిటఁ బ్రకటించెదను.

శ్రీరామచంద్రమూర్తి జననకాలమందు శుక్రబుధులు మీనమందును, రవి మేషమందును నన్నట్లు జ్యోతిషసిద్ధాంతరీత్యా యేర్పడుచున్నదిగాని మీరు వ్రాసినప్రకారము రవిబుధులిరువురు మేషమందుఁగాని బుధుఁడు వృషభమందుఁగాని యుండినట్లు తేర్పడదు.

అశ్వినీ ౩ చరణే మేషరాశౌ ఉచ్చక్షేత్రే రవిః
పునర్వసు ౪ చరణే కర్కటరాశౌ ఉచ్చగురుసంయుతే స్వక్షేత్రే చంద్రః
శ్రవణ 3 చరణే మకరరాశౌ ఉచ్చక్షేత్రే కుజః
ఉత్తరాభాద్ర 3 చరణే మీనరాశౌ ఉచ్చభృగుసంయుతే నీచక్షేత్రే బుధః
పుష్య ౧ చరణే కర్కాటకరాశౌ స్వక్షేత్ర చంద్రయుతే ఉచ్చక్షేత్రే గురుః
రేవతీ ౪ చరణే మీనరాశౌ నీచస్థబుధసంయుతే ఉచ్చక్షేత్రే శుక్రః
స్వాతి ౪ చరణే తులారాశౌ ఉచ్చక్షేత్రే శనిః
పూర్వఫల్గునీ ౪ చరణే సింహరాశౌ రాహుః
పూర్వాభాద్ర ౨ చరణే కుంభరాశౌ కేతుః.

రాశిచక్రము

శబు	ర		
కే			లచగు
కు			రా
		శ	

అంశచక్రము

శుశ		కే	రబు
			చ
			గు
	రా	కు	ల

శ్రీరామచంద్రజననకాలము పునర్వసువు ౪ చరణము.
గురుమహాదశాకాలః జన్మగర్భభుక్తివర్షాః ౧౬.
శేష్యవర్షాః ౪. అనంతరం శనిమహాదశాకాలః

కం॥ కౌసల్యా జగత్పతి శ్రీ,వాసునియుగ్రాంశమూర్తి • వరశుభదివ్యాంగున్
భాసురరఘుకులవర్ధను, వాసిం గనెఁ సర్వలోక•వందితు రామున్. ౫౦౧

మీఁదఁజెప్పిన ప్రమాణములలోని ఫలములను గవి సంక్షేపముగఁ జెప్పుచున్నాఁడు. 'పంచోచ్చే లోకనాయకః' యనువిషయమును లోకాసమపతి యను పదముచెప్పెను. లోకాసమపతి = లోకమునసాటిలేని ప్రభువు. లగ్నములోని గురుయోగఫలమును సర్వలోకవందితుఁ అనుపదము తెలుపును. వందితుఁ=నమస్కరింపఁబడినవానిని, "శ్లో॥కవి స్సుగీతః ప్రియదర్శన స్సుఖీ, దాతా చభోక్తా నృపపూజిత శ్శుచిః 'దేవద్విజారాధనతత్పరోఽథ భవేన్నరో దేవగురౌను సుస్థితే" యని హోరాప్రదీపమందుఁ గలదు. రాముఁ =(1) ఇఁకమీఁద రాముఁడని పిలువఁబడువానిని (2) నీలమేఘశ్యామలవర్ణుని, 'అథో రామహా సావిత్రా' అనువేదవాక్యములోని రామశబ్దమును శ్యామార్థముగ వ్యాఖ్యానముచేయబడినది. కర్కాటమునఁ గన్యాంశమున జాతుఁడనుట దీనిచే సూచితము. కన్య బుధాంశముగానైనను శుక్రాంశముగానైనను బరిగణింపవచ్చును. వీరిద్దఱు శ్యామవర్ణులు కావున రాముఁడును శ్యాముఁడు. "రక్త శ్యామో భాస్కరో గౌర ఇందు ర్నాత్యుచ్చాంగో రక్తగౌరశ్చవక్రః, దూర్వాశ్యామో జ్ఞో గురు ర్గౌరగాత్ర శ్శ్యామ శ్శుక్రో భాస్కరిః కృష్ణదేహీ" రాముఁడు దూర్వాంకురశ్యాముఁడనియుఁ జెప్పఁబడినది. వాస్తవమున భగవంతునకు వర్ణము లేదు. ఆకాశమునకు సముద్రమునకు వర్ణములేకున్నను నత్యంతగంభీరమగుటచే శ్యామముగాఁ గనిపించును. అట్లే యత్యంతగంభీరుఁడగుట విష్ణువు శ్యామవర్ణుఁడుగాఁ జెప్పఁబడును. శ్రీలక్షణుఁ = సంపత్కరమైన సాముద్రికలక్షణములు గలవానిని; ఇది లగ్నచంద్రయోగఫలము. "పూర్ణే శీతకరే లగ్నే తేజస్వీ నిత్య

గర్వితః" యని హోరాశాస్త్రము. అర్ధవిష్ణుః = విష్ణువుయొక్క యర్ధభాగమైన వానిని. విష్ణువు = విష్ణుమయమగు పాయసము - పాయసమునందలి సగముచేఁ బరిణమించిన దేహముగలవాని నని భావము. రఘుకులవర్ధనః - రఘుకులుఁడు = దశరథుఁడు, దశరథువంశమును వృద్ధిచేయువానిని, లగ్నమునకు సౌమ్యగ్రహయోగము గల దని దీనివలన సూచితము. 'నరశ్చిరాయుర్నృపపూజితస్సుఖీ లగ్నం భవే త్సౌమ్యయుతం యథాతథా।లగ్నే తథా స్వామినిరీక్షితే ధనీ కుశాగ్రబుద్ధిః కులకీర్తివర్ధనః' అని ప్రమాణము. మహాభాగునిః = గొప్ప భాగ్యముగలవానిని - దీనిచే లగ్నచంద్రునివలనిదోషము గురుయోగముచే బరిహరింపఁబడిన దని తెలిపెడిని. "జన్మకాలికలగ్నాంశే, చంద్రః కేంద్రగతో యది। జాతస్య వినయో విత్తం జ్ఞానం బుద్ధిశ్చ నైపుణం। హీనం పణపరస్థేస్మి న్మధ్యా న్యేతాని తస్య చ।ఆపోక్లిమస్థశ్చంద్రశ్చే దుత్కృష్టాని భవంతిహి॥స్వాంశాధిమిత్రస్యనవాంశకే వా చంద్రేతు వాచస్పతినాచ దృష్టే। ఏవంవిధే శీతకరేచ రాత్రౌ శుక్రేన దృష్టే ధనవాః సుఖీ స్యాత్." అని హోరాప్రదీపమున నీ విషయము చెప్పఁబడినది. ఇట్లే కేమద్రుమయోగమువలని దోషమును లేనట్లు తెలిపెడిని. చంద్రుని కుభయపార్శ్వములను గ్రహములు లేకుండెనేని కేమద్రుమయోగము. ఈ జాతకమందును కటకము చంద్రస్థానము కావున దాని ముందు వెనుకనుండు రాసులగు మిథునసింహములందు గ్రహంబు లెవ్వియు లేమింజేసి కేమద్రుమయోగము కలదు. "వ్యయార్థో భయగ శ్చంద్రా ద్వినా భానుం నచే ద్గ్రహః। యోగః కేమద్రుమోనామ జాతస్యాద్రుమగర్హితః॥ సంతానబంధుజనవస్త్రసుహృద్విహీనో, దారిద్ర్యదైన్యగదదుఃఖమలై రుపేతః। ప్రేష్యః ఖల స్సకలలోకవిరుద్ధవృత్తిః కేమద్రుమే భవతి పార్థివవంశజోపి" యని గార్గ్యవచనము. ఇట్టి దోషములన్నియుఁ దనప్రభావమున శాంతి వఱచుచున్నాఁ డని మహాభాగశబ్దము తెలిపెడిని. "లగ్నా త్కేంద్రగతే చంద్రే గ్రహైః రేకాదిభి ర్యుతే। కేమద్రుమఫలం నస్యా త్తేచిత్తేంద్రనవాంశకే" యని మణిబంధవాక్యమునుబట్టి కేమద్రుమయోగపరిహార మూహించునది. "అష్టమేశే కళత్రస్థే సురేశేవా కళత్రగే, మంగళేవా కళత్రస్థే భార్యా నాశం ప్రకుర్వతే" యను నిట్టిదోషంబులపరిహారము మహాభాగశబ్దమువలన నూహించునది.

౪౯౯ - ౫౦౦ - ౫౦౧ తాత్పర్యము.

యజ్ఞము సాంతముకాఁగా నాఱుఋతువులు గడువఁగా పండ్రెండవ నెలలోఁ జైత్రమాసమున శుద్ధపక్షమున నవమీతిథియందు పునర్వసూనక్షత్రమున నభిజిల్లగ్నంబున కర్కాటకలగ్నమందు చంద్రునిగూడి బృహస్పతియుదయవేళను సూర్యుఁడు మొదలగునైదుగ్రహములు వాని వాని యుచ్చస్థలంబులం దుండఁగా కౌసల్యాదేవి జగత్పాలకుఁడగు శ్రీమహావిష్ణువు నర్ధాంశమూర్తియు నైభ

లక్షణములు గలవాఁడును రఘువంశవర్ధనుని సర్వలోకములు నమస్కరించువానిని రామునిఁ గనియెను.

ఆ॥ అమితతేజుఁ డైన♦యాపుత్రకునిచేతఁ, గోసలేంద్రతనయ ♦ కొమరు మీఱె
నమరనాథుఁడైన♦యావజ్రపాణిచే, హవణు మీఱి వెలుఁగు♦నదితివోలె. ౫౦౨

శ్రీరామావతారమునకు ముఖ్యకారణము దశరథుని యజ్ఞము కాదు కౌసల్యాతపఃప్రభావ మని యీ పద్యమునఁ జెప్పుచున్నాఁడు. ఆమె నవమీవ్రత మాచరించుటచే భగవంతుఁడు ననమియందు జన్మించెను.

1. కోసలేంద్రతనయ = కౌసల్య, అమితతేజుఁడు = అధికకాంతిగలవాఁడు; 'స ఉ శ్రేయాన్ భవతి జాయమాన' యను శ్రుతిరీతిగ నవతారవిశేషములచే నీయన తేజస్సు హెచ్చు నని భావము. అమరనాథుఁడు = దేవప్రభువు, ఆవజ్రపాణిచే = తాను పరాత్పరుఁడగుటకు సూచకముగ వజ్రరేఖలు హస్తమందుఁ గల యుపేంద్రునిచేత, హవణి = ఒప్పిదము. అదితి = దేవమాత, దేవమాత యగు నదితి తపోవ్రతబలంబున నుపేంద్రునిఁ గన్నట్లు కౌసల్యయు నవమీవ్రతాదు లాచరించి శ్రీరామచంద్రమూర్తినిఁ గనె నని భావము. ఉపేంద్రుఁడు-వామనుఁడు, అదితి పయోవ్రతమాచరించి వామనుఁ గనెను. కౌసల్య నవమీవ్రతమాచరించి రామునిఁగనెను. అయోధ్యా-ప ౫౮౧. 'కొడుకులు కొడుకు లటంచును, గొడుకా నలిపితిని నేను ఘోరతపంబుల్.' ౫౭౭ పద్యమును జూచునది.

2. అమితతేజుఁడు = 'సూర్యస్యాపి భవేత్సూర్య' యన్నట్లు జగత్ప్రకాశకుండగు సూర్యునివంశమునకు నీయన ప్రకాశకుఁడుగాన నమితతేజుఁడు.

3. చైత్రమాసమున మట్టమధ్యాహ్నము మబ్బుమోసము లేక వెలుపలఁ గాయుచున్న సూర్యునికాంతికంటె నీయనకాంతి యధికముగ నుండుటచే నమితతేజుఁడు.

4. ఈయన తేజస్సులో నొకయంశము గలవారు సూర్యచంద్రాగ్నులు కావున వారి తేజము మితమైనది. ఈయన తేజ మమితమైనది.

"శ్లో. యదాదిత్యగతం తేజో, జగ ద్భాసయతేఽఖిలమ్
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ, త త్తేజో విద్ధి మామకమ్." భ.గీ.౧౫-౧౨.

సర్వప్రపంచమును బ్రకాశింపఁజేయు సూర్యుని తేజము చంద్రాగ్నులయం దుండు తేజము నా తేజ మని యెఱుంగుము.

5. "శ్లో. దివి సూర్యసహస్రస్య భవే ద్యుగప దుత్థితా
యది భా స్సదృశీ సా స్యాత్ భాస స్తస్య మహాత్మనః" భ. గీ. ౧౧.౧౨.

ఆకాశమందు వేయి సూర్యలోక్కసారిగ నుదయించిన నెట్టి కాంతి యుండునో ఆకాంతికి నాయనకాంతి సమమై యుండెను.

అన్నట్లు లనేకసూర్యులకాంతిగలవాఁ డగుట నమితతేజుఁడు.

6. అ + మితతేజుఁడు = విష్ణువుయొక్క ప్రసిద్ధముగాఁ దెలియఁబడిన తేజస్సుగలవాఁడు - తేజము చూడఁగానే యిది విష్ణుతేజమేకాని యితరదేవతలతేజము గాదు, మనుష్యతేజము గా దని తెలియవచ్చును - "మితౌ జ్ఞాత పరిచ్ఛిన్నౌ" అని నానా. ర.

7. "తతో ఖిలజగత్పద్మ, బోధా యాచ్యుతభానునా
దేవకీ పూర్వసంధ్యాయా, మావిర్భూతం మహాత్మనా. వి-పు.

అన్నట్లు లచ్యుతభానునికన్న నమితకాంతి గలవాఁడు. ఆ వజ్రహస్తునిచే - - దీనిని అపుత్రకునిచే అనుదానికి విశేషణముగను, స్వయంవిశేష్యముగను నన్వయించుకొనునది. విశేషణపర్యాయంబున పరత్వసూచకవజ్రలేఖ చేతి యందుఁ గలవానిచే నని యర్థము. విశేష్యమైనపుడు వజ్రాయుధము చేతి యందుఁ గల యింద్రునిచేత నని యర్థము. ఇంద్రునిచేత నదితి ప్రకాశించినట్లు రామునిచేఁ గౌసల్య ప్రకాశించె నని భావము. ఆ - ప్రసిద్ధిని తెలుపును. అట్ట ప్రసిద్ధవస్తువునే కదా యుపమానముగఁ జెప్పవలయును. కాఁబట్టియే "ఇషువ ద్గచ్ఛతి సవితా" సూర్యుఁడు బాణమువలె సూటిగఁ బోవును అని చెప్పుదురు. ఇట్లే యిచ్చటను ఇంద్రుఁడు రామునంతగొప్పవాఁడు కాకున్నను లోకబుద్ధి ననుసరించి గొప్పవాఁడు కావున రామచంద్రున కుపమాన మయ్యె ననికాని రామచంద్రమూర్తిగొప్పతన మింత కెక్కువచెప్పిన లోకులదృష్టి తాఁకు ననికాని యెంచి కవి నీచోపమానము చెప్పె నని యెంచవలయు. శ్రీరామజన్మమున మాతృరిష్టదోషము లేదనుట యీ పద్యమున సూచితము. మాతృకారకుఁ డగు చంద్రుఁడు వృద్ధిగాను గురుసంబంధముగలవాఁడుగాను నుండుట దీనికి హేతువు.

లోకమున సామాన్యముగ బిడ్డలదేహకాంతి మొదలగు దేహసంబంధచిహ్నములు తల్లివలనఁ గలుగును. ఇచ్చట నట్లు గాదు. పుట్టిన కుమారుని వలనఁ గౌసల్యకుఁ గాంతి, కీర్తి కలిగెను. శ్రీరామచంద్రునకుఁ దల్లియగుటచే గౌసల్య కీర్తిగలదయ్యెను. కాని కౌసల్యకుఁ గొడుకైన కారణమున రామచంద్రమూర్తి ప్రసిద్ధుఁడు కాలేదు. దీనివలన మాతృప్రయుక్తప్రకృతిసంబంధము కుమారునందు లేదనియు నాయన ప్రకృతివిలక్షణుఁడనియుఁ దెలియనగు. "కౌసల్యాసుప్రజారామ" ఎవనివలనఁ గౌసల్య మంచిబిడ్డను గన్నదన్నపేరు గలదయ్యెనో యనికదా విశ్వామిత్రుఁడు రామచంద్రమూర్తిని సంబోధించెను,

తాత్పర్యము.

దేవతలకుఁ బ్రభువైన నింద్రునిచే నదితి ప్రకాశించినట్లు అపరిమిత తేజస్సు గల యాకుమారునిచేఁ గౌసల్య యెంతయుఁ దేజోవతి యయ్యెను.

కా॥ సాక్షాద్విష్ణువునందు నాలుగవయం♦శం బూని కైకేయికిన్
జక్షుఃప్రీతికరుండు సర్వగుణరా♦జన్మూర్తి జన్మించె స
త్యాక్షీణాతిబలాఢ్యుఁడౌ భరతుఁ, డొ♦య్యం విష్ణునర్ధాంశు లై
దక్షుల్ వీరులు పుట్టి రిర్వురు సుమి♦త్రాదేవిగర్భంబునన్. ౫౦౩

కం॥ తనయు లశేషవిశేషర,సనిలయు లయి లక్ష్మణుండు ♦ శత్రుఘ్నుఁడు నాఁ
దనరినవారలకల్మష,వినయమతుల్ సుగుణరతులు ♦ విదితాస్త్రగతుల్. ౫౦౪

పాయసోపయోగక్రమముగఁ గౌసల్య ప్రసవానంతరము కైకేయీప్రసవమును జెప్పుచున్నాఁడు. చక్షుః ప్రీతికరుండు = జనులకు నేత్రానందము గలిగించువాఁడు, సత్య=స్థిరమైనదియు, అక్షీణ = తఱుగనిదియు, అతిబల + ఆఢ్యుఁడు = అధికబలసంపన్నుఁడు, సర్వగుణరాజన్మూర్తి = శ్రీరామునియందున్న సమస్తగుణములచేతఁ బ్రకాశించునాకారముగలవాఁడు-భరతుఁడు, సాక్షాద్విష్ణువునందు = ప్రత్యక్షవిష్ణువగు శ్రీరామునందు, నాలవయంశము=నాలవ భాగము, శ్రీరామావతారము పాయసమునందలి సగముచేత, భరతావతారము దానిలోని నాలవభాగ మనఁగా సమష్టిలో నెనిమిదవభాగమును, ఊని= పొంది; కైకేయికిన్, జన్మించెన్, ఇఁకలక్ష్మణశత్రుఘ్నులయంశములను జెప్పుచున్నాఁడు, ఒయ్యన్ = క్రమముగా, భరతానంతరమున: దక్షులు = నేర్పరులు, అశేష = సంపూర్ణమైన, విశేష= లోకోత్కృష్టమైన, రస = (1) ప్రేమాదులకు (2) వీరాదులకు; నిలయులు = ఉనికిపట్టులు, అకల్మష మతుల్ = నిష్కపటమైన వినయము గల మనస్సుగలవారు, విదిత తతుల్ = తెలిసికొనఁబడిన యస్త్రసమూహము గలవారు. విష్ణుసర్ధాంశులై = శ్రీరామునకుఁ గొంచెము తక్కువ యంశము గలవారై, లక్ష్మణుఁడు పాయసములోని నాలవపాలు, శత్రుఘ్నుఁ డెనిమిదవ పాలు- అని భావము. ఇట్లర్థము చెప్పుటంబట్టి పాయస భాగమునకు విరోధము రానేరదు.

తాత్పర్యము.

ప్రత్యక్షవిష్ణు వగు శ్రీరామునందు నాలవయంశమునఁ గైకేయికి నేత్రానందకరుండును సమస్తశుభగుణాకరుండును సత్యవంతుఁడు మిగుల బలవంతుఁడగు భరతుఁడును విష్ణువునం దొకభాగమై సుమిత్రాదేవిగర్భంబున నిరువురు వీరులు లోకోత్కృష్టప్రేమాదిగుణములకు స్థానభూతములై లక్ష్మణుఁడు శత్రుఘ్నుఁడు ననువా రిరువురు కవలబిడ్డ లుదయించిరి.

తే॥ పుష్యమున మీనరాశిని ♦ బుట్టె సుప్రసన్నమతి భరతుండును; ♦ సార్పభమునఁ
గర్కటకమున మధ్యాహ్న ♦ కాలమందుఁ, బుట్టిరి సుమిత్రతనయులు ♦ పుణ్యనిధులు. ౫౦౫

ఇఁక నీమువ్వురకు జన్మనక్షత్రములు చెప్పఁబడును - పుష్యమునన్ = పుష్య నక్షత్రముతోఁ గూడిన దినమున, అనఁగా శ్రీరాముఁడు జన్మించిన మఱు నాఁడు, సుప్రసన్నమతి = ఇది మీనలగ్నజన్మఫలము. మీనలగ్నము గురుక్షేత్రముగదా. భరతుఁడు పుట్టెను. సార్పభమునన్ = సర్పదేవతాక నక్షత్రమందు - ఆశ్లేషానక్షత్రమందు. 'ఆశ్లేషానక్షత్రగ్ం సర్పాదేవతా' యని శ్రుతి. చైత్రమాసమున కర్కటలగ్నము మట్టమధ్యాహ్నమున వచ్చును. దీనిచే భగవదవతారము పగటిపూఁట యయ్యెను, నక్షత్రము పునర్వసువు. భర తుఁడు దశమి పుష్యనక్షత్రము, సూర్యోదయపూర్వము, మీనలగ్నమందుఁ; గావున లక్ష్మణశత్రుఘ్నులు దశమి ఆశ్లేషానక్షత్రమున జనించుటమాత్రము విశేషము. పంచగ్రహము లుచ్చమందుండుట గురుచంద్రయోగము, అందఱకు సమానము. లక్ష్మణశత్రుఘ్నుల నొక్కటిగఁ జెప్పుటచే వారమడ లని గ్రహింప వలయును. వీరిరువురు కర్కటకలగ్నమందుఁ బగట జనించినవారే. ఒకరు పుష్య మనఁగాఁ బుష్యమాస మనియు శ్రీరామునకు భరతునకుఁ బదినెలల కాల విలంబనము కల దనియు వ్రాసిరి. కాని యావాదసాధుత్వము చింత్యము.

తాత్పర్యము.

భరతుఁడు పుష్యనక్షత్రమున మీనరాశియందును ఆశ్లేషానక్షత్రమునఁ గర్కటకలగ్నమందు మధ్యాహ్నకాలమున లక్ష్మణశత్రుఘ్నులును జనించిరి.

కం॥ కాంతిని ప్రోష్ఠపదోపము, లెంతయు ననురూపసుగుణ ♦ లీడ్యులు ధరణీ
కాంతున కిటు వేర్వే ఱత్యంతమహామహులు కలిగి ♦ రాత్మజులంతన్. ౫౦౬

వేర్వేఱు = ఒక్క భగవంతుఁడే నాలుగుమూర్తులుగ నైనవారు దీని కుప మానము. కాంతిచే = ప్రకాశముచేత, ప్రోష్ఠపదోపములు — ప్రోష్ఠ = గోవు యొక్క, పద = పాదములకు, ఉపములు = సమానలు, గోవు ఒక్కటియై యున్నను దానికాళ్ళు నాలుగై యున్నట్లు, భగవత్స్వరూప మొక్కటియైనను నాల్గవతారములుగ జనించె నని భావము. ప్రోష్ఠపదము. పూర్వాభాద్ర ఉత్త రాభాద్ర యీ రెంటికిని పేరు; పూర్వాభాద్రయందు రెండునక్షత్రములు ఉత్తరాభాద్రయందు రెండునక్షత్రములు వెరసి నాలుగు నక్షత్రములు. ఈ నాలు గించుమించు చవుకముగా నుండును. నక్షత్రములందు రెండొకజత రెండొకజత యెట్లయ్యెనో యట్లే వీరును రామలక్ష్మణు లొకజత భరత శత్రుఘ్ను లొకజత యై రని గ్రహింపవలయును. ఆకాశమున నీ చుక్కలు : :

ఈ విధముగఁ గానవచ్చును. తైత్తిరీయశ్రుతి - "చత్వారి ఏక మభికర్మ దేవాః ప్రోష్ఠపదా స ఇతి యాం వదంతి" అని. ఉపములు = సమానులు, అనురూపులును + సుగుణులును = ఒక్కటే విధమగు నాకారము గలవారును సద్గుణములు కలవారును - అనురూపములగు సద్గుణములు కలవారని యర్థము. ఈప్స్యలు = జనులచేఁ బొగడఁదగినవారు. వేర్వే ఱత్యంతమహాత్ము లనియుఁ జెప్పనగు. శ్రీరామునకు స్వధర్మానుష్ఠానముచేతను - లక్ష్మణునకు శేషత్వజ్ఞానముచేతను - భరతునకు భగవత్పారతంత్ర్యబుద్ధిచేతను - శత్రుఘ్నునకు భాగవతపారతంత్ర్యముచేతను మహాత్మత్వ మని యెఱుంగవలయును. కావున వేఱువేఱు మహాత్ము లనుట. ఆత్మజులు = కొడుకులు, ధరణీకాంతునకున్ = దశరథునకు, జనించిరి, ఇపుడుగదా యజ్ఞఫలపూర్తి యని భావము.

సందేహము.

అఖండము - అపరిచ్ఛేద్యము నగు భగవన్మూర్తి నాలుగుఖండములుగ నెట్లయ్యెను?

సమాధానము.

భగవంతుఁ డపరిచ్ఛేద్యుఁడు (ఛేదింపరానివాఁడు) అగుట సత్యమే. సర్వత్ర వ్యాపించియుండు నగ్ని వెయ్యిచోట్ల నెయ్యిదీపములుగాఁ బ్రకాశించినప్పుడు అగ్నిమహాత్ముఁడు పరిచ్ఛిన్నుఁడయ్యె నని చెప్పవచ్చునా? ఒకచోట నెక్కువగాఁ బ్రకాశించెనని యర్థమే కాని కొన్నిచోట్ల శూన్యము లని చెప్పవలనుపడదుగదా. ఒకచోట గాడుపులు తుపానులు ఘోరముగ వీచినఁ దక్కినచోటుల గాలిలేదా?

తాత్పర్యము.

పూర్వాభాద్ర ఉత్తరాభాద్రనలెఁ బ్రకాశించువారును పరస్పర మనురూపమైన సద్గుణములు గలవారును - స్తోత్రార్హులును నగు కుమారు లీరీతిని వేఱు వేఱు తల్లులందు వేఱువేఱుగ జన్మించిరి.

కం॥ పాడిరి గంధర్వులు తమి, నాడిరి యచ్చరలు మింట ♦ నమరు ల్గుములై
కూడిరి పరమోత్సవమున, వీడిరి భయ మెదల విబుధ♦వీరుల్ నారుల్. ౫౦౭

జననకాలమందలి శుభశకునములను జెప్పుచున్నాఁడు. తమిన్ = సంతోషముతో, అచ్చరలు = అప్సరస్త్రీలు, అమరుల్ = దేవతలు, గుములై = గుంపులై, పరమ + ఉత్సవమునన్ = జన్మదినమునందలి గొప్ప యుత్సవమునందు ఎదలన్ = మనస్సులందు.

తాత్పర్యము.

లోకరక్షణార్థమై భగవంతుఁ డవతరించుటచే నాకాశంబున గంధర్వులు

పాడిరి - అప్సరస లాడిరి - దేవతలు గుంపులై గూడిరి - మిక్కిలి సంతోషముతో దేవతలు స్త్రీలు రావణునివలన భయము వీడిరి.

క॥ కురిసెను బూవులవానలు, మొరసెను సురదుందుభులును • ముమ్మర మగుచుఁ బెరసెను బురి నుత్సవములు, నెరసెను, సమ్మదము ధాఁరి•ణీజనమందున్. ౧౮

సురదుందుభులు = దేవతల నగారాలు, ముమ్మరము = అధికము, మొరసెను = మోగెను, ఇఁక జాతకర్మోత్సవము చెప్పఁబడుచున్నది.

పురిన్ = అయోధ్యయందు - ఈయిల్లా యిల్లు అనక అన్ని యిండ్లయందును, బెరసెను = వ్యాపించెను, నెరసెను = నిండెను.

తాత్పర్యము.

పూలవాన గురిసెను. దేవదుందుభులు ధ్వనించెను. విశేషముగ నయోధ్యానగరమం దుత్సవములు జరగెను. భూప్రజలందు సంతోష మతిశయించెను.

ఉ॥ ఆపురమందు నయ్యెడ మ•హామహ మద్భుతభంగిఁ బర్వఁ బ్రో
ద్రోపులు నయ్యెఁ బట్టనము•త్రోవల నన్నిట రాచబాటలన్
భూపతిదత్తగోనిచయ•భూరిధనగ్రహణేచ్ఛ విప్రులు
ద్దీపితతేజులెల్ల జగ•తీతల మీనినయట్లు వచ్చుటన్. ౧౯

ఇఁక నాకాలమున రాజు చేసిన దానసమృద్ధిని జెప్పుచున్నాఁడు.

భూపతిదత్త = రాజుచే నీయఁబడిన; గోనిచయ = ఆవుల సమూహాము యొక్కయు, గ్రహణ + ఇచ్ఛన్ = తీసికొనవలయు నను కోరికతో, ఉద్దీపితతేజులై = మిక్కిలి ప్రకాశించునట్లు చేయఁబడిన కాంతిగలవారై, జగతీతలము = భూప్రదేశము, ఈనినయట్లు = బ్రాహ్మణులు గుంపులుగుంపులుగా వచ్చుటచే భూమియే మనుష్యుల నీనుచున్నట్లు కనఁబడెను.

తాత్పర్యము.

అయోధ్యానగరంబున దశరథుఁడు పుత్రోత్సవము చాటింపఁగానే నాశ్చర్యకరమైనరీతిగాఁ బట్టనమం దంతటను వారివారి యింటఁ దొలిచూలుకుమారుఁడు పుట్టిన ట్లుత్సవము చేయసాగిరి. రాజుచేయుదానము గ్రహించుటకై దేశదేశములనుండి వచ్చు విప్రులచే రాచబాటలు నిండిపోయెను.

క॥ నటనర్తకసంకులమై, పటుగాయకగాననాద•వందిరవప్ర
స్ఫుటమై హర్షోత్కటమై, పుటభేదన మమరె హృదయ•పుట ముల్లసిలన్. ౨౦

నటనర్తక సంకులమై - నట = వేశ్యల కాటనేర్పువారిచేతను, నర్తక = ఆడువారిచేతను, సంకులమై = నిండినదై; పటు = ప్రస్ఫుటమై — బాగుగఁ బాడు

వారును, వాద్యములు వాయించువారును మున్నగువారియొక్కయు, స్తుతిపాఠకులయొక్కయు శబ్దములచేత స్పష్టమైనదై, హర్ష + ఉత్కటమై = సంతోషముచే నెక్కువైనదై, పుటభేదనము = అయోధ్యాపట్టణము.

తాత్పర్యము.

రస మభినయించు నటులచేతను, భావమభినయించునర్తకులచేతను, సంకులమై గాయకుల గానములచేతను, వందులస్తోత్రవాక్యములచేతను ప్రస్ఫుటమై యతిశయించిన సంతోషముగలదై యంత అహృదయము లుల్లసిల్ల నయోధ్య రాజిల్లెను.

తే॥ పదియురెండవదినమునఁ • బార్థివుండు, పురుడు పాయంగఁ దన ప్రియ • పుత్రకులకు
నామకరణమహంబు నొ • నర్చెఁ బ్రేమ, నిర్భరానందమగ్నుఁడై • నివ్వటిలుచు. ౫౧౧

పదియు రెండవ దినమునఁ బురుడు తీరఁగ = 'క్షత్రియస్య ద్వాదశాహం సూతక'మ్మని శ్రుత్యనుసారముగఁ బండ్రెండుదినములు క్షత్రియునికిఁ బురుడు. అది పదుమూఁడవ దినమునఁ బోవును. తక్కినవారి పురుడును ముందుపురిటితోనే పోవును గాన రామోత్పత్తికిఁ బదుమూఁడవనాఁడే నామకరణోత్సవము జరగెను. నిర్భర .మగ్నుఁడై = అధికమైన సంతోషమున మునిఁగినవాఁడై; నివ్వటిలుచుఁ = అతిశయించుచు, నామకరణమహంబు నొనర్చెఁ = 'త్రయోదశే రాజ్ఞాం నామకరణ'మను శ్రుత్యనుసారముగఁ బదుమూఁడవదినమున నామకరణోత్సవమును జేసెను.

మూలమున "అతీత్యైకాదశాహంతు" పదునొకండు దినములు గడువఁగా నని యర్థము. ఇది లక్ష్మణు జనన దినమునుండి యని గ్రహించునది. లక్ష్మణుని పదునొకండవదినము శ్రీరాముని పదుమూఁడవదినమగును.

తాత్పర్యము.

పండ్రెండవదినముతోఁ బురుడు తీరిపోఁగాఁ బదుమూఁడవదినమున సంతోషాతిశయముచేఁ గుమారులకు నామకరణమహోత్సవము జరిగించెను.

తే॥ అనఘుజ్యేష్ఠుని రాముఁడ • టంచుఁ గైక, తనయుభరతుఁడనుచు సుమి • త్రాసుతులకు
సరవి లక్ష్మణశత్రుఘ్న • సంజ్ఞ లమరఁ, బేరు లిడియె వసిష్ఠుండు • పెం పెకింగి. ౫౧౨

ఎవరి కెవరి కేమేమి పేర్లు పెట్టె రనఁ జెప్పుచున్నాఁడు. అనఘుఁ = నిర్దోషుని - ఇది హేయప్రత్యనీకగుణవత్త్వమున కుపలక్షణము. దీనిచే రామశబ్ద వ్యుత్పత్తి తెలుపఁబడెను. రాముఁడు = ఇతని గుణంబులచే నీయనను

జూచినవారెల్లరు సంతోషింతు రని వ్యుత్పత్త్యర్థము. కైకతనయః = కైకేయీపుత్రుని, భరతుఁ డనుచుః = "భరత ఇతి రాజ్యభరణా" త్తను సహస్రానీకోక్తచే దశరథుఁడు మరణించి శ్రీరాముఁడు వనమునకుఁ బోవఁ దాను రాజ్యభారమును వహించుటచే నీపే రీతని కొప్పును. తనదికాని రాజ్యము తాను భరింపవలసివచ్చుట విశేషముగదా. సుమిత్రాసుతులకు = ఇద్దఱకుః; సరవిః = క్రమముగ, లక్ష్మణ శత్రుఘ్న సంజ్ఞలు = లక్ష్మణుఁడు, శత్రుఘ్నుఁడు అను పేళ్లు, శ్రీరామ కైంకర్య మను లక్ష్మి కలవాఁడు లక్ష్మణుఁడు. 'లక్ష్మణో లక్ష్మీసంపన్న' యని ముందు చెప్పఁబడును. శత్రుఘ్నుఁడు = 'పుంసాం దృష్టి చిత్తాపహారిణ'మ్మన్నట్టి శ్రీరామునియందు భక్తికై తనయింద్రియముల నపయోగింపక భాగవతుఁ డగు భరతునియందుఁ దన భక్తికై యుపయోగింప నింద్రియముల జయించి స్వాధీనమున నంచుకొన్నవాఁడు. 'శత్రుఘ్నో నిత్యశత్రుఘ్న' యని ముందుఁ జెప్పఁబడును. క్షత్రియులు తమ పుత్రులకుఁ దామే నామకరణము చేయరాదు - వారి పురోహితుఁడే చేయవలయును - అను సంప్రదాయము ననుసరించి చెప్పుచున్నాఁడు. వసిష్ఠుండు, పెంపు = బిడ్డల రాఁబోవు గుణాభివృద్ధి, నాలోచించి పేరు లిడెను. ఈ గుణములు మీఁద వివరించి నవే. 'త శబ్దః పుంసి సంభోగే నిశ్చయే' యని నానా.

నామైకదేశే నామగ్రహణ మ్మని సత్యభామ భామ యని పిలువఁబడునట్లు శ్రీరాముఁడే యిచ్చట రాముఁడని చెప్పఁబడెను. అట్లుకాదేని రాముఁ డనుపేరిదివఱకే పరశురామున కున్నదిగదా. ఆ పే రీయనకుఁ బెట్టిన నేమి విశేషము ? వైకుంఠమందు, శ్రీ = లక్ష్మీదేవియందు, రామ = రమించువాఁడే యీయన కావున నీయనకు శ్రీరాముఁ డనియే పేరు. పరశు వనఁగా గండ్రగొడ్డలి, పరులను హింసించుటచే భయంకరమైనది. అట్టిదానియందు రమించువాఁడు కావున జమదగ్నికుమారుఁడు పరశురాముఁ డయ్యెను. బలముచేఁ గ్రీడించువాఁడు బలరాముఁ డయ్యెను. అట్లులే శ్రీయందు రమించువాఁడు శ్రీరాముఁడయ్యెను. "రేవతీరమణో రామః" బలరామునకు రాముఁడనియు బరశురామునకు రాముఁడనియు నెట్లు నామములు గ్రహింపఁబడినవో యట్లు శ్రీరాముఁడు రాముఁ డయ్యెను. ఈ విషయము విశదముగఁ బద్మపురాణమందిట్లు చెప్పఁబడినది.

శ్లో॥ శ్రియః కమలవాసిన్యా, రమణోయం మహాప్రభుః
తస్మా చ్ఛ్రీరామ ఇత్యస్య, నామసిద్ధం పురాతనమ్॥

రామశబ్దమును గుఱించి శ్రీరామనామమాహాత్మ్యము చూడుఁడు.

తాత్పర్యము.

హేయగుణ మొక్కటియైన లేనివాఁ డగుటచేతన, లోకులమనస్సు లీయన యందు రమించుచుండుటను, యోగులహృదయములయం దీయన రమించుటచే తను, తనగుణరూపములచేవశీకృతులైనవారుతనయం దనురాగముగలవారగుట చేతను, తనకు వశులైనవారివిషయమున నంజిల్లువాఁడు గనుకను, సంసారబాధ తొలగినవా రాయనయందు రమింతురు గనుకను పెద్దకుమారునకు రాముఁడ నియు, శ్రీరామకైంకర్యమే తనకు గుత్తుగాను శ్రీరామకైంకర్యమే తనకు సంపదగాను దలఁచినవాఁడు కావున సుమిత్రాదేవి పెద్దకొడుకునకు లక్ష్మణుఁ డనియు, రాజ్యమును భరింపవలసినభారము తనయందు లేకున్నను భరించువాఁ డగుటచేతను (భర + త) తన్ను రక్షించుభారము శ్రీరామునిదే యను నిశ్చ యబుద్ధిగలవాఁడై కేవలరామపరతంత్రుఁడై యుండువాఁ డగుటచేఁ గైకేయీ కుమారునకు భరతుఁడనియు, నీయన కారణముగఁ గదా శ్రీరాముఁ డడవుల పాలాయెను - తండ్రి మనోభిమతమును మాతృకాంక్షిత మిచ్చెడే కదా యని నిత్య శత్రువులయిన కామక్రోధములకు వశపడక వానిని జయించి సవతితల్లి కొడు కైనను భాగవతుఁడుగదా-భగవత్సేవకన్న భాగవతసేవయే సుకరము, నిశ్చిత ఫలదమని యెంచినవాఁడు కావున సుమిత్ర రెండవపుత్రునకు శత్రుఘ్నుఁడనియు వారివారి గొప్పతన మెఱిఁగినవాఁడై వసిష్ఠుఁడు పేర్లు పెట్టెను.

కం॥ భూరమణుఁడు బ్రాహ్మణులకు, బౌరులకు సమస్తజానపదులకు నపుడ
వ్వారిగ భోజన మిడి మణి,వారంబుల నిచ్చె విప్రవర్యుల కెల్లన్. ౫౧౩

నామకరణకాలమునఁ జేయవలసిన నాంది యను కార్యమునుగూర్చి చెప్పు చున్నాఁడు. జానపదులకున్ = పల్లెలలోనివారికి, పౌరులకున్ = పురమున నుండువారికి, ఇవి బ్రాహ్మణులకు విశేషణములు. అవ్వారిగన్ = అపరిమితముగ.

తాత్పర్యము.

నామకరణమహోత్సవకాలమున దశరథుఁడు బ్రాహ్మణులకు నగరవాసులకుఁ బల్లెలవారికి దండిగ భోజనముపెట్టి బ్రాహ్మణులకు మణులు మొదలైనవి దక్షి ణల నిచ్చెను.

—* శ్రీరాముని శైశవవర్ణనము *—

కం॥ *కావు మని గజము మొఱలిడఁ, గావఁగ దక్షుండు దా నొకండే జగతిం
గావుటఁ బరు విడువేలుపు, త్క్ష్మావరసుతుఁ డగుచుఁగావు కావనియేడ్చెన్. ౫౧౪

గజము = ఏనుఁగు, కావుము = రక్షింపుము; మొఱలిడన్ = మొఱలు పెట్టఁగా; దక్షుండు = సమర్థుఁడు, జగతిన్ = సమస్తప్రపంచమందు, కావు

టన్ = అగుటచే, వేలుపు = నారాయణుఁడు; క్ష్మావరసుతుఁడు = రాజగుదశర థుని కుమారుఁడు; కావుకావు - ఇది రోదనానుకరణము కావున మువర్ణకము రాదు. కావున కావుకా వను వసుచరిత్ర - పాండురంగ మాహాత్మ్యములందలి ప్రయోగములఁగల దోష మిందు లేదు. కావు మని రాముఁ డేడువవలసినపని లేదుగదా.

తా త్ప ర్య ము.

మకరికిఁ జిక్కి రక్షింపుము రక్షింపుముఅని గజరాజు మొఱలుపెట్టఁగా నతని రక్షింపఁగలసమర్థుఁడు తానుదప్పమఱియొకఁడు లేకుండుటచే నతనిఁ గావఁ బరు వెత్తినవేలుపు నేఁడు రాజకుమారుఁడై పుట్టి కావ్ - కావ్ అని యేడ్చెను.

ఉ॥ *లాలసమానసంబులఁ గ♦లావతులున్ రమణీయడోలికా
పాలుల నుంచి యాజినర♦పాలకుమారులఁ, గంకణధ్వనుల్
దాలము గాఁగ, రాగములు ♦ తానము దప్పక పంచమధ్వనిన్
లాలి యటంచుఁ బాడిరి వి♦లాసవికాసవిభాసమానలై. ౫౧౭

కలావతులున్ = కాంతిమతులగు దశరథభార్యలు, ఆజి . కుమారులన్ = దశరథమహారాజపుత్రులను, లాలసమానసంబులన్=అభిలాషగల మనస్సులతో, రమణీయ = అందమైన, డోలికా = ఉయ్యాలలయొక్క; పాళులన్ = పంక్తుల యందు; కంకణ = కడియములయొక్క, తానము = స్థానము, తానవంబుగాన్= సన్నని గొంతుతో; పంచమధ్వనిన్ = కోకిల ధ్వనివంటి ధ్వనితో, విలాస = అందమైన యవయవ చేష్టలయొక్క, వికాస = అతిశయప్రకాశముచే; విభా సమానలై = ప్రకాశించువారై.

తా త్ప ర్య ము.

అటువంటి బాలురను నంతఃపురస్త్రీలు నవ్విళ్లూరు కోరికలచే నుయ్యాలల యం దుంచి పంచమధ్వనితో కంకణముల ధ్వనియే తాలధ్వనిగ రాగములు తప్పకుండఁగ విలాసమువలనఁ గలిగిన వికాసముచేఁ బ్రకాశించువారై లాలి యని పాటలు పాడిరి.

ఉ॥ *నాయన నిద్రవోర, రఘు♦నందన నిద్దుర వోర, యేలరా
పాయనియాటలం దవిలి ♦ బంగరుకొండ మొగుడ్పు వక్షులన్ ?
మాయురె యిట్టులైనను శ్ర♦మం బగురా, యని యెన్నఁడేఁ గనల్
మూయనియాదిదేవుఁ గని ♦ ముగ్ధలు జోలలు వాడి రయ్యెడన్. ౫౧౮

పాయని = వదలని, బంగరుకొండ, అక్షులన్ = కన్నులన్; మొగుడ్పు= మూయుపు - నిద్దురపోవు; మాయురె = మిక్కిలి యాశ్చర్యము; ముగ్ధలు =

(1) ఎన్నఁడు కన్నులు మూయని భగవంతుఁడని యెఱుఁగని యాదశరథు భార్యలు
(2) అందెకత్తెలగు దశరథు భార్యలు, జోలలు = జోలపాటలు.

తాత్పర్యము.

నాయనా నిద్రపో - రఘునందనా నిద్రపో - తండ్రీ నిద్దురపో - బంగారు కొండా యాటలుమరగి కన్నులు మూయవే - యేలరా - తండ్రీ! ఇట్లు నిద్రపోక యుండితివేని దేహ మలయునురా కుమారా యని యేనాఁడును గన్నులు మూయని దేవాదిదేవునిఁ గూర్చి యా ముద్దరాండ్రు పాటలు పాడిరి.

కం॥ *జలములు దానము గాఁగను, గలకాలము వెలయు వేల్పు ♦ కంజాతాక్షుల్
జలముల బోర్కాడింపఁగ, వెలఁదులఁ గనుచుండు ముగ్ధ♦విధమున నగుచున్. ౫౧౭

తానము = స్థానము, వేల్పు = శ్రీరాముఁడు - క్షీరాబ్ధిశాయి యని భావము. కంజాత + అక్షుల్ = తామరలవంటి కన్నులుగల దశరథుని స్త్రీలు. బోరుకాడింప=స్నానముచేయింపఁగ, ముగ్ధవిధమునన్ = ఏమియుఁ దెలియని వానివలె, నగుచున్ = నవ్వుచు, వెలఁదులన్ = స్త్రీలను, జలములు. వేల్పు - నారాయణశబ్దార్థ మిందుఁ గలదు. బోరుకాడించు. "తే॥ పాపనికి నూనె తలయంటి పసుపుపూసి, బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు, జలముఁగొన్ని చుట్టి రాజిలెడుతొట్ల, నునిచి దీవించి పాడి రయ్యువిదలెల్ల." — భాగ. ౧౦ స్కం. పూ.

తాత్పర్యము.

ఎల్లకాలము జలములే స్థానముగానుండు దేవునికి నాస్త్రీలు నీళ్లచే స్నానము చేయింపఁగా నేమియుఁ దెలియనివానివలె వారి యుత్సాహమున తనకై వారు పడు శ్రమము వారి యజ్ఞానము చూచి నవ్వుచుండెను.

తే॥*జలములం గొని తనపాణి♦జలజమునను, రక్షఁ ద్రిప్పను శ్రీరామ♦రక్ష యనుచు
రామునకునుద్రిలోకాభి♦రామునకును,శ్రీమతీమణి గౌసల్య♦ప్రేమమునను. ౫౧౮

శ్రీమతీమణి = శ్రీమంతురాండ్రలో గొప్పది. అందఱుస్త్రీలు - శ్రీ = సంపత్తుగోరువారే; అయినను కౌసల్యవలె భగవంతుని కని పెంచి లాలించు భాగ్య మెవ్వతెకుఁ గలుగును. పాణిజలజమునను = తామరపువ్వువంటి చేతిచే, భగవంతునకుఁ జేతితో నీళ్ళు పోయవచ్చునా? జలజము=శంఖము; ఆమె హస్తము శంఖమువలెఁ బవిత్రమై భగవదర్చనాయోగ్యమైన దని భావము. త్రి + లోక + అభిరామునకును = ముల్లోకములకు మనోహరుఁ డగు వానికి; శ్రీరామ + రక్ష=కౌసల్య లక్ష్మీనారాయణో పాసనముచేయునదికావున

నారాయణా! నీవే యీ శిశువును రక్షింపవలెను. శ్రీరామ = లక్ష్మియందు రమించువాఁడు-నారాయణుఁడు. రక్ష = రక్షణముగా నీళ్లను జుట్టుత్రిప్పుట.

తాత్పర్యము.

స్నానమైనతరువాతఁ గౌసల్య తనచేత నీళ్లు తీసికొని శ్రీరామనారాయణా యీ బాలుని రక్షింపుమా యని రక్షగాఁ జుట్టు త్రిప్పెను.

కం॥ *చెడుగులు దమప్రాణములం, బిడికిట నీరీతిఁ బట్టి ♦ మిడికెద రనఁగాఁ
బిడికిలి విడువక యుండెఁ,బుడుతఁడుగొన్నాళ్లు జనని♦ మోహము దీర్పన్. ౫౮౯

బుడుతఁడు = చిన్నికుమారుఁడు - శ్రీరాముఁడు; జనని మోహము = తల్లికోరిక; చెడుగులు = దుష్టులు, మిడికెదరు = మిణకరించెదరు - పిల్లలు స్వాభావికముగాఁ బట్టుకొను పిడికలిని దుష్టుల యభిప్రాయసూచనార్థ మని చెప్పుటం బట్టి గమ్యోత్ప్రేక్షాలంకారము.

తాత్పర్యము.

దుష్టులగువారు శ్రీరాముఁ డెప్పుడు వచ్చి మనలఁ జంపునో యని తమ ప్రాణములను భయముచేఁ బిడికిటఁ బట్టుకొని యున్నారని యభినయించునట్లు శ్రీరాముఁడు కొన్నిదినములు తన బాలక్రీడలచేఁ దల్లిమోహముఁ దీర్చుటకై పిడికిలి విడువక వ్రేళ్లు ముడుచుకొనియే యుండెను.

ఆ॥*చూడ వచ్చినట్టి♦చేడియల్ రామునిఁ, బొత్తిచేలములను ♦ హత్తియెత్తి,
యొమ్ము లంట నొత్తి ♦ యెమ్మెగా నవ్వించి, తల్లిచేతి కిత్తు ♦ రుల్ల మలర. ౫౯౦

చేడియల్ = స్త్రీలు, చేలములను = వస్త్రములందు, హత్తి = చేర్చి, ఎమ్మె = మనోహరముగా, ఉల్లము = మనస్సు; స్వభావోక్త్యలంకారము.

తాత్పర్యము.

బాలురను జూడవచ్చిన పురస్త్రీలు శ్రీరామునిఁ దమచేతులతో నెత్తినచో బాలుఁడు కసుగందునో యాయనదేహము ముఱికి యగునో యని పొత్తిగుడ్డలతోనే యెత్తికొని తమ స్తనములకు నొత్తుకొని చిటికెలు వ్రేసి యూలలు వేసి నవ్వించి మరలఁ దల్లిచేతి కిత్తురు.

కం॥ *ఆటలకై జగములజెం,జాటం బిడుకొనెడి వేల్పు♦జలజాక్షుల కే
ర్పాటుగ నాటలఁ బాటలఁ,బాటవమును జూపె శత్రు♦పాటనపరుఁడై. ౫౯౧

జెంజాటము = తగులాటము; శత్రుపాటనపరుఁడై = శత్రుసంహారము ప్రధానముగాఁగల వాఁడై; పాటవమును = సామర్థ్యమును.

తాత్పర్యము.

'లోకవత్తులీలాకైవల్య' మ్మని సమస్తభూమండలాధిపతియగు చక్రవర్తి వినోదమునకై చెండాడునట్లు ప్రపంచసృష్టిస్థిత్యాదివ్యాపారము పెట్టుకొన్న దేవుఁడు శత్రువుల వధించు కార్యమం దాసక్తుఁడయ్యు తన్ను నాడించు స్త్రీలను దా నాటలఁ బాటల నాడించెను. ఇవన్నియు నొక్కొక్కవయస్సున నొక్కొక్కకార్యమని యెఱుంగవలయును.

శా॥ *దాయల్ దానును గూడి యాడునెడలన్ • చన్ డాసి కౌసల్య యెం
తో యాసక్తిని రార డస్సితివిరా • యో రామచంద్రా యటం
చీయోజం దనఁ బిల్వఁ జన్గుడువఁగా • నేతెంచి తాఁ ద్రావకే
"ఊఁ" యమ్మా యని వ్రేలఁ జూపు ననుజన్ • హా యెట్టి సౌభ్రాత్రమో! ౨౨

ఇదిమొదలు మూఁడుపద్యములందు రామలక్ష్మణుల సౌభ్రాత్రము బాల్యము నుండి కల దని చెప్పుచున్నాఁడు. దాయల్ = తమ్ములు, డాసి = సమీపించి, ఆసక్తిని = ఆశతో, డస్సితివి = అలసితివి, ఈయోజన్ = ఈవిధముగా, ఊఁ - యిది యనునాసికము. సౌభ్రాత్రమో = చక్కని భ్రాతృభావమో, హా-ఇది యాశ్చర్యార్థకము - ఇట్టి చిన్నవయస్సునందే యిట్టి భ్రాతృస్నేహము కలదు గదా యని యాశ్చర్యము. దాయాదశబ్దభవము దాయ వర్ణలోపము. చంద్రుఁ డనఁగా నాహ్లాదపెట్టువాఁ డనియర్థము. అభిరామచంద్రుఁడే రామచంద్రుఁడు. ఈ రామచంద్రునిఁ జూచినపిమ్మట నాకాశచంద్రునిఁ జూచిన నింతకంటె సౌమ్యత గాని చక్కఁదనముగాని లేకుండుటచే నతఁడు ఆహ్లాదము కలిగింపలేఁడని భావము. ఆచంద్రుని జూచుటకంటె నీ రామచంద్రునిఁ జూచిన నెక్కువ యాహ్లాదము కలుగుచున్నది.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి తన తమ్ములతో నాడుకొనుసమయంబునఁ గౌసల్య వచ్చి నాయనా రామచంద్రా యాడి యాడి యలసినావురా తండ్రీ పాలు త్రావుదువుగాని రారా యని యెత్తుకో పోఁగాఁ దల్లి చంకకుఁ బోయి ఊఁ ఊఁ యని తమ్ములకుఁ బాలి మ్మని వ్రేలితోఁ దమ్ములవంక చూపి సైఁగలుచేయును. ఆహా యేమి భ్రాతృవాత్సల్యము.

కం॥ *తనయుల్యొల్లప్రక్కన లక్ష్మణునయ్యల లేకయున్నఁ • గనుమూయం డే
మిని నుల్లాసముఁ గానఁడు, జననీస్తన్యంబుఁ గ్రోలఁ • జనఁ డేమైనన్. ౨౩

ఏమిని — ఏమియును అను దానిలో యుకారము లోపింపఁగా నీరూప మేర్పడును. ఉల్లాసము = సంతోషము; స్తన్యము = చనుఁబాలు.

తా త్ప ర్య ము .

ఇఁక నొండుకొను నప్పుడో తన యయ్యాలప్రక్కన లక్ష్మణునయ్యేల లేక పోయెనా సంతోషముగా నాడుకొనఁడు - నిద్దురపోఁడు - ఏమైనను సరే - తల్లి పాలుకూడఁ ద్రాగఁడు.

తే॥ *పాలువిడువని యాలేఁత♦ప్రాయమంది, ప్రతిదినమునొక్కపరియైన ♦ రాఘవుండు సవతితల్లులయిండ్లకుఁ ♦ జనక విడువఁ, డెత్తికొని పోవ సైఁగల ♦ నెలమిఁజేయు. ౧౨౮

ఒకపరి = ఒకతూరి; ఎలమిన్ = సంతోషముతో.

తా త్ప ర్య ము .

అన్నప్రాశముకూడలేక కేవలము చనఁబాలు త్రావుచియుతివయస్సునందే దినమున నొక్కసారియైనఁ దనసవతితల్లులయిండ్లకుఁ దీసికొని పొమ్మని గోడాఁడించును. సైఁగలుచేయును. ఎత్తుకొనిపోవునఱకు విడువఁడు.

ఉ॥ *కమ్మనినూనెల మంటి, యెస♦కమ్మున గంధిజలంబు వోసి, ధూ పమ్మున నార్చి, వెండ్రుకలఁ, ♦ బల్చనగా జడయల్లి, తల్లి పొ న్సొమ్ములు పెట్టి మోమునను ♦ జుక్కయుఁ, గన్నులఁగాటుఁ, నుంచి మో దమ్మున ముద్దు పెట్టి పిన♦దమ్ములతోడుతఁ బంపు నాడఁగన్. ౧౨౯

కమ్మని = సువాసనగల, ఎసకమ్మునన్ = అతిశయమున, గంధిజలంబు = పన్నీరు - సువాసనగల నీరని యర్థము. ధూపమ్మున = మహిసాక్షి - సాంబ్రాణి పొగలచే.

తా త్ప ర్య ము .

మంచిపరిమళముగల సంపెంగనూనెతోఁ దలయంటి - పన్నీట జలకమార్చి - దశాంగమున ధూపమువైచి - వెండ్రుకల తడియాఱకముందే గట్టి జడవేసినఁ బిసకపట్టును గావునఁ బింపిణీజడవేసి - మేనినిండ బంగారుసొమ్ములు పెట్టి - ముఖము నందుఁ గస్తూరిచుక్కయుఁ గన్నులందుఁ గాటుకయు నుంచి - సంతోషముతో ముద్దుపెట్టి - తమ్ములతోడ నాడుకొనటకై కౌసల్య శ్రీరామచంద్రమూర్తినిఁ బంపుచుండెను.

మ॥ *ఘలుఘల్లంచును మ్రోయ గజ్జియలు బం♦గారందియల్, లీల ను య్యాల లూఁగన్ విపులోరమం దురుమణీ♦హారావళుల్, గుండలం బులు ఝాళ్ఝళ లాడఁ, గంకణరవం♦బుల్ మీఱఁగా, గంతులన్ జెలఁగ న్వైచుచు నాడఁబోవు దినముల్ ♦ శ్రీరామభద్రుం డొగిన్. ౧౩౦

ఉయ్యాలలూఁగన్ = ఇటునటు నాడఁగా, విపుల + ఉరమందున్ = వెడల్పు గల ఱొమ్మునందు, ధాళధళలాడన్ = తళ తళ మెఱయుచుండఁగ, శ్రీరామ భద్రుఁడు = మంగళకరుఁడగు శ్రీరాముఁడు - పాండవమధ్యమాదిశబ్దములవలె నిట విశేషణమునకుఁ బరనిపాతము, ఒగిన్ = క్రమముగ,

తాత్పర్యము.

శ్రీరామచంద్రుఁడు తనకాలిగజ్జియలు - బంగారందియలు ఘల్లుఘల్లుమనుచు ధ్వనింపఁగా నక్షత్రములమందలి హారములు ముందు వెనకకుఁ బ్రక్కలకు నుయ్యాల యూఁచిన ట్లూఁగుచుండఁగా చెవులపోఁగులు తళుక్కు తళుక్కుమని మెఱయుచుం డఁగా చేతుల ధరించిన కంకణములు జలిబిలిధ్వనులు చేయఁగా పిల్లతనము నటిం చుటకై తై తై యని యెగురుచు గంతులుపెట్టుచు నాయనా మెల్లఁగాఁ బోరా మెల్లగాఁ బోరా యని తల్లి హెచ్చరించుచుండ పట్టుకొనవచ్చినవారికిఁ జిక్కక తమ్ములతోడ నాడుకొనఁ బ్రతిదినము పోవుచుండెను

౫౧౮ మొదలు ౫౨౬ నఱకుఁగల పద్యము లాంధ్రగ్రంథకర్త సొంత పద్యములు. వీనికి సరియైనవి మూలమునందు లేవు. ఈగ్రంథము మూలము ననుసరించి యుండవలె నను మిత్రాభిప్రాయముప్రకారము చొప్పున నూర్ల కొలఁది పద్యములు తొలఁగించినను పాఁపగుడ్డులవలె నందందిట్టివి మిగిలిపోయి నవి. తీసివేయ మనస్సు రాక యుంచఁబడినవి. వీనివలన మూలమునకు బాధ లేదు.

రాజకుమారగుణవర్ణనము

కం॥ ఈలీల రాచకొమరులు, వాలాయము గారవమున ♦ వర్ధిల్లుచు వి
ద్యాలంపటులై నేర్చిరి, యోలిన్ సకలంబు మేలి♦యొజ్జలతోడన్. ౫౨౮

వాలాయము = ఎల్లప్పుడు; లంపటులై = అభిలాషగలవారై, మేలియొజ్జల తోడన్ = గొప్పయుపాధ్యాయుల యొద్ద; ఒజ్జలతోడ - సు. వ్యా. కారక. సూ ౧౧. ఉపయోగంబుసందార్థ్యాకుఁ-దృతీయ వలస లగు. లంపట-ఇది తెనుఁ గు పదము - శ్రమ మని యర్థము. లంపటము - సంస్కృతపదము - ఆసక్తి యని యర్థము. దేహలంపట ఇత్యాదు లసాధువులు. ఉపాధ్యాయ శబ్దభవము ఒజ్జ.

తాత్పర్యము.

ఈవిధముగ రాజకుమారులల్లారు ముద్దుగ గోమునఁ బెరుఁగుచు విద్యాయం దాసక్తులై సమస్తవిద్యలు శ్రేష్ఠులైన గురువులవలన నేర్చిరి.

కం॥ వారలలో జనకునకున్, శ్రీరాముఁడు ధ్వజమురీతిఁ ♦ బ్రియుఁడయ్యె గదున్
ధారణి భూతావళులకు, సారససంభవుఁడువోలె ♦ జనవినుతుండై. ౫౨౯

రాముని మహత్త్వమును జెప్పుచున్నాఁడు.

ధ్వజమురీతిక్ = ధ్వజమువలె (1) తనస్థలమును బ్రకాశింపఁజేయునట్లు రామచంద్రమూర్తియును దనవంశమును బ్రకాశింపఁజేయును (2) ధ్వజము తనచుట్టు నున్నవానికంటె నౌన్నత్యము గలదై యుండును. ఈయనయుఁ దక్కినవారికంటె గొప్పవాఁడని భావము. (3) ధ్వజము సేనకుఁ బ్రాణమువంటిది. ధ్వజముపోయిన సేనకుఁ బ్రాణము మానము పోయినట్టే. అట్లులే రామచంద్రమూర్తి యయోధ్యకుఁ బ్రాణమైయుండెను. ఆయనలేకున్న నది పాడుపడినట్టే. వినుతుండై = స్తోత్రము చేయఁబడినవాఁడై, భూత = ప్రాణులయొక్క; సారసనంభవుఁడువోలెక్ = బ్రహ్మవలె, జనకునకుఁ గడుఁ బ్రియుఁడయ్యె నని భావము. రక్షణముతో పాటు శిక్షణము కార్యముగా నంచుకొనుటచేఁ గొందఱు విష్ణువును ద్వేషింతురు. కొందఱు శివుని ద్వేషింతురు. బ్రహ్మయో దేవతలకు రాక్షసులకుఁ గార్యార్థుల కంరఱకు సముఁడే ఎవరువరములడిగినను నిచ్చుచుండుటయే యాయనపని.

తాత్పర్యము.

ఆనలువురుకుమారులలో శ్రీరాముఁడు జనులపొగడ్తకు యోగ్యుఁడై తండ్రికి సేనకు ధ్వజమువలె భూతకోటులకు బ్రహ్మదేవునివలె మిగులఁ బ్రియుఁడయ్యెను.

ఉ॥ అందఱు సర్వవేదవిదు । లందఱు శూరకులాగ్రగణ్యు, ల
య్యందఱు లోకభద్రరతు, । లందఱు జ్ఞానయుతుల్, దయాళు రా
యందఱు, సత్యసత్త్వగుణు । లందఱు, సాధుమణుల్. మహాత్ము ల
య్యందఱు సుందరుల్, విబుధు । లందఱు సర్వకళాప్రవీణతన్. ౨౫

వీరల విద్యాభ్యాసమును జెప్పుచున్నాఁడు. సర్వవేదవిదులు = సమస్తవేదముల నెఱిఁగినవారు. శూరకుల + అగ్రగణ్యులు = వీరశ్రేష్ఠులు - ఈపదము ధనుర్వేదాధ్యయనము దెలుపుచున్నది. భద్రరతులు = మేలుచేయుటయందభిలాషగలవారు - ఈపదము ధనుర్విద్యాభ్యాసమువలని ఫలము దెలుపుచున్నది. శస్త్రధారణఫల మార్తరక్షణము - దీనార్త రక్షణము - "విద్యా వివాదాయ, ధనం మదాయ, శక్తిః పరేషాం పరిపీడనాయ। ఖలస్య, సాధోర్విపరీతమేత జ్జ్ఞానాయ, దానాయ చ రక్షణాయ" దుష్టుని విద్య వివాదమునకు, ధనము గర్వమునకు, బలము పరులఁ బీడించుటకు నుపకరించును. శిష్టుని విద్య జ్ఞానమునకు, ధనము దానమునకు, బలము పరార్తరక్షణకు నుపయోగించును. ఈ యర్థమునే సీతాదేవియు రామచంద్రమూర్తికి బోధించెను - అరణ్య ౧౧౮ చూడుఁడు. జ్ఞానయుతుల్ = వేదార్థజ్ఞానము గలవారు, దీనివలన విద్యాఫలము

తెలుపఁబడియె. దయాళురు = దయగలవారు. ఇది శక్తిగల ఫలమును దెలుపును - సత్యసత్త్వగుణులు = దీనివలన సత్యంవద - ధర్మంచర యను వేదానుశాసనములు వర్తించుటయేగాక యనుష్ఠానమందును గలవారని భావము. ఆకారణముచేతనే - సాధుమణుల్ = సాధువులందు శ్రేష్ఠులు, సాధువులు కావుననే మహాత్ములు, సర్వకళాప్రవీణతన్ = చతుష్షష్టికళలయందును, విబుధులు = పండితులు, సర్వతంత్రస్వతంత్రులు.

తాత్పర్యము.

దశరథుని కుమారులు నలువురు నాలుగు వేదములు నధ్యయనము చేసినవారే. అందఱు శూరులందుఁ బేరుపొందినవారే, అందఱు జనక్షేమముఁ గోరువారే. అందఱు జ్ఞానవంతులే, అందఱు దయావంతులే, అందఱు సత్యవాక్యధురంధరులే, అందఱు సత్త్వగుణము ప్రధానముగాఁ గలవారే, అందఱు సాధువులందు రత్నముల వంటివారే, అందఱు గొప్ప మనస్సు గలవారే; అందఱు నరువదినాలుగు విద్యలందును ప్రవీణులయిన పండితులే.

ఉ॥ రాముఁడు, శీలసంపదభిరాముఁడు, సత్యపరాక్రమక్రమో
ద్దాముఁడు, నిర్వికల్పగుణధాముఁడు, సర్వజగత్సమిష్టచో
ధాముఁడు, సాధుచిహ్నసుమదాముఁడు, భాసిలె నీలనీరద
శ్యాముఁడు వారిలోనఁ దనుచారిమ ధిక్కృతకామధాముఁడై. ౫౦

నలుగురుకుమారుల గుణములఁ జెప్పఁబూని తొలుత రామచంద్రమూర్తి గుణములఁ జెప్పుచున్నాఁడు. శీలసంపత్ + అభిరాముఁడు = మంచి నడవడి యనెడి సంపదచే మనోహరుఁడు, ఉద్దాముఁడు = అతిశయించినవాఁడు, నిర్వికల్పగుణధాముఁడు = నిస్సందేహమగు గుణములకు స్థానమైనవాఁడు. సర్వజగత్సమిష్టచోధాముఁడు = సమస్త జగములకు నిష్టుఁడైన చంద్రుఁడు, సాధుచిహ్నసుమదాముఁడు = సజ్జనులలక్షణము లనెడు పువ్వులహారము కలవాఁడు; నీలతోయదశ్యాముఁడు = నల్లమేఘమువలె నల్లనివాఁడు - నీళ్లుండిన మేఘమే నల్లగానుండును. అట్టి మేఘమే వర్షముకురిసి ప్రజలకు మేలుచేయునది. అట్లే యీయనయు నని భావము. రుచిచారుతన్ = కాంతియొక్క మనోజ్ఞత చేత (కలిగిన), ధిక్కృతకామధాముఁడై = సౌందర్యముచే మన్మథునికాంతిని మించినవాఁడై; మన్మథమన్మథుఁడై యని భావము. భాసిలెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము.

వారిలో శ్రీరామచంద్రమూర్తి మంచినడవడి యనెడు సంపదచేత మనోహరుఁడైనవాఁడు; సత్యమై వంచనలేని విక్రమముయొక్క రీతిచేత గొప్పవాఁడు, సత్యముచేతనే పరుల నాక్రమించువిధియందు గొప్పవాఁడు; ఎప్పటికి నేకవిధ

మైన సద్గుణమును గలవాఁడే కాని సమయమునకుఁ దగినట్టు లొకసారి యొక్క విధముగ మఱియొకసారి మఱియొకవిధముగ వర్తింపనివాఁడు; వీరు శత్రువు లని వీరు మిత్రు లని వీరు గొప్పవా రని వీరు కొలఁదివా రని తారతమ్యబుద్ధిలేక సర్వసముఁడై సమస్తజీవకోటులకు నిర్మలపూర్ణచంద్రునివలెమిక్కిలి యిష్టుఁడైనవాఁడు, సాధుచిహ్నములే పూలహారములుగాఁ గలవాఁడు, వర్షించుటకు సిద్ధముగనుండు కారుమబ్బువంటివాఁడు, దేహసౌందర్యముచే మన్మథుని ధిక్కరించువాఁడునై ప్రకాశించెను.

లక్ష్మణుఁడు తండ్రిని నీవు నాకుఁ దండ్రివికా వని దూషించెను. దశరథునిఁ జంపనైనఁ జంపెదను, చెఱసాలయందు వైచెద ననెను. ఆఁడుదానిమాటల కేమి లెక్కసేక వదినెను దూషించెను. ఇంద్రజిత్తునిమిత్తమై నిరపరాధులయినరాక్షసులనుగూడ బ్రహ్మాస్త్రముచే సంహరించెద ననెను. సమయోచితముగ నధర్మమందును బ్రవర్తింపవచ్చు నని శ్రీరామునకు బోధించెను. అన్నయగు భరతుని జంప సమకట్టెను.

భరతుఁడో కన్నతల్లిని దూషించెను. గురువును గర్హించెను.

శత్రుఘ్నుఁడో తల్లిని గైకను దూషించెను. మందరను బడఁదన్ని చంపఁబోయెను. వీరలయందైన నిట్టిలోపములు గలవుగాని యెట్టికష్టదశయందును శ్రీరామునందు నీవికారములు లేవు. కావున నుత్తములైన నామువ్వురికంటె శ్రీరాముఁ డుత్తముఁ డయ్యెను.

ఈపద్యమందలి విశేషణము లీయర్థమును స్ఫురింపఁజేయుచున్నవి. స్థూలదృష్టి కివి దోషములుగఁ దోఁచినను నివి దోషములుగావు.

ఉ॥ ఏనుఁగుమీఁద నెక్కి, హయపృష్ఠమునందు, రథోపరిస్థితిన్,
బూనిక నిల్చి, కేల విలుఁ బూని, కృపాణముఁ దాల్చి, శస్త్ర మే
దైన ధరించి, సంగరమునందుఁ జరింప, హరింప శత్రులన్,
మానధనుండు నేర్చు; నసమానసపర్యలఁ దేల్చుఁ దండ్రినిన్. ౫౩౧

మానధనుండు = గౌరవమే ధనముగాఁ గల రాముఁడు, స్కంధమందున్ = మూఁపునందు, పృష్ఠమునందున్ = వీఁపున, శతాంగసీమలన్ = రథప్రదేశములందు, కృపాణము = ఖడ్గము, అసమానసపర్యలన్ = సాటి లేనిశుశ్రూషలచేత.

తాత్పర్యము.

ఏనుఁగుమీఁద నుండిగాని గుఱ్ఱముపై నెక్కిగాని రథస్థుఁడైకాని యేవాహనము లేక కాళ్ళపై నిలఁబడికాని - వింటితోఁగాని - కత్తితోఁగాని మఱి యే

శస్త్రమైన ధరించికాని యుద్ధము చేయుటకు, శత్రువుల సంహరించుటకు మానమే ఘనముగాఁగల రామచంద్రమూర్తి నేర్చెను. కొండఱకుఁ గొన్ని మాత్రమే యభ్యాసపడి యుండెను. అన్నిట శ్రీరామచంద్రునకు నభ్యాసము గలదు. ఇంతవిద్య నేర్చుటయందుఁ గాలము గడుపుచున్నను తండ్రి సేవలను గొఱంత లేకుండఁ దృప్తికరముగఁ జేయుచునే యుండెను.

ఉ॥ చిన్నతనాననుండియును ♦ జ్యేష్ఠుఁడు శ్రేష్ఠుఁడు లోకరాముఁ డౌ
నన్నకు, లక్ష్మివర్ధనుఁ ♦ డనంతముఁ గూరుచు స్నేహభక్తిసం
పన్నుఁడు లక్ష్మణుండు వెలి♦ప్రాణము స్వీకము నౌశరీరముగా
కిన్నను మిన్నయుగా, సకల♦కార్యహితాచరణుం డజస్రమున్. ౫౩౨

ఇఁక మూఁడుపద్యముల లక్ష్మణు గుణవిశేషణములు చెప్పఁబడును

లక్ష్మివర్ధనుఁడు =శ్రీరామసేవ యనసంపదను వృద్ధిచేసికొనువాఁడు - లక్ష్మణుఁడు; చిన్నతనాననుండియును గూరుచు స్నేహభక్తి సంపన్నుఁడు = (మొలకెత్తిన మొదలుకొని మిక్కిలి పరిమళించు తులసివలె) జన్మము మొదలుకొనియే లక్ష్మణుఁడు భ్రాతృభక్తిగలవాఁడు - శ్రీరాముని పడుకయొద్దఁ దసపడుకి వేయని రాత్రియంతయు నిద్రయయిన నొందసంతటి స్నేహముగలవాఁడు (2) స్నేహభక్త (మూఁఢభక్తి నిర్బంధభక్త కాక) ప్రీతిగాఁ బరిణమించినభక్త - ఈగుణమితనికి స్వభావసిద్ధమని దీనిచే నేర్పడియె. శ్రీరామునితోడ నుండకున్న నిద్రపోఁడని చెప్పుటచే లక్ష్మణభక్తి పరమభక్తి యని యేర్పడియె. "పునర్విశ్లేష భీరుత్వం పరమా భక్తి రుచ్యతే" ఎడఁబాటు కలుగు నను భయమే పరమ భక్తి లక్షణము. ఇది నారదమతము. లోకరాముఁడు = లోకమునంతయు సంతోషపఱుచువాఁడు, వెలిప్రాణము = బయటనుండు ప్రాణము. స్వీకము = సొంతము, మిన్న = శ్రేష్ఠుఁడు, అజస్రము = ఎల్లప్పుడు, లోకరాముఁ డను పదముచేత రామునకు లక్ష్మణుఁడు దాసుఁడై యుండుట రాముని గుణములకు మోహించి యని తెలియవలెను. "ఈప్రాజ్ఞునజ తుండఁ డాద్వంధీసద్గుణ రాజికిఁ బశుఁడనై దాస్యంబు గావించెదన్" అని లక్ష్మణుఁడే చెప్పెను. కిష్కింధ ౧౩౫ ప. 'జ్యేష్ఠుఁడౌ నన్నకు' నను పదము లక్ష్మణునకు దాస్యము జన్మముచేఁ గలిగినదని తెలుపును. స్వీకమునౌ శరీరముగా కన్నను మిన్నయు= శ్రీరాముని కుడిభుజమును వెలిప్రాణమునగుట లక్ష్మణుఁడు శ్రీరామున కాయన శరీరమునకన్న శ్రేష్ఠుఁడు, ప్రీతిపాత్రుఁడు నయ్యె నని భావము.

శ్లో. హృదిప్రాణో గుదేపాన, స్సమానో నాభిసంస్థితః, ఉదానః కంఠదేశస్థో వ్యాన స్సర్వశరీరగః॥ అన్నట్టు హృదయస్థానమం దుండువాయువు ప్రాణ మనఁబడును. గుదమునం దపానము, నాభియందు సమానము కంఠమందు నుదానము

దేహమంతయు వ్యానమను వాయువు లుండును. ఈవాయువులు దేహములో పలనుండి దేహమును రక్షించును, కాని వెలుపలనుండి వచ్చునాపదలనుండిరక్షింపఁజాలవు. లక్ష్మణుడో శ్రీరామునకు వెలుపలనుండు ప్రాణమై దేహమునంతయుఁ దా నొక్కఁడే రక్షించుచుండును. శీర్యత ఇతి శరీరం, శౄ హింసాయాం నశించునది కావున శరీర మనఁబడును. 'అనేకదోషదుష్టస్య దేహస్య' అన్నట్లు లనేకదోషములతోఁ గూడినది కావున తన శరీరముమీఁద దనకే యెప్పుడో యొక్కప్పుడు విసుగు రాకమానదు. కావునఁ గనశరీరమువలె ననిచెప్పక తనశరీరముకంటె నెక్కువ ప్రియమని చెప్పెను. శ్రీరామునకు లక్ష్మణుఁడు వెలుపలి ప్రాణము కావున రాముఁడు తనప్రాణమునం దెంత ప్రియముకలిగి యెంత జాగ్రత్తతో దాని రక్షించుకొననో యంత ప్రియము లక్ష్మణునందుఁ గలిగి యాయనను నట్లు రక్షించుచుండెను. లక్ష్మణుఁడు శ్రీరామునివిషయమం దెట్లు యుండెను లక్ష్మీవర్ధనుఁడనుటచే లక్ష్మణశబ్దము వ్యుత్పత్తి చెప్పఁబడెను. 'జ్యాపోః హ్రస్వస్సంజ్ఞాఛందసో ర్బహుళమ్' అను సూత్రప్రకారము లక్ష్మీవర్ధనుఁడు లక్ష్మవర్ధనుఁడయ్యెను.

తాత్పర్యము.

శైశవము మొదలు తనకంటెఁ బెద్దవాఁడును గుణములచే శ్రేష్ఠుఁడును ప్రజలను రంజింపఁజేయువాఁడును నగు శ్రీరామునియందలి స్నేహము భక్తియే తనకు నైశ్వర్య మని యెంచి లక్ష్మణుఁ డాయన వెలుపలి ప్రాణమై స్వశరీరమునకంటె నెక్కుడై యుండెను. కావున సకలకార్యములందు సర్వదా తన సౌఖ్య ముపేక్షించియైన హితమే చేయుచుండెను. తన ప్రాణముకంటె నాయన సుఖమే శ్రేష్ఠ మని స్వప్రాణరక్షణమందును లక్ష్యముంచక యాయనకు హితమైన పనులే చేయుచుండెను. (అన్నకపకీర్తి వచ్చునని యేకదా తన ప్రాణమిచ్చియైన విభీషణుని రక్షించుట - 'ఇత, పరం త్వదానుకూల్యమేవ కరిష్యే-ప్రాతికూల్యం న కరిష్యే' యను శరణాగతివాక్యము లిచ్చుట స్మరింపఁదగును.)

కం॥ జనయిత్రియె మృష్టాన్నముఁ, గొనివచ్చి యదెంత వేఁడుకొన ముట్టండుఁ
గనమాయఁడు పురుషోత్తముఁ, డనుఁగుందమ్ముండు లక్ష్మణాఖ్యుఁడు లేమిన్. ౫౩౩

శ్రీరామునికి లక్ష్మణునందుఁగల యనురాగమును జెప్పుచున్నాఁడు. అనుఁగుందమ్ముఁడు = ప్రియుఁడగు తమ్ముఁడు లేమిన్ = లేనియెడ, పురుషోత్తముఁడు = శ్రీరాముఁడు - పురుషులకంటె శ్రేష్ఠుఁడు, "ద్వి. క్షరమునకంటె నక్షరమునకంటెఁ, బరికింప నేదేనివలన నుత్తముఁడ, నైతి దానను భువనామ్నాయములను, ఖ్యాతిగఁ బురుషోత్తమాఖ్య నందితిని." ద్వి-భగ. ప్రీతిపాత్రుఁ డగువాని నొకప్పుడేని నెడఁబాయలేనంతటి గొప్పవాఁడు. "క్షణేపి తే యద్విరహో తిదుస్సహ"

యనికదా పెద్దలవాక్యము. నిన్ను విడిచి సీతగాని నేనుగాని నీళ్లలోనుండి బయట వేసిన చేఁపలవలె క్షణమైన బ్రతుకలేమని లక్ష్మణుఁడు చెప్పెఁగదా. అయోధ్య ౧౪_౫౯ ప. జనయిత్రియె = కన్నతల్లియె, మృష్ట = మనోహరమగు, మృష్టం దుర్ = తాఁకనుగూడఁ దాఁకఁడు, శ్రీరామునకు లక్ష్మణుఁడు కుడిచేయి. కుడిచేయి లేకున్న నెల్లు భుజింపసాధ్యమగును? కనుమూయఁడు = ప్రాణములేకున్న నిద్దుర యన నెట్టిది? అనిభావము. లక్ష్మణుఁడు ముందు తినకున్న శ్రీరామచంద్రమూర్తి తాను భుజింపఁడు, ముందు లక్ష్మణుఁడు నిద్రింపకున్నఁ దాను నిద్రింపఁడు.

తాత్పర్యము.

కన్నతల్లి కౌసల్యయే తాను స్వయముగ వండిన మంచిపరిశుద్ధము రుచ్యము నైన యన్నమును దెచ్చి నాయనా తినరా చంద్ర తినరా నీకు వెన్న పెట్టెదను దినరా యని లాలించి బేలించి బుజ్జగించి యడుగుకొన్నను లక్ష్మణుఁడు తనప్రక్కన లేకుండెనా యాయన ముందుభుజింపకుండెనా యాయన్నమును వ్రేలు వేసియైన శ్రీరాముఁడు దాఁకఁడు. ముందు లక్ష్మణుఁడు నిద్రింపఁడేని తాను నిద్దురయుఁ బోఁడు. ప్రాణాధారములైన నిద్రాహారములయందుఁ బ్రీతికంటె శ్రీరామునకు లక్ష్మణునందు నతిశయస్నేహ ముండెను.

ఉ॥ రాముఁ డుదారవిక్రముఁ డరణ్యమునకై మృగయావినోదకే
లీమతి నశ్వమెక్క చన ♦ లీలమెయిం జను నీడవోలె ను
ద్దామజవాన లక్ష్మణుఁడు ♦ దారుణచాపశరాసిపాణియై,
యేమఱ కెప్పుడుం దిరుగు ♦ నెంతయు భక్తిరసప్రపూర్ణుఁడై. ౫౩౮

ఉదారవిక్రముఁడు = గొప్ప పరాక్రమము కలవాఁడు, మృగయా = వేట యను, వినోదకేలీ = వేడుక యగు నాటయందలి, మతిన్ = మనస్సుతో; దారుణ = భయంకరమైన, చాపశర అసిపాణియై = ధనస్సు, బాణము, ఖడ్గము ధరించిన చేతులు గలవాఁడై. బాణమును సంధించిన వింటి నొక చేతను - కత్తి యొకచేత నని గ్రహింపవలయును. దూరపువ్రేటునకు బాణము, దగ్గఱవ్రేటునకు కత్తి. ప్రీతి యెక్కువగా నన్నచోట భీతియు నెక్కువగానే యుండును. కావున లక్ష్మణునకు శ్రీరామునియందుఁగల ప్రీత్యతిశయమే శ్రీరామున కెప్పు డేమి యపాయము వచ్చునో యని భీతిని గలుగఁజేయునట్టి దగుటచే లక్ష్మణుఁ డీవేషముతో రాము ననుసరించుట యుక్తమే. అతిస్నేహము పాపశంకిగదా. నీడవోలెన్ = విడిచి దూరముపోక యత్యంతసమీపమున నని భావము. ఉద్దామజవానన్ = మిక్కిలి వేగముతో - గుఱ్ఱముతో సమానమైన వేగముతో,

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తిని లక్ష్మణుఁడు సేవించుట యింటియం దున్నప్పుడు మాత్రమే కాదు. శ్రీరాముఁ డితరసాహాయ్యము కోరని గొప్పపరాక్రమము గలవాఁడు. అసహాయశూరుఁడైనను నాయన గుఱ్ఱము నెక్కి వేటకై యరణ్యము నకుఁ బోవునప్పు డాయన నీడవలె లక్ష్మణుఁడు శరశరాసనపాణియైతోడనే యుం డును. భక్తిరసావేశముచే నన్నను విడిచి యొకక్షణమైన నేమఱక వెంటనే తిరుగు చుండును. అంతటిగొప్పవానికిఁ బరాపేక్షలేనివానికి నాసాహాయ్య మేల? నే నేమి సాహాయ్యముచేయఁగల నని యెంచినవాఁడు కాఁడు. సేవచేయించునది స్నేహభావముగాని సామర్థ్యజ్ఞానముగాదు. శక్తి వంచనలేక చేయుట ప్రధా నము.

తే॥ భరతునకునల్లలక్ష్మణా•వరజుఁడెప్పుడు, బ్రాణములకంటెఁ బ్రియుఁడయి•రాణఁదనరె
భరతునందును లక్ష్మణా•వరజుఁ డెప్పుడుఁ, దరము లేనట్టిప్రేముడిఁ•దాల్చియుండె. ॥౩౫॥

ఇఁక భరతశత్రుఘ్నులగుణములు చెప్పుచున్నాఁడు. లక్ష్మణావరజుఁడు = లక్ష్మణుతమ్ముఁడు - శత్రుఘ్నుఁ డని పేరు చెప్పక లక్ష్మణుతమ్ముఁ డని చెప్పుటచే నాయనయం దెట్టిగుణములు కలవో యన్నయం దెట్టప్రీతివర్తనము గలవాఁడై యున్నాఁడో యట్టిగుణము లట్టివర్తనము కలవాఁడై యీ యనయు భర తుని విషయమున నన్నాఁ డని యేర్పడెను. తమ్మునియందు బ్రేమయుంచుటచే నన్నకును, నన్నయందు భక్తియుంచుటచేఁ దమ్మునకును సద్గుణములు చెప్పఁబడి నవి. తరములేనట్టి = సమానములేని; ప్రేముడి = ప్రేమ.

తాత్పర్యము.

లక్ష్మణుఁడు శ్రీరామునం దెట్టి ప్రీతివిశ్వాసములుంచెనో యెట్టు లాయనసేవ చేసెనో యట్టులే యాయనతమ్ముఁడగు శత్రుఘ్నుఁడు భరతునిపట్ల ప్రవర్తించెను. ఆయన కాయనప్రాణములకంటెఁ బ్రియుఁడై యుండెను. భరతుఁడును శత్రుఘ్ను పట్ల నట్టివాఁ డయియే యుండెను.

కం॥ భ్రాతలఁ బరిచితనృపహిత,నీతుల హితకాలసముప•నీతుల నగుణా
పేతుల సమస్తవిద్యో,పేతుల హ్రీయుతులఁ గీర్తి•విదితుల సుతులన్. ॥౩౬

కం॥ శూరుల నిజతేజోజిత,సూరుల శాస్త్రాదికళల•సూరుల మారా
కారులఁ బితృశుశ్రూషా,దారులఁ గని వారిఁ గలిత•దారులఁ జేయన్. ॥౩౭

కం॥ గురులన్ సమస్తబాంధవ,వరులన్ హితపరుల మంత్రి•వరులం గని భూ
వరుఁ డాలోచనఁ దెల్పెఁడు, ధరణిం గల రేచటనెచటఁ•దగురాకన్నెల్.॥౩౮

ఇఁక నీపుత్రులకు విద్యాగుణపూర్తులఁ దెలుపుచు సమావర్తనమునకుఁదగిన కాలము తటస్థించినటు చెప్పుచున్నాఁడు. మూఁడు పద్యము లేకాన్వయము. హితకాలసముపనీతులన్ = సరియైన కాలమున నుపనయనము చేయఁ బడినవారిని 'గర్భైకాదశేషు రాజన్యం' 'గ్రీష్మే రాజన్యం' అను శాస్త్రమునఁ జెప్పఁబడిన కాలమున నుపనయనము చేయింపఁబడినవారిని, పరిచిత నృపనీతులన్ = అభ్యసింపఁబడిన రాజనీతిగలవారిని, అగుణ + అపేతులన్ = దుర్గుణములులేనివారిని, హ్రీయుతులన్ = అజ్ఞానమువలన నకృత్యమాచరించిరేని దానికై సిగ్గుపడువారిని, హ్రీయుతులన్ = పూర్వపు మహాపురుషులచరిత్రము విన్నప్పుడు వారివంటివారము మనము కామైతిమి కదా యని తమనికృష్టత్వముఁ దలఁచి సిగ్గుపడువారిని, కీర్తివిదితులన్ = శాస్త్రజ్ఞానము సదాచారము గురువృద్ధభక్తి మొదలగు సద్గుణములచేఁ గలిగిన కీర్తిచే లోకులచేత నెఱుఁగఁబడినవారిని, రూపమును జూడనివారును గీర్తిచే వీరి నెఱుఁగుదు రని భావము. నిజ సూరులన్ = తమ కాంతిచే జయింపఁబడిన సూర్యుఁడు కలవారిని, సూరులన్ = విద్వాంసులన్, కలితదారులన్ = కూడిన భార్యలు గలవారిని, తగు = కులవయశ్శీలాదులఁ దగిన, రాకన్నెలు = రాచకన్నియలు.

తాత్పర్యము.

రాజనీతి చక్కఁగ నెఱిఁగినవారును, సరియైన కాలమున నుపనయనము చేయఁబడినవారును, హేయగుణములు లేనివారును, సమస్తవిద్యలు నేర్చినవారును, నకార్యములు చేయుటయందు సిగ్గుపడువారును, గీర్తిచే లోకులచే నెఱుఁగఁబడినవారును, శూరులును తమ తేజస్సుచే సూర్యుని జయించినవారును, శాస్త్రాదివిద్యలందుఁ బండితులును, మన్మథునివంటి సౌందర్యముగలవారును, పితృశుశ్రూషాపరులును గని వారికి వివాహములు చేయవలయు నని దశరథుఁ డాలోచించి తన గురులను బాంధవవరులను తన హితమునం దాసక్తి గలవారలను మంత్రివరులను జూచి నాకుమారులకుఁ దగిన రాచకన్నె లే యే రాజ్యమందుఁ గలరో చెప్పుఁ డని కోరెను.

విశ్వామిత్రుఁడు దశరథునిఁ జూడ వచ్చుట

కం॥ అని యోజించుచు నుండఁగ, వినుతమహాతేజుఁ డైన విశ్వామిత్రుం
డును నృపదర్శనకాంక్షం, జనుదెంచి వచించె ద్వారసంరక్షకుతోన్. ౫౩౯

ఇంతవఱకు భగవదవతారము చెప్పఁబడియె. ఇఁక గ్రంథాంతమువఱకు భగవదవతారప్రయోజనములు - శిష్టరక్షణ, దుష్టశిక్షణ ధర్మసంస్థాపనములు చెప్పఁబడును. అందు సేద్యముచేయువానికి ధాన్యప్రాప్తివలె ప్రధానఫలము

శిష్టపరిపాలనమే. పైరు బాగుండుటకై గడ్డి గాదము పీఁకివేయునట్లు శిష్టరక్షణార్థమై దుష్టశిక్షణము కాన నది నడుమంతరపు ఫలము. ఇప్పుడు శిష్టరక్షణార్థమై దుష్టశిక్షణముఁ జెప్ప విశ్వామిత్రవృత్తాంతమును బ్రారంభించుచున్నాఁడు. ఈ రెండు చెప్పుటచేత ధర్మసంస్థాపనము చెప్పినట్లే. యోజించుచుఁ = ఆలోచించుచు; వినుత మహాతేజుఁడు = కొనియాడఁబడిన గొప్ప ప్రభావము గలవాఁడు. "విశ్వామిత్రుఁడు తాను వచ్చినకార్యము సాధింప శక్తిగలవాఁడయ్యు, రామవైభవమును బ్రకటించుటకును, ఆయనపూనిన కార్యమునకు నిమిత్తమాత్రముగ సహాయుఁడగుటకునే దశరథునొద్దకు వచ్చె" నని యీపదము సూచించుచున్నది. కాంక్ష = అభిలాష.

తాత్పర్యము.

ఈ ప్రకారము దశరథుఁడు మంత్రులతో నాలోచించుచుండు సమయంబునందే యాయనసంకల్పబల మెట్టిదో కాని నాయనను దర్శింపఁ గోరిక కలిగి జగమునందంతయుఁ బ్రసిద్ధికెక్కిన మహాతేజస్సుగల విశ్వామిత్రమహర్షి వచ్చి ద్వారమునొద్ద నిలుచుండి ద్వారపాలకునితో నిట్లనియె.

ఉ॥ చెప్పరెఁ బోయి మీపతికిఁ • జెప్పుము వచ్చినవాఁడు గాధిజుం
డిచ్చటి కంచు, నన్న విని • హెచ్చినభీతిని వార లెల్లరుఁ
గ్రచ్చఱఁ బర్వవారలై, క్షితి•కాంతుగృహంబు ససంభ్రమంబుగాఁ
జొచ్చి, మునీంద్రు రాక యజ•మారునకుఁ నడి విన్నవించిరన్. ౫౪౦

గాధిజుండు = గాధిపుత్రుం డగు విశ్వామిత్రుఁడు, క్రచ్చఱఁ = (క్రచ్చు + అఱఁ) శీఘ్రముగా, ససంభ్రమంబుగా = త్వరతోఁ గూడినట్లుగ, అజసూనునకుఁ = అజమహారాజుకొడుకైన దశరథునకు, నడిఁ = వచ్చిన యతిథి విషయమై జాగుసేయుట కోర్వక వేగముగా, అతిథిని వాకిట చాలఁ గాలము నిలఁబెట్టినవాఁడు ఆయతిథి పాపమును దాను గొని తనపుణ్యమును ఆయతిథి కిచ్చువాఁ డగును. అంతియకాక విశ్వామిత్రుఁడు మహాకోపి యని ప్రసిద్ధి. ఆలస్యముచేసిన శపించునో యని భయము.

తాత్పర్యము.

ఓ ద్వారపాలకులారా! విశ్వామిత్రుఁడు వచ్చి వాకిట నిలువఁబడి యున్నాఁ డని మీరాజునకుఁ జెప్పుమనఁగా వారామాట వినఁగానే భయముతోను భక్తితోను నమస్కరించి ముందుకు [illegible] కాలికొలఁది యుఱికి పరుగెత్తిపోయి రాజగృహంబుఁ జొచ్చి మాటఁ దడఁబడ కాళ్లు వడవడ వడఁక గుండెలు తటతట కొట్టుకొన రాజా రాజా విశ్వామిత్రుఁడు వచ్చి వాకిట నిలుచున్నాఁ డని విన్నవించిరి.

౪౦॥ ఆపల్కులు విని దశరథ,భూపతి సంహృష్టచిత్తముున సపురోధుం
డై పరమేష్ఠి నెదుర్కొను, నాపవిధరుమాడ్కి డాయ ♦ నరిగి వ్రతీంద్రున్. ౫౪౧

సంహృష్ట = సంతోషించిన, సపురోధుండై = పురోహితునితోఁ గూడిన వాడై-ఆగమశాస్త్ర మనిత్యము గావున కప్రత్యయము రాలేదు. పరమేష్ఠిన్ = బ్రహ్మను - అలుక్సమాసము. పవిధరుమాడ్కిన్ = ఇంద్రునివలె - పవి = వజ్రాయుధము. వ్రతి + ఇంద్రున్ = యమనియమవ్రతములుగల విశ్వామిత్రుని, పై పద్యముతో నన్వయము.

మ॥ పరితుష్టాత్మునిఁ జేసి యర్ఘ్యమిడి సం♦భావించి యత్యంత మా
దర మొప్పార భజించి మోడ్చి నిజహా♦స్తద్వంద్వము న్నిల్వ భూ
వరునర్ఘ్యంబు గ్రహించి మౌని కుశల♦ప్రశ్నంబు గావించె నో
ధరణీశోత్తమ! నీకు సేమమ కదా ♦ దారాత్మజశ్రేణితోన్. ౫౪౨

అర్ఘ్యము = పూజార్థమైన జలము- ఇది వసిష్ఠునిచే నిప్పించి, సంభావించి = గౌరవించి, అత్యంతము = మిక్కిలి, భజించి = కొలిచి, నిజహస్తద్వంద్వమున్ = తన రెండుచేతులను, మోడ్చి = జోడించి - యంజలిచేసి, దార + ఆత్మజ + శ్రేణితోన్ = భార్యాపుత్రుల సమూహముతో.

తా త్ప ర్య ము.

ద్వారపాలకులు చెప్పిన పలుకులు విని దశరథుఁడు మిగుల సంతోషించి పురోహితులతోడ బ్రహ్మ కెదురుగఁ బోవు నింద్రునివలె నాయనను జేరఁబోయి యర్ఘ్య పాద్యాదులఁ బూజించి గౌరవించి సంతోషింపఁజేసి రెండుచేతులు జోడించి నిల్వఁగా విశ్వామిత్రుఁ డా యర్ఘ్యాదుల గ్రహించి రాజా నీకు నీభార్యలకు నీ కుమారులకు క్షేమమే కదా యని కుశలప్రశ్నంబుఁ గావించె.

మ॥ ధరణీశా! పురమందు నెల్లరకు మో♦దం బౌనె? కోశంబులున్
బరిపూర్తి న్విలసిల్లునే? జనపదా♦వాసుల్ సుఖం బుందురే?
వరమిత్రావళికిన్ శుభంబె? యతిఘ♦వ్రాతంబుఁ బూనంతువే?
జరగుంగా సురమానుషార్చనలు? శ♦త్రూయుక్తు లే శాత్రవుల్? ౫౪౩

మోదము = సంతోషము, కోశంబులు = బొక్కసములు, జనపద + ఆవాసుల్ = పల్లెలలో వసించువారు, వ్రాతము = సమూహము, సురమానుషార్చనల్ = దేవతలయొక్కయు మనుష్యులయొక్కయుఁ బూజలు, శాత్రవుల్ = శత్రువులు - స్వార్థకతద్ధితాంతము.

రాజేంద్రా! పట్టనమందుఁ బ్రజలెల్ల సంతోషముతో నున్నారుగదా? ధనాగారము కొఱఁతలేక నిండియున్నదికదా? పల్లెలయందు జనులెల్ల హాయిగ

నున్నారా? నీస్నేహితులందఱు సుఖులా? అతిథుల గౌరవింతువా? ౘద్దేవత
లను మనుష్యులను బూజించుచున్నావా? శత్రువులను దండించుచున్నావుకదా.

కం॥ అని ప్రశ్నించినపదపడి, యనఘాత్ము వసిష్ఠు ఋషుల • నరయఁగఁ జేరం
జని కుశలం బడుగఁగ నా,మునులు పరస్పరము కుశల•మును భాషింపన్. ౫౪౪

ఋషులన్ = వామదేవాదులను,

కం॥ అంద అమందానందపుఁ,గందళములు దీఁగసాఱ • క్ష్మావిభునిసభా
మందిరముఁ జొచ్చి యాసన,బృందంబుల నండ మునికిఁ•బృథ్వీశుఁడనెన్. ౫౪౫

అమంద + ఆనందము + కందళములు = అధికమగు సంతోషముయొక్క మొలకలు - గగుర్పాటులు, తీఁగసాఱన్ = వృద్ధిచెంది వ్యాపింపఁగా, క్ష్మావిభుని సభామందిరము = దశరథుని కొలువుకూటము, మునికిన్ = విశ్వామిత్రునికి.

తాత్పర్యము.

ఇట్లు దశరథుని క్షేమము విచారించి వసిష్ఠ వామదేవాది ఋషులయొద్దకుఁ బోయి వారిని గుశలము ప్రశ్నింప వారును విశ్వామిత్రునిగుశల మడిగిరి. ఇట్లు లొకరి నొకరు కుశలప్రశ్న లడిగినతరువాత నందఱు సంతోషాతిశయముచే నుబ్బుచు సభాభవనము ప్రవేశించి వారివారి యాసనంబుల వారువా రుండు నెడ దశరథుఁడు విశ్వామిత్రునితో నిట్లనియె.

—* దశరథుఁడు విశ్వామిత్రునిరాకకుఁ గారణ మడుగుట *—

చం॥ తనయవిహీనుఁ డాత్మసమ•దారలయందుఁ దనూజుఁ గంటఁ, బో
యిననిధు లబ్బుటన్, బహుళ•వృష్టుల నిర్జలసీమలన్, సుధా
శనమున, నిర్భరాభ్యుదయ•సంగతి, నెట్టిప్రమోద మబ్బు నో
మునివర! యట్టినిండుముద•ముం గనితిన్ భవదాగమంబునన్. ౫౪౬

ఆత్మ సమదారలు = తనతో సమానులైన భార్యలు, నిర్జలసీమలన్ = జలములేని యెడారులందు, బహుళవృష్టులన్ = అధికవర్షములచేతను, సుధా + అశనమునన్ = అమృతమును ద్రావుటచేతను, నిర్భర + అభ్యుదయ + సంగతిన్ = పుత్ర వివాహాదిరూపమగు గొప్పయుత్సవము సంభవించినపుడును; భవత్ + ఆగమంబునన్ = నీరాకచేత.

తాత్పర్యము.

కుమారులు లేనివాఁడు కులమునందు - గుణమునందుఁ దనతో సమానురాండ్రైన భార్యలయందు దీర్ఘకాలమునకుఁ బుత్రులఁ గనుటయు, నష్టములైన నిక్షేపములు మరల లభించుటయు, మరుభూములందు వానకురియుటయు, అమృ

తము ద్రావుటయు అధికమైన మేలుకలుగుటయు నెట్టి సంతోషము గలిగించునో యట్టి పరిపూర్ణానందము మీరు వచ్చుటచే నాకు లభించెను.

ఆత్మసమదార లనుటచేఁ దనజాతిస్త్రీని యథావిధి ధర్మపత్నిగా గ్రహించి యామెయందుఁ బడసినసంతానమే యుభయలోకతారకమగుటచే సంతోషకరముగాని విజాతిస్త్రీలయందుఁ బడయు సంతానము పతనకారణమగుటచే దుఃఖకరమగునుగాని సంతోషకరముగాదు.

దీర్ఘకాలము పుత్రులు లేకయుండి శ్రీరామాదులు జనించినారని విన్నప్పు డెంత సంతోషమో యిప్పు డంత సంతోషము కలిగె నని భావము.

ఉ॥ నన్నుఁ గృతార్థుఁ జేయుతమి • నాకడ కిట్టులు వచ్చు టయ్యెఁగా
సన్నుతశీల! నాయెడఁ బ్ర•సన్నుఁడవై యెఱిగించితేని ప్రే
మోన్నతి నీదు కామితము • నొప్పుగ నే సమకూర్తు నెద్దియేఁ
మన్ననఁ జేసి తెల్పు బతి•మాలెద వ్రాలెద నీపదద్వయిన్. ౫౪౭

కృతార్థుఁ = ధన్యునిఁగా, తమిఁ = అభిలాషచేత, సన్నుతశీల=సజ్జనులచేఁ గొనియాడఁబడిన స్వభావముగలవాఁడా, ప్రసన్నుఁడవు = దయగలవాఁడవు; ఉన్నతిఁ = అతిశయముచే, కామితము = కోరిక, మన్నన = గౌరవము.

తాత్పర్యము.

"ఊరక రారు మహాత్ములు వారధముల యిండ్లకడకు వచ్చుటలెల్లఁ గారణము మంగళముల" కన్నట్టు మహానుభావా! నీవు నాయొద్దకు వచ్చుటకుఁ గారణము నన్నుఁ గృతార్థుఁ జేయుటకేకాని మఱి యేయితరకారణ ముండఁజాలదు. ఏదియో యొకకారణము కల్పించుకొని నాచే నేదియో యొకకార్యము చేయించి యానెపమున నాకు శ్రేయస్సు గలిగింపవచ్చితివి కావున నీవు వచ్చినకార్యము నాశ్రేయస్సు కోరియే నేను జేయవలసియున్నది. నేను జేయుటవలన నీ కొకమేలుగాని చేయకపోవుటచే నీ కొక నష్టిగాని లేదు. కావున నాయం దనుగ్రహించి నీవు వచ్చినకార్య మెఱిఁగించితివేని నది యెద్దియైనను నేను సంతోషముతోఁ జేసెదను. కావున మహాత్మా నన్ను మన్నించి నీకార్యవిధము తెలుపుము. నీపాదములపైఁబడి ప్రార్థించెదను.

కం॥ మహిఁ దొలుత రాజఋషి వై, మహితాత్ముఁడ వైతి నిస్స•మానగురుతపో
మహిమను బ్రహ్మర్షివి మఱి, బహుధాపూజ్యుఁడవు నీవు•పరమమునీంద్రా. ౫౪౮

రాజఋషి - ఇటఁ బ్రకృతి భావము. మహిత + ఆత్ముఁడవు = గొప్పదియగు మనస్సుగలవాఁడవు; నిస్సమానగురుతపోమహిమను = సాటిలేని గొప్ప

తపస్సుయొక్క ప్రభావముచే; బహుధాపూజ్యుఁడవు; రాజర్షివై బ్రహ్మర్షివగుట చేత ననేకవిధములఁ బూజింపఁ దగినవాఁడవు.

తా త్ప ర్య ము.

మహానుభావా! నీవు తక్కిన సామాన్య ఋషులవంటివాఁడవు కావు. జన్మముచేతనే బ్రాహ్మణుఁడై జన్మప్రభృతి వనములందే యుండి బాల్యమునుండి తపోవ్రతానుష్ఠానపరుఁడై శిక్షితుఁడైనవాఁడు బ్రహ్మర్షి యగుట విశేషవిషయము కాదు. నీవో రజోగుణ మధికముగాఁగల క్షత్త్రియుఁడవుగాఁ బుట్టి క్షాత్త్రమున వర్తించుచుండి యందు రాజర్షివై సుకుమారుఁడవై యుండియుఁ దటుకున రాజ్యము భోగము సర్వము వదలి గొప్ప తపస్సుచేసి సత్త్వాతిశయముగల బ్రాహ్మణ్యమును సంపాదించి బ్రహ్మర్షివైతివి ఇట్లు చేసినవాఁడు లోకమున మఱియొకఁడు లేకుండుటచే నది యెంతటి దుస్సాధమో తెలియనయ్యెడిని. ఆకారణముచే నీవు విశేషించి పూజింపఁ దగినవాఁడవు.

ఉ॥ నీవు మహాత్మ నాకడకు ♦ నేఁ డిటు వచ్చుటఁజేసి జన్మమే
పావన మయ్యె, నా బ్రదుకు ♦ పండెను నిప్పుడె సార్థకంబునై,
కేవలమానిమాత్రుఁడవె ♦ కీర్తితశీల! మహానుభావ! నా
దైవమురీతి వచ్చితి వు♦దారమహాభ్యుదయంబు నాకగున్. ౫౪

ఉదార మహాభ్యుదయంబు = గంభీరమగు గొప్ప యభివృద్ధి.

తా త్ప ర్య ము.

అట్టి మహిమగల మహానుభావుఁడవు నీవు చేసికొనలేనిది పరులు నీకుఁ జేయవలసినది యగు కార్యము లేదు. అవాప్తసమస్తకాముఁడవు. అఘటన ఘటనాధురీణుఁడవునగు నీవు నాయొద్దకుఁ గార్యార్థివై వచ్చుటచే నాజన్మమే సఫలమయ్యెను. నేను జన్మమెత్తినఫలము నేఁడు లభించెను, నాపుట్టువే సార్థకమయ్యెను. నీ వేమి సామాన్యఋషివా? నా కేదియో గొప్ప శుభముఁ గలిగింపఁ గోరి వచ్చితివి. నీరాకవలన నాకుఁ దప్పక శ్రేయస్సుగలదు.

ఉ॥ పాత్రుఁడ వీవు నాయసమ♦భాగ్యమునం జనుదెంచితయ్య వై
ధాత్రసమాన! పావనము ♦ తద్దయు నద్భుత మయ్యె రాక, సు
క్షేత్రనివాసభాగ్య మిటు ♦ చేకుఱెఁ ద్వద్ఘనదర్శనంబునన్,
బాత్రుఁడ నేని మీదయకుఁ ♦ బల్కఁగదే భవదీప్సితార్థమున్. ౫౫

పాత్రుఁడవు = ఎట్టిదానికైన యోగ్యుఁడవు; అసమభాగ్యంబునన్ = సాటిలేని యదృష్టముచేత; వైధాత్రసమాన = బ్రహ్మపుత్త్రుఁ డగుసనత్కుమారునితో సమానుఁడా. విధాతృ నపత్యము వైధాత్రి. సుక్షేత్రనివాస భాగ్యము = మంచి

పుణ్యభూమియందు వసించునట్టి యదృష్టము. తామువచ్చుటచే మాయిల్లు దివ్యక్షేత్రమయ్యెనని భావము. నీమెట్టినయది ప్రయాగమని కలదుగదా. త్వత్ + ఘన + దర్శనంబునన్ = మీగొప్పదర్శనముచేత, చేకుఱెన్ = లభించెను. భవత్ + ఈప్సిత + అర్థమున్ = మీకిష్టమైన ప్రయోజనము.

తా త్ప ర్య ము.

ఎట్టిదానమునకైన నెంతటిదానమునకైన నీవు యోగ్యుఁడవే. నీ కీయరాని పదార్థము లోకమున లేదు. నేను బూర్వజన్మమునఁజేసిన గొప్పపుణ్యమునశంబున నీవు నాయొద్దకు వచ్చితివి సనత్కుమారా తేజా! నీవుమాయింట పాదముంచుట చేతనే యది పవిత్రమాయెను. అదిపవిత్రమగుటయే కాదు. ఇతరులను బావనులఁజేయు సుక్షేత్ర మాయెను. కావున దివ్యక్షేత్రములయందు వసించువారికిఁ గలుగుఫలంబు నాకును లభించెను. నీదర్శనము దివ్యక్షేత్రమందలి దేవతాదర్శనమువంటిది. కావున మీరు నన్ననుగ్రహింపఁదలఁచితిరేని మీకోరిక యేమో తెలుపఁగోరెదను. దేవతాదర్శనము వ్యర్థము పోరాదు కదా.

ఉ॥ చేయునో వీఁడు చేయఁడొకొ • చెప్పుదునా వలదా యటంచు గా = ౩౦౦౧
ధేయ! విచారమున్ విడుము • దేవుఁడ వీ విల నాదుపాలికిన్,
జేయుదు నెద్దియేనియు న• శేషవిశేషశుభంబుఁ గూర్ప న
త్యాయతరక్తి వచ్చితివి • ధర్మ మనుత్తమభంగి వర్ధిలెన్. ౫౫౧

అత్యాయతరక్తిన్ = అధికమైనయనురాగముతో, అనుత్తమము = శ్రేష్ఠము చతుర్థపాదమున బ్రాదియతి 'ఇదంశరీరం కౌంతేయ క్షేత్ర మిత్యభిధీయతే.' భ.గీ. యన్నట్లు క్షేత్ర మనఁగా శరీరము. ఈదేహము హేయమైనను నీదర్శనముచే నిది పవిత్ర మయ్యెను. ఇందు నేను (జీవుఁడు) వసించుఫలము నేఁడు లభించెను. చేయునో వీఁడు — ఇందలి వకారము ౧౩వ పద్యమందలి మూఁడవయక్షరము. దశరథవర్తనముచే ముందువెనుక లాలోచింపక మాటచెప్పరాదని యేర్పడుచున్నది. కైకవిషయమందును ముందుమాట జాఱుటచేఁగదా వెనుకఁ దపింపవలసివచ్చెను.

తా త్ప ర్య ము.

మనకార్య మితఁడు చేయునో చేయఁడో చేయి చూపించి యవలక్షణ మనిపించుకోవలెనా! ఊరకుండుట శ్రేయస్కరముకదా - కావునఁ జెప్పుదునా యూరకుందునా యని యిట్టిలు సందేహింపవలసిన పనిలేదు. గాధినందనా! నీవునాపాలి దేవుఁడవు. దేవుఁడు తానై చెప్పినకార్యము చేయని మనుష్యుఁడు మనుష్యుఁడా? నీ వేదిచెప్పినను దప్పకచేయుదును. నాకు విశేషశ్రేయస్సు గలిగింపఁగోరియే నీవు వచ్చితివి. అట్టి నీవు చెప్పినది నేను చేయనేని నాశ్రేయస్సునకు నేనే హాని

గలిగించుకొన్నవాఁడ నగుదునుగదా. నీవు ధర్మమైన దానినే చెప్పుదువుకాని యధర్మమును జెప్పవు. నీవు ధర్మమని చెప్పినదానిని జేయుటచే నాకెంతో ధర్మాభివృద్ధి యగును.

—* { ౧౯ సర్గము. విశ్వామిత్రుఁడు దశరథునకుఁ దనరాకకుఁ గారణముఁ జెప్పుట. } *—

చం॥ అనిన వికాసభాసురము♦ఖాంబుజుఁడై గగురొప్ప మౌని యో
జనవర! రాఘవాన్వయము ♦ శస్తము గాదె జగంబులందుఁ దా
నానరు ఋతోక్తికిన్ వితర♦ణోన్నతికిన్, భవదీయపూర్వులన్
విను మఱపించినాఁడవు ప♦విత్రచరిత్ర దయాసమృద్ధిమై. ౧౧౨

వికాస. అంబుజుఁడై = సంతోషముచేఁ బ్రకాశించుచునట్టి-తామరపూవువంటి ముఖముగలవాఁడై, గగురు = పులకలు - రాఘవ + అన్వయము = రఘువంశము; శస్తము = శ్రేష్ఠమైనది. ఋత + ఉక్తికిన్ = సత్యపుమాటకును, వితరణ + ఉన్నతికిన్ = దానాతిశయమునకు, భవదీయపూర్వులన్ = నీపెద్దవారిని - తండ్రి తాతలను, వారికంటె నెక్కువ దానము, సత్యముగలవాఁడ వని భావము. అదిగాక నీయందు విశేషదయాగుణమును గలదు.

తాత్పర్యము.

అని యిట్లు ప్రార్థించు దశరథుం జూచి సంతోషముచే వికాసము నొందిన ముఖముగలవాఁడై విశ్వామిత్రుఁ డిట్లనియె. ఓ రాజేంద్రా! రఘువంశము సత్యసంధతకు - దానమహిమకు జగంబునఁ బ్రసిద్ధిగాంచినదిగదా - అట్టి గొప్పవంశంబునఁ బుట్టిన నీ పేరెంటియందును దయాతిశయముచేతను మఱచిపోవునట్లు చేసితివి.

కం॥ కులము సవిత్రన్వయ మఁట, కులగురుఁడు వసిష్ఠుఁ డంట ♦ గుణము లమేయం
బులు నఁట తదుచితభంగిని, బలికితి విది నీకు నుచిత♦పద్ధతి గాదే. ౧౧౩

సవితృ + అన్వయము=సూర్యవంశము, కులగురుఁడు- వంశక్రమముగ వచ్చిన యాచార్యుఁడు-వసిష్ఠుఁడు. కాఁబట్టి నీవు పలుమాఱు సదుపదేశముల వినియుందువని భావము. అమేయంబులు=ఇంతింత యని కొలువ సాధ్యముగానివి. తత్... షక్తిని — వాని కిన్నిటికిఁ దగినవిధముగ, పద్ధతి = త్రోవ.

తాత్పర్యము.

నీ వంశమా సూర్యవంశము. కులగురుఁడా వసిష్ఠుఁడు. నీ గుణములా యింత యని పరిమాణము చెప్పరానివి. ఇట్టి నీ వేరీతి మాటలాడవలయునో యట్టి యోగ్యమైనరీతిని బలికితివి. ఇది నీకుఁ దగినదేకదా.

ఉ॥ వేఁడిన నిత్తు నంటి పృథివీవరచంద్రమ! యెద్దియేనియున్
వేఁడెద నామనోగతము వేగమ దానిని సంఘటించి యే
నాఁడును బొంకఁ డంచును ఘనప్రథఁ గాంచుము లోకపాళులం,
బోఁడిమి నాచరిత్రమును బొల్పుగఁ దెల్పెద విన్ము సన్మతిన్. ౫౫౪

పృథివీవరచంద్రమ = రాజోత్తములలో గొప్పవాఁడా. మనోగతము=కోరిక, సంఘటించి = చేసి, ఘనప్రథ = గొప్పకీర్తి, పోఁడిమిన్ = చక్కఁగ.

తాత్పర్యము.

రాజచంద్రా! నే నేది కోరినను దప్పక యిచ్చెద నంటివి. నా మనస్సునఁ గలదానిని వేఁడెదను. దాని నెఱవేర్చి దశరథుఁ డెట్టి సంకటసమయమందును బొంకువాఁడు కాఁడు అను గొప్పకీర్తి సంపాదింపుము. ఇఁక నా చరిత్ర చెప్పెద వినుము.

ఉ॥ తీరుప జన్నమొం డిపుడు దీక్షవహించితి, నంతరాయమున్
గూరుప రాక్షసద్వయము నూల్కొని యుండెను ఱేఁడ! వార లె
వ్వార లనన్ సుబాహుఁడును వానికి నన్నయుఁ గామరూపులున్
గ్రూరులు నస్త్రవంతులు నకుంఠబలుల్ గృతహస్తు లిర్వురున్. ౫౫౫

విశ్వామిత్రుఁడు తనకోరికను దెలుపుచున్నాఁడు. జన్నము= యజ్ఞము, తీరుపన్ = నెరవేర్పన్, అంతరాయమున్ = విఘ్నమును, ద్వయము = ఇద్దఱు, నూల్కొని = సిద్ధపడి, అకుంఠబలుల్ = మొక్కవోని పరాక్రమముగలవారు, కృతహస్తుల్ = గుఱితప్పక వేయువారు, కామరూపులు = కోరినరూపము ధరింపఁ గలవారు.

తాత్పర్యము.

నే నిప్పు డొకయజ్ఞముచేయ సంకల్పించి దీక్షపూనితిని. దాని నెట్లయినను విఘ్నపఱుపవలయు నని యిద్దఱురాక్షసులు పూనియున్నారు. వారు మారీచుఁడు సుబాహువు ననువారు. వారిరువురు కామరూపులు, దయాదాక్షిణ్యము తెలియనివారు, అస్త్రలక్షణము దెలిసినవారు, మహాబలులు, గుఱితప్పక కొట్టఁగలవారు.

కం॥ నెత్తుటఁ గ్రేవులు నెఱచియు, మొత్తంబులుగాఁగఁ గురిసి మొగి వేదిపయిన్
ముత్తి సదస్యుల మునులన్, మిత్తిని బ్రేచెద రి మేము మిడుకుచు నుండన్. ౫౫౬

ఎఱచి = మాంసము, వేదిపయిన్ = అగ్నిస్థానముమీఁద, సదస్యులన్ = సభ్యులను, మిత్తిని = మృత్యువును, మిడుకుచున్ = పరితపించుచు, 'ఎఱచియ భుజియింతు రర్థి నెల్లజనంబుల్' - భార-ఆర. మృత్యుశబ్దభవము మిత్తి.

తాత్పర్యము.

వా రేమిచేయుదు రనెదవేమో, నెత్తురు వ్రేవులు మాంసము కుప్పలు కుప్పలుగా వేదిమీఁదఁ గురియించి సభ్యులను దన్ని చూడవచ్చినమునులను మేము చూచుచుండఁగాఁ జంపుదురు.

క॥ ఆయసురులు విఘ్నం బటు, చేయఁగ నుత్సాహ మెడలి ♦ చేడ్పడి గాసిన్
నాయాశ్రమదేశంబును, బాయుచు నినుఁ గనఁగ నిట్లు ♦ వచ్చినవాఁడన్. ౧౧౭

ఎడలి = పోయి, గాసిన్ = శ్రమమున, చేడ్పడి = బాధపడి.

తాత్పర్యము.

ఇట్లు వారు యజ్ఞమునకు విఘ్నము చేయుదురు కావున నుత్సాహము చెడి ప్రయాసపడి నా యాశ్రమభూమిని వీడి నీవు సాహాయ్యము చేయుదు వను నాసతో వచ్చినాఁడను.

క॥ పాపాత్ముల దైత్యులపస, శాపంబున మాపి యమునిసదనంబునకున్
వే పుచ్చ వారి నాకుం, గోపింపఁగరాదు దీక్షఁ ♦ గొనసమయమునన్. ౧౧౮

పస = గర్వము- బలము, వే = శీఘ్రముగ, పుచ్చన్ = పంపను.

తాత్పర్యము.

నీవు చాపము పట్టఁగలవు, శాపము పెట్టఁగలవే, నీవు వారిని విలువిద్యచే జయింపరాదా, శాపముచే జంపరాదా యందువేమో ఆ పాపాత్ములబలగర్వముల నేను ద్రుంచి వారిని యమలోకమునకుఁ బంపఁగలనుగాని యజ్ఞదీక్షసమయమున నేను గోపించి విల్లుపట్టను రాదు, శపింపను రాదు. తక్కినసమయములందు వారు రారు. నే నేమి చేయుదును? యజ్ఞసమయమునందే వారిని దండింపవలసి యున్నది.

—*విశ్వామిత్రుఁడు శ్రీరామునిఁ దనతోడఁ బంపుమని దశరథు నడుగుట*—

తే॥ ముంగురులు వ్రేలుముద్దు నెమ్మొగమువానిఁ, గప్రతరమైనపిల్లకూఁ♦కటులవాని
రామ బలధామ నీదు గా♦రాముసుతుని, సత్యవిక్రము నీఁగదే ♦ క్ష్మాతలేంద్ర!
౧౧౯

ఆ విషయమున నేను జేయవలసిన దే మనఁ జెప్పుచున్నాఁడు. క్ష్మాతలేంద్ర — రాజా; ముంగురులు — మొగమున వ్రేలాడు నంగరిములవంటి వెంట్రుకలు, నెఱ + మొగము, నెమ్మొగము—అందమైనముఖము. కప్రతరమైన— మిక్కిలి మనోహరములగు; పిల్లకూఁకటులు = పిల్లజుట్టులు; గారాముసుతుని= ముద్దుకుమారుని; సత్యవిక్రమున్ = వంచనలేని పరాక్రమముగలవానిని;

పరాక్రమమున లోపము లే దని భావము. ఆయన సత్యస్వరూపుఁడై సత్యమును రక్షించువాఁడు కావున నాయన ధర్మమే యాయనను గాపాడును. 'ధర్మో రక్షతి రక్షితః.'

తాత్పర్యము.

అటులయిన నావలనఁ గావలసిన సాహాయ్యమేమి యందువా? పెద్దవాఁడవైన నీ కేమియు శ్రమమియ్య నేను దలఁపలేదు. నేను గోరునది యేమనఁగా రాజా! కమలముమీఁదిఁ దుమ్మెదలవలె ముద్దునెమ్మొగముమీఁద వ్రేలాడు ముంగురులు యందమైన జుసపాలుగలవాఁడై బలమునకు స్థానమైన నీగారాబు కుమారుని శ్రీరామచంద్రమూర్తిని సత్యపరాక్రముని నాకు నిమ్ము.

శా॥ నాచే రక్షితుఁడై భవత్సుతుఁడు విజ్ఞానంబు మైఁ ద్రుంచు మా
రీచాద్యాశరకోటి దివ్యనిజనిర్నిద్రప్రతాపోన్నతిన్
నీచుల్ వారలు, వారి రాముఁ డొకఁడే నేర్చున్ వధింపంగ, నా
లోచింపం బని లేదు, రక్షకును జాలుం, బంపుమా రామునిన్. ౯౬౦

బాలుఁడగు శ్రీరాముఁడు మిగులగొప్ప రాక్షసుల నెట్లు చంపఁగలఁ డనుటకు సమాధానము చెప్పు చున్నాఁడు. ఆశరకోటిన్=రాక్షససమూహమును, దివ్యనిజనిర్నిద్రప్రతాపోన్నతిన్ - దివ్య = అమానుషమైన - శ్రేష్ఠమైన, నిజ = తన యొక్క, నిర్నిద్ర = హెచ్చరికతోఁగూడిన, ప్రతాప = పరాక్రమముయొక్క, ఉన్నతిన్ = అతిశయముచేత, విజ్ఞానంబుమైన్=సామర్థ్యముచేత-వారిని వధింపఁగలవాఁడు శ్రీరాముఁ డొకఁడేకాని నీవు సేనలతోడ వచ్చియుఁ బ్రయోజనములే దని భావము.

తాత్పర్యము.

రాక్షసులతోడ యుద్ధ మంటివి- ఆరాక్షసులు మాయావులు- మహాబల పరాక్రమసంపన్నులు - సస్త్రవేదులు నంటివి. అట్టివారితోడఁ బోరుటకు జేనేఁడు పిల్లవానిని దీసికొనిపోవు యేమిప్రయోజన మందువేమో.

నేను గాపాడుచుండఁగా నీకుమారుఁడు మారీచాదిరాక్షసుల సమూహమును దనప్రతాపాతిశయముచేత చులకనఁగాఁ ద్రుంపఁగలఁడు. వారి బలాతిశయ మెట్లున్నను దయాధర్మాదిగుణశూన్యులైన నీచులుగావున వారసాధ్యులు గారు. అయినను వారిని జంపఁగలబలశాలి శ్రీరాముఁ డొక్కఁడేకాని మఱి యెవ్వఁడు గాఁడు. కావున నీ వాలోచింపవలసినపని లేదు. నాయజ్ఞమును రక్షింపనతఁడు సమర్థుఁడుకావున శ్రీరాముని నా వెంటఁ బంపుము.

కం॥ నా కీకార్యము సేయన, నేకశుభంబులును గూర్తు నీసుతునకు న
స్తోకయశోభాసురుఁడై, లోకంబుల నెగడు మనుజలోకాధ్యక్షా! ౯౬౧

మనుజలోకాధ్యక్షః = మనుష్యలోకమునకుఁ బ్రభువా; అస్తోకయశోభాసురుఁడై = అధికమగు కీర్తిచేఁ బ్రకాశించువాఁడై - బలపరాక్రమాదుల వచ్చెడి పేరు కీర్తి - దానాదుల వచ్చెడిది యశస్సు. సామాన్యముగ రెండును పర్యాయ పదములుగ వాడఁబడును. విశ్వామిత్రయజ్ఞరక్షకుఁడనియు, అహల్యాశాప మోచకుఁడనియు, శివధనస్సును విఱిచినవాఁడనియుఁ, బరశురాము భంగపఱిచినవాఁడనియు నిత్యాదులగుగొప్ప కీర్తులు సంపాదించినవాఁడగు నని భావము.

తాత్పర్యము.

ఈకార్యము నాకు నెఱవేర్చితివా నీ కుమారునకు నెన్నియో శుభములు గలుగ నేను జేసెదను. నీపుత్త్రుఁడు లోకంబున విశేషము కీర్తిమంతుఁడై ప్రకాశించును.

క॥ బలగర్వితు లయ్యును బాపులు గావునఁ గాలపాశములకు న్వశులై
కలన మని రాము నెదుర్ప, నిలువంగా లేరు నిజము నిజము నృపాలా. ౧౬౨

ఇంత చిన్నవాఁడెట్లు రాక్షసులఁ జంపు నన సమాధానము చెప్పుచున్నాఁడు. కాలపాశములకున్ = యమునిచేత త్రాళ్లవలెనుండు నాయుధములకు, వశులై = లోపడినవారై, కలనన్ = యుద్ధమందు, మని = బ్రదికి, నిజము, నిజము - ద్విరుక్తి దార్ఢ్యార్థము.

తాత్పర్యము.

వారెంతబలముచే గర్వించినవారయ్యును పాపాత్ములును ధర్మహీనులుగావున మృత్యువశులగుటచేత యుద్ధమునందు శ్రీరాము నెదిరించి నిలువఁజాలరు. తత్కాలమునఁ బాప మెంత బలిష్ఠముగా నున్నను దుదకు ధర్మమే జయించును.

[హనుమంతుఁడు లంకనుండి మరలి వచ్చి రాక్షసులవృత్తాంతము రామచంద్రమూర్తితోఁ జెప్పుచు -

'శ్లో॥ అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ, రాక్షసానాం గృహే గృహే' రాక్షసుల యింటింట అగ్నిహోత్రములు వేదములు కలవు అని చెప్పగానే యిఁక వీరి నెట్లు సాధింప సాధ్య మని శ్రీరామునిముఖము తెల్లబోయె నఁట. అది కని యింగితజ్ఞుఁడైన హనుమంతుఁడు వెంటనే

'దయా సత్యంచ శౌచంచ రాక్షసానాం నవిద్యతే' దయ - సత్యము - శౌచము - రాక్షసులకుఁ దెలియ వనెనఁట. ఇఁకజయించితిని భయములేదని రామచంద్రమూర్తి ప్రసన్నుఁడయ్యెనఁట. మంత్రములు - తంత్రములు - వేదములు లోనైనవి యశుచులను నిర్దయులను నసత్యవాదులను రక్షింపవు. మొదట మేలుచూపినను దుదకుఁ గీడుచేయును.]

కం॥ చాలం డని కలనికిఁ బసి,బాలుం డని, విడువు పుత్త్రుపై మోహంబున్
జాలరు బ్రతుకఁగ నీసుతు, మ్రోల సురాహితులు శపథము న్వచియింతున్.
౫౬-౩

మోహమును = భ్రాంతిని, మ్రోలన్ = ఎదుట, = సుర + అహితులు = రాక్షసులు; శపథము = ప్రతిజ్ఞ.

తాత్పర్యము.

యుద్ధముచేయ శక్తుఁడు కాఁడని పసిబాలుఁడని పుత్త్రుపై మోహము వదలి పెట్టుము. రాక్షసులు నీసుతు నెదుట నిలువఁజాలరని ప్రమాణముచేసి చెప్పెదను.

తే॥ ఏ నెఱుంగుదు రాజేంద్ర యీమహాత్ము, రాముసత్యపరాక్రమోద్దాము నతిప్ర
సిద్ధతేజోధికుండు వసిష్ఠమునియు, నీతపస్వితు లెల్లరు నెఱుఁగువార. ౫౬-౪

సంసారిగానుండు నేను నాపుత్త్రునియందుఁ బుత్త్రమోహ మెట్లు వదలుదు? నా కొడుకు బలాబలములు నాకుఁ దెలియకున్న నీ కెట్లు తెలియు ననిన, రాజా! శ్రీరాముఁడు పేరునకు నీకుమారుఁడే కాని లోకమునకుఁ దండ్రి. లోకము నుద్ధరించుటకై పుట్టినవాఁడు కాని నీయింట సుఖించుచుండఁ బుట్టినవాఁడు గాఁడు. నీకొడుకని యీరామునియం దెంత ప్రీతి నీకున్నదో యంత ప్రీతి జగజ్జనకుఁడైన యీరామునకు లోకముమీఁద నున్నది. నీవు సత్త్వ మెఱుఁగక నీకుమారుఁ డనియే నీవు తలంచెదవు. సత్త్వ మెఱిఁగిన నాబోఁటులు భగవంతుఁడని చూచెదరు. కావున నీయన యందఱిసొత్తుగాని నీయొకనిసొత్తుమాత్రమే కాదని విశ్వామిత్త్రుఁడు సమాధానము చెప్పుచున్నాఁడు.

రాజేంద్ర = రాజశ్రేష్ఠుఁడా! రాజులు రజోగుణప్రధానులు - వారిలో నీవు శ్రేష్ఠుఁడవు - కావున నత్యంతరజోగుణయుక్తుఁడవు కావున - నీవు సత్త్వ మెఱుఁగవు. ఏను = సత్త్వగుణయుక్తుఁడనై యోగీంద్రుఁడనైన నేను, కావుననే పరబ్రహ్మస్వరూపమును తెలిసికొనఁదగిన నేను, కావున నే నెఱుంగుదునుగాని-"జ్ఞాననముం గప్పి యజ్ఞానంబు వెలయు,దానఁగదా జంతుతతులు మోహించు" ద్వి-భగ-౫ అధ్యాయము. అన్నట్లు లజ్ఞానముచేఁ గప్పబడిన జ్ఞానముగలవాఁడవై పామరుఁడవై మోహపడెడి నీ వెఱుఁగఁజాల వని భావము. 'అహంకారవిమూఢాత్మా' యన్నట్టు లహంకారముచే నే నని చెప్పలేదు, ఏను = అనేక గురువుల సేవచేసి జ్ఞానము సంపాదించుకొన్నవాఁడను, పరాపరతత్త్వయాథాత్మ్య మను నాయోగబలముచేఁ బ్రత్యక్షముగఁ జూచువాఁడను నేను - నీ వన్ననో యజ్ఞాది కామ్యకర్మము లాచరించువాఁడవు; ఐహికసుఖముల వదలి జటావల్కలములు ధరించువాఁడను నేను - నీవో రజోగుణసముద్భవము లైన కామక్రోధాదుల ధరించువాఁడవు, 'గర్భభూతాస్తపోధనాః' 'నీగర్భముపోలె నీ కెపుడు గావఁగ

మమ్ముఁ దగుఁ' ఆరణ్య. అన్నట్టులు ఆయనగర్భమం దుండువారము మేము- నీవో యాయన నీగర్భమున జనించెనని గర్వించువాఁడవు; యోగక్రమ మెఱిఁగినవాఁడ నేను; భోగక్రమమెఱిఁగినవాఁడవు నీవు; మోక్షకామినై యాగము చేయువాఁడను నేను - పుత్త్రకామివై యజ్ఞము చేసినవాఁడవు నీవు; ధర్మమోక్షములఁ బాటించువాఁడను నేను - అర్థకామములఁ బాటించువాఁడవు నీవు; ఇట్టి గుణంబులుగల నేను శ్రీరామచంద్రమూర్తి యెట్టివాఁడో యెఱుంగుదునుగాని మంటిలోనుండు రత్నము వెల మంటికిఁ దెలియనట్లు నీ యుంట నన్నంతమాత్రమున నాయనమహిమ నీ వెఱుఁగఁజాల వని భావము. ఈ యర్థములన్నియు "ఏను" అను సర్వనామమున కర్థములు. సర్వార్థములఁ జెప్పునదికదా సర్వనామము.

"సాంగవేద యదివా నకిలేతి వేద స్సందేగ్ధ్యసర్ఘువిద మాత్మని రంగనాథ" మ్మనియుఁ 'విధిశివ సనకాద్యై ర్ధ్యాతు మత్యంతదూరం' మ్మనియుఁ బరమాత్మ యిట్టివాఁ డని యెవ్వరికిఁ నెఱుఁగరాకుండఁగా నీవుమాత్ర మెఱ్లెఱిఁగితి వనిన సమాధానము చెప్పుచున్నాఁడు.

ఈ మహాత్ము నెఱుంగుదు = ఈయనను మహాత్మునిఁగానే యెఱుంగుదు. "వేదాహమేతం పురుషమ్మహాంత"మ్మని శ్రుతి యిట్లే యున్నది.

ఈ పురుషసూక్తవాక్యమే రామాయణమున 'అహంవేద్మి మహాత్మాన' మ్మని చెప్పఁబడెను. కావున రెండువాక్యములఁ జెప్పఁబడిన మహాత్ముఁ డొకఁడే యని యాయన శ్రీరామచంద్రమూర్తిగా నవతరించిన పురుషసూక్తవాచ్యుఁ డగు భగవంతుఁడే యని యెఱుఁగ నగు.

ఏతం = ఈ, అనఁగా జనులతోఁగలసిమెలసియుండున ట్టింత సౌలభ్యము గల, పురుషం = పరమాత్మను, అహం=ఈయన నెఱుంగ ననుకూలగుణములు గల నేను, మహాంతం వేద = మహాత్ముఁడుగానే యెఱిఁగితిని. కొలఁది చెప్పరాని గుణములుగల వానినిగా నెఱిఁగితిని. ఈశ్రుతియందు ఏత మ్మని సౌలభ్యమును, పురుష మ్మని పరత్వమును జెప్పఁబడినవి. అవి యీపద్యమునను గలవు.

మహాత్ము నెఱుంగుదు ననక - ఎఱుంగుదు మహాత్ము ననుట నిర్వికల్పమైన దృఢజ్ఞానమును బ్రకటించుటకే.

మూలమునందుఁగల "అహమ్" శబ్దమునకు - శబ్దబ్రహ్మమైన విష్ణువుగాఁ గొంద ఱర్థము చెప్పుచున్నారు. అ ఇ ఉ ణ్ ఇత్యాదిపర్ణసమామ్నాయమందు అకారము మొదటియక్షరము, హల్ అని హకారము కడపటియక్షరము. ముప్ర త్యాహారమున అహ మ్మని ద్వితీయయం దగు - విష్ణువు నని యర్థము. ఈ పక్షమున నాంధ్రంబున.

ఏనెఱుంగుదు నన్నచోట "ఏన్" ఏనుగా ననఁగా విష్ణువునగా నెఱుంగుదు నని యు నర్థము చెప్పనగు. ఏకారమునకు విష్ణు వర్థము. "ఏకార స్తేజసి జలే రాత్రౌ హర్మ్యోదరే హరౌ" ఏ-వు. ఇది తేజస్సునకు - ఉదకమునకు - రాత్రికి - మేడ మధ్యభాగమునకు - విష్ణువునకుఁ బేరు. అని నానా. ర.

ఏకారమునకు నుత్తవిష్ణు వని యర్థముగాదు. లక్ష్మీవిశిష్టుఁడైన విష్ణు వని యర్థము. అ + ఈ = ఏ - సంస్కృత వ్యాకరణసూత్రముల ప్రకారము - అ ఈ = ఏ యగును. 'అకారః నారాయణస్య ప్రథమాభిధాన' మ్మని - అకార మునకు నారాయణుఁ డని యర్థము ఆయనభార్యయగుటచే లక్ష్మీదేవి ఈకార మున కర్థము- "ఈకారో౽బ్జదళే లక్ష్మ్యాం" అని నానా. ఈకారము తామర రేకునకు లక్ష్మికి పేరు. రామున్ - ఇది సౌలభ్యమును సూచించును. సత్యపరా క్రమ + ఉద్దామున్ - అనుటచే బలిత్వము చెప్పఁబడెను. సత్యుఁడు పరి ఆక్ర ముఁడు భగవంతుఁడుగాక మఱియెవ్వరు? (2) 'తేజసాంహి నవయ స్సమీక్ష్యతే' 'తేజోనిధికి వయసు కారణ మగునే' యను న్యాయముగ నింతబాల్యముననే యపరిమితపరాక్రమముగలవాఁడు. మహాత్మున్ = ఆత్మలకు నాత్మగావున గొప్ప యాత్మను, 'సత్యస్య సత్య' మను న్యాయ మిచ్చట నెఱుంగనగు. 'య ఆత్మని తిష్ఠన్' అను శ్రుతి యిచ్చటఁ బ్రమాణము. ఆత్మ = దేహము - 'ఆత్మా జీవే ధృతౌ దేహే' యని యమరవాక్యము. మహాత్మున్ = గొప్ప దేహముగల వానిని. ఆ దేహము = అప్రాకృత దివ్యమంగళరూపము - 'సతస్యప్రాకృతమూర్తి' యని స్మృతివాక్యము ప్రమాణము.

మహాత్మున్ = "సకలభూతావళి సభయంబును నేవావిరిఘుటయితు నిదియ వ్రతమగు నాకున్" ౩ు-౭. అని చెప్పఁగల గొప్ప స్వభావము గలవానిని, రాము మహాత్మున్ = శ్రీరాముఁడుగా నవతరించి మహాస్వభావము గలవానిని- 'స ఉశ్రేయాన్ భవతి జాయమాన' యను శ్రుతి యిందుఁ బ్రమాణము. సత్య పరాక్రమోద్దామున్ = ఎల్లప్పుడు నొక్కరీతిగనుండు పరాక్రమముచే గొప్ప వానిని - 'నావిజిత్య నివర్తతే' గెలిచిగాని మఱలిరాఁ డని ముందు చెప్పఁ బడును.

(2) నిజమైన పరాక్రమముచే గొప్పవానిని (3) సత్యముచేఁ బరుల నాక్ర మించువాఁడు సత్యపరాక్రముఁడు. ఉద్దాముఁడు = గొప్పవాఁడు, ఇట్టివానిని జూడఁగానే శత్రువులు పడియుండుట్టవానిని.

నేను నా కార్యార్థమై యిట్లు చెప్పలేదు. ఈవిషయ మెఱిఁగినవాఁడు నే నొకఁడనే కాను. మీ వసిష్ఠునికిని దెలియు ననుచున్నాఁడు.

ప్రసిద్ధతేజోధికుండు = సరస్వతీదేవిభర్త యగు బ్రహ్మదేవుని పుత్త్రుఁడనియు, యోగమహిమచే జ్ఞానము సంపాదించినాఁ డనియుఁ బ్రసిద్ధిచెందిన ప్రభావముగలవాఁడు (2) సత్యంవద, ధర్మంచర యని నీ కుపదేశించుట మాత్రమేకాక తా ననుష్ఠించి చూపు తేజోవంతుఁడు. వసిష్ఠమునియు = నీ కత్యంతాప్తుఁడై కులాచార్యుఁ డగు వసిష్ఠుఁడుకూడ ఇచ్చట 'యు' అను సముచ్చయము విరోధార్థకము. నాకు వసిష్ఠుఁడు విరోధియైనను అని యర్థము. ఎవ్వని వాక్యముచే నేను బ్రహ్మర్షి నయితినో యంతటి గొప్పవాఁ డనియైనను సముచ్చయార్థము. 'యద్బ్రాహ్మణశ్చ బ్రాహ్మణశ్చ ప్రశ్నమేయాతాం బ్రాహ్మణా యాధిబ్రూయా' త్తను న్యాయ మనుసరించి నీకు నాకు వివాదము గలిగినపుడు బ్రాహ్మణుఁడవైన నీపక్షముననే వసిష్ఠుఁడు చెప్పునగాని నాపక్షమునఁ జెప్పునా యందు వేని యింద్రియముల జయించి వానిని తనవశమున స్థిరపఱుచుకొన్న యీయన పక్షపాతముచే నసత్యము చెప్పఁడు. అట్లు నాపక్షమునఁ బక్షపాతముచేఁ జెప్పునని నీవు సందేహించెదవేని యీయనఁగాకున్న నితరఋషుల నడిగిచూడు మనుచున్నాఁడు. ఈతపస్థ్సితులు + ఎల్లరుఁ = రాజగృహసంబంధములేనివారు గనుక పక్షపాతములేనివారును, 'తస్య ధీరాః పరిజానంతి యోని' మ్మన్నట్లు లవతార రహస్యము నెఱింగినవారును, ప్రసిద్ధులై యాచార్యపదవీనిర్వాహకులును 'గర్భస్థ ఋషిర్వామదేవః ప్రపేదే' యనియు, 'సప్తకల్పస్థితో ముని' యనియు శాస్త్రమునఁ జెప్పినట్లు బ్రహ్మజ్ఞానమున నొకరిని మించిన మఱియొక రగు వామదేవ మార్కండేయాదులు నని యీపదముయొక్క భావము. తపః + స్థితులు = (1) దేహపోషణాదికార్యముల వదలి దేహమును శుష్కింపఁజేయు తపస్సునందే యుండువారు (2) తపస్సు = ఉపవాసాదివ్రతాదులచే దేహమును శోషింపఁజేయుట, అట్టివారు తపస్థ్సితులు. (3) తపస్సు - జ్ఞానము, తప = ఆలోచనే యని ధాతుపాఠము. జ్ఞానయోగనిష్ఠులు తపస్థ్సితులు (4) న్యాసవిద్య = తపస్సు - 'తస్మాన్న్యాసం తపసామతిరక్తమాహుః' యని శ్రుతివాక్యమిటఁ బ్రమాణము. తపస్థ్సితులు - న్యాసవిద్యాపరులు - వీరి నొక్కరొక్కరి నేకాంతమున నడుగుము. వీరు సమ్మతించిరేని రామచంద్రమూర్తిని నాతోడఁ బంపుమని భావము.

ఈమహాత్మ ననుటచే రామచంద్రమూర్తి సభయందున్నాఁడని నిశ్చయింపఁబనిలేదు. 'సమాసఘటితం బీశబ్దం బొక్క చో సూచనార్థకం బగు' - ప్రౌ. వ్యా. సమాస. ౧౧ సూ. 'ఈ యున్నపౌష్యపాలిక' భాస. సమీపార్థమున 'ఈ' ప్రయోగింపఁబడెను.

తాత్పర్యము.

రాజేంద్రా! నే నెఱుఁగుదునయ్యా, యీ శ్రీరాముని మహాత్ముని సత్యపరాక్రముఁ డగువానిని, నామాట సందేహించెదవేని తపోబలమున మహా

తేజుఁడైన నావిరోధి యగు నీవసిష్ఠు నడుగుము. అంతటితో నీకుఁ దృప్తి లేకుండిన నిచ్చటనుండు తపస్వులనందఱ నడుగుము. వీరందఱు శ్రీరామునిమహిమ నెఱిఁగినవారే.

తే॥ వసుధ స్థిరముగ ధర్మలాభంబు మఱియు, లలితకీర్తియు నొందఁగ ♦ వలతు వేని
రాముఁ బంపుము నాతోడ ♦ రాజచంద్ర, లేనిపోనికుశంకలు ♦ మాననయ్య. ౫౬౫

వసుధన్ = భూమియందు, ధర్మలాభము = ధర్మాభివృద్ధి, వలతువు = కోరుదువు, కుశంకలు = చెడ్డసందేహములు, ధర్మము = న్యాయాగము రక్షించుట, దుష్టుల శిక్షించుట లోనగు ధర్మకార్యమువలనఁ గలుగు నూర్ధ్వలోకసుఖము, కీర్తి = తాటకావధ, అహల్యాశాపమోక్షణము, శివధనుర్భంగము, సీతా పరిణయము, పరశురామ పరాభవము. లోనగు వానివలన వచ్చుకీర్తి, తల్లి దండ్రులకుఁ బుత్రోత్సవము పుత్రజన్మ దినమునఁ గాదు, వాఁడు లోకమున కీర్తి పరుఁడైననాఁడు, కావున శ్రీరామున కట్టికీర్తి కలిగించి నీకుఁ బుత్రోత్సవము కలిగించుటకై వచ్చి శ్రీరాము నడుగుచున్నాను.

తా త్ప ర్య ము

రాజా! నీకు ధర్మ మభివృద్ధిచేసికొని యూర్ధ్వలోకసుఖము పొందవలె ననీ మంచి కీర్తిలోనైన నైహికఫలములు కావలయు నని యభిప్రాయ ముండెనా శ్రీరామచంద్రుని నాతోడఁ బంపుము. పనికిమాలిన సందేహములన్నియు వదలిపెట్టుము. పంపకపోయితివా నీ కిహము లేదు, పరము లేదు.

తే॥ నిను వసిష్ఠుఁడు మొదలైన ♦ నీ సుమంత్రి, వరులు సమ్మతి నిసులఁ ♦ బంపుమనిరి
యేని పంపుము నాతోడ నిష్టముగను, రమ్యగుణభద్రు వేగము ♦ రామభద్రు
౫౬౬

రమ్యగుణభద్రున్ = మనోహరములైన గుణములచే మంగళకరుని.

తా త్ప ర్య ము.

వసిష్ఠుఁడు మొదలయిన పురోహితులును - సుమంత్రుఁడు లోనగు మంత్రులును నీకుమారుని నావెంటఁ బంపు మని నీకు బోధించితిరా సంతోషముతోఁ బంపుము - వారు వలదనిరా మానుము.

కం॥ దశరాత్రం బగు యజ్ఞము, దశరథ! రక్షింపవలయు ♦ దైత్యావళికిన్
వశపడకుండఁగ దీక్షా,దశ నతికాలంబుగాక ♦ తనయుని నిమ్మా. ౫౬౭

దశరాత్రము = పదిదినములు చేయఁదగినది; అతికాలము = మంచికాలము మిఱంచిపోకుండునట్లు - 'ఏకదేశసంఖ్యావ్యయంబులకును సర్వసంఖ్యాతపుణ్యా

శబ్దములకును బరమైన రాత్రిశబ్దము అకారాంతమగు' సు.వ్యా.సమాస-౫౮ సూ.

తా త్ప ర్య ము.

నేను జేయఁబూనిన యజ్ఞము సాంతమగుటకు నేఁడుమొదలు పది దినములగును. ఈయజ్ఞము రాక్షసులచే విఘ్నపడకుండ రక్షింపవలయును. కావున దీక్షాకాలము మించిపోకమునుపే నీకుమారుని నిమ్ము. తోడుకొనిపోయెదను.

కం॥ శామిత్రావనమిష వి,శ్వామిత్రుల దైత్యపతుల ♦ హరియింపఁగ వి
శ్వామిత్రుఁడు మిత్రాన్వయు, రాముని నిటు పంప వేఁడి ♦ రాజితఫణితిన్. ౧౬౦

శామిత్ర . మిషన్ - శామిత్ర = యజ్ఞముయొక్క, అవనమిషన్ = రక్షించు నెపమున; విశ్వ + అమిత్రులన్ = లోకవిరోధులను, మిత్ర + అన్వయున్ = సూర్యవంశమునఁబుట్టినవానిని, రాజితఫణితిన్ = ధర్మ్యములగు ప్రకాశించు వాక్యములతో; యజ్ఞరక్షణము నెపమని చెప్పఁబడెనే యది నిజము కాదా యందు రేమో-కాదు. చూడు ౭౦౮ పద్యము. ఋషీశ్వరులతపస్సులు లోనైనవి రక్షించుటకుఁగాను వారివారి తపస్సులలో నాఱవవంతు రాజున కిచ్చుచుందురు. కావున వారి తపస్సులకు యజ్ఞములకు విఘ్నములు రాకుండఁ జక్కఁగా జరుపవలసినది రాజులకు విధి. నేను రాయ నని చెప్పి తప్పించుకొనరాదు. కావున నీ కారణము చెప్పిన దశరథుండు రామునిఁ బ్రమాణముగ నంపు నని విశ్వామిత్రుఁడు యోజించెను. నీకు యజ్ఞరక్షణము ప్రధానమైనచో నేను వచ్చి రక్షించెదను. రక్షించువా రెవ్వరైన నీ కేమి యని దశరథుఁడు చెప్పబోవు నన్నాఁడు.

తా త్ప ర్య ము.

యజ్ఞరక్షణము నెపముగాఁ గొని శ్రీరాముని బిలుచుకొని పోయి యాయనచే మారీచసుబాహులఁ జంపింపవలయు నని విశ్వామిత్రుఁడు దశరథు వేఁడి చెప్పవలసిన మాటలన్ని చెప్పి దశరథుని ప్రత్యుత్తరము వినఁగోరి యూరకుండెను.

ఉ॥ ఊరక కూరుచుండిన నృ♦పోత్తముఁ డామునివర్యుఁ డన్న వ్యా
హారము లాలకించి హృద♦యప్రవిదారణకృద్దుర్వ్యథా
పారమహాంబుధి న్మునిఁగి ♦ వారనిశోకమునం దపించుచున్
ధారణిప్రాలె శస్త్రనిహ♦తం బయికూలు ద్రుమంబుచాడ్పునన్.. ౧౬౧

వ్యాహారములు — మాటలు, హృదయ — గుండెను, ప్రవిదారణ — చీల్చుటయందు; దక్ష = సామర్థ్యముగల, దుర్వ్యథా = సహింపరాని దుఃఖమను; అపార = అంతములేని, మహాంబుధిన్ = గొప్పసముద్రమునందు, వారని = తగ్గని; శస్త్రనిహతము = ఆయుధముచే నఱకఁబడిన, ద్రుమంబు చాడ్పునన్ = వృక్షమ్రాఁకువలె.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడు రామచంద్రమూర్తిని నావెంటఁబంపుమన్న మాట (౫౬౯ ప) వినఁగానే ముఖము వెలవెలఁబోయి ముందు గొప్పవానితో మాటచెప్పితినే, యెట్లు తప్పుదును? తప్పకుండిన శ్రీరాము నెట్లుపంపుదును? శ్రీరామునివిడచి యెట్లు బ్రదుకఁగలను? అవు ననుటకు లేదు. కా దనుటకులేదు - అని సహింపరానివిషాదమున మునిఁగి ముని చెప్పినమాటలు విని - వినక రామచంద్రమూర్తినిఁ బంపకుండిన నీవైన రిమ్మని చెప్పవేమో యని తెలివి బిగపట్టుకొనియుండి యామాట యాయననోటరాకపోవుటచే నాశవదలి గుండెలు వ్రీలి దుఃఖసముద్రములో మునిఁగి స్మృతితప్పి గొడ్డంటనఱికిన చెట్టువలె నేలపైఁ బడెను.

౨౦ సర్గము. శ్రీరామునిఁ బంపఁజాలక దశరథుఁడు పరితపించుట

కం॥ ఒక్కముహూర్తం బీగతిఁ, ద్రెక్కొనమూర్ఛకను జిక్కి ♦ ధృతిగొని సుతుపై
మక్కువచే నివ్విధమున, నక్కుశికతనూజుతోడ ♦ ననినిపుఁ డనియెన్.　౫౭౦

ఇదిమొదలు ౫౮౯ వఱకు రామచంద్రమూర్తినిఁ బంపజాలక దశరథుఁడు పరితపించుట చెప్పఁబడును.

ముహూర్తము = కొంచెముసేపు, త్రెక్కొను = అతిశయించు, ధృతి = ధైర్యము.

తాత్పర్యము.

అల్పకాల మీ విధముగ స్మృతితప్పి పడియుండి ధైర్యము తెచ్చుకొని లేచి కొడుకుమీఁదనుండు మోహముచే విశ్వామిత్రునితో నిట్లనియె.

కం॥ మారాముఁడు బాలకుఁ, డారాముం డూనషోడశాబ్దుం డీయం
భోరుహనేత్రుఁడు నిశిసంచారులతో రణము సేయ ♦ శక్తుం డగునే?　౫౭౧

శ్రీరామచంద్రమూర్తిమాహాత్మ్యమును గుఱించి విశ్వామిత్రునివాక్యము లేవియు నాలోచింపక దశరథుఁడు పామరత్వంబునఁ బుత్రమోహముచె శ్రీరాముని బాల్యమునే యెంచుచు రామచంద్రునిఁ బంప వలనుపడ దనుచున్నాఁడు.

మారాముఁడు = రాముఁడు లోకరాముఁ డని చెప్పిన విశ్వామిత్రునివాక్యము పెడచెవిని బెట్టియో మనస్సు వ్యాకులపడియుండుటచే వినఁబడని హేతువుననో మరల మారాముఁ డనుచున్నాఁడు. మా + ఆరాముఁడు = సౌందర్యలక్ష్మికి వినోదవిహారస్థలమైనవాఁడు. ఇంతటి సుందరమూర్తిని నెట్లు పాయుదును. ఎట్లు రాక్షసులపాలఁ ద్రోయుదు నని భావము. మారాముఁడు = ఎప్పుడు నాతోడయుండేయుండి లాలింపఁబడుచుండు రాముఁడు. (2) నే నఱువదివేలేండ్లు సంతానములేక దుఃఖించి మిక్కిలి శ్రమపడి కన్న కుమారుఁడు

రాముడు -- తండ్రికి సదా ప్రీతికరుఁడు 'జనకునకుఁ శ్రీరాముఁడు ప్రియుడయ్యెఁగదుఁ' అని ముందే చెప్పఁబడెను. పామరత్వముచే = స్వీయాభిమానముచే, మా రాముఁ డనినను దశరథునినోర సత్యమే వచ్చెను. మా + రాముఁడు = లక్ష్మియందు రమించువాఁడు. ఊనషోడశాబ్దుఁడు - ఊన = కొఱఁత పడిన, షోడశ = పదునాఱు, అబ్దుండు = ఏండ్లుగలవాఁడు, పదునాఱేండ్లకుఁ దక్కువ వయస్సుగలవాఁడు - పండ్రెండేండ్లవాఁడు, 'ద్వాదశవత్సరుఁడు' అని ఆరణ్య గీ 3 పద్యము. అషోడశము బాల్య మని శాస్త్రము. కావున, ఆలోపలి వయస్సువాఁడు యుద్ధార్హుఁడుకాఁడు - పండ్రెండేండ్ల రాముఁ డెట్లు యుద్ధముచేయఁగలఁడని భావము! 'మైనారిటి' తీరలే దని భావము. యుద్ధార్హుఁడు కాకుండుట వయస్సు తక్కువగుటచేతనే కాదు. రాక్షసుల స్వభావములు విచారించినను నితఁడు వారలతో యుద్ధముచేయ నర్హుఁడు కాఁ డనుచున్నాఁడు.

ఈయంభోరుహనేత్రుఁడు = తామరపూవువంటి కన్నులుగల వీఁడు; తామరపూవు సూర్యాస్తమానము కాఁగానే ముకులించునట్లు ఈయనయు నస్తమయము కాఁగానే నిదురించు నని భావము. రాక్షసు లన్ననో రాత్రించరులు కావున వారితో నీతఁ డెట్లు యుద్ధముచేయఁగల డని భావము.

బాలక్రీడారాముఁడు = విద్యాభ్యాసముకంటెను బాలక్రీడయం దెక్కువ ప్రీతిగలవాఁడు

నిశిసంచారులతోఁ = రాత్రియందు సంచరించు రాక్షసులతో - పగలు మనుష్యులతోనే యుద్ధముచేయలేనివాఁడు రాత్రులందు రేద్రిమ్మరులయి మనుష్యుల భక్షించు రాక్షసులతో నెట్లు యుద్ధముచేయఁగలఁడు? ఒక్క రాక్షసునితోనే యుద్ధముచేయలేనివాఁ డనేకరాక్షసులతో నెట్లు యుద్ధము చేయఁగలఁడని భావము.

రణము సేయ శక్తుం డగునే = శ్రీరాముఁడు ఆటలాడ యోగ్యుఁడేకాని యుద్ధముచేయశక్తుఁడుకాఁ డని భావము. రాక్షసుఁడని-రణమని విన్నమాత్రాన భయపడుబాలుఁడు రాక్షసులతో రణ మెట్లు సేయఁగలఁడు?

ఊనషోడశాబ్దుఁడు పదునాఱేండ్లకుఁ దక్కువవాఁడు అని చెప్పినప్పుడు పదునాఱేండ్లకు నొకటిరెండుమాసములో దినములో తక్కువ యని చెప్పనొప్పునుగాని రెండుమూఁడేండ్లు తక్కువ యని చెప్పవచ్చునా? అట్లుండినఁ బదునాలుగేండ్లవాఁడనియో, పండ్రెండేండ్లవాఁ డనియో చెప్పవచ్చును గదా. కాఁగా దశరథుని వాక్యముప్రకారము శ్రీరామున కిపుడు పదునాఱవయేఁడు నడచుచున్న దని యేర్పడుచున్నది. ఆ యేటనే సీతావివాహము. అటుపిమ్మటఁ బండ్రెండేండ్లు అయోధ్యాపురవాసము అని;

శ్లో॥ సమాద్వాదశ తత్రాహం, రాఘవస్య నివేశనే
భుంజానా మానుషాన్ భోగాం, త్సర్వకామసమృద్ధినీ॥
అయో. స. శ్లో.

అను సీతాదేవివాక్యమునుబట్టి యేర్పడుచున్నది. ఈ విధముగఁ జూచిన శ్రీరాము లరణ్యమునకు బయలుదేఱునప్పటికి ౨౭ ఇరువదియెనిమిది సంవత్సరము లగును. ఇది సీతాదేవివాక్యముతో విరోధించుచున్నది. ఎట్లనిన సీతాదేవి రావణునితో.

శ్లో॥ మమభర్తా మహాతేజా, వయసా పంచవింశకః
అష్టాదశహి వర్షాణి, మమ జన్మనిగణ్యతే. ఆరణ్య. స.

మహాతేజుఁడైన నాభర్త కప్పటికి నిరువదియైదేండ్లు నాకు నా జన్మమునుండి పదునెనిమిది వర్షములు అని చెప్పెను. ఈ కార్యమును బట్టి వనప్రవేశకాలమున శ్రీరామున కిరువదియైదేండ్లని యేర్పడుచున్నది. మఱియు.

శ్లో॥ దశసప్తచ వర్షాణి, జాతస్య తవ పుత్రక
అసితాని ప్రకాంక్షంత్యా, మయాదుఃఖ పరిక్షయమ్.
అయో.స.శ్లో.

అరణ్యమునకుఁ బోవ సమకట్టి తన్నుఁ జూడవచ్చినరామచంద్రమూర్తితోఁ గౌసల్యచెప్పిన యీ వాక్యమునుబట్టి శ్రీరాముఁ డరణ్యప్రయాణకాలమున కాయనకు పదునేడేండ్లని తెలియవచ్చెడిని. ఈ పరస్పరభిన్నవాక్యములకు సమన్వయ మెట్లు? ఇందేదైన నొకటి సత్యముగా నుండునగాని మూఁడును సత్యములు గాఁజాలవు. కావున నిం దేది సత్యము?

(1) కౌసల్యావాక్యమునకు జన్మప్రభృతి పదునేడేండ్లని యర్థము గ్రహించితిమేని తత్పూర్వము పండ్రెండుసంవత్సరములు సీతారాము లయోధ్యయందుండుటచే వారివివాహము శ్రీరామున కైదవయేఁటనే జరిగియుండవలెను. విశ్వామిత్రునివెంటఁ బోవునప్పటికి నుపనయన మయినట్లు స్పష్టముగ నున్నది. ఐదవయేఁట నుపనయనము శాస్త్రవిరుద్ధము కావునఁ బదునే డనునది జన్మప్రభృతి గా దని ద్విజన్మత్వప్రాప్తిప్రభృతి యనియు శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవునప్పటికి ౮ + ౧౭ = ౨౫ ఏండ్లగుననియు గ్రహింపవలెను. ఇఁక శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవునప్పటికి నిరువదియెనిమిదియేండ్లను వాదము ఊనషోడశవర్షము అను మాటపై నాధారపడియున్నది. ఈ వాక్యమునకుఁ బదునాఱవవర్షము జరగుచున్న దనియే యర్థమందుమేని బాలుఁ డని యకృతాస్త్రుఁడని చెప్పినవాక్యము లసత్యము లగును. ౧౬ వ సంవత్సరము రాఁగానే బాల్యము పోవుచున్నది. అప్పటికి కులవిద్య రాదేని యావల వచ్చు

కపుడు? బాణప్రయోగము పిట్టలఁ గొట్టుటకా? కావునఁ బదునాఱింటికిఁ దక్కువ యని చెప్పినపుడు పదునాఱవవర్షము పుట్టనే లేదని చెప్పవలయునుగాని పదునారవయేఁడు నడచుచున్నదనుట సరిగాదు. పదునాఱవయేఁడు పుట్టినదికాని పూర్తికాలేదని ఊనషోడశశబ్దమున కర్థమందమా, బాలుఁడు-కాకపక్షధరుఁడు అకృతాస్త్రుఁడు - అయుద్ధయోగ్యుఁ డను దశరథునివాక్యములు మిథ్య లగుచున్నవి. విశ్వామిత్రుఁడును బాలుఁ డని కాకపక్షధరుఁడని అకృతాస్త్రుఁ డని యంగీకరించి యట్లున్నను భయములేదని సమాధానము చెప్పెనేకాని నీ వసత్య మాడుచున్నా వనలేదుకదా. అదియును కాక మారీచుఁడు రావణునితో

“చం॥అనవుడుఁగౌశికోక్తులకు నానరపాలకుఁ డిట్లనుం దపోధన పసివాఁడు రాఘవుఁడు ద్వాదశవత్సరుఁ డస్త్రకౌశలంబునఁ గలుగండు” అని చెప్పఁగా విశ్వామిత్రుఁడు బాలుం డయ్యు నాతండు

“చాలుఁ రాక్షసు నొంప” నని విశ్వామిత్రుఁడు బదులిడెనని చెప్పెను. వాల్మీకిశైలియే యొకవిలక్షణమైనది. ఒకవిషయమై యొకచోటసంపూర్ణముగఁ జెప్పఁబడదు. ఒకవిషయమే రెండుమూఁడుసందర్భములఁ జెప్పవలసియుండునేని యక్కడఁ గొంచె మక్కడఁ గొంచెము చెప్పునేకాని పూర్ణముగఁ దొలుతనే పునరుక్తిదోషముఁ గలుగఁ జెప్పఁడు. ఈపై వాక్యము లనువాదములేకాని మారీచుని స్వవాక్యములు కావు. దీని ననుసరించిపూర్వవాక్యము లర్థము చేసికొనవలయును. మారీచుఁడు స్వవాక్యములుగా

“ఆయెడ రాముఁ డేకవసనాంచితుఁడై శిఖియై సరోజపత్రాయతనేత్రుఁడై మెఱయు హాటకమాలికలీల వ్రేలఁగా శ్రీయుతమూర్తియై ముఖము చెల్వము నందము చాఁటుచుండ లేఁబ్రాయము.”

“పొడతెంచు బాలచంద్రునివడువున శోభిల” నని చెప్పెను. పదునాఱేండ్లవాఁడై యుండినఁ బాలచంద్రుఁ డని చెప్పియుండునా? ఈ మారీచువాక్యములఁ బట్టి శ్రీరామున కిప్పటికిఁ బండ్రెండేండ్లనియే యేర్పడుచున్నది. ముఖమున చెల్వము నందము చాటుచుండ లేఁబ్రాయము అనఁగా నజాతవ్యంజనుఁడు మీసకట్టు రానివాఁ డని యర్థము. దీనికిఁ బదునాఱేండ్లవాదు లిట్లు సమాధానము చెప్పెదరు. రావణుని బెదరించుటకై పండ్రెండేండ్లవాఁ డని చెప్పెనేకాని వాస్తవముగా నేండ్లు పండ్రెం డగుటచేఁ గాదు తా నస్త్రముచే దెబ్బతినినను బాలుఁ డకృతాస్త్రుఁ డని చెప్పలేదా యందురు.

మూఁడేండ్లు తక్కువగాఁ జెప్పినంతమాత్రముననే రావణుఁడు భయపడి తన పట్టు వదలువాఁ డని తలంచుటకంటె నసంభావితము మఱొం డుండదు.

కవచముతొడుగనివాఁడు మీసకట్టురానివాఁడు బాలుఁ డని చెప్పిన భయ

పడనివాఁడు పండ్రెండేండ్లని చెప్పినంతమాత్రమున భయపడు నని కాఁబోలు అన్నియు సత్యముచెప్పి యిదియొకటిమాత్రమే యసత్యము చెప్పను. అకృతాస్త్రిఁడనఁగానస్త్రజ్ఞానమే లేనివాఁ డని యర్థముకాదు.ఆపదమున కాయర్థము లేదు. అస్త్రప్రయోగాదులందు నభ్యాసముచే నాఱితేఱిన పండితుఁడు కాఁడని యభిప్రాయము. ముందుదిన మస్త్రముల నుపదేశము నొందెను. మఱుసనాఁడు ప్రయోగింపఁబూనెను. అనుభవమువలనఁగలుగు సామర్థ్య మెక్కడిది? అట్టులుండియు నంతపని చేసె నని భావము. కావున మారీచునిమాటలందుఁ బొరపాటు లేదు.

ఈమారీచునివాక్యమును సీతాదేవి రావణునితోఁ జెప్పిన

కం॥ ప్రతిభటసహితుం డగు నా,పతి కిరువదియేఁడసమలప్రాయం బపు డీ
క్షితిఁ బుట్టువాఁడగాఁ గను, హితగుణ నా కిప్పు డదియు నెనిమిదియేఁడుల్.
ఆ. ౭౬౭

యీవాక్యము బలపఱచుచున్నది. ఎట్లన - విఘ్నమైన పట్టాభిషేకమప్పటికి రామచంద్రమూర్తికి నిరువదియైదేండ్లట. సర్వకామసమృద్ధజనసుఖములఁ బదియు రెండేండ్లు లిక్ష్వాకులయింటను గడిపితి' ననియు రావణుతోఁ జెప్పెను. పండ్రెండవయేఁట వివాహము గాఁగఁ బండ్రెండేండ్లు అయోధ్యయందు భర్తతోనుండెను గావున ౨౫ వయేట వనవాసమునకుఁ బోవుట సిద్ధమే. కావున విశ్వామిత్రునివెంట రాముఁడు పోయినది పండ్రెండవయేఁడనియే యేర్పడుచున్నది.

ఊనషోడశాబ్దుఁడనిన నింకను బాల్యావస్థ తీఱలేదని చెప్పుటకే. బాల్యావస్థ పోయినఁగాని యుద్ధయోగ్యుఁడు గాఁడు. ఇప్పటి వ్యవహారభాషలో వయసు చెప్పక మైనారిటి తీఱలేదని చెప్పినట్లు పదునైదు సంవత్సరములు వెళ్లి పదునాఱవసంవత్సరము వచ్చినఁగాని యుద్ధయోగ్యుఁడు గాఁడు కావున నట్టి వయస్సు రాలేదని చెప్పుటకే ఎదాతండ్రికి నక్షత్రవాఁ డని చెప్పఁబడెను.

'కౌమారం పంచదశభిః యౌవనంతు తతఃపరం.'
'బాలోఽథపంచదశభి స్త్రింశద్భిస్తు కుమారకః.'

'బాల ఆషోడశా ద్వర్షా త్పౌగండ శ్చేతి కీర్త్యతే' యనియు నుండుటచేఁ బదునాఱవయేఁడు వచ్చువఱకు బాలుఁడే యగును.

రామునకు వనవాసకాల మప్పటికి నిరువదియైదేండ్లయినచో నది యుపనయనమాదిగాఁ గౌసల్య చెప్పినట్లు పదునేడవ సంవత్సర మైనచో తొమ్మిదవయేఁటనేకదా యుపనయనమయి యుండవలయును.

అది "గర్భాష్టమేఽబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనం, గర్భాదేకాదశేరాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశ" ఇతి మనుస్మృతివాక్యము. రాజులకు జననమాది పదియవయేట నుపనయన మని యుండఁ బ్రౌఢ్మిదవయేఁట నుపనయన మనుట సరిగా దని యాక్షేపము.

ముఖ్యకాలమైన పదియవయేఁడును మించరా దని దీనిభావమేకాని తొమ్మిదవయేఁటఁ జేయరా దని యిది నిషేధింపదు. ఏలయనఁ దొమ్మిదవయేఁట నుపనయనము చేయవచ్చునని వాక్యములు గలవు.

శ్లో॥ బ్రహ్మవర్చసకామస్య, కార్యం విప్రస్య పంచమే
రాజ్ఞో బలార్థిన షష్ఠే, వైశ్య స్యేహార్థినోఽష్టమే
సప్తమే చాష్టమే వర్షే నవమే దశమే తథా
ఏకాదశే ద్వాదశేచ, హ్యుపనీయు ర్ద్విజాతయః
బ్రహ్మవర్చస మాయుష్యం, తేజోఽన్నాద్యం తథేంద్రియం
పశూంశ్చ కామయానాస్తే, ప్రాప్నువంతియథాక్రమమ్॥ స్మృతిరత్నము.

అని యుండుటచేఁ దొమ్మిదవయేఁట నుపయనము శాస్త్రసమ్మతమే.

శ్రీరామచంద్రమూర్తికిఁ బండ్రెండవయేఁటనే వివాహమైనచో సీత కాఱు సంవత్సరములేకదా, వారు భోగించినటులు బాలకాండమునఁ జెప్పఁబడెనుగదా యిది యెట్లు సాధ్య మని మఱియొక యాక్షేపము.

శ్రీరామచంద్రమూర్తికి నిరువదియైదేండ్లయినప్పుడు సీతాదేవికిఁ బదు నెనిమిది సంవత్సరములు. ఇరువురకు నేడేండ్లు వ్యత్యాసము కలదు. రాముసకుఁ బదునైదేండ్లకు వివాహ మని యంగీకరించినచో సీతకు నెనిమిదేండ్లగు చున్నది. అప్పుడుమాత్ర మెట్లుసాధ్యము ? అదియునుగాక బాలకాండాంత మునఁ గ్రీడించి రని యున్నదికాని సంభోగశృంగారము వర్ణించి యుండలేదు. ఇందుఁ జెప్పఁబడిన యుపమానము "విభుండు విష్ణు వారాజసహోదరిం గలసి రాగమునఁ విలసించుచాడ్పునఁ" అననది సంభోగము సూచింపదు. ప్రాకృత దంపతులవలె సంభోగించినట్లు, తేజస్ఖలనమైనట్లు, కుమారుఁ డుద్భవించినట్టు లప్రాకృతవిగ్రహులైన లక్ష్మీనారాయణులవిషయమై యేగ్రంథము చెప్పదు. బ్రహ్మయు మన్మథుఁడు సంకల్పసంభూతులేకాని రేతస్సంభూతులు గారు. సీతారాములు పండ్రెండుసంవత్సరములు సంభోగించి యుండిన గర్భ మేల రాదయ్యె? పట్టాభిషేకమైన పిమ్మట రెండేండ్లలోనే గర్భము వచ్చెనుగదా. కావున బాలకాండాంతమునఁ జెప్పఁబడిన శృంగారవర్ణన మాంతరసంభోగమును సూచిం పదు. అట్లైనచో వివాహకాలమునకు సీతాదేవి "పతిసంయోగసులభ" యని సీతాదేవియే చెప్పెనుగదా. (చూ- అయోధ్య. ౧౧౮-౩౪) యనదు రేమో-

సత్యమే. పతిసంభోగసులభ యని చెప్పలేదు. పతిసంయోగసులభ యనఁగా వివాహమునకు యోగ్యురా లని యభిప్రాయము. పెండ్లిండ్లు వచ్చినది కావున జనకుఁడు పెండ్లిప్రయత్నము చేసె నని భావము.

సాధారణవివాహములందే యేఁడాదిరెండేండ్లు వివాహవిషయమై యాలోచనలు జరుగుచుండఁగా మహారాజులు తగినసంబంధములు నెంతకాలము వెదకవలయునో పూర్వవ్యాఖ్యాతలు సౌకుమార్యాతిశయముచేతను బుద్ధిశక్తిత్వముచేతను బండ్రెండేండ్ల రామునకు నాఱేండ్లసీతకు సంభోగము 'సంభవత్యేవ' యని యంగీకరించిరి. 'వయసా పంచవింశః' అను వాక్యమునందు 'ఇవ' శబ్దము లేకుండుటచే యోగ్యుఁడు కాఁడు- గావున నిపుడు రాముఁడు యువకుఁడు కాఁడు - కావున నిపుడు నేను యువతినై యుంటి నని సీతాభిప్రాయమనియు నిది శ్రీరాముని నిత్యయౌవనత్వమును సూచించుచున్నదనియుఁ గొందఱందురు. అట్లు చెప్పఁగా - మీసకట్టులేనివానికి పెండ్లి వయసులో మీసములు పుట్టనేలేదని యర్థము కాదు. కొంతేముగా నున్నవని యర్థ మందురు. ఇదంతయుఁ గ్లిష్టకల్పన మని వేఱుగఁ జెప్పఁబనిలేదు. శ్రీరాముఁడు నిత్యయౌవనుఁ డయ్యేనేని తల్లికడుపులోనుండి వచ్చినప్పుడు యువకుఁడై యే వచ్చెనా? అవతారాంతములు నిత్యయౌవన లేని

గీ॥ లేదు వగపు కాంత లేదువ్వచనాని, లేదు వగపు ప్రచ్ఛిలింపఁ
కంబు తనేత్రకరుగుచున్నదికదా, వయసటంచు నా నగునువాఁడు.
(యుద్ధ ౧౦౯ స.)

అని రాముఁ డేల యేగెను?

శ్రీరాముఁడుమాత్రమే నిత్యయౌవనుఁడు సీత నిత్యయువతికాకుండు రేమో వాస్తవమున వారు నిత్యయౌవనులైనను మాయామానుషవేషములు ధరించి యన్నివిధముల మనుష్యులవలె నటించినవారి విషయమునవారిమాత్రము దేవతలవలె నటింతురా? కావున మానుషభావమునే ప్రశంసింపఁదగినది శ్రీరామచంద్రమూర్తి కాకపక్షధరుఁడు = జునుపాలుగలవాఁ డని చెప్పఁబడెనుగదా కొంచెముగానైన మీసములుగలవాఁడు జునుపాలుండకపోవునా?

మోసగాఁడని యెఱుఁగక బ్రాహ్మణుఁడని సన్న్యాసి యని తలఁచి సత్యము చెప్పకుండిన శపించునోయని భయపడి రావణునితో సీతాదేవి సత్యమే జెప్పెను. వనవాసగమనమునప్పటికి శ్రీరామున కిరువదియైదేండ్లనియు - విశ్వామిత్రుని వెంటఁ బోవునప్పటికిఁ బండ్రెండేండ్లనియు వాస్తవార్థము గ్రహింపవలయును.

పండ్రెండవనెలయందు శ్రీరామజననము.

పండ్రెండవయేఁట విశ్వామిత్రానుగమనము.

పండ్రెండేండ్లు అయోధ్యావాసము.

పంన్రెండేండ్లు వనసంచారము (ఇంచుమించు రెండేండ్లు పంచవటీవాసము.
పంన్రెండేండ్లు సీత వాల్మీకాశ్రమమం దుండుట.

ఈచిత్ర మేమో తత్త్వవేత్తలకే యెఱుక- పామరప్రత్యుత్తరము యాదృచ్ఛికము.

శ్రీసీతారాము లయోధ్యయం దున్న బాల్యావస్థను భవభూతి యుత్తర రామచరిత్రమునం దేమిగ వర్ణించెనో చూడుఁడు.

శ్లో॥ పతన విరళప్రాంతోన్మీలన్మనోహరకున్తలై
ర్దశనకుసుమై ర్ముగ్ధాలోకం శిశు ర్దధతీముఖమ్
లలితలలితై ర్జ్యోత్స్నాప్రాయై రకృత్రిమవిభ్రమై
రకృతమధురై రంబానాం మే కుతూహల మంగకైః. ౨౦

ఇందు పాలపండ్లు రాలిపోయి మరల మొలచు లేతదంతములుగలశిశువుగా సీత వర్ణింపఁబడెను బాలిక యవ్యక్తాకారను తెల్పెనుగా?

ఊనషోడశాబ్దుఁ డనుమాటకుఁ గొంత అర్థము చెప్పెదరు. ఐదునా అను సంఖ్యగణించి వాల్మీకిప్రశ్న పద్యమందే వ్రాయఁబడెను. అందు "చారుషోడశకలాసహితుఁడు" అను భాగవతవాక్య ముదాహరింపఁబడెను. పదునాఱుకళలు పూర్తియైనఁగాని దుష్టశిక్షణాత్మకమైన యవతారప్రయోజనము సాధింప సాధ్యపడదు. లోకవిడంబనార్థమై యవి పూర్తిచేసికొనవలసియున్నది. అస్త్రసంప్రాప్తి లేదు. ఈ యవతారమునకు మూలకారణభూత సీతయు నింకను జేరలేదు. సీత యెవనిదో వానితోఁ వైరమేమి మనకిదా మారీచుఁడు చెప్పెను. శ్రీరాముఁడు పరమదయాళువు - శుద్ధసాత్త్వికమూర్తి. రక్షించుట యాయన కార్యమేకాని శిక్షించుట యాయన కార్యము గాదు. తమశ్శక్తి యున్నగాని సంహారకార్యము జరుగదు. అది శివశక్తి. దానిని గొంత గ్రహింపవలసి యున్నది. రాక్షసులనందఱఁ జంపుటకుఁ గ్రోధము తెచ్చుకొనెను అనికదా వాల్మీకి చెప్పెను. కేవలము దానినే స్వీకరించిన మిగులఁ గ్రూరుఁ డగును. కావున దయాగుణము కావలయును. దయాస్వరూపిణి సీత. ఆమెను స్వీకరింపవలసి యున్నది. ఇన్నిలోపము లుండఁగా నిప్పుడే శ్రీరాముని రాక్షససంహారమునకై పంపుమనెదవే. ఇది సరిగాదని యూనషోడశ మనుట కర్థ మందురు.

ఓయీ! సీతాసాంగత్యము లేకుండిన రాక్షసవధ యసాధ్యమేని తాటకను మారీచసుబాహువుల నెట్లు వధించెను? సీత యొద్దలేకున్న రామచంద్రమూర్తి కదల మెదల నేరఁ డని యర్థము కాదు. విశ్వామిత్రుఁ డుపదేశించిన బలాతిబలావిద్యలబలమున స్వశక్తిచేఁ దాటకను సంహరించెను. ఆవల నస్త్రము లుపదేశింపఁ బడుటచే వానిచే మారీచ సుబాహుల వధించెను.

పరశురామునిచేతివిల్లు లాగుకొనుటలో నాయన వైష్ణవతేజస్సును లాగుకొనినట్లు శివునివిల్లు విఱిచి యందలి శివశక్తిని గ్రహించెను. ఆవల సీతాదేవిని వివాహమయ్యెను. రావణవధ కామె సాహాయ్యము కావలయును.

సీతవేఱు రాముఁడు వేఱు అని పాఠకులు భ్రమింపరాదు. భగవంతుని సంకల్పరూపక=క్రియాశక్తి కధిష్ఠానదేవతయే లక్ష్మి. కేవలకరుణామయి. భగవంతుఁడు పురుషవ్యక్తి కావునఁ గోపమున "న క్షమామి" నేనీ పాపాత్ముల క్షమింపను. "క్షిపామ్యజస్రం" శాశ్వతముగా నధోగతులపాలుచేయుదు నని చెప్పినను ఆమె సమీపమునుండెనా వెంటనేయడ్డపడి రక్షించుట మనపని కాని శిక్షించుట మనపని కాదు అని బోధించి దయపుట్టఁజేసి రక్షింపఁజేయును. ఆ వాల్లభ్యశక్తి యామెయందుఁ గలదు.

తాత్పర్యము.

అయ్యా! విశ్వామిత్రమహామునీ! నీవు విశ్వమునకంతయు మిత్రుఁడవు - కావునఁ గదా విశ్వామిత్రుఁడని పేరు పొందితివి. అట్టి నీవు నాపిల్లమాత్రమునకు మిత్రుఁడవు కానేల? మా రాముఁ డింకను బాలుఁడు; ఆటలయందే వినోదించువాఁడు- పదునాఱుసంవత్సరములకు లోపడినవయస్సుగలవాఁడు-కావున యుద్ధయోగ్యుఁడు కాఁడు - ఇట్టి కమలనేత్రుఁడు సూర్యాస్తమయము కాఁగానే కమలములు ముకుళించునట్లు నిద్రచేఁ గన్నులు మోడ్చువాఁడు రాత్రిసంచరించుచు రాత్రులం దెక్కువబలము గలవారగు రాక్షసులతో నెట్లు యుద్ధము చేయఁగలఁడు?

సీ॥ కలదు నాకక్షయ • క్షౌహిణీసేన పూర్ణంబుగ దానిఁ దోడ్కొంబ తోడు
కొనుము నే వచ్చెదఁ • గ్రూరశస్త్రాస్త్రకోవిదులు నాభృత్యులు • ధీవరులు
దైత్యులతోఁ బో యుద్ధంబు సలుపంగ, శక్తిమంతులు మఱి • సాహసికులు
నే ధనుష్పాణినై • నిఖిలయోధులతోడఁ, గాచెద యజ్ఞంబుఁ • గడిమి మెఱసి
తే॥ ప్రాణములు మేనిఁ బాయునం • తవఱకును, రాక్షసులతోడఁ బోరుచుఁ • బ్రాసమేది
సవనరక్షణము నేను • సలుపువాఁడ, నమ్ము నామాట యోమునినాథచంద్ర!
౫౭౨

నేను గోరిన దిచ్చెద నంటివి. నాకార్యము నెఱవేర్చెద నంటివి. ఇప్పు డిట్లు చెప్పుచున్నాఁడవు. యజ్ఞముపూర్తికాఁగా ననెదవా యని యడుగు నని దశరథుఁడు సమాధానము చెప్పుచున్నాఁడు. అక్షౌహిణీసేన = అక్షౌహిణి యను సంఖ్యగలసేన - దీనిపరిమాణ మిట్లు భారతమునఁ జెప్పఁబడినది.

సీ॥ వరరథ మొక్కండు వారణ మొక్కండు, తురగముల్ మూఁడు కాల్బంటులు నేవు
రను సంఖ్యగలయది యగుఁ బంక్తి యది త్రిగుణంబైన సేనాముఖంబు దీని

త్రిగుణంబు గుల్మంబు ముమ్మడు గగు, గణము తద్గణము త్రిగుణితమైన
వాహినియగు దానివడిమూఁటగుణియింపఁ, బృతనాఁబరఁగుఁదత్పృతనమూఁట

గీ॥ గుణితమైనఁ జమువగుఁ జమూతిదానిము, మ్మడుఁ గనీకినీ సమాఖ్య నొసరు
నదియుఁ బదిమడుంగులైన నక్షౌహిణి, యా నిరంతర ప్రమాణసంఖ్య.

భార. ఆది. ౧౦ ప.

దీని ప్రకారమునఁగాడ ౨౧,౮౭౦ ఏనుగులు-ఇన్ని రథములు - ౬౫,౬౧౦ గుఱ్ఱములు-౧,౦౯,౩౫౦ కాల్బలముగల సేన యక్షౌహిణి యనఁబడును. అక్షౌహిణీ= అక్షౌహిణి, పూర్ణంబుగ = కొఱఁతలేక; తూర్ణంబు = శీఘ్రముగానే, క్రూరశస్త్రాస్త్రకోవిదులు=కఠినమైన శస్త్రముల ప్రయోగమందు - నస్త్రప్రయోగమందుఁ బండితులు, శక్తిమంతులు = శక్తిగలవారు, ధనుష్పాణినై = వింటిని జేతియందు ధరించినవాఁడనై, త్రాసమేది = భయములేక, సవనము = యజ్ఞము.

తా త్ప ర్య ము.

ఓవిశ్వామిత్రమునీంద్రా! యజ్ఞరక్షణముగదా నీకుఁ బ్రయోజనము - దానిని నేను నెఱవేర్పఁగలను - నాకుఁ బూర్ణముగ నొకయక్షౌహిణిసేన గలదు. ఇంత సేనను దీసికొని యిదిగో నీవెంటనే వచ్చెదను - నాభటులు శస్త్రవిద్యయందు నస్త్రవిద్యయందు మిగుల సమర్థులు, వీరులు కావున రాక్షసులతో యుద్ధముచేయుటయందు శక్తిగలవారు - మిగుల సాహసముగలవారు. సేనను బంపుటయే కాదు. నేను కోదండధరుండనై యుద్ధభటులతోడ వచ్చి నీయాగమును నా దేహమందుఁ బ్రాణము లుండువఱకు రాక్షసులతో యుద్ధముచేసి రక్షించెదను. మునీశ్వరా! నామాట నమ్ముము.

క॥ బాలుని నవిదితవరశర,జాలు బలాబలవిమూఢు ♦ సమరము నేర్పుల్
చాలని క్షీరకపోలు సు,శీలునిఁ గొనిపోవ నీకుఁ ♦ జెల్లునె చెప్పుమా. ౫౭౩

బాలునిన్ = యుద్ధయోగ్యమైన వయస్సురాని పసివానిని. అవిదితవరశరజాలునిన్ = శ్రేష్ఠమైన బాణసమూహములు ప్రయోగింపఁ దెలియనివానిని; బలాబలవిమూఢున్ = శత్రువుల బలాబలములు దెలియనివానిని; సమరము నేర్పుల్ = యుద్ధముజేయుటయందలి చమత్కారములు; క్షీరకపోలున్ = పాల బుగ్గలుగలవానిని. సుశీలునిన్=మంచినడవడిగలవానిని, దుష్టులతో నెట్లుమెలఁగవలయునో తెలియనివాని యని భావము. ఇది పుత్ర స్నేహముచేఁ జెప్పినమాటయే గాని వాస్తవము గాదు. ఇంతటియనడల నేల విశ్వామిత్రుఁ డడుగవచ్చును? ౫౩౭ వ పద్యమందు శూరుల నని చెప్పఁబడెను.

తాత్పర్యము.

మునీంద్రా! నీవు కోరినకార్యము ముక్కాఁకలఁ దీరిన యింక నేసతో రణమున గడిదేఱిన నేను వచ్చిసాధించుటయే కష్టమని తోఁచుచుండగా యుద్ధయోగ్యుఁడు కాని పసికూనను, విలువిద్య చక్కఁగాఁ దెలియనివానిని, ఎవఁడు బలవంతుఁడో, యెవఁడు బలహీనుఁడో - బలహీనులతో నెట్లు పోవలయునో, బలవంతునితో నెట్లు రణము సేయవలయునో తాఁకుదప్పులు తెలియనివానిని యుద్ధనైపుణిలేని పాలబుగ్గలు గలవానిని మంచివారితో మెలఁగఁగలవాఁడేకాని దుష్టులసడ వడులుగాని వారితో మెలఁగువిధముగాని తెలియనివానిని నీవు రాక్షసుల తోడ యుద్ధముసేయఁ దీసికొని పోవుట న్యాయ్యమా?

క॥ క్రించులనర్ దృఢపరిచిత, వంచనలన్ మనుజభుజుల • వధియింపఁగ తేఁ
జుంచుం గలబాలుఁడు వాఁ, డంచితగతి నెట్లు శక్తుఁ • డగును మహాత్మా! ౫౭౪

క్రించులనర్ = నీచులను, ఒకానొకచో గ్రుతంబు ద్రుతంబుగానగు, 'ఉ॥ లాడియునంగాక, గవంబునంబోలె.' దృఢపరిచితవంచనలన్ = చక్కఁగ నభ్యసించిన మోసముగలవారిని, మనుజభుజుల = రాక్షసుల, = వధియింపఁ గన్ = చంపుటకు, తేఁజుంచున్ = లేఁత పిల్లకూఁకుటులు.

"క॥ చించి దవ్వుఁ బాలుద్రావు ము, గంచితముగ ననుదుఁ బాలుద్రావి వనితోఁ
జించొంటవనవన లీలాచుంచున్నై యతఁడు మంచుఁజూ నరేంద్రా!"
భాగ. ౧౦ స్కం.

లీలాచుంచుండు = క్రీడయందు నేర్పరి.
మహాత్మా = గొప్పమనస్సుగలవాఁడా!

తాత్పర్యము.

కుశికనందనా! కులముచేతను గుణముచేతను నీచులు - ఉగ్గుపాలతోడ వంచనము నేర్చినవారు - మనుష్యులను దినువారు నగు రాక్షసులను వధియించుటకు గొప్పకులమునఁబుట్టి గొప్పగుణములుగలవాఁడై వంచన మన నెట్టిదో యెఱుఁగకయుండు మనుష్యుఁడు నందుఁ బిల్లజుట్టుకూడఁ దీయని పసిబాలుఁడు సమర్థుఁ డగు - నని గొప్పమనస్సుగలవాఁడవు ఆలోచనపరుఁడవు ఎట్లు తలంచితివయ్యా!

తే॥*పండుకొనలేఁడు తోడు నొక్కండు లేక, చీఁకటిని నొంటననుమన్నఁ • జికిలుఁజికిలు
పట్టినాపట్టి యడవుల • గుట్టలందు, నెట్టులు చరించు, నాకడు • పెట్టలోర్చు. ౫౭౫

చికిలుఁ జికిలున్ = చనవుచే రానియేడ్పుతోఁ గన్నులు నలుముకొనుచు - సన్నగొంతుతో మిక్కిలి నేడ్చును. భృశార్థకమున ద్విరుక్తి. పట్టి = కొడుకు, గుట్టలందున్ = పర్వతములందు. విషమాలంకారము.

తాత్పర్యము.

అయ్యా, మునీశ్వరా! మా రాముఁడు రాత్రి వేళఁ బ్రక్కన మఱియొకరు (తల్లి తోడు) లేక పండుకొనుటకు భయపడును. చీఁకటిలో నొంటిగాఁ బొమ్మంటిమా నాలి యేడ్పు లేడ్చును. ఇటువంటి నాకొడుకు కాఱడవులందు గుట్టలందు మిట్టలందు నెట్లు నీవెంట నడువఁగలఁడు? ఒకవేళ వాఁడు మనమాట మీఱలేక నడచినను నాకడుపెట్లులయ్యా సహించును? భగ్గుమనదా? ప్రాణములు నిలుచునా? నాకు వాఁడు ప్రాణము. వాఁడు కష్టపడుట యన నా ప్రాణము కష్టపడుటయేకదా.

తే॥ *పండుకొనఁ దల్లి కేలిడి • దిండుగాఁగ, మీఁద నొండొక చెయిపైచి • మేలికథలు
చెప్ప నూఁకొట్టుచును గను • తెప్పమూయు, కూన ముండ్లను రాలను • గూర్కు నెట్లు? ౨౭౬

కేలిడి = చేయియుంచి, కూన = లేఁత శిశువు

తాత్పర్యము.

రాత్రులందుఁ దల్లి ముందుగాఁ బండుకొని తనచేయి దిండుగాఁ బెట్టఁగా నందు శిరస్సుంచి తనమీఁదఁ దల్లి రెండవచేయివైచి కథలుచెప్పుచుండఁగా నూఁకొట్టుచుఁ గొట్టుచు నట్టులే నిద్రపోవు బాలుఁడు ముండ్లలో రాలలోఁ గటికినేలపై నెట్లయ్యా పండుకొనును?

తే॥ *గిల్లినను బాలు బుగ్గలఁ • జిల్లుమనును, తీరన్ నుచ్చియు నాఱని • తీఁగచాటు
పిందెయతఁ డేడ నడవులఁ • గందమూలములను దిని వారితోఁ బోరు • సలుపు టేడ. ౨౭౭

తీరన్ = పూర్ణముగా, ఉచ్చి = బ్రహ్మరంధ్రము - మాడుపట్టు, ఆఱని = తడిదీయని, తీఁగచాటుపిందె = స్వతంత్రముగా బయటరాలేక పరులరక్షణములో నుండువాఁడు. చిల్లుమనును = ధ్వన్యనుకరణమందు ముగాగమము.

తాత్పర్యము.

అయ్యా, చెక్కుగిల్లినఁ బాలు చిల్లుమని గాఱుచున్నదే- అంతలేఁబ్రాయమే- ఇంకను బూర్ణముగ నచ్చియు నాఱలేదే - ఒకరిచాటున నుండవలసినవాఁడే- వీఁడేమి? యడవులలోఁ గందమూలములు దిని రాక్షసులతో యుద్ధము సేయుటేమి? ఇది యెట్ట యసంభావితకార్యమో యాలోచింపవైతివిగదా.

కం॥ రాముని నెడఁబాసియు నే, నీమహి జీవింపఁగలనె • తృటియేఁకడైనన్
రామునిఁ గొనిపోవకుమీ, యోమునివర! నీదుచరణ • యుగము భజింతున్. ౨౭౮

తృటిన్ = అల్పకాలమైనను, నీదు = నీయొక్క, షష్ఠ్యర్థమును నేకవచనము నందు వచ్చును. నాదు - నీదు.

తాత్పర్యము.

అయ్యా, శ్రీరామచంద్రమూర్తి యనంగా నాప్రాణమే వానికి నాకు నెడఁబాపితివేని నాప్రాణ మీదేహమున నిలుచునా? వానివెంట పోయి విడిచి పోవునేకాని. కావున మునీశ్వరా! నన్నుఁ జంప నీకు నిష్టములేదేని మారాముని దీసికొని పోకుము. నీచరణసేవ చేసెదను.

కం॥ రాముని దప్పకతోడ్కొని,పో మదిలోఁ దలఁతు వేని ♦ పురుతరసేనా
స్తోమముతో నాతనిబడి, నోమునినాథ నేను వత్తు ♦ నోసంగును యజ్ఞన్. ౫౮౯

పురుతరసేనాస్తోమము = మిక్కిలి గొప్పదగు సేనలసమూహము.

తాత్పర్యము.

మునీంద్రా! నేను గోరినది రామచంద్రమూర్తినిఁ బంపుమని - ఎముకకనీన యజ్ఞరక్షణమునకని కారణము చెప్పితిని నాయజ్ఞమును నీవు రక్షించుమని నేను గోరలేదు అనెడివా—యుక్తమైన బలవంతముగ శ్రీరామునే తీసికొనిపొమ్ము. వానివెంబడి నపారసేనతో నేను వచ్చెదను. వలెనన నాకన్న నిమ్ము.

కం॥ పోడమిన దాదిగ నేనులు, నడచెను నార్పదులవేలు ♦ నా కతిదుఃఖం
పడి కొడుకును శ్రీరాముని, బడసితి మమ్మెడలఁ బాపఁ ♦ బాడిగాదు నీకున్. ౫౯౦

అర్పదులవేలు = అఱువదివేలు, దుఃఖంపడి= వ్రతములు తపస్సులు మొదలగువానిచే మిగుల శ్రమించి.

తాత్పర్యము.

గాధేయా! నా కిప్పటికి అఱువదివేలేండ్లు బిడ్డలు లేక లేక వ్రతములు తపములు దానములు చేసి చేసి తుదకెట్లుటో శ్రీరామునిఁ గంటిని. అట్టె మమ్ము నా యీవయస్సున వేఱుసేయ నీకు ధర్మమా?

కం॥ నలువురు పుత్రులు నాకుం, గల రైనం బద్దినాయుఁడు ♦ కడుధర్మపరుం
డలరామచంద్రమీఁడనె, నిలుపుదుఁ బ్రాణంబుఁ బంప ♦ నేర్తునె వానిన్?
౫౯౧

అర్థము - సుగమము.

తాత్పర్యము.

నీకు నలువురు కొడుకులుగదా - నే నడిగిన యొక శ్రీరామునినే లెక్క చెప్పెద వేమి యందువేమో - నలువురు కొడుకు లున్నను జ్యేష్ఠపుత్రుఁడే కదా నిజమైన

పుత్త్రుఁడు - అందు వాఁడు మిగులధర్మాత్ముఁడు - కావున నాప్రాణములు వానియందే యున్నవి - అట్టివాని నెట్లు పంపుదును? పంపితినా యెట్లు జీవింపఁగలను?

—* { దశరథుఁడు విశ్వామిత్రుని యజ్ఞవిఘ్నకరు లగు రాక్షసులవృత్తాంత మడుగుట } *—

ఉ॥ ఎవ్వనిపుత్త్రు లాయసురు? లెవ్వనిపంపున వచ్చువారు? వా
రెవ్విధిఁ బోరువారు? బల మెంత? ప్రమాణము లెంత? వారిసే
నెవ్వియొ? నాయకుం డెవఁడొ? యేగతి మా కొసరింపఁగాఁ దగున్
జివ్వను రాము డైన మఱి సేనలతోఁ జని నేను నేమియన్? గీ౨

అసురులు = రాక్షసులు - అసూన్ = ప్రాణాన్, రాంతి = గృహ్ణంతి - ప్రాణములఁగొనువారు, పంపునన్ = ఆజ్ఞప్రకారము, ఎవ్విధిన్ = ఏవిధముగా, చివ్వన్ = యుద్ధమందు.

తాత్పర్యము.

నీయజ్ఞముఁ జెఱుపనున్న రాక్షసు లెవ్వరు? వా రెవ్వరికొడుకులు? ఎవరి యాజ్ఞచొప్పున వచ్చెదరు? వారు యుద్ధముచేయువిధ మెట్టిది? అస్త్రములతోనా - శస్త్రములతోనా - ముఖాముఖి యెదురుగానుండియా - చాటుననుండియా - వారి కేమాత్రము బలము - వారిప్రమాణము లెంత? వారినామము లెవ్వి? వారికిఁ బ్రభు వెవ్వఁడు? శ్రీరాముఁ డైనను సేనలతో వచ్చి నేనైనను వారు చేయుక్రియకుఁ బ్రతిక్రియ యెట్లు చేయవలెను? తెలుపఁగోరెదను.

కం॥ అన విని దశరథుఁ గనుఁగొని, మునివరుఁ డి ట్లనియె రాజముఖ్యా! వినవే
ధనదుని తమ్ముఁ బులస్త్యుని, మునుమని విశ్రవసు సుతుని మహి రావణునిన్. గీ౩

ధనదునితమ్మున్ = కుబేరునితోడఁ బుట్టినవానిని, వినవే = వినలేదా.

తాత్పర్యము.

అనిన విశ్వామిత్రుఁడు దశరథునితో నిట్లనియె. రాజేంద్రా! నీవు కుబేరుని తమ్ముఁడు పులస్త్యునిమనుమఁడు విశ్రవసునికొడుకు నగు రావణుని పేరు విన్నాఁడవుకదా. (రావణునియూరు-అదియుండు దిక్కు చెప్పలేదు.)

కం॥ లోకేశదత్తవరుఁ డస్తోకబలపరాక్రముండు దోషాచరసే
నాకాండపరివృతుండై, లోకంబుల నెల్ల నతఁడు లొగ్గడి పెట్టున్. గీ౪

లోకేశదత్తవరుఁడు = బ్రహ్మచే నీయఁబడిన వరములుగలవాఁడు; అస్తోకబలపరాక్రముండు = అధికబలము, పరాక్రమము గలవాఁడు; దోషాచరసేనా

కాండపరివృతుండై = రాక్షససేనాసమూహముచేఁ జుట్టఁబడినవాఁడై, లొగ్గడి = కలవరపాటు - క్షోభము.

తాత్పర్యము.

ఆ రావణుఁడు బ్రహ్మచే వరములనొందినవాఁడు - మిక్కిలిబలము పరాక్రమము గలవాఁడు-రాక్షససేనాసమూహములచేఁ జుట్టఁబడినవాఁడై మూఁడులోకములను గలగుండు పెట్టుచు మొఱ్ఱో యనిపించుచున్నాఁడు.

ఉ॥ ఆతఁడు దానగా సరిగి ♦ యజ్ఞవిఘాతము సేయఁ డైన దు
ర్నీతిపరుండు గానఁ దన ♦ నెయ్యుర భృత్యులఁ బంపు దానికై;
యాతనియాజ్ఞ మేరగ సు ♦ హాబలు లిద్దఱు తాటకాత్మసం
జాతులు వచ్చి యధ్వరము ♦ సాగసహింప రొకింతయేనియున్.   ౧౮౧

తానగా = స్వయముగా, యజ్ఞవిఘాతము = యజ్ఞమునకు విఘ్నము, నెయ్యుర = స్నేహితులను - స్నేహశబ్దభవము నెయ్యము. తాటకా + ఆత్మసంజాతులు = తాటకాపుత్రులు, అధ్వరము = యాగము, ఒకయింతయు = కొంచెమైనను, సాగక = జరుగుటకు, సహింపరు = ఓర్వరు.

తాత్పర్యము.

వాఁడు ప్రభువుగావునను నల్పకార్యములను లక్ష్యముచేయక స్వయముగా యజ్ఞములఁ జెఱుపరాఁడు. అట్టికార్యములకు వానిమిత్రులను సేవకులను బంపుచుండును. వానియాజ్ఞచొప్పున బలవంతులిరువురురాక్షసులు తాటకకొడుకులు వచ్చి యజ్ఞము సాగనియక విఘ్నముచేయుదురు.

—— ✱ దశరథుఁడు శ్రీరాములను బంప నిరాకరించుట ✱ ——

చం॥ అని వచియింపఁగా విని ధ ♦ రాధిపుఁ డెంతయు భీతచిత్తుఁడై
యనఘ! వశంబె నా కయిన ♦ నాదురితాత్ముని మ్రోల సంగరా
వని నిలునంగ, నాపయిఁ గృ ♦ పాగరిమంబును జూపవయ్య, నా
తనయుని మన్పవయ్య, మఱి ♦ దైవము నీవ కదయ్య నా కటన్.   ౧౮౬

ధరాధిపుఁడు = దశరథరాజు, భీతచిత్తుఁడై = భయపడిన మనస్సుగలవాఁడై అనఘ = పాపరహితుఁడా, దురితాత్మునిమ్రోలన్ = పాపాత్మునియెదుట, సంగర + అవనిన్ = యుద్ధభూమియందు, కృపాగరిమంబును = దయయొక్క గొప్పతనమును; మన్పవయ్య = బ్రతికింపవయ్య - మను ధాతువు + అయ్య - మనపవయ్య - ప్రార్థనార్థకము.

తాత్పర్యము.

అని యిట్లు విశ్వామిత్రుఁడు చెప్పఁగా రావణుఁడని తాటకాపుత్రులని విన్నమాత్రముననే దశరథమహారాజు భయపడినవాఁడై విశ్వామిత్రా! నీ వెంతో పాపరహితుఁడవై కన్నులు తెలియని కసుగందును నోరెఱుఁగని బాలుని రాక్షసులవాతఁ ద్రోయునట్టి యాలోచన యేల చేసితివయ్యా? రాముని మాట యటుండనిమ్ము. ఆపాపాత్ములయెదుట నిలువఁబడుటకైన నాయట్టివానికైన శక్యమా? కావున నాపై మిక్కిలి దయ తలంపుము. నాకుమారుని యూపిరితో నుండనిమ్ము. అయ్యా, నాకిప్పుడు నీవే దైవము. ఆనాఁడు బిడ్డలనిచ్చినవాఁడు దైవము కాఁడు. ఇప్పుడు నీవు వారిని బ్రతుకనిచ్చితివేని నీవే బిడ్డలనిచ్చిన దైవముగ భావింతును.

కం॥ నాపాలిగురువ వంచును, నీపాలం బడినవాఁడ ♦ నిర్భాగ్యుఁడ నా
కీపుత్రభిక్ష నిమ్మా, యాపాపనిఁ బంపఁ జాల ♦ నయ్యా మునీంద్రా! ॥౨౧

గురువు=ఇచ్చటఁ దల్లియుదండ్రియునసియర్థము. పురుషులకుఁ దల్లిదండ్రులు, జ్యేష్ఠభ్రాత, ఆచార్యుఁడు గురువులు, స్త్రీలకు భర్త, తల్లిదండ్రులు, మామ, ఆచార్యుఁడు గురువులు. నిర్భాగ్యుఁడన్ = అదృష్టహీనుఁడను, పాపనిన్ = పసి పిల్లవానిని.

తాత్పర్యము.

మునీంద్రా! నీవే తండ్రివని రక్షింపుమని నీపాలఁబడితిని. - పుత్రునకుఁ బుత్రశోకము కలిగించుట తండ్రికి న్యాయ్యము గాదు. నీకెంతటి నిర్భాగ్యుఁడనో కాకున్న పండ్రెండ్లు కొడుకో కొడుకో యని కలవరించి కన్నీరు ధారవోసి తుద కెంతో ప్రయాసమున లభించినకొడుకు కన్నులు తెఱచి తెలవకముందే రాక్షసుల వాతఁ బెట్టుదునా దృష్టము కలుగునా? యాచించుట నాకులవృత్తిగాదు, క్షత్రియ ధర్మముగాదు - కాకున్నను వ్రతము వీడిన సుఖముదక్క వలయు నన్న సామెత ప్రకారము పుత్రుని భిక్షగా నిమ్మని ప్రార్థించెదను, ఈబాలుని నేను బంపఁజాలను క్షమింపుము.

కం॥ సురకిన్నరయక్షులు కింపురుషులు గంధర్వులైనఁ ♦ బోరఁగ లేరే
దురమున రావణుతోడను, దరమే మనుజులకు వానిఁ దాఁకి సహింపన్. ॥౨౨

దురమునన్ = యుద్ధమందు, తరమే = సాధ్యమా, కిన్నరులు - గుఱ్ఱము మొగము గలవారు.

తాత్పర్యము.

దేవజాతులైన దేవతలు - కిన్నరులు - యక్షులు - కింపురుషులు - గంధర్వు

లైనను రావణునితో యుద్ధముసేయలేరే, ఇఁక వానిదాడిని యోర్వ మనుష్యులకు శక్యమా?

సీ॥ ఆతండు వీరద♦ర్పాపహుం డగుటను, నబలుండ సబలుండ♦ నయ్యెఁగాని
కొమరులతోడుతఁ ♦ గూడి యైనను గాని, యెదిరింపఁజాల నా♦యింద్రవైరి
సుందోపసుందుల♦సుతులు సామాన్యులే, యంతకప్రతిము ల♦త్యంతబలులు
కలనిలో వారు ము♦క్కాఁకలఁ దీరిన, వారు నాకొమరుండు ♦ బాలుఁడగుట
తే॥ నకృతహస్తుండు నాట నే♦ నంపఁజాల, వారిలో నొక్కరునితోడఁ ♦ బౌరుషమున
సఖులతోఁగూడి సమరంబు♦సలుపువాఁడఁ, గాక యనుచును స్నేహప♦ర్యాకులోక్తి.
౫౮౯

వీరదర్పాపహుండు = వీరుల గర్వమును బోఁగొట్టువాఁడు, సబలుండు = సేనతోఁ గూడినవాఁడు, అబలుండు = సేనలేనివాఁడు, ఇంద్రవైరి = ఇంద్రునకు విరోధి-రావణుఁడు, సుందోపసుందులసుతులు=మారీచ సుబాహువులు-సుందోపసుందు లన్నదమ్ములు - సుందునికిఁ దాటకయందు జన్మించినవాఁడు మారీచుఁడు, ఉపసుందునికుమారుఁడు సుబాహువు, అంతకప్రతిములు = యమునితో సమానులు, కలనిలోన = యుద్ధమందు, ముక్కాఁకలు = మూఁడు కాఁకలు-ఇక్కడ కాఁక యనఁగా పుటము, అకృతహస్తుఁడు = సరిగా గుఱిగొట్టలేనివాఁడు, సమరము = యుద్ధము, స్నేహపర్యాకులోక్తిన = స్నేహముచే డగ్గుత్తికపడినమాటచే.

తాత్పర్యము.

గాధేయా! రావణుఁడు వీరుఁడని పేరుగలవాని దర్పము నణఁచువాఁడు. కావున సేనలతో వచ్చి కాని సేనలు లేక యొంటరిగాఁ గాని వానిని నే నెదిరించి యుద్ధముచేయఁ జాలను. ఇఁక మారీచసుబాహు లందమా, దేవతలకుఁ గూడ నసాధ్యులై యెవ్వరికి నజయ్యులై మరణించినవారు సుందోపసుందులు. అట్టివారికొడుకులు సామాన్యులా? యమునకు సద్దియగువారు. మిక్కిలి బల శాలులు. వారిబారిని బడిన యమునిబారిన బడినట్టె. ఏలన వారు యుద్ధమందు ముమ్మారుపుటమువేసి దీసిన బంగారువలె నాఱితేఱినవారు. ఇఁక నాకొడుకో బాలుఁడు. గుఱి చక్కఁగాఁ గొట్టలేఁడు. కావున నేను వానినిఁ బంపఁజాలను. ఆయిరువురిలో నొక్కనితోనైన మిత్త్రులతోఁ గలిసి నేను బోరఁగలను.

ఈ సుందోపసుందులు తిలోత్తమనిమిత్తముగాఁ దమలోఁ దాము పోరి చచ్చినవారు గా రని తోఁచుచున్నది. ఏలన సుందుఁ డగస్త్యుచేఁ జచ్చినట్టు విశ్వామిత్త్రుఁడు శ్రీరామచంద్రమూర్తికిఁ జెప్పెను. "కాలవశుఁడయ్యె సుందుఁ డగస్త్యుచేత" బాల. ౭౮౯ ప.

కం॥ జనపతి యిటు వదరిన నా, మునిపతి యాహుతుల యజ్ఞమున నగ్ని యనన్
గనుఁగవ నిప్పుక లురలఁగ, మనమున రోషంబు గదుర మటమటలాడెన్. ౨౮

వదరిన = ప్రయోజనములేని మాట లూరక వాగఁగా; ఆహుతులన్ = నేతిధారలచే; కనుఁగవ=రెండుకన్నులయందు; నిప్పుకలు = నిప్పులు; ఉరలఁగన్ = రాలఁగా.

తాత్పర్యము.

కుమారునియందలివాత్సల్యముచే డగ్గుత్తికపడి యీప్రకారము నిష్ప్రయోజనమైన మాటలు వాగఁగా విశ్వామిత్రుఁడు యజ్ఞమున నగ్నులందు నేయిపోసినట్టు మండిపడి కందోయినుండి నిప్పులురాలఁగ మనస్సున గోప ముద్భవింప మటమటలాడుచు నిట్లనియె.

౨౧ సర్గము. విశ్వామిత్రుఁడు దశరథుపైఁ గోపించుట

మ॥ వికటభ్రూకుటిదుర్నిరీక్ష్యుఁ డయి పృథ్వీమండలం బెల్ల నే
చి కటాక్షోగ్రహుతాశనార్చులను భస్మీభూతముం జేయుపో
లిక దీపింప యుగాంతరుష్టతరకాలీనాథుభంగిన్ సభన్
బ్రకటాటోపతఁ బూని మౌనివిభుఁ డుగ్రక్రోధసంరంభియై. ౧

వికటభ్రూకుటిదుర్నిరీక్ష్యుఁడయి = ముడిపెట్టుటచే మిగులవంకరమైన కనుబొమలచేఁ జూడ సాధ్యముకానివాఁడయి, పృథ్వీమండలంబు = భూమండలము. ఏచి = విజృంభించి, కటాక్షోగ్రహుతాశనార్చులను = కడగంటిచూపులనెడి భయంకరమైన యగ్నిహోత్రజ్వాలలచే, భస్మీభూతమున్ = బూదియైపోవునట్లు; యుగాంతరుష్టతరకాలీనాథుభంగిన్ = యుగాంతమునఁ బ్రలయమందు మిగులఁ గ్రుద్ధుఁడైన రుద్రునివలె, ప్రకటాటోపత=స్పష్టమైన సంరంభముచే.

తాత్పర్యము.

దశరథుఁ డీయన యేదికోరిన నిచ్చెదనంటినే మరల లేదనుట యెట్టులాయను నసత్యభీతిలేక, యెదుటివానిపరువుగాని, మనకుఁ దెలిసినంతమాత్రము తెలియక, యాలోచింపక, యిటువంట మహాత్ముఁ డడుగవచ్చెనే యనిగాని యాలోచింపక చెప్పినను దెలిసికొను తెలివిలేక, కేవలపామరత్వమున వదరిన మాటలు విని యిట్టి మూఢుఁ డీక మంచిమాటలతోఁ జక్కఁబడఁడని యోజించి కోపము తెచ్చుకొని కనుబొమలు చూచువారికి భయంకరముగ వడఁకుచుండఁగడకంటిచూపులనెడు నగ్నులచేతనే భూచక్రము బూదిచేయునట్లు ప్రలయకాలరుద్రునివలె భయంకరుఁడై క్రోధముచే సంరంభించినవాఁడై.

ఉ॥ *ఎండినకాష్ఠదండముల ♦ నేర్చి మహోగ్రత మండుమంటలో
దండిగ నేయి పోసినను ♦ ధగ్గని రేఁగు హుతాశునట్లు దా
మండి ప్రచండకోపమున ♦ మానవనాథునిఁ జూచి దేవతా
మండలిగుండె ఝల్లన క్ష్మ♦మాతల మెల్ల వడంక నిట్లనున్. ౫౯ ౨

ఎండినకాష్ఠదండములు = ఎండినకట్టెలసమూహములు, తండోపతండములు - ఇది సాధుప్రయోగము కాదు. తండ మనశబ్దము సంస్కృతమునలేదు. సమూహార్థమున దండ మనియొకటి కలదు. "దండోమానేవిశేషేవ్యూహే రవిపారిపార్శ్వపుంసి" నానా. దండశబ్దభవముకంఠు. తండా దేశ్యము. హుతాశనునట్లు=అగ్నివలె. క్ష్మాతలము = భూప్రదేశము ఏర్చి = కాల్చి - ఎండుకట్టెలే ధగ ధగ మండును. అందు నేయిపోసిన మఱింత విజృంభించును.

తా త్ప ర్య ము.

ఎండినకట్టెలను దహించుచు మండెడుమంటలో నేయిపోసిన ధగ్గని విజృంభించు నగ్నివలెనే మొదటనే కోపముఁడైన విశ్వామిత్రుని హృదయమున దశరథుని యవ్యక్తప్రలాపములు నాటఁగా కోపముతో మండిపడి మఱల నేమి చేయునో యని దేవతాసమూహము భయపడుచుండ భూమి గడగడలాడ రాజుతో నిట్లనెను.

శా॥ *ఓరీ రాఘవసత్కులాపశద! లే♦రో పుత్రు లెవ్వారికిన్
గారామారఁగ నీ వొకండవె ధరం♦గన్గొంటివే నేఁటి' కీ
వారం గూర్చెద నాదుకోర్కి యని ము♦స్నట్లాడి యిష్టిట్లహం
కారం బొత్తఁగ నీను బొమ్మనెదవా ♦ కానీ క్రియల్ నిల్చునే. ౫౯ 3

రాఘవసత్కులాపశద = రఘువుయొక్క మంచివంశమునఁ బుట్టిననీచుఁడా! గారాము = ప్రీతి, ఆరన్ = పూర్ణముగా - రఘుమహారాజు సర్వస్వము దానముచేసి మంటిముంతమాత్రము మిగిలించుకొనియుండఁగా కౌత్సఋషి వచ్చి యపుడు ధనము యాచింప మిక్కిలి శ్రమించి యతనికోర్కి తీర్చెను. అట్టి కష్టదశయందుఁ గూడ లేదు అని చెప్పనొల్లనివాఁడు రఘువు. అట్టివానివంశమునఁ బుట్టి ముందుగా నిచ్చెద నని వాగ్దానముచేసి లే దనిచెప్పువాఁ డావంశమున కపకీర్తి తెచ్చువాఁడేకదా.

అపశదుఁడా యనుట తిట్టు. కకుత్థ్సవంశమునఁ బుట్టినవాఁడు దేహి యన్నవానికి నాస్తి యనినవాఁడు లేఁ డని ప్రసిద్ధి. అట్టి వంశములో నీవెవఁడవురా యిట్టి నీచజాతివి పుట్టితి వని దూషణము. విష్ణుపురాణమున సౌభరి మాంధాతతోఁ జెప్పిన వాక్యము చూడుఁడు "నిర్వేష్టుకామోస్మి నరేంద్ర

కన్యాం, ప్రయచ్ఛమే మాప్రణయం విభాంక్షీః, న హ్యర్థినః కార్యవశా దుపేతాః, కకుత్స్థవంశే విముఖాః ప్రయాంతి."

"విప్రస్య త్రిషు వర్ణేషు నృపతే ర్వర్ణయో ర్ద్వయోః, వైశ్య స్స్వవర్ణే చైకస్మిన్ షడేతేఽపశదాః స్మృతాః" మను. ౧౦-౧౦. బ్రాహ్మణునకు క్షత్రియ వైశ్య శూద్రజాతి స్త్రీలయందును - క్షత్రియునకు వైశ్య శూద్రజాతిస్త్రీలయందును, వైశ్యునకు శూద్రస్త్రీయందును బుట్టిన యీ యాఱుగురకు నపశదు లని పేరు.

"కులస్యాస్య విపర్యయ" యనునది యీ యర్థమును సూచించును.

తాత్పర్యము.

ఓరీ, రఘువంశమున నపకీర్తిఁ దేఁబుట్టిన నీచుఁడా! లోకమునం దెవ్వరికిఁ గొడుకులు లేరా? ఈనాఁటికి నీ వొక్కఁడవా కొడుకులఁ గంటివి? నాకోరికసంపూర్ణముగా నెఱవేర్చెద నని ముందఱ్లు బాసచేసి నేను నోరుజాఱిచెప్పినపిమ్మట నహంకరించి నే నీనుపో యనెదవా? నీ కింత గర్వమా? కానిలే - నీవు నీకొడుకును బంపనంతమాత్రమున నాకార్యము నిలిచిపోవునేమో చూతము.

క౦॥ *నిను మూర్ఖు విషయలోలుని, ననృతపరుఁ శఠుని మూఢు ♦ ననఘపతి గాఁగను రాముజనకుఁ జేసిన, వనజాసను వలయుఁ బట్టి♦పాలార్పంగన్.   ౫౪

మూర్ఖుఁ = చెప్పినను దెలిసికొనలేని హఠవాదిని, విషయలోలునిఁ = విషయములందాసక్తిగల వానిని, అనృతపరుఁ = అసత్యవాదిని, శఠునిఁ = వంచకుని; మూఢుఁ = జ్ఞానములేనివానిని, రాముజనకుఁ = రామునికిఁ దండ్రిగా; వనజాసనుఁ = బ్రహ్మదేవుని, పట్టిపాలార్పంగఁ = పట్టిఖండింపఁగా; వలయుఁ.

తాత్పర్యము.

దశరథా! నీవంటి స్వతః జ్ఞానములేనివానిని, చెప్పినను తెలిసికొనలేక పట్టినపట్టు సాధింపఁజూచువానిని, విషయాసక్తుని, కల్లరీని, మోసగానిని, నిన్ను దేశమునకుఁ బ్రభువుగా - నందు శ్రీరామునివంటివానికిఁ దండ్రిగాఁజేసిన బ్రహ్మదేవుని బట్టి తునుకలు తునుకలుగా ఖండింపవలయును గాని నిన్నని ప్రయోజనములేదు.

క౦॥ *చంద్రమతీశ్వరు ఘనని, స్తంద్రబుతత్వ మ్మెఱింగి ♦ తద్వంశ్యుఁడ వఁ సాంద్రాభిలాష భూవర,చంద్రా! నిన వేఁడినాఁడ ♦ క్షమియింపఁ దగున్.   ౫౫

చంద్రమతీశ్వరు = చంద్రమతికి భర్తయైన హరిశ్చంద్రునియొక్క - చంద్రవతి సాధుశబ్దము - అయినను వాడుకయందుఁ జంద్రమతి యనియే యున్నది. కావున చంద్రునివలె సదా ప్రసన్నమైన మనస్సు గలది యని యర్థము గ్రహింపనగు. ఘనని స్తంద్రబుతత్వమ్ము = గొప్పదై హెచ్చరికతప్పని సత్యవాదిత్వము;

తద్వంశ్యుఁడవు = ఆయన వంశమందుఁ బుట్టినవాఁడవు. సాంద్రాభిలాషక = దట్టమైన కోరికచే, భూవరచంద్రా = రాజా - ఇది పరిహాసోక్తి. భారతంబున హరిశ్చంద్రునిభార్యపేరు సత్యవతి యని యున్నది.

> స్వయంవరే మహాభాగం, వరయామాస భామినీ
> హరిశ్చంద్రం సమేతానాం, రాజ్ఞాం మధ్యే పతిం విభుమ్
> తయా సహ మహీపాలః, సత్యవత్యా మనోజ్ఞయా
> రేమేచ సుచిరం కాలం, రాజా రాజ్య మివాప్యచ.
>
> భార-వన-౭౭ అధ్యా. ౩౦ శ్లో.

ఈయన కొడుకు లోహితుఁ డని యున్నది. వీఁడె లోహితాస్యుఁడు. హరిశ్చంద్రుని తండ్రి త్రిశంకుఁడు.

తాత్పర్యము.

హరిశ్చంద్రుఁడాడితప్పనివాఁడని నాయనుభవముచేఁ దెలియుటవలన నాయన వంశమునందుఁ బుట్టిన నీవు సత్యసంధుఁడవుగా నుందువని భ్రమించి నిండు కోరికతో నిన్ను యాచించితిని. రాజా! నాతప్పు క్షమింపుము.

ఆ॥ పలికి బొంకనీకుఁ • బాడియ యగు నేని, నచ్చినట్లు పోవు • వాఁడ రాజ!
సౌఖ్యపడఁగలయ్య • సకలబాంధవులతోఁ, ననృతవాది వగుచు • ననుమఁ గినుక.
౫౬

పడి = ప్రతిజ్ఞ, అనృతవాదివి = బొంకులమారివి, సౌఖ్యపడఁగలయ్య = ప్రధానార్థంబులలో సుఖిస్తయనంత క్రియలమీఁదఁ గలదు కావు పూర్వార్థంబులన్నాదులకు వ్యతిరేకంబు లగు నది వ్యంగ్యోక్తి.

తాత్పర్యము.

రాజా! ముందు మాట చెప్పి తప్పుట నీకు ధర్మమైన యెడల వచ్చినట్లు మఱలిపోదును. అసత్యవాదివై సకలబంధువులతో సుఖింపుము.

ఇప్పుడు విశ్వామిత్రుఁడు సత్యవిషయమై కొట్టినదెబ్బను దశరథుఁడు కైకేయితో సంభాషించినపుడు స్మరించి గాయపడినాఁడు కాని భేదము గ్రహింప లేకపోయెను. ఇప్పుడు శ్రీరాముని నడవులకు బంపుట ధర్మనిర్వాహణమునకు - అప్పుడు పంపుట కామనిర్వాహణమునకు. నిష్కారణముగఁ బరులకు బాధకలిగించు సత్యము సత్యముగాదు.

తే॥ కటము లదరఁగఁ జూపులు • కంప మందఁ, గన్నుఁగవ నిప్పుకలు రాలఁ • గ్రాలుగాధిసంభవునిఁ జూచి దేవతల్ • సంభ్రమింపఁ, దత్తఱించెడిధారిణీ • ధవునిఁ గాంచి.
౫౭

కటములు = చెక్కిళ్లు; చూపఱు = చూచువారు; గాధిసంభవుఁడు = గాధి కొడుకు - విశ్వామిత్రుఁడు.

తా త్ప ర్య ము.

అని యీ ప్రకారము చెక్కిళ్లదిరుచుండఁ జూచువారు గడగడ లాడుచుండ రెండుకన్నుల నిప్పులురాల విజృంభించి పలుకు విశ్వామిత్రుని జూచి దేవతలు నివ్వెరపడఁ దత్తఱలాడుదశరథునిఁ జూచి వసిష్ఠుఁ డి ట్లనియె.

—* వసిష్ఠుఁడు దశరథునకు శ్రీరామునిఁ బంప బోధించుట *—

చం॥ పలికె వసిష్ఠుఁ డి ట్లనుచుఁ • బార్థివసత్తమ! యేది కోరినన్
జలిపెద నంచుఁ బల్కితివి • న్యాయ్యమె యాడినమాటఁ దప్పఁగా
నలఘు కకుత్థ్సనన్వయము•నందు జనించి వహించి, సువ్రతా
కలనము, ధర్మమూర్తి వనఁ • గ్రాలినసీవును బొంకఁ జెల్లునే. ౫-౭

పార్థివసత్తమ = రాజశ్రేష్ఠుఁడా, అన్వయము = వంశము. దీనివలన నక్రమ మార్గమునఁ బోవు రాజునకు నప్రియమే మో యని భయపడక యతనిమంత్రులు పురోహితులు మోమోటములేక హిత ముపదేశింపవలయు నని యేర్పడు చున్నది. "సజ్జమాన మకార్యేషు, నిరుంధ్యుర్మంత్రిణో నృపమ్ । గుణానామివ చైతేషాం, శృణుయా ద్వచనం నృపః॥ ఈవిషయము రావణునకు మారీచుఁడు చెప్పినవాక్యములను అరణ్యకాండము ౬౭౭ వ పద్యముఁ జూడుఁడు.

తా త్ప ర్య ము.

రాజేంద్రా! నీవు ముందు మించి తొందిరపడి నీ వేది కోరినను నిచ్చెద నంటివి. ఆయన కోరిక చెప్పినపిమ్మట నీ వాడినమాటఁ దప్పుట న్యాయ్యమా? మహాత్ము లకు నొకరిని యాచించుటయే నీచము. అట్లుండఁ జేయిచూపించి యవల ఘుణ మనిపించుకొన్నట్లు నోరుజాఱి యాచించి లేదు పొమ్మనిపించుకొనుట కంటె నవమానప్రసంగ మింకేది కలదు? నీ వీయనను సామాన్యుపుబిచ్చగాని వలెఁ జూచితివి. నీవు పుట్టినదా కకుత్థ్సవంశమునందు. పూనినదా సత్య వ్రతము. పేరా ధర్మాత్ముఁ డని ప్రసిద్ధి. ఇట్టి నీవుకూడ నబద్ధమాడఁ దగునా?

కం॥ మతియుతుఁడవు ధృతిరతుఁడవు, వ్రతహితుఁడవు విమలకీర్తి•పరుఁడవు త్రిజగ
న్నుత ధర్మిష్ఠుఁడ వయి యీ,గతి ధర్మము దప్పనాడఁ • గార్యం బగునే. ౮-౯

మతియుతుఁడవు = బుద్ధిమంతుఁడవు; ధృతిరతుఁడవు = ధీరత్వమం దాసక్తి గలవాఁడవు, వ్రతహితుఁడవు = వ్రతములందు హితబుద్ధి గలవాఁడవు. ఉభయ యుక్తి,

తాత్పర్యము.

రాజా! నీవు తప్పొప్పు లాలోచించుబుద్ధిబలము గలవాఁడవు. ఎట్టికష్టములందును జలింపని ధైర్యముగలవాఁడవు. వ్రతము భంగముకాక సాంగముగ సాధించుటయందు హితబుద్ధిగలవాఁడవు సత్యవ్రతుఁడని నిర్మలమైన కీర్తిని సంపాదించినవాఁడవు. మూఁడులోకములందు ధర్మాత్ముఁడవని స్తోత్రముఁజేయఁబడువాఁడవు. ఇట్టివాఁడవై యీవిధముగ ధర్మము దప్పునట్లు మాటలాడ వచ్చునా?

కం॥ జగముల నన్నిట దశరథ, జగతీపతి పరమధర్మ♦చరితుం డనుచుం
బొగడితఁ గనియు స్వధర్మముఁ, దగునే విడువంగ నీకు ♦ ధర్మైకరతా! ౬౦౦

పొగడిక = కీర్తి - సా. పొగడ్త. స్వధర్మము = క్షత్రియధర్మము - గృహస్థధర్మము. ధర్మైకరతా = ధర్మమొక్కదానియందే ప్రీతిగలవాఁడా!

తాత్పర్యము.

ధర్మాత్ముఁడా! అన్నిలోకములయందు దశరథమహారాజు మిగుల ధర్మాత్ముఁడని యశముగాంచియును నిపుడు స్వధర్మమును నీవు విడువఁ దగునా?

సీ॥ చెప్పి యెయ్యది యైనఁ ♦ జేసెద నంటివి, చేయ కుండఁగ నిన్ను ♦ జెల్లునయ్య?
చేసెద నని మున్ను ♦ చెప్పి చేయక యున్న, వచ్చు నిష్టాపూర్తి♦వధఫలంబు
గావున శ్రీరాముఁ ♦ గౌశికు వెంబడిఁ, బంపుటయే నీకుఁ ♦ బరమశుభము
కలితాస్త్రుఁడైన న♦కలితాస్త్రుఁడైనను, నగ్ని రక్షించు ది♦వ్యామృతంబు
తే॥ నట్లు గాధిజరక్షితుం ♦ డైనరాము, భద్రుఁ జెనకంగ లేరెట్టి♦ప్రబలదైత్య
వీరు లైనను వెఱవకు ♦ వేగ పంపు, మౌనిమాత్రుండె కౌశిక♦మౌనివరుఁడు. ౬౦౧

ఇష్టాపూర్తివధము - ఇష్టము = యాగము, దేవతార్చనము, పూర్తము = గుంటలు బావులు త్రవ్వించుట, తోఁపులు వేయుట లోనైనవి, వధము = వీనిని బాడుచేయుట,

శ్లో॥ వాపీకూపతటాకాది, ప్రతిష్ఠా సేతుబంధనమ్
అన్నప్రదాన మారామః, పూర్త మి త్యభిధీయతే.

సిరాయి - నడబావి - చెఱువు - వీని ప్రతిష్ఠయు, సేతువుకట్టుటయు - అన్నప్రదానము - తోఁట వేయుట యివి పూర్తము.

కలితాస్త్రుఁడు = అస్త్రములు గలవాఁడు. అకలితాస్త్రుఁడు = అస్త్రములు లేనివాఁడు.

అగ్నిరక్షించు దివ్యామృతంబు — స్వర్గమునందు నమృతమును నగ్నిహో

త్రుఁడు కాఁచియున్నాఁ డని భారతమున గరుడుఁ డమృతముఁ దెచ్చు ఘట్టమునఁ జెప్పఁబడెను.

రాముని కస్త్రజ్ఞానము లే దని వసిష్ఠునియభిప్రాయ మైనచోఁ గలితాస్త్రుఁడైన నని చెప్పఁ గారణ ముండదు. కావున తత్త్వవేత్తల మగు మా యభిప్రాయమున శ్రీరామచంద్రమూర్తి కలితాస్త్రుఁడే. లేక నీ యభిప్రాయప్రకారము అకలితాస్త్రుఁ డందమా యనిన విశ్వామిత్రుఁడు రక్షించుచున్నాఁ డని భావము.

తా త్ప ర్య ము .

రాజేంద్రా! ఏమికోరినను జేసెద నని నీవు చెప్పితివి. చెప్పిన తరువాత నిప్పుడు చేయ ననవచ్చునా? చేసెద నని ముందుచెప్పి చేయకయుండిన యాగములను బావులను గుంటలను తోఁపులను ధర్మకార్యములను జెఱిచిన పాప ఫలము వచ్చును. కావున శ్రీరామచంద్రమూర్తిని విశ్వామిత్రుని వెంటఁ బంపుటయే నీకు మేలైన కార్యము.

అస్త్రవంతుఁడైనను గాకుండినను దివ్యామృతమును రక్షించు నగ్నివలె విశ్వామిత్రుఁడు రక్షింప శ్రీరామచంద్రు నెంతటి బలవంతులైనను రాక్షసులైనను జెనకలేరు. కావున శ్రీరాముని కే యపాయము కలుగునో యని భయపడవలదు. భయకారణము లేదు. విశ్వామిత్రుఁ డనిన సందఱుమునీశ్వరుల వంటి సామాన్యుఁ డను కొంటివా యేమి? కాఁడయ్యా-కాఁడు.

ఉ॥ ఆకృతి గొన్నధర్మము, పరాక్రమినంతులలోన మేటి, మే
ధాకలితుండు, సువ్రతనిధానము, లోకమునం జరాచరా
నీక మెఱుంగఁజాలని యనేకమహాస్త్రము లీతపస్వికిం
బ్రాకటలీల వశ్య మయి రాజిలు చుండు, నతుల్యుఁ డిన్నిటన్. ౬౦౨

ఆకృతి = రూపము, మేధాకలితుఁడు = బుద్ధిబలముగలవాఁడు, చరాచరానీకము = కదలువానియొక్కయు కదలనివానియొక్కయు సమూహము, అతుల్యుఁడు = అసమానుఁడు. తపస్వికిన్ = విశ్వామిత్రునకు నని యొక యర్థము. తపస్వికిన్ = పరమాత్మ యగు శ్రీరామునకు నని రెండవయర్థము. తపస్విశబ్దము భగవత్పర్యాయముగ నన్వయించుటకు బాలకాండము ౬౯౬ వ పద్యము, దాని వ్యాఖ్యానము చూడుఁడు. ఈయర్థమున నీ పద్యమునందలి విశేషణములన్నియు శ్రీరామునకే యన్వయించును.

చరాచర రాజిలుచుండున్ = భగవంతుఁడు భూమిపై మనుష్యస్వరూపమున నవతరించినపుడే యాయనయస్త్రములన్నియు నవతరించి యాయనను వెంటనంటియే యున్న వని భావము. (ఉత్తరకాండము ౧౬౪౨ వ పద్యము చూచునది)- 'శరచాపముల్ పూరుషరూపములను, సకలాయుధావళుల్ సరవిని

గొలువంగ' నని యందుఁ జెప్పఁబడెను. ఈయర్థము రామాయణతత్త్వదీపిక ననుసరించి వ్రాయఁబడెను.

తాత్పర్యము.

విశ్వామిత్రు నీ వేమనితలఁచితివో మనుష్యస్వరూపము ధరించినధర్మము- పరాక్రమంతులలో శ్రేష్ఠుఁడు - బుద్ధిబలముచేఁ గ్రొత్త క్రొత్త గొప్పకార్యములు చేయఁగలవాఁడు- మంచి వ్రతములకు స్థానము - లోకమున జంగమస్థావరముల సమూహము లెఱుఁగనియస్త్రము లీయనకు వశములు. అసమానుఁడు.

క॥ సుర కిన్నర కింపురుషా,సురగంధర్వాహిగరుడ♦శూరుల కైనన్
బరికించి తెలియరానివి, పరమాస్త్రచయంబు లితని♦వశమునఁ గ్రాలున్. ౬౦౩

పరమాస్త్రచయంబులు = గొప్పనగు నస్త్ర సమూహములు - ఈ పద్యము కూడ శ్రీరామపర్యాయమునసే యన్వయింపవచ్చును.

తా త్ప ర్య ము .

దేవతలకు - కిన్నరులకు - కింపురుషులకు - అసురులకు - గంధర్వులకు - పన్నగులకు - గరుడులకు వీరిలో శూరు లనిపించుకొన్నవారికైనను నివి యిట్టి వని పరీక్షించియైనఁ దెలిసికొనసాధ్యపడని మహాస్త్రము లీయనవశమునం దున్నవి.

సీ॥ మున్ను భృశాశ్వనా♦ముఁడు ప్రజాపతి యొక్కఁ,డుండు చెలంగుధీ♦రుఁడు దక్ష
సుతల జయాఖ్యను ♦ సుప్రభాఖ్యను బెండ్లి,యయ్యె నిర్వుర జయ♦యందుఁగాంచెఁ
గామరూపులను వి♦క్రమవంతులను నేను,ఁదులపుత్రకుల, సు♦ప్రభయుఁ గాంచె
నందఱసుతుల సం♦హారాభిధానుల, దుర్ధర్షబలుల ని♦స్తులితశక్తి
తే॥ పరుల నస్త్రంబు లైరయ్యు ♦ వార లెల్ల, వాని నన్నిటి నిజతపో♦బలముకలిమిఁ
బొందెనితఁడుభృశాశ్వుచేఁ♦బుడమినేలు,సమయమునయందు నీ కేల♦సందియంబు. ౬౦౪

ఇట్లు శ్రీరామమాహాత్మ్యంబు చెప్పినను దెలిసికొనలేని దశరథునిఁ జూచి యాతనికి నమ్మకము గలుగుటకై విశ్వామిత్రు నస్త్రసంపత్తిఁ దెలుపుచున్నాఁడు.

భృశాశ్వనాముఁడు = భృశాశ్వుఁ డను పేరుగలవాఁడు.

సమయమునయందు - ఉదంతము లగు సమహాత్ములకు సందు వర్ణకము పరంబగునపుడును నగాగమంబు కొన్నియెడలఁ గానంబడియెడి. త్రి. శ. ౨౧. సూ.

తా త్ప ర్య ము .

పూర్వమందు భృశాశ్వుఁ డను ప్రజాపతియొక్కఁ డుండెను. ఆయన దక్షుని పుత్రికల జయ - సుప్రభ యను నిరువురిను బెండ్లియాడి, యందు జయ యను

దానియందు నేఁబదిపుత్రులను కోరినరూపము ధరింపఁగలవారిని పరాక్రమము కలవారిని, సుప్రభయందు సంహారు లను పేరుగలవారిని అజయ్యబలులను నసమానశక్తిమంతులను నేఁబదిమందిని గనెను. వారందఱు నస్త్రంబు లైరి. ఆయస్త్రముల నన్నిటని భృశాశ్వుచేతనే యాయనరాజ్యముచేయుకాలమందే తన తపోబలముచే సంపాదించెను. ఈ విషయమై నీకు సందేహము పనిలేదు.

కం॥ అవి యేటికి? నెన్నెన్నియొ, నవనవముగ సృష్టిసేయు♦నైపుణి గలఁ డీ
భవనిభుఁ డీతనివెంబడి, నవనీశ్వర! పంపవయ్య ♦ యాత్మజు రామున్. ౬౦౫

నవనవముగన్ = క్రొత్తక్రొత్తగ; నైపుణి = నేర్పు, భవనిభుఁడు = శివునితో సమానుఁడు, ఆత్మజున్ = కుమారుని.

తాత్పర్యము.

ఆయస్త్రము లనియే యేమి? శివునితో సమానుఁ డగు నీయన ఎన్నెన్ని యస్త్రములో క్రొత్తక్రొత్తగ సృష్టిచేయు శక్తిగలవాఁడు - కావున నీకొడుకునకు నస్త్రములు తెలియ వని భయపడక నీకుమారుని నీయనవెంటఁ బంపుము.

కం॥ తలఁపకు తనకార్యంబును, జలుపుకొనఁగ లేక రామ♦చంద్రుని వేఁడన్
దలకొనె నని, నీసుతునకుఁ, గలిగింపఁగఁ గోరి వచ్చెఁ ♦ గల్యాణంబుల్. ౬౦౬

అర్థము - సుగమము.

తాత్పర్యము.

ఆయనతనకార్యమును దాను సాధించుకొనలేక రామచంద్రునిష్మని వేఁడుటకు వచ్చినవాఁ డని తలంపకుము. నీకొడుకునకు మేలు కలిగింపఁ గోరి వచ్చినవాఁడు.

౨౨ సర్గము. దశరథుఁడు రామలక్ష్మణులను విశ్వామిత్రువెంట సంపుట

కం॥ అనుచు వసిష్ఠుఁడు పల్కిన, విని ప్రముదితచిత్తుఁ డగుచు ♦ విపులాపతియున్
మునివెంటఁ బంపఁగా రా,ముని లక్ష్మణసహితుఁ బిలువఁ ♦ బూన్చిమనమునన్.
౬౦౭

ప్రముదితచిత్తుఁడు = సంతోషించిన మనస్సుగలవాఁడు, విపులాపతియు = భూపతి - రాజు.

దీనివలనఁ ఏన కిష్టము లేకున్నను దనహితులు చెప్పినట్లుచేయుట శ్రేయస్కరమని యేర్పడుచున్నది. అట్లు విననివాఁడు చెడు నని రావణచర్య తెలుపుచున్నది.

తాత్పర్యము.

అని యీ ప్రకారము వసిష్ఠుఁడు చెప్పఁగా విని దశరథుఁడు సంతోషించి మునివెంటఁ బంపుటకై లక్ష్మణుతోడనుండు రామచంద్రమూర్తిని నిండు

మనస్సుతోఁ బిలిచెను. లక్ష్మణుతోడి రాము ననటచే వారొకరిని విడిచి యొకరుండ రని భావము. అవినాభావసంబంధము.

ఉ॥ వారలు సమ్మదం బెదల ♦ వర్ధిల వచ్చినఁ దల్లిదండ్రు ల
య్వారికిఁ బ్రీతి మున్నుగను ♦ స్వస్త్యయనం బొనరింప బాలురే
ఁజేరి పురోహితుండు హిత♦నిష్ఠితబుద్ధని మంగళోక్తులన్
గారవమారు మంత్రితులు♦గా నొనరించినయంతఁ దండ్రియున్. ౬౧౧

ఎదలన్ = హృదయములందు, వర్ధిలన్ = వృద్ధిఁబొందుచుండఁగా, తల్లిదండ్రులు = కౌసల్యాదశరథులు, స్వస్త్యయనము - స్వస్తి + అయనము = మంగళాశాసనము, మంత్రితులు = మంత్రింపఁబడినవారలు.

తల్లిదండ్రులు స్వస్త్యయనం బొనరించి రనటచే సభనండి రామలక్ష్మణుల నంత పురంబునకుఁ బిలిచికొని యచ్చటఁ గౌసల్యాసుమిత్రల కీవృత్తాంతముఁ దెలిపి వారును దానును గలిసి దశరథుఁడు బాలుర దీవించె నని యెఱుఁగవల యును 'సమ్మదం బెదల వర్ధిలన్' అనటచే నింతవఱకుఁ దండ్రి విశ్వామిత్రునకుఁ జెప్పినసమాధానము వారికి సంతోషము గలిగింపలే దని వ్యంగ్యము.

ఇందు దల్లిదండ్రు లని చెప్పుట సమాసనియమత్వమె కాదు శ్రేష్ఠత్వముగూ బట్టి తల్లి ముందు చెప్పఁబడెను. దీనివలన బిడ్డలను మహాకార్యార్థమై పంపునపుడు తల్లిదండ్రులు దీవించి పంపవలయును. ఈ విషయ మైతరేయబ్రాహ్మణమం దిట్లు చెప్పఁబడెను "తే దేవా అబ్రువన్ గాయత్రీం త్వం న ఇమం సోమం రాజాన మాహర ఇతి స్వస్త్యయనే గచ్ఛేతి - స్వస్తి పున రాగచ్ఛ తీతి" తల్లిదండ్రులిరువురు పుత్రుని దీవింపవలసినవారే యయ్యును దల్లిదీవనయే ప్రధానము. సీతయు హనుమంతుని "శుభమగుఁగాక తిరిగి వచ్చెదవు" యని దీవించెగదా. ఈదీవనబలముచేఁగదా హనుమంతుఁ డెరిసూడినట్లై లంక దహించి క్షేమముగా రామచంద్రమూర్తినిఁ జేరెను.

ఇదియునుగాక భారతయుద్ధంబున దుర్యోధనుఁడు జయము గోరి తల్లియొద్దకుఁ బోయి "శివ మాశంస మే మాత. యుధ్యమానస్యశత్రుభి ' శత్రువులతో యుద్ధము చేయు నన్ను శుభము గలుగ దీవించుమని వేఁడఁగా "యతో ధర్మస్తతో జయ" యని దీవించెను. ఇది వ్యతిరేకఫలమే చూపెను. సీతదీవన యనుకూలదీవన.

ఈవిషయము భారతము-స్త్రీపర్వము - ప్రథమాశ్వాసము - ౧౫౧ పద్యముఁ జూడుఁడు. దుర్యోధనునందు ధర్మములేదు గావున వానికి మేలుగలుగదయ్యె.

తాత్పర్యము.

తండ్రి తమ్ముఁ బిలువఁగానే కులోచితమైన ధర్మకార్యనిర్వాహణమందుఁ దండ్రి నియోగించుచున్నాఁడు గదా, సాధువర్తనలగు ఋషుల రక్షింపను

వారికిఁ గీడు గలిగించు నధర్మవర్తనుల శిక్షింపను సమయము తటస్థించెఁగదా, యవతారప్రయోజనము సమకూరఁ బ్రారంభమాయెఁగదా యని మనస్సులో సంతోషముప్పొంగుచుండ వచ్చిన కుమారులకుఁ దల్లిదండ్రులు ముందుగా మంగళాశాసనము గావింపఁగాఁ దరువాతఁ బురోహితుఁడు శుభమైనవాక్కుల వారి హితముఁ గోరి వారికి రాక్షసులచే బాధ కలుగకుండునట్లు మంత్రింపఁగా.

తే॥ చిన్నికొమరునిఁ దనపజ్జ♦చేరఁదీసి, శిరము మూర్కొని మీఁదను♦ జేయివైచి
యంతరాత్మమహాప్రీతి♦నలరుచుండ, నబ్జజసమానుఁడగు ముని♦కప్పగించె. ౬౦౯

చిన్ని=అందముగల, పజ్జ=సమీపము, ప్రక్క; మూర్కొని=వాసనచూచి; అబ్జజసమానుఁడు = బ్రహ్మతోసమానుఁడు - సృష్టికిఁ బ్రతిసృష్టిచేసినవాఁడు.

కావున సముఁడు - బ్రహ్మదలఁచిన నాయుస్సునకుఁ దక్కువాయన్నట్లు విశ్వామిత్రుఁడు బ్రహ్మసమానుఁడు - కావున శ్రీరామునకుఁ బ్రాణభయములే దని దశరథుఁడు ధైర్యము వహించె నని భావము.

తాత్పర్యము.

దశరథుఁడు శ్రీరామచంద్రమూర్తినిఁ దనప్రక్కకుఁ జేరదిగిచి శిరము వాసన చూచి మీఁదఁ జేయివైచి మహాప్రీతిచే నంతరాత్మ సంతోషించుచుండ బ్రహ్మసమానుఁడైన విశ్వామిత్రునకు నప్పగించెను.

ఉ॥ మందము మందమై సురభి♦మారుత మల్లన నీరజంబుగాఁ
బొందుగ వీచె స్పర్శసుఖ♦మున్ ఘటియించుచు, దేవదుందుభుల్
క్రందుగ మ్రోసె, రాలె సుమ♦రాసులవర్షము, కోసలాత్మజా
నందనుఁ డిట్లు లాకుశిక♦నందను వెంబడిఁ బోవఁ బూనినన్. ౬౧౦

సురభిమారుతము = పరిమళముతోఁగూడిన వాయువు, నీరజంబుగాన్ - నిర్ + రజంబు = దుమ్ములేకుండునట్లు, స్పర్శసుఖమున్ = తాఁకుటచే సుఖమును - సుఖముకలుగునట్లు తాఁకుచు (ఝంఝు [=సుడిగాలి] వలెఁగాక)

దశరథనందనుఁ డనక కోసలాత్మజానందనుఁ డనుటకుఁ గారణము దశరథుని వలె నామె యడ్డమాటలు చెప్పక, రాచకూఁతుపుత్త్రుఁ గాంచు నెద్దాని కట్టి సమయము తటస్థించెఁగదా నాకొడుకు చిన్నవాఁడైనను నిట్టిఘనకార్యము చేయఁ బూనెఁగదా యను సంతోషముతో వెంటనే యనుమతించెనుగనుక.

తాత్పర్యము.

కౌసల్యానందనుఁడైన శ్రీరామచంద్రమూర్తి అవతారప్రయోజనమున కంకురార్పణము గావింపఁబోవుచున్నాఁడు. కావున దేవతలు శుభశకునములఁ బ్రదర్శించిరి. ఈయన నాశ్రయించి తనకుమారుఁడు ధన్యుఁడై తనకును గీర్తి

తేనున్నాఁడను సంతోషముతో వాయుదేవుఁడాయనకు మార్గాయాసము కలుగకుండుటకై తనచేతనైన సేవ సువాసనతోడ మెల్లమెల్లగా సుఖము కలుగునట్లు వీచెను. ఇఁక మనకు రాక్షసులభయములేదు జయమే యనుధైర్యముతో దేవతలు బహిరంగముగా దుందుభులు మ్రోయించిరి. భూజాతములు (వృక్షములు) (భూజాత - సీత) యిట్టి లీయనపైఁ దలంబ్రాలుఁబోయు నని సూచించునట్లు పూలవాన గురియించెను. సూర్యకిరణముల వేఁడిమి సోఁకకుండునట్లు సన్నతుంపరవానయుఁ గురిసెను.

కం॥ రయమునను శంఖదుందుభి, చయముల నిస్వనము లెసఁగ ♦ సంకులముగ న
ష్టయగతి మునిపతివెంటను, బయనం బై వేడ్కఁ రామ♦భద్రుఁడు వోవన్. ౬౧

రయమునను = ఆలస్యములేక, నిస్వనములన్ = ధ్వనులన్, అయగతి = శుభకరమైనరీతిగ, వేడ్కన్ = విలాసముగా - 'తల్లిదండ్రులను విడిచి పోవలసి వచ్చెనే, ఈముని యెక్కడికో యడవులకుఁ బిలుచుకొని పోవుచున్నాడే' యను జంకు కొంకు లేక యాటకుఁ బోయినట్లుగా.

తాత్పర్యము.

దేవతలుగనఁబరచిన శుభశకునములను జూచి పురమునవారును బ్రహ్మకుమారుఁడైన కుశికునినందనుఁడైన విశ్వామిత్రునివెంట శుభరీతి శ్రీరామచంద్రుఁడు పోవుచుండ శంఖములు నగారాలు సంకులముగా మ్రోయించిరి.

సీ॥ ముందు విశ్వామిత్ర♦ముని యేగఁగఁ బిఱుంద, డాకేలఁ జాపంబు ♦ డాక మెఱయ
ముద్దుజుల్పంబులు ♦ మోదంబు నింపఁగ, ననుగుఁదమ్ముఁడు వెంట ♦ నంటిరాఁగ
రామభద్రుం డేగెఁ ♦ గ్రాలభూషణములు, దశదిశల్ వెలుగంగఁ ♦ దనదుద్యుతినిఁ
బురమునఁ గల్గిన♦పురుషులు మగువలు, మూఁగలై యందంద ♦ మూఁగిచూడఁ
తే॥ బూలుగొని పూవుఁబోఁడులు ♦ లీలఁ జల్ల, మంగళరవంబు దెసలన♦మ్రింగివైవఁ
దల్లులందఱుఁ గిటికీనఁ ♦ దఱిసి నిల్చి, చొక్కి కనుమేరదూరంబు♦నిక్కిచూడ.
౬౧౨

పిఱుందన్ = వెనుక; డాకేలన్ = ఎడమచేతియందు, ద్యుతి = కాంతి; మూఁగలై = దృష్టులు మనస్సులు వారిమీదనే యేకాగ్రముగ నుండుటచే నొకరితో నొకరు మాట్లాడక మూఁగవాండ్రవలె; మూఁగి = గుంపుగూడి; పూవుఁబోఁడులు - స్త్రీలు, తఱిసి = సమీపించి; కనుమేరదూరంబు = చూపులు ప్రసరించువఱకు.

పూవుఁబోఁడులు — పూవుఁబోఁడి వ్యాకరణవిషయము. విరిఁబోఁడిలోనగు శబ్దంబులయందలి పోఁడి శబ్దము పరుషాదియా లేక సరళాదియా (బోఁడి) యని విచారింపఁగా చిన్నయసూరిగారు దమ బాలవ్యాకరణ సమాసపరి

ఛ్చేదమున 23 వ సూత్రంబునందు "బహువ్రీహిని స్త్రీ వాచ్యం బగుచో నుపమానంబుమీఁది మేనునకు బోఁడి యగు" నని వ్రాసి యున్నారు. ఈ సూత్రమువలన బోఁడి సరళాది యనియు నా శబ్దమునకు దేహ మర్థ మనియు నుపమానంబుమీఁగ వచ్చినప్పుడు బహువ్రీహి యగు ననియు వారియభిప్రాయము. బహుజనపల్లి సీతారామాచార్యులవారు తమ ప్రౌఢవ్యాకరణంబున సమాసపరిచ్ఛేదంబున 19 వ సూత్రంబున "అలరుఁబోఁడిత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబులు" "ఇటఁ బోఁడి పరం బగుచో నెల్లెడ ను మ్మగు- ఆది పదంబుచేఁ దియ్యఁబోఁడి, ననఁబోఁడి, ఇగురుఁబోఁడి, విరిఁబోఁడి, పూఁబోఁడి యిత్యాదులు గ్రాహ్యంబులు. అలరు + పోఁడి, దీనికిఁ బువ్వుల వలె మనోజ్ఞురాలైన దని యర్థము ఇట్లంతటఁ దెలియంగవలయు." అని శాసించిరి చిగురుంబోఁడి, పువుంబోండ్లు పూవుంబోండ్లు అనువానికిని తీయంబోఁడి యను దానికిని లక్ష్యము లుదాహరించిరి. చిగురుంబోఁడి యిత్యాదులఁ బూర్ణానుస్వారంబు కలిమి నర్థానుస్వారంబు సమర్థింప వీలులేదు. ఎట్లనిన "సమాసంబుల నుదంతంబు లగు స్త్రీసమంబులకుం, బు, ంపు లకుం బరుష సరళంబులు పరంబు లగునపుడు నగాగమం బగు" నని చిన్నయ సూరిగారు సంధిపరిచ్ఛేదంబున సూత్రించి "సరళంబులు పరంబు లగునపుడు లోపసంశ్లేష పూర్ణబిందువులచే మూఁడురూపంబు" లని "ఉన్నతంపుగొడుగు, ఉన్నతంపున్గొడుగు, ఉన్నతంపుం గొడుగు" అనియుదాహరణములిచ్చిరి. కావున నీ సూత్రము చొప్పున "చిగురు + బోఁడి= చిగురుంబోఁడి" యనియు నేర్పడఁ గలదు. కాని రామరాజభూషణవిరచిత హరిశ్చంద్రనలోపాఖ్యానమున ౧-ఆ. ౨౮-వ పద్యమున "సీ॥ పూని యిట్లను రాగము దెరల్పఁ గలనైన, మఱచియైనను నలమానవపతి। యన్న పలుకు దప్పకలరుఁబోఁడి మితోదరాత్రయై" యనుచో "పోఁడిమితోన్ + అలరున్" అని హరిశ్చంద్రకథపరమైన యర్థమునందును, "అలరుఁబోఁడి + మితోదరాత్రయై" యని నలకథపరమైన యర్థమునందును పదచ్ఛేదము. కావున "అలరుఁబోఁడి" యనుచో "అలరు" ఉదంత స్త్రీసమమైనను సరళము "బో" పరమై యుండిన నర్థానుస్వారమునకుఁ గారణము లేదు. అదియుఁగాక బాలవ్యాకరణమున ఉదంత మను తపరకరణము బలిమిచే హ్రస్వ ఉకారము మాత్రము ద్యోతక మగుచుండఁ బింగళి సూరన్నగారి కళాపూర్ణోదయంబున ౧-ఆ- "పూఁబోఁడి యొకసికొని చనఁ। గాఁ బయ్యెద యొడిసిపట్టెఁగనుఁగొంటె చెలీ। లేఁబొన్నను ఒళ్లి రాయిది। గోఁ బురుషాహ్వాయమునిలుపుకొనుసమయంబున్" అనియు, శ్రీనాథుని భీమఖండంబున "పూఁబోఁడులకును విటులకు। వేఁబోకలఁ దలరుసొంపు వీక్షాలుపుఁ బురిన్। వేఁబోకఁ బోకతోఁటల। పూఁబాళల కమ్మతావిఁ బొదలినగాడ్పుల్" అని దీర్ఘ ఉకారము

పైనను, "ద్రోవదగ్, తీయంబోఁడి వరింపగా వసుధ కేతేఁ జూచు నాదిత్యులో" యని 'అ' కారముపైనను, నుగాగమము కానంబడుటచే సీతారామాచార్యుల వారియభిప్రాయమే సరి యని తోఁచెడి. కానిచో నుభయరూపములు గ్రహింప వలసివచ్చును.

విశ్వామిత్రుఁడు = విశ్వ + మిత్రుఁడు = విశ్వామిత్రుఁడు.

"మిత్రేచర్షాఇతి విశ్వశబ్దస్య దీర్ఘః - తస్యాం విశ్వంమిత్ర మాసీద్యదిదం కించ తస్మాద్విశ్వామిత్ర ఇత్యాచక్షత" శ్రుతి.

విశ్వామిత్రశబ్దమున కర్థము విశ్వామిత్రుఁడే యిట్లుచెప్పెను.

శ్లో॥ విశ్వేదేవాశ్చ మే మిత్రం, మిత్ర మస్మి గవాం తథా
విశ్వామిత్ర ఇతి ఖ్యాతం, యాతుధాని నిబోధమామ్. అను ౧౮ ౨ అధ్యా.

సమస్తదేవతలు నామిత్రులు- నే నింద్రియములకు (ప్రపంచమునకు) మిత్రుఁడను. కావున నో రాక్షసీ! నన్ను విశ్వామిత్రుఁ డందురు.

తాత్పర్యము.

ముందు త్రోవఁజూపుచు విశ్వామిత్రుఁడు పోవఁగాఁ దనవెనుక లక్ష్మణుఁడు రాఁగా నెడమచేత విల్లు పట్టుకొని సొమ్మునకు సొమ్ముపెట్టినట్టు ముద్దుజల్పంబులు చూచువారికి సంతోషము కలిగింప భూషణములు మెఱయుచుండఁ దన ప్రకాశముచే దిక్కులు వెలుఁగఁగాఁ బురమున నున్నస్త్రీలు పురుషులు నొకరితో నొకరు పలుకక దృష్టులు మనస్సులు నేకాగ్రముగ వారియందే నిలిపి మూఁగల వలె నిలఁబడి చూచుచుండఁ గొందఱుస్త్రీలు పుష్పాంజలులు చల్లఁగా దిక్కులు మ్రింగునట్లు వాద్యములు మ్రోయ మూఁడువందలయేఁబదిమందితల్లులు వారి వారి మేడలమీఁద నిలుచుండి కిటికిలలోనుండి కనఁబడువఱకు పరవశలై తొంగి నిక్కి నిక్కి చూచుచుండ శ్రీరామచంద్రమూర్తి పోవుచుండెను.

సీ॥ తరకసంబులజతఁ • దనరుమూఁపులవారిఁ, గెంగేల ధనువులు • గెరలువారి
ముత్తలపాములు•మురువుఁ జూపడివారి, సంగుళీత్రాణంబు • లమరువారి
దశదిశల్ వెలిగించు•తనరుచు ల్గలవారి, మెయినిండ సొమ్ములు • మెఱయువారి
సౌందర్యమున జిత•జలజేషు లగువారి, ఖడ్గముల్ గలనడి•కట్టువారి
తే॥ విధిని వెన్నంటు నక్కులు•విధమువారి, శివుని వెనుకొను కొమరుల • చెలువువారి
మహితగుణులనురామలక్ష్మణులఁదోడు,కొనుచుఁ జనియెనుగౌశిక•మునివరుండు.
౬౧౩

తరకసంబులజత=రెండంబులపొదులు-కుడిమూఁపుననొకయంబులపొదియు నెడమమూఁపున నొకయంబులపొదియు; కెంగేల-కెంపు + కేలు=కెంగేలు. లేత

ప్రాయము; ముత్తల=మూఁడుతలలుగల, రెండంబులపొదులు వానినడుమ శిరస్సు చూడ మూఁడుతలలపాములవలె నున్నారు. అంగుళీత్రాణంబులు = బాణంబులు ప్రయోగించినపుడు వ్రేళ్లురాపుచే గాయముపడకుండుటకై రక్షణార్థముగా నుడుముచర్మముచేఁ జేసినవ్రేళ్ళకవచములు గలవారిని, తనురుచుల్ = దేహకాంతులు, మెయినిండఁగ = దేహమునిండఁగ, జితజలజేషులు = తామరపూలబాణముగల మన్మథుని జయించినవారు, విధిని = బ్రహ్మదేవుని, అశ్వులు = అశ్వినీదేవతలు, కొమరుల = కుమారస్వామి - విశాఖుఁడు - వీరలయొక్క, చెలువము = అందము, అశ్వినీదేవతలు = దేవతలయందు వైద్యులు, అన్నదమ్ములు= ఎడఁబాయ కెప్పుడు జంటగా నుండువారు, బ్రహ్మ దేవతాజ్యేష్ఠుఁడు కావునఁ బెద్దవారివెంట నేమట్టుమర్యాదలతోఁ బిన్నవారు పోవలయునో యట్టి మర్యాదలతో రామలక్ష్మణులు వినయవిధేయతలతోఁ బోయిరని భావము. పెద్దవారు క్రొత్తవారైనపుడు వారివెంటఁబోవు పిన్నవాండ్రు భయముచే జంకుదురు. అట్టి భయమున కందు కారణములే దని రెండవ యుపమానము. శివునివెంట నాయనకుమారులవలె ననుటచేఁ గుమారులు తండ్రివెంట నెంత చనువుతోఁ బోదురో యంతచనవునఁ బోయి రని భావము.

కుమారవిశాఖులు రుద్రపుత్రు లనుటకు—

తతో భవ చ్ఛతుర్మూర్తిః క్షణేన భగవా౯ ప్రభుః
స్కందో విశాఖ శ్శాకశ్చ నైగమేషశ్చ పృష్ఠతః॥ అని భారతము.

తాత్పర్యము.

(ఇందుఁ బ్రయాణమైపోవు రామలక్ష్మణులు వర్ణింపఁబడుచున్నారు.) చేత విండ్లు ధరించి తల కిరువంకల రెండుమూఁపులమీఁద రెండంబులపొదులు బిగించి మూఁడుతలలపాములవలెఁ గాన్పించుచు వ్రేళ్లకు దెబ్బ తగులకుండునట్లు తిత్తులు దొడిగికొని తమదేహకాంతులు పదిదిక్కుల వ్యాపింపఁగా దేహమునిండ నాభరణములు ధరించి సౌందర్యమున మన్మథు నతిశయించి నడికట్టులందు ఖడ్గములు చొనిపి బ్రహ్మదేవునివెంటఁ బోవు నశ్వినీదేవతలవలె శివుని వెనుకఁబోవు కుమారస్వామివిశాఖులవలె నుండు శ్రీరామలక్ష్మణులను విశ్వామిత్రుఁడు తోడుకొని పోయెను.

—* విశ్వామిత్రుఁడు రామునకు బలాతిబల లను విద్యల నిచ్చుట *—

మ॥ అరుగంగా నిటు సార్ధయోజనము ధ్యా•తాత్మస్వరూపాఢ్యుఁడు౯
సరయూదక్షిణతీరధారిణిని జం•చన్మాధురీవాఃశిఁ బ్రే
మ రఘూత్తంసుని రామచంద్ర! రఘురా•మా! యంచు నోవత్స! నీ
కరనీరేజముల౯ జలంబుఁ గొనుమా • కానిమ్ము జా గేటికి౯? ౬౧౪

సార్ధయోజనము = ఒకటిన్నరయామడ - (ఆఱుక్రోసులు) ఆమడను కొంద ఱెనిమిది, కొందఱు పది మైళ్ళని చెప్పినట్లు.

"Yojana is a measure of uncertain length variously reckoned as equal to nine miles, five and a little less"—Gorresio page 5

యోజనక్రోశపరిమాణములు భిన్నభిన్నములుగా నున్నవి. సార్ధయోజన, మనటచే నిది గోప్రతారతీర్థముకే వని యేర్పడుచున్నది (చూ.ఉత్త-౧౬౫౦). ధ్యాతాత్మస్వరూపాధ్యుఁడుర్ = పర ఆత్మ స్వరూపమును ధ్యానించువారిలో శ్రేష్ఠుఁడు; సరయూదక్షిణతీరధారిణిని = సరయూనదియొక్క దక్షిణపు టొడ్డుప్రదేశమున, చంచత్ మాధురీవాణిర్ = ప్రేమచేఁ దొట్రుపడుచున్న తియ్యని పలుకుతో - రామ యనునది వినను పలుకను దియ్యనైనది. వత్స = నాయనా; కరనీరేజములర్ = కమలములవంటి చేతులందు, జాగు = ఆలస్యము, సరయూనదీతీరముననే యయోధ్య యున్నది. విశ్వామిత్రుఁడు పోవురేవు దూరమం దున్న దని గ్రహింపవలెనుగాని యూరికినే యొకటిన్నరయామడ యున్నదా? యనరాదు. ఏటికి నెన్ని యోరేవులు. ఒక్కొక్క యూరికి నొక్కొక్క రేవు. జాగేటికిర్ = ఉన్నట్టుండి నాయనా చేతనీళ్లు తీసికొమ్మనఁగా దేనికైనది యర్థముగాక శ్రీరామచంద్రమూర్తి యూరకుండఁగా విశ్వామిత్రుఁడు తీవరించుచున్నాఁడు. ప్రొద్దు గ్రుంకవచ్చినది. రాత్రులందు మంత్రము లుపదేశింపరాదు. కావున విశ్వామిత్రుఁడు తీవరించెను. అభిజిత్సర్వదోషఘ్న మ్మని యభిజిల్లగ్నమందు బయలుదేఱి యుండిన ౧౫ మైళ్లు నడచుటకు బాలురుకావున ౫ ఘంటలు పట్టియుండును కావున నస్తమానసమయము.

తా త్ప ర్య ము.

విశ్వామిత్రుఁడు శ్రీరామలక్ష్మణులఁ దోడుకొని యొకటన్నరయామడపోయి సరయువుదాఁటి దక్షిణపుటొడ్డుచేరి తియ్యనిమాటలతో 'రామచంద్రా! రఘురామా' యని పిలిచి, 'నాయనా నీచేత నీళ్లుతీసికొమ్ము,ఏల యాలస్యముచేసెదవు?

క౦॥ తెప్పున బల యతిబల యను, నొ ప్పగుమంత్రముల నీకు • నుపదేశింతుర్
దప్పియు నాఁకలి శ్రమమే, న్నప్పుడు పరియింపఁ ద్రోవ • నడచెడివేళన్. ౬౧౫

అర్థము - సుగమము.

బలాతిబలమంత్రము.

బలాతిబలయోః విరాట్పురుష ఋషిః । గాయత్రీ దేవతా । గాయత్రీ ఛందః । అకారోకారమకారా బీజాద్యాః । క్షుధాదినిరసనే వినియోగః । క్లామిత్యాది షడంగన్యాసః। ధ్యానమ్॥ అమృతకరతలార్ద్రౌ సర్వసంజీవనాధ్యౌ

వపుహరణసుదక్షౌ వేదసారేమయూఖే । ప్రణవమయవికారౌ భాస్కరాకారదేహౌ సతత మనుభవేఽహం తౌ బలాతీబలేశౌ । ఓం హ్రీం బలే మహాదేవి హ్రీం మహాబలే క్లీం చతుర్విధపురుషార్థసిద్ధిప్రదే తత్సవితుర్వరదాత్మికే హ్రీంవరేణ్యం భర్గో దేవస్య వరదాత్మికే-అతిబలేసర్వదయామూర్తే బలేసర్వక్షుద్భ్రమోపనాశిని ధీమహి ధియోయోనర్జాతే ప్రచుర్యాప్రచోదయాత్మికే ప్రణవశిరస్కాత్మికే హుంఫట్ స్వాహా। ఏవం విద్వాన్ కృతకృత్యో భవతి । సావిత్ర్యా ఏవ సలోకతాం జయతి॥ ఇత్యుపనిషత్ । ఆప్యాయన్త్వితి శాంతిః॥

తాత్పర్యము.

అస్తమానము కావచ్చినది కావున శీఘ్రముగ నీకు బల - అతిబల యను రెండుమంత్రముల నుపదేశించెదను. వానిని నీవు పఠించితివేని త్రోవ నడచు సమయమందు బడలిక తోఁపదు, ఆకలి గాదు, దప్పియుఁ గలుగదు.

చం॥ నిదురను బూని యున్నయెడఁ, నేనిఁ, బ్రమాదమునందునేని, నా
పద లొాదవింప లే వసురఁపంక్తులు నీకు, భుజాబలంబునన్
సదృశులు గల్గ రెయ్యెడల, జ్ఞానమునన్ సుభగత్వవీర్యసం
పదలను ధీరతాప్తి నసఁమానుఁడ వయ్యెదు, కీర్తి హెచ్చెడిన్. ౬౧౬

ప్రమాదము = హెచ్చరిక తప్పినసమయము; సదృశులు = సమానులు. సుభగత్వ వీర్యసంపదలను = సౌందర్య పరాక్రమ సంపదలందు; ధీరతాప్తి= ధైర్యమందు. 'ద్వాపరా ద్వయోః । భుజబాహూ ప్రవేష్టోదోఃస్యాత్' అని యమరుఁడు. భుజ భుజా యని రెండురూపంబులు గలవు. అట్టులే బాహూ బాహు లని రెండురూపంబులు.

తాత్పర్యము.

ఆమంత్రములవలనఁ గలుగు ఫల మింతయకాదు. నీవు నిద్రపోవుచున్నను హెచ్చరిక తప్పి పరధ్యానముగ నున్నను రాక్షసులు నీకుఁ గీడు గలిగింపలేరు. భుజబలమందు నీకు సమాను లుండరు. సౌందర్యవీర్యములందును నసమానుఁడ వయ్యెదవు. నీకీర్తి లోకమున నతిశయించును.

కం. ధీమహిమ యుక్తిపటుత య,సామాన్యం బగును వీని జ్ఞానజననుల్
నీమదిఁ బరించి తేని, పి,తామహసుత లివి యటంచుఁ దలఁపుము మదిలోన్. ౬౧౭

ధీమహిమ=బుద్ధి బలముయొక్క గొప్పతనము. యుక్తిపటుత=యుక్తి సామర్థ్యము - జ్ఞానజననుల్=జ్ఞానము కలిగించునవి - ఇవి పితామహసుతలు=బ్రహ్మ

దేవుని పుత్రికలు - సామాన్యములైనవి కావు. "భృశాశ్వస్యతు దేవర్షే ర్దేవ ప్రహరణాస్సుతాః॥ వి. పు. ౧. ౧౫. ౩౭

తా త్ప ర్య ము.

ఈ మంత్రములు బ్రహ్మ సృజించినవి కావున సామాన్యములని యెంచకుము. వీనివలన బుద్ధిబలము యుక్తిచాతుర్యము లోకోత్తరములగును. ఇవి జ్ఞానమును కలిగించును.

ఉ. పావనధర్మనిష్ఠఁ దగు ♦ పాత్రము నీవ గ్రహింప నీమనుల్,
గావున నిచ్చెదం గొనుము ♦ కాలవిలంబన మేల, నీమదిన్
భావన సేయు కార్యము ల♦వశ్యము చేకుఱు, సందియంబు లే
దో వరశీల! పెక్కుగతు ♦ లుర్విఁ జెలంగుత నీకు నిచ్చుటన్. ౬౧౮

పాత్రము=యోగ్యుఁడవు, మనుల్=మంత్రములు - విలంబనము=ఆలస్యము; మంత్రార్థమున మను శబ్ద మప్రయుక్తమని యలంకారశాస్త్రమం దున్నను బూర్వకవి ప్రయోగములు కలవు. అదియునుగాక 'అప్రయుక్తస్వదోషస్తు నవిరుద్ధో హరేర్మతే' యని కారికయుఁగలదు. అప్రయుక్తదోషము లేదని భాష్య కారుల వచనమును గలదు.

తా త్ప ర్య ము.

మహామంత్రములు జపించువారి కుండవలసిన బ్రహ్మచర్యము ధర్మబుద్ధి లోనగు సద్గుణములు నీయం దున్నవి. కావున వీని నిచ్చెదను. ఆలస్యము చేయకుము. నీవు తలఁచిన కార్యము లన్నియు ఫలవంతమగును. సందేహము లేదు. వీని నీ కిచ్చుటచేఁ బాత్రునకు దానము చేయువాని కెట్టి గతులు గలుగునో యట్టి యుత్తమగతులు నీవలన నాకుఁ గలుగును. (2) ఈ మంత్రములు లోకమున బహువిధముల వ్యాపించును.

దీనివలన మంత్రోపదేశముఁ గొనువాఁడు శుచియై యాచమించి యేకాగ్ర చిత్తమున గ్రహింపవలయునని సూచన. మంత్రములు పాత్రునకే యుపదేశింప వలెను. ఉపదేశముఁగొన్న శిష్యుఁడు కొంతకాలమైన గురుశుశ్రూష చేయవలయు నని దీనివలన నేర్పడుచున్నది. లేనిచో నవి వ్యర్థములు.

మ॥ అని బోధింప జలంబు వార్చి శుచి యై ♦ యారామచంద్రుండు గై
కొని యామంత్రయుగంబు నొప్పె శరద♦ర్కుంబోలి తేజానఁ, జ
య్యనఁ గావించె గురుప్రయుక్త మగుకా♦ర్యం బంతయున్, రాత్రి యె
ల్లను నాముపృరుఁ బుచ్చి రంద సుఖలీ♦లాలోలచిత్తంబులన్. ౬౧౯

వార్చి = ఆచమించి; శరదర్కుంబోలి = శరత్కాలమందలి సూర్యునివలె - శరత్కాలమందు మబ్బులుండవు. కావునఁ దేజస్సెక్కువ. గురుప్రయుక్తమగు కార్యము = మంత్రోపదేశముచేసిన గురువు పాదములు కడిగి తీర్థము తీసికొనుట పాదము లొత్తుట లోనగు కార్యములు.

తా త్ప ర్య ము .

అని బోధింపఁగా శ్రీరామచంద్రమూర్తి యాచమించి శుచియై యా రెండు మంత్రములను గ్రహించి తేజమునందు శరత్కాలసూర్యునివలెఁ బ్రకాశించెను. ఆవల గురువు చెప్పిన కార్యమంతయుఁ గావించెను. రాత్రియంతయు నా మువ్వురా నదీతీరమందే సుఖముగాఁ గడపిరి.

ఈ మంత్రముల బలమువలన వారి కాహారచింత లేదయ్యెను. శ్రీరామునకుఁ జెప్పినపు డుపలక్షణముగా లక్ష్మణునకును జెప్పినాఁడనియే గ్రహింపవలెను. లేదా రామచంద్రమూర్తి లక్ష్మణున కుపదేశించె ననియైన గ్రహింపవలెను.

తే॥ అపుడు దశరథవసుమతీ♦శాత్మజులకు, ననుచితపుఁదృణశయనీయ♦మందుఁగూడ
బండువారికిఁగౌశిక♦వాక్యలాలి,తులకు నా రేయి సౌఖ్యంబు ♦ గలుగఁ జేసె. ౬౨౦

దశరథవసుమతీశాత్మజులకున్ = దశరథరాజకుమారులకు, అనుచితపుఁదృణశయనీయమందున్ = రాజకుమారులు పండుకొనుటకు యోగ్యముగాని పచ్చికపడకయందు. కూడన్= విశ్వామిత్రునితో, పండుకొనినవారికిన్=పండుకొనినవారికి, తదర్థారక క్రియ మూఁడుకాలములందు నన్వయించును. కౌశికవాక్యలాలితులకు = విశ్వామిత్రునిచే బుజ్జగింపఁబడినవారికి- విషమాలంకారము. దీనివలన రామలక్ష్మణుల జితేంద్రియత్వము తెలియవచ్చెడిని - ఈ పద్యమందుఁ దృణశయనీయ మని చెప్పినను ౬౨౧ పద్యమందుఁ దృణపర్ణశయ్యను జెప్పుటచే నిచ్చటను గడ్డి ఆకులు కలిసిన శయ్యయందే పరుండిరని తెలియవలెను. ఇట్టివీ గ్రంథమందుఁ బెక్కులు గలవు. అనభిజ్ఞులు పూర్వోత్తరవిరుద్ధమని భ్రమింతురు. ఇది మొదటిరాత్రి.

దీనివలన శిష్యులు గురుసన్నిధి నుండునపుడు తా మెంత గొప్పవారైనను గురువునకంటె నెక్కువగ సుఖభోగములను గోరరాదని సూచన.

తా త్ప ర్య ము .

దశరథమహారాజకుమారు లగుటచే నాగర్భశ్రీమంతులు, సుకుమారులు, కష్టమెన్నఁడు నెఱుఁగని వారయ్యు, నట్టివారికి యోగ్యముగాని పచ్చిగడ్డి

మీఁదఁ బరుండి విశ్వామిత్రుఁడు బుజ్జగింపుమాటలు చెప్పుచుండఁగా హాయిగా నిద్రించిరి.

—* ౨౩- వ సర్గము *—

కం॥ తెలతెలవాఱఁగ మెల్లని, నలినాసనసన్నిభుండు ♦ నవతృణపర్ణా
కలితశయనంబులన్ రవి,కులజులఁ గని వారి డాసి ♦ కూర్మిం బలికెన్. ౬౨౧

నలినాసన సన్నిభుండు=బ్రహ్మతో సమానుఁడు. నవతృణ పర్ణాకలిత శయనంబులన్=క్రొత్తపచ్చిక యాకులు- వీనితోనైన పడకలయందు. రవికులజులు=సూర్యవంశమునందుఁ బుట్టినవారు. రవికులజులుగావున రవి యుదయింపఁగా వీరు నిద్రించుట సరిగాదని - తెలతెలవాఱ ననఁగా నరుణోదయ మైనదని యర్థమేగాని సూర్యుఁ డుదయించినాఁడని యర్థముకాదు. సూర్యుఁ డుదయింపఁగా నిద్రించు ద్విజుఁడు "శ్లో॥ సుప్తే యస్మిన్నస్తమేతి సుప్తే యస్మిన్నుదేతిచ। అంశుమానభినిర్ముక్తా, భ్యుదితౌ తౌ యథాక్రమమ్॥ అమరము. ఎవఁడు నిద్రించుచుండఁగా సూర్యుఁడస్తమించునో వాఁడు అభినిర్ముక్తుఁడు ఎవఁడు నిద్రించుచుండఁగా సూర్యుఁడుదయించునో వాఁడు అభ్యుదితుఁడు. వీరిరువురు పాపులే. "తంచే దభ్యుదయాత్సూర్యః, శయానం కామచారతః, నిమ్లోచేద్వాప్య విజ్ఞానా, జ్జపన్నుపవసేద్దినమ్" ఒకఁడు మైమఱచి నిద్రించినపుడు సూర్యుఁ డుదయించెనేని గాయత్రీజపంబాచరించుచుఁ బగలంతియు నుపవసించి రాత్రి భుజింపవలయును. "శ్లో॥ సూర్యేణ హ్యభినిర్ముక్తః, శయానోఽభ్యుదితశ్చయః, ప్రాయశ్చిత్త మకుర్వాణో, యుక్తః స్యాన్మహతైనసా॥ సూర్యుఁ డుదయించుచుండఁగను నస్తమించుచుండఁగఁగాని నిద్రించువాఁడు పాతకముగలవాఁ డగును. ఆపాపము పోవుటకై ప్రాయశ్చిత్త మొనరింపఁడేని మహాపాపముతోఁ గూడినవాఁడగును. మనుస్మృతి అ. ౨. ౨౨౦ - ౨౨౧.

తాత్పర్యము.

దిక్కు లరుణోదయ వేళఁ దెల్ల నగుచుండఁగా విశ్వామిత్రుఁడు లేఁతపచ్చిక యాకులు పఱచుకొని పండుకొనియుండు నా సూర్యవంశరాజకుమారుల రామలక్ష్మణులను సమీపించి ప్రేమతో నిట్లనియె.

కం. కౌసల్యాసుప్రజ! రా,మా! సరసిజనయన లెమ్ము ♦ మా నగుఁ బ్రాక్సం
ధ్యాసమయము నరపుంగవ, వాసిగ దైవాహ్నికంబు ♦ వలయుం జలుపన్. ౬౨౨

సుప్రజ=మంచిబిడ్డను గన్నది. కౌసల్యా సుప్రజ ఎవనిని గనుటచేఁ గౌసల్య సుప్రజ యయ్యెనో యట్టి రామా=రామచంద్రా - ఈయర్థము చెప్పవలయునే

కాని కౌసల్యయొక్క మంచికుమారుఁడాయని షష్ఠ్యర్థమునఁ జెప్పరాదు. రామచంద్రమూర్తినిఁ గనుటవలనఁ గౌసల్య ప్రసిద్ధికెక్కి ధన్యురాలయ్యెఁగాని కౌసల్యకుఁ బుట్టుటచే రామచంద్రమూర్తి ధన్యుఁడు కాలేదు. కవి యీయర్థమందే ప్రయోగించె ననుట కితరప్రయోగములు కలవు. అయోధ్యాకాండము ౭౦ స. ౧౭ శ్లోకము గచ్ఛ తాతానుజానే త్వాం, కైకేయీ సుప్రజాస్త్వయా! యని కలదు.

తండ్రి పేరు స్మరింపక తల్లిపేరు చెప్పఁ గారణమే మన:—

౧. స మయా బోధిత శ్శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః" సుందర. ౬౩౦వ స. శ్రీమంతుఁడును సుఖముగా నిద్రించువాఁడును శత్రువులఁ దపింపఁజేయువాడును నగు శ్రీరాముని నేను నిద్రలేపితి నని సీతాదేవి చెప్పినట్లు శ్రీరామచంద్రమూర్తి నిద్రించునపుడును భక్తులకు శ్రీమంతుఁడుగాను శత్రువులకుఁ దపింపఁ జేయువాఁడుగను గానవచ్చును. కావున సుఖముగ నిద్రించు శ్రీరాముని లేపఁ బోయిన విశ్వామిత్రుఁ డాయన నిద్రాకాలికసౌభాగ్యసంపత్తిని జూచి తాను వచ్చిన కార్యము మఱచి నివ్వెఱగొని యాహా! యిటువంటి శ్రీమంతునికిఁ దల్లి యగుటకుఁ గౌసల్యాదేవి యేతపములు చేసెనోకదా యని విస్మయపడుచు కౌసల్యాసుప్రజ యని సంబోధించెను.

౨. కౌసల్యయొద్దఁ బండుకొను బాలుఁడు కావున నామెపేరు విని నంతన తల్లియే వచ్చినదని సంతోషముతో లేచు నని భావము. హనుమంతుఁడు సీతాదేవిని మేల్కొల్పుటకు నిట్టులేకదా 'రాజా దశరథోనామ' యని ప్రారంభించెను.

౩. ఇది ముని తనలోఁ దా ననుకొన్నదిగానైనఁ జెప్పవచ్చును. "అమిత తేజుఁడైన యీ పుత్రకునిచేతఁ గోసలేంద్రతనయ గౌమరువిూఁత్రా" నని చెప్పఁబడెనుగదా. బాల-౧౦౨-స.

౪. ఊరక రామా యని పిలిచిన నది పరశురామున కన్వయించును గావున నట్లన్వయింపకుండుటకై 'కౌసల్యా సుప్రజ రామా' యని పిలిచెను.

౫. 'మాతా పుత్రస్య భూయాంసి కర్మాణ్యారభత' యన్నట్లు పుత్రునకు సమస్తకార్యములు చేయునది తల్లియే - కావునను,

౬. 'మాతృదేవో భవ పితృదేవోభవ' యని తండ్రికంటె ముందు తల్లియే శ్రేష్ఠురాలుగాఁ జెప్పఁబడుటను,

౭. 'పితు శ్శతగుణం మాత' యని తండ్రికంటెఁ దల్లి నూఱంతలు హెచ్చని స్మృతివాక్య ముండుటచేతను,

౮. విశ్వామిత్రుఁడు "ఏ నెఱుంగుదు రాజేంద్ర యీమహాత్ము"నని శ్రీరాము మహిమ చెప్పినను దశరథుఁడు తెలిసికొనలేకపోయి వసిష్ఠుఁడు బలవంతపెట్టుటచే రామచంద్రమూర్తిని బంప నియ్యకొనెను. కౌసల్యయో విశేషపుత్రవాత్సల్యము గలదయ్యును సాదరముగ జాగులేక యంగీకరించెను. తల్లి యెక్కువ చిక్కులు పెట్టునేమో యని సందేహించుచున్న విశ్వామిత్రుఁ డామెగుణమహిమ కబ్బురపోయెను. అది స్మరించి యిప్పు డామెపేరు స్మరించెను.

తల్లిదండ్రులిద్ద ఱనుమతించినను 'నడవులకు నేనబోన, కాయగసురులు తిని నేలపైఁ బరుండలేను' అని రామచంద్రమూర్తి మొండికివేసికొని యేమనునారంభించిన విశ్వామిత్రుఁ డేమి చేయఁగలఁడు? అటుగాక తల్లిమాట తండ్రిమాట జవదాఁటరాదు. కష్టమో సుఖమో వారు చెప్పినట్లు చేయుటే పుత్రులకు ధర్మమనునది స్వానుష్ఠానముచే రామచంద్రమూర్తి బాల్యమునందే లోకమునకుఁ దెలుపఁబూనెను. గావున సుప్రజ = మంచిబిడ్డఁ డని విశ్వామిత్రుఁ డనెను.

దాశరథీ యని కాని కౌసలేయ యనికాని రాఘవా యనికాని పిలువక, రామా యనుటకుఁ గారణము నిద్రించునప్పుడుకూడ రాముని సౌందర్యమునకు నచ్చెరువు పడియే రామా యనుపదమునఁ బిలిచెను. ప్రాక్సంధ్యాసమయము; మానగుణ = సర్వలోకవంద్యుని, తమస్సంహారుని, అజ్ఞాననిరసనకరుని నిన్నుఁ గౌసల్య యెట్లు కనెనో యట్లు సర్వలోకవంద్యుని నంధకారనిరసనకరుని తమస్సంహారుని సూర్యుని బూర్వదిశయుఁ గనుచున్నది. నీవు జగత్పద్మప్రబోధకరుఁడవు. సూర్యుఁడు పద్మప్రబోధకరుఁడు. నిన్నుఁ గని కౌసల్య యెట్లు గౌరవింపఁదగిన దయ్యెనో యట్లె పూర్వసంధ్యయు గౌరవింపఁదగియున్నది. కావున లెమ్ము. సూర్యుఁ డెట్లు విరోధుల మందేహాదిరాక్షసుల నిరసింప నున్నాఁడో నీవు నట్లే విరోధుల రాక్షసుల నిరసింప వలసినవాఁడవై యున్నావు. కావున లెమ్ము. రాత్రి యనునజ్ఞానాంధకారము పోయెను. భగవత్సాక్షాత్కారము పూర్తిగాఁ గావలసినసమయము తటస్థించినది. కావున లెమ్ము. పెద్దవెల్లువవచ్చినపుడు గుంతలు మిట్టలుగా జలమయ మైనట్లు కేవలశుద్ధసత్త్వమూర్తివి నీ వవతరించుటఁజేసి ప్రపంచమున సత్త్వగుణ ముద్రేకించుకాలమైనది. అట్టులే సూర్యుఁ డుదయించి లోకమును దనప్రకాశముచే నిండింపనున్నాఁడు. కావున లెమ్ము. 'అద్యమే సఫలం జన్మ సుప్రభాతాచ మే నిశా, యదున్నిద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్రక్ష్యామ్యహం ముఖమ్' (వికసించిన కమలమువంటికన్నులుగల విష్ణుని ముఖము చూడఁ గంటిని గావున) ఇప్పుడు నాజన్మము సఫలము, నారాత్రి తెల్లవాఱెను, అనునది యనుసంధింపవలెను.

నీవు నిద్రించునపుడు నీదివ్యముఖారవిందసౌందర్యలక్ష్మిని సేవించితిని. నీవు మేల్కొను నప్పటి సౌందర్యలక్ష్మిని సేవింపఁ గోరిక కలదు. అన్నివిధముల సేవ లేకాంతమునఁ జేయవలనుపడు ననికదా నిన్నిట్లు పిలుచుకొని వచ్చితిని. కావున లెమ్ము.

సరసిజనయన=కమలములవంటి కన్నులు గలవాఁడా! లోకమున సూర్యోదయసమయమునకుఁ గమలములు వికసించుచుండ నీనయనకమలములు వికసింప కుండుట ధర్మముకాదు. కావునఁ గన్నులు తెఱచి లెమ్ము. 'కప్యాసం పుండరీకమక్షిణీ'యన్నట్లు ముఖసూర్యబింబము ప్రక్కన నందుకనుదమ్ములు ముకుళించి యుండుట స్వభావవిరుద్ధము. కావునఁ గన్నులు తెఱచి లెమ్ము. నీవు కన్నులు మూసి నిద్రించితివేని లోకమంతయు నిద్రించును. నీవు కన్నులు విచ్చిన లోకమంతయు వికాసముపొందును – కావున లెమ్ము.

రామా! నీముఖమే యమృతసరస్సు. అందలికమలములే నీనయనములు. అర్థములు పొందించునవికదా నయనములు? అట్టులే నీనయనములవలన (నీదృష్టిసోఁకుటచే) నేన-లోకము- ఇష్టార్థములుపొందఁ గాచియుండుటచేఁ గన్నులు తెఱచి లెమ్ము. "నీయతే అనేన - నయనం" అని నయనశబ్దవ్యుత్పత్త్యర్థము.

నయనరశ్మి లోకపదార్థముపైఁబడి దానియాకారము గ్రహించుటచే నాపదార్థము గానవచ్చుచున్నది. కావుననే కదా పసిరికలుగలవానికి శంఖము పచ్చగాఁ గానవచ్చుచున్నది.

నరపుంగవ=మానవశ్రేష్ఠుఁడా! నీవు నారాయణుఁడవైనను నరవేషము వేసి నరలోకమునకు ధర్మమార్గ మనుష్ఠానముచేఁ జూపుటకై యవతరించినవాఁడవు గావున సంధ్యాకృత్యములు దీర్ప లెమ్ము. నరపుంగవా! లెమ్ము=మానవశ్రేష్ఠుఁడా! లెమ్ము. మనుష్యులందు నీవుశ్రేష్ఠుఁడవు గావున తక్కినవారికి నీవుమార్గదర్శివి కావలసినవాఁడవై యున్నావు. 'యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః' శ్రేష్ఠుఁ డేదేదిచేయునో తక్కినవా రది యట్లే చేయుదురు. కావున లోకము చెడకుండుటకై నీవు సమయమునకు సంధ్యాకృత్యములు నిర్వహింప లెమ్ము. నరపుంగవ లెమ్ము=ఆశ్రితవిరోధుల నిరసించునీకు నిద్రకవకాశమెక్కడిది? ఆశ్రితు లెవ్వరు లేరు కానేపు నిద్రపోవుద మని తలచితివా? ప్రక్కన నేను గాచియే యున్నానే - కావున లెమ్ము - నాకార్యము చేయవలసియున్నదికదా?

ప్రాక్సంధ్యాసమయము=I. సంధ్యాసమయమునకు ముందుచేయవలసినకార్యములు గలవు. II. తొలిసంధ్యాసమయమునఁ జేయవలసినవి గలవు. లెమ్ము - ఏమికార్యము లందువాన్నిదే వాహ్నికంబు=సర్వేశ్వరవిహితనిత్యకర్మము - నీకు

సంబంధించినవై నీయాజ్ఞారూపకకర్మములు నేను జేయవలయును. నీవు లేచినఁ గదా నేను జేయఁగలుగుదును. వానిని స్వీకరింప లెమ్ము. III. దేవారాధనభూత కర్మము పగలుచేయవలసినది. మానగుణ్=చక్కఁగా లోపములేకుండునట్లు - ఆసమయమునకు లేచి తొందరతొందరగాఁ గార్యము లడావిడిచేయక ముందు గనే లేచి చక్కఁగాఁ జేయవలయును. చలుపఁజ వలయుణ్=చలుపవచ్చును అని యనుమతి కాదు. చలుపవలయుణ్ విధి - చేయకుండినఁ బ్రత్యవాయముకలదు. కావున లెమ్ము.

తాత్పర్యము.

కౌసల్యానందనా! రామా! కమలలోచన! తొలిసంజ వర్తించుచున్నది. నరోత్తమా! దేవతాకార్యము సంధ్యావందనము నిర్వహింపవలయును గదా, లెమ్ము.

సీ॥ అని యిట్లు కౌశికుఁ • డాదరంబునఁ బల్కు, విని లేచి రఘుకుల•వీరు లంత
సరయువునం గృత•స్నానులై యుదకంబు, వారిచి పరమజ•పంబు నిష్ఠ
జపియించి యర్ఘ్యాది•సకలక్రియల్ దక్కు,నాహ్నికంబులు దీర్చి • యమలమతిని
వరతపోధనుని వి•శ్వామిత్రునిఁ జూచి, యభివాదన మొనర్చి•హర్షమునను
తే॥ బయన మొనరింపనూల్కొను•బాలురఁగని, తోడుకొంచేగుచుండ నా•త్రోవలోన
రాచకొమరులుగాంచి రం•బ్రంబు గదుర,సరయుసంగమభూమిని•జహ్నుతనయ. ౬_౨౩

విని=నిద్రపోవుచుండిరేని విశ్వామిత్రుని వాక్యములు వినఁబడవు, కావున రామలక్ష్మణులు మేలుకొని లేచుటకు సిద్ధపడి. 'ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే' యనుమంత్రమును జెప్పుకొనుచుండి రనిభావము. స్నానమునకు ముందును నాచమనము ప్రాణాయామము కర్తవ్యములే-కావున నుదకంబు వారిచి కృతస్నానులై యనియు వారిచి=అర్ఘ్యమిచ్చి,పరమజపంబు నిష్ఠనలిపిరనియు నన్వయింపవలయును.జపము నకు ముందుగదా యర్ఘ్యమన వారు'గుఱకపెట్టినిద్రపోయి'యన్నట్టులన్వయించు కొనవలయును. వారిచి=ఆచమించి, పరమజపము=గాయత్రీమంత్రము 'న గాయత్ర్యాః పరంజప్యం'గాయత్రికంటెజపింపవలసిన శ్రేష్ఠమంత్రములేదు.అర్ఘ్యము= జపాంతమున నర్ఘ్యము, ఆహ్నికంబులు=పగలుచేయవలసినకర్మములు-తర్పణాదులు, అభివాదనమొనర్చి = పేరుచెప్పుచునమస్కరించి, నూల్కొను = ప్రయత్నపడు- ఉత్సహించు, అబ్రంబు=అబ్బురము - ఆశ్చర్యము.

నిద్రపోవువారు మేలకువరాఁగానే తటాలున తేవక "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే, దేవయంతస్త్వేమహే ఉపప్రయంతు మరుత స్సుదానవః ఇంద్రప్రాశూర్భవా

శుచా, ప్రైతు ర్బ్రహ్మణస్పతిః ప్ర దేవ్యేతు సూనృతా అచ్ఛా వీరంనర్యం పంక్తి రాధసం దేవా యజ్ఞం నయంతు వః॥

వసురసో్య విభూరసి, ప్రాణే త్వమసి సంధాతా బ్రహ్మ స్త్వమసి విశ్వసృ, తేజోదా స్త్వమస్యగ్నే, ర్వర్చోదా స్త్వమసి సూర్యస్య, ద్యుమ్నోదా స్త్వమసి చంద్రమస ఉపయామగృహీతోసి బ్రహ్మణే త్వా మహస ఓ మిత్యాత్మానం యుంజీత॥—అోమ్మున కుడిచేయియుంచి యివి జపించి యావల లేవవలయును.

అభివాదనమొనర్చి యనుటచే శిష్యులు గురువున కుదయమున శుచులై నమస్కరింపవలయు నని సూచన. ఇట్లు దినదినము పెద్దలకు గురువులకు నమస్కరించువారికి ఆయువు యశస్సు ప్రజ్ఞ బలము హెచ్చును.

శ్లో॥ అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః,
"చత్వారి తస్య వర్ధంతే హ్యాయుః ప్రజ్ఞా యశో బలమ్." —మనువు.

తాత్పర్యము.

ఈ ప్రకారము విశ్వామిత్రుఁడు ప్రీతితోఁ బలుకఁగా శ్రీరామలక్ష్మణులు విని, లేచి, యాచమించి, సరయువునందు స్నానము చేసి, యాచమించి గాయత్రి జపించి, యర్ఘ్యము మొదలైనకార్యములుదీర్చి, నిర్మలములైన మనస్సులతో విశ్వామిత్రునొద్దకుఁ బోయి నమస్కరించి సంతోషమునఁ బ్రయాణముసేయ నుత్సాహపడుచున్న పిల్లవాండ్రను దోడుకొని పోవుచుండఁగా, నారాజకుమారులు గంగాసరయూసంగమమును జూచి యచ్చెరువుపడిరి.

ఉ॥ అచ్చట నుగ్రతేజులు మ • హర్షు లనేకసహస్రవర్షముల్
పొచ్చెము లేనినిష్ఠలను • బూని తపం బొనరించి రాస్థలిఁ
సచ్చరితుల్ రఘూద్వహులు • సంతసమారఁగఁ గాంచి యాత్మలో
హెచ్చెడికౌతుకంబుమెయి • నిట్లని రా మునిసార్వభౌముతోన్. ౬౨౮

జనశ్రీ × శ్రేష్ఠులు = తీవ్రమైన తేజస్సుగలవారు పొచ్చెము = కొఱఁత.

తాత్పర్యము.

ఆస్థలమందు తీవ్రతేజు లయిన మహర్షులు పెక్కువేలయేండ్లు కొఱఁతయులేని నిష్ఠఁబూని తపస్సుచేసిరి. మంచి నడవడిగల రామలక్ష్మణులు సంతోషముతో దానిని జూచి తెలిసికొనఁగోరికతో మునీంద్రునితో నిట్లనిరి.

క॥ ఈపుణ్యాశ్రమ మేరిది?, యేపురుషుం డిట వసించు • నెప్పుడుఁ? గుతుకం
బేపారె దీని వినఁగ మ,హాపురుషా! యెఱుఁగఁ జెప్పు•వయ్యా మాకున్. ౬౨౯

తాత్పర్యము.

ఈ పుణ్యప్రద మయిన యాశ్రమ మెవరిది? ఎవ్వఁ డిచ్చట నుండును? ఇది తెలిసికొన నాశ యగుచున్నది. మహాత్మా! మాకుఁ జెప్పుము.

—⁕ విశ్వామిత్రుఁడు రామునకు నంగదేశవృత్తాంతముఁ దెల్పుట ⁕—

చం॥ అన విని పిన్ననవ్వు దొలఁకఁ గాడ మునీంద్రుఁడు పల్కు 'రామ! యీ
యనఘమహాశ్రమంబుకథ యంతయు నీకు నెఱుంగఁ జెప్పెదన్
మునుపు మరుండు భాసిలఁగ మూర్తియుతుం డయి స్థాణుఁ డిచ్చటన్
ఘనతప మాచరించె గిరికన్య దమిం బరిచర్య సల్పఁగన్. ౯౨౯

పిన్ననవ్వు=చిఱునవ్వు, మరుండు=మన్మథుఁడు, మూర్తియుతుండు=ఆకారముతోఁ గూడినవాఁడు, స్థాణుఁడు=శివుఁడు, గిరికన్య = పార్వతి.

తాత్పర్యము.

సర్వజ్ఞులయ్యు నేమియుఁ దెలియనివారివలె సన్నగుచున్నారే యనియు, 'నేది యెటుపోయిన మన కేమి మనత్రోవన మనము పోద' మనుకొనక బాలురు విషయములు తెలిసికొనవలయు నని యుత్సాహవంతులై యున్నారు గదా యనియు సంతోషించి చిఱునవ్వుతో విశ్వామిత్రుఁ డిట్లనెను రామా! గొప్పదియుఁ బాపరహితమైనదియు నగు నీయాశ్రమవృత్తాంతము నీకుఁ దెలిపెదను. వినుము. పూర్వకాలమున మన్మథుఁడు స్వరూపముతోఁ గానవచ్చుకాలమందు శివుఁ డిచ్చటఁ దపస్సుచేయఁగా నాయనకుఁ బార్వతి పరిచర్య చేయుచుండెను.

కం॥ ఆతపమునకును విఘ్నము, చేతోభవుఁ డాచరింప శ్రీకంఠుఁడు ప్ర
స్ఫీతం బగుఫాలానలజాతంబునఁ గుమతి భస్మసాత్కృతుఁ జేసెన్. ౯౩౦

ఆతపమునకున్=ఆతపస్సునకు; చేతోభవుఁడు=మన్మథుఁడు, శ్రీకంఠుఁడు=విషము కంఠమందుఁ గల శివుఁడు, 'శ్రీ ర్వేషరచనాశోభాసంపత్సరళశాఖిషు - వాణీలక్ష్మీలవంగేచ - విషే - బిల్వే'.— నానా. శ్రీ=విషము, ఫాలానలజాతంబునన్=నొసటినుండి వెలువడిన యగ్నిజ్వాలలసమూహముచే, కుమతి=కుత్సితమనస్సుగల మన్మథుఁడు - తపస్సులు చెఱుచువారు కుమతులేకదా. భస్మసాత్కృతిన్=బూదియగునట్లు.

తాత్పర్యము.

ఆశివుని తపస్సును దుర్బుద్ధియై మన్మథుఁడు విఘ్నముచేయఁగాఁ గామమును జ్ఞానాగ్నిచే దగ్ధముచేయవలయును గావున నొసటి కంటిమంటలచే నతని శివుఁడు బూదియగునట్లు చేసెను.

చం॥ అదిసుత మేను లేమిని ననంగుఁ డనంగుఁ డనంగ భూమిపై
విదితసమాఖ్యుఁ డయ్యెఁజుమి, యీడుటచే మరుఁ డంగ మిచ్చటన్
సదనులశీల! యియ్యదియు సన్నుతిఁగాంచెను నంగదేశమం,
చిదియ తదాశ్రమం బిట నహీనతపస్వులు రుద్రశిష్యులై. ౬౨౮

అదిసుత = అదిమొదలు, అనంగుఁడు=మన్మథుఁడు, అనంగుఁడు= దేహము లేనివాఁడు అని, విదితసమాఖ్యుఁడు = తెలియఁబడిన పేరుగలవాఁడు

తాత్పర్యము

అదిమొదలుకొని దేహములేనివాఁడగుటచే మన్మథుఁ డనంగుఁ డని ప్రసిద్ధుఁ డయ్యెను. మన్మథుఁ డిచ్చట నంగమును వదలినకారణముచే నీదేశ మంగదేశ మని ప్రఖ్యాతిపడసెను. ఆయాశ్రమ మిదియే ఇచ్చటఁ గొందఱు గొప్పతప స్వులు రుద్రశిష్యులు.

ఆయాశ్రమము=కామాశ్రమము లేక రుద్రాశ్రమము. కొన్ని గ్రంధములందు హిమవంతమునఁ దపస్సుచేయుచుండిన ట్లున్నది దానికి సమాధానము కల్పాంతరవ్యవస్థయే.

కం. తరతరములుగా నుందురు, పొరయవు పాపములు వారిఁ బుణ్యాకృతుల, నేఁ డిరవుగ మన మిచ్చట రే, జరపుచు తే పసురసేటినిఁ జనుఁ దరియింపన్. ౬౨౯

తాత్పర్యము

పెక్కుతరములుగా వంశపారంపర్యముగా నున్నారు. వారు పుణ్యకార్యములు చేయువారు కావున వారిని పాపము లంటవు నేఁ డిచ్చటనుండి.

ఉ॥ పోవుదమయ్య యీసరయుపుణ్యజలంబులఁ గ్రుంకి శుద్ధులై
పావనమంత్రవారము జపం బొనరించి హుతంబు వేల్చి భూ
దేవులదర్శనార్థ’ మని తెల్పుచు నుండఁగ నింగిలోన నా
దేవఋషుల్ తపోవిభవదీర్ఘసుచక్షు లెఱింగి ప్రీతులై. ౬౩౦

క్రుంకి = స్నానముచేసి, వేల్చి = హోమముచేసి, భూదేవులు = బ్రాహ్మణులు, తపోవిభవదీర్ఘసుచక్షువులు = తపస్సంపదచేతఁ గలిగిన దూరపుదృష్టి గలవారు. క్రుంకి శుద్ధులై మంత్రజపం బొనరించి యనుటచే ముందు స్నానము చేయక దేహశుద్ధి మనశ్శుద్ధి లేక మంత్రముల జపింపరా దని యేర్పడుచున్నది. ‘నిత్యోదకసంధ్యా ముపాసీత’ యని యాశ్వలాయనాదులు.

తాత్పర్యము.

తేపు సరయూనదీజలంబుల స్నానంబుచేసి, శుద్ధులమై పవిత్రవంతము లయిన మంత్రముల జపించి, యగ్నిహోత్రకార్యములు దీర్చుకొని, బ్రాహ్మ

ములు దర్శింపఁబోవుద మని చెప్పుచుండునంతలో తపస్సంపదచే దూరదృష్టి గలిగిన యా దేవర్షులు వీరిరాక యెఱింగినవారై బయటికి దేఁటి వచ్చి-

ఉ॥ వారలఁ జేరి యర్ఘ్యమును ♦ బాద్యముఁ గౌశికమౌని కిచ్చి సో
దారత నాతిథేయము ధ♦రాధిపసూనుల కిచ్చినంత స
త్కారము లంది మువ్వురుఁ గ♦థాశ్రవణంబులఁ బ్రొద్దు పుచ్చుచుఁ
వారిచి సంధ్య నిష్ఠను జ♦పంబులు సల్పిరి యర్హపద్ధతిన్ ౬౩౧

అర్ఘ్యము = పూజాద్రవ్యము. "ఆపః క్షీరం కుశాగ్రం చ, దధి సర్పి స్సతండులం, యవః సిద్ధార్థకశ్చైవ, అష్టాంగో ఽర్ఘ్యః ప్రకీర్తితః." జలము - పాలు - దర్భకొనలు - పెరుఁగు - నెయ్యి - బియ్యము - యవలు - ఆవాలు ఇవి యాయ కున్నను కేవలజల మిచ్చినను అర్ఘ్య మిచ్చుట యగును. 'అర్ఘ్యమర్ఘార్థే పాద్యంపాదాయ వారిణి' అర్ఘార్థం వారి అర్ఘ్యం= పూజకొఱకైనజలము. ఇవి కంచుచెంబుల తో నీయరాదు. పాద్యము= కాళ్లుకడుగుకొను నీళ్లు. ఆతిథేయము=అతిథుల కెదురుగాఁబోవుట. రండు - కూర్చుండుఁడు అని గౌరవించుట ఆతిథేయము. ఆతిథ్యము = హవి రాతిథ్య మని యుండుటచే నతిథికి భోజనము పెట్టుట. 'ప్రత్యుజ్జగా మాతిథి మాతిథేయః' స్వధర్మయుక్తం కుటుంబిన మభ్యాగచ్ఛతి ధర్మపురస్సారో నాన్నప్రయోజనః సోఽతిథి ర్భవతి = అన్నమునకై కాక స్వధర్మమునందున్న కుటుంబి యింటికి ధర్మమును బురస్కరించుకొనివచ్చినవాఁ డతిథి, అన్నముమాత్రము కోరువాఁ డభ్యాగతుఁడు - "అభ్యాగతో జ్ఞాతపూర్వః అజ్ఞాతో ఽతిథి రుచ్యతే" యని పూర్వము తెలిసినవాఁ డభ్యాగతుఁడు, క్రొత్తవాఁ డతిథి.

తా త్ప ర్య ము .

వారలను గలిసికొని, విశ్వామిత్రునకు నర్ఘ్యము - పాద్య మిచ్చి రాజకుమారులకు నాతిథేయ మిచ్చి యాదరించిరి. వారుమువ్వు రీవిధముగ బహూకరింపఁబడినవారై కథలను వినుటచేఁ గాలయాపనముచేసి సంధ్యవార్చి నిష్ఠతో గాయత్ర్యాదులు జపించిరి

అనాదిగ మనదేశమందు శివభక్తులు గలరు, విష్ణుభక్తులు గలరు. వారివారి యుపాస్యదేవతను వారువారు గొప్పగ నెంచుచుండి, పరస్పరమైత్రి గలవారై యసూయలేక యుండిరి. ఇప్పుడు భక్తిజ్ఞానములు తక్కువయై దురభిని వేశము మాత్ర మెక్కువగుటచే నసూయాద్వేషములు ప్రబలినవి.

కం॥ కామాశ్రమమునఁ గడు నభి,రామం బగుకథలచేత ♦ రమణీయగుణా
రాముల నిద్దురవుచ్చెను, రాముని లక్ష్మణుని మౌని♦రాజాగ్రణియున్. ౬౩౨

అభిరామము=మనోహరము, రమణీయగుణారాముల౯ = మనోహరములైన కల్యాణగుణములచే వినోదించువారిని. ఇది రెండవరాత్రి.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడు కామాశ్రమమందు మిగుల మనోహరములైన కథలు చెప్పుచు హేయగుణములు లేనివారై మనోహరములైన కల్యాణగుణములు గల రామచంద్రమూర్తిని లక్ష్మణుని నిద్దురపుచ్చెను.

౩౫ సర్గము. విశ్వామిత్రుఁడు రామునకు సరయూవృత్తాంతముఁ దెలుపుట.

సీ॥ వేగుఁబోకను రఘు♦వీరు లాహ్నికములఁ, దీరిచి మున్ను గా♦ధేయుఁ డరుగ
నాతని వెన్నంటి ♦ యరుగుచు జాహ్నవీ,తటరమ్యదేశంబుఁ ♦ దరియ నచటి
సంయమధనులు వి♦శ్వామిత్రునిం జేరి, మహితాత్మ! నావ య♦మర్చినార
మీరలు భూతలా♦ధీశనందనులతోఁ, దరియింపుఁ డీపుణ్య♦తటిని నేల
తే॥ తడవటంచన సరియని ♦ యుడుపమెక్కి,యానదిఁ దరించుచుండమ♦ధ్యంబునందు
భంగసంరంభవర్ధిత♦ప్రబలరవము, నాలకించి రఘూత్తముఁ♦డనియె మునికి. ౬౩౩

వేగుఁబోక=ఉదయమున, ఆహ్నికములు=పగలుచేయవలసిన దేవతాకార్యములును, సంధ్యావందనాదులును, సంయమధనులు = ఇంద్రియనిగ్రహమే ధనముగాఁ గలవారు - తపస్వులు, తడవు = ఆలస్యము, ఉడుపము=నావ - పడవ, తరించుచు=దాఁటుచు, భంగసంరంభవర్ధిత = అలల విజృంభణముచే వృద్ధియయిన, ప్రబలరవము=గొప్పధ్వని, ఆలకించి = విని, శ్రీమద్రామాయణమందు సూర్యోదయ మయిన దని సూర్యాస్తమయ మయిన దని యెచ్చటఁ జెప్పఁబడునో యచ్చట శ్రీరామచంద్రమూర్తి సంధ్యవార్చినట్లు చెప్పఁబడియుండును. దీనివలన శ్రీరామచంద్రమూర్తి కర్మయోగి యని స్పష్టపడుచున్నది. అంతియగాక రామాయణము గాయత్రీగర్భితము గదా. అట్టిదానిని గుఱించి కొంత యయినఁ జెప్పుట యావశ్యకము. "నగాయత్ర్యాః పరంమంత్ర" మ్మని గాయత్రికంటె శ్రేష్ఠమగు మంత్రములేదు. తన్ను జపించువానిని రక్షించునది కావున దానికి గాయత్రి యని పేరు. సూర్యోదయమునకు మూఁడుగడియల కాలము ప్రాతస్సంధ్య, సూర్యాస్తమానమున కావల మూఁడుగడియలవఱకు సాయంసంధ్య. ముందే యర్ఘ్యప్రదానము, సూర్యోదయమువఱకు జపము. ఉదయమున నిలుచుండి సాయంకాలమునఁ గూర్చుండి జపింపవలయును. ఉదయమున నీశానదిశగా, సాయంకాలము వాయవ్యదిశగా మరిలి జపింపవలయును. ౧-౪-౭-౮-౧౩-౧౪-౧౫ తిథులందు సాయంకాలమున జపము సంకోచ పఱువ

వలయును. ప్రాతస్సంధ్యవలన రాత్రిచేసినపాపము - సాయంసంధ్యవలనఁ బగలు చేసినపాపము నశించును. సంధ్యవార్చనివాఁడు శూద్రుఁడు, కావున వాఁడు దేవతాకార్యములకుఁగాని పైతృకకార్యములకుఁగాని పనికిరాఁడు సంధ్య యూరివెలుపల వార్చుట యుత్తమపక్షము, ఫలమధికము. దీనికనధ్యయనదోషము లేదు. శాస్త్రబద్ధుఁడైనబ్రాహ్మణుఁడు గాయత్రీమాత్రము జపించువాఁడైనను శ్రేష్ఠుఁడే. శాస్త్రబద్ధుఁడు కాక నిషిద్ధభోజనము మున్నగు ననాచారములు గలవాఁడును శాస్త్రనిషిద్ధవస్తువుల విక్రయించువాఁడును, మూఁడు వేదములు సాంగముగ నధ్యయనముచేసినవాఁడైనను హీనుఁడే. —మనుస్మృతి ౨ – ౧౦౧ మొదలు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రచరణారవిందపరాగముచేఁ గామాశ్రమమును బవిత్రము చేయించి తాటకాశ్రమము పవిత్రము చేయింపఁ బిలుచుకొని పోవుచున్నాఁడు.

ఉదయమున రామలక్ష్మణులు ప్రాతస్సంధ్యావందనాదులఁ దీర్చి పయనమై ముందు విశ్వామిత్రుఁడు పోవుచుండ నాయన వెంబడి పోవుచు గంగాతీరముఁ జేర, నచటనుండు తపస్వులు వీరిరాక ముందే యెఱింగినవారై నావను సిద్ధముగా నమర్చియుంచుకొని విశ్వామిత్రున కెదురుగా వచ్చి, "మహాత్మా! నావ సిద్ధముగా నున్నది. మీరు రాజకుమారులతోడ గంగానదిని జాగులేక దాఁటుఁ" డని ప్రార్థింప, నట్లె యని యంగీకరించి, యానావ నెక్కి నదిని దాఁటుచుండు సమయమున నల లొకదానితో నొకటి కొట్టుకొనుచుండుటచేఁ బ్రబలు మండు ధ్వని విని, రామచంద్రమూర్తి మునీశ్వరున కిట్లనియె.

మున్ను గాధేయుఁ డరుగ నాతని వెన్నంటి శ్రీరామలక్ష్మణులు పోయిరనుటచేఁ బెద్దవారి నతిక్రమించి పిన్నవారు పోరాదు. వారిసేడఁ బ్రాకరాదు, అని సూచన.

క॥ మునిశార్దూలమ! స్రోతస్వినిజలముల వినఁగ నయ్యె॥ విపులపు టులి వీ
ధ్వని వీచీకర్షణసం, జనితమొ మఱి యొండొ దీర్పు॥సందియ మనినన్. ౬౨౪

మునిశార్దూలమ—మునిశ్రేష్ఠుఁడా! - 'సింహశార్దూలనాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః॥' యన్నట్లు సింహ - శార్దూల - నాగ - వృషభ - పుంగవ - చంద్ర - ఇంద్ర శబ్దము లుపమానముగ నుత్తరపదములై శ్రేష్ఠార్థమును దెలుపును. స్రోతస్విని=నది, విపులపు టులివు - విపులము=గొప్పది, ఉలివు=ధ్వని, వీచీకర్షణసంజనితమొ=అలల రాఁపిడిచేఁ బుట్టినదో? సందియము=సందేహము.

తా త్ప ర్య ము.

మునీంద్రా! యేటి నీటియందు గొప్పధ్వని వినవచ్చుచున్నది. ఇది యలల రాఁపిడిచే నైనచప్పుడా మఱొండా - సందేహమును దీర్పుమా యని వేఁడిరి.

కం॥ ఆరాముని వచనంబుల, నారాముని విని యుదీర్ణ♦హర్షాకులుఁడై
గారామున నిట్లనియెను, సారామలమతిని దాని♦చరితం బెల్లన్. ౬౩౫

ఆరామునిఆరామచంద్రుని, ఆ + రా + ముని=ఆరాచముని, విని,= ఉదీర్ణ హర్షాకులుఁడై=అతిశయించిన సంతోషముచేఁ జెదరిన మనస్సుగలవాఁడై, గారామున=ప్రియముగ - అనతారంమూర్తియగు శ్రీరామచంద్రమూర్తి మన యం దనుగ్రహించి ప్రసన్నుఁడై - మనతో సంభాషించుచున్నాఁడు గదా యని సంతోషాతిశయము.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తిమాటలు విని విశ్వామిత్రుఁడు సంతోషాతిశయముచేఁ బ్రేమతో దానిచరిత్ర మిట్లు చెప్పఁదొడఁగెను. 'నీటిరాపిడిచే' అని చెప్పిన నే నీళ్ళని యడుగును. సరయువు నీళ్ళని చెప్పిన నది యెక్కడినుండి వచ్చిన దనును, గావున సరయువుపుట్టుక మొదలు చెప్పుచున్నాఁడు.

శా॥ కైలాసంబున ముస్విధాత్రుఁడు దటా♦కం బొందు సంకల్పకే
ళీలోలుం డయి మానసంబుననె బాళిన్ ♦ సృష్టి గావించె, నా
నాళీకాకర మొప్పు మానససరో♦నామంబునం, దత్సరః
పాళీనిర్గత మాట నిద్ది సరయూ♦ప్రఖ్యాతిఁ గాంచెం జుమీ. ౬౩౬

విధాత్రుఁడు=బ్రహ్మ - విధాత్రుశబ్దమునకుఁ బ్రథమంబున విధాత యనియు విధాత్రుఁ డనియు రెండురూపములు గలవు. నాళీకాకరము=సరస్సు. మానససరోనామంబునన్=మానససరస్సను పేరితో. తత్సరఃపాళీనిర్గతము=ఆసరస్సు ప్రదేశమునుండి వెలువడినది.

తా త్ప ర్య ము.

బ్రహ్మదేవుఁడు సంకల్పముచేతనే యొకతటాకమును కైలాసమందు సృష్టించెను. మానసముచే సృష్టింపఁబడినది కావున దానికి మానస సర స్సని పేరు. దానినుండి వెడలివచ్చుటచే దీనికి సరయు వని పేరు.

సీ॥ అది యయోధ్యాపురి♦నంటుచుఁ బ్రవహించి, గంగాతరంగిణిఁ♦గలియు నిచట
నీనీటియొరయిక ♦ నెసఁగు శబ్దం బిది, సలుపు సమస్కృతి♦ శ్రద్ధతోడ
ననిన నాధర్మాత్ము♦ లభివాద మొనరించి, యద్దరికిని దాఁటి ♦ రంత మువ్వు
రావలఁ బయనమై♦ యరుగుచుఁ గనియందుఁ,గడుభయంకరమైన♦గహన మొండు

తే॥ మానివరునిఁ గనుంగొని • మానవేంద్ర, తనయు లిట్లని రీవనాం•తరము చూడ
విజనమై దృష్టిభయదమై • వెలయుచున్న, దెవ్వరిందువసింతురో•యెఱుకపఱుపు. ౬_౩౭

తరంగిణి=నది, విజనమై=జనము లేనిదై. దృష్టిభయదమై = చూచుటకు భయంకరమై - ధర్మాత్ములు=ధర్మస్వభావము గలవారు; (2) ధర్మమే జీవముగాఁ గలవారు (3) ధర్మమే శరీరముగాఁగలవారు. (4) ధర్మబుద్ధిగలవారు. (5) ధర్మమునకు జీవమైయుండువారు. (6) ధర్మమునకు శరీరమై యుండువారు. "ఆత్మా యత్నధృతిస్వాంతస్వభావపరమాత్మసు జీవబుద్ధిశరీరేషు" - నానా. అంటు చుఁ = అయోధ్యకుఁ బడమటిభాగమున నారంభించి దాని కుత్తరముగాఁ బాటి తూర్పుగా వచ్చి యంగదేశములోనుండి ప్రవహించి గంగలోఁ గలియు చున్నది. 'సలుపునమస్కృతిశ్రద్ధతోడ' ననటచేఁ బుణ్యతీర్థములు దర్శించిన వెంటనే తద్దేవతలకు నమస్కరింపవలయు నని సూచన.

తాత్పర్యము.

ఆనది యయోధ్యానగరమును దాఁకుచుఁ బ్రవహించి యిచట గంగానదిలోఁ గలియును. సరయూనదినీ నెత్తునుండి గంగలో దూఁకుటచే రెండు నదులనీ ఢీకొనుటవలన నీశబ్దము కలిగెను. గంగాసరయూసంగమము పుణ్యతీర్థము కావున శ్రద్ధతో నమస్కరింపుము. అనిన నాధర్మాత్ములు నమస్కరించి దక్షిణపుటొడ్డుచేరిరి. అచ్చట నావ దిగి వారు ముగ్గురు కాలినడఁ బ్రయాణమైపోవుచు నందు భయంకరమై చొరరాని యడవినిఁ జూచి మునీంద్రా యీకాఱడవి మనుష్యసంచారము లేనిదై చూచుటకు భయంకరమయియున్నది. ఇం దుండువా రెవ్వరు? గంగానదికి దక్షిణపుటొడ్డునఁ దాటకారణ్యము.

కం॥ తిందుకపాటలధవకా, కేందునదీసర్జకకుభ • కీచకబదరీ
కుందవిభీతకసిందుక, బృందాన్వితమగుచు లోక•భీకరలీలన్. ౬_౩౮

కం॥ గండకగండోలీవే, తండక్రోడాచ్ఛభల్ల•దారుణమహిషో
ద్దండారవములు దశది, క్మండలి నిండారె దుర్గ•మం బిది యనఁగన్. ౬_౩౯

తిందుక=తుమ్మికచెట్లు - పాటల=పాదిచెట్లు - ధవ=చండ్రిచెట్లు - కాకేందు=కాకితుమ్మికచెట్లు - నదీసర్జ=ఏఱు మద్దిచెట్లు - కీచక=బోలువెదుళ్లు - బదరీ = రేఁగుచెట్లు - కుంద=మొల్ల. విభీతక=తాండ్ర - సిందుక= వావిలిచెట్లు - వీని యొక్క, బృంద=సమూహముచే - అన్వితము=కూడినది - గండక=ఖడ్గములు - గండోలీ = కణుఁదురీఁగలు - వేతండ=ఏనుగులు - క్రోడ=అడవిపందులు; - అచ్ఛభల్ల=ఎలుగుగొడ్లు - దారుణ=క్రూరము లగు మహిష = దున్నపోతులు - వీని యొక్క ఉద్దండ + ఆరవము=అధికమైన శబ్దములు; దశ దిక్ + మండలి=పదిది

క్షుల్లప్రదేశమందును కావున, దుర్గమంబు=చొరరానిది. రెండవపాదమునను భ యయతి.

తాత్పర్యము.

తుమ్మికిచెట్లు - పాదిచెట్లు - చండ్రలు - కాకితుమ్మికలు-ఏఱుమద్దులు బోలు వెదురు పొదలు - రేగుచెట్లు మొదలయిన వృక్షములు గలిగి, ఖడ్గమృగములు - కుందురీగలు - ఎలుఁగుగొడ్లు - అడవిదున్నలు - వీనియొక్క భయంకరములైన ధ్వనులు పదిదిక్కులు వ్యాపించుచుండఁ జూచుటకు దిగులు పుట్టించుచుఁ జొరరాక యున్నది.

—• విశ్వామిత్రుఁడు రాముసకు మలద-కరూశముల వృత్తాంతముఁ దెలుపుట •—

కం॥ ఈవనచారిత్రం బో,పావనశుభలీల! తెలియఁ•బఱిచెద వినుమా
దేవవినిర్మితధనసం,భావితజనపదము లివియుఁ • బ్రాక్కాలమునన్. ౬౪౦

పావనశుభలీల = పవిత్రమై మంగళకరమైన విలాసము కలవాఁడా! ప్రాక్కాలమునన్ = పూర్వకాలమందు. దేవవినిర్మిత = దేవతలవంటివారిచేఁ గల్పింపఁబడి; జనసంభావిత = జనులచే గౌరవింపఁబడిన, జనపదములు = ఊళ్లు.

తాత్పర్యము.

ఓ పవిత్రమై మంగళకరమైన వినోదక్రీడకలవాఁడా! ఇవి పూర్వకాలమున దేవతలవంటివారిచేఁ గట్టఁబడినవి. ధనధాన్యసమృద్ధి కలిగి లోకులచే గౌరవింపఁబడినయూళ్ళు.

సీ॥ మలద కరూశ నా•మంబుల నొప్పారు, నివి తొల్లి యింద్రుండు • వృత్రుఁ జంప
నాతని బ్రహ్మహ•త్యాదోష మంటిన, నాఁకలి మలము పా•కారిఁ బొందె
సురలు మహర్షులు • సురనాథు సుస్నాతుఁ, గావింప నిందుఁ ద•త్కాయజములు
మలముఁ గారూశంబు • మడుఁగ సంతుష్టుఁడై, నిర్మలుండును మఱి • నిష్కరూశుఁ
తే॥ డగుచు నీదేశములకు నా•హరిహయుండు, వరములిచ్చెను నిజదేహ•భవమలంబు
నీధరిత్రి ధరించుట • నింకమీఁద, మలద మనఁగఁ గరూశాఖ్య • వెలయుననుచు.
౬౪౧

మలద కరూశము లనిపేళ్ళు. బ్రహ్మహత్యాదోషము = బ్రాహ్మణునిఁ జంపిన పాపము - వృత్రుఁడు = బ్రాహ్మణుఁడు - సుస్నాతుర్ = మంగళతీర్థములచే స్నానముచేసిన వానినిఁగా, కాయజములు = దేహమువలనఁ గలిగినవి. మలము = ముఱికిపదార్థము - కారూశము = ఆఁకలి, ఆఁకలి యడఁగ నన్నముఁ దినిన మలము రాకమానదు. మరుఁగర్ = అణఁగిపోఁగా, సంతుష్టుఁడై=

సంతోషించినవాఁడై, నిర్మలుఁడై = మలములేనివాఁడయి, నిష్కరూశుఁడు = ఆకలిలేనివాఁడు - మలదము = మలమును హరించునది.

"ఇంద్రుఁడు వృత్రుఁ జంప నాతని బ్రహ్మహత్యాదోష మంటిన" వృత్రుఁడు బ్రాహ్మణుఁడయినను యుద్ధమునఁ జంపఁబడెను. గావున నింద్రునకు బ్రహ్మహత్య యెట్లు వచ్చెను? శ్లో॥ ఆత్మనశ్చ పరిత్రాణే దక్షిణానాంచ సంగరే, స్త్రీవిప్రా భ్యుపపత్తౌచ ఘ్నన్ధర్మేణ నదుష్యతి" ఆత్మరక్షార్థము, శత్రురాజులు దండెత్తి వచ్చినపుడును, స్త్రీలను బ్రాహ్మణులను సంరక్షించుటకును, దమ్ముఁ జంపవచ్చిన వారిని న్యాయమార్గమునఁ జంపుట దోషము గాదు "శ్లో॥ గురుంవా బాల వృద్ధౌవా బ్రాహ్మణంవా బహుశ్రుతం, ఆతతాయిన మాయాంతం హన్యాదేవా విచారయన్" గురువునైనను, బాలునైనను, వృద్ధునైనను, వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణునైనను ఆయుధములు ధరించి చంపవచ్చినవారిని నిర్విచార ముగఁ జంపవచ్చును. —మను-౮-౩౫౦

శ్లో॥ నాతతాయివధే దోషో హంతుర్భవతి కశ్చన, ప్రకాశంవా ఽప్రకా శంవా మన్యుస్తం మన్యుమృచ్ఛతి॥ —మను ౮-౩౫౧ చంపునాని కోపాభి మానదేవత చంపఁబడువానికోపమును బొందింపఁగించుచున్నది కావునఁ బలువురకుఁ దెలియునట్లుకాని రహస్యముగఁ గాని చంపవచ్చినవానిని జంపుటయందే దోషము లేదు. అని యిట్లు స్మృతివాక్యము లుండ నింద్రునకు వృత్రవధవలన బ్రహ్మహత్య యెట్లుప్రాప్తించెను. ప్రత్యుత్తరము - ఈ ప్రమా ణము లంగీకార్యములే ఈకారణముచేతనే భీష్ముఁడు పరశురామునిఁ జంపఁ బూనెను. కాని యిది వృత్రవిషయంబున నన్వయింపదు. ఇంద్రుఁడు వృత్రుని యుద్ధమునఁ జంపలేదు. మిత్రద్రోహియై చంపెను. వృత్రుండు తనకు నింద్రు నకు మైత్రిగుదుర్చవచ్చిన మునులతో "కం॥ ఏనొక్కటి తెలిఁగు సెప్పెద, దానిం గాదనక చేసి తగమీరలు సంధానము దృఢముగఁ జేయుండా నాకేశునకు నాకు నధికప్రీతిన్. వ॥ అది యెయ్యది యనిన, నార్ద్రంబైనదానను శుష్కంబైనదానను దరువునం బాషాణంబున శస్త్రాస్త్రంబుల దివంబున రాత్రియందును నేనువధ్యుండఁ గాకుండవలయు ననిన వారును దానికి నొడంబడి యవ్విధంబు లొనంగి వృత్ర వజ్రధరులకు మిత్రభావం బొనరించి మగుడం జని యత్తెఱంగు వాసవున కెఱిం గించి నిజనివాసంబుల కరిగిరి . సురనాథుండు సుఖం బుండి పెద్దకాలంబునకుం దనమనంబునఁ బాయని వైరంబు సైరింపఁజాలక దామోదరునిపూనికయు ముని జనంబులుచేసిన సంధివిధంబును నిరూపించి, రిపుం బరిభవింప రంధ్రాన్వేషణంబు సేయుచుండి యొక్కనాఁడు. చం॥ జలనిధితీరభూమిఁ దన శత్రుఁ గనుంగొని వీని నిష్ఠు ద్దోర్బల మెసఁగంగ నాదుభిదురంబునఁ ద్రుంచెద రాత్రిగాదు తాఁ దలఁప దివం బుగా దిది యుదగ్రపరాక్రమయోగ్యసంధ్య నా యలవుఁ జలంబుఁ జూప నెపమై

తగుసాధన మెద్దిగల్గునో॥ కం॥ అని తలఁచుచు నచ్చట నొక, వననిధిఫేనంబుఁ జూచి వాసవుఁ డార్ద్రం, బును శుష్కంబును గాదిది యనుచుం గులిశమునఁగూర్చి యధికరయమునన్॥ తే॥ దాన వృత్రుని ప్రేయ నత్తఱి మురారి, యందుఁ దగ సంక్రమించి యయ్యసురఁ జంపె, జిష్ణుఁ డతిభక్తి విష్ణుఁ బూజించె నాత్మ, నఖిల లోకంబులకు మోద మానహిల్లె॥ వ॥ ఇవ్విధంబునం బగతుం బరిమార్చి పేర్చి యింద్రుఁడు నిజపురంబునకుం జనియె. మఱియును భూతసంఘుం బిట్లు బ్రహ్మ హత్య సేయందగునే యని నిందించిన " ఇట్లు మిత్రద్రోహముచేసి వంచనచేఁ జంపుటచే నింద్రునకు బ్రహ్మహత్య ప్రాపించెఁ గాని రామచంద్రమూర్తి రావణుఁ జంపినట్లు ధర్మయుద్ధంబునఁ జంపుటచేఁ గాదు. వృత్రునిఁ జంపిన యింద్రునకువలె రావణాసురునిఁ జంపిన రామచంద్రునకు బ్రహ్మహత్య వచ్చె ననుట దురుక్తి, కుయుక్తి యగు. ఈ విషయము వేఱొకచోఁ జర్చింపఁ బడును.

తాత్పర్యము.

మలద మని కరూశ మని యీయూళ్ళ పేర్లు. పూర్వము సీసలమందు నింద్రుఁడు కశ్యపపుత్రుఁడైన వృత్రాసురునిఁ జంప నతనికి బ్రహ్మహత్య ప్రాప్తించె. దాని దోషమువలన నింద్రునకు నాఁకలియు - మలము విడుచుటయు సంభవించె. ఆరెండు పోవుటకై దేవతలు దివ్యతీర్థములచే నతని స్నానము చేయించిరి. అప్పుడా బ్రహ్మహత్య తొలఁగిపోయెను. ఆఁకలియు మలము రెండును నిచ్చటఁ బోవుటచే నొకప్రదేశమునకు మలద మనియు నొకదానికిఁ గరూశ మనియు నింద్రుఁడు వీనికిఁ బేర్లు గలుగఁజేసెను. మలం ద్యతి ఖండయతీతి మలదః॥ మలమును ఖండించునది మలదము. కరూశమె కారూశము.

తే॥ పాకశాసనుఁ డిబ్భంగిఁ బలికి నంత, మేలు మే లని బుధు లెల్ల మెచ్చి రతని
నీవిషయములు సౌఖ్యసమృద్ధిఁ దనరె, జనులు వెలసిరి ధనధాన్యసంపదలను. ౬౪౨

పాకశాసనుఁడు = ఇంద్రుఁడు. ఈ భంగి=ఇబ్భంగి, ఈవిధముగా, విషయములు=దేశములు.

తాత్పర్యము.

ఇంద్రుఁ డీప్రకారము చెప్పఁగా బాగుబాగని దేవతలెల్ల మెచ్చి సంతోషించిరి. ఈ దేశములు సౌఖ్యాతిశయముచే నొప్పుచుండెను. జనులు ధనధాన్యసమృద్ధిగలవారైరి.

— విశ్వామిత్రుఁడు రామునకుఁ దాటకావృత్తాంతముఁ దెలుపుట —

ఆ॥ ఇట్లు కొంతకాల, మేగిన జనియించెఁ, దాటకాఖ్య యక్ష, తరుణి నూఱు
పదులగజములంత, బలమును స్వేచ్ఛాను, రూపరూప మెత్తు, నేపు గలిగి. ౬౪౩

తాటకాఖ్య=తాటక యను పేరుగలది - స్వేచ్ఛానురూపరూపము=తన యిష్టమునకు ననురూపమైన రూపము.

తాత్పర్యము.

కొంతకాల మిట్లు సుఖముగాఁ గడచెను అవల నూఱువేలయేనుఁగుల బలముగల యొక యక్షస్త్రీ కోరిన రూపము ధరింప శక్తిగలదై యాప్రాంతముల నుండెను.

ఉ॥ ఆచపలాక్షి సుందునికి, నాలయి యాత్మజుఁ గాంచె నొక్క మా
రీచుని శక్రవిక్రము న, రీణపరాక్రము వృత్త బాహువున్
ద్యోచరభీకరున్ వికట, దుష్టచరిత్రుని రాక్షసాధమున్
నీచుఁ గుశీలు భక్షితము, నిప్రవరాధ్వగసాధుసంఘునిన్. ౬౪౪

శక్రవిక్రము=ఇంద్రునివంటి బలముగలవానిని, అరీణ=వంకరగాని, పరాక్రము=శౌర్యముగలవానిని, వృత్తబాహువున్ - వట్రువులైన భుజములు గలవానిని. ద్యోచరభీకరున్=దేవతలకు భయము గలిగించువానిని, వికటదుష్టచరిత్రుని-లోకవిరుద్ధమైన చెడునడవడిగలవానిని, రాక్షసాధమున్=రాక్షసుల యందుఁ దక్కువవానిని, కుశీలు-కుత్సితస్వభావముగలవానిని, భక్షిత సంఘునిన్-భక్షింపఁబడిన మునీశ్వరులు, బాటసారులు, సాధువులు, వీరి సంఘము గలవానిని, కాంచెన్=కనెను.

తాత్పర్యము.

ఆతాటక సుందుఁడనువానికిభార్యయై యింద్రునంతటి బలపరాక్రమములు గలిగి, గుండుబాహువులుగలిగి లోకవిరుద్ధచర్యకలవాఁడై, కుత్సితుఁడై, దేవతలకు భయంకరుఁడై, మునీశ్వరులను, బాటసారులను, సాధువులను దిను నొక నీచరాక్షసుని మారీచుఁ డను వానిని కుమారునిఁగాఁ గనెను.

తే॥ దినముదినమును జనములఁ, దినుచుఁ దినుచుఁ, బాడుగావించె నిదివల్ల, కాడుగాఁగ
మలదమును గరూశము మఱి, మాయ మగుచు, నిట్టిభీకరగతిని గ, న్పట్టుటయ్యె. ౬౪౫

వల్లకాడు = శ్మశానము, మఱుమాయము = ఉరువులేనిది, భీకరగతి = భయంకరమైనవిధము.

తా త్ప ర్య ము.

ప్రతిదినము నీయూళ్లయందలి జనములఁ దినితిని యిది శ్మశానముగఁజేసెను. మలద కరూశములు-రెండును రూపుమాసిపోయి యీవిధముగఁ జూచుటకు భయంకరముగానయ్యెను.

శా॥ ఈదేశం బెటు పాడు సేయఁబడె వింటే, యక్షియావాస మా
నా దేశం బిఁక సార్ధయోజనము ద ♦ వ్వయ్యుండెడిన్, ధాత్రి నిః
ఖేదంబుగ్ ఘటియింపు మీవె భుజశ ♦ క్తిం దాటకం దున్మి, నా
యాందేశంబునఁ బాపుమీ భయము రా ♦ మా! యీప్రదేశంబునన్. ౬౪౬

ఆవాసము = వసించు ప్రదేశము - సార్ధయోజనము = ఒకటిన్నరియామడ, నిఃఖేదముగ్=దుఃఖములేనిది. ఆదేశము = ఆజ్ఞ - నా కస్త్రములురావే యన కుండ భుజబలముచేతనే చంపుమనెను. వెయ్యియేనుఁగుల బలముగల తాటక కంటెఁ బండ్రెండేండ్ల బాలరాముఁడు బలవంతుఁడనియొప్పెదుచున్నది. క్రియాసిద్ధి స్సత్త్వే భవతి మహతాం నోపకరణే - మహాత్ములకుఁ గార్యసిద్ధి వారిమనోబలముచే నగునుగాని సాధనసంపత్తిచేఁ గాదనువిషయము నిదిసూచించుచున్నది.

తా త్ప ర్య ము.

రామా! యీదేశ మేవిధముగఁ బాడుచేయఁబడెనో వింటివిగదా. ఆతాటకవసించుస్థల మిచ్చటకినొకటిన్నరయామడ యున్నది. నీభుజబలముచే నాతాటకను జంపి యీదేశమును ఖేదములేనిదానిఁగా నాయాజ్ఞచొప్పున నీవు చేయవలసినది. (మంత్ర ముపదేశించినవాఁడు గురువు గావున నాజ్ఞపెట్టు నధికారము గలదు.)

కం॥ మనఁగాఁ గోరెడివారలు, మనవలె నెవ్వార లైన ♦ మనమున నైనన్
జన నోడుదు, రది తటిమినఁ జనినజనం బిప్పటికిని ♦ జనుదేర దనన్. ౬౪౭

మనఁగాన్ = బ్రదుకుటకు, ఓడుదురు = భయపడుదురు.

తా త్ప ర్య ము.

బ్రదుకుమీఁది యాశగలవారెవ్వరు మనమువచ్చినట్టు లీప్రదేశమునకు రాఁదలఁపరు - భయపడుదురు. అది తటిమినఁ బాఱిపోయినవా రిప్పటికి మరలి వచ్చినవారు లేరు.

—* ౨౫ సర్గము. తాటక నగస్త్యుఁడు శపించుట *—

కం॥ బలహీనలు యక్షు లన, న్వెలయును లోకోక్తి, యెట్లు నెలఁతకుఁ గలిగెన్
దెలుపుము సహస్రవారణ,బలము తపోధన యటన్నఁ ♦ బలికెన్ముని యిట్లున్. ౬౪౮

లోకోక్తి = సామెత, లోకమున వాడుకమాట, నెలఁతకు – ఆఁడుదానికి, సహస్రవారణబలము = వెయ్యియేనుఁగులబలము.

తాత్పర్యము.

మునీంద్రా! లోకములో యక్షులు దుర్బలు లనివాడుక. అట్లుండ యక్షస్త్రీ కెట్లు వేయి యేనుఁగుల బలము కలిగెను. అనిన ముని యిట్లనియె.

సీ॥ తొల్లి సుకేతుఁ డన • దొడ్డయక్షుఁ డొకండు, సదమలాచారుండు • సంతు లేక
తీవ్రతపంబున • దీపింప నాతని,యంబుజభవుఁడు • యజ్జభవుఁడు
తాటకానామికఁ • దనుజాతఁగా నిచ్చి, పదినూర్గజములు•బలము దాని
కొసఁగెను గాని తా • నొసఁగఁడు పుత్త్రు, నా,వనితకు రూపయౌ•వనము లొప్ప
తే॥ సుందుఁ డనియెడిఝర్ఝరి•సుతున కిచ్చి, పెండ్లి గావింప నతఁ, డది• ప్రియతనూజుఁ
గాంచె మారీచుఁ డనియెడి• క్రవ్యభోజుఁ,గాలవశుఁడయ్యె సుందుఁ డ•గస్త్యుచేత. ౬౪౯

సంతు = సంతానము, సదమలాచారుండు - మంచి నిర్మలమైన యాచారము గలవాఁడు. అబ్జభవుఁడు – బ్రహ్మ, తాటకానామక – తాటకయనుపేరు గలదానిని. తనుజాత – కూఁతురు, కాలవశుఁడయ్యె = చచ్చెను. ఇచ్చట సుందుఁ డగస్త్యుచేఁ జచ్చినట్లు చెప్పఁబడెను. భారతమునఁ దిలోత్తమనిమిత్తమై సుందోపసుందులు పరస్పరనిహతులైన ట్లున్నది. వారు వీరు భిన్నులుకాఁ బోలు.

తాత్పర్యము

పూర్వకాలమున సదాచారసంపన్నుఁడైన సుకేతుఁ డను గొప్ప యక్షుఁ డుండెను. వాఁడు సంతానము లేక బ్రహ్మకుఁ దపంబు చేయఁగా సంతోషించి యాయనఁగొడుకు ననుగ్రహింపక వెయ్యియేనుఁగుల బలముగలదానిని కూఁతు నిచ్చెను. అదియును రూపయౌవనములు గలదికాఁగా దానితండ్రి ఝర్ఝరుని కొమరుఁడైన సుందునకు నిచ్చి దాని వివాహముచేసెను. దానికి మారీచుఁ డనియెడి క్రూరుఁడైన కుమారుఁడు పుట్టెను. సుందుఁ డగస్త్యుచే మరణించెను.

ఉ॥ తాటక పుత్త్రుఁగూడి యతి•దారుణభంగి మునీంద్రుఁ జంప ది
క్కూటము లాడ నార్భటులఁ • గ్రూరతఁ బైఁ గవియంగఁ, దా నిరా
ఘాటత శాప మిచ్చి ముని, •కష్టు నిశాటుఁడ వంచుఁ బుత్త్రు, నో
బోటి సురూపము న్విడిచి • పొందు వికారపు భీమరూపమున్. ౬౫౦

దారుణభంగిన్ = భయంకరమైనరీతిని, దిక్కూటములు = దిక్ప్రదేశములు, నిశాటుఁడు=రాక్షసుఁడు; బోఁటి- స్త్రీ.

తాత్పర్యము.

తన మగనిని జంపెనని తాటక పగపట్టి కొడుకుతోఁగూడి యగస్త్యునిఁజంప దిక్కు లల్లలనాడున ట్లఱచుచు మైపడరాఁగా నగస్త్యుఁడు 'మారీచుఁడా! నీవు రాక్షసుఁడవు కమ్ము. ఓసీ! నీవు సుందరరూపమును విడిచి భయంకరరూపము పొందుము.

కం॥ మనుజ దిని వై వికృతా, ననమునను విరూప వగుచు ♦ నడమాడు మటం
చును శపియించినఁ గినుకన్, మునివరుఁడు చరించు దేశ♦ముల నీకరణిన్. ౬౫౧౩

మనజాదిని=మనుష్యులఁ దినునది, వికృతాననమున=వికారపు ముఖమును. విరూపవు-ఆకారము మాఱినదానవు. నడమాడుము-చరించుచుండుము. కినుకన్-కోపముచే.

తాత్పర్యము.

ఓసీ! మనుష్యులఁ దినుదానవై వికారపుముఖముతో నీ రూపముమాఱి సంచరించుచుండుము. అని కోపముచే శపింపఁగా నదియు నగస్త్యుఁడు సంచరించు దేశముల నీవిధముగా.

కం॥ క్షణదాచరి మానవభ, క్షణపర యై పాడుచేసె ♦ జనపదములు, బ్రా
హ్మణగోచయహితముగ ని, ష్కృణతన్ వధియించి దీనిఁ♦గీర్తింగనుమా. ౬౫౧౪

క్షణదా + చరి-రాత్రియందుఁ దిరుగునది - రేఁగ్రిమ్మరి, మానవభక్షణపరయై-మనుష్యుల దినుటయందాసక్తిగల్లదై, బ్రాహ్మణగోచయహితముగన్ = బ్రాహ్మణులకు గోవులకు మేలుకలుగునట్లు, నిర్ఘృణతన్=దయలేక, శ్రీరామచంద్రమూర్తి యత్యంతదయాళువు, నిష్కారణముగ నొకరిని బాధింపఁడు. కావున నొకరిని జంపుటెట్లు. అందు నాఁడుదానినిఁ జంపుటెట్లని దయతలఁచునేమో యని ముందుగానే హెచ్చరించుచున్నాఁడు.

తొలుత నగస్త్యాశ్రమ మిందుండెను. తాటకవలన బాధపడలేక కాఁబోలు దీని విడిచి దక్షిణమునఁజేరెను. రామచంద్రుఁ డాప్రాంతములఁ బోయినపుడీయనయాశ్రమము పంచవటికిఁ గొంతదూరమం దున్నట్లుచెప్పఁబడెను. సుగ్రీవుఁ డంతకుదక్షిణమున నగస్త్యాశ్రమ మున్నట్లు వానరులకుఁ జెప్పెను.

తాత్పర్యము.

ఆరాక్షసి మనుష్యులఁదినుటయందు నాసక్తిగల్లదై యూళ్లను బాడుచేసెను గావున గోబ్రాహ్మణులకు మేలగునట్లు దయలేక దీనిఁజంపి కీర్తిమంతుఁడవగుము.

తాటకను జంప విశ్వామిత్రుఁడు రామునికి బోధించుట

క॥ శాపపరీత వధింపఁగ, నేపురుషుండైన నుత్సహింపఁగ లేఁ డో
భూపసుత! నీవు దక్కఁగ, నేపాటియుతండు నైన ♦ నేలోకమునన్. ౬౨౩

శాపపరీతేక = శాపముచేఁబట్టఁబడినది, భూపసుత = రాజకుమారా! నీవు భూమిని పాలించువారిపుత్రుఁడవు. భూమినిఁబాలించుటయన దుష్టులశిక్షించుట శిష్టులరక్షించుట గదా - కావున నిది నీకు కులధర్మము - చేయకతప్పదు.

తాత్పర్యము.

తొలుత నే యది మిగులబలశాలిని. అందును శాపముచే మిగులఁ గ్రూరురాలు. అట్టిదానిని రాజకుమారా! నీవుతప్ప మఱియేమగవాఁడును నెంతవాఁడైనను నేలోకమువాఁడైనను జంపుటకుఁజాలనేరఁడు. ఇఁక నిలిచియుద్ధముచేయుట యెక్కడ?

క॥ కాంతావధపాపసమా, క్రాంతుఁడ నగుదునో యటంచుఁ ♦ గరుణాపరతేఁ
జింతింపకు నృపసూనుఁడు, సంతతముం గావవలయు ♦ జాతులు నాల్గున్. ౬౨౪

భూపకుమారశబ్దము వివరించియీపద్యముఁ జెప్పఁడు చున్నది

కాంతావధ = స్త్రీవధముచేఁగలుగు, పాప - పాపముచే, సమాక్రాంతుఁడక = ఆక్రమింపఁబడినవాఁడగ, కరుణాపరతేక కేవలదయచే, నృపసూనుఁడు - రాజకుమారుఁడు.

తాత్పర్యము

కేవలదయచే నితరసందర్భము లాలోచింపక స్త్రీవధముచేసిన పాపము వచ్చునని యాలోచింపకుము ఇది రాజకుమారులు చేయవలసిన యాలోచన కాదు. సర్వకాలసర్వావస్థలయందు నరపాలకుమారుఁడు నాలుగువర్ణముల వారిని రక్షింపవలసినది విధి.

క॥ క్రూరపుఁబనియేనియు న, క్రూరపుఁబనియేని నఘముఁ ♦ గూర్చునయేక జే
కూరునయే నపవాదము, క్ష్మారమణులు సేయఁదగుఁ బ్ర ♦ జారక్షకులై. ౬౨౫

అఘము = పాపము, అపవాదము = నింద, క్ష్మారమణులు రాజుల, ప్రజారక్షకులై = ప్రజలను రక్షించుటకుఁగాను.

తాత్పర్యము.

ఏమయ్యా! రాజకుమారుఁడు కాఁగానే ధర్మముచేఁ బ్రజల రక్షింప వలయునుగాని యధర్మమునఁ బ్రవర్తింపవచ్చునా? యందువేని, భూమినిఁ బరి పాలించువారు ప్రజలరక్షించుటకై క్రూరపుఁబనియైనను గ్రూరపుఁబనికాకున్నను

పాపము వచ్చినను బుణ్యము వచ్చినను తనకు నింద వచ్చినను నేపనియైనఁ జేయవలసినదే. ఏలనఁ దానొకఁడు చెడియైన లోకమున ననేకులఁ గాపాడవలయును. తన క్షేమము మాత్రముఁ జూచుకొని యూరకుండనేని లోకము చెడినదో నాపాపము బొందవలసివచ్చును. అందఱు చేసిన యన్నిపాపములచేఁ దాను జెడుట మేలా? తానొక్కఁడే యొక్కకార్యముచేసి చెడుట మేలా? అసత్యముచే సత్యము అధర్మముచే ధర్మము చెడిపోవు సమయము వచ్చునపుడు దానిని జక్కదిద్ద సామర్థ్యము గలవాఁ డుపేక్షించి యూరకుండిన నాపాపము వానిని గొట్టును. అనేకులు మనుష్యులు ఆవులు దీనిచేఁ బ్రాణములు గోలుపోవుచుండ నీవు వానిని రక్షించు శక్తిగలవాఁడవై యూరకుందువేని గోబ్రాహ్మణహత్యాదోషము నీకును బ్రాప్తించును. స్త్రీవధ మధర్మ మందువేని నిష్కారణముగ నధర్మముగ నింద జేక్రూరాత్మురాలిచేఁ జచ్చుచుండ రక్షింప శక్తి గలిగియుఁ జూచి సహించి యూరకుండుట ధర్మమా? అట్లైనఁ గ్రమముగ దుష్టులు ప్రబలిపోదురు. శిష్టులు హతులై పోదురు. ఇదియా ప్రజారక్షణమన? ఇదియా ధర్మసంస్థాపనమన? అధర్మము ధర్మముచేఁ జయింపవలెనుగాని యధర్మముచే జయింపఁ బూనితిమేని యిరువురు సమాను లేకదా. ఒకఁ డెక్కువయేమి? మఱియొకఁడు తక్కువయేమి? ఇరువురు నధర్మవర్తనులే. అధర్మమును ధర్మముచే జయింపబూనిన నదియే యుత్తమమార్గము. అది సాధ్యముకాదేని యధర్మవర్తనుల నధర్మమార్గమున జయించితిమేని వారి యధర్మమే వారినిఁ జంపినట్లగును? దానివలన నధర్మవర్తనుఁడు ధర్మముచేనైనఁ జెడును, అధర్మముచేనైనఁ జెడు నని యేర్పడును. కావునఁ గ్రూరులను గ్రూరతచేతను గుటిలులఁ గుటిలతచేతను నధర్మవర్తనుల నధర్మముచేతను లోకహితార్థము చెఱుచుట యధర్మముకాదు. ధర్మమేయగు. ఎవరికి? క్షత్రియులకు. నీవు రాజకుమారుఁడవు. ప్రజలను రంజింపఁజేయువాఁడు గావున రా జనఁబడును. ప్రజలు నిష్కారణముగఁ జచ్చుచుండఁ జూచుచుండువాఁడు రాజుకాఁడు.

తే॥ రాజ్యభారధురీణు లౌ రాజసుతుల, కిది సనాతనధర్మమం చెఱుగవయ్య
ధర్మ మెఱుఁగదు చంపు మధర్మరతను, వినుము వల తేని యిఁకఁ బురాణవృత్త
ములను. ౬౫౬

రాజ్యభారధురీణులు = ప్రజలపరిపాలనము భారము వహించిన వారు, సనాతన ధర్మము = శాశ్వత ధర్మము - సమయోచిత ధర్మము కాదు - ఏకాలమునందైన నిది యనుష్ఠింపఁబడ వలసినదే.

తాత్పర్యము.

రాజకుమారా! నేను నిన్నధర్మకార్యమును జేయుమని చెప్పుచున్నా నని తలఁపవలదు. నేను గొన్నినాళ్లు రాజ్యమేలినవాఁడనే, ప్రజలఁ బాలించినవాఁడనే. కావున నాకు రాజధర్మము శాస్త్రము చదువుటచేతను అనుభవముచేతను దెలియును. ఇప్పుడు నేను జెప్పినది రాజ్యభారమువహించిన రాజపుత్రులకందఱకు సనాతనమైనధర్మము కావున దానికి విరోధముగ వర్తింపరాదు. సమయోచితమైననీతిగాదు. దానికి ధర్మమనన్నెట్టిదో తెలియదు. దానికి సధర్మమందే ప్రీతి. కావునఁ జంపుము.

ఉ॥ క్రూరతఁ జంపఁడే ముని విరోచనసంజను డైనమంధరన్
ధారిణిఁ జంపఁ బూనినను ♦ దారుణవజ్రహతిన్ శచీశుఁడున్
వారక నింద్రలోకమును ♦ వాంఛ యొనర్చెడి కావ్యమాత ల
క్ష్మీరమణుండు చక్రమునఁ ♦ జెక్కఁడొకో భృగుపత్ని? రాఘవా!　　౬౫౭

కావ్యమాతను = శుక్రునితల్లిని, లక్ష్మీరమణుండు = విష్ణువు, దారుణము = భయంకరము.

తాత్పర్యము.

రామచంద్రా! నేను నీకుఁజెప్పినవిషయమునకుఁ బూర్వదృష్టాంతములు గలవు. విరోచనునికూఁతురగు మంథర భూమినిఁజంపఁ బ్రయత్నింపఁగా నింద్రుఁడు వజ్రధారచే దానిని జంపలేదా? లోకమున నింద్రుఁడు లేకపోవునుగాక యని సంకల్పించిన భృగుమహర్షి భార్యను శుక్రునితల్లిని విష్ణువుచక్రధారచేఁ జంపలేదా; దేవతల శిక్షించుటకుఁగాను శుక్రుఁడు రుద్రసమీపమునఁ దపస్సు చేయుచుండఁగా దేవతలచేఁ బీడింపఁబడిన రాక్షసు లాయిన తల్లిశరణు చొచ్చిరి. ఆరాక్షసుల పక్షముఁ బూని యామె దేవతలను జంపి లోకమున కింద్రుఁడు లేకుండఁజేయ యత్నింపఁగా నింద్రప్రార్థితుఁడై విష్ణు వామెను జక్రధారచేఁ జంపెనని మత్స్యపురాణంబునఁ గలదు. (ఉత్త రా. ౧౧౮౦-౧౧౮౫ పద్యములు చూచునది.) ఈ యితిహాసము చెప్పుటకుఁ గారణము నీవేమ న్నిట్లు చేసి యున్నాఁడవు - స్మరింపుమని హెచ్చరించుటకే.

కం॥ ఇంతియుగా కన్యలు భూ, కాంతు లధర్మాత్మక లగు ♦ కాంతల ధరణిన్
హంతవ్య లగుటఁ జంపిరి, చింతిలకు మదాజ్ఞ నీవు ♦ చేయుము నృపతీ! ౬౫౮

అన్యులు-ఇతరులు - హంతవ్యలు - చంపఁదగినవారు - చింతిలకు-ఆలోచింపకు - మదాజ్ఞ-నాయానతి.

తాత్పర్యము.

రామా! వీరిరువురే కారు. అధర్మప్రవర్తనముగల స్త్రీలను జంపినవారితర రాజులును గలరు. కావునసే నీ వాలోచింపవలసిన పనిలేదు. నేను జెప్పినట్లు చేయుము.

——* ౨౬ సర్గము - శ్రీరాముఁడు తాటకను వధించుట *——

చం॥ అనిన మహార్థబోధకము • లైనమునీంద్రుని సంగతోక్తులన్
విని మునియాజ్ఞ లెల్ల నెఱవేర్పు మటంచును బల్కెఁ దండ్రి నిం
డినసభలోన నాయన నుడిన్ జవదాఁటఁగ రాదు గౌరవం
బునఁ గననౌను గాన మునిపుంగవుచిత్తముఁబట్టి పోయెదన్. ౬౫౯

మహార్థబోధకములు = గొప్ప విషయమును బోధించునవి. సంగతోక్తులు= యోగ్యములై యుక్తియుక్తములైన మాటలు.

తాత్పర్యము.

అని యిట్లు విశ్వామిత్రుఁడు చెప్పిన గొప్ప విషయమును బోధించునవియు యుక్తియుక్తములైనవియునగు పలుకుల విని తనలోఁ దానిట్లు రామచంద్రమూర్తి యోజించెను. స్త్రీవధమా పాపమని తోఁచుచున్నది. గురువగు విశ్వామిత్రుఁడా యధర్మప్రవర్తనయగు దానిని జంపుట పాపముకాదని చెప్పుచున్నాఁడు. ఈయన యేల యసత్యముచెప్పి నాచే నధర్మకార్యము చేయించును? అయినను నీ ధర్మాధర్మవిచారముతో నాకుఁ బనిలేదు. నిండుసభలో మా తండ్రి రామా! యీయనచెప్పిన పనులన్ని చేయుమని చెప్పెను. జనకాజ్ఞ మీఱరాదు. గౌరవింపవలెను. కావున ధర్మమో యధర్మమో యీయన యిష్టప్రకారము వర్తించెదను.

శ్రీరామచంద్రమూర్తి యవతారకార్యధురంధరత్వము స్త్రీవధతోఁ బ్రారంభమగుచున్నది. స్త్రీవధ పాపమని రామాయణమే చెప్పుచున్నది "ఎల్ల ప్రాణులను గాంత లవధ్యలుగారె తమ్ముడా"-అయోధ్య. ౧౯ ౯౪ భరతవాక్యము. "ఓ లోకవధ్య! జడుఁడా! స్త్రీలను వధియించు పాపశీలుర లోకం బోలిఁ గనె దీవు."-యుద్ధ. ౧౯ ౧౬ . ఇదియింద్రజిత్తును జూచి హనుమంతుఁడుచెప్పినవాక్యము. భారతంబున మహాప్రస్థాన పర్వంబున ధర్మరాజువాక్యము-"చం॥ అనఘచరిత్ర! విన్ము, శరణాగతుఁ జేకొన కున్కి శుద్ధమిత్రునియెడఁ జేయుద్రోహము, వధూటి వధించుట, విప్రసర్వముం గొనుట యనంగఁ గల్గు నివికూడ సమంబగు నాకుఁ జూడ భక్తు ననపరాధునిన్విడుపుదోషము దానది మోర్వవచ్చునే॥ ౫౮ ప. ఇట్లుండ నెట్లు శ్రీరామచంద్రమూర్తి స్త్రీవధ గావించెను? భగవద్గీత పుట్టినది యీ సంశయ విచ్ఛిత్తికే. కావున నీప్రశ్నకుఁ బ్రత్యుత్తరము భగవద్గీతయే.

అర్జునుఁడు క్షత్రియుఁడు-శ్రీరాముఁడు క్షత్రియుఁడు. స్వధర్మమని బంధువులఁ జంపినఁ బాపమువచ్చునని భయపడినవాఁ డర్జునుఁడు - స్వధర్మమని స్త్రీని జంపవచ్చునా యని శంకించినవాఁడు రామచంద్రమూర్తి. అక్కడఁ గృష్ణుఁ డేమి యుపదేశించెనో యిచ్చట విశ్వామిత్రుఁ డదియే యుపదేశించెను. శ్రీకృష్ణవాక్యములు.

శ్లో॥ స్వధర్మమపి చావేక్ష్య, న వికంపితు మర్హసి,
ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోన్యత్ క్షత్రియస్య న విద్యతే.
శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥
స్వే స్వే కర్మ ణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః।
శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్।
స్వభావనియతం కర్మ, కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్।
సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్॥

అర్జునా! నీస్వధర్మమాలోచించితివేని నీవు క్షత్రియధర్మమునుండి చలింపరాదు. ధర్మయుద్ధమునకంటె క్షత్రియునకు శ్రేయస్కరమైనది వేఱొండులభింపదు. చక్కఁగాననుష్ఠింపఁబడు పరధర్మమునకంటె విరుద్ధగుణములుకలదైనను స్వధర్మమే మేలు. స్వధర్మమనుష్ఠించుటయందుఁ జచ్చినను మేలే. పరధర్మము భయకారణము. వానివానిస్వధర్మము లనుష్ఠించుటచేతనే మనుష్యుఁడు మోక్షమును పొందును. చక్కఁగా ననుష్ఠింపఁబడిన పరధర్మమునకంటె గుణహీనమైనను స్వధర్మమే శ్రేయస్కరము. స్వభావనియతమైన కర్మముచేయువాఁడు పాపము నొందఁడు. పుట్టువుచే వచ్చినకర్మము దోషయుక్తమైనను విడువరాదు. స్వధర్మనిర్వహణము తనకు విధియని శ్రీరామచంద్రమూర్తి యాసక్తిలేక చేసెను అర్జునుఁడట్లు చేయలేకపోయెను. రామాచరణము కృష్ణోపదేశము రెండు నొకటే. ఈసందర్భమున విష్ణుపురాణములోని యీ శ్లోకము లనుసంధింపఁదగినవి. పృథుచక్రవర్తి భూదేవిని జంపఁబూనినపుడా మె 'స్త్రీవధే త్వం మహాత్పాపం కిం నరేంద్ర నపశ్యసి, యేన మాం హంతు మత్యర్థం ప్రకరోషి నృపోద్యమమ్॥ రాజా! స్త్రీవధ మహాపాపమని నీకేల కానరాలేదు నన్నుఁ జంపుటకై నీవేల యింత ప్రబల ప్రయత్నము చేయుచున్నావు. అని యడుగఁగాఁ బృథుచక్రవర్తి యిట్లు చెప్పెను. 'శ్లో॥ ఏకస్మి న్యత్ర నిధనం ప్రాపితే దుష్టకారిణి, బహూనాం భవతి క్షేమ స్తస్య పుణ్యప్రదో వధః॥ వి. పు. ౧-౧౩-౨౩-౨౪. చెడు నడవడిగలదానా! యొక్కరినిఁ జంపుటచేఁ బెక్కురకు క్షేమముగలదేని యట్టివధవలనఁ బుణ్యము వచ్చును. ప్రమాణము లిట్లుండుటచే శ్రీరామచంద్రమూర్తి తాటకను జంపుట దోషావహముగాదు.

చం॥ పనిచినతండ్రిమాటఁ గొని ♦ బ్రహ్మనిభుం డగుబ్రహ్మవాదిశా
సన మొనరింతు, నేమిటికి ♦ సందియ మంచు మొగిడ్చి హస్తముల్
మునివర విప్రగోవిషయ♦ముల్ సుఖమొందఁ ద్వదుక్తిఁ దాటక౯
దునిమెద నంచు దిక్తటులు ♦ తుంపెసలాడ గుణంబు మీటినన్. ౬౬౦

పనిచిన=ఆజ్ఞాపించిన, త్వదుక్తి౯=నీమాటమీఁద, తునిమెద౯=ఖండించెదను. దిక్తటులు=దిక్ప్రదేశములు. తుంపెసలాడ౯-ఊఁగులాడ౯, గుణంబు=అల్లెత్రాడు.

తా త్ప ర్య ము.

ఆజ్ఞాపించిన తండ్రిమాటప్రకారము బ్రహ్మసమానుఁడైన యీ బ్రహ్మవాది యాజ్ఞ నెఱవేర్చెదను. అటులైన జనకాజ్ఞ గుర్వాజ్ఞ రెండు నెరవేర్చినవాడ నగుదును. కేవల దయయే యెంచి చేయకపోతినా యిరువురయాజ్ఞ మీఱినవాఁడ నగుదును. కావున సందేహింపఁ బనిలేదని నిశ్చయించుకొని విశ్వామిత్రునిఁ జూచి కేలుమోడ్చి మునీంద్రా! బ్రాహ్మణులు గోవులు దేశములు సుఖపడుటకై నీ యాజ్ఞప్రకారము తాటకను జంపెద నని ధ్వనిచే దిక్కు లూఁగులాడునటు లల్లెత్రాడు మీటెను.

శా॥ ఆరావంబు శ్రవోవిదారణచణం ♦ బై వీచుచు౯ యక్షి హుం
కారాస్ఫోటితభూదిశావరణ యై ♦ గర్జించుచు౯ లేచి వే
యూరావం బరుదెంచుజాడఁ గొని తీ♦వ్రాటోపపాదోద్గతి౯
ఘోరాకారతఁ బాఱుదేరఁగ నపుం ♦ గుంటెమ్ముతో రాముఁడున్. ౬౬౧

రావము - ధ్వని, శ్రవోవిదారణచణంబు = చెవులు పగలఁజీల్చు సామర్థ్యముగలదై, వీచుచు౯ - వీవఁగా, హుంకార = హుమ్మను ధ్వనిచే, ఆస్ఫోటిత = చీల్పఁబడిన, భూదిశావరణయై = భూమియొక్కయు దిక్కులయొక్కయు ఆవరణముగలదై, ఆరావంబు = ధ్వని, తీవ్రాటోపపాదోద్గతి౯ = భయంకరమైన (తీక్ష్ణమైన) వేగముతోఁబెట్టెడు నడుగులదెబ్బలచే, ఘోరాకారత౯ = దిగులుపుట్టించు రూపముతో.

తా త్ప ర్య ము.

ఆధ్వని చెవులు పగిలిపోవునట్లుగా వీవఁగాఁ దాటక హుంకారములచే భూమి దిక్కులు పగిలిపోవునట్లు చేయుచు గర్జలు పెట్టుచు లేచి ధ్వనివచ్చుజాడను బట్టి దబ్బుదబ్బని ధ్వనింపఁ బాదములు నేలఁబెట్టుచు భయంకరాకారముతో వచ్చుచుండుట చూచి రాముఁడు లక్ష్మణునితో నిట్లనెను.

ఉ॥ తమ్ముఁడ, లక్ష్మణా! కనితె ♦ దారుణదేహముతో వికారవే
షమ్మున భైరవారవము ♦ సల్పెడు రాక్షసి, ధీరులైన ను
గ్రమ్ముగదీనిరూపుఁ గన ♦ బ్రద్దలువాఱుఁగ గుండె లంత నా
శమ్మును బొందరే, యతుల ♦ శాంబరివిద్య నజయ్య యేరికిన్.   ౬౬౨

భైరవారవము - భయంకరమగు ధ్వని, అతులశాంబరి = అసమానమైన మాయ, శంబరునివిద్య శాంబరి! మాయ = కానరాకుండుశక్తి! అజయ్య = జయింపరానిది.

తాత్పర్యము.

తమ్ముఁడా, లక్ష్మణా! ఈరాక్షసి యొల్లు వికారవేషముతో భయంకరదేహముతో, దిగులుపుట్టించు ధ్వనిచేయుచున్నది! భయంకరమైన దీనిరూపము చూచినంతనే యెంతటిధీరులైనను గుండెలు బ్రద్దలైపోవ వెంటనే చావరా? దేహబలముచేతనే కాదు, అసమానమైన మాయావిద్యయు దీనియందుఁగలదు. కావున నెట్టివారికైన నిది జయింపరానిదే

ఉ॥ దీని మరల్తుఁ జూడు సుదతీహననం బొనరింప నొల్ల, ని
ద్దాని నికృత్తనాసికఁగ ♦ దారితకర్ణఁగఁ జేసి బీరముల్
మానిచి యానవేగమును ♦ మాయఁగఁ జేసెద నంచు నుండ న
ద్దానవి రామునిపైఁ గవిసె ♦ దారుణహుంకృతిఁ జేతు లెత్తుచున్.   ౬౬౩

సుదతీహననంబు = స్త్రీవధము, కృత్తనాసికగా = కోయఁబడినముక్కు గలదానిగ, దారితకర్ణగా = చీల్పఁబడిన చెవులుకలదానిగ, బీరము = వీర్యము, యానవేగము గమనమునందలి త్వర.

తాత్పర్యము.

లక్ష్మణా! విశ్వామిత్రుఁడు సత్యమే చెప్పెను. దీని నెవరు జయింపరానిమాట నిజమే. కావున నేనే దీనిని జంపవలసియున్నది. అయినను 'అయ్యో! స్త్రీయే యెట్లుచంపుదునా' యని కరుణ పెరిఁగించుచున్నది. కావున దీనిని జంపను. చెవులు ముక్కు గోసి గమనవేగమునణఁచి మరలిపోవునట్లుచేసెదను. అంతతో భయము గలిగి దుష్కార్యములు చేయకయుండును. అని చెప్పుచుండ నింతలో నారాక్షసి చేతులు మీఁదికెత్తి హుంకరించుచు రామునిపైపడ వచ్చెను.

ఇదియే, తాటకనుజంపుటయందు శ్రీరామచంద్రమూర్తికిఁ గామముగాని క్రోధముగాని లేదని, కర్తవ్యముగానఁ జేయబూనెనని, తెలుపుచున్నది.

చం॥ భయదతరాకృతిం గవియ ♦ బ్రహ్మఋషీంద్రుఁ డదల్చి హుంకృతిన్
జయజయ రామభద్ర యని ♦ స్వస్తి వచించెను, యక్షకాంతయున్

రయమునఁ బాంసువర్షమున ♦ రాఘవులం గదుముంప మోహాత
స్వయత ముహూర్తముం బ్రతి యొ♦నర్పఁగ యోజన సేయుచుండఁగన్ । ౬౬౮

భయదఘోరాకృతిన్ = మిక్కిలిభయంకరమైన యాకారముతో, పాంసువర్షము— దుమ్మువాన, మోహాతస్వయతన్ = నివ్వెరపాటున; ప్రతి = బదులునకుబదులు. రామున కిప్పటి కస్త్రములు తెలియవు. ధూళివర్షము బాణములచేఁ బోవునది కాదు. కావున నేమి యుపాయ మని యాలోచించుచుండఁగా.

తాత్పర్యము.

భయంకరాకారముతో నది రామునిపైఁ బడ రాఁగా విశ్వామిత్రుఁడు హుంకారముచే నదలించి రామభద్రా! జయజయ యని దీవించెను. తాటకయు దూరమందేయుండి శీఘ్రముగ దుమ్మువాన రామునిపైఁ గురియించెను. దాని కాయన నివ్వెరపడి దీనికి మా తేమిచేయవచ్చునని యాలోచించుచుండఁగా.

సీ॥ అదియు మాయాయుక్త ♦ యై రాఘవుల నొంచెఁ, జటులనిష్ఠురశిలా♦సారధార
దానిపోకలఁ జూచి ♦ దారుణక్రోధాంత,రంగుఁడై బాణవ♦ర్షంబుచేత
రాముండు దానికూ♦రత మాన్పి ఖండించెఁ, గరయుగ్మమును బృష♦త్కములచేత
నీలోన సౌమిత్రి ♦ హృతకర్ణనాసికఁ, గావించె దాని ని♦ష్ఠురుఁడు నగుచు
తే॥ నీడఁబోవక యదియును ♦ నేపుమీఱి, కామరూపంబులను దాల్చి ♦ కనఁగరాక
మాయచే మోహపఱచుచు♦మాయుకొనియె, నశ్మవృష్టిని గురియించు ♦ చధిక
ముగను. ౬౬౯

మాయాయుక్తయై=మాయతోఁ గూడినదై. మాయయనఁగా నద్భుతశక్తి. ఇచటఁ గానరాకపోవుశక్తి. చటుల నిష్ఠుర శిలాసారధార=ఱివ్వుఱివ్వున వచ్చు గట్టిరాలవానయొక్క ధారచే, దారుణక్రోధాంతరంగుఁడై=తీవ్రముతోఁ గూడిన మనస్సుగలవాఁడై, కరయుగ్మమును — రెండుచేతులను, పృషత్కములచేత = బాణములచేత, హృతకర్ణనాసికన్—హరింపఁబడిన చెవులు ముక్కుగల దానినిగ, నిష్ఠురుఁడు=దయలేనివాఁడు, ఈడఁబోవక — వెనుదీయక, అశ్మవృష్టి—రాల వాన.

తాత్పర్యము.

ఇంతలోఁ దాటకయు మాయతోఁ గూడినదై రామలక్ష్మణులమీఁద ఱివ్వుఱివ్వున రాలవాన ధారలుధారలుగాఁ దెంపులేక కురియించెను. అదిచేయు చేష్టలుచూచి రాముఁడు కోపించి యీ చేతు లుండినఁగదా యిట్లు చేయుచున్నదని రాలు తమకుఁ దగులకుండ దానిపై బాణవర్షము గురియించి బాణములచే దాని రెండుచేతుల నఱికెను. ఇంతలో దానిని జంపను ముక్కుచెవులు

కోసెద నని యున్న చెప్పిన కారణముచే నాపని తానే చేయఁగోరి లక్ష్మణుఁడు దానిపై దుమికి దయమాలి చెవులు ముక్కు ఖండించెను. ఆ మాత్రమున నది వెనుదీయక విజృంభించి కోరినట్లు నానారూపముల ధరించి కన్నుల కగపడక మాయచే మతిభ్రమణము కలిగించుచు విపరీతపు రాలవాన గురియించుచు నెదిరించెను.

ఉ॥ దానియసహ్యావిక్రమని♦తాంతజవంబులఁ జూచి రామ! నీ
వూనకుమయ్య దీనియెడ ♦ నొక్కలవంబు దయన్, వధింపుమీ
దీనిని దుష్టచారిణి న♦దీనపరాక్రమ యజ్ఞహంత్రి ని
ష్ఠానెటి, సంజయైన వధి♦యింపఁగ దుష్కరమయ్యు దైత్యులన్ ౬౬౬

అసహ్యా = సహింపరాని, నితాంతజవంబు = అధిక వేగము, లవంబు = కొంచెమయినను, దుష్టచారిణి = చెడునడవడి గలదానిని, అదీనపరాక్రమ = విస్తారపరాక్రమము గలదానిని, యజ్ఞహంత్రి = యజ్ఞములు నాశము చేయుదానిని, ఏనెటి — ఏవిధముగ నైనను, సంజ — సంధ్యాసమయము. సంధ్య తద్భవము సంజ దుష్కరము = చేయఁగష్టమైనది. దీని వలన నిపుడు సంధ్యాకాలము కావచ్చిన దని భావము.

తాత్పర్యము.

ఆ తాటకయొక్క సహింపరాని విక్రమము, అధికమైన వేగముఁ జూచి విశ్వామిత్రుఁడు రామా! నీవేమో దీనియందు దయదలఁచి చంపక యూరక తలుమఁగొట్టఁ జూచుచున్నావు. ఇది యట్లు పోవునదికాదు. ఇది చెడు నడ వడిగలది. విస్తారపరాక్రమముగలది. యజ్ఞముల నాశముచేయునది. ఈవిధ ముగా నీవు దీనిఁ జంపుటయందు జాగుచేసితివా సంధ్యావేళయాయెనా తరు వాత దీనిఁ జంపుట యసాధ్యము. సంధ్యలందు రాక్షసులకు బల మెక్కువ.

సీ॥ అని మౌని బోధింప ♦ నంతలో యక్షియు, వర్షించుచును రాల♦వాన గదియ
మాయాబలంబున ♦ మహిపకుమారుఁడు, శబ్దవేధులునైన ♦ సాయకములఁ
దద్వేగ మణఁగింపఁ దాటక వేగపై, పడఁగ రా జీవ్వన ♦ బలియుఁ దుర్గ
సాయకం బొక్కటి ♦ సంధించి యురమున, నట్టె నాటింప ని♦శాటి చచ్చి
తే॥ భూమి యల్లలనాడ ద♦బ్బునను బడిన, హరిహయాదిసురావళి ♦ హర్ష మంది
మేలు మేలనిపొగడుచు ♦ మెచ్చుకొనుచుఁ, బూజగావించె నారఘు♦పుంగవునకు.
౬౬౭

శబ్దవేధులు=వస్తువు కానరాకున్నను ధ్వనిఁబట్టి లక్ష్యమును భేదించునవి; సాయకములన్ - బాణములచే, నిశాటి=రాక్షసి, రాత్రియందుఁ దిరుగునది. హరిహయాది సురావళి=ఇంద్రుఁడు మొదలగు దేవతాసమూహము.

తాత్పర్యము.

అని విశ్వామిత్రుఁడు బోధించుచుండ నింతలోఁ దాటకయు రాలవానఁగురియించుచు మాయాబలముచే సమీపించిరాఁగా నదికానరామిని రామచంద్రమూర్తి దాని ధ్వనిఁబట్టి బాణములు ప్రయోగించి దానిమద మణఁచెను. తాటకయు మాయ నిష్ప్రయోజనమగుటచే దానిని వదలి ప్రత్యక్షంబుగ ఱివ్వున నోడి సెలరాయివలెఁ బైపడరాఁగా బలవంతుఁడైన రామచంద్రమూర్తి భయంకరమై తీక్ష్ణమైన బాణమునుదీసి సంధించి, దానిఱొమ్మునునాటునట్లువేయఁగా నారాక్షసి చచ్చి, భూమియదరునట్లు దబాలునఁ బడెను. అదిచూచి యింద్రుఁడు మొదలగు దేవతలు దుష్టరాక్షసి చచ్చెనని సంతోషించి, యంతటి బలముగలదానిని కేవల బాణములచేతనే రామచంద్రమూర్తి చంపగలిగెను. ఇఁక నస్త్రబల ముండినను నీయన యెంతకార్యమైనఁ జేయఁగలఁడని పొగడి శ్రీరామచంద్రమూర్తినిఁ బూజించిరి.

ఉ॥ అంత బలాంతకాదులు స♦సంతము సంతసమార నస్త్రవి
ద్యాంతునిఁ జూచి యిట్లనిరి ♦ కౌశిక! యీమహనీయదైత్యకాం
తాంతకు స్నేహయుక్తిని భృ♦శాశ్వసుతాప్తునిఁ జేయవయ్య, భూ
కాంతసుతుండు చేయఁ దగు♦కార్యము లున్నవి లోకరక్షకై. ౬౬౮

బలాంతకాదులు-ఇంద్రుఁడు మొదలగువారు - అనంతము=మితిమీఱిన - అస్త్రవిద్యాంతుని=అస్త్రములు దెలిసినవారిలో శ్రేష్ఠుని - దైత్యకాంతాంతకుఁ=రాక్షసస్త్రీనిఁ జంపినవానిని - భృశాశ్వసుతాప్తుని-భృశాశ్వపుత్త్రులై యస్త్రములై యుండువారిని బొందినవానిఁగా, భూకాంతసుతుండు=రాజకుమారుఁడు.

తాత్పర్యము.

అంతట నింద్రుఁడు మొదలగువారు మిక్కిలి సంతోషించి యస్త్రజ్ఞానముగల వారిలో శ్రేష్ఠుఁడైన విశ్వామిత్రునిఁజూచి మునీంద్రా! భృశాశ్వనందను లస్త్రములై నీయొద్ద నున్నారుగదా వారి నీయన కప్పగింపుము లోకరక్షణార్థ మీ రాజకుమారుఁడు చేయవలసినకార్యము లున్నవి అస్త్రజ్ఞానములేక యెట్లు చేయఁగలఁడు.

ఉ॥ ఈతనికన్నఁ బాత్రుఁడు మ♦రేఁడును నీకు లభింపఁ డెల్లవి
ద్యాతతి నిమ్మటంచు. జనఁ♦ దాపసుఁ డారఘువీరుఁ గ్రుచ్చి సం
ప్రీతి శిరంబు మూర్కొని మ♦రీ యిటఁ బుత్త్రమటయ్య తేఘు వి
ఖ్యాతచరిత్ర! పోదము మ♦దాశ్రమభూమిని డాయ నంచనన్. ౬౬౯

పాత్రుఁడు = యోగ్యుఁడు. మఱేఁడును = ఇతరుఁడెవ్వఁడైనను. ఉపు = ఉదయము. లోకమునఁ బరికరసంపత్తిగలిగించి కార్యముచేయుమనుట వాడుక. నాఁగలిమొద్దు లీయక పొలము దున్నుమనిన నెవఁడెట్లుచేయును? అయినను నిది యట్టిదికాదు. శిష్యునిఁబరీక్షించికాని మంత్రోపదేశముచేయరాదు. కావున రామచంద్రమూర్తి గురువాక్యము దక్కించునా దక్కింపఁడా? ఇచ్చినదిసమర్థించు కొనఁగలఁడా లేఁడా యని పరీక్షార్థము ముందు తాటకను జంప రాముని నియమించెను.

దీనివలన శాస్త్రవిహితమైన స్వకులాశ్రమధర్మములను బుణ్యపాపవిచారము లేక నిష్కాముఁడై చేయవలయును. శాస్త్రవిహితమైనదానిని గురువులు చెప్పినప్పుడది తనకిష్టముండినను లేకుండినను జేయవలయు ననిసూచన. గురువులు దుష్కార్యములుచెప్పినఁ జేయరాదు.

తా త్ప ర్య ము.

మునీంద్రా! అస్త్రదానముచేయుటకు నీయనకంటె యోగ్యుఁడైనవాఁడు మఱియొకఁడు నీకు లభింపఁడు. కావున నీయొద్దనుండు విద్యాసమూహమునెల్ల నీయనకిమ్ము - అనిచెప్పిపోఁగా విశ్వామిత్రుఁడును రామునిఁ గౌఁగిలించికొని ప్రేమతో శిరస్సునాఘ్రాణించి, నాయనా! యిప్పటికి సంధ్యాసమయమైనది కావున నీరాత్రి యిందేకడపి యుదయముకాఁగానే నాయాశ్రమభూమినిఁ జేరఁబోదము.

ఉ॥ అట్టులగాక యం చచట ♦ నానిశ యుండఁగఁ జూడ నొప్పె ము
న్నొట్టినశాప మూఁడుట వి♦నూతనపల్లవపుష్పరాజికిం
బట్టయి శ్రీదుచైత్రరథ♦మా యని సందియ మెల్లవారికిం
బుట్టఁగఁజేయ నాగహన♦భూమి మనోజ్ఞరమానివాసమై. ౭౭౦

నిశ = రాత్రి, ఇది మూఁడవనాటిరాత్రి, తొట్టిన = కలిగిన, వినూతన = క్రొత్తదైన, పల్లవ = చిగుళ్లయొక్కయు, పుష్ప = పూలయొక్కయు, రాశికిన్ = సమూహమునకు, పట్టయి = స్థానమై, శ్రీదుచైత్రరథమా = కుబేరుని చైత్రరథమను నుద్యానమా, గహనభూమి = అరణ్యప్రదేశము. మనోజ్ఞరమానివాసమై = మనోహరమైన లక్ష్మికి (వనలక్ష్మికి) నివసించుప్రదేశమై.

తా త్ప ర్య ము.

అనినట్లులే కానిమ్మని యా మూఁడవనాఁటిరాత్రి యచ్చటనే యుండఁగ నప్పు డా వనము పూర్వశాపము తాటకచావుతోఁ దీఱిపోవుటచేఁ గ్రొత్త చిగుళ్లు పూవులు గుత్తుగుత్తులుగఁ గానవచ్చి యిదియేమి చైత్రరథమనుపేరుగల

కుబేరుని యుద్యానవనమా యని తోఁచునట్లు లా యరణ్యప్రదేశము సుందర వనలక్ష్మికి నివాసభూమియై కనఁబడెను.

―* ౨౭వ సర్గము *―

సీ॥ ఆరీతి నచ్చోట ♦ నా రాత్రి వసియించి, వఱువాత నాచిన్ని ♦ బాలకులను
మునిరాజు బోధించి ♦ కనఁగొని శ్రీరాము, సంతోషమయ్యె నీ♦చరితములకుఁ
బరమముదంబున ♦ నరసురాసురయక్ష,గంధర్వకిన్నర♦గరుడసిద్ధ
సమితి నైనను నీవు ♦ సమితి జయింపఁగఁ, జాలెడిపరమాస్త్ర♦సముదయముల
తే॥ నిచ్చెదను నీకు గ్రహియింపు ♦ మింపుతోడ, నెట్టిశత్రుల నేనియు ♦ మట్టుపెట్టి
వశముఁ గావించుకొనఁ జాలు♦వాలుమగఁడ, వైధరాస్థలి నెలసెదు ♦ సాధువినుత. ౬౭౧

వఱువాతన్ = ఉదయమున, పరమముదంబునన్ = మిక్కిలి సంతోషముతో, సమితిన్ = యుద్ధమందు, పరమాస్త్రసముదయములన్ - శ్రేష్ఠములైనయస్త్రముల సమూహములను, మట్టుపెట్టి = అణఁచి - వాలుమగఁడవు = శూరుఁడవు.

తాత్పర్యము.

ఆవిధముగా నా రాత్రి యచ్చటనే యుండి నాలవనాఁ డుదయముకాఁగానే యాముద్దుబాలకులను విశ్వామిత్రుఁడు లేపి, శ్రీరామచంద్రమూర్తినిఁ జూచి, రామా! నాయనా! రామచంద్రా! నీనడవడిక నేను జాల సంతోషించితిని. నీకు మనుష్యులయు దేవతలయు రాక్షసులయు యక్షులయు గంధర్వ కిన్నర గరుడ సిద్ధులయు సమూహములను యుద్ధభూమియందు జయింపఁజాలిన శ్రేష్ఠములైన యనేకాస్త్రములను నిచ్చెదను. నీవు గ్రహింపుము. దీనిచే నీవెట్టిశత్రులనైన నణఁచి వశపఱచుకొనఁగల శూరుఁడవై భూమియందుఁ బ్రసిద్ధికెక్కెదవు.

― విశ్వామిత్రుఁడు శ్రీరామునకు దివ్యాస్త్రంబు లొసంగుట ―

సీసమాలిక.

సీ॥ దండచక్రంబును ♦ ధర్మచక్రముఁ గాల,చక్రంబు మఱి విష్ణు♦చక్ర మతుల
మైంద్రాస్త్రభయదవ♦జ్రాస్త్రముల్ వరమగు, శివశూలమును బ్రహ్మ♦శీర్షశరము
నైషీకశరము బ్ర♦హ్మాస్త్రంబు మోదకీ, శిఖరులన్ పేరైన♦శ్రేష్ఠగదలు
వరుణపాశంబును ♦ వారుణాస్త్రము ధర్మపాశంబు మఱి కాల♦పాశ మొండు
నార్ద్రాశుష్కాఖ్య లౌ♦నశనులు రెండును, నారాయణాస్త్రపై♦నాకశరము
లాగ్నేయబాణంబు ♦ సగ్నిదయితమైన, శిఖరాస్త్రమును వాయ♦వ్యాజిహ్మగంబు
హయశిరోస్త్రంబుఁ గ్రౌం♦చాస్త్రంబు శక్తులు, దైత్యసంఘాతంబు♦దాల్చితిరుగు

కంకాల ముసల కం♦కణములుఁ గాపాల,మును నివియెల్లఁ బెం♦పుగ నొసంగు
వాఁడను మఱియును ♦ వైద్యాధరాస్త్రంబు, నందనం బనుపేర ♦ నందగించు
నసిరత్నమును మాన♦వాస్త్రంబు గాంధర్వ, శరముఁ బ్రశమనప్ర♦స్వాపనములు
భాస్కరాస్త్రంబు ద♦ర్పణశోషణంబులు, సంతాపనవిలాప♦శరయుగంబు
దర్పకాస్త్రంబుఁ గం♦దర్పకదయితంబు, పైశాచకశరంబుఁ ♦ బ్రబలమోహ
నంబును సంవర్త♦కంబును దామసం,బును సౌమనంబు న♦మోఘమైన
మౌసలసత్యముల్ ♦ మాయాధరంబు తే,జఃప్రభాస్త్రంబును ♦ సౌమ్యశరము
ద్వష్ట్రస్త్రమైనసు♦దామనంబు భగేశు, సీతేషువులు సౌర♦శితశరంబు

తే॥ గామరూపమహాబల♦కలితము లగు,నీశరంబుల నన్నింటి ♦ నిచ్చువాఁడఁ
దూర్పుముగఁ గూర్చుటం చిచ్చెఁ♦ దూర్పుదిరిగి, శుచితరామున కాయస్త్ర♦నిచయ
ముంగ. ౬౭౨

తాత్పర్యము.

దండచక్రము - ధర్మచక్రము - కాలచక్రము - విష్ణుచక్రము - ఐంద్రాస్త్రము - భయంకరమైన వజ్రాస్త్రము - శివశూలము - బ్రహ్మశిరము - ఐషీకము బ్రహ్మాస్త్రము - మోదకీ శిఖరులను రెండుగదలు - ధర్మపాశము - వారుణాస్త్రము - ధర్మపాశము - కాలపాశము - ఆర్ద్రము శుష్కము అను రెండుగల యశనులు (పిడుగులు)- నారాయణాస్త్రము-పైనాకము-అగ్ని దేవతాకమైన యాగ్నేయాస్త్రము - శిఖరాస్త్రము - వాయవ్యాస్త్రము- హయశిరోస్త్రము క్రౌంచాస్త్రము - రాక్షసులు ధరించి తిరుగు కంకాలము, ముసలము, కంకణము, కాపాలము, వీనినన్నిటిని నిచ్చెదను. ఇదిగాక వైద్యాధరాస్త్రము, నందనమను ఖడ్గము-మానవాస్త్రము-గాంధర్వాస్త్రము- ప్రశమనము - ప్రస్వాపనము భాస్కరాస్త్రము - దర్పణము శోషణము సంతాపనము - విలాపనము - కందర్పునకుఁ బ్రియమైన దర్పకాస్త్రము - పైశాచాస్త్రము - మోహనము సంవర్తకము- దామనంబు - సౌమనము - మౌసలము -- సత్యము - మాయాధరము - తేజ, ప్రభాస్త్రము - సౌమ్యము - త్వష్ట్రాస్త్రమయిన సుదామనము - భర్గాస్త్రము - శీతాస్త్రము - సౌరాస్త్రము - ఈ యస్త్రములన్నియుఁ గామరూపములు - మహాబలవంతములు. వీని నన్నిటి నిచ్చెదను శీఘ్రముగ గ్రహింపుము అని తూర్పుమొగమై శుచియై యాచమించి యా యస్త్రముల మంత్రములనెల్ల నాయన కుపదేశించెను.

అస్త్రమంత్రములు.

ఇందుఁ జెప్పఁబడిన యన్నియస్త్రములకు, మంత్రములు గలవు. మచ్చునకై ముఖ్యమైనవి కొన్నిమాత్రము వచించెద.

బ్రహ్మాస్త్రము.

ఫాంతం (వాంతం) వహ్నిసమాయుక్తం, వ్యోమ హాలాసమన్వితమ్
మేషద్వయం దంతయుతం, హాలాహల మతఃపరమ్
ఘనాద్యం వాయుపూర్వంచ, దంతయుక్త మథాన్వితమ్
నరసం ఋక్షపర్యాయం భాంతం భృగుమతః పరమ్॥
అంబరం వాయుసంయుక్త, మరిమర్దన మప్యత
ప్రదీప్త మథవక్తవ్యం, పరమంచ పదం తతః,
తత్తే పదే ప్రయోక్తవ్యే, గాయత్ర్యా మధ్యమం తతః,
పదత్రయం ప్రయోక్తవ్య, మేత ద్బ్రహ్మాస్త్ర మీరితమ్.

దండచక్రము.

జీవః పంచమవర్గాది, చతుర్థా ద్యోంతిమాన్వితః
భృగు స్సదీర్ఘో దండాద్యో, మేషో యష్ట్యపరాహ్వయః
ఆత్మనేచ పదం తత్ర, చక్రాయేతి పదం తతః
కర్మాంత ఏష మంత్రస్తు, దండచక్ర మితీష్యతే.

కాలచక్రము.

కరుణం మాయయా యుక్తం, వాంగం వారుణసంయుతమ్
యూపాంతం వహ్నినా యుక్తం, మోధసాగ్ని రథాత్రియుక్
ధాంతం కాలాత్మనే ప్యేత, చ్చక్రాయేతి పరంతతః
షడంత ఏష మంత్రస్తు, కాలచక్రం ప్రకీర్తితం.

విష్ణుచక్రము.

తారపూర్వంచ హృదయం, భగాద్యంతౌ వనాదిమః
చండీశయుక్త ఆషాఢ, తీవ్రతేజస ఇత్యపి
పర్యాయం లక్షసంఖ్యాయాః, ఆరేతిచ పదం తతః
పర మత్ర ప్రయోక్తవ్యం, ఛిందీతిచ, పదం తతః
భీషయేత్యపి వక్తవ్యం, విష్ణుచక్ర మిదం విదుః.

బ్రహ్మశిరము.

క్రోడీ దండీచ చండీశ, వీరాంతం వృశ్చికాదిమమ్
ఆషాఢయుక్సచండీశో, హుంఫట్ బ్రహ్మశిరః స్మృతమ్.

నారాయణాస్త్రము.

విష్ణుదండీ పునశ్చాన్యో, భుజంగో దీర్ఘసంయుతః
ఆపాఢో మాయయా యుక్తః, సుదర్శనపరాహ్వయః
దారణేతి పదం తత్ర, విశ్వమూర్తే ఇతి క్రమాత్
వర్మాస్త్రే చ తథా జ్ఞేయే, నారాయణ మిదం స్మృతమ్.

పాశుపతాస్త్రము.

సపినాకీ బకో బిందు, ర్మహామాయాసమన్వితః
లోహితోఽథ బక శ్చాయం, పంచమస్వరసంయుతః
కవచాస్త్రే ప్రయోక్తవ్యే, ఏత త్పాశుపతం స్మృతమ్.

అన్నిమంత్రము లీ విధముగ నున్నవి. ఇవి శ్రీశంకరుఁడు నారదున కుపదేశించెను.

ఉ॥ ఇన్నియు దేవతాతతుల • కేని యసాధ్యము సంగ్రహింపఁ, దా
నన్ని యొసంగె రామున కు•దారత బ్రాహ్మణుఁ, డంత రాముఁ డ
త్యున్నతనిష్ఠమై జపము • నోలి నొనర్ప మునీంద్రునాజ్ఞఁ దా
మన్నియు నస్త్రశస్త్రనిచ•యంబులు రామునిఁ గొల్చె భృత్యులై. ౬౭౩

ఇన్నియస్త్రములొక్కఁడు సంపాదింప దేవతలకైన సాధ్యపడదు. అట్టివాని నన్నిటిని రామున కుదారబుద్ధితో విశ్వామిత్రుఁ డిచ్చెను. అంత శ్రీరామచంద్రుఁడును మిక్కిలినిష్ఠతో, జపము చేయఁగా మునీంద్రుని యాజ్ఞచొప్పున నాయస్త్రశస్త్రసమూహములన్నియు భృత్యులై రామచంద్రమూర్తిని సేవించెను.

ఉ॥ గారవమార వానిఁ గర•కంజములన్ స్పృశియించి యింక స్వే
చ్ఛారతి మీరు మీవలయు•చక్కటికిం జని యెప్పుడేని నేఁ
గోరినపట్లఁ గార్యమును • గొబ్బునఁ దీర్పఁగ రండు పొం డటం
చారఘువీరుఁ డాడ నవి • యన్నియుఁ బోయె యథేప్సితంబుగన్ ౬౭౪

స్వేచ్ఛారతిన్ = మీయిష్టము చొప్పున, చక్కటికిన్ = ప్రదేశమునకు, యథేప్సితము = ఇష్టప్రకారము.

తాత్పర్యము.

ఇట్లు ప్రత్యక్షములైన యస్త్రదేవతలనెల్ల హస్తపద్మములచేఁదాఁకి స్వీకరించి, యిఁక మీరు మీయిష్టముచొప్పునఁ బొండు - పనిపడినపుడు నేను దలఁచెదను. అప్పుడు మీరు వచ్చి కార్యము చక్కఁబఱుపుఁడు, పొం డని సెలవీయ వారందఱు తమతమయిష్టానుసారము వెడలిపోయిరి.

కం॥ ఆతతమతి రఘువీరుఁడు, చేతము రంజిల్ల మౌనిశేఖరునకు సం
ప్రీతిని మ్రొక్కి ప్రయాణం, బై తరలుచు నిట్టు లనియె హర్షము పేర్మిన్. ౬౭౫

ఆతతమతి = ఉదారమైనమనస్సుతో - చేతము = మనస్సు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుఁడంత సంతోషాతిశయముచే వికాసమునొందిన మనస్సుగల వాఁడై విశ్వామిత్రునకు నమస్కరించి ప్రయాణమై పోవుచు నిట్లనియె.

—* ౨౮ వ సర్గము *—

ఉ॥ ఆరయ దేవతాతతులకైన నజయ్యము లైనయస్త్రముల్
కారుణికాగ్రణీ! యొసఁగఁ గైకొనితిన్ మఱి వీని కిమ్ము సం
హారములన్ యథావిధిగ నంచు వచించిన సువ్రతాత్ముఁ డా
శ్రీరఘురామచంద్రునకుఁ జెప్పఁ దొడంగెను వాని నన్నిటిన్. ౬౭౬

అజయ్యములు = జయింప సాధ్యముగానివి. సంహారములన్ = సంహారాస్త్రములను. యథావిధి = శాస్త్రప్రకారము.

తా త్ప ర్య ము.

దయావంతుఁడా! దేవతాసమూహములకైనను జయింపరాని యస్త్రములను నీ విచ్చితివి, గ్రహించితిని. శత్రువులు మనపై నేయస్త్రము ప్రయోగించిన దానిని నేయస్త్రముతో సంహరింపవలయునో, మనము ప్రయోగించిన దానినే మన ముపసంహరింపవలసియుండిన నెట్లు చేయవలయునో యదియును జెప్పుమని యడిగిన వానినెల్లఁ జెప్ప నారంభించెను.

—* విశ్వామిత్రుఁడు శ్రీరామున కుపసంహారాస్త్రములొసంగుట *—

సీ॥ సత్యవంతంబును సత్యకీర్తిశరంబుఁ, బ్రతిహారతరధృష్టరభసములును
మొగిఁ బరాఙ్ముఖ మవాఙ్ముఖము లక్షాక్షవిషములును మఱి దశాక్షంబు నగ్ర
దృఢనాభము సునాభ మెసఁగు సుదీప్తంబు,దశశీర్షమును శతోదరము నిశిత
శతవక్త్రశరముఁ గృశనము జ్యోతిషపద్మనాభ మహానాభనామకములు
తే॥ దుందునాభసునాభముల్ తోయజాక్ష,విమలనైరాశ్యశుచిబాహువిరుచిరుచిర
ధనమహాబాహునిష్కలిదైత్యశమన, కాండములును హారిద్రయోగంధరములు.
౬౭౭

తే॥ మకరధాన్యములుఁ బితృసౌ♦మనసములను, శాతకరవీరశరమువి♦ధూతశరముఁ
గామరుచి యావరణమోహ ♦ కామరూప, సర్వనాభజృంభకములుఁ ♦ జారుశీల. ౬౭౮

కం॥ సంతానవరణశరము ల,నంతవిభావంతములు భృ♦శాశ్వతనూజుల్
చింతితరూపులు జాపక, చింతామణు లనుచు నిచ్చె ♦ శ్రీరామునకున్. ౬౭౯

తాత్పర్యము.

సత్యవంతము - సత్యకీర్తి - ప్రతిహారము - రభసము - పరాఙ్ముఖము - అవాఙ్ముఖము - లక్ష్యాలక్ష్యవిషములు - దశాక్షము - దృఢనాభము - సునాభము - సుదీప్తము - దశశీర్షము - శతోదరము - శతవక్త్రము - కృశనము - జ్యోతిషము - పద్మనాభము - మహానాభము - దుందునాభము - సునాభము - నైరాశ్యము - శుచి - బాహువు - విరుచి - రుచిరము - ధనము - మహాబాహువు - నిష్కలి - దైత్యశమనము - హరిద్రము - యోగంధరము - మకరము - ధాన్యము - పితృవు - సౌమనసము - కరవీరశరము - విధూతశరము - కామరుచి - ఆవరణము - మోహము - కామరూపము - సర్వనాభము - జృంభకము - సంతానము - వరణము - అనంతము - విభావంతము — వీరందఱు భృశాశ్వునికొడుకులు. కోరినరూపములు గలవారు. జపించువారి పాలిటి చింతామణు లనుచు విశ్వామిత్రుఁడు శ్రీరామున కిచ్చెను. వీనికన్నిటికి మంత్రములు గలవు. ఏమిలాభము? గ్రంథవిస్తరభీతి ననువదింపలేదు.

—* శ్రీరామున కుపసంహారాస్త్రదేవతలు ప్రత్యక్ష మగుట *—

ఉ॥ కొన్ని సుమూర్తిమంతములు ♦ గొన్ని యఖర్వసుపర్వతేజముల్
గొన్ని సుఖప్రదంబులును ♦ గొన్ని జ్వలద్దహనోపమానముల్
గొన్నియు ధూమతుల్యములు ♦ గొన్ని యహస్కరచంద్రదీప్తు లి
ట్లన్నియు రామూఁ జేరి కలి♦తాంజలులై మధురోక్తి ని ట్లనున్. ౬౮౦

సుమూర్తిమంతములు = మంచికరినదేహములుగలవి - అఖర్వసుపర్వతేజముల్ = కొరతలేని దివ్యతేజములుగలవి - జ్వలత్ దహనోపమానముల్ = మండుచున్నయగ్నికిసమానములు - ధూమతుల్యములు = పొగతోసమానమైనవి - అహస్కరచంద్రదీప్తులు=సూర్యునియొక్కయుచంద్రునియొక్కయుఁ గాంతివంటికాంతిగలవి - కలితాంజలులు = ముకుళించిన చేతులుగలవై, మధురోక్తిఁ = తియ్యనిమాటలతో. ఈయస్త్రములన్నియు నవతారమూర్తి యగు శ్రీరామచంద్రమూర్తికిఁ దెలియనివికావు అయినను మంత్రములకు సద్గురూపదేశ మావశ్యక మని లోకమునకు బోధించుటకై విశ్వామిత్రువలన గ్రహించెను.

తా త్ప ర్య ము.

అయస్త్రములు కొన్ని మంచికరినశరీరములు గలవి. కొన్ని విస్తారమైనదివ్య తేజముగలవి. కొన్ని సుఖమిచ్చునవి. కొన్ని మండుచున్నయగ్నికి సమానములైనవి. కొన్ని పొగవలెనుండునవి. కొన్ని సూర్యచంద్రుల తేజము గలవి. అవన్నియు రామచంద్రమూర్తిని సమీపించి కేలుమోడ్చి తియ్యనిమాటలతో నిట్లనియె.

తే॥ కంజదళనేత్ర నీకుఁ గిం•కరుల మేము, పని విధింపుము మా కనఁ• బార్థివుండు
మదిని నేను దలంచిన•మాత్ర వచ్చి, సాహ్య మొనరింపుఁ డిచ్ఛమైఁ• జనుఁడటన్న. ౬౮౧

కంజదళనేత్ర = తామరరేకులవంటి కన్నులుగలవాఁడా - ఓ భగవంతుఁడవైన పుండరీకాక్షా! ఏము = మేము-విధింపుము = ఆజ్ఞాపింపుము - సాహ్యము = సాహాయ్యము, తోడుపాటు - ఇచ్ఛమైఁ = ఇష్టప్రకారము. నేను అనుటకు మొదటిరూపము ఏను. మేము అనుటకు మొదటిరూపము ఏము. భారతమందు నేను అనుపదము లేదు. కావునఁ దిక్కనకాలమున కీవలననే నేను శబ్దము ప్రచారములోనికి వచ్చియుండవలయును.

తా త్ప ర్య ము.

పుండరీకాక్షుఁడవైన రామచంద్రా! మేము నీకుఁ గింకరులము, క్రొత్తవారము కాము, నీ వెట్లు లాజ్ఞచేసిన నట్లు వర్తింపఁగలవారము అనిన రాజకుమారుఁడు నేను స్మరించినవెంటనే వచ్చి కార్యముఁ జక్కఁబఱిచి పొండు.

కం॥ నిటలతటఘటితకరసం,పుటములతో రామచంద్ర•భూమీశున కు
త్కటముదమున వలగొని యవి,మిటుమాయం బయ్యె నంత•[మనుజేంద్రుండున్. ౬౮౨

నిటల పుటములతో = నొసటిప్రదేశమందుఁజేర్పఁబడిన ముకుళించినహస్తములతో, ఉత్కటముదమునన్ = తమ్మఁస్వీకరించెఁగదా యను నధికసంతోషముతో - వలగొని = ప్రదక్షిణించి.

తా త్ప ర్య ము.

అనిన నయ్యస్త్రమంత్రమూర్తులు నొసటహస్తములు జోడించి శ్రీరామచంద్రమూర్తి తమ్మనుగ్రహించి స్వీకరించెఁగదా యను మహాసంతోషముతో నాయనకుఁ బ్రదక్షిణముచేసి కానరాకపోయెను.

కం॥ ఆమునివరునాజ్ఞం గొని, సౌమిత్రికి నిచ్చె నఖిల•సంహారాస్త్ర
స్తోమము సంతోషంబున, నీమెయి నావిద్య లెల్ల • నెఱిఁగినవాఁడై.] ౬౮౩

ఈపద్యమునకు మూలశ్లోకము ప్రక్షిప్తము.

తాత్పర్యము.

విశ్వామిత్రుని యాజ్ఞప్రకారము సంహారాస్త్రములన్నియు రామచంద్రమూర్తి లక్ష్మణున కిచ్చెను ఈవిధముగ వా రావిద్యలెల్ల నేర్చినవారై,

వనమయూరము॥ మాణవకరత్నములు ♦ మౌనివరు వెంటన్
రాణమెయిఁ బోవునెడ ♦ రాముఁడు మృదుశ్రీ
వాణి నిటు పల్కె ఋషి♦వర్య! గిరిచెంతన్
బోణిమి నెసంగెఁ దరు♦పుంజ మది గంటే? ౬౮౪

మాణవకరత్నములు = శ్రేష్ఠులైనబాలురు, తరుపుంజము = వృక్షసమూహము. వనమయూరము - భ-జ-స-న-గగలు గణములు, తొమ్మిదింట యతి.

తాత్పర్యము.

రత్నములవలె శ్రేష్ఠములైన సద్గుణములుగల యాబాలురు విశ్వామిత్రుని వెంటఁ బోవునమయమున మెత్తనిశుభవాక్యులతో రామచంద్రమూర్తి యిట్లనెను. ఋషిశ్రేష్ఠుఁడా! అదిగోఁ గొండప్రక్క నందమైనచెట్లగుంపున్నది చూచితివా?

చం॥ జలదనికాశమై సరస♦సాలరసాలతమాలమాలతీ
మలయజబీజపూరదహ♦నాఘ్యశిరీషకమాధవీలతా
వళులును జిత్రచిత్రశుక♦బర్హిణబంభరడింభఝుంకృతుల్
గలయఁగఁ బర్వె లోచనవి♦కాసకరంబు మనోహరంబునై. ౬౮౫

జలదనికాశమై = మేఘముతోసమానమై, సరస = రసవంతమైన, సాల = వృక్షములు, రసాల = తియ్యమామిడిచెట్లు, తమాల = చీఁకటిమ్రాఁకులు, మాలతీ = జాజితీఁగలు, మలయజ = శ్రీగంధవృక్షములు, బీజపూర = మాదీఫలములు, దహను = గజనిమ్మ, నాఘ్య = మొల్ల, శిరీష = దిరిసన, మాధవీలత = పూలగురివిందతీఁగ, ఆవళి = సమూహములను, చిత్రచిత్రశుకబర్హిణబంభరడింభఝుంకృతుల్ = ఆశ్చర్యకరమైన పెక్కురంగులుగల చిలుకలయొక్కయు, నెమిళ్లయొక్కయు తుమ్మెదలయొక్కయు పిల్లలఝుంకారములు, పర్వె = వ్యాపించెను, లోచనవికాసకరంబు = కన్నులు వికసింపఁజేయునది, మనోహరంబు = మనస్సు నాకర్షించునది.

తాత్పర్యము.

మబ్బుక్రమ్మినట్లు దట్టమై - నల్లనై - చీఁకటులుగలిగించునవియై రసవంతములైన వృక్షములు తియ్యమామిడులు - చీఁకటిమ్రాఁకులు - జాజులు - చందన వృక్షములు - మాదిఫలములు - గజనిమ్మలు - మొల్లలు - దిరిసెనలు - పూలగురివిందతీఁగలు వీనిసమూహములు, ఆశ్చర్యముకలిగించు నానావర్ణములు

గల చిలుకలు - నెమిళ్లు - తుమ్మెదలు - వీనిపిల్లలఝుంకారములు నంతటను కన్నుల కానందము కలిగించుచు మనస్సు నాకర్షించుచు నంతట వ్యాపించెను.

కం॥ శారీకీరీమత్తమ, యూరీగానములు గగన ♦ మొరసెను దళమై
యేఋషి యిం దుండెడి నో, సారమతి నటంచు రామ♦చంద్రుఁడు మఱియున్. ౬౮౬

శారీ = ఆఁడుగోరువంకలు, కీరీ = ఆఁడుచిలుకలు, మయూరీ = ఆఁడు నెమిళ్లు, గానములు = పాటలు. పురుషులపరుషధ్వనికన్న మధురవాణుల కంఠధ్వని మనోహరము. కావున నాఁడుపక్షులు చెప్పఁబడును. ఈమగపక్షుల కంఠరవమే శ్రావ్యము. ఇఁకనాఁడుపక్షులకంఠరవము శ్రావ్యతరము. ఒరసెను = రాచుకొనెను. దళమై = దట్టమై. ఋప్రాసము, ౩౨౭పద్యము చూడుఁడు.

తాత్పర్యము.

ఆఁడుగోరువంకలయు నాఁడుచిలుకలయు నాఁడునెమిళ్ళయు పాటలు దట్టమై యాకాశమును రాచుకొనుచున్నవి. ఈవనమం దుండు ఋషి యెవఁడు? తెలుపుము.

మత్తకోకిలము॥ దారుణం బగు కాననంబును ♦ దాఁటినార మ టంచు నీ
హారిసౌఖ్యతరప్రదేశము ♦ నారయ న్మదిఁ దోఁచెడిఁ
జారుభూరినినాదముల్ మృగ♦సంచయంబుల స్వైరసం
చారముల్ గన నయ్యెఁ బెల్లుగ ♦ సంయమీశ్వర! చెప్పవే. ౬౮౭

దారుణము = భయంకరము - కాననము = అడవి - హారి = మనోహరమై - సౌఖ్య = సుఖముగలిగించు- ప్రదేశము = స్థలము - స్వైరసంచారములు = భయములేకయిచ్చవొప్పిన తిరుగులాడుటలు.

తాత్పర్యము.

మునీంద్రా! భయంకరమైనయడవిని దాఁటితిమని యీమనోహరమై సుఖమైనప్రదేశము చూడఁగాఁ దోఁచుచున్నది. నిన్నటభయంకరధ్వనులు - క్రూరమృగములు లేక మనోహరమైనధ్వనులు వినవచ్చుచున్నవి. ఎక్కడఁ జూచినను మనుష్యులభయము లేక తమయిచ్చవచ్చినట్లు జింకలుతిరుగుచున్నవి. మునీంద్రా! దీని కేమి కారణము?

మ॥ భవదీయాధ్వరవిఘ్నకర్త లగునాఁ♦బ్రహ్మఘ్ను లెవ్వారు? మీ
సవనారామ మ దెద్ది? యాఖలులవా♦సస్థాన మెం దుండు? నే
ననునం జేక్రియ నెప్పు డెప్పగిదిఁ జే♦యం గార్యమాఁ? బల్కవే
యివి సర్వం బన నప్రమేయునకు మౌ♦నీంద్రుండు దా నిట్లనున్. ౬౮౮

భవదీయ అధ్వరవిఘ్నకర్తలు = నీయజ్ఞమునకు విఘ్నముచేయువారు - బ్రహ్మఘ్నులు = బ్రాహ్మణులఁజంపువారు - సవన + ఆరామము = యజ్ఞము చేయువనము ఖలులు = దుష్టుల - అవనము = రక్షణము - అప్రమేయునకుఁ = మహిమప్రమాణ మింత యనిచెప్ప నలవికానివానికి - ఇంచిలి యప్రమేయశబ్దము ముందు రాఁబోవు త్రివిక్రమావతారకథను సూచించుచున్నది.

తాత్పర్యము.

మునీంద్రా! నీయజ్ఞమునకు విఘ్నముచేయుబ్రాహ్మణహంత లెవ్వరు? మీరు యజ్ఞము చేయు వన మెం దున్నది? నేను యజ్ఞరక్షణ మెట్లుచేయుట యుక్తము? అనిన నింతని పరిమాణము చెప్ప సాధ్యపడనిమహిమగల యారామచంద్రునకు విశ్వామిత్రుఁ డిట్లనెను.

౨౯ సర్గము. శ్రీరామునకు విశ్వామిత్రుఁడు సిద్ధాశ్రమవృత్తాంతము
దెల్పుట

ఉ॥ ఇచ్చట మున్న రాఘవ య♦నేకయుగంబు లనేకవర్షముల్
పొచ్చెము లేనినిష్ఠఁ దప♦ముం బచరించెను విష్ణుమూర్తి దా
నిచ్చఁ దపోవ్రతంబును న♦హీనపుయోగము సిద్ధిఁ బొందఁగా
నిచ్చట వామనుండు వసి♦యించెఁ, దదాశ్రను మిద్ది, యిద్యోడన్. ౬౮౯

అహీనపుయోగము = గొప్పయోగము ఈవనమందు = ఈప్రదేశమందు ననుటకుఁగాను ఇచ్చట నిచ్చట నని రెండుమార్లు చెప్పఁబడెను.

తాత్పర్యము.

శ్రీరామచంద్రా! యీప్రదేశమందుఁబూర్వ మనేకయుగము లనేకసంవత్సరములు నిష్ఠకేలోపము లేకుండునట్లు తపస్సు మహాయోగము సిద్ధిపొందు నట్లిచ్చట విష్ణువు తపము చేసెను. ఆవిష్ణుమూర్తియగువామనుఁడు వసించినప్రదేశ మిదియే. ఇచ్చట విష్ణువు తపస్సుచేయుట లోకప్రవర్తనార్థము. విష్ణుమూర్తియే తపస్సుచేసెనే తపస్సుచేసిన నెంతఫలమున్నదో మనము చేయుద మని లోకులను బ్రవర్తింపఁజేయుటకు బదరీనారాయణమందువలె నిచ్చటఁదపస్సుచేసెను. ఎచ్చటనో హిమవత్పర్వతమధ్యమందుఁ దపస్సుచేసిన లోకమున వారి కెట్లు తెలియవలయును - కావున నందఱకుఁదెలియుటకై యందందుఁ దపస్సుచేయవలయును. విష్ణు వని వామనుఁ డని చెప్పుటచే విష్ణుస్వరూపమునను వామనస్వరూపమునను గూడ నిచ్చటఁ దపస్సు చేసెననియర్థము. ఇట్టి దివ్యక్షేత్రమే వాసయోగ్య మని తెలుపుటకుఁగా నాయనచరిత్రము చెప్పఁబడుచున్నది.

క॥ సిద్ధించు మహాతపఃములు, సిద్ధము కశ్యపుఁడు యోగ॰సిద్ధిం గనెఁ దా
నిద్ధముగ నిచట దానన్, సిద్ధాశ్రమ మనఁగ నిది ప్ర॰సిద్ధం బయ్యెన్. ౯౯౦

తా త్ప ర్య ము.

ఈపద్యమున నీప్రదేశమునకు సిద్ధాశ్రమ మను పేరు వచ్చుటకుఁ గారణము తెలుపఁబడుచున్నది.

ఎంతటిగొప్పతపస్సైనను నిర్విఘ్నముగ సాగి యిచ్చట ఫలవంతమగును. ఇచ్చటఁ జేసినతపస్సు వ్యర్థము పోదు. కశ్యపుఁ డాప్రకారముచేసి యిచట సిద్ధిని బొందెను. కావున దీనికి సిద్ధాశ్రమ మనిపేరు జగత్ప్రసిద్ధ మయ్యెను. కశ్యప శబ్దార్థమును గశ్యపుఁడే యిట్లు చెప్పెను.

శ్లో॥ కులం కులంచ కువమః కువమః కశ్యపో ద్విజః,
కాశ్యః కాశనికాశత్వా దేత న్మే నామ ధారయ॥

కశ = కొఱడా, దానికి యోగ్యమైనవి - కశ్యాః = గుఱ్ఱములు - ఇంద్రియములే గుఱ్ఱములు. వాని కాశ్రయమగుటచే కశ్యములు=దేహములు. కులంకులం= వీప్సయందు ద్విర్వచనము. ప్రతిశరీరమందు, నే నొకఁడనే కశ్యపుఁడను. కశ్యతి = శరీరముల రక్షించువాఁడు పాలించువాఁడు - త్రాగువాఁడు - భుజించువాఁడు త్రావించువాఁడు - ఎండించువాఁడు - ఇదియోగార్థము. కువమః — కు = భూమిని వమః = వర్షించువాఁడు కావున కువముఁడు = సూర్యుఁడు. మునుపటివలె వీప్సయందు ద్విర్వచనము అనఁగా సూర్యులందఱు నేనే, దేవతలందఱు నా కొడుకు లగుటచే వారే నేను. కాశ్యః = దీప్తిమంతుఁడు. దానికిఁ గారణము, కాశనికాశత్వాత్ =అనేకకాలముగ నుండువాఁడ నగుటచే-కాశమనఁగా తెల్ల-దానిపువ్వు - దానితో సమాన మనఁగాఁ దెలుపు. దీర్ఘకాలముగఁ దపస్సుచే యుటచేఁ దెల్లనైనవెండ్రుకలు గలవాఁడను.—నీలకంఠ.

ఉ॥ యాచనకామరద్రుమము ♦ వైబలియుండు బలీంద్రుఁ డల్ల వై
రోచని నిర్జితాఖిలమ♦రుద్గణసిద్ధబలారి యై త్రియా
మాచరఖేచరప్రకర♦మండలి గొల్వ జగత్ప్రశస్తుఁడై
ధీచతురుండు విశ్రుతగ♦తిం బరిపాలనచేసె లోకముల్. ౯౯౧

యాచనక + అమరద్రుమము = యాచకులపాలికల్పవృక్షము - వైరోచని = విరోచనుకొడుకు. నిర్జిత = జయింపఁబడిన, అఖిల = సమస్తమైన, మరుద్గణ = వాయుగణములు - ఆవహాము ప్రవహాములోనైనవి - సిద్ధ = సిద్ధులు - బలారియై = ఇంద్రుఁడై. త్రియామాచర = రాత్రియందు సంచరించురాక్షసులయు - ఖేచర = ఆకాశమందుసంచరించు దేవతలయు - ప్రకర=సమూహముల - మండలి=గుంపు -

కొల్వ = సేవింపఁగా, జగత్ప్రశస్తుఁడై = ప్రపంచముచేఁ బొగడఁబడినవాఁడై ధీచతురుండు=బుద్ధినేర్పుగలవాఁడు. శ్రుతగతిన్=కీర్తికరమైనరీతిగా-ధర్మమార్గమున - పాలనసంగ్రము చరిత్రాదులలోఁ జేరినది. కావున పాలన పాలనము యని రెండు రూపములు - ప్రహ్లాదునికొడుకు విరోచనుఁడు - విరోచనునికొడుకు బలిచక్రవర్తి - త్రియామ = మూఁడుజాములుగలది - సూర్యాస్తమయమయిన తరువాతి ఒక ము, సూర్యోదయమునకు ముందటి ము సంధిసమయము - పగటిలోనే చేరుచున్నది - కావున రాత్రికి మూఁడుజాములే.

తాత్పర్యము.

యాచకులకోరికలు లేకుండ తీర్చువాఁడును, బలవంతుఁడునైన విరోచనకుమారుఁడైన బలిచక్రవర్తి వాయువులను,సిద్ధులను, నింద్రుని జయించినవాఁడై రాక్షసులు దేవతలుకూడఁ దనసేవజేయుచుండ ధర్మమార్గమున వర్తించుచు లోకమునఁ గీర్తిమంతుఁడై మూఁడులోకములను బరిపాలించెను. ఈబలిచక్రవర్తియున్నస్థలమే మహాబలిపురము. ఇది చెన్నపురీ సమీపమున నున్నది.

ఉ॥ అప్పుడు వచ్చి యిచ్చటికి ♦ నగ్నిపురోగములైన దేవతల్
చెప్పుచు విష్ణుఁ గాంచి కడు♦దీనతఁ బల్కిరి సప్తతంతువున్
గొప్పగఁ జేసెడిన్ దనుజ♦కుంజరుఁ డయ్యది తీరమున్న మీ
రిప్పుడ యాబలిం గనఁగ ♦ నేగి స్వకార్యముఁ జక్కఁబెట్టుఁడీ. ౬౯౩

అగ్నిపురోగములు అగ్నిముందుగాఁగలవారు. సప్తతంతువు = యజ్ఞము. 'సప్తభి ఛందోభి స్తన్యత ఇతి సప్తతంతుః' - తను విస్తారే - ఏడుఛందస్సులచేత విస్తరింపఁబడినది. - తీరమున్న = ముగియకమునుపె - స్వకార్యము = మీపని. ఆశ్రితులగుదేవతలకార్యము మీకు స్వకార్యమేకదా- కావున దాని నెఱవేర్పుఁడు.

తాత్పర్యము.

ఆసమయంబున నగ్నిని ముందుగుంచుకొని దేవతలుప్రదేశంబునకువచ్చి విష్ణుం గాంచి మిక్కిలిదీనత్వముతో నిట్లనిరి - దేవా! బలిచక్రవర్తి యిప్పుడు గొప్ప యాగము చేయుచున్నాఁడు. అది ముగియుటకు ముందే మీ రతనిఁ జూడ బోయి మీకు స్వకార్యమైన దేవతాకార్యమును జక్కఁబెట్టవలయు నని ప్రార్థించెదము.

యజ్ఞము ముగిసినతరువాత నేల చేయరా దందురా - ఆవల జయింప సాధ్యుఁడు గాఁడు.

యాగ మనఁగానేమి? ఫలప్రదము లగుజ్యోతిష్టోమాది కార్యములు, అని చెప్ప రాదు. కార్యము లచేతనము లగుటచే నవి ఫలము లీయఁజాలవు. అచేతనములు

ఫలమియ్యవలసియుండినఁ జేతనసాహాయ్య మవశ్యకమై యుండును. ఇంద్రాయ స్వాహా యనుశబ్దము లచేతనములు కావున నవియు ఫలమీయఁజాలవు. కాఁబట్టి యాయా దేవతల ప్రీత్యర్థమై యాయా దేవతల నుద్దేశించి యాయామంత్రముల తోఁ జేయుహోమము యాగ మనఁబడును. ఇట్టులే జ్యోతిష్టోమాదులు- 'యస్యై దేవతాయై హవిర్గృహీతం స్యాత్తాం ధ్యాయే ద్వషట్కరిష్యన్ సాక్షాద్దేవతాం ప్రీణాతి' యను శ్రుతివాక్య మిందుఁ బ్రమాణము. ఏదేవతకై హవిస్సు గ్రహింపఁబడుచున్నదో యాదేవత వషట్కారపూర్వకముగ ధ్యానింపఁబడుటచే నా దేవత ప్రత్యక్షముగావచ్చి యగ్నిముఖంబున హవిస్సును గొని (అగ్నిముఖా వై దేవా యనియున్నదికదా.) తృప్తిపడి ఫలమిచ్చును. అట్లు దేవత ప్రత్యక్షముగా వచ్చి హవిర్భాగమును గొని తృప్తిపడునెడల వేలువేలు దేశములందు నేకకాలమున వేలువేలు జనలు యాగము చేసిరేని యెచ్చటికై వారు పోదురు? అని సందేహింపఁబనిలేదు. దేవతలు నానారూపము లేకకాలమున నెత్త గలవారు కావున మీఁదఁజెప్పబడినది యాగమైనచో బలి దేవవిరోధి కావునఁ బ్రత్యక్షదేవతలఁ జావఁగొట్టి వారిచే సేవచేయించుకొనుచుఁ బరోక్షమున వారినిఁ బూజించినాఁ డనుట యయుక్తము. కావునఁగదా రావణుఁడు ఇంద్రజిత్తు చేసినయాగము నధిక్షేపించెను - ఉత్త. కాండము ౫౩౯ వ పద్యము - రావణ వాక్యము.

"దీనను మేలు లేదు, మన ద్వేషుల నింద్రముఖామరాదులన్
మానితరీతి భక్తిని నమంచితవస్తువులన్ యజింతురే"

అట్లైన బలిచేసినకార్య మేది?

బలిచక్రవర్తి యింద్రాదులప్రీతికై యజ్ఞము చేసినవాఁడు కాఁడు. ఆయన విష్ణుభక్తుడు. విష్ణుభక్తుఁడు విష్ణువును దప్పఁ దక్కిన దేవతలవలన ఫలముగోరి వారినిఁ బూజింపఁడు. కావున బలి చేసినది విష్ణ్వారాధనరూపమైనయజ్ఞము. యజ్ఞ మనఁగా దేవపూజ ఇందుఁ బూజింపఁబడినదేవత విష్ణువు. కావున బలి యజ్ఞముచేయుట యుక్తమే. అట్లైన నింద్రాయస్వాహా వరుణాయస్వాహా యని వీరిపేర్లుచెప్పి యేల హోమము చేయుదురు? అనిన ఇంద్రవరుణాది శబ్దములకు ముఖ్యాన్వయము భగవంతుఁ డగు శ్రీమన్నారాయణునందే, కావున నింద్రుఁ డనినను వరుణుఁ డనినను నారాయణుఁ డనియే మొదటిముఖ్యార్థము. ఇంద్రాదులఁ దది గౌణము, భగవచ్ఛబ్దము లోకసైనవానివలె. కావున విష్ణుభక్తుఁడగువాఁ డా దేవతలపేర్లు చెప్పునపుడు తనయిష్టదేవత యగు నారాయణుని నాపదముచేఁ బూజించును. ఆతనిభావన యట్లుండును. కావున నతనికి ఫలమిచ్చువాఁడు భగవంతుడే. తక్కినవారో యాయాదేవతల నుద్దేశింతురు. కావున నాయాదేవత లెంత

ఫలము నీయ నధికారులలో యామాత్రమిత ఫలముచే వారిమూలమున భగవంతుఁడే యిచ్చును.

ఇట్లు తనయం దనన్యభక్తిగలబలి నెట్లు విష్ణువు చెఱుపఁదలపెట్టె ననుప్రశ్న వచ్చును తనయందు భక్తి చేయువానికంటెఁ దనభక్తులయందు భక్తిగలవానిని జూచిభగవంతుఁడు సంతోషించును గాని భక్తవిరోధియగు భక్తునిఁ జూచి సంతోషింపఁడు. వానిని శిక్షించియైనఁ గ్రమమార్గమున వర్తింప జేయును. ఒకతండ్రి తనకొడుకులలో నొకఁడు బలిష్ఠుఁడై యన్నదమ్ముల బాధించునేని వానినడవడికి నతఁడు సంతోషించునా? ఈసందర్భమున నీవాక్యము లనుసంధింపవలయును.

శ్లో॥ మమ మద్భక్తభక్తేషు ప్రీతి రభ్యధికా భవేత్
తస్మా న్మద్భక్తభక్తాశ్చ, పూజనీయా విశేషతః॥

నాభక్తులభక్తులైనవారియందు నాకెక్కువప్రీతి. కావున నాభక్తులభక్తులను విశేషముగాఁ బూజింపవలయును. "తస్మా ద్విష్ణుప్రసాదాయ వైష్ణవాన్ పరితోషయేత్."

కావున విష్ణువునను గ్రహముకొఱకు విష్ణుభక్తుల సంతోషపఱుపవలయును. "అనాదృతం సుతం గేహీ పురుషం నాభినందతి, తథా నర్చితసద్భక్తం,భగవా న్నాభినందతి" తనకొడుకు నవమానించువానివిషయమున గృహస్థుఁడు సంతోషింపఁడు. అట్టులే తనసద్భక్తు నారాధింపనివానిని భగవంతుఁడు సంతోషింపఁడు. 'స్వారాధనం విహాయాపి స్వభక్తా నర్చయంతి యే, తేభ్యః ప్రసన్నో భగవాన్ సిద్ధిమిష్టాం ప్రయచ్ఛతి.'' తన్నారాధింపకపోయినను తనభక్తుల నారాధించువారివిషయమున భగవంతుఁ డనుగ్రహించి వారియిష్టసిద్ధిని గలిగించును. కాని బలి విష్ణుభక్తుఁడైనను విష్ణుభక్తుల దేవతల బాధించుటచే విష్ణు వాయనను దండింపవలసివచ్చెను.

దీనివలన భక్తుఁడగువాఁడు తా నెంతగొప్పవాఁడైనను నితరభక్తుల బాధింపరాదని సూచన.

తే॥ యాచకు లెక్కు దిక్కుల,యందునుండి, వచ్చి యాతని యాచింప ♦ నిచ్చుకొలఁది
నెవ్వ రెదిగోరి రేనియు ♦ నిచ్చు నతఁడు, మట్టు మీఱిన మఱి యది ♦ యెట్టిదైన. ౬౯౩

తాత్పర్యము.

యజ్ఞదీక్షవహించియుండుకాలమందు యాచకులు దేహి యన నాస్తి యనరాదు. కావున యాచకులు నలుదిక్కులనుండి గుంపులుగుంపులై వచ్చి వారి

వారి యిష్టప్రకారం మడుగుచున్నారు. ఆయనను వారెట్టిదుర్ఘటమైనది మితి మీఱినదియైనను అడిగినలే దనక దేనినైన నిచ్చుచున్నాఁడు.

ఉ॥ మాయ సమాశ్రయించి సుర•మండలి కభ్యుదయప్రదాతవై
చేయుము వామనాకృతిని• జేకొని యుత్తమ మాశుభంబు నా
రాయణ వారిజాక్ష యని • ప్రార్థన సేయుచునుండ నత్రిచో
వాయుసఖోపముండు ముని•వర్యుఁడు నందనలాభకాంక్షమై. ౬౯౪

మాయ = లోకమునకు విష్ణుత్వము రాకుండఁ గప్పుదివ్యశక్తి - అభ్యుదయప్రదాతవై = క్షేమము నొసఁగువాఁడవై - వామనాకృతిని = మఱుగుజ్జువాని వలె. వాయుసఖోపముండు = అగ్నిహోత్రునితో సమానుఁడు- నందనలాభకాంక్షమై = కొడుకుగలుగవలయు నను కోరికచేత.

తాత్పర్యము.

నారాయణ! పుండరీకాక్ష! అచింత్యమై - యద్భుతమై యఘటితఘటనాసమర్థమగు నీశక్తిని నాశ్రయించినవాఁడవై లోకమునకు నీస్వస్వరూపము గాననీయక దేవతలకు మేలుకూర్చువాఁడవై పొట్టివానివలెనై మేలుచేయుము, అని ప్రార్థించుచుండుసమయంబున నగ్నితేజుఁడైన మునిశ్రేష్ఠుఁడు కశ్యపుఁడు కొడుకును గను కోరికగలవాఁడై.

ఉ॥ శ్రీపతిఁగూర్చి కశ్యపుఁడు • చేసెఁ దపం బదితిద్వితీయుఁడై
యోపిక దివ్యవర్షములు•కొండుసహస్రక మత్యుదారని
ష్ఠాపరిణాహ మొప్ప నతి•సాత్త్వికవృత్తి యొసంగ, దానల
క్ష్మీపతి తుష్టుఁడౌచు దయ•చేసిన నిట్లు గణించె మౌనియున్. ౬౯౫

శ్రీపతిఁగూర్చి = లక్ష్మీవల్లభుఁడైన నారాయణు నుద్దేశించి, అదితిద్వితీయుఁడై = భార్యయగునదితితోఁగూడినవాఁడై, అత్యుదారనిష్ఠాపరిణాహము = మిక్కిలిగొప్పదగు నిష్ఠాతిశయముచే- శ్రీపతిఁగూర్చి యనుటచే లక్ష్మివిశిష్టుఁడైన నారాయణుఁడే యుపాసింపఁదగినవాఁడనియు అదితిద్వితీయుఁడై భార్యతోఁగూడి తపస్సుచేసె ననుటచే నేకమనస్సుతో నేకనిష్ఠతో భార్యాభర్తలిరువురు నుపాసించినవిశేషఫలదమనియు శీఘ్రముగా నది కలుగు ననియు నెఱ్ఱిఁగించుచున్నది. దీనివలన భార్యలు భర్తృశుశ్రూషచేయుచుఁ దాముగ దపస్సుచేయవచ్చు నని సూచన.

భార్యాభర్త లిరువురు నేకాభిప్రాయముతోఁ జేయుతపస్సువలన విశేషఫలము గలదు - అది శీఘ్రముగను ఫలించును.

తాత్పర్యము.

శ్రీమన్నారాయణుఁగూర్చి కశ్యపమహర్షి భార్యయగు నదితితోఁడ నొప్పికతో ననేకదివ్యసంవత్సరములు మిక్కిలినిష్ఠతో, సత్త్వగుణముగలవాఁడై తపస్సుచేయఁగా దానిచే నారాయణుఁడు సంతోషించి ప్రత్యక్షముకాఁగా నాయన యిట్లు స్తుతించెను.

'సో ఽకామయత - బహుస్యాం ప్రజాయేయేతి స తపోతప్యత' యను శ్రుతివాక్యముచొప్పున విష్ణుమూర్తి లోకరక్షార్థమై యిచ్చట నాలోచించుచుండెను. (తప యనఁగా నాలోచన తప ఆలోచనే - యని ధాతువు.) గాని యొకానొకఁడు చెప్పినట్లు యోగసిద్ధికై యష్టాంగయోగము తత్పూర్వయోగము రానట్లిప్పుడు సాధింపఁ దపస్సుచేయఁబూనినట్లు అర్థము చెప్పరాదు ఇట్లు చేయునపు డదృశ్యుఁడై పామరలోకగోచరుఁడుగాక భక్తజనమాత్రగోచరుఁడై యుండెను. ఇచ్చట విష్ణువు సన్నిహితుఁడై యుండుట యెఱింగి తపస్విలిచ్చటఁ దపస్సుచేసి యాయనయనుగ్రహమువలన సిద్ధిఁబొందిరి. వారిలోఁ గశ్యపుఁ డొకఁడు పుత్రకాంక్షచేఁ దపస్సుచేసెను. ఈసమయమందే దేవతలు విష్ణువున 'బలియను నీభక్తుఁడే కావునఁ గశ్యపునకుఁ బుత్రుఁడవై బలిని హింసింపక యూపించి సురరాజ్యము నిమ్మని' కొన్ని వేఁడిరి. దీనివలన భక్తులగువారు వేఱొకభక్తునికిఁ గీడుగలిగింపకయే సౌమ్యమార్గమునఁ దమకార్యము దానివలన సాధింపఁగోరుదు రని సూచన.

సీ॥ పుణ్యతపోమయు ♦ భూరితపోరాశి, వరతపోమూర్తిని ♦ భక్తవరదు
వరతపఆత్మకుఁ ♦ బరమపూరుషు నిన్నుఁ, గంటి నిప్పుడు తపో♦గరిమచేత
ననఘ నీదుశరీర♦మున యందు సకలప్రపంచంబుఁ గన నయ్యె ♦ భద్రమూర్తి
నీ వనాద్యంత న♦నిర్దేశ్యుఁడవు గాన, శరణంబు నాకు నీ♦చరణయుగమె
తే॥ యనినఁ గశ్యపుఁగనుఁగొని♦మనములోనఁ, గరుణగళుకొత్తనిట్లనె♦గరుడగమనుఁ
డయ్య వరమునకర్హుండ ♦ వైతి వింక, వరముగోరుము నీకెది ♦ వాంఛయనుడు.

౬౯౬

పుణ్యతపోమయుః = పవిత్రమైనతపస్సుచేఁ బ్రచురమైనవానిని- ఆరాధ్యుఁడగుటచేఁ బ్రచురుఁడు. తపస్సుచే నారాధ్యుఁ డని యర్థము. తపోరాశిః = తపోరాశిస్వరూపుని అనఁగాఁ దపఃఫలమిచ్చువాని ననియర్థము. తపోమూర్తి = జ్ఞానస్వరూపుని, తపఆలోచన ఇతిధాతో రసుఃప్రత్యయః. తపఆత్మకు = తపస్స్వభావుని, జ్ఞానగుణకుఁ డని యర్థము. ఉణాదౌ ఇగుపధ కవిధాన మితి కః. భక్తవరదుః = భక్తులకోరికల నిచ్చువానిని- వరతపఆత్మకుః = గొప్పతపస్సు స్వభావముగాఁ గలవానిని - హ్రస్వమైన అకారము పూర్వముగాఁ గలవిసర్గమునకు హ్రస్వ

మైన అకారమునకంటె నితరములైన అచ్చులు పరమైనపుడు లోపము వైకల్పికము. పరమపూరుషుఁ = పురుషులకంటెఁ బరముఁడైనవానిని - పురుషులు జీవులు. వీరు బద్ధులు ముక్తులు నని రెండువిధములు. వీరికంటె విలక్షణుఁడు. తపోగరిమచేత = తపస్సుయొక్క గొప్పతనముచేత ఆరాధనమే తపస్సు. అది యితరప్రయోజనము గోరక నిన్ను సాక్షాత్కరించుకొనుటయే ప్రయోజనముగాఁ గలది గావున నది గొప్పది. నీదుశరీరమునయందు సకలప్రపంచము గానవయ్యె.

"పశ్యామి దేవాం స్తవ దేవ దేహే సర్వాం స్తథా భూతవిశేషసంఘాన్, బ్రహ్మాణ మీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యాన్." -భ.గీ. ౧౧ అధ్యాయము. అనియర్జునుఁడు శ్రీకృష్ణునందు సకలప్రపంచమును జూచెను. శ్రీకృష్ణుఁడు నోరు తెఱచినపుడు యశోద చూచెను. ప్రలయకాలమందు మార్కండేయుఁడు చూచెను. నీశరీరమందుఁ బ్రపంచమును జూచుచున్నానఁగా, బ్రపంచమంతయు నీకు శరీరము గావున నిన్నుఁ బ్రపంచశరీరునిగాను ప్రపంచమంతయు నీశరీరముగాను జూచుచున్నా ననియైనఁ జెప్పవచ్చును. యుద్ధకాండము. ౨౭౦౭. వ. ప. "సర్వంబు లోకంబు నీకున్ శరీరంబు" అని బ్రహ్మ స్తుతించెను.

అనాద్యంతుఁడవు = ఆదిలేనివాఁడవు. అనిర్దేశ్యుఁడవు = ఇంతటివాఁ డని చెప్ప సాధ్యముకానివాఁడవు. తళుకొత్తన్ = అతిశయింపఁగా. గరుడగమనుఁడు = గరుడునిపై నెక్కి ప్రయాణముచేయువాఁడు. వాంఛ = కోరిక.

తా త్ప ర్య ము .

దేవా! నీవు తపస్సుచే నారాధ్యుఁడవు. తపఃఫలము నిచ్చువాఁడవు. జ్ఞానస్వరూపుఁడవు. జ్ఞానగుణకుఁడవు. భక్తకామితదాతవు. గొప్పతపస్సే స్వభావముగాఁ గలవానిని ఇట్టి నిన్ను నారాధనబలముచేఁ బ్రత్యక్షముగఁ గనఁగలిగితిని. సమస్తప్రపంచము నీశరీరమందుఁ గానవచ్చుటయే గాక నీశరీరముగఁ గూడఁ గానవచ్చుచున్నది. కల్యాణగుణాకరమైన యాకారముగలవాఁడా! నీవు పుట్టువు లేనివాఁడవు. ఇంతటివాఁడ వని చెప్ప నెవరికిసాధ్య పడనివాఁడవు. కావున నీచరణములే నాకు శరణము అనిన విష్ణువు కశ్యపునిం జూచి దయఁదలఁచి మునీంద్రా! నీవు భక్త్యతిశయముచే వరము నొంద యోగ్యుఁడ వైతివి నీకోరిక యేదో తెలుపుము.

ఆ॥ వరము నిమ్ము దేవ ♦ వరదుండ వేనియు, నదితియందు నాకు ♦ నసురవైరి!
సుతుఁడ వగుచుఁ బుట్టి ♦ సుత్రాముభ్రాతవై, గాసి వగచు సురలఁ ♦ గావవయ్య.

తాత్పర్యము.

అనినఁ గశ్యపుఁ డిట్లనియె. నాకు నీవు వరమీయ ననుగ్రహించెదవేని యో యసురవిరోధీ! నాకు నీవు కుమారుఁడవై యింద్రునిభ్రాతవై జనించి దుఃఖముల పాలయియుండు దేవతలను రక్షింపుము. నీవు స్వభావముగ నసురవిరోధివి. కావున నేను నిన్ను నీకు స్వభావవిరుద్ధమైనకార్యములు చేయఁగోరలేదు.

క॥ ఆతతముగ సిద్ధించెను, నాతప మిటఁ గాన దీని♦నామము పరఁగుం
గాతఁ సిద్ధాశ్రమ మని, ఖ్యాతిఁ జనియింపవయ్య ♦ కారుణ్యనిధీ! ౬౯౮

తాత్పర్యము.

ఇచ్చట నాతపము సిద్ధిపొందెను - గావున నీప్రదేశము సిద్ధాశ్రమ మనుపేర లోకమునఁ బ్రసిద్ధిచెందునుగాక.

చ॥ అనినఁ దథా స్తటంచుఁ జని ♦ యంబుజనాభుఁడు వామనాకృతిం
గనికర మారఁగా నదితి♦గర్భమునం దుదయించి తా విరో
చనసుతుఁ గానఁ దత్సవన♦శాలకు నేగి జగత్త్రయావనం
డనఘు సురారినేతఁ గని ♦ హాళి వచించెను మానదుం డిటుల్. ౬౯౯

తథాస్తు=అట్లేయగునుగాక. అంబుజనాభుఁడు=విష్ణువు - వామనాకృతిఁ= పొట్టివానిరూపముతో - కనికరము = దయ - సవనశాల = యజ్ఞవాటము - జగత్త్రయావనుండు = ముల్లోకముల రక్షించువాఁడు. సురారినేత=రాక్షసప్రభువు - హాళిఁ = ఆసక్తితో - మానదుఁడు = ఆశ్రితులమానమును రక్షించువాఁడు - దురభిమానమును ఖండించువాఁడు.

తాత్పర్యము.

అని యీప్రకారము కశ్యపుఁడు వరము కోరఁగా నీవు కోరినట్టులే చేసెద నని విష్ణువు దయతో వామనుఁడై యదితిగర్భంబునఁ బుట్టి బలిని జూడ నతఁడుండు యజ్ఞశాలకుఁ బోయి త్రిలోకరక్షకుం డగుటచే నొకరిచే నొకరు బాధపడుట చూడలేనివాఁడు గావున దేవతలకుఁ గీడుచేయుబలిని జూచి గర్విష్ఠుల దురహంకారమును నాశముచేయు విష్ణుం డిట్లనియె. ఇతరవిషయముల నెంతగొప్పవారైనను లోకమును బాధించువారిని భగవంతుఁడు సైఁపఁ డని సూచన.

ఆ॥ అడుగు లొకటి రెండు♦యాచింతు నసురేంద్ర, యంతమాత్ర ముర్వి♦యైనఁజాలు
నని గ్రహించి భువన♦ మంతయుఁ దా నిండి, యతని గట్టెనైచె ♦ నతులశక్తి.

ఒకటి - రెండు - మూఁడు = అల్పముగఁదోఁచుటకుఁగాను ఒక్కసారిగ మూఁడనక ఒకటి రెండనెను. ఉర్వీ = భూమి. భువనమంతయు = లోకమంతయు - అతులశక్త్యా = అసమానమైనశక్తిచేత.

తాత్పర్యము.

దానవరాజా! నాకాలికొలఁతను నొకటిరెండడుగులభూమిని యాచించుచున్నాను. అంతమాత్రమిచ్చితివేని చాలును. అని యాయన యీయఁగైకొని లోకమంతయు నిండి తనశక్తిచే బలిని బంధించెను.

కం॥ వంచితవైరోచనియుఁ బ్రపంచము సర్వంబు మరల ♦ బలవైరికి న ర్పించెను మేల్ మే లని మోదించిరి మును లెల్ల సురల♦తేజం బెసఁగెన్. ౨౧

వంచితవైరోచని = వంచింపఁబడిన బలిగలవాఁడు - బలిని వంచించినవాఁడు. బలవైరికి = ఇంద్రునకు - మోదించిరి = సంతోషించిరి.

తాత్పర్యము.

ఇట్లు వామనుఁడు బలిని వంచించి త్రివిక్రముఁడై ప్రపంచమంతయు నాక్రమించి దానిని మఱల యింద్రున కిచ్చెను. మేలుమేలని మునీశ్వరులు సంతోషించిరి. సురలు మునుపటివలెఁ దేజోవంతులైరి.

కం॥ శ్రమనాశక మగు నీయాశ్రమమున వామనుఁడు నిలిచె ♦ రామా! నేనుఁ గమలాహృదయేశ్వరపద,కమలామితభక్తికలిమిఁ ♦ గలిగితి నిలువన్. ౨౨

శ్రమనాశకము = శ్రమము హరింపఁజేయునది- కమలా=కలిమి- లక్ష్మీవల్లభుఁడైన నారాయణునిపాదకమలములయందలి విస్తారముగుభక్తిచేత - సమీపమున గంగాతీరమం దుండు స్థాణ్వాశ్రమమం దుండక యిందున్నవాఁడ వేల యని ప్రశ్నమడుగునని తానే తాను విష్ణుభక్తుఁడ ననియు అన్యదేవతలందుఁ బరత్వబుద్ధి లేనివాఁడ ననియు స్థాణ్వాశ్రమమం దుండువారు శైవులనియు మతాంతరుల విడిచి యేకభక్తిగలవారితోఁడ నుండుట భక్తిపరులలక్షణ మనియు కావున నిందున్నాననియుఁ జెప్పెను. - (గోవిందరాజీయము)

తాత్పర్యము.

ఇచ్చటఁ దపస్సుచేయువారికి శ్రమ మేమియుఁ గలుగదు. సంసారశ్రమమును దొలఁగించును. కావున నీయాశ్రమమందు వామనుఁడు మరల వచ్చి నిలిచెను. రామా! నేను నా విష్ణుపాదభక్తుఁడ నగుటచే నిందు నిలిచితిని - ప్రపంచసృష్టివిషయమునఁ బరిణామవాద మని వివర్తవాద మని రెండువాదములు గలవు. మంటిముద్దయే కుండయైనట్లు సూక్ష్ములైన చిదచిత్తులతో నుండు భగవంతుఁడే స్థూలచిదచిద్విశిష్టుఁడై ప్రపంచాకారముగాఁ బరిణమించెననియు సూక్ష్మమునకు

స్థూలమునకు నణుత్వబృహత్త్వభేదము తప్ప మఱి యేభేదము లేదనియు రెండును సత్యమని చెప్పుట పరిణామవాదము. ప్రపంచము మిథ్య, బ్రహ్మమే సత్యమనుట వివర్తవాదము. బాలుఁడు యౌవనవంతుఁడైనట్లు సూక్ష్మముగ నున్న వామనుఁడే ముల్లోకముల నాక్రమించిన త్రివిక్రముఁడగుటచే నిరువురకును భేదము లేదనియు, రెండును సత్యమనియు నేర్పడుటచే నీవామనావతారము పరిణామవాదమును స్థిరపఱుచుచున్నది. దీనికే వామనత్రివిక్రమన్యాయ మనిపేరు. పంచాంగముచే జీవించు శాక్తేయాపశదుఁడొకఁడు వామనావతారమునకు యాచనయే యుద్దేశమనియు నా కారణముచేతనే యాచనవృత్తిగాఁగల కశ్యపునకుఁ బుట్టెననియు నిది వామనావతారతత్త్వ మని వ్రాసెను. ఇది తుచ్ఛాతితుచ్ఛమనియుఁ దన వృత్తి నతఁడు కశ్యపునందు నారోపించెననియు వేఱుగఁ జెప్పవలసిన పనిలేదు. కశ్యపుఁ డప్రతిగ్రహవ్రతశాలి యని మహాభారతమునఁ గలదు.

వామనుఁడు యాచించినది తనభార్యకు సొమ్ములనిమిత్తమై కాదు. తాను బ్రదుకలేక కాదు. కావున నది యాచన యనరాదు. యాచనాదోషము దాని యందు లేదు. గుర్వర్థమై - దేవతార్థమై - లోకోపకారార్థమై - చేయు యాచన యాచన గాదు.

కం॥ ఇచ్చటికి నేగుదెంతు ర,సచ్చరితులు దైత్యవరులు ♦ జన్నంబులకున్
లొచ్చు ఘటియింప నిటఁ బోరి,పుచ్చంగా వలయు వారిఁ ♦ బురుషవరేణ్యా! ౨౦౩

అసత్ + చరితులు = చెడునడవడిగలవారు. జన్నంబులకున్ = యజ్ఞములకు - యజ్ఞశబ్దభవము జన్నము - లొచ్చు = లోపము - పోరిపుచ్చంగా చంపఁగా.

తాత్పర్యము.

చెడునడువడిగల రాక్షసులు యజ్ఞము విఘ్నముచేయుటకై యిచ్చటికి వత్తురు. వారిని నీవు చంపవలయును.

ఉ॥ నాయన! రామచంద్ర! యిఁక ♦ నవ్యము భవ్య మనుత్తమంబు నో
నాయనఘాశ్రమంబును గ♦నం జన నౌను, దదాశ్రమంబు నా
కోయఘదూర! యెట్టిదియొ ♦ యొప్పగు నీకును నట్టి దౌచు, నం
చాయతి యాయతీద్యసుకృ♦తాత్ములఁ దోడ్కొని యేగి ప్రీతితోన్. ౨౦౪

నవ్యము = మనోహరమైనది. భవ్యము = శుభప్రదమైనది. అనుత్తమము = శ్రేష్ఠతమమైనది. దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమమైనది. అతి + ఈద్య సుకృతాత్ములన్ = మిగులఁ బొగడఁదగిన పుణ్యస్వభావము గలవారిని. ఆయాశ్రమమునఁ బూర్వము నీవు తపస్సుచేసితివి - ఇప్పుడు

నేను జేయుచున్నాను, కావున నా కెట్టిదో నీ కట్టిదే యని గూఢార్థము. నా కెట్టిదో నీ కట్టిదే యనుటచే నిది నాకెట్లు సొంతమో యట్టులే నీకు సొంతమని యెంచుకొనుము. కాని తక్కినచోట్లవలె నన్యులదియను భావ ముంచకుము. ప్రాణసమానములైన నాయస్త్రములన్నియు నీసొత్తు లెట్టులయ్యెనో యిదియు నీసొత్తట్టులే యయ్యెను. కావున నాయందు నన్యథాభావ ముంచకు మని భావము. దీనివలన భక్తుఁడు మమకారము (నాది యను భావము) వదలి సర్వము భగవంతునిదే భగవంతునికొఱకే యను భావముగలవాఁడై తనకుఁ గల సర్వము భగవంతున కర్పింపవలయును - అని సూచన.

తా త్ప ర్య ము .

నాయనా! రామచంద్రా! యిఁక మనము మిగుల మనోహరమైన శుభప్రదమై మిగుల శ్రేష్ఠమైన నాపాపరిహితమైన యాశ్రమంబును జూడఁ బోఁదగును. ఆయాశ్రమము నా కెట్టిదో నీకు నట్టిదే - అని మిక్కిలి స్తోత్రపాత్రులైన యా యిరువురను విశ్వామిత్రుఁడు దోడ్కొనిపోయెను.

౪౦॥ శ్రమ మెడలఁ జొచ్చి సిద్ధాశ్రమమును మునివరుఁడు రామ సౌమిత్రులతో
హిమరహితుఁడై పునర్వసుసమేతుఁ డయి వెలయుచున్న చందురుమాడ్కిన్. ౨౦౫

శ్రమము=దారినడచినగాసి, హిమరహితుఁడై = మంచుచేఁ గప్పఁబడనివాఁడై - పునర్వసునక్షత్రముతోఁ గూడినవాఁడు = పునర్వసువునందు రెండు నక్షత్రములు. బాలురు కావున రామలక్ష్మణులకుఁ బోలిక - విశ్వామిత్రుఁడు పెద్దవాఁడు కావున చంద్రునకుఁబోలిక.

తా త్ప ర్య ము .

ఇట్లు తోడుకొనిపోయి యాశ్రమంబునఁగల చెట్లనీడలచేతను మంచిపరిమళముతోఁగూడినగాలివీచుటచేతను, దారినడచినబడలికపోవుచుండ సిద్ధాశ్రమమును బునర్వసువుతోఁగూడినచంద్రునివలె విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతోఁ బ్రవేశించెను.

సీ॥ అరుదెంచు నక్కుశి కాత్మజుఁ బొడఁగని, సిద్ధాశ్రమస్థు ల శేషమాను
లభిముఖులైవచ్చి యర్చించి విధియుక్త, యట్టుల యమ్మహీ శాత్మజులకు
నాతిథేయం బిచ్చి యలరించి ప్రశ్నింప, నావల బడలిక యపనయింప
నొకముహూర్తంబు దాఁ మూరక కూర్చుండి, రాఘవుల్ పలికి రా రాచతపసి
తే॥ కధ్వరపుదీక్షఁ దాల్పుమీ యనఘ నేఁడ, భద్రమగుఁగాత యజ్ఞంబు ఫలముగాంచ
నగుత సిద్ధంబు సిద్ధాశ్ర మాహ్వయంబు, సత్యమగుత భవత్సూక్తి సత్యవచన! ౨౦౬

అభిముఖులై వచ్చి = ఎదురుగావచ్చి, అధ్వరపుదీక్ష = యజ్ఞదీక్ష, సత్యవచన = ఋషీశ్వరా! అధ్వరపుదీక్షఁబూనుమా యని రామలక్ష్మణులు చెప్పుటచే శిష్యులు గురువునకు ధైర్యము ఉత్సాహము గలిగించి తాముతోడై దేవతాకార్యము లాయనచేఁ జేయింపవలయు నని యేర్పడుచున్నది.

తాత్పర్యము.

ఇట్లువచ్చుచున్నవిశ్వామిత్రునిఁ జూచి సిద్ధాశ్రమమం దుండు మునులందఱు నెదురుగా వచ్చి శాస్త్రప్రకారము పూజించి యాప్రకారమే రాజకుమారులకు నాతిథేయమిచ్చి సంతోషింపఁజేసి కుశలప్రశ్న మడిగి రామలక్ష్మణులకు బడలిక దీర నల్పకాలమూఱకయుండి యావల విశ్వామిత్రునితో నిట్లనిరి. మునీంద్రా! నీవు నేఁడే యజ్ఞదీక్ష వహింపుము. నీకు మేలగుఁగాక! నీయజ్ఞము సఫలమగును. సిద్ధాశ్రమ మనుపేరు దీనికి సార్థకమగును. నీమాటయు సత్యమగును.

చ॥ అనఘులు రాఘవేంద్రు లిటు ♦ లాడిన నాదట నాలకించి యా
మునివృషభుండు గాధిజుఁడు ♦ మోదమున న్నియతేంద్రియుండునై
కొనియెను దీక్ష, వేడ్కను ♦ గోసలరాజకుమారు లత్తపో
ధనుఁ గృతసాంధ్యకార్యు లయి ♦ తత్పరులై ప్రణమిల్లి రంతటన్. ౨౦౭

ఆదటన్ = ప్రీతితో, ఆలకించి = విని, నియతేంద్రియుండు = ఇంద్రియముల నియమించినవాఁడై - మౌనవ్రతముఁబూని, కృతసాంధ్య కార్యులు = ప్రాతస్సంధ్యయందుఁజేయవలసిన కార్యములు చేసినవారు - సంధ్యవార్చినవారు. తత్పరులు=విశ్వామిత్రుకార్యము నెఱవేర్చుటయందాసక్తిగలవారు. ఇట్లనుటచే గురువు పూనినసత్కార్యమును నిర్వహించుటయందు శిష్యులకు నాసక్తి పట్టుదల యుండవలయు నని యేర్పడుచున్నది.

తాత్పర్యము.

త్రికరణశుద్ధులై పాపమన నెట్టిదో యెఱుఁగని శ్రీరామలక్ష్మణు లీప్రకారము పలికినపలుకులను విశ్వామిత్రుఁడు ప్రీతితో విని మౌనవ్రతముఁ బూని యింద్రియముల నిగ్రహించి దీక్ష గ్రహించెను. ఉభయమున దశరథనందనులు సంధ్యావందనాదికాల్యకృత్యములు దీర్చి యాయనకార్యముదీర్చుటయందాసక్తి గలవారై యాయనకు నమస్కరించి యిట్లనిరి. ఉభయమున శుచులై యాచార్యనమస్కారము చేయవలయునని దీనివలన నేర్పడుచున్నది. అశుచులై పాదుముఖములతో గురువునకు నమస్కరింపరాదు. ఊరువిడిచి నేఁటికి నయిదు దినములు.

—• ౩౦ సర్గము. శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రయాగసంరక్షణం బొనర్చుట •—

ఉ॥ కాలము దేశముం దెలిసి • కార్యసమర్థులు వాక్చణుల్ తప
శ్శీలుని గాధినందనునిఁ • జేరి మహాత్మ! నిశాచరాళు లే
కాలమునందు నిచ్చటికిఁ • గచ్చెకు వచ్చెదుఁ జెప్పు మేము త
త్కాలము మీఱకుండఁ గ్రతు•తంత్రముఁ గాచుచు నుందు మం చనన్. ౨౦౫

కాలముదేశముందెలిసి = ఎప్పుడు మాట్లాడింపవచ్చును - ఏప్రదేశమందు మాట్లాడింపవచ్చును- అనుజ్ఞానముకలవారై అనఁగా గురువు నిష్ఠయందో ధ్యానతత్పరుఁడయియో కార్యాంతరాసక్తుఁడయియో యుండుసమయమందు మాట్లాడింపరాదు. అట్టులే శౌచాదులకుఁ బోయినచోట మొదలగుప్రదేశము లందుఁ బలుకరింపరాదు. ఆయన కార్యములన్నియుఁ దీర్చుకొని యూరక కూర్చుండినపుడు సమీపించి నమస్కరించి యేదైన నడుగవలసియుండిన నడుగ వచ్చును. వాక్చణుల్=మాటలయందు నేర్పరులు- వినయవిధేయతలు గలిగి ధార్ష్ట్యములేక ప్రశ్నింపవలయును. అట్టివిధము నేర్చినవారు. కచ్చెకు = యుద్ధమునకు.

తాత్పర్యము.

గురువును మాటలాడింపఁదగిన కాలము - ప్రదేశము - బ్రశ్నించురీతియందు నేర్పరులై తియ్యని మాటలతోఁ జెల్లుపెట్టక కార్యము సాధించు శక్తిగలవారైన శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రుని సమీపించి, 'మహాత్మా! రాక్షసు లే సమయమున నిచ్చటికి కలహమునకు వచ్చెదరు చెప్పుము. ఆ కాల మతిక్రమింపకుండ మేము యజ్ఞము కాచుచుండెదము' అని యడుగఁగా.

దీనివలన కార్యము మించిన తరువాత, మీరు మాకుఁ జెప్పలేదు. మేము చేయలేదు. చెప్పియుండినఁ జేసియుండమా, యని శిష్యులనక, ముందే యాయనను, అయ్యా యీ కార్యమందు మే మేమి చేయవలయును? ఎప్పుడు చేయవలయును? ఎట్లు చేయవలయు, నని శిష్యులు ప్రశ్నింపవలయునని యేర్పడుచున్నది.

ఉ॥ సంగరరంగకౌతుకుల • సాహసశీలురఁ బ్రీతిఁ గాంచి తా
రంగము వొంగ మోదమున • నందఱు మానులు మేలు మే లటం
చుం గరము న్నుతించి నృప•సూనులు! నేఁడు మొదల్ సవావనం
బుం గడఁకన్ ఘటంపుఁడు త•పోధనుకై తమి నాఱుయామినుల్. ౨౦౬

సంగరరంగకౌతుకులన్ = రంగ మనఁగా యుద్ధభూమి. నాట్యస్థానము. కావున శ్రీరామలక్ష్మణులకు యుద్ధభూమి నాట్యస్థానమువంటిది. వారి పాలి

టికి యుద్ధ మొక యాటమాత్ర మని భావము. దానియందుఁ గౌతుకులు = కోరిక యుత్సాహము గలవారు. సాహసశీలురు = సాహసమే స్వభావముగాఁ గలవారు. ఉత్తరకుమారునివలెఁ గాదని భావము. నృపసూనులు = రాజకుమారులారా, మధ్యమపురుషమందు నారగాగమము లోపించెను. ఆఱు యామినుల్ = ఆఱురాత్రులు - నేఁడు మొదలాఱురాత్రులని చెప్పుటచేతను ముందునాఁటి రాత్రియే విశ్వామిత్రుఁడు దీక్ష వహించుటచేతను నిది యేడు దినముల యజ్ఞమని యేర్పడుచున్నది. అటయిన విశ్వామిత్రుఁడు దశరథునితోఁ జెప్పినప్పుడు దశరాత్రంబగు యజ్ఞ మని చెప్పెను. ఇది పూర్వోత్తరవిరుద్ధము గాదు. యజ్ఞమున కెంతకాలము పట్టు నని దశరథుఁ డడుగ నేఁడు మొదలు పది దినములు పట్టు నని విశ్వామిత్రుఁడు చెప్పెను. ప్రయాణమైన నాలుగవనాఁటి రాత్రి సిద్ధాశ్రమప్రవేశము ఆరాత్రియే విశ్వామిత్రుఁడు దీక్ష గైకొనెను. ఇది మొదవదినము. పదవనాఁటికి యజ్ఞము సాంతముకాఁగా నాఱుదినములు సరిపోవుచున్నవి. ౫౬-౭ పద్యమున కర్థము. దీని ననుసరించియే వ్రాయఁబడెను.

తాత్పర్యము.

యుద్ధమునకుఁ బోవుటయన నాటకుఁ బోవుటవలె దానియం దుత్సాహము గలవారై సాహసవంతులైన యారామలక్ష్మణులఁ జూచి మునులందఱుఁ జాల సంతోషించి మేలుమే లనిపొగడి రాజకుమారులారా! నేఁడు మొదలాఱు రాత్రులు మీరు యజ్ఞమును రక్షింపవలయును. రాక్షసులు రాత్రులందు వత్తురు. కావున నాఱుపగళ్లని చెప్పక యాఱురాత్రు లని చెప్పిరి.

కం॥ దీక్ష వహియించి మునిహర్యక్షుఁడు మౌనంబుఁబూను ♦ నటు గావున మీ
రక్షుద్రజాగరూకత, దక్షులరై కావుఁ డనుచుఁ ♦ దగ బోధింపన్.   ౭౧౦

మునిహర్యక్షుఁడు = మునిసింహము - మునిశ్రేష్ఠుఁడు. అక్షుద్రజాగరూకతన్ = మిక్కిలిహెచ్చరికతో. దక్షులరు = సమర్థులరు.

తాత్పర్యము.

నిన్నరాత్రియే విశ్వామిత్రుఁడు దీక్ష వహించెను. మౌనముఁ బూన నున్నాఁడు. కావున నాయన మాటలాడఁడు. మీరీయాఱురాత్రులు హెచ్చరికతో యజ్ఞము రక్షింపవలయును. అని బోధింపఁగా.

ఉ॥ వారలభాషణంబు విని ♦ వారిజలోచను లుగ్రధన్వులై
క్రూరు కొకింత లేక ముని♦కుంజరు నమ్మునియాగభూమి దు
ర్వారపరాక్రమంబునను ♦ వాసరషట్క మహర్నిశంబు పెం
పారఁగఁ గాచి దాశరథి ♦ యాఱవనాఁడు సుమిత్రపుత్రుతోన్.   ౭౧౧

భాషణంబు = పలుకు - ఉగ్రధన్వులై = భయంకరమైన ధనస్సులు ధరించినవారై - కూరుకు = ప్రమాదము, తూఁగు- వాసరషట్కము=ఆఱుదినములు- అహర్నిశము = రేవగలు - ద్వంద్వము - ఏకవచనము.

తా త్ప ర్య ము.

వారిపలుకులు విని శ్రీరామలక్ష్మణులు భయంకరములైనవిండ్లను చేఁబూని హెచ్చరికతప్పక విశ్వామిత్రునియాగభూమిని నాఱుదినములు రాత్రులు పగళ్లు రక్షించి యాఱవనాఁడు రామచంద్రమూర్తి లక్ష్మణునితో నిట్లనియె.

శా॥ అన్నా లక్ష్మణ! యింక హెచ్చరిక సు॰మ్మా, నీవు నేనుం గడుఁ
సన్నాహంబునఁ గావఁగా వలయు య॰జ్ఞం బంచు సన్నద్ధుఁడై
యున్న న్వేదిక ప్రజ్వలించెఁ గుసుమ॰వ్యూహంబుతో స్రుక్కుతోఁ
జె న్నాదర్భలతోడ ఋత్విజులతో ॰ శ్రీపానపాత్రంబుతోన్. ౭౧౨

అన్నా = ఇది ప్రీతితోఁ బిలిచెడిమాటఁ - నాయనవలె. సన్నాహంబున = యుద్ధప్రయత్నముతో - సన్నద్ధుఁడై = యుద్ధమునకు సిద్ధపడినవాఁడై - వేదిక = యజ్ఞవేది, తిన్నె - కుసుమవ్యూహంబుతోఁ = పూలసమూహముతో - స్రుక్కుతో = యజ్ఞమున నెయ్యి హోమముచేయుటకై చేసిన కొయ్యగరిటతో - పానపాత్రంబుతోఁ = సోమరసము త్రాగుపాత్రముతో.

తా త్ప ర్య ము.

అన్నా! లక్ష్మణా! రాక్షసులు వచ్చుదిన మిదియే. కావున నిఁక నీవు నేను హెచ్చరికగా నుండి యజ్ఞమును మిగులఁ బ్రయత్నముతోఁ గావవలయును. అని యుద్ధసన్నద్ధులై యుండఁగా యజ్ఞవేది పూలతోను స్రుక్కుతోను దర్భలతోను ఋత్విజులతోను సోమపానముచేయు పాత్రముతోను బ్రజ్వలించెను.

చం॥ సవిధిగ మంత్రవంతముగ ॰ జన్నము సాగుచు నుండ నాకసం
బవియఁగ భూరిరావము భ॰యానకమై జనియించె, వెంటనే
యవిరళమేఘసంఘము ని॰రంతరమై వెస వర్ష నభ్రముఁ
వ్యవధ యొనర్చునట్లుగ శాంబరి నాశ్రయించుచున్. ౭౧౩

సవిధిగ = శాస్త్రప్రకారము, జన్నము = యజ్ఞము, ఆకసంబు = ఆకాశము, అవియఁగఁ = పగులునట్లు, భూరిరావము = గొప్పధ్వని, భయానకమై = భయముకలిగించునదియై, అవిరళ = దట్టమైన, నిరంతరమై = సందులేక, వర్షఁ = వర్షాకాలమందు, అభ్రముఁ = ఆకాశమును, వ్యవధ = మఱుఁగు, శాంబరి = మాయ.

తాత్పర్యము.

శాస్త్రమునఁ జెప్పఁబడినప్రకారము సమంత్రకముగ యజ్ఞము జరుగుచుండఁగా నాకాశము పగిలిపోవునట్లు భయంకరముగ గొప్పధ్వని జనించెను. వెంటనే వానకాలమందు కారుమబ్బులు క్రమ్మినట్లు లాకాశము మఱుఁగుపడునట్లు రాక్షసులు మాయతోఁగూడినవారై యాకాశమంతయుఁ గప్పిరి.

కం॥ మారీచసుబాహులు పరి, వారము గొల్వంగ రక్త♦వర్షము వేదిన్
ఘోరంబుగఁ గురియింపన, పారంబుగ నదియు వెలిఁగె ♦ బలురక్తమునన్. ౭౧౪

తాత్పర్యము.

మారీచుఁడు, సుబాహువు ననువారు సేనలతో వచ్చి నెత్తురువానను వేదిపై ఘోరంబుగఁ గురియించిరి ఆవేదియు రక్తముచేఁ బ్రకాశించెను.

⸻* శ్రీరాముఁడు మారీచునిఁ బాఱఁదోలి సుబాహువును వధించుట *⸻

సీ॥ రామచంద్రుం డంత ♦ సౌమిత్రిసహితుఁ డై, యావేది వీక్షించి♦యాగ్రహించి
వెసవెస వచ్చి యా♦కసమునఁ బఱ తెంచు, దైత్యులఁ గనుఁగొని ♦ తమ్ముఁజూచి
యన్న లక్ష్మణ చూడు ♦ మిన్న రాదుల దుష్ట, చరితుల మానవా♦స్త్రంబుబలిమిఁ
బెనుగాలి వీవంగ ♦ వనదముల్ సల్లడఁ, జెల్లాచెదరు లయి ♦ చీలునట్లు
తే॥ చెదరఁ గొట్టెద నని దానిఁ ♦ జేతఁబూని, చూచి మారీచు ఱొమ్మున♦నూటివైవ
దండి శతయోజనంబు లు♦ద్దండ రీతి, వానిఁ గొనిపోయి పడవైచె♦వనధిలోన. ౭౧౫

తాత్పర్యము.

లక్ష్మణుతోడ రామచంద్రమూర్తి యావేది చూచి కోపించి మిక్కిలి త్వరగా వచ్చి యాకాశమున వచ్చుచుండు రాక్షసులఁ జూచి తమ్మునితో, లక్ష్మణా! చూడుము. ఈమనుష్యభక్షకులై దుష్టులైన రాక్షసులను మానవాస్త్రబలముచేత పెద్దయోరుగాలికి మేఘములు నలుగడఁ జెదరిపోవునట్లు చెదరఁగొట్టెద నని యాయస్త్రమును చేఁగొని మారీచుఱొమ్మునఁ బాణమ్ములు వేసెను. అదియును వానిని నూఱామడగొనిపోయి సముద్రములోఁ బాఱవైచెను.

కం॥ మునుఁగుచు మూర్ఛను దెలివిం, గనక చటులమానవాస్త్ర♦కారణమునఁ దాఁ
బెనుగాలిక నొగుడా కనఁ, జనుదైత్యునిఁ జూపి రామ♦చంద్రుం డనియెన్. ౭౧౬

తాత్పర్యము.

ఆ యస్త్రము తాఁకున మారీచుఁడు మూర్ఛపోఁగా స్మృతిదప్పి యుండు వానిని మానవాస్త్రముకారణముగా పెనుగాలికి నొగుడాకు వలెఁ గొట్టుకొని పోవుచుండు రాక్షసునిఁ జూపి రామచంద్రమూర్తి లక్ష్మణుతో నిట్లనియెను.

క॥ చూచితె లక్ష్మణ నరనా, రాచము సద్ధర్మయుతము • రాక్షసవరు మా
రీచునిఁ జంపక తోఁకొని, వే చనియెడి మూర్ఛముంచి • వియదధ్వమునన్. ౨౧౭

నరనారాచము = మానవాస్త్రము - సద్ధర్మయుతము = మంచి ధర్మబుద్ధి గలది. తోఁకొని = తోడుకొని - వే = శీఘ్రముగ - వియదధ్వమునన్ = ఆకాశ మార్గమున. మారీచునితో ముందు పనియున్నది కావున వాని నిప్పుడు చంప రామచంద్రమూర్తి తలంపలేదు.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! మానవాస్త్రము ధర్మబుద్ధిగలది గనుక మారీచునిఁ జంపక మూర్ఛ ముంచి నిశ్చేష్టితునిఁజేసి యాకాశమార్గమున దూరముగఁ గొనిపోవు చున్నది

క॥ అర్దితమునివర్యులఁ గడు, నిర్దయులన్ దుష్టగుణుల • నిఖిలబుధాసౌ
హార్దులఁ బాపాత్ముల నే, మర్దించెదఁ జూడు నిశిత•మార్గణశక్తిన్. ౨౧౮

అర్దితమునివర్యులన్ = బాధింపఁబడిన మునిశ్రేష్ఠులుకలవారలను, నిర్దయులన్ = దయలేని వారిని - నిఖిలబుధ + అసౌహార్దులన్ = సమస్తదేవతలకు విరోధులను - నిశిత = పదునైన - మార్గణశక్తిన్ = బాణబలముచే.

తా త్ప ర్య ము.

మునివర్యుల బాధించుచున్నట్టియు దయలేనట్టియు జెడుగుణములు గల యట్టియు దేవతాశత్రువులను పాపస్వభావులను నేను పదునైనబాణములబల ముచేఁ జంపెదను జూడుము.

మ॥ అని యాగ్నేయశరంబుఁ గేలఁ గొని క్రో • ధావిష్టచిత్తంబునన్
గనుచున్ వేగ సుబాహుఱొమ్ముపయి డా•కన్ వైచినన్ దాన నా
దనుజుం డుర్విఁ బరాసువై పడియె, నం•తం దక్కురక్షస్తతిన్
ఘనవాయవ్యశరంబునన్ ధరఁ దొరం•గం జేసె దర్పోద్ధతిన్. ౨౧౯

క్రోధావిష్టచిత్తంబునన్ = క్రోధముచే నావేశింపఁబడిన మనస్సుతో - పరాసువు = పీనుఁగు.

తా త్ప ర్య ము.

అని యాగ్నేయాస్త్రమును దీసి వింటసంధించి కోపించి సుబాహువు ఱొమ్ము గుఱిచూచి యాడ్చివైవఁగా దానిచేఁ వాఁడు చచ్చి పడెను. అంతటఁ దక్కిన రాక్షసులపై వాయవ్యాస్త్రమును బ్రయోగింపఁగా వారు నేలఁబడిరి.

తే॥ సవనమును బన్న మొనరింపఁ ♦ దవులు సర్వ, రాక్షసానీక మీగతి ♦ మ్రందఁజేసి
మున్ను కదనంబునను గెల్పు ♦ గొన్న యింద్రు, నోజ రాముఁడు ఋషులచేఁ ♦
బూజఁగొనియె. ౬౨౦

బన్నము = భగ్నము - విఘ్నము, రాక్షసానీకము = రాక్షససేన, కద
నము = యుద్ధము, ఓజ = విధమున.

తాత్పర్యము.

ఈ విధముగ యజ్ఞమునకు విఘ్న మొనరింపఁ బూనిన రాక్షససేనలను
వధించి పూర్వము యుద్ధమున గెలిచిన యింద్రునివలె రామచంద్రమూర్తి
ఋషులచేఁ బూజ గ్రహించెను.

ఉ॥ భాతి దిశల్ వెలింగెఁ, బరి ♦ పాటి సమాప్తము గాంచె నధ్వరం
బీతి దొలంగె నెల్లయెడ ♦ నింతయుఁ గన్గొని గాధిపట్టి సం
ప్రీతిని రాముఁ జూచి కృత ♦ కృత్యుఁడ నైతి గురూక్తి నీవు వి
ఖ్యాతిగఁ దీర్చి తీకతన ♦ సార్థక మయ్యె మదాశ్రమం బనన్. ౬౨౧

భాతిన్ = కాంతిచే - పరిపాటిన్ = క్రమముగా - ఈతి= బాధ గురూక్తిన్ =
తండ్రిమాట ప్రకారము - ఈకతనన్ = ఈకారణముచే

తాత్పర్యము.

రాక్షసులమాయచేఁ గ్రమ్మినమబ్బులు పోఁగా దిక్కులు ప్రకాశించెను.
యజ్ఞము సక్రమముగా నెఱవేఱెను. అన్ని చోటుల రాక్షసబాధ తొలఁగెను. ఇవ
న్నియుఁ జూచి విశ్వామిత్రుఁడు, రామా! నేను గృతకృత్యుఁడ నైతిని మీతండ్రి
చెప్పిన ప్రకారము నీవు ప్రసిద్ధిగ యజ్ఞము రక్షించుటచే నాయాశ్రమమునకు సిద్ధా
శ్రమ మను పేరు సార్థకమయ్యెను.

——* { ౩౧ సర్గము. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను మిథిలా నగరమునకుఁ దోడ్కొని పోవుట. } *——

ఆ॥ రాచతపసి వేల్మిఁ ♦ గాచి యీకరణిని, బ్రొద్దుకొలము రాచ ♦ బొట్టియలును
నిదురగొనిరి రేయి ♦ నిండారు నెలమిని, వేగుఁబోక యైన ♦ వేగ లేచి. ౬౨౨

వేల్మి = యజ్ఞము - ప్రొద్దుకులము = సూర్యవంశము - రాచబొట్టియలు =
రాజకుమారులు - ఎలమి = సంతోషము - వేగుఁబోక = ఉదయము - ఇది యచ్చ
తెనుఁగుపద్యము.

తా త్ప ర్య ము.

రాజవంశమునఁబుట్టిన ఋషియగువిశ్వామిత్రునియజ్ఞ మీవిధముగ రక్షించి సూర్యవంశపు రాజకుమారులగు రామలక్ష్మణులు తండ్రియాజ్ఞాపించినకార్యము చేసినవారమైతిమికదా యను నిండుసంతోషముతో కన్నారనిద్రించి తెల్లవాఱఁగానే త్వరగ లేచి,

ఉ॥ వేకువకర్జముల్ సలిపి ♦ వీరవరుల్ కుశికాత్మజుం దప
శ్శ్రీకలితాన్యమానులను ♦ జేరి నమస్కృతు లాచరించి మా
ర్ద్వీకరసాభవాక్యముల ♦ వీనులవిందుగ మందలించి ర
య్యా కుశికాత్మసంభవ ద♦యామయభావన యోగపావనా. ౭౨౩

కర్జముల్ = కార్యములు - తపశ్శ్రీకలిత = తపస్సంపదతోఁగూడిన, అన్యమానులను = ఇతరఋషులను - నమస్కృతులు = నమస్కారములు - మార్ద్వీకరసాభవాక్యముల = తేనెతోసమానములైన తియ్యనిమాటలచే - వీనుల విందుగ=చెవులపండువుగ - మందలించిరి = చెప్పిరి. దీనివలనఁ బదుగురతో గురువున్నప్పుడు ముందు గురువునకు నమస్కరించి యావలఁ దక్కినవారికి నమస్కరింపవలయు నని తెలియుచున్నది. దయామయభావన = దయతో విశేషముగఁ గూడినయాలోచనగలవాఁడా - శిష్యులయందలి విశేషవాత్సల్యముతో వారికేమేలు చేయుదమా యని యాలోచించువాఁడా! యోగపావనా = అట్లు చేయుటకుఁ దగిన యోగశక్తిచేఁ బావనుఁడైనవాఁడా.

తా త్ప ర్య ము.

ప్రాతఃకాలకృత్యములు దీర్చి వీరాగ్రణులైన శ్రీరామలక్ష్మణులు ముందు గురువైన విశ్వామిత్రునకు నావలఁ దపస్సంపన్నులయిన ఋషీశ్వరులకు నమస్కరించి తేనెలు గురియు ముద్దుమాటలచే నిట్లు వచించిరి.

క౦॥ వీరలు మీ కింకరులు న,పార తపోవిభవ! యేమి ♦ పనిగల్గిన వే
తీరుప సమర్థులానతి,మీరగ సెల విమ్ము దేని ♦ మేకొన వలయున్? ౭౨౪

వీరలు మీ కింకరులు-మేము అనక వీరు అని ప్రథమపురుషమందుఁజెప్పుట గురువునందు శిష్యుల కుండవలసిన వినయగుణముఁ దెలుపుచున్నది. ఇది యహంకారరాహిత్యముఁ దెలుపుచున్నది. కింకరులు=దాసులు. శిష్యుల మనియైనఁ జెప్పక కింకరుల మనుటచే నిది శిష్యునకు భక్తున కుండవలసిన దీనత్వము తెలుపుచున్నది. గురువునను గ్రహము దైవానుగ్రహము సంపాదించుకొనుటకు కైంకర్యమే యుపాయ మని తెలుపుచున్నది. కింకరులు ఎంతటిచిన్న కార్యమైనను ఇది మా పరువునకుఁ దగినదికాదే యనక చేయువారు. అపార

తపోవిభవ = అంతములేని తపశ్శక్తి సంపదగలవాఁడవు నీవు. ఆనతిమేరగ = ఆజ్ఞాప్రకారము - మేకొనవలయుఁ = పూనవలయును.

తా త్ప ర్య ము.

మునీంద్రా! వీరు మీ దాసులు. నీవు మితిమీఱినతపశ్శక్తిచేతనే నీకార్యము లన్నియుఁ జక్కఁబెట్టుకొనఁగలవాఁడవు. మేము మీకు సాధించి యిచ్చునది యేదియు లేదు. అయినను మాకుఁ బరలోకోపాయముగ సేవ యనునది కల్పించి మాచేతఁ జేయించుకొని మీరు సంతోషపడి మాకును గురుసేవ లభించె ధన్యులమైతి మను సంతోషము కలిగింపఁ గోరెదము. మేము స్వయముగ మీ కార్యములు చేయలేనివారమైనను మీ వాక్యబలమే మాచే నా కార్యములు చేయింపఁగలదు. గావున వీరు చేయవలసిన కార్య మేదో తెలుపుఁడు

సీ॥ అని యిట్లు పలికిన♦యాకుమారకులకు, గాధిపుత్త్రుఁడు లోనై ♦ మేధ గలుగు
తపసు లి ట్లనిరి యో♦దశరథనందన, మైథిలుం డగుజన♦నాథవరుఁడు
పరమధర్మిష్ఠుఁ డై ♦ పరఁగెడి జనకాఖ్య, సవమున కాతండు ♦ దివిరెఁ గాన
నది చూడ మే మంద ♦ అరుగువారము నీవు, మాతోడ వచ్చెదే ♦ పూతచరిత

తే॥ దివ్యకోదండ మొప్పసం♦స్తవ్యమగుచు, నద్భుతముగొల్పుదానిమ♦హత్త్వమరయ
మున్ను దేవత లొసఁగిరి ♦ జన్నమునను, దేవరాతసమాఖ్యపృ♦థ్వీధవునకు. ౭-౧౫

తొట్టి = మొదలుగాఁగల, మేధ = ప్రజ్ఞ, మైథిలుఁడు = మిథిలదేశపు రాజు, సంస్తవ్యము = పొగడఁదగినది.

తా త్ప ర్య ము.

(శిష్యున కాచార్యసేవ యెంతముఖ్యమో యాచార్యునకు శిష్యులకు యోగ క్షేమములుకూర్చుట యంతముఖ్యము. కావునవారికి శుభము సమకూరునుపాయ మాలోచించి తెలుపుచున్నాఁడు.) అని వారిప్రకారముచెప్పఁగా విశ్వామిత్త్రుఁడు మొదలైన ఋషీశ్వరులు 'రామచంద్రా! మిథిలాదేశపురాజు జనకుఁడు మిగుల ధర్మాత్ముఁడు ఆయన యిప్పుడు యజ్ఞముచేయఁబ్రయత్నించెను. మే మచ్చటికిఁ బోవుచున్నారము. నీవును వచ్చెదవా? ఆయన రాజు- మేము రాజకుమారులము- ఆయన పిలువక మేము పోవుట మర్యాద గా దనకుఁడు. 'అనాహూతోధ్వరం గచ్ఛేత్' పిలువఁబడకున్నను యజ్ఞమునకుఁ బోవలయు ననువిధి కలదుగదా! అదియునగాక రాజులుపోఁదగినకార్య మందుఁ గలదు. ఆయనయొద్ద దేవతా సంబంధమైన మిగులఁబ్రసిద్ధికెక్కినధనస్సు గలదు. దానిమహిమ యాశ్చర్య కరము. పూర్వము దానిని దేవతలు దేవరాతుఁ డనురాజున కిచ్చిరి.

క॥ సురగంధర్వోరగకి,న్నరరక్షోయక్షవరగ♦ణంబుల కైనం
గర మరు దది మోపెట్టఁగ, నరకోటుల నేమి చెప్ప ♦ నాళీకాక్షా! ౭౨౬

కరము = మిక్కిలి; అరుదు = అసాధ్యము; మోపెట్టఁగ = ఎక్కుపెట్టఁగ, మోపు + పెట్టు = మోపెట్టు - నాళీకాక్షా = కమలములవంటి కన్నులు గలవాఁడా. నీవు పుండరీకాక్షుఁడవు కావున దానిని నీవు చూచినఁ బ్రయోజనము కలదు. కాని యెందఱుచూచిన నేమి ప్రయోజన మని భావము.

తా త్ప ర్య ము.

ఆ వి ల్లెక్కుపెట్టుటకు దేవతలు, గంధర్వులు, పన్నగులు, కిన్నరులు, రాక్షసులు, యక్షులు, వీరిలో ముఖ్యులగువారి సమూహమునకైనను ఇందఱు కలసియు నని భావము దాని నెక్కుపెట్టఁగ నసాధ్యము. ఇఁకఁ గమలాక్షా! మనుష్యులమాట యేల? అలంకారము. కావ్యార్థాపత్తి.

క॥ ఆ వి ల్లెక్కిడుతేమి బహు,భూవరు లరుదెంచి దానిఁ ♦ బూరింపక ల
జ్జావనతాననములతోఁ, బోవుదు రేమనఁగ నాత్మ♦పురములత్రోవన్. ౭౨౭

తా త్ప ర్య ము.

ఆవిల్లెక్కుపెట్టుకోరికతో నానారాజులు వచ్చి దాని నెక్కుపెట్టలేక సిగ్గుచేఁ దలవంచుకొని తమపురములత్రోవపట్టుకొని వచ్చినట్లు పోవుచున్నారు. ఆ వింటిమహిమ నే మని చెప్పుదుము?

క॥ రాఘవ కులదీపక! నీ,వాఘను నధ్వరవరంబు ♦ నచ్చటిదివ్యా
మోఘధనూరత్నంబును, శ్లాఘాపాత్రముగఁ జూడఁ ♦ జనుదువు రమ్మా.౭౨౮

రాఘవకులదీపక=రఘువంశమును గీర్తిచేఁ బ్రకాశింపఁజేయువాఁడా-ఆవిల్లును నీవుచూచుట నీకు నీవంశమునకుఁ గీర్తికర మని భావము. నీవు క్షత్రియుఁడవు కావున నీకులోచితకార్యముచేసి కీర్తిసంపాదింపు మని పౌరుషము నుద్రేకింపఁ జేయుచుఁ జెప్పెను గాని సీతాస్వయంవరవిషయము చెప్పిన మాతండ్రియట్టి కార్యముచేయఁజెప్పలే దను నేమో యని యది చెప్పినవాఁడు కాఁడు. శ్లాఘాపాత్రముగ ననుటచే నీవు దానిని మోపెట్టఁగల వని భావము.

తా త్ప ర్య ము.

రఘువంశదీపమా! నీ వామహాత్మునియజ్ఞము నచ్చటి దివ్యము అమోఘము నగుశ్రేష్ఠమైనచాపమును గీర్తికరముగఁ జూడఁదగుదువు రమ్ము, పోదము.

చ॥ ప్రథితచరిత్రుఁ డొక్క క్రతు,రాజము శస్త్రవిధిఁ ఘటించి ము
న్మిథిలవిభుండు శైల్పులకు ♦ మేకొనఁ జేసి నితాంతతృప్తి ని

ర్థితవిరోధి తత్ఫలము•మాటుగఁ గోరె సునాభమున్ మనో
రథముగ దివ్యచాపము సు•రప్రకరంబులఁ, దచ్ఛరాసమున్. ౭౨౯

వింటివృత్తాంతము విశ్వామిత్రుఁడు చెప్పుచున్నాఁడు - ప్రథితచరిత్రుఁడు = కీర్తికెక్కిన నడవడిగలవాఁడు-క్రతురాజము = శ్రేష్ఠమైనయజ్ఞము - శస్త్రవిధి= శ్లాఘ్యమైనవిధముగా - మేకొనఁజేసి = కలిగించి - నిర్మథితవిరోధి = శత్రువులను మథించినవాఁడు - మనోరథముగన్ = కోరికఁగా - మిథిలవిభుండు = ఇది సిద్ధసమాసము కాదు - సాధ్యసమాసము. ఇందు రెండుపదంబులు తత్సమంబులే. రాకసుధాంశుమండలమనుచో - రాకన్ + సుధాంశుమండల మని శ్రీనాథుఁడు వ్యస్తముగాఁ బ్రయోగించియుండ నది సిద్ధసామాసమని భ్రమించి కొందఱు రాకసుధాంశుమండల ఇత్యాదు లనాకరంబు లని వ్రాయుచున్నారు. ఇందట్టిభ్రాంతి నిరాకరము.

తా త్ప ర్య ము.

కీర్తనీయచరిత్రుఁడైన యామిథిలాధిపతియొక్క గొప్పయజ్ఞమును శాస్త్రప్రకారము నిర్వర్తించి దానిచే దేవతలఁ దృప్తులఁజేసి దానికిఁ బ్రతిఫలముగ సునాభ మను దివ్యచాపమును నిం డని దేవతలఁ గోరెను.

ఉ॥ వార లొసంగి యేగి, రది • వర్తిలు నప్పటినుండి తన్నృపా
గారమునందుఁ, బ్రత్యహము • గంధమునన్ సుమధూపదీపసం
భారములన్ శుభాకృతుల • మండితమై కడుఁబూజ లొందు, నఁ
చాఋషివర్యు లాడఁ దన•యంచున రాముఁడు లక్ష్మణుండు రాన్. ౭౩౦

నృపాగారమునందు=రాజునింటియందు - ప్రత్యహము=ప్రతిదినము - మండితమై =అలంకరింపఁబడినదై-ఇచ్చట దేవత లని సమూహవాచకము చెప్పినను నందు ముఖ్యదేవత శివుఁ డనియే గ్రహింపవలయును.

శ్లో॥ ప్రీతశ్చ భగవా నీశ, స్త్రిశూలీ నీలలోహితః। ప్రదదౌ శత్రునాశార్థం, జనకా యాద్భుతం ధనుః॥ అని కూర్మపురాణమునఁ గలదు. ౧౨౦౮ వ పద్యమును జూచునది. దీనివలన శివసహితులైన దేవత లిచ్చి రని గ్రహింపవలయును.

తా త్ప ర్య ము.

ఆయన కోరినట్లు వా రిచ్చిపోయిరి. అదిమొద లాచాప మీరాజగృహమందే యున్నది. ప్రతిదినము గంధముచేతను, పూలు, ధూపము, దీపము, మొదలైన సామగ్రులచేతను మిక్కిలిపూజింపఁబడుచున్నది. అనియాఋషులు చెప్పఁగా విశ్వామిత్రుఁడు తన వెనుక శ్రీరామలక్ష్మణులు వచ్చుచుండఁగా.

కం॥ చనఁదొడఁగి గాధితనయుఁడు, వనదేవతలార మీకు ♦ వర్తిలు శుభముల్
చనియెద మీసిద్ధాశ్రమ,మును వీడి హిమాచలంబు ♦ పొంతకు ననుచున్. ౭౩౧

చనన్ = పోవుటకు, తొడఁగి = ప్రారంభించి;

తాత్పర్యము.

పోవుటకుఁ బ్రారంభించి విశ్వామిత్రుఁడు,వనదేవతలారా! మీకుశుభము కలుగునుగాక. మీసిద్ధాశ్రమమును వదలి హిమవత్పర్వతమునొద్దకుఁ బోయెదను. (దీనివలనఁ బ్రయాణమైపోవునపుడు పరిచితులతోఁ జెప్పి పోవలయు నని తెలియవచ్చెడిని)

తే॥ ఆశ్రమమునకు వలగొని ♦ యరుగఁబూనె, నుత్తరపుదిక్కునకు నంత ♦ నొయ్యమౌని
వరుని వెంటను జనుముని ♦ వరులనేక, శకటముల నగ్నులను గొని ♦ చనిరి వేడ్క. ౭౩౨

వలగొని = ప్రదక్షిణించి.

తాత్పర్యము.

అని చెప్పి యాశ్రమమునకుఁ బ్రదక్షిణముచేసి యుత్తరపుదిక్కునకుఁ బోవఁబూనెను. అంత నాయనతోడిమునీంద్రులును బండ్లపై నగ్నులకుంపటులను గొనిపోయిరి. [దీనివలనఁ బ్రయాణమైపోవువారు దేవాలయములకు నాశ్రమములకుఁ బ్రదక్షిణముగాఁ బోవలయు నని తెలియుచున్నది.]

కం॥ చనియెను ముని వెంటను దద్వనమందలిమృగశకుంత ♦ తతులుఁ వానిన్
జనుఁడీ మీ నెలవుల కని, చనవున మరలించి కుశిక ♦ సంభవుఁ డరిగెన్. ౭౩౩

మృగశకుంతతతులు = జింకలుమొదలగుమృగములు - పక్షులు - వీనిసమూహములు.

తాత్పర్యము.

ఆవనమందలి జింకలు మొదలగు మృగములు, చిలుకలు లోనగు పక్షులు విశ్వామిత్రునివెంటఁ బోఁగా వానినిఁజూచి నాతోడ నెంతదూర మని వచ్చెదరు, మీ మీ స్థానములకుఁ బొండని మచ్చిక మంచిమాటలచే వానిని మరలి పోవునట్లుచేసి విశ్వామిత్రుఁడు పోయెను.

[దీనివలనఁ బ్రయాణమై పోవువారివెంట వారియందుఁ బ్రీతిగలవారు కొంతదూరముపోయి వారిచే వీడుకోలువడసి రావలయు నని యేర్పడుచున్నది. నీరడ్డమువచ్చినఁ బోరాదు. చాలదూరము పోరాదు.]

ఉ॥ దూరము పోయి పోయి యటఁ ♦ దోయజబాంధవుఁ డస్తశైలశృం
గోరుతటంబున న్నిలువ ♦ నొయ్యన మానులు శోణనిమ్నగా

తీరమునందు నిల్చి నద • తీర్థములం దొగిఁ దాన మాడి పం
కేరుహబాంధవుండు సనఁ • గృత్యము లన్నియుఁ దీర్చి యోలి నై. ౭౩౪

తోయజబాంధవుండు = సూర్యుఁడు. అస్తశైల = సూర్యుఁడస్తమించు పర్వతముయొక్క. శృంగోరుతటంబునన్ = శిఖరముయొక్క గొప్ప ప్రదేశమందు. శోణనిమ్నగా=శోణనదము. 'శోణో హిరణ్యవాహ స్స్యాత్' అని యమరుఁడు. ఇది పురుషనది కావున నదము. ఇది (బండల్ఖండ్) గాండ్వానా (ఖాండవ వనము)నఁ బుట్టి పాటలీపుత్రము (పాట్నా)యొద్ద గంగలోఁ గలియుచున్నది ఇప్పుడు దీనిని సోన్ (Sone) అనుచున్నారు. పంకేరుహబాంధవుండు = సూర్యుఁడు, చనన్ = అస్తమింపఁగా. కృత్యములు = సంధ్యాదికార్యములు. తానము = స్నానము శోణనదమునకు హిరణ్యబాహు వనియుఁ బేరు గలదు.

తాత్పర్యము.

దూరముగఁ బ్రయాణముచేసి సూర్యుఁ డస్తాద్రి చేరఁగా మునీశ్వరులు శోణ నదమున స్నానముచేసి సంధ్యాదికార్యములు తీర్చుకొన్నవారై.

దీనివలన సూర్యునియర్ధాస్తమానసమయమున సాయంసధ్య వార్చవలయు ననియు సూర్యుఁ డుండఁగానే సాయంకాలస్నానముచేయవలయుననియు నేర్పడు చున్నది.

కం॥ ముందుగ నిడికొని గాధిజు, నందఱు విలసిల్ల నచట • ననుజునితో నా
నందమున రామచంద్రుఁడు, వందిన మొనరించి మౌని • వరులకు భక్తిన్. ౭౩౫

తాత్పర్యము

ఇట్లు సాయంకృత్యములు దీర్చుకొని మునులందఱు విశ్వామిత్రుని బెద్దగాఁ జేసి యాయనముం దుంచుకొని కూర్చుండఁగా రామచంద్రమూర్తి లక్ష్మణు నితో వారికి భక్తితో నమస్కరించి యిట్లని ప్రశ్నించెను.

ఉ॥ ఎవ్వని దేశ మియ్యది స • మృద్ధలతాతరుషండమండితం
బివ్విధ మాలకింపఁగ మ • హిష్ఠకుతూహల మయ్యె నంచు వా
క్రువ్వఁగ రామచంద్రు రఘు • కుంజరుఁ గాంచి తపోధనుండు దా
నివ్విధిఁ జెప్పఁగాఁ దొడఁగె • నెల్లమునుల్ విన నున్నదున్నటుల్. ౭౩౬

సమృద్ధ = మిక్కిలివృద్ధిపొందిన; లతాతరుషండ = తీఁగలయొక్కయు, చెట్ల యొక్కయు గుంపుచే; మండితము=అలంకరింపఁబడినది; మహిష్ఠకుతూహలము= మిక్కిలికోరిక; వాక్రువ్వఁగన్ = పలుకఁగా.

తా త్ప ర్య ము.

మిక్కిలివృద్ధిపొందినతీఁగలచేతను చెట్లచేతను నలంకరింపఁబడిన యీదేశ మెవ్వనిది ? వినుటకు మిక్కిలియుత్సాహము కలుగుచున్నది. అని రామచంద్ర మూర్తి పలుకఁగా విశ్వామిత్రుఁ డందఱు వినుచుండ నాదేశముకథ యథార్థ ముగాఁ జెప్పఁ దొడఁగెను.

—* ౩౨ సర్గము. విశ్వామిత్రుఁడు తనవంశకథ శ్రీరామునకుఁ జెప్పుట *—

కం॥ కుశుఁడు తపోనిష్ఠ నిరం, కుశుఁడు పితామహునిసుతుఁడు ♦ కుటిలజనాళీ
కశుఁడు హితవిదుఁడు సజ్జన, వశుఁడు మహామహుఁడుమున్న ♦ వర్తిలె వత్సా! ౭౩౭

శిష్యుఁడు గురువంశపరంపరయు గురువుమాహాత్మ్యము తెలిసికొనుట యావశ్య కము కావున విశ్వామిత్రుఁడు తనవంశమును దానే తెలుపుచున్నాఁడు. గురువు తనమాహాత్మ్యము తాను జెప్పుకో రాదు ఆయనవిషయము తెలిసినయితరుల వలన వినవలయును. కావున నది శతానందుఁడు చెప్పఁగా శ్రీరామలక్ష్మణులు తెలిసికొనిరి. (చూ - పద్యము బాల. ౧౦౧౭).

నిరంకుశుఁడు = అడ్డములేనివాఁడు - కుటిల = కుచ్చితులైన, జనాళీ = జన సమూహమునకు, కశుఁడు = కొఱడా (చబుకు) వంటివాఁడు, కుశుఁడు = కౌ= భూమౌ, శేత ఇతి కుశః = భూమికివచ్చినవాఁడు, నారదాదులవలె బ్రహ్మలోకమం దుండియు భూప్రజారక్షణార్థము రాజవంశమునిలుప భూలోకమునకు బ్రహ్మచేఁ బంపఁబడెను. ఈయన స్వయముగఁబట్టాభిషిక్తుఁడై రాజ్యమేలె ననుట కాధా రము లేదు. కావున క్షత్రియసుతులఁ గాంచి వారిచేఁ బ్రజాపాలనకార్యము జరిపించుటకై క్షత్రియస్త్రీని వివాహమాడెను.

తా త్ప ర్య ము .

నాయనా ! పూర్వకాలమందు విఘ్నములేక తపస్సుచేసినవాఁడును, బ్రహ్మ పుత్రుఁడును, కుచ్చితప్రజనుల దండించువాఁడును లోకులకు దనకు మేలిచ్చుదానిని దెలిసినవాఁడును సాధువశుఁడును గొప్పమహిమగలవాఁడును నై కుశుఁ డను నతఁ డుండెను.

కం॥ నిర్భరసద్గుణమణి వై, దర్భి మహావంశ తనకుఁ ♦ దగునాలుగఁ ద
ద్గర్భమున నాత్మతుల్యుల, నర్భకులం బడసె సుతుల ♦ నమలినగుణులన్. ౭౩౮

నిర్భరసద్గుణమణి = అతిశయమయిన మంచిగుణములుగలరత్నమువంటిది, వైదర్భి =విదర్భరాజుకూఁతురు, మహావంశ = గొప్పవంశమునఁబుట్టినది, ఆత్మ తుల్యులన్ = తనతోసమానులను, అర్భకులను = కొడుకులను, అమలినగుణు లన్ = నిర్మలగుణములుగలవారిని, పడసెన్ = కలవాఁడయ్యెను.

తాత్పర్యము.

మిక్కిలిసద్గుణములుగలరత్నము వంటిదియుగొప్పవంశమునఁబుట్టినదియు నగు విదర్భరాజుకూతురు తనకు భార్యగాఁ గొని తనతోసమానులయిన నలువురు కుమారులను నిర్మలగుణములుగలవారిని నామెగర్భమునఁ గన్న వాఁడాయెను.

దీనివలనఁ దనకులమున గొప్పవంశమునఁ బుట్టి మంచిగుణములుగలదానిని భార్యగా గ్రహింపవలయు నని యేర్పడుచున్నది. కుశుఁడు బ్రహ్మపుత్త్రుఁడైనను నీయనకుమారులు క్షత్త్రియస్త్రీకి జనించి క్షత్త్రియవృత్తి జరించినవారు కావున క్షత్త్రియులైరి. రావణాసురుఁ డిట్టివాఁడే కదా.

తే॥ నలువురఁ గుశాంబుఁ డనఁ గుశ•నాభుఁ డనఁగఁ,
బరఁగ నాధూర్తరజసుఁడు • వసువు నాఁగ
దీప్తిమంతులు నుత్సాహ•ధీరతాది
సుగుణలసితులు వా రతి•శూరు లగుచు. ౭౩౯

ఆ నలువురు కుమారులపేళ్లు చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము.

కుశాంబుఁడు - కుశనాభుఁడుఁ - అధూర్తరజసుఁడు - వసువు - అను నలువురు తేజోవంతులు, ఉత్సాహము, ధైర్యము లోనగు గుణములు గలవారు, అతిశూరులు. అధూర్తరజసునకు అమూర్తరజసుఁ డనియుఁ బేరు గలదు. తిలకవ్యాఖ్యయం దీరూపము గ్రహింపఁబడినది.

కం॥ క్షత్త్రియధర్మచికీర్షను, బుత్త్రులతో ననియెఁ గుశుఁడు • పుణ్యము పెరుగున్
ధాత్త్రిని బరిపాలించిన, మాత్త్రన యటు సేయుఁడీ కు•మారకులారా! ౭౪౦

క్షత్త్రియధర్మచికీర్షన్ = క్షత్త్రియధర్మము నడుపవలయు ననుకోరిక.

తాత్పర్యము.

కుశుఁడు బ్రహ్మపుత్త్రుఁడైనను క్షత్త్రియస్త్రీని వివాహమాడి యామెయందుఁ గుమారులఁ గన్నవాఁ డగుటచే నా ధర్మమునే కాపాడు కోరికగలవాఁడై కొడుకులను జూచి నాయనలారా! భూమి పరిపాలనముచేయుటచేతనే పుణ్యమతిశయించును గావున మీ రట్లు చేయుఁ డని నియమించెను.

ఉ॥ ఆకుశనందనుల్ నలువు • రాఋషిపల్కుల నాలకించి సు
శ్లోకులు యోగ్యదేశముల•చొప్పులు గన్గొని యందు నిల్చి న్యా
యైకవిశుద్ధులై జనము • లాఁపడి పోవక యుండ నాదట
న్వేకున వేలు చుండి రవ•నీధవులై జనలోకపూజ్యులై. ౭౪౧

సుశ్లోకులు = మంచికీర్తిగలవారు. వీర్యేణ = పరాక్రమముచే. అవనీధవులు = రాజులు. బ్రాహ్మణునివలన క్షత్త్రియస్త్రీయందు బుట్టినవాఁడు జాతిచే క్షత్త్రియుఁడే యని శంఖస్మృతి. వీఁడు జాతిచే క్షత్త్రియుఁడైనను బ్రాహ్మణసవర్ణుఁడగును. అని మనుస్మృతి. కావున వీనికి దండాజినోపవీతాదులు గలవని విజ్ఞానేశ్వరుఁడు. దీనిచే రావణుఁడు జాతిచే క్షత్త్రియుఁడని యెఱుఁగవలయును. ఇది సుందరకాండమందు ౧౧౦౭ వ పద్యవ్యాఖ్యానమందుఁ జర్చింపఁబడును.

తాత్పర్యము.

ఆకీర్తిమంతులైన కుశునికుమారులు నలువురు నాఋషిపలికినపలుకులు విని తమకు యోగ్యములైనప్రదేశముల నేర్పఱచుకొని న్యాయ్యముచేతనే పరిశుద్ధులై జనములు చెడిపోవకయుండునట్లు ప్రీతితోను బరాక్రమముతోను జనులు తమ్ము గౌరవించుచుండ రాజులై రాజ్య మేలిరి.

సీ॥ కడిమిఁ గుశాంబుండు • కౌశాంబినగరంబు, నతనితమ్ముఁడు మహో • దయము మఱియు
నాధూర్తరజసుండు • నతులధర్మారణ్య, మనుపత్తనవరంబు • ననఘ వసువు
ఘనగిరివ్రజమును • గావించుకొని రయ్య, తమకు యోగ్యంబు లౌ • స్థానములుగ
వారిలో వసుధరా • వల్లభుఁడీయ్యెడఁ, బ్రజలఁ బాలించెను • బ్రథితరీతి
తే॥ నీమహాధారిణీధ్రంబు • లేను దీనిఁ, జుట్టుకొని తేజరిల్లు ని • చ్చోటఁ బాఱు
మంజుతరశోణనద మది • మగధఁ బుట్టి, హారరుచిఁ దాల్చు నీయహా • ర్యములనడుమ. ౭౪౨

వీరు పరిపాలించిన దేశములు చెప్పఁబడుచున్నవి కడిమిన్ = పరాక్రమముచే, ధారిణీధ్రము = పర్వతము, అహార్యముల = పర్వతములయొక్క.

తాత్పర్యము.

కుశాంబుఁ డనువాఁడు తనపేరఁ గౌశాంబి యను నగరమును గట్టించి దానినిబరిపాలించెను. అతనితమ్ముఁడు కుశనాభుఁడు మహోదయ మను పట్టన మేలెను. ఆధూర్తరజసుఁడు ధర్మారణ్యనగరమునకు రాజయ్యెను. వసువు గిరివ్రజమను పురము రాజధానిగఁ జేసికొనెను. ఆనలుఁవురిలో వసురాజీప్రదేశమందుఁ బ్రజలఁ బరిపాలించెను. ఈయైదుమహాపర్వతములు దీనిని జుట్టుకొనటగోడలవలె దీనిని రక్షించును. మగధదేశమందుఁ బుట్టినశోణనద మీపర్వతములనడుమ రాజ్యలక్ష్మిధరించిన ముత్యాలసరమువలెఁ బ్రవహించుచుండును.

కం॥ పాఱును బడమటిమొగ మీ, యే ళీపెన్నిటఁ బండు • నెపు డారబముల్
కాఱుకొని కారుకారున, మీాతెను వసుకృతుని నిది స • మృద్ధిని వృద్ధిన్. ౭౪౩

ఆరబములు = పైరులు.

తా త్ప ర్య ము.

ఈశోణనది పడమటిముఖమై పాఱును. ఈనీట కారుకారునందుఁ బైరులు చక్కఁగా ఫలించును. ఇది వసువుచేసినప్రయత్నమువలన మిగుల వృద్ధిని జెందెను.

ఉ॥ రూపసి మందహాసశశి♦రోచి ఘృతాచిని బెండ్లియాడి యిం
ద్రోపమవైభవుండు నృకు♦లోత్తముఁ డాకుశనాభుఁ డంతట
న్రూపవిలాసధన్యలను ♦ నూర్వురఁ గన్యల లోకమాన్యల
న్దీపితకాంతియుక్తల న♦నిందితరక్తలఁ గాంచె, వారలున్.　　౭౪౪

రూపసి = అందకత్తె - మందహాసశశిరోచి = చిఱునవ్వనెడి చంద్రకాంతి కలది, ఘృతాచి = ఈపేరుగలయప్సరస. ఘృతవత్పురుషం దృష్ట్వా ద్రవతీ సతీ అంచతీతి ఘృతాచీ. ఘృతవత్పురుషం కృత్వా ద్రవతీ సతీ అంచతీతి ఘృతాచీ. అనఁగాఁ బురుషునిఁ జూచి నేతివలెఁ గఱఁగునది - లేకపురుషుని నేతివలెఁ గఱఁగించునది యనియర్థము. దేవతాస్త్రీలయందు జాతినియమములేదు కావున వారియందుఁ బుట్టుబిడ్డలు తండ్రిజాతివారే యగుదురు. శకుంతలవలె. ఇట్టిసందర్భములయందు బీజము ప్రధానము గాని క్షేత్రము గాదు.

తా త్ప ర్య ము.

సుందరియు వెన్నెలవంటి చిఱునవ్వుగలదియు నగు ఘృతాచిని బెండ్లియాడి యింద్రవైభవముతో సమానమైన వైభవముగల కుశనాభుఁడు రూపవిలాసాతిశయముగలిగి లోకముచే గౌరవింపఁబడు కన్యలను మంచితేజస్సు, నిర్మలప్రీతి, గలవారిని నూర్వురను గాంచెను.

—* కుశనాభపుత్రికల వృత్తాంతము *—

సీ॥ "పూచినతంగేడు♦పోలుపున మేనులు, పసిమిఱాగొంగుల♦పసల నీన
విరిసినమల్లెల♦విధమయి హాసవ్వఁ జోవ్రుదువ్వలువల♦ సిరి దనర,
విచ్చునశోకంబు♦మచ్చున భూషల, కెంపులతళతళ ♦ లింపుగూర్ప
గాలికిఁ గంపించు♦కందర్పకేతనం, బనఁగఁ బయ్యెంట లసి♦యాడు చుండ

తే॥ నిండుఁబ్రాయంపుఁబగటున♦గండు మీఱి, దండు వెడలినమరుతేజి♦కాండమనఁగి
దండియొయ్యారములను వే♦తండయాన,లొండు దినమునను ద్యాన♦మండలమున.
　　౭౪౫

విచ్చు = వికసించిన, అసియాడు = చలించు, పగటు = ప్రకాశము-లావణ్యము, మరుతేజికాండము = చిలుకలగుంపు, వేతండయానలు = ఏనుఁ

గునడకవంటి నడకగలవారు. వేదండమనియు నేనుఁగునకుఁ బేరు గలదు. సామవేదమువలనఁ బుట్టినది. "సూర్యస్యాండ కపాలే ద్వే,సమానీయ ప్రజాపతిః, పరిగృహ్య స్వహస్తాభ్యాం సప్తసామా న్యగాయత॥ గాయతో బ్రహ్మణ స్తస్మా త్సమాపేతు ర్రథంగజః॥ గజశాస్త్రము." ఈకారణముచే వీనికి వేదండములని సామజములని పేరు.

తా త్ప ర్య ము.

పూచినతంగేడుచెట్లవలె దేహములు బంగారుకాంతుల వ్యాపింపఁజేయుచుండ, వికసించిన మల్లెలవంటివై హుబ్బుని యూఁదిన నెగిరిపోవు సన్నని దువ్వలువల సొగసొప్పుచుండ విచ్చిన యశోకమువలె సొమ్ములందలి కెంపుల తళతళ మను కాంతులు మనోహరముకాఁగా గాలికి వడఁకు మన్మథధ్వజములో యన్నట్లు జాలుపైఁటలు కదలుచుండఁగా నిండునయసువికాసముచే నతిశయించి చిలుకలదండు వెడలెనా యన్నట్లు లొయ్యారముగ నా గజగమనలొకానొకదినంబున నుద్యానవనప్రదేశమందు.

ఉ॥ చేతుల వీణె లూని తమిచేఁతలఁ జేతము లుల్లసిల్ల వ
ర్షాతటిదుత్కరంబు లనఁ ♦ జారుశరీరము లొప్పఁ జూపఁ గే
ళీతదధీనచిత్తలయి ♦ లీలల బాళిని బాడుచు న్వనీ
జ్యాతల మందు వెల్గిరి ఘ♦నాంతరతారలచంద మొందఁగన్. ౭౮౬

తమిచేఁతలు=విలాసచేష్టలు - చేతములు = మనస్సులు. చేతశ్శబ్దమునకు దత్సమంబునఁజేతమనియుఁ జేత స్సనియు రెండురూపములు గలవు. "చేతము చల్లఁజేయవలె" నని యల్లసానిపెద్దనప్రయోగము. వర్షాతటిత్ ఉత్కరంబులు= వానకాలమందలి మెఱుఁగులసమూహములు - కేళీతదధీనచిత్తలు = ఆటల కధీనమైనమనస్సులుగలవారు. వనీజ్యాతలము = వనభూమిప్రదేశము - జ్యా = భూమి - ఘనాంతరతారలచందము = మబ్బునకునడుమనుండు నక్షత్రములవలె - చెట్లనడుమవారు తిరుగునపుడు మబ్బులనడిమిచుక్కలవలె నుండిరని భావము. మబ్బులనడిమిచుక్కలకుఁ గాంతియెక్కువ.

తా త్ప ర్య ము.

చేతులందు వీణెను ధరించి విలాసచేష్టలచే మనస్సులు సంతోషించుచుండ వానకాలమందలి మెఱుపులవలె మనోహరములైన శరీరము లందగింపఁగా నాటల మరగి విలాసముగాఁ బాడుచు నల్లనిమబ్బులనడిమి చుక్కలవలె వారు ద్యానమందుఁ బ్రకాశించిరి.

క॥ అసమానరూపయౌవన,లసమానలఁ గలితమణికలాపలఁ గని పె
న్విసుమానమ్ముగ మదనవి,కసమానస్వాంతుఁ డయి జగత్ప్రాణుఁ డనన్. ౭౮౭

అసమాన = సాటిలేని, రూపయౌవనలసమానలన్ = సౌందర్యముచేతను ప్రాయముచేతను బ్రకాశించుచున్నవారిని. లసమానశబ్దమున రామరాజభూషణాదిపూర్వకవిప్రయోగములు గలవు. కలిత = ధరించిన, మణికలాపలన్ = రత్నములుచెక్కినయొడ్డాణములుగలవారిని - విసుమానము = ఆశ్చర్యముగ. విస్మయశబ్దభవము విసుమానము. వికసమాన = వికాసించు, స్వాంతుఁ డు = మనస్సు కలవాఁడు - జగత్ప్రాణుఁడు = వాయుదేవుఁడు. జగత్ప్రాణ స్సమీరణః అని యమరుఁడు.

తా త్ప ర్య ము.

సమానములేని యందము ప్రాయముచేఁ బ్రకాశించువారును, రత్నములు చెక్కినయొడ్డాణములధరించినవారును నగు వారినిఁ జూచి యాశ్చర్యపడి మన్మథునిచే వికసింపఁజేయఁబడిన మనస్సుగలవాఁడై వాయుదేవుఁడు వారితో నిట్లనియె.

క॥ కోరెద మిమ్మెల్లర నా, దారలుగా నట్టులైనఁ ♦ దడయక నరతా
దూరతఁ గని దీర్ఘాయు,శ్శ్రీ రహిఁ మీఱెదరు సుందు ♦ చేడియలారా! ౭౪౭

దారలు = భార్యలు. నరతా + దూరత = మనుష్యత్వమునకు దూరత్వము. అనఁగా మనుష్యత్వము వదలి దేవతాస్త్రీలై. దీర్ఘాయుశ్శ్రీ = దీర్ఘమైనయాయుస్సుసంపద, రహిన్ = ఆనందముచే, మీఱెదరు = అతిశయించెదరు.

తా త్ప ర్య ము.

కన్యకలారా! మీరందఱు నాకు భార్యలు గండని మిమ్ముఁ గోరుచున్నాను. దానికి మీరు సమ్మతించితిరేని మీరు మనుష్యత్వమును వదలి దీర్ఘాయువు సంపద గలిగి యానందముచే నందఱు నతిశయించెదరు.

ఉ॥ అంగనలార! మిమ్ముఁ గని♦నంతటినుండి యనంగవేదనన్
భంగము నొందఁ జొచ్చితి న♦భంగురమోహమున, న్భవత్పరి
ష్వంగసుఖం బొసంగరె ర♦సంబున, మీకు సురత్వ మబ్బు మ
ర్త్యాంగనలందుఁ జంచలము ♦ యౌవన మాటను మీఱెఱుంగరే? ౭౪౮

అనంగవేదనన్ = మదనతాపముచే, అభంగుర = చక్కని, భవత్పరిష్వంగ సుఖంబు = మిమ్ముఁ గౌఁగిలించుకొనుటచేఁ గలుగు సుఖము, రసంబున = ప్రేమతో, సురత్వము = దేవత్వము, మర్త్యాంగనలందున్ = మనుష్యస్త్రీలయందు, చంచలము = స్థిరముకానిది.

తాత్పర్యము.

చక్కని యవయవములుగల వనితలారా! మిమ్ముఁ జూచినప్పటినుండియు మదనతాపముచే విస్తారమోహముచే బాధపడుచున్నాను. కావున మిమ్ముఁ గౌఁగిలించుకొనుటవలనఁ గలుగు సుఖంబు నా కనుగ్రహింపుఁడు. మీకు దేవత్వము కలిగించెదను. దానివలన మీరు దీర్ఘకాలము యౌవనముగలవారై సుఖింపఁగలరు. మనుష్యులందు యౌవనము శాశ్వతము కాదని మీకుఁ దెలియదా?

కం॥ అంగుగ నాసంగతిని నె,సంగ నమర్త్యత్వ మబ్బుఁ • జయ్యన ననఁ జ
క్రాంగగమన లని రాసా,రంగతురఁగునకు సాప•హాసవచనముల్. ౭౫౦

అంగుగన్ = అందముగ, అమర్త్యత్వము = చావులేనిదానితనము - దేవత్వము - చక్రాంగగమనలు = హంసయానలు, సారంగతురంగునకున్ = జింకవాహనముగాఁగల వాయుదేవునకు; సాపహాసవచనముల్ = హేలనముతోడి మాటలు.

తాత్పర్యము.

మీరు నాభార్యలై నాతో సాంగత్యముచేసితిరేని మీకు మరణములేని దేవత్వము లభించును - అనిన నాహంసయానలు నవ్వుచుఁ బరిహాసపుమాటల నిట్లనిరి.

ఉ॥ రాణను భూతరక్షణప•రాయణతన్ సడిగన్న నిన్ జగ
త్ప్రాణ! యెఱుంగ కుందుమె, చ•రాచరకోటులయంతరాత్మవై
ప్రాణిమి నందు, విట్టి నిను• గోటులకుం బరిపాటి దప్పి భీ
తైణవిలోచనామణుల • నక్కట యి ట్లవమానపెట్టఁగన్? ౭౫౧

రాణను = ప్రీతిచే, భూత - రక్షణ - పరాయణతన్ = జీవులరక్షించుట యందు మిగుల నాసక్తిచే, సడిసన్న = కీర్తివహించిన, నినుబోఁటులకున్ = నీవంటివారికి, పరిపాటి = క్రమము, భీతైణవిలోచనామణులన్ = బెదరినజింక కన్నులవంటికన్నులుగలస్త్రీరత్నములన్.

తాత్పర్యము.

జగత్ప్రాణా! ప్రీతిచే సమస్తభూతకోటులను రక్షించువాఁడ వని కీర్తి గన్న నిన్నుఁ దెలియకుందుమా! చరాచరముల కన్నిటికి నంతరాత్మవై యుందు నీవంటిమహాత్ములకు న్యాయమార్గము దప్పించి మగవారిని జూచినంతమాత్రముననే దిగ్భ్రమఁ గొని చూచు నాఁడుపిల్లలను నిట్లవమానపుమాట లాడఁ

దగునా! నీ వింత గొప్పవాఁడవయ్యుఁ గులకన్యకాధర్మ మెఱుఁగక వారస్త్రీల తోఁ గులటలతో మాట్లాడినట్లు మాట్లాడెదవే. ఇది నీకు నీతిగాదు.

ఉ॥ ఓపవమాన! నిన్నిచట • నుండఁగనీక తొలంగఁ జేయఁగా
నోపుదు, మైన నిస్గడప • నొల్లము వమ్ముగ మాతపమ్ము పో
నోపము గాన, నీ వెఱుఁగ•వో యెపు డీకుశనాభుకూఁతులం
బాపము! నీ కెఱుంగఁ దర•మా మరుఁ డక్షుల దుమ్ముఁ గొట్టఁగన్, ౭౫౨

పవమాన = వాయుదేవా! పవిత్రులఁజేయువాఁ డని వ్యుత్పత్త్యర్థము, కడ పన్ = చంపఁగా, వమ్ముగన్ = వ్యర్థముగ.

తాత్పర్యము.

ఓయి వాయుదేవా! నీవు పరులను పవిత్రులఁ జేయువాఁడవు గనుకఁ బవనుఁ డని పవమానుఁ డని కీర్తిచెందితివి. ఇట్టి యధర్మకార్యములకు నీవు పూనితివేని నీ వపవిత్రుఁడవై యితరుల నెట్లు పవిత్రులఁజేయఁగలవు? అప్పుడు పవమానుఁడను పేరు నీకు నేతిబీరకాయవంటి దగునుగదా! నీ వింతకు సాహసించితివి కావున నిన్ను నిప్పుడే మాతపోబలముచే శపించి వధింపఁగలముకాని కోపించుటచే మాతపములు వ్యర్థము లగు నని యూరకుండవలసివచ్చెను. ఈకుశనాభునిపుత్త్రికల నీ వెప్పు డెఱుఁగవుకాఁబోలు! కనకనే జారిణులతో మాట్లాడినట్లు మాట్లాడుచున్నావు. అయ్యో! పాపము మన్మథుఁడు నీవు రేఁచుదుమ్ము నీకన్నులందే కొట్టుచుండఁగా మే మెవ్వరైనది యెఱుఁగ నీకు శక్యమా?

(ఆహారనియమము - అప్రతిగ్రహము - కామజయము - యోగాభ్యాసము గలవారు నిగ్రహానుగ్రహసమర్థు లగుదురు. పూర్వపుస్త్రీలయం దిట్టినియమములు గలవు. కావున వారి కట్టిశక్తి యుండెను. ఇప్పు డివి లేవుగావున బ్రాహ్మణులును శాపానుగ్రహసమర్థులు కాక యున్నారు)

శ్లో॥ముఖం దగ్ధం పరాన్నేన హస్తౌ దగ్ధౌ ప్రతిగ్రహాత్,
మనోదగ్ధం పరస్త్రీభిః, బ్రహ్మశాపః కుతః కలౌ॥

పరాన్నభుక్తిచే ముఖము దగ్ధము. దానము పట్టుటచే హస్తము దగ్ధము. ఇతరస్త్రీలయందలికాంక్షచే మనస్సు దగ్ధము. ఇఁకఁ గలియుగమందున బ్రాహ్మణునకు శాపశక్తి యెక్కడిది? అని యర్థము.

అని పూర్వులు చెప్పిరిగదా!

ఉ॥ దుష్టవిచార! నిన్నిపుడ • త్రుంపక యుండెడిఁగాక తండ్రి, యా
శిష్టునిఁ జుల్కఁ జూడకుము, • చెప్పెద మాతఁడ తేఁడు వేల్పుఁ, దా
నిష్టము పూని యేఘనున • కిచ్చునొ యాతఁడె మాకు గా(రాలన్)
కష్టపువాక్యముల్ పలుకఁ•గాఁ గన కూరక పొమ్మ • చెప్పిరి వగచేన్. ౭౫౩

దుష్టవిచార = దురాలోచనగలవాఁడా! చుల్లక = లాఘవముగా - తేలికఁగా.

తాత్పర్యము.

ఓరి దురాలోచనగలవాఁడా! యీవార్త మాతండ్రికిఁ దెలిసెనా నిన్నుఁ జంపకమానఁడు. కావున నాయనచెవిని బడకముందే తొలఁగిపొమ్ము. ఆయన నలక్ష్యదృష్టిఁ జూడకుము ఆయనకుఁ గన్యాదానఫలము రాకుండఁ జేయకుము. రాచకన్నియల మగుటచేతను వయస్సువచ్చినవాం మగుటచేతను స్వయంవరాధికారము మా కున్నను మే మాయనకుఁ గన్యాదానఫలము లేకుండఁ జేయుకార్యము మే మంగీకరింపము. మామాట వినుము. మాకుఁ దండ్రియే దైవము - రాజు. ఆయన సమ్మతించి యెవని కిచ్చునో వాఁడే మాకు భర్త. కావున నిటువంటి నీచపుమాటలు పలుకక పొమ్ము.

దీనివలన గాంధర్వవివాహములకు, స్వయంవరములకు నధికారముగల కన్యకలు కూడఁ దామై వరుల వరింపక తండ్రి యెవనికిచ్చునో వాఁడే పతి యని యుండుట యుత్తమమార్గ మని యేర్పడుచున్నది.

కం॥ కంజాయతాక్షు లీగతిఁ, గొంకక భాషింప మిగులు♦కోపంబున నా
కుంజరయానలమేనులు, భంజించెను లోనఁ జొచ్చి♦పవనుఁ డదయుఁడై. ౭౫౭

తాత్పర్యము.

ఆకమలనేత్రలిట్లు జంకులేక పలుకఁగా వాయువు కోపించి వారల దేహములలోఁ జొచ్చి దయలేనివాఁడై యవయవములు వంకరటంకరపోవునట్లు చేసెను.

దీనివలన వయస్సుపడుచు లొంటరిగా స్వతంత్రించి తిరుగఁ బోవరాదని యేర్పడుచున్నది. 'ఆఁడువారిఁ గన్న నర్థంబుఁ గన్నను దిమ్మకైనఁ బుట్టు దిమ్మతెగులు' అని కలదు కదా!

కం॥ కఱకుటొడల్ వంకడల్, కుఱుచతొడల్ గలిగి మిగుల♦గోడుం గొనుచున్
మఱుగుజ్జు లగుచుఁ గిడువడిఁ, బఱతెంచిరి తెఱవ లార్త♦భవనంబులకున్. ౭౫౮

కఱకు + ఒడల్ = కఠినమైనదేహము; వంకరనడల్ = వంకరనడకలు, కుఱుచతొడల్ = పొట్టితొడలు; గోడు = వికారము.

తాత్పర్యము.

...సుపాటిన దేహములు - వంకరనడకలు - పొట్టిమైన తొడలు గలిగి ...కారమైన దేహములతో మిగుల బొట్టివారై రాఁగూడినంత ...పుయిండ్లకు వచ్చిరి.

ఉ॥ ఇట్టుల యింటి కేగి, మది ♦ హీనసిబ్బిని పోలి వ్రాల, లేఁ
బట్టులఁ జూచి తండ్రి మదిఁ ♦ దప్పిన నిబ్బర మేది చింతలోఁ
దొట్టఁగ సంభ్రమంబునను ♦ దోయరుహాయత నేత్రలార! యే
కట్టఁడి మీకు నిట్టి యప ♦ కార మొనర్చెను ధర్మదూరుఁడై? ౭౫౬

సిబ్బితిన్ = సిగ్గుచే, లేఁబట్టులన్ = చిన్నబిడ్డలను - నిబ్బరమేది = నిబ్బరములేక, కట్టఁడి = కట్టు + ఇఁడి = నియమహీనుఁడు, పాపి, ధర్మదూరుఁడు= అధర్మవర్తనుఁడు.

తాత్పర్యము.

ఈరీతిగా వారింటికిఁబోయి మిక్కిలి సిగ్గుపడి నేల పోలియున్న చిన్నబిడ్డలఁ జూచి తండ్రి నిబ్బరము చెడి మనస్సులో విచారము పుట్టఁగాఁ దొందరపాటున, నో తామరసాక్షులారా! యే పాపాత్ముఁడు నియమముచెడి ధర్మముదప్పి మీకిట్టి యపకార మొనర్చెను?

ఉ॥ కన్నుల నీరుగార నెస ♦ కంబుగ రిత్తధరిత్రి బొర్లుచా
పన్నదశావశాత్మ లయి ♦ పల్కక యుండెద రేల? యెవ్వఁ డా
సన్నవినాశుఁ డాడుఁడు వ ♦ శాంగమనామణులార! యంచుఁ ద
త్ఖిన్నతకుం గతంబు వి ♦ ను దివ్యమహామహిముండు వేచినన్. ౭౫౭

ఎసకంబుగన్ = మిక్కిలి, అతిశయముగ, రిత్తధరిత్రిన్ = వట్టినేల. ఆపన్నదశావశాత్మలై = కీడుసితిచే స్వాధీనముతప్పినమనస్సులుగలవారై, వశాంగమనామణులార = ఆఁడుయేనుఁగులనడకవంటి నడకగలనాతిలో శ్రేష్ఠులారా, ఖిన్నతకున్ = దుఃఖమునకు, కతంబు = కారణము! దివ్యమహామహిముండు = దేవతలమహిమవంటిమహిమగలవాఁడు, వేచినన్ = కాచియుండఁగా.

తాత్పర్యము.

అతిశయముగఁ గన్నీరు కాలుచుండ రిత్తనేలఁబడి పొర్లుచుఁ గీడునకుఁబాలయి యేల పలుకక యున్నారు. ఎవనికిఁ జేటుకాలము సమీపించి గజగమనలారా! మిమ్మిట్లు చేసెను. మీదుఃఖమున కేమికారణము? చెప్పుఁ డని వారిప్రత్యుత్తరము విన నిరీక్షించుచుండెను.

—*{ 33 సర్గము. కుశనాభసుతలు తమ్ముఁ బవమానుఁ డవమానించుటఁ దండ్రికిఁ దెల్పుట }*—

కం॥ వారెల్ల వారిపూరము, ధారాళముగాఁగఁ గన్న ♦ దమ్ముల రాలన్
సారసభవనిభుపదములఁ, జేరిచి మస్తకము లిట్లు ♦ చెప్పిరి వగచేన్. ౭౫౮

వారిపూరము = నీటిప్రవాహము, ధారాళముగా = అడ్డములేక, విస్తారముగా; మస్తకములు = తలలు.

తాత్పర్యము.

వారందఱు కన్నులనుండి నీరు ప్రవాహమువలెఁ గాఱుచుండ బ్రహ్మతోడ సమానుఁడగు తండ్రిపాదంబుల శిరస్సు లుంచి దుఃఖముచే నిట్లు చెప్పిరి.

శా॥ తండ్రీ! యే మని చెప్పువార మకటా ♦ దర్పించి మోహాంధుఁడై
మండ్రాటం బొదవించె గాడ్పశుభ మా ♦ మార్గంబునం జొచ్చి, నన్
గొండ్రా వల్లభుగాఁగ నంచుఁ బలుకం ♦ గోరంగదే నీవు మా
తండ్రిం; దండ్రి యొసంగ నట్లగుత, స్వా♦తంత్ర్యంబు మా కున్నదే? ౭౫౯

దర్పించి = గర్వించి, మండ్రాటంబు = సంతాపము, గాడ్పు = గాలి, అశుభమామార్గమునన్ = చొరరాని మార్గమున- మస్తాంగములోఁ దూఱి, బలాత్కారముగా నని గోవిందరాజవ్యాఖ్య - కొండ్రా = కొనుఁడా.

తాత్పర్యము.

తండ్రీ! మే మేమని చెప్పుదుము. అయ్యో! మోహాంధుఁడై గర్వించి వాయువు మాలోనికిఁ జొరానిమార్గంబునం బ్రవేశించి యిట్టిసంతాపము కలిగించెను. ఆయనకు మీరేమియపరాధము చేసితి రందువా మేమేమియుఁ జేయలేదు. మీరందఱు నన్ను భర్తగాఁ గొనుఁడని యాయన యడిగెను. నీవు మాతండ్రిని గోరవలసినది. తండ్రి మమ్ము నీ కిచ్చిన నట్లేయగును. భర్తలను గోరుటయందు మాకు స్వాతంత్ర్యమున్నదా?

కం॥ జనకుఁడు మాపరమార్థము, కనుఁగొనవా తండ్రిచాటు♦కన్నెలు గామా?
యనకు మధర్మపునుడి మముఁ, గనలింపకు నీకు శుభము♦గావుతమనుచున్. ౭౬౦

పరమార్థము = ఉత్తమవస్తువు - అధర్మపునుడి = అన్యాయపుమాట. కనలింపకు = కోపము వచ్చునట్లు చేయకుము.

తాత్పర్యము.

మాకు మా తండ్రిని మించినవస్తువు లేదు. అన్నిటికి నాయనమాటను బట్టి పోవువారము. మాకు స్వాతంత్ర్య మెక్కడిది? ఇంతమాత్రము తెలియదా? ఆకుచాటు పిందెలవలెఁ దండ్రిచాటున నుండువారము గామా? కావున ధర్మముదప్పిన మాటలాడకుము. మేము కోపించిన నీకు మేలులేదు. కావున నీమేలు కోరినవాడవై మాకుఁ గోపమువచ్చునట్లు చేయకుము.

కం॥ అబ్జజనిభ యిటు పల్కిన, నబ్జాక్షుల మనక పాపి ♦ యవమానించెన్
గుబ్జలుగా నొనరిచి యన, న్యబ్జలుగా నున్నవారి ♦ నుత్తమసుతలన్. ౭౬౧

అబ్జజనిభ = బ్రహ్మతో సమానుఁడా; అబ్జాక్షులమనక = వీరు స్త్రీలుగదా యని యాలోచింపక, కుబ్జలు = మఱుగుజ్జులు.

తా త్ప ర్య ము.

పరమేష్ఠిసమానా! వీరాఁడుపిల్లలు - వీరితోనేమి యని తలఁపక - యా పాపాత్ముఁడు మ హిళ్ల లనమానకరమైన కుబ్జల యాకారములు గలవారిగాఁ జేసెను. అని చెప్పుచున్న యా మఱుగుజ్జులె యుత్తమగుణములుగల కన్యలను.

ఉ॥ నమితవిరోధి యైన కుశ♦నాభుఁడు గన్గొని బిడ్డలార! మీ
క్షమ స్తవనీయ మౌ, ఘనల♦చందము నిట్టిద కాదె నాదువం
శమునకు యుక్తమైనకృతి ♦ సల్పితి రింతఱు నొక్క మాటగా,
క్షమయ కదా సుభూషణము ♦ కాంతల కే న్మగవారి కేనియున్. ౭౬౨

నమితవిరోధి = అణఁపఁబడిన శత్రువులు గలవాఁడు. ఈ విశేషణమువలన వాయువునైనను దండింపఁగలవాఁడని యర్థము గ్రాహ్యము. స్తవనీయము = పొగడఁదగినది.

తా త్ప ర్య ము.

ఎట్టిశత్రువునైనను నమస్కరింపఁజేయశక్తిగల యాకుశనాభుఁడు వారినిజూచి కుమారులారా! మీ యోర్పు మిక్కిలి శ్లాఘింపదగినది. గొప్పవారివిధము చెల్లి యుండియు సైరణసేయుటయే కదా. నాకడుపునబుట్టి నాకుఁ గీర్తికరమైనపని మీరందఱేకవిధముగ నొక్క మాటగాఁ జేసితిరి. మీలో నొకరైన నోర్పుతప్పి మ రలశపించినవారు కారైతిరి. దేహసౌందర్యము భూషణసౌందర్యము సౌందర్య ముగాదు. ఆడువారికైనను మగవారికైనను నెట్టికష్టదశలందైనను క్షమయే భూషణము.

ఉ॥ సైరణవాని యం దది య♦సాధ్యపుఁగార్యము, దానిలో నభ
శ్చారుల రూపదర్పితుల ♦ సైఁచుట యంతకు నుత్తమంబు, ని
ష్కారణకారణాకరునిఁ ♦ గాచుట యం దసమానరూప మౌ
నోరుపు నిందఱుం గొనితి, ♦ రుత్తమ మింతకు నొండు కల్గునే? ౭౬౩

సైరణ = ఓర్పు-క్షమ, నభశ్చారులను = దేవతలను, నిష్కారణకారణా కరునిన్ = కారణములేక బాధగలిగించినవానిని.

తా త్ప ర్య ము.

స్త్రీలకు, నందుబాలికలకుఁ దమ్మవమానపఱుపవచ్చినవానిని సహించుట సాధ్యముగానికార్యము. అందు రూపయౌవనములచే దర్పించిన దేవతలను సహిం

చుట దానికంటె గొప్ప. వారిసౌందర్యమును యౌవనమును గాంచి కామము నకు వశపడక తండ్రినిమిత్తమై సహించియుండుట గొప్పకదా. అందు కారణమే దియులేక బాధింపువానిపైఁ గోపింపక శాంతివహించి వానినిరక్షించుట యంత కంటె శ్లాఘ్యము. అందు నిందలు నేకరీతిగ నొక్కరైనను గామక్రోధములకు వశపడకుండుట యుత్తమోత్తమము. ఇంతకంటె నుత్తమమైనది మఱియొకటి గలదా.

తే॥ క్షమయె దానంబు జన్నంబు ♦ క్షమయ చుండు
క్షమయె సత్యంబు సత్కీర్తి ♦ క్షమయ కాదె
క్షమయె సద్ధర్మ మటుగానఁ ♦ గన్యలార!
క్షమను నెలకొని యుండెడి♦జగములెల్ల. ౭౬.౪

క్షమయే దానము = దానమువలన నేఫలము గలదో క్షమవలస నాఫల మే గలదు. ఇట్లులే తక్కినచోట్ల నన్వయించునది.

తాత్పర్యము.

కన్యలారా! క్షమయే దానము. యజ్ఞము క్షమయే. క్షమయే సత్యము. సత్కీర్తి క్షమయే. క్షమయే మేలైనధర్మము. కావున క్షమయందే జగమంత యు నాధారపడియున్నది. కావున నొకక్షమను సాధించినవాఁడిన్నిటిని సాధించినవాఁడే. వానిని సాధించుటకై వేఱువేఱుగఁ బ్రయాసపడఁబనిలేదు.

సీ॥ అని యిట్లు తనముద్దుఁ♦దనయల నూరార్చి, కుశనాభుఁ డంతటఁ ♦ గొలువు దీరి
కాలదేశంబులఁ ♦ బోల నాలోచించి, తగు వరులకు నీయఁ ♦ దనదుసుతల
విశ్వాసపాత్రులై ♦ వెలయుమహామాత్ర,జనులతో యోజన ♦ సలుపుచుండె
నివ్వహిఁ గుశనాభుఁ♦డిల యేలు నూర్ధ్వరే,తసుఁడు చూళి యసంగఁ♦ దాపసుండు
తే॥ తపము సేయంగ నచట గం♦ధర్వతరుణి,యూర్మిళామహిళాసుత♦ యూర్మిమాలి
సోమద యనంగ నొక్కర్తు ♦ సుమతియతని,యొద్ద శుశ్రూషగావించు♦ చుండె భక్తి. ౭౬.౫

మహామాత్రజనులు = మంత్రిజనులు, ఇవ్వహిఁ = ఈవిధముగా, ఊర్ధ్వరే తసుఁడు = రేతస్స్ఖలనములేనివాఁడు. ? హుపీహి కావున సమాసాంతకార్య ము చూపట్టమి దోషముకాదు.

తాత్పర్యము.

అని యీప్రకారము తనముద్దుకూఁతుల సమాధానపఱిచి కుశనాభుఁడు కొలువుదీరి మంత్రులనెల్ల రావించి వారితోఁ గాలము, దేశము, నాలోచించి యీనాపుత్రికలకుఁ దగినవరుఁ డెవ్వఁడా? యని యోజించుచుండెను. ఈసమ

యంబున చూళి యను నూర్ధ్వరేతస్కుఁడైన మునీశ్వరుఁడు తపముచేయుచుండ నూర్మిళయను నొకగంధర్వస్త్రీ పుత్రిక సోమద యను కన్య యాయనకు శుశ్రూష చేయుచుండెను.

—* బ్రహ్మదత్తు చరిత్రము *—

ఆ॥ కొన్నివత్సరములు ♦ చన్ననీ రీతిగ, దాసిభక్తి కిచ్చఁ ♦ దపసి మెచ్చి
సుందరాంగి! నీదు♦శుశ్రూషకును మెచ్చు, వచ్చె నేమి ప్రియము ♦ వలయు ననిన. ౭౬౬

ఇచ్ఛ = మనస్సునందు.

తా త్ప ర్య ము .

కొన్నిసంవత్సరములు జరుగ నామె శ్రద్ధాభక్తులకు సంతోషించి యో సుందరీ! నీశుశ్రూషకు మెచ్చితిని. నీ కేమిప్రియము కావలయునో యనుగుము.

కం॥ వరివస్యానియతికి ముని, పరితుష్టుం డగు టెఱింగి ♦ భాగ్యం బనుచున్
బరమప్రీతిని మధురా,ధర మధురాలాపకుశల ♦ తపసిం బలికెన్. ౭౬౭

వరివస్యానియతి = శుశ్రూష, మధురాధర = తియ్యనిపెదవిగలది. అధరశబ్దము సంగాదులలోఁ జేరనిది. కావున మధురాధరియని రూపములేదు. అట్లులే యబ్జనేత్రి -కమలనేత్రియు ససాధువులు. మధురాలా పకుశల = తియ్యనిమాటలాడుటయందు నేర్పుగలది.

తా త్ప ర్య ము .

తాను చేసిన శుశ్రూషచే ముని సంతోషించినాఁ డని తెలిసికొని యదృష్టము పండె నని తలంచి మిక్కిలి ప్రీతితోఁ దియ్యనిమాటలయందు నేర్పుగల యా సోమద మునీంద్రు నుద్దేశించి యిట్లనియెను.

కం॥ చూళీదివ్యతపోధన, మాళీ యసమప్రతాప♦మర్దితహేళీ
కేళీధృతతనువిధి నా, బాళి న్నీ వడుగ నాదు♦భాగ్యము కాదే. ౭౬౮

హేళి = సూర్యుఁడు, కేళీధృతతనువిధి = విలాసార్థముగ దేహమును ధరించిన బ్రహ్మదేవా! బాళి = అపేక్ష, భాగ్యము = పుణ్యము గదా. హేళీ, రాలింగనే ఙ్క్ష్మ్ చ- నానా.

తా త్ప ర్య ము .

దివ్యమహర్షులయందు శ్రేష్ఠుఁడవు, అసమానతపఃప్రకాశముచే సూర్యుని జయించినవాఁడవు, అపరబ్రహ్మవు నగు చూళిమునీంద్రా! నాకోరిక నీవు తెలిసికొనఁగోరుట నా పుణ్యబలమున నేకదా.

క౦॥ బ్రాహ్మణపుంగవుఁడవు స, ద్బ్రహ్మజ్ఞానైకనిధివి ♦ బ్రహ్మాత్ముఁడ వో
బ్రహ్మనిభ! నాకు నిమ్మా, బ్రహ్మతపోయుక్తుఁ బుత్త్రుఁ ♦ బరమపవిత్రున్. ౨౬౯

బ్రహ్మసమానుఁడా! నీవు బ్రాహ్మణశ్రేష్ఠుఁడవు. శ్రేష్ఠమగు బ్రహ్మజ్ఞానమునకు ముఖ్యస్థానమవు - తపస్స్వరూపుఁడవు. నాకు మిగులఁ బవిత్రుఁడును బ్రహ్మజ్ఞానముతోఁ గూడినవాఁడును నగు కొడుకు ననుగ్రహింపుము.

క౦॥ నా కెవ్వఁ డింటియాతఁడు, లేకుండుట నీక తెలియు ♦ లేదు వివాహం
బో కరుణాకర! యాశర,ణాకలితన్ ససుతఁ జేయ ♦ నగు నీమహిమన్. ౨౭౦

ఇంటియాతఁడు=మగడు. మగఁడులేఁడనిన నిది విధవయో వేశ్యయో యని చునేమో యని నాకు వివాహమే కాలేదని చెప్పుచున్నది. కరుణా + ఆకర = దయకు గనియైనవాఁడా, శరణాకలితన్ = శరణుచొచ్చినదానిని, ససుతన్ = కొడుకుగలదానినిగా, నీమహిమన్ = నీతపః ప్రభావముచే ననుగ్రహింపుమనుచున్నదానను గాని దేహసంపర్కముచేఁ గాదని భావము.

తా త్ప ర్య ము .

మహాత్మా! నాకు మగఁడెవ్వఁడు లేఁడు. నాకు వివాహమే లేదు. నిన్ను శరణుజొచ్చినదానను, నీతపోమహిమచే నాకుఁ బుత్త్రు ననుగ్రహింపుము.

క౦. అన్నెలఁతపలుకులకుఁ బ్ర,సన్నుండై చూళి తనదు♦సంకల్పభవున్
సన్నుతశీలునిఁ బుత్త్రుఁగ, నన్నారీమణికి నిచ్చి ♦ యనిపెం బ్రీతిన్. ౨౭౧

తా త్ప ర్య ము .

ఆనెలఁతపలుకులకు సంతోషించినవాఁడై చూళి తన సంకల్పముచేత నామెకుఁ గొడుకును మంచినడవడిగలవానిని గలుగ ననుగ్రహించి పంపెను.

పురుషులకు ముఖ్యరేతస్థానము బీజములయినను రేతస్సును వెలుపలకుఁ బోనీయక లోపలనే యిముడునట్లు చేసితిమేని యది దేహమంతయు వ్యాపించి దేహమునకు బలము, ఆరోగ్యము, కలిగించుటయే గాక ఓజస్సై శిరస్సున మెదడులోఁ జేరి బుద్ధిబలము జ్ఞానము తేజస్సు లోనైనవి వృద్ధిచేయును. ప్రాణాయామబలముచే యోగులు దినదినము బీజములోనుండు నీశక్తిని పైకి లాగుచుందురు. ఆకారణముచే వీరికి స్ఖలనము లేదు. ఇట్టివీరు తమ మనోబలముచేతనే తమలోని తేజస్సును స్త్రీలగర్భమందుఁ జేర్పఁగలరు. లేక దర్శన గర్భస్పర్శములచేఁ బ్రవేశపెట్టఁగలరు. ఈమూఁడువిధములయినశక్తులు లేనివారు దేహసంపర్కముచేతనే యీకార్యము చేయవలసియున్నది. "తతః ప్రభృతి మైత్రేయ ప్రజామైథునసంభవాః, సంకల్పాద్దర్శనాత్స్పర్శాత్పూర్వేషామభవన్ ప్రజాః తపోవిశేషైస్సిద్ధానాం తదాఽత్యంతతపస్వినామ్." వి - పు ౧-౧౫-౭౯,

తే॥ బ్రహ్మదత్తుండు సోమదా♦రమణిపుత్త్రుఁ, డతఁడు రాజయి కాంపిల్య♦యనుపురంబు
నింద్రుఁ డమరావతినిబోలె ♦ నేలుచుండె, లలితసత్కీర్తి దిక్కుల ♦ నలముచుండ. ౭౭౨

బ్రహ్మదత్తుఁడు = బ్రాహ్మణునిచే నీయఁబడెను. గావున సోమద కుమారున కీ పేరు పెట్టెను. అలము = ఆక్రమించు.

తాత్పర్యము.

సోమదకుమారుఁడైన బ్రహ్మదత్తుఁడు కాంపిల్య యను పురమునకు రాజయి కీర్తిమంతుఁడై యింద్రుఁ డమరావతినిఁబోలెఁ బాలించుచుండెను.

చం॥ నయముగ బ్రహ్మదత్తుఁ గుశ♦నాభుఁడు వే పిలిపించి కూర్మి స్వా
శయము నెఱుంగఁ జెప్పి తను♦జాతల నూర్వురఁ బెండ్లిచేయ వి
స్మయముగ నందఱుం గనఁగఁ ♦ జానలకేలతఁ డంటఁ దత్సతీ
చయవికృతాకృతుల్ దొలఁగి ♦ సారమనోహరకాంతిసంపదన్. ౭౭౩

స్వాశయము = తనయభిప్రాయము, తనుజాతలన్ = పుత్త్రికలను. చానల కేలు = స్త్రీలకేలు, తత్సతీచయ = ఆస్త్రీసమూహములయొక్క. వికృతాకృతుల్ = వికారస్వరూపములు.

తాత్పర్యము.

ఆబ్రహ్మదత్తుని కుశనాభుఁడు యోగ్యతకుఁదగినమార్గమునఁ బిలిపించి తన యభిప్రాయ మెఱిఁగించి యాయనకుఁ దననూర్వురుకొమార్తెలనిచ్చి వివాహము గావించెను. ఆయనయు వివాహకాలంబున నాస్త్రీలను గేలఁదాఁకఁగానే వారికందఱకు మునుపున్నవికారదేహములు పోయి మిగుల మనోహరములైన సుందరాకారములు గలవారైరి.

చం॥ వెలయఁ దనూజలం గనుచు ♦ విస్మయహర్షపరీతచిత్తుఁడై
నలువుగఁ బ్రీతివారిఁ గుశ♦నాభుఁడు నాథునితోడఁ బంచె, నా
చెలువలఁ బుత్త్రకానుగుణ♦శీలల సోమద చూచి మేనఁ గ్రొం
బులకలు మొల్కలెత్త మెయి ♦ ముట్టుచు మెచ్చెను వారిఁ దండ్రినిన్. ౭౭౪

విస్మయ హర్షపరీతచిత్తుఁడై = ఆశ్చర్యముచేతను సంతోషముచేతను గప్పఁబడినమనస్సుగలవాఁడై. పుత్త్రకానుగుణశీలల = కొడుకుగుణములకు సరిపోవు నడవడులుగలవారిని. మేనన్=శరీరమందు క్రొంబులకలు=క్రొత్తగగురుపాటు. క్రొత్త + పులకలు=క్రొంబులకలు. క్రొత్త-కెంపు - క్రింది శబ్దముల కాద్యక్షర శేషంబులకుం గొన్నియెడల నుగాగమంబును, కొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబును బహుళంబుగా నగు. సు. వ్యా. సంధి ౪౫ సూ. మెయి=దేహము.

తాత్పర్యము.

ప్రకాశించుచున్న కొమార్తెలఁజూచి కుశనాభుఁ డాశ్చర్యము, సంతోష ముచే మైమఱచినవాఁడై ప్రీతితో వారిని భర్తవెంటఁ బంపెను. ఆ సుందరు లను భర్తనడవడి ననుసరించి యాయన కనుకూలముగ వర్తించువారిని జూచి సోమదయును దేహము గరుఁడంపఁగా వారిని స్పృశించి యీ పడుచులను నట్టి గుణవతులను గన్నతండ్రిని మెచ్చుకొనెను. ఆరును జూచి చొంగుణము చెప్ప వచ్చును గదా! బిడ్డలు మంచి నడవడి గలవారైరేని తల్లిదండ్రులకుఁ గీర్తి గలదు. దీనివలన బిడ్డలు తా మెంత కష్టపడినను దల్లిదండ్రుల కపకీర్తి వచ్చు కార్యము చేయరాదు. అని యేర్పడుచున్నది.

ఈ కన్యక లుండిన ప్రదేశమునకే కన్యాకుబ్జమని పేరు ఇప్పుడు దీనిని కనోజ్ యందురు

౩౪ సర్గము

ఉ॥ ఆవిధి బ్రహ్మదత్తుఁడు నిజాత్మభవాశతముఁ వివాహమై
పోవఁగ వారిఁదోడఁ దనపూర్గణికిం, గుశనాభుఁ డంతటన్ ౪౦౦౧
దా విగతాత్మజుం డగుటఁ దత్పరుఁడై సుతలబ్ధి కిష్టినిం
బావనరీతిఁ జేయఁగను బ్రహ్మసుతుండు కుశుండు పుత్రునిన్. ౭౭౫

నిజాత్మభవాశతముఁ = తన నూర్వురు పుత్రికలను, పూర్గణికిఁ = పట్టణ శ్రేష్ఠమునకు, విగతాత్మజుండగుట = కొడుకులులేనివాఁ డగుటచే కొడుకును గాంచుటయం దాసక్తిగలవాఁడై, సుతలబ్ధికిఁ = కొడుకు గలుగుటకు, ఇష్టి = యాగము.

తాత్పర్యము.

తన నూర్వురు కొమార్తెలను పిలుచుకొని బ్రహ్మదత్తుఁడు తన నగరమునకుఁ బోఁగాఁ గుశనాభుఁడు సంతానము లేనివాఁడై కొడుకునిమిత్తమై యజ్ఞము చేసెను. అప్పుడు బ్రహ్మమానసపుత్రుఁడగు కుశుండు.

చం॥ కనుఁగొని పుత్ర! నిన్నెనయఁగాఁ గలపుత్రుఁడు పుట్టు ధార్మికుం
డనఘుఁడు గాధి, శాశ్వతయశోంచితుఁ జేయు నతండు ధాత్రి ని
న్ననుచును బ్రహ్మలోకమునకాతఁడు పోవఁగఁ గొంతకాలము
న్జన జనియించె గాధి సుజనస్తవనీయుఁడు ధర్మనిష్ఠుఁడై. ౭౭౬

ఎనయఁగాఁగల=సరిపోలునట్టి, సుజనస్తవనీయుఁడు = సజ్జనులచేఁ బొగడఁ బడ యోగ్యుఁ డగువాఁడు.

తాత్పర్యము.

తనకుమారుఁడైన కుశనాభునిఁ జూచి, కుమారా! నీకు సమానుఁడగు పుత్త్రుఁడు పుణ్యాత్ముఁడు గాధి యనువాఁడు జనించి నీకు భూమిపై శాశ్వతకీర్తి గలిగించును. అని చెప్పి యాయన పోఁగాఁ గొంతకాలమునకు ధర్మనిష్ఠుఁడు సజ్జనస్తుతిపాత్త్రుఁడు నగు గాధి జనించెను.

క॥ ఆగాధియ నాజనకుం, డోగుణభూషణ! కుశాన్వ♦యోద్భవుఁడను నీ
లాగగుటను గాశికుఁ డని, నే గణనీయుండ నైతి ♦ నిఖిలజగములన్. ౭౭౭

తాత్పర్యము.

ఆగాధియే నాతండ్రి. కల్యాణగుణములే భూషణములుగాఁగల రామచంద్రా! నేను కుశునివంశమునఁ బుట్టినవాఁడను కారణమునఁ గస్తూరిపాత్త్ర యన్నట్లు గాశికుఁ డని లోకమున నెన్నఁబడుచున్నాఁడను. వంశమున నొకకీర్తిపరుఁడైన మహాత్ముఁ డుండినను ఆవంశమునకంతయుఁ గీర్తి కలదు. అపకీర్తియు నట్లే వ్యాపించును. కావునఁ దనవలనఁ దనవంశమునకు సత్కీర్తి వచ్చునట్లు వ్యవహరింపవలయును గాని యపకీర్తి వచ్చునట్లు మెలఁగరా దని సూచన.

క॥ నాయప్ప సత్యవతినాఁ, జాయఁగను ఋచీకునకు నొ♦సంగిన సతి దా
నీయొడలితోడ దివముం, దాయం జనె నిజసుశీల♦తామహిమమునన్. ౭౭౮

అప్ప = అక్క - జాయ = భార్య - ఒడిలితోడఁ = దేహముతో - నిజసుశీలతామహిమమునన్ = తన పాతివ్రత్యమహిమచే (ఈసత్యవతియే శునశ్శేఫునితల్లి - ఈకథ ముందు రాఁగలదు).

ఉ॥ అంతియ కాక యయ్యమ మ♦హాపగ కౌశికి నాఁగ దివ్యమై
కాంతము నై చెలంగుచు జ♦గద్ధితవాంఛను సర్వదేవతా
క్రాంతము శతశైలశిఖ♦రంబును డిగ్గ దివంబునుండి, య
త్యంతము నప్పు నెయ్యమున ♦ నచ్చట నే సుఖ నై వసించెదన్. ౭౭౯

అయ్యమ = ఆయమ్మ - మహాపగ = గొప్పనది - కాంతము = మనోహరమై - జగద్ధితవాంఛను = లోకమునకు మేలుచేయుకోరికతో - సర్వదేవతాక్రాంతము = సమస్తదేవతలచే నాక్రమింపఁబడినది - శీతశైలశిఖరము = హిమవత్పర్వతశిఖరము.

౭౭౮ — ౭౭౯ తాత్పర్యము.

రామచంద్రా! మాతండ్రివలనఁ గలిగినకీర్తియే కాదు. మాయక్కగారి వలనను నాకుఁ గీర్తిగలిగినది. ఎట్లన నామె తనపాతివ్రత్యమహిమచే దేహముతో

స్వర్గమునకుఁ బోయియును నచ్చట సుఖములు తానుమాత్ర మనుభవింప నిష్టము లేక యట్టిసుఖ మందఱకుఁ గలిగింపవలె నని కోరి గొప్పదేవతానదియై మరల దేవతలనివాసభూమి యగు హిమవత్పర్వతశిఖరముపైకి నాకాశమున నుండి దిగెను. ఆమెయందలి స్నేహముచే నేనును నానదీప్రాంతమందే సుఖినై యుందును. 'ఆకాశగంగయే పామరులను పావనులను జేయుటకై బ్రహ్మచేఁ బంపఁబడి క్రిందికి దిగివచ్చెను. ఈమెయో తనంతటఁ దానే లోకులను బావనులను జేయుటకై స్వర్గసుఖములను విడిచి వచ్చెను.' అనుకీర్తి యామె సంపాదించెను. ఆమె సోదరుఁడను కీర్తి నాకును వచ్చెను. ఈనదిని నిప్పుడు కూసి యందురు.

కం॥ ఆసత్యవతీసతియును, భాసురసత్యైకధర్మ♦పథచారిణియై
తా సత్యవతీఖ్యాతిని, భాసిలు నానదికి సాటి ♦ పలుకం గలదే? ౧౦

భాసుర చారిణియై = ప్రకాశించు సత్యమొక్కటియే ముఖ్యముగాఁగల ధర్మమందుఁజరించునదియై - సత్యవతి యను పేరుచేతనే సార్థకనామధేయురాలై యొప్పుచున్నది. ఆనదికి సమానమైనది లేదు. అనఁగాఁ గౌశికీనదికి సత్యవతి యనియు నామాంతరముగలదు.

కం॥ రామా! యాగార్థం బై, శ్రీమంతముఁ జేరి నిలిచి ♦ సిద్ధాశ్రమస
ద్భూమిని సిద్ధుఁడ నైతిని, నీమహనీయప్రసాద♦నిస్తులశక్తిన్. ౧౧

శ్రీమంతము = లక్ష్మీవాసస్థానము - నీమహనీయప్రసాదనిస్తులశక్తిన్ = గొప్పదగు నీయనుగ్రహ మనెడి యసమానశక్తిచే.

తా త్ప ర్య ము.

రామచంద్రా! యక్కడనుండువాఁడ నిక్కడకేల వచ్చితి నందువేమో - యాగముచేయఁ దలంపుగలిగి శ్రీమంతమైన యీసిద్ధాశ్రమమందుఁ జేసితినేని సిద్ధిపొందుదు నని తలఁచి యిచ్చటికి వచ్చితిని. వచ్చినపని నీగొప్ప యనుగ్రహశక్తిచే సఫలమైనది. కావున మునుపటివలె నచ్చటనే యుండఁబోవుచున్నాను.

దీనివలనను దశరథునితో విశ్వామిత్రుఁడు 'ఏ నెఱుంగుదు రాజేంద్ర' యని చెప్పినమాటలవలనను విశ్వామిత్రుఁడు తక్కిన యనేకఋషీశ్వరులవలె నవతారవిశేష మెఱింగియే 'భగవంతుఁడు భూమిపై దుష్టసంహార శిష్టరక్షణార్థమై యవతరించెను - ఆయనయుద్దేశ్యమున కనుకూలమైన సేవ మనచేత నయినది చేయుద' మనుతలంపుతోనే తానుద్దేశించిన కార్యములన్నియుఁ జేయుటకు సిద్ధాశ్రమము మధ్యభాగముగ నుండు నని తలంచి యందుఁ జేరె నని తెలియనయ్యెడి. దీనివలన నెంతటి మహాత్ములకైనను భగవత్సేవ యథాశక్తిచేయుట కర్తవ్యమని యేర్పడుచున్నది.

క॥ నీ వడిగినకారణమున, నావంశముచరితరీతి ♦ నాజననవిధం
బీవిషయాఖ్యానంబును, బావనగుణశీల! యెఱుఁగఁ ♦ బలికితి నీకున్. ౨౮-౨

తాత్పర్యము.

నావిషయమై నేనై చెప్పుకొనరాదు. అయినను నీ వడిగినపుడు చెప్పక యుండరాదు. చెప్పకయుండినఁ బెద్దలయశస్సును దాఁచిన ట్లగును. కావున నావంశమువిధము నేను జనించినరీతి యీదేశచరిత్రము పవిత్రగుణములుగల రామచంద్రా! నీకుఁ దెలియఁజెప్పితిని.

ఉ॥ అద్దమరేయి డాసెడిని ♦ నబ్జహితాన్వయ నేఁ గథావళుల్
పద్దుగఁ జెప్పుచుండుటను ♦ భద్రము నీ కగుఁగాక రాఘవా!
నిద్దుర పొమ్ము లెస్స యిఁక ♦ నిద్దురలే కడు గెట్లు సాగెడిన్
బ్రొద్దున లేచి తోవ చనఁ ♦ బూనినచో వ్యథ దోఁప కుండునే? ౨౮-౩

అద్దమరేయి = అర్ధరాత్రము - డాసెడిని = సమీపించుచున్నది.

తాత్పర్యము.

రామచంద్రా! నేను మీకుఁ గథలు చెప్పుచుండుటలో నర్ధరాత్రము కావచ్చినది. నాయనా! నీకు క్షేమమగుఁగాక - ఇఁకఁ జక్కఁగా నిద్దురపొమ్ము - నిద్దుర పోనియెడల నుదయమునఁ బ్రయాణముచేయవలయునుగదా! అదు గెట్లుసాగును? బడలిక తోఁచునుగదా! [ఇది యూరువిడిచిన ౧౧ వ రాత్రి].

—* రాత్రివర్ణనము *—

శా॥ ఆ కల్లాడుట మానె వృక్షములయం, ♦ దత్యంతనిద్రాళులై
జోకం గూర్కుగొనెన్ మృగాండజము, ల♦స్తోకాంధకారంబు న
వ్యాకీర్ణం బయి ముంచె దిక్కులను, సం♦ధ్యం బాసె నల్లల్లరే,
యాకాశం బుడుపంక్తితో విమలనే♦త్రాప్తిం బలెన్ భాసిలెన్. ౨౮౪

నిద్రాళులై = నిద్రపోవునవి - మృగాండజములు = మృగములు పక్షులు- అస్తోకాంధకారము = గాఢమైన చీఁకటి - అవ్యాకీర్ణము = చెదరక నిలుక డగా - ఉడుపంక్తి = నక్షత్రములవరుస - నేత్రాప్తిన్ బలెన్ = కన్నులు గలిగి నట్లు. భాసిలెన్=ప్రకాశించెను. 'సంధ్యం బాసె నల్లల్లరే' యనుటచేత సూర్యాస్తమానమై యరజామైన దని తెలియనగును. అనఁగా నిప్పటికి నించు మించు నెనిమిదిగంటలు (అయిదుగడియలు) ప్రొద్దయి యుండవలయును. సంజచీఁకటిని వర్ణించుటచే నిది బహుళపక్ష మనియు, తదియయో చవితియో యనియుఁ దెలియ నగును. పదిన్నరగంట మొదలు ఒకటిన్నరగంటవఱకు నర్ధరాత్ర మని యెన్నఁబడును. కావున నర్ధరాత్రము సమీపించిన దనుట సరియే.

తాత్పర్యము.

రామచంద్రా! చెట్లయందు నొక్కయాకైనఁ గదలకున్నది. మిక్కిలి నిద్దుర గొన్నవై మృగములు - పక్షులు నిదురించుచున్నవి. గాఢమైన చీఁకట్లు సందులేక ముంచెను. రాత్రి సంధ్యాకాలము నతిక్రమించెను. ఆకాశమే నక్షత్రములతోఁ గన్నులుగలదానివలెఁ బ్రకాశించుచున్నది.

క॥ చల్లనితనకిరణంబుల, బల్లిదపుంజీఁకువాలు ♦ పలుపఱియలుగా
నల్లదె యుదయించెను జా,బిల్లి జగం బెల్ల ముదము♦పెంపునఁ గ్రాలన్. ౭౮౧

బల్లిదపుంజీఁకువాలు = బలమైనచీఁకటి - పలుపఱియలుగాన్ = అనేకములైన తునుకలుగా - జాబిల్లి = చంద్రుఁడు.

తాత్పర్యము.

చల్లనితనకిరణములచే దట్టమైనచీఁకటి తునుకలుతునుక లగుచుండఁగా లోకము సంతోషించునట్లు చంద్రుఁ డుదయించెను.

క॥ చీఁకటి వెఱవని గూబల, మూఁకలు మొదలైనక్రూర♦మృ లగుమెగంబుల్
దేఁకువయక్షులసంఘము, సోఁకుగమి చరించె నెల్ల♦చోటులఁ గలయన్. ౭౮౬

సోఁకుగమి = రాక్షసులగుంపు.

తాత్పర్యము.

చీఁకటికి భయపడని గుడ్లగూబలగుంపులు మాంసము దిను క్రూరమృగములు యక్షులసమూహములు రాక్షసులగుంపు ధైర్యముతో నన్నిప్రదేశములందుఁ జరించుచున్నవి.

చం॥ అని ముని యూరకున్న మును ♦ లందఱు నాతనిఁ గాంచి మేలు మే
లని వినుతించి మీ యమలి♦నాన్వయ మెంతయు సుప్రసిద్ధ మ
త్యనఘము ధర్మశీలము త్వ♦దన్వయజాతులు బ్రహ్మతుల్యులున్
మనుజవరేణ్యులున్ నిరుప♦మానులు దివ్యమహానుభావులున్. ౭౮౭

అమలినాన్వయము = పవిత్రవంశము - త్వదన్వయజాతులు = మీవంశమునఁ బుట్టినవారు - నిరుపమానులు = సమానులులేనివారు - దివ్యమహానుభావులు = దేవతలకుఁగల మహిమవంటి మహిమగలవారు.

తాత్పర్యము.

అని విశ్వామిత్రుఁ డూరకుండఁగా నది వినుచున్నమునీశ్వరులు మేలు-మేలు మీపవిత్రవంశము లోకమున మిక్కిలి ప్రసిద్ధి కెక్కినది- దోషరహితమైనది-ధర్మమే స్వభావముగాఁగలది. మీవంశమునఁ బుట్టినవారో బ్రహ్మతో సమానులు.

మనుష్యులందు శ్రేష్ఠులు - ప్రభువులు - అసమానులు - మహిమయందు దేవతలతో సమానులు.

ఉ॥ వారలలో సుపర్వతతి ♦ వారిజగర్భుఁడుఁబోలె నీవు దు
ర్వారమహానుభావుఁడవు ♦ రాజతకీర్తివి గాధిపుత్ర! మీ
సారతరాన్వయంబును బ్ర♦శస్తముఁ జేసె నదీమతల్లి నీ
గారపుఁదోఁడఁబుట్టనుచుఁ ♦ గౌతుకమారఁగఁ బల్కె నంతటన్. ౭౨

సువర్వతతిన్ = దేవతాసమూహమునందు - వారిజగర్భుఁడుఁబోలెన్ = బ్రహ్మదేవునివలె - దుర్వారమహానుభావుఁడవు = వారింపరానిమహిమగలవాఁడవు- గారపుఁదోఁడఁబుట్టు = గొప్పదనముగలయక్కగారు గౌరవశబ్దభవములు గారము - గారవము - గారాము.

తాత్పర్యము.

మీవంశమువారిలో నీవు దేవతలలో బ్రహ్మవలె శ్రేష్ఠుఁడవు. నీమహిమ కడ్డము లేదు. కావుననే కీర్తిచేఁ బ్రకాశించుచున్నాఁడవు. గాధేయా! సహజముగా సారవంతమైనమీవంశమును నదులయందు శ్రేష్ఠయగు మీయప్ప మిగులఁ గీర్తిమంతముఁ జేసెను. అని యిట్లు చెప్పుచుండఁగా.

కం॥ అస్తగతుం డగుసూర్యుని, నిస్తున ముని నిదుర వోవ ♦ శ్రీరాముఁడు సం
శస్తగుణుఁన్ మునిఁ దెలచి తృ,ణాస్తరమున నిదురవోయె♦ననుజాతునితోన్. ౭౩

అస్తంగతుఁడగు = అస్తమించినవాఁడు - నిస్తున = వలె - తెలచి = స్తుతించి - తృణాస్తరమున=పచ్చికపడుకయందు-అనుజాతునితోన్=తమ్మునితో.

తాత్పర్యము.

తాను నిదురింపకుండిన వీరును నిదురింపరు - ముచ్చటలాడుచుందు రని విశ్వామిత్రుఁ డస్తమించిన సూర్యునివలె నిద్దురవోయెను. శ్రీరామచంద్రుఁడును స్తోత్రపాత్ర మగు గుణములుగల విశ్వామిత్రుని పొగడుచుఁ దమ్మునితోఁ బచ్చికపైఁ బరుండెను.

—* ౩౯ సర్గము *—

ఉ॥ తక్కటరేయి యంతయు య♦థాసుఖవృత్తి మునీంద్రకోటతో
మక్కువ శోణకూలమున ♦ మానిమృగేంద్రుఁడు నిద్రవోయి తె
ల్వక్కఁగఁ దూర్పు లేచి కృత♦కృత్యవిధుం డయి కౌసలేయునిన్
మిక్కిలి గారవమారఁ గని ♦ మేల్కొలిపెన్ మృదుభవ్యసూక్తులన్. ౭౪

తత్కటిరేయి = మిగిలినరాత్రి, తెల్లవ్రక్కఁగా = తెల్లవాఱఁగా; కృతకృత్యవిధుండయి = నిత్యనైమిత్తికకర్మములు చేసినవాఁడై, మృదుభవ్యసూక్తులన్ = శుభములైన మంచిమాటలచే.

తాత్పర్యము.

తక్కినరాత్రియంతయు మునీంద్రులసమూహముతో శోణనదతీరమునందు హాయిగా మునిసింహము విశ్వామిత్రుఁడు నిద్రపోయి తూర్పుతెల్లన గాఁగా లేచి యీసమయమునఁ జేయవలసినస్నానసంధ్యాదికార్యములు చేసినవాఁడై మిక్కిలిప్రీతితోను గౌరవముతోను మెత్తని శుభదములైన మంచిమాటలచే బాలుర మేలుకొలిపెను. రామలక్ష్మణులు బ్రహ్మచారులు గావున వారికి స్నానము, సంధ్య తప్ప వేఱుకృత్యములు లేవు. కావునఁ దాను దనకృత్యములు దీర్చుకొని వెనుక వారల నిద్ర లేపెను.

క॥ తెలతెలవాఱఁగఁ జొచ్చెను, దొలిసంజయు డాసె లెమ్ము ♦ తోయజనేత్రా!
కలదుగదా పయనము మీ, కలమిక శుభమగుత మని ఋ♦షీశ్వరుఁడాడన్. ౭౯౧

తాత్పర్యము.

రామచంద్రా! నాయనా! తండ్రీ! తూర్పుతెల్లవాఱుటకుఁ బ్రారంభించినది. ప్రాతస్సంధ్యయు సమీపించెను. కమలాక్షా! సూర్యుఁ డుదయింపఁ గమలములు ముకుళించియుండునా? కావున లెమ్ము. మీరు సంతోషముతోఁ బ్రయాణము చేయవలయును గదా! మీకు మే లగుత మని విశ్వామిత్రుఁ డాడఁగా.

ఉ॥ ఆనుడి నిద్ర మేలుకొని ♦ యంబురుహాక్షుఁడు కల్యవిధ్యను
ష్ఠానము లెల్లఁ దీర్చికొని ♦ చయ్యనఁ దాఁ బయనంబు సేయఁగాఁ
బూని మునీశ్వరుం గని త♦పోధన శోణము శుభ్రనీరమై
మానితసైకతావళుల♦మంజుల మై యలరారె గాధమై. ౭౯౨

ఆనుడిన్ = ఆమాటలచే, కల్యవిధ్యనుష్ఠానము = ప్రాతఃకాలమున శాస్త్రప్రకారము చేయవలసిన యనుష్ఠానములు, మానితసైకతావళులన్= మన్నింపఁదగు నిసుకదిబ్బలసమూహములచే; మంజులమై= సుందరమై. 'అథ కల్యమహర్ముఖే'- నానా.

తాత్పర్యము.

ఆమాటలకు రామచంద్రమూర్తి మేలుకొని యుదయమున నెఱవేర్పవలసిన స్నానసంధ్యాదిక్రియలు సలిపినవాఁడై ప్రయాణమునకు సిద్ధపడి మునీంద్రా!

యీశోణనది నిర్మలమై శుభ్రమైనజలముగలదై యిసుకదిబ్బలచే సుందరమై లోఁతై యొప్పుచున్నది.

క౦॥ ఏరేవునఁ దరియింపం, దీ రగు నీనదిని నా ము♦నిప్రవరేణ్యుల్
కోరి చనెద రేతెరువున, దారి యదియ మన కటంచుఁ ♦ దలఁతుఁ గుమారా! ౭౯౩

తాత్పర్యము.

ఎంతో లోఁతుగల యీనదిని దాఁటు టెట్లు, అని రామచంద్రమూర్తి ప్రశ్నింప విశ్వామిత్రుఁడు కుమారా! మునిశ్రేష్ఠు లేతెరువునఁ బోదురో యది యే మనకు దారి యని తలంచెదను – అని చెప్పెను.

"మహాజనా యేన గతా స్సపంథా" యనువాక్య మిచట స్మరించునది. సంసార మను నదిని దాఁటుటకు మహాజను లేత్రోవనఁ బోదురో యదియే మార్గ మని దీని కర్థము.

చ౦॥ అనిన మహర్షు లంత భృశ♦హర్షమునన్ వనజాలవీథులం
జనుచును వేడ్క మీఱఁ దమ♦చాయలు దా రటు త్రొక్కువేళకున్
మునిజనసేవ్యమాన మయి ♦ పుణ్యతరోదక మై మరాళకో
కనికర మైనజాహ్నవిని ♦ క్ష్మాధవనందనయుక్తి డాయుచున్. ౭౯౪

భృశహర్షమునన్ = అధికసంతోషముతో - వనజాలవీథులన్ = వనసమూహములందలి బాటలయందు - తమచాయలు = తమ నీడలు - త్రొక్కువేళకున్ = మట్టమధ్యాహ్నమునకు - మరాళకోక నికరమైన = హంసలయుచక్రవాకములయు సమూహములుగల - క్ష్మాధవనందనయుక్తిన్ = రాజకుమారుల తోడ - డాయఁగన్ = సమీపింపఁగ.

తాత్పర్యము.

ఇట్లు విశ్వామిత్రుఁడు చెప్పఁగా ఋషీశ్వరులు మిగులసంతోషించి యేటుదాఁటి వనములలోఁ గల దారివెంబడి పోయి పోయి మధ్యాహ్నమునకు సరిగా హంసలు చక్రవాకములు గల గంగానదీతీరమును రాజకుమారులతోఁ జేరిరి.

క౦॥ ఆవిబుధనిమ్నగాతీ,రావని వసియించి యుచిత ♦ మగునెలవులఁ దా
రావెనుకఁ దర్పణాదులఁ, గావించి భుజించి యమృత♦కల్పహవిస్సున్. ౭౯౫

విబుధనిమ్నగా = దేవనదియొక్క - తీరావనిన్ = ఒడ్డుప్రదేశమందు - నెలవులు = స్థానములు - అమృతకల్పహవిస్సున్ = అమృతముతో సమానమైన హవిస్సును. హవిస్సు - అనఁగా యజ్ఞమున హోమముచేయఁగా మిగిలినది. తర్పణములు = పంచమహాయజ్ఞములు; కాండఋషితర్పణాదులు. అగ్ని

హూోత్రములు లేనివారికి దేవతానివేదితాన్నమే హవిస్సు. యజ్ఞము = దేవపూజ - 'యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మసనాతనమ్' అని భ.గీ. అమృత మను పేరుగల యజ్ఞశేషమును నెవరు భుజింతురో వారు సనాతనబ్రహ్మ పదము నొందుదురు.

—* శ్రీరాములు గంగానదీవృత్తాంతము విశ్వామిత్రు నడుగుట *—

చం॥ వరవిబుధాపగావిమల♦వారితటిన్ సికతోరువేదికో
పరి యుపవిష్టులై నడుమ ♦ భాసిలు చామునినేత యొప్పఁగాఁ
బరమముదంబునన్ సుగుణ ♦ భద్రుఁడు రాముఁడు మౌనిఁ గాంచి ని
ర్జరనది మూఁడుత్రోవలుగ ♦ సాగరుఁ జేరుట కేమి హేతువో? 28

వరవిబుధాపగా = ఇష్టమైన దేవతానదియొక్క "క్లీబేతు కుంకుమే శ్రేష్ఠే త్రిష్విష్టే హ్యవ్యయం వరం" - నానా. విమలవారితటిన్ = నిర్మలమైన నీటి యొడ్డున, సికతోరువేదికోపరి= ఇసుక గొప్పదిన్నెమీఁద, ఉపవిష్టులై=కూర్చుండినవారై, నిర్జరనది = గంగ, సాగరున్ = సముద్రుని.

తాత్పర్యము.

మనస్సునకింపైన గంగానదీతీరభూమియందుఁగల యొక పెద్దయిసుకదిన్నెపై వారందఱు నడుమ విశ్వామిత్రునిఁ నుంచుకొని కూర్చుండి యుండఁగా గంగానదినిఁ జూచి రామభద్రుఁడు విశ్వామిత్రునితో నీగంగానది మూఁడుమార్గముల సముద్రముఁ జేర నేమి కారణము?

ఆ॥ అనుచు వేఁడ గాధి♦తనయుండు దశరథు, ముద్దుఁబట్టిఁ జూచి ♦ మోదమునను
బలుకఁ దొడఁగె గంగ ♦ ప్రభవంబు సద్దాని,యభ్యుదయము నచటి♦సభ్యు లలర. 29

వేఁడన్ = ప్రార్థింపఁగా, అభ్యుదయము = వృద్ధి.

తాత్పర్యము.

అని యిట్లు ప్రార్థింపఁగా విశ్వామిత్రుఁడు దశరథుముద్దుకుమారుఁడైన రామచంద్రమూర్తినిఁ జూచి సంతోషించునట్లు చెప్పఁదొడఁగెను.

క౦॥ కలదు గదా ప్రాలేయా,చలము వివిధరత్నకూట♦చయచుంబినభోం
చలము బహుధాతువర్గో,జ్జ్వల మతిశయశీతవాత♦చలనాతులమై. 30

ప్రాలేయాచలము = మంచుకొండ - హిమవత్పర్వతము, వివిధరత్న = నానావిధములైనమణులుగల; కూట = శిఖరముల; చయ = సమూహముచే, చుంబి = ముద్దుపెట్టుకొను, నభోంచలము = ఆకాశప్రదేశముగలది; బహు

విధ = పలుతెగలైన, ధాతు = రాగి ఇనుము లోనగు లోహాదుల - వర్గ = సమూహాముచే; ఉజ్జ్వలము = ప్రకాశించునది, అతిశయశీతవాతచలనాతులమై = మిక్కిలి చల్లనిగాలి కదలికచే ననమానమైనది.

తాత్పర్యము.

అనేకములైన రత్నములుగల శిఖరములచే నాకాశమంటుచున్నదియు నానాధాతువర్గముచేఁ బ్రకాశించునదియు మిక్కిలి చల్లనిగాలి వీచుటచే ననమానమైనదియు నగు మంచుఁగొండ కల దనుట ప్రసిద్ధమే కదా!

కం॥ ఆతండును హేమాచలజాతె మనోరమను మేన ♦ జాయగఁ గొని వి
ఖ్యాతయశస్స్ఫితలఁ దగు, తలనిరువురను గాంచె ♦ సంపన్నుతలన్. ౭౯౯

హేమాచలజాత = బంగారుకొండ యగు మేరుపర్వతముకూఁతురు. మంచుఁగొండ బంగారుకొండ యన్నప్పుడు రాలు గుండ్లని యర్థము కాదు. వాని కధిష్ఠానదేవత లనియు వారి కవి దేహములవంటివనియు నెఱుఁగునది. మనోరమను = మనస్సును రంజింపఁజేయఁ గలదగుటచే మనోరమ యనుపేరు గల, మేన = మేనక యనుదానిని, జాయగన్ = భార్యగ, విఖ్యాతయశస్స్ఫితలన్ = ప్రసిద్ధమైన కీర్తిచేఁ బ్రకాశించువారిని, తనుజాతలన్ = పుత్రికలను.

తాత్పర్యము.

ఆహిమవంతుఁడు మేరుపర్వతముకూఁతురగు మనోరమ యను మేనకను బెండ్లాడి యామెయందు నిరువురఁ బుత్రికలఁ గనెను.

ఉ॥ వారలలోనఁ బెద్ద యయి ♦ వర్తిలు గంగ, ద్వితీయ యాయుమా
వారిజనేత్ర, వా రెలమి ♦ వరలు చుండఁగ దేవతార్థమై
కోరి సురావళుల్ శిశిరగోత్రముఁ జేరి మహాత్మ! గంగ ము
ద్దారిని బాఱఁ జేయుమని ♦ తద్దయు వేఁడఁగ శైలనాథుఁడున్. ౮౦౦

ద్వితీయ = రెండవది - ఉమావారిజనేత్ర = ఉమ యను కమలాక్షి - శిశిరగోత్రమున్ = హిమవత్పర్వతమును (చల్లనికొండను) - దేవతార్థమై = దేవకార్యమునిమిత్తమై, సేనాపతిజననమో - పరమదేవతార్చనార్థమో.

తాత్పర్యము.

ఆయిరువురిలో గంగ యనునామె పెద్దది - రెండవది యుమ. వా రిరువురు పెరుఁగుచుండుసమయంబున దేవతలు తమనిమిత్తమై హిమవంతునిఁ జేరి మహాత్మ! గంగను మూఁడుదారులఁ బ్రవహింపఁజేయుము. అందొకటి మా కిమ్మని మిక్కిలి వేఁడిరి.

చం॥ అడిగినవారియాసలను ♦ నాఅడిపుచ్చుఁగ రాదటన్న యా
నుడి మది నిల్పి యగ్రసుత ♦ నూల్కొని పుణ్యఁ ద్రిలోకపావనిన్
గడిమి యథేష్టగామిని జ♦గద్ధితముం ఘటియించు పొంటె న
ప్పుడ యొసఁగన్ గ్రహించి తమ♦భూముల కేగిరి వారు,ధన్యులై. ౮౦౧

అఅడిపుచ్చు = వ్యర్థపఱుచు - త్రిలోకపావనిన్ = మూఁడులోకములఁ బావనముచేయుదానిని - యథేష్టగామినిని = ఇష్టము కొలఁదిపోవుదానిని - జగత్ + హితము= లోకమునకుమేలు - ఘటియించుపొంటెన్=కూర్చుకొఱకు.

తాత్పర్యము.

దేహి యని యడిగినవారియాసను నాస్తి యని వ్యర్థపఱుపరాదను ధర్మమెఱిఁగినవాఁడౌటచే నది మది నంచుకొని హిమవంతుఁడు పుణ్యమై మూఁడు లోకములఁ బావనముచేయునదియై స్వేచ్ఛగాఁ జరించునది యగుటచే నాకాశమునఁ బోవఁగలది యగు గంగను వారి కప్పుడే యీయఁగా వా రామెను గ్రహించి తమలోకమునకుఁ బోయిరి.

ఉ॥ రెండవకూఁతురైన యుమ ♦ ప్రీలని యుగ్రతపంబుమై జగ
త్కాండము లెల్ల మ్రొక్కఁగను ♦ గ్రాలిన నప్రతిరూప శైలకో
దండున కిచ్చె భార్యగను, ♦ దాశరథీ! యిటు లోకపూజ్యలై
కొండలతేనియయ్యనుఁగు♦కూఁతులు భాసిలి రిద్ధకీర్తులై. ౮౦౨

ప్రీలని = చెడని - జగత్కాండములు = జగత్సమూహములు - అప్రతిరూప = అనుకూలుఁడైన - శైలకోదండునకు = శివునకు. త్రిపురాసుర సంహారమందు శివుఁడు మేరుపర్వతమును విల్లుగా ధరించెను. కావున నాయనకు శైలకోదండుఁ డనుపేరు గలిగెను. ఇద్ధకీర్తులై = ప్రసిద్ధమైన కీర్తిగలవారై. పార్వతి ఘోరమైనతపము చేయుచుండఁ దల్లి ఉ - మా వల దని చెప్పుటచే ఉమ యను పేరుగలిగెను.

తాత్పర్యము.

రెండవకూఁతురైన ఉమాదేవి ఘోరమైన తపమును ఆకులనైనను ఆహారముగఁ గొనక యపర్ణయై తపముచేయఁగా నామెను సమస్తలోకములచే మ్రొక్కఁబడుచుండు ననుకూలుఁడైన శివునకు భార్యగా నిచ్చెను. రామచంద్రా! యీ విధముగా నా పర్వతరాజుప్రియపుత్రిక లిరువురు కీర్తిమతులై ప్రకాశించిరి.

క॥ గతిమద్వర! తొలుదొల్తను, క్షితిధరవరతనయ గంగ ♦ కెరలుచును నభో
గత యైనవిధం బంతయు, నుతచరితా! నీకుఁ దెలియ♦నొడివితిఁ జుమ్మీ. ౮౦౩

గతిమద్వర = సుందరగమనము గలవారిలో శ్రేష్ఠుఁడా - క్షితిధరవర తనయ = పర్వతరాజు ప్రియపుత్త్రి, నభోగత = ఆకాశమునకుఁ బోయిన.

తాత్పర్యము.

సుందరగమనముగలవారిలో శ్రేష్ఠుఁడా! మొట్టమొదట పర్వతరాజుకూఁతురగు గంగ యేవిధముగ జనించి యాకాశమునకుఁ బోయెనో యదియంతయు నీకుఁ దెలియఁజెప్పితిని.

కం॥ ఈపర్వతవిభుసుత యే, పాపాపహ యగుచు నుదక♦వాహిని యై దే
　　వాపగ యై నాకంబుగ, బ్రాపించెను నాయక ! సుర♦ప్రార్థిత యై.　　౧౦౪

పాపాపహ = పాపములఁ బోఁగొట్టునది. ఉదకవాహినియై = జలప్రవాహమై - దేవాపగ = దేవతానదియై దేవతల ప్రార్థనము నంగీకరించి స్వర్గమును బొందెను.

గంగ విష్ణుపాదతీర్థము గావున దేవతలనుగూడఁ బవిత్త్రులను జేయునది.

—* { ౩౬ సర్గము. గంగ త్రిపథగయైనవృత్తాంతము శ్రీరామునకు విశ్వామిత్త్రుఁడు దెల్పుట. } *—

చం॥ అన విని రామలక్ష్మణులు ♦ హర్షసముత్సుకులై మహాత్మ! యీ
　　యనఘచరిత్ర దేవమను♦జావనిజాతము నెంతయు న్విన౯
　　గొనియెద మాస, మంచుమల♦కూఁతు రదేటికి మూఁడుత్రోవల౯
　　గొనె! నది యెట్లు కీర్తి గనె ♦ గొప్పగు నేఱుల మేలుబంతి యై?　　౧౦౫

హర్షసముత్సుకులై = సంతోషముతోఁ దమ కిష్టమైనవిషయముఁ దెలిసికొనఁగోరినవారై - దేవమనుజావనిజాతము = దేవలోకమందు - మనుష్యలోకమందు సంభవించినవిధము-ఎంతయు౯=మిక్కిలి విస్తరముగా. ఆస=ఆశ. మూఁడుత్రోవల౯=స్వర్గ-మర్త్య-పాతాళముల మార్గముల-మేలుబంతి=శ్రేష్ఠము. మేలుబంతి మానా అనఁగా పైపంక్తి యనియర్థము. బాలు రక్షరములు వ్రాయ నేర్చుకొనునపుడు మొదటిపంక్తి చక్కఁగా వ్రాయనేర్చినవారు వ్రాసి యీయక్షరములవలె మీరు వ్రాయుఁ డని చెప్పుదురు. ఆకారణముచేఁ దక్కినపంక్తులకంటె నది యుత్తమమై యుండును. ఇతరు లనుకరింపఁదగిన దని యర్థము.

గంగకు త్రిపథగ యనుపేరేల వచ్చె నని రామచంద్రుని ప్రశ్న. దానికిఁ బ్రత్యుత్తరముగ గంగ యాకాశమునకు - స్వర్గమునకుఁ బోయినవిధము చెప్పఁబడెను. మూఁడవమార్గ మెట్లను విషయ మీసర్గయందుఁ జెప్పఁబడును.

తాత్పర్యము.

గంగావృత్తాంతము పూర్ణముగ వినఁ గోరికఁగలవారై శ్రీరామలక్ష్మణులు మహాత్మా! పాపరహితురాలైన గంగ దేవలోకమందు మనుష్యలోకమం దెట్లు సంభవించెను? ఆమె కంతకర్తి వచ్చుటకు నేమికారణము? ఏకార్యము చేయుటచే నదులయం దుత్తమురా లయ్యెను?

క॥ అని రాకొమరులు వేఁడినఁ, గని వారల మౌనిమధ్య•గతగాధేయుం
డనియెను వినుఁడీ వినిచెద, ననఘాత్మకులార! గంగ•యావచ్చరితన్. ౭౦౬

రాకొమరులు = రాజకుమారులు - వేఁడినన్ = కోరఁగా - మౌనిమధ్యగతగాధేయుండు = మునులమధ్యనందు విశ్వామిత్రుఁడు - హారమున నాయకమణివలె - రెండుప్రక్కల నెదుట - వినిచెదన్ = వినిపించెదను - యావచ్చరితన్ = సంపూర్ణచరిత్రమును. అనఘాత్మకులారా! గంగచరిత్రమును విను కోరిక గలుగుటచేతనే మీరు పుణ్యాత్ముల రని తెలియుచున్నది - పాపాత్ముల కాబుద్ధి పుట్టదు.

తాత్పర్యము.

రాజకుమారు లీవిధముగఁ గోరఁగా ఋషులనడుమ నందు విశ్వామిత్రుఁడు గంగాచరిత్రమునంతయుఁ జెప్పెదను వినుఁడు.

ఉ॥ పూర్వము రామచంద్ర! నెల•పూతలదాలుపువేల్పు పెండ్లియై
పార్వతి నిండుహర్షమున • భావజకేళి కుపక్రమింప సౌ
పర్వశతాబ్దముల్ గడచెఁ, • బట్టి యొకండును బుట్టఁ డయ్యె, లో
పర్వినభీతి గుంపు లయి • బ్రహ్మయులోనగుబాసవాల్గముల్. ౭౦౭

నెలపూ = చంద్రుఁ డను పుష్పమును - తలదాల్పు = తలయందు ధరించిన వేల్పు=దేవత - శివుఁడు. భావజకేళికి = రతిక్రీడకు - సౌపర్వశతాబ్దముల్ = నూఱుదివ్యసంవత్సరములు - పట్టి = కుమారుఁడు- ఈశబ్దమునకు సరియైనది బిడ్డ - అపత్యము - ఇచ్చట మగబిడ్డ. బాసవాల్గముల్ = బాసవాల్ =మాటయే బాణముగాఁ గలదేవతల గుంపులు - గీర్వాణశబ్దార్థము గ్రహించునది.

తాత్పర్యము.

రామచంద్రా! పూర్వకాలమున శివుఁడు పార్వతిని బెండ్లియాడి యామెతో మిగుల సంతోషముతో నూఱుదివ్యసంవత్సరములు సంభోగించెను. కాని కుమారుఁడు కలుగఁడయ్యెను. రేతస్స్ఖలనము కాదయ్యెను. కావున నింతకాలమైనను రేతస్స్ఖలనము గాకయుండినచో నదియైనప్పు డెంతబలిష్ఠుఁడు పుత్త్రుఁ

డు పుట్టునో-వాఁ డెటువంటివాఁడగునో - వానిని సహించు టెట్లో యని దేవ తలు భయపడి దేవతలు గుంపు లయి బ్రహ్మదేవునితోడ నిటు లాలోచించిరి.

కం॥ వలిగుబ్బలిసుతకడుపునఁ, గలిగినచో భూత మొకఁడు ♦ గలఁడే యెవఁ డే
బలిమిని నోర్వ నటంచును, గలఁకను శితికంఠుఁ డాసి ♦ కలితాంజలు లై. ౮౦౦

వలిగుబ్బలిసుత = మంచుపర్వతముకూఁతురు - ఓర్వ౯ = యుద్ధమందు సహింపను - కలకను = మతివ్యాకులత్వముతో - శితికంఠు౯ = శివుని.

తా త్ప ర్య ము.

ఇన్ని సంవత్సరములు సంభోగించినను పార్వతియుఁ జలించినది కాదు. శివుఁడు విరమించినవాఁడు కాఁడు. ఇట్టివానికి నట్టియా మెకడుపునందుఁ గుమారుఁడు పుట్టెనేని వానినోర్వ నెవనికి శక్యము. అని వ్యాకులపడి శివుని సమీపించి చేతులు మోడ్చినవారై

తే॥ దేవదేవ మహాదేవ ♦ త్రిభువనైక,హితరతాత్మక దండంబు ♦ కృత్తివాస!
కనికరింపుము మాప్రొక్కులను గ్రహించి,జగము లోపవునీదు తేజంబు మోవ.
౮౦౯

త్రిభువనైకహితరతాత్మక = మూఁడులోకములకు మేలే చేయుటయందుఁ బ్రీతిగలమనస్సుగలవాఁడా - ఇట్లనుటచే లోకహానికరకార్యము నీవు చేయరాదు. నీ విప్పుడు చేయునది యట్టిదయున్న దని భావము కృత్తివాస=చర్మమును వస్త్రముగా ధరించినవాఁడా - తేజస్సు = కాంతి - తేజ శ్శబ్దమునకు శుక్లమనియు నర్థము గలదు - "తేజః పరాక్రమే ప్రాణే వర్చ స్యగ్నిపి రేతసి"-రత్నమాల.

తా త్ప ర్య ము

దేవతలకు దేవతవైనవాఁడ వగుటచే మహాదేవా! ముల్లోకములకు మేలు చేయుకోరికగలవాఁడా! చర్మధరా! నమస్కారంబు. మా ప్రొక్కులను గ్రహించి మాయందనుగ్రహింపుము. నీ తేజస్సువలనఁ గలుగుకుమారుని లోకములన్నియైన భరింపఁజాలవు.

ఉ॥ దేవియు నీవు వేదహిత♦తీవ్రతపశ్చరణైకశీలత౯
భావజవైరి క్రాలుఁడు, ప్ర♦భాభరితం బగు నీదు తేజము౯
నీవ ధరింపుమీా, జగము ♦ నిశ్చలహర్షమునం జెలంగఁగాఁ
గావుము దేవ! లోకము ల♦కాండలయంబునఁ గూల్పఁబోకుమీా. ౮౧౦

దేవియు = పార్వతిదేవియు - వేదహిత = వేదోక్తమై లోకహితమై. తీవ్రతపశ్చరణైకశీలత౯ = ఘోరమైనతపస్సుచేయుటయే ముఖ్యస్వభావముగాఁ గలవాఁడవై - దేవియు నీవు = నీభార్యయైనపార్వతియు నీవు - క్రాలుఁడు =

ఉండుఁడు - తేజమ్ముఁ = రేతస్సును - నీవ = నీవే - పార్వతియందు విడువక నీ తేజోమయశరీరమందు - ధరింపుమీ = ఉంచుకొనుము - నిశ్చలహర్షమునన్ = చలనములేని సంతోషముతో - అకాండలయంబు = అకాలప్రళయమున - భావజవైరి = నీవు మదనునిజయించినవాఁడవయ్యు మరల మదనపరవశుఁడవై యిట్టికార్యము చేయుట నీకుఁ దగదుసుమా యని భావము.

తాత్పర్యము.

మన్మథవిరోధీ! పార్వతియు నీవు వేదోక్తమైన ఘోరతపమును సలుపుఁడు కాంతిపూరితమైన నీ రేతస్సును పార్వతియందు విడువక నీవ యుంచుకొమ్ము. అటులైన లోకములు చలనములేని సంతోషముగలవగును. దేవా! లోకమునకు నకాలప్రళయము కల్పింపక రక్షింపుము [ఇది మహామైథునమని హాముకయందుఁ జెప్పఁబడినది. పంచమకారులైన శాక్తేయుల కిది (మద్యము మాంసము మత్స్యము, ముద్ర, మైథునము - ఇవి పంచమకారములు ఇవియే వారికి పంచతత్త్వములు.) పరమపవిత్రవ్రతముగా నుండును.]

చం॥ అని కొనియాడు వేలుపుల నాదటఁ దాఁ దిలకించి శంకరుం
డనియె సుపర్వులార! యటు లౌత, ధరింతుము మేమ వీర్యముల్
జనములు నిర్జరుల్ సుఖసంపద వర్తిలుచుండ్రుగాక, యే
యనఘుఁడు మోచుఁ జెప్పుఁడు మహత్తరతేజము జాతి నంతటన్. ౧౧౧

కొనియాడువేలుపులన్ = పొగడుచున్న దేవతలను - ఆదటన్ = ప్రీతితో. తిలకించి = చూచి - అటులౌతన్ = మీరుచెప్పినట్లే కానిండు మేమ = మేమే - అనఁగా నేను నా భార్యయు. వీర్యముల్ = నేను రేతస్సును - నా భార్య శోణితమును. ధరింతుము = వెలుపల విడువము. నాభార్యగర్భంబున నీ రెండుఁ గలియనీయ మని భావము. స్త్రీగర్భంబున నివి రెండు కలిసినఁగదా పిండోత్పత్తి. నిర్జరుల్ = దేవతలు.

తాత్పర్యము.

అని యిట్లు స్తోత్రముచేయు దేవతలను శివుఁడు ప్రేమముతోఁ జూచి దేవతలారా! మీరు చెప్పినట్లే చేసెదము. నేను వీర్యమును - పార్వతి శోణితమును మాయందే ధరించెదము. అనఁగా నీ రెండు కలియనీయము. వేఱువేఱుగా నుంచెదము. మనుష్యులు దేవతలు సుఖముగా నుండనిండు.

నా రేతస్సును పార్వతియందు విడువనుగాని వెలుపలకు రాక తప్పదుగదా! అప్పుడు దాని ధరింపఁగలవాఁ డెవఁడు?

ఉ॥ గారవ మార నిట్లు కళ•కంఠుఁడు పల్కిన దేవతాళి యీ
ధారిణి నీదు తేజు చలి•తం బయినన్ ధరియించు నా భవా
నీరమణుండు పోవిడువ • నిండె సకాననపర్వతంబుగా
ధారణి యీశు తేజమున • దానికి బెగ్గిలి దేవసంఘముల్. ౮౧౨

గారవమారన్ = గౌరవ మతిశయిల్లఁగా - కళకంఠుఁడు = గరళకంఠుఁడు- గరకంఠశబ్దభవము కళకంఠుఁడు - గ్రామ్యపద మని చిన్నయ్యసూరిగారు వ్రాసిరి గాని యట్లుగా దని తద్భవపద మని సీతారామాచార్యులవారు వ్రాసిరి. భవా నీరమణుఁడు= శివుఁడు - సకాననపర్వతంబుగన్ = అడవులతోఁ బర్వతముల తోడ - బెగ్గిలి=భయపడి

తా త్ప ర్య ము .

గౌరవ మతిశయించునట్లు శివుఁ డిట్లు పలుకఁగా నీ తేజము జారెనేని యీ భూదేవి దానిని ధరించు నని దేవతలు చెప్పిరి అంతట శివుఁడు దానిని వెలుపల వదలెను. అదియును నడవులు కొండలతోడ భూమియంతయు వ్యాపించెను. అది వ్యాపించువిధము చూచి దేవతలు భయపడిరి.

చం॥ హుతవహుఁ జూచి యి ట్లనిరి • నోపుదు వీవ మహాత్మ పూనఁగాఁ
గ్రతుహరు తేజు నెయ్యుఁ డగు•గాడ్పును గూడి య టన్న వల్లె యం
చతఁ డది చొచ్చె దాన నది • యాచు సితాచలరీతి లోకస
మ్మతదిననాథపావక స•మగ్రవిభావిభవాభిరామ మై. ౮౧3

హుతవహున్ = అగ్నిహోత్రుని - ఓపుదువు = శక్తిగలవాఁడ వగుదువు క్రతుహరు తేజున్ = దక్షునియజ్ఞము ధ్వంసముచేసిన శివుని తేజమును - నెయ్యుఁడు = మిత్రుఁడు - వల్లె = సరి - సితాచలరీతి = తెల్లనికొండవలె - హిమవంతమువలె - లోకసమ్మత = జనులకు సమ్మతమైన, దిననాథ = సూర్యునియొక్కయు - పావక = అగ్నియొక్కయు - సమగ్రవిభా = సంపూర్ణకాంతియొక్క విభవ = సంపదచే- అభిరామమై = మనోహరమై.

తా త్ప ర్య ము .

ఆవల వారు అగ్నిహోత్రునిఁ జూచి అగ్నిదేవా! యీశివతేజస్సును భూమి భరింపఁజాలకున్నది. నీవు వాయుదేవునితోఁగూడి భరింపఁగలవు. కావున నీ వాకార్యమునకుఁ బూనకొమ్మనఁగా నాయన దానియందుఁ బ్రవేశించెను. ఆకారణమున నది పెద్ద మంచుఁగొండవలె నయ్యెను. అది సూర్యాగ్నుల సంపూర్ణకాంతిచే మనోహరమై లోకసమ్మతమయ్యెను.

తే॥ శరవణం బయ్యె నద్దాన♦జననమంది, యనలసుతుఁ డయ్యెఁగార్తికే♦యప్రభుండు
దానిఁగని వేల్పులెల్ల ని♦తాంతముదిత,హృదయులై పూజ సలిపిరి ♦ యీశుగౌరి. ౮౧౪

శరవణము=శర + వనము - రెల్లువనము. "ప్రనిరంతశ్శరేణీతి ణత్వం." అనలసుతుఁడు = అగ్నిహోత్రుని కుమారుఁడు - కార్తికేయప్రభుండు = కృత్తికలపుత్రుఁడైన ప్రభువు - దానిఁ = ఆ కుమారస్వామిని - నితాంతముదిత హృదయులై = మిక్కిలి సంతోషించిన మనస్సుగలవారై.

తాత్పర్యము.

కాలక్రమమున నది శరవణ మయ్యెను. దానియందుఁ బుట్టినవాఁ డగుటచేఁ గుమారస్వామి అగ్నిపుత్త్రుఁడయ్యెను. ఆయనయే కృత్తికలపుత్త్రుఁడై కార్తికేయుఁడయ్యెను. కొందఱిది జుగుప్సాకర మని వ్రాసియున్నారు వారి కెటులైన నుండునుగాక! ఇందాలోచింపవలసినవిషయములు కొన్ని గలవు. పండ్రెండుసంవత్సరముల బాలబ్రహ్మచారులకు విశ్వామిత్త్రునంతటివాఁ డింతపచ్చిగా దీని నిట్లు వివరించి చెప్పవలయునా? తేలికగాఁ బోనిచ్చియుండరాదా? ఇట్లు చెప్పుటలో నాయనయుద్దేశ మేమి? రేతస్ఖలనము చెప్పుటచే శివుఁడు ప్రాకృతవర్గములోఁ జేరుచున్నాఁడు. శివుఁడు దేవుఁడు కాఁడనుటకు వైష్ణవులు చేయు గొప్ప యాక్షేప మిదియే. ఆ యాక్షేపమునకుఁ దగిన సమాధాన మింతవఱకు నెవరు చెప్పినట్టు లేదు ఈవ్యాఖ్యాత యభిప్రాయమున నిందు గొప్పయోగరహస్య మున్నది. దానిని బూర్తిగా వివరించి చెప్పునంతటి సామర్థ్యము లేదు. ఇందు భార్యాభర్తల కిరువుర కెన్నిదినములకు రేతస్ఖలనము కాలే దని చెప్పఁబడినది. ఒక సంవత్సరము మాత్రమైనను జక్కఁగఁ బ్రాణాయామ మభ్యసించి యొకముద్రయం దున్నవారై భార్యాభర్తలు సంభోగించిరేని యా ముద్రయం దున్నంతకాలము రేతస్సు రజస్సు స్ఖలనము గాదు. ఇది యోగమున సుప్రసిద్ధ విషయమే. ఒకరుమాత్రము సాధించి రెండవవా రాముద్ర తెలియనివారైరేని తెలియనివారికిఁ బ్రాణగొడ్డ మగును. తెలిసినవారును దృష్టిలేక సంకటపడుదురు. అప్పుడు దేవతలు శివుని పార్వతిని పొగడిరి.

—* పార్వతీదేవి దేవతల శపించుట *—

తే॥ వడఁకుగుబ్బలిగారాబుఁ♦బట్టి యంతఁ, గంటుగొని కింక నా తెలి♦గంటిగముల
గెంటసము లాడె నో వేల్పుఁ♦గుంటలార, యనుభవింపుఁడుమీచేయు♦నఘ
ఫలంబు. ౮౧౫

వడకుగుబ్బలి గారాబుపట్టి = చలిపర్వతముయొక్క ప్రియమైన బిడ్డ- కింకన్ = కోపముచే - కంటుగొని = విరోధించి - తెలిగంటిగములన్ = దేవతా

సమూహములను - రెంటసములు = పరుషవాక్యములు - అఘఫలంబు = పాపముయొక్క ఫలము.

తాత్పర్యము.

చలిమలకూఁతుఱైన పార్వతి దేవతలపై పగఁబూని కోపించి యోదేవతలారా! మీరుచేసిన పాపఫల మనుభవింపుఁ డని నిష్ఠురము లాడెను.

చం॥ అని కనుఁగొనలందుఁ గన♦లంతకు నంతకు మీఱ వారలం
గని తనదోయిటన్ జలముఁ♦ గైకొని మత్తనయాభిలాషవి
ఘ్ననిహతి నొందఁ జేసితిరి ♦ గావున నోసురలార! మీకు మీ
వనితలు బిడ్డలం గనరు, ♦ వారలికన్ మనువారు గొడ్డులై　౨౧౬

వారుచేసినపాపము దానిఫలము చెప్పఁబడుచున్నది. - కనుఁగొనలందు = కన్నులకొనలయందు- కనలు = కోపము- అనగా కన్నులెఱ్ఱఁగా. దోయిటన్= అంజలియందు- మత్తనయాభిలాషన్ = కుమారునిగనవలయు నని నాకుఁగల కోరికను - విఘ్ననిహతిన్ = విఘ్నముచేఁ జెడినదానిఁగా

తాత్పర్యము.

అని కనుఁగొనలందుఁ గెంపువాఱుచుండఁగా వారినిఁ జూచి తనదోసిట నీళ్లు తీసికొని 'నాకుఁ గొడుకుఁ గనవలయు నని యుండినకోరికను విఘ్నపఱిచితిరి గావున మీకు మీస్త్రీలు బిడ్డలఁ గనరు. వారు గొడ్డులై యుందురు' అనఁగా దేవతాస్త్రీలకు దేవతలవలన బిడ్డలు గలుగరు. కావుననే మేనక యూర్వశి మొదలగువారు మనుష్యులకు భార్యలై బిడ్డలఁ గనిరి. ఈశాపము సామాన్యమైన యప్సరసల కన్వయించునో యన్వయింపదో - వారెవరి భార్యలు గాదుగదా!

చం॥ అని శపియించి, భూమిఁ గని ♦ యాఁకర మూఁపక యోసి పాంసులా!
మనుమ యనేకభార్య వయి ♦ మాఁకనైకవిధస్వరూప వై
తనయుఁడు నాకుఁ గల్గుటకుఁ ♦ దాలిమి నోరువ నైతి గాన నీ
కును లభియింప కుండెడిని ♦ గూరిమిపుత్త్రులఁ గాంచు మోదముల్　౨౧౭

ఆఁకరము = కోపము - ఆగ్రహము, పాంసులా = పాపాత్మురాలా! దుష్టురాలా, మనుము = జీవింపుము, అనేకభార్యవై = అనేకులకు భార్యవై. రాజులందఱు భూభర్తలేకదా! నైకవిధస్వరూపవై = అనేకవిధములయిన రూపములుగలదానవై, మోదముల్ = సంతోషములు, న + ఏక = నైకము.

తాత్పర్యము.

ఆవల భూమినిఁ గని కోపించి యోసి పాంసులా! నేను బిడ్డలఁ గనుట చూ పోపవైతివి. కావున నీవు అనేకులకు భార్యవై అనేకరూపములుగలదానవై

యుండువుగాక! నీవును ప్రీతితో బిడ్డలఁ గను సంతోషము లేకపోవునుగాక - అని శపించెను. భూపుత్రి - సీత - నరకాసురుఁడు - వీరు భూపుత్రులైనను రేతస్సువలన గర్భము ధరించి కనుసుఖము భూమికిఁ గలిగించినవారు కారు.

చ॥ అని గిరిరాజనందన య♦హంకృతిరోషపరీత యై శపిం ♦
చినఁ బెనసిబ్బితిం గలలు ♦ జేజెలు వాంచిన వారిదుఃఖముఁ
గనఁగోకలేక శంకరుఁడు ♦ గౌరిని గూడి ప్రతీచి కేగి ని
ష్ఠను దప ముండె భూరిహిమ♦శైలవరోత్తరశృంగసీమపై. ౨౫

గిరిరాజనందన = పార్వతి - అహంకృతిరోషపరీతయై = అహంకారము చేతను రోషముచేతను గప్పఁబడినదై - పెనసిబ్బితిన్ = మిక్కిలి సిగ్గుచే - తమ భార్యలితరులకు బిడ్డలు గనువారుగా నైరిగదా యని సిగ్గు. జేజెలు = దేవతలు - రూ - జేజేలు. ప్రతీచి = పడమర - భూరి = గొప్పదగు - హిమశైలవర = పర్వతశ్రేష్ఠములందు శ్రేష్ఠమగు హిమవత్పర్వతముయొక్క - ఉత్తర శృంగసీమపై = ఉత్తరపువైపుననుండు శిఖరప్రదేశమునందు.

తాత్పర్యము.

అని పార్వతీదేవి యహంకారరోషములతో శపింపఁగా దేవతలు సిగ్గుచేఁ దలలు వంచుకొని దుఃఖించిరి. వారి దుఃఖము చూడలేక శివుఁడు పార్వతితోడ హిమవత్పర్వతము నుత్తరశిఖరమునకుఁ దపస్సు చేయఁబోయెను.

గంగావిషయమైన రామచంద్రమూర్తిప్రశ్నకుఁ బార్వతీచరిత్ర మేల చెప్పవలసివచ్చె నని సందేహింపరాదు. ముందు చెప్పఁబోవుకథకుఁ బార్వతికి సంబంధము కలదు. కావునఁ జెప్పవలసివచ్చెను.

కం॥ ఎఱిఁగించితిఁ గఱకంఠుని, తెఱవచరిత్రంబు నెల్లఁ ♦ దెలియఁగ మీకున్
దెఱఁ గొప్పఁగ గంగ తెఱం, గెఱిఁగించెద వినుఁడు తమ్ముఁ♦డీవును వేడ్కన్. ౨౬

కఱకంఠుఁడు = శివుఁడు.

తాత్పర్యము.

పార్వతిచరిత్రము మీకుఁ దెలిపితిని. ఇఁక గంగచరిత్రము చెప్పెద వినుఁడు.

—* ౩౭ సర్గము. కుమారస్వామి జననచరిత్రము *—

ఉ॥ తొల్లి పినాకపాణి యతి♦దుర్భరఘోరతపం బొనర్పఁగా
నెల్లఋషీశ్వరుల్ దివిజు ♦ లేగి పితామహుఁ గాంచి భారతీ
వల్లభ! మాకు నొక్కదళ♦వాయి నొసంగితి వాశివుండు దాఁ
జల్లనిగుంటిపైఁ దపముఁ ♦ జల్పఁగఁ జొచ్చె నుమాసమేతుఁడై. ౧౨౦

పినాకపాణి = పినాక మను పేరుగల వింటిని చేతియందుఁగలవాఁడు- శివుఁడు. అతిదుర్భరఘోరతపంబు=మిక్కిలి యతిశయమైన తీవ్రతపమును. భారతీవల్లభ= సరస్వతీదేవికి భర్తయైనవాఁడా! దళవాయి=సేనానాయకుఁడు. చల్లనిగుంటి= చల్లనికొండ - హిమవత్పర్వతము. ఉమాసమేతుఁడై = పార్వతీదేవితోఁ గూడినవాఁడై.

తా త్ప ర్య ము.

మీఁద వివరించినట్లు శివుఁడు పార్వతితోడఁ దపస్సుచేయ హిమవంతము నకుఁ బోఁగా దేవతలందఱు ఋషీశ్వరులు బ్రహ్మయొద్దకుఁబోయి వాణీశా! పూర్వము మాకు సేనానాయకునిఁగా శివు నిచ్చితివి ఆయన యిప్పు డాకృత్యము మాని తపస్సుచేయ హిమవంతమునకుఁ బోయెను.

ఉ॥ ఆనల నేమి చేయఁదగు ♦ నయ్య జగంబులమేలుకోరి వా
ణీవర! మాకు నేడుగడ ♦ నీవ కదయ్య, యథోచితంబు సం
భావన సేయవయ్య, యని ♦ ప్రార్థన చేయఁగ వారిఁ జూచి బ్రా
హ్మీవిభుఁ డూఱడించుచును ♦ మెలగు తేనియ లొల్కుపల్కులన్. ౮-౨౧

ఏడుగడ=రక్షకుఁడు - కం. గురుఁడును దల్లియుఁ దండ్రియుఁ । బురుషుఁడు విద్యయును దైవమును దాతయు నాఁ । బొరి నేడుగడయుఁ దానై । హరి నను రక్షించుఁగాక యనవరతంబున్ వాసి. ౧ ఆ. పురుషుఁడనఁగా భర్త. ఏడు విధముల దిక్కయినవాఁడు ఏడుగడ. బ్రాహ్మీవిభుఁడు=సరస్వతిమగఁడు.

తా త్ప ర్య ము.

ఇప్పుడు జగత్తును రక్షించుటక్కై ప్రజలమేలుకోరి మేము చేయఁదగిన దేమి? రాక్షసులా జగమును మమ్మును బిడించువారు. వారితోడ దినదినము పోరే. యుద్ధముచేయుటకుఁ దగిన బలవంతుఁడు సేనానాయకుఁడు లేకుండిన మేమేమి చేయఁగలవారము? పార్వతిశాపమున కేడుతుమా? రాక్షసులతన్నుల కేడు తుమా? కావున నుచితకార్య మేదో యాలోచింపుము - అని ప్రార్థింపఁగా బ్రహ్మ దేవుఁడు తియ్యనిమాటల వారి సమాధానపఱిచి యిట్లనెను.

చ॥ వలిమలపట్టిశాపవిధి ♦ వాస్తవ, మయ్యది తప్ప దెప్పుడున్
గలుగదు మీకు సంతు నిజ♦కాంతలయం దది యుండె నిండు, నే
ల్పులమొగ మెక్కనిం దనయుఁ ♦ బుట్టఁగఁ జేయును గంగయందు, న
య్యలఘుపరాక్రముండు పృత♦నాధిపుఁడై మిముఁ గాచుచుండెడిన్. ౮-౨౨

వలిమలపట్టి = మంచుఁగొండబిడ్డ - పార్వతి. సంతు = సంతానము. నిజ కాంతలయందు = మీమీభార్యలయందు. వేల్పులమొగము = అగ్ని

హోత్రుఁడు. అగ్ని ముఖావై దేవా యని ప్రమాణము. మనుష్యుల నోర నన్న ముపెట్టుకొన దేహమున వ్యాపించునట్లు దేవతలకుముఖ మగ్ని కావున నాయ నయందు హోమముచేసిన దేవతలు గ్రహింతురు. పృతనాధిపుఁడై = సేనా నాయకుఁడై.

తాత్పర్యము.

దేవతలారా! పార్వతిశాపము దప్పునదికాదు. అది యథార్థమే యగును. దానికి మీ రిప్పుడు వగచి ప్రయోజనములేదు. మీ భార్యలందు మీకు సంతా నము లేదు. కాఁబట్టి యది యట్లుండ నిండు. సేనానాయకుఁడు లేఁ డంటిరి. గంగయందు నగ్నిహోత్రున కొకకుమారుఁడు గలుగఁగలఁడు. వాఁడు సేనా నాయకుఁడై మిమ్ము రక్షించును.

ఉ॥ గంగయు గారవించుఁ బెన•గాదిలిపుత్త్రుఁడు గాఁగ నా తనిన్
రంగుగ సమ్మతించు గిరి•రాజకుమారియు, సందియంబు నా
స్త్యం గనకుండుఁ డంచన వి•ధాతను సంస్తుతిఁ డన్పి దేవతల్
చంగున వెండికొండకును • బోగి కృశానునిఁ జూచి ప్రీతులై. ౮౨౩

గాదిలిపుత్త్రుఁడు = ప్రియకుమారుఁడు. తనకిష్టములేని కార్యముచేసెనని భూమిపైఁ గోపించుచు పార్వతి గంగపైఁ గోపింపదా యనిన నామె తనయక్క యాటచే నాకుమారుఁడై ననేమి నాయక్కకుమారుఁడై ననేమి యని యూర కుండును.

తాత్పర్యము.

గంగాదేవి యతనిని దనపుత్త్రుఁడని గారవించును. పార్వతీదేవియు నట్లులే తనకుమారుఁడని యంగీకరించును - సందేహములేదు. అనిన వారలు బ్రహ్మను స్తుతించి కైలాసమునకుఁబోయి యగ్ని దేవునిఁజూచి సంతోషించినవారై.

క॥ విశ్వావసులోలాత్మక, వైశ్వానర పడయఁ దివుస • వరఁలు సుతునిన్
విశ్వజనీనం బిది నీ,యీశ్వర తేజంబు విడువు•మీ సురిటెటినిన్. ౮౨౪

విశ్వావసలోలాత్మక = ప్రపంచమును రక్షించునాసక్తగలవాఁడా. వైశ్వా నర = విశ్వానరుఁడను ఋషికుమారుఁడు వైశ్వానరుఁడు - అగ్నిహోత్రుఁడు- విశ్వజనీనంబు = ప్రపంచంబునకు హితమైనది.

తాత్పర్యము.

ప్రపంచరక్షణమం దాసక్తిగల యగ్ని దేవా! నీవుధరించిన యీశ్వరు తేజం బును గంగయందు విడిచి కుమారునిఁ గనుము. లోకజనులకెల్ల నిది హితమైన కార్యము.

మ॥ అని ప్రార్థించినఁ బావకుండు సితశై ♦ లాధ్యక్షుజఁ జాయఁగాఁ
జన నాగంగయు సమ్మతించి సతియై ♦ సౌందర్యసంపత్తిమైఁ
జనుదేరన్ సకలాంగకంబులను దే ♦ జఃపాతముం జేయ స్వ
ర్ధునిపూరంబు సమస్తముం బరఁగె నెంతో తేజునన్, గంగయున్. ౮_౨౫

పావకుండు = అగ్ని - సితశైలాధ్యక్షుజన్ = గంగను - జాయఁగన్ = సమీపింపఁగా - సకలాంగకంబులను = అన్ని యవయవములనుండి - తేజఃపాతమున్ = తేజస్సుపడునట్లు దీనివలన నిది మనుష్యభార్యాభర్తలు కలిసినట్లుగా గని యేర్పడుచున్నది వాస్తవముఁ బురుషదేహమునందు రేతస్సాకస్థలమందే కాదుండునది. దేహమందంతయు వ్యాపించియుండును. అవయవములనుండి యనుటచే నీయర్థమే గ్రహింపవలయును. స్వర్ధునిపూరంబు=గంగానదియొక్క ప్రవాహము - తేజునన్ = ప్రకాశముచే

తాత్పర్యము.

అని వేడఁగా నగ్ని దేవుఁడు సమ్మతించి గంగను సమీపించెను. ఆమెయు నంగీకరించి సౌందర్యవంతమైన రూపము ధరించి రాఁగా నగ్నిహోత్రుఁడు తన సర్వావయవములనుండి తనయందున్న తేజస్సు విడిచెను. దానిచే గంగా ప్రవాహమంతయు మిగుల తేజస్సుచేఁ బ్రకాశించెను.

ఉ॥ దుస్సహమయ్యె నోప నిఁక ♦ దుర్భరమా భవదీయ తేజమున్
ద్రెస్సెడి నంగకంబు లివె ♦ దీనతఁ జెందితి దగ్ధనైతి నం
చుస్సురు మంచు నున్నఁ గని ♦ నొయ్యనఁ గొమ్ములవేల్పు భగ్నరం
హస్సురవాహినిం గని సఁయఁబునఁ బల్కెను గార్యవేదియై. ౮_౨౬

దుస్సహము = సహింపరానిది - దుర్భరము = భరింపరానిది - త్రెస్సెడిన్ = చీలిపోవుచున్నది - కొమ్ములవేల్పు=అగ్నిహోత్రుఁడు - “చత్వారిశృంగ” అని ప్రమాణము - భగ్నరంహస్—చెడినవేగముగల - సురవాహినిన్ = గంగను (దేవనదిని) కార్యవేది= మగఁగల కార్యము తెలిసినవాఁడు.

తాత్పర్యము.

గంగాదేవి యగ్నిహోత్రునితో దేవా! నే నీగర్భవేగ మ సహింపలేను. నీ తేజస్సు భరింపరాక యున్నది. అవయవములు దుర్బలములై తెగిపోవుచున్నవి. దేహమా! మండిపోవుచున్నది. అని యుస్సు రని నిట్టూర్చుచు దీలుపడిన గంగను జూచి యగ్నిహోత్రుఁడు రాఁగల కార్య మాలోచించి యిట్లనెను.

కం॥ హైమగిరిపాదతలమున, హైమవతీ! విడువు గర్భ ♦ మన నాసతియుఁ
బ్రేమంబున నటు చేయఁగ, హేమము రజతంబు నయ్యె ♦ సిల యచ్చోటన్. ౮౨౭

హైమగిరి=మంచుఁగొండయొక్క - పాదతలమునన్= క్రిందిప్రదేశమునందు-
తేజము-అగ్నిచే దగ్ధమై శ్వేతపర్వతమువలె నుండుదానిని.

తాత్పర్యము.

గంగా! నీవు నీగర్భమును హిమవంతము క్రిందిభాగమున నేలయందు విడువు
మని చెప్పఁగా ఆమెయును నాప్రకారమే శుక్లశోణితముల విడిచెను ఆప్రదేశ
ము బంగారు వెండి యయ్యెను శివరేతస్సు పాదరస మందురు. రసవాదులు
పాదరసమునుండి వెండి బంగారు చేయుదురు. ఈ ఘట్టమునందా ప్రక్రియ
గుప్తముగాఁ జెప్పఁబడినది. తొలుత భూస్థాపనము, ఆవల నగ్నిపుటము, ఆవల
నీళ్ళలో వేయుట లోనైనవి యాక్రియాంగములు. 'నాగరసగంధకం - హేమరస
మర్దనమ్ బాలరవిచుంబనం - హేమకరో హేమకరో.' అని బంగారుచేసెడి
విధము. ఈ శ్లోకమునకు సరియైన యర్థము తెలియక రసవాదు లనేకులు
చెడిరి.

ఉ॥ తక్కటిక్షారభాగములు ♦ తామ్రము నల్లనియిస్సు నయ్యె, న
య్యెక్కడ సీసముం దగర ♦ మేర్పడె నక్కడ, నద్ది పాఱునా
యిక్కలఁ బెక్కుధాతువులు ♦ వృద్ధి గనెన్, మఱి గర్భ మేయెడ
నక్కఁగ నిల్పె నాశరవ♦ణంబు నశైలము మించె హైమమై. ౮౨౮

తక్కటి = మిగిలిన - ప్రత్యక్షముగా తేజస్సుగల యవి - భూమిభాగములు -
క్షారము = దానితీక్ష్ణముచేఁ గాలి బూదియైన భాగములు - తామ్రము = రాగి -
మస్టు = మలినము - శరవణంబు = తెల్లువనము - హైమమై = బంగారై.

తాత్పర్యము.

దాని వేడిమికిఁ గాలి బూదియైన ప్రదేశము రాగి యినుమయ్యెను. మస్టునిలి
చినచోటు సీసము తగరమయ్యెను. ఇంతియగాక యది ప్రవహించిన చోట
ననేకధాతువు లేర్పడెను. ప్రత్యక్షముగా గర్భ మెక్కడ నిలిచెనో యాతెల్లు
వనము బంగారుమయ మయ్యెను. దీనివలన నన్నిలోహములు పాదరసము నుం
డియే యుత్పత్తికాఁగలవని తెలిసెడిని పూర్వులు రహస్యవిషయములు తెలిపెడి
మార్గమిదియే. ప్రత్యక్షముగాఁ జెప్పరు.

తే॥ అచటివృక్షులతాగుల్మ♦యవసములును, హాటకం బయ్యె నదిమొద♦లగ్నితుల్య
కాంతిసంపద వహియించి ♦ కనక మనఘ, జాతరూప సమాఖ్యఁ బ్ర♦శస్తిఁ గాంచె. ౮౨౯

వృక్ష - లతా - గుల్మ - యవసములును = చెట్లు తీఁగలు పొదలు పచ్చగడ్డియును. హాటకము = బంగారు, అగ్నితుల్యకాంతి = అగ్నితో సమానమైన కాంతి, కనకము = బంగారు, జతరూపసమాఖ్య = జాతరూపమను పేరు, జాతరూపము = శ్రేష్ఠమైన రూపముగలది.

తాత్పర్యము.

అది వ్యాపించినచోట నుండిన చెట్లు - తీఁగలు - పొదలు - పచ్చిక కూడ బంగారయ్యెను. అది మొదలు బంగారు అగ్నివర్ణమును ధరించుటచే జాతరూపమనుపేరు కలదయ్యెను.

—* శ్రీకుమారస్వామి జననము *—

సీ॥ అందు జనించిన♦నందను గనుఁగొని, బృందారకులును బు♦రందరుండు
నందించి స్తన్య మీ♦యం దగఁ బెరేఁప, నంగఁ గృత్తికా♦సుంకరుఁ ను
డెందంబులను బొంగి ♦ నందనుఁగా మాకు, నొందింతురే నీయ♦కొందు మనిన
సందేహమేల యీ♦కందు జగంబుల,యం దెల్లఁ గృత్తికా♦నందనుఁ డనఁ
తే॥ గార్తికేయుఁ డనంగను ♦ గాంచుఁ గీర్తి, ననిన వారలు హర్షించి ♦ యక్కుమారు
బోరుకాడించి చన్నిచ్చి♦పాలఁతులెల్లఁ, బుత్త్రుఁడంచును భావించి♦పొలుపుగనిరి. ౮౫౦

పెరరేపఁగ = ప్రేరేపింపఁగా - స్తన్యము = చనుఁబాలు - ఈయకొందుము = అంగీకరింతుము - కందు = శిశువు - బోరుకాడించి = స్నానముచేయించి

తాత్పర్యము.

ఆశరవణమందుఁబుట్టిన కుమారునిఁ జూచి యింద్రుఁడు మొదలైన దేవతలాయన తమకు సేనాపతి యగు నని బ్రహ్మచెప్పిన కారణమున బాలునికిఁ జనుఁ బాలిచ్చుటకుఁగాను కృత్తిక లను స్త్రీలను ప్రేరింపఁగా వారు మనస్సులందు సంతోషమున నుప్పొంగి 'దేవతలారా! మీ రీయనను మాకుఁ గొడుకుఁగా నంగీకరించితిరేని మీరు కోరినట్లు చేయుదు' మనిన వారు దానికి సమ్మతించి యీ బాలుఁడు మీ పేర కృత్తికానందనుఁడని కార్తికేయుఁడని పేరొందుననిరి. వారును సంతోషించి యీ బాలునికి నీళ్లుపోసి చన్నిచ్చి యీ యార్వురుస్త్రీలు తమ బిడ్డ యనియే భావించిరి

కం॥ గర్భపరిస్రవమున బ్రా,దుర్భావము నొందెఁ గానఁ ♦ దొరంబుగ నీ
యర్భకునకు స్కందుఁడనఁ,స్వర్భూభువనములఁ బేరు♦ చనునని రమరుల్. ౮౫౧

గర్భపరిస్రవమునన్ = గర్భము జాఱుటచే - ప్రాదుర్భావము = పుట్టుక - అర్భకునకున్ = బాలునకు - స్వర్భూభువనములన్ = స్వర్గలోకమందు భూలోకమందు,

తా త్ప ర్య ము.

గర్భము జాఱుటచేఁ బుట్టినవాఁడు కావున నీబాలునకు స్కందుఁడనుపేరు తగునని దేవత లాపేరే పెట్టిరి. మనుష్యులు దేవత లాపేరనే యాయనను బిలిచిరి.

కం॥ జాఱఁగఁ జన్నుల దుగ్ధము, లాఱుగురుం గృత్తికలును ♦ నటు గదిసిఁ దా
నాఱు మొగంబులఁ గైకొని, పోఁడుపాల్ద్రావియొక్క ♦ పూఁటన వెలిఁగెన్. ౮-3౨

దుగ్ధము = పాలు - పోఁడు = బాలుఁడు.

తా త్ప ర్య ము.

నేను ముందు పాలిచ్చెద ననిన నేను ముందు పాలిచ్చెద నని కృత్తిక లాఱుగురు నొక్కసారి రాఁగా నా బాలుఁడు ఆఱుముఖంబులు ధరించి యార్వురచను బాలున నొక్కసారిత్రావి యొక్కపూటకే వృద్ధిగాంచెను

చం॥ తనదుబలంబుశక్తి నతి ♦ దారుణమౌప్రవిదారణంబునన్
దనుజచమూసమూహములఁ ♦ దర్ప మణంప, నిలింపు లాత్తవా
హినిదళవాయిఁగా నతని ♦ నిచ్చగఁ దా రభిషిక్తుఁ జేసి, రో
యనఘ! సురాపగాచరిత ♦ మంతయు నంతె నవిస్తరంబుగన్ ౮-33

దారుణము = భయంకరము, ప్రవిదారణము = యుద్ధము-చమూ = సేనల, నిలింపులు = దేవతలు - ఆత్తవాహిని = తమసేనయొక్క, సురాపగా చరితము = దేవనది యగు గంగయొక్క చరిత్రము

తా త్ప ర్య ము

తన బలసంపదచే ఘోరమైన యుద్ధమందు రాక్షససేనాసమూహముల గర్వ మణంపఁగా దేవతలు తమసేనలకు నాయకునిగా నాయన కభిషేకముఁ జేసిరి. నాయనా! రామచంద్రా! యీవిధముగ నీకు గంగాదేవి చరిత్ర మంతయుఁ జెప్పితిని.

కం॥ ఈకొమరసామిచరితం, బాకర్ణించినగుణాఢ్యుఁ ♦ డవనీశ్వరపు
త్రా! కడుధన్యుఁడు పుణ్యుం, డై కల్యాణములఁ గూడు ♦ ననవరతంబున్. ౮-3౪

కొమరసామి = కుమారస్వామి-ఆకర్ణించిన = వినిన, అవనీశ్వరపుత్రా = రాజకుమారా - అనవరతము = ఎల్లప్పుడు - కల్యాణము = శుభము.

తా త్ప ర్య ము.

ఈ కుమారస్వామిచరిత్రము వినిన పుణ్యాత్ముఁడు రాజకుమారా, రామచంద్రా! మిగులఁ బుణ్యుఁడై యెల్లప్పుడు శుభముల నందుచుండును.

భారతమునందువలె నడుమనడుమ గ్రామ్యకథలు లేక యఖండరామచరిత్రమైన రామాయణమందు కుమారస్వామిచరిత్రము చెప్పి వాల్మీకి రసభంగము గావించినాఁడని యొక వైష్ణవుఁడు వ్రాసెనుగాని యీగంగాకథనము భగవత్పాదతీర్థమహిమవర్ణన మని యాయన యేలగ్రహింపఁ డయ్యెనో.

విష్ణుకథయం దీమాత్రము శివసంబంధము సహింపలేనివాఁడు తనపితామహులకుఁ దర్పణము విడుచునపుడు అస్మత్పితామహం గోత్రం రుద్రరూప మ్మని చెప్పఁడేమో.

కం॥ శ్రీకార్తికేయభక్తుఁడు, కాకుత్స్థమణీ! సుఖించి ♦ క్ష్మను సుతపౌత్ర
శ్రీకలితుం డయి మించిన, సాకమునం గాంచు స్కంద♦సాలోక్యంబున్. ౮3౫

కార్తికేయ = కుమారస్వామియొక్క. క్ష్మన్ = భూమియందు. సాకమునన్ = ఉత్సవమున, సంతోషమున. స్కందసాలోక్యము = కుమారస్వామియుండు లోకము.

తా త్ప ర్య ము.

ఈకుమారస్వామిభక్తుఁడు భూమియందు కొడుకులతో మనుమలతో సంపదతో సుఖించి చచ్చి కుమారస్వామిలోకమునకుఁ బోవును.

—* 3౮ సర్గము. సగరచక్రవర్తి వృత్తాంత ప్రారంభము *—

చం॥ అని యిటు వల్కి వెండియును ♦ నాధరణీశకుమారయుక్తముం
గని వచియింపఁగాఁ దొడఁగెఁ ♦ గౌశికుఁడున్ మును మీయయోధ్యకుం
జనపతి శూరవర్యుఁ డతి♦సత్కృతిలోలుఁడు లోకపాలనా
వనుఁడు యశోవిభాస్వరుఁడు ♦ వర్తిలెఁ దా సగరాభిధానుఁడై ౮3౬

వెండియును = మఱియును, సత్కృతిలోలుఁడు = మంచికార్యములను జేయుటయందాసక్తిగలవాఁడు, లోకపాలనావనుఁడు = ప్రజలరక్షించుటయందు సంతోషముగలవాఁడు. యశోవిభాస్వరుఁడు = కీర్తిచేఁ బ్రకాశించువాఁడు. సగరాభిధానుఁడై = సగరుఁడను పేరుగలవాఁడై. గంగ భూలోకమునకు వచ్చిన విధము చెప్పఁబోవుచున్నాఁడు.

తా త్ప ర్య ము.

ఇట్లు చెప్పి గంగ భూలోకమునఁ బ్రవహించుకారణము చెప్పఁదలఁచినవాఁడై రామలక్ష్మణులతో నిట్లనియెను. పూర్వము మీయయోధ్యకు మిగులశూరుఁడును, సత్కార్యములం దాసక్తిగలవాఁడును, ప్రజలను బాలించుటయందు సంతోషము గలవాఁడును, కీర్తిమంతుఁడు నగు సగరుఁ డనువాఁడు చక్రవర్తియై యుండెను.

క౦॥ ఆతండు దనకు నొక తనుజాతుండును లేమి మిగుల • సంతాపించెం
బూతుండును సద్గుణవిఖ్యాతుండును నైనకొడుకు • గలుగునె యనుచున్. ౮౩౭

తనుజాతుఁడు = కుమారుఁడు - పూతుఁడు = పవిత్రుఁడు.

తా త్ప ర్య ము .

ఆయన తన కొకఁడైనఁ గుమారుఁడు లేనికారణముచేత నొకఁడైన పవిత్రముగల నడవడిగలవాఁడు మంచిగుణములుగలవాఁడు పుట్టఁడాయెఁగదా యని మిగుల సంతాపించెను.

ఉ॥ నిర్భరతేజుఁ డైనధర•ణీపతికిం సతు లిర్వు, రందు వై
దర్భతనూజ కేశిని సు•ధర్మవిలోలయు నిత్యసత్యసం
దర్భయు జ్యేష్ఠ యయ్యెను, ని•తాంతసురూప యరిష్టనేమికిం
గర్భజ యైనయాసుమతి • ఖ్యాతి వహించెఁ గనిష్ఠభార్యయై. ౮౩౮

నిర్భరతేజుఁడు = అధికమైన తేజస్సుగలవాఁడు. ఇర్వురు = ఇద్దఱు - వైదర్భతనూజ = విదర్భదేశపురాజుకూఁతురు. ఈమెపేరు కేశిని. అందమైన వెండ్రుకలు గలది. సుధర్మవిలోల = మంచిపుణ్యకార్యములు చేయుటయందు మిగుల నాసక్తిగలది. నిత్యసత్యసందర్భ = ఎప్పుడు సత్యముతోనే కూడియుండునది. జ్యేష్ఠ = పెద్దభార్య - నితాంతసురూప = మిక్కిలియందగత్తె - అరిష్టనేమికిం = అరిష్టనేమి యనువానికి, కశ్యపునకు. గర్భజ= కూతుఁరు. ఈమె పేరు సుమతి. ఈమె చిన్నభార్య. ఈమె గరుత్మంతుని చెల్లెలు.

తా త్ప ర్య ము .

మిగులఁ దేజోవంతుఁడైన యా సగరునకు నిరువురు భార్యలు. అందొకతె కేశిని. ఈమె విదర్భరాజుకూఁతురు. పుణ్యకార్యములం దాసక్తిగలది. నిత్యసత్యవ్రత. ఈమె పెద్దభార్య. చిన్నభార్య సుమతి. ఈమె మిగుల చక్కనిది. అరిష్టనేమి కూఁతురు.

ఉ॥ దస్రసమానమూర్తి తన•దారలతోఁ జని భక్తిమై భృగు
ప్రస్రవణాఖ్యశైలమున • వర్షశతంబు దపం బొనర్ప నా
యస్రపవైరితేజునకు • నాదటఁ దోఁచి భృగుండు నిండుమో
దాస్రులఁ జూచునాతనికి • సద్గిలి నిచ్చె వరంబ్బయిం గృపన్. ౮౩౯

దస్రసమానమూర్తి = అశ్వినీదేవతల సౌందర్యముతో సమానమైన సౌందర్యముగల యాకారముగలవాఁడు - దారలతోం = భార్యలతో - అస్రపవైరి = రాక్షసవిరోధి - అస్రపులు = నెత్తురు పానముచేయువారు - మోదాస్రులు = ఆనందబాష్పములు.

తాత్పర్యము.

సౌందర్యమం దశ్వినీసుతులతో సమానుఁడైన యా సగరుఁడు - భృగు ప్రస్రవణ మను పేరుగలపర్వతమునందు నూఱు సంవత్సరములు తపస్సు చేయఁగా విష్ణుతేజముగల యాతనికి భృగుఁడు ప్రత్యక్షమై యానందబాష్పములు గురియఁ దన్నుఁజూచు నా రాజునకు రెండువరము లిచ్చెను.

ఉ॥ పుత్రులు నీకుఁ బెక్కు రిలఁ ♦ బుట్టెదరయ్య, భవద్యశోలతల్
ధాత్రిని నిండు మెండుగను ♦ ధాత్రిప! వంశకరుండు నొక్కఁడే
పుత్త్రుఁడు పుట్టు నొక్కతెకుఁ ♦ బుత్త్రకషష్టిసహస్ర మంబురు
ణ్నేత్ర కొకర్తె కంచను ము♦నిం గని మ్రొక్కి వచించి రంగనల్. ౮౮౦

పెక్కురు = అనేకులు - భవద్యశోలతల్ = నీకీర్తి యను తీఁగలు - వంశకరుండు = వంశమును నిలుపువాఁడు - షష్టిసహస్రము = అఱువదివేలమంది.

తాత్పర్యము.

రాజా! నీకుఁ గుమారులు పెక్కురు గలిగెదరు. నీకీర్తియు లోకమున వ్యాపించును. నీభార్య లిరువురిలో నొకతెకు వంశము నిలుపువాఁ డొకఁడే కొడుకు పుట్టును. మఱియొకతెకు నఱువదివేలమంది జనింతురు - అని చెప్పెను.

తే॥ సత్య మగుఁగాక నీసూక్తి ♦ సత్యవచన
యేకపుత్త్రుండు జనియించు ♦ నెవ్వతెకునో
యెవతె కుదయింత్రు బహుసుతు ♦ లెఱుఁగఁ బలుకు
మనిన మాకోర్కి చొప్పున ♦ నగుత మనిమె. ౮౮౧

తాత్పర్యము.

ఆమాటలు విని యాస్త్రీలు 'మునీంద్రా! నీమాట సత్య మగునుగాక. మాలో నొకఁ డెవతెకుఁ బుట్టును, అఱువదివేలమంది యెవతెకుఁ బుట్టుదురు, తెలుపు'మనిన భృగుండు మీ రెవ రెట్లుగోరిన నట్లగు ననియె.

ఉ॥ అంతట మానికాంతుఁడు త♦దంగనలం గని కాంతలార! మీ
స్వాంతముచొప్పు చెప్పుఁ డిఁక ♦ సంతతికారణ మేకపుత్త్రుఁ డే
కాంతకు నిష్టుఁ డౌ, బలులు ♦ గాఢయశుల్ బహుపుత్త్రవర్యు లే
కాంతకు నిష్టు లౌదు రనఁ ♦ గంజదళాక్షులు మానివర్యుతోన్. ౮౮౨

స్వాంతముచొప్పు = మీమనస్సున నుండువిధము.

తాత్పర్యము.

అట్లుచెప్పి, 'సతీమణులారా! మీయిష్టము చెప్పుఁడు. మీలో నెవతె కొక

పుత్రుఁడు కావలయునో యొవతెకు ననేకపుత్రులు కావలయునో చెప్పుఁ' డన
వా రామునీంద్రునితో రాజుసమక్షంబున ని ట్లనిరి.

తే॥ చెప్పి రిట్లని యందుఁ గే♦శిని వచించె,వంశకరుఁ డైనతనయుఁడు♦ వలయు ననుచు
నలసుపర్ణసహోదరి ♦ యభిలషించె, సుతుల నఱువదివేవుర ♦ క్షితిపు మ్రోల. ౮౪౩

తాత్పర్యము.

మునీంద్రా! వంశప్రతిష్ఠాపకుఁ డైనకొడుకొక్కఁడు నాకుఁ గావలయు నని కేశిని కోరెను. తనకు బహుపుత్రులు కావలయు నని గరుత్మంతుని చెలియలగు సుమతి కోరెను.

కం॥ అంతట ముని వీడ్కొని భూ,కాంతుఁడు నిజపురికి నరిగెఁ ♦ గాంతాయుతుఁ డై
కొంతవడి యిట్లు చన నా,కాంతలు గర్భములు దాల్చి ♦ క్రాలిరి వేడ్కన్. ౮౪౪

వీడ్కొని = సెలవుతీసికొని.

తాత్పర్యము.

ఇట్లు వరములు పొందినవాఁడై సగరుఁడు మునిసెలవుతీసికొని తన పట్టణమునకు భార్యలతోడఁ బోయెను. ఇట్లు కొంతకాల మరుగఁగా వారికి గర్భములు నిలిచెను.

తే॥ తామరసనేత్ర కేశిని♦తనయుఁ గాంచె,నతఁడ యసమంజుఁడనఁగ వి♦ఖ్యాతిఁ దనరె
గర్భతుంబంబు జనియించెఁ ♦ గలికి సుమతి, కందు నఱువదివేవురు♦కందు లొదవ. ౮౪౫

తాత్పర్యము.

కమలములవంటి కన్నులుగల కేశిని యొకకుమారునిఁ గనియెను. వీనిపేరసమంజుఁడు. రెండవభార్య సుమతికి గుండ్రని గర్భపిండము పుట్టెను. దానిని బగులఁదీసికొని యఱువదివేలమంది శిశువులు జనించిరి. ఇది గాంధారి గర్భతుంబమువలె వెనుక విభజనీయమైనది కాదు.

ఉ॥ దాదులు నేతికుండలను ♦ దచ్ఛిశుకాండము నుంచి నేర్పు మైఁ
బ్రోది యొనర్చుచుండఁగను ♦ బోయెఁ జుమీ బహుకాల, మంత దా
యాదులు ప్రాప్తయౌవనులు ♦ హారివిహారులు నైరి, యందు వ్యా
పాదితబాలకుం డగుచు ♦ వర్తిలె నాయసమంజుఁ డుగ్రుఁడై. ౮౪౬

శిశుకాండము = పిల్లవాండ్ర సమూహము. ప్రోది = రక్షణము. దాయాదులు = కుమారులు. వ్యాపాదితబాలకుండు = పిల్లవాండ్రను జంపువాఁడు. ఉగ్రుఁడై = క్రూరుఁడై.

తాత్పర్యము.

ఆ పిల్లవాండ్రగుంపులో నొక్కొక్కని నొక్కొక్క నేతికుండలో నుంచి దాదులు నేర్పుతో సాఁకుచుండఁగాఁ గొలకాలము జరిగెను ఆవల వారందఱు యౌవనవంతులును నందముగ విహరించువారు నైరి అందుఁ బెద్దభార్యకుమారుఁ డసమంజుఁ డూరిబాలకులను జంపువాఁ డయ్యెను.

క॥ పౌరులబిడ్డల సరయూ,పూరంబుల వైచి వారు ♦ బుటుకున మునుఁగన్
నీరంబులపైఁ దేలఁగఁ, దీరంబుననుండి కనుచుఁ ♦ దెంపరి నగుచున్. ౮౪౮

పౌరుల = పురజనముల, తెంపరి = సాహసి.

తాత్పర్యము.

ఊరివారిబిడ్డలను గొనిపోయి సాహసికుఁ డగు నా యసమంజుఁడు సరయూనదిప్రవాహమందు వైచి వారు నీళ్లలో మునుఁగుచుఁ దేలుచుఁ దన్నుకొనుచుండఁగా నొడ్డుననుండి నవ్వుచు వేడుక చూచుచుండెను.

క॥ అనుదిన మిటు పాపావహ, మనక శిశులఁ జంపు సజ్జ♦నాహితుఁ బాపున్
జనహితుఁడు పురమువలనను, దనయుఁ డనక వెడల నడిచె ♦ ధర్మిష్ఠుండై. ౮౪౯

అనుదినము = ప్రతిదినము - పాపావహము = పాపము కలిగించునది- సజ్జనాహితున్ = సజ్జనులకుఁ గీడుచేయువానిని.

తాత్పర్యము.

పాపకార్య మనక దినదిన మీ ప్రకారము వాఁడు చేయుచుండఁగా సుజనులకుఁ గీడుచేయు నా పాపాత్ముని జనముల మేలుగోరి సగరుఁడు ధర్మమందు నిలిచి కొడుకని దాక్షిణ్యముంచక పురమునుండి యడవులకు వెడలఁగొట్టెను. అయోధ్యాకాండమందలి ౧౧౧౧ – ౧౧౧౬ పద్యములు చూచునది.

ధర్మసందేహము.—సగరుఁడు తన జ్యేష్ఠభార్యయందు జ్యేష్ఠపుత్రుఁడగు నసమంజుని నెట్లు వదలెను? ఇది శాస్త్రసమ్మతమైన కార్యమా? కాదు-అని పూర్వపక్షము. ఏలన పున్నామ నరకమునుండి రక్షించువాఁడు పుత్రుఁడుగదా! ఒకనికినలుగురు కొడుకు లుండిరేని యీ కార్యముచేయువాఁ డెవఁడు? జ్యేష్ఠపుత్రుఁడే. “జ్యేష్ఠేన జాతమాత్రేణ పుత్రీ భవతిమానవః, పితౄణామనృణశ్చైవ సతస్మాత్సర్వమర్హతి. యస్మిన్నృణం సన్నయతి యేన చానంత్య మశ్నుతే, సఏవ ధర్మజః పుత్రః కామజానితరా న్విదుః”—మను. ౯-౧౦౬-౧౦౭. పెద్దకొడుకు పుట్టినవెంటనే మనుష్యుఁడు పుత్రవంతుఁ డగుచున్నాఁడు. దానివలన పితరుల ఋణము తీఱిపోవును. తనకుఁ బున్నామనరకబాధ తప్పును. ఏ జ్యేష్ఠపుత్రుఁడు పుట్టఁగనే

మనుష్యుఁడు పితరులఋణమునుండి ముక్తుఁ డగునో, ఏ జ్యేష్ఠపుత్రునిచే మోక్షమునొందునో వాఁడొక్కఁడే ధర్మశాస్త్రప్రకారము పుట్టినపుత్రుఁడు. తక్కిన వారందఱు కామజు లని మును లందురు. ఈ వచనముల నాలోచించినచోఁ దన్ను ఋణవిముక్తునిఁజేసి యుత్తమలోకప్రాప్తి కాధారమై వంశాభివృద్ధికి హేతుభూత మగు పెద్దకొడుకు విడువఁదగినవాఁడు కాఁడు.

సిద్ధాంతము.— జ్యేష్ఠపుత్రుఁడు గుణవంతుఁడైననే పుత్రగౌరవమునకు యోగ్యుఁ డగునుగాని గుణవంతుఁడు గాకున్న నాగౌరవమునకు యోగ్యుఁడు గాఁడు. రామాయణమందే-

క॥ కడుపునబుట్టినబిడ్డలు, దుడుకున నహితంబు సేయఁ దొడఁగిరయేనిన్
విడుతురు భూపతు లయ్యల, గడియింతురు కార్యసాధకతఁ గ్రాలినచోన్.
—అయోధ్యా. ౭౭౫

అని శ్రీరామచంద్రుఁడే చెప్పెనుగదా. కావునఁ బతితుఁడైనను జ్యేష్ఠపుత్రుఁడు త్యాజ్యుఁడు కాకపోఁడు. పతితుఁడనఁగా "ద్విజాతికర్మభ్యో హానిః పతనమ్" అనఁగా బ్రాహ్మణుఁడు బ్రాహ్మణ కర్మమును, క్షత్రియుఁడు క్షత్రియ కర్మమును, వైశ్యుఁడు వైశ్యకర్మమును జేయఁడేని పతితుఁ డగును - అని గౌతముఁడు. "అకుర్వన్విహితం కర్మ నిందితంచ సమాచరన్, ప్రసజంశ్చేంద్రియార్థేషు నరః పతన మృచ్ఛతి" అని మనువు. శాస్త్రవిహిత కర్మములు చేయకున్నను, జేయరానివి చేసినను, నింద్రియార్థములందు విశేషాసక్తిగలవాఁడైనను బతితుఁ డగును. "గురోరప్యవలిప్తస్య, కార్యాకార్య మజానతః, ఉత్పథం ప్రతి పన్నస్య పరిత్యాగో విధీయతే, కార్యం భవతి శాసన" మ్మని పాఠాంతరము. గురువైనను దండ్రియైనను గర్వముచేఁగాని యిది కార్య మిది యకార్య మని తెలియకకాని సరియైనమార్గ మతిక్రమించి నడచునేని నతని వదలిపెట్టవలయును ఇట్టితండ్రియే త్యాజ్యుఁ డగుచుండఁగాఁ గొడుకుమాట చెప్పనేల? తల్లియిట్టిదైనను వదల రాదు. "పతితాయామపి-తస్యాం శుశ్రూషే"ఇతి. "పతితాగురవస్త్యాజ్యా నతు మాతా కథంచన, గర్భధారణపోషాభ్యాం తేన మాతా గరీయసీ" పతితురాలైనను దల్లికి శుశ్రూష చేయవలయును. పతితు లగు గురువులు త్యాజ్యులే కాని తల్లిమాత్రము గాదు. గర్భధారణపోషణములచేఁ దల్లి గొప్పది. ఈ వాక్యములవలనఁ బతితులు (తల్లితప్ప) గురువు - పుత్రుఁడు - భ్రాత - సఖుఁడు - సంబంధులు - చుట్టములు - శిష్యులు - సేవకులు నందఱు త్యాజ్యులే. పతితుఁడైన భర్తను భార్య వదలఁగలయును. పతితభార్యను భర్త వదలవచ్చును. పరిత్యజింపవలసినవారిని వదలకున్నను వదలరానివారిని వదలినను మహాదోషము. "నిందితకర్మాభ్యాసిపతితా త్యాగ్యపతితత్యాగినః పతితా పాతసంయోజకాశ్చ,

త్రైశ్చాబ్దం సమాచరేత్" — గౌతముఁడు. ఛాందోగ్యమున - "ఏతే పతంతి చత్వారః, పంచమ శ్చాచరం స్తైః" పతితులతోడ సహవాసముజేయువాఁడును బతితుఁడే యగును

రాజునకు ముఖ్యధర్మ మేది? ప్రజాపాలనము. అనఁగాఁ బ్రజలధర్మవర్తనులుగాక ధర్మమార్గమందే వర్తించునట్లు పాలించుట.

"హితం చాసాంకుర్వీత"—గౌతముఁడు. ప్రజలకు హితమైనకార్యమునే రాజు చేయవలయును. "ప్రధానం క్షత్రియే కర్మ ప్రజానాం పరిపాలనమ్"—యాజ్ఞవల్క్యుఁడు. క్షత్రియులకుఁ బ్రధానకర్మము ప్రజా పరిపాలనము. "ప్రజానాం రక్షణం దాన,మిజ్యాధ్యయన మేవచ,విషయేష్వప్రసక్తిశ్చ, క్షత్రియస్య సమాదిశేత్"—మనువు. "అభిషిక్తస్యచ రాజ్ఞః ప్రజాపాలనం పరమో ధర్మః"—ఆపస్తంబులు. "నృపాణాం ప్రథమో ధర్మః ప్రజానామేవపాలనమ్, పాలనేనైవ భూతానాం కృతకృత్యో మహీపతిః. సమ్యక్పాలయితా భాగం ధర్మస్యాప్నోతి పుష్కలమ్"-శాంతిపర్వము. "పాలనేనైవభూతానాంకృతకృత్యోమహీపతిః"—మార్కండేయపురాణము. "యదహ్నా కురుతే ధర్మం - ప్రజాధర్మేణపాలయన్, దశవర్షసహస్రాణి తస్య భుంక్తే మహాఫలమ్" బ్రహ్మాండపురాణము. "రక్షన్ ధర్మేణ భూతాని, రాజావధ్యాంశ్చఘాతయన్,యజతేఽహరహర్యజ్ఞైః సహస్రశతదక్షిణైః"—మనవు ఇట్టిప్రమాణము లనేకములు గలవు. ఈవిషయము సగరునందే కాక సీతావిషయమున శ్రీరామచంద్రునియందు నన్వయింపవలసియుండును. ఈయసమంజుఁడు మన దేశము వెడలిపోయి యీజిప్టునకుఁ బ్రభువైనట్లు దీనికి జతపఱిచిన యాంగ్లలేఖవలనఁ దెలియనయ్యెడి.

A Page from INDO - EGYPTIAN HISTORY

(By B DAS, M L A)

Every Hindu believed in the superiority of the Aryan civilization till the impact of West on the East The Western Civilisation as was understood by the English and other European traders and travellers two hundred years ago could not conceive of human civilisation dating back eons ago, and naturally they questioned the authenticity of the great epics like the Ramayan and Mahabharat and also the later Puranas To the Brahman, absorbed in the infinite and absolute, time and space was of little consideration and naturally the great sages and savants of the East left no dates of events chronicled in these epics and shastras as are understood by the modern historians. With the spread of Western education and

culture Indians themselves began to doubt the authenticity of their epics and shastras and a school of thought developed that followed the Westerner's mentality whereby Greek and Roman civilisations were given precedence over the Hindu [Aryan] Civilisation That was though for a short period and was confined to the circle untutored in the hoary antiquities and culture of their own ancestors

ARYAN CONQUEST OF EGYPT

In the meantime, certain European philologists and scholars, —great savants these were—un-prejudiced with the spirit of conquest of the Britisher and not facing the situation of admission of belonging to a later civilisation—the very offspring of the hoary Aryan civilisation through its successive phases the phoenician, the Hellenic, the Gothic, and the Roman civilisations—scholars like Weber and Max Muller recognised the antiquities of the Rig Veda and ancient civilisation of the Hindus Then came the Egyptologists—mostly Europeans and Americans, that tried to interpret the pictographic and hieroglyphic writings found on seals and potteries in the tombs and pyramids of Pharaohs of Egypt and discovered an ancient civilisation to the Hellenic and Roman civilisation and supposed it to be the father of the world civilisation. In the meanwhile, other scholars and savants, worked independently to trace the origin of all civilised languages and traced their origin to the Aryan tongue—the Sanskrit of the Vedas We are indebted to Waddell for his researches in this particular direction and Waddell has proved conclusively that the ancient Egyptian language is radically Aryan in origin The old school of Egyptologists have still to be combatted The Sumerian hieroglyphs found in Babylon (Mesopotamia) required a different key than what the Egyptologists discovered for the Egyptian hieroglyphs The key to this Sumerian civilisation and to Sumerian hieroglyphs was found at Mahenjo Daro, when the Indian archeologists found in its excavation same tablets, potteries, seals as were found at Babylon The key to Sumerian civilisation and to the Sumerian language has now been discovered by scholars and the Sumerian is now proved to be the fore-runner of the Aryan civilisation Up to date research shows that the Aryans founded their empire in Babylonia after their migration from their cool homeland and their developed world-wide empire which embraced England on the West and Sind (India) on

the East These Sumerians or Aryans conquered Egypt (Misor Gopta of Sanskrit) and founded the Egyptian Empire under Pharaoh Menes now proved to be Manasyu or Aswa-manja, son of the great Aryan King Sagar

INDO - EGYPTIAN RELATIONS

Every Hindu with elementary knowledge of his puranas knows it that Sagar's son crossed the sea with 60,000 soldiers and that was done to found the Egyptian Empire and Manasyu or Aswamanja became the first Pharaoh of Egypt It may interest readers to learn that Pharaoh is derived from Sanskrit Prabhu—Overlord The most wonderful result of all these researches by Egyptologists and Sumerulogists has been established in the oneness of the dynasties of Kings in Aryan Puranas, the Sumerian Hieroglyphs and Egyptian Hieroglyphs For these far reaching conclusions we are once again indebted to Waddell It must be noted that Waddell could reach these conclusions after his long association in archaeo logic excavations in Pataliputra (Patna) and Mohenjo Daro At last oriental scholars of the West have had to admit the antiquity and seniority of the Aryan civilisation!

Indian readers, specially Hindu readers, will find indentities of countries mentioned in Mahabharat, if they can read Waddell's latest book "Egyptian Civilisation, Its Sumerian Origin" Names such as Kur (Suria or Syria—the land of Kurus), Misor Gopta (Egypt), Maruts of Asia Minor (the land of Maruts or Amorities) and lastly Kuru-Panch (Kuru-Panchala—Syria being known as the land of Kuru Panchala) will no doubt rouse vivid curiosity in the minds of readers to locate the Ancestral Empire of the Aryans as has been depicted in the Mahabharat and the Puranas Every modern student of History reads of the Phoenicians, but he does not know that these were the Panch (Panchala) of the Vedas—the blue eyed sea faring Aryans who spread the Aryan civilisation in the Mediterranean coasts and even carried it to the British shores on the West and helped their Indo-Aryan brothers to spread Aryan civilisation not only in Malay peninsula, China, Corea and Japan, but crossed the Pacific ocean and brought under the influence of the Indo-Aryan civilisation the whole of America where there are still remains of the mighty civilisation in the colossal architecture of the Mayas in Mexico and Central America and of the Lucas of Peru.

ARYAN CIVILISATION OLDER THAN EGYPTIAN

History of the world—history of the Aryan civilisation, has still to be rewritten Scholars now agree that Aryan civilisation led to the world civilisation Empires and civilisations now dead and buried whether Egyptian, Phoenician, Assyrian, Hellenic or Roman, all owed their origin to the Aryan civilisation—which was then the inspirer of language, thought and culture as it is even now If there arose the semitic civilisation and semitic influence later, its influence was localised and confined to modification of language and culture in the Assyrian or Egyptian civilisation The alphabets and writings of all old civilisations and all old countries— Egypt, Babylonia, Asia Minor, China, Japan, Corea and even ancient America were derived from Aryan alphabets and all writings were left to right, numerals were Aryan in origin as also the solar year prevalent in all civilised countries of the world What European scholars still hesitate to admit owing to their stunted notions of life and eternity as conceived through the Christi an civilisation and mentality, that the Aryan civilisation is much older than they wish to concede The older Egyptologists wanted to prove Egyptian civilisation originated 4000 B C and that would lead us to conclude that the Aryan civilisation is much older Waddell and European Antiquarians are anxious to prove that the Sumerian—Aryan civilisation dates only back to 3000 B C They base it on the arguments that as the dynastics of kings of all ancient civilisations are the same—the dynasties of kings and emperors as mentioned in Mahabharat—they calculate from circumstantial evidence in Egyptian records of hieroglyphs that Aswamanja reigned in Egypt about 2704 B C — 2641 B C No Hindu scholar, no Aryan savant will agree to this limitation of the period of ancient Aryan civilisation Astronomy will play a great part in the interpretation of age of the Aryan civilisation If European scholars now concede the authenticity of the genealogy of the Kings of India as chronicled in Mahabharat and as verified from hieroglyphs in tablets, and seals of three different civilisations— the Sumerian, the Assyrian and the Egyptian— these scholars must have to forget their pre-convinced notions about date of origin and restudy Hindu Shastras in the light of Science and Astronomy to fix the dates of these kings and to trace back the period of the dawn of human civilisation—the Aryan civilisation,

క౦॥ అతనిసుతుఁ డంశుమంతుఁడు, ఋతవాదియు సర్వలోక♦హితుఁ డై వెలసెన్
మతియొకటె సగరునకుఁ దాఁ, గ్రతు వొక్కటి చేయ దాని♦కై పని పూనెన్. ౮౮౯

ఋతవాది = న్యాయవాది. క్రతువు = యజ్ఞము.

తాత్పర్యము.

ఆ యసమంజుని కొడుకు అంశుమంతుఁడు. వీఁడు న్యాయవాదియు సమస్త ప్రజల మేలుకోరువాఁడు నయ్యెను. ఇట్లుండుసమయంబున యజ్ఞమొకటి చేయవలయు నను సంకల్పము సగరునకుఁ గలిగెను.

—*౩౯ సర్గము. సగరుఁ డశ్వమేధము సేయ నింద్రుఁడుయజ్ఞాశ్వ మపహారించుట*—

క౦॥ సంధ్యాతాండవునకు సాం,బంధ్యము గలధారిణీధ్ర♦పరివృఢుఁడుగ నా
వింధ్యావనీధరంబు న,సంధ్యానోన్యేక్షణముల♦సలుపు సతంబున్. ౮౯౦

సంధ్యాతాండవునకున్ = సంధ్యాకాలమందుఁ దాండవమాడు శివునకు, సాంబంధ్యము = సంబంధిభావము, సంబంధి = మామ, ధారిణీధ్రపరివృఢునకున్ = పర్వతశ్రేష్ఠునకు - అవంధ్య = గొడ్డుపోని, అన్యోన్యేక్షణములు = ఒకరినొకరు చూచుకొనటలు.

తాత్పర్యము.

హిమవత్పర్వతము వింధ్యపర్వతము రెండును నెదురైన కొండలే కావున నడుమ నే పదార్థము లడ్డములేక యొకరి నొకరు చూచుచుండుట సిద్ధించెను.

క౦॥ ఆ రెంటికి నడుమను నవ,నారంభము సేయ యోగ్య♦మగుఁ గావున ధా
త్రీరమణుం డచ్చో న,ంభారంబుల నెల్లఁ గూర్చె♦ముఖ మొనరింపన్. ౮౯౧

తాత్పర్యము.

ఆ రెండుకొండలనడిమిప్రదేశమందు యజ్ఞముచేయుట ప్రశస్తము కావున నారాజచ్చటఁ జేయు యజ్ఞమునకుఁ గావలసినపదార్థముల నెల్ల సమకూర్చెను.

హిమవంతమునకు వింధ్యపర్వతమునకు నడిమిప్రదేశ మార్యావర్త మనఁబడును. ఇది పుణ్యప్రదేశము.

'ఆర్యావర్తఃపుణ్యభూమి ర్మధ్యంవింధ్య హిమాగయోః' అని యమరకోశము. హిమవద్వింధ్యపర్వతములకుఁ దూర్పుపడమరిసముద్రములకు నడిమిభూమి యార్యావర్తము. హిమవద్వింధ్యపర్వతములకుఁ దూర్పుపడమరల వినశన ప్రయాగలకు నడిమిదేశము మధ్యదేశము.

శ్లో॥ ఆసముద్రాచ్చవై పూర్వా, దాసముద్రాచ్చ పశ్చిమాత్
హిమవద్వింధ్యయో ర్మధ్య, మార్యావర్తం విదుర్బుధాః.
హిమవద్వింధ్యయోర్మధ్యే యత్ప్రాగ్వినశనాదపి,
ప్రత్యగేవ ప్రయాగాచ్చ, మధ్యదేశ స్స ఉచ్యతే. —మనవు.

క౦॥ అశ్వాధ్వర మొనరించుచు, నశ్వముబడి నంశుమంతు ♦ నంపిన నపు డా
విశ్వవినుతధానుష్కుఁడు,విశ్వాసము మెఱయఁ జనియె♦విపులబలముతోన్. ౧౫౨

అశ్వాధ్వరము = అశ్వమేధయాగము - విశ్వవినుతధానుష్కుఁడు = ప్రపంచ ముచేఁ గొనియాడఁబడిన చాపాయుధుఁడు.

తా త్ప ర్య ము .

అశ్వమేధయాగము చేయుచు నశ్వము వెంట నంశుమంతు నంపెను. అతఁడును విలువిద్యయందు జగత్ప్రసిద్ధుఁ డౌటచేఁ దన సేనతోడ నమ్మకముగాఁ బోయెను. అఱువదివేలమంది పెద్దవారు కొడుకు లుండఁగా మనుమని బాలుని నొంటరిగాఁ బంపనేల యనిన దానికిఁ గారణముఁ జెప్పుచున్నాఁడు.

క౦॥ పర్వదినంబున మాయ సు,పర్వప్రాగ్రసరుఁ డసుర♦వపువున యజ్ఞీ
యార్వంబు నపహరించిన, సర్వోపాధ్యాయు లనిరి ♦ సగరునితోడన్. ౧౫౩

సుపర్వప్రాగ్రసరుఁడు = దేవతలయందు శ్రేష్ఠుఁడు- ఇంద్రుఁడు, అసురవపువునన్ = రాక్షసశరీరముతో, యజ్ఞీయార్వంబు = యజ్ఞమునకై యుద్దేశించిన గుఱ్ఱము.

తా త్ప ర్య ము .

ఉత్సవమందు నింద్రుఁడు తనమాయాబలముచే రాక్షసునివలె వచ్చి యజ్ఞాశ్వమును దొంగిలించికొనిపోయెను. అప్పుడు ఋత్విజులందఱిట్లనిరి.

ఉ॥ కర్తను నిగ్రహింపక ♦ కార్యము భంగము సేయఁ గోరి యే
ధూర్తో హరించె వారువము, ♦ దోసము, దీన ఘటిల్లుఁ గీడు భూ
భర్తకు నీకు మాకు, నటు ♦ ప్రాప్తములకుండఁగ నశ్వహర్తృసం
హర్తవు నౌచు యజ్ఞమును ♦ సాంతముఁ జేయు నృపాలకాగ్రణీ! ౧౫౪

ధూర్తో = ధూర్తుఁడో. నీచ మూర్ఖ ధూర్త చార్వాక వృద్ధ ప్రేష్ఠ గృహస్థ శబ్దములు ప్రథమయందు నదంతములుగాఁ బ్రయోగింపనగును.—సు. వ్యా. తత్సమ. ౨౦ సూ. వారువము = గుఱ్ఱము, అశ్వహర్తృసంహర్త = అశ్వమును హరించినవాని సంహరించినవాఁడవు సాంతము = ముగింపు.

తాత్పర్యము.

రాజా! యజ్ఞకర్తవైన నిన్ను లక్ష్యముసేయక నీకార్యమునకు విఘ్నము కలిగింపఁగోరి యేదుష్టుఁడో గుఱ్ఱము నపహరించెను. ఇది పాపకార్యము. దీని వలన నీకు మాకుఁ గూడ కీడు గలుగును. కావున నాగుఱ్ఱపుదొంగను సంహరించి యాగుఱ్ఱమును మరలఁ దెప్పించి యజ్ఞము నిర్విఘ్నముగాఁ బరిపూర్తి సేయుము.

కం॥ ఋత్విజు లిటుపల్కిన విని, సత్వరుఁడై సగరుఁ డాత్మ♦జాతులఁ ద్రిజగ
జ్జిత్వరులను నఱువదివేల్, సత్త్వాఢ్యులఁ గాంచి పలికె♦సంభ్రమ మమరన్. ౮౫౫

సత్వరుఁడై = త్వరతోఁగూడినవాఁడై, ఆత్మజాతులన్ = తనకుమారులను, త్రిజగత్. జిత్వరులను = మూఁడులోకములు జయింపఁగలవారిని, సత్త్వాఢ్యులన్ = బలవంతులను.

తాత్పర్యము

ఋత్విజు లీప్రకారముచెప్పఁగావిని జాగులేకమూఁడులోకములనైన జయింపఁగల బలవంతులైన తనకుమారుల నఱువదివేలమందిని చూచి తత్తఱపాటున నిట్లనెను.

—* సగరకుమారు లశ్వమునిమిత్తమై భూమిని ద్రవ్వుట *—

సీ॥ సుతులార! దివ్యతేజులు ఋత్విజులు నన, మంత్రవంతపుఁ గ్రతు♦తంత్ర మునుపఁ
జోరత రాక్షసుల్ ♦ వారువంబును గొని, యేగుటఁ గన నైతి ♦ నీరలెల్ల
జలనిధివలయిత♦సర్వసర్వంసహా, చక్రంబు వెదుకుఁడు ♦ సర్వముగ
నొక్కొక్క యోజనం ♦ బోలిమై దొంగయు, మావుఁ జేపడుదాఁక ♦ మరలవలదు
తే॥ ఋత్విజులు మునుమందును ♦ నేను నిచట, నుండువారము సైంధవ♦మొదవుదాఁక
నిదియనుజ్ఞగఁ గొని చనుఁ ♦ డీ రటన్న, హృష్టమానసులై వార ♦ లేగియంత. ౮౫౬

చోరత = దొంగతనముగ - ఈరలు = మీరు - జలనిధివలయిత=సముద్రముచేఁ జుట్టఁబడిన, సర్వసర్వంసహాచక్రము = సమస్తమైన భూచక్రమంతయు. సర్వంసహా = సర్వమును సహించునది = భూమి, మావు = గుఱ్ఱము, సైంధవము = గుఱ్ఱము, హృష్టమానసులై = సంతోషించిన మనస్సుగలవారై.

తాత్పర్యము.

పుత్త్రులారా! దివ్యతేజులగు ఋత్విజులు మంత్రపూతముగ నొక్క యజ్ఞము నాచేఁ జేయించుచుండఁగా దొంగతనముగా రాక్షసులు వచ్చి గుఱ్ఱమును హరించుకొనిపోవుట నేను జూచినవాఁడను గాను. కావున మీ రందఱు బయలు

దేఱిపోయి సముద్రమువఱకుఁ గల భూమినంతయు వెదకుఁడు. ఆలస్యము చేయవలదు. మీలో నొక్కొక్కఁ డొక్కొక్క యామడవంతున వెదకవలయును పొంగయు గుఱ్ఱము చిక్కువఱకు మీరు మరలి రారాదు. మీరు మరలి వచ్చువఱకు నేను బుత్విజులు మనుమఁడైన యంశుమంతుఁడు నిందే యుండఁగల వారము ఇది రాజాజ్ఞగ నా యనుజ్ఞగా గ్రహించి పొం డనిన వారు సంతోషించినవారై బయలుదేఱిపోయిరి.

తే॥ యోజనాయామవిస్తార ♦ మొక్కఁ డొకఁడ, నాకపాయుధశిఖరాభ♦నఖరములను
నుగ్రశూలహలంబుల ♦ నర్వి(జీల్చ, దాన జనియించె దుస్సహం ♦ బైనరవము. ౧౫౭

యోజనాయామవిస్తారము = ఆమడ పొడుగుగల ప్రదేశమున, నాకపాయుధ = వజ్రాయుధము, శిఖరము, ఆభ = సమానమైన, నఖరములను = గోళ్లను.

తాత్పర్యము.

వారందఱు పోయి యొక్కఁడొకఁ డొక్కొక యామడ నిడివిగల ప్రదేశమును వజ్రాయుధములవంటి శిఖరములవంటి గోళ్లతోను భయంకరమైన శూలముల తోను నాగేళ్లతోను భూమిని బగులఁదీసిరి. ఆకారణమున సహింపరాని ధ్వని జనించెను.

కం॥ నీల్గెడిచిలువలతుటుములు, యీల్గెడిపొలదిండిగముల ♦ యేడుపుటులివుల్
మాల్గెడిరక్కసిమూఁకల, మూల్గులు నల్గొన లందు ♦ ముమ్మరి మయ్యెన్. ౧౫౮

నీల్గెడి = చచ్చుచున్న - చిలువల తుటుములు = పాముల గుంపులు - చిలుము + వా = చిలువ = విషముగల నోరుగలది - పొలదిండిగముల = మాంసమును భుజంచువానిసమూహముల - ఏడుపుటులివుల్ = రోదనధ్వనలు - మాల్గెడి = సోమరితనము చేఁ గదలని, నల్గొనలందుఁ = నాలుగు దిక్కుల యందు - ముమ్మరము = దట్టము.

తాత్పర్యము.

చచ్చెడి పాములయు మరణించు క్రూరజంతువులయు నేడుపుధ్వనిలును - పరువెత్తిపోక నిలిచిన రాక్షసులమూల్గులును నాలుగు దిక్కుల వ్యాపించెను.

కం॥ అఱువదివేలామడ యా,యఱువదివేవురును ద్రవ్వి ♦ రాబలితలముఁ
గఱకుఁదనంబును గొని చిం,కఱవందఱ చేసి రెల్ల♦ధరణీతలమున్. ౧౫౯

ఆబలితలము= పాతాళమువరకు. అవ్యయీభావ సమాసము. దీనివలనఁ దమ కనిష్టమైనను గష్టమైనను బితృవాక్యపరిపాలనము కర్తవ్యమని సూచన. (చూ- అయోధ్య. ౬౦౬ ప)

తాత్పర్యము.

అఱువదివేలమంది యఱువదివేలామడ నేల పాతాళమువఱకుఁ ద్రవ్వి కఠినులై భూమినంతయుఁ జిందఱవందఱగాఁ జేసిరి.

—* దేవతలు బ్రహ్మతో సగరకుమారులవలనిరాయిడి విన్నవించుట *—

క॥ డంబున సధారణీధర, జంబూద్వీపంబుఁ ద్రవ్వి ♦ సగరాత్మజుల
శ్వంబును వెదకఁగఁ జొచ్చిన, నింఒటి గంధర్వనాగ♦బృందారకులున్ ౭౬౦

డంబునన్ = ప్రకాశముగా - సధారణీధర = పర్వతములతోఁ గూడిన - జంబూద్వీపంబున్ = జంబూద్వీపమును.

తాత్పర్యము.

ఎల్లెడఁ బ్రకాశముగాఁ గొండలతోఁగూడ జంబూద్వీపమునంతయు సగరకుమారులు గుఱ్ఱమును వెదకుచుండఁగా దిగులుపడి స్థైర్యముచెడి గంధర్వులు పన్నగులు దేవతలు నొకటిగఁజేరి.

సీ॥ కాంచనగర్భునిఁ ♦ గానంగ నేగి సం,భ్రాంతమనస్కులై ♦ పల్లటిలుచు
నాతనిఁ గని దేవ ♦ భూతలం బెల్లన, సగరాత్మజులచేతఁ ♦ జక్కఁబడియె
గుఱ్ఱంబుకొఱకు నై ♦ కఱులు చేకొని, మిఱులతో నేలఁ ♦ దొఱ్ఱవెట్టి
పెక్కురు పెద్దల♦బీరంబుఁ బెడఁబాపి, పాతాళతల మెల్లఁ ♦ బాఁతు గలఁచి
తే॥ రితఁడె మామావుదొంగని ♦ యిదిగొపేఁడె,తురికిజన్నంబుఁ జెఱిచిన♦దుండగీఁడ
టంచుఁ జెలరేఁగి సర్వభూ♦తావళులను, బారిసమరుచున్నారు♦భారతీశ. ౭౬౧

కాంచనగర్భునిన్ = బ్రహ్మను, పల్లటిలుచున్ = తత్తఱపడుచు, చక్కఁబడియె = ధ్వంసముచేయఁబడియె. "చాలనివారింగొని యేచక్కంబెట్టువాఁడనే పాండవులన్."— భార - ఉద్యో - ౨ ఆ తురికిజన్నము = అశ్వమేధము, బారిసమరు = హింసించు.

తే॥ కాలపక్వంబులైన లోకముల జముఁడు
బారిసమరెడు చాడ్పున."— భార - విరా - ౫ ఆ.

తాత్పర్యము.

బ్రహ్మదేవునిఁ జూడఁబోయి మనస్సు తొట్రుపడుచుండఁ దత్తఱపడుచు నాయనతో నిట్లనిరి. దేవా! సగరకుమారులచే భూమియంతయు నాశమయ్యెను

గుఱ్ఱముకొఱకై కట్టులు ధరించి మిట్టులన్నియుఁ బల్లములుగను - బల్లము లన్నియు మిట్టలుగను దాఱుమాఱుచేసి పెద్దల పౌరుషము చెఱిచి, పాతాళ మంతయుఁ బాఁదుతోడఁ గలయఁబెట్టి, వీఁడె మా గుఱ్ఱపుదొంగ వీఁడె మా యశ్వమేధయాగము చెఱిచిన దుష్టుఁడని సమస్తభూతములను హింసించు చున్నారు

౪౦-వ సర్గము

చం॥ అనడుఁ బితామహుం డనుమహాభయకంపితనిర్జరాళులం
గని సురవర్యులార! నవ ♦ ఖండయుతావని యెల్ల వాసుదే
వునయది, యమ్మహామహుఁడు ♦ పూనుచుఁ గాపిలరూపుఁ దాల్చి మే
దిని, నటు గాన సాగరులఁ ♦ దీర్చుఁ గ్రుధోగ్రహుతాశనార్చులన్. ౭౬౨

అనుడున్ — అని చెప్పఁగా, నవఖండయుతావని = తొమ్మిదితునుకలతోఁ (ద్వీపములు) గూడినభూమి, క్రుధోగ్రహుతాశనార్చులన్ = కోపమనెడు తీవ్రమైన యగ్నిజ్వాలలచే, తీర్చున్ = నాశముచేయును. దీనివలన బహుజనపీడ గావించువానినాశమున కుపాయము దేవతలు వెదకుచుందురని యేర్పడుచున్నది.

శ్లో॥ జంబూప్లక్షాహ్వాయద్వీపౌ శాల్మలి శ్చాపరోద్విజ
కుశః క్రౌంచ స్తథాశాకః పుష్కర శ్చైవ సప్తమః.

జంబువు - ప్లక్షము - శాల్మలి - కుశము - క్రౌంచము - శాకము - పుష్కరము, ఇవి యేడు ద్వీపములని యొకమతము "తునుకలు తొమ్మిదియఁట పదునెనమండ్రఁట మోచువారు॥" అని నవద్వీపములని యొకమతము వితతనవద్వయ ద్వీపనానాజయశ్రీవధూటీ సమాశ్లిష్టభుజుఁడు."— నై॥ పదునెనిమిదిద్వీపము లని కొందఱు.

తాత్పర్యము.

మిక్కిలి భయముచే వణఁకుచున్న దేవతాసమూహములను జూచి బ్రహ్మదేవుఁ డో దేవతలారా! నవద్వీపములతోఁ గూడిన భూచక్రమంతయు వాసుదేవునిది. ఆ మహాత్ముఁడు కపిలుఁడై భూమిని నెప్పుడు భరించియుండును. కావున సగరుకుమారుల నాయనయే కోపాగ్నులచే భస్మముచేయును. మీరు చింతింపవలదు.

తే॥ కల్పకల్పంబునందు నీ♦కరణిధాత్రి, యెల్లఁ ద్రవ్వఁగఁబడుచుండు ♦ నేల వగవ?
నగును నాశంబునిజముస్వ♦ల్పాయువులైన,సగరసుతులకు నంబర♦చారులార! ౭౬౩

కల్ప కల్పంబునందుఁ = ప్రతికల్పమునందు - అంబరచారులార = ఆకాశమునసంచారముచేయు దేవతలారా బ్రహ్మదినమునకుఁ గల్పమని పేరు. ఆదినాంతమున నవాంతరప్రలయము. మనుష్యులాహారవిహారాదులందుఁ బ్రతిదిన మించుమించుగ నొకవిధముగా నెట్లు వర్తింతురో యట్లే బ్రహ్మదేవుఁడును బ్రతికల్పమందుఁ జేయుచు మరలమరల సూర్యచంద్రాదులను సృష్టించుచుండును. ఒకకల్పమునందు జరిగినవే కొంచెముభేదముతోఁ బ్రతికల్పమందును జరుగుచుండును. ప్రకృతిస్థితిగతులన్నియు నేకవిధముగానే యుండును గాని జీవులుమాత్రము భేదింతురు. పోయినకల్పమునందలి సూర్యచంద్రులవలెనే యాకారములు గలిగి కార్యములవియే చేయుదురు. కాని పోయినకల్పమున సూర్యునియందలి జీవాత్మ యీకల్పసూర్యునియందలిజీవాత్మ గాదు. ఆజీవాత్మ యింతకుఁబైస్థితికిఁ బోఁగా నాస్థానమున కర్హుఁడైనజీవుఁడు మఱియొకఁడాస్థాన మలంకరించును. ఒకయుద్యోగి యంతకంటెఁ బైయుద్యోగమునకుఁ బోయిన మఱియొకఁడాస్థానమునకు వచ్చినట్లు.

తాత్పర్యము.

ప్రతికల్పమునందు భూమి యీవిధముగఁ ద్రవ్వఁబడుచుండును. కావున దీనికై మీరేల వగచెదరు? అల్పాయువులైనరాజకుమారులు శీఘ్రకాలమునందే నాశమగుదురు.

తే॥ అనిన ముప్పదిమువ్వురౌ ♦ యమరవరులు, వచ్చుత్రోవన పోయిరి ♦ వరుసపట్టి
వారివారినెలవుల క ♦ పారమైన, సంతసం బెదఁ గ్రాల, నా ♦ సగరసుతులు. ౪౬౪

ముప్పది మువ్వురు = పన్నిద్దఱు భాస్కరులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ఇద్దఱు అశ్వినులు, కలిసి ముప్పది మువ్వురు. ముప్పదిమూఁడుకోట్ల దేవతలని చెప్పఁబడువారు వీరే. ఈముప్పదిమువ్వురు, వీరిసేనలు, పరిచారకులు లోనగువారుగలిసి ముప్పదిమూఁడు కోట్లు.

తాత్పర్యము.

అనిచెప్పగా నాముప్పది మువ్వురు దేవతలు సంతోషముతో వారివారి స్థానములకు వచ్చినత్రోవఁబట్టుకొని పోయిరి.

చం॥ అట మహితార్భటిం బుడమి ♦ నంతయుఁ ద్రవ్వి ప్రదక్షిణంబుగాఁ
జటులతఁ జుట్టి వారువము ♦ జాడఁ గనుంగొనఁ జాల కంద ఱొ
క్కటిగను జేర తండ్రిఁ గని ♦ క్ష్మాతల మంతయుఁ ద్రవ్వి విక్రమో
ద్భటసురదైత్యకిన్నరులు ♦ భంగపడన్ వధియించి యెంతయున్. ౪౬౫

వారువము = గుఱ్ఱము.

తా త్ప ర్య ము.

ఆసగరుకుమారులు గొప్పధ్వని కలుగునటులు ప్రదక్షిణముగాఁ బోయి భూమినంతయుఁ ద్రవ్వియును గుఱ్ఱ ముండుజాడఁ దెలిసికొనలేక యంద ఱొక్క ప్రదేశమందుఁ జేరి తండ్రిని జూడఁబోయి తండ్రీ! భూమినంతయుఁ ద్రవ్వితిమి. రాక్షసులు కిన్నరులు భంగపడఁ జేసితిమి

ఉ॥ మిఱ్ఱును బల్లమం చనక ♦ మేదిని యంతయు రోసిరోసి యా
గుఱ్ఱముపోబడిం గనకి ♦ గొబ్బున వచ్చితి మంచుఁ బల్కఁ గ
న్నెఱ్ఱ యొనర్చి చిఱ్ఱున మ♦హీరమణీరమణుండు పల్కు నా
కుఱ్ఱలఁ ద్రవ్వుఁ డింక ధర ♦ గుఱ్ఱపుదొంగను దేక వ్యర్థులై. ౮౬౬

తా త్ప ర్య ము.

ఇది మిట్ట యిది పల్లము ఇది సందు యిది గొంది యనక భూమియంతయు వెదకి వెదకి యెక్కడ గుఱ్ఱపుజాడ తెలిసికొనలేక మరలి శీఘ్రముగ వచ్చితి మని చెప్పఁగా సగరుఁడు చిఱ్ఱుమని కోపించి పిల్లవాండ్రను జూచి గుఱ్ఱపుదొంగను బట్టుకొని రాక వ్యర్థులై వచ్చితిరా? భూమి నింకను ద్రవ్వుఁడు.

సీ॥ వత్తురే మరలుఁడీ ♦ త్రచ్చుఁడీ సర్వంబు, రాకుఁడీ కార్యంబు ♦ గాకమున్న
యని తండ్రి పల్కిన ♦ విని యెల్లరును వేగ, మేగి రసాతల ♦ మెల్లఁ ద్రవ్వి
యచ్చో విరూపాక్ష ♦ మనుదిశానాగంబు, నెద్ది పెన్నగమున ♦ కుద్ది యగుచు
నర్విసి మోచుచోఁ ♦ బర్వదినంబుల, బారఖేదంబును ♦ బాపుకొనఁగ
తే॥ శిరము వణఁకింప దానన ♦ ధరచలించు, నట్టియేనుంగు వలగొని♦దిట్ట లగుచుఁ
దూర్పు భేదించి వలకడఁ♦ దోఅట వెట్టె, యట మహాపద్మమనుపేరి♦హస్తిఁగాంచి.
౮౬౭

పెన్నగము = పెద్దకొండ, వలగొని = ప్రదక్షిణముచేసి, వలకడ = తూర్పు దిక్కున, తోఅట = తోట్ర.

తా త్ప ర్య ము.

కార్యార్థులై పోయినవారు కార్యము సాధింపక రావచ్చునా? మరలఁబొండు. ఇంకను ద్రవ్వుండు. ఇఁకఁ గార్యము సాధించితిరా నాయెదుటికి రండు. లేకున్న రావలదు - పొండు. ఉత్తచేతులతో వచ్చి ముచ్చటలు చెప్పిన యజ్ఞ మెట్లు సాంతమగు నని తలఁచితిరి. అని చెప్పఁగా మరల సందఱు రసాతలమెల్లఁ ద్రవ్వి యచట కొండవలెనుండు విరూపాక్ష మను నేనుఁగును జూచిరి. ఆదిగ్గజము భూమిని మోయు సమయమందు నొక్కొక్కసారి పర్వదినంబులందు బరువువలనఁ గలిగిన బాధను తొలఁగించుకొనుటకు శిర మాడించును. అప్పుడు భూమియు వడఁకును.

అట్టియేనుఁగునకుఁ బ్రదక్షిణనమస్కారములుచేసి తూర్పుదిశ భేదించి యావల దక్షిణము ద్రవ్వి చని యచట మహాపద్మ మను పేరుగల యేనుఁగును జూచిరి.

ఉ॥ దానిని జుట్టివచ్చి వినతప్రథమాంగకులై ప్రతీచినిఁ
మానక ద్రవ్వి యచ్చటను క్ష్మాధరమో యన నొప్పుదాని నా
శానతనాగముం గనుచు సౌమనసాఖ్యము మ్రొక్కి దాని కీ
శానసఖాశ కేగి సితసామజవర్యము గాంచి భద్రమున్ ౧౬౮

వినతప్రథమాంగకులు = నమస్కరించుచున్న శిరస్సులుగలవారు - ప్రతీచి= పడమర - క్ష్మాధరము = పర్వతము - ఆశానతనాగముఁ = ప్రసిద్ధికెక్కినదిగ్గజము ఈశానసఖాశ = కుబేరుని దిక్కు - ఉత్తరము. సితసామజవర్యము = శ్రేష్ఠమైన తెల్లయేనుఁగు

తాత్పర్యము

ఆదిగ్గజమునకుఁ బ్రదక్షిణించి శిరస్సుచే మ్రొక్కి పడమరగ పోయి కొండవలె నుండు నచటి దిగ్గజమును సౌమనస మను పేరుగలదానిని జూచి దానికి మ్రొక్కి దానికుత్తరమున భద్ర మను పేరుగల తెల్లయేనుఁగును జూచిరి

కం॥ మంచును బోలుచు సితరుచి, నంచితమగుదానిఁ గుశల మాడుకొనుచుఁజని యా
పంచాస్యదిశను ధర ద్రవ్వించిరి సమకట్టి రోషదీపితమతులై. ౧౬౯

సితరుచి = తెల్లనికాంతి, పంచాస్యదిశ = ఈశాన్యదిశ, పంచాస్యుఁడు = శివుఁడు. ఆమోదము - సంతోషము - నుదేస - కొమ్మను - ఈశాన యమునలుగల ప్రమథగణములుగలవారు రోషదీపితమతులై - క్రోధముచే మండుచున్న మనస్సులు గలవారై.

తాత్పర్యము

మంచువంటి తెల్లనికాంతిచే మనోహరమైన యీ యేనుఁగును కుశలప్రశ్నముఁ గావించి పోయి యీశాన్యదిక్కును కోపముచే మండిపడుచుఁ ద్రవ్విరి.

సగరకుమారులు కపిలుకోపాగ్నిని భస్మీభూతులగుట

ఉ॥ రాకొమరుల్ మహాబలపరాక్రమశీలురు త్రవ్వుచోట ను
ద్రేకిత వాసుదేవుని నరీణతపోనయు దేవదేవుని
న్బ్రాకటయోగశీలుని సనాతను నాతనిదాపునందు హే
షాకలితాశ్వముం గనుచు సంతస మందుచుఁ గ్రోధమూర్తులై. ౧౭౦

రాకొమరుల్ = రాజకుమారులు, అరీణ=వక్రముగాని, సనాతను=నిత్యుని; హేషాకలితాశ్వముఁ = సకిలించుచున్న గుఱ్ఱమును, వాసుదేవునిఁ = భగ

వంతుని - జగము లెవ్వనియందు వసించునో, యెవ్వఁడు జగములందు వసించునో యట్టివాఁడు వాసుఁడు. వాసుదేవుఁడే వాసుఁడు. భీముఁడు - భీమసేనుఁడు వలె. వసంత్యస్మిన్ జగంతీతి వాసుః. వాసుశ్చ అసౌ దేవశ్చ వాసుదేవః. వసత్యాత్మా జగత్యత్ర తస్మిన్ వసతివా జగత్ స వాసుదేవః - అని వాసుదేవ శబ్దనిర్వచనము.

తాత్పర్యము.

మహాబలపరాక్రమవంతులైన రాజకుమారులు భూమినిఁ ద్రవ్వుచో నొకచోట పూర్ణతపస్స్వరూపుని దేవతలకెల్ల దేవుఁడగువానిని యోగము స్వభావముగాఁగలవానిని నిత్యుఁడగువానిని వాసుదేవునిని, ఆయన సమీపమందు సకిలించుచున్న గుఱ్ఱమును జూచి కష్టము గట్టెక్కె నని సంతోషించి కోపంబు రూపంబు గొనినవారివలెనై.

చ॥ నిలు నిలు మోరిచోర! తగునే యిఁక యజ్ఞహయాపహరణంబు ముచ్చిల? మునిముచ్చవై యిచటఁ ♦ జేసిన బూమెలు మోసపోదుమే,
తెలియవె సాగరావళులఁ ♦ దీరునె డొంగినయంతమాత్రనే
పలువ! మదీయఘోటకముఁ ♦ బట్టినసీకిక నేఁడు దిక్కురా? ౨౭

చోర = దొంగా - యజ్ఞహయాహరణంబు = యజ్ఞముకొఱకై యుద్దేశించిన గుఱ్ఱమును - ముచ్చిలన్ = దొంగిలింపఁగా - తగునే = తగునా - మునిముచ్చు = దొంగముని - బూమెలు = మాయలు - డొంగిన = దొంగవేషమువేసి, దాఁచుకొనిన - ఘోటకము = గుఱ్ఱము - దిక్కు = రక్షకుఁడు "దొంగవలె వచ్చి యిచ్చట డొంగినావ దేవయా బావగారు" అని ప్రయోగము.

తాత్పర్యము.

ఓరోరి దొంగవాఁడా! నిలు - నిలు. యజ్ఞపుగుఱ్ఱమును దొంగిలించి యజ్ఞమునకు విఘ్నముచేయుట నీకు ధర్మమా? మునివేషము వేసినంతనే నీమాయలకు మేము మోసపోదుమా? ఓరి పలువా! మాగుఱ్ఱమును బట్టుకొనిన నీకు నెవఁడురా యిప్పుడు రక్షకుఁడు?

క॥ జంకక యిటు పల్కినయా, మంకులఁ గని కపిలమౌని ♦ మండుచుఁ గినుకన్
హుంకారముఁ గావించిన, బింకము చెడి వారలైరి ♦ వెలిమిడిప్రోవుల్. ౨౮

జంకక = భయపడక - మంకులన్ = మూర్ఖులను - సాధు వెవఁడో యసాధు వెవఁడో తెలియులేనిమూఢులను - కని=చూచి - బింకము = పౌరుషము - వెలిమిడిప్రోవుల్ = బూడిదరాసులు.

సాంఖ్యదర్శనాచార్యుఁడైన కపిలుఁడే యీకపిలుఁడని భాగ. ౯ స్కం. ౨౦౯ పద్యమువలనఁ దెలియనయ్యెడి.

సీ॥ కొందఱు కపిలుని కోపానలంబున మ్రందిరి సగరకుమారులనుచు। నందురాముని శాంతుఁ డానందమయమూర్తి తోడరి కోపించునే దువ్వనేలఁ।గాక జన్మించునే గగనస్థలంబున నే సాంఖ్యమతమున నిద్ధమతులు। భవసముద్రము మృత్యుభయమును లంఘింతు రాబుద్ధిఁజేయు పరాత్మభూతుఁ। డఖిలబోధకుఁ డతనికినరసి చూడ। సఖులమిత్రులు నెవ్వరు సగరసుతులు। దాము దమచేయు నేరమిఁ దనువులందు। నవలకీలలు పుట్టి నీఱైరిగాక ।

తాత్పర్యము.

భయములేక యిట్లు మాటలాడిన యావివేకశూన్యులగు మూఢులను జూచి కోపించి మండుచు హుఙ్కారముతో క్రోధాగ్నిచేఁ గాలినవారై వారందఱొక్కసారిగ బూడిదరాసులై పడిరి.

౪౧ సర్గము

సీ॥ అక్కడ సగరుఁడు • స్రుక్కుచు నాత్మలోఁ, బెద్దకాలంబైన • బిడ్డలెల్ల
రామికి వగచి గా•రాముమనవనిఁ జూచి, నాయనా! నీకు లేఁ•బ్రాయమైనఁ
గృతవిద్యుఁడవు మఱి • కృతహస్తుఁడవు మహా,శూరవరుండవు • ధీరతాది
సద్గుణంబులఁ బూర్వ•జనపాలురను బోలు,వాఁడవు గుఱ్ఱంబు•వలతి యెఱిఁగి
తే॥ పిన్నతండ్రు లదేగతిఁ • జన్నవారొ, వారిపోఁబడి యారసి • వత్స! రమ్ము
నీకతంబున జన్నంబు • నేను నిర్వ,హింపఁగలవాఁడ వేగ నీ• వేగి రమ్ము. ౮౭౩

లేఁబ్రాయము = లేఁతప్రాయము, చిన్నవయస్సు - వలతి = జాడ - నీకతంబున = నీకారణమున - కృతహస్తుఁడు = గుఱి చక్కఁగాఁ గొట్టఁగలవాఁడు.

తాత్పర్యము

అక్కడ యజ్ఞవాటమందు సగరుఁడు తనలోఁ గొడుకులు పోయి చాలఁ గాలమైనను రాకపోయిరే - వారిజాడ తెలియదాయెనే - యజ్ఞము పూర్తికాకపోయెనే యని సంతాపించి ముద్దు మనుమని నంశుమంతుని జూచి నాయనా! నీవు చిన్నవాఁడవైనను విద్యావంతుఁడవు,విలువిద్యయందుఁ జక్కఁగాఁ జేయి తిరిగినవాఁడవు, శూరులందు గొప్పవాఁడవు, ధైర్యము లోనగు నుత్తమపురుష సుగుణంబులందుఁ బూర్వరాజులను బోలువాఁడవు. నీవు పోయి గుఱ్ఱపుజాడ తెలిసికొని నీపినతండ్రు లేమైపోయిరో వారిపోఁబడి గుర్తెఱిఁగి రమ్ము. నీకారణమున నేను యజ్ఞము నిర్వహించినవాఁడ నగుదును. పొమ్ము - వేగరమ్ము.

తే॥ భూమిలోపలఁ గల్గిన • భూతతతులు, భూరిసత్త్వవిశిష్టముల్ • పురుశరీర
వంతములు గాన వానిని • ర్వాపణార్థ, మసియుఁగోదండమునుగొని • యరుగవయ్య.
౧౭౪

భూరిసత్త్వవిశిష్టముల్ = మిగులబలముగలవి - పురుశరీరవంతములు - పెద్ద దేహములుగలవి - నిర్వాపణార్థంబు = చంపుకొఱకు - అసి = కత్తి.

తాత్పర్యము.

భూమిలో గొప్పబలము పెద్దదేహముగల భూతము లుండును. అవి సులభసాధ్యములు గావు. కావున వానిని వధించుటకుఁగాను విల్లుబాణములు ఖడ్గము తీసికొని పొమ్ము.

కం॥ మ్రొక్కఁదగువారికెల్లను, మ్రొక్కుము విఘ్నంబు సేయు • మొఱకుల బలిమిన్
దక్కగొనుము కదనంబునఁ, జక్కఁగ జనుదెమ్ము కార్య • సాధకుఁడగుచున్. ౧౭౫

మొఱకులన్ = మూర్ఖులను - దక్కగొనుము = వశపఱుచుకొనుము - కదనంబునన్ = యుద్ధమందు.

తాత్పర్యము.

మ్రొక్కఁదగినవారికి మ్రొక్కుము. నీకార్యమునకు విఘ్నముచేయు మూర్ఖులను యుద్ధముచేసి జయింపుము. కార్యము సాధించుకొని యాలస్యము లేక చక్కఁగా రమ్ము.

—* అంశుమంతుఁడు యజ్ఞాశ్వము వెదకఁ బోవుట. *—

చం॥ అన విని యంశుమంతుఁ డటు • లౌ నని ఖడ్గియు ధన్వి యౌచు గ్ర
క్కనఁ జని పిన్నతండ్రు లిల • ఖాతముచేసినచొప్పు పట్టి భూ
మిని వడిఁజొచ్చి యచ్చట సు • మేరుసమోరుదిశాగజంబుఁ గ
న్గొని వలగొంచు వేఁడెఁ దమ • గుఱ్ఱముచొప్పుఁ బితృవ్యసంస్థితిన్ ౧౭౬

అటులౌన్ = అటులే యగునుగాక - ఖడ్గియు = ఖడ్గముధరించినవాఁడును. ధన్వి = విల్లుధరించినవాఁడును - గ్రక్కన = త్వరఁగా - సు-గ్రక్కున- సుమేరు= మేరుపర్వతముతో, సమ = సమానమైన - ఉరు = గొప్పదైన - దిశాగజంబున్ = దిగ్గజమును - వలగొంచు = ప్రదక్షిణముచేయుచు - పితృవ్య = పిన్నతండ్రుల - సంస్థితిన్ = మరణమును - బాగుండువిధమును.

తాత్పర్యము.

ఆమాటలు విని యంశుమంతుఁ డట్టులే చేసెద నని యంగీకరించి విల్లు-ఖడ్గము ధరించినవాఁడై జాగుచేయక తనపినతండ్రులు భూమిని త్రవ్విన జాడపట్టుకొని

భూమిలోఁ బ్రవేశించి యచ్చట మేరుపర్వతముతో సమానమైన పెద్దదేహము గల దిగ్గజమును జూచి దానికిఁ బ్రదక్షిణము సలిపి గుఱ్ఱపుజాడ పిన్నతండ్రులస్థితి యడిగెను.

ఆ॥ అంశుమత్కులీన ♦ నంశుమంతునిఁ జూచి, దిగ్గజంబు పలికె ♦ దివ్య తేజ! యబ్బు నీకుఁ దేజి ♦ గొబ్బున నీవు కృ, తార్థుఁ డగుచుఁ బురికిఁ ♦ నరుగఁ గలవు
౮౭౭

అంశుమత్కులీను = సూర్యవంశమునఁ బుట్టినవానిని. తేజి = గుఱ్ఱము - కృతార్థుఁడవు = కార్యము సాధించినవాఁడవు. తేజ = "దీర్ఘాణాం హ్రస్వస్స్యాత్ - నచ దేశ్యపదే-నైకవర్ణే న దేశ్యేపి హ్రస్వో దేశ్యేతువా క్వచిత్" అని యుండుటచేఁ దేజీ - తేజి, పల్లకీ - పల్లకి యని రెండురూపంబులు ప్రయోగంబులఁ గాన నయ్యెడి.

తాత్పర్యము.

సూర్యవంశమునఁ బుట్టినవాఁ డగు నంశుమంతునిఁ జూచి యాయేనుఁగు దివ్యతేజా! నీకు శీఘ్రకాలమందే గుఱ్ఱము లభించును - కార్యము సాధించికొని యూరికి సుఖముగఁ జేరఁగలవు.

తే॥ అనిన నాపల్కు లాలించి ♦ యచటు విడిచి, చనుచు దిగ్గజపంక్తిని ♦ సరవిఁగాంచి యపచితి నొనర్చి యర్థించె ♦ నశ్వవిధముఁ, బిన్నతండ్రులచొప్పును ♦ బ్రేమనవియు.
౮౭౮

ఆలించి = విని. అచటు = ఆచోటు. ఎట్లు - అచటు - అచ్చోటు - అచ్చోట్టు - అచోటు. అపచితి = పూజ. అర్థించెను = వేఁడెను.

తాత్పర్యము.

అని యాయేనుఁగు చెప్పఁగా విని యాస్థలము విడిచిపోయి వరుసగా దిగ్గజములనెల్ల గాంచు వానినెల్ల గుఱ్ఱముండుపట్టును పిన్నతండ్రులగతియును దెలుపుఁడని ప్రార్థించెను.

కం॥ మఖఘోటకముం గొనుచును, సుఖముగ మరలంగఁ గలవు ♦ సుమ్మీ నీ వీ ముఖముగఁ జను మన నాశత, మఖవిక్రముఁడట్లు యరిగి ♦ మార్గమునందున్.
౮౭౯

మఖఘోటకము = యజ్ఞమున కగు గుఱ్ఱము - శతమఖవిక్రముఁడు = ఇంద్రునిపరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు.

తా త్ప ర్య ము.

యజ్ఞాశ్వమును గ్రహించి సుఖముగ మరల నయోధ్యకుఁ బోయెదవు. ఈముఖముగఁ బొమ్మని యవిత్రోవచూపిన రాజకుమారుఁడును ఆప్రక్కఁబోవుచు మార్గమందు.

తే॥ పిన్నదండ్రులబూదిప్రో • వున్నఁగాంచి, సైఁపఁగారానిదుఃఖాన • సంతపించి
వావిడిచి యేడ్చె వారల•వధమునకును, జనకదుఃఖంబు సుతునకు•సహ్య మెట్లు? ౧౦

ప్రోవు = రాశి. వా = నోరు.

తా త్ప ర్య ము.

పిన్నతండ్రుల బూడిదరాసులను జూచి దుఃఖముసహింపలేక నోఁగువిచ్చివారి మరణమునకై హా యని యేడ్చెను. తండ్రులమరణము బిడ్డలకు దుఃఖకరమే కదా!

—* పితృవ్యులకై వగచు నంశుమంతుని గరుడుం డూరార్చుట *—

ఉ॥ కన్నుల నీరు జాలుగొన • గద్గదికం గొని, మే తమేయు చం
దున్నహయంబుఁ గాంచి, తగ • వూహ యొనర్చి జలక్రియాదులం
గ్రన్ననదీర్ప రోయఁ గన • రా దొకఁడేని జలాశయంబు, త
త్ఖిన్నత నన్నిచోట్లఁ బరి•కించుచు దూరమునందు నొక్కెడన్. ౧౧

జాలు = వెల్లువ, జలక్రియాదులన్ = నివాపములను - చచ్చిన వారికి నీళ్లు విడచుటలోనైనవి.

తా త్ప ర్య ము.

కన్నులనుండి నీరు ప్రవాహమువలెఁ గాఱుచుండఁగా గొంతు డగ్గుత్తికపడుచుండ నచ్చట మేఁతమేయుచున్న గుఱ్ఱమునఁజూచి, చచ్చినవారికి నీళ్లు విడువవలయునే - యెట్లు సేయుదునా? సమీపమందు నీళ్లున్నవా యని వెదుకఁగా నొక తటాకమైనను గానరాదయ్యెను. దానికిఁ జాల విచారపడి యింకను నన్ని ప్రదేశములందు వెదకఁగా దూరమునం దొకచోట.

చం॥ కనియెఁ బితృవ్యమాతులు ఖ•గప్రకరప్రవరేణ్యుఁ బుణ్యపా
వనజనతావగీర్ణుని సు•వర్ణసవర్ణు సుపర్ణు నంత న
వ్వినతతనూభవుండు పృథి•వీవరపుత్రునిఁ జూచి పల్కె స
జ్జనవతధీరతా! భువన • సమ్మత మీవధ కుందు మానుమీ. ౧౨

పితృవ్యమాతులు= పిన్నతండ్రులమేనమామను-ఖగప్రకరప్రవరేణ్యున్=పక్షిసమూహముల కధిపతియైన వాని, పుణ్య...గీర్ణుని = పుణ్యముచేఁ బవిత్రులైన

జనసమూహముచేఁ బొగడఁబడినవానిని. సువర్ణ = బంగారుతో. సవర్ణు = సమానవర్ణముగలవాని, బంగారుచాయగల దేహముగలవానిని. సుపర్ణు = గరుత్మంతుని. వినతతనూభవుండు = వినతయొక్క కొడుకు.

తాత్పర్యము.

పిన్నతండ్రులకు మేనమామయు పక్షికులమున కధిపతియు పుణ్యములు చేసి పవిత్రులయిన జనసమూహముచే స్తోత్రము చేయఁబడువానిని బంగారువలె నెట్టని పచ్చని దేహముగలవానిని గరుత్మంతునిఁ జూచెను. అంత నా గరుడుఁడును రాజకుమారునిఁ జూచి, సజ్జనులచే బుద్ధిమంతుఁ డనిపించుకొనిన నాయనా! వీరి మరణము లోకసమ్మతమైనదే. కావున నీవు వగవకుము.

ఆ॥ అప్రమేయుఁడైన♦హరి కపిలాకృతిఁ, గసి మసంగి వీరిఁ ♦ గసిమసంగి
మసిగఁ జేసెఁజుమ్ము ♦ మహితవిక్రములకు, వగవఁ జన్నె రాజ♦వర్యతనయ! ౧౮౩

అప్రమేయుఁడు = అల్పత్వమందుఁగాని మహత్త్వమందుఁగాని పరిమాణము చెప్పరానివానిని. "అణోరణీయాన్ మహతో మహీయాన్" అని శ్రుతి. హరి — కపిలాకృతి = కపిలుని యాకారము. కసి = పగ. మసగి = విజృంభించి. కసిమసంగి విజృంభించి.

తాత్పర్యము.

పరిమాణము చెప్పరాని విష్ణువు కపిలు నాకారము గొని వీరుచేసిన దుండగమునకు వీరిపైఁ బగవహించి వీరిని జంపి బూదిచేసెను. రాజకుమారా! నీవు క్షత్రియుఁడవై పరాక్రమవంతుల చావునకు విలపింపవచ్చునా?

ఉ॥ శూరుల కీధరామరని♦షూదితమాన్యులకున్ నివాపముల్
వారిజమిత్రవంశ్య! తగ♦వా తగువారిని నీయ కిట్లు ని
స్సారపుసారసాకరము♦సారములం గొని యీయఁ బూన? నీ
హారధరాధరాగ్రతన♦యాంబువులం ఘటియింపు మే లగున్. ౧౮౪

ధరామర = బ్రాహ్మణునిచే - నిషూదిత = చంపఁబడిన - మాన్యులకున్ = గౌరవింపఁదగినవారికి - నివాపములు = ఉదకములు - తగు వారిని = యోగ్యమైన నీటిచే - నిస్సారపు = సారములేని - సారసాకరము = తటాకముయొక్క - సారములన్ = నీటిచే- నీహారధరాధర = మంచుఁగొండయొక్క - అగ్రతనయా = పెద్దకొమరితయొక్క - అంబువులన్ = నీటిచే - ఘటియింపు = చేయుము.

'చండాలా దుదకా త్సర్పా ద్వైద్యుతాత్ బ్రాహ్మణాదపి, దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణం పాపకర్మణాం. ఉదకం పిండదానంచ ఏతేభ్యో యద్విధీయతే,

నోపతిష్ఠతి తత్సర్వ మంతరిక్షేతు నశ్యతి'—స్మృతి. చండాలుర చేతను, నీళ్లచేతను, పాములచేతను, పిడుగులచేతన, బ్రాహ్మణులచేతను, కోఱలుగల మృగముల చేతన, పశువులచేతను పాపకర్ములకు మరణము సంభవించును. వీరికై చేయు తర్పణములు పిండప్రదానములు వీరికిఁ జెందవు. ఆకాశముననే నశించును. కావున వీరికి గంగోదకముచేఁ దర్పణములు - కర్మములు జేసినఁగాని వీరికిఁ బిశాచత్వము పోదు.

తా త్ప ర్య ము.

బ్రాహ్మణకోపముచేఁ జచ్చినవారికిఁ దగినట్లు లుదకదానము చేయకున్న నూర్ధ్వగతులు లేవు. కావున వారికి యోగ్యమైన పుణ్యతీర్థములచే నుదక దానముచేయక నిస్సారమైన చెఱువునీటిచేఁ జేయనగునా? కావున హిమ వంతుని పెద్దకూఁతు రగు గంగాదేవిని తెచ్చి యానీటిచే నుదకదానము చేసితి వేని వారికి నూర్ధ్వలోకములు గలుగును.

—* అంశుమంతుని గరుత్మంతుఁడు గంగఁ దేర బోధించుట *—

ఉ॥ పావనశీల! వీరివగు ♦ భస్మసమూహముమీఁద నా జగ
త్పావని పాఱె నేని పరి♦భావితనారకమార్గు లౌచు సం
భావన పొంది నాకమున ♦ భావన కందని సౌఖ్యసంతతుల్
వావిరిచేపడఁగ సతము ♦ వాలఁ గలా రటు చేయు పుత్రకా! ౮౮౫

పరిభావిత = తిరస్కరింపఁబడిన - నారకమార్గులు = నరకమార్గముగలవారు. నాకమునఁ = స్వర్గమందు - భావనకు = ఆలోచనకు - చేపడఁగ =లభింపఁగా.

తా త్ప ర్య ము.

పవిత్రమైన యాచారముగలవాఁడా! వీరి భస్మరాసులమీఁద లోకపావని గంగ పాఱెనేని వీ రిందఱు నరకమునకుఁ బోక గౌరవముగలవారై యిట్టి దని చెప్ప సాధ్యపడని సౌఖ్యపరంపర లనుభవించుచు స్వర్గమున నుండఁగలరు. కావున కుమారా! నీ వట్లు చేయుము.

క౦॥ చేవాటునఁ జరియించెడి, యావారుపమున్ గ్రహించి ♦ యరుగుము వత్సా!
కావింపు తాతజన్నము, వేవే పారంబుముట్ట ♦ విశ్వం బెఱుఁగన్. ౮౮౬

చేవాటునఁ = సమీపమునందు.

తా త్ప ర్య ము.

సమీపమందే పచ్చిక మేయుచున్న గుఱ్ఱమును దీసికొని పొమ్ము. తాతచేయు యాగమును సాంతముచేయుము.

సీ॥ ఆఖగేంద్రునివాక్య ♦ మాలించి యంశుమంతుఁడు వోయి పురికిని ♦ దురికిఁగొనుచు
దీక్షితుఁడై యున్న ♦ యాక్షితిపాలుని, వీక్షించి సర్వంబు ♦ విన్నవించె
వైనతేయునిబోధ ♦ లోనుగాఁగలవట్టు, లంతయు విని వ్యథా ♦ క్రాంతమతిని
సగరుండు మిక్కిలి ♦ పొగిలి జన్నముఁ దీర్చి, విహితకల్పము యథా ♦ విధిగ నంతఁ

తే॥ దనదుపురిఁ జేరి యాకాశ ♦ ధునిని ధరణిఁ, జేరఁ దేరంగ మార్గంబు ♦ నేరకతఁడు
చాలఁ దలపోఁత ముప్పది ♦ వేలయేండ్లు, ధరణిఁ, బాలించి దివమున ♦ కరిగెఁబిదప ౧౧౭

ఖగేంద్రునివాక్యము = పక్షిరాజగు గరుఁడునిమాట, తురికి = తురగము, వైనతేయుఁడు = వినతాకుమారుఁడు, గరుత్మంతుఁడు, వ్యథాక్రాంతమతిని = వ్యసనముచే నాక్రమింపఁబడిన మనస్సుచే, పొగిలి = దుఃఖించి

తాత్పర్యము.

ఆగరుత్మంతుని మాట విని యంశుమంతుఁడు గుఱ్ఱముతోఁ దనయూరుచేరి తాత యగు సగరునిఁ జూచి పిన్నతండ్రులగతియు గరుడుఁడు చెప్పినవిధము మొదలుగా నంతయుఁ జెప్పఁగా సగరుఁడు పుత్త్రశోకంబునఁ బీడితుఁడై యుద్దేశించిన ప్రకారము యజ్ఞమును సాంతముగఁ దీర్చి తనయూరికి నయోధ్యకుఁ బోయి యాకాశగంగను భూమికిఁ దెచ్చు టెట్లో తెలియక యాలోచనతోనే ముప్పది వేల యేండ్లు భూమిని బాలించి స్వర్గమున కరిగెను.

—* ౪౨-వ సర్గము *—

చం॥ ప్రకృతిజనంబు లెల్లరును ♦ రాజుగఁ గోరిరి యంశుమంతు ధా
త్రికవరు; నాతఁ డాత్మజు న ♦ మేయబలుం గనుచుండ్ దిలీపునిన్
సకలధరిత్రి యాతనిభు ♦ జంబుల నిల్పి తపంబు చేసె నై
హికగిరిరాజకూటమున ♦ కేగి భయంకరనిష్ఠ గంగకై ౧౧౧

ప్రకృతిజనంబులు = మంత్రులు లోనగువారు.

తాత్పర్యము.

మంత్రులు సామంతులు లోనగువా రందఱు ధర్మనిష్ఠుఁడైన యంశుమంతునే రాజుగఁ గోరిరి. ఆయనయు మహాబలసంపన్నుఁడైన తనకుమారుఁడగు దిలీపుని పై రాజ్యభారము నిలిపి హిమవత్పర్వతమున కేగి యచట గంగకై ఘోరమైన తపస్సుచేసెను. కాళీదాసుఁడు చెప్పిన దిలీపుఁ డితఁడు కాఁడు

తే॥ ముప్పదియు రెండువేలేండ్లు ♦ మొనసి తపము, సలిపి గంగను దేలేక ♦ స్వర్గమరిగ
నాపుడమితేఁడు పిదప ది ♦ లీపవిభుఁడు, తాతలమృతికి దుఃఖప ♦ రీతమతిని. ౧౧౯

తా త్ప ర్య ము.

ముప్పదిరెండువేలేండ్లు తపముచేసి గంగను తేలేక మరణించెను, ఆయన వెనుక దిలీపుఁడు దన తాతల మృతికిఁ జాల దుఃఖించి.

కం॥ నీఁగంగఁ బితలఋణముం, దేఁగం గను టెట్లొ గంగఁ ♦ దిప్పలపై నే
నీఁగంగాఁ జేయు టెటో, యీఁగం గాండములు వారి ♦ కెట్లయ్యెడినో. ౫౯౦

నీఁగంగన్ = తీర్చుటకు - పాపుకొనుటకు, నీఁగంగాన్ = విస్తరింపఁజేయుటకు, ఈఁగన్ = ఈయఁగ, కాండములు = ఉదకములు.

తా త్ప ర్య ము.

నే నెట్లు గంగను దెత్తును-పితరులఋణ మెట్లు దీర్తును - గంగను దెచ్చినను బూదిరాసులపై నెట్లు వ్యాపింపఁజేయుదును - ఆనీళ్లతో నే నుదకముల నెట్లు విడుతును - ఇది యెట్లు సాధ్యమగును?

సీ॥ అనుచుఁ జింతావశుఁ ♦ డయి సల్పె ప్రెక్కుల, ధ్వరముల నొకముప్పఁదు♦పదులవేలు
వర్షముల్ పాలించి ♦ వసుధను బితరుల, నుద్ధరింపఁగఁజాలు♦నోజలేక
శోకావిలుం డయి ♦ నాకలోకముఁ జేరె, సుతు భగీరథు భూమి♦పతిఁగఁ జేసి
యతఁడు రాజర్షియై ♦ హితము నాలోచించి, యనపత్యుఁ డగుటచే ♦ నఖిలధరణి
తే॥ యాత్మసచివాగ్రణులకును ♦ నప్పగించి, గంగఁ దేరంగఁ బూని గో♦కర్ణమునకు
నరిగి పంచాగ్నిమధ్యంబు♦నందు నిలిచి, నిర్జితేంద్రియుఁ డయి కడు♦నిశ్చలముగ. ౫౯౧

తా త్ప ర్య ము.

అని చాలవిచారపడుచు ననేకయాగములు చేసి ముప్పదివేల యేండ్లు భూమిని బాలించి పితరుల నుద్ధరింపఁ దెలియక శోకముచే వికలమైన మనస్సు గలవాఁడై తనకొడుకును భగీరథుని రాజుగఁజేసి మరణించెను. భగీరథుఁడు రాజర్షియై బిడ్డలు లేనివాఁడగుటచే నేదిచేసిన మేలుగలదో యని యాలోచించి రాజ్యమును మంత్రులకు వశపరచి గంగను దెచ్చుటకై గోకర్ణమునకుఁ బోయి యచ్చట పంచాగ్నుల నడుమనుండి యింద్రియముల జయించి మిక్కిలి చలింపని మనస్సుతో. పంచాగ్నులు = నాలుగు ప్రక్కల మంటలు పైనసూర్యుఁడు.

—* భగీరథుఁడు గంగకై తపంబు చేయుట *—

ఉ॥ వర్షము లొక్క వేయి యని♦వారితవిక్రముఁ డూర్ధ్వబాహుఁడై
వర్షము గాలి నాక, గొని ♦ వన్యములన్ నెల కొక్క తేప, సో
త్కర్షతపంబు సేయఁగను♦ దద్దయుఁ దా నెద మెచ్చుచుం జతు
శ్శీర్షుఁడు నిర్జరర్షితతి ♦ చెంతలఁ గొల్వఁగ వచ్చి యిట్లనున్. ౫౯౨

అనివారిత = వారింపఁబడని - ఊర్ధ్వబాహుఁడు = చేతులు మీఁదికెత్తిన వాఁడు. నాక = అనక - వన్యములన్ = అడవియందుఁబుట్టిన కందమూలఫలాదులను - సోత్కృష్టతపంబు = ఉత్కృష్టమైన తపస్సును - చతుశ్శీర్షుఁడు = బ్రహ్మ - నిర్జరర్షితతి = దేవమునుల సమూహము - చెంతలన్ = పార్శ్వములందు.

తాత్పర్యము.

ఒకవేయి సంవత్సరములు విక్రమవంతుఁడైన భగీరథుఁడు చేతులెత్తి నిరాలంబనుఁడై నిలిచి వానను గాలిని లక్ష్యపెట్టక నెలకొక్కసారి యడవియందుఁ బుట్టిన కందమూలఫలములఁ దినుచు గొప్పతపముచేయఁగా బ్రహ్మదేవుఁడు మెచ్చి దేవర్షులు సేవింపఁగా వచ్చి యాయనతో నిట్లనియె.

శా॥ వత్సా! లెమ్ము భగీరథా! వరములం బ్వాంఛింపుమా! నీదు ని
ష్కుత్సాతుల్యతపస్సమాధి కెద మెంచ్చున్ వచ్చె నం చన్న నా
సత్సౌజన్యధనుండు లేచి విచికిత్సాదూరుఁడై చూచి భా
స్వత్సౌవర్ణశరీరు హస్తపుటముల్ సంధించి తా నాదలన్. ౮౯౩

వాంఛింపుమా = కోరుమా- నిష్కుత్స = వంచనలేని- అతుల్య = అసమానమైన. తపస్సమాధికిన్ = తపమునందలి చిత్తస్థైర్యమునకు, ఎదన్ = మనస్సునందు - విచికిత్సాదూరుఁడై = సందేహమును విడిచినవాఁడై - భాస్వత్ = ప్రకాశించుచున్న - సౌవర్ణ + శరీరున్ = బంగారువంటిపచ్చనిశరీరముగలబ్రహ్మను - హస్తపుటముల్ = దొప్పవలె చేతులు జోడించి, ఔదలన్ = ముందలయందు.

తాత్పర్యము.

కుమారా! భగీరథా! లెమ్ము. నీకోరిక లేవియో తెలుపుము. నిర్వంచనముగా నీవు చేసిన యసమానతపస్సులకు మిగులమెచ్చితిని - అని చెప్పఁగా, సౌజన్యమే ధనముగాఁగల యా భగీరథుఁడు సందేహరహితుఁడై బ్రహ్మదేవునిఁ జూచి బంగారువన్నెగల యాపరమేష్ఠికి ముందల చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె.

తోటకము॥ జగదీశ్వర నాకుఁ బ్రసన్నుఁడవే, నొగి నాతపమున్ ఫలయుక్తమ యే
న్నగరాత్మజులందఱు నావలనన్, వగదీఱఁగఁగాంత్రు నివాపములన్. ౮౯౪

నివాపములు = పితరులకు విడుచు నుదకములు - తర్పణములు.

తోటకవృత్తమునకు నాలుగు సగణంబులు. తొమ్మిదవ యక్షరము యతిస్థానము.

తాత్పర్యము.

లోకనాయకా! నాయందు నీ వనుగ్రహించితివేని నాతపము ఫలించినదేని సగరకుమారులందఱు నావలన నివాపములను గ్రహించి సుఖింతురుగాక.

కం॥ హైమవతీజలములఁ బ్రపి, తామహాభసితములఁ దడుపఁ ♦ దా రరుగఁగ స్వర్భూమికి, వంశము నిలువంగా మహి సుతు లొదవ వరముఁ ♦ గరుణింపు మనన్ ౮౯౫

హైమవతీజలములన్ = గంగాజలములచే - భసితము = బూడిద.

తాత్పర్యము.

దానికై నీ కేమికావలయు నందువా? గంగానదీతీర్థములచే నాతాతల బూడిదరాసులఁ దడుపఁగా వారందఱు స్వర్గమునకుఁ బోవలయును. భూమిమీఁద మాయిక్ష్వాకువంశము నిలిచిపోకయుండునట్లు నాకు పుత్త్రుల నిమ్ము.

కం॥ దుర్ధర్ష! యట్లయగు నా, స్వర్ధుని దివినుండిపడఁగ ♦ క్ష్మాతలమునకున్ దుర్ధరము గాన వేఁడుము, యర్ధేందుకిరీటు, నోపఁ ♦ డన్యుఁడు సైఁపన్. ౮౯౬

దుర్ధర్ష = శత్రువులకు జయింపరానివాఁడా - స్వర్ధుని = ఆకాశగంగ - దుర్ధరము = ధరింపరానిది - అర్ధేందుకిరీటున్ = శివుని.

తాత్పర్యము.

జయింపరాని పరాక్రమముగలవాఁడా! నీవుకోరినట్లే యగునుగాక. ఆకాశగంగ భూమిపైఁ బడెనేని యావేగమును భారమును భూమి సహింపఁజాలదు. కావున దానిని భరించుటకు శివునిఁ బ్రార్థింపుము. ఆయనతప్ప మఱియెవ్వరు దానిని సహింపఁజాలరు.

కం॥ అని యిట్లుపల్కి యారా, జునకున్ మఱి నాకనదిని ♦ జూచి సతీ! యీ యనఘునికోరిక దీర్పుము, యని యంతర్ధాన మయ్యె ♦ నమరులతోడన్. ౮౯౭

తాత్పర్యము.

అని యిట్లు రాజునకుఁజెప్పి గంగను జూచి సతీ! యీపుణ్యచరిత్రునికోర్కి దీర్చుటకై భూలోకమునకుఁ బొమ్మని చెప్పి బ్రహ్మ యంతర్ధానమాయెను.

—* ౪౩-వ సర్గము *—

కం॥ ఈవిధి విధి పల్కి తిరో, భావంబును బొందఁ దనదు ♦ భావమున హరున్ భావించి బొటనవ్రేల్పను, ధావరుఁడిల మోపి యేఁడు ♦ తప మొనరించెన్. ౮౯౮

ఈవిధిన్ = ఈరీతిగ - విధి = బ్రహ్మ - తిరోభావము = కానరాకపోవుట - బొటనవ్రేలు = కాలిబొటనవ్రేలు - ఇలన్ = భూమియందు - వసుధావరుఁడు = రాజు - ఏఁడు = సంవత్సరము.

తా త్ప ర్య ము.

ఈవిధముగ బ్రహ్మదేవుఁడు చెప్పి మాయమై పోఁగా భగీరథుఁడు కాలిబొటనవ్రేలు నేలపై మోపి నిలఁబడి శివునిఁగూర్చి యొకయేఁడు తపమొనరించెను.

ఉ॥ బాహులు మీఁది కెత్తుకొని ♦ పట్టొక యింతయు లేకయుం బృష
ద్వాహము భోజనంబుగను ♦ స్థాణువుపోలిక నిట్ట నిల్చి యా
యాహతలక్షణుండు మద♦నారిని గొల్వ నహర్నిశంబు గో
వాహనుఁ డేగి యాధరణి ♦ వల్లభునిం గని పల్కెఁ గూర్మితోన్.   ౮౯౯

పృషద్వాహము = వాయువు (జింకవాహనముగాఁ గలవాఁడు) ఆహతలక్షణుండు = గుణములచేఁ బ్రసిద్ధుఁడైనవాఁడు - మదనారి = శివుఁడు (మదన + అరి), అహర్నిశంబు = పగలు, రేయి - విరామములేక, గోవాహనుఁడు = శివుఁడు, "గౌః క్రతౌ వృషభే చంద్రే" - నానా. గోశబ్దము పుంలింగమందు వృషభమునకు - స్త్రీలింగమందు ఆవునకుఁ బేరు.

తా త్ప ర్య ము.

చేతులు రెండు పైకెత్తి యాధారముగ దేనిని బట్టుకొనక నిరాధారముగ నిలువఁబడి నిట్టనిల్చి (నిడివిగా నిలఁబడి) యాసుగుణములచేఁ బ్రసిద్ధుఁడైన భగీరథుఁడు శివునిగూర్చి రేయుఁబగలు తపస్సుచేయఁగా శివుఁడు ప్రత్యక్షమై యారాజును జూచి ప్రేమతో నిట్లనెను.

సీ॥ ప్రీతుండ నైతి నో♦నృపతికులాగ్రణీ, శిరమున వహియింతు ♦ సురసరిత్తు
నని పల్కినంతనే ♦ యాకాశవాహిని, గర్వసముద్రేక♦గరిమఁ దలఁచె
నోపునే నాదునా♦టోపంబు సీతఁడు, వీనిని గొని యేగు♦దాన నిపుడ
పాతాళమున కని ♦ భయదరూపంబున, దుస్సహవేగంబు ♦ తోరముగను

తే॥ వచ్చు నప్పుణ్యవాహినీ ♦ పటిమఁజూచి, దానిగర్వం బెఱింగి భ♦వానివిభుఁడు
రోషసంరంభమూర్తియై ♦ రూపుమాపఁ, దలఁచెఁ బుణ్యంబుఁబ్రాలేయ♦ధర
నిభంబు.   ౯౦౦

సురసరిత్తు = దేవనదిని - గంగను, భయద = భయంకరమైన, దుస్సహ = సహింపరాని.

తా త్ప ర్య ము.

రాజా! నీయందుఁ బ్రీతిగలవాఁడనైతిని. నీకోరికప్రకారము గంగానదిని నేను శిరస్సున ధరించెదను - అని చెప్పఁగానే యాకాశగంగ గర్వాతిశయముచే వీఁడా నాయాటోపమును సహింపఁగలవాఁడు! చూచెదఁగాక! వీని నెత్తుకొని పోయి పాతాళమునఁ బడఁద్రోచెద నని చూచువారిగుండెలు పగులునట్టి

యాకారముతో సహింపరాని యధికవేగముతో వచ్చుచుండు నాకాశగంగ బిగువుం జూచి దానిలోనిపొగరు తెలిసికొని శివుఁడు రోషముతో విజృంభించిన యాకారముగలవాఁడై దానిని నరువులేకుండఁ జేయవలె నని సంకల్పించెను.

—* గంగ రుద్రజటాజూటంబునఁ దిరుగుడు పడుట *—

క॥ రుద్రజటాగహ్వరమును, రౌద్రంబుగఁ జొచ్చి వెలికి ♦ రాఁ జాలక య
క్షుద్రంబుగ భ్రమియించు చు,పద్రవమును బొందె గంగ ♦ బహువత్సరముల్. ౯౦౧

గహ్వరము = గుహ - అక్షుద్రంబుగ = విస్తారముగ.

తాత్పర్యము.

హిమవత్పర్వతముతో సమమై గుహావంటి దగు రుద్రుని జడయందు భయంకరముగఁ బ్రవేశించి వెలువడి రాలేక యచ్చటనే తిరుగుచుఁ జాల సంవత్సరములు సుళ్ళుపెట్టుచు బాధపడుచుండెను.

క॥ చొచ్చుటయె కాని వెలికిని, వచ్చుట లేకున్నఁ జూచి ♦ వసుధాపతి పెం
పచ్చుపడం దప మొనరిచె, సచ్చరితా! శివునిఁ గూర్చి ♦ సదమలనిష్ఠన్. ౯౦౨

తాత్పర్యము.

శివునిజడలలోఁ బ్రవేశించెనే కాని మరల వెలువడి గంగ రాకుండుట చూచి భగీరథుఁడు మరల శివుని గుఱించి మిగుల నిష్ఠతో గొప్పతపమును చేసెను.

సీ॥ వానికి మెచ్చి భ♦వానీధవుఁడు గంగ, జడలగుంపు లోకింత ♦ సడలఁ బుచ్చి
బిందుసరోవరం♦బందుఁ దా విడువఁగ, నేడుపాయలుగాఁగ ♦ నేఱు పాఱె
హ్లాదిని పావని ♦ యనఁగను నళిని నాఁ, బాయలు దూర్పుగఁ ♦ బాఱఁ జొచ్చె
బడమటిదెసగాఁగఁ ♦ బాఱెమూఁడు సుచక్షు, వన సీతయన సింధు ♦ వనఁగ నెగడి
తే॥ యందు నేడవపాయ వె♦న్నంటె నృపతి
నామహాతేజుఁ డొక్క ది♦వ్యరథ మెక్కి
ముందు చన మింట, గంగ యా♦స్యందనంబు
వెనుకఁ జనె భూమి, నుతియింప ♦ విబుధగణము. ౯౦౩

తాత్పర్యము.

భగీరథుని తపస్సునకు మెచ్చి గిజగాని గూడువలెనుండు నాజడలగుంపులోఁ గొంచెము సందుకల్పించి కొంచెముగా బిందుసరోవరమందు విడిచెను. అందుండి యేడు పాయలుగా నది పాఱెను. అందు హ్లాదిని - పావని - నళిని యను మూఁడుపాయలు తూర్పుముఖమై పాఱెను. సుచక్షువు సీత సింధు వను మూఁ

డుపాయలు పడమటి ముఖముగఁ బాఱెను. మిగిలిన యేడవపాయ భగీరథుని వెనువెంట వచ్చెను. ఆయనయు నొక్క యాకాశగమనముగల తేరెక్కి యాకాశమార్గమున రాఁగా దేవతలు పొగడుచుండ భూమిమీఁద గంగ యారథము వెంబడి పోయెను. ఇందలి నళినిని నిప్పుడు బ్రహ్మపుత్ర యందురు.

క॥ అచ్ఛద్యుతి దివివలనన్, విచ్ఛిత్తిని బొంది పొంది • విశ్వేశుజటన్
గచ్ఛపజలచరయుక్త స,విచ్ఛిన్నముగాఁగ గంగ • పృథివిం బాఱెన్. ౯౦౪

అచ్ఛద్యుతి = నిర్మలమగు కాంతి, విచ్ఛిత్తి = చీలిపోవుట, అవిచ్ఛిన్నము = తెంపులేక.

తాత్పర్యము.

నిర్మలకాంతిచే నాకాశమునుండి చీలి వేఱుపడి శివునిజటాజూటమందుఁ బడి యచ్చటనుండి చీలి తాఁబేళ్లు చేఁపలు మొదలగు నీటియందు వసించు జంతువులతో గంగ భూమిపైఁ బ్రవహించెను.

ఉ॥ అంతట దేవమానిసుర•యక్షవరుల్ గడుసంభ్రమంబునన్
దంతితురంగసంఘములఁ • దారు మహానగరోపమానయా
నాంతరవీథుల న్నిలిచి • యబ్బుర ముప్పతిలంగ నంబరా
భ్యంతరసీమ శైలతన•యాపతనంబును గాంచి రెంతయున్. ౯౦౫

దంతి = ఏనుఁగులయు - తురంగ = గుఱ్ఱములయు - మహా = గొప్పవగు- నగర = పట్టనములతో - ఉపమాన = పోలుచున్న - యానాంతరవీథులన్ = విమానములోపలి ప్రదేశములందు - అబ్బురము = ఆశ్చర్యము - అంబరాభ్యంతరసీమ = ఆకాశముయొక్క యంతరాళప్రదేశమందు - శైలతనయాపతనంబును = గంగపడుటను.

తాత్పర్యము

అంతట దేవమునులు సురలు యక్షులు మిక్కిలి తొట్రుపాటుతో నేనుఁగుల మీఁద గుఱ్ఱములమీఁద పెద్ద పట్టనములవలె నుండువిమానముల మీఁద నాకాశమందు నిలిచి యాశ్చర్యముగ గంగాపతనంబును జూచిరి.

క॥ క్షితికని డిగుసురతతితో, ద్యుతి మెఱసెడి తద్విభూషణస్తోమములతో
గతతోయద మగుగగనము, శతభాస్కరయుత మనంగ • సంశోభించెన్. ౯౦౬

ద్యుతి = కాంతి - భూషణస్తోమములతోన్ = ఆభరణముల సమూహముతో - గతతోయదము = మేఘములు లేనిది.

తా త్ప ర్య ము.

భూమిమీఁదికి దిగుచున్న దేవతల దేహకాంతులతోడను వారు ధరించిన యాభరణముల కాంతులతోను మబ్బులులేని యాకాశము నూర్వురు సూర్యులతో నుండినట్లు ప్రకాశించెను.

క॥ చంచలశఫరీపన్నగ, సంచయగురుశింశుమారసంహతితో రా
జించె వియత్తల మప్పుడు, చంచలలను నిండి యున్న చందము దోఁపన్. ౯౦౭

చంచల = చలించు - శఫరీ = మిడిసిపడుచేఁపలయు పన్నగ = పాములయు- సంచయ = గుంపుతోను - శింశుమార = మొసళ్ళ - సంహతితో = సమూహముతో - వియత్తలము = ఆకాశము - చంచలలు = మెఱుపులు.

తా త్ప ర్య ము.

చలించుచున్న మిడిసిపడు చేఁపలు పాములు వీని గుంపులతోను, గగనము మెఱుపులతో నిండియున్నట్లు కానవచ్చెను.

క॥ నదియురవడి నలుగడలం, జెదరినవెలినరుఁగుతోఁడ జెలు వలరె సిత
చ్ఛదతతితోఁ గూడినశా,రదనీరదముల నభంబు రాణించు గతిన్. ౯౦౮

ఉరవడి = వేగము. సితచ్ఛద = తెల్లరెక్కలుగల హంసల. తతితోన్ = సమూహముతో. శారదనీరదములన్ = శరత్కాలమందలి మేఘములచే. నభంబు = ఆకాశము - శరత్కాలమందలి మేఘములు తునుకలుగాను తెల్లగా నుండును.

తా త్ప ర్య ము.

సీటివేగమునకు నాలుగుప్రక్కల చెదరిన తెల్లని నురుగుతో నాకాశము హంసలతోడను శరత్కాలమేఘముల తునకలతోడను బ్రకాశించినట్లు కానవచ్చెను.

ఉ॥ ఒక్కొకచోట డాఁగయన నుద్దవిడిం బరువెత్తు, నొక్కచోఁ
జక్క గభీరత న్నడుచు సాధ్వియటుల్, మఱి భోగినీగతిన్
మిక్కిలి వక్రమార్గ యగు, మిట్టున నర్తకియట్లు గంతులన్
ద్రొక్కటలాడు, నొక్కయెడఁ దోఁచు నితంబిని యట్లు మందతన్. ౯౦౯

డాఁగ = ధూర్తురాలు - ఉద్దవిడిన్ = మిక్కిలి, చూ. ఉద్దవడి - సాధ్వి = పతివ్రత - భోగిని = వేశ్య - నర్తకి = నాట్యమాడుస్త్రీ - ఆటకత్తె; నితంబిని = పెద్ద పిఱుఁదులు గలది.

తాత్పర్యము.

గంగానది ప్రవహించునపుడు పల్లముగా నున్నప్పుడు ధూర్తస్త్రీవలె మిక్కిలి పరువెత్తును. సమప్రదేశములందు మెల్లగా గంభీరముగాఁ బతివ్రతవలె నడచును. ఒకచోట వేశ్యవలె వంకరత్రోవఁబోవును. మిట్టలపైఁ బాఱునప్పు డాటకత్తెవలె గంతులు పెట్టుచుఁ గ్రొక్కులాడును. ఒకచోట ఒలిసిన పిఱుదులుగల దానివలె మందముగా నడచున.

కం॥ పాఱెడినీరును నెదురై, పాఱెడునీరంబుఁ దాఁకి ♦ పై కెగిరిపడుః
మీఁటినసిరి నడుమను రా, వీఁడి దా మిడిసిపడెడి ♦ విధ మెదఁ దోఁపన్. ౯౧౦

తాత్పర్యము.

ముందుగాఁబాఱు నీరు దాని కెదురుగా నేదైన నడ్డమువచ్చుటచే వెనకకు మరలుచున్న నీరు ఒకదాని నొకటి దాఁకుటచే నీళ్లచ్చుటచ్చుట నెగిరిపడుచుండుట చూడ దరిద్రుఁడుగా నున్నవానికి సంపద గలుగఁగానే మిడిసిపడునట్లుండెను.

కం॥ భ్రష్టం బై హరుశిరమున, భ్రష్టం బై మరల భూమి♦భాగమునందుః
విష్టపముల వెలసెను నది, కష్టాత్మకపాపహార♦కం బయి కీర్తిన్ ౯౧౧

భ్రష్టంబై = జాఱిపడినదై - విష్టపముల = లోకములందు - కష్టాత్ముల = పాపాత్ముల - పాపహారకంబయి = పాపముల హరించునదినై

ఆకాశమున గంగ స్థానభ్రష్టురాలై నడుము నెచట నిలువక పాతాళలోకముఁ జేరెను. అట్టులే యున్నతదశయందుండువాఁడు చెడెనేని యధమాధమదశకు వచ్చును. కొట్టకొనకొమ్మనుండు పండు తొడిమయూడెనేని నేలపైఁబడునేకాని నడుమ నిలువదు. అట్టులే ఉత్తమబ్రాహ్మణుఁడు పతితుఁడై చెడెనేని పంచముని కంటె నీచుఁడగున. అయినను ఉత్తముఁడు స్వబుద్ధిచేఁ జెడక దైవవశమునఁ జెడుటకలిగెనేని యధమదశయందున్నను లోకమునకు మేలుచేసి కీర్తిపడయును. గంగ యిట్టిదని యీపద్యమున చెప్పఁబడెను గంగపడుటకు దాని దుశ్చేష్ట కారణముకాదు. దైవాజ్ఞ. కావున నుత్తమగుణములుగలవారు తాము హీనదశకు వచ్చినైన లోకులను బాగుచేయుదురు.

ఉ॥ దేవఋషుల్ సురల్ వసుమ♦తీతలవాసులు వార్చి రందఱుం
బావన మీజలంబు హర♦మస్తకసంపతితం బటంచు, నం
దావల ఘోరశాపహతు♦లై దివినుండి ధరిత్రిఁ గూలు నా
దేవతలెల్లఁ గ్రుంకు లిడి ♦ దివ్యతఁ గాంచి రపాస్తదోషులై. ౯౧౨

వార్చిరి = ఆచమించిరి. పావనము = పవిత్రమైనది. పవిత్రులఁజేయునది. హరమస్తకసంపతితంబు = శివునిశిరస్సునందుఁ బడినది. "శంకరస్య శిరసి భ్రష్టం పతితం కల్మషాపహం" అనఁగా శంకరుని శిరస్సునందుఁ బడినది, పాపములఁ బోఁగొట్టునది, అని మహేశ్వరతీర్థీయము. పావనమని రుద్రుఁడును శిరస్సునందు ధరించెను. కావున మనము పావనులమగుదమని తక్కిన దేవతలు పానముచేసిరి. హరుని శిరస్సునుండి పడుటచేఁ బవిత్రమనినచో నంతకు ముం దపవిత్రమని యేర్పడుచున్నది. అది సరిగాదు. కావునఁ బంచమి పొసగదు, సప్తమ్యర్థమే చెప్పవలయును.'హరస్యగాత్రసంస్పర్శాత్ పవిత్రత్వముపాగతా' గాత్రసంస్పర్శముచే హరునకును బవిత్రత్వము గలిగెనని యర్థము.

భాగవతమునందు - యచ్ఛౌచ నిస్సృత సరిత్ప్రవరోదకేన తీర్థేన మూర్ధ్ని విధృతేన శివశ్శివోభూత్' - అని కలదు. అనఁగాఁ బవిత్రమైన యీ నదీజల మును దీర్ఘముగ శిరస్సున ధరించి శివుఁడు శివుఁడయ్యెను అని యర్థము. భారతమందు "తదంబు పతితం దృష్ట్వా దధార శిరసాహరః, పావనార్థం జటా మధ్యే యోగ్యోస్మీ త్యవధారణాత్."

ఆజలముపడుటచూచి యోగ్యుఁడనైతినని తలఁచి పావనుఁడగుటకై జడల నడుమ శివుఁడు దానిధరించెను - అని యర్థము. అయోధ్యాకాండమందు - 'విష్ణుపాదోద్భవాం దివ్యా' మ్మని విష్ణుపాదమునందుఁ బుట్టుటచేఁ బవిత్రమైనది. కావున గంగాపవిత్రత్వమునకు విష్ణుపాదమునందుఁ బుట్టుటకారణము. భవాం గమునుండి పడినను విష్ణుపాదములఁబుట్టుటచేఁ బవిత్రమనియైనఁ జెప్పవచ్చును. ఎట్లన- 'నదీ వేగేన శుద్ధ్యతి' నది వేగముచేతనే శుద్ధమగును - అను ప్రమాణము నుబట్టి శివసంపర్కముతోఁ గలఁగి వడిగఁబ్రవహించుటచేఁ బవిత్రము. ఈ యర్థము లు గోవిందరాజీయ వ్యాఖ్యానమందుఁ జెప్పఁబడినవి. 'తతః ప్రభవతి బ్రహ్మన్ సర్వపాపహరా సరిత్, గంగా దేవాంగనాగాత్ర మనులేపనపింజరా। వామపా దాంబుజాంగుష్ఠ నఖస్రోతో వినిర్గతా, విష్ణోర్బిభర్తియాం భక్త్యా శిరసాహర్నిశం శివః.—వి. పు. ౨-౮.

బ్రాహ్మణా! సర్వపాపముల హరించునదియు, దేవతాస్త్రీల దేహము నందలి కుంకుమాదులచేఁ బిశంగవర్ణము గలదియు విష్ణువుయొక్క యెడమకాలి బొటనవ్రేలి గోటినుండి వెడలినదియు, భక్తచే శిరస్సునందు శివుఁడు రాత్రి పగలు ధరించునదియు నగు గంగ పుట్టెను.

మహాభారతమున ననుశాసనిక పర్వము ౨-ఆ.—

సీ॥ * * * *। రాజభయంబు చోరభయంబుఁ బాపభయంబును భూతభయంబులోను। గాఁ గలుగు భయనికాయంబు గంగా ప్రశంసనమునఁ

బాయు శంభుఁడర్ధి। నతుల పుణ్యమైన యద్దేవి దివినుండి రా। ధరింపఁడే శిరస్తలమున।. ॥

శ్రీభాగవతము నవమస్కంధము ౨౨౯ ప.

ఆ॥ భక్తవత్సలుండు ఫాలాక్షుఁ డాభగీ। రథుని మెచ్చి నిజశిరంబునందు। శౌరి పాదపూతసలిలమై దివినుండి। ధరకువచ్చుగంగఁ దాల్చె నపుడు॥-

గంగోత్పత్తివిషయమునఁ ద్రివిక్రమావతారమున భగవంతుని చరణాహతి బ్రహ్మాండకటాహమున ఛిద్రమేర్పడఁగా దానికి బాహ్యమున నున్న జలములోనికి వచ్చె ననియొకచోటను త్రివిక్రముపాదములను బ్రహ్మదేవుఁడు తన కమండలు జలముచేఁగడుగఁగా నా జలము గంగయయ్యె నని మఱియొకచోటను బ్రహ్మజప కారము ధర్మమే ద్రవమై గంగ యయ్యె నని వేఱొకచోటను జెప్పఁబడెను. దీని వలనఁ దొలుత బ్రహ్మ తనకమండలుజలముచేఁ ద్రివిక్రముపాదములు కడుగఁగా నవి పర్యాప్తములుగాని ధర్మమున ద్రవముగాఁ జేసెననియు నదియుఁబూర్తముగా మిని బ్రహ్మాండకటాహభేదముచే బాహ్యమందుండు జలము వచ్చి గంగయయ్యె ననియు సామరస్యము కుదుర్పఁబడెను. ఈవిషయము విష్ణుపురాణవ్యాఖ్యాన మందుఁ గలదు 'పావన మీశజలంబు హరమస్తకసంపతితంబటంచు' నను దోహారు ని శిరస్సునందుండి పడుటచే గంగ పుణ్యనదియయ్యెనని శైవులవాదము. గంగ పుణ్యనది గనుకనే శివుఁడు తలయందు ధరించె నని వైష్ణవవాదము. ఈవివాద మును రామాయణమే పరిష్కరించుచున్న దని యీవ్యాఖ్యాత యభిప్రాయము. 'సా తస్మిన్ పతితా పుణ్యా, పుణ్యేరుద్రస్యమూర్ధని' యని మూలశ్లోకము. ఇందుఁ బుణ్యగంగ పుణ్యశివశిరస్సునఁబడెనని యున్నది. దీనివలన గంగాశివులకుఁ బర స్పరసంబంధము లేనప్పుడుకూడ నిరువురు పుణ్యులనియే యేర్పడుచున్నది. అ ధ్యాత్మరామాయణమందు - అయోధ్యాకాండమున వసిష్ఠవాక్యము.

త్వత్పాదసలిలం ధృత్వా, ధన్యోభూద్గిరిజాపతిః, బ్రహ్మాపి మత్పితా, తే హి, పాదతీర్థహతాశుభాః —నీపాదతీర్థము ధరించి పార్వతీపతి ధన్యుఁ డయ్యెను. అట్లులే నాతండ్రి బ్రహ్మయు, వారు పాదతీర్థముచే హతములైన యశుభములు గలవారైరి.

ఘోరశాపహతులై = వారివారి పుణ్యములు నశించుటచే మరల భూమిపై జన్మించుటకు నాకాశమునుండి వచ్చుచున్నవా రచ్చటనే గంగాస్నానముచేసి దోషరహితులై మరల దేవతలై స్వర్గమునకుఁ బోయిరి.

తాత్పర్యము.

ఈ గంగాజలము పవిత్రమైనది, శివుని శిరస్సునందుఁ బడినది యని దేవ ర్షులు దేవతలు భూమియందుండువారు దానియందాచమించిరి. ఆవల ఘోర

శాపవశమున స్వర్గమునుండి భూమిపైఁబడు దేవతలును దానియందు స్నానము చేసి పాపరహితులై మరల దేవత్వమును బొందిరి.

భాగీరథి యాకాశగంగయే ఆకాశమునుండియే భూమికి వచ్చెను. అట్లుండ సుర లాకాశమునందే మునఁగక భూస్పర్శమైన పిమ్మట నేల యట్లు చేసిరని సందేహము.

వాననీళ్లయినను భూస్పర్శలేక యంతరాళమున నందువలనను స్నానపాన ములకు యోగ్యములు కావు. ఈ విషయము "భూమిగతా స్వప్స్వాచమ్య ప్రయతో భవతి" యని యాపస్తంబులు చెప్పిరి. భూమిగతమైన జలమం దా చమించి పరిశుద్ధుఁ డగు నని యర్థము కావున నాకాశవాహినికంటె భూతల వాహినియే శ్రేష్ఠము. మనుస్మృతియందును "ఆప శ్శుద్ధా భూమిగతా" ౫-౧౨౮. యని యున్నది.

చం॥ ధరణిజనంబు గ్రుంకి విగతశ్రమ మై చెలువారె, నంత నా
యరుణకులావతంసము శతాంగము ముందుగఁ బోవ గంగ యా
యరదము వెంట నంటె ♦ ససురామరకిన్నరయక్షపాళు లా
సురధుని వెంబడించె, జను♦చో నది జహ్నునియజ్ఞవాటమున్. ౯౧౩

విగతశ్రమమై = గాసితొలఁగినదియై - అరుణకులావతంసము = సూర్య వంశమందుఁ బుట్టినవారిలో శ్రేష్ఠునియొక్క - శతాంగము = తేరు - అరదము = తేరు - సురధుని = గంగను.

తా త్ప ర్య ము .

భూమియందలి జనులు గంగయందు స్నానముచేసి యాయాసము పోఁగొట్టు కొన్నవారైరి అంత నా సూర్యవంశరాజులలో శ్రేష్ఠుఁ డగు భగీరథునిరథము ముందు పోవుచుండఁగా దాని వెంబడించి గంగ పోవుచుండెను. ఆ గంగవెంబడి దేవతలు, రాక్షసులు, కిన్నరులు, యక్షులగుంపులు పోవుచుండిరి. ఇట్లు పోవుచు మార్గమధ్యమందు జహ్నుని యజ్ఞముచేయు ప్రదేశమును గంగ నీటి తో ముంచెను.

—* జహ్నుఁడు గంగాజలంబుల నెల్లఁ ద్రావుట *—

ఉ॥ ముంచె నిజాంబుపూరముల ♦ ముంచిన నాతఁడు దానిగర్వ మూ
హించి సరోషుఁ డై జలము ♦ నెల్లను ద్రావ నిమేషమాత్రఁ బూ
జించుచు నమ్మహామహు న♦శేషమునీశసురేశులెల్ల న
భ్యంచితరీతి నీదుసుత ♦ యర్థ ప్రథ గాంచును వీడు మం చనన్. ౯౧౪

తాత్పర్యము.

ఇట్లు తన నీటితో గంగ తన యజ్ఞవాటము నింపఁగా నా జహ్నుఁడు దాని గర్వము తెలిసికొని యా జలమునంతయు నిమిషమాత్రమునఁ ద్రావెను. అప్పుడు వెంబడివచ్చుచున్న మునీంద్రులు లోనగు వా రమ్మహాత్ముఁ బూజించి అయ్యా! యీమె నీకూఁతు రను ప్రఖ్యాతి వహించును. వదలిపెట్టు మని ప్రార్థించిరి.

ఈ జహ్నుముని రాజర్షి - భరతవంశపురాజు. ఈ వంశమున నజామీఢుఁ డనురాజు గలఁడు. అతనికొడుకు జహ్నువు. ఈయనయే గంగాపానముచేసిన వాఁడు. ఈయనకొడుకు సింధుధ్వజుఁడు ఈయనకొడుకు బలాకాశ్వుఁడు. ఈయనకొడుకు వల్లభుఁడు. ఈయనకొడుకు కుశికుఁడు. ఈయనకొడుకు గాధి. ఈయన కుమారునినిమిత్తమై యడవిలో దపస్సుచేయుచుండు కాలమందు సత్యవతి జన్మించెను. ఆవల విశ్వా, జన్మించెను. ఈ సత్యవతిని భృగు వంశమునఁ బుట్టిన చ్యవనునికి చీకుఁడు వివాహమాడెను. సత్యవతీ ఋచీకులకొడుకు జమదగ్ని. జ ర్య రేణుక. వీరికుమారుఁడు పరశు రాముఁడు. విష్ణుపురాణంబునఁ 'బురూరవునికొడు కాయువు. ఆతనికొడుకు అమా వసుఁడు. అతనికొడుకు భీముఁడు. భీమునికొడుకు కాంచనుఁడు. కాంచనుని కొడుకు సుహోత్రుఁడు. అతనికొడుకు జహ్నువు.' అని యున్నది. అజమీఢుఁడే సుహోత్రుఁడేమో?

తే॥ దాన సంతుష్టిఁ జెంది య◆ త్తపసియపుడు, వీనులను దానిఁ బోవిడె◆ విస్మయముగ
దాన జహ్నునిసుత యని◆తరణికులుఁడ!, జాహ్నవియనంగఁబరఁగెనీ◆సౌరతటిని. ౯౧౫

తాత్పర్యము.

వారిమాటలకు సంతోషించి జహ్నుండు గంగను చెవులలోనుండి యచ్చెరువు పడ వెలుపల విడిచెను. ఆకారణమున రామచంద్రా! గంగ జాహ్నవియనుపేరఁ బ్రసిద్ధియయ్యెను.

ఉ॥ అంతట మఱిన్ భగీరథర◆థానుగ నై మినువాఁక యాఁక లే
కెంతయు నబ్ధిఁ జొచ్చి తద◆భీప్సితసిద్ధికి లేలిహానలో
కాంతముఁ దూఱి యారవికు◆లాగ్రణితాతలబూదిమీఁద నే
కాంతము పాఱ వారు హత◆కల్మషులై దివి కేగి రంతటన్. ౯౧౬

భగీరథరథానుగయై = భగీరథునిరథము వెంటఁబోయినదై - మినువాక = ఆకాశగంగ - ఆఁకలేక = అడ్డములేక - లేలిహానలోకాంతము = పాతాళ

లోకమునందు - (లేలిహానము = పాము). ఏకాంతము = మిక్కిలి - హతకల్మషులై = అపమృత్యుదోషమును బోగొట్టుకొన్నవారై - మఱిన్ = మఱియును - మఱి కళయే-దానికి 'ను' సముచ్చయము చేరినది. దానిమీఁదిహల్లు లోపింపఁగా మఱిన్ అనురూప మేర్పడెను. అంతియేకాని 'మఱి' ద్రుతాంతము గాదు.

నామసర్వనామంబులకును, గిళలగునవ్యయంబులకును, గడపల సముచ్చయార్థవిశేషపాదపూరణంబులయందు 'ను' శబ్దంబు తెలుపఁగ నగు కళలకు ననుదంతశబ్దంబులమీఁద నయ్యాది 'యు' వర్ణపూర్వికంబుగ విభాషనగు. మఱియు నది శేషషష్ఠియందు 'యొక్క' లోపించినపుడు లాగమాంతబహువచనంబు మీఁదను సముచ్చయమునం జూపట్టెడు.—ప్రౌ. వ్యా. శబ్ద. ౧౧౬.

తాత్పర్యము.

ఆవల గంగ భగీరథునిరథము బోయి యేయడ్డములేక సముద్రముఁ బ్రవేశించి యారాజుకోరిక నెరవే తాళలోకమును బ్రవేశించి భగీరథునితాతలబూడిదమీఁద దండిగ ఱఁగా వారందఱు దోషముచే విడువఁబడినవారై - స్వర్గమునకుఁ బోయిరి.

—* ౪౪ సర్గము. భగీరథునకు బ్రహ్మ ప్రత్యక్షమగుట *—

ఉ॥ అంచితరీతి నానృపతి ♦ యట్టులు గాంగఝరంబు వెన్కొనన్
సంచితసాధుకీర్తు లగు♦నాగరు లెల్లరు భస్మసాత్కృతిన్
గాంచినచోట కేగి గతి♦గానివారలబూదిరాసులన్
ముంచినఁ జక్క వచ్చి నృప♦ముఖ్యునిఁ గాంచి విరించి యిట్లనన్. ౯౧౭

భస్మసాత్కృతిన్ = భస్మమగుటను - విరించి = బ్రహ్మ.

తాత్పర్యము.

మనస్సునకు సరియైనరీతిని నాభగీరథుఁడు తనవెనుక గంగానది రాఁగా సగరకుమారులందఱు భస్మమై పడియుండినచోటికిఁ బోఁగా గతులులేక పడియుండినవారి బూదికుప్పలనుఁ దాఁటఁజేయఁగా నప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై భగీరథునితో నిట్లనియెను.

సీ॥ రాజేంద్ర! సగరత♦నూజాతు లఱువది, వేవు రిప్పుడు దేవ♦భావ మంది
త్రిదివంబు ప్రాపించి ♦ రుదధిని నీరంబు, లెంతదాఁక రహించు ♦ నంతదాఁక
వారును దివ్యులై ♦ సౌరాలయంబున, నుండంగఁ గలరు, భూ♦మండలమున
గంగ నీకూఁతు ర♦నంగ విఖ్యాత యౌ, నీ పేరఁ బరఁగును ♦ నేఁడుమొదలు

తే॥ దేవతటినియు గంగ నాఁ ♦ ద్రిపథగ యన
వెండి భాగీరథి యనంగ ♦ వినుతిఁ గాంచి
మూఁడుపేరులఁ, బొలుట ♦ మూఁడుమార్గ
ములను ద్రిపథగ యనుపేరు ♦ మొనసి యుండు.　　౯౧౮

సౌరాలయము = స్వర్గము.

తాత్పర్యము.

రాజేంద్రా! సగరునికుమారులఱువదివేలమంది యిప్పుడు పిశాచత్వము వదలి భువర్లోకము విడిచి స్వర్గలోకమునకుఁ బోయి దేవత్వముగాంచినవారైరి. ఎంతవఱకు సముద్రమందు జలము లుండునో యంతవఱకు స్వర్గమందే యుందురు. భూలోకమందు గంగాదేవి నీకూఁతు రను పేరుగలదై నీపేర భాగీరథి యని ప్రసిద్ధి కెక్కును. దేవనదియను నీశబ్దముఁగ గంగ యని, త్రిపథగ యని, భాగీరథి యని మూఁడుపేర్లు గల దగును. మూఁడుమార్గములఁ బొలుటచేఁ ద్రిపథగ యనుపేరు సార్థక మగును.

విశేషవిషయములు.

కుమారసంభవసందర్భమున రసవాదమువలె నిచ్చట యోగవిషయము చెప్పఁబడెను.

శ్లో॥ తత్పాదపద్మజాం గంగాం, నిపతంతీం స్వమూర్ధని
చింతయేత్ బ్రహ్మరంధ్రేణ, ప్రవిశంతీం స్వకాం తనుం
తయా సంక్షాళయే ద్దేహం, బాహ్య మభ్యంతరం మలం
తత్క్షణా ద్విరజో౽యం స్యా, జ్జాయతే స్ఫటికోపమః.

అనుశ్లోకములయర్థము ననుసంధింపనది. ప్రాణశక్తి వాయువాహనమై బ్రహ్మరంధ్రముమూలమున సహస్రారమను స్థానముఁ బ్రవేశించి యచ్చటనుండి శివస్థానమగు నాజ్ఞాచక్రమునకు దిగి యచ్చట మూఁడుపాయలుగా ఇడాపింగళసుషుమ్నలగును. అందు సుషుమ్న నడిమి దీనినే తపోబలమున భగీరథుఁడు తెచ్చినది. ఇది మేరుదండమువెంటఁ గ్రిందికి దిగిదిగి మూలాధారమందలి కుండలినిం (నాగలోకము) దాఁకును. దీనివలన నిశ్చేష్టములై పడియుండునణువు లూర్ధ్వగాము లగును. ఇది సూచనమాత్రము. యోగులు సవిశేషముగ నెఱుంగుదురు తక్కినవారికి దభేద్యము.

ఉ॥ తాతల కెల్ల నీ వుదక♦దానము లిచ్చుటఁ జేసి నీప్రతి
జ్ఞాతము దీర్చు కొ, మ్మతియ♦శస్వియు నుత్తమధర్మి నీదుము
త్తాతయు గంగఁ దేర మును ♦ దాను సమర్థుఁడు గాఁడుగాదె నీ
తాతగునంశుమంతుఁడు వృ♦ ద్ధాశ్రమ మొందెఁ బ్రతిజ్ఞఁ దీర్పఁగన్.　　౯౧౯

ఉదకదానము = తర్పణము - ప్రతిజ్ఞాతము = ప్రతిన - బాస.

తాత్పర్యము.

తాతలకందఱకు నీవు గంగాజలముతోఁ దర్పణముచేసి నీవు పట్టినపట్టు సాధించినవాఁడ వగుము. మిక్కిలి కీర్తిశాలియు, ఉత్తమధర్మిష్ఠుఁడును నీము త్తాతయు నగు సగరుఁడు గంగను దెచ్చుటకు సమర్థుఁడు గాఁడాయెను. నీతాత యంశుమంతుఁడును ప్రతిజ్ఞదీర్ప వృథా శ్రమించెను.

సీ॥ భూపతీంద్రుఁడు దిలీపుఁడు మేటిరా, జర్షియు దేవమహర్షిసముఁడు
నీతండ్రి తపమున నాతోడఁ బురిడించు, క్షత్రధర్ముండు పవిత్రకీర్తి
యట్టివాఁడును గట్టుపట్టిని నేలపైఁ, బాఱింపలేక తాఁ దీఱి పోయెఁ
గొఱ లేక ప్రతినను నెఱవేర్చి నిర్మల,కీర్తి వైతివి పుణ్యమూర్తి వవుర
ఆ॥ యనవరతము దాన మాడంగఁ దగుగంగ,నీటిలోన నాడి నీవు మిగుల
శుచివి గమ్ము పుణ్యనిచయఫలంబును, బొందవయ్య రాజ! యిందు తేజ! ౯-౧౦

నీతండ్రియగు దిలీపుఁడు రాజశ్రేష్ఠుఁడును గొప్పరాజర్షియు దేవమహర్షి సముఁడు నయ్యుఁ, దపమున నాతో సమానుఁడయ్యును, క్షత్రధర్మమందు నిలిచినవాఁడును నిర్మలకీర్తియు నైనను, గంగను భూమిమీఁదఁ బాఱింపలేక మరణించెను. నీవు కొఱఁతలేక ప్రతిజ్ఞను పూర్ణముగఁ దీర్చి నిర్మలకీర్తిపరుఁడ వైతివి. అవురా నీ వెంతపుణ్యమూర్తివో.

అనవరతము = ఎల్లప్పుడు, దానము = స్నానము. దానమునకుఁ బ్రకృతి శబ్దము స్నానమని సర్వలక్షణసారసంగ్రహమందు కూచిమంచితిమ్మకవి వ్రాసెను. గాని స్నానశబ్దమందు తకారము లేదు. ఆడి = స్నానముచేసి. "సకలతీర్థంబుల నాడి" —కాశి ౭ ఆ.

అనవరతము దానమాడంగఁ దగు గంగ.

శ్లో॥ ద్విమాసం సరితస్సర్వా భవంతిహి రజస్వలాః, అప్రశస్తం తతస్స్నానం వర్షాదా నవవారిణి॥— మార్కండేయుఁడు.

వ్యాఘ్రపాదుఁడు.— సింహకర్కటయోర్మధ్యే సర్వా నద్యో రజస్వలాః। తాసు స్నానం నకుర్వీత వర్జయిత్వా మహానదీః॥ ఈవాక్యములవలన సూర్యుఁడు సింహకర్కటములం దుండఁగా (ఆషాఢ శ్రావణములందు) మహానదులకుఁదప్ప దక్కినయన్నిటికి రజస్వలాత్వదోషము కలదు. కావున నా రెండు నెలలు నదులయందును గ్రొత్తగావచ్చిన నీటియందును స్నానము చేయరాదు. అట్టి నిషేధము గంగకు లేదనియు నేవేళయందైన స్నానము చేయవచ్చు ననియు

భావము. మహానదియనఁగా సముద్రమునఁ గలియపాఱు నది. ఉపనది గాదు. శ్రద్ధతో గంగయందు స్నానముచేసినంతమాత్రమున బ్రహ్మలోకము కలుగును.

తా త్ప ర్య ము.

రాజశ్రేష్ఠుఁడును - గొప్పరాజర్షియు దేవమహర్షులతో సమానుఁడును, క్షత్రధర్మము తెలిసి యనుష్ఠించువాఁడును, నిర్మలకీర్తియును, తపస్సునందు నాతో సమానుఁడును నగు నీతండ్రి దిలీపుఁడు అట్టివాఁడుకూడ గంగను భూమిపైఁ బాఱింపలేకపోయెను. నీవు చేసిన ప్రమాణము కొఱంతలేక దీరునట్లు యెప్పుడు స్నానయోగ్యమైన గంగాజలముల స్నానముచేసి శుచివై పుణ్యసమూహఫలమును బొందుము.

ఉ॥ తాతల కెల్ల నీ వుదక ♦ దానము లిమ్ము, పురంబుఁ బొమ్ము, సం
ప్రీతిని నేను బోయెద న ♦ భీష్టగతిం ద్రిదివంబుఁ జేరఁగా
నాతతమంగళం బగుత ♦ మంచువచించి, నిజేచ్ఛ సత్యముం
ధాతయుఁ బోవఁగా, నృపతి ♦ తర్పణముల్ పొనరించి గంగలోన్. ౯౨౧

తా త్ప ర్య ము.

నీతాతలకందఱకు నీటితోఁ దర్పణముచేయుము. నీయూరికిఁ బొమ్ము. నేనును బ్రహ్మలోకమునకుఁ బోయెదను. నీకు మంచిశుభ మగును - అని దీవించి స్వేచ్ఛగా సత్యలోకమునకుఁ బోవఁగా, భగీరథుఁడును గంగలోఁ దాతలకందఱకుఁ దర్పణ మొనర్చెను.

క॥ తనదుపురంబునకుం జని, తనరాజ్యశ్రీని బూన ♦ ధరణిజనంబుల్
వనట దొఱంగుచు ముదముం, గన నతిసంపదలఁ దేలె ♦ గతసంజ్వరతన్. ౯౨౨

తా త్ప ర్య ము.

తననగరమునకుఁబోయి తనరాజ్యసంపద యథాప్రకారము పూనఁగా భూజనులు దుఃఖమును విడిచి సంతోషమును బొందునట్లు మనోవేదన విడిచి రాజ్యసంపద లనుభవించెను.

ఆ॥ గంగచరిత మెల్లఁ ♦ గాకుత్స్థకులచంద్ర!, యానుపూర్విఁ బలుకు ♦ టయ్యె, నీకు
మేలు గలుగుఁ గాక ♦ మిగిలె సంధ్యావేళ, గంగ యిలకు దిగిన ♦ కథను వినిన. ౯౨౩

ఆనుపూర్వి = మొదటినుండి.

తా త్ప ర్య ము.

రామచంద్రా! గంగాచరిత్రమునంతయు మొదటినుండి నీకుఁ దెలిపితిని. నీకు మేలు గలుగునుగాక. సంధ్యావేళ యతిక్రమించెను. గంగ భూమిపైకి దిగినకథను విన్నవారికి.—

గంగామాహాత్మ్యకథనము

సీ॥ విత్తకామునకును ♦ విత్తంబు ఘటియించుఁ, గీర్తికాములకును ♦ గీర్తి నిచ్చు
నాయువుఁ గోర దీర్ఘాయువుఁ బొందించు, సుతులను గోరిన ♦ సుతుల నొసఁగు
స్వర్గంబుఁ గోరిన ♦ స్వర్గంబును నయించుఁ, బితరుల కెల్లఁ దాఁ ♦ బ్రీతి నిడును
దైవతకోటులు ♦ దనిసెదు నిద్దాన, బ్రాహ్మణక్షత్రియ♦వైశ్యు లితర
తే॥ జాతులం దెవ్వరైనను ♦ శ్రద్ధ పూని, వినెడువారును గథ విని♦పించువారు
సర్వపాపంబులను బాసి ♦ సర్వకామ,ములను నాయువుఁ గీర్తియుఁ ♦ బొందఁగలరు. ౯౨౪

తాత్పర్యము.

ధనముకోరినవారికి ధనము లభించును. కీర్తిగోరినవారికిఁ గీర్తి కలుగును. ఆయువుగోరినవారికి నాయువు పెరుఁగును పుత్రులు కావలయునని కోరినవారికిఁ బుత్రులు పుట్టుదురు. స్వర్గము గోరినవారికి స్వర్గము లభించును. పితరులకందఱకు మిగులఁ బ్రీతి కలిగించును. దీనిచే దేవకోటులు తృప్తిపడుదురు. నాలుగు వర్ణములవారిలో నెవ్వరైనను శ్రద్ధచే వినెడువారును దీనిని వినిపించువారును సర్వపాపములచే విడువఁబడి దీర్ఘాయుస్సు పొంది సమస్తమైనకోరికలఁ బొందఁగలరు.

౪౫-వ సర్గము

కం॥ కౌశికువాక్యములను విని, దాశరథి నితాంతహర్షి♦తస్వాంతుం డై
పేశలవచనంబులఁ ద్రిది, వేశనిభా! వినిన భవదు♦దీరితకథలన్. ౯౨౫

నితాంత స్వాంతుఁడు = మిక్కిలిసంతోషించినమనస్సుగలవాఁడు, పేశల = మృదువులైన, వచనంబులన్ = మాటలతో, త్రిదివేశనిభా = ఇంద్రునితోసమానుఁడా, భవత్ + ఉదీరిత కథలన్ = నీచేఁజెప్పఁబడినకథలను.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడుచెప్పినమాటలు విని రాముఁడు మిగులసంతోషించి మృదువులైనపలుకులతో నిట్లనియె. ఇంద్రసమానా! నీవుచెప్పినకథలను వినఁగ వినఁగ.

ఉ॥ అచ్చెరువయ్యె మా కనుచు ♦ నానిశ యెల్లను దమ్ముతోడ నా
సచ్చరితుండు పల్కిన ప్ర♦శస్తకథ స్మరియించుచు
న్మెచ్చుచుఁ బూర్వదిక్తటము ♦ నీరజమిత్త్రుఁ డలంకరింపఁగాఁ
బొచ్చెము లేనిభక్తి నతి♦పూర్వముగాఁ గృతికర్ము నిట్లనన్. ౯౨౬

తాత్పర్యము.

మాకు మిక్కిలి యాశ్చర్యము గలిగించెను - అని రామచంద్రమూర్తి లక్ష్మణుతోడ నారాత్రియంతయు శుభచరిత్రుఁడైన విశ్వామిత్రుఁడు పల్కినకథనే

స్మరించుచు సగరచక్రవర్తిసంపద్వైభవము- ఆయనపుత్రుఁడను నభిమానములేక భార్యతోడ నసమంజుని నడవులకు నెట్టిన ధర్మాభిమానము - అంశుమంతుని సౌజన్యసంపత్తి - సాగరులు పితృవాక్యమును బరిపాలింపఁ జేసిన మహాకార్యము - పితృభక్తి - భగీరథప్రయత్నము - ఆయన కార్యసాధకత్వము - గంగాపతనము లోనగుగాఁగల యొక్కొక్కరిగుణములను మెచ్చుచు సూర్యుఁడు తూర్పుకొండమీఁదికి రాఁగాఁ బ్రాతఃకాలకృత్యముల నన్నిటని దీర్చుకొనిన విశ్వామిత్రునకు నిర్మలభక్తితో నమస్కరించి యిట్లనియె.

ఉ॥ రేయి భవత్కథామననరీతి నిమేషము ల్లు వోయె, నీ
వీమెడ నంట దా రెఱిఁగి యిద్ధసుఖాసన మైనయోడ నీ
కై యతిపుణ్యులైనమునిహాటకగర్భులు పంచి రోమహా
మేయగుణా! వెసం జదల మే తరియించి సుపుణ్య హ్నవిన్. ౯౨౭

మననరీతి = ఆలోచించుటయందు - మునిహాటకగర్భులు = మునిబ్రహ్మలు.

తాత్పర్యము.

రాత్రియంతయు నీవు చెప్పినకథవిషయమై యాలోచించుటయందే పోయెను. నీ విచ్చటనుండుట యెఱిఁగినవారై మహాపుణ్యాత్ములును బ్రహ్మసమానులునైన మునులు మిగులవిశాలమై మెత్తనై సుఖాసనములుగల యోడను బంపిరి. మహాత్మా! యీపుణ్యనదిని గంగను దాఁటిపోవుదమా.

క౦॥ ఆరాకొమరునివచనము, గారామున విని తరించి గాధేయుఁడు ద
ద్భూరిమణికుమారులతో, నాఋషితతితో నుదక్తటావని దిగియెన్. ౯౨౮

రాకొమరుని = రాజకుమారుని - ఉదక్తటావనిన్ = ఉత్తరతీరభూమి యందు.

తాత్పర్యము.

ఆరాజకుమారునివచనము గారాబముతో విని విశ్వామిత్రుఁడు శ్రీరామ లక్ష్మణులతోడను ఋషీశ్వరులతోడను గంగిదాఁటి యుత్తరపుటొడ్డున దిగెను.

క౦॥ సాలఁబుల ధిక్కృతకుల, శైలంబుల సౌధకోటిజాలంబుల రు
గ్జాలంబుల ఫలసహితతరసాలంబుల దివిని నగు విశాలానగరిన్. ౯౨౯

సాలంబులన్ = ప్రాకారములచేతను, ధిక్కృత = ధిక్కరింపఁబడిన, కులశైలంబులన్ = కులపర్వతములను. శ్లో॥ మహేంద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాన్ గంధమాదనః, వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః- త్రికాండశేషము. సౌధకోటిజాలంబులన్ = అనేకములైన మేడలసమూహములయొక్క, రుగ్జాలంబు

లన్ = కాంతిసమూహములచే, ఫలసహితరసాలంబులన్ = పండ్లతోఁగూడిన తియ్యమామిడిచెట్లచే, దివిని = స్వర్గమును.

తా త్ప ర్య ము.

ప్రాకారములచేతను, కులపర్వతములను మించియున్న మేడలగుంపులకాంతులచేతను, తియ్యమామిడిలోనగు ఫలవృక్షములచేతను స్వర్గమును బరిహసించుచున్న విశాల యను నగరమందు.

―* శ్రీరాములు విశ్వామిత్రుని విశాలానగరవృత్తాంత మడుగుట *―

ఉ॥ రాముని లక్ష్మణుం గలిసి • రాముని వేఁ జొర రాచపట్టి తా
నామహనీయుఁ గాంచి మహి•తాత్మక! యిప్పురి యేలురా జెవం
డో మఱి వానివంశ మెది•యో? యని ప్రశ్న మొనర్ప నాయనం
బ్రేమ దలిర్పఁ గాంచి ముని•వేలుపుఱేఁడు వచించుఁ దత్కథన్. ౯౩౦

రాముని = రాచముని, విశ్వామిత్రుఁడు, చొరన్ = ప్రవేశింపఁగా, రాచపట్టి = రాజకుమారుఁడు.

తా త్ప ర్య ము.

విశ్వామిత్రుఁడు శ్రీరామలక్ష్మణులతోఁ బ్రవేశింపఁగానే రాజకుమారుఁడైన రామచంద్రమూర్తి మహాత్ముఁడైన విశ్వామిత్రునిఁ జూచి యయ్యా! యీనగర మేలు రా జెవ్వఁడు? వాఁ డేవంశమువాఁడు? అని ప్రశ్నింపఁగా నాయనను బ్రేమతోఁ జూచి మునీంద్రుఁ డాకథ నిట్లు చెప్పెను.

మ॥ వినుమా రాఘవ! మున్ గృతంబున మహా•వీరోత్తముల్ దైత్యులున్
ఘనశౌర్యుల్ బహుధర్మకర్మనిరతిం • గ్రాలంగ నాదిత్యులున్
మన మిం కెట్టు లొకో నిరామయుల మై • మర్త్యత్వముం బాయుచు
న్మన నౌ నిర్జరభావ మూని యనుచు • న్భావించి వారాత్మలన్. ౯౩౧

కృతంబునన్ = కృతయుగమందు - ఆదిత్యులు = దేవతలు, అదితికుమారులు - అపత్యార్థకతద్ధితము. దితికుమారులు = దైత్యులు - అపత్యార్థకతద్ధితము. నిరామయులము = వ్యాధిలేనివారము - మర్త్యత్వము = మరణించువానితనము నిర్జరభావము = ముసలితనము లేకుండుట.

తా త్ప ర్య ము.

రామచంద్రా! వినుము. పూర్వము కృతయుగంబున వీరులగు దైత్యులు గొప్పశౌర్యము గలిగియు విస్తారము ధర్మకార్యములందుఁ బ్రేమగలదేవతలు కలిసి మనము ముసలితనము మరణము వ్యాధులు లేక హాయిగానుండ మార్గ మెద్దియో యని యాలోచించిరి.

క॥ కలశపయోధిని జిలికిన, గలుగును రస మంచు వారు ♦ కవ్వముగాఁ బె
న్నల మందర మహీ వాసుకిఁ, జిలుకుంద్రాడుగ ఘటించి ♦ చిలుకుచునుండన్. ౯౩౨

కలశపయోధిని = పాలసముద్రమును - రసము = అమృతము - చిలుకుంద్రాడు = చిలుకుత్రాడు,

తా త్ప ర్య ము.

పాలసముద్రమును జిలికితిమేని దానియం దమృతము పుట్టును, అది భుజించితిమా మనకుఁ జావు రాదు, ముసలితనము రా దని యోజించి మందరపర్వతము కవ్వముగా వాసుకి చిలికెడిత్రాడుగాఁ జేసి పాలసముద్రమును జిలుకుచుండిరి.

మ॥ ఒక వేవత్సరముల్ చనంగ ఫణిరా ♦ జుగ్రంబుగా క్ష్వేళ మో
ర్వక తాఁ గ్రక్కెఁ దటస్థ మాశిలల దం♦ష్ట్రాదష్టము ల్వ్రేయఁగా
వికటీభూత శిలాప్రభూత మయి యా♦భీలోరుహాలాహల
ప్రకటక్ష్వేళము సామరాసురభువిన్ ♦ భస్మంబుఁ గావింపఁగన్. ౯౩౩

క్ష్వేళము = విషము - ఓర్వక = రాపిడిసహింపలేక - తటస్థమాశిలల = ఆపర్వతమందుండు రాలను - దంష్ట్రా = కోఱలచే - దష్టముల్ = కొఱకఁబడినవి - వికటీభూతశిలాప్రభూతమయి = విఱిగినరాలనుండిపుట్టినదై - ఆభీల = భయంకరమైన - ఉరు = గొప్పదైన - హాలాహల= హాలాహల మను పేరుగల- ప్రకటక్ష్వేళము = ప్రసిద్ధవిషము - సామరాసురభువిన్ = అమరులతోను, అసురులతోను గూడినప్రపంచమును. "హాలాహలం, హాలహలం హాలిహాలం, హాలాహలమ్"— ద్వి-కో.

తా త్ప ర్య ము.

ఇట్లు వేయేండ్లు వారు చిలుకఁగా నారాపిడిని సహింపలేక వాసుకి విషమును గ్రక్కెను. దానివేఁడిమికిఁ గొండరాలు పగులుటయేగాక ప్రసిద్ధమైన హాలాహలము రాక్షసులను దేవతలనుగూడ భస్మముచేయఁ జొచ్చెను.

ఉ॥ అంత నితాంతతాపకర ♦ మైనహాలాహలము న్స్మరింప నే
కాంతపుభక్తి దేవతలు ♦ గ్రక్కున దేవవిభు న్నగాత్మజా
కాంతునిఁ బాహి పాహి త్రిజ♦గత్పరిరక్షణశీల యంచు న
త్యంతము వేఁడ వారలకు ♦ నక్షిపథస్థితుఁ డయ్యె నీశుఁడున్. ౯౩౪

నితాంతతాపకరము = మిక్కిలితాపమును గలిగించునది - ఏకాంతపుభక్తి = మిక్కిలిభక్తి - నగాత్మజాకాంతునిన్ = పార్వతీపతిని, శివుని - అక్షిపథస్థితుఁడు = ప్రత్యక్షమైనవాఁడు.

తాత్పర్యము.

అంతట మిక్కిలి తాపముగలిగించుచున్న యాహాలాహలమును హరించునట్లు దేవతలెల్ల శివుని పాహిపాహి యని మిగులభక్తితో మిక్కిలి ప్రార్థింపఁగా వారికి శివుఁడు ప్రత్యక్షమయ్యెను.

ఉ॥ అంతట శంఖచక్రధరుఁ ♦ డై హరి దోఁచి త్రిశూలిఁ గాంచి యొ
క్కింత స్మితంబు దోఁప విబు♦ధేశ్వర! వేల్పులు ద్రచ్చఁ బుట్టె దు
ర్దాంతవిషంబు తొల్దొలుత ♦ దైవతకోటులఁ బెద్ద వౌట స
త్స్వాంతమునన్ గ్రహింపు మిది ♦ యాదర మారఁగ నగ్రపూజగన్. ౯౩౫

తాత్పర్యము.

ఆసమయమందు విష్ణువు శంఖచక్రధరుఁడై వచ్చి చిఱునవ్వుతో వేలుపులపెద్దా! దేవతలు చిలుకఁగా మొట్టమొదట సహింపరాని విషము పుట్టెను- నీవు వేల్పులలోఁ బెద్దవు కావున ప్రథమమున నిన్ను గౌరవింపవలయును గావున ముందువచ్చినది నీవు ముందు మంచిమనస్సుతోఁ దీసికొమ్మని చెప్పెను.

—* శివుఁడు హాలహలముఁ మ్రింగుట *—

తే॥ ఇటులువచియించి హరియుఁ దా ♦ నేగెనంత,సురలవెఱపును గనిసిరి♦వరునిపలుకు
వినికరంబునఁగొనియుగ్ర♦విషముహాల,హలముఁగంఠస్థమొనరించె♦హరుఁడులీల. ౯౩౬

తాత్పర్యము.

ఈప్రకారము చెప్పి విష్ణువు వెడలిపోయెను. అంత దేవతలభయము చూచి విష్ణువు చెప్పినమాట విని చేతిలోనికి నావిషమును దీసికొని కంఠమున నిలిపెను.

మత్తకోకిలము॥ ఆహరించి విషంబు నిట్లు పు♦రారి యేగిన, దేవతల్
మోహరించి మఱల్ మథింపఁగ ♦ మున్గఁ గొండ పయోనిధిన్
బాహి యంచు నుతించి రంతటఁ ♦ బంకజాక్షుని నీజగ
ద్వ్యాహరక్షకు నందు మాకును ♦ బూఁట వీవ కదా హరీ! ౯౩౭

ఆహరించి = మ్రింగి - పురారి = శివుఁడు - త్రిపురములజయించినవాఁడు - జగద్వ్యాహరక్షకున్ = ప్రపంచసమూహములను గాపాడుటకు, అందు = వానిలో విశేషించి - పూఁట = భారమువహించినవాఁడవు.

తాత్పర్యము.

శివుఁ డిట్లు విషమును మ్రింగిపోఁగా దేవతలు మరల పూనుకొని చిలుకఁగా కొండయే సముద్రమందు బుటుక్కున మునిఁగెను. అప్పుడు దేవతలందఱు విష్ణు

వును జూచి దేవా! ప్రపంచమందు ముఖ్యముగ మమ్ము రక్షించుటకుఁ బూఁట పడినవాఁడవు నీవే కదా!

మత్తకోకిలము. — ర స జ జ భ ర - గణములు, ౧౧ వ స్థానము యతి.

క॥ మునిఁగినకొండను మీఁదికిఁ, గొని రమ్ము మహాత్మ! నిన్నుఁ ♦ గొలిచెడివారల్
గనుచుండఁ గాటియలు నీ,వును జూచుచు నుండె దనిన ♦ భువనాత్మకుఁడున్. ౯౩౮

కాటియలు = విపత్తులు.

తాత్పర్యము.

హరీ! కొండ నీటిలో మునుఁగుచున్నది. దానిని పైకి యెత్తిపట్టుటకు నీవు తప్ప మఱి యెవ్వరు లేరు. నిన్ను సేవించుచుండువారు ఆపదలపాలగు చుండ నీవును ఊరక చూచుచుండవచ్చునా? ఆశ్రితరక్షణవ్రతమునకు హాని కదా!

క॥ కరమును గిరికొన మోపుచుఁ, దరికొండను మోసి యుదధిఁ ♦ దనవీఁపుపయిన్
సురలందుఁ దాను నొకఁడై, పురుషోత్తముఁ డమృతమథన♦మ్ముం గావించెన్. ౯౩౯

తాత్పర్యము.

ఇట్లు దేవతలు ప్రార్థింపఁగా ప్రపంచశరీరమునకు ఆత్మయై యుండు విష్ణువు తాను దేవతలలో నొకఁడై యొకచేయి కొండకొనన నిలిపి కొండక్రిందఁ దాను దాఁబేలయి నిలిచి దానిని మోయుచు విష్ణువే యమృతమునకై చిలికెను.

—* క్షీరసముద్రమున ధన్వంతరి లోనగువా రుదయించుట *—

క॥ తిరముగ నిటు వేయేఁడులు, జరిగినఁ దొలుదొల్త నందు ♦ జనిఁగెను ధన్వం
తరి దండకమండలువులు, ధరియించి త్రిజన్ముఁ డగుచు ♦ దైవతతతికిన్. ౯౪౦

త్రిజన్ముఁడు = వైద్యుఁడు - (వైద్యనిఘంటువు)

తాత్పర్యము.

స్థిరముగ నడుమ విఘ్నములులేక వేయిసంవత్సరము లిటుజరుగఁగా నాపాల సముద్రమందు యోగదండము కమండలువు ధరించి దేవతలకు వైద్యుఁడై తొలుత ధన్వంతరి పుట్టెను.

క॥ అప్పులు మథింప వానను, నుప్పతిలెన్ రసము దాన ♦ నుద్భవమై రం
పొప్పమిటారులు సొగసుం,దిప్పలు నప్సరస లనఁగ ♦ దిక్కులు వెలుఁగన్. ౯౪౧

అప్పులు = జలములు - పాలు జలవికారమే కావున పాలు జలము లని చెప్పఁబడెను - మథింపఁగ = చిలుకఁగా - వానను = ఆజలములందు - ఉత్పతి లెన్ = పుట్టెను - రసము = క్షీరసారము - దానన్ = దానియందు.

తా త్ప ర్య ము.

జలమును జిలుకఁగా వానియందు సారము జనించెను. దానియందు కొంద అందగత్తెలు స్త్రీలు పుట్టిరి. అప్పులనుండివచ్చినరసమున జనించినవారు కావున వారు అప్సరసలు అనఁబడిరి.

క౦॥ అచ్చర లఱువదికోటులు, సచ్చరితా! వారికిఁ బరి♦చారిక లెన్నన్
వచ్చునె యెందఱొ, యసురవి,యచ్చరులు గ్రహింప రైరి ♦ యాయంగనలన్. ౯౪౨

అచ్చరలు = అప్సరసలు.

తా త్ప ర్య ము.

అఱువదికోటు లచ్చరలు పుట్టిరి. వారిపరిచారిక లెందఱో గలరు. వారిని లెక్కింప నెవరివశము? ఆస్త్రీలను దేవతలుగాని రాక్షసులుగాని గ్రహించిన వారు కారు.

క౦॥ కావున నర్తిలి నాక్రోం,బూవుంబోడుల నెవండుఁ ♦ బూనమిఁ గాన రా
మా! వారలు సామాన్యా,భావంబున వెలయు చుండ్రు ♦ పడుపుంజెలులై. ౯౪౩

క్రొంబూవుంబోండ్లు = క్రొత్తపూలవలెఁ గోమలములైన దేహములుగల స్త్రీలు-అర్తిలిన్=ప్రేమచే, కామముచే - సామాన్యా=వేశ్య - పడుపుంజెలులై= వారకాంతలై, వెలయాండ్రై).

తా త్ప ర్య ము.

రామచంద్రా! యా యచ్చరలను రాక్షసులుగాని దేవతలుగాని కామముచే గ్రహింపరైరి. కావున వారు మగవారియందఱియందు సమానపతి భావము గలవారై లంజలై వర్తించిరి.

క౦॥ వరుణునికూఁతురు వారుణి, సుర పేర గ్రహీత నరసి ♦ చూచుచుఁ బుట్టన్
బరికింపరైరి యసురులు, తరుణిని గైకొనిరి సురలు ♦ తాత్పర్యమునన్. ౯౪౪

వారుణి = వరుణుని అపత్యము స్త్రీ వారుణి. ఈమెకు సుర యనియుఁ బేరు. ఈమె సురాధిష్ఠాన దేవత. గ్రహీతన్ = గ్రహించువానిని. అరసి = వెదకి.

తాత్పర్యము.

సుర యనుపేరుగల వరుణునికూఁతురు తన్నెవఁడు గ్రహించునో యని చూచుచు రాఁగా నామెను నసురులు గ్రహింపరైరి దేవత లిష్టముతోఁ బరిగ్రహించిరి.

కం॥ సుర నొల్లమి దితిపుత్త్రు లసుర లైరి, పరిగ్రహించి ♦ సుర నదితిసుతుల్
సుర లగుచును హృష్టాంగ, కరణంబుల నొప్పి రపుడు ♦ గస్గురుపొడువన్. ౯౪౫

తాత్పర్యము.

దైత్యులు సురను గ్రహింపనికారణముచే నసురులైరి. దానిని గ్రహించిన కారణమున దేవతలు సురలై దేహంబున గగ్గురుపాటుగలుగ సంతోషించిరి.

తే॥ అవల నుచ్చైశ్శ్రవం బను ♦ హయము పుట్టెఁ, గౌస్తుభం బనురత్నంబు ♦ గలిగెఁ బిదప
వెండి నుత్తమ మమృతంబు ♦ వెడలివచ్చె, జలధి నగి వారివంశంబు ♦ సమయఁజేసె. ౯౪౬

ఆవల నుచ్చైశ్శ్రవ మను గుఱ్ఱము పుట్టెను. ఆవలఁ గౌస్తుభం బను రత్నము కలిగెను. ఆవల నమృతము పుట్టెను. అది వారివంశము నాశము చేసెను.

చం॥ అది యెటు లన్న నాసుధకునై యొకరై యల రాక్షసాసురుల్
ప్రిదులక వేల్పులం దొడరి ♦ పెందురముం ఘటింప వారిలో
గుదిగొని రెండువాఁగులను ♦ గూలిరి లెక్కకు మిక్కుటంబుగాఁ,
ద్రిదశులపక్ష మూని హరి ♦ తెప్పునఁ దా హరియించె నత్సుధన్. ౯౪౭

సుధకునై = అమృతమునిమిత్తము. త్రిదశులు = మూఁడుదశలుగలవారు. ఉత్పత్తిస్థితిమరణములుగలవారు. ఇవి మనుష్యులకును గలవు. అయినను దేవతలు పుట్టినపుడు జీవించియున్నప్పుడు మరణించునపుడు ఇరువదియైదేండ్లవారివలె నుందురు; గాని బాల్యము వార్ధకము లోనగు త్రిక్కినయవస్థలు లేవు. పెందురము = పెద్దయుద్ధము. ప్రిదులక = వెనుకఁదీయక.

తాత్పర్యము.

అమృత మిది యెట్లు వారినాశమునకుఁ గారణ మాయె ననెదవా వినుము. అమృతము పుట్టఁగానే దానిని దేవతలకేక తామే హరింపవలెనని రాక్షసులు అసురులు నొకటై దేవతలతో యుద్ధము చేసిరి. దానిలో రెండుపక్షముల వారిలో ననేకులు చచ్చిరి. అప్పుడు విష్ణువు దేవతలపక్షము వహించి యాయమృతమును దా నపహరించెను. ఏదోయొకనిమిత్తముగఁజేయు స్నేహాఫల మిట్టిదై యుండును.

క౦॥ మోహనమాయనుసురుల, మోహింపఁగఁ జేసి యెదురు♦మూఁకలఁ గూల్చెన్
స్నేహంబు నెఱపి విబుధ,వ్యూహంబున కిచ్చె నమృత ♦ ముల్లం బలరన్. ౯౮౭

మోహనమాయను = మోహింపఁజేయు నద్భుతశక్తిచేత - మోహినియై, ఎదురుమూఁకలన్ = ఎదిరించిన గుంపులను, విరోధులను.

తా త్ప ర్య ము.

విష్ణువు మోహినీవేషము ధరించి రాక్షసుల మోహింపఁజేసి విరోధించిన రాక్షసులగుంపుల వధించెను. దేవతలపట్ల స్నేహభావముఁ జూపి యమృతమును వారు సంతోషించునట్లు వారి కిచ్చెను.

క౦॥ ఘోరాహవరంగంబునఁ, గ్రూరాసురకోటిఁ దునిమి ♦ రూక్షుంబుగఁ బా
కారి స్వరాజ్యము నేలె స,చారణఋషిదైవతంబు ♦ సంతోషపడన్. ౯౮౮

తా త్ప ర్య ము.

ఇట్లమృతము ద్రావుటచే మరణములేని వారైనదేవతలఁ జేర్చుకొని యింద్రుఁడు భయంకరమైన యుద్ధభూమియందు దయలేక రాక్షసుల వధించి చారణులు, ఋషులు, దేవతలు, సంతోషించునట్లు తనరాజ్యము మరల నేలెను.

ఇంద్రుఁ డొకనాఁ డైరావతము నెక్కి విహారము వచ్చుచుండఁగా దుర్వాసుఁ డెదురుగ వచ్చి యొకపుష్పహార మాయన కిచ్చెను. ఇంద్రుఁడు దాను దానిని ధరింపక యైరావతము కుంభములకుఁ జుట్టెను. అది తొండముతో దానిని తీసి నేలవేసి కాలరాచెను. సగౌరవముగఁ దా నిచ్చిన పూలగండకు వచ్చినగతి చూచి దుర్వాసుఁడు కోపించి యైశ్వర్యమదముచేఁ గదా నీవు నన్నిట్లవమానపఱిచితివి. నీయైశ్వర్యమంతయు సముద్రముపాలై పోవునుగాక యని శపించెను. వెంటనే యింద్రునకుఁగల యేనుఁగులు గుఱ్ఱములు మణులు లోనైనభోగపదార్థములన్నియు మాయమై సముద్రమునఁ జొచ్చెను. ఇంద్రుఁడు దరిద్రుఁడై బుద్ధిమంతుఁడై మరల విష్ణువును బ్రార్థింపఁగా నీకమీఁద నిట్లు పెద్దల నవమానింపకు మని బుద్ధిచెప్పి మందరమును బాలసముద్రమున వైచి చిలికినయెడల మరల మునుపటియైశ్వర్యమంతయు లభించు నని చెప్పెను. ఆమహావిష్ణువు సహాయముచే నింద్రుఁడు మరల లబ్ధైశ్వర్యుఁ డయ్యెను.

ఇదియును యోగశాస్త్రము ననుసరించియే యున్నది. మూలాధారమందుండు త్రికోణము మందరము. దానిఁజుట్టియుండు వాసుకి కుండలి. దానిని మథించిన సురాసురులు ఇడాపింగళనాడులయందలి ప్రాణశక్తివాయువులు. ఇంతకు నాధారభూతుఁడు విష్ణువు. కుండలి తొలుత మేల్కొనునపుడు దేహమున శక్తిప్రసారము కారణముగ వికారములు పుట్టును. అప్పుడా యోగవిద్య తెలిసిన

గురువు దానివలన నపాయములేకుండఁ జేయవలయును. ఈగురువే వాసుకిభూష ణుఁడైన శివుఁడు. శివుఁడు వాసుకికంకణుఁడు గావున నావిష మాయనను బాధింపఁజాలదు. భగవంతుఁడు విష్ణువే గురువును (శివుని) దీనికై ప్రేరించును. ఆవలఁ దానే యాధారముగ నిలిచి యోగియభీష్టము నెరవేర్చును. అమృతము పుట్టినను, అట్టిదశయందు హరిభక్తిలేనిసాధకులు సుందరులఁ జూచి చెడిపోవుదురు. భగవంతు నాశ్రయించియుండువారు కాదరు ఆయనయే విఘ్నముల నణఁచి వారి కమృతము లభింపఁజేయును.

౪౬ సర్గము. దితి యింద్రునిఁ జంపుకొడుకునకై వ్రత మనుష్ఠించుట

చం॥ కొడుకులపాటుఁ గాంచి దితి ♦ కూరినదుఃఖముచే విషణ్ణయై
మిడుకుచు భర్తకశ్యపున ♦ మీపముఁ జేరి సబాష్పనేత్ర నా
కడుపున నీకుమారకులె ♦ కాల్చిరిచు మ్మిటు నాథ! యింక నే
వడువున నోర్చుదానఁ బగఁ ♦ బాపుసుతుండు జనింపఁ డేనియున్. ౯౩౦

తాత్పర్యము.

తన కొడుకులకు వచ్చినదురవస్థఁ జూచి దితి దుఃఖాతిశయముచే వెల్లఁ బోయి సంకటపడుచుఁ దనభర్త యగు కశ్యపునిఁ జేరఁబోయి కన్నీరుకారు చుండ నాథా! నీకొడుకులె నాకడుపును గాల్చిరి. ఇఁక నాపగ దీర్చుకొడు కొకఁడైనఁ బుట్టఁడేని నే నెట్లు పుత్రశోకము భరింపఁగలను?

కం॥ పాకారిఁ జంపుపుత్త్రుఁడు, నాకడుపునఁ బుట్టఁగల్గి♦నం బగదీఱుఁ
నా కట్టిసుతు నొసంగుము, చేకొనుమా మనవి తపము♦చేసెద ననుచున్. ౯౩౧

తాత్పర్యము.

ఇంద్రునిఁ జంపఁగలకొడుకు నాకడుపునఁ బుట్టెనా వాఁడు పగదీర్చును. కావున నాకట్టికొడుకు గలుగ ననుగ్రహింపుము. నీవు చెప్పినట్లు తపము చేసెదను. నామనవిని వినుము. నన్ననుగ్రహింపుము.

సీ॥ అతిదుఃఖతాప్త యా ♦ దితిఁ గని యిట్లనుఁ, గశ్యపుఁ డట్లగుఁ ♦ గాక నీవు
నిండు వేయేఁడు ల♦ఖండతపంబును, నాపల్కురీతి నొ♦నర్చితేని
శక్రునిఁ జంపు ప♦రాక్రమవంతునిఁ, ద్రైలోక్యభర్తఁ బు♦త్త్రకునిఁ గనెద
వని యామె యుదరంబుఁ♦ దనకేల స్పృశియించి, శుభమగు నీకు నో♦సుందరాంగి

తే॥ యనుచు వచియించి యతఁ డేగ ♦ వనమునకును
దితియు ముద మంది యొనరించె ♦ దీర్ఘతపముఁ
దాఁ గుశప్లవనంబున ♦ దారుణముగ
శక్రుఁ డామెకు, బరిచర్య ♦ సలుప వచ్చె. ౯౩౨

తాత్పర్యము.

అని మిగులదుఃఖపడుచున్న దితిని జూచి కశ్యపుఁ డిట్లనియె, దేవీ! నీవు వేయేఁడులు నేను జెప్పినట్లు పూర్తిముగ నడుమ విఘ్నములేక చేయుము. అట్లు చేయఁగలిగితివేని నీ వింద్రునిఁ జంపఁగలవాఁడును మూఁడులోకములకు నేలిక యగువాఁడును నగు కొడుకును గనెదవు అని యామెకడుపును దనచేతితోఁ దాఁకి తడవి, యోసుందరీ! నీకుఁ బ్రియమగుఁగాక యనుచుఁ జెప్పి తపస్సు చేయుటకై యాయనవనమునకుఁ బోయెను. దితియు మిగుల సంతోషించి కుశప్లవ మను క్షేత్రమునందు దీర్ఘకాలము తీవ్రమైన తపమును జేసెను. ఆకాలమందు నామె కుపచారము చేయుటకై యింద్రుఁడు వచ్చెను.

ఉ॥ నీతి యొకింత దప్పక వి♦నీతుఁడునై గురుభక్తియుక్తిఁ ద
ల్లాతకు సేవ సేయుఁ, దరు♦ణంబును దప్పఁగనీక సత్ఫల
వ్రాతము దర్భలుఁ సమిధ♦పఙ్క్తము లోనగ నెల్లవస్తువుల్
ప్రీతిగఁ దెచ్చి యిచ్చు, మఱి ♦ వీవన వీచు శ్రమంబు దీఱఁగన్. ౯౫౩

తాత్పర్యము

ఇంద్రుఁడు కొంచెమైనను నీతిమార్గమును విడువక వినయముగలవాఁడై తల్లి యను గొప్పభక్తితోఁ గూడినవాఁడై యాతల్లికి సేవచేయుచుండెను. సమయమునకు సరిగా మంచిపండ్లు దర్భలు సమిధలు మొదలైనవస్తువులన్నియుఁ దెచ్చి యిచ్చును. ఆమె తపస్సుచేసి యలసి పరుండినప్పుడు విసనకఱ్ఱతో శ్రమము పాయ వీచుచుండెను.

చం॥ బడలినవేళఁ గాల్పిసుకు, ♦ భామిని యెయ్యది చెప్ప జాగు లే
కెడ విసుమాల కగ్గ ఘటి♦యించు, నిటుల్ పరిచర్య సేయఁగాఁ
గడచె సహస్రకంబుకొఱ♦గా నొకవేసము, లంతఁ దృప్తయై
కొడుకును జూచి పల్లె సుమ♦కోమల ప్రీతమనోంబుజాతయై. ౯౫౪

బడలికచెందినవేళఁ గాళ్లు పిసుకును. ఆమె యేపనిచెప్పినను ఆలస్యములేక విసుఁగుకొనక యది వెంటనేచేయును. ఈప్రకారము శుశ్రూషచేయుచుండఁగాఁ బదిసంవత్సరములు తక్కువగా వేయేండ్లు పూర్తిగావచ్చెను. అప్పుడతనిసేవకుఁ దృప్తిపడినదై పుష్పమువలెఁ గోమలమైనదేహముగలయామె ప్రీతితోఁ గొడుకగు నింద్రునిఁ జూచి యిట్లనెను.

ఉ॥ వేఁడఁగ నీదుతండ్రిఁ బృథి♦వీధరశాసన! యొక్కపుత్రు వే
యేఁడులు నిష్ఠ నీవ్రతము ♦ నే నొనరింపఁగఁ గల్గు నంచనన్

మూఁడుజగంబుల న్నినుఁ బ్రమోఘబలంబున గెల్వ శక్తమా
జూఁడియు నాకుఁ గల్గె, ననుజం గనఁగొందువు నిష్ఠ నిండినన్   ౯౫౫

వ్రతము సాంతము గావచ్చినది ఇఁక విఘ్నభయము లేదు తనకోరిక నెఱవేఱును. మర్మమువిడిచి చెప్పినను దోషములేదని యెంచి రహస్యముఁ బట్టఁజాలక యింద్రునితో నిట్లనియెను. ఇంద్రా! నీతండ్రిని నేనొక్క వరమును వేఁడితిని. ఆయనయు నాయందనుగ్రహించి వేయిసంవత్సరములు నీవఖండతపస్సును జేసితివేని నీకుఁ గొడుకు గలుగునని యనుగ్రహించెను. ఆవరప్రబలమున మూఁడు లోకంబులను నిన్నును ఎదురులేనిబలముచే గెలువఁగలశక్తిగల గర్భము నాకుఁ గలిగెను. ఈపదిసంవత్సరములు పూర్తికాఁగానే యట్టితమ్ముని నీవు చూడఁగలవు.

చం॥ వెఱవకుమయ్య నీకొఱకు ♦ వేయువిధంబుల నైనఁ జెప్ప యే
కొఱఁతయు నీకు లేనిగతిఁ ♦ గూర్మిసుతుం దవరించుదాన, ని
ద్దఱు నొకటై జగంబులను ♦ దర్పము బ్రోవుఁడు, నిన్న భద్రము
ల్దొఱయ నటంచు నాడు మను ♦ దొయ్యలి యానడిపూఁట నండకున్. ౯౫౬

తొయ్యలి = స్త్రీ.

తా త్ప ర్య ము.

కుమారా! నన్ను గెలుచుకుమారుఁడు గలుగునఁట, ఇంక నాగతి యేమి? యని భయపడకుము. నీపక్షమున వేయివిధములుగనైన మాటలాడి నీ కే కొఱఁతయు లేకుండునటుల నాముద్దుకుమారుని నేను చక్కదిద్దెదను, మీ రిరువురు నొద్దికగలవారై లోకములను రక్షింపుఁడు. నాయనా! నీకు మేలగుఁగాక - యని చెప్పి యామె మధ్యాహ్నము నెండకు ఒడలినదై.

ఉ॥ ముమ్మర మైననిద్ర దను ♦ ముంచిన మైమఱచ పొంది పాదదే
శమ్మున వ్రేల వెండ్రుకలు ♦ సాధ్వి శిరఃకలితాంఘ్రిభాగ యై
యిమ్ముగ నంటఁ గాంచి హసియించి ముఖంబున లోనఁ జొచ్చి గ
ర్భమ్మును నేడుతున్కలుగ ♦ వజ్రహతిం హరి ద్రుంచెఁ, ద్రుంచినన్   ౯౫౭

ముమ్మరము = అధికమైన - మైమఱపు = దేహమును హెచ్చరికనప్పుట - శిరఃకలితాంఘ్రిభాగయై = శిరముతోఁగూడిన పాదప్రదేశముగలదై - హసియించి = నవ్వి.

తా త్ప ర్య ము.

మిక్కుటమైననిద్ర తన్ను ముంపఁగా దేహమును మఱచి విరిసినవెండ్రుకలు కాళ్లమీఁద వ్రేలుచుండగా మోఁకాళ్ళమీఁదఁ దలయుంచి సుఖముగ నిద్రించు

చుండుట చూచి యీమాత్రమునకా నన్ను జయించుకొందునను గన్నట్లు వాని వలన నాకు విపత్తు గలుగునట్లు నీకు మధ్యవర్తితనము చేసెద నని చెప్పితివని యీమెయభిమానమునకు కాంచినందుకు సందు దొరకెఁ గదా యని నవ్వుచు, గెలిచితిని. ఇఁక నేమిభయము సందు దొరకెనని సంతోషించి యీమె లో పలఁ బ్రవేశించి యాగర్భపిండమును నేడుతునకలుగా నింద్రుఁడు వజ్రాయుధముచే నఱకెను.

మధ్యాహ్నవేళ దితి నిద్రించినవిధము కొందఱు వేఱువేఱువిధములుగ వ్రాసి యున్నారు. వ్రతనిష్ఠయందుండి పగలునిద్రించుట పాపము కొందఱుశయ్యపైఁ గాళ్ళదిక్కుతల, తలదిక్కు కాళ్లుంచి పండుకొనె ననిరి. శయ్య యనఁగా బానపుగాక పోయినను కృష్ణాజినమని కొందఱనిరి. కొందఱు కూర్చుండియే పాదములను శిరస్సుఁదగుల నిద్రించినదనియు, నిది బ్రాహ్మణుఁడు శూద్రుని దాఁకుటవంటిదని యుఁ గావున నశుచిత్వ మనియు తపస్సునందుండు దానికి శయ్యయుండదు గావున శయ్యయందుఁ బరుండినదనుట సరిగాదనియుఁ గొందఱనిరి. కొందఱు భూమిమీఁదఁ బరుండినను తూర్పు దక్షిణము తప్పఁ దక్కిన దిక్కులందు శిరస్సుంచుట దోషము గావున నట్లుచేసిన దనిరి. దితికిఁ బగటిపూట నిద్రింపరాదని - అందు వ్రతస్థయై యేవిధముగనైన నిద్రింపరాదని తెలియకయున్నదా? ఆమె బుద్ధిపూర్వకముగ నిద్రించినదికాదు. ఇంద్రునితో మాటలాడుచుండి పెద్దమ్మ యావేశించుటచే నవశయై కూర్చుండినది. కూర్చుండినట్లే కూర్కెను. శిరస్స్నానముచేసిన దగుటచే వెండ్రుకలెండించుటకుఁగా విరియఁబోసికొని యుండెను. పద్మాసనస్థయై కూర్చుండినను రెండుపాదములమీఁదికి శిరస్సు రాఁజాలదు. ఒకవేళ వచ్చినదనుదమన్న నంతక్రిందికి శిరస్సు వచ్చునప్పటికి మెలకువ రానే వచ్చును. కావున ముడిచిన మోఁకాళ్లమీఁదఁ దలయుంచె ననుటయే సాధువని తోఁచుచున్నది. మోఁకాళ్లుకూడ కాళ్ళలోఁ జేరినవేకదా.

—* ఇంద్రుఁడు దితిగర్భమున నున్న పిండంబును ఖండించుట *—

ఉ॥ మానక యేడ్వఁ బిండములు ♦ మా రుద మా రుద యంచుఁ ద్రుంప నా
చానయు నిద్ర మేలుకని ♦ చంపకు చంపకు మంచుఁ బల్కినన్
మానుచు మాతృవాక్యగరి♦మంబున వజ్రముఁ గేలఁ బూని యా
మానినిపాదసీమ శత♦మన్యుఁడు వ్రాలి వచించె నీగతిన్. ౯౫౧

మా రుద = ఏడువకుము. చాన = స్త్రీ. మాతృవాక్యగరిమంబునన్ = తల్లిమాటయందుఁగల గురుత్వముచే. శతమన్యుఁడు = ఇంద్రుఁడు.

తా త్ప ర్య ము.

ఇట్టు లింద్రుఁడు పిండమును ఖండింపఁగా నది యేడ్చెను - ఏడువకు మేడువకు మని మఱిమఱి ఖండించెను. ఇంతలో దితి మేలుకని చంపకు చంపకు మని పలికెను. ఇంద్రుఁడును దల్లిమాటయందలిగౌరవముచేఁ జంపక వజ్రాయుధము చేతఁ బూని వెలుపల వచ్చి యామెపాదములపైఁబడి యింద్రుఁ డిట్లు వచించెను.

శా॥ తల్లీ! నే నపరాధి నిక్క మిది క్షం◆తవ్యుండ మన్నింపుమీ
యల్లీలన్ నిదురింప నీ వశుచి వై ◆ యంఘ్రిద్వయి న్మూర్ధజ
మ్ము ల్లీల న్నటియింప నిమ్ము గని నీ◆పుత్త్రున్ బిడౌజోంతకున్
బెల్లాల్యంబున నేడుతున్కలుగ నే ◆ భేదించితిం జు మ్మనన్. ౯౫

అపరాఘని = అపరాధము చేసినవాఁడను - అయినను- క్షంతవ్యుఁడన్ = క్షమింపఁదగినవాఁడను - అంఘ్రిద్వయిన్ = రెండుకాళ్లయందు - మూర్ధజమ్ములు = తలవెండ్రుకలు - బిడౌజోంతకున్ = ఇంద్రునిఁ జంపువానిని - బిడౌజస్ + అంతకుఁడు=బిడౌజోంతకుఁడు - సకారమునకు బదులుగ వచ్చిన విసర్గమునకుఁ బూర్వ మప్లుతమై హ్రస్వమైన అకార ముండి పరంబుగ హ్రస్వమైన అకారముగాని యావర్గముయొక్క ౩-౪-౫ అక్షరములుగాని యరలవసహలుగాని యుండినచోట విసర్గము ఉకారముగా మాఱును - బిడౌజస్ + అంతకుఁడు= బిడౌజోంతకుఁడు - బిడం = వ్యాపనశీలం ఓజో యస్య సః బిడౌజాః =వ్యాపనశీలమైన తేజస్సుగలవాఁడు - పెల్లులౌల్యమున్ = అధికమైన దేహాభిమానముచే.

తా త్ప ర్య ము.

తల్లీ! నేను నిజముగ నపరాధముచేసినవాఁడనే - అయినను నేను క్షమింపఁబడుటకు యోగ్యుఁడను కావున శపింపక మన్నింపుము - నీ వావిధముగ నశుచివై (వ్రతము సలుపువారు పగలు నిద్రింపరాదు - అది యొకదోషము. రెండవది నీవు తలవిరియఁబోసికొని కాళ్లకు వెండ్రుకలు దగులఁజేయుట - మూఁడవది మోఁకాటిపై శిరముంచుట- యీ మూఁటివలన నీ వశుచి వని భావము) తల వెండ్రుకలు కాళ్లపైఁ బడుచుండఁగా నిదే సమయ మని యెంచి నా దేహమును నేను రక్షింపవలయు నను కోరికతో నన్నుఁ జంపువానిని నేను నేడుతునకలుగ ఖండించితిని. తన్నుఁ జంపవచ్చినబ్రాహ్మణునైనను- స్త్రీనైనను - గోవునైనను జంపవచ్చు నని శాస్త్రముకలదు - కావున నన్నుఁ జంపనున్నవాని నేను జంపుట దోషము గాదు- కావున క్షమింపుము.

౪౭ సర్గము. సప్తమరుత్తులయుత్పత్తి.

తే॥ తనదుగర్భ మీగతి నేడు♦తునకలైనఁ, బల శోకించి మిగుల న♦జయ్యుఁడైన
బలవిరోధిని వీక్షించి ♦ పలికె దితియు, సానునయవాక్యముల నిట్లు ♦ లంబుజాక్ష! ౯౬౦

అజయ్యుఁడు = జయింపసాధ్యముగానివాఁడు బలవిరోధిని = ఇంద్రుని. సానునయవాక్యములన్ = ఊరార్పుమాటలను.

తాత్పర్యము.

తనగర్భ మీవిధముగా నేడుతునకలు గాఁగా జయింపరాని యింద్రునిఁ జూచి దితి యతని నూరార్చుచు రామా! యిట్లనెను.

ఉ॥ దోసము లేదు నీవలన ♦ దోసము నాయది యాట భూమిభృ
చ్ఛాసన! సప్తధాభిదగఁ ♦ జల్పఁగఁ గల్గిని నీవు గర్భముల్
రోస మదేల నా కిఁక, మ♦రుత్తులు నేడ్వురు నేలు భూములన్
వాసిగ వీరిపాలనము ♦ వర్తిలఁ జేయుము నాకుఁ బ్రీతిగన్. ౯౬౧

భూమిభృచ్ఛాసన = పర్వతముల శిక్షించువాఁడా - సప్తధాభిదగ = ఏడుగఁ జీలునట్లు.

ఇంద్రా! నీవలన దోసము లేదు - దోసము నాది యగుటచేతనే నాగర్భమును ఏడుతునకలుగా నీవు చేయఁగలిగితివి. ఇఁక నాకు నీపై కోపమేల? మరుత్తులు నేడ్వురు పాలించు భూములయందు వీరిపాలనము నాకుఁ బ్రీతిగలుగునట్లు ప్రవర్తిలఁజేయుము.

కం॥ నాకొడుకు లేడ్వురును దివ్యాకృతులై నీవు పిలిచి ♦ నటు మారుతులన్
ప్రాకటనామంబున వాతాకృతిఁ జరియించు వార ♦ లాకసమందున్. ౯౬౨

దివ్యాకృతులై = దేవతల యాకారములు గలవారై - వాతాకృతిన్ = వాయుస్వరూపములతో.

తాత్పర్యము.

నాకొడుకు లేడ్వురు దేవతల యాకారములు ధరించి నీవు నీవుపిలిచినట్లు మారుతు లను ప్రఖ్యాతనామములతో వాయుస్వరూపులై యాకాశమందుఁ జరించుచుండ నిమ్ము.

ఆ॥ ఒకఁడు బ్రహ్మలోక ♦ మొకఁ డింద్రలోకంబు♦నొకఁడు వాయువనఁగ♦నుడుపథంబు
నొంది మలయువార ♦ లున్నవల్వురు నాల్గు,దెసల యుష్మదాజ్ఞఁ♦దిరుగువారు. ౯౬౩

తాత్పర్యము.

బ్రహ్మలోకమందొకడు ఇంద్రలోకమందొకడు ఆకాశమునవొకడు తక్కిన నలువురు నీయాజ్ఞాప్రకారము నాలుగుదిక్కుల నుండుదురు.

క॥ కొంజక యిటు పలుకు మునం, బ్రాంజలి యై తల్లిఁ జూచి • యనె నింద్రుం డో రంజితసుజనా! సత్య మగుం జూవె యి ద్దెల్ల శంక • మూర్చకు మదిలోన్. ౯౬౮

తాత్పర్యము.

సందేహింపక నీ విట్లుచేయు మని తల్లి చెప్పఁగా నింద్రుఁడు చేతులు జోడించి నమస్కరించి తల్లీ! నీవు చెప్పినట్లే జరుగును. సంశయింపకుము.

క॥ అని తల్లియుఁ గొడుకుఁ దపో,వనమున నీరీతి నమయ • పంక్తి సంతుష్టిం జనిరి దివంబున కని యిది, వినినారము మున్ను దివ్య • విభవా రామా! ౯౬౯

తాత్పర్యము.

అని యీరీతిగాఁ దల్లియగు దితియుఁ గొడుకగు నింద్రుఁడు తపోవనమునందు కట్టుపాటుచేసికొని సంతోషముతో స్వర్గమునకుఁ బోయిరి. అని యిది పెద్దలు చెప్పఁగా విన్నాఁడను.

శ్లో॥ ఆవహః ప్రవహశ్చైవ సంవహ శ్చోద్వహ స్తథా
వివహాఖ్యః పరివహః పరావహ ఇతి క్రమాత్
సప్తైతే మారుతస్కంధాః మహర్షిభి రుదాహృతాః
ఆవహో వర్తయే ద్వాయు ర్మేఘోల్కావృష్టివిద్యుతః
వర్తయే త్ప్రవహశ్చైవ తథా మార్తాండమండలమ్
సంవహో మారుతస్కంధ స్తథా శీతాంశుమండలమ్
వర్తయే దుద్వహశ్చాపి తథా నక్షత్రమండలమ్
పంచమో వివహాఖ్యశ్చ తిష్ఠేద్ గ్రహమండలమ్
సప్తర్షిచక్రం స్వర్గం గాం షష్ఠః పరివహ స్తథా
పరావహ స్తథావాయు ర్వర్తయే ద్ధ్రువమండలమ్.

ఆవహుఁడు ప్రవహుఁడు సంవహుఁడు ఉద్వహుఁడు వివహుఁడు పరివహుఁడు పరావహుఁడని యీసప్తమరుత్తుల పేర్లు - వీరును స్కంధములకు మారుతస్కంధము లనిపేర్లు - ఇందు ఆవహుఁ డనువాఁడు (ఆవహ మను గాలి) మేఘములు - పిడుగులు - వర్షము - ఆకాశమున నూడిపడుకొఱవులు - వీని యందు వర్తించును. ప్రవహ మనువాయువు సూర్యమండలమున వర్తించును - సంవహ వాయువు చంద్రమండలమున వర్తించును - ఉద్వహవాయువు నక్షత్ర మండలమందు వర్తించును - ఐదవదగు వివహవాయువు గ్రహమండలమున వర్తిం

చును - ఆఱవ పరివహావాయువు సప్తర్షిమండలమందు స్వర్గమందు భూమియందు వర్తించును. పరావహావాయువు ధ్రువమండలమున వర్తించును.

శ్లో॥ గగనస్పర్శనో వాయు రనిలశ్చ తథా పరః
ప్రాణః ప్రాణేశ్వరో జీవ ఇత్యేతే సప్తమారుతాః.

గగనము - స్పర్శనము - వాయువు - అనిలుఁడు - ప్రాణము - ప్రాణేశ్వరుఁడు- జీవుఁడు- అనియు సప్తమారుతులపేర్లు గలవు.

—♦ శ్రీరాములకు విశ్వామిత్రుఁడు విశాలాదేశవృత్తాంతంబుఁ దెలుపుట. ♦—

క॥ ఈదేశము శక్రుఁడు మున్నాదితికిని సేవచేసి♦నట్టిది వినుమా
భూదయితుం డిక్ష్వాకుం, డాదృతిని నలంబుసాఖ్య♦యందుం గనియెన్. ౯౬

శక్రుఁడు = ఇంద్రుఁడు - భూదయితుఁడు = రాజు.

తా త్ప ర్య ము.

పూర్వ మింద్రుఁడు దితికి సేవచేసినదేశ మిదియే - ఇందు నిక్ష్వాకుఁ డనురాజు అలంబుస యనుభార్యయందు.

సీ॥ పరమధార్మికకీర్తి ♦ బరగువిశాలుని, నతఁ డిటఁ గట్టించె ♦ నయ్యె దీని
వసుధ విశాల నా♦వరలునియ్యాదియు వి,శాలుసుతుఁడు హేమ♦చంద్రుఁ డయ్యె
నమ్మహాబలశాలి♦యాత్మజుండు సుచంద్రుఁ, డతనికిఁ బుట్టె ధూ♦మ్రాశ్వుఁడనఁగ
నాతనితనయుఁడై ♦యలరెస్సృంజయుఁడు త,త్తనయుఁడు సహదేవ♦మనుజనాథుఁ
తే॥ డతనికులవర్ధనుండు కు,శాశ్వుఁడయ్యె, నతనిసుతుఁడయ్యెసోమద♦త్తాఖ్యనృపతి
సోమదత్తున కుదయించె ♦ శూరవరుఁడు, వినతగుణుఁడు కకుత్థ్సప్ర♦థ్వీవిభుండు. ౯౭

తా త్ప ర్య ము.

మిక్కిలి ధర్మాత్ముఁ డని కీర్తిని సంపాదించిన విశాలుఁ డనువానిని గాంచెను - ఆవిశాలుఁడే యిచ్చటఁ దనపేర విశాల యను నగరముఁ గట్టించెను. ఆవిశాలుని కుమారుఁడు హేమచంద్రుఁడు - ఆబలవంతుఁడైన యాహేమచంద్రుని కుమారుఁడు సుచంద్రుఁడు - అతనికుమారుఁడు ధూమ్రాశ్వుఁడు - అతనికుమారుఁడు స్సృంజయుఁడు - ఆతనికుమారుఁడు సహదేవుఁడు - అతనికుమారుఁడు కుశాశ్వుఁడు - అతనికుమారుఁడు సోమదత్తుఁడు - సోమదత్తునికుమారుఁడు శూరుఁ డగు కాకుత్థ్సుఁడు.

క॥ ఆతనిసుతుఁ డగుసుమతియె, యీతరుణమునందు దీని ♦ నేలెడి; నిక్ష్వా
క్వాతతదయ నీనృపతులు, పూతిమతులు ధర్మరతులుఁ♦బొరి దీర్ఘాయుల్. ౯౮

ఇక్ష్వాకు అతితదయ = ఇక్ష్వాకుని విస్తారమైనకరుణచే.

తాత్పర్యము.

ఆకాకుత్స్థునికుమారుఁ డగు సుమతి యను రాజు ప్రకృత మీనగర మేలుచున్నాఁడు - ఇక్ష్వాకునిదయచే నాయన వంశమునఁ బుట్టినరాజులందఱు పరిశుద్ధమైనమనస్సుగలవారు - ధర్మమునందుఁ బ్రీతిగలవారు -దీర్ఘాయువుగలవారు. (ఈకకుత్స్థుఁడు శ్రీరాములతాత యగు సూర్యవంశపురాజైన కకుత్స్థుఁడు కాఁడు.)

ఈసుమతివంశము శ్రీభాగవతంబున నవమస్కంధంబున నిట్లు చెప్పఁబడెను. మనువు - మనువునకు ఇక్ష్వాకుఁడు - నృగుఁడు - శర్యాతి - దిష్టుఁడు - ధృష్టుఁడు - కరూశకుఁడు - అరిష్యంతుఁడు - పృషద్ధ్రుఁడు - నభగుఁడు - కవి - యని పదుగురు పుత్త్రులు జనించిరి. అందు దిష్టునకు నాభాగుఁడు - అతనికి హలంధనుండు- అతనికి వత్సప్రీతి - అతనికిఁ బ్రాంశువు - అతనికిఁ బ్రమితి - అతనికి ఖమిత్త్రుఁడు - అతనికిఁ జాక్షుషుఁడు - అతనికి వివింశతి - అతనికి రంభుఁడు - అతనికి ఖనేత్త్రుఁడు - అతనికిఁ గరంధనుఁడు - అతనిక నవిక్షిత్తు - అతనికి మరుత్తుఁడు - మరుత్తునకు దముఁడు- అతనికి రాజవర్ధనుఁడు - అతనికి సుధృతి - అతనికి సౌధృతేయుఁడు - అతనికిఁ గేవలుఁడు - అతనికి బంధుమంతుఁడు - అతనికి వేదవంతుఁడు - అతనికి బంధుఁడు - అతనికిఁ దృణబిందుఁడు- ఆ తృణబిందునకప్సర యగు నలంబుసయందు నిలబిల యను కూఁతురు జన్మించె - ఈ యిలబిలయందు విశ్రవసునకుఁ బుట్టినవాఁడు కుబేరుఁడు. (చూ. ఉత్తరరామా) ఆ తృణబిందునకు విశాలుఁడు - ఈ విశాలుఁడే వైశాలి యను నగరంబు గట్టించెను. ఈ వైశాలియే విశాలి యని రామాయణంబునఁ జెప్పఁబడెను. ఆ విశాలునకు హేమచంద్రుఁడు - అతనికి ధూమ్రాక్షుఁడును - అతనికి సహదేవుఁడు - అతనికిఁ గృశాశ్వుఁడు - అతనికి సోమదత్తుఁడు- అతనికొడుకు సుమతి - రామలక్ష్మణవిశ్వామిత్త్రులు చూచిన దీయనే - ఇతనికొడుకు జనమేజయుఁడు- జనమేజయునకు సుమతి-యని విష్ణుపురాణమునఁ గలదు.

"తృణబిన్దోః ప్రసాదేన, సర్వే వైశాలికా నృపాః
దీర్ఘాయుషో మహాత్మానో, వీర్యవన్తోఽతిధార్మికాః."

అని కలదు - తృణబిందు ననుగ్రహముచే వైశాలికు లగు రాజులందఱు దీర్ఘాయుష్మంతులు - మహాత్ములు- వీర్యవంతులు - అతిధర్మాత్ములు.

మ॥ మన మీ రే యిట నిల్చి సౌఖ్యముగ రా॥మా! రేపు వేవంగనే
జనకుం జూత మటంచు నందు నెడ వి॥శ్వామిత్రమౌనీశ్వరా

కను వైశాలికుఁ డైనయాసుమతి యాకర్ణించి వే వచ్చి యా
మ్మునివర్యుల్ విహితోపచారవిధులం బూజించి తా మ్రొక్కుచున్. ౯౬౯

రే - రేయి - వేవంగన్ = తెల్లవాఱఁగా వైశాలికుఁడు = విశాలాపురప్రభువు. ఆకర్ణించి = విని - విహితోపచారవిధులన్ = యోగ్యమైన శాస్త్రసమ్మతమైన యుపచారకార్యములచే.

తాత్పర్యము.

రామచంద్రా! మన మీరాత్రి యాపురమందుండి రేయి తెల్లవాఱఁగానే లేచి పోయి జనకరాజును జూతమని యాలోచించుచుండు నంతలో విశాలాప్రభు వగు సుమతి వీరిరాక విశ్వామిత్రునిరాక విని త్వరగా వచ్చి యర్ఘ్యపాద్యాదులచే శాస్త్రప్రకారముగఁ బూజించి నమస్కరించి యిట్లనియె.

క॥ ధన్యుఁడ నైతిని మునిరాజన్యా! నుద్దేశ మీవు వచ్చుటచే నసా
మాన్యభవద్దర్శనమున, ధన్యులు నాకంటె లేరు వేడిన నచుచున్. ౯౭౦

మునీంద్రా! నీవు నా దేశమునకు వచ్చుటచేతన సామాన్యముగ లభింపని నీద ర్శనము నాకు లభించుటచేతను నేను ధన్యుఁడనైతిని-దేశమున వెదకినను నాకంటె ధన్యులు లేరు - (దీనివలన మహాత్ములు తమగ్రామమునకు వచ్చినవార్త తెలిసిన యెడల గ్రామములోని గొప్పవారు వారిదర్శనమునకుఁ బోవలయును.

—* ४౮ సర్గము. సుమతివిశ్వామిత్రుల సంభాషణము *—

క॥ కుశికసుతుండును సుమతియుఁ, గుశలప్రశ్నంబు చేసి కొమరగుసామి నా
దశరథసుతులను గనుచుఁ ద్రిదశవల్లభనిభుఁడు గాధితనయున కనియెన్. ౯౭౧

కుశికసుతుఁడు = విశ్వామిత్రుఁడు - త్రిదశవల్లభనిభుఁడు = ఇంద్రునితో సమానుఁడు.

తాత్పర్యము.

ఈరీతిగ విశ్వామిత్రుఁడు సుమతి పరస్పరము కుశలప్రశ్నము గావించిరి. మిక్కిలికోరికతో నాదేవేంద్రునితో సమానుఁడగు సుమతి విశ్వామిత్రునితో నిట్లనియె.

సీ॥ ఏవార లయ్యా యీ దేవపరాక్రముల్, వారణపంచాస్య పరమగతులు
వీరులు శార్దూల వృషభసంకాశులు, జలజాతలోచనల్ సరసమతులు
కలవాలతూణీర శరచాపధారులు, నాశ్వినేయసమాన హారితనులు
తొలకరించుచు నున్న మొలకప్రాయమువార, లిచ్చమై దివినుండి యిలకు దిగిన

తే॥ యమృతభోజనులట్టుల ♦ యమరువారు, మఱియు నింగితచేష్టాప్ర♦మాణములను
నొక్కరీతిని నున్నవా ♦ రక్కజముగ, వేఁడెదను జెప్పవే వీరి♦విధము నెల్ల. ౬౭౨

ఈదేవపరాక్రముల్ = సంస్థానవిశేషసర్వస్వముచే శ్రీయఃపతివంటిపరాక్రమముగలవా రని తోఁచుచున్నది. వారణపంచాస్యపరమగతులు = ఏనుఁగుయొక్కయు - సింహముయొక్కయు శ్రేష్ఠమైన నడకగలవారు - శార్దూలవృషభసంకాశులు - పులితోడను కోడెతోడను బోల్పఁదగినవారు - కరవాలతూణీరశరచాపధరులు = కత్తులు - అంబులపొదులు - బాణములు - విండ్లు ధరించినవారు - జలజాతలోచనుల్ = కమలములవంటి కన్నులుగలవారు. ఆశ్వినేయసమానహారితనులు = అశ్వినీదేవతాకుమారులతో సమానమైన మనోహరమైన దేహములుగలవారు - అమృతభోజనులు = దేవతలు - ఇంగితచేష్టాప్రమాణములను - ఇంగితము = లోపలియభిప్రాయమును దెలుపుచుండునవ్వు కనుబొమలాడించుట లోనగునవి - చేష్ట = నడచుట - పలుకాడుట - చూచుట లోనైనవి - ప్రమాణము = ఒడ్డుపొడుగు లోనైనవి - అక్కజము = ఆశ్చర్యము.

తాత్పర్యము.

మునీంద్రా! విష్ణుపరాక్రమమువంటి పరాక్రమముగలవారు - వీ రెవ్వరు? వీరు గాంభీర్యగమనమందు ఏనుఁగుతోను పగులఁ దిరస్కరింప సమర్థమైన గమనమందు సింహమును - భయంకరగమనమందు పులిని - గర్వముతోడి గమనమందు వృషభమును బోలినవారు. శత్రువులచే మొక్కఁబడుచు వీర్యముగలవారు - కమలములఁబోలు కన్నులుగలవారు - ఘనమగు మనస్సుగలవారు - ఖడ్గములు - పొదులు - విల్లు - బాణములు ధరించినవారు - అశ్విదేవతలవలె సుందరమై మనోహరమైన దేహములుగలవారు - ఎటుమరించుచున్న లేతప్రాయము వారు - స్వేచ్ఛగా భూమిమీఁదికి దిగిన దేవతలవలె నున్నవారు - మఱియు నింగితమందును చేష్టలందును ప్రమాణమందును నొకరితో నొకరు సమానముగ నున్నారు. వీరినిజూడ నాశ్చర్యమగుచున్నది. వీ రెవ్వరో చెప్పఁ బ్రార్థించెదను.

ఉ॥ ఏటికి నీబడిన్ మనుజు ♦ లెన్నఁడుఁ గ్రుమ్మరరాని యట్టిఘో
రాటవిఁ బాదచారు లయి ♦ యాయుధముల్ ధరియించి యెట్టు లి
ప్పాట మునీంద్ర! వచ్చిరి తు♦షాకరసూర్యులు మిన్నవోలె నీ
వాటి వెలుంగఁ జేసెద ర♦వారణవిక్రము లేరిపుత్రులో? ౬౭౩

నీబడిన్ = నీవెంట - తుషాకరసూర్యులు = చంద్రుఁడు సూర్యుఁడు. మిన్నవోలె = ఆకాశమునుబోలె - వాటి = ప్రదేశము - అవారణవిక్రములు = అడ్డులేని పరాక్రమముగలవారు.

తాత్పర్యము.

మునీంద్రా! వీరు నీవెంబడి యెన్నఁడు మనుష్యులు దిరుగసాధ్యపడని భయంకరమైన యడవులంగుఁ గాలినడ నాయుధములు ధరించి యెట్లు వచ్చిరి. సూర్యచంద్రులాకాశము వెలిఁగించునట్లు వీరు భూతలములను వెలిఁగించుచున్నారు-ఇట్టి వారింపరానిపరాక్రమముగల యీ బాలు రెవరిపుత్రులు?

కం॥ అను నావాక్యములను విని, ముని సిద్ధాశ్రమనివాస ♦ మును రాక్షసులన్ దునుముట లోనగుచరితం,బును సర్వము వినిచె సుమతి♦భూపతి కెలమిన్. ౯౭౪

అని యడుగఁగా విశ్వామిత్రుఁడు సిద్ధాశ్రమమం దుండుటయు రాక్షసులను సంహరించుటయు మొదలగు చరిత్రమంతయును సుమతికిఁ దెలియఁజెప్పెను.

చ॥ కుశికతనూజువాక్యముల♦కుం బరమం బగుమోద మంది యా
దశరథరాజపుత్రుల న♦దారబలాఢ్యుల సత్క్రియార్హులం
బ్రశమితవైరి యాసుమతి ♦ భాగ్య మటంచును బూజ సల్పె, ద్వా
దశతనువంశజాతులు ము♦దంబున దాని గ్రహించి కూరిమిన్. ౯౭౫

ప్రశమితవైరి = అణఁపఁబడినశత్రువులుగలవాఁడు - ద్వాదశతనువంశజాతులు = సూర్యవంశమునఁబుట్టినవారు- 'ద్వాదశాత్మా దివాకర' యని నిఘంటువు.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడు చెప్పినమాటలు విని విరోధుల నణఁచిన యా సుమతి చాలసంతోషించి మిక్కిలిబలవంతులైన యా దశరథరాజకుమారులు
కం॥ [illegible] తనయింటికి వచ్చుటకుఁ దనభాగ్యమే కారణమనియు నెంచి వారినిఁ బూజించెను. రామలక్ష్మణులును సంతోషముతో నాపూజలను గ్రహించిరి.

ఉ॥ ప్రాకటలీల నాపురిని ♦ రాతిరి యొక్కటి వుచ్చి వేడుకన్
వేకువ లేచి తర్లి ముని♦బృందముతో మిథిలం గనంగ, న
స్తోకము దానిసొంపుఁ గని ♦ సొక్కి మునీశులు మేలుమే లనన్
శ్రీకరశీలి చూచి పురిచేరువ నాశ్రమతుల్య దేశమున్. ౯౭౬

తాత్పర్యము.

ఆరాత్రి నందఱు నాపురమునందే సంతోషముతోఁ గడపినవారై యుదయమున లేచి మునిజనసమూహముతో బయలుదేఱిపోయి దూరమునం దుండియే మిథిలాపురమును జూచి దానియందము మెచ్చుకొనుచుఁ బోవుచుండ నా నగరముచేరువ నాశ్రమముతో సమానమైన ప్రదేశమును జూచి,

—♦ గౌతమాశ్రమవృత్తాంతప్రారంభము ♦—

ఉ॥ ఎవ్వరి యాశ్రమం బిది? యి ♦ పేటికి నిర్జన మయ్యె రమ్యమై?
యవ్విధ మెల్లఁ జెప్పు మని ♦ యాకుశికాత్మజు వేఁడ, మేలు మే
లివ్వని మిట్టు లౌటకును ♦ హేతువుఁ జెప్పెద విన్ము రాఘవా!
యవ్వనజాసనాభుఁడు మ♦హాత్ముఁడు గౌతము డుండె మున్నిటన్. ౯౭

తాత్పర్యము.

ఈ యాశ్రమ మెవ్వరిది? ఏల యిది చూచుటకు సుందరమయ్యు జనహీనమైనది? ఈ విధమంతయుఁ జెప్పు మని శ్రీరామచంద్రమూర్తి విశ్వామిత్రుఁ గోరఁగా, మేలు మేలు చక్కఁగ బ్రశ్నించితివి. ఇది యీగతిఁ బట్టుటకుఁ గారణమును జెప్పెద వినుము. పూర్వ మిచ్చట బ్రహ్మతో సమానుఁడైన గౌతమమహర్షి యుండెను. గౌతమశబ్దార్థమును గౌతముఁడే ఇట్లు చెప్పెను.

శ్లో॥ గోతమో దమతో ఽభూమో ఽదమ స్తే సమదర్శనాత్
విద్ధి మాం గౌతమం కృత్యే యాతుధాని నిబోధ మామ్.

గోశబ్దమునకు స్వర్గము భూమి యర్థము ఆరెంటిని (తమయతి = వశీకరోతి) వశపఱచుకొనినవాఁడు గోతముఁడు. దానికిఁ గారణము దమము = ఇంద్రియ జయము. ఇంద్రియజయమువే భూస్వర్గలోకముల జయించినవాఁడని యర్థము. అభూమ = పొగలేని యగ్నితో సమానుఁడు. కావుననే అదముఁడు. కనకనే యెవరికి వశపఱచుకొన సాధ్యపడనివాఁడు. దానికిఁ గారణము, తే = త్వయి = నీయందు, సమదర్శనాత్ - సమస్య = బ్రహ్మణః, దర్శనాత్ = దృష్టివలన = బ్రహ్మజ్ఞానముచే. రాక్షసి నీవు బ్రహ్మస్వరూప మని చూచుటయే. ఇచ్చట 'త' కారమునకు మాఱు దకారము చెప్పఁబడెను. —నీలకంఠ.

శా॥ రామా! యాతఁ డహల్యఁ గూడి పలువ♦ర్షంబుల్ తపం బుండ, సు
త్రాముం డొక్కెడ నందు గాంచి, సతిఁ జే♦రన్ వచ్చి యామానియు,
ల్లామోదంబున దానిఁ గాంచి జలజా♦స్యా! మన్మథప్రేరిత
వ్యామోహాత్ములు కారె పే ఋతుప్రతీ♦క్షాఽశక్తు, లగ్గోటచేన్. ౯౮

సుత్రాముఁడు = ఇంద్రుఁడు; మోదము = సంతోషము; మన్మథప్రేరిత వ్యామోహాత్ములు = మన్మథునిచేఁ బ్రేరింపఁబడిన విశేషమోహముతోఁ గూడిన మనస్సుగలవారు ఋతుప్రతీక్షాఽశక్తులు = ఋతుకాలమువఱకుఁ గాచికొని యుండశక్తిలేనివారు.

తాత్పర్యము.

ఆగౌతముఁడు తనభార్య యగు నహల్యతోఁడఁ బెక్కుసంవత్సరము లిటుఁ దపస్సుచేయుచుండఁగా నింద్రుఁ డొకనాఁడు సమయము కనిపెట్టి యాగౌతముని వేషమును వేసికొని యహల్యను జేరఁబోయి దానిఁ జూచి కమలమువంటి ముఖముగలదానా! మన్మథునిచేఁ బ్రేరింపఁబడి విశేష మోహమునఁ దపించు మనస్సుగలవారు స్త్రీలతో సంభోగించుటకు వారికి ఋతుకాలమువఱకుఁ గాచి యుండలేరుగదా కావున.

కం॥ అంగజకేళిని దమి నీ, సంగతిఁ గాంక్షించినాఁడఁ ♦ జరితార్థునిఁగా
సంగన! సలుపుము యని ఒవాలు, భంగులఁ బ్రార్థింప నత్త♦పస్విని మదిలోన్. ౯౭౯

అంగజకేళి = మన్మథక్రీడయందు - చరితార్థునిఁగా = నెఱవేర్పఁబడిన కోరికగలవానిఁగా - తపస్విని = తపస్వినియగుస్త్రీ.

తాత్పర్యము.

నీతో రతికేళిదేలుటకు కోరుచున్నాఁడను. నాకోరిక నెఱవేర్పుము. అని యనేకవిధములఁ బ్రార్థింపగా నాతాపసస్త్రీ యగునహల్య మనస్సులో.

కం॥ మునివేషధరుఁడు శక్రుం, డని యెఱిఁగియు నిర్జరేంద్రుఁ ♦ డనుతలఁపున నీ
కొనియెఁ దుర్మతి యై యా, తనితోఁ గలియంగ మఱి ము♦దంబునఁ బలికెన్. ౯౮౦

మునివేషము వేసికొనినవాఁ డింద్రుఁడని యెఱిఁగియు వానితోడ రమించుట పాపకారణ మని యెఱిఁగియు నింద్రునంతటివాఁడు వచ్చి ప్రార్థింపఁగా నెట్లు కాదుకూడ దందునని మొగమోటమిని దుష్టబుద్ధియై కలిమికులాలమిండఁడను సామెత సృష్టపఱుచుచు నాయింద్రునితోఁ గ్రీడించి తరువాత నిట్లు సంతోషంబునఁ బలికెను.

ఉ॥ సంతసమయ్యె, నిన్ను నను ♦ జక్కఁగఁ బ్రోవుము మానదా! శచీ
కాంతుఁడ! ధన్యనైతి, నిటుఁ ♦ గా దిఁక నిల్వఁగఁ బొమ్ము వేగ యీ
ప్రాంతము వీడి, యన్న సుర♦రాజు హసించుచు మోద మయ్యె నో
యింతి! భయంబు మాను మిదె♦యేగెద వచ్చినత్రోవ నింతలోన్. ౯౮౧

తాత్పర్యము.

ఇంద్రుఁడా! చాలసంతోషమయ్యెను. ఇఁక నిన్నుఁ గాపాడుకొని నన్నుఁ గాపాడుము నీయట్టివానితో సంభోగించుటచే నేను ధన్యురాలనైతిని ఇఁక నీ విచ్చట నుండరాదు. త్వరగాఁ బొమ్ము. ఈసమీపమున నుండకుము. అనిన

నింద్రుఁడు నవ్వుచు 'సంతోషమయ్యెను. చెలువా! భయముపడకు నే నిప్పుడే వచ్చినత్రోవను బోయెదను'.

కం॥ అని యాసతి సంతృప్తగ, నొనరిచి గౌతముఁడు వచ్చునో యను శంకన్
గొని బిటబిట నటజము విడి, చనుటకు వెలి వచ్చి జంభశాత్రుఁ డేమటన్. ౯౮౨

తాత్పర్యము.

అని యామెను సంతృప్తిపఱిచి గౌతముఁడు వచ్చునో యను సందేహముతో త్వరత్వరగా నా యాకుటింటిని వదలి యింద్రుఁడు వెలుపలరాఁగా నే

ఉ॥ చేతను దర్భలూని, పెడచే సమిధల్ ధరియించి, తీర్థసు
స్నాతుఁడు నోట నార్ద్రవసనంబులు దాలిచి, సంయమిహవ్యవా
ట్లాతత దేవదానవమనోభరిత తేజుఁడు గౌతముఁడు రాఁ
జేతము పల్లటిల్లఁ గని చేష్టలు దిగ్గఁ బ్రకంపితాంగుఁడై. ౯౮౩

ఆర్ద్రవసనములు = తడిగుడ్డలు.

తాత్పర్యము.

కుడిచేత దర్భలు నెడమచేత సమిధలు ధరించి తీర్థమునందు స్నానముచేసి తడివస్త్రములతో బ్రహ్మవర్చస్సుచే మండుచున్న మంటవలె బోలి దేవతలకు దానవులకు సహింపరాని తేజముగల గౌతముఁడు వచ్చుచుండఁగా నాయింద్రుఁ డాతనిఁ జూచి మనస్సు తల్లడమంద భయముచేఁ జేష్టలుడిగి కాలు సేతులు వణఁకుచుండఁ.

కం॥ వెలవెలఁ బాఱెడి మోమున, నిలిచిన దనుఁ జూచి గౌని సుర్విభునాథుం
దెలిసి మహామహుఁ డిట్లని, పలికెన్ రోషంబు రూపుపడిసి ధరింపన్. ౯౮౪

తాత్పర్యము.

తెల్లఁబాఱినముఖముతోఁ దనయాకారమును ధరించి నిలిచిన యింద్రునిఁ జూచి యా మహాత్ముఁడు కోపంబు రూపంబుగొనినవిధముగ నై.

—* గౌతముఁ డహల్యను నింద్రుని శపించుట *—

కం॥ నాయట్టి రూపుఁ గైకొని, చేయంగా రానియట్టి చేఁతకుఁ దెగినా
వా? యఱజాతీ! బీజము, వాయుంగా నీకు నేలపాలుగ దీనన్. ౯౮౫

ఓరిదుర్జాతీ! నారూపమువంటి రూపమును ధరించి చేయరాని కార్యము చేయ సాహసించితివా? ఈపాపము ఫలముగ నింక నీ విట్లుచేయకుండునట్లు నీవృషణము లూడి నేలపాలై పోవును గాక?

క॥ అని శపియించిన సంక్రందనువృషణము లూడి పడియెఁ దత్క్షణము ధరన్,
ఘనరోషంబున వనజా,క్షను ముని శపియించెఁ గటము లంగఁగ నిట్టుల్. ౨౮

అని యిట్లు శపింపఁగా నాక్షణమందే యింద్రునివృషణము లూడి నేలఁబడెను. ఆవల నింటిలోనికిఁ బోయి తనభార్యను జూచి కోపమునఁ జెక్కిళ్లదరుచుండ నిట్లు శపించెను.

క॥ పెక్కేండ్లు నీవు గాలిన్, మెక్కుచుఁ గూడేమి లేక మిడుకుము తాపం
బెక్కఁగఁ గనఁబడ కేరికి, నిక్కడఁ బెనుబూదిఁ బండి హీనచరిత్రా! ౨౯

నీచపునడవడిగలదానా! అనేకసంవత్సరములు నీవు గాలియే యాహారముగాఁ గొనుచుఁ గూడునీళ్లులేక యిక్కడనే బూడిదలో బడి యెవరికిఁ గానరాక తాపంబునఁ బొరలుచుండుము.

క॥ ఏనాఁడు దశరథేశ్వరు, సూనుఁడు రాముండు దీనిఁ జొరఁ గలుగునో నీ
వానాఁడు పూతవై దు,ర్జ్ఞానిని! పాయంగఁ గలవు మహితాఘంబున్. ౩౦

ఎప్పుడు దశరథునికుమారుఁడైన రాముఁడు దీనిఁ బ్రవేశించుట సంభవించునో నీ వానాఁడు చెనఁటిపాపము తొలఁగినదానవై పవిత్రురాలవయ్యెదవు.

శ్లో॥ గచ్ఛత స్తస్య రామస్య, పాదాగ్రేణ మహాత్మనః
అభూత్సుహాసా వనితా, సమాక్రాంతా మహాశిలా.

—పద్మపురాణమ్.

ఇట్లు అహల్య శిలగానయ్యెనని కొన్నిగ్రంథములయందుఁ గలదు - గాని యిది వాల్మీకిమతముగాదు. దుఃఖానుభవములేక రాయిగా నయియుండినఁ బాపఫలమేమి యనుభవించినట్లు? కావున నహల్య స్త్రీగా నుండియే యాహారములేక తాపమున మాఁడుచుండెను. రామచంద్రమూర్తి యాశ్రమమునఁ బ్రవేశింపఁగానే యా తాపము తొలఁగుటచే లోకమునకుఁ గానవచ్చెను. దీనివలన జారత్వదోష మనేకసంవత్సరములు తపించి భగవత్సాక్షాత్కారమైనగాని పోదు అట్లు కాదేని వంశము నిర్మూలించును. రావణాసురుఁడే లక్ష్యము గౌతముఁడహల్యను స్వరూపనాశము చేయక గాలి యాహారముగాఁ దపస్సుచేయుచుఁ గఠినవ్రతము లాచరింపు మని చెప్పుటచేఁ జపలబుద్ధిచేఁ బరపురుషసాంగత్యము కదాచిత్తుగఁ జేసినదానిని నది వాస్తవముగఁ బశ్చాత్తాపబుద్ధిగలదాయెనేని తగిన వ్రతములు తపస్సులు నియమించి భర్త పరిగ్రహింపవచ్చు నని సూచన. జారత్వమే యభ్యాసముగాఁ గలది పతిత గావున దానిని జేరఁదీయరాదు. పరిత్యజింపవలయును.

జారత్వదోషమునకుఁ బ్రాయశ్చిత్తము.

శ్లో॥ వినా గర్భం సవర్ణేషు, సత్యాజ్య గమనాత్ స్త్రియః,
ప్రాయశ్చిత్తం యథాన్యాయం, దండం కుర్యా త్సమంజిత.
శ్వభిర్వా దంశనం స్నానం, సవనత్రితయం నిశి,
భూమౌచ భర్తృశయనం, దానం భోగవివర్జితమ్.

స్త్రీలు తమజాతివారితో వ్యభిచరించిరేని గర్భమురానియెడల వారిని బరిత్యాజింపరాదు. అనఁగా గర్భమువచ్చినను, నసవర్ణులతో వ్యభిచరించినను వదలిపెట్టవలయును. గర్భము రానివారిని న్యాయశాస్త్రప్రకారము దండించి ప్రాయశ్చిత్తము చేయింపవలెను. లేదా కుక్కలచేఁ గఱపింపవలెను. ఆ స్త్రీలు దినమునకు మూఁడుమార్లు స్నానముచేయవలయును. రాత్రులందు భూమిపై బూడిదలోఁ బండుకొనవలయును. దానము భోగము గూడదు.

శ్లో॥ కామరాగసమాయుక్తాః, పతీ నతిచరంతియైః,
ప్రతికూలపరాయాస్తు, పతీన్ ప్రతి యథాతథా.
శౌచం లజ్జాంతు విత్యజ్య, యథేష్టపరిచారిణీ,
ఏవం యుక్తసమాచారా, యమలోకే సుకంపితాః.
యదిస్యాత్ మానుషం జన్మ, లభేరం స్తాస్తథావిధాః,
తదా ప్రభృతి తా దుష్టా, పతంత్యేవ నసంశయః,
శోచంతి చేత్తు తద్వృత్తం, మనసా హిత మాప్నుయుః.

కామరాగములుగల స్త్రీలు భర్తనతిక్రమించి భర్తకుఁ బ్రతికూలముగ వర్తించుచు శుచిత్వము సిగ్గు విడిచి వారియిష్టముప్రకారము వర్తించిరేని యమలోకమున కంపింపఁబడి యొకవేళ మఱల మనుష్యజన్మమువచ్చినను మఱల జారిణులగుదురు. అదిమొదలు వారు పతితలే. సందేహము లేదు. తమనడవడిని తలఁచి వారు మరణకాలములోపల శోకించిరేని బాగుపడుదురు. లేనియెడల నధోగతులపాలగుదురు.

శ్లో॥ ఆకంఠసమ్మితే కూపే, గోమయోదకకర్దమే,
తత్ర స్థిత్వా నిరాహారా, త్వహోరాత్రేణ నిష్క్రమేత్.
సశిఖా వపనం కృత్వా, భుంజీయా ద్యావకోదనమ్,
త్రిరాత్ర ముపవాసిత్వా, త్వేకరాత్రం జలే వసేత్.
శంఖపుష్పలతామూలం, పత్రంవా కుసుమం ఫలం,
సువర్ణపంచగవ్యంచ, క్వాథయిత్వా పిబే జ్జలమ్.
ఏకభుక్తం చరేత్పశ్చాత్, ద్యావత్పుష్పవతీ భవేత్,

వ్రతం చరతి తద్యావ, త్తావ త్సంవత్సతే బహిః.
ప్రాయశ్చిత్తే తతశ్చీర్ణే, కుర్యా ద్బ్రాహ్మణభోజనమ్,
గోద్వయం దక్షిణాం దద్యా, చ్ఛుద్ధిం పారాశరో బ్రవీత్.

వ్యభిచారదోషమును బోఁగొట్టుకొనఁదలఁచిన స్త్రీ తన దోషము బయలు పఱచి బ్రాహ్మణసమ్మతి నొంది బురదగానుండు గోమయముగల కుత్తుకబంటి గుంతలో నాహారములేక యొకరాత్రి యొకపగ లుండవలెను. ఆవల వెలుపల వచ్చి తల బోడియగునట్లు గొఱిగించుకొని యవాన్నము తినవలయును. ఆవల మూఁడురాత్రు లుపవసించి యొకరాత్రి నీటిలో నుండవలెను. ఆవల గిలకచెట్టు వేరు - ఆకు - పువ్వు - ఫలము - బంగారు - పంచగవ్యము వీనిని కషాయముగాఁ గాఁచి యానీళ్ళు త్రాగవలయును. ఆవల మరల ముట్టగువఱకు నొంటిపూఁట భోజనముచేయవలయును. ఈవ్రతము ముగియువఱకు నింటికి వెలుపలనే యుండవలయును ఇట్లు ప్రాయశ్చిత్తము పెట్టుకొన్నపిమ్మట బ్రాహ్మణులు కన్నదానముచేసి యొకయావును నొకయెద్దును దానముచేయవలయును. ఇటుచేసిన శుద్ధి యగు నని పరాశరమతము

శ్లో॥ హృతాధికారాం మలినాం, పిండమాత్రోపజీవినీమ్,
పరిభూతా మధశ్శయ్యాం, వాసయే ద్వ్యభిచారిణీమ్.

వ్యభిచరించినదానిని భార్యల కుండు నధికారము తీసి తొలఁగింపవలయును. కట్టుకొనుటకు మాసినగుడ్డ నియ్యవలయును. ప్రాణము పోకయుండునంత మాత్రము కూడు పెట్టవలయును. ఛీక్కరించుచు నింటియందే పడియుండునట్లు చేయవలయును. ఇది యాజ్ఞవల్క్యమతము.

శ్లో॥ అపత్యలోభాద్యాతుస్త్రీ, భర్తార మతిలంఘయేత్
సేహ నిందా మవాప్నోతి, పరలోకాచ్చహీయతే.
వ్యభిచారాత్తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నింద్యతామ్,
సృగాలయోనిం ప్రాప్నోతి, పాపరోగైశ్చ పీడ్యతే.

బిడ్డలులేరని యెవతె భర్తనుల్లంఘించి వ్యభిచరించునో యది యిచ్చట నిందలపాలై భర్తకు నింద గలిగించి పరలోకభ్రష్టయై మరల నక్కగాఁ బుట్టును. మరల మనుష్యస్త్రీయైనను మామగారు వైద్యముచేయరానిస్థలమందు పుండులు లోనైన పాపరోగములు కలిగి బాధపడుచుండును.

శ్లో॥ నాన్యోత్పన్నా ప్రజాస్తీహ, నచాప్యన్యపరిగ్రహః,
నద్వితీయశ్చ సాధ్వీనాం, క్వచి ద్భర్తోపదిశ్యతే.

వివాహముచేసికొనినమగనికిఁ దప్ప వేఱొకనికి బిడ్డలఁ గనరాదు. మఱియొకని బరిగ్రహింపను రాదు పతివ్రతకు రెండవభర్త లేఁడు.

తస్మా న్నైకా ద్వౌపతీ విందే ఇతి శ్రుతిః.

ఈకారణముచే నొక తెకు నిరువురు పతులు లే రని శ్రుతి.

శ్లో॥ వ్యభిచారా దృతౌశుద్ధి ర్గర్భే త్యాగో విధీయతే.

వార్తిక ఋతౌశుద్ధిరిత్యేతత్ మానసవ్యభిచారాభిప్రాయం, రజసాస్త్రీ మనోదుష్టేత్యుక్తత్వాత్ గర్భే త్యాగ ఇతి.

మానసికవ్యభిచారదోషము ఋతుమతియై పోవును. గర్భవతియైనను దానినే త్యజింపవలయును.

శ్లో॥ బందీగ్రాహేణ యా భుక్తా, హత్వా బద్ధ్వా బలా ద్భయాత్,
కృత్వా సాంతపనం కృచ్ఛ్రం, శుద్ధ్యం పారాశరోఽబ్రవీత్.

బలవంతముగఁ బట్టికొని కట్టి భయపెట్టి భోగింపఁబడిన స్త్రీ సాంతపన కృచ్ఛ్రముచేఁ బవిత్రురాలగును.

శ్లో॥ సకృ ద్భుక్తాతు యానారీ, నేచ్ఛంతీ పాపకర్మభిః,
ప్రాజపత్యేన శుద్ధ్యేత, ఋతుప్రస్రవణేన చ.

పాపాత్ములచేఁ దన యిష్టమునకు విరోధముగ భోగింపఁబడిన స్త్రీ ప్రాజాపత్యవ్రతముచేసి ఋతుమతియై పరిశుద్ధురాలగును.

శ్లో॥ జారేణజనయేద్గర్భం, మృతే వ్యక్తే గతే పతౌ,
తాం త్యజేత పరే రాష్ట్రే పతితే పాపకారిణీమ్.

పతి మరణించినను, దేశాంతరముపోయి వానియునికి దెలియరాకుండినను, పతితుఁడైనను పరపురుషసాంగత్యముచే బిడ్డఁగన్న దానిని పరదేశమునకు వెడలఁగొట్టవలయును.

శ్లో॥ బ్రాహ్మణీతు యదా గచ్ఛే, త్పరపుంసా సమన్వితా
సాతు నష్టా వినిర్దిష్టా నతస్యా గమనంపునః.

బ్రాహ్మణస్త్రీ తండ్రి భర్త రక్తబంధువులు మొదలగువారు గాక పరపురుషుని వెంట దేశాంతరము పోయెనేని యది చెడిన దని యందఱకుఁ దెలుపవలెను. మరల దాని నింటిలోనికి రానీయరాదు.

వ్యభిచారరతా నారీ, బాలరండాతుజాయతే। వ్యభిచరించిన స్త్రీ మఱుజన్మమున బాలరండగాఁ బుట్టును.

చం॥ అతనికి నాతిథేయ మగు♦నర్హసపర్య లొనర్చి యోసి దు
ర్మతి! గతలోభమోహ వయి ♦ మానిత మైనస్వరూప మూని యా
తతముదమార మన్నికట♦ధారిణి నిల్వఁగఁ గల్గ దంచు ను
గ్రతి శపియించి దీని విడి ♦ తాఁ జనె శీతనగంబుపొంతకున్. ౯౮

సపర్యలు = పూజలు నికటధారిణి = సమీపభూమి - శీతనగంబు=హిమ వత్పర్వతము.

తా త్ప ర్య ము.

ఆయనను నతిథిగా నెంచి యతిథికిఁజేయవలసిన పూజలుచేసి దుర్బుద్ధీ! లోభము మోహము పోయినదానవై నీయెప్పటిఅందమైన యాకారము ధరించి సంతోషముతో నాసమీపమున నుండఁగలవు. అని శపించి యీయాశ్రమము వదలి హిమవంతముపొంతకుఁ బోయెను.

ఇచ్చట మూలమున 'స్వంవపుర్ధారయిష్యసి' యనియున్నది. నీదేహమును ధరింపఁగల వనుటచే నంతకాలము దేహము లేక పాషాణముగా నుండెనని స్ఫురించుచున్నదని దానికి పద్మపురాణవాక్యమాధార మని గోవిందరాజీయ వ్యాఖ్యానమందుఁ గలదు. ఇంతవఱకు దేహముండినను కూడునీళ్ళులేక వటించి తాపముచే మాఁడుచుండుటచే నిప్పటిసౌందర్యము పోయి వికారస్వరూపము గలదై జీవచ్ఛవముగా నుండి శాపానంతరమెప్పటి సౌందర్యము కలదగునని భావము గ్రహింపనగు. పాషాణ మగుమని శపించియుండిన కూడునీళ్లులేని దానవై తాపంబున బూడిదలోఁ బొరలాడు మనుట వ్యర్థము.

—౪౯-వ సర్గము—

సీ॥ ఈరీతి ముష్కవి♦హీనుఁడై శతమన్యుఁ, డగ్ని పురోధసు ♦ లైనసురలఁ
గడు వెల్లబాటునఁ ♦ గని గౌతముఁడు ఘోర,తప మాచరింప నా♦తపముఁజెఱిచి
యతనికిఁ గ్రోధంబు ♦ నగ్గలం బొనరించి, తపమును నే విఘా♦తంబు చేసి
దేవకార్యముఁ దీర్చి♦తిని, ముని కలుషించి, బీజహీనుఁడుగ శ♦పించె నన్ను
తే॥ సతి నహల్యను దిట్టి రోష♦మున విడిచె, నతఁడు మ మ్మిట్లు దిట్టుట♦ నతనితపమ
పొల్లువడె సురకార్యంబు♦పొంకె నిట్లు,లైతి సఫలునిఁ జేయు ♦డోయమరవరులు.

ముష్కవిహీనుఁడు = వృషణములులేనివాఁడు. శతమన్యుఁడు = ఇంద్రుఁడు. పురోధసులు= పురోహితులు. అగ్నిమీళే పురోహిత మ్మని శ్రుతి. అగ్గలము= అతిశయము. విఘాతంబు = విఘ్నము పొంకెన్ = కొలుకు. సఫలుని = బీజములతోఁ గూడిన వానిని. అమరవరులు = దేవశ్రేష్ఠులారా! మధ్యమపురుషంబు నం దారగాగమంబు వైకల్పికంబు.

ఈ పద్యమందు గౌతముని తపస్సు చెఱుచుట దేవకార్యమని చెప్పఁబడినది. మనుష్యులకు శ్రేయస్కరమైన తపస్సు చెఱుచుట యెట్లు దేవకార్యమగునని ప్రశ్నము ఘోరతపస్సు చేయుట స్వర్గాదికమునకుఁ బైపడిన తపోలోక బ్రహ్మలోకములు గోరియే ఏ ఫలముగోరి తపస్సు చేయుదురో యా ఫలము పొందుటకుఁ దగిన యోగ్యత తపస్వులందున్నదా లేదా యని, యుద్యోగాదులు గోరిన విద్యార్థుల నుపాధ్యాయులు పరీక్షించునట్లు, దేవతలును జేయుదురు. ఊర్ధ్వగతులకుఁ గామక్రోధజయ మనివార్యము. ఆ రెండుగుణములు తపస్వులయందున్నవా లేవా యని పరీక్ష ఉండెనా వారు యోగ్యులు కారు. అవి తొలఁగునటులకుఁ దపస్సు చేయవలయును. ఆ పరీక్షానిమిత్తమై దేవతాస్త్రీలను బంపుట లోనగు కార్యములు దేవతలు చేయుదురు గౌతముఁడు కామమును గెల్చినాఁడని స్త్రీలకు వశపడఁడని యింద్రుఁ డెఱుఁగును (ఉత్తర ౬౭౪ చూడుము.) కామమును గెలుచుటకంటె నసాధ్యమైనది క్రోధము క్రోధవిషయ పరీక్షకు భార్యను జెఱుచుటకంటె వేఱులేదు. ఈ పరీక్షయందు గౌతముఁడు తప్పిపోయెను.

ముష్కము - బీజము - ఫలము - ఇవి వృషణమునకుఁ బేర్లు "లాభనిష్పత్తి భోగేషు బీజే పాలే ధనే ఫలమ్"-నిఘంటువు.

తాత్పర్యము.

ఈ విధముగా నింద్రుఁడు వృషణహీనుఁడై యగ్నియే పురోహితుఁడుగాఁ గల దేవతలను వెల్లఁబోయిన మొగముతోఁ జూచి "దేవతలారా! గౌతముఁడు తపమాచరింపఁగా నాయన క్రోధమును జయించెనో లేదో పరీక్షించుటకై యతనికిఁ గోపాతిశయము గలుగునట్లుచేసి యతని తపమును జెఱిచితిని. ఈ దేవతాకార్యము చేసినదానికి ఫలముగా నన్ను బీజహీనుఁడవు కమ్మని శపించెను. భార్య నహల్యను శపించి రోషముతో నామెను వదలిపెట్టెను. మాయందుఁ గోపమువహించి శపించుటచే నతని తపము వ్యర్థమయ్యెను దేవకార్యము నిర్వహింపఁబోయిన నాగతి యిట్లాయెను. దేవతలారా! మరల నాకు వృషణములు వచ్చు నుపాయము చేయుఁడు"

[ఈవిషయము ఉత్తరకాండమున ౬౭౨ మొదలు ౬౮౮ వఱకు జూడుఁడు. ఈ చరిత్రము కొంత యిందుఁ గొంత యందుఁ జెప్పఁబడినది. కాని పరస్పర విరుద్ధము కాదు. అదియునుగాక ౬౮౬ వ పద్యములోఁ జెప్పఁబడిన రహస్య విషయ మిప్పుడే వెలిపఱుపరాదు.]

చం॥ హరిహయుఁ డిట్టు లాడ విని ♦ సాగ్నిపురోగము లెల్ల దేవతా
వరులు మరుద్గణంబు పితృ♦సర్గములం గని మేక సొండ మా

సురపతి యండహీనుఁ డయి • స్ఫుటగ ల్గెను గాన వేగ మీ
రరసి యజాండము ల్గొని సు•రాధిపు బీజయుతుం ఘటింపరే. ౯౯౧

హరిహయుఁడు = ఇంద్రుఁడు = ఆకుపచ్చని గుఱ్ఱములు గలవాఁడు.

తాత్పర్యము.

ఇంద్రుఁ డీప్రకారము చెప్పఁగా విని యగ్ని మొదలయిన దేవతలు - మరుద్గణము - పితృదేవతలను జూచి, 'మేఁక యండములు గలది. ఇంద్రుఁడు వృషణములులేక యున్నాఁడు. కావున మేఁకయండములను దీసి యింద్రుని బీజయుతునిఁగాఁ జేయఁగోరెదము.

ఆ॥ అఫల మైన మేఁక • యామిషంబును మీరు, గనివి గూర్పఁగాక • ధరణిజనము
లట్టిదాని నొసఁగ • యజ్ఞఫలమునకు, హాని రాకయుండు • నని వచింప. ౯౯౨

అఫలము = బీజములేనిది, ఆమిషము = మాంసము.

తాత్పర్యము.

యజ్ఞములందు మనుష్యులు వృషణహీనమైన మేఁకమాంసము నిచ్చిరేని మీరు దానితోఁ దృప్తిపొంది యజ్ఞఫలమునకు హానిరాకుండఁ జేయుఁడు.'

చం॥ దివిజుల నాలకించి పితృ•దేవత లప్పుడు మేఁకబీజము
ల్దివిచి సురేంద్రునందుఁ దవి•లించిరి, నాఁటనుగోలె బీజముల్
దవులని మేఁకమాంసమును • దాము భుజించుచు యజ్ఞకర్తకుఁ
మివుల ఫలంబు లీయఁగను • మేకొని రాపితృదేవతల్ దమిన్. ౯౯౩

తాత్పర్యము.

దేవతలు చెప్పిన మాటలు విని పితృదేవతలు మేఁకబీజములుదీసి యింద్రునకుఁ దగిలించిరి. ఆదినము మొదలు బీజములులేని మేఁకమాంసమును దాము భుజించి యజ్ఞముచేసినవారికి మునుపటివలె యజ్ఞఫలము విశేషముగ నీయసాగిరి.

ఆ॥ గౌతమర్షి తపము • కలిమిఁ బలంబున, మేషవృషణుఁ డగుచు • మేఘవాహుఁ
డమరె నాఁట గోలె • నాశ్రమంబును జొచ్చి, సతిఁ దరింపఁ జేయ • మతిఁ దలంపు.
౯౯౪

తాత్పర్యము.

గౌతమమహర్షి తపముబలముచే నాఁటనుండి యింద్రుఁడు మేషవృషణుఁ డయ్యెను. నీ వీ యాశ్రమములోఁ బ్రవేశించి యహల్య దరించునట్లు సంకల్పింపుము.

—* అహల్యాశాపమోక్షణము *—

సీ॥ అనుచు వాక్రుచ్చిన • మునివాక్యములు విని, సహలక్ష్మణుఁడు రామ • చంద్రుఁ డంత
ననఘుండు కౌశికుం • డును మున్నుగా నేగ, గౌతమాశ్రమ మేగి • కాంచె నందు
వరమహాభాగను • గురుతపోద్యోదిత, దుర్భర తేజను • దుర్నిరీక్షఁ
బనివడి నలువచే • తను నమానుషరూప, గాఁగ మాయామయి • కరణి సృష్ట
తే॥ మంచు కప్పిన మబ్బున • మాటువడిన, యిందుఁజందురువోలెను • నుండుదాని
నీటఁబ్రతిబింబితం బయి • నెగడుచున్న, యెండయనఁ దేఱి చూడరా • కుండుదాని. ౯౯౫

వాక్రుచ్చిన = చెప్పిన, గురుతపోద్యోదిత దుర్భర తేజను = గొప్పతపస్సుచేఁ గలిగిన విశేష తేజస్సుగలదానిని , మహాభాగను = తపస్సనెడి మహాభాగ్యము గలదానిని , దుర్నిరీక్ష = శాపాంతము వఱకు దేవదానవులకును మనుష్యులకును చూచుటకు సాధ్యముకానిదానిని; అమానుషరూప = మనుష్యులందు లేని సౌందర్యముగలది. నలువచేత = బ్రహ్మచేత. నలువ = నాలుగువాలు (ముఖములు) గలవాఁడు. మాయామయి = మాయచే సృష్టింపఁబడినది. "దర్శనమాత్రేణాహల్యామపాపాం చకార"-వి. పు. ౪. ౧౪ చూపుమాత్రముచే నహల్యను పాపరహితఁగాఁ జేసెను.

తాత్పర్యము.

అని విశ్వామిత్రుఁడు చెప్పగా విని లక్ష్మణుతోడ రామచంద్రమూర్తి విశ్వామిత్రు ముందుంచుకొనిపోయి గౌతమాశ్రమముఁ బ్రవేశించి యందు తపమును భాగ్యముగాఁగలదానిని, గొప్పతపస్సుచే లభించిన తేజోతిశయము గలదానిని, నింతవఱకు దేవదానవమానవులకుఁ గానరానిదానిని బ్రహ్మచే మనుష్యులందు లేని సౌందర్యముగలదానినిగా మాయచే సృజింపఁబడినదానివలె నుండుదానిని మంచుకప్పినట్టియు - మబ్బుక్రమ్మినట్టియు చంద్రకాంతి వలెనుండు దానిని, నీటిలోఁ బ్రతిఫలించినసూర్యునియెండవలెఁ జూడ సాధ్యముగానిదానిని జూచెను.

కం॥ శ్రీరామచంద్రుఁ డాశ్రమ, ధారిణిఁ జేరంగ శాప • తాపము వాయన్
నారీమణి తనపూర్వా, కారంబున భువనములకు • గనఁబడె మరలన్. ౯౯౬

ఆశ్రమభూమిని శ్రీరామచంద్రమూర్తి ప్రవేశింపఁగానే శాపతాపము తొలఁగుటచే నా యహల్య పూర్వమున్నరూపమున లోకములకుఁ గానవచ్చెను.

సీ॥ రామలక్ష్మణు లంత • నామెకు మ్రొక్కిన, మదిరాక్షి గౌతము • మాటఁ దలఁచి
వారలు పూజ్యు లం • చారసి పాద్యంబు, నర్ఘ్యంబు నిచ్చిన • నందుకొనిమోఁ

గాకుత్స్థుఁ డంతట • నాకంబునందుండి, సుమవృష్టి గురిసెను • సురలు దేవ
దుందుభిస్వనములు • క్రందుగ మొరయంగ, మేలుమే లంచును • మెచ్చిరింత
తే॥ ఘోరతపమున శుద్ధ యా•వారిజాక్షి, స్వీకరించుచు గౌతమ•ర్షి ప్రవరుఁడు
రాముఁ బూజించె నామును•రాజుచేతఁ, బూజలను బొంది రాముండు • పోవఁ
దొడఁగె. ౬౯౭

శ్రీరామలక్ష్మణు లామెకు నమస్కరింపఁగా నామెయు వారవతారమూర్తు లనిన గౌతముమాటఁదలంచి పూజ్యులని వారికి నర్ఘ్యపాద్యము లిచ్చెను. రామచంద్రమూర్తి దానిని గ్రహించెను. దేవతలు దుందుభులు మొరయించి మేలుమేలని యామెను మెచ్చిరి. ఈ విధముగా శ్రీరామానుగ్రహముచేతను నింతకాలము చేసిన తపస్సుచేతను బరిశుద్ధురాలైన యామెను గౌతమమహాముని పరిగ్రహించి రామచంద్రమూర్తినిఁ బూజించెను. ఆ మునీశ్వరునిచేఁ బూజింపఁబడి రామచంద్రమూర్తి పోవఁ బ్రయాణమయ్యెను.

"Kumarila says 'In the same manner, if it is said that Indra was the seducer of Ahalya, this does not imply that the God Indra committed such a crime but Indra means the Sun, Ahalya (from Ahna and li) the night, and as the night is seduced and ruined by the sun of the morning, there is Indra called the paramour of Ahalya.' "— Maxmuller's History of Sanskrit Literature, page 530.

—* ౫౦-వ సర్గము *—

సీ॥ తమ్ముఁడు దోడు రా • నమ్ముని ముస్నగా, నీశాన్యదిక్కుగా • నేగి జనకు
సవనవాటముఁ జొచ్చి • సవురు నాలోకించి, మునివర్యుతోడ రా•ముండుపలికె
యజ్ఞసామగ్రి య•త్యంతము శ్లాఘ్యంబు, వివిధదేశాగత•విప్రవరులు
వేదాధ్యయనరతు•ల్వేనవే లున్నారు, పరమఋషీశ్వర•వాటములును
తే॥ శకటశతసంకులం బయి• ప్రకటమయ్యె, నెందునిలువంగ మన కిటఁ•బొందు మనిన
జలము నిండారి జనకల•కలము లేని,తలము విధియించె నమ్ముని • జలజభవుఁడు.
౬౯౮

విశ్వామిత్రుఁడు ముందుపోవుచుండఁ దోడఁ దమ్ముఁడు రాఁగా నీశాన్యదిక్కుగాఁ బోయి జనకుని యజ్ఞప్రదేశము నందముఁ జూచి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె. మునీంద్రా! యజ్ఞమునకుఁ గావలసిన సంభారములు మిక్కిలి శ్లాఘ్యమై యున్నవి. నానాదేశములనుండి వచ్చిన బ్రాహ్మణశ్రేష్ఠులు వేదాధ్యయనమందుఁ బ్రీతిగలవారు వేలకొలఁది లున్నారు గొప్ప ఋషీశ్వరు లుండు ప్రదేశములు నూర్లకొలఁది బండ్లచే నిండియున్నవి. ఇట్టిచోట మన మెందు నిలువనగునో చెప్పుమనిన విశ్వామిత్రుఁడును జలసమృద్ధిగలిగి జనుల సందడిలేని ప్రదేశముగాఁ జూచి మన మిందుండ మని యేర్పాటు చేసెను.

దీనివలనఁ దపస్వులకు జనసమ్మర్దములేక నీటికి సమీపముగ నుండు ప్రదేశము ముఖ్యమని యేర్పడుచున్నది. "ప్రభూతైధోదకే గ్రామే యత్రాత్మాధీనం ప్రయమణం తత్ర వాసో ధర్మ్యో బ్రాహ్మణస్య" యని యాపస్తంబులు.

క॥ మునివర్యుఁడు కౌశికుఁ డటఁ, జనుదెంచుట నాలకించి ♦ జనకుఁడు భక్తిం
దనదుపురోహితవర్యుని, సనఘు శతానందుఁ గూడి ♦ యచటికి వచ్చెన్. ౯౯౯

తాత్పర్యము.

మునిశ్రేష్ఠుఁడైన విశ్వామిత్రుఁడు వచ్చినవార్త విని జనకమహారాజు భక్తియుక్తుఁడై తన పురోహితుఁడైన శతానందునితోఁగూడి యా విశ్వామిత్రుఁడున్నచోటికి వచ్చెను

—* శ్రీరామాదులు మిథిలకుఁ బోవుట *—

చ॥ ఇటు లరుదెంచి యమ్మునిమ ♦ హేంద్రునిఁ గొల్చుచునుండ నింతలోఁ
దటుకున ఋత్విజుల్ విధిహి ♦ తంబుగ నర్ఘ్యముఁ బాద్య మీయఁ బ్ర
స్ఫుటమతి వానిఁ గైకొనుచు ♦ భూపతి సేమము సప్తతంతుసం
ఘటనము ప్రశ్నచేసి ఋషి ♦ కాండములన్ మఱి గారవించుచున్. ౧౦౦౦

సప్తతంతువు = యజ్ఞము

తాత్పర్యము.

ఇట్లువచ్చి యా మునిరాజును సేవించుచుండు నంతలో ఋత్విజులు జాగు లేక శాస్త్రప్రకారముగ నర్ఘ్యము పాద్య మీయఁగా సంతోషముచే వికాసము నొందిన మనస్సుతో వానిని గైకొని రాజుక్షేమవార్త యజ్ఞము చక్కఁగా జరుగుచుండుట ప్రశ్నించి ఋషీశ్వరుల నందఱ గారవించుచు.

ఉ॥ ముచ్చట లాడుచుండు ముని ♦ ముఖ్యునిఁ జూచి నరేంద్రచంద్రుఁ డో
సచ్చరితా! మునీశ్వరుల ♦ సంఘముతోడన యాసనంబునం
దిచ్చమెయి న్వసింపు మని ♦ యెంతయు వేఁడిన నట్లచేసి యిం
పచ్చుపడంగ నీవు భవ ♦ దాసనముం గొను మంచుఁ బల్కినన్. ౧౦౦౧

తాత్పర్యము.

సంభాషించుచున్న మునీంద్రుని విశ్వామిత్రునిఁ జూచి రాజశ్రేష్ఠుఁడగు జనకమహారాజు "ఓ సాధుచరిత్రా! యీ మునీశ్వరులతో నీ యాసనంబున నీ యిష్టప్రకారము కూర్చుండుము." అని మిక్కిలి ప్రార్థింపఁగా నట్లుచేసి, రాజా! నీవును నీ యాసనంబునఁ గూర్చుండు మని చెప్పఁగా.

క॥ జనకమహీపతి ఋత్వి, గ్జనసహితుం డగుచు మంత్రి♦సంఘంబులతోఁ
దనదుపురోధలతో నా,సనములఁ గూర్చుండి గాధి♦సంభవుఁ బలికెన్. ౧౦౦౨

తా త్ప ర్య ము.

జనకమహారాజు ఋత్విక్కులతోడను మంత్రులతోడను పురోహితులతోడను నాసనములఁ గూర్చుండి విశ్వామిత్రునితో నిట్లనియె.

సీ॥ నేఁడుగా మునిచంద్ర! ♦ నేఁ జేయునీయజ్ఞ,మున పుణ్యఫలమును ♦ బొందఁగంటి
నేఁడుగా దేవతా♦నికరంబులీ క్రతు,సామగ్రిఁ జేసెను ♦ సఫలముగను
నేఁడుగా మౌనీంద్ర! ♦ నీ విటువచ్చుట, కతన ధన్యుఁడనైతి ♦ క్ష్మాతలమున
నేఁడుగా పుణ్యాత్మ! ♦ నీయనుగ్రహమున, జన్మ మెత్తుట యయ్యె ♦ సార్థకంబు
తే॥ పదియు రెండుదినంబు లే♦ర్పడియెఁ గొఱఁత, యజ్ఞపూర్తికి ననెద రీ♦యార్యవర్యు
లంత భాగార్థులై వచ్చు♦నమరవితతి,ననఘ! దర్శింపఁ దగుసని ♦ యడిగె మఱియు.
౧౦౦౩

తా త్ప ర్య ము.

మునీంద్రా! నిన్ను దర్శించుటచే నేను చేయుయజ్ఞముయొక్క పుణ్యఫలమును నేఁడుగదా పొందఁగలిగితిని. నేఁడుకదా యీయజ్ఞమునకై కూర్చిన పదార్థములనెల్ల దేవతలు పవిత్రములుచేసిరి. నేఁడుకదా నీవువచ్చిన కారణమున నేను భూమియందు ధన్యుఁడనైతిని. పుణ్యాత్మా! నీ యనుగ్రహముచేత నేను భూమిపైఁబుట్టుట సార్థకమయ్యెను ఇఁక యజ్ఞము పూర్తియగుటకుఁ బండ్రెండుదినములు కొఱఁతయున్నట్లు ఋత్విజులు చెప్పుచున్నారు. అంతట హవిర్భాగముఁ గైకొన దేవతలు వత్తురు. వారిని దర్శింపఁదగును గాన నీవంత వఱకు నిందే నిలువవలయు నని ప్రార్థించి, మఱియు నిట్లనియె

సీ॥ ఏవారలయ్య యీ♦దేవపరాక్రముల్, వారణపంచాస్య♦పరమగతులు
వీరులు వ్యాఘ్రశూరు♦వృషభసంకాశులు,జలజతలోచనల్ ♦సరసనుతులు
కరవాలతూణీర♦శరచాపధారులు, నాశ్వినేయసమాన♦హారితనులు
తొలకరించుచునున్న ♦ మొలకప్రాయమువార, లిచ్చమై దివినుండి♦యిలకుడిగిన
తే॥ యమృతభోజను లట్టుల ♦ యమరువారు

మఱి భవీంగితచేష్టాప్ర♦మాణములను ౫౦౧
నొక్కరూపయి కూఁకట్ల ♦ నొప్పువారు
వేఁడెదను జెప్పవే నాకు ♦ వీరి తెఱఁగు. ౧౦౦౪

ఈ పద్యార్థమునకు ౯౭౨ పద్యము చూచునది. కూఁకట్లు = పిల్లజుట్టు-
ఇందలి 'వీ' లోని వకారము ౮౩ వ పద్యంబునందలి ౫ వ యక్షరము.

చం॥ అని జనకుండు పల్కిన మ♦హాత్ముఁడు గాధిసుతుండు తేని కీ
యనఘపరాక్రముల్ దశర♦థావనినాథతనూజు లంచు వా
కొని నిజయజ్ఞరక్షణముఁ ♦ క్రూరనిశాటవధంబునర్థి విశా
లను గనఁగొంట వెండి మహి♦ళామణి యైనయహల్యఁ గాంచుటల్. ౧౦౦౫

తాత్పర్యము.

అని జనకమహారాజు ప్రశ్నింపఁగా విశ్వామిత్రుఁడు 'రాజా! యీ దోషరహిత మైన పరాక్రమము గల వీరు దశరథమహారాజు కుమారులు' అని చెప్పి వారు తన యజ్ఞమును రక్షించుటయు క్రూరులైన రాక్షసులఁ జంపుటయు విశాలా నగరముఁ జూచుటయు నహల్యకు శాపమోక్షణము గావించుటయు.

కం॥ గౌతమసందర్శనమును, ప్రీతిగ వచియించి వీరు ♦ శ్రీకంఠునివి
ల్చేతము రంజిలఁ జూడ మ,హాతేజా! కోర్కి గలిగి ♦ యరుదెంచి రనన్. ౧౦౦౬

గౌతమ మహర్షిని జూచుటయు బ్రీతితోఁ జెప్పి వీరు నీయొద్దనుండు శివుని విల్లు చూచుటకై వచ్చిరని చెప్పెను.

— ౫౧-వ సర్గము —

కం॥ మునినుడులను విని గౌతమ,తనయాగ్రణి మేనఁ బులక♦తతు లమరఁగ రా
మునిదర్శనమున నచ్చెరు, గొనుచు శతానందుఁ డనియెఁ ♦ గుశికాత్మజుతోన్. ౧౦౦౭

పులక = సంతోషముచే నిట్ట నిలిచిన వెంట్రుకల, తతులు = సమూహములు.

తాత్పర్యము.

ఆయనచెప్పినమాటలు విని గౌతముని తనయుఁడైన శతానందుఁడు సంతోషమున మేనుపులకరింపఁగా రామచంద్రమూర్తి దర్శనమున నాశ్చర్యపడి విశ్వామిత్రునితో నిట్లనియె.

సీ॥ చూపితే మునిరాజ ♦ సుశ్లోకఁ జిరతప,స్విని నాదుజనని రా♦తనయునకును
దెలిచెనే యీసర్వ♦దేహిపూజార్హుని, నాతల్లి రాము వ♦న్యంబు లొసఁగి
చెప్పితే నాతల్లి ♦ చేటుకాలం బైనఁ,జలిపిన యాదుష్ట♦చరితమెల్లఁ
జేరెనే నాతల్లి ♦ చెలిమి నాతండ్రిని, దశరథాత్మజుశుభ♦దర్శనమున
తే॥ నాదుజనకుండు పూజించె♦నా మహాత్ము, రాముఁ? బూజల నందెనా♦బ్రహ్మవిదుఁడు
స్వాశ్రమాగతుఁ డైనయీ♦యనఘుచేతఁ? దండ్రిగైకొనెనయ్యా నా♦తల్లిమరల? ౧౦౦౮

సుశ్లోక = మంచికీర్తిగలది - చిరతపస్విని = దీర్ఘకాలము తపస్సుచేసినది.
తెలిచెనే = పూజించెనా? సర్వదేహిపూజార్హునిన్ = సమస్తదేహధారుల

పూజకు యోగ్యుఁడగువానిని. బ్రహ్మరుద్రాదులపూజకు నర్హుఁ డని యర్థము. దీనిచే గౌతమవాక్యమునుబట్టి శ్రీరామచంద్రమూర్తి భగవంతునియవతారమూర్తియని శతానందుఁడు గ్రహించెనని తెలియనగు. వన్యంబులు = అడవిలోఁ బుట్టిన ఫలాదులు.

తా త్ప ర్య ము .

మునీంద్రా! చిరకాలము తపస్సుచేసి కీర్తిసంపాదించిన నాతల్లిని నీరాజకుమారునకుఁ జూపితివా? నాతల్లి యడవిఫలాదులచే సర్వజీవకోటికిఁ బూజ్యుఁడైన యీయనను బూజించెనా? అంత తపస్సుచేసి యంతకీర్తి సంపాదించియుఁ జెడిపోవుకాలమున కామె చేసిన చెడునడతయంతయుఁ జెప్పితివా? దశరథనందను దర్శన మహిమచే స్నేహభావమున నాతల్లి నాతండ్రితోఁ గలిసికొనెనా? మహామహిమగల యీ రాముని నాతండ్రి పూజించెనా? తన యాశ్రమమునకు వచ్చిన యీ పుణ్యాత్మునిచేత బ్రహ్మవేత్త నాతండ్రి పూజల గ్రహించెనా? నాతండ్రి మరల నాతల్లిని గ్రహించెనా?

కం॥ అని యిట్లు శతానందుఁడు, దను నడిగిన గాధిజుండు ♦ తరుణము చెడకుం
డను జేసితిఁ గర్తవ్యం,బున, రేణుక పతిని బోలె ♦ ముని గౌతమునిన్. ౧౦౬

అని యిట్లు శతానందుఁడు తన్నడుగఁగా విశ్వామిత్రుఁడు సమయము చెడిపోకుండునట్లు చేయవలసినకార్యము చేసితిని. పరశురాముని తల్లి రేణుక తన భర్తను జమదగ్నిని గలిసికొన్నట్లు నీతల్లియు నీతండ్రిని గౌతముని గలిసికొనెను.

ఈ రేణుకావృత్తాంతము భారతంబున నరణ్యపర్వంబునఁ దృతీయాశ్వాసంబున నిట్లు చెప్పఁబడినది.

"ఆజమదగ్ని ప్రసేనజితుండను రాజకూఁతు రేణుక యనుదాని వివాహంబయి దానియందు రుమణ్వ త్సుషేణవసు, విశ్వావసు. రాము లను వారి నేవురుకొడుకులం బడసి వనంబున నుగ్రతపంబు సేయుచు నొక్కనాఁడు వన్యఫలంబులు దేరం గొడుకులు వోయిన రేణుక వారి వెఱుకఁబోయి యొక్కసరోవరంబునందు సభార్యుండయి జలక్రీడలాడుచున్న వాని మార్తికావతపతి యగు చిత్రరథుం డను రాజుం జూచి కామమోహితయై వ్యభిచరించిన దాని దుశ్చరితం బెఱింగి కోపోన్మాదపరవశుండై

కం॥ తనయుల నలువురఁగ్రమమున, ఁబనిచెఁ జమదగ్ని తనదు♦భార్యవధింపన్
జననీహాతము పాతక, మని వారలు పలుకకుండి ♦ రత్యనహితులై.

కం॥ కడునలిగి యమ్మునీంద్రుఁడు, గొడుకులకును శాపమిచ్చి ఘోరాటవిలో
జడమతి మృగపక్షులయి, యుడుగక యజ్ఞానవృత్తినుండుండనుచున్.

వ॥ మఱియు నిశితపరశుహస్తరాముం జూచి దీని వధియింపు మని పంచిన వాఁడు గురువచనంబునఁ దల్లిఁ దక్షణంబున వధించిన

కం॥ శమితనిజక్రోధుండై, జమదగ్ని తనూజుసాహసమునకుఁ దనవా
క్యము లంఘింపమికిఁ బ్రసన్నమనస్కుండై తనూజునకు నిట్లనియెన్

వ॥ నావచనంబున నతిదుష్కరంబైన కార్యంబు సేసితి నీ కిష్టంబైనవాని నెల్లను వేఁడుమిచ్చెదననిన రాముండు సంతుష్టహృదయుండై మదీయజనని దోషవిముక్తయై జీవించియుండునట్లును సహోదరులు శాపవిముక్తులయి యెప్పటియట్ల యుండునట్లును సమరంబున నాకు ప్రతిహతశక్తియు దీర్ఘాయువుంగాఁ బ్రసాదింపుఁ డని తండ్రివలనం దనయభిమతంబులు వడసి యుండెను."

ఈసందర్భమున శ్రీభాగవతంబున నీపద్యంబు గానవగు. 'ఆ॥ పడినవారి మరల బ్రతికింపనోపుచు, జనకుఁ డనుచుఁ జంప జామదగ్న్యుఁ, డతఁడు సంపె ననుచు నన్నలఁ దల్లిని, జనకు నాజ్ఞ నైనఁ జంపఁ దగదు'— ౯ స్కం. ౪౭౬.

కం॥ మీతల్లి చేరికొనియెం, బ్రీతి సటంచనఁగ ముదము ♦ మోకొని కౌస
ల్యాతనయునిఁ గనుఁగొనుచు మహాతేజుఁడు గౌతమర్షి♦యాత్మజుఁ డొసఁగన్. ౧౦౧౦

అని చెప్పఁగా మిగులఁ దేజోవంతుఁడైన శతానందుఁడు సంతోషించినవాఁడై శ్రీరామచంద్రునిఁ జూచి యిట్లనియె.

తే॥ స్వాగతము నీకు నో రామ♦చంద్ర! మాయదృష్టమున నిట్లు వచ్చితి♦ దేశమునకు
నరయఁగ నజయ్య తేజుఁడై♦నట్టి గాధి,నందనుఁడు మున్నుగాఁగ నా♦నందమునను. ౧౦౧౧

తాత్పర్యము.

రామచంద్రా! నీకు స్వాగతము. ఈ దేశమునకు మా యదృష్టముకొలఁది జయింపరాని తేజుగల విశ్వామిత్రుఁడు పిలుచుకొనిరాఁగా సంతోషముగ వచ్చితివి.

తే॥ తెలియుదే రామ! నిస్తుల♦ తేజుఁడైన, కౌశికుం డెన్నరా నట్టి♦గడుసుఁదపము
చేత బ్రహ్మర్షితను గొన్న♦ శిష్టవరుఁడు, నీకు శివతాతి యంచును♦ నెన్నుమున. ౧౦౧౨

నిస్తులతేజుఁడు = అసమాన తేజముగలవాఁడు - శివతాతి = మేలుచేయువాఁడు. "శివతాతి శ్శివంకర" యని నిఘంటువు.

తాత్పర్యము.

రామచంద్రా! నీ వెవనివెంబడి వచ్చితివో యట్టి విశ్వామిత్రుఁ డెట్టివాఁడో నీకుఁ దెలియునా? అసమానతేజముగల యీ విశ్వామిత్రుఁడు ఘోరమైన తపముచేసి బ్రహ్మర్షిత్వమును సంపాదించినవాఁడు. శిష్టులలో శ్రేష్ఠుఁడు. ఈ యన నిన్నుఁ దోడుకొనివచ్చుట తన మేలునకై కాదు. నీకు శుభముఁ గూర్పఁ గోరి నిన్నుఁ దోడుకొనివచ్చెను.

క॥ ధన్యుఁడు గలుగఁడు రామా, యన్యుఁడు నీకంటె భువన♦మం దెందు నసా
మాన్యతపోబలుఁ డగు నీ,మాన్యుఁడు నీరక్షకుఁ డయి ♦ మహి వెలయుటచేన్. ౧౧౧౩

రామా! యితరఋషీశ్వరులకు లభ్యముగాని తపోబలముగల యీపూజ్యుఁడు నీకు రక్షకుఁ డయి యొప్పును - గావునఁ బ్రపంచమందు నీకంటె ధన్యుఁడు వేఱొకఁడు గలుగఁడు.

క॥ వినుమా విశ్వామిత్రుని, ఘనమాహాత్మ్యంబు నీవు ♦ కడమ వడక యె
ల్లను మానితగతి నే వా, కొనవాఁడను సతనిబలము ♦ గుణములుఁ జరితల్. ౧౧౧౪

ఈ విశ్వామిత్రుని గొప్పమహిమను, గుణము, చరిత నీకుఁ గొఱఁతలేక చెప్పెదను వినుము.

—శ్రీరాములకు శతానందుఁడు విశ్వామిత్రుపూర్వవృత్తాంతంబుఁ దెల్పుట.—

సీ॥ ఈధర్మశీలుఁడు ♦ పృథ్వీశుఁడై యెంత, యేనికాలము ప్రజ ♦ నేలినాఁడు
సకలవిద్యలనేర్చి ♦ జనహితరతుఁ డయి,ధర్మజ్ఞుఁ డనకీర్తిఁ ♦ దనరినాఁడు
అజునిపుత్రుఁడు కుశుఁ♦డాతండు కుశనాభుఁ,గనియెనాతఁడుగాధిఁ♦గనియెనయ్య
గాధితనూజుఁ డీ♦కౌశికబ్రహ్మర్షి, పెక్కు వేలేఁడు లీ♦పృథ్వి నేలు
తే॥ చుండియొకనాఁడునిజచమూ♦వ్యూహయుక్తి,నఖిలమేదినిగలిగిన♦యాశ్రమములు
బట్టణంబులు నేఱులుఁ ♦ బర్వతములు,సంచరించు చొకానొక♦సమయమునను.

చమూవ్యూహయుక్తిః = సేనాసమూహముతోడ ౧౧౧౫

తాత్పర్యము.

ఈధర్మస్వభావుఁడు చాలఁగాలము ప్రజాపాలనము చేసెను. విద్యలన్నియు నేర్చి జనులకు హితముచేయుటయందుఁబ్రీతిగలవాఁడయిధర్మజ్ఞుఁ డనకీర్తిచేఁ బ్రకాశించెను. బ్రహ్మకొడుకు కుశుఁడు. కుశునికొడుకు కుశనాభుఁడు. ఆయన కొడుకు గాధి. గాధికుమారుఁ డీ విశ్వామిత్రబ్రహ్మర్షి. ఈయన యనేకసంవత్సర

ములు రాజ్యముచేయుచుండి యొకనాఁడు సేనాసమూహముతో భూమియందం తయుఁగల ఆశ్రమములు - పట్టనములు - నదులు - కొండలు తిరుగుచు నొక్క నాఁడు.

పట్టనశబ్దము సంస్కృతమైనపుడు ణత్వము లేదు. పట్టనము. సంస్కృతనిఘంటువులందును గ్రంథములందును వైయాకరణమతంబునను పత్తన, పట్టన శబ్దములుగలవుగాని 'పట్టణ' మని లేదు. దీని కనుగుణముగా "ఘనశౌర్యుండు నిరంగరాయ నరలోకస్వామి తోఁబుట్టురా। మనృపాలాగ్రణిసహ్యజాంబుధి పయోమధ్యోర్వి శ్రీరంగపట్టన లంకానగరంబు ఘ్నాజనపీడావార్తలేకుండఁ గైకొనియెఁ మిత్రభవోపకార నిరపేక్షుండై విచిత్రంబుగఁ." అని వసుచరిత్ర. 1-ఆ. అవతారిక 76-పద్యంబునఁ గన్పట్టెడి. ఇట్లుండ నిర్వచనోత్తరరామాయణంబున 5-ఆశ్వాసంబున "రణవిజయము గైకొనిపట్టన ముక్కట సుభటసంకటంబుగ భాస్వ। స్మణిగణ ధనములు మొదలుగఁ। దృణము తుదిగఁ జూఱగొని యె దిపిఁారి వెసఁ" అని 79-వ పద్యంబున ముద్రితమైయున్నది. శబ్దకల్పద్రుమంబున "పట్టనమ్. క్లీ. పటంతిగచ్ఛంతి వణిజో యత్ర - (పటగతౌ + బాహులకాత్ తనన్) పత్తనమ్" అనియున్నది. పట్టనశబ్ద వికృతి పట్నము.

క౦॥ నానావృక్షసమాకుల, మై నానామృగవిహంగ♦మాకీర్ణంబై
దానవదేవాన్వితమై, మానితమై సాధుహారిణ♦మంజుల మగుచున్. ౧౦౧౬

నానావృక్షసమాకులమై = అనేకవిధములైన చెట్లచేఁ గలియఁబడినదై; నానామృగవిహంగమాకీర్ణంబై = పక్షులవిధములయిన మృగములచేఁ గలిసినదై, దానవదేవాన్వితమై = దానవులతోను దేవతలతోను గూడినదై, సాధుహారిణ మంజులము = సాధువులగు జింకలచే మనోహరమై.

ఆ॥ అగ్నికల్పులౌ మ♦హాత్ములచేతను, దపము సేయుధన్య♦తములచేత
దివ్యతేజులైన♦ దేవర్షివరులచే, బ్రహ్మఋషులచేతఁ ♦ బ్రబలుదాని. ౧౦౧౭

అగ్నికల్పులు = అగ్నితో సమానులు. కల్పప్రత్యయము కొంచెము తక్కువను సూచించును.

ఆ॥ వారిభక్షకులును ♦ వాయుభక్షకులును, భూజశీర్ణపర్ణ♦భోజనులును
ఫలము లారగించి ♦ పరివర్జితక్రోధు, లైనవారు దాంతు ♦ లైనవారు. ౧౦౧౮

వారిభక్షకులును = నీళ్లాహారముగాఁగలవారును - భూజశీర్ణపర్ణభోజనులును = చెట్లనుండి రాలు యాకులను దినువారును (చెట్లయందలి యాకులు కోయుట హింస యని రాలినయాకులనే ఋషులు భక్షింతురు). పరివర్జితక్రోధులు =

వదలిపెట్టఁబడిన కోపగుణముకలవారు. దాంతులు = ఇంద్రియనిగ్రహముగల వారు.

క॥ రిసులును జపపరవైఖా,నసులును మఱివాలఖిల్య♦నానామునిరా
డ్వ్రసరంబులు పొలుపారఁగ, నసమంబై బ్రహ్మలోక♦మనఁదగు దానిన్. ౧౦౯

రిసులు = ఋషులు - ఋషిశబ్దభవము రిసిగాని రుసిగాదు. వైఖానసులు = వానప్రస్థులు - ఈ యర్థముననే రామాయణమునఁ బ్రయుక్తము - విఖనస ఋషివంశమువారు వైఖానసులు. విఖనసశబ్దము బ్రహ్మపర్యాయముగ శ్రీ భాగవతంబునఁ గలదు. "నఖలుగోపికా నందనోభవా, నఖిలదేహినా మంత రాత్మదృక్ విఖనసార్థితో విశ్వగుప్తయే, సఖఉదేయివాన్ సాత్వతాం కులే." —గోపికాగీతలు. దీనివలన వైఖానసశబ్దమందలి ఖకారము వర్గద్వితీయాక్షరమే కాని కొందఱు వ్రాయునట్లు వర్గచతుర్థవర్ణము కాదు.

౧౦౮ — ౧౦౯ తాత్పర్యము.

నానావిధములగు చెట్లతోను పెక్కువిధములగు మృగములతోను పక్షుల తోను దానవులతోను దేవతలతోను గలిసి సాధువులగు జనులచే మనోజ్ఞమై యగ్నితో సమానలగు మహాత్ములచేతను, తపముచేయు ధన్యులచేతను, దివ్య తేజముగల బ్రహ్మఋషులచేతను బ్రబలినదై జలమే యాహారముగాఁ గల వారును, చెట్లనుండి రాలిన యాకులు దిని జీవించువారును, ఫలములు దిను వారును, క్రోధమును జయించినవారును, నింద్రియనిగ్రహము గలవారును, నగు ఋషులును, జపశీలురైన వానప్రస్థులును, వాలఖిల్యులులోనగు నానాముని జనసమూహంబులు గలిగి యసమానమై బ్రహ్మలోకమా యనఁదగియుండు వసిష్ఠాశ్రమమును గాంచెను.

♦ ౫౨ వ సర్గము. విశ్వామిత్రుఁడు వసిష్ఠునాశ్రమంబునకుఁ బోవుట ♦

చం॥ ఘనుఁడు వసిష్ఠునాశ్రమముఁ♦గాంచి ముదంబును జెంది చొచ్చి స
ద్వినయవిధేయతాగరిమ♦వీరుఁడు తజ్జపశీలుచెంతకున్
జని ప్రణతుల్ ఘటింప ముని♦చంద్రముఁ డో నృపవర్య సేమమా
యని యుచితాసనంబిడిన♦నం దుపవిష్టుఁడు నయ్యె నీతఁడున్. ౧-౨

ఘనుఁడు, వసిష్ఠునాశ్రమము = గొప్పవాఁడగు వసిష్ఠునియొక్క యాశ్రమము, ఉపవిష్టుఁడు = కూర్చుండినవాఁడు.

తాత్పర్యము.

ఇట్లు మహాత్ముఁడగు వసిష్ఠునాశ్రమముఁ జూచి సంతోషించి లోపలఁ బ్రవే శించి వినయవిధేయతల యతిశయముచే వీరుఁడైన విశ్వామిత్రుఁడు జపశీలుఁ

ధైన వసిష్ఠు సమీపమున కరిగి నమస్కారములు చేయఁగా నామునీశ్వరుఁడు రాజేంద్రా సేమమా యని యీాయనకుఁ దగిన యీాసనము సమర్పింపఁగా నం దీ యన కూర్చుండెను.

క॥ ఇం బమర యథాశాస్త్రీ, యంబుగ ముని తెచ్చి మధుఫలాదుల నిడఁ జి
త్తంబునఁ బొంగుచు నానం, దంబున నీయన గ్రహించి • తాపసిం బలికెన్. ౧౦_౨౧

ఇంబు = ఇంపు - ఆనందము, మధుఫలాదులు = తియ్యనిపండ్లు మొదల యినవి.

తా త్ప ర్య ము.

సంతోషముతో శాస్త్రము విధించినప్రకారము వసిష్ఠుఁడు తియ్యనిపండ్లను దెచ్చియియ్యగా మనస్సున సంతోషించి వాని నీయన గ్రహించి యాఋషీశ్వరుతో నిట్లనియె.

తే॥ కుశలమా మీాకు నోముని • కులవతంస, సేమమే యగ్నులకు నెల్ల • శిష్యులకును
భద్రమా లెస్సయా నెత • పంబు జపము, తరుల తాదులఫలము లు • దనరునయ్య.
౧౦_౨౨

తా త్ప ర్య ము.

మునిశ్రేష్ఠా! మీాకుఁ గుశలమేకదా? అగ్నులకు శిష్యులకు క్షేమమా? జపము తపము చక్కఁగా జరుగుచున్నదా? చెట్లయందును తీఁగలయందును ఫలములు లభించుచున్నవా? "ఘనుఁడు వసిష్ఠు నాశ్రమము షష్ఠీవిశేషాణాం ప్రథమా స్యాత్" అని షష్ఠీవిశేషణమునకుఁ బ్రథమ యగు. "పాండవప్రాగస రుండు ధర్మసుతుపన్నిది నీకు సలంఘ్యమిత్రోక్తికి"—భార॰గము.

తే॥ అనిన రాజేంద్రునకు నిట్లు • లనె వసిష్ఠ, మాని కుశలంబ సర్వంబు • భూమివేంద్ర
సేమమేకద నీకు నీ • సేవకులకు, నయినవారికి హితులకు • నంచు ననును. ౧౦ ౨౩

అని యడిగిన యీాయనకు వసిష్ఠుఁడు రాజా! యందఱకు క్షేమము. నీకు నీసేవకులకు బంధువులకు మిత్రులకు నెల్లవారికి సేమమేకదా?

సీ॥ ధర్మమార్గం బింత • తప్పక రాజన్య, నీతిమై జనములఁ • బ్రోతువయ్య
నీభృత్యు లెల్లరు • నీవశవర్తులే, కరము ప్రీతిని వారి • నరయుదయ్య
నీశత్రు లెల్లరు • నిర్జితు లేకదా, బలకోశమిత్రముల్ • ప్రబలునయ్య
భార్యలుఁ బుత్రులుఁ • బౌత్రులుఁ గుశలులే, జనులకు హర్షంబు • దనరునయ్య
తే॥ యనుచు నడిగినఁ గుశలమ • టంచుఁ బలికె, నిట్టులిద్దరు హర్షంబు • మట్టుమీాఱఁ
బుణ్యగాథలఁ గాలంబుఁ • బుచ్చుచుండ, క్ష్మాతలేంద్రుని బలికెను • జపివరుండు.
౧౦_౨౪

తాత్పర్యము.

రాజేంద్రా! ధర్మముతప్పక రాజనీతి ననుసరించి ప్రజల రక్షించుచున్నావా? నీసేవకులు నీమాటకులోఁబడి వర్తించుచున్నారా? వారిని దయతో యోగక్షేమములు విచారించుచున్నావా? నీశత్రువులందఱు జయింపఁబడిరి కదా? చతుర్విధసేనలయు బొక్కసములయు స్నేహితులయు సంపత్తి గలదు గదా? పెండ్లములు కొడుకులు మనుమలు క్షేమముగ నన్నారుగదా? యనుచు నడుగఁగా నందఱకుఁ గుశలమని యీయన చెప్పెను. ఇట్లు లీయిరువురు సంతోషాతిశయముచేఁ బుణ్యకథలు చెప్పుచుఁ గాలము పుచ్చుచుండ జపశీలుఁడైన వసిష్ఠుఁడీ రాజుతో నిట్లనియె.

—' వసిష్ఠుఁడు విశ్వామిత్రునకు విందు సేయుట *—

కం॥ అతిథిశ్రేష్ఠుఁడ వీవో, క్షితిపా! పూజ్యుఁడవు నిన్ను ♦ సేనలతోడన్
మతి గలిగి సత్కరింపఁగ, నితవుగ నంగీకరింపు♦మీ నీ వనిసన్. ౧౦౨౫

రాజా! నీ వతిథులందు గుణముచేతను ఒడివిచేతను శ్రేష్ఠుఁడవు. కావునఁ బూజ్యుఁడవు. కావున నీ సేనలతోడ నిన్ను నాతిథ్యముచే గౌరవింపఁగోరెదను. దీని నీవు హితబుద్ధి నంగీకరింపవలయును.

ఉ॥ అందితి నాతిథేయము మ♦హాత్మక నీప్రియవాక్యులన్, సుధా
తుందిలకందమూలవిత♦తుల్ వనమందలి వాంగించి యుం
నంగముఁ బొందినాఁడన, ఘు♦నం బగు తావకదర్శనంబునన్
జె దితి ధన్యతన్- సెలవె ♦ స్నేహముఁ బాయకు పోయి వచ్చెదన్. ౧౦౨౬

అని చెప్పఁగా నీప్రియవాక్యులచేత నే యతిథిసత్కారము గ్రహించితిని. అమృతముచే నిండిన కందమూలసమూహములు భుజించి సంతోషించితిని. గొప్పదగు నీదర్శనముచే ధన్యుఁడనైతిని. ఋషీశ్వరా! స్నేహము మఱువకుము. సెలవిమ్ము. పోయివచ్చెదను.

కం॥ అనుచున్ మఱిమఱి తనఁ బ్రార్థన చేసెడిమానివరునిఁ ♦ దా నిట్లు లనెన్
మునివర! నీ కిష్టం బెది, యొనరించెద దాని ననుడు ♦ సర్వవిధవుఁడున్. ౧౦౨౭

అని యీయన మీఁదమీఁదఁ దన్నునాతిథ్యముగొమ్మని ప్రార్థించు వసిష్ఠునితో మునీంద్రా! నీ కేది యిష్టమో దానినే నేను జేసెదను.

చం॥ అనఘుఁడు మౌని యంత శబ♦లాఖ్యను దైవతసౌరభేయినిం
గని విను రమ్ము రమ్ము క్షితి♦కాంతున కేఁ బెనువిందు పెట్టెదన్
జని యిదె వీరి కెల్లరకుఁ ♦ జాలఁగఁ గూర్చుము కోర్కి తీరఁ జ
ఱ్యాన మధురాన్న పానక ర♦సాయన లేహ్య ఫలాదిభోజ్యముల్. ౧౦౨౮

శబలాఖ్యాను = శబల యను పేరుగలదానిని. శబల యనఁగాఁ జిత్రవర్ణము గలది. దైవతసౌరభేయి = దేవతల యావు - కామధేనవు

తాత్పర్యము.

ఇట్లీయన యంగీకరింపఁగా వసిష్ఠుఁడు తనకామధేనవును శబల యనుదానిని బిలిచి వేగ రమ్ము - రమ్ము. విను వినుము నేనీరాజునకు విందుపెట్టఁదలఁచితిని ఈయనకు నీయనసేనలకు నెల్లవారికిఁ జాలినంత వారికోరికతీరునట్లు శీఘ్రముగఁ దియ్యనియన్నము పానకములు రసాయనములు లేహ్యములు ఫలములు లోనగు భోజ్యములు కల్పింపుము.

—*౫౩-వ సర్గము *—

చం॥ అన విని కామధేనవు య♦థార్థముగాఁ బలుపిండివంటలున్
ఘనముగఁ దేనె మద్యములుఁ ♦ గమ్మనికూరలుఁ బప్పు లప్పముల్
గొనకొని యెవ్వ రెవ్వ రవి ♦ కోరెదు రట్టివి యెల్ల రాసులై
యొనరఁగఁ బాలుఁ బంచ్లు రుచి♦రోష్ణతరాన్నముఁ గండచక్కెరల్. ౧౦౨౯

ఉ॥ నీటుగు తీయ్యపానకపు ♦ నిర్మలపాత్రలు లోనగాఁగ నే
ర్పాటుగ సృష్టిచేయ ముని♦రాజు నృపాలున కెల్లవారికిన్
హాటకపాత్రలుంచి సుచి♦రాసనము ల్గొన వారిఁ బంచి వే
పాటిగఁ గుడ్వ పెట్టెఁ బరి♦పాటిగ వెండియునంటియాకులన్. ౧౦౩౦

తాత్పర్యము.

వసిష్ఠుఁడు చెప్పిన యామాటలు విని కామధేనవు తగినరీతిని ననేకములైన పిండివంటలు - తేనె - సారాయములు - కమ్మని రుచిగల కూరలు - పప్పులు - అప్పములు - లోనైన పివి యవి యననేల యెవరెవరేదేది కోరిరో యవియెల్ల రాసులుగా సృష్టించి మఱియును బాలు పంచ్లు ఇంపైన వేడివేడి యన్నము కండచక్కెర తియ్యని పానకపుఁ బాత్రములు మొదలైన వేర్పాటుగ సృజించెను. అవి చూచి వసిష్ఠుఁ డందఱకు నందములైన పీటలులోనగు నాసనములు వేసి బంగారుచెంబులుంచి వెండిపాత్రలలో నందఱకుఁ గ్రమముగా వడ్డించెను.

కం॥ అంతఃపురకాంతలతో, మంతులతో ద్విజులతోడ ♦ మఱిసైన్యముతో
నెంతయు మెక్కెను నృపుఁడ,త్యంతము సంతుష్టి కంర♦దఘ్నముగాఁగన్ ౧౦౩౧

మంతులతోన్ = మంత్రులతో - కంరదఘ్నము = కంఠములోఁతు.

తాత్పర్యము.

అంతఃపురస్త్రీలతోను మంత్రులతోను బ్రాహ్మణాదులతోడను సైన్యములతోను రాజు సంతృప్తికంరదఘ్నముగాఁగ చక్కగ భుజించెను.

కం॥ ఈపాటను బరిపాటిగ, సాపా టొనరించి మానిసత్తముతో మే
మాపోవఁ గంటి మనఘా, నీపూజల మెచ్చు వచ్చె నీశక్తులకున్. ౧౦౩౨

ఆపోవఁగంటిమి = తృప్తిపడితిమి.

తాత్పర్యము.

ఈవిధముగ క్రమముగ నందఱు భోజనముచేసి ఋషీశ్వరునితో రాజు అయ్యా! మేము సంతుష్టిచెందితిమి. నీశక్తికి నీవు చేసినపూజకు చాల మెచ్చితిమి. అనిరి.

— విశ్వామిత్రుఁడు తనకుఁ గామధేనువు నిమ్మని వసిష్ఠు నడుగుట —

కం॥ మచ్చిక నొక్కటి చెప్పఁగ, సచ్చరితా! కుతుకపడెద శతదశశతముల్
మెచ్చులిడు మేలికదుపుల, నిచ్చెద నా కొసఁగవే మునీశ్వర! శబలన్. ౧౦౩౩

నీ విచ్చిన చనవుకారణముగ నీకొక్కటి చెప్పఁగోరెదను. నిర్మలచరిత్రా! నీకు నూఱువేలమంచియావుల నిచ్చెదను. ఈశబలను నా కిమ్ము.

కం॥ ఏ యన నాలలోపల, మేలైనది శబల చూవె మిత్రసుతేజా
మేలైనవస్తుతతి భూ,పాలిది గద వినవె రత్నహారులు రాజుల్. ౧౦౩౪

రత్నహారులు = శ్రేష్ఠపదార్థముల హరించువారు. రత్నం శ్రేష్ఠేమణావపి. జాతౌజాతౌ యదుత్కృష్టం తద్రత్నమభిధీయతే – వి. ప్రతిజాతియందు నేది శ్రేష్ఠమైనదో దానికి రత్నమని పేరు. కావ్యరత్నము - కన్యారత్నము - హయరత్నము - స్త్రీరత్నము - పండితరత్నము - ఇట్లు.

తాత్పర్యము.

నీ కేలయంటివా? ఈశబల యావులయన్నిటిలో శ్రేష్ఠమైనది. శ్రేష్ఠమైన పదార్థములన్నియు రాజులయొద్ద నుండవలయును. రాజులు రత్నహారులు. వినలేదా? ఇట్టి యమూల్యవస్తువు నీ కేల?

చం॥ అన జపినర్యుఁ డిట్లను జనాధిప! యేటికి నూఱువేలు వా
కొనిమెద వాల నిత్తు నని కోటిశతంబుల నాల నిచ్చినన్
గనకపురాసు లిచ్చినను గా దెడఁబాయఁగ దీని, నాత్మవం
తుని యశ మెట్టు లట్టు లిది దొల్గదు న న్విడి యెల్లవేళలన్. ౧౦౩౫

అనఁగా జపముచేయువారిలో శ్రేష్ఠుఁడగు వసిష్ఠుఁడు రాజా! నూఱువేలావుల నిచ్చెద నని యేలయ్యా చెప్పెదవు? నూఱుకోట్ల యావుల నిచ్చినను బంగారు కుప్పలు కుప్పలుగా నిచ్చినను నీయావు నే నెడఁబాయరాదు. ఆత్మ

జ్ఞానముగలవానిని గీర్తి యెడఁబాయనట్లు నన్ను విడిచి యిది యెప్పుడు నుండఁ జాలదు.

ఉ॥ హవ్యముఁ గవ్యము న్బలియు ♦ నగ్నులు హోమము దేహయాత్రయుఁ
భవ్యగుణాఢ్య! యీసురభి♦పాలనె సర్వముఁ దీర్చుచుండెడ
న్దివ్యము లైనవిద్దియ ల♦నేకము లున్నవి దీనియందు, నా
కవ్యయమోదహేతువు య♦థార్థము సు మ్మిది పాయ నేర్తనే. ౧౦౩౬

ఈ యావుపాలచేతనే దేవతలకుఁ గావలసిన హవ్యము పితరులకుఁగావలసిన కవ్యము - బలి - యగ్నికార్యములు హోమమునకుఁ గావలసిన పదార్థములు దేహయాత్ర. యిదియది యననేల సర్వము దీనితో నేను నెఱవేర్చుచున్నాఁడను. అదియునుగాక దివ్యవిద్యలు పెక్కులు దీనియందున్నవి. నాకు నిది యవ్యయానందమునకుఁ గారణమైనది - ఇది సత్యము. ఇట్టిదానిని నే నెట్లు విడనాడి యుండఁగలను?

ఆవుపాలవిషయమునఁ బూర్వఋషుల యభిప్రాయ మిట్లుండ నేఁటిమహాత్ములు ఆవుపాలనఁగా కావునెత్తురుగావున గోక్షీరపానము నిషిద్ధ మనుచున్నారు. కలివింతలలో నిది యొకటి.

సీ॥ అంతియకాక య♦నంతము లున్నవి, హేతువు ల్గాన నే ♦ నీయ శబల
నన వసిష్ఠునిఁ జూచి ♦ యనియె గాధిసుతుండు,బంగారుసొమ్ములఁ ♦ బటిమ మాఱు
పదునాల్గువేలద్వి♦పముల నొసంగెద, నాల్గుకర్ణములచే ♦ సవ్యము లగు
హేమరథంబుల ♦ నిచ్చెద నీకును, నెనిమిదినూఱు ల♦హీనజవము
తే॥ లయినదేశభవంబుల ♦ నశ్వములను, బదియునొక్కొండువే లిత్తు ♦ బహువివర్ణ
యుక్తధేనవులను గోటి ♦ నొసఁగువాఁడ, నీయవే నాకు మౌనీంద్ర♦యాశబలను. ౧౦౩౭

హేతువు లనంతము లున్నవి = అనేక కారణము లున్నవి. (ఇవి విశ్వామిత్రుఁడు పడఁబోవు పాటులు. వసిష్ఠుఁడు దివ్యర్షి కావున కాఁబోవునది ముందుగాఁ దెలిసికొనె నని గ్రహింపవలయును.)

తాత్పర్యము.

ఇప్పుడు నేను జెప్పినవేకాక యింకను ననేక కారణములచేత నీకు దీని నే నీయను, అని చెప్పఁగా వసిష్ఠునిఁ జూచి విశ్వామిత్రుఁడు బంగారు సొమ్ములచే నలంకరింపఁబడిన పదునాల్గువేల యేనుఁగులను నాలుగు తెల్లని గుఱ్ఱములఁ గట్టిన మంచిబంగారు తేరులను మిగులవేగముగలవి దేశమందుఁ బుట్టినవి యగు

పదునొకండువేల గుఱ్ఱములను నానావర్ణములుగల కోటియావులను నీ కిచ్చెదను. మునీంద్రా! నా కీ శబల నిమ్ము.

మ॥ నగలో రత్నములో హిరణ్యములొ నానాదేశసామగ్రులో
తగుమాన్యంబులొ భూములో మడులొ కాంతాశ్రేణులో యెవ్వి ని
చ్చగ నాసించెద వన్ని నిచ్చెద మునీశా! యీయవే దీని నా,
కగునే యీయఁగ నెంతయే నడుగు మీయన్నెర భూపాలకా! ౧౦౩౮

దీనికిమాఱుగ నీవుకోరినన్ని యాభరణములో మణులో బంగారునాణెములో నానాదేశములనుండు మంచివస్తువులో గ్రామములో మడులో చేలో స్త్రీలనో యెవి కోరినను నీకుఁ దృప్తికరముగ నిచ్చెదను. మునీంద్రా! దీనిని నా కిమ్ము - అని యీయన యడుగఁగా, వసిష్ఠుఁడు భూమీశ్వరా! నీ వెంత యడిగినను నే మిచ్చినను దీని నీ కీయను అనెను. మునీశా! యీయవే యనుటచే ముక్కుపట్టుకొని జపముచేసికొను నీ కీజంజాటమేల? భూమిపాలించువారికేఁ గదా సర్వవస్తువులు కావలసియుండును. అట్టివాఁడను గావున నిది నాయొద్ద నుండఁదగినది, యనఁగా వసిష్ఠుఁడు నీవు భూమిపాలుఁడవైన నగుదువుగాక నే నీయను. భూమినిఁ బాలించువారికి బ్రాహ్మణులతపస్వులసొత్తు కోరవచ్చునా? యని మునీశ - భూపాల యను శబ్దములందలి యర్థము గ్రహింప నగు.

చం॥ ఇదియ ధనంబు నాకు ధరణీశ్వర! యియ్యదె నాకు రత్న, మి
య్యదియ మదీయసర్వధన మయ్యెడిఁ జుమ్ము మదీయజీవితం
బిది యగు దర్శ యజ్ఞము లహీనపుదక్షిణపూర్ణమాస, లి
య్యది చుమి మత్క్రియాగతుల కంతకు మూలము గాధినందనా! ౧౦౩౯

ధరణీశ్వర = భూనాయకా - భూమియంతయు నీదే కావున నీకుఁ బదార్థదారిద్ర్యము లేదు. నాకో యిదయొక్కటే ధనము. నీ వీయఁదలఁచిన ధనమైనను నా కిదియే, రత్నమైనను నా కిదియే. నాకుఁగల సర్వస్వ మిదియొక్కటే. నాకు జీవనాధార మిదియే. అమావాస్య - యజ్ఞములు - పున్నములు - భూరిదక్షిణలు దీనివలననే జరుగవలసియున్నవి. నేనుజేయు కార్యములన్నియు దీనివలననే సాధ్యమగుచున్నవి.

గాధినందనా! యనుటచే గాధి యెంతో ధర్మాత్ముఁ డని యితరుల ద్రవ్యమాశించినవాఁడు కాఁడని కీర్తిని సంపాదించెనే ఆయన నందనుఁడవు నీ కిట్టి బుద్ధి తగునా? నీయిట్టికార్య మాయనకు సంతోషకర మగునా? యని భావము.

కం॥ ఏమిటికి నిష్ప్రయోజక, మౌమాటలు పెక్కు లాడ ♦ నన్నిటి నిడు నీ
కామగవి నొసఁగ నేరను, భూమీశ్వర! విడువు ప్రొద్దు♦పోవనిమాటల్. ౧౦౪౦

పనికిరాని మాటలేల? యవి యిచ్చెద నివి యిచ్చెద నని యూరక పలుమాట లాడెదవు. ఈ కామధేనవు నీవిచ్చెదనన్నవి నాకుఁ గావలసినవి నే నడిగిన వెల్ల నిచ్చుచున్నది. ఈయఁగలదు. ఇఁక నీవస్తువులు నాకేల? కావున నీప్రొద్దుపోవని ముచ్చటలు వదలిపెట్టుము.

దీనివలన బ్రాహ్మణులు గోవుల విక్రయింపరా దని సూచన. రాజులు యజ్ఞ దక్షిణగా నిచ్చినవి తమకుఁ బ్రయోజనపడనివి తాము భరింపలేనివి మరల వారికే యిచ్చి వినిమయముగా నేదేని కొంత దీసికొనుట దోషముగాదు.

౫౪ సర్గము. విశ్వామిత్రుఁడు కామధేనువును బలాత్కరించి పట్టుకొనిపోవుట.

సుగంధి॥ ఇట్టు లామునీంద్రుఁ డాడి ♦ యీయన న్నధేనవుఌ
బట్టి కట్టి కొంచుఁ బోవఁ ♦ బార్థివుండు బల్మిమైఁ
దొట్టఁగ న్దురంతచింత ♦ దుఃఖితాత్మ యామ న
న్నిట్టు వాయఁగా మునీంద్రుఁ ♦ డేమి తప్పు చేసితిన్. ౧౦౪౧

బల్మిమెౝ = బలాత్కారముగ, తొట్టఁగౝ = నిండఁగ, పాయఁగాౝ = వదలిపెట్టుటకు. సుగంధివృత్తమునకు ర జ ర జ ర గణములు - తొమ్మిదింట యతి.

తాత్పర్యము.

వసిష్ఠుఁ డీప్రకారము చెప్పి నేను ధేనవునీయ ననఁగా నే యీయన బలవంతముగా దానినిబట్టి కట్టి తీసికొనిపోవఁ జొచ్చెను. అప్పు డాశబల మిక్కిలి విషాదము, మనస్సున నిండఁగా మిక్కిలి దుఃఖంచినదై నన్ను మునీశ్వరుఁ డిట్లు వదలిపెట్టుటకు నే నేమి తప్పుచేసితిని?

కం॥ ఏడ్చుచు నుండఁగ న న్నిఁ, ట్లీడ్చుకొనుచుఁ బోవఁజాగి ♦ రీభటు లని తా
నూడ్చుకొని కట్టులను గవి, మూడ్చుచుఁదద్భటులఁ జేరి♦మౌనినికటమున్. ౧౦౪౨

నే నేడ్చుచున్నను వదలక యీభటులు నన్నీడ్చుకొని పోవుచున్నారే యని కట్టులను ద్రెంచుకొని తన్నీడ్చుకొనిపోవువారిని నేలఁబడఁ దన్ని మునీశ్వరుని శబల చేరవచ్చెను.

ఉ॥ కన్నుల నీరు గాఱ నధి♦కవ్యథ నేడ్చుచు గోలుగోలునౝ
బన్నుగ దేవదుందుభిర♦వంబున ని ట్లను బ్రహ్మపుత్రు యా

పన్నజనావనా! యిటులు ♦ పాయుటకుం గత మేమి నన్ను, నీ
సన్నిధిఁ బాపికొంచు జరుగ ♦ సాగిరి యీధరణీశుకింకరుల్. ౧౦౪౩

ఆపన్నజనావనా = ఆపదనొందినవారిని రక్షించువాఁడా!

తా త్ప ర్య ము.

కన్నులవెంట నీరుకాఱుచుండ మిక్కిలిబాధపడుచు గోలుగోలున నేడ్చుచు దేవదుందుభిధ్వనివంటిధ్వనితో 'బ్రహ్మకుమారా! యాపదనొందినవారిని రక్షించువాఁడా! నీవు నన్నువదలిపెట్టుటకు నే నేమినేరముచేసితిని? నీయొద్ద నుండనీక రాజభటులీడ్చుకొని పోవుచున్నారే!' యనెను.

శా॥ తోడంబుట్టువువోలె దుఃఖగరిమన్ ♦ దోదూయమానాత్మయై
వాడంబాఱిన మోముతో వగచుచుం ♦ బ్రార్థించు నగ్గోవుతో
వీడ న్నే నిను ధేనురత్నమ! కడున్ ♦ వీర్యాతిగర్వంబునన్
బాడిం బాసి గ్రహించె ని న్నిలిమి భూ♦పాలుండు మోహాంధుఁడై. ౧౦౪౪

దోదూయమానాత్మయై = పరితాపపడుచున్న మనస్సుగలదై. పాడిన్ = న్యాయమును.

తా త్ప ర్య ము.

దుఃఖాతిశయముచేఁ బరితపించుచు వాడిన ముఖముతోఁ దోడఁబుట్టినదానివలె నేడ్చుచుఁ బ్రార్థించుచున్న యా యావుతో వసిష్ఠుఁ డిట్లనియె. ధేనువా! నేను బుద్ధిపూర్వకముగ నిన్ను వదలినవాఁడను గాను. మోహముచేఁ గన్నులు గానక న్యాయముఁ దప్పి రాజు నిన్ను బలాత్కారముగఁ బట్టుకొనిపోయెను.

కం॥ అతండు ధారిణీశుఁ డు,పేతబలుఁడు వీర్యయుతుఁ డిఁ♦కే మన నేనో
వీతబలుఁడ బాఁపఁడ నా,చేత మఱే మగును వాని♦చేఁతలు మాన్పన్? ౧౦౪౫

అతఁ డా భూమికంతయుఁ బ్రభువు. దేహబలము సేనాబలము అస్త్రబలము గలవాఁడు, వీరుఁడు. ఇఁక నేనో బలహీనుఁడను, బ్రాహ్మణుఁడను. వానిచేష్టలు మానుపుటకు నాకు సాధ్యమా? అతనిని నే నేమిచేయఁగలను?

కం॥ వానికిఁ గల దక్షౌహిణి,సేన శతాంగాశ్వకేతు♦సింధురయుత మై
జానై; యేమున్నది నా, కానృపు నెదిరింప? నెఱుఁగ♦వా నాస్థితులన్? ౧౦౪౬

ఆయనకో తేర్లు గుఱ్ఱాలు కేతువులు ఏనుగులు వీనితో నందమై యక్షౌహిణిసేనకూడ నున్నది. నాస్థితి నీకుఁ దెలియదా?

చం॥ అన విని సౌరభేయియు మ♦హాత్మక! క్షత్రబలంబునం బలం
బన నగు నయ్య? బ్రహ్మబల ♦ మా బల మన్నన, నప్రమేయమా
ననుపమతేజ! నీమహిమ ♦ మాన్నృపుఁ డెంతబలాఢ్యుఁ డయ్యె నీ
కును నధికుండు గాఁడు, వెసఁ ♦ గూల్చెద నాతనిసేన నంతయున్. ౧౦౪౭

అని వసిష్ఠుఁడు చెప్పఁగా విని శబల యిట్లనియె. 'మహాత్మా! క్షత్రియబల మొక బలమా? అదియొకగొప్పగాఁ జెప్పెదవేమి? బల మనిన బ్రాహ్మణబలమే బలము. నీమహిమ యింత యని కొలఁది చెప్పరానిది. కావున నా రా జెంత బలవంతుఁ డైనను నీకంటె నధికుఁడు గాఁడు. న న్నాజ్ఞాపింపుము. వాని సేననంతయు నాశముచేసెదను.

క౦॥ వాని దురాత్ముని దర్పవి,హీననిగా యుష్మదీయ♦భృశమంత్రబలా
దీనను నేఁ గావించెద, మానీశ్వర! యాన తీయు♦మా యని తన్నన్.౧౦౪౮

యుష్మదీయ = నీయొక్క - భృశ = గొప్పదగు - మంత్రబల = మంత్ర బలముచే - అదీనను = బలసంపత్తి గలదానను.

తా త్ప ర్య ము.

'మునీంద్రా! బలమే న్యాయ మను దుష్టబుద్ధిగల యతనిని బలహీనునిగా నీ మంత్రబలముచే బలసంపత్తిగల నేను జేసెదను. నీ వాజ్ఞయిమ్ము.'

క౦॥ వేఁడెడిశబలకు నమ్ముని,తేఁ డానతి యిచ్చె రిపులు ♦ తెచ్చ పడంగాఁ
బోఁడిమి సెడఁ గల్పింపుము, వాఁడిమగల ననిన శబల ♦ వందలకొలఁదిన్.౧౦౪౯

అని తన్నుఁ బ్రార్థించుచున్న శబలతో మునిరాజు 'శబలా! శత్రువులు నివ్వెఱ పడునట్లు వారిరూపము చెడునట్లు చేయఁగల శూరులను నూర్లకొలఁది సృష్టింపుము' అని యనుజ్ఞయిచ్చెను.

* కామధేనుకల్పితసైన్యముచే విశ్వామిత్రుసేన నాశమగుట *

క౦॥ శూరుల రిపుచయభయదా,కారులఁ బహ్లవుల నంతఁ ♦ గల్పించెను హుం
భారవమున; వారు చమూ,వారంబును రూపుమాపి ♦ వఱలఁగఁ గనుచున్.
౧౦౫౦

రిపుచయ = శత్రుసమూహములకు, భయద = వెఱపు కలిగించు; ఆకారు ల్లన్ = రూపములు కలిగినవారిని, చమూవారమున్ = సేనాసమూహమును,

తా త్ప ర్య ము.

శత్రుసమూహములకు భయముకలిగించు శూరులగు పహ్లవులను వారిని హుంభారవముచేతనే కల్పించెను. వారు విశ్వామిత్రుని సేననంతయు రూపుమాపి విజృంభించిరి.

ఉ॥ క్రోధకషాయితాక్షుఁ డయి ♦ ఘోరశరంబులఁ బహ్లవాళి దు
స్సాధపరాక్రముండు ధర ♦ సాల్వడి వీఁచ మడంగఁ గూల్చినన్
గాధితనూజుపైఁ గలఁచెఁ ♦ గ్రమ్మఁ ధేనువు పట్టిసావళీ
సాధనధారులన్ యవన♦సంఘములన్ శకసైన్యకోటులన్. ౧౦౫౧

క్రోధకషాయితాక్షుఁడు—కోపముచే నెఱ్ఱనగు కన్నులు గలవాఁడు, సాల్వడి=నిస్సారమై; యవనులు = Ionians.— Iavones Ionians అయ్యెను.

తా త్ప ర్య ము.

అది చూచి సాధింపరాని పరాక్రమముగల విశ్వామిత్రుఁడు కోపముచే నెఱ్ఱనగు కన్నులుగలవాఁడై భయంకరబాణములచే పహ్లవులను జచ్చి భూమిమీఁద నిస్సారమై పడునట్లు కూల్పఁగా నాగోవు విశ్వామిత్రుమీఁదఁ బట్టిసములు ధరించిన యవనశక సేనలగుంపులను విస్తారముగఁ బంపెను.

ఉ॥ వారలు కారుచిచ్చన స♦వారణవిక్రమకేళికారతిన్
భూరమణోరుసైన్యముఁ ♦ బూర్ణముగా దహియించి వైచినన్
గ్రూరతరాస్త్రకోటులను ♦ గూల్చెను వారల నెల్లఁ గౌశికుం
ధారణిఁ బీనుఁగుపెంటలుగఁ♦ దగ్ధ పడన్ గుది గ్రుచ్చినట్లుగన్. ౧౦౫౨

ఆయవనులు శకులు కారుచిచ్చువలెనే బడినట్లు సేనలమీఁదఁ బడి నివారింపరాని పరాక్రమక్రీడయందలి ప్రీతిచే రాజుసైన్యమును దహింపఁగా వారినందఱను కోపముచేఁ గ్రూరములైన యస్త్రకోటులచేఁ గూల్చి పీనుఁగుపెంటలు కావించెను.

⸻* ౫౫-వ సర్గము *⸻

సీ॥ చటులవిశ్వామిత్ర♦శస్త్రాస్త్రనిర్దగ్ధ, సేనలఁ గాంచి వ♦సిష్ఠమునియు
శబల! సృజింపుము ♦ సత్వరంబుగ యోగ,బలమాశ్రయించుచు ♦ బలఁగములను
నని నిదేశించిన ♦ నదియు హుంభారవం,బున సృష్టిచేసెఁ గాం♦భోజసమితి
బొదుగునఁ బహ్లవ♦పూగంబుఁ గల్పించె, యోనిని యవనాళి ♦ నొదువఁ జేసె;
తే॥ సృష్టి గావించె శకుల శ♦కృత్ప్రదేశ, మునను; మ్లేచ్ఛకిరాతాళి ♦ పొడమె ధేను
రోమకూపాళి; వారెల్ల ♦ దురంబి రణము, సరథగజఘోటభటముగ♦ స్తాపుసేన. ౧౦౫౩

భయంకరమైన విశ్వామిత్త్రు శస్త్రాస్త్రములచేఁ గాలిపోయిన సేనలఁ జూచి వసిష్ఠుఁ డో శబలా! శీఘ్రముగ నింకను యోగబల మాశ్రయించి సృజింపుమని యాజ్ఞ చేయఁగా నదియును హుంకారమునఁ గాంభోజసేనలను బొదుగునఁ బప్లవసమూహమును యోనియందు యవనలను పేఁడపుట్టుప్రదేశమునుండి శకులను రోమకూపములనుండి (వెండ్రుకల గూళ్ళు) మ్లేచ్ఛులను కిరాతులను సృజించెను. వారెల్ల రాజుసేనలపైఁ గవిసి రథములతోను నేనుఁగులతోను గుఱ్ఱములతోను గూడిన రాజుసేనను నాశముజేసిరి.

ఉ॥ సేనలు మూలముట్టుగ వ♦సిష్ఠునిచే హతమైన, భూమిభృ
త్సూనులు నూర్వు రుగ్రతర♦శూలపరశ్వధశస్త్రహస్తులై
మానుగ నొక్కపూఁపున స♦మన్యు మునీంద్రుని డాయ, హుంకృతి
స్థానివరుండు నూర్వుర నొ♦నర్చె క్షణంబున బూదిప్రోవుగన్. ౧౦౫౪

ఈప్రకారము సేనలు మొదలుముట్ట వసిష్ఠునిచే హతముకాఁగాఁ జూచి విశ్వామిత్రునికుమారులు నూర్వు రొక్కసారిగఁ గోపించియుండు వసిష్ఠుని సమీపింపఁగా నాయన హుంకారముచే నూర్వురను నిమిషములో బూడిదరాసులై పడఁజేసెను.

చం॥ కొడుకులు నూర్వురుఁ ధరణిఁ ♦ గూలుటయుఁ బల మెల్ల నుగ్గుగాఁ
బొడవు చెడంగ బిద్దుటయు ♦ భూపతి గన్గొని సిగ్గుచేఁ
జెడితి, మునీశ్వరు న్గెలువఁ ♦ జేగుఱు లెట్లొ? యటంచు దీనుఁడై
మిడుకుచు నెచ్చనూర్చుచును ♦ మేదిని వ్రాలి విషణ్ణచిత్తుఁడై. ౧౦౫౫

నూర్వురుకొడుకు లేకకాలమునఁ జచ్చిపడుటయు సేనలన్నియు నగ్గునూచమై చచ్చుటయుఁ జూచి విశ్వామిత్రుఁడు సిగ్గుచే నడఁగిపోయి చెడితినిగదా యేవిధమున నీమునీశ్వరు గెలువసాధ్య మగునని దీనుఁడై వ్యసనపడుచు వేఁడి నిట్టూర్పులూర్చుచు విషాదముతోఁగూడినవాఁడై భూమిపై వ్రాలెను.

ఉ॥ వేగము లేని నీరనిధి, ♦ వీడినకోఱలక్రూరసర్పముఁ,
బాగుగ గ్రస్తుఁడైనఖర♦భానుఁడు, పక్షము లూడఁగఁ బక్షి, నా
వేగముఁ బాసి కాంతి చెడి ♦ వెల్వెలఁ బోవుచు భగ్నదర్పుఁడై
యేగతినే జయింప మది ♦ నెంచి కుమారుని నిల్పి భూభృతిన్. ౧౦౫౬

తాత్పర్యము.

వేగములేని సముద్రము - కోఱలు పీఁకినసర్పము - గ్రహణమునాఁటి సూర్యుఁడు - ఱెక్కలూడిన పక్షి వలె వేగముఁబాసి కాంతిమాసి వెలవెలఁ

బోవు మ గర్వము సెడి యేవిధముగనైన వసిష్ఠుని జయింపవలె నని తలఁచి భూభార మందుఁ దనకుమారుని నిలిపి.

క౦॥ వీరుండు వడఁకుగుబ్బలిఁ, జేరం జని తప మొనర్చె శివుఁగూర్చి; భవా
నీరమణుఁడు దర్శన మిడి, కోరుము రాజేంద్ర కోర్కెఁ గొనసాగింతున్. ౧౦౫౭

వీరుఁడైన యీ విశ్వామిత్రుఁడు హిమవంతముపొంతకుఁ జని శివునిఁగూర్చి తపస్సుచేసెను. శివుఁడును బ్రత్యక్షమై 'రాజా! నీకేమివరము కావలయునో కోరుము. నీకోర్కి దీర్చెదను.'

చ౦॥ ఇటులు నిటాలనేత్రుఁడు నృపేంద్రునిఁ బల్కిన మోడ్పుఁజేతులన్
నిటలముఁ జేర్చి మ్రొక్కి ధరణీవిభుఁ డోనతభక్తలోకసం
కటహరణా! యుమారమణ! కర్కశదైత్యహరా! హరా! విశం
కటదయ నన్నుఁ జూడు పురఖండన! తుష్టుఁడ వేని నాయెడన్. ౧౦౫౮

నిటాలనేత్రుఁడు = ఫాలమందుఁ గన్నులు గలవాఁడు - శివుఁడు. నిటాల రూ- నిటలము.

తా త్ప ర్య ము .

ఇట్లు ఫాలాక్షుఁడు వచింపఁగా రాజు చేతులుజోడించి నొసటఁజేర్చి నమస్కరించి, నమస్కరించు భక్తజనములసంకటము హరించువాఁడ, పార్వతీప్రియుఁడా, కఠినచిత్తులగు, రాక్షసుల సంహరించువాఁడా, హరా, త్రిపురసంహారా, నాయెడ నీవు సంతుష్టుఁడవేని నన్ను విశేషదయతోఁ జూడుము.

క౦॥ సాంగోపాంగోపనిషత్సంగతి సరహస్యముగఁ బ్రసాదింపుము నా
కుం గరుణ ధనుర్వేదం, బంగజమదహరణ! సురసమర్చితచరణా! ౧౦౫౯

సాంగోపాంగోపనిషత్సంగతి — సాంగోపాంగ = అంగములతో - నుపాంగములతో,ఉపనిషత్సంగతి = మంత్రరహస్యముతోఁ గూడునట్లు. అంగము = సమీపమం దున్నప్పు డుపకరించు సాధనము. ఉపాంగము = దూరంబున నుపకరించునది. ఉపనిషత్తు = మంత్రరహస్యము; ఉపదేశమువలనఁ బొందఁదగినది; ధనుర్వేదము = విలువిద్య, అంగజమదహరణ = మన్మథుని మదము హరించినవాఁడా, సురసమర్చితచరణా = దేవతలచేఁ బూజింపఁబడిన పాదములుగలవాఁడా.

తా త్ప ర్య ము .

మన్మథునిగర్వము హరించినవాఁడా, దేవతలచేఁ బూజింపఁబడిన చరణములు గలవాఁడా, నాయందు దయయుంచి విలువిద్యయంతయు నంగము

లతోను నుపాంగములతోను మంత్రములతోను వానివాని రహస్యములతో నా కుపదేశింపుము.

ఆ॥ అసురులందు మునుల♦యందును గంధర్వ, వరులయందు యక్ష♦సురులయందుఁ
గలుగునస్త్రసమితిఁ ♦ గరుణింపవే నాకు, గారమారఁ గోర్కి♦దీర ననిన. ౧౦౬౦

రాక్షసులయందు మునులయందు గంధర్వులయందు యక్షులయందు దేవతలయందు నేయేయస్త్రములుగలవో యవన్నియు నాకోర్కిదీర దయయుంచి యుపదేశింపుము.

ఉ॥ వల్లె యటంచు హైమవతి♦వల్లభుఁ డీగిన, నస్త్రమండలం
బెల్లను గైవసం బగుడు, ♦ నెంతయుఁ బొంగి సమృద్ధదర్పుఁడై
పొల్లడఁగె న్మునీశ్వరుఁడు♦పో యని పున్నమనాఁటికంధి నాఁ
బెల్లుగ నుబ్బుచుం జనియెఁ ♦ బెన్నడ నమ్మునియాశ్రమోర్వికిన్. ౧౦౬౧

అనిన నట్లేకానిమ్మని పార్వతీపతి యుపదేశించి పోఁగా నస్త్రములన్నియుఁ దనకు స్వాధీనపడ మిక్కిలి పొంగి యతిశయించిన గర్వముగలవాఁడై చచ్చెఁబో మునీశ్వరుఁడని పున్నమనాఁటి సముద్రునివలెఁ బొంగుచు దూరపుటడుగులు వేసికొనుచు వసిష్ఠుఁడున్నయాశ్రమప్రదేశమునకు విసవిస వచ్చెను.

⟵* వసిష్ఠవిశ్వామిత్రులయుద్ధము *⟶

చం॥ జితసకలారి భూపతి వ♦సిష్ఠతపోవన మెల్ల భస్మసా
త్కృత మొనరించె నొక్కత్రుటిఁ ♦ గీడ్పడి యచ్చటి మౌనికోటి భీ
హతమతిఁ బాఱ దిక్కులకు ♦ నవ్యయదివ్యమహాస్త్రకీలలన్
ద్రుతగతిఁ బాఱెఁ బక్షితతి ♦ దూలిరి శిష్యవరుల్ భయార్తులై. ౧౦౬౨

జితసకలారి = జయింపఁబడిన సకలశత్రువులు గలవాఁడు, భస్మసాత్కృతము = బూడిదవంటిది.

తాత్పర్యము.

సకలశత్రువుల జయించిన యారాజు వసిష్ఠునితపోవనమంతయును నల్పకాలములో బలిష్ఠములైన దివ్యాస్త్రములజ్వాలలచేఁ గాల్చి బూడిదవలెఁ జేసెను. దానికి సహింపలేక యచ్చటి మునులసమూహము దిక్కులవెంటఁ బరువెత్తిరి. పక్షులన్నియు నాకాశమునకై యెగసిపోయెను. శిష్యులు భయపీడితులై సోలిపోయిరి.

చం॥ నిమిషములోపలం జనిటి♦నేలకుఁ దుల్యతనొంది తివ్వనం
బమరఁగ శబ్దశూన్యమయి ♦ యప్పుడు రుష్టమనంబుతోడ సం

యమి పారిపుత్తు గాధిజు ర♦యంబున మంచును సూర్యునట్టు ల
శ్రమమునఁ బోకుపోకుఁ డని ♦ సారెకుఁ జెప్పిన నిల్వ రెవ్వరున్. ౧౦౬౩

రుష్టమనంబు = రోషములోఁగూడిన మనస్సు.

తా త్ప ర్య ము.

తెప్పపాటుకాలములో నా వనమంతయుఁ జెట్టనదిలేక చవిటినేలతో సమానమై శబ్దమనునది లేనిదికాఁగాఁ గోపించి వసిష్ఠుఁడు సూర్యుఁడు మంచును రూపుమాపిన ట్లవలీలగా విశ్వామిత్రునిపొద మాపెదను, భయపడవలదు, పోకుఁడు పోకుఁ డని పలుమాఱు చెప్పినను నిల్వక యెక్కడిహా రక్కడనుండియే పరువెత్తిరి.

కం॥ ఇటు చెప్పియు నిలకున్నను, ఒటుతరసంరంభరోష♦పరవశుఁ డగుచున్
గుటిలభ్రూకుటినటనము, స్ఫుటముగ నిట్లనియె మౌని ♦ భూపాలునితోన్. ౧౦౬౪

ఇటు చెప్పినను నాశ్రమవాసు లెవ్వరు నిలువకుండుట చూచి మిక్కిలి రోషావేశముచేఁ బరవశుఁడై వంకరయై కనుబొమ లదరుచుండఁగా మునీశ్వరుఁడు రాజుతో స్ఫుటముగ నిట్లనియెను.

ఉ॥ ఆఁపగ లే నటం చనిర ♦ యక్కట మచ్చిరసంప్రవృద్ధ మౌ
తోఁపును దూపులం గినిసి ♦ దోఁకిన పెట్రితి, కాల్చి దివ్వటీ
దోఁపిడికాఁడువోలె ? నిను ♦ దోసము గోరి దురాత్మ! యిం కిటన్
సైఁపఁగ, నంచు రోషవివ♦శస్ఫృహుఁ డై కడు దుర్నిరీక్షుఁ డై. ౧౦౬౫

ఓరీ! నీ విజృంభణము నాఁపలేననియా - నేను జిరకాలముగఁ బెంచి వృద్ధి చేసిన నా తపోవనమును దోఁగుడుపాటుచే దోఁకినట్లు దివ్విటీదొంగలు దోఁచి కాల్చినట్లు చేసితివి ఓరి చెడుబుద్ధిగలవాఁడా! యిఁక నిన్ను సహించినఁ బాపము వచ్చును. అని రోషమునకు బరవశుఁడై తేఱిచూచుటకు సాధ్యముగాని తేజస్సుగలవాఁడై.

కం॥ రెండవ యమదండం బయి, చెండుచు నిర్ధూమకల్ప♦శిఖి యనఁ గీలల్
మండు తనబ్రహ్మదండం, బొండాడక కేలఁ దాల్చి ♦ యుద్ధతి నిలిచెన్. ౧౦౬౬

ఇట్లు చెప్పినను వినక యస్త్రముపెంట నస్త్రమును బ్రయోగించుచున్న విశ్వామిత్రునియెదుట వసిష్ఠుఁడు రెండవ యమదండమువంటిదై పొగలేక యుండు కాలాగ్నిజ్వాలలవంటి జ్వాలలఁ జిమ్ముచుఁ బ్రకాశించు తన బ్రహ్మదండమును మఱియేమియుఁ జెప్పక చేతఁబట్టుకొని నిలఁబడెను.

—* ౫౬-వ సర్గము *—

శా॥ జృంభారంభమహోద్ధతి న్నిలువ నే సెన్ మహానిపై భూమిభృ
జ్జంభారాతియు నిల్వు నిల్వు మని వాచాడంభ మేపార సం
రంభోత్తేజితవహ్ని బాణ, మది పైరాఁ జూచి యమ్మౌని దో
స్స్తంభాగ్రంబున బ్రహ్మదండ మిడి విశ్వామిత్రుతో నిట్లనున్. ౧౦౬౭

జృంభారంభమహోద్ధతిన్ = ఒడలువిఱిచికొను త్వరచే నగు మహాగర్వముతో, భూమిభృజ్జంభారాతి = రాజేంద్రుఁడు! వాచాడంభము=మాటపొగరు, సంరంభోత్తేజితవహ్నిబాణము = ఆటోపము మిగులఁ దేజముగలదిగాఁ జేయఁబడిన యాగ్నేయాస్త్రము, దోస్స్తంభాగ్రంబునన్ = స్తంభమువంటిచేతిచివర, బ్రహ్మదండము = బ్రాహ్మణునిచేతి కఱ్ఱ.

తాత్పర్యము.

ఒడలువిఱిచి వేగముగ గర్వముతో నిలువఁగా నాఁ వసిష్ఠునిపై విశ్వామిత్రుఁడు నిలునిలు మెందుఁ బోఁగలవని పొగరుమాటలాడుచు నాటోపమున నాగ్నేయాస్త్రము ప్రయోగించెను. తనపైకి వచ్చుట చూచి మునిరాజు భుజముపై బ్రహ్మదండము నిడుకొని విశ్వామిత్రునితో నిట్లనియె.

చం॥ నిలిచినవాఁడ గాధిజుఁడ! నే నిదె, చూపుము క్షత్రబంధు! నీ
బలముఁ జలంబు శస్త్రములపాండితిదర్పము నీఱు చేసి ని
న్నిలకును బాతు, క్షత్రబల మెక్కడ బ్రహ్మబలం బ దేడరా!
పలువ! నృశంస! దివ్య మగు బ్రహ్మబలం బిటు చూడు చూపెదన్. ౧౦౬౮

ఓరీ నీచక్షత్రియుఁడా! యిదిగో నిలిచినానురా! నీ బలమెంతో నీ చలమెంతో నీ శస్త్రాస్త్రములపాండిత్య మెంతో యంతయుఁ జూపరా! ముందు వానిని భస్మముచేసి యావల నిన్ను భూమిపై లేకుండఁ జేసెదను. ఓరీ! వాగుఁబోతా! నిర్దయుఁడా! యెక్కడి క్షత్రియబలము, ఎక్కడి బ్రాహ్మణబలము! ఇంత మాత్ర మెఱుంగవు. దివ్యమగు బ్రాహ్మణబలము నీకుఁ జూపెదను జూడుము.

సీ॥ అని బ్రహ్మదండంబు నను నార్చె గాధిజు, నగ్ని బాణము నీట నగ్నిఁ బోలె
ధారణీశ్వరుఁడును వారుణరౌద్రైంద్ర, పాశుపతైషీక బాణములును
స్వాపనగాంధర్వరోపముల్ మోహన, మానవజృంభణమాదనములు
సంతాపనంబు దుర్దాంతవిలాపన, దారుణశోషణదారణములుఁ
తే॥ బరమదుర్జయ మగువజ్రశరము బ్రహ్మ, పాశమును గాలవారుణపాశములును
దండపైశాచదయితముల్ రెండశనులుఁ, గ్రౌంచశుష్కార్ద్రిపైనాకఖగము లేసె.
౧౦౬౯

సీ॥ ధర్మచక్రంబును ♦ దారుణకాలచ, క్రంబును విష్ణు♦చక్రంబు మఱియు
మథనవాయవ్యముల్ ♦ మఱి హయశిరమును, శ క్తియుగ్మంబు ము♦సలము వెండి
గంకాళమును ఘోర♦కాలాస్త్రమును దీవ్ర, వైద్యాధరంబు నా ♦ వఱలుశరముఁ
గాపాలముఁ ద్రిశూల♦కంకణాజిహ్మాగం, బులుఁ గిన్కఁ దెగ నిండఁ ♦ బూన్చి విప్ర
తే॥ బ్రహ్మదండంబునను మ్రింగె ♦ బ్రహ్మసుతుఁడు, తచ్ఛరంబులనెల్లను ♦ దత్క్షణమున
నేమి చెప్పుదు శ్రీరామ! ♦ యెల్లరకును, నక్కజంబయితోఁచె మ♦హాత్మమహిమ.
౧౦౭౦

అని విశ్వామిత్రుని యగ్ని బాణమును నా బ్రహ్మదండముచేతనే చల్లార్చెను. అంతతో నిలువక విశ్వామిత్రుఁడు వారుణాస్త్రము - రౌద్రాస్త్రము - పాశుపతము - ఐషీకము - స్వాపనము - గాంధర్వము - మోహనము - మానవము - జృంభణము - మాదనము - సంతాపనము - విలాపనము - శోషణము - దారణము - జయింపరాని వజ్రశరము - బ్రహ్మపాశము - కాలపాశము - వారుణపాశము - దండము - పైశాచము - దయితము - రెండశనులు - క్రౌంచాస్త్రము - శుష్కము - ఆర్ద్రము - పైనాకము - ధర్మచక్రము - భయంకరమైన కాలచక్రము - విష్ణుచక్రము మథనము - వాయవ్యము - హయశిరము - రెండుశక్తులు - ముసలము - కంకాళము - కాలాస్త్రము - వైద్యాధరము - కాపాలము - త్రిశూలము - కంకణాస్త్రము - వీనినన్నిటిని నల్లెత్రాడాకర్ణాంతముగ లాగి విడిచెను. బ్రహ్మసుతుఁడు వసిష్ఠుఁడు వీనినన్నిటిని వెంటనే బ్రహ్మదండము చేతనే హరించెను. అప్పుడు చూచువారికందఱకు నేమి యీయనమాహాత్మ్యమని యాశ్చర్యము తోఁచెను.

శా॥ సర్వాస్త్రంబులు నిష్ఫలం బగుడు వి♦శ్వామిత్రుఁ డుద్యన్మహా
ఖర్వక్రోధభయానకాకృతి లస♦ద్గర్వంబునన్ రేఁగి గం
ధర్వర్షిప్రతతుల్ సుపర్వగణముం ♦ద్రైలోక్యముల్ భీతిమై
దుర్వారంబుగ సంభ్రమింప మునిపై ♦ దోర్దర్పముం జూపుచున్. ౧౦౭౧

ఉద్యన్మహాఖర్వక్రోధభయానకాకృతి = పుట్టుచున్నదీర్ఘమైన క్రోధముచే భయంకరమైన యాకారము.

తాత్పర్యము.

ఇట్లు తాను వేసినయస్త్రములన్నియు వ్యర్థమైపోఁగా గర్వము దీపింపఁగా మనస్సులోఁ బుట్టుచున్న దీర్ఘక్రోధముచే భయంకరాకారుఁడై విజృంభించి గంధర్వులు ఋషులు వీరిసమూహములు దేవతాగణము మూఁడులోకములు భయముచే మిగులఁదొట్రుపడ భుజాబలముఁ జూపుచు.

శా॥ బ్రహ్మాస్త్రంబు బరి వోసి యేయ నదియుం ♦ బై రాశిఖామాలిక
ల్బ్రహ్మాండంబున నిండఁ గాంచి తనకేల్ ♦ లన్ బ్రహ్మదండంబునన్
బ్రహ్మాపత్యము పూని మ్రింగె విబుధు ♦ ల్భ్రాంతాత్ములై చూడఁ; ద
ద్బ్రహ్మాస్త్రగ్రసనంబున న్మునికి రౌ ♦ ద్రం బయ్యె నాకారమున్. ౧౦౭౨

బ్రహ్మాస్త్రమువిట సంధించి విడిచెను. అదియును బ్రహ్మాండము తనయగ్ని జ్వాలలచే నిండఁజేయుచుఁ దనమీఁదికి రాఁగాఁ జూచి తనచేత బ్రహ్మదండంబును బూని యాబ్రహ్మకుమారుఁడు దేవతలందఱు భ్రాంతచిత్తులై చూచుచుండ దానిని మ్రింగెను. ఆబ్రహ్మాస్త్రమును మ్రింగుటచే మునీంద్రున కాకారము మిగుల భయంకరమయ్యెను.

ఉ॥ దారుణ మైనరూపమును ♦ దాల్చినయమ్మునిరోమనిష్కుహ
ద్వారచయంబులన్ దహన ♦ జ్వాలలపంక్తులు వెల్వడంగ, దు
ర్వారమహాప్రభావు ముని ♦ రాజును గాంచి ఋషీశ్వరుల్ స్తవం
బార నొనర్చి యి ట్లనిరి ♦ హర్షసముల్లసితాంతరంగు లై. ౧౦౭౩

రోమనిష్కుహద్వారచయంబులన్ = వెండ్రుకలరంధ్రము లనెడి ద్వారసమూహములనుండి, హర్షసముల్లసితాంతరంగులై = సంతోషముచే వికాసము నొందిన యంతరంగములు గలవారై.

తా త్ప ర్య ము.

భయంకరాకారమును ధరించిన యామునీంద్రుని రోమకూపముల ద్వారములనుండి యగ్నిజ్వాల లనుపంక్తులు బయలుదేఱఁగా నాఁపరాని మహాప్రభావముగల యమ్మునిశ్రేష్ఠునిఁ జూచి ఋషీశ్వరు లందఱు స్తోత్రములుచేసి సంతోషముచే వికాసమునొందిన మనస్సులు గలవారై యిట్లనిరి.

తే॥ కడు నమేయంబు త్వద్బల ♦ గరిమ మనఁచు, లోకవిఖ్యాతమయ్యె సు ♦ శ్లోక! జగము
లవ్యథములుగఁ దేజంబు ♦ నణఁపవయ్య, బ్రాహ్మణోత్తమ! నిర్జింపఁ ♦ బడియె నృపతి. ౧౦౭౪

అవ్యథములు = వ్యథము లేనివగునట్లు.

తా త్ప ర్య ము.

మునీంద్రా! నీతపోబలమహత్త్వ మింతింత యని చెప్పరాని దని జగమునందుఁ బ్రసిద్ధివెందెను. సత్కీర్తిగలవాఁడా! లోకములకు వెతలేకుండునట్లు నీతేజస్సు శమింపఁజేయుము. బ్రాహ్మణోత్తమా! రాజు నీచే జయింపఁబడెను.

పైపద్యమునందు వసిష్ఠుని గుఱించి చెప్పునప్పుడు జపివర్యుఁ డని జపశీలుఁ డని (చూ. ౧౦౭౪ - ౧౦౭౫) యిట్టివిశేషణములు ప్రయోగింపఁబడినవి. ♦♦

వలన వసిష్ఠుని మాహాత్మ్యమునకు జపమేకారణమని యేర్పడుచున్నది. ఆజపించిన మంత్రము గాయత్రియే. గాయత్రియే బ్రహ్మాస్త్రము. దానిని జపించుటచే నింతటి మహత్త్వము గలవాఁ డయ్యెను. మఱియొకక్షత్రియుఁ డైనచో బ్రహ్మాస్త్రముదగిలి చచ్చియుండును. లేదా బ్రహ్మాస్త్రముచేతనే దాని నణఁచి యుండును. వసిష్ఠుఁడు దానిని మ్రింగి జీర్ణించుకొనెను. తపోబలముచేతను జపబలముచేతను బ్రాహ్మణ్యముచేతను నాయనదేహమే బ్రహ్మమైయుండ నాయనను మఱియొకఁ డేమి చేయఁగలఁడు? కారుచిచ్చుమీఁదఁ జిచ్చుబుడ్ల ప్రయోగించినట్లు.

ఈవసిష్ఠవిజయము వాస్తవమున గాయత్రీవిజయమే. ఇట్టి గాయత్రి నధికరించి యుండునది శ్రీమద్రామాయణము, ఆంధ్రవాల్మీకి రామాయణము. కావున నివి సర్వోత్కృష్ట గ్రంథము లని వేఱుగ చెప్పవలయునా? 'ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతక నాశన' మ్మనునది సత్యమనుటయందు సందేహమేమి? ఒక్కొక్క యక్షర మనఁగా నొక్కొక్కయక్షరము నధికరించుకొనియుండు గ్రంథమని యర్థము గ్రహింపవలెను. గాయత్రియొక్కొక్కయక్షరమందును మహిమగలదు.

ఈ వసిష్ఠ విశ్వామిత్రయుద్ధము - బ్రాహ్మణక్షత్రియయుద్ధముమాత్రమే కాదు. ఆత్మవిద్యకు అనాత్మవిద్యకు యుద్ధము. సంపూర్ణముగ ననాత్మవిద్య నేర్చినవాఁడైనను ఆత్మవంతుని గెలువలేఁడు. అంతియగాక విద్యావంతుని దౌష్ట్యము ఆత్మవంతుని సాధుస్వభావము దీనియందు స్పష్టమగుచున్నవి. వసిష్ఠుఁడు తనను రక్షించుకొనుటకై ప్రయత్నించెనేకాని తనయుప్పు దినియుఁ గృతఘ్నుఁడై దివిటీదొంగవలెఁ దనసొమ్ము నపహరింపఁజూచి తనయాశ్రమమంతయుఁ బాడుచేసి తన్నుఁ జంప యత్నించినను దాను గృతికిఁ బ్రతికృతిగానైన విశ్వామిత్రునకుఁ గీడుదలఁచినవాఁడు కాఁడు. ఇది యాత్మవంతుఁడైన బ్రాహ్మణుని లక్షణము. బ్రాహ్మణుఁడు తాను బరులచేఁజెడ్డనైనఁ జెడునుగాని పరులను జెఱుపఁదలఁపెట్టఁడు. వసిష్ఠుఁడు కోపించుటగాని శపించుటగాని యేదియుఁ జేయఁడయ్యెఁగదా!

శ్లో॥ శమోదమ స్తపః శౌచం, క్షాంతి రార్జవమేవచ। జ్ఞాన విజ్ఞాన మాస్తిక్యం, బ్రాహ్మంకర్మ స్వభావజమ్॥— భ.గీ.౧౮. శమము - దమము - తపస్సు - శౌచము - క్షాంతి - ఆర్జవము - జ్ఞానము - విజ్ఞానము - ఆస్తిక్యము, ఇవి బ్రాహ్మణుని స్వభావకర్మములు.

—• విశ్వామిత్రుఁడు పరిభవమంది తపస్సుచేయ నిశ్చయించుకొనుట •—

౪౦॥ అని యిటు తనఁ బ్రార్థింపఁగ, మునిగణములు శాంతుఁడయ్యె • మునిపతి, దానిం
గని యూర్చుచు గాధేయుఁడు, దనమనమున నిట్టు లనుచుఁ • దలఁచెఁ వగచెన్.

౧౦౭౫

అని యిట్లు తన్ను మునిజనములు ప్రార్థింపఁగా వసిష్ఠుఁడు శాంతి వహించెను. ఇదంతయుఁ జూచి విశ్వామిత్త్రుఁ డేమియుఁ జేయఁజాలక నిట్టూర్పు లూర్చుచు దుఃఖమునఁ దనలో నిట్టు లాలోచించెను.

కం॥ బల మనఁగ బ్రహ్మతేజో,బల మే యగు; నిస్సి క్షత్త్ర♦బలముఁ బలమే ?
కలన మదస్త్రము లన్నిటిఁ, దలఁగక హరియించె బ్రహ్మ♦దండం బొకఁడే. ౧౦౭౬

బలమనిన బ్రాహ్మణునకుఁ దపస్సుచేఁ గలిగిన తేజముయొక్క బలమే కాని క్షత్త్రియుని దేహబల మొక బలమా? కాదు. ఏలన - నాయస్త్రముల నన్నింటిని నీ బ్రాహ్మణుని చేతికఱ్ఱయొకటియే హరించెఁగదా!

కం॥ ఏటికి నాక్షాత్త్రం బిఁక, నేటికి నస్త్రాళిఁ శాంత♦హృదయేంద్రియతన్
సాటి గనని బ్రహ్మత్వము,పాటిలఁ దపముందు ననుచుఁ ♦ బనిపూని మదిన్. ౧౦౭౭

తాత్పర్యము.

నాక్షాత్త్రము వ్యర్థమయ్యెను. నాయస్త్రములు వ్యర్థమయ్యెను. ఇఁక నివి యుండిననేమి పోయిననేమి' ఇఁక వీనితో నాకుఁ బనిలేదు. నే నింతకీడు చేసినను బ్రాహ్మణుఁడై శాంతచిత్తుఁడై యింద్రియముల జయించుటచేఁగదా నీయన కింత మహత్త్వము గలిగెను! కావున నేనును శాంతచిత్తుఁడనై యింద్రియముల జయించి బ్రాహ్మణుఁడ నగుటకు యత్నించెదను, దీనికై నే నిఁకఁ దపస్సుచేసెద నని పూనకొనెను.

—* ౫౭-సర్గము *—

కం॥ మైత్త్రావరుణునితోఁ దన, శాత్త్రవమును భంగపాటు ♦ స్మరియించుచు ఖే
దత్త్రపలకులోనై కుశ,పుత్త్రుఁడు నిట్టూర్చి యూర్చి ♦ పొగులుచు నంతన్. ౧౦౭౮

మైత్త్రావరుణునితోన్ = వసిష్ఠునితో (ఉ-కాం-౧౧౦౨ ప-) ఖేదత్త్రపలకు = శోకమునకు, లజ్జకు.

దేవతా ద్వంద్వేచ॥ పాణి - ౬-౨-౨౬

వాయుశబ్దప్రయోగే నిషేధః

ఈదగ్నేః సోమవరుణయోః॥ వార్తిక.

ఈ సూత్త్రముల ప్రకారము మిత్త్ర + వరుణుఁడు = మిత్త్రావరుణులు. సూర్యాచంద్రమసులు - (సూర్యాచంద్రు లనరాదు.) అగ్నామారుతులు అని రూపములు. మిత్త్రావరుణాపత్యము మైత్త్రావరుణుఁడు.

తా త్ప ర్య ము.

వసిష్ఠునితోడఁ దనకుఁ గలిగిన విరోధము - పరాభవము వలపోసి పోసి, శోకమునకు లజ్జకుఁ బాలుపడి విశ్వామిత్రుఁడు మఱేమియుఁ జేయఁజాలక యూరక నిట్టూర్పుపుచ్చిపుచ్చి లోలోపలనే శోకాగ్నిచేఁ గుములుచు బాధపడుచుండెను.

సీ॥ దక్షిణదిశ కేగి ♦ దారయుతంబుగ, నుగ్రతపస్స్థితి ♦ నుండఁ దనయు
లందుఁ గల్గిరి హవి♦ష్యందమధుష్యంద, దృఢనేత్రులు మహార♦థాఖ్యయశులు
వేయివర్షము లైన ♦ విధియట కరుదెంచి, మధురవాక్యంబుల ♦ మహిపుఁ జూచి
యనియె రాజర్షిచ♦యంబు నీచే జిత, మయ్యెను దపమున ♦ నల్లుగాన
తే॥ రాజఋషి వైతి వనియెంతు♦రాజ' యనిస్వ, లోకమున కేగ సురలతో♦లోనఁజింత
వఱల సిబ్బితిఁ దలవ్రేల♦ వైచి దుఃఖ, మన్యుదందహ్యమానుఁడై ♦ మదిఁదలంచు. ౧౦౭

తా త్ప ర్య ము.

భార్యతోడ దక్షిణదిక్కునకుఁబోయి తీవ్రమైన తపస్సుచేయఁగా నచట హవిష్యందుఁడు మధుష్యందుఁడు దృఢనేత్రుఁడు మహారథుఁ డనువారు నలువురు కొడుకులు గలిగిరి. ఇట్లు వేయిసంవత్సరములు తపస్సుచేయఁగా బ్రహ్మ వచ్చి తియ్యని వాక్కులచే రాజా నీవు నీతపంబుచేత రాజర్షులనందఱ మించితివి, కావున రాజర్షివైతివని తలంచెద, నని దేవతలతోఁ దనలోకమునకుఁ బోయెను. విశ్వామిత్రుఁడును నే నింతటి తపస్సుచేసినది రాజర్షిత్వమునకా యని విచారపడి సిగ్గుచేఁ దల వంచుకొని దుఃఖముచేతను శోకముచేతను గాల్పఁబడినవాఁడై యిట్లనుకొనెను.

కం॥ ఎం తెంతో తప మొనర్చితి, నంతయు భావింతు వ్యర్థ ♦ మని, ముని సుమన
స్సంతతి నను రాజర్షిగ, నెంతు నటం చనియె, దీన ♦ నే మగు నాకున్ ౧౦౮

నే నెంతో గొప్పతపమును జేసితిని. ఇదంతయు వ్యర్థమాయెను. ఏలన దేవతలు మునులు నన్ను రాజర్షి యనిరి. దీనితో నా కేమి కాఁగలదు!

బ్రాహ్మణులు బ్రహ్మచర్యము గార్హస్థ్యము వానప్రస్థము సన్న్యాసము నను నాలుగాశ్రమములకు నధికారులు. క్షత్త్రియులు మొదటిమూఁడాశ్రమములకే కాని సన్న్యాసమునకు నధికారులుగా రని యుండుటచేతను విశ్వామిత్రుఁడు భార్యతోడ నుండుటచేతను, వానప్రస్థాశ్రమమునం దుండెనని యెఱుఁగనగు.

కం॥ అని నిశ్చయించి మనమున, ఘనతరమగు తపము సేయఁ ♦ గడఁగెను వెండిన్
విను మితఁ డిటు లుండఁగ నట, నినకులజాతుఁడు త్రిశంకు♦పృథ్వీవరుఁడున్. ౧౦౯

అని మనస్సులో నిశ్చయించుకొని మునుపటికంటె గొప్పతపమును జేయ నారంభించెను. ఇతఁ డిట్లు తపము చేయుచుండుసమయంబున నచట నయోధ్య యందు త్రిశంకుఁ డను రా జొకఁ డుండెను.

—* త్రిశంకూపాఖ్యానము *—

ఉ॥ ఎంచుచు మేనితోడ దివి • కేఁగఁగ నధ్వరమొండు సేయఁ బి
ల్పించి వసిష్ఠు నేగతి ల•భించును నాసమభీష్ట మన్నఁ జిం
తించి యతండు జన్న మిది • దీర్ప, నశక్య మ టన్న మాని వ
ర్జించి యమాశ నేగెను వ•సిష్ఠతనూజశతంబుఁ గానఁగన్. ౧౦౨

తా త్ప ర్య ము.

ఆ త్రిశంకుఁడు దేహముతోడనే స్వర్గమునకుఁ బోయి స్వర్గసుఖము లనుభ వింపవలయు నని తలంపుగలవాఁడై వసిష్ఠుఁ బిలిపించి తన యభీష్టముఁ దెలిపి నాచే నిట్టి యాగము చేయింపు మని కోరెను ఆయనయు నాలోచించి యది యసాధ్యకార్య మని చెప్పెను. దానిపై నారాజు వసిష్ఠుని వదలి దక్షిణదిక్కునకు వసిష్ఠునినూర్వురుకుమారులఁ జూడఁబోయెను.

కం॥ ఈకరణి నేగి వినత,శ్లోకుల నిస్తుల్యకాంతి•శుద్ధుల సుశోప
శ్శ్రీకుల గురుసుతులం గని, భూకాంతుఁడు మ్రొక్కి యాను•పూర్వ్యముగాఁగన్. ౧౦౩

ఇట్లుపోయి కీర్తిచేఁ బ్రసిద్ధికెక్కినవారును అసమానమైన తపస్తేజముచే శుద్ధు లయినవారును తపస్సే సంపదగాఁ గలవారును నగు గురుపుత్రులఁ జూచి పెద్ద మొదలు చిన్నవానివఱకు వారికందఱకు వరుసగా నమస్కరించెను.

చం॥ కరములు మోడ్చి, లజ్జను ము•ఖం బర వాలిచి, వారి కిట్లనుఁ
గురుసుతులార! మీశరణుఁ • గోరెదఁ, గం డిట దిక్కు నాకు, నా
దరమున, మేనితో దివికిఁ • దార మనంబునఁ గోరి యొక్కయ
ధ్వర మునుపంగ మీజనకు • వావిరిఁ గోరితి పైసిమాలితిన్. ౧౦౪

ఇట్లు నమస్కరించి చేతులుజోడించి సిగ్గుచేఁ దలసగమువంచి వారితో నిట్లని యెను. గురుకుమారులారా! మీశరణుఁ జొచ్చితిని. మీరే నాకు రక్షకులు. ఈదేహముతోనే స్వర్గమునకుఁ బోవఁగోరి నాచే నొకయజ్ఞము నొనర్పుమని మీతండ్రిని గోరితిని. అవమానపడితిని.

ఇది వక్రబుద్ధిగల శిష్యునిలక్షణము. తన కేది హితమో పథ్యమో యది చెప్పుమని గురువును గోరవలయును గాని నిర్బంధపఱిచి తనయిష్టప్రకార మసాధ్యకార్యమైనను గురువుచేయింపఁ డని గురువును ద్యజించుట దోషము. కావుననే త్రిశంకున కాగతి గలిగెను.

చం॥ శిరము భవత్పదంబులను జేరిచి వేఁడెద నన్నుఁ బ్రోవుఁడీ
పరమతపస్విలార! సురపట్టనముఙ్ మెయితోడఁ బోవ న
ధ్వర మొనరింపఁ బంపుఁడు, భవజ్జనకుండు తిరస్కరింపఁగా
గురుసుతు లీరు గాక సమకూడునె వే ఱొకప్రాపు నా కిలన్. ౧౦౮౫

గురుపుత్రులారా! మీపాదములపై నాశిరస్సుంచి మ్రొక్కెదను. పరమతపస్వులారా! నన్ను రక్షింపుఁడు. నే నీదేహముతో దేవతానగరమునకుఁ బోవుయాగమును నాచేఁ జేయింపుఁడు. మీతండ్రి నన్నుఁ దిరస్కరించి పంపెను. ఆవల నాకు మీరుగాక వేఱుప్రాపున్నదా?

శా॥ ధిక్కారంబును బొంది వచ్చితిని, నాదిక్కింక మీ రయ్య, నా
కిక్కార్యంబు ఘటింపుఁడీ, గతి గదా యిక్ష్వాకువంశ్యాళికిన్
దక్కం జేయఁగ నెల్లపుణ్యముఁ బురోధస్స్రష్ట, యాతండ పో
దిక్కన్నస్మతి దైవ మన్న నిల ధాత్రీపాలకశ్రేణికిన్ ౧౦౮౬

తాను బురోహితుఁడ నని నేను రాజ నని రాజులకార్యము నెఱవేర్చుట పురోహితులకార్య మని యోజింపక నన్ను ధిక్కరించి పంపెను. ఇఁక మీరే నాకు దిక్కు. నాయీకార్యము నెఱవేర్పుఁడు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన రాజులకందఱకుఁ బురోహితబ్రహ్మయేకదా సర్వపుణ్యకార్యములు చేయింప గతి. ఆపురోహితుఁడే వారికి దిక్కనినను దైవమనినను. కావున మీరు నేను గోరిన కార్యము నెఱవేర్పుఁడు. అట్లు చేయలేని మీరు మాకుఁ బురోహితులు గానుండి యేమి ప్రయోజనము? కోరిన కార్యము చక్కఁ జేయలేని పురోహితులున్ననేమి, లేకున్ననేమి?

—* ౫౮-వ సర్గము *—

కం॥ కోపసమన్వితమగు నా,భూపాలాపముల నెల్లఁ బోరి విని యను నా
తాపసవరసుతశత మా,క్ష్మాపాలునిఁ జూచి రోషసంభ్రమపరతన్. ౧౦౮౭

కోపముతోఁ గూడిన రాజు మాటలనెల్లఁ బూర్ణముగా విని యానూర్వురు తపస్విలు కోపించినవారై రాజుతో నిట్లనిరి.

మ॥ అవివేకీ! ఋతవాది యాగురుఁడు ప్రత్యాఖ్యానముం జేయఁగాఁ శే
దవునే యన్యుని నాశ్రయింప? మరియాదా వానిఁ బోనాడఁగా? డు
రవివంశ్యావళికిం బురోహితుఁడె గోత్రానాథ! యాచార్యుఁడౌ,
నవునే యాతనిమాట మీఱ, ముసి మిథ్యావాది యం చెంచితే? ౧౦౮౮

ఓరి వివేకహీనుఁడా! సత్యము వచించిన గురునివిషయమై యెదురాడుట తగునా? ఆయనను గాదని మఱియొకని నాశ్రయింపవచ్చునా? కులగురువున

విడుచుట మర్యాదయగునా! సూర్యవంశపురాజుల కందఱకు పురోహితుఁడే యాచార్యుఁడు. ఆయనమాట మీఱవచ్చునా? ఆయన కల్లలాడెనని యెంచితివా? ఏమని యాయనను విడనాడతివి?

క॥ కాదని వసిష్ఠుఁ డాడిన, భూదయితా! మాకు దానిఁ ♦ బొసఁగునె చేయన్
లేదు వివేకము నీకెదఁ, గాదన కఁకఁ బురికిఁ జనుము ♦ కనుము వసిష్ఠున్. ౧౦౭౯

ఇదికానిపని యసాధ్యమని వసిష్ఠుఁడు చెప్పఁగా మా కది చేయ సాధ్యపడునా? నీకుఁ దాఁకు తప్పు దెలియదు. నీవు సరిగాఁ బురమునకుఁ బోయి వసిష్ఠునే చూడుము

ఆ॥ నిన్నె కాదు జగము♦లన్నిటియందలి,వారి నెవరినైన ♦ సాంశక్తి
నతఁడు పవన మునుపఁ♦ జతురుఁ డాతని కవ,మాన మొదవుపనిని♦బూనఁగలమె?
౧౦౮౦

నిన్నొకనినే కాదు అన్నిలోకములందలి యెట్టివారిచేతనైన నేయాగమైనఁ జేయింపశక్తిగలవాఁడు వసిష్ఠుఁడు. ఆయన కాదనినదానిని మేము చేయించెద మని పూనవచ్చునా? అది యాయన నవమానించినట్లుకాదా? అట్టికార్యము మేము చేయవచ్చునా?

దీనివలనఁ బుత్రులు తండ్రిమార్గ మనుసరించి వర్తింపవలయునుగాని తండ్రి కవమానకర మగు కార్యము చేయరాదని సూచన.

క॥ పరుషంబుగ నిటు లాడిన, ధరణీశుఁడు గురువుచేతఁ ♦ దత్తనయులచేఁ
బరిభవము గల్గె నేటొక, శరణంబునుగాంతు మీకు ♦స్వస్త్యస్తనుచున్. ౧౦౮౧

ఇట్లు వారు కఠినముగ మాటలాడఁగా, నారాజు 'గురువుచేతను నవమానింపఁబడితిని. ఆయన కుమారులచేతను నవమానింపఁబడితిని. మఱియొకని శరణముచొచ్చి నాకార్యము సాధించుకొనెద. మీకు స్వస్తియగును గాక!'

క॥ చనియెదనని నృపుఁ గనుఁగొని, మనమున రోషాగ్ని పెరుఁగ ♦ మానితనూజుల్
గనుమీ చండాలత్వం, బని శాపం బిచ్చి చొచ్చి ♦ రాశ్రమతలమున్. ౧౦౮౨

పోయెదనని రాజు పలుకఁగా వారు లోపల కోపాగ్ని ప్రజ్వరిల్ల 'నోరీ! యేమి మాటలాడితివి! గురుధిక్కారమును నిష్కారణముగఁ గావించితివి కావున నీవు చండాలుఁడ వవుదువుగాక' యని శపించి తమయాశ్రమమును బ్రవేశించిరి. రాజు తన నగరమునకుఁ బోయెను.

దీనివలన గురునిందచేయువాఁడు చండాలుఁ డగు నని సూచన.

సీ॥ వఱువాత మేల్పన ♦ నొఱపైన నునుఁజేల, కాటు కద్దినగుడ్డ♦కరణి నయ్యె
బంగారురుచిమించు ♦ సింగారపు న్నెయి, కారుమేఘమురీతిఁ ♦ గాన నయ్యె

మృదువులై నిడుదలై ♦ యింపులౌ నెఱికురుల్, కఱకున రేఁగిజం♦జాటులయ్యె
మణిమయకనకభూ♦షణసమూహంబులు, నాయసాభరణంబు ♦ లగుచునొప్పెఁ
తే॥ జూడ నేమందు మెడను వ్రే♦లాడుచుండు, జన్నిదపుఁబ్రోగు లెల్ల నా♦త్మాపునందు
నినపకమ్ములు నయ్యె నో♦మనజవర్య!, సైఁప రానట్టి మునిజన♦శాపమునను. ౧౧౩

తాత్పర్యము.

ఉదయమున నిద్ర లేచి చూచుకొనఁగా నంటమై నున్నపైన వస్త్రము కాటుకలో నద్దినట్లు నల్లగనయి యుండెను. బంగారుకాంతిని నతిశయించియుండునంద మైన దేహకాంతి నానకాలమందలి మబ్బువలె నలుపై యుండెను. మెత్తనివై నిడుపులై యందమైన తలవెండ్రుకలు ఎఱుసెక్కి చెదిరి చింపిరిమైయుండెను. మణులు చెక్కిన బంగారు సొమ్ములన్నియు నినుపసొమ్ములై కానవచ్చెను. మెడలో వ్రేలాడుచుండు జందెములప్రోగులు నినుప కమ్ములయ్యెను సహింపరాని మునీశ్వరులశాపముచే సర్వము నిట్టులయ్యెను.

ఉ॥ మౌనులకిన్కచేత నిటు ♦ మాలతనంబును గన్నయాధరా
జానిని గాంచి యెల్లరును ♦ సత్వరులై యెడఁ బాసి పోవలో
నూనినధైర్య మొక్కటియ ♦ యూడనిబాసట గాఁగ దుఃఖసం
తానసుదగ్ధమానసము♦నం బతి కౌశికుఁ డాసి నిల్చినన్. ౧౧౪

తాత్పర్యము.

మునుల కోపముచేత నిటు చండాలుఁడైన యాభూభర్తను జూచి పురమునవారెల్లరు శీఘ్రముగా దూరదూరముగాఁ బోయిరి. అందఱు వదలిపోయినను ధైర్య మొక్కటియే వదలని సహాయముగా దుఃఖసంతానముచేత దహింపఁబడిన మనస్సుగలవాఁడై విశ్వామిత్రుని సమీపించి నిలిచెను.

ఉ॥ చేరిన మాలవేషమునఁ ♦ జేడ్పడి యున్నత్రిశంకుఁ గాంచి నిం
డారుదయన్ మునీంద్రుఁడు ధ♦రాధిప! శాపము పేర్మిఁ బుల్కసా
కారము నొంది యిచ్చటికిఁ ♦ గారణ మే మరుదేర? నన్న నా
భూరమణుండు మోడ్చి కర♦ముల్ వచియించెను వాక్యకోవిదున్. ౧౧౫

ఇట్లు తను సమీపింపఁగా చండాలవేషమున నున్నవాఁడు త్రిశంకుఁడను రాజని యెఱిఁగి దయగలవాఁడై, రాజా! యేల యిట్లు శాపముచే మాలవాఁడవైతివి. ఇచ్చటి కేల వచ్చితి, వని యడిగినఁ జేతులు జోడించి నమస్కరించి యిట్లనియె.

త్రిశంకుఁ డనుపేరు సంపాదించిన సత్యవ్రతుఁడు సూర్యారుణు కుమారుఁడు. ఇతఁడు సత్యవ్రతను వివాహమైన పడిపడి యయోధ్యాపురమందుఁ బౌరుఁ డొక్కఁడు పెండ్లైన బాలను బాల్యముచేతను, ఈసుచేతను, రాజకుమారుఁడను గదా యను యధికారగర్వంబునను దాను గ్రహించెను. అది రాజునకుఁ దెలిసి కోపించి తిట్టి ఛీ నాయొద్ద నుండవలదు పొమ్మని యాజ్ఞాపించెను. ఎక్కడకుఁ బోదు నని సత్యవ్రతుఁ డడిగెను. ఆయన కోపముచేఁ గుక్కలఁ జంపి తిను మనుష్యులఁగూడి తిరుగఁ బొమ్ము. నీవు నాకొడుక వను మమత నాకు లే దనెను. వాఁడు నట్లె వెడలిపోయెను. ఇది తెలిసి తనపతుమునఁ దండ్రితో మాటలాడి తాను బోకుండఁ జేసినవాఁడు కాఁడా యెఁగదా యని వసిష్ఠునిపై సత్యవ్రతుఁడు లోపలఁ గోపము వహించియుండెను. అతని తండ్రి యడవికిఁ బోయి తపస్సు చేయుచుండ రాజ్యమునకు నాథుఁడులేక యరాజకమగుటచే నధర్మంబు ప్రబలె, వసిష్ఠుండు రాష్ట్రంబును - పురంబును - అంతిపురంబును చెడకుండఁ గాపాడుచుండెను. అట్టి సమయంబున విశ్వామిత్రుఁడు తనభార్యను బిడ్డలను ఆదేశంబున విడిచి పశ్చిమసముద్రతీరంబునఁ దపస్సుచేయుచుండెను. ఆవఱపునందు ముగ్గురుకొడుకులను దన్నుభరించుకొనలేక విశ్వామిత్రునిభార్య నడిమికొడుకుమెడకు పలుపుగట్టి యీ నాకొడుకు నమ్మెదను, నూఱుగోవు లిచ్చి కొనుఁ డని విక్రయించుచుండెను. అది యెఱిఁగి సత్యవ్రతుండు వలదు వల దని యామెను వారించి మెడత్రాడుతీసివైచి వారినందఱను దాను రక్షించుచుండె. గళబంధముపోయెను గాన వాఁడు గాలవుఁ డనఁబడెను. ఇట్లను దినము వేఁటాడి వారికి మాంసాహారము పెట్టుచుండ నొకనాఁ డొక మృగమైన లభింపదయ్యె. కావున దూరము పోయి యచట నొకచోట మేయుచున్న వసిష్ఠునిగోవును జూచి యది వసిష్ఠుని దని యెఱిఁగియుఁ బూర్వవిరోధంబు స్మరించి దానిని జంపి మాంసంబు చేకొనెను.

అది తెలిసి వసిష్ఠుఁడు వచ్చి యోరీ! నీవు తండ్రి కప్రియమైనవర్తనముగలవాఁడగుట, గురునిపాలిచ్చుగోవును జంపుట, అప్రోక్షితమాంసంబు నుపయోగించుట, యను హృదయశంకువులు మూఁడుకావించుటఁజేసి త్రిశంకుఁ డను పేరువహింపుము. లోకనిందితుఁడవైన నిన్ను నే నేమియుఁ జేయనేరఁ బొమ్మనెను. ఆ కారణంబున సత్యవ్రతుండు త్రిశంకుఁ డయ్యె. విశ్వామిత్రుఁడు తరువాత వచ్చి తన భార్యను బిడ్డలను బిలుచుకొని పోవుచుఁ ద్రిశంకునకు నీవు కోరినపుడు నీకుఁ గావలసినసాహాయ్యముచేసెదను - అని చెప్పెను. ఈకారణమున విశ్వామిత్రుఁ డిప్పుడు త్రిశంకునకు సహాయపడఁగలిగెను.

శ్లో॥ పితుశ్చాపాదిదోషేణ । గురుదోగ్ధ్రీవధేనచ । అప్రోక్షితోపయోగాచ్చ । త్రివిధా స్తద్వ్యతిక్రమః । ఏవం త్రీణ్యస్య శంకూని । తాని దృష్ట్వా మహాయశాః । త్రిశంకు రితిహోవాచ । త్రిశంకు స్తేన స స్మృతః॥ - హరివంశము.

క॥ గురుఁడును గురుపుత్త్రులు నో, ప్పరికించుట కాక నన్ను ♦ వాంఛం దీర్పక
దొరకొనక యిట్లు సేసిరి, పరిభవముం బడితి నిట్టి ♦ పాటును వచ్చెన్. ౧౭౬

మునీంద్రా! నన్ను గురుఁడును గురుపుత్త్రులును నుపేక్షించిరి. నాకోరిక తీర్పక పోవుటయే కాక నా కీగతిఁ గల్పించిరి. అవమానము పడితిని. ఇట్టిదశ యును గలిగెను.

దీనివలనఁ దనయిష్టానుసారము కార్యము చేయుమని గురువును నిర్బంధింప రాదనియు శుశ్రూషచే నతనిమనస్సు సంతోషపఱచి తనకార్యము సాధించు కొనవలయు ననియు సూచన. "గురోరళీకనిర్బంధో నకర్తవ్యః కదాచన, అను మాన్య ప్రసాద్యశ్చ గురుః క్రుద్ధో యుధిష్ఠిర, శిష్యో గురౌ నరశ్రేష్ఠ ప్రతికూలం ననంచరేత్॥ వి - పు. "మహాంతిపాతకా న్యాహుః సంసర్గశ్చాపి తైస్సహ, అనృతంచ సముత్కర్షే రాజగామిచ పైశునమ్, గురో శ్చాళీకనిర్బంధః సమాని బ్రహ్మహత్యయా."- మను.

శిష్యుఁడు చేయరానిపని పూనకొని గురువును దోడుర మ్మని బలాత్కరించుట వలన బ్రహ్మహత్యవచ్చు నని యేర్పడుచున్నది.

క॥ దేహంబుతోడ స్వర్గా, రోహణముం జలుపఁ గోరి ♦ యూహఁగ శతసం
ఖ్యాహవము లలిపితి నే, నూహింపఁగ ఫలము శూన్య ♦ మో మునివర్యా! ౧౭౮

దేహముతో స్వర్గమునకుఁ బోవఁదలఁచి నూఱుకోలఁది యజ్ఞములు చేసితిని. ఫలమేమియుఁ గలిగినది కాదు.

ఉ॥ ఆడను గల్ల యిందనుక ♦ నాడుట లే దిఁకమీఁద నెన్నఁడే
నోడక క్షత్త్రధర్మమున ♦ నొప్పు మెయిన్ శపథంబు సేసెదన్
గో డొడఁగూడి యుండినను ♦ గోవిదవర్య! నిజంబె పల్కుదున్
వీడక ధర్మముం బ్రజల ♦ వేయువిధంబులఁ బ్రోచి, జన్నముల్. ౧౭౯

ఇంతవఱకు నే నసత్యము పలికినవాఁడను గాను. ఇఁకమీఁద నిట్టిదశవచ్చి నను నెన్నఁడైన నాడఁబోను. ఇట్లని క్షత్త్రియధర్మముపై ప్రమాణము చేసెదను. నాకుఁ గష్టదశవచ్చినను నేను సత్యమే పలుకుదును. నేను రాజధర్మము వదలక వేయివిధములుగఁ బ్రజలకు మేలగు కార్యములు చేసితిని.

త్రిశంకునకు మొదటిపేరు సత్యవ్రతుఁడు. ఈయనభార్య సత్యవ్రత. కేకయ రాజుకూఁతురు.

తే॥ ఎన్నిటినో చేసి గురులక ♦ హీనచరిత, ములను సద్గుణగణముల ♦ ముదముఁగూర్చి
వాసిఁగంటినిగాని య ♦ ధ్వరము సేయఁ, గడఁగు నాయందు వారికిఁ ♦ గరుణలేదు.
౧౮౦

ఎన్నిటినో యజ్ఞములఁ జేసితిని. గొప్ప నడవడులచేత గురులను సంతోషింపఁ జేసితిని. కీర్తిని సంపాదించితిని. ఇంత చేసినను నే నిప్పుడు యజ్ఞము చేయఁబూనఁగా నాయందు వారికి దయరాకున్నది.

క౦॥ కావున దైవమె పర మని, భావింతు నిరర్థకంబు ♦ పౌరుష మిల్లపై
దైవాక్రాంతము సర్వము, దైవమె పరగతి యటంచుఁ ♦ దలఁతు మునీంద్రా! ౧౧౦౦

కావునఁ బౌరుషము వ్యర్థ మని దైవమే శ్రేష్ఠ మని తలఁచెదను. సర్వము దైవమునకు లోఁబడియుండునదే. ఉత్తమగతియు దైవమనియె యనియు దైవము తప్పఁజూచిన పౌరుషము ఫలింపదనియుఁ దలఁచెదను.

మరణకాలంబున దుర్యోధనుండును నిట్లే 'దైవమేవ పరం మన్యే' యని తలంచెను ఇది వాఁడు ముందుగా గ్రహించిన మనదేశమున కీకడగండ్లు రాక యుండును. కొందఱు కార్యఫలములకుఁ దామే కర్తలందురు. కొందఱు సర్వము దైవాధీనము. పౌరుషము వ్యర్థమందురు. ఈ రెండభిప్రాయములు సరిగావు.

గీ॥ కాఁపు లావువెరవు గలిగి కర్షణము సేయంగ వృష్టిదగిన యట్లు గలుగ
ఫలము గలుగునట్లు పౌరుషంబునకు దైవంబుతోడుపాటు వలయు నెందు.

చం॥ వెరవున లావునం గృషికి వేయువిధంబుల మేలొనర్చి ?
దొరకొనునే ఫలంబు దఱితోఁ దగువర్షము లేకయున్న? నె
వ్వరుసున లెస్సచేసినను బౌరుషముల్ ఫలియించుటెల్ల నా
దరణమునం బ్రసన్నమగు దైవముచేతన చూనె ఫల్గునా!

గీ॥ కార్యఫలములయెడఁ దాన కర్తననుట, కడునెఱుంగమి చుమ్మీ తాఁ గర్తయేని
దగిలి తనదైన కార్యజాతంబు నెల్లఁ, జెడక ఫలియించునట్లుగాఁ జేయరాదె.

గీ॥ పౌరుషంబు దైవంబుతోడ్పాటులేక, ఫలము గలుగంగనేరదు పార్థివేంద్ర
విత్తు సహకారిగాకున్న రిత్తనేల, వంధ్యమగుఁగాక తాఫలవంతమగునె?

"దైవేన దేయమితి కాపురుషావదంతి, యత్నే కృతేయది నసిధ్యతికోత్ర దోషః."

క౦॥ దైవోపహతుఁడ శరణము, నీవే యొండెడకుఁబోవ ♦ నిశ్చయ మిది నా
దైవంబు నివర్తింపుము, కావున నన్నిపుడు పురుషకారముబలిమిన్. ౧౧౦౧

నేను దైవముచేఁ గొట్టఁబడినవాఁడను. నీవే నాకు రక్షకుఁడవు. నేను మఱి యొకరియొద్దకుఁ బోను. ఇది నానిశ్చయము. నాదైవమును బురుషప్రయత్నముచే మఱలింపుము.

రామాయణ ముపదేశించు ముఖ్యనీతులలో దైవమే పరముగాని పౌరుషము గాదనుటయుఁ బౌరుషముచే దైవము సాధింపఁబడదనుటయు నొకటై యున్నది. ఈవిషయము రామాయణమం దనేకస్థలములఁ జెప్పఁబడినది. కేవల పౌరుషము వ్యర్థమనుటకుఁ ద్రిశంకు చరిత్ర, రావణచరిత్ర దృష్టాంతములు. భారతమున దుర్యోధనుచరిత్ర యిట్టిది.

—॰ ౫౯ - వ సర్గము ॰—

కం॥ అని దీనోక్తుల వేఁడెడి,జనపతి సాక్షాన్నిషాదు ♦ సంయమి గని యి
ట్లనియెను మధురోక్తుల నా,యన! కడు మేలగుత నీకు ♦ నంచును మఱియున్. ౧౧౦౨

అని దీనాలాపము లాడుచున్న మాలవాఁడే యగు నారాజును జూచి ముని తియ్యనిమాటలచే నాయనా! నీకు మేలుగలుగును గాక - యని ధైర్యము చెప్పి మఱియు నిట్లనియెను.

చం॥ వెఱవకు మోయి తేఁడ శుభ♦వృత్తుఁడ వంచు నెఱింగినాఁడ, నీ
కోఱిక దీర్చువాఁడ, ముని♦కోటులనెల్లను బిల్వఁ బంతుఁ గ్ర
చ్చఱ సవనంబు సేయు, గురు♦శాపకృతం బగు నిట్టిరూపుతో
నఱిది దివంబుఁ జేర నిను ♦ నోడకు పుచ్చెదఁ గీర్తి దెచ్చెదన్. ౧౧౦౩

ఓయి రాజా! నీవు భయపడకుము. నీవు మంచినడవడిగలవాఁడ వని నే నెఱుంగుదును. నీకు మనస్సునఁగల కోఱిక నేను జక్కఁజేసెదను. యజ్ఞము చేయ శీఘ్రముగ మునీశ్వరులనందఱఁ బిలువఁబంచెదను. గురుశాపము తప్పింప సాధ్యపడదు. కావున శాపమువలన వచ్చిన యీరూపుతోనే దృఢముగా నిన్ను స్వర్గంబుఁ జేరఁ బంచెదను. భయపడకుము. నీకుఁ గీర్తి తెచ్చెదను.

కం॥ విస్తర మేలా నృప! విను, వాస్తవము వచింతు నింక ♦ స్వర్గము నీకున్
హస్తామలకం బనుచుఁ బ్రశస్తగుణా! తలఁతు నన్ను ♦ శరణముఁ గనుటన్. ౧౧౦౪

విస్తరము = ఎక్కువమాటలు.

తాత్పర్యము.

రాజా! ఎక్కువమాటలవలన నేమి ప్రయోజనము? సత్యముచెప్పెదను - వినుము. నన్ను నీవు శరణుచొచ్చినకారణమున నీకు స్వర్గ మఱచేతియుసిరికాయ యను కొమ్ము.

చం॥ అని వచియించి గాధిసుతుఁ ♦ డాత్మజులం గని యజ్ఞవస్తువు
ల్గనుఁగొనఁ జెప్పి శిష్యులబ♦లంగముఁ జూచి మదాజ్ఞఁ బెంపునన్
మునివరులన్ సశిష్యహితా♦ముఖ్యబహుశ్రుతఋత్విజంబుగా
ననయత నేఁ డెం డనుచు ♦ సత్వరులై పిలువుండు వెండియున్. ౧౧౦౫

అని చెప్పి విశ్వామిత్రుఁడు తనకుమారులఁ జూచి యజ్ఞమునకుఁ గావలసిన వస్తువులన్నియు నున్నవా యని చూడుఁ డని చెప్పి శిష్యసమూహముం జూచి నాయాజ్ఞాగౌరవముచే మునీశ్వరులందఱు శిష్యులతోడను ముఖ్యహితులతోడను బహుశ్రుతులతోడను ఋత్విజులతోడను సయముఁగా రమ్మని త్వరగాఁ బోయి పిలిచి రండు. అంతేగాక,

మ॥ ఎవఁ డే నాపలు కాదరింప కను నే♦మే దానిసర్వంబు మీ
రు వచింపం దగుఁ జుండు నా కనడు, వా♦రుల్ దేశదేశంబు లు
ద్గవడిం బోయి తదాజ్ఞఁ బిల్చిరి సమ♦స్తబ్రహ్మవాదీశులన్
సవముం జూడఁగ వచ్చి రెల్లరును వి♦శ్వామిత్రునాజ్ఞప్తిచేన్.	౧౧౦౬

సవము = యజ్ఞము. ఆజ్ఞప్తి = ఆనతి.

తాత్పర్యము.

ఎవఁడైనను నాపలు కాదరింపక యేమైన ననెనా యది యంతయు మీరు నాకుఁ జెప్పవలయును. అని యాజ్ఞాపింపఁగా వారందఱు దేశదేశంబులు త్వరగాఁ దిరిగి బ్రహ్మవాదులనందఱఁ బిలిచిరి. విశ్వామిత్రునియాజ్ఞప్రకారము (మనసు గలిగికాదు, శపించు నని భయపడి) అందఱు యజ్ఞమును జూడవచ్చిరి

ఉ॥ ఛాత్రులు నేగుదెంచి ముని♦సత్తమ! పిల్చితి మెల్లవారి, స
చ్ఛాత్రులు బ్రహ్మవాదు లిదె ♦ చయ్యన వచ్చిరి వేల్మిఁ జూడఁగా,
శ్రోత్రియుఁ డామహోదయుఁడు ♦ చూడఁగ రాఁ, డది యట్లు లుండ వై
ధాత్రిసుతాళి రోషవశ♦తన్ వచియించెను నిట్టు లుగ్గతిన్.	౧౧౦౭

ఛాత్రులు = శిష్యులు - గురునిదోషము దాఁచువా రని వ్యుత్పత్త్యర్థము. వైదాత్రి = బ్రహ్మకుమారుఁడైన వసిష్ఠునియొక్క, సుతాళి = కొడుకులవరుస, స + ఛాత్రులు = సచ్ఛాత్రులు, వేల్మి = యజ్ఞము.

తాత్పర్యము.

అంతట శిష్యులందఱు వచ్చి 'మునీంద్రా' యెల్లవారిని బిలిచితిమి. బ్రహ్మవాదులందఱు శిష్యులతోడ యజ్ఞమును జూచుటకై వచ్చిరి. శ్రోత్రియుఁడైన యా మహోదయుఁడు చూడరాలేదు. అదట్లు లుండ వసిష్ఠునికుమారులందఱు రోషమునకు వశులై గర్వించి యిట్లు లనిరి.

శా॥ చండాలుం డఁట దీక్షితుండు, మఱి వి♦శ్వామిత్రభూపాలుఁ డా
చండాలాధ్వరయాజకుం డఁట, బళే ♦ సద్బ్రాహ్మణాగ్రేసరుల్
చండాలాన్న మ దెట్లు తిందురో? సురల్ ♦ సంప్రీతిమై వత్తురో?
చండాలుం డెటు స్వర్గ మేగెడినో? యా♦స్వర్గం బహో యెట్టిదో?	౧౧౦౮

యజ్ఞము చేయువాఁడు చండాలుఁడఁట. చండాలయజ్ఞమునకు యాజకుఁడు విశ్వామిత్త్రుఁ డను రాజఁట (ఇప్పటికిఁకను విశ్వామిత్త్రుఁడు రాజర్షియే మహర్షియుఁ గాఁడు) ఔరా! మంచి బ్రాహ్మణశ్రేష్ఠు లందఱు చండాలునియన్న మెట్లు తిందురో? ఎట్లు దేవతలు సంతోషముతో వత్తురో? చండాలుఁడు స్వర్గమున కెట్లు పోవునో? చండాలుఁడు పోవుస్వర్గ మదెట్టి స్వర్గమో?'

చండాలునకు యజ్ఞముచేయునధికారములేదు క్షత్త్రియునకు యజ్ఞము చేయించు నధికారములేదు కావున వా రాక్షేపించిరి.

శ్లో॥ చండాలాన్నం ద్విజో భుక్త్వా సమ్యక్చాంద్రాయణం చరేత్
బుద్ధిపూర్వేతు కృచ్ఛ్రాబ్దం పునస్సంస్కార మర్హతి

ద్విజుఁడు ప్రమాదమునఁ జండాలాన్నముఁ దినవేసి చక్కఁగఁ జాంద్రాయణవ్రతము జరుపవలెను. తెలిసి తినెనా సంవత్సరకృచ్ఛ్రము పునరుపనయనము తగును. "బ్రాహ్మణో ఋత్విజః"- బోధాయనుఁడు. "క్రిర్వధితయా బ్రాహ్మణానామేవార్త్విజ్యమ్"-గౌతముఁడు. ఇత్యాదివాక్యములు బ్రాహ్మణేతరుఁడు యాజనమున కధికారి గాఁడని తెలుపుచున్నవి.

కర్త చండాలుఁ డగుటచే బ్రాహ్మణులైనను అయాజ్యయజనము కర్తవ్యము గాదని తెలిపెడిని. దీని కనేకప్రమాణవచనములు గలవు

"త్రయో ధర్మాని వర్తంతే। బ్రాహ్మణాత్ క్షత్త్రియం ప్రతి।అధ్యాపనం యాజనంచ। తృతీయశ్చ ప్రతిగ్రహః"-మనువు.

క౦॥ అనుచు మహోదయుఁడాదిగ, మునివర! వాసిష్ఠు లనిరి ♦ ముసకొని యనఁ దాఁ
గనుఁగవ నిప్పులు రాలఁగఁ, గనుఁగొని యటనున్న వారి ♦ గాధిజుఁ డనియెన్ ౧౧౦౯

అని మహోదయుఁడు మొదలుగాఁగల వసిష్ఠకుమారులు పలికిరని చెప్పఁగా రెండుకన్నులఁ గోపముచే నిప్పులురాలఁగా నచ్చట నున్నవారినిఁ జూచి విశ్వామిత్త్రుఁ డిట్లనెను.

చం॥ నిరతతపస్సమాధిపరి♦నిష్ఠితు ధర్మరతున్ ననున్ మహా
దురితము లాడి తిట్టు కుమ♦తుల్ మసిగాఁగలవారు వెంటనే,
నిరయముఁ బొంది కాలభట♦నిష్ఠురపాశవశాత్ములై ధరం
బొరయుదు రేడునూర్లభవ♦ముల్ శవభక్షకులౌచు, నాపయిన్. ౧౧౧౦

నిరతతపస్సమాధిపరినిష్ఠితున్ = విశేషప్రీతితోఁ బరమాత్మధ్యానమందే దృఢముగానుండు వానిని, మహాదురితములు = మిక్కిలి పాపపుమాటలు, తిట్టు = శపించు.

౧౧౦౮ వ పద్యములోనివాక్యము లున్నవా స్తవార్థములేకాని తిట్లు కావు. 'మృషావాదే భవేద్దోష, సత్యే దోషో నవిద్యతే' ఇది నారదవచనము. భార. అను. ౨క అధ్యాయము. దొంగను దొంగ యనుటదోషముగాదు. దొంగ గానివానిని దొంగ యనుట దోషము. అకారణమేమైనచో విశ్వామిత్రుఁడు వసిష్ఠకుమారులఁ శపింపఁ గారణము లేదు. కాని వారు కుక్కమాంసము తినువానిచే యజ్ఞముచేయించుచున్నాఁడు కావున విశ్వామిత్రుఁడును కుక్కమాంసము తినును గాక యని శపించి నట్టును, పిరువాత నింద్రుని గూర్చి తపస్సుచేసి యాశాపమునుండి తన్నుఁ దప్పింపు మని కోరినట్టును, పిమ్మట నొక ఘోరదుర్భిక్షమందు నాహారము దొరకక యొకమాలవాడలో నారఁబెట్టిన కుక్కమాంసమును దొంగిలించి తినఁబోఁగా నింద్రుఁడు దానిని హరించినట్టును భారతంబునఁ గలదు.

తాత్పర్యము.

విశేషప్రతితో నాత్మధ్యానమందే విశేషించి దృఢముగా నుండు ధర్మాసక్తుఁడైన నన్ను మిగుల పాపపుఁ బలుకులు పలికి దూషించిన చెడుబుద్ధిగలవారు వెంటనే మసి గాఁగలవారు. ఇట్లు చచ్చి నరకమునకుఁ బోయి యమభటుల కఠినపాశములకు వశపడినదేహులై మరల నేడునూర్లజన్మములను పీనుగులను దినువారగుదురు. ఆమీఁద

తే॥ కుక్కమాంసంబుఁ దినుచును ♦ దిక్కుమాలి, నెనరు మదిలేక దుర్జాతి♦నీచులగుచు
వికృతవేషంబుతోడుత ♦ వీరలెల్ల, భూమిఁ దిరుగంగఁ గలవార♦పూజ్యులగుచు. ౧౧౧౧

కుక్కమాంసంబుఁదినుచు దిక్కులేక దయలేనివారై దుర్జాతులయు - నీచచరిత్రులయు వికారవేషములతో భూమిమీఁద వీరందఱు నపూజ్యులై తిరుగుచుండఁ గలరు.

శ్వపచులు వసిష్ఠగోత్రమువా రనుట కిది కారణము కాఁబోలు.

ఆ॥ తిట్టరానినన్నుఁ ♦ దిట్టినయామహో, దయుఁడు బోయ యగుచు ♦ ధరణిఁదిరిగి
యాత్మహత్యబలిమి ♦ నరిగి దుర్గతి కందుఁ, గూలువాఁడు నాదు♦కోపమునను. ౧౧౧౨

తిట్టరాని నన్నుఁ దిట్టినమహోదయుఁడు బోయవాఁడై భూమిమీఁదఁ దిరిగి కడపట నాత్మహత్య చేసికొని నా కోపము కారణముగ దుర్గతులలోఁ గూలఁగలఁడు.

తామసులతప స్స్వభావానికి విని యోగపడును.

౬౦ - వ సర్గము

క౦॥ ఈగతి శపించి మునివర,పూగంబును గాంచి గాధిపుత్త్రుండు మహా
భాగుఁ డితండు త్రిశంకుఁడు, త్యాగియు నిక్ష్వాకుకులుఁడు ♦ ధర్మాత్ముండున్. ౧౧౧౩

పూగము = సమూహము.

తాత్పర్యము.

ఈ విధముగ వారిని శపించి గాధినందనుఁడు మునులసమూహమును జూచి త్రిశంకుని జూపి 'యితఁ డిక్ష్వాకువంశపురాజు. త్రిశంకుఁ డను పేరుగల ధర్మాత్ముఁడు. దాత. మహాభాగ్యసంపన్నుఁడు.

ఉ॥ ఈమెయితోడ స్వర్గమున ♦ కేగ మదిం దలపెట్టి వచ్చి న
న్నీమెయిఁ బ్రాపుగోరె, నిఁక ♦ నెల్లర మయ్యది దేన సాధ్య మా
నామహితాధ్వరంబును బ్ర♦యత్నము సేయుద మన్న నాత్మలో
నామును లెల్ల గాధిసుతుఁ ♦ డాగ్రహశీలుఁడు వహ్నికల్పుఁడున్. ౧౧౧౪

తాత్పర్యము.

ఈ దేహముతోడనే స్వర్గమునకుఁ బోవఁదలఁచి నాసాహాయ్యముఁగోరెను. కావున మన మందఱము కలిసి యే యజ్ఞముచే నీతనికోర్కి నెఱవేఱునో యా యజ్ఞమును చేయుదము. అని చెప్పఁగా నామునీంద్రులందఱు తమలో నిట్లు లాలోచించిరి.

ఉ॥ మాఱు వచించిన స్మనల ♦ మాడ్చు శపించి యి దేటిపీడ యీ
మోఱకుఁ డెద్ది చెప్పె మన♦ముం దగ దాని న లెస్స యన్న నీ
దే రెడిఁగాక భూధవుని♦యిచ్ఛయ మౌనిమహానుభావతన్,
జాఱని నిండు హెచ్చరిక ♦ సర్వము దీర్తుమ టంచు నెంచుచున్. ౧౧౧౫

విశ్వామిత్త్రుఁడు పరమకోపి. నిప్పువంటివాఁడు. మనము కాదంటిమా మనలను శపించి మాడ్చును. ఈపీడ మన కేల? హితము చెప్పనేల? తిట్టు దిన నేల? కావున నీమూర్ఖుఁ డేమి చెప్పునో దానినే మనము సరిసరి యనుచునుండిన యజ్ఞమువలనఁగాకపోయినను ఈయన మహిమచేనైన రాజుకోరిక నెఱవేఱును. మన కేమి నష్టి? కావున నిండుహెచ్చరికతోఁ గార్యము నిర్వహింతము.

'దుష్టస్సర్వత్ర పూజ్యతే' యను సూక్తి స్మరణీయము, సాధులు సాధువును బూజింతురు. దుష్టుఁడు సర్వత్ర పూజింపఁబడును.

ఉ॥ యాజకుఁడైన కౌశికుఁడు ♦ యాగమునంతయుఁ దీర్ప, వారుఁ జే
రోజను వారివారిపను ♦ లొక్కటి దప్పక చేయ, నాత్మభూ
తేజుఁడు భాగము ల్గొనఁగ ♦ దేవతలం బిలువంగ, వారు రా
మోజపశీల! యన్న, ముని♦యుం బటురోషకషాయితాక్షుఁడై. ౧౧౧౬

విశ్వామిత్రుఁడు యాజకుఁడై యాగము నిర్వహించుచుండఁగా మునులు వారివారికి నియమించిన పనులను వారు వారు (ఎవ రేమి లోపముచేసిన నీవల నఁ గ్రతువు చెడెనని నెపముపెట్టి తిట్టునోయని భయముచే) హెచ్చరికతో నిర్వహించుచుండిరి. ఇట్లు యజ్ఞముసాగ బ్రహ్మతేజుఁడైన విశ్వామిత్రుఁడు వారి వారి హవిర్భాగములు వారు వారు తీసికొనుటకై దేవతలను బిలిచిన మేము రా మనిరి. దానిపై నీయనకోపముచేఁ గన్నులెఱ్ఱచేసె

దీనివలన కర్త, ఋత్విజుఁడు, ధనము శుద్ధమైనఁగాని దేవతలు సంతోషింప రని యేర్పడు చున్నది.

“సుశుద్ధై ర్యజమానైశ్చ, ఋత్విగ్భిశ్చ తథావిధః, శుద్ధై ర్ద్రవ్యోపకరణై, ర్యష్టవ్య మితి నిశ్చయః. తథావిధేషు యజ్ఞేషు దేవానాం తోషణం భవేత్ । తుష్టేషు దేవసంఘేషు యజ్ఞే యజ్ఞఫలం లభేత్.” భార॥ అన॥

—* విశ్వామిత్రుఁడు త్రిశంకుని స్వర్గంబున కనుచుట *—

చం॥ స్రువమును జేత నెత్తుకొని ♦ చూడు నృపా! క్రతువట్లు లుండ నీ
యవితథమత్సమార్జితత♦పోధికవీర్యము పెంపుచేత నే
దివికిని మేనితోడ నినుఁ ♦ దెప్పునఁ బంచెద నంచుఁ బల్కి యా
యవనిపుఁ గాంచి వెండి యిటు ♦ లాడు, దపోవిభవాభిరాముఁడై. ౧౧౧౭

తే॥ ఏ గడించుతపఃఫలం ♦ బించుకంత, నింకయును గల దటుగాన ♦ నేరికైన
మేనితోఁబోవరానిస్వ♦ర్గస్థానమునకుఁ, జగము మెయితోడ నాతప♦శ్శక్తి జేఁడ!
౧౧౧౮

స్రువము = కొయ్యగరిఁట.

తాత్పర్యము.

స్రువమును చేతఁ దీసికొని త్రిశంకునిఁ జూచి ‘రాజా! యజ్ఞమట్టులుండనీ. దానివలనఁ బ్రయోజనములేదు. వ్యర్థము గానట్టిదియు నాచే సంపాదింపఁబడి నట్టిదియు నగు నా తపశ్శక్తిచేతనే స్వర్గమునకు నిన్ను దేహముతోఁ బంపె దను’ అని చెప్పి తపోబలసంపదచే నొప్పు విశ్వామిత్రుఁడు నేను సంపాదించిన తపఃఫలము వాసిష్ఠాదుల శపించుటచే వ్యయమైనది గాక యింకను గొంచెము

కలదు. దానిబలముచే నెవ్వరికైనను దేహముతోఁబోవరానిస్వర్గమునకు నీవు పొమ్ము.'

విశ్వామిత్రుఁ డీ కార్యమును బూనుటకు ముఖ్యహేతువు వసిష్ఠునందలి స్పర్ధయే. దానిచేఁ దపస్సు వ్యయమయ్యెను. కావున గొప్పవారివిషయమున స్పర్థపూనువాఁడు చెడు నని యేర్పడుచున్నది.

కం॥ అని గాధిపుత్త్రుఁ డాడినఁ, గనుచుండఁగ నెల్లమునులు ♦ క్ష్మానాథుండున్
జనె నుగ్గమించి మెయితో, వనజాక్షా! విబుధనగరి♦వంకకు నాయున్." ౧౧౯

అని విశ్వామిత్రుఁడు చెప్పఁగానే ఋషులందఱుఁ జూచుచుండఁగ నా రాజెగిసి యాకాశమార్గమున సురపురముఁ జేఁబోయెను.

కం॥ సురనికురుంబయుతంబుగ, హరిహయుఁ డానృపునిఁ గాంచి ♦ యనియెఁ 'క్షితీశా!
సురలోకమునం దిదివు, లిరవుగొనం దగవు ధరణి ♦ కేగుము మరలన్. ౧౨౦

అప్పుడు దేవతాసమూహముతోఁ గూడినవాఁడై యింద్రుఁడు త్రిశంకును జూచి స్వర్గమున నీ వుండఁదగవు. మరల భూలోకమునకుఁ బొమ్ము

మ॥ గురుశాపోపహతాత్మ! బాలిశ! త్రిశం♦కూ! నీకునన్ స్వర్గమా?
ధరణి న్వ్రేలఁ దలక్రిందుగాఁ బడు' మనన్ ♦ ధాత్త్రీశుఁడుం గూలుచున్
గురుతేజా! ననుఁ గావవే యనుచు నా♦క్రోశింప, గాధేయుఁ డా
పరమార్తధ్వని నాలకించి పలికె♦ వసూన్ఛా త్రిభూపాలుతోన్. ౧౨౧

గురుశాపముచేఁ గొట్టఁబడినవాఁడా! మూఢుఁడా నీకుఁగూడ స్వర్గమా? పలోఁపములేనిమానవునకే దేహముతోడ స్వర్గప్రాప్తి లేదే. ఇఁక నీకా స్వర్గవాసము! తలక్రిందుగా భూమిమీఁద దొరలు మనఁగా రాజు పడుచు 'గొప్ప తేజస్సుగలవాఁడా! రక్షింపుము. రక్షింపుము. నాగతి యిట్లయ్యె' నని దుఃఖించుచు నఱవఁగా నాదీనాలాపము విని విశ్వామిత్త్రుఁడు తీవ్రకోపముచే విజృంభించి రాజుతో నిట్లనియె.

దీనివలన గురుశాపహతుఁడు రెండులోకములఁ జెడు నని సూచన.

సీ॥ నిలునిలు మం చంద♦నిలిపి యాతని సప్త,ఋషులను జుక్కల ♦ సృష్టి చేసి
దక్షిణదిక్కున ♦ దాఁకురోషంబున, నింద్రు నొక్కని నేను ♦ సృష్టి యొండె
సలిపెదఁ గానిచోఁ ♦ గలుగ కుండెడిఁగాక, యింద్రుఁ డం చమరుల♦సృష్టిచేయ
గమకింప దేవసం♦ఘములు మానులు వచ్చి, ప్రార్థించి రిట్లు లో♦భవ్యతేజ!
తే॥ మహిపుఁ డీతఁడు గురుశాప♦నిహతుఁ డయ్యె, నర్హమే వీనిస్వర్గంబు♦నందు నుంప
మేనితోడఁ దపోధనా! ♦ దీని నీవ, మదిని దలపోసి మానుము ♦ మచ్ఛరంబు.
౧౨౨

రాజా! యందే నిలునిలుము, పడకు మనితనశక్తిచే నిలిపి, తీవ్రమైన కోపముచే దక్షిణదిక్కునందు సప్తర్షులను నక్షత్రములను గొన్నిఁటిని సృష్టించి యిదిగో నేను వేఱొక్క యింద్రునిఁగూడ సృష్టించెదను అట్లుగాదేని లోకమున నింద్రుఁడే లేకపోవుఁగాక యని దేవతలను సృష్టింప యత్నింపఁగా దేవతలు మునులు వచ్చి ప్రార్థించి యిట్లనిరి. 'భగవంతా! నీ తేజము లోకమునకుపకారకముగ నుపయోగింపవలయును గాని యిట్లు చేయవచ్చునా? ఈ రాజు గురుశాపముచే నిహతుఁడయ్యెను ఇట్టి వానిని స్వర్గమునం దుంచఁగలనా? నీవే యొకరి నిట్లు శపించితివి గనకో. వానిని యింకొకఋషి యిట్లులే చేయఁబూనిన నేమిగతి? అప్పుడు నీవే మందువు? స్వర్గము మాలిపోయి పోవలయునా? దానివలన శాస్త్రములన్నియు ధ్వంసముకావలయునా? నీవు చేయఁదలఁచినకార్య మిదియా? కావున నీవు మచ్చరము మాని మచ్చరముచేఁ జేయరానిపని చేయ సాహసింపకుము రాజర్షిమాత్రుఁడవు నీవే యిట్టి యకార్యమునకుఁ బూనిన మహర్షులు బ్రహ్మర్షులున్నారే, వారెంతకార్యము చేయలేరు! వారు శాస్త్రమర్యాద మీఱలేక యూరకున్నారని తలఁచితివా? కావున నీ కార్యము నీకుఁ దగినది కాదు శాస్త్రమర్యాద నుల్లంఘింపకుము.

సీ॥ అనిన వారలఁ జూచి ♦ యనియె గాధేయుఁడు, పృథివీశు నీతని ♦ త్రిదివమునను
నిలిపెద నని పల్కి ♦ నే నెన్న దప్పుదు, నైన నొక్కటిచేయ♦రయ్య మీర
లీజగంతంబు ♦ తేజరిల్లెడు నాదు, తారాగణంబున ♦ దైవతాళి
యున్న యాఁగావృత ♦ మమరు నియ్యవి యెల్ల, శాశ్వతం బగుచు వై♦శ్వానరాధ్వ
తే॥ మునకు వెలిగాఁగ నో మునిముఖ్యు లెలుచు, నా త్రిశంకుఁడు తలక్రిందు♦నగుచు నతని
ననుసరించెడి నక్షత్ర ♦ యమలకీర్తి, నాకమునఁబోలె సౌఖ్యంబు ♦ లందు నందు

౧౭-౨౩

ఇట్లు చెప్పుచున్న దేవతలను మునులను జూచి విశ్వామిత్రుఁ డీ రాజును నేను స్వర్గమున నిలిపెద నని చెప్పి యెట్లు తప్పుదును. కావున నాపూన్కి నెఱవేఱున ట్లొక్క యుపాయము చెప్పెదను. నేను సృష్టించిన నక్షత్రము లీ జగ ముండు వఱకు నుండనిండు. వానిని మీరు ధ్వంసము చేయవలదు. అనిన వారు దాని కియ్యకొని, యివి యిట్టులే సుప్రసిద్ధజ్యోతిర్మార్గమునకు వెలిగాఁగ శాశ్వతముగా నిలువనిమ్ము. త్రిశంకుఁడు తలక్రిందుగా నతని ననుసరించి యీనక్షత్రము లుండనిమ్ము. స్వర్గము నందువలె నందే యతఁడు సుఖపడ నిమ్ము. అని చెప్పిరి.

శ్లో॥ యద్దురాపం దురామ్నాయం, దురాధర్షం దురన్వయమ్
తత్సర్వం తపసా సాధ్యం, తపోహి దురతిక్రమమ్.-భార-౧౪-౫౧-౧౭.

రాజర్షియగు విశ్వామిత్రుఁడే సృష్టికిఁ బ్రతిసృష్టిచేయఁగలిగినపుడు తపస్సున కేది యసాధ్యము.

క॥ అన విని వశ్లే యనుచును, మునివరుఁ డనఁ జనిరి సురలు ♦ మునులును స్వేచ్ఛన్
జని రాయజ్ఞము ముగియుడు, మునివరులును దమనివాస♦ములకుం బ్రీతిన్. ౧౧-౨౪

దానిని విశ్వామిత్రుఁ డంగీకరించెను. తమయిచ్ఛానుసారముగ దేవతలు మునులు పోయిరి. యజ్ఞమునకు వచ్చినమును లది యట్లు ముగియఁగానే వారివారి స్థానములకు వారు వారు పోయిరి.

దీనిచేఁ దపస్సున కసాధ్యమైనది లే దనియేర్పడుచున్నది.

౬౧-వ సర్గము.

ఉ॥ అందఱు వోవ నావనము♦నందలి మౌనులఁ జూచి విఘ్నముల్
పొందఁగఁ గల్గె నీయెడఁ ద♦పోగరిమంబున, కింక వేఱుది
క్కుం దగఁ జేరి చల్పుదమె ♦ ఘోరతపంబు? విశాలసద్వనీ
సుందర మల్లపశ్చిమము ♦ సొంపునఁ బెం పగుఁ బుష్కరం బటన్. ౧౧-౨౫

ఇట్లందఱు వెడలిపోవఁగా నావనమునందున్న మునులఁ జూచి విశ్వామిత్రుఁడు నా కీవనమునందు గొప్పతపస్సుచేయుటకు విఘ్నములు కలిగెను. కావున నిఁక మఱియొకదిక్కునకుఁ బోయి తీవ్రతపము చేయుదమా? పడమటిదిక్కు విశాలమైన మంచివనములచే నలంకరించియున్నది అందే పుష్కరమును గలదు.

ఉ॥ అచ్చటి కేగి యందఱ మ♦నంతతపం బొనరింప సిద్ధి యౌఁ
జెచ్చెర రండటంచుఁ జని ♦ చేసె భయంకర మౌ తపంబు, పెం
పెచ్చ ఫలాశనుం డయి య♦హీనగతిన్ దృఢనిశ్చయంబునన్
సచ్చరితా! మహామహుఁ డ♦నన్యవిచింత్యమహిష్ఠనిష్ఠలన్. ౧౧-౨౬

అక్కడఁ దీవ్రమైన తపస్సుచేసినఁ దపస్సిద్ధి గలుగును. త్వరగాఁ బోదము రండని యచటికిఁ బోయి యచట భయంకరమైన తపము ఫలములుమాత్ర మాహారముగాఁ గొని తపస్సిద్ధియైనఁ గావలయును, మరణమైన రావలయు నని నిశ్చయించుకొని యుత్కృష్టమార్గంబున నితరులకుఁ జింతించుటకైన సాధ్యముగాని మిక్కిలిగొప్పవై కఠినమైన నిష్ఠలఁ బూని తపముచేయ నారంభించెను.

మ॥ అతఁ డీరీతిఁ దపంబు సేయఁగ నయో♦ధ్యాధీశ్వరుం డార్యసం
స్తుతభాషుండు తపోవిశేషుఁడు నరో♦షుం డుత్తమన్యాయని
ర్జితదోషుండు గుణైకభూషుఁడు ధరి♦త్రీపాంబరీషుండు ప్రీ
ణితశేషుం డగునంబరీషుఁ డటఁ బూ♦నెన్ వేలిమిం జల్పఁగన్. ౧౧-౨౭

ఆర్యసంస్తుతభాషుఁడు = పెద్దలు పొగడునట్లు మాటలాడువాఁడు, అరోషుఁడు = క్రోధములేనివాఁడు దుర్వాసుఁడు తనకుఁ గీడుచేయఁబూనినను బదులుకీడు చేయనెంచలేదుగదా! ఉద్యమన్యాయనిర్జితదోషుండు = శ్రేష్ఠమైన న్యాయమార్గమున జయించిన పాపములుగలవాఁడు, గుణైకభూషుఁడు = గుణములే ముఖ్యములైన యాభరణములుగాఁ గలవాఁడు, నరశ్రేష్ఠాంబరీషుఁడు = రాజమార్తాండుఁడు లేక రాజేశ్వరుఁడు, 'శ్రేష్ఠే భూపభేదే శంభా వాక్ప్రాశకే రవౌ'-నానా. ప్రీణితశేషుండు = సంతోషపెట్టఁబడిన విష్ణువుగలవాఁడు. 'శేషో నంత హరిః'- నానా. వేలిమి = యజ్ఞము.

తాత్పర్యము.

ఇట్లు విశ్వామిత్రుఁడు తపముచేయుచుండుసమయమందే యయోధ్యయందు పెద్దలు మెచ్చునట్లు మాటలాటవేర్చినవాఁడును, క్రోధమును జయించినవాఁడును, శ్రేష్ఠమైన న్యాయమార్గమున దోషములు జయించినవాఁడును, సద్గుణములే భూషణములుగాఁ గలవాఁడును, రాజశ్రేష్ఠుఁడు నగు నంబరీషుఁ డనురాజు రాజ్యము సేయుచుండి యొకయాగముఁ జేయఁబూనెను.

(చూ ప ౯౬౭) మనువుకుమారుఁడైన నభగునకు నాభాగుఁడు జనించెను. అతనికుమారుఁడు అంబరీషుఁడు.

కం॥ ఆ జన్నపుఁబశువును సుర, రాజు కరే ప్రుచ్చిలింప ♦ రాజుఁ డిప్రుం డోజ చెడ నీవు గాచెడి, యాజంతువు పోయె, నిట్టి ♦ యలసత దగునే? ౧౧౭౮

అట్లాయన యజ్ఞముచేయునప్పు డింద్రుఁడు యజ్ఞపశువును దొంగిలించెను. ఆ ఋత్విజుఁడు రాజును జూచి నీవు రక్షించుచున్న యజ్ఞపశువు పోయెను. ఇట్టి మాంద్యము తగునా?

కం॥ క్రతుపశువు పోయె నేనియు, క్షితిపా! తత్పశువుఁ గావు ♦ సేయనిరాజున్ హతుఁ జేయును దద్దోషము, మతి మఱ పగునయ్య యిట్టి♦మహితార్థములన్? ౧౧౭౯

యజ్ఞపశువుపోయెనా యా యజ్ఞపశువును గాచురాజు నా దోషము చంపును. కావున నిట్టికార్యములం దింత మఱుపు దగునా?

ఉ॥ నీమఱ పింత చేసె ధర♦ణీధవ! పోయినయట్టిదానిఁ గా
నీ, మఱి యద్ది దుర్లభమ ♦ యేని మఖార్థముగా మనుష్యుఁగా
నీ, మొగిఁ దెమ్ము వేగ మన ♦ నిర్జరతుల్యుఁడు పల్లెపల్లెయు
గ్రామముగ్రామమున్ వనవ♦నంబును బట్టనపట్టనంబునన్. ౧౧౮౦ *

ని మఱపింత చేసెను. పోయిన పశువునైనఁ దెమ్ము. అది దొరకదాయెనా యజ్ఞము నిమిత్తమై మనుష్యునిఁగానీ వేగముగఁ దెమ్ము. అనఁగా దేవసముఁడైన యారాజు యజ్ఞపశువునిమిత్తమై యూరూరు పల్లెపల్లె వనవనము పట్టన పట్టనము వెదుక నారంభించెను.

కం॥ రోయంగఁ దొడఁగి స్వయముగ, నేయెడ నెవఁ డేని దొరకఁ◆డే తాఁ బశువై
యీ యజ్ఞముఁ దీర్పఁగ నని, రేయును బవ లనక తిరిగె ◆ నృపతిలకుండున్. ౧౧౩౦

ఏస్థలమందైన నెవఁడైనఁ దాను బశువై యజ్ఞము సాంతముచేయించువాఁ డొకఁడు దొరకకపోవునా యని రాత్రియనక పవలనక తానే స్వయముగ వెదక నారంభించెను.

శునశ్శేపోపాఖ్యానము

ఉ॥ పాలితధర్ముఁ డైననర◆పాలకుఁ డీగతి సంచరించుచో
నాలుగు బిడ్డలుం గలమ◆హాత్ము ఋచీకునిఁ గాంచి మ్రొక్కి నీ
కాలను నూఱు వే లిడుదు ◆ నయ్య, యొసంగుచుఁ బుత్త్రు జన్నముం
బాలన సేయు, మంచు బతి◆మాలుచు వెండియుఁ బల్కు మానికిన్. ౧౧౩౨

ఇల్లు తిరుగుచు ధర్మపరిపాలకుఁ డౌటచే నారాజు బలాత్కారముగ నెవనిని బీడింపక తానే నిండుమనస్సుతో నెవఁడైన వచ్చునా యని వెదకుచుఁ దిరుగు చుండునెడ నొకచోట భార్యయు బిడ్డలుగల ఋచీకుఁడను మునిని జూచి (యీ ఋచీకుఁడే విశ్వామిత్రునితోఁడఁబుట్టినదాని మగఁడు) నమస్కరించి యయ్యా! నీకొక లక్షయావుల నిచ్చెదను. నీ కొడుకులలో నొకని నిచ్చి యజ్ఞము రక్షింపుము - అని బతిమాలి మఱియిట్లనియె.

కం॥ కాలీచపడఁగఁ దిరిగితిఁ, జాలఁగ దేశములు నెందు ◆ జన్నపుమెకముఁ
జాలన కన సవపశువుగ, బాలకు నా కమ్ము మాత్మ◆భవు లం దొకనిన్. ౧౧౩౩

పోయిన యజ్ఞపశువు దొరకునేమో యని కాలీచపడునట్లు దేశమంతయుఁ దిరిగితిని. ఎక్కడ లభించినది కాదు. దానిబదులు మనుష్యునే యుంచవలసి వచ్చినది. నీకు ముగ్గురుకుమారు లున్నవారు కదా! వారిలో నొకని నా కమ్ముము.

తే॥ అనిన నీ వేమియిచ్చిన ◆ నధిప! యీయఁ, బ్రేమభాజన మైననా◆పెద్దకొడుకు
ననిన నృపుఁజూచి యనియె ని◆ట్లతనిభార్య, వినితివే రాజ! భార్గవుఁ◆డనినపలుకు. ౧౧౩౪

అనిన ఋచీకుఁడు నీ వేమి యిచ్చినను నా ప్రేమకుఁ బాత్రుఁడౌటచే నా పెద్దకొడుకు నీయ నని చెప్పెను. ఆ మాట విని యాయనభార్య రాజా! యీయన చెప్పినమాట వింటివికదా!

కం॥ తన పెద్దకొడుకు నీఁ డఁట, శునకుం డస్మత్కనిష్ఠ♦సుతుఁ డాతని మే
కొనఁజాల, నమ్మనీకును, జననికిఁ గడగొట్టుకొడుకు ♦ సమ్మతుఁ డధిపా! ౧౧౩౫

తనకుఁ బ్రేమపాత్రుఁడు కావునఁ బెద్దవాని నీయఁడఁట. శునకుఁడనువాఁడు నా కడపటికొడుకు. తల్లికిఁ గడపటికొడుకు మిక్కిలి యిష్టుఁడు, కావున నతని నేను విక్రయింపను, అనెను.

తే॥ ప్రాయికమ్ముగ జగమున ♦ రాజవర్య!, పెద్దవానిపైఁ దండ్రికిఁ ♦ బ్రేమ మెండు
పిన్నవానిపైఁ దల్లికిఁ ♦ బ్రీతి గానఁ, గుఱ్ఱవానిని రక్షించు♦కొనుదు ననుఁడు. ౧౧౩౬

రాజా! లోకమునందు సామాన్యముగఁ బెద్దవానిపైఁ దండ్రికిఁ బ్రీతి, పిన్నవానిపైఁ దల్లికిఁ బ్రీతి. కావున నా కొడుకును నేను రక్షించుకొనెదను.

దీనివలన నడిమికొడుకుపైఁ దల్లిదండ్రుల కిరువురకుఁ బ్రీతియుండదనుట స్పష్టము. ఈగ్రంథకర్తతల్లి మరణసమయమందు (కడపలో) పెద్దకొడుకు సమీపమం దుండెను. ఈగ్రంథకర్త చెన్నపురియం దుండెను. మూఁడవకొడుకు బద్వేలియం దుండెను. అట్టి యంత్యదశయందుఁ బెద్దకొడు కమ్మా సుబ్బన్నను బిలిపింతునా యని యడిగెనఁట. వాఁ డేల రంగని బిలిపింపు మని యామె యనెనఁట.

కం॥ జనకునిపలుకుల నాపయి, జననీవాక్యములను విని ♦ జనపతిని గనం
గొనుచు శునశ్శేపుం డను, తనయుఁడు మధ్యముఁడు కడు ను♦దారత ననియెన్. ౧౧౩౭

మొదటఁ దండ్రి చెప్పినమాటలు ఆవలఁ దల్లి చెప్పినమాటలు విని వారి భావము గ్రహించి, యిరువురకుఁ బనికిరానివాఁడను, నడిమివాఁడను నేనేకదా! ఇఁక నే నిక్కడనుండిన నేమి? ఎక్కడనుండిననేమి? ఎక్కడను లేకుండిననేమి? నాప్రాణ మిచ్చి రాజుయజ్ఞమైన రక్షించెదను - అనితలఁచి శునశ్శేపుఁడనువాఁడు డుదారబుద్ధితో రాజున కిట్లనియె.

తే॥ తండ్రియొల్లఁడు తనజ్యేష్ఠ♦తనయు నమ్మఁ, దల్లియొల్లదు తనపిన్న♦తనయు నమ్మ
వారియిరువురిమాటల♦వలను చూడ, మధ్యముని నన్ను నమ్మంగ ♦ మనసుగలరు. ౧౧౩౮

కలరు = కలవారు.

తాత్పర్యము.

రాజా! తండ్రి పెద్దకుమారు నమ్ముట కిష్టపడలేదు. తల్లి చిన్నకుమారు విక్రయింప సమ్మతింపలేదు. వారిరువురిమాటలజడ చూచిన నిరువురకు నన్ను విక్రయింప నిష్టముకలదు.

దీనివలన గొప్పఋషీశ్వరులకును గామములోభము నజయ్యములని సూచన.

మ॥ఇదె నే వచ్చెద మానవేంద్ర! కొనిపొమ్మిమ్ము యిమ్ము నీనూఱువేల్
కదుపుల్ దండ్రికి నంచు నన్న నిడి భూకాంతుండు నైశింబ తా
ముద మారగ మునిపుత్రు ధర్మరతుఁ గొంపోవంగ మార్గంబున
గ్గదియం బుష్కరమందు నిల్చె నడిమింట వ్వేవెలుం గొప్పఁగన్. ౧౧౩౯

వేవెలుఁగు = సూర్యుఁడు - సహస్రకిరణుఁడు.

తాత్పర్యము.

కావున రాజా! నేను వచ్చెదను. కొనిపొమ్ము. నీ విచ్చెదనని చెప్పిన నూఱువేల యావులను నాతండ్రికిమ్ము - అని చెప్పఁగా రాజాప్రకారమే యిచ్చి యాలస్యములేక తుదకు లభించెఁగదా, యజ్ఞము సాంతమగునుగదా యని సంతోషించి ధర్మప్రీతిగలయాకుమారునిఁ దోడుకొనిపోవుచు మార్గమధ్యమున మధ్యాహ్నవేళఁ బుష్కరతీరమందు నిలిచెను.

(పుష్కరము = తీర్థము లక్షణచే 'గంగాయాం ఘోష' యన్నట్లు పుష్కరతీరమని యర్థము చెప్పవలెను.)

"అత్ర గాథాం యమే గీతాం । కీర్తయంతి పురా విదః । యథాన్యోపి నవిక్రేయః కింపునః పురుష ప్రజాః । యోమనుష్యో మనుష్యస్య విక్రయా ద్ధనమిచ్ఛతి । తస్యమూత్రం పురీషంచ స పరత్రోపి జీవతి."

ఈ మనువాక్యము చొప్పున మగబిడ్డల నమ్మరాదనియు నేమనుష్యుఁడు మనుష్యుల విక్రయించి ధనము సంపాదింపఁగోరునో వాఁడు వానిమూత్రపురీషములచేఁ బరలోకమున జీవించువాఁ డగునని ప్రమాణ ముండఁగా నెట్లు ఋచీకుఁడు పుత్రుని విక్రయించెనని శంక. ఇది జ్యేష్ఠపుత్రవిషయ మని పరిహారము. జ్యేష్ఠపుత్రుని దానమియ్యరాదు (దత్తుఁడుగా), విక్రయింపను రాదు. న జ్యేష్ఠపుత్రం దద్యాద్గృహ్ణీయాద్వాసహి సంతానాయ పూర్వేషామ్." - మితాక్షర.

"న త్వేకపుత్రం దద్యాత్సహి సంతానాయ పూర్వేషామ్" - బోధాయనుఁడు. ఒంటికొడుకును గాని పెద్దకొడుకును గాని దత్తుఁడుగా నీయరాదు. "శోణిత

శుక్లసంభవో మాతృపితృ నిమిత్తకః తస్య ప్రదాన పరిత్యాగ విక్రయేషు మాతాపితరౌ ప్రభవతః."—బోధాయనుఁడు. తల్లిశోణితముతండ్రిశుక్లము కలిసి పుత్త్రుఁడు పుట్టుటచే వానిని దానమిచ్చుటయందు నిరువురకు నధికారము కలదు. ఒకరిని గాదని మఱియొకరు పని చేయరాదు కడపటికొడుకును విక్రయింపరామికిఁ దల్లిప్రేమయే కారణము. పాండవు లరణ్యమునకుఁ బోవునపుడు సహదేవునిఁ జూచి "సహదేవా! నీవు నా దేహమునకంటెఁ బ్రియుఁడవు. నీవు నన్ను వదలిపోకుము. మీయన్నలందఱు నడవికిఁ బోయినఁ బోనిమ్ము. నన్నురక్షించు పుణ్యము నీ విందుండి సంపాదింపుము" అని చెప్పెను—సభాపర్వము ఇట్టులే యాశ్రమవాసపర్వంబునఁ గుంతి ధృతరాష్ట్రితోడఁ బోవుచు సహదేవుని ధర్మజుని కప్పగించి పోయెను. ఈకాలమునఁ గక్కసకొడుకులను దోఁచియైనఁ జిన్నకొడుకులకుఁ బెట్టుట సాధారణముగఁ దల్లులకు వాడుక. వారికంటెఁ గూఁతు లెక్కువ.

—* ౬౨-వ సర్గము *—

ఉ॥ ఓపక యెండవేఁడిమి నృపోత్తముఁ డాయెడ నిల్వగా శున
శ్శేపుఁడు పాఱుదెంచి ఋషిశేఖరయుక్తుని మాతులుం దపో
వ్యాపృతుఁ గౌశికుం గనుచు వారనిదప్పిని గాసి దీనుఁడై
ప్రోవఱె గాజువాఱ ముఖముర్ వడిగా నొడిలోన వ్రాలుచున్. ౧౧౪౦

ఎండవేఁడిమికిఁ దాళలేక ప్రయాణము నిలిపి యచ్చట రాజు నిల్వఁగాఁ గొంచెము విరామము దొరకుటచే శునశ్శేపుఁడు పరువెత్తివచ్చి ఋషీశ్వరులతోఁ గూడియుండుమేనమామను విశ్వామిత్రునిఁ జూచి యతిశయమైన దప్పిచేతను పరువెత్తివచ్చినగాసిచేతను దీనుఁడై ముఖము తెల్లవాఱఁగాఁ దటాలున నొడిలోఁ బడి యిట్లనెను.

—* శునశ్శేపుఁడు విశ్వామిత్రుశరణుఁ జొచ్చుట *—

శా॥ మామా! యే మని చెప్పువాఁడ నిఁక నన్నన్నించి కాపాడవే
భూమిం దండ్రియు లేఁడు, లేదు తలియుం బ్రోవంగఁ జుట్టంబు లేఁ
డో మౌనీశ్వర! నాకు నిప్పు డెటు లే నూహించి భూమీశున
త్యాగమంబు న్నెఱవేఱ నేఁ దపసినై కాంసంగ స్వర్ధామమున్. ౧౧౪౧

మామా = మేనమామయైనను మేనమామనగూడ మామ యని పిలుచుటయే వాడుక. తండ్రి లేఁడు - తల్లిలేదు - అనఁగా జచ్చినా రని యర్థముగాదు. ఉండియు లేనట్టి నిష్ప్రయోజకు లని యర్థము. 'మాతానాస్తి పితానాస్తి నాస్తి బంధు సహోదర' యన్నచోట నీ యర్థమే గ్రహింపవలెను.

తాత్పర్యము.

మామా! నాగతి నే నేమని చెప్పికొందును? నన్ను మన్నించి నీవే కాపాడుము. తల్లిదండ్రు లుండఁగా నన్నుఁ గాపాడు మనెద వేల యందువేమో! నాకుఁ దల్లిలేనిదే తండ్రిలేనివాఁడే. రక్షించుటకుఁ జుట్టములు లేనివారే. ఉండియు వీరు నన్ను రక్షింపరైరి. కావున లేనివారే. కాఁబట్టి నీవే యేవిధముగనైన నాలోచించి యారాజుకోరిక నెఱవేఱునట్లు నేను దపస్సుచేసి స్వర్గము చేరునట్లు చేయుము.

చం॥ చిరమగు నాయు వొందునటు ♦ చేయుము, దిక్కొకఁడైన లేఁడు, నా
పర మగుదిక్కు గమ్ము, తన♦పట్టిని దండ్రియుఁ బోలె, నాపసం
బారయఁగ నీక కావు, మతి ♦ పుట్టిన లోకములోనియెల్లర
గరుణను గావవే? యనినఁ గౌశికుఁ ♦ డూఱడఁ బల్కి యల్లునిన్. ౧౧౪౨

ఈవిధముగ నధాయువనై చావక దీర్ఘాయువు గలిగి జీవించునట్లు చేయుము. కామభోగార్థముకాదు. స్వర్గమునకుఁ బోఁజాలినంత తపస్సుచేయుటకు. నాకు రక్షకుఁ డెవఁడును లేఁడు. నీవే నా పరమగతివి కమ్ము నీ బిడ్డలను నీవు కాపాడునట్లు నన్నుఁ గాపాడుము. ఆపదపాలుసేయకుము. నీకు మనస్సు గలిగెనేని లోకములోనివారి నందఱను గాపాడలేదా? యనినఁ గౌశికుఁ డల్లునినూరడించి.

చం॥ తనయులఁ జూచి యిట్లనియె ♦ ధర్మపరాయణులార! భూమిపైఁ
దనయులఁ గోరుచుంట తలి♦దండ్రులు దాము వచింపువాక్యము
ల్వినియెడివారు పుట్టుటకు, ♦ విశ్రుతనాకసుఖంబుఁ గాంచగాఁ
గనుటకుఁ, గాన వాని కిదె ♦ కాలము వచ్చెను మీరు దీర్పఁగన్. ౧౧౪౩

తన కొడుకులను జూచి విశ్వామిత్రుఁ డిట్లనెను. ధర్మమే పరమగతిగాఁగల కుమారులారా! తల్లిదండ్రులు భూమిమీఁదఁ దమకు బిడ్డలు కావలయునని కోరుటకుఁ దాము చెప్పినమాట వినువారు కలుగవలయుననియు, వారివలనఁ దాము స్వర్గసుఖము ననుభవింపవలయుననియు రెండుకారణములు. కావున నాకోరిక మీరు దీర్చుకాలము సంభవించినది.

'జీవతో వాక్యకరణాత్ ప్రత్యబ్దం భూరిభోజనాత్। గయాయాం పిండదానాచ్చత్రిభిఃపుత్రస్య పుత్రతా.' తల్లిదండ్రులు జీవించియుండుకాలమున వారుచెప్పిన మాట వినువాఁడును, వారు మరణించినపిమ్మటఁ బ్రతిసంవత్సర మాదినమున విశేషముగ నన్నదానము చేయువాఁడును, గయయందుఁ బిండముపెట్టువాఁడును నీమూఁడుకార్యములు చేయుటచేఁ బుత్రుఁడు పుత్రుఁడనిపించుకొనును. అట్లుచేయనివాఁడు పుత్రుఁడుకాఁడని భావము. మఱియును గొడుకులను వదలి

యైన శరణాగతరక్షణము చేయవలయుననియు నేర్పడుచున్నది. "తస్మాదపి వధ్యం ప్రపన్నం నప్రతిప్రయచ్ఛతి' - శ్రుతి. భారతమున ఘోషయాత్రఘట్టంబున ధర్మరాజు భీమునితో "కం॥ శరణం బని వచ్చిన భీ। కరశత్రుని నయినఁ బ్రీతిఁ గావఁగవలయున్। కరుణాపరుల తెఱంగిది। యిరవుగ సరిగావు దీని కేధర్మంబుల్." శరణాగతరక్షణము చేయకుండుట మహాపాపమనియు శాస్త్రముచెప్పుచున్నది. కూటసాక్ష్యం, తథైవోక్త్వా, నిక్షేపమపహృత్యచ, పతిదేవవ్రతంకుర్యాత్, త్యక్త్వాచ శరణాగతమ్'-శంఖధర్మశాస్త్రము. తప్పుసాక్ష్యము చెప్పినను, నిక్షేపమపహరించినను, శరణాగతుని రక్షింపక వదలినను ఈవ్రతము చేయవలయును. ఈవ్రత మేదన.—"శ్లో॥నిత్యంత్రిషవణస్నాయీ, కృత్వా పర్ణకుటీంవనే, అధశ్శాయీ జటాధారీ, పర్ణమూలఫలాశనః, గ్రామం విశేచ్చ భిక్షార్థం, స్వకర్మ పరికీర్తయన్, ఏకకాలం సమశ్నీయాత్, వర్షేచ ద్వాదశే గతే." అడవిలో గుడిసె వేసికొని, ప్రతిదినము ముమ్మాఱుస్నానము చేయుచు, నేలపైఁ బండుకొనుచు, జడలుధరించి, ఆకులు వేళ్లు ఫలములు తినుచు నమ్మలారా, యయ్యలారా! నేను శరణాగతుని రక్షింపక వదలినవాఁడను! నాకింతభిక్షము పెట్టుఁడని బిచ్చమెత్తుటకై గ్రామమునఁ బ్రవేశించుచు దినమున కొకసారి యాహారము గొనుచుఁ బండ్రెండుసంవత్సరము లుండవలయును.

శా॥ బాలుం డీతఁడు మౌనిపుత్త్రకుఁడు గాఁ * పాడంగదే యంచు భీ
లోలుండై శరణంబు వేఁడె నను, మీ * లో నెవ్వఁడేన్ వీనికిన్
వాలాయంబుగఁ బ్రాణదాన మిడుఁ డీ * వాక్యంబు పాటింపుఁడీ,
మేలై నట్టిప్రియంబు నాకిది సుతుల్ * మీ రీయెడం గూర్పుఁడీ. ౧౧౪౪

ఇతఁడో బాలుఁడు ఋషిపుత్త్రుఁడు. రక్షింపుమీ యని భయపడి నాశరణు చొచ్చినాఁడు. కావున మీలో నెవఁడైన నొకఁడు వీని కెట్టులైనఁ బ్రాణభిక్ష పెట్టుఁడు. నేను చెప్పిన యీమాట విని నన్ను గౌరవింపుఁడు. ఇది నాకు మిక్కిలి శ్రేయస్కరమైన ప్రియకార్యము. పుత్త్రులారా! దీనిని నెఱవేర్పుఁడు.

ఉ॥ మీర లెఱుంగనట్టివియు * మీయొనరింపనిధర్మజాలము
ధారణి లేవు గావున ని * లాతలనాయకుయజ్ఞవేదికన్
మీరు పశుత్వ మూనుకొని * మేకొని యగ్నికిఁ దృప్తిఁ గూర్పుఁడీ,
యారయ దీనఁ గల్గెడు న * నంతఫలం, బది చెప్పశక్యమే? ౧౧౪౫

మీకుఁ దెలియనివి మీరు చేయఁజాలనివి ధర్మములు లోకమున లేవు. కావున రాజుయజ్ఞవేదియందు మీరు పశువులరై యగ్నికిఁ దృప్తిఁగూర్చుఁడు. మీ రిట్లు చేసినఁ గల మహాఫలము నే నేమి చెప్పఁగలను?

కం॥ కాపుగడ గనెదు నీతఁడు, భూపతి జన్నంబు చక్క • బొం దగు సురలున్
బ్రాపింతురు హర్షంబును, గాపాడఁగఁబడు మదుక్తి, • కావింపుఁ డటుల్. ౧౧౮౬

ఇతఁడు రక్షింపఁబడును. రాజుయజ్ఞము నెఱవేఱును. దేవతలు సంతోషింతురు. నామాటదక్కించినవా రగుదురు. కావున మీ రట్లు చేయుఁ డనెను.

చం॥ అన జనకోక్తుల న్విని య • హంకృతితోఁ బరిహాసభాసురా
ననములతోడఁ 'దండ్రి! నిజ • నందనులన్ బలిపెట్టి యన్యునం
దనుఁ బరిరక్షసేఁత దగు • నా? యిది చూడఁగ శ్వామిషంబు భో
జన మనఁ గానికార్య' మని • చయ్యనఁ బుత్రకు లంద ఱాడినన్. ౧౧౮౭

అని తండ్రి చెప్పఁగా విని యహంకారముతో హేళనము సూచించు ముఖములతో వా రందఱు నిట్లనిరి 'తండ్రీ! తినబిడ్డలను బలిపెట్టి యితరుని కొడుకును రక్షింపఁబూనుట న్యాయ్యమా' ఇది స్వార్జితమధురాహారము మాని కుక్కమాంసము దినుటవలె నిషిద్ధకార్యము.'

(కుక్కమాంసము తినుట యనునది విశ్వామిత్రుని దెప్పిపొడిచెడిమాట. ఒకసారి విశ్వామిత్రుఁ డాఁకలికిఁ దాళలేక కుక్కమాంసమును దొంగిలించి తినఁబోయెనని భారతమునఁ గలదు)

దీనివలనఁ దల్లిదండ్రులను గర్వముచే ధిక్కరించిన మహాదోష మని యేర్పడుచున్నది.

"పితృమాతృగురూణాంచ, యేవజ్ఞాం చక్రు రుద్ధతాః, త ఇమే పూయవిణ్మూత్రగరే మజ్జంత్యధోముఖాః, గర్దభో జాయతే జంతు, పిత్రోశ్చాప్యవమానకృత్, ఆక్రుశ్య మాతాపితరౌ, శారికా సంప్రజాయతే తావేవ పీడయిత్వాతు, కచ్ఛపః సంప్రజాయతే. పరివాదీ ఖరోభవతి, శ్వావై భవతి నిందకః. పరిభోక్తా క్రిమిర్భవతి, కీటో భవతి మత్సరీ. ఆచార్యశ్చ పితాచైవ మాతా భ్రాతా చ పూర్వజః నార్తేనాప్యవమంతవ్యా, బ్రాహ్మణేన విశేషతః."

ఎవఁడు తల్లిదండ్రులను గురువును గర్వముచే ధిక్కరించునో వాఁడు మూత్రపురీషబిలమందుఁ దలక్రిందుగా మునిఁగియుండును. వారి నవమానించువాఁడు గాడిదగాను, బరుషముగఁ బలుకువాఁడు గోరువంకగను, బీడించువాఁడు తాఁబేలుగను, అపనిందలాడువాఁడు ఖరముగను, నిందించువాఁడు కుక్కగను, పరిభోక్త పురుగుగను, మచ్చరించువాఁడు కీటముగను బుట్టును. కావున నాచార్యునిఁ దల్లిదండ్రులను అన్నను దా నెంత యార్తుఁడైయున్నను నవమానింపరాదు. అందు ముఖ్యముగ బ్రాహ్మణునకుఁ దగదు. 'గురునిందా దహత్యాయుః' గురునింద యాయువును దహించు నని యనుశాసనపర్వంబునఁ గలదు.

శా॥ ఏమీ! యీనని నేను జెప్పినది యం♦ డ్రే కాదు కా దంచు మీ
రీమాడ్కిన్ భయ మేని ధర్మమతియే ♦ నెంచంగఁబో కాత్మలో
నామాటన్ జవదాఁటి మీర లిఁక మం♦ డ్రా! తించు వాసిష్ఠు ల
ట్లే మండ్రాడుఁడు జాగిలంబు నెఱచిన్ ♦ హీనాత్ములై వేసమల్. ౧౧౮౫

అని కొడుకులంద ఱిట్లు లేకవాక్యముగఁ జెప్పఁగా విశ్వామిత్రుఁ డేమీ నే నవుననినది మీరు కాదు కాద నెదరా? మీకుఁ గొంచెమైన భయము లేదా యెను. తండ్రిమాటమీఱుట ధర్మవిరుద్ధమనియుఁ దోఁపదాయెనుగదా! నా మాట నతిక్రమించి యింకను మీరు బ్రదికెదరా? ఛీ! వసిష్ఠునికుమారుల వలె మీరును ముష్టికజాతివారై కుక్కమాంసము దిని నీచమనస్సులు గలవారై వేయిసంవత్సరము లల్లాడుఁడు

ఉ॥ ఈపగిదిం దనూజుల న♦హీనరుషన్ శపియించి మౌని యా
పాపనిఁ గాంచి రక్ష యిడి ♦భద్రము చేకుఱ వైష్ణవంబు నౌ
యూపమునందుఁ గట్టబడి♦యుండెడివేళను నగ్నిఁ గాంచుచున్
వే పఠియింపు వీని నని ♦ విశ్రుతగాథల నిచ్చి రెండిటిన్. ౧౧౮౬

అని పట్టరాని కోపముచేఁ గొమకులను శపించి విశ్వామిత్రుఁ డా బాలుని శున శ్శేపునిఁ జూచి యతనికి భయములేకుండ మంత్రించిన విబూదిపెట్టి నాయనా! నిన్ను విష్ణుసంబంధమైన యూపమునందుఁ గట్టినపు డగ్నినిఁ జూచి జాగు సేయక యీమంత్రములఁ బఠింపు మని 'ఇమమ్మేవరుణ' యను రెండుమంత్రము లుపదేశించెను.

(వైష్ణవోవై దేవతాయా యూప యని యూపము వైష్ణవ మని శ్రుతి యందుఁ గలదు. ఈ మంత్రములయం దొకటి యింద్రస్తుతి. ఒకటి యుపేంద్ర స్తుతి.)

కం॥ మఱియును ని ట్లను వీని, న్మఱవక పఠియించి తేని ♦ మహీపతిక్రతువున్
నెఱవేఱు నీకు సిద్ధియు, వఱలు ననుచుఁ బనుప నతఁడు ♦ వడి చని నృపునిన్.
౧౧౮౭

ఇట్లుపదేశించి నేను జెప్పినప్రకారము వీనిని బఠించితివా రాజుయజ్ఞము సఫలమగును. నీకు జీవితసిద్ధియుఁ గలుగును. అని చెప్పఁగా నా మంత్రములను గ్రహించి శునశ్శేపుఁడు రాజునొద్దకుఁ బోయెను.

॥ కని నరపాలచంద్రమ! యిఁ♦కం దడ వేటికి యజ్ఞవాటికిన్
జనుదము, సప్తతంతువును ♦ జల్పఁగ దీక్ష వహింపు వైళ, మం
చన మునిపుత్రుమాటలకు ♦ హర్షము నొంది నృపాలుఁ డధ్వరం
బునకుఁ బురోధసమ్మతిని ♦ బూనె నతంద్రత నంత విప్రులున్. ౧౧౮౮

ఇట్లు పోయి యంబరీషునిఁ జూచి రాజా! ఏల యింకను జాగుచేసెదవు? యజ్ఞప్రదేశమునకుఁ బోవుదము. లెమ్ము. శీఘ్రముగ యజ్ఞదీక్ష వహింపుము. అని చెప్పఁగా నా మునికుమారునిమాటలు విని సంతోషించి రాజు పురోహితుఁడు చెప్పిన ప్రకారము యజ్ఞమునకై దీక్ష వహించెను.

క॥ అట్టునఁ బువ్వులఁ జుట్టియు, నెట్టనిపుట్టములు గట్ట ♦ నిడి జన్నంపుం
గొట్టునఁ గట్టిన వెఱవక, కుట్టఁడు పరియించి మంత్ర♦కూటము మదిలోన్. ౧౧౫౨

. అంతట బ్రాహ్మణులు బాలునకు మెడలోఁ బూలదండలువేసి యెఱ్ఱని వస్త్రములు గట్టి దర్భలచేఁ జేయఁబడిన త్రాళ్లతో యూపస్తంభమునకు బాలునిఁ గట్టిరి. వాఁడును భయపడక మంత్రములను దనలో స్మరించుచుండెను.

పశుభోక్త యింద్రుఁడు. యూపస్తంభదేవత విష్ణువు. తన్నాశ్రయించిన వానినిఁ జేవిడువరా దని విష్ణువు తలఁచి యింద్రునితో వీనికి జీవితసిద్ధి, రాజునకు యజ్ఞఫలమునిమ్మనఁగాఁ దనస్వామినిస్తుతించె నని సంతోషించుచున్న యింద్రుఁడు విష్ణునాజ్ఞ ప్రకారము చేసెను

క॥ ఇంద్రుని నింద్రావరజుఁ, సాంద్రముదంబునను ముంపఁ ♦ జయ్యన నావ్యా
నీంద్రజునకు దీర్ఘాయువు, నింద్రుం డిడి సఫలుఁ జేసెఁ ♦ బృథ్వీవరునిన్. ౧౧౫౩

ఇట్లు స్తోత్రముచే నింద్రుని నుపేంద్రుని స్తుతింపఁగా నింద్రుఁడు మెచ్చి యతనికి దీర్ఘాయు విచ్చి రాజునకు యజ్ఞఫలము నిచ్చెను.

(శ్రీ)భాగవతంబున శునశ్శేపునిఁ గొన్న రాజుపేరు హరిశ్చంద్రుఁ డని కలదు. "ఘను శునశ్శేపునిఁ గొని యాగపశువుగ, నాహరిశ్చంద్రుని కాతఁ డిచ్చె" నని యున్నది. గోవిందరాజీయవ్యాఖ్యానమందు అంబరీషునకు నామాంతరము హరిశ్చంద్రుఁ డని యున్నది.

క॥ వైశ్వానరతేజుం డీ,విశ్వామిత్రుండు నిండు ♦ వేయేండ్లు దనర్
విశ్వంబు పొగడఁ దపముఁ, శశ్వద్గతిఁ బుష్కరమునఁ ♦ జలిపెఁ నిష్ఠన్. ౧౧౫౪

అగ్నితేజుఁడైన యావిశ్వామిత్రుఁడు పూర్ణముగ వేయేండ్లు తన్ను జగము పొగడునట్లు పుష్కరమున నిలిచి గాఢమైనతపముఁ జేసెను.

౬౩-వ సర్గము.

ఉ॥ నిండిన నేండ్లు వేయియు ము♦ని ప్రవరుం గన వచ్చి దేవతా
మండలితో విరించి శుభ♦మానితవాక్కులఁ బల్కు సత్క్రియా
కాండసమార్జితం బగు న♦ఖండఫలాన ఋషిత్వ మంది తో
దండితవైరి యంచు నని ♦ తాను దిరోహితుఁ డయ్యె నయ్యెడన్. ౧౧౫౫

ఇట్లు వేయిసంవత్సరములు నిండఁగా బ్రహ్మ దేవతలతోఁడ మునీశ్వరుఁ జూడ వచ్చి శుభకరమైన వాక్కులతో నాయనా! నీవు చేసినతపమువలన నీవు ఋషి వైతి వని కానరాకపోయెను.

ఉ॥ అంతటఁ దృప్తి నొందక మ♦హాత్ముఁడు గాధిజుఁ డాచరించె నే
కాంతతపంబు, నట్టియెడ ♦ నాకమలాకరవారి నాడఁగాఁ
గాంతనితాంతసుందరతఁ ♦ గంతునికుంత మనంగ నప్సరః
కాంత యొకర్తు మేనక ని♦కారవిధంబున వచ్చె, వచ్చినన్. ౧౧౫౬

కమలాకరము = సరస్సు. వారి = జలము.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁ డంతటితోఁ దృప్తిపడక యింకను దీవ్రమైన తపముచేసెను. అట్లు చేయుచుండుసమయమున నాతీర్థమున స్నానముచేయుటకై నిక్కిలి మనోహరమైన సౌందర్యముచే మన్మథునియాయుధమోయన్నటు లొక యప్సరస్త్రీ విశ్వామిత్రుని మోసగించు తలంపుతో వచ్చెను.

——* విశ్వామిత్రుఁడు మేనకను మోహించుట *——

కవిరాజవిరాజితవృత్తము.

నలినవిలోచన సూనమనోహర♦నవ్యశరీర విహారరత
జలదవినీలశిరోరుహఁ గోరక ♦ చారురద శశిరాంశుముఖి
స్థలకము లొడ ఘనాంతరచంచల ♦ నాఁ గని మారశరాహతుఁడై
కలఁగుమఁ దామరపాకుజలం బనఁ ♦ గాంతను డాసె వచించె నిటుల్. ౧౧౫౭

నలినవిలోచన = కమలములవంటి కన్నులుగలది. సూనమనోహరనవ్య శరీర = పుష్పమువలె మనోహరమై పొగడఁదగిన శరీరముగలది. విహారరత = జలక్రీడయందు నాసక్తిగలది. జలదవినీలశిరోరుహ = మేఘమువలె నల్లనైన తలవెండ్రుకలుగలది. కోరకచారురద = మొగ్గలవలె నందమయిన దంతములుగలది. శశిరాంశుముఖి = చంద్రునివంటి ముఖముగలది. ఘనాంతరచంచల = మేఘమునడుమనుండు మెఱుపు. మారశరాహతుఁడై = మన్మథబాణములచేఁ గొట్టఁబడినవాఁడై. తామరపాకు జలము = తామరాకు మీఁది నీళ్లు.

కవిరాజవిరాజిత వృత్తము - న-జ-జ-జ-జ-జ-జ-వ- గణములు. ఛందస్సు- అప్ప కవి కవిరాజవిరాజితమునకు ౮-౭-౭ స్థానములందు యతి యని చెప్పెను. నన్నయ భట్టారకుఁడు "రజనికరాననఁ బీనపయోధర♦రాజిత రాజసుత విలస ద్గజ పతిగామినిఁ జందనగంధిఁ బ్ర♦కాశితకాంతి సమన్వితఁ బం॥ కజ..." యని ౧౩ వ

స్థానంబున నొక యతితోనే పద్యము వ్రాసెను. తిక్కన స్త్రీపర్వంబున "అనవుడు నిట్లను♦నన్నరపాలున ♦ కాంతుడు మోక్షము ♦ నర్థిజగ । జ్జనులకుం బుట్టుట ♦ సన్మతిం గోరి వి♦శారదు లాదర♦సంభృతులై" యని పాదమునకు మూండేసి యతు లుంచెను. మఱి యీయనయే పైపద్యమునకు నాలుగవపద్యమున "అనయము లోలతమై విషయప్రచ♦యం బను దుస్తరపంకమున । న్మునుంగుచుం దేలుచునుండంగం గాలము♦ముట్టి రుజ జర నెవ్వగిపై "యని యొంటియతితో నన్నయభట్టువలెనే రచించెను. ఈపద్యమున నన్నయమార్గ మనుసరింపంబడెను.

తాత్పర్యము.

కమలములవంటి కన్నులుగలదియు, పూవువలె మనోహరమై మెచ్చుకొనదగిన శరీరముగలదియు, క్రీడయం దాసక్తిగలదియు, మేఘమువలె నల్లనైన వెంట్రుకలుగలదియు, మొగ్గలవంటిదంతములుగలదియు, చంద్రునివంటి ముఖముగలదియు నగు నా యప్సరస మేఘమునడుమనుండు మెఱుపుదీంగవలె నీళ్ళలో స్నానముచేయుచుండంగాం జూచి కామబాణపీడితుండై మనస్సు కలవరపడి తామరాకుమీంది జలము చలించినట్లు చలింపంగా నాయందగత్తెను సమీపించి యిట్లనెను.

ఉ॥ అచ్చరకన్నెరో! శుభము ♦ తాంత, నినుం గని నంతనుండియుం
గ్రుచ్చెడి నన్ను మన్మథుండు ♦ క్రూరశరంబులం, దాళం జాల నీ
విచ్చగ నిచ్చట న్నిలిచి ♦ హెచ్చు తమి న్నను నేలుకొమ్ము, నీ
నచ్చినబంట నౌదు నను ♦ నమ్ముము నెమ్మది నంచు వేండినన్. ౧౧౫౮

ఓ యచ్చరకన్నియా! నీకు శోభనమగుంగాత! నిన్నుం జూచినప్పటినుండి మన్మథుండు దయలేనివాండై తన బాణములచేం దూంటులుపడం బొడుచుచున్నాండు. ఆ వేదన సహింపలేను. నీవు మనసార నిచ్చట నిలిచి ప్రేమాతిశయమున నన్నుం బాలింపుము - నీకు నమ్మిన బంటనై వర్తించెదను. నా మాట నమ్ముము. మోసములేదు. అని ప్రార్థించెను.

"శ్లో॥ స్వభావ ఏష నారీణాం, నరాణా మిహ దూషణమ్ । అతోర్థా న్న ప్రమాద్యంతి, ప్రమదాసు విపశ్చితః॥ అవిద్వాంస మలం లోకే, విద్వాంసమపివా పునః। ప్రమదా హ్యుత్పథం నేతుం, కామక్రోధవశానుగమ్॥" మను- ౨-౨౧౩-౨౧౪. పురుషులను మోహింపంజేసి వారిసిం జెఱుచుట స్త్రీలకు స్వభావగుణము. కావునం బండితులు స్త్రీలవిషయమునం బ్రమాదపడరాదు. 'మగవాండు పండితుండైనను మూర్ఖుండైనను వాండు కామక్రోధములకు వశుండై యుండెనేని నట్టివానిని దప్పుద్రోవలకుం బ్రమద లీడ్వంగలరు' అను నీతిని గ్రహింపందగును.

క॥ నీలోత్పలనయనాతర, ళాలోకనహతులు సోఁకునంతకు వెలుఁగున్
ధీలలితసుజనవిమలో, ద్వేలాతిస్ఫుటవివేకదీపము నెమ్మిన్.

చ॥ నిరతముఁ దిండి బిచ్చమగు నీరసమద్దియు నొక్కపూఁటయే
ధరణి తలంబు సెజ్జ సతతంబును దోడుశరీరమాత్రమే
చిరుఁగుల చీరతున్కగమిచేత సమర్చిన బొంతపుట్ట మీ
కరణి మెలంగినన్ విషయకాంక్ష లొకింతయుఁ బాయ వక్కటా!

చ॥ వనదళవాతముల్ మెసవువారు పరాశరకౌశికాదు లా
ఘనులును సుందరీజనులఁ గన్గొని మోహితచిత్తులైరి హె
చ్చిన ఘృతపాయసాన్నము భుజించెడివారలకున్ మనోజయం
బు నెగడునేని వింధ్యము సముద్రజలంబులఁ దేలియాడదే -భర్తృహరి

గీ॥ కాము గెలువవచ్చుఁ గాలారి గావచ్చుఁ, బొంగువిషమునైన మ్రింగవచ్చు
నాఁడువారిచూపుటంపర గెలువంగ, వశముగాదు త్రిపురవైరికైన.— భాగ.

తే॥ ఆవరారోహ యాను గా ♦ కంచు నిలిచెఁ, దత్తపోధనునాశ్రమ♦స్థలిని లీల
నిట్లు పదియేఁడు లరుగ ము♦నీంద్రచంద్రుఁ, డొక్కనాఁ డిట్లుతలపోసె♦నుల్లమునను. ౧౧౫౯

ఆ వరారోహ = గొప్ప పిఱుదులుగల స్త్రీ.

తా త్ప ర్య ము.

ఆ యచ్చరయు సరి యని యంగీకరించి యాఁ బుషీశ్వరు నాశ్రమమందే యుం డెను. ఇట్లు వారిరువురు భార్యాభర్తలుగఁ బదిసంవత్సరము లుండిరి. అంతటఁ గొంతకాలమునకు విశ్వామిత్రుఁడు మదనవేగము తగ్గఁగా నిట్లు లాలోచించెను.

ఉ॥ పీడక బ్రాహ్మణత్వమున ♦ వేడ్క యొనర్చువిరాగి గాధిజుం
డేడ? నిరాకులస్థితి న♦హీనతపం బొనరించు టేడఁ? దన్
గూడి చరింపఁగాఁ బడుపుఁ♦గోమలి యేడ? నయారె విన్నచో
బాడబు లెల్ల నన్నుఁ గని ♦ పక్కున నవ్వరె, బైసియార్పరే. ౧౧౬౦

పడుపుఁ గోమలి = వేశ్య.

తా త్ప ర్య ము.

వదలిపెట్టక యెట్టులైన బ్రాహ్మణ్యము సంపాదింపవలయు నని యాశ గలిగి వైరాగ్యము పూనిన విశ్వామిత్రుఁ డెక్కడ? వ్యాకులపడక జితేంద్రియుఁ డనై మహాతపము చేయుట యెక్కడ? తనకుఁ దోడు భోగము దేడ? బ్రాహ్మణులు వినిన ఫక్కున నవ్వరా? సిగ్గుదీయరా?

క॥ రేపటిమాపటివలెనే, వే పోయెం బదియునేండ్లు ♦ వెలనెలఁతుకతో
 శ్రీపుత్త్రునిబారి కయ్యో, లోపడితిఁ సిగ్గు చెడితి ♦ లోలాత్ముఁడ నై. ౧౧౬౧

 శ్రీపుత్త్రుఁడు = మన్మథుఁడు.

తా త్ప ర్య ము.

అయ్యయ్యో! యొకరేపు, ఒకమాపువలెఁ బది సంవత్సరము లీయాఁడుదాని తగులాటముతో వ్యర్థముగాఁబోయెను. చపలమనస్కుఁడనై మన్మథుని బారి కయ్యో వశపడితిని అవమానపడితిని.

విశ్వామిత్త్రుని చరిత్రమువంటిది విష్ణుపురాణంబున నొకటిగలదు ౧ అంశము. ౧౫ అధ్యాయము. కండుఁడను నొక ఋషి గోమతీతీరమునఁ బరమతప మాచరించుచుండెను. ఆయన తపస్సు చెఱుచుటకై యింద్రుఁడు ప్రమ్లోచ యను నప్సరసను బంపెను. అది యాయనమనస్సును క్షోభింపఁజేసి వశపఱుచుకొనెను ఆయన విషయాసక్తమనస్కుఁడై దానితోడ మందరద్రోణియం దుండెను ఇట్లు నూఱుసంవత్సరములకుఁ బయిపడియుండి యొకనాఁ డా యచ్చర 'మునీంద్రా! నాకు సెలవిచ్చెదవా, పోయివచ్చెద' ననెను ఆయనయు నింకఁ గొన్నిదినము లుండి పొమ్మనెను. అదియు నంగీకరించి మరల నూఱుసంవత్సరమ్ము లుండి పోయెద నని సెల వడిగెను. ఇంకఁ గొన్ని దినము లుండి పొమ్మని కండుఁ డనెను. ఇట్లది యడిగినపు డంతయుఁ బోవల దని యతఁడు వారించుచుండెను. ప్రేమవశముననుశాపభయముననుఁ నది పో దయ్యెను. ఇట్లుండ నొకనాఁ డా ముని పర్ణశాల విడిచి వెలుపలఁ బోవుచుండెను. ఎక్కడికిఁ బోయెద వని యది యడిగెను. సంధ్యవార్వ వేళయయ్యెను. వార్వకున్నఁ గర్మలోప మగు ననెను. అది పకాలున నవ్వి యిన్నిదినాలుగ లేని సంధ్య నేఁడేల వచ్చె ననెను అప్పుడు కండుఁడు నేఁటియుదయమునఁగదా! నిన్ను నదీతీరమునఁ జూచి యాశ్రమమునకుఁ దోడితెచ్చితిని. ఇప్పుడు సాయంకాల మయ్యెను. సంధ్యవార్వవలదా యనెను. అదియును మునీంద్రా! నేను నీయొద్దకు వచ్చి నూర్లకొలఁదిసంవత్సరము లాయెననెను. ఓసీ! పరిహాసముగాదు, నీతోడ నే నుండి యెన్నిదినము లాయెను? అని యడిగెను. మునీంద్రా! నేను నీతోఁ బరిహాసమాడుదునా ? నేను నీయొద్దకు వచ్చి తొమ్మిది నూర్లయేడుసంవత్సరములు నాఱునెలలు మూఁడుదినము లాయె ననెను. అయ్యో! తపస్సు పాడాయెఁగదా యని యతఁడు పరితపించెను.

సమాధి సాధించినవారి కిది గొప్పవిషయము గాదు. సమాధి మనోవ్యాపారమే కదా! మనస్సుచంచలతలేక యొక్కదానియందు స్థిరపడియుండ నభ్యాసపడనేని ధ్యానవిషయమేదైననేమి? అడవైన నాత్మయందు; నిల్లైనఁ గ్రామమందు.

వ్యాకరణము.

లోపడు = ఈపదమును సీతారామాచార్యులవారు డాకారము సొచ్చు, అడఁగు, మస్తరించు లోనగు శబ్దంబులకడ లక్ష్యంబులలో లోపడు అని వ్రాసియు వానిని మరల సవరింపకయు శబ్దమును లోఁబడు అనియే వ్రాసిరి. దీనికిఁగారణము వారు "కినిసిపాణి నాళీకంబు సొనుపుటయును నంతలోఁబడ కదియు" (అంత లోన్ + పడక=అంతన్ + లోఁబడక అని ఛేదము - హ న ౨ ఆ) అని వ్రాయుటగాఁ దోఁచెడి. రెండర్థములందును లోపడు శబ్దమే యేల గ్రహింపరాదో. లోను + పడు = లోపడు లోన లోని 'ను' ద్రుతము గాదు. దేశ్యవిశేష్య మని వారే వ్రాసి "మురభిని వేశంబైన యూలోను నిశ్చింతుండై సతికేలు పట్టికొని చొచ్చెన్" భార ౨-ఆ ఇచట లోను = లోపల యని యర్థము విరాటపర్వము ౧ ఆ. ౩౨౮ పద్యంబున 'లోనుపటుపడ' యనియే యున్నది. చిన్నయసూరిగారి నీతిచంద్రికయందును "లోపడు" అనియే ప్రయోగింపఁబడి యున్నది. అది చేపడు, పైపడు వంటిది. లోచేయి, లోచూపు, లోకడుపు, లోచేసికొను, లోతక్కువ లోనగుశబ్దంబులం దరసున్న గానరాదు. పైన్ + పడు = పైపడు, చేన్ + పడు = చేపడు నని యేకశబ్దంబు లగుచో ద్రుతమునకు లోపమయినట్లు లోను పడు లోపడు నని యేల కాదు? వాఁడు నీళ్ళలోఁబడెను. వాఁడు నాకు లోపడెను. కొమ్మవిఱిగి నెత్తిపైఁ బడెను. నా మీఁదికి వాఁడు పైపడివచ్చెను. నా పతులగు గంధర్వులచేపడి. ఒరుచేపడ వెన్నఁడును. పైపడు నాపకపైఁచిన భూపాలా క్షణములోనఁ బొందు శుభంబుల్ - భార ౨ ఆ. వీనివలన లోన్ అనునది విభక్తి ప్రత్యయమైనపుడు లోఁబడుననియు నేకపదమైనపుడు లోపడుననియు రూపంబులు గ్రాహ్యంబులు.

క॥ ఱేఁడఁట సుఖముఁ రోసిన,వాఁడఁట బ్రాహ్మణతఁ గోరి ♦ వనముల నేఁడుల్
పూఁడులు మునియై వెలననఁ,బోఁడికిఁ దక్కెనఁట ! యిట్టి ♦ బూమెలు గలవే. ౧౧౬౨

వెలననఁబోఁడి = బోగముది. బూమెలు = మాయలు.

తాత్పర్యము.

రాజఁట - సుఖమును వదలినవాఁడఁట. విరాగియఁట. బ్రాహ్మణ్యము సంపాదింపఁగోరి యడవులలో నేండ్లు పూండ్లు చేయునది తపమఁట. బోగముదానికి వశపడెనఁట. ఇట్టి బుద్ధిమోసముకూడఁ గలదా ?

క॥ ఘనమైనబుద్ధిమోసం,బునఁ జెడితిం జెడితి రిత్త♦బూటక మేలా
ముని యఁట వెలచెలిపొం దఁట !!, వినువారలు నగరె వట్టి♦వేడబ మనుచున్. ౧౧౬౩

వేడబము = వేషము.

తా త్ప ర్య ము.

గొప్ప బుద్ధిమోసంబునఁ జెడిపోయితిని. ఇఁక నుత్తమోసపువేషముతో నేమి ప్రయోజనము ? మునియఁట. భోగముదానితోఁ బొందఁట. ఎవరైన వినిన నుత్తవేష మని నవ్వరా ?

మ॥ అని లజ్జావనతాస్యుఁడై యెటు లొకో ♦ ప్రాప్తించె జంజాట మం
చని యోజించి సుపర్వకోటులు తపో♦హానిఁ ఘటింపంగఁ జే
సిన మోసం బని యూర్చి కుంది మదిరా♦క్షిఁ సాధ్వసాకంపితాం
గను వీక్షించి తపోధనుండు మృదువా♦క్యస్ఫూర్తిఁ దా నిట్లనున్. ౧౧౬౮

లజ్జావనతాస్యుఁడు = సిగ్గుచే వంచిన ముఖముగలవాఁడు, సాధ్వసాకంపితాంగను = భయముచే వణఁకు దేహముగలదానిని.

తా త్ప ర్య ము .

ఇట్లాలోచించి సిగ్గుచేఁ దలవంచుకొని యీ జంజాటము గలుగుటకు నేమి కారణము ? ఎట్లిది గలిగెను? అని యోజించి యోహో యిది నా తపస్సు పాడుచేయ దేవతలు పన్నిన పన్నాగము అని దెలిసికొని మోసపోయితినిగదా యని నిట్టూర్పు విడుచుచు శాపము పెట్టునో యని భయముచే గడగడ లాడుచున్న మేనకను జూచి మెత్తనిమాటల నిట్లనియె.

కం॥ ఏలా వెఱచెద వోసుర,బాలా! స్మరజితుఁడ నైన♦బాలిశుఁడను ద్వ
ల్లీలారతిఁ జెడితిని ని, న్నేలా యన వలయు నింక ♦ నేగుము తరుణీ! ౧౧౬౯

ఓసీ! దేవకన్యా! నీ వేల భయపడెదవే. నీ దోష మిం దేదియు లేదు. నేను బుద్ధిలేనివాఁడనై కామముచే జయింపఁబడి నీ సాంగత్యముచేఁ జెడితిని. దోషము నాయం దుండ నిన్నని ప్రయోజన మేమి ? ఇఁకఁ బొమ్ము.

శ్లో॥ అర్థాశ్చ నార్యశ్చ సమాన మేత
చ్ఛ్రేయాంసి పుంసా మిహ మోహయంతి,
రతిప్రమోదా త్ప్రమదా హరంతి
భోగై ర్ధనం చా ప్యుపహంతి ధర్మాన్.—భార.

పురుషుని మోహింపఁజేసి వానిశ్రేయస్సును హరించుటయందు స్త్రీలు ధనములు సమానములు. రతిసంతోషముచే స్త్రీలు హరింతురు. భోగముల మరపి ధనము ధర్మమును నాశముచేయును. కావునఁ దనశ్రేయస్సుగోరువాఁడు కామినీకాంచనములవలనఁ బ్రమాదపడరాదు.

గీ॥ పొలఁతి దానవవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు, కరఁగకుండ రాదు గదిసెనేని,
బ్రహ్మయైనఁ గూఁతుఁ బట్టకమానఁడు — భాగ

తే॥ అనుచుఁదెఱగంటివాల్గంటి ననిపి చనియె, దానవలిగట్టుపొంతకుఁ దపము సేయ
గామముజయింపఁగా మదిఁ గార్యమూని, కౌశికీతీరమునఁజల్వఁ గడుసుఁదపము. ౧౧౬౬

తెఱగంటి వాల్గంటి = దేవతాస్త్రీ. తెఱ + కన్ను = మూఁతపడక తెఱచికొని యుండుకను బహువ్రీహియందు తెఱగంటి యగును ముక్కంటివలెనే-తెఱకన్నుగలది, తెఱగంటి సంస్కృతసంప్రదాయానుసారముగ సమాసాంత కార్యము. ఇది 'అనిమేష' శబ్దపర్యాయము. వాలు + కన్ను కలది = వాల్గంటి, కన్ను శబ్ద మాపవిభక్తికము గావున 'ంటి' వచ్చి ంటి యయ్యెను. వలిగట్టు= చలిమల, హిమవంతము.

తాత్పర్యము.

అని చెప్పి దేవకాంతను బంపి తాను హిమవ త్పర్వతముపొంతకుఁ గామమును జయింపఁగోరి కౌశికీతీరమందు కఠినతపము చేసెను.

—* విశ్వామిత్రుఁడు మహర్షిం

ఉ॥ ఉత్తరపర్వతంబున మహోద్యమతత్పరుఁడై
మొత్తముగా నిలింపతతి మోదముఁగ
సత్తముఁడౌ మహర్షి యనఁ జాల
యుత్తలపాటు చెందె భువనోత్తరప

మహోద్యమము = గొప్పప
సక్తిగలవాఁడు.

ఉత్తరమున నుండు
వేయిసంవత్సరములు
తాసమూహ
సజ్జనశ్రే మెఱు
ఆవ తల గో

ఆ॥

అనిన బ్రహ్మదేవుఁడు వచ్చి విశ్వామిత్రునిఁజూచి నాయనా! నీవు మహర్షివైతివని చెప్పఁగా నీయన వ్యసనముపడక పొంగిపడక బ్రహ్మను జూచి యిట్లనెను.

ఉ॥ నీవు మహర్షి వం చనుట ♦ నే నిపుడైతి జితేంద్రియుండ నాఁ,
గావు జితేంద్రియుండ విఁక ♦ గాధిజ! యత్నము సేయు దానికిన్,
నావుడుఁ జేతు లెత్తి యశ♦నంబుగ గాడుపుఁ గ్రోలి ప్రాపు లే
కావలఁ గేవలం బచలుఁ♦డౌచు మహాద్భుతనిష్ఠ సల్పుచున్. ౧౧౬౯

దేవా! నీవు నన్ను మహర్షి వని యంటివి. అట్లైన నేను జితేంద్రియుండనే కదా యనిన నీవు జితేంద్రియుండవు కావు దానికై యింకను నీవు ప్రయత్నము చేయుము. నీమనస్సు వికారమునొందుటకుఁ గారణము గల్గినను నెపు డది వికారము నొందకుండునో యపుడు జితేంద్రియుఁడవుగాని యూరక వికారకారణములు లేనపుడు వికా ములేక యుండుట గాదు. అల్పకారణమున నీపుత్రుల శపించితివే నీ వెట్లు జి [illegible] యుఁడవు? అని బ్రహ్మదేవుఁడు చెప్పిపోఁగా విశ్వామిత్రుఁడు [illegible] గోరి రెండుచేతులు మీఁది కెత్తి గాలి నాహార [illegible] నేమియుఁ గదలక మెదలక మిక్కిలి యాశ్చర్య

[illegible] గారబయటను వాన ల♦వ్వారి గురియఁ
[illegible] శేలుంబవళ్లును ♦ నిష్ఠ సలిపె. ౧౧౭౦

[illegible] డుచున్నది

[illegible] నఁ బంచాగ్ని మధ్యమందు,
[illegible] పుండువంటి చలిలోన

గుడిచి

ఓ.

—* ౬౪ సర్గము. రంభ విశ్వామిత్రునితపంబుఁ జెఱుపఁ బోవుట *—

శా॥ రంభా! వంచితయోగిపుంగవసమా॥రంభా! భవన్నైపుణీ
జంభం బిప్పుడు చూపఁగా నదను, వి॥శ్వామిత్రమౌనీంద్రుసం
రంభం బాఁపవె, దేవకార్య మిది వి॥స్రంభంబుగాఁ దీర్పు, నా
జంభారాతిని జూచి సిగ్గువడి వా॥చాదైన్య మేపారఁగిన్. ౧౧౭౨

వంచితయోగిపుంగవసమారంభా = వంచింపఁబడిన యోగిశ్రేష్ఠులప్రయత్నములు గలదానా. భవత్ = నీ. నైపుణీ = నేర్పు. అదను = సమయము, విస్రంభము = నమ్మకము, జంభారాతిని = ఇంద్రుని, జంభుఁ డను రాక్షసునికి విరోధి.

తాత్పర్యము.

యోగిపుంగవులప్రయత్నములను ఫలహీనములుగఁ జేసెడిరంభా! నీ నేర్పు దంభము నేడుగాఁ జూపుటకు సమయము! విశ్వామిత్రునితపమునాటోపము నణఁపుము. ఇది దేవతాకార్యము. నమ్మకముగ జేయఁదగినదానవు నీ' అనిన నది తాను జేయఁజలమికి సిగ్గుపడి దీనవా   తో నింద్రునితో నిట్ల

చం॥ కరములు మోడ్చి యిట్లు లనుఁ ♦ గంజగ
సరసకుఁ బోవ నెంచినను ♦ జల్లను గుం
కరమున కాటపట్టు, నణఁ♦కం ద్రోణఁ
దురును నెఱుంగవే, కోఁటివి♦తోఁ

చల్లజంపు = భయంకరుఁడు
ఉ. ౧౦ అ.) అఁకరము = ఆ
దనము.

రెండుచేతులు జో
సమీపమునకుఁజో
కోపమునకుఁ
తన మెఱు
తల గోఁ

ఆ॥

తాత్పర్యము.

వజ్రమువంటిదాని నాయుధముగఁగలవాఁడా! ఆఁడుదానను, నిరాయుధనైన నాయందు దయదలంపుము. నీవజ్రముచేఁ గానిపని యాఁడుదాననగు నాచే నేమి కాఁగలదు? కావున సరళహృదయా! నాయందు దయ చూడుము. అని దీనవాక్యులతో నాదేవకాంత ప్రార్థింపఁగా దానినిఁ జూచి యింద్రుఁ డిట్లనియె.

చం॥ వెఱచెద వేల రంభ! తగ♦వే శుభ మయ్యెడుఁ గాత నీకు, నీ
యొఱపు నుతింతగా మెఱయ ♦ నజ్జ్వలపుష్పపుసార రమ్ము నీ
కుఱఁగట నుండువాఁడ, సుమ♦కోమల! మారుసితోఁ బికంబనై
బిఱుసుగఁ గూయఁగాఁ గలను,♦ ప్రేయసి! యామని నిల్చుఁ గొమ్మలన్. ౧౧౭౫

రంభా! ఏల భయపడెదవే? నీవంటిదాని కిది తగునా? నీకు మేలు గలుగునుగాక! నీ సౌం[illegible]ర్య మినుమిక్కిలిగా మెఱయునట్లు సౌందర్యము చేసికొని రమ్ము. మన్మథునిఁ [illegible] ప్రక్కన నే నుండువాఁడను నేను గోకిలనై కూయుచుందును. [illegible] వసంతుఁడు నిలుచును. కావున జెట్లన్నియు వికసించి యుండును.

[illegible]రితయుఁ [illegible]గై నేసికొని న♦వనవంబుగఁ ద
[illegible] మనోజ్ఞంపుఁబాట♦యొక్కటిపాడెన్. ౧౧౭౬

[illegible] క్రొత్త క్రొత్తసొగసుచేసికొని యాముని
[illegible]చు మనోహరమైనపాట యొక్కటి

[illegible]డి పంచమధ్వనిఁ
[illegible]దేవకామినిఁ
చెలిఁగి లోఁ
[illegible] రంభతోన్. ౧౧౭౭

[illegible]నైదవది గనుకఁ
[illegible]ను.

పంచమ
[illegible]వ

య మని యెఱింగి మనస్సునఁ గోప ముదయింపఁగా గన్ను లెఱ్ఱజేసి రంభతో నిట్లనియె.

—✱ విశ్వామిత్రుఁడు రంభను శిలగా శపించుట ✱—

శా॥ఓసీ! కామముఁ గ్రోధముఁ గెలువఁగా ♦ నుంకించుచో నౌనటే
దోసం బెంచక నాతపోగరిమముఁ ♦ దుశ్శీల! పోకార్పఁగా
వేసంబుఁ వహియించి వచ్చితివి. పృథ్విఁ ♦ రాయి వై వేలుపుం
దాసీ! పో పదివేల యేండ్లు పడియుం ♦ డఁ మీఁద లగ్గయ్యెడిన్. ౧౧౭౮

ఉంకించు వోఁ = ప్రయత్నించుచుండఁగా, పోకార్చు = నాశముచేయు.

తా త్ప ర్య ము.

ఓసీ! నేను గామక్రోధముల జయింపఁ బ్రయత్నించి తపస్సు చేయుచుండఁగా నిది పాపకార్యమని యెంచక నాతపస్సు పాడుచేయుటకు వేషము వేసికొని వచ్చితివా? ఓసీ దాసీ! పో, పదివేలయేండ్లు రాయివై పడియుండుము. ఆమీఁద నీకు మేలగును.

దీనివలనఁ గామమును జయించుటకంటెఁ గ్రోధమును జయించుట దుష్కర మని యేర్పడుచున్నది. కాముని జయింప శివునకు క్రోధముపాలు కావలసి వచ్చెను.

కం॥ నాయిచ్చినయీశాప మ,మేయతపోబలయుతుండు ♦ మేధానిధి య
త్యాయతతేజుఁడు విప్రుఁడు, పాయంగాఁ జేసి నిన్నుఁ ♦ బరిరక్షించున్. ౧౧౭౯

ఇప్పుడు నేను బెట్టిన శాపము గొప్ప తపోబలము బుద్ధిబలము విస్తారమైన తేజస్సుగలవాఁడు నగు బ్రాహ్మణుఁడు పోఁగొట్టి రక్షించును.

కం॥అని తిట్టి తాల్మి లేమికి, మనమున నుడు కొందె, వేల్పు ♦ మగువయు నావెం
టనె శిల యై పడె, దానిని, గని పఱచిరి వాసవుండు ♦ గందర్పుండున్. ౧౧౮౦

అని తటాలున శపించి యయ్యో తొందరపడితినే గదా! ఓర్పులేదాయెఁ గదా యని తపించెను. అది చూచి యిఁక నిక్కడ నుండిన మనప్రాణము మీఁదికి వచ్చు నని భయపడి యింద్రుఁడు మన్మథుఁడు పరువెత్తిరి.

జితేంద్రియుఁ డగుటకు యోగమార్గముకంటె భక్తి మార్గమే శ్రేష్ఠ మని "యమనియమాదియోగముల నాత్మ నియంత్రితమయ్యుఁ గామరోషములఁ బ్రచోదితం బయగు శాంతివహింపదు, విష్ణుభక్తిచేఁ గ్రమమున శాంతి గైకొనిన కైవడి" నని భాగవతము. యోగసిద్ధిగల విశ్వామిత్ర దుర్వాసులకు భక్తులగు నంబరీష నారదుల కెంత తారతమ్య మున్నదో చూడుఁడు.

ఉ॥ అంతట మౌనినాథుఁడు ర♦వంతయుశాంతము లేమికిం గడు
న్జింతిలి యెంత లైన నిఁక ♦ నిశ్చయ మియ్యది కోప మూన నా
స్వాంతమునందు, వా తెఱచి ♦ పల్కను బల్కఁటె యుజ్జగింతు, నే
నంతకుఁ దీర కుండిన శ♦తాబ్దము లైనను నూర్పు మానెదన్. ౧౧౮౧

అంతట మునీశ్వరుఁడు తనకుఁ గొంచెమైనను శాంతిగుణములేమికిఁ జాల విచారపడి యయ్యో యిది నన్ను మోసగింపవచ్చె నని యాగ్రహపడితిని గాని యది నన్నేమి చేయఁగలదు? నాసమ్మతిలేక నన్నుఁ జెఱుపలేదుగదా! ధీపొమ్మ నినఁ బోయియుండునుగదా! ఆమాత్రమునకుఁ దాలిమిలేక తపస్సునాశము చేసి కొంటినే! కామక్రోధముల జయించితినా యని బ్రహ్మ నడిగితినే! నాలోపము నాకే తెలియుచున్నదే! కామమును జయించితినిగాని క్రోధమును జయింపలేనైతినిగదా! కానిమ్ము. దానిని జయించెద ను అని యోచించి యిఁక నిదే నిశ్చయము. ఎంతలైన రానిమ్ము, నా మనస్సునఁ గోపము పూనను. నోరు తెఱచి యొకమాటయైనఁ బలుకను. అంతకు సాధ్యపడకుండిన నూర్పుకూడ నూతేంప్లయినను మానెదను.

కం॥ చిక్కించెదఁ గాయంబును, స్రుక్కించెద నింద్రియముల ♦ శుద్ధంబుగ నే
మక్కించెదఁ గామంబును, ద్రొక్కిన మ్రొక్కినను నొక్క♦త్రోవన యుందున్. ౧౧౮౨

దేహము సన్నగిల్లఁ జేసెదను. ఇంద్రియములపొగ రణఁగించెదను. కామమును బూర్ణముగఁ జంపెదను. నన్ను నెవ్వరైన మీఁదఁబడి త్రొక్కినను లేక గౌరవించి మ్రొక్కినను నొక్కరీతిగ నుందును.

కం॥ కుడువను గుడుపును శ్వాసము, విడువను మఱి కోప మనెడి♦విషయంబు మదిం
దడవను బాఱునితన మల,వడుదాఁక న టంచు సుధ్రు♦వం బగుమతితోన్. ౧౧౮౩

ఆహారము తినను; ఊర్పు విడువను, కోప మనుదానిని మనస్సుచేనైన స్పృశింపను. ఇట్లు నాకు బ్రాహ్మణత్వము లభించుదాఁక నుందును; అని నిశ్చయించుకొన్నవాఁడై.

దీనివలనఁ దపస్సిద్ధికి జితేంద్రియత్వ మావశ్యక మనియేర్పడుచున్నది.

జితేంద్రియుఁ డనఁగా "శ్రుత్వా స్పృష్ట్వాచ దృష్ట్వాచ భుక్త్వా ఘ్రాత్వాచ యో నరః। నహృష్యతి గ్లాయతి వా స విజ్ఞేయో జితేంద్రియః"-మను. ఎవఁడు విని, తాఁకి, చూచి, తిని, మూచూచి సంతోషముగాని యసంతుష్టిగాని పడఁడో వాఁడు జితేంద్రియుఁడు. "తస్మాత్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ, పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్॥ భ. గీ. ౩-౪౧.

కావున నర్జునా! నీవు తొలుత నింద్రియముల వశపఱుచుకొని జ్ఞానమును విజ్ఞానమును నాశముచేయు పాపపుఁ గామక్రోధములఁ జంపుము.

——* ౬౫ వ సర్గము. విశ్వామిత్రుఁడు ఘోరతపంబు చేయుట *——

కం॥ ధనదాశ విడిచి తూరుపు, చని పల్కుట యుడిగి వేయి♦సంవత్సరముల్
పినియతిఁ దప మొనరింపఁగఁ, బొనఁపడి శుష్కించెఁ బూరి♦పుడుకయ పోలెన్. ౧౧౮౪

ధనదాశ = కుబేరుని దిక్కు - ఉత్తరము. పొనపడు = నిస్తేజమగు.

తాత్పర్యము.

ఉత్తరమువదలి తూర్పుదిశకుఁబోయి మాటలుచాలించి వేయిసంవత్సరములు విశేషనియమము బూని తపముచేయఁగాఁ దేజు మాసి పూరిపుడకవలెఁ జిక్కెను.

తే॥ ఎడ నెడ ఘనాంతరాయంబు ♦ లెన్ని యేని
దాపరించినఁ గోపంబుఁ ♦ దాల్పఁ డయ్యె
నిట్లు నిశ్చితమతి యయి ♦ యెనక మెసఁగ
నిండు వేయేండ్లు పెనుఁదప ♦ ముండె నితఁడు. ౧౧౮౫

ఎంతగొప్పవిఘ్నము దాపరించినను గోపపడినవాఁడు కాఁడు. ఇట్లు నిశ్చయించుకొని విజృంభించి వేయేండ్లు పూర్ణముగ గొప్పతపస్సుచేసెను.

ఉ॥ నిండిన వేయియేఁడులు ము♦నిప్రవరుండు భుజింపఁ బోవ శ
క్రుండు ద్విజాతిరూపమునఁ ♦ గోరెఁ దదన్నముఁ, బెట్టవే క్షుధా
ర్తుండ మునీంద్ర! యన్న, మని ♦ తోరపుభక్తి నొసంగెఁ గాని లో
నొండు దలంపఁ డాగ్రహము ♦ నొందఁడు సర్వము నిచ్చె మౌని యై. ౧౧౮౬

ఇట్లు లాయన సంకల్పించినప్రకారము వెయ్యిసంవత్సరములు పూర్ణముకాఁగానే భుజింత మని విస్తరిముందుఁ గూర్చుండఁగా నింద్రుఁడు బ్రాహ్మణవేషము వేసికొని వచ్చి యయ్యా! బ్రాహ్మణుఁడను. ఆఁకలిచేఁ బెనుబాధపడుచున్నాఁడను. తాళలేను. ప్రాణముపోవున ట్లున్నది. అన్నము పెట్టు మని వచ్చి యడిగెను. వెంటనే యే కొంకులేక తా నుంచుకొన్న యన్నమంతయు మాఱుమాటాడక యిచ్చెఁగాని కోపించినవాఁడు కాఁడు.

దీనివలన వైశ్వదేవాంతమున వచ్చిన యతిథికి ముందాహారము నియ్యవలెను. ఆయనకుఁ దృప్తిగాఁ బెట్టఁగా మిగిలినది తాను దినవలయు నని యేర్పడుచున్నది.

తే॥ నిట్రుపాసెంబుగానేల♦నిలిచి యూరు, పార్పకయ వెండి వేయేఁడు♦లధికతపముఁ
జేయ జనియించె నాతని♦శిరముచుండి, ఘోరధూమంబు లోకంబు♦గోడుగుడువ. ౧౧౮

నిట్రుపాసెము = శుష్కోపవాసము.

తా త్ప ర్య ము .

శుష్కోపవాసముతో నేల నిలఁబడి శ్వాసవిడువక, మఱివేయేఁడులు మును పటివలెనే గాఢమైన తపస్సుచేసెను. అప్పు డతనిశిరంబునుండి భయంకరమైన పొగవెలువడి లోకమును గందరగోళము పట్టించెను.

సీ॥ సురలు గంధర్వు ల♦సురులుఁ బన్నగులును, వ్యాకుల మందుచు ♦ నజునిఁ గాన
నరిగి యి ట్లనిరి యో♦సురనాథ జగముల, గాధిజువలనను ♦ గావవయ్య
యెన్ని యోయుక్తులు ♦ పన్నితిమే కాని, కామియుఁ గోపియుఁ ♦ గాఁడు దేవ
యాతనిహృదయ మ♦త్యంతని ర్మలదశఁ, బుటము దీరినపైఁడి♦పోలె నున్న
తే॥ దనఘ యాలంబు చేయుట ♦ చనదు వాఁడు, నిఖలజగమును దపమున ♦ నిర్దహింప
కుండ మును వానియిష్టంబు ♦ నిండఁ జేయ, వయ్య లోకంబు హానవళి♦నావురనియె. ౧౧౮

దేవతలు, గంధర్వులు, అసురులు, పన్నగులులోనగువారు కలవరపాటు చెంది బ్రహ్మదేవునిఁ జూడఁబోయి యిట్లు చెప్పిరి. దేవా! సురజ్యేష్ఠా! విశ్వామిత్రునివలన జగము కీడునొందకుండఁ గాపాడుము. ఆయనయందుఁ గామము క్రోధము కలదా చూఁతమని యెన్నెన్ని యుపాయములనో పరీక్షించి చూచితిమి. కాని యాయన కామియుఁ గాఁడు, కోపియుఁగాఁడు. ఆయనమనస్సు మిక్కిలి నిర్మలమై తీరఁ బుటమువేసినబంగారువలె నున్నది. ఇఁక నాలస్యముచేయుట న్యాయముగాదు. ఆయన తనతపస్సుచే లోకమునంతయు ధ్వంసముచేయక ముందే వానికోరిక యేదో యది నెఱవేర్పుము. లోకమంతయుఁ గీడుపడి హాహాకారము చేయుచున్నది.

దీనివలన సర్వానర్థకరమైన క్రోధమును జయించినవాఁడుగాని తపస్సిద్ధి పొందనేరఁడనియు బ్రాహ్మణ్యమునకుఁ గామక్రోధజయ మావశ్యకమనియు నేర్పడుచున్నది

శ్లో॥ కామఏష క్రోధఏష, రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా, విద్ధ్యేన మిహా వైరిణమ్. —భ. గీ.

కామక్రోధములు రెండు రజోగుణమువలనఁ గలుగునవి. వీని కెంత యాహారమైనఁ జాలదు. మహాపాపములు. ఇవి శత్రువులు.

క॥ దిక్కులు వ్యాకులితములై, ప్రాక్కెడి జలనిధులు గ్రాఁగి ♦ పొంగెడి నగముల్
స్రుక్కెడిఁ బుడమి వడంకెడి, మిక్కిలి పెనుగాలి జగము ♦ మిడికెడి దేవా! ౧౧౮౯

దిక్కులు వ్యాకులములై తపించుచున్నవి. సముద్రము గ్రాఁగి పొంగుచున్నది. కొండలు తగ్గిపోవుచున్నవి. భూమి వడఁకుచున్నది. ఓరుగాలి జగమున వీచుచున్నది.

క॥ నాస్తికుల యట్లు జనములు, పాస్తిని మానిరి దినేశు♦ప్రభ చెడె జగముల్
కస్తిం గనె గాధేయుఁడు, పస్తుండి తపంబు సేయఁ♦బట్టె విధాతా! ౧౧౯౦

లోకులు నాస్తికులవలె నుపాసనము చేయుట మానిరి. సూర్యకాంతి చెడిపోయెను. జగములు మిగులఁ గష్టపడుచున్నవి. విశ్వామిత్రుఁ డుపవాస ముండి తపస్సుచేయుటచే నిట్టికష్టములన్నియుఁ దటస్థించినవి.

క॥ కాలాగ్నివోలె లోకము, వాలాయము గాల్పఁ గడఁగె ♦ వాసవుపద మేని
లీలాగతి నొసఁగి జగం, బేలుము తద్వాంఛితంబు ♦ నిమ్మెది యేనిన్. ౧౧౯౧

ఆయన తపస్సువలనఁ బుట్టిన వేఁడిమి ప్రలయకాలమందలి యగ్నివలె లోకముల నడ్డములేక కాల్చుచున్నది. ఆయనకు నింద్రపదమైనను సరే యిచ్చి లోకమును గాపాడుము.

చం॥ అనినఁ బితామహుండు విబు♦ధావళిఁ గూడి మునీంద్రుఁ గౌశికున్
గని యిఁక లెమ్ము బ్రాహ్మణతఁ ♦ గంటివి, వెండి చిరాయు విచ్చితిన్,
ఘనతరభద్రముల్ గలుగు ♦ గాధిజ! పొమ్ము యథాసుఖంబుగా,
ననవుడు బ్రహ్మఁ జూచి యమ♦రావళి మ్రొక్కి వచించె నీగతిన్ ౧౧౯౨

అని యంద ఱీగతిఁ జెప్పఁగా బ్రహ్మ మునీంద్రులతోడ వచ్చి విశ్వామిత్రునిఁ జూచి 'నాయనా! నీకు బ్రాహ్మణత్వము లభించెను. తపము చాలును. లెమ్ము. నీకు దీర్ఘాయువు నిచ్చితిని. నీ కనేకములగు గొప్పమేళ్లు కలుగఁగలవు. గాధిజ! లెమ్ము! యథాసుఖముగఁ బొమ్ము' అని చెప్పఁగా దేవతలకు నమస్కరించి బ్రహ్మతో నిట్లనియె.

* బ్రహ్మ విశ్వామిత్రునకుఁ బ్రహ్మర్షిత్వ మిచ్చుట *

సీ॥ దేవ! బ్రాహ్మణ్యంబు ♦ దీర్ఘాయువును నాకు, నమరిన నోంకార ♦ మాగమములు
మఱివషట్కారంబు ♦ మానుగా వరియించుఁ, గాత నన్నింకొండు♦గలదు దేవ!
క్షత్రవేదవిదుల ♦ సత్ప్రబ్రహ్మవేదుల, మొదటివాఁడు వసిష్ఠ♦మునివరేణ్యుఁ
డాతండు నన్నిట్టు ♦ లంగీకరింపఁగ, వలయు నియ్యది నాదు♦వాంఛితంబు

తే॥ దీని ఘటియించి చన రయ్య ♦ దేవవరులు, నాఁగ వేల్పులు వేఁడ న♦నఘతపస్వి
గాధిజునితోడ నెయ్యంబు ♦ గలిగి నీవు, బ్రహ్మఋషి వైతివని యెను ♦ రామచంద్ర! ౧౯౩

'దేవా! నాకు బ్రాహ్మణత్వము లభించెనేని వారివలె నాకు నోంకారము వేదాధ్యయనాధ్యాపనాధికారము యాజనాధికారము కలుగునుగాక! ఇదిగాక నాకుమఱియొకకోరిక గలదు. బ్రాహ్మణులవేదములు క్షత్రియులవేదములు తెలిసిన వారిలో మొదటివాఁడు వసిష్ఠుఁడు. ఆయన వచ్చి నీకు బ్రాహ్మణ్యము లభించె నని యంగీకరింపవలయు. అంతవఱకు నాకు నమ్మకము లేదు. ఇది నాకోరిక. దీని నెఱవేర్చిపొండు' - అని చెప్పఁగా దేవతలు వసిష్ఠునొద్దకుఁ బోయి యాయ నను బ్రార్థింపఁగా నామహాతపస్వి వచ్చి విశ్వామిత్రునితో స్నేహముచేసి విశ్వా మిత్రా! నీవు బ్రహ్మర్షివై తి వని చెప్పెను.

'క్షత్రియాణాం బలం తేజో, బ్రాహ్మణానాం క్షమా బలమ్'- భార. ౧-౧౭౫-౨౯. 'క్షత్రియులకుఁ దేజస్సు బలము - బ్రాహ్మణులకు క్షమ బల'మను నది వసిష్ఠుచర్య సూచించుచున్నది. "విప్రులయలుకయుఁ దృణహుతాశనంబు దీర్ఘమగునె" - భార.ఆది. బ్రాహ్మణుఁడు దీర్ఘక్రోధి కారాదు.

తే॥ నీవు బ్రహ్మర్షి వైతివి ♦ నిశ్చయముగ, బ్రాహ్మణార్హక్రియాకలా♦పంబు లెల్ల
నిన్నుఁబొందె నటంచేగ ♦ నిర్జరాళి, స్నేహపడియె నితండు వ♦సిష్ఠుతోడ. ౧౯౪

విశ్వామిత్రా! నీవు నిజముగ బ్రహ్మఋషివైతివి. బ్రాహ్మణుల కధికారము గల కార్యము లన్నియు నీవును జేయవచ్చును. ఆ యధికారము లభించె నని దేవతలు చెప్పిపోయిరి. అప్పుడీయనయు వసిష్ఠుతో స్నేహము చేసెను.

కం॥ ఈవిధమున బ్రాహ్మణ్యం, బీవిధితుల్యుండు పొంది ♦ యిచ్ఛాగతిమై
భూవలయంబునఁ గ్రుమ్మరు, నీవిశ్వామిత్రు నేమి ♦ యెంచితి రామా! ౧౯౫

ఈవిధముగ బ్రహ్మతో సమానుఁడైన యీయన బ్రాహ్మణ్యమును సంపాదించెను. ఇట్లు సంపాదించి ప్రపంచమందంతయు నిచ్చవొప్పనఁ దిరుగుచుండును. నీ గురువైన విశ్వామిత్రుని నేమని తలఁచితివి?

కామక్రోధములను విశ్వామిత్రుఁడు జయించి యుండెనేని దశరథుపై నెట్లు కోపించె నని ప్రశ్న. మునుపటి విశ్వామిత్రుఁ డయియుండెనేని శపించి యావల వేఱొకమాట మాటాడియుండును. అదియునుగాక కార్యసాధనమునకై యిది తెచ్చుకొనినకోపమేకాని మునుపటివలె మనస్సునఁ గాఁపురముచేయుచున్న కోపము కాదు. శ్రీరామచంద్రమూర్తి యిట్టివాఁ డనియే, "క్రోధమా

హారయ త్తీవ్రం, వధార్థం సర్వరక్షసామ్" అనుచోఁ జెప్పఁబడెను. రాక్షసులఁ జంపఁ గ్రోధము తెచ్చుకొనెను. ఇట్టి కోపము కోపముగాదు.

గీ॥ తనిసిరే వేల్పు లుదధిరత్నములచేత। వెఱచిరే ఘోరకాకోలవిషము చేత। విడిచిరే యత్న మమృతంబు పొడముదనక। నిశ్చితార్థంబు విడువరు నిపుణమతులు॥ శా॥ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై। ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ కావునన్" అను భర్తృహరి సూక్తికి విశ్వామిత్రుఁడే తగిన లక్ష్యము. విశ్వామిత్రునిచరిత్రవలనఁ దపస్సుచే సాధింపరానిది లేదనియు నెఱుంగఁదగు శాస్త్రమిట్లే చెప్పుచున్నది. 'తపసా లభ్యతే సర్వమ్' "తపసా విందతే మహత్" "నాప్రాప్యం తపసైవ కించిత్" "దురన్వయం దుష్ప్రధర్షం దురాపం దురతిక్రమమ్। సర్వం వై తపసాభ్యేతి తపో హి బలవత్తరమ్"- భార ౧౩-౧౨౨-౮. తపమనఁగా నింద్రియజయమే. 'ఇంద్రియాణ్యేవ సంయమ్య తపో భవతి నాన్యథా'. భార. 3-౨౧౧-౧౮.

కం॥ మునితల్లజుఁ డాకారం,బుగ బూనినతపము వీర్యమునకున్ రావున్
జననుతధర్మాసక్తుఁడు, వినితే శ్రీరామ! మౌని వృత్తాంతంబున్. ౧౧౯౬

ఈ మునిశ్రేష్ఠుఁ డాకారము వహించిన తపస్సు - వీర్యమునకు నెలవు - లోకు లందఱు స్తుతించునట్లు ధర్మమం దాసక్తి గలవాఁడు. రామచంద్రా! యీ మునీశ్వరుచరిత్రము వింటివికదా!

శిష్యుఁడు గురుపరంపరయు గురుమాహాత్మ్యము తెలిసికొని యుండవల యును. గురుపరంపర గురువువలననే తెలిసికొనవలయు గావునఁ దనవంశపరం పర విశ్వామిత్రుఁడే రామచంద్రమూర్తికిఁ దెలిపెను తనమాహాత్మ్యము తాను జెప్పిన నాత్మస్తుతియగును గావున దానినిఁ జెప్పఁడయ్యెను. తెలిసినవారివలన నిది తెలిసికొనవలయును. కావున దానిని శతానందుఁడు చెప్పెను.

విశ్వామిత్రుఁడు తొలుత రాజు, గృహస్థుఁడు. ఆవల భార్యతోడఁ జని వాన ప్రస్థుఁడై తపముచేసి రాజర్షియయ్యెను. ఆవల ఫలము లాహారముగఁ గొని తపస్సుచేసి ఋషియయ్యెను. ఇంతవఱకు భార్యలు బిడ్డలు కూడనే యుండిరి. ఆవల నొంటరిగఁ దపముచేసి మహర్షియయ్యెను. మహర్షులుకూడ జితేంద్రి యులు కారు. కావున జితేంద్రియుఁ డగుటకై పంచాగ్నిమధ్యమందు నిలిచి యాహారము మాని వాయువాహారముగఁ దపస్సుచేసెను. ఇంతచేసినఁ గామ మును జయింపఁగలిగెను. కాని క్రోధమును జయింపలేకపోయెను. దానిని జయిం చుటకై మౌనము వహించి కేవలకుంభకమందు నేండ్లకొలఁది నుండెను. ఇంతచేసి క్రోధమునుగూడ జయించి యావల బ్రహ్మర్షియయ్యెను. జన్మముచే

వచ్చు బ్రాహ్మణ్యము కర్మముచే రాదు. విశ్వామిత్రునకు వచ్చుటకు నితర కారణములు గలవు. ఎంతచేసినను కామక్రోధములు దుర్నివారములు. వానిని దనకు వశపడఁ జేసికొనినవాఁడే బ్రాహ్మణోత్తముఁడు. కావున బ్రాహ్మణ్యము సులభము గాదు. బ్రహ్మవిదున కపచారముచేసిన సర్వకార్యములు విఘ్నము లగును. కఠినప్రాయశ్చిత్తముచేఁగాని యాదోషముపోదు. ఇది ధ్వని. ప్రబంధగతవస్తువుచే వస్తుధ్వని.

సీ॥ అని చెప్పి గౌతమ♦తనయుఁ డూరక యున్న, జనకుండు రామల♦క్ష్మణులతోడ
నాతనివాక్యముల్ ♦ ప్రీతి నాకర్ణించి, కరములు ముకుళించి ♦ గాధితనయు
మోముఁ గనుంగొని ♦ భూమీశపుత్రుల,తో నీవు వచ్చుట ♦ దురితదూర
ధన్యుండ నైతిని ♦ మాన్యుండ నైతిని, నీదర్శనంబున ♦ నిర్మలాత్మ!
తే॥ పావనుఁడనైతి నీదుత♦పోవిశేష, ములను వింటి మసంఖ్యాక♦ములు గుణంబు
లప్రమేయంబు తపమును ♦ నప్రమేయ, మైన బలమును వినవిన♦నరిది తృప్తి. ౧౧౯౭

అసంఖ్యాకము = లెక్కింపరానిది, అప్రమేయము = పరిమాణములేనిది.

తాత్పర్యము.

అని చెప్పి శతానందుఁ డూరకుండెను. జనకుఁడు శ్రీరామలక్ష్మణులతోడ శతానందుఁడు చెప్పిన చరిత్రమంతయు విని హస్తములు జోడించి విశ్వామిత్రుతో నిట్లనియె. మునీంద్రా! నీవు రాజకుమారులతోడ నిచ్చటికి వచ్చుట చేతనే నేను ధన్యుఁడనైతిని. నాజన్మము పావనమయ్యెను. నీతపోమహిమ వింటిని. నీగుణములు లెక్కింపరానివి. నీతప మింతయని చెప్పరానిది. నీబలము కొలఁది చెప్పసాధ్యపడదు. వినకొలఁది తృప్తిలేదు.

ఉ॥ వేఁడివెలుంగువేలు పదె ♦ వ్రేలెడిఁ బశ్చిమశైలవాటిపై,
వేఁడెదఁ గర్మకాల మిఁక ♦ వీడ్కొనుదే దయ యుంచి, వేకువన్
బోఁడిమిఁ జూడఁగా దగును, ♦ బోయెద నేఁటి కటంచుఁ బల్కి యా
తేఁడు ప్రదక్షిణించె ముని♦తేని గురూత్తమబంధుయుక్తుఁడై. ౧౧౯౮

సూర్యుఁడు పశ్చిమపర్వతప్రదేశముపైఁ గ్రుంకుటకు సిద్ధముగా నున్నాఁడు. సంధ్యావందనాది కర్మముల కిది సమయము. దయయుంచి సెలవిమ్ము. ఉదయమున సంతోషముతో మరలఁ జూతును. ఇప్పటి కింటికిఁ బోయెదను. అని చెప్పి యారాజు గురువులతోను బంధువులతోను విశ్వామిత్రునికిఁ బ్రదక్షిణము చేసెను.

౬౦॥ రాముండు లక్ష్మణుఁడును మ,హామౌనిచయంబుఁ గొల్వ ♦ నాగాధిజుఁడుఁ
సామోదుండయి స్వాశ్రయ, భూమిం జేరంగఁజనియె ♦ బుధవినుతుండై. ౧౧౯౯

సామోదుఁడు = సంతోషముతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడు శ్రీరామలక్ష్మణులతోను మునీశ్వరులతోను సంతోషముతోఁ దాను దిగినచోటికిఁ బోయెను.

{ ౬౬ సర్గము. విశ్వామిత్రుఁడు జనకునితో రామలక్ష్మణులకు శివువింటిం జూపు మని చెప్పుట. }

ఉ॥ ఆమఱునాఁడు వేకువఁ గృ♦తాహ్నికుఁడై జనకావనీశుఁడుఁ
రామునితోడఁ గూడుకొని♦రా మునిఁ బిల్వఁగఁ బంచి వారలం
బ్రేముడి గౌరవించుచు స♦మీహిత మెయ్యది నాచరింతు నే
నో మునిచంద్రమా! యన నృ♦పోత్తముఁ జూచి వచించె మౌనియున్. ౧౨౦౦

కృతాహ్నికుఁడు = చేయఁబడిన పగటికార్యములు గలవాఁడు, ప్రేముడిఁ = ప్రేమచేత, సమీహితము = కోరిక.

తాత్పర్యము.

ఆ మఱుసనాఁటి యుదయమున జనకమహారాజు ప్రాతఃకాలకృత్యము లన్నియుఁ, దీర్చుకొని శ్రీరామచంద్రమూర్తితోడ రఘుని మునిరాజును బిల్వఁ బంచి వారు రాఁగా మిగులఁ బ్రేమతో గౌరవించుచు మునీంద్రా! మీరు కోరు నది యేదియో తెలిపితిరేని నేను జేసెదను. అని చెప్పఁగా నారాజుతో విశ్వామిత్రుఁ డిట్లనియెను.

సమస్త ప్రజలను రక్షింప నవసరము దొరకునా యనితానే సమయమున కెదురుచూచు భగవంతుఁడు, దేవతలశరణాగతి నెపముగాఁగొని రావణనిమిత్తమై యవతరించి, దాని కవాంతరోపాయభూతయై వేదవతియై, జనించి స్వయముగ సంకల్పించిన లక్ష్మీదేవి జనకవంశమున సీతగా నవతరింపఁగా, శీలమందు నడవడియందు సద్వంశమందుఁ దనతో సమానురాలగుకన్యను వరింపవలసినదను నీతి లోకమునఁ బ్రవర్తింపఁజేయుటకై యామెను బరిణయ మగుటకై ప్రయత్నించి సీత వీర్యశుల్క గావున రిక్తహస్తములఁ బోరాదని యామెకు యోగ్యమైనరీతిగా నామె సంతోషించునట్లు తాటకా సుబాహు వధచే దుష్టసంహారకార్యమును, కౌశికయాగరక్షణము - అహల్యాశాపమోక్షణము గావించుటచే శిష్టపాలనము, ముందుగాఁ గావించి యిఁకఁ బ్రత్యక్షముగ సీతను వరించుటకై యత్నముచేయుచున్నాఁడు.

క॥ వీరలు దశరథనృపతికు, మారులు దిననాథవంశ♦మండనులు మహా
వీరులు జగత్ప్రసిద్ధులు, కోరిరి నీధనువుఁ జూడఁ ♦ గువలయనాథా! ౧౨౦౧

జనకమహారాజా! వీరు దశరథమహారాజు కుమారులు. సూర్యవంశాలంకారములు. మహావీరులు. ప్రపంచమునఁ బ్రసిద్ధికెక్కినవారు. నీ ధనువును జూడఁగోరుచున్నారు.

క॥ ధనువును గాన్పింపుము యది, గనుఁగొని కృతకాములగుచుఁ♦గాకుత్స్థసుతుల్
చనువారు యథేష్టంబుగ, నన జనకుం డిట్లు లనియె ♦ నమ్మునితోడన్. ౧౨౦౨

కావున నీ ధనుస్సును జూపుము అదిచూచి కోరిక నెఱవేఱఁగా వారి యిష్టప్రకారము పోవఁగలవారు, అనిన నమ్మునితో జనకుఁ డిట్లనియె.

సీ॥ వినవయ్య మునినాథ ♦ వినిపించెదను నీకు, నీవి ల్లిచట నుండు♦హేతువులను
దేవరాతుం డన ♦ దివ్యప్రభావుండు, నిమికి నాఱవవాఁడు ♦ నిర్మలుండు
దేవత లతనికి ♦ దీని నిల్లడ యిచ్చి, పోయిరి దివికిని ♦ బూజ్యచరిత
దక్షాధ్వరధ్వంస♦తత్పరుం డయి మున్ను, రుద్రుండు త్రిదశుల ♦ రోషమునను
తే॥ గాంచి భాగార్థులార భా♦గంబు నాకు, నేల కల్పింప రిప్పుడ ♦ యిదిగో నొక్క-
పెట్ట మీశిరముల బలి♦పెట్టువాఁడ, నేల కీవింట నన సుర♦నికర మపుడు. ౧౨౦౩

మునీంద్రా! యీ ధను విచ్చట నాయొద్దనుండుకారణములను జెప్పెదను. వినుము. నిమికి నాఱవవాఁడైన దేవరాతుఁ డనురాజు దివ్యమహిమగలవాఁడు. అతఁడు మిగుల నిర్మలమైన మనస్సుగలవాఁడు. ఆయనయొద్ద నీవింటిని దేవతలిల్లడగానుంచిస్వర్గమునకుఁ బోయిరి. దేవతల కీవిల్లెట్లువచ్చెనందు రేమోవినుము. దక్షుఁడుచేయుయాగమును ధ్వంసముచేయు నాసక్తితో నుండు రుద్రుండు దేవతలను గోపించి యజ్ఞభాగార్థులైన దేవతలారా! యజ్ఞములందు మీరందఱు భాగములు పంచుకొని నా కేల లేకుండఁజేసితిరి? నాకు భాగమిచ్చెదరా? మీ యందఱితలలు నేలకు వరుసగ నీవింటితో బలిపెట్టుదునా?

ఉ॥ విన్నఁదనంబు దోఁపఁ దను ♦ వేఁడ క్షమించి ధనుస్సు నిచ్చె నా
పన్నగభూషణుండును సు♦పర్వులకుక్, మఱి వారు దీనినిక్
గ్రన్నన నాకుఁ బూర్వుఁ డగు♦రాజున కిచ్చిరి, నాఁటఁ గోలెఁ దా
నన్నది మద్గృహంబున న♦రోత్తమ! నిత్యసమర్చితంబు నై. ౧౨౦౪

అనిన దేవతలందఱు తెల్లఁబోయి తన్నుఁబ్రార్థింపఁ గా సర్వభూషణుఁడగు రుద్రుఁడు వారిని క్షమించి యాధనస్సును వారి కిచ్చెను. వారు దీనిని దెచ్చి నాకుఁ బూర్వుఁడగు రాజున కిచ్చిరి. ఆదినము మొదలు ప్రతిదినము పూజింపఁబడుచు నాయింట నున్నది.

క॥ జన్నంబు సేయుతలఁపున, దున్నింపఁగ భూమి నొండు • దోఁతెంచెఁ జుమీ
పిన్నది యొకర్తు, నే నా, చిన్నారిసెలంత కిడితి • సీతాహ్వయమున్. ౧౨౦౫

జన్నంబు = యజ్ఞము. తోఁతెంచె = కానవచ్చెను. చిన్నారి = సౌంద ర్యముగల దున్నింపఁగ = రెండుకాండ్లయెద్దులుకట్టిన నాఁగలిచే దున్నవలయు నన్న శాస్త్రవాక్యము ప్రకారము.

తాత్పర్యము.

ఒకసారి యొకయజ్ఞము చేయునభిప్రాయము గలవాఁడనై యొకభూమిని నాలుగెద్దులచే దున్నించితిని. ఆ నాఁగేటిచాలునం దొకచిన్నది కానవచ్చెను. సీత యనఁగ నాఁగటిచాలు కావున నాఁగటిచాలులో దొరకుటచే సౌందర్యముగల యీ పిన్నదానికి సీత యనుపేరుపెట్టితిని.

ఉ॥ మాన్యచరిత్ర! పూత మగు • మాడ్కి జనించెను గాని లోకసా
మాన్యగతిః జనింపద చు • మా, యటు గావుటఁ బెంచి కూఁతుఁగాఁ
గన్యను వీర్యశుల్క యని • గాధిజ! పెండిలి సేయకున్న రా
జన్యులు వచ్చి వేఁడిరి యొ • సంగవె మా కని, నేను వారితోన్. ౧౨౦౬

మాన్యమైన నడవడిగలవాఁడా! యీసీత పవిత్రమైన విధముగా జనించెను గాని లోకములోని యందఱు మనుష్యులవలెఁ బుట్టినది కాదు. కావున నేను నాకూఁతుగా నెంచి సాఁకితిని. ఈకన్య వీర్యశుల్క యని యెవరి కిచ్చి పెండిలి సేయక యూరకుండఁగా లోకములోని రాజకుమారులు వచ్చి మీపిన్నదానిని మా కిమ్మని కోరిరి.

సీ॥ ఈవిల్లు మోపెట్టు • నెవ్వఁడు వానికి, నాకూఁతు నిచ్చెద • లోక మెఱుఁగ
వీర్యశుల్క నొసంగ • బెండుమానిసి కన, విల్లుచూడఁగ వచ్చి • రెల్లవారు
గొనయంబు గనయంబుఁ • గూర్పు లేమియటుండ, నెత్తఁజాలరవార • లుత్తబిరుదు
లామూఁకమగఁటిమి • యల్పమా టెఱిఁగి నేఁ, గన్యనీయ నటన్న • మన్యువునను
తే॥ జుట్టు ముట్టిరి మిథిలను • బెట్టిదముగ, నట్టు చేసిన నేలక్ష్య • పెట్టనైతి
దిట్టతనమున వారెల్ల • రట్టుమీఱి, గట్టిమొనలుగఁ దీరిరి • తుట్టతుదకు.
౧౨౦౭

గనయము = వింటికొప్పు. గొనయము = అల్లెత్రాడు. మొనలు = వ్యూహములు. ఉత్తబిరుదులు = వ్యర్థమైన పౌరుషముగలవారు. బిరుదులుగల వారు బిరుదులు. 'విశేషణంబులు కొన్ని యెడ విశేష్యలక్షకంబు లగు' ప్రౌ వ్యా. శబ్ద. ౧౨.

తా త్ప ర్య ము .

అప్పుడు వారితో నే నిట్లంటిని. అయ్యలారా! నాకూఁతురు వీర్యశుల్క. శక్తిప్రదర్శనమే నాకూఁతున కీయవలసినయుంకువ. మఱి యే వస్త్రవాహనాద్యలంకారము లీయఁ బనిలేదు. ఈవిల్లు మోపెట్టువాఁ డెవ్వఁడో వానికి నా కూఁతు నిచ్చెదను; గాని దుర్బలున కియ్య నని చెప్పితిని. అని చెప్పగాఁ వారందఱు వచ్చి యల్లెత్రాడు వింటికొపున కెక్కింపలేకపోవుట యటుండ వింటినే యెత్తఁజాలరైరి. వారందఱు బింకపుబిరుదులుగలవారే కాని నిజమైన బలముగలవారు కారనియు, వా రల్పపౌరుషులనియుఁ దెలిసికొని నేను గన్య నీయనంటిని. దానిపై వారు నామీఁదఁ గోపించి యుద్ధమునకు సిద్ధపడి నా నగరము ముట్టడించిరి. వా రట్లు చేసినను నేను వారిని లక్ష్యపెట్టినవాఁడను గాను. వారంద ఱేకమై మట్టుమీఱి తుదకు గట్టిమొనలుగఁ దీరిరి.

సీ॥ ఏఁడాది వారు న ♦ న్నేఁచిన రణమున, సర్వసాధనములు ♦ సన్నగిల్లె
నెంతయు వగచి య♦హీనతపమ్మునఁ, దృప్తి నొందించితి ♦ దేవతలను
సంతసంబున వారు ♦ చతురంగబలముల, నీయఁ జెంగించితి ♦ నెల్లవీర
మాని శాత్రవులను ♦ మహితరణంబున, నూడఁబాడిరి వార ♦ లోర్వలేక

తే॥ యా ధనూరత్న మియ్యది ♦ యనఘశీల! కానిపించెద రామల♦క్ష్మణుల కిపుడు
విల్లు మోపెట్ట శ్రీరామ♦విభుఁ డయోని,జాత సీతను బ్రీతి నో♦సంగువాఁడ. ౧౨౦౮

వీరమాని = తాను వీరుఁడు గాకపోయినను వీరుఁడ నని తలఁచువాఁడు. ఊడఁబాడిరి = పరువెత్తిరి = ధనుర్ + రత్నము = ధనూరత్నము = శ్రేష్ఠమైన విల్లు.

వారు సేనలన్నియు వ్యూహముగాఁ బన్ని మిథిలను నొకసంవత్సరము ముట్టడించిరి. సాధనము లన్నియు క్షీణించెను. దానికై మిక్కిలి విచారపడి గొప్పతపస్సుచేసి దేవతలఁదృప్తి నొందించితి. వారు సంతోషించి నాకుఁ జతురంగబలము లొసఁగిరి. దానితో నావీరమాను లగు విరోధులనెల్ల నోడించి తఱిమితిని. వా రందఱు నాధాటి సైఁపలేక పరువెత్తిరి. ఇయ్యది యాధనూరత్నము. దానిని శ్రీరామలక్ష్మణులకుఁ జూపించెదను. శ్రీరామచంద్రమూర్తి విల్లు మోపెట్టఁగలిగెనా యోనియందు జన్మింపని మాసీత నిచ్చెదను.

౬౭-వ సర్గము

కం॥ జనకునివచనంబుల ముని, విని చూపుము వింటి ననిన ♦ విభుఁడు సచివులన్
గని కొని తెండీ చాపం, బనవుడు వా రెల్లఁ బురికి ♦ నరిగి ద్రుతగతిన్. ౧౨౦౯

జనకునిపలుకులు విని మునిపతి యేదీ వింటిని జూపు మనెను. అంతట జనకుఁడు మంత్రులతోఁ జాపము దెమ్మని చెప్పఁగా వారంద ఱూరిలోకి శీఘ్రముగఁ బోయిరి.

ఉ॥ ఆయతభీమదేహులు మ♦హాబలు లొక్కట నైదువేలు దా
రాయసపేటితోడను మ♦హాధనువుం గొనివచ్చి నిల్చి దే
వాయితతేజుఁ డైనజన♦వర్యుని మైథిలుఁ జూచి దేవ సు
శ్రీయుత మాశరాసనవ♦రిష్ఠముఁ దెచ్చితి మయ్య చూడుమా. ౧౨౧౦

ఆయతభీమదేహులు = దీర్ఘమైన భయంకరమైన దేహములుగలవారు. ఆయసపేటి = ఇనుపపెట్టె. దేవాయితతేజుఁడు = దేవతల తేజమువంటి తేజము గలవాఁడు.

తా త్ప ర్య ము.

దీర్ఘములై భయంకరమైన దేహములుగల మహాబలశాలు లైదువేలమంది యొక్కటిగఁబోయి యినుపపెట్టెతోడ పెద్దవింటిని దెచ్చి నిల్పి దేవతేజుఁడైన జనకునితో రాజేంద్రా! దివ్యధనువును దెచ్చినారము చూడు మని చెప్పిరి.

* జనకుఁడు రామలక్ష్మణులకు శివువింటిని జూపుట *

సీ॥ అని మంత్రు లాడిన ♦ జనకుండు గని లేచి, మోడ్పుఁగేలను రాచ♦మునిని రామ
సౌమిత్రులను జూచి ♦ యోమునిచంద్రమా, యిది యయ్య జనకాన♦నీంద్రు లెల్లఁ
బూజించుచాపంబు ♦ రాజు లెంతటిమహా, బలవంతు లయ్యును ♦ భగ్నపడిరి
యెక్క వెట్టఁగ లేక ♦ నిక్కు లెల్లను బాసి, మానవపాలుర ♦ మాట యేల
తే॥ సురలు నసురులు యక్షకి♦న్నరులు నైన, నెత్తఁజాలరు యెక్కిడు♦గేల చెప్పఁ
జూపఁగ నభీష్ట మేనియుఁ ♦ జూపవయ్య, చాపరత్నంబు రామల♦క్ష్మణుల కనిన. ౧౨౧౧

మంత్రులిప్రకారము చెప్పఁగా జనకమహారాజు లేచి చేతులు ముకుళించి విశ్వామిత్రుని రామలక్ష్మణులను జూచి, మునీశ్వరా! యిది జనకరాజు లందఱుఁ బూజించువిల్లు. ఎంతటిమహాబలు లని పేరువడసినవారందఱు విల్లెక్కుపెట్టలేక గర్వ ముడిగి యవమానపడి పోయిరి. మానవులయినరాజుల మాటయేల? కాని దేవతలు రాక్షసులు యక్షులు కిన్నరులునైన నెత్తలేకపోయిరి. ఇఁక మోపెట్ట లేదని యేల చెప్పవలె? నీ కిష్ట ముండి చూపఁదలఁచితివేని రామలక్ష్మణులకు దీనిని జూపుము.

కం॥ విని జనకునివాక్యము లా,మునివర్యుం డతిశయించు♦మోదంబున రా
మునిఁ జూచి వత్స రాఘవ, కనుమీ కోదండ మనినఁ ♦ గాకుత్స్థుండున్. ౧౨౧౨

జనకునిమాటలు విని విశ్వామిత్రుఁడు మహానందముతో రామచంద్రునిఁ జూచి 'నాయనా! రామచంద్రా! యీధనస్సును జూడుము' అనిచెప్పెను.

కం॥ మునివాక్యచోదితుం డయి, ధను వుండెడిమందసంబు ♦ దాయం జని మూఁ
తను దెఱచి చూచి యిట్లను, మునివర! స్పృశియించి కంటి ♦ ముదలయ యేనిన్.
౧_౨౧౩

మునివాక్యచోదితుఁడు=విశ్వామిత్రుని వాక్యముచేఁ బ్రేరింపఁబడినవాఁడు, మందసము = పెట్టె, ముదల = ఆజ్ఞ.

తాత్పర్యము.

విశ్వామిత్రునివాక్యముచేఁ బ్రేరింపఁబడినవాఁడై రామచంద్రమూర్తి ధను వుండుపెట్టె యొద్దకుఁ బోయి మూఁతదెఱచి చూచి మునీంద్రా! వింటిని దాఁకి చూచితిని. మీ రాజ్ఞ యిచ్చినయెడల.

కం॥ త్రిక్కక వెలుపలఁ దీసెద, నెక్కిడియెద నన్న నట్టులే ♦ కానిమ్మా
గ్రక్కున నని జనకుండును, మక్కువ గాధిజుఁడు పల్క ♦ మహీపసుతుండున్.
౧_౨౧౪

అవశ్యముగ దీని వెలుపలఁ దీసెద, ఎక్కుపెట్టెద, నని చెప్పఁగా జనకరాజు విశ్వామిత్రుఁడు ఆప్రకారమే చేయు మని చెప్పిరి.

—* శ్రీరాముఁడు హరువిల్లు విఱుచుట *—

కం॥ ఉఱక యవలీలఁ జాపం, బఱచేఁతను దిగిచి, చూడ ♦ నవనీశులు, క్ర
చ్చుఱఁ దెగ నిండఁగఁ దీసిన, బిఱుసే మని చెప్ప విల్లు ♦ ఫెల్లున విఱిగెన్. ౧_౨౧౫

లక్ష్యములేక యవలీలగా వింటిని నఱచేత బయట కీడ్చి రాజులందఱు చూచుచుండ వడిగా నల్లెత్రాడు పూర్తిగ లాగిన బిగు వేమని చెప్పవలెను; ఆయీడ్పుతోనే విల్లు ఫెల్లుమని రెండుగా విఱిగెను.

వింటియల్లెత్రా డొకకొన గట్టిగాఁగట్టఁబడి కావలసినపుడు రెండవకొనకుఁ దగిలించునట్లుగా నుండును. విల్లెక్కు పెట్టనపుడు ఋజువుగాఁ గట్టెవలె నుండును. వి ల్లెక్కుపెట్టువాఁ డెక్కు పెట్టవలసినకొప్పునకుఁ గొంచెము పైఁగా దండమును బట్టుకొని పైకి లేవనెత్తియల్లెత్రాటి నీడ్చితనపిడికిలిక్రిందనుండుకొప్పునకుఁ దగిలించును. ఇట్లీడ్చి తగిలించుటలో మితమునకంటె నెక్కువగా లాగుటచే ధనుర్దండము విఱిగెను. ఇది విలుకాని బలాతిశయము తెలుపుచున్నది.

కం॥ నిర్ఘాతనాద మగుచు ధ, నుర్ఘటితమహాస్వనం బ ♦ నూనం బగుదుర్
దీర్ఘముగ వణఁకె ధరణి స, నిర్ఘోషంబుగను గిరులు ♦ నెఱెపాఱుగతిన్. ౧_౨౧౬

నిర్ఘాతము = పిడుగు, నాదము = ధ్వని.

తా త్ప ర్య ము.

వింటిగెడి వింటిచప్పుడు పిడుగుపడినట్లు నిండిపోఁగాఁ గొండలు చీలునట్లు భూమి ధ్వనితోడఁ జాలసేపు వణఁకెను.

ఉ॥ రాముఁడు లక్ష్మణుండు ముని♦రాజు నృపాలుఁడు దక్క నెల్లరుఁ
భూమి విసంజ్ఞులై పడిరి ♦ బొమ్మర వోవుమనంబుతోడ, నా
భూమిధవుండు సభ్యతతి ♦ పోఁడిగఁ గ్రాలుడు లబ్ధసంజ్ఞ మై
యా మునితల్లజుం గనుచు ♦ న స్తదరుం డయి కేలు మోడ్చుచున్. ౧౨౦౭

రామచంద్రమూర్తి, లక్ష్మణుఁడు, విశ్వామిత్రుఁడు, జనకరాజు తప్ప తక్కినవా రందఱు మనస్సు భ్రమింప స్మృతిదప్పి నేలపైఁ బడిరి. ఆవలఁ గొంచెము సేపటికి సభ్యులందఱు స్మృతివచ్చినవారుకాఁగా జనకమహారాజు మునిశ్రేష్ఠునిఁ జూచి "యిటువంటి ప్రతినపట్టితినే ఈ వింటి నెవఁ డెక్కుపెట్టును? నామాట యెట్లు దక్కును? ఎవఁడు సీతకుఁ బెండ్లికొడుకు దొరకును. మనుష్యులలో దేవాదులలోఁ గూడ నిట్టివాఁడు కానరాలేదే. ఈ రామచంద్రమూర్తి యన్నివిధముల నొప్పి యున్నాఁడు. ఈయనకు మన సీతనిచ్చిన బాగుండునే. ఈయన వి ల్లెక్కుపెట్టఁ గలఁడో లేఁడో యీయన నా యల్లుఁ డగు నదృష్టము నాకుఁ గలదో లేదో" యని భయపడుచున్నవాఁడు భయమువిడిచి రెండుచేతులు జోడించి యిట్లనియె.

శా॥ కంటిం గంటి మునీంద్ర! రాఘవు నమోఘుం బై నదోశ్శక్తిఁ, దా
గెంటెన్ వింటి, మహాద్భుతంబుదు విశంక్యంపంగ దుస్సాధ మే
వెంటం జూడ నచింత్య మియ్యది చుమీ ♦ వే యేల మాసీతచేఁ
గంటిన్ ధన్యత రామచంద్రు విభుఁగాఁ ♦ గన్గొంట వాల్గంటియున్. ౧౨౦౮

మునీంద్రా! రామచంద్రమూర్తి భుజబలము చూచితిని, చూచితిని, కన్నారఁ జూచితిని. రామచంద్రమూర్తి వింటిని విఱిచెను. ఇది యాలోచింపఁగా మిక్కిలి యాశ్చర్యము అసాధ్యమునైనకార్యము. ఏవిధముగాఁ జూచినను నిది యిట్టి దని మనస్సునకైన వచ్చునది కాదు. ఇఁక నీమాటలు వేయేల, కాని మాసీత రామచంద్రమూర్తిని మగనిఁగా గ్రహించుటచే నేను ధన్యుఁడనైతిని.

కం॥ రాముని దశరథతనయుని, నాముద్దుఁగుమారి సీత ♦ నాథునిఁగ జన
స్తోమం బెఱుఁగఁగఁ బడసిత, పోమహితా! జనకవంశ♦మున కిఁకఁ గీర్తిన్. ౧౨౦౯

నాముద్దుఁగూఁతురు సీతదశరథకుమారుని శ్రీరామచంద్రుని లోక మెఱుంగు నట్లు ప్రసిద్ధరీతిని భర్తగాఁ బడసినది తపోధనా! మాజనకకులమునకే కీర్తి

సంపాదించి యిచ్చెను. "శ్లో॥ అనంతం బత మే విత్తం యస్య మే నాస్తి కించన మిథిలాయాం ప్రదీప్తాయాం న మే కించి త్ప్రదహ్యతే॥ నాకుఁగలధనమునకు మితి లేదుగాని దానిలో నాది కొంచెమైనను లేదు. కాలిపోవు మిథిలలో నాదేదియుఁ గాలిపోలేదు. (నాది యనఁగా నాత్మవస్తుసంబంధము). ఈవిధముగా మావంశమునకు వచ్చినకీర్తికంటె మాసీతవలన నెక్కువకీర్తి లభించెను.

కులము శీలవతి యగు కూఁతు రావంశమున నిరువదియొక్క తరమువారి నుద్ధరించును. "కులం తారయతే తాత సప్త సప్తచ సప్తచ" అని ప్రమాణము కలదు. కావున సీతవలన మాకులమంతయుఁ దరించెను.

ముద్దుఁ గూఁతురు = కొడుకు స్వార్జితమైన కీర్తినే కలిగించును, మాసీతయో జన్మప్రయుక్తాతిశయము గలది, భర్తృసంబంధకృతాతిశయముకలది, "కన్యా వరయతే రూపం, మాతా విత్తం, పితా శ్రుతమ్, బాంధవా శ్శీల మిచ్ఛంతి, మృష్టాన్న మితరే జనాః॥" కన్య తనమగఁడు రూపవంతుఁడుగా నుండఁగోరును, విద్యావంతుఁడుగా నుండవలయునని తండ్రి గోరును, తల్లి ధనము గోరును, చుట్టములు శీలము గోరుదురు, ఇతరులు పప్పన్నము గోరుదురు, అన్నిట్లు మాసీత రామచంద్రమూర్తిని వరియించి యిన్ని యతిశయములుగలదై యుండఁటను సంతోషపడెచెను.

—* జనకుఁడు దశరథునొద్దకు దూతలఁ బంపుట *—

ఉ॥ నాసుత వీర్యశుల్క యన నావచనంబు ఫలించె, నిచ్చెదన్
వాసిగ జీవితంబునకు ♦ వర్తిలి మిన్నగఁ బ్రేమపాత్ర యా
భూసుత రామచంద్రునకు ♦ భూరిగుణాబ్ధికి, నీయనుజ్ఞ మైఁ
గోసల కేఁగువార లిదె ♦ కోవిదవర్య! మదీయమంత్రులున్. ౧౨౨౦

నాకూఁతురు వీర్యశుల్క యని నేను జేసిన ప్రతిజ్ఞ ఫలించెను. నేను జెప్పిన ప్రకారము నాప్రాణముకంటెఁ బ్రియమగు భూపుత్రిని సీతను గొప్పగుణములు గల శ్రీరామచంద్రమూర్తి కిచ్చెదను. అని సీతను ధారాదత్తఁజేయ యత్నించెనుగాని రామచంద్రమూర్తి అంగీకరించినవాఁడు కాఁడు. విశ్వామిత్రుఁడు చెప్పినపని చేయవలసినదిగా నాకు జనకాజ్ఞ. ఆయన వింటిని జూడుమనెను. చూచితిని. ఎక్కుపెట్టుమనెను. ఎక్కుపెట్టఁబోయితిని. అది నిస్సారమైన దగుటచే ఫెళ్ళున విఱిగెను. నేను వివాహమాడుటకు నాతండ్రి యాజ్ఞలేదు. ఆ కార్యమునకు మాతండ్రి స్వతంత్రుఁడుగాని నేను గాను. ఆయన మెచ్చి యెవతెను వివాహముచేయునో యా వివాహము నాకు మెచ్చు. అని నిరాకరించెను. అప్పుడు విశ్వామిత్రుఁడు జనకమహారాజా! రామచంద్రమూర్తి ధర్మమే చెప్పెను, గావున

దశరథుని బిలిపింపుమనెను. జనకరాజును నీ యనుజ్ఞచే నయోధ్యకు నా మంత్రులిదే పోవుచున్నారు.

ఉ॥ చాలఁగ మీసుతుల్ కుశిక♦సంభవరక్షితు లౌచు వచ్చి మా
ప్రోలికి రాముఁడు గ్రధను♦ర్వర సభవారలు చూడఁ ద్రుంచుట
న్లీలగ వీర్యశుల్క సుత ♦ నీసుతరూజున కిచ్చువాఁడు నై
పాలితలోక మ మ్మిటకుఁ ♦ బంచెను మైథిలుఁ డంచు వేండియున్. ౧౨౨౧

పురశబ్దభవము ప్రోలు = పట్టనము.

తా త్ప ర్య ము.

వారిచే నేమిచెప్పి పంపెద వనియెదరా 'దశరథమహారాజా! నీ కుమారులు విశ్వామిత్రమహాముని రక్షింపఁగా నాయనవెంట మా పురమునకు వచ్చిరి. అందు రామచంద్రమూర్తి శివునిధనస్సును సభవారందఱు చూచుచుండ నవలీలగ విఱుచుటచే వీర్యశుల్క యగు నా పుత్త్రిని మీ కుమారుఁడు రామచంద్రమూర్తికి నిచ్చి వివాహము చేయఁదలఁచియున్నాను. ఈ వార్త మీ కెఱిఁగించి మిమ్ముఁ దోడుకొని రమ్మని జనకరాజు మమ్ముఁ బంపెను.'

కం॥ మీ రరుదేరఁగ వేఁడెడు, మారాజని యందు రనిన ♦ మౌని సరి యనఁగ
ధీరుఁడు మంత్రులఁ బుచ్చె య,ధారీతి వచింప దశర♦థక్ష్మాపతికిన్. ౧౨౨౨

మీరచ్చటికి రావలయునని మారాజు ప్రార్థించుచున్నాఁడు - అని చెప్పుదురు - అనిన విశ్వామిత్త్రుఁడును 'సరి - అట్లేపంపుము, అనిచెప్పెను. ఆమీఁద జనకమహారాజు దశరథునొద్దకు శుభలేఖ వ్రాసియిచ్చి దూతల నంపెను.

—* ౬౮-వ సర్గము *—

కం॥ రాజప్రేషితదూతలు, వాజులు రోఁజంగఁ బరువు♦పాఱుచు రాత్రుల్
వే జరపి మూఁడు ద్రోవన, యాజిపురము గనుచు నాలు♦గవదివసమునన్. ౧౨౨౩

రాజుచేఁబంపఁబడిన దూతలు గుఱ్ఱములు రోఁజునట్లుగ వానిని బరువెత్తించుచుఁ ద్వరగాఁ బ్రయాణముచేసి మూఁడురాత్రులు త్రోవలోఁగడపి నాలుగవ నాఁటి పగ లయోధ్యఁజేరి.

ఉ॥ ద్వారముఁ గాచియున్న భట♦వర్యులఁ గాంచి యెఱుంగఁ జెప్పుఁడీ
ధారిణినేతకున్ జనక♦ధాత్రిపుదూతల మంచు వారొనర
వారలు చెప్పివచ్చి జన♦పాలుఁడు రమ్మనినాఁడు వేగ మే
రారయ యన్న లోఁ జని ధ♦రావరు వృద్ధు సురాభు నాజినిన్. ౧౨౨౪

ఆజి = అజునికుమారుఁడు దశరథుఁడు.

తాత్పర్యము.

రాజద్వారము గాచియున్నభటుల ద్వారపాలురఁజూచి జనకమహారాజు దూతలము - ఆయనపనుపునవచ్చి కాచియున్నాము - అని మీరాజునకుఁ దెలియఁబఱుపుఁడని చెప్పఁగా, వారుపోయి చెప్పి మరలివచ్చి, దూతలారా! మీరు వచ్చినవార్త చెప్పఁగానే త్వరగాఁబిలుచుకొని రండని మాకాజ్ఞాపించెను. తడవు చేయక రండని పిలుచుకొనిపోఁగా వారు లోపలఁబోయి ముసలిఁవాఁడై దేవతలతో సమానుఁడైన దశరథునిఁ జూచిరి.

చం॥ కని భయ మేది కేల్మోగిచి ♦ కమ్రమృదూక్తుల రాజశేఖరా!
జనకుఁ డెఱుంగఁ గోరెడి స♦సర్వపురోహితమంత్రివహ్నివై
తనరెడినీదు సేమమును ♦ దద్దయు నింకొకవార్త గాధినం
దనుమెయికోలు గాంచి వసు♦ధాపతి యీగతి మన్విచేసెడిన్. ౧౨౨౫

భయమేది = భయమువిడిచి, కమ్ర = మనోహరమైన, మృదూక్తులన్ = మెత్తని మాటలచే - దశరథుని సౌజన్యము తెలిసినవారగుటచే నెట్లు మాటలాడినను గోపింపఁడని భయము విడిచి మాటలాడిరి.

తాత్పర్యము.

ఇట్లుచూచి భయమువిడిచి నమస్కరించి విన నింపైన మృదువైన మాటలచే రాజేంద్రా! జనకమహారాజు పురోహితులతోడను మంత్రులతోడను అగ్నులతోడను గూడిన మీ క్షేమము తెలియఁగోరుచున్నాఁడు. మఱియొక వార్తయుఁ గలదు. విశ్వామిత్రమునీశ్వరునాజ్ఞ నొంది మా రాజిట్లు మీకు మనవి చేయుచున్నాఁడు.

సీ॥ వినవయ్య నాసుత ♦ వీర్యశుల్క యటంచుఁ, బ్రతిన చేసితి మున్ను. పార్థివేంద్ర!
రాజులెందఱో వచ్చి ♦ రాజానన వరింప, బెండుమానసు లయి ♦ పెంపు సెడిరి
గాదె యదృచ్ఛమై ♦ గాధేయుతో వచ్చి, నీసుతుల్ గెలిచిరి ♦ నీరజాక్షి
నినసభమునఁ గన ♦ నెల్లరు రాముండు, వింటిని రెండుగా ♦ విఱిచి వైచెఁ
తే॥ గాన నమ్మహాత్మునకు నా♦కన్య సీత, నొసఁగి వీర్యశుల్క యనెడి ♦ యుక్తి దీర్పఁ
గోరుచున్నాఁడ నాకోర్కి ♦ దీర మీరు, సెల వొసంగెద రే యట్ల♦చేయుమనుచు.
౧౨౨౬

ఇనసభము=రాజసభ, "సభా రాజాఽమనుష్యపూర్వా" పాణిని-.౨-౪-౨౩. "అశాలాచ" ౨-౪-౨౪. సమాసమందు రాజపర్యాయశబ్దము మొదటిదిగానుండి (రాజశబ్దముగాదు) జనసమూహార్థమును దెలుపుసభాశబ్దము రెండవదిగానుండె

నేని యది నపుంసకమగు-"రాజసభ-ఇనసభము-ఈశ్వరసభము-ఇట్లు లే రక్షస్స భము-పిశాచసభము. స్త్రీసభము. స్త్రీసభ యనరాదు. ధర్మసభ ఇచ్చటసభాశబ్దము నకు శాలయని యర్థము ప్రతిన = ప్రతిజ్ఞ. రాజానన = చంద్రునివంటి ముఖ ముగలది బెండుమానసులు = నారహీనస్థమైన మనుష్యులు. యదృచ్ఛమై = ఆకస్మికముగ, ఇనసభము = రాజసభ, నీసుతుల్ గెలిచిరి = పందెమందు గెలి చిన వాఁడు రామచంద్రమూర్తి యొక్కఁడేయైనను, పూజ్యార్థమందు బహువచ నము. అల్లుడనిగౌరవము. లేదా మహారాజకుమారుఁడని పూజ్యత. శ్రీరామునితోడ లక్ష్మణుఁడు వచ్చుటచే నొకరుగెలిచిన నిరువురు గెలిచినట్లే. శ్రీరామలక్ష్మణుల సౌభ్రాత్రము జగత్ప్రసిద్ధమగుటచే వారిరువురు నొకయుద్ది కావున నొకరుచేసినపని యిరువురు చేసినట్ల యగుట బహువచనము. దేవ దానవమానవులకును నెత్తుటకును సాధ్యముగాని శివునివింటని విఱుచుటచే నిది యమానుషకృత్యమని బహుమానబుద్ధిచే బహువచనప్రయోగము.

తాత్పర్యము

రాజేంద్రా! వినుము నాకూఁతును సీత వీర్యశుల్కయని ముందు ప్రతిజ్ఞ చేసితిని. ఆచంద్రముఖిని వరింపఁగోరి యెందఱో వచ్చి బీరములేనివారై వ్యర్థా శులై పోయిరి. విశ్వామిత్రునితోడ నీకుమారులు నాయదృష్టము కొలఁది యాకస్మికముగ వచ్చి రాజులు నిండియుండు సభయందు నాపుత్రికను గెలిచిరి. ఎట్లన అందఱుఁజూచుచుండ వింటని రామచంద్రమూర్తి రెండుగా విఱిచెను. కాన నమ్మహాబలశాలికి నాసీతనిచ్చి వివాహముచేసి నాకూఁతురు వీర్యశుల్కయని నేను జేసినప్రతిజ్ఞ నెఱవేర్పఁదలఁచి యున్నాఁడను. నాకోరికఁ దీర్చుకొన నట్లే యని యాజ్ఞ యిచ్చెదరా?

మహాత్మునకు ననుటచే నిది యాయనస్వశక్తిచేఁ జేసినకార్యమేకాని యింద్ర జాలముకాదని భావము. ఎల్లరుఁజూడంగ ననటచే నిందు రహస్యము పక్ష పాతము లోనైనవి లేవని భావము.

చం॥ కొడుకులఁ జూడవచ్చు, నృప♦కుంజర! సంతస మందవచ్చు, నా
యడిగినకోర్కి దీర్చ నను ♦ వౌ, నటుగానఁ బురోహితాళితో
వడి హితపాళితో సచివ♦వర్గముతోఁ గొలువంగ దేవెరు
ల్గడయక యేగు దెమ్ము, సుతు♦లం గనఁగోష్ఠు ప్రియంబు మీఱఁగన్. ౧౩౨

దేవెరి నా॥-దేవేరి = రాణి. దేవీశబ్దభవము.

తాత్పర్యము.

రాజేంద్రా! యచ్చటికి మీరు దయచేసితిరేని మీకొడుకులను గోడండ్రను జూడవచ్చును. వివాహముఁజూచి సంతోషింప వచ్చును. నాకోరిక నెఱవేఱు

టకు సాధ్యమగును. కావునఁబురోహితులతో హితులతో మంత్రులతో వచ్చి పుత్రులను జూడుము.

సుతులః - 'సుతశ్చ సుతాచ తయోరేకశేష' యని సుతులు అనఁగా కూఁతురు కొడుకు అను ఏకశేషచే నా కూఁతురు నీ కూఁతురే యని భావము.

తే॥ అనుచు వచియించి సందేశ♦హారులు, రాజ, గౌరవముశంకచే నిల్వ♦ ఘొ్మథవుండు
వామదేవవసిష్ఠాది ♦ వరసచివుల, మోముఁ గని పల్కె నిర్భరా♦మోదయుక్తి. ౧౨౮

సందేశహారులు = దూతలు, నిర్భరామోదయుక్తి = అతిశయించిన సంతోషముతోఁగూడి.

తాత్పర్యము.

అని మా రాజు చెప్పెనని చెప్పి రాజులయొద్ద విశేషించి మాటలాడుట గౌరవము గాదని పలుకకుండిరి. దశరథుఁడును వామదేవవసిష్ఠాదులను మంత్రులను బిలిపించి సంతోషమున నప్పొంగుచు నిట్లనియె.

సీ॥ గాధిజగుప్తుఁడై ♦ కౌసల్యతనయుండు, సౌమిత్రితోఁ గూడి ♦ జనకపురిని
నున్నవాఁడట, రాము♦నుగ్రశక్తిని జూచి, జనకుండు సుత నీయ ♦ సమ్మతించె
నఁట, జనకునివృత్త♦ మది మీకు మెచ్చేనిఁ, దిరలుద మచటికిఁ♦దడ విఁ కేల
యనుడు మంతురు లెల్ల ♦ రగు నగు నిది యన, సంతుష్టచిత్తుఁడై ♦ జనవిభుండు
తే॥ చేయనగు శ్రేష పయనంబు♦సిద్ధమనుచు, మంత్రులకుఁ జెప్పిజనకుని♦మంత్రులకును
హితము దీపింపఁగా బహు♦మతు లొసంగ, నిశను జపరి వా రంప♦నిష్కళముగ. ౧౨౯

గాధిజగుప్తుఁడు = విశ్వామిత్రునిచే రక్షింపఁబడువాఁడు.

తాత్పర్యము.

విశ్వామిత్రుఁడు రక్షింపఁగాఁ గౌసల్యాకుమారుఁడు మన రామచంద్రమూర్తి లక్ష్మణుతో జనకుని రాజధానియగు మిథిలయం దున్నాఁడఁట. మన శ్రీరామచంద్రుని బలపరాక్రమముఁ జూచి మెచ్చి జనకుఁడు తనకూఁతునిచ్చి వివాహము చేయుచున్నాఁడఁట. జనకుఁడు తలపెట్టిన కార్యము మీకు సమ్మతమేని యాలస్యములేక పయనమై పోదము. అనఁగా మంతురులందఱు నిది తగినకార్యమే మంచి సంబంధమే యనఁగా దశరథుఁడు సంతోషించి యుదయమునందే మనము ప్రయాణము కావున సర్వము సిద్ధపఱుపుఁ డని మంత్రులకాజ్ఞాపించి జనకుని మంత్రులకును హితవైనరీతి శుభవార్తతెలుపుటచే బహుమానము లిచ్చెను. వారును నా రాత్రి యందే యుండిరి.

౬౯-వ సర్గము

సీ॥ రేపాడి! సభదీరి ♦ భూపతి చుట్టముల్, మాగలు గొలువ సు♦మంత్రుఁ జూచి
యిప్పుడ ధనములు ♦ కుప్పలుగాఁ గొని, ధనపతుల్ముందుగాఁ ♦ దరల వలయుఁ
జతురంగబలముల ♦ ద్రుతగతి వెడలింపు, మాజ్ఞతోడనె కూర్పు ♦ మందలంబు
వామదేవుండు పి♦తామహసుతుఁడును, జాబాలికాశ్యపుల్ ♦ సాధుగతి చి
తే॥ రాయువు మృకండుసుతుఁడు కా♦త్యాయనుండు
చనఁగవలె మున్ను, నా కొక♦స్యందనంబుఁ
బన్ను మీ దూత లాత్రము♦పఱచుచున్న
వారు కాలంబు మీఱిన ♦ వలను గాదు. ౧౨౩౦

రేపాడి = ఉదయము.

ఉదయముకాఁగానే దశరథుఁడు సభ దీరి బంధువులు మాగలు కొలుచుచుండఁగా సుమంత్రునిఁజూచి యిప్పుడే బొక్కసమున కధికారులైనవారు విశేష ధనము తీసికొని బయలుదేఱవలయును. వారివెంటనే చతురంగబలములు త్వరగాఁ బ్రయాణముకావలయును. నాయాజ్ఞయైనదో లేదో తత్క్షణము పల్లకీ జతపఱుపుము వామదేవుఁడు, వసిష్ఠుఁడు, జాబాలి, కాశ్యపుఁడు, దీర్ఘాయువగు మార్కండేయుఁడు, కాత్యాయనుఁడు - వీరుముందుగాఁబోవలెను. నా నిమిత్తమొక రథమేర్పాటుచేయుము. దూతలు త్వరపెట్టుచున్నారు. కాలము మీఱి మనము పోయియు నేమి ప్రయోజనము?

కం॥ అనవుడు సుమంత్రుఁడను ధ,జ్జనపతి యాదేశమునను ♦ సర్వబలంబుల్
బనిచి ఋషివర్యులకు స్యందనములు కల్పించి తెలిపె ♦ దశరథపతికిన్ ౧౨౩౧

దశరథుఁ డిట్లు చెప్పఁగా రాజాజ్ఞ ప్రకారము సమస్తసేనను బంపి ఋషులకు రథము లమర్చి సర్వము సిద్ధమని రాజునకుఁ దెలిపెను.

ఉ॥ రాజవరుండు మంత్రిముని♦రాజసమూహము గొల్వ వాహినీ
రాజులతో శతారిగతి ♦ రాజిలు వేడ్కను బంచమాహ్నమం
దోజ విదేహముం గన మ♦హోత్సుకతన్ జనుచుండు వచ్చి తాఁ
బూజ లొనర్చె నామునలి♦భూపతికిన్ భృశహృష్టచిత్తుఁడై. ౧౨౩౨

శతారి = ఇంద్రుఁడు, శతారము - వజ్రము, నూఱంచులు గలది. అదిగలవాఁడు శతారి.

తాత్పర్యము.

రాజేంద్రుఁడగు దశరథుఁడు మునిరాజులగుంపు తన్నుఁ గొలిచివచ్చుచుండ సేనాసమూహములతో నింద్రునివలె మిక్కిలి సంతోషముతో నైదవదినము

పగట విదేహనగరము చేరఁగా జనకుఁడు మిక్కిలి సంతుష్టిగల మనస్సుగల వాఁడై వచ్చి ముసలిరాజును బూజించెను.

—✱ జనకుండు దశరథుతోఁ గుశలప్రశ్న సేయుట ✱—

తే॥ స్వాగతము నీకు నోనర♦పాలచంద్ర, వచ్చితివినాదు శ్రేయస్సు♦పండుకతన ౬౦౦౧
నాత్మభవశౌర్యసంజాత♦మైన ప్రీతి, ననుభవింపుము మనసార♦నర్గతేజ ౧౨౩౩

రాజసత్తమా! నీకు స్వాగతము. నా భాగ్యము ఫలించిన కారణముచే నా పట్టనమునకు వచ్చితివి కొడుకుల శౌర్యమువలనఁ గలిగిన సంతోషము మనసార ననుభవింపుము.

ఈ పద్యమునందలి 'శ్రేయస్సు' లోని 'శ' వర్ణము ౮౩వ పద్యములోని యాఱవ యక్షరము.

సీ॥ నాయదృష్టంబున ♦ నరనాథచంద్రమా, నినుఁ గాంచుపుణ్యంబు ♦ నేఁడు గలిగె
నాభాగ్యమునను మ♦హాభాగ ద్విజయుక్తు, ఘను వసిష్ఠమునీంద్రుఁ♦ గనఁగఁగలిగె
నాసుకృతంబున ♦ నలినలిగాఁ బోయెఁ, బ్రత్యూహనిచయంబు ♦ పార్థివేంద్ర
నాపుణ్యమునఁ జేసి ♦ నళినాప్తవంశమ, హాత్ములతో వియ్య ♦ మందఁగంటిఁ
తే॥ బరమశౌర్యాఢ్యులైనమీ♦బాంధవమున, నస్మదన్వయ మతిపూజ్య♦మయ్యెనిపుడు
నిండె నాకోర్కు లెల్లను♦ నీదుకృపను, సరసగుణసాంద్ర దశరథ♦ఖ్యాతలేంద్ర. ౧౨౩౪

దశరథరాజ చంద్రమా! నాయదృష్టముచే నిన్ను నేఁడు దర్శించుపుణ్యము గలిగెను. మహాభాగా! నాభాగ్యమువలన బ్రాహ్మణులతోఁగూడిన వసిష్ఠుఁ జూడఁగంటిని నాపుణ్యపరిపాకముచేత విఘ్నసమూహము లన్నియు నాశమై పోయెను. నాపుణ్యము మంచిదగుటచే సూర్యవంశపు రాజులతో వియ్యమాడ గలిగెను. మిక్కిలి బలవంతులైన మీతోడి బంధుత్వము గలుగుటచే మావంశ మతిపూజ్య మయ్యెను. నీదయచే నాకోర్కులన్నియు నెఱవేఱెను.

తే॥ రేపు వఱువాత నోధరి♦త్రీమహేంద్ర, వేళ్ళకడపలఁ జలుపుమీ ♦ విధిహితముగఁ
బరమఋషిసమ్మతంబుగఁ ♦ బరిణయంబు, ననిన జనకునితో సన♦నాజి యెలమి. ౧౨౩౫

వఱువాత = ప్రాతఃకాలమున. యజ్ఞముకడపట శాస్త్రసమ్మతమైనరీతిని పరమర్షుల కిష్టమైన విధముగఁ బరిణయంబుచేయుము, అనిన సంతోషముతో దశరథుఁడు జనకున కిట్లనియె.

క౦॥ ఇచ్చెడివారలవశ మగుఁ, బుచ్చుకొనుట యనుచు వింటిఁ ♦ బూర్వము ఱేఁడా
యెచ్చందమున వచించిన, నచ్చందమునం జరింతు ♦ నన్యఁడ నోకో. ౧౨౩౬.

దానము దాతవశమని తొల్లిపెద్దలుచెప్పఁగా వినియుంటిని. దాతవు నీవు. నీ వేవిధముగఁ జెప్పెదవో యావిధముగనే వర్తించెదను. నేనేమి క్రొత్తవాఁడనా?

క౦॥ కీరితి ధర్మముఁ గూర్చెడి, వ్యారమణునినడికి నాతఁ ♦ డచ్చెరువుగొనెఁ
జేరినమునిసంఘాతం, బారఁగ సుఖరీతిఁ గడపె ♦ నారే ప్రీతిన్. ౧౨౩౭

దశరథుఁడు గొప్ప రాజవుటచే నెంత రాజసముగా నో మాటలాడునని తలఁచి యుండిన జనకుఁడు వినయముతోఁ గూడి కీర్తి ధర్మము వృద్ధిచేసెడి దశరథుని మాటలు విని యాశ్చర్యపడెను. పెండ్లికై వచ్చిన మునిసమూహమంతయు నచటనే సుఖముగాఁ గడపెను.

క౦॥ తనయులఁ గని రఘుభూపతి,మనుమఁడు సుఖగోష్ఠి నుండె ♦ మఱి జనకుండుఁ
గొన ముట్టఁ దీర్చి జన్నము, గొనబుగఁ గావించెఁ బెండ్లి♦కూఁతుల సుతలన్.
౧౨౩౮

రఘురాజుమనుమఁడగు దశరథుఁడు పుత్త్రులఁ జూచి వారితో సుఖముగ ముచ్చట లాడుచుండెను. జనకుఁడు యజ్ఞము సాంతముచేసి కూఁతులను బెండ్లి కూఁతులను జేసెను.

⟜✱ ౭౦-వ సర్గము ✱⟝

సీ॥ వెఱువాతఁ గృతకర్త♦వర్గుఁడై జనకుఁడ,నఘుఁ బురోహితు శతా♦నందుఁ జూచి
నాచిన్నతమ్ముండు ♦ నయధర్మశీలుండు, ఘనపుష్పకాభసాం♦కాశ్యపురిని
నిక్షుమతీజలం ♦ బింపారఁ గ్రోలు చు,న్నాడు కుశధ్వజ♦నామకుండు
వానిఁజూడఁగనాకు♦వాంఛయయ్యెడునాదు, క్రతువుఁగాచెనటంచుఁ♦గలదునాకు
తే॥ నాతఁడీవేడ్కనాతోడ♦ననుభవింప, వలయు ననియానయయ్యెడు♦వలయుఁబనుప
వార్తికావళి నతనికి ♦ వైళమ యని, పుచ్చెఁ గొందఱ జంఘాల♦పుంగవులను.
౧౨౩౯

వెఱువాతన్ = ఉదయమున, కృతకర్మవర్గుఁడై = చేయఁబడిన సంధ్యావందనాది కార్యములు గలవాఁడై, వార్తికావళిన్ = దూతలను. జంఘాలురు = త్వరగ నడమవారు, బలిష్ఠములైన పిక్కలు గలవారు.

తాత్పర్యము.

జనకమహారాజుదయమున నె లేచి ప్రాతస్సంధ్యాది కృత్యముల నెల్లఁ దీర్చి కొని తన పురోహితుఁడైన శతానందునిఁ జూచి యిక్షుమతీనదీతీరమున నుండు పుష్పకమువంటి సాంకాశ్యపట్టణమునకు రాజై పాలించు నా తమ్ముఁడు నీతిధర్మముఁ దప్పనివాఁ డగు కుశధ్వజుఁ డున్నాఁడు. నేను జేయుచుండిన యజ్ఞ

మును వాఁడు కాపాడెనుగదా యని మనస్సునఁ గలదు. కావున వానినిఁ జూడఁ గోరెదను. ఈ వివాహమహోత్సవసంతోషము వానితోడ ననుభవింపవలయు నని యాసయగుచున్నది. కాఁబట్టి యతనియొద్దకు శీఘ్రముగ నడువఁగల దూతలఁ బంపవలయు నని చెప్పి తగినవారినిఁ బంపెను.

ఆ॥ విభునిశాసనమున ♦ వేగవంతంబులౌ, సైంధవముల నెక్కి ♦ జాగు లేక
జిష్ణునాజ్ఞచేత ♦ విష్ణునిఁ గొనివచ్చు,వారు వోలె నరిగి ♦ వార్తఁ దెలుప. ౧౨౮౦

రాజాజ్ఞాప్రకారము వేగముగఁ బోవు గుఱ్ఱములపై దూతలు తడవుసేయక ప్రయాణము చేసి యింద్రునియాజ్ఞచే నుపేంద్రుని గొనివచ్చువారివలెఁ బోయి యాయనకు జనకుఁడు చెప్పినవార్తఁ దెలిపిరి.

తే॥ అన్న రమ్మన్న యామాట ♦ విన్న యంతఁ
గ్రన్న నరుదెంచి మోదంబు ♦ మిన్ను ముట్ట
నన్నకుఁ బురోధకును మ్రొక్కి ♦ చెన్నుమీఱు
చున్న యొకయాసనంబున ♦ నన్న, నిల్చు. ౧౨౮౧

అన్న రమ్మన్నాఁడనఁగానే కుశధ్వజుఁడు బయలుదేఱి త్వరగా వచ్చి సంతోషాతిశయముచే నన్నకుఁ బురోహితునకు నమస్కరించి తగిన యాసనమునఁ గూర్చుండెను.

ఉ॥ భ్రాత లలంకరించి రుచి♦రం బగునాసనపాళులం గడుం
బ్రీతి సుదాము మంత్రివరుఁ ♦ బిల్చి వచించిరి మంత్రిసత్తమా!
చేతము పల్లవింపఁ జని ♦ చెచ్చెరఁ దోడ్కొని రమ్ము యాజిధా
త్రీతలనాథు ధీసచివ♦బృందముతో నిజపుత్రపంక్తితోన్. ౧౨౮౨

అన్నదమ్ము లిరువురు యోగ్యమైన యాసనంబులపైఁ గూర్చుండి, సుదాముఁ డను ముఖ్యమంత్రినిఁ బిలిచి మంత్రివరా! నీవు పోయి సంతోషముతో దశరథ రాజును మంత్రులతోను పుత్రులతోను దోడుకొని రమ్ము.

కం॥ అనుడు సుదాముఁడు దశరథ,జనపతిశిబిరంబుఁ జొచ్చి ♦ క్ష్మాపతిఁగని వం
దన మొనరించి శిరమ్మున, జనకుఁడు మిముఁ జూడఁ గోరె♦సపురోహితుఁడై.
౧౨౮౩

అని చెప్పఁగా సుదాముఁడు వెంటనే పోయి దశరథుఁడు దిగియుండు శిబిరముఁ బ్రవేశించి యాయనను జూచి శిరస్సుతో నమస్కరించి రాజేంద్రా! పురోహితునితోడనుండి జనకరాజు మిమ్ముఁ జూడఁగోరుచున్నాఁడు.

సీ॥ నావుడు దశరథ♦భూవల్లభుఁడు ఋషి, వర్గంబు నిజబంధు♦వర్గ మమరఁ
జని జనకావనీం♦ద్రునిఁ జూచి యిట్లనుఁ, దెలియుఁడు విక్ష్వాకు♦కులము వేల్పు
యీవసిష్ఠుం డని ♦ యీవంశీలుండె, సత్త్వయుతకిలాప్త♦శక్తుఁ డనఘ
గాధిజుం డాదిగా ♦ మేధావులీయున్న, మును లెల్ల ననుమతిం♦చిన మదీయ

తే॥ వంశవిధ మీమహర్షి ని♦స్సంశయముగఁ, దెలుపఁగలవాఁ డటంచని♦పలుకకున్న
హితపురోహితమంత్రిస♦మేతు మిథిల, నాథుఁ గని గాని యప్పుడు♦నాథుఁ డనియె. ౧౨౮౮

అని సుదాముఁ డిట్లు చెప్పఁగా దశరథుండును ఋషి సమూహము బంధుసమూహముతోడఁ బోయి జనకరాజును జూచి రాజవర్యా! మా యిక్ష్వాకువంశము నకు కులము వేల్పు వసిష్ఠుఁ డని మీకుఁ దెలియుంగదా! ఈయనయే మావిషయమై చెప్పవలసిన విషయము లన్నియుఁ జెప్పవలెను. అన్ని కార్యములు సాధింప శక్తిగలవాఁ డీయనయే. గాధిజుఁడగు విశ్వామిత్రుఁ డాదిగా నిచటనుండు మునీశ్వరులందఱు ననుమతించిన రేని మావంశవిధ మీవసిష్ఠుఁడు సందేహము లేకయుండఁ జెప్పఁగలవాఁడు - అని చెప్పుచుండెను. అంతట హితులతోడను, బురోహితులతోడను, మంత్రులతోడను గూడియుండు జనకునకు వసిష్ఠుఁ డిట్లనియె.

కన్య నిచ్చుకోలు పుచ్చుకోలు సందు అథయుపక్షమున మూఁడుతరముల వంశజ్ఞానము ప్రధానము. కుల మెఱుఁగక కన్య నీయరాదు. తీసికొనను రాదు. కావున తన వంశమును దెలియఁ జేయవలసివచ్చెను. వసిష్ఠుని మీఁద నే భారమంతయు వేసిన నే సిగ్గుచేసికొని నసయమున నాయన నాపేరైనఁ జెప్పకపోయెఁ గదాయని విశ్వామిత్రుఁడు కోపించునో యని యాయన యనుమతి కోరెను

వివాహమందు వధూవరుల కులము పరీక్షింపవలెను ‘కుల మగ్రే పరీక్ష్యే మాతృతః పితృతశ్చ’- ఆశ్వలాయనుఁడు- తల్లి తండ్రుల కులము పరీక్షింపవలయును. “మహాన్త్యపి సమృద్ధాని, గోజాధనధాన్యతః స్త్రీ సంబంధే దశైతాని, కులాని పరివర్జయేత్”- మను. “గోవులు - మేఁకలు - గొఱ్ఱెలు - ధనము-ధాన్యము నివి యెంత సమృద్ధిగ నుండినను వివాహవిషయమున నీక్రింది పదివంశముల వారిని విడువవలయును. అవియేవన - “హీనక్రియం, నిష్పురుషం, నిశ్ఛందో, రోమశార్శసమ్, క్షయ్యామయా వ్యపస్మారి శ్విత్రికుష్ఠి కులానిచ” జాతకర్మాది క్రియలు లేనిది, పురుషసంతానము లేనిది, విద్యాశూన్యమైనది, మిగుల వెండ్రుకలుగల రోమములు కలది, మూలరోగముగలది, క్షయము అజీర్ణము అపస్మారము బొల్లి కుష్ఠము గలది యను వంశములతో వివాహ సంబంధము చేయరాదు. “యస్యాస్తు నభవేద్భ్రాతా, నవిజ్ఞాయేతవా పితా

నోపయచ్ఛేతతాం ప్రాజ్ఞః పుత్రికాధర్మశంకయా॥ తోడఁబుట్టినవాఁడు లేని పిల్లను, తండ్రియెవఁడో తెలియనిదానిని వివాహమాడరాదు. ఇప్పుడు పుత్రికా శంకలేదు గావునఁ దోడఁబుట్టువులు లేనిదానిని వివాహమాడవచ్చును. గాని తండ్రిఁదెలియని దానిని వివాహమాడరాదు.

* వసిష్ఠుఁడు జనకునితో సూర్యవంశక్రమంబుఁ దెలుపుట *

సీ॥ అవ్యక్తజుఁడు నిత్యుఁ • డవ్యయుం డగుబ్రహ్మ,గనె మరీచి నతండు•కశ్యపమునిఁ
గనియెఁ గశ్యపునకుఁ • గలిగె వివస్వంతుఁ, డన నాతనికిఁ బుట్టె • మనువు వాని
తనయుఁ డిక్ష్వాకుఁ డా•తనిరాజధాని య,యోధ్యాపురం బయ్యె•నొప్పమీఱ
నిక్ష్వాకుతనయుఁడై • యెసఁగెఁ గుక్షి వికుక్షి, కొడు కాతనికని వి•కుక్షిసుతుఁడు
తే॥ బాణుఁ డనరణ్యుఁ[1] డాతని•పట్టి యయ్యె
నతనిపుత్త్రుఁడు పృథుఁడు త•దాత్మజుండు
సుమి త్రిశంకుఁడు నాతని•సుతుఁడు ధుంధు
మారుఁ డన నొప్పెఁ గడు నస•మానబలుఁడు. ౧౨౪౫

సీ॥ యువనాశ్వుఁడనునామ•మొప్పు నాతనికిఁద,త్తనయుఁడుమాంధాతృ•జనవిభుండు
మాంధాతృసుతుఁడు శ్రీ•మంతుఁడై ససుసంధి, యతనికి ధ్రువసంధి•యనఁ బ్రసేన
జిత్తు నాఁ దనయులు • చెలఁగిరి ధ్రువసంధి, తనయుండు భరతుండు • ధర్మరతుఁడు
భరతునిపుత్త్రుఁడై •పరఁగెను నసితాఖ్యుఁ, డతఁడు శత్రువులు హై•హయులుఁదాల
తే॥జంఘశశిబిందువులుదాఁక•సంగరమున,నోడివసములఁబడిమంత్రి•యుక్తుఁడగుచుఁ
బాఱి వలిగట్టుననుభృగు•ప్రస్రవణము, నందువసియించె మితబలుఁ•డనుచువింటి.
౧౨౪౬

అవ్యక్తజుఁడు = అవ్యక్తునకు జనించినవాఁడు - అవ్యక్తుఁడు = ప్రత్యక్షాది ప్రమాణములకు గోచరింపనివాఁడు - వీఁడెవఁడు? ఈవసిష్ఠుఁడే యీ సూర్య వంశమును గుఱించి చెప్పునపుడు 'ఆకాశప్రభవో బ్రహ్మ' యని యయోధ్యా కాండము ౧౧౦ సర్గమందుఁ జెప్పగలఁడు.

దీనివలన నవ్యక్తమనినను నాకాశమనినను నొకవస్తువే యని యేర్పడెను. అట్టైన నీయాకాశమెవరు? శ్లో॥ సంక్షిప్య హి పురా లోకాన్ మాయయా స్వయమేవహి। మహార్ణవే శయానోఽప్సు మాం త్వం పూర్వమజీజనః। పద్మే దివ్యేఽర్కసంకాశే నాభ్యాముత్పాద్య మామపి। ప్రాజాపత్యం త్వయా కర్మ సర్వం మయి నివేశితం॥ అని బ్రహ్మదేవుఁడు చెప్పెను "సీ॥ పూర్వంబు జగములఁ బొలియించి మాయచే స్వయముగ జలరాశిశాయి వగుచుఁ, దొలుత సృష్టించితి జలములయందు నన్ను" ఉత్తర - ౧౫౮౩. "గీ॥ దివ్యమై తామరసహితదీప్తిఁ దనరు। వారిజంబున నీ నాభివలన నన్నుఁ। గలుగఁజేసి ప్రాజాపత్య కర్మము

నను। నీవ నిలిపితి వోదేవ నిత్యముగను" ౧౫౹౮. కావున నవ్యక్తమనినను ఆకాశమనినను నారాయణునకే పేరు అవ్యయుఁడు = ప్రవాహరూపముగ నెడఁదెగక ప్రతికల్పము నుండువాఁడు—గోవిం. నిత్యుఁడు = ద్విపరార్థకాలము నాశము లేనివాఁడు.

ఇచ్చటఁ గొందఱు అవ్యక్తాకాశ శబ్దములకు శూన్యము అభావ మని విపరీత ప్రతిభావ లాడుటచే సృష్టివిషయము కొంచెము ముచ్చటింపవలసివచ్చెను. వ్యక్తముగానిది యవ్యక్తము. వ్యక్తము = స్పష్టము. పగటివేళఁ బదార్థములు యథాస్వరూపములుగ భిన్నభిన్నములుగఁ గానవచ్చును. చీఁకటియందట్లు గానరాదుకదా. ఇఁక ఆ + కాశము = సర్వత్ర ప్రకాశించునది ఆకాశము. సర్వత్రి ప్రకాశించునది ద్రవ్యముగా నుండునుగాని యభావముగ నుండదుగదా.

కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందోనస్యాత్ । (త్తై. ఆన. ౭ అను). ఈయానందమయమగు నాకాశము లేనియెడల నెవఁడు జీవింపఁగలఁడు, ఎవఁడు నిలువఁగలఁడు?

ఆకాశోహవై నామరూప యోర్నిర్వహితా। తేయదంతరా తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా –(ఛా-౮-౧౪-౧ వా). నామ రూపముల నేర్పఱచునదిగా నీలోపలనుండు నాకాశము అమృతము. అది యాత్మ.

ఆకాశోర్థాంతరత్వాదివ్యపదేశాత్॥ బ్ర॥ సూ॥ ౧-౩-౪౧. దహర ఉత్తరేభ్యః॥ ౧-౩-౧౪

ఆకాశోహవై నామరూపయోః నిర్వహితా తే యదంతరాత్మ తద్బ్రహ్మ॥ ఆకాశము నామరూపములను గలిగించునది నీలోపల నందునది యేదియో యది బ్రహ్మము.

ఆకాశో బ్రహ్మ.—ఛాందోగ్యము.

ఈప్రమాణములవలన నాకాశ మనఁగా బ్రహ్మమే.

మనుస్మృతియందు - ఆసీదిదం తమోభూత, మప్రజ్ఞాత మలక్షణం। అప్రతర్క్యమవిజ్ఞేయం ప్రసుప్తమివ సర్వతః॥ ఈ ప్రపంచము తమస్సునందు లీనమై యుండెను. తమస్సనఁగాఁ బ్రకృతి. చీఁకటివంటిది గావునఁ దమ స్సనఁబడును. ఆ ప్రాగ్దశయందుఁ జీఁకటియందలి పదార్థములవలెఁ బ్రకాశింపఁబడక యుండెను. అనఁగాఁ బ్రలయకాలమందు సూక్ష్మరూపములచేఁ బ్రకృతియందు లీనమై యుండెను. "తమ ఆసీ త్తమసా గూఢమగ్రే" యని శ్రుతి. అప్పుడు ప్రకృతిగూడ బ్రహ్మముచే నవ్యాకృతమై (నామరూపములచే నిర్దేశింప

రానిదై) యుండెను. కావుననే అప్రజ్ఞాతం = అప్రత్యక్షము మఱియు నది వాచకస్థూల శబ్దములు లేకుండుటచేఁ దర్కింపరానిది శబ్దముచేతను దెలిసి కొనరానిది. ఇట్టిదై యంతయు నిద్రించుచున్నట్లుండెను. శ్లో॥ "తతస్స్వయంభూర్భగవా, నవ్యక్తో వ్యంజయన్నిదమ్। మహాభూతాది వృత్తౌజాః, ప్రాదురాసీత్తమోనుదః॥" ఇట్లు కొంతకాలము సర్వము నిద్రించుచున్నట్లుండినపిమ్మట స్వేచ్ఛానుసారముగ శరీరపరిగ్రహము చేయ శక్తిగల బాహ్యకరణాగోచరుఁడైన పరమాత్మ తనంతట మహాభూతాదులను గొలఁది సూక్ష్మరూపమున నావల స్థూలరూపమునఁ బ్రకాశపఱుచుచుఁ దమస్సును ధ్వంసముచేసి యప్రతిహతసృష్టిసామర్థ్యముచేఁ బ్రకాశించినవాఁ డయ్యెను. శ్లో॥ "యోసావతీంద్రియగ్రాహ్యః సూక్ష్మోవ్యక్తస్సనాతనః। సర్వభూతమయోఽచింత్యః సఏవ స్వయముద్బభౌ"॥ ఎవఁడింద్రియములచే గ్రహింపరానివాఁడని సూక్ష్ముఁడని యవ్యక్తుఁడని సనాతనుఁడని సర్వభూతమయుఁడని యచింత్యుఁడని శాస్త్రములందుఁ జెప్పఁబడెనో యాపరమాత్మ మహదాదికార్యరూపముగా స్వయముగా నుద్భవించెను.

"సోభిధ్యాయ శరీరాత్స్వాత్సిసృక్షుర్వివిధాః ప్రజాః అపఏవససర్జాదౌ తాసుబీజమవాసృజత్." ఆపరమాత్మ సంకల్పముచే తనశరీరమునుండి నానావిధ ప్రజలను సృష్టించెను. జలము లుత్పన్నములగు గాక యని సంకల్పించి జలమును సృజించి యానీటియందు స్వశక్తిరూపమైన బీజము నుంచెను ఇక్కడ వ్యాఖ్యాతయగు కుల్లూకభట్టు 'అచేతనము స్వతంత్రముగ ప్రకృతిపరిణమించెనను వాదము సమ్మతముగాదు. బ్రహ్మమే యవ్యాకృతశక్తిచే జగత్కారణ మగుచున్నదండి వేదాంత సిద్ధాంతమే (వశిష్టాద్వైతమే) మనుసమ్మతమని' వ్రాసెను

ఈక్షతేర్నాశబ్దమ్॥ బ్ర॥ సూ॥, తదైక్షత బహుస్యాం ప్రజాయే యేతి॥ ఛాందో॥ అను నివి ప్రమాణములు. తనశరీరమనఁగా నవ్యాకృతరూపము. అవ్యాకృతమనఁగా బ్రకృతి, యదియే యాయనశరీరము. అవ్యాకృతమనుటచే పంచభూతములు కర్మేంద్రియములు ప్రాణము మనస్సు కర్మావిద్యావాసనలే సూక్ష్మరూపముచేశక్తిరూపమున నుండుట యని యర్థము. అవ్యాకృతబ్రహ్మమే జగద్రూపముగాఁ బరిణమించెను కావున నద్వైతము దీనివలన నవ్యక్తమనిను ఆకాశమనినను అవ్యాకృత బ్రహ్మమనియే గ్రహింప వలయును.

"శ్లో॥ తదండ మభవద్ధైమం, సహస్రాంశు సమప్రభమ్

తస్మిన్జజ్ఞే స్వయం బ్రహ్మా, సర్వలోకపితామహః.

జలములందుంచఁబడిన భగవచ్ఛక్తిరూపమైన బీజమే సూర్యకాంతిగలదై బంగారువన్నె యండ మాయెను. పూర్వజన్మమందు నేను "హిరణ్యగర్భుఁడ నాదునుగాక"యని యేజీవి భగవంతు నుపాసించెనో యాలింగశరీరముగల

జీవమును బ్రవేశించి పరమాత్మ తానే సర్వలోకములకుఁ గారణభూతుఁడైన హిరణ్యగర్భుఁడుగ జన్మించెను.

దీనివలనఁ బరిణామవాదమే మనసమ్మత మని, యథార్థ మని యేర్పడు చున్నది.

తా త్ప ర్య ము.

అవ్యక్తసంభవుఁడును, నిత్యుఁడును, అవ్యయుఁడు నగు చతుర్ముఖబ్రహ్మకు మరీచి జనించెను. ఆయనకుఁ గశ్యపుఁడు జనించెను. ఆయనకు వివస్వంతుఁడు గలిగెను. ఆయనకు మనువు. మనువునకు నిక్ష్వాకుఁడు జనించెను. ఆయన రాజధాని యయోధ్య. (అయోధ్యను మనువు నిర్మించె ననియు దాని నిక్ష్వాకుడు రాజధానిగఁ గైకొనె ననియు గ్రహించునది (చూ. ప. ౨౮౨) ఇక్ష్వాకుతనయుఁడు కుక్షి. కుక్షికుమారుఁడు వికుక్షి. వికుక్షిపుత్రుఁడు బాణుఁడు బాణుని సుతుఁడు అనరణ్యుఁడు (రావణుని శపించిన రాజయోగి యితఁడే). అనరణ్యతనూజుఁడు పృథుఁడు. ఆయనతనూభవుఁడు త్రిశంకుఁడు. ఆయన సుతుఁడు దుంధుమారుఁడు. ఈయనయే యువనాశ్వుఁడు. ఈ యువనాశ్వుని యాత్మజుఁడు మాంధాత. మాంధాత కొడుకు సుసంధి. సుసంధికి ధ్రువసంధి, ప్రసేనజిత్తు నను నిరువురు కుమారులు. ధ్రువసంధి యాత్మభవుఁడు భరతుఁడు. భరతుని పట్టి యసితుఁడు. ఈయన విరోధులగు హైహయులు తాలజంఘులు శశిబిందువు లనువా రీయనను యుద్ధమున నోడింప మంత్రులతోఁ బరువెత్తిపోయి యడవులలోఁ బడి హిమవత్పర్వతమునందలి భృగుప్రస్రవణమందు మితబలుఁడై వసించె నని వింటిని. (ఇది వింట ననుటచేఁ దక్కిన వన్నియుఁ బ్రత్యక్షవిషయము లని భావము ఇది యెక్కడనో హిమాలయమధ్యప్రదేశమందు జరిగినది. అది నేను జూచితి ననక వింట ననుట సత్యవ్రతమునందలి యాసక్తిని దెలుపును.)

క౦॥ ఆపన్నసత్త్వ లిరువురు, భూపాలక యతనిసతులు ♦ పొలఁతుక యొక్క-
　　ర్తేపగిదినో సవతాలిక, సాపద నిడె భక్ష్యమెుండు ♦ సగరము గాఁగన్. ౧౨౨౭

ఆపన్నసత్త్వలు= గర్భిణులు. సవతాలు = 'సవతాలికిఁ బతి వలచిన' నని భాగవతప్రయోగము. ఇది యిట్లేయుండ గాదు. సవతు + ఆలు= సవతాలు - అని పదచ్ఛేదము చేయవలెనే కాని సవతి + ఆలు అని చేయరాదు. సవతు అనఁగా సమానము - సమానభార్య య నర్థము. శబ్దరత్నాకర మీవిషయమునఁ బొరపడె నని తోఁచెడిని. సవతు = సమానమనుటకు - "క౦॥ సురదైత్య యక్షరాక్షస, నరఖేచరసిద్ధమునిగణప్రవరుల భా! స్వరతపములు నాదగు దు,

ష్కర ఘోరతపంబు సవతుకా నమ రేంద్రా! (భార ఆది. ౩ ఆ), సాపడఁ = భుజిం చుటకు; సగరము = విషముతోఁగూడినది.

తా త్ప ర్య ము.

ఆయసితున కిరువురు భార్యలు - ఇద్దఱు గర్భిణులు ఇందొక భార్య తనసవతి నేవిధముగానో విషము కలిపినభక్ష్యము తినిన్చెను.

ఉ॥ అందుల కేగుదేరఁ జ్యవనాఖ్యుఁడు భార్గవుఁ డాకఁడా నాఁడు కా
ళింది మునీంద్రు డాయుచు లలింప్రణమిల్లె సుతుండు గల్గ నా
యందు ననుగ్రహింపు ముని యాత్మఁ దలంచుచు నామెఁ జూచి యో
సుందరి! పుత్త్రుఁ గాంచెదవు శోకము మానుము శూరవర్యునిన్. ౧౨౪౮

అందులకున్ = ఆప్రదేశమునకు - "అందులకు ధరణిగల నృపనందను లెల్ల రును ముదంబునం బోయిరి" అని భారతము.

తా త్ప ర్య ము

భృగువంశమునఁ బుట్టిన చ్యవనుఁ డను మహర్షి వారుండుచోటికి వచ్చెను. అప్పు డసితునిభార్య కాళింది యాయనకు 'నాకుఁ బుత్త్రుఁడు కలుగ ననుగ్రహిం పు, ముని నమస్కరింపఁగా నాయన యాలోచించి 'శీఘ్ర శూరులలో శ్రేష్ఠుఁ డగు కుమారునిఁ గాంచెదవు. వ్యసనపడకుము.

క॥ గరసహితుండయి పుట్టుట, సరసజముఖి నాఁడు వంగు సగరుఁ డనంగా
వరబలుఁడై యలఁగ నలు,కెరమునఁ గాళిం దిగాంచె దనయున్ సగరున్. ౧౨౪౯

గరసహితుండయి - విషముతోఁగూడినవాఁడై, గరము. చూ - గరళము. గరకంఠుఁడు - ఇత్యాదులు.

తా త్ప ర్య ము.

నీకొడుకు గరళముతోడఁ బుట్టుట గాఫున బలముగలవాఁడై సగరుఁడని పేరొందును. అని దీవించెను. అటుతరువాత నాకాళింది సగరుని కుమారుఁ గాంచెను.

ఈ సగరునితండ్రిని హైహయులు తాలజంఘులు లోనగు కొందఱు కలిసి రాజ్యభ్రష్టునిఁ జేసి తఱుమఁగా నాయన హిమవత్పర్వతమునకుఁ బాఱిపోయెను. అచట సగరుని తల్లి గర్భవతిగానుండు సమయంబున నాయన మరణించెను. ఆమె సహగమనము చేయఁబోఁగాఁ జ్యవనుఁడు వారించి యామెను దనయాశ్ర మమం దుంచుకొని రక్షించి యం దుదయించిన కుమారునకు సగరునకుఁ దానే

సంస్కారాదులుచేసి యాగ్నేయాస్త్రము లొసఁగి యవి నేర్పెను. అతఁడు బుద్ధి తెలిసినవాఁడై తల్లినిఁ 'మాతండ్రి యెవఁడు' అని యడిగెను. ఆమె వృత్తాంతమంతయుఁ దెలిపెను. అప్పు డాయన వారిమీఁదికి యుద్ధమునకుఁ బోయి యోడించి గురువునాజ్ఞప్రకారము వారిని జంపక యవనులను బోడితలలవారిగను, శకులను నర్ధముండలనుగ బారదులను విరితలవారలగను ని ట్లందఱ జాతిభ్రష్టులఁ జేసి యాక్షత్రియుల స్వాధ్యాయహీనులుగను వషట్కారరహితులుగను జేసి స్వధర్మహీనులఁ జేసి యీ దేశమునుండి వెడలఁ గొట్టెను. వీరే మ్లేచ్ఛులు. ఇప్పటి తురకలనఁ బూర్వులు. ఇరాన్ అనునది ఆర్యశబ్దమునుండి పుట్టినదే. మొదటి వికృతి అయిరాన్ (Airan). ఈ విరోధము నేఁటికిని బాధించుచున్నది.

సీ॥ అనఘ! యాతనిపుత్త్రుఁ ♦ డసమంజుఁ డతనికి, నంశుమంతుఁడు పుట్టె ♦ నతనితనయుఁ
డయ్యె దిలీపుఁడు ♦ నాతనిసుతుఁడు భగీరథుఁ డయ్యె భ♦గీరథునకుఁ
గలిగెఁ గకుత్స్థుండు ♦ క్ష్మాపాల! యాతనికి, రఘువు సూనుం డయ్యె ♦ రఘువుకొడుకు
భువిఁ బ్రవృద్ధుం డయ్యెఁ ♦ బురుషాదకుం డనఁ, గల్మాషపాదాఖ్య ♦ గల దతనికి
తే॥ నతనిసుతుఁడయ్యె శంఖణుం ♦ డతనికొడుకు, పరఁగెను సుదర్శనుండు నా ♦ పార్థివునకు
నగ్నివర్ణుఁడు గలిగె నా ♦ యగ్నివర్ణు, సుతుఁడు శీఘ్రగుఁ డాతని ♦ సుతుఁడు మరువు. ౧౨౫౦

సీ॥ అతఁడు ప్రశుశ్రుకు ♦ నతఁ డంబరీషుని, నతఁడు నహుషుఁ గనె ♦ నతనిసుతుఁడు
వఱలు యయాతి నా ♦ నసుమతీనాథుండు, నతనికి నాభాగుఁ ♦ డాత్మజుండు
నాభాగుసుతుఁ డయ్యె ♦ నవ్యయశోధనుం, డైన మహాత్ముకుఁ ♦ డజనృపాలుఁ
డజునకు జనియించె ♦ నాదిమధ్యుండు, దశరథుం డను మహా♦ధన్యుఁ డల్ల
తే॥ ఘనున కుదయించి రయ్య యీ ♦ యనఘతేజు, లైన శ్రీరామలక్ష్మణు ♦ లార్యచరిత!
యాదివంశవిశుద్ధులు ♦ నసమధర్మ,నుతులు వీరులు సత్యైక ♦ గతులు వీరు. ౧౨౫౧

ఆసగరునికుమారుఁ డసమంజుఁడు. అతనికుమారుఁ డంశుమంతుఁడు. అతనికొడుకు దిలీపుఁడు. అతనిసుతుఁడు భగీరథుఁడు భగీరథుపుత్త్రుఁడు కకుత్స్థుఁడు. అతనికొడుకు రఘువు రఘువుకొడుకు ప్రవృద్ధుఁడు.

ప్రవృద్ధుఁడు - ఇతఁడు వసిష్ఠునిశాపముచే రాక్షసుఁడై మనుష్యులను భక్షించుటచేఁ బురుషాదకుఁ డయ్యెను. తన్ను శపించిన వసిష్ఠుని మరల శపింప దోసిట జలము గైకొనఁగా మహాపతివ్రతయగు నతనిభార్య మదయంతి భర్తకుఁ గోపోపశమనముచేయఁగా నాజలమును భూమిమీఁద విడువరాదు గావునఁ దన పాద

ములపై విడుచుకొనెను. అప్పు డాయనపాదములు కమిరిపోయెను. ఆకారణమున నతఁడు కల్మాషపాదుఁడయ్యెను.

అతనికొడుకు శంఖణుఁడు - అతనికొడుకు సుదర్శనుఁడు - ఆయనకుమారుఁడు అగ్నివర్ణుఁడు - ఆయగ్నివర్ణు సుతుఁడు శీఘ్రగుఁడు - అతనిపుత్రుఁడు మరువు - అతనికొడుకు ప్రశుశ్రుకుఁడు - అతనిపుత్రుఁడు అంబరీషుఁడు - అతనికొడుకు నహుషుఁడు - అతనికొడుకు యయాతి అతనికొడుకు నాభాగుఁడు - నాభాగునకు నజుఁడు - అజునకు బలశాలి యగు దశరథుఁడు - అతనికిఁ గుమారులీ రామలక్ష్మణులు ఈవిధముగ వీరివంశ మాదినుండి పరిశుద్ధమైనది. వీరందఱు నసమానధర్మరతులు - వీరులు - సత్యమునందే ప్రీతిగలవారు.

అజుఁ డనఁగా బ్రహ్మ. బ్రహ్మముహూర్తమునఁ బుట్టినవాఁడగుటచే దశరథుని తండ్రికి నజుఁ డని పేరు. ఈయనచరిత్రము కౌసల్యాపరిణయమునఁ గలదు.

క౦॥ రామునకును సౌమిత్రికి, భూమిప! నీసుతలఁ దుల్య♦పూజితగుణలన్
ప్రేమమున నీయ వేఁడెద, నామనవిని దీర్ప వయ్య ♦ నరనాథ! యనన్. ౧౨౫౨

కావున రాజేంద్రా! శ్రీరామచంద్రునకును లక్ష్మణునకును వీరిగుణములకు సమానమైన గుణములచే గౌరవింపఁదగు గుణములు గలవారైన నీయిరువురు పుత్రికలను ప్రేమపూర్వకముగ నీయఁగోరెదను. నామనవిని గొనసాగింపుము

—* ౭౧ సర్గము - జనకుఁడు వసిష్ఠునకు నిజవంశక్రమంబుఁ జెప్పుట *—

సీ॥ జనకుఁ డిట్లనియె నో♦సంయమి! మావంశ,విధ మెల్ల వినవయ్య♦విస్తరింతుఁ
గన్నియ దానంబుఁ ♦ గావించునాతఁడు, సత్కులీనుం డయి ♦ జరగ నేని
వక్తవ్య మతనికి ♦ వంశవిధం బెల్ల, నిమి యొప్పు సద్ధర్మ♦నిరతుఁ డగుచు
నతనిపుత్రుఁడు మిథి ♦ యమ్మహాత్మునిచేత, మిథిలాపురంబు ని♦ర్మింపఁబడియెఁ
తే॥ బ్రథమజనకుఁ డతఁడ యుదా♦వసువుఁ గనియెఁ
దనయుఁ డతనికి నందివ♦ర్ధనుఁడు గలిగెఁ
నాయనకును సుకేతుఁ డా♦త్మాధిపునకు
దేవరాతుఁడు జనియించె ♦ దేవనిభుఁడు. ౧౨౫౩

సీ॥ ఆయన కుదయించె ♦ నయ్య బృహద్రథుం, డతఁడు మహావీరు ♦ ననఘుఁ గనియె
నా మహావీరుని♦యాత్మజుండు సుధృతి, సుధృతియు నిరుపమ♦శూరుఁ డైన
ధృష్టకేతువుఁ గనె, ♦ ధృష్టకేతువునకు, హర్యశ్వుఁ డుదయించె ♦ నమితబలుఁడు
హర్యశ్వునకు మరు ♦ వావిర్భవించెను, ధీరుఁడు మరువు ప్ర♦తీంధకునిని
తే॥ గనియెఁ గీర్తిరథాఖ్యునిఁ ♦ గాంచె నాతఁ
డతనిపుత్రుఁడు దేవమీ♦ఢాఖ్యుఁ డయ్యె

నతనితనయుండు విబుధాఖ్యుఁ ♦ డతనిపుత్త్రుఁ
డయ్యెను మహీంద్రకుండు నా ♦ నతనిసుతుఁడు. ౧౨౫౪

సీ॥ కీర్తిరాతుం డయ్యెఁ♦గీర్తిరాతునకును, సుతుఁడు మహారోమ♦శూరవర్యుఁ
డతనికి స్వర్ణరో♦మాఖ్యుఁడు వానికి, హ్రస్వరోముఁడు పుట్టె ♦ నాతనికిని
గలిగెను బుత్త్రయు♦గ్మంబు తత్సుతులందు, నగ్రజుఁడను నాదు♦ననుజుఁ డితఁడు
వనమున కేగుచో ♦ వసుధేశుఁగాఁ జేసి, ననుఁ బెద్ద నౌటను ♦ నాదుతమ్ము
ఆ॥ నాకు నప్పగించి ♦ నాకంబునకు నేగె, జనకుఁ డేను నీకు♦శధ్వజునిని
నెలమిఁ జూచుకొనుచు ♦ నిలనేల సాంకాశ్య,కతి సుధన్వుఁ డనెడి♦క్షితివిభుండు. ౧౨౫౫

కం॥ దూతల నంపెను సరసీ,జాతాక్షిని సీత శివుని♦చాపము నీయన్,
భీతిప్రదఘోరాహవ, మాతనితో నయ్యె దేని ♦ నర్పింపుమిచేన్. ౧౨౫౬

మ॥ సమరక్షోణిని వానిఁ ద్రుంచి యనుజున్ ♦ సాంకాశ్యమం దుంచితి
న్సమకుం బట్టముఁ గట్టి, యీతఁడ చుమీ ♦ నాతమ్ముఁ డే జ్యేష్ఠుఁడన్
విమలాత్మా! యిదె రామలక్ష్మణులకున్ ♦ వీర్యంబె శుల్కంబు నా
రమణీరత్నము సీత నూర్మిళను గా♦రామారఁగా నిచ్చెదన్. ౧౨౫౭

అని వసిష్ఠుఁడు చెప్పఁగా జనకమహారా జాయనతో నిట్లనియె. మునీంద్రా! మావంశవిధము విస్తరించెద వినుము కన్యాదానము చేయువాఁడు మంచి కులమునఁ బుట్టినవాఁ డయ్యేనేని తనవంశమును వాఁ డెఱింగించుట యత్యావశ్యకము మా వంశమునఁ బూర్వుఁడు నిమి. ఈయన మిక్కిలి ధర్మాత్ముఁడు. అతని పుత్త్రుఁడు మిథి యనువాఁడు. ఆమహాత్ముఁడే యీ మిథిలాపురమును దన పేరఁ గట్టించెను. ఇతఁడు మొదటి జనకుఁడు ఈయన పేరే మా వంశములో జనకుఁడు జనకుఁ డని వచ్చుచుండును. అది వంశనామమే యయ్యెను. అతని కొడు కుదావసువు. అతని పుత్త్రుఁడు నందివర్ధనుఁడు. అతని సుతుఁడు సుకేతుఁడు. అతని నందనుఁడు దేవరాతుఁడు. ఆయనకు బృహద్రథుఁడు జనించెను. ఆయన మహావీరుని గనెను. ఆమహావీరుని యాత్మజుఁడు సుధృతి. సుధృతి కొడుకు ధృష్టకేతువు ధృష్టకేతువునకు హర్యశ్వుఁ డుదయించెను. హర్యశ్వునకు మరువు కలిగెను. మరువునకుఁ బ్రతీంధకుఁ డుద్భవమయ్యెను. అతఁడు కీర్తిరథాఖ్యుఁ గాంచెను. అతని తనూజుఁడు దేవమీఢుఁడు. అతనికొడుకు విబుధుఁడు. అతనికి మహీధ్రకుఁడు. అతనికిఁ గీర్తిరాతుఁడు. అతనికి మహారోముఁడు. అతనికి స్వర్ణరోముఁడు. అతనికి హ్రస్వరోముఁడు. ఆయన కిరువురు కొడుకులు. అందు నేను బెద్దవాఁడను. ఈయన నాతమ్ముఁడు. మాతండ్రి

తపస్సునకై వనమునకుఁ బోవుచు వీని నాకప్పగించెను. ఆయన యావల మరణించెను. జనకుఁడనఁబడు నేను ఈకుశధ్వజునిఁ గాపాడుచుంటిని.

సాంకాశ్యపురపతి సుధన్వుఁ డనెడివాఁడు సీతను శివునిచాపంబును దన కిమ్మని దూతలఁ బంపెను. నేను దేని నియ్యనైతిని. ఆ కారణముగ వానికి నాకు భయంకరమైన యుద్ధము జరగెను. వానిని వధించి నా తమ్ముని సాంకాశ్యమందుఁ బ్రభువుగాఁ బట్టాభిషేకముఁజేసి యుందే యుంచితిని వీఁడే నా తమ్ముఁడు. నేను జ్యేష్ఠుఁడను. శ్రీరామలక్ష్మణుల కిరువురకు నీ యాజ్ఞప్రకారము నా కూఁతులను సీతను ఊర్మిళను సంపూర్ణప్రీతితో నిచ్చెదను. రామలక్ష్మణులకు 'వీర్యంబె శుల్కంబునౌసీత - నూర్మిళను గారామారఁగా నిచ్చెదట' విల్లువిఱిచినది రామచంద్ర మూర్తియే యయినను లక్ష్మణుఁడు నంతటిబలశాలియే కావున నూర్మిళయు వీర్యశుల్కగానే భావించి లక్ష్మణున కామె నిచ్చెదను. ఊర్మిళ జనకునికూఁతురు.

క౦॥ ముమ్మాటికి నిచ్చెద లే, దిమ్మాటకు సందియంబు ♦ నృపవర! సుతర
త్నమ్ముల రాముని, నాతని, తమ్ముని గోదానమిదియె ♦ తఱి చేయింపన్.౧౨౫౫

మూఁడు + మాటలు = ముమ్మాటు ముమ్మాటికి = త్రికరణశుద్ధిగాను - ముమ్మారు అచ్ఛద్విగు వేకవచనము.

తాత్పర్యము.

అని చెప్పి దశరథుపక్కఁ జూచి రాజేంద్రా! ముమ్మాటికి నిచ్చెదను. ఈమాట యందు సందేహములేదు. కావున నీపుత్రులగు రామలక్ష్మణులచే గోదానము చేయింప నిదియే సమయము

గోదానము = సమావర్తన మను కర్మమునకుఁ బూర్వాంగము. గో = వెండ్రుకలు - 'గాః స్వర్గేషు రశ్మివృగ్బాణస్వర్గవజ్రాంబులోమసు' -నానా. దానము = ఖండించుట పాదమూలరోమఖండనము = గోదానము.

గోదానము - శ్లో॥ గోదానం చౌలవత్కార్యం షోడశేబ్దే తదుచ్యతే। అంకోపవేశనం నాస్తి శ్మశ్రూణాం ముండనం భవేత్॥ స్నాత్వాచ వాగ్యతస్తిష్ఠన్నహశ్శేషం నయేద్ధ। ఆదిత్యే స్తమితే వాచం విసృజేదాంతికే గురోః,అహం వరం దదామీతి దద్యాద్గోమిథునం తతః॥" యని ఆశ్వలాయనకారిక.

గోదానము (కేశఖండనము) - చౌలమువలెనే చేయవలయునుగాని తొడమీఁదఁ గూర్చుండుట లేదు మీసములు మాత్రము వపనము చేయవలయును. స్నానముచేసి మౌనము వహించి పగలంతయుఁ గడపి సూర్యాస్తమానము కాఁ

గానే గురువునొద్ద మానము విడువవలయును. నేను మీకు గురుదక్షిణ నిచ్చెద నని గోమిథునము నీయవలెను. దీనికి గోదాన మని పేరు. ఇది ముందుచేసి తరువాత సమావర్తనము చేయవలయును.

"శ్లో॥ వేదం వ్రతాని వాపారం నీత్వా హ్యుభయ మేవవా। గురవేతు వరం దత్వా స్నాయీత తదనుజ్ఞయా॥" యాజ్ఞవల్క్యస్మృతి వేదాధ్యయనముగాని వ్రతముగాని రెండుగాని తుదముట్టించి గురువునకు దక్షిణనిచ్చి యాయన యనుజ్ఞచే స్నానము చేయవలయును ఇది సమావర్తనము

'గోదానము సమావర్తనము ముందుచేయక వివాహము చేయరాదు' అని మనుస్మృతి.

క౦॥ నేడు మఖానక్షత్రము, మూడునదినముల వివాహ♦మునకు జనవరయా
తేడా! యుత్తరఫల్గుని, నాఁడు, సుఖోదర్క మిాగి♦ బడసెద రీయన్. ౧౨౭౯
సుఖోదర్కము = రాఁగల సుఖఫలము.

తాత్పర్యము.

రాజేంద్రా! నేడు మఖానక్షత్రము. మూడవదినమగు రేపుపోను యెల్లుండి ఉత్తరఫల్గుని అనాఁడు వివాహము జరపుము. నీకుమారులచే దానములు చేయించుము భవిష్యత్కాలమున సుఖము గలుగును, ఉత్తర ఫల్గునీ నక్షత్రము శ్రీ రాముచంద్ర మూర్తికి శుభకరమే గాని సీతకు జన్మనక్షత్రము అయినను - 'శ్లో॥ తిథి స్సదోషా వ్యథ యేచ కాలే నక్షత్రదోషోఽభి జదాచకాలే। లగ్నాదిదోషాస్తు యేచకాలే సర్వాదిదోషాః ప్రభవంతి రాత్రౌ॥" అను వాక్యముప్రకారము అభిజిల్లగ్నదోషము కావున నా లగ్నము మంచిదే. అదియుంగాక ఆ నక్షత్రము చరణము విడిచి యామెది కన్యారాశి యగుటచే స్త్రీకూటము కాదని యిట్లు కూటశుద్ధియుండుటచే నక్షత్ర దోషము లేదు. "భకూటశుద్ధాజన్మదుష్టి"మని జ్యోతిశ్శాస్త్రము. అయినను భార్యాభర్తల కదువునకు నేకనాడి యగుటచే వియోగప్రాప్తి కొంద ఱుత్తరఫల్గుని యందో నుత్తర = శ్రేష్ఠమైన, ఫల్గుని = పూర్వఫల్గుని యని వ్రాసి యున్నారు. అప్పుడు పండ్రెండవయింట చంద్రుఁడుండుట గనుక నప్పుడు వివాహము చేయుటనుచితమే - అని మహేశ్వరతీర్థులు

—* ౭౨-వ సర్గము *—

సీ॥ అని జనకుం డాడ♦ నంత గాధిసుతుండు, మైత్రావరుణి గూడి♦ పలికెందు
ననఘ! యచింత్యంబు♦ లప్రమేయంబు లి, క్ష్వాకు విదేహవం♦శంబు లిలను

మీకు సమానులు ♦ మేటులుఁ గనరారు, సంబంధమును రూప•సంపదయును
రామలక్ష్మణులకు ♦ రాజన్య! భూమిసు,తోర్మిలాసతులకు ♦ నొక్కరూప,
తే॥ కలదు వేఱొండు మాకు వ•క్తవ్య మధిప, నీదుతమ్ముండు సద్ధర్మ•నిష్ఠుఁడైన
యాకుశధ్వజునకుఁ ♦ గూతు లిరువు రిమ్ము, భరతశత్రుఘ్నులకు వారి•భార్యలుగను. ౧౦౬౦

మైత్రావరుణి=వసిష్ఠుఁడు. వక్తవ్యము=చెప్పఁదగినది. మంతలించు = చెప్పు.

తాత్పర్యము.

అని జనకరాజు చెప్పఁగా విశ్వామిత్రుఁడు వసిష్ఠునితో నాలోచించి యాయనతో నిట్లనియెను. రాజన్యా! మీరెండువంశము లాలోచించి తెలిసికొనరాని మహిమగలవి మిగుల గొప్పవి. మీ యిరువురితోఁపాటివారును లేరు. మిమ్ము మించువారును లేరు సంబంధమందు సౌందర్యమందు రామలక్ష్మణులకు సీతోర్మిళలకుఁ దగియున్నది కావున నీవు చెప్పినది మాకు సమ్మతమే. కాని మేము మఱియొకవిషయము చెప్పవలసియున్నది. అది యేదన నీ తమ్ముఁడగు కుశధ్వజునకు నిరువురుపుత్రికలు గలరు. ఆ యిరువురను భరతశత్రుఘ్నుల కిచ్చి వివాహము సేయుము.

కం॥ అందంబున భుజబలముల, చందనంబునఁ బరువమునను ♦ జనవర! యొకఁడే
చందం బందఱు దశరథ, నందనులు దిగీశబలులు ♦ నందితచరితుల్. ౧౦౬౧

పరువము = ప్రాయము. దిగీశబలులు = దిక్పాలురతో సమానమయిన బలము గలవారు. నందితచరితుల్ = ఆనందింపఁ దగినఁనడవడి గలవారు.

తాత్పర్యము.

సౌందర్యమందును, భుజాబలమందును, ప్రాయమందును దశరథుకుమారులు నలువురు సమానులు. అందఱు దిక్పాలురవంటి బలశాలురు. ఆనందింపఁ నడవడి గలవారు.

కం॥ సరి సరి యని జగ మెన్నఁగ, సరి సరి యగు బాంధవంబు ♦ చను మీకు మఱిం
బొరి బొరి వృద్ధింగను మీ, యిరువురవంశములు గూడి ♦ యెసఁగినయేనిన్. ౧౦౬౨

పొరిఁ బొరి = మిక్కిలి.

తాత్పర్యము.

సరి-సరి యీడు జోడు బాగున్నదని లోకులు శ్లాఘించునట్లు మీయిరువురకు సమానబంధుత్వము చెల్లును. అదియునుగాక మీయిరువురవంశములు కలిసెనేని నింకను మిగులవృద్ధి చెందును.

క॥ అన విని జనకుం డి ట్లను, మునిసింహులు తుల్యవంశ♦మున సంబంధం
బును దామ యానతిచ్చుట, ననఘము ధన్యంబు నయ్యె ♦ నస్మత్కులమున్. ౧౨౯౩

అని విశ్వామిత్రవసిష్ఠులు చెప్పఁగా జనకుఁ డిట్లనియెను. మునిసింహములారా! మీరు మాయిరువురవంశములు సమానము లని మాకుఁ బరస్పరసంబంధము చెల్లు నని చెప్పితిరి. సూర్యవంశపురాజులవంశముతో మావంశము సమాన మని మీరు చెప్పుటచే మాకులము పావనమై ధన్య మయ్యెను.

ఉ॥ విండు మహాత్ములార! కడుఁ ♦ బ్రీతిఁ గుశధ్వజరాజుకూఁతులన్
అందుగఁ గైకపుత్త్రునకు ♦ నాతనితమ్ముని కే నొసంగెదన్,
వీండ్రకు నొక్కనాఁడ నెఱ♦వేడుకఁ బెండిలి సేయ నొప్పు, గో
డండ్రుర నల్వురం గన నెడండ ముదం బగుఁగాక యాజికిన్. ౧౨౯౪

మహాత్ములార! మిక్కిలి సంతోషముతోఁ గుశధ్వజుని యిరువురపుత్త్రికలను భరతశత్రుఘ్నుల కిచ్చెదను. ఈనలువుర కొక్కనాఁడే వివాహము చేయఁదగును. నలువురఁగోడండ్ర నొక్కనాఁడు సంపాదించికొని దశరథుఁడు సంతోషించునుగాక!

ఓయి! యొకయింట నేకకాలమున నేకశుభకార్యమే కాని పెండ్లు చేయరాదని "శ్లో॥ ఏకస్మింస్తు గృహే కుర్యా, దేకామేవశుభక్రియాం, అనేకాం యస్తు కురుతే స నాశ మధిగచ్ఛతి" యిట్లు జ్యోతిశ్శాస్త్రమందుఁ గలదుగదా. దీనికి సమాధానము - జ్యోతిశ్శాస్త్రమందే దైవజ్ఞవిలాస మను గ్రంథమందు నేకకాలమున నొక యింటనే యన్నదమ్ములకే శుభకార్యముఁ జేయవచ్చు నని "శ్లో॥ భిన్నోదరోదయవతా, ముద్వాహే కల్పయేత్-పృథగ్వేదిం, ఏకగృహే జగు రార్యా, మంటప మేకం పరాశరేణోక్తమ్" అని కలదు ఇందు భిన్నోదరు లని కదా యున్నది లక్ష్మణ శత్రుఘ్ను లేకోదరులే - వారి కట్లు చేయఁబడె నందురేని "శ్లో॥ ఏకమాతృప్రసూతానా మేకస్మిన్నేవ వత్సరే, వివాహం మౌంజిబంధంచ చూడాకర్మ నకారయేత్" త్తని నిషేధవాక్యము లుండుట సత్యమేయైనను దైవజ్ఞవిలాస మను గ్రంథమందు "భ్రాతృద్వయే స్వసృయుగేతథా। సమానాశ్చ క్రియాః కుర్యు ర్మాతృభేదే తథైవచ। ఏకస్మిన్ దివసే త్వేకలగ్నే భిన్నాంశకే తయోః। ఏకగర్భోద్భవయవతో ర్వివాహః శుభకృ ద్భవేత్" అని కలదు. అమడలవిషయమున విశేషవిధి గలదు. కాలదీపమున నమడలవిషయ మిట్లు వ్రాయఁబడినది. లక్ష్మణ శత్రుఘ్ను లమడలేకదా! "శ్లో॥ భ్రాతృద్వయే స్వసృయుగే, స్వసృభ్రాతృయుగేఽథవా। సమానాపి క్రియాకార్యా మాతృభేదే తథైవచ"—వైద్యనాథీయము. కర్మఠుఁడైన జనకుఁడు పెట్టినది. వసిష్ఠ విశ్వా

మిత్రాది మహర్షు లంగీకరించినది యెట్లు శాస్త్రవిరుద్ధము కాఁగలదు. తనకుఁ దెలియని వన్ని తప్పు లనువారి కెవరు సమాధానము చెప్పఁగలరు.

క॥ ఉత్తరదివసంబున నగు, నుత్తరఫల్గునియు, దాన ♦ నుద్వాహము మే
లత్తఱి భగుఁడు ప్రజాపతి, సత్తము లది యుత్తమ మని♦శంసింత్రుగదా! ౧౨౬౫

ఎల్లుండి యుత్తరఫల్గుని-దాని కధిపతి భగుఁ డను ప్రజాపతి - ఆయన శుభ కరుఁడు కావున నది యుత్తమ మని సత్తములు ప్రశంసింతురుగదా!

ఉత్తరఫల్గుని యేల ప్రశస్త మనిన దాని కధిష్ఠాత భగుఁ డను ప్రజాపతి - ప్రజోత్పత్తిస్థానము లయిన యోనిలింగములకు నధిష్ఠాత.

క॥ ఛాత్రుండను మీకరుణకుఁ, బాత్రుండను నాకు మీరు ♦ పరధర్మంబుల్
బాత్రం బని చెప్పితి రని, ధాత్రీశుఁడు మఱియుమాని♦ధాత్రీశులతోన్. ౧౨౬౬

నేను మీ శిష్యుఁడను - మీ దయకుఁ బాత్రుఁడను - మీరు నాకు గొప్ప ధర్మమును దగు నని చెప్పితిరి - అని మఱియు జనకుండు మునీంద్రులతో నిట్లనియె!

ఉ॥ ఓఋషివర్యులార! యిపె ♦ యుండుఁడు కూరిమి నాసనత్రయిన్
మీరలు, మూఁడురాజ్యములు ♦ మీయవి గా వొకో, యూజి కెగ్గి యె
ట్లారయ నా కయోధ్య యటు ♦ లౌట యథార్హ గతిన్ భరింపుఁడీ
మీరలు సంశయింప కన ♦ మెచ్చుచుఁ బంక్తిరథుండు హృష్టుఁడై. ౧౨౬౭

ఋషీశ్వరులారా! మీ రీ మూఁడాసనములయందుఁ గూర్చుండుఁడు. నా రాజ్యము నాతమ్ముని రాజ్యము దశరథురాజ్యము ఈమూఁడును మీవేకదా! దశరథున కిందుఁగల స్వాతంత్ర్యము నా కయోధ్యయందును గలదు. ఇదియు నయోధ్యయు నాసొంతమే. అదియు నిదియు దశరథుని సొమ్మే. కావున మీ మీ యోగ్యతకుఁ దగినట్లు కార్యభారము వహింపవలయును. సందేహింపఁ బనిలేదు. ఏదైన లోపము జరిగెనా యది మీదోషమే కాని నాది కాదు. మీ రాజ్యమున మీరు కార్యములు లోపించిన మీదోషముకాక నాది యెట్లగును? అనిన దశరథుఁడు జనకుని కలుపుకోలుతనమునకు మెచ్చి యిట్లనియె.

తే॥ అన్నదమ్ములు మీర ల♦నంతభద్ర, గుణుల రెప్పుడుఁ గోటానఁ♦గోటు లైన
రాజులను మునిరాజుల♦రాజులఁదమి ,బూజనేసినవారల ♦పుణ్యధనులు. ౧౨౬౮

వింద్రు—రువర్ణకంబు బరంబగునవుడు నున్నమీఁది ద డలయుత్వంబునకు లోపంబు విభాషనగు నిచ్చట నిది ప్రార్థనార్థకమునఁ బ్రయుక్తము. కొడం డ్రురన్ = కొడుకులు + అలు = కొడలు. "బహువచనమ్మునఁ గొన్ని డుమంత

ములమీఁది 'లు' వర్ణంబునకును, ఆల్వాదులలోని లు వర్ణంబునకును, బూర్ణ బిందుపూర్వక డ్రకారం బాదేశంబగు.' సు-వ్యా-ఆచ్ఛిక. ౧౨. ఈసూత్రప్రకారము కొడలు-బహు-కొడండ్రు. కొన్ని బహువచనాంతనామంబులమీఁద బహువచనం బగు అను ౨౫వ సూత్రముప్రకారము కొడండ్రురు అని యయ్యె.

మీరిరువు రన్నదమ్ములు సమితమ్మైన కల్యాణగుణములు గలవారు. దినదినము కోటానఁగోటులగు రాజులను మునిశ్రేష్ఠులసమూహమును బూజించు పుణ్యాత్ములరు. మీకుఁ దెలియని దేమున్నది? కార్యభారము తెలిసినవారియందుండవలయును గాని యేమియు నెఱుఁగని మామీఁద నుంచిన నేమిఫలము? మేము తెలియనితనముచే నేదేని లోపింపఁజేసినఁ దెలిసినవాఁడు జనకుఁడున్నాఁడుకదా! ఆయన యేల చెప్పలేదని నిద మీయందే యుండును. మీ రెట్లు చెప్పిన నట్లు చేయుదుము.

తే॥ ధరణినాయక! నే నింటి♦దాఁకఁ బోయి,వత్తునే? నాంది మొదలుగా♦వలయుఁగాదె
జరుప నని కౌశికవసిష్ఠ♦సహితుఁ డగుచు, విడిదికిసి నేగె దశరథ♦విభుఁడు వేగ. ౧౨౯

రాజా! యింటిదాఁకఁబోయి వత్తునా? నాంది మొదలగు కార్యములు జరుపవలసి యున్నదిగదా యని విశ్వామిత్రవసిష్ఠులతో దశరథుఁడు తనవిడిదికిఁ బోయెను.

చం॥ ఇటు తనయింటి కేగి, ధర♦ణీశుఁడు నాంది యొనర్చి, వేగుఁబో
కట వడి మేలుకాంచి, తన♦గాదిలిపుత్త్రులఁ గూర్చి యిచ్చెఁ బ్ర
స్ఫుటకనకేద్ధశృంగయుత♦భూరిపయస్వినులైన యాల నొ
క్కట నలునూఱువేలు, పిదు♦కంగ నొసంగెను గంచుపాత్రముల్. ౧౩౦

వేగుఁబోకట = ఉదయమున, గాదిలి = ప్రియమైన, కనకేద్ధశృంగయుత = బంగారు మయమై ప్రకాశించుకొమ్ములతోఁ గూడిన - భూరిపయస్వినలు = చాలఁబాలిచ్చునవి - ఆలన్ = ఆవులను.

తాత్పర్యము.

దశరథుఁడు తనయింటికిఁ బోయి నాందీకార్యముఁ దీర్చి యుదయముననే లేచి తనప్రియపుత్త్రుల నుద్దేశించి బంగారుకొమ్ములుగలిగి చాలఁబాలిచ్చు నావుల నాలుగు లక్షలను బాలుపిదుకుటకుఁ గంచుపాత్రముల నిచ్చెను.

కం॥ కొడుకులకొఱకై పెల్లుగ, విడిముడి బ్రాహ్మణుల కిచ్చె ♦ విధిమై నల్వు
రొక్కడుకులతో దిక్పాలకు, లొడఁగూడి భజింప నీర♦జోద్భవుఁ డనఁగన్. ౧౩౧

విడిముడి = ధనము.

తాత్పర్యము.

కొడుకుల నిమిత్తమై బ్రాహ్మణులకు శాస్త్రప్రకారము విశేషధనము దానము చేసెను. ఆవల నలువురుదిక్పాలురతోఁగూడిన బ్రహ్మయో యన నొప్పెను.

—* 23 సర్గము. యుధాజిత్తు దశరథుఁ జూడ వచ్చుట *—

క॥ ఏదినమున గోదానము, భూదయితుఁడు చేసె నల్ల♦పూఁటన చూడం
గా దశరథుఁ గేకయసుతుఁ, డాదటఁ జనుదెంచె, మేన♦యల్లుం భరతున్. ౧౨౭౨

ఏదినమున గోదానము జరగెనో యాదినమందే కేకయరాజకుమారుఁడు తనమేనల్లుని భరతుని దశరథునిఁ జూడవచ్చెను.

ఉ॥ హత్తినప్రేమఁ దండ్రి దను ♦ నంపగఁ దోడ్కొనిపోవ నాయుధా
జిత్తరుదేరఁ గాంచి పతి♦సేమము నారయ సేమ మంచుఁ దాఁ
జిత్తమునందుఁ దండ్రి దమి♦సేసె సుతాసుతుఁ జూడ, దాన నే
నిత్తటి వచ్చినాఁడ నృప! ♦ యేగితి నిగ్గన నయ్యయోధ్యకున్. ౧౨౭౩

తండ్రి పంపఁగా మేనల్లునిఁ బిలుచుకొని పోవవచ్చిన యుధాజిత్తును జూచి దశరథుఁడు కేకయరాజు క్షేమము విచారింపఁగా క్షేమముగా నున్నాఁడని చెప్పి మాతండ్రి తనమనుమనిఁజూడ నాసగొని నన్నుఁ బంపఁగా నీ వయోధ్య యందే యున్నావని తలఁచి యచ్చటికిఁ బోయితిని.

ఉ॥ అచ్చట విన్నవాఁడ నిట ♦ కందఱఁ గూడి నృపాలచంద్ర! నీ
వచ్చుట పెండ్లికై, పరుగు♦పాఱితి నల్లునిఁ జూడఁగోరి నే
ముచ్చట మీఱ, నన్న విని ♦ మోదమునం దనబావగారిఁ దా
నెచ్చుగ నాదరించె ధర♦ణీశ్వరుఁ డాజి యథార్హసత్కృతిన్. ౧౨౭౪

అచ్చట మీరందఱిచ్చటికిఁ బెండ్లికై వచ్చుట విని యెకాయెకీన నిచ్చటికి నల్లునిఁబెండ్లిని చూచుటకై పరువున వచ్చితిని అని చెప్పఁగా సంతోషించి తన బావగారినిఁ దగిన మర్యాదలతో దశరథుఁ డాదరించెను.

క॥ కొడుకులతో నారాతిరి, గడపి దశస్యందనుఁడు ♦ కడువేడుకలన్
బొడుపుమలఁ బ్రొద్దు దోఁచిన, వడి దీరిచి విధుల యజ్ఞ♦వాటముఁ జొచ్చెన్. ౧౨౭౫

ఆరాత్రి కొడుకులతో వినోదముగాఁ గడపి దశరథుఁడు తూరుపుకొండపై సూర్యుఁ డుదయింపఁగాఁ గల్యకృత్యములఁ దీర్చి యజ్ఞభూమి ప్రవేశించెను.

క॥ ఇమ్మగుసొమ్ములు దాలిచి, తమ్ములతోఁ దాను భద్ర♦దం బగుసుముహూ
ర్తమ్మున ధృతకంకణహ, స్తమ్మున వెలుఁగుచును రామ♦చంద్రుఁడు వచ్చెన్. ౧౨౭౬

అందములైన సొమ్ములు ధరించి తమ్ములతో విజయకరమైన మంచి ముహూర్తమునఁ జేతఁ దోరము ధరించి రామచంద్రమూర్తి వచ్చెను.

ఉ॥ మున్న వసిష్ఠగాధిసుత♦ముఖ్యులు దో నడువంగ రాముఁ డా
జన్నపువాటిఁ జొచ్చుడును ♦ జయ్యన నేగి వసిష్ఠమౌని వి
ద్వన్నుతు మైథిలుం గని య♦థావిధిమైఁ గృతకౌతుకుల్ సుతుల్
దన్న భజింప నాజి యదె ♦ దాతనిమిత్తము నేచి యుండెడిన్. ౧౨౭౭

కౌతుకము = కంకణము.

తాత్పర్యము.

వసిష్ఠుఁడు మొదలయిన మునీంద్రులు ముందుగ నిలిచి తమతోడ రాఁగా యజ్ఞభూమిఁ బ్రవేశింపఁగానే వసిష్ఠుఁడు పోయి జనకరాజును జూచి శాస్త్రప్రకారము కంకణములు ధరించిన కొడుకులు తన్ను సేవింపఁగా దశరథుఁడు దాతనిమిత్తము కాచియున్నాఁడని చెప్పెను. ఇచ్చట యజ్ఞభూమి యనఁగా దాని సమీపమునఁ బెండ్లికై యేర్పడిన యుత్సవశాల యని యర్థము గ్రహింపవలెను.

క॥ దాతయును బ్రతిగృహీతయుఁ, జేతఃప్రీతిమెయి నొకటఁ ♦ జేరినఁ గాదే
యాతలికార్యములగు, వి,ఖ్యాతి స్వధర్మంబు నిలుపు♦మా పెండిలిగాన్. ౧౨౭౮

ప్రతిగృహీత = దానము పుచ్చుకొనువాఁడు

తాత్పర్యము.

ఇచ్చువాఁడు పుచ్చుకొనువాఁడు నిరువురు నొకచోటఁ జేరినఁ గదా యావలి కార్యములు జరుగఁగలవు. కావున నీ స్వధర్మము దాతచేయవలసిన కార్యము పెండ్లి జరగునట్లు చేయుము.

ఉ॥ ఇవ్విధి మౌని వల్క మిథిలేశ్వరచంద్రముఁ డామునీంద్రుతో
నెవ్వరు క్రొత్త? లిట్లు తడ ♦ వేటికిఁ జేసితి? రెవ్వ రడ్డమో?
యెవ్వరి యాజ్ఞ వేచెదరొ? ♦ యిమ్మహి యెల్లను మీదె యన్న వా
క్రువ్వఁగ నేల నాగృహముఁ ♦ గోవిద! జంకె స్వమందిరంబునన్. ౧౨౭౯

ఈ విధముగా వసిష్ఠుఁడు చెప్పఁగా జనకరాజాయనతో నిట్లనియె. మునీంద్రా! యిక్కడ నెవ్వరు క్రొత్తవారు? ఇంత యాలస్యము మీ రేల చేసితిరి? ఇంతకును ముందే కార్యారంభము చేయకుండ నెవ్వ రడ్డము వచ్చిరి?

కార్యము జరుపుటకు నెవరి యాజ్ఞకై కాచియున్నారు? నా రాజ్యమంతయు మీదే యని ముందే చెప్పితినిగదా! అట్లుండ నిఁక నా యిల్లుమాత్రము మీదికాదా! తన యింటిలో జంకువారును గలరా?

క॥ భూషితలై రుచిరవధూ, వేషంబుల నాదుసుతలు ♦ వేదికకడ సం
తోషమున నున్నవారు వి, శేషంబుగ వెలుఁగు నగ్ని ♦ చెలువున మానీ! ౧౨౮౦

అలంకరించుకొని పెండ్లికూఁతుల వేషములు ధరించి నా నలువురు కొమారితలు సంతోషముగ వేదియందలియగ్నివలె వెలుంగుచు వేదికడనే యున్నవారు.

క॥ ఇదె సిద్ధ మెల్ల మీకై, యెదురు గనుచు నున్నవాఁడ ♦ నేల తడయుఁగా?
ముదితల నిలిపితి వేదిని, సదయులరై పెండ్లిఁ దీర ♦ నలుపుఁడు మీరల్. ౧౨౮౧

ఇదిగో సర్వము సిద్ధముగానున్నది. మీ రింకను రాలే దని మీరాకకై యెదురుచూచుచున్నాఁడను. ఏల యాలస్యముచేసెదరు? నేను జేయవలసిన కార్యము నాసుతలను వేదియొద్ద నిలిపినాను తక్కిన పెండ్లికార్యము చేయవలసినవారు మీరే.

క॥ జనకుఁ డిటు లాడ దశరథుఁ, డనిపెను దనతనయులను మ ♦ హర్షులఁ గ్రతుశా
లను వెండి వసిష్ఠుం గని, జనకుం డి ట్లనియె నధిక ♦ సమ్మద మారన్. ౧౨౮౨

జనకుఁ డిట్లు చెప్పఁగా నామాటలు వసిష్ఠుఁడు దశరథునకుఁ జెప్ప దూతలను బంపెను. అది విని దశరథుఁడు తనకొడుకులను మహర్షులను యజ్ఞశాలకుఁ బంపెను. అప్పుడు వసిష్ఠుం జూచి జనకుఁ డిట్లనెను.

తే॥ ఋషులతోఁ గూడి యోముని ♦ వృషభ నీవు, రామునకును ద్రిలోకాభి ♦ రామునకును
నింపు దళుకొత్త వేగ చేఁ ♦ యింప వయ్య, యింక వైవాహిక క్రియా ♦ బృందమెల్ల.
౧౨౮౩

మునీంద్రా! యీఋషులతోఁ గూడి నీవు త్రిలోకాభిరాముఁడైన రామచంద్రమూర్తికి శీఘ్రముగా సంతోషముతో వివాహసంబంధమైన కార్యములనన్నిటిని జేయింపుము.

సీ॥ అనిన వల్లెయటంచు ♦ ననఘుఁడు గాధిపు, త్త్రుఁడు శతానందుండు ♦ తోడుపడఁగఁ
జలువపందిరిలోన ♦ శాస్త్రోక్తవిధి వేదిఁ, గల్పించి పుష్పను ♦ గంధతతులఁ
గై సేసి మెఱుఁగుబం ♦ గరుపాలికలతోడ, సాంకురంబు లయి శో ♦ భావహ మగు
ఛిద్రకుంభములతోఁ ♦ జిగుళుల నొ ప్పగు, మూఁకుళ్ళతోడుత ♦ మోహనముగ
ఆ॥ ధూపయుక్తమైన ♦ ధూపపాత్రములతో, వఱలు చున్నస్రుక్స్రు ♦ వములతోడ
నర్ఘ్యలాజపూరి ♦ తాచ్ఛపాత్రములతో, నక్షతలను నించెఁ ♦ నపుడు వేది. ౧.౨౮౪

సాంకురములు = మొలకలెత్తినవి. లాజలు = పేలాలు. వేది = తిన్నె - అరుఁగు.

గార్హ్యపత్యాగ్నికిని ఆహవనీయాగ్నికిని నడుమ వేయఁబడిన యరుఁగు వేది యనఁబడును. దీనియందు హోమమునకుఁ గావలసిన పదార్థము లుంచఁబడును.

తా త్ప ర్య ము .

అనిన వసిష్ఠుఁడట్లే చేసెద నని విశ్వామిత్రుఁడు శతానందుఁడు తనకు సహాయపడుచుండఁ జలువపందిరిలో శాస్త్రప్రకారము వేదిని దీర్చి పూలతోఁ బరిమళద్రవ్యములతో దాని నలంకరించి మెఱయుచున్న బంగారుపాలికలతోను, మొలకలెత్తిన శుభకరమైన యడుగులేని పాత్రములతోను, జగుళ్లుగల మూఁకుళ్లతోను, ధూపముతోడి ధూపపాత్రలతోను, స్రుక్కులు స్రువములు అర్ఘ్యము పేలాలు వీనితోనిండిన స్వచ్ఛపాత్రములతోను, పచ్చనియక్షతలతోను వేది నిండించెను.

మూఁకుళ్లు ఏక - మూఁకుడు , బహు - మూఁకుడులు. "లువర్ణంబునకు ముందున్న యసంయుక్తంబులైె యుదంతంబులయిన డ-ల-ర లకు నలఘుల కారంబు బహుళంబుగ నగు. ఉ.—మూఁకుళులు." సు. వ్యా. ఆచ్ఛిక ౨౦-౨౧. మూఁకుళ్లు.

ఆ॥ మంత్రపూర్వకముగ ♦ మంచి దర్భలఁ బర్చి, విధిహితంబుగాఁగ ♦ వేదియందు
నగ్ని నుంచి వేల్చె ♦ నందు వసిష్ఠుండు, నంతె జనకరాజు♦హర్షయుక్తి ౧౨౮౫

మంత్రములు చెప్పుచు పరిశుద్ధములైన దర్భలఁ బఱచి శాస్త్రోక్తరీతి వేదియందు నగ్నినుంచి వసిష్ఠుఁడు హోమముచేసెను.

సీ తా క ల్యా ణ ఘ ట్ట ము.

కం॥ సీతను సర్వాభరణో,పేతను దా నిలిపి నగ్ని♦ కెదురుగఁ గౌస
ల్యాతనయున కభిముఖముగ, క్ష్మాతలనాథుండు రాము♦చంద్రున కనియెన్.
౧౨౮౬

సర్వాభరణోపేతను = సమస్త భూషణములతోఁ గూడినదానిని.

తా త్ప ర్య ము .

అన్నివిధములయిన యలంకారములతోను బ్రకాశించు సీతను నగ్ని కెదురుగ శ్రీరామచంద్రమూర్తి కెదురుముఖముగ నిలువఁబెట్టి జనకమహారాజు శ్రీరామచంద్రమూర్తితో నిట్లనెను.

కం॥ ఈసీత నాదుకూఁతురు, నీసహధర్మచరి దీని • నిం గైకొనుమా
కౌసల్యాసుత! నీకును భాసురశుభ మగు గ్రహింపు • పాణిం బాణిన్. ౧౨౮౭

అర్థము.

కౌసల్యాసుత = కౌసల్యాకుమారా యని జనకుఁడు శ్రీరామచంద్రమూర్తిని సంబోధించుచున్నాఁడు స్త్రీపేరు చెప్పి పిలువకుండిన వాడుకపేర రామా యని పిలువరాదా? దశరథకుమారా యనగాదా? యనిన నవిరెండును నిప్పుడు సరిగావు. పరశురామునకు రాముఁడని యున్నట్టు లాపేరుగలవారు సభలో మఱి యెవ్వరైన నున్నారేమో వారి నెవ్వరినైనఁ బిలుచుచున్నాఁడేమో తన్నుఁ గాదేమో యని రామచంద్రమూర్తి విని వినక యుండునేమో? దశరథకుమా రా యని పలిచిన లక్ష్మణభరత శత్రుఘ్నులు కూడ దశరథకుమారులేకదా! అందఱు 'నో' యనిన నేమి జేయవలయును? కౌసల్యాసుత యనిన నట్టి సందే హములకుఁ గారణము కలుగదు.

ఈ సీత - సీత సిగ్గుచే నా చేతిని బట్టుకొమ్మని తానై చేయి చాఁపదు. రామచంద్రమూర్తియో తానై చేయిచాఁచి సీతచేతిని బట్టుకొనబోయినఁ బెండ్లికాకముందే యెంతస్వాతంత్ర్య మబ్బా! ఎంత కాముకుఁడు రామచంద్రుఁ డని లోకులు తలఁతు రని బిడియపడు నని తలఁచి జనకుఁడు తానే సీతచేతిని రామచంద్రమూర్తివైపునకుఁ జాఁపి యీ సీత యని చెప్పుచున్నాఁడు.

అలంకరింపఁబడిన కళ్యాణమంటపమందు నలువైపుల నిలువుటద్దాలు వేయఁ బడి యుండుటచే నన్నిటియందు నన్ని సీతారూపములు కానరాఁగా నిజమైన సీత యేదియో తెలిసికొనలేక నలుదిక్కులు చూచు రామచంద్రమూర్తికి భ్రమదీర జేయిసాఁచి యీసీత యని చూపించి చెప్పుచున్నాఁడు.

'ఊరక సీతను వరింపుము' అని చెప్పిన నందఱు స్త్రీలలో సీత యెవ్వతెయో? యెవతెచేతిని బట్టకొనును? కావున నట్టిసందేహమున కెడము లేకుండునట్లు ఈసీత యని చెప్పుచున్నాఁడు. 'అతిరూపవతీ సీతా' యన్నట్లు సౌందర్య సౌకుమార్యలావణ్యాదులయందు నందఱుస్త్రీల నతిశయించియుండు నీసీతను.

ఎదురుగానుండు బాలిక నీకుఁ గానరాలే దని నేను ఈసీత యని చెప్పరా లేదు. నేను జెప్పెడుమాటలయర్థము గ్రహింపుము. నేను ఈ యని నిర్దేశించు చున్నా నని తలంపకుము. ఈ సీత యనఁగా ఈ యగు సీత యని యర్థము. నీ వె ప్పుడు శివునివిల్లు విఱచితివో నీవు శివునికంటె గొప్పవాఁడ వని విష్ణువని గ్రహిం చితిని. అట్టి నీకుఁ బామరకన్యను దెచ్చి నే నిత్తునా? సీత ఈ యనఁగా: ఈసీతయే లక్ష్మీదేవి యని యనపాయిని యని తలంపుము. నీ వవశ్యము గ్రహింపఁదగినది. ఈసీత = ఈ యగు సీత - 'ఈకారోఙ్బదళే లక్ష్మ్యా' మ్మని నానా.

ఈసీత: రామా నీవేమో "పుంసాం మోహనరూపాయ" యని మహాసుందరపురుషుఁడ నని గర్వించుచున్నావు. ఈమె యెంత సౌందర్యవతియో యిటు చూడుము. నీకంటెఁ దక్కువైనది కాదు

సీత: సీత యఁట. అబ్బే! యిది యేమి పేరని యెంచకుము. సీత యనఁగా నాఁగటిచాలని కదా నీవు తలంచితివి! నాఁగటిచాలు భూమిని భేదించుకొని యెట్లు రూపముగల దగునో యట్లు యీమెయు భూమిని భేదించుకొని వచ్చుటచే సీత యన్న పేరు ప్రఖ్యాతమయ్యెను. దీనివలన నామె యాభిజాత్యము దెలియనగును.

కాఁపువాఁడు కృషిని ఫలింపఁజేసి వానికి ఫలము గలిగించునది సీతయేకదా (సీత = నాఁగటిచాలు)! అట్లు నీవు చేయుకార్యము లన్నియు నీమెవలననే ఫలవంతములు కావలసియున్నవి. ఈమెసాహాయ్యము లేక నీవు చేయుకృషి వ్యర్థము. తాను ఫల మేమియు నాసింపక ఫలమును గలిగించి యా ఫలము నెల్ల కర్షకునకే యిచ్చునట్లు నీమెయుఁ బ్రతిఫలాపేక్ష లేక నీకు సాహాయ్యకారిణి.

ఆకాశగంగానదశాఖ యగు సీత యేవిధముగ నొకసారి తన్ను సేవించిన పాపములను ధ్వంసము సేయునో యట్టులే యీ సీతయును నొక్కసారి నమస్కారము చేసినవారిపాపములను ధ్వంసము చేయును "వేదాహ మేతం పురుషం మహాన్తం" అనుదానిని రామపర్యాయముగ 'అహం వేద్మి మహాత్మానం' అని చెప్పినట్టు లిచ్చట సీతావిషయమందును ఛాందోగ్యోపనిషత్తు ఎనిమిదవ ప్రపాఠకము మూఁడవ ఖండమందలి యర్థమును 'ఇయం సీతా-సీతా ఇయం-సీతేయం' అను పదములచే వాల్మీకి తెలిపెను.

"తానిహవా ఏతాని త్రీణ్యక్షరాణి స, తీ, య, మితి తద్యత్స త్తదమృత మథ యత్తి స్మర్త్య మథ య ద్యంతేనోభే యచ్ఛతీ య దనేనోభే యచ్ఛతి తస్మాద్య మహరహర్వా ఏవం విత్స్వర్గం లోక మేతి"॥.

"తానిహ వా ఏతాని బ్రహ్మణో నామాక్షరాణి త్రీణ్యేతాని స, తీ, య, మితి సకార, స్తకారో౽యమితి చ ఈకార స్తకారే ఉచ్చారణార్థోనుబంధః హ్రస్వే నైవాక్షరేణ పునః ప్రతినిర్దేశాత్. తేషాం తత్ తత్ర యత్సత్ సకారః తదమృతం సచ్ఛబ్దో అమృతవాచకత్వా దమృతఏవ సకార స్తకారాంతో నిర్దిష్టః. అథ యత్తి తికారః, త న్మర్త్యం అథ య ద్యమక్షరం తేనాక్షరేణా మృతమర్త్యాఖ్యే పూర్వే ఉభే అక్షరే యచ్ఛతి యమయతి నియమయతి వశీకరో త్యాత్మనేత్యర్థః"॥ — శంకరభాష్యము.

శంకరభాష్యప్రకారము పరబ్రహ్మవాచకమైన సత్యమ్ అను వాచకమందు స-త్-యమ్. అను మూఁడక్షరములు గలవు. ఆ మూఁడు స-త-యమ్ గా

గ్రహింపవలయును. సత్ బదులు స తకారముమీఁది ఈకార ముచ్చారణసౌక ర్యార్థముగ నైన యనుబంధము. సకారము అమృతము. తకారము మర్త్యము. అమృతమును మర్త్యమును రెంటిని యమించునది యనగా నియమించునది యమ్. యమ్ మర్త్యత్వమును అమర్త్యత్వమును గలుపునది.

రంగరామానుజ భాష్యప్రకారము "తానిహవా ఏతాని త్రీణ్యక్షరాణి సత్తియ" మితి. సత్ - తి - యమ్ - ఇతి సత్యనామ త్ర్యక్షరాత్మికమి త్యర్థః. తద్య త్సత్త దమృతం అథయత్తి త న్మర్త్యం- అత్రామృతమర్త్యశబ్దాభ్యాం చేత నాచేతనే నిర్దిశ్యేతే. అథ యద్యంతే నోభే యచ్ఛతి. అమృతత్వమర్త్యత్వ రూపేణో పలక్షితే ఉభే యచ్ఛతీతి య మిత్యర్థః. య దనే నోభే యచ్ఛతి తస్మా ద్యం- అనేన చేతనాచేతనత్వరూపేణ ఉపలక్షితే ఉభయతో యచ్ఛతి తస్మా ద్య మిత్యర్థః.

ఈవ్యాఖ్యానప్రకారము - సత్ = అమృతము - అనఁగా చేతనములను, తి = యనఁగా మర్త్యము= అచేతనములు- యమ్ అనునది రెంటిని నియమించు నది - దీనివలన సత్తియం సత్యంచేతనాచేతనముల నియమించునది యయ్యె.

మధ్వాచార్యభాష్యమున సత్య మనుశబ్దంబున సత్, తి, యమ్ అనుమూఁడ క్షరములు గలవు. సత్ = అమృతమును (ముక్తజీవులను) తెలుపును. తియను నది మర్త్యులను (ముక్తులుగాని జీవులను) దెలుపును యమ్ అనునది (ముక్తా ముక్తజీవులను) నిరుదెగలను నియమించునది యని యర్థము అని కలదు.

దీనివలన సతియం అనుటకు మర్త్యులుగానుండు కర్మబద్ధజీవులకు నమర్త్య త్వమును బొందించునది యనియు, జీవులను బ్రకృతిని నియమించునది యనియు ముక్తాముక్తుల నిరువురి నియమించునది యనియు నేర్పడెను.

దీనివలన సతియం సేతువువంటి దయ్యెను. 'ఏష సేతుర్విధరణ' యని శ్రుతి కలదుగదా. సేతు వనఁగా సద్గ్రించునది యని యర్థము చేయరాదు. ఏటికో సముద్రమునకో యీ యొడ్డున నున్నవారిని నాయొడ్డునఁ జేర్చుటకు సాధన మైన దని యర్థము గ్రహింపవలెను. అట్లైతే దేని సాహాయ్యమున మర్త్యు లమర్త్యులగుదురో యది సతియం - సీతేయం యనుచో నీయర్థమునే గ్రహింప వలయును. సకారముమీఁది ఈకారము, తకారము మీఁది ఏకారము దీయఁగా స-తి-యం అని యేర్పడును. సేతువు చేయు కార్యమేకదా పురుషకారభూత మైన లక్ష్మి సీత చేయునది.

శ్రీసాత్వతసంహితయందు "యా మాలంబ్య సుఖే నేమం, దుస్తరంహి గుణోదధిం, నిస్తరంత్యచిరేణైవ, వ్యక్తధ్యానపరాయణా." ఎవతెను నాధార

ము చేసికొని దాఁటరాని ప్రకృతి గుణసముద్రమును సుఖముగ శీఘ్రముగ వ్యక్తస్వరూపమందు ధ్యానాసక్తులైనవారు తరింతురో.

చేతనాచేతనముల కన్నిటికి నీశ్వరి లక్ష్మికదా. ఆమెయే "రాఘవత్వే భవే త్సీతా" యని విష్ణుపురాణోక్తి గలదుగదా.

"శ్లో॥ యథా మయా జగద్వ్యాప్తం, స్వరూపేణ స్వభావతః, తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీ చ త థేశ్వరీ" నేను ప్రపంచమందు గుణముచేతను రూపముచేతను ఎట్లు వ్యాపించియున్నానో లక్ష్మియు నట్లే వ్యాపించియున్నది. సమస్తప్రపంచమునకు నామెయే నియంత్రి. ఈశ్వరి. కావున నీరక్షణబిరుదము సార్థక మీమెవలననే కావలసియున్నది.

ఈ సీత - నీవు కౌసల్యాసుతుఁడవు. కావున యోనిజుఁడవు. ఈసీత యయోనిజ. కావున నాభిజాత్యమందు నీకంటెఁ దక్కువైనది కాదు.

సిద్ధాశ్రమమందు నీమెవిషయము విన్నది మొదలు సీత నెప్పుడు చూతునా యని యే సీతనుగుఱించి యేకారుచుంటివో యాసీతయే యీసీత.

మిఱుమిట్లుగొలుపు విశేషకాంతిగల మెఱుపువంటి పదార్థము తళుక్కున మెఱసినపుడు అవయవమైన కాంతి కనఁబడునేకాని అది దేనికాంతియో యది కనఁబడదు. అట్టులే మెఱుపుఁదీఁగవంటి సీతను జూడఁగానే యాకాంతి రామచంద్రమూర్తి మిఱుమిట్లుగొనఁజేయగా దృష్టించి చూడలేక తికమకగొను రామచంద్రమూర్తికి ఈసీత యని చూపించెను.

శ్రీరామచంద్రమూర్తి సీతాచరిత్రము విన్నది మొదలు తదేకధ్యాననిష్ఠుఁడై యుండుటచే నిరంతరభావనాబలంబున 'ప్రాసాదే సా,పథిపథిచసా, పృష్ఠతః సా, పురః సా' "మేడయందు నామె, త్రోవత్రోవయందు నామెయే, వెనుక నామె, ముందు నామె" యన్నట్లు లామెను గనుచుండిన వాఁడగుటచే నప్పుడును మోహపరవశత్వముచే దిక్కులుచూచు రామచంద్రమూర్తికిఁ దావిచ్చునట్టి సీత యీమెయే యని సీతను జూపించుచున్నాఁడు.

సీత — రామా! యీమె సీత కావున భూపుత్రి. కారణగుణములు కార్యమందుండును గావున భూమి యెట్లు క్షమయో = ఓర్పుగలదో, సర్వంసహయో = సర్వమును సహించునదియో, భూతధాత్రియో = సర్వభూతముల ధరించునదియో, విశ్వంభరయో = సమస్తమును భరించునదియో, ఎట్లు మహియో = పూజింప యోగ్యరాలో యట్లులే యీమెయు నెన్నికష్టములకైన మాఱుమాటచెప్పక గొణగక యుండునది. ఎవ రెన్ని యపరాధములు చేసినను సహించునది. అపరాధుల క్షమించుటయగుట నీ వ్రతము. దానివలన నీకప

రాధజ్ఞానము గలదు. ఈమెకు నపరాధ మనునట్టిది యేదో యెఱుంగదని యీమె వ్రతము. తన్ను లోకులు గడ్డపాఱలతోఁ ద్రవ్వినను తనపై మలమూత్రములు విడిచినను గాళ్ళఁ దన్నినను భూమి యెట్లు సహించియుండునో యట్లే యెవ రెంత తనపట్ల దోషము చేసినను 'నకశ్చి న్నాపరాధ్యతి' అపరాధము చేయనివాఁడు లేఁడని యితరులయపరాధములు లెక్కింపక వారికి మేలే చేయును.

ఈమె లక్ష్మి కావున సర్వభూతములను ధరించునది. భరించునది. కావున నీకును గౌరవింపఁ దగినదే

ఈమె సీత కావునఁ దల్లిలేనిది తల్లిలేని బిడ్డ నెట్లు లాదరింపఁ దగినదో యట్లు లీమెయు నాదరింపఁ దగినది

భూమి రత్నగర్భ కావున భూమియందుఁ బుట్టిన యీమె స్త్రీరత్న మని తలఁపుము. రత్నము నెట్లు గౌరవింపవలయునో యట్లు గౌరవింపుము. భూమి వసుమతి కావున నీమెను బంగరుశలాక యని తలఁపుము నీ వింద్రనీల మవుదువు గాక. బంగారు లేక యింద్రనీలము ప్రకాశింపదుగదా! కావున నీవు లోకమునఁ బ్రకాశించుటకు నీమెసాంగత్య మనివార్యము. ఈమె సాంగత్యము లేదేని నీవు పేరు ప్రతిష్ఠ నామరూపములు లేక యుండవలసినవాఁడవే. "అనర్ఘమపి మాణిక్యం హేమాశ్రయ మపేక్షతే" మాణిక్య మెంత వెలగలదైనను బంగారు నాశ్రయము కోరును

'నా దు కూఁ తు రు.'

నాయొక్క కూఁతురు. ఈమెచేత సీత యగుటచే. భూమిలో దొరికిన దంటివి. ఇట్టిదానికిఁ దల్లి యెవతె? తండ్రి యెవఁడు? అట్టివారు లేనిదానిని నే నెట్లు పెండ్లియాడవచ్చును 'పితృహీనాం పితృశ మాతృశ యని కలదుగదా' యందు వేమో. ఈమె నాకూఁతురు

నాకూఁతు రీమె యని సగర్వముగాఁ జెప్పుచున్నావే, నీవిశేష మేమందు వేమో.— నీవు రాజమాత్రుఁడ వవుటచే నెప్పుడో యేదో ప్రజలకు మేలైన కార్యములుచేసి యదియును వారివలనఁ బ్రతిఫలముఁబొంది సంతోషపెట్టి ప్రజల రంజింపఁజేయువాఁడవు. నేనో ప్రజలను సర్వకాలసర్వావస్థలయందు వారివలనఁ బ్రతిఫలముఁగోరక జనకునివలె యోగక్షేమభారము వహించి కాపాడువాఁడను గనుక నన్నందఱు జనకుఁడనియే తలఁచుచున్నారు పిలుచుచున్నారు.

2. 'కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయ' యన్నట్లు సదాచారసంపత్తికి, యోగవిద్యకు, జ్ఞానసిద్ధికి నేను బ్రసిద్ధికెక్కినవాఁడను.

'గొప్ప తపస్సుచేసి నిన్నుఁ గంటి' నన్నట్లు నే నెంతో తపస్సు చేసి నీతో సంబంధము చేయఁగోరి యీమెను గంటిని నీ నిమిత్తమై నీ తల్లిదండ్రు లెంత తపస్సు చేసిరో యంత నేను జేసియున్నాను.

నాకూఁతురు = నీ తల్లిదండ్రులు గొప్పతపస్సులుచేసి యజ్ఞములుచేసి నిన్నుఁ బుత్త్రుఁ గాంచిరి. నేను దపస్సుచేసి 'పుత్రా చ్ఛతగుణం పుత్రీ' కొడుకు కంటె నూఱంతలు కూఁతురు మేలని యుండుటచే నీమెను గంటిని. నీ తల్లి దండ్రుల తపస్స్యెక్కువో నా తప స్సెక్కువో యాలోచింపుము.

నీ తండ్రి రాజసుఁడు. పామరుఁడు. కాముకుఁడు. ఈమె తండ్రి యగు నేనో శ్లో॥ అనంతం బత మే విత్తం, యస్య మే నా స్తికించన।మిథిలాయాం ప్రదీప్తాయాం నమే కించి త్ప్రగహ్యతే" నాకు మితిలేని ధనము గలదు. ఐననేమి? అందు నాది కొంచెమైనను లేదు. కాలిపోవు మిథిలయందు నా దేదియుఁ గాలిపో లేదని చెప్పినవాఁడను నేను. నీ తండ్రి గొప్పవాఁడో యీమెతండ్రి గొప్పవాఁడో యాలోచింపుము.

ఇట్టి నా కూఁతురు గావున నెట్లు ప్రేమింపవలయునో యట్లు ప్రేమింపుము సీత యనుటచే జన్మపరిశుద్ధియు, నా కూఁతు రనుటచే నావాసపరిశుద్ధియుఁ దెలుపఁబడెను.

'నీ స హ ధ ర్మ చ రి'

అయ్యా! నీకొమార్త ప్రతిష్ఠ, పేరుపెంపు, నీపేరుపెంపు చెప్పుకొంటివి. సంతోషమే. కాని నావిషయమునం దేటు లుండునో యనెదవా? అది నీ వాలోచింపవలసినపని లేదు. ఈమె నీసహధర్మచరి. నీ వేది ధర్మ మని చేసెదవో యట్టి ధర్మమందు నీమె నీకుఁ దోడై యుండి యాకార్యము నిర్వహింపఁ గలదు. నీవు నీతండ్రివాక్యమును బాలించు నట్లు లీమెయు నా వాక్యమును బాలించి నీకు ధర్మకార్యములం దన్నిటఁ దోడై యుండును. కావునఁ బరిగ్రహింపుము. నీసహధర్మచరి= చెప్పిపెట్టిన బుద్ధి, కట్టి యిచ్చిన సద్ది యెన్నాళ్లుండునందువా? నాబోధ ప్రకారము నా బలవంతమున నీ సహధర్మచరి యని తలంపుకుము. ఈమె లక్ష్మీదేవి యని ముందే చెప్పితిని గదా. నీ సహధర్మచారిత్వ మీమెకు స్వభావ సిద్ధము నీ కైంకర్యమే యీమెకు స్వరూపము. సృష్టియందుఁగాని రక్షయందుఁ గాని సంహారమందుఁగాని యీమె నీకు సర్వకాలసర్వావస్థలఁ దోడై యుండు నది అని యీమె స్వభావము చెప్పితిని గాని స్వభావముచే గుణవతి గానట్టు నా బోధచే నగునట్లు నేను జెప్పలేదు. నీసహధర్మచరి యని యంటివే యిది వివాహము పూర్తియయిన తర్వాతఁ గదా నీ యని చెప్పవలయును. ఇంకను నాది కా లేదు గదా యందువా? సర్వహృదయముల నాకర్షించు నీసౌందర్య మను వలచే నీమెను వలలో వేసికొంటివి. ఏనాఁడు నీవు విల్లు విఱిచితివో యానాఁడే యీమె నీసొత్తయ్యెను. ఈ వివాహకర్మము శాస్త్రమర్యాదారక్షణార్థము. అదియునగాక యీమె యెప్పటికి నీసొత్తేకదా. ఈ వివాహలీల లోకవిడంబనార్థమే. కావున నీసొత్తు నీవు తీసికొమ్మని చెప్పుచున్నాను.

ప్రాజాపత్యవివాహమందు నీ సహధర్మచారిణి యని చెప్పుటయే సంయోగ మంత్రము. సంయోగ మంత్ర మనఁగా ముఖ్యమంత్రము. "శ్లో॥ సహోభౌ చరతం ధర్మ, మితి వాచానుభాష్యచ। కన్యాప్రదాన మభ్యర్చ్య, ప్రాజాపత్యో విధిః స్మృతః" మీరిరువురు గలిసి ధర్మమాచరింపవలసినది. వేఱువేఱుగాఁ గూడదు - అని కన్యాదాత చెప్పఁగా వరుఁడు, "అహం గృహస్థాశ్రమ ఏవ ధర్మం చరిష్యామి నాన్యాశ్రమస్థ ఇతి వరం ప్రతిశ్రావ్య" "నేను గృహస్థాశ్రమ ధర్మమంచే చరించెదను. వే ఱాశ్రమమం దుండను." అని చెప్పవలయును. ఇది యీ వివాహమున ముఖ్యవిషయము.

ఇప్పుడు వివాహములందు "ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరితవ్య" యని కన్యాదాత చెప్పఁగా 'నాతిచరామి' అతిక్రమించిపోను అని వరుఁడు ప్రమాణము చేయుచున్నాఁడు.

కైకొనుమా – నాసహధర్మచారిణి యైనచో వచ్చి నాయింట నుండు మనుము ధర్మకార్యములు చేయనిమ్ము. నేను జేయవలసిన దేమున్న దనెద వేమో? నీవు పరిగ్రహింపుము.

పరిగ్రహింపు మనఁగా నిరాకరింపకుండుట యనుమతించుట మాత్రము కాదు. కై + కొనుమా = పాణిగ్రహణముచేసికొనుము. నాపూర్వపరిగ్రహ మని లక్ష్మి యని యనాదిగా నాతోడనుండునది యని యంటివే నాసొత్తు నేను గ్రహించుట యందు నీమధ్యవర్తిత మేమి? నీ విచ్చునదియేమి నేను దీసికొనునదియేమి? నావ స్తువు కాకుండినఁగదా నీ విచ్చుట, నేను దీసికొనుట యందు వేమో? ఇది లోక విడంబనార్థము. మీయిరువుర రహస్యము నాకుఁ దెలియునుగాని తక్కినవా రేమి యెఱుఁగుదురు? ఊరక నీవు పిలుచుకొని పోయిన దాసివలె భోగినివలె లోకులు దలంతురుగాని ధర్మపత్నియని యెఱుంగలేరు. కావున నీవు పాణిగ్రహణముచేసికొ నుము. సత్యము మనకుఁ దెలిసి యున్నప్పుడు లోకము ీడ మన కేమి పని యందు వేమో? మీ రవతరించినది యేల? మనుష్యరూపముల మనుష్యవర్తనమున మనుష్యులకు హితము ధర్మము బోధించుటకే కదా. అట్టి నీవు శాస్త్ర మార్గము నవలి లోకవృత్త మనుసరింపక స్వేచ్ఛగా వర్తించిన లోకు లంద అట్లే చేయుదురు ఏమనిన 'రామచంద్రమూర్తి చేయలేదా, మేము చేసిన నే' మందురు అట్టి యపవాదము నీకు వచ్చును. లోకము చెడును. ధర్మపత్నీ గౌరవ మీమెకు లేకపోవును. కావునఁ బాణిగ్రహణమునఁ బరిగ్రహింపుము. లోకమర్యాద, శాస్త్రమర్యాద ననుసరించి కన్యాదాత యియ్యవలె. వరుఁడు పరిగ్రహింపవలెఁ గావున నే నిచ్చెదను. నీవు పరిగ్రహింపుము.

కైకొనుమా = నా గురువు వాక్యము పాలించుటకై వి ల్లెక్కిడితిని. అది విఱిగెను. కాని మీ పిల్ల నిమ్ము వి ల్లెక్కుపెట్టితి నని ముం దొడఁబాటు లేదు గదా. ఇప్పుడు న న్నీల పాణిగ్రహణము చేసికొ మ్మని బలవంత పెట్టెదవు. ఇచ్చుటయందు నీ కెంత యధికారము గలదో పుచ్చుకొనుటయందు నా కంత యధికారము గల దందువా? కాదు నేను గాదనను కాని విల్లు మోపెట్టిన వానికి నాకన్య నిచ్చెద నని వాగ్దానముచేసి యున్నట్లు ముందే చెప్పితినిగదా! కావున నీకు ఫలమం దాస లేదేని యీ కార్యమునకుఁ బూనుకొనక యుండవలసి యుండెను. కార్యముచేసి ఫలానుభవము వల దనినఁ దప్పునా? అట్లు చేసిన న న్నసత్యవాదినిఁ జేసినవాఁడ వగుదువు గదా! నీ తండ్రిచే నీ వసత్య మాడించుట ని కెట్లు తగదో యట్లులే నాచే నసత్యమాడించుట నీకుఁ దగదు. నేను రాజ నని కైకొనుము అని విధిగ శాసింపలేదు. ఈ కన్యాదాన ఫలమునఁ దరింతును గాక యని కైకొనుమా యని ప్రార్థించుచున్నాను. కావున నాప్రార్థన మంగీకరించి కృతార్థునిఁ జేయుము. లోకమున వివాహమాడఁగోరిన వరుఁడు కన్యాజనకునియొద్దకు వచ్చి నీకన్య నాకి మ్మని యడుగుట మర్యాద. అట్లుండ నేనై నాపిల్లను నీ కిచ్చెదను, పరిగ్రహింపు మనిన నీ కేల యింత బిగువు

'నీకు సు భాసుర శుభ మగు.'

అయ్యా! నీప్రార్థన మంగీకరించి నేను నీకన్యను బాణిగ్రహణమునఁ గైకొంటినేని నీకు కన్యాదానలాభము గల దంటివి. నీకన్యయుఁ దగిన వరుఁడు లభించె నని సంతోషించును. నిజమే కాని నా కేమి మేలు - అందువా.

నీకును జగత్ప్రసిద్ధమైన మేలు కలదు ఈమెను బరిగ్రహించినచో నన్నియాశ్రమములలోన శ్రేష్ఠమైన గృహస్థాశ్రమమును స్వీకరించినవాఁడ వగుదువు అదియొక పురుషార్థసాధనము గదా. 'దారసంగ్రహంబు ధరణీశ రతిపుత్రఫలము' అన్నట్లు ఇహసౌఖ్యము కలుగుటయేకాక వంశాభివృద్ధి యగును. కావునఁ బితరులు సంతోషింతురు. పరలోకసుఖము కలదు. ఈమెను నీవు గ్రహించిననే నీవు శ్రీరాముఁడ వగుదువుగాని యీమె లేకున్న నీవు శ్రీరాముఁడు కానేరవు. అశ్రీకరాముఁడ వగుదువు.

నీవు శిష్టరక్షణము దుష్టశిక్షణము ధర్మస్థాపనము చేయవలసినవాఁడవు. ఈ కార్యము లీమెతోడ్పాటు లేక చేయఁజాలవు కావున నీకీర్తిప్రతిష్ఠలకై యీమెను గ్రహింపుము.

శుభమగు = నేను తపోబలముచే నిగ్రహానుగ్రహశక్తి గలవాఁడను. కావున నీకు మేలుకలుగ మంగళాశాసనము కావించుచున్నాఁడను.

రామచంద్రమూర్తి సౌందర్యవిశేషముఁ జూచి యెవరైన దృష్టిపెట్టుదురో యని దృష్టిదోషపరిహారార్థము మంగళాశాసనముఁ గావించుచున్నాఁడు. నీ కెంతో పుణ్య మగునుగాక నావ్రతముగ బరిపాలింపుమని ప్రార్థించుచున్నాఁడు.

'గ్రహింపు పాణింబాణిన్'

రామా! యిప్పుడు నేను జేయవలసినదేమి యనెదవేమో నీవు చేయవలసినది మఱి యేమి లేదు. ఈమె పాణిని నీపాణిచేఁ బట్టుకొమ్ము ఆమెచేయి సాఁచినఁగదా యందువేమో, అట్లుగాదు. సీత కన్య, ముగ్ధ, కావున లజ్జపడును. కావున నీవే యామెపాణిని బట్టుకొమ్ము నీవుచేసిన యపరాధమునకు నీపై నామె ప్రణయకోపము వహించెనేని యపుడు శయ్యాగారంబునఁ బాదములు పట్టుకొందువు గాని యిప్పటికి చేతినే పట్టుకొమ్ము.

సన్నికల్లు త్రొక్కించునపుడు పాదము పట్టుకొందువు ఇప్పటికిఁ గేలు పట్టుకొమ్ము. రామా! శివునివిల్లే యతి కఠినము దానిని విఱిచిన నీ చేయి యింకనెంత కఠినమో. అట్టి హస్తముచే నావింటని బట్టినట్లు లీమె హస్తమును బట్టకుము. ఈమె బాల, సుకుమారి. కావున మెల్లఁగాఁ బట్టుకొనుము

నే నెప్పుడీమె వక్షమునందే ధరియించియుండువాఁడనే అంతకంటెఁ జేతిని బట్టుకొనుట యెక్కువయా యందువేమో. నిత్యవిభూతియందు నీ వట్లుండినను లీలావిభూతియందు మనుష్యలీల వర్తింపుము.

పాణింబాణిః = 'గృహ్ణామి తే సుప్రజాస్త్వాయ హస్త' మని మంత్రపూర్వకముగ నీమెపాణిని నీపాణిచేఁ బట్టుకొమ్ము. "శ్లో॥ శరః క్షత్రియయా గ్రాహ్యః ప్రతోదో వైశ్యకన్యయా। వసనస్య దశా గ్రాహ్యా శూద్రయోత్కృష్టవేదనే." మనుస్మృతి 3-४४ నందు క్షత్రియస్త్రీ మగనిబాణముకదా పట్టుకొనవలయు ననిన నది యసవర్ణవివాహవిషయమే. క్షత్రియస్త్రీ బ్రాహ్మణుని వివాహమాడునపు డాబ్రాహ్మణుఁడు పట్టుకొన్న బాణమును నది పట్టుకొనవలయును గాని సవర్ణవివాహములందుఁ బాణిగ్రహణమే విధి "శ్లో॥ పాణిగ్రహణ సంస్కారః సవర్ణాసూపదిశ్యతే।అసవర్ణా స్వయం జ్ఞేయో విధి రుద్వాహకర్మణి"-మను. 3-४3. పాణిగ్రహణసంస్కారము సవర్ణవివాహములందుఁ జెప్పఁబడెను. అసవర్ణవివాహములందు 'శరః క్షత్రియయా' యనువిధి ననుసరింపవలెను. "శ్లో॥ పాణిర్గ్రాహ్యః సవర్ణాసు, గృహ్ణీయాత్ క్షత్రియా శరమ్। వైశ్యా ప్రతోద మాదద్యా ద్వేదనే త్వగ్రజన్మనా"-శంఖ. సవర్ణవివాహములందుఁ బాణినే పట్టుకొనవలయును. అసవర్ణవివాహములందు క్షత్రియస్త్రీ బాణమును బట్టుకొనవలయును, వైశ్య కొఱడా పట్టుకొనవలెను.

ఈమెపాణిని నీపాణిచేఁ బట్టుకొమ్ము నీచేత నీమెచేతిని బట్టుకొమ్మనక యీమె చేతిని నీచేతఁ బట్టుకొమ్మనుటకు సీతాదేవిశ్రీహస్తమందు భోగ్యత యతిశయించి యుండుటే కారణము. భోగించువాఁడు భోగ్యవస్తువును దానేగదా గ్రహింపవలయును.

శత్రువులను జంపినవానిని రాముని సీతాదేవి కౌఁగిలించెను. అని యుండుటచే ఖరాసురాదులతో యుద్ధముచేసి పడినగాసి గాయములు పోవ సీతాదేవి కౌఁగిలించెను. కావున వడఁబడినవాఁడు స్నానార్థమై సరోవరమునకుఁ బోయినట్లు నీవే యీమె హస్తమును బట్టుకొంటివేని నీతాపము పాయును. శిష్టరక్షణమునకు దుష్టశిక్షణమునకు ధర్మసంస్థాపనమునకై భగవంతుఁ డవతరించి నపుడు భక్తులు వారివారి శక్తికొలఁది సాహాయ్యము చేయవలయును. ఆనిమిత్తమున విశ్వామిత్రుఁడు శిష్టరక్షణమునకై శస్త్రాస్త్రముల నొసఁగెను. రాక్షస నాశమునకు మూలకందమగు సీతను జనకుఁ డిచ్చెను. ఈ విధముగ వీ రిరువురు కృతకృత్యులైరి. ఇందు సీతాదేవి సహధర్మచరి యని చెప్పఁబడెను. సహధర్మచారిణీ లక్షణమును పార్వతి శివున కిట్లు చెప్పెను. "సుఖభావా, సువచనా, సువ్రతా, సుఖదర్శనా, అనన్యచిత్తా, సుముఖీ, భర్తుః సా ధర్మచారిణీ। సా భవే ద్ధర్మపరమా, సా భవే ద్ధర్మభాగినీ। దేవవత్సంతతం సాధ్వీ, భర్తారం పరిపశ్యతీ। శుశ్రూషాం పరిచర్యాంచ, దేవతుల్యం ప్రకుర్వతీ। నాన్యభావాహ్యవిమనాః, సువ్రతా సుఖదర్శనా।యాసాధ్వీ నియతాహారా సా భవే ద్ధర్మచారిణీ। పరుషాణ్యపి చోక్తా యా, దృష్టా దుష్టేన చక్షుషా। సుప్రసన్నముఖీ భర్తుర్యా నారీ సా పతివ్రతా।న చంద్రసూర్యౌ న తరుం పున్నామ్నో యా నిరీక్షతే। భర్తృపూజ్యా వరారోహా, సా భవే ద్ధర్మభాగినీ। దరిద్రం వ్యాధితం దీన,మధ్వనా పరికర్శితమ్। పతిం పుత్రమి వోపాస్తే సా నారీ ధర్మచారిణీ। న కామేషు న భోగేషు నైశ్వర్యే న సుఖే తథా।స్పృహా యస్యా యథా పత్యౌ,సా నారీ ధర్మభాగినీ।

భర్తను సంతోషపెట్టు తలంపుగలది, భర్త సంతోషించునట్లు మంచిమాటలాడునది, భర్తహితముగోరి వ్రతముచేయునది, మగనికి సంతోషకరముగఁ గనఁబడునది, మగనినిఁదప్ప వేఱొకనిపై మనస్సుంచనిది ప్రసన్నురాలై యుండునది, పాతివ్రత్యమే పరమధర్మ మని యెంచునది, భర్తను సర్వదా దైవమని చూచునది, దేవునికిఁ జేయు నుపచారముల మగనికిఁ జేయునది, మఱియొకదాని యందు భావ ముంచనిది, భర్తకంటెఁ దాను వేఱుకా దని తలంచునది, వ్యసనము లేని మనస్సుగలది, ఆహారనియమముగలది, మగఁడు తన్ను దూషించినను, క్రూరపుఁజూపులఁ జూచినను ప్రసన్నమైన ముఖముగలది, చంద్రసూర్యులనైనను చెట్లనైనను పురుషులపేర్లుగలదానిని ననురాగదృష్టి చూడనిది, మగనిచే

గౌరవింపఁబడునది, దరిద్రుఁడైనను, దుఃఖితుఁడైనను, దోవనడచి గాసిపడినను భర్తను గొడుకునువలె నుపాసించునది, కామ, భోగ, సుఖ, సంపదలయందు భర్తయందుండు కోరికకంటె నెక్కువకోరిక లేనిది సహధర్మచారిణి యనఁబడును.

తే॥ నిన్ను నెడఁబాయ దెప్పుడు ♦ నీదునీడ, వగిది నీపతివ్రత మహా♦భాగ యనుచు
మంత్రపూతజలంబుల ♦ మైథిలుండు, ధారవోసెను రాముహ♦స్తంబునందు. ౧౨౭

మంత్రపూతజలంబులన్ = మంత్రములచేఁ బవిత్రములైన నీట, పతివ్రత= పతి ననుసరించుట వ్రతముగాఁగలది పతివ్రత. 'నచ సీతా త్వయాహీనా, నచాహ మపి రాఘవ। ముహూర్త మపి జీవావో, జలాన్మత్స్యావివోద్ధృతౌ.' నీళ్లను విడిచిన చేఁపవలె నిన్ను విడిచి మాసీత క్షణమైన జీవింపఁజాలదు. నీవును 'క్షణం సౌమ్య న జీవేయం, వినా తా మసితేక్షణామ్' 'కాటుకకంటిసీతను విడిచి క్షణమైన నేను బ్రతుకలే'నని నీ వుండవలయును.

"అద్భి రేవ ద్విజాగ్ర్యాణాం, కన్యాదానం విశిష్యతే।ఇతరేషాంతు వర్ణానా మితరేతరకామ్యయా॥" - మను 3 35 బ్రాహ్మణు లుదకధారాపూర్వకముగఁ గన్యాదానము చేయుట శ్రేష్ఠము. ఇతరవర్ణములవారికిఁ బరస్పరేచ్ఛయుఁ దల్లిదండ్రు లిచ్చెద మని చెప్పుటయుఁ జాలును. కాని ధారాపూర్వకదానము నిషిద్ధము గాదు.

తాత్పర్యము.

రామచంద్రా! పతివ్రతయు మహాభాగ్యవతియు నగు నీ సీత నీనీడవలె నొకప్పుడైన నిన్ను విడిచి యుండదు. అని మంత్రములచేఁ బవిత్రవంతములైన జలధారలచే రామచంద్రమూర్తిహస్తమునందు జనకరాజు ధారవోసెను. నీడ యనుటచే నిత్యసంబంధము చెప్పఁబడెను.

పతివ్రత - భుంక్తే భుంక్తేఽథ యా పత్యౌ, దుఃఖితే దుఃఖితా చ యా। ముదితే ముదితాత్యర్థం, ప్రోషితే మలినాంబరా। సుప్తే పశ్చాచ్ఛ యా శేతే, పూర్వమేవ ప్రబుధ్యతే। నాన్యం కామయతే చిత్తే, సా విజ్ఞేయా పతివ్రతా." మగఁడు భుజించినఁ దాను భుజించును. మగఁడు దుఃఖించినఁ దాను దుఃఖించును. మగఁడు సంతోషించెనా తాను మిగుల సంతోషించును. మగఁడు దూరదేశముపోయెనా తాను మాసినగుడ్డలు కట్టుకొని శృంగారము వర్జించును మగఁడు పండుకొనినతరువాతఁ దాను బండుకొనును. మగనికంటె ముందు నిద్ర లేచును. ఇతరుని మనస్సునందైనఁ గోరదు. అట్టి స్త్రీకిఁ బతివ్రత యని పేరు.

ఉ॥ మెచ్చిరి దేవతల్ ఋషులు • మే లిది మేలు భళీ యటంచు, లో
హెచ్చిరి నిండుమోదమున • నెల్లరు, వేల్పులు పుష్పవర్షముం
దెచ్చిరి, దేవదుందుభులు • దీర్ఘముగా మొరయించి, రంతటన్
వచ్చిరి శోకదైన్యములు • వాసవుఁ డాదిగ నెల్లవారలున్. ౧౨౮

దేవతలు ఋషులు మేలు మేలు బళీ యని శ్లాఘించిరి సంతోషాతిశయముచే దేవతలు పూలవాన గురియించిరి, దేవదుందుభులు చాలసేపు మ్రోయించిరి. వాసవుఁడు మొదలుగాఁగల యెల్లవారు తమ శోకమును దీనత్వమును దమ మనస్సులందుండి వీల్చి పాఱవైచిరి.

రామచంద్రమూర్తి గొప్పకార్యములు చేసినప్పుడూరకున్న దేవతలకిప్పుడు శ్రీరామచంద్రమూర్తి పెండ్లి చేసికొనఁగా నింత సంతోష మేల? రావణవధార్థ మవతరించినవారు సీతారాములు ఏ దిరువురు కలిసినఁగాని రావణవధము జరుగదు. అందు ముఖ్యురాలు, రావణుని సమూలము నాశముచేయఁ గంకణము కట్టి పుట్టినది సీత. 'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' సీత యెవనిదో వాని తేజ ప్రమేయ మని యుండుటచే రామచంద్రమూర్తి తేజోవంతుఁడు సాధనసంపత్తి గలవాఁ డిప్పు డయ్యెను. లంక నాశముచేసినది రామచంద్రమూర్తివిల్లు గాదు. వానరసేన గాదు. సీతయే చెట్టుతొఱ్ఱలోఁ జేరిన యగ్నిహోత్రమువలె లంకలోఁ జేరి తనతపోబలముచే లంకను శవప్రాయము చేసెను. లంకలోఁ జేయవలసినకార్యమంతయు సీతయే చేసిన దని, రామచంద్రమూర్తి నిమిత్తమాత్ర మని హనుమంతుఁడే చెప్పెనుగదా. కావున నేఁడు పోసినపాలికలు రావణవధోత్సవమున కంకురార్పణము గావునఁ దమ దుఃఖము తీఱుకాలము వచ్చెను గదా యని దేవతలకు, ఋషులకు సంతోషము. కావున నీయాడంబరము.

కం॥ ఈరీతిని మంత్రోదక,ధారాపూర్వకముగాఁగ • ధరణీతనయన్
శ్రీరామున కిచ్చి మఱిన్, సౌమ్మిత్రి గనుఁ గొట్టు లనియె•సంతోషమునన్. ౧౨౯

ఈవిధముగ మంత్రించిన జలముల ధారలువోయుచు భూపుత్రి యగు సీతను జనకమహారాజు శ్రీరామచంద్రమూర్తి కిచ్చితిని గదా యను సంతోషముతో లక్ష్మణుఁ జూచి యిట్లనెను.

శ్రీ సీ తా వి వా హ వి ష య చ ర్చ.

మనుస్మృతి ప్రకారము స్త్రీవివాహము లెనిమిది విధములు. ౧ బ్రాహ్మము ౨ దైవము ౩ ప్రాజాపత్యము ౪ ఆర్షము ౫ ఆసురము ౬ గాంధర్వము ౭ రాక్ష

సము ౮. పైశాచము ఇది యధమము. ఈ యెనిమిదివిధములలో సీతావివాహ మేతరగతికిని జేర దని వివాదపడుచున్నారు. ఎట్లన-

౧. వేదాధ్యయనముచేసి యాచారవంతుఁడైన యొక బ్రహ్మచారిని దానై రప్పించి వస్త్రాలంకారములఁ బూజించి కన్యాదానము చేయుట బ్రాహ్మవివాహ మనఁబడును. శ్రీరామచంద్రమూర్తి జనకరాజు పిలిపింపఁగా వచ్చిన వాఁడు గాఁడు. కావున నీ వివాహము బ్రాహ్మము గాదు.

౨. యజ్ఞమునందు నధ్వర్య్వము చేయు ఋత్విజునకుఁ గన్య నలంకరించి దానము చేయుట దైవవివాహ మనఁబడును క్షత్రియుఁడగు శ్రీరామచంద్ర మూర్తికి నార్త్విజ్యమునం దధికారములేదు. జనకయజ్ఞమం దాయన ఋత్విజుఁడు కాఁడు. కావున నీ వివాహము దైవవివాహము గాదు.

౩. ఒక గోమిథునము (ఆవు-ఎద్దు) గాని రెండుగాని యాగసిద్ధి కొఱకో కన్యానిమిత్తముగానో తీసికొని కన్యనిచ్చుట ఆర్షవివాహ మనఁబడును. ఈ వివాహమందు గోమిథునదానము చెప్పఁబడలేదు. కావున నిది యార్షవివాహము గాదు.

౪. వరునివలన నేదియు గ్రహింపక మీ రిరువురు కలిసి ధర్మ మాచరింపుఁడని చెప్పి కన్యాదానము చేయుట ప్రాజాపత్య మనఁబడును. జనకుఁడు నా కూఁతురు వీర్యశుల్క యనుటచే నిది ప్రాజాపత్యము గాదు

౫. బంధువులకును, కన్యకకును ధనమిచ్చి వరుఁడు తనయిష్టప్రకారము పెండ్లి చేసికొనుట ఆసురవివాహ మనఁబడును. శ్రీరామచంద్రమూర్తి ధనమేదియు నీయలేదు. కావున నిది యాసురవివాహము కాదు.

౬. స్త్రీపురుషులు పరస్పరము కోరి కలియుట గాంధర్వవివాహ మగును. ఈ వివాహమునకు మంత్రము లేదు ఇది కామసంభవము. మైథునకర్మమున కేర్పడినది. ఇందుఁ జెప్పిన కర్మమేదియు లేదు. కల్యాణమునకుఁ బూర్వము సీతారాములు పరస్పరము చూచినవారుగారు. కావున నిది గాంధర్వము గాదు.

౭. కన్యకబంధువులు సమ్మతింపనపుడు వారిని, జంపి, చీల్చి, నఱకి, నాశము చేసి యాకన్య కుయ్యో మొఱ్ఱో యని యేడ్చుచుండ బలాత్కారముగఁ దీసికొని పోవుట రాక్షసవివాహ మనఁబడును. ఈ ఘోరకార్యములు జరుగలేదు. కావున నిది రాక్షసముగాదు.

౮. నిద్రపోవుదానిని మద్యాదులచే మైమఱచియుండుదానిని, శీలరక్షణము లేనిదానిని రహస్యముగా సంగమించునేని యిది పైశాచ మనఁబడును. అన్ని

వివాహములలో నిది నీచము. మిగులఁ బాపిష్ఠము. సీతావివాహ మిట్టిది కాదని చెప్పఁబనియే లేదు.

ఇట్లైనచో ధర్మసంస్థాపనమునకై పుట్టిన సీతారామచంద్రమూర్తులే యశాస్త్రీయవివాహమునకు మార్గదర్శులయిరా? యని శంక.

శ్రీ. సీతావివాహము ప్రాజాపత్య వివాహమే.

"సహ ధర్మం చరతేతి ప్రాజాపత్యః" అని ఆశ్వలాయనుఁడు.

"సంయోగమంత్రః ప్రాజాపత్యే సహధర్మంచర్యతామ్" అని గౌతముఁడు.

"ఆచ్ఛాద్యాలంకృత్యైషా సహధర్మం చర్యతామితి ప్రాజాపత్యః" అని బోధాయనుఁడు.

"సహోభౌ చరతాం ధర్మ" మని మనువు చెప్పియుండుటచేత సహధర్మచారిత్వము ప్రాజాపత్యవిషయమున ముఖ్యాంశము. అది 'నీ సహధర్మచరి' యను జనకవాక్యమువలన స్పష్టపడినది.

ఓయీ! సీతావివాహము ప్రాజాపత్య మగునేని యది క్షత్రియోచితము గాదుగదా! ఎనిమిది వివాహములందు 'షడానుపూర్వ్యా విప్రస్య, క్షత్రస్య చతురోఽవరాన్। విట్ శూద్రయోస్తు తానేవ, విద్యాద్ధర్మ్యానరాక్షసాన్॥ చతురో బ్రాహ్మణస్యాద్యాన్ ప్రశస్తాన్ కవయో విదుః। రాక్షసం క్షత్రియస్యైకమాసురం వైశ్యశూద్రయోః॥' అను మనుస్మృతివాక్యములవలన బ్రాహ్మణునకు మొదటి యాఱు ధర్మములయినను మొదట నాలుగే (బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్యములు) ప్రశస్తములనియు నందు వెనుక వానికంటె ముందువే గ్రాహ్యములనియు, క్షత్రియునకు రాక్షసము ప్రశస్తమనియు, వైశ్యశూద్రులకు నాసురమనియు నేర్పడుచున్నది. బోధాయనులు 'తేషాం చత్వారః పూర్వే బ్రాహ్మణస్య తేష్వపి పూర్వః పూర్వః శ్రేయాన్ 'ఉత్తరేషా ముత్తరోత్తరః పాపీయాన్ అత్రాపి షష్ఠసప్తమౌ ధర్మ్యానుగతౌ తత్ప్రియత్వాత్ క్షత్రియస్య' అని చెప్పుటచే మీఁదియర్థమే దృఢపడుచున్నది. ఎట్లు చూచినను క్షత్రియులకుఁ బ్రాజాపత్యము ప్రశస్తముగాఁ జెప్పఁబడలేదు. ఉండురేని యట్లు కావు. మనుస్మృతియందే "పంచానాంతు త్రయో ధర్మ్యా, ద్వావధర్మ్యౌ స్మృతావిహ। పైశాచశ్చాసురశ్చైవ నకర్తవ్యౌకదాచన"॥ ప్రాజాపత్యము మొదలు ఆసురమువఱకుఁ గల యైదువివాహములలో ప్రాజాపత్య గాంధర్వ రాక్షసములు మూఁడును ధర్మయుక్తములు. తక్కినవి రెండు ధర్మశాస్త్రసమ్మతములు కావు. పైశాచాసురములు సర్వదా నిషిద్ధములు.

ఈ నియమము ప్రకారము ప్రాజాపత్యగాంధర్వరాక్షసములు వ్యవస్థితవివాహములు లభింపనపుడు సర్వవర్ణములవారికి సాధారణధర్మ మని యేర్పడుచున్నది. కావునఁ బ్రాజాపత్యవివాహము క్షత్రియులకు శాస్త్రసమ్మతమైనదే. మఱియును గౌతముఁడు "చత్వారో ధర్మ్యాః ప్రథమపడి త్యేకే" యను సూత్రముచే వర్ణవిభాగము ననాదరించి బ్రాహ్మాది నాలుగు లేక యాఱువివాహములు ధర్మ్యములే యని వచించెను. కావునఁ బ్రాజాపత్యము క్షత్రియులకు ధర్మ్య మని యాయన యనుజ్ఞ యిచ్చినవాఁ డయ్యెను. మితాక్షరవ్యాఖ్యానమందును "ఆదితః చత్వారో ధర్మ్యాః ధర్మా దనపేతాః ప్రశస్తా" యని కానన య్యెడి. ఇందును వర్ణవిభాగ ప్రశంస లేదు. "పూర్వే వివాహాశ్చత్వారో, ధర్మ్యా స్తోయప్రధానికా" యని దేవలుఁడు. ఉదకధారాపూర్వకముగ నిచ్చు తొలినాలుగు వివాహములు ధర్మశాస్త్ర సమ్మతములు. ఈ ప్రమాణవాక్యములచేఁ బ్రాజాపత్యవివాహము ధర్మశాస్త్రసమ్మతమైన ప్రశస్తవివాహమే యగును.

ఓయీ! ప్రాజాపత్యవివాహము ధర్మ్యవివాహమే యగునుగాక. "పృథక్ పృథగ్వా మిశ్రౌ వా వివాహౌ పూర్వచోదితౌ। గాంధర్వో రాక్షసశ్చైవ ధర్మ్యౌ క్షత్రస్య తౌ స్మృతౌ" అను మనువచనప్రకారము క్షత్రియులకు గాంధర్వరాక్షసములే ముఖ్యము లనియుఁ బ్రాజాపత్యము గౌణ మనియు నేర్పడలేదా?

సీతావివాహవిషయమున గాంధర్వరాక్షసముల కవకాశమే లేదు. గాంధర్వము కేవలకామప్రధాన మైనది. సీతారాము లిరువురు కామదాసులు గారు. అదియునుగాక వారిరువురకు ముఖావలోకనము లేదు. కావునఁ గామమున కాస్పదము లేదు. వారివయస్సులు కామోద్రేకకరములైనవి కావు. మఱియును దనతండ్రి తన్ను వీర్యశుల్క యని ప్రకటించియుండ నేమని యాయనయభిప్రాయమునకు విరోధముగ గాంధర్వవివాహమున కంగీకరించి తండ్రికిఁ గన్యాదాన ఫలము లేకుండఁ జేయఁగలదు. "కం॥ సతి జనకునిచే ధారా। యుతముగ నెవ్వనికి దత్త యోగ్యచరిత యా।సతి కాపతి పరమున నగు।శ్రుతులిట్లని మొఱలుపెట్టు సుమతీ వినవే॥" అయోధ్య ౬_౨౯ ప. అను సీతాదేవి వాక్యమువలన ధారాయుతముగాని వివాహములకంటె ధారాయుతవివాహమే శ్రేష్ఠ మని నిర్ధారితమగుచున్నది.

ఇఁక రామచంద్రమూర్తియో సీతాదేవిని వివాహమాడఁ దాన్తై యంగీకరించినవాఁడు కాఁడు - నిరాకరించెను. "ఉ॥ అంతట సత్యవాది జనకావనినాథుఁడు నన్ను రామభూ। కాంతున కీ జలంబుఁగొనఁ గైకొనఁడయ్యెను దండ్రియిష్ట మా। వంత యెఱుంగరామి నపు డాదట మజ్జనకుండు పంచ త్సౌ।కాంతుని

మామగారి నటఁగ్రచ్చుఁ దోడ్కొనిరాఁగ దూతలన్." అయో. ౨౫౮౮ వ. అను సీతాదేవివాక్యములచే నెఱుఁగ నయ్యెడి

ఇట్టి రామచంద్రమూర్తి సీతాదేవిబంధువులఁ జంపి రాక్షసవివాహమున సీతను హరించు ననుట యేమి మాట? సీతావిషయముననే కాదు. ఏకన్యక విషయమందు నట్లాయన చేసియుండఁడు

ఈ వివాహము తన బలపరాక్రమసాధన మను నభిప్రాయమే యాయనకు లేదు. తండ్రి చేసిన వివాహము కావున గౌరవింపఁదగిన దనియే యాయనయభిప్రాయము.

"కం॥ ప్రణుతామరునకు యోపి, క్షణి పితృకృతదార యగుట మదిఁ బ్రియ మయ్యెన్." బాల. ౧౩౬ వ. ఇట్టి యభిప్రాయములుగల సీతారామచంద్రమూర్తులకుఁ గామదాసుల గాంధర్వరాక్షసవివాహములకు నెట్టి సంబంధము గలుగఁ గలదు?

ఓయీ! కన్యాదాత వరునివలన శుల్కము గ్రహింపరాదనికదా శాస్త్రములు చెప్పుచున్నవి జనకుఁ డెట్లు తనకూఁతురు వీర్యశుల్క యని చాటించెను? రామచంద్రమూర్తి యెటు లాశుల్కమిచ్చి సీతను గొనెను?

"శ్లో॥ ఆర్షే గోమిథునం శుల్కం, కేచి దాహు ర్మృషైవ తత్। అల్పోవాపి మహాన్వాపి, విక్రయ స్తావ దేవసః॥" మను ౩ ౫౩ ఆర్షవివాహమునందు గోమిథునము (ఒకయావు ఒకయెద్దు) ఓలిగైకొనవచ్చు నని కొందఱనిరి. కాని యది కల్లయే ఓలి కొంచెము పుచ్చుకొన్నను గొప్పఁగాఁ బుచ్చుకొన్నను నది విక్రయమే. దానివలన పాపమే.

"నకన్యాయాః పితా విద్వాన్, గృహ్ణీయా చ్ఛుల్కమణ్వపి, గృహ్ణం చ్ఛుల్కం హి లోభేన, స్యా న్నరోఽపత్యవిక్రయీ॥" వివేకముగల తండ్రి వరునివలనఁ గొంచెమైనను ఓలి తీసికొనరాదు. లోభముచే నతఁ డట్లుగైకొనెనా వాఁడు బిడ్డనమ్మినవాఁడే యగును.

"శ్లో॥ కన్యావిక్రయిణో మూర్ఖా,మహాపాపస్య కారకాః। పతంతినరకే ఘోరే యావ దాభూతసంప్లవే॥ క్రయక్రీతాతు యా నారీ న సా పత్నీ విధీయతే, సాతు దైవేచ, పిత్ర్యేచ, దాసీ స్యా న్నతు సంస్కృతా। య స్తాం వివాహయేత్కన్యాం। బ్రాహ్మణో మదమోహితః। అసంభాష్య స్త్వపాం క్తేయ స్స విప్రో వృషలీపతిః" కన్యల విక్రయించు మూర్ఖులు మహాపాతకము చేసినవారై ప్రళయమువఱకు ఘోరనరకమునఁ బడియుందురు. అట్లు ధన మిచ్చి కొన్న కన్యక పత్ని యనఁబడదు. దేవపితృకార్యములందు దానినవలె భావింపఁ

బడవలయును. సంస్కారము పొందిన స్త్రీగా దానిని భావింపరాదు అట్లు శుల్కము గొని వివాహముచేయు బ్రాహ్మణుఁడు సంభాషించుటకు యోగ్యుఁడు కాఁడు. వాఁడు పంక్తికిని యోగ్యుఁడు గాఁడు. ఆ బ్రాహ్మణుఁడు శూద్రదాని మగఁ డగుచున్నాఁడు.

ఇచ్చట బ్రాహ్మణుఁ డని చెప్పుటచేఁ దక్కినవర్ణములవారు కన్యాశుల్కము గ్రహింపవచ్చు నని యర్థము గాదు.

"శ్లో॥ ఆదదీత న శూద్రోపి, శుల్కం దుహితరం దదత్ । శుల్కంహి గృహ్ణాకురుతే, చ్ఛన్నం దుహితృవిక్రయమ్॥" శూద్రుఁడైనను కూఁతు నిచ్చి శుల్కము తీసికోరాదు. అట్లు తీసికొనినవాఁడు కూఁతు నమ్మినవాఁడే యగును.

"శ్లో॥ యో మనుష్యం హి విక్రీయ, యత్కించి ద్ధన మృచ్ఛతి। తస్య మూత్రం పురీషంచ, స పరత్రోపజీవతి॥"

ఎవఁడు మనుష్యుని విక్రయించి యెంత కొంచెము ధనము గ్రహించినను వాఁడు పరలోకమున విక్రయింపఁబడినవానిమూత్రపురీషములతో జీవించువాఁడగును. కన్యాశుల్కము నిషేధించు వాక్యము లిన్నియుండ రామజనకచర్య లెట్లు సాధువు లగును?

అయ్యా! నీ వుదాహరించిన ప్రమాణవాక్యము లం దొకటియైన రామజనకులవిషయమున నన్వయింపదు. కన్యాదాత స్వప్రయోజనమునకై లోభబుద్ధిచే వరునివలన ధనము గ్రహించెనేని యది శుల్క మని కన్యావిక్రయ మని చెప్పఁబడును. కాని కన్య నలంకరించుటకుఁ దీసికొను వస్త్రాభరణాదులు శుల్కమనిపించుకొనఁబడవు. కన్య పేరుపెట్టి తీసికొని తా ముపయోగించుకొని రేని మహాపాపముచేసినవారేయగుదురు. "శ్లో॥ స్త్రీధనానితు యో మోహా దుపజీవంతి బాంధవాః। నారీయానాని వస్త్రంవా తే పాపా యాం త్యధోగతిమ్॥" కన్యబంధువులు తండ్రిగాని యితరులుగాని కన్యకకు నిచ్చినధనమునుగాని వాహనవస్త్రాదులుగాని మోహముచే నుపయోగించుకొనుదురో యాపాపు లధోగతుల పాలగుదురు.

"శ్లో॥ యో మనుష్యో మనుష్యస్య, విక్రయా ద్ధన మిచ్ఛతి। తస్యమూత్రం పురీషంచ, స పర త్రోపజీవతి."

ఏ మనుష్యుఁడు మనుష్యుని విక్రయించి ధనము సంపాదింపఁగోరునో వాఁడు వాని మూత్రపురీషములతోఁ బరలోకమున జీవించువాఁ డగును.

"శ్లో॥ యో మనుష్యః స్వకం పుత్రం, విక్రయా ద్ధన మిచ్ఛతి । కన్యాంవా జీవితార్థాయ, యశ్శుల్కేన ప్రయచ్ఛతి।సప్తావరేమహా ఘోరే నిరయేకాలసాహ్వయే।

స్వేదం మూత్రం పురీషంచ తస్మిన్ మూఢః సమశ్నుతే॥" ఎవఁడు తనపుత్రుని విక్రయించి ధనము సంపాదింపఁగోరునో, యెవఁడు తనజీవనమునకై శుల్కము దీసికొని కన్యనిచ్చునో, వాఁడు వారి చెమట, మలమూత్రములను పరలోకమునఁ దినుచుండును. దీనివలనఁ గన్యాశుల్కగ్రహణ మెంత దోషమో వరశుల్కమంత దోషమే. ఇత్యాదివాక్యములు రామజనకులం దెట్లన్వయించును?

జనకుఁడు గోరిన శుల్కమువలన నాయన కేమియు లాభము లేదు. ఆశుల్కము కన్యకకే కీర్తికరము ఇందు శుల్కశబ్ద మౌపచారికమే కాని ముఖ్యము గాదు. వీర్యమును శుల్క మని చెప్పుట వరుని యోగ్యత పరీక్షించుటకే.

"శ్లో॥ విద్యయా బ్రాహ్మణ శ్శ్రేష్ఠో, వీర్యేణ క్షత్రియః స్మృతః। వైశ్య స్తుధాన్య ధనతః, శూద్ర స్త్వేవ తు జన్మతః॥ బ్రాహ్మణులందు విద్యావంతుఁడు శ్రేష్ఠుఁడు? క్షత్రియులందు వీర్యవంతుఁడు శ్రేష్ఠుఁడు, వైశ్యులందు ధనధాన్యవంతుఁడు శ్రేష్ఠుఁడు, వయస్సుచే శూద్రుఁడు శ్రేష్ఠుఁడు.

కావున బలపరాక్రమసంపన్నుఁ డగు వరుని జనకుఁడు గోరుట నింద్యమగునా? గుణమే యగును.

కన్యకకుఁ దగినవరుఁ డగునా కాదా యని పరీక్షింపక తనయిచ్చకొలఁది కన్యాదానము చేయువాఁడు బ్రహ్మహత్య చేసినవాఁ డగును.

శ్లో॥ ఆత్మజాం రూపసంపన్నాం, మహతీం సదృశే వరే, న ప్రయచ్ఛతి యః కన్యాం, తం విద్యా ద్బ్రహ్మఘాతుకమ్."—అను. ౬౩ అధ్యా.

క॥ రమ్మా లక్ష్మణ యూర్మిళఁ, గొమ్మా దానంబుగాఁగఁ ♦ గూర్మి నొసఁగెదఁ
గొమ్మా కరమ్ము పెరిమ శు,భ మ్మగుత మిఁ కేల జాగు ♦ పలుపఁ గుమారా.

౧౨౯౧

పెరిమ = ప్రేమ.

తాత్పర్యము.

లక్ష్మణా! యిటు రమ్ము. దానముగా నూర్మిళను గైకొమ్ము. ప్రీతిపూర్వకముగ నిచ్చెదను. ఈమెపాణిని ప్రేమతో గ్రహింపుము. నాయనా! యిఁక నేల జాగు చేసెదవు? ఉదక దాన మర్థ సిద్ధమని గ్రహించునది.

క॥ అని జనకుఁడు భరతునిదెసఁ, గనుఁగొని మాండవికరంబు ♦ గ్రహియింపు మటంచని, శత్రుఘ్నుని శ్రుతకీ,ర్తిని గైకొనుమా యటంచుఁ ♦ బ్రేమం బలికెన్.

౧౨౯౨

అని యూర్మిళను లక్ష్మణునకు దానముచేసి భరతునిఁజూచి మాండవిచేతిని గ్రహింపుమని శత్రుఘ్నునిఁ జూచి శ్రుతకీర్తిని గ్రహింపుమని ప్రేమతోఁ బలికెను.

లక్ష్మణునికన్నను భరతుఁడు వయస్సునఁ బెద్దవాఁడుకావునఁ బెద్దవాఁ డుండఁగా ముందు పిన్నవానికిఁ జేయవచ్చునా యనిన సవతులబిడ్డలయం దిది నిషిద్ధము కాదు. 'పితృవ్యపుత్రే సాపత్నే, పరనారీసుతేషు వా। వివాహదానయజ్ఞాదౌ, పరివేదో న దూషణమ్॥' పిన్నతండ్రి కొడుకులు, సవతుల కొడుకులు, ఇతరస్త్రీకొడుకులు, వీరిలో వివాహము దానము యజ్ఞాదులయందు ముందు చిన్నవాఁడు గ్రహించుట దోషముగాదు.

జనకుఁడు పెద్దవాఁ డగుటచే నిది యనఙ్ఞ యనియు ధారాదత్తమును కుశధ్వజుఁడే చేసె ననియు గ్రహించునది.

క॥ సుందరు లగుభార్యలతో, నందఱు సౌమ్యులరు నంద • నాచారములన్
జెందినవారల రగుఁడ య,నిందితమతులార! యనుచు • నిలుచున్న యెడన్.
౧౭౯౩

ఇట్లు నలువురకు నలువురఁ గన్యల ధారవోసి జనకుఁడు రాజకుమారులఁ జూచి దోషరహితములైన మనస్సు గలవారలారా! మీ రందఱు సుందరులగు భార్యలతోఁ గలిసి సౌమ్యగుణము గలవారును, సదాచారసంపన్నులును గండు అని చెప్పి యూరక నిలుచుండెను.

క॥ జనకునివాక్యములను విని, కని గురు ననుమతి గ్రహించి • కరములఁ దత్త
ద్వనజాతాక్షులకరముల, ఘనమతి నల్వురును వేడు•కల్ గొన బారన్.
౧౭౯౪

జనకుని వాక్యములను విని తమ తండ్రియనుజ్ఞను బొందినవారై తమ చేతుల నా కన్యకల చేతులు పట్టికొని గొప్పమనస్సులతో సంతోష మతిశయించుచుండ.

చం॥ అలమినభక్తి మ్రొక్కిరట • నగ్నికి వేదికి మౌనికోటికిన్
వలగొని రక్తి రాజులకు • వారిజనేత్రలతోడ రాఘవుల్,
వెలసె వివాహ మంత నతి•విశ్రుత మై విధిపూర్వకంబుగాఁ
జెలఁగుచుఁ బుష్పవృష్టి గురి•సెన్, మొరసెన్ దివి దేవదుందుభుల్. ౧౭౯౫

మలినములేని భక్తిచే రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నగ్నికి వేదికి మౌనీశ్వరుల కందఱకు రాజులకుఁ దన తన భార్యతోడఁ బ్రేమచేఁ బ్రదక్షిణించిరి. వివాహము శాస్త్రప్రకారము ప్రసిద్ధవిధముగా సాగెను. పూలవాన గురిసెను, ఆకాశమున దేవదుందుభులు ధ్వనించెను.

క॥ ఆడిరి నిర్జరకాంతలు, పాడిరి గంధర్వసతులు ♦ బహులముగ గుమిం
గూడిరి మింటను వేల్పులు, వీడుచు భయ మప్పు డిట్టి ♦ వింతలు సెలగెన్. ౧౨౯౬

దేవతాస్త్రీ లాడిరి. గంధర్వస్త్రీలు పాడిరి. మనస్సులో భయమును బూర్ణముగ విడిచి రావణాసురభయమున సందుల గొందుల డాఁగిన వా రందఱు స్వేచ్ఛగా నిర్భయముగా గుంపులు గుంపులుగా నాకాశమున నిలిచిరి. ఆ వివాహకాలమున నిట్టివింతలు విస్తరిల్లెను.

క॥ మీఱఁగ వాద్యధ్వని దై,వాఱఁగ మోదంబు రాఘు ♦ వచతుష్క ము ము
మ్మా ఱగ్నికి వలగొనఁగా, జాఱనికుతుకములఁ బెండ్లి ♦ సాంతముగాఁగన్. ౧౨౯౭

దైవాఱఁగ = అతిశయింపఁగా. రాఘవచతుష్కము = రఘువంశమునఁ బుట్టిన నలువురు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు.

తాత్పర్యము.

మంగళవాద్యధ్వను లతిశయింపఁగా సంతోషము మిక్కుటము గాఁగా రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నగ్నికి మూఁడుతడవలు ప్రదక్షిణముచేయఁగాఁ బెండ్లి ముగిసెను.

క॥ పడఁతులతోడుత దశరథు, కొడుకులు దమవిడిదియిండ్ల ♦ కుం జనఁ దోడ్క
నడచెఁ బతి మౌనియుతుఁడై, యెడలక చుట్టములతో మునీశ్వరుఁ డంతన్. ౧౨౯౮

తమ భార్యలతో దశరథుకొడుకులు తమ విడిదియిండ్లకుఁ బోఁగా వారి వెంట దశరథుఁడును వసిష్ఠవిశ్వామిత్రాదిమునీశ్వరులతోడను జుట్టములతోడను బోయెను.

—* ౭౪ వ సర్గము *—

ఉ॥ వేగిన మేలుకాంచి నృప ♦ వీరునిసమ్మతి నొంది దీవనల్
బాగుగ నిచ్చి యానృపతి ♦ బాలురకుం గుశికాత్మజుండు దా
నేగె హిమాద్రిప్రాంత; కటు ♦ లేగుడు మైథిలుఁ గాంచి యాజి మే
మేగ ననుజ్ఞ యిచ్చెదరె ♦ యింక నయోధ్య కటంచుఁ బల్కినన్. ౧౨౯౯

పెండ్లియైన మఱునాఁటి యుదయమందే విశ్వామిత్రుఁడు మేలుకొని దశరథుని సమ్మతిఁ బొంది రాజకుమారులకు మంచి దీవన లిచ్చి హిమాచలసమీపమునకుఁ బోయెను. ఆయన యిట్లు పోఁగా దశరథుఁడు జనకుని జూచి యయోధ్యకుఁ బోవ మా కనుజ్ఞయిచ్చెదరా యని యడిగెను.

ఉ॥ బ్రాఁతి రహింపఁగా జనక♦రాజశిఖామణి యిచ్చె గారవం
గూఁతుల కొక్కకొక్కతెకు ♦ గోవులలక్షయు, మేలివన్నెగ
నేతలకంబళంబులను, ♦ నిర్మలచేలచయంబు, నిండుగ
సేఁతలదాసులన్, రుచివి♦శేషశతాంగమతంగజాళులన్. ౧౩౦౦

క॥ వాఁడిమి గలగుఱ్ఱంబుల, వాఁడిమగలు నైనభటుల ♦ వరమౌక్తికముల్
పైఁడిని బగడంబులఁ దన, యాఁడుంబిడ్డలకు నరణ ♦ మాజనకుండున్. ౧౩౦౧

ప్రీతియతిశయముచే జనకరాజు తనముద్దుఁగూఁతులకు నొక్కొక్కతెకు లక్షగోవులు, మంచి రంగులతో నలంకరించి చేసిన కంబళములు, శుభ్రవస్త్రములు, అలంకారయుతలైన దాసికలు, విశేషకాంతిగల రథములు, ఏనుఁగులు, తీవ్రవేగము గల గుఱ్ఱములను, శూరులైన భటులను, మంచిశ్రేష్ఠము లయిన యాణిముత్తెములు, బంగారు పగడాలు నరణముగా నాఁడుబిడ్డల కిచ్చెను.

తే॥ ఇచ్చి యారీతి బిడ్డలఁ ♦ బుచ్చి తాను, గొంతదవ్వేగి కౌసల్య♦కాంతు నవల
సాగనంపి తదనుమతి ♦ నేగెఁ దనదు, మందిరమునకు భూపపు♦రందరుండు. ౧౩౦౨

ఈప్రకారము బిడ్డల కరణ మిచ్చి వారితోఁడఁ దాను గొంతదూరము పోయి దశరథరాజును నావలఁ బ్రయాణము సాగనంపి యాయన యనుజ్ఞ దీసికొని జనకరాజేంద్రుఁడు తనయింటికిఁ బోయెను.

క॥ ఆరామచంద్రు వరసుకు, మారతయును సోయగంబు ♦ మహితంబగు గం
భీరత శౌర్యముఁ గని పుర, వారిజలోచనలు మెచ్చి♦వాకొని రిట్టుల్. ౧౩౦౩

ఆ రామచంద్రుని యింపైన శ్రేష్ఠమైన సుకుమారత్వము అందము గొప్ప గాంభీర్యగుణము శౌర్యముఁ గని మిథిలాపురమందలి స్త్రీలు మెచ్చి యిట్లనుకొనిరి.

సీ॥ వీఁడటే తాటక ♦ వీరరణంబున, గీటణఁగించిన♦యేటుకాఁడు
ఇతఁడటే కౌశిక♦క్రతురిపుని సుబాహుఁ, బిలుకుమార్చిన యట్టి♦బిరుదులాఁడు
వీఁడటే గౌతము♦నెలఁదిశాపముఁ బాపి, యింతిగాఁ జేసిన♦యితవుకాఁడు
ఇతఁడటే మనవీటి♦పతి దాఁచియున్న యా,యుగ్రవిల్విఱిచిన♦హొంతకాఁడు
తే॥ ఈతఁడా నిన్న మనసీత♦నెలమిఁ బెండ్లి,యాడి కులుకుచు నున్నట్టి♦యందకాఁడు
ఔర! యెంతటిపుణ్యాత్ముఁ♦డమ్మ జనకుఁ,డితఁడు తనపెండ్లికొడుకుగ♦నెసఁగినాఁడు. ౧౩౦౪

ఏటుకాఁడు = బాణప్రయోగమందు నేర్పరి; పిలుకుమార్చిన = చంపిన; బిరుదులాఁడు = పౌరుషము గలవాఁడు; ఇతవుకాఁడు = మేలుచేయువాఁడు;

హితము = హితవు; తద్భవము - ఇతవు. పీఠిపతి = నగరమున కధిపతి, ఉగ్రుని = శివుని, హరాంతకాఁడు = జెట్టివాఁడు సూ. హరాంతకారి. పెండ్లికొడుకు = అల్లుఁడు. గీ॥ అర్థితో నోషధీశ్వరుఁ డాదిగాఁగల పెండ్లికొడుకుల నెల్లరఁ బిలువఁబనిచె —భీమ.౨ ఆ.

తాత్పర్యము.

అమ్మా! వీఁడా యుద్ధమందుఁ దాటకను జంపిన విల్లుకాఁడు. వీఁడా విశ్వామిత్రుని యాగము రక్షించుచు సుబాహుని జంపిన పౌరుషశాలి. వీఁడా యహల్యను శాపముఁబాపి మరల స్త్రీగాఁజేసిన యుపకారపరుఁడు. వీఁడా మన రాజు దాఁచియుంచిన శివునివిల్లు విఱిచిన జగజ్జెట్టి. వీఁడా నిన్న మనసీతను బెండ్లిచేసికొని కులుకుచున్న సుందరుఁడు. అమ్మా! మనరాజు జనకుఁడెంతపుణ్యాత్ముఁడే. ఇట్టివాని నల్లునిఁగా సంపాదించినాఁడు. అని ముక్కుపై వ్రేలుంచికొని యాశ్చర్యపడిరి.

సీ॥ ఏమి నోచెనో కదే ♦ యీతనిసుతుఁగాఁగఁ, గౌసల్య కడుపారఁ ♦ గాంచుటకును
నేనిష్ఠ సలిపెనో ♦ మానిని మనసీత, పతిగాఁగ నీతనిఁ ♦ బడయుటకును
నేమి జపించెనో ♦ యీమనజనకుండు, వీఁ డల్లువాఁ డయి ♦ వెలయుటకును
నేతపంబుండిరో ♦ యీతఁ డేలికయయి, యోమఁగాఁ దమ్ము న ♦ యోధ్యజనులు
తే॥ ఏమినియమంబు జరపెనో ♦ యింతులార, ప్రత్యహంబును శ్రీరామ ♦ భద్రు గనుల
కఱవు దీఱంగ వీక్షింపఁ ♦ గా నయోధ్య, జనము సత్క్షేత్రతీర్థవా ♦ సంబు పొదలి. ౧౩౦౫

అల్లువాఁడు = అల్లుఁడు. రెండువంశముల నల్లువాఁ డని యర్థము. ఓమఁగాఁ = రక్షింపఁగా, ప్రత్యహము = ప్రతిదినము. క్షేత్రతీర్థవాసంబు = క్షేత్రవాసమందు తీర్థవాసమందు నేఫలముగలదో యాఫలము నీయన యుండునయోధ్యయం దుండుటచేతనే కలదు. అయోధ్యా మథురా మాయా॰ యని ముక్తిప్రదములైన యేడుక్షేత్రములలో నయోధ్య మొదటిది.

తాత్పర్యము.

అమ్మా! యీయనను గొడుకుగాఁ గడుపారగాంచుటకుఁ గౌసల్య యేమి నోము నోఁచెనోకదా! ఈయనను భర్తగాఁ బొందుటకు మనసీత యేనిష్ఠలు సలిపెనోకదా! ఈయన తనయల్లుఁ డగుటకు మన జనకరాజేమంత్రము జపించెనో కదా! ఈయన ప్రభువుగాఁ దమ్ముఁ బాలించుటకుఁగా నయోధ్యాజనంబు లేమి తపములు చేసిరో కదా! అయోధ్యజనులు సత్క్షేత్రతీర్థవాసఫలంబుఁ గాంచి

యీాయనను బ్రతిదినము కనలార దర్శించుటకు నేమి నియమములు వ్రతములు జరిపిరో కదా!

సీ॥ చూడఁగాఁ గలమె యీా♦సుందరాకారుని, నింకొక్కమాఱైన ♦ నింతులార
కానఁగాఁ గలమె యీా♦కమలాయతాక్షుని,మఱి యొక్కమాత్రైన♦మగువలార
వీక్షింపఁ గలమె యీా♦యిందీవరశ్యాము, వేఱొక్కపఱియైన ♦ వెలఁదులార
లక్షింపఁ గలమె యీా♦లలనామనోహరు, నొండొక్కతఱినైన ♦ నవిదలార

ఆ॥ యేమిజాములందు ♦ నేమిపుణ్యంబులఁ, జేసినార మొక్కొ ♦ చెలువలార
నేఁడు చూడఁ గల్గె ♦ నిండారుఁగన్నుల,పండువుగను రామ♦భద్రు నిచట. ౧౩౦౯

ఇందీవరశ్యాము = నల్లకలువ వంటి నీలవర్ణముగల దేహము గలవానిని. జాము = జన్మము. ప్ర - భవము.

తాత్పర్యము.

సుందరులారా! మన జీవితకాలమందు మరల నొక్కసారి యీా యందఁగాని జూడఁగలమాా? కమలాక్షులారా! మరల నొకసారియైనఁదామరపూలవంటి కన్నులుగల యీాయనను జూడఁగలమాా? వెలఁదులారా! యింకొక్కమాటు మన మీాకలువవన్నెకానిఁ జూడఁగలమాా? యువతులారా! స్త్రీలమనస్సుల నాకర్షించు వీని నొక్కసారియైనఁ జూడఁగలమాా? అక్కలారా! మన మేజన్మమం దేమి కొంచెము పుణ్యము చేసితిమో కాని దానిఫలముగ నేఁ డిచ్చటఁ గన్నులార శ్రీరామచంద్రమూర్తినిఁ జూడఁగలిగితిమి.

—* దశరథునకు మార్గమున నపశకునంబు లగుట *—

క౦॥ అంతటఁ దమిని నయోధ్యా, కాంతుఁడు దనుఁగూడి రాఁగ ♦ గాదిలితనయుల్
చెంతల మునివర్గము రాఁ, గొంతవడికిఁ జనఁగ నెదుట ♦ ఘోరత దోఁపన్. ౧౩౧౦

తాత్పర్యము.

పురస్త్రీ లీ విధముగ మాటలాడుకొనుచుండ దశరథుఁడు పయనమై కొడుకులు తనతోడను, మునులు పార్శ్వములందును వచ్చుచుండఁ బయనమై పోవుచుండఁ గొంతదూరము పోఁగా నాయన కెదుట భయంకరముగా.

క౦॥ పక్షులు గూాసెను రూక్షత, నక్షత్రపథంబునం గ♦నఁ మృగసంఘం
బాక్షణమ పాఱఁ దొడఁగెఁ బ్రదక్షిణముగ దానిఁ జూచి ♦ దశరథుఁ డార్తిన్. ౧౩౧౧

పరుషధ్వనులతో నాకాశమునఁ బక్షులు గూసెను. అపుడే మృగములు ప్రదక్షిణముగఁ బరువెత్తసాగెను. ఇట్లు లాకాశమున నపశకునములు, భూమి మీఁద శుభశకునములు కనఁబడఁగాఁ జూచి దశరథుఁడు పరితాపముతో.

చ॥ అడిగె వసిష్ఠు నేమి యది ♦ యంచు, మునీంద్రుఁడు పక్షికూఁతలన్
జెడిదపుఁగీడు దోఁచినను ♦ బెగ్గిలపోకు ప్రదక్షిణించె నీ
యడవిమృగంబు, లట్లగుట ♦ నాపద లే దనుచుండ నంతలో
సుడిసుడి గొట్టె వాయువులు ♦ చూపఱగుండెలు ఝల్లుఝల్లనన్. ౧౩౦౯

వసిష్ఠునిఁ జూచి యిది యే మిది యని యడుగఁగా నాయన పక్షికూఁతలచే నేదో భయంకరమైన కీడు కలుగును గాని భయపడవలసిన కారణము లేదు. అడవిమృగములు ప్రదక్షిణముగాఁ బోవుచున్నవి. కావున నాపద గలుగదు అని చెప్పుచుండెను. ఇంతలో చూచెడివారలగుండెలు ఝల్లన గాలి సుళ్ళుపెట్టుచుఁ గొట్టెను.

చూచువారు = చూపఱు. చూపఱులు - అనియుఁ బ్రయోగముకలదు.

ముందవతారప్రస్తావనయందు జగత్ప్రభుండు లోనగు వాక్యములచే విష్ణువునకుఁ బరత్వము చెప్పఁబడెను. (ప. ౪౪౭.) ఆవల 'ఏ నెఱుంగుదు రాజేంద్ర యీమహాత్ము' (ప. ౭౬౪) లోనగు విశ్వామిత్రవాక్యములచేఁ బురుషసూక్తము ప్రమాణముగాఁగొని చెప్పఁబడెను. కశ్యపుఁడు నతించు ఘట్టమందు(ప. ౬౯౬) నీదుశరీరమునయందుః సకలప్రపంచంబు గననయ్యె భద్రమూర్తి! నీ వనాద్యుండవని ద్రేశ్యుఁడవుగాన శరణంబు నాకు నీచరణయుగమె' అనువాక్యముఁ చే సకలజగత్కారణత్వము లోనైనవి చెప్పఁబడెను. ఇప్పుడు శివుఁడు విష్ణువునకంటె నల్పశక్తుఁడగుట పరత్వములేమి చెప్పఁబడును - అని గోవిందరాజవ్యాఖ్య.

చ॥ వడఁకె వసుంధరాతలము, ♦ వ్రాలె ద్రుమంబులు, దండిచీఁకటుల్
సుడిసెను భాస్కరుఁ, దెసల ♦ చొప్పు దొలంగె నెఱుంగరాక, పెం
బుడమి దుమారి మేచి యల ♦ భూపతిసేనలఁ గప్పఁ దెల్వియుం
జెడి నిలపాటు చెందె వెఱఁ ♦ జేయఁగ నేమియుఁ దోఁప కంతటన్. ౧౩౧౦

భూమి వడఁకెను చెట్లు నేలఁబడెను. విస్తారమైన చీఁకటులు సూర్యునిఁ గప్పెను. దిక్కు తెలియలేదు. దుమ్ము విశేషముగ రేఁగి సేనలనెల్లఁ గప్పఁగాఁ దెలివిచెడి యేమి చేయుటకుఁ దోఁపక భయముతో నవి నిలఁబడి పోయెను.

క॥ అక్కట యేమన నత్తఱి, నక్కడ దశరథనృపాలుఁ ♦ డాత్మజులు ఋషుల్
దక్కఁగ నొక్కండేనియుఁ, జిక్కఁడు వెఱఁ దెలివిదొఱఁగి ♦ చేష్టడకుండన్.
౧౩౧౧

హాకష్టమ్ = అక్కటా.

తాత్పర్యము.

అయ్యో! యేమని చెప్పను. ఆసమయమందు నాజనసమూహములో దశరథుఁడు రాజకుమారులు ఋషులు తప్పఁ దక్కినవారిలో నొకఁడైన భయముచేఁ దెలివి తప్పి కీడుపడనివాఁడు లేఁడు

—* పరశురాముఁడు శ్రీరాములఁ జూడ వచ్చుట *—

శా॥ ఆపెంజీఁకటి భీమసంహననుఁ డత్యాభీలతేజస్వి గో
త్రాపాలాంతకమూర్తి భార్గవుఁడు దుర్ధర్షుండు రౌప్యాద్రి నాఁ
గోపోద్రేకతఁ గల్పవహ్ని జనచక్షుర్దుర్నిరీక్షుండు నా
టోపస్ఫూర్తి శరాసహస్తుఁ డురుజూటుం డాపురఘ్నాభుఁడున్ ౧౩౧౨

పెను + చీఁకటిన్ = పెంజీఁకటిని. దట్టమైన చీఁకటిని భీమసంహననుఁడు = భయము కలిగించు నాకారము గలవాఁడు. అత్యాభీలతేజస్వి = మిగుల భయంకరమైన తేజస్సుగలవాఁడు. గోత్రాపాల = భూమిపాలురపాలిటికి, అంతకమూర్తి = మృత్యువైనవాఁడు, భార్గవుఁడు = పరశురాముఁడు, దుర్ధర్షుఁడు = జయింపరానివాఁడు. రౌప్యాద్రినాన్ = వెండికొండయో యన, కోపోద్రేకతన్ = కోపాతిశయమున. కల్పవహ్ని = ప్రలయకాలాగ్ని. జనచక్షుర్దుర్నిరీక్షుండు = లోకులు కన్నెత్తి చూడరానివాఁడు. శరాసహస్తుఁడు = చేత విల్లుగలవాఁడు; ఉరుజూటుండు = పెద్ద జడలు గలవాఁడు, పురఘ్నాభుఁడు = త్రిపురాసురసంహారము చేసిన రుద్రునితో సమానుఁడు.

తాత్పర్యము.

ఆ గాఢాంధకారమందు భయంకరమైన యాకారముతో దిగులు పుట్టించు తేజము గలవాఁడును రాజుల పాలిటికి మృత్యువైనవాఁడును, జయింపరానివాఁడును, వెండికొండను బోలినవాడును కోపాతిశయమునఁ బ్రలయకాలాగ్నియునై జనులకుఁ గన్నెత్తి చూచుటకు సాధ్యపడనివాఁడును కోదండము చేత ధరించినవాఁడును త్రిపురహరునితో సమానుఁడును భృగువంశమునఁ బుట్టినవాఁడును.

కం॥ స్కంధవిలసితపరశ్వధ, మంధీభూతులను జేయ నందఱ మదయు
క్సింధురగమనంబున నిల, ధంధమ్మన వచ్చె జామదగ్న్యుండు వడిన్. ౧౩౧౩

మూఁపునందుఁ బ్రకాశించు గండ్రగొడ్డలి తనకాంతిచే భయము గలిగించి చూచువారిని గ్రుడ్డివారిగాఁ జేయుచుండ మదముపట్టిన యేనుఁగువలె నడు

గులు పెట్టువేగమున భూమి ధంధ మ్మనుచుండ వేగిరపాటుతో జమదగ్నికుమారుఁడు పరశురాముఁడు వేగముగ వచ్చెను.

ఉ॥ వచ్చిన నవ్వసిష్ఠముఖ♦నర్యులు నొండొరుతోడ నాడఁగాఁ
జొచ్చిరి గుంపుగూడి మది ♦ జొబ్బిలఁ దండ్రివధంబుకోప మీ
సచ్చరితుండు భూమిధవ♦సంతతులన్ వధియించి మానెఁగా,
వ్రచ్చి వధించునే మరల ♦ రాజుల, లేవుగ యట్టికోరికల్. ౧౩౧౪

ఇట్లు వచ్చుచుండు నాయనను దూరమునందె చూచి మునీశ్వరులు గుంపులు గుంపులుగూడి యొకరితో నొకరు తనతండ్రిని జంపినా రనిన కోపముతో రాజుల నందఱను నీసాధుచరిత్రుఁడు చంపి యావల నాకార్యమును మానెఁగదా? మరల రాజులను జంపఁబూనినాఁడా యేమి? అట్టి కోరిక లే దని తలఁచెదము. అని మాటలాడుచుండిరి. ఇంతలోఁ బరశురాముఁడు రాఁగా.

క॥ అని మునివర్గం బర్ఘ్యం,బును రామా! యనుచు మధుర♦ముగఁ బలుకుచు ని
చ్చినఁ గైకొని దశరథరా,మునితో జమదగ్నిసుతుఁడు ♦ మునుకొని పల్కెన్.
౧౩౧౫

మునిసమూహ మర్ఘ్యము రామా యని తియ్యనగాఁ బలుకుచు నిచ్చిన నది గైకొని వారిని దాఁటపోయి శ్రీరామునితో నిటు పలికెను.

౭౫-వ సర్గము

క॥ రామా! దశరథరామా! నీమహితాద్భుతబలంబు ♦ నెఱి వింటిని, నీ
భీమధనుర్భంజనమును, భూమిని నెల్లెడలఁ జెప్పఁ ♦ బొలుపుగ వింటిన్ ౧౩౧౬

ధనుర్భంజమును ఇందు 'ను' అనుక్తిసముచ్చయము. దీనివలనఁ దాటకావధ యజ్ఞరక్షణము లోనైనవి కూడ వింటి నని యర్థము.

తాత్పర్యము.

రామా! దశరథరామా! యద్భుతమైన నీగొప్పబలముపిధము వింటిని. నీవు శివునిచాపమును విఱుచుటకూడ లోకు లందఱు చెప్పుకొనఁగా వింటిని. ద్విరుక్తికి రోషము కారణము.

క॥ త్రినయనువిలు నివిఱుచుట, యన నత్యద్భుత మచింత్య ♦ మది విని నేనుఁ
గొని వచ్చినవాఁడ మహా,ధనువును వే ఱొండు నీదు♦దర్పముఁ జూడన్.
౧౩౧౭

త్రినయనుఁడు = మూఁడు కన్నులు గలవాఁడు - ముక్కంటి. ఇది త్రిణయనుఁడు కానేరదని మల్లినాథసూరి వ్రాసియున్నాఁడు కావున 'త్రిణయనుని రాణివాసము' అను శ్రీనాథునిప్రయోగము ప్రమాదపతితమని తోఁచెడిని.

తాత్పర్యము

శివునివిల్లు నీవు విఱుచుట యనఁగా నది మిగుల నాశ్చర్యకరమైనది. ఇట్టిదని యాలోచించి తెలియరానిది. దానిని విని నేను దానితో సమాన మగు మఱి యొకగొప్పవింటిని నీ బలము పరీక్షించుటకై తెచ్చినాఁడను.

కం॥ ఇదె జామదగ్న్యచాపం, బదరుం గుండియలు చూచి ♦ నంతన, దీనిం
బదిలముగ శరము నెక్కిడి, బెదరక నా కిపుడు చూపు ♦ బీరము లావున్. ౧౩౧౮

ఇదిగోఁ బరశురాముని విల్లు. దీనిని జూడఁగానే గుండెలు ఝల్లుమనును. దీని నీ వెక్కుపెట్టి భయపడక నీబల మెంతో వీర్య మెంతో, చూపుము.

కం॥ ఈవింటిని మోపెట్టిన, నీవిక్రమ మేను జూచి ♦ నీతోఁ బిదపం
గావింతు ద్వంద్వయుద్ధం, బో వీరవతంస యన న ♦ యోధ్యాపతియున్. ౧౩౧౯

ఈ వింటిని నీవెక్కుపెట్టితివేని నీపరాక్రమ మేమాత్రమో చూచి వీరశ్రేష్ఠుఁడా! పిదప నీతో ద్వంద్వయుద్ధము చేసెదను.

ఇచ్చట ద్వంద్వయుద్ధము చేసెద ననెను గాని నిన్నుఁ జంపెద నని చెప్పలేదు. దీని కాధారముగాఁ బ్రహ్మపురాణమందు 'ఇక్ష్వాకవో న వధ్యా మే మాతామహకులోద్భవాః.' ఇక్ష్వాకువంశమువారు నామేనమామవంశమువారు; కావున వారి నేను జంప నని చెప్పినట్లున్నది

వైవస్వతమనువు కొడుకులలో శర్యాతి యను రాజొకఁడు కలఁడు ఆయన పుత్రియగు సుకన్యను చ్యవనుఁడు పెండ్లియాడెను. చ్యవనునికొడుకు ఋచీకుఁడు. ఋచీకుని కొడుకు జమదగ్ని. జమదగ్నికొడుకు పరశురాముఁడు కావున సంబంధము.

—* దశరథుఁడు పరశురాముని శమింపఁ బ్రార్థించుట *—

చం॥ వెలవెలఁబాఱె మోము కడు ♦ విన్నఁబడెం, బదముల్ వణంకఁగాఁ,
బలుకులఁ దొట్రుపా టొదవఁ, ♦ బల్కెను భార్గవు నోమహాత్మకా!
కులమున బ్రాహ్మణుండ, వటు ♦ గూరిమి శాంతత రాచజాతిపై,
బలరిపుతోడ శస్త్రమును ♦ బట్ట నటంచుఁ బ్రతిజ్ఞ సేయవే? ౧౩౨౦

అను మాటలు దశరథుఁడు విని మొగము వెలవెలఁ బోయి దీనత్వము కలుగఁగాఁ గాళ్లువణఁకఁగాఁ బలుకులు తడఁబడఁ బరశురామునిఁ జూచి యిట్లనియె. అయ్యా! మహాత్మా! నీవు జాతిచే బ్రాహ్మణుఁడవు. రాచజాతిమీఁదఁ గోపము మాని శాంతి వహించితివి. ఇఁక శస్త్రము పట్ట నని యింద్రునితోఁ బ్రతిజ్ఞచేసితివి గదా! ఇప్పు డిటు పలుకుట న్యాయ్యమా?

క॥ బాలురు కొమరులు క్రీడాలోలుప కయుణింప వయ్యా ♦ లోఁ గొని తప్పుల్
శీలులు స్వాధ్యాయవ్రత, శాలులు భార్గవులు నీకుఁ ♦ జన్నే యలుగన్. ౧౩౨౧

ఈ నా కుమారులు బాలురు. ఆటలయందు దాసక్తిగలవారు. పిల్లవాఁ డేదియో మాటగాఁ బల్కినను శివునివిల్లు విఱిచెను. ఆ తప్పు క్షమింపుము. భృగువంశమునఁ బుట్టినవారు శీలముగలవారు. వేదాధ్యయనము వ్రతము గలవారు. కావున శాంతులై యుండవలయును గాని యిట్లు కోపు లగుట తగునా?

క॥ ఇల నెల్లఁ గాశ్యపునకుల్, సలలితగతి ధార వోసి ♦ సద్గుణశీల
నిలిచితి మహేంద్రపర్వత, ములు గాఁగ, జన్నె మఱియు ♦ నిటు లలుగంగన్.
౧౩౨౨

భూమి నంతయుఁ గశ్యపమహర్షికి ధర్మమార్గమున దానముచేసి యీ దేశ మందే యుండక మహేంద్ర పర్వతము నీ విల్లుగాఁ జేసుకొని యందు నిలిచితివి. ఇటు చేసియు మరలఁ గోపింపఁ దగునా?

క॥ ఓమౌనివర్య! వచ్చితె, నామహితార్థంబు లెల్ల ♦ నాశము సేయన్
రాముని నొక్కనిఁ జంపిన,వా మేమును వానితోడి,వారము గమే? ౧౩౨౩

ఓయి మునీశ్వరా! నా గొప్ప పురుషార్థములన్నియు నాశము చేయ వచ్చితివా? రామచంద్రుని నొక్కనిఁ జంపినవా మే మందరము వానితో పాటు పోవల సిన వారమే

క॥ అని దశరథుఁ డాడినఁ దా, విన కపు పెడచెవులఁ బెట్ట ♦ వీఁడు భృగుసం
జనితుఁడు రామునితో నను, వినుమా వివరింతు విల్లు ♦ వృత్తాంతంబున్.
౧౩౨౪

అని దశరథుఁడు మాటలాడఁగా వినక వినక పెడచెవిపెట్టి వీఁడు పరశురాముఁడు శ్రీరామచంద్రమూర్తితో నీ విల్లు వృత్తాంతముఁ జెప్పెద వినుము.

— శైవవైష్ణవధనస్సుల వృత్తాంతము —

సీ॥ ఈరెండువిండులు ♦ భూరిసత్త్వంబులు, దివ్యముల్ శ్రేష్ఠముల్ ♦ దృఢతరములు
విశ్వకర్ముఁడు వీని ♦ విపులప్రయత్నుఁడై, కావింపఁ ద్రిపురముల్ ♦ గాసి చేయ
నం దొండు శివునకు ♦ నమరు లిచ్చిరి నీవు, విఱిచిన దదియ చూ,♦విష్ణువునకు
నీరెండవధనస్సు ♦ నిచ్చిరి దేవత, లిది వైష్ణవము రామ ♦ యుద్ధబలము

తే॥ శైవచాపంబుఁ బరిడించు ♦ సత్త్వగరిమ, నరుగ నట కొంతకాలమ♦నంతరమున
నలువకడ కేగి నిర్జర♦నాథు లడిగి, రెవఁడు బలియుండు విష్ణుమ♦హేశులందు.
౧౩౨౫

నీవు విఱిచినవిల్లు, ఇప్పుడు నాచేతనుండు విల్లు రెండును మిగుల బలిష్ఠము లైనవి. దేవతలుచెప్పి చేయించినవి. మిగుల శ్రేష్ఠములైనవి. మిక్కిలి దృఢము లైనవి. ఈ రెంటిని గొప్పప్రయత్నముచేసి విశ్వకర్మ చేసెను. అందొకటి త్రిపుర సంహారకాలమందు శివునకు దేవత లిచ్చిరి. నీవు విఱిచిన దావిల్లే ఇది రెండవది. దీనిని దేవతలు విష్ణున కిచ్చిరి. ఇది మిగుల బలిష్ఠమైనది. బలమునందు శైవ చాపముతో సమానమైనది. అట్లు కొంతకాల మరుగఁగా దేవతలు బ్రహ్మ యొద్దకుఁ బోయి శివకేశవులలో బలవంతుఁ డెవఁ డని ప్రశ్నించిరి.

దేవా! నీ విదివఱకు శివునికంటె విష్ణువే బలవంతుఁ డని చెప్పుచుంటివి. మేము నమ్మియుంటిమి. ఇప్పుడు త్రిపురదహనకాలమందు విష్ణువు యుద్ధోపకరణమైన శరముగా మాత్ర మయ్యెఁగ కావున శివుఁడే బలవంతుఁ డని తోఁచుచున్నది. పరమార్థజ్ఞానము మాకుఁ గావలయును. శివకేశవులలో నెవఁడు బలీయుఁ డని దేవతలు ప్రశ్నించిరి - అని మహేశ్వరతీర్థవ్యాఖ్యయందున్నది.

ఉ॥ అంత విధాత వారితలఁ◆పంత నెఱింగి విరోధముఁ రమా
కాంతునకుఁ గిరీంద్రసుత◆కాంతునకుఁ జనియింపఁ జేయ న
త్యంతభయానకం బగుచు◆నాహవ మాహరికిం బినాకికిఁ
వింతగ సంఘటిల్లె రఘు◆వీర పరస్పరముఁ జయేచ్ఛమై. ౧౩౨౬

వారి యభిప్రాయ మెఱింగి బ్రహ్మదేవుఁడు క్రియారూపముగ మీ సందేహము తీర్చెద నని శివునకు విష్ణునకు విరోధము గల్పించెను. శివునొద్దకుఁ బోయి మహేశ్వరా త్రిపురముల నాశము చేసిన దెవ రని యడిగెను. నే నని శివుఁడు చెప్పెను. చేతగాని ప్రజలు చెప్పుకొనెద వేమి? విష్ణువు బాణమై పోయికదా త్రిపురములు గాల్చెను. నీవు చేసిన దేమి యున్నది? త్రిపురములు కాల్చి బూడిదచేసినవాఁడను నే నని, శివుఁడు నిమిత్తమాత్రమే కాని యాయన చేసిన దేమి యున్న దని, విష్ణు వనుచున్నాఁడే యనెను. అట్లైనఁ గార్యము చేయువాఁ డని కర్తను జెప్పవలయునా? సాధనమును జెప్పవలయునా? విష్ణువు చేయశక్తిగల వాఁడైనచో నాకేల బాణమై నిలువవలయును అని శివుఁడనెను. ఈమాటలు విష్ణువునకుఁ జెప్పి పరస్పరద్వేషము కలిగించి యిరువురిను యుద్ధమునకు సిద్ధము చేసెను. ఇట్లు శివకేశవు లిరువురు క్రోధమున మిగులభయంకరమైన యుద్ధము చేసిరి. అందు శివునకు నీవు విఱిచిన వింటని, విష్ణువునకు నీ వింటి నిచ్చిరి. ఆయుధములలోఁ దారతమ్య ముండిన నిరువురి బలాబలములు నిర్ణయింప సాధ్యము కా దని సమానబలముగల విండ్లను నిరువుర కిచ్చిరి. వా రిరువురు జయముఁ గోరి యుద్ధము చేసిరి.

క॥ పంకజలోచన భీకర, హుంకారము బలిమిఁ బెటిలె ♦ నుగ్రునిధనువుఁ
బింక మతి మహాదేవుఁడు, శంకరుఁడు త్రిలోచనుండు ♦ స్తబ్ధుండయ్యెన్. ౧౩౨౭

పంకజలోచను = విష్ణువుయొక్క, భీకరహుంకారము = భయంకరమైన హుమ్మను ధ్వనియొక్క; బలిమిన్ = బలముచే.

తా త్ప ర్య ము.

ఆ యుద్ధమందు విష్ణువు హుంకరింపఁగానే యా గాలిదెబ్బకు శివుని విల్లు పెళ్లెను. శంకరుఁడు మూఁడు కన్నులు గలవాఁడు మహాదేవుఁ డయ్యును పౌరుషము చెడి జడమువలె నయ్యెను.

క॥ నాకౌకోముని చారణ, లోకం బది గాంచి యాత్రి ♦ లోచను హరి న
స్తోకంబుగఁ బ్రార్థించిన, మైకొని రాస్కందనంబు ♦ మానఁగ వారల్. ౧౩౨౮

ఆస్కందనము = యుద్ధము, నాకౌకోమునిచారణలోకంబు = దేవతలు, మునులు, చారణులు లోనగు వారి సమూహము.

తా త్ప ర్య ము.

దేవతలు, మునులు, చారణులు లోనగు వారిసమూహ మది చూచి యిఁక నేల వృధాకలహ మని హరిహరుల నిరువుర యుద్ధము మానఁ డని ప్రార్థింపఁగా వారు శాంతి వహించిరి.

క॥ గుడుసుం గ్రైదువు వేలుపు, వడికిని శివుధనువు పెడిలి ♦ పడుటయు వేల్పుం
దుడుములు మునులును విష్ణువె, కడు నధికుం డనచు నప్పుడు ♦ గ్రహియించి రెదన్. ౧౩౨౯

గుడుసుం గ్రైదువు వేలుపు = గుండ్రని యాయుధమగు చక్రమునుగల దేవతయొక్క, వడికిని = వేగమునకు, వేల్పుందుడుములు = దేవతాసమూహములు.

తా త్ప ర్య ము.

విష్ణువు బలవేగమున శివుని విల్లు పెట్లిపోవుట చూచి దేవతలు, మునులు, విష్ణువే శివునికంటె మిగుల నధికుఁ డని తమమనస్సులఁ దెలిసికొనిరి. చూచి = ఒకరుచూచి-చెప్పఁగా విని కాదు-కన్నారఁ జూచి తెలిసికొనిరి.

"తదాతు జృభింతం శైవం, ధను ర్భీమపరాక్రమమ్ । హుంకారేణ మహాదేవ స్తంభితోఽథ త్రిలోచనః॥" అని మూలము. విష్ణుదేవుని హుంకారముచే శివునిధనస్సు జృంభితమయ్యె నని యర్థము. జృంభిత మనఁగా, భగ్నమయ్యె నని గోవిందరాజవ్యాఖ్య. జడమువలె నయ్యె నని మహేశ్వరతీర్థవ్యాఖ్య. మహే

శ్వరుఁడు స్తంభితుఁడయ్యె ననుటకు జడమువలె నయ్యె నని మహేశ్వరతీర్థీయము.

ఇంద్రజిత్తుచే రామచంద్రమూర్తి పరాజయము నొందలేదా? దానివలన నాయనకంటె నింద్రజిత్తు గొప్పవాఁడా యని ప్రశ్నము. మాయాయుద్ధము ధర్మయుద్ధము గాదు. నెఱచి డాఁగిన వాని శబ్దవేధులచేఁ జంపుట ధర్మము గాదని ధర్మసంస్థాపనార్థమై యవతరించిన రామచంద్రమూర్తి యభిప్రాయము. అధర్మయుద్ధముచేసి గెలుచుటకంటె ధర్మయుద్ధమున నోడినను మేలే. హరిహరయుద్ధమట్టిది కాదుకదా! ఇది ప్రత్యక్షముగ నిలిచి చేసిన ధర్మయుద్ధము. ఈ సందర్భమున శాక్తేయు లొకరు 'కంచన కాలం దశకంఠస్యాపి స్వీయతపో వృద్ధికాలే సాక్షాద్వైకుంఠే విష్ణోరజయ్యత్వకథనేన పరత్వం వ్యత్యయేన కల్ప్యేత' 'రావణుఁడు తన తపస్సు వృద్ధియందున్నకాలమున సాక్షాద్వైకుంఠమందు విష్ణువునకజయ్యుఁడయ్యెఁగదా! దానివలనఁ బరత్వము వ్యత్యయముగాఁ గల్పింపవలసి వచ్చునుగదా' యనిరి. ఇది నిరాకరిమైన ప్రాకటపురాణము. రామాయణగ్రంథస్థము గాదు

'కించ ప్రకృతే శ్రీరామాపేక్షయా పరశురామస్య న్యూనత్వకథనేన విష్ణ్వంశస్యైవ న్యూనత్వకథన మిత్యాపద్యేత' మఱియును శ్రీరామునికంటెఁ బరశురాముఁడు తక్కువవాఁడనుటచే విష్ణ్వంశమునకే కొఱఁత చెప్పినట్లు పెద్దవిపత్తు సంభవించుచున్నది. 'నచ-పరశురామః కలావతారః శ్రీరామస్తు పూర్ణావతారః అతో నోక్తదోష ఇతి వాచ్యం కిం తావత్పూర్ణావతారత్వం పరాభిమతవిష్ణుసంబంధియావచ్ఛక్తివిశిష్టత్వం తదితిచేత్ - నచ విష్ణుస్స్వరూపతస్స్వీయయావచ్ఛక్తి మన్యత్రావేశయతి కింవా. స్వయం సాక్షాత్సాకల్యేన తాద్రూప్యేణ పరిణమతేవా - నాద్యః- స్వసత్త్వం స్వశక్తిసాకల్యాభావే కథం నాంత్యః. పరిణామిత్వే పరస్యానిత్యత్వప్రసంగ ఇత్యాది దోషాపత్తేరిత్యలం॥" పరశురాముఁడు కలావతారము. కావున నట్టి విపత్తు లేందురేమో! అట్లైనఁ బూర్ణావతార మనఁగా నేమి? విష్ణుసంబంధమైన యావచ్ఛక్తితోఁ గూడి యుండుట యందురేని యావిష్ణువు స్వరూపముతో నుండి తనయావచ్ఛక్తిని మఱియొకచో నావేశింపఁ జేయుటయా' మొదటిది కాదు స్వశక్తిసాకల్య మభావమగుటచే కడపటిది కాదు. పరునకుఁ బరిణామము చెప్పిన ననిత్యత్వము ప్రాప్తించును గావున దోషము." అని యాక్షేపము.

అవతారలక్షణ మెఱుంగమి యిన్ని సందేహములకుఁ గారణము. దీపమునుండివచ్చిన దీపమువంటిది పూర్ణావతారము. దయ్యమావేశించినట్టిది యావేశావతారము. కలావతారము అంశావతారము. మొదటిదానియందుఁ బ్రకృ

తిసాంగత్యము లేదు. షాడ్గుణ్యపూర్తి గలదు. రెండవదానియందు ప్రకృతిసాంగత్యముగలదు. గుణపూర్తి లేదు. అభిప్రాయభేదముల గుఱించి మందరము నకుఁ బట్టుదల లేదు. కాని చెప్పునది సత్యముగ, సప్రమాణముగ నుండవలయు ననియే దానికోరిక. ఈ సందర్భమున విష్ణు వెక్కుఁడా-శివుఁడెక్కుఁడా యని కలహాకారణ మొకటి కల్పించుకొని తత్తత్పక్షపాతులు తత్తత్పక్షమున విరివిగ గ్రంథములు వ్రాసియున్నారు. ఆకలహమందు మందరమునకు రుచి లేదు. అయినను నీయిరువాగులకు నీక్రిందివిషయము చెప్పవలసియున్నది బాణాసురునిపక్షము వహించి శివుఁడు కృష్ణునితో యుద్ధముచేసి 'యోడిపోయి వీఁడు నాభక్తుఁడు. వీనికి నేను వరమిచ్చియున్నాను. వీనిని జంపక నామాట దక్కింపు' మని వేఁడఁగా శ్రీకృష్ణమూర్తి శివునితో "శ్రీభగవాన్ - యుష్మద్దత్తవరో బాణో, జీవతా మేష శంకర। త్వద్వాక్యగౌరవా దేత, న్మయా చక్రం నివర్తితమ్॥ త్వయా య దభయం దత్తం, తద్దత్త మఖిలం మయా। మత్తో విభిన్న మాత్మానం, ద్రష్టు మర్హసి శంకర। యోఽహం సత్వం జగ చ్చేదం, సదేవాసురమానుషమ్॥ మత్తో నాన్య ద శేషం య, త్తత్త్వం జ్ఞాతు మిహార్హసి। అవిద్యామోహితాత్మానః, పురుషా భిన్నదర్శినః। వదంతి భేదం పశ్యంతి, చావయో రంతరం హర॥" "శంకరా! నీచే వరము పొందిన బాణుఁడు జీవించుఁగాక నీమాటయందలిగౌరవముచే చక్రమును మరలించితిని నీ విచ్చిన యభయము నే నిచ్చినదే నాకంటె నీ వభిన్నుఁడ వని చూడుము. నే నెవఁడనో వాఁడే నీవు దేవమనుష్యాసురులతోడి జగత్తును సమస్తము నాకంటె నన్యము గాదని తెలిసికొనుము అజ్ఞానముచే మోహితములైన మనస్సులుగలిగి భిన్నదర్శను లైన పురుషులు హరా! మనలో భేదముగ జెప్పుదురు చూతురు." ఈవిష్ణుపురాణవాక్యము లుభయపక్షములవారు నంగీకరింపవలసినవై యున్నవి ఈదృష్టిగలవారు వ్యర్థకలహములందుఁ బాలుగొనరు మఱియు విష్ణుపురాణమందలి యీవాక్యములఁ గనుఁడు. "సృష్టిస్థిత్యంతకరణాత్, బ్రహ్మవిష్ణుశివాత్మికామ్। స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః॥" "భగవంతుఁడు జనార్దనుఁ డొకఁడే, సృష్టిస్థితినాశములు చేయుటవలన బ్రహ్మ యని విష్ణు వని శివుఁ డని పేర్లుగలవాఁ డగుచున్నాఁడు"

"త్వం కర్తా సర్వభూతానాం, త్వం పాతా త్వం వినాశకృత్। సర్గాదిషు ప్రభో బ్రహ్మ విష్ణురుద్రాత్మరూపధృత్" "సృష్టిస్థితి సంహారములందు బ్రహ్మవిష్ణురుద్రరూపములు ధరించి భూతముల సృష్టించు కర్తవు నీవే, రక్షించువాఁడవు నీవే, సంహర్తవు నీవే.

"శంకరో భగవాన్ విష్ణుః, గౌరీ లక్ష్మీ ర్ద్విజోత్తమ" "బ్రాహ్మణా! శంకరుఁడు భగవంతుఁడగు విష్ణువు; గౌరి లక్ష్మీదేవి ఈ విషయమున నహి నిందాన్యాయము సుప్రశస్తము.

ఇచ్చట శైవపక్షమున నప్పయదీక్షితులవారు విష్ణువుకంటె శివుఁ డధికుఁ డనుటకు రెండు కారణములు వ్రాసియున్నారు.

౧ "భార్గవో ఽతిదృప్తః ప్రసిద్ధ స్తదానీం చ క్రోధాంధ ఇతి స్వక్షత్రియవధా దుపరతిం శస్త్రసన్న్యాసం చ పరిత్యజ్య చపల ఇతి విదితః."

విష్ణు వధికుఁ డని దేవతలు గ్రహించి రనిచెప్పినవాఁడు పరశురాముఁడు. ఇతఁ డతిగర్విష్ఠుఁడు. అదియును గాక క్రోధాంధుఁడు. క్షత్రియవధ చేయ నని శస్త్రసన్న్యాసము తీసికొని మరల దానిని వదలి యీ యాయుధమును బట్టినవాఁడు. కావున నితనిమాట గ్రాహ్యము కాదు.

౨ "అపిచే త్సమరం ప్రాప్య, భవిష్యసి మమాధికః". భార ద్రో. నీకు నాకు యుద్ధము పొసఁగెనేని నా కంటె నీ వధికుఁడ వయ్యెద వని శివుఁడు నారాయణునకు వరమిచ్చెను. ఇట్లు వరమిచ్చినకారణముచే శివుఁ డోడిపోయెనఁట.

పరశురాముఁడు రుద్రశిష్యుఁడు. తన గురువువిల్లు క్షత్రియుఁ డొకఁడు విఱచినాఁ డని విని క్రోధము వహించి వచ్చినమాట నిజమే. కాని విష్ణుఁ డధికుఁ డనునది నా యభిప్రాయ మని చెప్పలేదు. ఆకాలమందు దేవత లిట్లు తలఁచి రని దేవతలయభిప్రాయమును తెలిపెను. ఇది తన వింటిప్రాశస్త్యమును దెలుపఁ జెప్పినమాటయే కాని శివకేశవతారతమ్యము స్థాపింపఁ జెప్పినవిషయముగాదు. క్రోధాంతరంగుఁ డని దీక్షితులు చెప్పఁజాలిరిగాని యసత్యము చెప్పినాఁ డని వ్రాయ వారి యంతఃకరణ మంగీకరించినది కాదు. అట్లుచెప్పుట కాకరము లేదు. అట్లు చెప్పియుండిరేని వారివాదము వారికే గండకత్తెర యగును. ఏలన వారు చెప్పిన రెండవకారణము యుద్ధమునందు నన్ను నీవు జయించెదవు, నాకంటె నీ వధికుడ వయ్యెద, వని శివుఁ డిచ్చిన వర మసత్య మగును గదా. కావున శివుఁ డోడినట్లు శివునికంటె, విష్ణు వధికుఁ డైనట్లు వారివాదముప్రకారమే యంగీకరింపవలసియున్నది

శివుఁడు విష్ణువునకిచ్చినవర మీయుద్ధమునకు ముందా వెనుకనా? ఈయుద్ధమునకు ముందే యిచ్చియుండినయెడలఁ దన పరాజయము నిస్సందేహముగఁ దెలిసియుండి యెట్లు యుద్ధమునకుఁ దిగెను. క్రోధాంతరంగుఁ డగుటచే సర్వజ్ఞునకును స్మృతి దప్పెనా? సందిగ్ధవిషయములందే బుద్ధిమంతుఁడు ప్రవర్తింపఁ డనఁ నీఁక స్పష్టముగాఁ బరాభవము దెలిసి తెలిసి నిష్కారణముగ నెట్లు కలహింప సాహసించెను. ఇట్టి యవివేకకార్యముఁగూడ సర్వజ్ఞుఁడు చేయునా?

ఈ యుద్ధమునకు వెనుక వరమిచ్చె నందమా, ఇప్పుడు గెలిచినది తన వరబలముచేతఁ గాదుకదా. అదిస్వభావశక్తిచేతనే కదా! తనకంటె నధికుఁడని యేర్ప

డినవానికిఁ దాను దనకంటె నధికుఁడవుక మ్మని వర మిచ్చె ననిన నేమి యర్థము? ఎవఁడైనను దనశక్తికి మించినవర మీయ సాధ్యమా? తన యాశ్రితునకుఁ దహశీల్ దారు మండలాధిపత్య మియ్యఁగలఁడా? లక్షధనికుఁడు తన యాశ్రితునకు రెండులక్ష లీయఁగలఁడా? మొకటితరగతిపాఠములు నేర్చినవాఁడు మఱియొకనికి నాల్గవతరగతిపాఠము నేర్పఁగలఁడా? ఈవిషయములను దీక్షితులవారాలోచించినవారు గారు.

పూర్వము నరనారాయణులకు శివునకు బదరికాశ్రమమందు యుద్ధము జరిగెను. ఆవిషయము మహాభారతమున శాంతిపర్వమందు ౩౫౨ వ యధ్యాయమునఁ జెప్పఁబడినది అందలి కొన్నిశ్లోకము లనువదించుచున్నాను. బ్రహ్మ శివునిఁ జూచి,

"నరో నారాయణశ్చైవ, జాతౌ ధర్మకులోద్వహౌ
తపసా మహతా యుక్తౌ, దేవశ్రేష్ఠౌ మహావ్రతౌ
అహం ప్రసాదజ స్తస్య, కుతశ్చిత్కారణాంతరే
త్వం చైవ క్రోధజ స్తాత, పూర్వసర్గే సనాతనః
మయా చ సార్థం వరద, విబుధైశ్చ మహర్షిభిః
ప్రసాదయాశు లోకానాం, శాంతి ర్భవతు మాచిరమ్
బ్రహ్మణా త్వేవము క్తస్తు, రుద్రః క్రోధాగ్ని ముత్సృజన్
ప్రసాదయామాస తతో, దేవం నారాయణం ప్రభుమ్
శరణంచ జగా మాద్యం, వరేణ్యం వరదం హరిమ్
తతోఽథ వరదో దేవో, జితక్రోధో జితేంద్రియః
ప్రీతిమా నభవ త్తత్ర, రుద్రేణ సహ సంగతః
ఋషిభి ర్బ్రహ్మణా చైవ, విబుధైశ్చ సుపూజితః
ఉవాచ దేవ మీశాన, మీశ స్స జగతో హరిః
య స్త్వాం వేత్తి స మాం వేత్తి, య స్త్వా మను స మా మను
నావయో రంతరం కించి, న్మా తే భూ ద్బుద్ధి రన్యథా॥"

"నరనారాయణు లనువారు ధర్ముని వంశమునఁ బుట్టినవారు. దేవశ్రేష్ఠులు, మహాతపస్వులు, మహావ్రతులు. కారణాంతరమువలన నే నాయనయనుగ్రహమువలన జనించితిని నాయనా! సనాతనుఁడవైన నీ వాయనక్రోధమువలనఁ బూర్వసర్గమున జనించితివి. వరదా! నేను ఋషులతోఁ బ్రార్థించెదను. అనుగ్రహింపుము. లోకము మేలుపడునుగాక!" అని బ్రహ్మ చెప్పఁగా రుద్రుఁడు క్రోధము విడిచి ప్రభువు దేవుఁడునైన నారాయణు సంతోషపఱుప వరదుఁడును, ఆద్యుఁడును, వరేణ్యుఁడును నగు హరిని శరణుచొచ్చెను. అప్పుడు జితక్రోధుఁడు, జితేంద్రియుఁడు నగు

దేవుఁడు ప్రీతుఁడై రుద్రుతోఁ గలిసికొనెను. బ్రహ్మయు ఋషులు దేవతలు పూజించిరి. అప్పుడు జగదీశుఁడగు నాహరి దేవుఁడగు నీశానుతో నిట్లనియె- "నిన్నుఁ దెలిసికొనిన వాఁడు నన్నుఁ దెలిసికొనును, ఎవఁడు నిన్ననుసరించునో వాఁడు నన్ననుసరించును" అని చెప్పెను

ఇట్లుండుటచే వారివారిప్రకృతితత్త్వముకొలఁది శైవులు శివునిఁ బరతత్త్వముగాను, వైష్ణవులు విష్ణునిఁ బరతత్త్వముగాను భావించి హరిహరులవలెఁ బరస్పరమైత్రి కలిగియుందురుగాక! వారిలో వారికి లేని విరోధబుద్ధి క్షుద్రమనుష్యులకేల?

సీ॥ క్రుద్ధుఁడై రుద్రుఁడు ♦ కోదండ మిచ్చె నా, రాచంబుతో దేవ♦రాతునకును
నిది వైష్ణవం బయి ♦ యెసఁగుశరాసనం, బిచ్చె ఋచీకుఁ డా ♦ భృగుభవునకు
విష్ణుండు, నతఁ డిచ్చె ♦ విశ్వవిదుం డగు, తనసుతునకు జమ♦దగ్ని కతఁడె
నాతండ్రి యాతండు ♦ న్యస్తశస్త్రుండయి, తప మాచరింప మ♦దంబు పేర్మి
తే॥ నర్జునుఁడు నీచమతి యయి ♦ హతునిఁ జేయ, దారుణం బైనజనకవ♦ధంబు వినికిఁ
గ్రోధ మెదలోనఁ బుట్టంగఁ ♦ గ్రూరగతిని, బెక్కుమాఱులు రాజులఁ♦బిలుకుమార్చి. ౧౩౩౦

దేవతలయభిప్రాయ మెఱింగి వింటిపైఁ గోపించినవాఁడై రుద్రుఁడు బాణములతోడ దానిని దేవరాతున కిచ్చెను. ఇది విష్ణువు ధరించిన విల్లు. దీని నాయన ఋచీకుఁ డను భృగువంశభవున కిచ్చెను. ఆ ఋచీకుఁడు తన కొడుకును విశ్వవిదుఁడు నగు జమదగ్ని కిచ్చెను. ఆయనయే నా తండ్రి. ఆయన శస్త్రసన్న్యాసము తీసికొని తపము చేయుచుండఁగా గర్విష్ఠుఁడగు కార్తవీర్యార్జునుఁడు నీచబుద్ధియై యతనిఁ జంపెను. ఆ దారుణమైన పితృవధవార్త విని మనస్సులోఁ గోపము కలుగఁగాఁ గ్రూరుఁడనై యా రాజులను బలుమాఱు వధించితిని.

జమదగ్ని శబ్దార్థమును జమదగ్నియే యిట్లుచెప్పెను.

శ్లో॥ జాజమద్యజజా నేహం, జిజాహీహ జిజాయిషీ
జమదగ్ని రితి ఖ్యాతం, తతో మాం విద్ధి శోభనే॥- అను.

జాజమంతు లనఁగా దేవతలు. అనేకయజ్ఞములందు నేకకాలమున మరల మరల భక్షింతురు కావున దేవతలు జాజమంతులు. జము భక్షణే అని ధాతువు. యజము = అగ్ని - దేవతలు దీనియందుఁ బూజింపఁబడుదురు. దానియందుఁ బుట్టినవాఁడను గావున నేను జిజాహిని. కావున యోగమువలన నన్ను జమదగ్ని యని తెలిసికో. జాజమత్-దీనిలోఁ బ్రథమాక్షరము లోపింపఁగా జమత్ అని మిగిలెను. జమత్ + అగ్ని - జమదగ్ని యయ్యెను. జాజమంత

మైన యగ్ని యీాయనయందుఁగలవాఁడు కావున జమదగ్నిమంతుఁ డయ్యెను. మతుప్పు లోపింపఁగా జమదగ్ని యని రూపము మిగిలెను.

ఈ పద్యమందు శివుఁడు తనధనస్సును దేవరాతున కిచ్చినట్లు చెప్పఁబడెను. ౧-౨౦౪ వ పద్యమందు దేవతల కిచ్చినట్లు చెప్పఁబడెను. ఇది యెట్లు సంగత మన.—ఈ విల్లు తనకు దేవతలవలనఁ బ్రాప్తమైనదే కావున మీావిల్లు మీారే తీసికొనుఁ డని దేవతల కియ్యఁబోఁగా వారు దానిని గ్రహింప భయపడి భవిష్యత్తు నాలోచించి దేవరాతున కిమ్మని చెప్పి దేవరాతునితో దీనిని నీయొద్ద నిల్లడగా నుంచుకొ మ్మనిరి. అప్పుడు శివుఁడు దేవరాతున కిచ్చెను గావున నసంగతమేదియు లేదు.

అట్లైన ౭-౯౯ వ పద్యమందు దేవతలు జనకునకు నిచ్చినట్లు చెప్పఁబడినది. ఇది యెట్లు సంగతము ? ౭-౨౫ వ పద్యమునందు దేవరాతున కిచ్చినట్లే చెప్పఁబడెను. ఆవల జనకునకు యజ్ఞఫలము మాఱుగ నతని కోరికప్రకారము దానిని సొంతముగ నిచ్చిరి. కావుననే రామచంద్రమూర్తి దానిని విఱిచినను జనకుఁడు విచారపడలేదు. అటుకాకుండిన నిల్లడసొమ్ము పాడుచేసినవాఁడు సొంతగాఁ డడిగినప్పు డేమి చెప్పఁగలఁడు? తొలుత నిల్లడగా నుంచినదానిని నీవే తీసికొమ్మనిన నసంగత మేమియున్నది?

అట్లైన సీతాదేవి యనసూయతో జనకునకు వరుణుఁడు యజ్ఞకాలమున నిచ్చె నని చెప్పెనే యది యెట్లు సంగతము ? దేవత లిచ్చిరని చెప్పిన వారిలోఁ జేతఁగొని యిచ్చువాఁ డొకఁడేకదా! ఆయొకఁడు వరుణుఁడు. దేవతలచేఁ బ్రేరింపఁబడి వరుణుఁడు జనకున కిచ్చెను. ఇందును నసంగత మేదియును లేదు

జనకునకు ధనవు లభించినవిధ మెట్లన.—మొదటఁ ద్రిపురాసురులవధ నిమిత్తము విశ్వకర్మ నిర్మించెను. దానిని దేవతలు శివున కిచ్చిరి. దక్షయజ్ఞవిరోధకాలమున నది విష్ణువుచేఁ జెడఁగా దానిని దేవతలు దేవరాతున కిమ్మని ప్రార్థింపఁగా శివుఁడు దానిని దేవరాతునిచేతి కిచ్చెను. అది మొదలిల్లడగానే యది యతనివశమున నుండెను. దానిని జనకునియజ్ఞమందు దేవతలు వరుణునిచే జనకున కిప్పించిరి. పరశురామునిధనస్సును దేవతలసొమ్ము దేవతలయొద్దనే యుండనీ, మనుష్యుల కేల, యని రామచంద్రమూర్తి వరుణున కిచ్చెను.

ఇందుఁ బరశురాముఁడు రాజుల వధించితి నని చెప్పెను. దీనికిఁ గొందఱు హైహయులమాత్రమని చెప్పుదురు. అది సరిగాదు క్షత్రియజాతి నని యెఱుంగనగు ప్రమాణవాక్యములు. శ్రీభాగవతము ప్రథమస్కంధమున-'పదునావది యగు భార్గవరామాకృతిని గుపితభావంబుఁ దాల్చి బ్రాహ్మణద్రోహుల యిన రాజుల నిరువదియొక్కమాఱు వధియించి నిఃక్షత్రంబు గావించె." ఆ॥ "అ

య్యపగకు రాముఁ డలయక రాజుల।నిరువదొక్కమాఱు నరసి చంపె । జగతి మీఁద రాజశబ్దంబు లేకుండ । నూడు దీర్పలేనిసుతుఁడు సుతుఁడె॥ కం॥ భగవంతుఁడు హరి యాక్రియ । భృగుకులమునఁ బుట్టి యెల్ల పృథివీపతులన్ । జగతీభారమువాయఁగఁ।బగగొని పలుమాఱుఁ జంపెఁ బవరమున నృపా॥" పద్మపురాణము—"శ్లో॥ నిఃక్షత్రముర్వీం కృత్వాతు, జామదగ్న్యః ప్రతాపవాన్ ।౧౧౬ భగవా నేక, మిక్ష్వాకోస్తు మహాకులమ్ । మాతామహస్యాన్వయత్వా, ద్రేణుకావచనాత్తథా । తాన్ భ్రష్టరాజ్యాన్ కృత్వావై, మాతామహకులోద్భవాన్ । అహత్వా పునవంశం తం, రామో నృపకులాంతకః । సర్వాఁతు భూభృతాం వంశం, నాశయామాస వీర్యవాన్ । నిఃక్షత్రా ముర్వీం కృత్వాతు, జమదగ్నిసుతో బలీ।అశ్వమేధం మహాయజ్ఞం చకార విధివద్ద్విజః॥" దీనివలనఁ దనతల్లి యిక్ష్వాకువంశజుఁ డగు రేణుకుని కూఁతు రగుటచే రేణుకమాటనిబట్టి యిక్ష్వాకువంశమును నాశము చేయలేదుగాని తక్కినరాజులనందఱ ధ్వంసము చేసె నని యేర్పడుచున్నది.

మహాభారతము ఆది. ౨ అధ్యా "శ్లో॥ త్రేతాద్వాపరయో స్సంధౌ, రామశ్శస్త్రభృతాంవరః । అసకృత్పార్థివం క్షత్రం, జఘానామర్షచోదితః । స సర్వం క్షత్రముత్సాద్య, సవీరేణానలద్యుతిః । యచ్చ రోషాభిభూతేన, క్షత్రముత్సాదితం వయా॥" వ్యాఖ్య- క్షత్రం క్షత్రియసంతతిం . ౬౫వ అధ్యాయము-౪-శ్లో॥ 'త్రిస్సప్తకృత్వః పృథివీం కృత్వా నిఃక్షత్రియాం పురా। జామదగ్న్య స్తపస్తేపే మహేంద్రే పర్వతోత్తమే। తదా నిఃక్షత్రియే లోకే భార్గవేణ కృతే సతి॥" ౧౧౩-౪- త్రిస్సప్తకృత్వః పృథివీంకృత్వా, నిఃక్షత్రియాం పురా। ఏవం నిఃక్షత్రియే లోకే కృతే తేన మహర్షిణా॥" కావున పరశురాముఁడు హైహయులనే కాక సర్వక్షత్రియులను నాశము చేసెననుట కనేకప్రమాణములు గలవు. భయపడి స్త్రీలలో నావులలో డాఁగికొంటను ప్రతికరి పట్టాభిషిక్తులనెల్లఁ జంపె నని తెలియవలయును.

సీ॥ ధారుణీసకలంబు ♦ దక్షిణగానిచ్చి, క్రతుసమాప్తిని ♦ గశ్యపునకు
నేను మహేంద్రంబు ♦ నిలయంబుగాఁ గొని, యున్నాఁడ సుఖవృత్తి ♦ నుగ్రతపము
సలుపుచు సురసంఘ♦సంసేవితుండనై, యిప్పుడ నీవు ను♦త్కృష్టబలము
చూపి త్రుంచితి హరు♦చాపంబునా విని, పరువున వచ్చితిఁ ♦ బార్థివుండ
తే॥ రామ! యావైష్ణవం బయి ♦ క్రాలుచాప, మిదియె నీతంత్రితాతల♦యేపుమీఱు
క్షత్రధర్మంబుఁదలఁచియీ♦చాపమెక్కు, పూన్పమాచూపఁ గదనె నీదు♦భుజబలంబు.
౧౩౩౧

ఇట్లు రాజులనెల్లఁ జంపి యజ్ఞముచేసి యజ్ఞాంతమున నీ భూమియంతయు గశ్యపునకు దానము చేసి నే నిపుడు మహేంద్రపర్వతము వాసస్థానము చేసి

కొని తపము చేయుచు సుఖముగా దేవతాసంఘసేవితుఁడనై యున్నాను. నీవు నీ మహాబలముచే శివునివిల్లు విఱిచితివని విని వడువున వచ్చితిని ఆవైష్ణవ చాపం బిదియే నీవు క్షత్రియవంశమునందుఁ బుట్టినవాఁడవైతివేని నీ తండ్రి తాతలక్షాత్రము స్మరించి యీ వివిల్లెక్కుపెట్టుము నీ భుజబలము చూచెదను.

క౦॥ ఎక్కిడి శరముం గూర్చిన, నక్కున నీతోడ ద్వంద్వ♦యుద్ధమునకు నే
నెక్కటి దొడఁగెదఁగానీ, గ్రక్కునఁ గాని క్షత్రుల్లుగలుషితమతి నై. ౧౩౩౨

నీ వీ విల్లెక్కుపెట్టి బాణము సంధించితివేని నీతో ద్వంద్వయుద్ధము నే నొక్కండనే సేయఁ బ్రారంభించెదను. కానీ త్వరగాఁ గానీ యని పరశురాముఁ డనఁగా శ్రీరామచంద్రమూర్తి కోపించినవాఁ డయ్యెను.

—* ౭౬ సర్గము. శ్రీరాముఁడు పరశురాముని ధిక్కరించి నిస్తేజుఁ జేయుట *—

క౦॥ ఆరామునిమాటలు విని రా,రాముఁడు చెంతఁ దండ్రి ♦ రాజులు కతనన్
గౌరవమున సౌమ్యస్వర, మారఁగ నిటు పలుకు భార్గ♦వా! యే మంటే? ౧౩౩౩

ఆ పరశురాముని మాటలు విని రాజగు శ్రీరామచంద్రమూర్తి తనసమీపమందుఁ దన తండ్రి యున్నకారణముచేఁ బెద్దవారియెదుట గట్టిగా మాటలాడరాదను నీతి ననుసరించి యాయనయం దుండు గౌరవముచే మెల్లనిస్వరముతోనే 'పరశురామా! యే మంటివి?

క౦॥ వింటిని నీకథ, సరి యని, యుంటిని జనకుని ఋణంబు ♦ నటు దీర్చుట, న
న్నంటివిగా దుర్బలుఁ డని?, యంటివిగా క్షత్రధర్మ♦మం దనదవలెన్? ౧౩౩౪

నీకథ వింటిని శూరుఁడు పగదీర్చుట న్యాయ్యమే కనుక జనకుఋణము తీర్చుటకు నీవుచేసిన పని సరి యని యంగీకరించితిని. అంతవఱకు సరియే. కాని నేను దుర్బలుఁడ నని తలఁచితివిగదా. క్షత్రధర్మమందు దేబె నని యంటివిగదా! దానిని సహింపను

తే॥ తెలియఁగా లేవుగా నాదు♦తేజ మీవు, గాంచుమా చూపువాఁడ నా♦కడిమి పెంప
పటంచు భార్గవుకరమున♦యందు నున్న, యుగ్రధనువును బాణంబు♦నొడిసి తిగిచి.
౧౩౩౫

నా తేజస్సు నీవు తెలిసికోలేక యున్నావుగదా! నా బలాధిక్యమును జూపెదను జూడుము, అని పరశురాముని చేతియం దున్న భయంకరమైనవింటిని నొడిసి లాగుకొనెను.

ఈవింటిని లాగుటలోఁ బరశురాముని వైష్ణవతేజస్సును రామచంద్రమూర్తి లాగుకొనెను. ఈవిషయము పద్మపురాణమం దిట్లు చెప్పఁబడినది-"శ్లో॥ ఏవ ము

క్తస్తు కాకుత్స్థో భార్గవేణ ప్రతాపవాన్। తచ్చాపం తస్య జగ్రాహ తచ్ఛక్తిం వైష్ణవీ మపి॥" పరశురాముఁ డీప్రకారము చెప్పఁగాఁ బ్రతాపవంతుఁడైన శ్రీరామచంద్రమూర్తి ఆయనచేతివింటిని అందలివిష్ణుశక్తిని గూడ లాగుకొనెనని యర్థము. అర్జునువిషయమున కృష్ణమూర్తి యిట్టులేకదా చేసెను.

పరశురామావతార మావేశావతారము. కార్యార్థమై జీవునియందుఁ దత్కాలమున భగవంతుని తేజస్సావహించెనేని యది యావేశావతారము. ఇందు దేహము ప్రాకృతము. జీవుఁడు బద్ధుఁడు. ఇట్టి ప్రకృతిసంబంధముగల యవతారములు పూజ్యములు గావు, మోక్షదములు గానేరవు. శ్రీరామావతారము పూర్ణావతారము. ఇట్లు రెండు కలిసినపుడు తక్కువతేజస్సెక్కువతేజస్సులోఁ గలియును. అర్జునాదు లిట్టివారే.

పద్మపురాణము.—శ్లో॥ ఏతత్తే కథితం దేవి జామదగ్న్యే ర్మహాత్మనః। శక్త్యావేశావతారస్య, చరితం శార్ఙ్గిణః ప్రభోః। నోపాస్యహి భవే త్తస్మాత్ భక్త్యావేశా న్మహాత్మనః। విశిష్టై ర్భగవద్భక్తై, ర్విప్రముఖ్యై ర్మహాత్మభిః॥

విష్ణుశక్తి యావేశించిన యవతార మగు పరశురామావతారముయొక్క విషయమంతయుఁ జెప్పితిని. ఇట్టివి భక్తులకు బ్రాహ్మణులకు సాధువులకు నుపాసింపఁదగినవి కావు.

క॥ ఎక్కిడి కోదండముఁ బేర్చక్కున నారాచమందు ♦ నూనిచి బలు కెంపెక్కఁగఁ గంటను గోపం, బక్కజముగఁ గదుర నిట్టు ♦ లను భార్గవునిన్. ౧౩౩౬

ఇట్లు విల్లు లాఁగొని యెక్కుపెట్టి మిక్కిలిబలశాలి శ్రీరామచంద్రమూర్తి యొక తీవ్రబాణము సంధించి కన్నులెఱ్ఱవాఱఁగా మిక్కిలికోపంబునఁ జూచుచుఁ బరశురామునితో నిట్లనెను.

క॥ గాధికుమారునిచుట్టము, వైధాత్రీనిర్జరుండ ♦ వగుటను నీపైఁ గ్రోధము గొని నినుఁ జంపెడి,సాధన,మిది వైవ మనసు♦చాలదు నాకున్. ౧౩౩౭

నీవు బ్రాహ్మణుఁడవైనను శస్త్రము ధరించి తనమీఁదికి వచ్చిన బ్రాహ్మణునిఁ జంపవచ్చునని శాస్త్ర మనుమతించునను నీవు నాగురు వగు విశ్వామిత్రునిబంధుఁడవు. కావున నీపైఁ గోపించి నిన్నుఁ జంపఁగల యీబాణమును నీపై వేయ మనస్సు రాకయున్నది.

విశ్వామిత్రునితోఁడబుట్టిన సత్యవతి ఋచీకునిభార్య. ఆయిరువురకుమారుఁడు జమదగ్ని. ఆయనకుమారుఁడు పరశురాముఁడు.

శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణుఁడగు పరశురాముని జంపి బ్రహ్మహత్య సంపాదించుకొొన నెట్లు యత్నించె నని ప్రశ్న.

"బ్రాహ్మణో నహంతవ్య" యనియుండుట సత్యమే. బ్రాహ్మణుని జంపినహత్య వచ్చుటయు సత్యమే కాని యెట్టి బ్రాహ్మణునిజంపిన బ్రహ్మహత్యవచ్చును? నిరాయుధుఁడై యయుధ్యమానుఁడైయున్న బ్రాహ్మణుని జంపిన బ్రహ్మహత్య వచ్చును. కాని యాయుధముధరించి యుద్ధమునకు వచ్చిన బ్రాహ్మణుని జంపినఁ బాపములేదు. ఈధర్మ మనుసరించియే భీష్ముఁడు పరశురాముని జంప యత్నించెను. గురువులైన ద్రోణ కృపాశ్వత్థామలను పాండవులు గొట్టిన దీధర్మము ననుసరించియే. దీనికిఁ బ్రమాణవాక్యములు—

"పితౄన్, పితామహాన్ పిత్ర్యం, గురూన్ సంబంధిబాంధవాన్। మిథ్యాప్రవృత్తాన్ యః సంఖ్యే, నిహన్యాద్ధర్మపవసః। సమయత్యాగినో లుబ్ధాన్, గురూనపిచ కేశవ। నిహంతి యస్తాన్సమరే క్షత్రియో యస్స ధర్మవిత్॥"- శాంతిపర్వము. తండ్రులను, తాతలను, పినతండ్రులను, గురువులను, వియ్యంకులను, చుట్టములను, నియమము నతిక్రమించి లుబ్ధు లగుగురువులను యుద్ధమందుఁ జంపిన దోషము లేదు. అట్లు చేయు క్షత్రియుఁడే ధర్మ మెఱిఁగినవాఁడు.

ఉద్యోగపర్వమున భీష్ముఁడు పరశురామునితో "ఉద్యతేషు మథో దృష్ట్వా బ్రాహ్మణం క్షత్రబంధువత్। యో హన్యాత్సమరే క్రుద్ధో యుధ్యంత మపలాయినమ్। బ్రహ్మహత్యా నతస్య స్యా దితి ధర్మేషు నిశ్చయః। క్షత్రియాణాం స్థితో ధర్మే క్షత్రియోఽస్మి తపోధన। యో యథావర్తతే యస్మిం స్తథా తాన్ ప్రతివర్తయన్। నాధర్మం సమవాప్నోతి నచాశ్రేయశ్చ విందతి। ఏతే దేవాః శరీరస్థా బ్రాహ్మణ్యం యచ్చ తే మహత్। తపశ్చ సుమహత్తప్తం నతేభ్యః ప్రహరామ్యహమ్। ప్రహరే క్షత్రధర్మస్య యత్త్వం రామ సమాస్థితః। బ్రాహ్మణక్షత్రియత్వంహి యాతి శస్త్ర సముద్యమాత్.

"ఓయీ తపోధనా! యాయుధము ధరించి యుద్ధమునకు వచ్చి పరువెత్తిపోక నిలిచిన బ్రాహ్మణుని జంపిన బ్రహ్మహత్య రాదు. ఇది ధర్మశాస్త్రములందు నిశ్చితము. నేను క్షత్రధర్మమందుండు క్షత్రియుఁడను. ఎదుటివా రెట్లు వర్తింతురో యట్టులే వారి విషయమునఁ దాను వర్తించుట యధర్మము గాదు. దాని వలన శ్రేయోహానియు లేదు. నీవు క్షత్రియునివలె నాయుధము ధరించి వచ్చితివి. కావున నీవు క్షత్రియుఁడవే" మఱియు -

"శ్లో॥ ఉద్యమ్య శస్త్ర మాయాంత, మపి వేదాంతగం రణే। నిగృహ్ణీయాత్స్వధర్మేణ, ధర్మాపేక్షీ నరాధిపః॥"—శాంతి. ఆయుధమును ధరించి వచ్చిన

వేదాంతియైనను రాజు స్వధర్మమంగునిలిచి యుద్ధమందుఁ జంపవచ్చును.

"జ్యాయాంసమపి చేద్వృద్ధం, గుణైరపి సమన్వితమ్। ఆతతాయిన మాయాంతం, హన్యాద్ఘాతక మాత్మనః॥" భీష్మ ద్రోణాదులైనను వృద్ధులైనను గుణవంతులైనను దన్ను జంపవచ్చిన దుష్టుని జంపవచ్చును. ఆ కారణమునఁ బరశురామునిఁ జంప శ్రీరామచంద్రమూర్తి ప్రయత్నించుట దోషముగాదు. వాస్తవ మిట్లుండ క్షత్రియుఁ డగు రావణాసురుని యుద్ధమునకుఁ జంపిన శ్రీరామచంద్రమూర్తికి బ్రహ్మహత్య వచ్చె నని యది పాపుకొనుటకై లింగప్రతిష్ఠ చేసె నని చెప్పెడి వారి మాట లెంత విశ్వసనీయములో ప్రాజ్ఞులాలోచింతురుగాక!

క౦॥ నీయాపడగలిఁ గానీ, నీయార్జితపుణ్యలోక♦నిచయముఁగానీ
నీయిష్టము వొప్పున నే, నీయెడ ఖండింతు రిక్క♦ మీ బాణమునన్. ౧౩౩౮

నీ విఁక నడచుటకు లేక యొకదిక్కునఁ బడియుండునట్లు నీ కాళ్లగమనముగానీ నీవు తపస్సుచేసి సంపాదించిన పుణ్యలోకములఁ గానీ నీ వేది కోరెదవో దాని నీ బాణమున ఖండింతును.

క౦॥ అర్థింపుము పరనగరా,నర్థకరము వైష్ణవంబు♦ నగుశర మిది దా
వ్యర్థంబుగఁ బోనేరదు, సార్థక మయి లక్ష్యభేద♦నార్తిం దక్కన్ ౧౩౩౯

అర్థింపుము = నెంటిలో నేది చేయుమనెదవో కోరుకొనుము. పరనగరానర్థకరము = శత్రువులపట్టనములకుఁ గీడు కలిగించునది, వైష్ణవము = విష్ణుసంబంధమైనది,యీ బాణము. ఇది సంధించినపిమ్మట వ్యర్థముగఁబోదు సార్థకముగ లక్ష్యమును భేదించియే శమించును. కావున దేనిని ఖండింపు మనెదవో చెప్పుము.

క౦॥ అని పరశురాము దశరథ,తనయుఁడు భర్జించుచో ని♦తాంతాద్భుత మం
చును గుమిగొని బృందారక,మునిచయములు మేఘమార్గ♦మునఁగొండి కనెన్.
౧౩౪౦

దశరథరాముఁడు పరశురాము నిట్లు భయపెట్టి వేఁడఁగా మిగుల నద్భుత మిది యని దేవతలు మునులు నాకాశంబున గుంపులుగఁ జేరి చూచిరి.

క౦॥ వీరుని రాముని భయదా,కారునిఁ బటుచాపబాణ♦కరుని౦ జూడం
జారణకిన్నరరక్షో, వారయుతుం డగుచు బ్రహ్మ♦ వచ్చె నచటకిన్. ౧౩౪౧

వీరుఁడును భయంకరాకారుఁడును తీక్ష్ణమైన బాణములఁ జేతఁ బూనిన వాఁడును నగు శ్రీరామునిఁ జూచుటకు బ్రహ్మ చారణకిన్నరసమూహముతో నచ్చటికి వచ్చెను.

క॥ బెడిదపుఁజాపముఁ బూనిన, వడిఁ గని జగమెల్ల బ్రాన్పడ, భార్గవుఁడున్
జడుఁడై నిర్వీర్యుండై, చెడి రాముని గనుచు నుండెఁ జిత్తరువువలెన్. ౧౩౪౨

భయంకరమైన చాపముఁ బూనిన వేగము బలముఁ జూచి జగ మంతయు మొద్దుపాఱిపోయెను. పరశురాముఁడును జడుఁడై వీర్యహీనుఁడై చెడి చిత్తరువుబొమ్మవలె శ్రీరామచంద్రుని జూచుచుండెను.

తే॥ రామ తేజోభిహతపరా క్రముఁడు నగుచు
జామదగ్న్యుండు బల మేది జడతఁ గాంచి
రామచంద్రునిఁ గమలాభిరామనయనుఁ
గాంచి యిట్లను మెల్ల సగౌరవముగ. ౧౩౪౩

శ్రీరామచంద్రుని తేజముచే నాశము చేయఁబడిన పరాక్రమము గలవాఁడై పరశురాముఁడు బలము గోలుపోయి జడమువలె నయి కమలములవలె నందమయిన కన్నులుగల శ్రీరామచంద్రునిఁ జూచి మునుపటి యొసగొడుకు విడిచి గౌరవముతోడ మెల్లగా నిట్లనియె.

నారసింహపురాణంబున.—'శ్లో॥ తతః పరశురామస్య, దేహాన్నిర్గత్య వైష్ణవమ్। పశ్యతాం సర్వదేవానాం, తేజో రామ ముపావిశత్.' పరశురాముని యందలి వైష్ణవతేజము బయలువెడలి దేవతలందఱు చూచుచుండ శ్రీరాము నందుఁ బ్రవేశించెను.

—* { పరశురాముఁడు తనపుణ్యలోకంబుపై నస్త్ర మేయ శ్రీరాముఁ బ్రార్థించుట. } *—

క॥ ఇల నొసఁగితిఁ గాశ్యపునకు, నెలవుకొనకు మనియెఁ దనదు నేల వసియిన్ రాత్రులయందుఁ గాన నిలువను, జలజాక్షా! గురువరేణ్యశాసనగరిమన్. ౧౩౪౪

పుండరీకాక్షా! భూమి నంతయుఁ గశ్యపునకు దానముగ నిచ్చితిని. ఆయనయు నాకు దానమునిచ్చినదానిలో నీ వుంటివేని దత్తస్వమును నీ వనుభవించినవాఁడ వవుదువు. కావున నాభూమిలో నీ వుండవల దని యాజ్ఞాపించెను. కావునఁ బగలు తిరిగినను రాత్రులందు నే నీభూమిని గురువర్యుని గొప్పయాజ్ఞప్రకారము నిలువను. తప్పక వెడలిపోవలయును.

చం॥ నఱకకుమీ మహాత్మ! గమనంబు, మహేంద్రనగంబుఁ జేరఁగాఁ
బఱతు మనోజవంబునఁ, దపస్స్ఫురణన్ గడియించులోకముల్
బిఱబిఱ నీదుబాణమున భిన్నముచేయుము, తప్పు చేసితిన్
మఱకువ, నీవునన్ నృపతిమాత్రుఁడవే తలపోయ రాఘవా! ౧౩౪౫

మహానుభావా! నానడకను నీవు నఱకవలదు మనోవేగముతోఁ బోయి మహేంద్రపర్వతముఁ జేరెదను. నాతపస్సుచే నేను సంపాదించిన పుణ్యలోకముల నీ బాణముచే ధ్వంసముచేయుము ఆపుణ్యలోకముల యనుభవము నాకు లేకపోవుఁగాక! అజ్ఞానముచేఁ దప్పుచేసితిని. తెలియనితనముచే నీవు రాజమాత్రుఁడ వని యట్లు మాటలాడితిని గాని నీవును రాజమాత్రుఁడవా? కావు కావు.

నీవునౕ = నీవుకూడ - అనఁగా నందఱు రాజులు మీఁద నెంతో లోపల నంతే. నీవు రాజవేషము వేసితివి గాని నిజముగా రాజవు కావు.

చం॥ ఎఱిఁగితి నాశరాసనము ♦ నీగతి నీడ్చి శరంబుఁ బూన్పఁగా
నెఱవడి యక్షయుండ వని ♦ నీవు మధుప్రతిపక్షుఁ డంచు, నే
మఱపునఁ దప్పు చేసితిని ♦ మన్నన సేయుము, నీకు భద్రముల్
వఱలెడుఁ గాక, యీయమర♦వర్గము గూచె భవత్ప్రతాపమున్. ౧౩౪౬

నీవు దురుసుగ మాటలాడినపుడు రాజమాత్రుఁడను, ఇంతలోఁ గాకపోయితినా యందువేమో? - నీ వేమో యప్పటి కిప్పటికి నొక్కఁడవే నా తెలివి యందే మార్పుగలిగెను. అప్పుడు నేను నీసత్త్వ తెలిసికొనలేక లోకముతో పాటు రాజ వని తలఁచితిని. ఎప్పుడు నావిల్లు నాచేతినుండి లాగికొని బాణము సంధించితివో యది యితరుల కెవ్వరికి సాధ్యముకాని పని కావున నిర్వికారుఁడవు, అపరాజితుఁడవు, మధువైరివైన శ్రీమన్నారాయణుఁడ వని తెలిసికొంటిని. నేను తెలివిమాలి యపరాధముచేసితిని క్షమింపుము నీకు శుభమగుఁగాక! నీప్రతాపమును దేవతలందఱు చూచిరి.

'ఉతామృతత్వస్యేశాన' యన్నట్లు శ్రుతిప్రసిద్ధబ్రహ్మమే నీవు- అని తిలక వ్యాఖ్య.

ఈసందర్భమున భారతమున అనుశాసనపర్వంబున ౯౮వ యధ్యాయమందు శ్రీరామచంద్రమూర్తి పరశురామునకుఁ దనవిశ్వరూపముఁ గనఁబఱచిన ట్లున్నది.

"ఏత చ్ఛ్రుత్వాబ్రవీ ద్రామః, ప్రదీప్త ఇవ మన్యునా
శ్రూయతే క్షమ్యతే నైవ, దర్పపూర్ణోఽసి భార్గవ
త్వయా హ్యధిగతం తేజః, క్షత్రియేభ్యో విశేషతః
పితామహప్రసాదేన, తేన మాం క్షిపసి ధ్రువమ్
పశ్య మాం స్వేన రూపేణ, చక్షు స్తే వితరా మ్యహమ్
తతో రామశరీరే వై, రామః పశ్యతి భార్గవః
ఆదిత్యాన్ సవసూన్ రుద్రాన్, సాధ్యాంశ్చ సమరుద్గణాన్

పితరో హృష్యతాశ్చన్త్వైవ, నక్షత్రాణి గ్రహా స్తథా
గంధర్వా రాక్షసా యక్షా, నద్య స్తీర్థాని యాని చ
ఋషయో వాలఖిల్యాశ్చ, బ్రహ్మభూతా స్సనాతనాః
దేవర్షయశ్చ కార్త్స్న్యేన, సముద్రాః పర్వతా స్తథా
వేదాశ్చ సోపనిషదో, వషట్కారై స్స్వహాధ్వరైః
చేతోమంతి చ సామాని, ధనుర్వేదశ్చ భారత
మేఘబృందాని వర్షాణి, విద్యుతశ్చ యుధిష్ఠిర
తతః స భగవాన్ విష్ణు, స్తం వై బాణం ముమోచ హ.

కం॥ ఉల్లమున లజ్జ దోఁపదు, ముల్లోకము లేలు దేవ♦ముఖ్యునిచే నే
నిల్లీల భంగపడ నుద్యల్లలితకృపాభిరామ ♦ దశరథరామా.   ౧౩౪౭

ఇంతవఱకుఁ బరాభవ మెట్టిదో నే నెఱుఁగను. నేఁడు నా జన్మమున మొదటి సారి రాచబాలుఁడ వగు నీచే భంగపడితిఁగదా యని యవమానము తోఁచుట లేదు. ఏలన నీవు మూఁడులోకములు పాలించు ముఖ్యదేవుఁడవు మనోహరమైన దయచే హృదయసమృద్ధమైనవాఁ డౌదశరథరాముఁ డని జనవాదమాత్రముగలవాఁడా!

కం॥ అసమానమోఘశరంబును, వసుధాతనయాహృదీశ ♦ వడి విడువుము నా
యసమమఱ గతులు చెడం గని, వెసఁ జనుదు మహేంద్రనగము ♦ వేళకుఁ జేరన్.
౧౩౪౮

అసమానమై వ్యర్థముకాని దగు నీ బాణమును జనకీవల్లభా! విడువుము. నా కీర్తి నాశమై గతులు నాశము కాఁగాఁ గన్నులారఁ జూచి సమయమునకు మహేంద్రనగంబుఁ జేరఁ బోయెదను.

కం॥ అనవుడు శరమున్ విడిచినఁ, దనస్వార్జితపుణ్యగతులు ♦ దగ్ధము లగుడున్
గని రాము మెచ్చి వలగొని, చనియె మహేంద్రంబుఁ జేర ♦ జమదగ్నిజుఁడున్.
౧౩౪౯

అని పరశురాముఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి బాణమును విడుచుటచేఁ దనపుణ్యగతులు దగ్ధమై పోవఁగాఁ గని పరశురాముఁడు మెచ్చి ప్రదక్షిణించి మహేంద్రపర్వతముఁ జేరఁబోయెను.

దీనిచే శివభక్తులు విష్ణువును ద్వేషించిరేని బాణపరశురాములవలెఁ జెడుదురని సూచన.

కం॥ విచ్చెన దిమిరము దెసలన్, మెచ్చిరి నిర్జరులు మును ల♦మేయబలాఢ్యున్
హెచ్చినముదమున రామున్, వచ్చెను స్మరణంబు నెల్ల♦వారికి సేనన్. ౧౩౫౦

ఆయన పోఁగానే దిక్కులందుఁ జీఁకట్లు విరిసిపోయెను, పరిమాణము చెప్పరాని బలముగల శ్రీరామచంద్రమూర్తిని దేవతలు మెచ్చిరి. సేనలోని యెల్లవారికి స్మరణము కలిగెను.

రావణవధవఱకు శ్రీరామపరత్వము రహస్యముగ నుంచవలసియుండఁ బరశురాముఁ డెట్లు వెలిపఱిచె నను నాక్షేపము రావచ్చును. పరశురాముఁడు చెప్పినది విన్నవా రెవరు? సేనలోనివా రందఱు స్మృతిదప్పి పడియుండిరి. దశరథుఁడు నష్టిపాఁడై యుండెను. మును లందఱు రహస్య మెఱిఁగినవారే. అది యుగ్గాక యుద్ధము చేయువారు గుంపునడుమఁ జేయుదురా? దూరమునందుఁ జేయుదురు. క్రింది పద్యమందలి మరలి యనునది యీ యర్థమును సూచించెడిని. కావున రహస్యము ప్రకటనము కాలేదు.

—॰{ ౭౭-సర్గము పరశురాముఁడు పోయినవార్తఁ దెలిపి శ్రీరాముఁడు దండ్రిని బ్రయాణము సేయఁ గోరుట. }*॰—

తే॥ జామదగ్న్యుండు చనిన దా♦శరథి ధనవు,నిషువస్పృశ్యుఁడౌ వరుణున కిచ్చి మరలి
మ్రొక్కి మైత్రావరుణ్యాది♦మునుల కెల్ల, విహ్వలుం డైనతండ్రిని ♦ వేగ డాసి. ౧౩౫౧

పరశురాముఁడు వెడలిపోఁగానే శ్రీరామచంద్రుఁ డా ధనస్సును బాణమును నదృశ్యుఁడై వచ్చియున్న వరుణునిచేతి కిచ్చి మరలివచ్చి వసిష్ఠాదుల కెల్ల మ్రొక్కి భయముచే నవయవముల స్వాధీనము తప్పి యుండిన తండ్రిని వేగ సమీపించి.

దీనివలన యుద్ధప్రసక్తిగాని వింటిని వరుణున కిచ్చుటగాని దశరథునకుఁ దెలియదు. మరలి, వేగ డాసి - యనునవి గుంపులోఁగాక దూరమందు రామపరశురామసంభాషణము జరగె నని తెలియనగు.

శ్రీరామచంద్రమూర్తి గుంజుకొన్నవిల్లు పరశురాముఁడు మరల నడుగ లేదు. యుద్ధమున శత్రువు గుంజుకొన్నది వానిసొత్తే కదా! వైష్ణవతేజస్సు పోయినపిమ్మట నావి ల్లెత్తు శక్తియైన నాయనకుఁ గలదా?

ఉ॥ పోయెను జామదగ్న్యుఁ డిఁకఁ ♦ బోవఁగ వచ్చు నయోధ్య కెల్లరున్
హాయిగ నాయనా! బలఁగ♦మంతయు నీదుననుజ్ఞ గోరి యి
ట్లీయెడ వేచు టయ్యె, స్తన♦యిత్నుజలార్థము చాతకోత్కరం
బో యన నాజ్ఞ యిమ్ము చన ♦ నొయ్యన నీ పిమ్మట నేని యంచనన్. ౧౩౫౨

తండ్రీ! పోయెను బరశురాముఁడు సుఖముగ నిఁక మన మందఱ మయోధ్యకుఁ బోవచ్చును. సేనయంతయు మేఘమునీటికై చాతకములసమూహము

వలె నీయాజ్ఞకై యెదురుచూచుచున్నది నీ కిష్టమేని పోవ్యుని యాజ్ఞ నీడ వచ్చును.

సేనకుఁ జాతకమునకు నుపమానము చెప్పుటచే నీయాజ్ఞవచ్చునంగాని మఱి యెవరు చెప్పినను సేనాభటులు కదలరని భావము.

ఉ॥ పోయెను రాముఁ డంట విని పొంగి ముదంబున నాత్మజుంగుఁ దా
నీయిలఁ గ్రమ్మఱఁ జనన ♦ మెత్తుటఁగాఁ దలపోసి రామునిన్
డాయఁగఁ దీసి చేతుల నె♦డంబడకుఁ గ్రుచ్చి శిరంబు మూరుకొం
చాయవనీశ్వరుండు చను ♦ నాజ్ఞ నొసంగెను సేన కంతకున్ ౧౩౫౩

పోయెను రాముఁ డని విని సంతోషముచే నుప్పొంగి కొడుకుఁ దాను మరల భూమిపై జన్మించిన ట్లెంచి రామచంద్రుని దగ్గఱకుఁ దీసి రెండుచేతుల నతని రొమ్మున కొత్తుకొని శిరము వాసనచూచి, యారాజు సేనకుఁ బ్రయాణము సేయ ననుజ్ఞయిచ్చెను.

—* దశరథాదు లయోధ్యాపురిఁ బ్రవేశించుట —

సీ॥ పలుడంబులను మీఱు♦కలువడంబులు గట్టి, మంగళరావముల్ ♦ సింగె ముట్ట
బాటల నన్నిట ♦ నీట సిక్తముఁ జేసి, యెల్లచోటుల నెడ♦చల్లి పూలు
తోరణంబులు మోద♦కారణంబుగఁ గూర్చి, రంగారు వన్నెల♦ముగ్గులు దీర్చి
చెన్నుమీఱఁగ సన్న♦వన్నెచేలలు దాల్చి, యెమ్మె దోఁపఁ గడాని♦సొమ్ములూని
తే॥ పౌరు లెల్లరు మంగళా♦చారకలనఁ, బౌరముఖ్యులు తనయులఁ బ్రేమఁగను సుతుల
తోడహిమవత్సదృక్షమా♦మేషియందుఁ బొచ్చె దశరథుఁ డాపురిలోన ♦ నోచ్చ నెలమి
౧౩౫౪

పలుడంబులు = నానావిధములైన రంగులు. కాంతులు కలువడంబులు = పూలదండలు. సిక్తము = తడిసినది. కడాని - బంగారు, హిమవత్సదృక్షము = హిమవంతముతో సమానము

తాత్పర్యము.

రాజు కొడుకులతోను గోడండ్రతోను వచ్చుచున్నాఁ డని విని యయోధ్య యందలి జనములు పెక్కు వన్నెల పూలతోరణంబులను గట్టి మంగళవాద్య ధ్వను లాకాశము తగులుచుండఁ జేసి బాటల నన్నిటిని నీళ్లుపోసి తడిపి యన్ని స్థలములందుఁ బుష్పములు వెదచల్లి చూచినంతన మనస్సునకు సంతోషము కలుగునట్లు తోరణంబులు గట్టి పలురంగుల రంగవల్లులు దీర్చి పౌరులు సన్న దువ్వలువలు గట్టి బంగారు సొమ్ములు ధరించి మంగళాచారములతోడఁ దమ్మై

దుర్గాని రాఁగాఁ గొడుకులతో హిమవంతమునకు సమానమైన మేడయందు దశరథుఁడు సంతోషము హెచ్చుచుండఁగాఁ బ్రవేశించెను.

తే॥ గరిమఁ గౌసల్యయు సుమిత్ర ♦ కైక యాది,యైననరపాలసతులు మ♦హానభావ
నర్వితనయ, యశస్విని ♦ నూర్మిలాఖ్య, మాండవీశ్రుతకీర్తుల ♦ మంజుగతిని.
౧౩౫౫

కం॥ మంగళవాద్యధ్వానము, లంలుగ మ్రోఁగంగ వెలుఁగు♦నంతిపురములఁ
బొంగుచుఁ బ్రవేశపెట్టిరి, శృంగారించిరి సుధౌత♦చేలంబులతోన్. ౧౩౫౬

కౌసల్య, సుమిత్ర, కైక మొదలగు రాజభార్యలు మహానుభావయగు సీతను, యశోవతి యగు నూర్మిలను, మాండవీశ్రుతకీర్తులను మంగళవాద్య ధ్వనులు మ్రోఁగుచుండఁగా నంతఃపురములందు సంతోషముచే నుప్పొంగుచుఁ బ్రవేశపెట్టిరి. తెల్లనివస్త్రంబులతో శృంగారించిరి.

కం॥ చందనవిలేపనాదుల, సుందర మగుమేను లొప్ప ♦ శుభవచనంబుల్
గ్రందుగఁ దమయిలువేలుపు, మందిరముల కర్చ లిచ్చి ♦ మఱి పెద్దలకున్.
౧౩౫౭

కం॥ గురుమతి మ్రొక్కిరి కోడం, డ్రురు ధనధాన్యముల నాల♦నుఁ విప్రులఁ ద
న్పిరి భర్తలతో సౌధాం,తరముల సుఖియించి రెసఁగ ♦ నవమోదంబుల్.
౧౩౫౮

మంచిగంధపుఁబూతలచే సుందరములగు దేహములు రమ్యము లగుచుండ శుభవాక్యములు చెప్పుచు తమ యిలువేలుపుమందిరముల కర్చనలు చేసి యావలఁ బెద్దలకుఁ గోడండ్రు మ్రొక్కిరి. ధనధాన్యములతోను నావులతోను బ్రాహ్మణులఁ దృప్తిపఱిచిరి. ఆవల భర్తలతో సౌధాంతరములఁ గ్రొత్తక్రొత్త సంతోషములు గలుగ సుఖించిరి.

కం॥ వీరులు కృతదారులు సుకు,మారులు నిజరూపహసిత♦మారులు హితసం
చారులు కుమారు లొప్పిరి, హారులు జనకేష్టశుభవి♦హారులు నగుచున్.
౧౩౫౯

వీరులు భార్యలుగలవారు సుకుమారులు తమ సౌందర్యముచే మన్మథుని నపహాసించువారు హితమైన నడవడిగలవారు మనోహరులు తండ్రి కిష్టమై శుభమైనట్లుగాఁ దిరుగువారై కుమారు లొప్పిరి.

ఉ॥ పోయినఁ గొంతకాల మిటు ♦ భూపతి కైకతనూజుఁ జూచి యో
నాయన! మాతులుం డిచట ♦ నాఁటనుగోలె భవన్నిమిత్తమై

తీయక యున్నవాఁడు చన ♦ దే యన లక్ష్మణుతమ్ముఁ గూడి మి
త్రాయితమూర్తి దండ్రికినిఁ ♦ దల్లులకుం బ్రణమిల్లి యేగినన్. ౧౩౬౦

ఇట్లు కొంతకాల మరుగఁగా దశరథుఁడు భరతునిఁ జూచి నాయనా! మేనమామ యిచట నీనిమిత్తమె పెండ్లికి వచ్చినప్పటినుండి కాచుకొని విడువక యున్నవాఁడు, పోయెదవా, యనిన భరతుండును శత్రుఘ్నునితో సూర్యునివంటి తండ్రికిఁ దల్లులకు నమస్కారములుచేసి వారి యనుమతి పడసి పోయెను.

కం॥ భరతుం డరిగిన శుభగుణ,నిరతులు వేల్పనెడిబుద్ధి ♦ నిజజనకుని ము
ద్భరితుం జేయుచు నుండిరి, ధరణిసుతావల్లభుండుఁ ♦ దమ్ముఁడు భక్తిన్. ౧౩౬౧

భరతుఁడు వెడలిపోఁగా సీతానాథుఁడైన రామచంద్రమూర్తియును లక్ష్మణుండును మంచిగుణముల నాసక్తిగలవారై జనకుఁడే దేవుఁ డను తలఁపుతో నాయనకు సంతోషమును భక్తిచేఁ గలిగించుచుండిరి

కం॥ జనకుని యానతిఁ దొప్పున, జనులకు హితముం బ్రియంబు ♦ సతతముఁ జేయున్
జననీగురులకు రాముఁడు,ఘనముగ సంతోష మిడు స♦కాలమునందున్. ౧౩౬౨

తండ్రియాజ్ఞచొప్పున శ్రీరామచంద్రమూర్తి ప్రజలకు మేలైనది సంతోషకరమైనది చేయుచుండెను. తల్లికిఁ దండ్రికి గురువులకు నే యే వేళల నెట్లెట్లు నడచిన వారికి సంతోషమో యట్లు చరించుచు సంతోషముఁ గలిగించుచుండెను.

కం॥ రాముని సమస్తసుగుణా,రాముని సచ్ఛీలతాభి♦రాముని సుబలో
ద్దాము యశోధామునిఁ గని, తామరుసము నొందిరర్య♦ధాత్రీవిబుధుల్.
౧౩౬౩

సమస్తగుణములందు రమించువాఁడును మంచి నడవడిచే నభిరాముఁడైనవాఁడును మంచి బలముచే నధికుండును కీర్తిస్థానమును నగు రామచంద్రమూర్తినిఁ జూచి బ్రాహ్మణులు వైశ్యులు చాల సంతోషించిరి

అర్యధాత్రీవిబుధుల్, ఉపలక్షణము - అన్నిజాతులవా రని యర్థము.

⸻✻ శ్రీసీతారాములు స్వపురంబున సుఖంబు లనుభవించుట ✻⸻

ఉ॥ శ్రీరఘురామచంద్రుఁడును ♦ సీతను గూడి యనేకముల్ ఋతుల్
హారివిహారలీలలఁ బ్రి♦యంబుగఁ బుచ్చెను నిచ్చలున్ మనం
బారమణీలలామపయి ♦ నారసికూరిమి నిల్పి, యామెయున్
గూరిమి పేరిమిం జెలఁగఁ ♦ గూర్చె మనంబు సదా హృదీశుపై. ౧౩౬౪

శ్రీరఘురామచంద్రుఁడును = 'ను' అనునది మీఁదఁ జెప్పినదానికి వేఱగు విషయమును దెలుపును.

ఇదివఱకుఁ జెప్పినవి పితృశుశ్రూషణ ధర్మప్రవర్తన దేవతారాధనాదులు. ఇఁక మీఁదఁ జెప్పఁబోవునది కామతంత్రవిషయము.

సీత అయోనిజాత

సీతనుగూడి ప్రియంబుగఁ బుచ్చెను అనుటచే భోగానుభవమందుఁ బ్రాధాన్యము శ్రీరామచంద్రమూర్తికే చెప్పఁబడెను. సీత భోగ్య, రామచంద్రుఁడు భోగి. భోగ్యమునకంటె భోగి ప్రధానమే కదా! సీతనుగూడి ప్రియంబుగ అనుటచే సీత లేదేని కాలము దుఃఖకరమేకాని ప్రియము కాఁజాలదని భావము. 'స ఏకాకీ న రమేత' యని శ్రుతి గలదు గదా!

పుచ్చెను - ఇది పరస్మైపదము. కార్యఫలము కర్తను బొందక పరులఁ జెందునపుడు పరస్మైపదము నుపయోగింపవలయును. కావున సీతారాములవిహారము వలనఁ గలిగినసంతోషము సీతకుఁ జెందవలయు ననియే రామచంద్రమూర్తి యభిప్రాయము

తాత్పర్యము.

శ్రీరామచంద్రుఁడు సీతతోడ ననేకములు ఋతువులు మనోహరమైన విహారక్రీడలచేఁ బ్రియముగఁ గడపెను సర్వదా మనస్సును నా స్త్రీరత్నమునందే కొంతలేని ప్రేమచే నిల్పెను. ఆమెయును సర్వదా కూర్మియతిశయముచే మనస్సును హృదయేశ్వరుఁడైన రామచంద్రునందే నిలిపెను.

ఇరువురివిషయంబునను 'గూరిమి' శబ్దమునే ప్రయోగించుటచే వారిరువురు పరస్పరము సమానమైన ప్రేమకలవారై యుండిరని భావము. కూరిమి చెప్పఁబడనేకాని కామము చెప్పఁబడకుండుటచే వారి యైకమత్యమునకుఁ బరస్పరానురాగమునకుఁ గామము కారణముగాదు. అనేకసంవత్సరములని చెప్పక అనేకఋతువు లని చెప్పుటచే నేయే ఋతువున నెట్లెట్లు సుఖపడవలయునో యట్లట్లు సుఖపడి రని భావము.

హిమ, శిశిర, వసంత, గ్రీష్మ, వర్షా, శరత్సు। స్తన తపన వనాంభో హర్మ్య గోక్షీరపానైః। సుఖ మనుభవ రాజన్ త్వద్రుజా యాంతి నాశం। దివస, కమల, లజ్జా, శర్వరీ రేణు పంక్తైః." ఓయిరాజ! స్తనముల నాలింగనముచేయుటచే హిమకాలమందును, నెండల నుండుటచే శిశిరకాలమందును, నుద్యానవనములందుండి వసంతకాలమందును, జలాభిషేకాదుల నెండకాలమందున, మేడలలో వసించి వానకాలమందును, ఆవుపాలు త్రాగుటచే శరత్కాలమందును సుఖ మనుభ

వింపుము. చలికాలమందలి పగటివలె, శిశిరమునందలి కమలములవలె, వసంతకాలమందలి సిగ్గువలె, ఎండకాలమునందలి రాత్రివలె, వానకాలమునందలి భూమిదుమ్మువలె, శరత్కాలమందలి బురదవలె ని వ్యాధి శమించును.

ఇది యిచ్చట ననుసంధింపవచ్చును.

క॥ ప్రణతామరునకు యోషి, ద్రత్న పితృకృతదార యగుట • మదిఁ బ్రియ యయ్యెన్
గుణముల ననుగుణసద్గుణ, గణముల రూపాదికములఁ • గామించెఁ గడున్. ౧౩౬౫

ప్రణతామరునకు = నమస్కరించు దేవతలుగలవానికి, యోషిద్రత్నము = స్త్రీరత్నము, పితృకృతదార - తండ్రి సమాధానపడి యిచ్చిన భార్యగావున, అనుగుణసద్గుణములన్ = తనగుణములకుఁ దగిన గుణసమూహములచేతను, రూపాదికములన్ = సౌందర్యాభిజాత్యాదులచేతను, కామించెను = ప్రతివహించెను- ఇచ్చట కామము సంభోగవిషయముగాదు; కడున్ = మిక్కిలి.

తాత్పర్యము.

దేవతలచేతను నమస్కరింపఁబడు శ్రీరామచంద్రమూర్తికి స్త్రీరత్నమైన సీతను దండ్రి మెచ్చి భార్యగా నిచ్చెఁగావున మనసునందు మిగులఁ బ్రియురాలయ్యెను. తండ్రి చేసిన పంపు గావున సీత ప్రియురాలయ్యెనే కాని యామెగుణములచేతఁ గాదేమో యనరాదు. ఏలయనఁ దనయందే గుణములు మంచివిగా నున్నవో యట్టిగుణములామెయందుఁ గుప్పలుగా నున్నవి. అనఁగా రామచంద్రునియందున్న సద్గుణములకంటె సీతయందెక్కువసద్గుణములున్నవి. అంతియేకాదు. సౌందర్య సౌశీల్య సౌజన్య సౌభాగ్యాదులు కలవు. కావునఁ బ్రీతికి మిక్కిలి పాత్రురాలయ్యెను. పితృకృతభార్యయగుటఁ బ్రియురాలయ్యెను. గుణాదికములచే మిగులఁ బ్రియురాలయ్యెను. రామచంద్రమూర్తికి సీతయందలి ప్రీతికి రెండు కారణములు. సీతకు రామచంద్రమూర్తియందు భక్తి యనునది యొకటియే కారణము.

సీతాదేవి యనసూయతో, అయోధ్య ౧౧౮-౭ ప., "ఉ॥ నాపతి వృత్తహీనుఁడయినన్ దృఢభక్తి నభేదబుద్ధినే। నోపిక నేను గొల్చెద నుండఁదగున్ విజితేంద్రియుండు శ్లా। ఘాపరిపూతసద్గుణుఁడు కారుణికాగ్రణి ధర్మబుద్ధి మా। తాపితృవత్ప్రియుండు నగు ధన్యుని రాముని గొల్చు టబ్రమే" అని చెప్పెను.

క॥ పతి సుందరి యగుటాగుణ, పతిమనమున ద్విగుణముగను • బరివర్తించెన్
సతియంతర్గతాశయ, మతిసూక్ష్మం బైనఁ బతికి • వ్యక్తంబు యగున్. ౧౩౬౬

పతి = రామచంద్రమూర్తి. ఆగుణపతిమనమున. ద్విగుణముగన్ = రెండంతలుగ. పరివర్తించెన్ = చక్కఁగా వర్తించెను. సతి = సీతాదేవియొక్క.

అంతర్గతాశయము = మనస్సునఁగల యభిప్రాయము. పతికి = రామచంద్రమూర్తికి. వ్యక్తంబు = స్పష్టముగఁ దెలియుచుండెను. అదెట్లు తెలియు ననన మనస్సునందే యెల్లప్పుడు తా నుండుటచేత నని తెలియవలెను.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి సీతవిషయమునఁ దా నెంత ప్రేమ తన మనస్సునఁగలవాఁ డగునో అంతకు నిబ్బడిప్రేమ రామచంద్రునివిషయమున సీత తనహృదయమునఁ గలదైయుండెను. ఇఁక రామచంద్రుఁడో సీతయభిప్రాయ మెంతకొంచెమైనను నామెమనస్సునందుఁ బుట్టిపుట్టకముందే స్పష్టముగఁ దెలిసికొనుచుండెను.

కం॥ అల సాక్షాల్లక్ష్మిగతిం, జెలువంబున నమరి యనఁగఁ ♦ జెలువగు నా మై
థిలకన్య సీత పతిం, గలప్రేమ నెఱుంగు భర్తృకంటెను మిగులన్. ౧౩౬౭

ప్రత్యక్షమైన లక్ష్మియై సౌందర్యమున దేవతాస్త్రీవలె నందముగల యాసీతాదేవి తనభర్తృహృదయమును, తనహృదయము రామచంద్రమూర్తి తెలిసికొనుటకంటె, నెక్కువగఁ దెలిసికొనుచుండెను. సీతహృదయమం దభిప్రాయము పుట్టినతరువాతఁ దెలిసికొనుచునచ్చినవాఁడు రామచంద్రమూర్తి. ఈసందర్భము లిట్లున్నవి. కావున రామచంద్రుఁ డీ కోరిక కోరఁబోవు నని యూహించి ముందే తెలిసికొనినది సీత. ఆమె కంతటశక్తి యెట్లు వచ్చె ననఁ. మైథిలుకన్య కావున, మహాయోగియు మహాజ్ఞానియు నగు జనకరాజుకూఁతురగుటచేతను, అట్టిరాజుండునది మిథిల కావున దేశస్వభావము వంశస్వభావమును బట్టియు, దేవతతో సమానము గావునఁ బ్రాగల్భ్యమును బట్టియు, సాక్షాల్లక్ష్మి కావున సహజబుద్ధివిశేషము చేతను, నట్లు తెలిసికొనఁ గలిగెను.

ఉ॥ రాజసుతుండు రాముఁ డభి♦రామయు నుత్తమరాజకన్య యా
రాజముఖీమణిం గలిసి ♦ రాజితకాముఁ డనంతకామతో
రాజిలు మోహబంధముల ♦ రంజలు చుండె విభుండు విష్ణు వా
రాజసహోదరిం గలిసి ♦ రాగమునన్ విలసించుచాడ్పునన్. ౧౩౬౮

పరస్పరానురాగము వర్ణించి యనురాగఫలమైన భోగమును వర్ణించుచున్నాఁడు.

రాముఁడు	సీత
రాముఁడు	అభిరామ
రాజసుతుఁడు	ఉత్తమరాజకన్య
రాజితకాముఁడు	అనంతకామ

తాత్పర్యము.

దశరథరాజకుమారుఁడు రామచంద్రమూర్తి రాజతకాముఁడై మహాయోగి యని మహాజ్ఞాని యని జీవన్ముక్తుఁ డని ప్రసిద్ధికెక్కుటచే రాజులందెల్ల నుత్తముఁ డగు జనకరాజకన్యయుఁ దనకంటె మిగుల రమింపఁజేయునదియుఁ, దనకంటె నత్యధిక ప్రీతికలదియు నగు సీతతో నాలింగనమున నేకభావము నొందినవాఁడై స్వయంగ్రహాశ్లేషమునకు విషయభూతుఁడై కలిసి ప్రత్యాలింగన సమర్థుఁడై విష్ణువు చంద్రసోదరి యగు లక్ష్మితోఁ గలిసి యనురాగముచేఁ బ్రకాశించునట్లు రంజిలుచుండెను.

రాజసుతుం డనుటచే నిరతిశయభోగము ననుభవించుటకుఁ దగిన సాధనము లన్నియుఁ గలవాఁ డని యర్థము. రాముఁడు = రమించువాఁడు, రమింపఁజేయువాఁడు. అభిరామ = రామునకంటె నతిశయముగ రమించునది, రమింపఁజేయునది. ఉత్తమరాజకన్య = రామచంద్రమూర్తికంటె నెక్కువ భోగోపకరణములు కలది. రాజముఖీమణిః = చంద్రునివంటి ముఖముగల యందకత్తెలలో నందగత్తె. కలిసి = ఏకమగునట్లు కూడి. సీతాదేవి రాముని గాఁగిలించునపుడు తమపరమైక్యమునకు నభ్యంతర మగు నని తనకుఁ బ్రియమైన సొమ్ములు హారములుకూడఁ దీసి యావల నంచుచుండెను. ఇంకను వీరల కలయిక యెట్టిగన "శ్లో॥ లీనేవ ప్రతిబింబితేవ లిఖితే వోత్కీర్ణరూపేవచ। ప్రత్యుప్తేవచ వజ్రలేపఘటితే వాంత ర్నిఖాతేవచ। సా నశ్చేతసి కీలితేవ విశిఖై శ్చేతోభువః పంచభిః। చింతాసంతతి తంతుజాలనిబిడ స్యూతేవ లగ్నా ప్రియా॥"
—మాలతీమాధవీయము. అర్థము.—నా ప్రియురాలు నా మనస్సునట్లు లగ్నమైన దనెగవా? విను. పాలలోఁ గలకండ కరఁగినట్లు, స్ఫటికమున దాసానిపువ్వు ప్రతిఫలించినట్లు, కాగిదమున రూపము లిఖించినట్లు, రాతిమీఁద మలచినట్టు, ఉంగరమున మణిని బొదిగినట్లు, వజ్రలేపముచేనదికించినట్లు, పంచబాణుని పంచబాణములను మేకులు గొట్టి బిగించినట్లు, నిరంతరచింతాసంతానమనెడి తంతువులచే నంటఁగట్టినట్లు ప్రియురాలు నా మనస్సున లగ్నమై యున్నది.

విభుండు = సీత యెంతమక్కువతోఁ గాఁగిలించెనో యంత మక్కువతో మరలఁ గాఁగిలించుటయందు సమర్థుఁడు.

విష్ణువు = మూర్తిభేదముచే నుపమానము. అవినాభావసంబంధము అనురాగము ఆమూర్తియం దెట్లో యిప్పుడు నట్లే యనుటకై యీయుపమానము. వేఱొక యుపమానము సాధ్యము కాదు.

మోహబంధములచే = వలపను కట్టులచే. రంజిలుచుండెను = అనురాగముఁ గలవాఁడై యుండెను. రాజసహోదరి = చంద్రసోదరి. ఇరువురు పాలసంద్రమునఁ బుట్టినవారు గావున సహోదరులు.

సీతారాముల భోగవిషయమై యీరామాయణమునఁ జెప్పఁబడిన లక్ష్మీనారాయణోపమానమే పద్మపురాణంబునఁ గలదు "శ్లో॥ తత్ర ద్వాదశవర్షాణి రాఘవ స్సహ సీతయా । రమయామాస ధర్మాత్మా నారాయణ ఇవ శ్రియా ॥" ఈయుపమానబలంబువ దివ్యదంపతిభోగ మే యిచ్చట వ్యంగ్యము అనఁగాఁ బ్రాకృతకామప్రేరితసంభోగ మెందును జెప్పఁబడలేదు అప్రాకృతదివ్యమూర్తులందుఁ బ్రాకృతకామము లెందుండి రాఁగలవు? కావున సీతారాములవిషయమందు బాహ్యసంభోగమేకాని యాంతరసంభోగము లేదని యేర్పడుచున్నది. వివాహమప్పటికి నాఱుసంవత్సరము లని యామెవాక్యములవలననే యేర్పడుచున్నది. ఎట్లన సీతాదేవి రావణుతోఁ దాను వనములకు భర్తతో బయలుదేఱునప్పటికి బదునెనిమిది యేండ్లని చెప్పెను అరణ్య. ౪౭. ౭. "క్షితిఁ బుట్టువాఁడిగాఁ గన, హితగుణ! నాకపుడు పదియు నెనిమిదియేఁడుల్" అని చెప్పెను. మఱియు వివాహానంతరము పండ్రెండుసంవత్సరములు తా నత్తగారింట సుఖముగా నున్నట్లను "పదియు రెండేఁడు లిక్ష్వాకుల యింటను, గడపితి నేదియుఁ గడమలేక" అనటచే ౧౮ - ౧౨ = ౬ సంవత్సరముల ప్రాయంబునఁ దా నత్తవారింటికి వచ్చిన ట్లయ్యెను.

ఈ వయస్సున నాంతరసంభోగ మొప్పదు 'శ్లో॥ జీ దంత్యాశ్చ లోద్యూ బ్రాహ్మణాం వృద్ధస్త్రీం కన్యకాం త్యజేత్ ॥' అంత్యజాతి దాసితోఁ గాని, తనకంటెఁ బెద్దదానితోఁ గాని కన్యకతోఁ గాని రమింపరాదు. కావున సంభోగశృంగారము చెప్పరాదు అట్లైన భర్తృసంయోగసులభ నని(అయోధ్య ౨౧౭౮) తానే చెప్పెఁగదా, యందురేని, దానికర్థము మహేశ్వరతీర్థులు చెప్పినట్లు పాణిగ్రహణోత్సవయోగ్యమైనవయస్సని యే యర్థము. కాని భర్తృసంభోగసులభ యని కాదు. ఎనిమిదిసంవత్సరములు వచ్చినఁ గదా కన్యాత్వప్రాప్తి, వివాహయోగ్యత యందురేని రాజులలోఁ దగిన వరుఁడు తటాలున దొరకునా? కావునఁ బెండ్లివిషయమై యాలోచింపఁదగిన వయస్సని యర్థము గ్రహింపవలెను. 'దృష్ట్వా సర్వాంగసుందరీ' మ్మని యుండుటచే వయస్సునఁ జిన్నదైనను లక్ష్మీదేవి కావున యువతివలె నుండెను. కావున సంభోగమే కవ్యభిప్రాయ మందురేని పండ్రెండుసంవత్సరములు సంభోగించి యుండిన నలువురు కోడండ్రలో నొకతెకైన గర్భము వచ్చియుండదా? అందఱు గొడ్రాండ్రుగదమా? పట్టాభిషేకమైన 1-2 సంవత్సరములలోనే యెట్లు

గర్భములు వచ్చెను? ఈ కాలమందలి సీతాదేవి భవభూతి యెట్లున్నట్లు వర్ణించెనో చూడుఁడు. "శ్లో॥ పరిణవిరళప్రాంతో స్త్రీల స్తనోహారకుట్మలై, ర్దశన కుసుమై ర్ముగ్ధాలోకం శిశు ర్దధతీ ముఖం॥" ఈ శ్లోక వ్యాఖ్యాసమందు శిశుః శైశవాంతవతీ శిశుప్రాయేత్యర్థః 'వరసంయోగసులభం వయో దృష్ట్వాచ మే పితే' త్యుక్తేః. పాలపండ్లు పడిపోయి మరల మొగ్గలవలెఁ బండ్లు వచ్చుచున్నట్లు వర్ణింపఁబడుటచే నెన్నియేండ్ల ప్రాయమో యూహింప వచ్చును. కావున బాహ్యరతియందే వా రాసక్తులై యుండిరని చెప్పవలసియున్నది.

మైథున మెనిమిదివిధములు. "శ్లో॥ స్మరణం కీర్తనం కేళిః ప్రేక్షణం గుహ్యభాషణమ్। సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియానిర్వృత్తిరేవచ। ఏతన్మైథున మష్టాంగం ప్రవదంతి మనీషిణః॥ కావున మొకటి 5-6 చెప్పవచ్చును.

అట్లైనఁ బెండ్లివయస్సు రాని పిల్లలకుఁ బెండ్లిచేయుట శాస్త్రవిరుద్ధముకదా యందురేమో, కాదు."శ్లో॥ ఉత్కృష్టాయాభిరూపాయ వరాయ సదృశాయచ। అప్రాప్తామపి తాం తస్మై కన్యాం దద్యాద్యథావిధి." - మను.౯-౮౮. అధికుఁడు, సుందరుఁడు, కులశీలాదులసమానుఁడు నగు వరుఁడు లభించినపుడు కన్యకు నీడురాకున్నను నతని కిచ్చి శాస్త్రప్రకారము పెండ్లిచేయవచ్చును.

బాలకాండాంతపద్యములు.

కం॥ ఓంకారాత్మక రామా! శంకరగిరిజావిరించిజపితసునామా!
సంకటనిచయవిరామా! పంకజమిత్రాన్వవాయ♦వారిధిసోమా! ౧౩౬౯

ఓంకారాత్మక = ఓంకారస్వరూపా - తస్యవాచకః ప్రణవః - ఓమిత్యేకాక్షరం బ్రహ్మ - ఓంకారమునకు రామశబ్దమునకు రూపభేదమేకాని యర్థభేదము లేదు. రామనామమాహాత్మ్యము చూచునది.

శంకరగిరిజావిరించి = శివపార్వతీబ్రహ్మలచే, జపిత = జపము చేయఁబడిన; సునామా = మంచిపేరుగలవాఁడా!; సంకటనిచయవిరామా = సంకటసమూహములను నాశముచేయువాఁడా, పంకజమిత్రాన్వవాయ = సూర్యవంశమనెడి; వారిధి = సముద్రమునకు, సోమా = చంద్రుఁడైనవాఁడా!

కం॥ సర్వాధిక సర్వాత్మక!, సర్వజగత్కారణా ప్రశస్తగుణాఢ్యా!
సర్వాదిమకారణ హరి! సర్వశరణ్యా మహాత్మ♦సర్వస్తుత్యా! ౧౩౭౦

సర్వాధిక = సర్వచరాచరకోటికి నధికుఁడైనవాఁడా! సర్వాత్మక = సర్వము నకు నాత్మయగువాఁడా.

సర్వజగత్కారణా = సమస్తప్రపంచమునకుఁ గారణమైనవాఁడా.

ప్రశస్తగుణాఢ్యా = శ్లాఘ్యమైన కల్యాణగుణసంపద గలవాఁడా.

సర్వాదిమకారణ = సమస్తమునకు మొదటికారణమైనవాఁడా.

హరి = భక్తులదుఃఖముల హరించువాఁడు కావున హరి - విష్ణువు.

సర్వశరణ్యా = సమస్తజీవకోటికి రక్షకుఁడైనవాఁడా

మహాత్మ = గొప్ప మనస్సుగలవాఁడా.

సర్వస్తుత్యా = సమస్తభూతములచే స్తోత్రముచేయఁబడువాఁడా.

తరలము॥ జలజవైరిమహీధరాగ్నిశ♦శాంకపద్యనిరూపితా౽
తులితబాల్యవినోదఖేలన ♦ తోయజాక్ష! రమాధవా!
కలశవారిధితుల్యసజ్జన♦కాండచిత్తనివాసకా!
కలుషసంహర! యొంటిమిట్టని♦కాయ! జానకివల్లభా! ౧౩౭౧

—♦ గద్యము ♦—

ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందమిళిందాయమాన మానసత్వమహావైభవ
వావిలికొలను రామచంద్రరాయతనూభవ సుజనవిధేయ
సుబ్బరాయ నామధేయప్రణీతం బైన
శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణ మను
నిర్వచనమహాకావ్యమునందు
బాలకాండము.

జలజవైరి = చంద్రుఁడు- ౧, మహీధర = పర్వతములు - ౭, అగ్ని = త్రేతాగ్నులు- 3, శశాంక = చంద్రుఁడు- ౧, అనఁగా ౧౩౭౧ సంఖ్యగల; పద్య = పద్యములచే; నిరూపిత = నిరూపింపఁబడిన, అతులిత = అసమానమైన; బాల్యవినోదఖేలన = బాలురవినోదక్రీడలుగలవాఁడా! ఇది బాలకాండ గావున నిందు ౧౩౭౧ పద్యములుండుటచే నిట్లు చెప్పఁబడెను. తోయజాక్ష = కమలములవంటి కన్నులుగలవాఁడా. రమాధవా = లక్ష్మీనాథ!

కలశవారిధితుల్య = పాలసముద్రముతో సమానమైన, సజ్జనకాండ = సజ్జనసమూహముల; చిత్తనివాసక = మనస్సులే నివాసస్థానముగాఁ గలవాఁడా; **కలుషసంహార** = పాపములహరించువాఁడా!

జానకీవల్లభా = ఇది సాధ్యసమాసము కావున దీర్ఘములేదు.

ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందమిళిందాయమానమానసత్వ మహావైభవ
వావిళ్లకొలను రామచంద్రరాయతనూభవ సుజనవిధేయ వాసుదాస
నామధేయ ప్రణీతంబైన మందరాఖ్య శ్రీమదాంధ్ర
వాల్మీకిరామాయణవ్యాఖ్యయందు
బాలకాండము.

శ్రీ రామార్పణమస్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్లో॥ నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.